# హదీసు మకరందం (బులూఘుల్ మరామ్) - 1

[ తెలుగు ]

# بُـــلـــوغُـــل مَـــــرَام - 1

[اللغة التلغو ]


రబువ జాలియాత్

الجاليات بالربوة

ఇబ్నె హజర్

ابن هجر

అనువాదం : - అజీజుర్రహ్మాన్

ترجمة: - عزيز الرحمان

పునర్విమర్శ : ముహమ్మద్ కరీముల్లాహ్

مراجعة: محمد كريم الله



రబువ జాలియాత్ - రియాద్

المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة بمدينة الرياض

2009 –1430

islamhouse.com


بسم الله الرحمن الرحيم

# హదీసు మకరందం

## బులూఘుల్ మరామ్

### మొదటి భాగం

సంకలనం
అబుల్ ఫజల్ షిహాబుద్దీన్ అహ్మద్ ఇబ్నె హజర్ అస్ఖలానీ

వ్యాఖ్యానం
మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి

తెలుగు అనువాదం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్
హైదరాబాద్-59.

# Hadeesu Makarandam - **Part-1**

## Bulugh Al-Maram (Telugu)

*Compiled by* : **Al-Hafiz Ibn Hajar Al-Asqalani**

*Commentary* : **Maulana Safi-ur-Rahman Mubarakpoori**

Translation in Telugu : **Muhammed Azeez-ur-Rahman**

***All Rights Reserved with Publishers***

*First Edition* : May, 2002

Copies : 2000

***Price*** **: Rs.250**

*Publishers* : **AL HAQ TELUGU PUBLICATIONS**
**Eidgah Compound, Akbar Bagh**
**Sayeedabad, Hyderabad - 500 059.**
**Phone : 4550007**

*Typeset at* : Golden Graphics
Chatta Bazar, Hyderabad.
Phone : 6700401

*Printed at* : Kala Jyoti Process Ltd.
Hyderabad.

# అంకితం

అహరహం ఏదో చేయాలనే ఆరాటంతో అనుక్షణం శ్రమిస్తూ,
అడుగడుగునా అనుచరులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ,
తాను చేపట్టిన బృహత్తర పథకాలన్నింటికీ దైవగ్రంథాన్నే ప్రాతిపదికగా చేసి,
తెలుగులో ఇస్లామీయ సాహిత్యాన్ని ఉన్నత స్థాయిలో వెలువరించాలని పరితపిస్తూ,
ప్రవేశ పరీక్షల ద్వారా పల్లెసీమల్లో ప్రతిభా వ్యుత్పత్తులను అన్వేషిస్తూ,
అరకొర సౌకర్యాలతోనే అద్భుత ఫలితాలను సాధిస్తూ,
అంతిమ దైవసందేశహరులు (సఅసం) పంచిన ప్రేమపరిమళ ధారను
తెలుగునాట నలుమూలలా వ్యాపింపజేయాలని ఉవ్విళ్ళూరుతూ,
తన స్వప్నం సాకారమవుతుండగానే మనందరినీ వీడి,
ఆశలకు అభిలాషలకు అతీతమైన ఊర్ధ్వలోకాలకు ప్రస్థానం చేసిన
**అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్** వ్యవస్థాపకులు,
గురువర్యులు హాఫిజ్, ఖారీ **మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్** (రహ్మ.లై) గార్కి
అంకితం ఈ గ్రంథం.

**అబ్దుల్ రహ్మాన్**
**డైరెక్టర్, అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్**

# ఆకాంక్ష!

విశ్వవిఖ్యాత హదీసు గ్రంథం **"బులూఘ్-అల్-మరామ్"** ను అల్ హఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోని **'అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్'** తెలుగులో ప్రచురించటం శుభసూచకం. అంతిమ దైవ సందేశహరులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనల సుగంధ పరిమళాన్ని తెలుగునాట గుబాళించే ప్రయత్నంలో ఈ పుస్తక ముద్రణ కూడా ఓ ప్రధాన ఘట్టమని మా అభిప్రాయం. ఇంతకు ముందు **అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్** ప్రచురించిన **"అల్లూలూ వల్ మరజాన్"** (మహాప్రవక్త-స-మహితోక్తులు) హదీసు గ్రంథానికి తెలుగు పాఠకుల నుండి లభిస్తున్న ఆదరణ మరుపురానిది. ఇప్పుడు మీ ముందున్న ఈ **'హదీసు మకరందం'** కూడా మనందరి ధర్మావగాహనలో దోహదకారి కాగలదని భావిస్తున్నాము.

దైవచిత్తమయితే హదీసు, సీరత్‌లపై తెలుగులో మరెన్నో అమూల్యమైన గ్రంథాలను మీ ముందుకు తీసుకురావాలన్నది మా ఆకాంక్ష. కరుణామయుడైన అల్లాహ్ కటాక్షిస్తే, పాఠకులైన మీరంతా ఆదరువుగా నిలిస్తే ఈ ఆకాంక్ష నెరవేరటం అసంభవమేమీ కాదు. ఈ పుస్తక ముద్రణలో తోడ్పడిన శ్రేయోభిలాషులందరికీ దైవం ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థన (ఆమీన్).

**షేఖ్ అబ్దుల్లాహ్ సిద్దీఖీ అల్ అమూది**
**ప్రెసిడెంట్,**
**అల్ హఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్.**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | **తొలిపలుకులు** | ix |
| **1.** | **శుచీ శుభ్రతల పుస్తకం** | **1** |
| | 1వ అధ్యాయం : నీళ్ళ రకాలు | 1 |
| | 2వ అధ్యాయం : వంటపాత్రలు | 15 |
| | 3వ అధ్యాయం : మాలిన్యం, దాన్ని దూరం చేసే విధము | 20 |
| | 4వ అధ్యాయం : వుజూ | 27 |
| | 5వ అధ్యాయం : మేజోళ్ళపై మసహ్ చేయటం | 43 |
| | 6వ అధ్యాయం : వుజూను భంగపరిచే విషయాలు | 49 |
| | 7వ అధ్యాయం : కాలకృత్యాలు తీర్చుకునే పద్ధతి | 62 |
| | 8వ అధ్యాయం : గుసుల్ మరియు జనాబత్ | 72 |
| | 9వ అధ్యాయం : తయమ్ముమ్ | 83 |
| | 10వ అధ్యాయం : రుతుస్రావానికి సంబంధించిన ఆదేశాలు | 91 |
| **2.** | **నమాజ్ పుస్తకం** | **102** |
| | 1వ అధ్యాయం : నమాజ్ వేళలు | 102 |
| | 2వ అధ్యాయం : అజాన్ | 115 |
| | 3వ అధ్యాయం : నమాజ్‌కై షరతులు | 129 |
| | 4వ అధ్యాయం : సుత్రా (తెర లేక అడ్డు) | 142 |
| | 5వ అధ్యాయం : నమాజ్‌లో అశక్తత, అణకువ | 147 |
| | 6వ అధ్యాయం : మస్జిద్ వ్యవస్థ | 153 |
| | 7వ అధ్యాయం : నమాజ్ చేసే విధానం | 161 |
| | 8వ అధ్యాయం : సహూ సజ్దాలు | 209 |
| | 9వ అధ్యాయం : నఫిల్ నమాజులు | 224 |
| | 10వ అధ్యాయం : సామూహిక నమాజ్ మరియు ఇమామత్ | 246 |
| | 11వ అధ్యాయం : ప్రయాణీకుల, వ్యాధిగ్రస్తుల నమాజ్ | 267 |
| | 12వ అధ్యాయం : జుమా నమాజ్ | 275 |

13వ అధ్యాయం : భయస్థితిలో నమాజ్ (సలాతుల్ ఖౌఫ్) 292
14వ అధ్యాయం : పండుగల నమాజ్ 297
15వ అధ్యాయం : గ్రహణ సమయాలలో నమాజ్ (సలాతుల్ కుసూఫ్) 306
16వ అధ్యాయం : వర్షం కొరకు నమాజ్ (సలాతుల్ ఇస్తిస్ఖా) 313
17వ అధ్యాయం : వస్త్రధారణ 323

**3. అంత్యక్రియల పుస్తకం 328**

**4. జకాత్ పుస్తకం 366**
1వ అధ్యాయం : సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రాదానం) 383
2వ అధ్యాయం : స్వచ్ఛంద దాన ధర్మాలు 385
3వ అధ్యాయం : దానధర్మాల పంపిణీ 394

**5. ఉపవాసాల పుస్తకం 401**
ఉపవాస నియమాలు 401
1వ అధ్యాయం : నఫిల్ ఉపవాసాలు మరియు నిషిద్ధ ఉపవాసాలు 417
2వ అధ్యాయం : ఏతెకాఫ్ - ఖియామె రమజాన్ 424

**6. హజ్జ్ పుస్తకం 429**
1వ అధ్యాయం : హజ్జ్ మహత్తు 429
2వ అధ్యాయం : మీఖాత్ (ఇహ్రామ్ పూనవలసిన ప్రదేశాలు) 436
3వ అధ్యాయం : ఇహ్రామ్ రకాలు - వాటి గుణాలు 438
4వ అధ్యాయం : ఇహ్రామ్ - తత్సంబంధిత విషయాలు 439
5వ అధ్యాయం : హజ్జ్ తీరు - మక్కాలో ప్రవేశించే విధము 448
6వ అధ్యాయం : హజ్జ్‌ను కోల్పోయినవారు, ఆపబడినవారు 469

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# తొలి పలుకులు

**సు**ప్రసిద్ధ హదీసు గ్రంథం **"బులూఘుల్ మరామ్"** కు తెలుగు అనువాదం ఈ కృతి. తెలుగు పాఠకుల ప్రయోజనార్థం ఈ అనువాదం సమర్పించబడుతోంది. ధర్మాదేశాలతో కూడుకున్న ఈ హదీసుల అనువాదంతోపాటు సంక్షిప్త వ్యాఖ్యానం కూడా ఇవ్వబడింది. క్లుప్తంగా హదీసు ఉల్లేఖకుల పరిచయం కూడా చేయబడింది. తెలుగు అనువాదం కోసం ఎంపిక చేయబడిన మూలం ఎంతో విశిష్ఠమయింది. మూలగ్రంథమైన **"బులూఘుల్ మరామ్"**కు అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. కొన్ని వ్యాఖ్యానాలయితే అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. అయితే మీ ముందున్న తెలుగు అనువాదం కోసం భారత దేశ ప్రఖ్యాత విద్వాంసులు మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి గారి వ్యాఖ్యాన ప్రతిని ఎన్నుకోవటం జరిగింది. ఎంతో సంక్షిప్తంగా, సరళంగా ఉన్న ఈ వ్యాఖ్యానాన్ని తెలుగు నాట ప్రాచుర్యంలోకి తీసుకు వస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి గారికి హదీసు, సీరత్‌లపై మంచి పట్టు ఉంది. మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితచరిత్రపై ఆయన వ్రాసిన ఒక పుస్తకానికి మక్కా ముకర్రమాలోని "రాబిత ఆలమె ఇస్లామీ" సంస్థ తరపున ప్రథమ బహుమతి లభించింది. దీన్నిబట్టి ఆయన ఏ స్థాయికి చెందిన విద్వాంసులో ఊహించవచ్చు.

"హదీసు" అనే అంశంపై రెండు రకాల పుస్తకాలు సాధారణంగా మన దృష్టికి వస్తాయి. మొదటి రకం: హదీసు మాతృగ్రంథాలు. ఉదాహరణకు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం మొదలగునవి. ఈ గ్రంథాలలో హదీసుతోపాటు దాని పుట్టుపూర్వోత్తరాలు, దాన్ని అందజేసిన వారి పరంపర కూడా పేర్కొనబడుతుంది. రెండవ రకం: ఇందులో హదీసు సంకలనాలుంటాయి. ఉదాహరణకు 'మిష్కాత్', 'బులూగుల్ మరామ్' ఇత్యాదివి. ఇస్లామీయ ధర్మవేత్తలు, హదీసు వేత్తలు తమ తమ అభిరుచికి అనుగుణంగా హదీసు మూల గ్రంథాలనుంచి ఎంచుకున్న వివిధ హదీసుల క్రోడీకరణే రెండవ రకం హదీసు పుస్తకాలు. మొదటి రకం హదీసు గ్రంథాలను పండితులు, హదీసు అవగాహన

ఉన్న వారే అర్థం చేసుకోగలుగుతారు. అయితే రెండవ రకం హదీసు పుస్తకాలు సామాన్య జనులకు ఎక్కువగా ఉపయోగపడేవిగా ఉంటాయి. ఎందుకంటే వీటి శైలి సరళంగా ఉంటుంది. ఒకే అధ్యాయంలో అనేక మూలగ్రంథాల సారం లభిస్తుంది. అందుకే ధార్మిక విద్యాపీఠాలలో కూడా - ప్రాథమిక తరగతుల్లో ఇలాంటి "హదీసు సంకలనాలే" బోధించబడతాయి. పై తరగతులలో, పరిశోధనా విభాగాలలో చదివే విద్యార్థులకు మాత్రమే సహీహ్ బుఖారీ వంటి మూలగ్రంథాలు బోధింపబడతాయి.

ఇటువంటి హదీసు సంకలనాలనేకముండగా కొన్నింటికి మాత్రమే అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. వాటిలో "బులూఘుల్ మరామ్" కూడా ఒకటి. హదీసు గనులలో **"బులూఘుల్ మరామ్"**కు లభించిన కీర్తికి కారణాలు రెండు. పుస్తకం కొరకు ఎన్నుకున్న హదీసులు, వాటి కూర్పు ఒక కారణమైతే, వీటి సంకలనకర్త హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ్‌లై) వ్యక్తిత్వం మరో కారణం.

## అల్లామా హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ్‌లై) గురించి

అబుల్ ఫజల్ అహ్మద్ బిన్ అలీ బిన్ ముహమ్మద్ బిన్ హజర్ అస్ఖలానీ హిజ్రీ శకం 773 షాబాన్ నెలలో ఈజిప్టులో జన్మించారు. ఆయన వంశస్థులంతా ధార్మికులు. ధార్మిక విద్యాభ్యాసం కోసం ఈయన్ని ఒక ప్రాథమిక దీనీ మదర్సాలో చేర్పించారు. తొమ్మిదేళ్ల వయస్సులో ఈయన దివ్య ఖుర్ఆన్‌ను కంఠస్థం చేశారు. ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయిన తరువాత, ధార్మిక శిక్షణ నిమిత్తం ఈయన హిజాజ్, బైతుల్ మఖ్దిస్, డెమాస్కస్, యమన్ తదితర ప్రాంతా లలో పర్యటించి ఆ కాలంనాటి విశ్వవిఖ్యాత విద్వాంసులందరినీ కలుసుకున్నారు. వారి సాన్నిధ్యంలో గడిపి ఖుర్ఆన్, హదీసు, ఫికహ్ విద్య మరియు అరబీ సాహిత్యంపై పట్టును సంపాయించారు. ముఖ్యంగా హదీసుపట్ల ఆయనలో ఎంతో ఆసక్తి, జిజ్ఞాస కలిగాయి. హదీసు విద్యలో అపారమయిన పాండిత్యాన్ని సంపాదించి తన కాలపు ఇమామ్‌గా పిలువబడ్డారు. ఈ కారణంగానే ఆయన పేరుతో పాటు 'హాఫిజ్' అనే పదం లిఖించబడుతుంది. ఆయన ఒక్క ఖుర్ఆన్‌కు మాత్రమే కాదు, హదీసుకు కూడా హాఫిజ్‌గానే భావించబడేవారు. దాదాపు 150 రచనలు చేశారు. వాటిల్లో చాలా వరకు హదీసు విద్యకు సంబంధించిన రచనలే. అందులో కొన్ని రచనలు పరిశోధనాత్మక గ్రంథాలుగా ఖ్యాతి చెందాయి. ప్రఖ్యాత పండితులు, ధర్మశాస్త్ర కోవిదులు

ఈ రచనల రెఫరెన్సు ఇచ్చేవారు. నేటికీ ఈయన రచనలు ధార్మిక విజ్ఞాన జగత్తులో ప్రామాణిక గ్రంథాలుగా పరిగణించబడతాయి.

ఆయన ఈజిప్టులో ధార్మిక అధ్యాపకునిగా, ఉపన్యాసకునిగా, ముఫ్తీగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండేవారు. అనంతరం ఖాజియుల్ ఖుజాత్ (ప్రధాన న్యాయమూర్తి) హోదా వరించింది. సహచరుల ప్రోద్బలంపై అతి కష్టమ్మీద ఆయన ఈ పదవికి అంగీకరించారు. ఆ కాలంలో షరీయత్ పట్ల, పరిస్థితుల స్వరూపం పట్ల పూర్తి అవగాహన ఉన్న వారికి మాత్రమే ఈ పదవి ఇవ్వబడేది. జీవిత కాలమంతా ధార్మిక సేవలో వెచ్చించిన హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ హి.శ. 852 జిల్ హజ్జ్ నెలలో పరలోకానికి ప్రస్థానం చేశారు.

గ్రంథ రచయిత ధర్మాదేశాలను, దైనందిన జీవితంలో ఒక మనిషికి ఎదురయ్యే ధర్మ సందేహాలకు సంబంధించిన హదీసులను ఈ పుస్తకంలో క్రోడీకరించారు. ప్రతివ్యక్తీ వీటిని తెలుసుకోవటం ఎంతైనా అవసరం. హదీసుకు సంబంధించిన ఈ గ్రంథం సంక్షిప్తమైనదైనప్పటికీ ఎన్నో పెద్ద పెద్ద గ్రంథాలలోని సారాంశమంతా చక్కగా సమకూర్చటం జరిగింది. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు అల్లామా అస్ఖలానీ హదీసు విభాగంలో గొప్ప ఇమామ్‌గా ఎంచబడేవారు. ఇంత పెద్ద హదీసు జ్ఞాని క్రోడీకరించిన హదీసు సంకలనం కూడా అతని పాండితీ ప్రకర్షకు ప్రతీకగా ఉండి తీరుతుంది. అందువల్లనే ఆయనగారి ఈ రచన (బులూగుల్ మరామ్) ప్రపంచంలోని అనేక ధార్మిక విద్యాలయాల, యూనివర్సిటీల పాఠ్యాంశాలలో చేర్చబడింది. ఆఖరికి సవూదీ అరేబియాకు చెందిన మదీనా మునవ్వరా ఇస్లామీయ విశ్వవిద్యాలయం (అల్ జామియతుల్ ఇస్లామీయ)లోని కొన్ని విభాగాలలో కూడా ఇది పాఠ్యాంశంగా ఉంది.

అల్ హమ్దులిల్లాహ్ ఇంతటి ఘనకీర్తిగల ఈ పుస్తకాన్ని తెలుగులో మా మిత్రులు అజీజుర్రహ్మాన్ అనువదించటం సంతోషకరం. ఈయన ఇంతకు ముందు అనువదించిన ఎన్నో ధార్మిక పుస్తకాలు ఆంధ్రావనిలో ఆదరణ పొందాయి. మీ ముందున్న ఈ అనువాదం కూడా భాషాపరంగా, శైలిరీత్యా పాఠకులను ఆకట్టుకోగలదని ఆశిస్తున్నాను. తెలుగు భాష దక్షిణ భారతంలో కోట్లాది ప్రజల భాష. ఈ భాషలో మరెంతో ధార్మిక సాహిత్యం ప్రచురించబడవలసిన ఆవశ్యకత ఉంది. విద్వాంసుల, శ్రేయోభిలాషుల ఆసక్తి, చొరవవల్ల ఈ అవసరం నెమ్మదిగా తీరుతుంది - ఇన్‌షా అల్లాహ్!

## హదీసు - హదీసు విద్య గురించి....

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనాలు, ఆదర్శాలు, ఆయన సహచరుల ఆచరణ, ఆయన (సఅసం) దృష్టికి వచ్చిన మీదట ఆయన (సఅసం) మౌనం వహించిన దృష్టాంతాలు "హదీసు" అనబడతాయి. దీనినే సున్నత్‌గా కూడా వ్యవహరిస్తారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను అల్లాహ్ సమస్త జనుల కోసం ప్రవక్తగా చేసి పంపాడు. ఆయనకు విధేయత చూపటం ప్రతి ముస్లింకు అవశ్యం, ఆయన (సఅసం)కు మనం చూపే విధేయతే అల్లాహ్‌పై విశ్వాసానికి, ఆయనపై గల ప్రేమకు ప్రబల తార్కాణం.

قُلْ إِنْ كُنْتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ
وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَحِيمٌ ﴿٣١﴾

ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా తెలుపు: "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను."
(ఆలి ఇమ్రాన్ - 31)

وَمَا أَرْسَلْنَا مِنْ رَسُولٍ إِلَّا لِيُطَاعَ بِإِذْنِ اللَّهِ ۚ
وَلَوْ أَنَّهُمْ إِذْ ظَلَمُوا أَنْفُسَهُمْ جَاءُوكَ فَاسْتَغْفَرُوا اللَّهَ
وَاسْتَغْفَرَ لَهُمُ الرَّسُولُ لَوَجَدُوا اللَّهَ تَوَّابًا رَحِيمًا ﴿٦٤﴾

(ఓ ప్రవక్తా! వారికి ఇలా తెలుపు) "మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము. వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న తరువాత వారి కొరకు ఉత్తమమయిన పద్ధతి ఏమిటంటే, వారు నీ వద్దకు వచ్చి ఉండ వలసింది; క్షమించు అని అల్లాహ్‌ను అర్థించి ఉండవలసింది, ఇంకా ప్రవక్త కూడా వారి కొరకు మన్నింపునకై విజ్ఞాపన చేసి ఉండేవాడు. అప్పుడు

వారు నిశ్చయంగా అల్లాహ్‌ను క్షమించేవాడుగా, కరుణించేవాడుగా కనుగొని ఉండేవారు."

(అన్ నిసా - 64)

مَنْ يُّطِعِ الرَّسُوْلَ فَقَدْ اَطَاعَ اللّٰهَ ۚ وَمَنْ تَوَلّٰى فَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ۝

"ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవంగా అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. కాని ఎవరయితే విముఖులయ్యారో అటువంటి వారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు." (అన్ నిసా - 80)

దైవప్రవక్త స్థానం అత్యంత ముఖ్యమైనది, బాధ్యతాయుతమైనది. అందుచేత ఆయన ధర్మానికి, షరీయత్‌కి సంబంధించి ఏది చెప్పినా, మరేది చేసినా తన మనోభిరామం ప్రకారం చెయ్యడు. దైవాదేశానుసారమే ఆయన మసలుకుంటాడు.

وَمَا يَنْطِقُ عَنِ الْهَوٰى ۝ اِنْ هُوَ اِلَّا وَحْيٌ يُّوْحٰى ۝

"అతడు తన మనోవాంఛలను అనుసరించి ఏదీ చెప్పటం లేదు. ఇది అతనిపై అవతరింపజేయబడే ఒక వహీ (దివ్యావిష్కృతి)." (అన్ నజ్మ్ - 3,4)

ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) ఆదేశాల, ఉపదేశాల స్థాయి కూడా ఖుర్‌ఆన్ ఆదేశాల వంటిదే. వాటిని విశ్వసించటం, శిరసావహించటం ఒక ముస్లింకు అనివార్యం. ఒకవేళ ఎవరయినా దివ్య ఖుర్‌ఆన్‌ని విశ్వసించి దైవప్రవక్త (సఅసం) ప్రవచనాలను, దైవప్రవక్త విధానాలను నిరాకరిస్తే అతడు ముస్లిమే కాజాలడు. అయితే అతడు హదీసును గురించి పరిశోధించవచ్చు. ఒక హదీసు గురించి, అది దైవప్రవక్త (స) చెప్పినదేనా? కాదా? ఆ హదీసు ప్రమాణబద్ధమైన ఆధారాల ద్వారానే అందిందా? లేదా? అన్న అంశాలను గురించి అతడు యోచన చెయ్యవచ్చు. అది నిజమైనదని తెలిసిన మీదట మాత్రం దానిని శిరసావహించటం, తదనుగుణంగా ఆచరించటం తప్పనిసరి అవుతుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడినట్లు -

وَمَآ اٰتٰىكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۗ وَمَا نَهٰىكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ

"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి. ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి." (అల్ హష్ర్ - 7)

ఇస్లాంను అర్థం చేసుకోవడానికీ, ఇస్లామీయ ఆదేశాలను అనుసరించడానికీ రెండు మౌలిక అంశాలపై ఆధారపడవలసి ఉంటుంది - (1) దివ్య ఖుర్‌ఆన్ (2) హదీసు. అల్లాహ్ ఈ రెండు మూల వస్తువులను ప్రళయదినం వరకూ చెక్కు చెదరకుండా - సురక్షితంగా ఉండేలా - కట్టుదిట్టమయిన ఏర్పాట్లు చేశాడు. మహాప్రవక్త (సఅసం) జీవించి వున్న కాలంలో చాలామంది సహచరులు దివ్య ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసుకున్నారు. ఆయన (స) పర్యవేక్షణలోనే దీనిని లిఖించటం కూడా జరిగింది. ఆయన (స) తదనంతరం ధర్మ ఖలీఫాలు ఈ మూల ప్రతి ఆధారంగా అనేక ప్రతులను తయారు చేసి వివిధ ప్రాంతాలకు పంపించారు.

దివ్య ఖుర్‌ఆన్‌ను లిఖిస్తున్న కాలంలో హదీసులను కూడా గ్రంథస్థం చేయడాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. ఖుర్‌ఆన్‌తో పాటు ఇది కలగాపులగం కారాదన్న ఉద్దేశ్యంతోనే దైవప్రవక్త (స) ఈ మేరకు ఆదేశించారు. అయితే ప్రవక్త ప్రియ సహచరులు (ర.అన్‌హుం) హదీసులను జ్ఞాపకముంచుకోవటమే గాక వాటిని ఒండొకరికి వినిపించేవారు. ఖుర్‌ఆన్ శైలిని, దాని భాషను సహచరులు బాగా జీర్ణించుకున్న తర్వాత హదీసులను కూడా లిఖించేందుకు ఆయన (సఅసం) అనుమతి ఇచ్చారు. వ్రాయటం వచ్చిన సహాబా తమ వంతు బాధ్యతగా గ్రంథస్థం చేయసాగారు. సహాబా తరువాత తాబయీన్లు కూడా ఈ బృహత్తర కార్యంపై శ్రద్ధ వహించారు. ఈ పరంపర నిరాఘాటంగా కొనసాగింది. ఇక హదీసువేత్తల, ఇమాముల కాలంలోనయితే హదీసు విద్యపై అపూర్వమయిన, అద్వితీయమైన కృషి జరిగింది. హదీసులను పరి రక్షించే ఈ పని ఎంత పకడ్బందీగా జరిగిందంటే 14 వందల సంవత్సరాలు గడచిపోయినప్పటికీ దైవప్రవక్త (సఅసం) ఆదేశాలు, ఉపదేశాలు భద్రంగా - యథాతథంగా - ఉన్నాయి. ఎవరయినా

వాటిని తెలుసుకోదలిస్తే ఆ సంఘటనలు నేడు మన మధ్య జరుగుతున్నట్లే, ప్రవక్త సహచరులు మనతో ముచ్చటిస్తున్నట్లే అనిపిస్తుంది. ఒక్కో హదీసు ప్రామాణికతను, దాని పరంపరను నిర్ధారించటానికి మహాప్రవక్త (స) అనుయాయులు తీసుకున్న జాగ్రత్తలు అటువంటివి మరి! ఒక్క మహనీయ ముహమ్మద్ (సఅసం) తప్ప మరే ప్రవక్త ఉపదేశాలూ ఇంత పకడ్బందీగా గ్రంథస్థం చెయ్య బడలేదు.

స్వచ్ఛమైన హదీసులను కాపాడటానికీ, ప్రజలు కల్పించే మనో కల్పిత విషయాలను వాటినుండి వేరుపరచటానికి హదీసువేత్తలు సలిపిన కృషి శ్లాఘనీయం. ఒక విద్యను రక్షించటానికై అంతకు ముందు ఎన్నడూ చరిత్రలో కనీవినీ ఎరుగని ఒరవడిని హదీసువేత్తలు సృష్టించారు. ఇల్మె రిజాల్, తబఖాత్, జరహ్, తాదీల్ వంటి గ్రంథాలు ఇందుకు కొన్ని దృష్టాంతాలు మాత్రమే. వీటి ద్వారా వేలాది మంది హదీసు ఉల్లేఖకుల జీవితాలు, స్థితిగతులు భద్రపరచబడ్డాయి. తద్వారా హదీసు ప్రామాణికత, హదీసు ఉల్లేఖకుని చరిత్ర తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడ్డాయి. ఉదాహరణకు హదీసును అందజేసిన వారెవరు? ఎక్కడుండేవారు? ఎలాంటివారు? వారి గుణగణాలు ఎటువంటివి? - ఇత్యాది విషయాలను క్షుణ్ణంగా పరికించి, వాటి ఆధారంగా హదీసు ప్రామాణికతను బేరీజు వేయటం జరిగింది. ఈ విధంగా దైవప్రవక్త (స) వారి ప్రవచనాలలో ఎవరూ హెచ్చుతగ్గులు చేయకుండా, అబద్ధాలు ఆపాదించకుండా ఉండేలా గట్టి ఏర్పాట్లు చేయబడ్డాయి. హదీసు విద్యకు సంబంధించి మన పూర్వీకులు తీసుకున్న ఈ జాగ్రత్తలను పరిశీలించిన విమర్శకులు ఆశ్చర్యచకితులయ్యారు. ఈ ఏర్పాట్లు ముస్లింలు హదీసు విద్యపై గర్వపడేలా ఉన్నాయనీ, ఇంతకు ముందు ఎవరూ మహనీయుల ప్రవచనాలను భద్రపరచేందుకు ఇంత పకడ్బందీగా ప్రయత్నం చెయ్యలేదనీ వారు కొనియాడారు. ఒకవేళ ఎవరికయినా ఫలానా హదీసు మహాప్రవక్త (సఅసం) ప్రవచించినదేనా? కాదా? అన్న సందేహం కలిగితే వారు హదీసు సూత్రాన్నుసరించి పరిశోధన జరిపి చాలా సులువుగా దాన్ని కనుగొనవచ్చు. ఎందుకంటే హదీసు అవగాహనకు సంబంధించిన మూల సూత్రాలు ఉనికిలోకి వచ్చాయి. వాటి ఆధారంగా ఒక హదీసు ప్రామాణికమైనదో, లేక బలహీనమైనదో, హదీసు పరంపరలో ఎక్కడ లింకు తెగిందో ఇట్టే పసిగట్టవచ్చు. తద్వారా ముస్లింలకు ప్రమాణ బద్ధమైన ఆదేశాలను పరిగణనలోనికి తీసుకుని ధర్మాన్ని, షరీయత్‌ను అవలంబించడానికి మార్గం సుగమం అవుతుంది. ఏ కాలంలోనయినాసరే

ప్రజలు ఖుర్‌ఆన్ హదీసులను మార్గదర్శిగా తీసుకుని జీవన యాత్ర సాగించటంలోనే వారి శ్రేయో సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా రూఢీ అయిన అంశాలను మాత్రమే అనుసరణీయంగా భావించి, వాటికి విరుద్ధంగా ఉన్న అంశాలను నిస్సంకోచంగా త్యజించాలి.

కారుణ్య ప్రభువు ఈ కృషిని స్వీకరించాలనీ, ఈ బృహత్తర కార్యంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన వారందరికీ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలనీ మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. మహనీయ ముహమ్మద్ (సఅసం) విధానానికనుగుణంగా జీవితం గడిపే సద్బుద్ధిని మనందరికీ ప్రసాదించాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీవుల్ అలీమ్.**

**- ముహమ్మద్ అబ్దుల్ హాది**

తేది : 30-7-2001 (8, జమాదివుల్ అవ్వల్ హి. 1422)

(అధ్యక్షులు, మజ్లిసుల్ ఖజా అల్ ఇస్లామీ, బ్రిటన్)

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# 1. శుచీ శుభ్రతల పుస్తకం

# كتاب الطَّهَارة

## మొదటి అధ్యాయం

## నీళ్ల రకాలు

## ١ - بابُ المِيَاه

**(వివిధ మార్గాల ద్వారా లభ్యమయ్యే నీటి వివరాలు)**

(١) عَن أبي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رسولُ اللهﷺ في البَحْرِ: «**هُوَ الطَّهُورُ مَاؤُهُ والحِلُّ مَيْتَتُهُ**». أَخْرَجَهُ الأَرْبَعَةُ وَابْنُ أبي شِيْبَةَ وَاللَّفْظُ لَهُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ والتِّرْمِذِيُّ، وَرَوَاهُ مَالِكٌ وَالشَّافِعِيُّ وَأَحْمَدُ.

1. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం (ఒక వ్యక్తి వెలిబుచ్చిన సందేహానికి సమాధానంగా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సముద్రపు నీటి గురించి ఇలా వివరించారు: "దాని నీరు పరిశుభ్రమైనది. అందులో చని పోయినవి ధర్మ సమ్మతమైనవి" (ఈ హదీసును అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, ఇబ్నె అబీ షైబాలు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ మరియు తిర్మిజీలు దీన్ని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఇమామ్ మాలిక్, షాఫయి, అహ్మద్ కూడా ఈ ఉల్లేఖనాన్ని ఉల్లేఖించారు).

### సారాంశం

ఈ హదీసు వాస్తవానికి ఒక పృచ్ఛకుని ప్రశ్నకు సమాధానంగా ఉద్భోధించబడింది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) తదితరులు ఉటంకించిన దాని ప్రకారం ఒక వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సన్నిధికి వచ్చి, 'ఓ దైవప్రవక్తా! మేము సముద్రయానం చేస్తూ ఉంటాము. మా వెంట మంచినీరు కొద్దిగానే ఉంటుంది. ఈ నీటితో గనక మేము 'వుజూ' చేస్తూపోతే దాహంతో చచ్చిపోతాము. కాబట్టి మేము సముద్రపు నీటితో 'వుజూ' చేయవచ్చా?' అని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా "ఆ నీరు పరిశుద్ధమైనదే" అని మహాప్రవక్త (సఅసం) ప్రవచించారు.

సముద్రపు నీరు ముమ్మాటికీ పరిశుద్ధమైనదనటానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. మరో గమనార్హ మైన విషయం ఏమిటంటే సముద్రంలోని చరాలు - అవి కుక్క, పందిని పోలినవి అయినాసరే- హలాల్ (ధర్మ సమ్మతం) గానే పరిగణించబడతాయి. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)ల అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం కేవలం సముద్రపు చేపలనే ధర్మసమ్మతంగా భావించారు.

మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు సముద్రపు నీటితో పాటు సముద్రంలో సహజంగా మరణించిన జంతువులను కూడా ధర్మసమ్మతమైన వాటి జాబితాలో చేర్చారు. ప్రశ్నించే వ్యక్తి అడగక పోయినప్పటికీ మహాప్రవక్త (సఅసం) ఈ సందేహ నివృత్తి చేశారు. ఎందుకంటే సముద్రపు నీరు ధర్మ సమ్మతమో కాదో అన్న సందేహం కలిగిన వ్యక్తి, సముద్రంలో చనిపోయిన చరాలు ధర్మ సమ్మతమా? కాదా? అన్న విషయమై కూడా తీవ్రమయిన సందేహానికి, మీమాంసకు లోనయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దివ్య ఖుర్ఆన్‌లో చనిపోయిన వాటిని తినరాదన్న ఆదేశం వచ్చిందిగాని వాటికి సంబంధించిన తప్సీళ్లు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో సముద్ర ప్రయాణాలు చేసే వ్యక్తి చనిపోయిన జలచరాల విషయంలో సందిగ్ధానికి లోనుకావచ్చు. ఈ విధంగా చూసినపుడు మహాప్రవక్త (సఅసం) గారి సమాధానం యుక్తితో, నేర్పుతో, వాత్సల్యంతో కూడుకున్నదిగా కనిపిస్తుంది.

ఇంతకీ ఈ పృచ్ఛకుడు ఎవరు? అనే విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. అతని పేరు అబ్దుల్లా అల్ ముద్‌లజీ (రజి) అయి ఉండవచ్చుననీ, అబ్దుల్ అర్కీ (రజి) కూడా కావచ్చుననీ ఒక వాదన ఉంది. ఉబైద్ - అల్ అర్కీ అనేది కూడా నిజం కావచ్చునని కొంతమంది వాదించారు. సముద్రం లేక నదులలో పడవ నడిపేవారిని అరబీలో 'అర్కీ' గా వ్యవహరిస్తారు.

సముద్రపు నీరు పరిశుద్ధమైనదనీ, దాంతో వుజూ చేయటం, దానిని (ట్రీట్‌చేసి) మన ఉపయోగం లోకి తీసుకురావటం సబబేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అలాగే సముద్రంలో ఉండే జంతువులు (సముద్రం బయట జీవించి ఉండలేనివి) అన్నీ - అవి సముద్రంలో చనిపోయినా లేక వాటిని పట్టుకున్న తరువాత అవి ప్రాణం విడిచినా - వాటిని తినటం సమ్మతమే. అలాగే సముద్రంలో ప్రయాణం చేయటం కూడా ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ అబూహురైర (రజి) అగ్రశ్రేణి ప్రవక్త సహచరులలో ఒకరు. ఈయనగారి ద్వారా అందరికన్నా ఎక్కువ హదీసులు మనకు అందాయి. సంకలనకర్త అభిప్రాయం ప్రకారం ఈయనగారి అసలు పేరు అబ్దుల్లాహ్ లేక అబ్దుర్రహ్మాన్ అయి ఉంటుంది. ఈయన దౌస్ తెగకు చెందినవారు. హిజ్రీ శకం 6వ యేట ఇస్లాం స్వీకరించారు. 78 ఏళ్ల ప్రాయంలో - హిజ్రీ 59లో- అశాశ్వతమయిన ఈ లోకాన్ని విడిచిపోయారు. మదీనాలోని "బఖీ" అనే ఖననవాటికలో ఖననం చేయబడ్డారు. హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ముఫ్తీగా నియమితులయ్యారు. ఈయనగారి చేత ఇంచుమించు 5384 హదీసులు ఉల్లేఖించబడినాయి. ఖచ్చితంగా హదీసుల సంఖ్య అల్లాహ్‌కే తెలుసు.

(٢) وَعَنْ أَبِي سَعِيدٍ الخُدْرِيِّ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ، قَالَ: قال رسول الله ﷺ: «إِنَّ المَاءَ طَهُورٌ لاَ يُنَجِّسُهُ شَيْءٌ». أَخرَجَهُ الثَّلاَثَةُ وَصَحَّحَهُ أَحْمَدُ.

2. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నీరు పరిశుద్ధమైనది. ఏ వస్తువూ దానిని అశుద్ధపరచదు." (ఈ ఉల్లేఖనాన్ని అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నెమాజ ఉల్లేఖించారు. దీని ప్రామాణికతను అహ్మద్ ధృవీకరించారు)

## సారాంశం

హదీసు సారాంశమేమిటంటే నీరు స్వచ్ఛమైనది, పరిశుద్ధమైనదై ఉంటుంది. కేవలం అందులో మాలిన్యం ఉన్నంత మాత్రాన - అది తక్కువ మోతాదులో ఉన్నా, ఎక్కువ మోతాదులో ఉన్నాసరే- అది అపవిత్రం, అశుద్ధం అయిపోదు. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), జవాహిర్ మరియు ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) ల అభిప్రాయం కూడా ఇదే. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) కొన్ని షరతులతో ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) చేత ఉల్లేఖించబడిన ఈ హదీసుతో ఒక ప్రత్యేక సంఘటన ముడిపడి ఉంది. అదేమంటే;

'మేము 'బీరె బుజాఅ' నీటితో వుజూ చేయవచ్చా?' అని కొంతమంది సహచరులు దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించారు (అదొక పాత బావి. అందులో బహిష్టు బట్టలు (ముట్లు), కుక్క మాంసపు ముక్కలు, దుర్వాసనతో కూడిన వస్తువులు పారవేయబడేవి). దీనికి సమాధానంగా ఆయన (సఅసం) "నీరు మాత్రం పరిశుద్ధమైనది" అని చెప్పారు. ప్రశ్నించిన వారి దృష్టిలో 'బీరె బుజాఅ' నీరు ఉంది. ఆ బావి వెడల్పు ఆరు గజాలుంటుంది. ఆ బావిలో మహా అయితే నాభి వరకు లేక అంతకన్నా కొంచెం ఎక్కువ లోతు నీరుంటుంది. లేదంటే నాభికన్నా కొంచెం తక్కువ లోతు ఉంటుంది. అబూ దావూద్ తన సునన్‌లో కూడా దీన్ని గురించి ఇలాగే ప్రస్తావించారు.

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే నీరు ఇంత ఎక్కువ మోతాదులో ఉన్నప్పుడు అందులో మలినం పడినంత మాత్రాన అది అశుద్ధమైపోదు. అయితే నీరు తక్కువగా ఉన్నప్పుడు మాలిన్యం పడినట్లయితే అప్పుడది అశుద్ధమైపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ సయీద్ ఖుదరీ (రజి). అబూ సయీద్ అనేది మరో పేరు.అసలు పేరు సాద్ బిన్ మాలిక్ బిన్ సునాన్. అన్సార్లకు చెందిన 'ఖజ్‌రజ్' తెగవారు. పెద్ద సహాబీలలో ఒకరుగా పరిగణించబడ్డారు. ఖుద్ర అనేది ఒక అన్సారీ తెగ. ఆ తెగ పేరున ఈయన ఖుదరీగా పిలువబడ్డారు. దాదాపు 86 సంవత్సరాలు జీవించారు. హిజ్రీ శకం 74వ ఏట మరణించారు. ఈయన గారి ద్వారా కూడా మనకు చాలా హదీసులు అందాయి.

(٣) وعَنْ أَبِي أُمامَةَ البَاهِلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ الله ﷺ: «**إِنَّ المَاءَ لاَ يُنَجِّسُهُ شَيْءٌ إِلاَّ مَا غَلَبَ عَلَى رِيحِهِ وَطَعْمِهِ وَلَوْنِهِ**». أَخْرَجَهُ ابْنُ مَاجَه، وَضَعَّفَهُ أَبُو حَاتِم، وَلِلْبَيْهَقِيِّ: المَاءُ طَهُورٌ إِلاَّ إِن تَغَيَّر رِيْحُه أو طَعْمُه أو لَونُه بَنَجَاسَةٍ تَحدُثُ فِيْهِ.

3. హజ్రత్ అబూ ఉమామ అల్ బాహిలీ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు- "నిశ్చయంగా నీళ్ళను ఏ వస్తువూ అపవిత్రంగానీ, మలినంగానీ చేయజాలదు - నీళ్ళపై ఆ అశుద్ధ వస్తువు తీవ్ర ప్రభావం చూపి దాని రుచి, రంగు, వాసనలో మార్పువస్తే తప్ప!" (ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. అబూ హాతిమ్ దీనిని బలహీన హదీసుగా ఖరారు చేశారు). బైహఖీలో హదీసు వాక్యం ఈ విధంగా ఉంది: నీరు పరిశుద్ధమైనది (పరిశుద్ధపరచేది కూడాను). కాకపోతే నీటిలో పడిన ఆ అశుద్ధ వస్తువు నీటి వాసనను, రుచినీ, రంగును మార్చివేస్తే అప్పుడది అశుద్ధమైపోతుంది."

## సారాంశం

కేవలం మలినం పడినంత మాత్రానికే నీరు అశుద్ధం అయిపోదు. నీరు ఎక్కువ పరిమాణంలో- అంటే రెండు పెద్ద తొట్టెలకు సమానంగా ఉన్నప్పుడు అశుద్ధతా ప్రభావం ఏర్పడదు. ఒకవేళ మలినం పడటం మూలంగా ఆ నీటి వాసన, రుచి, రంగు వంటి మూడు గుణాలలో ఏ ఒక్క గుణం మారినా ఆ నీరు అశుద్ధం అయిపోతుంది. అటువంటి నీరు అధిక పరిమాణంలో ఉన్నా, అల్ప పరిమాణంలో ఉన్నా అది అశుద్ధంగానే పరిగణించబడుతుంది.

ఈ హదీసు ప్రామాణికత రీత్యా బలహీనంగా ఉన్నప్పటికీ భావార్థం రీత్యా సరైనదే అన్న విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉంది. నీరు కొద్దిగా ఉన్నా, ఎక్కువ మోతాదులో ఉన్నా - మలినం పడిన కారణంగా దాని మూడు గుణాలలో ఏ ఒక్క గుణం మారినా అది అశుద్ధమైపోతుందన్న పండితుల ఏకాభిప్రాయాన్ని ఇమామ్ షాఫయి (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై), ఇబ్నె ముంజిర్ (రహ్మ.లై)లు నకలు చేశారు.

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే మరో విషయం ఏమిటంటే నీరు అధిక పరిమాణంలో - అంటే రెండు పెద్ద తొట్టెలకు సమానంగా లేక అంతకు మించి ఉంటే ఏ వస్తువూ దానిని అశుద్ధ పరచదు. కాని మలినం మూలంగా నీటి రంగు, రుచి, వాసనలలో మార్పువస్తే మటుకు అది అశుద్ధమైపోయినట్లే.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించినవారు అబూ ఉమామ అల్ బాహిలీ (రజి). అబూ ఉమామ

అనేది మారు పేరు. బాహిల అనే తెగకు చెందిన వారవటం చేత బాహిలీగా వ్యవహరించబడ్డారు. ఈయన అసలు పేరు సుదై బిన్ అజ్‌లాన్. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. ఈయన ద్వారా ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. ఈజిప్టులో కొంతకాలం స్థిరపడి, ఆ తరువాత 'హిమ్స్'కు తరలి వెళ్ళారు. ఈయన మరణం హి.శ. 81 లేదా 86లో సంభవించింది. సిరియాలో తనువు చాలించిన చిట్టచివరి సహాబీ ఈయనే.

(٤) وعَنْ عَبدِاللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِذَا كَانَ المَآءُ قُلَّتَيْنِ لَمْ يَحمِلِ الخَبَثَ». وفي لَفْظٍ: «لَمْ يَنْجُسْ» أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

4. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు: "నీటి పరిమాణం రెండు పెద్ద కడవలకు సమానంగా ఉన్నప్పుడు అది మాలిన్యాన్ని గ్రహించదు." వేరొక ఉల్లేఖనంలోని వాక్యం ఇలా ఉంది: "నీరు అశుద్ధం కాదు." (దీనిని అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమా, ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్‌లు దీని ప్రామాణికతను ధృవీకరించారు).

## సారాంశం

పై హదీసులో ప్రస్తావించబడిన కడవల సైజుకు సంబంధించి కొంత అభిప్రాయభేదం ఉంది. అయితే అరబ్బులోని రాతి తొట్టెలు సుప్రసిద్ధమైనవి. అక్కడి కవులు తమ కవితల్లో తరచూ ఈ తొట్టె లను ప్రస్తావిస్తూ ఉండేవారు. వాటి ఉపమానాలు కూడా ఇచ్చేవారు. హదీసులో ప్రస్తావనకు వచ్చిన తొట్టెలు (లేదా కడవలు) ఈ రాతి తొట్టెలే అయి ఉంటాయి. ఆ తొట్టెలలో 250 రతల్‌ల నీరు పడు తుంది. రెండు పెద్ద తొట్టెలలో సుమారు 500 రతల్‌ల నీరు పడుతుంది. నేటి ఆధునిక కొలమానం ప్రకారం ఇది 227 కిలో గ్రాములకు సమానం. ఈ పరిమాణంలో ఉన్న నీరు సాధారణంగా మలినాన్ని స్వీకరించదు. కొద్దిపాటి మాలిన్యం ఒకవేళ అందులో పడినా అది అశుద్ధమైపోదు.

ఈ హదీసు నీటి యొక్క అధిక - అల్ప పరిమాణాలను నిర్ధారించే విషయంలో కొలబద్ద వంటిది. నీళ్ళకు సంబంధించిన ఈ హదీసులన్నింటి ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే నీటి పరిమాణం రెండు పెద్ద తొట్టెలకన్నా తక్కువ ఉన్నప్పుడు - అందులో మలినం పడితే అప్పుడది అశుద్ధమైపోతుంది. నీటి రంగు, రుచి, వాసనలో మార్పు పొడసూపినా, పొడసూపకపోయినా అది అశుద్ధమైపోయిందనటంలో సందేహానికి ఆస్కారం లేదు. అయితే నీరు రెండు తొట్టెలకు సమానంగా లేక అంతకన్నా ఎక్కువగా ఉన్నప్పుడు మలినం పడిన కారణంగా ఆ నీరు అశుద్ధం అవదు. పైగా ఆ నీరు పరిశుద్ధంగా ఉంటుంది. ఇతర వస్తువులను పరిశుద్ధపరచే శక్తి కలిగి ఉంటుంది. కాని

మలినం మూలంగా దాని మూడు గుణాలలో (రంగు, రుచి, వాసన) ఏ ఒక్క గుణం మారినా అప్పుడు అది అశుద్ధ నీరుగానే భావించ బడుతుంది.

ఇంతకు ముందు మీరు చదివిన హదీసు (బావికి సంబంధించిన హదీసు)లో నీరు రెండు పెద్ద తొట్టెలకన్నా అధికంగా ఉంది. ఆ హదీసును హదీసువేత్తల ఓ పెద్ద సమూహం ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించింది. ఆ కోవకు చెందిన వారిలో ప్రముఖులు : ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అబూ ఉబైద్ (రహ్మ.లై), అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై), యహ్యా బిన్ మొయిన్ (రహ్మ.లై), ఇబ్నె ఖుజైమ (రహ్మ.లై), తహావీ (రహ్మ.లై), ఇబ్నె హిబ్బాన్ (రహ్మ.లై), దారెఖుత్ని (రహ్మ.లై), ఇబ్నె ముంద (రహ్మ.లై), హాకిమ్ (రహ్మ.లై), ఖతాబీ (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై) ఇబ్నె హజమ్ (రహ్మ.లై) మొదలగువారు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) జ్ఞాన సంపన్నులు. గొప్ప ప్రజ్ఞాశాలి. పిన్న వయస్సులోనే ఇస్లాం స్వీకరించారు. మక్కా నుండి మదీనాకు ప్రస్థానం కూడా చేశారు. తొలిసారిగా కందక యుద్ధంలో పాల్గొన్నారు. హిజ్రీ 75 వ సంవత్సరంలో పవిత్ర మక్కాలో మరణించారు. 'జీతువా' స్థలంలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.

(٥)وَعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ اللهِ ﷺ: «لا يَغْتَسِلْ أَحَدُكُمْ فِي المَاءِ الدَّائِمِ وَهُوَ جُنُبٌ». أخرجه مسلم. وللبخاري: «لاَ يَبُولَنَّ أَحَدُكُمْ فِي الْمَآءِ الدَّائِمِ الَّذي لاَ يَجْرِي، ثُمَّ يَغْتَسِلُ فِيْهِ». ولمُسْلِمٍ «منه» وَلأَبِي دَاوُد «وَلاَ يَغْتَسِلْ فِيْهِ مِنَ الجَنَابَةِ».

5. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయితే అశుద్ధావస్థకు లోనై ఉన్నారో వారు నిలిచి ఉన్న నీటిలో స్నానం చేయ రాదు" (ముస్లిం). బుఖారీలోని పదాలు ఈ విధంగా ఉన్నాయి: "మీలో ఎవరూ నిలిచి ఉన్న నీటిలో మూత్ర విసర్జన చేయటంగానీ, స్నానం చేయటంగానీ చేయరాదు." సహీహ్ ముస్లింలోని పదం 'ఫీహి' బదులు 'మిన్‌హు' అని ఉంది. అంటే దానిలోని కొంత నీరును తీసుకుని స్నానం చేయరాదు. అబూదావూద్‌లోని వాక్యం ఇలా ఉంది : "వలా యగ్‌తసిల్ ఫీహి మినల్ జనాబతి" - అంటే - లైంగిక అశుద్ధావస్థకు లోనైన పరిస్థితిలో అందులో స్నానం చేయ రాదు."

## సారాంశం

హదీసులో 'జనాబత్' అని ఉంది. సంభోగం వల్ల మరియు వీర్య స్ఖలనం వల్ల ఏర్పడే అశుద్ధావస్థను, 'జనాబత్' అంటారు.

ముస్లింలోని ఉల్లేఖనంలో 'ఫీహి' అనే బదులు 'మిన్‌హు' అనే పదం ప్రయోగించబడింది. ఒకవేళ 'ఫీహి' అని ఉంటే, 'ఆ నీటిలో ప్రవేశించటం మరియు మునగటం నిషిద్ధం' అని అర్థం వస్తుంది. 'మిన్‌హు' అని గనక ఉంటే అందులో నుంచి కొంత నీరును తీసుకుని వేరుగా స్నానం చేయటం అని కూడా రాదు.

మొత్తం మీద 'ముస్లిం' ఉల్లేఖనంలో కేవలం స్నానం చేయటం నిషిద్ధం అన్న అర్థం మాత్రమే వస్తుంది. బుఖారీ ఉల్లేఖనంలోనయితే అందులో మూత్ర విసర్జన చేయటం, స్నానం చేయటం - రెండూ వారించబడ్డాయి. అబూ దావూద్ ఉల్లేఖనం దృష్ట్యా చూస్తే అందులో మూత్ర విసర్జన చేయటం, మునిగి స్నానం చేయటం, లేక అందులో నుంచి కొంత నీరును తీసుకుని వేరుగా స్నానం చేయటం - అన్నీ వారించబడ్డాయి. మొత్తానికి ఈ ఉల్లేఖనాలన్నింటి ద్వారా అవగతమయ్యేదేమిటంటే రెండు పనులూ నిషిద్ధమే. ఎందుకంటే నిలిచి ఉన్న నీరు తక్కువ పరిమాణంలో ఉంటే అది అపవిత్రం అయిపోతుంది. ఒకవేళ నిలిచి ఉన్న నీరు ఎక్కువ పరిమాణంలో ఉన్నప్పటికీ నిరంతరం అందులో మూత్ర విసర్జన చేస్తూ, స్నానాలు కూడా చేస్తున్నందున క్రమక్రమంగా అది కలుషితమై నీటి గుణాలలో మార్పు వచ్చేస్తుంది.

(٦) وعَنْ رَجُلٍ صَحِبَ النَّبِيَّ ﷺ قَالَ: نَهَى رَسُولُ اللّٰهِ ﷺ أَنْ تَغْتَسِلَ الْمَرأَةُ بِفَضْلِ الرَّجُلِ، أَوِ الرَّجُلُ بِفَضْلِ الْمَرْأَةِ، وَلْيَغْتَرِفَا جَمِيْعاً. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَإِسْنَادُهُ صَحِيْحٌ.

6. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచర్యంలో ఉండి ధార్మిక లబ్ధి పొందిన ఒక వ్యక్తి కథనం : "పురుషుడు స్నానం చేయగా మిగిలి ఉన్న నీటితో స్త్రీ స్నానం చేయటాన్ని, స్త్రీ స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్ళతో పురుషుడు స్నానమాడటాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. ఒకవేళ ఇద్దరూ ఒకే సమయంలో దోసిట్లో నీళ్ళు తీసుకుని స్నాన మాడితే (అందులో అభ్యంతరం ఏమీ లేదు). (అబూ దావూద్, నసాయి. ఈ హదీసు అందజేయబడిన తీరు ప్రామాణికమైనది).

## సారాంశం

ఈ హదీసును ఉల్లేఖించిన సహచరుని పేరు వెల్లడి కానంత మాత్రాన హదీసుకు కలిగిన అనర్థం ఏమీ లేదు. ఎందుకంటే హదీసుల అభివ్యక్తిలో ప్రవక్త ప్రియ సహచరులంతా

నిష్పాక్షికంగా, న్యాయంగా వ్యవహరిస్తారన్న విషయమై హదీసువేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది.

ఈ హదీసులో వచ్చిన 'వారింపు' (నహీ) హరామ్‌కు సంబంధించినది కాదు. అంటే అది నిషిద్ధం అని కాదు. అది'నహీయె తన్జీహి'-అంటే అవాంఛనీయమైనది, అయిష్టకరమైనదన్న భావంలో తీసుకోబడింది. రాబోయే హదీసులో దీని వివరణ ఉంది. కనుక స్త్రీ స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్లతో పురుషుడు స్నానం చేస్తే ఏదో ఘోరం జరిగిపోయినట్లుగా భావించవలసిన అవసరంలేదు.

ఇక - ఏకకాలంలో స్త్రీ పురుషులిద్దరూ దోసిట్లో నీళ్లు తీసుకోవటం వల్ల ఒకరి ప్రభావం మరొకరిపై పడవచ్చు. ఆ విధంగా ఒకరు ఇంకొకరికి చెల్లు అవుతారు. ఇందులో కూడా ఆక్షేపణీయమైన విషయం ఏమీ లేదు. అందుచేత ఇందుకు అనుమతించబడింది.

ఒకవేళ భార్యా భర్తలిరువురూ ఒకే పాత్రలో నుంచి నీళ్లు తీసుకుని స్నానం చేస్తే అది ధర్మసమ్మతమే. అయితే కేవలం భర్త లేక కేవలం భార్య - పరిశుద్ధతను పొందే సంకల్పంతో చేసే - స్నానం తరువాత మిగిలి ఉన్న నీళ్లను తమ కొరకు ఉపయోగించటం సమ్మతం కాదు. ఇరువురి మనస్సులలో లేశమయినా శంక మిగిలి ఉండరాదన్న ఉద్దేశ్యంతో ఈవిధంగా సెలవీయబడింది.

(٧) وعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَغْتَسِلُ بِفَضْلِ مَيْمُونَةَ رَضِيَ اللهُ تعالى عنها. أخرجه مسلم. ولأصحابِ السُّنَنِ: اغْتَسَلَ بَعْضُ أَزْوَاجِ النَّبِيِّ ﷺ فِي جَفْنَةٍ، فَجَاءَ النَّبِيُّ ﷺ لِيَغْتَسِلَ مِنْها، فَقَالَتْ له: إِنِّي كُنْتُ جُنُباً، فَقَالَ: «إِنَّ المَاءَ لاَ يَجْنُبُ». وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

7. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణి అయిన మైమూన (ర.అన్‌హా) స్నానం చేయగా మిగిలివున్న నీళ్లతో స్నానం చేసేవారు (ముస్లిం). అస్‌హాబె సునన్‌లోని ఉల్లేఖనంలో ఇలా ఉంది: ప్రవక్త సతీమణులలో ఒకామె తొట్టెలాంటి ఒక పాత్రలో స్నానం చేసిన మీదట, తాను కూడా స్నానం చేసే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (సఅసం) ఏతెంచారు. నేను ఇందులో అశుద్ధావస్థను దూరం చేసే స్నానం చేశాను కదా అని ఆమె విన్నవించుకోగా, "నీరు అశుద్ధమైనది కాదు కదా!" అని ఆయన (స) పలికారు. (ఈ ఉల్లేఖనాన్ని తిర్మిజీ, ఇబ్నె ఖుజైమాలు ప్రామాణికమైనదిగా ధృవీకరించారు).

## సారాంశం

"అస్‌హాబె సునన్" అంటే అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్నె మాజ, అలాగే దారిమి, దారె ఖుత్నీ, ఇబ్నె ఖుజైమ మరియు హాకిమ్‌లు అని భావించాలి.

ఈ హదీసు ఇంతకుముందు వచ్చిన హదీసుకు విరుద్ధమైనదే! అన్న సందేహం రావచ్చుగాని సందేహానికి తావు నివ్వవలసిన అవసరం లేదు. వాస్తవానికి ఉమ్మత్ (ముస్లిం అనుచర సమాజం) యొక్క సౌలభ్యం నిమిత్తం ఆయన (స) ఇలా ప్రవచించారు. అదీగాక, ఆయన స్వయంగా దీనిని ఆచరించి చూపారు. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు హదీసులూ వాటి కోణాలనుండి సరైనవే నన్నదానికి ఇదొక నిదర్శనం. గమనార్హమయిన మరో ముఖ్య విషయం ఏమంటే ఇందులోని 'వారింపు' 'నిషిద్ధం'తో సమానం కాదు. ఇది కేవలం 'అయిష్టకరమయినది' మాత్రమే. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ధర్మ పత్ని మైమూన (ర.అ) స్నానం చేసిన మీదట మిగిలివున్న నీళ్లతో తాను కూడా స్నానం చేసేవారు. దీని భావం ఏమిటంటే హాజ్రత్ మైమూన (ర.అ) మరియు మహాప్రవక్త (స) - ఇరువురూ ఒకే పాత్రలో నుంచి నీరు తీసుకుని స్నానం చేసేవారు. సహీహ్ ముస్లింకు చెందిన ఇదే హదీసులోని రెండవ ఉల్లేఖనం కూడా ఈ విషయాన్ని సూచిస్తోంది.

'అస్‌హాబె సునన్'ల ఉల్లేఖనం ప్రామాణికత రీత్యా బలహీనమైనది. అందుచేత ప్రాధాన్యత నివ్వవలసిన అంశం ఏమిటంటే, భార్యాభర్తలిరువురూ కలసి ఒకే పాత్ర నుండి నీళ్లు తీసుకుని స్నానం చేయటం సమంజసమేగాని, వేర్వేరుగా స్నానం చేసినపుడు ఒకరు స్నానం చేయగా మిగిలి ఉన్న నీళ్లతో ఇంకొకరు స్నానం చేయటం సమంజసం కాదు.

## హదీసు ఉల్లేఖకులు

1. ఉల్లేఖకుని పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర.అన్‌హు). ముస్లిం సమాజంలో ఆయన 'జ్ఞాన సాగరం'గా వినుతికెక్కారు.ధార్మిక వ్యవహారాలలో గొప్ప కౌశల్యం ప్రదర్శించేవారు. ఆయన పాండితీ ప్రకర్ష గురించి ఆనాడు ఎవరికీ ఎలాంటి సందేహం ఉండేది కాదు. ఎందుకంటే ఆయనకు జ్ఞానంలో, యుక్తిలో, అవగాహనలో, అన్వయింపులో వృద్ధి నొసగమని దైవప్రవక్త (సఅసం) ప్రార్థించి ఉన్నారు. ఈయన హిజ్రీ 3వ సంవత్సరంలో జన్మించారు. హిజ్రీ 67లో తాయఫ్‌లో మరణించారు.

2. హాజ్రత్ మైమూన (ర.అన్‌హా) : ఈమె పూర్తి వంశపరంపర ఇలా వుంది - మైమూనా బిన్తె హారిస్ అల్ హిలాలియ. దైవ ప్రవక్త (స) హిజ్రీ 7వ సంవత్సరం ఈమెను వివాహమాడారు. హిజ్రీ 61 లేక 51 లేక 66లో ఈమె మరణించారు.

(٨) وعَنْ أبي هُرَيرةَ رضي اللَّهُ تَعالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ الله ﷺ: **طُهُورُ إِنَاءِ أَحَدِكُمْ إِذَا وَلَغَ فِيهِ الكَلْبُ أَنْ يَغْسِلَهُ سَبْعَ مَرَّاتٍ، أُولاَهُنَّ بِالتُّرَابِ** أَخرَجَهُ مُسْلِمٌ، وَفِي

8. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హాజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలోని ఎవరి పాత్రలోనయినా కుక్క ఎంగిలి చేస్తే దాన్ని ఏడుసార్లు కడగాలి. అన్నిటి కన్నా ముందు మన్నుతో తోమి (పరి శుభ్రం చేయాలి)." (ముస్లిం) 'ఫల్ యురిఖ్' అనీ, అంటే దాన్ని పడ

لَفظِ لَهُ «فَلْيُرِقْهُ». وَلِلتِّرمِذِيِّ: «أَخْرَاهُنَّ أَوْ أُولَاهُنَّ بِالتُّرَابِ».

వేయాలని 'ముస్లిం'లో నకలు చేయ బడింది. మొదటిసారి లేదా ఆఖరిసారి మన్నుతో శుభ్రపరచాలన్న పదాలు 'తిర్మిజీ'లో పొందుపరచబడి ఉన్నాయి."

**సారాంశం**

"తొలిసారి లేదా ఆఖరిసారి" అన్న అనుమానం బహుశా ఉల్లేఖకునిలో కలిగి ఉంటుంది. తొలిసారి మట్టితో కడిగినా, ఆఖరిలో మట్టితో కడిగినా అది కడిగేవాని ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండాలి. "మొదటిసారి" అనే పదం అనేక ఉల్లేఖనాలలో ఉండటం వల్ల, బుఖారీ మరియు ముస్లింలలో కూడా ఈ విధంగానే పేర్కొనబడటం మూలంగా "మొదటిసారి మన్నుతో తోమి శుభ్రపరచాల"న్న దానికే ప్రాధాన్యత నివ్వబడుతున్నది.

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే, కుక్క నోరు, దాని చొంగ, ఎంగిలి అశుద్ధం. ఈ కారణంగానే దాని శరీరమంతా అశుద్ధంగా పరిగణించబడుతుంది. అది మూతి పెట్టిన పాత్రను ఏడుసార్లు కడగటం తప్పనిసరి అనటాన్ని బట్టి అది ఎంత అపవిత్రమైన జంతువో వ్యక్తమవుతోంది. పరిశోధకుల అభిప్రాయం కూడా ఇదే. ఏడుసార్లు కడిగి, ఒకసారి మన్నుతో తోమి శుభ్రపరచటం అభిలషణీయమేగాని అనివార్యం కాదని మరి కొంతమంది భావించారు. మూడుసార్లు కడిగితే చాలని ఇంకొంతమంది వాదించారు. కాని వాస్తవమేమిటంటే హదీసులోని ఆధారం ఈ రెండు వాదాలనూ సమర్థించదు. ఏడుసార్లు తప్పనిసరిగా కడగాలని హదీసులో చెప్పబడిందంటే అందులో ఎన్నో మర్మాలు, పరమార్థాలు ఇమిడి ఉంటాయి.

సాధారణంగా కుక్క ప్రేగుల్లో చిన్న చిన్న సూక్ష్మక్రిములు చాలా ఉంటాయని వర్తమాన కాలపు వైద్యులు స్పష్టపరుస్తున్నారు. అవి నాలుగు మిల్లీ మీటర్ల దాకా పొడవుంటాయి. కుక్క మల విసర్జన చేసినపుడు ఆ మలంతోపాటు అసంఖ్యాకమయిన అండాలు కూడా బయటకు వస్తాయి. మల విసర్జన భాగంలో (పిరుదుల వద్ద) వెంట్రుకలకు అతుక్కుపోతాయి. మల విసర్జన తరువాత కుక్క నాలుకతో తనను తాను పరిశుభ్రపరచుకుంటుంది. ఆ సమయంలో అండాలు దాని మూతికి తగులుతాయి. నోటి లోనికి ప్రవేశిస్తాయి. అనంతరం ఆ కుక్క నీళ్ల పాత్రలో మూతిపెట్టినా, నీరు త్రాగినా, లేక ఎవరయినా పాశ్చాత్యుల తరహాలో ఆ కుక్క మూతిని ముద్దు పెట్టుకున్నా ఆ అండాలు తక్షణం అంటుకుంటాయి. ఆ విధంగా అవి జీర్ణకోశంలోకి ప్రవేశిస్తాయి. ఆ అండాలలోంచి సూక్ష్మ క్రిములు జనించి జీర్ణకోశాన్ని చీల్చుకుని రక్త నాళాలలోకి ప్రవేశిస్తాయి. తత్కారణంగా హృద్రోగాలు, మెదడు వ్యాధులు రావటం, ఊపిరితిత్తులు చెడిపోవటం సంభవిస్తుంది. ఈ పరిణామాలన్నింటినీ పాశ్చాత్య వైద్యులు ఖుద్దుగా నిర్ధారించారు. ఈ సూక్ష్మక్రిములు గల కుక్కలను గుర్తించటం చాలా కష్టం.

షరీయత్ పరంగా కుక్కను అపవిత్ర, అశుద్ధ జంతువుగా ఖరారు చేయటం వెనుక ఇలాంటి పరమార్థాలు ఎన్నో ఉన్నాయి. అది ఎంగిలి చేసిన పాత్రను ఏడుసార్లు కడగాలనడంలోని మర్మం ఇదే. తద్వారా ఆ పాత్ర వీలయినంత అధికంగా పరిశుభ్రం కావాలన్నది అసలు ఉద్దేశ్యం. యదార్థ జ్ఞానం మాత్రం అల్లాహ్‌కే తెలుసు.

తినే, త్రాగే పదార్థాన్ని గనక కుక్క ఎంగిలి చేస్తే దాన్ని ఉపయోగించేబదులు పారవేయాలి. హదీసు బోధన ప్రకారం దాన్ని ఏడుతూర్లు కడగాలి. దీన్నిబట్టి కుక్క స్వతహాగా అపవిత్రమైనదేగాక, అది మూతిపెట్టిన వస్తువు సయితం అపవిత్రం అయిపోతుంది. ఒకవేళ మన వినియోగంలో వున్న పాత్ర అయితే దాన్ని ఏడుసార్లు కడగాలి. ముస్లింలోని ఉల్లేఖనంలో ఏడోసారి బదులు ఎనిమిదోసారి మన్నుతో తోమాలని ఉంది. అంటే మొదటిసారి మన్నుతో తోమి, ఆ తరువాత ఏడుసార్లు నీళ్లతో కడగాలి. ఇలా చేయటం వల్ల పాత్రయింత ఎక్కువ పరిశుద్ధత ప్రాప్తమయి, సందేహానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పోతుంది. మూడుసార్లు కడిగినా పరిశుభ్రమైపోతుందని హనఫీలు భావిస్తున్నారు. వాళ్లు తమ ఈ అభిప్రాయానికి ఆధారంగా దారెఖుత్నిలో పేర్కొనబడిన హజ్రత్ అబూహురైర (రజి) 'ఫత్వా'ను ఉదాహరిస్తున్నారు. కుక్క ఎంగిలిచేసిన పాత్రను మూడుసార్లు కడగాలని అందులో ఉంది. మరి చూడబోతే ఈయనగారు ఇచ్చిన మరో ప్రామాణిక ఫత్వాలో, అలాంటి పాత్రను 'ఏడుసార్లు కడగాలి' అన్న పలుకు కూడా ఉంది. ఇలాంటి ద్వంద్వాభిప్రాయాలు ముందుకు వచ్చినపుడు మూల హదీసుకు అనుకూలంగానున్న ఫత్వాను తీసుకోవటం అభిలషణీయం. ప్రమాణబద్ధంగా చూసినా 'ఏడుసార్లు కడగాలి' అన్న ఫత్వా (తీర్పు) ఎక్కువ సరైనదిగా తోస్తున్నది (ఫత్‌హుల్ బారీ - సం-1, పేజీ - 277).

(٩) وعن أَبِيْ قَتَادَة رضي الله تعالى عنه أَنَّ رَسولُ الله ﷺ قَالَ في الهِرَّةِ: «إِنَّهَا لَيْسَتْ بِنَجَسٍ، إِنَّمَا هِيَ مِنَ الطَّوَّافِينَ عَلَيْكُمْ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

9. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పిల్లి గురించి ఇలా ప్రవచించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) వివరించారు: "అది అపవిత్రమైనది కాదు. ఎందుకంటే అది ఎల్లవేళలా వస్తూ పోతూ ఉండే పెంపుడు జంతువు." (దీనిని అబూ దావూద్, నసాయి, తిర్మిజీ, ఇబ్నెమాజాలు నలుగురూ ఉల్లేఖించారు. తిర్మిజీ మరియు ఇబ్నె ఖుజైమాలు దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు).

## సారాంశం

హదీసు పూర్వరంగం ఏమిటంటే హజ్రత్ అబూ ఖతాద (రజి) వుజూ చేసే నీళ్ళ పాత్రను ఒకచోట ఉంచారు. అంతలో ఒక పిల్లి వచ్చి అందులో మూతిపెట్టి నీరు త్రాగసాగింది. దాని అవస్థను గమనించిన హజ్రత్ అబూ ఖతాద (రజి), పిల్లికి సౌలభ్యం కలిగించే ఉద్దేశ్యంతో ఆ పాత్రను వెంటనే ఒక ప్రక్కకు వంచారు. మీరెందుకిలా చేస్తున్నారు? అని జనులు ప్రశ్నించగా హజ్రత్ అబూ ఖతాద (రజి) ఇలా వివరించారు: "పిల్లి అశుద్ధమైనది కాదు" అని దైవప్రవక్త (స) ప్రవచించగా నేను విన్నాను.

పిల్లి ఎంగిలి అశుద్ధమైనది కాదని ఈ ఉల్లేఖనం ద్వారా రూఢీ అవుతోంది. అయితే అది ఏ పదార్థాన్నయినా ఎంగిలి చేసినపుడు దాని మూతికి అశుద్ధ వస్తువు తగిలి ఉండకూడదన్నది షరతు.

## హదీసు ఉల్లేఖకులు

'అబూ ఖతాద' మారు పేరు. అసలు పేరు హారిస్ బిన్ రిబయి. సుప్రసిద్ధ ప్రవక్త సహచరులలో ఒకరు. 'దైవప్రవక్త (స) గారి అశ్వం'గా బిరుదు లభించింది. అన్సార్లకు చెందిన వారవటంచేత అన్సారీగా కూడా వ్యవహరించబడేవారు. ఈయన ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నారు. ఈయన మరణకాలం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. హిజ్రీ 40లో మరణించారని కొంతమంది, హిజ్రీ 54వ యేట పరమపదించారని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. రెండవ అభిప్రాయమే బలమైనది, సుప్రసిద్ధమైనది.

(١٠) وعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله تعالى عنه قال: جَاءَ أعرابيٌّ، فَبَالَ في طَائِفَةِ الْمَسْجِدِ، فَزَجَرَهُ النَّاسُ، فَنَهَاهُمُ رسولُ الله ﷺ، فلما قَضَى بَولَهُ أَمَرَ النَّبيُّ ﷺ بِذَنُوبٍ من مَاءٍ فأُهْرِيقَ عَلَيْه. مُتَّفَقٌ عَلَيْهِ.

10. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒక పల్లెటూరి బైతు వచ్చి మస్జిదు మూలన మూత్ర విసర్జన చేస్తుండగా ప్రజలతనికి చీవాట్లు పెట్టసాగారు. అయితే దైవప్రవక్త (సఅసం) చీవాట్లు పెట్టరాదని వారించారు. ఆ వ్యక్తి తాపీగా మూత్ర విసర్జన చేసిన పిమ్మట దైవప్రవక్త (సఅసం) ఒక బొక్కెన నీరు తెప్పించి, ఆ (అశుద్ధ) స్థలంలో పారపోశారు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఇంతకీ ఆ పల్లెటూరి వ్యక్తి ఎవరు? ఆయన పేరు జుల్ ఖువైసర యమానీ అనీ, ఆయన పెద్ద బొజ్జ కలవారనీ చెప్పబడుతోంది. మస్జిద్ మూల ప్రదేశంలో మూత్రం పోయటం చూసి జనం ఆయన్ని ఈసడించుకుంది. తీవ్రంగా మందలించింది. అంతలో ఆ దృశ్యం చూసిన దైవప్రవక్త (సఅసం) మందలిస్తున్న వారినే మందలించి, మూత్ర విసర్జనను మధ్యలో అడ్డుకొనకుండా ఉండేలా ప్రయత్నించారు. ఎందుకంటే మూత్ర విసర్జనను మధ్యలో ఆపటం వల్ల పురుషుని పురుషాంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలా చేయటం వల్ల ఒక్కోసారి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది. అదీగాక మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తిని మధ్యలో హడావిడి చేసి ఆపినట్లయితే, అతను అక్కడినుండి లేచి మరోచోటకు వెళతాడు. ఆ కంగారులో మూత్రపు బొట్లు అతని లుంగీపై పడవచ్చు, లేదా మూత్రం ధారాపాతంగా ప్రవహించి మస్జిదులోని ఇతరచోట్ల కూడా అశుద్ధత వ్యాపించవచ్చు. అందుకే మహాప్రవక్త (సఅసం) ఆ సమయంలో సమయోచితంగా స్పందించి గొడవ చేసే జనులను తొలుత శాంతింపజేశారు. ఆ తర్వాత బొక్కెన నీరు తెప్పించి మూత్రం పోయబడిన అశుద్ధ స్థలంపై కుమ్మరించారు. దాంతో ఆ అశుద్ధత కాస్తా దూరమైపోయింది.

'తిర్మిజీ'లో కూడా ఈ హదీసు హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా సరిగ్గా ఇలాగే విశదీకరించబడింది. తిర్మిజీలో దీని నిజ నిర్ధారణ కూడా జరిగింది. ఈ హదీసు ద్వారా మనిషి మూత్రం అశుద్ధమైనదని రూఢీ అవుతోంది. ఈ విషయంపై ముస్లిం సమాజంలో ఏకాభిప్రాయం ఉంది. నేల ఒకవేళ అశుద్ధమైనదయితే నీళ్ల ద్వారా అది పరిశుభ్రమవుతుందని కూడా ఈ అంశాన్నిబట్టి వెల్లడవుతోంది. ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే మరికొన్ని ముఖ్యాంశాలు : మస్జిద్ ఔన్నత్యాన్ని కాపాడటం, అవివేకి అయిన వ్యక్తిపట్ల మృదువుగా వ్యవహరించటం, కరకుగా వ్యవహరించకపోవటం, సమయోచితంగా వ్యవహరించి దైవప్రవక్త (స) సమస్యను ఉత్తమ రీతిలో పరిష్కరించటం - ఇత్యాది విషయాలు అనుసరణీయమైనవి.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ అనస్ (రజి) దైవప్రవక్త (సఅసం) గారి ప్రత్యేక సేవకులు. ఆయన తల్లి ఉమ్మె సులైమ్ ఆయన్ని బాల్యంలోనే దైవప్రవక్త (స) గారి సేవకై అంకితం చేశారు. చివరి క్షణాల వరకూ ఈయన దైవప్రవక్త (స) సేవలో నిమగ్నులై ఉన్నారు. అబూ హమ్జా (రజి) ఈయనకు గల మరో పేరు. ఖజ్రజ్ తెగకు చెందిన 'నజ్జార్' వర్గానికి చెందినవారు. ఈ కారణంగా ఈయన నజ్జారీ ఖజ్రజీ అని కూడా పిలువబడేవారు. హిజ్రీ 91లో పరమపదించారు. బస్రాలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.

(١١) وعن ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «**أُحِلَّتْ لَنَا مَيْتَتَانِ وَدَمَانِ، فَأَمَّا الْمَيْتَتَانِ فَالْجَرَادُ وَالْحُوتُ، وَأَمَّا الدَّمَانِ فَالْكَبِدُ وَالطِّحَالُ**».

أَخْرَجَهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَفِيهِ ضَعْفٌ.

11. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "రెండు రకాల మృత వస్తువులు (జంతువులు) మరియు రెండు రక్తాలు మన కొరకు హలాల్ (ధర్మ సమ్మతం) గావించబడ్డాయి. (జిబహ్ చేయబడని) ఆ రెండు వస్తువులలో ఒకటి: మిడుత, రెండవది: చేప. మిగిలిన రెండు రక్తాలలో ఒకటి : కాలేయం, రెండవది: గుల్మము" (అహ్మద్, ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖిం చారు. ఇందులో కొంత బలహీనత కానవస్తుంది).

## సారాంశం

'మిడుత' ఎట్టి పరిస్థితిలోనూ హలాల్ (ధర్మ సమ్మతం) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అది సహజ మరణం పొందినా లేక వేరితర కారణంగా మరణించినా దానిని తినటంలో ఎలాంటి ఆక్షేపణ లేదు. మిడుతను మనిషి వేటాడటం వల్ల గానీ, తల తెగటం వల్లగానీ మరణిస్తే హలాల్ అవుతుందనీ, ఇతరత్రా కారణాల వల్ల మరణిస్తే హలాల్ కాజాలదని ఇమామ్ మాలిక్

(రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. చేప విషయంలోనూ అంతే. దాన్ని పట్టుకునే సమయంలో అది మరణించినా, సముద్రపు అలల తాకిడికి తట్టుకోలేక బయటపడి మరణించినా - రెండు పరిస్థితులలోనూ అది ధర్మసమ్మతమే. హనఫీ శాస్త్రం ప్రకారం పై రెండు పరిస్థితుల్లోను చేప ధర్మ సమ్మతమే గానీ, ఒకవేళ చేప దానంతట అదే మరణిస్తే లేక ఏదైనా జంతువు వాతన పడి మరణిస్తే మట్టుకు ధర్మ సమ్మతం కాదు, అది నిషిద్ధం.

(١٢) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسولُ اللهِ ﷺ: «**إِذَا وَقَعَ الذُّبَابُ فِي شَرَابِ أَحَدِكُمْ فَلْيَغْمِسْهُ، ثُمَّ لِيَنْزِعْهُ فَإِنَّ فِي أَحَدِ جَنَاحَيْهِ دَاءً، وَفِي الآخَرِ شِفَاءً**». أَخْرَجَهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ، وَزَادَ: «**وَإِنَّهُ يَتَّقِي بِجَنَاحِهِ الَّذِي فِيْهِ الدَّاءُ**».

12. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీరు త్రాగే పానీయాలలో ఎప్పుడయినా ఈగ గనక పడితే దాన్ని అందులో ముంచి మరీ తీయాలి. ఎందుకంటే దానికి చెందిన ఒక రెక్కలో రోగం (రోగ క్రిములు) ఉండగా రెండవ రెక్కలో రోగ నివారణ ఉంది" (దీనిని బుఖారీ, అబూ దావూద్‌లు ఉల్లేఖించారు). అబూ దావూద్‌లోని ఉల్లేఖనంలో ఒక వాక్యం అదనంగా ఉంది. అది : "ఈగ పానీయంపై వాలినపుడు వ్యాధిక్రిములు వున్న రెక్కనే అందులో ముంచుతుంది."

### సారాంశం

అంటే ఈగ తనను సురక్షితంగా ఉంచుకునే ఉద్దేశ్యంతో వ్యాధి నివారణతో కూడుకున్న రెక్కను నీళ్లలో ముంచకుండా జాగ్రత్తపడుతుంది. ఇమామ్ అహ్మద్ (రజి), ఇబ్నె మాజ (రహ్మ.లై)ల అభిప్రాయంలో ఈగ తన విషపూరితమయిన రెక్కను ముందు వైపు, వ్యాధి నివారణకు ఉద్దేశించిన రెక్కను వెనుకవైపు ఉంచుతుంది. ఈగను ఆ పానీయంలో ముంచి తీయటం వల్ల అది రోగానికి విరుగుడు అవుతుంది. మొదటి రెక్క ద్వారా సోకిన విషపూరిత క్రిములు రెండవ రెక్క యొక్క చికిత్స ద్వారా నిర్వీర్యమవుతాయి.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే ఈగ గనక ఏదైనా ద్రవపదార్థంలో పడి చచ్చిపోయినంత మాత్రాన అది అశుద్ధం కాబోదు. దీనిద్వారా మరో ఆదేశం కూడా వెలికి తీయబడింది. అదేమంటే ప్రసరించే రక్తమే లేని కీటకాలు, ఉదాహరణకు : తేనెటీగ, గండు చీమ, వాటిని పోలిన ఇతరత్రా కీటకాలు గనక పానీయాలలోనూ, ప్రవహించే వాటిలోనూ పడి చచ్చిపోతే ఆ మాత్రానికే అది అశుద్ధమైపోదు. ఎందుకంటే ఇటువంటి వాటి శరీరంలో రక్తం ఉండదు. ఏదైనా వస్తువు అశుద్ధం అవడానికి రక్తస్రావం ప్రధాన కారణం అయి ఉంటుంది.

ఈ హదీసు వల్ల తేటతెల్లమయ్యే మరొక విషయం ఏమిటంటే, నష్టాన్ని నివారించే ఉద్దేశ్యంతో

ఈగను చంపటం సమ్మతమే. అంతేగాని తగు కారణం ఏదీ లేకుండా చంపటం వాంఛనీయం ఎంతమాత్రం కాదు. సాధారణంగా ఈగ వేడి ద్రవపదార్థంలో పడగానే చచ్చిపోతుంది. ఒక్కోసారి చల్లని పానీయాలలో ముంచినా అది చనిపోతుంది. మనం త్రాగే ఏ పదార్థంలో ఈగ పడిపోయినా అది అపవిత్రం, అశుద్ధం కాజాలదు. అట్టి పరిస్థితిలో మనం దానిని ఆ పదార్థంలో ముంచి మరీ బయట పారవేయాలి.

(١٣) وعَنْ أَبِي وَاقِدٍ اللَّيْثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ الله ﷺ: «مَا قُطِعَ مِنَ البَهِيمَةِ، وَهِيَ حَيَّةٌ، فَهُوَ مَيِّتٌ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَاللَّفْظُ لَهُ.

13. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) తెలిపారు : "బ్రతికి ఉన్న పశువులలో నుంచి ఏ భాగం కోసుకున్నా అది మృత భాగమే అవుతుంది." (దీనిని అబూ దావూద్, తిర్మిజీలు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు).

### సారాంశం

పూర్వం అజ్ఞానం ఆవరించిన అరబ్బులు బ్రతికి ఉన్న పశువులలో నుంచి కొంత మాంసాన్ని కోసుకుని తినేవారు. ఈ హదీసు క్రూరాతిక్రూరమైన ఆ చేష్టను ఖండిస్తూ, అది మృత పశువు మాంసంతో సమానమని చెప్పింది. మృత పశువు మాంసం హరామ్ (నిషిద్ధం) అన్నది గమనార్హం.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ వాఖిద్ లైసీ. అబూ వాఖిద్ మారు పేరు. అసలు పేరు హారిస్ బిన్ ఔఫ్. బనీ ఆమిర్ బిన్ లైస్‌కు చెందిన వారవటం చేత లైసీగా పిలువబడేవారు. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. మదీనా వాసులు. కాని తన చివరి కాలంలో మక్కాలో స్థిరపడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారని భావించబడుతోంది. హిజ్రీ 65 లేక 67వ యేట మరణించారు.

### రెండవ అధ్యాయం

## ٢ - بَابُ الآنِيَةِ

## వంటపాత్రలు

(١٤) عَنْ حُذَيْفَةَ بْنِ اليَمَانِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «لاَ تَشْرَبُوا فِي آنِيَةِ الذَّهَبِ وَالفِضَّةِ وَلاَ تَأْكُلُوا

14. హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "బంగారు, వెండి పాత్రలలో తినడం గానీ, త్రాగటంగానీ చేయకండి. ప్రాపం

فِي صِحَافِهَا، فَإِنَّهَا لَهُمْ فِي الدُّنْيَا وَلَكُمْ فِي الآخِرَةِ». مُتَّفَقٌ عَلَيْهِ.

చిక జీవితంలో ఇవి అవిశ్వాసుల కొరకు ఉద్దేశించినవి. పరలోకంలో మాత్రం కేవలం మీకే ప్రత్యేకం."

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

బంగారు, వెండి పాత్రలలో తినటం, త్రాగటం నిషిద్ధమనీ, అటువంటి పాత్రలను వుజూ కొరకు ఉపయోగించటం కూడా వాంఛనీయం కాదనీ ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అయితే వజ్ర వైఢూర్యాలు, పగడాలు పొదగబడిన పాత్రలలో తినటం, త్రాగటం, వాటిని వుజూ కొరకు ఉపయో గించటం ధర్మసమ్మతమే. కాని బంగారు, వెండి నీరు (పూత) పట్టించిన పాత్రల్ని ఉపయోగించే విషయంపై అభిప్రాయ భేదం ఉంది. ఇలాంటి అనుమానాస్పద అంశాలలో సయితం జాగ్రత్తపడటం మంచిది.

### హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ హుజైఫా (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. సుప్రసిద్ధ సహాబీ. దైవప్రవక్త (సఅసం)కు ఎంతో సన్నిహితులు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతినొందిన నలభై రోజులకు ఈయన గారు మదయన్‌లో - హిజ్రీ 36వ సంవత్సరంలో మరణించారు.

(١٥) وعن أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعالَى عَنها قالت: قَالَ رسولُ الله ﷺ: «الَّذِي يَشْرَبُ فِي إِنَاءِ الفِضَّةِ إِنَّمَا يُجَرْجِرُ فِي بَطْنِهِ نَارَ جَهَنَّمَ». مُتَّفَقٌ عَلَيْهِ.

15. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "వెండి పాత్రలలో (తినే) త్రాగేవాడు తన పొట్టను నరకాగ్నితో నింపుకుం టాడు."

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో కూడా బంగారు, వెండి పాత్రలను ఉపయోగించడంపై వారింపు ఉంది. ఈ వారింపును ఖాతరు చేయని వారికి పట్టే గతి ఏమిటో కూడా స్పష్టపరచబడింది.

### హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె సలమా (ర.అ) గారి అసలు పేరు 'హింద్ బిన్తె అబూ ఉమయ్య.' అబూ సలమా అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ అస్వద్ మఖ్జూమీ గారి సతీమణి. అబిసీనియా (నేటి ఇథియోపియా)కు మొదట హిజ్రత్ చేసిన అనుయాయులలో ఈమె కూడా ఉన్నారు. ఉహుద్ సంగ్రామంలో కలిగిన గాయం వల్ల అబూ సలమా మరణించారు. ఆయన మరణానంతరం హిజ్రీ 4వ సంవత్సరం షవ్వాల్ నెలలో మహాప్రవక్త (సఅసం) ఉమ్మె సలమాను తన దాంపత్యంలోకి తెచ్చుకున్నారు. హిజ్రీ 59 లేక 62లో ఈమె మరణించారు. అప్పటికి ఆమెకు 84 ఏళ్లు. జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(١٦) وعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِذَا دُبِغَ الإِهَابُ فَقَدْ طَهُرَ». أَخْرَجَهُ مُسْلِمٌ، وَعِنْدَ الأَرْبَعَةِ «أَيُّمَا إِهَابٍ دُبِغَ».

16. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వివరించారు: "ముడి చర్మాన్ని లవణాలతో రంగరిస్తే (రసాయనిక ప్రక్రియలో పెడితే) అది పరిశుభ్ర మైపోతుంది" (ముస్లిం). సుననె అరబాలో ఈ పదాలు కూడా ఉన్నాయి - "ఏ చర్మమైనా సరే దాన్ని రంగరించవచ్చు)."

## సారాంశం

అన్ని రకాల చర్మాలు, అన్ని కోవలకు చెందిన జంతువుల చర్మాలు ఇందులోకి వస్తాయని హదీసు ద్వారా అర్థం వస్తోంది. అయితే పంది చర్మం మాత్రం దీనికి వర్తించదు. చాలామంది ధర్మవేత్తల దృష్టిలో కుక్క చర్మం కూడా ఈ వినాయింపులోనికి వస్తుంది. ఏ ఏ జంతువుల, మృగాల మాంసం తినకూడదో ఆ చర్మాలు సయితం ఉపయోగంలోనికి తేవచ్చునని పరిశోధన జరిపిన పండితులు నిర్ధారించారు.

హలాల్ జంతువు అయినా, హరామ్ జంతువు అయినా, జిబహ్ చేయబడిన జంతువు అయినా, సహజ మరణం పొందిన జంతువు అయినా రసాయనిక ప్రక్రియ అనంతరం అది పరిశుభ్రమైపోతుందని పై హదీసు ద్వారా స్పష్టంగా అవగతమవుతున్నది. ఈ సాధారణ సూత్రాన్ని అన్వయించిన మీదట కూడా కొన్ని రకాల జంతు చర్మాలు ఉప్పు పట్టించిన తరువాత పరిశుభ్రం మరియు ధర్మ సమ్మతం కాజాలవు. ఉదాహరణకు : పంది. అది 'నజసె ఐన్' (పరమ అశుద్ధం) కావటం మూలంగా దాని చర్మం సయితం అశుద్ధంగానే భావించబడుతోంది. అలాగే మానవ చర్మం కూడా దానికున్న వైశిష్ట్యం, ఔన్నత్యం కారణంగా ఉపయోగంలోకి తేవటం నిషేధించబడింది. తక్బీర్ పలికి కోయబడిన పక్షంలో కుక్క, పంది చర్మాలను కూడా ఉపయోగించవచ్చునని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని ఈ అభిప్రాయం సరైనది కాదు. అలాగే రసాయనిక ప్రక్రియ అనంతరం కుక్క చర్మాన్ని కూడా పరిశుభ్రమైనది (సమ్మతమైనది)గా కొంతమంది ధర్మవేత్తలు భావించటం కూడా సముచితం అనిపించదు.

ఏ ఏ జంతువుల చర్మాలు రసాయనిక ప్రక్రియ అనంతరం పరిశుద్ధమవుతాయో వాటి కొమ్ములు, వెంట్రుకలు, దంతాలు, ఎముకలను కూడా ఉపయోగంలోకి తీసుకురావచ్చు. వాటి క్రయ విక్రయాలు జరపవచ్చు.

(١٧) وعن سَلَمَةَ بْنِ الْمُحَبَّقِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رسولُ الله ﷺ:

17. హజ్రత్ సలమ బిన్ ముహబ్బిఖ్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "మృత జంతువుల చర్మాలను (ఉప్పు తదితర

«دِبَاغُ جُلُودِ المَيْتَةِ طَهُورُهَا». صَحَّحَهُ ابْنُ حِبَّانَ.

పదార్థాలతో) రంగరించటమే వాటి శుచీ శుభ్రత." (ఇబ్నె మాజ దీని ప్రామాణిక తను ధృవీకరించారు).

## హదీసు ఉల్లేఖకులు

సలమగారి వేరొక పేరు అబూ సుఫ్యాన్. బస్రీ సహబీలలో ఒకరుగా పరిగణించబడతారు. ఆయన హునైన్ యుద్ధంలో నిమగ్నులై ఉండగా, ఆయనకు ఆయన పుత్రుడు 'సినాన్' పుట్టాడన్న శుభవార్త ఇవ్వబడింది. ఆ సమయంలో ఆయన ఇలా పలికారు : "ఈ శుభవార్త వల్ల కలిగిన ఆనందం దైవప్రవక్త (సఅసం) కు రక్షాకవచంగా నిలిచి నేను బాణం ప్రయోగించినపుడు కలిగిన ఆనందం కన్నా ఎక్కువేమీ కాదు."

(١٨) وعَنْ مَيْمُونَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَرَّ النَّبِيُّ ﷺ بِشَاةٍ يَجُرُّونَهَا، فَقَالَ: «لَوْ أَخَذْتُمْ إِهَابَهَا» فَقَالُوا: إِنَّهَا مَيْتَةٌ، فَقَالَ: «يُطَهِّرُهَا المَاءُ والقَرَظُ». أَخْرَجَه أَبُو دَاوُدَ وَالنَّسَائِيّ.

18. హజ్రత్ మైమూన (ర.అన్హా) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాగిపోతున్న దారిలో కొంత మంది చనిపోయిన మేకను ఈడ్చు కుంటూ వెళ్ళడం గమనించారు. ఆయన (స) వాళ్ళ నుద్దేశ్యించి, "మీరు దీని చర్మాన్ని వలచుకున్నా బావుండేదే!" అని అన్నారు. 'ఇది చచ్చి పోయింది కదా!' అని వాళ్ళు సందేహ పడ్డారు. "(చచ్చిపోతే మాత్రం ఏమయింది?) దీనిని నీరు మరియు తుమ్మ బెరడు పరిశుభ్రపరుస్తాయి కదా!" అని ఆయన (స) సమాధానమిచ్చారు." (అబూ దావూద్, నసాయి)

## సారాంశం

మృత జంతువుల చర్మాలు రసాయనిక ప్రక్రియ ద్వారా శుభ్రమవుతాయనీ, అటువంటి చర్మాలతో తయారుచేయబడిన వస్తువులు, పాత్రలతో 'వుజూ' సయితం చేయవచ్చుననీ ఈ హదీసు ద్వారానూ, ఇంతకు ముందు వచ్చిన రెండు హదీసుల ద్వారానూ బోధపడుతోంది.

చనిపోయిన చతుష్పాదాల చర్మం వలచి రంగరించినట్లయితే అవి పరిశుభ్రంగా తయారవుతాయి. అటువంటి చర్మాలతో నీళ్లు తోడవచ్చు. నీళ్ళ తిత్తి కూడా తయారుచేయవచ్చు. ఇతరత్రా కూడా వాటిని ఉపయోగించవచ్చు.

(١٩) وعَنْ أَبِي ثَعْلَبَةَ الْخُشَنِيِّ رَضِيَ

19. హజ్రత్ అబూ సాలబ ఖుష్నీ (రజి) కథనం: 'ఓ దైవ ప్రవక్తా (సఅసం)!

اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ إِنَّا بِأَرْضِ قَوْمٍ أَهْلِ كِتَابٍ، أَفَنَأْكُلُ فِي آنِيَتِهِمْ؟ قَالَ: «لاَ تَأْكُلُوا فِيهَا إِلاَّ أَنْ لاَ تَجِدُوا غَيْرَهَا، فَاغْسِلُوهَا، وَكُلُوا فِيهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

మేము గ్రంథవహుల ప్రాంతంలో ఉంటాము. వారు ఉపయోగించే పాత్రలలో మేము భోజనం చేయవచ్చా?' అని నేను ప్రశ్నించాను. దీనికి సమాధానంగా ఆయన (స) ఇలా ప్రబోధించారు: "వారి పాత్రలలో తినకండి. అయితే ఒకవేళ వారి పాత్రలు తప్ప అసలు పాత్రలే లేనపుడు వాటిని శుభ్రంగా కడిగి వాటిలో తినవచ్చు."

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

గ్రంథవహులు - అంటే యూదులు, క్రైస్తవులు - ఉపయోగించే పాత్రలలో తినటం, త్రాగటం, వుజూ చేయడం ధర్మసమ్మతం కాదని ఈ హదీసు సూచిస్తోంది. కారణం సుస్పష్టమే. వాళ్లు ధర్మ సమ్మతం కాని మాంసాహారాలు అందులో వండుతారు. తింటారు. గ్రంథవహుల పాత్రలలో తినటం, త్రాగటమే ధర్మ సమ్మతం కానపుడు ఇతర మతాల వారు, నాస్తికులు ఉపయోగించే పాత్రలలో తినటం, త్రాగటం కూడా ధర్మసమ్మతం కాజాలదు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ సాలబ ఖుష్‌నీ 'బైతె రిజ్వాన్' సహచర బృందంలో ఒకరు. ఆయన తన తెగవారి వైపునకు పంపబడగా వారంతా ఇస్లాం స్వీకరించారు. సిరియాలో స్థిరపడ్డారు. హి.శ. 75వ యేట పరమపదించారు. ఆయన నమాజ్ చేస్తూ ఉండగా - సజ్దాలో ఉండగా - ఆత్మ ఊర్ధ్వలోకాలకు ప్రస్థానం చేసింది. ఈయనగారి అసలు పేరు గురించి తీవ్రమయిన భేదాభిప్రాయం ఉంది. మారు పేరుతోనే వినుతికెక్కారు.

(٢٠) وعَنْ عِمْرانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللهُ تعالى عَنْهُمَا: أَنَّ النَّبِيَّ ﷺ وأَصْحابَه تَوَضَّؤُوا مِن مَزادَةِ امْرَأَةٍ مُشْرِكَةٍ مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيْثٍ طَوِيْلٍ.

20. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహచరులు (ర.అన్‌హుం) ఒక ముష్రిక్కు స్త్రీ నీళ్ల తిత్తి నుండి నీరు తీసుకుని 'వుజూ' చేశారు." (బుఖారీ, ముస్లిం - ఇదొక సుదీర్ఘ హదీసులోని భాగం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా గ్రంథవహుల పాత్రలేగాక, బహుదైవారాధకుల వినియోగంలోనున్న పాత్రలు సయితం పరిశుద్ధమైనవన్న సంగతి విదితమవుతోంది. మృత జంతువు యొక్క చర్మం

రసాయనిక ప్రక్రియ అనంతరం పరిశుద్ధమైపోతుందన్న సంగతి కూడా మరోసారి ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఎందుకంటే ఆయన (స) తీసుకున్న నీళ్లతిత్తి ఒక అవిశ్వాస స్త్రీ అధీనంలోనిది. అవిశ్వాసులు కోసిన జంతువు నుండి తీసిన చర్మంతో ఆ తోలు తిత్తి తయారుచేయబడింది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే అవిశ్వాసులు ఉపయోగించే పాత్రలలో - నిషిద్ధ వస్తువులు లేవని నిర్ధారణ అయినపుడు - నిస్సంకోచంగా వాటిని వాడుకోవచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) అగ్రశ్రేణి సహాబాలో ఒకరుగా పేర్కొనబడతారు. ఈయనకు గల మరో పేరు అబూ నుజీద్. ఖైబర్ యుద్ధకాలంలో ఇస్లాంలో చేరారు. బస్రాలో స్థిరపడ్డారు. బస్రాలోనే హి.శ. 52 లేక 53లో మరణించారు.

(٢١) وعن أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللهُ تعالى عنه: أَنَّ قَدَحَ النَّبِيِّ ﷺ انْكَسَرَ فَاتَّخَذَ مَكَانَ الشَّعْبِ سِلْسِلَةً مِنْ فِضَّةٍ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

21. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) గారి స్వంత పాత్ర ఒకటి విరిగిపోగా, విరిగిన చోట ఆయన (స) వెండి తారుతో కుట్టి అతుకు వేశారు." (బుఖారీ)

### సారాంశం

విరిగిపోయిన, తెగిపోయిన, చినిగిపోయిన వస్తువులను జోడించే నిమిత్తం కొద్దిపాటి వెండి తారును ఉపయోగించటంలో తప్పులేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అదే విధంగా తినే, త్రాగే పాత్రలలో అక్కడక్కడా - కొద్దిగా -వెండి బంగారు నగిషీ ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించవచ్చు. వుజూ, గుసుల్ కోసం కూడా ఆ పాత్రలను నిస్సంకోచంగా వాడుకోవచ్చు. అయితే అధిక మోతాదులో లేక పూర్తిగా బంగారు, వెండి ఉన్న పాత్రలను ఉపయోగించకూడదు. అలా ఉపయోగించటంవల్ల గర్వం, డాబు, దర్పం వ్యక్తమవుతాయి. ఇలాంటి డాబుసరిని, బడాయితనాన్ని సృష్టికర్త ఇష్టపడడు. అందుకే వాటి వాడకం అధర్మంగా ఖరారు చేయబడింది. కాకపోతే విరిగిపోయిన, తెగిపోయిన వాటిని జోడించే, కుట్లువేసే ఉద్దేశ్యంతో తారు ఉపయోగిస్తే అది అభ్యంతరకరం కాదు. అలా చేయటంలో గర్వం, బడాయి వ్యక్తం కావు.

### మూడవ అధ్యాయం

## ٣ - بَابُ إِزَالَةِ النَّجَاسَةِ وَبَيَانِهَا

## మాలిన్యం, దాన్ని దూరం చేసే విధము

(٢٢) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله عنه قَالَ: سُئِلَ رَسُولُ اللهِ ﷺ عَنِ الْخَمْرِ تُتَّخَذُ

22. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) వివరించారు : "సారాయిని పులియబెట్టి 'కాడి' (సిర్కా)ని తయారు చేయటం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

خَلاًّ؟ قال: «لاَ». أَخْرَجَهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَقَالَ حَدِيْثٌ حَسَنٌ صَحِيْحٌ

వ సల్లం)ను దర్యాప్తు చేయగా ఇలా చేయరాదు అని ఆయన (స) నొక్కి పలికారు." (ముస్లిం, తిర్మిజీ. దీన్ని ప్రామాణికమైనదిగా తిర్మిజీ ధృవీకరించారు).

### సారాంశం

మద్యం (షరాబు, సారాయి) ద్వారా తయారుచేసే 'సిర్కా' లేక కాడి నిషిద్ధం (హరామ్) అన్నదానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. అయితే ఈ విషయమై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. వాస్తవానికి ఒక వస్తువు తన యథాస్థితిని కోల్పోతే దానికి సంబంధించిన ఆదేశాలు కూడా మారతాయి. మద్యం గనక తన నిజస్థితిని కోల్పోయి సిర్కాగా మారిపోతే అప్పుడు కూడా నిషిద్ధంగానే పరిగణించబడుతుందా? అన్న విషయంపై ఒక నిర్దిష్టమయిన అభిప్రాయం లేదు. అయితే మద్యాన్ని 'సిర్కా'గా మార్చటాన్ని మాత్రం వారించటం జరిగింది.

ఈ హదీసు యొక్క పూర్వాపరాలు ఇలా ఉన్నాయి - హజ్రత్ అబూ తల్హా (రజి) దగ్గర అనాథల మద్యం అప్పగింతగా ఉండేది. మద్యపానం నిషేధించబడిందన్న దైవాజ్ఞ రాగానే పాపం ఆ అనాథలకు తీవ్రమయిన నష్టం కలుగుతుందికదా! అని ఆయనకు జాలి కలిగింది. ఈ నష్టాన్ని నివారించే ఉద్దేశ్యంతోనే ఆయన దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, మద్యాన్ని సిర్కాగా మార్చేందుకు అనుమతి కోరారు. కాని అలా చేయరాదని దైవప్రవక్త (స) తాకీదు చేశారు. ఇంత స్పష్టంగా వారించిన మీదట కూడా ఎవరయినా మద్యం ద్వారా సిర్కాను తయారుచేయవచ్చని తీర్పు (ఫత్వా) ఇస్తే అతడు ధర్మోపదేశాన్ని ఉల్లంఘించినట్లే లెక్క. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే మద్యానికి సంబంధించిన ఏ రకాన్ని వినియోగించినా, మద్యం నుండి ఎలాంటి ద్రవపదార్థాన్ని వడబోసి తీసినా అది అధర్మమే అవుతుంది.

(٢٣) وعَنْهُ قَالَ: لَمَّا كَانَ يَومُ خَيْبَرَ أَمَرَ رَسُولُ اللهِ ﷺ أَبَا طَلْحَةَ فَنَادَى: أَنَّ اللَّهَ وَرَسُولَهُ يَنْهَيَانِكُمْ عَنْ لُحومِ الْحُمُرِ الأَهْلِيَّةِ، فَإِنَّها رِجْسٌ. مُتَّفَقٌ عَلَيْه.

23. హజ్రత్ అనస్ (రజిఅన్) కథనం : "ఖైబర్ యుద్ధం జరిగిన రోజున దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశానుసారం అబూ తల్హా (రజి) బిగ్గరగా ప్రకటన గావించారు - "పెంపుడు గాడిదల మాంసాన్ని మీరు తినడాన్ని దైవం మరియు దైవప్రవక్త (సఅసం) వారిస్తున్నారు. ఎందుకంటే అవి అశుద్ధమైనవి." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

గాడిద మాంసం హరామ్ (నిషిద్ధం) అనే విషయంలో ఏకాభిప్రాయం ఉంది. కేవలం ఇబ్బె

అబ్బాస్ మాత్రమే దీనిని ధర్మసమ్మతంగా భావిస్తున్నారు. గాడిద ఎంగిలి నలుగురు ఇమాముల దృష్టిలోనూ పరిశుద్ధమైనదే. కొద్దిమంది ధర్మశాస్త్రవేత్తలు మాత్రమే దీనిని అశుద్ధంగా తలపోస్తున్నారు. ఉదాహరణకు : ఇమామ్ హసన్ బస్రీ (రహ్మతుల్లై), ఇమామ్ ఔజాయి (రహ్మతుల్లై) ప్రభృతులు. ఈ వ్యవహారంలో నలుగురు ఇమాముల అభిప్రాయం ఎక్కువ ప్రాధాన్యతతో కూడుకున్నది, అనుసరణీయమైనది.

## హదీసు ఉల్లేఖకులు

పెంపుడు గాడిద మాంసం నిషేధం గురించి ఎలుగెత్తి ప్రకటించిన ప్రవక్త సహచరుడు అబూ తల్హా (రజి). పెద్ద సహాబాల్లో ఒకరు. అబూ తల్హా (రజి) మారు పేరు. అసలు పేరు జైద్ బిన్ సహ్ల్ బిన్ అస్వద్ బిన్ హరామ్ అన్సారీ. అఖబాలో బైత్ (ప్రమాణం) చేసిన వారిలో ఈయన కూడా ఉన్నారు. ముఖ్యమయిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఉహుద్ సంగ్రామంలో దైవప్రవక్త (సఅసం) కు రక్షణగా నిలిచిన సమయంలో చేతికి తీవ్రమయిన గాయం అయింది. హునైన్ యుద్ధంలో 20 మంది శత్రు సైనికులను సంహరించారు. హి.శ. 34లో మరణించారని కొందరూ, 54లో పరమపదించారని మరికొందరూ వాదిస్తున్నారు.

(٢٤) وعن عَمْرو بْنِ خَارِجَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: خَطَبَنَا رَسولُ الله ﷺ بِمِنًى وَهُوَ عَلَى رَاحِلَتِهِ، وَلُعَابُهَا يَسِيْلُ عَلَى كَتِفِي. أَخْرَجَهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ وَصَحَّحَهُ.

24. హజ్రత్ అమ్ర్ బిన్ ఖారిజ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వాహనంపై కూర్చుని 'మినా' ప్రదేశంలో మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగించారు. ఆ సమయంలో ఆ ఒంట నెమరువేయగా దాని నోటి నురుగు నా భుజాలపై పడి ప్రవహించింది." (అహ్మద్, తిర్మిజీ - తిర్మిజీ దీని సత్యతను ధృవీకరించారు)

## సారాంశం

ఏ పశువుల మాంసం తినటం ధర్మసమ్మతమో వాటి నోటి నురుగు కూడా పరిశుద్ధమైనదేననీ, అది శరీరంపై పడినంత మాత్రాన అశుద్ధత ఏర్పడదని ఈ హదీసువల్ల విశదమవుతోంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన అమ్ర్ బిన్ ఖారిజ బిన్ మున్తఫిఖ్ అసదీ అన్సారీ వర్గీయులు. అబూ సుఫ్యాన్‌కు మద్దతుదారులు. అసదీ తెగకు చెందినవారని కూడా ప్రతీతి. ప్రముఖ సహాబీలలో ఒకరు. సిరియాలో స్థిర నివాసమేర్పరచుకున్నారు.

(٢٥) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رسولُ الله ﷺ يَغْسِلُ المَنِيَّ

25. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన లుంగీకి అంటు

ثُمَّ يَخْرُجُ إِلَى الصَّلاَةِ فِي ذَلِكَ الثَّوبِ وَأَنَا أَنْظُرُ إِلَى أَثَرِ الغَسْلِ فِيْهِ. متفق عليه. ولمسلم: «لَقَدْ كُنْتُ أَفْرُكُه مِنْ ثَوبِ رَسولِ اللهِ ﷺ فَرْكاً، فَيُصلِّي فِيْهِ. وَفِي لفظٍ لَهُ: «لَقَد كُنْتُ أَحُكُّهُ يَابِساً بِظُفُرِي مِنْ ثَوْبِهِ».

కుని వున్న వీర్యపు మరకను కడిగేవారు. ఆ వస్త్రాన్నే శుభ్రంగా ఉతికి దాంతో నమాజ్ చేసేవారు. కడిగిన ఆ గుర్తులను, వాటి ప్రభావాన్ని నేను (నా కళ్ళారా) స్పష్టంగా చూసేదానిని."

(బుఖారీ, ముస్లిం)

"నేను దైవప్రవక్త (సఅసం) వస్త్రంపై వున్న వీర్యపు మరకను గీకివేసేదాన్ని. ఆయన ఆ వస్త్రంతోనే నమాజ్ సలిపేవారు" అని ముస్లింలో ఉంది.

ముస్లింలోని మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "వీర్యపు మరక ఆరిపోయిన మీదట నేను ఆ వస్త్రాన్ని నా గోళ్ళతో గీకి తొలగించేదానిని."

**సారాంశం**

రేతస్సు లేక వీర్యపు మరకలను తొలగించడానికి బట్టలను ఉతకటం అనివార్యం కాదని, ఇతరత్రా విధానాల ద్వారా కూడా ఈ మలినాన్ని తొలగించవచ్చుననీ దీనిద్వారా అవగతమవుతోంది. ముఖ్యంగా అది ఆరిపోయినపుడు దాన్ని గీకివేసినా, డ్రైక్లీనింగ్ చేసినా, వేరితర గుడ్డతో తుడిచివేసినా, గరకు గడ్డితో లేక బద్దతో గీకి పారద్రోలినా సరిపోతుంది. ఈ హదీసు వెలుగులో వీర్యపు మరకలను కొంతమంది పండితులు పరిశుద్ధమైనవిగా తలపోశారు. కాని అవి పరిశుద్ధమైనవనడానికి ప్రబల నిదర్శనాలేమీ లేవు. వీర్యపు మరకలను కడిగి, ఉతికి, పిండి, నలిపి పారద్రోలిన ఆధారాలున్నాయని ఆచార్య షౌకానీ (రహ్మ.లై) "నైలుల్ ఔతార్"లో పేర్కొన్నారు. కనుక అత్యధిక హదీసువేత్తల అభిప్రాయం ప్రకారం వీర్యం (రేతస్సు) అశుద్ధమైనదని భావించటమే సరైనది. దానిని తొలగించడానికి పైన సూచించిన పద్ధతులలో ఏదైనా ఒక పద్ధతిని అవలంబించాల్సిందే. అయితే ఆచార్య షౌకానీ (రహ్మ.లై) మాత్రం వీర్యాన్ని పరిశుద్ధమైనదిగా ఖరారు చేయటం విశేషం! ఇది అశుద్ధం అనడానికి మూలాధారం ఏదీ లేదంటారాయన. మొత్తానికి ఈ విషయంలో ఈయన అభిప్రాయం విభిన్నంగా ఉంది.

ఇకపోతే ఈ జిగటుపదార్థం పరిశుభ్రమైనదా లేక అపరిశుభ్రమైనదా? అన్న విషయంలో ఎలాగూ అభిప్రాయభేదం ఏర్పడింది. పురుషాంగం నుండి వెలువడిన జిగటు పదార్థం కూడా నోటి చొంగ మాదిరిగా పరిశుద్ధమైనదేనని ఒక వర్గం వాదించింది. ఈ దృక్పథాన్ని కలిగివున్న వారిలో ఇమామ్ షాఫయి (రహ్మ.లై), దావూద్ జాహిరీ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) ముఖ్యులు. ప్రవక్త సహచరులలో హజ్రత్ అలీ (రజి), హజ్రత్ సాద్ బిన్ వఖాస్ (రజి), హజ్రత్

ఇబ్నె ఉమర్ (రజి), ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా)ల దృక్పథం కూడా ఇదే. రెండవ దృక్పథం కలిగి ఉన్న వారిలో ఇమామ్ మాలిక్ (రహ్మాలై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) ముఖ్యులు. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) దృష్టిలో ఆరిపోయిన వీర్యపు మరకను గీకివేసినట్లయితే అది పరిశుభ్రమైపోతుంది, నీళ్లతోనే కడగవలసిన అవసరం లేదు. ఇరుపక్షాల వారూ తమ తమ దృక్పథాల కనుగుణంగా ప్రబల నిదర్శనాలను చూపుతున్నారు.

వీర్యాన్ని పరిశుద్ధమైనదిగా భావించేవారు చూపే ఆధారం ఇది : "సదరు హదీసులో గీకివేసిన తరువాత వస్త్రాన్ని కడిగినట్లుగా లేదు. అందుచేత ఇది పరిశుద్ధమైనది. ఒకవేళ అది గనక అశుద్ధ మైనదైతే గీకిన తరువాత తప్పక దాన్ని ఉతికి ఆరేసేవారు."

వీర్యాన్ని అశుద్ధమైనదిగా భావించిన వారి ఆధారం చూడండి: "వీర్యంతో కలుషితమైన చోటును నీళ్లతో కడగటమే సమంజసం. ఒకవేళ అదే గనక పరిశుద్ధమై ఉంటే దానిని తొలగించే ప్రస్తావనే వచ్చేది కాదు కదా!"

హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ 'బదాయిల్ ఫవాయిద్' (పేజీ 119 - 126)లో దీన్ని క్షుణ్ణంగా చర్చించారు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన వారు హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా). మహాప్రవక్త (స) మదీనాకు వలసపోక రెండు సంవత్సరాల క్రితమే ఆమెను వివాహమాడారు. హిజ్రీ 1లో ఆమెను తన ఇంటికి పిలిపించుకున్నారు. అప్పటికి ఆమె వయస్సు 9 సంవత్సరాలు. ఆమె ప్రజ్ఞాపాటవాల గురించి వేరుగా చెప్పనవసరం లేదు. హిజ్రీ 58వ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీన మరణించారు. హజ్రత్ అబూ హురైర(రజి) ఆమె జనాజా నమాజ్‌కు సారధ్యం వహించారు. జన్నతుల్ బఖీలో అంత్య క్రియలు జరిగాయి. గొప్ప విద్వాంసురాలు. భారీ సంఖ్యలో హదీసులను ఉల్లేఖించారు. అరబీ కవనంలో మంచి ప్రవేశం ఉండేది. ఆమె పాతివ్రత్యం గురించి ఆకాశం నుండి ప్రకటన గావించబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని నూర్ సూరాలో ఈ వృత్తాంతం ఉంది. దైవప్రవక్త (సఅసం) ఈమెగారి కుటీరంలోనే ఖననం చేయబడ్డారు.

(٢٦) وَعَنْ أَبِي السَّمْحِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يُغْسَلُ مِنْ بَوْلِ الجَارِيَةِ، وَيُرَشُّ مِنْ بَوْلِ الغُلَامِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَه الْحَاكِمُ.

26. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉద్బోధించారని హజ్రత్ అబూ అస్సమహ్ (రజి) చెప్పారు : "ఆడ పిల్ల మూత్రం పోస్తే ఆ వస్త్రాన్ని కడగాలి. మగ పిల్లవాడు మూత్రంపోస్తే నీళ్లు చిలకరించినా చాలు." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీని ప్రామాణికతను గురించి ధృవీకరించారు).

## సారాంశం

ఆడ శిశువు మూత్రం, మగ శిశువు మూత్రం షరీయత్‌పరంగా వేర్వేరు ఆదేశాలు కలిగి ఉన్నాయని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఆడపిల్ల మూత్రం పోసిన వస్త్రాన్ని కడగటమైనా, మగపిల్లవాడు మూత్రం పోసిన వస్త్రంపై నీళ్లు చిలకరించటమైనా - వారిద్దరూ కేవలం పాలు త్రాగినంత కాలమే ఈ వేర్వేరు ఆదేశాలు వర్తిస్తాయి. పాలతోపాటు వేరితర ఆహారపదార్థాన్ని తిన్న రోజు నుండే వారిరువురి మూత్రం ఒకే రకమయిన మలినంగా భావించబడుతుంది. ఆ రోజు నుండీ వారిరువురికీ ఒకే ఆదేశం వర్తిస్తుంది. మగ పిల్లవాని మూత్రంపై నీళ్లు చిలకరించిన కారణంగా ఆ మూత్రం 'పరిశుద్ధమైనద'ని భావం ఎంతమాత్రం కాదు. కాకపోతే హదీసులో మగపిల్లవాని మూత్రాన్ని పారద్రోలే విషయంలో కొంత సడలింపుల వైఖరి కనబరచబడిందంతే.

హదీసు వల్ల తేటతెల్లమయ్యే దేమిటంటే ఆడ శిశువు - మగ శిశువుల మూత్రంలో కించిత్ వ్యత్యాసం ఉంది. పాలు త్రాగే వయస్సులో ఆడపిల్ల మూత్రం మగపిల్లవాని మూత్రంకన్నా ఎక్కువ అశుద్ధమైనదిగా పరిగణించబడింది. ఈ క్షీర గడువు తరువాత వారిరువురిలో ఎలాంటి వ్యత్యాసం లేదు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇబ్నె వహబ్ (రహ్మ.లై), హజ్రత్ అలీ (రజి), హసన్ బస్రీ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై)ల దృష్టిలో మగపిల్లవాని మూత్రంపై నీళ్లు చిలకరిస్తే సరిపోతుంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం కడగటం అవసరమని భావించారు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ అస్సమహ్ మారు పేరనీ, అసలు పేరు ఇయ్యాద్ అనీ భావించబడుతోంది. ఈయన దైవ ప్రవక్త (స) చేత స్వాతంత్ర్యం పొందిన బానిస. దైవప్రవక్త (స) సేవకునిగా ఉన్నారు. అనంతరం ఆయన ఎవరికీ కనబడకుండా పోయారనీ, ఇబ్నె అబ్దుల్ బిర్ చెప్పారు. అందుచేత ఆయన ఎక్కడ, ఎప్పుడు మరణించారో తెలియదు. ఈ ఒక్క హదీసు మాత్రమే ఆయనచేత ఉల్లేఖించబడినది.

(٢٧) وعَنْ أَسْمَاءَ بِنْتِ أَبِي بَكْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي دَمِ الْحَيْضِ يُصِيبُ الثَّوْبَ: «**تَحُتُّهُ، ثُمَّ تَقْرُصُهُ بِالمَاءِ، ثُمَّ تَنْضَحُهُ، ثُمَّ تُصَلِّي فِيهِ**». مُتَّفَقٌ عَلَيهِ.

27. బట్టలకు అంటుకున్న బహిష్టు రక్తం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతూ, "మొదట దాన్ని గీకి శుభ్రం చేయండి. తర్వాత నీళ్ళలో (నాన బెట్టి) కడగండి. ఆ తర్వాత దానిపై బాగా నీరు పోయండి. అనంతరం ఆ వస్త్రాన్ని కట్టుకుని నమాజ్ చేయండి" అని అన్నారని హజ్రత్ అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్‌హా) ఉల్లేఖించారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

గీకటం ద్వారా, నీళ్లలో నానబెట్టడం ద్వారా ఆ వస్త్రం రక్తపు మరకలున్నచోట నీరు బాగా పీల్చు కుంటుంది. ఆ తరువాత ఉతికి ఆరేస్తే మలినం తొందరగా దూరమై వస్త్రం పరిశుభ్రమవు తుంది. కేవలం నీళ్ళలో ముంచి తీయటం వల్ల రక్త ప్రభావం తొలగిపోదు.

ఒకవేళ నీళ్ళలో నానబెట్టి బాగా ఉతికిన మీదట కూడా బహిష్టు రక్తపు మరకలు తొలగకపోతే, అందులో చింతించవలసిన విషయం ఏమీ లేదు. అటువంటి వస్త్రం తొడిగి నమాజ్ చేయటంలో షరీయత్‌పరంగా దోషం ఏమీ లేదు.

### హదీసు ఉల్లేఖకులు

అస్మా బిన్తె అబూ బకర్ (ర.అన్‌హా) దైవప్రవక్త (స) గారి ధర్మపత్ని అయిన హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా)కు అక్క అవుతారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి)కు తల్లిగారు. మక్కాలో విశ్వసించి ఇస్లాం స్వీకరించిన తొలి ముస్లింలలో ఈమె ఒకరు. అనంతరం మదీనాకు వలస వచ్చారు. హిజ్రీ 73లో తన కుమారుడు అబ్దుల్లాహ్ హత్య గావించబడిన నెల రోజులకు - మక్కా నగరంలో - మరణించారు. అప్పటికి ఆమెకు నూరేళ్లు నిండాయి. ఇంతటి వార్ధక్యం పొందినప్పటికీ ఆమె పళ్లు ఊడిపోవటంగానీ, బుద్ధీ వివేకాలలో కించిత్ మార్పు రావటంగానీ జరగకపోవటం విశేషం!

(٢٨) وعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قال: قَالَتْ خَولَةُ: يَا رَسُولَ اللهِ! فَإِن لَمْ يَذْهَبِ الدَّمُ؟ قَالَ: «يَكْفِيكِ الْمَاءُ، وَلاَ يَضُرُّكِ أَثَرُهُ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَسَنَدُهُ ضَعِيفٌ.

28. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: "ఓ దైవప్రవక్తా (సల్లల్లాహు అలైహి వ సల్లం)! (రక్తం పీల్చిన గుడ్డను బాగా నలిపి ఉతికిన పిదప కూడా) రక్తపు మరక చెరగకపోతే ఏం చేయాలి?" అని ఖౌలా (ర.అన్‌హా) విన్నవించుకోగా ఆయన(స) ఇలా బదులిచ్చారు: "చేసేదే ముందీ, బాగా నీరు పొయ్యి. (నీటిలో బాగా జాడించు) అంతే చాలు. ఆ మరకలు నీకు ఎలాంటి హాని కలుగ జెయ్యవు." (ఇమామ్ తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. ప్రామాణికత రీత్యా ఈ హదీసు బలహీనమైనది)

### సారాంశం

మలినాన్ని దూరం చేయడానికి ఉద్దేశ్యించిన విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తే చాలు అది పరిశుద్ధమై పోతుందనీ, ఇంతచేసిన తరువాత కూడా మలిన ప్రభావం కానవస్తే షరీయత్‌పరంగా అందులో ఎలాంటి లొసుగూ లేదని పై హదీసు ద్వారా వ్యక్తమవుతోంది. ఈ హదీసు ముస్లిం అనుచర సమాజానికి అందిన తీరునుబట్టి ధర్మ శాస్త్రవేత్తలు దీనిని 'బలహీనమైన హదీసు'గా

ఖరారు చేశారు. అయితే హదీసులో ప్రస్తావించబడిన అంశంలో మాత్రం ఎలాంటి బలహీనత లేదు.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త ముందు ధర్మ సందేహం వెలిబుచ్చిన ఖౌలా (ర.అ) పూర్తి పేరు ఖౌలా బిన్తె యసార్. ఈమె సుప్రసిద్ధ సహాబియ. అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ గారు ఈమె ఆధారంగా ఈ హదీసును ఉటంకించారు. బహుశా ఈ హదీసును వివరించిన వారు ఖౌలా బిన్తె యమాన్ అయి ఉండవచ్చునని ఇబ్నె అబ్దుల్ బిర్ అనుమానం వ్యక్తపరిచారు. అయితే సంకలనకర్త దీనిని త్రోసిపుచ్చారు.

### 4వ అధ్యాయం

## వుజూ

## ٤ - بَابُ الوُضُوءِ

29. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "నా అనుచర సమాజం గనక కష్టాల్లో పడిపోతుందన్న సంశయం నాకు లేకుండినట్లయితే ప్రతి వుజూ సమయంలో 'మిస్వాక్' చేయాలని ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి" (మాలిక్, అహ్మద్, నసాయి దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీని ప్రామాణికతను ధృవీకరించారు. బుఖారీ దీనిని నకలు చేశారు).

(٢٩) عَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه عن رسول اللهِ ﷺ أَنَّهُ قَالَ: «**لَوْلاَ أَنْ أَشُقَّ عَلَى أُمَّتِي لأَمَرْتُهُمْ بِالسِّوَاكِ مَعَ كُلِّ وُضُوءٍ**». أَخْرَجَهُ مَالِكٌ وَأَحْمَدُ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ، وَذَكَرَهُ الْبُخَارِيُّ تَعْلِيقاً.

### సారాంశం

ఎప్పుడు వుజూ చేసినా మిస్వాక్ చేయటం (పల్లు తోముకోవటం) అభిలషణీయమనీ, ప్రవక్త సంప్రదాయమనీ పై హదీసు చెప్పకనే చెబుతోంది. మిస్వాక్ చేయటం అంటే నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవటం మరియు తమ ప్రభువు ప్రసన్నతను చూరగొనటమేనని 'ముస్లిం' లోనూ, 'అబూ దావూద్'లోనూ లిఖించబడింది. మరో గమనార్హమయిన విషయం ఏమిటంటే మిస్వాక్ చేయటం దైవప్రవక్తలందరి సంప్రదాయం. ముస్నదె ఇమామ్ అహ్మద్, ఇబ్నె ఖుజైమ, హాకిమ్, దారె ఖుత్నీలలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ద్వారా ఈ విధంగా ఉల్లేఖించబడినట్లు ఉంది - "ఏ నమాజ్ అయితే మిస్వాక్ చేసి మరీ చేయబడిందో దాని పుణ్యం మిస్వాక్ చేయబడని నమాజ్ కన్నా డెబ్భయి రెట్లు అధికం." కాని ఈ ఉల్లేఖనం బలహీనమైనది. ఒకవేళ ముందునుంచీ 'వుజూ' ఉంటే, నమాజ్‌కు ముందు మిస్వాక్ చేసుకోవటం మంచిది. తద్వారా ప్రవక్త విధానాన్ని అనుసరించినట్లవుతుంది.

(٣٠) وعَنْ حُمْرَانَ مَوْلَى عُثْمَانَ رضي الله تعالى عنه: أَنَّ عُثْمَانَ دَعَا بِوَضُوءٍ فَغَسَلَ كَفَّيْهِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ تَمَضْمَضَ وَاسْتَنْشَقَ وَاسْتَنْثَرَ، ثُمَّ غَسَلَ وَجْهَهُ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ غَسَلَ يَدَهُ الْيُمْنَى إِلَى الْمِرْفَقِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ الْيُسْرَى مِثْلَ ذَلِكَ، ثُمَّ مَسَحَ بِرَأْسِهِ، ثُمَّ غَسَلَ رِجْلَهُ الْيُمْنَى إِلَى الْكَعْبَيْنِ ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ الْيُسْرَى مِثْلَ ذَلِكَ، ثُمَّ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ تَوَضَّأَ نَحْوَ وُضُوئِيْ هَذَا. مُتَّفَقٌ عَلَيْهِ.

30. హజ్రత్ హుమ్రాన్ మౌలా (రజి) కథనం : "హజ్రత్ ఉస్మాన్ (రజి) వుజూ చేయడానికి నీరు తెప్పించారు. మొదట ఆయన తన అరచేతులను మూడుసార్లు కడిగారు. తరువాత మూడు సార్లు నీరు పుక్కిలించారు. ఆ తరువాత ముక్కులోనికి నీరు పోనిచ్చి, ముక్కు చీది మరీ శుభ్రం చేశారు. పిదప మూడుసార్లు ముఖం కడుక్కున్నారు. అనంతరం తన కుడిచేతిని మోచేతుల వరకు మూడు సార్లు కడిగారు. అలాగే మూడుసార్లు ఎడమ చేతినీ కడిగారు. తరువాత నీళ్లతో తన తలను తుడుచుకున్నారు. (మసహ్ చేశారు). ఆ తరువాత తన కుడి కాలును, ఎడమ కాలును మడమల వరకూ మూడేసి సార్లు కడిగారు. ఆపైన ఆయన ఇలా అన్నారు - 'నేనిప్పుడు ఏ విధంగా వుజూ చేశానో సరిగ్గా అదే విధంగా దైవప్రవక్త (సఅసం) వుజూ చేస్తుండగా చూసివున్నాను."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

సంబంధిత శరీరావయవాలను మూడేసిసార్లు కడగాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. మరో ఉల్లేఖనంలో రెండుసార్లు అని ఉంది. మరికొన్ని ఉల్లేఖనాలలో ఒక్కోసారి కడగాలని ఉంది. ఈ ఉల్లేఖనాలన్నింటినీ క్రోడీకరించిన మీదట హదీసువేత్తలు, ధర్మశాస్త్రవేత్తలు ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. దీనిప్రకారం ప్రతి అవయవాన్ని ఒకసారి కడగటం తప్పనిసరి (వాజిబ్). మూడేసి సార్లు కడగటం సంప్రదాయం (మస్నూన్). రెండేసిసార్లు కడిగినా సరిపోతుంది. ఈ అంశంపై ఇమామ్ నవవీ (రహ్మాలై) అత్యధికుల అభిప్రాయాలను ఉటంకిస్తూ 'ఒకసారి కడగటం వాజిబ్ (తప్పనిసరి)'అని వ్రాశారు.

## హదీసు ఉల్లేఖకుల గురించి

1. ఈ హదీసును ఉల్లేఖించిన హుమ్రాన్ (రజి) పూర్తి పేరు హుమ్రాన్ బిన్ అబాన్. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) పరిపాలనా కాలంలో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఈయన్ని ఒక

యుద్ధఖైదీగా పట్టుకున్నారు. ఆ తరువాత ఈయన ముసైబ్ బిన్ నజబా వాటాలోకి వచ్చారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈయన్ని ముసైబ్ నుండి కొని స్వేచ్ఛనొసగారు. హిజ్రీ 75లో మరణించారు. మరి కొంతమంది హి.శ. 76 అనీ, ఇంకొంతమంది హి.శ. 71 అని కూడా అభిప్రాయపడ్డారు.

2. హదీసు ఉల్లేఖకులలో రెండవ వారు హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి). తృతీయ ధర్మ ఖలీఫా. ఇస్లాంను స్వీకరించిన తొల్దొలి సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) గారి ఇద్దరు ముద్దుల కూతుళ్లు (రుఖియ్య, ఉమ్మె కుల్సూమ్)-ఒకరి తరువాత మరొకరు - ఈయన వైవాహిక జీవితంలోకి వచ్చారు. అందుకే 'జున్నూరైన్' అనే బిరుదుతో కూడా పిలువబడేవారు. శుక్రవారం నాడు వీర మరణం పొందారు. అది హిజ్రీ 35వ సంవత్సరం జిల్ హజ్జ్ 18వ తేదీన జరిగిన సంఘటన! ఇస్లామీయ చరిత్రలో అత్యంత విషాదకరమయిన సంఘటన!!

(٣١) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِيْ صِفَةِ وُضُوءِ النَّبِيِّ ﷺ – قَالَ: وَمَسَحَ بِرَأْسِهِ وَاحِدَةً. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَأَخْرَجَهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ بِإِسْنَادٍ صَحِيحٍ، بَلْ قَالَ التِّرْمِذِيُّ: إِنَّهُ أَصَحُّ شَيْءٍ فِي الْبَابِ.

31. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి వుజూ చేసే విధానాన్ని వివరిస్తూ ఇలా అన్నారు: "ఆయన (స) తన తలను ఒకేసారి మసహ్ చేశారు (తడి చేతులతో తలను తుడుచుకున్నారు)." (అబూ దావూద్, నసాయి, తిర్మిజీలు దీని ప్రామాణికతను ధృవీకరిస్తూ మరీ ఉల్లేఖించారు. ఈ అధ్యాయం క్రింద పేర్కొనబడిన హదీసులలో ఇది అన్నిటికన్నా ఎక్కువ ప్రామాణికమైనదని తిర్మిజీ వ్యాఖ్యానించారు).

## సారాంశం

ఒక్కసారి తలను మసహ్ చేయటమే ఫర్జ్ (విధి) అని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ముస్లిం సమాజానికి చెందిన పండితులందరి అభిమతం కూడా ఇదే. ఒక్క ఇమామ్ షాఫయి (రహ్మ.లై) మాత్రం భిన్నాభిప్రాయం వ్యక్తపరిచారు. ఇతర అవయవాల మాదిరిగా తలను కూడా మూడుసార్లు మసహ్ చేయాలంటారీయన. అబూ దావూద్‌లోని ఒక ఉల్లేఖనాన్ని ఆసరాగా తీసుకుని ఈయన ఈ నిర్ధారణకు వచ్చారు. అయితే సహీహైన్ మరియు సునన్‌లో పేర్కొనబడిన అనేక హదీసుల వెలుగులో ఒకసారి తలను మసహ్ చేయడమే సరైనది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) నాల్గవ ధర్మ ఖలీఫాగా పరిపాలన చేశారు. హజ్రత్ హసన్ (రజి), హుసైన్ (రజి)ల పితామహులు. దైవప్రవక్త (సఅసం) అల్లుడు. బంధుత్వం రీత్యా దైవప్రవక్త గారి పెత్తండ్రి కుమారుడు కూడా అవుతారు. ఒక్క తబూక్

యుద్ధంలో తప్ప దైవప్రవక్త (స) పాల్గొన్న యుద్ధాలన్నింటిలో ఈయన కూడా పాల్గొన్నారు. హి.శ. 35వ సంవత్సరం జిల్ హజ్జ్ 18వ తేదీన ఖిలాఫత్ బాధ్యతలను స్వీకరించారు. హిజ్రీ 40వ యేట రమజాన్ నెల 17వ తేదీన శుక్రవారం ఉదయం కూఫాలో కర్కశుడైన అబ్దుర్రహ్మాన్ బిన్ ముల్జమ్ ఈయనపై దాడిచేసి దారుణంగా హత్య చేశాడు.

(٣٢) وعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدِ بْنِ عَاصِمٍ رضي الله تعالى عنه – فِيْ صِفَةِ الْوُضُوءِ – قَالَ: وَمَسَحَ رَسُولُ اللهِ ﷺ بِرَأْسِهِ فَأَقْبَلَ بِيَدَيْهِ وَأَدْبَرَ. مُتَّفَقٌ عَلَيْهِ.

32. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) 'వుజూ'కు సంబంధించి ఇలా వివరించారు: "దైవప్రవక్త (స) తలకు మసహ్ చేస్తూ తన రెండు చేతులనూ తల ముందు భాగం నుంచి వెనుక భాగం వరకు తీసుకుపోయారు. తిరిగి వెనుక వైపు నుంచి ముందు వైపునకు తీసుకువచ్చారు. (బుఖారీ, ముస్లిం)

وَفِيْ لَفْظٍ لَهُمَا: بَدَأَ بِمُقَدَّمِ رَأْسِهِ حَتَّى ذَهَبَ بِهِمَا إِلَى قَفَاهُ، ثُمَّ رَدَّهُمَا حَتَّى رَجَعَ إِلَى الْمَكَانِ الَّذِيْ بَدَأَ مِنْهُ.

బుఖారీ, ముస్లింలు పొందుపరచిన మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఆయన తల ముందు భాగం నుంచి (మసహ్‌ను) ప్రారంభించి చేతులను తల వెనుక భాగం చివరి వరకు - అంటే మెడ వరకూ తీసుకువెళ్ళారు. అలాగే రెండు చేతులనూ తల వెంట్రుకలకు స్పృశిస్తూ మసహ్ ప్రారంభించిన చోటికి వాపసు తీసుకువచ్చారు."

### సారాంశం

ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే, తలకు చేసే మసహ్ తల ముందు భాగం నుంచి మొదలెట్టాలి. నలుగురు ఇమాముల (ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ షాఫయి) తో పాటు ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే అభిమతం కూడా ఇదే. అయితే తిర్మిజీలో పొందుపరచబడిన ఒక ఉల్లేఖనం ప్రకారం, తలకు చేసే మసహ్‌ను తల వెనుక భాగం నుంచి ప్రారంభించటం కూడా ధర్మసమ్మతమేనని తెలుస్తోంది. దీని ఆధారంగా కూఫా వాసులు చాలా మంది ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. వకీ బిన్ జరాహ్ కూడా వారిలో ఒకరు. అయితే అత్యధికమంది ఇమాములు మరియు హదీసువేత్తలు ఈ ఉల్లేఖనాన్ని ప్రమాణబద్ధమైనదిగా పరిగణించటం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) అన్సార్ వర్గానికి చెందినవారు. అన్సార్‌కు చెందిన తెగ బనీ మాజిన్ బిన్ నజార్ సభ్యులు. ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నారు. యమామ పోరాటంలో వహ్‌షీతో కలసి బూటకపు ప్రవక్తగా అవతరించిన ముసైలమాను సంహరించారు. హిజ్రీ 63లో ఒక యుద్ధంలో అమరగతినొందారు. అబ్దుల్లాహ్ బిన్ జైద్, అంటే స్వప్నంలో అజాన్ పలుకులు విన్న సహాబీ అన్న సందేహం కలుగవచ్చు. కాని ఈయన ఆయన కాదు. ఈయన పేరు అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్. ఆయన పేరు అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహీ. అంటే వీరిద్దరి తాతలు వేర్వేరు వ్యక్తులు అని మరువరాదు. ఇబ్నె అబ్దె రబ్బిహీ ప్రస్తావన అజాన్ సందర్భంగా వస్తుంది (ఇన్‌షాఅల్లాహ్).

(٣٣) وعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رضي الله تعالى عنهما، فِيْ صِفَةِ الْوُضُوءِ قَالَ: ثُمَّ مَسَحَ ﷺ بِرَأْسِهِ وَأَدْخَلَ إِصْبَعَيْهِ السَّبَّاحَتَيْنِ فِيْ أُذُنَيْهِ، وَمَسَحَ بِإِبْهَامَيْهِ عَلَى ظَاهِرِ أُذُنَيْهِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَه ابْنُ خُزَيْمَةَ.

33. వుజూ గురించి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) వివరిస్తూ ఇలా అన్నారు: "ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన తలను మసహ్ చేశారు. అనంతరం తన రెండు చేతుల చూపుడు వ్రేళ్లను చెవులలోనికి జొప్పించారు, ఆపైన బొటన వ్రేళ్లతో చెవుల పై భాగాలను స్పృశించారు." (దీనిని అబూ దావూద్ మరియు నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీన్ని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు).

## సారాంశం

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) చెవుల లోపలి భాగాలను, ఉపరి భాగాలను కూడా తడి చేతులతో స్పృశించారని ఈ హదీసు ద్వారా రుజువు లభిస్తోంది.

## హదీసు ఉల్లేఖకులు

హదీసును ఉల్లేఖించిన సహాబీ పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ బిన్ వాయల్ సహ్మీ ఖురైషీ (రజి). ఆయన తన తండ్రికన్నా ముందే ఇస్లాం స్వీకరించారు. తన తండ్రికన్నా కేవలం 13 ఏండ్ల చిన్నవారు. అగ్రశ్రేణి విద్వాంసులలో ఒకరు. హదీసు సంస్మర్త. నికార్సయిన దైవదాసుడు. పెద్ద సంఖ్యలో ప్రవక్త ప్రవచనాలను ఉల్లేఖించారు. మహాప్రవక్త (స) ఉపదేశాలను ఈయన ఎప్పటికప్పుడు లిఖించేవారు. హిజ్రీ 63 లేదా 70లో పరమపదించారు. అంత్యక్రియలు జరిగిన స్థలం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. మక్కా అని కొందరు, తాయఫ్ అని కొందరు, ఈజిప్ట్ అని కొందరు అభిప్రాయపడ్డారు.

(٣٤) وعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا اسْتَيْقَظَ أَحَدُكُمْ مِنْ مَنَامِهِ فَلْيَسْتَنْثِرْ ثَلاَثاً، فَإِنَّ الشَّيْطَانَ يَبِيتُ عَلَى خَيْشُومِهِ». مُتَّفَقٌ عَلَيْه.

34. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరు నిద్ర మేల్కొన్నా మూడుసార్లు ముక్కు చీది శుభ్రం చేయాలి. ఎందుకంటే షైతాన్ ముక్కు పుటాలపై రాత్రి పూట సైరు చేస్తాడు." (బుఖారీ, ముస్లిం)

(٣٥) وعَنْهُ: «إِذَا اسْتَيْقَظَ أَحَدُكُمْ مِنْ نَوْمِهِ فَلاَ يَغْمِسْ يَدَهُ فِي الإِنَاءِ حَتَّى يَغْسِلَهَا ثَلاَثاً، فَإِنَّهُ لاَ يَدْرِي أَيْنَ بَاتَتْ يَدُهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَهَذَا لَفْظُ مُسْلِمٍ.

35. హజ్రత్ అబూ హురైర (రజి) ద్వారానే ఈ విధంగా కూడా ఉల్లేఖించ బడింది: "మీలో ఎవరు నిద్రనుండి మేల్కొన్నా మూడుసార్లు కడిగేదాకా తమ చేతులను నీళ్ల పాత్రలో ముంచరాదు. ఎందుకంటే రాత్రిపూట చేయి ఎక్క డెక్కడ సంచరించిందో (ఏ ఏ శరీర భాగా లను స్పృశించిందో, ముట్టు కుందో) అతనికి తెలియదు." (బుఖారీ, ముస్లిం-పై హదీసులోని వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి).

**సారాంశం**

ఎవరు రేయింబవళ్ళలో గాఢనిద్ర నుంచి లేచినా వారు నీళ్ల పాత్రలో చేతులను ముంచే ముందు మూడుసార్లు శుభ్రంగా కడుక్కోవటం అభిలషణీయమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఏ సైజు నీళ్ల పాత్ర అయినా సరే ఈ సూత్రమే వర్తిస్తుంది. అయితే కాలువ లేక సరస్సు లాంటి వాటి విషయంలో ఈ సూత్రం వర్తించదు. వాటిలో చేయి ముంచటం ధర్మసమ్మతమే. అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) కూడా 'ఫత్‌హుల్ బారీ'లో ఈ అభిప్రాయాన్నే వెల్లడించారు.

(٣٦) وعَنْ لَقِيطِ بْنِ صَبِرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَسْبِغِ الْوُضُوءَ، وَخَلِّلْ بَيْنَ الأَصَابِعِ، وَبَالِغْ فِي الاسْتِنْشَاقِ إِلاَّ أَنْ تَكُونَ صَائِماً». أَخْرَجَهُ

36. హజ్రత్ లఖీత్ బిన్ సబ్ర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రబోధించారు : "వుజూ సవ్యంగా పూర్తి చేయండి. వ్రేళ్ల మధ్య భాగాలను తడపండి. ముక్కులోనికి సరిగా నీరు ఎక్కించండి. అయితే ఉప

ٱلْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ. وَلِأَبِي دَاوُدَ فِي رِوَايَةٍ: «إِذَا تَوَضَّأْتَ فَمَضْمِضْ».

వాస స్థితిలో మాత్రం ఇలా చేయకండి." (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీని ప్రామాణికతను ధృవీకరించారు). అబూదావూద్‌లోని ఉల్లేఖనంలో ఒక వాక్యం ఈ విధంగా ఉంది: "నీవు వుజూ చేసినపుడు పుక్కిలించు."

### సారాంశం

పై హదీసులో 'ఖిలాల్' అనే పదం వచ్చింది. ఖిలాల్ చేయటం అంటే వుజూ చేస్తున్న సమయంలో చేతుల మరియు కాలి వ్రేళ్ల మధ్య గల భాగాలు తడిసేలా వ్రేళ్లను జొప్పించి మరీ కడగటం అని అర్థం. ఉపవాసమున్నపుడు ముక్కులోనికి చాలా జాగ్రత్తగా నీరు పోనివ్వాలి. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ముక్కుద్వారా నీరు శరీరంలోనికి పోయి ఉపవాసం భంగమయ్యే ప్రమాదముంది.

### హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన లఖీత్ బిన్ సబ్ర (రజి) పూర్తి పేరు లఖీత్ బిన్ సబ్ర బిన్ అబ్దుల్లాహ్ బిన్ ముస్తఫిఖ్ బిన్ ఆమిర్ అల్ ఆమిరీ (రజి). బనీ ముస్తఫిఖ్ బృందానికి సారథిగా ఉన్నారని అనబడుతోంది.

(٣٧) وَعَنْ عُثْمَانَ رضي الله تعالى عنه: أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يُخَلِّلُ لِحْيَتَهُ فِي الْوُضُوءِ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

37. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇలా వివరించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'వుజూ' చేసే సమయంలో తన గడ్డం (లోపలికి చేతి వ్రేళ్లను జొప్పించి) ఖిలాల్ చేసేవారు." (తిర్మిజీ- ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు).

### సారాంశం

మహాప్రవక్త (సఅసం) స్వయంగా గడ్డాన్ని ఖిలాల్ చేసినట్లు ఆధారముంది గనక దీనిని పాటించటం సంప్రదాయం (మస్నూన్). అయితే ఇలా చేయటం తప్పనిసరి (వాజిబ్) మాత్రం కాదు.

(٣٨) وَعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: أَنَّ النَّبِيَّ ﷺ أُتِيَ بِثُلُثَيْ مُدٍّ فَجَعَلَ

38. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో రెండొం

يَدْلُكُ ذِرَاعَيْهِ. أَخْرَجَهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

తుల 'ముద్' నీరు సమర్పించబడగా, ఆయన(స) చేతులను నలుపుతూ వుజూ కోసం ఉపక్రమించారు" (అహ్మద్ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణిక హదీసుగా ధృవీకరించారు).

**సారాంశం**

'ముద్' అనెది అనాటి ఒక కొలమానం. నేటి ఆధునిక పరిభాషలో అది ఆరువందల గ్రాముల బరువుకు సమానం. రెండు వంతుల ముద్ నీటితో మహాప్రవక్త (స) వుజూ చేసినట్లు బుఖారీ, ముస్లింల లోని హదీసులో కూడా ఉంది. వేరొక ఉల్లేఖనంలో ఒక ముద్ నీరు ఉపయోగించినట్లు ఉంది. వుజూ కోసం అనవసరంగా ఎక్కువ నీరు ఉపయోగించరాదనీ, వీలైనంత పొదుపరితనాన్ని పాటించాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

(٣٩) وعَنْهُ: أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ يَأْخُذُ لِأُذُنَيْهِ مَاءً خِلَافَ الْمَاءِ الَّذِيْ أَخَذَهُ لِرَأْسِهِ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَقَالَ: إِسْنَادُهُ صَحِيْحٌ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ أَيْضاً.

39. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) వుజూ చేస్తుండగా ఈయన గమనించారు - ఆయన (స)తలను మసహ్ చేయడానికి తీసుకున్న నీరునుగాక, చెవుల మసహ్ కోసం వేరుగా తీసుకునే వారు. (బైహఖీ దీనిని ఉల్లేఖించడమే గాక, దీని ప్రామాణికతను ధృవీకరించారు. తిర్మిజీ కూడా దీనిని ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించారు).

وَهُوَ عِنْدَ مُسْلِمٍ مِنْ هَذَا الْوَجْهِ بِلَفْظِ: وَمَسَحَ بِرَأْسِهِ بِمَاءٍ غَيْرِ فَضْلِ يَدَيْهِ. وَهُوَ الْمَحْفُوظُ.

ముస్లింలోని ఉల్లేఖనంలో వాక్యం ఇలా ఉంది: "ఆయన (స) తలను మసహ్ చేశారు. కాని ఆ చేతుల్లో నీరు మిగిలి లేదు -" అంటే కొత్తగా నీరు తీసుకుని ఉపయోగించారు. ముస్లింలోని ఈ ఉల్లేఖనమే సురక్షితమైనది."

**సారాంశం**

ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కూడా చెవుల మసహ్ కోసం వేరుగా నీళ్లు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), సుఫియాన్ సౌరీ (రహ్మ.లై)ల

అభిప్రాయం తద్భిన్నంగా ఉంది - "చెవులు కూడా తలకు అనుకునే ఉన్నాయి గనక వాటి 'మసహ్' కోసం మలి సారి నీరు తీసుకోవలసిన అవసరం లేదనీ, మొదటిసారి తీసుకున్న నీరే సరిపోతుంద"నీ వీరిరువురూ భావించారు. అత్యధిక సహీహ్ హదీసులు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి.

(٤٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِنَّ أُمَّتِي يَأْتُونَ يَوْمَ القِيَامَةِ غُرًّا مُحَجَّلِينَ مِنْ أَثَرِ الوُضُوءِ، فَمَنِ اسْتَطَاعَ مِنْكُمْ أَنْ يُطِيلَ غُرَّتَهُ فَلْيَفْعَلْ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

40. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైర (రజి) వివరించారు: "ప్రళయ దినాన నా ఉమ్మత్ (అనుచర సమాజం) ప్రజలు వుజూ కారణంగా తమ కాళ్లు చేతులు మెరిసిపోతున్న స్థితిలో హాజరవుతారు. (కనుక) మీలో ఎవరు ఎంతగా ఈ మెరుపును, వెలుగును పెంచగలుగుతారో అంతగా తప్పక పెంచుకోవాలి సుమా! (బుఖారీ, ముస్లిం - పదాలు మాత్రం ముస్లిం లోనివి).

## సారాంశం

ఈ హదీసు మతలబులు అనేకం కావచ్చు. వాటిలో ఒకటేమంటే, వుజూలోని శరీర భాగాలను నిర్ధారిత హద్దులకు మించి కడగటం. ఉదాహరణకు : చేతులను భుజాల వరకూ, కాళ్లను మోకాళ్ల వరకూ కడగటం. హదీసును ఉల్లేఖించిన అబూ హురైర (రజి) గారు కూడా ఈ మతలబునే గ్రహించి, తదనుగుణంగా ఆచరించేవారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)లు కూడా దీనినే ముస్తహబ్ (అభిలషణీయం)గా భావిస్తున్నారు. కాని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దీనిని అభిలషణీయంగా భావించటం లేదు. వుజూలో ఏ శరీర భాగాలు ఎక్కడి వరకు కడగాలో నిర్ధారితమై ఉండటంచేత అంతకు మించిపోవలసిన అవసరం లేదంటారాయన.

వుజూలోని ప్రతి శరీర భాగాన్ని మూడేసిసార్లు కడగటం మంచిదన్నది మరో మతలబు కావచ్చు. మనిషి వుజూతో ఉండి కూడా పుణ్యార్జన ఉద్దేశ్యంతో తాజాగా వుజూ చేసుకుని ప్రార్థన చేయటం వాంఛనీయం అన్నది ఇంకొక మతలబు అయి ఉండవచ్చు. ఎల్లవేళలా వుజూతో ఉండటం మంచిదన్నది కూడా వేరొక మతలబు కావచ్చు. అయితే ఇవన్నీ అంచనాపై మాత్రమే ఆధారపడి ఉన్నాయని గమనించాలి.

(٤١) وعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ تعالى عنها قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعْجِبُهُ التَّيَمُّنُ فِي تَنَعُّلِهِ وَتَرَجُّلِهِ وَطَهُورِهِ، وَفِي شَأْنِهِ كُلِّهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

41. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పులు తొడిగినా, తల దువ్వుకున్నా, వుజూ చేసినా - ఏ పని చేసినాసరే (కుడి వైపునుంచి మొదలెట్టడాన్ని) ఇష్టపడేవారు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) ప్రతి మంచి పనినీ కుడివైపు నుంచి ప్రారంభించడాన్ని ఇష్టపడేవారు. ఉదాహరణకు : మస్జిద్‌లో అడుగుపెట్టాలన్నా, నమాజ్ ముగించిన తరువాత సలాం చేయాలన్నా, వుజూ చేసే సమయంలో వివిధ శరీరావయవాలను కడగటమైనా, కరచాలనం చేయాలన్నా, భోజనం చేయాలన్నా, పాలు పితకాలన్నా, చొక్కా ధరించాలన్నా, కళ్ళల్లో సుర్మా పూసుకునేటప్పుడైనా, మిస్వాక్ చేసేటప్పుడయినా - కుడి చేత్తో చేయటం, కుడివైపు నుంచి మొదలెట్టడం ఆయన (స) సంప్రదాయం అయి ఉండేది. కాని నేటి ఆధునిక యుగపు ముస్లిం ఎంతో విలువైన ఈ విషయాలను విస్మరించి అన్యులను అనుకరిస్తున్నాడు. పాశ్చాత్యుల ప్రభావానికి లోనై కుడి బదులు ఎడమ వైపునకు మొగ్గు చూపుతున్నాడు. ఇదెంతో శోచనీయం.

(٤٢) وعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا تَوَضَّأْتُمْ فَابْدَءُوا بِمَيَامِنِكُمْ**». أَخْرَجَهُ الْأَرْبَعَةُ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

42. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీరు వుజూ చేయడానికి ఉపక్రమించినపుడు కుడి వైపు నుంచి మొదలెట్టండి." (దీనిని అబూ దావూద్, నసాయి, తిర్మిజీ మరియు ఇబ్నె మాజాలు నలుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రమాణబద్ధమైనదని ఖరారు చేశారు).

### సారాంశం

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యే దేమిటంటే, ఆయన(స)కు కుడివైపే అత్యంత ఇష్టకరమయినది, ప్రియమైనది. ఆయన (స) స్వయంగా దీనిని ఆచరించటమేగాక, తన అనుచర సమాజాన్ని కూడా కుడి వైపునుంచి ఆరంభించండని ఆదేశించారు.

(٤٣) وعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رضي الله تعالى عنه، أَنَّ النَّبِيَّ ﷺ تَوَضَّأَ فَمَسَحَ بِنَاصِيَتِهِ

43. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వుజూ చేసినపుడు తన నుదుటి జుత్తుపై, తల పాగాపై, మేజోళ్లపై

وَعَلَى الْعِمَامَةِ وَالْخُفَّيْنِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

మసహ్ చేశారని హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తెలిపారు. (ముస్లిం)

### సారాంశం

కేవలం నుదుటిపై మసహ్ చేయటం వల్ల తల భాగపు మసహ్ సంపూర్ణం కాజాలదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. కేవలం తల పాగాపై మసహ్ చేసినా సరిపోదని చాలామంది ఇమాములు అభిప్రాయపడ్డారు. అయితే అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ "జుల్‌మిఆద్" లో ఇలా విశదీకరించారు: "ఆయన (స) ఒక్కొక్కప్పుడు కేవలం నగ్న తలపై మసహ్ చేసేవారు. ఒక్కోసారి తలపాగాపై మసహ్ చేసేవారు. ఒక్కోసారి తలపాగా మరియు నుదురు - రెంటిపై మసహ్ చేసేవారు. ఆయన (స) కేవలం నుదుటిపై మసహ్ చేసినట్లు ఏ ఆధారమూ లేదు.

మేజోళ్లపై మసహ్ చేయటం ధర్మసమ్మతమని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. తలపాగాపై మసహ్ చేయటం కూడా సరైనదేనని తెలియవస్తోంది. ఇది రెండు విధాలుగా సరైనది కావచ్చు. ఒకటి: కొంత మసహ్ తలపై చేసి మరికొంత తలపాగాపై చేయాలి. ఇందులో భేదాభిప్రాయం లేదు. రెండు: కేవలం తలపాగాపై మసహ్ చేయటం. తిర్మిజీలోని ఒక సహీహ్ హదీసు ద్వారా కూడా ఇది రూఢీ అవుతోంది. ప్రవక్త సహచరులలోని కొందరు ప్రముఖులు, ఇమాములు కూడా ఈ విధానాన్ని సమర్థించినట్లు తెలుస్తోంది. అలాంటివారిలో కొందరు ప్రముఖులు : హజ్రత్ అబూబకర్ (రజి), ఉమర్ (రజి), అనస్ (రజి), ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ.లై), హసన్ బస్రీ (రహ్మ.లై), మక్‌హూల్ (రహ్మ.లై), అబూసూర్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఔజాయి (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై), వకీ (రహ్మ.లై) మొదలగువారు. మిగిలిన ప్రముఖ ఇమాములు, కేవలం తలపాగాపై మసహ్ చేస్తే సరిపోదని భావిస్తున్నారు.

### హదీసు ఉల్లేఖకులు

ఈయన (ముగీరా బిన్ షూబ - రజి) కు గల మరో పేరు అబూ అబ్దుల్లాహ్ లేక అబూ ఈసా. వంశవృక్షం ప్రకారం ముగీరా బిన్ షూబ బిన్ మస్‌వూద్ సఖఫీ అనబడతారు. సుప్రసిద్ధ సహబీలలో ఒకరు. కందక యుద్ధం జరిగే రోజుల్లో ఇస్లాం స్వీకరించారు. హిజ్రత్ చేసి మదీనా వచ్చారు. హుదైబియా ఒప్పందంలో పాల్గొన్నారు. ఆయన పాల్గొన్న మొదటి యుద్ధం అదే. అమీర్ ముఆవియ (రజి) తరపున కూఫా గవర్నర్‌గా నియమితులయ్యారు. హిజ్రీ 50వ సంవత్సరంలో కూఫాలోనే కన్నుమూశారు.

(٤٤) وعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رضي الله تعالى عنهما – فِيْ صِفَةِ حَجِّ النَّبِيِّ ﷺ – قَالَ ﷺ: «اِبْدَءُوا بِمَا بَدَأَ اللّٰهُ بِهِ». أَخْرَجَهُ

44. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి హజ్ విధానాన్ని వివరిస్తూ చెప్పారు - దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు : "అల్లాహ్ ఆరంభించినట్లుగానే ఆరంభించండి."

(నసాయి 'ఆరంభించండి' అని ఉల్లేఖించారు. కాగా, ఇమామ్ ముస్లిం 'మేము ఆరంభిస్తున్నాం' అని పేర్కొన్నారు).

النَّسَائِيُّ هَكَذَا بِلَفْظِ ٱلْأَمْرِ، وَهُوَ عِنْدَ مُسْلِمٍ بِلَفْظِ ٱلْخَبَرِ.

## సారాంశం

రచయిత ఈ హదీసును 'వుజూ' అధ్యాయంలో తీసుకొని వుజూ పరిధిలోనికి వచ్చే శరీరావయవాలను కడిగేటప్పుడు కూడా క్రమపద్ధతిని అవలంబించాలని చెప్పదలిచారు. ఏ శరీర భాగాన్ని మొదట కడగాలని ఖుర్ఆన్‌లో ఆదేశించబడిందో ఆ శరీర భాగాన్నే మొదట కడగాలి. దివ్యఖుర్ఆన్ హజ్ ఆచారాలను గురించి చెబుతూ 'ఇన్నస్సఫా వల్ మర్వత' అని అన్నది. అంటే హజ్‌లో ఒక ముఖ్య అంశమైన 'సయీ' సఫా పర్వతం వద్ద నుంచి మొదలెట్టాలని భావం.

అలాగే వుజూకు సంబంధించిన ఖుర్ఆన్ వాక్యంలో తొలుత ముఖం కడగాలని ఉంది. ఆ తరువాత ఇతర శరీర భాగాల ప్రస్తావన వస్తుంది. కాబట్టి 'వుజూ' కూడా దైవాదేశానికనుగుణంగా - సూచించబడిన క్రమ పద్ధతి ప్రకారం - చేయాలని హదీసు చెబుతోంది.

(మొదట ముఖం కడగటంతో వుజూ ప్రారంభించాలన్న వాక్యం చదివి సందేహానికి లోను కావలసిన అవసరం లేదు. వుజూలోని 'ఫరాయజ్‌ల' ప్రస్తావన మాత్రమే ఇక్కడ వచ్చిందిసుమా!) - అనువాదకుడు

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. అన్సార్‌కు చెందిన 'నులమ్' అనే తెగకు చెందిన వారవటంచేత 'అన్సారీ నులమీ' గా వ్యవహరించబడ్డారు. ప్రముఖ సహచరులలో ఒకరుగా పేరు మోసారు. వార్ధక్యంలో కంటిచూపు పోయింది. హిజ్రీ 75లో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 94. ఈయన మదీనా మునవ్వరాలో పరమపదించిన ఆఖరి సహాబి అని అనబడుతోంది.

(٤٥) وعَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا تَوَضَّأَ أَدَارَ الْمَاءَ عَلَى مِرْفَقَيْهِ. أَخْرَجَهُ الدَّارَقُطْنِي بِإِسْنَادٍ ضَعِيفٍ.

45. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వుజూ చేస్తున్నపుడు తమ మోచేతులపై బాగా నీరు పోసేవారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఈ హదీసు ప్రామాణికత రీత్యా బలహీనమైనది).

(٤٦) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ وُضُوءَ

46. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "వుజూ ఆరంభి

لِمَنْ لَمْ يَذْكُرِ اسْمَ اللَّهِ عَلَيْهِ». أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَه بِإِسْنَادٍ ضَعِيْف. وَالتِّرْمِذِيُّ عَنْ سَعِيْدِ بْنِ زَيْدٍ وَأَبِي سَعِيْدٍ نَحْوَهُ. وَقَالَ أَحْمَدُ: لاَ يَثْبُتُ فِيْهِ شَيْءٌ.

స్తున్న సమయంలో 'బిస్మిల్లాహ్' పఠించని వాని వుజూ కాదు." (ఈ హదీసును అహ్మద్, అబూ దావూద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. కాని దీన్ని వివరించిన తీరు మాత్రం బలహీనమైనది. తిర్మిజీ గారు ఈ హదీసును సయీద్ బిన్ జైద్ నుండి సంగ్రహించారు. అబూ సయీద్ నుండి కూడా ఇదేవిధంగా సేకరించారు. దీని గురించి ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై) ఇలా పలికారు: "ఈ విషయమై ఏదీ రుజువు కాలేదు").

### సారాంశం

ముగ్గురు ఇమాముల దృష్టిలో వుజూ చేసేముందు "బిస్మిల్లాహ్" పఠించటం మస్నూన్ (సంప్రదాయం). ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై), దావూద్ జాహిరీల అభిప్రాయంలో వుజూకు ముందు 'బిస్మిల్లాహ్' చదవటం వాజిబ్ (తప్పనిసరి). ఉద్దేశ్యపూర్వకంగా బిస్మిల్లాహ్‌ను విడనాడిన వ్యక్తి వుజూ చేసినా అది వుజూ కాదు అని ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే నొక్కి వక్కాణించారు.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందించిన సయీద్ బిన్ జైద్ (రజి) పూర్తి పేరు - సయీద్ బిన్ జైద్ బిన్ అమ్ర్ బిన్ నఫీల్ అల్ అద్వి అల్ ఖురైషీ. అబుల్ ఆవర్ మరో పేరు. దైవప్రవక్త (సఅసం) నోట ప్రపంచంలోనే స్వర్గలోకపు శుభ వార్తను విన్న పదిమంది ప్రియసహచరులలో ఈయన ఒకరు. ఇస్లాంను స్వీకరించిన ప్రథమశ్రేణి సహచరులలో ఈయన కూడా ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) గారి తోబుట్టువు ఫాతిమ బిన్తె ఖత్తాబ్ (ర.అన్‌హా) ఈయన సతీమణి. ఈ దంపతులు హజ్రత్ ఉమర్ (రజి)ను ఇస్లాం వైపునకు మరల్చటంలో కీలక పాత్ర పోషించారు. బద్ర్ సంగ్రామంతోపాటు, దైవప్రవక్త (స) పాల్గొన్న మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. హిజ్రీ 51లో మరణించారు. జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٤٧) وعَنْ طَلْحَةَ بْنِ مُصَرِّف عَنْ أَبِيْهِ عَنْ جَدِّهِ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَفْصِلُ

47. హజ్రత్ తల్హా బిన్ ముసర్రిఫ్ (రహ్మ.లై) తన తండ్రి గారి నుండి, ఆయన తన తాత గారినుండి ఉటంకించారు : "నేను దైవప్రవక్త (సఅసం) గారిని నా కళ్లారా చూశాను. ఆయన (స) పుక్కిలించడం కోసం, ముక్కులోనికి నీరు ప్రవేశింపజేయటం కోసం వేర్వే

بَيْنَ الْمَضْمَضَةِ وَالْاِسْتِنْشَاقِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

రుగా నీరు తీసుకునేవారు." (ఈ ఉల్లేఖనాన్ని అబూదావూద్ బలహీనమైన ఆధారాలతో పొందుపరిచారు).

### సారాంశం

ఈ హదీసు ద్వారా పుక్కిలించటం కోసం, ముక్కు కోసం వేర్వేరుగా నీరు తీసుకోవచ్చని వెల్లడవుతోంది. ప్రామాణికత రీత్యా రచయిత ఈ హదీసును బలహీనమైనదిగా ఖరారు చేశారు. దీనికి భిన్నంగా బుఖారీ, ముస్లింలలో వచ్చిన హదీసులలో దైవప్రవక్త (సఅసం) ఒకేసారి చేతిలో నీళ్లు తీసుకుని పుక్కిలించటం, ముక్కులోనికి నీరు ఎక్కించటం చేసేవారు. రాబోయే హదీసులలో ఈ ప్రస్తావనను గమనించగలరు.

### హదీసు ఉల్లేఖకులు

తల్హా బిన్ ముసర్రిఫ్ (రహ్మలై) గారి మరోపేరు అబూ ముహమ్మద్. ప్రవక్తగారి ప్రశిష్యుల (తాబయీల)లోనివారు. మేధావి వర్గానికి చెందినవారు. మధురాతి మధురంగా ఖుర్‌ఆన్‌ను పఠించేవారు. జ్ఞాని. హిజ్రీ 112లో కన్నుమూశారు.

(٤٨) وعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ – فِي صِفَةِ الْوُضُوءِ –: ثُمَّ تَمَضْمَضَ ﷺ وَاسْتَنْثَرَ ثَلَاثًا، يُمَضْمِضُ وَيَنْثُرُ مِنَ الْكَفِّ الَّذِيْ يَأْخُذُ مِنْهُ الْمَاءَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

48. హజ్రత్ అలీ (రజి) గారిచే వుజూ గురించి వివరించబడిన హదీసు : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడుసార్లు పుక్కిలించారు. ముక్కులోనికి నీరు ఎక్కించారు. ఆయన (స) ఏ చేత్తో నీరు తీసుకున్నారో ఆ చేత్తోటే పుక్కిలించటం, ముక్కులోనికి నీరు పోయటం చేశారు." (అబూదావూద్, నసాయి).

### సారాంశం

ఒకేసారి చేత్తో తీసుకున్న నీరును పుక్కిలించడానికి, ముక్కులోనికి పోయడానికీ ఉపయోగించవచ్చునని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఈ పనిని దైవప్రవక్త (స) మూడుసార్లు చేసేవారని కూడా తెలుస్తోంది. కుడిచేత్తో నోటిలో, ముక్కులో నీరు పోసేవారనీ, ఎడమచేత్తో ముక్కును పట్టి చీదేవారని నసాయిలో క్షుణ్ణంగా వివరించబడింది.

(٤٩) وعَنْ عَبْدِ اللّٰهِ بْنِ زَيْدٍ رضي الله تعالى عنه – فِيْ صِفَةِ الْوُضُوءِ –: ثُمَّ أَدْخَلَ

49. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) వుజూ గురించి ఇలా వివరించారు : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిలో నీరు తీసుకున్నారు. తరువాత పుక్కిలించారు, ఆ తరువాత

ﷺ يَدَهُ فَمَضْمَضَ وَاسْتَنْشَقَ مِنْ كَفٍّ وَاحِدٍ، يَفْعَلُ ذَلِكَ ثَلاَثًا. مُتَّفَقٌ عَلَيْهِ.

ముక్కు లోనికి నీరు ఎక్కించారు. ఒకే చేతిలో ఉన్న నీటితో ఆయన మూడు సార్లు ఈ విధంగా ఆచరించారు.''

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పై రెండు హదీసులు కూడా పుక్కిలించడానికీ, ముక్కులోకి నీరు పోయడానికి ఒకేసారి చేత్తో తీసుకున్న నీరు సరిపోతుందని వెల్లడిస్తున్నాయి. పైగా ఇది అత్యంత పొదుపుతో కూడుకున్న విధానం కూడా. అయితే తల్హా బిన్ ముసర్రిఫ్ పేర్కొన్న హదీసు వేర్వేరుగా నీరు తీసుకోవాలని కోరుతున్నది. కాని అది వివరించబడిన తీరునుబట్టి బలహీనమైన హదీసుగా ఖరారు చేయబడింది. ఈ నేపథ్యంలో విజ్ఞులైన పండితులు వెల్లడించిన అభిప్రాయం ప్రకారం రెండింటిలో ఏ విధానాన్ని అనుసరించినా అది మస్నూన్ (ప్రవక్త విధానం) గానే పరిగణించబడుతుంది. అయితే ''ఒకేసారి తీసుకున్న నీటితో పుక్కిలించటం, ముక్కులోనికి నీరు ఎక్కించటం'' అన్న హదీసు ఎక్కువ ప్రామాణికమైనది. ప్రామాణిక మైన హదీసుకు ప్రాధాన్యత నివ్వటం సమంజసం కూడా.

(٥٠) وَعَنْ أَنَسٍ رضي الله تعالى عنه قَالَ: رَأَى النَّبِيُّ ﷺ رَجُلاً وَفِي قَدَمِهِ مِثْلَ الظُّفْرِ لَمْ يُصِبْهُ الْمَاءُ، فَقَالَ: «**ارْجِعْ فَأَحْسِنْ وُضُوءَكَ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

50. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి దృష్టి ఒక వ్యక్తిపై పడింది. అతని కాలిపై గోరంత భాగం నీటితో తడవ లేదు. ఆయన (స) ఆ వ్యక్తినుద్దేశ్యించి, ''వెళ్లి ఉత్తమ రీతిలో వుజూ చేసి రా'' అని ఆదేశించారు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు).

## సారాంశం

నిర్ణీత కాళ్ల భాగాన్ని పూర్తిగా తడిసేలా కడగాలని ఈ హదీసు స్పష్టం చేస్తున్నది. కాలిపై ఎంతభాగం తడవలేదో అంతవరకూ అది అగ్నికి ఆహుతి అవుతుందని ముస్లిం ఉల్లేఖించిన మరో హదీసులో హెచ్చరించబడింది. అబూ దావూద్‌లో ఖాలిద్ బిన్ మాదాన్ (రజి) చేత ఉల్లేఖించబడిన ఒక హదీసులో దాదాపు ఇదే భావం వ్యక్తమవుతుంది. ఆ హదీసు ప్రకారం; ఒక వ్యక్తి నమాజ్ చేస్తుండగా అతనిపై ప్రవక్త (స) గారి దృష్టిపడింది. అతని అడుగు వెనుక భాగాన నీటితో తడవని కొద్ది భాగం స్పష్టంగా - ఒక మచ్చలాగా - కనిపించింది. 'తాజాగా వుజూచేసి, ఆ తర్వాత నమాజ్ చేయి' అని దైవప్రవక్త ఆ వ్యక్తిని ఆజ్ఞాపించారు. ఈ హదీసు ద్వారానూ, ఈ శీర్షిక క్రిందికి వచ్చే ఇతర హదీసుల ద్వారాను అవగతమయ్యేదేమిటంటే, వుజూలో కాళ్లను కడగటం విధి (ఫర్జ్). కేవలం మసహ్ చేస్తే సరిపోదు. ఈ హదీసుల వెలుగులోనే నలుగురు ఇమాములు మరియు ధర్మశాస్త్రవేత్తలు కాళ్లను విధిగా కడగాల్సిందేనన్న విషయంపై ఏకాభిప్రాయం వెలిబుచ్చారు.

(٥١) وعَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَتَوَضَّأُ بِالْمُدِّ، وَيَغْتَسِلُ بِالصَّاعِ إِلَى خَمْسَةِ أَمْدَادٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

51. హజ్రత్ అనస్ (రజి) గారి చేతనే ఉల్లేఖించబడిన మరో హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక 'ముద్' నీటితో వుజూ చేసేవారు. ఒక 'సా'-అంటే నాలుగైదు ముద్‌ల నీటి తో స్నానం చేసేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

వుజూ కోసమయినా, స్నానం (గుసుల్) కోసమయినా వీలయినంత తక్కువగా నీరును ఉపయోగించాలనీ, నీటిని దుర్వినియోగం చేయరాదనీ ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. అనవసరంగా నీటిని పారబోయటం షరీయత్ దృష్టిలో వాంఛనీయం కాదు.

హదీసులో ప్రస్తావించబడిన 'సా' అంటే నేటి ఆధునిక పరిభాషలో అది సుమారు రెండున్నర కిలో గ్రాములకు సరిసమానమవుతుంది.

ముస్లింలోని హదీసులో ఒక 'ఫర్ఖ్' నీళ్లతో దైవప్రవక్త (స) స్నానం ముగించేవారని ఉంది. 'ఫర్ఖ్' ఆనాడు ఉపయోగంలో వున్న ఒక పాత్ర. అందులో సుమారు 9 సేర్ల నీరు పడుతుంది. ఒక 'ఫర్ఖ్' నీళ్లను దైవప్రవక్త మరియు హజ్రత్ ఆయిషా (ర.అ) - ఇద్దరూ స్నానం కోసం సరిపెట్టుకునేవారని వేరొక ఉల్లేఖనం ద్వారా విదితమవుతుంది.

ఈ హదీసుల వెలుగులో నీటి పరిమాణాన్ని నిర్ధారించటం అసలు ఉద్దేశ్యం కాదనీ, దైవప్రవక్త (స) వారు ఇన్ని నీళ్లతో స్నానం ముగించేవారని తెలియజెప్పటమే అసలు ఉద్దేశ్యమనీ ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) వ్యాఖ్యానించారు.

(٥٢) وعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مِنْكُمْ مِنْ أَحَدٍ يَتَوَضَّأُ فَيُسْبِغُ الْوُضُوءَ، ثُمَّ يَقُولُ: أَشْهَدُ أَنْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ لاَ شَرِيكَ لَهُ، وأَشْهَدُ أَنَّ مُحَمَّداً عَبْدُهُ وَرَسُولُهُ، إِلاَّ فُتِحَتْ لَهُ أَبْوَابُ الجَنَّةِ». أَخْرَجَهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَزَادَ: «اللَّهُمَّ اجْعَلْنِي مِنَ التَّوَّابِينَ وَاجْعَلْنِي مِنَ الْمُتَطَهِّرِينَ».

52. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు : "మీలో ఎవరు వుజూ చేస్తాడో మరియు ఉత్తమ రీతిలో వుజూ చేసి -'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడనీ, ఆయన అద్వితీయుడనీ, ఆయనకు సహవర్తులెవరూ లేరనీ, నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ (సఅసం) ఆయన దాసులనీ, ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలుకుతాడో అతని కొరకు స్వర్గం యొక్క ఎనిమిది ద్వారాలూ తెరువబడ

తాయి. ఇక అతను ఏ ద్వారం గుండా నయినా స్వర్గంలోనికి ప్రవేశించవచ్చు.'' (ముస్లిం, తిర్మిజీ). తిర్మిజీలో ''ఓ దేవా! నన్ను పశ్చాత్తాపం చెందేవారిలో, పరిశుభ్రంగా ఉండేవారిలో చేర్చు'' అన్న వాక్యం అదనంగా ఉంది.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉమర్ (రజి) గారి పూర్తి పేరు - ఉమర్ బిన్ ఖత్తాబ్ బిన్ నఫీల్ బిన్ అబ్దుల్ ఉజ్జా (రజి). 'అబూ హఫస్' అనేది మరోపేరు. ఈయనది విశిష్టమైన వ్యక్తిత్వం. రెండవ ధర్మ ఖలీఫాగా పరిపాలన చేశారు. భూమండలాన్ని న్యాయం, ధర్మం, విజయాలతో పులకింపజేశారు. అజ్ఞానకాలంలో ఖురైష్ తెగకు ప్రతినిధిగా ఉండేవారు. దైవదౌత్యం అందిన 6వ యేట దైవప్రవక్త (స) చేతుల మీదుగా ప్రమాణం చేసి ఇస్లాం స్వీకరించారు. ఈయన ఇస్లాం స్వీకారంలో, ఈయన బావగారైన సయీద్ (రజి), సోదరి అయిన ఫాతిమా బిన్తె ఖత్తాబ్ (ర.అన్హా) కీలకపాత్ర వహించారు. ఒక్క తబూక్ పోరాటం తప్ప మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఈయన ఖిలాఫత్ కాలంలో ఇస్లాం విజయపరంపర కొనసాగింది. ఇరాక్, ఈరాన్, సిరియా, ఈజిప్టు తదితర ప్రాంతాలు ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చేశాయి. ముగీరా బిన్ షూబ (రజి) గారి బానిస అయిన అబూ లూలూ దాడి చేసి ఆయన్ని తీవ్రంగా గాయపరిచాడు. ఆ బాధతోనే ఆయన అమరగతినొందారు.ఈ సంఘటన హిజ్రీ 24వ సంవత్సరం ముహర్రం నెలలో జరిగింది.

### 5వ అధ్యాయం

## ٥ - بَابُ الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ

## మేజోళ్ళపై మసహ్ చేయటం

(٥٣) عَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَتَوَضَّأَ فَأَهْوَيْتُ لِأَنْزِعَ خُفَّيْهِ، فَقَالَ: «دَعْهُمَا فَإِنِّي أَدْخَلْتُهُمَا طَاهِرَتَيْنِ» فَمَسَحَ عَلَيْهِمَا. مُتَّفَقٌ عَلَيْهِ.

53. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తెలిపారు : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాను. ఆయన (స) వుజూ కోసం ఉపక్రమించగానే నేను ఆయన మేజోళ్లను తీయడానికి ముందుకొచ్చాను. అప్పుడాయన (స) ఇలా పలికారు : ''వదులు. నేను మేజోళ్లు తొడిగినప్పుడు వుజూతో ఉన్నాను.'' ఆ తరువాత ఆయన (సఅసం) వాటిపై మసహ్ చేశారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే వుజూ చేసివున్న స్థితిలో మేజోళ్లు తొడిగి ఉంటేనే వాటిపై మసహ్ చేయటం ధర్మసమ్మతం అవుతుంది. ఈ సంఘటన తబూక్ యుద్ధ సందర్భంగా ఫజ్ర్ నమాజ్ సమయంలో ఎదురయిందని అబూ దావూద్ మరియు ముహద్దిసీన్ ఇమామ్ మాలిక్‌లలో వివరించబడింది.

(٥٤) وللأَرْبَعَةِ عَنْهُ إِلاَّ النَّسَائِيَّ: أَنَّ النَّبِيَّ ﷺ مَسَحَ أَعْلَى الْخُفِّ وَأَسْفَلَهُ. وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

54. 'నసాయి' లోనే గాకుండా మిగిలిన సునన్ యొక్క నాలుగు గ్రంథాలలో కూడా ముగీరా బిన్ షూబ (రజి) గారి చేతనే ఈ విధంగా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేజోళ్లపైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేశారు." (ఈ ఉల్లేఖనం అంతగా ప్రామాణికమైనది కాదు).

**సారాంశం**

మేజోళ్ల పైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. అయితే ఈ ఉల్లేఖనం బలహీనమైనది. రాబోయే ప్రామాణికమైన హదీసుకు ఇది విరుద్ధంగా ఉన్నది.

(٥٥) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَوْ كَانَ الدِّينُ بِالرَّأْيِ لَكَانَ أَسْفَلُ الخُفِّ أَوْلَى بِالْمَسْحِ مِنْ أَعْلاَهُ، وَقَدْ رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَمْسَحُ عَلَى ظَاهِرِ خُفَّيْهِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

55. హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖించారు : "ఒకవేళ ధర్మం పునాదే గనక అభిప్రాయాలపై, హేతువుపై ఆధారపడి ఉంటే మేజోళ్ల పైభాగానికి బదులు క్రింది భాగానికి మసహ్ చేయటం ఎక్కువ సమంజసంగా భావించబడేది. అయితే దైవప్రవక్త (సఅసం) తన మేజోళ్ల పైభాగాన మసహ్ చేయటం నేను ఖుద్దుగా చూశాను." (అబూ దావూద్ దీనిని ప్రామాణికమైన రీతిలో ఉల్లేఖించారు).

**సారాంశం**

దీనిభావం ఏమిటంటే ధర్మాదేశాలు దైవ సంకేతంపై ఆధారపడి ఉంటాయిగాని బుద్ధి వివేకాలపై కావు. బుద్ధిపై, హేతువుపై గనక ఇవి ఆధారపడి ఉన్నట్లయితే మేజోళ్ల పైభాగాన

మసహ్ చేయాలని ఎన్నటికీ ఆజ్ఞాపించబడేది కాదు. మేజోళ్ల అడుగు భాగాన మాత్రమే మసహ్ చేయాలని ఆదేశించబడేది. ఎందుకంటే అడుగు భాగమే అశుద్ధతకు, మలినానికి లోనై ఉంటుంది. కాని హదీసు హేతువుకు విరుద్ధంగా ఉంది. మూలాంశం స్పష్టంగా ఉన్నప్పుడు మనిషి హేతువు కాంతిలో ఆలోచించకూడదు. అయితే గియితే అంటూ తన స్వంత అభిప్రాయాలను అన్వయింపజేసే ప్రయత్నాలు చేయకూడదు.

(٥٦) وَعَنْ صَفْوَانَ بْنِ عَسَّالٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَأْمُرُنا إِذَا كُنَّا سَفْراً أَن لاَّ نَنْزِعَ خِفَافَنَا ثَلاَثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ إِلاَّ مِنْ جَنَابَةٍ، وَلَكِنْ مِنْ غَائِطٍ وَبَوْلٍ وَنَوْمٍ. أَخْرَجَهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَاللَّفْظُ لَهُ، وَابْنُ خُزَيْمَةَ وَصَحَّحَاهُ.

56. హాజ్రత్ సఫ్వాన్ బిన్ అస్సాల్ (రజి) వివరించారు : మేము ప్రయాణంలో ఉండగా - అశుద్ధావస్థకు లోనైతే తప్ప- మూడు పగళ్ళూ, మూడు రాత్రుల దాకా మేజోళ్లు విడువనవసరం లేదని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆజ్ఞాపించేవారు. అయితే మలమూత్రాల విసర్జన దృష్ట్యా, నిద్ర కారణంగా వాటిని విడువవలసిన అవసరం లేదు." (నసాయి, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం తిర్మిజీ నుండి తీసుకోబడ్డాయి. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమాలిరువురూ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ధృవీకరించారు).

### సారాంశం

మేజోళ్లపై మసహ్ చేసే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేదు. ఈ అంశాన్ని గురించి ఉల్లేఖించిన సహాబీల సంఖ్య 80కు చేరింది. స్వర్గలోక శుభవార్త పొందిన సహాబీలు కూడా వీరిలో ఉన్నారు.

అయితే మేజోళ్ల గడువు ప్రయాణీకులకు, స్థానికులకు వేర్వేరుగా నిర్ధారించబడి ఉంది. ప్రయాణీకులయితే మూడు రేయింబవళ్ల వరకూ మేజోళ్లు ధరించి ఉండవచ్చు. స్థానికులయితే ఒక పగలూ ఒక రేయి వరకూ తొడగవచ్చు. వుజూ భంగమయిన క్షణం నుంచీ గడువు మొదలవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి జుహ్ర్ నమాజ్ సమయంలో వుజూ చేసి మేజోళ్లు తొడిగాడు, అతని వుజూ సాయంత్రం భంగమైందనుకోండి, అతని గడువు సాయంత్రం నుండే మొదలవుతుంది. మనిషి అశుద్ధతకు లోనైన (తప్పనిసరిగా స్నానం చేయవలసిన అగత్యం ఏర్పడిన) కారణంగా మేజోళ్లు తీసినట్లయితే మసహ్ భంగమైనట్లే. అలాగే గడువు ముగిసిన మరుక్షణం నుంచే మసహ్ భంగమైపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈయన పూర్తి పేరు సఫ్వాన్ బిన్ అస్సాల్ మురాదీ అల్ జుమలీ. ప్రముఖ సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో జరిగిన 12 యుద్ధాలలో ఈయన పాల్గొన్నారు. కూఫాలో స్థిరనివాస మేర్పరచుకున్నారు.

(٥٧) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَعَلَ النَّبِيُّ ﷺ ثَلاَثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ لِلْمُسَافِرِ، وَيَوماً وَلَيْلَةً لِلْمُقِيمِ، يَعْنِي فِي الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

57. హజ్రత్ అలీ (రజి) గారిచే ఇలా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణీకుని కోసం మేజోళ్లపై మసహ్‌కై మూడు రేయింబవళ్ళను, స్థిర నివాసమున్న వానికై ఒక పగలూ రేయిని గడువుగా నిర్ధారించారు." (ముస్లిం)

(٥٨) وعَنْ ثَوْبَانَ رضي الله تعالى عنه قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ سَرِيَّةً فَأَمَرَهُمْ أَنْ يَمْسَحُوا عَلَى العَصَائِبِ، يَعْنِي العَمَائِمَ، وَالتَّسَاخِيْنَ، يَعْنِي الخِفَافَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

58. హజ్రత్ సోబాన్ (రజి) ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక సైనిక దళాన్ని పంపిస్తూ, తల పాగాలపై, మేజోళ్లపై 'మసహ్' చేయవలసిందిగా వారిని ఆదేశించారు." (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు- హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

హదీసులో ప్రయోగించబడిన అరబీ పదాలకు మేజోళ్లు బదులు 'కట్లు, 'పట్టీలు' అన్న అర్థాలు వస్తాయి. కాళ్లను చలి తీవ్రత నుండి కాపాడటానికి ఉపయోగించే వస్తువు అన్నభావం కూడా వస్తుంది. అవి మేజోళ్లూ కావచ్చు, లేక మరే కట్లు అయినా కావచ్చు. కాళ్లకు తగిలిన గాయాలపై కట్టే పట్టీ (బ్యాండేజి) కూడా కావచ్చు.

సైనిక బృందాన్ని యుద్ధానికి పంపిస్తూ దైవప్రవక్త (స) ఈ రకమయిన ఆజ్ఞలు జారీ చేశారంటే; క్షతగాత్రులైన యోధులు వుజూ భాగాలను మాటిమాటికీ కడిగేబదులు గాయాలపై కట్టబడి వున్న పట్టీలపై మసహ్ చేస్తే సరిపోతుంది అన్న భావం అయి ఉంటుంది.

## హదీసు ఉల్లేఖకులు

సౌబాన్ (రజి) గారి పూర్తి పేరు సోబాన్ బిన్ బుజ్దద్ బిన్ జహ్‌దర్. మారుపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన 'సురాత్' కు చెందిన వారు. అది మక్కా-మదీనాల మధ్య ఉన్న ఒక స్థలం. హుమైర్ తెగకు చెందినవారన్న వాదన కూడా ఉంది. ప్రయాణావస్థలోనూ, సాధారణ

సమయాలలోనూ ఈయన - జీవితాంతం - దైవప్రవక్త (సఅసం)కు వెన్నంటి ఉండేవారు. అన్ని రకాల సేవలు అందించేవారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని కొని బానిసత్వం నుండి విముక్తి కలిగించారు. దైవప్రవక్త (స) మరణించిన పిదప ఈయన సిరియాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. కొన్నాళ్ల తర్వాత హిమ్స్ వైపునకు పయన మయ్యారు. హిజ్రీ 54లో కన్నుమూశారు.

(٥٩) وعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مَوْقُوفاً، وأنسٍ مَرْفوعاً: «إِذَا تَوَضَّأَ أَحَدُكُمْ وَلَبِسَ خُفَّيْهِ فَلْيَمْسَحْ عَلَيْهِمَا، وَلْيُصَلِّ فِيهِمَا، وَلاَ يَخْلَعْهُمَا إِنْ شَاءَ إِلاَّ مِنْ جَنَابَةٍ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ وَصَحَّحَهُ.

59. హజ్రత్ ఉమర్ (రజి) చే గుర్తింపు పొందనిది (మౌఖూఫ్) గానూ, హజ్రత్ అనస్ (రజి)చే గుర్తింపు పొందినది (మర్ఫూ)గానూ ఉల్లేఖించబడిన హదీసు లో ఇలా అనబడింది:

"మీలో ఎవరయినా మేజోళ్లు ధరించి 'వుజూ' చేస్తే వాటిపై మసహ్ చేసుకో వచ్చు. వాటిని ధరించి వున్న స్థితిలోనే నమాజ్ చేయవచ్చు. విధిగా స్నానం చేయవలసిన స్థితికి లోనైతే తప్ప వాటిని తీయవలసిన అవసరం లేదు." దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీని ప్రామాణికతను ధృవీకరించారు).

(٦٠) وعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللهُ تَعالى عنه عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ رَخَّصَ لِلْمُسَافِرِ ثَلاَثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ، وَلِلْمُقِيمِ يَوْماً وَلَيْلَةً، إِذَا تَطَهَّرَ فَلَبِسَ خُفَّيْهِ، أَنْ يَمْسَحَ عَلَيْهِمَا. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

60. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హజ్రత్ అబూ బక్ర (రజి) వివరించారు - ఆయన (స) బాటసారి కోసం (మసహ్ నిమిత్తం) మూడు రేయింబవళ్ల సౌకర్యం ఇచ్చారు. బాటసారి కాని వారికి ఒక పగలూ, ఒక రాత్రి సౌలభ్యం ఇచ్చారు. అయితే వుజూ చేసి వున్న స్థితిలో మేజోళ్లు తొడిగితేనే ఇలా మసహ్ చేయవచ్చు." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ఖరారు చేశారు).

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన అబూ బక్ర (రజి) అసలు పేరు నుఫై బిన్ హారిస్. ఈయన తాయఫ్ కోట నుంచి కొంతమంది యువకులతో బయటకు వచ్చి ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (సఅసం) ఈయనకు స్వేచ్ఛనొసగారు. బుద్ధిజీవులలో ఒకరుగా పరిగణించబడ్డారు. హిజ్రీ 51 లేదా హిజ్రీ 52లో బస్రాలో కన్నుమూశారు. అధిక సంతానం కలవారు.

(٦١) وعَنْ أُبَيِّ بْنِ عِمَارَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللهِ! أَمْسَحُ عَلَى الْخُفَّيْنِ؟ قَالَ: نَعَمْ، قَالَ: يَوْماً؟ قَالَ: نَعَمْ، قَالَ: ويَوْمَيْن؟ قَالَ: نَعَمْ، قَالَ: وثَلاَثَةَ أَيَّامٍ؟ قَالَ: نَعَمْ، وَمَا شِئْتَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَقَالَ: لَيْسَ بِالْقَوِيِّ.

61. హజ్రత్ ఉబై బిన్ ఇమార (రజి) వివరించారు : 'ఓ దైవ ప్రవక్తా! నేను మేజోళ్ల పై మసహ్ చేయగలనా?' అని ప్రశ్నించాను. "అవును, చేసుకోవచ్చు" అని ఆయన (స) జవాబిచ్చారు. 'ఒక రోజా?' అని నేను అడగ్గా "అవును, ఒక రోజు" అని ఆయన (స) బదులిచ్చారు. 'రెండు రోజులు?'అని విన్నవించుకోగా, "అవును, రెండు రోజులు" అని సెలవిచ్చారు. 'మూడు రోజులు కూడానా?' అని నేను ప్రశ్నించగా "అవును, మూడు రోజులు. నీ కిష్టమొచ్చినంత కాలం" అని ఆయన (స) పలికారు. (అబూ దావూద్ ఈ హదీసును ఉల్లేఖించారు. అయితే ఇది దృఢమైనది కాదు అని ఆయన అభిప్రాయపడ్డారు).

## సారాంశం

ఈ హదీసు బలహీనమైనది. పైగా ఇది ఇంతకు ముందు గడువును సూచించిన రెండు ప్రామాణికమైన హదీసులకు విరుద్ధంగా ఉంది. బాటసారి కోసం మూడు రేయింబవళ్లు, బాటసారి కాని వ్యక్తికి ఒక పగలు రేయి మసహ్ చేసే గడువుగా లోగడ వచ్చిన ప్రామాణిక హదీసులలో నిర్ధారించబడింది. దృఢమైన, ప్రామాణికమైన హదీసుల ముందు బలహీనమైన హదీసు ఉపేక్షించబడుతుంది. ఈ హదీసు చాలా బలహీనమైందన్న విషయంపై హదీసువేత్తలంతా ఏకీభవించినట్లు ఇమామ్ నవవీ (రహ్మలై) 'షర్‌హుల్ ముహజ్జిబ్' లో పేర్కొన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

ఉబై బిన్ ఇమార (రజి) మదీనాకు చెందిన అన్సార్లలో సుప్రసిద్ధులు. ఈజిప్టులో స్థిరపడ్డారు.

రెండు ఖిబ్లాల (బైతుల్ మఖ్దిస్, బైతుల్లాహ్)కు అభిముఖమై నమాజ్ చేసిన భాగ్యం పొందిన వారిలో ఈయన కూడా ఉన్నారని ఇబ్నె హిబ్బాన్ పలికారు. అయితే ఈ హదీసుపై, దీని ప్రామాణికతపై తనకు నమ్మకం లేదని కూడా ఆయన నొక్కి పలికారు.

### 6వ అధ్యాయం

## వుజూను భంగపరిచే విషయాలు

## ٦ - بَابُ نَوَاقِضِ الْوُضُوءِ

62. హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాక కోసం సహచరులు ఇషా నమాజ్‌లో తీవ్రంగా నిరీక్షించేవారు. నిద్రమత్తుతో ఒక్కోసారి వారి తలలు వాలిపోయేవి (కునుకు వచ్చేది). కాని వారు సరికొత్తగా వుజూ చేయకుండానే నమాజ్ చేసేవారు. (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దారె ఖుత్నీ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. దీని మూలం మాత్రం 'ముస్లిం'లో ఉంది).

(٦٢) عَنْ أَنَسٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ أَصْحَابُ رَسُولِ اللهِ ﷺ عَلَى عَهْدِهِ يَنْتَظِرُونَ الْعِشَاءَ. حَتَّى تَخْفِقَ رُءُوسُهُم، ثُمَّ يُصَلُّونَ وَلاَ يَتَوَضَّئُونَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَصَحَّحَهُ الدَّارَقُطْنِيُّ. وَأَصْلُهُ فِي مُسْلِمٍ.

### సారాంశం

మనిషి గాఢ నిద్రకు లోనయ్యే వరకూ అతని వుజూ భంగం కాజాలదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అదీగాక ఏ నిద్రవల్ల వుజూకు భంగం కలుగుతుందో, మరే నిద్రవల్ల వుజూ భంగం కాదో ప్రవక్త ప్రియ సహచరులకు తెలుసు. దీని గురించి వివరాల్లోకి పోనవసరం లేదు. ఒక విషయం మాత్రం గమనార్హం. దేనికయినా ఆనుకుని లేదా తలగడను ఆశ్రయించి నిద్రించటం వల్ల వుజూ ప్రమాదంలో పడవచ్చు. వేరితర పరిస్థితుల్లో వచ్చే నిద్రవల్ల, కునుకు వల్ల వుజూకు వాటిల్లే నష్టం ఏమీలేదు. ఆనుకుని నిద్రించటం వల్లనూ, తలగడ ఆసరా పొందటంవల్లనూ మానవ శరీరం అతని అదుపులో ఉండదు. పైగా ఆ స్థితిలో కడుపులో నుంచి వాయువులు విసర్జితమయ్యే అవకాశాలు హెచ్చు. ఈ కారణంగా జాగ్రత్త కోసం సరికొత్తగా వుజూ చేసుకోవాలని ఆజ్ఞాపించబడింది.

63. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: ఫాతిమా బిన్తె అబూ హుబైష్ (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు- "దైవప్రవక్తా (స)! నేను ఎల్లకాలం 'ఇస్తెహాజా (సుదీర్ఘ

(٦٣) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: جَاءَتْ فَاطِمَةُ بِنْتُ أَبِي حُبَيْشٍ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنِّي امْرَأَةٌ أُسْتَحَاضُ فَلاَ أَطْهُرُ، أَفَأَدَعُ الصَّلاَةَ؟ قَالَ:

«لاَ، إِنَّمَا ذَلِكِ عِرْقٌ وَلَيْسَ بِحَيْضٍ، فَإِذَا أَقْبَلَتْ حَيْضَتُكِ فَدَعِي الصَّلاَةَ، وإِذَا أَدْبَرَتْ فَاغْسِلِي عَنْكِ الدَّمَ ثُمَّ صَلِّي». مُتَّفَقٌ عَلَيْهِ.

కాలంపాటు జరిగే) రక్త స్రావానికి లోనై ఉంటాను. పరిశుద్ధతను పొందే భాగ్యమే దక్కదు. మరి నేనీ స్థితిలో నమాజ్‌ను మానెయ్యాలా?'' దీనికాయన (స) ''లేదు. అదొక విధమైన నరం (అది తెగి పోవటం వల్ల రక్తం స్రవిస్తుంది). అంతే గాని అది బహిష్టు రక్తం కాదు. అయితే బహిష్టు కాలపు రక్తస్రావం జరుగుతున్న ప్పుడు నమాజ్‌ను మానెయ్యి. ఈ కాలం పూర్తయిన తరువాత రక్తాన్ని కడిగేసు కుని నమాజ్ చెయ్యి'' అని బోధించారు. (బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ: «ثُمَّ تَوَضَّئِي لِكُلِّ صَلاَةٍ». وَأَشَارَ مُسْلِمٌ إِلَىٰ أَنَّهُ حَذَفَهَا عَمَداً.

''మరి ప్రతి నమాజ్‌కు ముందు వుజూ చేస్తుండాలి'' అన్న వాక్యం బుఖారీలో అదనంగా ఉంది. 'ముస్లిం' ఉద్దేశ్య పూర్వకంగా దీనిని విడిచిపెట్టినట్లు తెలిపారు.

## సారాంశం

స్త్రీ మూడు రకాల రక్త స్రావాలకు గురికావలసి వస్తుంది. 1. బహిష్టు రక్తం. స్త్రీ రజస్వల అయినప్పటినుంచి వృద్ధాప్యానికి చేరుకునే వరకూ సాధారణంగా ప్రతి నెలా ఈ రక్తస్రావం మూడు నుండి ఏడు రోజుల వరకూ జరుగుతూ ఉంటుంది. అయితే గర్భధారణ జరిగినపుడు ఈ రక్తం స్రవించదు. ఈ రక్తం చిక్కగా, కాస్త నలుపుగా ఉంటుంది.

రెండవది పురిటి రక్తస్రావం : ఇది స్త్రీ ప్రసవించిన రోజునుంచి 40 రోజుల దాకా లేక అంతకన్నా తక్కువ రోజులు స్రవిస్తుంది. 40 కన్నా ఎక్కువ రోజులు కూడా కనబడవచ్చు.

మూడవది 'ఇస్తెహాజా' రక్తం. ఇది ఇంతకు ముందు పేర్కొనబడిన రెండు రకాల రక్తం కంటే భిన్నమైనది. ఇది గర్భసంచితో ముడిపడివున్న ఒక నరం చిట్లటం వల్ల (ఇన్‌ఫెక్షన్ అవటం వల్ల) స్రవిస్తుంది. ఈ బ్లీడింగ్ ఎర్రగా ఉంటుంది. క్రమక్రమంగా ఇది గైనిక్ ప్రాబ్లమ్‌గా, ఫైబ్రాయిడ్ యుటరస్‌గా రూపొందుతుంది. ఏ క్షణంలో ఈ రక్తం స్రవిస్తుందో, ఎప్పుడు ఆగుతుందో చెప్పలేము. (తగు చికిత్స జరగకపోతే) మనోపాజ్ దశ వరకూ బ్లీడింగ్ అవుతూ ఉంటుంది. ఒక్కోసారి ఇన్‌ఫెక్షన్‌వల్ల ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసు ఉల్లేఖనానికి కారకురాలైన ఫాతిమా బిన్తె అబూ హుబైష్ (ర.అన్హా) సుప్రసిద్ధ సహాబీయ. కురైష్ తెగకు చెందిన 'అసద్' అనే ఉప తెగతో ఆమెకు సంబంధముంది. ఈమె

తండ్రి పేరు ఖైస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా బిన్ ఖుసై. ఈమె అబ్దుల్లాహ్ బిన్ జహష్ (రజి) సతీమణి. మర్యాదస్తురాలు, ఈమె దైవమార్గంలో హిజ్రత్ (ప్రస్థానం) కూడా చేశారు.

(٦٤) وعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رضي الله تعالى عنه قَالَ: كُنْتُ رَجُلاً مَذَاءً فَأَمَرْتُ الْمِقْدَادَ أَن يَسْأَلَ النَّبِيَّ ﷺ، فَسَأَلَهُ، فَقَالَ: فِيْهِ الْوُضُوءُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

64. హజ్రత్ అలీ (రజి) ఇలా వివరించారు : నాకు తరచూ (పురుషాంగం నుంచి)జిగటు పదార్థం వెలువడేది (శుక్ర నష్టం జరిగేది). దీనికి సంబంధించిన ఆదేశాలేమిటో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడిగి తెలుసుకోవలసిందిగా నేను మిఖ్దాద్ (రజి)ను కోరాను. మిఖ్దాద్ (రజి) దైవప్రవక్త (స)ను దీని గురించి కనుక్కున్నారు (దీని కారణంగా వుజూ చేయాలా? లేక విధిగా స్నానం చేయాలా? అని అడిగారు). "ఇలాంటి స్థితిలో వుజూ చేస్తే సరిపోతుంది" అని ఆయన (స) సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం - అయితే ఈ వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి).

## సారాంశం

అరబీలో 'మజీ' వెలువడుతోంది అని ఉంది. ఏమిటీ 'మజీ'? ఇది తెల్లగా, చిక్కగా, జిగటుగా ఉండే నీరు. భార్యతో సరస సల్లాపాలు చేస్తున్నప్పుడు, ముద్దుపెట్టుకున్నప్పుడు, సంభోగాలోచన కలిగినప్పుడు పురుషాంగం నుంచి శీఘ్రంగా స్ఖలిస్తుంది. హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (సఅసం) కు అల్లుడు కావటం వల్ల, తన బలహీనతను ఆయన ముందు చెప్పుకోవటానికి సిగ్గుపడి, తన స్నేహితులైన మిఖ్దాద్ (రజి) సహాయం పొందారు.

## హదీసు ఉల్లేఖకులు

మిఖ్దాద్ (రజి) పూర్తి పేరు మిఖ్దాద్ బిన్ అమ్ర్ బిన్ సాలబ అల్‌బహ్రానీ. అబుల్ అస్వద్ అనేది మరో పేరు. మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి) పేరుతో ప్రసిద్ధిచెందారు. ఇస్లాంను స్వీకరించిన వారిలో 6వ వారు. రెండుసార్లు హిజ్రత్ చేసిన ఘనత ఈయనకు దక్కింది. పండితులు, సద్గుణ సంపన్నులగు సహచరులలో ఈయన కూడా ఒకరని అనబడుతోంది. బద్ర్ యుద్ధం జరిగిన రోజున అశ్వారూఢుల్లో ఈయన ఉన్నారు. ఈజిప్టు విజయంలో భాగస్థులు, హిజ్రీ 33లో మదీనాకు మూడు మైళ్ల దూరంలో వున్న 'జౌఫ్' వద్ద ఈయన మరణించారు. భౌతికకాయం మదీనాకు

తరలించబడింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) జనాజా నమాజ్ చేయించారు. బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి. అప్పటికి ఆయన వయస్సు 70 ఏండ్లు.

(٦٥) وَعَنْ عَائِشَةَ رضي الله تعالى عنها، أَنَّ النَّبِيَّ ﷺ قَبَّلَ بَعْضَ نِسَآئِهِ ثُمَّ خَرَجَ إِلَى الصَّلاَةِ وَلَمْ يَتَوَضَّأْ. أَخْرَجَهُ أَحْمَدُ وَضَعَّفَهُ الْبُخَارِيُّ.

65. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తన సతీమణులలో ఒకామెను ముద్దుపెట్టుకుని, నమాజ్ చేయడానికి వెళ్ళిపోయారు, వుజూ చేయలేదు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. బుఖారీ దీనిని బలహీనమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) నుండి ఇబ్రాహీం తైమీ దీనిని ఉటంకించారు. కాని ఇబ్రాహీం హజ్రత్ ఆయిషా (ర.అ) నుండి ఏమీ వినలేదు. కనుక ఇది బలహీనమైనది. అయితే బుఖారీలోని ఒక హదీసు దీనిని సమర్థిస్తోంది. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) స్వయంగా ఈ విధంగా తెలిపారు: "దైవప్రవక్త (సఅసం) రాత్రి చీకటిలో తహజ్జుద్ నమాజ్ చేసేవారు. నా కాళ్లు ఆయన సజ్దా చేసేచోట అడ్డుతగిలేవి. సజ్దాలోకి వెళ్ళే ముందు ఆయన (స) తన చేత్తో నా పాదాలను స్పృశించేవారు. వెంటనే నేను నా కాళ్ళను దూరంగా జరుపుకునే దానిని. దీని ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే స్త్రీ శరీరావయవాల్లోని ఏ భాగాన్నయినా ముట్టుకున్నంత మాత్రాన వుజూ భంగం కాదు. అలాగే ముద్దుపెట్టుకున్నంత మాత్రాన కూడా వుజూ భంగం కాదు. హజ్రత్ అలీ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కూడా ఇదే విధంగా ఆలోచిస్తున్నారు. ఇమాములలో ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) విధానం కూడా ఇదే. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో స్త్రీని ముట్టుకోవటం వల్ల వుజూ భంగమైపోతుంది.

(٦٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ اللهِ ﷺ: «إِذَا وَجَدَ أَحَدُكُمْ فِي بَطْنِهِ شَيْئاً فَأَشْكَلَ عَلَيْهِ، أَخَرَجَ

66. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలో ఎవరయినా మీ కడుపుల్లోంచి వాయువు విసర్జిత మైనట్లు అనిపిస్తే - అలాంటి పరిస్థితిలో నిజంగానే వాయువు విసర్జిత మైందా? లేదా? అన్న సంశయం కలిగి ఒక నిర్ణయానికి రావటం కష్టమయినట్లయితే-మీరు (వుజూ చేయడానికి) మస్జిద్‌నుండి బయటికి పోవలసిన అవ

مِنْهُ شَيْءٌ أَمْ لاَ؟ فَلاَ يَخْرُجَنَّ مِنَ الْمَسْجِدِ، حَتَّى يَسْمَعَ صَوْتًا أَوْ يَجِدَ رِيحًا». أَخْرَجَهُ مُسْلِمٌ.

సరంలేదు. (నిజంగానే) అపానవాయువు వెడలినట్లుగా శబ్దం వస్తే లేక దుర్వాసన వస్తే అప్పుడు (తాజాగా వుజూ కోసం) బయటికిపోవచ్చు.'' (ముస్లిం)

**సారాంశం**

కేవలం అనుమానం వచ్చినంతమాత్రాన వుజూ భంగం కాదని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ఈ భావాన్ని మరి కాస్త విస్తృతార్థంలో తీసుకుంటే ఒక సూత్రం మన ముందుకు వస్తుంది. అదేమంటే ప్రతి వస్తువూ తనదైన ఒక ఆదేశంపై నెలకొని ఉంది. ఏ పనైనా దానికి విరుద్ధంగా జరిగినట్లు ఖచ్చితంగా స్పష్టం కానంతవరకూ సంశయాలు, అనుమానాలు లెక్కలోకి రావు.

(٦٧) وَعَنْ طَلْقِ بْنِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَجُلٌ: مَسَسْتُ ذَكَرِي، أَوْ قَالَ: الرَّجُلُ يَمَسُّ ذَكَرَهُ فِي الصَّلاَةِ أَعَلَيْهِ وُضُوءٌ؟ فَقَالَ النبي ﷺ: «لاَ إِنَّمَا هُوَ بَضْعَةٌ مِنْكَ». أَخْرَجَهُ الْخَمْسَةُ. وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَقَالَ ابْنُ الْمَدِينِي: هُوَ أَحْسَنُ مِنْ حَدِيثِ بُسْرَةَ.

67. హజ్రత్ తల్ఖ్ బిన్ అలీ (రజి) వివరించారు : 'నేను నా మర్మాంగాన్ని చేత్తో తాకాను' అని ఒక వ్యక్తి అన్నాడు. లేదా ఇలా అన్నాడు : 'ఒకతను నమాజ్‌లో తన మర్మాంగాన్ని చేత్తో ముట్టుకుంటున్నాడు. మరి అతను సరికొత్తగా వుజూ చేయవలసిందేనా?' దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ''లేదు. అది నీ శరీరంలోని ఒక భాగం'' అని బదులిచ్చారు. (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీని ప్రామాణికతను ధృవీకరించారు. బుస్రా హదీసు కన్నా ఈ హదీసు మెరుగైనదని ఇబ్నె మదీని అభిప్రాయపడ్డారు).

**సారాంశం**

ఇబ్నె మదీనీగా ప్రసిద్ధిచెందిన అలీ బిన్ అబ్దుల్లాహ్ హిజ్రీ 121 లో జన్మించారు. హి.శ. 224లో మరణించారు. ఈయన ఇమామ్ బుఖారీ, అబూ దావూద్‌ల అధ్యాపకులలో ఒకరు. పురుషాంగాన్ని ముట్టుకున్నంత మాత్రాన వుజూ భగ్నం కాదని చాలామంది ప్రవక్త సహచరులు భావించేవారని తిర్మిజీ పేర్కొన్నారు. ఇబ్నె మదీనీ, ఇబ్నె ముబారక్, కూఫా వాసులు కూడా ఈ అభిప్రాయమే కలిగి ఉండేవారు.

కాగా; మరోవైపు అనేకమంది సహాబీలు, తాబయీలు పురుషాంగాన్ని తాకటంవల్ల వుజూ

భంగమైపోతుందని అభిప్రాయపడుతున్నారు. దీనికి ఆధారంగా వారు బుస్రా ఉల్లేఖనాన్ని ఉదాహరిస్తున్నారు. ఈ ఉల్లేఖనం దీని తరువాత రాబోతుంది. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కూడా ఈ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

తల్ఖ్ బిన్ అలీ (రజి) గారి మరో పేరు అబూ అలీ. వంశపరంపర ప్రకారం ఆయన పేరు - తల్ఖ్ బిన్ అలీ బిన్ తల్ఖ్ బిన్ అమ్ర్ హనఫీ యమామీ. దైవప్రవక్త (సఅసం) మదీనా ఏతెంచినపుడు ఈయన అప్పటికప్పుడే ఆయన (స) సమక్షంలోకి హాజరయ్యారు. మస్జిదె నబవీ నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నారు. ఈయన చేత 14 హదీసులు ఉల్లేఖించబడ్డాయని అనబడుతోంది.

(٦٨) وعَنْ بُسْرَةَ بِنْتِ صَفْوَانَ رضي الله تعالى عنها أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ مَسَّ ذَكَرَهُ فَلْيَتَوَضَّأْ». أَخْرَجَهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ، وَقَالَ الْبُخَارِيُّ: هُوَ أَصَحُّ شَيْءٍ فِي هَذَا الْبَابِ.

68. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని బుస్రా బిన్తె సఫ్వాన్ (ర.అన్హా) ఉల్లేఖించారు : "ఎవరు తన మర్మాంగాన్ని చేత్తో తాకాడో అతను వుజూ చేసుకోవాలి." (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఈ అధ్యాయం క్రింద వచ్చిన వాటిలోకెల్లా ఇది అత్యంత ప్రామాణికమైన హదీసు అని ఇమామ్ బుఖారీ వ్యాఖ్యానించారు).

## సారాంశం

పురుషాంగాన్ని ముట్టుకోవటం వల్ల వుజూ భంగమైపోతుందని ఈ హదీసు స్పష్టంగా చెబుతోంది. ప్రాధాన్యత నివ్వదగిన ప్రవచనం ఇదే. ఎందుకంటే ఈ ప్రవచనంలో నిర్ధిష్టమైన ఒక ఆజ్ఞ ఉంది. ఊహాగానాలకు ఇందులో ఎలాంటి ఆస్కారం లేదు. ఇంతకు ముందు వచ్చిన తల్ఖ్ బిన్ అలీ ఉల్లేఖనం కన్నా బుస్రా బిన్తె సఫ్వాన్ ఉల్లేఖనం సూటిగానూ, నిర్ధిష్టంగానూ ఉందని దైవభక్తిపరాయణులైన ఇమాములు అనేకమంది అభిప్రాయపడ్డారు. అటువంటి వారిలో కొందరు ప్రముఖులు : ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అబూ జర్ఆ (రహ్మ.లై), అబూ హాతిమ్ (రహ్మ.లై), దారె ఖుత్నీ (రహ్మ.లై), బైహఖీ (రహ్మ.లై), ఇబ్నె జౌజీ (రహ్మ.లై) మొదలగువారు.

బుస్రా ఉల్లేఖనం కన్నా తల్ఖ్ బిన్ అలీ ఉల్లేఖనం మెరుగైనదన్న ఇబ్నె మదీనీ అభిప్రాయాన్ని ఇమాములు ఆమోదించలేదు. అదీగాక బుస్రా బిన్తె సఫ్వాన్ హదీసుకు సమర్థింపుగా దాదాపు 18 మంది ప్రవక్త సహచరుల ఉల్లేఖనాలు ఉన్నాయి. కనుక ఈ హదీసు మొదటి హదీసుకన్నా ప్రాధాన్యత నివ్వదగినది, అనుసరణీయమైనదీను.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన బుస్రా (ర.అన్‌హా) పూర్తి పేరు ఇది: బుస్రా బిన్తె సఫ్వాన్ బిన్ నౌఫిల్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా ఖురైషియ అసదియ. ప్రథమశ్రేణి సహచరులలో ఈమె కూడా ఒకరుగా పరిగణించబడతారు. తొలికాలంలో హిజ్రత్ చేసినవారిలో ఈమె కూడా ఉన్నారు. ఈమె అమీర్ ముఆవియ పరిపాలనా కాలం వరకూ జీవించి ఉన్నారు.

(٦٩) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ رَسُولَ اللَّهِ ﷺ قَالَ: «مَنْ أَصَابَهُ قَيْءٌ أَوْ رُعَافٌ أَوْ قَلَسٌ أَوْ مَذْيٌ، فَلْيَنْصَرِفْ فَلْيَتَوَضَّأْ، ثُمَّ لْيَبْنِ عَلَى صَلاَتِهِ، وَهُوَ فِي ذَلِكَ لاَ يَتَكَلَّمُ». أَخْرَجَهُ ابْنُ مَاجَه، وَضَعَّفَهُ أَحْمَدُ وَغَيرُهُ.

69. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖించారు : "ఎవరి కయినా నమాజ్‌లో వాంతి అయితే, లేదా ముక్కునుండి రక్తం స్రవిస్తే లేదా కడుపులోని పదార్థమేదైనా నోటిగుండా బయటికి వస్తే లేదా అంగం నుండి జిగటు పదార్థం స్ఖలిస్తే అతను నమాజ్‌ను వదలివెళ్లి వుజూ చేయాలి. ఎక్కడయితే నమాజ్‌ని వదలిపెట్టాడో అక్కడి నుంచీ మొదలెట్టాలి. అయితే ఈ లోగా అతను సంభాషించకుండా ఉండాలన్నది షరతు." (ఇబ్నె మాజ దీనిని ఉల్లేఖించారు. అహ్మద్ దీనిని బలహీనమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

స్ఖలనం జరిగినపక్షంలో తక్షణం వుజూ భంగమైపోతుందని ధర్మశాస్త్రవేత్తలంతా ముక్త కంఠంతో నొక్కిపలికారు. అయితే వాంతి అవటం వల్ల, ముక్కు నుండి రక్తం స్రవించటంవల్ల, కడుపులోని పదార్థమేదైనా నోటి ద్వారా బయటకు రావటం వల్ల వుజూ భంగం అవుతుందని కొందరు, కాదని మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అలాగే నమాజ్‌ను ఎక్కడ వదలిపెట్టడం జరిగిందో అక్కడి నుంచి మొదలెట్టాలన్న విషయంలో కూడా అభిప్రాయభేదం ఏర్పడింది. ఈ హదీసు బలహీన మైనదేగాక, ప్రామాణిక హదీసులలో చెప్పబడిన కొన్ని విషయాలకు వ్యాఘాతంగా పరిణమించింది. అందుచేత ఈ హదీసు ఆధారంగా తుది నిర్ణయానికి రావటం దుర్లభమే.

వుజూ భంగమైన కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయిన నమాజును, అక్కడినుంచే మొదలెట్టే విషయంలో కూడా ఇమాముల మధ్య అభిప్రాయభేదం ఉంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఈ అంశానికి అనుకూలంగా ఉండగా, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ప్రతికూలంగా ఉన్నారు. నమాజ్ చేసే వ్యక్తి 'వుజూ' ను కోల్పోయినపుడు, అతని నమాజ్ ఇంకెక్కడ మిగిలివుంటుంది? అంటారు ఇమామ్ షాఫయి (రహ్మ.లై).

(٧٠) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَجُلاً سَأَلَ النَّبِيَّ ﷺ: أَتَوَضَّأُ مِنْ لُحُومِ الْغَنَمِ؟ قَالَ: **إِنْ شِئْتَ**. قَالَ: أَتَوَضَّأُ مِنْ لُحُومِ الإِبِلِ؟ قَالَ: **نَعَمْ**. أَخْرَجَهُ مُسْلِمٌ.

70. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) ఉల్లేఖించారు : 'నేను మేక మాంసం తిన్న తరువాత వుజూ చేసుకోవాలా?' అని ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రశ్నించాడు. "నీ మనసు కోరితే చేసుకో" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. 'ఒంటె మాంసం తింటే?' అని ఆ వ్యక్తి మళ్ళీ సందేహ పడగా, "ఒంటె మాంసం తిన్న తరువాతైతే వుజూ చేయాల్సిందే" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (ముస్లిం)

## సారాంశం

ఒంటె మాంసం తిన్న తరువాత వుజూ చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతోంది. ఈ మాంసం తిన్నంతనే వుజూ ఎందుకు ప్రమాదంలో పడుతుంది? అందలి పరమార్థం ఏమిటీ? అన్న ప్రశ్నలు ఇక్కడ అనవసరం.

ఒంటె మాంసం తినటం వల్ల వుజూ భంగమవుతుందా? అవదా? ఈ విషయంలో ఇమాములలో, ప్రవక్త అనుయాయులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇమామ్ అహ్మద్, ఇస్‌హాఖ్ బిన్ రాహ్వై, ఇబ్నె ముంజిర్, ఇబ్నె ఖుజైమ తదితర హదీసువేత్తలంతా - ఒంటె మాంసం తిన్న తరువాత వుజూ మిగిలి ఉండదనే అంటున్నారు. బైహఖీ మరియు అహ్లె హదీసు వారు కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), అనేకమంది సహాబీలు మరియు తాబయీలు మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. హలాల్ (ధర్మసమ్మతం చేయబడిన) జంతువు మాంసం తిన్నప్పుడు 'వుజూ' భంగం కాజాలదని వీరంతా వాదిస్తున్నారు. దీనికి ఆధారంగా వీరు అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాల వ్యాఖ్యను ఉదాహరిస్తున్నారు. ఇక్కడ 'వుజూ' చేయటంలోని అంతరార్థం భోజనానంతరం ముఖం చేతులు కడుక్కోవటం లాంటిదని వీరంతా అభిప్రాయపడుతున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

జాబిర్ బిన్ సమురా (రజి) ప్రవక్త సహచరులలో ప్రముఖులు. కూఫాలో స్థిరపడ్డారు. సుమారు 186 హదీసులు ఈయనగారి చేత ఉల్లేఖించబడ్డాయి. హిజ్రీ 73లో మరణించారు.

(٧١) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ النَّبِيُّ ﷺ: «**مَنْ غَسَّلَ مَيِّتاً فَلْيَغْتَسِلْ، وَمَنْ حَمَلَهُ فَلْيَتَوَضَّأْ**». أَخْرَجَهُ

71. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మృతునికి స్నానంచేయించిన వాడు స్వయంగా

أَحْمَدُ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَقَالَ أَحْمَدُ: لاَ يَصِحُّ شَيْءٌ فِي هَذَا الْبَابِ.

స్నానం చేయాలి. మృతుని లేపినవాడు (మోసినవాడు) వుజూ చేయాలి." (ఈ హదీసును అహ్మద్, నసాయి, తిర్మిజీలు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'అహ్సన్' గా ఖరారు చేశారు. ఈ అధ్యాయం క్రింద ఏ హదీసూ ప్రామాణికమైనదిగా రుజువు కాలేదని అహ్మద్ వ్యాఖ్యానించారు).

**సారాంశం**

మృతునికి స్నానం చేయించిన వ్యక్తి తాను కూడా స్నానం చేయటం 'మంచి'దన్న భావంలోనే ఇది చెప్పబడిందిగాని 'తప్పనిసరి' అన్న భావంలో మాత్రం కాదు. సునన్ దారె ఖుత్నీ, ముస్నద్ అహ్మద్‌లో అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) గారి వివరణ ఇందుకు ప్రబల నిదర్శనం. ఆయన ఇలా అన్నారు : మేము మృతునికి స్నానం చేయించేవాళ్లం. తదుపరి (స్నానం చేయించిన వారిలో) కొంతమంది స్నానం చేసేవారు. మరికొంతమంది స్నానం చేసేవారు కాదు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) ఈ వివరణా తీరును సరైనదిగా ఖరారు చేశారు. బైహఖీ మరియు హాకిమ్‌లో ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం కూడా దీనిని సమర్థిస్తోంది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), ఇబ్నె ఉమర్ (రజి), ఆయిషా (ర.అన్హా), హసన్ బస్రీ (రహ్మ.లై), ఇబ్రాహీం నఖ్యీ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై) తదితర విద్వాంసులు కూడా ఈ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నారు. అయితే కొంతమంది 'స్నానం తప్పనిసరి' అని కూడా అభిప్రాయపడ్డారు. ఇక; జనాజాను మోసేవారు వుజూను తప్పనిసరిగా చేయాలని మాత్రం ఎవరూ భావించటం లేదు.

(٧٢) وعَنْ عَبْدِ اللهِ بْنِ أَبِي بَكْرٍ رضي الله تعالىٰ عنهما أَنَّ فِي الكِتَابِ الَّذِي كَتَبَهُ رَسولُ اللهِ ﷺ لِعَمْرِو بْنِ حَزْمٍ: أَنْ لاَ يَمَسَّ القُرْآنَ إِلاَّ طَاهِرٌ. رَوَاهُ مَالِكٌ مُرْسَلاً، وَوَصَلَهُ النَّسَائِيُّ وابْنُ حِبَّانَ، وَهُوَ مَعْلُولٌ.

72. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ (రజి) తెలిపారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అమ్ర్ బిన్ హజమ్ (రజి)కు రాసిచ్చిన ఆజ్ఞాపత్రంలో ఇలా పేర్కొన్నారు : "దివ్య ఖుర్‌ఆన్‌ను పరిశుద్ధుడైన మనిషి (వుజూ చేసినవాడు) మాత్రమే ముట్టుకోవాలి." (ఇమామ్ మాలిక్ దీనిని 'ముర్సల్'ఉల్లేఖనంగా తీసుకున్నారు. నసాయి, ఇబ్నెమాజాలు దీనిని 'మౌసూల్'గా పరిగణించారు. వాస్తవానికి ఈ హదీసు "మాలూల్". అంటే లోపభూయిష్ట మైనది).

## సారాంశం

ఈ హదీసులో పరిశుద్ధత అనేది 'తహారత్' అనే అరబీ పదానికి అర్థంగా తీసుకోబడింది. తహారత్ రెండు రకాలు. ఒకటి: హదసె అక్బర్ (పెద్ద తరహా అశుద్ధత). రెండు : హదసె అస్గర్ (చిన్న తరహా అశుద్ధత).

మనిషి హదసె అక్బర్‌కు లోనై ఉంటే - అంటే సంభోగించి ఉంటే, లేదా వీర్య స్థలనం జరిగి ఉంటే, లేదా విధిగా స్నానం చేసి పరిశుద్ధత పొందవలసిన అగత్యం ఏర్పడివుంటే - అట్టి స్థితిలో అతను దివ్య ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటం అధర్మం (నిషిద్ధం). కేవలం వుజూ లేని స్థితిలో ముట్టుకోవచ్చా? ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే వుజూ చేసి ముట్టుకోవటం అభిలషణీయం.

## హదీసు ఉల్లేఖకులు

1. అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ (రజి) పూర్తి పేరు: అబ్దుల్లాహ్ బిన్ అబూ బకర్ బిన్ ముహమ్మద్ బిన్ అమ్ర్ హజమ్ అన్సారీ. ప్రముఖ ప్రశిష్యులు (తాబయీ). హిజ్రీ 135లో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 70 సంవత్సరాలు.

2. అమ్ర్ బిన్ హజమ్ (రజి) : ఈయన పరంపర ఇలా ఉంది - అమ్ర్ బిన్ హజమ్ బిన్ యజీద్ ఖజ్‌రజీ నజ్జారీ. అబూ జిహాక్ మారు పేరు. కందక పోరాటంలో పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని నజరాన్ ప్రాంతం వైపునకు ధర్మబోధకునిగా నియమించి పంపారు. ప్రజలకు ధర్మాదేశాలను తెలిపి, ఖుర్‌ఆన్ చదివించి శిక్షణ నివ్వమని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన పరమపదించారు. మహాప్రవక్త (స) ఈయనకు అందజేసిన సూచనా పత్రంలో ధర్మవిధులు, సున్నత్‌లు, దానధర్మాలు, హద్దులు తదితర అంశాలు లిఖించబడ్డాయి. పై హదీసులో పేర్కొనబడిన 'ఆజ్ఞాపత్రం' ఇదే. హిజ్రీ 50 తరువాత ఈయన మదీనాలో మరణించారు.

(٧٣) وعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَذْكُرُ اللَّهَ عَلَى كُلِّ أَحْيَانِهِ. رَوَاهُ مُسْلِمٌ، وَعَلَّقَهُ الْبُخَارِيُّ.

73. "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎల్లవేళలా దైవస్మరణ చేసే వారు" అని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు. (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. బుఖారీ దీనిని నకలు చేశారు).

## సారాంశం

దీని సారాంశం ఏమిటంటే సంభోగం, మలమూత్ర విసర్జన తదితర అశుద్ధావస్థలలో మినహా మిగిలిన సమయాలలో - సతతం - దైవ నామస్మరణ చేసేందుకు అనుమతి ఉంది. అశుద్ధావస్థకు లోనై ఉన్నప్పుడు తప్ప మిగిలిన వేళల్లో దైవప్రవక్త (సఅసం) దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారని హదీసుల ద్వారా తెలుస్తోంది. నోరు (నాలుక) పరిశుద్ధమైనది. నోటి ద్వారా ఎల్లవేళలా దైవనామస్మరణ చేయవచ్చు.

(٧٤) وعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: أَنَّ النَّبِيَّ ﷺ احْتَجَمَ وَصَلَّى، وَلَمْ يَتَوَضَّأْ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ، وَلَيَّنَهُ.

74. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) వివరించారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శరీరం నుండి రక్తం తీసారు. కాని వుజూ చేయకుండానే నమాజ్ చేశారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. దీనిని బలహీనమైన హదీసుగా నిర్ధారించారు).

**సారాంశం**

అసలు హదీసులో "ఇహ్తిజామ్" అనే పదం వచ్చింది. దీని అర్థం శరీరాన్ని గుచ్చటం, ఏదైనా పరికరంతో శరీరంలోని రక్తాన్ని తీయటం అని వస్తుంది. ఆధునిక పరిభాషలో టీకాలు వేయటం, చెడురక్తం, చీము పేరుకుని ఉన్నచోట శస్త్రచికిత్స ద్వారా దాన్ని తొలగించటం అన్న అర్థంలో కూడా తీసుకోవచ్చు.

మలమూత్ర విసర్జనావయవాలు తప్ప శరీరంలోని మిగిలిన భాగాలనుండి రక్తం తీయటం వల్ల వుజూ భంగం కాదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), ఇబ్నె అబ్బాస్ (రజి) తదితర సహాబీల, తాబయీల ఓ పెద్ద సమూహంతోపాటు ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయీల అభిమతం కూడా ఇదే.

(٧٥) وعَنْ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**العَيْنُ وِكَاءُ السَّهِ، فَإِذَا نَامَتِ العَيْنَانِ اسْتَطْلَقَ الوِكَاءُ**». رَوَاهُ أَحْمَدُ وَالطَّبَرَانِيُّ، وَزَادَ: «**وَمَنْ نَامَ فَلْيَتَوَضَّأْ**».

75. హజ్రత్ ముఆవియా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "కళ్లు తెరచుకుని ఉంటే అవి వాయువు పోకుండా కట్టడి చేస్తాయి. నిద్ర కారణంగా కళ్లు మూసుకుపోతే ఈ కట్టు (బంధనం) సడలిపోతుంది. (ముస్నద్ అహ్మద్, తబ్రానీ). ("ఎవరికయితే నిద్రవస్తుందో వారు సరికొత్తగా వుజూ చేసుకోవాలి" అని తబ్రానీ ఒక వాక్యం పెంచారు).

وَهَذِهِ الزِّيَادَةُ فِي هَذَا الْحَدِيثِ عِنْدَ أَبِي دَاوُدَ مِنْ حَدِيثِ عَلِيٍّ دُونَ قَوْلِهِ: «اسْتَطْلَقَ

ఈ అదనపు పలుకులు అబూ దావూద్ ఉల్లేఖనంలో కూడా ఉన్నాయి. అయితే ఈయన హజ్రత్ అలీ (రజి) ఆధారంగా

الْوِكَاءُ» وَفِي كِلاَ الإِسْنَادَيْنِ ضَعْفٌ.

దీనిని ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనంలో 'బంధనం సడలిపోతుంది' అన్న వ్రాత లేదు. (ప్రామాణికత రీత్యా ఈ రెండు హదీసులూ బలహీనమైనవే).

وَلأَبِي دَاوُدَ أَيْضاً عَنِ ابْنِ عَبَّاس رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا مَرْفُوعاً: «إِنَّما الْوُضُوءُ عَلَى مَنْ نَامَ مُضْطَجِعاً». وفي إسناده ضعف أيضاً.

అబూ దావూద్‌లోనే ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఇంకొక ఉల్లేఖనంలో ఇలా అన బడింది : "పండుకుని నిద్రించిన వాడే వుజూ చేయవలసి ఉంటుంది." (ప్రామాణికతరీత్యా ఈ హదీసు కూడా బలహీనమైనదే).

## సారాంశం

ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే నిద్ర స్వతహాగా వుజూను భంగపరచేది కాకపోయినా దానివల్ల వుజూ విషయంలో సందిగ్ధావస్థ నెలకొంటుంది. అయితే ఈ రెండు ఉల్లేఖనాలు కూడా బలహీనమైనవే. ఎందుకంటే వీటిలో హదీసును అందజేసిన 'బఖ్‌య' అనే ఒక ఉల్లేఖకుని విషయంలో హదీసువేత్తలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఇది బలహీనమైనదైనప్పటికీ ముంజరీ, నవవీ లాంటి వారు హాఫిజ్ అలీ (రజి) ఉల్లేఖనాన్ని పరిగణనలోకి తీసుకోదగ్గదిగా ఖరారు చేశారు.

పండుకొని నిద్రించటం వల్ల వుజూ భంగమవుతుందని హదీసులో ఉంది. గాఢనిద్రవల్ల వుజూ భంగమైపోతుందని కూడా వేరొక ఉల్లేఖనంలో ఉంది. ఈ రెంటి ద్వారా ఒక విషయం అవగతం అవుతోంది - ఒక ప్రక్కకు ఒరిగి నిద్రించటం వల్ల గాఢనిద్ర వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో శరీరావయవాలు పట్టు సడలిపోతాయి. ఆ సమయంలో అపానవాయువు వెడలే అవకాశాలు హెచ్చు. కాగా; తేలికపాటి నిద్రలో అలా జరగదు.

## హదీసు ఉల్లేఖకులు

పూర్తి పేరు ముఆవియ బిన్ అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ (రజి). మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. ఈయన సోదరుడు యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ మరణానంతరం హాఫిజ్ ఉమర్ (రజి) ఈయన్ని సిరియా గవర్నర్‌గా నియమించారు. హాఫిజ్ అలీ (రజి) ఖిలాఫత్ వరకు ఈయన ఈ హోదాపై ఉన్నారు. హాఫిజ్ హసన్ (రజి) ఖిలాఫత్‌తో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించిన మీదట అనుయాయులు ఆయన సమక్షంలో బైత్ చేశారు. అమీర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇది హిజ్రీ 40 నాటి సంఘటన. హిజ్రీ 60లో ఈయన కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 78 సంవత్సరాలు.

(٧٦) وعَنِ ابْنِ عَبَّاسٍ رضي الله تعالى عنهما، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**يَأْتِي أَحَدَكُمُ الشَّيْطَانُ فِي الصَّلاَةِ فَيَنْفُخُ فِي مَقْعَدَتِهِ، فَيُخَيَّلُ إِلَيْهِ أَنَّهُ أَحْدَثَ، وَلَمْ يُحْدِثْ، فَإِذَا وَجَدَ ذَلِكَ فَلاَ يَنْصَرِفْ حَتَّى يَسْمَعَ صَوْتاً أَوْ يَجِدَ رِيحاً**». أَخْرَجَهُ الْبَزَّارُ.

76. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: "నమాజ్ చేస్తున్నప్పుడు మీలో ఎవరి వద్దకయినా షైతాన్ వస్తాడు. అతని మల విసర్జనా మార్గంలో ఊదుతాడు. వాస్తవానికి అతడు వుజూను కోల్పోకపోయినా అతడు వుజూను కోల్పోతూ ఉన్న అనుమాన బీజాన్ని అతని మస్తిష్కంలో నాటి పోతాడు. కాబట్టి మీలో ఎవరి కయినా ఇలా అనిపిస్తే అపానవాయువు వెడలినట్లుగా శబ్దం వినండి లేదా దుర్వాసన వచ్చేదాకా నమాజ్‌ను వదల కండి." (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. ఈ హదీసు యొక్క మూలం బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ జైద్ ద్వారా, ముస్లింలో అబూ హురైర (రజి) ద్వారా పొందుపరచ బడి ఉంది).

وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ مِنْ حَدِيثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ.

ముస్లింలో హజ్రత్ అబూ హురైర (రజి) గారి ద్వారా సరిగ్గా ఇలాంటి వాక్యాలే ఉల్లేఖించబడ్డాయి.

وَلِمُسْلِمٍ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ نَحْوُهُ.

హాకిమ్ అబూ సయీద్ ద్వారా సంగ్రహించి ఇలా వివరించారు: "మీలో ఎవరి వద్దకయినా షైతాన్ వచ్చి, నీవు వుజూను కోల్పోయావని మస్తిష్కంలో అనుమానాన్ని నాటితే, 'నీవు చెప్పేది అబద్ధం' అని ఆ వ్యక్తి అతనికి జవాబివ్వాలి. దీనిని ఇబ్నె హిబ్బాన్ ఈవిధంగా పేర్కొన్నారు: "నీవు అబద్ధాల కోరువి" అని ఆ వ్యక్తి తన మనసులో అనుకోవాలి.

وَلِلْحَاكِمِ عَنْ أَبِي سَعِيدٍ مَرْفُوعاً: «**إِذَا جَاءَ أَحَدَكُمُ الشَّيْطَانُ، فَقَالَ: إِنَّكَ قَدْ أَحْدَثْتَ، فَلْيَقُلْ: إِنَّكَ كَذَبْتَ**». أَخْرَجَهُ ابْنُ حِبَّانَ بِلَفْظِ: «**فَلْيَقُلْ فِي نَفْسِهِ**».

### 7వ అధ్యాయం

## కాలకృత్యాలు తీర్చుకునే పద్ధతి ٧ - بَابُ آدَابِ قَضَآءِ الْحَاجَةِ

(٧٧) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا دَخَلَ الخَلَاءَ وَضَعَ خَاتَمَهُ. أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَهُوَ مَعْلُولٌ.

77. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం)కాలకృత్యాలు తీర్చుకోవడానికి- బహిర్ ప్రదేశానికి - వెళ్లినపుడు (తన వేలికున్న) ఉంగరాన్ని తీసేసేవారు" (దీనిని అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనం లోపభూయిష్టమైనది).

### సారాంశం

ఈ ఉల్లేఖనాన్ని అబూదావూద్ మాలూల్ (లోపభూయిష్టమైనది)గా ఖరారు చేశారు. బహిర్ ప్రదేశం, తదితర అపవిత్ర స్థలాలలోకి వెళ్ళేటప్పుడు దైవనామాలు లేదా దివ్య ఖుర్ఆన్ వచనాలు లిఖించి వున్న వస్తువులు తీసుకెళ్ళరాదని హదీసు ద్వారా స్పష్టమవుతోంది. కాగా; హదీసులో దైవప్రవక్త (స) తీసి వేరుగా ఉంచిన ఉంగరంపై 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని చెక్కబడి ఉంది. అందుకే దైవప్రవక్త (స) ఆ ఉంగరాన్ని బహిర్ ప్రదేశంలోకి తీసుకెళ్ళలేదు.

(٧٨) وعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا دَخَلَ الْخَلَآءَ قَالَ: «**اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنَ الخُبُثِ وَالْخَبَائِثِ**». أَخْرَجَهُ السَّبْعَةُ.

78. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) గారే ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం మరుగుదొడ్డికి వెళ్ళేటప్పుడు ఈ దుఆ పఠించేవారు: "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ ఖుబుసి వల్ ఖబా యిస్" (ఓ అల్లాహ్! దుష్ట జిన్నుల, దుష్ట జిన్నాతురాళ్ల కీడునుండి నీ శరణు వేడు తున్నాను). (దీనిని ఏడుగురూ - అంటే బుఖారీ, ముస్లిం, అహ్మద్, అబూ దావూద్, నసాయి, ఇబ్నె మాజ మరియు తిర్మిజీ ఉల్లేఖించారు).

**సారాంశం**

అశుద్ధత, మాలిన్యం ఉన్నచోట్ల మాలిన్యాన్ని ఇష్టపడే పైశాచిక శక్తులు, దుష్ట జిన్నులు సంచరిస్తుంటాయి. అందుకే దైవప్రవక్త (సఅసం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెళ్ళేముందు పఠించవలసిన దుఆను నేర్పారు. మానవుని మర్మస్థానాలు కూడా మలమూత్ర విసర్జన సమయంలో మలినభరితమయి ఉంటాయి. అందుచేత మనిషిని వేధించడానికి, ఆవహించి బాధ పెట్టడానికి ఇదే తగిన అవకాశమని పైశాచిక శక్తులు తలపోస్తాయి.

(٧٩) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَدْخُلُ الْخَلاَءَ، فَأَحْمِلُ أَنَا وَغُلاَمٌ نَحْوِي إِدَاوَةً مِنْ مَّاءٍ، وَعَنَزَةً فَيَسْتَنْجِي بِالْمَاءِ. مُتَّفَقٌ عَلَيْهِ.

79. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) గారే ఇలా వివరించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెడలినప్పుడు నేను, నా సమ వయస్కుడైన మరో అబ్బాయి నీళ్ల చెంబును, ఒక చిన్న ఈటెను పుచ్చుకుని తోడుగా వెళ్ళేవారం. ఆ నీళ్ళతో ఆయన (స) 'ఇస్తింజా' చేసేవారు. (శుభ్రత పొందేవారు)."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు స్పష్టమవుతున్నాయి. ఉదాహరణకు : పిన్న వయస్కులైన వారిచే పనులు చేయించు కోవటం, తనకన్నా చిన్న స్థాయి కలవారిచేత సేవ చేయించుకోవటం అసమంజసం కాదు. నీటితో ఇస్తింజా చేయటం - అంటే మర్మ స్థానాన్ని మలమూత్ర విసర్జనానంతరం కడగటం శ్రేష్ఠం. మట్టి పెడ్డను, నీటిని కూడా 'ఇస్తింజా' నిమిత్తం ఉపయోగించటం మరింత మంచిదని పండితులు అభిప్రాయపడ్డారు.

(٨٠) وعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: خُذِ الْإِدَاوَةَ، فَانْطَلَقَ حَتّٰى تَوَارَى عَنِّيْ، فَقَضٰى حَاجَتَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

80. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం : "నీళ్ళ చెంబు తీసుకుని (వెంట) రా" అని దైవప్రవక్త (సఅసం) నన్ను ఆదేశించారు. ఆయన (స) మల విసర్జన నిమిత్తం నా కంటికి కానరానంత దూరం వెళ్ళి, అక్కడ కాలకృత్యం తీర్చుకున్నారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) గారి ఈ ఆచరణ ద్వారా మనకు స్పష్టమయ్యే దేమిటంటే బహిర్ ప్రదేశానికి పోయేవారు తెరమరుగు అవ్వాలి లేదా ఎవరికీ కానరాని చోట కూర్చోవాలి. మల

విసర్జనకు బహిరంగ స్థలం తప్ప మరో చోటు లభ్యంకాని పరిస్థితుల్లో ఇసుక లేక మట్టి గుట్టల ఆసరాలోనయినా కూర్చోవాలనీ, ఆ మాత్రం జాగ్రత్త వహించకపోయినట్లయితే షైతాన్ ఆవహించటానికి అదను దొరుకుతుందని మహనీయ ముహమ్మద్ (స) వారి మరో ప్రవచనం ద్వారా తెలుస్తోంది.

(٨١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رضي الله تعالى عنه قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اتَّقُوا اللاَّعِنَيْنِ، الَّذِي يَتَخَلَّى فِي طَرِيقِ النَّاسِ، أَوْ فِي ظِلِّهِمْ**». رَوَاه مُسْلِمٌ.

81. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "శాపానికి కారణభూతమయ్యే రెండు స్థలాలపై మల విసర్జన చేసే చేష్టకు దూరంగా ఉండండి. ఒకటి : జనులు నడిచే దారిలో. రెండు : (జనులు విశ్రాంతి తీసుకునే) నీడనిచ్చే స్థలంలో." (ముస్లిం)

وَزَادَ أَبو دَاوُد عَنْ مُعاذٍ: «وَالْمَوارِدَ». وَلَفْظُه: «**اتَّقُوا الْمَلاعِنَ الثَّلاثَةَ، الْبَرَازَ فِي الْمَوَارِدِ، وَقَارِعَةِ الطَّرِيقِ، والظِّلِّ**». ولأحمد عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما: «**أَوْ نَقْعِ مَاءٍ**». وَفِيهِمَا ضَعْفٌ.

అబూ దావూద్ హజ్రత్ ముఆజ్ (రజి) ఆధారంగా గ్రహించిన ఉల్లేఖనంలో ఇలా ఉంది - "శాపానికి కారణభూత మయ్యే మూడు అంశాలకు దూరంగా ఉండండి: నీరు ప్రవహించే స్థలాలలో, జనులు వచ్చేపోయే దారిలో, నీడ (నిచ్చే వృక్షం) క్రింద మల విసర్జన చేయటం నుండి" (దూరంగా ఉండండి).

ఇమామ్ అహ్మద్ గారు ఇబ్నె అబ్బాస్ (రజి) ఆధారంగా గ్రహించిన ఉల్లేఖనంలో ఇలా ఉంది : "నీరు నిలిచిఉండే చోట కూడా మల విసర్జన చేయరాదు." (ఈ రెండు ఉల్లేఖనాలు కూడా బలహీనమైనవే).

وَأَخْرَجَ الطَّبْرَانِيُّ: النَّهْيَ عَنْ قَضَاءِ الْحَاجَةِ تَحْتَ الْأَشْجَارِ الْمُثْمِرَةِ وَضَفَّةِ النَّهْرِ الْجَارِي، مِنْ حَدِيثِ ابْنِ عُمَرَ بِسَنَدٍ ضَعِيفٍ.

ఇబ్నె ఉమర్ (రజి) ఆధారంగా తబ్రానీ తీసుకున్న ఉల్లేఖనంలోని వాక్యం ఇలా ఉంది: "కాయలు కాసే, నీడనిచ్చే చెట్టు క్రింద, ప్రవహించే కాలువ ప్రక్కన మల విసర్జన చేయరాదు" (దీని వివరణా తీరులో కూడా కొంత అస్పష్టత ఉంది).

### సారాంశం

ఈ హదీసులలో మల విసర్జనకు సంబంధించిన శిక్షణ ఇవ్వబడింది. దానికి సంబంధించిన కొన్ని నియమాలు, మర్యాదలు సూచించబడ్డాయి. ఐదు స్థలాలు, లేక ప్రదేశాలలో మల విసర్జన చేయటం నిషిద్ధం అని స్పష్టం చేయబడింది. అవేమంటే; (1) రహదారిపై (2) నీడనిచ్చే వృక్షాల క్రింద (3) ప్రవహించే నీటిలో (4) పండ్లు ఫలాలనిచ్చే చెట్టు క్రింద (5) ప్రవహించే కాలువల ప్రక్కన. జనులు సంచరించే మార్గంలో మల విసర్జన చేయటం నిషిద్ధం. అయితే జన సంచారం లేని మార్గాలయితే ఫరవాలేదు.

### హదీసు ఉల్లేఖకులు (హజ్రత్ ముఆజ్ -రజి)

ఈయన అన్సార్ వర్గానికి చెందినవారు. ఖజ్రజ్ తెగతో ఈయనకు సంబంధముంది. గొప్ప జ్ఞాని. మర్యాదస్తులు. బైతె అఖబాలోనూ, బద్ర్ సంగ్రామంలోనూ పాల్గొన్నారు. మహాప్రవక్త (సఅసం) ఈయన్ని యమన్‌కు గవర్నర్‌గా నియమించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని హజ్రత్ అబూ ఉబైద బిన్ జర్రాహ్ (రజి) అనంతరం సిరియా గవర్నర్‌గా నియమించారు. హిజ్రీ 17లో ప్లేగువ్యాధికి గురై మరణించారని అనబడుతోంది. హిజ్రీ 18లో మరణించారని మరొక వాదన. అప్పటికి ఆయన వయస్సు 38.

(٨٢) وعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا تَغَوَّطَ الرَّجُلَانِ فَلْيَتَوَارَ كُلُّ وَاحِدٍ مِنْهُمَا عَنْ صَاحِبِهِ، وَلاَ يَتَحَدَّثَا، فَإِنَّ اللَّهَ يَمْقُتُ عَلَى ذَلِكَ**». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ ابْنُ السَّكَنِ وَابْنُ الْقَطَّانِ، وَهُوَ مَعْلُولٌ.

82. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఇద్దరు వ్యక్తులు మల విసర్జనకై బహిర్ ప్రదేశానికి వెళితే వారు ఒకొరికొకరు కనబడని విధంగా - చాటుగా - ఉండాలి. ఆ స్థితిలో వారు పరస్పరం సంభాషించుకోకూడదు. ఎందుకంటే ఇలాంటి చేష్టను అల్లాహ్ (సుతరామూ ఇష్టపడడు) కోపగించుకుంటాడు." (అహ్మద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె సకన్, ఇబ్నె ఖత్తాన్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు. కాని ఈ హదీసులో కొంత లోపం ఉంది).

### సారాంశం

అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మలై) గారు ఈ హదీసును ఇక్రమ బిన్ అమ్మార్ బిన్ యహ్యా బిన్ కసీర్ కారణంగా మాలూల్ (లోపభూయిష్టం) గా ఖరారు చేశారు. ఈ ఉల్లేఖకుడు

ఈయన దృష్టిలో నమ్మకస్థుడు కారు. మరి చూడబోతే ఇక్రమ ఉల్లేఖనాన్ని ఇమామ్ ముస్లిమ్ స్వీకరించారు. ఇమామ్ బుఖారీ సయితం దీనిని ఉల్లేఖించారు.

సతర్ పరిధిలోకి వచ్చే శరీర భాగాలను మరుగుపరచాలని, మల మూత్ర విసర్జన సమయంలో పరస్పరం మాట్లాడుకోవటం నిషిద్ధమనీ ఈ హదీసు రుజువు చేస్తోంది. ఎవరయినా ఈ చేష్టకు ఒడిగడితే అది దేవుని ఆగ్రహానికి, అయిష్టతకు కారణభూతమవుతుందని చెప్పబడింది. కొందరు ప్రముఖులు అభిప్రాయపడినట్లు ఈ చేష్ట కేవలం మక్రూహ్ (అవాంఛనీయం) అయి ఉంటే దేవుని తరపున ఇంత తీక్షణమైన హెచ్చరిక చేయబడేది కాదు. ఇలాంటి సమయంలో సలాంకు బదులు పలకటం సయితం సమ్మతం కాదని దైవప్రవక్త (స) గారు క్రియాత్మకంగా నిరూపించి ఉన్నారు.

(٨٣) وعَنْ أَبِيْ قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رسول الله ﷺ: **«لاَ يَمَسَّنَّ أَحَدُكُمْ ذَكَرَهُ بِيَمِينِهِ وَهُوَ يَبُولُ، وَلاَ يَتَمَسَّحْ مِنَ الْخَلاَءِ بِيَمِينِهِ، وَلاَ يَتَنَفَّسْ فِي الْإِنَاءِ».** مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

83. హజ్రత్ అబూ ఖతాదా(రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు - "మీలో ఎవరూ మూత్ర విసర్జన చేసే సమయంలో కుడిచేత్తో పురుషాంగాన్ని పట్టుకోరాదు. మల విసర్జన తరువాత కుడిచేత్తో శుభ్రపరచుకోవడంగానీ, నీరు త్రాగే సమయంలో శ్వాస పీల్చడంగానీ చేయరాదు." (బుఖారీ, ముస్లిం - వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

**సారాంశం**

ఈ హదీసులో రెండు ముఖ్యాంశాలు వివరించబడ్డాయి -

(1) మూత్ర విసర్జన సమయంలో కుడిచేత్తో పురుషాంగాన్ని పట్టుకోవటంగానీ, తాకటంగానీ చేయరాదు. ఇలా చేయటం హరామ్ (నిషిద్ధం). ఈ చేష్ట వికృతమైనది, అనాగరికమైనది.

(2) పానీయం త్రాగేటప్పుడు శ్వాస పీల్చటం (మరియు వదలటం) నిషిద్ధం. ఎందుకంటే దీనిద్వారా వెలువడే సూక్ష్మక్రిములు త్రాగే పానీయంలో కలసిపోయి, తిరిగి జీర్ణకోశంలోకి ప్రవేశిస్తాయి. ఈ సూక్ష్మక్రిములు వైద్యశాస్త్రపరంగా ఆరోగ్యానికి హానికరమైనవి.

(٨٤) وعَنْ سَلْمَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَقَدْ نَهَانَا رَسُولُ اللهِ ﷺ أَن نَسْتَقْبِلَ الْقِبْلَةَ بِغَائِطٍ أَوْ بَوْلٍ، أَوْ أَنْ نَسْتَنْجِيَ بِالْيَمِيْنِ، أَوْ أَن نَسْتَنْجِيَ بِأَقَلَّ مِن ثَلاَثَةِ أَحْجَارٍ أَوْ أَنْ

84. హజ్రత్ సల్మాన్ (రజి) ఉల్లేఖించారు: మేము మలమూత్ర విసర్జన సమయాల్లో ఖిబ్లా వైపునకు అభిముఖమై ఉండటాన్ని లేదా కుడిచేత్తో కడుక్కోవటాన్ని లేదా మూడుకన్నా తక్కువ పెడ్డలతో ఇస్తింజా చేయటాన్ని లేదా (ఎండిన) పేడతో, లద్దెతో, ఎముక

تَسْتَنْجِيَ بِرَجِيْعٍ أَوْ عَظْمٍ. رَوَاهُ مُسْلِمٌ.

తో ఇస్తింజా చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు." (ముస్లిం)

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన సల్మాన్ (రజి) నామాంతరం అబూ అబ్దుల్లాహ్. వాస్తవానికి ఈయన పారసీక దేశస్థులు. సత్యాన్వేషణలో బయలుదేరారు. మధ్యలో క్రైస్తవమతం కూడా స్వీకరించారు. అనంతరం మదీనా వచ్చారు. మదీనాకు రాగానే దైవప్రవక్త (స) సమక్షంలో ఇస్లాం స్వీకరించారు. సల్మానుల్ ఖైరాన్ అనే బిరుదు పొందారు. ఇస్లాంలోకి ప్రవేశించిన నాటినుంచీ తు.చ. తప్పకుండా దీనిని పాటించారు. ధర్మావలంబనలో ఆయన చిత్తశుద్ధినీ, సంకల్ప నిరతిని చూసి దైవప్రవక్త (సఅసం) "సల్మాన్ మా ఆప్తులు" అని కొనియాడేవారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని 'మదాయన్'కు గవర్నర్‌గా నియమించారు. కూలీ నాలీ చేసి సంపాదించిన వేతనాన్ని దైవమార్గంలో దానం చేసేవారు. హిజ్రీ 32లో కన్నుమూశారు.

(٨٥) وَلِلسَّبْعَةِ مِنْ حَدِيْثِ أَبِي أَيُّوبَ: لاَ تَسْتَقْبِلُوا الْقِبْلَةَ بِغَائِطٍ أَوْ بَوْلٍ، وَلا تَسْتَدْبِرُوهَا، وَلَكِنْ شَرِّقُوا أو غَرِّبُوا.

85. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) చే ఉల్లేఖించబడింది: "మల, మూత్ర విసర్జన సమయంలో ఖిబ్లా వైపునకు తిరిగి కూర్చోవటంగానీ, దాని వైపునకు వీపు నివ్వటంగానీ చేయకండి. తూర్పు లేక పడమర వైపునకు అభిముఖులవండి." (దీనిని ఏడుగురూ - అంటే ఇమామ్ బుఖారీ, ముస్లిం, అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజాలు ఉల్లేఖించారు).

## సారాంశం

ఇక్కడొక ముఖ్య విషయాన్ని విస్మరించరాదు. అలనాడు ఈ హితవు మదీనా వాసుల నుద్దేశ్యించి చేయబడింది గనక, 'తూర్పు పడమరల వైపునకు తిరిగి కూర్చోండి' అని ఉంది. మదీనావాసులకు 'ఖిబ్లా' దక్షిణ దిక్కున ఉంటుంది. ఎవరికయితే ఖిబ్లా దక్షిణ లేక ఉత్తర దిక్కున పడుతుందో వారు తూర్పు - పడమరల వైపు తిరిగి కూర్చోవటం సరైనదే. అయితే తూర్పు లేక పడమర దిశల్లో 'ఖిబ్లా' ఉన్న వారు ఉత్తర - దక్షిణ దిశల్లో తిరిగి కూర్చోవలసి ఉంటుంది.

గోడగానీ, లేక మరేదైనా ఆసరాగానీ లేనిపక్షంలో-బహిరంగ మైదానాలలో ఈ పరిస్థితి ఎదురవుతుంది. ఇళ్ల దగ్గర, కార్యాలయాల దగ్గర - మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించబడి ఉంటే - అంటే మనిషికి ఎదురుగా గోడ ఉంటే అప్పుడు ఈ నిబంధన వర్తించదు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) సుప్రసిద్ధ సహాబీ. అబూ అయ్యూబ్ మారు పేరు. అసలు పేరు ఖాలిద్ బిన్ జైద్ బిన్ కులైబ్. మదీనా ఏతెంచినప్పుడు దైవప్రవక్త (సఅసం) గారి ఒంటె ఈయన ఇంటి ముంగిటే కూర్చుంది. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. రోము గడ్డపై ధర్మయుద్ధం చేస్తూ (హిజ్రీ 50లో) వీరమరణం పొందారు. ఈయన సమాధి ఇస్తాంబుల్ గోడ ఛాయలో ఉంది.

(٨٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ تعالى عنها، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: **مَنْ أَتَى الْغَائِطَ فَلْيَسْتَتِرْ**. رَوَاهُ أَبُو دَاوُدَ.

86. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు : "మల విసర్జన కోసం వెళ్లిన వారు చాటు ప్రదేశంలో కూర్చోవాలి." (అబూదావూద్)

(٨٧) وعَنْهَا رَضِيَ اللهُ عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا خَرَجَ مِنَ الْغَائِطِ قَالَ: «**غُفْرَانَكَ**». أَخْرَجَهُ الخمسة وصححه أَبُو حَاتِم وَالْحَاكِمُ.

87. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి చేతనే మరో ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన చేసి మరుగుదొడ్డి నుండి బయటికి వస్తున్నప్పుడు 'గుఫ్రానక' (దేవా! నీ మన్నింపుకై, ఆచ్ఛాదనకై అర్థిస్తున్నాను) అని పలికేవారు." (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు ఐదుగురు ఉల్లేఖించారు. అబూ హాతిమ్ మరియు హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు).

(٨٨) وعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَتَى النَّبِيُّ ﷺ الغَائِطَ، فَأَمَرَنِي أَنْ آتِيَهُ بِثَلَاثَةِ أَحْجَارٍ، فَوَجَدْتُ حَجَرَيْنِ، وَلَمْ

88. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మల విసర్జన నిమిత్తం బహిర్ ప్రదేశానికి వెడలినప్పుడు, తన కోసం మూడు మట్టిపెడ్డలు తెమ్మని నన్ను ఆదేశించారు. నాకు రెండు పెడ్డలు దొరికాయి గాని మూడవది దొరకలేదు. (గత్యంతరంలేక) ఎండిన

أَجِدْ ثَالِثاً، فَأَتَيْتُه بِرَوْثَةٍ، فَأَخَذَهُمَا وَأَلْقَى الرَّوْثَةَ، وَقَالَ: «إِنَّها رِكْسٌ». أَخْرَجَهُ الْبُخَارِيُّ. وَزَادَ أَحْمَدُ وَالدَّارَقُطْنِيُّ «ائْتِنِي بِغَيْرِهَا».

పేడ ముక్క నొకదానిని తీసుకొచ్చాను. ఆయన (సఅసం) రెండు మట్టి పెడ్డల నయితే తీసుకున్నారు గాని, పేడ ముక్కను దూరంగా పారవేశారు. 'ఇది స్వయంగా మలినం కదా!' అని పలికారు." (బుఖారీ)

అహ్మద్, దారె ఖుత్నీలలో మరొక వాక్యం అదనంగా ఉంది: "దీని బదులు ఇంకొక పెడ్డ తీసుకురా."

### సారాంశం

స్వతహాగా మలినంతో కూడుకున్న వస్తువు - అది ఎండిపోయినప్పటికీ - దాని ద్వారా పరిశుద్ధత ఒనగూడదని ఈ హదీసు స్పష్టపరుస్తోంది. కాబట్టి అలాంటి వాటిని విడనాడాలి. మల విసర్జన తర్వాత పరిశుద్ధత కోసం కనీసం మూడు మట్టి పెడ్డలను ఉపయోగించాలి. ఒకవేళ మరిన్ని మట్టి పెడ్డలు కావలసి ఉంటే బేసి సంఖ్యలో వాటిని తీసుకోవాలి. (అంటే ఐదు, ఏడు). నేటి ఆధునిక యుగంలో (డ్రై క్లీనింగ్ నిమిత్తం) ఎన్నో వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. ఉదాహరణకు టిష్యూ పేపర్లు. ఈ టిష్యూ పేపర్లు కూడా బేసి సంఖ్యలోనే ఉపయోగించాలి.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఇబ్నె మస్‌వూద్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్. బహుముఖ ప్రజ్ఞాశాలి. బుద్ధికుశలురైన సహాబాలలో ఒకరుగా పరిగణించబడ్డారు. బద్ర్ మరియు ఇతర యుద్ధాలలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) గారి ఆంతరంగిక సహచరులలో ఒకరు. ప్రయాణాలలోనూ, ఇంటి వద్ద కూడా దైవప్రవక్త (స) కు సన్నిహితంగా మెలిగేవారు. ఈయనగారి గుణ విశేషాలను గురించి ఎంత చెప్పినా తక్కువే. హిజ్రీ 32లో మదీనా మునవ్వరాలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు సుమారు 60 సంవత్సరాలు.

(٨٩) وعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى أَنْ نَسْتَنْجِيَ بِعَظْمٍ أَوْ رَوْثٍ، وَقَالَ: «إِنَّهُمَا لاَ يُطَهِّرَانِ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَصَحَّحَهُ.

89. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఎముకతో, ఎండిన పేడ (వంట)తో 'ఇస్తింజా' చేయటాన్ని వారించారు. దాంతోపాటు ఇలా ఉపదేశించారు: "ఇవి రెండూ పరిశుద్ధతను చేకూర్చలేవు." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. దీనిని ప్రామాణికమైనదిగా కూడా ఖరారు చేశారు).

**సారాంశం**

పేడ స్వతహాగా మలినం గనక దానివల్ల శుచీ, శుభ్రత లభించే ప్రశ్నే లేదు. కాగా; ఎముక నున్నగా ఉంటుంది. అందులో పీల్చే గుణం ఉండదు. అందుచేత దాంతో పరిశుభ్రపరచటం సాధ్యం కాదు. ఇస్తింజా కోసం వీటిని ఉపయోగించకపోవటంలోని మరో మర్మాన్ని దైవప్రవక్త (స) తెలుపుతూ; అవి జిన్నుల ఆహారమనీ, వాటి పశువుల మేత అనీ అన్నారు.

(٩٠) وعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ الله ﷺ: «اسْتَنْزِهُوا مِنَ الْبَوْلِ، فَإِنَّ عَامَّةَ عَذَابِ الْقَبْرِ مِنْهُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَلِلْحَاكِمِ: «أَكْثَرُ عَذَابِ الْقَبْرِ مِنَ الْبَوْلِ» وَهُوَ صَحِيْحُ الْإِسْنَادِ.

90. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మూత్రపు తుంపరల నుండి మిమ్మల్ని కాపాడు కోండి. చాలా వరకు సమాధి యాతన దీనికారణంగానే ఉంటుంది." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు) హాకిమ్ ఉల్లేఖనంలో ఇలా ఉంది: "చాలా వరకు సమాధి యాతన మూత్రపు తుంపరల కారణంగా విధించబడు తుంది." (ఇది అందజేయబడిన తీరు ప్రామాణికమైనది).

**సారాంశం**

మూత్ర విసర్జన సమయంలో అజాగ్రత్త, నిర్లక్ష్య వైఖరి మూలంగా వాటి తుంపరలు శరీరంపై పడతాయి. పైకి ఇది చాలా చిన్న విషయంగా కనిపిస్తున్నప్పటికీ పరిణామం రీత్యా ఎంత భయానకంగా తయారవుతుందో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి మూత్ర విసర్జన సమయంలో శరీరంపై తుంపరలు పడకుండా జాగ్రత్త వహించటం ఎంతో అవసరం.

(٩١) وعَنْ سُرَاقَةَ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: عَلَّمَنَا رَسُولُ اللهِ ﷺ فِي الْخَلَاءِ أَنْ نَقْعُدَ عَلَى الْيُسْرَى وَنَنْصِبَ الْيُمْنَى. رَوَاهُ الْبَيْهَقِيُّ بِسَنَدٍ ضَعِيْفٍ.

91. హజ్రత్ సురాఖా బిన్ మాలిక్ (రజి) తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు కాలకృత్యాల పద్ధతులను వివరిస్తూ ఇలా అన్నారు: "ఎడమకాలిపై బరువువేసి కూర్చోండి. కుడికాలిపై తక్కువ బరువుపడేలా ఆ కాలిని నిలిపి ఉంచండి." (దీనిని బైహఖీ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

వివేకి ఆజ్ఞాపించిన ఏ ఆజ్ఞ కూడా వివేకరహితంగా ఉండదు. అది ఎవరికి అర్థమయినా కాకపోయినా - అది విజ్ఞతా వివేచనలతో, యుక్తితో నిండి ఉంటుంది. ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) ఎడమ కాలిపై ఎక్కువ భారం పడేలా ఒక ప్రక్కకు వాలి కూర్చోమని చెప్పారు. మనిషి జీర్ణకోశం ఎడమ వైపున ఉంటుంది. ఎడమ కాలిపై బరువు మోపి కూర్చోవటం వల్ల కడుపులోని వ్యర్థాలు సులువుగా విసర్జితమవుతాయి.

### హదీసు ఉల్లేఖకులు

సురాఖా బిన్ మాలిక్ బిన్ జాషమ్ ముద్లజ్ తెగకు చెందినవారు. అందువల్ల ముద్లజీగా కూడా వ్యవహరించబడ్డారు. ఈయన నామాంతరం అబూ సుఫ్యాన్. ప్రముఖ సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) మక్కానుండి మదీనాకు హిజ్రత్ చేస్తున్న సమయంలో అవిశ్వాసులు ప్రకటించిన బహుమానానికి ఆశపడి ఈయన దైవప్రవక్తను వెంటాడారు. కాని తీరా దైవప్రవక్త (స) ను సమీపించాక ఈయన గుఱ్ఱం మోకాళ్ళ వరకూ నేలలో కూరుకుపోయింది. అప్పుడీయన దైవప్రవక్త (స) శరణు కోరారు. దైవప్రవక్త (స) ఈయనకు అభయమిచ్చారు. 'మక్కా విజయం' నాడు ఈయన ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 24లో మరణించారు.

(٩٢) وَعَنْ عِيْسَى بْنِ يَزْدَادَ (بُرْدَادَ) عَنْ أَبِيْهِ قَالَ: قَالَ رسولُ الله ﷺ: «إِذَا بَالَ أَحَدُكُمْ فَلْيَنْتُرْ ذَكَرَهُ ثَلَاثَ مَرَّات». رَوَاهُ ابْنُ مَاجَهْ بِسَنَدٍ ضَعِيْفٍ.

92. హజ్రత్ ఈసా బిన్ యజ్దాద్ తన తండ్రి ఆధారంగా వివరించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరు ఎప్పుడు మూత్ర విసర్జన చేసినా అంగాన్ని మూడుసార్లు జాడించాలి." (ఇబ్నె మాజా దీనిని అప్రమాణిక ఆధారాలతో ఉల్లేఖించారు).

### సారాంశం

అంగాన్ని మూడుసార్లు జాడించమనటంలోని ఉద్దేశ్యమేమంటే మూత్రపు చుక్క ఏదైనా మార్గమధ్యంలో నిలిచివుంటే అది కూడా విసర్జితమవ్వాలి. మూత్ర విసర్జన పూర్తిగా జరిగిందన్న నమ్మకం మనిషికి కుదరాలి. ఈ ఉల్లేఖనం బలహీనమైనప్పటికీ మూత్రపు బిందువుల నుండి సురక్షితంగా ఉండాలన్న హదీసును సమర్థిస్తోంది. మూత్రపు తుంపరల పట్ల చూపే నిర్లక్ష్యవైఖరి మనిషిని సమాధి యాతనకు గురిచేస్తుందని ఇంతకు ముందు చెప్పుకున్నాం కదా!

### హదీసు ఉల్లేఖకులు (ఈసా బిన్ యజ్దాద్)

ఈ హదీసును ఉల్లేఖించిన తండ్రీ కొడుకులిద్దరూ అపరిచితులని, వారిని గురించి ఎవరికీ ఏమీ తెలియదని ఇబ్నె ముయీన్ తెలిపారు.

(٩٣) وعَنِ ابْنِ عَبَّاسٍ رضي الله تعالى عَنْهما، أَنَّ النَّبِيَّ ﷺ سَأَلَ أَهْلَ قُبَاءٍ فَقَالَ: **إِنَّ اللَّهَ يُثْنِي عَلَيكُمْ**. فَقَالُوا: إِنَّا نُتبِعُ الحِجَارَةَ الماءَ. رَوَاهُ البَزَّارُ بِسَنَدٍ ضَعِيفٍ. وَأَصْلُه فِي أَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، بِدُوْنِ ذِكْرِ الْحِجَارَةِ.

93. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఖుబా' వాసులను ద్దేశ్యించి, "అల్లాహ్ మీ (శుచీ, శుభ్రతల) గురించి ఎంతగానో కొనియాడాడు. దీనిక్కారణమేమిటి?" అని అడగ్గా వాళ్లు ఇలా విన్నవించుకున్నారు - 'మేము మట్టిపెడ్డలను ఉపయోగించిన మీదట, మరింత శుచీ, శుభ్రత కోసం నీటిని కూడా ఉపయోగిస్తాము." (బలహీన ఆధారాలతో దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. దీని మూలాంశం అబూదావూద్, తిర్మిజీలలో ఉంది. ఈ సందర్భంగా ఇబ్నె ఖుజైమగారు అబూహురైర (రజి) ఉల్లేఖనాన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు. అయితే అందులో మట్టి పెడ్డల ప్రస్తావన లేదు).

**సారాంశం**

'ఖుబా' గ్రామం మదీనాకు దక్షిణాన మూడు మైళ్లదూరంలో ఉంది. హిజ్రత్ సందర్భంగా మహాప్రవక్త (సఅసం) తొలుత ఇక్కడే ఆగారు. ఈ హదీసు ద్వారా; ఇస్తింజా కోసం మట్టి పెడ్డలతో పాటు నీటిని ఉపయోగించటం మంచిదని తెలుస్తోంది.

**8వ అధ్యాయం**

## ٨ - بَابُ الْغُسْلِ وَحُكْمُ الْجُنُبِ

## గుసుల్ మరియు జనాబత్

**(స్నానం చేయటం, లైంగిక అశుద్ధతను పారద్రోలటం)**

(٩٤) عَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ:

94. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నీరు విసర్జించబడినపుడే నీరు ఉపయోగించాలి." (అంటే వీర్య స్ఖలనం జరిగే వరకూ గుసుల్ చేయటం తప్పని సరి

«الْمَاءُ مِنَ الْمَاءِ». رَوَاهُ مُسْلِمٌ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

కాదు). (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. అయితే మూలాంశం మాత్రం బుఖారీలో ఉంది).

### సారాంశం

ఈ హదీసు 'ఇహ్తెలామ్' (వీర్య స్ఖలనం) కు సంబంధించినదనీ, సంభోగంతో దీనికి సంబంధం లేదని పండితులు వ్యాఖ్యానించారు. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) ఇలా అంటున్నారు: "ఇస్లాం ఆరంభకాలంలో భార్యాభర్తలు రతి క్రీడలో పాల్గొన్నప్పటికీ - స్ఖలనం జరిగేదాకా - స్నానం (గుసుల్) తప్పనిసరి గావించబడలేదు. అయితే ఈ ఆజ్ఞ తరువాత రద్దు పరచబడింది."

ఖాజీ ఇబ్నె అరబీ ఏమంటున్నారో చూడండి: స్త్రీ పురుషులిద్దరి మర్మాంగాలు పరస్పరం కలుసుకుంటే చాలు - వీర్య స్ఖలనం జరిగినా, జరగకపోయినా - స్నానం చేయటం తప్పనిసరి అయి పోతుంది.

(٩٥) وعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ الله ﷺ: «إِذَا جَلَسَ أَحَدُكُمْ بَيْنَ شُعَبِهَا الْأَرْبَعِ ثُمَّ جَهَدَهَا، فَقَدْ وَجَبَ الْغُسْلُ». مُتَّفَقٌ عَلَيْه، وَزَادَ مُسْلِمٌ: «وَإِنْ لَمْ يُنْزِلْ».

95. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినాసరే స్త్రీ యొక్క నాలుగు శాఖల మధ్య కూర్చుని (అంటే స్త్రీని ఆక్రమించుకుని) ఆ తరువాత సఫల యత్నం చేస్తే స్నానం తప్పనిసరిగా చేయాల్సిందే." (బుఖారీ, ముస్లిం) ముస్లిం తన ఉల్లేఖనంలో "వీర్య స్ఖలనం జరిగినా, జరగకపోయినాసరే" అన్న వాక్యం కూడా పొందుపరచారు.

### సారాంశం

(1) 'స్త్రీ యొక్క నాలుగు శాఖలు' అంటే రెండు కాళ్లు, రెండు జబ్బలు అని కొంతమంది, రెండు తొడలు మరియు రెండు పిక్కలని మరికొంతమంది విశదీకరించారు. ఏ విధంగా అర్థం తీసుకున్నా అది రతి క్రీడకు సంబంధించిన అంశమేనన్న సంగతి మాత్రం మరువరాదు.

(2) పురుషాంగం స్త్రీ యోనిలోకి ప్రవేశిస్తే చాలు - కనీసం శిశ్నం వరకూ ప్రవేశించినా సరే - గుసుల్ (స్నానం) విధిగా చేయవలసిందే. నలుగురు ధర్మ ఖలీఫాల, నలుగురు ఇమాముల, ప్రవక్త శిష్యుల, ప్రశిష్యుల అభిమతం కూడా ఇదే. ఈ హదీసు ఇంతకు ముందు వచ్చిన హదీసును రద్దుపరుస్తోంది.

(٩٦) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ أُمَّ سُلَيْمٍ – وَهِيَ امْرَأَةُ أَبِي طَلْحَةَ – قَالَتْ: يا رسولَ اللهِ! إِنَّ اللَّهَ لاَ يَسْتَحِي مِنَ الْحَقِّ، فَهَلْ عَلَى الْمَرأَةِ مِنْ غُسْلٍ إِذَا احْتَلَمَتْ؟ قَالَ: «نَعَمْ، إِذَا رَأَتِ الْمَاءَ»، الحديث مُتَّفَقٌ عَلَيْه.

96. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) కథనం: అబూ తల్హా సతీమణి అయిన ఉమ్మె సులైమ్ (ర.అన్‌హా) దైవప్రవక్త (సఅసం) నుద్దేశ్యించి, 'ఓ దైవప్రవక్తా (సఅసం)! అల్లాహ్ సత్యం చెప్పడానికి సిగ్గుపడడు కదా! కాబట్టి స్త్రీకి స్వప్న స్ఖలనం జరిగితే ఆమె కూడా తప్పని సరిగా స్నానం చేయాల్సిందేనా చెప్పండి?, అని అడిగారు. దానికి ఆయన (స), "అవును. ద్రవ పదార్థం ఆమెకు కనిపిస్తే (స్నానం చేయాల్సిందే)" అని బదులిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

సాధారణంగా స్త్రీలు ఇలాంటి విషయాలను అడిగి తెలుసుకోవటానికి సిగ్గు పడుతుంటారు. స్త్రీలలో అల్లాహ్ పొందుపరచిన లజ్జా గుణమే దీనికి ప్రధాన కారణం. ఈ లజ్జా గుణం వల్ల ధర్మ సందేహాలు వెలిబుచ్చకుండా ఉంటే మహిళావని ధర్మ సందేహాలు కూడా తీరవు. హజ్రత్ ఉమ్మె సులైమ్ ఎంతో చాకచక్యంగా దైవప్రవక్త (స) సమక్షంలో తన సందేహాన్ని వెలిబుచ్చి కోట్లాదిమంది మహిళలకు మేలు చేశారు.

### హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె సులైమ్ అసలు పేరు రుమైసా లేక ఘుమైసా బిన్తె మిల్హాన్ అని తెలుస్తోంది. ఈమె హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తల్లి. పండితురాలు. తొలుత ఈమె మాలిక్ బిన్ నసర్‌కు సతీమణిగా ఉన్నారు. ఈమె ఇస్లాం స్వీకరించింది. భర్తను సయితం ఇస్లాం స్వీకరించమని ప్రాధేయపడింది. భర్త ఈమెపై ఆగ్రహించి సిరియా వెళ్లిపోయాడు. అక్కడే మరణించాడు. మాలిక్ బిన్ నసర్ మరణానంతరం అబూ తల్హా (రజి) ఈమెకు వివాహ సందేశం పంపారు. అప్పటికి అబూ తల్హా (రజి) కూడా ముస్లిం కాలేదు. ఇస్లాం స్వీకరిస్తేనే నికాహ్ చేసుకుంటానని ఈమె షరతు విధించింది. ఈ షరతును శిరసావహిస్తూ అబూ తల్హా (రజి) ఇస్లాం స్వీకరించారు. అనంతరం ఉమ్మె సులైమ్ (ర.అన్‌హా) ఈయన్ని వివాహ మాడారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈమె మరణించారు.

(٩٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ، فِي الْمَرأَةِ تَرَى فِي

97. హజ్రత్ అనస్ (రజి) కథనం: కలలో యువకుడైన పురుషుడు చూచినదే స్త్రీ కూడా చూస్తే ఆమె స్నానం (గుసుల్) చేయవలసి ఉంటుందని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

مَنَامِها مَا يَرَى الرَّجُلُ، قال: **تَغْتَسِلُ.** مُتَّفَقٌ عَلَيْه، وَزادَ مُسْلِمٌ: «فَقَالَتْ أُمُّ سَلَمَةَ: وَهَل يَكُونُ هَذا؟ قَالَ: «**نَعَمْ، فَمِنْ أَيْنَ يَكُونُ الشَّبَهُ؟**».

ముస్లిం అదనంగా ఈ వాక్యాలు చేర్చారు: ఉమ్మె సలమా (ర.అన్హా) దైవ ప్రవక్త (సఅసం) సమాధానం విని, 'ఏమిటి, స్త్రీకి కూడా ఇలా అవుతుందా?' అని సందేహపడగా, "అవును, అలా అవని పక్షంలో (పిల్లవాడికి తల్లి) పోలికలు ఎలా వస్తాయనుకున్నావు?" అని పలికారు.

### సారాంశం

పుట్టిన శిశువులకు తండ్రి పోలికలతో పాటు తల్లి పోలికలు కూడా వస్తుంటాయి. తల్లి తరపు బంధువుల పోలికలు కూడా వస్తాయి. సంభోగం జరుపుతున్నప్పుడు పురుషునితో పాటు స్త్రీలో కూడా స్పందన అధికమై ద్రవాలు ఊరుతాయి. ఇవి పుట్టే శిశువు పోలికలపై ప్రభావం చూపుతాయి.

హజ్రత్ ఉమ్మె సలమా (రజి) తీవ్రంగా సందేహం వెలిబుచ్చడాన్నిబట్టి అర్థమయ్యే మరో విషయమేమిటంటే; స్త్రీలలో స్థలనం చాలా అరుదుగా అవుతుంటుంది. పురుషుల మాదిరిగా తరచూ అవదు.

వీర్య స్థలనం (స్వప్న స్థలనం) జరిగినప్పుడు పురుషులు స్నానం చేయటం ఎలా తప్పనిసరో అలాగే స్త్రీలు కూడా తమకు స్వప్న స్థలనం అయినప్పుడు తప్పనిసరిగా స్నానం చేయవలసి ఉంటుంది.

(٩٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَغْتَسِلُ مِنْ أَرْبَعٍ: مِنَ الْجَنَابَةِ، وَيومَ الْجُمُعَةِ، وَمِنَ الحِجَامَةِ، وَمِنْ غُسْلِ الْمَيِّتِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابنُ خُزَيْمَةَ.

98. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాలుగు కారణాలవల్ల గుసుల్ (స్నానం) చేసేవారు - 1. సంభోగించినపుడు. 2. శుక్రవారం వచ్చినపుడు. 3. శరీరం నుండి రక్తం తీసినపుడు. 4. మృతునికి స్నానం చేయించినపుడు. (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

### సారాంశం

నాలుగు పనుల మూలంగా స్నానం చేయవలసి ఉంటుందని ఈ హదీసులో చెప్పబడింది. (1) సంభోగించిన తరువాత స్నానం చేయటం విధి (ఫర్జ్) అన్న విషయంలో సందేహానికి ఆస్కారమే

లేదు. (2) అయితే శుక్రవారం నాడు స్నానం చేయటం చాలామంది సహాబీల, ఇమాముల దృష్టిలో సంప్రదాయం (మస్నూన్) మాత్రమేగాని విధి (ఫర్జ్) కాదు. కాని ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌లు మాత్రం ఈ స్నానాన్ని విధిగా తలపోస్తున్నారు. (3) శరీరం నుండి (చెడు) రక్తం తీసినపుడు స్నానం చేయటం కూడా మస్నూన్ మాత్రమే. ఫర్జ్ కాదు. (4) ఇక, మృతునికి స్నానం చేయించిన మీదట స్నానం చేయటం ముస్తహబ్ (అభిలషణీయం) గా భావించబడుతుంది. అంతేగాని తప్పనిసరి కాదు. ఈ విషయంలో అత్యధికుల అభిమతం ఇదే.

(٩٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رضيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ ثُمَامَةَ بْنِ أُثَالٍ عِنْدَمَا أَسْلَمَ – وَأَمَرَهُ النَّبِيُّ ﷺ أَنْ يَغْتَسِلَ. رَوَاهُ عَبْدُ الرَّزَّاقِ، وَأَصْلُهُ مُتَّفَقٌ عَلَيْهِ.

99. సుమామ బిన్ ఉసాల్ (రజి) ఇస్లాం స్వీకారానికి సంబంధించిన వృత్తాంతాన్ని వివరిస్తూ హజ్రత్ అబూ హురైర (రజి) ఇలా తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనికి స్నానం చేసి రమ్మని ఆదేశించారు." (అబ్దుర్రజ్జాఖ్ దీనిని ఉల్లేఖించారు. దీని మూలాంశం బుఖారీ, ముస్లింలలో పొందుపరచబడి ఉంది).

### సారాంశం

ఒక ముస్లిమేతరుడు ఇస్లాం స్వీకరణకు సిద్ధమైనప్పుడు తొలుత అతను స్నానం చేయాలి. ఈ స్నానం వాజిబా (తప్పనిసరా?) లేక ముస్తహబా (అభిలషణీయమా?) అన్న విషయమై పండితులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో తప్పనిసరి. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల దృష్టిలో అభిలషణీయం.

### హదీసు సూత్రధారి

ఈ హదీసుకు సూత్రధారియైన సుమామ బిన్ ఉసాల్ యమామాకు చెందినవారు. బనూ హనీఫా తెగకు సర్దారు. ఉమ్రా చేయడానికి (మక్కాకు) బయలుదేరారు. దైవప్రవక్త (స) నియమించిన గస్తీ దళానికి పట్టుబడ్డారు. అనంతరం మదీనా మునవ్వరాలో - దైవప్రవక్త (స) సమక్షంలో - హాజరుపరచ బడ్డారు. మస్జిదె నబవీలో ఒక స్థంభానికి మూడు రోజులు బంధించి ఉంచారు. మూడు రోజుల అనంతరం దైవప్రవక్త (స) ఈయన యెడల ఉదార వైఖరినవలంబిస్తూ వదలిపెట్టారు. ప్రవక్త వారి కనికరానికి ప్రభావితుడై ఈయన ఇస్లాం స్వీకరించారు. తుది శ్వాస దాకా ఇస్లాంపై స్థిరంగా ఉన్నారు. తన ప్రాంతంలో ప్రజలు ముసైలమా అబద్ధాలకోరు మాయమాటల్లోపడి ధర్మభ్రష్టులైపోతున్న క్లిష్ట సమయంలో సయితం కదలని కొండలా స్థయిర్యం కనబర్చారు.

(١٠٠) وعَن أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ:

100. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు:

«غُسْلُ يَوْمِ الجُمُعَةِ وَاجِبٌ عَلَى كُلِّ مُحْتَلِمٍ». أَخْرَجَهُ السَّبْعَةُ.

"శుక్రవారం నాడు స్నానం చేయటం ప్రతి యుక్తవయస్కునికీ తప్పనిసరి." (దీనిని ఏడుగురూ -అంటే-బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, అహ్మద్ ఉల్లేఖించారు).

### సారాంశం

శుక్రవారం నాడు స్నానం చేయటం తప్పనిసరి (వాజిబ్) అని వాదించేవారికి ఈ హదీసు ప్రబల ఆధారంగా ఉంది. ఎందుకంటే ఇందులో 'వాజిబ్' అన్న పదం స్పష్టంగా ఉంది. అయితే అధికసంఖ్యాక పండితవర్గం మాత్రం శుక్రవారం నాటి స్నానాన్ని 'మస్నూన్'గా భావిస్తోంది. ఈ హదీసులోని 'వాజిబ్' పదం గట్టిగా నొక్కి చెప్పే ఉద్దేశ్యంతో ఉపయోగించబడిందని వీరంటున్నారు.

(١٠١) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ تَوَضَّأَ يَوْمَ الجُمُعَةِ فَبِهَا وَنِعْمَتْ، وَمَنِ اغْتَسَلَ فَالْغُسْلُ أَفْضَلُ». رَوَاهُ الخَمْسَةُ، وَحَسَّنَهُ التِّرمِذِيُّ

101. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ సమురా (రజి) తెలిపారు: "శుక్రవారం ఎవరయితే 'వుజూ' చేశాడో అతడు మంచిపని చేశాడు. మరెవరయితే 'గుసుల్' (స్నానం) చేశాడో (అతని) గుసుల్ ఎట్టి పరిస్థితిలోనూ శ్రేష్ఠమయినది, ఉత్తమమైనది." (దీనిని ఐదుగురు -అంటే- అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

### సారాంశం

శుక్రవారం నాటి స్నానం తప్పనిసరి (వాజిబ్) కాదని దీనిద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే 'వాజిబ్' అయిన దానిని 'అఫ్జల్' (శ్రేష్ఠమైనది)గా అభివర్ణించరు. బహుశా ఈ కారణంగానే అత్యధికమంది పండితులు దీనిని 'తప్పనిసరి' అన్న అర్థంలో తీసుకోలేదు. అయితే అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న విషయం ఏమిటంటే ముస్లింలు శుక్రవారం నాడు స్నానం చేయటం మరువరాదు. ఈ స్నానం గురించి గట్టిగా చెప్పబడిందని ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) అన్నారు. వితర్ నమాజు 'వాజిబ్' అన్న అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నప్పుడు శుక్రవారం నాటి స్నానం అంతకన్నా ఎక్కువగానే పరిగణణలోకి తీసుకోదగ్గదవుతుంది.

## హదీసు ఉల్లేఖకులు

పూర్తిపేరు సమురా బిన్ జున్దుబ్. సుప్రసిద్ధ సహాబీ. ఈయన మారు పేరు అబూ అబ్దుల్లాహ్.

ఫజార్ తెగ వారవటంచేత ఫజారీ అని కూడా పిలువబడేవారు. అన్సారులతో మైత్రీ సంబంధాలుండేవి. ఖుర్ఆన్ హదీసులలో చాలా భాగం కంఠస్థం చేసుకున్నవారిలో ఈయన ఒకరు. బస్రాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. 'హరూరియ' వర్గంపట్ల చాలా కఠిన మనస్కులై ఉండేవారు. హిజ్రీ 59లో మరణించారు.

(١٠٢) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يُقْرِئُنَا الْقُرْآنَ مَا لَمْ يَكُنْ جُنُباً. رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَهَذَا لَفْظُ التِّرْمِذِيِّ، وَحَسَّنَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

102. హజ్రత్ అలీ (రజి) తెలిపారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లైంగిక అశుద్ధతకు లోనై వున్నప్పుడు తప్ప మిగిలిన ఏ స్థితిలోనయినా మాకు ఖుర్ఆన్ చదివించేవారు." (దీనిని ఐదు గురు - అంటే - అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం తిర్మిజీ లోనివి. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు).

**సారాంశం**

లైంగిక అశుద్ధతకు గురైవున్న పురుషుడు దివ్య ఖుర్ఆన్‌ను పఠించరాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. గుసుల్ చేసే వరకూ ఖుర్ఆన్‌ను ముట్టుకోవటంగానీ, పారాయణం చేయటంగానీ చేయరాదు.

(١٠٣) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا أَتَى أَحَدُكُمْ أَهْلَهُ، ثُمَّ أَرَادَ أَنْ يَعُودَ، فَلْيَتَوَضَّأْ بَيْنَهُمَا وُضُوءًا». رَوَاهُ مُسْلِمٌ، زَادَ الْحَاكِمُ: «فَإِنَّهُ أَنْشَطُ لِلْعَوْدِ».

103. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరయినా మీ భార్య వద్దకు పోతే (సంభోగిస్తే), మరోసారి కూడా ఆనందానుభూతి పొందాలన్న కోర్కె కలిగితే - మధ్యలో 'వుజూ' చేసుకోండి." (ముస్లిం)

وَلِلأَرْبَعَةِ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى

హాకిమ్ అదనంగా ఈ వాక్యం చేర్చారు: (ఈ వుజూ) మలిసారి సంభోగానికి ఎక్కువ హాయినీ, తాజాదనాన్నిస్తుంది.

عَنْهَا، قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَنَامُ وَهُوَ جُنُبٌ، مِنْ غَيْرِ أَنْ يَمَسَّ مَآءً. وَهُوَ مَعْلُولٌ.

సునని అరబా (అంటే అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ)లో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారిచే ఇలా ఉల్లేఖించబడింది: "దైవప్రవక్త - (సల్లల్లాహు అలైహి వ సల్లం) -లైంగిక అశుద్ధతకు లోనై వున్న తరుణంలో నీళ్లను తాకకుండానే నిద్రించేవారు." (ఈ ఉల్లేఖనం లోపభూయిష్టమైనది).

**సారాంశం**

పై హదీసు వెలుగులో స్పష్టమయ్యేదేమిటంటే అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించిన హదీసులోని 'వుజూ చేయాలన్న ఆదేశం' 'ముస్తహబ్' మాత్రమే గాని 'వాజిబ్' కాదు.

'ముస్లిం' ఉల్లేఖనం ప్రకారం రూఢీ అయ్యేదేమిటంటే, ఆయన (స) అన్న పానీయాల నిమిత్తం, సంభోగం నిమిత్తం మర్మాంగాన్ని కడుక్కొని, వుజూ చేసేవారు. విద్వాంసులలో అధిక సంఖ్యాకులు ఈ వుజూను తప్పనిసరిగా భావించలేదు. అభిలషణీయంగా మాత్రమే తలపోశారు.

(١٠٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ. كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا اغْتَسَلَ مِنَ الْجَنَابَةِ يَبْدَأُ فَيَغْسِلُ يَدَهُ، ثُمَّ يُفْرِغُ بِيَمِيْنِهِ عَلَى شِمَالِهِ فَيَغْسِلُ فَرْجَهُ، ثُمَّ يَتَوَضَّأُ ثُمَّ يَأْخُذُ الْمَآءَ فَيُدْخِلُ أَصَابِعَهُ فِي أُصُولِ الشَّعْرِ، ثُمَّ حَفَنَ عَلَى رَأْسِهِ ثَلَاثَ حَفَنَاتٍ، ثُمَّ أَفَاضَ عَلَى سَائِرِ جَسَدِهِ، ثُمَّ غَسَلَ رِجْلَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمسْلِمٍ.

104. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఇలా వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లైంగిక అశుద్ధత నుండి పరిశుద్ధత పొందే నిమిత్తం స్నానానికి ఉపక్రమించినపుడు మొదట చేతులు కడుక్కునేవారు. తరువాత కుడిచేత్తో ఎడమచేతిపై నీరు పోసి తన మర్మ స్థానాన్ని కడిగేవారు. ఆ తరువాత వుజూ చేసేవారు. ఆపైన నీళ్లు తీసుకుని తన చేతివ్రేళ్లతో తలవెంట్రుకల వ్రేళ్ల భాగం సయితం తడిసేలా నీరు పోసే వారు. ఆపైన దోసిట్లో నీళ్లు తీసుకుని మూడుసార్లు తలపై నీరు పోసేవారు. ఆపైన శరీరమంతటిపై నీళ్లు పోసుకునే వారు. ఆఖరిలో కాళ్లు కడిగేవారు. (బుఖారీ, ముస్లిం. హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

وَلَهُمَا فِي حَدِيْثِ مَيْمُوْنَةَ: «ثُمَّ أَفْرَغَ عَلَى فَرْجِهِ وَغَسَلَهُ بِشِمَالِهِ، ثُمَّ ضَرَبَ بِهَا الأَرْضَ».

బుఖారీ, ముస్లింలలోనే హజ్రత్ మైమూన (ర.అన్‌హా) ఉల్లేఖనం ఇలా ఉంది: మరి తన మర్మ స్థానంపై నీరు పోసేవారు. తన ఎడమ చేత్తో దాన్ని కడిగేవారు. చేతులను నేలపై కొట్టి మట్టితో బాగా తోముకునేవారు (శుభ్ర పరచుకునేవారు).

وَفِيْ رِوَايَةٍ: «فَمَسَحَهَا بِالتُّرَابِ». وَفِي آخِرِهِ: «ثُمَّ أَتَيْتُهُ بِالْمِنْدِيْلِ فَرَدَّهُ»، وَفِيْهِ: «وجَعَلَ يَنْفُضُ الْمَاءَ بِيَدِهِ».

వేరొక ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మరి రెండు చేతులనూ మట్టితో తోమి, బాగా శుభ్రపరచుకునేవారు." ఈ ఉల్లేఖనం ఆఖరిలో ఇలా ఉంది: "నేను ఆయన (సఅసం)సేవలో తువాలు సమర్పించాను. కాని ఆయన (స) దానిని వాపసు చేశారు (శరీరంపై వున్న నీటి బిందువులను) చేత్తోనే తుడిచేశారు."

## సారాంశం

పై హదీసు వెలుగులో కొన్ని విషయాలను ఇక్కడ వివరించటం అవసరం. వివిధ హదీసులను కలిపిన తర్వాత బోధపడేదేమిటంటే గుసుల్‌కు (స్నానానికి) ముందు ఆయన (స) చేతులను కడిగేవారు. ఎన్నిసార్లు కడిగేవారో ప్రస్తావించబడలేదు. ఉమ్ముల్ మోమినీన్ మైమూన (ర.అన్‌హా) ఉల్లేఖనం ద్వారా రెండు లేక మూడుసార్లు కడిగేవారని తెలుస్తోంది. తరువాత ఆయన (స) తన మర్మస్థానం కడుక్కునేవారు. అటు తరువాత అరచేతులను నేలపై అదిమి, మట్టితో తోమి శుభ్రపరచుకునేవారు. ఆపైన నమాజ్ నిమిత్తం ఎలా గుసుల్ చేసేవారో సరిగ్గా అలాగే గుసుల్ (స్నానం) చేసేవారు. తలపై నీరు పోసుకునేటప్పుడు చేతి వ్రేళ్ళను జుత్తులోనికి జొప్పించి వెంట్రుకలు పూర్తిగా తడిసేలా జాగ్రత్త వహించేవారు. ఆ తర్వాత శరీరమంతటిపై నీరు ప్రవహింపజేసేవారు. ఆఖరిలో కాళ్లు కడుక్కునేవారు. మొదట ఒక ప్రక్కకు జరిగి, పిదప రెండు కాళ్లపై నీరు పోసుకునేవారని హజ్రత్ మైమూన (ర.అన్‌హా) కథనంలో ఉంది. ఈ గుసుల్‌లో భాగంగా చేసుకున్న వుజూతోనే ఆయన (స) ఉదయం పూట సున్నత్ - రెండు రకతులు, ఫర్జ్ రెండు రకతుల నమాజ్ చేసేవారు. అంటే గుసుల్ తరువాత, వేరుగా వుజూ చేసేవారు కాదు.

ఈ హదీసు ద్వారా విదితమయ్యే ఇంకొక విషయమేమిటంటే గుసుల్ మరియు వుజూ తరువాత ముఖానికి, శరీరానికి, చేతులకు అంటుకున్న నీరును తుడవడానికి రుమాలును ఉపయోగించటం తప్పనిసరి కాదు. అలాగే చేతులతో వుజూ నీటి బిందువులను తుడుచుకోవటం కూడా ఆక్షేపణీయం కాదు. చేత్తో నీటి బిందువులను తొలగించరాదన్న హదీసు బలహీనమైనది. ప్రామాణికమైన హదీసు ముందు బలహీనమైన హదీసుకు ఎలాంటి స్థానం లేదు.

(١٠٥) وعَنْ أُمِّ سَلَمَةَ رضي الله تعالى عنها قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنِّي امْرَأَةٌ أَشُدُّ شَعَرَ رَأْسِي، أَفَأَنْقُضُهُ لِغُسْلِ الجَنَابَةِ؟ وَفِيْ رِوَايَةٍ: وَلِلْحَيْضَةِ؟ فَقَالَ: **لاَ، إِنَّمَا يَكْفِيْكِ أَنْ تَحْثِي عَلَى رَأْسِكِ ثَلاَثَ حَثَيَاتٍ.** رَوَاهُ مُسْلِمٌ.

105. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) తెలిపారు: "ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను నా శిరోజాలను గట్టిగా ముడివేస్తాను. సంభోగానంతరం స్నానం చేసేటప్పుడు ముడి విప్పటం అవసరమా?" వేరొక ఉల్లేఖనంలో "రుతుస్రావం తరువాత స్నానం చేసేటప్పుడు" అని ఉంది. దీనికి ఆయన (సఅసం) "లేదు. (ముడి విప్పవలసిన అవసరం లేదు). నువ్వు నీ తలపై మూడు దోసిట్ల నీరు పోస్తే అదే చాలు" అని సమాధానమిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

లైంగిక అశుద్ధతకు లోనైన స్త్రీ లేక రుతుస్రావం అయిన స్త్రీ పరిశుద్ధతను పొందే సంకల్పంతో స్నానం చేసేటప్పుడు ముడి విప్పి శిరోజాలన్నింటినీ తడపవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా అవగతమవుతుంది. అయితే ఆయన (స); శిరోజాలను విప్పవలసిందిగా ఆజ్ఞాపించినట్లు హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనంలో ఉంది. అయితే ఈ రెండు ఉల్లేఖనాలూ పరస్పర విరుద్ధమైనవి కూడా కావు. ఎందుకంటే శిరోజాలను విప్పాలన్న ఆజ్ఞ కేవలం 'అభిలషణీయం' అన్న ఉద్దేశ్యంతోనే ఇవ్వబడింది. అంతేగాని సంభోగానంతరం మరియు రుతుస్రావం ఆగిన తరువాత స్నానం చేసే సమయంలో స్త్రీలు ముడిని తప్పనిసరిగా విప్పాల్సిందేనన్న నిబంధన ఏదీ లేదు. తల వెంట్రుకలు మొలిచే మొదళ్లలోకి నీరు ప్రవేశించి, తల చర్మం పూర్తిగా తడిస్తే చాలు.

స్త్రీలు సంభోగం తరువాత, రుతుస్రావం తరువాత స్నానం చేసేటప్పుడు శిరోజాలన్నింటినీ విప్పి మరీ తడపవలసిందిగా హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆజ్ఞాపిస్తున్నారని ఎవరో చెప్పగా విని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఆశ్చర్య చకితులయ్యారు. ఆ సందర్భంగా ఆమె ఇలా స్పందించారు: "శిరోజాలు విప్పమని అబ్దుల్లాహ్ (రజి) స్త్రీలకు ఎలా ఆదేశిస్తున్నారో అర్థం కావటం లేదు. ఇంకా నయం, గుండు చేయించుకోమని చెప్పారు కాదు. నేను మరియు దైవప్రవక్త (స) ఒకే గంగాళం నుంచి నీరు తీసుకుని స్నానం చేసేవాళ్లము. నేను కేవలం మూడుసార్లు తలపై నీరు పోసుకునే దానిని. ముడివిప్పవలసిన అగత్యమే ఏర్పడేది కాదు." (ముస్లిం, ముస్నద్ అహ్మద్)

(١٠٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «**إِنِّي لاَ**

106. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నేను రుతుస్రావానికి గురైవున్న

أُحِلُّ الْمَسْجِدَ لِحَائِضٍ وَلاَ جُنُبٍ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

స్త్రీని, లైంగిక అశుద్ధతకు లోనై వున్న పురుషుడినీ మస్జిద్‌లోకి ప్రవేశించడానికి సమ్మతించను." (అంటే అశుద్ధావస్థలో వారిరువురూ మస్జిద్‌లోకి వెళ్ళ లేరు). (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

### సారాంశం

రుతుస్రావానికి గురై వున్న స్త్రీగానీ, లైంగిక అశుద్ధతకు లోనైవున్న పురుషుడు గానీ మస్జిద్‌లో ఆగటంగానీ, మస్జిద్‌లోకి ప్రవేశించటంగానీ ధర్మసమ్మతం కాదని ఈ హదీసు స్పష్టపరుస్తోంది. అయితే వారిరువురూ సాగిపోవటానికి మస్జిద్ మినహా మరొక మార్గాంతరం లేనపుడు - ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయీల దృష్టిలో - సాగిపోవటం సమ్మతమే. కాని ఇమామ్ అబూ హనీఫా దృష్టిలో ఎట్టి పరిస్థితిలోనూ మస్జిద్ గుండా పోవటం సమ్మతం కాదు. ఈ హదీసు కూడా ఇమామ్ అబూ హనీఫా గారి అభిప్రాయాన్నే బలపరుస్తోంది.

నడచిపోవటం ధరమ్మసమ్మతమే అని భావించేవారు దివ్య ఖుర్‌ఆన్‌లోని వచనాన్ని ఉదాహరిస్తున్నారు. ఆ వచనంలో ఇలా ఉంది: "లైంగిక అశుద్ధతకు లోనైవున్న వాడు మస్జిద్‌లోకి వెళ్ళరాదు. ఒకవేళ మస్జిద్‌లోనుంచి వెళ్ళటం అనివార్యమైతే - గత్యంతరం లేని స్థితిలో వెళ్ళవచ్చు."

సదరు హదీసు కూడా మస్జిదులో ఆగరాదనే అంటున్నదిగానీ నడచివెళ్ళరాదని అనటంలేదు. ఏ మనిషైనా మస్జిద్‌లో నిద్రపోయిన తరువాత అతను (స్వప్న స్థలనంవల్ల) లైంగిక అశుద్ధతకు లోనైతే తక్షణం మస్జిద్ నుంచి వెడలిపోవాలి.

(١٠٧) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أَغْتَسِلُ أَنَا وَرَسُولُ اللهِ ﷺ مِنْ إِنَاءٍ وَاحِدٍ، تَخْتَلِفُ أَيْدِينَا فِيهِ، مِنَ الْجَنَابَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ ابْنُ حِبَّانَ: «وَتَلْتَقِي».

107. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారి చేతనే ఇలా ఉల్లేఖించబడింది: "నేను మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇద్దరం ఒకే బానలోనుంచి (నీరు తీసుకుని) లైంగిక అశుద్ధతను దూరంచేసే స్నానం చేసేవాళ్లం. ఆ బానలో మా చేతులు ఒకరి తరువాత ఒకరివి పడేవి. ఒక్కోసారి ఒకరి చేయి మరొకరి చేతికి తగిలేది."

### సారాంశం

భార్యాభర్తలిరువురూ ఏక కాలంలో ఒకే పాత్ర నుంచి నీళ్లు ముంచుకుని స్నానం చేయటంలో తప్పులేదని పై హదీసు ద్వారా విదితమవుతున్నది.

(١٠٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ تَحْتَ كُلِّ شَعَرَةٍ جَنَابَةً، فَاغْسِلُوا الشَّعَرَ، وَأَنْقُوا الْبَشَرَ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَضَعَّفَاهُ، وَلِأَحْمَدَ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا نَحْوُهُ، وَفِيهِ رَاوٍ مَجْهُولٌ.

108. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ప్రతి వెంట్రుక అడుగున (మొదలులో) లైంగిక అశుద్ధతా ప్రభావం ఉంటుంది. కనుక వెంట్రుకలను (బాగా) తడిపి కడగండి. శరీరాన్ని బాగా (తోమి) శుభ్రపరచండి." (అబూ దావూద్, తిర్మిజీ లిరువురూ దీనిని ఉల్లేఖించారు. దాంతోపాటు దీనిని 'బలహీనమైనది'గా కూడా నిర్ధారించారు. ముస్నద్ అహ్మద్‌లో కూడా హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ద్వారా ఇదే విధంగా ఉల్లేఖించబడింది. ఈ పరంపరలో ఒక ఉల్లేఖకుడు అపరిచితుడు).

**సారాంశం**

సంభోగించిన మీదట స్నానం చేసినపుడు శరీరంలో వెంట్రుకవాసి భాగం కూడా పొడిగా ఉండకుండా - పూర్తిగా తడపాలని, శరీరాన్ని బాగా తోమి శుభ్రం చేయాలని పై హదీసు వెల్లడిస్తోంది. అయితే పుక్కిలించే, ముక్కులోనికి నీరు ఎక్కించే విషయమై పుకహాల (ధర్మవేత్తల) మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. హనఫీ ఫికహ్ ననుసరించి ఇది కూడా ఫర్జ్ (విధి)గా పరిగణించబడుతుంది. ఇమామ్ అహ్మద్ అభిమతం కూడా ఇదే. ఇమామ్ షాఫయి దృష్టిలో మాత్రం ఇది మస్నూన్ (సంప్రదాయం).

మొత్తానికి హదీసు వెలుగులో బోధపడే మౌలికాంశం ఏమిటంటే లైంగిక అశుద్ధతను తొలగించే స్నానం చేసినపుడు శరీరమంతటినీ పూర్తిగా తడిపిమరీ శుభ్రపరచాలి.

**9వ అధ్యాయం**

## ٩ - بَابُ التَيَمُّمِ

## తయమ్ముమ్

(١٠٩) عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**أُعْطِيتُ خَمْسًا لَمْ يُعْطَهُنَّ أَحَدٌ قَبْلِي، نُصِرْتُ بِالرُّعْبِ مَسِيرَةَ شَهْرٍ، وَجُعِلَتْ لِيَ الْأَرْضُ**

109. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: "నాకు పూర్వం ఎవరికీ ఇవ్వబడని ఐదు వస్తువులు నాకు ప్రసాదించబడ్డాయి - నాకు ఒక

مَسْجِداً وَطَهُوراً، فَأَيُّمَا رَجُلٍ أَدْرَكَتْهُ الصَّلاَةُ فَلْيُصَلِّ». وذَكَرَ الْحَدِيْثَ.

మాసపు ప్రయాణ దూరంతోనే (శత్రువును) హడలించే శక్తి ఇవ్వబడింది. సమస్త భూమండలం నా కొరకు సజ్దా స్థలంగా, శుచీశుభ్రతల సాధనంగా చేయ బడింది. ఇక ఎవరికి (ఎక్కడ) నమాజ్ సమయం ఆసన్నమయినా అతడు (అక్కడే) నమాజ్ చేసుకోవాలి." ముందు మొత్తం హదీసు ప్రస్తావించబడుతుంది.

وَفِيْ حَدِيْثِ حُذَيْفَةَ عِنْدَ مُسْلِمٍ: «وَجُعِلَتْ تُرْبَتُهَا لَنَا طَهُوراً إِذَا لَمْ نَجِدِ الْمَآءَ».

ముస్లింలో హజ్రత్ హుజైఫా (రజి) ద్వారా ఇలా ఉల్లేఖించబడింది - "మనకు నీరు లభ్యం కానపుడు నేలలోని మట్టి మన కొరకు పరిశుభ్రతా ప్రాప్తికై పవిత్రం గావించబడింది."

وَعَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ عَنْهُ، عِنْدَ أَحْمَدَ: «وَجُعِلَ التُّرَابُ لِيَ طَهُوراً».

ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ అలీ (రజి) చే ఇలా తెలుపబడింది-"మట్టి నా కొరకు పరిశుభ్రత నొసగే సాధనంగా చేయ బడింది."

## సారాంశం

ఈ హదీసులో నుంచి రచయిత దైవప్రవక్త (స)కు ప్రసాదించబడిన రెండు విశిష్ట వరాలను మాత్రమే ప్రస్తావించారు. మిగిలిన మూడు అనుగ్రహాలలో ఒకటి విజయప్రాప్తి; అంటే యుద్ధ సమయాలలో శత్రువుల నుండి ముస్లిం సేనలకు స్వాధీనమైన ధనాన్ని సమస్త ముస్లిం సమాజం కొరకు దేవుడు ధర్మసమ్మతం చేశాడు. అలాగే ప్రళయదినాన మానవాళికి క్షమాభిక్షపెట్టమని దైవ సమక్షంలో సిఫారసు చేసే అవకాశం కూడా మహాప్రవక్తకే ఇవ్వబడుతుంది. ఇంకా దేవుడు ఆయన్ని (స) భూమండలంలోని సమస్త మానవుల కోసం, జిన్నుల కోసం ప్రవక్తగా నియుక్తం చేశాడు. రచయిత ఈ చివరి మూడు విశిష్ట అనుగ్రహాలను మినహాయించి తహారత్, నమాజ్‌లకు సంబంధించిన రెండు విశిష్ట వరాలనే ప్రస్తావించారు.

నీరు లభ్యం కాని పరిస్థితిలో తయమ్ముమ్ చేసుకునే సౌలభ్యం కల్పించి ఇస్లామీయ షరీయత్ ముస్లిం సమాజంపై ఎంతగానో దయదలిచింది, నేలలోని ఏ భాగంతోనయినా తయమ్ముమ్ చేసుకోవచ్చు. నేలలో నుంచి లభించే ఖనిజాలతో కూడా తయమ్ముమ్ చేయవచ్చు. అయితే వాటిపై దుమ్ము ధూళి పేరుకుని ఉండటం అవసరం.

(١١٠) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: بَعَثَنِي النَّبِيُّ ﷺ فِي حَاجَةٍ، فَأَجْنَبْتُ، فَلَمْ أَجِدِ الْمَاءَ، فَتَمَرَّغْتُ فِي الصَّعِيدِ، كَمَا تَمَرَّغُ الدَّابَّةُ، ثُمَّ أَتَيْتُ النَّبِيَّ ﷺ، فَذَكَرْتُ لَهُ ذَلِكَ، فَقَالَ: **إِنَّمَا كَانَ يَكْفِيكَ أَنْ تَقُولَ بِيَدَيْكَ هَكَذَا، ثُمَّ ضَرَبَ** بِيَدَيهِ الأَرْضَ ضَرْبَةً وَاحِدَةً، ثُمَّ مَسَحَ الشِّمَالَ عَلَى الْيَمِينِ وظَاهِرَ كَفَّيْهِ وَوَجْهَهُ. متفق عليه وَاللَّفْظُ لِمُسْلِمٍ.

110. హాజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను ఒక అవసరార్థం పంపించారు: నేను (వీర్య స్ఖలనం వల్ల) అశుద్ధతకు లోనయ్యాను. నాకు నీరు లభించలేదు. అందుచేత నేను క్రిందపడి మట్టిలో ఒక చతుష్పాదం (జంతువు) వలే దొర్లాను. (అవసరం నెరవేరిన) తరువాత నేను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి జరిగినదంతా వివరించాను. "నీవు చేత్తో ఈవిధంగా చేయాల్సింది" అని ఆయన (స) చెప్పారు. తరువాత ఆయన (స) తన రెండు అర చేతులనూ ఒకసారి నేలపై కొట్టారు. ఎడమ చేతిని కుడి చేతిపై రుద్దారు. ఆ తర్వాత చేతుల ఉపరితలాన్ని, ముఖాన్ని తుడుచుకున్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి).

وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ «وَضَرَبَ بِكَفَّيْهِ الأَرْضَ، وَنَفَخَ فِيهِمَا، ثُمَّ مَسَحَ بِهِمَا وَجْهَهُ وَكَفَّيْهِ.

బుఖారీ ఉల్లేఖనంలోని చివరి వాక్యం ఇలా ఉంది: "తన రెండు అరచేతుల్ని నేలపై కొట్టిన పిదప నోటితో ఊది దుమ్ము ధూళిని దూరం చేశారు. తరువాత వాటిని ముఖంపై, చేతులపై రుద్దుకున్నారు."

### సారాంశం

చేతుల్ని ఒకేసారి (పరిశుభ్రమైన) నేలపై కొడితే సరిపోతుందని హదీసుద్వారా స్పష్టంగా రూఢీ అవుతోంది. 'తయమ్ముమ్'లో ఉన్న సౌలభ్యాలలో ఇదీ ఒకటన్నది గమనార్హం. ఒకసారి చేతికి అంటిన ధూళి ముఖం మరియు చేతుల్ని రుద్దుకోవటానికి సరిపోతుంది. ఈ అధ్యాయంలో వచ్చిన హదీసులలో అత్యంత ప్రామాణికమైనది ఇదే. అత్యధికమంది హదీసువేత్తల, ధర్మవేత్తల విధానం కూడా ఇదే. కాగా, చేతుల్ని రెండుసార్లు నేలకు కొట్టాలన్న ఉల్లేఖనం బలహీనమైనది. హనఫీ మరియు షాఫయీ విధానాన్ని అనుసరించేవారు చేతుల్ని రెండుసార్లు నేలకు (ఒకసారి

ముఖం కోసం, మరోసారి చేతుల్ని రుద్దడం కోసం) కొట్టాలని భావిస్తున్నారు. పై హదీసులోని (బుఖారీలో పొందుపరచబడిన) చివరి వాక్యం దీనికి బలం చేకూరుస్తుంది.

ఇక అమ్మార్ బిన్ యాసిర్ గారి ఇజ్తెహాద్ (అన్వయింపు)ను చూద్దాం. నీరు లభ్యం కాకపోవటం వల్ల ఆయన (రజి) తన బుద్ధి వివేకాలకు పదునుపెట్టి నేలపై దొర్లటం మొదలుపెట్టారు. స్నానం చేసేటప్పుడు నీళ్లతో శరీరమంతా తడుపుతారు గనక, తయమ్ముమ్ దీనికి ప్రత్యామ్నాయం గనక, శరీరమంతటికీ మట్టి తగలటం తప్పనిసరి కాబోలు! అని ఆయన బుద్ధి ఆయనకు మార్గం చూపింది. తదనుగుణంగా ఆయన అలా ఆచరించారు. విషయ పరిజ్ఞానం లేకపోవటం మూలంగా ఆయన అంచనాలపై ఆధారపడ్డారు. అసలు విషయం ముందుకు వచ్చిన మీదట అంచనాలకు ఏపాటి ప్రాముఖ్యమూ ఉండబోదు. కనుక అంచనాలకు, అన్వయింపులకు స్వస్తి పలికి 'అసలు'ను గట్టిగా పట్టుకోవాలి.

దైవప్రవక్త (సఅసం) గారి ఆచరణ వల్ల విదితమయ్యే మరో ముఖ్యాంశం ఏమిటంటే; చేతుల్ని నేలపై కొట్టిన పిదప నోటితో ఊదటం 'మస్నూన్'. నీరు లభ్యం కాని పక్షంలో అశుద్ధతకు లోనైన వ్యక్తి ఈ మాత్రం ప్రయాసపడితే చాలు - అతడు పరిశుద్ధుడైపోతాడు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన అమ్మార్ బిన్ యాసిర్ (రజి) తొల్దొలి ప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు. ఇస్లాం స్వీకరించిన కారణంగా మక్కాలో ముష్రిక్కులు ఈయన్ని చిత్రహింసలు పెట్టారు. అయినా ఈయనగారి నిలకడ చెక్కుచెదరలేదు. దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు (ఒక హిజ్రత్ అబిసీనియా వైపునకు, మరో హిజ్రత్ మదీనా వైపునకు) చేశారు. బద్ర్ యుద్ధంతో సహా ముఖ్య సంగ్రామాలన్నింటిలోనూ పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన గురించి ఇలా చెప్పారు: ''అమ్మార్! విచారకరమయిన విషయం ఏమిటంటే తిరుగుబాటు వర్గం ఒకటి నిన్ను హతమారుస్తుంది.'' హిజ్రీ 36లో సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా హజ్రత్ ముఆవియ (రజి) మరియు హజ్రత్ అలీ (రజి)ల సైనిక దళాలలోని ఒక తిరుగుబాటు వర్గం ఈయన్ని దారుణంగా హత్య చేసింది. అప్పటికి ఆయన వయస్సు 73 సంవత్సరాలు.

(١١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «التَّيَمُّمُ ضَرْبَتَانِ، ضَرْبَةٌ لِلْوَجْهِ، وَضَرْبَةٌ لِلْيَدَيْنِ إِلَى الْمِرْفَقَيْنِ» .رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَ الْأَئِمَّةُ وَقْفَهُ.

111. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "తయమ్ముమ్ రెండు సార్లు (నేలకు) కొట్టడం వల్ల పూర్తవుతుంది. ఒక దెబ్బ ముఖం (రుద్దడం) కోసం, మరో దెబ్బ మోచేతుల సమేతంగా రెండు చేతుల (ను రుద్దడం) కోసం." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఇతర ఇమాములు ఇది 'మౌఖూఫ్' కావడాన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు).

**సారాంశం**

ఈ హదీసును అందజేసిన పరంపరలో లోపం ఏర్పడిన కారణంగా హదీసువేత్తలు దీనిని బలహీనమైన హదీసుగా నిర్ధారించారు.

(١١٢) وَعَنْ أَبِي هُرَيرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الصَّعِيدُ وَضُوءُ الْمُؤْمِنِ الْمُسْلِمِ، وَإِنْ لَمْ يَجِدِ الْمَاءَ عَشْرَ سِنِينَ، فَإِذَا وَجَدَ الْمَاءَ فَلْيَتَّقِ اللَّهَ، وَلْيُمِسَّهُ بَشَرَتَهُ**». رَوَاهُ الْبَزَّارُ، وَصَحَّحَهُ ابنُ الْقَطَّانِ، وَلٰكِن صَوَّبَ الدَّارَقُطْنِيُّ إِرسَالَهُ، وَلِلتِّرمِذِيِّ عَنْ أَبِي ذَرٍّ نَحْوُه، وَصَحَّحَهُ وَالْحاكِمُ أَيضاً.

112. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మన్ను విశ్వాసి అయిన ముస్లిం పాలిట 'వుజూ' లాంటిది - పదేళ్ళ వరకూ నీరు లభ్యం కాకపోయినాసరే! అయితే నీరు లభ్య మవగానే దైవానికి భయపడాలి. అప్పుడు అతను తన శరీరంపై నీరు పోసు కోవాలి." (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. ఇబ్నుల్ ఖత్తాన్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. అయితే దారె ఖుత్నీ దీనిని 'ముర్సల్' గా నిర్ధారిం చారు. తిర్మిజీలో హజ్రత్ అబూజర్ (రజి) చేత కూడా ఇలాగే ఉల్లేఖించబడింది - దీనిని తిర్మిజీ ప్రామాణికమైనదని ధృవీక రించారు. హాకిమ్ సయితం దీనిని 'ప్రామాణికం' అని అన్నారు.

**సారాంశం**

ఈ హదీసులో 'తయమ్ముమ్' వుజూగా ఖరారు చేయబడింది. అంటే 'తయమ్ముమ్' 'వుజూ'కు ప్రత్యామ్నాయం అన్నమాట! ఇది నీరుకు ప్రత్యామ్నాయం అయినపుడు ఆ రెంటికి సంబంధించిన ఆజ్ఞలు కూడా ఒకేవిధంగా ఉంటాయి, ఉండాలి కూడా. అంటే ఒక వుజూతో మనిషి ఎన్ని నమాజులు చేయగలుగుతాడో అన్ని నమాజులు తయమ్ముమ్‌తో కూడా చేయగలడు. అయితే కొంతమంది - ఈ హదీసు ఆధారంగా - తయమ్ముమ్ ద్వారా అశుద్ధత దూరం కాజాలదని అభిప్రాయపడ్డారు. తయమ్ముమ్ ద్వారా తాత్కాలికంగా నమాజ్ చేసేందుకు మార్గం మాత్రం సుగమమవుతుందని వీరంటారు. నమాజ్ ముగియగానే తయమ్ముమ్‌కు పూర్వం వున్న స్థితికే అతను లోనవుతాడని ఈ వర్గం వాదిస్తోంది.

హనఫీ మస్లక్‌ను పాటించేవారు మాత్రం మొదటి పద్ధతికే కట్టుబడి ఉన్నారు - అంటే ఒకసారి చేసిన తయమ్ముమ్‌తో (అది భంగం కాకుండా ఉన్నంతవరకూ) ఎన్ని విధులైనా నిర్వర్తించవచ్చునని హనఫీలు భావిస్తున్నారు. సయీద్ బిన్ ముసైబ్, హసన్ బస్రీ, జహ్రీ, సుఫియాన్ సౌరీల అభిప్రాయం కూడా ఇదే.

అయితే ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌ల అభిప్రాయం మరో విధంగా ఉంది. వారి దృష్టిలో తయమ్ముమ్ ద్వారా పూర్తిస్థాయి శుచీ, శుభ్రత ప్రాప్తం కాదు. అది గత్యంతరం లేని స్థితిలో - అవసరం తీరడానికి - అనుసరించే ఒక తాత్కాలిక పద్ధతి మాత్రమేననీ, ఏ విధిని నెరవేర్చే సంకల్పంతో తయమ్ముమ్ చేసుకోవటం జరిగిందో అదొక్కటే దానివల్ల నెరవేరుతుందని ఈ ప్రముఖులు తలపోస్తున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులలో ఒకరైన అబూజర్ (రజి) అసలు పేరు జున్దుబ్ బిన్ జునాదా. దైవభక్తి పరాయణులు, సాత్వికులు. భవబంధాల పట్ల ఆసక్తి లేనివారు. మక్కాలోనే ఇస్లాం స్వీకరించారు. తరువాత తన జాతి వారి వైపునకు వెళ్ళిపోయారు. మదీనాలో తిరిగి దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యారు. 'రబ్జా' అనే చోట స్థిర నివాసమేర్పరచుకున్నారు. హిజ్రీ 32లో కన్నుమూశారు. సదాచార సంపన్నులు. దేవునిపై అచంచలమైన భక్తీ విశ్వాసం కలవారు.

(١١٣) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدرِيِّ رَضِيَ اللَّهُ تَعالَى عَنْهُ، قَالَ: خَرَجَ رَجُلاَن فِي سَفَرٍ، فَحَضَرَتِ الصَّلاَةُ، وَلَيْسَ مَعَهُمَا مَاءٌ، فَتَيَمَّمَا صَعِيْداً طَيِّباً، فَصَلَّيَا، ثُمَّ وَجَدَا الْمَاءَ فِي الْوَقْتِ، فَأَعَادَ أَحَدُهُمَا الصَّلاَةَ، وَالوُضُوءَ، وَلَمْ يُعِدِ الآخَرُ، ثُمَّ أَتَيَا رَسُولَ اللَّهِ ﷺ، فَذَكَرا ذَلِكَ لَهُ، فَقَالَ لِلَّذِي لَمْ يُعِدْ: «**أَصَبْتَ السُّنَّةَ، وَأَجْزَأَتْكَ صَلاَتُكَ**»، وَقَالَ لِلآخَرِ: «**لَكَ الأَجْرُ مَرَّتَيْنِ**». رَوَاه أَبُو دَاوُدَ وَالنَّسائِيُّ.

113. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలిపారు: ఇద్దరు వ్యక్తులు ప్రయాణానికి బయలుదేరారు. నమాజ్ వేళ అయింది. కాని వారి వద్ద నీరు లేదు. ఇద్దరూ పరిశుభ్రమయిన మట్టితో 'తయమ్ముమ్' చేసి నమాజ్ చేశారు. నమాజ్ వేళ ముగియక ముందే నీరు కూడా వారికి లభ్యమయింది. వారిలో ఒక వ్యక్తి వుజూచేసి నమాజ్ చేయగా రెండవ వ్యక్తి తిరిగి వుజూ చేయటంగానీ, నమాజ్ చేయటం గానీ చేయలేదు. ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన మీదట ఇరువురూ దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన సంఘటనను వివరించారు. ఆయన రెండవసారి నమాజ్ చేయని వ్యక్తి నుద్దేశ్యించి, "నీవు సున్నత్‌ను అనుసరించావు. నీవు చేసిన (మొదటి) నమాజ్ నీకు సరిపోతుంది"అని అన్నారు. రెండవ సారి నమాజ్‌చేసిన వ్యక్తిని ఉద్దేశ్యించి, "నీకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది" అని అన్నారు. (అబూదావూద్, నసాయి)

### సారాంశం

ఒకసారి తయమ్ముమ్ చేసి నమాజ్ చేసిన మీదట నీరు లభ్యమయితే వుజూ చేసి తిరిగి నమాజ్ చేయవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. నలుగురు ధర్మవేత్తల అభిమతం కూడా ఇదే.

మలిసారి నమాజ్ చేసిన వ్యక్తికి రెట్టింపు పుణ్యఫలం లభించడానికి కారణం ఏమై ఉంటుంది? అంటే అతనికి ఒక పుణ్యం నమాజ్ చేసినందుకు లభించగా, మరో పుణ్యం ఇజ్తెహాద్ చేసినందుకు (ధర్మావలంబనలో విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించినందుకు) లభించింది. అతని ఇజ్తెహాద్ సరైంది కాకపోయినప్పటికీ, అతను చేసిన కృషికిగాను రెట్టింపు పుణ్యం ఇవ్వబడిందన్నమాట!

(١١٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، فِي قَوْلِهِ عَزَّ وَجَلَّ: ﴿وَإِنْ كُنْتُمْ مَرْضَى أَوْ عَلَى سَفَرٍ﴾ قَالَ: إِذَا كَانَتْ بِالرَّجُلِ الجِرَاحَةُ فِي سَبِيلِ اللهِ وَالقُرُوحُ، فَيُجْنِبُ، فَيَخَافُ أَن يَموتَ إِنِ اغْتَسَلَ، تَيَمَّمَ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ مَوْقُوفاً وَرَفَعَهُ البَزَّارُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَالْحَاكِمُ.

114. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "వ ఇన్ కున్తుమ్ మరజన్ అవ్ అలా సఫరిన్" అనే దైవసూక్తి గురించి ఈయన్ని దర్యాప్తుచేయగా ఈయన ఇలా సమాధానమిచ్చారు - ఎవడి కయినా దైవ మార్గంలో గాయమైతే, దెబ్బతగిలితే, అదే స్థితిలో అతను లైంగిక అశుద్ధతకు కూడా లోనవుతే, అట్టి స్థితిలో స్నానం చేయటంవల్ల చనిపోయే ప్రమాదం ఉందనిపిస్తే అతడు 'తయమ్ముమ్' చేసుకోవాలి. (ఈ ఉల్లేఖనాన్ని దారె ఖుత్నీ 'మౌఖూఫ్'గా, బజ్జార్ 'మర్ఫూ' గాను, హాకిమ్ 'సహీహ్'గానూ ఖరారు చేశారు).

### సారాంశం

"ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేక ప్రయాణంలో ఉంటే, మరి మీకు నీరు లభ్యం కాకపోతే తయమ్ముమ్ చేసుకోండి."

దీని భావం ఏమిటంటే మీరు నమాజ్ చేయదలచినపుడు నీటితో వుజూ చేయటం వల్లనూ, స్నానం చేయటం వల్లనూ ఏదైనా హాని కలుగుతుందని భయముంటే తయమ్ముమ్ చేసి నమాజ్ చేయాలి. ఈ ఆయత్‌లో ప్రస్తావనకు వచ్చిన వ్యాధి తేలికపాటి వ్యాధికాదు. తేలికపాటి గాయం, కురుపు, చెమటకాయలు, దురద, ఎలర్జీ వంటివి ఈ కోవలోకి రావు.

అయితే వ్యాధి తీవ్రతకు సంబంధించి - అంటే ఏ స్థాయికి చెందిన వ్యాధిగ్రస్తత వుంటే తయమ్ముమ్ చేయవచ్చు? అనే విషయమై ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. నీళ్లతో వుజూ చేయటం వల్ల ప్రాణం పోతుందనే భయమున్నప్పుడు, వుజూ పరిధిలోకి వచ్చే శరీరావయవాలు పనికిరాకుండా పోయే ప్రమాదముందను కున్నప్పుడు మాత్రమే 'తయమ్ముమ్'

చేయటం సమంజసమని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయంలో; వ్యాధి ముదిరి దీర్ఘకాలిక వ్యాధిగా మారే భయముంటే చాలు - తయమ్ముమ్ ధర్మ సమ్మతమైపోతుంది.

హదీసులో ప్రస్తావించబడిన ఖుర్ఆన్ వాక్యంలో 'ప్రయాణావస్థలో వున్నప్పుడు తయమ్ముమ్ చేసుకోవచ్చ'ని ఉంది. ఇది నమాజ్‌ను ఖసర్ చేసుకునే, ఉపవాసాన్ని వాయిదా వేసుకునే ప్రయాణం కానేకాదు. నీరు లభ్యం కాని ప్రయాణం అని దీని భావం. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల అభిమతం కూడా ఇదే.

(١١٥) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعالَى عَنْهُ قَالَ: انْكَسَرَتْ إِحْدَى زَنْدَيَّ، فَسَأَلْتُ رَسولَ اللهِ ﷺ فَأَمَرَنِيْ أَنْ أَمْسَحَ عَلَى الْجَبَائِرِ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِسَنَدٍ وَاهٍ جِدًّا.

115. హజ్రత్ అలీ (రజి) కథనం: నా 'కట్టు' తెగిపోయింది. అప్పుడు నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వుజూ గురించి ప్రశ్నించగా "పట్టీలపై మసహ్ చేసుకో" అని ఆయన (స) సమాధానమిచ్చారు." (ఇబ్నె మాజా దీనిని అత్యంత బలహీనమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

'కట్టు' అంటే చేయి లేక కాలి ఎముక చిట్లినపుడు, ఎముకను జోడించడానికి బద్దలతో వేసే కట్టు అని భావం. ఎముక అతికే దాకా ఆ బద్దలు ఊతగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితిలో నిర్ణీతభాగాన్ని (కట్టు కట్టిన భాగాన్ని) మసహ్ చేస్తే సరిపోతుంది - నీటితో తడపనవసరం లేదు.

(١١٦) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعالَى عَنْهُ، فِي الرَّجُلِ الَّذِي شُجَّ فَاغْتَسَلَ فَمَاتَ: إِنَّمَا كَانَ يَكْفِيْهِ أَن يَّتَيَمَّمَ وَيَعْصِبَ عَلَى جُرْحِهِ خِرْقَةً ثُمَّ يَمْسَحَ عَلَيْهَا، وَيَغْسِلَ سَائِرَ جَسَدِهِ. رَوَاهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ فِيْهِ ضَعْفٌ، وَفِيْهِ اخْتِلَافٌ عَلَى رَاوِيْهِ.

116. తలకు గాయమైవున్న స్థితిలోనే స్నానం చేసి మరణించిన వ్యక్తి గురించి హజ్రత్ జాబిర్ (రజి) ఇలా వివరించారు: (అతని గురించి దైవప్రవక్త - సల్లల్లాహు అలైహి వ సల్లం - వ్యాఖ్యానించారు) "అతడు తయమ్ముమ్ చేసుకుంటే సరిపోయేది. తన గాయంపై కట్టుకట్టి మసహ్ చేసుకుంటే, మిగిలిన శరీరాన్ని కడుక్కుంటే (ఈ స్థితి ఏర్పడేది కాదు కదా)". (ఈ ఉల్లేఖనాన్ని బలహీన ఆధారాలతో అబూదావూద్ ఉల్లేఖించారు. హదీసును అందజేసిన పరంపర గురించి కూడా అభిప్రాయభేదం ఉంది).

**సారాంశం**

అబూదావూద్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఆధారంగా వృత్తాంతాన్ని వివరించారు. జాబిర్ (రజి) కథనం ఇలా వుంది: మేము ఒక ప్రయాణానికి బయలుదేరాము. మాలో ఒక వ్యక్తి తలకు రాయి తగిలింది. అతను తీవ్రంగా గాయపడ్డాడు. అదే స్థితిలో అతనికి స్వప్న స్ఖలనం కూడా అయింది. 'నేను తయమ్ముమ్ చేసుకోగలనా?' అని ఆ వ్యక్తి అందరినీ అడిగాడు. నీరు ఉపయోగించగల శక్తి నీలో ఉంటే తయమ్ముమ్ చేసుకోవడమెందుకు? అని అందరూ సలహా ఇచ్చారు. సహచరుల సలహా మేరకు అతడు స్నానం చేశాడు, తరువాత చనిపోయాడు.

ప్రయాణం నుండి తిరిగి వచ్చిన మీదట మేమంతా దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వెళ్ళి ఆ వ్యక్తి మరణ వృత్తాంతం వివరించాము. దీనిపై దైవప్రవక్త (స) స్పందిస్తూ, "వీళ్లంతా కలసి అతన్ని చంపేశారు. దేవుని దెబ్బ వీళ్లపై పడుగాక! విషయం వీరికి అర్థం కానపుడు దర్యాప్తు చేయవచ్చుకదా! తెలియనపుడు, విషయ పరిజ్ఞానం లేనపుడు దాని గురించి తెలుసుకోవాలి కదా!" అన్నారు. తరువాత ఆయన (స) అతడు 'ఇలా చేస్తే పోయేది' అంటూ హదీసులోని వాక్యం పలికారు.

అంటే గాయమైనచోట కట్టుకట్టే ముందు తయమ్ముమ్ చేస్తే అశుద్ధతా ప్రభావం దూరమై పోతుంది. కాళ్లు కడిగిన తరువాత మేజోళ్లు తొడిగి వాటిపై ఎలా మసహ్ చేసుకోవటం జరుగుతుందో ఇదీ అంతే.

(١١٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مِنَ السُّنَّةِ أَنْ لاَّ يُصَلِّيَ الرَّجُلُ بِالتَّيَمُّمِ إِلاَّ صَلاَةً وَاحِدَةً، ثُمَّ يَتَيَمَّمُ لِلصَّلاَةِ الْأُخْرَى. رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ جِدًّا.

117. హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "తయమ్ముమ్ చేసే వ్యక్తి తయమ్ముమ్‌తో ఒకే నమాజ్ చేయాలి. మరో నమాజ్ కోసం సరికొత్తగా తయమ్ముమ్ చేసుకోవాలి. ప్రవక్త సంప్రదాయం (సున్నత్) ఇదే." (దీనిని దారె ఖుత్నీ అత్యంత బలహీనమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

ఈ హదీసు బలహీనమైనది. ఎందుకంటే అందజేసిన వారిలో ఒకరైన హసన్ బిన్ అమ్మార్ బలహీనులు. అందుచేత హదీసువేత్తలు దీనిని 'జయీఫ్' హదీసుగా నిర్ధారించారు. తయమ్ముమ్ వుజూకు ప్రత్యామ్నాయం అని లోగడ చెప్పబడిన హదీసుకు ఇది విరుద్ధంగా ఉంది.

## 10వ అధ్యాయం

## ١٠ - بَابُ الْحَيْضِ

**రుతుస్రావానికి సంబంధించిన ఆదేశాలు**

(١١٨) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: إِنَّ فَاطِمَةَ بِنْتَ أَبِي حُبَيْشٍ كَانَتْ

118. హాజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఇలా తెలిపారు: "ఫాతిమా బిన్తె హుబైష్ (ర.అన్‌హా) కు నిరంతరం 'ఇస్తెహాజా'

تُسْتَحَاضُ، فَقَالَ لَهَا رَسُولُ اللهِ ﷺ: «إِنَّ دَمَ الْحَيْضِ دَمٌ أَسْوَدُ يُعْرَفُ، فَإِذَا كَانَ ذَلِكَ فَأَمْسِكِي عَنِ الصَّلَاةِ، فَإِذَا كَانَ الْآخَرُ فَتَوَضَّئِي وَصَلِّي». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ أَبُو حَاتِمٍ.

రక్తం స్రవించేది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా ఉద్బోధించారు - "రుతుస్రావపు రక్తం నల్లగా (చిక్కగా) ఉంటుంది. దాన్ని తేలిగ్గా గుర్తుపట్టవచ్చు. ఏఏ రోజుల్లో ఇలాంటి రక్తం వస్తుందో ఆ రోజుల్లో నమాజ్‌ను మానివెయ్యి. వేరే రంగు ఉన్నప్పుడు 'వుజూ' చేసి నమాజ్ చేస్తూ ఉండు." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అబూ హాతిమ్ దృష్టిలో ఇది నిరుపయోగమైనది).

وَفِيْ حَدِيْثِ أَسْمَاءَ بِنْتِ عُمَيْسٍ عِنْدَ أَبِيْ دَاوُدَ: وَلْتَجْلِسْ فِي مِرْكَنٍ، فَإِذَا رَأَتْ صُفْرَةً فَوْقَ الْمَاءِ فَلْتَغْتَسِلْ لِلظُّهْرِ وَالْعَصْرِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلْ لِلْمَغْرِبِ وَالعِشَاءِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلْ لِلْفَجْرِ غُسْلاً وَاحِداً، وَتَتَوَضَّأُ فِيْ مَا بَيْنَ ذَلِكَ.

అబూ దావూద్ చేత ఉల్లేఖించబడిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్‌హా) హదీసులో ఇలా ఉంది: ఒక తొట్టిలో కూర్చోవాలి. అప్పుడు నీటి పై భాగంలో కుంకుమ పువ్వు రంగు కనిపిస్తే జుహ్ర్ మరియు అస్ర్ నమాజుల కోసం ఒకసారి స్నానం చేయాలి. అలాగే మగ్రిబ్ మరియు ఇషా నమాజుల కోసం స్నానం చేయాలి. మరియు ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేయాలి. ఈ నమాజుల కోసం వుజూ చేయాలి."

## సారాంశం

పడుచు స్త్రీ మూడు రకాల రక్త స్రావాలకు లోనవుతుంది. ఒకటి: బహిష్టు రక్త స్రావం. దీనిని అరబీలో 'హైజ్' అని అంటారు. రెండు : పురిటి రక్తస్రావం (దీనిని అరబీలో దమె నిఫాస్‌గా వ్యవహరిస్తారు. ప్రసవించిన నాటి నుంచి సుమారు 40 రోజుల వరకూ ఈ రక్త స్రావం జరుగుతుంది). మూడు : దమె ఇస్తెహాజా. రుతుస్రావం మరియు పురిటి రక్త స్రావం జరిగే రోజుల్లోనే గాక ఇతర దినాలలో కూడా బ్లీడింగ్ అవుతున్నట్లయితే దీనిని 'ఇస్తెహాజా' రక్తంగా వ్యవహరిస్తారు.

బహిష్టు రక్త స్రావం కనీస గడువు ఇమామ్ షాఫయి దృష్టిలో ఒక రోజు. గరిష్ఠ వ్యవధి 15 రోజులు. మూడు రోజుల నుంచి పదిరోజుల వరకు ఈ రుతుస్రావం ఉంటుందని ఇమామ్ అబూ హనీఫా భావిస్తున్నారు. దేశ, కాల పరిస్థితుల దృష్ట్యా, స్త్రీల ఆరోగ్య ప్రమాణాల రీత్యా ఇద్దరు ఇమాముల అభిప్రాయాలూ తమ తమ కోణాలనుంచి సరైనవే కావచ్చు. అయితే ప్రతి స్త్రీ స్వానుభవం మరియు తన స్వభావం దృష్ట్యా తన 'పీరియడ్' ఎన్నాళ్ళుంటుందో తాను స్వయంగా - సరిగ్గానే -అంచనా వేయగలదు. అంతకు మించి కూడా బ్లీడింగ్ అవుతుంటే అది 'ఇస్తెహాజా' రక్తంగా భావించి తదనుగుణంగా ఆచరించాలి.

## హదీసు ఉల్లేఖకులు

హదీసును అందజేసిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి) సతీమణి. ఈమె తన భర్తతో కలసి అబిసీనియాకు హిజ్రత్ చేశారు. అక్కడామెకు దేవుడు సంతాన భాగ్యం కలుగజేశాడు. అబ్దుల్లాహ్ అనే అబ్బాయి పుట్టాడు. మౌతా యుద్ధంలో ఈమె భర్త మరణించిన పిదప హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఈమెను తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు. తరువాత ఈమెకు మరో పిల్లవాడు పుట్టాడు. ఈ అబ్బాయే ముహమ్మద్ బిన్ అబూబక్ర్‌గా ప్రసిద్ధిచెందాడు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మరణానంతరం హజ్రత్ అలీ (రజి) ఈమెను వివాహమాడారు. ఇప్పుడీ దంపతులకు యహ్యా అనే అబ్బాయి పుట్టాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమెను కలల భావార్థం అడిగి తెలుసుకునేవారు. హజ్రత్ అలీ (రజి) మరణానంతరం ఈమె కూడా కన్నుమూశారు.

(١١٩) وَعَنْ حَمْنَةَ بِنْتِ جَحْشٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أُسْتَحَاضُ حَيْضَةً كَثِيرَةً شَدِيدَةً، فَأَتَيْتُ النَّبِيَّ ﷺ أَسْتَفْتِيهِ، فَقَالَ: «إِنَّمَا هِيَ رَكْضَةٌ مِنَ الشَّيْطَانِ، فَتَحَيَّضِي سِتَّةَ أَيَّامٍ أَوْ سَبْعَةَ أَيَّامٍ، ثُمَّ اغْتَسِلِي، فَإِذَا اسْتَنْقَأْتِ فَصَلِّي أَرْبَعَةً وَعِشْرِينَ أَوْ ثَلَاثَةً وَعِشْرِينَ، وَصُومِي

119. హజ్రత్ హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఇలా తెలిపారు: నేను తీవ్రమయిన రక్త స్రావానికి (బ్లీడింగ్‌కి) లోనై ఉండేదానిని. ఈ విషయమై దైవప్రవక్త (సఅసం) అభిప్రాయం ఏమిటో కనుక్కుందామని వెళ్ళాను. ఆయన (సఅసం) ఇలా చెప్పారు - "ఇది షైతాన్ దెబ్బ. కనుక నీవు ఆరు లేక ఏడు దినాలు బహిష్టు కాలంగా లెక్కించి స్నానం చెయ్యి. నీవు పూర్తిగా పరిశుద్ధత నొందిన మీదట ఇరవైనాలుగు లేక ఇరవై మూడు రోజుల వరకూ నమాజ్ చెయ్యి. ఉపవాసవ్రతం కూడా (ఈ దినాలలో) పాటించు. నిశ్చయంగా నీ కొరకు ఇది చాలు. నెల నెలా ఇతర బహిష్టు స్త్రీల వలెనే నువ్వు కూడా ఇలాగే

وَصَلِّي، فَإِنَّ ذَلِكَ يُجْزِئُكِ، وَكَذَلِكَ فَافْعَلِي كُلَّ شَهْرٍ، كَمَا تَحِيضُ النِّسَاءُ، فَإِنْ قَوِيْتِ عَلَى أَنْ تُؤَخِّرِي الظُّهْرَ وَتُعَجِّلِي العَصْرَ، ثُمَّ تَغْتَسِلِي حِينَ تَطْهُرِينَ، وَتُصَلِّينَ الظُّهْرَ وَالعَصْرَ جَمِيعاً، ثُمَّ تُؤَخِّرِينَ الْمَغْرِبَ وَتُعَجِّلِينَ العِشَاءَ، ثُمَّ تَغْتَسِلِينَ وَتَجْمَعِينَ بَيْنَ الصَّلاَتَيْنِ، فَافْعَلِي، وَتَغْتَسِلِينَ مَعَ الصُّبْحِ وَتُصَلِّينَ، قَالَ: وَهُوَ أَعْجَبُ الأَمْرَيْنِ إِلَيَّ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ الْبُخَارِيُّ.

చేస్తూ ఉండు. (ఇలా వద్దనుకుంటే) నీలో గనక జుహ్ర్ వేళను కాస్త ఆలస్యం చేసి అస్ర్ వేళను కాస్త ఇవతలకు జరుపుకునే శక్తి ఉన్నట్లయితే స్నానం చేసి పరిశుద్ధత నొందిన పిదప జుహ్ర్-అస్ర్ నమాజులను కలుపుకో. మరి అలాగే మగ్రిబ్ నమాజును కాస్సేపు వాయిదా వేసి ఇషా నమాజును కాస్త ఇవతలకు జరుపుకుని స్నానం చేసి పరిశుద్ధతను పొందు. రెండు నమాజులనూ కలుపుకో. నువ్విలా చేయవచ్చు. (ఈ మేరకు నీకు అనుమతి ఉంది). ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేసి నమాజ్ చెయ్యి. తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ఈ రెండు పద్ధతులలో రెండవదే నాకు ఇష్టమైనది" (దీనిని 'ఐదుగురి'లో నసాయి మినహా మిగిలిన వారంతా ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. బుఖారీ దీనిని 'సుస్పష్టం'గా పేర్కొన్నారు).

## సారాంశం

ఈ హదీసులో హమ్నా బిన్తె జహష్‌కు రేయింబవళ్ళలో మూడుసార్లు స్నానం చేయాలని సూచించబడింది. జుహ్ర్ - అస్ర్ నమాజుల కోసం ఒక స్నానం, మగ్రిబ్ - ఇషా నమాజుల కోసం ఒక స్నానం, ఫజ్ర్ నమాజ్ కోసం ఒక స్నానం. ఇంతకు ముందు వచ్చిన హదీసులో ఫాతిమా బిన్తె హుబైష్‌కు - ప్రతి నమాజు కోసం వుజూ చేయాలని ఆజ్ఞాపించబడింది. దీనిద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే నిరంతర బ్లీడింగ్ వ్యాధికి లోనైవున్న స్త్రీ ప్రతి నమాజు కోసం స్నానం చేయటం తప్పనిసరి కాదు గాని ప్రతి నమాజు కోసం సరికొత్తగా వుజూ చేయటం తప్పనిసరి. స్నానం అభిలషణీయం మాత్రమే. అది కూడా ఆరోగ్య, వాతావరణ స్థితిగతులు అనుకూలిస్తేనే. లేకుంటే స్నానం కూడా చేయవలసిన అవసరం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్

జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) సోదరి. తొలుత ఈమె ముసైబ్ బిన్ ఉమైర్ (రజి)కు సతీమణిగా ఉన్నారు. ఉహుద్ యుద్ధంలో ముసైబ్ అమరగతి నొందగా తల్హా బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఈమెను నికాహ్ చేసుకున్నారు.

(١٢٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ أُمَّ حَبِيْبَةَ بِنْتَ جَحْشٍ شَكَتْ إِلَى رَسُولِ اللهِ ﷺ الدَّمَ، فَقَالَ: «**اُمْكُثِي قَدْرَ مَا كَانَتْ تَحْبِسُكِ حَيْضَتُكِ، ثُمَّ اغْتَسِلِي**»، وَكَانَتْ تَغْتَسِلُ لِكُلِّ صَلاَةٍ. رواه مسلم.

120. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి 'దమె ఇస్తిహాజా' (బ్లీడింగ్) గురించి ఫిర్యాదు చేసింది. దానికి ఆయన (స) ఇలా సెలవిచ్చారు - "నీ నెలవారీ దినాలు లోగడ ఎన్ని నిర్ధారితమయి ఉండేవో అన్ని దినాలూ (నమాజ్, రోజా) వది లెయ్యి. ఆ తరువాత స్నానం చేసి నమాజ్ విధిని నెరవేర్చు." ఉమ్మె హబీబా ఆ తరువాత ప్రతి నమాజ్‌కై తాజాగా స్నానం చేసేది. (ముస్లిం)

وَفِي رِوَايَةِ البُخَارِيِّ «وَتَوَضَّئِي لِكُلِّ صَلاَةٍ». وَهِيَ لأَبِي دَاوُدَ وَغَيْرِهِ مِنْ وَجْهٍ آخَرَ.

కాగా; బుఖారీ ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మరి ప్రతి నమాజ్ కోసం సరికొత్తగా వుజూ చేస్తూ ఉండు." (అబూ దావూద్ తదితర హదీసువేత్తలు ఈ హదీసును మరో విధంగా ఉల్లేఖించారు).

### సారాంశం

ఈ హదీసు ద్వారాగానీ, ఈ అధ్యాయం క్రింద వచ్చిన ఇతర హదీసుల ద్వారాగానీ అవగతమయ్యేదేమిటంటే దీర్ఘకాలంగా బ్లీడింగ్ వ్యాధితో బాధపడే మహిళ బహిష్టు రక్తానికీ - సాధారణ బ్లీడింగ్‌కి మధ్య వున్న వ్యత్యాసాన్ని గ్రహించే ఆనవాళ్లు కొన్ని ఉన్నాయి. అనుభవం, విచక్షణా జ్ఞానంగల మహిళ ఈ తేడాను ఇట్టే పసిగట్టగలుగుతుంది. బహిష్టు కాలపు రక్తం చిక్కగా, నలుపు ఆవరించి ఉంటుంది. వాసన కూడా భరించశక్యం కానిదిగా ఉంటుంది. కాగా; ఇస్తెహాజా (సాధారణ బ్లీడింగ్) రక్తం లేత ఎరుపురంగు కలిగి ఉంటుంది. ఒక్కోసారి కుంకుమ పువ్వు రంగులో కనిపిస్తుంది. పల్చగా ఉంటుంది. అదీగాక ఒక స్త్రీకి తనకు సాధారణంగా - లోగడ ఎన్ని రోజులు బహిష్టు రక్తం పోయేదో - లెక్క ఉంటుంది. ఆ లెక్క ప్రకారం కూడా ఆమె తన పీరియడ్‌ను అంచనా వేయగలదు. లేక తన సమ వయస్కులైన, తన స్వభావానికి అనుగుణమైన స్త్రీలకు ఎన్ని రోజులు రుతుస్రావం జరుగుతుందో తెలుసుకుని కూడా 'పీరియడ్'ను లెక్కించవచ్చు.

హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) ప్రతి నమాజుకై స్నానం చేసేవారు. ఈ స్నానం ఆమె తన శక్తీ స్థోమతలనుబట్టి చేశారేతప్ప ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేయటం తప్పనిసరి కాదు. పండితులలో అధిక సంఖ్యాకుల అభిప్రాయం ఇదే. ఇస్తెహాజా వ్యాధికి లోనైన స్త్రీపై షరీయత్ ప్రతి నమాజు కోసం స్నానం చేయాల్సిందేనన్న నియమం పెట్టలేదు. 'ఫత్హుల్ బారీ' లో అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) కూడా దీనినే సమర్థించారు. బ్లీడింగ్‌తో సతమతమయ్యే మహిళలపై ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేసే భారం సహీహ్ హదీసుల ద్వారా నిరూపితం కాలేదంటా రాయన. ఇలాంటి స్త్రీ బహిష్టు కాలం పూర్తయిన పిదప స్నానంచేసి, ఆ తరువాత ప్రతి నమాజ్ కోసం ఇస్తింజా చేసి వుజూ చేసుకుంటే సరిపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉమ్మె హబీబా బిన్తె జహష్ (ర.అన్హా) హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) కు తోబుట్టువు. ఈమె అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సతీమణి. ముస్లింలోని ఉల్లేఖనం ప్రకారం ఈమె నిరంతరం ఏడు సంవత్సరాలు బ్లీడింగ్‌తో బాధపడ్డారని తెలుస్తోంది. హిజ్రీ 44లో ఈమె మరణించారు. కొంతమంది వాదన ప్రకారం జహష్‌కు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురూ 'ఇస్తె హాజా' వ్యాధిగ్రస్తులే. ఈ ముగ్గురిలో ఒకరు: ఉమ్ముల్ మోమినీన్ జైనబ్, రెండవవారు: హమ్నా. మూడవవారు: ఉమ్మె హబీబా. కాని నిజమేమిటంటే హజ్రత్ జైనబ్ (ర.అన్హా) ఈ వ్యాధినుండి సురక్షితంగా ఉన్నారు. దైవప్రవక్త (సఅసం) కాలంలో పదిమంది మహిళలు 'ఇస్తెహాజా' వ్యాధికి లోనై ఉండేవారని ప్రతీతి.

(١٢١) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنَّا لاَ نَعُدُّ الْكُدْرَةَ وَالصُّفْرَةَ بَعْدَ الطُّهْرِ شَيْئاً. رَوَاهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ.

121. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) వివరించారు: మేము (రుతుస్రావ కాలం ముగిసిన తరువాత) స్నానాదులు చేసి పరిశుద్ధత పొందేవారం. ఆ తరువాత (స్రవించే) జిగటు మరియు పసుపు పచ్చని రంగుగల పదార్థానికి ప్రాధాన్యత నిచ్చే వారము కాము. (అంటే ఆ పదార్థం స్రవిస్తే దాన్ని రుతుస్రావంగా తలపోసే వాళ్ళం కాము). (బుఖారీ, అబూదావూద్ - హదీసు పదాలు మాత్రం అబూ దావూద్‌లోనివి).

## సారాంశం

బహిష్టు కాలం ముగిసిన తరువాత కనిపించే మైల మరియు పసుపుపచ్చని డిశ్చార్జ్‌ని తాము 'బహిష్టు రక్తం' గా ఎన్నటికీ భావించేవారం కాదు అని భావం.

ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ప్రకారం పసుపుపచ్చని రంగులో స్రవించే నీరును రుతుస్రావంగా తలపోసే వారని తెలిసింది. కాని ఈ హదీసులో 'ఇలాంటి నీరుకు మేము ప్రాధాన్యతనిచ్చే వాళ్లం కాదు' అని చెప్పబడింది. పైకి ఈ రెండు హదీసులలో వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ, కాస్త నిశితంగా ఆలోచిస్తే ఈ వ్యాఘాతం సమసిపోగలదు. పైన పేర్కొనబడిన రంగుగల నీరు ఒకవేళ రుతుస్రావ సమయంలో కనిపిస్తే దాన్ని రుతుస్రావంగానే భావించవచ్చు. ఒకవేళ పీరియడ్ గడచిన తరువాత కనిపిస్తే దానికి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం లేదని అనుకోవచ్చు. హదీసులో వచ్చిన 'బాదుత్తుహర్' అనే పదం సూచిస్తున్నది కూడా ఇదే.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె అతియా (ర.అన్హా) అసలు పేరు నుసైబా. కాబ్ కుమార్తె. ఈమె హారిస్ పుత్రిక అని కూడా ఒక వాదన ఉంది. ఈమె గొప్ప స్థానం పొందిన సహాబియాత్‌లలో ఒకరుగా ప్రసిద్ధికెక్కారు. యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) కు తోడుగా ఉండేవారు. రోగగ్రస్తులకు సేవలందించేవారు. క్షతగాత్రులకు కట్టుకట్టేవారు. ఉహుద్ యుద్ధంలో శూరులైన మగవారివలే పోరాడారు. దైవప్రవక్త (సఅసం) కుమార్తెకు (చనిపోయినపుడు) చేయించిన స్నానానికి ఆమె సాక్షిగా ఉన్నారు. ఆమె ఎంతో శుభ్రంగా ఆమెకు స్నానం చేయించారు. ఈమె బస్రాలో ఉన్న కాలంలో అక్కడి పండితులు, తాబయీన్లు ఈమె నుండి అనేక హదీసులను సంగ్రహించేవారు. ఈమె అసలు హదీసు మృతునికి చేయించే స్నానం గురించి ఉంది. బస్రాలో స్థిరపడిన కారణంగా బస్రీ సహాబియాగా పరిగణించ బడ్డారు.

(١٢٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ الْيَهُودَ كَانُوا إِذَا حَاضَتِ الْمَرْأَةُ فِيهِمْ لَمْ يُؤَاكِلُوهَا، فَقَالَ النَّبِيُّ ﷺ: «اِصْنَعُوا كُلَّ شَيْءٍ إِلاَّ النِّكَاحَ». رَوَاهُ مُسْلِمٌ.

122. హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: యూదులలో ఏ స్త్రీకయినా బహిష్టు కాలం వస్తే వాళ్లు ఆ స్త్రీతో కలసి తినటం, త్రాగటం మానేసేవారు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు - "(ఓ ముస్లింలారా!) మీరు ఒక్క సంభోగం తప్ప ఏ పనైనా (మీ భార్య అయిన) స్త్రీతో చేయించగలరు." (ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) గారి ఉపదేశం వెలుగులో బహిష్టు కాలంలో వున్న స్త్రీతో కలసి కూర్చోవటం, పడుకోవటం, తినటం, త్రాగటం - అన్నీ ముస్లిముల కొరకు ధర్మ సమ్మతమే. కేవలం ఒక్క సంభోగానికి దూరంగా ఉండటం అవసరం. ఈ అంటరానితనం యూదులలో, హిందువులలో అధికంగా ఉంది. ముస్లిముల దృష్టిలో దీనికి ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

(١٢٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُنِي فَأَتَّزِرُ، فَيُبَاشِرُنِي وَأَنَا حَائِضٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

123. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను లోఉడుపు గట్టిగా కట్టుకోమని చెప్పేవారు. ఆ తరువాత నన్ను హత్తుకుని పడుకునే వారు. నేనప్పుడు బహిష్టు స్థితిలో ఉండే దానిని." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒండొకరు హత్తుకుని పడుకోవటాన్ని అపార్థం చేసుకోనవసరం లేదు. విచారకరమైన విషయం ఏమిటంటే హదీసులను త్రోసిపుచ్చే వర్గం (మున్కిరీనె హదీస్) మహాప్రవక్త (స) వారి హదీసుల పట్ల ప్రజాబాహుళ్యంలో వెగటును పుట్టించి, అనుమానాలను రేకెత్తించే ఉద్దేశ్యంతో ఇలాంటి హదీసులను వక్రీకరిస్తుంది. ఉదాహరణకు : వారు ఈ హదీసును ఉదాహరిస్తూ దివ్య ఖుర్‌ఆన్‌లో వారించబడినప్పటికీ దైవప్రవక్త (సఅసం) బహిష్టు స్థితిలోవున్న తమ భార్యలతో సంభోగించే వారని (దైవం మన్నించుగాక!) అభాండం వేశారు. తత్కారణంగా హదీసులు నిజమైనవి కావని ఘోషిస్తారు. ఇవి నమ్మదగ్గ మాటలు కావు. పరస్పరం హత్తుకుని పండుకోవటమే సంభోగమని అనటం అన్యాయం కాకపోతే ఏమిటీ? బహిష్టు స్థితిలో - ఒక్క నాభిక్రింది భాగాన్ని తప్ప - స్త్రీ శరీరమంతటినీ తాకి మధురానుభూతిని పొందేందుకు షరీయత్ అనుమతిస్తోంది.

(١٢٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، فِي الَّذِي يَأْتِي امْرَأَتَهُ وَهِيَ حَائِضٌ، قَالَ: «يَتَصَدَّقُ بِدِينَارٍ أَوْ بِنِصْفِ دِينَارٍ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ الْقَطَّانِ، وَرَجَّحَ غَيْرُهُمَا وَقْفَهُ.

124. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : తన భార్య బహిష్టు అయి వున్న స్థితిలో ఆమె వద్దకు పోయిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), "అతడు ఒక దీనారు లేక అర్ధ దీనారు దానం చేయాలి" అని సెల విచ్చారు. (ఈ హదీసును ఐదుగురు ఉల్లేఖించారు. హాకిమ్ మరియు ఇబ్నె ఖత్తాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. మిగిలిన హదీసువేత్తలు దీనిని 'మౌఖూఫ్'గా నిర్ధారించారు)

(١٢٥) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ:

125. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు:

«أَلَيْسَ إِذَا حَاضَتِ الْمَرْأَةُ لَمْ تُصَلِّ وَلَمْ تَصُمْ؟». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

"ఏమిటీ, స్త్రీ బహిష్టు అయి వున్నప్పుడు నమాజ్, ఉపవాసాలను విడిచిపెట్టదా?" (బుఖారీ, ముస్లిం - ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

అంటే ఈ అశుద్ధావస్థలో ఆమె నమాజ్ చేయవలసిన అవసరం లేదు. ఉపవాస (రోజా) వ్రతాన్ని పూనవలసిన అవసరం కూడా లేదు. వదలివేయబడిన 'రోజా' లను ఇతర దినాలలో 'ఖజా' చేసుకోవలసి ఉంటుంది. అయితే బహిష్టు కాలంలో వదలివేసిన నమాజులను మాత్రం 'ఖజా' చేయవలసిన అవసరం లేదు.

(١٢٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمَّا جِئْنَا سَرِفَ حِضْتُ، فَقَالَ النَّبِيُّ ﷺ: «افْعَلِي مَا يَفْعَلُ الْحَاجُّ، غَيْرَ أَنْ لاَ تَطُوفِي بِالْبَيْتِ حَتَّى تَطْهُرِي». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

126. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) వివరించారు: "మేము 'సరిఫ్' అనే ప్రదేశానికి చేరుకునేసరికి నాకు బహిష్టు దినాలు మొదలయ్యాయి. (ఈ సంగతిని నేను తెలియజేయగా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఇతర హాజీల మాదిరిగానే నీవు కూడా హజ్ ఆచారాలను నెరవేర్చు. అయితే బైతుల్లాహ్ (దైవ గృహం) ప్రదక్షిణ మాత్రం గడువు దాటిన మీదట స్నానం చేసి చెయ్యి." (బుఖారీ, ముస్లిం - ఇది కూడా సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

(1). దైవప్రవక్త (స) వారి అంతిమ హజ్ యాత్ర సందర్భంగా జరిగిన సంఘటన ఇది.

(2). 'సరిఫ్' ఒక ప్రదేశం పేరు. ఇది మక్కాకు పది మైళ్ళ దూరంలో ఉంది.

(3). ఈ హదీసు ప్రకారం బహిష్టు అయివున్న స్త్రీ కాబా ప్రదక్షిణ చేయజాలదు. ఎందుకంటే ప్రదక్షిణ కోసం శుచీ శుభ్రత అవసరం. కాగా; బహిష్టు కాలంలో స్త్రీ అశుద్ధతకు లోనై ఉంటుంది. అశుద్ధావస్థకు లోనై వున్న స్త్రీ మస్జిద్‌లోనే ప్రవేశించలేనప్పుడు కాబా గృహం వద్దకు ఎలా రాగలుగుతుంది? ఈ స్థితిలో ఆమె కనీసం నమాజ్ కూడా చేయజాలదు. అందుకే రచయిత ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకుని విషయాన్ని విశదీకరించారు.

(١٢٧) وَعَنْ مُعاذٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَأَلَ النَّبِيَّ ﷺ، مَا يَحِلُّ لِلرَّجُلِ مِنَ امْرَأَتِهِ وَهِيَ حَائِضٌ؟ فَقَالَ: «مَا فَوْقَ الْإِزَارِ». رَوَاهُ أَبُو دَاوُدَ، وضَعَّفَهُ.

127. హాజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, 'స్త్రీ బహిష్టు కాలంలో ఉన్నప్పుడు ఆమెకు సంబంధించిన ఏఏ వస్తువులు భర్త కొరకు ధర్మసమ్మతం అవుతాయి?' అని ప్రశ్నించగా, ఆయన (సఅసం) ఇలా బదులిచ్చారు: "పాజామా లేక ఇజారు (లేకలంగా) పరిధిలోకి వచ్చే శరీర భాగం తప్ప మిగిలినదంతా అతని కొరకు ధర్మసమ్మతమే." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - బలహీనమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి: బహిష్టు దినాలలో నాభి క్రింది భాగం జోలికి పోకూడదు. అంటే రతిక్రీడలో పాల్గొనరాదు. రెండు: నిర్ణీత శరీర భాగాన్ని మినహాయించి స్త్రీ యొక్క ఇతర శరీరావయవాలను తాకవచ్చు, స్త్రీని హత్తుకుని నిద్రించవచ్చు. ఆమె వండిపెట్టిన ఆహార పదార్థాలను తినవచ్చు - ఒక్క సంభోగం తప్ప - ప్రతిదీ చేయవచ్చు.

(١٢٨) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَتِ النُّفَسَاءُ تَقْعُدُ على عَهْدِ النَّبِيِّ ﷺ بَعْدَ نِفَاسِهَا أَرْبَعِيْنَ يَوْماً. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَاللَّفْظُ لِأَبِيْ دَاوُدَ.

128. హాజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో స్త్రీలు ప్రసవించిన తరువాత నలభై రోజుల వరకూ అశుద్ధులుగా కూర్చుని ఉండేవారు. (నసాయితో పాటు మరో ఐదుగురు దీనిని ఉల్లేఖించారు. హదీసు పదాలు మాత్రం అబూదావూద్ లోనివి)

وَفِيْ لَفْظٍ لَهُ: وَلَمْ يَأْمُرْهَا النَّبِيُّ ﷺ بِقَضَاءِ صَلاَةِ النِّفَاسِ. وَصَحَّحَهُ الْحَاكِمُ.

దీని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: పురిటిరక్త స్రావ కాలంలో విడిచిపెట్టబడిన నమాజులను 'ఖజా' చేసుకోమని దైవప్రవక్త (సఅసం) ఆదేశించలేదు. (హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

## సారాంశం

ప్రసవించిన స్త్రీల అశుద్ధ గడువు 40 రోజులని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. దీని కనీస గడువు ఎంత? అనేది ఇదమిత్థంగా చెప్పబడలేదు. అయితే 40 రోజుల తరువాత కూడా పరిశుద్ధత చేకూరకపోతే దాన్ని 'ఇస్తెహాజా'గా పరిగణించవలసి ఉంటుంది.

గడువు ముగిసిన తరువాత నమాజ్, రోజాలను విడిచిపెట్టకూడదు. భర్తతో లైంగిక సంబంధం కూడా ఏర్పరచుకోవచ్చు.

బహిష్టు కాలంలో ధర్మానికి సంబంధించిన ఏ ఏ నిబంధనలున్నాయో అవే పురిటి రక్త స్రావంలోనూ ఉన్నాయి. అంటే ఈ 40 రోజుల గడువులో స్త్రీలు నమాజ్, రోజాలను విడిచిపెట్టాలి. మస్జిద్‌లో ప్రవేశించరాదు. కాబా ప్రదక్షిణ కూడా చేయకూడదు. దివ్య ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటంగానీ, పారాయణం చేయటం గానీ చేయకూడదు. ఈ గడువులో విడిచిపెట్టబడిన ఉపవాసాలను మాత్రం తరువాత ఖజా చేసుకోవాలి. నమాజులను ఖజా చేయనవసరం లేదు.

# 2. నమాజ్ పుస్తకం

# كِتَابُ الصَّلاَةِ

**1వ అధ్యాయం**

## నమాజ్ వేళలు

## ١ - بَابُ الْمَوَاقِيتِ

129. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "జుహ్ర్ నమాజ్‌వేళ నడినెత్తి మీదినుండి పొద్దు వాలినప్పటినుండి మొదలై అస్ర్ నమాజ్ వేళ ఆరంభమయ్యే వరకూ ఉంటుంది. అస్ర్ వేళ మనిషి నీడ అతని ఎత్తుకు సమానంగా పడినప్పటినుండి మొదలవుతుంది. అస్ర్ ఆఖరివేళ సూర్యుడు పసుపుపచ్చని రంగును సంతరించుకునే వరకూ ఉంటుంది. మగ్రిబ్ నమాజ్ వేళ (సూర్యాస్తమయం అయినప్పటినుండి మొదలై ఆకాశాన వున్న) ఎరుపుదనం మటుమాయమయ్యేదాకా ఉంటుంది. ఇషా నమాజు వేళ అర్ధరాత్రి వరకూ ఉంటుంది. ఫజ్ర్ నమాజ్ వేళ తెల్లవారు జాము నుండి మొదలై సూర్యోదయానికి ముందు వరకూ ఉంటుంది. (ముస్లిం)

(١٢٩) عَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «وَقْتُ الظُّهْرِ إِذَا زَالَتِ الشَّمْسُ، وَكَانَ ظِلُّ الرَّجُلِ كَطُولِهِ، مَا لَمْ يَحْضُرِ الْعَصْرُ، وَوَقْتُ الْعَصْرِ مَا لَمْ تَصْفَرَّ الشَّمْسُ، وَوَقْتُ صَلاَةِ الْمَغْرِبِ مَا لَمْ يَغِبِ الشَّفَقُ، وَوَقْتُ صَلاَةِ الْعِشَاءِ إِلَى نِصْفِ اللَّيْلِ الأَوْسَطِ، وَوَقْتُ صَلاَةِ الصُّبْحِ مِنْ طُلُوعِ الْفَجْرِ مَا لَمْ تَطْلُعِ الشَّمْسُ». رَوَاهُ مُسْلِمٌ.

ఇందులోనే (అంటే ముస్లింలోనే) బురైదా (రజి) గారి ద్వారా అస్ర్ గురించి ఇలా ఉల్లేఖించబడింది - "సూర్యుడు తెల్లగా, స్పష్టమయిన స్థితిలోనుండాలి." అబూ మూసా (రజి) గారు "సూర్యుడు బాగా ఎత్తున ఉన్నప్పుడు" అని అన్నారు.

وَلَهُ مِنْ حَدِيثِ بُرَيْدَةَ فِي الْعَصْرِ: «وَالشَّمْسُ بَيْضَاءُ نَقِيَّةٌ» وَمِنْ حَدِيثِ أَبِي مُوسَى: «وَالشَّمْسُ مُرْتَفِعَةٌ».

## సారాంశం

ఈ హదీసు ప్రకారం జుహ్ర్ నమాజ్‌వేళ మనిషి నీడ అతని ఎత్తుకు సమానంగా పడేవరకూ ఉంటుంది. అప్పటినుండే అస్ర్ వేళ కూడా మొదలైపోతుంది. ముగ్గురు ప్రముఖ ఇమాములైన ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)లే గాక ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ జుఫర్‌ల అభిమతం కూడా ఇదే. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయం కూడా ఇదే. అయితే ఆయన (రహ్మ.లై) కు సంబంధించి ఉదాహరించే మరో ప్రసిద్ధ ఉల్లేఖనంలో "నీడ రెట్టింపు అయ్యేవరకూ జుహ్ర్ వేళ ఉంటుంది" అని ఉంది. హనఫీ పండితులు ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి మొదటి విధానాన్ని స్వీకరించలేదు. మనిషి ఎత్తుకు సమానంగా నీడవచ్చే వరకూ జుహ్ర్ నమాజును ముగించటమే ఉత్తమం. అబూ హనీఫా (రహ్మ.లై) గారి ముఖ్య శిష్యులైన ఖాజీ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌ల నిర్ణయం కూడా ఇదే.

ఇక మగ్రిబ్ వేళ గురించి కూడా ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. సూర్యాస్తమయం తరువాత ఆకాశాన - పడమటి దిక్కున - ఏర్పడే **షఫఖ్** గురించి అభిప్రాయపడుతూ ఇమామ్ అబూ హనీఫా, ఆకాశాన ఆవరించే అరుణిమ అనంతరం అగుపించే తెలుపే ఈ **షఫఖ్** అని అన్నారు. దీనికి భిన్నంగా ఇమామ్ షాఫయి, **షఫఖ్** అంటే సూర్యాస్తమయం తరువాత ఆకాశపుటంచున ఏర్పడే ఎరుపుదనమేనని అభిప్రాయపడ్డారు.

సూర్యోదయ సమయంలోనూ, సూర్యాస్తమయ సమయంలోనూ నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అంటే సూర్యోదయం కాబోతుందని తెలియగానే నమాజ్‌ను విరమించాలి. ఎందుకంటే ఆ సమయంలో సూర్యుడు షైతాన్ యొక్క రెండు కొమ్ములపై ఉదయిస్తాడు. అది సూర్యుణ్ణి పూజించే వారి సమయం. అలాగే సరిగ్గా సూర్యాస్తమయం జరుగుతున్న వేళ కూడా నమాజ్ ప్రారంభించకూడదు.

ఈ హదీసు ద్వారా ఐదుపూటల నమాజు వేళలు తెలుపబడ్డాయి. నమాజు ఆరంభవేళ, ఆఖరివేళ కూడా హదీసులో సూచించబడింది. కనుక ఈ వేళలలోనే ఆయా నమాజులు చేయాలి.

## హదీసు ఉల్లేఖకులు

(1) హదీసు ఉల్లేఖకులైన బురైదా (రజి) పూర్తిపేరు బురైదా బిన్ హుసైబ్ అస్లమీ. మారుపేరు అబూ అబ్దుల్లాహ్. దైవప్రవక్త (నఅసం) మదీనా వైపునకు హిజ్రత్ చేస్తున్న సమయంలో మార్గమధ్యంలో ఇస్లాం స్వీకరించిన 80 మందిలో ఈయన ఒకరు. ఉహుద్ యుద్ధానంతరం దైవప్రవక్త (స) సమక్షంలో హాజరయ్యారు. ఆ తరువాత యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'బైతుర్రిజ్వాన్'లో కూడా ఈయన ఉన్నారు. అనంతరం బస్రా వైపునకు ప్రస్థానం చేశారు. అక్కడి నుండి 'ఖురాసాన్'కు జిహాద్ నిమిత్తం బయలుదేరారు. చివరకు 'మర్వ్' అనే చోట స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. ఈయన అంత్యక్రియలు హిజ్రీ 62 లేక 63లో జరిగాయి.

(2) హదీసు ఉల్లేఖకులలో రెండవవారైన అబూ మూసా అష్అరీ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ అష్అరీ (రజి). ఘనత వహించిన సహచరులలో ఈయన కూడా ఒకరు. తొలుత అబిసీనియా వైపునకు ప్రస్థానం (హిజ్రత్) చేశారు. ఖైబర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త

(స)ను కలుసుకున్నారు. జుబేద్ మరియు అదన్ ప్రాంతాల పర్యవేక్షకుడిగా నియుక్తులయ్యారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో కూఫా మరియు బస్రాలకు గవర్నర్‌గా నియమించ బడ్డారు. ఈయన ఆధ్వర్యంలో తస్తర్ జయించబడింది. ఇంకా ఇతర పట్టణాలను కూడా ఈయన జయించారు. హిజ్రీ 42లో మరణించారు.

(١٣٠) وَعَنْ أَبِي بَرْزَةَ الأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الْعَصْرَ، ثُمَّ يَرْجِعُ أَحَدُنَا إِلَى رَحْلِهِ فِي أَقْصَى الْمَدِينَةِ وَالشَّمْسُ حَيَّةٌ، وَكَانَ يَسْتَحِبُّ أَنْ يُؤَخِّرَ مِنَ الْعِشَاءِ، وَكَانَ يَكْرَهُ النَّوْمَ قَبْلَهَا وَالْحَدِيثَ بَعْدَهَا، وَكَانَ يَنْفَتِلُ مِنْ صَلاَةِ الْغَدَاةِ حِينَ يَعْرِفُ الرَّجُلُ جَلِيسَهُ، وَكَانَ يَقْرَأُ بِالسِّتِّينَ إِلَى الْمَائَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

130. హజ్రత్ అబూ బర్జా అస్లమీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అస్ర్ నమాజు ఏ సమయంలో చేసేవారంటే, మాలో ఎవరయినా మదీనా చివరి హద్దుల దాకా వెళ్ళి చూసినా అప్పటికీ సూర్యుడు భగభగా మండుతూ, ప్రకాశిస్తూ కనిపించేవాడు. ఆయన (స) ఇషా నమాజును ఆలస్యంగా చేయడాన్ని ఇష్టపడేవారు. ఇషా నమాజుకు ముందు నిద్రపోవడాన్ని, ఇషా నమాజు అనంతరం (అనవసరంగా) కబుర్లు చెప్పుకోవడాన్ని ఇష్టపడే వారు కాదు. ఫజ్ర్ నమాజ్‌ను ఒక వ్యక్తి సాటి వ్యక్తిని గుర్తుపట్టగలిగే సమయానికే ముగించేవారు. (సాధారణంగా ఫజ్ర్ నమాజ్‌లో) అరవై నుండి వంద ఆయత్‌ల వరకూ పారాయణం చేసేవారు. (బుఖారీ, ముస్లిం)

وَعِنْدَهُمَا مِنْ حَدِيثِ جَابِرٍ: «وَالْعِشَاءُ أَحْيَاناً يُقَدِّمُهَا، وَأَحْيَاناً يُؤَخِّرُهَا، إِذَا رَآهُمُ اجْتَمَعُوا عَجَّلَ وَإِذَا رَآهُمْ أَبْطَؤُوا أَخَّرَ، وَالصُّبْحُ كَانَ النَّبِيُّ ﷺ يُصَلِّيهَا بِغَلَسٍ.

జాబిర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది: ఆయన (స) ఇషా నమాజు ఒక్కోసారి త్వరగా చేసేవారు, ఒక్కోసారి ఆలస్యంగా చేసేవారు. ప్రజలందరూ వచ్చే శారని నిర్ధారణ అయితే తొందరగా నమాజ్ మొదలెట్టేవారు. ప్రజలు ఆలస్యంగా వస్తున్నారనిపిస్తే కాస్సేపు ఆగి ఇషా నమాజు చేసేవారు. అయితే ఉదయం నమాజును మాత్రం దైవప్రవక్త (స) చీకటి అలుముకుని ఉండగానే చేసేవారు. (బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ مِنْ حَدِيْثِ أَبِي مُوْسَى: «فَأَقَامَ الفَجْرَ حِيْنَ انْشَقَّ الْفَجْرُ، وَالنَّاسُ لاَ يَكَادُ يَعْرِفُ بَعْضُهُمْ بَعْضاً».

ముస్లింలో అబూ మూసా (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: "ఉదయం నమాజును తొలి జాములోనే మొదలెట్టే వారు. చీకటి మూలంగా సహచరులు ఒండొకరిని అతి కష్టంమీద గుర్తుపట్ట గలిగేవారు."

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) ఫజ్ర్ నమాజును తొలివేళలోనే - చీకటి ఉండగానే - చేసేవారనీ, ఈ నమాజులో అరవై నుండి నూరు ఆయత్‌ల దాకా పారాయణం చేయటం ద్వారా చాలా సుదీర్ఘమయిన నమాజు చేసేవారని, దివ్య ఖుర్‌ఆన్‌ను బాగా ఆగి ఆగి పఠించేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. దీన్నిబట్టి బేరీజువేయవచ్చు - ఆయన (స) ఎంత తొందరగా ఫజ్ర్ నమాజును మొదలెట్టేవారో! దీన్నిబట్టి ఉదయం నమాజ్‌ను తొలివేళలో - అంటే చీకటి ఉండగానే ప్రారంభించాలని మనకు తెలిసివస్తున్నది. అయితే నమాజు కొరకు నిలబడే సమయానికి ఆకాశాన ధవళ రేఖలు పొడసూపటం అవసరమని మరువరాదు. అంతకు ముందు గనక నమాజ్ చేస్తే అప్పటికి ఫజ్ర్ వేళ అవదు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ బర్జా (రజి) అసలు పేరు నద్‌ల బిన్ ఉబైద్. అబూ బర్జా ఆయన నామాంతరం. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించిన ప్రియ సహచరులలో ఒకరు. మక్కా విజయంలోను, ఆ తరువాత జరిగిన యుద్ధాలలోనూ పాల్గొన్నారు. బస్రాలో స్థిరపడ్డారు. ఆ తర్వాత ఖురాసాన్‌కు బదిలీ అయ్యారు. ఒక కథనం ప్రకారం 'మర్వ్'లో హిజ్రీ 60లో పరమపదించారు. హిజ్రీ 64లో మరణించారని వేరొక ఉల్లేఖనం చెబుతోంది.

(١٣١) وَعَنْ رَافِعِ بْنِ خَدِيْجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي الْمَغْرِبَ مَعَ رَسُولِ اللهِ ﷺ، فَيَنْصَرِفُ أَحَدُنَا وَإِنَّهُ لَيُبْصِرُ مَوَاقِعَ نَبْلِهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

131. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి మగ్రిబ్ నమాజ్ చేసేవాళ్ళం. ఆ తరువాత మాలో నుంచి ఎవరయినా (మస్జిద్) బయటికి పోయి చూస్తే ప్రయోగించిన బాణం ఎక్కడ పడిందో చూడగలిగేంత వెలుతురు ఉండేది. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

మగ్రిబ్ నమాజ్ చేయటంలో తాత్సారం చేయరాదనీ, వేళ అయిన వెంటనే నమాజ్‌ను ముగించటం ఉత్తమమనీ ఈ హదీసులోని సంఘటననుబట్టి అర్థమవుతున్నది.

### హదీసు ఉల్లేఖకులు

రాఫె బిన్ ఖదీజ్ (రజి) యొక్క మరో పేరు అబ్దుల్లాహ్. పిన్న వయస్సు కారణంగా బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. ఉహుద్ యుద్ధంలోనూ, ఆ తర్వాతి యుద్ధాలలోనూ పాల్గొన్నారు. హిజ్రీ 73 లేక 74లో 86 ఏండ్ల వయస్సులో మరణించారు.

(١٣٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَعْتَمَ النَّبِيُّ ﷺ ذَاتَ لَيْلَةٍ بِالْعِشَاءِ، حَتَّى ذَهَبَتْ عَامَّةُ اللَّيْلِ، ثُمَّ خَرَجَ فَصَلَّى، وَقَالَ: «إِنَّهُ لَوَقْتُهَا، لَوْلاَ أَنْ أَشُقَّ عَلَى أُمَّتِي»، رَوَاهُ مُسْلِمٌ.

132. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రాత్రి ఇషా నమాజును ఎంత ఆలస్యంగా చేశారంటే, అప్పటికి ఒక వంతు రాత్రి గడచిపోయింది. ఆయన (స) నమాజు కోసం విచ్చేశారు, నమాజు చేసిన మీదట ఇలా వ్యాఖ్యానించారు: నా అనుచర సమాజం కొరకు (ఈ వేళ) భారం కానట్లయితే నేను ఇషా నమాజుకై ఈ వేళనే నిర్ధారించేవాణ్ణి." (ముస్లిం)

### సారాంశం

ఇషా నమాజ్ ఆలస్యంగా చేయటం ఉత్తమం అన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. అయితే ఈ ఆలస్యం ఒక్క ఇషా నమాజ్‌కే ప్రత్యేకం. వేరితర నమాజులు తొలివేళల్లో చేయటం శ్రేష్ఠం. ఇషా నమాజు కోసం ప్రజలు రావటంలో ఆలస్యమయితే మహాప్రవక్త (స) నిరీక్షించేవారని ఇంతకుముందు చెప్పుకున్నాం. అంటే ఏ విషయమయినా ప్రజలకు క్లిష్టతరంగా కనిపిస్తే దాన్ని వీలయినంత వరకు సులభతరం చేయడానికి దైవప్రవక్త (సఅసం) ప్రయత్నించేవారు.

(١٣٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا اشْتَدَّ الحَرُّ فَأَبْرِدُوا بِالصَّلاَةِ، فَإِنَّ شِدَّةَ الحَرِّ مِنْ فَيْحِ جَهَنَّمَ». مُتَّفَقٌ عَلَيْهِ.

133. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: వేసవి తీవ్రత ఉంటే అప్పుడు కాస్త చల్లబడిన తరువాత నమాజ్ చేయండి. ఎందుకంటే వేసవి తీవ్రత నరకం వదిలే గాలి వల్ల ఉత్పన్నమవుతుంది." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

వేసవి కాలంలో జుహ్ర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేయాలని పై హదీసు ద్వారా విశదమవుతున్నది. అయితే ఈ ఆలస్యానికి ఆఖరి హద్దు ఏమై ఉంటుంది? ఈ సందేహానికి

సమాధానం అబూ దావూద్, నసాయిలలో ఉంది - దైవప్రవక్త (స) ఎండా కాలంలో జుహ్ర్ నమాజ్ చేసే సమయానికి నీడ మూడడుగుల నుంచి ఐదడుగుల వరకు వచ్చేది. అయితే ఇది ఆయాదేశాల భౌగోళిక, అక్షాంశ రేఖలపై ఆధారపడి ఉంటుందని అల్లామా ఖుతాబీ అభిప్రాయపడ్డారు. మొత్తంమీద బోధపడే అంశం ఏమిటంటే ఎండాకాలంలో జుహ్ర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేయటం అభిలషణీయం. అత్యధిక మంది పండితుల, విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే.

(١٣٤) وَعَنْ رَافِعِ بْنِ خَدِيْجٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَصْبِحُوا بِالصُّبْحِ، فَإِنَّهُ أَعْظَمُ لِأُجُورِكُمْ». رَوَاهُ الْخَمْسَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

134. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "ఫజ్ర్ నమాజ్‌ను బాగా తెల్లవారబోతుందనగా చేయండి." (దీనిని ఐదుగురు - అంటే అబూదావూద్, తిర్మిజీ, నసాయి, అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. తిర్మిజీ మరియు ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

హనఫీ ఫికహ్ ననుసరించేవారు ఈ హదీసు ఆధారంగానే ఫజ్ర్ నమాజ్‌ను ఆఖరివేళలో చేయటం ఉత్తమమని భావిస్తారు. అయితే దైవప్రవక్త (సఅసం) వారి నిరంతర ఆచరణను, ధర్మ ఖలీఫాల ఆచరణను, అత్యధిక సహాబీల, వారి శిష్యుల అనుసరణనుబట్టి చూస్తే ఆలస్యంగా చేయాలన్న నిదర్శనం ప్రబలంగా కనిపించదు. అబూదావూద్‌లో హజ్రత్ అబూ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఫజ్ర్ నమాజ్‌ను ఒకసారి చీకటి ఉండగా చేశారు, ఒకసారి తెల తెలవారుతుండగా కూడా చేశారు. ఆ తరువాత ఆయన (స) జీవితాంతం చీకటి ఉండగానే నమాజ్ చేసేవారు. తెల్ల వారబోతుందన్న సూచన ప్రస్ఫుటం అయినట్లు గమనించి నమాజ్ ఆచరించండన్నదే అసలు ఈ హదీసు భావార్థం. ఇమామ్ అహ్మద్ (రహ్మ్‌లై) తదితరులు వక్కాణించినట్లు తెల్లవారబోతుందన్న విషయంలో అనుమానానికి ఆస్కారం ఉండకూడదు.

(١٣٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «مَنْ أَدْرَكَ مِنَ الصُّبْحِ رَكْعَةً قَبْلَ أَنْ تَطْلُعَ الشَّمْسُ فَقَدْ أَدْرَكَ الصُّبْحَ، وَمَنْ أَدْرَكَ رَكْعَةً مِنَ الْعَصْرِ

135. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "సూర్యోదయం కాకపూర్వమే ఎవరు ఫజ్ర్ నమాజ్‌లోని ఒక రకత్‌ను పూర్తి చేశాడో అతడు ఉదయం నమాజ్‌ను పొందాడు. మరెవరు సూర్యాస్తమయానికి మునుపే

قَبْلَ أَنْ تَغْرُبَ الشَّمْسُ فَقَدْ أَدْرَكَ الْعَصْرَ». مُتَّفَقٌ عَلَيْهِ.

అస్ర్ నమాజ్‌లోని ఒక రకత్‌ను నెర వేర్చాడో అతడు అస్ర్ నమాజ్‌ను పొందాడు." (బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا نَحْوُهُ، وَقَالَ: «سَجْدَةً» بَدَلَ «رَكْعَةً» ثُمَّ قَالَ: وَالسَّجْدَةُ إِنَّمَا هِيَ الرَّكْعَةُ.

ముస్లింలో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) హదీసులో కూడా ఇదేవిధంగా చెప్ప బడింది. అయితే రకత్ స్థానంలో సజ్దా అనే పదం వచ్చింది. సజ్దా కూడా రకత్‌లో అంతర్భాగమే కదా అని కూడా అనబడింది.

**సారాంశం**

సరిగ్గా సూర్యోదయం, సూర్యాస్తమయం అవుతున్న సమయంలో నమాజ్ చేయటం నిషిద్ధం. కాని ఒకవేళ ఎవరయినా ముందే నమాజ్‌ను ప్రారంభించి ఉండగా సూర్యోదయ సమయం లేక సూర్యాస్తమయ సమయం ఆసన్నమైతే అప్పుడు ఆ వ్యక్తి నమాజ్‌ను పూర్తి చేసుకోవాలి. అతని నమాజ్ నెరవేరుతుందనటంలో సంశయానికి తావు లేదు.

(١٣٦) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسولَ اللهِ ﷺ يَقُوْلُ: «لاَ صَلاَةَ بَعْدَ الصُّبْحِ حَتَّى تَطْلُعَ الشَّمْسُ وَلاَ صَلاَةَ بَعْدَ الْعَصْرِ حَتَّى تَغِيبَ الشَّمْسُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلَفْظُ مُسْلِمٍ: «لاَ صَلاَةَ بَعْدَ صَلاةِ الْفَجْرِ».

136. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) వివరించారు: నేను దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఉద్బోధించగా విన్నాను - "ఉదయం నమాజ్ నెరవేర్చిన తరువాత సూర్యోదయం వరకూ మరే నమాజూ లేదు. అలాగే అస్ర్ నమాజ్ నెరవేర్చిన తరువాత సూర్యాస్తమయం వరకూ ఏ నమాజూ లేదు (చేయటం ధర్మసమ్మతం కాదు). (బుఖారీ, ముస్లిం)

وَلَهُ عَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: ثَلاَثُ سَاعَاتٍ كَانَ رَسُولُ اللهِ ﷺ يَنْهَانَا أَنْ نُصَلِّيَ فِيهِنَّ وَأَنْ نَقْبُرَ فِيهِنَّ مَوْتَانَا: حِيْنَ تَطْلُعُ الشَّمْسُ بَازِغَةً حَتَّى تَرْتَفِعَ، وَحِيْنَ يَقُوْمُ قَائِمُ الظَّهِيْرَةِ حَتَّى تَزُوْلَ الشَّمْسُ، وَحِيْنَ تَتَضَيَّفُ الشَّمْسُ لِلْغُرُوبِ.

"ఫజ్ర్ నమాజ్ తరువాత మరే నమాజూ లేదు"అని ముస్లింలో ఉంది. ముస్లింలో (నే) ఉఖ్‌బా బిన్ ఆమిర్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: మేము మూడు వేళల్లో నమాజ్ చేయడాన్నీ, మృతుని అంత్యక్రియలు జరపటాన్నీ దైవప్రవక్త (స) వారించేవారు. మొదటిది: సూర్యో

وَالْحُكْمُ الثَّانِي عِنْدَ الشَّافِعِيِّ رَحِمَهُ اللَّهُ تَعَالَى مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ بِسَنَدٍ ضَعِيفٍ وَزَادَ: «إِلاَّ يَوْمَ الْجُمُعَةِ» وَكَذَا لِأَبِي دَاوُدَ عَنْ أَبِي قَتَادَةَ نَحْوُهُ.

దయం అయ్యే వేళ. అది పైకెక్కేవరకూ (ఈ రెండు పనులు చేయరాదు). రెండవది: నడినెత్తి మీదికొచ్చిన సూర్యుడు వాలేవరకూ. మూడవది: సూర్యాస్త మయం అయ్యే వేళ. రెండవ ఆజ్ఞను (అంటే మిట్ట మధ్యాహ్నవేళ నమాజ్ చేయరాదన్న ఆజ్ఞను) ఇమామ్ షాఫయి (రహ్మ.లై) హజ్రత్ అబూ హురైర (రజి) నుండి బలహీన (జయీఫ్) ఆధారాలతో ఉల్లేఖించారు. అయితే ఇందులో **'ఇల్లా యౌమల్ జుముఅ'** అనే పదాలు అదనంగా ఉన్నాయి. (అంటే మిట్ట మధ్యాహ్న వేళ నమాజ్ చేయకండి. కాని శుక్రవారం నాడు చేయవచ్చు). అబూ దావూద్ కూడా హజ్రత్ అబూ ఖతాదా (రజి) నుండి హజ్రత్ అబూ హురైర (రజి) తరహా ఉల్లేఖనాన్ని నకలు చేశారు. (అందులో కూడా శుక్రవారం మినహాయింపు ఉంది)

**సారాంశం**

ఈ హదీసులో నిషిద్ధ వేళల్లో చేయకూడని పనుల గురించి వివరించబడింది. వీటిలో మొదటిది: 'శవాన్ని మూడు వేళల్లో ఖననం చేయకూడదు.' ఇందులో జనాజా నమాజ్ కూడా వచ్చేస్తుంది. ఏదైనా అనివార్యమయిన పరిస్థితి ఏర్పడితే అప్పుడు అంత్యక్రియలు జరపవచ్చు.

రెండవది: మిట్ట మధ్యాహ్నవేళ. సూర్యుడు నడినెత్తి మీదికొచ్చినపుడు - అది పడమటి దిక్కుకు వాలే వరకూ నమాజ్‌గానీ, జనాజా నమాజ్‌గానీ చేయరాదు. ఆ సమయంలో శవాన్ని ఖననం కూడా చేయకూడదు. అయితే శుక్రవారానికి మినహాయింపు ఉంది. ఆ సమయంలో నఫిల్ నమాజులు చేసుకోవచ్చు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం కూడా ఇదే. శుక్రవారం నాడు సూర్యుడు వాలుతున్న సమయంలో జుమా నమాజు కూడా చేయవచ్చు. హజ్రత్ అబూ హురైర (రజి) నుండి ఉటంకించిన హదీసులలో కూడా ఈ సంగతి వచ్చింది.

మూడవ ఆజ్ఞ : సూర్యాస్తమయ సమయంలో కూడా జనాజా నమాజ్ చేయటంగానీ, శవాన్ని పూడ్చి పెట్టడంగానీ చేయరాదు. ఉదయించిన సూర్యుడు "పైకెక్కే వరకూ..." అని హదీసులో వచ్చింది. దీని భావం ఏమిటి? అబూదావూద్, నసాయి తదితర ఉల్లేఖనాలలో దీని ఎత్తు ఒకటి లేక రెండు ఈటెలకు సమానమని చెప్పబడింది. అంటే సూర్యుడు తూర్పు దిక్కున ఒకటి లేక

రెండు ఈటెలకు సమానమైన ఎత్తుకు చేరుకోగలిగితే అప్పుడు నమాజ్ చేసేందుకు అనుమతి ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) మారు పేరు అబూ హమ్మాద్ లేక అబూ ఆమిర్. హిజ్రత్ చేసినవారిలో ఈయనా ఉన్నారు. దైవగ్రంథాన్ని మధురాతి మధురంగా పారాయణం చేసేవారు. ధర్మ శాస్త్ర కోవిదులు. ధర్మవేత్త అవటంతోపాటు మంచి కవి కూడా. బస్రాలో స్థిరపడ్డారు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అమీర్ ముఆవియ (రజి) పక్షాన నిలిచారు. మూడేండ్లు ఈజిప్టు గవర్నర్‌గా ఉన్నారు. సముద్రతీర యుద్ధాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈజిప్టులో హిజ్రీ 58లో మరణించారు. 'ముఖ్తమ్'లో అంత్యక్రియలు జరిగాయి.

(١٣٧) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَا بَنِي عَبْدِ مَنَافٍ لاَ تَمْنَعُوا أَحَداً طَافَ بِهَذَا الْبَيْتِ، وَصَلَّى أَيَّةَ سَاعَةٍ شَاءَ مِنْ لَيْلٍ أَوْ نَهَارٍ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

137. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "ఓ అబ్దె మునాఫ్ సంతతి వారలారా! దైవ గృహ ప్రదక్షిణ చేసేవారి నెవరినీ వారిం చటంగానీ, నమాజ్ చేసేవారిని ఆపటం గానీ చేయకండి - వారు ఏ ఘడియలో ఈ పని చేసినాసరే (చేయనివ్వండి). (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

కాబా ప్రాంగణంలో చేయబడే ఏ నమాజ్ గురించి ఈ హదీసులో చెప్పబడిందీ? కాబా ప్రదక్షిణ అనంతరం చేసుకునే 'నఫిల్ నమాజుల'ని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. సాధారణ నఫిల్ నమాజులు మాత్రం కాదు. కాని అబూదావూద్‌లో పేర్కొనబడిన ఒక హదీసు ప్రకారం ఈ నమాజులు సాధారణ నఫిల్ నమాజులేనని విదితమవుతోంది. మరో ముఖ్య విషయం - మూడు వేళల్లో నమాజ్ చేయరాదన్న ఆజ్ఞ కాబా ప్రాంగణంలో చేసే నమాజులకు వర్తించదని అత్యధికమంది పండితులు అభిప్రాయపడుతున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

(1) జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) గారి మారు పేరు అబూ ముహమ్మద్ లేక అబూ ఉమయ్యా. పూర్తి పేరు జుబైర్ బిన్ ముత్‌యిమ్ బిన్ అదీ బిన్ నౌఫల్ ఖురషీ. మృదు స్వభావులు.

మర్యాదస్తులు. ఖురైష్ వంశీయుల వంశపరంపరను చెప్పటం ఆయనకు కొట్టిన పిండి. మక్కా విజయానికి పూర్వం ఇస్లాం స్వీకరించి మదీనా వచ్చారు. ఈయన మరణ సమయం గురించి అభిప్రాయభేదం ఉంది. హిజ్రీ 54 లేదా 57 లేదా 59లో మరణించారని చెప్పబడుతోంది.

(2) హదీసులో అబ్దె మునాఫ్ ప్రస్తావన వచ్చింది. అబ్దె మునాఫ్ అంటే మునాఫ్ దాసుడు, మునాఫ్ బానిస అని అర్థం. పూర్వం 'మునాఫ్' అనే విగ్రహం ఉండేది. తల్లిగారు ఈయన్ని ఆ దేవతకు సేవకునిగా అంకితం చేసింది. ఈ కారణంగా ఈయన అబ్దె మునాఫ్‌గా పేరు మోసారు. వాస్తవానికి ఈయన పేరు ముగైరా. అబూ అబ్దుషమ్స్ అనేది మారుపేరు. బనూ మఖ్జూమ్ మరియు బనూ అబ్దె మునాఫ్ అనే రెండు తెగలతోనూ ఈయనకు సంబంధం ఉండేది. ఇంతకీ ఈ అబ్దె మునాఫ్ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ముత్తాత గారన్న సంగతి మరువరాదు. ఖురైషు సర్దారులలో అత్యంత గౌరవనీయులుగా పరిగణించబడ్డారు.

(١٣٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الشَّفَقُ الْحُمْرَةُ**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَ ابْنُ خُزَيْمَةَ وَغَيْرُهُ وَقْفَهُ.

138. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రపచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) చెప్పారు: "షఫఖ్ అంటే ఎరుపు అని అర్థం." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమా దీనిని ప్రామాణికం అని అనగా ఇతరులు 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

'షఫఖ్' అంటే సూర్యాస్తమయం అయిన తరువాత ఆకాశపుటంచున ప్రస్ఫుటమయ్యే అరుణిమ చారలు అని భావం. ఈ నిర్వచనంపై ఇమాములందరూ, నిఘంటువు కర్తలు కూడా ఏకీభవిస్తున్నారు. కాని ఒక్క ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం దీంతో విభేదించారు. ఎరుపుదనం పోయిన తరువాత ఏర్పడే తెలుపుదనమే 'షఫఖ్' అంటారాయన. ఆయన ప్రియాతి ప్రియమైన శిష్యులిరువురు కూడా 'షఫఖ్' ను 'ఎరుపు' అన్న భావంలోనే తీసుకున్నారు మరి!

(١٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْفَجْرُ فَجْرَانِ، فَجْرٌ يُحَرِّمُ الطَّعَامَ وَتَحِلُّ فِيهِ الصَّلَاةُ، وَفَجْرٌ تَحْرُمُ فِيهِ الصَّلَاةُ، أَيْ صَلَاةُ الصُّبْحِ، وَيَحِلُّ فِيهِ الطَّعَامُ**». رَوَاهُ ابْنُ خُزَيْمَةَ

139. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సఅసం) ప్రవచించారు - "ఫజ్ర్ రెండు రకాలు. ఒక రకపు ఫజ్ర్‌లో (ఉపవాసికోసం) తినటం హరామ్ (నిషిద్ధం), నమాజ్ చేయటం హలాల్ (ధర్మసమ్మతం). రెండవ రకపు ఫజ్ర్‌లో నమాజ్ చేయటం హరామ్, తినటం హలాల్." (ఇబ్నె

وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ، وَلِلْحَاكِمِ مِنْ حَدِيثِ جَابِرٍ نَحْوُهُ، وَزَادَ فِي الَّذِي يُحَرِّمُ الطَّعَامَ: إِنَّهُ يَذْهَبُ مُسْتَطِيلاً فِي الْأُفُقِ. وَفِي الآخَرِ: «إِنَّهُ كَذَنَبِ السِّرْحَانِ».

ఖుజైమ, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు. ఇరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

ముస్తద్రక్ హాకిమ్‌లో జాబిర్ (రజి) చేత కూడా ఇలాగే ఉటంకించబడింది. అయితే అందులో ఈ వాక్యం అదనంగా ఉంది: "ఏ ఫజ్ర్‌లో తినటం నిషిద్ధమో అది ఆకాశపుటంచుల్లో, పరిసరాల్లో విస్తృతంగా విస్తరిల్లిపోతుంది. రెండవ కోవకు చెందినది; గొఱ్ఱె తోకలా ప్రస్ఫుట మవుతుంది."

### సారాంశం

ఫజ్ర్ రెండు రకాలు. ఒకటి: సుబహ్ సాదిఖ్. రెండు: సుబహ్ కాజిబ్. మొదటి రకం ఫజ్ర్‌లో తెల్లవారే సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. రెండవ రకం ఫజ్ర్‌లో చీకటి అలుముకుని ఉంటుంది. చీకటి అలుముకుని వున్న ఫజ్ర్‌లో ఉపవాసం పాటించేవారు సహ్రీ చేస్తారు. తెల తెలవారుతుండగా ఫజ్ర్ నమాజ్ చేస్తారు. ఈ రెండు ఆచరణలకు మధ్య కొద్దిపాటి విరామం కూడా ఉంటుంది. సహ్రీ వేళల్లో ఫజ్ర్ నమాజ్ నిషేధించబడగా ఫజ్ర్ నమాజ్ వేళలో భోజనాదులు నిషేధించబడ్డాయి. ఇదీ ఈ హదీసు సారాంశం.

(١٤٠) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَفْضَلُ الْأَعْمَالِ الصَّلَاةُ فِي أَوَّلِ وَقْتِهَا». رَوَاهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ.

140. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "తొలివేళలో చేసే నమాజ్ ఆచరణల న్నింటిలోకీ శ్రేష్ఠమైనది." (తిర్మిజీ, హాకిమ్‌లు దీనిని ఉల్లేఖించటమేగాక, ఇరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. హదీసు మూలం మాత్రం బుఖారీ, ముస్లింలలో ఉంది).

### సారాంశం

ఈ హదీసులో నమాజును తొలి వేళల్లో చేయటాన్ని అన్నింటికన్నా ఉత్తమమయిన ఆచరణగా చెప్పటం జరిగింది. కాగా; ఇతర హదీసులలో ఈమాన్ (విశ్వాసం), సదఖా (దానం), జిహాద్

(ధర్మయుద్ధం)లను శ్రేష్ఠమయిన ఆచరణలుగా పేర్కొనటం జరిగింది. నిజానికి ఈ హదీసులన్నీ ఆయా కోణాల నుంచి సరైనవే. వాటిమధ్య గల సమన్వయం, సమరసం ఈ విధంగా ఉంది: ఈమాన్- అంటే విశ్వాసం మనసుతో, అంతరాత్మతో ముడిపడి ఉంది. కాబట్టి మానసిక ఆచరణలన్నింటిలోకీ శ్రేష్ఠమైనది విశ్వాసం. నమాజ్ శరీరంతో ముడిపడి ఉంది. కనుక శారీరకమయిన సత్కార్యాలన్నింటిలోకీ శ్రేష్ఠమైనది నమాజ్. దానధర్మాల సంబంధం ధనంతో ఉంది. కాబట్టి ధనసంబంధమైన ఆచరణల్లోకెల్లా ఉత్తమమైనది దానం. కాగా; జిహాద్ యుక్త వయస్సుతో, పోరాటపటిమతో, శక్తితో, ఆరోగ్యంతో ముడిపడి ఉంది. ఈ శక్తి సామర్థ్యాలను ఎవరు దైవమార్గంలో అర్పిస్తారో వారి పాలిట జిహాద్ అన్నింటికన్నా గొప్ప ఆచరణ అవుతుంది. ఈ విధంగా ఈ హదీసుల మధ్య పరస్పర సానుకూలత, పరస్పర ప్రయోజనాలు ఉన్నాయి. తొలివేళల్లో నమాజ్ ఆచరించాలన్న ప్రబోధనం ఒక్క ఇషా నమాజ్‌కు తప్ప మిగిలిన అన్ని నమాజులకూ వర్తిస్తుంది.

(١٤١) وَعَنْ أَبِي مَحْذُوْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: أَوَّلُ الْوَقْتِ رِضْوَانُ اللّٰهِ، وَأَوْسَطُهُ رَحْمَةُ اللّٰهِ، وَآخِرُهُ عَفْوُ اللّٰهِ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ بِسَنَدٍ ضَعِيْفٍ جِدًّا وَلِلتِّرْمِذِيِّ مِنْ حَدِيْثِ ابْنِ عُمَرَ نَحْوُهُ دُوْنَ الْأَوْسَطِ وَهُوَ ضَعِيْفٌ أَيْضاً.

141. హజ్రత్ అబూ మహ్‌జూర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "తొలివేళ (లో చేసే నమాజ్) దైవప్రసన్న తను చూరగొనే సాధనం. మధ్యవేళ (లో చేసే నమాజ్) దైవ కారుణ్యానికి మూలం. ఆఖరివేళ(లో చేసే నమాజ్) రాయితీతో కూడుకున్నది." (దారె ఖుత్నీ దీనిని అత్యంత బలహీనమయిన ఆధారంతో ఉల్లేఖించారు. తిర్మిజీలో ఇబ్నె ఉమర్ (రజి) హదీసు కూడా ఇలాగే ఉందిగానీ అందులో 'మధ్యవేళ' గురించిన ప్రస్తావన లేదు. అయితే ఇది కూడా బలహీనమైనదే).

**సారాంశం**

పై హదీసు అందిన తీరులోనూ, మధ్యలో దాన్ని అందించిన వారి పరంపరలో లోపాలుండటం చేతనూ హదీసువేత్తలు దీనిని అత్యంత జయీఫ్ (బలహీన) హదీసుగా నిర్ధారించారు. ఈ హదీసును సేకరించటానికి యాఖూబ్ బిన్ వలీద్ అనే వ్యక్తి సహాయం తీసుకోవలసివచ్చింది. అతని గురించి ఇమాములకు, హదీసువేత్తలకు సదభిప్రాయం లేదు. ఇమామ్ నసాయి (రహ్మతుల్లై) గారైతే, ఇతన్ని పూర్తిగా ఉపేక్షించారు. ఇబ్నె హిబ్బాన్‌గారైతే, ఇతడు హదీసులను కల్పించేవాడని ఆరోపించారు. విమర్శకుల, హదీసువేత్తల ఈ అభిప్రాయాలు ముందుకు వచ్చిన తరువాత ఈ హదీసు పరిగణణలోకి తీసుకోదగ్గది కాదని తేలిపోయింది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ మహ్‌జూర (రజి) అసలు పేరు సమురా లేక ఔస్. దైవప్రవక్త (స)చే నియమించబడిన ముఅజ్జిన్. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. మక్కాలోనే స్థిరపడ్డారు. ఐదు పూటల నమాజులకై అజాన్ పిలుపు ఇచ్చేవారు. హిజ్రీ 59లో మరణించారు.

(١٤٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «لاَ صَلاَةَ بَعْدَ الْفَجْرِ إِلاَّ سَجْدَتَيْنِ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

142. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ఫజ్ర్ (ఫర్జ్ నమాజ్) తరువాత కేవలం రెండు రకతుల సున్నత్ తప్ప మరే (నఫిల్) నమాజూ లేదు." (నసాయి తప్ప మిగిలిన ఐదుగురూ దీనిని ఉల్లేఖించారు).

وَفِي رِوَايَةِ عَبْدِ الرَّزَّاقِ: «لاَ صَلاَةَ بَعْدَ طُلُوعِ الْفَجْرِ إِلاَّ رَكْعَتَيِ الْفَجْرِ» وَمِثْلُهُ لِلدَّارَقُطْنِيِّ عَنِ ابْنِ عَمْرِو بْنِ الْعَاص.

అబ్దుర్రజ్జాఖ్ ఉల్లేఖనంలో ఇలా వుంది- "తెల్లవారాక ఫజ్ర్ యొక్క కేవలం రెండు రకతులే ఉన్నాయి." (దారె ఖుత్నీలో ఇబ్నె అమ్ర్ బిన్ ఆస్ - రజి - చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది).

## సారాంశం

ఈ హదీసు ప్రకారం ఫజ్ర్ అనంతరం రెండు రకతుల సున్నత్ నమాజ్ మినహా మరే నఫిల్ నమాజయినా చేయకూడదు.

(١٤٣) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: صَلَّى رَسُولُ اللهِ ﷺ الْعَصْرَ، ثُمَّ دَخَلَ بَيْتِي، فَصَلَّى رَكْعَتَيْنِ، فَسَأَلْتُهُ فَقَالَ: شُغِلْتُ عَنْ رَكْعَتَيْنِ بَعْدَ الظُّهرِ فَصَلَّيْتُهُمَا

143. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అస్ర్ నమాజ్ చేసి నా కుటీరంలోకి విచ్చేశారు. రెండు రకతుల నమాజ్ చేశారు. 'ఈ రెండు రకతులు దేనికి సంబంధించినవి?' అని నేనాయన్ని (స) ప్రశ్నించాను. "జుహ్‌ర్ వేళ ఫర్జ్ నమాజ్ అనంతరం రెండు రకతుల నమాజ్ నెరవేర్చలేకపోయాను. దానిని ఇప్పుడు పూర్తి చేశాను" అని ఆయన (స) వివరించారు. 'ఈ రెండు రకతుల ఖజా మా

ٱلآنَ. قُلْتُ: أَفَنَقْضِيهِمَا إِذَا فَاتَتَا قال: «لاَ». أَخْرَجَهُ أَحْمَدُ، ولأَبِي دَاوُدَ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا بِمَعْنَاهُ.

వల్ల కూడా ఎప్పుడయినా జరిగిపోతే మేము కూడా ఇలాగే పూర్తిచేయవచ్చా?' అని నేను అడిగాను. "లేదు" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. అబూదావూద్ హజ్రత్ ఆయిషా - ర.అన్హా - గారిచేత కూడా ఇలాగే ఉల్లేఖించబడింది)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే, వదలివేయబడిన సున్నతులను అస్ర్ నమాజ్ అనంతరం నెరవేర్చే వ్యవహారం ఒక్క దైవప్రవక్త (సఅసం)కే ప్రత్యేకం. ఇమామ్ తహావీ, అల్లామా యమానీల అభిప్రాయం కూడా ఇదే.

అయితే ఇమామ్ బైహఖీ, హాఫిజ్ ఇబ్నె హజర్‌ల దృక్పథం మరోవిధంగా ఉంది - "మేము కూడా ఇలా పూర్తి చేయవచ్చా?" అన్న హదీసులోని చివరి వాక్యం 'జయ్యిఫ్' అనీ, ఖజా అయిపోయిన ఫర్జ్ నమాజులయినా, సున్నత్‌లయినా అస్ర్ అనంతరం నెరవేర్చటం సమంజసమేననీ వీళ్లంటున్నారు. అబూదావూద్ వ్యాఖ్యాత షేఖ్ షమ్సుల్ హఖ్ ముహద్దిస్ డయాన్వీగారు "ఆలామ్ అహ్‌లుల్ అస్ర్"లో దీని గురించి బహుచక్కగా చర్చించారు.

**2వ అధ్యాయం**

## ٢ - بَابُ ٱلأَذَانِ

## అజాన్

(١٤٤) عَنْ عَبْدَ اللهِ بِنْ زَيْدِ بن عَبْدِ رَبِّهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: طَافَ بِيْ – وَأَنَا نَائِمٌ – رَجُلٌ، فَقَالَ: تَقُولُ «اللَّهُ أَكْبَرُ اللَّهُ أَكْبَرُ» فَذَكَرَ ٱلأَذَانَ بِتَرْبِيعِ التَّكْبِيرِ بِغَيْرِ تَرْجِيعٍ، وَالإِقَامَةَ فُرَادَى، إِلاَّ «قَدْ قَامَتِ الصَّلاَةُ» قَالَ: فَلَمَّا أَصْبَحْتُ أَتَيْتُ رَسُولَ اللهِ

144. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహి (రజి) ఇలా వివరించారు: కలలో నాకు ఒక వ్యక్తి కానవచ్చాడు. అతడు నాకు 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్' అని పలకమని చెప్పాడు. ఆ తరువాత అతను అజాన్ అంతటినీ వినిపించాడు. అల్లాహు అక్బర్ అని- తర్జీ లేకుండా - నాలుగు సార్లు చెప్పాడు. ఇఖామత్‌లో (ని పదాలు) ఒక్కొక్కసారి పలికాడు. అయితే 'ఖద్ ఖామతిస్ సలాహ్' మాత్రం రెండుసార్లు పలికాడు. తెల్లవారిన తరువాత నేను దైవప్రవక్త

ﷺ، فقال: «إِنَّهَا لَرُؤْيَا حق»، الحديث أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَصَحَّحَهُ التِّرمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

(సఅసం) సమక్షంలో హాజరయ్యాను (కలలో జరిగినదంతా చెప్పాను). "నిస్సందేహంగా ఈ కల నిజమైనది" అని ఆయన (సఅసం) అన్నారు. (ఈ హదీసును అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

وَزَادَ أَحْمَدُ فِي آخِرِهِ قِصَّةَ قَوْلِ بِلَالٍ فِيْ أَذَانِ الْفَجْرِ «الصَّلَاةُ خَيْرٌ مِنَ النَّوْمِ».

ఈ ఉల్లేఖనంలో అహ్మద్ హజ్రత్ బిలాల్ (రజి) గారి ఫజ్ర్ అజాన్‌లో - అస్సలాతు ఖైరుమ్మిననౌమ్" - వృత్తాం తాన్ని కూడా విశదీకరించారు.

وَلِابْنِ خُزَيْمَةَ عَنْ أَنَسٍ قَالَ: مِنَ السُّنَّةِ إِذَا قَالَ الْمُؤَذِّنُ فِي الْفَجْرِ «حَيَّ عَلَى الْفَلَاحِ» قَالَ: «الصَّلَاةُ خَيْرٌ مِنَ النَّوْمِ».

ఇబ్నె ఖుజైమాలో హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనంలో ఆయన ఇలా అన్నారు: "ముఅజ్జిన్ ఫజ్ర్ నమాజ్‌కై ఇచ్చే అజాన్‌లో 'హయ్య అలల్ఫలాహ్' అన్న తరువాత 'అస్సలాతు ఖైరుమ్మి ననౌమ్' అని పలకటం సున్నత్ (సంప్రదాయం)."

## సారాంశం

హిజ్రత్ చేసిన మొదటి సంవత్సరం మదీనాలో దైవప్రవక్త (స) సహచరులను సమావేశపరచి సామూహిక నమాజ్‌కై ప్రజలను పిలిచే పద్ధతి గురించి సంప్రతించారు. ఒక్కొక్కరు ఒక్కో సలహా ఇచ్చారు. శంఖం ఊదాలని ఒకరు, ఎత్తయిన స్థలంలో మంట పెట్టాలని మరొకరు, బిగులు వినిపించాలని ఇంకొకరు - తలా ఒక విధంగా సూచించారు. హజ్రత్ ఉమర్ (రజి) మాత్రం అజాన్ పిలుపు ఇవ్వాలని సూచించారు. దైవప్రవక్త (స)కు ఈ సలహా నచ్చింది. బిగ్గరగా అజాన్ పలకమని ఆయన (స) హజ్రత్ బిలాల్ (రజి)ను ఆదేశించారు. ఈ సందర్భంగానే ఈ హదీసు ఉల్లేఖకులైన అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) కూడా కలగన్నారు. కలలో ఒక వ్యక్తి శంఖం పట్టుకుని ఉన్నాడు. 'దేవుని దాసుడా! ఈ శంఖం అమ్ముతావా?' అని అబ్దుల్లా బిన్ జైద్ అతన్ని అడిగారు. 'దీంతో నీకేంపని?' అని ఆ వ్యక్తి ఎదురు ప్రశ్న వేశాడు. 'మేము దీని సహాయంతో జనులను సామూహిక నమాజ్ కోసం పిలుస్తాము' అని ఆయన జవాబిచ్చారు. 'నేను నీకు ఇంతకన్నా మంచి పద్ధతి తెలుపనా?' అన్నాడు. 'తప్పకుండా తెలుపు' అని అబ్దుల్లా బిన్ జైద్ చెప్పారు. అప్పుడా వ్యక్తి ప్రస్తుత అజాన్ మరియు ఇఖామత్ పలుకులను నేర్పాడు.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అబ్దె రబ్బిహి (రజి). ఈయన మరోపేరు అబూ ముహమ్మద్. అన్సార్‌కు చెందిన ఖజ్రజ్‌తో సంబంధమున్నందున అన్సారీ, ఖజ్రజీగా వ్యవహరించబడేవారు. బద్ర్ యుద్ధం తప్ప ఇతర యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రత్ మొదటి సంవత్సరంలో ఈయన కలలో ప్రస్తుత అజాన్‌ను ఆస్వాదించారు. ఈ సంఘటన మస్జిదె నబవీ నిర్మాణం తర్వాత జరిగింది. ఈయన హిజ్రీ 32లో 64 యేండ్ల వయస్సులో మరణించారు.

(2) బిలాల్ (రజి). 'తైమ్' తెగకు చెందినవారు. పూర్తిపేరు బిలాల్ బిన్ రిబాహ్. స్వేచ్ఛ నొసగబడిన బానిస. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో వర్ణనాతీతమయిన బాధలకు, వేధింపులకు గురయ్యారు. కాని సత్యమార్గంనుండి ఏమాత్రం తొణకలేదు. దైవప్రవక్త (స) గారి ముఅజ్జిన్. దైవప్రవక్త (స) మరణానంతరం ఈయన అజాన్ ఇవ్వటం మానేశారు. మదీనా నగరాన్ని విడిచిపెట్టి డెమాస్కస్‌లో స్థిరపడ్డారు. హిజ్రీ 17 లేక 18వ సంవత్సరంలో 60 పైచిలుకు వయస్సులో మరణించారు. ఈయనకు సంతానం లేదు.

(١٤٥) وَعَنْ أَبِي مَحْذُوْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ عَلَّمَهُ الأَذَانَ، فَذَكَرَ فِيْهِ التَّرْجِيْعَ. أَخْرَجَهُ مُسْلِمٌ، وَلٰكِن ذَكَرَ التَّكْبِيْرَ فِي أَوَّلِهِ مَرَّتَيْنِ فَقَطْ، وَرَوَاهُ الْخَمْسَةُ فَذَكَرُوْهُ مُرَبَّعاً.

145. హజ్రత్ అబూ మహ్‌జూర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు అజాన్ నేర్పారు. అందులో ఆయన 'తర్జీ' గురించి ప్రస్తావించారు. (ముస్లిం దీనిని ఉల్లేఖించారు. అయితే ఇందులో మొదటి సారి 'అల్లాహు అక్బర్'ను రెండుసార్లు పలికినట్లు ఉంది. **అబూ మహ్‌జూర (రజి) చేత ఉల్లేఖించబడిన హదీసును ఐదుగురూ పొందుపరచారు. 'అల్లాహు అక్బర్'ను ప్రథమంలో నాలుగుసార్లు పలికినట్లు వీరు పేర్కొన్నారు).**

## సారాంశం

"అల్లాహు అక్బర్" అనే పదాన్ని మొదట్లో రెండుసార్లు కాదు, నాలుగుసార్లు పలకటమే సరైనదని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అజాన్ కోసం పెద్ద కంఠం, మంచి కంఠం గలవారిని ఎన్నుకోవాలి. ఈ ఎంపిక నిమిత్తం 'అజాన్ పోటీలు' నిర్వహించినట్లుగా కూడా చరిత్రలో ఆధారాలున్నాయి.

(١٤٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: أُمِرَ بِلَالٌ أَن يَشْفَعَ الْأَذَانَ، وَيُوتِرَ الإِقَامَةَ

146. హజ్రత్ అనస్ (రజి) కథనం: అజాన్ వచనాలు రెండేసిసార్లు, తక్బీర్ (ఖద్ ఖామతిస్సలాహ్) తప్ప మిగిలిన

إِلاَّ الإِقَامَةَ. يَعْنِيْ إِلاَّ قَوْلَهُ. قَدْ قَامَتِ الصَّلاَةُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَلَمْ يَذْكُرْ مُسْلِمٌ الاسْتِثْنَاءَ، وَلِلنَّسَائِيِّ: أَمَرَ النَّبِيُّ ﷺ بِلاَلاً.

వచనాలన్నీ ఒక్కోసారి పలకాలని హజ్రత్ బిలాల్ (రజి)కు ఆదేశించబడింది.

(బుఖారీ, ముస్లిం)

అయితే ముస్లింలో 'ఖద్ఖామతిస్సలాహ్' వినాయింపు గురించిన ప్రస్తావన లేదు. 'దైవప్రవక్త (సఅసం) బిలాల్‌కు ఆజ్ఞాపించార'ని నసాయిలో ఉంది.

**సారాంశం**

హజ్రత్ అనస్ (రజి) హదీసులో ఆదేశమిచ్చిన వారు ఎవరో కాదు, దైవప్రవక్తే (స). అజాన్‌లో ఒక్కో వచనం రెండేసిసార్లు పలకాలి. ఇఖామత్‌లో ఒక్కో వచనం ఒక్కోసారి మాత్రమే పలకాలి. ఒక్క 'ఖద్ఖామతిస్సలాత్' వచనం మాత్రం రెండుసార్లు పలకాలని భావం.

(١٤٧) وَعَنْ أَبِيْ جُحَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ بِلاَلاً يُؤَذِّنُ، وَأَتَتَبَّعُ فَاهُ هٰهُنَا وَهٰهُنَا، وَإِصْبَعَاهُ فِيْ أُذُنَيْهِ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرمِذِيُّ، وَصَحَّحَهُ.

147. హజ్రత్ అబూ జుహైఫా (రజి) కథనం: అజాన్ ఇస్తుండగా నేను బిలాల్ (రజి)ను చూచాను. ఆయన తన ముఖాన్ని అటూ ఇటూ తిప్పేవారు. అప్పుడు ఆయన చూపుడు వ్రేళ్లు ఆయన రెండు చెవులలో ఉండేవి. (అహ్మద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు).

وَلاِبْنِ مَاجَهْ: وَجَعَلَ إِصْبَعَيْهِ فِي أُذُنَيْهِ. وَلأَبِي دَاوُدَ: لَوَى عُنُقَهُ لَمَّا بَلَغَ «حَيَّ عَلَى الصَّلاَةِ» يَمِيْناً وَشِمَالاً، وَلَمْ يَسْتَدِرْ. وَأَصْلُهُ فِي الصَّحِيْحَيْنِ.

ఇబ్నె మాజా ఉల్లేఖనంలో ఉంది - "ఆయన తన వ్రేళ్లను తన చెవులలో పెట్టుకున్నారు." అబూదావూద్‌లో ఇలా వుంది: "హయ్య అలస్సలాహ్ అని అనేటప్పుడు తన కుడి ఎడమల వైపునకు కొద్దిగా ముఖం తిప్పేవారంతే. పూర్తిగా తిరిగేవారు కాదు." దీని మూలం 'సహీహైన్'లో ఉంది.

**సారాంశం**

ఖిబ్లా వైపునకు తిరిగి అజాన్ ఇవ్వటం సంప్రదాయం. అలాగే 'హయ్య అలస్సలాహ్'

అనేటప్పుడు కుడివైపునకు, 'హయ్య అలల్ఫలాహ్' అనేటప్పుడు ఎడమవైపునకు కేవలం ముఖం త్రిప్పటం కూడా సంప్రదాయమే. అజాన్ పిలుపు ఇచ్చే సమయంలో వ్రేళ్ళను చెవులలో పెట్టుకోవటం వల్ల రెండు లాభాలున్నాయి. దీనివల్ల శబ్దం బిగ్గరగా వినవస్తుంది. అజాన్ వినలేని చెవిటివాడు ముఅజ్జిన్ యొక్క ఈ దృశ్యం చూచి అజాన్ ఇవ్వబడుతుందని గ్రహించగలుగుతాడు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ జుహైఫా (రజి) మారుపేరు. అసలు పేరు వహబ్ బిన్ అబ్దుల్లాహ్ సువాయి. సువాయి ఆమిరీగా ప్రసిద్ధిచెందారు. యువ సహచరులలో ఒకరుగా పరిగణించబడ్డారు. కూఫాలో స్థిరపడ్డారు. హజ్రత్ అలీ (రజి) తన పరిపాలనా కాలంలో ఈయన్ని కోశాధికారిగా నియమించారు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. హిజ్రీ 74లో కూఫాలోనే మరణించారు.

(١٤٨) وَعَنْ أَبِي مَحْذُوْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَعْجَبَهُ صَوْتُهُ فَعَلَّمَهُ الأَذَانَ. رَوَاهُ ابْنُ خُزَيْمَةَ.

148. హజ్రత్ అబూ మహ్జూర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) కు ఈయన కంఠస్వరం ఎంతగానో నచ్చింది. అందువల్ల ఆయన (స) ఈయన (అబూ మహ్జూర) కు అజాన్ తర్ఫీదు ఇచ్చారు. (ఇబ్నె ఖుజైమ)

## సారాంశం

ముఅజ్జిన్‌లను ఎంపిక చేసేటప్పుడు, నియమించేటప్పుడు వారి కంఠస్వరాన్ని తప్పకుండా పరిగణన లోకి తీసుకోవాలన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. మధురమైన స్వరం హృదయాలను ఆకట్టుకుంటుంది. సత్యం గురించి ఆలోచింపజేస్తుంది.

(١٤٩) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ العِيْدَيْنِ، مِنْ غَيْرِ مَرَّةٍ وَلاَ مَرَّتَيْنِ، بِغَيْرِ أَذَانٍ وَلاَ إِقَامَةٍ. رَوَاهُ مُسْلِمٌ، وَنَحْوُهُ فِي الْمُتَّفَقِ عَلَيْهِ عَنِ ابْنِ عَبَّاسٍ وَغَيْرِهِ.

149. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) తెలిపారు: నేను ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, అనేకసార్లు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి పండుగ నమాజు చేశాను. ఇందు నిమిత్తం అజాన్‌గానీ, ఇఖామత్‌గానీ ఇవ్వబడేది కాదు. (దీనిని ముస్లిం ఉల్లేఖించారు. బుఖారీ, ముస్లింలలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) చేత కూడా ఇలాగే పేర్కొనబడింది)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) కాలంలో పండుగ నమాజు సామూహికంగా చేయబడేదన్న దానికి ఈ హదీసు నిదర్శనం. అయినప్పటికీ అంత పెద్ద సమూహాన్ని సమావేశపర్చడానికి అజాన్‌గానీ, ఇఖామత్‌గానీ ఇవ్వబడేది కాదు. ముస్లిం అనుచర సమాజం ఆచరణ దీనికనుగుణంగానే ఉంది.

(١٥٠) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ فِي الْحَدِيْثِ الطَّوِيْلِ فِيْ نَوْمِهِمْ عَنِ الصَّلَاةِ: ثُمَّ أَذَّنَ بِلَالٌ، فَصَلَّى النَّبِيُّ ﷺ كَمَا كَانَ يَصْنَعُ كُلَّ يَوْمٍ. رَوَاهُ مُسْلِمٌ.

150. హజ్రత్ అబూ ఖతాద (రజి) కథనం: (ఇదొక సుదీర్ఘమయిన హదీసు. ఇందులో ప్రయాణావస్థలో ప్రయాణ బడలిక మూలంగా గాఢ నిద్ర వచ్చి సకాలంలో మెలకువ రాలేదని చెప్పబడింది). నిద్రనుండి మెలకువ వచ్చిన తరువాత బిలాల్ (రజి) అజాన్ ఇచ్చారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి రోజూ నమాజ్ చేయించినట్లుగానే నమాజ్ చేయించారు. (ముస్లిం)

وَلَهُ عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ عنهُ: أَنَّ النَّبِيَّ ﷺ أَتَى الْمُزْدَلِفَةَ، فَصَلَّى بِهَا الْمَغْرِبَ وَالعِشَاءَ بِأَذَانٍ وَاحِدٍ وإِقَامَتَيْنِ.

ముస్లింలో జాబిర్ (రజి) కథనం ఇలా వుంది: దైవప్రవక్త (సఅసం) 'ముజ్దలిఫా' చేరుకున్నాక, అక్కడాయన మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఒక అజాన్, రెండు ఇఖామత్‌లతో చేయించారు.

وَلَهُ عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا: جَمَعَ النَّبِيُّ ﷺ بَيْنَ الْمَغْرِبِ وَالعِشَاءِ بِإِقَامَةٍ وَاحِدَةٍ. وَزَادَ أَبُو دَاوُدَ: «لِكُلِّ صَلَاةٍ» وَفِيْ رِوَايَةٍ لَه: وَلَمْ يُنَادِ فِي وَاحِدَةٍ مِنْهُمَا.

ముస్లింలోనే ఇబ్నె ఉమర్ (రజి) కథనం ఈ విధంగా ఉంది: దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్ మరియు ఇషా నమాజులను కలిపి ఒకే ఇఖామత్‌తో చేశారు.

అబూదావూద్ అదనంగా ఈ వాక్యం చేర్చారు: ప్రతి నమాజు కోసం తక్బీర్ పలుకబడింది. ఈ రెండు నమాజులలో ఏ ఒక్కదానికై కూడా అజాన్ పిలుపు ఇవ్వబడలేదని అందులోనే మరో ఉల్లేఖనంలో అనబడింది.

**సారాంశం**

(అ) మెలకువ రాని సంఘటన ఫజ్ర్ నమాజ్‌కు సంబంధించినది. దైవప్రవక్త (స) ఖైబర్ నుండి తిరిగి వస్తున్న సందర్భంగా రాత్రి బాగా పొద్దుపోయాక ఒకచోట మకాం వేశారు. మేల్కొనే ఉండమనీ, ఫజ్ర్ నమాజ్ వేళ కాగానే అందరినీ మేల్కొల్పమని దైవప్రవక్త (స) హజ్రత్ బిలాల్ (రజి)ను ఆదేశించి నిద్రపోయారు. బడలిక వల్ల హజ్రత్ బిలాల్ (రజి)కు సయితం నిద్ర ముంచుకువచ్చింది. సూర్యోదయమయ్యే వరకూ మెలకువ రాలేదు. ఈ పరిస్థితిని గమనించిన దైవప్రవక్త (సఅసం) తక్షణం ఆ లోయను వదలిపెట్టవలసినదిగా ఆజ్ఞాపించారు. సహచరులంతా అప్పటికప్పుడు అక్కడినుంచి బయలుదేరి మరో లోయలో మకాం వేశారు. దైవప్రవక్త (స) ఆదేశంపై హజ్రత్ బిలాల్ (రజి) అజాన్ ఇచ్చారు. ఆయన (స) నమాజ్ చేయించారు.

(ఆ) 'ముజ్దలిఫా' - ఇది మక్కాలోని ప్రదేశం పేరు. మినా - అరఫాత్‌ల మధ్య ఉంది. హజ్ ఆచారాలను నిర్వర్తించేటప్పుడు హాజీలు అరఫాత్‌లో ఆగిన పిదప - జిల్ హజ్జ్ 10వ తేదీ రాత్రి ఇక్కడకు వస్తారు.

(ఇ) ఈ హదీసు ద్వారా తెలియవచ్చే ఒక ముఖ్యాంశం ఏమిటంటే; నిద్ర కారణంగా నమాజ్ వేళ దాటి పోయినప్పటికీ సామూహికంగా నమాజ్ చేయదలచుకుంటే అప్పుడు అజాన్ ఇవ్వవలసి ఉంటుంది.

(ఈ) ఇబ్నె ఉమర్ గారి హదీసు, జాబిర్‌గారి మొదటి హదీసుకు విరుద్ధంగా అగుపిస్తుంది. ఎందుకంటే ఈ హదీసు - ముజ్దలిఫాలో మగ్రిబ్ ఇషా నమాజులను కలిపి చేసినపక్షంలో - అజాన్ ఇవ్వనక్కరలేదని అంటోంది. కాగా; ఒక్క అజాన్, రెండు ఇఖామత్‌లు చెప్పబడినట్లు జాబిర్ (రజి) ఉల్లేఖనం రూఢీ చేస్తోంది. జాబిర్ (రజి)గారి మొదటి హదీసు సకారాత్మకమైనది. ఇక్కడ సకారాత్మకమైనదానికి నకారాత్మకమైనదానిపై ప్రాధాన్యతనివ్వాలి.

(١٥١) وَعَنِ ابْنِ عُمَرَ وَعَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمْ، قَالاَ: قَالَ رَسُولُ اللهِ ﷺ «إِنَّ بِلاَلاً يُؤَذِّنُ بِلَيْلٍ، فَكُلُوا وَاشْرَبُوا حَتَّى يُنَادِيَ ابْنُ أُمِّ مَكْتُومٍ، وَكَانَ رَجُلاً أَعْمَى لاَ يُنَادِي حَتَّى يُقَالَ لَهُ: أَصْبَحْتَ أَصْبَحْتَ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي آخِرِهِ إِدْرَاجٌ.

151. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మరియు హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఇరువురి ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "బిలాల్ (రజి) రాత్రి ఉండగానే అజాన్ పిలుపు ఇస్తారు. మీరు ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అజాన్ అయ్యేవరకూ తినవచ్చు, త్రాగవచ్చు." ఇబ్నె ఉమ్మె మక్తూమ్ అంధులు. 'తెల్లవారింది, తెల్లవారింది' అని జనులు చెప్పేవరకూ ఆయన అజాన్ ఇచ్చేవారు కాదు. (బుఖారీ, ముస్లిం).

### సారాంశం

తెల్లవారుజాము కాకపూర్వం కూడా అజాన్ ఇవ్వటం సబబేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ (మొదటి) అజాన్ ద్వారా ఉపవాసాలు పాటించేవారికీ, తహజ్జుద్ నమాజ్ చేయ దలచుకున్న వారికి ఎంతో మేలు కలుగుతుంది. ఉపవాసం ఉండేవారు తొందరగా మేల్కొని 'సహ్రీ' సన్నాహాలు చేసుకుంటారు. అజాన్ నిమిత్తం ఒక మస్జిద్‌లో ఇద్దరు ముఅజ్జిన్‌లను నియమించవచ్చునని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది.

### హదీసు ఉల్లేఖకులు

హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అసలు పేరు అమ్ర్ లేక అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ ఖురషీ ఆమిరీ. దివ్య ఖుర్‌ఆన్‌లోని 'అబస్' సూరా అవతరణ సందర్భంగా ఈయన పేరు చర్చకు వస్తుంది. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. హిజ్రత్ కూడా చేశారు. దైవప్రవక్త (సఅసం) తాను నగరంలో లేనపుడు ఈయన్ని 13సార్లు తన స్థానంలో (నమాజ్ చేయించే నిమిత్తం) తాత్కాలిక సారధిగా నియమించారు. ఖాదిసియా యుద్ధంలో అమరగతినొందారు. ఆ రోజు ధ్వజం ఆయన చేతిలో ఉంది.

(١٥٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا: أَنَّ بِلَالاً أَذَّنَ قَبْلَ الْفَجْرِ، فَأَمَرَهُ النَّبِيُّ ﷺ أَنْ يَرْجِعَ فَيُنَادِيَ: أَلاَ إِنَّ الْعَبْدَ نَامَ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَضَعَّفَهُ.

152. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: (ఒక రోజు) బిలాల్ - రజి - తెల్లవారుజాము కాక మునుపే అజాన్ ఇచ్చేశారు. మళ్లీ అజాన్ ఇవ్వ వలసిందిగా దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞా పించగా (బిలాల్ - రజి - ఈ విధంగా ప్రకటన గావించారు - "బాగా వినండి! ఈ దాసుడికి నిద్రవచ్చేసింది." (అందుకే ఈ పొరపాటు జరిగిపోయింది). (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు. బలహీన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

హజ్రత్ బిలాల్ (రజి) ఒక్కరే అజాన్ ఇస్తున్నప్పటి సంఘటన ఇది. ఫజ్ర్ వేళ అయిపోయిందనుకుని ఆయన అజాన్ పిలుపు ఇచ్చారు. కాని నిజానికి అప్పటికింకా వేళ కాకపోవటంతో మలిసారి పిలుపు ఇవ్వవలసిందిగా దైవప్రవక్త (సఅసం) పురమాయించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ రెండవ ముఅజ్జిన్‌గా నియమితులైన తరువాత రెండు అజాన్‌లు ఇవ్వబడసాగాయి. మొదటి అజాన్ హజ్రత్ బిలాల్ ఇవ్వగా, రెండవ అజాన్‌ను ఇబ్నె ఉమ్మె మక్తూమ్ ఇచ్చేవారు.

(١٥٣) وعنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا سَمِعْتُمُ النِّدَاءَ فَقُولُوا مِثْلَ مَا يَقُولُ الْمُؤَذِّنُ». مُتَّفَقٌ عَلَيْهِ.

153. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "మీరు అజాన్ విన్నప్పుడు ముఅజ్జిన్ పలికినట్లుగానే మీరు కూడా పలకండి."
(బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ عَنْ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِثْلُهُ.

وَلِمُسْلِمٍ عَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فِي فَضْلِ الْقَوْلِ كَمَا يَقُولُ الْمُؤَذِّنُ كَلِمَةً كَلِمَةً سِوَى الْحَيْعَلَتَيْنِ، فَيَقُولُ: لاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللهِ.

బుఖారీలో ముఆవియ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది. ముస్లిం హజ్రత్ ఉమర్ (రజి) ఆధారంగా ఉల్లేఖించిన దానిలో - ముఅజ్జిన్ పలుకులకు సమాధానంగా అదేవిధంగా ఒక్కొక్క వచనం పలకటంలోని మహత్మ్యం గురించి చెప్పబడింది. అయితే 'హయ్య అలస్సలాహ్' 'హయ్య అలల్ ఫలాహ్' అనే పదాలకు బదులుగా 'లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి' అని పలకాలి.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా మనకు స్పష్టంగా బోధపడేదేమిటంటే - ముఅజ్జిన్ అజాన్‌లో ఏ ఏ వచనాలు పలుకుతాడో వాటిని వినేవారు కూడా - బదులు - పలకాలి. మనిషి ఎట్టి పరిస్థితిలోనూ - అతడు పరిశుద్ధ స్థితిలో వున్నా, అశుద్ధావస్థకులోనై వున్నా సరే - అజాన్‌కు సమాధానం ఇవ్వవలసిందే. అయితే మల మూత్ర విసర్జనలో నిమగ్నమై ఉంటే మాత్రం బదులు పలకటం సమ్మతం కాదు.

హదీసులో చెప్పబడినట్లు ముఅజ్జిన్ ఏ ఏ వచనం పలికితే మనం కూడా ఆ వచనాన్ని పలుకుతూపోవాలి. అయితే 'హయ్య అలస్సలాహ్' 'హయ్య అలల్ ఫలాహ్' పదాలకు మాత్రం 'లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి' అని స్పందించాలి. "ముఅజ్జిన్ పలికినట్లుగానే మీరూ పలకండి" అని అబూ సయీద్ ఖుదరీ హదీసులో చెప్పబడింది. ఇది సాధారణ ఆజ్ఞ. ఆ తరువాత ప్రత్యేక ఆజ్ఞ వచ్చింది. ప్రత్యేకమయిన దానిని సాధారణమైనదానిపై ప్రాధాన్యత నివ్వటం ఇక్కడ నిర్ధారిత సూత్రం.

(١٥٤) وَعَنْ عُثْمَانَ بْنِ أَبِي الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللهِ!

154. హజ్రత్ ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ (రజి) కథనం: ఈయన ఇలా విన్నవించుకున్నారు - "ఓ దైవప్రవక్తా (సఅసం)!

اجْعَلْنِيْ إِمَامَ قَوْمِي، فَقَالَ: «أَنْتَ إِمَامُهُمْ وَاقْتَدِ بِأَضْعَفِهِمْ، وَاتَّخِذْ مُؤَذِّناً لاَ يَأْخُذُ عَلَى أَذَانِهِ أَجْرًا». أَخْرَجَهُ الْخَمْسَةُ وَحَسَّنَهُ التِّرمِذِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

నన్ను నా జాతి వారికి ఇమామ్‌గా నియమించండి." "నీవు వారికి ఇమామ్ అయ్యావు" (నీవు కోరినట్లుగానే నిన్ను నీ జాతివారికి ఇమామ్‌గా నియమించటం జరిగింది). అయితే వారిలో బలహీనులను, వృద్ధులను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకో. అజాన్ పిలుపు ఇచ్చి వేతనం పుచ్చుకోని ముఅజ్జిన్‌ను నియమించు" అని సెలవిచ్చారు దైవప్రవక్త (స). (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం ప్రామాణికం (సహీహ్) అని అన్నారు).

## సారాంశం

ముఅజ్జిన్ తాను నిర్వర్తించే బాధ్యతకు జీతం పుచ్చుకోవటం ధర్మసమ్మతమేనా? కాదా? ఈ విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. జీతం పుచ్చుకోవటం హరామ్ అని మాత్రం హదీసులో లేదు. అయితే జీతం తీసుకోకుండా - స్వచ్ఛందంగా - ఈ బాధ్యతను నిర్వర్తించటం మంచిదనీ, అభిలషణీయమని బోధపడుతున్నది.

ఎట్టి పరిస్థితిలోనూ ఇమామ్ అయినవారు నమాజీల సాధకబాధకాలను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా మసలుకోవాలనీ, సుదీర్ఘమయిన నమాజ్ చేయించి ప్రజలను సామూహిక నమాజ్ పట్ల విముఖత కలిగించరాదనీ ఈ హదీసు తాకీదు చేస్తోంది. ముఅజ్జిన్ జీతం పుచ్చుకోకుండా డ్యూటీ చేయటం మంచిదని కూడా ఈ హదీసు సూచిస్తోంది. అత్యధికమంది ధర్మవేత్తలు జీతం పుచ్చుకోవటాన్ని అవాంఛనీయం (మక్రూహ్)గా భావించారే తప్ప అధర్మం (హరామ్) గా మాత్రం తలపోయలేదు. గత్యంతరం లేని స్థితిలో తీసుకుంటే ధర్మసమ్మతమేనని కూడా నిర్ణయించారు. మంచిని పెంపొందించే, సదాచరణలో ముందంజవేసే సంకల్పంతో ఇమామత్‌ను కోరుకోవటం (నమాజ్‌కు సారథ్యం వహించాలనుకోవటం)లో తప్పులేదని కూడా ఈ హదీసు ద్వారా సంకేతం లభిస్తున్నది. సారథ్య బాధ్యతలను సాధ్యమయినంత వరకు సజావుగా నెరవేర్చే శక్తి సామర్థ్యాలుంటే దాన్ని కోరుకోవటం ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ (రజి) గారి మరో పేరు అబూ అబ్దుల్లాహ్. తాయఫ్ నుండి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన ప్రతినిధి బృందంలో అందరికన్నా పిన్న వయస్కులు ఈయన.

దైవప్రవక్త (స) ఈయన్ని ఆ బృందానికి నాయకునిగా నియమించారు. ఈయన తన జాతి ప్రజలను ధర్మభ్రష్టులు కాకుండా ఆపారు. తత్ఫలితంగా వారు రుజుమార్గంపై నిలకడగా ఉండగలిగారు. హజ్రత్ ఉమర్ (రజి) తాను ఖలీఫాగా ఉన్న కాలంలో ఈయన్ని బహ్రైన్, అమ్మాన్‌లకు గవర్నర్‌గా నియమించారు. బస్రాలో హిజ్రీ 51లో మరణించారు.

(١٥٥) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لَنَا النَّبِيُّ ﷺ: «إِذَا حَضَرَتِ الصَّلَاةُ، فَلْيُؤَذِّنْ لَكُمْ أَحَدُكُمْ» الْحَدِيثَ، أَخْرَجَهُ السَّبْعَةُ.

155. హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్(రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఇలా ఉపదేశించారు- "నమాజ్ వేళ సమీపిస్తే మీలో ఎవరయినా ఒకరు మీ అందరినీ పిలిచే ఉద్దేశ్యంతో అజాన్ పలకాలి." తరువాత పూర్తి హదీసు వివరించారు. (దీనిని ఏడుగురూ - అంటే అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

మాలిక్ బిన్ హువైరిస్ (రజి) గారి మరో పేరు అబూ సల్మాన్. ధార్మిక శిక్షణ గరిపే నిమిత్తం దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. 20 రోజుల వరకూ ఆయన (సఅసం) దగ్గరవున్నారు. తిరిగి వెళుతున్న సమయంలో దైవప్రవక్త (స) ఈ బృందానికి హితబోధ చేస్తూ, "దారిలో నమాజ్ వేళ ఆసన్నమయినపుడు మీలో ఒకరు అజాన్ ఇవ్వాలి. మీలో వయసులో పెద్దవారు నమాజ్‌కు నేతృత్వం వహించాలి" అని అన్నారు. ప్రయాణీకులు కూడా అజాన్ పలకాలనీ, సామూహికంగా నమాజ్ చేయాలనీ ఈ ఉపదేశం ద్వారా బోధపడుతున్నది. వ్యక్తిగత స్థాయికన్నా సామూహికతకు ఎక్కువ ఆధిక్యత, శ్రేష్ఠత ఉంది. మాలిక్ బిన్ హువైరిస్ (రజి) హిజ్రీ 74లో బస్రాలో మరణించారు.

(١٥٦) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ لِبَلَالٍ: «إِذَا أَذَّنْتَ فَتَرَسَّلْ، وَإِذَا أَقَمْتَ فَاحْدُرْ، وَاجْعَلْ بَيْنَ أَذَانِكَ وَإِقَامَتِكَ قَدْرَ مَا يَفْرُغُ الْآكِلُ مِنْ أَكْلِهِ» الحديث. رَوَاهُ التِّرْمِذِيُّ، وَضَعَّفَهُ.

156. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిలాల్ (రజి)కు ఇలా ఉపదేశించారు - "అజాన్ ఇస్తున్నప్పుడు బాగా ఆగి ఆగి ఇవ్వండి. అయితే 'తక్బీర్' మాత్రం త్వరత్వరగా పలకండి. అజాన్ - ఇఖామత్‌ల మధ్య విరామం భోజనం చేసే వ్యక్తి భోజనాన్ని పూర్తి చేసి సామూహిక నమాజులో పాల్గొన గలిగేంతగా ఉండాలి." (తరువాత హదీసు

నంతటినీ వివరించారు. దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. జయీఫ్‌గా ఖరారు చేశారు)

وَلَهُ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ يُؤَذِّنُ إِلاَّ مُتَوَضِّىءٌ». وَضَعَّفَهُ أَيْضاً.

దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "వుజూ చేయకుండా ఎవరూ అజాన్ ఇవ్వకండి" (దీన్ని కూడా జయీఫ్ - బల హీనం - గా ఖరారు చేశారు)

وَلَهُ عَنْ زِيَادِ بْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «وَمَنْ أَذَّنَ فَهُوَ يُقِيمُ». وَضَعَّفَهُ أَيْضاً.

జియాద్ బిన్ హారిస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవ చించారు: "అజాన్ ఇచ్చిన వారే ఇఖామత్ చెప్పాలి." (దీనిని కూడా తిర్మిజీ 'జయీఫ్'గా ఖరారు చేశారు)

وَلأَبِي دَاوُدَ من حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ، أَنَّهُ قَالَ: أَنَا رَأَيْتُهُ، يَعْنِي الأَذَانَ، وَأَنَا كُنْتُ أُرِيْدُه، قَالَ: فَأَقِمْ أَنْتَ. وَفِيْهِ ضَعْفٌ أَيْضاً.

అబూదావూద్‌లో అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: నేను అజాన్‌ను కలలో చూశాను. నేను ముఅజ్జిన్‌గా నియమించబడాలన్న కోరిక నాకు ఉండేది. "నీవు తక్బీర్ చెప్పు" అని ఆయన (సఅసం) నన్ను ఆజ్ఞాపించారు. (ఈ హదీసు కూడా జయీఫ్ కోవకు చెందినదే)

### సారాంశం

పై హదీసు ద్వారా మన దృష్టికివచ్చే కొన్ని ముఖ్యాంశాలు: (1) అజాన్ వాక్యాలు బిగ్గరగానూ, బాగా ఆగి ఆగి పలకాలి. అయితే 'ఇఖామత్' వాక్యాలు మాత్రం త్వరత్వరగా పలకాలి.

(2) అజాన్‌కి - సామూహిక నమాజ్‌కి మధ్య ఎక్కువ విరామం ఉండకూడదు. భోజనం చేస్తున్న వ్యక్తి భోజనం ముగించి వచ్చి సామూహిక నమాజ్‌ను అందుకునేంత విరామం ఇస్తే చాలు. 4 రకత్‌ల నమాజు చేసేంత విరామం ఉంటే చాలని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(3) అజాన్ ఇచ్చిన వ్యక్తే ఇఖామత్ చెప్పాలనీ, విద్వాంసులలో అధిక సంఖ్యాకులు భావిస్తున్నారు. అయితే అజాన్ ఇచ్చిన వ్యక్తికి అభ్యంతరం లేనిపక్షంలో ఇతరులు కూడా ఇఖామత్ చెప్పవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులలో ఒకరైన జియాద్ బిన్ హారిస్ (రజి) సుదా తెగకు చెందినవారు. ఈ తెగ యమన్‌కు చెందినది. దైవప్రవక్త (సఅసం) చేతిపై ప్రమాణం చేసినవారు. ఆయన (స) సమక్షంలో అజాన్ కూడా ఇచ్చారు. ఎట్టకేలకు బస్రాలో స్థిరపడ్డారు.

(١٥٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اَلْمُؤَذِّنُ أَمْلَكُ بِالْأَذَانِ، وَالْإِمَامُ أَمْلَكُ بِالْإِقَامَةِ**». رَوَاهُ ابْنُ عَدِيٍّ، وَضَعَّفَهُ، وَلِلْبَيْهَقِيِّ نَحْوُهُ عَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ مِنْ قَوْلِهِ.

157. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ముఅజ్జిన్ అజాన్ ఇవ్వడానికి, ఇమామ్ తక్బీర్ పలకడానికి ఎక్కువ హక్కుదారులు", (ఇబ్నె అదీ దీనిని ఉల్లేఖించారు. బలహీనమైనదిగా ఖరారు చేశారు. బైహఖీలో కూడా హజ్రత్ అలీ (రజి) చే ఈ విధంగానే అనబడింది)

## సారాంశం

అజాన్ ఇవ్వడానికి ముఅజ్జిన్ ఎక్కువ హక్కుదారుడు. ఎందుకంటే నమాజ్ వేళలను రక్షించవలసిన బాధ్యత అతనిపై ఉంది. అందుచేత వేళకు ముందుగానీ, ఆలస్యంగా గానీ అజాన్ ఇవ్వమని అతనిపై ఒత్తిడి తెచ్చే అధికారం కూడా ఎవరికీ లేదు. తక్బీర్ పలికించే హక్కు ఇమామ్‌ది. అతను సంజ్ఞ చేసే వరకూ (నమాజ్ సారథ్యానికి అతడు సమాయత్తం కానంతవరకూ) ఎవరూ తక్బీర్ పలకలేరు.

(١٥٨) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لَا يُرَدُّ الدُّعَاءُ بَيْنَ الْأَذَانِ وَالْإِقَامَةِ**». رَوَاهُ النَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

158. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "అజాన్ - ఇఖామత్‌ల మధ్య గల విరామ సమయంలో చేసే దుఆ త్రోసిపుచ్చబడదు." (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

దైవప్రవక్త (స)గారి ఈ ఉపదేశాన్ని విని సహచరులు, "మరైతే ఓ దైవప్రవక్తా! మేము ఆ సమయంలో దైవాన్ని ఏమని వేడుకోవాలి?" అని విన్నవించుకున్నారు. "దైవసమక్షంలో మన్నింపును,

క్షమాభిక్షను, ఇహపరాల బాగోగులను అర్థించండి" అని ఆయన (స) సలహా ఇచ్చారు (తిర్మిజీ). దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దుఆ స్వీకారానికి ఈ సమయం అత్యంత సముచితమైనది.

(١٥٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ قَالَ حِينَ يَسْمَعُ النِّدَاءَ: اللَّهُمَّ رَبَّ هَذِهِ الدَّعْوَةِ التَّامَّةِ، وَالصَّلَاةِ الْقَائِمَةِ، آتِ مُحَمَّداً الْوَسِيلَةَ وَالْفَضِيلَةَ، وَابْعَثْهُ مَقَاماً مَحْمُوداً الَّذِي وَعَدتَّهُ حَلَّتْ لَهُ شَفَاعَتِي يَوْمَ الْقِيَامَةِ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ.

159. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ఎవరయితే అజాన్ పిలుపు విని ఈ దుఆ చేస్తాడో అతని కోసం ప్రళయదినాన నేను సిఫారసు చేయటం సమ్మతమై పోతుంది. (ఈ దుఆ ఇలా ఉంది) - "అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావ తిత్తామతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మద నిల్ వసీలత వల్ ఫజీలత వబ్ అస్హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వ అత్తహు" (అర్థం: ఓ అల్లాహ్! ఈ సంపూర్ణ పిలుపుకు, స్థాపించబడే నమాజ్‌కు అధిపతి అయినవాడా! ముహమ్మద్ - సఅసం - కు ప్రతిష్ఠాత్మక మయిన స్థానాన్ని (మఖామె మహ్మూద్), ఆధిక్యతను ప్రసాదించు. ఏ ప్రశంసాత్మక మయిన (ఉన్నత) స్థానం (స్వర్గంలో) ప్రసాదిస్తానని నీవు వాగ్దానం చేశావో ఆ స్థానంలో (ఆయన్ని) ప్రతిష్ఠింపజెయ్యి) (ఈ హదీసును అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు).

**సారాంశం**

అజాన్ విన్న తరువాత పైన పేర్కొనబడిన దుఆ (ప్రార్థన) చేయటం మస్నూన్ (దైవప్రవక్త విధానం) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దుఆ చేసే వాడికి ప్రవక్త గారి సిఫారసు లభిస్తుందంటే అంతకన్నా భాగ్యం ఇంకేముంటుందీ?! ఆయన ఎవరి గురించి సిఫారసు చేసినా అతను ఎట్టకేలకు స్వర్గంలో ప్రవేశిస్తాడు. "మఖామె మహ్మూద్" ప్రస్తావన దివ్య ఖుర్ఆన్‌లోని బనీ ఇస్రాయీల్ సూరాలో వచ్చింది. "నీ ప్రభువు నిన్ను మఖామె మహ్మూద్ పైకి చేర్చే అవకాశం ఉంది" అని అందులో వాగ్దానం చేయబడింది.

**3వ అధ్యాయం**

## నమాజ్‌కై షరతులు

## ٣ - بَابُ شُرُوطِ الصَّلاَةِ

(١٦٠) عَنْ عَلِيِّ بْنِ طَلْقٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ ﷺ: «إِذَا فَسَا أَحَدُكُمْ فِي الصَّلاَةِ، فَلْيَنْصَرِفْ، وَلْيَتَوَضَّأْ وَلْيُعِدِ الصَّلاَةَ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

160. హజ్రత్ అలీ బిన్ తల్ఖ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నమాజ్ చేస్తుండగా మీలో ఎవరికయినా అపాన వాయువు వెలువడితే వారు తిరిగి వెళ్ళి (నమాజ్‌ను పరిత్యజించి), సరికొత్తగా వుజూ చేసి, మళ్ళీ నమాజ్ చేయాలి." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఈ ఐదుగురూ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

**హదీసు ఉల్లేఖకులు**

అలీ బిన్ తల్ఖ్ (రజి) గారి పూర్తిపేరు - అలీ బిన్ తల్ఖ్ బిన్ ముంజిర్ బిన్ ఖైస్ సహిమీ యమామి హనఫీ. బనూ హనీఫా తెగతో సంబంధం కలిగి ఉండటంచేత హనఫీగా పిలువబడ్డారు. ఈయన తల్ఖ్ బిన్ అలీ తండ్రి అని ఒక వాదన ఉంది. వీరిద్దరూ ఒక్కరేనన్న అభిప్రాయం కూడా ఉంది.

(١٦١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «لاَ يَقْبَلُ اللَّهُ صَلاَةَ حَائِضٍ إِلاَّ بِخِمَارٍ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

161. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరి కయితే నెలవారీ అవుతుందో (అంటే ఏ స్త్రీ యుక్త వయస్సుకు చేరిందో) ఆమె వోణీ కప్పుకునేదాకా అల్లాహ్ ఆమె నమాజును స్వీకరించడు." (ఒక్క నసాయి తప్ప మిగిలిన నలుగురూ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

యుక్త వయస్సుకు చేరిన స్త్రీ శరీరమంతా నమాజ్ చేసే సమయంలో వస్త్రంతో కప్పబడి ఉండాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఆఖరికి శిరోజాలు సయితం కప్పబడి ఉండాలి.

(١٦٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهُ: «**إِنْ كَانَ الثَّوْبُ وَاسِعاً فَالْتَحِفْ بِهِ، يَعْنِي فِي الصَّلاَةِ**». وَلِمُسْلِمٍ: **فَخَالِفْ بَيْنَ طَرَفَيْهِ، وَإِنْ كَانَ ضَيِّقاً فَاتَّزِرْ بِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

162. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఈ విధంగా ఉపదేశించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు: "వస్త్రం పెద్దగా పొడవుగా ఉంటే (నమాజ్‌లో) వస్త్రాన్ని బాగా చుట్టుకోండి" ముస్లింలోని ఉల్లేఖనంలో ఇలా వుంది - "వస్త్రం పొడవుగా ఉంటే దాని రెండు అంచులను భుజం యొక్క ఇరువైపులా వేసుకోండి. ఒకవేళ వస్త్రం చిన్నగా, కురచగా ఉంటే లుంగీ మాదిరిగా కట్టుకోండి." (బుఖారీ, ముస్లిం)

وَلَهُمَا مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ: «**لاَ يُصَلِّي أَحَدُكُمْ فِي الثَّوبِ الْوَاحِدِ، لَيْسَ عَلَى عَاتِقِهِ مِنْهُ شَيْءٌ**»

బుఖారీ, ముస్లింలోనే హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ఇలా ఉంది - "మీలో ఎవరూ ఒకే వస్త్రంలో - దాని భాగమేదయినా భుజాలపై లేనంత వరకూ - నమాజ్ చేయకండి."

**సారాంశం**

నమాజ్ చేసేవాని భుజాలు కూడా నగ్నంగా ఉండరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

(١٦٣) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّهَا سَأَلَتِ النَّبِيَّ ﷺ: أَتُصَلِّي الْمَرْأَةُ فِي دِرْعٍ وَخِمَارٍ بِغَيْرِ إِزَارٍ؟ قَالَ: «**إِذَا كَانَ الدِّرْعُ سَابِغاً يُغَطِّي ظُهُورَ قَدَمَيْهَا**». أَخْرَجَهُ

163. హజ్రత్ ఉమ్మె సలమ (రజి) కథనం : ఏ స్త్రీ అయినా నడుము బట్ట (లంగా, చీర, పైజామా ఇత్యాదివి) లేకుండానే కేవలం చొక్కా మరియు వోణీ ధరించి నమాజ్ చేయవచ్చా? అని నేను దైవప్రవక్త (సఅసం) ను ప్రశ్నించగా ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు- "చొక్కా పొడవుగా ఆమె పాదాల వరకూ వచ్చేలా ఉంటే అప్పుడు ధర్మసమ్మత

أَبُو دَاوُدَ، وَصَحَّحَ الأَئِمَّةُ وَقْفَهُ.

మవుతుంది.'' (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఇమాములు దీనిని మౌఖూఫ్‌గా ఖరారు చేశారు)

### సారాంశం

నమాజ్ చేసే సమయంలో స్త్రీ తన శరీరమంతటినీ వస్త్రంతో కప్పటం అవసరం. ఒక పాడవాటి (మాక్సి తరహా) చొక్కాను తొడుక్కొని, వోణీ కప్పుకుని కూడా ఆమె నమాజ్ చేయగలదు. కాని ఆ చొక్కా ఆమె కాలి మడమలను సయితం కప్పేంత నిడివిగా ఉండాలి. నమాజ్ చేసేటప్పుడు స్త్రీ పాదాలను కూడా కప్పటం అవసరమని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ హదీసు వెలుగులో కొంతమంది ఉలమా (పండితులు) స్త్రీ పాదాలను సయితం ఆమె 'సతర్'లో అంతర్భాగంగా చేర్చారు.

(١٦٤) وَعَنْ عَامِرِ بْنِ رَبِيْعَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا مَعَ النَّبِيِّ ﷺ فِي لَيْلَةٍ مُظْلِمَةٍ، فَأَشْكَلَتْ عَلَيْنَا الْقِبْلَةُ، فَصَلَّيْنَا، فَلَمَّا طَلَعَتِ الشَّمْسُ إِذَا نَحْنُ صَلَّيْنَا إِلَى غَيْرِ الْقِبْلَةِ، فَنَزَلَتِ الآيَةُ ﴿فَأَيْنَمَا تُوَلُّوا فَثَمَّ وَجْهُ اللهِ﴾ أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَضَعَّفَهُ.

164. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) కథనం : ఒక చీకటి రాత్రి మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాము. 'ఖిబ్లా' దిశను నిర్ధారించటం మాకు గగనమైపోయింది. మేము (ఒక అంచనా ప్రకారం దిశను నిర్ధారించి) నమాజ్ చేశాము. తీరా సూర్యోదయం అయిన పిదప మాకు బోధపడింది - మేము నిర్ధారించుకున్న ఖిబ్లా సరైనది కాదనీ, మరో దిశలో తిరిగి నమాజ్ చేశామని! అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: 'మరి మీరు ఏ వైపునకు అభిముఖమైనా ఆ వైపే అల్లాహ్ ఉన్నాడు.'' (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - జయీఫ్‌గా ఖరారు చేశారు)

### సారాంశం

మనిషి వల్ల పొరపాటు జరగటం సహజం. ప్రయాణావస్థలో పలు కారణాలవల్ల ఖిబ్లా దిశను నిర్ణయించటం కష్టమవుతుంది. మనిషి తన ఆలోచనకు పదునుపెట్టి ఏదో ఒక నిర్ధారణకు వస్తాడు. అతని నిర్ధారణ తప్పని తరువాత తెలిసిరావచ్చు. అంతమాత్రాన నమాజ్‌ను మళ్ళీ చేయవలసిన అవసరం లేదు. కాని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం మాత్రం మరోవిధంగా ఉంది. నమాజ్ వేళ దాటినా, దాటకపోయినాసరే - ఖిబ్లా దిశ నిర్ధారించటంలో తప్పటడుగు

వేసినట్లు తెలియగానే ఆ నమాజ్‌ను తిరిగి చేయాల్సిందే. ఎందుకంటే నమాజ్ కోసం ఖిబ్లా వైపునకు తిరగటం అవసరం అంటారాయన.

### హదీసు ఉల్లేఖకులు

ఆమిర్ బిన్ రబీయ (రజి) అన్జ్ బిన్ వాయల్ తెగకు చెందినవారు. వాయల్ కుమారులగు బక్ర్, తగ్లిబ్‌లు ఈయనకు సోదరులు. ఈయన తొలి కాలంలోనే ఇస్లాం సత్యామృతాన్ని ఆస్వాదించారు. అబిసీనియా వైపునకు, మదీనా వైపునకు - రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ సంగ్రామంలోనూ, ఇతర యుద్ధాలలోనూ వీరోచితంగా పోరాడారు. ఈయన మరణ సమయం గురించి అభిప్రాయభేదం ఉంది. హిజ్రీ 32 అనీ, 33 అనీ, 35 అనీ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

(١٦٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ قِبْلَةٌ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَقَوَّاهُ الْبُخَارِيُّ.

165. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రవచించారు: "తూర్పు - పడమరల మధ్యన 'ఖిబ్లా' ఉంది." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. బుఖారీ దీనిని దృఢతరమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసు మదీనా వాసులను, ఆ దిశలోనే ఉన్న ఇతరులను దృష్టిలో పెట్టుకుని చెప్పబడింది. అన్ని ప్రాంతాలవారికి, ముఖ్యంగా భారతీయులకు ఇది వర్తించదు. మదీనా నగరం పవిత్ర మక్కాకు ఉత్తరాన ఉంది. అంటే మదీనా వాసులకు కాబా గృహం దక్షిణాన ఉంటుంది.

(١٦٦) وَعَنْ عَامِرِ بْنِ رَبِيْعَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي عَلَى رَاحِلَتِهِ حَيْثُ تَوَجَّهَتْ بِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، زَادَ الْبُخَارِيُّ: يُوْمِيءُ بِرَأْسِهِ، وَلَمْ يَكُنْ يَصْنَعُهُ فِي الْمَكْتُوبَةِ.

166. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) తెలిపారు: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తమ ఒంటెపై నమాజ్ చేస్తుండగా చూశాను. ఒంటె ఏ వైపునకు తిరిగినప్పటికీ ఆయన నమాజ్‌ను చేస్తూనే ఉండేవారు (బుఖారీ, ముస్లిం). 'ఆయన తన తల ఊపటం ద్వారా నమాజ్ చేసేవారు. ఫర్జ్ నమాజ్‌లో అలా చేసేవారు కాదు.' అన్న వాక్యం బుఖారీలో అదనంగా ఉంది.

وَلأَبِي دَاوُدَ مِنْ حَدِيْثِ أَنَسٍ: وَكَانَ إِذَا سَافَرَ فَأَرَادَ أَنْ يَتَطَوَّعَ اسْتَقْبَلَ بِنَاقَتِهِ الْقِبْلَةَ، فَكَبَّرَ ثُمَّ صَلَّى حَيْثُ كَانَ وَجْهُ رِكَابِهِ. وَإِسْنَادُهُ حَسَنٌ.

అబూదావూద్‌లో హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది - ఆయన (సఅసం) ప్రయాణంలో నుండగా (ఒక సారి) నఫిల్ నమాజ్ చేయగోరి తన ఒంటె దిశను 'కాబా' వైపునకు మళ్లించారు. ఆ తరువాత వాహనం ఏఏ దిశలలో సాగినా -నమాజ్‌ను నిరాఘాటంగా చేసి - పూర్తి చేశారు. (ఈ హదీసు 'పరంపర' దృష్ట్యా 'హసన్'గా ఖరారు చేయబడింది)

**సారాంశం**

ప్రయాణావస్థలో నఫిల్ నమాజులు కూడా వాహనంపై కూర్చుని చేయవచ్చని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఒకసారి మన ముఖాన్నిగానీ, వాహనం ముఖాన్నిగానీ ఖిబ్లా వైపునకు తిప్పి ఆరంభిస్తే చాలు - మధ్యలో వాహనం ఎన్ని దిశలవైపునకు తిరిగినా ఫరవాలేదు; నిస్సంశయంగా నమాజ్ నెరవేరుతుంది. ఈవిధంగా ఆధునిక యుగంలో రైలు, ఓడ, విమానం తదితర వాహనాలపై నమాజ్ చేయటం ధర్మసమ్మతమే. ధర్మవేత్తలంతా ఈ విషయంపై ఏకాభిప్రాయం వ్యక్తపరిచారు.

(١٦٧) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الأَرْضُ كُلُّهَا مَسْجِدٌ إِلاَّ الْمَقْبَرَةَ وَالْحَمَّامَ**». رَوَاهُ التِّرْمِذِيُّ، وَلَهُ عِلَّةٌ.

167. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: "ఖబరస్తాన్ (ఖనన వాటిక) మరియు స్నానశాల తప్ప మిగిలిన భూభాగమంతా మస్జిదే (ఎక్కడంటే అక్కడే నమాజ్ చేయవచ్చు)." (తిర్మిజీ)

**సారాంశం**

ఖననవాటికలో, బాత్‌రూంలో నమాజ్ చేయటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. బహుదైవారాధనకు దారితీసే ఏ అవకాశానికి కూడా తావు కలగరాదన్న ఉద్దేశ్యంతో 'ఖబరస్తాన్'లో నమాజ్ చేయడాన్ని వారించటం జరిగింది.

(١٦٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ

168. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏడుచోట్ల నమాజ్ చేయడాన్ని వారిం

يُصَلَّى فِي سَبْعَةِ مَوَاطِنَ: الْمَزْبَلَةِ، وَالْمَجْزَرَةِ، وَالْمَقْبَرَةِ، وَقَارِعَةِ الطَّرِيْقِ، وَالْحَمَّامِ، وَمَعَاطِنِ الإِبِلِ، وَفَوْقَ ظَهْرِ بَيْتِ اللهِ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَضَعَّفَهُ.

చారు. చెత్తా చెదారం (కసువు వగైరా) వేసేచోట, జంతువులను కోసేచోట, ఖబరస్తాన్ (ఖననవాటిక)లో, జనులు నడిచే దారిలో, స్నానశాలలో, ఒంటెను కట్టే చోట మరియు బైతుల్లాహ్ (కాబా గృహం) కప్పుపై (నమాజ్ చేయ కూడదు). (తిర్మిజీ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

భూభాగమంతా మస్జిద్‌గా ఖరారు చేయబడినప్పటికీ కొన్ని నిర్ణీత స్థానాలలో నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. వాటిలో ఒకటి ప్రజలు చెత్తా చెదారం వేసే స్థలం. అది పరిశుద్ధంగా ఉండదు. నమాజ్ చేసే చోటు పరిశుభ్రంగా ఉండటం అవసరం గనక ఈ స్థలంలో నమాజ్ చేయరాదు. అలాగే జంతువులను జిబహ్ చేసేచోటు (Slaughter House). అది కూడా రక్తం వల్ల, కసువువల్ల అశుద్ధంగా ఉంటుంది. జనులు వచ్చే పోయే మార్గంలో కూడా నమాజ్ చేయకూడదు. ఎందుకంటే అసలే జనుల రాకపోకలవల్ల మార్గాలు ఇరుకుగా ఉంటాయి. అందులోనే ప్రజలు నమాజ్ కోసం కూడా మరికొంత జాగాను ఆక్రమిస్తే వచ్చే పోయేవారికి ఇబ్బంది కలుగుతుంది సరికదా, నమాజ్ చేసేవారికి ఏకాగ్రత కూడా లభించదు. ఇక కాబా గృహం పైకప్పుపై నమాజ్ చేయకుండా వారించటంలోని మర్మం ఏమిటంటే నమాజ్ చేసే సమయంలో మనిషి కాబా గృహం వైపునకు అభిముఖమై ఉండటం అవసరం. కప్పుపైకెక్కి నమాజ్ చేస్తే అతనికి ఖిబ్లా ఎదురుగా ఉండదు.

(١٦٩) وَعَنْ أَبِي مَرْثَدٍ الْغَنَوِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُوْلُ: «**لاَ تُصَلُّوا إِلَى الْقُبُوْرِ، وَلاَ تَجْلِسُوا عَلَيْهَا**». رَوَاهُ مُسْلِمٌ.

169. హజ్రత్ అబూ మర్సద్ ఘనవీ (రజి) కథనం: "గోరీలు ఎదురుగా నుండగా నమాజ్ చేయటంగానీ, వాటిపై కూర్చోవటంగానీ చేయకండి" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా నేను విన్నాను." (ముస్లిం)

**సారాంశం**

సమాధుల వైపునకు ముఖం త్రిప్పి నమాజ్ చేయటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా స్పష్టమవు తున్నది. చనిపోయిన కొంతమంది పుణ్య పురుషుల ఆత్మల నుండి స్ఫూర్తి పొందవచ్చన్న సంకల్పంతో కొందరు మస్జిదులను ఉద్దేశ్యపూర్వకంగా సమాధులున్న చోట కడతారు. ఇది కూడా నిషిద్ధమే. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) హదీసులో ఈ సంగతి స్పష్టంగా చెప్పబడింది - "అల్లాహ్

శాపం యూదులపై, క్రైస్తవులపై పడుగాక! వాళ్లు తమ ప్రవక్తల గోరీలను సాష్టాంగస్థలం (మస్జిద్) గా చేసుకున్నారు" అని మహాప్రవక్త (సఅసం) చెప్పారు. అంటే నమాజ్ కోసం నిలబడినచోట - ఎదురుగా సమాధి ఉంటే అది షిర్క్ (బహుదైవోపాసన)కు బీజం నాటవచ్చు. అందుకే ఈ అంశాన్ని తీవ్రంగా వారించటం జరిగింది.

ఇక సమాధిపై కూర్చోవటం గురించి -

దీనికీ రెండు అర్థాలున్నాయి. ఒకటి: సమాధిని ఆసీనమయ్యే చోటుగా, తలగడగా చేసుకోవటం తప్పు. రెండు: సమాధులవద్ద ముజావర్లుగా తిష్ఠ వేయటం లేదా కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఆ స్థలాన్ని దుర్వినియోగపరచటం నిషిద్ధం.

## హదీసు ఉల్లేఖకులు

అబూ మున్సద్ ఘనవీ అసలు పేరు కనాజ్ బిన్ హుసైన్ బిన్ యర్బూ. అబూ మున్సద్ మారు పేరు. ఘిత్ఫాన్ తెగకు చెందిన ఒక వ్యక్తి ఘనీ బిన్ యాసుర్‌తో గల సంబంధం కారణంగా ఘనవీ అని సంబోధించబడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహాబీ ఈయన. హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌కు మద్దతుదారులు. యుద్ధాలన్నింటిలోనూ పాల్గొన్నారు. హిజ్రీ 16లో 66 ఏళ్ల వయస్సులో కన్ను మూశారు.

(١٧٠) وَعَنْ أَبِي سَعِيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا جَاءَ أَحَدُكُمُ المَسْجِدَ فَلْيَنْظُرْ فَإِنْ رَأَى فِي نَعْلَيْهِ أَذىً أَوْ قَذَراً فَلْيَمْسَحْهُ، وَلْيُصَلِّ فِيهِمَا**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ. وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

170. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరయినా మస్జిద్‌కు వచ్చినపుడు (లోనికి ప్రవేశించేముందు తన చెప్పులను) సరిగ్గా చూచుకోవాలి. ఒకవేళ తమ చెప్పులకు అశుద్ధతగానీ, మలినంగానీ అంటుకుని ఉంటే అతడు దాన్ని పరిశుభ్రం చేసుకుని మరీ నమాజ్ చేయాలి." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.

## సారాంశం

చెప్పులు (లేక బూట్లు) తొడిగి నమాజ్ చేయటంలో ఆక్షేపణీయం ఏమీ లేదన్న దానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. అయితే పాదరక్షలు పరిశుభ్రంగా ఉండాలన్నది షరతు. చెప్పులకు అంటుకుని వున్న అశుద్ధతను, మాలిన్యాన్ని దూరం చేయటం వల్ల అవి పరిశుభ్రం అయిపోతాయని కూడా దీన్నిబట్టి అవగతమవుతున్నది.

దైవప్రవక్త (సఅసం) ఈవిధంగా ప్రబోధించటం వెనుక ఒక సంఘటన ఉంది. ఒకసారి ఆయన (సఅసం) చెప్పులు తొడిగి నమాజ్ చేయిస్తున్నారు. తన చెప్పు అశుద్ధంగా వున్న సంగతి ఆయన (స)కు తెలీదు. దాని అడుగుభాగాన మలినం తగిలి ఉంది. నమాజ్ మధ్యలో దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఆయన (స)కు ఈ సంగతి తెలియజేశారు. ఆయన నమాజ్ మధ్యలోనే చెప్పులు విడిచి, నమాజ్‌ను కొనసాగించారు. వెనుక నమాజ్ చేస్తున్న సహచరులు కూడా దైవప్రవక్త (స)ను అనుసరిస్తూ తమ తమ పాదరక్షలను విడిచేశారు. నమాజ్‌ను యథాతథంగా కొనసాగించారు. నమాజ్ పూర్తయిన తరువాత, చెప్పుల్ని విడవటానికి కారణం దర్యాప్తు చేశారు దైవప్రవక్త (స). మేము మిమ్మల్ని అనుసరించేవాళ్ళము, మీరు ఎలా చేస్తే మేమూ అలాగే చేస్తాముకదా! అని సహచరులు సంజాయిషీ ఇచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) తాను తన చెప్పులను విడువటానికి గల కారణం వివరించారు.

ఈ హదీసు ద్వారా మనకు బోధపడే విషయం ఏమిటంటే నమాజ్ చేస్తున్న వ్యక్తికి - తన దుస్తులకుగానీ, చెప్పులకుగానీ, మేజోళ్లకుగానీ అశుద్ధత అంటుకుని వున్న సంగతి ముందుగా తెలియక, నమాజు మధ్యలో తెలిస్తే నిస్సంకోచంగా అశుద్ధ వస్తువును అప్పటికప్పుడే విడిచి తన నమాజ్‌ను కొనసాగించవచ్చు. అలా చేయటం వల్ల అతని నమాజ్‌కు ఎలాంటి హాని కలుగదు.

(١٧١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا وَطِئَ أَحَدُكُمُ الْأَذَى بِخُفَّيْهِ فَطَهُورُهُمَا التُّرَابُ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

171. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరైనా మేజోళ్లు ధరించి అశుద్ధతపై నుంచి నడచివెళితే నిస్సందేహంగా మట్టి పరిశుద్ధపరుస్తుంది." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

చెప్పులకు, బూట్లకు, (తోలుతో చేయబడిన) మేజోళ్లకు - వాటి అడుగు భాగాన అంటుకున్న అశుద్ధత ఎండిపోయినా లేక తడిగా ఉన్నా, అది చిన్న తరహా మలినమయినా, పెద్ద తరహా మలిన మయినా, పరిశుద్ధమయిన మట్టిపై తుడవటం వల్ల అది పరిశుభ్రమైపోతుంది. ప్రత్యేకంగా వాటిని కడగవలసిన అవసరం లేదు. అబూ హనీఫా (రహ్మాలై) గారి విధానం మరోవిధంగా ఉంది. అయితే హనఫీ శాస్త్రాన్ని అనుసరించేవారు కూడా ఇమామ్ షాఫయి (రహ్మాలై) విధానాన్ని అంగీకరించారు. ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) కూడా ఈ పద్ధతిపట్ల ఏకీభవించారు.

(١٧٢) وَعَنْ مُعَاوِيَةَ بْنِ الْحَكَمِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ

172. హజ్రత్ ముఆవియా బిన్ హకమ్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్ల

هَذِهِ الصَّلاَةَ لاَ يَصْلُحُ فِيهَا شَيْءٌ مِنْ كَلاَمِ النَّاسِ إِنَّمَا هِيَ التَّسْبِيحُ وَالتَّكْبِيرُ وَقِرَاءَةُ الْقُرْآنِ». رَوَاهُ مُسْلِمٌ.

ల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "నమాజ్‌లో సంభాషణకు ఎలాంటి అవకాశం లేదు. నమాజులోనయితే కేవలం దేవుని పవిత్రత (సుబ్‌హా నల్లాహ్), దేవుని గొప్పతనం (అల్లాహు అక్బర్) కొనియాడబడాలి. దివ్య గ్రంథ పారాయణం చేయాలి." (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు పూర్వరంగం ఏమిటంటే నమాజు మధ్యలో ఒక వ్యక్తి తుమ్మి 'అల్ హమ్దులిల్లాహ్' అని పలికాడు. దీనికి సమాధానంగా ముఆవియ (రజి) గారు నమాజ్ చేస్తూనే (యర్‌హముకల్లాహ్) అని బదులిచ్చారు. నమాజు ముగించిన తరువాత దైవప్రవక్త (సఅసం) పై హదీసును ఉపదేశించారు. నమాజు మధ్యలో ఇతరుల్ని సంబోధించి మాట్లాడటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా అర్థమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

ముఆవియా బిన్ హకమ్ (రజి) హిజాజ్ ప్రాంతానికి చెందినవారు. మదీనాలో స్థిరపడ్డారు. 'బనూ సులైమ్'లో ఉండసాగారు. ఈయన కూడా ప్రవక్త ప్రియసహచరులు (సహాబి)గా పరిగణించ బడతారు.

(١٧٣) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ قَالَ: إِن كُنَّا لَنَتَكَلَّمُ فِي الصَّلاَةِ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ: يُكَلِّمُ أَحَدُنَا صَاحِبَهُ بِحَاجَتِهِ، حَتَّى نَزَلَتْ ﴿حَافِظُوا عَلَى الصَّلَوَاتِ والصَّلاَةِ الْوُسْطَى وَقُومُوا للهِ قَانِتِينَ﴾ فَأُمِرْنَا بِالسُّكُوتِ، وَنُهِينَا عَنِ الْكَلاَمِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

173. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో నమాజు మధ్యలో ఒండొకరితో సంభాషించే వాళ్లం. ఒండొకరి అక్కరలను గురించి చర్చించుకునేవాళ్లం. ఎట్టకేలకు ఈ ఆయత్ అవతరించింది - "హాఫిజూ అలస్సలవాతి వస్సలాతిల్ వుస్తా వ ఖూమూ లిల్లాహి ఖానితీన్." దీని తరువాత నిశ్శబ్దంగా ఉండాలని ఆదేశించ బడింది. నమాజ్‌లో మాట్లాడుకోవటాన్ని వారించటం జరిగింది." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

### సారాంశం

నమాజ్ మధ్యలో సంభాషించటం నిషిద్ధమని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. ఇస్లాం ఆరంభకాలంలో నమాజ్ మధ్యలో సంభాషించుకునేందుకు అనుమతి ఉండేది. తరువాత ఇది నిషేధించబడింది.

### హదీసు ఉల్లేఖకులు

జైద్ బిన్ అర్ఖమ్ (రజి) అన్సార్ వర్గీయులు. ఖజ్రజ్ తెగకు చెందినవారు. అబూ అమ్ర్ ఈయన నామాంతరం. కందక యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. దైవప్రవక్త (స)తో కలసి మొత్తం 17 యుద్ధాలలో పాల్గొన్నారు. సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా హజ్రత్ అలీ (రజి) మద్దతుదారుల పక్షాన ఉన్నారు. కూఫాలో స్థిరపడ్డారు. హిజ్రి 66లో మరణించారు.

(١٧٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «التَّسْبِيحُ لِلرِّجَالِ وَالتَّصْفِيقُ لِلنِّسَاءِ». مُتَّفَقٌ عَلَيْهِ، زَادَ مُسْلِمٌ: «فِي الصَّلَاةِ».

174. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖించారు: "(నమాజులో అవసరమైనప్పుడు) పురుషులు తస్బీహ్ పలకాలి (అంటే సుబ్‌హానల్లాహ్ అని అంటూ ఇమామ్‌ను జాగరూకపరచాలి) స్త్రీలు చప్పట్లు చరచాలి" (బుఖారీ, ముస్లిం-ముస్లింలో 'ఫిస్సలాతి' అంటే నమాజులో అనే పదం అధికంగా ఉంది).

### సారాంశం

నమాజులో ఇమామ్ మరచిపోతే అతన్ని సావధానపర్చడానికి వెనుక నున్నవారు 'సుబ్‌హానల్లాహ్' అని పలికి అతని పొరబాటును అతని దృష్టికి తీసుకురావాలి. వెనుక నమాజ్ చేసేవారు స్త్రీలయితే చప్పట్లు చరచటం ద్వారా పొరపాటును ఎత్తి చూపాలి. అంతేగానీ స్త్రీలు తమ నోటితో సుబ్‌హానల్లాహ్ తదితర వాక్యాలు పలుకనవసరం లేదు. వారు తమ కుడిచేతి యొక్క రెండు వ్రేళ్లను ఎడమచేతి ఉపరితలంపై చరిస్తే సరిపోతుందని ఈసా బిన్ అయ్యూబ్ తెలిపారు. పరాయి స్త్రీ కంఠం మగవారికి తెలియకూడదన్న ఉద్దేశ్యంతోనే చప్పట్లు చరిచే పద్ధతి ప్రతిపాదించబడింది. అంటే స్త్రీ కంఠం (శబ్దం) కూడా ఒకవిధంగా 'పరదా' లాంటిదే. ఈ విషయంలో ఇస్లాం ఎంత సెన్సిటివ్‌గా ఉందో, ఆధునికత పేరిట విశృంఖలంగా విహరిస్తున్న మహిళలు ఆలోచించాలి. కొంతమంది మగవాళ్లు ఇమామ్ పొరబాటును ఎత్తిచూపటానికి 'సుబ్‌హానల్లాహ్' బదులు 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ ఉంటారు. ఇది కూడా సరైనది కాదు. ఎందుకంటే దైవప్రవక్త విధానంలో ఇలాంటిదేదీ లేదు.

(١٧٥) وَعَنْ مُطَرِّفِ بْنِ عَبْدِ اللهِ ابْنِ

175. హజ్రత్ ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ (రజి) తన తండ్రి గారు చెప్పి

الشِّخِّيرِ عَنْ أَبِيْهِ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي وَفِي صَدْرِهِ أَزِيزٌ كَأَزِيزِ الْمِرْجَلِ، مِنَ الْبُكَآءِ. أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ ابْنَ مَاجَه، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

నట్లు తెలిపారు: (తండ్రిగారు) ఇలా చెప్పారు - నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను నమాజ్ చేస్తుండగా చూచాను. దైవభీతి కారణంగా ఆయన (స) గుండెలో నుంచి ఉడుకుతున్న కుండ చేసే ధ్వని లాంటిది వినవచ్చేది". (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమని ఖరారు చేశారు)

### సారాంశం

దైవభీతి, దైవభక్తి పరాయణత కారణంగా నమాజు మధ్యలో మనిషి విలపిస్తే దానివల్ల నమాజ్‌కు ఎలాంటి భంగం, నష్టం వాటిల్లదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది.

### హదీసు ఉల్లేఖకులు

(1) ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ (రజి) హర్షీ, ఆమిరీ బస్రీ. తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడతారు. విశ్వసనీయులు. దైవభక్తి పరాయణులు. జ్ఞానిగా పేరు మోశారు. హిజ్రీ 95లో మరణించారు.

(2) 'తండ్రిగారు' అంటే ఇక్కడ అబ్దుల్లాహ్ బిన్ షిఖ్ఖీర్ బిన్ ఔఫ్ బిన్ కాబ్ హర్షీ ఆమిరీ (రజి) అన్నమాట. ఈయన దైవప్రవక్త సహచర్యం పొందిన వారిలో ఒకరు. దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చిన బనీ ఆమిర్ బృందంలో ఈయన కూడా కీలకమయిన వ్యక్తి. బస్రీగా పరిగణించబడతారు.

(١٧٦) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ لِيْ مِنْ رَسُولِ اللهِ ﷺ مَدْخَلاَنِ، فَكُنْتُ إِذَا أَتَيْتُهُ وَهُوَ يُصَلِّي، تَنَحْنَحَ لِيْ. رَوَاهُ النَّسَآئِيُّ وَابْنُ مَاجَهْ.

176. హజ్రత్ అలీ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను రెండు వేళల్లో కలుసుకునేవాణ్ణి. నేను ఆయన (స) వద్దకు వెళ్ళిన సమయంలో ఆయన (సఅసం) గనక నమాజ్ చేస్తున్నట్లయితే నన్ను 'ఆగు' అని తెలియజేయడానికి (నమాజ్‌లో నెమ్మదిగా) దగ్గేవారు. (నసాయి, ఇబ్నె మాజ)

### సారాంశం

నమాజ్ మధ్యలో అనివార్యమైనపుడు నోటితో మాట్లాడకుండా కేవలం గొంతు సవరించుకున్న చందాన నెమ్మదిగా దగ్గవచ్చు. దీనివల్ల నమాజ్ భగ్నం కాదని హదీసు చెబుతోంది.

(١٧٧) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قُلْتُ لِبِلَالٍ: كَيْفَ رَأَيْتَ النَّبِيَّ ﷺ يَرُدُّ عَلَيْهِمْ حِيْنَ يُسَلِّمُونَ عَلَيْهِ، وَهُوَ يُصَلِّي؟ قَالَ: يَقُوْلُ هٰكَذَا وَبَسَطَ كَفَّهُ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ والتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

177. హజ్రత్ (అబ్దుల్లాహ్) ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "నమాజ్ చేసే సమయంలో ప్రజలు దైవప్రవక్త (సఅసం) కు సలాం చేస్తే ఆయన (స) వారికి బదులు ఎలా పలికేవారు?" అని నేను బిలాల్ (రజి)ను అడిగాను. 'ఈ విధంగా చేసేవారు' అంటూ ఆయన తన చేతిని చాపారు. (అబూదావూద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు-తిర్మిజీ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

నమాజ్‌లో సంజ్ఞ (సైగ చేయటం) ద్వారా 'సలాం' కు బదులు పలకటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. చాలామంది దీనితో ఏకీభవిస్తున్నారు. అయితే కొందరు దీంతో విభేదించారు. "నమాజ్‌లో సంభాషించేందుకు అనుమతి వున్న కాలం నాటిది ఈ సంఘటన. నమాజ్ మధ్యలో సంభాషించటం నిషేధించబడిన తరువాత సలాంకు బదులు పలకటం కూడా హరాం గావించబడినట్లే" అని వీళ్లు అంటున్నారు.

ఇక్కడ కాస్త ఆగి ఆలోచిస్తే ఒక విషయం అర్థం కాగలదు - నమాజ్‌లో సంభాషించే అనుమతి వున్న తొలికాలంలో సైగ ద్వారా జవాబు ఇవ్వవలసిన అగత్యం ఎందుకు ఏర్పడుతుంది? హాయిగా నోటితోనే సలాంకు బదులు ఇవ్వవచ్చుకదా! నోటితో గాకుండా సంజ్ఞతో జవాబు ఇచ్చారంటే, ఇది తరువాతి కాలంలో జరిగిన సంఘటనేనని, అప్పటికే నమాజ్‌లో సంభాషించటం నిషేధించబడిందని స్పష్టమవుతున్నది. వాస్తవం ఏమిటంటే నమాజ్ స్థితిలో ఎవరయినా చేసిన సలాంకు సైగతో బదులు ఇవ్వటం ధర్మసమ్మతమే.

ఈ హదీసు ద్వారా బోధపడే ఇంకొక విషయమేమిటంటే బయటినుండి, నమాజ్ చేస్తున్న వ్యక్తికి సలాం చేయవచ్చు. కాకపోతే నమాజ్ చేసేవారు నోటితో గాకుండా సైగ చేయటం ద్వారా బదులు ఇవ్వాలి. ఈ సైగ ఎలా చేయాలి? దీనికి సంబంధించి కూడా అనేక ఉల్లేఖనాలు ఉన్నాయి. ఈ అనేక ఉల్లేఖనాల ఆధారంగా తెలిసేదేమంటే తల ఊపటం ద్వారా, చేయిచాపటం ద్వారా, చేతి వ్రేలి ద్వారా నమాజ్ స్థితిలో సలాంకు బదులు పలకవచ్చు.

(١٧٨) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي، وَهُوَ حَامِلٌ أُمَامَةَ بِنْتَ زَيْنَبَ، فَإِذَا سَجَدَ وَضَعَهَا،

178. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయిస్తూ (తన మనుమరాలైన) ఉమామ బిన్తె జైనబ్ (ర.అన్హా)ను ఒడిలో ఎత్తుకుని ఉండే

وَإِذَا قَامَ حَمَلَهَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «وَهُوَ يَؤُمُّ النَّاسَ فِي الْمَسْجِدِ».

వారు. సజ్దాలోకి వెళ్ళేముందు ఆమెను దించేసేవారు. సజ్దాచేసి నిలబడిన తరువాత (తిరిగి ఆమెను) ఎత్తుకునే వారు." (బుఖారీ, ముస్లిం) 'ఆయన(స) ప్రజలకు నమాజ్ చేయిస్తూ ఈ విధంగా చేసేవారు' అని ముస్లిం ఉల్లేఖనంలో అదనంగా ఉంది.

## సారాంశం

అంటే దైవప్రవక్త (సఅసం) సామూహిక నమాజ్‌కు నేతృత్వం వహిస్తూ ఆ పిల్లను ఎత్తుకున్నారని హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఫర్జ్ నమాజ్ అయినా, నఫిల్ నమాజులో నయినా తప్పనిసరైనపుడు పిల్లలను ఎత్తుకుని నమాజ్ చేయవచ్చని దీన్నిబట్టి అర్థమవుతోంది. దీనివల్ల నమాజ్‌కు కలిగే కీడు ఏమీ లేదు.

నమాజులో తలపై నుండి తలపాగా (లేక టోపీ) క్రింద పడిపోతే దాన్ని ఎత్తుకుని తలపై పెట్టుకోవచ్చా? అని ఎవరో ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) ని ప్రశ్నించగా, దైవప్రవక్త (స) మూడేండ్ల పిల్ల ఉమామ బిన్తె జైనబ్‌ను నమాజ్‌లో ఎత్తుకున్నప్పుడు, తల పాగాను ఎత్తుకోవటంలో అభ్యంతరం ఏముందీ? అని ఆయన వ్యాఖ్యానించారు. అంటే క్రిందపడిన తల పాగా (లేక టోపీ)ను ఎత్తుకోవటం సమంజసమే. ఈ మాత్రం కదలిక 'అమలె కసీర్' క్రిందికి రాదు.

## హదీసు ఉల్లేఖకులు

హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఉమామ బిన్తె జైనబ్ (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం) కుమార్తె యగు జైనబ్ (ర.అన్హా) కూతురు. ఈమె తండ్రి పేరు అబుల్ ఆస్ బిన్ రబీ. ఫాతిమా (ర.అన్హా) వసీయతు ప్రకారం హజ్రత్ అలీ (రజి) గారు ఫాతిమ (ర.అన్హా) మరణానంతరం ఈమెను నికాహ్ చేసుకున్నారు.హజ్రత్ అలీ (రజి) అమరగతినొందిన తరువాత ముగీరా బిన్ నౌఫిల్ (రజి) ఈమెను వివాహమాడారు. కడకు ఈమె ఆయన సతీమణిగానే మరణించారు.

(١٧٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اُقْتُلُوا الْأَسْوَدَيْنِ فِي الصَّلَاةِ: الْحَيَّةَ وَالْعَقْرَبَ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

179. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నమాజులో రెండు నల్లటి జంతువులను (పామును, తేలును) చంపేయండి." (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు నలుగురూ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు.)

### సారాంశం

నమాజ్ మధ్యలో పాము, తేలు వంటి విషపూరిత జంతువులను, కీటకాలను చంపటం వల్ల నమాజు భంగం కాజాలదని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. హానికరమయిన ఈ రెండు జంతువులను కనిపించగానే చంపివేయటం అవసరమని కూడా హదీసు వల్ల విదితమవుతోంది. అత్యధికమంది పండితులు కూడా దీంతో ఏకీభవించారు.

### 4వ అధ్యాయం

## ٤ - بَابُ سُتْرَةِ الْمُصَلِّي

## సుత్రా (తెర లేక అడ్డు)

(١٨٠) عَنْ أَبِي جُهَيْمٍ بْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَوْ يَعْلَمُ الْمَارُّ بَيْنَ يَدَيِ الْمُصَلِّي مَاذَا عَلَيْهِ مِنَ الْإِثْمِ، لَكَانَ أَنْ يَقِفَ أَرْبَعِينَ خَيْراً لَهُ مِنْ أَنْ يَمُرَّ بَيْنَ يَدَيْهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ. وَوَقَعَ فِي الْبَزَّارِ مِنْ وَجْهٍ آخَرَ: «أَرْبَعِينَ خَرِيفاً».

180. హజ్రత్ అబూ జుహైమ్ బిన్ హారిస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నమాజ్ చేస్తున్న వ్యక్తి ముందు నుంచి నడిచిపోయే వానికి, తన ఈ చేష్టవల్ల ఎంత పాపం కలుగుతుందో తెలిస్తే, అలా నడచిపోయేబదులు నలభై (యేండ్లు) అయినాసరే అక్కడ నిలబడ టానికే అతను ఇష్టపడతాడు."

(బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి. బజ్జార్ ఉల్లేఖ నంలో-వేరొక సౌజన్యంతో - 40 యేండ్లు అన్న ప్రస్తావన వచ్చింది)

### సారాంశం

'సుత్రా' అంటే నమాజ్ చేసే వ్యక్తి తాను సజ్దా చేసే స్థలానికి ముందు అడ్డుగా ఉపయోగించుకునే వస్తువు. అది గోడ కావచ్చు, స్థంభం కావచ్చు, అడ్డు తెర కావచ్చు, కర్ర కావచ్చు లేదా అటువంటిదే మరేదయినా వస్తువు కావచ్చు. ఈ సుత్రా నమాజ్ చేసే వ్యక్తికీ, అతని ముందు నుంచి నడచిపోయే వారికీ మధ్య అడ్డుగా ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

అబూ జుహైమ్ బిన్ హారిస్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ అని అనబడుతోంది. ఖజ్రజ్ తెగకు చెందిన హారిస్ బిన్ సిమ్మ అన్సారీ కుమారులు. ప్రముఖ సహాబీలలో ఒకరు. అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ వరకు జీవించివున్నారు.

(١٨١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سُئِلَ رَسُولُ اللهِ ﷺ فِي غَزْوَةِ تَبُوكَ عَنْ سُتْرَةِ الْمُصَلِّي، فَقَالَ: «**مثل مُؤْخِرَةِ الرَّحْلِ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

181. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: తబూక్ యుద్ధ సందర్భంగా 'సుత్రా' (ఎత్తు) గురించి దైవప్రవక్త (సఅసం)ను అడగటం జరిగింది: దానికి ఆయన (సఅసం), "అది ఒంటెపై కట్టబడే పల్లకీ వెనుకభాగపు ఎత్తుకు సమానంగా ఉండాల"ని అన్నారు.

(ముస్లిం)

### సారాంశం

పొలాలు, బహిరంగ స్థలాలు, అటవీ ప్రాంతాలలో 'సుత్రా'ను ప్రతిష్ఠించాలని హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

(١٨٢) وَعَنْ سَبْرَةَ بْنِ مَعْبَدٍ الْجُهَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لِيَسْتَتِرْ أَحَدُكُمْ فِي الصَّلَاةِ وَلَوْ بِسَهْمٍ**». أَخْرَجَهُ الْحَاكِمُ.

182. హజ్రత్ సబ్ర బిన్ మాబద్ జుహనీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "నమాజ్ (చేసే సమయం)లో మీలో ప్రతి ఒక్కరూ సుత్రాను తప్పక నెల కొల్పుకోవాలి -అది ఒక బాణమైనాసరే!"

(ముస్తద్రక్ హాకిమ్)

### సారాంశం

'సుత్రా' ఆఖరికి ఒక బాణమైనాసరే అని అనబడటాన్నిబట్టి అది లావుగా వున్నా, సన్నగా వున్నా దాన్ని ప్రతిష్ఠించటం మాత్రం అవసరమని దీన్నిబట్టి విదితమవుతున్నది.

### హదీసు ఉల్లేఖకులు

సబ్ర బిన్ మాబద్ జుహనీ (రజి) మదీనా సహాబీ. 'జీమర్వ'లో నివాసం ఏర్పరచుకున్నారు. ఈయన మారు పేరు అబూ సురయ్య. కందక పోరాటంలో తొలిసారిగా పాల్గొన్నారు. హజ్రత్ అలీ (రజి) పరిపాలనా కాలంలో అలీ (రజి) గారు తన తరపున ఈయన్ని సిరియా వాసుల నుండి 'బైత్' స్వీకరించడానికి హజ్రత్ ముఆవియ (రజి) వద్దకు పంపించారు. హజ్రత్ ముఆవియ పరిపాలనాకాలం చరమ దశలో ఈయన మరణించారు.

(١٨٣) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**يَقْطَعُ صَلَاةَ**

183. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు: "ముస్లిం

الْمَرْءِ الْمُسْلِمِ – إِذَا لَمْ يَكُنْ بَيْنَ يَدَيْهِ مِثْلُ مُؤْخِرَةِ الرَّحْلِ – الْمَرْأَةُ وَالْحِمَارُ وَالْكَلْبُ الْأَسْوَدُ». الْحَدِيثَ. وَفِيهِ: «الْكَلْبُ الْأَسْوَدُ شَيْطَانٌ». أَخْرَجَهُ مُسْلِمٌ.

పురుషుని నమాజ్‌ను - అతని ముందర, ఒంటెపై కట్టే పల్లకీ వెనుక భాగపు కర్ర ఎత్తుకు సమానంగా 'సుత్రా' లేనట్ల యితే- స్త్రీ, గాడిద, నల్లకుక్క - భంగపరు స్తాయి." "నల్లకుక్క షైతాన్ అయి వుంటాడు" అన్న వాక్యం కూడా ఈ హదీసులో ఉంది. (ముస్లిం)

وَلَهُ عَنْ أَبِي هُرَيْرَةَ نَحْوَهُ دُوْنَ الْكَلْبِ، وَلِأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ عَنِ ابْنِ عَبَّاسٍ نَحْوَهُ دُوْنَ آخِرِهِ، وَقَيَّدَ الْمَرْأَةَ بِالْحَائِضِ.

ఇందులో హాజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం కూడా ఉందిగాని అందులో కుక్క ప్రస్తావన రాలేదు. అబూదావూద్, నసాయి కూడా హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఆధారంగా ఇదే విధంగా నకలు చేశారు. అయితే ఇందులో హదీసు ఆఖరి భాగం లేదు. ఇంకా, స్త్రీ గురించి చెబుతూ 'బహిష్టు అయి ఉన్నప్పుడు' అన్న నిబంధన ఉంది.

**సారాంశం**

'సుత్రా' నిబంధనలో ఎన్నో పరమార్థాలు అంతర్లీనమై ఉన్నాయి. దానుడు నమాజ్ కొరకు నిలబడినపుడు హదీసులో చెప్పబడినట్లు అతని ముందర దైవకారుణ్యం ఉంటుంది. దానుడు నమాజ్‌కు ముందు సుత్రాను స్థాపిస్తే అది ఒక హద్దును ఏర్పరచుకుంటుంది. దాని అవతల నుంచి ఎవరు రాకపోకలు సాగించినా నమాజ్‌లో ఎలాంటి అంతరాయం కలగటంగానీ, దైవకారుణ్య పరిధిలో జోక్యం జరగటంగానీ ఉండవు.

'నమాజ్ భంగమవుతుంది' అన్న హదీసులోని వాక్యానికి భావం నమాజ్ పూర్తిగా వృధా అయిందని కాదు, నమాజులోని శుభాలు, మేళ్లు పుణ్యఫలాలు క్షీణిస్తాయని మాత్రమే దీని మతలబు. సామూహిక నమాజ్‌లో నమాజ్‌కు సారథ్యం వహించే వ్యక్తి (ఇమామ్) తన వెనుకనున్న వారందరి పాలిట - పరోక్షంగా - సుత్రాగా ఉంటాడు.

ఇక హదీసులో స్త్రీ, కుక్క, గాడిదల ప్రస్తావన ప్రత్యేకంగా ఎందుకు వచ్చింది? వారుగాక మరొకరెవరయినా నమాజీ ముందునుంచి నడచిపోతే నమాజ్ భంగమవదా?? అన్న ప్రశ్నలు ఇక్కడ జనిస్తాయి. వాస్తవానికి ఎవరు అలా నడచివెళ్ళినా నమాజులో దోషం తప్పక ఏర్పడుతుంది. ఇంతకు ముందు వచ్చిన ఒక హదీసులో పురుషుని ప్రస్తావన కూడా వచ్చింది. కాకపోతే ఇతరులకన్నా ఈ మూడింటి ద్వారా నమాజ్ ఏకాగ్రతకు మరింత ఎక్కువగా ఆటంకం కలుగుతుందన్నమాట!

అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) ఆధారంగా తిర్మిజీ ఉటంకించిన ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది - స్త్రీ దాగి వుండవలసిన వస్తువు. ఆమె ఇంటి నుండి బయటికి వస్తే చాలు, షైతాన్ ఆమెను చాటు మాటుగా వెంటాడతాడు. ఇక గాడిద గురించి ఏమనబడిందంటే, అది షైతాన్‌ను చూచినపుడు గాండ్రుపెడుతుంది. ఇక కుక్క గురించి హదీసు ఉండనే ఉంది - నల్ల కుక్క షైతాన్ అయివుంటుంది. కుక్క అత్యంత చెండాలపు జంతువు. అది వున్న చోట దైవదూతలు ప్రవేశించరు. ఎవరయితే షరీయత్ సూచించిన హద్దులలో కాకుండా వేరితర పద్ధతిలో కుక్కను పెంచాడో అతడు అనుదినం తన పుణ్యార్జనలో రెండు యూనిట్ల కోత విధించుకున్నాడు.

(١٨٤) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **إِذَا صَلَّى أَحَدُكُمْ إِلَى شَيْءٍ يَسْتُرُهُ مِنَ النَّاسِ، فَأَرَادَ أَحَدٌ أَنْ يَجْتَازَ بَيْنَ يَدَيْهِ، فَلْيَدْفَعْهُ، فَإِنْ أَبَى فَلْيُقَاتِلْهُ، فَإِنَّمَا هُوَ شَيْطَانٌ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ: فَإِنَّ مَعَهُ الْقَرِيْنَ.

184. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినా 'సుత్రా'ను ప్రతిష్ఠించి నమాజ్ చేయసాగినపుడు ఎవరయినా దాని ముందు నుంచి (అంటే సుత్రాకి-నమాజీకి మధ్య నుండి) నడచిపోతుంటే నమాజ్ చేసే వ్యక్తి అతన్ని ఆపేందుకు ప్రయత్నించాలి. అప్పటికీ అతను ఖాతరు చేయకపోతే అతనితో పోరాడాలి. ఎందుకంటే అతడు (మానవ రూపంలో వున్న) షైతాన్" (బుఖారీ, ముస్లిం) 'అతనితో పాటు అతని సావాసి ఒకడున్నాడు' అని మరో ఉల్లేఖనంలో చెప్పబడింది.

### సారాంశం

ఒక వ్యక్తి 'సుత్రా'ను నెలకొల్పి నమాజ్ చేసుకుంటూ ఉండగా అతని ముందర నుంచి వెళ్లడం అవాంఛనీయమయిన విషయం. అలా నడచివెళ్లే వానిని ఆపటం తప్పనిసరి (వాజిబ్) లేక అభిలషణీయం (ముస్తహబ్). ముందు నుంచి నడచిపోయే వ్యక్తిని నమాజీ సైగతో ఆపాలి. అప్పటికీ అతను లెక్క చేయకపోతే అతన్ని ప్రతిఘటించాలి. అప్పటికీ అతను నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే కొట్టాలి. అంతే. అంతకుమించిన గొడవగానీ, సిగపట్లు పట్టుకోవటంగానీ చేయకూడదు. అయితే నమాజీ 'సుత్రా'ను ప్రతిష్ఠించినపుడే ఇలా ప్రతిఘటించే హక్కు ఉంటుంది. ఒకవేళ సుత్రాను ప్రతిష్ఠించకపోతే ఆ తప్పు నమాజీది అవుతుంది. ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే ఈపాటి చలనం వల్ల నమాజ్ భంగమవదు.

(١٨٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَجْعَلْ تِلْقَاءَ وَجْهِهِ شَيْئاً، فَإِنْ لَمْ يَجِدْ فَلْيَنصِبْ عَصاً، فَإِنْ لَمْ يَكُنْ فَلْيَخُطَّ خَطّاً، ثُمَّ لاَ يَضُرُّهُ مَنْ مَرَّ بَيْنَ يَدَيْهِ**». أَخْرَجَهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّان، وَلَمْ يُصِبْ مَنْ زَعَمَ أَنَّهُ مُضْطَرِبٌ بَلْ هُوَ حَسَنٌ.

185. హజ్రత్ అబూ హురైర (రజి) కథనానుసారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరయినా నమాజ్‌కు ఉపక్రమించినపుడు తన ముందర ఏదైనా వస్తువు పాతుకోవాలి లేదా నెలకొల్పుకోవాలి. ఏ వస్తువూ దొరక్కపోతే తన కర్రనే నిలబెట్టుకోవాలి. అదీ లేకపోతే కనీసం నేలపై గీత గీసుకోవాలి. ఇక ఇప్పుడు నమాజీ ముందు నుంచి సాగిపోయేవాడు నమాజీకి ఎలాంటి నష్టం కలిగించలేడు." (దీనిని అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఈ హదీసు విషయంలో ఎవరయినా సందిగ్ధస్థితికి లోనయితే వారి ఈ స్థితి సరైనది కాదు. పైగా ఈ హదీసు 'హసన్' (స్పష్టమయిన) స్థాయికి చెందినది).

**సారాంశం**

ప్రతి వస్తువూ 'సుత్రా'గా ఉపయోగపడుతుందని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. ఏ వస్తువూ లభ్యం కాకపోతే నేలపై ఒక గీత గీసుకుని దానినే 'సుత్రా'గా పరిగణించవచ్చు.

(١٨٦) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَيَقْطَعُ الصَّلاَةَ شَيْءٌ، وَادْرَءُوا مَا اسْتَطَعْتُمْ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَفِي سَنَدِهِ ضَعْفٌ.

186. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "నమాజ్‌ను ఏ వస్తువూ భంగపరచజాలదు (అయితే ముందునుంచి) నడచిపోయేవారిని సాధ్యమైనంతవరకు ఆపే ప్రయత్నం చేయండి." (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇది అందిన పరంపర బలహీనంగా ఉంది)

## 5వ అధ్యాయం

## నమాజ్‌లో అశక్తత, అణకువ

## ٥ - بَابُ الْحَثِّ عَلَى الْخُشُوعِ فِي الصَّلاَةِ

187. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: నమాజ్‌లో తమ (రెండు) చేతులను రెండు జబ్బలపై పెట్టుకుని నమాజ్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యం మాత్రం ముస్లింలోనిది)

(١٨٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يُصَلِّيَ الرَّجُلُ مُخْتَصِراً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ، وَمَعْنَاهُ أَنْ يَجْعَلَ يَدَهُ عَلَى خَاصِرَتِهِ.

బుఖారీలోనిహజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనంలో ఇలా వుంది - "ఇది యూదుల ఆరాధనా పద్ధతి."

وَفِي الْبُخَارِيِّ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: «أَنَّ ذَلِكَ فِعْلُ الْيَهُودِ».

### సారాంశం

నమాజ్ కేవలం అల్లాహ్ కొరకే చేస్తున్నపుడు పూర్తి ఏకాగ్రతతో, మనసును లగ్నం చేసి మరీ చేయాలి. నమాజ్ స్ఫూర్తికీ, దాని స్వభావానికి, సంస్కారానికి విరుద్ధమయిన ఏ పని అందులో జరగరాదు. నమాజ్‌లో చేతులు కట్టుకుని నిలబడటమే మర్యాద అనిపించుకుంటుంది. జబ్బలపై చేతులు పెట్టుకుని నిలబడటం అణకువకి కాదుకదా అది అహంకారానికి ప్రతిరూపం. నమాజులోనయితే దాసుని అశక్తత, అణకువ, వినయ వినమ్రతలు తొణికిసలాడాలి. అందుకే చేతుల్ని జబ్బలపై (లేదా ప్రక్కలపై) పెట్టుకోవడాన్ని వారించటం జరిగింది. అదీగాక ఈ పద్ధతి యూదుల ఆరాధనా పద్ధతిని పోలివుండటంచేత దానిని విడనాడవలసిన అవసరం కూడా ఏర్పడింది.

188. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "సాయంకాలపు భోజనం గనక తయారై ఉంటే మగ్రిబ్ నమాజ్ చేయకమునుపే భుజించండి." (బుఖారీ, ముస్లిం)

(١٨٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ: قَالَ: «**إِذَا قُدِّمَ الْعَشَاءُ فَابْدَءُوا بِهِ قَبْلَ أَنْ تُصَلُّوا الْمَغْرِبَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

### సారాంశం

దీని భావం ఏమిటంటే నమాజ్‌కు ముందే వంట పూర్తయి భోజనం వడ్డించబడితే - ఆకలి కూడా ఉంటే - నమాజ్‌కు ముందే తినటం మంచిది. దీనివల్ల నమాజ్‌లో ఏకాగ్రత ఉంటుంది. మనిషి ఆకలి బాధతో అలమటిస్తున్నపుడు అతని మనసు నమాజ్‌లో లగ్నమవదు. అతని ధ్యాసంతా అన్నపానీయాలపైనే ఉంటుంది.;;;

(١٨٩) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا قَامَ أَحَدُكُمْ فِي الصَّلاَةِ فَلاَ يَمْسَحِ الْحَصَى، فَإِنَّ الرَّحْمَةَ تُوَاجِهُهُ**». رَوَاهُ الْخَمْسَةُ بِإِسْنَادٍ صَحِيحٍ، وَزَادَ أَحْمَدُ: «**وَاحِدَةً أَوْ دَعْ**». وَفِي الصَّحِيحِ عَنْ مُعَيْقِيبٍ نَحْوُهُ بِغَيْرِ تَعْلِيلٍ.

189. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "మీలో ఏ వ్యక్తయినా నమాజ్ చేస్తున్నప్పుడు (సజ్దా చేసే స్థలం నుండి) కంకరరాళ్ళను తన చేత్తో తొలగించరాదు. ఎందుకంటే (ఆ సమయంలో) దైవకారుణ్యం నమాజీ వైపునకు కేంద్రీకృతం అయి ఉంటుంది." (దీనిని అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ లైదుగురూ ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు)

ముస్నద్ అహ్మద్‌లో అదనంగా ఇలా ఉంది - "ఒకవేళ కంకరరాళ్లను తొలగించాలనే అనుకుంటే ఒకసారి తొలగించండి లేదా వదిలెయ్యండి" సహీహ్ బుఖారీలో హజ్రత్ ముఐఖిబ్‌చే ఈ విధంగా ఉల్లేఖించబడింది. అందులో కారణం తెలుపబడలేదు.

## సారాంశం

నమాజ్ మధ్యలో సజ్దా చేసే స్థలాన్ని శుభ్రపరచటం, తుడవటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఒకవేళ అలాంటిదేదయినా చేయాల్సివుంటే నమాజ్‌కు ముందే చేసుకోవాలి. ఇలా వారించబడటంలోని ఆంతర్యం ఏమిటంటే నమాజ్‌లో మనిషికి ఒక్క నమాజ్ తప్ప మరో ధ్యాస ఉండకూడదు. అతని మనసు నమాజ్‌లో పూర్తిగా నిమగ్నమై ఉండాలి. నమాజ్ మధ్యలో అతని నుదుటికి దుమ్ము తగిలినా, లేక మరేదయినా గడ్డి పరకలాంటిది అంటుకున్నా మధ్యలోనే దాన్ని దులపకూడదు. ఎందుకంటే ఆ సమయంలో దైవకారుణ్యం అతని వైపునకు మరలి ఉంటుంది. కీలకమయిన ఆ ఘడియలో అతను తన ఏకాగ్రతను పోగొట్టే చేష్టలకు పాల్పడితే దైవకారుణ్యానికి దూరమయ్యే ప్రమాదముంది. కనుక మరీ అనివార్యమైతే తప్ప అతను ఇలాంటి చేష్టలకు పాల్పడ కూడదు.

## హదీసు ఉల్లేఖకులు

ముఐఖిబ్ (రజి) పూర్తిపేరు ముఐఖిబ్ బిన్ అబూ ఫాతిమ. దౌస్ తెగకు చెందిన వారవటంచేత 'దౌసీ'గా పిలువబడేవారు. మక్కాలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో అబిసీనియా వైపునకు హిజ్రత్ చేశారు. బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) వారి 'ప్రవక్తా ముద్ర' ను భద్రపరచేవారు. హజ్రత్ అబూబక్ర్, హజ్రత్ ఉమర్‌లు ఈయన్ని కోశాగారానికి ఇన్‌చార్జిగా నియమించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(١٩٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنِ الالْتِفَاتِ فِي الصَّلاَةِ، فَقَالَ: «**هُوَ اخْتِلاَسٌ يَخْتَلِسُهُ الشَّيْطَانُ مِنْ صَلاَةِ الْعَبْدِ**». رَوَاهُ الْبُخَارِيُّ.

190. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: నేను దైవప్రవక్త (సఅసం)ను నమాజులో కళ్ల కొనలతో అటూఇటూ దృష్టిసారించడాన్ని గురించి అడిగాను. దీనికాయన (సఅసం), "ఇది షైతాన్ దోబూచులాట. దీనిద్వారా షైతాన్ దాసుని నమాజ్‌ను దోచుకుంటాడు" అని చెప్పారు. (బుఖారీ)

وَلِلتِّرمِذِيِّ عَنْ أَنَسٍ – وَصَحَّحَهُ –: «إِيَّاكَ وَالْالْتِفَاتَ فِي الصَّلاَةِ، فَإِنَّهُ هَلَكَةٌ، فَإِنْ كَانَ لاَ بُدَّ فَفِي التَّطَوُّعِ»:

తిర్మిజీలోని హదీసులో దైవప్రవక్త (స) ఇలా చెప్పారని ఉంది: "నమాజ్‌లో దోబూచులాటకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఇది వినాశకర చేష్ట. మరీ అంతగా అవసరమైతే నఫిల్ నమాజులలో అలా చేయవచ్చు."

## సారాంశం

షైతాన్ మనిషికి బద్ధశత్రువు. మనిషికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ వాడు జారవిడుచుకోడు. ఆఖరికి నమాజులో సయితం మనిషిని వెంటాడి, అతని ఆలోచనలను పరిపరి విధాలా మళ్లించి అతన్ని మరుపుకు లోను చేయాలని చూస్తాడు. కనీసం నమాజీ దృష్టినయినా మరో వైపు మళ్లించాలని ఎత్తు వేస్తాడు. ఆ విధంగానయినా మనిషిని పరధ్యానానికి లోనుచేయవచ్చన్నది వాడి ఉద్దేశ్యం. అందుకే దైవప్రవక్త (సఅసం) నమాజ్ చేసే వ్యక్తిని; షైతాన్ ఎత్తుగడలనుంచి కడు జాగ్రత్తగా, సావధానంగా ఉండాలని తాకీదు చేశారు. మరీ అనివార్యమైతేనే దృష్టిని ప్రక్కకు మరల్చాలి. అది కూడా ముఖం త్రిప్పేబదులు కళ్ల కొనలతో చూడాలంతే. అంతేగాని ఈ చేష్టను అలవాటుగా చేసుకోరాదు.

(١٩١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ

191. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَ أَحَدُكُمْ فِي الصَّلاَةِ فَإِنَّهُ يُنَاجِي رَبَّهُ فَلاَ يَبْصُقَنَّ بَيْنَ يَدَيْهِ وَلاَ عَنْ يَمِينِهِ، وَلَكِنْ عَنْ شِمَالِهِ تَحْتَ قَدَمِهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ: «أَوْ تَحْتَ قَدَمِهِ».

ప్రవచించారు - "మీలో ఎవరయినాసరే నమాజ్ చేస్తున్నప్పుడు అతడు తన ప్రభువుతో సంభాషిస్తూ ఉంటాడు. (కాబట్టి ఈ స్థితిలో) తన ముందు వైపు గానీ, కుడిప్రక్కనగానీ ఉమ్మివేయ రాదు. దానికి బదులు తన ఎడమ వైపున కాలి క్రింద (ఉమ్మాలి)" (బుఖారీ, ముస్లిం). "ఎడమవైపున లేక తన కాలి క్రింద" అని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

నమాజ్ చేస్తుండగా ఉమ్మి వచ్చిన-, జలుబు కారణంగా ముక్కులోనుంచి నీరు వచ్చినా ఖిబ్లా దిశలోగానీ, కుడి వైపునగానీ ఉమ్మటంగానీ, ముక్కు చీదటం గానీ చేయరాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఆ సమయంలో మనిషి మస్జిద్‌లోవుంటే చేతి తువాలును గానీ, గుడ్డ (లేక టిష్యూ పేపర్)నుగానీ అడ్డుపెట్టుకోవాలి. ఒకవేళ ఆ క్షణంలో ఏ వస్తువూ లేకపోతే - గత్యంతరంలేని స్థితిలో - తన ఎడమకాలిక్రింద పారవేయాలి. మస్జిద్‌లో తివాచీ తదితర పాన్పులు లేనపుడే ఇది సాధ్యమవుతుంది. నమాజ్ ముగించిన వెంటనే ఆ స్థలాన్ని నీళ్లతో కడిగివేయాలి. వీలయితే డెట్టాల్ లాంటి క్రిమి సంహారక ద్రవ్యంగానీ, సుగంధద్రవ్యంగానీ అక్కడ చిలకరించి అశుద్ధతా ప్రభావాన్ని పూర్తిగా రూపుమాపాలి. ఇది ఒక విధంగా చేసిన తప్పుకు పరిహారం లాంటిదన్నమాట.

మొత్తానికి నమాజ్‌లో ఖిబ్లా దిక్కున ఉమ్మి వేయటం తప్పు. కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు, వారి శిష్యులు నమాజ్‌లో లేనపుడు (సాధారణ సమయాలలో) కూడా ఈ నియమాన్ని పాటించేవారు. ఖిబ్లా దిశపట్ల వారికున్న గౌరవమర్యాదలకు ఇదొక మచ్చు తునక. దైవప్రవక్త (స) ఒక ఇమామ్‌ను, నమాజ్ చేస్తుండగా ఖిబ్లా దిక్కున ఉమ్మివేసినందుకు, ఇమామత్ బాధ్యతలనుండి ఉద్వాసన పలికారని అబూదావూద్‌లో ఉల్లేఖించబడింది.

(١٩٢) وَعَنْهُ قَالَ: كَانَ قِرَامٌ لِعَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، سَتَرَتْ بِهِ جَانِبَ بَيْتِهَا، فَقَالَ لَهَا النَّبِيُّ ﷺ: «أَمِيطِي عَنَّا قِرَامَكِ هَذَا، فَإِنَّهُ لاَ تَزَالُ تَصَاوِيرُهُ تَعْرِضُ لِي فِي صَلاَتِي». رَوَاهُ الْبُخَارِيُّ.

192. హజ్రత్ అనస్ (రజి) కథనం: హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారి వద్ద ఒక ఆకర్షణీయమైన తెర (పరదా నిమిత్తం) ఉండేది. దాన్ని ఆమె తన కుటీరంలో ఒకచోట వ్రేలాడదీశారు. దైవప్రవక్త (సఅసం) దాన్ని గమనించి, "ఆకర్షణీయమైన ఈ తెరను మా ముందునుంచి తీసివెయ్యి. ఎందుకంటే

وَاتَّفَقَا عَلَى حَدِيْثِهَا فِيْ قِصَّةِ أَنْبِجَانِيَّةِ أَبِي جَهْمٍ، وَفِيْهِ: «فَإِنَّهَا أَلْهَتْنِي عَنْ صَلَاتِي».

దీనిపై వున్న చిత్రాలు నమాజులో నా ముందుకు వచ్చి ఆటంకం కలిగిస్తు న్నాయి" అని సెలవిచ్చారు. (బుఖారీ) బుఖారీ మరియు ముస్లిం లిరువురూ అబూజహమ్ గారి ఉన్ని తెర వృత్తాం తంపై ఏకాభిప్రాయం కలిగివున్నారు. అందులో ఇలా వుంది: "ఈ తెర నన్ను నా నమాజ్ నుండి విస్మరణకు గురి చేసింది."

## సారాంశం

ఈ హదీసు ద్వారా మనకు లభించే గుణపాఠం ఏమిటంటే; నమాజీ ఏకాగ్రతను భగ్నం చేసి అతని దృష్టిని తనవైపునకు త్రిప్పుకునే ప్రతి వస్తువునూ దూరంగా ఉంచాలి. దాన్ని నమాజ్ చేసేచోటినుంచి తొలగించటం సంభవం కాకపోతే స్వయంగా అక్కడినుండి నిష్క్రమించి వేరేచోట నమాజ్ చేయాలి. నమాజ్‌లో ఏకాగ్రతను, వినమ్రతను, భక్తీ పారవశ్యాన్ని కాపాడుకోవటానికి ఈ చర్య తీసుకోవటం అవసరం.

## హదీసు ఉల్లేఖకులు

అబూజహమ్ (రజి) - ఈయన ఇబ్నె హుజైఫా బిన్ ఘానిమ్ ఖురషీ అదవీ. అదవీ తెగకు చెందిన వారవటం చేత అదవీగా వ్యవహరించబడేవారు. ఈయన అసలు పేరు ఆమిర్ లేక ఉబైద్. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. సుదీర్ఘ ఆయుష్షు పొందిన వారిలో ఒకరు. ఖురైషులు కాబాను నిర్మించినపుడూ ఉన్నారు. ఇబ్నె జుబైర్ (రజి) కాబా గృహాన్ని నిర్మించిననాటికి కూడా ఈయన జీవించివున్నారు. ఈయన ఇబ్నె జుబైర్ (రజి) ఖిలాఫత్ తొలికాలంలో మరణించారు.

(١٩٣) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيَنْتَهِيَنَّ أَقْوَامٌ يَرْفَعُونَ أَبْصَارَهُمْ إِلَى السَّمَاءِ فِي الصَّلَاةِ، أَوْلَا تَرْجِعُ إِلَيْهِمْ». رَوَاهُ مُسْلِمٌ.

193. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ముస్లిం జాతి నమాజు చేస్తున్నప్పుడు తమ చూపులను ఆకాశం వైపునకు మరల్చే చేష్టకు దూరంగా ఉండాలి. లేకుంటే వారి చూపు తిరిగి రాని పరిస్థితి ఏర్పడ వచ్చు (అంటే అంధులుగా మారిపో వచ్చు). (ముస్లిం)

وَلَهُ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «لاَ صَلاَةَ بِحَضْرَةِ الطَّعَامِ، وَلاَ وَهُوَ يُدَافِعُهُ الأَخْبَثَانِ».

'ముస్లిం'లోనే హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ఇలా వుంది: "భోజనం తయారై వుండగా, (మల మూత్ర విసర్జన) అవసరం ఏర్పడి వుండగా చేసే నమాజ్ నెరవేరదు" అని దైవప్రవక్త (సఅసం) చెప్పగా నేను విన్నాను.

### సారాంశం

నమాజ్ మధ్యలో ఆకాశం వైపు చూడటం హరామ్ (నిషిద్ధం). ఇలా చూచేవాని నమాజ్ స్వీకరించబడదని ఇబ్నె హజమ్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ నవవీ (రహ్మ.లై) ముస్లిం వ్యాఖ్యానంలో - ఆకాశం వైపునకు చూచేవానికి ఇందులో తీవ్రమయిన హెచ్చరిక ఉందని అన్నారు. ఈ విషయంపై ఆయన పండితుల, విద్వాంసుల ఏకాభిప్రాయాన్ని కూడా నకలు చేశారు.

నమాజ్ ప్రారంభించకముందే కాలకృత్యాలు తీర్చుకోవటం మంచిది. మలమూత్రాలను విసర్జించవలసిన అవసరం ఏర్పడి ఉండగా, వాటిని బలవంతంగా ఆపే ప్రయత్నం చేస్తూ నమాజ్‌కై ఉపక్రమించటం మంచిదికాదు. దీనివల్ల నమాజ్‌లో ఏకాగ్రత దెబ్బతింటుంది. నమాజ్ నుంచి ఎప్పుడు బయటపడాలా? అన్న ఆలోచన అతన్ని తొలచివేస్తూ ఉంటుంది.

(١٩٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. أَنَّ النَّبِيَّ ﷺ: قَالَ: «التَّثَاؤُبُ مِنَ الشَّيْطَانِ فَإِذَا تَثَاءَبَ أَحَدُكُمْ فَلْيَكْظِمْ مَا اسْتَطَاعَ». رَوَاهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَزَادَ: «فِي الصَّلاَةِ».

194. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) వక్కాణించారు: "ఆవులింత రావటం షైతాన్ చేష్ట. మీలో ఎవరికయినా ఆవులింత వస్తే వీలయినంతవరకు దాన్ని ఆపడానికి ప్రయత్నించండి." (ముస్లిం, తిర్మిజీ - తిర్మిజీ తన ఉల్లేఖనంలో "నమాజులో" అన్న పదం పెంచారు).

### సారాంశం

ఆవులింత సోమరితనానికి, బద్ధకానికి, నిద్రమత్తుకు, మితిమీరిన తిండికి ప్రబల నిదర్శనం. దైవదాసుణ్ణి అలాంటి స్థితిలో చూచి షైతాన్ మహా సంబరపడిపోతాడు.

**6వ అధ్యాయం**

## మస్జిద్ వ్యవస్థ

## ٦ - بَابُ الْمَسَاجِدِ

(١٩٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَمَرَ رَسُولُ اللهِ ﷺ بِبِنَاءِ الْمَسَاجِدِ فِي الدُّوْرِ. وَأَنْ تُنَظَّفَ وَتُطَيَّبَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَ إِرْسَالَهُ.

195. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు: ఇండ్లల్లో (మరియు పేటల్లో) నమాజ్ చేసే స్థలాలను నిర్ధారించుకోవాలనీ, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశించారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'ముర్సల్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

మస్జిదును, నమాజ్ చేసే స్థలాలను పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచుకోవాలి. సాధ్యమైనంతవరకు ఆ స్థలాలలో సువాసనను, పరిమళాన్ని వెదజల్లాలి. హదీసులో 'దువర్' అనే పదం వచ్చింది. దీని అర్థం వీధి అనీ, పేట అనీ వస్తుంది. అంటే మనం నివసించే పట్టణంలో పెద్ద మస్జిదుతో పాటు చిన్న చిన్న మస్జిదులను కూడా పేటల్లో, బస్తీలలో నిర్మించుకోవాలి. వాటిని చాలా పరిశుభ్రంగా ఉంచాలి. సుగంధద్రవ్యాల గుభాళింపుతో వాటిని అత్యంత పరిశుద్ధంగా ఉంచాలి. మన ఇండ్లల్లో కూడా ఏదో ఒక గదిని లేక మూల ప్రదేశాన్ని నమాజ్ కొరకు కేటాయించి దానిని ఎంతో నీటుగా ఉంచాలి. ఈ స్థలంలో ఇంటి ఆడవాళ్లు నమాజ్ చేయటంతో పాటు మగవారు కూడా సున్నత్, నఫిల్ నమాజులను ఆచరించవచ్చు.

(١٩٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**قَاتَلَ اللَّهُ الْيَهُودَ، اتَّخَذُوا قُبُورَ أَنْبِيَائِهِمْ مَسَاجِدَ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ: «**وَالنَّصَارَى**».

196. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: దేవుడు యూదులను సర్వనాశనం చేయుగాక! వాళ్లు దైవప్రవక్తల సమాధులను సాష్టాంగ (సజ్దా) స్థలంగా చేసుకున్నారు. (బుఖారీ, ముస్లిం - ముస్లింలో 'క్రైస్తవులు' అన్న పదం కూడా చేర్చబడింది)

وَلَهُمَا مِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا: **كَانُوا إِذَا مَاتَ فِيْهِمُ الرَّجُلُ الصَّالِحُ بَنَوْا عَلَى قَبْرِهِ مَسْجِداً. وَفِيْهِ: أُوْلٰئِكَ شِرَارُ الْخَلْقِ.**

బుఖారీ, ముస్లింలలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చే ఇలా ఉల్లేఖించబడింది: "వారిలో పుణ్యపురుషుడు ఎవరయినా మరణిస్తే వాళ్లు ఆయన సమాధిని 'సజ్దా'గా చేసుకునేవారు." ఈ హదీసులో "వాళ్లు అత్యంత నీచమయిన జీవులు" అన్న వాక్యం కూడా ఉంది.

**సారాంశం**

దివ్య ఖుర్ఆన్ ప్రకారం వీళ్లు (యూదులు, క్రైస్తవులు) గ్రంథవహులు. వారికి ఆకాశ గ్రంథాలు ప్రసాదించబడ్డాయి. కాని విచారకరమయిన విషయం ఏమిటంటే వారు గ్రంథజ్ఞానం ఉండికూడా ప్రవక్తల సమాధులను పూజా స్థలాలుగా చేసుకున్నారు. ఆ సమాధుల వద్ద తమ కోరికలు వెలిబుచ్చుతూ మొక్కుకునేవారు. నిషిద్ధమయిన, అధర్మమయిన ఈ చేష్టను యూదులు మొదలెట్టగా, క్రైస్తవులు కూడా వారి పంథాలోనే నడవసాగారు. ఈ విధంగా వీళ్లు సృష్టికర్త దృష్టిలో అత్యంత తీవ్రమయిన, క్షమార్హం కాని షిర్క్ (బహుదైవోపాసన) కు ఒడిగట్టారు. కాగా; దర్గాల వద్దకు పోయి, సమాధులను ఆరాధనా స్థలాలుగా మారుస్తున్న నేటి సోకాల్డ్ ముస్లిములు, తాము ఎవరిని అనుసరిస్తున్నారో, తమ ఈ చేష్ట సృష్టికర్త ఆగ్రహాన్ని ఏ విధంగా కొనితెస్తుందో కాస్త ఆలోచించాలి. ముస్లింల ఈ చేష్ట కూడా విగ్రహారాధనా పరిధిలోకి వస్తుందనటంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఈ పనిని అన్యులు చేస్తే అది శాపగ్రస్తమూను, ముస్లిములు చేస్తే పుణ్యప్రదమూనా?! ఇదెక్కడి ధర్మం? ఇది ఆత్మ వంచన తప్ప మరేమీ కాదు. అల్లాహ్ ముస్లిములకు ఇలాంటి వికృత చేష్టలకు దూరంగా మెలిగే సద్బుద్ధి నొసగుగాక!

(١٩٧) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: بَعَثَ النَّبِيُّ ﷺ خَيْلاً، فَجَاءَتْ بِرَجُلٍ، فَرَبَطُوْهُ بِسَارِيَةٍ مِنْ سَوَارِي الْمَسْجِدِ»، الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

197. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకసారి ఓ చిన్న సైనిక (గస్తీ) దళాన్ని ఏదో ప్రాంతం వైపునకు పంపించారు. ఆ సైనికులు ఒక (ముష్రిక్) వ్యక్తిని నిర్బంధించి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి తీసుకువచ్చారు. ఆ వ్యక్తిని మస్జిదె నబవీ స్థంభాలలోని ఒక స్థంభానికి కట్టివేశారు (ఖైదీగా బంధించారు).

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అవసరమైనప్పుడు ముష్రిక్కును మస్జిద్‌లోకి రప్పించటం, మస్జిదును కారాగారంగా ఉపయోగించటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఇందులో అనేక పరమార్థాలు

దాగి వున్నాయి. నిర్బంధితుడైన అవిశ్వాసి ముస్లింల ఆరాధనా రీతులను దగ్గరినుంచి గమనిస్తాడు. వాళ్లు ఏవిధంగా బారులు తీరి, హెచ్చుతగ్గులు లేకుండా నిలబడుతున్నారో, ఏవిధంగా ఒకే సమయంలో దైవ సన్నిధిలో మోకరిల్లి ప్రార్థిస్తున్నారో, ఏవిధంగా దివ్య గ్రంథపారాయణం చేస్తున్నారో శ్రద్ధగా తిలకిస్తాడు. ప్రభావితుడవుతాడు. హదీసులో నిర్బంధితునిగా తీసుకురాబడిన వ్యక్తి యమామ ప్రాంతపు నాయకుడు సమామ బిన్ ఉసాల్. ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో వెళుతూ పట్టుబడ్డాడు. మస్జిదె నబవీ (ప్రవక్త మస్జిద్)లో ఆ వ్యక్తిని దైవప్రవక్త (స) మూడు రోజులపాటు బంధించి ఉంచారు. ఎట్టకేలకు అతడు ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదించాడు.

(١٩٨) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ عُمَرَ مَرَّ بِحَسَّانَ يُنْشِدُ فِي الْمَسْجِدِ، فَلَحَظَ إِلَيْهِ، فَقَالَ: قَدْ كُنْتُ أُنْشِدُ فيه، وَفِيْهِ مَنْ هُوَ خَيْرٌ مِّنْكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

198. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) గారు హజ్రత్ హస్సాన్ (రజి) కూర్చున్న వైపు నుండి వెళుతున్నారు. ఆయన మస్జిద్‌లో కూర్చుని కవితలు చెబుతున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయన వంక తీక్షణంగా చూచారు. '(ఎందుకలా కొరకొరా చూస్తారు?) మస్జిద్‌లో మీకన్నా శ్రేష్ఠులు (దైవప్రవక్త - సఅసం) ఉన్నప్పుడు కూడా నేను ఇలాగే కవిత్వం చెప్పేవాడిని' అని ఆయన (రజి) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసును బట్టి మస్జిదులో కవితలు చెప్పటం సమ్మతమేగాని ఆ కవిత్వం తౌహీద్ (ఏక దైవారాధన) కు వ్యతిరేకంగా ఉండకూడదు. ఇంకా అందులో బహుదైవోపాసనా భావాలుగానీ, మిథ్యావాదాలుగానీ, ద్వంద్వార్థాలు వచ్చే మాటలుగానీ, నమాజీల ఏకాగ్రతను పాడుచేసే పరాచికాలు గానీ ఉండరాదు. హజ్రత్ హస్సాన్ (రజి) మస్జిద్‌లో కూర్చుని అవిశ్వాసుల ఆత్మ విశ్వాసాన్ని నీరుగార్చే కవితలు అల్లేవారు. దైవప్రవక్త (స) ఈ కవితల్ని విని "పరిశుద్ధాత్మ నీకు తోడ్పడుగాక! నీ కవితలు అవిశ్వాసులకు బాణాల్లా గుచ్చుకుంటున్నాయి" అని దీవించేవారు.

## హదీసు ఉల్లేఖకులు

హస్సాన్ బిన్ సాబిత్ (రజి) అన్సార్ సహాబీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. 'ప్రవక్త (స) కవి'గా బిరుదు పొందారు. ఆనాటి పట్టణ కవులలో హస్సాన్ బిన్ సాబిత్ (రజి) గారే అందరికన్నా గొప్పవారు. హిజ్రీ 54లో హజ్రత్ ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో మరణించారు. హిజ్రీ 55లో మరణించారని మరికొందరు వాదిస్తున్నారు. మరణ సమయంలో ఆయన వయస్సు 120 సంవత్సరాలన్నది గమనార్హం.

(١٩٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ سَمِعَ رَجُلاً يَنْشُدُ ضَالَّةً فِي الْمَسْجِدِ فَلْيَقُلْ: لاَ رَدَّهَا اللَّهُ عَلَيْكَ، فَإِنَّ المَسَاجِدَ لَمْ تُبْنَ لِهَذَا**». رَوَاهُ مُسْلِمٌ.

199. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఏ మనిషయినా తాను పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో వెతుకుతున్నాడని ఎవరైనా వింటే, 'దైవచిత్తమయితే ఆ వస్తువు దొరకకుండుగాక!' అని అనండి. మస్జిదులు నిర్మించబడింది ఈ ఉద్దేశ్యం కొరకు కాదు కదా!" (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో అందరికీ ఒక హెచ్చరిక ఉంది. ఎక్కడో పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో అన్వేషించటంలో అర్థం లేదు. ఇది మస్జిద్ మర్యాదకు విరుద్ధమయిన విషయం. ఈ మధ్య మస్జిదు వేదికలనుండి చేయబడే అనేకానేక ప్రకటనలు కూడా సమంజసమైనవి కావు. అయ్యవారి ఆవులు పోయినా, కామందులవారి కోడిపుంజు కనబడకుండాపోయినా ప్రకటనలు చేయడానికి మస్జిద్ మెంబరే దొరికిందా? ఈ జంతువులు మస్జిద్‌లోకయితే రావుకదా? ఒకవేళ అంతగా అడిగి ఆరా తీయదలచుకుంటే మస్జిద్ గేటు బయట నిలబడి వచ్చేపోయేవారిని అడగవచ్చు.

(٢٠٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِذَا رَأَيْتُمْ مَنْ يَبِيعُ أَوْ يَبْتَاعُ فِي المَسْجِدِ فَقُولُوا: لاَ أَرْبَحَ اللَّهُ تِجَارَتَكَ**». رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

200. హజ్రత్ అబూ హురైర (రజి) కథనానుసారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "మీలో ఎవరినయినా మస్జిద్‌లో క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు మీరు చూస్తే, 'దేవుడు నీ వర్తకంలో, లావాదేవీలలో లాభం చేకూర్చకుండుగాక!' అని అనండి." (ఈ హదీసును తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

మస్జిదులలో వ్యాపార లావాదేవీలు, కొనుగోలు - అమ్మకాలు జరపరాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అంటే మస్జిదులను వాణిజ్య కేంద్రాలుగా, వ్యాపార మండీలుగా మార్చుకోరాదు. మస్జిదులను నిర్మించేది దైవారాధన, దైవనామస్మరణ కోసమే గాని వర్తకం కోసం కాదు. మస్జిద్‌లయొక్క ఈ మర్యాదను మనం ఖాతరు చేయకపోతే అవి తమ ఉద్దేశ్యాన్ని, అసలు లక్ష్యాన్ని కోల్పోతాయి.

(٢٠١) وَعَنْ حَكِيمِ بْنِ حِزَامٍ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تُقَامُ الحُدُودُ فِي المَسَاجِدِ، وَلاَ يُسْتَقَادُ فِيهَا**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ بِسَنَدٍ ضَعِيفٍ.

201. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "మస్జిదులలో శిక్షలు విధించటంగానీ, వాటిలో ఖిసాస్ (రక్త పరిహారం) తీసుకోవటంగానీ చేయరాదు." (ఈ హదీసును అబూదావూద్, అహ్మద్ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

మస్జిదులు దైవారాధన కోసం నిర్మించబడ్డాయి. అవి పవిత్ర స్థలాలు. అందుచేత వాటిలో హద్దులు (శిక్షలు) విధించటం, రక్తం ప్రవహింపజేయటం వంటివి చేయరాదు. శిక్షల్ని అమలుపరచే స్థానాలను ప్రత్యేకంగా నిర్ధారించుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

హకీమ్ బిన్ హిజామ్ (రజి) మరో పేరు అబూ ఖాలిద్. ఖురైష్ వర్గంలోని అసద్ తెగకు చెందినవారు. హజ్రత్ ఖదీజా (ర.అన్హా) కు అన్న కుమారులవుతారు. ఖురైషు కులీనులలో ఒకరుగా గుర్తింపుపొందారు. ఏనుగుల వాళ్ల సంఘటన జరగక 13 సంవత్సరాల క్రితం మక్కాలో జన్మించారు. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 54 తరువాత మదీనాలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 120 సంవత్సరాలు. అంటే 60 యేండ్లు అజ్ఞాన కాలంలోనూ, మరో 60 యేండ్లు ఇస్లాంలోనూ గడిచాయి. ఆయనకు నలుగురు కుమారులు. నలుగురూ సహాబీలుగా పరిగణించబడ్డారు. మర్యాదస్తులు.

(٢٠٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُصِيبَ سَعْدٌ يَوْمَ الْخَنْدَقِ، فَضَرَبَ عَلَيْهِ رَسُولُ اللهِ ﷺ خَيْمَةً فِي الْمَسْجِدِ، لِيَعُودَهُ مِنْ قَرِيبٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

202. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: కందక యుద్ధ సందర్భంగా హజ్రత్ సాద్ (రజి) గాయపడగా దైవ ప్రవక్త (సఅసం) ఆయనకు దగ్గరవుండి వైద్యసేవలు చేసే నిమిత్తం మస్జిద్‌లో పందిరి వేయించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దీన్నిబట్టి అత్యవసర సమయాల్లో రోగులను, క్షతగాత్రులను పరామర్శించే, వైద్యసదుపాయాలు కల్పించే ఉద్దేశ్యంతో మస్జిదులో ప్రత్యేక క్యాంపులు (శిబిరాలు) స్థాపించవచ్చని ఈ హదీసు ద్వారా అర్థమవుతోంది. అలాగే మస్జిదులో నిద్రించటం, రోగిని పరామర్శించటం, క్షతగాత్రులకు సేవలు చేయటం, వైద్యసదుపాయాలను సమకూర్చటం కూడా ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఇక్కడ సాద్ (రజి) అంటే సాద్ బిన్ ముఆజ్ అన్నమాట! ఈయన 'ఔస్' తెగ నాయకుడు. పెద్ద సహాబీలలో ఒకరుగా పరిగణించబడతారు. రెండు ఉహుబా ప్రమాణాలలో కూడా హాజరయ్యారు. ఈయన ఇస్లాం స్వీకరించిన కారణంగా బనూ అబ్దె అష్‌హల్ తెగ కూడా ఇస్లాం స్వీకరించింది. ఈయన తన తెగకు సర్దారుగా, మర్యాదస్తుడైన వ్యక్తిగా పేరు సంపాయించారు. ఈయన తెగవారు ఈయన మాటను జవదాటేవారు కాదు. కందక యుద్ధంలో బాణం గుచ్చుకుని శరీరం నుండి రక్తం తీవ్రంగా ప్రవించింది. ఈ బాధతోనే ఆయన (రజి) బనూ ఖురైజ సంఘటన అనంతరం - హిజ్రీ 5 జీఖఅదలో - మరణించారు.

(٢٠٣) وَعَنْهَا قَالَتْ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَسْتُرُنِيْ، وَأَنَا أَنْظُرُ إِلَى الْحَبَشَةِ يَلْعَبُونَ فِي الْمَسْجِدِ، الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

203. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను చూచాను, ఆయన (స) నా కొరకు పరదా కట్టారు. నేను, మస్జిదులో క్రీడా విన్యాసాలు చేస్తున్న అబిసీనియన్లను (నీగ్రోలను)చూస్తూ నిలబడ్డాను. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

పండుగలు, పర్వదినాలలో, ఆనంద సమయాలలో మస్జిదు ప్రాంగణంలో కర్రసాము చేయటం, యుద్ధ విన్యాసాలు ప్రదర్శించటం సమ్మతమేనని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతున్నది. అలాగే అపరిచిత పురుషుల సామూహిక ప్రదర్శనలు కూడా స్త్రీలు తెరచాటున ఉండి చూడవచ్చు.

(٢٠٤) وَعَنْهَا أَنَّ وَلِيْدَةً سَوْدَاءَ كَانَ لَهَا خِبَاءٌ فِي الْمَسْجِدِ، فَكَانَتْ تَأْتِيْنِي، فَتَحَدَّثُ عِنْدِي. الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

204. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం: "ఒక నల్లని ఆడపిల్ల కోసం మస్జిద్‌లో శిబిరం వేయబడింది. ఆ పిల్ల నాతో మాట్లాడటానికి వస్తూ ఉండేది." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

స్త్రీ కూడా రాత్రిపూట మస్జిదులో ఉండగలదని ఈ హదీసువల్ల స్పష్టమవుతున్నది. అయితే ఉపద్రవానికి, గొడవలకు ఏమాత్రం అవకాశం లేని శుభప్రదమయిన వాతావరణంలోనే ఇలాంటి దృష్టాంతాలు నెలకొల్పటం సాధ్యమవుతుంది.

ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే. పూర్తి హదీసు బుఖారీలో వుంది.

(٢٠٥) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ

205. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**البُصَاقُ فِي الْمَسْجِدِ خَطِيئَةٌ، وَكَفَّارَتُهَا دَفْنُهَا**». مُتَّفَقٌ عَلَيْهِ.

(రజి) తెలిపారు - "మస్జిద్‌లో ఉమ్మి వేయటం పాపం. దీని పరిహారం ఉమ్మిని పూడ్చిపెట్టడమే. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మస్జిద్ దైవారాధన నిమిత్తం నిర్మించబడింది. దైవారాధన జరిగే చోటు పవిత్రంగా ఉండాలి. అశుద్ధతకు, మాలిన్యానికి అక్కడ ఎలాంటి ఆస్కారముండకూడదు. మస్జిద్‌లో ఉమ్మివేయటం మస్జిద్ మర్యాదకు విరుద్ధాంశం. అందులో ఏది జరిగినా సభ్యతా సంస్కారాలకు ప్రతిబింబంగా ఉండాలి. అసభ్యంగా, అమర్యాదకరంగా ప్రవర్తించి పవిత్రమయిన వాతావరణాన్ని పాడు చేయకూడదు. అందుకే మస్జిద్‌లో ఉమ్మటం మహాపాపంగా పరిగణించబడింది. ఎవరయినా తెలియక అలా చేస్తే దానికి పరిహారం (కప్పారా) పూడ్చిపెట్టడమే. (ఒకవేళ నాపరాయిపై లేక గచ్చుపై ఉమ్మివేస్తే దాన్ని శుభ్రంగా కడిగివేయాలి)

(٢٠٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَقُومُ السَّاعَةُ حَتَّى يَتَبَاهَى النَّاسُ فِي الْمَسَاجِدِ**». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

206. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు: "ప్రజలు మస్జిదుల (నిర్మాణం)పై గర్వాన్ని చాట నంతవరకూ ప్రళయం సంభవించదు." (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప అందరూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ప్రళయదినం సమీపించేముందు ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ప్రజలు అందమైన మస్జిదులను నిర్మిస్తారు. వాటిని అపురూపంగా తీర్చిదిద్దుతారు. మా మస్జిద్ ఫలానా వారు కట్టిన మస్జిద్‌కన్నా అందంగా ఉందని బడాయి చాటుకుంటారు. కాని శోచనీయమయిన విషయం ఏమిటంటే ఆ మస్జిదులు నమాజీలతో కళకళలాడే బదులు వెల వెల బోతుంటాయి. జనులు మస్జిదులనయితే పోటీపడి నిర్మిస్తారుగానీ నమాజ్ కోసం రారు. తమపట్ల నిర్మాతలు కనబరుస్తున్న నిర్లక్ష్యవైఖరిపై మస్జిదులు విలపిస్తూ ఉంటాయి.

(٢٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا

207. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "మస్జిదుల అలంకరణ, ముస్తాబు గురించి నాకు ఆజ్ఞాపించబడలేదు" (అబూదావూద్

أُمِرْتُ بِتَشْيِيدِ الْمَسَاجِدِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు).

### సారాంశం

ఆర్భాటంగా మస్జిదులపై నగిషీలు వేయటం, అట్టహాసంగా విద్యుద్దీపాలతో ముస్తాబు చేయటం సమంజసంకాదని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. మస్జిదులను దైవ నామస్మరణ ద్వారా, నమాజ్ ద్వారా కళకళలాడేలా చేయమని ఆజ్ఞాపించబడింది. దేవుని దృష్టిలో అసలు కళ 'ఆరాధనే'. ఈ కళను పట్టించుకోకుండా కృత్రిమమయిన కళాకాంతులపై శ్రద్ధచూపటంలో అర్థం లేదు. మస్జిదులలో మోతాదుకు మించిన అలంకరణ వల్ల నమాజ్‌లో ఏకాగ్రతకు భంగం వాటిల్లే అవకాశం ఉంది. పైగా అట్టహాసంతో కూడిన నగిషీలు, అలంకరణలు రాజుల, చక్రవర్తుల సున్నత్ (సంప్రదాయం) మాత్రమే గానీ ప్రవక్త సంప్రదాయం కాదు. వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ మస్జిదె నబవీలో తొలిసారిగా నగిషీలు వేయించాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలంలోగానీ, ధర్మ ఖలీఫాల పరిపాలనా కాలంలోగానీ ఇలాంటి వినూత్న పోకడలు మస్జిద్‌లలో ఎక్కడా కానరావు. సత్య ప్రేమికులయిన ఉలమా సయితం ఇలాంటి విషయాలపై నోరు విప్పని పరిస్థితి దాపురించింది.

(٢٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عُرِضَتْ عَلَيَّ أُجُورُ أُمَّتِي، حَتَّى الْقَذَاةُ يُخْرِجُهَا الرَّجُلُ مِنَ الْمَسْجِدِ». رَوَاهُ أَبُو دَاوُدَ والتِّرْمِذِيُّ، وَاسْتَغْرَبَهُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

208. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: "నా అనుచర సమాజం ఆచరణలు నా ముందు సమర్పించ బడ్డాయి. (పుణ్యప్రదమయిన) ఈ ఆచరణలలో మనిషి మస్జిద్ నుండి తీసి బయటపారవేసే ఓ చిన్న చెత్తముక్కను కూడా నేను చూశాను." (ఈ హదీసును అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'గరీబ్ (అరుదైనది)గా ఖరారు చేశారు, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

### సారాంశం

అతి చిన్న సత్కార్యం కూడా లెక్కలోనికి వస్తుందనీ, చిత్తశుద్ధి ఉంటే ఆ చిన్న సదాచరణే ఒక్కోసారి పెద్ద పుణ్యఫలాన్ని ఆర్జించిపెడుతుందనీ ఈ హదీసు భావం. మస్జిదుల పరిశుభ్రత, పరిశుద్ధతల గురించి ఇస్లాం తన అనుయాయులకు గట్టిగా తాకీదు చేస్తోంది. ఒక చిన్న గడ్డిపరక,

రద్దీముక్క కూడా మస్జిదులో ఉండకుండా మనం జాగ్రత్తపడాలి. ఎవరయినా ఈ తేలికపాటి పనిని కూడా సంకల్పశుద్ధితో చేస్తే దాని సత్ఫలం అతనికి తప్పక లభిస్తుంది.

(٢٠٩) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا دَخَلَ أَحَدُكُمْ المَسْجِدَ فَلاَ يَجْلِسْ حَتَّى يُصَلِّيَ رَكْعَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

209. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరు ఎప్పుడు మస్జిద్‌లో ప్రవేశించినా కూర్చునే ముందు రెండు రకతుల (నఫిల్) నమాజు చేయాలి."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో ప్రస్తావించబడిన నఫిల్ నమాజును 'తహియతుల్ మస్జిద్' అనంటారు. షాఫయీల దృష్టిలో ఇది తప్పనిసరి. కాగా; అత్యధికమంది ధర్మవేత్తలు దీనిని అభిలషణీయం (ముస్తహబ్) గా భావించారు. హదీసులోని తాకీదును దృష్టిలో పెట్టుకుని కొంతమంది పండితులు నఫిల్ నమాజులను మక్రూహ్ వేళల్లో కూడా చేసేందుకు అనుమతించారు. ఈ హదీసు దృష్ట్యా మనకు బోధపడే మరో విషయమేమిటంటే; మస్జిద్ వేదికపైనుండి ఖతీబ్ ప్రసంగిస్తున్నప్పటికీ మస్జిద్‌లోకి ప్రవేశించిన వ్యక్తి రెండు రకతుల నమాజ్ చేసి మరీ కూర్చోవాలి.

**7వ అధ్యాయం**

## ٧ - بَابُ صِفَةِ الصَّلاَةِ

## నమాజ్ చేసే విధానం

(٢١٠) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: **إِذَا قُمْتَ إِلَى الصَّلاَةِ فَأَسْبِغِ الْوُضُوءَ، ثُمَّ اسْتَقْبِلِ الْقِبْلَةَ فَكَبِّرْ، ثُمَّ اقْرَأْ مَا تَيَسَّرَ مَعَكَ مِنَ الْقُرْآنِ، ثُمَّ ارْكَعْ حَتَّى تَطْمَئِنَّ رَاكِعاً، ثُمَّ ارْفَعْ حَتَّى تَعْتَدِلَ قَائِماً، ثُمَّ اسْجُدْ حَتَّى تَطْمَئِنَّ سَاجِداً، ثُمَّ ارْفَعْ حَتَّى تَطْمَئِنَّ جَالِساً، ثُمَّ اسْجُدْ حَتَّى**

210. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "మీరు నమాజ్ చేయ సంకల్పించినపుడు ముందు సరిగ్గా వుజూ చేసుకుని ఖిబ్లా వైపునకు తిరిగి తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకండి. తరువాత దివ్య ఖుర్‌ఆన్‌లో ఎంత భాగం మీకు జ్ఞాపకమున్నా అందులో నుంచి సులువుగా చదవగలిగినంత చదవండి. తరువాత 'రుకూ' చేయండి. రుకూ సాధ్యమైనంత వరకు తాపీగా చేయండి. తరువాత

تَطْمَئِنَّ سَاجِداً، ثُمَّ افْعَلْ ذَلِكَ فِي صَلاَتِكَ كُلِّهَا». أَخْرَجَهُ السَّبْعَةُ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

నిటారుగా నిలబడండి. ప్రశాంతంగా నిలబడండి (హడావిడి వద్దు). ఆ తరువాత 'సజ్దా' చేయండి. సజ్దా చాలా నింపాదిగా చేయండి. సజ్దాలోనుంచి తల పైకెత్తి హాయిగా కూర్చోండి. ఆ తరువాత రెండవ సజ్దా చేయండి. ఈ సజ్దా కూడా నింపాదిగా చేయండి. అంతే. ఆ తరువాత మిగిలిన నమాజు నంతా ఈ విధంగానే (ప్రశాంతంగా - ఓపికతో - చేయండి). (దీనిని బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ, ఇమామ్ అహ్మద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం ఇమామ్ బుఖారీ గారివి)

وَلاِبْنِ مَاجَهْ بِإِسْنَادِ مُسْلِمٍ: «حَتَّى تَطْمَئِنَّ قَائِماً» وَمِثْلُهُ فِي حَدِيْثِ رِفَاعَةَ بْنِ رَافِعٍ بْنِ مَالِكٍ عِنْدَ أَحْمَدَ وَابْنِ حِبَّانَ. وَفِي لَفْظٍ لِأَحْمَدَ: فَأَقِمْ صُلْبَكَ حَتَّى تَرْجِعَ العِظَامُ.

ఇబ్నె మాజ ముస్లిం ఆధారంగా - 'రుకూ' నుండి నిలబడే సమయంపై ఈ పదాలు నకలు చేశారు: "పూర్తిగా స్థిరంగా నిలబడండి" అహ్మద్ మరియు ఇబ్నె హిబ్బాన్‌లో రిఫా బిన్ రాఫె బిన్ మాలిక్ ఉల్లేఖనంలో కూడా ఇలాగే వుంది. ముస్నద్ అహ్మద్‌లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: "మీ నడుమును నిటారుగా - ఎముకలు తమ స్థానాలలోకి వచ్చేలా - నిలబెట్టండి" అని వుంది.

وَلِلنَّسَائِيِّ وَأَبِيْ دَاوُدَ مِنْ حَدِيْثِ رِفَاعَةَ ابْنِ رَافِعٍ: إِنَّهَا لَنْ تَتِمَّ صَلاَةُ أَحَدِكُمْ حَتَّى يُسْبِغَ الْوُضُوءَ كَمَا أَمَرَهُ اللَّهُ تَعَالَى، ثُمَّ يُكَبِّرَ اللَّهَ تَعَالَى، وَيَحْمَدَهُ، وَيُثْنِيَ عَلَيْهِ. وفيها: فَإِنْ

నసాయి మరియు అబూదావూద్‌లో రిఫా బిన్ రాఫె ద్వారా ఇలా ఉల్లేఖించ బడింది: "అల్లాహ్ ఆదేశించిన విధంగా వుజూ సంపూర్ణంగా చేయనంతవరకూ నమాజ్ సంపూర్ణం కాజాలదు. తరువాత తక్బీర్ పలకాలి, దైవస్తోత్రం చేయాలి,

كَانَ مَعَكَ قُرْآنٌ فَاقْرَأْ، وَإِلاَّ فَاحْمَدِ اللَّهَ، وَكَبِّرْهُ، وَهَلِّلْهُ. وَلأَبِي دَاوُدَ «ثُمَّ اقْرَأْ بِأُمِّ الْقُرْآنِ، وَبِمَا شَاءَ اللَّهُ» وَلابْنِ حِبَّانَ: «ثُمَّ بِمَا شِئْتَ».

ఆయన్ని కొనియాడాలి." ఈ ఉల్లేఖనం లో ఇంకా ఇలా వుంది: "నీకు ఖుర్ఆన్ లోని ఎంత భాగం జ్ఞాపకముంటే అంత పఠించు. లేకుంటే దైవస్తోత్రం చెయ్యి మరియు అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలుకు." అబూ దావూద్‌లో "ఫాతిహా సూరా పఠించు. ఇంకా అల్లాహ్ తలచినంతగా (పఠించు)" అని వుంది. ఇబ్నె హిబ్బాన్ లో "మరి మీరు కోరినంతగా చదవండి" అని వుంది.

### సారాంశం

ఎంతో ప్రశాంతంగా, ఆగి ఆగి ఒక్కో 'రుకున్'ను చక్కగా, పరిపూర్ణంగా నెరవేరుస్తూ మరీ నమాజ్ చేయాలని హదీసులో తాకీదు చేయబడింది. నమాజ్‌లో ఏ అంశం తరువాత ఏ అంశం వస్తుందో - క్రమపద్ధతిలో తెలుపబడింది. నమాజ్ చేసేవారు - వారు ఇమాములయినా, ఇమాములను అనుసరించే ముఖ్తదీలయినా, లేక ఒంటరిగా నమాజ్ చేసే వారయినా - తాము నమాజ్‌లో ఏం పలుకుతున్నారో, ఏం చేయబోతున్నారో బాగా ఆలోచించి, అర్థం చేసుకుని చేస్తే అందలి మధురిమను తనివితీరా ఆస్వాదించవచ్చు. అలా కాకుండా ఏదో మొక్కుబడిగా చేస్తే మనిషి జీవితంపై దాని ప్రభావం కనిపించదు. హడావిడిగా చేసే నమాజ్ అసలు నమాజే కాదు. ఇటువంటి వారిని దైవప్రవక్త (స) నమాజ్ దొంగలుగా, కపట నమాజీలుగా పేర్కొన్నారు.

### హదీసు ఉల్లేఖకులు

రిఫా బిన్ రాఫె బిన్ మాలిక్ (రజి). ఈయన మారుపేరు అబూ ముఆజ్. జుర్ఖీ అన్సారీ మదనీగా పేరు మోశారు. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. ఈయన తన తండ్రితో కలసి 'ఉఖబా ప్రమాణా'నికి హాజరయ్యారు. ఈయన తండ్రిగారు అన్సార్లలో అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించారు. రిఫా బిన్ రాఫె బద్ర్ యుద్ధం మినహా మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. జమల్ మరియు సిఫ్ఫీన్ యుద్ధాలలో హజ్రత్ అలీ (రజి)కి మద్దతునిచ్చారు. అమీర్ ముఆవియ (రజి) పరిపాలనా కాలంలో - హిజ్రీ 41లో మరణించారు.

(٢١١) وَعَنْ أَبِي حُمَيْدٍ السَّاعِدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ

211. అబూ హుమైద్ సాయిదీ (రజి) ఉల్లేఖించారు: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను తక్బీర్ (తక్బీరె ఊలా) చేస్తుండగా చూశాను.

ﷺ إِذَا كَبَّرَ جَعَلَ يَدَيْهِ حَذْوَ مَنْكِبَيْهِ، وَإِذَا رَكَعَ أَمْكَنَ يَدَيْهِ مِنْ رُكْبَتَيْهِ ثُمَّ هَصَرَ ظَهْرَهُ، فَإِذَا رَفَعَ رَأْسَهُ اسْتَوَى، حَتَّى يَعُودَ كُلُّ فَقَارٍ مَكَانَهُ، فَإِذَا سَجَدَ وَضَعَ يَدَيْهِ غَيْرَ مُفْتَرِشٍ وَلاَ قَابِضِهِمَا، وَاسْتَقْبَلَ بِأَطْرَافِ أَصَابِعِ رِجْلَيْهِ الْقِبْلَةَ، وَإِذَا جَلَسَ فِي الرَّكْعَتَيْنِ جَلَسَ عَلَى رِجْلِهِ الْيُسْرَى، وَنَصَبَ الْيُمْنَى، وَإِذَا جَلَسَ فِي الرَّكْعَةِ الأَخِيرَةِ قَدَّمَ رِجْلَهُ الْيُسْرَى، وَنَصَبَ الأُخْرَى، وَقَعَدَ عَلَى مَقْعَدَتِهِ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

అప్పుడాయన రెండు చేతులనూ భుజాలకు సమానాంతరంగా లేపేవారు. రుకూ చేసినపుడు తన రెండు చేతులతో తన మోకాళ్లను గట్టిగా పట్టుకునేవారు. ఆ సమయంలో తన వీపును వంచేవారు. రుకూనుండి తలను ఎత్తినపుడు నిటారుగా - కీళ్లన్నీ యథాస్థానంలోకి వచ్చేలా-నిలబడేవారు. సజ్దా చేసినపుడు తన రెండు చేతులనూ నేలపై ఉంచేవారు. ఆ సమయంలో (చేతుల్ని) మరీ ముడుచుకోవటంగానీ, మరీ చాపటంగానీ చేసేవారు కాదు. సజ్దా స్థితిలో రెండు కాళ్ల వ్రేళ్లు ఖిబ్లా వైపునకు ఉండేవి. ఆయన రెండు రకతులు పూర్తి చేసి ఖాయిదాలో కూర్చున్నపుడు ఎడమ పాదాన్ని నేలపై పరచుకునేవారు. కుడిపాదాన్ని నిలిపి ఉంచేవారు. చివరి ఖాయిదాలో ఎడమ పాదాన్ని కాస్త ముందుకు జరిపి కుడి పాదాన్ని నిలిపి ఉంచేవారు. పిరుదుపై (బరువు మోపి) కూర్చునేవారు." (బుఖారీ)

## సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) గారి నమాజ్ చేసే విధానం విశదీకరించబడింది. ఆయన (స) అనుయాయులయిన ముస్లింలు కూడా సాధ్యమైనంతవరకూ ఈ విధానాన్నే అనుసరించాలి. 'నేను నమాజ్ చేస్తుండగా మీరు చూసిన విధంగానే మీరు కూడా నమాజ్ చేయండి' అని దైవప్రవక్త (స) ఉపదేశించారు. దైవప్రవక్త (స) వారి ఉపదేశాన్ని దృష్టిలో పెట్టుకుని నమాజీలు ఎంతో నింపాదిగా, ప్రశాంతంగా, ఒక్కో అంశాన్ని సజావుగా నెరవేరుస్తూ, ఖుర్ఆన్ వాక్యాలను బాగా ఆగి ఆగి పఠిస్తూ నమాజ్ చేయాలి. త్వరత్వరగా రుకూ, సజ్దాలు చేసి నమాజ్‌ను చెడగొట్టకూడదు. కొద్ది సమయంలో ఆదరాబాదరాగా నమాజ్ చేసేవానిని కోడి ముక్కుతో పోల్చటం జరిగింది. ఇంకా అటువంటి నమాజ్ 'కపట నమాజ్'గా ఖరారు చేయబడింది. అటువంటి నమాజులతో చేకూరే ప్రయోజనం ఏముంటుంది?

## హదీసు ఉల్లేఖకులు

అబూ హుమైద్ సాయిదీ (రజి) గారి నామాంతరం అమ్ర్. ముంజిర్ బిన్ సాద్ బిన్ ముంజిర్ అని కొందరంటారు. మాలిక్ అన్సారీ ఖజ్రజీ మదనీ అని మరికొందరు వాదిస్తారు. ఉహుద్ మరియు ఆ తరువాత జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రీ 61లో అమీర్ ముఆవియా (రజి) పరిపాలనా కాలం చరమదశలోనో, లేక యజీద్ పరిపాలనా కాలం తొలిదశలోనో మరణించారు.

(٢١٢) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ رَسُولِ اللهِ ﷺ، أَنَّهُ كَانَ إِذَا قَامَ إِلَى الصَّلاَةِ، قَالَ: «**وَجَّهْتُ وَجْهِيَ لِلَّذِي فَطَرَ السَّمَاوَاتِ وَالأَرْضَ** – إِلَى قَوْلِهِ – **مِنَ المُسْلِمِينَ. اللَّهُمَّ أَنْتَ المَلِكُ، لاَ إِلَهَ أَنْتَ، أَنْتَ رَبِّي وَأَنَا عَبْدُكَ، إلى آخره**». رَوَاهُ مُسْلِمٌ، وَفِي رِوَايَةٍ لَهُ إِنَّ ذَلِكَ فِي صَلاَةِ اللَّيْلِ.

212. హజ్రత్ అలీ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ కొరకు నిలబడినపుడు మొదట ఈ దుఆ పఠించేవారు - "నేను నా ముఖాన్ని ఏకాగ్రచిత్తంతో భూమ్యాకాశాలను సృష్టించిన వాని వైపునకు త్రిప్పుకొంటున్నాను. నేను బహుదైవారాధకులలోని వాణ్ణి కాను. నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం మరియు నా మరణం సర్వలోక ప్రభువైన అల్లాహ్‌కే అంకితం. ఆయన సహవర్తులెవరూ లేనివాడు. నాకు దీని గురించిన ఆజ్ఞే ఇవ్వబడింది. నేను ముస్లింలలోని వాణ్ణి. ఓ అల్లాహ్! నీవే యజమానివి (చక్రవర్తివి). నీవే ఆరాధ్యుడవు. నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నీవే నా ప్రభువువి. నేను నీ దాసుణ్ణి....." (ముస్లిం)

## సారాంశం

పై హదీసులోని దుఆ ఇంకావుంది. మిగిలిన భాగం యొక్క అనువాదం ఇది: "..... నేను నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను. నేను నా పాపాన్ని ఒప్పుకుంటున్నాను. కనుక (ఓ స్వామీ) నా పాపాలన్నింటినీ మన్నించు. (వాస్తవమేమిటంటే) నీవు తప్ప పాపాలను మన్నించగల వాడెవడూ లేడు. నన్ను ఉత్తమ నైతికత వైపునకు, సత్ప్రవర్తన వైపునకు నడిపించు. నీవు తప్ప మంచినడవడిక వైపునకు ఎవరూ మార్గదర్శకత్వం వహించలేరు. నా దుర్గుణాలను నా నుండి దూరం చెయ్యి. వాస్తవమేమిటంటే నీవు తప్ప మరెవరూ దుర్గుణాలను దూరం చెయ్యలేరు. మాటిమాటికీ నీ సమక్షంలో హాజరవుతున్నాను. నీ విధేయుణ్ణి. మేళ్లన్నీ నీ స్వాధీనంలో ఉన్నాయి. నీ తరపునుండి ఎన్నటికీ కీడు ఉండదు. నేను నీ వెంటవున్నాను. నీ వైపున ఉన్నాను. నీవు మాత్రమే శుభప్రదమయిన వాడవు మరియు ఘనత, ఆధిపత్యం కలవాడవు. పాపాల మన్నింపుకై నిన్నే వేడుకుంటున్నాను.

పశ్చాత్తాపభావంతో నీ వైపునకే మరలుతున్నాను." దీనిని ముస్లిం ఉల్లేఖించారు. ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఈ దుఆ రాత్రిపూట (తహజ్జుద్) నమాజ్‌లో చేసేవారని ఉంది. ఫర్జ్ నమాజ్‌లో దైవప్రవక్త (సఅసం) ఈ దుఆ చేసేవారన్న దానికీ అనేక ఆధారాలున్నాయి. (వివరాల్లోకి పోయే అవకాశం లేకపోవటం వల్ల ఈ చర్చను ఇక్కడితో ముగిస్తున్నాము).

(٢١٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا كَبَّرَ لِلصَّلاَةِ سَكَتَ هُنَيَّهَةً قَبْلَ أَنْ يَقْرَأَ، فَسَأَلْتُهُ، فَقَالَ: أَقُولُ: «**اللَّهُمَّ بَاعِدْ بَيْنِي وَبَيْنَ خَطَايَايَ، كَمَا بَاعَدْتَ بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ، اللَّهُمَّ نَقِّنِي مِنْ خَطَايَايَ، كَمَا يُنَقَّى الثَّوْبُ الأَبْيَضُ مِنَ الدَّنَسِ، اللَّهُمَّ اغْسِلْنِي مِنْ خَطَايَايَ بِالْمَاءِ وَالثَّلْجِ وَالْبَرَدِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

213. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: తక్బీరె తహ్రీమా తరువాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొద్దిసేపు ఆగి ఖుర్‌ఆన్ పారాయణం మొదలెట్టేవారు. 'దైవప్రవక్తా (స)! ఈ విరామ సమయంలో మీరేం చదువుతారు?' అని నేను ప్రశ్నించాను. "ఈ దుఆ పఠిస్తాను" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు: (దుఆ అనువాదం ఇది) "ఓ అల్లాహ్! తూర్పు - పడమరలకు మధ్య ఎంత అంతరం ఉందో నాకు - నా పాపాలకు మధ్య అంత దూరాన్ని ఉంచు. ఓ దేవా! ఏ విధంగా తెల్లని వస్త్రం మాలిన్యాల నుండి పరిశుభ్రం చేయబడుతుందో ఆ విధంగా నన్ను పాపాలు, అపరాధాల నుండి పరిశుద్ధ పరచు. ఓ ప్రభూ! నా పాపాలను నీటితో, మంచుతో, వడగళ్లతో ప్రక్షాళనం చెయ్యి." (ముస్లిం)

**సారాంశం**

'తక్బీరె తహ్రీమా' తరువాత - ఖుర్‌ఆన్ పారాయణం మొదలెట్టక ముందు - ఈ 'దుఆ' చేయటం దైవప్రవక్త విధానమని ఈ హదీసు ద్వారా మనకు బోధపడుతున్నది. దుఆ బిగ్గరగా గాకుండా, మెల్లగా చదవాలని కూడా హదీసు ద్వారా విదితమవుతోంది.

(٢١٤) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَانَ يَقُولُ: «**سُبْحَانَكَ اللَّهُمَّ،**

214. హజ్రత్ ఉమర్(రజి) (విరామ సమయంలో) "సుబ్‌హాన కల్లాహుమ్మ..." పఠించేవారు - (అర్థం) దేవా! నీవు పవిత్రుడవు. ప్రశంసలన్నీ నీకు మాత్రమే

وَبِحَمْدِكَ، وَتَبَارَكَ اسْمُكَ، وَتَعَالَى جَدُّكَ، وَلاَ إِلَه غَيْرُكَ». رَوَاهُ مُسْلِمٌ بِسَنَدٍ مُنْقَطِعٍ، وَالدَّارَقُطْنِيُّ مَوْصُولاً، وَهُوَ مَوقُوفٌ.

తగును. నీ నామం శుభప్రదం. నీ ఘనత ఎంతో ఉన్నతమైనది. నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. (ముస్లిం దీనిని 'మున్ఖతీ'గాను, దారె ఖుత్నీ 'మౌసూల్'గాను ఉల్లేఖించారు. ఈ హదీసు మౌఖూఫ్)

وَنَحْوُهُ عَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ مَرْفُوعاً عِندَ الْخَمْسَةِ، وَفِيْهِ: وَكَانَ يَقُولُ بَعْدَ التَّكْبِيْرِ: «أَعُوذُ بِاللهِ السَّمِيْعِ الْعَلِيْمِ مِنَ الشَّيْطَانِ الرَّجِيْمِ مِنْ هَمْزِهِ، وَنَفْخِهِ، وَنَفْثِهِ».

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) సౌజన్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. ఇందులో "అవుజుబిల్లాహి స్సమీయిల్ అలీమ్, మినష్షయితా నిర్రజీమ్ మిన్ హమ్జిహీ, వ నఫ్ఖిహీ, వ నఫ్సిహీ" అని కూడా ప్రస్తావించ బడింది (అర్థం: నేను శాపగ్రస్తుడైన షైతాన్ బారినుండి, వాడి పైశాచిక ప్రేరణలనుండి, వాడి కవ్వింపు నుండి, వాడి గర్వాహంకారం నుండి సర్వం వినే వాడు, సర్వం తెలిసినవాడైన అల్లాహ్ శరణు కోరుతున్నాను).

### సారాంశం

'తక్బీరె తహ్రీమా'కి - సూరె ఫాతిహాకి మధ్య నున్న విరామ సమయంలో "అల్లాహుమ్మ బాయిద్ బైని....." అనే దుఆ పఠించాలని ఇంతకు ముందు వచ్చిన సహీహ్ హదీసులో ఉంది. కొన్ని ఉల్లేఖనాలలో "ఇన్నీవజ్జహ్తు...." దుఆ చదవాలనీ, దీంతోపాటు "సుబ్హానకల్లాహుమ్మ....." కూడా కలుపుకోవచ్చనీ ఉంది. "సుబ్హానకల్లాహుమ్మ" ప్రస్తావన ఉన్న హదీసు 'మౌఖూఫ్' అయినప్పటికీ హజ్రత్ ఉమర్ (రజి) లాంటి గొప్ప సహాబీ బిగ్గరగా దాన్ని పఠించటమేగాక, ప్రజలకు దానిని నేర్పేవారు. అందువల్ల దీనిని ఉపేక్షించలేము. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కూడా దీనిని అవలంబించారు. మరో ముఖ్య విషయం - ఫాతిహా సూరా ప్రారంభించే ముందు 'తఅవ్వుజ్' మరియు 'తస్మియ' చదవటం అవసరం అని దైవప్రవక్త (సఅసం) గారి ఆదేశం వల్ల తెలుస్తోంది.

(٢١٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَسْتَفْتِحُ الصَّلاَةَ بِالتَّكْبِيرِ، وَالْقِرَاءَةَ بِـ«الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ، وَكَانَ إِذَا رَكَعَ لَمْ يُشْخِصْ رَأْسَهُ وَلَمْ يُصَوِّبْهُ، وَلَكِنْ بَيْنَ ذَلِكَ؛ وَكَانَ إِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ لَمْ يَسْجُدْ حَتَّى يَسْتَوِيَ قَائِماً، وَإِذَا رَفَعَ رَأْسَهُ مِنَ السُّجُودِ لَمْ يَسْجُدْ حَتَّى يَسْتَوِيَ جَالِساً، وَكَانَ يَقُولُ فِي كُلِّ رَكْعَتَيْنِ التَّحِيَّةَ، وَكَانَ يَفْرِشُ رِجْلَهُ الْيُسْرَى، وَيَنْصِبُ الْيُمْنَى، وَكَانَ يَنْهَى عَنْ عُقْبَةِ الشَّيْطَانِ، وَيَنْهَى أَنْ يَفْتَرِشَ الرَّجُلُ ذِرَاعَيْهِ افْتِرَاشَ السَّبُعِ، وَكَانَ يَخْتِمُ الصَّلاَةَ بِالتَّسْلِيمِ. أَخْرَجَهُ مُسْلِمٌ، وَلَهُ عِلَّةٌ.

215. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అల్లాహు అక్బర్' అంటూ నమాజ్‌ను ఆరంభించేవారు. 'అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్' (ఫాతిహా సూరా) తో ఖుర్‌ఆన్ పఠనం మొదలెట్టే వారు. రుకూ చేసినపుడు తన తలను మరీ పైకిగానీ, మరీ క్రిందికిగానీ ఉంచే వారు కారు. ఆ రెండింటికీ మధ్య స్థితిలో తల ఉంచేవారు. రుకూ స్థితినుండి తల పైకెత్తిన తరువాత అప్పటికప్పుడే సజ్దా లోకి వెళ్ళకుండా నిటారుగా నిలబడే వారు. సజ్దానుండి తలపైకెత్తిన మీదట ప్రశాంతంగా కూర్చొననిదే రెండవ సజ్దా లోకి వెళ్ళేవారు కాదు. ప్రతి రెండు రకతుల తరువాత తషహ్హుద్ (అత్తహియ్యాత్) పఠించేవారు. ఆ సమయంలో ఎడమ కాలిని క్రిందపరచుకుని కుడి పాదాన్ని నిలిపి ఉంచేవారు. షైతాన్ తరహాలో కూర్చోవటాన్ని వారించేవారు. క్రూరమృగాల వలె భుజాలను (చేతులను) ముందుకు జరిపి కూర్చోవడాన్ని కూడా వారించేవారు. సలాం చేయడంతో నమాజ్‌ను ముగించేవారు." (ముస్లిం - దీని పరంపర లోపభూయిష్టంగా ఉంది)

(٢١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَرْفَعُ يَدَيْهِ

216. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్‌ను ఆరంభించినపుడు తన

حَذْوَ مَنْكِبَيْهِ إِذَا افْتَتَحَ الصَّلاَةَ وَإِذَا كَبَّرَ لِلرُّكُوعِ، وَإِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ. مُتَّفَقٌ عَلَيْهِ.

రెండు చేతులను భుజాలకు సమానాంతరంగా ఎత్తేవారు. రుకూ చేసినపుడు, రుకూ నుండి తలపైకెత్తినపుడు కూడా తన రెండు చేతుల్ని భుజాలకు సమానాంతరంగా లేపేవారు. (అంటే 'రఫెయదైన్' చేసేవారు). (బుఖారీ, ముస్లిం)

وَفِيْ حَدِيْثِ أَبِي حُمَيْدٍ عِنْدَ أَبِي دَاوُدَ يَرْفَعُ يَدَيْهِ حَتَّى يُحَاذِيَ بِهِمَا مَنْكِبَيْهِ، ثُمَّ يُكَبِّرُ.

అబూదావూద్‌లో అబూ హుమైద్‌చే ఉల్లేఖించబడిన హదీసులో ఉంది: "తన రెండు చేతుల్ని భుజాలకు సమానంగా ఎత్తి అల్లాహు అక్బర్ అని పలికేవారు."

وَلِمُسْلِمٍ عَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. نَحْوَ حَدِيْثِ ابْنِ عُمَرَ، لَكِنْ قَالَ: حَتَّى يُحَاذِيَ بِهِمَا فُرُوْعَ أُذُنَيْهِ.

ఇంకా ముస్లింలో మాలిక్ బిన్ హువైరిస్ (రజి) చేత ఉల్లేఖించబడిన హదీసులో కూడా ఇబ్నెఉమర్ ఉల్లేఖనంలో ఉన్నట్లే చెప్పబడింది. కాని ఇందులో 'తన భుజాలకు సమానాంతరంగా' అనే బదులు 'చెవులవరకు' అని ఉంది.

### సారాంశం

తక్బీరె తహ్రీమా చెప్పే సమయంలోనూ, రుకూలోకి వెళ్ళే సందర్భంలోనూ, రుకూ నుండి నిలబడే సమయంలోనూ 'రఫెయదైన్' చేయటం దైవప్రవక్త సంప్రదాయం (మస్నూన్) అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. మరికొన్ని హదీసులలో రెండు రకతుల తరువాత మూడవ రకత్ ఆరంభానికి ముందు కూడా రఫెయదైన్ చేయాలని ఉంది. అత్యధిక సహాబీలు, వారి శిష్యులు ఈ విధానాన్నే పాటించారు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అహ్మద్ (రహ్మ.లై), అబూసూర్ (రహ్మ.లై), ఇబ్నె ముబారక్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ద్వారా కూడా ఇదే ఉటంకించబడింది. దైవప్రవక్త (సఅసం) జీవితాంతం 'రఫెయదైన్' చేసేవారని, ధర్మ ఖలీఫాలు కూడా ఈ పద్ధతిని అనుసరించారన్న దానికి చారిత్రక ఆధారాలున్నాయి.

హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) గారి సాక్ష్యం ఈ విషయంలో ప్రబల తార్కాణంగా నిలిచింది. వాయల్ బిన్ హుజ్ర్ (రజి) తబూక్ యుద్ధానంతరం హిజ్రీ 9లో ఇస్లాం స్వీకరించారు. మరుసటి సంవత్సరం ఆయన (రజి) దైవ ప్రవక్త (సఅసం) సన్నిధిలోకి వచ్చినపుడు మదీనాలో చలి తీవ్రంగా ఉంది. ఆయన ప్రవక్త ప్రియ సహచరులను (చలి కారణంగా) దుస్తుల లోపలినుంచే 'రఫెయదైన్' చేయటం గమనించారు. అవి హిజ్రీ 10వ సంవత్సరం ఆఖరి మాసాలు. ఆ తరువాత

హిజ్రీ 11వ ఏట దైవప్రవక్త (సఅసం) పరమపదించారు. దీన్నిబట్టి తెలిసేదేమంటే 'రఫెయదైన్' ఆచరణ ఆయన (స) జీవితం ఆఖరి ఘడియ వరకూ కొనసాగింది. కొంతమంది చెబుతున్నట్లు ఈ ఆచరణ రద్దవటంగానీ, మానివేయబడటంగానీ జరగలేదు. ప్రవక్త ప్రియసహచరులలో అత్యధికులు దీనిని అవలంబించారు. కూఫా నగరంతో సహా అరేబియాలోని ప్రముఖ పట్టణాలన్నింటిలోనూ దీనిపై అమలు జరిగింది. ఇస్లామీయ ధర్మవేత్తలలో అత్యధికులు ఈ 'రఫెయదైన్' పద్ధతిని అభిలషించారు. బుఖారీ, ముస్లింలతో పాటు క్రింద పేర్కొనబడిన గ్రంథాలలో కూడా ఈ హదీసు పొందుపరచబడి ఉంది : -

సునన్ అబూదావూద్, జామె తిర్మిజీ, సునన్ నసాయి, సునన్ ఇబ్నెమాజ, సునన్ దారిమీ, మువత్తా ఇమామ్ మాలిక్, ముసన్నఫ్ అబ్దుర్రజ్జాఖ్, అల్ ముసన్నఫ్, లి ఇబ్నె అబీ షైబ, ముస్నద్ అహ్మద్, సహీహ్ ఇబ్నె ఖుజైమ, సహీహ్ ఇబ్నె హిబ్బాన్, ముస్నద్ అబీ అవానా, సునన్ దారె ఖుత్నీ, సునన్ కుబ్రా, బైహఖీ మొదలగునవి.

(٢١٧) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَوَضَعَ يَدَهُ الْيُمْنَى عَلَى يَدِهِ الْيُسْرَى عَلَى صَدْرِهِ. أَخْرَجَهُ ابْنُ خُزَيْمَة.

217. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) ఉల్లేఖించారు: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి నమాజ్ చేశాను. ఆయన (స) తన కుడి చేతిని ఎడమ చేతిపై ఉంచి రొమ్ముపై చేతులు కట్టుకున్నారు." (ఇబ్నె ఖుజైమ)

### సారాంశం

ఈ హదీసు ద్వారా రెండు అంశాలు మన దృష్టికి వస్తున్నాయి. ఒకటి: నమాజులో చేతులు కట్టుకుని నిలబడటం సరైన విధానం (మస్నూన్). చేతులు వదలి నమాజ్ చేయటం సరైన విధానం కాదు. షాఫయీలు, హనఫీలు, హంబలీలు - అందరూ ఈ అంశంపై ఏకీభవించారు. అత్యధికమంది ప్రవక్త సహచరులు, వారి శిష్యుల ఉవాచ కూడా ఇదే. ఇబ్నె ముంజిర్ తదితరులు ఇమామ్ మాలిక్ నుండి సంగ్రహించిన నకలులో కూడా ఇదే ఉంది. ఆఖరికి మువత్తా ఇమామ్ మాలిక్‌లో కూడా చేతులు కట్టుకోవడం గురించిన ఉల్లేఖనమే ఉంది. మరలాంటప్పుడు ఈ పద్ధతినే పాటించాలి. దీనికి భిన్నంగా - చేతులు వదలి నమాజ్ చేయాలన్న ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఉల్లేఖనం సరైనది కాదు.

రెండు: చేతులు ఎక్కడ కట్టాలి? అన్న విషయానికి వద్దాం. చేతులు రొమ్ముపై కట్టుకోవాలా? నాభిక్రింద కట్టుకోవాలా? కొంతమంది నాభిక్రింద చేతులు కట్టుకుంటారు. దీన్ని సమర్థిస్తున్న హదీసు బలహీనమైనది, ప్రామాణికమైనది కాదు. పైన పేర్కొనబడిన హదీసును ఇబ్నె ఖుజైమ తన సహీహ్‌లో లిఖించగా ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ హల్ఫ్ హదీసు ద్వారా దీనికి మద్దతు లభిస్తున్నది. దైవప్రవక్త (స) తన చేతులను రొమ్ముపై కట్టుకునే వారని అందులో చెప్పబడింది. అహ్లె హదీస్ ఉలమాలు, రొమ్ముపై చేతులు కట్టుకోవటమే సరైనదని, నాభి క్రింద చేతులు కట్టుకోవాలన్న ఉల్లేఖనం బలహీనమైనదని ప్రబలమైన నిదర్శనాల ద్వారా నిరూపిస్తున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

వాయల్ బిన్ హుజ్ర్ (రజి) గారి మరో పేరు అబూ హునైద లేక అబూ హింద. సుప్రసిద్ధ సహాబీలలో ఒకరు. హజర్‌మౌత్ చక్రవర్తులలో ఒకరు. ఈయన తన మిత్ర బృందంతో కలసి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి వచ్చినపుడు ఈయన గౌరవార్థం దైవప్రవక్త (స) తన శాలువాను క్రిందపరచి కూర్చోబెట్టారు. ఈయన కొరకు, ఈయన సంతతి కొరకు ప్రార్థించారు. హజర్‌మౌత్ తెగలపై ఈయన్ని పర్యవేక్షకునిగా నియమించారు. ఎట్టకేలకు ఈయన కూఫాలో స్థిరపడ్డారు. అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(٢١٨) وَعَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ صَلاَةَ لِمَنْ لَمْ يَقْرَأْ بِأُمِّ الْقُرْآنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

218. హజ్రత్ ఉబాద బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు: "ఎవరయితే (నమాజ్‌లో) ఉమ్ముల్ ఖుర్‌ఆన్ పఠించలేదో అతని నమాజ్ నెరవేరదు." (బుఖారీ, ముస్లిం)

وَفِيْ رِوَايَةٍ لابْنِ حِبَّانَ وَالدَّارَقُطْنِيِّ: «لاَ تُجْزِىءُ صَلاَةٌ لا يُقْرَأُ فِيهَا بِفَاتِحَةِ الكِتَابِ».

ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ ఉల్లేఖనాలలో ఇలా వుంది: "ఏ నమాజులో ఫాతిహా సూరా పఠించబడలేదో ఆ నమాజ్ అసంపూర్ణంగా ఉంటుంది."

وَفِيْ أُخْرَى لِأَحْمَدَ وَأَبِيْ دَاوُدَ وَالتِّرْمِذِيِّ وَابْنِ حِبَّانَ: «لَعَلَّكُمْ تَقْرَءُوْنَ خَلْفَ إِمَامِكُمْ؟» قُلْنَا نَعَمْ؛ قَالَ: «لاَ تَفْعَلُوا إِلاَّ بِفَاتِحَةِ الْكِتَابِ، فَإِنَّهُ لاَ صَلاَةَ لِمَنْ لَّمْ يَقْرَأْ بِهَا.»

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌ల మరో ఉల్లేఖనంలో ఉంది- "బహుశా మీరు ఇమామ్ వెనుక (ఏదో) చదువుతారనుకుంటాను" అని ఆయన (స) చెప్పగా 'అవును' అని మేమన్నాము. "అలా చేయకండి - ఒక్క ఫాతిహా సూరా తప్ప. ఎందుకంటే ఎవరు ఫాతిహా సూరా చదవలేదో అతని నమాజే కాదు" అని ఆయన (స) సెలవిచ్చారు.

## సారాంశం

సూరె ఫాతిహా చదవనిదే నమాజ్ కాదన్న దానికి ఈ హదీసు స్పష్టమయిన ఆధారం. ఇమామ్ అయినా, ముఖ్తదీ అయినా, ఒంటరిగా నమాజ్ చేసే వ్యక్తి అయినా ఫాతిహా సూరా పఠనం తప్పనిసరి. ప్రామాణిక హదీసుల వెలుగులో సిసలయిన విధానం ఇదే. షాఫయీలు, అహ్లెహదీసు వారు ఈ విధానాన్నే అవలంబించారు. ప్రతి నమాజ్, ప్రతి రకతులో ఫాతిహా సూరా పఠించటం

తప్పనిసరియని వీరంతా వక్కాణిస్తారు. ప్రవక్త ప్రియసహచరుల, తాబయీన్ల, అధికసంఖ్యాక ఉలమాల మస్లక్ (పద్ధతి) ఇదే. ముస్లింలో హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా కూడా - ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించటం అనివార్యం అని విదితమవుతున్నది.

మౌలానా అబ్దుల్ హై లక్నోవీ హనఫీ "ఉమ్మల్ కలామ్"లో ఇలా అంటున్నారు: "ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించరాదన్న వాదనను సమర్థించే బలమైన హదీసు ఏదీ లేదు. ఈ సందర్భంగా ఉదాహరించబడేవీ ప్రామాణికమైనవి కావు. సిర్రీ నమాజుల్లోనూ, జహ్రీ నమాజులలోనూ ఇమామ్ వెనుకనున్నవారు (ముఖ్తదీలు) ఫాతిహా సూరా పఠించాలన్నదే ప్రామాణికమైనది. హదీసువేత్తల (ముహద్దిసీన్)లోని ఒక సమూహం అవలంబన కూడా ఇదే."

ఈయనే కాదు, హనఫీ పండితులలోని పూర్వీకులు, తరువాతి తరంలో కూడా కొంతమంది తాము జరిపిన పరిశోధన ఆధారంగా, ఇమామ్ వెనుక ఫాతిహా సూరా పఠించేవారు. షాహ్ వలియుల్లాహ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మలై), షాహ్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) కూడా ఈ కోవకు చెందినవారిలో ఉన్నారు. కడకు మౌలానా రషీద్ అహ్మద్ గంగూహీ (రహ్మలై) వంటివారు సయితం సిర్రీ నమాజులలోనే గాక, జహ్రీ నమాజులలోనూ ఇమామ్ వెనుక సూరె ఫాతిహా పఠించడాన్ని ధర్మసమ్మతంగా ఖరారు చేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలకై "అల్‌కలామ్" మొదటి సంపుటిని చూడవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

ఉబాదా బిన్ సామిత్ (రజి) అన్సారీ సహాబీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. అన్సార్ సర్దారులలో ప్రముఖ వ్యక్తిగా పేరుమోసారు. ప్రథమ, ద్వితీయ అఖబా ఒప్పందాలలో పాల్గొన్నారు. బద్ర్‌తో పాటు ఇతర యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని సిరియా వైపునకు ఖాజీగా, అధ్యాపకునిగా నియమించి పంపారు. తొలుత హిమ్స్‌లో స్థిరపడ్డారు. తరువాత పాలస్తీనా వైపునకు ప్రస్థానం చేశారు. 'రమ్ల'లో కన్నుమూశారు. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం హిజ్రీ 34లో బైతుల్ మఖ్దిస్‌లో మరణించారు. అప్పటికి ఆయనకు 72 సంవత్సరాలు.

(٢١٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ وَأَبَا بَكْرٍ وَعُمَرَ كَانُوا يَفْتَتِحُونَ الصَّلاَةَ بِـ«الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ». مُتَّفَقٌ عَلَيْهِ.

219. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం), అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి) లందరూ "అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్"తో నమాజ్‌ను ఆరంభించేవారు. (బుఖారీ, ముస్లిం)

زَادَ مُسْلِمٌ: لاَ يَذْكُرُونَ «بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيمِ» فِي أَوَّلِ قِرَاءَةٍ وَلاَ فِي آخِرِهَا.

ముస్లింలో అదనంగా ఇలా అనబడింది: "పఠనం మొదట్లోగానీ, ఆఖరిలోగానీ - రెండు సందర్భాలలో కూడా బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్ చదివేవారు కారు."

وَفِيْ رِوَايَةٍ لِأَحْمَدَ وَالنَّسَائِيِّ وَابْنِ خُزَيْمَةَ: لاَ يَجْهَرُوْنَ بِبِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيْمِ.

ముస్నద్ అహ్మద్, నసాయి, ఇబ్నె ఖుజైమాలలోని ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ హెచ్చు స్వరంతో పఠించేవారు కాదు."

وَفِيْ أُخْرَى لابْنِ خُزَيْمَةَ: «كَانُوْا يُسِرُّوْنَ». وَعَلَى هَذَا يُحْمَلُ النَّفْيُ فِيْ رِوَايَةِ مُسْلِمٍ، خِلاَفاً لِمَنْ أَعَلَّهَا.

ఇబ్నె ఖుజైమాలోని వేరొక ఉల్లేఖనంలో "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ నెమ్మదిగా పఠించేవారు" అని వుంది.

**సారాంశం**

దైవప్రవక్త (స) ఫాతిహా సూరాతో దైవగ్రంథ పారాయణాన్ని మొదలెట్టేవారనీ, 'బిస్మిల్లాహ్' మెల్లగా పఠించేవారనీ ఈ హదీసుద్వారా అవగతమవుతున్నది. మరికొన్ని ఉల్లేఖనాలలో బిస్మిల్లాహ్ బిగ్గరగా చెప్పేవారని కూడా ఉంది. కాబట్టి రెండు విధాలుగా పఠించినప్పటికీ అది అనుచితం కాదుగానీ ప్రామాణిక ఉల్లేఖనాల దృష్ట్యా 'బిస్మిల్లాహ్'ను నెమ్మదిగా పలకటమే సమంజసం.

(٢٢٠) وَعَنْ نُعَيْمٍ الْمُجْمِرِ قَالَ: صَلَّيْتُ وَرَاءَ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فَقَرَأَ بِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيْمِ، ثُمَّ قَرَأَ بِأُمِّ الْقُرْآنِ، حَتَّى إِذَا بَلَغَ «وَلاَ الضَّآلِّيْنَ» قَالَ: آمِيْنَ. وَيَقُوْلُ كُلَّمَا سَجَدَ، وَإِذَا قَامَ مِنَ الْجُلُوْسِ: اَللَّهُ أَكْبَرُ، ثُمَّ يَقُوْلُ إِذَا سَلَّمَ: وَالَّذِيْ نَفْسِيْ بِيَدِهِ إِنِّي لأَشْبَهُكُمْ صَلاَةً بِرَسُوْلِ اَللَّهِ ﷺ. رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ خُزَيْمَةَ.

220. హజ్రత్ నుఐమ్ ముజ్మిర్ (రహ్మ.లై) వివరించారు: నేను హజ్రత్ అబూ హురైర (రజి) నేతృత్వంలో నమాజ్ చేశాను. ఆయన మొదట బిస్మిల్లాహ్ పఠించారు. తరువాత ఉమ్ముల్ ఖుర్ఆన్ (సూరె ఫాతిహా) పారాయణం చేశారు. 'వలజ్జాల్లీన్' వరకూ వచ్చిన తరువాత ఆయన 'ఆమీన్' పలికారు. సజ్దాలోకి వెళ్ళినప్పుడు, సజ్దా తరువాత కూర్చుని నిలబడినపుడు 'అల్లాహు అక్బర్' అనేవారు. సలాం చేసిన తరువాత ఆయన ఇలా పలికారు: "ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షిగా చెబుతున్నాను! నిశ్చయంగా నేను మీకన్నా ఎక్కువగా నమాజ్ నెరవేర్చటంలో దైవప్రవక్త (సఅసం)ను పోలి వున్నాను." (నసాయి, ఇబ్నె ఖుజైమ)

### సారాంశం

ఈ హదీసు 'బిస్మిల్లాహ్' మరియు 'ఆమీన్'లను బిగ్గరగా పలకాలన్న దానికి ఆధారంగా నిలిచింది. అయితే అత్యధిక ప్రామాణిక ఆధారాల దృష్ట్యా 'బిస్మిల్లాహ్' నెమ్మదిగానూ, 'ఆమీన్' బిగ్గరగానూ పలకటం సమంజసం. ఎన్నో సమయాల్లో (జహ్రీ నమాజులలో) బిస్మిల్లాహ్ నెమ్మదిగా చదవబడింది. కొన్ని సమయాల్లోనే బిగ్గరగా పఠించబడింది.

ఫాతిహా సూరా ముగింపుపై 'ఆమీన్' పలకటం 'మస్నూన్'అనే విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఇమామ్ అయినా, ముఖ్తదీ అయినా, ఒంటరిగా నమాజ్ చేసేవారైనా - అందరూ ఆమీన్ చెప్పవలసిందే. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో ఆమీన్ పలకటం తప్పనిసరి. ఆమీన్ పలకనివాడు పాపాత్ముడవుతాడు. "ఓ అల్లాహ్! నా ప్రార్థనను స్వీకరించు" అని ఆమీన్ భావం.

### హదీసు ఉల్లేఖకులు

నుఐమ్ ముజ్మిర్ (రహ్మ.లై) హజ్రత్ ఉమర్ (రజి)చే స్వేచ్ఛ నొసగబడిన బానిస. ఈయన మారు పేరు అబూ అబ్దుల్లాహ్. హజ్రత్ ఉమర్ ఆదేశాన్ని శిరసావహిస్తూ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం మస్జిదె నబవీని సుగంధ నీటితో కడిగేవారు. ఈ కారణంగానే ఈయన ముజ్మిర్‌గా ఖ్యాతి గడించారు. ప్రసిద్ధ తాబయీలలో ఒకరు. అబూ హాతిమ్, ఇబ్నె ముయీన్, ఇబ్నె సాద్, నసాయి తదితరులు ఈయన్ని విశ్వసనీయమయిన వ్యక్తిగా నిర్ధారించారు.

(٢٢١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قال رَسُولُ اللهِ ﷺ: «**إِذَا قَرَأْتُمُ الفَاتِحَةَ فَاقْرَءُوا بِسْمِ اللهِ الرَّحْمَنِ الرَّحِيمِ، فَإِنَّهَا إِحْدَى آيَاتِهَا**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَصَوَّبَ وَقْفَهُ.

221. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "మీరు ఫాతిహా సూరా పఠించినపుడు బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్ కూడా దాంతోపాటే పఠించండి. ఎందుకంటే అది కూడా ఫాతిహా సూరాలోని ఒక వచనమే." (దారె ఖుత్నీ దీనిని 'మౌఖూఫ్'గా నిర్ధారించారు)

### సారాంశం

'బిస్మిల్లాహ్' ఫాతిహా సూరాలోని ఒక ఆయత్ అని ఈ హదీసు వక్కాణిస్తోంది. అయితే ఈ హదీసు మౌఖూఫ్ అన్న విషయాన్ని విస్మరించరాదు. ముస్లింలోని సహీహ్ హదీసు దీనికి విరుద్ధంగా ఉంది. ఈ హదీసులో దైవప్రవక్త ఈ సూరాను విభజించారు. 'అల్ హమ్దులిల్లాహ్'ను మొదటి భాగంగా ఖరారు చేశారు - 'బిస్మిల్లాహ్'ను ఇందులో చేర్చలేదు.

(٢٢٢) وَعَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا فَرَغَ مِنْ قِرَاءَةِ أُمِّ الْقُرْآنِ، رَفَعَ صَوْتَهُ

222. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమ్ముల్ ఖుర్ఆన్ (ఫాతిహా సూరా) పఠనం పూర్తి కాగానే బిగ్గరగా

وَقَالَ: آمِينَ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَحَسَّنَهُ، وَالْحَاكِمُ وَصَحَّحَهُ. وَلأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ وَائِلِ ابْنِ حُجْرٍ نَحْوُهُ.

ఆమీన్ పలికేవారు." (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. 'హసన్'గా నిర్ధారించారు. హాకిమ్ మాత్రం దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారుచేశారు. అబూ దావూద్, తిర్మిజీలలో వాయల్ బిన్ హుజ్ర్ - రజి- ఉల్లేఖనం కూడా ఇలాగే ఉంది)

**సారాంశం**

సూరె ఫాతిహా చివరిలో దైవప్రవక్త (స) 'ఆమీన్'ని బిగ్గరగా పలికేవారని ఈ హదీసులో వుంది. అయితే బిగ్గరగా పలకటం - నెమ్మదిగా పలకటం గురించి భేదాభిప్రాయం ఉంది. ఆమీన్ పలికే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు. హనఫీలు ఆమీన్ నెమ్మదిగా పలకాలంటారు. కాగా; మిగిలిన ఇమాములు ముగ్గురూ, హదీసువేత్తలు, అహ్లెహదీసు విద్వాంసులు ఆమీన్ బిగ్గరగా పలకాలంటారు.

అనేక ప్రామాణిక హదీసుల ద్వారా ఆమీన్ బిగ్గరగా పలకడానికే ఎక్కువ సమర్థన లభిస్తోంది. తిర్మిజీ, అబూదావూద్, దారిమీలలో దైవప్రవక్త (స) ఆమీన్ పలికారనీ, ఆ సమయంలో తన గొంతును పెంచారని వాయల్ బిన్ హుజ్ర్ (రజి) ఉల్లేఖనం చెబుతోంది.

సహీహ్ ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ, హాకిమ్‌లలో - దైవప్రవక్త (స) ఉమ్ముల్ ఖుర్‌ఆన్‌ను ముగించిన తరువాత హెచ్చు స్వరంతో 'ఆమీన్' చెప్పేవారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ద్వారా స్పష్టమవుతున్నది.

సహీహ్ ఇబ్నె ఖుజైమాలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ గురించి ఇలా ఉంది: ఆయన ఇమామ్ వెనుక నమాజ్ చేసినపుడు జనులు కూడా ఆమీన్ పలికేవారు. ఇబ్నె ఉమర్ కూడా ఆమీన్ పలికేవారు. దీనిని 'సున్నత్'గా భావించేవారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆమీన్‌ను వదిలేవారు కారనీ, ఆమీన్ పలకమని మమ్మల్ని ప్రోత్సహించేవారనీ ఆయన శిష్యులు నాఫె తెలిపారు.

ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గురువర్యులైన హజ్రత్ అతా బిన్ రిబాహ్ ఇలా అంటున్నారు: "మక్కాలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) బిగ్గరగా ఆమీన్ పలికేవారు. ఆయన వెనుకనున్న వారు కూడా బిగ్గరగా ఆమీన్ అనేవారు. దీంతో మస్జిద్ ప్రతిధ్వనించేది." (బుఖారీ)

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "యూదులు ముస్లింలపై మూడు విషయాలలో ఈర్ష్య చెందుతారు: (1) సలాంకు బదులు ఇవ్వటంపై (2) పంక్తుల్ని తీర్చిదిద్దటంపై (నమాజ్‌లో వరుసలు తీరి నిలబడటంపై) (3) ఇమామ్ వెనుక నిలబడి 'ఆమీన్' అనటంపై"

దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు- "యూదులు మీలోని 'సలాం' మరియు 'ఆమీన్'లపై అసూయ చెందినంతగా మరేవిషయంలోనూ అసూయ చెందరు." (సునన్ ఇబ్నె మాజ)

ఈ విధంగా ఉదాహరించసాగితే మరెన్నో హదీసులు వస్తాయి. ఇక భారత ఉపఖండానికి చెందిన కొంతమంది సుప్రసిద్ధ విద్వాంసులు దీని గురించి ఏమంటున్నారో చూద్దాం -

షేఖ్ అబ్దుల్ హఖ్ ముహద్దిస్ దహెల్వీ ఇలా అంటున్నారు - "దైవప్రవక్త (సఅసం) జహ్రీ నమాజులలో ఆమీన్ బిగ్గరగా పలికేవారు. వెనుకనున్న అనుయాయులు కూడా ఆయన్ను అనుసరించేవారు. బిగ్గరగా ఆమీన్ పలకాలన్న హదీసులు అధికంగానూ, బలవత్తరంగానూ ఉన్నాయి."

హజ్రత్ షాహ్ ఇస్మాయీల్ షహీద్ (రహ్మ.లై) ఇలా వ్యాఖ్యానించారు: "బిగ్గరగా ఆమీన్ పలకాలన్న హదీసులు ఎక్కువగానూ, సుస్పష్టంగానూ ఉన్నాయి."

మౌలానా అబ్దుల్ హై లక్నోవి (ఈయన హనఫీ ఆలిమ్) ఇలా అభిప్రాయపడ్డారు: "ప్రమాణబద్ధమైన ఆధారాల వెలుగులో చూసినపుడు ఆమీన్‌ను బిగ్గరగా పలకమని అనటమే న్యాయం." ఆ మాటే ఆయన 'సఆయ'లో మరింత స్పష్టంగా విడమరచి చెప్పారు. ఆయన ఇలా అన్నారు - "నెమ్మదిగా ఆమీన్ పలకాలి అని అంటున్న ఉల్లేఖనాలు బలహీనమైనవి (జయీఫ్). బిగ్గరగా ఆమీన్ పలకాలంటున్న ఉల్లేఖనాలతో ఇవి పోటీపడలేవు."

ఇంత చర్చ జరిగాక ఈ విషయమై ఇంకా వ్యాఖ్య అనవసరం.

(٢٢٣) وَعَنْ عَبْدِ اللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: إِنِّي لاَ أَسْتَطِيْعُ أَنْ آخُذَ مِنَ القُرْآنِ شَيْئاً، فَعَلِّمْنِي مَا يُجْزِئُنِي مِنْهُ، فَقَالَ: «قُلْ: سُبْحَانَ اللهِ، وَالْحَمْدُ لِلَّهِ، وَلاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَاللَّهُ أَكْبَرُ، وَلاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللهِ الْعَلِيِّ الْعَظِيمِ» الْحَدِيْثَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ.

223. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ ఔఫా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి, 'నేను దివ్య ఖుర్‌ఆన్‌లోని ఏ భాగాన్నీ జ్ఞాపకం ఉంచుకోలేకపోతున్నాను. కనుక దీనికి ప్రత్యామ్నాయం కాగల మరేదయినా నాకు ఉపదేశించండి' అని విన్నవించుకున్నాడు. దీనికి ఆయన (స), "సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్" పఠించమని సూచించారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, దారె ఖుత్నీ, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

## సారాంశం

ఎవరికయినా ఖుర్‌ఆన్‌లో ఏ కొంత భాగం కూడా (చిన్న చిన్న సూరాలు కూడా) జ్ఞాపకం లేకపోతే వారు గత్యంతరం లేని స్థితిలో పై వచనాలను పఠించినా నమాజ్ నెరవేరుతుంది అని ఈ హదీసు చెబుతోంది. ఇక ఎవరయినా దీనిని ఒక ఆధారంగా తీసుకుని 'నమాజ్‌లో సూరె ఫాతిహా చదవటం విధి కాద'ని వాదిస్తే ఇది మరీ చాదస్తం అనిపించుకుంటుంది. ఎందుకంటే ఇది గత్యంతరం లేని పరిస్థితి. ఒక వ్యక్తికి ఏమీ జ్ఞాపకం లేని స్థితిలో ప్రవక్త అతనికి అతి సులభ మయిన ఒక 'కలిమా' నేర్పారు. ఇదొక తాత్కాలిక స్థితి. ఇలాంటి వారికోసం షరీయత్ రాయితీ కల్పిస్తుంది. కొత్తగా కలిమా పఠించి ఇస్లాంలోకి ప్రవేశించిన వ్యక్తి ఆ క్షణం నుంచే నమాజ్ చేయవలసి ఉంటుంది. మరి అతనికి నమాజ్‌లో ఏం చదవాలో తెలీదు. ఈ కారణంచేత అతన్ని నమాజ్ చేయరాదని అంటామా? నమాజ్‌ను పూర్తిగా నేర్చుకునేంతవరకూ ఆ వ్యక్తి మౌనంగా నిలబడినా, వచ్చినమటుకే చదివినా దైవసన్నిధిలో అతని నమాజ్ స్వీకారయోగ్యమవుతుంది.

ఇంతకీ చెప్పవచ్చిందేమంటే గత్యంతరం లేని స్థితి అందరికీ వర్తించదు. ఆ స్థితి వర్తించవలసిన వారికే వర్తిస్తుంది. కాబట్టి ఇలాంటి వాటిని ఆసరాగా తీసుకుని అందరూ అసలు విషయం నుండి పలాయనం చిత్తగించే ప్రయత్నం చేయకూడదు. నమాజ్‌లో - దివ్య గ్రంథ పారాయణం అన్నప్పుడు ఫాతిహా సూరా పఠనం కూడా అందులో ఇమిడి ఉందని మరువరాదు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి). మారుపేరు అబూ ముహమ్మద్ లేక అబూ ముఆవియ. ఈయన తండ్రి పేరు అల్ఖమ బిన్ హారిస్ అస్లమీ. తండ్రీ కొడుకులిరువురూ సహాబీలే. ఈయన హుదైబియా ఒడంబడిక లోనూ, ఖైబర్ యుద్ధంలోనూ పాల్గొన్నారు. ఆ తరువాత జరిగిన యుద్ధాలలో కూడా వచ్చారు. దైవప్రవక్త (స) మరణానంతరం కూఫా వైపునకు ప్రస్థానం చేశారు. హిజ్రీ 87లో మరణించారు. కూఫాలో మరణించిన సహాబీలలో అందరికన్నా చివరివారు ఈయనేనని అంటారు. వయసు పెరిగిన కొద్దీ కంటిచూపు తగ్గిపోసాగింది.

(٢٢٤) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي بِنَا فَيَقْرَأُ فِي الظُّهْرِ وَالْعَصْرِ فِي الرَّكْعَتَيْنِ الْأُوْلَيَيْنِ بِفَاتِحَةِ الْكِتَابِ وَسُورَتَيْنِ، وَيُسْمِعُنَا الْآيَةَ أَحْيَاناً، وَيُطَوِّلُ الرَّكْعَةَ الْأُوْلَى، وَيَقْرَأُ فِي الْأُخْرَيَيْنِ بِفَاتِحَةِ الْكِتَابِ. مُتَّفَقٌ عَلَيْهِ.

224. హజ్రత్ అబూ ఖతాదా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు నమాజ్ చేయించినపుడు - జుహ్ర్, అస్ర్‌ల మొదటి రెండు రకతులలో ఫాతిహా సూరాతోపాటు మరో రెండు సూరాలు పఠించేవారు. ఒక్కోసారి మాకు ఏదన్నా ఒక ఆయత్‌ను వినిపించేవారు కూడా. మొదటి రకత్‌ను సుదీర్ఘంగా చేసేవారు. ఆఖరి రెండు రకతులలో కేవలం ఫాతిహా సూరా పఠించేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా కొన్ని విషయాలు చర్చకు వస్తాయి. (1) జుహ్ర్ అస్ర్ నమాజులలో ఖుర్ఆన్ పారాయణం నెమ్మదిగా జరగాలి. ఇందులో ద్వంద్వాభిప్రాయానికి తావులేదు. మరలాంటప్పుడు ఏదన్నా ఒక ఆయత్‌ను వినిపించటంలోని ఆంతర్యం ఏమై ఉంటుంది?! ఇందులో దాగివున్న ఒక పరమార్థం; ప్రస్తుతం ఆయన నమాజులో ఖుర్ఆన్‌లోని ఒకానొక భాగాన్ని పారాయణం చేస్తున్నారే తప్ప వేరొక స్మరణలో, దుఆలో నిమగ్నమై లేరు అని సహాబీలకు తెలియజేయటం కావచ్చు! రెండు : ఈ నమాజులో ఫలానా సూరా పఠించబడిందని నమాజీలకు తెలియజేయటం మరో ఉద్దేశ్యం కావచ్చు!!

(2) మొదటి రకత్‌లో ఖుర్ఆన్ పఠనం రెండవ రకత్‌లోని పఠనంకన్నా కాస్త అధికంగా ఉండాలన్న అంశం కూడా ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌లతో పాటు ఇమామ్ ముహమ్మద్ దృక్పథం కూడా ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ అబూ యూసుఫ్‌ల దృష్టిలో మాత్రం రెండు రకతుల్లోనూ ఖుర్ఆన్ పారాయణం సమంగా ఉండాలి. జుహ్ర్, అస్ర్ నమాజుల్లోని మొదటి రకతులు సుదీర్ఘంగా ఉండేవని మూలాంశం ద్వారా రూఢీ అవుతోంది. ఆయన (స) అలా ఎందుకు చేసేవారు? ఆలస్యంగా వచ్చే ప్రజలకు కూడా మొదటి రకత్ లభించాలన్నది ఒక పరమార్థం అయి ఉండవచ్చు!

(3) జుహ్ర్, అస్ర్‌లలోని ఆఖరి రెండు రకతులలో అల్‌హం సూరా తప్ప మరో సూరా పఠించేవారు కాదని ఈ హదీసు ద్వారా తెలియ వస్తోంది. అయితే మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆఖరి రెండు రకతులలో కూడా మరో సూరా పఠించవచ్చని ఉంది. అందువల్ల ఫాతిహా సూరాతో పాటు మరేదయినా సూరా కూడా ఆఖరి రకతులలో ఎవరయినా పారాయణం చేస్తే అందులో విపరీతం ఏమీ లేదు.

(4) సిర్రీ నమాజులలో (అంటే మెల్లగా చదివే నమాజులలో) ఏదన్నా ఒక వాక్యం (ఆయత్) బిగ్గరగా చదివినంత మాత్రాన "సజ్దా సహూ" తప్పనిసరికాదు. దైవప్రవక్త (స) ఒకటి రెండు సార్లు కాదు, అనేకసార్లు ఈ విధంగా చేసినట్లు ఆధారాలున్నాయి.

(٢٢٥) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نَحْزُرُ قِيَامَ رَسُولِ اللّٰهِ ﷺ فِي الظُّهْرِ وَالْعَصْرِ، فَحَزَرْنَا قِيَامَهُ فِي الرَّكْعَتَيْنِ الْأُوْلَيَيْنِ مِنَ الظُّهْرِ قَدْرَ ﴿الٓمٓ تَنْزِيلُ﴾ السجدة وفي الأُخْرَيَيْنِ قدر النِّصْفِ

225. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: మేము జుహ్ర్, అస్ర్‌లలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్ఆన్ పారాయణాన్ని అంచనా వేసేవాళ్ళం. మా అంచనా ప్రకారం ఆయన (స) జుహ్ర్ యొక్క మొదటి రెండు రకతులలో 'సూరె సజ్దా' పారాయణం చేసినంత సమయం తీసుకునేవారు. ఆఖరి రెండు రకతుల కోసం మొదటి రెండు రకతుల్లోని సగం సమ

مِنْ ذَلِكَ وَفِي الْأُوْلَيَيْنِ مِنَ الْعَصْرِ، عَلَى قَدْرِ الْأُخْرَيَيْنِ مِنَ الظُّهْرِ، وَالْأُخْرَيَيْنِ عَلَى النِّصْفِ مِنْ ذَلِكَ. رَوَاهُ مُسْلِمٌ.

యాన్ని తీసుకునేవారు. కాగా; అస్ర్‌లోని మొదటి రెండు రకతులకోసం జుహ్ర్ లోని చివరి రెండు రకతులకు సమాన మైన సమయం తీసుకునేవారు. ఇంకా అస్ర్‌లోని చివరి రెండు రకతులకై అస్ర్ లోని మొదటి రెండు రకతుల్లోని సగం సమయం వెచ్చించేవారు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా జుహ్ర్, అస్ర్ నమాజులలో దైవప్రవక్త (స) గారి ఖుర్ఆన్ పారాయణం పరిమాణం తెలియవస్తోంది. చివరి రెండు రకతులలో ఫాతిహా సూరాతోపాటు మరేదయినా సూరా పఠించటం మస్నూన్ అని కూడా దీనిద్వారా స్పష్టమవుతోంది. అలాగే కొన్ని సమయాల్లో పఠించకపోవటం కూడా మస్నూన్‌యేనని బోధపడుతున్నది. కనుక నమాజీ చివరి రెండు రకతులలో ఫాతిహా సూరాతో పాటు మరేదయినా సూరా చదువుకుంటే అందులో తప్పు పట్టాల్సిన పని ఏమీ లేదు. అలాగే చదవకపోవటం వల్ల వచ్చిన అనర్థం కూడా ఏమీ లేదు.

(٢٢٦) وَعَنْ سُلَيْمَانَ بْنِ يَسَارٍ قَالَ: كَانَ فُلَانٌ يُطِيْلُ الْأُوْلَيَيْنِ مِنَ الظُّهْرِ وَيُخَفِّفُ الْعَصْرَ وَيَقْرَأُ فِي الْمَغْرِبِ بِقِصَارِ الْمُفَصَّلِ، وَفِي الْعِشَاءِ بِوَسَطِهِ، وَفِي الصُّبْحِ بِطِوَالِهِ، فَقَالَ أَبُوْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ: مَا صَلَّيْتُ وَرَاءَ أَحَدٍ أَشْبَهَ صَلَاةً بِرَسُوْلِ اللّٰهِ ﷺ مِنْ هٰذَا. أَخْرَجَهُ النَّسَائِيُّ بِإِسْنَادٍ صَحِيْحٍ.

226. హజ్రత్ సులైమాన్ బిన్ యసార్ (రహ్మ.లై) ఇలా తెలిపారు: "ఫలానా వ్యక్తి జుహ్ర్‌లోని మొదటి రెండు రకతులను సుదీర్ఘంగా చేస్తున్నారు (అంటే వీటిలో సుదీర్ఘంగా ఖుర్ఆన్ పఠిస్తున్నారు). అస్ర్ నమాజ్‌ను సంక్షిప్తంగా చేస్తున్నారు. మగ్రిబ్ నమాజులో చిన్న తరహా సూరాలు పఠిస్తున్నారు. ఇషా నమాజులో మధ్య తరహా సూరాలు పఠిస్తున్నారు. ఉదయం నమాజులో సుదీర్ఘమయిన సూరాలు పఠిస్తున్నారు." (అని ఆయన చెప్పగా) ఇది విని అబూ హురైర (రజి) ఇలా అన్నారు: "నేను ఎవరి ఇమామత్ (సారథ్యం)లో కూడా ఇంతకన్నా ఎక్కువగా దైవప్రవక్త (స) నమాజ్‌ను పోలిన నమాజ్‌ను చేయలేదు." (నసాయి దీనిని ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు).

### సారాంశం

దివ్య ఖుర్ఆన్‌లోని అల్ హుజ్రాత్ సూరా నుండి చివరి వరకు (సూరయె నాస్ వరకూ) గల సూరాలు 'ముఫస్సలాత్' అనబడతాయి. ఇందులోనూ మూడు రకాలున్నాయి. (1) చిన్న తరహా (2) మధ్య తరహా (3) పెద్ద తరహా సూరాలు. ఫజ్ర్ నమాజ్‌లో పెద్ద తరహా సూరాలు, ఇషా నమాజులో మధ్య తరహా సూరాలు, మగ్రిబ్ నమాజులో చిన్న తరహా సూరాలు పఠించటం మస్నూన్ (దైవప్రవక్త విధానం).

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు సులైమాన్ బిన్ యసార్ (రహ్మ.లై). మరోపేరు అబూ అయ్యూబ్. ఏడుగురు (సమకాలీన) అగ్రశ్రేణి ధర్మవేత్తలలో ఈయన కూడా ఒకరుగా పరిగణించబడ్డారు. దైవభక్తి పరాయణులు, ధర్మావగాహనలో సాటిలేని మేటి. అత్యుత్తమశ్రేణి పండితులు. అసంఖ్యాకమయిన హదీసులు ఈయనచేత ఉల్లేఖించబడ్డాయి. ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ మైమూన (ర.అన్హా)చే స్వేచ్ఛ నొసగబడిన బానిస.

(٢٢٧) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقْرَأُ فِي الْمَغْرِبِ بِالطُّورِ. مُتَّفَقٌ عَلَيْهِ.

227. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మగ్రిబ్ నమాజులో తూర్ సూరా పఠించగా విన్నాను." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

సాధారణంగా దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్ నమాజులో చిన్న సూరాలనే చదివేవారు. అయితే ఎప్పుడయినా ఒక్కోసారి (ఈ హదీసులో వచ్చినట్లు) పెద్ద సూరాలు కూడా పారాయణం చేసేవారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం అద్దుఖాన్, సాఫ్ఫాత్ లాంటి పెద్ద సూరాలు కూడా మగ్రిబ్ నమాజ్‌లో చదివారని ఉంది. ప్రయాణ సమయాల్లో ఆయన (స) ఫజ్ర్ నమాజ్‌లో కేవలం 'ముఅవ్వజతైన్' (సూరయే ఫలఖ్, సూరయే నాస్‌లు) పఠించేవారని కూడా మనకు ఆధారాలు లభిస్తున్నాయి. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే, లోగడ వచ్చిన హదీసు (హదీసు నెంబరు 226) ప్రకారమే సాధారణంగా ఆయన (స) ఆచరణ ఉండేది. కాకపోతే అప్పుడప్పుడు ఈ 'మామూలు'లో మార్పు ఉండేది.

(٢٢٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقْرَأُ فِي صَلَاةِ الْفَجْرِ يَوْمَ الْجُمُعَةِ (الٓمٓ تَنْزِيلُ)

228. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం నాడు ఫజ్ర్ నమాజు మొదటి రకత్‌లో సూరయే సజ్దా (అలిఫ్-లామ్-మీమ్. తన్‌జీలు), రెండవ

السَّجْدَةَ، «وَهَلْ أَتَى عَلَى الإِنْسَانِ». مُتَّفَقٌ عَلَيْهِ. وَلِلطَّبَرَانِيِّ مِنْ حَدِيْثِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «يُدِيْمُ ذَلِكَ».

రకత్‌లో సూరయే దహర్ (హల్ అతా అలల్ ఇన్‌సాని) చదివేవారు (బుఖారీ, ముస్లిం). తబ్రానీలో ఇబ్నె మస్‌వూద్ ఉల్లేఖనంలో - "ఆయన నిత్యం ఇలాగే చేసేవారు" అని ఉంది.

**సారాంశం**

దైవప్రవక్త (స) శుక్రవారం నాడు ఈ రెండు సూరాలనే ఎందుకు ఎన్నుకున్నారు? దీని గురించి షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "ఈ రెండు సూరాలలో ఆదం సృష్టి గురించి, ప్రళయదినాన హష్ర్ మైదానంలో మానవులంతా సమావేశపరచబడటం గురించి వివరంగా వచ్చింది. ప్రళయం కూడా శుక్రవారం నాడే సంభవిస్తుంది. ఈ కారణంగా దైవప్రవక్త (స) శుక్రవారం నాటి నమాజులో ఈ రెండు సూరాలను ప్రత్యేకంగా ఎన్నుకుని తన అనుచర సమాజంలో మానవసృష్టి పరమార్థాన్నీ, పరలోక చింతనను పాదుకొల్పాలని తలంచి ఉండవచ్చు."

అందుచేత శుక్రవారం నాడు ఉదయం ఫర్జ్ నమాజులో ఈ రెండు సూరాలను పఠించటం సంప్రదాయం. ఏ ఆచరణను దైవప్రవక్త (స) నిత్యం పాటించారో దానిని మనం కూడా పాటించటం మస్నూన్. అయితే ఈ రెండు సూరాలు తప్ప ఇతర సూరాలు పఠించటం వల్ల నమాజ్ నెరవేరదని దీని భావం ఎంతమాత్రం కాదు. ఏ సూరాలు ఎన్నుకున్నా నమాజ్ నెరవేర్పులో ఎలాంటి దోషం ఏర్పడదు. కాకపోతే దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఒక ఆదర్శాన్ని అవలంబించటంలో అపారమయిన శుభాలు ఇమిడి ఉంటాయి. ఇప్పటికీ అహ్లె హదీసు వారు వీలయినంతవరకు ఫజ్ర్ నమాజ్‌లో శుక్రవారంనాడు ఈ రెండు సూరాలనే పఠిస్తారు.

(٢٢٩) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ، ﷺ فَمَا مَرَّتْ بِهِ آيَةُ رَحْمَةٍ إِلاَّ وَقَفَ عِنْدَهَا يَسْأَلَ، وَلاَ آيَةُ عَذَابٍ إِلاَّ تَعَوَّذَ مِنْهَا. أَخْرَجَهُ الْخَمْسَةُ وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

229. హుజైఫా (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి నమాజ్ చేశాను. దైవ కారుణ్య ప్రస్తావన ఉన్న ఆయత్‌లు వచ్చినపుడు ఆయన (స) ఆగి కారుణ్యాన్ని అర్థించేవారు. శిక్షకు సంబంధించిన ఆయత్‌లు వచ్చినపుడు కొద్దిగా ఆగి దాని బారినుండి దేవుని శరణు కోరేవారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా లైదుగురూ దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా నిర్ధారించారు)

**సారాంశం**

ఈ ఆచరణ బహుశా తహజ్జుద్ నమాజ్‌కు సంబంధించినది. ముస్నద్ అహ్మద్‌లో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ద్వారానూ, వేరితర ఉల్లేఖనాల ద్వారానూ, దైవప్రవక్త (స) తహజ్జుద్ నమాజ్‌లో ఈ విధంగా చేసేవారని తెలుస్తున్నది. ఒకవేళ ఈ విధంగా ఫర్జ్ నమాజులో చేసినా తప్పులేదు - అయితే ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు ఇలా చేస్తే ఫరవాలేదు. సామూహిక నమాజులో ఇలా చేయటం వల్ల ఇతరుల్ని ఇబ్బందుల్లో పడవేసినట్లవుతుంది.

(٢٣٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَلاَ وَإِنِّي نُهِيتُ أَنْ أَقْرَأَ الْقُرْآنَ رَاكِعاً أَوْ سَاجِداً، فَأَمَّا الرُّكُوعُ فَعَظِّمُوا فِيهِ الرَّبَّ، وَأَمَّا السُّجُودُ فَاجْتَهِدُوا فِي الدُّعَاءِ، فَقَمِنٌ أَنْ يُسْتَجَابَ لَكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

230. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "ప్రజలారా! వినండి. నేను రుకూ, సజ్దాలలో ఖుర్‌ఆన్ పారాయణం చేయడాన్ని వారించబడింది. కనుక రుకూలో మీ ప్రభువు ఔన్నత్యాన్ని కొనియాడండి. సజ్దాలో దుఆ చేసేందుకు ప్రయత్నించండి - తద్వారా మీ దుఆ స్వీకరించబడవచ్చు." (ముస్లిం)

**సారాంశం**

నమాజ్‌లో వివిధ అర్కాన్ (ముఖ్యాంశాలు)లున్నాయి. వాటిలో ప్రతిదీ వైవిధ్యంతో కూడుకున్నది. ఒక్కో 'రుకున్' లో దైవధ్యానం చేసే పద్ధతి ఒక్కోవిధంగా ఉంది. తదనుగుణంగానే వాటిని పాటించటం సున్నత్ (సంప్రదాయం). దైవప్రవక్త (సఅసం) రుకూ, సజ్దాలలో ఖుర్‌ఆన్ పారాయణం చేయడాన్ని వారించారు. ఖుర్‌ఆన్ పారాయణం 'ఖియామ్' స్థితిలో మాత్రమే జరగాలి. రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీమ్' అంటూ దేవుని ఘనత్వాన్ని కీర్తించాలి. సజ్దాలో దైవాన్ని వేడుకోమని ప్రవక్త (స) వారు బోధించారు. కొంతమంది హదీసు వేత్తల మరియు ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) ల అభిప్రాయంలో రుకూలో దేవుని ఘనత్వం, సజ్దాలో వేడుకోలు (దుఆ) తప్పనిసరి. అయితే అత్యధిక మంది ఉలమా దీనిని ముస్తహబ్ (అభిలషణీయం)గా భావించారు. దుఆ స్వీకరించబడే సందర్భాలలో 'సజ్దా' ముఖ్యమైనది. అందుకే దైవప్రవక్త (స) సజ్దా స్థితిలో దుఆ చేయమని ఉద్బోధించారు. ఆయన స్వయంగానూ సజ్దాలో అనేక వేడుకోళ్లు చేసేవారు. వాటిలో ఒక దుఆ దీని తరువాతి హదీసులో రాబోతున్నది.

(٢٣١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ فِي

231. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రుకూ సజ్దాలలో ఈ విధంగా వేడుకునేవారు - "సుబ్‌హానకల్లాహుమ్మ రబ్బనా వ బిహమ్దిక. అల్లాహుమ్మగ్

رُكُوعِهِ وَسُجُودِهِ: «سُبْحَانَكَ اللَّهُمَّ رَبَّنَا وَبِحَمْدِكَ، اللَّهُمَّ اغْفِرْ لِي». مُتَّفَقٌ عَلَيْهِ.

ఫిర్‌లీ'' (నీవు పవిత్రుడవు. ఓ అల్లాహ్! ఓ మా ప్రభూ! ప్రశంసలు, పొగడ్తలు నీకే తగును. ఓ అల్లాహ్! నన్ను క్షమించు). (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

రుకూలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీమ్', సజ్దాలో 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా' అని అనటంతోపాటు పైన పేర్కొనబడిన దుఆ కూడా చేయవచ్చన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. ''ఇజా జాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు'' సూరా అవతరించినప్పటి నుండీ ఆయన (సఅసం) నిత్యం ఈ 'దుఆ' నే రుకూ సజ్దాలలో చేసేవారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ద్వారా తెలుస్తున్నది. కాబట్టి నమాజీలు ఈ మస్నూన్ దుఆలలో ఏదో ఒక దానిని అప్పుడప్పుడూ చదువుతూ ఉండటం మంచిది.

(٢٣٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ إِذَا قَامَ إِلَى الصَّلَاةِ يُكَبِّرُ حِيْنَ يَقُوْمُ، ثُمَّ يُكَبِّرُ حِيْنَ يَرْكَعُ، ثُمَّ يَقُولُ: سَمِعَ اللَّهُ لِمَنْ حَمِدَهُ، حِيْنَ يَرْفَعُ صُلْبَهُ مِنَ الرَّكُوعِ، ثُمَّ يَقُولُ وَهُوَ قَائِمٌ. رَبَّنَا وَلَكَ الْحَمْدُ، ثُمَّ يُكَبِّرُ حِيْنَ يَهْوِي سَاجِداً، ثُمَّ يُكَبِّرُ حِيْنَ يَرْفَعُ رَأْسَهُ، ثُمَّ يُكَبِّرُ حِيْنَ يَسْجُدُ. ثُمَّ يُكَبِّرُ حِيْنَ يَرْفَعُ، ثُمَّ يَفْعَلُ ذَلِكَ فِي الصَّلَاةِ كُلِّهَا، وَيُكَبِّرُ حِيْنَ يَقُوْمُ مِنَ الثِّنْتَيْنِ بَعْدَ الْجُلُوسِ. مُتَّفَقٌ عَلَيْهِ.

232. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ కొరకు నిలబడగానే అల్లాహు అక్బర్ అని పలికేవారు. రుకూలోకి వెళుతున్నప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని అనేవారు. రుకూచేసి నిలబడే సమయంలో 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని చెప్పి నిలబడేవారు. అలా నిలబడిన మీదట 'రబ్బనా వలకల్ హమ్ద్' అని పలికేవారు. సజ్దా స్థితిలోకి వెళుతున్నప్పుడు తక్బీర్ పలికి సజ్దా కొరకు వంగేవారు. సజ్దా నుండి లేస్తూ కూడా అల్లాహు అక్బర్ అనేవారు. తిరిగి సజ్దాలోకి వెళుతూ అల్లాహు అక్బర్ అనేవారు. మళ్లీ సజ్దానుండి తల ఎత్తేటప్పుడు కూడా అల్లాహు అక్బర్ అనేవారు. తరువాత నమాజ్ అంతా ఇలాగే చేసేవారు. రెండవ రకత్ (పూర్తయిన) తరువాత తషహ్హుద్ చదివి లేచేటప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని పలికేవారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

నమాజ్‌లో పలకబడే మొట్టమొదటి తక్బీర్‌ను 'తక్బీరె తహ్రీమా' లేక 'తక్బీరె ఊలా' అంటారు. ఈ తక్బీర్ పలకగానే మనిషి నమాజ్‌లో ప్రవేశిస్తాడు. ఆ క్షణంనుంచీ నమాజ్ ముగించే వరకూ సాధారణ సమయాలలో అతని కొరకు హలాల్ అయివున్నవన్నీ ఇప్పుడు 'హరామ్' అయిపోతాయి. మిగిలిన తక్బీర్‌లను 'తక్బీరాతె ఇన్తిఖాల్' గా వ్యవహరిస్తారు. అంటే మనిషి నమాజ్‌లో ఒక రుకున్‌లోనుంచి మరో రుకున్‌లోకి బదిలీ అవుతూ తక్బీర్ పలకటం వల్ల 'ఇన్తిఖాల్' అనే పదం ఉపయోగించబడింది. ఇన్తిఖాల్ అంటే బదిలీ, ప్రస్థానం అనే అర్థాలువస్తాయి. నమాజ్‌లో మొదటి తక్బీర్ ఫర్జ్ (విధి)కాగా, మిగిలిన తక్బీర్‌లను కొందరు వాజిబ్ (తప్పనిసరి) గా భావించారు. కాని అధిక సంఖ్యాకులు వీటిని మస్నూన్ (సంప్రదాయం)గా భావించారు.

బనూ ఉమయ్యా పరిపాలనా కాలంలో కొంతమంది అధికార్లు ఈ తక్బీర్‌లను అప్రస్తుత మైనవిగా భావించి వాటిని పరిత్యజించసాగారు. కాని ఆ కాలంలో తాబయీలు, ధర్మవేత్తలు సంస్కరణకు నడుం బిగించి ఈ తక్బీర్ల ప్రాముఖ్యతను గురించి ప్రజలకు బోధపర్చారు. ఆ విధంగా వారు దైవప్రవక్త (స) ఆచార సంప్రదాయాల పరంపర తెగిపోకుండా కాపాడారు. ఆ మాటకు వస్తే అన్ని కాలాల్లోనూ సత్యప్రేమికులయిన పండితులు, ధర్మవేత్తలు తమ గురుతర బాధ్యతను గుర్తెరిగి, దురాచారాలకు లోనవుతున్న ప్రజాబాహుళ్యాన్ని దైవప్రవక్త (స) విధానం వైపునకు మరల్చాలి. ధర్మంలో కొత్త పుంతలు తొక్కే పరిపాలకులకు కళ్ళెం వేయాలి. దీనికొరకు వారు ప్రజాచైతన్యాన్ని మేల్కొలుపుతూ ఉండాలి.

(٢٣٣) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ قَالَ: «**اللَّهُمَّ رَبَّنَا لَكَ الْحَمْدُ مِلْءَ السَّمٰوَاتِ وَالْأَرْضِ، وَمِلْءَ مَا شِئْتَ مِنْ شَيْءٍ بَعْدُ، أَهْلَ الثَّنَاءِ وَالْمَجْدِ، أَحَقُّ مَا قَالَ الْعَبْدُ – وَكُلُّنَا لَكَ عَبْدٌ – اللَّهُمَّ**

233. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) రుకూ నుండి తన తలను ఎత్తినపుడు ఈ దుఆ పఠించేవారు - "అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్దు మిల్ అస్సమావాతి వల్ అర్జి వ మిల్అ మాషీత మిన్ షయ్యిన్ బాదు, అహ్లస్సనాయి వల్ మజ్ది అహక్కు మా ఖాలల్ అబ్దు.- వ కుల్లునా లక అబ్దున్ -అల్లాహుమ్మ లా మానిఅ లిమా ఆతైత వలా మూతియ లిమా మనాత వలా యన్ఫవు జల్‌జద్ది మిన్కల్ జద్దు." (ముస్లిం) (అర్థం: ఓ అల్లాహ్! మా ప్రభూ! ప్రశంస కేవలం నీ కొరకే. భూమ్యాకాశాలు నిండిపోయేంత ప్రశంస! ఆ తరువాత నీవు కోరిన ప్రతిదీ నిండిపోయేంత ప్రశంస (నీకు మాత్రమే

لاَ مَانِعَ لِمَا أَعْطَيْتَ، وَلا مُعْطِيَ لِمَا مَنَعْتَ، وَلاَ يَنْفَعُ ذَا الجَدِّ مِنْكَ الجَدُّ». رَوَاهُ مُسْلِمٌ.

శోభిస్తుంది). ఓ ఘనతకు, మరియు పొగడ్తలకధిపతీ! దాసులు పొగిడే ప్రతి దానికీ నీవు అర్హుడవు. అందరూ నీ దాసులే. ఓ అల్లాహ్! నీవు ఏది ప్రసాదించినా దాన్ని ఎవరూ అడ్డుకోజాలరు. మరి నీవు దేనిని ఇవ్వకున్నా దానిని ఇతరులెవరూ ఇవ్వజాలరు. ఇంకా - ఎవరి పెద్దరికం, ఐశ్వర్యం కూడా నీ శిక్ష ముందు వారికి లాభం చేకూర్చలేవు)

**సారాంశం**

రుకూ చేసి నిలబడిన తరువాత (ఖౌమ స్థితిలో) ఈ దుఆ చేయటం సంప్రదాయం అన్నదానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. ఈ దుఆ కేవలం నఫిల్ నమాజుకే ప్రత్యేకం అని వాదించే వారివద్ద ఏ నిదర్శనమూ లేదు. అది వారు ఏర్పరచుకున్న భావం మాత్రమే. 'ముస్లిం'లో పొందుపరచబడి వున్న బరా బిన్ ఆజిబ్ (రహ్మ్) ఉల్లేఖనం ఈ ఊహను పటాపంచలుచేస్తుంది. ఫర్జ్ నమాజులో ఈ దుఆ చేసినట్టు రుజువు ఉందని ఈ ఉల్లేఖనం స్పష్టం చేసింది.

అదీగాక ఈ దుఆలోని "వలా యన్ఫవు జల్‌జద్ది మిన్కల్ జద్దు" వాక్యం ద్వారా తేటతెల్లమై పోయింది- భూమ్యాకాశాల సృష్టికర్త సమక్షంలో మానవుని సిరిసంపదలు, ఆస్తి అంతస్థులు, అధికారాలు, అట్టహాసాలు దేనికీ పనికిరావని! అతని వంశపరంపరగానీ, అతని కులగోత్రాలు గానీ మనిషిని కాపాడలేవు. కేవలం అతని సదాచరణలు, అతనిలోని దైవభక్తి మాత్రమే అతన్ని రక్షిస్తాయి. ఒకరు ఉన్నత కుటుంబీకుడైనంత మాత్రాన, పుణ్యపురుషుని పుత్రరత్నమైనంత మాత్రాన దైవాగ్రహం నుండి తప్పించుకోలేడు. ఒకవేళ అదే సాధ్యమై ఉంటే దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) కుమారుడు, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) తండ్రి, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి పినతండ్రి అబూతాలిబ్‌లు కూడా దేవుని శిక్షనుండి తప్పించుకోగలిగేవారు. మహాప్రవక్త (స) తన కుటుంబీకులను పిలిపించి, సత్కార్యాలు చేయమనీ, తాను దైవ సమక్షంలో ఏ విధంగానూ సహాయపడలేనని స్పష్టం చేశారు. కన్న కూతురు హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) ను పిలిచి ఆయన (స) ఇలా ఉపదేశించారు: "ఫాతిమా! నీవు అంతిమ దైవప్రవక్త (స) పుత్రికనన్న భ్రమలో పడి ఉండకు. నేను నిన్ను దైవశిక్షనుండి ఏ విధంగానూ కాపాడలేను. కేవలం నా కూతురైనంత మాత్రాన నీవు దేవుని పట్టునుండి బయటపడలేవు. సదాచరణ చెయ్యి. అది మాత్రమే నిన్ను దైవశిక్షనుండి కాపాడవచ్చు."

చూశారా ! వజ్రసంకల్పులైన దైవప్రవక్తలే తమ ఆప్తులను దేవుని పట్టునుండి కాపాడలేనపుడు, అంతిమ దైవ సందేశహరులు (సఅసం) సయితం తన సంతానానికి అభయం ఇవ్వలేనపుడు తమ తాత ముత్తాతల ఘనకార్యాల ఆధారంగా దైవసమక్షంలో ఇట్టే ఉత్తీర్ణులవగలమని ఎవరైనా ఎలా దావా చేయగలరు?

ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే నమాజ్‌లో (ఖౌమాలో) నిటారుగా నిలబడటంతోనే సరిపోదు, మస్నూన్ దుఆలలో ఏదైనా ఒకటి పఠించాలి.

(٢٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **أُمِرْتُ أَنْ أَسْجُدَ عَلَى سَبْعَةِ أَعْظُمٍ: عَلَى الجَبْهَةِ – وَأَشَارَ بِيَدِهِ إِلَى أَنْفِهِ – وَالْيَدَيْنِ، وَالرُّكْبَتَيْنِ وَأَطْرَافِ الْقَدَمَيْنِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

234. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "నాకు ఏడు ఎముకల (అవయవాల) ఆధారంగా 'సజ్దా' చేయమని ఆదేశించ బడింది - తన చేతుల సైగతో తెలిపారు- నుదురు మరియు ముక్కు, రెండు చేతులు, రెండు మోకాళ్లు, రెండు పాదాలు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నుదురు మరియు ముక్కు - రెండూ కలిపి ఒకే ఎముక (శరీరావయవం)గా పరిగణించ బడిందని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఒకవేళ వాటిని వేర్వేరుగా లెక్కిస్తే మొత్తం ఎనిమిది అవయవాలు అవుతాయి. అందుచేత ఆ రెంటినీ ఒకే భాగంగా లెక్కించటం జరిగింది. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ షాఫయీలతో పాటు ఇమామ్ అబూ హనీఫా గారి ప్రియ శిష్యులైన ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌లు కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. కేవలం నుదురు లేక కేవలం ముక్కును నేలకానించి చేసే సజ్దా అసంపూర్ణ సజ్దా అవుతుంది. దీనికి భిన్నంగా ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అవి రెండూ వేర్వేరు శరీర భాగాలని అన్నారు. ఆ రెంటిలో ఏ ఒక్క శరీర భాగం నేలకు ఆనినా సజ్దా అయిపోతుందని, అందులో ఎలాంటి వెలితి ఉండబోదని ఆయన వ్యాఖ్యానించారు.

అయితే ఇది అధికసంఖ్యాకుల అభిప్రాయానికి భిన్నంగా ఉంది. ముగ్గురు ఇమాములు మరియు ఇద్దరు హనఫీ ఇమాములు ఒక వైపు ఉండగా ఒక్క అబూ హనీఫా (రహ్మ.లై) గారే తనదైన అభిప్రాయంపై నిలిచివున్నారు. పైగా ఆయన అభిప్రాయం పై హదీసుకు విరుద్ధంగా ఉంది. అందుచేత ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి అభిప్రాయం బలహీనమైనది. ఇబ్నె అబీ షైబాలో హజ్రత్ ఇక్రిమ (రజి)చే ఉల్లేఖించబడిన ఒక హదీసు ఇలా వుంది: దైవప్రవక్త (స) ఒక వ్యక్తి నమాజ్ చేస్తున్న వైపునుంచి సాగిపోతున్నారు. అతని ముక్కు నేలకు తగలటంలేదు. అప్పుడాయన (స) ఇలా అన్నారు - "ఎవరి నుదురు మరియు ముక్కు నేలకు ఆనలేదో వారి నమాజ్ నెరవేరదు" అంటే సజ్దా స్థితిలో నుదుటితో పాటు ముక్కు కూడా నేలకు తగలటం అవసరం అన్నమాట!

(٢٣٥) وَعَنِ ابْنِ بُحَيْنَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا صَلَّى وَسَجَدَ، فَرَّجَ بَيْنَ يَدَيْهِ حَتَّى يبدو بَيَاضُ إِبطَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

235. హజ్రత్ ఇబ్నె బుహైన (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ సందర్భంగా సజ్దా చేసినప్పుడు తన రెండు భుజాలను తన రెండు ప్రక్కలనుండి వేరుగా ఉంచే వారు - ఆ స్థితిలో ఆయన (స) చంకల తెలుపుదనం సయితం కనిపించేది."

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

అంటే దైవప్రవక్త (స) సజ్దా స్థితిలో ముడుచుకుపోకుండా తన రెండు చేతులను కొంత విస్తరింపజేసేవారు. ఆ స్థితిలో ఆయన (స) చంకల తెలుపుదనం సయితం కానవచ్చేది. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ తబ్రీ తదితరులు ఇలా అంటున్నారు: దైవప్రవక్త (స) గారి చంకలు శరీరంలోని ఇతర అవయవాల్లా తెల్లగా ఉండేవి - నల్లగా ఉండేవి కావు. ఆయనలోని ఇతర ప్రత్యేకతల మాదిరిగా ఇది కూడా ఒక ప్రత్యేకతే అనుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

ఇబ్నె బుహైన (రజి) గారి పూర్తి పేరు అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ బిన్ ఖిష్బ్. బుహైన అనేది ఆయన తల్లి పేరు. తల్లి పేరుతోనే ఆయన ప్రసిద్ధిచెందారు. తండ్రిపేరు మాత్రం మాలిక్. తొల్దొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. కఠోర అభ్యాసాలు జరిపేవారు. అత్యధికంగా ఉపవాసాలు పాటించేవారు. ఇహలోకంతో నామమాత్రపు సంబంధం పెట్టుకునేవారు. మదీనాకు 30 మైళ్ళ దూరంలో వున్న రిమ్ లోయలో హిజ్రీ 54 - 58 మధ్య కాలంలో మరణించారు.

(٢٣٦) وَعَنِ الْبَرَاءِ بْنِ عَازِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا سَجَدْتَ فَضَعْ كَفَّيْكَ، وَارْفَعْ مِرْفَقَيْكَ». رَوَاهُ مُسْلِمٌ.

236. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) తెలిపారు: "నీవు సజ్దా చేసినపుడు నీ అరచేతులను నేలకు ఆనించు, మోచేతులను పైకి లేపు."

(ముస్లిం)

### సారాంశం

సజ్దా స్థితిలో రెండు చేతులను నేలపై పరచటంగానీ, మోచేతులను తొడలకు ఆనించి అలసట తీర్చుకోవటం వంటివి గానీ చేయరాదనీ పై హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. దైవప్రవక్త (స) గారు ఏ విధంగా నమాజ్ చేశారో ఆ విధంగానే మనం కూడా నమాజ్ చేయాలి.

### హదీసు ఉల్లేఖకులు

బరా బిన్ ఆజిబ్ (రజి) మరో పేరు అబూ అమ్మార. తండ్రి పేరు ఆజిబ్ బిన్ హారిస్ బిన్ అదీ. అన్సార్‌కు చెందిన ఔస్ తెగతో ఈయనకు సంబంధం ఉండేది. తండ్రీ కొడుకులిరువురూ సహాబీలే. బరా బిన్ ఆజిబ్ పిన్న వయస్సు మూలంగా బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. ఉహుద్ సంగ్రామంలోనో, కందక యుద్ధంలోనో తొలిసారిగా యుద్ధరంగ ప్రవేశం చేశారు. రే' ను జయించారు. జమల్, సిఫ్ఫీన్, నహర్ వాన్ యుద్ధాలలో హజ్రత్ అలీ (రజి) మద్దతుదారునిగా నిలిచారు. కూఫాలో హిజ్రీ 72లో మరణించారు.

(٢٣٧) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ

237. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రుకూలో ఉన్నప్పుడు తన

اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَكَعَ فَرَّجَ بَيْنَ أَصَابِعِهِ، وَإِذَا سَجَدَ ضَمَّ أَصَابِعَهُ. رَوَاهُ الْحَاكِمُ.

(చేతి) వ్రేళ్లను విప్పి (చాచి) ఉంచేవారు. మరదే సజ్దా స్థితిలో మాత్రం తన (చేతి) వ్రేళ్లను పరస్పరం కలిపి ఉంచేవారు." (ముస్తద్రక్ హాకిమ్)

**సారాంశం**

రుకూ మరియు సజ్దాల స్థితిలో చేతివ్రేళ్లు ఎలా ఉండాలో ఈ హదీసు మనకు చెబుతోంది. రుకూలో నుండగా చేతి వ్రేళ్లను విడిగా నుంచటం మస్నూన్. మరదే సజ్దాలోనయితే రెండు చేతుల వ్రేళ్లను పరస్పరం కలిపివేయాలి. ఎందుకంటే ఆ స్థితిలో వ్రేళ్లు కాబా దిశలో ఉండగలగటానికి అలా చేయాలి.

(٢٣٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي مُتَرَبِّعاً. رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

238. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను కాళ్లు మడత పెట్టుకుని కూర్చుని నమాజ్ చేయగా చూచాను." (నసాయి దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) గుఱ్ఱంపై నుంచి క్రిందపడి కాలికి దెబ్బ తగిలిన తరువాత చేసినప్పటి నమాజ్‌కు సంబంధించినది ఈ హదీసు. దీన్నిబట్టి బోధపడేదేమంటే మనిషి ఏ కారణంగానయినా సాధారణ స్థితిని కోల్పోయినపుడు షరీయత్ అతన్ని తదనుగుణమైన రీతిలో నమాజ్‌ను నెరవేర్చేందుకు అనుమతినిస్తుంది.

(٢٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقُولُ بَيْنَ السَّجْدَتَيْنِ: **اَللَّهُمَّ اغْفِرْ لِي، وَارْحَمْنِي،**

239. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు సజ్దాల మధ్య ఈ దుఆ చేసేవారు : "అల్లాహుమ్మగ్‌ఫిర్లీ వర్‌హమ్నీ వహ్‌దినీ వ ఆఫినీ వర్‌జుఖ్‌నీ" (ఓ అల్లాహ్! నన్ను క్షమించు. నాకు సన్మార్గం చూపు. నా తప్పులను మన్నించు. ఇంకా నాకు (ధర్మసమ్మత మయిన) ఉపాధిని ప్రసాదించు) (దీనిని

وَاهْدِنِي، وَعَافِنِي، وَارْزُقْنِي. رَوَاهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَاللَّفْظُ لِأَبِي دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

'నలుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖిం చారు. వాక్యాలు మాత్రం అబూ దావూద్ లోనివి. హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) నమాజ్‌లో వివిధ సందర్భాలలో వివిధ వేడుకోళ్లు చేసేవారు. రెండు సజ్దాల మధ్య - 'జల్సా' స్థితిలో - ఆయన ఈ 'దుఆ' చేశారు. కనుక మనం కూడా నమాజులో ఈ చిన్న దుఆను చేయటం మస్నూన్ (సంప్రదాయం).

(٢٤٠) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ يُصَلِّي، فَإِذَا كَانَ فِي وِتْرٍ مِنْ صَلاَتِهِ لَمْ يَنْهَضْ حَتَّى يَسْتَوِيَ قَاعِداً. رواه البخاري.

240. తాను దైవప్రవక్త (సఅసం)ను నమాజ్ చేస్తుండగా చూచానని హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) చెప్పారు: "ఆయన (స) తన నమాజులోని వితర్ (రకత్)ను చేసినప్పుడు (ముందు కాస్సేపు) కూర్చొని తరువాత తిన్నగా నిలబడేవారు." (బుఖారీ)

**సారాంశం**

ఇలా కూర్చోవటాన్ని "జల్సయే ఇస్తిరాహత్" అంటారు. ఇమామ్ షాఫయి దీనికి అనుకూలంగా ఉన్నారు. కాని ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా దీనికి అనుకూలంగా లేరు. వృద్ధాప్యం వల్ల దైవప్రవక్త (స) అలా విరామం పాటించేవారని వీరిద్దరి వాదన. అయితే ఈ హదీసును ఉల్లేఖించిన మాలిక్ (రజి) మరియు ఆయన మిత్రబృందాన్ని ఉద్దేశ్యించి దైవప్రవక్త (స) ఖుద్దుగా ఇలా అన్నారు: నేను ఏవిధంగా నమాజ్ చేస్తుండటాన్ని మీరు చూచారో ఆ విధంగానే నమాజ్ చేయండి." ఈ హదీసు వెలుగులో ఏది మంచిదో మీరే ఆలోచించండి!

(٢٤١) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَنَتَ شَهْراً بَعْدَ الرُّكُوعِ، يَدْعُوْ عَلَى أَحياءٍ من أَحْيَاءِ الْعَرَبِ، ثُمَّ تَرَكَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

241. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పూర్తిగా నెల రోజులపాటు రుకూ అనంతరం 'దుఆయే ఖునూత్' చదివారు. ఆ తరువాత వదిలేశారు."

(బుఖారీ, ముస్లిం)

وَلِأَحْمَدَ وَالدَّارَقُطْنِيِّ نَحْوُهُ مِنْ وَجْهٍ

అహ్మద్, దారె ఖుత్నీ తదితరులు మరో విధంగా దీనిని ఉల్లేఖించారు. అందులో

آخَرَ، وَزَادَ: فَأَمَّا فِي الصُّبْحِ فَلَمْ يَزَلْ يَقْنُتُ حَتَّى فَارَقَ الدُّنْيَا.

వారు అదనంగా ఇలా పేర్కొన్నారు - "ఉదయం నమాజ్‌లో దుఆయే ఖునూత్‌ను జీవితాంతం చేశారు."

## పూర్వాపరాలు

దైవధర్మ ప్రచారం నిమిత్తం పంపబడిన రెండు సహచర బృందాలను శత్రువులు మోసగించి, దగాచేసి చంపినందుకుగాను దైవప్రవక్త (సఅసం) శోకసంతప్త హృదయంతో - శపిస్తూ చేసిన దుఆ ఇది.

అది హిజ్రీ 4వ సంవత్సరం సఫర్ మాసం - అరేబియాలోని కొన్ని తెగలవారు చేసిన అభ్యర్థనపై- వారికి ధర్మాదేశాలు బోధించడానికిగాను దైవప్రవక్త 70 మంది ఖుర్‌ఆన్ బోధకులను ఆ తెగలవారి వద్దకు పంపారు. రీల్, జక్వాన్, ఉసైయ వంటి తెగలు నమ్మకద్రోహానికి పాల్పడి ఎంతో విలువైన ప్రవక్త ప్రియ సహచరులను చుట్టుముట్టి నరమేధం సృష్టించారు. వారిలో ఒక్క కాబ్ బిన్ జైద్ (రజి) మాత్రమే ఎలాగో బయటపడగలిగారు.

అలాగే బనూ లిహ్యాన్ దరఖాస్తుపై దైవప్రవక్త (స) పదిమంది విద్వాంసులను ధర్మోపదేశం నిమిత్తం పంపగా ఆ తెగకూడా విశ్వాసఘాతుకానికి పాల్పడి హత్యాకాండ చేసింది. ఇద్దరు సహాబీలు ప్రాణాలతో బయటపడగలిగారు. ఈ రెండు విషాదాంతాల సమాచారం దైవప్రవక్త (సఅసం)కు ఒకే రాత్రి అందింది. ఆయన (స) మనసు బాధతో తల్లడిల్లిపోయింది. అందుచేత ఆయన నెలరోజులపాటు వారిని శపిస్తూ దైవాన్ని ప్రార్థించారు. ఇటువంటి దుఆయె ఖునూత్‌ను 'ఖునూతె నాజిలా' అంటారు. ఇటువంటి ప్రార్థనలు వ్యధాభరితమయిన ఉదంతాలు జరిగినపుడు, జాతి భయంకరమయిన విపత్తులకు లోనయినపుడు చేయబడతాయి.

## సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు చర్చకు వస్తాయి. ఫజ్ర్ నమాజ్‌లో ఆయన (స) 'దుఆయె ఖునూత్' చేసినట్టు రుజువవుతున్నది. వాగ్దాన భంగానికి పాల్పడి తన సహచరులను హతమార్చినందుకు గాను అవిశ్వాసులను ఆయన (స) నెలరోజులపాటు శపించారు. అంటే ఫర్జ్ నమాజులో (సామూహిక నమాజులో) ఆయన ఈ విధంగా చేశారు. రుకూ చేసి నిలబడిన తరువాత ఈ దుఆ చేశారన్నది గమనార్హం.

దీనిద్వారా తెలిసే మరో విషయం ఏమిటంటే ఇస్లాం ధర్మం మానవులందరికీ పరిచయం చెయ్యవలసిన ధర్మం. ఇందునిమిత్తం ధర్మప్రచారకుల సమూహం (బృందం) ఒకటి నిత్యం సిద్ధంగా ఉండాలి. ఎక్కడెక్కడ దీని అవసరముంటే అక్కడ ఆ జమాఅత్‌ను పంపి సందేశ ప్రచార బాధ్యతను నిర్వర్తిస్తూ ఉండాలి. ఈ విధి నిర్వహణ నిమిత్తం ఒక జమాఅత్ ఉండాలనీ, దానికొక అమీర్ (నాయకుడు) ఉండాలని కూడా సంకేతం లభిస్తున్నది.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే మరో ముఖ్య విషయం ఏమిటంటే దైవప్రవక్త (స)కు 'అగోచర జ్ఞానం' లేదు. కొంతమంది చెబుతున్నట్లు ఆయన (స) కు అగోచర జ్ఞానం (ఇల్మె గైబ్)

గనక ఉండి ఉంటే తన ప్రియ సహచరులను హంతకులకు ఎందుకు అప్పజెప్పేవారు? తెలిసీ ఆయన (స) అలా చేస్తారా? (దైవం మన్నించుగాక!) దేవుని తరపున ఈ సమాచారం అందేవరకు ఆయన (స)కు హతుల గురించి ఏమీ తెలీదాయె!

హనఫీ మస్లక్ ననుసరించేవారు ఈ హదీసు వెలుగులో అవసరం ఏర్పడినపుడు 'ఖునూతె నాజిలా' చేయవచ్చని అంగీకరిస్తారు. కాగా; ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఫజ్ర్ నమాజ్‌లో నిత్యం దుఆయె ఖునూత్ చదవాలంటారు. దీన్ని ఆయన 'మస్నూన్'గా ఖరారు చేశారు. ఈ దుఆచేసే పద్ధతి ఏమిటంటే; ఇమామ్ రుకూ తరువాత చేతులెత్తి ఖునూతె నాజిలా పఠిస్తుండగా వెనుకనున్నవారు 'ఆమీన్' పలకాలి.

(٢٤٢) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ لَا يَقْنُتُ إِلاَّ إِذَا دَعَا لِقَوْمٍ أَوْ عَلَى قَوْمٍ. وَصَحَّحَه ابْنُ خُزَيْمَةَ.

242. హజ్రత్ అనస్ (రజి) గారి చేతనే మరో ఉల్లేఖనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏదేని ఒక జాతి కోసం ప్రార్థన చేయవలసివుంటే లేదా ఎవరి నయినా శపించవలసి ఉంటేనే 'ఖునూత్' పఠించేవారు. లేకుంటే పఠించేవారు కాదు." (ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ఈ హదీసులలో వైరుధ్యం, వ్యాఘాతం ఉన్నట్లు పైకి కనిపిస్తోంది. ఫజ్ర్‌లో ఖునూత్ నిత్యం పఠించాలని మొదటి హదీసులో చెప్పబడింది. ఏదేని జాతి ప్రయోజనాన్ని ఆశించో, లేక దాని వినాశాన్ని కాంక్షించో ఖునూత్ పఠించేవారని రెండవ హదీసులో ఉంది. రాబోయే హదీసులో - ఫజ్ర్ నమాజ్‌లో ఖునూత్ పఠించటం 'వినూత్న విషయం' (కొత్తపుంత) అని వుంది. వీటి మధ్య పొంతన ఈ విధంగా ఉండవచ్చు!

ఆయన (స) మరియు ఖులఫాయె రాషిదీన్ ఫజ్ర్ నమాజులో ఖునూత్‌ను పఠిస్తూ ఉన్నారు. రాబోయే హదీసులో అది 'కొత్త విషయం'గా పేర్కొనబడిందంటే దాని భావం ఉదయం నమాజులో నిరంతరం - నాగా లేకుండా - అలా జరగలేదన్నది కావచ్చు. అంటే ఈ పద్ధతిని మస్నూన్‌గా ఖరారు చేయటం 'కొత్త పోకడ' అన్నది దీని మతలబు కావచ్చు! అంటే ఫజ్ర్ నమాజులో నాగాలేకుండా - అవసరం లేకపోయినప్పటికీ - ఖునూత్ చదవవలసిన పనిలేదు అని భావం!

అయితే ఏ హదీసులో - ఫజ్ర్ నమాజ్‌లో - నిత్యం ఖునూత్ చదవాలని ఉందో, దాని భావం మాత్రం సుస్పష్టమే - ఖునూత్ ఎప్పటికీ రద్దుకాలేదని ఇది చెబుతోంది. అవసరం ఏర్పడినప్పుడల్లా ఆయన (స) ఖునూత్ చదువుతూ ఉండేవారు.

ఏ హదీసులో ఒకరి శ్రేయాన్ని కోరి లేక ఒకరి వినాశాన్ని వాంఛించి ఖునూత్ పఠించేవారని వుందో అది తాత్కాలిక స్థితిని సూచిస్తోంది. అంటే అవసరార్థం దుఆ చేయటమో, శపించటమో

చేసేవారన్నమాట! హనఫీ ఫికహ్ ననుసరించేవారు దీనినే అవలంబిస్తున్నారు. ఒక్క వితర్ నమాజ్‌లో తప్ప మరే నమాజులోనయినా - నిత్యం ఖునూత్ పఠించాలన్న వాదనకు హనఫీ ధర్మవేత్తలు సుముఖంగా లేరు. ముస్లింలపై ఏదన్నా ఆపద ముంచుకువస్తే, ఉదాహరణకు శత్రువు వారి రాజ్యాన్ని కబళిస్తే, ఏదయినా మహమ్మారి ప్రబలిపోతే, దుర్భిక్షం తాండవిస్తే అట్టి పరిస్థితిలో హనఫీలు కూడా ఐదు పూటలా నమాజులో ఖునూత్ పఠించటం 'మస్నూన్' గా భావిస్తున్నారు.

(٢٤٣) وَعَنْ سَعْدِ بْنِ طَارِقٍ ٱلْأَشْجَعِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ لِأَبِي: يَا أَبَتِ! إِنَّكَ قَدْ صَلَّيْتَ خَلْفَ رَسُولِ اللهِ ﷺ وَأَبِي بَكْرٍ وَعُمَرَ وَعُثْمَانَ وَعَلِيٍّ، أَفَكَانُوا يَقْنُتُونَ فِي الْفَجْرِ؟ قَالَ: أَيْ بُنَيَّ مُحْدَثٌ. رَوَاهُ ٱلْخَمْسَةُ إِلاَّ أَبَا دَاوُدَ.

243. హజ్రత్ సాద్ బిన్ తారిఖ్ అష్‌జయి (రజి) కథనం: "నాన్నా! మీరు దైవప్రవక్త (సఅసం), అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), అలీ (రజి)ల వెనుక నమాజ్ చేసివున్నారు కదా! వీళ్లంతా ఫజ్ర్ నమాజ్‌లో దుఆయే ఖునూత్ పఠించేవారా?!" అని నేను నా తండ్రిని అడిగాను. "అబ్బాయి! ఇదొక క్రొత్త విషయం (బిద్‌అత్)" అని ఆయన నాకు జవాబు ఇచ్చారు." ('ఐదుగురి'లో అబూదావూద్ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు)

## సారాంశం

ఈ హదీసును ఆధారంగా తీసుకుని నమాజ్‌లో ఖునూత్ పఠించటం 'బిద్‌అత్' అని ఎవరయినా అంటే అది సరికాదు. దీనికి సంబంధించిన వివరణ మేమింతకు ముందే ఇచ్చాము. నిత్యం, ఎడతెగకుండా ఖునూత్ పఠించనవసరం లేదన్న భావంలో ఈ హదీసు ఉంది. అంతేగాని ఇది పూర్తిగా ఖునూత్‌ను త్రోసిపుచ్చటం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

1. సాద్ (రహ్మ.లై) : పూర్తిపేరు సాద్ బిన్ తారిఖ్ బిన్ అష్‌యమ్ బిన్ మస్‌వూద్ అష్‌జయి (రజి). మారుపేరు అబూ మాలిక్. విశ్వసనీయులయిన తాబయీన్లలో ఒకరుగా పరిగణించ బడతారు. హిజ్రీ 140లో మరణించారు.

2. తారిఖ్ అష్‌జయి (రజి) : అంటే సాద్ (రహ్మ.లై) గారి తండ్రి. ప్రముఖ సహాబీలలో ఒకరు. ఈయన కేవలం 14 హదీసులు మాత్రమే అందజేశారు. ఈయన గారినుండి ఈయన కుమారుడు తప్ప వేరెవరూ హదీసులను సంగ్రహించలేదు. కూఫా వాసులుగా పరిగణించబడ్డారు.

(٢٤٤) وَعَنِ الْحَسَنِ بْنِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: عَلَّمَنِي رَسُولُ اللهِ ﷺ

244. హజ్రత్ హసన్ బిన్ అలీ (రజి) వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాకు కొన్ని వచనాలు నేర్పారు. నేను వాటిని వితర్‌లో

كَلِمَاتٍ أَقُولُهُنَّ فِي قُنُوتِ الْوِتْرِ: «اللَّهُمَّ اهْدِنِي فِيمَنْ هَدَيْتَ، وَعَافِنِي فِيمَنْ عَافَيْتَ، وَتَوَلَّنِي فِيمَنْ تَوَلَّيْتَ، وَبَارِكْ لِي فِيمَا أَعْطَيْتَ، وَقِنِي شَرَّ مَا قَضَيْتَ، فَإِنَّكَ تَقْضِي وَلاَ يُقْضَى عَلَيْكَ، إِنَّهُ لاَ يَذِلُّ مَنْ وَالَيْتَ، تَبَارَكْتَ رَبَّنَا وَتَعَالَيْتَ». رَوَاهُ الْخَمْسَةُ، وَزَادَ الطَّبْرَانِيُّ وَالْبَيْهَقِيُّ: «وَلاَ يَعِزُّ مَنْ عَادَيْتَ». زَادَ النَّسَائِيُّ مِنْ وَجْهٍ آخَرَ فِي آخِرِهِ: «وَصَلَّى اللَّهُ عَلَى النَّبِيِّ».

(దుఆయె ఖునూత్‌గా) పఠిస్తాను. ఆ వచనాలివి: "అల్లాహుమ్మహ్‌దినీ ఫీమన్ హదైత్. వ ఆఫినీ ఫీమన్ ఆఫైత్. వ తవల్లనీ ఫీమన్ తవల్లైత్. వ బారిక్‌లీ ఫీమా ఆతైత్. వఖినీ షర్ర మా ఖజైత్. ఫ యిన్నక తఖ్‌జీ వలా యుఖ్‌జా అలైక్. ఇన్నహు లా యజిల్లు మన్ వాలైత్. తబారక్త రబ్బనా వ తఆలైత్."

(అర్థం: ఓ అల్లాహ్! నాకు సన్మార్గం చూపి నీవు సన్మార్గం చూపిన వారి శ్రేణిలో నన్ను చేర్చు. నాకు రక్షణనిచ్చి నీవు రక్షణనిచ్చిన వారిలో నన్ను చేర్చు. ఎవరినయితే నీవు నీ నేస్తాలుగా ఖరారు చేశావో వారిలో నన్ను కూడా చేర్చి నీ నేస్తంగా చేసుకో. నీవు నాకు ప్రసాదించిన దానిలో వృద్ధి నొసగు. ఏ చెడు మరియు కీడుకు సంబంధించి నీవు నిర్ణయం గైకొన్నావో దాన్నుండి నన్ను సురక్షితంగా ఉంచు. నిశ్చయంగా నిర్ణయాన్ని జారీ చేసేవాడవు నీవే. నీకు వ్యతిరేకంగా నిర్ణయం జారీ చేయటం అసంభవం. ఎవరినయితే నీవు స్నేహితునిగా చేసుకున్నావో అతడు ఎన్నటికీ పరాభవానికి, అవమానానికి గురికాడు. ప్రభూ! నువ్వు మాత్రమే శుభాలు కలవాడవు, సర్వోన్నతుడవు) (దీనిని ఐదుగురు - అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు. తబ్రానీ మరియు బైహఖీలు "వలా యుయిజ్జు మన్ ఆదైత్" అనే వాక్యాన్ని

అదనంగా నకలు చేశారు. నసాయి మరో విధంగా ఈ దుఆ చివరిలో "వ సల్లల్లాహు అలన్నబీ" అనే వాక్యాన్ని అదనంగా ఉల్లేఖించారు.

وَلِلْبَيْهَقِي عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُنَا دُعَاءً نَدْعُوَ بِهِ فِي الْقُنُوتِ مِنْ صَلاةِ الصُّبْحِ. وَفِي سَنَدِهِ ضَعْفٌ.

బైహఖీలో ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది - "దైవప్రవక్త -సఅసం- మాకు దుఆ నేర్పేవారు. దానిని మేము ఉదయం నమాజులో 'దుఆయె ఖునూత్' రూపంలో చదివేవాళ్లం." (దీని ఆధారం బలహీనంగా ఉంది)

## సారాంశం

వితర్ నమాజులో ఈ దుఆ చేయాలని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ దుఆ రుకూకి ముందు, తరువాత - రెండు తరహాలుగా కూడా చేయవచ్చు. అయితే ముస్తద్రక్ హాకిమ్, బైహఖీలోని మాటల్ని బట్టి రుకూ తరువాత దుఆ చేయటమే సమంజసం. దుఆ చివరిలో నున్న "సల్లల్లాహు అలన్నబీ" వాక్యాన్ని కొంత మంది 'జయీఫ్' గా ఖరారు చేశారు. అయితే అల్లామా అల్-బానీ గారు ఈ అదనపు వాక్యాన్ని ప్రమాణబద్ధమైనదిగా వ్యాఖ్యానించారు.

ఇక నమాజె వితర్ స్థాయి ఏమిటీ? దాని రకత్‌లు ఎన్ని? అనే విషయంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. హనఫీ పుకహా దృష్టిలో ఈ నమాజ్ వాజిబ్ (తప్పనిసరి). కాగా; మిగిలిన వారందరి అభిప్రాయంలో ఇది సున్నత్.

రకతుల సంఖ్య గురించి కూడా అనేక ఉల్లేఖనాలున్నాయి. వివిధ ఉల్లేఖనాల ప్రకారం దీని సంఖ్య ఒకటి నుంచి పదకొండు వరకూ వుంది. హనఫీ పుకహా మూడు రకతుల వైపునకు మొగ్గు చూపారు. దీనిని నెరవేర్చే విధానంలో కూడా స్వల్పమయిన వ్యత్యాసం ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

హసన్ బిన్ అలీ (రజి) దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి ప్రియతమ మనవడు. స్వర్గలోకపు యువజన నాయకులలో ఈయన కూడా ఒకరు. హజ్రత్ హసన్ (రజి) హిజ్రీ 3లో జన్మించారు. తండ్రి అమరగతి నొందిన తరువాత ఈయన ముస్లిముల ఖలీఫాగా చేయబడ్డారు. కాని ఖలీఫాగా ఎన్నికయిన ఏడు మాసాల తర్వాత హిజ్రీ 41 జమాదుల్ ఊలాలో - హజ్రత్ ముఆవియాకు అనుకూలంగా ఆయన తన పదవిని త్యాగం చేశారు. ముస్లిముల మధ్య అంతర్గత వైషమ్యాలు పెచ్చరిల్లి రక్తపాతం జరగరాదన్నదే ఆయన నిర్ణయం వెనుక ముఖ్యోద్దేశ్యం. హిజ్రీ 49లో మరణించారు. జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٢٤٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا سَجَدَ أَحَدُكُمْ فَلاَ يَبْرُكْ كَمَا يَبْرُكُ الْبَعِيرُ، وَلْيَضَعْ يَدَيْهِ قَبْلَ رُكْبَتَيْهِ». أَخْرَجَهُ الثَّلاَثَةُ.

245. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవరయినా సజ్దా చేసినప్పుడు ఒంటె మాదిరిగా కూర్చోకండి. మోకాళ్ల కన్నా ముందుగా మీ చేతులను నేలపై ఆనించండి." (నసాయి, తిర్మిజీ, ఇబ్నె మాజ)

وَهُوَ أَقْوَى مِنْ حَدِيْثِ وَائِلِ ابْنِ حُجْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «رَأَيْتُ النَّبِيَّ ﷺ إِذَا سَجَدَ وَضَعَ رُكْبَتَيْهِ قَبْلَ يَدَيْهِ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ. فَإِنَّ لِلأَوَّلِ شَاهِداً مِنْ حَدِيْثِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ. وَذَكَرَهُ الْبُخَارِيُّ مُعَلَّقاً مَوْقُوفاً.

ఈ హదీసు వాయల్ బిన్ హుజ్ర్ (రజి) తరపున ఉల్లేఖించబడిన హదీసుకన్నా బలవత్తరమైనది. అందులో (వాయల్ హదీసులో) ఇలా వుంది: "నేను దైవ ప్రవక్త (స)ను సజ్దాలోకి వెళుతుండగా చూశాను - ఆయన (స) తన మోకాళ్లను చేతులకన్నా ముందుగా నేలపై ఆనిం చారు." (దీనిని నలుగురు - అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజా- ఉల్లేఖించారు. మొదటి హదీసుకు సాక్ష్యం ఇబ్నె ఉమర్ (రజి) హదీసు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. బుఖారీ దీనిని 'మౌఖూఫ్' అని చెప్పారు)

**సారాంశం**

హజ్రత్ వాయల్ (రజి) ఈ హదీసును ఒంటరిగా వివరించారు. హదీసును ఎవరయినా ఒంటరిగా చెప్పినపుడు - ఆ ఉల్లేఖనంపై హదీసు వేత్తలు తమ వ్యాఖ్యానాలు చేశారు. వాయల్ హదీసును హజ్రత్ అనస్ (రజి) గారి ఉల్లేఖనం ఒకటి సమర్థిస్తున్నప్పటికీ, దానిని అందజేసిన వారిలో ఒక వ్యక్తి అంతగా నమ్మకస్థుడు కాడు. కాబట్టి హజ్రత్ అబూహురైర (రజి)చే ఉల్లేఖించబడిన హదీసు ఎక్కువ ప్రామాణికమైనదనీ, అనుసరణీయమైనదనీ రూఢీ అయింది.

గ్రంథ రచయిత హాఫిజ్ ఇబ్నె హజర్ కూడా హజ్రత్ అబూ హురైర (రజి) హదీసునే అనుసరణీయమైనదిగా భావించారు. ఎందుకంటే ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం దీనిని సమర్థిస్తోంది. హదీసువేత్తలు, హంబలీ ఫికహ్ ననుసరించేవారు కూడా ఈ హదీసుకు అనుకూలంగా ఉన్నారు. అయితే హనఫీలు, షాఫయీలు మాత్రం హజ్రత్ వాయల్ (రజి) హదీసు వైపుకు మొగ్గు చూపారు. మొదట మోకాళ్లను నేలకు ఆనించాలని ఈ హదీసులో ఉంది.

(٢٤٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ كَانَ إِذَا قَعَدَ لِلتَّشَهُّدِ وَضَعَ يَدَهُ الْيُسْرَى عَلَى رُكْبَتِهِ الْيُسْرَى، وَالْيُمْنَى عَلَى الْيُمْنَى، وعَقَدَ ثَلَاثاً وَخَمْسِينَ، وَأَشَارَ بِإِصْبَعِهِ السَّبَّابَةِ. رَوَاهُ مُسْلِمٌ.

246. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తషహ్హుద్ కోసం (ఖాయిదాలో) కూర్చున్నప్పుడు తన ఎడమ చేతిని ఎడమ మోకాలిపై ఉంచేవారు. కుడి చేతిని తన కుడి మోకాలిపై ఉంచి, చేతి (నాలుగు) వ్రేళ్లను ముడుచుకునేవారు. చూపుడు వ్రేలితో సంజ్ఞ చేసేవారు."

(ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَهُ: وَقَبَضَ أَصَابِعَهُ كُلَّهَا، وَأَشَارَ بِالَّتِي تَلِي الْإِبْهَامَ.

ముస్లిం ఉల్లేఖించిన వేరొక ఉల్లేఖనం లో ఇలా వుంది: తన (కుడి చేతి) వ్రేళ్ల న్నింటినీ మూసివుంచి, బొటన వ్రేలికి దగ్గరలో వున్న వ్రేలితో (చూపుడు వ్రేలితో) సంజ్ఞ చేసేవారు."

**సారాంశం**

హదీసు మూలంలో '53ను పోలిన ముడి వేసేవార'ని ఉంది. చూపుడు వ్రేలిని చాచి, మిగిలిన మూడు వ్రేళ్ళను బొటన వ్రేలితో నొక్కి పట్టుకుంటే, అరబీ అంకెల ప్రకారం 53ను పోలిన రూపం వస్తుంది. ఖాయిదాలో దైవ ప్రవక్త (స) ఎలా చేసేవారో మనం కూడా అలాగే చేయాలి. దైవ ప్రవక్త (స) అనుసరణలో ఇది కూడా ఒక భాగమే కదా! తషహ్హుద్‌లో చూపుడు వ్రేలితో సంజ్ఞ చేయటంపై ఇమాములందరూ ఏకీభవించారు.

(٢٤٧) وَعَنْ عَبْدِاللهِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: الْتَفَتَ إِلَيْنَا رَسُولُ اللهِ ﷺ، فَقَالَ: «إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَقُلْ: «التَّحِيَّاتُ لِلهِ وَالصَّلَوَاتُ وَالطَّيِّبَاتُ، السَّلَامُ عَلَيْكَ أَيُّهَا النَّبِيُّ! وَرَحْمَةُ اللهِ وَبَرَكَاتُهُ، السَّلَامُ عَلَيْنَا وَعَلَى عِبَادِ اللهِ الصَّالِحِينَ،

247. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వైపు దృష్టిసారించి ఇలా ఉపదేశించారు - మీలో ఎవరయినా నమాజ్ చేసినపుడు 'తషహ్హుద్' లో ఇలా అనండి: సమస్త స్తోత్రాలు, పరిశుద్ధతలు, (సమస్త నోటి ఆరాధనలు, శారీరక ఆరాధనలు, ధనపరమైన ఆరాధనలు) కేవలం అల్లాహ్ కొరకే. ఓ ప్రవక్తా! మీపై శాంతి కలుగుగాక! దైవకారుణ్యం

أَشْهَدُ أَنْ لاَ إِلَه إِلاَّ اللَّهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّداً عَبْدُهُ وَرَسُولُهُ» ثُمَّ لِيَتَخَيَّرْ مِنَ الدُّعَاءِ أَعْجَبَهُ إِلَيْهِ، فَيَدْعُو». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

మరియు శుభాలు కలుగుగాక! మాపైన మరియు దేవుని సజ్జనులైన దాసులపైన కూడా శాంతి కలుగుగాక! అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్య మిస్తున్నాను. ముహమ్మద్ (సఅసం) దేవుని దాసుడు మరియు సందేశహరు డని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను." - ఆ తరువాత వారు 'దుఆ'ను ఎన్నుకో వాలి. తనకు అన్నిటికన్నా మంచిదనిపిం చిన దుఆ చేయాలి. (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

وَلِلنَّسَائِيِّ: «كُنَّا نَقُولُ قَبْلَ أَنْ يُفْرَضَ عَلَيْنَا التَّشَهُّدُ». وِلأَحْمَدَ: أَنَّ النَّبِيَّ ﷺ عَلَّمَهُ التَّشَهُّدَ، وَأَمَرَهُ أَنْ يُعَلِّمَهُ النَّاسَ.

'నసాయి'లో ఉంది: "తషహ్హుద్ విధించ బడక మునుపు మేము ఇది.... పఠించే వారము." అహ్మద్‌లో వుంది: "దైవప్రవక్త (స) వీళ్లకు తషహ్హుద్ నేర్పారు. ప్రజలకు దీన్ని నేర్పమని ఆజ్ఞాపించారు." ముస్లిం లో ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ఈ విధంగా ఉంది: "దైవప్రవక్త (సఅసం) మాకు తషహ్హుద్‌ను నేర్పేవారు. అది ఈవిధంగా ఉండేది-(అత్తహియ్యాతుల్ ముబార కాతు అస్సలవాతుత్తయ్యిబాతు లిల్లాహి.....)"

وَلِمُسْلِمٍ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُنَا التَّشَهُّدَ: «اَلتَّحِيَّاتُ الْمَبَارَكَاتُ الصَّلَوَاتُ الطَّيِّبَاتُ لِلهِ» إِلَى آخِرِهِ.

## సారాంశం

తషహ్హుద్ విధించబడక మునుపు ప్రవక్త సహచరులు "అస్సలాము అలల్లాహ్-అస్సలాము అలా జిబ్రయీల్ వ మేకాయీల్....." అని పఠించేవారు. దైవ ప్రవక్త (స) దీనిని వారించి 'అత్తహియ్యాత్ .....' నేర్పారు.

తషహ్హుద్ తరువాత దుఆ చేయటం 'మస్నూన్' అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఏ దుఆ చేయాలి? అన్న దానిపై ఎలాంటి షరతు లేదు. మనకు నచ్చిన దుఆ ఏదయినా చేయవచ్చు. అయితే దైవప్రవక్త (స) గారి దుఆలు చేయటం మంచిది. ఖుర్‌ఆనీ దుఆలు కూడా చేయవచ్చు. మన అవసరాలు, అక్కరలకు సంబంధించిన దుఆలు కూడా చేయవచ్చు.

తషహ్హుద్ వాజిబ్ (తప్పనిసరి) అని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. హజ్రత్ ఉమర్

(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి), ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) కూడా దీనిని వాజిబ్‌గానే తలంచారు. ఇతర విద్వాంసులు మాత్రం దీనిని ఫర్జ్ (విధి)గా పరిగణిస్తున్నారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖనంలోని తషహ్హుద్ వాక్యాలను ఇమామ్ అబూ హనీఫా సహా అనేక మంది విద్వాంసులు ఇష్టపడ్డారు. ఎందుకంటే తషహ్హుద్ అధ్యాయం క్రింద వచ్చిన ఉల్లేఖనాలన్నింటిలోకీ ఇది అత్యంత ప్రామాణికమైనది.

ఇమామ్ షాఫయి మాత్రం హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)చే ఉల్లేఖించబడిన తషహ్హుద్ వాక్యాలను అవలంబించారు.

(٢٤٨) وَعَنْ فَضَالَةَ بْنِ عُبَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعَ رَسُولُ اللهِ ﷺ رَجُلاً يَدْعُوْ فِي صَلاَتِهِ، وَلَمْ يَحْمَدِ اللَّهَ، وَلَمْ يُصَلِّ عَلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: عَجِلَ هَذَا، ثُمَّ دَعَاهُ، فَقَالَ: إِذَا صَلَّى أَحَدُكُمْ فَلْيَبْدَأْ بِتَحْمِيْدِ رَبِّهِ وَالثَّنَاءِ عَلَيْهِ، ثُمَّ يُصَلِّيْ عَلَى النَّبِيِّ ﷺ، ثُمَّ يَدْعُوْ بِمَا شَاءَ. رَوَاهُ أَحْمَدُ وَالثَّلاَثَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

248. హజ్రత్ ఫజాలా బిన్ ఉబైద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తిని నమాజులో దుఆ చేస్తుండగా విన్నారు. అతను దైవ స్తోత్రం చేయటంగానీ, దైవ ప్రవక్త (స) పై దరూద్ పంపటం గానీ చేయలేదు. "ఇతను తొందరపడ్డాడు" అని దైవప్రవక్త (స) వ్యాఖ్యానించారు. తరువాత ఆయన (స) ఆ వ్యక్తిని దగ్గరకు పిలిచి, "మీలో ఎవరయినాసరే దుఆ చేయ సాగినపుడు తొలుత మీ ప్రభువును ప్రశంసించాలి, కొనియాడాలి. తరువాత దైవప్రవక్త (స)పై దరూద్ పంపాలి. ఆ తరువాత మీరు కోరుకున్నదల్లా అర్థించవచ్చు" అని ఉపదేశించారు. (దీనిని అహ్మద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజాలు ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రమాణ బద్ధమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

దుఆలో వేగిరపాటు పనికిరాదని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతున్నది. అణకువకీ, అశక్తతకీ మారుపేరే దుఆ. ఇందులో వీలయినంత ఎక్కువగా దాసుని నిస్సహాయస్థితి వ్యక్తం కావాలి. అందుకే దుఆ చేస్తున్నప్పుడు ఎంతో నింపాదిగా, ప్రశాంతంగా వ్యవహరించాలి. మొదట దేవుని స్తోత్రం చేయాలి. తరువాత దైవప్రవక్త (స)పై శాంతి శుభాలు కలుగజేయమని కోరాలి. ఆ తరువాత

తమ కోసం దైవాన్ని వేడుకోవాలి. ఈ హదీసు చాలా వరకు అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) గారి 'హదీసె తషహ్హుద్'ను పోలివుంది.

### హదీసు ఉల్లేఖకులు

ఈయన ఫజాలా బిన్ ఉబైద్ (రజి). బిన్ నాఫిజ్ బిన్ ఖైస్. మారు పేరు అబూ ముహమ్మద్. అన్సార్లలోని ఔస్ తెగకు చెందిన వ్యక్తి. ఉహుద్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. ఆ తరువాత యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'బైతె రిజ్వాన్'లో ఈయన కూడా పాలుపంచుకున్నారు. సిరియా వైపునకు ప్రస్థానం చేశారు. డెమాస్కస్‌లో స్థిరపడ్డారు. అమీర్ ముఆవియా (రజి) సిఫ్ఫీన్ యుద్ధానికి వెళ్ళినప్పుడు ఈయన ఆ పట్టణ ఖాజీగా ఉన్నారు. హిజ్రీ 56లో మరణించారు.

(٢٤٩) وَعَنْ أَبِي مَسْعُودٍ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ بَشِيْرُ بْنُ سَعْدٍ: يَا رَسُولَ اللهِ! أَمَرَنَا اللَّهُ أَنْ نُصَلِّيَ عَلَيْكَ، فَكَيْفَ نُصَلِّي عَلَيْكَ؟ فَسَكَتَ؟ ثُمَّ قَالَ: «قُولُوا: اللَّهُمَّ صَلِّ عَلَى مُحَمَّدٍ، وَعَلَى آلِ مُحَمَّدٍ، كَمَا صَلَّيْتَ عَلَى إِبْرَاهِيمَ، وَبَارِكْ عَلَى مُحَمَّدٍ، وَعَلَى آلِ مُحَمَّدٍ، كَمَا بَارَكْتَ عَلَى إِبْرَاهِيمَ فِي الْعَالَمِينَ، إِنَّكَ حَمِيدٌ مَجِيدٌ. وَالسَّلَامُ كَمَا عَلِمْتُمْ». رَوَاهُ مُسْلِمٌ،

249. హజ్రత్ అబూ మస్ఊద్ అన్సారీ (రజి) కథనం: 'ఓ దైవప్రవక్తా (సఅసం)! అల్లాహ్ మమ్మల్ని మీపై దరూద్ పంప మని సెలవిచ్చాడు కదా! మరయితే మేము మీపై ఎలా దరూద్ పంపేదీ?' అని బషీర్ బిన్ సాద్ విన్నవించు కున్నారు. కొద్దిసేపు ఆగి దైవప్రవక్త (సఅసం), "ఇదిగో ఈ విధంగా చేయండి. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్.....(అర్థం : ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీంపై కరుణానుగ్రహాలను కురిపించినట్లే ముహమ్మద్ (సఅసం)పై, ముహమ్మద్ (స) కుటుంబీకులపై కరుణానుగ్రహాలను కురిపించు. ఇబ్రాహీంపై, ఇరులోకాలలో శుభాలు కురిపించినట్లే నీవు ముహమ్మద్ (సఅసం)పై ఆయన (స) కుటుంబీకు లపై శుభాలను కురిపించు. నిస్సందే హంగా నీవు స్తుతించదగినవాడవు, మహోన్నతుడవు) ఇక 'సలాం' అంటారా అది మీకు నేర్పబడింది కదా!" (ముస్లిం) మరియు ఇబ్నె ఖుజైమ ఇందులో

وَزَادَ ابْنُ خُزَيْمَةَ فِيهِ: فَكَيْفَ نُصَلِّي عَلَيْكَ إِذَا نَحْنُ صَلَّيْنَا عَلَيْكَ فِي صَلَاتِنَا؟.

అదనంగా ఇలా నకలు చేశారు: మేము నమాజ్ చేస్తున్నప్పుడు మీపై దరూద్ ఎలా పంపాలి?)

## సారాంశం

నమాజ్‌లో 'దరూద్' మరియు 'సలాం' పంపటం వాజిబ్ అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఇమామ్ షాఫయి సమేతంగా అనేకమంది ఇమాములు దీనిని వాజిబ్‌గానే తలపోశారు.

ఇక దరూదె షరీఫ్‌లోని వాక్యాలు విభిన్నంగా ఉన్నాయి. వివిధ ఉల్లేఖనాలలో ఈ వైవిధ్యం కానవస్తున్నది. అయితే అన్నింటికన్నా ప్రామాణికమైన ఉల్లేఖనం ఈ హదీసులోనిదే. కనుక దరూద్ పఠించేటప్పుడు ఈ హదీసులోని వాక్యాలకు ప్రాధాన్యత నివ్వటం శ్రేయస్కరం.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబూ మస్‌వూద్ అన్సారీ (రజి) : ఈయన అసలు పేరు ఉఖ్బా బిన్ అమ్ర్. అబూ మస్‌వూద్ మారు పేరు. మదీనాలోని అన్సార్ వర్గీయుడవటంచేత అన్సారీగా వ్యవహరించబడ్డారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న ప్రముఖ సహచరులలో ఈయన కూడా ఒకరు. రెండవ అఖబా ఒడంబడికలో పాల్గొన్నారు. అయితే అప్పటికి పిన్న వయస్కులు. కూఫాలో స్థిరపడ్డారు. అక్కడే మరణించారు. హిజ్రీ 40 తరువాత మదీనాలో మరణించారని మరొక వినికిడి ఉంది.

(2) బషీర్ బిన్ సాద్ (రజి) : మరోపేరు అబూ నూమాన్. అన్సారీ. ఖజ్రజీ. బద్ర్ యుద్ధంలోనూ, అఖబా ఒప్పందంలోనూ పాల్గొన్న పెద్ద సహాబీ. ఉహుద్ యుద్ధం, కందక యుద్ధం, ఆ తరువాత జరిగిన ముఖ్య యుద్ధాలన్నింటిలో ఈయన పాల్గొన్నారు. 'ఐనుత్తమర్'లో హిజ్రీ 13లో అమరగతినొందారు.

(٢٥٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا تَشَهَّدَ أَحَدُكُمْ فَلْيَسْتَعِذْ بِاللَّهِ مِنْ أَرْبَعٍ، يَقُولُ: اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ عَذَابِ جَهَنَّمَ، وَمِنْ عَذَابِ الْقَبْرِ، وَمِنْ فِتْنَةِ الْمَحْيَا

250. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: - "మీలో ఎవరయినా సరే తషహ్హుద్ పఠించిన మీదట నాలుగు విషయాల నుండి దేవుని శరణు కోరండి. 1) ఓ అల్లాహ్! నరకం నుండి నేను నీ శరణు కోర్తున్నాను. 2) మరియు సమాధి యాతన నుండి నీ శరణు కోర్తున్నాను. 3) జీవన్మరణాల పరీక్ష నుండి నీ శరణు వేడుతున్నాను. 4) ఇంకా - మసీహ్

وَالمَمَاتِ، وَمِنْ شَرِّ فِتْنَةِ المَسِيحِ الدَّجَّالِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: إِذَا فَرَغَ أَحَدُكُمْ مِنَ التَّشَهُّدِ الْأَخِيرِ.

దజ్జాల్ ఉపద్రవపు కీడు నుండి నీ శరణు కోర్తున్నాను." (ముస్లిం, బుఖారీ) ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది: "మీలో ఎవరయినా సరే ఆఖరి తషహ్హుద్ పఠించటం పూర్తయిన మీదట ఈ నాలుగు విషయాల నుండి అల్లాహ్ శరణు కోరండి."

**సారాంశం**

తషహ్హుద్‌లో దరూద్, సలాం అన్నీ పూర్తయిన మీదట ఈ విధంగా వేడుకోవటం వాజిబ్ అని ఇబ్నె హజమ్ వక్కాణించారు. తాబయీన్లలో ఇమామ్ తావుస్ (రహ్మ.లై) అభిమతం కూడా ఇదే. కాగా; మిగిలిన పండితులు, విద్వాంసులు దీనిని చివరి తషహ్హుద్‌లో - దరూద్ ముగించిన తరువాత పఠించటం అభిలషణీయం (ముస్తహబ్) అని అభిప్రాయపడ్డారు.

సమాధి యాతన అనేది సత్యమని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దీనిని గనక కాదంటే ఖుర్‌ఆన్, హదీసులను నిరాకరించినట్లవుతుంది.

(٢٥١) وَعَنْ أَبِي بَكْرٍ الصِّدِّيقِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ قَالَ لِرَسُولِ اللهِ ﷺ: عَلِّمْنِي دُعَاءً أَدْعُوْ بِهِ فِيْ صَلَاتِيْ! قَالَ: «قُلْ: اللَّهُمَّ إِنِّي ظَلَمْتُ نَفْسِي ظُلْماً كَثِيراً، وَلَا يَغْفِرُ الذُّنُوبَ إِلَّا أَنْتَ، فَاغْفِرْ لِي مَغْفِرَةً مِنْ عِنْدِكَ، وَارْحَمْنِي، إِنَّكَ أَنْتَ الغَفُورُ الرَّحِيمُ». مُتَّفَقٌ عَلَيْهِ.

251. హజ్రత్ అబూబక్ర్ సిద్ధీఖ్ (రజి) కథనం: నేను నమాజ్‌లో చేయగల దుఆ ఏదయినా నాకు ఉపదేశించండి అని నేను దైవప్రవక్త (సఅసం)ను విన్నవించుకోగా, ఆయన (సఅసం) ఇలా అన్నారు- "ఈ దుఆ పఠించండి - అల్లాహుమ్మ ఇన్నీ జలమ్తు నఫ్సీ.... (అర్థం: ఓదేవా! నేను నా ఆత్మకు ఎంతో అన్యాయం చేశాను. నీవు తప్ప పాపాలను మన్నించగల వాడెవడూ లేడు. కనుక నీ తరపున నాకు క్షమాభిక్షను ప్రసాదించు. నాపై దయజూపు. నిస్సందేహంగా నీవు మాత్రమే క్షమించేవాడవు, నిత్యం కటాక్షించేవాడవు)"

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ప్రతి మనిషీ తన వల్ల జరిగిన పాపాలపై, లోటుపాట్లపై సిగ్గుతో కుమిలిపోతూ క్షమాపణ కొరకు దైవాన్ని ప్రార్థించాలని ఈ హదీసు చెబుతోంది. ఎందుకంటే మానవుని వల్ల నిత్యం తప్పులు, పొరబాట్లు జరుగుతుంటాయి. అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) లాంటి పుణ్యపురుషులే దీనికి అతీతులు కానపుడు ఇతరుల లెక్కేముందీ?

### హదీసు ఉల్లేఖకులు

అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ ఉస్మాన్. అబూబక్ర్ మారు పేరు. సిద్దీఖ్ అనేది ఆయన బిరుదు. 'తైమ్' తెగకు చెందినవారు. దైవప్రవక్త (సఅసం) పరమపదించిన పిదప తొలి ధర్మ ఖలీఫాగా ఎన్నికయ్యారు. దైవప్రవక్తల (అలైహిముస్సలాం) తరువాత మానవకోటిలో అత్యుత్తములు. మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు దైవప్రవక్త (స)కు తోడుగా ఉన్నారు. సూర్ గుహలో దైవప్రవక్త (స) వెంటవున్న ఘనత ఈయనకు దక్కింది. అందుకే ఈయన్ని 'గుహవాసి'గా కూడా వ్యవహరిస్తారు. ఎర్రగా, బక్కపలచగా ఉండేవారు. పాగడ్తల కతీతమైన వ్యక్తిత్వం. వజ్ర సంకల్పులు. దైవమార్గంలో ఆయన చూపిన సహనస్థయిర్యాలు అనుపమమైనవి. మిత్రుల పాలిట దయార్ద్ర హృదయులు. ధర్మ విరోధుల పాలిట కొరుకుడు పడని తత్వం. సత్యధర్మం విషయంలో ఎన్నటికీ రాజీ ధోరణి నవలంబించలేదు. హిజ్రీ 13వ సంవత్సరం జమాదివుల్ ఆఖిర్‌లో మరణించారు.

(٢٥٢) وَعَنْ وَائِلِ بْنِ حُجْرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّيْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَكَانَ يُسَلِّمُ عَنْ يَمِيْنِهِ: السَّلَامُ عَلَيْكُمْ وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهُ، وَعَنْ شِمَالِهِ: السَّلَامُ عَلَيْكُمْ وَرَحْمَةُ اللّٰهِ وبَرَكَاتُهُ. رَوَاهُ أَبُوْ دَاوُدَ بِإِسْنَادٍ صَحِيْحٍ.

252. హజ్రత్ వాయల్ బిన్ హుజ్ర్ (రజి) కథనం: "నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి నమాజ్ చేశాను. ఆయన (స)కుడివైపుకు సలాం చేస్తూ అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు అన్నారు. అలాగే ఎడమ వైపునకు సలాం చేస్తూ అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు అన్నారు."

(అబూదావూద్ దీనిని ప్రామాణిక మయిన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

నమాజ్ చివరిలో చేసే 'సలాం'లో 'వ బరకాతుహు' అనే అదనపు పదం సహీహ్ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ అంశం క్రింద వచ్చిన అనేక హదీసులలో ఈ అదనపు పదం లేకపోయినప్పటికీ దీని ప్రామాణికతపై ఎలాంటి సంశయానికి తావులేదు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) "నతాయజుల్ అఫ్కార్"లో దీనిపై వివరంగా చర్చించారు. అందుచేత 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు' అని అనటం సమంజసమే.

(٢٥٣) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقُولُ فِي دُبُرِ كُلِّ صَلاَةٍ مَّكْتُوبَةٍ: «لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ لاَ شَرِيْكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيْرٌ، اَللّٰهُمَّ لاَ مَانِعَ لِمَا أَعْطَيْتَ، وَلاَ مُعْطِيَ لِمَا مَنَعْتَ، وَلاَ يَنْفَعُ ذَا الْجَدِّ مِنْكَ الْجَدُّ». مُتَّفَقٌ عَلَيْهِ.

253. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి ఫర్జ్ నమాజు చివర్లో ఈ దుఆ చేసేవారు : "లా ఇలాహ ఇల్లల్లాహు.... (అర్థం : అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన ఏకేశ్వరుడు, సహవర్తులెవరూ లేనివాడు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే శోభాయమానం. ఆయన ప్రతిదాన్నీ చేయగల సమర్థుడు. ఓ అల్లాహ్! నీవు అనుగ్రహించిన దానిని ఎవరూ ఆపలేరు. నీవు ఆపిన దానిని ఇప్పించగలవాడెవడూ లేడు. నీకు వ్యతిరేకంగా ఏ భాగ్యవంతుడికీ అతని భాగ్యాలు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేవు)"

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఫర్జ్ నమాజ్‌ను ముగించిన వెంటనే ఈ దుఆ చేయాలి. ఈ దుఆలో ఒక వైపు దేవుని వైభవం చాటబడింది - మరోవైపు దానుని నిస్సహాయస్థితి కూడా వ్యక్తపరచబడింది. యదార్థానికి మనిషి అక్కరలను తీర్చేవాడు, అతన్ని కటాక్షించేవాడు ఆయన మాత్రమే. భూమ్యాకాశాలలో వున్నదంతా ఆయన సొంతం. ఎవరికి ఏది ఇవ్వాలన్నా, ఏది ఇవ్వకూడదనుకున్నా - అది ఆయన ఇష్టాయిష్టాలపై ఆధారపడివుంది. సాటిలేని స్వామి ఆయన. ప్రాపంచిక పదవులు, ఆస్తి అంతస్తులు ఆయన చలువతోనే మనిషికి ప్రాప్తమవుతాయి. ఆయన కటాక్షం లేనంతవరకూ ఎవరి ఐశ్వర్యం కూడా వారికి అచ్చిరాదు. దేవుని ఏకత్వానికి ఈ దుఆ మచ్చుతునక లాంటిది.

(٢٥٤) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ كَانَ يَتَعَوَّذُ بِهِنَّ دُبُرَ كُلِّ صَلاَةٍ: «اللّٰهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنَ الْبُخْلِ، وَأَعُوذُ بِكَ مِنَ الْجُبْنِ، وَأَعُوذُ بِكَ مِنْ أَنْ أُرَدَّ إِلَى أَرْذَلِ الْعُمُرِ،

254. హజ్రత్ సాద్ బిన్ వఖ్కాస్ (రజి) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి నమాజ్ చివర్లో ఈ 'తఅవ్వుజ్'ను పఠించేవారు : అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక..... (అర్థం: దేవా! పిసినారితనం నుండి, పిరికితనం నుండి నేను నీ శరణు కోర్తున్నాను. హీనాతి హీనమైన వృద్ధాప్యం వైపునకు

وَأَعُوذُ بِكَ مِنْ فِتْنَةِ الدُّنْيَا، وَأَعُوذُ بِكَ مِنْ عَذَابِ الْقَبْرِ». رَوَاهُ الْبُخَارِيُّ.

మరలించబడటం నుండి నీ శరణు వేడుతున్నాను. ప్రాపంచిక పరీక్ష నుండి, సమాధి యాతన నుండి నీ శరణు కోరు తున్నాను." (బుఖారీ)

### సారాంశం

హదీసు వాక్యాలను బట్టి ఈ దుఆ నమాజ్ చివరిలో 'సలాం' చేయక మునుపు, సలాం చేసిన తరువాత కూడా పఠించవచ్చని అర్థమవుతున్నది. ఎంతో అర్థవంతమైన, సమగ్రమైన దుఆ ఇది. దీన్ని సాధ్యమైనంతవరకు చేస్తూ ఉండటం మంచిది.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు సాద్ బిన్ వఖ్కాస్. మరోపేరు అబూ ఇస్‌హాఖ్. తండ్రి పేరు మాలిక్. ఖురైషు వంశీయులు. ఇస్లాం స్వీకరించిన వారిలో ఐదవవారు. ప్రపంచ జీవితంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన పదిమందిలో ఈయనా ఉన్నారు. దైవమార్గంలో విలువిద్యను ఆచరణలో పెట్టిన ప్రథమ వ్యక్తి ఈయన. అంటే మొట్టమొదట ఈయనే బాణం ప్రయోగించారు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఇరాక్‌ను జయించారు. పట్టివారు. కాని గట్టివారు. గోధుమ వర్ణం ఛాయ. మదీనాకు పదిమైళ్ళ దూరంలో ఉన్న 'అఖీఖ్'లో తనువు చాలించారు. అక్కడి నుంచి ఈయన భౌతిక కాయం మదీనా తేబడింది. హిజ్రీ 55లో జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٢٥٥) وَعَنْ ثَوْبَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا انْصَرَفَ مِنْ صَلَاتِهِ اسْتَغْفَرَ اللَّهَ ثَلَاثاً، وَقَالَ: «اللَّهُمَّ أَنْتَ السَّلَامُ، وَمِنْكَ السَّلَامُ، تَبَارَكْتَ يَا ذَا الْجَلَالِ وَالْإِكْرَامِ». رَوَاهُ مُسْلِمٌ.

255. హజ్రత్ సోబాన్ (రజి) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సలాం చేసిన మీదట మూడు సార్లు అస్తగ్‌ఫిరుల్లాహ్ అని పలికేవారు. ఆ తరువాత 'అల్లాహుమ్మ అన్తస్సలాము, వ మిన్కస్సలాము, తబారక్త యా జల్ జలాలి వల్ ఇక్రామ్" పఠించేవారు. (అర్థం : ఓ అల్లాహ్! నీవు శాంతిగల వాడవు. శాంతి నీ వైపు నుంచే ఉంది. ఓ ఘనత్వం, గౌరవోన్నతులు గలవాడా! నీవు ఎంతో శుభవంతుడవు) (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా నమాజ్ సందర్భంగా చేసే పై దుఆల ప్రాముఖ్యత ఎంతటిదో అర్థమవుతున్నది. నమాజ్ చేస్తున్నప్పుడు మానవ సహజమయిన దౌర్బల్యాల వల్ల తప్పులు జరగవచ్చు. మరుపుకు గురికావచ్చు. నమాజులో పలు ఆలోచనలు రావచ్చు. మనము నమాజులో

లగ్నం కాలేకపోవచ్చు. వీటన్నింటికీ మందు ఒక్కటే - క్షమాభిక్ష! దాసుడు తన అశక్తతను వెలిబుచ్చి, ప్రభువును క్షమాపణ కోరుకుంటే ఆయన తన దయతో మన్నించి నమాజును స్వీకరించే అవకాశం ఉంది.

దైవప్రవక్త 'ఇస్తిగ్ఫార్' ఎలా చేసేవారు? అని ఇమామ్ బైజాయి (రహ్మ.లై) ని ఎవరో ప్రశ్నించగా, "దైవప్రవక్త (స) అస్తగ్ఫిరుల్లాహ -అస్తగ్ఫిరుల్లాహ - అస్తగ్ఫిరుల్లాహ" అని అనేవారని ఆయన జవాబిచ్చారు.

(٢٥٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ رَسُولِ اللهِ ﷺ قَالَ: «مَنْ سَبَّحَ اللَّهَ دُبُرَ كُلِّ صَلاَةٍ ثلاثاً وَثَلاَثِيْنَ، وَحَمِدَ اللَّهَ ثَلاَثاً وَثَلاَثِيْنَ وَكَبَّرَ اللَّهَ ثَلاَثاً وَثَلاَثِيْنَ، فَتِلْكَ تِسْعٌ وَتِسْعُونَ، وَقَالَ تَمَامَ الْمِائَةِ «لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ لاَ شرِيْكَ لهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيْرٌ» غُفِرَتْ لَهُ خَطَايَاهُ وَلَوْ كَانَتْ مِثْلَ زَبَدِ الْبَحْرِ». رَوَاهُ مُسْلِمٌ، وَفِيْ رِوَايَةٍ أُخْرَى: أَنَّ التَّكْبِيْرَ أَرْبَعٌ وَثَلاَثُونَ.

256. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ఉపదేశించారు - "ఎవరయితే ప్రతి నమాజులో సలాం చేసిన మీదట 33 సార్లు సుబ్‌హానల్లాహ్, 33 సార్లు అల్ హమ్దు లిల్లాహ్, 33 సార్లు అల్లాహు అక్బర్ అని కూడా పలికాడో - ఇవి మొత్తం 99 అవుతాయి - మరియు నూరును పూర్తి చేయడానికి లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లాషరీకలహూ లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు వహువ అలాకుల్లి షైయిన్ ఖదీర్ అని పలికాడో, అతని పాపాలన్నీ-వాటి సంఖ్య సముద్రంలోని బుడగల సంఖ్యకు సమానంగా ఉన్నా సరే - క్షమించి వేయ బడతాయి. (ముస్లిం) వేరొక ఉల్లేఖనం లో 34వ సారి 'అల్లాహు అక్బర్' అని పలకాలి అని వుంది.

**సారాంశం**

ప్రతి నమాజ్ ఆఖరిలో - అది ఫర్జ్ నమాజయినా, నఫిల్ నమాజయినా - ఈ కలిమాలు (వచనాలు) పలకటం 'మస్నూన్' అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే కొంతమంది పండితులు ఈ 'తస్బీహ్' ఫర్జ్ నమాజులకే వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ తస్బీహ్ పూర్వాపరాలిలావున్నాయి - ఒకరోజు కొంతమంది ముహాజిర్ పేదలు దైవప్రవక్త (స) సన్నిధిలోకి వచ్చి 'ఓ దైవప్రవక్తా! ధనవంతులు పుణ్యకార్యాలన్నీ జుర్రుకుంటున్నారు. వాళ్లూ మాలాగే నమాజ్ చేస్తున్నారు, ఉపవాసాలు పాటిస్తున్నారు. దానధర్మాలు కూడా మాకన్నా ఎంతో ఎక్కువగా చేస్తున్నారు. మేము (దాన ధర్మాలలో) వాళ్లతో పోటీపడలేకపోతున్నాము (ఎందుకంటే

మా దగ్గర సిరి సంపదలు లేవు)' అని విన్నవించుకోగా ఆయన (స) వారికి ఈ తస్బీహ్ గురించి బోధించారు....

(٢٥٧) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ لَهُ: «أُوصِيكَ يَا مُعَاذُ: لاَ تَدَعَنَّ دُبُرَ كُلِّ صَلاَةٍ أَنْ تَقُولَ: اللَّهُمَّ أَعِنِّي عَلَى ذِكْرِكَ، وَشُكْرِكَ، وَحُسْنِ عِبَادَتِكَ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ بِسَنَدٍ قَوِيٍّ.

257. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నాకిలా ఉపదేశించారు - ఓ ముఆజ్! ప్రతి నమాజును ముగించిన తరువాత ఈ వచనాలను విస్మరించ రాదని నేను నీకు వసీయతు చేస్తు న్నాను- "అల్లాహుమ్మ అఇన్నీ అలా జిక్రిక వ షుక్రిక వ హుస్ని ఇబాదతిక". (అర్థం : ఓ అల్లాహ్! నాకు నీ ధ్యానం చేసే, నీకు కృతజ్ఞతలు తెలిపే, అత్యు త్తమ రీతిలో నిన్ను ఆరాధించే సద్బుద్ధి నొసగు) (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి దృఢమయిన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

'విస్మరించరాదు' అని తాకీదు చేయడాన్నిబట్టి దీనికెంత ప్రాముఖ్యం ఉందో అర్థం చేసుకో వచ్చు. ప్రతి నమాజు తర్వాత - ముఖ్యంగా ఫర్జ్ నమాజు ముగించిన తరువాత ఈ దుఆను తప్పక పఠించాలి. దీన్ని విడనాడటం మంచిది కాదు. ఈ దుఆయేగాక హదీసు గ్రంథాలైన ముస్లిం, అబూదావూద్, నసాయి, అహ్మద్, తిర్మిజీలలోని మరెన్నో దుఆలను ఆయన (స) చేసినట్లు ఆధారా లున్నాయి. సాధ్యమయినంతవరకు వాటిని కంఠస్థం చేసుకుని పఠిస్తే మన స్వయానికి ప్రయోజనం చేకూరటమేగాక, ప్రవక్త (స) గారి సున్నత్‌కు ప్రాచుర్యం ఇచ్చినట్లవుతుంది.

(٢٥٨) وَعَنْ أَبِي أُمَامَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ قَرَأَ آيَةَ الْكُرْسِيِّ دُبُرَ كُلِّ صَلاَةٍ مَكْتُوبَةٍ، لَمْ يَمْنَعْهُ مِنْ دُخُولِ الْجَنَّةِ إِلاَّ الْمَوْتُ». رَوَاهُ

258. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ ఉమామ (రజి) ఉల్లేఖించారు - ఏ వ్యక్తయితే ప్రతి ఫర్జ్ నమాజ్ తరువాత 'ఆయతుల్ కుర్సీ' పఠించాడో అతన్ని స్వర్గంలో ప్రవేశించకుండా మృత్యువు

النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَزَادَ فِيهِ الطَّبَرَانِيُّ: «وَقُلْ هُوَ اللَّهُ أَحَدٌ».

తప్ప మరేదీ అడ్డుకోజాలదు (అంటే మరణించగానే అతనికై స్వర్గం సిద్ధంగా ఉంటుంది. అయితే అతని విశ్వాసంలో 'తౌహీద్' ఉండాలి) (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికంగా ఖరారు చేశారు - తబ్రానీ ఇందులో 'ఖుల్‌హు వల్లాహు అహద్'ను కూడా చేర్చారు.)

## సారాంశం

'ఆయతుల్ కుర్సీ' మహత్యం గురించి ఆయన (స) ప్రవచనాలనేకం ఇతర హదీసు గ్రంథాలలో కూడా ఉన్నాయి. దీని మహత్యానికి గల అనేక కారణాలలో ఒకటి: దేవుని ఏకత్వానికి సంబంధించి ఇందులో స్పష్టంగా చెప్పబడటమే అయివుండవచ్చు. ఇందులో దేవుని ఏకత్వంతోపాటు, ఆయన గుణవిశేషాలు, అపారమయిన అధికారాలు, ఆధిపత్యాల ప్రస్తావన ఉంది. అందుకే ఇది అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరమయినది.

సూరయే ఇఖ్లాస్ కూడా అటువంటిదే. అది మూడవ వంతు ఖుర్‌ఆన్‌కు సమానంగా పుణ్యం కలిగినది. ఇస్లాం విశ్వాసాలు మౌలికంగా మూడు - (1) తౌహీద్ (2) రిసాలత్ (3) ఆఖిరత్. కాగా; ఈ సూరా (ఖుల్‌హు వల్లాహు అహద్) తౌహీద్ (దేవుని ఏకత్వం) తో నిండి వుంది. అందుచేత ఈ సూరా కూడా అల్లాహ్‌కు ఎంతో ఇష్టకరమయినది. అందువల్ల ఏ మనిషి ఫర్జ్ నమాజ్ తరువాత వీటిని మనస్ఫూర్తిగా పారాయణం చేస్తాడో అతడు మరణించిన వెంటనే స్వర్గంలో పంపబడతాడు - ఇన్‌షా అల్లాహ్!

## హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమామ (రజి) మారుపేరు. అసలు పేరు ఇయాస్ బిన్ సాలబ బలవీ. అన్సార్‌కు చెందిన బనూ హారిసా తెగకు మద్దతుదారులు. సహాబీగా గుర్తించబడే భాగ్యం పొందారు. ఈయన చేత అనేక హదీసులు ఉల్లేఖించబడ్డాయి. తల్లి సేవలో ఉండటం వల్ల బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు.

(٢٥٩) وَعَنْ مَالِكِ بْنِ الْحُوَيْرِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلُّوا كَمَا رَأَيْتُمُونِي أُصَلِّي». رَوَاهُ الْبُخَارِيُّ.

259. హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్(రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రభోధించారు : "ఏ విధంగా నన్ను నమాజ్ చేస్తుండగా మీరు చూశారో ఆ విధంగానే నమాజ్ చేయండి." (బుఖారీ)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఆనాడు ప్రత్యక్షంగా తన సహచరులనుద్దేశ్యించి ఈ మాటలన్నప్పటికీ ముస్లిం సమాజ సభ్యుడైన ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుంది. నమాజ్‌లో ఆయన (స) ఏ ఏ క్రియను ఏ విధంగా ఆచరించారో సరిగ్గా అదేవిధంగా ఆచరించటం వాజిబ్ అని ఈ హదీసు ద్వారా అవగత మవుతున్నదని అమీర్ యమానీ వ్యాఖ్యానించారు.

(٢٦٠) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: «صَلِّ قَائِماً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَقَاعِداً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَعَلَى جَنْبٍ، وَإِلاَّ فَأَوْمِ». رَوَاهُ الْبُخَارِيُّ.

260. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఉపదేశించారని హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) తెలిపారు: "నమాజ్‌ను నిలబడి చేయండి. ఒకవేళ నిలబడి చేయలేకపోతే కూర్చుని చేయండి. ఒకవేళ కూర్చుని చేసే శక్తి కూడా లేకపోతే ప్రక్క ఆధారంగా పరుండి చేయండి. వీటిలో ఏ ఒక్కటీ చేయలేకపోతే సైగ ద్వారా (నమాజ్) చేయండి." (బుఖారీ)

**సారాంశం**

ఎట్టి పరిస్థితిలో కూడా నమాజ్ క్షమార్హం కాదనీ, ఒక్క స్పృహ కోల్పోయిన స్థితిలో మాత్రమే దీనినుండి మినహాయింపు లభిస్తుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. సాధారణంగా నమాజ్‌ను నిలబడి నెరవేర్చటం మంచిది. అస్వస్థత కారణంగా నిలబడలేకపోతే కూర్చుని చేయవచ్చు. అదీ సాధ్యం కాకపోతే పండుకుని చేయవచ్చు. అత్యంత హీన దశలో సైగ ద్వారా కూడా నమాజ్ చేయవచ్చు. అంటే ఏ పరిస్థితిలో కూడా మనిషి నమాజ్‌ను త్యజించరాదు.

(٢٦١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لِمَرِيضٍ – صَلَّى عَلَى وِسَادَةٍ، فَرَمَى بِهَا، – وَقَالَ: «صَلِّ عَلَى الْأَرْضِ إِنِ اسْتَطَعْتَ، وَإِلاَّ فَأَوْمِ إِيمَاءً، وَاجْعَلْ سُجُودَكَ أَخْفَضَ مِنْ رُكُوعِكَ». رَوَاهُ الْبَيْهَقِيُّ بِسَنَدٍ قَوِيٍّ، وَلٰكِن صَحَّحَ أَبُو حَاتِمٍ وَقْفَهُ.

261. హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఒక వ్యాధిగ్రస్తుడు దిండుపై నమాజ్ చేస్తుండగా గమనించి ఆ దిండును పారవేశారు. "చేయగలిగితే నేలపై నమాజ్ చెయ్యి. లేకుంటే సైగతో (నమాజ్) చెయ్యి. అయితే సజ్దాను రుకూ కన్నా కాస్త దిగువ ఉండేలా చూసుకో" అని అతనికి ఉపదేశించారు. (దీనిని బైహఖీ దృఢమయిన ఆధారంతో ఉల్లేఖించారు. అయితే అబూ హాతిమ్ దీనిని 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు).

**సారాంశం**

నమాజీ ఎత్తయిన వస్తువుపై సజ్దా చేయటం సమంజసం కాదన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. అతడు సజ్దా చేయదలచుకుంటే నేలపైనే చేయాలి. అలా చేయలేకపోవటానికి ఏదయినా బలమైన కారణముంటే,సైగతోనే అతడు నమాజ్ చేయాలి. అయితే సజ్దా చేయవలసి వచ్చినపుడు రుకూ కన్నా కాస్త ఎక్కువగా వంగాలి. ఎట్టి పరిస్థితిలోనూ మనిషి తన సృష్టికర్తతో సంబంధం త్రెంచుకోజాలడనీ, అనుదినం, అనుక్షణం అతని మనో మస్తిష్కాలలో దేవుడు మెదలుతూ ఉండాలనీ ఈ హదీసు ద్వారా సూచన లభిస్తోంది. ఇదే అసలు దైవదాస్యానికి ప్రతీక.

**8వ అధ్యాయం**

## ٨ - بَابُ سُجُودِ السَّهْوِ وَغَيْرِهِ

## సహూ సజ్దాలు

(٢٦٢) عَنْ عَبْدِاللهِ بْنِ بُحَيْنَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِهِمُ الظُّهْرَ فَقَامَ فِي الرَّكْعَتَيْنِ الْأُوْلَيَيْنِ، وَلَمْ يَجْلِسْ، فَقَامَ النَّاسُ مَعَهُ، حَتَّى إِذَا قَضَى الصَّلَاةَ، وَانْتَظَرَ النَّاسُ تَسْلِيمَهُ كَبَّرَ وَهُوَ جَالِسٌ، وَسَجَدَ سَجْدَتَيْنِ قَبْلَ أَنْ يُسَلِّمَ، ثُمَّ

262. హజ్రత్ అబ్దుల్లా బిన్ బుహైన (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు జుహ్ర్ నమాజ్ చేయించారు. కాని రెండు రకతులు పూర్తయిన తరువాత తషహ్హుద్‌లో కూర్చోకుండానే లేచి నిల బడ్డారు. ముఖ్తదీలు కూడా ఆయన (స) నే అనుసరించారు. ఆ విధంగా ఆయన (స) నమాజ్ అంతటినీ పూర్తి చేశారు. ఆయన (స) ఇక సలాం చేయ బోతున్నారని ప్రజలు ఎదురు చూస్తుం డగానే - ఆయన (స) కూర్చునే - 'అల్లాహు అక్బర్' అంటూ సలాంకు ముందు రెండు సజ్దాలు చేశారు. అనంతరం సలాం చేశారు. (దీనిని అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి) ముస్లిం ఉల్లే ఖనంలో ఇలా వుంది: "ప్రతి సజ్దాకోసం

سَلَّمَ. أَخْرَجَهُ السَّبْعَةُ، وَهَذَا لَفْظُ الْبُخَارِيِّ. وَفِيْ رِوَايَةٍ لِمُسْلِمٍ: يُكَبِّرُ فِي كُلِّ سَجْدَةٍ وَهُوَ جَالِسٌ، وَسَجَدَ النَّاسُ مَعَهُ، مَكَانَ مَا نَسِيَ مِنَ الْجُلُوسِ.

'అల్లాహు అక్బర్' అనే వారు. కూర్చునే సజ్దా చేశారు. వెనుకనున్న వారు కూడా ఆయన్ని అనుసరించారు. ఇది మరచి పోయిన దానికి ప్రత్యామ్నాయం" - అంటే రెండు రకతుల తరువాత తష హ్హుద్‌లో కూర్చోవటం మరచిపోయి నందుకు పరిహారంగా ఈ రెండు సజ్దాలు చేశారన్న మాట!

**సారాంశం**

అరబీలో మరుపుకై రెండు పదాలు ఉపయోగించబడతాయి. ఒకటి: సహూ. రెండు: నిస్‌యాన్. మొదటి పదం సాధారణంగా ఏదైనా క్రియను మరచిపోవటానికి సంబంధించి ఉపయోగిస్తారు. రెండవది: విషయ పరిజ్ఞానం గురించి వాడతారు. పండిత వర్గంలో ఏ ఒక్కరు కూడా దైవప్రవక్త (స) రెండవ రకపు మరపుకు (నిస్‌యాన్‌కు) గురయ్యారని భావించరు. ఎందుకంటే దైవప్రవక్త (స) తనకు 'వహీ' ద్వారా అందజేయబడిన దైవాదేశాలను మానవాళికి అందజేయటంలో ఎన్నడూ మరుపుకు లోనుకాలేదు. అలాంటి అవకాశానికి తావు కూడా లేదు. ఎందుకంటే 'సనుఖ్‌రివుక ఫలా తన్సా' అని అల్లాహ్ స్వయంగా హామీ ఇచ్చాడు.

ఇక నమాజ్‌లో జరిగిన 'సహూ' అంటారా! అది ఆచరణకు సంబంధించినది. పైగా ఇలా జరగవలసిన అవసరం కూడా ఉందని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. దైవప్రవక్త (స) అందరికీ ఆదర్శప్రాయులు. ఆయన నమాజులో ఈ మరుపుకు లోనై ఉండకపోతే 'సహూ' గురించి ఉమ్మత్‌కు తెలిసేదికాదు. ఇది కూడా దైవ ప్రణాళికలోని ఒక అంశమే మరి!

నలుగురు ఇమాములు కూడా దైవప్రవక్త (స) ద్వారా 'సహూ' జరిగిన విషయంపై ఏకీభవించారు. బహుశా ఈనాటి వరకూ ఎవరూ దీనిపై ఆక్షేపణ తెలుపలేదు. పైగా ఇందులో ఎన్నో పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. జ్ఞానసంపన్నులైనవారికి ఇందలి మర్మాలను గురించి బాగా తెలుసు!

(٢٦٣) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى النَّبِيُّ ﷺ إِحْدَى صَلَاتَيِ الْعَشِيِّ رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ قَامَ إِلَى خَشَبَةٍ فِي مُقَدَّمِ الْمَسْجِدِ، فَوَضَعَ يَدَهُ عَلَيْهَا وَفِي الْقَوْمِ أَبُو بَكْرٍ وَعُمَرَ، فَهَابَا، أَنْ يُكَلِّمَاهُ، وَخَرَجَ سَرَعَانُ النَّاسِ فَقَالُوا: أَقُصِرَتِ

263. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మధ్యాహ్నం తరువాత రెండు నమాజులలో (జుహ్ర్, అస్ర్) ఏదో ఒక దానిలో రెండు రకతులు చేసి సలాం చేశారు. ఆ తరువాత మస్జిద్‌కు ముందున్న ఒక కొయ్య వద్దకు వెళ్ళి దానిపై చేయిపెట్టి అక్కడే నిలబడ్డారు.

الصَّلاَةُ، وَرَجُلٌ يَدْعُوهُ النَّبِيُّ ﷺ ذَا الْيَدَيْنِ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَنَسِيْتَ أَمْ قَصُرَتِ الصَّلاَةُ؟ فَقَالَ: **لَمْ أَنْسَ وَلَمْ تُقْصَرْ، قَالَ: بَلَى قَدْ نَسِيْتَ، فَصَلَّى رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ كَبَّرَ، فَسَجَدَ مِثْلَ سُجُودِهِ أَوْ أَطْوَلَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ فَكَبَّرَ، ثُمَّ وَضَعَ رَأْسَهُ فَكَبَّرَ، فَسَجَدَ مِثْلَ سُجُودِهِ أَوْ أَطْوَلَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ وَكَبَّرَ.**

مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

నమాజీలలో హజ్రత్ అబూబక్ర్, ఉమర్ కూడా ఉన్నారు. వారిద్దరికీ ఈ విషయమై ఆయన (స)తో మాట్లాడే ధైర్యం లేకపోయింది. తొందరపాటుతో మస్జిద్ నుంచి బయటకు వెళ్ళిపోయిన వారు- ఏమిటీ? నమాజులో రకతుల కోత విధించబడిందా? అంటూ పరస్పరం గుసగుసలాడుకోసాగారు. నమాజీలలో ఒక వ్యక్తి ఉండేవాడు (అతని చేతులు పొడవుగా ఉండటం వల్ల) దైవప్రవక్త (స) అతన్ని 'ఆజానుబాహుడా!' అని సంబోధించే వారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (స) నుద్దేశ్యించి, 'ఓ దైవప్రవక్తా! (ఈ రోజు) మీరు మరచిపోయారా? లేక నమాజ్ కుదించ బడిందా?' అని అడిగాడు. "నేను మరచిపోనూలేదు, నమాజ్ కుదించ బడనూలేదు" అని ఆయన(స) సమాధానమిచ్చారు. 'మరైతే మీరు తప్పకుండా మరచిపోయారు' అని ఆ వ్యక్తి అన్నాడు. అప్పుడాయన (స) వదలి వేయబడిన రెండు రకతులను పూర్తి చేశారు. ఆ తరువాత సలాం చేశారు. మరి 'అల్లాహు అక్బర్' అంటూ మామూలు సజ్దాల వలెనే సజ్దా చేశారు. లేదా మరి కాస్త సుదీర్ఘమయిన సజ్దా చేసి అల్లాహు అక్బర్ అంటూ తల పైకెత్తారు. మళ్ళీ అల్లాహు అక్బర్ అంటూ తలను నేలకాన్చారు. సాధారణ సజ్దా

లాగే చేశారు. లేదా మరి కాస్త సుదీర్ఘమయిన సజ్దా చేసి అల్లాహు అక్బర్ అంటూ తలపైకెత్తారు. (బుఖారీ, ముస్లిం) (ఈ పదాలు బుఖారీలోనివి)

وَفِيْ رِوَايَةٍ لِّمُسْلِمٍ: «صَلاَةَ الْعَصْرِ». وَلأَبِيْ دَاوُدَ: فَقَالَ: أَصَدَقَ ذُو الْيَدَيْنِ؟ فَأَوْمَئُوا أَيْ نَعَمْ. وَهِيَ فِي الصَّحِيْحَيْنِ، لٰكِنْ بِلَفْظِ: «فَقَالُوا». وَفِيْ رِوَايَةٍ لَّهُ: «وَلَمْ يَسْجُدْ حَتَّى يَقَّنَهُ اللَّهُ تَعَالَى ذٰلِكَ».

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో వుంది : "ఇది అస్ర్ నమాజ్‌కు సంబంధించినది". అబూదావూద్ ఉల్లేఖనం ప్రకారం, "ఆజానుబాహుడు చెప్పింది నిజమేనా?" అని దైవప్రవక్త (స) దర్యాప్తు చేయగా 'అవును' అన్నట్టు జనులు తలూపారు. ఈ అదనపు వాక్యాలు 'సహీహైన్'లో కూడా ఉన్నాయి - అయితే 'అవును' అని నోటితో జవాబిచ్చినట్లు అందులో వుంది. ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది - "దేవుని తరపున ఈ మేరకు సంకేతం లభించే వరకూ ఆయన (స) 'సజ్దా సహూ' చేయలేదు."

## సారాంశం

దైవప్రవక్త (స) 'మరుపు'కు లోనయ్యారన్న దానికి ఈ హదీసు తార్కాణం. అయితే ఇది ప్రవక్త స్థాయికి విరుద్ధమయిన విషయం ఏమీ కాదు. దైవప్రవక్త (స) కూడా మానవమాత్రులే. మనిషి అనేవాడు మరచిపోవటం సహజం. ఆయనకు అగోచర జ్ఞానం లేదన్న దానికి కూడా ఈ సంఘటన ఒక నిదర్శనం. ఆయనకే గనక అగోచర జ్ఞానం ఉండివుంటే తన వల్ల జరిగిన 'సహూ' గురించి ప్రజలను అడిగి తెలుసుకోవలసిన అవసరం ఉండేది కాదు. తనవల్ల పొరబాటు జరిగిందని తెలుసుకున్నప్పుడు దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయటం గొప్పవారి లక్షణం.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త (స) 'ఆజానుబాహుడా!' అని సంబోధించిన వ్యక్తి పేరు 'ఖిర్‌బాఖ్ బిన్ అమ్ర్ సులమీ (రజి). బనూ సులైమ్ తెగకు చెందిన వారవటంచేత సులమీగా పిలువబడ్డారు. ఈయన అమీర్ ముఆవియ (రజి) పరిపాలనా కాలంలో మరణించారు. హాజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో 'జీ ఖషబ్' అనే ప్రాంతంలో మరణించారని వేరొక ఆధారం ద్వారా తెలుస్తోంది. ఈయన చేతులు మరీ పొడవుగా ఉండటంవల్ల 'జుల్ యదైన్'గా పేరుమోశారు.

(٢٦٤) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِهِمْ فَسَهَا، فَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ تَشَهَّدَ، ثُمَّ سَلَّمَ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَالْحَاكِمُ، وَصَحَّحَهُ.

264. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు నమాజ్ చేయించగా ఆయన (స) వల్ల 'సహూ' అయింది (అంటే మరచిపోయారు). అందుచేత ఆయన (స) రెండు సజ్దాలు చేశారు, తరువాత తషహ్హుద్ చదివారు. ఆ తర్వాత సలాం చేశారు. (దీనిని అబూ దావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేయగా, హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా నిర్ధారించారు).

**సారాంశం**

నమాజ్‌లో దైవప్రవక్త (స) వల్ల 'మరుపు' జరిగిందన్న సుప్రసిద్ధ సంఘటన పాడవుచేతుల వ్యక్తి ప్రశ్నించినదే. నమాజ్ కుదించబడిందా? లేక మీరు మరచిపోయారా? అని ఆయన నేరుగా దైవప్రవక్త (స)ను ప్రశ్నించి అసలు విషయాన్ని వెలికి తీశారు. ఈ సంఘటన సహీహైన్ మరియు సునన్ గ్రంథాలలో వివరంగా వచ్చింది. అయితే ఈ గ్రంథాలన్నింటిలో ఎక్కడా 'సజ్దాసహూ' తరువాత తషహ్హుద్ ప్రస్తావన రాలేదు. సహీహ్ ముస్లింలో స్వయంగా హజ్రత్ ఇమ్రాన్ గారి ఈ ఉల్లేఖనంలోనూ తషహ్హుద్ ప్రస్తావన రాలేదు. అందువల్ల తిర్మిజీలోని ఉల్లేఖనంలో ప్రస్తావనకు వచ్చిన ఈ తషహ్హుద్ పదం 'అరుదైనది.' బైహఖీ కూడా అదే అంటారు. కాని హాఫిజ్ ఇబ్నె హజర్ మాత్రం మొత్తానికి తషహ్హుద్ ఉంది అని అభిప్రాయపడ్డారు. అత్యధిక ధర్మవేత్తల దృష్టిలో సలాంకు ముందు సజ్దాసహూ చేయవలసివుంటే తషహ్హుద్ చదువవలసిన అవసరం లేదు. ఒకవేళ సలాం తరువాత సజ్దాసహూ చేసినట్లయితే అప్పుడు తషహ్హుద్ తలచుకుంటే చేయవచ్చు, చేయకపోవచ్చు.

(٢٦٥) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا شَكَّ أَحَدُكُمْ فِي صَلَاتِهِ فَلَمْ يَدْرِ كَمْ صَلَّى أَثَلَاثًا أَمْ أَرْبَعًا؟ فَلْيَطْرَحِ الشَّكَّ، وَلْيَبْنِ عَلَى مَا اسْتَيْقَنَ، ثُمَّ يَسْجُدْ سَجْدَتَيْنِ قَبْلَ أَنْ

265. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "మీలో ఎవరికయినా నమాజ్‌లో చదివిన రకతులు ఎన్ని? మూడా? నాలుగా? అన్న సంశయం కలిగితే అట్టి పరిస్థితిలో సంశయాన్ని ఉపేక్షించి, నిశ్చితంగా మీకు కలిగిన దృఢ అభిప్రాయాన్నే

يُسَلِّمَ، فَإِنْ كَانَ صَلَّى خَمْساً شَفَعْنَ لَهُ صَلاَتَهُ، وَإِنْ كَانَ صَلَّى تَمَاماً كَانَتَا تَرْغِيماً لِلشَّيْطَانِ». رَوَاهُ مُسْلِمٌ.

ప్రాతిపదికగా తీసుకుని నమాజ్‌ను కొన సాగించండి. 'సలాం' చేయకముందు 'సహూ'కి సంబంధించిన రెండు సజ్దాలు చేయండి. ఒకవేళ మీరు ఐదు రకతులు చదివి ఉంటే, ఈ రెండు (సహూ) సజ్దాలు ఆరవ రకతుకు ప్రత్యామ్నా యంగా ఉపయోగపడతాయి. (అంటే బేసి సంఖ్యను సరి సంఖ్యగా మారు స్తాయి). ఒకవేళ అతడు ముందే పూర్తి నమాజు (సరిగ్గా) చేసి వుంటే ఈ రెండు సజ్దాలు షైతాన్ పాలిట పరాభవంగా పరిణమిస్తాయి." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడిందేమిటంటే నమాజ్ మధ్యలో మనిషికి తాను పూర్తి చేసిన రకతుల గురించి అనుమానం రేకెత్తితే, అప్పుడతను తక్కువ చేసినట్లుగా పరిగణించాలి. ఇటువంటి పరిస్థితిలో అతనికి దృఢనమ్మకం కుదురుతుంది. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ మరియు అధిక సంఖ్యాక పండితుల అభిమతం ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరోవిధంగా ప్రతిపాదించారు: అలాంటి పరిస్థితిలో మనిషి జ్ఞాపకం తెచ్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాలి. అప్పటికీ అనుమానం తీరకపోతే మనసు ఎటువైపు మొగ్గితే అటువైపు సంఖ్యనే లెక్కలోకి తీసుకోవాలి. అంతచేసినప్పటికీ రకతులు సరిసమానంగా లెక్కలోకి వస్తే అప్పుడు తక్కువ సంఖ్యను అనుసరించాలి.

(٢٦٦) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللهِ ﷺ، فَلَمَّا سَلَّمَ قِيلَ لَهُ: يَا رَسُولَ اللهِ أَحَدَثَ فِي الصَّلاَةِ شَيْءٌ؟ قَالَ: «وَمَا ذَاكَ؟» قَالُوا: صَلَّيْتَ كَذَا وَكَذَا، قَالَ: فَثَنَى رِجْلَيْهِ، وَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ أَقْبَلَ عَلَيْنَا بِوَجْهِهِ فَقَالَ: «إِنَّهُ لَوْ حَدَثَ فِي الصَّلاَةِ شَيْءٌ أَنَبَّأْتُكُمْ بِهِ، وَلَكِنْ إِنَّمَا أَنَا بَشَرٌ مِّثْلُكُمْ،

266. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయించారు. సలాం చేసిన తరువాత ఆయన (సఅసం) సమక్షంలో ఇలా విన్నవించు కోవటం జరిగింది-'దైవప్రవక్తా (సఅసం)! నమాజ్‌లో ఏదన్నా మార్పు చేయ బడిందా?' "ఏమిటది?" అని ఆయన (స) అన్నారు. 'ప్రస్తుతం తమరు ఇన్ని రకాతులు చేశారు' అని సహచరులు

أَنْسَى كَمَا تَنْسَوْنَ، فَإِذَا نَسِيتُ فَذَكِّرُونِي، وَإِذَا شَكَّ أَحَدُكُمْ فِي صَلَاتِهِ فَلْيَتَحَرَّ الصَّوَابَ، فَلْيُتِمَّ عَلَيْهِ، ثُمَّ لِيَسْجُدْ سَجْدَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

విన్నవించుకున్నారు. ఇబ్నె మస్'వూద్ ఇలా అంటున్నారు - మహాప్రవక్త తన రెండు కాళ్ళను మడుచుకున్నారు (కూర్చున్నారు). ఖిబ్లావైపుకు తిరిగి రెండు సజ్దాలు చేశారు. తరువాత సలాం చేశారు. ఆ తరువాత మమ్ముల నుద్దేశించి ఇలా ఉపదేశించారు: "ఒకవేళ నమాజ్‌లో ఏదయినా కొత్తదనం వచ్చివుంటే నేను స్వయంగా దీనిగురించి మీకు తెలిపి ఉండేవాణ్ణి. కాని నేను కూడా మానవ మాత్రుణ్ణేనన్న సంగతిని గుర్తుంచుకోండి. మీరు మరచిపోయినట్లే నేను కూడా మరచిపోతుంటాను. కనుక నేను మరచిపోయినప్పుడల్లా నన్ను జ్ఞాపకం చేస్తుండండి. మీలో ఎవరికయినా - ఏ నమాజ్‌లోనయినా - సందిగ్ధ స్థితి ఏర్పడితే నిజనిర్ధారణ కొరకు ప్రయత్నించండి (ఆలోచించండి). దాని ఆధారంగానే నమాజ్‌ను పూర్తిచేసి తరువాత రెండు సజ్దాలు చేయండి". (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لِّلْبُخَارِيِّ: «فَلْيُتِمَّ، ثُمَّ يُسَلِّمْ، ثُمَّ يَسْجُدْ». وَلِمُسْلِمٍ: أَنَّ النَّبِيَّ ﷺ سَجَدَ سَجْدَتَيِ السَّهْوِ بَعْدَ السَّلَامِ وَالْكَلَامِ.

బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది: "(తొలుత) నమాజ్ పూర్తి చేసుకోవాలి. తదుపరి సలాం చేయాలి. ఆపైన సజ్దా చేయాలి." దైవప్రవక్త (సఅసం) సజ్దా సహూను సలాం మరియు కలాం తరువాత చేశారని ముస్లింలో వుంది.

وَلِأَحْمَدَ وَأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ مِنْ

ముస్నద్ అహ్మద్, అబూదావూద్, నసాయిలో ఉల్లేఖించబడిన అబ్దుల్లా

حَدِيْثِ عَبْدِاللهِ بْنِ جَعْفَرٍ مَرْفُوعاً: مَنْ شَكَّ فِيْ صَلاَتِهِ فَلْيَسْجُدْ سَجْدَتَيْنِ بَعْدَ مَا يُسَلِّمُ. وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

బిన్ జాఫర్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది: "ఏ వ్యక్తికయితే నమాజ్‌లో సందేహం కలిగిందో అతడు సలాం చేసిన మీదట రెండు సజ్దాలు చేయాలి." (ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికంగా ఖరారుచేశారు)

### సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (స) 'నేను కూడా మానవమాత్రుణ్ణే' అని చెప్పారు. కనీసం ఈ వాక్కు ఆధారంగానయినా ప్రజలు తమ మూఢ విశ్వాసాలను, మిథ్యా ఆలోచనలను సంస్కరించుకోవాలి. దైవప్రవక్త (స) 'మానవమాత్రులు కారు' అని బొంకేవారికి ఇది చెంపపెట్టువంటిది.

సామూహిక నమాజులో ముఖ్తదీలు (వెనుకనున్నవారు) ఇమామ్ ఒకవేళ మరచిపోయినప్పటికీ ఇమామ్‌ను మాత్రమే అనుసరించాలి. కాకపోతే ఇమామ్ వల్ల పొరబాటు జరిగినప్పుడు "సుబ్‌హానల్లాహ్" అంటూ వెనుకనుండి సావధానపరచవచ్చు. దీనికి సంబంధించిన వివరాలు ఇతర హదీసులలో కూడా ఉన్నాయి.

### హదీసు ఉల్లేఖకులు (అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ - రజి)

పూర్తిపేరు అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ బిన్ అబూతాలిబ్. మారుపేరు అబూ జాఫర్. తల్లి పేరు అస్మా బిన్తె ఉమైస్. అబిసీనియా (నేటి ఇథియోపియా) వైపునకు వలసపోతున్న సందర్భంగా ఇస్లాంలో జన్మించిన తొలి శిశువు ఈయన. హిజ్రీ 7వ యేట తండ్రితో కలసి మదీనా వచ్చారు. గొప్ప ధర్మదాత. ధీశాలి. సచ్ఛీలి. మర్యాదస్తులు. విస్తృతంగా దానధర్మాలు చేసిన కారణంగా 'దాతృసాగరం'గా పేరుగాంచారు. మదీనా మునవ్వరాలో హిజ్రీ 80లో 80 సంవత్సరాల వయస్సులో తనువు చాలించారు.

(٢٦٧) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ، قَالَ: «إِذَا شَكَّ أَحَدُكُمْ، فَقَامَ فِي الرَّكْعَتَيْنِ، فَاسْتَتَمَّ قَائِماً، فَلْيَمْضِ، وَلاَ يَعُودُ، وَلْيَسْجُدْ سَجْدَتَيْنِ، فَإِنْ لَمْ يَسْتَتِمَّ قَائِماً فَلْيَجْلِسْ،

267. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరికయినా రెండు రకతుల తర్వాత సందేహం రేకెత్తితే -అట్టి స్థితిలో లేచి నిలబడితే - పూర్తిగా నిలబడితే - అతను నమాజ్‌ను కొనసాగించాలి - వెనుకంజ వేయనవసరం లేదు. తరువాత రెండు సహూ సజ్దాలు చేసుకోవాలి.

وَلاَ سَهْوَ عَلَيْهِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَاللَّفْظُ لَهُ، بِسَنَدٍ ضَعِيفٍ.

ఒకవేళ నిటారుగా నిలబడకముందే సందేహం వస్తే వెంటనే కూర్చోవాలి. అట్టి పరిస్థితిలో అతడు సజ్దా సహూ చేయవలసిన అవసరం లేదు." (అబూ దావూద్, ఇబ్నె మాజ, దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు కూడా దారె ఖుత్నీలోనివే. దీని ఆధారం బలహీనమైనది (జయీఫ్).

(٢٦٨) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَيْسَ عَلَى مَنْ خَلْفَ الْإِمَامِ سَهْوٌ، فَإِنْ سَهَا الْإِمَامُ فَعَلَيْهِ وَعَلَى مَنْ خَلْفَهُ». رَوَاهُ الْبَزَّارُ وَالْبَيْهَقِيُّ بِسَنَدٍ ضَعِيفٍ.

268. హజ్రత్ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : - "ఏ ముఖ్తదీ (ఇమామ్ వెనుకనున్నవాని) పైనా సజ్దా సహూ బాధ్యతలేదు. ఒకవేళ ఇమామ్ మరిచి పోతే అప్పుడు ఇమామ్ మరియు ముఖ్తదీ - ఇద్దరిపై సజ్దా సహూ బాధ్యత ఉంటుంది." (దీనిని బజ్జార్, బైహఖీ లిరువురూ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు.)

(٢٦٩) وَعَنْ ثَوْبَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لِكُلِّ سَهْوٍ سَجْدَتَانِ بَعْدَ مَا يُسَلِّمُ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ بِسَنَدٍ ضَعِيفٍ.

269. హజ్రత్ సోబాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రతి సహూ (మరుపు)కై రెండు సజ్దాలున్నాయి. అవి సలాం చేసిన తరువాత చేయాలి." (అబూదావూద్, ఇబ్నె మాజా లిరువురూ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

(٢٧٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَجَدْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ فِي «إِذَا السَّمَاءُ انْشَقَّتْ» و«اقْرَأْ بِاسْمِ رَبِّكَ». رَوَاهُ مُسْلِمٌ.

270. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : మేము సూరయె ఇజస్సమావున్ షఖ్ఖత్, ఇఖ్రి బిస్మిరబ్బికల్లజీ....(సూరయె అలఖ్)లలో దైవప్రవక్త (సఅసం)తో కలిసి "సజ్దా తిలావత్" చేశాము.

(బుఖారీ)

**సారాంశం**

"సజ్దా తిలావత్" (దివ్య గ్రంథ పారాయణపు సజ్దా) చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. దీనిపై ఉలమా అందరిమధ్య ఏకాభిప్రాయం ఉంది. అయితే ఇది తప్పనిసరా? లేక సంప్రదాయమా? అన్న విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలున్నాయి. అధిక సంఖ్యాక పండితులు సజ్దా తిలావత్‌ను మస్నూన్ (సంప్రదాయం) గా భావించగా, ఇమామ్ అబూ హనీఫా మాత్రం దీనిని వాజిబ్ (తప్పనిసరి)గా ఖరారు చేశారు.

ఖుర్‌ఆన్‌లోని సజ్దాల సంఖ్యపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయినాయి. సూరయె 'సాద్' మరియు ముఫస్సల్ సూరాలలో సజ్దా తిలావత్ అక్కరలేదంటారు ఇమామ్ షాఫయి. ఈ విధంగా ఆయన దృష్టిలో ఖుర్‌ఆన్‌లోని సజ్దాలు 11 మాత్రమే. ఈ లెక్కన చూస్తే ఈ హదీసు ఈయనగారి ఆలోచనకు భిన్నంగా ఉంది. ఇమామ్ అబూ హనీఫా గారేమో మొత్తం 14 సజ్దాలున్నాయని అంటారు. ఈయన హజ్ సూరాలోని మొదటి సజ్దాను సజ్దాగా శిరసావహించారుగాని, అందలి రెండవ సజ్దాను పరిగణనలోకి తీసుకోలేదు. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారి దృష్టిలో హజ్ సూరాలోని రెండు సజ్దాలను కూడా కలుపుకుంటే మొత్తం 15 సజ్దాలు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. ఈ విషయంలో అందరికన్నా అత్యంత ప్రామాణికమైన, అనుసరణీయమైన విధానం ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారిదే అనాలి.

(٢٧١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: (ص) لَيْسَتْ مِنْ عَزَائِمِ السُّجُودِ، وَقَدْ رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَسْجُدُ فِيهَا. رَوَاهُ الْبُخَارِيُّ.

271. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "తప్పనిసరిగా చేయవలసిన సజ్దాలలో సూరయె సాద్ సజ్దా లేదు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ సూరా పారాయణం చేసే సంద ర్భంగా సజ్దా చేయటం నేను చూచాను."

(బుఖారీ)

**సారాంశం**

దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే సూరయె సాద్ సజ్దా దైవప్రవక్త (స) మాత్రం చేశారుగాని, దాని గురించి ఇతరులను ఆజ్ఞాపించటంగానీ, తాకీదు చేయటంగానీ చేయలేదు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే కొన్ని ఆచరణలు 'మస్నూన్' అయి ఉంటాయిగానీ, ఇతరులపై దానికి సంబంధించిన ఆంక్ష ఉండదు. అనుసరిస్తే మంచిది. అనుసరించకపోతే వచ్చే అనర్థం కూడా లేదు.

(٢٧٢) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ سَجَدَ بِالنَّجْمِ. رَوَاهُ الْبُخَارِيُّ.

272. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి మరొక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నజమ్ సూరాలో 'సజ్దా తిలావత్' చేశారు.

(బుఖారీ)

### సారాంశం

నజమ్ సూరాలో సజ్దా తిలావత్ చేయటం తప్పనిసరి అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ముఫస్సల్ సూరాలలో సజ్దాలు లేవని వాదించేవారు దీనిపై యోచన చేయాలి.

(٢٧٣) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَرَأْتُ عَلَى النَّبِيِّ ﷺ النَّجْمَ، فَلَمْ يَسْجُدْ فِيهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

273. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎదుట నజమ్ సూరాను పారాయణం చేశాను. కాని ఆయన (స) ఈ సందర్భంగా సజ్దా తిలావత్ చేయలేదు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దైవప్రవక్త (స) నజమ్ సూరా సందర్భంగా ఎప్పుడయినా ఒకసారి (పారాయణపు) సజ్దా చేయలేదంటే దీని భావం ఆ సూరాలో సజ్దా తిలావత్ అసలు లేదనీ లేక సజ్దా చేయనక్కరలేదని ఎంతమాత్రం కాదు. అసలు విషయం ఏమిటంటే కొన్ని కొన్ని సందర్భాలలో ఆయన (స) సజ్దా చేయలేదు. ఈ ఖుర్ఆనీ సజ్దాలు 'సున్నత్' (సంప్రదాయం) అన్న దానికి ఇదొక నిదర్శనం. ఒకవేళ ఇవి వాజిబ్ అయివుంటే సజ్దా తప్పకుండా చేసి వుండేవారు. ఈ విషయంలో అధిక సంఖ్యాక పండితుల అభిమతం కూడా ఇదే.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు జైద్ బిన్ సాబిత్ (రజి). మారుపేరు అబూ సయీద్. అన్సార్‌ల ప్రముఖ తెగ అయిన నజ్జార్‌తో ఈయనకు సంబంధముండేది. దైవప్రవక్త (స)పై అవతరించే 'వహీ'ని అందరికన్నా ఈయనే అధికంగా గ్రంథస్థం చేసేవారు. దైవప్రవక్త (స) సహచరులలో వారసత్వ పంపకాలను విశదీకరించటంలో సాటిలేని మేటి. కందక పోరాటంలో తొలిసారిగా పాల్గొన్నారు. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ పరిపాలనా కాలంలో ఖుర్ఆన్‌ను క్రోడీకరించే కార్యం ఈయనే అధికంగా నిర్వర్తించారు. హజ్రత్ ఉస్మాన్ పరిపాలనా కాలంలో వాటి నకలును కూడా తయారు చేశారు. దైవప్రవక్త (సఅసం) ఆదేశానుసారం కేవలం 15 రోజులలో యూదుల భాషా లిపిని నేర్చుకుని, దైవప్రవక్త (స)గారి ఉత్తరాలను లిఖించసాగారు. లిఖించిన మీదట ఆ ఉత్తరాలను దైవప్రవక్త (స)కు చదివి వినిపించే వారు. హిజ్రీ 45లో మదీనాలో మరణించారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం మదీనా గాక, వేరొక ప్రాంతంలో మరణించారు.

(٢٧٤) وَعَنْ خَالِدِ بْنِ مَعْدَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: فُضِّلَتْ سُوْرَةُ الْحَجِّ بِسَجْدَتَيْنِ. رَوَاهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيْلِ، وَرَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ مَوْصُولاً مِنْ حَدِيْثِ عُقْبَةَ بْنِ

274. హజ్రత్ ఖాలిద్ బిన్ మాదాన్ (రజి) కథనం : "హజ్ సూరాకు రెండు సజ్దాల మూలంగా శ్రేష్ఠత నొసగ బడింది." (అబూదావూద్ దీనిని 'మరాసీల్' అనే పుస్తకంలో ప్రస్తావించారు) అహ్మద్ మరియు తిర్మిజీ దీనిని

عَامِرٍ، وَزَادَ: «فَمَنْ لَمْ يَسْجُدْهُمَا فَلاَ يَقْرَأْهَا». وَسَنَدُهُ ضَعِيفٌ.

ఉత్బా బిన్ ఆమిర్ హదీసును బట్టి 'మౌసూల్'గా ఖరారు చేశారు. ఇందులో అదనంగా ఈ వాక్యం ఉంది - "ఎవరయితే ఈ సూరాలోని రెండు సజ్దాలు చేయరో వారు దీనిని పారాయణం చేయరాదు." (దీని ఆధారం బలహీనం)

## సారాంశం

హజ్ సూరాలో రెండు సజ్దాలున్నాయనీ, ఆ రెండు సజ్దాలు కూడా చేయాల్సిందేననీ ఈ హదీసు చెబుతోంది. సజ్దాలు చేయదలచనివారు దీనిని పఠించకూడదు గాక! అని కూడా అనబడింది. ఇందలి పరమార్థం ఏమిటంటే ఖుర్ఆన్ పారాయణం ముస్తహబ్ కాగా; సజ్దా తిలావత్ చేయటం మస్నూన్. సున్నత్‌ను విడనాడటం కన్నా ముస్తహబ్ పై అమలు చేయకుండా ఉండటమే మంచిది - అంటే ఈ సూరాను పారాయణం చేయకుండా ఉండటం సముచితమని భావం. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి), అబూ మూసా (రజి), అబూదర్దా (రజి), అమ్మార్ బిన్ యాసిర్ (రజి) తదితర సహచరులు హజ్ సూరాలోని రెండు సజ్దాలు కూడా చేసేవారు. అందుచేత ఈ ఉల్లేఖనాన్ని ఆచరణ యోగ్యం కాదని అనటం పొరపాటు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు ఖాలిద్ బిన్ మాదాన్ (రజి). మారుపేరు అబూ అబ్దుల్లా కలాయి. హిమ్స్ (సిరియా)కు చెందినవారు. సహాబీల తరువాతి తరం వారు (తాబయి). జ్ఞానసంపన్నులు. తాను 70 మంది సహాబీలను కలుసుకున్నానని ఆయన అనేవారు. ఈయన మరణం హిజ్రీ 103 లేక 104 లేక 108 లో సంభవించింది.

(٢٧٥) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: يَا أَيُّهَا النَّاسُ! إِنَّا نَمُرُّ بِالسُّجُودِ، فَمَنْ سَجَدَ فَقَدْ أَصَابَ، وَمَنْ لَمْ يَسْجُدْ فَلاَ إِثْمَ عَلَيْهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

275. హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు : "ప్రజలారా! మనం సజ్దాలున్న ఆయత్‌లు పారాయణం చేస్తూ ముందుకు సాగుతుంటాము. 'సజ్దా' చేసినవాడు సవ్యంగా తన బాధ్యతను నిర్వర్తించాడు. చేయనివాడు పాపాత్ముడు మాత్రం కాడు." (బుఖారీ)

وَفِيْهِ: إِنَّ اللَّهَ تَعَالَى لَمْ يَفْرِضِ السُّجُودَ إِلاَّ أَنْ يَشَاءَ. وَهُوَ فِي الْمُوَطَّإِ.

ముఅత్తాలో ఇలా వుంది-"అల్లాహ్ సజ్దా తిలావత్‌ను విధిగా చేయలేదు. అయితే పఠించేవాడు గనక తలచుకుంటే (సజ్దా) చేయవచ్చు".

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఖుర్ఆన్ పారాయణం చేసేవారికి సజ్దా తిలావత్‌కు సంబంధించి స్వేచ్ఛ ఇవ్వబడింది. సజ్దా తిలావత్ గనక ఫర్జ్ లేక వాజిబ్ అయివుంటే ఈ మేరకు స్వేచ్ఛ నొసగ బడేది కాదు. హజ్రత్ ఉమర్ (రజి) సహాబీల సమక్షంలో ఈ మాటలన్నారు. విన్నవారంతా మౌనంగా ఉన్నారు. అంటే ఇది అందరికీ వర్తించే అంశమని విదితమవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌ల అభిమతం కూడా ఇదే. అహ్లె హదీసు వారు కూడా సజ్దా తిలావత్‌ను 'మస్నూన్'గానే తలపోస్తారు. కాని హనఫీలు దీనిని 'వాజిబ్'గా తలంచారు.

(٢٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَقْرَأُ عَلَيْنَا الْقُرْآنَ، فَإِذَا مَرَّ بِالسَّجْدَةِ كَبَّرَ وَسَجَدَ، وَسَجَدْنَا مَعَهُ. رَوَاهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ فِيْهِ لِيْنٌ.

276. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా ముందు దివ్యఖుర్ఆన్ పారాయణం చేసేవారు. సజ్దా గల ఆయత్ వచ్చినపుడు 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా చేసేవారు. మేము కూడా ఆయన (స)తో పాటే సజ్దా చేసే వారము." (అబూదావూద్ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు).

**సారాంశం**

సజ్దా తిలావత్ చేసేటప్పుడు అల్లాహు అక్బర్ అని అనటం నియమం అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. సజ్దా తిలావత్‌లో ఈ దుఆ పఠించాలి -

**సజద వజ్'హీలిల్లజీ ఖలఖహూ వ సవ్వరహూ వ**
**షఖ్ఖ సమఅహూ వ బసరహూ వ బిహౌలిహీ వ ఖువ్వతిహీ**

(అర్థం : ఎవరయితే సృష్టించాడో, రూపకల్పన చేశాడో, వినే శక్తినిచ్చాడో, చూపునొసగాడో, శక్తి సామర్థ్యాలను ప్రసాదించాడో వాని ముందు నా తల వాలిపోయింది)

(٢٧٧) وَعَنْ أَبِيْ بَكْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا جَاءَهُ أَمْرٌ يَسُرُّهُ خَرَّ سَاجِداً لِلّٰهِ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

277. హజ్రత్ అబూబక్ర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఏదయినా శుభవార్త అందితే ఆయన (స) దైవసమక్షంలో సాష్టాంగ పడేవారు" ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు).

### సారాంశం

ఏదైనా దైవానుగ్రహం కలిగినపుడు, ఏదైనా గండం గడచినపుడు, ఏదైనా సంతోషకర విషయం తెలిసినపుడు దైవానికి కృతజ్ఞతా సూచకంగా మోకరిల్లటం షరీయత్‌పరంగా సబబేనని దీన్నిబట్టి రూఢీ అవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌లు కూడా దీనికి సుముఖంగా ఉన్నారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫాలు దీనిని వాంఛనీయంగాగానీ, అవాంఛనీయంగాగానీ పేర్కొనలేదు.

(٢٧٨) وَعَنْ عَبْدِ الرَّحْمَنِ بْنِ عَوْفٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَجَدَ النَّبِيُّ ﷺ فَأَطَالَ السُّجُودَ، ثُمَّ رَفَعَ رَأْسَهُ وَقَالَ: **إِنَّ جِبْرِيْلَ أَتَانِي، فَبَشَّرَنِي، فَسَجَدْتُ لِلّٰهِ شُكْراً.** رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

278. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సజ్దా చేశారు. చాలా సుదీర్ఘమయిన సజ్దా చేశారు. సజ్దా నుండి తల పైకెత్తిన పిదప ఇలా అన్నారు- "ఇప్పుడే జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా దగ్గరకు ఒక శుభవార్త తీసుకు వచ్చారు. ఆ శుభవార్త విని నేను అల్లాహ్ సన్నిధిలో కృతజ్ఞతా పూర్వకంగా సాష్టాంగ పడ్డాను." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు).

### సారాంశం

ముస్నద్ అహ్మద్‌లో ఈ హదీసు పలు ఆధారాలతో ఉల్లేఖించబడింది. ఆ శుభవార్త ఏమిటో కూడా అందులో తెలుపబడింది - "ఎవరయితే మహాప్రవక్త (సఅసం)పై ఒకసారి దరూద్ పంపుతాడో అతనిపై అల్లాహ్ పది దయానుగ్రహాలను తన తరపున కురిపిస్తాడు" అని ఆయనకు తెలుపబడగా ఆయన (స) దైవానికి కృతజ్ఞతలర్పిస్తూ ఈ సజ్దా చేశారు. కాబట్టి ఎవరికయినా సంతోషకరమయిన వార్త అందినపుడు వారు తమ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సజ్దా చేయటం అభిలషణీయం.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి). మరోపేరు అబూ ముహమ్మద్. ఖురైషీకు చెందిన 'జుహ్రి' తెగతో ఈయనకు బాంధవ్యం ఉంది. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు చేసిన ఘనత ఈయనకు దక్కింది. బద్ర్, ఉహుద్‌లతో సహా యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) నోట ఇహలోకంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన

పదిమందిలో ఈయన కూడా ఉన్నారు. తన తరువాత ఖలీఫాగా ఎంపిక చేసేందుకు పరిశీలించదగ్గ ఆరుగురు వ్యక్తుల పేర్లతో కూడిన జాబితాను ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) అందజేశారు. ఈ ఆరుగురు వ్యక్తులలో ఈయన కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) కాలంలో ఈయన ఒకసారి నాలుగువేలు, మరోసారి నలభై వేల దీనార్లు దానం చేశారు. అంతేకాదు, దైవమార్గంలో పోరాటం నిమిత్తం 500 గుఱ్ఱాలు, 500 ఒంటెలను కూడా సమర్పించారు. దైవప్రవక్త సతీమణుల కోసం తన ఆస్తిలోని ఒక భాగాన్ని వీలు వ్రాసి ఇచ్చారు. ఆ తరువాత ఆ ఆస్తికి వెలకట్టగా అది 4 లక్షల దీనార్లని తేలింది. హిజ్రీ 34లో మరణించారు. జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

(٢٧٩) وَعَنِ الْبَرَاءِ بْنِ عَازِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ عَلِيًّا إِلَى الْيَمَنِ، فَذَكَرَ الحديث. قال: فكتب عليٌّ بإسلامهم، فَلَمَّا قَرَأَ رَسُولُ اللهِ ﷺ الْكِتَابَ خَرَّ سَاجِداً، شُكْراً للهِ عَلَى ذَلِكَ. رَوَاهُ الْبَيْهَقِيُّ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

279. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ అలీ (రజి)ని యమన్ వైపునకు పంపించారు. హదీసు ఉల్లేఖకులు ఇలా అంటున్నారు - హజ్రత్ అలీ (రజి) యమన్ వాసుల ఇస్లాం స్వీకారానికి సంబంధించిన వివరాలు దైవప్రవక్త సమక్షానికి వ్రాసి పంపగా దైవప్రవక్త (స) ఆ ఉత్తరాన్ని చదివారు. దైవానికి కృతజ్ఞతలు చెల్లించేందుకై ఆయన (స) సాష్టాంగ పడ్డారు. (బైహఖీ దీనిని ఉల్లేఖించారు- దీని మూలం బుఖారీలో పొందుపరచబడి ఉంది)

**సారాంశం**

యమన్ ప్రజలు ఇస్లాంలోకి ప్రవేశించిన సంగతిని హజ్రత్ అలీ (రజి) లేఖ ద్వారా తెలుసుకుని దైవప్రవక్త (స) మేను ఆనందంతో పులకించింది. కృతజ్ఞతా సూచకంగా దైవసన్నిధిలో ఆయన (స) సజ్దా చేశారు.

ముస్లింల సంఖ్య గణనీయంగా పెరగటం సంతోషదాయకమైన విషయం. నిశ్చయంగా ఇది దేవుని మహదానుగ్రహం. కనుక దీనికిగాను కృతజ్ఞతలర్పించటం ధర్మం. ఒకప్పుడు ఇలాంటి సంతోషకరమైన సంఘటనలు జరిగినపుడు - ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగినపుడు - దేవునికి కృతజ్ఞతలర్పించేవారు. కాని ఇప్పుడో?! ముస్లింల సంఖ్యను గణనీయంగా తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కుటుంబ నియంత్రణ పథకాల పేరుతో, వ్యక్తిగత స్థాయిలోనే గాకుండా, ప్రభుత్వ స్థాయిలో కూడా జననాల రేటును తగ్గించే కృషి జరుగుతోంది. కొన్ని ముస్లిం రాజ్యాలలో సయితం ఈ పథకాలు ప్రవేశపెట్టబడటం కడు శోచనీయం!

**9వ అధ్యాయం**

## నఫిల్ నమాజులు

## ٩ - بَابُ صَلاَةِ التَّطَوُّعِ

280. హజ్రత్ రబీయ బిన్ కాబ్ అస్లమీ (రజి) ఉల్లేఖించారు : ఒకరోజు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్నుద్దేశ్యించి ఇలా అన్నారు : "(నీకేం కావాలో) అడుగు?". 'నేను స్వర్గంలో తమరి వెంట ఉండగోర్తున్నాను' అని నేనన్నాను. "ఇదిగాక ఇంకేమయినా కోరుకో" అని అన్నారాయన (స). 'నాకంతే చాలు' అని నేను విన్నవించుకున్నాను. "మరయితే నీ ఆశయ సాధనకై అత్యధికమయిన సజ్దాలతో నాకు తోడ్పడు" అని ఆయన (సఅసం) ఉపదేశించారు.

(ముస్లిం)

(٢٨٠) عَنْ رَبِيْعَةَ بْنِ كَعْبٍ الْأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِيَ النَّبِيُّ ﷺ: «سَلْ»، فَقُلْتُ: أَسْأَلُكَ مُرَافَقَتَكَ فِي الْجَنَّةِ، فَقَالَ: «أَوَ غَيْرَ ذَلِكَ؟» فَقُلْتُ: هُوَ ذَاكَ، قَالَ: «فَأَعِنِّي عَلَى نَفْسِكَ بِكَثْرَةِ السُّجُودِ». رَوَاهُ مُسْلِمٌ.

### సారాంశం

ఈ హదీసులో అత్యధిక సజ్దాలంటే భావం నఫిల్ (అదనపు) నమాజులు ఎక్కువగా చేస్తూ ఉండమని అన్నమాట! నమాజులోని అంశాలన్నింటికన్నా శ్రేష్ఠమయినది సజ్దా (సాష్టాంగం). దైవ సామీప్యానికి అత్యంత ముఖ్యమయిన సాధనం సజ్దా. దైవ సామీప్యం పొందడానికీ, దైవప్రవక్త (స) సహచర్యం (సాన్నిహిత్యం) లభించడానికి నఫిల్ (స్వచ్ఛంద) నమాజులను నెరవేర్చటం అవసరమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

చాలామంది తమను తాము దైవప్రవక్త (స) యొక్క నికార్సయిన అనుయాయులమని ప్రకటించుకుంటారు. కాని ప్రవక్త (స) సూచించిన ఆరాధనలను, అభ్యాసాలను మాత్రం పట్టించుకోరు. మరికొంత మంది ఉన్నారు - వారు తమను తాము దైవప్రవక్త (స) భక్తులుగా, వీరాభిమానులుగా గొప్పలు చెప్పు కుంటారు. కాని వారు నఫిల్ నమాజులు కాదుకదా, కనీసం ఫర్జ్ నమాజులు కూడా చేయరు. ఇది అజ్ఞానానికి, సోమరితనానికి, తలబిరుసుతనానికి, దగుల్బాజీతనానికి ప్రబల తార్కాణం మాత్రమే.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు రబీయ బిన్ కాబ్ (రజి). మారుపేరు అబూ ఫిరాస్. అస్లం తెగకు చెందిన వారవటం చేత అస్లమీగా పిలువబడ్డారు. అస్‌హాబె సుఫ్ఫహ్ (అరుగువాళ్ల)లో ఒకరు. మదీనా వాసులు. దైవప్రవక్త (సఅసం) గారి ప్రత్యేక సేవకులు. మదీనాలోనూ, ప్రయాణ సమయాల్లోనూ దైవప్రవక్త (సఅసం) కు తోడుగా ఉండేవారు.

(٢٨١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: حَفِظْتُ مِنَ النَّبِيِّ ﷺ عَشْرَ رَكْعَاتٍ: رَكْعَتَيْنِ قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ بَعْدَهَا، وَرَكْعَتَيْنِ بَعْدَ الْمَغْرِبِ فِي بَيْتِهِ، وَرَكْعَتَيْنِ بَعْدَ الْعِشَاءِ فِيْ بَيْتِهِ، وَرَكْعَتَيْنِ قَبْلَ الصُّبْحِ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لَّهُمَا: وَرَكْعَتَيْنِ بَعْدَ الْجُمُعَةِ فِيْ بَيْتِهِ.

281. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి పది రకతులు నాకు జ్ఞాపకం ఉన్నాయి. రెండు రకతులు జుహ్ర్ నమాజుకు ముందు, రెండు తరువాత, మగ్రిబ్ (నమాజు) తర్వాత రెండు రకతులు ఇంటి వద్ద చదివేవారు. అలాగే రెండు రకతులు ఇషా ఫర్జ్ నమాజ్ అనంతరం ఇంటి వద్దనే చేసేవారు. రెండు రకతులు ఉదయానికి (నమాజుకు) ముందు చేసేవారు.'' (బుఖారీ, ముస్లిం).

బుఖారీ, ముస్లింలలోని రెండు ఉల్లేఖనాలలోనూ ఇది కూడా వుంది: ''రెండు రకతులు జుమా నమాజ్ (ఫర్జ్ నమాజ్) అనంతరం ఇంటివద్ద చేసేవారు.''

وَلِمُسْلِمٍ: كَانَ إِذَا طَلَعَ الْفَجْرُ لاَ يُصَلِّي إِلاَّ رَكْعَتَيْنِ خَفِيْفَتَيْنِ.

ముస్లిం ఉల్లేఖనంలో ఇంకా ఈ విధంగా ఉంది - ''తెల్లవారాక తేలికపాటి రెండు రకతులు తప్ప మరొకటి నెరవేర్చేవారు కారు.''

**సారాంశం**

ఈ హదీసును బట్టి జుహ్ర్ నమాజులో ఫర్జ్‌కు ముందు రెండు రకతులు, ఫర్జ్ తరువాత రెండు రకతులు - మొత్తం నాలుగు రకతులు మాత్రమే (సున్నత్ నమాజులు) ఉన్నాయని అవగతమవుతోంది. వేరొక హదీసు ప్రకారం ఫర్జ్‌కు ముందు 4 రకతులు, ఫర్జ్ తరువాత 2 రకతులు చేసినట్టు కూడా ఆధారం ఉంది.

(٢٨٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ لاَ يَدَعُ أَرْبَعاً قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ قَبْلَ الْغَدَاةِ. رَوَاهُ الْبُخَارِيُّ.

282. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుహ్ర్ నమాజుకు ముందు 4 రకతులను, ఫజ్ర్ నమాజు (కు ముందు) రెండు రకతులను ఎన్నడూ విడనాడ లేదు.'' (బుఖారీ)

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) రేయింబవళ్లలో ఫర్జ్ నమాజులతో పాటు కొన్ని నఫిల్ నమాజులను కూడా నెరవేర్చేవారు. ఏ నఫిల్ నమాజులను ఆయన ఎన్నడూ విడవకుండా చేసేవారో మరియు చేయమని తన సహచరులను ప్రోత్సహించేవారో వాటిని 'సున్నతె ముఅక్కద'గాను, మరే నమాజులను నిరంతరం చేసేవారు కాదో వాటిని 'సున్నతె గైర్ ముఅక్కద'గానూ, 'నఫిల్' నమాజులు గాను పేర్కొనటం జరిగింది. యదార్థానికి ఇవన్నీ నఫిల్ నమాజులే (స్వచ్ఛంద నమాజులే).

ఈ హదీసులో జుహ్ర్ నమాజుకు ముందు నాలుగు రకతుల ప్రస్తావన వచ్చింది. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారి ఉల్లేఖనంలో జుహ్ర్‌లో ఫర్జ్‌కు ముందు రెండు రకతులు, ఫర్జ్ తరువాత రెండు రకతులు అని వుంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో జుహ్ర్‌కు ముందు రెండు రకతులు ప్రాధాన్యతతో కూడుకున్నవి. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో నాలుగు రకతులు ప్రాధాన్యతతో కూడుకున్నవి. ఈ సందర్భంగా ఉల్లేఖనాలన్నింటినీ ముందుకు తెచ్చి, ఆయన (సఅసం) రెండు విధాలుగానూ ఆచరించే వారని చెప్పటం సమంజసంగా ఉంటుంది. అయితే రెండు రకతులకన్నా నాలుగు రకతులు చదవటం ఎక్కువ పుణ్యప్రదం అనటంలో సందేహం లేదు.

(٢٨٣) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمْ يَكُنِ النَّبِيُّ ﷺ عَلَى شَيْءٍ مِّنَ النَّوَافِلِ أَشَدَّ تَعَاهُداً مِّنْهُ عَلَى رَكْعَتَيِ الْفَجْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

283. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నఫిల్ నమాజులలో అన్నిటి కన్నా అధికంగా ఫజ్ర్ సున్నతుల పట్ల శ్రద్ధ వహించేవారు." (బుఖారీ, ముస్లిం).

وَلِمُسْلِمٍ: «رَكْعَتَا الْفَجْرِ خَيْرٌ مِّنَ الدُّنْيَا وَمَا فِيهَا».

ముస్లింలో ఇలా వుంది : "ఫజ్ర్ నమాజులోని రెండు రకతులు (సున్నత్) ప్రపంచం మరియు అందులో ఉన్న దానికన్నా శ్రేష్ఠమైనవి."

### సారాంశం

ఇందులో ఏమాత్రం సందేహానికి ఆస్కారం లేదు. నఫిల్ నమాజులలో దైవప్రవక్త (స) ఉదయం పూట నమాజుకు ఇచ్చినంత ప్రాధాన్యత మరి దేనికీ ఇవ్వలేదు. ఆఖరికి ప్రయాణ సమయాలలో కూడా ఆయన (స) ఈ రెండు రకతులను విడిచిపెట్టలేదు. ఈ రెండు సున్నతుల గురించి చేయబడిన తాకీదును దృష్టిలో పెట్టుకునే హనఫీ ఫికహ్ ననుసరించేవారు ఫజ్ర్‌లో సామూహిక నమాజ్ జరుగుతున్నప్పటికీ - ఈ రెండు రకతులను చేయటం అనివార్యంగా చేసుకున్నారు. మరి చూడబోతే ఈ పద్ధతి హదీసుతో సమరసం చెందదు. ఎందుకంటే మస్జిద్‌లో - ఫర్జ్ నమాజ్ సామూహికంగా నెలకొన్న తరువాత వేరొక నమాజ్‌కు వీలుండదు. దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: "ఇఖామత్ అయిన తరువాత ఫర్జ్ నమాజు తప్ప మరో నమాజు లేదు."

(٢٨٤) وَعَنْ أُمِّ حَبِيبَةَ أُمِّ الْمُؤْمِنِينَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «**مَنْ صَلَّى اثْنَتَيْ عَشْرَةَ رَكْعَةً فِي يَوْمٍ وَلَيْلَةٍ بُنِيَ لَهُ بِهِنَّ بَيْتٌ فِي الْجَنَّةِ**». رَوَاهُ مُسْلِمٌ، وَفِي رِوَايَةٍ: «تَطَوُّعاً»

284. ఉమ్ముల్ మోమినీన్ హాజత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా నేను స్వయంగా విన్నాను- "ఏ వ్యక్తయితే రేయింబవళ్ళలో 12 రకతుల నఫిల్ నమాజు చేశాడో అతని కొరకు - వాటికి బదులుగా - స్వర్గంలో గృహం నిర్మించబడింది" (ముస్లిం). మరొక ఉల్లేఖనంలో "నఫిల్ రూపేణా" అని వుంది.

وَلِلتِّرْمِذِيِّ نَحْوُهُ وَزَادَ: أَرْبَعاً قَبْلَ الظُّهْرِ، وَرَكْعَتَيْنِ بَعْدَهَا، وَرَكْعَتَيْنِ بَعْدَ الْمَغْرِبِ، وَرَكْعَتَيْنِ بَعْدَ الْعِشَاءِ وَرَكْعَتَيْنِ قَبْلَ صَلاَةِ الْفَجْرِ.

తిర్మిజీ ఉల్లేఖనంలో కూడా ఇలాగే వుంది - అయితే అందులో అదనంగా ఇలా చెప్పబడింది: "4 రకతులు జుహ్రీకు ముందు, 2 రకతులు తరువాత, 2 రకతులు మగ్రిబ్ నమాజు తర్వాత, 2 రకతులు ఇషా తరువాత, 2 రకతులు ఉదయం నమాజుకు ముందు."

وَلِلْخَمْسَةِ عَنْهَا: «**مَنْ حَافَظَ على أَرْبَعٍ قَبْلَ الظُّهْرِ، وَأَرْبَعٍ بَعْدَهَا، حَرَّمَهُ اللَّهُ تَعَالَى عَلَى النَّارِ**».

ఐదుగురూ (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ) హాజత్ ఉమ్మెహబీబా (ర.అనహా) గారి ఆధారం గానే ఇలా ఉల్లేఖించారు: "ఎవ రయితే జుహ్రీలోని మొదటి నాలుగు రకతులను కాపాడాడో, తదుపరి నాలుగు రకతులను సక్రమంగా చదువుతూ ఉన్నాడో అతనిపై అల్లాహ్ నరకాగ్నిని నిషిద్ధం (హరామ్) గావిస్తాడు."

**సారాంశం**

రేయింబవళ్లలో 12 రకతులు 'సున్నతె ముఅక్కద'గా చేయబడ్డాయని ఈ హదీసును బట్టి విదిత మవుతోంది. దీనిని తప్పక పాటించాలి. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) ఈ నమాజులను

నిరంతరం పాటించారు. జుహ్రులో ఫర్జ్ నమాజ్ అనంతరం రెండు రకతులయినా చేయవచ్చు. నాలుగు రకతుల నమాజ్ అయినా చెయ్యవచ్చు. నాలుగు రకతులు ఎంతో మహత్ పూర్వకమైనవని చెప్పబడింది. ఒకవేళ ఎవరయినా ఆరు రకత్‌లు చెయ్యదలచుకుంటే అందుకూ అనుమతి ఇవ్వబడింది.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె హబీబా (ర.అన్‌హా). ఈమె అసలు పేరు 'రమ్‌లా'. అబూ సుఫ్యాన్ కుమార్తె. అమీర్ ముఆవియ (రజి) సోదరీ. తొలికాలంలోనే ఇస్లాం స్వీకరించారు. అబిసీనియా (నేటి ఇథియోపియా)కు వలస వెళ్ళిన వారిలో ఈమె కూడా ఉన్నారు. ఈమె భర్త అబ్దుల్లా బిన్ జహష్ కూడా ఈమెతోపాటే వలస వెళ్ళాడు. కాని అక్కడతను క్రైస్తవుడిగా మారిపోయాడు. కొంతకాలం తరువాత అక్కడే చనిపోయాడు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆమెను - హిజ్రీ 7లో - నికాహ్ చేసుకుని తన దాంపత్య జీవితంలోనికి తెచ్చుకున్నారు. నికాహ్ సమయంలో ఈమె అబిసీనియాలోనే ఉన్నారు. తరువాత ఈమె అబిసీనియా ముహాజిర్లతో కలసి మదీనా వచ్చారు. హిజ్రీ 42లోనో, 44లోనో లేక 50 లోనో మరణించారు.

(٢٨٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «رَحِمَ اللَّهُ امْرَأً صَلَّى أَرْبَعاً قَبْلَ الْعَصْرِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرمِذِيُّ، وَحَسَّنَهُ، وَابْنُ خُزَيْمَةَ، وَصَحَّحَهُ.

285. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు: "అస్ర్ నమాజుకు ముందు నాలుగు రకతులు చదివిన వానిపై అల్లాహ్ దయదలచుగాక!" (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. ఇబ్నె ఖుజైమా మాత్రం 'సహీహ్'గా నిర్ధారించారు.)

## సారాంశం

అస్ర్ నమాజుకు ముందు చదివే ఈ నాలుగు రకతులు 'సున్నతె ముఅక్కద' క్రిందికి రావు - ఇవి కేవలం నఫిల్ మాత్రమే. అయితే వీటిని నెరవేర్చిన వానిపై దైవకారుణ్యానికి సంబంధించిన వేడుకోలు వచనాలు వచ్చినందున ఈ నాలుగు రకతులు చేయటం మంచిదే. దైవకారుణ్యానికి నోచుకోవటంకన్నా భాగ్యం ఇంకేముందీ?!

(٢٨٦) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مُغَفَّلٍ الْمُزَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «صَلُّوا قَبْلَ الْمَغْرِبِ، صَلُّوا قَبْلَ

286. హజ్రత్ అబ్దుల్లా బిన్ ముగప్ఫల్ ముజనీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మగ్రిబ్‌కు ముందు నమాజ్

الْمَغْرِبَ»، ثُمَّ قَالَ فِي الثَّالِثَةِ: لِمَنْ شَاءَ، كَرَاهِيَةَ أَنْ يَتَّخِذَهَا النَّاسُ سُنَّةً. رَوَاهُ الْبُخَارِيُّ.

చేయండి. మగ్రిబ్‌కు ముందు నమాజ్ చేయండి. మూడవసారి - 'చేయదలిచిన వానికి మాత్రమే ఈ ఆజ్ఞ వర్తిస్తుంది' అని అన్నారు. ప్రజలు దీనిని ఎక్కడ సున్నత్‌గా తలపోస్తారో నన్న సంశయంతో ఆయన (స) ఈ విధంగా సెలవిచ్చారు." (బుఖారీ)

وَفِيْ رِوَايَةٍ لابْنِ حِبَّانَ: أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى قَبْلَ الْمَغْرِبِ رَكْعَتَيْنِ.

ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖనంలో ఇలా వుంది: "దైవప్రవక్త (సఅసం) మగ్రిబ్‌కు ముందు రెండు రకతుల నమాజ్ సలిపారు."

وَلِمُسْلِمٍ عَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي رَكْعَتَيْنِ بَعْدَ غُرُوبِ الشَّمْسِ، وَكَانَ النَّبِيُّ ﷺ يَرَانَا، فَلَمْ يَأْمُرْنَا، وَلَمْ يَنْهَنَا.

ముస్లింలో హజ్రత్ అనస్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా వుంది: "మేము సూర్యాస్తమయం అయిన తరువాత (ఫర్జ్ నమాజ్‌కు ముందు) రెండు రకతులు చేసేవారము. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) మమ్మల్ని గమనిస్తూనే ఉండేవారు. కాని ఆయన (స) ఈ నమాజు చేయండి అని గానీ, చేయవద్దు అని గానీ చెప్పేవారు కాదు."

## సారాంశం

మగ్రిబ్ నమాజుకు ముందు (అజాన్ ఇచ్చిన వెంటనే) చేసే రెండు రకతుల నమాజ్ అదనపు నమాజుగా పరిగణించబడుతుంది. ఇది 'సున్నతె ముఅక్కద' పరిధిలోకి రాదు. అయితే ఈ నమాజును చేయటం అభిలషణీయం (ముస్తహబ్).

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్ ముజనీ (రజి) ముజ్‌నియా తెగకు చెందినవారు. అందుకే ముజనీగా వ్యవహరించబడ్డారు. 'అస్‌హాబె షజర్'లో ఈయనా ఉన్నారు. (అంటే హుదైబియా సంఘటన సందర్భంగా వృక్షం క్రింద కూర్చుని - ఖురైషులకు వ్యతిరేకంగా - ధర్మరక్షణకై కట్టుబడి ఉంటామని శపథం చేసిన వారిలో ఈయన కూడా ఉన్నారు). తొలుత మదీనాలో ఉన్నారు. తదుపరి ఈజిప్టుకు మకాం మార్చారు. బస్రా వాసులకు ధార్మిక శిక్షణ నివ్వడానికి హజ్రత్ ఉమర్ (రజి) చే పంపబడిన 10 మంది అధ్యాపక వర్గంలో ఈయన కూడా ఒకరు. హిజ్రీ 60లో మరణించారు.

(٢٨٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ يُخَفِّفُ الرَّكْعَتَيْنِ اللَّتَيْنِ قَبْلَ صَلاَةِ الصُّبْحِ، حَتَّى إِنِّي أَقُولُ: أَقَرَأَ بِأُمِّ الْكِتَابِ؟ مُتَّفَقٌ عَلَيْهِ.

287. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్ నమాజ్‌కు ముందు రెండు రకతుల (సున్నత్) నమాజ్‌ను ఎంతో సరళంగా (అంటే ముక్తసరిగా) చేసేవారు. ఆయన (స) బహుశా ఉమ్ముల్ కితాబ్ (ఫాతిహా సూరా)తోనే సరిబుచ్చుతున్నారా?! అని నాకు సందేహం కలిగేది". (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే ఆయన (స) ఉదయం నమాజులో - ఫర్జ్ నమాజుకు ముందు రెండు రకతుల సున్నత్ నమాజును ఎంతో సంక్షిప్తంగా చేసేవారు. అంటే చిన్న సూరాలు పఠించేవారు, ఎక్కువ సేపు నిలబడి ఉండేవారు కాదని భావం. దీని ఆధారంగానే ఉదయం పూట సున్నత్ నమాజులో కొద్దిసేపు మాత్రమే ఖియామ్ చేయటం ఉత్తమమని ఇమామ్ షాఫయి, అధిక సంఖ్యాక విద్వాంసులు నిర్ధారించారు. కాని ఇమామ్ అబూ హనీఫా మాత్రం సుదీర్ఘమయిన ఖియామ్ చేయాలని అభిప్రాయపడ్డారు. ఆయన అభిప్రాయంతో ఆయన ప్రముఖ శిష్యులయిన ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్‌లు సయితం ఏకీభవించలేదు. అది వేరే విషయం ! దైవప్రవక్త (స) ఈ నమాజులో ఫాతిహా సూరాతో పాటు చిన్న చిన్న సూరాలు పఠించేవారు. వాటి వివరాలు తరువాతి హదీసులో వస్తాయి.

(٢٨٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَرَأَ فِي رَكْعَتَيِ الْفَجْرِ «قُلْ يَا أَيُّهَا الْكَافِرُونَ» وَ «قُلْ هُوَ اللَّهُ أَحَدٌ». رَوَاهُ مُسْلِمٌ.

288. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్‌లోని రెండు (సున్నత్) రకతులలో మొదటి దానిలో 'ఖుల్ యా అయ్యు హల్ కాఫిరూన్', రెండవ దానిలో 'ఖుల్‌హు వల్లాహు అహద్' పఠించారు. (ముస్లిం)

### సారాంశం

ఈ రెండు రకతులలో ఈ రెండు సూరాలను పఠించటం మస్నూన్ (సంప్రదాయం). దైవప్రవక్త అడుగుజాడలలో నడిచే భావనతో ఈ రెండు సూరాలనే పఠించటం మంచిది. అంతమాత్రాన వేరే సూరాలు పఠించరాదనిగానీ, పఠిస్తే నమాజ్ నెరవేరదనిగానీ భావం ఎంతమాత్రం కాదు సుమా!

(٢٨٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا صَلَّى رَكْعَتَيِ الْفَجْرِ اَضْطَجَعَ عَلَى شِقِّهِ الْأَيْمَنِ. رَوَاهُ الْبُخَارِيُّ.

289. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజ్ర్ నమాజులోని రెండు రకతులను చదివి, కుడి ప్రక్కకు తిరిగి కాస్సేపు విశ్రమించేవారు. (బుఖారీ)

### సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే ఉదయం (ఫర్జ్) నమాజుకు ముందు రెండు రకతుల సున్నత్ చదివి కాస్సేపు విశ్రాంతి తీసుకుంటే అందులో దోషం ఏమీ లేదు. పైగా దైవప్రవక్త (స) ఈ మేరకు ప్రోత్సహించారని రానున్న హదీసు ద్వారా తెలుస్తోంది.

(٢٩٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «إِذَا صَلَّى أَحَدُكُمُ الرَّكْعَتَيْنِ قَبْلَ صَلَاةِ الصُّبْحِ فَلْيَضْطَجِعْ عَلَى جَنْبِهِ الْأَيْمَنِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

290. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "మీలో ఎవరయినాసరే ఫజ్ర్ నమాజుకు ముందు రెండు రకతులను పూర్తి చేస్తే వారు (కాస్సేపు) తమ కుడిప్రక్క ఆధారంగా విశ్రమించాలి." (ఈ హదీసును అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

### సారాంశం

పై రెండు హదీసుల దృష్ట్యా ఉదయం పూట సున్నత్ నమాజు చేసిన వెంటనే కాస్సేపు విశ్రాంతి తీసుకోవటం సున్నత్ అని రూఢీ అయింది. ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త ఈ మేరకు ఆచరించగా, మరొక హదీసు ప్రకారం అలా ఆచరించమని ఆదేశించారు. దీన్ని ఆధారంగా తీసుకుని 'అహ్లె జవాహిర్' (బాహ్య గ్రాహ్యార్థుల) వర్గం ఈ విశ్రాంతిని వాజిబ్‌గా భావించింది. ఏ నమాజీ ఉద్దేశ్యపూర్వకంగా దీన్ని ఆచరించలేదో అతని ఫర్జ్ నమాజ్ కూడా నెరవేరదని తేల్చి చెప్పేసింది. కాని ఇలా అనటం సమంజసం కాదు. ఇమామ్ నవవీ (రహ్మ.లై) దీనిని 'సున్నత్'గా పరిగణించారు. మరి కొంతమంది ఈ విశ్రాంతిని 'మక్రూహ్'గా భావించారు. ఈ భావన కూడా హదీసుకు విరుద్ధమైనదే. ఏ విధంగా చూచినా దీనిని 'సున్నత్'గా పరిగణించటమే సమంజసం.

(٢٩١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ:

291. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "రాత్రి

«صَلاَةُ اللَّيْلِ مَثْنَى مَثْنَى، فَإِذَا خَشِيَ أَحَدُكُمُ الصُّبْحَ صَلَّى رَكْعَةً وَاحِدَةً، تُوتِرُ لَهُ مَا قَدْ صَلَّى». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِلْخَمْسَةِ – وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ – بِلَفْظِ «صَلاَةُ اللَّيْلِ وَالنَّهَارِ مَثْنَى مَثْنَى». وَقَالَ النَّسَائِيُّ: هَذَا خَطَأٌ.

నమాజ్ రెండేసి రకతుల రూపంలో (చేయాలి), మీలో ఎవరికయినా ఉషోదయం కావస్తున్నట్టు అనిపిస్తే (ఆఖరిలో) ఒక్క రకత్‌నే చేయండి. అంతకు ముందు చదివిన అతని నమాజ్ అంతా వితర్ (బేసి)గా చేయబడుతుంది.". (బుఖారీ, ముస్లిం మరియు మిగిలిన ఐదుగురూ ఉల్లేఖించారు.) ఇబ్నె హిబ్బాన్ మాత్రం "రేయింబవళ్ళ నమాజ్‌లు రెండేసి రకతులుగా ఉన్నాయి" అన్న దానిని ప్రామాణికంగా ఖరారు చేశారు. అయితే నసాయి దీనిని ఖతా - అంటే పొరపాటు - అని వ్యాఖ్యానించారు.

**సారాంశం**

రాత్రిపూట చేసే నమాజులను రెండేసి రకతులుగా చేయాలని, రెండు రకతుల తర్వాత సలాం చేయాలని ఈ హదీసు సారాంశం. ముస్లిం సమాజంలోని అత్యధికులు దీన్ని అంగీకరించారు. మరో ముఖ్య విషయం - వితర్ నమాజ్ ఒక్క రకత్ చేసినా నెరవేరుతుంది. మరికొంతమంది దృష్టిలో అసలు వితర్ ఒక్క రకతే. కాని హదీసు ప్రకారం 3, 5, 7, 9, 11 వరకూ వితర్ చేయవచ్చు.

(٢٩٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَفْضَلُ الصَّلاَةِ بَعْدَ الفَرِيضَةِ، صَلاَةُ اللَّيْلِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

292. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఫర్జ్ నమాజు తర్వాత అత్యంత శ్రేష్ఠమయిన నమాజ్ రాత్రిపూట నమాజ్." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తహజ్జుద్ నమాజ్ ప్రాముఖ్యత విదితమవుతున్నది. దీని ప్రాముఖ్యత, మహత్తు గురించి దివ్య ఖుర్‌ఆన్ స్వయంగా సాక్ష్యమిచ్చింది. హజ్రత్ అబూ హురైర (రజి) గారి ఒక ఉల్లేఖనం ప్రకారం; ఫర్జ్ నమాజ్ తర్వాత అన్నిటికన్నా మహత్తు గల నమాజ్ ఏది? అని దైవప్రవక్త (స)ను ప్రశ్నించగా, 'రాత్రి చివరి భాగంలోని నమాజ్' అని ఆయన (స) సమాధానమిచ్చారు. తిర్మిజీలో అమ్ర్ బిన్ అబ్సా గారి ఉల్లేఖనం ప్రకారం; దాసుడు తన ప్రభువు సామీప్యం పొందేందుకు అత్యంత అనువైన సమయం రాత్రి చివరి భాగం అని తెలుస్తోంది.

అందుచేత దైవదాసులు రాత్రి చివరి భాగంలో తహజ్జుద్ నమాజ్ చేసి అరుదైన వ్యక్తుల జాబితాలో చేరే ప్రయత్నం చేయాలి. తమ ప్రభువును కలుసుకునే, ఆయనతో సంభాషించే, ఆయనకు విన్నపాలు చేసుకునే సమయం ఇది!

(٢٩٣) وَعَنْ أَبِي أَيُّوبَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «الْوِتْرُ حَقٌّ عَلَى كُلِّ مُسْلِمٍ، مَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِخَمْسٍ فَلْيَفْعَلْ، وَمَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِثَلَاثٍ فَلْيَفْعَلْ، وَمَنْ أَحَبَّ أَنْ يُوتِرَ بِوَاحِدَةٍ فَلْيَفْعَلْ». رَوَاهُ الْأَرْبَعَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَرَجَّحَ النَّسَائِيُّ وَقْفَهُ.

293. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: వితర్ ప్రతి ముస్లింపై గల హక్కు (అంటే దానిని నిర్వర్తించవలసిన బాధ్యత అతనిపై ఉంది). ఎవరికి ఐదు (రకాత్‌ల) వితర్ చేయటం ఇష్టమో అతను ఆ విధంగానే చేయాలి. మరెవరికి మూడు (రకతుల) వితర్ ఇష్టమో అతను ఆ మేరకే ఆచరించాలి. ఇంకా ఎవరికి ఒక (రకత్) వితర్ ఇష్టమో అతను తదనుగుణంగా పాటించాలి. ('నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అయితే నసాయి మాత్రం దీనిని 'మౌఖూఫ్' అని గట్టిగా తలపోశారు).

## సారాంశం

వితర్ నమాజ్ వాజిబా? లేక సున్నతా? ఈ విషయమై ఇమాముల మధ్య భేదాభిప్రాయం ఉంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.)లై దీనిని 'వాజిబ్'గా భావిస్తున్నారు. కాగా; అత్యధిక మంది ఉలమా దీనిని సున్నత్‌గానే అభిప్రాయపడ్డారు. "వితర్ చదవటం హక్కు" అన్న వాక్యాన్నిబట్టి అది వాజిబ్ అన్న అర్థం మాత్రం రావటం లేదు. అయితే దీని ప్రాముఖ్యత మాత్రం విస్మరించరానిది. "వితర్ సత్యబద్ధమైనది. ఎవరు దీనిని చేయరో వారితో మాకు సంబంధం లేదు" అని ఒక హదీసు ఉంది. ఈ హదీసులో కూడా వితర్ నమాజ్ మహత్తు నొక్కి వక్కాణించబడిన సంగతి వాస్తవమేగాని 'వాజిబ్' అన్న పదం అందులోనూ లేదు. ఆయన (స) ప్రయాణ సమయాలలో కూడా వితర్ నమాజ్ చేసేవారు. వాహనంపై కూర్చుని కూడా వితర్ చేసేవారు. దీన్నిబట్టి ఈ

నమాజు మహత్తు తెలియవస్తుందేగాని అది వాజిబ్ (తప్పనిసరి) గావించబడిందన్న దానికి ఆధారం ఏదీ కనిపించటం లేదు.

ఈ హదీసును బట్టి వితర్ నమాజ్ ఒక రకత్ లేక మూడు రకతులు లేక ఐదు రకతులు చేయవచ్చునని బోధపడుతున్నది. హనఫీ ఫికహ్ ననుసరించేవారు మూడు రకతులు చేయవలసిందేనని అంటారు.

(٢٩٤) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَيْسَ الْوِتْرُ بِحَتْمٍ كَهَيْئَةِ الْمَكْتُوبَةِ، وَلَكِنْ سُنَّةٌ سَنَّهَا رَسُولُ اللهِ ﷺ: رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرمِذِيُّ وَحَسَّنَهُ، وَالْحَاكِمُ وَصَحَّحَهُ.

294. హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) కథనం : ఫర్జ్ నమాజుల మాదిరిగా వితర్ అనివార్యం కాదు. పైగా అది దైవప్రవక్త (సఅసం) నిర్ధారించిన సున్నత్ మాత్రమే.'' (తిర్మిజీ, నసాయి దీనిని ఉల్లేఖించారు. 'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం దీనిని 'సహీహ్' అని అన్నారు).

**సారాంశం**

వితర్ నమాజ్ వాజిబ్ (తప్పనిసరి) కాదు అని చెప్పే అత్యధిక మంది విద్వాంసులు ఈ హదీసును నిదర్శనంగా చూపిస్తారు. ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసును హసన్ (సుస్పష్టమైనది)గా నిర్ధారించగా ఇమామ్ హాకిమ్ (రహ్మ.లై) 'సహీహ్' (ప్రామాణికమైనది)గా ఖరారు చేశారు.

(٢٩٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَامَ فِي شَهْرِ رَمَضَانَ، ثُمَّ انْتَظَرُوهُ مِنَ الْقَابِلَةِ فَلَمْ يَخْرُجْ، وَقَالَ: إِنِّي خَشِيتُ أَن يُكْتَبَ عَلَيْكُمُ الْوِتْرُ. رَوَاهُ ابْنُ حِبَّانَ.

295. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ నెలలో (రాత్రిపూట) ఖియామ్ చేశారు. (సామూహికంగా వితర్ నమాజు చేయించారు). మరుసటి రోజు కూడా సహచరులు ఆయన (సఅసం) కొరకు నిరీక్షించారు. కాని ఆయన (స) తన కుటీరం నుంచి బయటికి రాలేదు. దీని గురించి ఆయన (స) ఇలా వ్యాఖ్యానించారు -''ఈ విత్ర్ నమాజ్ మీ కొరకు ఎక్కడ ఫర్జ్‌గా (విధిగా) చేయబడుతుందోనని నాకు భయమేసింది.'' (దీనిని ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖించారు)

(٢٩٦) وَعَنْ خَارِجَةَ ابْنِ حُذَافَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللَّهَ أَمَدَّكُمْ بِصَلَاةٍ هِيَ خَيْرٌ لَكُمْ مِنْ حُمْرِ النَّعَمِ»، قُلْنَا: وَمَا هِيَ يَا رَسُولَ اللهِ؟ قَالَ: «الْوِتْرُ، مَا بَيْنَ صَلَاةِ الْعِشَاءِ إِلَى طُلُوعِ الْفَجْرِ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

296. హజ్రత్ ఖారిజ బిన్ హుజాఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ ఒక నమాజ్ ద్వారా మీకు సహాయపడ్డాడు. ఆ సహాయం మీ కొరకు ఎర్రని ఒంటెల కన్నా ఎంతో మేలైనది." 'ఓ దైవ ప్రవక్తా! ఆ నమాజ్ ఏది?' అని మేము విన్నవించుకోగా, "విత్ర్ నమాజ్. అది ఇషా మరియు ఉషోదయానికి మధ్యనున్నది" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అహ్మద్ గారు అమ్ర్ బిన్ షుఐబ్ నుండి, ఆయన తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి దీనిని సంగ్రహించారు.)

وَرَوَى أَحْمَدُ عَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ عَنْ أَبِيهِ عَنْ جَدِّهِ نَحْوَهُ.

## సారాంశం

'సహాయం' అంటే అదేదో కొత్త వస్తువు అని భావించనవసరం లేదు. అది ముందు నుంచీ ఉన్నదే. దానికి బలం చేకూర్చడానికి ఈవిధంగా నొక్కిపలికారు. వితర్ నమాజ్‌కు గల ప్రాముఖ్యతను, మహత్తును నొక్కి వక్కాణించటం ఇక్కడ ముఖ్యోద్దేశం. ఈ నమాజును ఎర్రని ఒంటెలతో పోల్చటం జరిగింది.

ఆనాడు అరేబియాలో ఎర్రని ఒంటె అత్యంత ఖరీదైన వాహనం. అది ఈనాటి మెర్సిడిస్ కారుకన్నా ఎంతో విలువైనది. -అనువాదకుడు)

## హదీసు ఉల్లేఖకులు

(1) ఖారిజ బిన్ హుజాఫ ఖురషీ అదవీ (రజి). గొప్ప శూరుడు. ఈయన వెయ్యి గుఱ్ఱాలకు సమానమని ప్రతీతి. అమ్ర్ బిన్ ఆస్ (రజి) మూడు వేల రౌతులను కోరగా హజ్రత్ ఉమర్ (రజి) ముగ్గురు శూరులను పంపించారు. వారిలో ఒకరు జుబైర్ బిన్ అవామ్, రెండవవారు మిఖ్దాద్ బిన్ అస్వద్, మూడవ వారు ఖారిజ బిన్ హుజాఫ. అమ్ర్ బిన్ ఆస్ (రజి) కోరిక మేరకు ఈయన ఈజిప్టుకు ఖాజీగా పంపబడ్డారు. హిజ్రీ 40 రమజాన్ నెలలో హత్యచేయబడ్డారు. అమ్ర్ బిన్ ఆస్ అని తలపోసి ఈయన్ని ఒక ఖారిజీ వర్గంవాడు హత్యచేశాడు. అప్పట్లో ఖవారిజ్ తిరుగుబాటు

దారులు ఒకే సమయంలో హజ్రత్ అలీని, హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్‌ను, అమీర్ ముఆవియాను హతమార్చాలని కుట్ర పన్నారు.

(2) అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) : ఆయన వంశపరంపర ఈ విధంగా ఉంది - అమ్ర్ బిన్ షుఐబ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ సహ్మీ ఖురషీ మదనీ. మారుపేరు అబూ ఇబ్రాహీం. తాయఫ్‌లో స్థిరపడ్డారు. నసాయిగారు ఈయన్ని విశ్వసనీయులైన వ్యక్తిగా కితాబు ఇచ్చారు. హిజ్రీ 118లో మరణించారు.

(3) షుఐబ్ : నమ్మకస్థులైన తాబయి. ఈయన పిన్న వయస్కులుగా నుండగానే ఈయన తండ్రి ముహమ్మద్ మరణించారు. అందువల్ల ఈయన తాతగారైన అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈయన్ని తన సంరక్షణలోకి తీసుకున్నారు. అందువల్ల ఆయన సంగ్రహించిన హదీసు ప్రమాణ బద్ధమైనదిగా పరిగణించబడింది.

(٢٩٧) وَعَنْ عَبْدِ اللهِ ابْنَ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عنه ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْوِتْرُ حَقٌّ، فَمَنْ لَمْ يُوتِرْ فَلَيْسَ مِنَّا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِسَنَدٍ لَيِّنٍ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَلَهُ شَاهِدٌ ضَعِيْفٌ عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عِنْدَ أَحْمَدَ.

297. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ బురైద తన తండ్రి గారి ఆధారంగా ఉల్లేఖించారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "వితర్ సత్యబద్ధమైనది. ఎవరు వితర్ (నమాజ్) చేయలేదో వారితో మాకు ఎలాంటి సంబంధం లేదు" (అబూదావూద్ దీనిని బలహీనమైన ఆధారాలతో నకలు చేశారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. అహ్మద్ గారి వద్ద దీనికి సంబంధించి సాక్ష్యం కూడా ఉంది. దాని ప్రకారం ఇది హజ్రత్ అబూ హురైర (రజి)చే ఉల్లేఖించబడింది).

### హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ బురైద (రహ్మ.లై)గారి మరోపేరు అబూ సహ్ల్. 'మర్వ్'లో ఖాజీగా నియమితులయ్యారు. ఎన్నదగిన, విశ్వసనీయులైన తాబయీలలో ఒకరు. మూడో తరానికి చెందినవారు. హిజ్రీ 115లో 'మర్వ్'లోనే మరణించారు.

(٢٩٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَا كَانَ رَسُولُ اللهِ ﷺ يَزِيْدُ فِيْ رَمَضَانَ وَلاَ فِيْ غَيْرِهِ عَلَى إِحْدَى عَشْرَةَ رَكْعَةً، يُصَلِّيْ أَرْبَعاً، فَلاَ تَسْأَلْ عَنْ حُسْنِهِنَّ

298. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్‌లోనూ, రమజానేతర సమయాలలోనూ (రాత్రిపూట) 11 రకతుల కన్నా ఎక్కువ నమాజ్ చేయ

وَطُولِهِنَّ، ثُمَّ يُصَلِّي أَرْبَعاً، فَلاَ تَسْأَلْ عَنْ حُسْنِهِنَّ وَطُولِهِنَّ، ثُمَّ يُصَلِّي ثَلاَثاً، قَالَتْ عَائِشَةُ فَقُلْتُ: يَا رَسُولَ اللهِ أَتَنَامُ قَبْلَ أَنْ تُوتِرَ؟ قَالَ: يَا عَائِشَةُ إِنَّ عَيْنَيَّ تَنَامَانِ، وَلاَ يَنَامُ قَلْبِي. مُتَّفَقٌ عَلَيْهِ.

లేదు. 4 రకతులు బహుచక్కగా (నింపాదిగా) చేసేవారు. ఎంత చక్కగా చేసేవారంటే వాటి చక్కదనం మరియు సుదీర్ఘ ప్రక్రియ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ తర్వాత మరో నాలుగు రకతులు చేసేవారు. వాటిని నెరవేర్చిన తీరు గురించి, సుదీర్ఘ ప్రక్రియ గురించి ఏం చెప్పమంటారు?! తరువాత 3 రకతులు చేసేవారు. 'దైవప్రవక్తా! మీరు వితర్ చదవకుండానే నిద్రపోతున్నారా?' అని నేను విన్నవించుకోగా, "ఆయిషా! నా కళ్లు నిద్రిస్తాయి. మనసు మాత్రం నిద్రించదు" అని ఆయన (స) సెల విచ్చారు. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَّهُمَا عَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا كَانَ يُصَلِّي مِنَ اللَّيْلِ عَشْرَ رَكْعَاتٍ، وَيُوتِرُ بِسَجْدَةٍ، وَيَرْكَعُ رَكْعَتَيِ الْفَجْرِ، فَتِلْكَ ثَلاَثَ عَشْرَةَ.

బుఖారీ, ముస్లిం రెండింటిలోనూ వేరొక ఉల్లేఖనంలో ఇలా అనబడింది - "రాత్రి ఆయన (స) 10 రకతులు చదివే వారు. ఆ తరువాత 1 వితర్ చేసేవారు. ఆ తరువాత ఫజ్ర్ యొక్క రెండు రకతులు చేసేవారు. ఇవన్నీ కలుపుకుని 13 రకతులయ్యేవి.

## సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక ముఖ్యాంశాలు మన ముందుకు వస్తున్నాయి -

(1) దైవప్రవక్త (సఅసం)గారి 'కళ్లు నిద్రించేవి, మనసు మాత్రం మేల్కొనే ఉండేది' - ఇది ఆయన (సఅసం)గారి ప్రత్యేకతలలో ఒకటి! దైవప్రవక్తలందరి మనసు సతతం మేల్కొనే ఉంటుందని, కళ్లు మాత్రం నిద్రిస్తాయని బుఖారీలోని మరో ఉల్లేఖనంలో ఉంది.

(2) మనసు నిద్రపోయేంత గాఢ నిద్రగనక వస్తే వుజూ భంగమైపోతుంది.

(3) తహజ్జుద్ నమాజును బాగా ఆగి ఆగి, ఉత్తమ రీతిలో చేయాలి.

(4) దైవప్రవక్త (సఅసం) తరావీహ్ నమాజు (వితర్ సహితంగా) 11 రకతులు మాత్రమే

చేశారని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ సందర్భంగా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ప్రాధాన్యతతో కూడుకున్నది. ఎందుకంటే ఆయన (స) ఈ ఆరాధనలను రాత్రి పూట ఇంటివద్దనే నెరవేర్చేవారు. ఆయన (స) ఇంట్లో చేసే ఆచరణలు, ముఖ్యంగా రాత్రిపూట చేసే ఆరాధనల గురించి ధర్మపత్నికి తెలిసి ఉన్నంతగా వేరొకరికి తెలిసివుండదు.

(5) హదీసు ఆఖరిలో, దైవప్రవక్త (స) 10 రకతుల తహజ్జుద్ నమాజ్ కూడా చేశారని, చివర్లో ఒక రకత్ వితర్ రూపంలో చేశారని వుంది. ఈ విధంగా 11 రకతులు అవుతాయి.

(6) ఆయన ఒక్కోసారి 13 రకతులు చేశారనీ చెప్పబడింది. వాటిలో 8 రకతులు నఫిల్ కాగా, మిగిలిన 5 రకతులు విత్ర్‌కు సంబంధించినవి.

(٢٩٩) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي مِنَ اللَّيْلِ ثَلاَثَ عَشْرَةَ رَكْعَةً، يُوْتِرُ مِنْ ذَلِكَ بِخَمْسٍ، لاَ يَجْلِسُ فِي شَيْءٍ إِلاَّ فِي آخِرِهَا.

299. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి మరో ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాత్రి పూట 13 రకతులు చదివేవారు. వాటిలో 5 విత్ర్‌కు సంబంధించినవి. ఈ ఐదు విత్ర్‌లలో తషహ్హుద్ కోసం ఆఖరి రకతులోనే కూర్చునేవారు.

(ముత్తఫఖున్ అలైహ్)

(٣٠٠) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مِنْ كُلِّ اللَّيْلِ قَدْ أَوْتَرَ رَسُولُ اللهِ ﷺ، وَانْتَهَى وِتْرُهُ إِلَى السَّحَرِ. مُتَّفَقٌ عَلَيْهِمَا.

300. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారిదే ఇంకొక ఉల్లేఖనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాత్రి పూట అన్ని దశలలో విత్ర్ నమాజు చేశారు. ఆయన (స) విత్ర్ చేసిన ఆఖరి సమయం సహ్రీ సమయం.

(ముత్తఫఖున్ అలైహ్)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యిందేమిటంటే ఆయన (స) విత్ర్ నమాజును రాత్రి మొదటి భాగంలోనూ, నడిరేయిలోనూ, రాత్రి చివరి భాగంలోనూ చేశారు. విత్ర్ సమయం ఇషా నమాజు నుండి మొదలై తెల్లవారు జాము వరకూ ఉంటుంది. తహజ్జుద్ నమాజు చేసే అలవాటువున్నవారు విత్ర్‌ను రాత్రి చివరి భాగంలో చేయటం మంచిది. రాత్రి చివరి భాగంలో లేవలేనివారు ఇషా నమాజు తర్వాత విత్ర్ చేసుకోవాలి. ఒకవేళ ఏదయినా గత్యంతరం లేని పరిస్థితిలో విత్ర్ నమాజ్ రాత్రి చేయలేకపోతే ఫజ్ర్ నమాజ్‌కై జమాఅత్ నిలబడే వరకూ విత్ర్ చేయవచ్చు.

(٣٠١) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: «يَا عَبْدَ اللهِ لاَ تَكُنْ مِّثْلَ فُلاَنٍ، كَانَ يَقُوْمُ مِنَ اللَّيْلِ. فَتَرَكَ قِيَامَ اللَّيْلِ». مُتَّفَقٌ عَلَيْهِ.

301. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాకిలా ఉప దేశించారు - "అబ్దుల్లాహ్! రాత్రిపూట దైవారాధన (ఖియాముల్లైల్)ను చేస్తూ తరువాత దాన్ని పరిత్యజించిన ఫలానా వ్యక్తి మాదిరిగా మారిపోకు." (ముస్లిం)

### సారాంశం

ఖియాముల్లైల్ (రాత్రిపూట ఆరాధనకై నిలబడటం) తప్పనిసరి కాదు గాని అది వాంఛనీయమైన ఆచరణే. సదాచరణను ఒకసారి మొదలెడితే దాన్ని నిరంతరం కొనసాగించటం, మధ్యలో విడనాడకుండా ఉండటం మంచిది. సదాచరణలో ఆరంభశూరత్వాన్ని కనబరచి తరువాత అలసత్వం కనబరచటం, బద్ధకంతో ఆ పనిని విడనాడటం వాంఛనీయం కాదు. పైగా ఆ పనిని ఎడతెగకుండా చేయాలి. దైవ ప్రవక్త (సఅసం) ఎప్పుడయినా ఏదయినా ఒక ఆచరణను ప్రారంభిస్తే - అది సాధారణ ఆచరణ అయినా సరే - దానిని కొనసాగించేవారు.

ఈ హదీసు ద్వారా బోధపడే మరో ముఖ్య విషయం ఏమిటంటే; ఒకరి చెడు అలవాటును ఇతరుల ముందు ప్రస్తావించవలసి వచ్చినపుడు అతని పేరును ప్రస్తావించరాదు. రాత్రిపూట తహజ్జుద్ నమాజును పరిత్యజించిన వ్యక్తి పేరును దైవప్రవక్త (స) మరుగుపరచటం గమనార్హం.

(٣٠٢) وَعَنْ عَلِيِّ بْنِ أَبِيْ طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَوْتِرُوا يَا أَهْلَ الْقُرْآنِ! فَإِنَّ اللَّهَ وِتْرٌ، يُحِبُّ الْوِتْرَ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

302. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) ఉల్లేఖించారు: "ఓ ఖుర్ఆన్ వారలారా! వితర్ చదవండి. అల్లాహ్ స్వయంగా వితర్. ఆయన వితర్‌ను ఇష్టపడతాడు." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

### సారాంశం

'ఖుర్ఆన్ వారలారా!' అనేది ముఖ్యంగా 'హాఫిజె ఖుర్ఆన్'లకు వర్తిస్తుంది. హదీసులో 'వితర్' అంటే రాత్రిపూట దైవసన్నిధిలో నిలబడి దైవారాధన చేయటం అని భావం. ఈ ఆరాధనవల్ల

దైవసామీప్యం లభించటంతోపాటు, ఖుర్ఆన్‌ను జ్ఞాపకముంచుకోవటానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

(٣٠٣) وَعَنِ ابنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «اِجْعَلُوا آخِرَ صَلَاتِكُمْ بِاللَّيْلِ وِتْرًا». مُتَّفَقٌ عَلَيْهِ.

303. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీరు రాత్రి యొక్క చివరి నమాజును వితర్ రూపంలో చేయండి"

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ ఉపదేశం కూడా 'వాజిబ్' కాదు; ముస్తహబ్ మాత్రమే. ఒకవేళ ఎవరయినా రాత్రి తొలి భాగంలోనే వితర్ చదివి పడుకుంటే, రాత్రి మధ్య భాగంలోనో, రాత్రి చివరి భాగంలోనో మెలకువవస్తే అప్పుడతను తాను తలచుకున్న నమాజ్‌ను చేయవచ్చుగానీ వితర్ చేయకూడదు. వితర్ చేసిన తరువాత రెండు రకతులు చదివితే అందులో దోషం లేదు. దైవప్రవక్త (సఅసం) స్వయంగా వితర్ నమాజ్ తర్వాత కూడా రెండు రకతులు కూర్చుని చదివేవారని సహీహ్ ముస్లింలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది.

(٣٠٤) وَعَنْ طَلْقِ بْنِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: لَا وِتْرَانِ فِي لَيْلَةٍ. رَوَاهُ أَحْمَدُ وَالثَّلَاثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

304. హజ్రత్ తల్ఖ్ బిన్ అలీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా నేను విన్నాను - "ఒకే రాత్రి రెండుసార్లు వితర్ ఉండదు." (అహ్మద్ మరియు ముగ్గురు - తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

**సారాంశం**

ఒకేరాత్రి రెండు సార్లు వితర్ నమాజ్ చేయరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఒకవేళ రాత్రి తొలిభాగంలో వితర్ చదివి ఉండి రాత్రి చివరి భాగంలో మేల్కొంటే - అప్పుడు ఒక రకత్ నమాజ్ చేసి - వెనుకటి నమాజులను సరిసంఖ్యలో లెక్కించుకోవాలనీ, ఆ తరువాత నఫిల్ నమాజులు నెరవేర్చి, చివర్లో వితర్ నమాజు చేయవచ్చుననీ కొంతమంది సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. కాని ఈ సర్దుబాటు హదీసు ఉపదేశానికి విరుద్ధమైనది. మరిన్ని వివరాల కోసం ఇమామ్ మరూజీ (రహ్మ.లై) గారి 'ఖియాముల్లైల్'ను అధ్యయనం చేయగలరు.

(٣٠٥) وَعَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُوتِرُ «بِسَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» وَ«قُلْ يَا أَيُّهَا الْكَافِرُونَ» و«قُلْ هُوَ اللَّهُ أَحَدٌ» رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَزَادَ: وَلَا يُسَلِّمُ إِلَّا فِي آخِرِهِنَّ.

305. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు రకతుల వితర్ (నమాజు)లో క్రమంగా ఈ సూరాలు పఠించేవారు - మొదటి రకత్‌లో సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా, రెండవ రకత్‌లో ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్, మూడవ రకత్‌లో ఖుల్‌హు వల్లాహు అహద్ చదివేవారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. "చివరి రకత్‌లో సలాం చేసేవారు" అన్న వాక్యాన్ని నసాయి అదనంగా చేర్చారు.)

وَلِأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ نَحْوُهُ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، وَفِيهِ: كُلُّ سُورَةٍ فِي رَكْعَةٍ، وَفِي الْأَخِيرَةِ «قُلْ هُوَ اللَّهُ أَحَدٌ» وَ«الْمُعَوِّذَتَيْنِ».

అబూదావూద్ తిర్మిజీలు కూడా హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా)ఉల్లేఖనాన్ని ఇదే విధంగా నకలు చేశారు. అందులో ఇలా వుంది - "ప్రతి రకత్‌లో ఒక సూరా పఠించేవారు. చివరి రకత్‌లో మాత్రం ఖుల్‌హు వల్లాహు అహద్‌తోపాటు ముఅవ్వజతైన్ పఠించేవారు. "

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) మూడు రకతుల వితర్ నమాజు చేసేవారనీ, ప్రతి రకతులో ఫాతిహా సూరాతోపాటు వేరొక సూరా కూడా పఠించేవారనీ, ఆఖరి రకత్‌లో మాత్రం దివ్య ఖుర్‌ఆన్‌లోని చిట్టచివరి మూడు సూరాలు పారాయణం చేసేవారనీ పై హదీసు ద్వారా స్పష్టమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

ఉబై బిన్ కాబ్ (రజి) అసలు పేరు. అబూ ముంజిర్ మరుపేరు. అన్సార్లకు చెందిన ఖజ్రజ్ తెగలోని నజ్జార్ అనే ఉపతెగకు చెందినవారు. అందువల్ల అన్సారీ, ఖజ్రజీ, నజ్జారీగా పిలువబడ్డారు. ఖుర్‌ఆన్ విద్వాంసులకు గురువు. అందుచేత 'సయ్యిదుల్ ఖుర్రా' అనే బిరుదు పొందారు. దైవప్రవక్త (సఅసం)పై అవతరించే 'వహీ'ని లిఖించే వారిలో ఈయన కూడా ఒకరు. దైవప్రవక్త (స) హయాంలో ధార్మిక తీర్పులు (ఫత్వాలు) కూడా జారీ చేసేవారు. రెండవ అఖబా ఒప్పందంలో పాల్గొన్నారు. బద్ర్ యుద్ధంలోనూ, ఆ తరువాతి యుద్ధాలలోనూ పాల్గొన్నారు. ఈయన మరణకాలం

గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. హిజ్రి 19 నుండి హిజ్రి 33 వరకు గల మధ్య కాలంలో మరణించి ఉంటారని చెప్పబడుతోంది. వాస్తవం దైవానికే ఎరుక.

(٣٠٦) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «أَوْتِرُوا قَبْلَ أَنْ تُصْبِحُوا». رَوَاهُ مُسْلِمٌ.

306. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "తెల్లవారక ముందే వితర్ చదువు కోండి." (ముస్లిం)

وَلِابْنِ حِبَّانَ: مَنْ أَدْرَكَ الصُّبْحَ وَلَمْ يُوتِرْ، فَلَا وِتْرَ لَهُ.

ఇబ్నె హిబ్బాన్‌లో ఉంది - "ఎవరయితే తెల్లవారే వరకూ వితర్ చదవలేదో వారి వితర్ వితరే కాదు."

### సారాంశం

ఉషోదయం కాక మునుపు వరకూ వితర్ నమాజ్‌కు అవకాశం ఉందని ఈ హదీసు చెబుతోంది. ఉషోదయం అవగానే వితర్ వేళ దాటిపోతుంది. ఆ తర్వాత దాన్ని నెరవేర్చినా అది వితర్ అనిపించుకోదు. మరి 'ఖజా' సంగతేమిటి? దాన్ని ఎప్పుడయినా చేయవచ్చు. రాబోయే హదీసు దీన్ని వివరిస్తోంది.

(٣٠٧) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ نَامَ عَنِ الْوِتْرِ أَوْ نَسِيَهُ، فَلْيُصَلِّ إِذَا أَصْبَحَ أَوْ ذَكَرَ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

307. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "వితర్ చదవకుండానే నిద్రపోయిన వారు లేదా మరుపునకు గురయిన వారు ఉదయం పూట నెరవేర్చాలి లేదా తమకు జ్ఞాపకం వచ్చినపుడు చేయాలి" ('ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు దీనిని ఉల్లేఖించారు).

### సారాంశం

ఏ కారణంగానయినా రాత్రి వితర్ నమాజ్‌ను నెరవేర్చలేకపోయిన వారు దాన్ని మొత్తానికి పూర్తి చేసుకోవాలని హదీసు చెబుతున్నది. ఈ హదీసును బట్టి కూడా వితర్ నమాజుకు గల ప్రాముఖ్యత తెలియవస్తున్నది.

(٣٠٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ خَافَ أَنْ لاَ

308. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

يَقُومَ مِنْ آخِرِ اللَّيْلِ فَلْيُوتِرْ أَوَّلَهُ، وَمَنْ طَمِعَ أَنْ يَقُومَ آخِرَهُ فَلْيُوتِرْ آخِرَ اللَّيْلِ، فَإِنَّ صَلاَةَ آخِرِ اللَّيْلِ مَشْهُودَةٌ، وَذَلِكَ أَفْضَلُ». رَوَاهُ مُسْلِمٌ.

వ సల్లం) ఇలా ఉపదేశించారు: "రాత్రి చివరి భాగంలో మెలకువ రాదేమోనన్న భయం వున్నవారు రాత్రి తొలి భాగం లోనే వితర్ నమాజ్ చేసుకోవచ్చు. రాత్రి చివరి భాగంలో మేల్కోగలనన్న నమ్మకం, భరోసా వున్నవారు రాత్రి చివరి భాగంలోనే వితర్ నమాజ్ చేయటం మంచిది. ఎందుకంటే రాత్రి చివరి భాగంలో చేసే నమాజ్‌కై దైవదూతలు హాజరవుతారు. ఇదెంతో శుభకర మైనది." (ముస్లిం)

**సారాంశం**

దైవదూతలు కూడా సృష్టితాలేననీ, వాళ్ళూ తమ తమ డ్యూటీని నిర్వర్తిస్తారనీ, వారి డ్యూటీ వేళలు కూడా మారుతూ ఉంటాయనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. రాత్రి చివరి భాగంలో వితర్ నమాజ్ చేయటం ఎంతో శ్రేష్ఠమని కూడా విదితమవుతున్నది. మెలకువ వచ్చే అవకాశముంటే చివర్లోనే ఈ నమాజ్ చేయాలి. ఒకవేళ మెలకువ రాదన్న సంశయం వుంటే మాత్రం వితర్ చేసి నిద్రపోవటం మంచిది.

(٣٠٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا طَلَعَ الْفَجْرُ، فَقَدْ ذَهَبَ وَقْتُ كُلِّ صَلاَةِ اللَّيْلِ، والْوِتْرِ، فَأَوْتِرُوا قَبْلَ طُلُوعِ الْفَجْرِ». رَوَاهُ التِّرْمِذِيُّ.

309. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు - "ఉషోదయం అయిందంటే చాలు, వితర్ సమేతంగా రాత్రిపూట చదవ వలసిన నమాజులన్నింటి వేళ దాటి పోయినట్లే లెక్క." (తిర్మిజీ)

(٣١٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الضُّحَى أَرْبَعاً، وَيَزِيْدُ مَا شَآءَ اللَّهُ. رَوَاهُ مُسْلِمٌ.

310. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం :దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుహా నమాజు (చాష్త్ నమాజ్) లో నాలుగు రకతులు చేసేవారు. దైవ చిత్తమయిన మేరకు ఇంకా ఎక్కువ కూడా చేసేవారు." (ముస్లిం)

وَلَهُ عَنْهَا أَنَّهَا سُئِلَتْ: هَلْ كَانَ رَسُولُ اللهِ ﷺ يُصَلِّي الضُّحَى؟ قَالَتْ: لاَ إِلاَّ أَن يَجِيْءَ مِن مَغِيْبِهِ.

ముస్లింలోనే హాజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనంలో వుంది - దైవ ప్రవక్త (సఅసం) జుహా నమాజ్ చేసే వారా? అని ఆమెను ప్రశ్నించగా 'లేదు- ప్రయాణం నుంచి వాపసు అయి నప్పుడు మాత్రమే అలా చేసేవారు' అని ఆమె సమాధానమిచ్చారు.

وَلَهُ عَنْهَا: مَا رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُصَلِّي سُبْحَةَ الضُّحَى قَطُّ، وَإِنِّي لأُسَبِّحُهَا.

ముస్లింలోనే హాజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారి ఉల్లేఖనం ఈ విధంగా కూడా ఉంది - "నేను దైవప్రవక్త (సఅసం)ను జుహా నమాజు చేస్తుండగా ఎన్నడూ చూడలేదు. అయినప్పటికీ నేను నఫిల్ నమాజులు చేస్తాను."

**సారాంశం**

'నమాజె ఇష్రాఖ్', 'సలాతె జుహా', 'సలాతె అవ్వాబీన్' - ఇవి మూడూ వేర్వేరు నమాజులా లేక ఒకే నమాజు యొక్క వేర్వేరు పారిభాషిక పదాలా? అరబీ భాష ఎంతో విస్తృతమయినది. ఇందులో ఒకే వస్తువు అసంఖ్యాకమయిన పదాలలో వర్ణించబడుతుంది.

'తబ్రానీ'లోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది : - దైవప్రవక్త (సఅసం) తమ బంధుత్వ వరుసకు సోదరి అయ్యే ఉమ్మె హానీ (ర.అన్‌హా) ఇంట నమాజు చేశారు. ఉమ్మె హానీని పిలిచి, "ఇది ఇష్రాఖ్ నమాజు" అని తెలియజేశారు.

హాజ్రత్ అనస్ (రజి) గారి ఒక ఉల్లేఖనం ప్రకారం ఇది "సలాతె జుహా" అని తెలుస్తోంది. ఈ నమాజు సూర్యోదయం అయినప్పటినుండి సూర్యుడు (పగలులో) నాల్గోవంతు పైకెక్కేవరకూ చేయబడింది.

అవ్వాబీన్ నమాజ్ వేళ ఎండ ముదిరిన తరువాత మొదలవుతుంది. అంటే సూర్యుడు బాగా పైకెక్కేవరకూ చేయవచ్చన్నమాట!

మరి కొంతమంది అభిప్రాయంలో ఈ మూడు నమాజులూ వాస్తవానికి ఒక్కటే. కాకపోతే వాటి పేర్లు మాత్రం విభిన్నం. ఇష్రాఖ్ నమాజునూ, జుహా నమాజు ఒక్కటేననీ, అవ్వాబీన్ నమాజు మాత్రం వేరని ఇంకొందరి అభిప్రాయం.

ఇంతకీ జుహా నమాజులోని రకతులు ఎన్ని? అన్నది అసలు ప్రశ్న. కనీస రకతులు రెండనీ, గరిష్ట సంఖ్య పన్నెండనీ హదీసు ద్వారా తెలుస్తోంది.

(٣١١) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «صَلَاةُ الْأَوَّابِينَ حِينَ تَرْمَضُ الْفِصَالُ». رَوَاهُ التِّرْمِذِيُّ.

311. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "అవ్వాబీన్ నమాజ్ వేళ (ఆడ) ఒంటె దూడలు ఎండను, గ్రీష్మతాపాన్ని ఆస్వాదించ సాగినపుడు మొదలవుతుంది." (తిర్మిజీ)

(٣١٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ صَلَّى الضُّحَى ثِنْتَيْ عَشْرَةَ رَكْعَةً، بَنَى اللَّهُ لَهُ قَصْراً فِي الْجَنَّةِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَاسْتَغْرَبَهُ.

312. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరయితే జుహా నమాజ్ (చాష్త్ నమాజ్)యొక్క 12 రకతులు చదివాడో అతని కొరకు అల్లాహ్ స్వర్గంలో మేడను నిర్మిస్తాడు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు గాని దీనిని సందేహాస్పదమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా చాష్త్ నమాజ్ మహత్తు తెలియ వస్తోంది. అయితే ఇమామ్ తిర్మిజీ (రహ్మతుల్లై) ఈ హదీసును 'గరీబ్'గా ఖరారు చేశారు. ఈ నమాజు ప్రాముఖ్యతను చాటే హదీసులు ఇంకా అనేకం ఉన్నాయిగాని అవన్నీ 'జయీఫ్' హదీసుల కోవకు చెందినవే.

(٣١٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ رَسُولُ اللهِ ﷺ بَيْتِي، فَصَلَّى الضُّحَى ثَمَانِيَ رَكَعَاتٍ. رَوَاهُ ابْنُ حِبَّانَ فِي صَحِيحِهِ.

313. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా కుటీరానికి విచ్చేసి, జుహా నమాజ్‌కి సంబంధించిన ఎనిమిది రకతులు నెరవేర్చారు. (ఇబ్నె హిబ్బాన్ దీనిని తన సహీహ్‌లో ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా దైవప్రవక్త (సఅసం) గారు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలో 8 రకతుల జుహా నమాజ్ చేసినట్టు రూఢీ అవుతోంది. బహుశా ఇది దైవప్రవక్త (స) ప్రయాణం నుంచి తిరిగి వచ్చిన పిదప చేసిన నమాజ్ అయివుండవచ్చు. నమాజె జుహా ప్రయోజనాలు 'ముస్లిం' లోని ఉల్లేఖనంలో క్షుణ్ణంగా తెలుపబడ్డాయి - మనిషి యొక్క ఒక్కో కీలుకు ఒక్కో హక్కును నెరవేర్చాల్సిన బాధ్యత ఉంటుంది. మానవ శరీరంలో 307 కీళ్ళు ఉంటాయి. ఈ

నమాజులోని రెండు రకతుల్ని నెరవేర్చటం ద్వారా కీళ్ళన్నింటిపై మోపబడివున్న బాధ్యత నెరవేరినట్లవుతుంది.

**10వ అధ్యాయం**

# సామూహిక నమాజ్ మరియు ఇమామత్

# ١٠ - بَابُ صَلاةِ الْجَمَاعَةِ وَالإِمَامَةِ

(٣١٤) عَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: صَلاَةُ الجَمَاعَةِ أَفْضَلُ مِنْ صلاَةِ الفَذِّ بِسَبْعٍ وَعِشْرِينَ دَرَجَةً». مُتَّفَقٌ عَلَيْهِ.

314. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "సామూహికంగా చేసే నమాజ్ ఒంటరి గా చేసే నమాజ్ కన్నా ఇరవై ఏడు రెట్లు శ్రేష్ఠమయినది." (బుఖారీ, ముస్లిం)

وَلَهُمَا عَنْ أَبِي هُرَيْرَةَ: «بِخَمْسٍ وَعِشْرِينَ جزءًا» وَكَذَا لِلْبُخَارِيِّ عَنْ أَبِي سَعِيْدٍ، وَقَالَ: «دَرَجَةً».

బుఖారీ మరియు ముస్లింలోనే హజ్రత్ అబూహురైర్హ్(రజి) ఉల్లేఖనంలో "ఇరవై అయిదు రెట్లు పుణ్యం అధికంగా లభిస్తుంది" అని వుంది.

బుఖారీలో - హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనంలో 'రెట్లు' బదులు 'అంతస్థు' అనే పదం వుంది.

**సారాంశం**

నమాజ్‌ను సామూహికంగా (జమాఅత్‌తో కలసి) చేయటం వాజిబ్ (తప్పనిసరి)కాదు అని వాదించేవారికి ఈ హదీసు ద్వారా పరోక్షంగా సమర్థన లభిస్తోంది. ఒంటరిగా చేసే నమాజ్‌లో పెక్కు కారణాల దృష్ట్యా శుభాలు క్షీణిస్తాయి అన్నది నిర్వివాదాంశమేగాని నమాజ్ నెరవేరకపోయే ప్రశ్న మాత్రం తలెత్తదు. ఒకవేళ ఫర్జ్ నమాజ్‌ను సామూహికంగా చేయాలన్నది 'వాజిబ్'గా నిర్ధారించబడి వుంటే ఒంటరిగా నెరవేర్చేవాని నమాజ్ ధర్మసమ్మతం అయ్యేది కాదు. కాని వాస్తవానికి అలా కాలేదు. కనుక ఫర్జ్ నమాజును జమాఅత్‌తో కలసి చేయటాన్ని "సున్నతె ముఅక్కద"గా భావించాలి.

(٣١٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «وَالَّذِي

315. హజ్రత్ అబూహురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "ఎవరి

نَفْسِي بِيَدِهِ، لَقَدْ هَمَمْتُ أَنْ آمُرَ بِحَطَبٍ فَيُحْتَطَبَ، ثُمَّ آمُرَ بِالصَّلاَةِ فَيُؤَذَّنَ لَهَا، ثُمَّ آمُرَ رَجُلاً فَيَؤُمَّ النَّاسَ، ثُمَّ أُخَالِفَ إِلَى رِجَالٍ لاَ يَشْهَدُونَ الصَّلاَةَ فَأُحَرِّقَ عَلَيْهِمْ بُيُوتَهُمْ، وَالَّذِي نَفْسِي بِيَدِهِ لَوْ يَعْلَمُ أَحَدُهُمْ أَنَّهُ يَجِدُ عَرْقاً سَمِيناً، أَوْ مِرْمَاتَيْنِ حَسَنَتَيْنِ لَشَهِدَ العِشَاءَ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షి! కట్టెల్ని ప్రోగుచేయమని ఆజ్ఞాపించి, తరువాత నమాజ్ కోసం (అజాన్) పిలుపు ఇవ్వమని ఆదేశించి, ఆ తరువాత ఎవరినయినా నమాజ్ చేయించమని చెప్పి, నమాజ్‌కు రాకుండా ఇండ్లల్లో కూర్చున్న వారి వైపుకు నేను స్వయంగా వెళ్ళి - వారలా కూర్చుని ఉండగానే - వారి ఇళ్ళకు నిప్పు అంటించాలని నాకనిపిస్తోంది. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను! (వీళ్లు ఎలాంటి వారంటే) మాంసంతో కూడిన ఒక లావుపాటి ఎముక దొరుకుతుందని వీళ్లకు తెలిసినా లేదా (గొఱ్ఱె) కాళ్లు రెండు లభ్యమవుతాయని తెలిసినా ఇషా నమాజుకు ఎగబడి వచ్చేవాళ్లు" (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ నుండి గ్రహించబడ్డాయి).

**సారాంశం**

ఫర్జ్ నమాజును జమాఅత్‌తో కలసి చేయటం చాలా ముఖ్యమనీ, ఇది 'ఫర్జె ఐన్' అనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. ఇది ఫర్జె కిఫాయగానీ, సున్నతె ముఅక్కద గానీ కాదు. ఇదే గనక ఫర్జె ఐన్ కాకపోతే దీన్ని విడనాడిన వారికి ఇంత తీవ్రమైన హెచ్చరిక చేయబడేది కాదు. జాహిరియ, అతా, ఔజాయి, ఇమామ్ అహ్మద్, అబూ సూర్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె ముంజిర్, ఇబ్నె హిబ్బాన్ తదితరులందరూ జమాఅత్‌తో కలసి నమాజ్ చేయటం ఫర్జ్ అని అంటున్నారు. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ.లై) మాత్రం దీనిని 'ఫర్జె కిఫాయ' గా పరిగణిస్తున్నారు. అంటే కొంతమంది సామూహికంగా చేస్తే చాలు, మిగిలిన వారు జవాబుదారులు కారు అని దీని భావం. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో సామూహిక నమాజ్ 'సున్నతె ముఅక్కద' - ఇది 'ఫర్జె కిఫాయ' కానేకాదు, ఒకవేళ ఇది 'ఫర్జె కిఫాయ' అయి వుంటే జమాఅత్ కొరకు రానివారి ఇళ్లకు నిప్పు అంటించాలన్న ఆగ్రహం వ్యక్తమయ్యేదే కాదు. ఫర్జె కిఫాయ ప్రకారం చూస్తే కొద్దిమంది జమాఅత్‌కు వచ్చి, జమాఅత్‌ను నెలకొల్పితే సరిపోతుందాయె!

(٣١٦) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: أَثْقَلُ الصَّلَاةِ عَلَى الْمُنَافِقِينَ صَلَاةُ الْعِشَاءِ وَصَلَاةُ الْفَجْرِ، وَلَوْ يَعْلَمُونَ مَا فِيهِمَا لَأَتَوْهُمَا وَلَوْ حَبْواً». مُتَّفَقٌ عَلَيْهِ.

316. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వ్యాఖ్యానించారు - "కపటుల (మునాఫిఖ్‌ల) పాలిట అన్ని టికన్నా ఇషా మరియు ఫజ్ర్ నమాజులు భారంగా, కష్టంగా పరిణమిస్తాయి. ఈ రెండింటికీ హాజరవటం వల్ల ఎంత (గొప్ప) పుణ్యఫలం ప్రాప్తమవుతుందో వారికి బోధపడి ఉంటే వాళ్లు అవశ్యంగా వచ్చేవాళ్లు-మోకాళ్ళ ఆధారంగా రావలసి వచ్చినా వెనుకాడే వారు కాదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇషా నమాజ్ భారంగా ఎందుకనిపిస్తుందంటే పగలంతా శ్రమించిన వారు అలసిసొలసి వుంటారు. తియ్యని నిద్ర ముంచుకొస్తూ ఉంటుంది. ఇప్పుడు మస్జిద్ దాకా ఎందుకులే, ఇంట్లోనే నమాజ్ చేసి పడుకో అని మనసు పురికొల్పుతుంది. మనోవాంఛకు లొంగిపోయి సామూహికతకు ఉన్న ప్రాముఖ్యతను మనిషి విస్మరిస్తాడు. ఇక ఫజ్ర్ నమాజ్‌కు ఎందుకు రాలేకపోతాడంటే, నిద్రమత్తుకు లోనైవున్న వారిని షైతాన్ లాలించి, బుజ్జగించి పడుకోబెడతాడు. అయితే సజ్జనులైన దాసులు మాత్రం అజాన్ పిలుపు విన్నంతనే మనోవాంఛలకు, షైతాన్ లాలింపులకు లొంగిపోకుండా సరాసరి మస్జిద్ వైపునకు కదలివస్తారు.

(٣١٧) وَعَنْهُ قَالَ: أَتَى النَّبِيَّ ﷺ رَجُلٌ أَعْمَى فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّهُ لَيْسَ لِي قَائِدٌ يَقُودُنِي إِلَى الْمَسْجِدِ، فَرَخَّصَ لَهُ، فَلَمَّا وَلَّى

317. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: ఒక అంధుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలోకి వచ్చి, 'ఓ దైవప్రవక్తా(స)! నన్ను మస్జిద్ వరకూ తీసుకుని వచ్చే వారెవరూ లేరు' అని విన్నవించుకున్నాడు. (ఆ వ్యక్తి ఇంట్లోనే నమాజ్ చేసుకునేందుకు) దైవప్రవక్త (సఅసం) అతన్ని అనుమతించారు. కాని అతను తిరిగి వెళుతుండగా ఆయన (స) అతన్ని వెనక్కి

دَعَاهُ فَقَالَ: «هَلْ تَسْمَعُ النِّدَآءَ بِالصَّلاَةِ؟» قَالَ: نَعَمْ، قَالَ: «فَأَجِبْ». رَوَاهُ مُسْلِمٌ.

పిలిపించి "నీకు అజాన్ పిలుపు వినవస్తుందా?" అని అడిగారు. దానికి 'అవున'న్నాడా వ్యక్తి. "అయితే నీవు అజాన్‌కు బదులు ఇవ్వాల్సిందే (అంటే మస్జిద్‌కు వచ్చి సామూహిక నమాజ్ చేయాల్సిందే)" అని సెలవిచ్చారాయన (స). (ముస్లిం)

**సారాంశం**

అజాన్ పిలుపు చెవిన పడిన తరువాత వికలాంగుడైన వ్యక్తి సయితం మస్జిద్‌కు రావలసిందేనని ఈ హదీసు చెబుతోంది. వికలాంగుడు ఇంట్లో నమాజ్ చేసుకుంటే అతని నమాజ్ స్వీకారయోగ్య మయితే అవుతుంది గాని సామూహిక నమాజ్‌లోని శుభాలు మాత్రం ప్రాప్తమవవు. ఎవరయినా అజాన్ పిలుపు వినకపోతే వారి సంజాయిషీ స్వీకారయోగ్యమే. అయితే అజాన్ పిలుపు విన్న మీదట వంకలు పెట్టడానికి వీలుండదు. కాకపోతే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం షరీయత్ మినహాయింపునిస్తుంది. ఉదాహరణకు - వర్షం, తుఫాను, తీవ్రమయిన ఆకలిబాధ, మలమూత్ర విసర్జన, వ్యాధిగ్రస్తత, శత్రు భయం లాంటి కారణాలుంటే అప్పుడు జమాఅత్‌లో వచ్చి కలవక పోయినా క్షమార్హమే.

(٣١٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ سَمِعَ النِّدَاءَ فَلَمْ يَأْتِ فَلاَ صَلاَةَ لَهُ إِلاَّ مِنْ عُذْرٍ». رَوَاهُ ابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَإِسْنَادُهُ عَلَى شَرْطِ مُسْلِمٍ، لَكِن رَجَّحَ بَعْضُهُمْ وَقْفَهُ.

318. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "అజాన్ పిలుపు విన్న మీదట సామూహిక నమాజ్‌లో పాల్గొనని వ్యక్తి కోసం మరే నమాజూ లేదు - ఏదయినా బలమైన (షరీయత్ పరమైన) కారణముంటే తప్ప!" (ఇబ్నెమాజ, దారెఖుత్నీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు. దీని ఆధారం 'ముస్లిం' నిబంధనకు అనుగుణంగా ఉంది. అయితే కొంత మంది దీన్ని 'మౌఖూఫ్' అనడానికే ప్రాధాన్యత ఇచ్చారు).

**సారాంశం**

ఈ హదీసు ద్వారా కూడా మనిషి సామూహిక నమాజ్‌లో పాల్గొనవలసిన ఆవశ్యకత తెలియవస్తోంది. అబూదావూద్‌లో - ఈ హదీసు చివర్లో ప్రియ సహచరులు దైవప్రవక్త (స)

నుద్దేశ్యించి, "ఆ బలమైన కారణమేమిటీ?" అని విన్నవించుకోగా, "(శత్రు) భయం మరియు వ్యాధి" అని దైవప్రవక్త (స) జవాబిచ్చారు. పెనుగాలులు, భారీ వర్షంతో పాటు క్రింది కారణాల వల్ల కూడా మనిషికి సామూహిక నమాజ్ నుండి మినహాయింపు లభిస్తుందని వేరొక హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అవేమంటే, పచ్చి ఉల్లిగడ్డ, వెల్లుల్లి లాంటివి అప్పుడే తిని వుంటే వారు మస్జిద్‌లోకి రాకూడదు. ఎందుకంటే వాటి వల్ల నోటినుండి అదో రకమయిన - ఇతరుల్ని ఇబ్బందుల్లోపెట్టే - వాసన వస్తుంది. ఈ కారణంగా సాటి నమాజీలకు బాధ కలుగుతుంది. అలాగే ధూమపానం, పొగాకు నమలటం, జర్దా కిళ్లీలు నమలటం వంటివి తీరా సామూహిక నమాజ్‌కు ముందు చేయరాదు. దీనివల్ల సాటి దైవదాసులను నమాజ్‌లో మానసిక క్షోభకు గురిచేసి, వారి ఏకాగ్రతను భంగపరచినట్లవుతుంది. ముస్లిం అనేవాడు తన ఇరుగు పొరుగువారిని వేధించకూడదు కదా!

(٣١٩) وَعَنْ يَزِيْدَ بْنِ ٱلْأَسْوَدِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ صَلَّى مَعَ رَسُولِ اللهِ ﷺ صَلاَةَ الصُّبْحِ، فَلَمَّا صَلَّى رَسُولُ اللهِ ﷺ، إِذَا هُوَ بِرَجُلَيْنِ لَمْ يُصَلِّيَا، فَدَعَا بِهِمَا، فَجِيءَ بِهِمَا، تَرْعَدُ فَرَائِصُهُمَا، فَقَالَ لَهُمَا: «مَا مَنَعَكُمَا أَنْ تُصَلِّيَا مَعَنَا»؟ قَالاَ: قَدْ صَلَّيْنَا فِي رِحَالِنَا، قَالَ: «فَلاَ تَفْعَلاَ، إِذَا صَلَّيْتُمَا فِي

319. హజ్రత్ యజీద్ బిన్ అస్వద్ (రజి) కథనం: ఆయన దైవప్రవక్త (సఅసం)తో కలసి ఫజ్ర్ నమాజ్ చేశారు. దైవప్రవక్త (సఅసం) దృష్టి నమాజ్‌ను ముగించిన పిదప ఇద్దరు వ్యక్తులపై పడింది. వాళ్ళిద్దరూ (ఆయన -స-తో కలిసి) నమాజ్ చేయలేదు. ఆయన (స) వారిద్దరినీ తన దగ్గరకు పిలిచారు. వారిరువురూ ఆయన (స) సమక్షంలో హాజరు పరచబడ్డారు. (భయంతో) వాళ్ల శరీరాలు ఒణుకుతున్నాయి. "మీరు మా వెంట నమాజ్ చేయకుండా ఏ వస్తువు అడ్డుకుందో చెప్పండి" అని ఆయన (స) దర్యాప్తుచేయగా 'మేము మా ఇండ్లలోనే నమాజ్ చేశాము' అని ఇద్దరూ సంజాయిషీ ఇచ్చుకున్నారు. "అలా చేయకండి. ఒకవేళ మీరు మీ ఇండ్లలో నమాజ్ చేసినప్పటికీ, ఇమామ్‌ను గనక మీరు పొందితే, ఇమామ్ కూడా అప్పటి వరకూ నమాజ్ చేయకుండా

رِحَالِكُمَا ثُمَّ أَدْرَكْتُمَا الإِمَامَ وَلَمْ يُصَلِّ فَصَلِّيَا مَعَهُ، فَإِنَّهَا لَكُمَا نَافِلَةٌ». رَوَاهُ أَحْمَدُ، وَاللَّفْظُ لَهُ، وَالثَّلاثَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఉంటే అతనితో కలసి (సామూహిక) నమాజ్ చేయండి. ఇది మీ కొరకు నఫిల్ (అదనం) అవుతుంది" అని ఆయన (స) ఉపదేశించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు కూడా ఇందులోనివే. మరో ముగ్గురు (తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ) కూడా దీనిని పొందుపర్చారు. తిర్మిజీ , ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు).

### సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడిందేమిటంటే ఎవరయినా అంతకుముందే నమాజ్ చేసి వుండగా జమాఅత్ లభిస్తే అది ఏ నమాజు అయినాసరే అతను జమాఅత్‌లో కలసిపోవాలి - ఇమామ్ షాఫయి గారి అభిప్రాయం కూడా ఇదే. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం, జుహ్ర్ మరియు ఇషా నమాజులయితేనే అలా చేయవచ్చునని అన్నారు. ఫజ్ర్ నమాజ్‌ను మాత్రం తిరిగి ఎందుకు చేయకూడదు? హదీసులో అసలు చెప్పబడింది ఫజ్ర్ సమయంలోనే కదా! అన్న సందేహం రావచ్చు, అందుచేత ఈ విషయంలో ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృక్పథం స్పష్టమైనది, అనుసరణీయమైనది.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు యజీద్ బిన్ అస్వద్ (రజి). మారుపేరు అబూ జాబిర్ సవాయి ఆమిరీ. ఖురైషులతో ఈయన తెగకు మైత్రీ సంబంధాలుండేవి. సుప్రసిద్ధ సహాబీ ఈయన. తాయఫ్‌లో స్థిరపడ్డారు. ఈయనచేత ఈ ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది. ఈయన కుమారుడు జాబిర్ (రహ్మ.లై) ఈయన నుండి హదీసును విని అందజేశారు.

(٣٢٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّمَا جُعِلَ الإِمَامُ لِيُؤْتَمَّ بِهِ، فَإِذَا كَبَّرَ فَكَبِّرُوا، وَلاَ تُكَبِّرُوا حَتَّى يُكَبِّرَ، وَإِذَا رَكَعَ فَارْكَعُوا، وَلاَ تَرْكَعُوا حَتَّى يَرْكَعَ وَإِذَا قَالَ: «سَمِعَ اللَّهُ لِمَنْ حَمِدَهُ» فَقُولُوا: «اللَّهُمَّ رَبَّنَا لَكَ

320. దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "ఇమామ్‌ను అనుసరించాలన్న ఉద్దేశ్యంతోనే అతన్ని నియమించటం జరిగింది. కనుక అతను అల్లాహు అక్బర్ అని అంటే మీరు కూడా అల్లాహు అక్బర్ అనండి. ఇమామ్ అల్లాహు అక్బర్ అని పలికే

الحَمْدُ» وَإِذَا سَجَدَ فَاسْجُدُوا، وَلاَ تَسْجُدُوا حَتَّى يَسْجُدَ، وَإِذَا صَلَّى قَائِماً فَصَلُّوا قِيَاماً، وَإِذَا صَلَّى قَاعداً فَصَلُّوا قُعُوداً أَجْمَعِينَ».

رَوَاهُ أَبُو دَاوُدَ، وَهَذَا لَفْظُهُ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ.

వరకూ మీరు అల్లాహు అక్బర్ అని పలకకండి. అతను రుకూ చేస్తే మీరు కూడా రుకూ చేయండి. ఇమామ్ రుకూ చేసే వరకూ మీరు రుకూ చేయకండి. ఇమామ్ 'సమి అల్లాహు లిమన్ హమిదహ్' అని అంటే, మీరు 'అల్లాహుమ్మ రబ్బనాలకల్ హమ్ద్' అని అనండి. అతను సజ్దా చేస్తే మీరు కూడా సజ్దా చేయండి. అతను సజ్దా చేసే వరకూ మీరు సజ్దా చేయకూడదు. మరి ఇమామ్ నిలబడి నమాజ్ చేయసాగితే మీరు కూడా నిలబడి నమాజ్ చేయండి. అతను కూర్చుని నమాజ్ చేస్తే మీరు కూడా కూర్చుని నమాజ్ చేయండి.'' (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు అబూదావూద్‌లోనివే. దీని మూలం మాత్రం సహీహైన్ (బుఖారీ, ముస్లిం)లో ఉంది)

**సారాంశం**

ముఖ్తదీలు (వెనుకనున్నవారు) తమ ఇమామ్‌ను అనుసరించటం అవశ్యమని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. వారు ఏ విషయంలోనూ ఇమామ్ కన్నా ముందంజ వేయరాదు. తక్బీరె తహ్రీమా మొదలుకుని సలాం చేసేవరకూ ఇమామ్ కన్నా కొంచెం వెనుక ఉండాలి. ఇమామ్ చేసినట్లే చేయాలి. అనుసరణ అంటే ఇదే. దైవప్రవక్త (స) సజ్దాలో తలను నేలకు ఆన్చినపుడు, తాము సజ్దాకై వంగేవారమని సహాబీలు తెలిపారు. ఇమామ్ సమిఅల్లాహు లిమన్ హమిదహ్ అని అన్నప్పుడు ముఖ్తదీలు 'రబ్బనా లకల్ హమ్ద్' అనాలి. ఇమామ్ అబూహనీఫా అభిప్రాయం ఇదే. అయితే ఇమామ్ అబూహనీఫా గారి ప్రియశిష్యులిరువురూ, అహ్లె హదీసు వారు, ఇమామ్ షాఫయిగారేమంటారంటే; ముఖ్తదీలు కూడా 'సమిఅల్లాహ్' పలికి, ఆపైన రబ్బనా లకల్ హమ్ద్ అని చెప్పాలి.

(٣٢١) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ رَأَى فِي

321. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులను వెనుక జరిగి ఉండటం గమనించి

أَصْحَابِهِ تَأَخُّراً، فَقَالَ «تَقَدَّمُوْا، فَائْتَمُّوا بِيْ، وَلْيَأْتَمَّ بِكُمْ مَنْ بَعْدَكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

"ముందుకు జరగండి. నన్ను అనుసరించండి. మీకు వెనుకనున్న వారు మిమ్మల్ని అనుసరించాలి" అని ఉద్బోధించారు. (ముస్లిం)

**సారాంశం**

సామూహిక నమాజ్‌లో తొలి వరుస (పంక్తి) కు ఎంత ప్రాముఖ్యం ఉందో దీన్నిబట్టి అర్థమవుతోంది. మొదటి వరుసలో నిలబడివున్నవారు ఇమామ్‌ను ఖచ్చితంగా అనుసరించాలి. ఇందుకోసం వారు ఇమామ్‌ను క్రీగంట చూసినా తప్పులేదు. వెనుక పంక్తుల్లోనున్నవారు తమ ముందు పంక్తుల్లో నిలబడినవారిని అనుసరించాలి. దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే ఇమామ్‌ను నేరుగా చూడలేనివారు, ఇమామ్ పలుకులను వినలేనివారు తమ ముందు వరుసల్లోని నమాజీల కదలికలను అనుసరించవచ్చు. ఈ హదీసు ద్వారా లభించే ఇంకొక సూచన ఏమిటంటే; తమ వద్ద ధర్మజ్ఞానం లేనివారు విద్వాంసులను అడిగి తెలుసుకోవాలి.

(٣٢٢) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: اتَّخَذَ رَسُولُ اللهِ ﷺ حُجْرَةً مُخَصَّفَةً، فَصَلَّى فِيْهَا، فَتَتَبَّعَ إِلَيْهِ رِجَالٌ، وَجَاءُوْا يُصَلُّوْنَ بِصَلَاتِهِ، الْحَدِيْثَ. وَفِيْهِ: «أَفْضَلُ صَلَاةِ الْمَرْءِ فِيْ بَيْتِهِ، إِلَّا الْمَكْتُوبَةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

322. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గడ్డిపోచతో తయారు చేయబడిన చాపతో ఒక చిన్న (పందిరిలాంటి) కుటీరాన్ని వేసి అందులో నమాజ్ చేయసాగారు. ఈ సంగతి తెలుసుకుని ప్రజలు కూడా వచ్చి ఆయనతో కలసి నమాజ్ చేయసాగారు. '(ఫర్జ్ నమాజ్ తప్ప ఇతర నమాజులను) పురుషుడు తన ఇంట్లో చేయటం ఉత్తమం' అని కూడా ఈ హదీసులో ఉంది.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

రమజాన్ నెలలో జరిగిన సంఘటన ఇది. మస్జిద్‌లో ఒక మూల ఆయన (స) ప్రత్యేకంగా ఈ పందిరి వేసుకున్నారు. మస్జిద్‌లో ఇతర నమాజీలకు అసౌకర్యం కలగని పక్షంలో ఈ విధంగా ఏర్పాటు చేసుకోవచ్చునని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రత్యేక స్థానాన్ని కేటాయించుకుని నమాజ్ చేస్తున్నారని తెలుసుకున్న ప్రజలు - ఒక్కొక్కరుగా వచ్చి ఆయన వెంట నమాజ్ చేయటం మొదలెట్టారు. దైవప్రవక్త (స) ఒక రోజు రాత్రి ఆలస్యంగా ఆ పందిరి నుండి బయటికి వచ్చి, "నేను మీ పరిస్థితిని అర్థం చేసుకున్నాను. మీ ఇండ్లలో నమాజ్ చేయండి. ఎందుకంటే ఫర్జ్ నమాజ్ తప్ప మిగిలిన నమాజులను పురుషులు ఇంట్లో చేయటం ఉత్తమం" అని ఉద్బోధించారు.

(٣٢٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى مُعَاذٌ بِأَصْحَابِهِ الْعِشَاءَ، فَطَوَّلَ عَلَيْهِمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: «أَتُرِيدُ أَنْ تَكُونَ يَا مُعَاذُ فَتَّانًا؟ إِذَا أَمَمْتَ النَّاسَ فَاقْرَأْ «بِالشَّمْسِ وَضُحَاهَا» وَ«سَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» وَ«اقْرَأْ بِاسْمِ رَبِّكَ» «وَاللَّيْلِ إِذَا يَغْشَى» مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

323. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : హజ్రత్ ముఆజ్ (రజి) తన ముఖ్తదీలకు ఇషా నమాజ్ చేయించారు. ఆ సందర్భంగా ఆయన సుదీర్ఘ పారాయణం చేశారు. దీనిపై దైవప్రవక్త (సఅసం), "ఓ ముఆజ్! నమాజీలకు పరీక్ష పెడుతున్నావా? నీవు ప్రజలకు ఇమామత్ చేస్తే వష్షమ్సి వజుహాహా, సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా సూరాలు, ఇంకా ఇఖ్రి బిస్మి, వల్లైలి ఇజా యఘ్షా వంటి సూరాలు చదవాలి"అని ఉద్బోధించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

ప్రజలకు నమాజ్ పట్ల విసుగుపుట్టేలా, సామూహిక నమాజ్ అంటే వారికి భయం కలిగేలా సుదీర్ఘమయిన సూరాలు ఇమామ్ పఠించరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. అయితే ఖుర్ఆన్ పారాయణంలోని ముఖ్యోద్దేశమే మరుగున పడిపోయేవిధంగా మరీ అంత సంక్షిప్తంగా కూడా చేయరాదు. రెండు అతివాదాలకు మధ్య మధ్యేమార్గాన్ని అవలంబించటం శ్రేయస్కరం. దైవప్రవక్త (స) విధానం కూడా ఇదే. వెనుకనున్న నమాజీల ఓపికనుబట్టి సుదీర్ఘ పారాయణం కూడా చేయవచ్చు. ఇక హజ్రత్ ముఆజ్ (రజి)గారి ఇమామత్ సంఘటన బుఖారీలో ఈ విధంగా ఉంది -

ఒకరోజు రాత్రి హజ్రత్ ముఆజ్ (రజి) గారు ఇషా నమాజ్ చేయిస్తూ, మామూలు కంటే సుదీర్ఘమయిన పారాయణం చేశారు. ఒక ప్రయాణీకుడు అదే రోజు తన రెండు ఒంటెలను బయట వదలి వచ్చి, సామూహిక నమాజులో పాల్గొన్నాడు. నమాజు మరీ సుదీర్ఘంగా ఉండటంతో అతను జమాఅత్‌ను పరిత్యజించి, ప్రక్కకు వెళ్ళి ఒంటరిగా నమాజ్‌చేసి, తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఈ సంగతి ముఆజ్ (రజి)కు తెలియగా, 'అతడు మునాఫిఖ్ (కపటి)' అని వ్యాఖ్యానించారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సమక్షానికి వచ్చి, హజ్రత్ ముఆజ్ (రజి) గురించి ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ముఆజ్ (రజి)ను పిలిపించి పై హదీసులోని విధంగా హితబోధ చేశారు. 'పరీక్ష పెడుతున్నావా?' అంటే భావం - నమాజులో వృద్ధులు, బలహీనులు, అగత్యపరులు, అలసిపోయినవారు రకరకాల జనులుంటారు. ఇమామ్ అయినవాడు వాళ్లందరినీ దృష్టిలో పెట్టుకోవాలి. అందరి పరిస్థితినీ అర్థం చేసుకుని మసలుకోవాలి. లేకుంటే ప్రజలకు సామూహిక నమాజ్ పట్ల వెగటు కలిగి వారు ఏకాంతంలో నమాజ్ చేసుకోవటం మొదలెడతారు. తత్ఫలితంగా ముస్లింల సామూహిక వ్యవస్థ కుంటుపడుతుంది.

(٣٢٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، فِيْ قِصَّةِ صَلاَةِ رَسُولِ اللهِ ﷺ بِالنَّاسِ وَهُوَ مَرِيْضٌ، قَالَتْ: فَجَاءَ حَتَّى جَلَسَ عَنْ يَسَارِ أَبِي بَكْرٍ، فَكَانَ يُصَلِّيْ بِالنَّاسِ جَالِساً، وَأَبُو بَكْرٍ قَائِماً. يَقْتَدِيْ أَبُو بَكْرٍ بِصَلاَةِ النَّبِيِّ ﷺ، وَيَقْتَدِي النَّاسُ بِصَلاَةِ أَبِيْ بَكْرٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

324. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యాధిగ్రస్తులై వుండి నమాజ్ చేయించిన వైనాన్ని ఇలా తెలిపారు - ఆయన (సఅసం) వచ్చి హజ్రత్ అబూబక్ర్ (రజి) కు ఎడమ ప్రక్కన కూర్చున్నారు. ఆయన (స) కూర్చునే నమాజ్ చేయిస్తుండగా హజ్రత్ అబూబక్ర్ (రజి) నిలబడి వున్నారు. అబూబకర్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను అనుసరిస్తుండగా, ప్రజలు అబూబకర్ (రజి)ను అనుసరించ సాగారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) మరణ వ్యాధికి గురైవున్నప్పటి సంఘటన ఇది. ఆయన (స) రోగగ్రస్తులయ్యారు. జ్వరం తీవ్రతరమయింది. ఈ సందర్భంగా ఆయన (స) ఆదేశానుసారమే హజ్రత్ అబూబకర్ (రజి) సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించేవారు. ఒకరోజు ఆరోగ్యం కాస్తంత కుదుటపడగా ఆయన (స) ఇద్దరు మనుషుల సహాయంతో మస్జిద్‌కు వచ్చారు. ఆ సమయంలో అబూబకర్ (రజి) నమాజ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన (స) అబూబకర్‌కు ఎడమ ప్రక్కన కూర్చుని నమాజ్ చేయించటం మొదలెట్టారు. ఆయన (స) ఇమామత్ చేయసాగారు. అందుకే ఎడమప్రక్కన కూర్చున్నారు. ఆ క్షణం నుంచీ అబూబకర్ (రజి) 'ముఖ్తదీ'గా మారిపోయారు. ఎందుకంటే ఆయన (రజి) కుడిప్రక్కన నిలుచుని వున్నారు. వ్యాధి మూలంగా దైవప్రవక్త (స) బాగా నీరసించిపోయారు. ఆయన (స) నోట వెలువడే తక్బీర్ అందరికీ వినబడలేదు. అందుచేత హజ్రత్ అబూబకర్ (రజి) 'ముకబ్బిర్' గా మారి హెచ్చు స్వరంతో తక్బీర్లు పలకసాగారు. ప్రజలు అబూబక్ర్‌ను అనుసరించి నమాజ్‌ను నెరవేర్చారు. ఈ హదీసు ఆధారంగా షాఫయీలు ఒక గమనార్హమైన విషయాన్ని ప్రతిపాదించారు. అదేమంటే తమకన్నా శ్రేష్ఠుడైన వ్యక్తి మస్జిదుకు వచ్చినపుడు ఇమామ్ తన స్థానాన్ని ఖాళీచేసి, ఆ వ్యక్తికి ఇమామత్ చేసే అవకాశం కల్పించాలి. అయితే ఈ వ్యవహారం ఒక్క దైవప్రవక్త (స) కే ప్రత్యేకం అని ఇబ్నె అబ్దుల్ బిర్ వ్యాఖ్యానించారు.

(٣٢٥) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «إِذَا أَمَّ أَحَدُكُمُ النَّاسَ فَلْيُخَفِّفْ، فَإِنَّ فِيهِمُ الصَّغِيرَ وَالْكَبِيرَ

325. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరయినా ప్రజలకు ఇమామత్ చేసినపుడు వారు ఖిరాత్‌ను తగ్గించాలి.

والضَّعِيفَ وَذَا الْحَاجَةِ، فَإِذَا صَلَّى وَحْدَهُ فَلْيُصَلِّ كَيْفَ شَاءَ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఎందుకంటే ముఖ్తదీలలో (వెనుకనున్న వారిలో)పిల్లలు,వృద్ధులు, బలహీనులు, అగత్యపరులు ఉంటారు. అయితే మీరు ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు మీరు కోరినవిధంగా చేసుకోవచ్చు."

(ముత్తఫకున్ అలైహ్)

**సారాంశం**

దీన్నిబట్టి తెలిసేదేమంటే ఒక వ్యక్తి సారథ్య బాధ్యతల్ని నెరవేరుస్తున్నప్పుడు పెద్దపెద్ద సూరాలు పఠించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదు. ఎందుకంటే వెనుక నమాజ్ చేసే వారిలో రకరకాల వారుంటారు. అందరి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇమామ్ తదనుగుణంగా వ్యవహరించాలి. అయితే ఒకవ్యక్తి ఒంటరిగా నమాజ్ చేస్తున్నప్పుడు అతని పరిస్థితి అతనికి బాగా తెలుసు గనక, అతనెంత సుదీర్ఘ పారాయణం చేసుకున్నా ఫరవాలేదు. ఇక్కడా ఒక విషయాన్ని మరువరాదు. తాను ఒంటరిగా నమాజ్ చేస్తున్నాను కదా అని చెప్పి, తన ఆరోగ్య స్థితిని, దైనందిన జీవితావసరాలను కూడా లెక్క చేయకుండా పొద్దస్తమానం దైవధ్యానంలో గడపటం కూడా విపరీతమే. ఎందుకంటే అతని శరీరావయవాలకు కూడా అతనిపై హక్కుంది.

(٣٢٦) وَعَنْ عَمْرِو بْنِ سَلِمَةَ قَالَ: قَالَ أَبِي: جِئْتُكُمْ مِنْ عِنْدِ النَّبِيِّ ﷺ حَقًّا، قَالَ: «فَإِذَا حَضَرَتِ الصَّلَاةُ فَلْيُؤَذِّنْ أَحَدُكُمْ، وَلْيَؤُمُّكُمْ أَكْثَرُكُمْ قُرْآنًا»، قَالَ: فَنَظَرُوْا، فَلَمْ يَكُنْ أَحَدٌ أَكْثَرَ قُرْآنًا مِنِّي، فَقَدَّمُوْنِي، وَأَنَا ابْنُ سِتٍّ أَوْ سَبْعِ سِنِيْنَ. رَوَاهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

326. హజ్రత్ అమ్ర్ బిన్ సలమ (రజి) కథనం : మా మాన్నగారు తన జాతి వారి నుద్దేశ్యించి, నేను మీ వద్దకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరపున సత్యం తీసుకువచ్చాను. ఆయన (సఅసం) ఏమని ఉపదేశించారంటే, "నమాజ్ వేళ అవగానే మీలో ఒకరు అజాన్ పిలుపు ఇవ్వాలి మరియు మీలో దివ్య ఖుర్ఆన్ అవగాహన అత్యధికంగా ఉన్నవారు నమాజ్‌కు నాయకత్వం వహించాలి." (నేను తప్ప ఖుర్ఆన్ పారంగతుడు వారిలో ఎవరూ లేక పోవటం గమనించి నా జాతి వారు నన్నే ఇమామత్ కొరకు ముందుకు పంపారు. అప్పుడు నా వయస్సు ఆరు లేక ఏడేళ్లు అంతే) అని అమ్ర్ అన్నారు.

(బుఖారీ, అబూదావూద్, నసాయి)

## సారాంశం

ఈ హదీసు ఇమామ్ నియామకం గురించి ఒక సూత్రాన్ని నిర్ధారించింది. ఎవరికి ఖుర్ఆన్ జ్ఞానం అధికంగా వుందో వారే ఇమామ్‌గా ఎంపిక కావాలి. అమ్ర్ (రజి)ను ఆయన జాతి ప్రజలు దీని ఆధారంగానే ఇమామత్ బాధ్యతను అప్పగించారు. ఇమామత్ హోదా ముఅజ్జిన్ హోదా కన్నా ఉన్నత మైనది. ముఅజ్జిన్ కొరకు కఠినమయిన షరతులు విధించబడలేదు. మంచి కంఠం గలవాడు, హెచ్చు స్వరంతో అజాన్ ఇవ్వగలవాడై ఉంటే చాలు - ముఅజ్జిన్‌గా నియమించవచ్చు. కాని ఇమామ్ కావటానికి ధర్మజ్ఞానం, ధర్మావగాహన అవసరం.

హజ్రత్ అమ్ర్ బిన్ సలమ (రజి) ఏడేళ్ల పిన్న వయస్కులైనప్పటికీ ఆయన జాతి వారు ఆయనకు ఇమామత్‌ను కట్టబెట్టడానికి కారణం - ఆయనకు ఇతరులకన్నా ఎక్కువగా ఖుర్ఆన్ కంఠస్థం అయి ఉండటమే. హసన్ బస్రీ, ఇమామ్ షాఫయి, ఇమామ్ రాహ్వే, అహ్లె హదీసు వారు - వీరంతా యుక్త వయస్కులు కాని అబ్బాయి వెనుక పెద్దవారు కూడా నమాజ్ చేయవచ్చని భావిస్తున్నారు. అయితే ఇమామ్ మాలిక్, ఇమామ్ సౌరి తదితరులు దీన్ని మక్రూహ్ (అయిష్టకరం)గా భావిస్తున్నారు. ఇమామత్ చేసేవ్యక్తి పిన్న వయస్కుడై (నా బాలిగ్) ఉంటే అతని వెనుక నఫిల్ నమాజులు చేయ వచ్చుగాని ఫర్జ్ నమాజు చేయటం ధర్మసమ్మతం కాదని ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ అహ్మద్‌లు చెబుతున్నారు. అమ్ర్ బిన్ సలమ (రజి)ను ఇమామ్‌గా నియమించిన వారు దైవప్రవక్త (సఅసం) ఆదేశాన్ని పురస్కరించుకుని నియమించటంగానీ లేదా దైవప్రవక్త (స)ను సంప్రతించి నియమించటం గానీ చేయలేదన్నది వీరి వాదన. ఈ వాదనలో అంతగా బలంలేదు. ఎందుకంటే ఒకవేళ ఆ నియామకం ధర్మ విరుద్ధమై వుంటే ఆ సంగతి వహీ ద్వారా దైవప్రవక్త (స)కు తెలిసి వుండేది. దైవప్రవక్త (స) భవిష్యత్తులో అలా జరక్కుండా ఆదేశాలు జారీ చేసేవారు. కాని అలా జరగలేదు. ఇది ఇస్లాం ధర్మం యొక్క అత్యంత ముఖ్యమైన ఆరాధన - నమాజ్ - తో ముడిపడి ఉండటం వల్ల అది గనక అధర్మమై ఉంటే దైవప్రవక్త (సఅసం) తన జీవితకాలంలోనే దానిని నిషేధించేవారు. కాని అలాంటి ఉత్తర్వులు ఏమీ అయన తరఫున జారీ కాలేదు. కనుక తేలిందేమంటే ధర్మజ్ఞానం ఆధారంగా పిన్న వయస్కులను కూడా - అవసరం మేరకు - ఇమామ్‌గా ఎన్నుకోవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు అమ్ర్ బిన్ సలమ (రజి). 'జురుమ్' తెగకు చెందిన వారవటం చేత జురుమీగా వ్యవహరించబడ్డారు. అబూ యజీద్ లేక అబూ బురైద్ ఈయన మారుపేరు. తన తండ్రి గారితో కలసి దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయ్యారు. అప్పటికి ఆయన వయస్సు ఆరేడు సంవత్సరాలు. వేరొక ఉల్లేఖనం ప్రకారం ఈయన దైవప్రవక్త (సఅసం) దగ్గరకు రాలేదు.

(٣٢٧) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَؤُمُّ الْقَوْمَ أَقْرَؤُهُمْ لِكِتَابِ اللهِ تَعَالَى، فَإِنْ كَانُوا فِي الْقِرَاءَةِ سَوَاءً فَأَعْلَمُهُمْ بِالسُّنَّةِ، فَإِنْ كَانُوا

327. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - దైవ గ్రంథ జ్ఞానం ఎక్కువగా వున్నవాడు ప్రజలకు ఇమామ్ కావాలి. ఈ అర్హతలో జనులంతా సమానులైవుంటే, దైవప్రవక్త

فِي السُّنَّةِ سَوَاءً فَأَقْدَمُهُمْ هِجْرَةً، فَإِنْ كَانُوا فِي الْهِجْرَةِ سَوَاءً فَأَقْدَمُهُمْ سِلْماً – وَفِي رِوَايَةٍ «سِنًّا» – وَلاَ يَؤُمَّنَّ الرَّجُلُ الرَّجُلَ فِي سُلْطَانِهِ، وَلاَ يَقْعُدُ فِي بَيْتِهِ عَلَى تَكْرِمَتِهِ، إِلاَّ بِإِذْنِهِ». رَوَاهُ مُسْلِمٌ.

(స) ఆచరణా విధానం గురించిన అవగాహన అధికంగా గలవారు ఇమామ్ కావాలి. ఈ విషయంలో కూడా ప్రజలు సమానులుగా ఉంటే, దైవమార్గంలో మొదట హిజ్రత్ చేసినవారు ఇమామ్ కావాలి. ఇక్కడా సమానత్వం కనిపిస్తే అప్పుడు అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించినవారు ఇమామ్ కావాలి. వేరొక ఉల్లేఖనంలో 'ఇస్లాం' బదులు 'వయస్సు' అన్న పదం ఉంది. అంటే పైన పేర్కొనబడిన గుణగణాలలో, ప్రతిభలో అందరూ సమానులుగా ఉన్నప్పుడు వయస్సులో పెద్దవారైన వారికి ఇమామత్ బాధ్యత అప్పజెప్పాలి. ఎవరూ ఒకరి అధికార ప్రతిపత్తికి లోబడి ఇమామత్ చేయించటంగానీ, ఒకరి ఇంట్లోని ప్రత్యేక స్థలంలో (ఆసనం లేక పడకపై) వారి అనుమతి లేకుండా కూర్చోవటంగానీ చేయరాదు. (ముస్లిం)

**సారాంశం**

దివ్య ఖుర్ఆన్ జ్ఞానం ఎక్కువగా వున్నవారు, దైవప్రవక్త (స) సున్నత్‌ను గురించి అధికంగా తెలిసివున్నవారు, దైవధర్మం కోసం వలసవెళ్లినవారు, త్యాగాలు చేసినవారు, సత్యామృతాన్ని ఆస్వాదించటంలో ముందంజ వేసినవారు, వయస్సులో పెద్దవారు ఇమామత్‌కు అర్హులని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది.

(٣٢٨) وَلاِبْنِ مَاجَهْ مِنْ حَدِيْثِ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «وَلاَ تَؤُمَّنَّ امْرَأَةٌ رَجُلاً، وَلاَ أَعْرَابِيٌّ مُهَاجِراً، وَلاَ فَاجِرٌ مُؤْمِناً»، وَإِسْنَادُهُ وَاهٍ.

328. ఇబ్నె మాజాలో హజ్రత్ జాబిర్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది: "ఏ స్త్రీ ఏ పురుషునికీ ఇమామ్ కారాదు. ఏ పల్లెటూరి బైతు కూడా ఏ ముహాజిర్ వ్యక్తికీ ఇమామత్ చేయరాదు. అలాగే ఏ పాపాత్ముడూ ఒక విశ్వాసికి ఇమామ్ కారాదు." (ఈ ఉల్లేఖనం అందిన తీరు జయీఫ్ - బలహీనమైనది)

**సారాంశం**

ఈ హదీసు అత్యంత బలహీనమైనది. ఇది అందిన పరంపర విశ్వసనీయమైనది కాదు. అందువల్ల దీని ఆధారంగా ధార్మిక అంశాలను పరిశోధించటం సమంజసం కాదు.

(٣٢٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «رُصُّوا صُفُوفَكُمْ، وَقَارِبُوا بَيْنَهَا، وَحَاذُوا بِالْأَعْنَاقِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

329. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు - మీ పంక్తులను కట్టు దిట్టం చేసుకోండి : వాటి మధ్య దూరం తగ్గించండి. మీ మెడలను ఒకే తీరులో ఉంచండి." (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఇస్లాంలో పంక్తుల్ని తీర్చిదిద్దడం గురించి, క్రమశిక్షణ గురించి గట్టిగా తాకీదు చేయబడింది. ఇస్లాం అనుయాయులు చేసే సామూహిక ఆరాధనలో సయితం వరుసలు తీరి నిలబడటానికి, క్రమశిక్షణకు అత్యధిక ప్రాముఖ్యత నివ్వబడింది. యుద్ధరంగంలో క్రమశిక్షణతో వరుసలు తీరి నిలవటానికి గల ప్రాముఖ్యతను గురించి వేరుగా చెప్పనవసరం లేదు. వరుసల్లో లోపం ఏర్పడితే, పరస్పర వ్యవహారాల్లో కూడా సమన్వయం దెబ్బతింటుంది. సంఘీభావం సన్నగిల్లుతుంది. నమాజ్ ద్వారా ఇస్లాం తన అనుయాయుల మధ్య ప్రేమానురాగాలను సృజించగోర్తుంది. వారిమధ్య గల అరమరికలను, అంతరాలను అంతమొందించి హృదయాలు హత్తుకునే ప్రేమైక వాతావరణాన్ని పెంపొందించగోర్తుంది. నిమ్నోన్నత భేదభావాలను రూపుమాపి సమాజంలోని అన్ని వర్గాల వారిని సమానులుగా - ఒకే పంక్తిలో - నిలబెట్టాలని ఆశిస్తుంది. ఐకమత్యానికీ, సంగఠిత భావానికి ప్రతీకగా వుండవలసిన పంక్తులమధ్య షైతాన్ జొరబడితే జరిగే అనర్థం ఏమిటో తెలియనిది కాదు.

అందుకే దైవప్రవక్త (సఅసం) వారు సామూహిక నమాజ్ కోసం అందరూ నిలబడినపుడు ఆయన నమాజీల వైపునకు తిరిగి "మీ పంక్తులను సరిదిద్దుకోండి. లేకుంటే అల్లాహ్ మీ మనసుల్లో వక్రతను, వైరుధ్య భావాన్ని నింపుతాడు" (సహీహైన్) అని తాకీదు చేసేవారు. ప్రజలు నమాజ్‌లో తమ భుజాన్ని ఇతరుల భుజంతో కలిపేవారనీ, తమ అడుగులను ప్రక్కనున్నవారి అడుగులతో కలిపేవారని ఉల్లేఖకులు తెలిపారు. దైవప్రవక్త (సఅసం) ఒకసారి ఇలా అన్నారు : "నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆయన సాక్షిగా చెబుతున్నాను - షైతాన్ పంక్తుల మధ్య తోడేలు పిల్ల రూపంలో జొరబడటాన్ని నేను చూస్తున్నాను" అంటే వాడు నమాజీల మధ్య దుష్ప్రేరణలను రేకెత్తిస్తాడు. దాసుల ఏకాగ్రతను దెబ్బతీస్తాడు. వారి ధ్యానను దేవుని తరపునుండి వేరే మార్గాల్లో మళ్ళించజూస్తాడు. అందుకే అందరూ వరుసలు తీరి, తిన్నగా, భుజానికి భుజం ఆనించి మరీ నిలబడాలి. మధ్యలో దూరం వదలకూడదు.

(٣٣٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «خَيْرُ صُفُوفِ الرِّجَالِ أَوَّلُهَا، وَشَرُّهَا آخِرُهَا، وَخَيْرُ صُفُوفِ النِّسَاءِ آخِرُهَا، وَشَرُّهَا أَوَّلُهَا». رَوَاهُ مُسْلِمٌ.

330. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "పురుషుల అత్యంత ఉత్తమ వరుస మొదటి వరుస. అత్యంత అధమ వరుస వారి ఆఖరి వరుస. స్త్రీల అత్యంత ఉత్తమ వరుస ఆఖరి వరుస. వారి అత్యంత అధమమైన వరుస మొదటి వరుస." (ముస్లిం)

**సారాంశం**

జమాఅత్‌లో స్త్రీలు, పురుషులు కూడా పాల్గొన్నప్పుడు వారి మధ్య దూరం ఎంత అధికంగా వుంటే అంతే మంచిదని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. మొదటి వరుసలో నిలబడే పురుషులు సాధారణంగా మస్జిద్‌కు అందరికన్నా ముందువస్తారు. మస్జిద్‌కు త్వరగా రావటం కూడా పుణ్యప్రదమైన విషయం. అదీగాక మొదటి వరుసలో వున్నవారు సాధారణంగా పెద్దవారు, జ్ఞానసంపన్నులు అయివుంటారు. ఇతర నమాజీలకన్నా వారు ఇమామ్‌కు అతి సమీపంలో వుంటారు. అందువల్ల వారు ఇమామ్ గారి తక్బీర్లను, ఖుర్‌ఆన్ పఠనాన్ని స్పష్టంగా వింటారు. స్త్రీలకు బహుదూరంగా ఉండటంవల్ల షైతాన్ రేకెత్తించే దుష్ప్రేరణల నుండి సురక్షితంగా ఉంటారు.

కాగా; పురుషుల చివరి పంక్తిలో నిలబడివున్న వారు వీటన్నింటికీ దూరంగా వుంటారు. అందుచేత వీరికి పుణ్యం మొదటి పంక్తి వారికన్నా తక్కువ లభిస్తుంది. స్త్రీల ఆఖరి వరుస అన్నింటికన్నా మేలైన వరుస అని అనబడటంలోని ఆంతర్యం ఏమిటంటే ఆఖరి వరుసలో నిలబడివున్న స్త్రీలు మస్జిద్‌కు ఆలస్యంగా వస్తారు. అందుచేత వారి సంచారం పురుషులు వున్న చోట ఉండదు. మస్జిద్‌లో ఒకే హాలు వుండి స్త్రీ పురుషులు ముందు - వెనుక నిలబడవలసి వచ్చినప్పుడు ఈ పరిస్థితి ఉత్పన్న మవుతుంది. ఒకవేళ స్త్రీలు కూడా ప్రత్యేక హాలులో - వేరుగా కూర్చోవలసి వచ్చినప్పుడు - వారి వంక్తుల్లో కూడా మొదటి పంక్తే ఉత్తమపంక్తిగా పరిగణించబడుతుంది సుమా!

(٣٣١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: صَلَّيْتُ مَعَ رَسُولِ اللهِ ﷺ ذَاتَ لَيْلَةٍ، فَقُمْتُ عَنْ يَسَارِهِ، فَأَخَذَ رَسُولُ اللهِ ﷺ بِرَأْسِي مِنْ وَرَائِي، فَجَعَلَنِي عَنْ يَمِينِهِ، مُتَّفَقٌ عَلَيْهِ.

331. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: నేను ఒక రోజు రాత్రి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి నమాజ్ చేశాను. నమాజ్‌లో ఆయన (స) ఎడమ ప్రక్కన నిలబడ్డాను. దైవప్రవక్త (సఅసం) వెనుక నుండి నా తల పట్టుకుని తన కుడి ప్రక్కకు నిలబెట్టుకున్నారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నమాజ్ చేసేవారు ఇద్దరే వున్నప్పుడు ముఖ్తదీ ఇమామ్‌కు కుడిప్రక్కన నిలబడాలి. ఒకవేళ తెలీక, అవివేకం వల్ల ముఖ్తదీ ఎడమప్రక్కన నిలబడితే ఇమామ్ అతన్ని తన కుడిప్రక్కకు లాక్కోవాలి. ఈ మాత్రం చేష్ట (కదలిక) వల్ల నమాజ్ చెడిపోదు. ఎందుకంటే ఈ చలనం కూడా నమాజ్ కోసమే జరిగింది. ఆ సమయంలో ముఖ్తదీ కూడా ఇమామ్ అంతరంగాన్ని పసిగట్టి శీఘ్రంగా స్పందించాలి. స్థానం మారినంత మాత్రాన నమాజ్‌కు కలిగే అనర్థం ఏమీ ఉండదు - ఎందుకంటే నమాజ్‌ను సంస్కరించే ఉద్దేశ్యంతోనే ఈ బదిలీ జరిగింది. ఈ హదీసు వల్ల తెలిసేదేమంటే ఇద్దరు వ్యక్తులు కూడా సామూహికంగా నమాజ్ చేయవచ్చు. నఫిల్ నమాజు కోసం కూడా జమాఅత్‌గా ఏర్పడవచ్చని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

(٣٣٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللهِ ﷺ، فَقُمْتُ أَنَا وَيَتِيمٌ خَلْفَهُ، وَأُمُّ سُلَيْمٍ خَلْفَنَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

332. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేయించగా నేను మరియు ఒక అనాథ వ్యక్తి - ఇద్దరం ఆయన (స) వెనుక నిలబడి నమాజ్ చేశాము. ఉమ్మె సులైమ్ (ర.అన్‌హా) (ఒక్కతే) మా వెనుక నిలబడి నమాజ్ చేశారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

నఫిల్ నమాజు సామూహికంగా చేయవచ్చన్న దానికి ఈ హదీసు ఇంకొక తార్కాణం. సామూహిక నమాజ్‌లో స్త్రీ ఒక్కామే ఉంటే ఆమె ఒక్కతే వేరుగా - వెనుక - పంక్తిలో నిలబడాలనీ, పురుషుల పంక్తిలోకి వచ్చి చేరకూడదని కూడా ఈ హదీసు చెబుతోంది. ఒకవేళ చిన్న పిల్లలు ఉన్నప్పటికీ ఆమె వారి వెనుకే నిలబడాలి. అంటే మొదట పురుషులు, వారి వెనుక పిల్లలు, వారి వెనుక స్త్రీల పంక్తి ఉండాలన్నమాట! ఒకవేళ పురుషుడు (పెద్దవాడు) ఒక్కడే ఉంటే చిన్నపిల్లలను తన ప్రక్కన నిలబెట్టుకోవచ్చు.

శుభాలను, మేళ్లను ఆశించి ఇంట్లో దైవభక్తి పరాయణుల సారథ్యంలో నఫిల్ నమాజులను చేయవచ్చు. ఉమ్మె సులైమ్ ఎవరో కాదు, స్వయంగా హజ్రత్ అనస్ (రజి) తల్లిగారే. ఈమెగారే అనస్ (రజి)ను దైవప్రవక్త (సఅసం) సేవకై అంకితం చేశారు. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే మరో విషయం ఏమిటంటే ఒక స్త్రీ తన కన్న కొడుకు ప్రక్కన సయితం నిలబడి - ఒకే పంక్తిలో - నమాజ్ చేయజాలదు.

(٣٣٣) وَعَنْ أَبِي بَكْرَةَ أَنَّهُ انْتَهَى إِلَى النَّبِيِّ ﷺ وَهُوَ رَاكِعٌ، فَرَكَعَ قَبْلَ أَنْ يَصِلَ إِلَى

333. హజ్రత్ అబూబక్రా (రజి) తెలిపారు: దైవప్రవక్త (సఅసం) రుకూ చేస్తున్న సమయంలో తాను ఆయన

الصَّفِّ، ثم مشي إلى الصف وَذَكَرَ ذَلِكَ لِلنَّبِيِّ ﷺ، فَقَالَ – لَهُ النَّبِيُّ ﷺ –: «زَادَكَ اللَّهُ حِرْصاً، وَلاَ تَعُدْ». رَوَاهُ الْبُخَارِيُّ، وَزَادَ أَبُو دَاوُدَ فِيهِ: «فَرَكَعَ دُوْنَ الصَّفِّ، ثُمَّ مَشَى إِلَى الصَّفِّ».

(స) వద్దకు వెళ్ళారు. వరుసలోకి వెళ్ళి కలవకుండానే ఆయన అక్కడికక్కడే రుకూలోకి వెళ్ళిపోయారు. దైవప్రవక్త (స) ఆయన్నుద్దేశ్యించి "దేవుడు నీ అత్యాశను మరింత వృద్ధి చేయుగాక! కాని ఇక మీదట ఇలా చేయకు" అని ఉపదేశించారు. (బుఖారీ)

"ఆ వ్యక్తి వరుసలోకి వెళ్ళి నిలబడక ముందే రుకూ చేశాడు. రుకూ స్థితిలోనే నడచివెళ్ళి వరుసలో కలసిపోయాడు" అని అబూదావూద్ నకలు చేశారు.

(٣٣٤) وَعَنْ وَابِصَةَ بْنِ مَعْبَدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ رَأَى رَجُلاً يُصَلِّي خَلْفَ الصَّفِّ وَحْدَهُ، فَأَمَرَهُ أَنْ يُعِيْدَ الصَّلاَةَ. وَرَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

334. హజ్రత్ వాబిస బిన్ మాబద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దృష్టి ఒక వ్యక్తిపై పడింది. అతను వెనుక ఒంటరిగా నిలబడి నమాజ్ చేస్తున్నాడు. నమాజ్‌ను తిరిగి చేయవలసిందిగా ఆయన (స) అతనిని ఆజ్ఞాపించారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్' గా ఖరారు చేయగా, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికంగా నిర్ధారించారు)

وَلَهُ عَنْ طَلْقٍ: لاَ صَلاَةَ لِمُنْفَرِدٍ خَلْفَ الصَّفِّ. وَزَادَ الطَّبْرَانِيُّ فِي حَدِيْثِ وَابِصَةَ: أَلاَ دَخَلْتَ مَعَهُمْ أَوِ اجْتَرَرْتَ رَجُلاً؟

అలాగే తల్క్ బిన్ అలీ (రజి) ఉల్లేఖనంలో ఉంది - "పంక్తి వెనుక ఒకే వ్యక్తి నమాజ్ చేస్తే అతని నమాజ్ నెరవేరదు." తిర్మిజీ గారు వాబిస హదీసులో అదనంగా నకలు చేసిన వాక్యాలు ఇలా వున్నాయి - "నీవు వీళ్ళతో ఎందుకు కలసిపోలేదు? లేదా నీవు ఏ నమాజీనయినా వెనక్కి ఎందుకు లాక్కోలేక పోయావు?"

## సారాంశం

పంక్తి వెనుక ఒకే వ్యక్తి నిలబడి నమాజ్ చేస్తే అతని నమాజ్ నెరవేరుతుందా? లేదా? ఈ విషయంపై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. ఇమామ్ అహ్మద్ మరియు మరి కొంతమంది పండితుల దృష్టిలో ఆ వ్యక్తి నమాజ్ అవదు. ఎందుకంటే అటువంటి వ్యక్తి నుద్దేశ్యించి, మళ్లీ నమాజ్ చేయవలసిందిగా దైవప్రవక్త (స) ఆజ్ఞాపించారు.

మరి కొంతమంది అభిప్రాయంలో అలాంటి వ్యక్తి నమాజ్ అయిపోతుంది. ఇక దైవప్రవక్త (స) ఆ వ్యక్తిని తిరిగి నమాజ్ చేయమన్నారంటే అతన్ని దండించే ఉద్దేశ్యంతో అలా చేశారని వీళ్ళంటారు.

ఈ విషయంలో సహీహ్ హదీసుల సారాంశం ఇలా వుంది -

ముందు వరుస పూర్తి కావాలి. ఇక ఆ వరుసలో ఏమాత్రం స్థలం లేనపుడు మిగిలిపోయిన ఒక వ్యక్తి వెనుక ఒంటరిగానే నిలబడవచ్చు. ఎందుకంటారేమో, ముందు వరుసలో మధ్యనుంచి ఒక నమాజీని వెనక్కి పిలుచుకుంటే ఆ వరుసలో వెలితి ఎలాగూ ఏర్పడుతుంది. ఈ వెలితి వాంఛనీయం కాదు. ఈ వెలితిని పూరించడానికి ఆ వరుసలోని నమాజీలంతా కదలవలసి ఉంటుంది. పోనీ వరుసలోని ఏదో ఒక మూల నుంచి ఒక వ్యక్తిని వెనక్కి లాక్కుంటే అట్టి పరిస్థితిలో చాలా దూరం (నమాజ్‌లో) నడవవలసి ఉంటుంది. ఇది కూడా అంతగా శ్రేయస్కరం కాదు. కనుక అతడు ఒంటరిగా వెనుక నిలబడి నమాజ్ చేసుకోవటమే భావ్యం. ఇమాములలో ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ షాఫయీల దృక్పథం కూడా ఇదే. షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియ కూడా ఈ పద్ధతినే ఇష్టపడ్డారు. ముందు వరుసలో నుంచి ఒక వ్యక్తిని వెనక్కి లాక్కోవాలన్న తబ్రానీలోని ఉల్లేఖనం అప్రమాణికమైనది (జయీఫ్).

## హదీసు ఉల్లేఖకులు

వాబిస బిన్ మాబద్ (రజి). మారుపేరు అబూఖిర్‌సాఫ. అన్సార్‌కు చెందిన తెగ అసద్ బిన్ ఖుజైమాతో ఈయనకు సంబంధం ఉంది. హిజ్రీ 9లో దైవప్రవక్త (స) సమక్షంలో ప్రతినిధిగా హాజరయ్యారు. మొదట కూఫాలో స్థిరపడ్డారు. తరువాత హీరా వైపునకు తరలివెళ్ళారు. హిజ్రీ 90లో మరణించారు.

(٣٣٥) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا سَمِعْتُمُ الْإِقَامَةَ فَامْشُوا إِلَى الصَّلَاةِ، وَعَلَيْكُمُ السَّكِيْنَةُ وَالوَقَارُ، وَلَا تُسْرِعُوا، فَمَا أَدْرَكْتُمْ فَصَلُّوْا، وَمَا فَاتَكُمْ فَأَتِمُّوْا»، مُتَّفَقٌ عَلَيْهِ. وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

335. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీరు నమాజ్‌కై ఇఖామత్‌ను వినగానే నమాజ్ వైపునకు నింపాదిగా, హుందాగా నడచి రండి. హడావిడి చేయకండి. జమాఅత్‌తో ఎంత నమాజ్ లభిస్తే అంత పొందండి. మిగిలిన (రకతుల) నమాజు తర్వాత పూర్తి చేసుకోండి." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

## సారాంశం

హదీసు ప్రకారం మనిషి నమాజ్ కోసం ఎప్పుడు మస్జిద్‌కు వచ్చినా గంభీరంగా, ప్రశాంతంగా, సంస్కారం ఉట్టిపడే విధంగా రావాలి. అంతేగానీ ఆందోళన చెందుతున్నట్లుగా, ఆదరాబాదరాగా- హైరానా పడిపోతున్నట్లుగా - నడచి రాకూడదు. నడుస్తున్నప్పుడు చూపుల్ని క్రిందికి దించాలి. ఏదన్నా చెప్పవలసి ఉంటే నెమ్మదిగా చెప్పాలి. ఆ విధంగా నడచివచ్చిన తరువాత, ఇమామ్ ఏ స్థితిలో వుంటే ఆ స్థితిలోనే నమాజ్‌ను మొదలెట్టాలి. మిగిలివున్న నమాజును తరువాత పూర్తి చేసుకోవాలి.

ఇమామ్ రుకూలోకి వెళుతుండగా వచ్చి కలసిన వారి రకత్ నెరవేరుతుందా? (లెక్కలోకి వస్తుందా?) లేదా? అనే విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ రకత్‌ను లెక్కలోకి తీసుకోక పోవటమే సరైనది. ఎందుకంటే రుకూలోకి వెళ్లకమునుపు ఆ వ్యక్తి ఖియామ్‌లో పాల్గొనలేదు, సూరె ఫాతిహా పఠించలేదు. నమాజ్‌లో ఈ రెండు అంశాలు పాటించటం చాలా ముఖ్యం. కనుక చివరి క్షణాల్లో వచ్చి రుకూలో చేరిపోయిన వ్యక్తికి ఆ రెండు అంశాలు లభించలేదు. మరలాంటప్పుడు అతని నమాజ్ పరిపూర్ణమెలా అవుతుంది?

(٣٣٦) وَعَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلَاةُ الرَّجُلِ مَعَ الرَّجُلِ أَزْكَى مِنْ صَلَاتِهِ وَحْدَهُ، وَصَلَاتُهُ مع الرَّجُلَيْنِ أزكى من صلاته مَعَ الرَّجُلِ، وَمَا كَانَ أَكْثَرُ فَهُوَ أَحَبُّ إِلَى اللهِ عَزَّ وَجَلَّ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

336. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) తెలిపారు : ఒక వ్యక్తి రెండో వ్యక్తితో కలసి నమాజ్ చేయటం ఒంటరిగా నమాజ్ చేయడం కన్నా ఎంతో పవిత్రమైనది. పుణ్యంతో కూడుకున్నది. ఇద్దరు వ్యక్తులతో కలసి నమాజ్ చేయడం (మొదటి స్థితికన్నా) మరింత ఎక్కువ పుణ్యప్రదమైనది. అదేవిధంగా ఎంతమంది అధికంగా ఉంటే అంతే అల్లాహ్ దృష్టిలో అది ప్రీతికరమవుతుంది. (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

సామూహిక నమాజ్ వ్యక్తిగత స్థాయి నమాజ్ కన్నా ఎన్నో రెట్లు మహత్తుతో కూడుకున్నది. అందునా సామూహిక నమాజులో ఎక్కువ మంది ఉంటే అది దేవుని దృష్టిలో మరింత మహత్తును సంతరించు కుంటుంది. అటువంటి భారీ సమూహంలో చేరి నమాజ్ చేయటం వల్ల దాసులకు చేకూరే ఇహపర శుభాలు అపారం.

(٣٣٧) وَعَنْ أُمِّ وَرَقَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ أَمَرَهَا أَنْ تَؤُمَّ أَهْلَ دَارِهَا. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

337. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు, తన ఇంటివారలకు నమాజ్ చేయించమని ఆజ్ఞాపించారని హజ్రత్ ఉమ్మె వరఖా (ర.అన్హా) చెప్పారు. (అబూదావూద్ ఉల్లేఖించారు- ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన దిగా నిర్ధారించారు)

### సారాంశం

స్త్రీ ఇమామత్ బాధ్యతలను నిర్వర్తించగలదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. కాని ఎవరికి? స్త్రీ పురుషులిద్దరికీ ఇమామత్ చేయగలదా? కొంతమంది ఇక్కడే పొరబడ్డారు. స్త్రీ స్త్రీలకు మాత్రమే ఇమామ్‌గా ఉండగలదు. పురుషుల నమాజ్‌కు ఆమె ఎట్టి పరిస్థితిలోనూ సారథ్యం వహించజాలదు.

స్త్రీ ఇమామ్‌గా నిలబడి స్త్రీలకు నమాజ్ చేయించేటప్పుడు పురుష ఇమామ్ మాదిరిగా ప్రత్యేకంగా- ఒంటరిగా - నిలబడకూడదు. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) చెప్పిన దాని ప్రకారం, స్త్రీల మొదటి పంక్తి మధ్యలో నిలబడి ఇమామత్ చేయాలి. హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా), హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కూడా ఇలాగే నమాజ్ చేయించేవారు.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన ఉమ్మె వరఖా (ర.అన్హా) నౌఫిల్ కుమార్తె లేదా అబ్దుల్లాహ్ బిన్ హారిస్ కుమార్తె అయివుంటారు. అన్సార్ వర్గానికి చెందినవారు. ఈమె హృదయంలో దాదాపు ఖుర్ఆన్ అంతా పదిలమై ఉండేది. బద్ర్ యుద్ధంలో పాల్గొనేందుకు ఈమె దైవప్రవక్త (సఅసం) అనుమతి కోరారు. కాని దైవప్రవక్త (స) అనుమతి ఇవ్వలేదు. ఎందుకంటే ఇంటివద్దనే ఆమెకు అమరగతి లభించనున్నది. ఆమెను పలకరించడానికి దైవప్రవక్త (సఅసం) స్వయంగా ఆమె ఇంటికి వచ్చేవారు. ఆయన (స) ఆమెను వీరవనితగా కొనియాడేవారు. ఆమె వద్ద ఇద్దరు బానిసలు (ఒక స్త్రీ, ఒక పురుషుడు) ఉండేవారు. తాను మరణించిన తక్షణమే వారు స్వతంత్రులవుతారని ఆమె ముందే ప్రకటించారు. కాని ఆ బానిసలిద్దరూ కుట్రపన్ని, ఒకనాడు రాత్రి సమయంలో ఆమెను దుప్పటితో ఉరివేసి రాత్రికి రాత్రే పలాయనం చిత్తగించారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి) వారిద్దరినీ నిర్బంధించి, ఉరిశిక్ష విధించారు. మదీనా మునవ్వరాలో ఉరితీతకు గురైన తొలి దోషులు వీరే. ఉమ్మె వరఖా (ర.అన్హా) దైవప్రవక్త (స) అనుమతితో తన వీధిలోని వారికి ఇమామత్ చేసేవారు. ఎందుకంటే ఈమె మనోఫలకంపై దివ్య ఖుర్ఆన్ ముద్రపడి ఉండేది.

(٣٣٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ اسْتَخْلَفَ ابْنَ أُمِّ مَكْتُومٍ،

338. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అంధులైన ఇబ్నె ఉమ్మె మక్తూమ్‌ను తన గైర్హాజరీలో ప్రజలకు ఇమామత్

يَؤُمُّ النَّاسَ وَهُوَ أَعْمَى. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَنَحْوُهُ لِابْنِ حِبَّانَ عَنْ عَائِشَةَ.

చేయించే బాధ్యతను అప్పగించారు. (అహ్మద్, అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ కూడా ఇటువంటి హదీసునే హజ్రత్ ఆయిషా - ర.అన్హా - ఆధారంగా ఉటంకించారు)

**సారాంశం**

ఇమామ్ తాను లేని సమయంలో ప్రజలకు నమాజ్ చేయించేందుకు గాను - తన సహాయకుడిని నియమించుకోవచ్చని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతూంది. అంధుడైన వ్యక్తి ఇమామ్‌గా నియమించబడవచ్చని కూడా ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. దైవప్రవక్త (స) నియమించిన అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) అంధులు. దైవప్రవక్త (స) ఈయన్ని 13 సార్లు తన ఉప ఇమామ్‌గా నియమించారు. దైవప్రవక్త (స) మదీనా నగరంలో లేని సమయంలో ఈయన సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించేవారు.

(٣٣٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلُّوا عَلَى مَنْ قَالَ لاَ إِلَه إِلاَّ اللَّهُ، وصَلُّوا خَلْفَ مَنْ قَالَ لاَ إِلَه إِلاَّ اللَّهُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

339. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "ఎవరయితే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని నోటితో పలికాడో అతని అంత్యక్రియల నమాజ్ చేయండి. మరెవరు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అన్నాడో అతని వెనుక నమాజ్ కూడా చేయండి." (దీనిని దారె ఖుత్నీ 'బలహీన' ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

దైవధర్మ విధులపట్ల నిర్లక్ష్య వైఖరి కనబరచిన వ్యక్తి చనిపోతే - అతను కలిమాను పఠించిన కారణంగా అతని జనాజా (అంత్యక్రియల) నమాజ్‌ను చేయవచ్చని ఈ హదీసు చెబుతున్నది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మతుల్లై) కూడా దీంతో ఏకీభవించారుగాని దైవధర్మంపై తిరుగుబాటు వైఖరిని ప్రదర్శించిన వ్యక్తి యొక్క జనాజా నమాజ్ మాత్రం చేయరాదని అన్నారు. మొత్తంమీద ఇస్లాం ధర్మం పట్ల పబ్లిగ్గా ధిక్కారానికి పాల్పడిన వ్యక్తి మరియు ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి జనాజా నమాజు చేయ కూడదు. దైవప్రవక్త (స) సయితం ఆత్మహత్యకు పాల్పడిన ఒక వ్యక్తి అంత్యక్రియల నమాజులో పాల్గొనలేదు. అయితే "మీరు వెళ్ళి అతని జనాజా నమాజ్ చేయించండి" అని ఆయన (స) తన సహచరులను ఆదేశించారు.

(٣٤٠) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا أَتَى أَحَدُكُمُ الصَّلَاةَ، وَالْإِمَامُ عَلَى حَالٍ، فَلْيَصْنَعْ كَمَا يَصْنَعُ الْإِمَامُ». رَوَاهُ التِّرْمِذِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

340. దైవప్రవక్త (నల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) వివరించారు : "మీలో ఎవరయినా నమాజ్ చేయ డానికి వస్తే, ఇమామ్‌ను ఏ స్థితిలో చూస్తే ఆ స్థితిలోనే మీరు ఇమామ్‌ను అనుసరించండి." (తిర్మిజీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

అంటే ఇమామ్ రుకూ స్థితిలో వుంటే, అప్పుడే వచ్చిన వ్యక్తి అల్లాహు అక్బర్ అంటూ రుకూలో చేరిపోవాలి. ఇమామ్ సజ్దా స్థితిలో ఉంటే అల్లాహు అక్బర్ అంటూ సజ్దాలోకి వెళ్ళిపోవాలి. ఒకవేళ ఇమామ్ కూర్చునివుంటే వచ్చినవ్యక్తి అల్లాహు అక్బర్ అంటూ కూర్చోవాలి. తిర్మిజీలోని ఈ హదీసు 'జయీఫ్' అయినప్పటికీ ఇతర హదీసుల ద్వారా దీనికి మద్దతు లభిస్తున్నది.

## ١١ - بَابُ صَلَاةِ الْمُسَافِرِ وَالْمَرِيضِ

## 11వ అధ్యాయం
## ప్రయాణీకుల, వ్యాధిగ్రస్తుల నమాజ్

(٣٤١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَوَّلُ مَا فُرِضَتِ الصَّلَاةُ رَكْعَتَانِ، فَأُقِرَّتْ صَلَاةُ السَّفَرِ، وَأُتِمَّتْ صَلَاةُ الْحَضَرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

341. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "ప్రారంభకాలంలో రెండు రకతులు ఫర్జ్ (విధి) గావించబడ్డాయి. అంటే ఫర్జ్ గావించబడినవి రెండు రక తులే. అవి (ప్రయాణీకుల నమాజ్‌గా) మిగిల్చి ఉంచబడ్డాయి. సాధారణ (స్థితి లోని) నమాజ్ పరిపూర్ణం గావించ బడింది. (అంటే నాలుగు రకతులు చేయబడింది) (బుఖారీ, ముస్లిం)

وَلِلْبُخَارِيِّ: ثُمَّ هَاجَرَ، فَفُرِضَتْ أَرْبَعاً، وَأُقِرَّتْ صَلَاةُ السَّفَرِ عَلَى الْأَوَّلِ.

బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - "ఆయన (స) హిజ్రత్ చేసిన తరువాత నాలుగు రకతులు విధించ బడ్డాయి. ప్రయాణ నమాజ్ మాత్రం యధాతథంగా (మొదటి స్థితిలో) ఉంచ బడింది."

وَزَادَ أَحْمَدُ: إِلاَّ الْمَغْرِبَ، فَإِنَّهَا وِتْرُ النَّهَارِ، وَإِلاَّ الصُّبحَ، فَإِنَّهَا تُطَوَّلُ فِيْهَا الْقِرَاءَةُ.

అహ్మద్ ఈ వాక్యాన్ని అదనంగా చేర్చారు: "మగ్రిబ్ నమాజ్ తప్ప. ఎందు కంటే అవి పగటి వితర్. ఉదయం నమాజ్ కూడా యథాతథంగానే ఉంచ బడింది. ఎందుకంటే ఈ నమాజ్‌లో ఖుర్‌ఆన్ పారాయణం సుదీర్ఘంగా ఉంటుంది."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే తొలి కాలంలో సాధారణ సమయాలలోనూ, ప్రయాణా వస్థలోనూ రెండేసి రకతుల నమాజ్ మాత్రమే ఫర్జ్‌గా ఉండేది. తరువాత ప్రయాణావస్థ నమాజును యథాతథంగా వుంచి, సాధారణ స్థితిలో నమాజ్‌ను రెండింతలు చేయటం జరిగింది. అంటే రెండు రకతుల ఫర్జ్ నమాజ్ కాస్తా నాలుగు రకతులుగా చేయబడింది.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఖసర్ నమాజ్ గురించిన ప్రస్తావన వచ్చింది. ప్రయాణావస్థలో నమాజ్‌ను ఖసర్ చేయటం (తగ్గించటం) ధర్మసమ్మతమేనని అందులో చెప్పబడిందేగాని, ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అని మాత్రం అనబడలేదు.

ప్రయాణంలో ఖసర్ చేయటం వాజిబ్ (తప్పనిసరి) అన్నది ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిమతం. ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) లు మాత్రం ఖసర్‌ను సున్నత్ (దైవప్రవక్త) సంప్రదాయంగా తలపోస్తున్నారు.

దారె ఖుత్నీలో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ఈ విధంగా ఉంది - "ప్రయాణ సమయంలో నేను పూర్తి నమాజ్ చేశాను. దీనిగురించి ఆయన (సఅసం) కు తెలియజేయగా, ఆయన (స) మెచ్చుకున్నారు."

(٣٤٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقْصُرُ فِي السَّفَرِ وَيُتِمُّ، وَيَصُوْمُ وَيُفْطِرُ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَرُوَاتُه ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ مَعْلُوْلٌ، وَالْمَحْفُوظُ عَنْ عَائِشَةَ بِنْ فِعْلِهَا، وَقَالَتْ: إِنَّهُ لاَ يَشُقُّ عَلَيَّ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ.

342. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణ దినాలలో ఒక్కోసారి ఖసర్ చేసేవారు. ఒక్కోసారి పూర్తి నమాజ్ చేసేవారు. (అంటే రెండింటినీ అనుస రించేవారు). అలాగే ఉపవాసాలూ ఉండేవారు, ఇఫ్తార్ కూడా చేసేవారు '(దారె ఖుత్నీ). ఈ హదీసును అందజేసిన వారు విశ్వసనీయులు. కాని హదీసు అందిన పరంపరలో మాత్రం ఎక్కడో లింకు తెగింది. అయితే హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) గారి ఆచరణ రూపంలో ఇది సురక్షితంగా ఉంది. "ఉపవాసవ్రతం

నాకు భారమేమీ కాదు" అని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వక్కాణించారు.

(బైహఖీ)

(٣٤٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللَّهَ يُحِبُّ أَنْ تُؤْتَى رُخَصُهُ، كَمَا يَكْرَهُ أَنْ تُؤْتَى مَعْصِيَتُهُ». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وابْنُ حِبَّانَ، وَفِي رِوَايَةٍ: «كَمَا يُحِبُّ أَنْ تُؤْتَى عَزَائِمُهُ».

343. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "అల్లాహ్ రాయితీ నిచ్చిన విషయాలలో ఈ రాయితీలపై అమలు చేయటం అయనకెంతో ఇష్టం. అయన తన అవిధేయతను ఎంతగా ఇష్టపడడో అంతగానే (తన ప్రసాదిత సౌలభ్యాలను సద్వినియోగ పరచుకోవటాన్ని ఇష్టపడతాడు).

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్‌లు ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు). వేరొక ఉల్లేఖనంలో ఈ వాక్యం ఉంది - "తాను తాకీదు చేసిన ఆదేశాలను - ఫర్జ్‌లను - నెరవేర్చటాన్ని అల్లాహ్ ఇష్టపడినట్లే."

**సారాంశం**

ప్రయాణంలో నమాజ్‌ను ఖసర్ చేసి (తగ్గించి) చేయటం ఉత్తమమని ఈ హదీసు తాత్పర్యం. క్రియాత్మకంగా 4 రకతుల బదులు 2 రకతులే చేసినప్పటికీ ఇదే శ్రేష్ఠమయినది - ఎందుకంటే దేవుడు సమకూర్చిన సౌలభ్యాన్ని సద్వినియోగపరచుకోవటం దాసుల విజ్ఞతకు తార్కాణం. ఇది దైవానికి అత్యంత ప్రీతికరం.

(٣٤٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا خَرَجَ مَسِيرَةَ ثَلَاثَةِ أَمْيَالٍ أَوْ ثَلَاثَةَ فَرَاسِخَ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ مُسْلِمٌ.

344. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు మైళ్ళు, లేక మూడు 'ఫిర్‌సిఖ్'ల దూరం ప్రయాణం చేసినపుడు రెండు రకతుల (ఖసర్) నమాజ్ చేసేవారు."

(ముస్లిం)

**సారాంశం**

ఒక మైలుకు 8 ఫర్లాంగులు. ఒక 'ఫిర్‌సిఖ్' మూడు మైళ్లకు సమానం. మూడు 'ఫిర్‌సిఖ్'లు అంటే 9 మైళ్ళు అన్నమాట! అయితే ఈ 'దూరం' విషయంలో హదీసువేత్తల, ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (రహ్మ.లై), ఆయన ప్రియ అనుయాయి హాఫిజ్ ఇబ్నె ఖయ్యిం (రహ్మ.లై) ల అభిప్రాయం ప్రకారం ఖసర్ నమాజు కోసం ఇంతదూరం ప్రయాణించాలి అని ఖచ్చితంగా ఏమీ నిర్ధారితం కాలేదు. ఇమామ్ షాబ (రహ్మ.లై) గారు మూడు మైళ్లు లేక మూడు ఫిర్‌సిఖ్‌లు ప్రయాణిస్తే చాలు, ఖసర్ చేయవచ్చునని వ్యాఖ్యానించారు. హదీసులో కూడా ఈ మాటే అనబడింది. కొంతమంది ఈ దూరాన్ని 36 మైళ్లుగా, మరి కొందరు 48 మైళ్లుగా, ఇంకా కొందరు 56 మైళ్లుగా నిర్ధారించారు. వాస్తవానికి ఇవన్నీ అంచనాల ఆధారంగా నిర్ధారించుకున్నవే గాని వారి ఈ నిర్ధారణను సమర్థించే సహీహ్ హదీసు ఏదీ లేదు.

(٣٤٥) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ مِنَ الْمَدِينَةِ إِلَى مَكَّةَ، فَكَانَ يُصَلِّي رَكْعَتَيْنِ رَكْعَتَيْنِ، حَتَّى رَجَعْنَا إِلَى الْمَدِينَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

345. హిజ్రత్ అనస్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి మదీనా నుండి మక్కా వరకు పయనించాము. ఆయన (సఅసం) తిరిగి వచ్చేదాకా రెండేసి రకతులే చేశారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

ప్రయాణ సంకల్పంతో మనిషి తన ఇంటి నుండి బయలుదేరినప్పటినుండీ అతడు బాటసారిగానే పరిగణించబడతాడు. పట్టణ పరిధిని దాటితే, అంటే నేటి ఆధునిక పరిభాషలో మునిసిపల్ పరిసరాలను లేక పంచాయితీ పాలిమేరలను దాటినప్పటినుండీ తిరిగివచ్చే వరకూ అతడు ప్రయాణీకుడే. ఈ మధ్య కాలంలో అతడు 'ఖసర్' చేయవచ్చు.

(٣٤٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَقَامَ النَّبِيُّ ﷺ تِسْعَةَ عَشَرَ يَوْماً يَقْصُرُ وَفِي لَفْظٍ: «بِمَكَّةَ، تِسْعَةَ عَشَرَ يَوْماً». رَوَاهُ الْبُخَارِيُّ. وَفِي رِوَايَةٍ لِأَبِي دَاوُدَ: «سَبْعَ عَشْرَةَ». وَفِي أُخْرَى: «خَمْسَ عَشْرَةَ».

346. హిజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 19 రోజులపాటు ప్రయాణంలో (ఒకచోట ఆగి) వున్నారు. కాని ఆయన (స) 'ఖసర్' చేస్తూ వున్నారు. 'మక్కాలో 19 రోజులు ఉన్నార'ని వేరొక ఉల్లేఖనంలో ఉంది (బుఖారీ). అబూ దావూద్ ఉల్లేఖనంలో 17 రోజులు అని ఉంది. ఇంకొక ఉల్లేఖనంలో 15 రోజులని ఉంది.

وَلَهُ عَنْ عِمْرَانِ بْنِ حُصَيْنٍ: «ثَمَانِيَ عَشْرَةَ». وَلَهُ عَنْ جَابِرٍ: أَقَامَ بِتَبُوكَ عِشْرِينَ يَوْماً يَقْصُرُ الصَّلاَةَ. وَرُوَاتُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي وَصْلِهِ.

అబూదావూద్‌లోనే ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)చే ఇలా ఉల్లేఖించబడింది - "ఆయన(స) ఆగిన కాలం 18 రోజులు." "ఆయన (స) తబూక్‌లో 20 రోజులు ఆగారు. ఆగినన్ని రోజులూ ఖసర్ చేశారు" అని జాబిర్ (రజి) చెప్పారు. ఈ ఉల్లేఖనాన్ని అందజేసిన వారు విశ్వసనీయులేగాని, అసలిది ఎక్కడినుండి మొదలైంది అన్న విషయం వివాదాస్పదం అయింది. (అబూదావూద్)

**సారాంశం**

మక్కాలో దైవప్రవక్త (సఅసం) ఆగిన రోజుల గురించి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 19 రోజులని కొందరూ, 17 రోజులని మరికొందరు, 18 రోజులని ఇంకొందరూ వాదించారు. ప్రతి ఒక్కరూ తమ తమ వాదనల కనుగుణంగా ఏదో ఒక ఆధారాన్ని ఉదాహరించారు. వాస్తవానికి ఇది దైవప్రవక్త (స) మక్కాను జయించినప్పటి సంఘటన. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆగిన గడువు కాదిది. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆయన (స) విచ్చేసినపుడు మొత్తం పది రోజులకన్నా ఎక్కువ ఉండలేదు. ఈ వివిధ ఉల్లేఖనాలను జోడించిన పిదప 19 రోజుల ఉల్లేఖనం ఇతర ఉల్లేఖనాలకన్నా దృఢంగా కనిపిస్తుంది. ఎందుకంటే దైవప్రవక్త (స) మక్కా విజయం సందర్భంగా - రమజాన్ నెల 17వ తేదీ మంగళవారం వాడు మక్కాలో ప్రవేశించారు. అక్కడి నుండి హునైన్ వైపునకు షవ్వాల్ మాసం 6వ తేదీన బయలుదేరారు. దాఖలైన రోజును, వెడలిపోయిన రోజును కలుపుకుంటే మొత్తం 19 రోజులవుతాయి.

అయితే ఈ 'అన్వయింపు' విషయంలో ధర్మవేత్తలమధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపాయి. ఒక్కొక్కరు ఒక్కో కోణం నుంచి ప్రయాణీకుని నిరీక్షణా గడువును నిర్ధారించారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మలై)ల దృష్టిలో ఈ గడువు 3 రోజులు. ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) దృష్టిలో 15 రోజులు. కాని ప్రయాణీకుని తిరుగు ప్రయాణ సమయం నిర్ధారితం కాక అతడు సందిగ్ధావస్థకు లోనైవుంటే అట్టి పరిస్థితిపై కూడా ఇమాముల మధ్య అభిప్రాయభేదం ఏర్పడింది. ఇలాంటి సందిగ్ధావస్థకు లోనై వున్న ప్రయాణీకుడు, అతడు తన స్థిరనివాసానికి చేరుకునేవరకూ ఖసర్ చేయవచ్చని ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయపడ్డారు. ఒకానొక కథనం ప్రకారం ఇమామ్ షాఫయి కూడా దీనికి మద్దతు తెలిపారు. ఈ అభిప్రాయాన్ని సమర్థించే సంఘటనలు కూడా ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆజర్ బాయ్‌జాన్‌లో 6 నెలల దాకా 'ఖసర్' చేశారు. హజ్రత్ అనస్ (రజి) ఒక ప్రయాణంలో ఏడాది కాలం లేక రెండేళ్ళపాటు డోలాయమాన

స్థితిలో ఉండవలసి వచ్చింది. అప్పటివరకూ ఆయన ఖసర్ చేస్తూనే వున్నారు. కొంతమంది ప్రవక్త సహచరులు ఒక ప్రయాణంలో 9 మాసాల దాకా అనిశ్చిత స్థితికి లోనుకావలసి వచ్చింది. ఈ స్థితి తొలగిపోయేదాకా వారు ఖసర్ చేసినట్టు ఆధారాలున్నాయి. ఈ సంఘటనల ద్వారా అవగతమయ్యే దేమిటంటే ప్రయాణంలో మనిషి అనిశ్చిత స్థితికి, సందిగ్ధావస్థకు గురైవున్నంత కాలం 'ఖసర్' గడువు ఇదమిత్థంగా 'ఇంత' అని చెప్పజాలము. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా అతను ఎన్నాళ్ళయినా 'ఖసర్' చేయటం ధర్మసమ్మతమే.

(٣٤٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا ارْتَحَلَ قَبْلَ أَنْ تَزِيْغَ الشَّمْسُ، أَخَّرَ الظُّهرَ إِلَى وَقْتِ الْعَصْرِ، ثُمَّ نَزَل فَجَمَعَ بَيْنَهُمَا، فَإِنْ زَاغَتِ الشَّمْسُ قَبْلَ أَن يَرْتَحِلَ صَلَّى الظُّهْرَ ثُمَّ رَكِبَ. مُتَّفَقٌ عَلَيْهِ.

347. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సూర్యుడు (పడమటి దిక్కున) వాలక ముందే ప్రయాణానికి బయలుదేరి వుంటే జుహ్ర్ నమాజును అస్ర్ నమాజ్ వేళ వరకూ చేయకుండా వాయిదా వేసే వారు. ఆ తర్వాత వాహనం దిగి జుహ్ర్ అస్ర్ నమాజులను ఒకేసారి నెరవేర్చే వారు. ఒకవేళ ప్రయాణానికి బయలు దేరక ముందే సూర్యుడు (పడమటి దిశన) వాలిపోయి వుంటే, అప్పుడు జుహ్ర్ నమాజ్ చేసి ప్రయాణం కట్టేవారు. (బుఖారీ, ముస్లిం)

وَفِيْ رِوَايَةٍ الْحَاكِمِ فِي الْأَرْبَعِيْنَ بِالْإِسْنَادِ الصَّحِيحِ: صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ ثُمَّ رَكِبَ.

హాకిమ్ గారి 'అర్బయీన్'లో ఒక ప్రామాణిక ఆధారం ఇలా ఉంది: "ఆయన (స) జుహ్ర్, అస్ర్ నమాజులను (ఒకేసారి) చేసి ప్రయాణానికి బయలుదేరారు."

وَلِأَبِيْ نُعَيْمٍ فِيْ مُسْتَخْرَجِ مُسْلِمٍ: كَانَ إِذَا كَانَ فِيْ سَفَرٍ فَزَالَتِ الشَّمْسُ صَلَّى الظُّهْرَ وَالْعَصْرَ جَمِيْعاً، ثُمَّ ارْتَحَلَ.

అబూ నుఐమ్ గారి "ముస్తఖ్రజ్"లో ఇలా వుంది - "ఆయన (స) ప్రయాణంలో నున్నప్పుడు, పొద్దు వాలిన తరువాత జుహ్ర్ మరియు అస్ర్ - రెండింటినీ కలిపి చేసేవారు. ఆ తరువాత ముందుకు సాగిపోయేవారు.

(٣٤٨) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: خَرَجْنَا مَعَ النَّبِيِّ ﷺ فِي غَزْوَةِ تَبُوكَ، فَكَانَ يُصَلِّي الظُّهْرَ وَالْعَصْرَ جَمِيعاً. رَوَاهُ مُسْلِمٌ.

348. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : "మేము తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసం) వెంట ఉన్నాము. ఆయన (స) జుహ్ర్ - అస్ర్ నమాజులను కలిపి చేసేవారు. మగ్రిబ్, ఇషా నమాజులను కలిపి ఒకేసారి చేసే వారు." (ముస్లిం)

(٣٤٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَقْصُرُوا الصَّلاَةَ فِي أَقَلَّ مِنْ أَرْبَعَةِ بُرُدٍ، مِنْ مَكَّةَ إِلَى عُسْفَانَ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَالصَّحِيحُ أَنَّهُ مَوقُوفٌ، كَذَا أَخْرَجَهُ ابْنُ خُزَيْمَةَ.

349. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : నాలుగు 'బురుద్'ల కన్నా తక్కువ దూరం వుంటే ఖసర్ నమాజ్ చేయకండి. నాలుగు బురుద్‌లంటే మక్కా నుండి 'ఉస్ఫాన్' వరకు గల దూరం. (దీనిని దారె ఖుత్నీ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు. వాస్తవానికి ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. ఇబ్నె ఖుజైమ కూడా దీనిని ఈ విధంగానే ఉల్లేఖించారు)

**సారాంశం**

'బురుద్' అనేది బహు వచనం. ఏకవచనంలో 'బరీద్' గా వ్యవహరిస్తారు. ఒక బరీద్ 12 మైళ్ళకు సమానం. 4 బురుదులంటే మొత్తం 48 మైళ్ళు అవుతాయి.

4 బురుదులకన్నా తక్కువ దూరం ప్రయాణిస్తే ఖసర్ ధర్మసమ్మతం కాదంటూ హదీసును అందజేసిన వ్యక్తి నమ్మదగిన వ్యక్తి కాడు. అతడు హదీసుకు అబద్ధాన్ని అంటగట్టాడు. ఇమామ్ సౌరీ (రహ్మ.లై) అతన్ని కజ్జాబ్‌గా అభివర్ణించారు. ఇబ్నె అబ్బాస్ (రజి) స్వయంగా మక్కా-తాయఫ్‌ల మధ్య ప్రయాణం చేసినపుడు ఖసర్ చేసేవారని ఆధారాలున్నాయి. మక్కా - ఉస్ఫాన్‌ల మధ్య, మక్కా - జెద్దాల మధ్య కూడా ఆయన ఖసర్ చేసేవారని ఇమామ్ మాలిక్ తన 'ముఅత్తా' లో నకలు చేశారు.

(٣٥٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «خَيْرُ أُمَّتِي الَّذِينَ

350. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు - "నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో అత్యుత్తములెవరంటే,

إِذَا أَسَاءُوا اسْتَغْفَرُوا، وَإِذَا سَافَرُوا قَصَرُوا وَأَفْطَرُوا». أَخْرَجَهُ الطَّبَرَانِيُّ فِي الْأَوْسَطِ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَهُوَ فِي مَرَاسِيلِ سَعِيدِ بْنِ الْمُسَيَّبِ عِنْدَ الْبَيْهَقِيِّ مُخْتَصَراً.

వారు తప్పులు చేసి క్షమాపణకై వేడు కుంటారు. ప్రయాణంలో ఉన్నప్పుడు ఖసర్ నమాజ్ చేస్తారు. ఉపవాసం ఉండరు." (దీనిని తబ్రానీ బలహీన ఆధారంతో తన 'ఔసత్'లో ఉల్లేఖిం చారు. బైహఖీలో సయీద్ బిన్ ముసైబ్ ఆధారంగా సంక్షిప్తంగా దీని గురించి వివరించబడింది)

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును అందజేసిన వారిలో ఒకరైన సయీద్ బిన్ ముసైబ్ (రహ్మ.లై) తాబయీన్ల నాయకునిగా ప్రసిద్ధిచెందారు. గొప్ప పండితులు. హదీసు, ఫికహ్, దైవధ్యానం, ఆరాధనలు, తఖ్వా (దైవభక్తి) తదితర అంశాలపై ఎంతో జ్ఞానసంపదను సమకూర్చారు. విద్యల క్రోడీకరణలో ప్రవీణులు. ఈయన హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ మొదలయిన రెండు సంవత్సరాలకు జన్మించారు. హిజ్రీ 90 లో మరణించారు.

(٣٥١) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَتْ بِي بَوَاسِيرُ، فَسَأَلْتُ النَّبِيَّ ﷺ عَنِ الصَّلَاةِ، فَقَالَ: «صَلِّ قَائِماً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَقَاعِداً، فَإِنْ لَمْ تَسْتَطِعْ فَعَلَى جَنْبٍ». رَوَاهُ الْبُخَارِيُّ.

351. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : నేను మొలల వ్యాధితో బాధ పడేవాణ్ణి. ఈ స్థితిలో నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను సంప్ర తించి నమాజ్ ఎలా చేయాలని అడిగాను. ఆయన (సఅసం) ఈ సలహా ఇచ్చారు-"నిలబడి (నమాజ్) చేయండి. ఒకవేళ నిలబడి చేయలేకపోతే కూర్చుని చేయండి. కూర్చుని చేయడానికి కూడా వీలుపడకపోతే ఒక ప్రక్కకు ఒత్తిగిలి నమాజ్ చేయండి." (బుఖారీ)

### సారాంశం

అయితే ఎలా కూర్చుని నమాజ్ చేయాలి? కాళ్లు మడతపెట్టుకుని కూర్చోవాలా? లేక తషహ్హుద్ స్థితిలో కూర్చున్నట్లు కూర్చోవాలా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వ్యాధిగ్రస్తుడు ఎలా కూర్చోగలిగితే అలాగే కూర్చుని నమాజ్ చేయవచ్చు. పడుకొని నమాజ్ చేసేటప్పుడు కూడా ఎలా వీలుంటే అలా చేయవచ్చు.

(٣٥٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: عَادَ النَّبِيُّ ﷺ مَرِيضاً، فَرَآه يُصَلِّي عَلَى وِسَادَةٍ فَرَمَى بِهَا، وَقَالَ: «صَلِّ عَلَى الأَرْضِ إِنِ اسْتَطَعْتَ، وَإِلاَّ فَأَوْمِ إِيمَاءً، وَاجْعَلْ سُجُودَكَ أَخْفَضَ مِنْ رُكُوعِكَ. رَوَاهُ الْبَيْهَقِيُّ، وَصَحَّحَ أَبُو حَاتِمٍ وَقْفَهُ.

352. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రోగిని పరామర్శించారు. అతడు దిండుపై నమాజ్ (సజ్దా) చేస్తున్నాడు. దైవప్రవక్త (స) ఆ దిండును తీసిపార వేశారు. "నీకు వీలుపడితే నేలపై నమాజ్ చెయ్యి. లేకుంటే తల ఊపుతూ నమాజ్ చెయ్యి. సజ్దా చేయవలసి వచ్చినపుడు మాత్రం రుకూ కన్నా కాస్త క్రిందికి తలను వంచు." (బైహఖీ దీనిని ఉల్లేఖించారు. అబూ హాతిమ్ గారు ఇది 'మౌఖూఫ్' కావటాన్ని నిజమని ఖరారు చేశారు)

(٣٥٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْها قالت: رَأَيْتُ النَّبِيَّ ﷺ يُصَلِّي مُتَرَبِّعاً رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

353. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను కాళ్లు మడత పెట్టుకుని నమాజ్ చేయగా చూచాను." (దీనిని నసాయి ఉల్లేఖించారు - హాకిమ్ గారు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**12 వ అధ్యాయం**

## జుమా నమాజ్

## ١٢ - بَابُ صَلاَةِ الْجُمُعَةِ

(٣٥٤) عَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ، وَأَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمْ، أَنَّهُمَا سَمِعَا رَسُولَ اللهِ ﷺ يَقُولُ عَلَى أَعْوَادِ مِنْبَرِهِ: «لَيَنْتَهِيَنَّ أَقْوَامٌ عَنْ وَدْعِهِمُ الْجُمُعَاتِ، أَوْ

354. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మరియు హజ్రత్ అబూహురైర (రజి)ల కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్ వేదిక మెట్లపై (నుంచి) చెబుతుండగా తాము విన్నామని తెలిపారు - "ప్రజలు జుమా (శుక్రవారం) నమాజు విడనాడటాన్ని మానుకోవాలి. లేకపోతే అల్లాహ్ వారి హృద

لَيَخْتِمَنَّ اللَّهُ عَلَى قُلُوبِهِمْ، ثُمَّ لَيَكُونُنَّ مِنَ الْغَافِلِينَ». رَوَاهُ مُسْلِمٌ.

యాలపై సీలు వేస్తాడు. మరి వారు నిశ్చయంగా విస్మరణకు గురైన వారిలో చేరిపోతారు." (ముస్లిం)

### సారాంశం

'జుమా' అంటేనే అసలు ఒకచోట సమావేశమవటం అని అర్థం. అజ్ఞానకాలంలో అరేబియాలో దీనిని 'ఉరూబ'గా వ్యవహరించేవారు. ఇస్లాం దీనికి 'జుమా' అని నామకరణం చేసింది. ముస్లింలు ఒక ప్రత్యేక దినాన ప్రత్యేక వేళలో సమావేశమై, అందరూ కలసి దైవారాధన చేసుకోవాలనీ, ఒండొకరి మంచీచెబ్బరలను గురించి తెలుసుకోవాలని, సామూహిక నిర్ణయాలు గైకొనాలని ఇస్లాం అభిలషిస్తోంది.

ఈ హదీసు ద్వారా శుక్రవారం నమాజు యొక్క ప్రాముఖ్యత స్పష్టమవుతోంది. షరీయత్‌పరమైన తగు కారణమేదీ లేకుండా దీనిని విడనాడినవారి హృదయాలపై సీలుపడిపోతుందని, దైవధర్మంపట్ల వారిలో పూర్తిగా నిర్లక్ష్య వైఖరి పొడసూపుతుందని, ఎట్టకేలకు వారు కపటులుగా, మిథ్యావాదులుగా మారిపోయే అవకాశం ఉందనీ హదీసు భావం. కాబట్టి శుక్రవారం నమాజును సాధారణ నమాజుగా భావించి దానిపట్ల అశ్రద్ధ, ఉపేక్ష కనబరచరాదు. ఒకవేళ అలా చేస్తే అది దౌర్భాగ్యానికి, పరాభవానికి తొలిమెట్టు అవుతుంది.

(٣٥٥) وَعَنْ سَلَمَةَ بْنِ الْأَكْوَعِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصَلِّي مَعَ رَسُولِ اللهِ ﷺ الْجُمُعَةَ، ثُمَّ نَنْصَرِفُ وَلَيْسَ لِلْحِيْطَانِ ظِلٌّ نَسْتَظِلُّ بِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

355. హజ్రత్ సలమ బిన్ అక్వ (రజి) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి జుమా నమాజు చేసేవారము. జుమా నమాజు ముగిసిన తరువాత మేము ఇళ్లకు వెళ్ళేటప్పుడు గోడ ప్రక్కన నీడలో విశ్రాంతి తీసుకుందామంటే గోడల నీడ క్రింద కనబడేదికాదు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు బుఖారీలోనివి)

وَفِي لَفْظٍ لِّمُسْلِمٍ: كُنَّا نُجَمِّعُ مَعَهُ إِذَا زَالَتِ الشَّمْسُ، ثُمَّ نَرْجِعُ، نَتَتَبَّعُ الْفَيْءَ.

"ఆయన(స)తో కలసి జుమా నమాజు చేసేవారం. పొద్దు వాలగానే వాపసు అయ్యేవారం" అని ముస్లింలో ఉంది.

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) కాలంలో శుక్రవారం నమాజు చాలా తొందరగా చేసేవారన్న దానికి ఈ హదీసు మచ్చుతునక. అయితే పొద్దువాలక మునుపు మాత్రం నమాజ్ అయ్యేది కాదన్నది కూడా గమనార్హమే. దాదాపు శుక్రవారం నమాజ్ కూడా జుహ్ర్ వేళలోనే అవుతుంది. విద్వాంసులలో అత్యధికులు ఈ సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఇమామ్ అహ్మద్, ఇమామ్ రాహ్వై, ఇమామ్

మాలిక్ ప్రభృతులు మాత్రం పొద్దువాలక ముందు కూడా జుమా నమాజ్ చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

ఆధునిక కాలంలోనయితే కొన్నిచోట్ల ప్రజలు జుహ్ర్ నమాజ్ వేళకన్నా ఆలస్యంగా జుమా నమాజ్ చేస్తున్నారు. ఇది దైవప్రవక్త (స) విధానానికి వ్యతిరేకం. మస్జిద్ ఇమాములు, వక్తలు దీని గురించి సీరియస్‌గా ఆలోచించాలి.

## హదీసు ఉల్లేఖకులు

సలమ బిన్ అక్వ (రజి). మరోపేరు అబూ ముస్లిం. దైవప్రవక్త (స) ప్రియ సహచరులలో గొప్ప యోధునిగా భావించబడేవారు. పరుగులో గుఱ్ఱంకన్నా వేగం అని ప్రతీతి. దాతృ స్వభావం గలవారు. విద్యావంతులు. మూర్తీభవించిన మృదుత్వం. మదీనాలో హిజ్రీ 74లో కన్నుమూశారు.

(٣٥٦) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَا كُنَّا نَقِيْلُ وَلاَ نَتَغَدَّى إِلاَّ بَعْدَ الْجُمُعَةِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ. وَفِيْ رِوَايَةٍ: فِي عَهْدِ رَسُولِ اللهِ ﷺ.

356. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : "(శుక్రవారం నాడు) మేము మధ్యాహ్న భోజనం, మధ్యాహ్న విశ్రాంతి జుమా నమాజ్ అనంతరమే చేసే వారము." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

"దైవప్రవక్త (సఅసం) గారి కాలంలో ఇలా జరిగేది" అని వేరొక ఉల్లేఖనంలో వుంది.

## సారాంశం

ఈ హదీసు ద్వారా కూడా బోధపడేదేమంటే, దైవప్రవక్త (సఅసం) కాలంలో జుమా నమాజ్ తొందరగా ముగిసేది. ప్రవక్త సహచరులు నమాజ్ అనంతరం ఇళ్లకు వెళ్ళి భోజనం చేసి విశ్రమించేవారు.

## హదీసు ఉల్లేఖకులు

సహ్ల్ బిన్ సాద్ (రజి) అసలు పేరు. అబుల్ అబ్బాస్ మారుపేరు. ఖజ్రజీ సైదీ అన్సారీ. ఇస్లాంకు పూర్వం ఈయన పేరు హజన్. ఇస్లాం స్వీకరణ తరువాత దైవప్రవక్త (స) ఈయన పేరు మార్చారు. మనిషి పేరులో దోషం ఉంటే దాన్ని మార్చివేయాలని ఈ హదీసు చెబుతోంది. దైవప్రవక్త (సఅసం) మరణించే సమయానికి ఈయన వయస్సు 15 సంవత్సరాలు మాత్రమే. హిజ్రీ 91లో మదీనాలో మరణించారీయన. మదీనాలో అందరికన్నా ఆఖరిలో మరణించిన సహాబీ ఈయనే. ఈయనగారి చేత సుమారు 100 హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٣٥٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى

357. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَخْطُبُ قَائِماً، فَجَاءَتْ عِيرٌ مِنَ الشَّامِ، فَانْفَتَلَ النَّاسُ إِلَيْهَا، حَتَّى لَمْ يَبْقَ إِلاَّ اثْنَا عَشَرَ رَجُلاً. رَوَاهُ مُسْلِمٌ.

జుమా ప్రసంగం నిలబడి ఇస్తుండగా సిరియా నుండి ఒక వర్తక బిడారు వచ్చింది. ప్రజలు ఆ బిడారు వైపునకు ఎగబడ్డారు. కేవలం 12 మంది మాత్రమే మస్జిద్‌లో వుండిపోయారు. (ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) నిలబడి జుమా ప్రసంగం ఇచ్చేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమయింది. సాంప్రదాయిక పద్ధతి ఇదే. జుమా ప్రసంగం జుమా నమాజ్‌కు ముందే అవుతుంది. 12 మంది ఉన్నప్పటికీ జుమా ప్రసంగం ఇవ్వవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. షాఫయీలు 40 మంది ఉంటేనే జుమా ప్రసంగం ఇవ్వాలన్నారు. ఇది సరైనది కాదు.

(٣٥٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ أَدْرَكَ رَكْعَةً مِنْ صَلاَةِ الْجُمُعَةِ وَغَيْرِهَا فَلْيَضِفْ إِلَيْهَا أُخْرَى، وَقَدْ تَمَّتْ صَلاَتُهُ». رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَاللَّفْظُ لَهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ، لَكِنْ قَوَّى أَبُو حَاتِمٍ إِرْسَالَهُ.

358. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం-"ఎవరయితే జుమా నమాజు మరియు ఇతర నమాజులలో ఏదైనా ఒక రకతును (జమాఅత్‌లో) పొందారో, వారు మిగిలిన దానిని దాంతో కలుపు కోవాలి. (అలా కలుపు కుంటే)చాలు, అతని నమాజ్ పూర్తయినట్లే." (నసాయి, ఇబ్నె మాజ, దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం దారె ఖుత్నీకి చెందినవి. దీని ప్రమాణం సరైనది. అయితే అబూ హాతింగారు దీనిని 'ముర్సల్' అని గట్టిగా భావిస్తున్నారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే జుమా నమాజులో ఒక రకత్‌ను మాత్రమే పొందినవాడు, దాంతోపాటు రెండవ రకత్‌ను కూడా కలుపుకోవాలి. అంటే అతను సలాం చేయకుండా నిలబడి రెండవ రకత్ (నమాజ్) అప్పటికప్పుడే చేయాలి. ఆఖరిలో వచ్చి ఒక రకత్‌ను పొందినవాడు జుమా ప్రసంగాన్ని కోల్పోయినట్లే. కాని అతని జుమా మాత్రం నెరవేరుతుంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల అభిప్రాయం కూడా ఇదే.

(٣٥٩) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ

359. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి

اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَخْطُبُ قَائِماً، ثُمَّ يَجْلِسُ، ثُمَّ يَقُوْمُ فَيَخْطُبُ قَائِماً، فَمَنْ أَنْبَأَكَ أَنَّهُ كَانَ يَخْطُبُ جَالِساً فَقَدْ كَذَبَ. أَخْرَجَهُ مُسْلِمٌ.

వ సల్లం) నిలబడి శుక్రవారం ప్రసంగం చేసేవారు. మధ్యలో కొద్దిసేపు కూర్చునే వారు. మళ్ళీ నిలబడి ఉపన్యసించే వారు. ఆయన (సఅసం) కూర్చొని ఉపన్యసించేవారని ఎవరయినా మీకు సమాచారమందిస్తే అతడు అబద్ధం చెప్పాడు (అని భావించండి)." (ముస్లిం)

**సారాంశం**

జుమాలో రెండు ప్రసంగాలున్నాయి. రెండు ప్రసంగాలకు మధ్య కొద్దిసేపు విరామం అవసరం. ఆ విరామ సమయంలో కూర్చోవటం సంప్రదాయం (సున్నత్). రెండు ప్రసంగాలను కూడా ఆయన (స) నిలబడే చేసేవారు. షరీయత్ పరమయిన కారణమేదీ లేకుండా వీటికి విరుద్ధంగా చేస్తే - అది బిద్అత్ అవుతుంది.

ఇబ్నె అబీ షైబ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స), అబూబకర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), అలీ (రజి) - వీళ్లంతా నిలబడే జుమా ప్రసంగమిచ్చేవారు. ఆయన (సఅసం) వేదికనెక్కి, ముఖ్తదీల వైపునకు తిరిగి అస్సలాము అలైకుమ్ అని అనేవారని కొన్ని హదీసుల ద్వారా తెలుస్తున్నది.

(٣٦٠) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا خَطَبَ اَحْمَرَّتْ عَيْنَاهُ، وَعَلاَ صَوْتُهُ، وَاشْتَدَّ غَضَبُهُ، حَتَّى كَأَنَّهُ مُنْذِرُ جَيْشٍ يَقُوْلُ: «صَبَّحَكُمْ وَمَسَّاكُمْ»، وَيَقُوْلُ: «أَمَّا بَعْدُ، فَإِنَّ خَيْرَ الحَدِيثِ كِتَابُ اللهِ، وَخَيْرَ الهَدْيِ هَدْيُ مُحَمَّدٍ، وشَرَّ الأُمُورِ مُحْدَثَاتُهَا، وَكُلَّ بِدْعَةٍ ضَلاَلَةٌ». رَوَاهُ مُسْلِمٌ.

360. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రసంగిస్తున్నప్పుడు ఆయన కళ్లు ఎర్రబడిపోయేవి. గొంతు బిగ్గరయ్యేది. ఆవేశం పెరిగేది (ఆ పరిస్థితిని చూసినవారికి) "శత్రుసైన్యం పొద్దున వచ్చిందా? సాయంత్రం వచ్చిందా?" అ సైనికదళాన్ని నిలదీస్తున్నారా? అనిపించేది.

(ప్రసంగ సమయలో) ఆయన ఇలా అనేవారు : "స్తోత్రానంతరం ... అన్నిటి కన్నా ఉత్తమమయిన వాక్కు దైవ గ్రంథం. ఉత్తమమయిన విధానం ముహమ్మద్ (సఅసం) విధానం. ఆచరణలన్నింటిలోకీ చెడ్డది కొత్త పోకడ

(బిద్అత్). ప్రతి బిద్అత్‌తో కూడినపని మార్గభ్రష్టతకు, మార్గవిహీనతకు ప్రతీక. (ముస్లిం)

وَفِيْ رِوَايَةٍ لَهُ: كَانَتْ خُطْبَةُ النَّبِيِّ ﷺ يَوْمَ الْجُمُعَةِ: يَحْمَدُ اللَّهَ، وَيُثْنِيْ عَلَيْهِ، ثُمَّ يَقُولُ عَلَى إِثْرِ ذَلِكَ، وَقَدْ عَلاَ صَوْتُهُ.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది : జుమా రోజున దైవప్రవక్త (సఅసం) ఉపన్యాసం ఇలా సాగేది - (తొలుత) దైవస్తోత్రం చేసేవారు. తరువాత ప్రసంగించటం మొదలెట్టగానే ఆయన స్వరం పెరిగేది.

وَفِيْ رِوَايَةٍ لَّهُ: «مَنْ يَهْدِ اللَّهُ فَلاَ مُضِلَّ لَهُ، وَمَنْ يُضْلِلْ فَلاَ هَادِيَ لَهُ». وَلِلنَّسَائِيِّ: «وَكُلُّ ضَلاَلَةٍ فِي النَّارِ».

ముస్లింలోని మరో ఉల్లేఖనంలో వుంది- "అల్లాహ్ ఎవరికయితే సన్మార్గం చూపాడో వారినెవరూ అపమార్గం పట్టించలేరు. ఆయన ఎవరిని అపమార్గాన వదిలేశాడో వారిని సన్మార్గానికి తీసుకురాగలవారు కూడా ఎవరూ లేరు". "ప్రతి అపమార్గం నరకాగ్నిలోకి తీసుకుపోతుంది" అని నసాయిలో ఉంది.

**సారాంశం**

ఇదీ దైవప్రవక్త (సఅసం) నోట జాలువారే ప్రసంగం. శుక్రవారం నాడు ఉపన్యాసకుడు ఉపన్యసించేటప్పుడు పరిసరాల ప్రభావం, పరిస్థితుల స్వరూపం అతని మనో మస్తిష్కాలపై చెరగని ముద్రవేసి ఉంటుంది. ఒకవైపు శుభవార్తలు, మరో వైపు అవాంఛనీయ సంఘటనలు అతని మెదడును తొలుస్తూ ఉంటాయి. అనుచర సమాజాన్ని ఈ సంక్లిష్ట పరిస్థితుల నుండి గట్టెక్కించేదెలా? అని అతడు తీవ్రంగా ఆలోచిస్తుంటాడు. తత్కారణంగా అతని ముఖం ఎర్రగా కందిపోతుంది. ప్రేక్షకుల్ని ప్రభావితం చేయడానికి అతని ముఖ కవళికలు ఈ మాత్రం మారవలసిన ఆవశ్యకత కూడా ఎంతైనా ఉంది.

ప్రసంగంలో తొలుత దైవస్తోత్రం తప్పక చేయాలి. ప్రసంగం ఏలైనంత క్లుప్తంగా ఉండాలి. కాని అది ఎంతో సమగ్రంగా ఉండాలి. ప్రసంగం ద్వారా ప్రేక్షకుల్ని ప్రభావితం చేయాలేగాని, వారిని భయభ్రాంతులకు లోను చేయరాదు. నిరాశానిస్పృహల వాతావరణాన్ని సృజించరాదు. భావప్రకటనలో ఎలాంటి మొహమాటానికీ, అస్పష్టతకు తావుండరాదు. ప్రసంగం మరీ సుదీర్ఘంగా ఉండకూడదు. క్లుప్తమైన ప్రసంగాలే ప్రజలకు బాగా జ్ఞాపకముంటాయి. అవి వారి మనోఫలకాలపై ముద్ర వేసుకుంటాయి.

(٣٦١) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِنَّ طُولَ صَلاَةِ الرَّجُلِ وَقِصَرَ خُطْبَتِهِ مَئِنَّةٌ مِنْ فِقْهِهِ». رَوَاهُ مُسْلِمٌ.

361. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం : "మనిషి నమాజ్ సుదీర్ఘం మరియు ఉపన్యాసం సంక్షిప్తం అయి ఉండటం అతని విజ్ఞతకు ప్రతీక" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా నేను విన్నాను. (ముస్లిం)

### సారాంశం

సంక్షిప్త ప్రసంగం, సుదీర్ఘ నమాజ్ మనిషి బుద్ధి కౌశల్యానికి, విజ్ఞతా వివేచనలకు తార్కాణమని ఈ హదీసులో చెప్పబడింది. సాధారణంగా దైవప్రవక్త (స) శుక్రవారంనాడు క్లుప్తంగా ప్రసంగించేవారు. ఈ ప్రసంగాలు చాలా తేలిగ్గా కంఠస్థం కూడా అయ్యేవి. ఈ సంగతి నేటి మన వక్తలకు కనువిప్పు కావాలి. ఎందుకంటే వారి ఉపన్యాస వరద గోదారి దీనికి విరుద్ధంగా పరవళ్లు తొక్కుతున్నది. వారి ఉపన్యాసాలు సుదీర్ఘంగా ఉంటాయి, కాని నమాజ్ మాత్రం అతి క్లుప్తంగా ఉంటుంది. ఇది సున్నత్‌కు విరుద్ధం. ఈ ధోరణి సంస్కరించదగినది.

(٣٦٢) وَعَنْ أُمِّ هِشَامٍ بِنْتِ حَارِثَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: مَا أَخَذْتُ ﴿قٓ وَالْقُرْآنِ الْمَجِيدِ﴾ إِلاَّ عَنْ لِّسَانِ رَسُولِ اللهِ ﷺ، يَقْرَأُهَا كُلَّ جُمُعَةٍ عَلَى الْمِنْبَرِ إِذَا خَطَبَ النَّاسَ. رَوَاهُ مُسْلِمٌ.

362. హజ్రత్ ఉమ్మె హిషామ్ బిన్తె హారిస (ర.అన్‌హా) వివరించారు : "నేను సూరె 'ఖాఫ్'ను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నోట వినీ వినీ జ్ఞాపకం చేసుకున్నాను. ఆయన (స) ప్రతి శుక్రవారం వేదికపై నిలబడి - జుమా ప్రసంగంలో -ఈ సూరాను పారాయణం చేసేవారు." (ముస్లిం)

### సారాంశం

జుమా ప్రసంగంలో ప్రేక్షకులకు దివ్య ఖుర్‌ఆన్‌లోని వాక్యాలు వీలైనంత అధికంగా వినిపించటం, విడమరచి చెప్పటం ఎంతో అవసరమని ఈ హదీసు తాత్పర్యం. దైవప్రవక్త (సఅసం) సాధారణంగా జుమా ప్రసంగంలో ఖాఫ్ సూరాను పఠించేవారని కూడా ఈ హదీసు చెబుతోంది. కడకు ఉమ్మె హిషామ్ (ర.అన్‌హా) కు ప్రసంగం ద్వారానే సూరా పూర్తిగా కంఠస్థం అయిపోయింది. ఈ సూరాలో మరణ ప్రస్తావన ఉంది. ప్రళయదినం గురించి చెప్పబడింది. స్వర్గనరకాల ప్రస్తావన వచ్చింది. అందుకే ఆయన ఈ సూరాను పదే పదే పఠించి ప్రజలలో పరలోక చింతనను పెంపొందించి, తద్వారా వారిని కార్యోన్ముఖుల్ని చేయాలని తలపోసేవారు. జుమా ప్రసంగంలో అనవసర విషయాలు, కాకమ్మ కథలు చోటు చేసుకోరాదు. కవితలు, ఆశయ రహితమయిన మాటలు షరీయత్ స్వభావానికి విరుద్ధమైనవి. కనుక వీటిని జుమా ప్రసంగంలో విడనాడాలి.

(٣٦٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ تَكَلَّمَ يَوْمَ الْجُمُعَةِ: وَالْإِمَامُ يَخْطُبُ، فَهُوَ كَمَثَلِ الْحِمَارِ يَحْمِلُ أَسْفَاراً، وَالَّذِي يَقُولُ لَهُ: أَنْصِتْ، لَيْسَتْ لَهُ جُمُعَةٌ». رَوَاهُ أَحْمَدُ بِإِسْنَادٍ لاَ بَأْسَ بِهِ.

363. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "జుమా రోజున ఇమామ్ వేదికనెక్కి ప్రసంగిస్తుండగా ఏ వ్యక్తయితే మాట్లాడతాడో అతడు వీపుపై పుస్తకాలు మోస్తున్న గాడిద లాంటివాడు. అతన్ని ఉద్దేశ్యించి, 'నిశ్శబ్దంగా ఉండు' అని చెప్పిన వాని జుమా కూడా వృధా అయిపోయింది." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు)

وَهُوَ يُفَسِّرُ حَدِيْثَ أَبِي هُرَيْرَةَ فِي الصَّحِيْحَيْنِ مَرْفُوعاً: «إِذَا قُلْتَ لِصَاحِبِكَ: أَنْصِتْ، يَوْمَ الْجُمُعَةِ، وَالإِمَامُ يَخْطُبُ، فَقَدْ لَغَوْتَ».

ఈ హదీసు 'సహీహైన్'లో చెప్పబడిన హజ్రత్ అబూహురైర (రజి) హదీసుకు 'తప్సీలు' వంటిది. అందులో ఇలా అనబడింది - "ఇమామ్ జుమా ప్రసంగం చేస్తుండగా 'నిశ్శబ్దంగా ఉండు' అని నీవు నీ తోడున్న వానికి చెబితే, నీవు కూడా వ్యర్థమయిన మాటనే అన్నావు లేదా నీ జుమాను వృధా చేసుకున్నావు."

**సారాంశం**

శుక్రవారం ప్రసంగాన్ని ఎంతో నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో వినాలని, ఆ సమయంలో మనిషి ఆలోచనలకు అవరోధం కలిగించే అలజడి, గలాటా ఏదీ జరగరాదని హదీసు బోధిస్తున్నది. ఒకవేళ ఎవరయినా ఆ సమయంలో తెలియక మాట్లాడినా, ఏదైనా వెకిలిచేష్ట చేసినా అతని జోలికి పోనూరాదు. 'నోరు మూసుకో' అని చెప్పటం కూడా ఒక విధంగా ప్రశాంతతను భగ్నం చేయటమే అవుతుంది. ఆ సమయంలో ప్రేక్షకుల ధ్యాసంతా వక్త చెప్పేమాటలపై ఉండాలి. మనసును పూర్తిగా లగ్నం చేసి వింటేనే అది హృదయకవాటాలను తట్టగలుగుతుంది.

(٣٦٤) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: دَخَلَ رَجُلٌ يَوْمَ الْجُمُعَةِ، وَالنَّبِيُّ ﷺ يَخْطُبُ، فَقَالَ: «صَلَّيْتَ»؟ قَالَ: لاَ، قَالَ: «قُمْ فَصَلِّ رَكْعَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

364. హజ్రత్ జాబిర్ (రజి) ఇలా తెలిపారు : జుమా రోజున ఒక వ్యక్తి మస్జిదులో ప్రవేశించాడు. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) ప్రసంగిస్తున్నారు. వచ్చిన వ్యక్తి నుద్దేశ్యించి ఆయన (స), "నమాజ్ చేశావా?" అని దర్యాప్తు చేశారు. 'లేదు' అని అన్నాడా

వ్యక్తి. "మరయితే లే. రెండు రకతుల నమాజ్ చెయ్యి" అని ఆయన (సఅసం) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

జుమా ప్రసంగం జరుగుతుండగా రెండు రకతుల నమాజ్ చేయవచ్చునని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ప్రసంగ కర్త మటుకు అవసరం మేరకు మాట్లాడగలడనీ, మస్జిద్‌కు వచ్చే నమాజీలకు రెండు రకతులు నెరవేర్చమని చెప్పగలడని కూడా దీనిద్వారా స్పష్టమవుతున్నది. హనఫీలు ఈ రెండు రకతులకు అనుకూలంగా లేరు.

(٣٦٥) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَقْرَأُ فِي صَلاَةِ الْجُمُعَةِ سُوْرَةَ الْجُمُعَةِ وَالْمُنَافِقِيْنَ. رَوَاهُ مُسْلِمٌ.

365. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాధారణంగా శుక్రవారం నాడు నమాజులో సూరయె జుమా, సూరయె మునాఫిఖూన్ పఠించేవారు." (ముస్లిం)

وَلَهُ عَنِ النُّعْمَانِ بْنِ بَشِيْرٍ كَانَ يَقْرَأُ فِيْ الْعِيْدَيْنِ وَفِيْ الْجُمُعَةِ «بِسَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى» «وَهَلْ أَتَاكَ حَدِيْثُ الْغَاشِيَةِ».

ముస్లింలోనే నూమాన్ బిన్ బషీర్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా వుంది : "ఆయన (సఅసం) పండుగ నమాజులలోనూ, శుక్రవారం నమాజులోనూ 'సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా', 'హల్ అతాక హదీసుల్ ఘాషియ' సూరాలు పారాయణం చేసేవారు.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అర్థమయ్యేదేమిటంటే ఆయన (స) కొన్ని ప్రత్యేక నమాజులలో కొన్ని ప్రత్యేక సూరాలు పఠించేవారు. దైవప్రవక్త (స)ను అనుసరించే ఉద్దేశ్యంతో అయా నమాజులలో ఆ సూరాలనే మనం కూడా పారాయణం చేయటం ఉత్తమం. ఇతర సూరాలు పఠిస్తే నమాజ్ నెరవేరదని దీని భావం ఎంతమాత్రం కాదు. పైన పేర్కొనబడిన సూరాలు జుమా సందర్భంలో, పండుగ సందర్భాలలో పఠించటంలో ఎన్నో పరమార్థాలు దాగి ఉన్నాయి.

సూరయె జుమాలో జుమా నమాజు వైపునకు రావటం గురించి, దాని మహత్తు గురించి నొక్కి చెప్పబడింది. జుమా నమాజులో నికార్సయిన ముస్లింలతోపాటు, కపటులు, వంచకులు కూడా వస్తారు. వారికి హెచ్చరిక చేసే ఉద్దేశ్యంతో ఆయన (స) మునాఫిఖూన్ సూరా పఠించేవారు. అలాగే అల్ ఆలా, అల్ ఘాషియ సూరాలలో ప్రళయదినం గురించి, పరలోక సాఫల్యం గురించి

చెప్పబడింది. అందుచేత దైవప్రవక్త (సఅసం) నమాజీలకు పరలోకాన్ని పదే పదే జ్ఞాపకం చేయదలచి ఈ రెండు సూరాలను పారాయణం చేసేవారు.

జుమా సూరాలో అల్లాహ్ అంతిమ దైవప్రవక్త (సఅసం) ప్రభవింపజేయబడటంలోని 4 ముఖ్యోద్దేశాలను తెలియజేశాడు. ముస్లిం అనుచర సమాజానికి ముహమ్మద్ (సఅసం) ప్రవక్త చేసిన మహోపకారాన్ని కూడా గుర్తుచేశాడు. ఆ తర్వాత దైవధ్యానం వైపునకు మరలమని ప్రేరేపించాడు. అలాగే మునాఫిఖూన్ సూరాలో కాపట్యాన్ని ఖండించటంతోపాటు, దానధర్మాలను ప్రోత్సహించటం జరిగింది.

## హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు నూమాన్ బిన్ బషీర్ (రజి). మారుపేరు అబూ అబ్దుల్లాహ్. అన్సార్ వర్గానికి చెందినవారు. హిజ్రత్ తరువాత 14వ మాసంలో అన్సార్లలో జన్మించిన తొలి శిశువు ఈయనే. సిరియాలో స్థిరపడ్డారు. కూఫాకు గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత 'హిమ్స్' గవర్నర్‌గా కూడా నియమించబడ్డారు. హిజ్రి 64లో రాహిత్ దినాన ఖాలిద్ బిన్ ఖలి అల్ కిలాయి ఈయన్ని హత్యచేశాడు.

(٣٦٦) وَعَنْ زَيْدِ بْنِ أَرْقَمَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى النَّبِيُّ ﷺ الْعِيْدَ، ثُمَّ رَخَّصَ فِيْ الْجُمُعَةِ، فَقَالَ: «مَنْ شَآءَ أَنْ يُصَلِّيَ فَلْيُصَلِّ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

366. హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ చేశారు. జుమా నమాజ్ విషయంలో అనుమతి ఇచ్చారు - "చేయదలచిన వారు చేయండి" అని ఆయన (స) ఆ సందర్భంగా సెలవిచ్చారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమని నిర్ధారించారు)

## సారాంశం

ఒకే రోజు పండుగ మరియు శుక్రవారం వస్తే అట్టి పరిస్థితిలో ఆయన (స) పండుగ నమాజ్‌ను చేయించారు. జుమా నమాజ్‌ను చేయటం చేయకపోవటం గురించి ప్రజల ఇష్టాయిష్టాలకే వదలిపెట్టారు. అబూదావూద్‌లో హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా ప్రకటించారు - "ఈ రోజు రెండు పండుగల సమావేశం ఉంది. దీంతో సరిపెట్ట దలచుకున్నవారు సరిపెట్టుకోవచ్చు. అయితే మేము మాత్రం జుమా నమాజ్ తప్పక చేస్తాము."

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే శుక్రవారంనాడు పండుగ వస్తే పండుగ నమాజ్ తర్వాత జుమా నమాజ్ ఫర్జ్ (విధి) కాదు - జుహ్ర్ నమాజ్ చేస్తే సరిపోతుంది. అయితే హనఫీ పండితులు దీనికి అనుకూలంగా లేరు.

పండుగరోజు, శుక్రవారం - రెండూ కలిసివస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం పతనమవుతుందని జన సామాన్యంలో ఒక నమ్మకం ఉంది. ఇది గుడ్డి నమ్మకం తప్ప మరేమీ కాదు. పైగా ఆయన (స) దీనిని రెండు పండుగల దినంగా ఖరారు చేశారు.

(٣٦٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا صَلَّى أَحَدُكُمُ الجُمُعَةَ فَلْيُصَلِّ بَعْدَهَا أَرْبَعاً».

رَوَاهُ مُسْلِمٌ.

367. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "మీలో ఎవ రయినా జుమా నమాజ్ చేస్తే, ఆ తరువాత 4 రకతులు చదవండి."

(ముస్లిం)

## సారాంశం

శుక్రవారం నాడు సామూహిక నమాజ్ అనంతరం 4 రకతుల (సున్నత్) నమాజ్ చేయాలని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్, మరియు అధిక సంఖ్యాకులైన పండితుల అభిప్రాయం కూడా ఇదే. వేరొక ఉల్లేఖనంలో ఆయన (స) జుమా తరువాత రెండు రకతులు చేసేవారని ఉంది. దీని ఆధారంగా షేఖుల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియ (రహ్మ.లై) ఏమన్నారంటే; మస్జిద్‌లో రెండు రకతులు చదివి, ఇంటి దగ్గర 4 రకతులు చదవాలి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఆచరణ కూడా ఇలాగే ఉండేది. హనఫీ ఫికహ్ ననుసరించేవారు జుమా తరువాత 6 రకతులు చేయాలని అంటారు. కాని ప్రామాణికమైన ఏ హదీసు ద్వారా కూడా దీనికి ఆధారం లభించటం లేదు.

(٣٦٨) وَعَنِ السَّائِبِ بْنِ يَزِيْدَ أَنَّ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ لَهُ: إِذَا صَلَّيْتَ الْجُمُعَةَ فَلاَ تَصِلْهَا بِصَلاَةٍ حَتَّى تَتَكَلَّمَ أَوْ تَخْرُجَ، فَإِنَّ رَسُولَ اللهِ ﷺ أَمَرَنَا بِذَلِكَ: أَنْ لاَ نُوْصِلَ صَلاَةً بِصَلاَةٍ حَتَّى نَتَكَلَّمَ أَوْ نَخْرُجَ.

رَوَاهُ مُسْلِمٌ.

368. హజ్రత్ సాయిబ్ బిన్ యజీద్ (రజి) కథనం : హజ్రత్ ముఆవియా (రజి) ఇలా తెలిపారు - "నీవు జుమా నమాజ్ చేశాక ఇతరులెవరితోనయినా సంభాషించే వరకూ లేక స్థానమార్పిడి జరిగే వరకూ ఇతర నమాజును చేయకు. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) మాకు ఈ మేరకు ఆదేశించారు. మేము జుమా చేశాక పరస్పరం సంభాషించుకునే వరకూ లేదా అక్కడి నుండి బదిలీ అయ్యేవరకూ వేరితర నమాజు చేయ రాదు" అని ఆయన (స) అన్నారు.

(ముస్లిం)

### సారాంశం

జుమా చేసిన తరువాత ఇతర సున్నత్ లేక నఫిల్ నమాజులకై అదే స్థానంలో నిలబడరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ఈ ఆదేశం ఒక్క జుమా నమాజుకే పరిమితం కాకుండా ఇతర దినాలలో కూడా స్థానమార్పిడికై ప్రయత్నించాలి. ఆ విధంగా ఫర్జ్ నమాజ్‌కీ - నఫిల్ నమాజులకీ మధ్య గల వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. దైవప్రవక్త (స) సాధారణంగా నఫిల్, సున్నత్ నమాజులను ఇంట్లో నెరవేర్చేవారు. ఈ పద్ధతే ఉత్తమమైనది. దైవారాధన ఒకేచోట కాకుండా దేవుని భూమండలంపై అనేకచోట్ల జరగాలన్నదీ, దైవనామస్మరణ అన్ని మూలల్లో జరగాలన్నది ఈ ఆదేశంలో దాగివున్న మరో మర్మం కావచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

సాయబ్ బిన్ యజీద్ (రజి) గారి మరోపేరు అబూ యజీద్ అల్ కింది. హిజ్రీ శకం 2వ సంవత్సరంలో జన్మించారు. తండ్రితో కలసి అంతిమ హజ్ యాత్రలో పాల్గొన్నారు. హిజ్రీ 80లో మరణించారు.

(٣٦٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنِ اغْتَسَلَ، ثُمَّ أَتَى الْجُمُعَةَ، فَصَلَّى مَا قُدِّرَ لَهُ، ثُمَّ أَنْصَتَ حَتَّى يَفْرُغَ الْإِمَامُ مِنْ خُطْبَتِهِ، ثُمَّ يُصَلِّي مَعَهُ، غُفِرَ لَهُ مَا بَيْنَهُ وَبَيْنَ الْجُمُعَةِ الْأُخْرَى، وَفَضْلُ ثَلَاثَةِ أَيَّامٍ». رَوَاهُ مُسْلِمٌ.

369. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఎవరయితే స్నానం చేసి జుమా నమాజ్‌కు వస్తాడో, తన అదృష్టంలో వున్నంత నమాజ్ చేస్తాడో, మరి ఇమామ్ ఖుత్బా (ఉపన్యాసం) ఇచ్చేవరకూ నిశ్శబ్దంగా కూర్చుని ఉంటాడో, తరువాత ఇమామ్‌తో కలసి ఫర్జ్ (సామూహిక) నమాజు చేస్తాడో రెండు శుక్రవారాల మధ్య అతని వల్ల జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. మరో మూడు రోజుల పాపాలు అదనంగా కూడా మన్నించబడతాయి."

(ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో శుక్రవారం నాటి నమాజు మహత్మ్యం చాటబడింది. స్నానం చేసి ఇమామ్‌కన్నా ముందే మస్జిద్‌లోకి వచ్చి దైవధ్యానంలో నిమగ్నమవటం మంచిది. మస్జిద్‌లో కూర్చున్నంతసేపూ ప్రశాంతంగా కూర్చోవాలి. ఇమామ్ చేసే ప్రసంగాన్ని శ్రద్ధగా వినాలి. సామూహిక నమాజ్‌ను శ్రద్ధాభక్తులతో చేయాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని జుమా నమాజు చేసిన వ్యక్తి యొక్క అపరాధాలు - రెండు శుక్రవారాల మధ్య అతని వల్ల జరిగిన చిన్న చిన్న తప్పులు - మన్నించబడతాయి.

(٣٧٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ ذَكَرَ يَوْمَ الْجُمُعَةِ، فَقَالَ: «**فِيهِ سَاعَةٌ لاَ يُوَافِقُهَا عَبْدٌ مُسْلِمٌ، وَهُوَ قَائِمٌ يُصَلِّي يَسْأَلُ اللَّهَ عَزَّ وَجَلَّ شَيْئاً، إِلاَّ أَعْطَاهُ إِيَّاهُ**». وَأَشَارَ بِيَدِهِ يُقَلِّلُهَا. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: «**وَهِيَ سَاعَةٌ خَفِيفَةٌ**».

370. ఈ హదీసు కూడా హజ్రత్ అబూ హురైర (రజి) గారి చేతనే ఉల్లేఖించ బడింది - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక రోజు జుమా నమాజ్ గురించి ప్రస్తావిస్తూ, 'అందులో ఒక ఘడియ వుంది. ఆ ఘడియలో ఏ ముస్లిం దాసుడు అయినా నమాజ్ చేసి దైవాన్ని ఏదయినా వేడుకుంటే దేవుడు తప్పక దాన్ని అతనికి ప్రసాదిస్తాడు' అని అన్నారు. ఆ ఘడియ చాలా కొద్దిసేపే అయివుంటుందని ఆయన (స) తన చేత్తో సైగ చేశారు. (బుఖారీ, ముస్లిం)

'ఆ సమయం చాలా చిన్నది' అని ముస్లింలోని ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

శుక్రవారం నమాజ్ సందర్భంగా ఉన్న ఆ అత్యంత విలువైన, కారుణ్య ప్రదమయిన ఘడియలో దాసుని దుఆ స్వీకారయోగ్యమవుతుంది. ఆ ఘడియ ఏ దశలో వుంది? అనేది దైవప్రవక్త (స) చెప్పలేదు. 'లైలతుల్ ఖద్ర్' మాదిరిగా ఈ శుభ ఘడియ కూడా గోప్యంగా ఉంచబడింది. దాని అన్వేషణలో దాసులు వీలైనంత ఎక్కువ సమయం మస్జిద్‌లో - దైవధ్యానంలో- గడపాలన్నది దీని ఉద్దేశ్యమై ఉండవచ్చు.

(٣٧١) وَعَنْ أَبِي بُرْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ أَبِيهِ، قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «**هِيَ مَا بَيْنَ أَنْ يَجْلِسَ الإِمَامُ إِلَى أَنْ تُقْضَى الصَّلاَةُ**». رَوَاهُ مُسْلِمٌ، وَرَجَّحَ الدَّارَقُطْنِيُّ أَنَّهُ مِنْ قَوْلِ أَبِي بُرْدَةَ.

371. హజ్రత్ అబూ బుర్దా (రజి) తన తండ్రి ఆధారంగా వివరించారు: ఆయన తండ్రి ఇలా వివరించారు : "దైవప్రవక్త (స) ఈ విధంగా చెప్పగా నేను విన్నాను- 'ఆ (శుభ) ఘడియ ఇమామ్ వేదికపై కూర్చున్న క్షణం నుంచీ సామూహిక నమాజ్ ముగిసే వరకూ ఎప్పుడన్నా ఆసన్నం కావచ్చు" (ముస్లిం). ఈ పలుకులు అబూ బుర్దా (రజి) గారివే అయి ఉండవచ్చునని దారె ఖుత్నీ అభిప్రాయపడ్డారు.

وَفِيْ حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ سَلاَمٍ عِنْدَ ابْنِ مَاجَهْ، وَجَابِرٍ عِنْدَ أَبِيْ دَاوُدَ وَالنَّسَائِيِّ: أَنَّهَا مَا بَيْنَ صَلاَةِ الْعَصْرِ إِلَى غُرُوبِ الشَّمْسِ.

అబ్దుల్లా బిన్ సలాం (రజి) నుండి ఇబ్నె మాజా గారు, జాబిర్ (రజి) నుండి అబూ దావూద్, నసాయి నకలు చేసిన ఉల్లేఖనం ఈ విధంగా ఉంది - "ఆ ఘడియ అస్ర్ నమాజ్ నుండి సూర్యాస్తమయం వరకూగల మధ్య సమయంలో ఉంది.

وَقَدِ اخْتُلِفَ فِيْهَا عَلَى أَكْثَرَ مِنْ أَرْبَعِيْنَ قَوْلاً أَمْلَيْتُهَا فِي شَرْحِ الْبُخَارِيِّ.

ఈ నేపథ్యంలో అనేకమంది ఉలమాల 40 వ్యాఖ్యలు ఉన్నాయి. వాటన్నింటినీ నేను 'ఫత్‌హుల్ బారీ' బుఖారీ వ్యాఖ్యానంలో పొందుపరచాను.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబూబుర్దా (రహ్మతుల్లై) గారి అసలు పేరు ఆమిర్ బిన్ అబీ మూసా అష్‌అరీ, ప్రఖ్యాత తాబయీన్లలో ఒకరు. ఈయన తన తండ్రి గారినుండీ, హజ్రత్ అలీ (రజి) గారినుండీ, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) నుండీ ఈ హదీసు విన్నారు. 80పై చిలుకు వయస్సులో - హిజ్రీ 104 లో - కన్నుమూశారు.

(2) అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) : ఈయనగారి మారుపేరు అబూ యూసుఫ్. యూద పండితులలో ఎన్నదగినవారు. హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) వంశస్థులు. బనూ ఖైనుఖాతో ఈయనగారికి సంబంధం ఉండేది. దైవప్రవక్త (సఅసం) మదీనాకు ఏతెంచినపుడే ఇస్లాం స్వీకరించారు. ప్రపంచంలో ఉండగానే స్వర్గలోక శుభవార్త పొందిన భాగ్యవంతులలో ఈయన ఒకరు. మదీనా మునవ్వరాలో హిజ్రీ 43లో మరణించి స్వర్గంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

(٣٧٢) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: مَضَتِ السُّنَّةُ أَنَّ فِي كُلِّ أَرْبَعِيْنَ فَصَاعِداً جُمُعَةً. رَوَاهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

372. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "నలభై లేక అంతకు మించిన సంఖ్య ఉంటేనే జుమా ఏర్పాటు చేసుకోవటం సంప్రదాయంగా వస్తోంది." (దారె ఖుత్నీ దీనిని అత్యంత బలహీనమైన ఆధారంతో ఉల్లేఖించారు)

## సారాంశం

జుమా నమాజ్ కొరకు నమాజీల సంఖ్య 'ఇంత ఉండాలి' అని సహీహ్ హదీసులలో ఎక్కడా ప్రస్తావన రాలేదు. అందుచేత ఈ విషయమై ధర్మవేత్తల మధ్య వివిధ అభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ కనీస సంఖ్య 4 అని కొందరు, 7 అని మరికొందరు, 9 లేక 12 అని ఇంకొందరు, 20 అనీ, 40 అనీ, 50 అనీ - ఇలా రకరకాలుగా అంచనా వేశారు. వీరిలో ఏ ఒక్కరూ సహీహ్ హదీసు

ఆధారంగా వ్యాఖ్యానించలేదు. ఇద్దరు వ్యక్తులున్నా జమాఅత్‌తో నమాజ్ చేయాల్సిందేనని దైవప్రవక్త (స) ఆదేశించారు. ప్రయాణంలో ఇద్దరు వ్యక్తులున్నప్పుడు వారిలో ఒకరు అజాన్ ఇవ్వాలి. ధర్మజ్ఞానం ఎక్కువగా ఉన్న వ్యక్తి ఇమామత్ చేయాలి. ఇమామ్ షాఫయి దృష్టిలో జుమా నమాజుకై 40 మంది హాజరవ్వాలి. ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయం ప్రకారం ఇమామ్‌గాక మరో ఇద్దరు వ్యక్తులున్నా చాలు - జుమా నమాజ్‌ను స్థాపించవచ్చు. అయితే జుమా నమాజ్ కోసం అది పెద్ద గ్రామం అయి ఉండాలని ఆయన షరతు విధించారు. కాని ఇస్లాంలో తొట్టతొలి జుమా నమాజు 'జవాసీ' బస్తీలో నెలకొల్పబడింది. మరి అది పెద్ద గ్రామమో లేక పట్టణమో కానేకాదు.

(٣٧٣) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَسْتَغْفِرُ لِلْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنَاتِ فِيْ كُلِّ جُمُعَةٍ. رَوَاهُ الْبَزَّارُ بِإِسْنَادٍ لَيِّنٍ.

373. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి శుక్రవారం విశ్వాసులైన పురుషుల, స్త్రీల మన్నింపుకై ప్రార్థించే వారు." (బజ్జార్ దీనిని బలహీనమైన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

శుక్రవారం నమాజ్ సందర్భంగా ప్రసంగకర్త తన కోసం, విశ్వాసులైన స్త్రీ పురుషులందరి మన్నింపు కోసం ప్రార్థించటం సమంజసమే. అయితే ఈ హదీసు అందజేసిన పరంపరలో లోపం ఏర్పడింది. ఈ పరంపరలో యూసుఫ్ బిన్ ఖాలిద్ అనే వ్యక్తిపై హదీసువేత్తలకు సదభిప్రాయం లేదు.

(٣٧٤) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ فِي الْخُطْبَةِ يَقْرَأُ آيَاتٍ مِّنَ الْقُرْآنِ، يُذَكِّرُ النَّاسَ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ.

374. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని వచనాలు జుమా ప్రసంగం సందర్భంగా పారాయణం చేసి ప్రజలకు హితబోధ చేసేవారు." (అబూదావూద్ - దీని మూలం ముస్లింలో ఉంది)

**సారాంశం**

జుమా ప్రసంగంలో దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయతులను ఉదాహరించటం 'సున్నత్' అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఈ ఆయత్‌ల ద్వారా ఉపన్యాసకుడు ప్రజలలో ధార్మిక చింతన కలిగించాలి. పరలోక భీతిని, దైవభీతిని రేకెత్తించి తద్వారా వారి జీవితాలలో నైతిక విప్లవం తీసుకురావటానికి కృషిచేయాలి. ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా జరిగినంత సంస్కరణ మరో సాధనం ద్వారా జరగదన్నది తిరుగులేని సత్యం. ఈ సందర్భంగా కట్టుకథలను, స్వీయకల్పిత విషయాలను జొప్పించే ప్రయత్నం చేయరాదు.

(٣٧٥) وَعَنْ طَارِقِ بْنِ شِهَابٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **«الجُمُعَةُ حَقٌّ وَاجِبٌ عَلَى كُلِّ مُسْلِمٍ فِي جَمَاعَةٍ، إِلاَّ عَلَى أَرْبَعَةٍ: مَمْلُوكٌ، وَامْرَأَةٌ وصبيٌّ ومَرِيضٌ»** رواه أبو داود وقال: لَمْ يَسْمَعْ طَارِقٌ مِّنَ النَّبِيِّ ﷺ، وَأَخْرَجَهُ الْحَاكِمُ مِنْ رِوَايَةِ طَارِقٍ الْمَذْكُورِ عَنْ أَبِي مُوْسَى.

375. హాజ్రత్ తారిఖ్ బిన్ షిహాబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "జుమా నమాజును సామూహికంగా నెరవేర్చటం ప్రతి ముస్లింకు తప్పనిసరి. అయితే నాలుగు రకాల వారికి దీని నుండి మినహాయింపు ఉంది - బానిస, స్త్రీ, పసిపిల్లలు, వ్యాధిగ్రస్తుడు." (అబూ దావూద్ దీనిని ఉల్లేఖించారు - తారిఖ్ నేరుగా దైవప్రవక్త (సఅసం) నుండి ఈ హదీసు వినలేదని కూడా ఆయన పేర్కొన్నారు - తారిఖ్ గారి ఈ ఉల్లేఖనాన్ని హాకిమ్ గారు అబూ మూసా సౌజన్యంతో ప్రస్తావించారు)

### సారాంశం

బానిసలు, స్త్రీలు, చిన్న పిల్లలు, రోగగ్రస్తులు - వీళ్లపై జుమా నమాజ్ ఫర్జ్ (విధి) కాదు. ఒకవేళ వారు జుమా నమాజ్‌లో పాల్గొంటే జుహ్ర్ నమాజ్ చేయనవసరం లేదు. జుమాకు రాకపోతే మాత్రం జుహ్ర్ నమాజ్ చేసుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

తారిఖ్ బిన్ షిహాబ్ (రజి). ఈయన 'కూఫా' వాస్తవ్యులు. బజలీ తెగకు చెందినవారు. అందుకే కూఫీగా, బజలీగా పిలువబడ్డారు. దైవప్రవక్త (సఅసం) ను చూచారు. కాని ఆయన (స) ద్వారా ఏమీ వినలేదు. హాజ్రత్ అబూబకర్, హాజ్రత్ ఉమర్‌ల పరిపాలనా కాలంలో 33 లేక 34 యుద్ధాలలో పాల్గొన్నారు. హిజ్రీ 82లో మరణించారు.

(٣٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لَيْسَ عَلَى مُسَافِرٍ جُمُعَةٌ»**. رَوَاهُ الطَّبَرَانِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

376. హాజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "ఏ ప్రయాణీకునిపై కూడా జుమా నమాజ్ (విధిగా చేయబడ)లేదు" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు. (తబ్రానీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ప్రయాణీకునిపై కూడా జుమా నమాజ్ బాధ్యత లేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఈ హదీసు జయీఫ్ అన్నది వాస్తవమే అయినప్పటికీ హజ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్త (సఅసం) జుమా నమాజ్ చేయలేదన్న సంగతి గమనార్హం.

(٣٧٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا اسْتَوَى عَلَى الْمِنْبَرِ، اسْتَقْبَلْنَاهُ بِوُجُوهِنَا. رَوَاهُ التِّرْمِذِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ. وَلَهُ شَاهِدٌ مِنْ حَدِيثِ الْبَرَاءِ عِنْدَ ابْنِ خُزَيْمَةَ.

377. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వేదికనెక్కి నిలబడగానే మేము మా ముఖాలను ఆయన (స) వైపునకు కేంద్రీకరించేవాళ్ళము. (తిర్మిజీ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు. దీని సాక్ష్యం ఇబ్నె ఖుజైమలో పొందుపరచబడి ఉంది.)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ప్రేక్షకులు జుమా ప్రసంగం సందర్భంగా తమ ముఖాలను 'ఖతీబ్' వైపునకు త్రిప్పుకోవాలి. ఈ విషయంలో భేదాభిప్రాయం లేదు. పైగా దీనిపై అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది.

(٣٧٨) وَعَنِ الْحَكَمِ بْنِ حَزْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْنَا الْجُمُعَةَ مَعَ النَّبِيِّ ﷺ، فَقَامَ مُتَوَكِّئاً عَلَى عَصاً أَوْ قَوْسٍ. رَوَاهُ أَبُو دَاوُدَ.

378. హజ్రత్ హకమ్ బిన్ హజ్న్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి జుమాలో పాల్గొన్నాము. ఆయన (స) లాఠీ లేక ఊతకర్ర సాయంతో (ప్రసంగించడానికి) నిలబడ్డారు." (అబూదావూద్)

**సారాంశం**

ఈ హదీసు దృష్ట్యా ప్రసంగకర్త ప్రసంగ సమయంలో ఏదైనా వస్తువును ఊతగా తీసుకుని నిలబడవచ్చు. పైగా ఇది 'ముస్తహబ్' కూడా. ఇది ప్రసంగీకునికి ఆధారంగా ఉంటుంది. చేతులు అనవసరంగా అటూ ఇటూ తిరగకుండా అదుపులో ఉంటాయి. ప్రసంగ సమయంలో మనిషి అలసిపోడు.

## హదీసు ఉల్లేఖకులు

పూర్తిపేరు హకమ్ బిన్ హజ్న్ బిన్ అబూ వహ్బ్ మఖ్ఖామి (రజి). మక్కా విజయం సందర్భంగా ఈయన ఇస్లాం స్వీకరించారు. ఈ హదీసును బట్టి ఈయన దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో జుమా నమాజ్ చేశారని అర్థమవుతోంది.

13వ అధ్యాయం

## భయస్థితిలో నమాజ్ (సలాతుల్ ఖౌఫ్)

## ١٣ - بَابُ صَلاَةِ الْخَوْفِ

379. హజ్రత్ సాలిహ్ బిన్ ఖవ్వాత్ (రజి), 'జాతుర్రిఖా' యుద్ధం జరిగిన నాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి 'సలాతుల్ ఖౌఫ్' (భీతావహ స్థితిలో నమాజ్) చేసిన వ్యక్తి ఆధారంగా ఉటంకించారు - ఆ వ్యక్తి ఇలా వివరించాడు - ఒక బృందం ఆయన (సఅసం)తో కలసి నమాజ్ కోసం వరుసతీరి నిలబడింది. రెండవ బృందం శత్రువును ప్రతిఘటించటానికి ఎదురుగా నిలబడింది. తన వెనుక, వరుస తీరి నిలబడిన వారికి ఆయన (సఅసం) ఒక రకత్ నమాజ్ చేయించి, ఆయన (స) తిన్నగా నిలబడ్డారు. వెనుక నున్నవారు మిగిలిన నమాజును తమ తమ తరపున పూర్తి చేసుకుని వెళ్ళి పోయారు. వెళ్ళి శత్రువును నిలువరించ డానికి నిలబడిపోయారు. అప్పుడు రెండవ బృందం వచ్చింది. ఈ బృందా నికి ఆయన (స) రెండవ రకతును చేయించి కూర్చున్నారు. కాగా; వెనుక నున్న వారు తమ తరపున మిగిలిన నమాజును పూర్తిచేసుకున్నారు. తరువాత ఆయన (సఅసం) వారితో కలసి 'సలాం' చేశారు. (బుఖారీ, ముస్లిం -కాని హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి. 'సాలిహ్ బిన్ ఖవ్వాత్ తన తండ్రినుంచి ఉల్లేఖించార'ని ఇబ్నె ముంద యొక్క 'అల్ మారిఫ'లో ఉంది)

(٣٧٩) عَنْ صَالِحِ بْنِ خَوَّاتٍ رَضِيَ اللَّهُ عَنْهُ عَمَّنْ صَلَّى مَعَ النَّبِيِّ ﷺ يَوْمَ ذَاتِ الرِّقَاعِ صَلاَةَ الْخَوْفِ: أَنَّ طَائِفَةً صَفَّتْ مَعَهُ، وَطَائِفَةً وِجَاهَ الْعَدُوِّ، فَصَلَّى بِالَّذِيْنَ مَعَهُ رَكْعَةً، ثُمَّ ثَبَتَ قَائِماً، وَأَتَمُّوا لِأَنْفُسِهِمْ، ثُمَّ انْصَرَفُوْا، فَصَفُّوا وِجَاهَ الْعَدُوِّ، وَجَاءَتِ الطَّائِفَةُ الْأُخرَى، فَصَلَّى بِهِمُ الرَّكْعَةَ الَّتِيْ بَقِيَتْ، ثُمَّ ثَبَتَ جَالِساً، وَأَتَمُّوا لِأَنْفُسِهِمْ، ثُمَّ سَلَّمَ بِهِمْ. مُتَّفَقٌ عَلَيْهِ. وَهَذَا لَفْظُ مُسْلِمٍ. وَوَقَعَ فِيْ الْمَعْرِفَةِ لِابْنِ مَنْدَه: عَنْ صَالِحِ بْنِ خَوَّاتٍ، عَنْ أَبِيْهِ.

## సారాంశం

'సలాతుల్ ఖౌఫ్' పలురకాలుగా చేయబడింది. అది ఆయా సమయ సందర్భాలనుబట్టి ఉంటుంది. ఈ హదీసులో పేర్కొనబడిన స్థితి దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన సంఘటనే. అంటే ఇమామ్ ప్రతి జట్టుకూ ఒక్కో రకత్ చొప్పున చేయించగా మిగిలిన ఒక రకత్‌ను సహాబీలు తమ తరపున నెరవేర్చుకున్నారు. ఆ విధంగా రెండు గ్రూపులకు కూడా జమాఅత్ (సామూహిక నమాజ్) లభించింది. మొదటి బృందం తమ తరపున సలాం చేసుకోగా, రెండవ బృందం దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో సలాం చేసింది.

ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ మరియు అధిక సంఖ్యాక ధర్మవేత్తల దృష్టిలో - భయానక స్థితిలో - సలాతుల్ ఖౌఫ్‌ను ప్రయాణంలో వున్నా లేకపోయినా కూడా చేయవచ్చు. ఇమామ్ మాలిక్ మాత్రం 'సలాతుల్ ఖౌఫ్' ప్రయాణావస్థలో ఉన్నప్పుడే చేయాలని షరతు పెట్టారు.

## హదీసు ఉల్లేఖకులు

(1) సాలిహ్ బిన్ ఖవ్వాత్ : పూర్తి పరంపర ఇలా వుంది - సాలిహ్ బిన్ ఖవ్వాత్ బిన్ జుబైర్ బిన్ నూమాన్ అన్సారీ మదనీ. ప్రఖ్యాత తాబయీన్లలో ఒకరు. అనేకమంది ప్రవక్త సహచరుల నోట ఈయన హదీసులు విన్నారు. ఈ హదీసును ఈయన హజ్రత్ సహ్ల్ బిన్ హస్మ (రజి) గారి ద్వారా విన్నారు లేదా తన తండ్రి (ఖవ్వాత్ - రజి) ద్వారా విన్నారు. హదీసు చివరిలో కూడా ఈ విషయం చెప్పబడింది.

(2) ఖవ్వాత్ (రజి) : ప్రముఖ సహాబీ. ఉహుద్ సంగ్రామంలో తొలిసారిగా పాల్గొన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం బద్ర్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. హిజ్రీ 40లో మదీనాలో మరణించారనీ, హిజ్రీ 40 తరువాత మరణించారనీ రెండు వేర్వేరు అభిప్రాయాలున్నాయి. అప్పటికి ఈయన వయస్సు 70 లేక 71.

(٣٨٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: غَزَوْتُ مَعَ رَسُولِ اللّٰهِ ﷺ قِبَلَ نَجْدٍ فَوَازَيْنَا الْعَدُوَّ، فَصَافَفْنَاهُمْ، فَقَامَ رَسُولُ اللّٰهِ ﷺ، فَصَلَّى بِنَا، فَقَامَتْ طَائِفَةٌ مَّعَهُ، وَأَقْبَلَتْ طَائِفَةٌ عَلَى الْعَدُوِّ. وَرَكَعَ بِمَنْ مَّعَهُ، وَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ انْصَرَفُوا مَكَانَ الطَّائِفَةِ الَّتِيْ لَمْ تُصَلِّ، فَجَاءُوْا، فَرَكَعَ بِهِمْ رَكْعَةً، وَسَجَدَ سَجْدَتَيْنِ، ثُمَّ سَلَّمَ فَقَامَ كُلُّ

380. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి 'నజ్ద్' వైపునకు ఏదో యుద్ధానికి వెళ్లాను. మేము శత్రు సేనకు ఎదురుగా నిలబడి ఉన్నాము. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) నిలబడి మాకు నమాజ్ చేయించారు. ఒక జట్టు ఆయన (స) వెనుక నమాజ్ చేయడానికై నిలబడింది. మరో జట్టు శత్రుసేనకు దీటుగా పంక్తులు తీరి నిలబడింది. దైవప్రవక్త (స)తో కలసి నమాజ్ చేస్తున్న (తొలి)జట్టు ఒక రుకూ,

وَاحِدٍ مِّنْهُمْ، فَرَكَعَ لِنَفْسِهِ رَكْعَةً وَسَجَدَ سَجْدَتَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

రెండు సజ్దాలు చేసి తిరిగివచ్చింది. అప్పటి వరకూ నమాజ్‌లో పాల్గొనని (రెండవ) జట్టు సభ్యులు వచ్చిచేరగా ఆయన (స) వారికి కూడా ఒక రుకూ, రెండు సజ్దాలు చేయించారు. తరువాత ఆయన (స) సలాం చేశారు. అయితే రెండు బృందాల వారు కూడా (తరువాత) వేర్వేరుగా తమ (అసంపూర్ణ) నమాజును పరిపూర్తి గావించుకున్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కథనం ప్రకారం 'సలాతుల్ ఖౌఫ్'కు సంబంధించి ఆరు లేక ఏడు సహీహ్ హదీసులు ఉన్నాయి. ఈ హదీసుల కనుగుణంగా ఎలా చేసినా ఈ నమాజ్ నెరవేరుతుంది. దీనికి ఒక పద్ధతి అంటూ ప్రత్యేకంగా నిర్ధారితం కాలేదు. పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని - తదనుగుణంగా - ఈ నమాజ్‌ను నెరవేర్చవచ్చు. ఈ నమాజ్ దైవప్రవక్త (సఅసం) నెలకొల్పినదన్న విషయంలో కూడా భేదాభిప్రాయం లేదు.

అల్లామా షౌకానీ (రహ్మ.లై) కూడా ఈ నమాజుకు సంబంధించి ఆరు పద్ధతులను విశదీకరించారు.

(٣٨١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ مَعَ رَسُولِ اللهِ ﷺ صَلاَةَ الْخَوْفِ، فَصَفَفْنَا صَفَّيْنِ، صَفٌّ خَلْفَ رَسُولِ اللهِ ﷺ، وَالعَدُوُّ بَيْنَنَا وَبَيْنَ الْقِبْلَةِ، فَكَبَّرَ النَّبِيُّ ﷺ، وَكَبَّرْنَا جَمِيعاً، ثُمَّ رَكَعَ، وَرَكَعْنَا جَمِيعاً، ثُمَّ رَفَعَ رَأْسَهُ مِنَ الرُّكُوعِ، وَرَفَعْنَا جَمِيعاً، ثُمَّ انْحَدَرَ بِالسُّجُودِ، وَالصَّفُّ الَّذِي يَلِيْهِ، وَقَامَ الصَّفُّ الْمُؤَخَّرُ فِي نَحْرِ الْعَدُوِّ، فَلَمَّا قَضَى السُّجُودَ قَامَ الصَّفُّ الَّذِيْ يَلِيْهِ، فَذَكَرَ الْحَدِيْثَ.

381. హజ్రత్ జాబిర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి 'నమాజె ఖౌఫ్' చేశాను. మేము రెండు పంక్తులు చేశాము. ఒక పంక్తి దైవప్రవక్త (సఅసం) వెనుక నిలబడింది. ఆ సమయంలో శత్రుసైన్యం మాకు - ఖిబ్లా దిశకు మధ్యన ఉంది. దైవప్రవక్త (సఅసం) అల్లాహు అక్బర్ అని పలుకగా మేమంతా అల్లాహు అక్బర్ అన్నాము. ఆయన రుకూ చేయగా మేమందరం రుకూ చేశాము. మరి ఆయన (స) రుకూ నుండి తలపైకెత్తగా మేమంతా తలలు పైకెత్తాము. ఆయన (స) సజ్దాలోకి వెళ్ళగా మొదటి పంక్తిలోని వారంతా

సజ్దాలోకి వెళ్ళారు. అయితే రెండవ పంక్తిలోని వారు మాత్రం - శత్రువును ఎదుర్కొనడానికి - నిలబడే వున్నారు. ఆయన (స) సజ్దాలు చేసిన పిదప ఆయన సమీప పంక్తిలో నున్నవారు నిలబడి పోయారు ... ఉల్లేఖకుడు ఈ విధంగా పూర్తి హదీసు వివరించారు....

وَفِيْ رِوَايَةٍ؛ ثُمَّ سَجَدَ، وَسَجَدَ مَعَهُ الصَّفُّ الْأَوَّلُ، فَلَمَّا قَامُوْا سَجَدَ الصَّفُّ الثَّانِيْ، ثُمَّ تَأَخَّرَ الصَّفُّ الْأَوَّلُ، وَتَقَدَّمَ الصَّفُّ الثَّانِيْ، وَذَكَرَ مِثْلَهُ، وَفِيْ آخِرِهِ: ثُمَّ سَلَّمَ النَّبِيُّ ﷺ، وَسَلَّمْنَا جَمِيْعاً. رَوَاهُ مُسْلِمٌ. وَلِأَبِيْ دَاوُدَ عَنْ أَبِي عَيَّاشٍ الزُّرَقِيِّ مِثْلُهُ، وَزَادَ: إِنَّهَا كَانَتْ بِعُسْفَانَ.

ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - ఆయన (స) సజ్దా చేయగా ఆయన (స)తో పాటు మొదటి పంక్తివారు కూడా సజ్దా చేశారు. మరి వీరంతా లేచి నిలబడగా, రెండవ పంక్తిలోనివారు సజ్దాలోకి వెళ్ళారు. తరువాత మొదటి పంక్తి వెనక్కి వెళ్ళిపోగా, వెనుక పంక్తి ముందుకు వచ్చింది. మునుపటి వలెనే ఇది దైవధ్యానం చేసింది. చివర్లో దైవప్రవక్త (సఅసం) సలాం చేయగా మేమంతా సలాం చేశాము. (ముస్లిం)

అబూ అయ్యాష్ జురఖీ నుండి అబూ దావూద్ నకలు చేసిన దానిలో - "అది ఉస్ఫాన్ అనే స్థలంలో నెరవేర్చబడింది" అన్న వాక్యం అదనంగా ఉంది.

وَلِلنَّسَائِيِّ مِنْ وَجْهٍ آخَرَ عَنْ جَابِرٍ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى بِطَائِفَةٍ مِّنْ أَصْحَابِهِ رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ، ثُمَّ صَلَّى بِآخَرِيْنَ أَيْضاً رَكْعَتَيْنِ، ثُمَّ سَلَّمَ. وَمِثْلُهُ لِأَبِيْ دَاوُدَ عَنْ أَبِيْ بَكْرَةَ.

నసాయి హజ్రత్ జాబిర్ (రజి) నుండి వేరొక ఆధారంతో ఇలా ఉల్లేఖించారు- దైవప్రవక్త (సఅసం) తన సహచరుల లోని ఒక వర్గానికి రెండు రకతులు చేయించి సలాం చేశారు. తరువాత రెండవ వర్గానికి కూడా ఇదే విధంగా రెండు రకతులు చేయించి సలాం చేశారు. అబూదావూద్‌లో హజ్రత్ అబూబక్రా (రజి) ఆధారంగా ఇలాంటి ఉల్లేఖనమే ఒకటుంది.

## సారాంశం

ఈ హదీసు ద్వారా నమాజె ఖౌఫ్‌కు సంబంధించిన మరో పద్ధతి ముందుకు వచ్చింది. నమాజె ఖౌఫ్‌కు సంబంధించిన పరిస్థితులు, ఉల్లేఖనాలు కూడా అనేకం ఉండటం వల్ల దాన్ని నెరవేర్చిన తీరులో కూడా వైవిధ్యం కనబడుతోంది. నసాయిలో హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) రెండు వేర్వేరు బృందాలకు రెండేసి రకతుల నమాజు చేయించారు. ఆ విధంగా దైవప్రవక్త (స)కు 4 రకతులు అయ్యాయి. అంటే ఆయన (స) మొదటి రెండు రకతులు 'ఫర్జ్' గా ఆచరించారు. మిగతా రెండు రకతులు 'నఫిల్' రూపంలో చేశారు. ఎందుకంటే ఒకే నమాజ్ రెండుసార్లు ఫర్జ్‌గా పరిగణించబడదు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే నఫిల్ నమాజు చేసే ఇమామ్ వెనుక ముఖ్తదీలు ఫర్జ్ నమాజును చేయవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ అయ్యాష్ జురఖీ (రజి) అసలు పేరు జైద్ బిన్ సాబిత్. అన్సారీగా, జురఖీగా ప్రసిద్ధి చెందారు. ఈ హదీసును ఒక ముస్లిం సమూహం ఈయనకు తెలియజేసింది. ఈయన హిజ్రీ 40 తరువాత మరణించారు.

(٣٨٢) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى صَلاَةَ الْخَوْفِ بِهؤُلاَءِ رَكْعَةً، وَهؤُلاَءِ رَكْعَةً، وَلَمْ يَقْضُوْا. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَمِثْلُهُ عِنْدَ ابْنِ خُزَيْمَةَ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا.

382. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా బృందానికీ ఒకే రకత్ (నమాజె ఖౌఫ్) చేయించారు. వేరొక బృందానికి కూడా ఒకే రకత్‌ను చేయించారు. మరి వారు నమాజ్‌ను పూర్తి చేయలేదు. (అహ్మద్, అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఇబ్నె ఖుజైమ కూడా ఇబ్నె అబ్బాస్ సౌజన్యంతో ఈ విధంగానే హదీసును నకలు చేశారు)

## సారాంశం

'నమాజె ఖౌఫ్' కనీసం ఒక రకత్ కూడా చేయవచ్చునన్న దానికి ఈ హదీసు ఒక ఆధారం వంటిది. ప్రవక్త (స) అనుయాయులలో ఒక వర్గం దీన్ని అనుసరిస్తున్నది. తాబయీన్లలో హసన్ బస్రీ (రహ్మ.లై), జహాక్ (రహ్మ.లై), ఇబ్నె రాహ్వా (రహ్మ.లై), అతా (రహ్మ.లై), తావుస్ (రహ్మ.లై), హకమ్ బిన్ ఉతైబ (రహ్మ.లై), ఖతాదా (రహ్మ.లై) తదితరులు ఇంకా ప్రవక్త ప్రియ సహచరులలో ఇబ్నె అబ్బాస్ (రజి), అబూ హురైర (రజి), అబూ మూసా అష్‌అరీ (రజి) లు దీనికి సుముఖంగా ఉన్నారు. భీతావహస్థితిలో కేవలం సైగతో ఒక రకత్ చేసినా సరిపోతుందని వీరి అభిప్రాయం. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి హదీసు ఈ దృక్పథాన్ని సమర్థిస్తోంది. ముస్లిం, తిర్మిజీలతో సహా

మరో ఐదుగురు ఉల్లేఖించిన ఈ హదీసులో ఇలా వుంది : "అల్లాహ్ తన ప్రవక్త (సఅసం) నోట సాధారణ స్థితిలో 4 రకతులను, ప్రయాణావస్థలో 2 రకతులను, భయానకస్థితిలో ఒక రకత్‌ను విధి (ఫర్జ్) గావించాడు."

అయితే అధిక సంఖ్యాక ధర్మవేత్తలతోపాటు నలుగురు ఇమాములు కూడా రకతుల సంఖ్యలో భయానక స్థితి ప్రభావం అంతగా లేదని వ్యాఖ్యానించారు.

(٣٨٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «صَلاَةُ الْخَوْفِ رَكْعَةٌ عَلَى أَيِّ وَجْهٍ كَانَ». رَوَاهُ الْبَزَّارُ بِإِسْنَادٍ ضَعِيفٍ.

383. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు: "నమాజె ఖౌఫ్‌ను ఏ విధంగా నెరవేర్చినాసరే అది ఒక రకత్ మాత్రమే." (బజ్జార్ దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ఆధారంగా కొంతమంది ఇమాములు, ముఖ్తదీలు కూడా నమాజె ఖౌఫ్ ఒకే రకత్ చేయాలని భావిస్తున్నారు. సుఫ్యాన్ కూడా దీనికి సుముఖంగా ఉన్నారు. 'ఏ విధంగా నెరవేర్చినాసరే' అన్న వచనంలో ఖిబ్లా వైపునకు అభిముఖమైనా, కాకపోయినాసరే నమాజ్ నెరవేరుతుంది అన్న భావం ఇమిడి ఉంది.

(٣٨٤) وَعَنْهُ مَرْفُوعاً: لَيْسَ فِي صَلاَةِ الْخَوْفِ سَهْوٌ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

384. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పినట్లుగా హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు - "నమాజె ఖౌఫ్‌లో సహూ సజ్దా లేదు." (దారె ఖుత్నీ దీనిని బలహీన ఆధారాలతో వెలికి తీశారు)

**14వ అధ్యాయం**

## ١٤ - بَابُ صَلاَةِ الْعِيدَيْنِ

## పండుగల నమాజ్

(٣٨٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْفِطْرُ يَوْمَ يُفْطِرُ النَّاسُ، وَالأَضْحَى يَوْمَ يُضَحِّي النَّاسُ». رَوَاهُ التِّرْمِذِيُّ.

385. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ రోజున ప్రజలు ఉపవాసాలు అన్నీ పూర్తిచేసి 'ఇఫ్తార్' చేస్తారో ఆ రోజు వారి కొరకు పండుగ రోజు అవుతుంది. ప్రజలు ఖుర్బానీ ఇచ్చే రోజు ఈదుల్ అజ్హా అవుతుంది." (తిర్మిజీ)

**సారాంశం**

ముస్లింల కొరకు ఏడాదికి రెండు పండుగలు మాత్రమే ఉన్నాయని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అవి (1) ఈదుల్ ఫిత్ర్ (2) ఈదుల్ అజ్హా. ఈ రెండు పండుగలు మినహా మరో పండుగగానీ, సంబరంగానీ ఇస్లాంలో లేదు. ఈ మధ్య ముస్లింలు సృష్టించుకున్న కొంగ్రొత్త పండుగలకు షరీయత్‌తో ఏ మాత్రం సంబంధం లేదు.

పండుగలు సామూహికత యొక్క ప్రాముఖ్యతను చాటి చెబుతాయి. ఇస్లాం ప్రతిపాదించిన పండుగలలో సామూహిక స్ఫూర్తితోపాటు, ఆరాధనలు కూడా ఉన్నాయి. ఏ ఒక్క మనిషి కూడా- ఒంటరిగా - నెలవంక చూసి, ఒంటరిగా పండుగ జరుపుకోలేడు. పండుగ జరుపుకోవటానికి ముస్లిం సమాజంలోని అత్యధికులు ఆమోదించాలి.

(٣٨٦) وَعَنْ أَبِي عُمَيْرِ بْنِ أَنَسٍ، عَنْ عُمُومَةٍ لَهُ مِنَ الصَّحَابَةِ، أَنَّ رَكْباً جَاءُوا، فَشَهِدُوْا أَنَّهُمْ رَأَوُا الْهِلاَلَ بِالأَمْسِ، فَأَمَرَهُمُ النَّبِيُّ ﷺ أَنْ يُفْطِرُوْا، وَإِذَا أَصْبَحُوا أَنْ يَغْدُوا إِلَى مُصَلاَّهُمْ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَهَذَا لَفْظُهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ.

386. హజ్రత్ అబూ ఉమైర్ బిన్ అనస్ (రజి) తన పినతండ్రి అయిన ఒక సహాబీ (రజి) గారి ఆధారంగా ఉల్లేఖించారు - కొంతమంది దైవప్రవక్త (సఅసం) దగ్గరకు స్వారీ చేసివచ్చి తాము నిన్న సాయంత్రం నెలవంకను చూసినట్టు సాక్ష్యమిచ్చారు. దీనిపై ఆయన (స), "ఉపవాసాన్ని విరమించండి. రేపు దయం పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు రండి" అని ఆజ్ఞాపించారు. (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు - వాక్యాలు మాత్రం అబూదావూద్‌లోనివి. దీని ఆధారం ప్రమాణ బద్ధమైనది)

**సారాంశం**

రమజాన్ నెల 29వ రోజు సాయంత్రం - ఆకాశం నిర్మలంగా వున్న ప్రదేశంలో గనక నెలవంక కనబడి - ఆ సమాచారం మరునాడు విశ్వసనీయ వర్గాల ద్వారా అందితే - ఆ సమాచారం ఆధారంగా అప్పటికప్పుడే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయవచ్చు. అయితే పొద్దు నడినెత్తిపై రాక మునుపే సమాచారం అందితే ఆ రోజు పండుగ నమాజ్ చేయాలి. మధ్యాహ్న సమయానికి సమాచారం అందితే పండుగ మరునాడే జరుపుకోవలసి ఉంటుంది.

ఈ హదీసు ఆధారంగా తెలిసిన మరో విషయమేమిటంటే పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో జరుపుకోవటం ఉత్తమం. నెలవంక కనబడినట్టు అధికారికంగా కూడా సమాచారం అందించవచ్చు. ఇలాంటి ప్రకటన ధార్మిక సంస్థల, ధార్మిక వ్యక్తుల ద్వారా చేయించటం మంచిది. ఆధునిక యుగంలో రేడియో, టీవీ వంటి ప్రసార సాధనాల వల్ల క్షణాల్లో సమాచారం అందుతోంది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమైర్ బిన్ అనస్ (రహ్మతుల్లై) గారి అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ అన్సారీ. అనస్ (రజి) గారి పెద్దకొడుకు. యువ తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడ్డారు. 4వ కోవకు చెందిన ఉల్లేఖకులు. తన తండ్రి తరువాత చాలా కాలం వరకు జీవించారు.

(٣٨٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ لاَ يَغْدُو يَوْمَ الْفِطْرِ حَتَّى يَأْكُلَ تَمَرَاتٍ يَأْكُلُهُنَّ وِتْرًا. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَفِي رِوَايَةٍ مُعَلَّقَةٍ – وَوَصَلَها أَحْمَدُ –: (وَيَأْكُلُهُنَّ إِفْرَادًا).

387. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ (ఈదుల్ ఫిత్ర్) కు బయలుదేరకముందు కొన్ని ఖర్జూరపు పండ్లు తినేవారు. ఈ ఖర్జూర పండ్లు బేసి సంఖ్యలో ఉండేవి." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు - ఒక అనిశ్చిత (ముఅల్లఖ్) ఉల్లేఖనంలో కూడా ఇలాగే ఉంది. ఆయన (స) ఈ ఖర్జూర పండ్లను ఒక్కొక్కటిగా చేసి తినేవారని అహ్మద్ గారు ఒక మౌసూల్ ఉల్లేఖనంలో ప్రస్తావించారు)

## సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన దృష్టికి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవి: (1) ఈద్ నమాజ్ కోసం బహిరంగ స్థలాలకు వెళ్ళాలి. (2) పండుగ నమాజ్‌కు వెళ్ళేముందు బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లు తినటం సంప్రదాయం (సున్నత్). (3) ఖర్జూర పండ్లు ఒకేసారి అనేకం నోట్లో వేసుకునే బదులు ఒక్కొక్కటీ తినాలి. ఒకేసారి నోట్లో కుక్కటం అనాగరికం, సంస్కార విహీనం అనిపించుకుంటుంది. ఒకవేళ ఖర్జూర పండ్లు లభ్యమవకపోతే మరేదయినా తీపి పదార్థంగానీ, తీపి పండ్లుగానీ తినవచ్చు.

(٣٨٨) وَعَنِ ابْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ لاَ يَخْرُجُ يَوْمَ الْفِطْرِ حَتَّى يَطْعَمَ، وَلاَ يَطْعَمُ يَوْمَ الْأَضْحَى حَتَّى يُصَلِّيَ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

388. తన తండ్రి తనతో చెప్పినట్లు హజ్రత్ ఇబ్నె బురైద తెలిపారు - "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ కొరకు ఏదైనా తినేవరకూ బయలుదేరేవారు కారు. అయితే ఖుర్బానీ పండుగనాడు ఆయన (స) నమాజ్ చేసేదాకా ఏమీ తినేవారు కారు. (అహ్మద్ మరియు తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

రమజాన్ పండుగ రోజున ఏదన్నా తిన్న తరువాత నమాజ్ చేయటం, బక్రీద్ పండుగనాడు నమాజ్ చేసిన తరువాత తినటం దైవప్రవక్త (స) విధానం. ఫలానా పదార్థమే తినాలన్న ఆంక్ష ఏమీలేదు. కాకపోతే ఖర్జూర పండ్లను 'మస్నూన్'గా భావించి వాటిని తినటం చాలా మంచిది.

(٣٨٩) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُمِرْنَا أَنْ نُخْرِجَ الْعَوَاتِقَ والْحُيَّضَ فِيْ الْعِيْدَيْنِ، يَشْهَدْنَ الْخَيْرَ وَدَعْوَةَ الْمُسْلِمِيْنَ، وَتَعْتَزِلُ الْحُيَّضُ الْمُصَلَّى. مُتَّفَقٌ عَلَيْهِ.

389. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : "ముస్లింల సంక్షేమ కార్యాలలో, వేడుకోళ్లలో పాలుపంచుకునే ఉద్దేశ్యంతో, మేము పడుచు పిల్లలను, బహిష్టు స్త్రీలను కూడా పండుగలకు (ఈద్గాహ్‌లకు) తీసుకు రావలసిందిగా మాకు ఆజ్ఞాపించబడింది. అయితే బహిష్టు స్త్రీలు ఈద్గాహ్ ప్రక్కనే ఉండాలని (నమాజ్ చేయరాదని, కేవలం దుఆలో పాల్గొనాలనీ) సూచించ బడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పండుగ నమాజ్ కొరకు మహిళలు ఇల్లు వదలి ఈద్గాహ్‌కు వెళ్ళటం సమంజసమేనని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (స) స్వయంగా తన సతీమణులను, కుమార్తెలను ఈద్గాహ్‌కు తీసుకు వెళ్ళేవారని ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), అలీ (రజి)లు స్త్రీలను పండుగ నమాజ్‌కు పిలుచుకు వెళ్ళటం తప్పనిసరి అని భావించేవారు.

ఈ హదీసుపై హనఫీ ధర్మవేత్తలు ఇలా వ్యాఖ్యానించారు: "ఇది ఇస్లాం ఆరంభకాలంనాటి సంగతి. ఆ రోజుల్లో ముస్లింల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. పర్వదినాలలో - ఈద్గాహ్‌లో - ముస్లింలు వీలైనంత ఎక్కువమంది పాల్గొంటే అవిశ్వాసులపై దాని ప్రభావం పడుతుందన్న ఉద్దేశ్యంతో మహిళలను సయితం గొనిపోయేవారు."

అల్లామా తహావీ ఎంతో కష్టపడి సేకరించిన ఈ సమాచారంలో పసలేదు. ఎందుకంటే హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఈ (పండుగ) సంఘటన మక్కా విజయం తరువాత సంభవించింది. దైవకృపవల్ల అప్పటికే ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగింది. మక్కా మదీనాలలో దాదాపు ఇస్లామీయ వ్యవస్థ నెలకొన్నది.

ఇంతకీ చెప్పవచ్చిందేమిటంటే ఈద్గాహ్‌లలో స్త్రీలు పాల్గొనటం మంచిది. ఇది దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఒక ఆదర్శం.

(٣٩٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ وَأَبُو بَكْرٍ وَعُمَرَ يُصَلُّونَ الْعِيْدَيْنِ قَبْلَ الْخُطْبَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

390. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం), హజ్రత్ అబూ బక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)లు పండుగ నమాజుల సంద ర్భంగా ప్రసంగానికి ముందే నమాజు చేసేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పండుగలలో తొలుత నమాజ్ చేసి, ఆ తరువాత ప్రసంగం చేయాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. బనూ ఉమయ్యా పరిపాలనా యుగంలో మర్వాన్ అనే పరిపాలకుడు ముందు ప్రసంగించి తరువాత నమాజ్ చేసే దురాచారాన్ని (బిద్అత్‌ను) ఆరంభించాడు. ఆ సమయంలో హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) దీనిపై తీవ్ర నిరసన తెలిపారు. 'నీవు సున్నత్‌కు విరుద్ధమైన పని మొదలెట్టావు' అని ఆయన పరిపాలకుని మొహం మీదే చెప్పేశారు. (సహీహ్ ముస్లిం)

(٣٩١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى يَوْمَ الْعِيْدِ رَكْعَتَيْنِ، لَمْ يُصَلِّ قَبْلَهُما وَلاَ بَعْدَهُمَا. أَخْرَجَهُ السَّبْعَةُ.

391. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున రెండు రకతుల నమాజ్ మాత్రమే చేశారు. దీనికి ముందుగానీ, తరువాతగానీ ఆయన (స) మరే నమాజూ చేయలేదు." (దీనిని ఏడు గురూ-అంటే అహ్మద్, బుఖారీ, ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా - ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఈద్గాహ్‌లో ఈ రెండు రకతుల పండుగ నమాజ్ తప్ప మరే నమాజూ దైవప్రవక్త (స) చేయలేదు. అయితే ఇంటికి తిరిగి వచ్చిన మీదట రెండు రకతులు చేసేవారు.

(٣٩٢) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى الْعِيْد بِلاَ أَذَانٍ وَلاَ إِقَامَةٍ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

392. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "అజాన్, ఇఖామత్‌లు చెప్ప కుండానే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్ చేయిం చారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖిం చారు -దీని మూలం బుఖారీలో ఉంది)

**సారాంశం**

పండుగ నమాజ్ కోసం అజాన్, ఇఖామత్‌లు చెప్పవలసిన అవసరం లేదు. ఒకవేళ ఎవరయినా అజాన్, ఇఖామత్ ఇస్తే వారు బిద్‌అత్ (కొత్త పోకడ)ను సృష్టించినవారే అవుతారు.

(٣٩٣) وَعَنْ أَبِي سَعِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ لاَ يُصَلِّي قَبْلَ الْعِيْدِ شَيْئاً، فَإِذَا رَجَعَ إِلَى مَنْزِلِهِ صَلَّى رَكْعَتَيْنِ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ حَسَنٍ.

393. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజ్‌కు ముందు ఏ నమాజూ చేసేవారు కాదు. అయితే ఇంటికి వచ్చిన తరువాత రెండు రకతుల నఫిల్ నమాజు మాత్రం చేసే వారు." (దీనిని ఇబ్నె మాజ స్పష్టమయిన ఆధారంతో ఉల్లేఖించారు)

(٣٩٤) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَخْرُجُ يَوْمَ الْفِطْرِ وَالْأَضْحَى إِلَى الْمُصَلَّى، وَأَوَّلُ شَيْءٍ يَبْدَأُ بِهِ الصَّلاَةُ، ثُمَّ يَنْصَرِفُ، فَيَقُومُ مُقَابِلَ النَّاسِ – وَالنَّاسُ عَلَى صُفُوفِهِمْ – فَيَعِظُهُمْ وَيَأْمُرُهُمْ. مُتَّفَقٌ عَلَيْهِ.

394. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ మరియు ఈదె ఖుర్బానీ కొరకు ఈద్గాహ్‌కు రాగానే చేసే మొదటి పని నమాజ్ చేయించటం. నమాజ్ పూర్తయిన వెంటనే ఆయన (స) ప్రజల వైపునకు తిరిగి నిలబడేవారు. ప్రజలు తమ తమ పంక్తుల్లో కూర్చుని వుండగా ఆయన (స) వారికి హితబోధ చేసేవారు. మంచిని పెంపొందించమని ఆజ్ఞాపించేవారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా క్రింది అంశాలు వెలుగులోకి వస్తాయి -

(1) పండుగ నమాజుకు మునుపు దైవప్రవక్త (సఅసం) మరే ఆచరణా చేసినట్టు ఆధారం లేదు. (2) నమాజ్ చేసిన తరువాత ప్రసంగించాలి. (3) ఉపన్యాసకుడు ప్రజల వైపునకు తిరిగి నిలబడాలి. (4) ఉపన్యాసం నిలబడి ఇవ్వాలి. ప్రతి ఉపన్యాసకుడూ ఉపన్యసించే సమయంలో ప్రజలకు ధర్మబోధ చేయాలి. సదాచరణ గురించి నొక్కి వక్కాణించాలి. అనవసర వ్యాఖ్యలకు, కాలక్షేపపు కబుర్లకు అందులో తావుండరాదు.(5) ప్రసంగం కొనసాగే సమయంలో ప్రజలు తమ తమ స్థానాలలో నిశ్శబ్దంగా కూర్చోవాలి. ఉపన్యాసకుని వైపునకు తిరిగి కూర్చోవాలి. (6) పండుగ

నమాజ్‌ను వీలయినంత వరకు ఈద్గాహ్‌లోనే చేయాలి. ఈ మధ్య జనులు తగు కారణమేదీ లేకుండానే తమ పేటలో వున్న మస్జిదులలో పండుగ నమాజ్ చేస్తున్నారు. ఇది హర్షించదగ్గ విషయం కాదు. (7) దైవప్రవక్త (నఅసం) పండుగ రోజు ప్రసంగం కొరకు వేదికను ఉపయోగించలేదు. అందరికన్నా ముందు ఈద్గాహ్‌లో వేదికను ప్రతిష్ఠించిన వ్యక్తి మర్వాన్ అనీ, అతడు దానిపై నిలబడి ఉపన్యసించాడనీ బుఖారీలో ఉంది. అయితే ఇబ్నె హిబ్బాన్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకసారి ఒంటెపై కూర్చొని పండుగ ప్రసంగం చేశారు. కనుక అవసరం మేరకు వాహనంపై నుంచి కూడా ప్రసంగించవచ్చునన్న దానికి ఇదొక నిదర్శనం.

(٣٩٥) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ نَبِيُّ اللهِ ﷺ: «التَّكْبِيرُ فِي الْفِطْرِ سَبْعٌ فِي الْأُولَى، وَخَمْسٌ فِي الْأَخِرَى، وَالْقِرَاءَةُ بَعْدَهُمَا كِلْتَيْهِمَا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَنَقَلَ التِّرْمِذِيُّ عَنِ الْبُخَارِيِّ تَصْحِيْحَهُ.

395. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి గారినుండి, మరి ఆయనేమో తన తాతగారి నుండి గ్రహించిన విషయాన్ని ఇలా తెలియజేస్తున్నారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు : "ఈదుల్ ఫిత్ర్ నమాజు మొదటి రకత్‌లో ఏడు తక్బీర్లు, రెండవ రకతులో ఐదు తక్బీర్లు ఉన్నాయి. రెండు రకతులలోనూ తక్బీర్ల అనంతరమే ఖిరాత్ (ఖుర్ఆన్ పారాయణం) ఉంటుంది." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు - తిర్మిజీ గారు ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) నుండి దీని ప్రామాణికతను నకలు చేశారు)

### సారాంశం

పండుగ నమాజులలో 12 అదనపు తక్బీర్లు ఉన్నాయని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ సాద్ (రజి), హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తదితర సహాబీల ఉల్లేఖనాలు కూడా ఈ హదీసుకు అనుకూలంగా ఉన్నాయి. అనేక మంది తాబయీలు, మదీనా ధర్మవేత్తల (ఫుకహా)తో పాటు ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయీ కూడా ఈ హదీసు ప్రకారమే ఆచరించారు. తిర్మిజీ వ్యాఖ్యాత అల్లామా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి దీని గురించి జరిపిన చర్చ తిరుగులేనిది.

అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు కొంతమంది కూఫా ధర్మవేత్తలు మాత్రం 6 అదనపు తక్బీర్లతో పండుగ నమాజ్ చేయాలని అభిప్రాయపడ్డారు. అంటే మొదటి రకతులో ఖిరాత్‌కు ముందు 3 తక్బీర్లు, రెండవ రకతులో 'రుకూ' లోకి వెళ్ళకముందు 3 తక్బీర్లు.

పండుగ నమాజ్‌లలో అదనపు తక్బీర్లు పలికే సమయంలో కూడా 'రఫెయదైన్' చేయటం సంప్రదాయమని ఇమామ్ ఇబ్నె ముంజిర్, బైహఖీలు పేర్కొన్నారు.

(٣٩٦) وَعَنْ أَبِي وَاقِدٍ اللَّيْثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَقْرَأُ فِي الْأَضْحَى وَالْفِطْرِ بِـ «قَ، وَاقْتَرَبَتْ». أَخْرَجَهُ مُسْلِمٌ.

396. హజ్రత్ అబూ వాఖిద్ లైసీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ అజ్హా మరియు ఈదుల్ ఫిత్ర్ నమాజులలో సూరయె ఖాఫ్ మరియు ఇఖ్తరబతిస్సాఅ సూరాలు పఠించేవారు." (ముస్లిం)

### సారాంశం

పండుగ నమాజులలో ఏ సూరాలు పఠించినా నమాజు నెరవేరుతుంది. అయితే ప్రవక్త (సఅసం) అనుసరణకు ప్రతీకగా ఈ రెండు సూరాలను చదవటం మంచిది.

(٣٩٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا كَانَ يَوْمُ الْعِيْدِ خَالَفَ الطَّرِيْقَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَلِأَبِيْ دَاوُدَ عَنِ ابْنِ عُمَرَ نَحْوُهُ.

397. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజున ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి మరో దారిగుండా తిరిగి వచ్చే వారు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు- అబూదావూద్‌లో ఇబ్నె ఉమర్ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది)

### సారాంశం

ఈద్గాహ్‌కు ఒక దారిన వెళ్ళి, మరో దారిన రావటం వల్ల ప్రజాబాహుళ్యంలో పండుగ వాతావరణాన్ని సృజించినట్లవుతుంది. పండుగ రోజున వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు పలికే తక్బీర్లతో వీధి వీధి, వాడ వాడ ప్రతిధ్వనిస్తుంది. దేవుని గొప్పదనం, ఘనత చాటబడుతుంది. తద్వారా ఇస్లాం వైభవం కూడా వ్యక్తమవుతుంది.

(٣٩٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَدِمَ رَسُولُ اللهِ ﷺ الْمَدِيْنَةَ، وَلَهُمْ يَوْمَانِ يَلْعَبُونَ فِيْهِمَا، فَقَالَ: قَدْ أَبْدَلَكُمُ اللَّهُ بِهِمَا خَيْراً مِّنْهُمَا: يَوْمَ الْأَضْحَى، وَيَوْمَ الْفِطْرِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ بِإِسْنَادٍ صَحِيْحٍ.

398. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా ఏతెంచినపుడు అక్కడ ఏడాదికి రెండు రోజులు ఆటపాటలకై, వినోదానికై ప్రత్యేకించబడి ఉండటం గమనించారు. "అల్లాహ్ మీ కోసం ఈ రెండు దినాలకు బదులుగా ఇంతకన్నా మేలైన రెండు దినాలను ప్రసాదించాడు. ఒకటి : ఈదుల్ అజ్హా. రెండవది :

ఈదుల్ ఫిత్ర్." (దీనిని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు - దీని ఆధారం ప్రామాణికమైనది)

**సారాంశం**

షరీయత్ పరిధిలో వుంటూ పండుగ దినాలలో ఆనందంగా ఆటలాడుకోవటం, విద్యా పాటవం ప్రదర్శించటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే అవధులు మీర కూడదు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధమైన వెకిలి చేష్టలకు, ధన మాన ప్రాణాలకు నష్టం కలిగించే కృత్యాలకు పాల్పడరాదు.

(٣٩٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مِنَ السُّنَّةِ أَنْ يَخْرُجَ إِلَى الْعِيْدِ مَاشِياً. رَوَاهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

399. ఈద్గాహ్ వైపునకు నడచి వెళ్లటం సున్నత్ (సంప్రదాయం)అని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. (దీనిని తిర్మిజీ నకలు చేశారు. 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈద్గాహ్‌కు నడచి వెళ్లడం ఎక్కువ పుణ్యప్రదమయిన విషయం. పండుగ నమాజ్ కోసం ఎన్ని అడుగులు వేస్తే అన్ని సత్కార్యాలు లిఖించబడతాయి. ఒకవేళ ఈద్గాహ్ చాలా దూరముంటే వాహనంపై వెళ్ళటంలో తప్పులేదు.

(٤٠٠) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُمْ أَصَابَهُمْ مَطَرٌ فِي يَوْمِ عِيْدٍ، فَصَلَّى بِهِمُ النَّبِيُّ ﷺ صَلاَةَ الْعِيْدِ فِي الْمَسْجِدِ. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ لَيِّنٍ.

400. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: ఒకసారి పండుగ రోజున ముస్లింలను వర్షం వెంటాడటం వల్ల దైవప్రవక్త (సఅసం), వారికి మస్జిదులోనే పండుగ నమాజ్ చేయించారు. (అబూదావూద్ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

షరీయత్‌పరంగా తగు కారణమేదైనా ఉంటే అప్పుడు మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేయవచ్చునని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. సాధారణంగా ఆయన (స) ఈద్గాహ్‌లోనే పండుగ నమాజ్‌ను చేసేవారు. కాని ఒకసారి మాత్రం దైవకారుణ్యం వర్షించటం మూలంగా మస్జిదులో పండుగ నమాజ్ చేయించాల్సి వచ్చింది.

ఇక పండుగ నమాజ్ ఈద్గాహ్‌లో చేయాలా? లేక మస్జిదులలో చేయాలా? అన్న విషయమై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో సువిశాలమైన (పెద్ద) మస్జిదులో పండుగ నమాజ్ చేయటం ఉత్తమం.

ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు: "దైవప్రవక్త (సఅసం) జీవితాంతం పండుగ నమాజ్‌ను బహిరంగ ప్రదేశంలో - ఈద్గాహ్ స్థలంలో - ఆచరించారు. కేవలం ఒక్కసారి మాత్రం వర్షం కారణంగా గత్యంతరం లేక మస్జిద్‌లో పండుగ నమాజ్‌ను నెరవేర్చారు. కనుక పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే శ్రేష్ఠం."

హాజ్రత్ అలీ (రజి) గారి పలుకులు -

ఆయన (రజి) పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన (రజి) ఇలా అన్నారు : "ఒకవేళ బహిరంగ స్థలానికి వచ్చి ఈద్ నమాజ్ చేయటం 'మస్నూన్' (సంప్రదాయం) కాకపోయినట్లయితే నేను మస్జిద్‌లోనే నమాజ్ చేసి ఉండేవాణ్ణి."

కాబట్టి పండుగ నమాజ్‌ను ఈద్గాహ్‌లో చేయటమే సంప్రదాయం, శ్రేష్ఠం కూడా.

**15వ అధ్యాయం**

## గ్రహణ సమయాలలో నమాజ్ (సలాతుల్ కుసూఫ్)

## ١٥ - بَابُ صَلاَةِ الْكُسُوفِ

(٤٠١) عَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: انْكَسَفَتِ الشَّمْسُ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ يَوْمَ مَاتَ إِبْرَاهِيْمُ، فَقَالَ النَّاسُ: انْكَسَفَتِ الشَّمْسُ لِمَوتِ إِبْرَاهِيْمَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ الشَّمْسَ وَالْقَمَرَ آيَتَانِ مِنْ آيَاتِ اللهِ، لاَ يَنْكَسِفَانِ لِمَوْتِ أَحَدٍ وَلاَ لِحَيَاتِهِ، فَإِذَا رَأَيْتُمُوهُمَا فَادْعُوا اللَّهَ وَصَلُّوا، حَتَّى تَنْكَشِفَ**». مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: «**حَتَّى تَنْجَلِيَ**».

401. హాజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఇబ్రాహీం చనిపోయిన నాడు సూర్యగ్రహణం పట్టింది. ఇబ్రాహీం మరణం మూలంగానే సూర్యునికి గ్రహణం పట్టిందని ప్రజలు చెప్పుకున్నారు. దీనిపై దైవప్రవక్త (సఅసం), "సూర్యచంద్రులు దేవుని నిదర్శనాలలో రెండు నిదర్శనాలు మాత్రమే. ఒకరి జీవన్మరణాలతో వాటి గ్రహణానికి ఎలాంటి సంబంధం లేదు. మీరు వాటిని ఎప్పుడు ఈ స్థితిలో చూచినా అల్లాహ్‌ను ప్రార్థించండి. సూర్యగ్రహణం వీడిపోయేదాకా నమాజ్ చేయండి" అని బోధించారు. (బుఖారీ, ముస్లిం) బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో "అది ప్రకాశించే వరకూ నమాజ్ చేస్తూ ఉండండి" అని ఉంది.

وَلِلْبُخَارِيِّ مِنْ حَدِيثِ أَبِي بَكْرَةَ: «فَصَلُّوا، وَادْعُوا، حَتَّى يَنْكَشِفَ مَا بِكُمْ».

బుఖారీలో అబూబక్రా (రజి) హదీసులో ఈ విధంగా ఉంది : "ఆ స్థితి మీ ముందు నుంచి తొలగిపోయేవరకు నమాజ్ చేయండి, దుఆ చేయండి."

## సారాంశం

సూర్యగ్రహణమైనా, చంద్రగ్రహణమైనా దైవనిదర్శనాలలో రెండు గొప్ప నిదర్శనాలు మాత్రమే. సూర్యచంద్రులు దేవుడు విధించిన నియమానికీ, ప్రణాళికకు కట్టుబడి ఉన్నాయి. ఈ నియమాన్ని అతిక్రమించి, తమ ఇష్టానుసారం ఉదయించే, అస్తమించే ధైర్యం వాటికి లేదు. అవి అలా చేయలేవు కూడా. దైవశాసనం ముందు అవి ఇంత నిస్సహాయంగా ఉన్నప్పుడు ఇతరులకు లాభనష్టాలు ఎలా కలిగించగలుగుతాయి? ఆలోచించాలి.

ఈ సందర్భంగా నమాజ్ చేయటం, దుఆ చేయటం సంప్రదాయం. రెండు రకతుల నమాజును ఆయన (స) సామూహికంగా చేసినట్టు ఆధారాలున్నాయి. ఒక్కో రకతులో రెండేసి రుకూలు చేయటం విశేషం. సూర్యగ్రహణం ఎప్పుడు పడితే అప్పుడే నమాజ్ చేయాలి.

ఇంతకీ ఈ నమాజ్ సున్నతా? వాజిబా? సున్నత్ అని కొందరు, వాజిబ్ అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారు ఈ నమాజ్‌ను వాజిబ్ (తప్పనిసరి)గా తలపోశారు. అత్యధిక ధర్మవేత్తల ప్రకారం ఈ నమాజ్ రెండు రకతులు. ఒక్కో రకతులో రెండేసి రుకూలు, రెండేసి ఖియామ్‌లు ఉంటాయి. రెండేసిసార్లు ఖిరాత్ కూడా చేయవలసి ఉంటుంది. మొదటి ఖియామ్‌లో ఫాతిహా సూరా పఠించే విషయమై ఏకాభిప్రాయముంది. కాని రెండో ఖియామ్‌లో ఫాతిహా సూరా పఠించటంపై అభిప్రాయభేదం ఉంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దృష్టిలో ఫాతిహా సూరా రెండవ ఖియామ్‌లోనూ పఠించవలసిందే. లేకపోతే ఆయన దృష్టిలో నమాజ్ సక్రమం కాజాలదు.

ఖిరాత్ (ఖుర్ఆన్ పారాయణం) బిగ్గరగా చేయాలా? నెమ్మదిగా చేయాలా? అన్న విషయంపై కూడా నాలుగు అభిప్రాయాలున్నాయి. బిగ్గరగా ఖుర్ఆన్ పఠించాలని భావించేవారిలో ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా, ఇస్‌హాఖ్ బిన్ రాహ్వే, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె ముంజిర్ తదితరులున్నారు. ఖిరాత్ నెమ్మదిగా పఠించాలని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వక్కాణించారు. ఏవిధంగా తలచుకుంటే ఆ విధంగా పఠించవచ్చు అన్నది మూడవ వాదన. సూర్యగ్రహణమైతే నెమ్మదిగా పారాయణం చేయాలనీ, చంద్రగ్రహణమైతే బిగ్గరగా పారాయణం చేయాలన్నది నాల్గవ దృక్పథం.

## హదీసు ఉల్లేఖకులు

ఇబ్రాహీం (రజి). ఈ పిల్లవాడు దైవప్రవక్త (సఅసం)గారి పుత్రుడు. ఈయన తల్లిపేరు మారియ ఖిబ్తియ (ర.అన్హా). అంటే ఈమె దైవప్రవక్త (సఅసం) ధర్మపత్ని. అలెగ్జాండ్రియా మరియు ఈజిప్టు పరిపాలకుడు ఈమెను దైవప్రవక్త (సఅసం)కు కానుకగా సమర్పించాడు. ఆయన (స) కుమారుడగు ఇబ్రాహీం (రజి) హిజ్రి 9వ ఏట జమాది ఉల్ ఊలాలో జన్మించారు. 18 మాసాల అనంతరం - హిజ్రి 10వ సంవత్సరం షవ్వాల్ మాసంలో - మరణించారు. బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి. "స్వర్గంలో ఒక పాలు త్రాపే మహిళ ఈ అబ్బాయి పాలగడువును పూర్తిచేసింది" అని దైవప్రవక్త (సఅసం) వ్యాఖ్యానించారు.

(٤٠٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ جَهَرَ فِي صَلاَةِ الْكُسُوفِ بِقِرَاءَتِهِ، فَصَلَّى أَرْبَعَ رَكْعَاتٍ، فِي رَكْعَتَيْنِ وَأَرْبَعَ سَجْدَاتٍ. مُتَّفَقٌ عَلَيْهِ، وَهَذَا لَفْظُ مُسْلِمٍ. وَفِي رِوَايَةٍ لَهُ: فَبَعَثَ مُنَادِياً يُنَادِي «اَلصَّلاَةُ جَامِعَةٌ».

402. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గ్రహణ సమయంలో చేసిన నమాజులో బిగ్గరగా (ఖుర్ఆన్) పారాయణం చేశారు. రెండు రకతులలో మొత్తం నాలుగు రుకూలు, నాలుగు సజ్దాలే చేశారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి) ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది -"ఆయన ప్రకటన గావించే వానిని పంపారు. ఆ వ్యక్తి 'అస్సలాతు జామిఅతున్' అని ప్రకటించేవాడు."

**సారాంశం**

దైవప్రవక్త (స) 'సలాతుల్ కుసూఫ్'లో బిగ్గరగా పారాయణం చేసేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. హజ్రత్ అలీ (రజి) చే ఉల్లేఖించబడిన ఒక హదీసు కూడా ఈ విషయాన్ని నిర్ధారిస్తోంది. ఈ నమాజు సాధారణ నమాజుల వంటిది కాదనీ, ఇందులో రుకూలు అదనంగా ఉంటాయని కూడా అర్థమవుతున్నది. ఈ ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఒక్కో రకత్‌లో రెండేసి రుకూలు చేశారు. ఈ నమాజుకు ఒక వేళ అంటూ ఉండదు. ఎప్పుడు సూర్యగ్రహణముంటే అప్పుడే చేయవలసి ఉంటుంది.

(٤٠٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: انْخَسَفَتِ الشَّمْسُ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ فَصَلَّى، فَقَامَ قِيَاماً طَوِيْلاً نَحْواً مِّنْ قِرَاءَةِ سُورَةِ الْبَقَرَةِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيْلاً، ثُمَّ رَفَعَ، فَقَامَ قِيَاماً طَوِيْلاً، وَهُوَ دُوْنَ الْقِيَامِ الْأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيْلاً، وَهُوَ دُوْنَ الرُّكُوعِ الْأَوَّلِ، ثُمَّ سَجَدَ، ثُمَّ قَامَ قِيَاماً طَوِيْلاً، وَهُوَ دُوْنَ الْقِيَامِ الْأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيْلاً، وَهُوَ دُوْنَ الرُّكُوعِ الْأَوَّلِ، ثُمَّ رَفَعَ، فَقَامَ قِيَاماً طَوِيْلاً، وَهُوَ دُوْنَ الْقِيَامِ

403. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో సూర్యగ్రహణం పట్టింది. ఆయన (స) నమాజె కుసూఫ్ చేశారు. అందులో సూరయె బఖరా పారాయణం చేసినంతసేపు నిలబడ్డారు. (రుకూ కూడా) సుదీర్ఘమయిన రుకూ చేశారు. మళ్లీ నిలబడ్డారు. ఈసారి కూడా సుదీర్ఘ సమయం నిలబడ్డారు. అయితే మొదటిసారి ఖియామ్ కన్నా కొంచెం తక్కువ. మళ్లీ సుదీర్ఘమయిన రుకూ చేశారు. కాని మొదటి రుకూ కన్నా

ٱلأَوَّلِ، ثُمَّ رَكَعَ رُكُوعاً طَوِيْلاً، وَهُوَ دُونَ الرُّكُوعِ ٱلأَوَّلِ، ثُمَّ رَفَعَ رَأْسَهُ، ثُمَّ سَجَدَ، ثُمَّ ٱنصَرَفَ، وَقَدْ ٱنجَلَتِ الشَّمْسُ، فَخَطَبَ النَّاسَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

చిన్నది. తరువాత సజ్దా చేశారు. ఆ తరువాత నిలబడి మళ్లీ పారాయణం చేశారు. కాని ఇది మొదటి రకత్‌లోని పారాయణంకన్నా తక్కువే. అనంతరం సుదీర్ఘ రుకూ చేశారు. అయితే మునుపటి రుకూ కన్నా స్వల్పం. తరువాత తలపైకెత్తి సుదీర్ఘమయిన ఖియామ్ చేశారు. ఇది అంతకుముందు ఖియామ్ కన్నా కొంచెం చిన్నది. ఆ తరువాత మరో సుదీర్ఘమయిన రుకూ చేశారు. ఇది క్రితంసారి రుకూ కన్నా కాస్త చిన్నది. తరువాత తన తలను పైకెత్తారు. ఆ తరువాత సజ్దా చేశారు. తరువాత సలాం చేశారు. (ఈ లోగా గ్రహణం వీడి) సూర్యుడు ధగధగా ప్రకాశించసాగాడు. అనంతరం ఆయన (స) ప్రజలకు ధర్మ బోధన చేశారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

وَفِي رِوَايَةٍ لِّمُسْلِمٍ: صَلَّى حِيْنَ كُسِفَتِ الشَّمْسُ ثَمَانِيَ رَكَعَاتٍ فِيْ أَرْبَعِ سَجَدَاتٍ.

ఆయన (స) సూర్యగ్రహణ సమయంలో ఎనిమిది రుకూలు, నాలుగు సజ్దాలతో నమాజ్ చేశారని ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఉంది.

وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِثْلُ ذَلِكَ.

హజ్రత్ అలీ (రజి)చే కూడా ఈ విధంగానే ఉల్లేఖించబడింది.

وَلَهُ عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: صَلَّى سِتَّ رَكَعَاتٍ بِأَرْبَعِ سَجَدَاتٍ.

ముస్లింలోనే హజ్రత్ జాబిర్ (రజి) గారి ఉల్లేఖనంలో ఇలా అనబడింది : "ఆయన (స) ఆరు రుకూలు, నాలుగు సజ్దాలతో ఈ నమాజ్ చేశారు."

وَلأَبِي دَاوُدَ عَنْ أُبَيِّ بْنِ كَعْبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: صَلَّى، فَرَكَعَ خَمْسَ رَكَعَاتٍ، وَسَجَدَ سَجْدَتَيْنِ، وَفَعَلَ فِي الثَّانِيَةِ مِثْلَ ذَلِكَ.

అబూదావూద్‌లో హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) చే ఈ విధంగా ఉల్లేఖించబడింది- "ఆయన (సఅసం) నమాజె కుసూఫ్ చేశారు. మొదటి రకత్‌లో ఐదు రుకూలు, రెండు సజ్దాలు చేశారు. రెండవ రకత్ కూడా అలాగే చేశారు."

**సారాంశం**

మొత్తంమీద రుకూ, సజ్దాల గురించి విభిన్న అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. వీటన్నింటినీ జోడిస్తే ఒక్కో రకత్‌లో రెండేసి, మూడేసి, నాలుగేసి, ఐదేసి రుకూలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిప్రకారం ఆయన (సఅసం) జీవిత కాలంలో అనేకసార్లు 'గ్రహణం' పట్టినట్లు విదితమవుతోంది. రెండేసి రుకూలతో కూడిన రకతులు ఎక్కువ అనుసరణీయమని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సంఘటన పూర్వాపరాలను సంక్షిప్తంగా చర్చించదలిచాము. అసలు విషయం పాఠకులకు బోధపడాలన్నదే దీని ఉద్దేశ్యం -

దైవప్రవక్త (స) పుత్రుడు ఇబ్రాహీం (రజి) చనిపోయినది హిజ్రీ 10వ సంవత్సరం షవ్వాల్ నెల 28 లేక 29వ తేదీ అనీ, అది క్రీ.శ. 632 జనవరి 27వ తేదీన వస్తుందని పరిశోధకులు, చరిత్రకారులు, ఖగోళ శాస్త్రవేత్తలు, విమర్శకులు, సమీక్షకులు అందరూ ఏకీభవించారు. సూర్యగ్రహణం ఉదయం ఎనిమిదిన్నరకు పట్టింది. దైవప్రవక్త (స) జీవితకాలంలో దీని తరువాత మరెన్నడూ సూర్యగ్రహణం పట్టలేదన్న విషయంలో కూడా వీరందరి మధ్య ఏకాభిప్రాయముంది. అయితే అంతకు ముందు పట్టిన గ్రహణాల గురించి ప్రఖ్యాత పరిశోధకుడు అల్లామా ఖాజీ ముహమ్మద్ సల్మాన్ మన్సూర్‌పూరీ తన విశ్వవిఖ్యాత గ్రంథం "సీరత్ రహ్మతుల్ లిల్ ఆలమీన్"లో ప్రస్తావించారు. దైవప్రవక్త (స) మక్కా జీవితంలోనూ, మదీనా జీవితంలోనూ మొత్తం 10సార్లు గ్రహణాలు పట్టాయనీ, వీటిలో సూర్యగ్రహణాలతోపాటు, చంద్రగ్రహణాలు కూడా ఉన్నాయనీ ఆయన పేర్కొన్నారు. దైవప్రవక్త (స) కుమారుడు చనిపోయిన సందర్భంగా పట్టిన సూర్యగ్రహణం కూడా అందులో ఉంది. ఈ గ్రహణం వాటిలో చిట్టచివరిది. అయితే రచయిత ఈ గ్రహణ సమయాలను గానీ, గ్రహణ ప్రదేశాలను గానీ పొందుపరచలేదు.

ఇక హదీసుల ఆధారంగా ఈ అంశాన్ని తరచిచూద్దాం - 'ముస్లిం'లో అబ్దుర్రహ్మాన్ బిన్ సమురా (రజి) ఉల్లేఖనం ఆధారంగా ఇలా అనబడింది - (ఆయన ఇలా అన్నారు) - నేను దైవప్రవక్త (సఅసం) జీవిత కాలంలో మదీనాలో విలువిద్యా విన్యాసాలు చేస్తున్నాను. అంతలోనే సూర్యునికి గ్రహణం పట్టింది. నేను బాణాలు పడేసి, 'ఈ సూర్యగ్రహణం మూలంగానే కదా ఈ రోజు దైవప్రవక్త (సఅసం) కు కష్టకాలం వచ్చింది. దైవసాక్షి! నేను దీన్ని తప్పక చూడాల్సిందే' అని మనసులో అనుకున్నాను.

ఈ పూర్వరంగంలో ఆలోచిస్తే దైవప్రవక్త (స) కాలంలో పట్టిన తొలి గ్రహణం ఇదేనని బోధపడుతుంది. అప్పటివరకూ గ్రహణానికి సంబంధించిన ధర్మాదేశం ఏదీ లేదు. కాగా; అబ్దుర్రహ్మాన్ బిన్ సమురా (రజి) మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారన్న సంగతి

విస్మరించరానిది. కనుక దైవప్రవక్త (స) హయాంలో కానవచ్చిన తొలి సూర్యగ్రహణం మక్కా విజయం తరువాత కానవచ్చినదేనని దీని ఆధారంగా స్పష్టమవుతున్నది.

ఇకపోతే, 'ముస్లిం' మరియు 'నసాయి'లలో జాబిర్ (రజి) ఉల్లేఖనం ఏమంటుందంటే, గ్రహణం తీవ్రమయిన వేసవి కాలంలో పట్టింది. కాగా; సూర్యగ్రహణం ఇబ్రాహీం (రజి) మరణం నాడు పట్టిందనీ, అది జనవరి మాసమని ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఈ మాసంలో తీవ్రంగా వేసవి కాదు, చలి ఉంటుంది. కాబట్టి ఈ సంఘటనలు వేర్వేరని దీన్నిబట్టి అవగతమవుతున్నది.

ఇక మనం అల్లామా ఖాజీ ముహమ్మద్ సల్మాన్ విశదీకరించిన ఖగోళ శాస్త్ర లెక్కల్ని పరిశీలిద్దాం- ఆయన ప్రకారం 'మక్కా విజయం' తరువాత మనకు మూడు గ్రహణాల ఆధారాలు లభిస్తున్నాయి. తొలి గ్రహణం హిజ్రీ 9, రబీవుల్ ఆఖిర్ 28వ తేదీన (క్రీ.శ. 630, ఆగస్టు 13వ తేదీ) పట్టింది. అది ఆగస్టు నెల. అరేబియా ద్వీపంలో ఈ నెలలో ఎండలు తీవ్రంగా ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. రెండవ గ్రహణం హిజ్రీ 9, షవ్వాల్ నెల 29వ తేదీ (క్రీ.శ. 631, ఫిబ్రవరి)న సంభవించింది. మూడవ గ్రహణం హిజ్రీ 10, షవ్వాల్ నెల 28వ తేదీన (క్రీ.శ. 632 జనవరి 27వ తేదీన) పట్టింది.

ఖగోళ శాస్త్ర లెక్కల్ని, హదీసులలో ప్రస్తావనకు వచ్చిన నమాజె కుసూఫ్‌లను మనం కలిపిచూస్తే గ్రహణాలు కనీసం రెండు అని రూఢీ అవుతుంది. ఒక గ్రహణం ఎండాకాలంలో - ఆగస్టు నెలలో - పట్టింది. రెండవది ఇబ్రాహీం మరణ సందర్భంగా - జనవరి నెలలో - పట్టింది. మూడవ సూర్యగ్రహణం ఫిబ్రవరి నెలలో పట్టింది. ఈ గ్రహణం మదీనాలో కూడా కనిపించిందా? లేదా? అన్నది ఖచ్చితంగా తెలీదు. ఈ సంఘటనలన్నింటి ద్వారా విదితమయ్యేదేమిటంటే ఆ కాలంలో సూర్యగ్రహణం అనేకసార్లు పట్టింది.

ఇబ్రాహీం మరణం నాడు పట్టిన గ్రహణం గురించి కూడా వివిధ ఉల్లేఖనాలు ఉన్నాయి. ఆ ఉల్లేఖనాల మధ్య కూడా కొంత వ్యాఘాతం కనిపిస్తుంది. ఆనాటి నమాజె కుసూఫ్ - ఒక్కో రకత్ రెండేసి రుకూలతో చేయబడిందని పెక్కు ఉల్లేఖనాలు చెబుతున్నాయి. కాని ముస్లింలోని ఉల్లేఖనం మాత్రం మూడేసి రుకూలతో ఒక్కో రకత్ నెరవేర్చబడిందని ఉంది. కాబట్టి ఈ సంఘటనకు సంబంధించిన హదీసులలో ఏర్పడిన వైరుధ్యాన్ని, వ్యాఘాతాన్ని దూరం చేయటం సాధ్యంకాదు. కాకపోతే ఒక్కో రకత్ రెండేసి రుకూలతో చేయబడిందని చెబుతున్న ఉల్లేఖనాలు దృఢమైనవిగా, ఎక్కువ ప్రమాణబద్ధమైనవిగా కనిపిస్తున్నాయి. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ బుఖారీ (రహ్మ.లై), ఇమామ్ ఇబ్నె తైమియ (రహ్మ.లై), ఆధునిక ధర్మవేత్తలలో షా వలియుల్లా (రహ్మ.లై) ప్రభృతులు కూడా రెండేసి రుకూలతో కూడిన నమాజె కుసూఫే ఎక్కువ అనుసరణీయమని అభిప్రాయపడ్డారు.

(٤٠٤) وَعَنْ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَا هَبَّتِ الرِّيْحُ قَطُّ، إِلاَّ جَثَا النَّبِيُّ ﷺ عَلَى رُكْبَتَيْهِ، وَقَالَ: «اللَّهُمَّ اجْعَلْهَا

404. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : వేగంగా పెనుగాలులు వీచినపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) మోకాళ్లపై కూర్చుని (దైవ సమక్షంలో) ఈ విధంగా వేడుకునేవారు:

رَحْمَةً، وَلاَ تَجْعَلْهَا عَذَاباً». رَوَاهُ الشَّافِعِيُّ وَالطَّبَرَانِيُّ.

"దేవా! ఈ గాలిని కారుణ్య పవనంగా చేయి. శిక్షగా మార్చకు." (దీనిని షాఫయి, తబ్రానీ - ఇరువురూ ఉల్లేఖించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే పెను గాలులు వీస్తున్నప్పుడు, భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు దాసులు దైవకారుణ్యాన్ని ఆశిస్తూ, కడు దీనంగా దైవాన్ని ప్రార్థించాలి. పెనుగాలుల వల్ల సంభవించే నష్టం నుండి కాపాడమని వేడుకోవాలి. కురిసే వర్షాన్ని ప్రాణుల కోసం లాభదాయకంగా చేయమని దుఆ చేయాలి.

(٤٠٥) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ صَلَّى فِي زَلْزَلَةٍ سِتَّ رَكَعَاتٍ، وَأَرْبَعَ سَجَدَاتٍ، وَقَالَ: هٰكَذَا صَلاَةُ الآيَاتِ. رَوَاهُ الْبَيْهَقِيُّ، وَذَكَرَ الشَّافِعِيُّ عَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِثْلَه، دُوْنَ آخِرِهِ.

405. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారిచే ఈ హదీసు కూడా ఉల్లేఖించబడింది. ఈయన భూకంపం వచ్చినపుడు నాలుగు సజ్దాలు, ఆరు రుకూలతో నమాజ్ చేశారు. 'దైవ నిదర్శనాల నమాజ్ ఈ విధంగానే చేయబడుతుంద'ని ఆయన (రజి) అన్నారు. (దీనిని బైహఖీ ఉల్లేఖించారు. హజ్రత్ అలీ (రజి) ఆధారంతో షాఫయి కూడా ఇలాగే సంగ్రహించారు. అయితే ఇందులో ఉల్లేఖనంలోని చివరి పలుకులు లేవు)

**సారాంశం**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చి నష్టం వాటిల్లినప్పుడు ఈ విధంగా నమాజ్ చేయాలని పై హదీసు చెబుతోంది. దీనిని "సలాతుల్ ఆయాత్" గా వ్యవహరిస్తారు. కష్టకాలంలో, పరీక్షా ఘడియలలో తమను సృష్టించిన వాని వైపునకే మరలాలి. ఆయన్నే వేడుకోవాలి. దైవేతరులను వేడుకోవటం, కష్టాలనుండి గట్టెక్కించమని మిథ్యా దైవాలను మొరపెట్టుకోవటం షిర్క్‌గా పరిగణించబడుతుంది. షిర్క్ చాలా పెద్ద అన్యాయం. ఈ అన్యాయానికి పాల్పడిన వారిని దేవుడు సుతరామూ క్షమించడు. కనుక ముస్లింలు ఎలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లోనూ దైవకారుణ్యం పట్ల నిరాశ చెందకుండా - ఆశావహ దృక్పథంతో - ఆయన్ని ప్రార్థించాలి.

16వ అధ్యాయం

## వర్షం కొరకు నమాజ్ (సలాతుల్ ఇస్తిస్ఖా)

## ١٦ - بَابُ صَلاَةِ الاسْتِسْقَاءِ

(٤٠٦) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما قَالَ: خَرَجَ النَّبِيُّ ﷺ مُتَوَاضِعاً، مُتَبَذِّلاً، مُتَخَشِّعاً، مُتَرَسِّلاً، مُتَضَرِّعاً، فَصَلَّى رَكْعَتَيْنِ، كَمَا يُصَلِّي فِي الْعِيْدِ، لَمْ يَخْطُبْ خُطْبَتَكُمْ هٰذِهِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَأَبُو عَوَانَةَ وَابْنُ حِبَّانَ.

406. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారు ఇలా తెలిపారు - "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో అణకువతో, నిరాడంబరమైన దుస్తుల్లో వినయ వినమ్రతలు ఉట్టిపడుతుండగా (వర్షం కొరకు వేడుకునే ఉద్దేశ్యంతో) నమాజ్‌కై బయటికి వెడలారు. పండుగ నమాజ్ మాదిరిగా ప్రజలకు రెండు రకతుల నమాజ్ చేయించారు. మీ ప్రసంగం వలె ప్రసంగించలేదు." (ఈ ఉల్లేఖనాన్ని ఐదుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ, అబూ అవానా, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమయిన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) 'నమాజె ఇస్తిస్ఖా' సామూహికంగా చేసినట్టు ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. 'ఇస్తిస్ఖా' అంటే నీళ్ల కోసం అర్థించటం, దరఖాస్తు పెట్టుకోవటం అని అసలు అర్థం. షరీయత్ పరిభాషలో 'ఇస్తిస్ఖా' అంటే ఒక ప్రత్యేక స్ఫూర్తితో, భావోద్రేకంతో దైవసమక్షంలో మొరపెట్టుకోవటం అని భావం. ఇస్తిస్ఖా మూడు రకాలు. (1) అల్పస్థాయి ఇస్తిస్ఖా (2) మధ్య స్థాయి ఇస్తిస్ఖా (3) ఉన్నతస్థాయి ఇస్తిస్ఖా.

అల్పస్థాయి ఇస్తిస్ఖాలో వర్షం కోసం సాధారణంగా దుఆ చేయటం జరుగుతుంది. మధ్య రకం ఇస్తిస్ఖాలో నమాజ్ తరువాత వర్షాన్ని కోరుతూ వేడుకోవటం జరుగుతుంది. ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాలో కొంతమంది కలసి, ఓ ప్రత్యేక వాతావరణాన్ని సృజిస్తారు. ఏదయినా బహిరంగ ప్రదేశంలో అందరూ ఒకచోట చేరి అత్యంత అణకువతో, ఆర్ద్రతతో దైవకారుణ్యంపట్ల పూర్తి ఆశతో, నమ్మకంతో ప్రార్థన చేస్తారు. దైవసమక్షంలో తమ అశక్తతను వెల్లడిస్తూ, వర్షం కురిపించి కష్టాలు తీర్చమని దీనాతిదీనంగా దుఆ చేస్తారు. ఇది ఉన్నతస్థాయి ఇస్తిస్ఖాగా భావించబడుతుంది.

దైవప్రవక్త (సఅసం) కేవలం 'దుఆ' ద్వారా కూడా వర్షాన్ని అర్థించినట్లు ఆధారాలున్నాయి. ఒకసారి ఆయన (స) జుమా ప్రసంగం చేస్తుండగా ఒక వ్యక్తి లేచి నిలబడి వర్షం కోసం దైవాన్ని

ప్రార్థించమని ఆయన్ని (స) అభ్యర్థించాడు. ఆయన (స) వేదికపై నిలబడి దుఆ చేశారు. దేవుడు ఆయన (స) మొరను ఆలకించాడు. వర్షం మొదలయింది. తరువాతి శుక్రవారం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. ఉపన్యాసకుడు ఉపన్యాస వేదికనుండి వర్షం కోసం ప్రార్థించవచ్చునన్నదానికి ఈ సంఘటన ఒక దృష్టాంతం. ఆ సమయంలో అతడు ఖిబ్లా వైపునకు తిరిగి ఉండవలసిన అవసరం లేదు. ఖుత్బా సమయంలో ఖతీబ్ (ప్రసంగకర్త)తో అత్యవసరమయిన అభ్యర్థన చేసుకోవచ్చునీ, ఖతీబ్ కూడా ఇతరుల అభ్యర్థనలను ఆమోదించవచ్చునీ ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

దైవప్రవక్త (సఅసం) గారు నమాజె ఇస్తిస్ఖాను పండుగ నమాజ్ తరహాలో చేసేవారని ఈ హదీసు చెబుతోంది. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేసే ప్రసంగం చాలా సంక్షిప్తంగా ఉండాలి. ప్రసంగ ఉద్దేశ్యాన్ని ప్రసంగకర్త విస్మరించకూడదు. విషయంతో సంబంధం లేని మాటలను ప్రస్తావించి ఎక్కువ నమయం వృధా చేయకూడదు. షాహ్ వలీయుల్లాహ్ ముహద్దిస్ దహ్లవీ (రహ్మ.లై) తన విశ్వవిఖ్యాత పుస్తకం "హుజ్జతుల్లాహిల్ బాలిఘ"లో ఇలా వ్రాశారు:

"దైవప్రవక్త (స) గారి నమాజె ఇస్తిస్ఖా గురించి పలు ఉల్లేఖనాలు ఉన్నాయి. మస్నూన్ (సాంప్రదాయిక) పద్ధతి ఏమంటే పట్టణ (లేక గ్రామ) ప్రజలంతా ఒకచోట - బహిరంగ ప్రదేశంలో - సమావేశమవ్వాలి. చినిగిన దుస్తులు (పాతబట్టలు) ధరించాలి. భయభక్తులతో, కుమిలిపోతూ దైవాన్ని వేడుకోవాలి. ఆ తరువాత ఇమామ్ వారికి రెండు రకతుల నమాజ్ చేయించాలి. ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా చేయాలి. తరువాత ప్రసంగించాలి. ఖిబ్లా వైపునకు తిరిగి 'దుఆ' చేయాలి. ఈ సమయంలో దుప్పటిని తిరగవేయాలి."

(٤٠٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: شَكَا النَّاسُ إِلَى رَسُولِ اللهِ ﷺ قُحُوطَ الْمَطَرِ، فَأَمَرَ بِمِنْبَرٍ، فَوُضِعَ لَهُ فِي الْمُصَلَّى، وَوَعَدَ النَّاسَ يَوْماً يَخْرُجُوْنَ فِيْهِ، فَخَرَجَ حِيْنَ بَدَا حَاجِبُ الشَّمْسِ، فَقَعَدَ عَلَى الْمِنْبَرِ، فَكَبَّرَ وَحَمِدَ اللَّهَ، ثُمَّ قَالَ: إِنَّكُمْ شَكَوْتُمْ جَدْبَ دِيَارِكُمْ، وَقَدْ أَمَرَكُمُ اللَّهُ أَنْ تَدْعُوْهُ، وَوَعَدَكُمْ أَن يَسْتَجِيْبَ لَكُمْ، ثُمَّ قَالَ: اَلْحَمْدُ للهِ رَبِّ الْعَالَمِيْنَ، الرَّحْمَنِ الرَّحِيمِ، مَالِكِ يَوْمِ الدِّيْنِ، لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، يَفْعَلُ مَا يُرِيْدُ، اللَّهُمَّ أَنْتَ اللَّهُ، لاَ إِلَهَ إِلاَّ أَنْتَ، أَنْتَ الْغَنِيُّ، وَنَحْنُ الْفُقَرَاءُ، أَنْزِلْ عَلَيْنَا الْغَيْثَ، وَاجْعَلْ مَا أَنْزَلْتَ عَلَيْنَا قُوَّةً وَبَلاَغاً إِلَى

407. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : వర్షాలు కురవకపోవటం మూలంగా కరువు ఏర్పడిందని ప్రజలు దైవప్రవక్త (సఅసం)కు ఫిర్యాదుచేసుకున్నారు. వేదిక (మింబర్)ను ఈద్గాహ్‌కు తరలించమని ఆయన (స) ఆజ్ఞాపించారు. వేదిక ఈద్గాహ్‌కు తరలించబడింది. ప్రజలు ఒక రోజు తామంతా బహిరంగ ప్రదేశానికి వస్తామని వాగ్దానం చేశారు. ఆయన (సఅసం) స్వయంగా ఆ రోజు ఉదయం ఇంటినుండి వెడలి వచ్చారు. సూర్యుడు ఆకాశపుటంచున ఉదయించగానే ఆయన వచ్చి వేదికపై కూర్చున్నారు. అల్లాహు అక్బర్ అని పలికి, ఆ తరువాత దైవస్తోత్రం చేశారు.

حِيْنِ. ثُمَّ رَفَعَ يَدَيْهِ، فَلَمْ يَزَلْ حَتَّى رُئِيَ بَيَاضُ إِبِطَيْهِ، ثُمَّ حَوَّلَ إِلَى النَّاسِ ظَهْرَهُ، وَقَلَّبَ رِدَاءَهُ، وَهُوَ رَافِعٌ يَدَيْهِ، ثُمَّ أَقْبَلَ عَلَى النَّاسِ، وَنَزَلَ، وَصَلَّى رَكْعَتَيْنِ، فَأَنْشَأَ اللَّهُ تَعَالَى سَحَابَةً، فَرَعَدَتْ، وَبَرَقَتْ، ثُمَّ أَمْطَرَتْ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَقَالَ: غَرِيْبٌ، وَإِسْنَادُهُ جَيِّدٌ.

దేవుని గొప్పదనాన్ని కొనియాడారు. తరువాత (ప్రజలనుద్దేశ్యించి) సెల విచ్చారు - "మీరు మీమీ ప్రాంతాల్లో సంభవించిన దుర్భిక్షం గురించి ఫిర్యాదు చేశారుకదూ! తనను వేడుకోమనీ, తాను మీ మొరలను ఆలకించి ఆమోదిస్తానని అల్లాహ్ ఆదేశించాడు." ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ప్రశంసలు పొగడ్తలు సర్వలోక ప్రభువైన అల్లాహ్‌కే శోభిస్తాయి. జనుల పాలిట ఆయన అపార కరుణామయుడు. పరమకృపాశీలుడు. తీర్పు దినపు యజమాని. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన తలచుకున్న దల్లా చేసితీర్తాడు. దేవా! నీవే దైవానివి. నీవు తప్ప మరో పూజనీయుడు లేడు. నీవు అక్కరలేనివాడవు. మేము అభాగ్యులము, నిరాధార జీవులము. మాపై నీ కారుణ్యాన్ని కురిపించు. నీవు మాపై కురిపించే దానిని మా కొరకు ఉపాధిగా, సుదీర్ఘకాలం దాకా సమకూరే సాధనంగా చెయ్యి." ఆ తరువాత ఆయన (సఅసం) తన రెండు చేతుల్నీ పైకి ఎత్తారు. అవి క్రమక్రమంగా పైకి లేవసాగాయి. ఆ సమయంలో ఆయన చంకల తెలుపు దనం సయితం కానరాసాగింది. తరువాత ఆయన ప్రజలకు వెన్నుచూపి నిలబడ్డారు. తన (భుజాలపై ఉన్న) దుప్పటిని తిరగవేసుకున్నారు. ఆ సమయంలో ఆయన (స) తన రెండు

చేతుల్నీ పైకి లేపి ఉన్నారు. ఆ పైన ఆయన (స) ప్రజల వంక తిరిగారు. వేదిక దిగివచ్చి రెండు రకతుల నమాజ్ చేయించారు. ఆ క్షణంలోనే అల్లాహ్ ఆకాశంలో మేఘాలు సృజించాడు. అవి దట్టంగా క్రమ్ముకున్నాయి, గర్జించాయి, మెరుపు తీగలు మెలిక తిరిగాయి, వర్షం కురవసాగింది. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఈ హదీసు 'గరీబ్' కోవకు చెందినదిగా భావించబడింది - అయితే హదీసు అందిన పరంపర మాత్రం ఉత్తమంగా ఉంది)

وَقِصَّةُ التَّحْوِيْلِ فِي الصَّحِيْحِ مِنْ حَدِيْثِ عَبْدِ اللهِ بْنِ زَيْدٍ، وَفِيْهِ: فَتَوَجَّهَ إِلَى الْقِبْلَةِ يَدْعُو، ثُمَّ صَلَّى رَكْعَتَيْنِ، جَهَرَ فِيْهِمَا بِالْقِرَاءَةِ.

సహీహ్ బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ జైద్ (రజి) ఉల్లేఖనంలో దుప్పటి (తిప్పు కున్న) సంఘటన ఇలా వుంది - "ఆయన (స) ఖిబ్లా వైపునకు తిరిగారు. దుఆ చేయసాగారు. అనంతరం రెండు రకతుల నమాజ్ చేయించారు. ఈ సందర్భంగా బిగ్గరగా ఖుర్ఆన్ పారాయణం చేశారు." దారె ఖుత్నీలో అబూ జాఫర్ బాఖిర్ గారి 'ముర్సల్' ఉల్లేఖనంలో, "దుర్భిక్షం కూడా ఈ దుప్పటి మాదిరిగా మారిపోవాలన్న దానికి సంకేతంగా ఆయన (స) దుప్పటిని తిరగవేశారు" అని వుంది.

وَلِلدَّارَقُطْنِيِّ مِنْ مُرْسَلِ أَبِي جَعْفَرٍ الْبَاقِرِ: وَحَوَّلَ رِدَاءَهُ لِيَتَحَوَّلَ الْقَحْطُ.

**సారాంశం**

'నమాజె ఇస్తిస్ఖా' సందర్భంగా మస్జిద్‌లోని వేదికను బహిరంగ స్థలానికి తీసుకు వెళ్లవచ్చునని దీని ఆధారంగా తెలుస్తున్నది. పండుగ నమాజ్ కొరకు వేదికను ఉపయోగించలేరు. నమాజె ఇస్తిస్ఖా సందర్భంగా చేతులు బాగా పైకెత్తి దుఆ చేయాలని కూడా ఈ హదీసు చెబుతోంది. హజ్రత్ అనస్ (రజి) మాటల్లోనే చెప్పాలంటే దైవప్రవక్త (సఅసం) ఈ సందర్భంగా చేతులు

పైకెత్తినంతగా మరెన్నడూ ఎత్తలేదు. చేతులెత్తి దుఆ చేసే విషయమై ఇమామ్ నవవీ (రహ్మ్) 30 హదీసులను సేకరించారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే చేతులెత్తి వేడుకోవటం కూడా సంప్రదాయమే. ప్రసంగం 'బిస్మిల్లాహ్' తో కాకుండా 'అల్ హమ్దులిల్లాహ్'తో ఆరంభించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా మన ముందుకు వచ్చింది. దైవస్తోత్ర వచనాలతో తప్ప వేరే వాక్యాలతో ప్రసంగాన్ని మొదలెట్టడం సమంజసం కాదు.

## హదీసు ఉల్లేఖకులు (అబూ జాఫర్ బాఖిర్ - రహ్మ్)

అసలు పేరు ముహమ్మద్ బిన్ అలీ జైనులాబిదీన్ బిన్ హుసైన్ బిన్ అలీ బిన్ అబూ తాలిబ్. అబూ జాఫర్ బాఖిర్ మారుపేరు. ఈయన హజ్రత్ అలీ (రజి)గారి మనవడు. హజ్రత్ హుసైన్ (రజి) గారి కుమారుడు. షియా వర్గం నమ్మకం ప్రకారం వాళ్ల 12 ఇమాముల పరంపరలో ఈయన ఐదవవారు. ఈయన జ్ఞాననంపద అపారమైనది. అందుకే ఈయన 'బాఖిర్' గా పిలువబడ్డారు. గొప్పపండితులు. హిజ్రీ 56లో జన్మించారు. హిజ్రీ 117లో 63 ఏళ్ళ వయస్సులో మరణించారు. జన్నతుల్ బఖీ ఖననవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

(٤٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً دَخَلَ الْمَسْجِدَ يَوْمَ الْجُمُعَةِ، وَالنَّبِيُّ ﷺ قَائِمٌ يَخْطُبُ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! هَلَكَتِ الْأَمْوَالُ، وَانْقَطَعَتِ السُّبُلُ، فَادْعُ اللَّهَ يُغِيثُنَا، فَرَفَعَ يَدَيْهِ، ثُمَّ قَالَ: «**اللَّهُمَّ أَغِثْنَا، اللَّهُمَّ أَغِثْنَا، اللَّهُمَّ أَغِثْنَا**»، فَذَكَرَ الْحَدِيثَ، وَفِيهِ الدُّعَاءُ بِإِمْسَاكِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

408. హజ్రత్ అనస్ (రజి) కథనం : ఒక వ్యక్తి శుక్రవారం నాడు మస్జిద్‌లో ప్రవేశించాడు. ఆ సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిలబడి ఉపన్యసిస్తున్నారు. 'ఓ దైవ ప్రవక్తా (స)! (పశు) సంపద నాశనమై పోయింది. రాకపోకల మార్గాలు (వాణిజ్య సంబంధాలు) స్తంభించాయి. మాపై వర్షం కురిపించమని కాస్త దైవ సన్నిధిలో ప్రార్థించండి' అని ఆ వ్యక్తి విన్నవించుకున్నాడు. ఆయన (స) అప్పటికప్పుడే చేతులెత్తి ఇలా ప్రార్థించారు, "ఓ దేవా! మా విన్నపాన్ని మన్నించి వర్షం కురిపించు. ఓ దేవా!! మా మొరను ఆలకించి మాపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి."..... ఈ విధంగా హదీసునంతటినీ వివరించారు. ఇందులో వర్షం ఆపమని ప్రార్థించిన ప్రస్తావన కూడా ఉంది. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్తలు సయితం అక్కరలు తీర్చమని దేవున్నే వేడుకుంటారనీ, వారంతట వారుగా ఏమీ చెయ్యజాలరని, ఆఖరికి అంతిమ దైవప్రవక్త (సఅసం) సయితం తనంతట తానుగా తన అనుచర సమాజానికి ఏమీ చెయ్యలేరని ఈ హదీసు స్పష్టంచేస్తోంది. అలాగే దైవప్రవక్త (స) నేరుగా దైవాన్నే ప్రార్థించారు. మధ్యలో ఇతర ప్రవక్తల ఆసరాగానీ, సిఫారసుగానీ పొందలేదు. ప్రవక్త ప్రియసహచరులు సయితం; తమకేదైనా ఆపద వచ్చిపడితే దాన్ని తొలగించగలవాడు కేవలం అల్లాహ్‌యేనని దృఢంగా విశ్వసించేవారు. దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చిన వ్యక్తి, తమ ప్రాంతంలో వర్షం కురిపించమని ప్రవక్త (స) ను కోరలేదు, వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించమని మాత్రమే విన్నవించుకున్నాడు. ఇదే తౌహీద్ (ఏక దైవారాధన).

దైవప్రవక్తలకు అగోచర జ్ఞానముండదు. అగోచర జ్ఞానమే గనక మహాప్రవక్త (స)కు ఉండివుంటే దుర్భిక్షం తాండవిస్తున్న ప్రాంత ప్రజల కష్టసుఖాలు ముందుగానే ఆయనకు తెలిసి ఉండేవి. కాని ఆ వ్యక్తి వచ్చి తమ బాధలు చెప్పుకున్న మీదటే అసలు సంగతి ఆయనకు అవగతమయ్యింది.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి. అబూ సుఫ్యాన్ అని కొంతమంది అభిప్రాయపడ్డారు. కాని అప్పటికింకా ఆయన ఇస్లాం స్వీకరించలేదు. విన్నపం చేసుకున్న తీరునుబట్టి ఆ వ్యక్తి తప్పక ముస్లిం అయి ఉంటాడని అర్థమవుతున్నది. అతడే గనక ముస్లిం కాకపోయినట్లయితే వర్షం కురిపించమని నేరుగా దైవప్రవక్తనే అభ్యర్థించి ఉండేవాడు.

ఈ హదీసు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే వర్షం కొరకు ఆయన (స) కేవలం 'దుఆ' చేశారు. నమాజ్ చేయలేదు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ్‌లై) బహుశా ఈ హదీసు ఆధారంగానే కాబోలు 'వర్షం కొరకు దుఆ చేస్తే సరిపోతుంది, నమాజ్ చేయవలసిన అవసరం లేద'ని అభిప్రాయపడ్డారు. అయితే ఇతర హదీసుల ద్వారా నమాజ్ కూడా చేయవచ్చని రూఢీ అవుతున్నది.

వివిధ ఉల్లేఖనాలన్నింటినీ ఒకచోట చేర్చి, వాటిని జోడిస్తే ఆయన (స) 6 పద్ధతుల్లో వర్షం కొరకు దైవాన్ని అర్థించారన్న వాస్తవం మన ముందుకు వస్తుంది. (1) ఒకసారి ఆయన (స) జనులను ఈద్గాహ్‌లోకి పిలుచుకు వెళ్ళి నమాజ్ చేయించారు, ప్రసంగించారు, వేడుకోలు చేశారు. (2) ఒకసారి జుమా ప్రసంగం సందర్భంగా వేదికపైనుంచి కేవలం దుఆ చేశారు. (3) ఒకసారి ఆయన (స) వేదికను తెప్పించి, దానిపై కూర్చుని దుఆ చేశారు. (4) ఒకసారి నమాజ్ ముగించిన పిదప అందరితో కలసి సామూహిక దుఆ చేశారు. (5) ఒకసారి జనవాసాలను దాటి (బహిరంగ స్థలానికి) వచ్చి 'అహ్‌జారుజ్జైత్' అనే స్థలంలో దుఆ చేశారు. (6) ఒకసారి యుద్ధసమయంలో వర్షం కొరకు అల్లాహ్‌ను ప్రార్థించారు.

409. హజ్రత్ అనస్ (రజి) కథనం : ప్రజలు కరువు కాటకాలకు గురైనపుడు హజ్రత్ ఉమర్ (రజి) గారు హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి)ను మధ్యవర్తి (వసీలా)గా చేసి వర్షం కొరకు

(٤٠٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ كَانَ إِذَا قَحَطُوا اسْتَسْقَى بِالْعَبَّاسِ بْنِ عَبْدِ الْمُطَّلِبِ، وَقَالَ:

اللَّهُمَّ إِنَّا كُنَّا نَسْتَسْقِيْ إِلَيْكَ بِنَبِيِّنَا فَتَسْقِيْنَا، وَإِنَّا نَتَوَسَّلُ إِلَيْكَ بِعَمِّ نَبِيِّنَا فَاسْقِنَا، فَيُسْقَوْنَ. رَوَاهُ الْبُخَارِيُّ.

అర్థించేవారు. ఆయన (రజి) ఈ విధంగా వేడుకునేవారు: "ఓ దేవా! మేము నిన్ను నీ ప్రవక్త (సఅసం) ఆధారంగా వర్షం కొరకు ప్రార్థించగా నీవు మాపై దయ దలచి వర్షం కురిపిస్తూ ఉండేవాడివి. మరి ఇప్పుడు నీ ప్రవక్త (సఅసం) పిన తండ్రిని మధ్యవర్తిగా నీ సమక్షంలోనికి తీసుకువచ్చాము. కనుక నీవు మాపై వర్షాన్ని కురిపించి మా కష్టాలు తీర్చు." (ఈ దుఆ స్వీకారానికి ప్రతీకగా) వారిపై వర్షం కురిసేది. (బుఖారీ)

**సారాంశం**

సమాధి పూజ చేసే వారికీ, చిల్లర దేవుళ్లను ఆశ్రయించేవారికి ఈ హదీసు 'ఒక ఆయుధం'గా తోడ్పడింది. ఈ హదీసులోని భావాన్ని వక్రీకరించి అమాయక జనులను పెడత్రోవ పట్టించడంలో వారు చాలామటుకు సఫలీకృతులయ్యారు. ప్రవక్త ప్రియసహచరులంతటివారే పుణ్యపురుషులను మధ్యవర్తి (వసీలా) గా చేసుకున్నప్పుడు మనం అలా చేయటంలో అభ్యంతరం ఏముందీ? అని వీళ్లు వేలకొలదీ ప్రశ్నలను ఉత్పన్నం చేశారు. వాస్తవానికి ఈ హదీసుకు ఈ మహానుభావులు చెబుతున్న భాష్యం తప్పుడు భాష్యం. వీళ్లు బ్రతికివున్న వాళ్ళనేకాదు, చనిపోయినవాళ్ళనీ, దగ్గరవున్న వాళ్ళనీ, లేనివాళ్ళనీ, వాళ్ల పేర్లనూ కూడా 'వసీలా'గా చేస్తున్నారు. కాగా; కేవలం బ్రతికి ఉన్న వాళ్ళను దుఆ కొరకు మధ్యవర్తిగా ఉదాహరించవచ్చని మాత్రమే ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ మహానుభావులు తలపోస్తున్నట్లుగా మరణించిన వారిని కూడా 'వసీలా'గా ఆశ్రయించటం ధర్మసమ్మతమై ఉంటే ప్రవక్త (స) గారి పినతండ్రిని మధ్యవర్తిగా చేయవలసిన ఖర్మ హజ్రత్ ఉమర్ (రజి)గారికి ఎందుకు పట్టేది? నేరుగా ఆయన దైవప్రవక్త (స)నే మధ్యవర్తి (వసీలా) గా చేసుకుని ఉండేవారుకదా! కాని ఇటువంటి 'వసీలా'కు సంబంధించి ఖుర్ఆన్‌లోగానీ, హదీసు లోగానీ ఎక్కడా ఎలాంటి సూచనా లేదు.

ఈ హదీసు మనకు మూడు విషయాలను నొక్కి పలుకుతోంది. ఒకటి: వర్షాన్ని కోరుతూ ప్రార్థించదలచినపుడు సజ్జనులను, దైవప్రవక్త (స) వంశానికి చెందిన దైవభక్తిపరాయణుడ్ని వెంటబెట్టుకు వెళ్ళవచ్చు. ఈ హదీసు ద్వారా హజ్రత్ అబ్బాస్ (రజి)గారి ధర్మపరాయణత, పెద్దరికం వ్యక్తమవుతున్నాయి. దైవప్రవక్త (సఅసం) కుటుంబీకులలో ఆయన (రజి) నిజంగానే కీలకమయిన వ్యక్తి, పెద్దమనిషి. ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి)లోని వినయ వినమ్రతలు కూడా ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నాయి. ఆయన ఒక ఖలీఫా అయివుండి కూడా దైవప్రవక్త (స)

కుటుంబీకుల్లోని ఒక ప్రముఖ వ్యక్తికి పెద్దపీట వేశారు. ప్రార్థన కోసం హజ్రత్ అబ్బాస్ (రజి)ను మధ్యవర్తిగా ఉంచారు. బ్రతికివున్న మనిషి చనిపోయిన వ్యక్తికన్నా అధమశ్రేణికి చెందినవాడైనప్పటికీ, అతని చేతనే దుఆ చేయించాలన్న విషయం కూడా ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. చనిపోయిన వ్యక్తి 'వసీలా'ను ఆశ్రయించటం షరీయత్‌పరంగా నిరూపితం కాలేదు.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) దైవప్రవక్త (సఅసం) కు స్వయాన పినతండ్రి. ఈయన నామాంతరం అబుల్ ఫజల్. కాబా గృహ వ్యవహారాల పర్యవేక్షణ, హజ్ యాత్రీకులకు మంచినీరు సరఫరా చేయటం వంటి బాధ్యతలు ఈయనపై ఉండేవి. 'అఖబా ఒప్పందం' సందర్భంగా ఈయన కూడా హాజరయ్యారు. ఒప్పందానికి కట్టుబడి ఉండవలసిన ఆవశ్యకతను అన్సార్లకు నొక్కి చెప్పడానికి ఆయన ఆ సందర్భంగా అక్కడికి వచ్చారు. విచిత్రమేమిటంటే అప్పటికింకా ఆయన ముస్లిం కారు. బద్ర్ యుద్ధంలో యుద్ధ ఖైదీగా పట్టుబడ్డారు. మక్కా విజయానికి కొన్నాళ్ల క్రితమే ఇస్లాం స్వీకరించారు. ఆ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. హునైన్ యుద్ధం జరిగిన రోజున మొక్కవోని వీరునిలా నిలిచారు. హిజ్రి 32వ సంవత్సరం రజబ్ లేక రమజాన్ నెలలో కన్ను మూశారు. మదీనాలోని జన్నతుల్ బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٤١٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَصَابَنَا – وَنَحْنُ مَعَ رَسُولِ اللهِ ﷺ – مَطَرٌ، قَالَ: فَحَسَرَ ثَوْبَهُ حَتَّى أَصَابَهُ مِنَ الْمَطَرِ، وَقَالَ: إِنَّهُ حَدِيثُ عَهْدٍ بِرَبِّهِ. رَوَاهُ مُسْلِمٌ.

410. హజ్రత్ అనస్ (రజి) గారే ఈ విధంగా ఉల్లేఖించారు: "మేమొకసారి వర్షంలో చిక్కుకున్నాము. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా మా వెంట వున్నారు. ఆయన (సఅసం) తన భుజాలపై ఉన్న వస్త్రాన్ని పైకి ఎత్తుకున్నారు. వర్షపు చినుకులు ఆయన (స) ఒంటిపై పడసాగాయి. 'ఇవి నా ప్రభువు, యజమాని తరపున కొంగ్రొత్త కానుకల రూపంలో ఇవ్వబడుతున్నాయి' అని ఆయన (స) సెలవిచ్చారు." (ముస్లిం)

## సారాంశం

ఈ వర్షం పరమ ప్రభువు తరపున పంపబడింది. మరో విశేషమేమిటంటే ఈ వర్షపు నీటిని అప్పటివరకూ ఏ పాపాత్ముడు కూడా ముట్టుకోలేదు. దుర్మార్గులు, దుష్టులు నివసిస్తున్న ప్రాంతాలకు ఈ నీరు ఇంకా చేరలేదు. అదీగాక ఆ వర్షపు చినుకుల్లో శుభశ్రేయాలు ఎన్నో నిండి ఉండవచ్చు. అందుచేత వర్షపు నీటిలో తడవటం, స్నానం చేయటం ఒక విధంగా మంచిదే.

(٤١١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَأَى الْمَطَرَ قَالَ: «اللَّهُمَّ صَيِّباً نَافِعاً». أَخْرَجَاهُ.

411. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కురవటాన్ని గమనించినప్పుడల్లా ఇలా వేడుకునేవారు - "ఓ అల్లాహ్! ఈ వర్షాన్ని మా కొరకు లాభ సాటిగా, ఫలవంతంగా చెయ్యి."

(బుఖారీ, ముస్లిం)

(٤١٢) وَعَنْ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ دَعَا فِي الاسْتِسْقَاءِ: «اللَّهُمَّ جَلِّلْنَا سَحَاباً كَثِيفاً، قَصِيفاً، دَلُوقاً، ضَحُوكاً، تُمْطِرُنَا مِنْهُ رُذَاذاً، قِطْقِطاً، سَحّاً، يَا ذَا الْجَلاَلِ وَالإِكْرَامِ». رَوَاهُ أَبُو عَوَانَةَ فِي صَحِيحِهِ.

412. హజ్రత్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇస్తిస్ఖా వేడుకోలు ఈ విధంగా చేశారు- "ఓ దేవా! భూమి అంతటినీ క్రమ్ముకున్న మబ్బుల ద్వారా, దట్టమైన మేఘాల ద్వారా, గర్జించే మేఘాల ద్వారా, ధారాపాతంగా కురిసే, మెరిసే, గర్జించే మేఘాల ద్వారా, నిరంతరం వర్షించే మేఘాల ద్వారా మాపై చిటపట చినుకుల రూపంలో అధిక వర్షం కురిపించు- ఓ ఘనతా గౌరవాల అధిపతీ!"

(ముస్నద్ అబూఅవానా)

**సారాంశం**

దుఆయె ఇస్తిస్ఖాలలో ఈ దుఆ ఒకటి. దైవప్రవక్త (సఅసం) వర్షాన్ని కోరుతూ అనేక రకాల దుఆలు చేశారు. వాటిలో దేనినయినా తీసుకోవచ్చు.

(٤١٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: خَرَجَ سُلَيْمَانُ عَلَيْهِ السَّلاَمُ يَسْتَسْقِي، فَرَأَى نَمْلَةً مُسْتَلْقِيَةً عَلَى ظَهْرِهَا، رَافِعَةً قَوَائِمَهَا إِلَى

413. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలియజేశారు : "హజ్రత్ సులైమాన్ - అలైహిస్సలాం - వర్షాన్ని అర్థించటానికి బయటికి వచ్చారు. ఆ సమయంలో ఒక చీమ తన వెనుకటి కాళ్లను ఆకాశం వైపునకు ఎత్తి దైవాన్ని వేడుకోవటం ఆయన గమనించారు.

السَّمَاءِ، تَقُولُ: اللَّهُمَّ إِنَّا خَلْقٌ مِنْ خَلْقِكَ، لَيْسَ بِنَا غَنًى عَنْ سُقْيَاكَ، فَقَالَ: «ارْجِعُوا فَقَدْ سُقِيتُمْ بِدَعْوَةِ غَيْرِكُمْ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ الْحَاكِمُ.

ఆ చీమ ఇలా వేడుకోసాగింది: "దేవా! నీవు సృష్టించిన ఇతర ప్రాణుల మాదిరిగానే మేము నీ ప్రాణులం. నీ వర్షపు నీరు లేకుండా మేము కూడా మనజాలము." ఇది విన్నంతనే హజ్రత్ సులైమాన్ అలైహిస్సలాం, "తిరిగి వెళదాం పదండి, ఇతర జీవాల ప్రార్థనా ఫలంగా మీపై వర్షం కురిసినట్లే" అని వ్యాఖ్యానించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

అంతిమ దైవప్రవక్త (సఅసం)కు ముందు గతించిన ప్రవక్తలు కూడా అనావృష్టి ఏర్పడినపుడు ఇళ్లనుండి బయటికి వచ్చి వర్షం కొరకు దైవాన్ని ప్రార్థించేవారని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఒక చిన్న చీమ చేసుకున్న విన్నపం ఆధారంగా ప్రాణులన్నింటికీ వర్షపు నీరు లభ్యమవటం యోచించదగ్గ విషయం. నమాజె ఇస్తిస్ఖా అయినా, దుఆయె ఇస్తిస్ఖా అయినా గ్రామం లేక పట్టణం బయటికి వచ్చి, చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో చేయటం అభిలషణీయం.

(٤١٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ اسْتَسْقَى فَأَشَارَ بِظَهْرِ كَفَّيْهِ إِلَى السَّمَاءِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

414. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్షం కొరకు దుఆ చేసినప్పుడు, రెండు (అర) చేతుల్నీ తిరగవేసి ఆకాశం వైపునకు చాచారు. (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) చేతుల్ని తిరగవేసి దుఆ చేసినట్టు ఉంది. సాధారణంగా ఆయన (స) అలా చేయరు. ఈ రెండు పద్ధతులకూ మధ్య గల వ్యత్యాసాన్ని తెలుపుతూ విద్వాంసులు ఇలా అన్నారు: కారుణ్యాన్ని అర్థిస్తున్నప్పుడు ఆయన (స) చేతుల్ని తిన్నగానే ఉంచేవారు. కాని ఏదైనా దుస్థితినీ, దురవస్థను దూరం చేయమని కోరుతున్నప్పుడు మాత్రం చేతుల్ని తిరగవేసేవారు. పరిస్థితిని ఈ విధంగా మార్చమన్న దానికి సంకేతంగా ఆయన (స) అలా చేసేవారు! దుఆయే ఇస్తిస్ఖా సందర్భంగా ఆయన (స) తన దుప్పటిని తిరగవేయటంలో ఉద్దేశ్యం కూడా బహుశా అదే అయి ఉంటుంది.

**17వ అధ్యాయం**

## వస్త్రధారణ

## ١٧ - بَابُ اللِّبَاسِ

(٤١٥) عَنْ أَبِي عَامِرٍ الْأَشْعَرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيَكُونَنَّ مِنْ أُمَّتِي أَقْوَامٌ يَسْتَحِلُّونَ الْحِرَ وَالْحَرِيرَ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُه فِي الْبُخَارِيِّ.

415. హజ్రత్ అబూ ఆమిర్ అష్‌అరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నా అనుచర సమాజంలో కొన్ని జాతుల వారుంటారు - వారు తప్పక వ్యభిచారాన్నీ, సిల్కు (పట్టు)ను తమ కొరకు ధర్మసమ్మతంగా తలపోస్తారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - దీని మూలం బుఖారీలో వుంది)

### సారాంశం

ఈ హదీసులో రెండు విషయాలు నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేయబడ్డాయి. అవేమంటే; (1) వ్యభిచారం (2) సిల్కు (పట్టు) వస్త్రాలు ధరించటం. సిల్కు వస్త్రాలు మనిషిలో - ముఖ్యంగా మగవారిలో - గర్వాన్నీ, అహంకారాన్నీ పెంపొందిస్తాయి. అందుకే ఇది ఉమ్మత్ కొరకు నిషిద్ధంగా పరిగణించబడింది. పైగా ఈ సిల్కు అత్యంత సున్నితమయింది. లావణ్యంతో కూడుకున్నది. లావణ్యం, సౌకుమార్యం పురుషులకు తగదు. లావణ్యంతో కూడుకున్న దుస్తులు ఆడవారికైతే శోభిస్తాయి. వస్త్ర ధారణలో మగవారు ఆడవారి తరహాలో తయారవటం హరామ్ (నిషిద్ధం).

### హదీసు ఉల్లేఖకులు

అబూ ఆమిర్ అష్‌అరీ (రజి) గారి అసలు పేరు అబ్దుల్లా బిన్ హాని లేదా ఉబైద్ బిన్ వహబ్. ప్రవక్త సహచరునిగా పేర్కొనబడ్డారు. సిరియాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఉమవీ ఖలీఫా అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ పరిపాలనా కాలంలో మరణించారు.

(٤١٦) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ نَشْرَبَ فِي آنِيَةِ الذَّهَبِ وَالْفِضَّةِ، وَأَنْ نَأْكُلَ فِيهَا، وَعَنْ لُبْسِ الْحَرِيرِ وَالدِّيبَاجِ، وَأَنْ نَجْلِسَ عَلَيْهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

416. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేము బంగారు వెండి పాత్రలలో తినటాన్నీ, త్రాగటాన్నీ, పలుచటి మరియు చిక్కటి సిల్కు (పట్టు) వస్త్రాలను ధరించటాన్నీ, వాటిపై కూర్చోవటాన్నీ వారించారు." (బుఖారీ)

(٤١٧) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ لُبْسِ الْحَرِيْرِ، إِلاَّ مَوْضِعَ أُصْبُعَيْنِ أَوْ ثَلاَثٍ أَوْ أَرْبَعٍ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

417. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పట్టు (సిల్కు) వస్త్రాలు ధరించటాన్ని వారించారు. రెండు లేక మూడు లేక నాలుగు అంగుళాలకు సమానంగా ఉంటే ఫరవాలేదు అని అన్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

### సారాంశం

పురుషులు పట్టు వస్త్రాలు ధరించటం షరీయత్ పరంగా నిషిద్ధం (హరామ్). అయితే దురద, ఎలర్జీ తదితర కారణాల దృష్ట్యా - తాత్కాలికంగా - అలాంటి సుతిమెత్తని దుస్తులు తొడుక్కుంటే తప్పులేదు. అదీగాక సాధారణంగా మనం ధరించే దుస్తులకు ఒకటి నుండి నాలుగు అంగుళాల వెడల్పు సిల్కును జోడించినా, డిజైనుగా అతికించినా అందులో తప్పులేదు. కాని పూర్తిగా పట్టుబట్టలు వేసుకోరాదు.

(٤١٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ رَخَّصَ لِعَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ وَالزُّبَيْرِ فِي قَمِيْصِ الْحَرِيْرِ، فِي سَفَرٍ، مِنْ حِكَّةٍ كَانَتْ بِهِمَا. مُتَّفَقٌ عَلَيْهِ.

418. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) మరియు జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) లకు పట్టు (సిల్కు) చొక్కా ధరించటానికి అనుమతి ఇచ్చారు. ఎందుకంటే వారిద్దరికీ దురద (ఎలర్జీ) లాంటిది ఉండేది."

(బుఖారీ, ముస్లిం)

### హదీసు ఉల్లేఖకులు

జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) బిన్ ఖువైలిద్ బిన్ అసద్ ఖురైషీ అసదీ. ఈయన దైవప్రవక్త (స)కు చాలా సన్నిహితులు. దైవప్రవక్త (స) అత్తగారైన సఫియా కుమారులు. ఇహలోకంలోనే స్వర్గలోక శుభవార్త పొందిన పదిమందిలో ఒకరు. యుద్ధాలలో గొప్ప పరాక్రమశాలిగా ఖ్యాతి గడించారు. జమల్ యుద్ధం నుండి తిరిగి వచ్చాక హిజ్రీ 36లో శాశ్వతంగా కన్నుమూశారు.

(٤١٩) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ

419. హజ్రత్ అలీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَسَانِي النَّبِيُّ ﷺ حُلَّةَ سِيَرَاءَ، فَخَرَجْتُ فِيهَا، فَرَأَيْتُ الْغَضَبَ فِي وَجْهِهِ، فَشَقَقْتُهَا بَيْنَ نِسَائِي. مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا لَفْظُ مُسْلِمٍ.

నాకు బంగారు జరీతో నేయబడిన ఒక పట్టుబట్టల జతను బహూకరించారు. నేను దాన్ని తొడిగి బయటికి రాగా దైవప్రవక్త (సఅసం) ముఖం ఆగ్రహంతో కందిపోయినట్టుగా కనిపించింది. అంతే, ఆ జతను విడిచి దాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కుటుంబ మహిళల్లో పంచి పెట్టేశాను." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

ఈ దుస్తులు దైవప్రవక్త (సఅసం)కు 'ఐలా' ప్రాంతపు రాజు నుండి కానుకగా అందాయి. వాటిని ఆయన (స) హజ్రత్ అలీ (రజి)కి ఇవ్వగా ఆయన ధరించి బయటికి వచ్చారు. ఇది చూడగానే దైవప్రవక్త (స) కు కోపం వచ్చింది. "ఇవి నీవు తొడగటానికి కాదు ఇచ్చింది, ఇంటి మహిళల కోసం ఇచ్చాను"అని ఆయన (స) వ్యాఖ్యానించినట్లు సహీహ్ ముస్లింలో ఉంది. హజ్రత్ అలీ ఆ వస్త్రాన్ని చించి తలో ముక్క పంపిణీ చేశారు. దీన్నిబట్టి తెలిసిందేమంటే కానుక మన ఉపయోగంలోకి వచ్చినా, రాకపోయినాసరే - కానుకను మనస్ఫూర్తిగా స్వీకరించవచ్చు.

(٤٢٠) وَعَنْ أَبِي مُوسَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**أُحِلَّ الذَّهَبُ وَالْحَرِيرُ لِإِنَاثِ أُمَّتِي. وَحُرِّمَ عَلَى ذُكُورِهِمْ**». رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ وَصَحَّحَهُ.

420. హజ్రత్ అబూ మూసా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "బంగారం, పట్టు (సిల్కు) నా అనుచర సమాజంలోని స్త్రీలకు ధర్మసమ్మతం గావించబడ్డాయి. అయితే ఇవి పురుషుల కోసం నిషేధించ బడ్డాయి." (దీనిని అహ్మద్, నసాయి, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

స్త్రీలు నగానట్రా రూపంలో బంగారం ధరించవచ్చు. అయితే వాటిని ప్రదర్శించే ఉద్దేశ్యంతో ధరించరాదు. అలాగే స్త్రీలు పట్టు వస్త్రాలు, సుతిమెత్తని దుస్తులు ఉపయోగించవచ్చు. కాని మగవారు వీటిని ధరించకూడదు.

(٤٢١) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**إِنَّ اللَّهَ**

421. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు -

يُحِبُّ إِذَا أَنْعَمَ عَلَى عَبْدِهِ نِعْمَةً، أَنْ يَرَى أَثَرَ نِعْمَتِهِ عَلَيْهِ». رَوَاهُ الْبَيْهَقِيُّ.

"అల్లాహ్ తన దాసుని కెవరికయినా ఏదన్నా అనుగ్రహిస్తే దాని ప్రభావం అతనిపై కనిపించటాన్ని అల్లాహ్ ఎంతో ఇష్టపడతాడు." (బైహఖీ)

**సారాంశం**

దైవప్రసాదిత వస్తువులను మనిషి క్రియాత్మకంగా అభివ్యక్తం చేయాలని ఈ హదీసు చెబుతోంది. అందుకే అతడు తన శక్తీ స్థోమతలకు తగ్గట్టుగా తినాలి, త్రాగాలి, ఉన్నంతలో మంచి దుస్తులను ధరించాలి. ఇలా వ్యక్తపరచటం భయభక్తులకు విరుద్ధాంశం ఏమీకాదు. కాకపోతే దైవానుగ్రహాలను దుర్వినియోగం చేయకూడదు, దుబారా ఖర్చులకు పాల్పడి సైతాన్ బాటలో నడవకూడదు. అలా అని మరీ పిసినిగొట్టులా కూడా మసలుకోరాదు. రెండు అతి వాదాలకు నడుమ మధ్యేమార్గాన్ని అవలంబించాలి.

(٤٢٢) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ لُبْسِ الْقَسِّيِّ وَالْمُعَصْفَرِ. رَوَاهُ مُسْلِمٌ.

422. హజ్రత్ అలీ (రజి) కథనం : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖస్ (ప్రాంతపు) సిల్కు వస్త్రాలు, కాషాయ రంగు బట్టలు ధరించటాన్ని వారించారు." (ముస్లిం)

(٤٢٣) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رَأَى عَلَيَّ النَّبِيُّ ﷺ ثَوْبَيْنِ مُعَصْفَرَيْنِ، فَقَالَ: «أُمُّكَ أَمَرَتْكَ بِهَذَا؟». رَوَاهُ مُسْلِمٌ.

423. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా ఒంటిపై కాషాయ రంగుతో కూడిన రెండు బట్టలుండటం గమనించి, "నీ తల్లి వీటిని తొడుక్కోమని చెప్పిందా?" అని సెలవిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

'ఈ బట్టలు తొడుక్కోమని మీ అమ్మచెప్పిందా?' అన్న దైవప్రవక్త (సఅసం) ప్రశ్నలో ఒకింత అయిష్టత, ఆగ్రహం కలగలసి ఉన్నాయి. ఈ ఆడవాళ్లు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? అన్న విసుగు కూడా ఆ మాటల్లో వ్యక్తమవుతున్నది. సహీహ్ ముస్లింలోని వేరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), 'మరయితే ఓ దైవప్రవక్తా! వీటిని కడిగివేయనా?' అని విన్నవించుకోగా, "లేదు. కాల్చి బూడిద చేసేయి" అని ఆయన (స) చెప్పారు.

(٤٢٤) وَعَنْ أَسْمَاءَ بِنْتِ أَبِي بَكْرٍ

424. హజ్రత్ అస్మా బిన్తె అబూబక్ర్ (ర.అన్హా) దైవప్రవక్త (సఅసం) గారి ఒక

رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهَا أَخْرَجَتْ جُبَّةَ رَسُولِ اللهِ ﷺ، مَكْفُوفَةَ الْجَيْبِ وَالْكُمَّيْنِ وَالْفَرْجَيْنِ بِالدِّيبَاجِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ، وَزَادَ: كَانَتْ عِنْدَ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا حَتَّى قُبِضَتْ، فَقَبَضْتُهَا، وَكَانَ النَّبِيُّ ﷺ يَلْبَسُهَا، فَنَحْنُ نَغْسِلُهَا لِلْمَرْضَى، نَسْتَشْفِي بِهَا. وَزَادَ الْبُخَارِيُّ فِي الْأَدَبِ الْمُفْرَدِ: وَكَانَ يَلْبَسُهَا لِلْوَفْدِ وَالْجُمُعَةِ.

జుబ్బాను బయటికి తీశారు. దాని చేతులపై, ముందు వెనుక భాగాలపై (అంచులపై) పట్టువస్త్రం వుంది. (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. మూలం మాత్రం ముస్లింలో వుంది). ఆ జుబ్బా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అధీనంలో ఉండేదనీ, ఆమె మరణించిన తరువాత నేను దానిని నా స్వాధీనంలో తీసుకున్నానని ఆమె అన్నారు. దైవప్రవక్త (సఅసం) దీనిని తొడిగేవారు, దీనిని కడిగి రోగగ్రస్తులకు ఆ నీరు త్రాపేవారు. స్వస్థత చేకూర్చమని ప్రార్థించేవారు (ముస్లిం). బుఖారీ 'అదబుల్ ముఫ్రద్'లో ఇలా అన్నారు - 'దైవప్రవక్త (స) దీనిని ప్రతినిధి బృందాలు వచ్చిన సమయాలలో, జుమా నమాజులలో ధరించేవారు.'

**సారాంశం**

విదేశాల నుండి రాయబారులు, దౌత్యవేత్తలు వచ్చినప్పుడు, చక్రవర్తులు, అధికారులు విచ్చేసినపుడు, లేదా పండుగ దినాలలో, జుమా నమాజులలో పాల్గొనవలసి వచ్చినపుడు, సమావేశాలకు హాజరు కావలసి వచ్చినపుడు సాధారణ దుస్తులకన్నా కొంచెం మంచి దుస్తులు, ఖరీదైన దుస్తులు ధరించటంలో తప్పులేదు. అయితే ఈ ప్రత్యేక సమయాలలో సయితం షరీయత్ విధించిన హద్దులను అతిక్రమించకూడదు. దుస్తులు మనిషిలో గర్వాన్ని, అహంకారాన్ని పెంపొందించేవిగా గాకుండా సంస్కారానికీ, వినమ్రతకు, హుందాతనానికి ప్రతీకగా ఉండాలి.

# 3. అంత్యక్రియల పుస్తకం

## ٣ - كِتَابُ الْجَنَائِزِ

(٤٢٥) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَكْثِرُوا ذِكْرَ هَاذِمِ اللَّذَّاتِ: الْمَوْتِ». رَوَاهُ التِّرْمِذِيُّ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

425. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "రుచులను, రసాస్వాదనలను త్రెంచివేసే దానిని (మృత్యువును) అత్యధికంగా స్మరిస్తూ ఉండండి." (దీనిని తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

మరణం ఒక సత్యం. మరణం తథ్యం. ఆది నుండి అంతం వరకూ ఏ ఒక్కరూ దీన్ని కాదనలేదు. కాదనలేరు కూడా. అనుదినం ఇది మానవులకు కనిపిస్తూనే ఉంటుంది. ఆత్మీయులలో, బంధు మిత్రులలో, ఇరుగుపొరుగు వారిలో, మనం నివసించే గ్రామాలలో ఎవరో ఒకరు మృత్యువాతన పడుతూనే ఉంటారు. ఇటువంటి సందర్భాలలో సహజంగానే గుండెలు కరుగుతాయి. భావాలు, భావోద్రేకాలు ఉప్పొంగుతాయి. మనిషిలో దైవభీతి, పరలోక భీతి పెంపొందుతుంది. ఆత్మావలోకనం చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రళయదృశ్యం కనుల ముందు కదలాడుతుంది. ఇహలోక జీవిత వాస్తవం అర్థమవుతుంది. పరలోక సామగ్రిని సమకూర్చుకోవాలన్న తహతహ మొదలవుతుంది. పర్యవసానంగా మానవుడు సదాచరణ వైపునకు మొగ్గుతాడు. అందుకే మరణాన్ని వీలయినంత ఎక్కువగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలని ఉపదేశించబడింది.

(٤٢٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لا يَتَمَنَّيَنَّ أَحَدُكُمُ الْمَوْتَ لِضُرٍّ نَزَلَ بِهِ، فَإِنْ كَانَ لا بُدَّ مُتَمَنِّياً، فَلْيَقُلِ: اللَّهُمَّ أَحْيِنِي مَا كَانَتِ الْحَيَاةُ خَيْراً لِّي، وَتَوَفَّنِي مَا كَانَتِ الْوَفَاةُ خَيْراً لِّي». مُتَّفَقٌ عَلَيْهِ.

426. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: "మీలో ఎవరయినా సరే వారిపై వచ్చి పడిన కష్టాలు, ఆపదల కారణంగా మృత్యువును ఎన్నడూ కోరుకోరాదు. ఒకవేళ ఆ కోరిక అవశ్యమయిపోతే ఈ విధంగా అనాలి - 'ఓ అల్లాహ్! ఎన్నాళ్ళపాటు నేను బ్రతికి ఉండటం నాకు శ్రేయస్కరమో అప్పటి వరకూ నాకు జీవితం ప్రసాదించు. మరణం నా పాలిట శ్రేయోదాయకమై నపుడు నాకు మృత్యువు నొసగు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఒక నిజమయిన, నికార్సయిన మోమిన్ (విశ్వాసి) కొరకు జీవితం గొప్ప వరం లాంటిది. సజ్జనుడు జీవితకాలంలో తన సదాచరణలను, సత్కార్యాలను వృద్ధి చేసుకుంటూనే పోతాడు. గతంలో తనవల్ల జరిగిన పాపాలపై సిగ్గుతో కుమిలిపోతూ పశ్చాత్తాపం చెందుతాడు అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. పాపాత్ముడు, దుష్టుడు, దుర్మార్గుడయినవాడికి కూడా ఈ జీవితం ఒక అవకాశం వంటిది. అతను గనక జీవిత సత్యాన్ని తెలుసుకోగలిగితే ఒక్కోక్షణం తన పాపాల ప్రక్షాళనకై ప్రయత్నించగలుగుతాడు. గతాన్ని మరచి భవిష్యత్తులో తనను కాపాడుకునే ఉపాయాలు ఆలోచిస్తాడు. చేసిన తప్పులపై సిగ్గు పడుతూ తన ప్రభువు వైపునకు మరలివస్తాడు. అందుకే కష్టాలకు, కడగండ్లకు, దారిద్ర్యానికి, లేమికీ, వ్యాధికీ వినుగెత్తిపోయి మరణాన్ని కాంక్షించరాదనీ, జీవించడానికి ఇహలోకంలో దొరికిన అవకాశాన్ని శాశ్వతమైన పరలోకం కోసం సద్వినియోగం చేసుకోవాలని దైవప్రవక్త (స) ఉపదేశించారు. అయితే సర్వలోక ప్రభువును వీలయినంత త్వరగా కలుసుకోవాలన్న ఆసక్తి ఉంటే అప్పుడు మరణాన్ని కాంక్షించవచ్చు. అలా కాంక్షించటం విశ్వాసపరిపూర్ణతకు ప్రబల నిదర్శనం కూడాను. ఒకవేళ ధర్మావలంబనలో కఠినపరీక్షలు ఎదురై, విశ్వాసం ప్రమాదంలో పడబోతుందని భావించినపుడు కూడా మృత్యువును కోరుకోవచ్చు. అంతేగాని ప్రాపంచిక కష్టాలతో కలతచెంది కాటికి కాళ్ళు చాపాలనుకోవటం ధీరత్వం కాదు. ఈ కష్టాల కొలిమిలో విశ్వాసి ఎంత కాలితే అంతే కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసి పోతాడు.

(٤٢٧) وَعَنْ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**الْمُؤْمِنُ يَمُوتُ بِعَرَقِ الْجَبِينِ**». رَوَاهُ الثَّلَاثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

427. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హజ్రత్ బురైద (రజి) తెలిపారు. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు - "విశ్వాసికి మరణ సమయం ఆసన్నమైనపుడు అతని నుదుటిపై చెమట ప్రస్ఫుటమవు తుంది." (ఈ ఉల్లేఖనాన్ని ముగ్గురు- తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

(٤٢٨) وَعَنْ أَبِي سَعِيْدٍ وَأَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالاَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لَقِّنُوا مَوْتَاكُمْ لاَ إِلٰهَ إِلاَّ اللّٰهُ**». رَوَاهُ مُسْلِمٌ وَالْأَرْبَعَةُ.

428. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ సయీద్ (రజి) మరియు హజ్రత్ అబూ హురైర (రజి ) తెలిపారు: "మరణ ఘడియలు సమీపించిన మనిషికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి ప్రోత్సహించండి." (దీనిని ముస్లింతో పాటు మరో నలుగురు - అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - కూడా ఉల్లేఖించారు)

### సారాంశం

కలిమా అంటే ఇక్కడ కేవలం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని మాత్రమే కాదు, పూర్తి కలిమాను ఉపదేశించాలి. మరణ ఘడియలు దాపురించిన మనిషికి దగ్గర్లో కూర్చున్నవారు కూడా ఈ కలిమాను పఠిస్తూ ఉండవచ్చు. మరణించే వ్యక్తికి స్పృహ ఉంటే కలిమాను అతనిచేత చదివించే ప్రయత్నం చేయాలి. దైవప్రవక్త (సఅసం) ఖుద్దుగా, మరణించే ఒక వ్యక్తికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' పఠించమని చెప్పినట్లు ఆధారముంది. (ముస్నద్ అహ్మద్)

(٤٢٩) وَعَنْ مَعْقِلِ بْنِ يَسَارٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «اِقْرَءُوْا عَلَى مَوْتَاكُمْ يس». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

429. హజ్రత్ మాఖిల్ బిన్ యసార్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మరణించే మీ ఆత్మీయుని ముందు యాసీన్ సూరా పఠించండి." (దీనిని అబూ దావూద్, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

### హదీసు ఉల్లేఖకులు

మాఖిల్ బిన్ యసార్ (రజి) ముజైనా తెగకు చెందిన సహాబి. హుదైబియా ఒడంబడికకు ముందు ఇస్లాం స్వీకరించారు. 'బైతె రిజ్వాన్'లో పాల్గొన్నారు. బస్రాలో ఈయన పేరుతో ఒక కాలువ ఉంది. హజ్రత్ ఉమర్ (రజి) ఆజ్ఞానుసారం ఈయన ఆ కాలువను త్రవ్వారు. అరబ్బుల్లో ఒక లోకోక్తి ఉంది- 'దేవుని కాలువ (వర్షపు నీరు) ముందు మాఖిల్ కాలువ ఏపాటిది?' అన్నది దాని భావం. ఈయన అమీర్ ముఆవియ (రజి) ఖిలాఫత్ ఆఖరికాలంలో - హిజ్రీ 60లో మరణించారు. యజీద్ కాలంలో మరణించారని మరికొందరి వాదన.

(٤٣٠) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ رَسُولُ اللهِ ﷺ عَلَى أَبِي سَلَمَةَ، وَقَدْ شُقَّ بَصَرُهُ، فَأَغْمَضَهُ، ثُمَّ قَالَ: «إِنَّ الرُّوْحَ إِذَا قُبِضَ اتَّبَعَهُ الْبَصَرُ»، فَضَجَّ نَاسٌ مِنْ أَهْلِهِ، فَقَالَ: «لاَ تَدْعُوْ عَلَى أَنْفُسِكُمْ

430. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : అబూ సలమా (రజి) మరణ సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడికి ఏతెంచారు. ఆ సమయంలో ఆయన కనుగ్రుడ్లు తెరచుకుని ఉన్నాయి. ఆయన (స) వాటిని (కనురెప్పలను) మూసివేశారు. అనంతరం ఇలా ప్రవచించారు: "ఆత్మ శరీరాన్ని వీడిపోతున్నప్పుడు కళ్లు దానిని వెంబడిస్తాయి." అంతలో ఇంట్లోని

إِلاَّ بِخَيْرٍ، فَإِنَّ الْمَلاَئِكَةَ تُؤَمِّنُ عَلَى مَا تَقُوْلُوْنَ»، ثُمَّ قَالَ: «اللَّهُمَّ اغْفِرْ لِأَبِي سَلَمَةَ، وَارْفَعْ دَرَجَتَهُ فِي الْمَهْدِيِّيْنَ، وَافْسَحْ لَهُ فِي قَبْرِهِ، وَنَوِّرْ لَهُ فِيْهِ، وَاخْلُفْهُ فِي عَقِبِهِ». رَوَاهُ مُسْلِمٌ.

వారంతా గొల్లుమన్నారు. బిగ్గరగా ఏడ్వ సాగారు. ఆయన (స) వారందరినీ ఉద్దేశించి, "మీ కొరకు ఉత్తమమయిన వేడుకోలు చేయండి. ఎందుకంటే మీరు ఏది పలికినా దైవదూతలు 'తథాస్తు' అని అంటారు" తరువాత ఆయన (స) ఇలా ప్రార్థించారు-"దేవా! అబూ సలమా (రజి)ను మన్నించు. సన్మార్గం పొందిన వారిలో ఈయన అంతస్థును ఉన్నతం గావించు. ఈయన సమాధిని విశాల వంతంగా చెయ్యి. జ్యోతిర్మయం గావించు. ఈయన వెనుకనున్న వారిలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చెయ్యి."

(ముస్లిం)

## సారాంశం

మరణించేవాని ఆత్మ ఊర్ధ్వలోకాలకు పయనమవుతున్నప్పుడు సాధారణంగా అతని కళ్లు తెరచుకుని ఉంటాయని ఈ హదీసు చెబుతోంది. వాటిని తొందరగా మూసివేయాలి. శరీరం చల్లారిపోయిన తరువాత కనురెప్పలు మూతబడటం దుర్లభమవుతుంది. కళ్లు గనక తెరచుకునే వుంటే భౌతిక కాయం చూసేవారికి భయంకరంగా కనిపిస్తుంది. మరణ సమీపంలో మృతుని వారసులు, బంధువులు, ఆత్మీయులు దగ్గరుండటం మంచిదని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. మృతుని అంత్యక్రియలు జరగక ముందు కూడా అతని క్షమాపణకై దైవాన్ని ప్రార్థించవచ్చన్న సంగతి కూడా స్పష్టమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ సలమా (రజి). ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ అసద్ మఖ్జూమీ ఖురషీ. ఈయన దైవప్రవక్త (స)కు బంధువులు. వరుసకు మేనత్త కొడుకు. మహాప్రవక్త (స)కు, హజ్రత్ హమ్జా (రజి)కు పాల సోదరుడు కూడా అవుతారు. అబూ లహబ్‌చే స్వేచ్ఛ నొసగబడిన ఒక బానిసరాలు ఈ ముగ్గురికీ పాలు త్రాగించింది. ఈయన తన సతీమణితో కలసి హిజ్రత్ చేశారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఉహుద్ సంగ్రామంలో గాయపడ్డారు. గాయం మానిందిగాని తరువాత మళ్లీ తిరగబెట్టింది. హిజ్రీ 4వ సంవత్సరం జమాది వుల్ ఊలాలో మరణించారు. ఈయన మరణానంతరం ఈయన సతీమణి ఉమ్మె సలమా (ర.అన్హా)ను షవ్వాల్ నెలలో దైవప్రవక్త (స) తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు.

(٤٣١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ حِيْنَ تُوُفِّيَ، سُجِّيَ بِبُرْدِ حِبَرَةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

431. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణించినపుడు ఆయన్ని (సఅసం) ఒక చారలు గల దుప్పటితో కప్పటం జరిగింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మృతునికి స్నానం చేయించక ముందు చారలున్న దుప్పటితో కప్పవచ్చు. దైవప్రవక్తలు కూడా మానవ మాత్రులేననీ, ఏదో ఒకనాడు వారిని నయితం మృత్యువు కబళిస్తుందని, ఈ సత్యాన్ని ఎవరూ తృణీకరించలేరని మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి మరణం రుజువు చేస్తోంది. ఒక సాధారణ మానవునికి ఏవిధంగా అంత్యక్రియలు చేయబడతాయో అదేవిధంగా దైవప్రవక్త (స)లకు కూడా అంత్యక్రియలు చేయబడతాయి.

(٤٣٢) وَعَنْهَا أَنَّ أَبَا بَكْرٍ الصِّدِّيْقَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَبَّلَ النَّبِيَّ ﷺ بَعْدَ مَوْتِهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

432. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "ఆయన (సఅసం) మరణించినపుడు హజ్రత్ అబూబక్ర్ (రజి) ఆయన్ని (సఅసం) - అంటే ఆయన నుదుటిని - ముద్దాడారు. (బుఖారీ)

(٤٣٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**نَفْسُ الْمُؤْمِنِ مُعَلَّقَةٌ بِدَيْنِهِ، حَتَّى يُقْضَىٰ عَنْهُ**». رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

433. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "విశ్వాసి ఆత్మ అతడు చేసిన అప్పును (అంటిపెట్టుకుని ఉంటుంది); దాన్ని తీర్చేవరకూ ఎటూకాని స్థితిలో ఊగిసలాడుతూ ఉంటుంది." (అహ్మద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఇది 'హుఖూఖుల్ ఇబాద్' (దాసుల హక్కులు)కు సంబంధించిన విషయం. దాసుల హక్కులకు ఇస్లాంలో ఎంత ప్రాధాన్యం ఉందో, తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించటం ఎంత అవసరమో ఆలోచించాలి. దాసుల హక్కుల వ్యవహారంలో దేవుడు కూడా తలదూర్చడు. తనకు రావలసిన హక్కును రుణదాత క్షమించనంత వరకూ లేక ఆ రుణాన్ని మృతుని వారసులు

చెల్లించనంతవరకూ ఆ మృతుని ఆత్మ మధ్యలో ఊగిసలాడుతూనే ఉంటుంది. ఎందుకంటే రుణం తీసుకునేటప్పుడు, దాన్ని తిరిగి ఇచ్చే సంకల్పంతో తీసుకోబడింది. ఈ బాధ్యత మృతునిపై ఉంది. మృతుని వారసులు ఒకవేళ ఈ రుణభారాన్ని భరించలేని స్థితిలో ఉంటే సమాజంలోని శ్రేయోభిలాషులు దాన్ని తీర్చేందుకు కృషిచేయాలి. లేదా ఇస్లాం శ్రేయోరాజ్యం తన పౌరుని బాధ్యతను తనపై వేసుకుని అతన్ని రుణభారం నుంచి విముక్తి నొసగాలి.

దైవప్రవక్త (సఅసం) ఇలా ఉద్బోధించారు - "మృతుడు తన వెనుక ఏదన్నా ఆస్తి వదలివెళితే అది అతని వారసుల హక్కు అవుతుంది. ఒకవేళ అతడు అప్పులు చేసి వెళితే దాన్ని తీర్చవలసిన బాధ్యత నాపై, నా రాజ్యప్రతినిధులపై ఉంది. మేము దాన్ని చెల్లిస్తాము."

కేవలం ఒక రుణభారం విషయంలోనే ఇంత తీవ్రమయిన హెచ్చరిక చేయబడినపుడు మోసం, దగా, వంచనలతో సాటి మానవుల హక్కులను కాలరాచేవారి పరిణామం ఇంకెంత వికృతంగా ఉంటుందో కాస్త ఆలోచించండి!

(٤٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي الَّذِي سَقَطَ عَنْ رَاحِلَتِهِ، فَمَاتَ: **اغْسِلُوهُ بِمَاءٍ وَسِدْرٍ، وَكَفِّنُوهُ فِي ثَوْبَيْنِ.** مُتَّفَقٌ عَلَيْهِ.

434. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : వాహనంపై నుంచి క్రిందపడి ప్రాణం విడిచిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సఅసం) "ఇతన్ని రేగు ఆకులతో, నీళ్లతో స్నానం చేయించి, అతనికే చెందిన రెండు దుప్పట్లతో కఫన్ ఏర్పాటు చేయండి" అని అన్నారు.

(బుఖారీ)

**సారాంశం**

ఇది హజ్ సందర్భంగా జరిగిన సంఘటన. చనిపోయిన వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సహచరులలో ఒకరు. ఇహ్రామ్ కట్టుకుని అరఫాత్ మైదానానికి వచ్చి ఉన్నారు. అకస్మాత్తుగా ఒంటె మీదినుంచి క్రిందపడి, మెడకు గాయమై చనిపోయారు.

ఈ హదీసు ద్వారా అనేక ముఖ్యాంశాలు వెలుగులోకి వస్తున్నాయి -

(1) అరఫాత్ మైదానానికి వాహనంపై వెళ్ళటం ధర్మసమ్మతమే.

(2) వాహనంగా ఒంటెను కూడా ఉపయోగించుకోవచ్చు.

(3) ఇహ్రామ్ స్థితిలో మరణించిన వ్యక్తికి కూడా రేగు ఆకులతో, నీళ్లతో స్నానం చేయించాలి.

(4) అతని కోసం కొత్తగా కఫన్ వస్త్రాన్ని తేవలసిన అవసరం లేదు, ఇహ్రామ్ వస్త్రంలోనే చుట్టి, దానినే కఫన్‌గా తలపాయాలి. ఈ మృతుని తలను కప్పటంగానీ, సువాసన పూయటం గానీ చేయరాదు. తల కప్పబడకుండా, సుగంధ ద్రవ్యం చల్లకుండా ఉండటంలోని పరమార్థం ఏమిటంటే, ఆ వ్యక్తి ప్రళయదినాన ఇహ్రామ్ స్థితిలోనే లేచి 'తల్బియా' (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్....) పఠిస్తూ దైవసమక్షంలోకి హాజరవుతాడు (ఇన్‌షా అల్లాహ్).

(٤٣٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمَّا أَرَادُوا غُسْلَ النَّبِيِّ ﷺ، قَالُوا: وَاللهِ مَا نَدْرِي نُجَرِّدُ رَسُولَ اللهِ ﷺ كَمَا نُجَرِّدُ مَوْتَانَا أَمْ لَا؟ الْحَدِيثَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ.

435. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ప్రవక్త ప్రియసహచరులు (ర.అన్హుం) దైవప్రవక్త (సఅసం) భౌతిక కాయానికి స్నానం చేయించ సంకల్పించినపుడు వాళ్ళు ఇలా అన్నారు: దైవసాక్షి! మేము మా మృతుల దుస్తులను తొలగించే విధంగా దైవప్రవక్త (సఅసం) దుస్తులను తొలగించాలో లేదో మాకు తెలీటం లేదు.'' తరువాత హదీసునంతటినీ వివరించారు. (అహ్మద్, అబూదావూద్)

**సారాంశం**

పూర్తి హదీసు సారాంశం ఏమిటంటే, ఈ డోలాయమాన స్థితిలోనే ప్రియసహచరులపై ఒక విధమైన మైకం ఆవరించింది. ఆ స్థితిలోనే వారు ఎవరో చెప్పగా విన్నారు - దైవప్రవక్త (స)కు దుస్తుల సమేతంగా స్నానం చేయించమని! అందుచేత సహచరులు ఆయన (స) ఒంటిపైనున్న దుస్తులను తీయకుండానే స్నానం చేయించారు. దైవప్రవక్త (సఅసం) ఇతర మనుషులకన్నా ఉత్తములు - మానవశ్రేష్ఠులవటం చేత ప్రియ సహచరులు ఆ సమయంలో సందిగ్ధావస్థకు లోను అయ్యారు. అంతేగాని మృతునికి స్నానం చేయించే సమయంలో శరీరంపైని దుస్తులను తొలగించటానికి సంకోచించ వలసిన పనిలేదు. అయితే శవస్నానం చేయించేటప్పుడు కూడా 'సతర్'పై ఆచ్ఛాదన కోసం ఒక గుడ్డను కప్పటం అవసరం.

(٤٣٦) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ عَلَيْنَا النَّبِيُّ ﷺ وَنَحْنُ نُغَسِّلُ ابْنَتَه، فَقَالَ: «اغْسِلْنَهَا ثَلَاثًا أَوْ خَمْسًا أَوْ أَكْثَرَ مِنْ ذٰلِكَ، إِنْ رَأَيْتُنَّ ذٰلِكَ، بِمَاءٍ وَسِدْرٍ، وَاجْعَلْنَ فِي الْأَخِيرَةِ كَافُوراً، أَوْ شَيْئاً مِنْ كَافُورٍ»، فَلَمَّا فَرَغْنَا آذَنَّاهُ، فَأَلْقَى إِلَيْنَا

436. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వద్దకు వచ్చినపుడు మేము ఆయన (సఅసం) కుమార్తె భౌతిక కాయానికి స్నానం చేయిస్తున్నాము. ''మీరు అవసరమనుకుంటే ఈమెకు మూడుసార్లు, లేక ఐదుసార్లు, లేక అంతకన్నా ఎక్కువ సార్లు నీళ్లు పోయండి. నీళ్లతో, రేగు ఆకులతో స్నానం చేయించండి. ఆఖర్లో కర్పూరం ఉపయోగించండి'' అని అన్నారు. స్నానం చేయించటం పూర్తయ్యాక మేము ఆయన (స) కు కబురంపాము.

حِقْوَهُ، فَقَالَ: أَشْعِرْنَهَا إِيَّاهُ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ: «اِبْدَأْنَ بِمَيَامِنِهَا، وَمَوَاضِعِ الْوُضُوءِ مِنْهَا». وَفِي لَفْظٍ لِلْبُخَارِيِّ: فَضَفَّرْنَا شَعْرَهَا ثَلَاثَةَ قُرُونٍ، فَأَلْقَيْنَاهَا خَلْفَهَا.

ఆయన (స) తన లుంగీని మా వైపునకు విసిరి "దీన్ని మృతదేహంపై కప్పండి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

గుసుల్ (స్నానం) కుడి వైపు నుంచి, వుజూ భాగాల నుంచి మొదలెట్టాలని ఒక ఉల్లేఖనంలో వుంది. బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది - "మేము ఆమె శిరోజాలను మూడు పాయలుగా విభజించి వాటిని వీపు వైపునకు ఉంచాము."

**సారాంశం**

ఒక ప్రముఖ ఉల్లేఖనం ప్రకారం ఇది ఆయన (సఅసం) కుమార్తె, అబుల్ ఆస్ సతీమణి అయిన హజ్రత్ జైనబ్ (ర.అన్హా)కు సంబంధించిన వృత్తాంతం. ఈమె హిజ్రీ 8వ సంవత్సరంలో మరణించారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం మృతురాలు హజ్రత్ ఉస్మాన్ (రజి) సతీమణి అయిన ఉమ్మె కుల్సూమ్ (ర.అన్హా) అని కూడా తెలుస్తున్నది. ఆ కాలంలో ఉమ్మె అతియా (ర.అన్హా) మరణించిన మహిళలకు గుసుల్ (స్నానం) చేయించేవారు.

భౌతికకాయానికి కనీసం మూడు లేక ఐదుసార్లు లేక ఏడుసార్లు నీళ్లుపోయాలని ఈ సంఘటన ద్వారా తెలుస్తున్నది. అంటే బేసి సంఖ్యను దృష్టిలో పెట్టుకోవాలన్నమాట! స్నానం కుడివైపు నుంచి, అందునా వుజూలో ఏ శరీర భాగాల నుంచి కడగటం మొదలెడతారో ఆ శరీర భాగాల నుంచే ఆరంభించాలి. స్నానం చేయించిన తరువాత శుభసూచకంగా ఎవరయినా మహనీయుని అంగవస్త్రాన్ని మృతునికి తొడిగించటం ఆక్షేపణీయం కాదు. స్త్రీ తలవెంట్రుకలను మూడు పాయలుగా విభజించి వీపు వైపునకు ఉంచాలి. శిరోజాలను రెండు పాయలుగా చేసి రొమ్ముపై ఉంచటం సరైంది కాదు. రేగు ఆకులతో, నీళ్లతో మృతునికి స్నానం చేయించాలని కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. చివర్లో కర్పూరం కలిపిన నీరు పోయాలి. లేదా కర్పూరాన్ని శరీరంపై పులమాలి. కర్పూరమేగాక ఇతర సుగంధ ద్రవ్యాలను కూడా ఉపయోగించవచ్చు.

(٤٣٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُفِّنَ رَسُولُ اللهِ ﷺ فِي ثَلَاثَةِ أَثْوَابٍ بِيضٍ سَحُولِيَّةٍ مِنْ كُرْسُفٍ، لَيْسَ فِيهَا قَمِيصٌ وَلَا عِمَامَةٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

437. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సఅసం) భౌతిక కాయాన్ని, యమన్‌కు చెందిన 'సహూల్'లో నేయబడిన మూడు తెల్లని వస్త్రాలలో (కఫన్ రూపంలో) చుట్టడం జరిగింది - అందులో చొక్కా గానీ, తల పాగా గానీ లేదు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

భౌతిక కాయం పురుషునిదైతే మూడు వస్త్రాలను కఫన్ కొరకు ఉపయోగించాలని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ వస్త్రాలలో చొక్కాగానీ, తలపాగా గానీ ఉండదు. అత్యధిక మంది పండితుల దృష్టిలో మూడు వస్త్రాలంటే మూడు పెద్ద దుప్పట్లని భావం. కొంతమంది విద్వాంసులు- దీనిని కఫన్‌గా, లుంగీతరహా వస్త్రంగా, పెద్ద దుప్పటిగా భావించారు.

(٤٣٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَمَّا تُوُفِّيَ عَبْدُ اللهِ بْنُ أُبَيٍّ جَاءَ ابْنُهُ إِلَى رَسُولِ اللهِ ﷺ فَقَالَ: أَعْطِنِي قَمِيْصَكَ أُكَفِّنْهُ فِيْهِ، فَأَعْطَاهُ إِيَّاهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

438. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయినప్పుడు అతని కుమారుడు దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, తమరు తమ చొక్కాను ప్రదానం చేస్తే నేను దీన్ని అతని కొరకు 'కఫన్'గా ఉపయోగిస్తానని ప్రాధేయపడ్డాడు. ఆయన (స) తన చొక్కాను తీసి అతనికిచ్చేశారు.

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్త (సఅసం)కు తన ప్రియసహచరుల పట్ల గల ప్రేమానురాగాలకు, వాత్సల్యానికి ఈ సంఘటన ఒక మచ్చుతునక. వారి భావాలు, భావోద్రేకాలను ఆయన (స) పూర్తిగా పరిగణనలోకి తీసుకునేవారు. ఏ వ్యక్తి కొరకు ఆయన చొక్కా ప్రదానం చేశారో, అతడు కపటాగ్రేసరుడని తెలిసి కూడా ఎంతో ఉదారంగా వ్యవహరించటం గమనార్హం. ఇలాంటి సంఘటన నుంచి నేటి నాయకులు, సంస్కర్తలు, లీడర్లు స్ఫూర్తిని పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## హదీసులో ప్రముఖులు

1. అబ్దుల్లాహ్ బిన్ ఉబై : అజ్ఞానకాలంలో 'ఖజ్రజ్' తెగకు నాయకుడు. పైకి ఇస్లాం స్వీకరించినప్పటికీ, అతని మనసులో ఇస్లాం చోటు చేసుకోలేదు. కపట చేష్టలతో ఇస్లాంకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించసాగాడు. కపటులకు (మునాఫిక్‌లకు) నేతృత్వం వహించి 'రయీసుల్ మునాఫిఖీన్'గా పేరుమోశాడు. ఉహుద్ యుద్ధ సమయంలో మూడోవంతు సైన్యాన్ని వెంటబెట్టుకుని మధ్యలో నుంచే తిరిగి వచ్చేశాడు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) పై అపనింద మోపి, దైవప్రవక్త (సఅసం)ను మానసికంగా వేధించటంలో కీలక పాత్ర పోషించాడు. దివ్య ఖుర్‌ఆన్‌లో సయితం అతని కపట చేష్టలు ప్రస్తావించబడ్డాయి. "మేము మదీనాకు తిరిగి వెళ్ళిన మీదట గౌరవనీయులు అల్పులను వెళ్ళగొడతార"ని అన్యాపదేశంగా మహనీయ ముహమ్మద్ (స)ను అవమానపర్చిన కపటాగ్రేసరుడు ఇతడు. హిజ్రీ 9వ సంవత్సరం జిఖఅద నెలలో చనిపోయాడు.

2. అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్నె సలూల్ : ఈయన ఎవరో కాదు, అబ్దుల్లాహ్ బిన్ ఉబై కన్నకొడుకే. కపటి కడుపులో పుట్టి కీర్తి శిఖరాల అంబరాలను చుంబించిన ఇస్లాం ముద్దుబిడ్డ. తండ్రి దైవప్రవక్తను వేధిస్తూ ఉంటే, కుమారుడు మాత్రం దైవప్రవక్త (స)కు రక్షాకవచంగా నిలిచేవారు. గొప్ప సహచరులలో ఒకరు. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. 'యమామ' యుద్ధంలో అమరగతి నొందారు. తండ్రి కపట ప్రవర్తనకు ఎంతగానో బాధపడేవారు. 'మర్యాదస్తులు దైవప్రవక్త (స)ను మదీనా నుంచి వెళ్ళగొడతార'ని అతని తండ్రి కూసాడని తెలిసి, తండ్రి తలను నరికి వేసేందుకు తనను అనుమతించమని ఆయన భావోద్వేగంతో అన్నారు. అజ్ఞాన కాలంలో ఈయన పేరు హుబాబ్. దైవప్రవక్త (స) ఈ పేరు మార్చి అబ్దుల్లాహ్ అని నామకరణం చేశారు.

(٤٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «اِلْبَسُوا مِنْ ثِيَابِكُمُ الْبِيضَ فَإِنَّهَا مِنْ خَيْرِ ثِيَابِكُمْ، وَكَفِّنُوا فِيهَا مَوْتَاكُمْ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

439. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "తెల్లని దుస్తులు ధరించండి. మీ దుస్తులలో కెల్లా అత్యుత్తమమైనవి ఇవే. మీ మృతులకు కూడా ఈ (తెల్లని) వస్త్రాలతోనే కఫన్ ఏర్పాటు చేయండి" ('ఐదుగురి' లో నసాయి తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

అప్పుడప్పుడూ రంగుల దుస్తులు తొడిగినప్పటికీ సాధారణంగా దైవప్రవక్త (స) తెల్లనిదుస్తులను అమితంగా ఇష్టపడేవారని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. మృతులను కూడా తెల్లటి వస్త్రాలలోనే చుట్టాలి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రం ఇతర రంగుల వస్త్రాన్ని కూడా ఉపయోగించవచ్చు.

(٤٤٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَفَّنَ أَحَدُكُمْ أَخَاهُ فَلْيُحْسِنْ كَفَنَهُ». رَوَاهُ مُسْلِمٌ.

440. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు - "మీలో ఎవరయినా మీ సోదరునికి కఫన్ (వస్త్రం) ఇస్తే మంచి కఫన్‌ను ఇవ్వాలి." (ముస్లిం)

**సారాంశం**

ఒక ముస్లిం మరో ముస్లింకు సోదరుడని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. మంచి కఫన్‌ను ఇవ్వటమంటే అర్థం పరిశుభ్రమయిన వస్త్రం ఇవ్వాలి. ఇంకా అది మృతుని శరీరాన్ని పూర్తిగా

కప్పగలిగే విధంగా ఉండాలి. మంచి కఫన్ అంటే భావం ఖరీదైనదని కాదు. ఖరీదైన వస్త్రాన్ని కఫన్ కొరకు ఉపయోగించటం వాంఛనీయం కూడా కాదు.

(٤٤١) وَعَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَجْمَعُ بَيْنَ الرَّجُلَيْنِ مِنْ قَتْلَى أُحُدٍ فِي ثَوْبٍ وَاحِدٍ، ثُمَّ يَقُولُ: «أَيُّهُمْ أَكْثَرُ أَخْذاً لِلْقُرْآنِ»؟ فَيُقَدِّمُهُ فِي اللَّحْدِ، وَلَمْ يُغَسَّلُوا، وَلَمْ يُصَلَّ عَلَيْهِمْ. رَوَاهُ الْبُخَارِيُّ.

441. ఈయనగారి (హజ్రత్ జాబిర్ - రజి) చేతనే ఉల్లేఖించబడిన మరో హదీసు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉహుద్ సంగ్రామంలో అమరగతి నొందిన ఇద్దరేసి అమరవీరులను ఒక్కో వస్త్రంలో చుట్టేవారు. ఆయన (స), 'వీరిలో ఎవరికి ఖుర్ఆన్ ఎక్కువగా జ్ఞాపకముంది?' అని అడిగేవారు. ఎవరికి ఎక్కువ భాగం ఖుర్ఆన్ జ్ఞాపకముంటుందో వారిని మొదట గోరీలో దింపేవారు. ఆ అమరవీరులకు జనాజా నమాజ్ చేయటంగానీ, గుసుల్ (స్నానం) చేయించటం గానీ జరగలేదు. (బుఖారీ)

## సారాంశం

ఈ హదీసు ద్వారా మన జ్ఞానపరిధిలోకి వచ్చే ముఖ్యాంశాలు ఇవి:

(1) అత్యవసరస్థితిలో ఒక్కో కఫన్‌ను ఇద్దరు వ్యక్తులకు కూడా ఉపయోగించవచ్చు.

(2) ఇద్దరేసి వ్యక్తులను (మృతులను) ఒక్కో సమాధిలో ఖననం చేయటం కూడా ధర్మసమ్మతమే. అయితే ఆ ఇరువురిలో ఖుర్ఆన్ అధికంగా కంఠస్థం అయివున్న వారిని మొదట సమాధిలో చేర్చాలి.

(3) దైవమార్గంలో అసువులు బాసిన వారికి గుసుల్ (స్నానం) చేయించవలసిన అవసరం లేదు. ఉహుద్ యుద్ధసందర్భంగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు : "వీరికి స్నానం చేయించకండి. వీరి శరీరాలకైన ఒక్కో గాయం ప్రళయదినాన 'ముష్క్' (కస్తూరి) లాంటి సువాసనను గుబాళిస్తుంటుంది.

(4) అమరగతి నొందిన వారి జనాజా నమాజ్ కూడా చేయనవసరం లేదు. ఉహుద్ సంగ్రామంలో అమరగతి నొందిన వారి జనాజా నమాజ్ గురించి, హజ్రత్ హమ్జా (రజి) జనాజా నమాజ్‌లో 70 తక్బీర్ల గురించి వచ్చిన ఉల్లేఖనం ప్రామాణికమైనది కాదని, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. సహీహ్ బుఖారీలో ఉఖబా బిన్ ఆమిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, ఆయన (స) ఎనిమిది సంవత్సరాల తరువాత ఉహుద్ వీరుల అంత్యక్రియల నమాజ్ చేశారని తెలుస్తున్నది. ఇది నిజంగా నమాజే కాదనీ, ఇది కేవలం క్షమాపణకై చేసిన వేడుకోలు అనీ ఇమామ్ షాఫయి వ్యాఖ్యానించారు.

(٤٤٢) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ النَّبِيَّ ﷺ يَقُولُ: «لاَ تُغَالُوا فِي الْكَفَنِ، فَإِنَّهُ يُسْلَبُ سَرِيعاً». رَوَاهُ أَبُو دَاوُدَ.

442. "(చాలా) ఖరీదైన కఫన్‌ను ఇవ్వ కండి. ఎందుకంటే అది బహుతొందరగా పాడైపోయేదే" అని దైవప్రవక్త (సఅసం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. (అబూదావూద్)

**సారాంశం**

విలువైన వస్త్రాన్ని కఫన్ కొరకు ఉపయోగించినంత మాత్రాన మృతునికి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. మృతునికి అసలు ఉపయోగపడేవి అతను చేసుకున్న కర్మలే. కఫన్ కోసం సమకూర్చే వస్త్రం ఎంత విలువైనదయినా అది మట్టిలో కలసిపోయేదే. ఈ ప్రబోధనం యొక్క ప్రభావం ప్రవక్త సహచరులపై ఎంతగా పడిందంటే, హజ్రత్ అబూబక్ర్ (రజి) తాను మరణించినపుడు ప్రత్యేకంగా కొత్త వస్త్రం ఉపయోగించవలసిన అవసరం లేదనీ, తన దుప్పట్లనే ఉతికి వాటినే తన కఫన్‌గా ఉపయోగించాలని తాకీదు చేశారు. కొత్త బట్టలు ధరించే హక్కు మృతులకన్నా బ్రతికి ఉన్న వారికి ఎక్కువగా ఉందని ఆయన (రజి) అభిప్రాయపడ్డారు. (బుఖారీ)

(٤٤٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهَا: «لَوْ مُتِّ قَبْلِي لَغَسَّلْتُكِ»، اَلْحَدِيثُ. رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّان.

443. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తనతో చెప్పారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు : "(ఆయిషా!) ఒకవేళ నీవు గనక నాకంటే ముందు చనిపోతే నేను నీకు స్నానం చేయిస్తాను." (దీనిని అహ్మద్, ఇబ్నె మాజ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

చనిపోయిన తన భార్యకు భర్త గుసుల్ ఇవ్వవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. అత్యధిక మంది ధర్మవేత్తలు ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దీంతో విభేదించారు. అయితే ప్రవక్త సహచరుల ఆచరణ ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతోంది. ఉదాహరణకు : హజ్రత్ అలీ (రజి) తన సతీమణి (దైవప్రవక్త పుత్రిక) అయిన ఫాతిమా (ర.అన్‌హా) చనిపోయినపుడు ఆమెకు అంత్యక్రియల స్నానం చేయించారు. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే భర్త భార్యకు, భార్య భర్తకు కడసారి స్నానం (గుసుల్) చేయించవచ్చు.

(٤٤٤) وَعَنْ أَسْمَاءَ بِنْتِ عُمَيْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ فَاطِمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى

444. హజ్రత్ అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్‌హా) కథనం : "హజ్రత్ అలీ (రజి) స్వయంగా తనకు (కడసారి) స్నానం

عَنْهَا أَوْصَتْ أَنْ يُغَسِّلَهَا عَلِيٌّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ.

చేయించాలని హజ్రత్ ఫాతిమా - రజియల్లాహు అన్హా - వసీయతు చేశారు. (సునన్ దారె ఖుత్నీ)

## సారాంశం

వసీయతు (వీలునామా)ను నెరవేర్చటం ఎంతో అవసరం. అందుకే ఆమె భర్త అయిన హజ్రత్ అలీ (రజి) ఖుద్దుగా ఫాతిమా (ర.అన్హా)కు కడసారి స్నానం చేయించారు. వసీయతు కూడా నెరవేరింది. భర్త తన భార్యకు స్నానం చేయించవచ్చునన్న ఒక విషయం కూడా ఉమ్మత్‌కు ఆధారంగా నిలిచింది.

## హదీసు ఉల్లేఖకులు

ఫాతిమా బిన్తె నబీ (ర.అన్హా), దైవప్రవక్త (సఅసం)గారి కనిష్ట పుత్రిక, గారాలపట్టీ. ముస్లిం అనుచర సమాజ మహిళలందరికీ నాయకురాలు. హిజ్రీ 2వ సంవత్సరం, రమజాన్ నెలలో హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ (రజి) ఈమెను వివాహమాడారు. కాపురానికి పంపబడేనాటికి ఈమె వయస్సు 15 సంవత్సరాల, 5 నెలలు. హిజ్రీ 11వ సంవత్సరం - రమజాన్ నెలలో - దైవప్రవక్త (స) మరణించిన 6 నెలలకు ఈమె కూడా మరణించారు.

(٤٤٥) وَعَنْ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِي الْغَامِدِيَّةِ، الَّتِي أَمَرَ النَّبِيُّ ﷺ بِرَجْمِهَا فِي الزِّنَا – قَالَ: ثُمَّ أَمَرَ بِهَا، فَصُلِّيَ عَلَيْهَا وَدُفِنَتْ. رَوَاهُ مُسْلِمٌ.

445. హజ్రత్ బురైద (రజి) గారు, వ్యభిచార నేరానికి పాల్పడి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)చే రాళ్లు రువ్వబడే శిక్షను అనుభవించిన ఘామిదియ వృత్తాంతం వివరిస్తూ ఇలా అన్నారు : "ఆయన (స) ఆమె అంత్యక్రియల నమాజును స్థాపించమని ఆదేశించారు. మరి ఆయన (స) స్వయంగా ఆమె నమాజె జనాజాను చేశారు. తరువాత ఆమెను ఖననం చేశారు." (ముస్లిం)

## సారాంశం

మహాప్రవక్త (సఅసం) స్వయంగా ఘామిదియ అంత్యక్రియల నమాజులో పాల్గొన్నారని సహీహ్ హదీసుల ద్వారా తెలుస్తోంది. ఘోర పాపాలకు పాల్పడే వారి - ఉదాహరణకు ఆత్మహత్యకు పాల్పడేవారి, వ్యభిచారానికి ఒడిగట్టేవారి - జనాజా నమాజ్‌లో పాల్గొనటం గురించి ఖాజీ అయాజ్ చెబుతూ, ఇస్లామీయ ధర్మవేత్తలు ఇందుకు అనుమతించారని పేర్కొన్నారు. అయితే ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) మాత్రం దీంతో ఏకీభవించలేదు. దుర్మార్గుడు, దుష్టుడు అయిన వ్యక్తి అంత్యక్రియలను బహిష్కరించాలనీ, తద్వారా సమాజంలో దుష్టశక్తులకు గుణపాఠం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

(٤٤٦) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أُتِيَ النَّبِيُّ ﷺ بِرَجُلٍ قَتَلَ نَفْسَهُ بِمَشَاقِصَ، فَلَمْ يُصَلِّ عَلَيْهِ. رَوَاهُ مُسْلِمٌ.

446. హజ్రత్ జాబిర్ బిన్ సమురా (రజి) కథనం : "బాణంతో ఆత్మహత్య చేసుకున్న ఒక వ్యక్తి శవం దైవప్రవక్త (సఅసం) వద్దకు తేబడింది. ఆయన (సఅసం) అతని నమాజ్ చేయలేదు." (ముస్లిం)

## సారాంశం

ఆత్మహత్య చేసుకున్నవాని 'నమాజె జనాజా' చేయటం గురించి ద్వంద్వాభిప్రాయాలున్నాయి. చేయవచ్చని కొందరూ, చేయకూడదని మరికొందరూ చెబుతున్నారు. సమాజంలోని మేధావులు, విజ్ఞులు ఈ వ్యక్తి నమాజులో పాల్గొనకపోయినా కనీసం సామాన్య జనులైనా పాల్గొని అతని అంతిమ యాత్రకు వీడ్కోలు పలకాలని కొంతమంది అభిప్రాయపడ్డారు. ఎందుకంటే నసాయిలోని ఉల్లేఖనం ప్రకారం "నేను ఇతని జనాజా నమాజు చేయను" అని మాత్రమే దైవప్రవక్త (స) అన్నారు. అంటే ప్రవక్త సహచరులు బహుశా ఆ వ్యక్తి జనాజా నమాజ్ చేసి ఉంటారన్న ఆలోచనకు తావు కలుగుతోంది. మొదట్లో రుణగ్రస్తుడైన వ్యక్తి చనిపోయినపుడు కూడా ఆయన (స) అతని జనాజా నమాజులో పాల్గొనేవారు కాదు, అయితే మీరు ఇతని నమాజ్ చేయండి అని సహచరులకు సలహా ఇచ్చేవారు.

(٤٤٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ - فِي قِصَّةِ الْمَرْأَةِ الَّتِي كَانَتْ تَقُمُّ الْمَسْجِدَ - قَالَ: فَسَأَلَ عَنْهَا النَّبِيُّ ﷺ، فَقَالُوا: مَاتَتْ، فَقَالَ: «أَفَلَا كُنْتُمْ آذَنْتُمُونِي»؟ - فَكَأَنَّهُمْ صَغَّرُوا أَمْرَهَا - فَقَالَ: «دُلُّونِي عَلَى قَبْرِهَا»، فَدَلُّوْهُ، فَصَلَّى عَلَيْهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

447. మస్జిద్‌లో చీపురుకట్టతో ఊడ్చే ఒక మహిళ గురించి హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : దైవప్రవక్త (సఅసం) ఆ మహిళ గురించి (ఆమె కనిపించటం లేదేమిటీ? అని) ఆరా తీయగా, 'ఆమె చనిపోయింది' అని సహచరులు (ర.అన్‌హుం) సమాధాన మిచ్చారు. "మరి మీరు నాకు ఎందుకు చెప్పలేదు?" అని ఆయన (స) నొచ్చుకున్నారు. అంటే ఆమె మరణాన్ని అందరూ సర్వసామాన్యమయిన విషయంగా తలపోశారు. "ఆమె సమాధి ఎక్కడుందో చూపెట్టండి" అని ఆయన (స) సహచరులను కోరారు. అక్కడికి వెళ్ళి ఆమె 'నమాజె జనాజా' చేశారు.

(బుఖారీ, ముస్లిం)

وَزَادَ مُسْلِمٌ: ثُمَّ قَالَ: «إِنَّ هَذِهِ الْقُبُورَ مَمْلُوءَةٌ ظُلْمَةً عَلَى أَهْلِهَا. وَإِنَّ اللَّهَ يُنَوِّرُهَا لَهُمْ بِصَلَاتِي عَلَيْهِمْ».

ముస్లింలో ఈ వాక్యం అదనంగా ఉంది: "ఈ సమాధులు సమాధివాసుల కోసం చీకట్లతో నిండి ఉన్నాయి. నా నమాజు వల్ల వీరి సమాధులలో వెలుగు వస్తుంది."

### సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక విషయాలు మన ముందుకు వస్తున్నాయి -

(1) ఖననం చేసిన తరువాత మృతుని సమాధి వద్ద కూడా నమాజె జనాజా చేయటం సమ్మతమే. ఖననానికి ముందు జనాజా నమాజ్ చేసివున్నప్పటికీ మలిసారి నమాజ్ చేయటంలో తప్పులేదు. హజ్రత్ బరా బిన్ మారూర్ (రజి) అంత్యక్రియల నమాజ్ కూడా దైవప్రవక్త (స) ఒక నెల రోజుల తరువాత - సమాధి దగ్గర - చేశారు. ఎందుకంటే ఈయన మరణించినప్పుడు దైవప్రవక్త (స) మక్కాలో వున్నారు.

(2) సమాధివాసులంటే సమాధుల్లో నిద్రిస్తున్నవారు. ఈ సమాధులలో చీకటి తప్ప వెలుగు లేదని ఆయన (స) ఆవేదన వ్యక్తం చేశారు.

(3) మస్జిద్‌ను వూడ్చే, పరిశుభ్రంగా ఉంచే వారి స్థానం ఎంతో గొప్పదని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

(4) ముస్లిం మహిళ సయితం మస్జిద్‌ను పరిశుభ్రపరచగలదు.

(5) మస్జిదును పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచటం అవసరం. పరిశుభ్రతకై పని చీపురుతోనూ చేయవచ్చు, గుడ్డతో తుడవటం ద్వారా కూడా చేయవచ్చు.

(6) కార్మికవర్గం పట్ల, పేదలపట్ల దైవప్రవక్త (సఅసం) కు గల ఆప్యాయతకు, ప్రేమానురాగాలకు, శ్రద్ధాసక్తికి ఈ సంఘటన అద్దం పడుతోంది.

(٤٤٨) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَنْهَى عَنِ النَّعْيِ. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

448. హజ్రత్ హుజైఫా (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణం గురించి బహిరంగంగా (దండోరా వేయడాన్ని) ప్రకటనలు చేయడాన్ని వారించారు." (అహ్మద్ మరియు తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు - తిర్మిజీ ఈ హదీసును 'హసన్'గా ఖరారు చేశారు)

## సారాంశం

మరణవార్త గురించి నలుగురికీ తెలియజేయరాదని దీని ఉద్దేశ్యం ఎంతమాత్రం కాదు. అసలు విషయమేమిటంటే అజ్ఞానకాలంలో అరబ్బులు మరణ సమాచారాన్ని ఒక తమాషాగా చేసుకున్నారు. హాహాకారాలు చేస్తూ, పెడబొబ్బలు పెడుతూ కబురు పంపేవారు. ఎంత ఎక్కువగా ఏడ్పులు, పెడబొబ్బలు పెడితే చనిపోయినవాడు అంత గొప్పవాడుగా పరిగణించబడేవాడు. దైవప్రవక్త (స) ఈ దురాచారాలను అరికట్టారు.

(٤٤٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَعَى النَّجَاشِيَّ فِي الْيَوْمِ الَّذِي مَاتَ فِيهِ، وَخَرَجَ بِهِمْ إِلَى الْمُصَلَّى، فَصَفَّ بِهِمْ، وَكَبَّرَ عَلَيْهِ أَرْبَعاً. مُتَّفَقٌ عَلَيْهِ.

449. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నజ్జాషీ చక్రవర్తి మరణ సమాచారం అందిన వెంటనే అందరికీ తెలియ పర్చారు. ఆయన (స) సహచరులను వెంటబెట్టుకుని అంత్యక్రియల నమాజ్ చేసే స్థలం వద్దకు వెళ్ళారు. అందరూ వరుసలు తీరి నిలబడ్డారు. 4 తక్బీర్లు పలికారు (జనాజా నమాజ్ చేశారు). (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

తమకు అందిన మరణ సమాచారాన్ని పలువురికి అందించాలనీ, దూరప్రదేశాలలో వున్నవారు అంత్యక్రియలకు హాజరు కాలేక పోయినప్పటికీ, "నమాజె గాయిబానా" చేయవచ్చుననీ ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ దీనికి సుముఖంగానే ఉన్నారు. అయితే హనఫీ ఫికహ్ ననుసరించేవారు, మాలికీ ధర్మవేత్తలు ఇందుకు సుముఖంగా లేరు. ఈ వ్యవహారం ఒక్క ప్రవక్తకే ప్రత్యేకం (పరిమితం) అని వీళ్లు వ్యాఖ్యానించారు.

## హదీసులోని ప్రముఖ వ్యక్తి

నజ్జాషీ (రజి) - ఈయన ఆనాటి అబిసీనియా (నేటి ఇథియోపియా) చక్రవర్తి. సత్యప్రియుడు. నజ్జాషీ అసలు పేరు కాదు. ఆ రాజ్యంలోని చక్రవర్తులకు గల బిరుదు అది. ఏ విధంగా రోము సామ్రాజ్యాధినేతను 'ఖైసర్'గా, ఈరాన్ చక్రవర్తిని 'కిస్రా'గా పిలిచేవారో అదేవిధంగా అబిసీనియా రాజును 'నజ్జాషీ' (నీగస్)గా వ్యవహరించేవారు. ఈయన అసలు పేరు అషమ బిన్ అబ్జర్ (రజి). మక్కాలోని అవిశ్వాసుల ఆగడాలనుండి తమ 'విశ్వాసాన్ని' కాపాడుకోవటానికి అలనాటి ముస్లింలు కొంతమంది అబిసీనియా వైపునకు వలస వెళ్ళారు. దైవప్రవక్త (సఅసం) హిజ్రీ 6వ సంవత్సరంలో అమ్ర్ బిన్ ఉమయ్య జమరీ (రజి) ద్వారా ఇస్లాం స్వీకరించమని నజ్జాషీకి ఆహ్వానం పంపారు. ఆయన ఈ ఆహ్వాన లేఖను ముద్దుపెట్టుకున్నాడు. కళ్ళకద్దుకున్నాడు. సింహాసనం నుండి దిగివచ్చి హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించాడు. ఆయన ఈ వృత్తాంతమంతా లిఖించి దైవప్రవక్త (సఅసం) కు పంపారు. నజ్జాషీ చక్రవర్తి హిజ్రీ 9లో - తబూక్

యుద్ధానంతరం - మరణించారు. ఆ తరువాత దైవప్రవక్త (స) అతని వారసునికి కూడా ఇస్లాం స్వీకరించమని ఆహ్వానం పంపారు.

(٤٥٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ النَّبِيَّ ﷺ يَقُولُ: «مَا مِنْ رَجُلٍ مُسْلِمٍ يَمُوتُ، فَيَقُومُ عَلَى جَنَازَتِهِ أَرْبَعُونَ رَجُلاً، لاَ يُشْرِكُونَ بِاللهِ شَيْئاً، إِلاَّ شَفَّعَهُمُ اللَّهُ فِيْهِ». رَوَاهُ مُسْلِمٌ.

450. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "ఏ ముస్లిమైనా మరణించగా, దైవానికి సహవర్తులుగా ఎవరినీ నిలబెట్టని నలభై మంది గనక అతని (జనాజా) నమాజ్‌లో పాల్గొంటే, అల్లాహ్ ఆ మృతుని పాలిట వాళ్ల వేడుకోలును ఆమోదిస్తాడు."

(ముస్లిం)

**సారాంశం**

అంత్యక్రియల నమాజ్‌లో అత్యధికమంది పాల్గొని మృతుని క్షమాభిక్షకై వేడుకోవలసిన ఆవశ్యకతను ఈ హదీసు సూచిస్తోంది. అయితే ఆ నమాజులో పాల్గొనే వారు షిర్క్ చేయనివారు, నికార్సయిన ఏకేశ్వరోపాసకులై ఉండాలన్న విషయం కూడా హదీసు ద్వారా ప్రస్ఫుటమవుతోంది. ఏక దైవారాధకులను అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడన్న దానికి ఈ హదీసు ఒక ప్రబల నిదర్శనం.

(٤٥١) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: صَلَّيْتُ وَرَاءَ النَّبِيِّ ﷺ عَلَى امْرَأَةٍ مَاتَتْ فِي نِفَاسِهَا، فَقَامَ وَسْطَهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

451. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక ఒక స్త్రీ నమాజె జనాజా చేశాను. ఆ స్త్రీ పురిటి రక్త స్రావంతో మరణించింది. ఆయన (స) ఆ స్త్రీ భౌతికకాయానికి ఎదురుగా - మధ్య భాగంలో-నిలబడ్డారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

చనిపోయిన ఆ మహిళ పేరు ఉమ్మె కాబ్ అన్సారియా (ర.అన్హా). ప్రసవ సమయంలో ఆమె మరణించింది.

చనిపోయిన వారు స్త్రీ అయినప్పుడు ఇమామ్ శవపేటికకు ఎదురుగా, మధ్య భాగంలో నిలబడి నమాజ్ చేయించాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. మృతుడు పురుషుడైనప్పుడు ఇమామ్ అతని తల భాగానికి ఎదురుగా నిలబడి నమాజ్ చేయించాలని హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ద్వారా విదితమవుతోంది. (ముస్నద్ అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ). ఇమామ్

షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల అభిమతం కూడా ఇదే. కాని దీనికి భిన్నంగా హనఫీ పండితులు సాధారణంగా మృతులైన స్త్రీ పురుషుల హృదయానికి ఎదురుగా నిలబడి నమాజ్ చేయిస్తున్నారు. దీనికి షరీఅత్ పరమయిన నిదర్శనమేదీ లేదు. వీళ్లు మూలాంశాన్ని ఉపేక్షించి అంచనాలపై అమలు జరుపుతున్నారు. విశ్వాసానికి మూలస్థానం హృదయం గనక హృదయానికి ఎదురుగా నిలబడాలన్నది వీళ్ల భావన. కాని ఇది హదీసుకు విరుద్ధాంశం.

(٤٥٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: وَاللّٰهِ لَقَدْ صَلّٰى رَسُوْلُ اللّٰهِ ﷺ عَلَى ابْنَيْ بَيْضَاءَ فِي الْمَسْجِدِ. رَوَاهُ مُسْلِمٌ.

452. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు : "దైవసాక్షి! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బైజా యొక్క ఇద్దరు కుమారుల నమాజె జనాజాను మస్జిదులోనే చేశారు."

(ముస్లిం)

## సారాంశం

మస్జిదులో 'నమాజె జనాజా' చేయటం దైవప్రవక్త (సఅసం) వారి (ఆచరణ) ద్వారా నిరూపితమయింది. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్‌లు ఇద్దరూ మస్జిద్‌లో నమాజె జనాజా చేయడాన్ని అయిష్టకరమైన విషయం (మక్రూహ్)గా భావిస్తున్నారు. మరి చూడబోతే దీనికి సంబంధించిన షరీఅత్ పరమైన ఆధారం ఏదీ లేదు. పైగా ప్రథమ ఖలీఫా హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) నమాజె జనాజాను హజ్రత్ ఉమర్ (రజి) మస్జిదులోనే చేయించారు. (ఇబ్నె అబీ షైబ). ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) నమాజె జనాజాను కూడా మస్జిదులోనే హజ్రత్ సుహైబ్ (రజి) చేయించారు. (ముస్నద్ సయీద్ మన్సూర్). ఒకవేళ ఇలా చేయటం అధర్మం, లేక అవాంఛనీయ విషయం అయివుంటే ధర్మ ఖలీఫాలు సయితం ఆ మేరకు ఆచరించి ఉండేవారు కాదు. కాబట్టి దైవప్రవక్త (స) ఆచరణ ద్వారా, ఆయన ప్రియ సహచరుల (రజి) అనుసరణ ద్వారా మనకు బోధ పడేదేమంటే మస్జిదులో జనాజా నమాజ్‌ను నిస్సంకోచంగా చేయవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

బైజా (ర.అన్హా). ఈమె సహ్ల్ మరియు సుహైల్‌ల తల్లిగారు. 'బైజా' అనేది ఆమెకు లభించిన బిరుదు. అసలు పేరు దాద్ బిన్తె జుహ్దుమ్ ఫిహ్రీ. ఈమె భర్తపేరు వహబ్ బిన్ రబీయ ఖురషీ. బనూహాషిమ్‌ను, ముస్లిములను సంఘం నుంచి బహిష్కరించాలంటూ ఖురైషులు ఆమోదించిన తీర్మాన పత్రాన్ని సహ్ల్ చించి ముక్కలు ముక్కలు చేసేశాడు. ఒక కథనం ప్రకారం ఈయన మక్కాలోనే ఇస్లాం స్వీకార ప్రకటన చేశాడు. మరో కథనం ప్రకారం తన ఈమాన్‌ను (విశ్వాసాన్ని) హృదయంలో దాచిపెట్టుకున్నాడు. ఆ స్థితిలోనే అతడు బద్ర్ యుద్ధరంగానికి వచ్చాడు. ముస్లింలు ఇతన్ని కూడా యుద్ధ ఖైదీగా పట్టుకున్నారు. అయితే ఈయన మక్కాలో నమాజ్ చేయటం తాను కళ్ళారా చూశానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) చెప్పటంతో, ఆయన సాక్ష్యంపై సహ్ల్ విడుదల చేయబడ్డాడు. ఈయన మదీనాలో మరణించారు.

ఇక సుహైల్ గురించి, ఈయన తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. అబిసీనియా వైపుకు, మదీనా వైపుకు రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ యుద్ధంలోనూ, ఇతర యుద్ధాలలోనూ పాల్గొన్నారు. తబూక్ యుద్ధం తరువాత - హిజ్రీ 9లో మదీనాలో మరణించారు. బైజా (ర.అనహా) గారి ప్రఖ్యాత కుమారులిద్దరూ వీరు. మూడవ కుమారుడు సఫ్‌వాన్. బద్ర్ యుద్ధంలో అమరగతి నొందారు. దైవప్రవక్త (సఅసం) మరణించిన చాలా కాలం తరువాత ఈయన మరణించారని మరో వినికిడి ఉంది.

(٤٥٣) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ أَبِي لَيْلَى قَالَ: كَانَ زَيْدُ بْنُ أَرْقَمَ يُكَبِّرُ عَلَى جَنَائِزِنَا أَرْبَعاً، وَأَنَّهُ كَبَّرَ عَلَى جَنَازَةٍ خَمْساً، فَسَأَلْتُهُ، فَقَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُكَبِّرُهَا. رَوَاهُ مُسْلِمٌ. وَالْأَرْبَعَةُ.

453. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ లైలా కథనం: జైద్ బిన్ అర్ఖమ్ (రజి) మా వాళ్ల జనాజా నమాజులో 4 తక్బీర్లు పలికేవారు. ఒకసారి ఆయన (ఆనవాయితీకి విరుద్ధంగా) 5 తక్బీర్లు పలికారు. ఈ సంగతి గురించి నేనాయన్ని దర్యాప్తు చేయగా, 'దైవప్రవక్త (స) 5 తక్బీర్లు కూడా పలికేవార'ని ఆయన సమాధానమిచ్చారు. (దీనిని ముస్లింతో పాటు మరో నలుగురు (అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ) ఉల్లేఖించారు)

## సారాంశం

జనాజా నమాజులో 4 అదనపు తక్బీర్లు పలకటం కూడా ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. దైవ ప్రవక్త (స) 4 నుండి 8 తక్బీర్ల దాకా పలికినట్లు ఆధారాలున్నాయి. ప్రవక్త (స) సహచరులు కూడా ఈ విధానాన్ని అనుసరించారు. హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో సహాబీలందరినీ సంప్రదించిన మీదట 4 తక్బీర్ల రివాజును ప్రవేశపెట్టారని బైహఖీలో తెలుపబడింది. ఈ అంశంపై అందరూ ఏకీభవించారని కొంతమంది పేర్కొన్నారు. కాని ఇది సరైంది కాదు. హజ్రత్ అలీ (రజి) తదితరులు 4 కన్నా ఎక్కువ తక్బీర్లతో నమాజె జనాజా చేయించే వారని ఆధారాలున్నాయి. 4 తక్బీర్ల తరువాత మృతుని కోసం దుఆ చేసేవారు. జనాజా నమాజ్‌లో ప్రవక్త సహచరులు రఫెయదైన్ చేసేవారు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఇందుకు సుముఖంగా ఉన్నారు. హనఫీ ఫికహ్‌ననుసరించే వారిలో కూడా కొంతమంది ఈ పద్ధతిని అవలంబిస్తారు.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుర్రహ్మాన్ బిన్ అబూలైలా (రహ్మ.లై) ప్రముఖ తాబయీలలో ఒకరు. అన్సార్ వర్గానికి చెందిన వారు. మదీనా వాసులు. తరువాత కూఫాకు మకాం మార్చారు. అంచేత కూఫీగా కూడా వ్యవహరించబడ్డారు. ఈయన నామాంతరం అబూ ఈసా. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన జన్మించారు. హిజ్రీ 86లో జమాజిమ్ యుద్ధంలో మరణించారని ప్రతీతి. మరో కథనం ప్రకారం బస్రా కాలువలో మునిగి చనిపోయారని కూడా తెలుస్తోంది.

(٤٥٤) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَبَّرَ عَلَى سَهْلَ بْنِ حُنَيْفٍ سِتًّا، وَقَالَ: إِنَّهُ بَدَرِيٌّ. رَوَاهُ سَعِيْدُ بْنُ مَنْصُورٍ. وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

454. సహ్ల్ బిన్ హునైఫ్ (రజి) నమాజె జనాజాలో తాను 6 తక్బీర్లు పలికాననీ, ఆయన ఒక బద్రీ సహాబీ అనీ హజ్రత్ అలీ (రజి) తెలియజేశారు. (సయీద్ బిన్ మన్సూర్ దీనిని ఉల్లేఖించారు. దీని మూలం బుఖారీలో ఉంది)

### సారాంశం

బద్రీ సహాబీ అంటే బద్ర్ యుద్ధంలో ముస్లిం సేనల తరపున పోరాడిన యోధుడు అని అర్థం. ఒక పెద్ద మనిషి యొక్క పెద్దరికాన్ని, అతని ఘన కార్యాలను దృష్టిలో పెట్టుకుని నమాజె జనాజా సందర్భంగా 4 కన్నా ఎక్కువ తక్బీర్లు పలకటంలో ఎలాంటి అతిశయోక్తి, అనౌచిత్యం లేదని ఈ హదీసు ద్వారా వ్యక్తమవుతోంది.

### హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన సహ్ల్ బిన్ హునైఫ్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొని, దైవప్రవక్త (సఅసం)ను వెన్నంటి నిలిచిన సహాబీలలో ఒకరు. అన్సార్ సహాబీ. ఔస్ తెగకు చెందిన వారు. మదీనా వాస్తవ్యులు. బద్ర్‌తోపాటు ఇతర యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన హజ్రత్ అలీ (రజి)తో దైవప్రవక్త (స) ఈయనకు సోదర బాంధవ్యం కల్పించారు. ఈ సోదర బంధాన్ని ఆయన ఎంతో చక్కగా కొనసాగించారు. హజ్రత్ అలీ (రజి) ఈయన్ని బస్రా పర్యవేక్షకునిగా నియమించారు. సిఫ్ఫీన్ యుద్ధ సందర్భంగా కూడా ఈయన హజ్రత్ అలీ (రజి)కి మద్దతు తెలిపారు. హిజ్రీ 38లో మరణించారు.

(٤٥٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُكَبِّرُ عَلَى جَنَائِزِنَا أَرْبَعاً، وَيَقْرَأُ بِفَاتِحَةِ الْكِتَابِ فِي التَّكْبِيْرَةِ الْأُوْلَى. رَوَاهُ الشَّافِعِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

455. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా జనాజా నమాజులలో 4 తక్బీర్లు పలికేవారు. మొదటి తక్బీర్‌లో ఫాతిహా సూరా పఠించేవారు." (షాఫయి దీనిని బలహీన - జయీఫ్ - ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

జనాజా నమాజ్‌లో మొదటి తక్బీర్ పలికిన తరువాత ఫాతిహా సూరా పఠించ వచ్చునని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది. నసాయిలోని వేరొక ఉల్లేఖనం ప్రకారం సూరతుల్ అస్ర్ కూడా పఠించవచ్చని తెలుస్తోంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో నమాజె జనాజాలో ఫాతిహా సూరా పఠించటం వాజిబ్ (అనివార్యం). అయితే మరి కొంతమంది దీంతో ఏకీభవించలేదు.

(٤٥٦) وَعَنْ طَلْحَةَ بْنِ عَبْدِاللهِ بنِ عَوْفٍ، قَالَ: صَلَّيْتُ خَلْفَ ابْنِ عَبَّاسٍ عَلَى جَنَازَةٍ، فَقَرَأَ فَاتِحَةَ الْكِتَابِ، فَقَالَ لِتَعْلَمُوا أَنَّهَا سُنَّةٌ. رَوَاهُ الْبُخَارِيُّ.

456. హజ్రత్ తల్హా బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఔఫ్ (రహ్మ.లై) కథనం : నేను ఇబ్నె అబ్బాస్ (రజి) వెనుక నమాజె జనాజా చేశాను. ఆయన సూరె ఫాతిహా పఠించారు. ఆయనిలా అన్నారు : ఇలా పఠించటం సున్నత్ అన్న సంగతి మీకు తెలియాలి (అన్న ఉద్దేశ్యంతోనే నేనీ సూరా పఠించాను). (బుఖారీ)

## సారాంశం

ఇబ్నె అబ్బాస్ (రజి) గారు ఫాతిహా సూరాను బిగ్గరగా పారాయణం చేశారు. ఇలా పారాయణం చేయటం దైవప్రవక్త (స) సంప్రదాయం అన్న విషయాన్ని అందరి దృష్టికి తీసుకురావటానికే తానిలా చేశానని ఆయన (రజి) వివరించారు కూడా. కాబట్టి నమాజె జనాజాలో ఫాతిహా సూరాను బిగ్గరగా పఠించటం ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

తల్హా బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఔఫ్ (రహ్మ.లై). ప్రఖ్యాత సహాబీ అయిన అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గారి అన్న కుమారుడు. 'తల్హా నదా' అనే బిరుదు పొందారు. అత్యుత్తమ శ్రేణికి చెందిన ధర్మవేత్త. తాబయీలలో మధ్యతరానికి చెందినవారుగా పరిగణించబడ్డారు. హిజ్రి 97లో - 72 సంవత్సరాల వయస్సులో మరణించారు.

(٤٥٧) وَعَنْ عَوْفِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: صَلَّى رَسُولُ اللهِ ﷺ عَلَى جَنَازَةٍ، فَحَفِظْتُ مِنْ دُعَائِهِ «اللَّهُمَّ اغْفِرْ لَهُ، وَارْحَمْهُ، وَعَافِهِ، وَاعْفُ عَنْهُ، وَأَكْرِمْ نُزُلَهُ، وَوَسِّعْ مَدْخَلَهُ، وَاغْسِلْهُ بِالْمَاءِ، وَالثَّلْجِ، وَالْبَرَدِ. وَنَقِّهِ مِنَ الْخَطَايَا، كَمَا نَقَّيْتَ الثَّوْبَ

457. హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక జనాజా నమాజ్ చేయించారు. నేను ఆయన (స) చేసిన దుఆలో జ్ఞాపకం చేసుకున్న భాగం ఇది: "ఓ అల్లాహ్! ఇతన్ని మన్నించు. ఇతనిపై కరుణించు. ఇతన్ని సుఖసౌఖ్యాలతో ఉంచు. ఇతని తప్పులను ఉపేక్షించు. ఇతనికి చక్కని అతిథి మర్యాద చెయ్యి. ఇతని సమాధిని విశాలవంతంగా చెయ్యి. ఇతన్ని నీళ్ళతో, మంచుతో, వడగళ్లతో కడిగివెయ్యి. తెల్లని వస్త్రం మలినం నుండి ఎలా పరిశుభ్రపరచ

الْأَبْيَضَ مِنَ الدَّنَسِ، وَأَبْدِلْهُ دَاراً خَيْراً مِّنْ دَارِهِ، وَأَهْلاً خَيْراً مِنْ أَهْلِهِ، وَأَدْخِلْهُ الْجَنَّةَ، وقِهِ فِتْنَةَ الْقَبْرِ، وَعَذَابَ النَّارِ». رَوَاهُ مُسْلِمٌ.

బడుతుందో అలాగే ఇతన్ని పరిశుభ్ర పరచు. ఇతనికి ప్రాపంచిక ఇల్లుకన్నా మంచి ఇల్లును, ప్రస్తుత ఆలుబిడ్డల కన్నా మంచి ఆలుబిడ్డలను ప్రసాదించు. ఇతన్ని స్వర్గంలో ప్రవేశింపజెయ్యి. ఇతన్ని సమాధి పరీక్ష నుండి, నరక యాతన నుండి సురక్షితంగా ఉంచు."

(ముస్లిం)

## సారాంశం

ఈ 'దుఆ'ను సయితం దైవప్రవక్త (సఅసం) బిగ్గరగా పఠించారని హదీసు తీరును బట్టి అర్థమవుతున్నది. బిగ్గరగా చదవబట్టే హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఈ దుఆను జ్ఞాపకం చేసుకోగలిగారు. లేదా ఈయన దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకుని, జ్ఞాపకం చేసుకుని ఉంటారన్న భావనకు కూడా ఆస్కారం లేకపోలేదు. ఇంతకీ ఈ దుఆను బిగ్గరగా చేయాలా లేక నెమ్మదిగా చేయాలా? అన్న విషయమై ద్వంద్వాభిప్రాయాలున్నాయి. చాలామంది ధర్మవేత్తలు దుఆను నెమ్మదిగా చేయాలని భావించారు. కొద్దిమంది మాత్రం బిగ్గరగా పఠించాలని అభిప్రాయపడ్డారు. రాత్రిపూట అయితే బిగ్గరగానూ పగటివేళ అయితే నెమ్మదిగానూ దుఆ చేయాలని మరికొంత మంది తలపోశారు. 'దుఆ' నెమ్మదిగా చేయటం ఉత్తమం కాబట్టి ఈ దుఆను నెమ్మదిగా చేయటమే మంచిదని అత్యధిక మంది ధర్మవేత్తలు నిర్ధారణకు వచ్చారు. ఎందుకంటే ఎక్కువ హదీసులు దీనిని సమర్థిస్తున్నాయి. అయితే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) మాదిరిగా బిగ్గరగా చదివినా అందులో ఆక్షేపణీయం ఏమీలేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఔఫ్ బిన్ మాలిక్ (రజి) దైవప్రవక్త సహచరులలో ఒకరు. అష్‌జా తెగకు చెందిన వారు. ఖైబర్ యుద్ధంలో తొలిసారిగా పాల్గొన్నారు. మక్కా విజయం నాడు అష్‌జా తెగ వారి ధ్వజం ఈయన చేతిలో ఉంది. సిరియాలో స్థిరపడ్డారు. హిజ్రీ 73లో మరణించారు.

(٤٥٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا صَلَّى عَلَى جَنَازَةٍ، يَقُولُ: «اللَّهُمَّ اغْفِرْ لِحَيِّنَا، وَمَيِّتِنَا، وَشَاهِدِنَا، وَغَائِبِنَا، وَصَغِيرِنَا، وَكَبِيرِنَا، وَذَكَرِنَا، وَأُنْثَانَا، اللَّهُمَّ مَنْ أَحْيَيْتَهُ

458. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎవరి జనాజా నమాజ్ చేయించినా ఈ దుఆ పఠించేవారు: "ఓ దేవా! మాలోని సజీవులను - మృతులను, ఇక్కడ ఉన్న వారినీ - లేనివారినీ, మాలోని చిన్నలనూ - పెద్దలనూ,

مِنَّا فَأَحْيِهِ عَلَى الْإِسْلَامِ، وَمَنْ تَوَفَّيْتَهُ مِنَّا فَتَوَفَّهُ عَلَى الْإِيمَانِ، اللَّهُمَّ لَا تَحْرِمْنَا أَجْرَهُ، وَلَا تَفْتِنَّا بَعْدَهُ». رَوَاهُ مُسْلِمٌ وَالْأَرْبَعَةُ.

మాలోని పురుషులనూ - స్త్రీలనూ క్షమించు. దేవా! మాలో నీవు ఎవరిని సజీవంగా ఉంచినా ఇస్లాంపై సజీవంగా ఉంచు. మరెవరికి మరణాన్ని ఇచ్చినా విశ్వాసస్థితిలో మరణాన్ని ఇవ్వు. ఓ దేవా! మమ్ము ఇతనితో ముడిపడి ఉన్న పుణ్యఫలాన్నుండి దూరం చేయకు. ఇంకా మమ్ము ఇతని తరువాత అపమార్గం పట్టించకు." (దీనిని ముస్లిం మరియు నలుగురు - అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ - ఉల్లేఖించారు)

(٤٥٩) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «إِذَا صَلَّيْتُمْ عَلَى الْمَيِّتِ فَأَخْلِصُوا لَهُ الدُّعَاءَ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

459. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు - "మీరు ఎప్పుడు ఎవరి జనాజా నమాజ్ చేసినా మనస్ఫూర్తిగా అతని కోసం (మృతుని కొరకు) దుఆ చేయండి." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

నమాజె జనాజాలో పాల్గొనే ప్రతి ఒక్కరూ చనిపోయిన వారి మన్నింపు కోసం ప్రార్థించే ఉద్దేశ్యంతోనే వస్తారు. తాను చేసే దుఆ వల్ల మృతునికి ప్రయోజనం చేకూరాలన్న తలంపు ఉన్నప్పుడు, ఆ దుఆలో ఎలాంటి లోటు కనబరచకూడదు. ఎంతో వినమ్రతతో, ఆర్ద్రతతో మృతుని క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకోవాలి. చాలామంది అంత్యక్రియలలో పాల్గొంటారు కాని వారిలో ఈ వినమ్రత కానరాదు. ఏదో లాంఛనప్రాయంగా, తాము కూడా పాల్గొన్నామన్న విషయాన్ని సాటి సమాజానికి తెలియజేసేందుకు వస్తారు. చిత్తశుద్ధి లోపించిన వేడుకోళ్లు దైవ సన్నిధిలో ఆమోదయోగ్యమవుతాయన్నది సందేహాస్పదమే.

(٤٦٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «أَسْرِعُوا بِالْجَنَازَةِ، فَإِنْ تَكُ صَالِحَةً، فَخَيْرٌ تُقَدِّمُونَهَا إِلَيْهِ، وَإِنْ تَكُ سِوَى ذَلِكَ، فَشَرٌّ تَضَعُونَهُ عَنْ رِقَابِكُمْ». مُتَّفَقٌ عَلَيْهِ.

460. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - "జనాజా (శవపేటిక) మోసుకు వెళ్ళటంలో శీఘ్రతను కనబరచండి. ఎందుకంటే చనిపోయిన వ్యక్తి ఒకవేళ సద్వర్తనుడై ఉంటే అది అతని పాలిట శుభకరం అవుతుంది. కనుక అతన్ని మంచి స్థానం వైపునకు త్వరగా తీసుకెళ్లండి. ఒకవేళ మృతుడు వేరేవాడై ఉంటే (దుర్వర్తనుడై ఉంటే) మీరు మీ భుజాల నుండి బరువు తగ్గించుకున్న వారవుతారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే మృతుని అంత్యక్రియలు జరపటంలో అనవసరంగా ఆలస్యం చేయకూడదు. ఇది సున్నత్‌కు విరుద్ధం. మరణించిన వారిని తొందరగా ఖననం చేయాలని దైవప్రవక్త (నఅసం) హజ్రత్ అలీ (రజి)కి తాకీదు చేశారు. తబ్రానీలో ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: "మీలో ఎవరయినా మరణిస్తే అతన్ని (అనవసరంగా) ఆపి ఉంచకండి. వీలయినంత తొందరగా అతన్ని సమాధి వైపునకు తీసుకువెళ్ళండి" అని దైవప్రవక్త (స) ఉపదేశించారు.

(٤٦١) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ شَهِدَ الْجَنَازَةَ حَتَّى يُصَلَّى عَلَيْهَا فَلَهُ قِيرَاطٌ، وَمَنْ شَهِدَهَا حَتَّى تُدْفَنَ فَلَهُ قِيرَاطَانِ»، قِيلَ: وَمَا الْقِيرَاطَانُ؟ قَالَ: «مِثْلُ

461. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "ఎవరయితే జనాజా వెంట వెళతాడో, జనాజా నమాజ్ చేయించే వరకూ ఉంటాడో అతనికి ఒక 'ఖీరాత్'కు సమానంగా పుణ్యఫలం లభిస్తుంది. మరెవరయితే ఖననం చేసే వరకూ హాజరై ఉంటాడో అతనికి రెండు 'ఖీరాత్'ల పుణ్యం లభిస్తుంది." 'రెండు ఖీరాత్'లంటే ఎంత?' అని ప్రశ్నించగా

الْجَبَلَيْنِ الْعَظِيمَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «حَتَّى تُوضَعَ فِي اللَّحْدِ».

"రెండు ఖీరాత్‌లంటే అవి రెండు పెద్ద పర్వతాలకు సమానం" అని దైవప్రవక్త (సఅసం) సమాధానమిచ్చారు.

"మృతుణ్ణి సమాధిలో దించేవరకూ హాజరై ఉంటాడో..." అన్న వాక్యం ముస్లిం ఉల్లేఖనంలో ఉంది.

وَلِلْبُخَارِيِّ: «مَنْ تَبِعَ جَنَازَةَ مُسْلِمٍ إِيمَاناً وَاحْتِسَاباً، وَكَانَ مَعَهَا حَتَّى يُصَلَّى عَلَيْهَا وَيُفْرَغَ مِنْ دَفْنِهَا، فَإِنَّهُ يَرْجِعُ بِقِيرَاطَيْنِ، كُلُّ قِيرَاطٍ مِثْلُ جَبَلِ أُحُدٍ».

బుఖారీలోని ఉల్లేఖనం ఈ విధంగా ఉంది-"ఎవరయితే ఒక ముస్లిం అంత్యక్రియల నమాజులో విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో పాల్గొంటాడో మరియు నమాజె జనాజా ముగిసే వరకూ తోడుగా ఉండి, ఖననం జరిగిన తరువాత వెను తిరిగి వస్తాడో అతడు రెండు ఖీరాత్‌లు పుచ్చుకుని వచ్చాడన్నమాట! ప్రతీ ఖీరాత్ ఉహుద్ పర్వతానికి సమానమైనది."

**సారాంశం**

అంత్యక్రియలలో పాల్గొన్న వారికి లభించే పుణ్యఫలాన్ని ఈ హదీసులో ఉపమానాల రూపంలో వివరించటం జరిగింది. మృతి చెందిన సాటి సోదరసోదరీమణుల అంతిమ వీడ్కోలుకై తప్పకుండా వెళ్ళండని ప్రోత్సహించటం ఈ హదీసు ప్రధాన ఉద్దేశ్యం.

(٤٦٢) وَعَنْ سَالِمٍ عَنْ أَبِيهِ، أَنَّهُ رَأَى النَّبِيَّ ﷺ وَأَبَا بَكْرٍ وَعُمَرَ، يَمْشُونَ أَمَامَ الْجَنَازَةِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَأَعَلَّهُ النَّسَائِيُّ وَطَائِفَةٌ بِالْإِرْسَالِ.

462. దైవప్రవక్త (స)ను, హజ్రత్ అబూబక్ర్ (రజి)ను, హజ్రత్ ఉమర్ (రజి)ను, జనాజాకు ముందు నడుస్తుండగా తాను చూశానని తన తండ్రిగారు తనకు చెప్పినట్లు హజ్రత్ సాలిమ్ వివరించారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా నిర్ధారించారు - నసాయి తదితరులు, దీనిని 'ముర్సల్'గా భావించారు)

**సారాంశం**

శవపేటిక వెంట నడచి వెళుతున్నప్పుడు ముందు ఉండాలా? వెనుక ఉండాలా? వివిధ ఉల్లేఖనాలను జోడించగా ఆయన (సఅసం) ముందు, వెనుక, కుడిప్రక్క, ఎడమ ప్రక్క - అన్ని విధాలుగా నడచినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. అయితే ఈ నాలుగు పొజిషన్లలో మెరుగైనదేది? అంటే ఇమాములు దీనిపై పలు రకాలుగా స్పందించారు. ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్‌లు ముందు నడవటాన్ని ఉత్తమంగా భావిస్తున్నారు. కాగా, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ ఔజాయీలు వెనుక నడవటాన్ని ఉత్తమంగా తలపోస్తున్నారు. 'ఎలా నడచినా ఫరవాలేదు, ముందైనా వెనుకైనా దేనికీ దేనిపైనా ఆధిక్యత, ప్రత్యేకత లేదు' అని ఇమామ్ షౌకానీ అభిప్రాయపడ్డారు. నడచి వచ్చే వారు మునుముందు ఉండాలనీ, వాహనంపై ఉన్నవారు వెనుక ఉండాలనీ సుఫియాన్ సౌరీ ప్రభృతులు భావిస్తున్నారు. ఏ స్థితిలో నడచినా పరిస్థితుల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని మసలుకోవచ్చు. ఇదేమంత తీవ్రమయిన విషయం కాదు.

(٤٦٣) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: نُهِينَا عَنِ اتِّبَاعِ الْجَنَائِزِ، وَلَمْ يُعْزَمْ عَلَيْنَا. مُتَّفَقٌ عَلَيْهِ.

463. హాజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్‌హా) కథనం : "మేము జనాజా (అంతిమ వీడ్కోలు) యాత్రలో పాల్గొనరాదని చెప్పబడింది. అయితే ఈ వారింపు మాపై అనివార్యంగా ఖరారు చేయబడలేదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మహిళలు జనాజా నమాజులో, జనాజా యాత్రలలో పాల్గొనరాదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ వారింపు బహుశా తొలి కాలానికి సంబంధించినదై ఉండవచ్చు. తదుపరి మహిళలలో ధర్మావగాహన పెంపొంది, ఇస్లామీయ చైతన్యం మేల్కొన్న తరువాత బహుశా జనాజా నమాజులో పాల్గొనే అనుమతి లభించి ఉండవచ్చు. నసాయి, ఇబ్నె మాజ, ఇబ్నె అబీ షైబాలలో వచ్చిన అబూ హురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం, ఒక జనాజాలో మహిళలు కూడా పాల్గొన్నారు. హాజ్రత్ ఉమర్ (రజి) వాళ్లను ఆపబోయారు. కాని "వారిని వెళ్లనివ్వండి" అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.

(٤٦٤) وَعَنْ أَبِي سَعِيدٍ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا رَأَيْتُمُ الْجَنَازَةَ فَقُومُوا، فَمَنْ تَبِعَهَا فَلاَ يَجْلِسْ حَتَّى تُوضَعَ». مُتَّفَقٌ عَلَيْهِ.

464. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హాజ్రత్ అబూ సయీద్ (రజి) తెలిపారు : "ఎవరి దయినా జనాజా (శవపేటిక) రావటం మీరు గమనిస్తే లేచి నిలబడండి. ఇంకా జనాజా వెంటనున్నవారు జనాజాను (శవపేటికను) నేలపై ఉంచే వరకూ కూర్చోకూడదు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

మరణం తిరుగులేనిది. అది ఎక్కడ సంభవించినా, ఎవరిని కబళించినా పరిసరాల వారిని కలచివేస్తుంది. కించిత్ సమయానికి మనిషిలో గుండె దడ పెరుగుతుంది. మృతుణ్ని సమాధి వైపునకు తీసుకు వెళుతున్నప్పుడు అతని పట్ల గౌరవభావంతో, మానవతా దృక్పథంతో లేచి నిలబడటం కనీస మర్యాద అనిపించుకుంటుంది. అదీగాక ఆ సమయంలో దైవదూతలు మృతునికి తోడుగా ఉంటారు. ఇక జనాజా యాత్రలో పాల్గొన్న వారు నిర్ణీత మజిలీకి చేరేదాకా వెంట వెళ్ళి శవ పేటికను క్రిందికి దించిన మీదటే కూర్చోవాలి. శవపేటికను ఎత్తుకుని ఉండగా కూర్చోకూడదు. నసాయిలో అబూహురైర (రజి), అబూసయీద్ (రజి)లు ఇలా అంటున్నారు : "దైవప్రవక్త (స) వారు ఏ జనాజాలో పాల్గొన్నా దాన్ని క్రింద నేలపై ఉంచే వరకూ ఆయన (స) కూర్చోవటం మేమెన్నడూ చూడలేదు."

(٤٦٥) وَعَنْ أَبِيْ إِسْحَاقَ، أَنَّ عَبْدَ اللهِ ابْنَ يَزِيْدَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَدْخَلَ الْمَيِّتَ مِنْ قِبَلِ رِجْلَيِ الْقَبْرِ، وَقَالَ: هٰذَا مِنَ السُّنَّةِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ.

465 హజ్రత్ అబూ ఇస్‌హాఖ్ (రహ్మ.లై) కథనం : "అబ్దుల్లాహ్ బిన్ యజీద్ (రజి) మృతదేహాన్ని దాని కాళ్ల వైపు నుంచి సమాధిలో దించారు. ఇదే సాంప్రదాయిక పద్ధతి (సున్నత్) అని కూడా ఆయన అన్నారు." (అబూదావూద్)

## సారాంశం

కాళ్ల వైపు నుంచి మృత దేహాన్ని గోరీలోకి దించాలని ఈ హదీసు చెబుతోంది. హిజాజ్ ప్రాంతం వారు ఈ విధానాన్నే అనుసరించేవారు. ఇమామ్ షాఫయి, అహ్మద్‌లు కూడా దీనినే అనుసరించారు. ఇదే ఉత్తమమయిన పద్ధతి. దీనికి భిన్నంగా ప్రామాణికమైన ఉల్లేఖనం ఏదీ ఇంత వరకు లభ్యం కాలేదు.

## హదీసు ఉల్లేఖకులు

1. అబూ ఇస్‌హాఖ్ గారి అసలు పేరు అమ్ర్ బిన్ అబ్దుల్లాహ్ సబ్‌యీ హమ్దానీ. కూఫా వాసులు. ప్రఖ్యాత తాబయీలలో ఒకరు. అనేక హదీసులు అందజేశారు. కాని వార్ధక్యంలో మతి భ్రమించింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో జన్మించారు. హిజ్రీ 129లో కన్నుమూశారు.

2. అబ్దుల్లాహ్ బిన్ యజీద్ (రజి) అన్సార్ వర్గీయులు. ఔస్ తెగకు చెందిన వారు. హుదైబియా ఒప్పందంలో పాల్గొన్నప్పుడు ఈయన వయస్సు 17. జమల్ యుద్ధంలోనూ, సిఫ్ఫీన్ యుద్ధంలోనూ హజ్రత్ అలీ (రజి) పక్షాన ఉన్నారు. కూఫాకు మకాం మార్చారు. ఇబ్నె జుబైర్ (రజి) హయాంలో 'కూఫా' గవర్నర్‌గా కూడా నియమితులయ్యారు. ఆ కాలంలోనే కూఫాలో కన్ను మూశారు.

(٤٦٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «**إِذَا وَضَعْتُمْ مَوْتَاكُمْ فِي الْقُبُورِ، فَقُولُوا: بِسْمِ اللهِ، وَعَلَى مِلَّةِ رَسُولِ اللهِ**». أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَأَعَلَّهُ الدَّارَقُطْنِيُّ بِالْوَقْفِ.

466. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "మీ మృతులను సమాధులలోకి దించేటప్పుడు 'బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహి' అని పలకండి." (దీనిని అహ్మద్, అబూ దావూద్, నసాయి వెలికితీశారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు - దారె ఖుత్నీ మాత్రం దీనిని 'మౌఖూఫ్'గా భావించారు)

**సారాంశం**

హదీసులో పేర్కొనబడిన దుఆ మస్నూన్ అనీ, దీనిని మృతులను సమాధిలో దించే సమయంలో పఠించాలనీ ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ దారె ఖుత్నీ (రహ్మ.లై) ఈ హదీసును నసాయి మాదిరిగా 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు గానీ ఇది సరయినది కాదు. ఎందుకంటే 'ముస్తద్రక్'లోని ఒక ఉల్లేఖనం కూడా ఈ హదీసు ప్రామాణికతను బలపరుస్తున్నది.

(٤٦٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**كَسْرُ عَظْمِ الْمَيِّتِ كَكَسْرِهِ حَيًّا**». رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ عَلَى شَرْطِ مُسْلِمٍ، وَزَادَ ابْنُ مَاجَهْ مِنْ حَدِيثِ أُمِّ سَلَمَةَ: «**فِي الْإِثْمِ**».

467. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు - "ఒక బ్రతికి వున్న మనిషి ఎముకను విరగ్గొట్టడం ఎంతో (ఎంత పాపమో) ఒక మృతుని ఎముకను విరగ్గొట్టడం కూడా అంతే" (దీనిని అబూ దావూద్, 'ముస్లిం' పెట్టిన షరతు ఆధారంగా ఉల్లేఖించారు - ఇబ్నె మాజా ఈ సందర్భంగా ఉమ్మె సలమా-ర. అన్హా-చే ఉల్లేఖించబడిన దానిలో 'పాప కార్యంలో' అన్న పదాన్ని అదనంగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఒక ముస్లిం వ్యక్తి - అతడు చనిపోయినప్పటికీ - ఎంతో మర్యాదకరంగా అతని పట్ల మసలుకోవాలని ఈ హదీసు చెబుతోంది. గౌరవాదరణల విషయానికి వస్తే సజీవునికీ - మృతునికీ మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. అయితే ఆధునిక యుగంలో ఏర్పడిన కొన్ని అత్యవసర, అనివార్య పరిస్థితుల దృష్ట్యా, చట్టపరమైన అవసరాల మూలంగా ధర్మవేత్తలు సర్జరీకి, పోస్టుమార్టంకి అనుమతించారు.

(٤٦٨) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أَلْحِدُوا لِيْ لَحْداً وَانْصِبُوا عَلَيَّ اللَّبِنَ نصباً، كَمَا صُنِعَ بِرَسُولِ اللهِ ﷺ. رَوَاهُ مُسْلِمٌ.

468. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్కాస్ (రజి) కథనం : ఆయన ఇలా అన్నారు- నా కోసం సమాధిలో చంక మాదిరిగా ప్రక్కనుంచి జాగా తీయండి. దైవ ప్రవక్త (స) సమాధి వలె నా పైన పచ్చి ఇటుకలు, సున్నం పేర్చండి (ముస్లిం)

وَلِلْبَيْهَقِيِّ عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ نَحْوُهُ، وَزَادَ: وَرُفِعَ قَبْرُهُ عَنِ الْأَرْضِ قَدْرَ شِبْرٍ. وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

బైహఖీ గారు కూడా హజ్రత్ జాబిర్ (రజి) సౌజన్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. అయితే అదనంగా ఈ వాక్యాలను నకలు చేశారు -'ఆయన (సఅసం) సమాధి నేలకు కేవలం ఒక జానెడు ఎత్తు మాత్రమే ఉంచబడింది.' (ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారుచేశారు)

وَلِمُسْلِمٍ عَنْهُ: نَهَى رَسُولُ اللهِ ﷺ، أَنْ يُجصَّصَ الْقَبْرُ، وَأَنْ يُقْعَدَ عَلَيْهِ، وَأَنْ يُبْنَى عَلَيْهِ.

'ముస్లిం'లో జాబిర్ (రజి) ఉల్లేఖనం ఇలా ఉంది - "సమాధిని పటిష్టవంతం చేయడాన్ని, దానిపై కూర్చోవటాన్ని, దానిపై కట్టడం నిర్మించడాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు."

## సారాంశం

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన దృష్టిలోకి వస్తున్నాయి. అవేమంటే 1) సమాధి ఒక జానెడు కన్నా ఎక్కువ ఎత్తుండరాదు. 2) సమాధి లోపల 'బగ్‌లీ' (డొక్క మాదిరిగా, చంక తరహాలో) చేయటం ఆయన (స)కు ఎంతో ఇష్టం. 3) సమాధిలో పచ్చి ఇటుకలు (లేక నాపరాళ్లు) వంకరగా పేర్చటం మంచిది. 4) సమాధిపై ఏదయినా కట్టడం నిర్మించటం, సమాధిని పటిష్టవంతంగా, అందంగా తీర్చిదిద్దటం నిషిద్ధం. 5) సమాధికి ఒక ప్రత్యేక రూపం ఇచ్చి, దానికొక ప్రత్యేకతను ఆపాదించటం కూడా సమంజసం కాదు. దైవప్రవక్త (సఅసం) గారి శాశ్వత విశ్రాంతి స్థలం కూడా ఒక జానెడు కన్నా ఎక్కువ ఎత్తు ఉండేది కాదు. హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)ల సమాధులు కూడా ఇలాగే ఉండేవి.

(٤٦٩) وَعَنْ عَامِرِ بْنِ رَبِيْعَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى عَلَى عُثْمَانَ ابْنِ مَظْعُوْنٍ، وَأَتَى الْقَبْرَ، فَحَثَى عَلَيْهِ ثَلَاثَ حَثَيَاتٍ، وَهُوَ قَائِمٌ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ.

469. హజ్రత్ ఆమిర్ బిన్ రబీయ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) నమాజె జనాజాను చేశారు. ఆయన సమాధి వద్దకు విచ్చేసి, నిలబడే మూడు దోసిట్ల మన్ను సమాధిపై వేశారు.

(సునన్ దారె ఖుత్నీ)

## సారాంశం

అంత్యక్రియలలో పాల్గొన్నవారు, మృతదేహాన్ని సమాధిలో చేర్చిన మీదట తలో మూడు దోసిట్ల మన్ను వేయాలని ఈ హదీసు ద్వారా తెలుస్తున్నది.

**హదీసులోని ప్రముఖ వ్యక్తి**

ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ జుమాహి ఖురషీ (రజి) వృద్ధ సహాబీలలో ఒకరు. గొప్ప దైవభక్తి పరాయణులు, సాధు స్వభావి. అజ్ఞాన కాలంలోనే ఈయన మద్యపానాన్ని తనకోసం హరామ్ గావించుకున్నారు. 13 మంది తరువాత ఇస్లాం స్వీకరించారు. దైవ మార్గంలో రెండు హిజ్రత్‌లు చేశారు. బద్ర్ యుద్ధంలో హాజరయ్యారు. మదీనాలో హిజ్రీ 30వ మాసంలో - షాబాన్‌లో - మరణించారు. ముహాజిర్లలో మరణించిన తొలివ్యక్తి ఈయనే. 'జన్నతుల్ బఖీ'లో ఖననం చేయబడ్డారు. ఈయన మరణించినపుడు దైవప్రవక్త (సఅసం) ఈయన్ని ముద్దుపెట్టుకున్నారు. అంత్యక్రియలు ముగిసిన తరువాత ఆయన గురించి వ్యాఖ్యానిస్తూ దైవప్రవక్త (సఅసం), 'ఆయన మనందరికీ పెద్ద దిక్కు' అన్నారు.

(٤٧٠) وَعَنْ عُثْمَانَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُوْلُ اللّٰهِ ﷺ إِذَا فَرَغَ مِنْ دَفْنِ الْمَيِّتِ وَقَفَ عَلَيْهِ، وَقَالَ: **اَسْتَغْفِرُوْا لِأَخِيْكُمْ، وَسَلُوْا لَهُ التَّثْبِيْتَ، فَإِنَّهُ الْآنَ يُسْأَلُ.** رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

470. హజ్రత్ ఉస్మాన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ మృతదేహాన్ని అయినా ఖననం చేసిన తరువాత సమాధి దగ్గర నిలబడి ఇలా అనేవారు: "మీ సోదరుని క్షమాపణకై అర్థించండి. స్థిరత్వాన్ని ప్రసాదించమని ప్రార్థించండి. ఎందుకంటే ఇప్పుడితను ప్రశ్నించబడతాడు" (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

సమాధిలో మృతులు ప్రశ్నించబడతారన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. ఖననం చేసిన తరువాత మృతుని క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించటం సరైనదేనని కూడా ఈ హదీసు చెబుతున్నది. అయితే ఈనాటి ప్రజలు ఈ సంప్రదాయాన్ని విడిచిపెట్టేసి, లేనిపోని కొత్త ఆచారాలను మొదలెట్టారు. చూడబోతే షరీయత్‌లో వాటికి ఎలాంటి చోటులేదు.

(٤٧١) وَعَنْ ضَمْرَةَ بنِ حَبِيْبٍ – أَحَدِ التَّابِعِيْنَ – قَالَ: كَانُوا يَسْتَحِبُّونَ إِذَا سُوِّيَ عَلَى الْمَيِّتِ قَبْرُهُ وَانْصَرَفَ النَّاسُ عَنْهُ، أَنْ يُقَالَ عِنْدَ قَبْرِهِ: يَا فُلَانُ! قُلْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، ثَلاَثَ مَرَّاتٍ، يَا فُلَانُ! قُلْ: رَبِّيَ اللَّهُ، وَدِيْنِي الْإِسْلاَمُ، وَنَبِيِّ مُحَمَّدٌ ﷺ. رَوَاهُ سَعِيْدُ بْنُ مَنْصُورٍ مَوْقُوفاً، وَلِلطَّبَرَانِيِّ نَحْوُهُ مِنْ حَدِيْثِ أَبِي أُمَامَةَ مَرْفُوعاً مُطَوَّلاً.

471. తాబయీన్లలో ఒకరైన హాజ్రత్ జమ్రా బిన్ హబీబ్ (రహ్మ.లై) ఇలా అంటున్నారు - మృతుని సమాధి చదునుగా చేసిన తరువాత, జనులు వెళ్ళిపోతున్నప్పుడు సమాధి వద్ద నిలుచుని, మృతుని సంబోధిస్తూ ఇలా అనటం వాంఛనీయం అని ప్రజలు తలపోసేవారు: "ఓ ఫలానా.... లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో దైవం లేడు) అని అను. ఇలా మూడు సార్లు చెప్పేవారు. "ఓ ఫలానా.... రబ్బి యల్లాహు (అల్లాహ్ నా ప్రభువు) అనీ, వ దీనీ అల్ ఇస్లాం (ఇస్లాం నా ధర్మం) అనీ, వ నబియ్యీ ముహమ్మద్ (స) (ముహమ్మద్ నా ప్రవక్త) అనీ పలుకు" అని కూడా చెప్పేవారు. (సయీద్ బిన్ మన్సూర్ దీనిని 'మౌఖూఫ్' గా పేర్కొన్నారు. తబ్రానీ దీనిని ఇదే విధంగా అబూ ఉమామ (రజి) నుండి 'మర్ఫూ' హదీసుగా వివరించారు)

### సారాంశం

ఖననం చేసిన తరువాత, మృతుని సంబోధించి 'ఉపదేశించటం' ఏ సహీహ్ హదీసు ద్వారా కూడా రుజువు కాలేదు. దీని గురించి ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) గారిని ప్రశ్నించగా, ఒక్క సిరియా ప్రజలు తప్ప మరొకరు ఇలా చేయటం తాను చూడలేదని అన్నారు.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు జమ్రా బిన్ హబీబ్. మారు పేరు అబూ ఉతబా. వంశపరంపర ఈ విధంగా ఉంది :-జమ్రా బిన్ హబీబ్ బిన్ సుహైబ్ జుబైదీ. హిమ్సుకు చెందిన వారవటం చేత హిమ్సీగా పిలువబడ్డారు. విశ్వసనీయులైన తాబయి. నాల్గో తరానికి చెందిన వారు.

(٤٧٢) وَعَنْ بُرَيْدَةَ بنِ الحُصَيْبِ ٱلأَسْلَمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «كُنْتُ نَهَيْتُكُمْ عَنْ زِيَارَةِ الْقُبُورِ، فَزُورُوهَا». رَوَاهُ مُسْلِمٌ. زَادَ التِّرْمِذِيُّ: «فَإِنَّهَا تُذَكِّرُ ٱلآخِرَةَ». زَادَ ابْنُ مَاجَهْ مِنْ حَدِيثِ ابنِ مَسْعُودٍ: «وَتُزَهِّدُ فِي الدُّنْيَا».

472. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ బురైద బిన్ హుసైబ్ అస్లమీ (రజి) తెలిపారు: "నేను మీకు సమాధులను సందర్శించ రాదని చెప్పి ఉన్నాను. కాని ఇక నుంచి మీరు వాటిని సందర్శించండి" (ముస్లిం). తిర్మిజీలో ఈ వాక్యం అద నంగా ఉంది : "సమాధుల సందర్శనం పరలోకాన్ని జ్ఞప్తికి తెస్తుంది." ఇబ్నె మాజ గారు ఇబ్నె మస్‌వూద్ (రజి) ఉల్లేఖ నంలో అదనంగా ఈ వాక్యం చేర్చారు- "ఈ సందర్శన ప్రాపంచిక వ్యామోహాన్ని తగ్గిస్తుంది."

**సారాంశం**

సమాధుల సందర్శన ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ప్రారంభ కాలంలో ఆయన (స) సమాధుల సందర్శనను వారించారు. కాని తరువాత ఇందుకు అనుమతిం చారు. ప్రజాబాహుళ్యంలో పరలోక చింతనను కలిగించడానికి, చనిపోయిన వారి మన్నింపుకై ఇతోధికంగా వేడుకోవటానికి దైవప్రవక్త (స) ఈ అనుమతి ఇచ్చారు. అంతేగాని సమాధుల వద్ద ఉరుసుల పేరుతో తమాషా చేయటానికి, మొక్కుకోవటానికి కాదు. ఈ రకమయిన చేష్టలకు షరీఅత్‌లో ఏ మాత్రం చోటులేదు.

(٤٧٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ لَعَنَ زَائِرَاتِ الْقُبُورِ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

473. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధుల సందర్శన నిమిత్తం వెళ్ళే స్త్రీలను ధూత్కరించారు." (దీనిని తిర్మిజీ సేకరించగా ఇబ్నె హిబ్బాన్ ప్రామాణిక హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

స్త్రీలు సమాధుల సందర్శనకై వెళ్ళరాదని ఈ హదీసు చెబుతోంది. సాధారణంగా 'ధూత్కారం' అనేది అధర్మమయిన కార్యం చేసినప్పుడే ప్రయోగించబడుతుంది. మరి కొన్ని హదీసుల ప్రకారం స్త్రీలు సమాధుల్ని సందర్శించవచ్చునని ఉంది. పై హదీసులోని 'వారింపు' సమాధుల సందర్శనకు అనుమతిలేని కాలానికి సంబంధించినదనీ, సమాధుల సందర్శనకు అనుమతి లభించిన తరువాత స్త్రీలు, పురుషులు - అందరికీ ఇది వర్తిస్తుందనీ కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. స్త్రీలు సమాధుల్ని

సందర్శించరాదన్న ప్రవచనం శాశ్వత ప్రాతిపదికతో కూడుకున్నదని మరికొందరు గట్టిగా వాదిస్తున్నారు. దీనికి పండితులు చెప్పే కారణాలేమిటంటే; స్త్రీలలో సాధారణంగా ఈ విషయంలో మటుకు సహనం, సంయమనం చాలా తక్కువగా ఉంటుంది. వాళ్ళు దుఃఖాన్ని ఆపుకోలేరు. గుండెలు బాదుకుంటారు. హాహాకారాలు చేస్తారు. ధర్మానికీ, షరీఅత్‌కు వ్యతిరేకమయిన ఎన్నో పనులకు శ్రీకారం చుట్టేస్తారు. అజ్ఞానానికి, మూర్ఖత్వానికి ప్రతిబింబమైన పనులను మొదలెట్టి సమాధుల సందర్శనా పరమార్థాన్ని మంటగలుపుతారు. అందుకే స్త్రీలు సమాధులను సందర్శించటాన్ని ప్రవక్త (స) తీవ్రంగా వారించారు. గుణపాఠం గరపే, పరలోక భీతిని పెంపొందించుకునే ఉద్దేశ్యంతో సమాధులను సందర్శిస్తే తప్పులేదు. సహీహ్ హదీసులో 'జవ్వారాత్' అనే పదం వచ్చిందనీ, దీని అర్థం అత్యధికంగా స్త్రీలు ఖనన వాటికకు వెళ్ళటంపై ఆయన (స) ధూత్కరించారనీ, గుణపాఠం కొరకు వెళితే ఫరవాలేదనీ అల్లామా షౌకానీ (రహ్మ.లై) వ్యాఖ్యానించారు. అల్లామా అల్-బానీ కూడా దాదాపు ఈ విధంగానే అభిప్రాయపడ్డారు.

(٤٧٤) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ النَّائِحَةَ وَالْمُسْتَمِعَةَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ.

474. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు: "మరణించిన వారి పేరున అరుపులు కేకలతో ఏడ్చే వారినీ, అలాంటి వాటిని ఏర్పాటుచేసి మరీ వినే వారినీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధూత్కరించారు." (అబూదావూద్)

**సారాంశం**

అజ్ఞాన కాలంలో అరబ్బులు ప్రత్యేకంగా ప్రొఫెషనల్స్‌ని పిలిచి మరీ ఈ మేరకు ఏర్పాట్లు చేసేవారు. బుర్రకథ, సోది తరహాలో ఆడవాళ్లు మృతుని గుణగణాలను, ఘనకార్యాలను జ్ఞాపకం చేసి గొల్లున ఏడ్చేవారు. హాహాకారాలు చేసేవారు. మృతుని పేరు మీద ఎంత ఎక్కువగా రోదిస్తే అతని ఆత్మ శాంతికి అంతగా మంచిదని నమ్మేవారు. ఇలాంటి మూఢాచారాలను దైవప్రవక్త (స) నివారించటమే గాక, వీటికి పాల్పడే వారిని ధూత్కరించారు.

దుఃఖంతో కళ్ళు చెమర్చటం, కళ్లలోంచి ధారాపాతంగా నీరు ప్రవహించటంలో అభ్యంతరం ఏమీలేదు. కాని నోటి ద్వారా మాత్రం సభ్యతా సంస్కారాలకు విరుద్ధమైన మాటలు ఆ సమయంలో వ్యక్తం కారాదు. శ్రేష్ఠ సమాజం మర్యాదను మంటగలిపే చేష్టలు కూడా చేయరాదు.

(٤٧٥) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَخَذَ عَلَيْنَا رَسُولُ اللهِ ﷺ أَنْ لاَّ نَنُوحَ. مُتَّفَقٌ عَلَيْهِ.

475. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్‌హా) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో బైత్ (ప్రమాణం లేక ప్రతిజ్ఞ) చేసిన సందర్భంగా - మృతుని పేర పెద్దపెట్టున అరుస్తూ ఏడవరాదని కూడా మా చేత వాగ్దానం చేయించుకున్నారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇంట్లో ఎవరయినా మరణిస్తే, ప్రళయాన్ని సృష్టించేలా గొడవచేయటం, పెడబొబ్బలు పెట్టడం, బట్టలు చించుకోవటం, రొమ్ములపై బాదుకోవటం, జడలు విప్పి తాండవమాడటం నిషిద్ధం. ఈ చేష్టలకు దూరంగా ఉండాలని మహాప్రవక్త (స) అడవారికి ప్రత్యేకంగా తాకీదు చేయటమే గాకుండా, ఆ మేరకు ప్రమాణం కూడా చేయించుకునేవారు.

(٤٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**الْمَيِّتُ يُعَذَّبُ فِي قَبْرِهِ بِمَا نِيحَ عَلَيْهِ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَلَهُمَا نَحْوُهُ عَنِ الْمُغِيرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ.

476. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "చనిపోయిన వానికి అతనిపై రోదించే వారి కారణంగా సమాధిలో యాతనకు గురిచేయటం జరుగుతుంది." (బుఖారీ, ముస్లిం - వీరిరువురూ ముగీరా బిన్ షూబ ఆధారంగా కూడా సరిగ్గా ఇదే విధంగా ఉల్లేఖనాన్ని విశదీకరించారు)

(٤٧٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ بِنْتاً لِلنَّبِيِّ ﷺ تُدْفَنُ، وَرَسُولُ اللهِ ﷺ جَالِسٌ عِنْدَ الْقَبْرِ، فَرَأَيْتُ عَيْنَيْهِ تَدْمَعَانِ. رَوَاهُ الْبُخَارِيُّ.

477. హజ్రత్ అనస్ (రజి) కథనం : "నేను దైవప్రవక్త (సఅసం)వారి పుత్రిక ఒకామె అంత్యక్రియలకు అక్కడే (సమాధి వద్ద) ఉన్నాను. దైవప్రవక్త (సఅసం) సమాధి వద్ద కూర్చుని ఉన్నారు. ఆయన (స) రెండు కళ్ళనుంచీ కన్నీళ్లు ప్రవహించటం నేను చూశాను." (బుఖారీ)

**సారాంశం**

మృతుని ముందు ఏడుపు రావటం సహజం. కాని గొల్లున - బిగ్గరగా - ఏడవటం మాత్రం సమ్మతం కాదు. శోకంతో కళ్లగుండా కన్నీరు రావటం కూడా సహజమే. దైవప్రవక్త (సఅసం) కుమారుడు హజ్రత్ ఇబ్రాహీం (రజి) చనిపోయిన సందర్భంగా ఆయన (స) కళ్లల్లోనుంచి కన్నీరు ప్రవహించసాగింది. "దైవప్రవక్తా (స)! తమరు కూడా ఏడుస్తున్నారా?" అని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆశ్చర్యం వెలిబుచ్చగా, "ఇది అసహనంతో కూడిన ఏడుపు కాదు సుమా! అనురాగంతో, వాత్సల్యంతో ఉబికివస్తున్న కన్నీళ్లు మాత్రమే" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

(٤٧٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ تَدْفِنُوا مَوْتَاكُمْ بِاللَّيْلِ إِلاَّ أَنْ تُضْطَرُّوا إِلَيْهِ». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ، لَكِنْ قَالَ: زَجَرَ أَنْ يُقْبَرَ الرَّجُلُ فِي اللَّيْلِ حَتَّى يُصَلَّى عَلَيْهِ.

478. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా తాకీదు చేశారు: "మీ మృతులను గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడితేతప్ప రాత్రిపూట ఖననం చేయకండి" (ఇబ్నెమాజ). దీని మూలం 'ముస్లిం'లో ఉంది. జనాజా నమాజ్ చేయబడి ఉంటే తప్ప - రాత్రిపూట ఖననం చేయటంపై ఆయన (స) మంద లించారని అందులో ఉంది.

**సారాంశం**

రాత్రిపూట అంత్యక్రియలు జరిపే పక్షంలో క్రియలు సక్రమంగా జరగవేమో, కఫన్ సరిగ్గా చుట్టలేకపోతారేమోనన్న ఉద్దేశ్యంతో బహుశా వారించి ఉంటారు. అయితే మృతుని నమాజె జనాజా పగటిపూటే చేసివుంటే లేదా ఏదయినా తప్పనిసరి కారణంపై రాత్రిపూటే ఖననం చేయవలసి వుంటే అప్పుడు ఫరవాలేదు. గమనార్హమైన విషయం ఏమిటంటే దైవప్రవక్త (స) పుత్రిక అయిన ఫాతిమ (ర.అన్హా) అంత్యక్రియలు రాత్రివేళే జరిగాయి. హజ్రత్ అబూబక్ర్ (రజి) కూడా రాత్రిపూటే ఖననం చేయబడ్డారు. దైవప్రవక్త (స) ఖుద్దుగా ఒక సహచరుని అంత్యక్రియలు రాత్రివేళ జరిపారు - (తిర్మిజీ, ఇబ్నె మాజ). ఇలాంటివే మరికొన్ని హదీసుల వెలుగులో చూస్తే ఏదైనా ప్రత్యేక కారణం లేకపోయినప్పటికీ రాత్రివేళ ఖననం చేయవచ్చని బోధపడుతున్నది. అత్యధికమంది ధర్మవేత్తల దృక్పథం కూడా ఇదే. కాని ఇమామ్ హసన్ బస్రీ, సయీద్ బిన్ ముసయ్యిబ్, ఇబ్నె హజమ్ ప్రభృతులు మాత్రం అకారణంగా రాత్రిపూట అంత్యక్రియలు జరపటం అవాంఛనీయం (మక్రూహ్) అని అంటున్నారు.

(٤٧٩) وَعَنْ عَبْدِ اللهِ بْنِ جَعْفَرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمَّا جَاءَ نَعْيُ جَعْفَرٍ، حِيْنَ قُتِلَ، قَالَ رَسُولُ اللهِ ﷺ، «اِصْنَعُوا لِآلِ

479. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ (రజి) కథనం: జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) అమరగతి నొందిన వార్త అంది నపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు : "జాఫర్ (రజి) ఇంటివారల కోసం భోజనం తయారు చేయండి. వారికి అందిన వ్యధాభరిత

جَعْفَرٍ طَعَاماً، فَقَدْ أَتَاهُمْ مَا يَشْغَلُهُمْ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ.

మయిన కబురు వాళ్లను (ఈ రోజు) వంట చేయనివ్వదు." (నసాయి తప్ప 'ఐదుగురి'లో మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు)

## సారాంశం

బంధువుల్లో, ఇరుగుపొరుగువారిలో ఎవరయినా మరణిస్తే, మృతుని కుటుంబీకులకు భోజనం తయారుచేసి పంపటం మస్నూన్ (సంప్రదాయం). పొరుగువారు ఈ బాధ్యతను గుర్తెరగాలి. భోజనం ఆ కుటుంబీకులకు, మృతుని చూడటానికి దూరప్రాంతాలనుంచి వచ్చిన వారికి చేయిస్తే సరిపోతుంది. ఇరుగుపొరుగు వారికోసం అక్కరలేదు. వారు స్థానికులే గనక కేవలం అంత్య క్రియలలో పాల్గొంటారు.

మృతుని ఇంట ఆ రోజు అందరూ శోకంలో మునిగి ఉంటారు. ఆ విచారంలో వారికి అన్న పానీయాల ధ్యాస కూడా ఉండదు. అయితే వారిని వారి మానాన వదలిపెట్టడం మర్యాద అనిపించు కోదు. కష్టకాలంలో సాటి సోదరుని మంచీ చెబ్బరలను అడిగి తెలుసుకోవటం, వాళ్ల అక్కరలను తీర్చటం మానవ ధర్మం. అందునా బంధుమిత్రులపై, ఇరుగుపొరుగు వారిపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది.

## హదీసు ఉల్లేఖకులు

జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి). ఈయన అబూ తాలిబ్ గారి కుమారులు. హజ్రత్ అలీ (రజి) సోదరుడు. అలీ (రజి) కన్నా పదేళ్ల పెద్దవారు. తొలుత అబిసీనియా వైపునకు వలసవెళ్లారు. అక్కడే స్థిరపడ్డారు. నజ్జాషీ చక్రవర్తి ఈయన చేతుల మీదుగానే ఇస్లాం స్వీకరించాడు. తరువాత ఈయన మదీనాకు వచ్చారు. ఖైబర్ విజయం వరించిన నాడు అక్కడికి (ఖైబర్‌కు) చేరుకున్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన రెండు కళ్ల మధ్యభాగంలో ముద్దుపెట్టుకుని, "ఈ రోజు నాకెంతో ఆనందంగా ఉంది, అది జాఫర్ రాక వల్లనో, ఖైబర్ విజయం వల్లనో మరి" అని వ్యాఖ్యానించారు. జాఫర్‌గారు గొప్ప దాతృగుణం కలవారు. హిజ్రీ 8లో 'మౌతా' యుద్ధంలో వీరమరణం పొందారు. ఈ యుద్ధంలో ఈయన ముస్లిం సేనలకు సారథ్య బాధ్యతలు వహించారు. రెండు భుజాలు తెగి శరీరం నుండి వేరైపోయాయి. "అల్లాహ్ ఈయన రెండు చేతులకు బదులుగా రెండు రెక్కలను తగిలించాడు. వీటితో ఆయన స్వర్గంలో తాను కోరుకున్నచోటికి ఎగిరిపోవచ్చు" అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.

(٤٨٠) وَعَنْ سُلَيْمَانَ بْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيهِ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَلِّمُهُمْ إِذَا خَرَجُوا إِلَى الْمَقَابِرِ، أَنْ يَقُولُوا: السَّلاَمُ عَلَى

480. హజ్రత్ సులైమాన్ బిన్ బురైద (రహ్మ.లై) తన తండ్రి ఆధారంగా ఇలా తెలిపారు - సహాబీలు ఖబరస్తాన్ (ఖనన వాటిక)కు వెళ్ళినపుడు ఈ విధంగా పలకమని దైవప్రవక్త (సఅసం) వారికి

أَهْلِ الدِّيَارِ مِنَ الْمُؤْمِنِيْنَ وَالْمُسْلِمِيْنَ، وَإِنَّا إِنْ شَآءَ اللَّهُ بِكُمْ لَاحِقُوْنَ، نَسْأَلُ اللَّهَ لَنَا وَلَكُمُ الْعَافِيَةَ. رَوَاهُ مُسْلِمٌ.

చెప్పేవారు - 'ఓ ఇంటివారలారా! (సమాధివారలారా!) మీపై శాంతికలుగు గాక! మీరు విశ్వాసులు మరియు ముస్లింల లోనివారు. దైవచిత్తమయితే మేము కూడా వచ్చి మీతో చేరిపోతాము. మేము మాకోసం, మీకోసం కూడా అల్లాహ్ నుండి సౌఖ్యాన్ని అర్థిస్తున్నాము." (ముస్లిం)

## సారాంశం

ఖబరస్తాన్‌కు వెళ్ళటం, సమాధులలో ఉన్న మృతులకోసం మరియు మన క్షమాపణ కోసం కూడా దైవాన్ని వేడుకోవటం సంప్రదాయం అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ వేడుకోలు కేవలం విశ్వాసుల, ముస్లింల కోసమే!

## హదీసు ఉల్లేఖకులు

సులైమాన్ బిన్ బురైద (రజి) ప్రఖ్యాత తాబయి. ఇబ్నె ముయీన్, అబూ హాతిమ్ ప్రభృతులు ఈయన్ని విశ్వసనీయులైన, ఎన్నదగిన వ్యక్తిగా పేర్కొన్నారు. 'ఈయన తన తండ్రి నుంచి హదీసు విన్నట్టు ఎక్కడా ప్రస్తావించబడలేద'ని ఇమామ్ హాకిమ్, ఇమామ్ బుఖారీ అంటున్నారు. అయితే ఈయన తన తండ్రి నుంచి సంగ్రహించిన హదీసులనేకం 'ముస్లిం'లో పొందుపరచబడి ఉన్నాయని ఖజ్రజీ చెప్పారు.

(٤٨١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَرَّ رَسُوْلُ اللهِ ﷺ بِقُبُوْرٍ الْمَدِيْنَةِ فَأَقْبَلَ عَلَيْهِمْ بِوَجْهِهِ، فَقَالَ: «**السَّلَامُ عَلَيْكُمْ، يَا أَهْلَ الْقُبُوْرِ! يَغْفِرُ اللَّهُ لَنَا وَلَكُمْ، أَنْتُمْ سَلَفُنَا، وَنَحْنُ بِالْأَثَرِ**». رَوَاهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ.

481. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాలోని ఖబరస్తాన్ వైపు నుంచి వెళుతూ అటువైపు తిరిగి ఇలా అన్నారు - "ఓ సమాధివాసులారా! మీపై శాంతి వర్షించుగాక! అల్లాహ్ మమ్మల్నీ మరియు మిమ్మల్నీ మన్నించుగాక! మీరు మాకన్నా ముందు వెళ్ళిపోయారు. మేము మీ వెనుకేవస్తున్నాము." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - ఈ హదీసును 'హసన్'గా ఖరారు చేశారు)

(٤٨٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لاَ تَسُبُّوا الْأَمْوَاتَ، فَإِنَّهُمْ قَدْ أَفْضَوْا إِلَى مَا قَدَّمُوا»**. رَوَاهُ الْبُخَارِيُّ، وَرَوَى التِّرْمِذِيُّ عَنِ الْمُغِيْرَةِ نَحْوَهُ، لَكِنْ قَالَ: **«فَتُؤْذُوا الْأَحْيَاءَ»**.

482. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హాజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) వివరించారు - "మృతులను దూషించకండి. ఎందుకంటే వాళ్లు (తమ కొరకు) ఏదయితే (ముందుగానే) పంపు కున్నారో దాన్ని వాళ్లు పొందారు." (బుఖారీ) తిర్మిజీ కూడా ముగీరా సొజ న్యంతో ఈ విధంగానే ఉల్లేఖించారు. అయితే "దూషణల ద్వారా మీరు బ్రతికి ఉన్నవారికి బాధకలిగిస్తారు" అని అందులో ఉంది.

**సారాంశం**

చనిపోయిన వారిని తిట్టడం, వాళ్ల పనులను గుర్తుచేసి అవమానకరంగా మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదు, ఎందుకంటే ఎవరి కర్మలు వారివెంట ఉంటాయి. దైవవిరోధి అయిన అబూలహబ్ కుమార్తె దుర్ర ఇస్లాం స్వీకరించింది. 'దైవ తిరస్కారి కూతురు ముస్లిమా?!' అని కొంతమందిలో గుసగుసలు మొదలయ్యాయి. ఆమె ఈ విషయాన్ని దైవప్రవక్త (స) కు ఫిర్యాదు చేయగా ఆయన (స) "చనిపోయినవారిని తిట్టకండి. దీనివల్ల ఇస్లాం స్వీకరించినవారి సంతతి మనసు నొచ్చుకుంటుంది" అని అన్నారు. (ముస్నద్ అహ్మద్)

ముస్లింల సమక్షంలో అవిశ్వాసులైన వారి పూర్వీకులను దూషించటమే ఇంత తీవ్రమయిన విషయమైనపుడు, ముస్లింలలోని ప్రముఖులను, విద్వాంసులను దూషించటం ఇంకెంత తీవ్రమయిన విషయమో ఆలోచించండి!

# 4. జకాత్ పుస్తకం

## ٤ - كِتَابُ الزَّكَاةِ

(٤٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ مُعَاذاً رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ إِلَى الْيَمَنِ، فَذَكَرَ الْحَدِيثَ، وَفِيهِ: «إِنَّ اللَّهَ قَدْ افْتَرَضَ عَلَيْهِمْ صَدَقَةً فِي أَمْوَالِهِمْ، تُؤْخَذُ مِنْ أَغْنِيَائِهِمْ، فَتُرَدُّ عَلَى فُقَرَائِهِمْ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

483. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యమన్ వైపునకు సాగనంపారు. తరువాత హదీసునంతటినీ వివరించారు. అందులో ఇలా వుంది: "అల్లాహ్ తరఫున వారి సంపదలపై 'జకాత్' విధించబడింది. అది వారి స్థితిమంతుల నుండి వసూలు చేయబడి వారిలోని అగత్యపరులలో, పేదలలో పంచిపెట్టబడాలి." (బుఖారీ)

### సారాంశం

దైవప్రవక్త (సఅసం) కాలంలో ధనవంతులనుండి జకాత్‌ను వసూలుచేసి అధికార స్థాయిలో హక్కుదారులకు (అగత్యపరులకు) పంపిణీ చేసే వ్యవస్థ ఏర్పడిందని ఈ హదీసు ద్వారా తేటతెల్ల మవుతోంది. ఏ ప్రాంతంలో జకాత్ వసూలు చేయబడుతుందో ఆ ప్రాంతంలోని పేదలకు, నిరాధార జీవులకే అది పంచిపెట్టబడటం న్యాయం అన్న విషయం కూడా దీనిద్వారా అవగతమవుతున్నది. ఒకవేళ అక్కడ జకాత్ పంపిణీ అయ్యాక కూడా మిగిలి ఉంటే అప్పుడు ఇతర ప్రాంతాలలోని హక్కు దారులకు ఇవ్వవచ్చు. 'జకాత్' అనేది పేదల హక్కు. దాన్ని చెల్లించటం శ్రీమంతుల బాధ్యత. జకాత్‌ను చెల్లించి వారు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నారే తప్ప ఒకరిపై ఉపకారం ఏమీ చేయటం లేదని గ్రహించాలి.

(٤٨٤) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أن أبا بكر رضي الله عنه كَتَبَ لَهُ: هٰذِهِ فَرِيضَةُ الصَّدَقَةِ، الَّتِي فَرَضَهَا رَسُولُ اللهِ ﷺ عَلَى الْمُسْلِمِينَ، وَالَّتِي أَمَرَ اللَّهُ بِهَا رَسُولَهُ: «فِي كُلِّ أَرْبَعٍ وَعِشْرِينَ مِنَ الإِبِلِ فَمَا دُونَهَا الْغَنَمُ: فِي كُلِّ خَمْسٍ شَاةٌ، فَإِذَا بَلَغَتْ خَمْساً

484. హజ్రత్ అనస్ (రజి) కథనం : హజ్రత్ అబూబక్ర్ (రజి) హజ్రత్ అనస్ (రజి)కు జకాత్ విధికి సంబంధించి (క్షుణ్ణంగా) ఒక పత్రం వ్రాసి ఇచ్చారు. వాస్తవానికి అది దైవప్రవక్త (సఅసం) ముస్లింలపై విధించిన పద్ధతి. ఆ మేరకు అల్లాహ్ తన ప్రవక్త (స)కు ఆజ్ఞాపించి ఉన్నాడు. (ఆ సూచనా పత్రంలో ఇలా

وَعِشْرِيْنَ إِلَى خَمْسٍ وَثَلَاثِيْنَ، فَفِيْهَا بِنْتُ مَخَاضٍ أُنْثَى، فَإِنْ لَّمْ تَكُنْ فَابْنُ لَبُوْنٍ ذَكَرٌ. فَإِذَا بَلَغَتْ سِتًّا وَثَلَاثِيْنَ، إِلَى خَمْسٍ وَأَرْبَعِيْنَ فَفِيْهَا بِنْتُ لَبُوْنٍ أُنْثَى. فَإِذَا بَلَغَتْ سِتًّا وَأَرْبَعِيْنَ، إِلَى سِتِّيْنَ، فَفِيْهَا حِقَّةٌ طَرُوقَةُ الْجَمَلِ. فَإِذَا بَلَغَتْ وَاحِدَةً وَسِتِّيْنَ، إِلَى خَمْسٍ وَسَبْعِيْنَ، فَفِيْهَا جَذَعَةٌ. فَإِذَا بَلَغَتْ سِتًّا وَسَبْعِيْنَ، إِلَى تِسْعِيْنَ، فَفِيْهَا بِنْتَا لَبُوْنٍ. فَإِذَا بَلَغَتْ إِحْدَى وَتِسْعِيْنَ، إِلَى عِشْرِيْنَ وَمِائَةٍ، فَفِيْهَا حِقَّتَانِ طَرُوْقَتَا الْجَمَلِ. فَإِذَا زَادَتْ عَلَى عِشْرِيْنَ وَمِائَةٍ، فَفِيْ كُلِّ أَرْبَعِيْنَ بِنْتُ لَبُوْنٍ، وَفِيْ كُلِّ خَمْسِيْنَ حِقَّةٌ. وَمَنْ لَّمْ يَكُنْ مَّعَهُ إِلاَّ أَرْبَعٌ مِنَ الْإِبِلِ، فَلَيْسَ فِيْهَا صَدَقَةٌ، إِلاَّ أَنْ يَشَاءَ رَبُّهَا. وَفِيْ صَدَقَةِ الْغَنَمِ، فِيْ سَائِمَتِهَا: إِذَا كَانَتْ أَرْبَعِيْنَ، إِلَى عِشْرِيْنَ وَمِائَةِ شَاةٍ، شَاةٌ. فَإِذَا زَادَتْ عَلَى عِشْرِيْنَ وَمِائَةٍ إِلَى مَائَتَيْنِ، فَفِيْهَا شَاتَانِ. فَإِذَا زَادَتْ عَلَى

లిఖించబడింది) : ఒంటెలు 24 లేక అంతకన్నా తక్కువగా ఉంటే వాటిపై మేకలను (జకాత్‌గా) ఇవ్వవలసి ఉంటుంది. ప్రతి 5 ఒంటెలకు గాను ఒక మేక. ఒంటెల సంఖ్య 25కు మించి 35 వరకు ఉంటే వాటిపై ఏడాది వయసున్న ఒక ఆడ ఒంటెను ఇవ్వాలి. అది గనక లేకుంటే రెండేళ్ల మగ ఒంటెను ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 36 నుండి 45 వరకు ఉంటే రెండేళ్ల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 46నుండి 60 వరకు ఉంటే మూడేళ్ల ఒంటెతో సంపర్కం చేయగల ఆడ ఒంటెను ఇవ్వాలి. ఈ సంఖ్య 61 నుండి 75 వరకు ఉంటే అందులో నుంచి నాలుగేళ్ల ఒంటెను సమర్పించుకోవాలి. ఒంటెల సంఖ్య 75కు మించి 90 వరకు చేరుకుంటే వాటిలో నుంచి రెండేళ్ల వయసున్న రెండు ఆడ ఒంటెలు ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 91 నుండి 120 వరకు ఉంటే అప్పుడు మూడేళ్ల వయస్సున్న, మగ ఒంటెతో జతకట్టగల రెండు పడుచు ఆడ ఒంటెల్ని ఇవ్వాలి. ఒంటెల సంఖ్య 120 కి మించిపోతే అప్పుడు ప్రతి నలభై ఒంటెలపై రెండేళ్ల ఒక ఆడ ఒంటెను, ప్రతి 50 ఒంటెలపై మూడేళ్ల ఒక ఆడ ఒంటెను ఇచ్చుకోవాలి. కేవలం నాలుగు ఒంటెలు మాత్రమే కలిగి ఉన్నవారిపై ఎలాంటి జకాత్ లేదు. ఒకవేళ యజమాని ఇవ్వదలచుకుంటే అది అతని ఇష్టం.

مِائَتَيْنِ، إِلَى ثَلاَثِمَائَةٍ، فَفِيْهَا ثَلاَثُ شِيَاهٍ. فَإِذَا زَادَتْ عَلَى ثَلاَثِمَائَةٍ، فَفِيْ كُلِّ مِائَةٍ، شَاةٌ. فَإِذَا كَانَتْ سَائِمَةُ الرَّجُلِ نَاقِصَةً عن أَرْبَعِيْنَ شَاةً، شَاةٌ، وَّاحِدَةً، فَلَيْسَ فِيْهَا صَدَقَةٌ، إِلاَّ أَنْ يَّشَاءَ رَبُّهَا، وَلاَ يُجْمَعُ بَيْنَ مُتَفَرِّقٍ، وَلاَ يُفَرَّقُ بَيْنَ مُجْتَمِعٍ، خَشْيَةَ الصَّدَقَةِ. وَمَا كَانَ مِنَ خَلِيْطَيْنِ، فَإِنَّهُمَا يَتَرَاجَعَانِ بَيْنَهُمَا بِالسَّوِيَّةِ. وَلاَ يُخْرَجُ فِي الصَّدَقَةِ هَرِمَةٌ، وَلاَ ذَاتُ عَوَارٍ، وَلا تَيْسٌ، إِلاَّ أَنْ يَشَاءَ الْمُصدِّقُ. وَفِي الرِّقَةِ:

మేకల జకాత్ ఈ విధంగా ఉంది: బయట మేతమేసే మేకలు 40 నుండి 120 వరకు ఉంటే కేవలం ఒక మేక మాత్రమే జకాత్‌గా వసూలు చేయబడుతుంది. ఈ సంఖ్య 121 నుండి 200 వరకు ఉంటే రెండు మేకలు జకాత్‌గా వసూలు చేయబడతాయి. మేకల సంఖ్య 201 నుండి 300 వరకు పెరిగితే అప్పుడు మూడు మేకలు జకాత్ రూపేణా తీసుకోవటం జరుగుతుంది. ఈ సంఖ్య 300 దాటితే ప్రతి నూరు మేకలపై ఒక మేక జకాత్‌గా వసూలు చేయబడుతుంది. బహిరంగ స్థలాలలో మేతమేసే మేకల సంఖ్య 40 కన్నా కేవలం ఒకటి తక్కువవున్నా వాటి యజమానిపై జకాత్ బాధ్యతలేదు. ఒకవేళ యజమాని తన ఇష్టపూర్వకంగా ఏదన్నా ఇచ్చుకుంటే అది వేరేవిషయం. జకాత్ భయంతో వేర్వేరుగా మేత మేసే పశువులను ఒక చోట సమీకరించటం గానీ, ఒకే మందను అనేక మందలుగా విభజించటంగానీ చేయరాదు. ఇద్దరు వ్యక్తులు కలసి - ఉమ్మడిగా - మేకల్ని పోషిస్తున్నప్పుడు జకాత్ వారిరువురి నుండి చెరి సమానంగా వసూలు చేయాలి. జకాత్ పద్దులో ముసలి మేకలను గానీ, ఒంటికన్నుగల పశువులను గానీ, కేవలం పోతును గానీ తీసుకోరాదు. జకాత్ ఇచ్చే వ్యక్తి పరిస్థితిని అర్థం చేసుకుని వసూలు చేసే వ్యక్తి సడలింపుల వైఖరిని అవలంబిస్తే అది వేరే విషయం.

فِي مِائَتَيْ دِرْهَمٍ، رُبْعُ الْعُشْرِ، فَإِنْ لَّمْ تَكُنْ إِلاَّ تِسْعِيْنَ وَمِائَةً، فَلَيْسَ فِيْهَا صَدَقَةٌ، إِلاَّ أَن يَشَاءَ رَبُّهَا. وَمَنْ بَلَغَتْ عِنْدَهُ مِنَ الْإِبِلِ صَدَقَةُ الْجَذَعَةِ، وَلَيْسَتْ عِنْدَهُ جَذَعَةٌ، وَعِنْدَهُ حِقَّةٌ، فَإِنَّهَا تُقْبَلُ مِنْهُ الْحِقَّةُ، وَيَجْعَلُ مَعَهَا شَاتَيْنِ إِنِ اسْتَيْسَرَتَا لَهُ، أَوْ عِشْرِيْنَ دِرْهَماً. وَمَنْ بَلَغَتْ عِنْدَهُ صَدَقَةُ الْحِقَّةِ، وَلَيْسَتْ عِنْدَهُ الْحِقَّةُ، وَعِنْدَهُ الْجَذَعَةُ. فَإِنَّهَا تُقْبَلُ مِنْهُ الْجَذَعَةُ، وَيُعْطِيْهِ الْمُصَدِّقُ عِشْرِيْنَ دِرْهَماً أَوْ شَاتَيْنِ.

رَوَاهُ الْبُخَارِيُّ.

వెండి జకాత్ ఈ విధంగా ఉంది: 200 వెండి దిర్హమ్‌లుంటే వాటిపై 40వ వంతును జకాత్‌గా ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ ఎవరి వద్దయినా రెండు వందల దిర్హములకన్నా ఒక్క దిర్హమ్ తక్కువ వున్నా అతనిపై జకాత్ తప్పనిసరి (వాజిబ్) కాదు. ఒకవేళ ఇవ్వదలచుకుంటే అది అతని ఇష్టం.

ఎవరి వద్దనుంచి నాలుగేళ్ల వయస్సుగల ఒంటె జకాత్ రూపేణా వసూలు కావలసి ఉన్నదో, అతనివద్ద గనక నాలుగేళ్ల ఒంటె లేకపోయినట్లయితే అప్పుడతని నుండి మూడేళ్ల వయస్సున్న పడుచు ఆడ ఒంటె మరియు రెండు మేకలు తీసుకోబడతాయి. అయితే ఆ ఆడ ఒంటె మగ ఒంటెతో సంపర్కానికి యోగ్యంగా ఉండాలి. రెండు మేకలు కూడా సులభంగా లభ్యమైతేసరి, లేకుంటే 20 దిర్హమ్‌లు ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ మూడేళ్ల ఆడ ఒంటెను జకాత్‌గా ఇవ్వవలసిన వానివద్ద ఆ వయస్సున్న ఆడ ఒంటె లేకపోయినట్లయితే - అతని దగ్గర నాలుగేళ్ల మగ ఒంటె ఉంటే - ఆ మగ ఒంటెనే తీసుకోవటం జరుగుతుంది. అట్టి పరిస్థితిలో జకాత్‌ను వసూలుచేసిన వ్యక్తి అతనికి 20 దిర్హములుగానీ, రెండు మేకలను గానీ వాపసు చేయవలసి ఉంటుంది.

(బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసులో ధనరూపంలో, పశువుల రూపంలో వసూలు చేయవలసిన జకాత్ తప్పీళ్లు వచ్చాయి. పశువుల వయస్సును, వాటి తరహాను క్షుణ్ణంగా పేర్కొనటంతోపాటు జకాత్ వ్యవస్థ యొక్క రూపురేఖలు స్థూలంగా తెలుపబడ్డాయి. ఈ సందర్భంగా యజమానికి అన్యాయం చేయటంగానీ, ప్రభుత్వాన్ని మోసగించటంగానీ జరగకూడదని చెప్పబడింది. అన్ని రకాల పశువులపై జకాత్ లేదు, కేవలం పాలాలలో, మైదానాలలో గడ్డిమేసే పశువులపై మాత్రమే జకాత్ విధించబడింది.

(٤٨٥) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَهُ إِلَى الْيَمَنِ، فَأَمَرَهُ أَنْ يَّأْخُذَ مِنْ كُلِّ ثَلَاثِيْنَ بَقَرَةً تَبِيْعاً أَوْ تَبِيْعَةً، وَمِنْ كُلِّ أَرْبَعِيْنَ مُسِنَّةً، وَمِنْ كُلِّ حَالِمٍ دِيْنَاراً، أَوْ عَدْلَه مَعَافِرِيّاً. رَوَاهُ الْخَمْسَةُ، وَاللَّفْظُ لِأَحْمَدَ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَأَشَارَ إِلَى اخْتِلَافٍ فِيْ وَصْلِهِ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

485. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తనను యమన్ ప్రాంతానికి (పర్యవేక్షకునిగా) పంపిస్తూ ఇలా ఆదేశించారు - "30 ఆవులపై ఒక ఏడాది వయసున్న ఆడ ఆవుదూడను లేదా మగ ఆవుదూడను (జకాత్‌గా) వసూలు చేయాలి. ప్రతి నలభై ఆవులపై రెండేళ్ల వయస్సున్న గిత్తను తీసుకోవాలి. ప్రతి యుక్త వయస్కుడైన వ్యక్తి నుంచి (అవిశ్వాసి నుంచి జిజ్‌యాగా) ఒక దీనార్‌గానీ, మాఫిరీ (యమన్‌లో తయారైన) దుప్పటిగానీ పుచ్చుకోవాలి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం అహ్మద్‌లోనివి. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు. ఇది 'మౌసూల్' అన్న విషయంలో అభిప్రాయభేదం ఉంది - ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికమైన హదీసుగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో ఆవులకు సంబంధించిన జకాత్‌తోపాటు, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరుల 'జిజ్‌యా'కు సంబంధించిన వివరాలు కూడా ఉన్నాయి. గేదెల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుందని ధర్మవేత్తలు నిర్ణయించారు.

(٤٨٦) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ بِيْهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «تُؤْخَذُ صَدَقَاتُ الْمُسْلِمِينَ عَلَى مِيَاهِهِمْ». رَوَاهُ أَحْمَدُ. وَلأَبِي دَاوُدَ: «وَلاَ تُؤْخَذُ صَدَقَاتُهُمْ إِلاَّ فِي دُوْرِهِمْ».

486. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, మరి ఆయనేమో తన తాతగారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "ముస్లింల నుంచి జకాత్ సొమ్ము వారు (పశువులను) నీరు త్రాగించే చోట వసూలు చేయబడుతుంది" (అహ్మద్). 'ముస్లింల సదఖాలు వారి ఇళ్లవద్దనే వసూలు చేయబడతాయ'ని అబూ దావూద్‌లోని ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

జకాత్ వసూళ్లకై నియమించబడిన అధికారులు స్వయంగా ప్రజల వద్దకు, వారి పశువుల కొట్టం వద్దకు వెళ్ళవలసి ఉంటుందని ఈ హదీసు చెబుతోంది. ఒకవైపు రైతులు ప్రభుత్వాన్ని ఏమార్చకుండా ఉండటానికీ, మరోవైపు ప్రభుత్వోద్యోగులు కార్యాలయాలలో కూర్చుని పెత్తనం చెలాయించకుండా ఉండటానికని ఈ విధంగా నిర్ణయించటం జరిగింది. ఉద్యోగులు ఈ వసూళ్లను తమ విధ్యుక్త ధర్మంగా భావించి ఇంటింటికీ తిరిగి మరీ వసూలు చేయాలి. జాబిర్ బిన్ అతీక్ కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు-"మీ వద్దకు జకాత్‌ను వసూలు చేసే ప్రభుత్వ ప్రతినిధులు వస్తారు. వారు మీ దగ్గరకు వచ్చినపుడు వారికి స్వాగతం పలకండి. వారు అడిగిన దాన్ని ఇవ్వండి. వారుగనక న్యాయంగా వ్యవహరిస్తే వారికి పుణ్యఫలం లభిస్తుంది. ఒకవేళ వారు అన్యాయానికి పాల్పడితే దాని ఖర్మను కూడా వారే అనుభవిస్తారు." ఒకవేళ ప్రభుత్వాధికారులు జకాత్ పరిమాణానికి మించిగనక డిమాండుచేస్తే ఎట్టి పరిస్థితిలోనూ వారికి అదనంగా ఇవ్వరాదని సహీహ్ బుఖారీలో ఉంది.

(٤٨٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيْسَ عَلَى الْمُسْلِمِ فِي عَبْدِهِ وَلاَ فِي فَرَسِهِ صَدَقَةٌ». رَوَاهُ الْبُخَارِيُّ. وَلِمُسْلِمٍ: لَيْسَ فِي الْعَبْدِ صَدَقَةٌ، إِلاَّ صَدَقَةَ الْفِطْرِ.

487. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ముస్లింలపై వారి బానిసల విషయంలోగానీ, వారి గుఱ్ఱాల విషయంలోగానీ జకాత్ లేదు" (బుఖారీ). ముస్లింలోని ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది - "బానిసలపై జకాత్ లేదు. అయితే వారు ఫిత్రా దానాన్ని మాత్రం చెల్లించవలసి ఉంటుంది."

**సారాంశం**

తమ సేవకోసం ఉన్న బానిసలపై, గుఱ్ఱాలపై జకాత్ చెల్లించవలసిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే గుఱ్ఱాల వ్యాపారం చేస్తే మాత్రం వాటిపై జకాత్ తప్పని సరవుతుంది.

(٤٨٨) وَعَنْ بَهْزِ بْنِ حَكِيْمٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**فِي كُلِّ سَائِمَةِ إِبِلٍ: فِي أَرْبَعِينَ بِنْتُ لَبُونٍ، لاَ تُفَرَّقُ إِبِلٌ عَنْ حِسَابِهَا، مَنْ أَعْطَاهَا، مُؤْتَجِراً بِهَا، فَلَهُ أَجْرُهَا، وَمَنْ مَنَعَهَا، فَإِنَّا آخِذُوهَا وَشَطْرَ مَالِهِ، عَزْمَةٌ مِنْ عَزَمَاتِ رَبِّنَا، لاَ يَحِلُّ لِآلِ مُحَمَّدٍ مِنْهَا شَيْءٌ**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَعَلَّقَ الشَّافِعِيُّ الْقَوْلَ بِهِ عَلَى ثُبُوتِهِ.

488. హజ్రత్ బహ్జ్ బిన్ హకీమ్ తన తండ్రినుండి, మరి ఆయన తన తాత గారి నుండి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: మేతమేసే మొత్తం 40 ఒంటెలపై రెండేళ్ల వయసున్న ఒక ఆడ ఒంటెను (జకాత్)గా ఇవ్వాలి. ఒంటెలను ఈ లెక్కన వేరు చేయకూడదు. ఎవరయితే పుణ్యార్జనా సంకల్పంతో జకాత్‌ను ఇస్తాడో అతనికి దాని పుణ్య ఫలం కూడా లభిస్తుంది. మరెవరయినా జకాత్‌ను (ఇవ్వకుండా) ఆపుకుంటే మేము బలవంతంగా జకాత్ వసూలు చేస్తాము; అతన్నుండి కొంత సొమ్ము కూడా (రాబడతాము). మన ప్రభువు విధించిన వాటిలో ఇది అనివార్యమైనది. వీటిలోని ఏ వస్తువు కూడా ముహమ్మద్ (సఅసం) కుటుంబీకుల కోసం ధర్మసమ్మతం (హలాల్) కాదు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు. షాఫయి మాత్రం దీని నిర్ధారణకు సంబంధించి తుది నిర్ణయానికి రాలేక పోయారు)

**సారాంశం**

బనూ హాషిమ్, బనూ అబ్దుల్ ముత్తలిబ్ వంశస్థులు - అంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) కుటుంబీకులు - జకాత్ విధి దానాలు స్వీకరించరాదన్న సంగతి ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. బనూ హాషిమ్‌లో హజ్రత్ అలీ సంతానం, హజ్రత్ అబ్బాస్ సంతతివారు, అఖీల్

సంతానం, హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ సంతతివారు కూడా చేరి ఉన్నారు. వీరంతా జకాత్‌కు అర్హులు కారు. అయితే ఇమామ్ యూసుఫ్ ప్రకారం ఒక సయ్యదు మరో సయ్యదుకు జకాత్ ఇవ్వగలడు.

## హదీసు ఉల్లేఖకులు

(1) అసలు పేరు బహ్జ్ బిన్ హకీమ్. మారుపేరు అబూ అబ్దుల్ మలిక్. పూర్తి వంశపరంపరను చూస్తే ఆయన పేరు ఇలా ఉంటుంది-బహ్జ్ బిన్ హకీమ్ బిన్ ముఆవియ బిన్ హైద. బస్రా వాస్తవ్యులు. ఆరవ కోవకు చెందిన తాబయి. ఈయన అందజేసిన హదీసు ప్రామాణికతపై భేదాభిప్రాయం వ్యక్తమయింది. ఈయన హదీసులు ప్రామాణికమైనవని అబూదావూద్ భావించారు. ఇబ్నె ముయీన్, ఇబ్నె మదీనీ, నసాయి కూడా వీటి ప్రామాణికతను ధృవీకరించారు. కాని ఈయనకు హదీసులపై పట్టులేదని అబూ హాతిమ్ వ్యాఖ్యానించారు. హదీసులను వివరించటంలో ఈయన వల్ల తప్పులు దొర్లాయని ఇబ్నె హిబ్బాన్ అభిప్రాయపడ్డారు. ఈయన హిజ్రీ 140 తరువాత మరణించారు.

(2) హకీమ్ బిన్ ముఆవియ. అంటే బహ్జ్ తండ్రి. ఈయన తాబయి. ఇబ్నె హిబ్బాన్ ఈయన్ని నమ్మకస్థులైన హదీసు ఉల్లేఖకులలో ఒకరుగా పరిగణించారు.

(3) ముఆవియ బిన్ హైద. ఈయన బస్రాలో స్థిరపడ్డారు. ఈయన గారి ద్వారా కూడా ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٤٨٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَتْ لَكَ مِائَتَا دِرْهَمٍ، وَحَالَ عَلَيْهَا الْحَوْلُ، فَفِيهَا خَمْسَةُ دَرَاهِمَ، وَلَيْسَ عَلَيْكَ شَيْءٌ، حَتَّى يَكُونَ لَكَ عِشْرُونَ دِينَاراً، وَحَالَ عَلَيْهَا الْحَوْلُ، فَفِيهَا نِصْفُ دِينَارٍ، فَمَا زَادَ، فَبِحِسَابِ ذَلِكَ، وَلَيْسَ فِي مَالٍ زَكَاةٌ، حَتَّى يَحُولَ عَلَيْهِ الْحَوْلُ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَهُوَ حَسَنٌ، وَقَدِ اخْتَلَفُوا فِي رَفْعِهِ.

489. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉద్బోధించారు - "నీవద్ద రెండు వందల దిర్హములు ఉండి వాటిపై ఒక ఏడాది కాలం గడచిపోతే దానిపై ఐదు దిర్హమ్‌ల జకాత్ చెల్లించవలసి ఉంటుంది. నీవద్ద 20 దీనార్లు ఉండి వాటిపై ఒక సంవత్సరం పూర్తి కానంతవరకూ నీవు ఏమీ చెల్లించనవసరం లేదు. 20 దీనార్లపై సంవత్సర కాలం పూర్తయితే మాత్రం దీనిపై సగం దీనారు జకాత్‌గా ఇవ్వాలి. అంతకు మించి (డబ్బు) ఉంటే ఈ లెక్కన జకాత్ చెల్లించవలసి ఉంటుంది. ఏ సంపదపై కూడా - ఏడాది కాలం పూర్తికానిదే జకాత్ ఉండదు." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఈ హదీసు 'హసన్' కోవకు చెందినది. ఇది 'మర్ఫూ' అన్న

وَلِلتِّرْمِذِيِّ عَنِ ابْنِ عُمَرَ: مَنِ اسْتَفَادَ مَالاً، فَلاَ زَكَاةَ عَلَيْهِ، حَتَّى يَحُولَ عَلَيْهِ الْحَوْلُ. وَالرَّاجِحُ وَقْفُهُ.

విషయంపై భేదాభిప్రాయం ఉంది) తిర్మిజీలో ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనంలో ఉంది - "ఆర్థిక సంవత్సరం మధ్యలో ప్రాప్తమయిన సంపదపై కూడా ఏడాది కాలం గడిచే వరకూ ఎలాంటి జకాత్ లేదు." ఈ హదీసు 'మౌఖూఫ్'గా పరిగణించబడింది.

### సారాంశం

ఈ హదీసులో వెండి బంగారాల జకాత్ ప్రస్తావన వచ్చింది. వెండి రెండు వందల దిర్హముల కన్నా తక్కువ ఉంటే దానిపై జకాత్ లేదు. నేటి ఆధునిక పరిభాషలో ధర్మవేత్తలు 52 1/2 తులాల బరువుకు సమానంగా ఉంటే దానిపై రెండున్నర శాతం జకాత్ ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే బంగారం విషయానికి వస్తే; ఏడున్నర తులాల బంగారం ఉంటే, మార్కెట్టులో దాని వెలనుబట్టి మొత్తం వెలకట్టి, దానిపై రెండున్నర శాతం జకాత్ ఇవ్వాలి.

(٤٩٠) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَيْسَ فِي الْبَقَرِ الْعَوَامِلِ صَدَقَةٌ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالدَّارَقُطْنِيُّ، وَالرَّاجِحُ وَقْفُهُ أَيْضاً.

490. (వ్యవసాయ) పనులకు ఉపయోగపడే ఎద్దులపై జకాత్ చెల్లించటం తప్పనిసరి కాదని హజ్రత్ అలీ (రజి) వివరించారు. (దీనిని దారె ఖుత్నీ, అబూ దావూద్ ఉల్లేఖించారు - ఈ హదీసు కూడా 'మౌఖూఫ్'గానే భావించబడుతున్నది)

### సారాంశం

వ్యవసాయోత్పత్తులకై ఉపయోగపడే పశువులపై జకాత్ చెల్లించనవసరం లేదని ఈ హదీసు చెబుతున్నది. అలాగే కర్మాగారాలలో వస్తువుల ఉత్పాదనకై ఉద్దేశించిన యంత్రాలపై కూడా జకాత్ లేదు. ఎందుకంటే అవి కూడా వ్యవసాయ పనిముట్ల, సాధనాల మాదిరిగానే ఉత్పత్తుల కొరకు పెట్టుకున్న పరికరాల క్రిందికి వస్తాయి.

(٤٩١) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ وَلِيَ يَتِيماً لَهُ مَالٌ، فَلْيَتَّجِرْ لَهُ، وَلاَ يَتْرُكْهُ حَتَّى تَأْكُلَهُ الصَّدَقَةُ». رَوَاهُ

491. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, మరి ఆయన తన తాత గారైన అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే ఒక అనాథకు సంరక్షకునిగా ఉంటాడో

التِّرْمِذِيُّ وَالدَّارَقُطْنِيُّ، وَإِسْنَادُهُ ضَعِيفٌ، وَلَهُ شَاهِدٌ مُرْسَلٌ عِنْدَ الشَّافِعِيِّ.

అతను ఆ అనాధ సొమ్మును వాణిజ్యం లో పెట్టుబడిగా పెట్టాలి. దాన్ని అలాగే- యధాతథంగా - వదలివేస్తే (క్రమ క్రమంగా) జకాత్ సొమ్ము దాన్ని హరించి వేయవచ్చు." (దీనిని తిర్మిజీ, దారె ఖుత్నీ ఉల్లేఖించారు - హదీసు అందిన పరం పర బలహీనంగా ఉంది - అయితే ఇమామ్ షాఫయి వద్దగల ఒక 'ముర్సల్' ఉల్లేఖనం దీనికి సాక్షిగా ఉంది)

**సారాంశం**

అనాధలకు సంరక్షకుడైన వాడు, అనాధల ఆస్తిపాస్తుల్ని కాపాడటమే గాకుండా వాటిని పెట్టుబడిగా పెట్టి, తద్వారా వచ్చిన లాభాలతో అనాధల సంపదను సమృద్ధిచేయడానికి కృషి చేయాలని పై హదీసు సూచిస్తోంది. అనాధ సొమ్ముపై కూడా జకాత్ ఉంటుంది.

(٤٩٢) وَعَنْ عَبْدِ اللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا أَتَاهُ قَوْمٌ بِصَدَقَتِهِمْ قَالَ: **اللَّهُمَّ صَلِّ عَلَيْهِمْ**. مُتَّفَقٌ عَلَيْهِ.

492. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూ ఔఫా(రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ప్రజలు జకాత్ సొమ్మును తీసుకుని వచ్చినప్పుడు, 'దేవా! వీళ్లని కరుణించు. వీళ్లను చల్లగా చూడు' అని ఆయన (స) వారికోసం ప్రార్థించేవారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

నసాయిలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సమక్షంలో జకాత్‌ను తీసుకుని రాగా, ఆయన (స) అతని కొరకు ఇలా ప్రార్థించారు : "అల్లాహుమ్మ బారిక్ ఫీహి వ అహ్లిహీ" (ఓ అల్లాహ్! ఈ వ్యక్తిలో, ఇతని ఇంటివారిలో శుభాన్ని సమృద్ధిని వొసగు). సహచరులు స్వయంగా వచ్చి జకాత్ సొమ్మును చెల్లించే వారని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది.

(٤٩٣) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ الْعَبَّاسَ سَأَلَ النَّبِيَّ ﷺ فِي تَعْجِيلِ صَدَقَتِهِ قَبْلَ أَن تَحِلَّ، فَرَخَّصَ لَهُ فِي ذٰلِكَ. رَوَاهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

493. హజ్రత్ అలీ (రజి) కథనం : "జకాత్ నిర్ణీత సమయంకన్నా ముందు గానే చెల్లించవచ్చునా?" అని హజ్రత్ అబ్బాస్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను దర్యాప్తు చేయగా, ఆయన (స) అందుకు అనుమతి ఇచ్చారు. (తిర్మిజీ, ముస్తద్రక్ హాకిమ్)

## సారాంశం

ఒక సంవత్సర కాలం నిండిన తరువాతే జకాత్ ఫర్జ్ (విధి) అవుతుంది. అయితే అడ్వాన్సుగా చెల్లించడానికి కూడా దైవప్రవక్త (స) అనుమతి ఇచ్చారు. ఈ అంశంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఏ విధంగానయితే నమాజ్, రోజా, హజ్ వంటి ఆరాధనలు నిర్ణీత సమయానికి ముందు నెరవేర్చబడవో అదేవిధంగా జకాత్ కూడా నిర్ణీతసమయం పూర్తికానిదే చెల్లించరాదనీ, ఎందుకంటే జకాత్ కూడా ఒక ఆరాధనేనని ఒక వర్గం వాదిస్తున్నది. సుఫియాన్ సౌరి అభిప్రాయం కూడా ఇదే. ఈ వాదనలో అంతగా బలం లేదు. ఎందుకంటే 'జకాత్' అనే విధిగా చెల్లించవలసిన దానానికి ఇతర ఆరాధనల మాదిరిగా ఒక నిర్ణీత సమయం అంటూ ఏమీ లేదు. ఏడాది గడువు నిండిన తరువాత కొన్ని రోజులు అటూ ఇటూగా జకాత్ చెల్లించినా ఫరవాలేదు. అత్యధిక ధర్మవేత్తల దృక్పథం కూడా ఇదే.

(٤٩٤) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، قَالَ: «لَيْسَ فِيمَا دُونَ خَمْسِ أَوَاقٍ مِنَ الْوَرِقِ صَدَقَةٌ، وَلَيْسَ فِيمَا دُونَ خَمْسِ ذَوْدٍ مِنَ الإِبِلِ صَدَقَةٌ، وَلَيْسَ فِيمَا دُونَ خَمْسَةِ أَوْسُقٍ مِنَ التَّمْرِ صَدَقَةٌ». رَوَاهُ مُسْلِمٌ.

494. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు- "ఐదు 'ఊఖియా'లకన్నా తక్కువ వెండి ఉంటే దానిపై జకాత్ లేదు. అలాగే ఐదు కన్నా తక్కువ సంఖ్యలో ఒంటెలుంటే వాటిపై కూడా జకాత్ లేదు. ఐదు 'వసఖ్'లకన్నా తక్కువ ఖర్జూరంపై కూడా జకాత్ లేదు." (ముస్లిం)

وَلَهُ مِنْ حَدِيثِ أَبِي سَعِيدٍ؛ لَيْسَ فِيمَا دُونَ خَمْسَةِ أَوْسَاقٍ مِنْ تَمْرٍ وَلاَ حَبٍّ صَدَقَةٌ. وَأَصْلُ حَدِيثِ أَبِي سَعِيدٍ مُتَّفَقٌ عَلَيْهِ.

'ముస్లిం'లో అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనంలో ఉంది: "ఐదు వసఖ్‌లకన్నా తక్కువ ఖర్జూరంపైగానీ, ధాన్యంపైగానీ జకాత్ లేదు." (అబూ సయీద్ ఖుదరీ(రజి) ఉల్లేఖనం యొక్క మూలం బుఖారీ, ముస్లింలలో ఉంది)

## సారాంశం

ఈ హదీసులో వెండి పరిమాణం ఐదు ఊఖియాలని చెప్పబడింది. ఇంతకు ముందు వచ్చిన హదీసులో రెండు వందల దిర్హములు అని ఉంది. ఈ రెండు హదీసులలో పైకి వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ వాస్తవానికి అలాంటి వైరుధ్యం ఏమీలేదు. ఎందుకంటే ఒక ఊఖియాలో నలభైదిర్హములు ఉంటాయి. 5 ఊఖియాలు 200 దిర్హములకు సమానం. కనుక ఈ వైరుధ్యం, వ్యాఘాతం సమసిపోయినట్లే.

అలాగే 300 హిజాజీ 'సా' మనదేశంలో అమలులో వున్న ఇంగ్లీషు తూకం ప్రకారం 20 మణుగులకు సమానం. ఒక 'వసఖ్'లో 60 'సా'లు ఉంటాయి. అంటే నాలుగు మణుగులకు

సమానం. ఐదు వసఖ్‌లంటే 20 మణుగులన్నమాట. ఈ లెక్కన మనదేశంలో 20 మణుగులకన్నా (ఇంచు మించు 10 క్వింటాళ్లకన్నా) తక్కువ ధాన్యం పండితే అందులోంచి జకాత్ ఇవ్వనక్కర లేదు. కాని హనఫీ ఫిఖహ్ ననుసరించే పండితులు దైవగ్రంథాన్నీ, హదీసుల సర్వసాధారణ ఉపదేశాలను దృష్టియందుంచుకుని; ధాన్యం లేక ఖర్జూరం ఒక మణుగుకన్నా తక్కువ పరిమాణంలో ఉన్నప్పటికీ దానిపై జకాత్ ఉందని 'ఫత్వా' (తీర్పు) ఇచ్చారు.

అయితే దీనికన్నా మొదటి దృక్పథమే సరైనది. ఎందుకంటే మహాప్రవక్త (సఅసం) స్వయంగా 'బరువు'ను నిర్ణయించినప్పుడు మనం దాన్ని అవలంబించి తీరాలి. మన తరపున మనం అందులో హెచ్చుతగ్గులు చేయటం భావ్యం అనిపించుకోదు. ఒక ఏడాది కాలంపాటు నిలువ ఉంచగలిగే ఆహారధాన్యాలన్నింటికీ ఈ జకాత్ వర్తిస్తుంది. ఉదాహరణకు: వరి, గోధుమ, జొన్న, రాగి, మొక్కజొన్న, పప్పు దినుసులు మొదలగునవి.

(٤٩٥) وَعَنْ سَالِمِ بْنِ عَبْدِ اللهِ، عَنْ أَبِيْهِ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **فِيْمَا سَقَتِ السَّمَاءُ وَالْعُيُوْنُ، أَوْ كَانَ عَثَرِيّاً، اَلْعُشْرُ، وَفِيْمَا سُقِيَ بِالنَّضْحِ نِصْفُ الْعُشْرِ.** رَوَاهُ الْبُخَارِيُّ. **وِلأَبِيْ** دَاوُدَ: **أَوْ كَانَ بَعْلاً اَلْعُشْرُ، وَفِيْمَا سُقِيَ بِالسَّوَانِي أَوِ النَّضْحِ نِصْفُ الْعُشْرِ.**

495. హజ్రత్ సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ (రహ్మ.లై) తన తండ్రి చెప్పినట్లుగా తెలియజేశారు. ఈయన తండ్రిగారి కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉద్బోధించారు: "ఏ భూమి అయితే వర్షపు నీటితో, సెలయేళ్లతో (కాలువల ద్వారా), లేక నేలలోని తేమతో పండుతుందో అందులో 10వ భాగాన్ని జకాత్ (ఉష్ర్)గా ఇవ్వాలి. మరే భూమి అయితే నీళ్లు తోడటం ద్వారా (లేక పంపుసెట్ల ద్వారా) పండుతుందో ఆ పంటలో 20వ వంతును (ఉష్ర్‌గా) ఇవ్వాలి" (బుఖారీ). అబూ దావూద్ ఉల్లేఖనంలో - "ఒకవేళ పశువుల ద్వారా లేదా నీరు చేదటం ద్వారా నీటి సరఫరా చేసినట్లయితే 20వ వంతు (సగం ఉష్ర్) ఇవ్వాలి" అని ఉంది.

### సారాంశం

నేల స్వభావాన్ని, పండించే తీరునుబట్టి జకాత్ (ఉష్ర్) నిష్పత్తిలో వ్యత్యాసముంటుందని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ఉదాహరణకు, ఏ భూమి అయితే అతి కష్టమ్మీద సాగు అవుతుందో, ఏ ఏ ప్రాంతాలలో నీటి సరఫరా కనాకష్టంగా ఉంటుందో అక్కడి రైతుల సాధక బాధకాలను దృష్టిలో పెట్టుకుని వారిపట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించటం జరిగింది. అంటే వాళ్లు 20వ వంతు పంటను జకాత్ (ఉష్ర్)గా ఇస్తే సరిపోతుందని చెప్పబడింది.

(٤٩٦) وَعَنْ أَبِيْ مُوسَى ٱلأَشْعَرِيِّ وَمُعَاذٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهُمَا: **لاَ تَأْخُذَا فِي الصَّدَقَةِ إِلاَّ مِنْ هٰذِهِ ٱلأَصْنَافِ ٱلأَرْبَعَةِ: الشَّعِيْرِ، وَالْحِنْطَةِ، وَالزَّبِيْبِ، وَالتَّمْرِ.** رَوَاهُ الطَّبَرَانِيُّ وَالْحَاكِمُ.

496. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తమతో చెప్పారని హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) లిరువురూ వివరించారు: "బార్లీ, గోధుమలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం - ఈ నాలుగు రకాల ఆహారోత్పత్తులపై తప్ప మరే ఆహారధాన్యాలపైనా జకాత్‌ను వసూలు చేయరాదు" (తబ్రానీ, హాకిమ్ దీనిని ఉల్లేఖించారు - దారె ఖుత్నీ ముఆజ్ (రజి) ఆధారంగా పొందుపరచిన ఉల్లేఖనంలో ఇలా ఉంది - "దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మపండ్లు, చెరకు వంటి పంటలను దైవప్రవక్త (స) జకాత్ నుండి మినహాయించారు. అయితే ఈ ఉల్లేఖనం అందిన తీరు బలహీనం (జయీఫ్) గా ఉంది)

وَلِلدَّارَقُطْنِيِّ عَنْ مُعَاذٍ قَالَ: فَأَمَّا الْقِثَّاءُ وَالْبِطِّيْخُ وَالرُّمَّانُ وَالْقَصَبُ، فَقَدْ عَفَا عَنْهُ رَسُولُ اللهِ ﷺ. وَإِسْنَادُهُ ضَعِيْفٌ.

**సారాంశం**

దారె ఖుత్నీలోని హజ్రత్ ముఆజ్ (రజి) ఉల్లేఖనం 'బలహీనం'గా ఉందని ఎందుకు అనబడిందంటే అందులోని ఒక ఉల్లేఖకుడు ఎన్నదగినవాడు కాదు. హదీసు పరంపరలో కూడా లింకు తెగింది.

(٤٩٧) وَعَنْ سَهْلِ بْنِ أَبِيْ حَثْمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللهِ ﷺ: **«إِذَا خَرَصْتُمْ فَخُذُوا، وَدَعُوا الثُّلُثَ فَإِنْ لَمْ تَدَعُوا الثُّلُثَ، فَدَعُوا الرُّبُعَ»**. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ ابْنَ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

497. హజ్రత్ సహ్ల్ బిన్ అబూ హస్మ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఈ విధంగా ఆజ్ఞాపించారు: - "మీరు ధాన్యాన్ని (లేక పండ్లను) అంచనావేసి అందులో మూడో వంతును వదిలేయండి. ఒకవేళ మూడో వంతును వదలలేకపోతే నాల్గవ వంతును వదలండి." ('ఐదుగురి'లో ఇబ్నెమాజా తప్ప మిగతావారు దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

## సారాంశం

ఈ హదీసు ఇస్లామీయ షరీయత్‌లోని విలువలను, సుగుణాలను వ్యక్తపరుస్తోంది. జకాత్ అనేది విధిగా ఇవ్వవలసిన దానం. అయితే ఇదిగాక 'సదఖా' అనే సర్వసాధారణమయిన దానం కూడా ఉంది. అంతేగాక, ఒక కొత్త పంట పండినపుడు ఆ రైతు కుటుంబీకులు ఎలాగూ దాన్ని తింటారు. అయితే ఆ ఊరిలోని పేదసాదలకు, బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారికి కూడా ఎంతో కొంత ఇవ్వటం అభిలషణీయం. రైతులు పండించే పంటలలో కొన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండజాలవు. ఉదాహరణకు చెట్లకు కాసే కాయలు, కాయగూరలు, ఆకుకూరలు నశ్వర వస్తువుల కోవకు చెందుతాయి. ఇలాంటి పంటలు చేతికి వచ్చినపుడు తామూ తినాలి, ఎల్లరికీ తినిపించాలి. ఇందులో ఎన్నో మేళ్లు ఇమిడి ఉన్నాయి.

## హదీసు ఉల్లేఖకులు

సహ్ల్ బిన్ అబూ హస్మ (రజి). ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ లేక ఆమిర్ బిన్ సైద బిన్ ఆమిర్ అన్సారీ ఖజ్రజీ, మదనీ. పిన్న వయస్కులైన సహాబీలలో ఒకరు. హిజ్రీ 3వ సంవత్సరంలో జన్మించారు. కూఫాలో స్థిరపడ్డారు. అయితే ఈయన మదీనా సహచరులలో ఒకరుగానే పరిగణించబడ్డారు. ముసైబ్ బిన్ జుబైర్ (రజి) పరిపాలనా కాలంలో మదీనాలో మరణించారు.

(٤٩٨) وَعَنْ عَتَّابِ بْنِ أَسِيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللهِ ﷺ أَنْ يُخْرَصَ الْعِنَبُ، كَمَا يُخْرَصُ النَّخْلُ، وَتُؤْخَذُ زَكَاتُه زَبِيْباً. رَوَاهُ الْخَمْسَةُ، وَفِيْهِ انْقِطَاعٌ.

498. హజ్రత్ అత్తాబ్ బిన్ అసీద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్ము ఈ విధంగా ఆదేశించారు- "ఖర్జూరపు పండ్లను ఎలా అంచనావేస్తారో ద్రాక్షపండ్లను కూడా మీరు అలాగే అంచనా వేయండి. వాటి 'జకాత్'గా ఎండుద్రాక్షను (కిస్మిస్‌ను) వసూలు చేయాలి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - అయితే హదీసును వివరించిన వారి మధ్య లింకు తెగింది)

## హదీసు ఉల్లేఖకులు

అత్తాబ్ బిన్ అసీద్ (రజి). ప్రముఖ సహాబీలలో ఒకరు. మక్కా విజయం తరువాత దైవప్రవక్త (సఅసం) హునైన్ వైపునకు సాగిపోతూ ఈయన్ని మక్కా పర్యవేక్షకునిగా నియమించారు. ఈయన ఈ పదవిపై హజ్రత్ అబూబక్ర్ పరిపాలనా కాలం వరకూ ఉన్నారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మరణించిననాడే ఈయన కూడా మరణించారని ప్రతీతి. మరొక కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ ఆఖరి దశ వరకూ జీవించి ఉన్నారు.

(٤٩٩) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، أَنَّ امْرَأَةً أَتَتِ النَّبِيَّ ﷺ

499. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ్‌లై) తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుండి ఉటంకించారు:

وَمَعَها ابْنَةٌ لَّهَا، وَفِي يَدِ ابْنَتِهَا مَسْكَتَانِ مِنْ ذَهَبٍ، فَقَالَ لَهَا: «أَتُعْطِيْنَ زَكَاةَ هٰذَا»؟ قَالَتْ: لاَ، قَالَ: «أَيَسُرُّكِ أَنْ يُسَوِّرَكَ اللَّهُ بِهِمَا يَوْمَ الْقِيَامَةِ سِوَارَيْنِ مِنْ نَارٍ»؟ فَأَلْقَتْهُمَا. رَوَاهُ الثَّلاَثَةُ، وَإِسْنَادُهُ قَوِيٌّ، وَصَحَّحَهُ الْحَاكِمُ مِنْ حَدِيْثِ عَائِشَةَ.

ఒక మహిళ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలోకి వచ్చింది. ఆమె వెంట ఆమె కూతురు కూడా ఉంది. ఆమె చేతికి రెండు బంగారు గాజులున్నాయి. ఆయన (స) ఆమెనుద్దేశ్యించి, "నీవు వీటి జకాత్‌ను చెల్లిస్తున్నావా?" అని అడిగారు. 'లేదు' అని ఆమె బదులిచ్చింది. "మరయితే ప్రళయ దినాన అల్లాహ్ నీకు రెండు అగ్ని గాజులు తొడిగించటం నీకు ఇష్టమేనా?" అని ఆయన (స) అన్నారు. ఇది విని ఆ మహిళ రెండు గాజులను తీసి పారవేసింది. (దీనిని ముగ్గురు ఉల్లేఖించారు - దీని ఆధారం దృఢమైనది. హాకిమ్ గారు దీనిని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఆధారంగా ఉల్లేఖించి, ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

బంగారు నగలపై కూడా జకాత్ ఉందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. అయితే ఈ విషయంపై కూడా పుకహా (ధర్మవేత్తల) మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. నగలపై జకాత్ వాజిబ్ (తప్పనిసరి) అని మొదటి వర్గం భావించింది. నగలపై జకాత్ ఫర్జ్ (విధి) కాదని రెండవ వర్గం అభిప్రాయపడింది. ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్, ఇమామ్ షాఫయి ఈ రెండో వాదనకే అనుకూలంగా ఉన్నారు. నగలపై జకాత్ ఒకసారి ఇస్తే సరిపోతుందన్నది మరో వాదన. వీటన్నింటినీ జోడించిన మీదట తుది నిర్ణయానికి రావలసినదేమిటంటే, నగలపై జకాత్ ఫర్జ్ (విధి) గావించబడింది. సహీహ్ హదీసు దీనికి బహిరంగ నిదర్శనం. కేవలం అంచనాల, ఊహల ఆధారంగా నగలపై జకాత్ లేదని అనటం సమంజసం కాదు.

(٥٠٠) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّهَا كَانَتْ تَلْبَسُ أَوْضَاحاً مِنْ ذَهَبٍ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! أَكَنْزٌ هُوَ؟ فَقَالَ: «إِذَا

500. హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్‌హా) కథనం : తాను బంగారు నగ తొడిగి ఉన్నప్పుడు దైవప్రవక్త (స)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా

أَدَّيْتِ زَكَاتَهُ فَلَيْسَ بِكَنْزٍ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

(సఅసం)! ఇది నిలువచేసిన నిధిగా భావించబడుతుందా?" దానికి ఆయన (స), "నీవు దీని జకాత్‌ను చెల్లిస్తే మటుకు ప్రోగుచేసిపెట్టిన నిధి క్రిందికి రాదు" అని అన్నారు. (ఈ హదీసును అబూ దావూద్, దారె ఖుత్నీ లిరువురూ ఉల్లేఖించగా, హాకిమ్ దీనిని ప్రమాణ బద్ధమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

"ఎవరయితే బంగారం, వెండిని ప్రోగుచేసి పెట్టారో, మరియు అందులో నుంచి దైవమార్గంలో ఖర్చుపెట్టరో వారికి వ్యధాభరితమయిన యాతన యొక్క శుభవార్తను అందజెయ్యండి.... " (9:34,35) అన్న దివ్య ఖుర్ఆన్ వాక్యంలో దీని వివరాలు వచ్చాయి.

వేరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (సఅసం) తన ధర్మపత్ని అగు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చేతిలో వెండి నగలు చూశారు. 'ఆయిషా! నీవు వీటి జకాత్‌ను చెల్లిస్తున్నావా?' అని అడిగారు. 'లేదు' అని ఆమె బదులివ్వగా 'అయితే నరకాగ్నిలో కాలడానికి నీవు వహించిన ఈ మాత్రం అశ్రద్ధ సరిపోతుంది' అని ఆయన (సఅసం) హెచ్చరించారు. (హాకిమ్)

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే బంగారు, వెండి నగలపై (అవి నిర్ణీత పరిమాణానికి మించి ఉన్నప్పుడు) జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

(٥٠١) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُنَا أَنْ نُخْرِجَ الصَّدَقَةَ مِنَ الَّذِي نَعُدُّهُ لِلْبَيْعِ. رَوَاهُ أبو دَاوُدَ، وَإِسْنَادُهُ لَيِّنٌ.

501. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు వర్తక సామగ్రి నుంచి జకాత్‌ను తీయవలసిందిగా ఆదేశించారు." (ఈ హదీసును అబూదావూద్ బలహీన ఆధారంతో ఉల్లేఖించారు).

**సారాంశం**

వర్తక సామగ్రిపై కూడా జకాత్ వుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. దీనికి ఆధారంగా ముజాహిద్ దివ్య ఖుర్ఆన్‌లోని, అన్‌ఫిఖూ మిన్ తయ్యిబాతి మా కసబ్‌తుమ్ అనే వచనాన్ని ఉదాహరించారు. ఇది విధిగా చెల్లించాలన్న విషయంలో ఎలాంటి సంశయానికి తావు లేదని ఇబ్నె ముంజిర్ పేర్కొన్నారు. ధర్మవేత్తలు, నలుగురు ఇమాములు కూడా వర్తక సామగ్రిపై జకాత్ చెల్లించటం విధి అన్న విషయంపై ఏకీభవించారు.

(٥٠٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «وَفِي الرِّكَازِ الْخُمُسُ». مُتَّفَقٌ عَلَيْهِ.

502. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "ఖనిజ సంపదలో (లేక గుప్తనిధిలో) 5వ వంతు (జకాత్‌గా ఇవ్వవలసి) ఉంది."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఖనిజ సంపద (గుప్తనిధి)పై చెల్లించవలసిన ఐదవ వంతును జకాత్ అనటంకన్నా దాన్ని ప్రభుత్వ వాటాగా పరిగణించటం సముచితం. భూగర్భంలో ఎక్కడ ఈ ఖనిజాలు లభించినా అందులోనుంచి ఇరవై శాతం సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చెయ్యాలి. మిగతా సొమ్ము యజమాని స్వంతమవుతుంది.

(٥٠٣) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ فِي كَنْزٍ وَجَدَهُ رَجُلٌ فِي خَرِبَةٍ: «إِنْ وَجَدْتَهُ فِي قَرْيَةٍ مَسْكُونَةٍ فَعَرِّفْهُ، وَإِنْ وَجَدْتَهُ فِي قَرْيَةٍ غَيْرِ مَسْكُونَةٍ فَفِيهِ وَفِي الرِّكَازِ الْخُمُسُ». أَخْرَجَهُ ابْنُ مَاجَه بِإِسْنَادٍ حَسَنٍ.

503. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ.లై) తన తండ్రి నుంచి, మరి ఆయన తన తాతగారి నుంచి గ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం), భూమి నుంచి ఖజానా లభించిన వ్యక్తి గురించి చెబుతూ; "నీవు ఈ ఖజానాను జనవాసాలున్న ప్రదేశంలో పొందివుంటే అది ఎవరిదో తెలుసుకునే ఉద్దేశ్యంతో అక్కడ ప్రకటన గావించు. ఒకవేళ ఏదయినా నిర్జన ప్రదేశంలో ఇది నీకు లభించి ఉంటే అది ఖనిజ సంపద (గుప్తనిధి) క్రిందికి వస్తుంది. దానిపై ఐదవ వంతును చెల్లించవలసి ఉంటుంది." (ఇబ్నె మాజా దీనిని విశ్వసనీయ ఆధారాల ద్వారా వివరించారు)

(٥٠٤) وَعَنْ بِلَالِ بْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَخَذَ مِنَ الْمَعَادِنِ الْقَبَلِيَّةِ الصَّدَقَةَ. رَوَاهُ أَبُو دَاوُدَ.

504. హజ్రత్ బిలాల్ బిన్ హారిస్ (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఖబాలియ' అనే ప్రదేశంలో వున్న గనుల నుంచి జకాత్‌ను వసూలు చేశారు. (అబూదావూద్)

### హదీసు ఉల్లేఖకులు

బిలాల్ బిన్ హారిస్ (రజి) 'ముజైనియా' తెగకు చెందినవారు. అందుచేత ఈయన ముజైనీగా కూడా పిలువబడ్డారు. ఆయన హిజ్రీ 5లో దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ప్రతినిధిగా హాజరయ్యారు. మదీనాలో స్థిరపడ్డారు. తరువాత బస్రాకు బదిలీ అయ్యారు. మక్కా విజయం సందర్భంగా ఈయన ముజైనియా తెగవారి ధ్వజం చేబూని నిలబడ్డారు. 80 సంవత్సరాల వయస్సులో - హిజ్రీ 60లో - మరణించారు.

### 1వ అధ్యాయం

## ١ - بَابُ صَدَقَةِ الْفِطْرِ

## సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రా దానం)

(٥٠٥) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: فَرَضَ رَسُولُ اللهِ ﷺ زَكَاةَ الْفِطْرِ صَاعاً مِنْ تَمْرٍ، أَوْ صَاعاً مِنْ شَعِيْرٍ، عَلَى الْعَبْدِ وَالْحُرِّ وَالذَّكَرِ وَالْأُنْثَى وَالصَّغِيْرِ وَالْكَبِيْرِ، مِنَ الْمُسْلِمِيْنَ، وَأَمَرَ بِهَا أَن تُؤَدَّى قَبْلَ خُرُوجِ النَّاسِ إِلَى الصَّلَاةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

505. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు - "ముస్లింల బానిసలు, స్వేచ్ఛాజీవులు, పురుషులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు - అందరిపై సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రాదానం) తప్పనిసరి గావించబడింది. ఒక 'సా' ఖర్జూరంగానీ, ఒక 'సా' బార్లీగానీ (ఫిత్రా రూపేణా) ఇవ్వాలి. ఈ ఫిత్రా (పండుగ) నమాజ్‌కు బయలుదేరక ముందే ఇచ్చేయాలి."

(బుఖారీ, ముస్లిం)

وَلِابْنِ عَدِيٍّ وَالدَّارَقُطْنِيِّ بِإِسْنَادٍ ضَعِيْفٍ: أَغْنُوهُمْ عَنِ الطَّوَافِ فِي هٰذَا الْيَوْمِ.

ఇబ్నె అదీ, దారె ఖుత్నీలో 'జయీఫ్' ఆధారంతో ఇలా అనబడింది: "ఆ రోజు పేదవాళ్లు ముష్టెత్తుకునే స్థితి ఏర్పడకుండా చూడండి."

### సారాంశం

ముస్లింలయిన ప్రతి ఒక్కరిపై ఫిత్రాదానం తప్పనిసరి గావించబడిందని ఈ హదీసు చెబుతోంది. అదీ పండుగకు ముందే చెల్లించాలని తాకీదు చెయ్యబడటం గమనార్హం. సమాజంలోని అభాగ్యజీవులు, అగత్యపరులు, బీదవాళ్లు కూడా ఆ రోజు అడుక్కు తినవలసిన నికృష్టస్థితి రాకూడదనీ, వాళ్లు సయితం పండుగ సంతోషాలను అందరిలా పొందాలన్న ఉద్దేశ్యంతో ఈ విధంగా ఆజ్ఞాపించబడింది. తలసరి ఫిత్రా ఒక 'సా' చొప్పున ఇవ్వాలని చెప్పబడింది. తమ వద్ద ముస్లిమేతర సేవకులు ఉంటే వారి పేరున ఫిత్రా ఇవ్వనవసరం లేదు. ముస్లిం సేవకుల పేరున మాత్రం ఫిత్రా తప్పక ఇవ్వాలి.

(٥٠٦) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُعْطِيْهَا فِي زَمَنِ النَّبِيِّ ﷺ صَاعاً مِنْ طَعَامٍ، أَوْ صَاعاً مِنْ تَمْرٍ، أَوْ صَاعاً مِنْ شَعِيْرٍ، أَوْ صَاعاً مِنْ زَبِيْبٍ. مُتَّفَقٌ عَلَيْهِ. وَفِيْ رِوَايَةٍ: «أَوْ صَاعاً مِنْ أَقِطٍ». قَالَ أَبُو سَعِيْدٍ: أَمَّا أَنَا فَلاَ أَزَالُ أُخْرِجُهُ، كَمَا كُنْتُ أُخْرِجُهُ فِي زَمَنِ رَسُولِ اللهِ ﷺ. وِلأَبِيْ دَاوُدَ: «لاَ أُخْرِجُ أَبَداً إِلاَّ صَاعاً».

506. హాజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) కథనం : మేము దైవప్రవక్త (సఅసం) హయాంలో ఒక 'సా' గోధుమలు, (లేక) ఒక 'సా' ఖర్జూరం (లేక) ఒక 'సా' బార్లీ, (లేక) ఒక 'సా' ఎండు ద్రాక్షను 'ఫిత్రా'గా ఇచ్చేవారము (బుఖారీ, ముస్లిం). మీగడ (లేక జున్ను) లో నుంచి కూడా ఒక 'సా'ను ఫిత్రాగా చెల్లించేవారమని వేరొక ఉల్లేఖనంలో ఉంది. దైవప్రవక్త (సఅసం) కాలంలో ఏ పరిమాణంలో ఇచ్చేవారమో ఆ పరిమాణంలోనే తాను ఎల్లప్పుడూ ఫిత్రా ఇస్తానని అబూ సయీద్ ఖుదరీ (రజి) అన్నారు. అబూదావూద్‌లోని ఉల్లేఖనం లో ఇలా వుంది - 'నేను ఎల్లకాలం ఒక 'సా' మాత్రమే ఇస్తాను.'

**సారాంశం**

ఫిత్రాగా ఏ ఆహారధాన్యాన్ని ఇచ్చినా ఒక 'సా' ఇవ్వటం మస్నూన్ (సంప్రదాయం) అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. హాజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఈ వ్యవహారంలో ఎంతో ఖచ్చితంగా అమలు జరిపారు. ఆయన ఎల్లకాలం ఒక 'సా' మాత్రమే ఇస్తానని కరాకండీగా చెప్పవలసిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందంటే, అమీర్ ముఆవియ (రజి) తన ఖిలాఫత్ కాలంలో అర్ధ 'సా' గోధుమలను, ఒక 'సా' బార్లీకి సమానంగా నిర్ధారించారు. ఇది అబూసయీద్ ఖుదరీ (రజి) గార్కి నచ్చలేదు. తాము తినే ఆహారధాన్యాలు ఏవయినా, వాటి ధరలో వ్యత్యాసమున్నా సరే - పూర్తిగా ఒక 'సా'ను ఇవ్వటమే న్యాయమన్నది ఆయన ఉద్దేశ్యం. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) కాలంలో ఈ విధంగానే అమలుపరచేవారు. అమీర్ ముఆవియా (రజి) తన వివేచన కనుగుణంగా ఇలా నిర్ధారించగా, అబూ సయీద్ ఖుదరీగారు దైవప్రవక్త (స) మరియు ప్రవక్త సహచరుల ఆచరణను ప్రమాణంగా పేర్కొని తన అభిమతాన్ని వెల్లడించారు. ఇక్కడ అమీర్ ముఆవియ 'ఇజ్తిహాద్' (షరీయత్ సూత్ర అన్వయింపు) కన్నా అబూ సయీద్ ఖుదరీ 'అనుసరణా తీరు' బలవత్తరమైనది.

(٥٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: فَرَضَ رَسُولُ اللهِ ﷺ زَكَاةَ

507. హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాసి వల్ల జరిగిన తప్పుల

الْفِطْرِ طُهْرَةً لِلصَّائِمِ مِنَ اللَّغْوِ وَالرَّفَثِ، وَطُعْمَةً لِلْمَسَاكِينِ، فَمَنْ أَدَّاهَا قَبْلَ الصَّلاَةِ فَهِيَ زَكَاةٌ مَّقْبُولَةٌ، وَمَنْ أَدَّاهَا بَعْدَ الصَّلاَةِ فَهِيَ صَدَقَةٌ مِنَ الصَّدَقَاتِ. رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

నుండి అతని ఉపవాసాన్ని పవిత్రం గావించే ఉద్దేశ్యంతో, నిరాధార జీవులకు అన్నంపెట్టే సంకల్పంతో ఫిత్రా దానాన్ని విధించారు. అది పండుగ నమాజ్‌కు ముందే చెల్లిస్తే (ఫిత్రాగా) స్వీకారయోగ్య మవుతుంది. నమాజ్ తరువాత చెల్లిస్తే సాధారణ దానాలలోని ఒక దానంగా పరిగణించబడుతుంది." (ఈ హదీసును అబూదావూద్, ఇబ్నెమాజా ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

ఫిత్రాదానం సొసైటీలోని పేదప్రజల, అగత్యపరుల హక్కు అనీ, పండుగ నమాజుకు ముందే దాన్ని అవశ్యంగా ఇచ్చివేయాలని ఈ హదీసు చెబుతోంది. పండుగ నమాజ్ చేసిన తరువాత ఫిత్రా ఇస్తే అది ఫిత్రాగా ఆమోదముద్ర పొందదు. అదొక సాధారణ దానంగా మాత్రమే భావించబడుతుంది.

**2వ అధ్యాయం**

## ٢ - بَابُ صَدَقَةِ التَّطَوُّعِ

## స్వచ్ఛంద దానధర్మాలు

(٥٠٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**سَبْعَةٌ يُظِلُّهُمُ اللَّهُ فِي ظِلِّهِ يَوْمَ لاَ ظِلَّ إِلاَّ ظِلُّهُ**» ـ فَذَكَرَ الْحَدِيثَ ـ وَفِيهِ: «**وَرَجُلٌ تَصَدَّقَ بِصَدَقَةٍ فَأَخْفَاهَا، حَتَّى لاَ تَعْلَمَ شِمَالُهُ مَا تُنْفِقُ يَمِينُهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

508. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "ఏడు రకాల మనుషులున్నారు. ఏ రోజున అల్లాహ్ నీడ తప్ప మరొకరి ఆశ్రయం ఉండదో ఆ రోజున అల్లాహ్ వారికి ఆశ్రయం ఇస్తాడు." తరువాత హదీసు నంతటినీ వివరించారు. అందులో ఒక వాక్యం ఇలా వుంది - "ఆ ఏడుగురిలో- కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి కూడా తెలియనంత రహస్యంగా దానం చేసేవాడు కూడా ఉన్నాడు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఏడు రకాల మనుషుల్లో మిగిలిన ఆరుగురు ఎవరు? అన్న ప్రశ్న ఇక్కడ జనించవచ్చు. ఆ ఆరుగురు వీరు - (1) న్యాయశీలుడైన నాయకుడు. (2) దైవారాధనలో కాలం గడిపిన యువకుడు. (3) ఎల్లప్పుడూ మస్జిద్‌లో మనసు లగ్నమై ఉండే వ్యక్తి. (4) కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో పరస్పరం ప్రేమించుకునే, కేవలం అల్లాహ్ ప్రసన్నతను బడసే సంకల్పంతోనే ఒండొకరి నుంచి వేర్పడిపోయే ఇద్దరు వ్యక్తులు. (5) అందగత్తె, కులీనురాలైన ఒక పడుచు స్త్రీ పొందు కోసం పిలువగా, తాను దైవానికి భయపడే వాడినని చెప్పి, ఆమె పిలుపును తిరస్కరించిన వ్యక్తి. (6) ఏకాంతంలో దైవధ్యానంలో నిమగ్నుడై ఉండగా దేవునిపట్ల భక్తీ పారవశ్యంతో - నయనాల నుండి అశ్రుధారలు ప్రవహించే వ్యక్తి. (7) ఇక ఏడవవ్యక్తి గోప్యంగా దానధర్మాలు చేసేవాడు. ప్రదర్శనాబుద్ధికి తావీయకుండా - కేవలం దైవాన్ని సంతోషపరచే ఉద్దేశ్యంతో - సాటి మానవుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసే ధన్యుడు.

ఈ హదీసు సదఖయె వాజిబా (తప్పనిసరి దానం), సదఖయె నాఫిలా (స్వచ్ఛంద దానం) - రెంటినీ పరివేష్టించి ఉంది.

ప్రళయం ఒకనాడు తథ్యమనీ, ఆనాడు దైవ సింహాసనం తప్ప మరొక నీడ, మరో ఆశ్రయం ఉండబోదని కూడా ఈ హదీసు చాటిచెబుతోంది. ఆ సింహాసనం ఎటువంటిది? దాని నీడ ఎలా ఉంటుంది? ఆ స్థితి వర్ణనాతీతం. దాని జ్ఞానం అల్లాహ్‌కే పరిమితం.

ఈ హదీసు కేవలం పురుషులకే ప్రత్యేకమా? స్త్రీలకు ఈ అదృష్టం లేదా? అన్న ప్రశ్న కూడా ఇక్కడ ఉత్పన్నమవటం సహజం. యదార్థమేమిటంటే ఇటువంటి సుగుణాలు గల మహిళలకు కూడా ఈ హదీసు యథాతథంగా వర్తిస్తుంది.

ఫర్జ్ మరియు వాజిబ్ సదకాలు ఇస్తున్నప్పుడు వాటిని బహిరంగంగా ఇవ్వాలి. ఎందుకంటే దీనివల్ల ఇతరులను కూడా సదాచరణ వైపునకు పురికొల్పినట్లవుతుంది. అయితే స్వచ్ఛంద లేక సాధారణ దానాలను మాత్రం గోప్యంగా ఇవ్వటం మంచిదని చెప్పబడింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో స్వచ్ఛంద దాన ధర్మాలు కూడా గోప్యంగా ఇవ్వటానికి వీలుపడదు. ఎంత కాదనుకున్నా అవి బహిర్గతమవుతాయి. దాన్ని ఎవరూ ఏమీ చేయలేరు. అయితే అటువంటి సందర్భాలలో దాత సంకల్పం బావుండాలి. నలుగురిలో పేరు ప్రఖ్యాతులను ఆర్జించే ఉద్దేశ్యంతో గాకుండా కేవలం తన ప్రభువును మెప్పించే ఉద్దేశ్యంతో దానం చేయాలి. 'చిత్తశుద్ధి' అంటే ఇదే మరి.

(٥٠٩) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: **كُلُّ امْرِىءٍ فِي ظِلِّ صَدَقَتِهِ حَتَّى يُفْصَلَ بَيْنَ النَّاسِ**». رَوَاهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

509. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హాజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) చెప్పారు : "ప్రతి వ్యక్తీ తన దానాల నీడలో నిలబడి ఉంటాడు. కడకు ప్రజల తీర్పు జరిగిపోతుంది."

(ఇబ్నె హిబ్బాన్, ముస్తద్రక్ హాకిమ్)

**సారాంశం**

దానధర్మాలలో ముందంజ వేసేవారి వైశిష్ట్యం ఈ హదీసులో తెలుపబడింది. ఎంత విస్తారంగా దానాలు చేసివుంటే వారి నీడ అంతగానే విస్తృతమయి ఉంటుంది. ప్రళయ దిన దృశ్యాన్ని ఓసారి ఊహించుకోండి - ఆ రోజు ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటారు. ఆనాడు ఎవరికి కాస్తంత నీడ దొరికినా అది వారి భాగ్యమే అనాలి. అతను చేసుకున్న దాన ధర్మాల నీడ ఆనాడు అతని మన్నింపు కొరకు దైవసమక్షంలో సిఫారసు చేస్తూ ఉంటుంది. స్వచ్ఛంద దానంలో వున్న మరో శుభకరమయిన కోణం ఏమిటంటే, 'సదఖయె వాజిబా'ను చెల్లించటంలో మనిషివల్ల ఏదయినా లోటు జరిగి ఉంటే ఆ లోటును ఇది పూరిస్తుంది.

(٥١٠) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **أَيُّمَا مُسْلِمٍ كَسَا مُسْلِماً ثَوْباً عَلَى عُرْيٍ كَسَاهُ اللَّهُ مِنْ خُضْرِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ أَطْعَمَ مُسْلِماً عَلَى جُوعٍ أَطْعَمَهُ اللَّهُ مِنْ ثِمَارِ الْجَنَّةِ، وَأَيُّمَا مُسْلِمٍ سَقَى مُسْلِماً عَلَى ظَمَإٍ سَقَاهُ اللَّهُ مِنَ الرَّحِيقِ الْمَخْتُومِ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَفِي إِسْنَادِهِ لِينٌ.

510. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలియజేశారు: ఆయన (స) ఇలా ప్రబోధించారు - "ఏ ముస్లిం అయినా దుస్తులు లేని తన సోదరునికి దుస్తులు తొడిగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గంలో పచ్చని పట్టు వస్త్రాలు తొడిగిస్తాడు. మరే ముస్లిం అయినా ఆకలితో అలమటించే తన సోదరునికి అన్నం పెడితే అల్లాహ్ అతనికి స్వర్గం లోని ఫలాలు తినిపిస్తాడు. ఇంకా ఏ ముస్లిమయినా దాహంతో బాధపడే తన సోదరునికి మంచినీరు (లేక పానీయం) త్రాగిస్తే అల్లాహ్ అతనికి స్వర్గలోకంలోని సీలు వేయబడివున్న స్వచ్ఛమయిన మద్యం త్రాపుతాడు." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దీని పరంపర లో బలహీనత ఉంది)

**సారాంశం**

పరలోకంలో అల్లాహ్ తన దాసులకు ప్రసాదించే ప్రతిఫలం ఇహలోకంలో వారు చేసిన పనులతో సమన్వయం చెందేదిగా ఉంటుందని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే స్వర్గంలోని దుస్తులు ప్రపంచంలోని దుస్తులకన్నా ఎంతో నాణ్యంగా, అందంగా, సుతిమెత్తగా ఉంటాయి. అతడు చేసిన సత్కార్యం దైవసన్నిధిలో ఆమోదయోగ్యమయినపుడే అతనికి ఈ ప్రతిఫలం లభిస్తుంది. సదాచరణ స్వీకారయోగ్యమవటానికి రెండు షరతులున్నాయి. ఒకటి:

అది షరీయత్ కనుగుణంగా ఉండాలి. దైవప్రవక్త (స) విధానానికి విరుద్ధంగా ఉండకూడదు. రెండు: సదాచరణ వెనుక చిత్తశుద్ధి ఉండాలి. అంటే దైవప్రసన్నత పొందే సంకల్పంతో సత్కార్యం చేయాలి. దాని వెనుక ప్రదర్శనా మనస్తత్వం ఉండకూడదు.

హదీసులో ఆకలిగొన్నవారు, దుస్తులు లేనివారు, దాహంతో బాధపడేవారి ప్రస్తావన వచ్చింది. యాచించే వారి నిజ స్థితి వారి వాలకాన్ని బట్టి అర్థమైపోతుంది. అటువంటి అగత్యపరులకు, నిరాధారులకు దానాలివ్వటం మంచిదే. కాని శారీరకంగా, మానసికంగా మంచి స్థితిలో ఉండి కూడా కష్టపడకుండా సోమరుల్లా తిరిగేవారికి, వృత్తిపరమయిన (ప్రొఫెషనల్స్) ఫకీర్లకు దానం ఇవ్వకూడదు. సిసలయిన అభాగ్య జీవులకు ఇవ్వటం వల్ల సమాజంలో వారి సమస్యలు పరిష్కృత మవుతాయి. వారి అక్కరలు తీర్తాయి. ఈ ఆచరణను అల్లాహ్ ఎంతగానో మెచ్చుకుంటాడు. ప్రతిఫలంగా వారికి శాశ్వతమయిన - అనుగ్రహభరితమయిన - స్వర్గవనాలలో ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారికి సమర్పించబడే మద్యం ప్రపంచంలోని మద్యం లాంటిది కాదు. అది సీలువేయ బడిన షరాబు. పవిత్రమైన, స్వచ్ఛమయిన షరాబు. మత్తునివ్వని మద్యం. దేవుడు సమ్మతించి ఆమోదించిన (హలాల్) మద్యం.

(٥١١) وَعَنْ حَكِيْمِ بْنِ حِزَامٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **اَلْيَدُ الْعُلْيَا خَيْرٌ مِنَ الْيَدِ السُّفْلَى، وَابْدَأْ بِمَنْ تَعُولُ، وَخَيْرُ الصَّدَقَةِ مَا كَانَ عَنْ ظَهْرِ غِنىً، وَمَنْ يَسْتَعْفِفْ يُعِفَّهُ اللّٰهُ، وَمَنْ يَسْتَغْنِ يُغْنِهِ اللّٰهُ».**

مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

511. హాజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "పై చేయి క్రింది చేయికన్నా ఉత్తమ మైనది. మీపై ఆధారపడివున్న వారితో (దానధర్మాలు) మొదలెట్టండి. మీ అవసరాలు, అక్కరలు తీరగా ఇచ్చేదే అత్యుత్తమమయిన సదఖా. ఎవరయితే ఒకరి ముందు చేయి చాచకుండా ఉంటాడో అతన్ని (అతని గౌరవమర్యాదలను) అల్లాహ్ కాపాడతాడు. ఎవరయితే పరువుగా బ్రతుకుతాడో అతనికి అల్లాహ్ స్వయం సమృద్ధి నొసగుతాడు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి)

**సారాంశం**

కుటుంబీకులు అధఃస్థితిలో వున్నప్పుడు వారి కష్టాలు తీర్చటం, వారి సమస్యలను పరిష్కరించటం కూడా సత్కార్యం క్రిందికే వస్తుంది. ఇంటి అక్కరలు తీరకుండానే బయటివారికి దానధర్మాలు చేయటం మంచి పద్ధతికాదు. 'ముస్లిం'లో హాజ్రత్ సోబాన్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, మనిషి తన ఆలుబిడ్డలు మరియు కుటుంబీకులపై వెచ్చించే సంపదే అత్యుత్తమ సంపద. లేదా అతను దైవమార్గంలో ఖర్చు చేయాలి లేదా తన ఆప్తులపై, బంధుమిత్రులపై ఖర్చుపెట్టాలి.

ఈ హదీసులో సదఖా (దానం) ఇవ్వటంలోని మహత్తును గురించి చెప్పటంతోపాటు అక్కర లేకపోయినా అర్థించేవారిని సున్నితంగా మందలించటం కూడా జరిగింది. చీటికీమాటికీ తమ హీనస్థితిని ఇతరుల ముందు చాటుకోకుండా - అభిమానధనులుగా జీవించే వారి కోసం అల్లాహ్ ఉపాధి ద్వారాలను తెరుస్తాడు. ఎవరిపైనా ఆధారపడకుండా నిరపేక్షాపరులుగా జీవించే స్థితిని కల్పిస్తాడు.

(٥١٢) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قِيْلَ: يَا رَسُولَ اللهِ! أَيُّ الصَّدَقَةِ أَفْضَلُ؟ قَالَ: **جُهْدُ الْمُقِلِّ، وَابْدَأْ بِمَنْ تَعُولُ.** أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

512. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: 'ఏ దానం శ్రేష్ఠమైనది?' అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎవరో ప్రశ్నించగా, "తక్కువ ధనం ఉన్నవాడు చేసే దానం. నీపై ఆధారపడి ఉన్నవారి నుంచి దానాన్ని మొదలెట్టు" అని దైవ ప్రవక్త (స) సమాధానమిచ్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఒకటి: ధనికుని దానానికీ, సామాన్యుని దానానికీ మధ్య స్పష్టమయిన వ్యత్యాసం ఉంది. రెండు : ఆలుబిడ్డల, కుటుంబ సభ్యుల కనీసావసరాలు తీర్చిన మీదట దానధర్మాలు చేయాలి. తాను పరులకు దానధర్మాలు చేస్తుండగా తన ఇంటివారలు అన్యుల ముందు చేయి చాచవలసిన నికృష్టస్థితి ఏర్పడకూడదు. అందుకే ముందు తన ఇంటివారి (షరీయత్‌పరంగా) ధర్మసమ్మతమయిన అక్కరలపై శ్రద్ధ చూపాలి.

(٥١٣) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**تَصَدَّقُوا**»، فَقَالَ رَجُلٌ: يَا رَسُولَ اللهِ! عِنْدِيْ دِيْنَارٌ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى نَفْسِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ: «**تَصَدَّقْ بِهِ عَلَى وَلَدِكَ**»، قَالَ: عِنْدِيْ آخَرُ، قَالَ:

513. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : "దానధర్మాలు చేయండి" అని దైవప్రవక్త (సఅసం) ఉపదేశించారు. 'దైవప్రవక్తా! నా దగ్గర ఒక్క దీనార్ మాత్రమే ఉంది'అని ఒక వ్యక్తి అన్నాడు. "దాన్ని నీ స్వయం కోసమే ఖర్చుపెట్టు" అని దైవప్రవక్త (స) అన్నారు. 'మరో దీనార్ కూడా ఉంది' అని అన్నాడావ్యక్తి. "దాన్ని నీ సంతానంపై సదఖాగా వెచ్చించు" అని ఆయన (స) సలహా

«تَصَدَّقْ بِهِ عَلَى زَوْجَتِكَ»، قَالَ: عِنْدِي آخَرُ، قَالَ: «تَصَدَّقْ بِهِ عَلَى خَادِمِكَ»، قَالَ: عِنْدِيْ آخرُ، قَالَ: «أَنْتَ أَبْصَرُ بِهِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

ఇచ్చారు. 'నా దగ్గర ఇంకొకటి కూడా ఉంది' అన్నాడా వ్యక్తి. "దాన్ని నీ భార్య కొరకు ఖర్చుపెట్టు' అని సూచించారాయన (స). 'నావద్ద ఇంకొకటి కూడా ఉంది' అని అతడు చెప్పగా "దాన్ని నీ సేవకుని కోసం ఖర్చుపెట్టు" అని ఉపదేశించారు ఆయన (స). 'దైవప్రవక్తా! నా వద్ద మరొకటి కూడా ఉందికదా!' అని అతడు సందేహపడగా, "దీన్ని ఖర్చుపెట్టే అవగాహన నీకు ఎక్కువగానే ఉంది" అని ఆయన (సఅసం) అన్నారు. (ఈ హదీసును అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు- ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే మానవుడు షరీయత్ పరిమితుల్లో ఉంటూ తొలుత తన వాళ్ల అవసరాలను తీర్చాలి. ధర్మసమ్మతమైన రీతిలో ఆలుబిడ్డల అవసరాలను తీర్చటం కూడా పుణ్యప్రదమయిన విషయమే. ఆ క్రమపద్ధతి ఇలా వుంది: ముందు తన స్వయానికై ఖర్చుపెట్టాలి. తరువాత సంతానం, భార్య, సేవకులూ వస్తారు. ఆ తరువాత తన ఇష్టమొచ్చిన వారిపై ఖర్చుపెట్టవచ్చు. లేదా భవిష్యత్తు కొరకు పొదుపు చేయవచ్చు. ఏది ఖర్చుచేసినా అతడు ఈ క్రమపద్ధతిని దృష్టిలో పెట్టుకోవాలి.

(٥١٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ النَّبِيُّ ﷺ: «إِذَا أَنْفَقَتِ الْمَرْأَةُ مِنْ طَعَامِ بَيْتِهَا، غَيْرَ مُفْسِدَةٍ، كَانَ لَهَا أَجْرُهَا بِمَا أَنْفَقَتْ، وَلِزَوْجِهَا أَجْرُهُ بِمَا اكْتَسَبَ، وَلِلْخَازِنِ مِثْلُ ذَلِكَ، لاَ يَنْقُصُ بَعْضُهُمْ مِنْ أَجْرِ بَعْضٍ شَيْئاً». مُتَّفَقٌ عَلَيْهِ.

514. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (రజి) వివరించారు - "స్త్రీ తన ఇంటి సొమ్మును దుబారాగా ఖర్చుపెట్టకుండా పొదుపును పాటిస్తే ఈ పొదుపరితనానికి బదులుగా ఆమెకు పుణ్యం లభిస్తుంది. ఆమె భర్తకు సంపాదించిన పుణ్యం లభిస్తుంది. అలాగే కోశాధికారికి కూడా పుణ్యం లభిస్తుంది. ఎవరి పుణ్యం కూడా ఇంకొకరి పుణ్యాన్ని తగ్గించదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒక ఉత్తమ ఇల్లాలి బాధ్యత ఏమిటో ఈ హదీసులో స్పష్టపరచబడింది. ఆమె ఎల్లప్పుడూ భర్త సంపాదనను బేరీజువేస్తూ, ఇంటి ఖర్చులను దానికనుగుణంగా సర్దుబాటు చేసుకోవాలి. దుబారా ఖర్చులు చేసి, భర్త అనుమతి లేకుండా దానధర్మాలు చేసి ఇంటి ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేయకూడదు. ఇల్లాలు ఒక్కో పద్దులో పాటించే పొదుపరితనం ఆ ఇంటిల్లిపాదికీ వరంగా పరిణమిస్తుంది. భర్తను అప్పులపాలు కాకుండా కాపాడుతుంది. అతడు నిశ్చింతగా ఉంటే బయటి వ్యవహారాలు, బాధ్యతలు సజావుగా నెరవేరుస్తాడు. ఈ విధంగా ఒక ఇల్లాలి యొక్క జాగరూకత మొత్తం వ్యవస్థ పాలిట శుభదాయకంగా పరిణమిస్తుంది. అలాగే ఒక ఇల్లాలి యొక్క అలక్ష్యం, అజాగ్రత్త మొత్తం వ్యవస్థనే అస్తవ్యస్తం చేసివేస్తుంది.

(٥١٥) وَعَنْ أَبِي سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَتْ زَيْنَبُ امْرَأَةُ ابْنِ مَسْعُوْدٍ، فَقَالَتْ: يَا رَسُوْلَ اللّٰهِ! إِنَّكَ أَمَرْتَ الْيَوْمَ بِالصَّدَقَةِ، وَكَانَ عِنْدِي حُلِيٌّ لِّي، فَأَرَدْتُ أَنْ أَتَصَدَّقَ بِهِ، فَزَعَمَ ابْنُ مَسْعُوْدٍ أَنَّهُ وَوَلَدَهُ أَحَقُّ مَنْ تَصَدَّقْتُ بِهِ عَلَيْهِمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: **«صَدَقَ ابْنُ مَسْعُوْدٍ، زَوْجُكِ وَوَلَدُكِ أَحَقُّ مَنْ تَصَدَّقْتِ بِهِ عَلَيْهِمْ»**. رَوَاهُ الْبُخَارِيُّ.

515. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) గారి శ్రీమతి జైనబ్ (ర.అన్‌హా) వచ్చి ఇలా విన్నవించుకున్నది - "ఓ దైవప్రవక్తా (సఅసం)! ఈ రోజు మీరు దానధర్మాలు చేయమని ఆజ్ఞాపించారు. నా దగ్గర నా స్వంత నగ ఉంది. దాన్ని నేను దానంగా ఇవ్వాలనుకుంటున్నాను. నా ఈ దానానికి (సదఖాకు) తాను, తన పిల్లలు ఎక్కువ హక్కుదారులని అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) భావిస్తున్నారు (నిజమేనా?)" దానికి ఆయన (స) "ఇబ్నె మస్‌వూద్ చెప్పింది నిజమే. నీ భర్త, నీ పిల్లలు నీవిచ్చే సదఖాకు ఎక్కువ హక్కుదారులు" అని అన్నారు. (బుఖారీ)

**సారాంశం**

'సదఖా' అనే అరబీ పదం చాలా విస్తృతమయింది. అది సాధారణ దానధర్మాలతోపాటు, జకాత్ నేపథ్యంలో కూడా ఉపయోగించబడుతుంది. పై హదీసులో ఇబ్నె మస్‌వూద్ (రజి) భార్య ఇవ్వదలచిన సదఖా స్వచ్ఛందమయిన సదఖా? లేక వాజిబ్ సదఖా? లేక జకాత్ మొత్తమా? అన్నది ఇక్కడ ప్రశ్న. సాధారణ సదఖా అయితే ఆమె దానికి సంబంధించి అడిగి తెలుసుకోవలసిన అవసరం లేదు. బహుశా ఇది జకాత్‌కి సంబంధించిన సదఖా (ఫర్జీ సదఖా) అయి ఉండవచ్చు. అధిక సంఖ్యాకులైన విద్వాంసుల, ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం భార్య తన భర్తకు జకాత్ ఇవ్వవచ్చు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) అభిప్రాయంలో భార్య తన భర్తకు జకాత్ ఇవ్వజాలదు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసులో దైవప్రవక్త (స) ముందు ధర్మసందేహం వెలిబుచ్చిన జైనబ్ (ర.అన్హా) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) సతీమణి. ఈమె బనూ సఖీఫ్ తెగకు చెందినవారు. ఈమె తండ్రి పేరు ముఆవియ లేక అబ్దుల్లా బిన్ ముఆవియ లేక అబూ ముఆవియ. ఈమె దైవప్రవక్త(స), హజ్రత్ ఉమర్, మరియు తన భర్త ఆధారంగా హదీసులను ఉల్లేఖించారు.

(٥١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَزَالُ الرَّجُلُ يَسْأَلُ النَّاسَ، حَتَّى يَأْتِيَ يَوْمَ الْقِيَامَةِ، وَلَيْسَ فِي وَجْهِهِ مُزْعَةُ لَحْمٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

516. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎవరయితే భిక్షాటనను, యాచించటాన్ని వృత్తిగా చేసుకుంటారో వారు ప్రళయదినాన తమ ముఖాలపై మాంసం లేని స్థితిలో లేచివస్తారు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ద్వారా భిక్షాటనం ఖండించబడింది. కేవలం మూడు రకాల మనుషులు మాత్రమే యాచించటం సమ్మతం. ఒకటి : ప్రకృతి వైపరీత్యాల, అవాంఛనీయ సంఘటనల వాతనపడి సర్వస్వాన్నీ కోల్పోయినవారు. తిండి తిప్పల కోసం కూడా ఏమీ మిగలనివారు. వారు తమ తాత్కాలిక అవసరాల కోసం, పునరావాసం కోసం అడగవచ్చు. అలాంటి వారి అవసరాలను అర్థం చేసుకుని ఉదారంగా ఆదుకోవాలి కూడా. రెండు: అన్యాయంగా జరిమానాకు గురైనవారు, అప్పుల ఊబిలో కూరుకుపోయినవారు. ఇలాంటి వారు ఇతరుల నుంచి అడిగి తమ దుస్థితి నుంచి బయటపడాలి. మూడు: పగలల్లా కష్టపడి పనిచేసినా కడుపునింపుకునేంత వేతనం లభించనివాడు, లేదా ఎంతగా అన్వేషించినా పని దొరకనివాడు, పరిమితమైన ఆదాయం వల్ల కుటుంబ అవసరాలు తీరనివాడు, ఆకలిదప్పులతో అలమటించేవాడు- ఇట్టి పరిస్థితిలో వారు సమాజంలోని స్థితిమంతుల నుంచి అడిగి తమ అవసరాలు తీర్చుకోవచ్చు. వీరు గాక భిక్షాటనను వృత్తిగా చేసుకున్నవారు, కష్టపడి పనిచేయగల శక్తి ఉండి కూడా ముష్టెత్తుకోవటాన్నే అలవాటుగా చేసుకున్నవారు ప్రళయదినాన అత్యంత అవమానకరమైన స్థితిలో లేపబడతారు.

(٥١٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ سَأَلَ النَّاسَ أَمْوَالَهُمْ تَكَثُّراً، فَإِنَّمَا يَسْأَلُ

517. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "ఎవరయితే తన సంపదను పెంచుకునే, వృద్ధిచేసుకునే ఉద్దేశ్యంతో జనుల నుండి యాచిస్తాడో అతడు తన కోసం

جَمْراً، فَلْيَسْتَقِلَّ أَوْ لِيَسْتَكْثِرْ». رَوَاهُ مُسْلِمٌ.

నిప్పులను తప్ప మరే వస్తువునూ యాచించటం లేదు. ఇప్పుడు వాటిని పెంచుకుంటాడో, తగ్గించుకుంటాడో ఇక అతని ఇష్టం." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా భిక్షాటనం అధర్మంగా ఖరారు చేయబడింది. ఆరోగ్యవంతుడు, కష్టపడి పని చేయగలవాడు, ఆర్థిక స్థోమత ఉన్నవాడు కూడా జనులవద్ద యాచిస్తే అతడు సమాజంలో తనను తాను కించపరచుకున్నట్లే. అటువంటి వారికి 'ధర్మం' చేయటం కూడా ధర్మం కాదు.

(٥١٨) وَعَنِ الزُّبَيْرِ بْنِ الْعَوَّامِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **لأَنْ يَأْخُذَ أَحَدُكُمْ حَبْلَهُ، فَيَأْتِيَ بِحُزْمَةِ الْحَطَبِ عَلَى ظَهْرِهِ، فَيَبِيعَهَا، فَيَكُفَّ بِهَا وَجْهَهُ، خَيْرٌ لَهُ مِنْ أَنْ يَسْأَلَ النَّاسَ، أَعْطَوهُ أَوْ مَنَعُوهُ.** رَوَاهُ الْبُخَارِيُّ.

518. హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవరయినా త్రాడుతో కట్టెల మోపుకట్టి, వీపుపై మోసుకువచ్చి, దాన్ని అమ్ముకుంటే, తద్వారా అల్లాహ్ అతని మొహాన్ని ముష్టెత్తుకోవటం నుంచి ఆపితే, అది అతని కొరకు - ఇచ్చినా ఇవ్వకపోయినా -జనుల నుంచి యాచించటం కన్నా ఎంతో ఉత్తమం." (బుఖారీ)

**సారాంశం**

కష్టపడి సంపాదించటం, కలో గంజో చెమటోడ్చిన దానితో కడుపునింపుకోవటం, యాచించి తినే స్వాదిష్టమైన ఆహారంకన్నా ఎంతో మిన్న అని ఈ హదీసు సారాంశం. యాచించే వానికి ఎంతమంచి అన్నం దొరికినా యాచించే సమయంలో అతడు పొందిన అవమానం, నలుగురిచేతా అతడు అనిపించుకున్న మాటలు సాధారణమైనవి కావు. అడుక్కోవటం వల్ల పరువు ప్రతిష్ఠలుండవు. సమాజంలో అందరూ అల్పదృష్టితో చూస్తారు. తేరగా వచ్చిపడుతున్న అన్నంవల్ల అతనిలో సోమరితనం, బద్ధకం పెంపొందుతుంది. ఇలాంటి జనం పెరిగిపోతే సమాజంలో అభివృద్ధి కూడా కుంటుపడుతుంది. భిక్షాటనం ఒక్కోసారి మనిషిలోని పౌరుషాన్ని, స్వాభిమానాన్ని చంపేసి అతన్ని దొంగతనం, దోపిడీ వంటి చెడులకు కూడా పురికొల్పుతుంది.

(٥١٩) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«الْمَسْأَلَةُ كَدٌّ يَكُدُّ بِهَا الرَّجُلُ وَجْهَهُ، إِلاَّ أَنْ**

519. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) తెలిపారు: "భిక్షాటనం ఒక గాయం వంటిది. దాంతో మనిషి తన ముఖాన్ని గాయపరచుకుం

يَسْأَلَ الرَّجُلُ سُلْطَاناً أَوْ فِي أَمْرٍ لاَ بُدَّ مِنْهُ».
رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

టాడు. అయితే గత్యంతరంలేక ఎవరయినా యాచిస్తే లేక రాజ్యపాలకునికి నివేదించుకుంటే అందులో తప్పు లేదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు - ప్రామాణికమైన హదీసుగా కూడా ఖరారు చేశారు)

**సారాంశం**

అక్కరలేకపోయినా ఇతరుల ముందు చేయి చాపటం సమ్మతం కాదని ఈ హదీసు తాత్పర్యం. అవసరం ఉన్నవాడు కూడా రాజ్యపాలకుడ్ని, తన పై అధికారిని నివేదించుకోవాలి. అటువంటివారికి బైతుల్‌మాల్ (కోశాగారం) లో హక్కు ఉంటుంది. బైతుల్‌మాల్ నుండి అగత్యపరునికి ఏదన్నా ఇస్తే అతని హక్కు అతనికి ఇచ్చినట్లవుతుంది. అంతేగాని ఎవరూ అతనిపై ఉపకారం చేసినట్టుకాదు.

**3వ అధ్యాయం**

## ٣ - بَابُ قِسمِ الصَّدَقَاتِ

## దానధర్మాల పంపిణీ

(٥٢٠) عَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَحِلُّ الصَّدَقَةُ لِغَنِيٍّ إِلاَّ لِخَمْسَةٍ: لِعَامِلٍ عَلَيْهَا، أَوْ رَجُلٍ اشْتَرَاهَا بِمَالِهِ، أَوْ غَارِمٍ، أَوْ غَازٍ فِي سَبِيلِ اللهِ، أَوْ مِسْكِينٍ تُصُدِّقَ عَلَيْهِ مِنْهَا فَأَهْدَى مِنْهَا لِغَنِيٍّ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأُعِلَّ بِالإِرْسَالِ.

520. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఐదు ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప స్థితిమంతుని కొరకు 'సదఖా' హలాల్ (ధర్మసమ్మతం) కాదు. (1) జకాత్ సొమ్మును సమీకరించినపుడు. (2) తన సొమ్ముతో దానధర్మాలకు సంబంధించిన ఏదయినా వస్తువును కొనుగోలు చేసినపుడు. (3) రుణగ్రస్తుడు. (4) దైవమార్గంలో పోరాడే వ్యక్తి. (5) దానంగా పొందిన దానిలోనుంచి ఒక నిరుపేద ఏదన్నా శ్రీమంతునికి కానుకగా ఇచ్చినపుడు." (దీనిని అహ్మద్, అబూదావూద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు - అయితే ఇది 'ముర్సల్' అని కూడా అభిప్రాయపడ్డారు)

### సారాంశం

శ్రీమంతుడు జకాత్ పుచ్చుకోరాదని ఈ హదీసు ద్వారా రూఢీ అయింది. అయితే జకాత్ వసూళ్ల నిమిత్తం నియమితులైన తహసీల్దార్లు, అకౌంటెంట్లు, గుమాస్తాలు - వారు ధనవంతులైనప్పటికీ - జీతంగా జకాత్ పద్దులో నుంచి తీసుకోవచ్చు.

(٥٢١) وَعَنْ عُبَيْدِ اللهِ بْنِ عَدِيِّ بْنِ الْخِيَارِ، أَنَّ رَجُلَيْنِ حَدَّثَاهُ: أَنَّهُمَا أَتَيَا رَسُولَ اللهِ ﷺ يَسْأَلَانِهِ مِنَ الصَّدَقَةِ، فَقَلَّبَ فِيهِمَا الْبَصَرَ، فَرَآهُمَا جَلْدَيْنِ، فَقَالَ: **إِنْ شِئْتُمَا أَعْطَيْتُكُمَا، وَلاَ حَظَّ فِيهَا لِغَنِيٍّ، وَلاَ لِقَوِيٍّ مُكْتَسِبٍ.** رَوَاهُ أَحْمَدُ، وَقَوَّاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

521. హజ్రత్ ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ (రహ్మ.లై) కథనం : ఇరువురు వ్యక్తులు నాకు తమ వృత్తాంతం వినిపించారు. వారిద్దరూ దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి వచ్చి, ఆయన్నుంచి 'సదఖా' కోరారు. ఆయన (సఅసం) వారిద్దరినీ నఖశిఖ పర్యంతం చూశారు. ఇరువురూ బలిష్టులుగానే కనిపించారు. ఆయన (సఅసం) ఇలా అన్నారు: "మీరు గనక కోరితే మీకు సదఖా ఇస్తాను. కాని శ్రీమంతునికీ, ఆరోగ్యవంతునికీ ఇందులో ఎలాంటి భాగం లేదు." (ఈ హదీసును అహ్మద్ ఉల్లేఖించగా, అబూదావూద్ మరియు నసాయి దీనిని 'దృఢమైనది'గా నిర్ధారించారు)

### సారాంశం

దృఢకాయులు, ధనవంతులు జకాత్‌కు, దానధర్మాలకు అర్హులు కారని ఈ హదీసును బట్టి అర్థమవుతోంది. దానం చేసేవారు కూడా యాచించేవారిని నిశితంగా చూచి, వారి స్థితిగతులను అడిగి తెలుసుకుని ఇవ్వటం సమంజసం. హక్కుదారులు కాని వారిని అడుక్కుతినరాదని గట్టిగా చెప్పాలి కూడా.

### హదీసు ఉల్లేఖకులు

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ (రహ్మ.లై). ఈయన ఖురైష్ వంశస్థులు. దైవప్రవక్త (సఅసం) కాలంలోనే జన్మించారని ఒక వాదన ఉంది. అందుచేత ఈయన తాబయీలలో ఒకరుగా పరిగణించబడ్డారు. ఈయన ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి)ల నుంచి హదీసులను సంగ్రహించారు. ఒక కథనం ప్రకారం ఈయన తండ్రి అవిశ్వాస స్థితిలోనే - బద్ర్‌యుద్ధంలో - తుదముట్టించబడ్డాడు. కాగా; ఈయన మక్కా విజయం నాటికి ప్రాజ్ఞ వయస్సుకు చేరుకున్నారు. ఈ రకంగా ఈయన్ని సహాబీగా కూడా పరిగణించవచ్చు. ఖురైష్‌కు చెందిన గొప్ప పండితులలో ఒకరుగా ఎంచబడతారు. హిజ్రీ 90లో - ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ హయాంలో - మరణించారు.

(٥٢٢) وَعَنْ قَبِيْصَةَ بْنِ مُخَارِقٍ الْهِلاَلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ الْمَسْأَلَةَ لاَ تَحِلُّ إِلاَّ لِأَحَدِ ثَلاَثَةٍ: رَجُلٌ تَحَمَّلَ حَمَالَةً، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَهَا، ثُمَّ يُمْسِكُ، وَرَجُلٌ أَصَابَتْهُ جَائِحَةٌ اجْتَاحَتْ مَالَهُ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَ قِوَاماً مِنْ عَيْشٍ، وَرَجُلٌ أَصَابَتْهُ فَاقَةٌ، حَتَّى يَقُومَ ثَلاَثَةٌ مِنْ ذَوِي الْحِجَى مِنْ قَوْمِهِ: لَقَدْ أَصَابَتْ فُلاَناً فَاقَةٌ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ حَتَّى يُصِيبَ قِوَاماً مِنْ عَيْشٍ، فَمَا سِوَاهُنَّ مِنَ الْمَسْأَلَةِ يَا قَبِيصَةُ سُحْتٌ، يَأْكُلُهُ صَاحِبُهُ سُحْتاً**». رَوَاهُ مُسْلِمٌ وَأَبُو دَاوُدَ وابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

522. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనతో చెప్పారని హజ్రత్ ఖబీస బిన్ ముఖారిఖ్ హిలాలీ తెలియజేశారు: "యాచించటం కేవలం ముగ్గురు వ్యక్తుల కొరకే ధర్మసమ్మతం." ఒకడు: ఒకరి బరువు బాధ్యతలను తనపై వేసు కున్న వ్యక్తి. కడకు తన అప్పులు తీరిన తరువాత అతడు యాచించటం మాను కోవాలి. రెండవవాడు : ఏదైనా అనుకోని విపత్తుకు గురై ఆస్తిపాస్తులను కోల్పోయి నవాడు. అతడు తన కనీసావసరా లకై మాత్రమే ప్రశ్నించగలడు. మూడవ వాడు : పస్తులకు గురవుతున్నవాడు. నిజంగానే అతడు పస్తులుండవలసి వస్తోందని తన జాతికి చెందిన ముగ్గురు విజ్ఞులు ఆ మేరకు సాక్ష్యమివ్వాలి. అట్టి పరిస్థితిలో అతడు జరుగుబాటుకు సంబంధించినంతవరకు అడగటం ధర్మసమ్మతం. వీరుగాక.... ఓ ఖబీసా ! ప్రశ్నించటం (యాచించటం) హరామ్. ప్రశ్నించేవాడు (యాచించేవాడు) హరామ్‌తో తన పొట్ట నింపుకుంటు న్నాడు సుమా! (ముస్లిం, అబూదావూద్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్)

**సారాంశం**

యాచించేవాని నిజస్థితిని ధృవీకరించే ఒక పద్ధతి (సిస్టమ్) ఈ హదీసులో ప్రతిపాదించ బడింది. సమాజంలోని విజ్ఞులు, బాధ్యతాయుత వ్యక్తులు ముగ్గురు ఒక వ్యక్తి లేక ఒక కుటుంబం గురించి, వారు నిజంగానే అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని, సమయానికి తిండిలేక పస్తులుండవలసి వస్తోందని సాక్ష్యపత్రం వ్రాసి ఇస్తే అప్పుడు వారు యాచించేందుకు అర్హులవుతారు. అడుక్కునే వారి స్థితిని వాకబు చేయమని కూడా చెప్పబడింది. దీన్నిబట్టి ఇస్లాం భిక్షాటనను ఎంతగా నిరుత్సాహ పరచిందో, శ్రమ జీవనాన్ని ఎంతగా ప్రోత్సహించిందో అర్థమవు తోంది.

### హదీసు ఉల్లేఖకులు

ఖబీస బిన్ ముఖారిఖ్ హిలాలీ (రజి). ఈయన నామాంతరం అబూ బిష్ర్. దైవప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు. బస్రాలో స్థిరపడ్డారు. ఒక ప్రతినిధి వర్గంతో కలసి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చారు. ఆయన (స) వద్ద హదీసులు విన్నారు. ఆరు హదీసులను ఉల్లేఖించారు.

(٥٢٣) وَعَنْ عَبْدِ الْمُطَّلِبِ ابْنِ رَبِيعَةَ ابْنِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ الصَّدَقَةَ لاَ تَنْبَغِي لِآلِ مُحَمَّدٍ، إِنَّمَا هِيَ أَوْسَاخُ النَّاسِ». وَفِي رِوَايَةٍ: «وَإِنَّهَا لاَ تَحِلُّ لِمُحَمَّدٍ وَلاَ لِآلِ مُحَمَّدٍ». رَوَاهُ مُسْلِمٌ.

523. హజ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ముహమ్మద్ (స) కుటుంబీకులకు సదఖా పుచ్చుకోవటం ఎంతమాత్రం సమంజసం కాదు. ఇది ప్రజల ధన సంపదల కాలుష్యం." వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది : "సదఖా ముహమ్మద్ (స) కొరకూ, ముహమ్మద్ (స) కుటుంబీకుల కొరకూ ధర్మసమ్మతం కాదు." (ముస్లిం)

### హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ (రజి). ఈయన వంశపరంపర ఈ విధంగా ఉంది: అబ్దుల్ ముత్తలిబ్ బిన్ రబీయ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ ఖురషీ. ఈయన మదీనాలో స్థిరపడ్డారు. తరువాత డెమాస్కస్‌కు వెళ్ళారు. హిజ్రీ 62లో అక్కడే మరణించారు.

(٥٢٤) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَشَيْتُ أَنَا وَعُثْمَانَ بْنُ عَفَّانَ إِلَى النَّبِيِّ ﷺ، فَقُلْنَا: يَا رَسُولَ اللهِ! أَعْطَيْتَ بَنِي الْمُطَّلِبِ مِنْ خُمُسِ خَيْبَرَ وَتَرَكْتَنَا، وَنَحْنُ وَهُمْ بِمَنْزِلَةٍ وَاحِدَةٍ، فَقَالَ

524. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం : నేను మరియు ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) ఇద్దరం కలసి దైవప్రవక్త (సఅసం) దగ్గరకెళ్ళి ఇలా విన్నవించుకున్నాము - "తమరు బనూ అబ్దుల్ ముత్తలిబ్ (అబ్దుల్ ముత్తలిబ్ సంతతి)కి ఖైబర్ నుంచి (విజయ ప్రాప్తిగా)లభించిన ఐదు ఆస్తులలో వాటా ఇచ్చారు. కాని మమ్మల్ని మాత్రం ఉపేక్షించటం జరిగింది. తమరితో గల సంబంధాల రీత్యా, సామీప్యం దృష్ట్యా

رَسُولُ اللهِ ﷺ: «إِنَّمَا بَنُو الْمُطَّلِبِ وَبَنُو هَاشِمٍ شَيْءٌ وَّاحِدٌ». رَوَاهُ الْبُخَارِيُّ.

ఇరువురూ సమానులే కదా!" ఇది విని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), "బనూ అబ్దుల్ ముత్తలిబ్, బనూ హాషిమ్ రెండూ ఒక్కటే" అని వ్యాఖ్యానించారు. (బుఖారీ)

**సారాంశం**

'మేము మరియు బనూ ముత్తలిబ్ సమానులమే కదా!' అని ఫిర్యాదు చేయటంలో గల ఆంతర్యం ఏమిటీ? రెండు ఉద్దేశ్యాలు కావచ్చు. ఒకటి : విశ్వసనీయతలో, వినయ విధేయతలలో అబ్దుల్ ముత్తలిబ్ సంతతి ఎంతగా రాణించిందో అంతగానే మేమూ రాణించాము. మీ మాటను ఎన్నడూ జవదాటలేదు. ఇక బంధుత్వ రీత్యా అంటారా? అందులోనూ మాకూ - ముత్తలిబ్ సంతతికి మధ్య పెద్దగా అంతరం లేదు. వాళ్లకి ఎంతగా మీతో దగ్గరి బంధుత్వముందో అంతగానే మాకూ మీతో బంధుత్వముంది. హజ్రత్ ఉస్మాన్ (రజి) బనూ ఉమయ్య వంశస్థులు. పైగా దైవప్రవక్త (స)కు అల్లుడు కూడాను. బనూ ఉమయ్య, బనూ హాషిమ్ వంశస్థులు ఖురైష్ వర్గంతో సరిసమానులుగా పరిగణించబడేవారు. మరోవిధంగా చెప్పాలంటే హజ్రత్ ఉస్మాన్ (రజి) బనూ అబ్దుషమ్స్‌లోని వారు. హజ్రత్ జుబైర్ (రజి) గారు నౌఫిల్ సంతానంలోని వారు. దైవప్రవక్త (సఅసం), అబ్బాస్ (రజి), హజ్రత్ అలీ (రజి) హాషిమ్ సంతతికి చెందినవారు. ఈ విధంగా వీరంతా ముత్తలిబ్ వంశస్థులే. హాషిమ్, ముత్తలిబ్, నౌఫిల్, అబ్దుషమ్స్ - ఈ నలుగురూ అబ్దె మునాఫ్ కుమారులే. ఈ విధంగా దైవప్రవక్త (స)తో ఉస్మాన్, జుబైర్, అలీకి సంబంధం ఒకే స్థాయికి చెందినది. ఉస్మాన్, జుబైర్‌లు దైవప్రవక్త (స)ను ప్రశ్నించటంలోని ఆంతర్యం కూడా ఇదే.

ఇక దైవప్రవక్త (సఅసం) సమాధానంలోని పరమార్థం ఏమై ఉంటుంది? అన్నది ప్రశ్న. ప్రాచీన కాలం నుంచీ బనూ హాషిమ్, బనూ ఉమయ్య సమాన స్థాయిలో చెలామణీ అవుతూ వస్తున్న సంగతి నిజమే. ఈ రకంగా ఆయన (స) ఎలాంటి తేడా చూపలేదు. కాకపోతే బనూ ఉమయ్యా కన్నా, బనూ హాషిమ్ దైవప్రవక్త (స)కు మరింత దగ్గరగా ఉంది. అందుకే ఆయన (స) బనూ హాషిమ్‌కి జకాత్ సొమ్మును నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేశారు. బనూ ఉమయ్య కొరకు జకాత్ సొమ్ము నిషిద్ధం కాదు. అందుకే బనూ హాషిమ్‌కి ఖైబర్‌కి చెందిన 'ఐదు ఆస్తులలో' వాటా ఇవ్వబడింది. బనూ ఉమయ్యాకు మాత్రం షేర్ లభించలేదు. ఈ కారణంగానే హజ్రత్ ఉస్మాన్ మరియు జుబైర్‌లకు ఖైబర్ విజయప్రాప్తిలో భాగం దక్కలేదు. జకాత్ సొమ్ము ధర్మసమ్మతం గావించబడిన సంతతికి 'ఐదు ఆస్తులలో' వాటా లభించలేదు. 'ఐదు ఆస్తులలో' వాటా పొందిన సంతతికై జకాత్ సొమ్ము శాశ్వతంగా నిషేధించబడింది. ఒక కోణం నుంచి ఒకరు లబ్ధిపొందగా, మరో కోణం నుంచి మరొకరికి న్యాయం జరిగిందన్నమాట!

525. హజ్రత్ అబూ రాఫె (రజి) కథనం:

(٥٢٥) وَعَنْ أَبِي رَافِعٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ رَجُلاً عَلَى

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖ్జూమ్ తెగకు చెందిన ఒక వ్యక్తిని జకాత్ వసూళ్లకై నియమించారు. ఆ

الصَّدَقَةِ مِنْ بَنِيْ مَخْزُوم، فَقَالَ لِأَبِيْ رَافِعٍ: اصْحَبْنِيْ، فَإِنَّكَ تُصِيْبُ مِنْهَا: فَقَالَ: لاَ، حَتَّى آتِيَ النَّبِيَّ ﷺ، فَأَسْأَلَهُ، فَأَتَاهُ، فَسَأَلَهُ، فَقَالَ: «مَوْلَى الْقَوْمِ مِنْ أَنْفُسِهِمْ، وَإِنَّها لاَ تَحِلُّ لَنَا الصَّدَقَةُ». رَوَاهُ أَحْمَدُ وَالثَّلاَثَةُ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

వ్యక్తి అబూ రాఫేనుద్దేశించి, 'నువ్వు కూడా నాతో రా. నీకూ ఇందులో ఎంతో కొంత భాగం లభిస్తుంది' అని అన్నాడు. 'దైవప్రవక్త (స) ను సంప్రతించి అందలి ఉచితానుచితాల గురించి తెలుసుకునే వరకూ నేను రాలేను' అని ఆయన బదులిచ్చారు. కనుక ఆయన (స) వద్దకు వెళ్ళి ఈ సంగతి గురించి ఆరా తీయగా, ఆయన (స) ఇలా అన్నారు : "ఒక జాతి దగ్గర వున్న బానిస కూడా ఆ జాతికి చెందిన వాడే అవుతాడు. మన కోసం సదఖా (జకాత్) ధర్మసమ్మతం కాదు." (దీనిని అహ్మద్, మరి ముగ్గురు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ కూడా)

### సారాంశం

ఏ వ్యక్తికై జకాత్ సొమ్ము నిషిద్ధం గావించబడిందో అతని వద్ద ఉన్న బానిసకై కూడా అది హరామ్ (నిషిద్ధం) అయిపోతుంది. అబూ రాఫె (రజి) దైవప్రవక్త (స) బానిస అవటం వల్ల ఆయన కోసం కూడా జకాత్ నిషేధించబడింది.

### హదీసు ఉల్లేఖకులు

అబూ రాఫె (రజి). ఈయన అసలు పేరుపై భిన్నాభిప్రాయాలున్నాయి. అస్లం అనీ, హుర్‌ముజ్ అనీ, సాబిత్ అనీ, ఇబ్రాహీం అనీ రకరకాలుగా చెప్పబడింది. వాస్తవానికి ఈయన హజ్రత్ అబ్బాస్ బానిస. ఆయన ఈయన్ని దైవప్రవక్తకు కానుకగా సమర్పించుకున్నారు. ఈయన బద్ర్ యుద్ధానికి మునుపు ఇస్లాం స్వీకరించారు. కాని బద్ర్‌లో పాల్గొనలేదు. ఆ తరువాత జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారు. హజ్రత్ అబ్బాస్ ఇస్లాం స్వీకరించిన శుభవార్తను ఈయన దైవప్రవక్త (స)కు వినిపించగా, ఈ ఆనందంలో దైవప్రవక్త (స) ఈయనకు స్వేచ్ఛనొసగారు. హిజ్రీ 36లో - హజ్రత్ అలీ పరిపాలనా కాలంలో - మదీనాలో మరణించారు.

(٥٢٦) وَعَنْ سَالِمِ بْنِ عَبْدِ اللهِ بْنِ عُمَرَ، عَنْ أَبِيْهِ، أَنَّ رَسُولَ اللهِ ﷺ كَانَ يُعْطِي عُمَرَ الْعَطَاءَ، فَيَقُوْلُ: أَعْطِهِ أَفْقَرَ مِنِّيْ، فَيَقُوْلُ:

526. హజ్రత్ సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ (రహ్మ.లై) బిన్ ఉమర్ (రజి) తన తండ్రి ఆధారంగా ఉల్లేఖించారు - దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉమర్ (రజి) కు ఏదన్నా వస్తువును ఇవ్వబోతే, 'నాకన్నా

خُذْهُ، فَتَمَوَّلْهُ، أَوْ تَصَدَّقْ بِهِ، وَمَا جَاءَكَ مِنْ هٰذَا الْمَالِ، وَأَنْتَ غَيْرُ مُشْرِفٍ وَلاَ سَائِلٍ، فَخُذْهُ، وَمالاَ فَلاَ تُتْبِعْهُ نَفْسَكَ. رَوَاهُ مُسْلِمٌ.

పేదవారైన వారికి ఇవ్వండి' అని హజ్రత్ ఉమర్ (రజి) అనేవారు. దానికి సమాధానంగా ఆయన (స), "దీన్ని తీసుకోండి. దీనిద్వారా స్థితిమంతులవండి లేదా దీన్ని ఇతరులకు దానం చేయండి. అత్యాశకు, ప్రలోభానికి పోకుండా ఏదైనా వస్తువు దానంతట అదే మీ వద్దకు వస్తే దాన్ని స్వీకరించండి. అందని దానికోసం మాత్రం ఆరాటపడకండి" అని ఉపదేశించారు. (ముస్లిం)

**సారాంశం**

ఏదేని వ్యవస్థలో పనిచేసే వ్యక్తి -తన జరుగుబాటు నిమిత్తం - వేతనం లేక ప్రతిఫలం తీసుకోవటంలో తప్పులేదని ఈ హదీసు చెబుతోంది. ఈ సంఘటన హజ్రత్ ఉమర్ (రజి) వసూలు చేసిన జకాత్ సొమ్ముపై ప్రతిఫలానికి సంబంధించినదని 'ముస్లిం'లోని ఒక హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. కాకపోతే మనిషిలో అత్యాశ ఉండకూడదు. పై అధికారులు అతని సేవలను గుర్తించి, అతనికేదైనా ప్రతిఫలం ఇస్తే అది అతని పాలిట ఒక 'పురస్కారం' అవుతుంది. అంతేగాని అతడు ధనానికి, కమీషన్‌కు ఆశపడి జకాత్ సొమ్మును వసూలు చేయకూడదు. అలాగే తనకు లభించదనుకున్న దానికోసం అనవసరంగా ప్రాకులాడకూడదు. పేరాశ కూడా 'హరాం' క్రిందికే వస్తుంది.

# 5. ఉపవాసాల పుస్తకం

## ٥ - كِتَابُ الصِّيَامِ

### ఉపవాస నియమాలు

(٥٢٧) عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «**لاَ تَقَدَّمُوا رَمَضَانَ بِصَوْمِ يَوْمٍ وَلاَ يَوْمَيْنِ، إِلاَّ رَجُلٌ كَانَ يَصُومُ صَوْماً فَلْيَصُمْهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

527. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "మీలో ఎవ్వరూ రమజాన్‌కు ముందు ఒకటి లేక రెండు ఉపవాసాలు ఉండకండి. అయితే ఎవరన్నా అంతకు ముందు నుంచి ఉపవాసవ్రతాలు పాటిస్తూ వస్తున్నట్లయితే ఆ రోజు ఉపవాసాన్ని పూర్తిచేసుకోవచ్చు." (బుఖారీ, ముస్లిం)

(٥٢٨) وَعَنْ عَمَّارِ بْنِ يَاسِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَنْ صَامَ الْيَومَ الَّذِيْ يُشَكُّ فِيْهِ، فَقَدْ عَصَى أَبَا الْقَاسِمِ ﷺ. ذَكَرَهُ الْبُخَارِيُّ تَعْلِيقاً، وَوَصَلَهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

528. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కథనం : "ఎవరయితే సందేహాస్పదమయిన రోజున ఉపవాసం (రోజా) పాటించాడో అతడు అబుల్ ఖాసిం (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అవిధేయత చూపాడు." (బుఖారీ దీనిని 'ముఅల్లఖ్'గా పేర్కొన్నారు. ఐదుగురూ దీనిని 'మౌసూల్'గా పరిగణించారు. కాగా; ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఇస్లామీయ షరీయత్ ప్రకారం ఉపవాసాలు మొదలెట్టినా (రమజాన్) నెలవంకను చూసి మొదలెట్టాలి. ఉపవాసాలు విరమించినా (షవ్వాల్) నెలవంకను చూసి మరీ విరమించాలి. ఒకవేళ షాబాన్ నెల 29వ తేదీన నెలవంక కనిపించకపోతే ఆ మరుసటి రోజు షరీయత్‌పరంగా సందేహాస్పదమయిన రోజుగా భావించబడుతుంది. ఆ దినాన ఉపవాసం ఉండటం భావ్యం కాదు. ఈ సందర్భంగా ఖగోళ శాస్త్రజ్ఞుల లెక్కలపై ఆధారపడటం కూడా షరీయత్ స్ఫూర్తికి విరుద్ధం. ఖగోళ శాస్త్రవేత్తలు వేసిన లెక్కలు కూడా అనేకసార్లు నిజం కాలేదు.

(٥٢٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُوْلُ: «إِذَا رَأَيْتُمُوهُ فَصُومُوا، وَإِذَا رَأَيْتُمُوهُ فَأَفْطِرُوا، فَإِنْ غُمَّ عَلَيْكُمْ فَاقْدُرُوا لَهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: فَإِنْ أُغْمِيَ عَلَيْكُمْ فَاقْدُرُوا لَهُ ثَلَاثِيْنَ. وَلِلْبُخَارِيِّ: فَأَكْمِلُوا الْعِدَّةَ ثَلَاثِيْنَ. وَلَهُ فِي حَدِيْثِ أَبِي هُرَيْرَةَ: فَأَكْمِلُوا عِدَّةَ شَعْبَانَ ثَلَاثِيْنَ.

529. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "నెలవంకను చూసిన మీదట మీరు ఉపవాసాలుండండి. (పండుగ కోసం) నెలవంకను చూసిన మీదట ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయండి. ఒకవేళ ఆకాశం మేఘావృతమయివుంటే లెక్క వేసుకోండి." (ముత్తఫఖున్ అలైహ్). 'ముస్లిం'లోని వాక్యం ఇలా వుంది: "ఒకవేళ ఆకాశం మేఘావృతమై ఉంటే 30 రోజుల లెక్క కట్టండి." బుఖారీలో ఈ విధంగా ఉంది - "మరి 30 రోజాల లెక్కను పూర్తిచేయండి." బుఖారీలోనే హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనం ఇలా వుంది: "మరి మీరు షాబాన్ నెలలోని 30 రోజులను గణించండి."

(٥٣٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: تَرَاءَى النَّاسُ الْهِلَالَ، فَأَخْبَرْتُ النَّبِيَّ ﷺ أَنِّي رَأَيْتُهُ، فَصَامَ، وَأَمَرَ النَّاسَ بِصِيَامِهِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ حِبَّانَ.

530. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : "ప్రజలు నెలవంకను దర్శించసాగారు. నేను కూడా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు నెలవంకను చూశానని సమాచారం అందజేశాను. ఆయన (స) స్వయంగా ఉపవాసం ఉండటమే గాక, ఉపవాసాలుండమని జనులను ఆజ్ఞాపించారు." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - హాకిమ్, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులన్నింటి ద్వారా అవగతమయ్యేదేమిటంటే నెలవంకను చూసి ఉపవాసాలు మొదలెట్టాలి. నెలవంకను చూసిన మీదట ఉపవాసాలు విరమించాలి. ఒకవేళ షాబాన్ నెల

29వ తేదీన నెలవంక కనబడకపోతే ఆ నెలను 30 రోజుల నెలగా పరిగణించాలి. అలాగే రమజాన్ నెల 29వ తేదీన నెలవంక దర్శనమివ్వకపోతే 30 రోజుల ఉపవాసాలు పూర్తిచేయాలి. ఒకవేళ ఆకాశం మేఘావృతమై ఉన్న కారణంగా నెలవంక కనబడక, ఆకాశం నిర్మలంగా ఉన్నచోట నెలవంక కనబడితే దీని ఆధారంగా ఆ ప్రాంతంలోని పట్టణాలు, గ్రామాలన్నింటిలో ఉపవాస వ్రతాలు ప్రారంభించాలి. పండుగ జరుపుకునే విషయంలో కూడా ఈ విధానాన్నే అనుసరించాలి. ఒకవేళ చంద్రుడు దర్శనమిచ్చిన ప్రాంతం భౌగోళికంగా పూర్తిగా భిన్నమైనదైనపుడు దాన్ని లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేదు. ఉపవాసం ఉండటానికి నమ్మకస్థుడైన ఒక వ్యక్తి నెలవంకను చూసినట్లు సాక్ష్యమిస్తే సరిపోతుంది. కాని పండుగ జరుపుకోవటానికి మాత్రం ఇద్దరు వ్యక్తులు సాక్ష్యం ఇవ్వాలి.

(٥٣١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ أَعْرَابِيًّا جَاءَ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: إِنِّي رَأَيْتُ الْهِلاَلَ، فَقَالَ: **أَتَشْهَدُ أَن لاَّ إِلَهَ إِلاَّ اللَّهُ؟** قَالَ: نَعَمْ. قَالَ: **أَتَشْهَدُ أَنَّ مُحَمَّداً رَّسُولُ اللهِ؟** قَالَ نَعَمْ، قَالَ: **فَأَذِّنْ فِي النَّاسِ يَا بِلاَلُ أَنْ يَصُوْمُوا غَداً.** رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ، وَرَجَّحَ النَّسَائِيُّ إِرْسَالَهُ.

531. హాజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి తాను నెలవంకను చూచినట్టు విన్నవించుకున్నాడు. "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడని నీవు సాక్ష్యమిస్తున్నావా?" అని దైవప్రవక్త (స) ఆ వ్యక్తిని ప్రశ్నించారు. 'అవున'న్నాడా వ్యక్తి. "ముహమ్మద్ దేవుని ప్రవక్త అని నీవు సాక్ష్యమిస్తున్నావా?" అని నిలదీశారు ఆ వ్యక్తిని. దానికతను 'అవును' అన్నాడు. అప్పుడాయన (స) ఇలా అన్నారు : "బిలాల్! లేవండి. రేపు ప్రజల్ని ఉపవాసాలుండమని ప్రకటించండి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు - నసాయి మాత్రం దీనిని 'ముర్సల్'గా భావించారు)

(٥٣٢) وَعَنْ حَفْصَةَ أُمِّ الْمُؤْمِنِينَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ لَمْ**

532. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని ఉమ్ముల్ మోమినీన్ హాజత్ హఫ్సా (ర.అన్హా)

يُبَيِّتِ الصِّيَامَ قَبْلَ الْفَجْرِ فَلاَ صِيَامَ لَهُ». رَوَاهُ الْخَمْسَةُ، وَمَالَ التِّرْمِذِيُّ وَالنَّسَائِيُّ إِلَى تَرْجِيحِ وَقْفِهِ، وَصَحَّحَهُ مَرْفُوعاً ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

తెలిపారు : "ఎవరయితే ఉషోదయానికి ముందే ఉపవాస సంకల్పం చేసుకోలేదో వారి ఉపవాసం ఉపవాసమే కాదు." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఈ హదీసు 'మౌఖూఫ్' అయి ఉంటుందని తిర్మిజీ, నసాయి తలపోశారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్‌లు మాత్రం 'మర్ఫూ'గా పరిగణించారు) దారెఖుత్నీ లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: "ఎవ రయితే రాత్రిపూట ఉపవాసాన్ని తన కొరకు తప్పనిసరిగా చేసుకోలేదో అతని ఉపవాసం నెరవేరదు."

وَلِلدَّارَقُطْنِيِّ: «لاَ صِيَامَ لِمَن لَّمْ يَفْرِضْهُ مِنَ اللَّيْلِ».

### సారాంశం

తెల్లవారకముందే ఫర్జ్ రోజాల సంకల్పం చేసుకోవటం అవసరమని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. సంకల్పం (నియ్యత్) సూర్యాస్తమయం మొదలుకుని ఫజ్ర్ నమాజ్ వేళ వరకూ ఎప్పుడయినా చేసుకోవచ్చు. ఉపవాసం ఒక ఆచరణ. ఆచరణలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి గనక రోజా (ఉపవాసం) అనే ఆచరణ కోసం కూడా సంకల్పం అనివార్యం. ప్రతిరోజూ ఉపవాసానికి ముందు సంకల్పం అవసరమవుతుంది. అయితే సంకల్పం కోసం ప్రత్యేకంగా నోటితో పలకవలసిన అవసరం లేదు. మనసులో దీక్ష బూనితే సరిపోతుంది. దైవప్రవక్త (స)గానీ, ప్రియ సహచరులు (రజి)గానీ సంకల్ప వచనాలు నోటితో పలికిన దాఖలాలేమీ లేవు.

### హదీసు ఉల్లేఖకులు

హఫ్సా బిన్తె ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర.అన్హా). మొదట ఈమె ఖునైస్ బిన్ హుజాఫా సహ్మీ నికాహ్‌లో ఉన్నారు. బద్ర్ యుద్ధ సందర్భంగా ఈయన మరణించారు. తరువాత దైవప్రవక్త (సఅసం) ఆమెను నికాహ్ చేసుకుని తన దాంపత్య జీవితంలోనికి తెచ్చుకున్నారు. ఇది హిజ్రీ 3వ సంవత్సరంలో జరిగిన సంఘటన. ఈమె 60 ఏళ్ల వయస్సులో - హిజ్రీ 45వ సంవత్సరంలో- మరణించారు.

(٥٣٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: دَخَلَ عَلَيْنَا النَّبِيُّ ﷺ ذَاتَ يَوْمٍ فَقَالَ: هَلْ عِنْدَكُمْ شَيْءٌ؟ قُلْنَا: لاَ، قَالَ: فَإِنِّي إِذاً صَائِمٌ، ثُمَّ أَتَانَا يَوْماً آخَرَ، فَقُلْنَا: أُهْدِيَ لَنَا

533. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ఒకనాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా వద్దకు వచ్చి, "మీ దగ్గర (తినడానికి) ఏ వస్తువు అయినా ఉందా?" అని అడిగారు. 'లేదు' అని మేము సమాధానమిచ్చాము. "అలాగైతే నేను (ఈ రోజు) ఉపవాసం ఉంటాను"

حَيْسٌ، فَقَالَ: أَرِينِيهِ فَلَقَدْ أَصْبَحْتُ صَائِماً، فَأَكَلَ. رَوَاهُ مُسْلِمٌ.

అన్నారు. అలాగే మరో రోజు ఆయన వచ్చినపుడు '(ఎక్కడినుంచో) పాయసం కానుకగా పంపబడింది' అని మేము చెప్పాము. దానికి ఆయన (స), "ఏదీ నాకు చూపెట్టండి, పొద్దున్నుంచి నేను ఉపవాసం ఉన్నాను" అని అన్నారు. తరువాత ఆయన (స) పాయసం ఆరగించారు. (ముస్లిం)

**సారాంశం**

ఇది నఫిల్ ఉపవాసాలకు సంబంధించినదేగాని, రమజాన్ మాసంలో పాటించే ఫర్జ్ ఉపవాసాల వ్యవహారం కాదు. నఫిల్ ఉపవాసాల సంకల్పం తెల్లవారకమునుపే చేసుకోవలసిన అవసరం లేదు. సూర్యోదయం తరువాత కూడా ఈ సంకల్పం చేయవచ్చు. నలుగురు ఇమాములలో ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) గారు, నఫిల్ ఉపవాసం కోసం కూడా తెల్లవారక ముందే సంకల్పం అవశ్యమని భావిస్తున్నారు. కాని హదీసులో ఈ మేరకు ఎలాంటి ఆంక్ష లేదు.

నఫిల్ ఉపవాసాలు అకారణంగా కూడా - మధ్యాంతరంలో - విరమించవచ్చని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ముగ్గురు ఇమాముల (ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్)తో పాటు పెక్కుమంది ధర్మవేత్తలు దీంతో ఏకీభవించారు. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో అకారణంగా రోజాను మధ్యలో విరమించటం ధర్మసమ్మతం కాదు. ఎవరయినా విందుకు ఆహ్వానిస్తేనే నఫిల్ ఉపవాసాన్ని విరమించవచ్చనీ, వేరితర కారణాలపై విరమించరాదని ఆయన అభిప్రాయపడ్డారు.

(٥٣٤) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «لاَ يَزَالُ النَّاسُ بِخَيْرٍ مَا عَجَّلُوا الْفِطْرَ» مُتَّفَقٌ عَلَيْهِ.

534. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ప్రజలు ఉపవాసాన్ని విరమించటం (ఇఫ్తార్ చేయటం)లో శీఘ్రత కనబరచినంత కాలం క్షేమంగా ఉంటారు." (ముస్లిం)

وَلِلتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: قَالَ اللَّهُ عَزَّ وَجَلَّ: «أَحَبُّ عِبَادِي إِلَيَّ، أَعْجَلُهُمْ فِطْراً».

తిర్మిజీలో హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం ఈ విధంగా ఉంది : ఆయన (సఅసం) ఇలా అన్నారు - "నా దాసులలో ఇఫ్తార్ కొరకు త్వరపడేవారే నాకు అత్యంత ప్రియతములు" అని అల్లాహ్ సెలవిచ్చాడు.

**సారాంశం**

సూర్యాస్తమయం అయిందని ఖచ్చితంగా నిర్ధారణ అయిపోయిన తరువాత అనవసరంగా కాలయాపన చేయకుండా - తొందరగా-ఇఫ్తార్ చేసుకోవాలి. ఆలస్యంగా ఇఫ్తార్ చేయటం యూదుల, క్రైస్తవుల పద్ధతి. కనుక మనం దైవప్రవక్త (స) ప్రబోధనానుసారం ఇఫ్తార్ కొరకు వేగిరపడాలి. కాస్త ఆలస్యంగా ఇఫ్తార్ చేస్తే ఎక్కువ పుణ్యం దక్కుతుందనుకొని-ఉద్దేశ్యపూర్వకంగా - ఆలస్యం చేయటం బిద్అత్ క్రిందికి వస్తుంది.

(٥٣٥) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «تَسَحَّرُوا، فَإِنَّ فِي السُّحُورِ بَرَكَةً». مُتَّفَقٌ عَلَيْهِ.

535. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖించారు- "సహ్రీని భుజించండి. ఎందుకంటే అందులో ఎంతో శుభం ఉంది."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

సహ్రీ తినవలసిన ఆవశ్యకతను ఈ హదీసు సూచిస్తోంది. ఎందుకంటే యూదులు, క్రైస్తవులు సహ్రీ ఏర్పాట్లు చేసుకోరు. వారికీ - మనకూ మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే. సహ్రీ భుజించటం వల్ల ఉపవాసి నిస్సత్తువకు, నీరసానికి గురికాకుండా ఉంటాడు.

(٥٣٦) وَعَنْ سَلْمَانَ بْنِ عَامِرٍ الضَّبِّيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا أَفْطَرَ أَحَدُكُمْ فَلْيُفْطِرْ عَلَى تَمْرٍ، فَإِنْ لَمْ يَجِدْ فَلْيُفْطِرْ عَلَى مَاءٍ، فَإِنَّهُ طَهُورٌ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

536. హజ్రత్ సల్మాన్ బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరయినా ఉపవాసాన్ని విరమించేటప్పుడు ఖర్జూరంతో ఇఫ్తార్ చేయాలి. ఖర్జూరం గనక లభ్యం కాక పోతే మంచి నీరుతో ఇఫ్తార్ చేయండి. ఎందుకంటే అది పరిశుద్ధమైనది." (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

వీలయినంతవరకు ఖర్జూర పండ్లతో ఇఫ్తార్ చేసేందుకు ప్రయత్నించాలి. ఎందుకంటే ఖర్జూరం జీర్ణకోశానికి శక్తినీ, పుష్టినీ సమకూరుస్తుంది. పగలల్లా ఉపవాసం ఉండటం వలన కలిగిన బలహీనతను అది చాలా వరకు దూరం చేస్తుంది. ఒకవేళ ఖర్జూరం గనక దొరక్కపోతే మంచినీళ్ళతోనే ఉపవాసాన్ని విరమించాలి. పండ్లు దొరక్కపోతే ఎండు ఖర్జూరంతోనే ఇఫ్తార్ చేయాలి. అదీ లభ్యం కాని పరిస్థితిలో మంచినీరు త్రాగాలి.

## హదీసు ఉల్లేఖకులు

సల్మాన్ బిన్ ఆమిర్ (రజి). పూర్తి వంశపరంపర ఇలా ఉంది: సల్మాన్ బిన్ ఆమిర్ బిన్ ఔస్ బిన్ హుజ్ర్ బిన్ అమ్ర్ బిన్ హారిస్ జబ్బి. ప్రఖ్యాత సహచరులు. బస్రాలో స్థిరపడ్డారు. దైవప్రవక్త(స) కాలంలోనే వృద్ధ సహాబీలలో ఒకరుగా పేరుపడ్డారు. ముఆవియ పరిపాలనా కాలం వరకూ బ్రతికి ఉన్నారని ప్రతీతి. మరో కథనం ప్రకారం జమల్ యుద్ధంలో అమరగతి నొందారు. అప్పటికి ఆయనకు నూరేళ్ళు నిండాయి.

(٥٣٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الوِصَالِ، فَقَالَ رَجُلٌ مِّنَ الْمُسْلِمِيْنَ: فَإِنَّكَ تُوَاصِلُ يَا رَسُولَ اللهِ؟ قَالَ: «**وَأَيُّكُمْ مِّثْلِيْ؟ إِنِّي أَبِيْتُ يُطْعِمُنِيْ رَبِّيْ وَيَسْقِيْنِيْ**»، فَلَمَّا أَبَوْا أَنْ يَنْتَهُوا عَنِ الْوِصَالِ وَاصَلَ بِهِمْ يَوْماً، ثُمَّ يَوْماً، ثُمَّ رَأَوُا الْهِلاَلَ، فَقَالَ: «**لَوْ تَأَخَّرَ الْهِلاَلُ لَزِدْتُكُمْ**»، كَالْمُنَكِّلِ لَهُمْ حِيْنَ أَبَوا أَن يَنْتَهُوا. مُتَّفَقٌ عَلَيْهِ.

537. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'విసాల్'ను (నిరంతరం - ఎడతెగకుండా - ఉపవాసముండటాన్ని) వారించారు. 'దైవప్రవక్తా! మరి తమరు ఎడతెగకుండా ఉపవాసాలుంటున్నారు కదా!' అని ముస్లింలలోని ఒక వ్యక్తి ప్రశ్నించగా; "మీలో నా లాంటి వారెవరున్నారు? నేను రాత్రి నా ప్రభువు సమక్షంలో గడుపుతాను. ఆయన నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు" అని ఆయన (స) సెలవిచ్చారు. ఎంతకీ ప్రజలు వినకపోవటంతో ఆయన (సఅసం) వారితో కలసి ఒక రోజు, రెండవ రోజు కూడా ఎడతెగని ఉపవాసం (విసాల్) మొదలెట్టారు. ఆనాడు నెలవంక కనిపించటంతో ఆయన (స) తన సహచరుల నుద్దేశ్యించి, "ఈ రోజు నెలవంక దర్శనమివ్వబట్టి సరిపోయింది. లేకుంటే మీ కోసం మరిన్ని రోజులు 'విసాల్' చేసేవాణ్ణి" అని అన్నారు. అంటే ఆయన (స) తన ప్రియసహచరులు తన మాటను లెక్క చేయనందుకు వారిని శిక్షించదలిచారన్న మాట! (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

'విసాల్' అవాంఛనీయం అని హదీసులో చెప్పబడింది. విసాల్ అంటే ఏమీ తినకుండా, త్రాగకుండా నిరంతరం ఉపవాసాలుండటం అని అర్థం. ఇలాంటి అతివాదాన్ని ఇస్లాం ఇష్టపడదు. దేవుడు తన దాసులను కష్టాల్లో పడవేయదలచుకోడు. అయితే దైవప్రవక్త (సఅసం) వ్యవహారం ప్రత్యేకమైనది. దైవసన్నిధిలో ఆయన (స) చేసే ధ్యానం వల్ల ఇతోధిక శక్తి ఆయనకు లభించేది. ప్రవక్త (స) వారి ఉపవాసాలను గమనించిన సహచరులు, తాము కూడా ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానానికి చేరుకోవాలన్న తపనతో నిరంతర ఉపవాసాలు ఆరంభించారు. కాని దైవప్రవక్త (స) తన సహచరులను గట్టిగా వారించారు. అప్పటికీ వారు వెనుకాడకపోవటంతో, వారిని దండించే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (స) కూడా వారితో పాటే ఉపవాస దీక్ష మొదలెట్టారు. అంతలోనే నెలవంక దర్శనమిచ్చింది. "చంద్రుడు కనిపించకుండా ఉంటే ఈ దీక్షను మరింత సుదీర్ఘం చేసి ఉండేవాడిని. అప్పటికిగాని మీకు బోధపడేది కాదు" అని చురక అంటించారు.

(٥٣٨) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ لَمْ يَدَعْ قَوْلَ الزُّورِ، وَالْعَمَلَ بِهِ، والْجَهْلَ، فَلَيْسَ لِلَّهِ حَاجَةٌ فِي أَنْ يَدَعَ طَعَامَهُ وَشَرَابَهُ». رَوَاهُ البخاريُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ.

538. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: "ఎవరయితే అబద్ధం చెప్పటం, అబద్ధంపై ఆచరించటం విడనాడలేదో, మూర్ఖత్వపు ధోరణిని వదలలేదో అతడు అన్నపానీయాలను పరిత్యజించటంపట్ల అల్లాహ్‌కు ఏ మాత్రం ఆసక్తి లేదు." (బుఖారీ, అబూదావూద్ - హదీసు వాక్యాలు మాత్రం అబూదావూద్‌లోనివి)

## సారాంశం

ఉపవాసి అనేవాడు అబద్ధాన్ని, బూటకపు ప్రేలాపనలను, మూర్ఖత్వపు చేష్టలను పూర్తిగా విడనాడాలని ఈ హదీసు చెబుతోంది. అసత్య ప్రకటనలవల్ల, వ్యర్థ ప్రేలాపనలవల్ల ఉపవాసంలోని ఆధ్యాత్మికత హరించుకుపోతుంది. అందుకే ఉపవాస దీక్షకు పూనుకున్న వ్యక్తి నీతిబాహ్యమైన విధానాలకు, అనర్థదాయకమైన పోకడలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఉపవాసం ద్వారా దేవుడు తన దాసులలో దైవభీతిని, సాత్వికతను, ఆత్మ నిగ్రహాన్ని పెంపొందించగోర్తున్నాడు. అబద్ధం, దగా, మోసం, అవినీతి, అరాచకం వంటి చెడుల నుంచి కాపాడదలుస్తున్నాడు. ఈ లక్ష్యాలే గనక ఉపవాస వ్రతం ద్వారా అతనికి ప్రాప్తించకపోతే పొద్దస్తమానం అతడు ఆకలి దప్పులతో బాధపడి ప్రయోజనం ఏమీలేదు.

(٥٣٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُقَبِّلُ وَهُوَ

539. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాస స్థితిలో తన భార్యను

صَائِمٌ، وَيُبَاشِرُ وَهُوَ صَائِمٌ، وَلٰكِنَّهُ كَانَ أَمْلَكَكُمْ لِإِرْبِهِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ، وَزَادَ فِيْ رِوَايَةٍ: «فِيْ رَمَضَانَ».

ముద్దుపెట్టుకునేవారు, కౌగిలించుకునే వారు. అయితే ఆయన (స)కు మీకన్నా అధికంగా తనపై పూర్తి అదుపు, నిగ్రహం ఉండేవి. (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం ముస్లింలోనివి) 'ఆయన (స) ఈ రెండు పనులనూ రమ జాన్ నెలలో చేసేవార'ని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

(٥٤٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ اِحْتَجَمَ وَهُوَ مُحْرِمٌ، وَاحْتَجَمَ وَهُوَ صَائِمٌ. رَوَاهُ الْبُخَارِيُّ.

540. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఇహ్రామ్' కట్టుకుని ఉన్నప్పుడు, ఉపవాసస్థితిలో ఉన్నప్పుడు (కూడా) శరీరానికి సూది గుచ్చుకున్నారు (అంటే చెడు రక్తాన్ని తీశారు). (బుఖారీ)

**సారాంశం**

సూది గుచ్చటంవల్ల (శస్త్ర చికిత్స వల్ల, శరీరంలో ఎక్కడైనా పేరుకుని ఉన్న చెడు రక్తాన్ని, చీము నెత్తురును తొలగించటం వల్ల) ఉపవాసానికిగానీ, ఇహ్రామ్ దీక్షకు గానీ ఎలాంటి నష్టం వాటిల్లదని ఈ హదీసు వల్ల స్పష్టమవుతున్నది. అయితే ఈ సాహసానికి పూనుకునే ముందు ఉపవాసులు తమలో గల శక్తినీ, ఓపికను సరిగ్గా బేరీజు వేసుకోవాలి. నీరసంవల్ల ఉపవాసం భంగమయ్యే ప్రమాదముంటే దాని జోలికి పోకూడదు.

(٥٤١) وَعَنْ شَدَّادِ بْنِ أَوْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَتَى عَلَى رَجُلٍ بِالْبَقِيْعِ، وَهُوَ يَحْتَجِمُ فِيْ رَمَضَانَ، فَقَالَ: «أَفْطَرَ الْحَاجِمُ وَالْمَحْجُومُ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ أَحْمَدُ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

541. హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'బఖీ'లో ఒక వ్యక్తిని సమీపించారు. అతడు రమజాన్ (నెల)లో శరీరం నుంచి రక్తం తీస్తున్నాడు. ఆయన (స) అతణ్ణి చూచి, 'శరీరానికి సూదులు పొడిచే, పొడిపించుకునే వారిద్దరి ఉపవాసం భంగమైనట్లే' అని అన్నారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు. అహ్మద్, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసు రద్దయిపోయిందని ఒక ఉల్లేఖనం ఆధారంగా తెలుస్తోంది. రాబోయే హదీసులలో ఏమనబడిందో గమనించండి.

### హదీసు ఉల్లేఖకులు

అసలు పేరు షద్దాద్ బిన్ ఔస్ (రజి). మారు పేరు అబూ యాల. అన్సార్ వర్గానికి చెందిన వారు. మదీనా వాస్తవ్యులు. హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (రజి)కు భ్రాతృజులు. జ్ఞాన సంపన్నులు. మృదు స్వభావులు. హిజ్రీ 58లో సిరియాలో మరణించారు. అప్పటికి ఆయనకు 75 ఏండ్లు.

(٥٤٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَوَّلُ مَا كُرِهَتِ الْحِجَامَةُ لِلصَّائِمِ، أَنَّ جَعْفَرَ بْنَ أَبِي طَالِبٍ احْتَجَمَ وَهُوَ صَائِمٌ، فَمَرَّ بِهِ النَّبِيُّ ﷺ فَقَالَ: أَفْطَرَ هَذَانِ. ثُمَّ رَخَّصَ النَّبِيُّ ﷺ بَعْدُ فِي الْحِجَامَةِ لِلصَّائِمِ، وَكَانَ أَنَسٌ يَحْتَجِمُ وَهُوَ صَائِمٌ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَقَوَّاهُ.

542. హజ్రత్ అనస్ (రజి) కథనం : అన్నిటికన్నా ముందు ఉపవాసికి - శరీరానికి సూది పొడుచుకోవటం ఎందుకు అయిష్టకరంగా భావించబడిందంటే జాఫర్ బిన్ అబూ తాలిబ్ (రజి) ఉపవాసస్థితిలో సూది పొడిపించుకున్నారు. దైవప్రవక్త (సఅసం) ఆయన వైపునుంచి వెళుతూ, "వీరిరువురి ఉపవాసం భంగమైపోయింది" అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సఅసం), ఉపవాసి సూది పొడిపించుకునేందుకు అనుమతినిచ్చారు. ఉపవాస స్థితిలో అనస్(రజి) కూడా సూది పొడిపించుకునే వారు. (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించడంతోపాటు దృఢమైన హదీసుగా నిర్ధారించారు)

### సారాంశం

సూది గుచ్చటంవల్ల ఉపవాసం భంగమైపోతుందన్న హదీసు రద్దయిపోయిందనటానికి ఈ హదీసు ప్రబలనిదర్శనం.

(٥٤٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ اكْتَحَلَ فِي رَمَضَانَ وَهُوَ

543. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ నెలలో - ఉపవాస స్థితిలో-'సుర్మా' పెట్టుకున్నారు. (దీనిని ఇబ్నెమాజ వివరించారు. ఈ విషయం

లో ఏ ఒక్క హదీసు కూడా ప్రామాణిక మైనది లేదని ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) అన్నారు)

صَائِمٌ. رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ ضَعِيْفٍ، وَقَالَ التِّرْمِذِيُّ: لاَ يَصِحُّ فِيْهِ شَيْءٌ.

**సారాంశం**

కళ్లకు సుర్మా పెట్టుకునే విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఇమామ్ అహ్మద్, ఇస్‌హాఖ్, ఇబ్నె ముబారక్, సుఫియాన్ సౌరీ ప్రభృతులు ఉపవాస స్థితిలో సుర్మా పెట్టుకోవటాన్ని అయిష్ట కరం (మక్రూహ్)గా భావించారని ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ప్రస్తావించారు. అయితే ఇమామ్ షాఫయి ఇందుకు అనుమతించారు. అత్యధికమంది ధర్మవేత్తలు కూడా దీన్ని సమర్థించారు.

544. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - "ఏ ఉపవాసి అయినా మరచిపోయి ఏదన్నా తిన్నా, త్రాగినా (ఫరవాలేదు) - అతడు తన ఉపవాసాన్ని కొనసాగించాలి. ఎందు కంటే అతనికి అల్లాహ్ తినిపించాడు, త్రాపాడు." (బుఖారీ, ముస్లిం)

(٥٤٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ نَسِيَ وَهُوَ صَائِمٌ، فَأَكَلَ أَوْ شَرِبَ، فَلْيُتِمَّ صَوْمَهُ، فَإِنَّمَا أَطْعَمَهُ اللَّهُ، وَسَقَاهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

"ఒకవేళ ఎవరయినా మరచిపోయి రమజాన్‌లో ఉపవాసాన్ని విరమిస్తే అతనిపై 'ఖజా'గానీ, కఫ్ఫారా (పరిహారం) గానీ లేదు" అని ఇమామ్ హాకిమ్ ద్వారా ఉల్లేఖించబడింది. (ఈ హదీసు ప్రామాణికమైనది)

وَلِلْحَاكِمِ: مَنْ أَفْطَرَ فِيْ رَمَضَانَ نَاسِياً فَلاَ قَضَاءَ عَلَيْهِ وَلاَ كَفَّارَةَ. وَهُوَ صَحِيْحٌ.

545. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు - "అప్రయత్నంగా వాంతి అయిన వ్యక్తి ఉపవాసాన్ని తిరిగి పాటించనవసరం లేదు. అయితే ఉద్దేశ్య పూర్వకంగా వాంతి చేసినవాడు ఉప వాసాన్ని 'ఖజా' చేయాలి (అంటే తిరిగి ఉపవాసం పాటించాలి)." (దీనిని

(٥٤٥) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ ذَرَعَهُ الْقَيْءُ فَلاَ قَضَاءَ عَلَيْهِ، وَمَنِ اسْتَقَاءَ

فَعَلَيْهِ الْقَضَاءُ». رَوَاهُ الْخَمْسَةُ، وَأَعَلَّهُ أَحْمَدُ، وَقَوَّاهُ الدَّارَقُطْنِيُّ.

ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ అహ్మద్ దీనిని 'మాలూల్'గా ఖరారు చేశారు. ఇమామ్ దారె ఖుత్నీ మాత్రం ఈ హదీసును 'దృఢమైనది'గా వ్యాఖ్యానించారు)

**సారాంశం**

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) తదితరులు ఈ హదీసును 'మాలూల్'గా అంటే, లోపభూయిష్టమైనదిగా పేర్కొన్నారు. అయితే ఇమామ్ దారె ఖుత్నీ, ఇమామ్ ఇబ్నె హిబ్బాన్, ఇమామ్ హాకిమ్‌లు దీనిని 'సహీహ్ హదీసు'గా ఖరారు చేశారు. హజ్రత్ అలీ (రజి), ఇబ్నె ఉమర్ (రజి), జైద్ బిన్ అర్ఖమ్ (రజి), మరియు పలువురు ఇస్లామీయ విద్వాంసులు కూడా ఈ ఉల్లేఖనానికి అనుకూలంగా స్పందించారు. అంటే - ఉద్దేశ్యపూర్వకంగా వాంతిచేస్తేనే ఉపవాసం భంగమవుతుందని అభిప్రాయపడ్డారు. పైగా ఈ అంశంపై ధర్మవేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉండేదని ఇమామ్ ఇబ్నె ముంజిర్ దావా చేశారు.

(٥٤٦) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ خَرَجَ عَامَ الْفَتْحِ إِلَى مَكَّةَ، فِيْ رَمَضَانَ، فَصَامَ، حَتَّى بَلَغَ كُرَاعَ الْغَمِيْمِ، فَصَامَ النَّاسُ، ثُمَّ دَعَا بِقَدَحٍ مِّنْ مَّاءٍ فَرَفَعَهُ، حَتَّى نَظَرَ النَّاسُ إِلَيْهِ، ثُمَّ شَرِبَ، فَقِيْلَ لَهُ بَعْدَ ذَلِكَ: إِنَّ بَعْضَ النَّاسِ قَدْ صَامَ، فَقَالَ: «أُولٰئِكَ الْعُصَاةُ، أُولٰئِكَ الْعُصَاةُ».

546. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : మక్కాను జయించిన సంవత్సరం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా వైపునకు రమజాన్ మాసంలో బయలుదేరారు. ఆయన (సఅసం) ఉపవాసం కూడా పాటిస్తున్నారు. కడకు ఆయన 'కురా అల్ - ఘమీమ్' స్థలానికి చేరుకున్నారు. ఆ రోజు సహచరులు కూడా ఉపవాసం ఉన్నారు. ఆయన(స) మంచినీళ్ల చెంబు తెప్పించారు. ఆ చెంబు అందరికీ కనబడేలా పైకి ఎత్తారు. తరువాత ఆయన (స) మంచినీరు త్రాగారు. కొంత మంది ఇప్పటికీ ఉపవాసం ఉన్నారని ఆయన (స)కు తెలియజేయగా; "అవిధేయులు వీరే, అవిధేయులు వీరే" అని ఆయన (సఅసం) అన్నారు.

వేరొక హదీసు ఇలా వుంది : "నిశ్చయంగా జనులను ఉపవాసం బాధపెడు

وَفِي لَفْظٍ: «فَقِيْلَ لَهُ: إِنَّ النَّاسَ قَدْ شَقَّ عَلَيْهِمُ الصِّيَامُ، وَإِنَّمَا يَنْتَظِرُوْنَ فِيْمَا فَعَلْتَ، فَدَعَا بِقَدَحٍ مِّن مَّاءٍ بَعْدَ الْعَصْرِ فَشَرِبَ». رَوَاهُ مُسْلِمٌ.

తోంది. మీరేం చేస్తారోనని ఎదురు చూస్తుండటం తప్ప వాళ్లు చేయగలిగిందేమీ లేదు" అని ఆయన (స)తో విన్నవించుకోగా ఆయన (సఅసం) అస్ర్ (నమాజ్) అనంతరం మంచినీళ్ల చెంబు తెప్పించి త్రాగారు. (ముస్లిమ్)

(٥٤٧) وَعَنْ حَمْزَةَ بْنِ عَمْرٍو الْأَسْلَمِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللّٰهِ! إِنِّي أَجِدُ بِيْ قُوَّةً عَلَى الصِّيَامِ فِي السَّفَرِ، فَهَلْ عَلَيَّ جُنَاحٌ؟ فَقَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**هِيَ رُخْصَةٌ مِّنَ اللّٰهِ، فَمَنْ أَخَذَ بِهَا فَحَسَنٌ، وَمَنْ أَحَبَّ أَنْ يَصُومَ فَلَا جُنَاحَ عَلَيْهِ**». رَوَاهُ مُسْلِمٌ، وَأَصْلُهُ فِي الْمُتَّفَقِ عَلَيْهِ مِنْ حَدِيْثِ عَائِشَةَ، أَنَّ حَمْزَةَ بْنَ عَمْرٍو سَأَلَ.

547. హాజ్రత్ హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి) కథనం : ఆయన దైవప్రవక్త (సఅసం)తో ఇలా అన్నారు - "నాకు ప్రయాణంలో సయితం ఉపవాసం పాటించగల శక్తి ఉంది. (ఒకవేళ నేను 'రోజా' ఉంటే) ఇది అభ్యంతరకరమా?" దానికి దైవప్రవక్త (సఅసం), "ఇది వాస్తవానికి అల్లాహ్ తరఫున ఇవ్వబడిన రాయితీ. ఎవరైనా దాన్ని వినియోగించుకుంటే అది వారికే మేలు. ఒకవేళ ఎవరయినా ఉపవాసమే ఉండదలిస్తే అందులో ఆక్షేపణీయం ఏమీ లేదు." అని అన్నారు. (ముస్లిం - హదీసు మూలం మాత్రం హాజ్రత్ ఆయిషా - ర.అన్హా - గారి ముత్తఫకున్ అలైహ్ హదీసులో ఇలా ఉంది: 'హమ్జా బిన్ అమ్ర్ ప్రశ్నించారు.')

### హదీసు ఉల్లేఖకులు

హమ్జా బిన్ అమ్ర్ అస్లమీ (రజి). హిజాజ్ ప్రాంతానికి చెందిన సహాబీ. మారుపేరు అబూ సాలిహ్ లేక అబూ ముహమ్మద్. ఈయన కుమారుడు మరియు ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా సిద్దీఖా (ర.అన్హా) ఈయన గారినుంచి హదీసులను ఉల్లేఖించేవారు. హిజ్రీ 61లో ఈయన - 80 ఏళ్ల వయస్సులో- కన్ను మూశారు.

(٥٤٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رُخِّصَ لِلشَّيْخِ الْكَبِيْرِ أَنْ

548. హాజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : "వృద్ధాప్యంలో ఉన్న వారికి ఇఫ్తార్ చేసేందుకు అనుమతి ఇవ్వబడింది. (అయితే) వారు ఒక్కో

يُفْطِرَ وَيُطْعِمَ عَنْ كُلِّ يَوْمٍ مِسْكِيْناً، وَلاَ قَضَاءَ عَلَيْهِ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ، وَصَحَّحَاهُ.

ఉపవాసానికి బదులుగా ఒక్కో పేదవానికి అన్నం పెట్టాలి. ఇంకా వారు ఉపవాసాన్ని 'ఖజా' చేయవలసిన అవసరం కూడా లేదు. (దారె ఖుత్నీ, హాకిమ్ ఈ హదీసును ఉల్లేఖించటమేగాక, ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

వార్ధక్యానికి చేరి, శరీరంలోని జవసత్వాలు ఉడిగిపోయినవారు, ఉపవాసం పాటించటంవల్ల కోలుకోలేమన్న భయం ఉంటే వారు ఉపవాసాలు పాటించనవసరం లేదు. అలాగే సుదీర్ఘ వ్యాధికి గురై స్వస్థత చేకూరే ఆశను వదలుకున్నవారు కూడా 'రోజా' పాటించనక్కరలేదు. అయితే ఇలాంటి వారు - తమకు దైవం తరపునుండి లభించిన ఈ మినహాయింపుకు బదులుగా - ఒక పేదవానికి 'ఫిదియా' గా భోజనం చేయించాలి. 30 మంది పేదలకు ఒకేసారి అన్నంపెట్టినా సరిపోతుంది. హజ్రత్ అనస్ (రజి) ముసలివారైపోయినపుడు భోజనం తయారుచేయించి 30 మంది బీదవారికి తినిపించారు. ఒక ఉపవాసానికి బదులుగా కనీసం అర్ధ 'సా' గోధుమలు కూడా ఇవ్వవచ్చని ఒక ఉల్లేఖనం ప్రకారం తెలుస్తున్నది.

గర్భవతి మరియు బాలింత కూడా ఉపవాసం పాటించగలిగే స్థితిలో లేకుంటే ఇలాగే ఫిదియా చెల్లించాలని హజ్రత్ ఇబ్నె అబ్బాస్, ఇబ్నె ఉమర్ పేర్కొన్నారు.

పేదవారికి అన్నంపెట్టే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మెజారిటీ విద్వాంసులు ఇది తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇమామ్ మాలిక్ గారు దీనిని వాంఛనీయంగా ఖరారు చేశారు. అన్నం పెట్టవలసిన అవసరం లేదనీ, దానం చేస్తే సరిపోతుందని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు.

(٥٤٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: هَلَكْتُ يَا رَسُولَ اللهِ! قَالَ: «وَمَا أَهْلَكَكَ»؟ قَالَ: وَقَعْتُ عَلَى امْرَأَتِي فِي رَمَضَانَ، فَقَالَ: «هَلْ تَجِدُ مَا تُعْتِقُ رَقَبَةً»؟ قَالَ: لاَ، قَالَ: «فَهَلْ تَسْتَطِيْعُ أَنْ تَصُومَ

549. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలోకి వచ్చి, 'దైవ ప్రవక్తా (స)! 'నేను నాశనమైపోయాను' అని మొత్తుకున్నాడు. "ఎలా నాశనమయ్యావో చెప్పావు కాదు" అని దైవ ప్రవక్త (సఅసం) అన్నారు. 'ఏం చెప్పమంటారు? నేను రమజాన్‌లో (ఉపవాస స్థితిలో) ఇల్లాలితో సంభోగించాను' అన్నాడు. దానికి ఆయన (సఅసం), "ఒక మెడను (బానిసను) విడిపించే

شَهْرَيْنِ مُتَتَابِعَيْنِ»؟ قَالَ: لاَ، قَالَ: «فَهَلْ تَجِدُ مَا تُطْعِمُ سِتِّينَ مِسْكِينًا»؟ قَالَ: لاَ، ثُمَّ جَلَسَ، فَأُتِيَ النَّبِيُّ ﷺ بِعَرَقٍ فِيهِ تَمْرٌ، فَقَالَ: «تَصَدَّقْ بِهَذَا»، فَقَالَ: أَعَلَى أَفْقَرَ مِنَّا؟ فَمَا بَيْنَ لاَبَتَيْهَا أَهْلُ بَيْتٍ أَحْوَجُ إِلَيْهِ مِنَّا، فَضَحِكَ النَّبِيُّ ﷺ حَتَّى بَدَتْ أَنْيَابُهُ، ثُمَّ قَالَ: «اذْهَبْ فَأَطْعِمْهُ أَهْلَكَ». رَوَاهُ السَّبْعَةُ وَاللَّفْظُ لِمُسْلِمٍ.

తాహతు నీకుందా?" అని అడిగారు. 'లేదు' అన్నాడా వ్యక్తి. "పోనీ నువ్వు రెండు మాసాలు నిరంతరం ఉప వాసాలు పాటించగలవా?" అని అడిగా రాయన (స). 'ఇదీ నావల్ల కాదు' అన్నా డతను. "పోనీ 60 మంది అభాగ్యులకు అన్నంపెట్టే స్థోమత నీకుందా?' అని ప్రశ్నించారాయన (స). 'లేదు' అన్నా డతను. మరి అతను అలాగే కూర్చుని ఉన్నాడు. అంతలో దైవప్రవక్త (సఅసం) వద్దకు ఒక తట్ట తేబడింది. అందులో ఖర్జూర పండ్లు ఉన్నాయి. "సరే. వీటిని దానంగా ఇవ్వు" అని చెప్పారు ఆయన (స). 'ఏమిటి, నాకన్నా అభాగ్యునికి దానం చేయమంటారా? ఈ పురము (మదీనా)లోని రెండు పర్వత లోయల మధ్య నన్ను మించిన దరిద్రుడు ఎవడూ లేడు' అని విన్నవించుకున్నాడా వ్యక్తి. ఇది విని దైవప్రవక్త (సఅసం) పెద్దగా నవ్వేశారు. ఆ సమయంలో ఆయన (స) దంతాలు కూడా కనిపించసాగాయి. తరువాత ఆయన (స) ఇలా అన్నారు : "వెళ్లు, వెళ్లి వీటిని నీ ఇంటివారలకు తినిపించు." (దీనిని ఏడుగురూ ఉల్లేఖిం చారు. హదీసు వాక్యాలు 'ముస్లిం' లోనివి)

**సారాంశం**

లేమికి గురై ఉన్న వ్యక్తి కఫ్ఫారా (పరిహారం) చెల్లించనవసరం లేదని ఇమామ్ బొజాయి, ఇమామ్ అహ్మద్ ఈ హదీసు ఆధారంగా వ్యాఖ్యానించారు. కాని ఇమామ్ మాలిక్, ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ సౌరి, ఇమామ్ అబూ సౌర్ ఈ తర్కంతో ఏకీభవించలేదు. పరిహారం పరిహారమేననీ, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లించాల్సిందేనని వీరు అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త

(స) ఆ వ్యక్తికి, పేదవాడైన కారణంగా ఖర్జూర పండ్లు దానం చేశారేతప్ప పరిహారంగా ఇవ్వలేదని వీరు వ్యాఖ్యానించారు.

అదీగాక, ఈ హదీసులో 'ఖజా రోజా' గురించిన ప్రస్తావన లేదు. ఇతర హదీసులలో ఖజా రోజా గురించి కూడా చెప్పబడింది. దీని ఆధారంగా నలుగురు ఇమాములు మరియు మెజారిటీ పండితులు ఏమంటారంటే; ఇలాంటి స్థితిలో స్త్రీ పురుషులిరువురూ ఖజా రోజా ఉండాలి. ఆ సమయంలో స్త్రీ ఒకవేళ ఉపవాసవ్రతం బూని ఉండకపోతే, ఆమెపై 'ఖజా' బాధ్యత లేదు. ఈ హదీసుపై కొందరు ధర్మవేత్తలు కొనసాగించిన చర్చ రెండు సంపుటాలలో వచ్చిందని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) 'ఫత్‌హుల్ బారీ'లో పేర్కొన్నారు.

(٥٥٠) وَعَنْ عَائِشَةَ وَأُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يُصْبِحُ جُنُباً مِنْ جِمَاعٍ، ثُمَّ يَغْتَسِلُ وَيَصُومُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ فِي حَدِيثِ أُمِّ سَلَمَةَ «وَلاَ يَقْضِي».

550. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా), హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) లిరువురూ ఇలా వివరించారు : "దైవ ప్రవక్త (సఅసం) లైంగిక అశుద్ధతకు లోనై ఉన్నస్థితిలో తెల్లవారిపోతే (సహ్‌రీ వేళ దాటిపోతే) అప్పుడు స్నానం చేసి ఉపవాసాన్ని మాత్రం కొనసాగించేవారు." (బుఖారీ, ముస్లిం) 'ఖజా మాత్రం చేసేవారు కాదు' అని ఉమ్మె సలమా (ర.అన్‌హా) పలికినట్లు 'ముస్లిం'లో ఉంది.

### సారాంశం

'జనాబత్'లో వున్న మనిషికి ఫజ్ర్ సమయానికి ముందే మెలకువ రాకపోతే అతడు తెల్లవారాక కూడా స్నానం చేసి-ఉపవాసాన్ని కొనసాగించవచ్చనీ, ఉపవాసాన్ని కేవలం ఈ కారణంగా విడనాడవలసిన అవసరం లేదనీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. ధర్మవేత్తలలో అధిక సంఖ్యాకులు దీంతో ఏకీభవించారు.

(٥٥١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ مَاتَ وَعَلَيْهِ صِيَامٌ، صَامَ عَنْهُ وَلِيُّهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

551. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఏ వ్యక్తయినా చనిపోతే, అతనిపై ఉపవాసాలు విధిగా పాటించవలసిన (ఖజా చేయవలసిన) బాధ్యత ఉండివుంటే అతని తరపున అతని వారసుడు వాటిని పాటించాలి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'హజ్' మాదిరిగా 'రోజా' విషయంలో కూడా వారసులు మృతుని తరపున వసీయతును నెరవేర్చవచ్చని హదీసువేత్తలు ఈ హదీసు ఆధారంగా అభిప్రాయపడ్డారు. అయితే ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ మాలిక్‌ల ఆలోచనా సరళి తద్భిన్నంగా ఉంది. వారసులు మృతుని తరపున ఉపవాసాన్ని పాటించనక్కర లేదనీ, పేదవానికి అన్నం పెడితే సరిపోతుందని వీరు అన్నారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి)ల తీర్పు కూడా ఇదే. అయితే మృతుని తరపున ఉపవాసం ఉండటం ధర్మసమ్మతం అని హదీసులో స్పష్టంగా ఉంది. కాబట్టి మృతునిపై ఉన్న బాధ్యతను వారసులు నెరవేరిస్తే అందులో ఆక్షేపణీయం ఏమీ లేదు. పైగా ఇదే అభిలషణీయం.

**1వ అధ్యాయం**

## ١ - بَابُ صَوْمِ التَّطَوُّعِ، وَمَا نُهِيَ عَنْ صَوْمِهِ

## నఫిల్ ఉపవాసాలు మరియు నిషిద్ధ ఉపవాసాలు

(٥٥٢) عَنْ أَبِي قَتَادَةَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ سُئِلَ عَنْ صَوْمِ يَوْمِ عَرَفَةَ، قَالَ: «يُكَفِّرُ السَّنَةَ الْمَاضِيَةَ وَالْبَاقِيَةَ»، وَسُئِلَ عَنْ صَوْمِ يَوْمِ عَاشُورَاءَ فَقَالَ: «يُكَفِّرُ السَّنَةَ الْمَاضِيَةَ»، وَسُئِلَ عَنْ صَوْمِ يَوْمِ الْاثْنَيْنِ، فَقَالَ:«ذٰلِكَ يَوْمٌ وُلِدْتُ فِيهِ، وَبُعِثْتُ فِيهِ، وَأُنْزِلَ عَلَيَّ فِيهِ». رَوَاهُ مُسْلِمٌ.

552. హజ్రత్ అబూ ఖతాదా (రజి) అన్సారీ కథనం : అరఫా దినాన (జిల్ హజ్జ్) ఉపవాసం ఉండటం గురించి దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించగా, "ఇది గడచిన సంవత్సరం పాపాలనూ, వచ్చే సంవత్సరపు పాపాలనూ ప్రక్షాళనం చేస్తుంది" అని ఆయన (స) అన్నారు. ఆషూరా దినపు (ముహర్రం) ఉపవాసం గురించి ఆయన్ని (స) అడగ్గా, "ఇది గడచిన సంవత్సరపు పాపాలను దూరం చేసివేస్తుంది" అని సెలవిచ్చారు. సోమవారంనాటి ఉపవాసం గురించి ఆయన్ని ప్రశ్నించగా, "ఆ రోజునే నేను పుట్టాను. ఆ రోజునే నాకు దైవదౌత్యం లభించింది. ఆ రోజునే నాపై ఖుర్ఆన్ అవతరింప జేయబడింది"అని తెలిపారు. (ముస్లిం)

(٥٥٣) وَعَنْ أَبِي أَيُّوبَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ:

553. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) తెలిపారు - "ఎవరయినా రమజాన్ ఉపవాసాలు

«مَنْ صَامَ رَمَضَانَ، ثُمَّ أَتْبَعَهُ سِتًّا مِنْ شَوَّال، كَانَ كَصِيَامِ الدَّهْرِ». رَوَاهُ مُسْلِمٌ.

పాటించి, ఆ తరువాత షవ్వాల్ (నెల)లో కూడా 6 ఉపవాసాలు పాటిస్తే, ఈ ఆచరణ ఒక సంవత్సరకాలం (రోజావ్రతం బూనటం)లాంటిది." (ముస్లిం)

(٥٥٤) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مِنْ عَبْدٍ يَصُومُ يَوْماً فِي سَبِيلِ اللهِ إِلاَّ بَاعَدَ اللَّهُ بِذَلِكَ الْيَوْمِ عَنْ وَجْهِهِ النَّارَ سَبْعِينَ خَرِيفاً». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

554. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) వివరించారు - "ఏ వ్యక్తయినా అల్లాహ్ మార్గంలో ఒక రోజు ఉపవాసం పాటిస్తే, అల్లాహ్ అతని ముఖాన్ని డెబ్భయి సంవత్సరాలపాటు నరకాగ్నికి దూరంగా ఉంచకపోవటం అన్నది అసంభవం." (బుఖారీ, ముస్లిం- ఈ వాక్యాలు ముస్లింలోనివి)

(٥٥٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَصُومُ حَتَّى نَقُولَ لاَ يُفْطِرُ، وَيُفْطِرُ حَتَّى نَقُولَ لاَ يَصُومُ، وَمَا رَأَيْتُ رَسُولَ اللهِ اسْتَكْمَلَ صِيَامَ شَهْرٍ قَطُّ إِلاَّ رَمَضَانَ، وَمَا رَأَيْتُهُ فِي شَهْرٍ أَكْثَرَ مِنْهُ صِيَاماً فِيْ شَعْبَانَ. مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِمُسْلِمٍ.

555. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాసాలు పాటిస్తూనే ఉండేవారు. ఆయన (స) తీరును గమనించి, "ఇక తమరు (స) ఉపవాసాలను బహుశా విరమించరు!" అని మేము అనేవాళ్లం. అలాగే ఆయన (స) ఉపవాసాలను అనేక రోజులపాటు విడనాడేవారు. "బహుశా ఇంక మీరు ఉపవాసాలు ఉండరు" అని మేము అభిప్రాయపడేవారము. ఒక్క రమజాన్ మాసంలో తప్ప మరే మాసంలో కూడా ఆయన (స) పూర్తిగా ఉపవాసాలుండటం నేను చూడలేదు. షాబాన్ నెలకన్నా ఎక్కువగా మరే నెలలో కూడా ఆయన (స) ఉపవాసాలు (నఫిల్ ఉపవాసాలు) ఉండటం కూడా నేను గమనించలేదు." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఇంచుమించు ప్రతి నెలలో నఫిల్ ఉపవాసాలు ఉండేవారని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతుంది. ఒక్కోసారి అనేక ఉపవాసాలు నిరంతరం పాటించారు. ఒక్కోసారి అనివార్య కారణాల దృష్ట్యా అనేక రోజుల పాటు ఉపవాస దీక్షకు పూనుకునేవారు కాదు. ఇక రమజాన్ నెల రమజాన్ నెలే. అందులో ఉపవాసాలను విడనాడే ప్రసక్తే ఉండదు. ఇతర మాసాల విషయానికివస్తే షాబాన్ నెలలో మాత్రం ఆయన చాలా రోజులు ఉపవాసం ఉండేవారు.

(٥٥٦) وَعَنْ أَبِيْ ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنَا رَسُولُ اللهِ ﷺ أَن نَصُومَ مِنَ الشَّهْرِ ثَلاَثَةَ أَيَّامٍ، ثَلاَثَ عَشْرَةَ، وَأَرْبَعَ عَشْرَةَ، وَخَمْسَ عَشْرَةَ. رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

556. హజ్రత్ అబూజర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ప్రతి నెలా మూడు రోజులు - అంటే పదమూడు, పధ్నాలుగు, పది హేనవ తేదీలలో - ఉపవాసాలుండమని ఆదేశించారు." (నసాయి, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని 'సహీహ్'గా ధృవీకరించారు)

(٥٥٧) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ يَحِلُّ لِلْمَرْأَةِ أَنْ تَصُومَ، وَزَوْجُهَا شَاهِدٌ، إِلاَّ بِإِذْنِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ، زَادَ أَبُو دَاوُدَ: «**غَيْرَ رَمَضَانَ**».

557. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) చెప్పారు - "తన భర్త ఇంట్లో ఉండగా అతని అనుమతి లేకుండా ఉపవాస వ్రతం పాటించటం ఏ ఇల్లాలికీ ధర్మసమ్మతం కాదు. ఆ మేరకు భర్త ఆమెకు అనుమతి ఇస్తే ఫరవాలేదు." (బుఖారీ, ముస్లిం- ఈ వాక్యాలు మాత్రం బుఖారీలోనివి). "ఒక్క రమజాన్ తప్ప" అనే వాక్యం అబూదావూద్‌లో అదనంగా ఉంది.

**సారాంశం**

భర్త హక్కులు భార్యపాలిట నఫిల్ ఉపవాసాల కన్నా ముఖ్యమైనవన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. భర్త అనుమతి పొందకుండా భార్య నఫిల్ ఉపవాసాలుండటం హరామ్ (నిషిద్ధం). అయితే ఫర్జ్ రోజాలు దీని పరిధిలోకి రావు. ఫర్జ్ రోజాలు ఎట్టి పరిస్థితిలోనూ పాటించ వలసిందే. వాటికోసం భర్తను అడగవలసిన అవసరం లేదు.

(٥٥٨) وَعَنْ أَبِي سَعِيْدِ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ صِيَامِ يَوْمَيْنِ: يَوْمِ الْفِطْرِ، وَيَوْمِ النَّحْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

558. హజ్రత్ అబూ సయీద్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు ప్రత్యేక దినాలలో ఉపవాసముండటాన్ని నిషేధించారు. ఒకటి: ఈదుల్ ఫిత్ర్, రెండు : ఈదుల్ అజ్హా."
(బుఖారీ, ముస్లిం)

(٥٥٩) وَعَنْ نُبَيْشَةَ الْهُذَلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَيَّامُ التَّشْرِيقِ أَيَّامُ أَكْلٍ وَشُرْبٍ وَذِكْرِ اللهِ عَزَّ وَجَلَّ». رَوَاهُ مُسْلِمٌ.

559. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ నుబైష హుజ్లీ (రజి) తెలిపారు : "తష్రీఖ్ దినాలు తినే, త్రాగే, దైవనామస్మరణ చేసే దినాలు." (ముస్లిం)

**సారాంశం**

'తష్రీఖ్ దినాలు' అంటే బక్రీద్ పండుగ తరువాత నిరంతరం మూడు రోజులు అని భావం. ఈ దినాలలో ఉపవాసం ఉండటం నిషిద్ధం.

**హదీసు ఉల్లేఖకులు**

నుబైష (రజి). ప్రముఖ సహాబీ. ఈయన చేత 11 హదీసులు ఉల్లేఖించబడ్డాయి. బస్రాలో స్థిరపడ్డారు. మనసున్న మనిషిగా పేరు పొందారు.

(٥٦٠) وَعَنْ عَائِشَةَ وَابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمْ قَالاَ: لَمْ يُرَخَّصْ فِي أَيَّامِ التَّشْرِيقِ أَن يُصَمْنَ إِلاَّ لِمَنْ لَمْ يَجِدِ الْهَدْيَ. رَوَاهُ الْبُخَارِيُّ.

560. హజ్రత్ ఆయిషా (ర.అన్హా), హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు : "ఖుర్బానీ పశువు లభించని వ్యక్తికి తప్ప-తష్రీఖ్ దినాలలో ఉపవాసం ఉండే అనుమతి ఇవ్వబడలేదు."
(బుఖారీ)

**సారాంశం**

తష్రీఖ్ దినాలలో ఉపవాసం ఉండరాదని చెప్పే హదీసులు అసంఖ్యాకంగా ఉన్నాయి. దీని గురించి పండితులలో భిన్నాభిప్రాయం వ్యక్తమయింది. కొంతమంది విద్వాంసులు ఈ దినాలలో ఉపవాసం ఉండటాన్ని అవాంఛనీయం(మక్రూహ్)గా ఖరారు చేశారు. ఇమామ్ షాఫయి, ఇమామ్ అబూ హనీఫాల దృక్పథం కూడా ఇదే.

(٥٦١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لاَ تَخُصُّوا

561. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "కేవలం శుక్ర వారం రాత్రిని జాగారం కొరకు ప్రత్యేకిం

لَيْلَةَ الْجُمُعَةِ بِقِيَامٍ، مِنْ بَيْنِ اللَّيَالِي، وَلاَ تَخُصُّوا يَوْمَ الْجُمُعَةِ بِصِيَامٍ، مِنْ بَيْنِ الأَيَّامِ، إِلاَّ أَنْ يَكُونَ فِي صَوْمٍ يَصُومُهُ أَحَدُكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

చుకోకండి. అలాగే కేవలం శుక్రవారం పగలును ఉపవాసం కోసం ప్రత్యేకించుకోకండి. ఉపవాసం ఉండవలసిన రోజు - కాకతాళీయంగా-శుక్రవారంనాడై ఉంటే అది వేరే విషయం." (ముస్లిం)

(٥٦٢) وَعَنْهُ أَيْضاً قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَصُومَنَّ أَحَدُكُمْ يَوْمَ الْجُمُعَةِ، إِلاَّ أَنْ يَصُومَ يَوْماً قَبْلَهُ، أَوْ يَوْماً بَعْدَهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

562. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరూ శుక్రవారం నాడు ఉపవాసం ఉండకండి - దానికి ఒక రోజు ముందు లేక ఒకరోజు తరువాత ఉపవాస వ్రతానికి పూనుకుంటే తప్ప." (బుఖారీ, ముస్లిం)

(٥٦٣) وَعَنْهُ أَيْضاً أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا انْتَصَفَ شَعْبَانُ فَلاَ تَصُومُوا». رَوَاهُ الْخَمْسَةُ، وَاسْتَنْكَرَهُ أَحْمَدُ.

563. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "సగం షాబాన్ తరువాత ఉపవాసాలుండకండి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) దీనిని 'మున్కర్'గా భావించారు)

## సారాంశం

రమజాన్‌లోని ఉపవాసాలు విధిగా నిర్ణయించబడిన సంగతి అందరికీ విదితమే. రమజాన్ నెలలో పాటించబోయే నిరంతర ఉపవాసాల కోసం మనిషి శారీరకంగా, మానసికంగా సంసిద్ధం కావాలి. దానికోసం శక్తిని కూడగట్టుకోవాలి. షాబాన్ నెలలో ఎక్కువగా నఫిల్ ఉపవాసాలు పాటిస్తే మనిషి బలహీనుడైపోవచ్చు. ఈ బలహీనత రమజాన్ నెలలో పాటించబోయే ఫర్జ్ ఉపవాసాలకు అవరోధంగా పరిణమించవచ్చు. అందుకే దైవప్రవక్త (స) తన సహచరులకు ఈ విధంగా తాకీదు చేశారు. ఇది ఒక తాకీదు మాత్రమే. ఒకవేళ షాబాన్ నెల చివర్లో ఎవరయినా నఫిల్ ఉపవాసం పాటిస్తే అది నిషిద్ధం మాత్రం కాబోదు.

(٥٦٤) وَعَنِ الصَّمَّاءِ بِنْتِ بُسْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ تَصُومُوا يَوْمَ السَّبْتِ إِلاَّ فِيمَا افْتُرِضَ عَلَيْكُمْ، فَإِنْ لَمْ يَجِدْ أَحَدُكُمْ إِلاَّ لِحَاءَ عِنَبٍ، أَوْ عُودَ شَجَرَةٍ، فَلْيَمْضُغْهَا**». رَوَاهُ الْخَمْسَةُ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ مُضْطَرِبٌ، وَقَدْ أَنْكَرَهُ مَالِكٌ، وَقَالَ أَبُو دَاوُدَ: هُوَ مَنْسُوخٌ.

564. హజ్రత్ సమ్మా బిన్తె బుస్ర్ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు- "శనివారంనాడు ఉపవాసం ఉండ కండి- ఆ రోజు ఉపవాసం మీపై విధిగా (ఫర్జ్గా) చేయబడివుంటే తప్ప. కనుక మీలో ఎవరయినాసరే (ఆ రోజు) ద్రాక్ష తొక్క, ఏదైనా వృక్షపు బెరడు దొరికినా దాన్ని తినండి." (దీనిని ఐదుగురు ఉల్లే ఖించారు. హదీసును అందజేసినవారు నమ్మకస్థులే గాని ఇందులో కొంత సందిగ్ధం ఉంది. ఇమామ్ మాలిక్ దీనిని తిరస్కరించారు. ఈ హదీసు రద్దుపరచబడిందని. అబూదావూద్ వ్యాఖ్యానించారు)

### హదీసు ఉల్లేఖకులు

సమ్మా బిన్తె బుస్ర్ (ర.అన్హా). వేరొక ఉల్లేఖనం ప్రకారం ఈమె పేరు బుహైమా బిన్తె బుస్ర్ అని కూడా తెలుస్తోంది. సహాబియాగా పరిగణించబడ్డారు. ఈమె అబ్దుల్లాహ్ బిన్ బుస్ర్‌కు తోబుట్టువు అనీ, అత్తగారనీ భిన్నాభిప్రాయాలున్నాయి.

(٥٦٥) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَكْثَرَ مَا كَانَ يَصُومُ مِنَ الأَيَّامِ، يَوْمُ السَّبْتِ، وَيَوْمُ الأَحَدِ، وَكَانَ يَقُولُ: «**إِنَّهُمَا يَوْمَا عِيدٍ لِلْمُشْرِكِينَ، وَأَنَا أُرِيدُ أَنْ أُخَالِفَهُمْ**». أَخْرَجَهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ، وَهٰذَا لَفْظُهُ.

565. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శనివారం, ఆదివారం చాలా సార్లు ఉపవాసం పాటించేవారు. "ఈ రెండు రోజులూ ముష్రికుల పండుగ రోజులు. నేను వీటిని వ్యతిరేకించదలు స్తున్నాను" అని ఆయన (స) అంటూ ఉండేవారు. (దీనిని ఇమామ్ నసాయి (రహ్మ్‌లై) ఉల్లేఖించారు. ఇమామ్ ఇబ్నె ఖుజైమ (రహ్మ్‌లై) ఈ హదీసును ప్రామాణికంగా నిర్ధారించారు. హదీసు వాక్యాలు మాత్రం ఇబ్నె ఖుజైమావి)

**సారాంశం**

ఇంతకు ముందు వచ్చిన హదీసులో దైవప్రవక్త (స) శనివారం నాడు ఉపవాసం పాటించ డాన్ని వారించినట్టుంది. కాని ఆ ఉల్లేఖనం రద్దుపరచబడింది. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) గారి పై హదీసు ప్రకారం ఈ హదీసు రద్దయిపోయింది. యూదులు శనివారాన్ని, క్రైస్తవులు ఆదివారాన్ని పర్వదినంగా భావించేవారు. అందుచేత ఆయన ఈ రెండు దినాలలో ఉపవాసాలు పాటించి అవి పండుగ రోజులుగానీ, పవిత్ర రోజులుగానీ కావని స్పష్టం చేశారు.

(٥٦٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ صَوْمِ يَوْمِ عَرَفَةَ بِعَرَفَةَ. رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ التِّرْمِذِيِّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَالْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ الْعُقَيْلِيُّ.

566. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరఫాత్ మైదానంలో, అరఫా దినాన ఉపవాసం ఉండటాన్ని వారించారు. ('ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు - ఇమామ్ ఇబ్నె ఖుజైమ, ఇమామ్ హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు. ఇమామ్ ఉఖైలీ దీనిని ఆమోదించలేదు)

**సారాంశం**

అరఫాత్ మైదానంలో హజ్ యాత్రీకులు అరఫా ఉపవాసం పాటించటం నిషిద్ధం (హరామ్) అన్నదానికి ఈ హదీసు ప్రబల నిదర్శనం. ఇమామ్ యహ్యా బిన్ సయీద్ అన్సారీ కూడా దీన్ని సమర్థించారు. సునన్ నసాయి, తిర్మిజీలలో "అరఫా దినం మా పండుగ దినం" అన్న హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) హదీసు కూడా దీన్ని సమర్థిస్తోంది. అంటే అరఫాత్‌లో ఉండేవారి కొరకు ఆ రోజు పండుగ రోజు. అందువల్ల వారు ఆ రోజున ఉపవాసం పాటించటం సమ్మతం కాదు. అయితే అధిక సంఖ్యాక పండితులు ఆ రోజు ఉపవాసం ఉండకపోవటం 'ముస్తహబ్' (అభిలషణీయం) అని మాత్రం అభిప్రాయపడ్డారు. దైవప్రవక్త (సఅసం) సయితం అంతిమ హజ్ యాత్ర సందర్భంగా అరఫా దినాన ఉపవాసం ఉండలేదు.

(٥٦٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لاَ صَامَ مَنْ صَامَ الأَبَدَ»**. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ عَنْ أَبِي قَتَادَةَ بِلَفْظِ: **«لاَ صَامَ وَلاَ أَفْطَرَ»**.

567. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎల్లప్పుడూ ఉపవాసం ఉండేవాడు (అసలు) ఉపవాసమే ఉండలేదు." (బుఖారీ, ముస్లిం) ముస్లింలో అబూ ఖతాద (రజి) ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఉపవాసమూ ఉండలేదు, ఇఫ్తార్ కూడా చేయలేదు."

## 2వ అధ్యాయం

## ఏతెకాఫ్ - ఖియామె రమజాన్

## ٢ - بَابُ ٱلاعْتِكَافِ وَقِيَامِ رَمَضَانَ

568. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ మాసంలో ఖియామ్ చేస్తాడో (రాత్రిళ్లు దైవారాధనలో గడుపుతాడో) అతని గత పాపాలు మన్నించబడతాయి." (బుఖారీ, ముస్లిం)

(٥٦٨) عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**مَنْ قَامَ رَمَضَانَ إِيمَاناً وَاحْتِسَاباً غُفِرَ لَهُ مَا تَقَدَّمَ مِنْ ذَنْبِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

### సారాంశం

రమజాన్ మాసంలో - రాత్రిపూట మేల్కొని దైవారాధనలో గడపటం ఎంత పుణ్యప్రదమైన విషయమో ఈ హదీసు చెబుతోంది. హదీసులో 'ఖియామ్' అనే పదం వచ్చింది. ఖియామ్‌లో నఫిల్ నమాజ్‌తోపాటు, దైవగ్రంథ పారాయణం, దైవనామస్మరణ, అపరాధాల మన్నింపుకై దైవాన్ని వేడుకోవటం మొదలగువన్నీ చేరి ఉన్నాయి. ఈ ఖియామ్ నెరవేర్పుకు అత్యుత్తమ సాధనం తరావీహ్ నమాజ్.

569. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "(రమజాన్ నెల) చివరి దశకం మొదలైందంటే చాలు, దైవప్రవక్త (సఅసం) రాత్రి జాగారం కోసం ఉపక్రమించేవారు. తన సతీమణులను కూడా మేల్కొనమనేవారు."

(బుఖారీ, ముస్లిం)

(٥٦٩) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا دَخَلَ الْعَشْرُ، ـ أَيِ الْعَشْرُ الأَخِيرَةُ مِنْ رَمَضَانَ، ـ شَدَّ مِئْزَرَهُ، وَأَحْيَا لَيْلَهُ، وَأَيْقَظَ أَهْلَهُ مُتَّفَقٌ عَلَيْهِ.

570. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఏతెకాఫ్' కొరకు సంకల్పించుకుంటే ఫజ్ర్ నమాజ్ చేయగానే 'ఏతెకాఫ్' స్థానంలోకి వెళ్ళిపోయేవారు."

(బుఖారీ, ముస్లిం)

(٥٧٠) وَعَنْهَا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا أَرَادَ أَنْ يَعْتَكِفَ، صَلَّى الْفَجْرَ ثُمَّ دَخَلَ مُعْتَكَفَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

(٥٧١) وَعَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَعْتَكِفُ الْعَشْرَ الْأَوَاخِرَ مِنْ رَمَضَانَ، حَتَّى تَوَفَّاهُ اللَّهُ عَزَّ وَجَلَّ، ثُمَّ اعْتَكَفَ أَزْوَاجُهُ مِنْ بَعْدِهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

571. ఆమె గారే (హజ్రత్ ఆయిషా - ర.అన్హా) ఉల్లేఖించిన మరో హదీసు : దైవప్రవక్త (సఅసం) - జీవితాంతం - రమజాన్ చివరి దశకంలో ఏతెకాఫ్ (ప్రత్యేక వ్రతం) పూనేవారు. ఆయన (స) మరణించిన తరువాత ఆయన (స) సతీమణులు ఏతెకాఫ్ పాటించసాగారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఏతెకాఫ్ సున్నత్ అన్న దానికి ఈ హదీసు తార్కాణం. దైవప్రవక్త (స) తన జీవితకాలంలో దీనిని ఏటేటా పాటించగా, ఆయన (స) తదనంతరం ఆయన (స) సతీమణులు దీనిని అనుసరించారు.

(٥٧٢) وَعَنْهَا قَالَتْ: إِنْ كَانَ رَسُولُ اللهِ ﷺ لَيُدْخِلُ عَلَيَّ رَأْسَهُ، – وَهُوَ فِي الْمَسْجِدِ، – فَأُرَجِّلُهُ، وَكَانَ لاَ يَدْخُلُ الْبَيْتَ إِلاَّ لِحَاجَةٍ، إِذَا كَانَ مُعْتَكِفاً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

572. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్‌లో (ఏతెకాఫ్ స్థితిలో) నుండగా తన తలను నా వైపునకు జరిపే వారు. నేను ఆయన (స) తల దువ్వే దానిని. ఆయన (స) ఏతెకాఫ్‌లో ఉన్న ప్పుడు - కాలకృత్యాలు తీర్చుకోవటానికి తప్ప - ఇంటికి వచ్చేవారు కాదు. (బుఖారీ, ముస్లిం-ఈ వాక్యాలు బుఖారీ లోనివి)

(٥٧٣) وَعَنْهَا قَالَتِ: السُّنَّةُ عَلَى الْمُعْتَكِفِ أَن لاَّ يَعُودَ مَرِيْضاً، وَلاَ يَشْهَدَ جَنَازَةً، وَلاَ يَمَسَّ امْرَأَةً، وَلاَ يُبَاشِرَهَا، وَلاَ يَخْرُجَ لِحَاجَةٍ إِلاَّ لِمَا لاَ بُدَّ لَهُ مِنْهُ، وَلاَ

573. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా వివరించారు : "ఏతెకాఫ్ వ్రతానికి పూను కున్నవారు వ్యాధిగ్రస్తులను పరామర్శిం చరాదు, అంత్యక్రియల నమాజులో పాల్గొనరాదు, భార్యను ముట్టుకోవటం గానీ, సంభోగించటం గానీ చేయరాదు. కాలకృత్యాలు తీర్చుకోవటానికి తప్ప మస్జిద్ బయటికి వెళ్లరాదు. జామా

اعْتِكَافَ إِلاَّ بِصَوْمٍ. وَلاَ اعْتِكَافَ إِلاَّ فِي مَسْجِدٍ جَامِعٍ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَلاَ بَأْسَ بِرِجَالِهِ، إِلاَّ أَنَّ الرَّاجِحَ وَقْفُ آخِرِهِ.

మస్జిద్‌లో తప్ప ఏతెకాఫ్ పాటించరాదు. ఇది సున్నత్ (ప్రవక్త సంప్రదాయం).'' (అబూ దావూద్, దీని ఉల్లేఖకులలో ఎలాంటి అంతరాయం లేకపోయినప్పటికీ - దీని చివరి వాక్యాలను 'మౌఖూఫ్'గా తలపోయటం జరిగింది)

**సారాంశం**

ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. ఏతెకాఫ్ మొత్తానికి మస్జిద్‌లోనే పాటించాలి. అది ఎలాంటి మస్జిద్ అయి ఉండాలి? జామా మస్జిద్ అంటే ఇక్కడ భావం ఏమిటీ? ఏ మస్జిద్‌లో సామూహిక నమాజ్ జరుగుతుందో ఆ మస్జిద్‌లో నిస్సంకోచంగా 'ఏతెకాఫ్' వ్రతం పాటించ వచ్చునని ఇమామ్ అహ్మద్, ఇమామ్ అబూ హనీఫా అభిప్రాయపడ్డారు.

(٥٧٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لَيْسَ عَلَى الْمُعْتَكِفِ صِيَامٌ، إِلاَّ أَنْ يَجْعَلَهُ عَلَى نَفْسِهِ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ، وَالرَّاجِحُ وَقْفُهُ أَيْضاً.

574. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - ''ఏతెకాఫ్ వ్రతంలో ఉన్న వారికై ఉపవాసం అనివార్యం కాదు. ఒకవేళ వారు దాన్ని తమపై విధించుకుంటే విధించుకోవచ్చు.'' (దీనిని దారెఖుత్నీ, హాకిమ్ ఉల్లేఖించారు - ఈ హదీసు కూడా 'మౌఖూఫ్'గానే భావించబడింది)

**సారాంశం**

''ఏతెకాఫ్' పాటించేవారు ఉపవాసాన్ని విధిగా పాటించాలా? పాటించకపోయినా ఫరవాలేదా? ఈ విషయమై విద్వాంసుల మధ్య భేదాభిప్రాయముంది. ఉపవాసం పాటించాల్సిందేనని అత్యధిక మంది భావించారు. అయితే దీనికి సంబంధించి స్పష్టమయిన మూలాధారం ఏదీ లేదు. దైవప్రవక్త (స) ఉపవాసం పాటించకుండా 'ఏతెకాఫ్'లో కూర్చున్నట్టు కూడా ఎలాంటి ఆధారం లేదు. ఉపవాసం పాటించగలిగిన పక్షంలోనే 'ఏతెకాఫ్'కు పూనుకోవాలన్న నిబంధన కూడా ఏదీ లేదు.

(٥٧٥) وَعَنْ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رِجَالاً مِنْ أَصْحَابِ النَّبِيِّ ﷺ

575. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులలో కొంతమందికి (రమజాన్ నెల) చివరి వారంలో

أُرُوا لَيْلَةَ الْقَدْرِ فِي الْمَنَامِ، فِي السَّبْعِ الْأَوَاخِرِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**أَرَى رُؤْيَاكُمْ قَدْ تَوَاطَأَتْ فِي السَّبْعِ الْأَوَاخِرِ، فَمَنْ كَانَ مُتَحَرِّيَهَا، فَلْيَتَحَرَّهَا فِي السَّبْعِ الْأَوَاخِرِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

షబేఖద్ర్ (ఘన మయిన రాత్రి) ఉన్నట్టు కనబడింది. దీనిపై దైవప్రవక్త (సఅసం), "చివరి వారంలో ఉన్నట్టు మీకు వచ్చిన కలను నేను చూస్తున్నాను. మీలో ఎవరు దాన్ని అన్వేషించగలుగుతారో చివరి వారంలో అన్వేషించండి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

(٥٧٦) وَعَنْ مُعَاوِيَةَ بْنِ أَبِي سُفْيَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ فِي لَيْلَةِ الْقَدْرِ: «**لَيْلَةُ سَبْعٍ وَعِشْرِينَ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَالرَّاجِحُ وَقْفُهُ.

576. హజ్రత్ ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) 'ఘనమయిన రాత్రి' గురించి చెబుతూ, "అది ఇరవై ఏడో రాత్రి ఉంది" అని అన్నారు (అబూ దావూద్). ఈ హదీసు మౌఖూఫ్‌గా పరిగణించబడింది. (హాఫిజ్ ఇబ్నె హజర్- రహ్మ్‌హుల్లై - ఇలా అన్నారు) ఘన మయిన రాత్రి నిర్ధారణలో భేదాభి ప్రాయం ఉంది. దీనికి సంబంధించి నలభై కథనాలు ఉన్నాయి. వాటిని నేను 'ఫత్‌హుల్ బారీ'లో నకలు చేశాను.

وَقَدِ اخْتُلِفَ فِيْ تَعْيِينِهَا عَلَى أَرْبَعِيْنَ قَوْلاً، أَوْرَدْتُها فِي فَتْحِ الْبَارِي.

(٥٧٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! أَرَأَيْتَ إِنْ عَلِمْتُ أَيُّ لَيْلَةٍ لَيْلَةُ الْقَدْرِ، ما أقول فيها؟ قَالَ: «**قُولِي اللَّهُمَّ إِنَّكَ عَفُوٌّ، تُحِبُّ الْعَفْوَ، فَاعْفُ**

577. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం: "దైవప్రవక్తా (సఅసం)! 'లైలతుల్ ఖద్ర్' ను గనక నేను పొందితే అందులో నేనేం చేయాలి?" అని ప్రశ్నించగా, ఆయన (స) ఇలా ఉపదేశించారు - నువ్వీవిధంగా వేడుకో: "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ. (దేవా! నిశ్చయంగా నువ్వు క్షమిం చేవాడవు. క్షమించడాన్ని నీవు ఎంతగానో ఇష్టపడతావు. కనుక నన్ను క్షమించు).

عَنِّي». رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ أَبِي دَاوُدَ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

('ఐదుగురి'లో అబూదావూద్ మినహా మిగిలినవారు దీనిని ఉల్లేఖించారు- తిర్మిజీ, హాకిమ్‌లు దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

(٥٧٨) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَشَدُّوا الرِّحَالَ إِلاَّ إِلَى ثَلاَثَةِ مَسَاجِدَ، الْمَسْجِدِ الْحَرَامِ، وَمَسْجِدِي هَذَا، وَالْمَسْجِدِ الأَقْصَى». مُتَّفَقٌ عَلَيْهِ.

578. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖించారు : "మూడు మస్జిదులు తప్ప మరో చోటకు ప్రయాణాలు చేయకండి. (1) మస్జిదుల్ హరామ్. (2) నా ఈ మస్జిద్ (మస్జిదె నబవీ). (3) మస్జిదె అఖ్సా."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పై హదీసులో పేర్కొనబడిన మూడు మస్జిదులు మినహా మరో చోటికి - పుణ్యక్షేత్రాలుగా భావించి - శుభం కోసం ప్రయాణాలు చేయటం, అక్కడ కొంత కాలం మకాం వేయటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా స్పష్టం అవుతున్నది. అయితే ఇతరత్రా అవసరాల కోసం ప్రయాణాలు చేయటంలో ఎలాంటి దోషం లేదు. పైగా ప్రయాణాలు చేయవలసిన అవసరం ఉంటుంది కూడా. మస్జిదుల్ హరాం (మక్కా), మస్జిదె నబవీ (మదీనా), మస్జిదె అఖ్సా (జెరూసలేం)లలో ఆగటం, అక్కడ దైవారాధన చేయటం, దైవగ్రంథ పారాయణం చేయటం, దైవనామస్మరణ చేయటం ఎంతో పుణ్యప్రదం.

# 6. హజ్జ్ పుస్తకం

# ٦ - كِتَابُ الحَجِّ

## (١) بَابُ فَضْلِهِ وَبَيَانُ مَنْ فُرِضَ عَلَيْهِ

## 1వ అధ్యాయం

## హజ్జ్ మహత్తు

(٥٧٩) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**الْعُمْرَةُ إِلَى الْعُمْرَةِ كَفَّارَةٌ لِمَا بَيْنَهُمَا، وَالْحَجُّ الْمَبْرُورُ لَيْسَ لَهُ جَزَاءٌ إِلاَّ الْجَنَّةُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

579. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "ఒక ఉమ్రాకు-మరో ఉమ్రాకు మధ్య గల వ్యవధి పాప పరిహారంతో కూడుకున్నది. ఒక 'హజ్జె మబ్రూర్' (నిష్కల్మషమయిన సంకల్పంతో చేసిన హజ్, స్వీకృతిపొందిన హజ్) కు ప్రతిఫలం స్వర్గం తప్ప మరేమీ కాదు." (బుఖారీ, ముస్లిం)

(٥٨٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قُلْتُ: يَا رَسولَ اللهِ! عَلَى النِّسَاءِ جِهَادٌ؟ قَالَ: «**نَعَمْ، عَلَيْهِنَّ جِهَادٌ لاَ قِتَالَ فِيهِ؛ الْحَجُّ وَالْعُمْرَةُ**». رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَاللَّفْظُ لَهُ، وَإِسْنَادُهُ صَحِيحٌ، وَأَصْلُهُ فِي الصَّحِيحِ.

580. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : 'దైవప్రవక్తా (సఅసం)! స్త్రీల కొరకు 'జిహాద్' ఉందా?' అని నేను ప్రశ్నించగా, "ఉంది. వారు చేసే 'జిహాద్' లో పోరాటం ఉండదు. అదేమంటే (అది)హజ్ మరియు ఉమ్రా." (అహ్మద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - హదీసు వాక్యాలు మాత్రం ఇబ్నె మాజాలోనివి. దీని ఆధారం ప్రామాణికమైనది. మూలం బుఖారీలో ఉంది).

(٥٨١) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَتَى النَّبِيَّ ﷺ أَعْرَابِيٌّ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَخْبِرْنِي عَنِ الْعُمْرَةِ،

581. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో ఒక పల్లెటూరి వ్యక్తి వచ్చి, 'ఓ దైవప్రవక్తా (స)! నాకు ఉమ్రా గురించి కాస్త వివరిం

أَوَاجِبَةٌ هِيَ؟ فَقَالَ: «لاَ، وَأَنْ تَعْتَمِرَ خَيْرٌ لَكَ». رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَالرَّاجِحُ وَقْفُهُ.

చండి - ఉమ్రా చేయటం తప్పనిసరా?' అని సందేహపడ్డాడు. దానికి ఆయన (స) "తప్పనిసరి మాత్రం కాదు. అయితే నువ్వు ఉమ్రా చేయగలిగితే అది నీకు ఎంతో శ్రేయస్కరం" అని సమాధాన మిచ్చారు. (దీనిని అహ్మద్, తిర్మిజీ ఉల్లేఖించారు - ఇది 'మౌఖూఫ్'గా పరిగణించబడింది) ఇమామ్ ఇబ్నె అదీ వేరొక బలహీన ఆధారంతో హజ్రత్ జాబిర్ (రజి) చే ఉల్లేఖించబడిన హదీసును ఉదాహరించారు: అందులో ఇలా వుంది - "హజ్ మరియు ఉమ్రా రెండూ ఫర్జ్ (విధి)గా నిర్ణయించబడ్డాయి."

وَأَخْرَجَهُ ابْنُ عَدِيٍّ مِنْ وَجْهٍ آخَرَ ضَعِيفٍ وعَنْ جَابِرٍ مَرْفُوعاً: «الْحَجُّ وَالْعُمْرَةُ فَرِيضَتَانِ».

(٥٨٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قِيلَ يَا رَسُولَ اللهِ! مَا السَّبِيْلُ؟ قَالَ: «الزَّادُ وَالرَّاحِلَةُ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَالرَّاجِحُ إِرْسَالُهُ، أَخْرَجَهُ التِّرْمِذِيُّ مِنْ حَدِيْثِ ابْنِ عُمَرَ أَيْضاً، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

582. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్తా! 'సబీల్' అంటే అర్థం ఏమిటీ?" అని ప్రశ్నించబడగా ఆయన (సఅసం) ఇలా సమాధానమిచ్చారు - "దారి ఖర్చు మరియు వాహనం" (దీనిని దారెఖుత్నీ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు. అయితే ఇది 'ముర్సల్'గా చెలామణీ అవుతోంది. తిర్మిజీగారు దీనిని ఇబ్నె ఉమర్ (రజి) హదీసు ఆధారంగా ఉటంకించారు. దీని పరంపర బలహీనంగా ఉంది)

(٥٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ لَقِيَ رَكْباً بِالرَّوْحَاءِ، فَقَالَ: «مَنِ الْقَوْمُ»؟ قَالُوا:

583. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం)కు 'రౌహా' స్థలంలో కొంతమంది యాత్రీకులు తారసపడ్డారు. 'మీరెవరు?' అని ఆయన (సఅసం) అడిగారు. 'మేము ముస్లిం

الْمُسْلِمُونَ، فَقَالُوْا: مَنْ أَنْتَ؟ قَالَ: «رَسُولُ اللهِ»، فَرَفَعَتْ إِلَيْهِ امْرَأَةٌ صَبِيًّا، فَقَالَتْ: أَلِهٰذَا حَجٌّ؟ قَالَ: «نَعَمْ، وَلَكِ أَجْرٌ». رَوَاهُ مُسْلِمٌ.

లము' అని వారు బదులిచ్చారు. 'మీరెవరు?' అని వాళ్లు అడగ్గా, 'నేను దైవప్రవక్తను' అని ఆయన (స) సమాధానమిచ్చారు. తరువాత ఒక స్త్రీ ఆయన (స) సమక్షంలో ఒక శిశువును తెచ్చి 'ఈ పసికందు హజ్జ్ కూడా నెరవేరుతుందా?' అని ప్రశ్నించింది. 'అవును. ఈ పుణ్యం నీకు దక్కుతుంది' అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (ముస్లిం)

(٥٨٤) وَعَنْهُ قَالَ: كَانَ الْفَضْلُ بْنُ عَبَّاسٍ رَدِيْفَ رَسُولِ اللهِ ﷺ، فَجَاءَتِ امْرَأَةٌ مِنْ خَثْعَمَ، فَجَعَلَ الْفَضْلُ يَنْظُرُ إِلَيْهَا، وَتَنْظُرُ إِلَيْهِ، وَجَعَلَ النَّبِيُّ ﷺ يَصْرِفُ وَجْهَ الْفَضْلِ إِلَى الشِّقِّ الآخَرِ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ فَرِيْضَةَ اللهِ عَلَى عِبَادِهِ فِي الْحَجِّ أَدْرَكَتْ أَبِيْ شَيْخاً كَبِيْراً، لاَ يَثْبُتُ عَلَى الرَّاحِلَةِ، أَفَأَحُجُّ عَنْهُ؟ قَالَ: «نَعَمْ»، وَذَلِكَ فِي حَجَّةِ الْوَدَاعِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

584. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఫజ్ల్ బిన్ అబ్బాస్ (రజి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక వాహనంపై కూర్చుని ఉన్నారు. అంతలో ఖస్అమ్ తెగకు చెందిన ఒక స్త్రీ అక్కడికి రాగా ఫజ్ల్ (రజి) ఆమె వైపు చూడసాగారు. ఆమె ఆయన వంక చూడసాగింది. దైవప్రవక్త (స) ఫజ్ల్ ముఖాన్ని మరోవైపునకు త్రిప్పసాగారు. తరువాత ఆ స్త్రీ 'దైవప్రవక్తా! నిశ్చయంగా హజ్ దేవుని తరపున ఆయన దాసులపై విధిగా నిర్ణయించబడింది. అయితే నా తండ్రి ముసలివాడు. ఆయన వాహనంపై కూర్చోలేడు. నేను ఆయన తరపున హజ్ చేయగలనా?' అని ప్రశ్నించింది. "అవును. చేయవచ్చు" అని ఆయన (స) బదులిచ్చారు. ఈ సంఘటన హజ్జతుల్ విదాకు సంబంధించినది. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

తనపై హజ్ ఫర్జ్ గావించబడిన వ్యక్తి (హజ్ చేయగల ఆర్థిక స్థోమత ఉన్న వ్యక్తి) వృద్ధాప్యానికి లేక వ్యాధికి లోనై ఉంటే అతని తరపున వేరొకరు హజ్ చేయటం ధర్మసమ్మతమే. త్వరగా కోలుకునే అవకాశం ఉంటే మాత్రం వేరొకరి ద్వారా హజ్ చేయించకూడదు.

## హదీసు ఉల్లేఖకులు

ఫజ్ల్ బిన్ అబ్బాస్ (రజి). ఈయన దైవప్రవక్త (స)కు బంధువు. పినతండ్రి కుమారుడవుతాడు. ఈయన తల్లిపేరు ఉమ్ముల్ ఫజల్ లుబాబ కుబ్రా బిన్తె హారిస్ హిలాలియ. ఫజ్ల్ చాలా అందంగా ఉండేవారు. హునైన్ యుద్ధంలో దైవప్రవక్త (స) వెంట స్థిరంగా ఉన్నారు - ఆయన (స) కు అంత్యక్రియల స్నానం చేయిస్తున్నప్పుడు కూడా దగ్గరే ఉన్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) కుమారులలో పెద్దవారు. జిహాద్ కొరకు సిరియా వెళ్ళారు. ప్లేగు వ్యాధి వచ్చిన సంవత్సరం (హిజ్రీ 18లో) మరణించారని ప్రతీతి. యర్మూక్ యుద్ధంలో అమరగతి నొందారని మరో కథనం. ఈయన ఒంటిపై దైవప్రవక్త (స) గారి దుప్పటి ఉండేది.

(٥٨٥) وَعَنْهُ أَنَّ امْرَأَةً مِنْ جُهَيْنَةَ جَاءَتْ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَتْ: إِنَّ أُمِّي نَذَرَتْ أَنْ تَحُجَّ، فَلَمْ تَحُجَّ، حَتَّى مَاتَتْ، أَفَأَحُجُّ عَنْهَا؟ قَالَ: «نَعَمْ، حُجِّي عَنْهَا، أَرَأَيْتِ لَوْ كَانَ عَلَى أُمِّكِ دَيْنٌ أَكُنْتِ قَاضِيَتَهُ؟ اقْضُوا اللَّهَ، فَاللَّهُ أَحَقُّ بِالْوَفَاءِ». رَوَاهُ الْبُخَارِيُّ.

585. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: జుహైనా తెగకు చెందిన ఒక స్త్రీ దైవ ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, "నిశ్చయంగా మా అమ్మ హజ్ చేస్తానని మొక్కుకుంది. కాని ఆమె హజ్ చేయకుండానే చనిపోయింది. నేనామె తరపున హజ్ చేయగలనా?" అని విన్నవించుకున్నది. దానికి ఆయన (స) ఇలా బదులిచ్చారు - "అవును. ఆమె తరపున హజ్ చేయి. నీ తల్లిపై రుణభారం ఉంటే నువ్వు దాన్ని తీర్చేదానివి కాదా? అలాగే అల్లాహ్ హక్కును కూడా తీర్చాలి. దాన్ని తీర్చగలందులకు అల్లాహ్ హక్కు దారుడు." (బుఖారీ)

(٥٨٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَيُّمَا صَبِيٍّ حَجَّ، ثُمَّ بَلَغَ الْحِنْثَ، فَعَلَيْهِ أَنْ يَحُجَّ حَجَّةً أُخْرَى، وَأَيُّمَا عَبْدٍ حَجَّ، ثُمَّ أُعْتِقَ فَعَلَيْهِ أَنْ يَحُجَّ حَجَّةً أُخْرَى». رَوَاهُ ابْنُ

586. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "పసితనంలో హజ్ చేసి యుక్త వయస్సుకు చేరిన వ్యక్తి మళ్లీ హజ్ చేయాలి. బానిసత్వంలో హజ్ చేసి తరువాత స్వతంత్రుడైన వ్యక్తి కూడా తిరిగి హజ్ చేయటం అవసరం." (దీనిని ఇబ్నె అబీ షైబ, బైహఖీ ఉల్లేఖించారు-

أَبِي شَيْبَةَ وَالْبَيْهَقِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي رَفْعِهِ، وَالْمَحْفُوظُ أَنَّهُ مَوقُوفٌ.

దీనిని అందజేసిన వారు నమ్మకస్థులే గాని ఇది 'మర్ఫూ' అవటంపై భేదాభిప్రాయముంది. దీనిని 'మౌఖూఫ్'గా భావించటం సమంజసం.

(٥٨٧) وَعَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَخْطُبُ يَقُولُ: «**لاَ يَخْلُوَنَّ رَجُلٌ بِامْرَأَةٍ إِلاَّ وَمَعَهَا ذُو مَحْرَمٍ، وَلاَ تُسَافِرُ الْمَرْأَةُ إِلاَّ مَعَ ذِي مَحْرَمٍ**»، فَقَامَ رَجُلٌ فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّ امْرَأَتِي خَرَجَتْ حَاجَّةً، وَإِنِّي اكْتُتِبْتُ فِي غَزْوَةِ كَذَا وَكَذَا، قَالَ: «**انْطَلِقْ فَحُجَّ مَعَ امْرَأَتِكَ**». مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِمُسْلِمٍ.

587. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సఅసం) ఒక ప్రసంగంలో ఇలా అంటుండగా విన్నాను - "ఏ పురుషుడూ ఒక స్త్రీతో కలసి ఒంటరిగా ఉండరాదు - ఒకవేళ ఆ స్త్రీ తరపున 'మహ్రమ్' వ్యక్తి తోడుంటే ఫరవాలేదు. ఏ స్త్రీ కూడా 'మహ్రమ్' లేకుండా (ఒంటరిగా) ప్రయాణం చేయ కూడదు." అంతలో ఒక వ్యక్తి లేచి నిలబడి, "దైవప్రవక్తా (సఅసం)! నా భార్య హజ్ కొరకు బయలుదేరింది. మరి నా పేరు ఫలానా ఫలానా యుద్ధాలలో పాల్గొనే నిమిత్తం వ్రాసుకోబడింది కదా!" అని సందేహపడ్డాడు. దానికి ఆయన (స), "నువ్వు నీ సతీమణితో హజ్ చేసేందుకు వెళ్ళొచ్చు" అని చెప్పారు. (ముత్తఫఖున్ అలైహ్). ఈ వాక్యాలు 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

పరాయి పురుషుని వెంట ఏకాంతంలో ఉండటం, ఒంటరిగా అతనితో కలసి పయనించటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. వారిరువురూ ఎప్పుడు ఏకాంతంలో వున్నా వారి వెంట మూడో వ్యక్తిగా షైతాన్ ఉంటాడు. కాబట్టి పరాయి స్త్రీతో -ఆమె తరపు 'మహ్రమ్' బంధువు లేకుండా -ప్రయాణం చేయకూడదు. కొంతమంది ధర్మవేత్తలు వృద్ధ మహిళల విషయంలో సడలింపుల వైఖరిని అవలంబించారు. కాని ఇది హదీసుకు విరుద్ధమైన వైఖరి. అలాగే ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే మరో విషయం ఏమిటంటే మహిళలకు నమాజ్

మాదిరిగా హజ్ కూడా విధి (ఫర్జ్)గా చేయబడింది. కాబట్టి వారు మొదటిసారి హజ్ యాత్ర నిమిత్తం తమ భర్తల అనుమతి పొందటం అవశ్యం కాదు. అయితే మలిసారి హజ్ కొరకు మాత్రం భార్య భర్త అనుమతిని తప్పక పొందవలసినదే.

(٥٨٨) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ سَمِعَ رَجُلاً يَقُولُ: لَبَّيْكَ عَنْ شُبْرُمَةَ، قَالَ: «مَنْ شُبْرُمَةُ»؟ قَالَ: أَخٌ لِّي، أَوْ قَرِيْبٌ لِّي، قَالَ: «حَجَجْتَ عَنْ نَّفْسِكَ»؟ قَالَ: لاَ، قَالَ: «حُجَّ عَنْ نَّفْسِكَ، ثُمَّ حُجَّ عَنْ شُبْرُمَةَ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَالرَّاجِحُ عِنْدَ أَحْمَدَ وَقْفُهُ.

588. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "షుబ్రుమా తరపున లబ్బైక్" అని ఒక వ్యక్తి పలుకుతుండగా దైవ ప్రవక్త (సఅసం) విన్నారు. "ఎవరీ షుబ్రుమా?" అని ఆయన (స) అడగ్గా, "ఆయన నా సోదరుడు లేక నా ఆప్తుడు" అని అతను జవాబిచ్చాడు. "నువ్వు నీ తరపున హజ్ చేశావా?" అని ఆయన (సఅసం) అడిగారు. "లేద"న్నాడావ్యక్తి. "ముందు నీ తరపున హజ్ నెరవేర్చు. తరువాత షుబ్రుమా తరపున చేయవచ్చు" అని ఆయన (స) ఉపదేశించారు. (అబూదావూద్, ఇబ్నె మాజా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఇమామ్ అహ్మద్ దృష్టిలో ఇది 'మౌఖూఫ్'గా చెల్లుతున్నది)

**సారాంశం**

ఈ హదీసు ప్రామాణికమైనదా? బలహీనమైనదా? అన్న విషయమై అభిప్రాయభేదముంది. ఇమామ్ అహ్మద్, ఇమామ్ ఇబ్నె ముంజిర్‌లు ఈ హదీసు 'మర్ఫూ' కావటాన్ని అంగీకరించలేదు. ఇమామ్ బైహఖీ, ఇబ్నె హిబ్బాన్ తదితరులు దీనిని 'సహీహ్'గా ఖరారు చేశారు. ఇమామ్ దారె ఖుత్నీ మాత్రం దీనిని 'ముర్సల్'గా భావించారు. మొత్తానికి ఈ హదీసును 'మౌఖూఫ్'గా పరిగణించినప్పటికీ ఈ హదీసు ఒక ప్రబల నిదర్శనమే అవుతుంది. ఎందుకంటే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనాలతో ప్రవక్త సహచరులలో ఎవరూ విభేదించటంగానీ, వ్యతిరేకించటం గానీ చేయలేదు. అందుకే 'హజ్జె బదల్' చేస్తున్నప్పుడు ఈ బాధ్యత తీసుకున్న వ్యక్తి మొదట తన హజ్‌ను చేసి తరువాత హజ్జె బదల్ చేయాలి. 'లేక నా ఆప్తుడు' అనేది ఉల్లేఖకునికి వచ్చిన సందేహమే. ఉల్లేఖకులు హదీసును అందజేయటంలో కించిత్ తడబాటుకు లోనయ్యారు.

(٥٨٩) وَعَنْهُ قَالَ: خَطَبَنَا رَسُولُ اللهِ ﷺ فَقَالَ: «إِنَّ اللَّهَ كَتَبَ عَلَيْكُمُ الْحَجَّ»، فَقَامَ الْأَقْرَعُ بْنُ حَابِسٍ، فَقَالَ: أَفِيْ كُلِّ عَامٍ يَا رَسُولَ اللهِ!؟ قَالَ: «لَوْ قُلْتُهَا لَوَجَبَتْ. الْحَجُّ مَرَّةً، فَمَا زَادَ فَهُوَ تَطَوُّعٌ». رَوَاهُ الْخَمْسَةُ غَيْرَ التِّرْمِذِيِّ، وَأَصْلُهُ فِي مُسْلِمٍ مِنْ حَدِيْثِ أَبِيْ هُرَيْرَةَ.

589. హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి)గారే ఇలా తెలిపారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు : "నిశ్చయంగా అల్లాహ్ మీపై హజ్ను విధి (ఫర్జ్)గా నిర్ణయించాడు." అప్పుడు అఖ్రా బిన్ హాబిస్(రజి) లేచి, 'దైవప్రవక్తా (సఅసం)! ఏటేటా ఇది ఫర్జ్ గావించబడిందా?' అని ప్రశ్నించారు. "ఒకవేళ నేను అవునంటే ఇది (ఏటేటా) ఫర్జ్ అయిపోతుంది. హజ్ ఒకసారి మాత్రమే. అంతకు మించి చేసిన హజ్లు 'నఫిల్'గా పరిగణించబడతాయి" అని ఆయన (సఅసం) వివరించారు. (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - దీని మూలం 'ముస్లిం'లో హాజ్రత్ అబూ హురైర -రజి- ఉల్లేఖనంలో ఉంది)

**సారాంశం**

మనిషి జీవితంలో ఒకసారి హజ్ చేస్తే అతని విధి నెరవేరుతుందన్న దానికి ఈ హదీసు ఒక నిదర్శనం. అంతకుమించి చేసిన హజ్లు అదనపు హజ్లు (నఫిల్ హజ్లు) గా భావించబడతాయి.

దైవప్రవక్త (స)కు తన అనుచర సమాజం సాధకబాధకాలు తెలుసు. ఏటేటా దీనిని వారిపై విధిగా నిర్ణయిస్తే వారెన్నో ఇక్కట్లకు లోనుకావలసివస్తుంది. అందుకే ఒకసారి హజ్ను మాత్రమే 'ఫర్జ్'గా నిర్ణయించారు.

"నేను 'అవును' అని అంటే ఇది ఏటేటా విధి అయిపోతుంది" అని దైవప్రవక్త (స) చెప్పటాన్ని బట్టి, షరీయత్ ఆదేశాలను ప్రవేశపెట్టడంలో దైవప్రవక్త (స) తన ఇచ్ఛప్రకారం వ్యవహరించగలరా? అన్న ఒక సందేహం ఇక్కడ జనించవచ్చు. అత్యధికమంది విద్వాంసులు "లేదు" అనే తలంచారు. ఈ తలంపు సరైనది కూడా. ఎందుకంటే దైవప్రవక్త (స) ఏ ఆజ్ఞను ఇచ్చినా అది దేవుని అభిమతంపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశంపై చర్చను సాగదీస్తే వివరాల్లోకి పోవలసి ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

అఖ్రా బిన్ హాబిస్ (రజి). ఈయన తమీమ్ తెగకు చెందినవారు. మక్కా విజయం తరువాత దైవప్రవక్త (స) సమక్షంలోకి వచ్చిన బనూ తమీమ్ ప్రతినిధి బృందంలో ఈయన సభ్యులు. "ముఅల్లఫతుల్ ఖులూబ్" లో - అంటే హృదయాలను జయించే ఉద్దేశ్యంతో సద్వ్యవహారం చేయబడిన వారిలో - ఒకరుగా పరిగణించబడతారు. ఇస్లాంకు పూర్వం, ఇస్లాం స్వీకారం తరువాత కూడా తన తెగకు సర్దార్‌గా ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈయన మరణించారు.

**2వ అధ్యాయం**

## మీఖాత్

## ٢ - بَابُ الْمَوَاقِيتِ

## (ఇహ్రామ్ పూనవలసిన ప్రదేశాలు)

(٥٩٠) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَدِينَةِ ذَا الْحُلَيْفَةِ، وَلِأَهْلِ الشَّامِ الْجُحْفَةَ، وَلِأَهْلِ نَجْدٍ قَرْنَ الْمَنَازِلِ، وَلِأَهْلِ الْيَمَنِ يَلَمْلَمَ، هُنَّ لَهُنَّ، وَلِمَنْ أَتَى عَلَيْهِنَّ مِنْ غَيْرِهِنَّ، مِمَّنْ أَرَادَ الْحَجَّ وَالْعُمْرَةَ، وَمَنْ كَانَ دُونَ ذٰلِكَ فَمِنْ حَيْثُ أَنْشَأَ، حَتَّى أَهْلُ مَكَّةَ مِنْ مَكَّةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

590. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనావాసుల కోసం 'జుల్ హులైఫా'ను, సిరియావాసుల కోసం 'జుహ్ఫా'ను, నజ్ద్ ప్రాంతం వారి కొరకు 'ఖర్నె మనాజిల్'ను, యమన్‌వారి కొరకు 'యలమ్‌లమ్'ను ఇహ్రామ్ కట్టుకునే సంకల్పం చేసుకునే స్థలాలు (మీఖాత్‌లు)గా నిర్ధారించారు. ఇతర పట్టణాలనుంచి, ఇతర ప్రదేశాలనుంచి హజ్ మరియు ఉమ్రాల కొరకు వచ్చే వారి కొరకు కూడా ఇవి 'మీఖాత్'గా ఉంటాయి. ఇక ఈ (మీఖాత్) పరిధి లోపల ఉండేవారు, తాము బయలు దేరిన చోటునుంచే ఇహ్రామ్ కట్టుకోవాలి. మక్కావాసులు మక్కానుండే ఇహ్రామ్ కట్టుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ప్రపంచం నలుమూలల నుంచి హజ్ మరియు ఉమ్రాల కోసం వచ్చేవారికై కొన్ని స్థలాలు 'మీఖాత్'లుగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆ స్థలాలు చేరుకోకముందే 'ఇహ్రామ్' దీక్షబూనినా తప్పు లేదు గాని ఆ స్థలాలు దాటి లోపల ప్రవేశిస్తే మాత్రం హజ్‌గానీ, ఉమ్రాగానీ నెరవేరదు. ఎందుకంటే హజ్ లేక ఉమ్రాల కొరకు 'ఇహ్రామ్' కట్టుకోవటం అవసరం.

(٥٩١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْعِرَاقِ ذَاتَ عِرْقٍ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَأَصْلُهُ عِنْدَ مُسْلِمٍ مِنْ حَدِيْثِ جَابِرٍ، إِلاَّ أَنَّ رَاوِيَه شَكَّ فِيْ رَفْعِهِ.

591. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇరాక్ వాసుల కోసం 'జాతె ఇర్క్'ను మీఖాత్‌గా నిర్ధారించారు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. దీని మూలం 'ముస్లిం'లో హజ్రత్ జాబిర్ ఉల్లేఖనం ఆధారంగా ఉంది. అయితే దీన్ని అందజేసిన వారు ఇది 'మర్ఫూ' అనే విషయంపై అనుమానాన్ని వ్యక్తం చేశారు)

وَفِيْ صَحِيْحِ الْبُخَارِيِّ: أَنَّ عُمَرَ هُوَ الَّذِيْ وَقَّتَ ذَاتَ عِرْقٍ.

'జాతె ఇర్క్'ను మీఖాత్‌గా నిర్ధారించింది హజ్రత్ ఉమర్ (రజి) అని సహీహ్ బుఖారీలో ఉంది.

وَعِنْدَ أَحْمَدَ وَأَبِيْ دَاوُدَ وَالتِّرْمِذِيِّ عَنْ ابْنِ عَبَّاسٍ، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَشْرِقِ الْعَقِيْقَ.

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలలో పొందుపరచబడిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది - "దైవప్రవక్త (సఅసం) తూర్పు ప్రాంతాల వారికై 'అఖీఖ్'ను మీఖాత్‌గా నిర్ణయించారు."

**సారాంశం**

'వాదియె ఫాతిమా'గా నేడు ప్రసిద్ధిచెందిన 'మర్రుజ్జహ్రాన్' లోయ వాస్తవానికి తాయఫ్ పట్టణానికి ముందు - మక్కాకు తూర్పు - నుంచి మొదలై దక్షిణ జెద్దాకు సమీపంలో అహ్మర్ సముద్రం పశ్చిమం వైపునకు సమాప్తమవుతుంది - ఈ లోయకు రెండు అంచులున్నాయి. దీని దక్షిణ అంచు తాయఫ్ మార్గంలో గల పెద్ద లోయ దగ్గర 'నఖ్లె యమానియా' కన్నా ముందు ఉంది. దీనినే 'ఖర్నె మనాజిల్' అని అంటారు. ఇక రెండవ ఉత్తర అంచు జరీబాకు చేరువలో 'జాతె ఇర్క్' వద్ద ఉంది. ఇరాక్ ప్రజలు, నజ్ద్ ప్రాంతం వారు ఇటువైపునుంచే వెళతారు. ఈ రెండు అంచుల మధ్య చాలా అంతరం ఉంది. అయితే ఈ రెండు స్థలాలనుంచి పవిత్ర మక్కా నగరం సమాన దూరంలో ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హజ్రత్ ఉమర్ (రజి) 'ఇజ్తిహాద్' చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనార్హం. కాబా గృహానికి చేరుకోవటానికి ముందు నిర్ధారిత ఐదు మీఖాత్‌లలో ఏ ఒక్క మీఖాత్ మీదుగా కూడా పోలేని వ్యక్తి - కనీసం ఆ మీఖాత్‌ల నుంచి కాబా గృహం ఎంత దూరం ఉంటుందో లెక్కకట్టి అంతదూరం నుంచే ఇహ్రామ్ కట్టుకోవటం అవసరం. ఈ దూరాన్ని అంచనావేసిన మీదటే హజ్రత్ ఉమర్ (రజి) గారు 'జాతె ఇర్క్'ను ఇరాక్ ప్రజల కోసం 'మీఖాత్'గా నిర్ణయించారు. ధర్మవేత్తలంతా ఈ 'ఇజ్తిహాద్'తో ఏకీభవించారు. కాబా

గృహానికి ఐదువైపులా మీఖాత్‌లుగా నిర్ధారించబడిన ఐదు స్థలాలను కలుపుతూ రేఖ గీస్తే అది పవిత్ర మక్కాను అన్ని వైపులనుంచి దిగ్బంధం చేసిన వలయాకారం ఏర్పడుతుంది. కనుక ప్రపంచం ఏమూల నుంచి వచ్చినా యాత్రీకులు ఈ వలయాకారాన్ని దాటి లోపలకు వెళ్ళవలసిందే. అదీగాక ఈ వలయాకారం సముద్ర స్థలంలో గాకుండా భూభాగంపైననే ఉంది. కాబట్టి ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి తూర్పు దేశాలనుంచి హజ్ లేక ఉమ్రా కొరకు సముద్ర ప్రయాణం చేసి వెళ్ళేవారు జెద్దా వరకూ ఇహ్రామ్ దీక్షబూనవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారు పయనించే ఓడ 'యలమ్‌లమ్' అనే మీఖాత్‌ను ఇంకా సమీపించనే లేదు.

## 3వ అధ్యాయం

## ٣ - بَابُ وُجُوهِ الإِحْرَامِ وَصِفَتُهُ

## ఇహ్రామ్ రకాలు - వాటి గుణాలు

(٥٩٢) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خَرَجْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ عَامَ حَجَّةِ الْوَدَاعِ، فَمِنَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ وعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، وَأَهَلَّ رَسُولُ اللهِ ﷺ بِالْحَجِّ، فَأَمَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ فَحَلَّ عِنْدَ قُدُوْمِهِ، وَأَمَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، أَوْ جَمَعَ بَيْنَ الْحَجِّ وَالْعُمْرَةِ، فَلَمْ يَحِلُّوْا حَتَّى كَانَ يَوْمُ النَّحْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

592. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి హజ్జతుల్ విదా (అంతిమ హజ్‌యాత్ర)కై బయలు దేరాము. మాలో కొంతమంది ఉమ్రా కొరకు 'తల్బియా' చెప్పారు. కొంతమంది హజ్ మరియు ఉమ్రాల కోసం 'తల్బియా' పలికారు. మరికొంతమంది హజ్ కొరకు 'లబ్బైక్' చెప్పారు. దైవప్రవక్త (సఅసం) కేవలం హజ్ కొరకు 'తల్బియా' పలికారు. ఉమ్రా కోసం 'తల్బియా' పలికిన వారు 'ఇహ్రామ్' నిబంధనల నుంచి విముక్తులైపోయారు. హజ్ కోసం లబ్బైక్ నినాదాలు చేసినవారు, హజ్ మరియు ఉమ్రాల కోసం లబ్బైక్ పలికినవారు ఖుర్బానీ దినం వచ్చే వరకూ 'ఇహ్రామ్' కు కట్టుబడే ఉన్నారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హజ్ మూడు రకాలని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది: (1) హజ్జె ఖిరాన్ (2) హజ్జె తమత్తు (3) హజ్జె ఇఫ్రాద్. ఈ మూడింటిలో శ్రేష్ఠమైన హజ్ ఏది? సాధారణంగా హజ్జె ఖిరాన్‌ను హనఫీలు, అహ్లె హదీసువారు శ్రేష్ఠమైన హజ్‌గా భావిస్తారు. ఎందుకంటే పవిత్రుడైన అల్లాహ్

తన ప్రియప్రవక్త (స)కై ఈ హజ్‌నే ఇష్టపడ్డాడు. ఈ హజ్ కాస్త శ్రమతో కూడుకున్నది కూడా అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మతై) 'జాదుల్ మఆద్'లో దీనిపై ఉత్తమమయిన చర్చ జరిపారు. అయితే ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌లు హజ్జె తమత్తును అత్యుత్తమమయిన హజ్‌గా భావిస్తున్నారు. ఈ హజ్ సౌలభ్యంతో కూడుకున్నది. ఒకానొక సందర్భంలో దైవప్రవక్త (స) 'ఈ హజ్‌కై సంకల్పించుకుంటే బావుండేదే'! అని చెప్పారు కూడా. అల్లామా షౌకానీ దృక్పథం కూడా ఇదే. మరికొంతమంది హజ్జె ఇఫ్రాద్‌ను శ్రేష్ఠ మయినదిగా పేర్కొన్నారు. అయితే ప్రబల నిదర్శనాల దృష్ట్యా చూస్తే ఈ మూడింటిలో మొదటిదే అత్యుత్తమ మయినదిగా చెలామణీ అవుతోంది.

## 4వ అధ్యాయం

# ٤ - بَابُ الْإِحْرَامِ وَمَا يَتَعَلَّقُ بِهِ.

# ఇహ్రామ్ తత్సంబంధిత విషయాలు

(٥٩٣) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَا أَهَلَّ رَسُولُ اللهِ ﷺ إِلاَّ مِنْ عِنْدِ الْمَسْجِدِ. مُتَّفَقٌ عَلَيْهِ.

593. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్ సమీపంలో తప్ప 'లబ్బైక్' నినాదం చేయలేదు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఇక్కడ మస్జిద్ అంటే 'జుల్ హులైఫా' స్థానం అని భావం. దైవప్రవక్త (స) 'బైదా' అనే స్థలంలో ఇహ్రామ్ కట్టుకున్నారని కొంతమందికి కలిగిన అపోహను దూరం చేయడానికి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఈ విధంగా అన్నారు. ఆయన (స) మూడుసార్లు 'లబ్బైక్' నినాదం చేసినట్టు హదీసులలో వచ్చింది. ఆయన (స) మస్జిద్‌లో ఉండగానే - రెండు రకతుల నమాజ్ చేసి - లబ్బైక్ పలికారని కొన్ని ఉల్లేఖనాలలో ఉండగా, 'బైదా' శిఖరానికి చేరుకుని అక్కడినుంచి లబ్బైక్ అని ఎలుగెత్తి చాటారని మరికొన్ని ఉల్లేఖనాలలో ఉంది. హదీసులలో పరస్పర వ్యాఘాతం పైకి కనిపిస్తున్నప్పటికీ వాటి మధ్య ఈ విధంగా సమన్వయం చేయబడింది - ఆయన (స) మస్జిద్‌లోనే ఇహ్రామ్ కట్టుకున్నారు. ఆ దృశ్యాన్ని చూచినవారు ఆ స్థితిని మాత్రమే వర్ణించారు. అయితే ఆయన (స) బయటికి వచ్చి ఒంటెపై కూర్చుని బిగ్గరగా లబ్బైక్ నినాదం చేసినపుడు ఆ దృశ్యాన్ని చూచినవారు, దైవప్రవక్త (స) ఇప్పుడే ఇహ్రామ్ దీక్షబూనారని తలపోశారు. ఇక కాస్త ముందుకు వెళ్ళాక - 'బైదా' స్థలంలో ఆయన (స) లబ్బైక్ పలకటం విన్న ప్రజలు, బహుశా దైవప్రవక్త (స) ఇక్కడే ఇహ్రామ్ దీక్షబూని ఉంటారని భావించారు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఈ దృశ్యాన్ని చూచారో వారు ఆ స్థితిని యథాతథంగా చిత్రీకరించారు. అందువల్ల ఈ హదీసులలో వైరుధ్యం కనబడుతోంది.

(٥٩٤) وَعَنْ خَلاَّدِ بْنِ السَّائِبِ، عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ

594. ఖల్లాద్ బిన్ సాయిబ్ తన తండ్రి నుంచి గ్రహించిన హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

قَالَ: «أَتَانِي جَبْرِيلُ، فَأَمَرَنِي أَنْ آمُرَ أَصْحَابِي، أَنْ يَرْفَعُوا أَصْوَاتَهُمْ بِالإِهْلاَلِ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఇలా అన్నారు - "జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా దగ్గరకు వచ్చి 'లబ్బైక్'ను బిగ్గరగా పలకమని మీ సహచరులను ఆదేశించండి' అని నన్ను సూచించారు." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - ఇమామ్ తిర్మిజీ, ఇమామ్ ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు)

### సారాంశం

'లబ్బైక్'ను బిగ్గరగా పలకాలన్న దానికి ఈ హదీసు బహిరంగ నిదర్శనం. దైవప్రవక్త (స) సహచరులు ఎంత బిగ్గరగా ఈ 'తల్బియా' పలికేవారంటే, ఒక్కోసారి వారి గొంతు బొంగురు పోయేది. మెజారిటీ ధర్మవేత్తలు కూడా దీంతో ఏకీభవించారు. అయితే 'తల్బియా' కేవలం మినా మరియు మస్జిదె హరామ్ వద్దనే బిగ్గరగా పలకాలని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అంటారు.

### హదీసు ఉల్లేఖకులు

(1) ఖల్లాద్ : ఖల్లాద్ బిన్ సాయిబ్ అన్సార్ వర్గానికి చెందినవారు. ఖజ్రజ్ తెగతో ఈయనకు సంబంధం ఉంది. ప్రముఖ తాబయి. నమ్మదగ్గ ఉల్లేఖకులు. ఈయన సహాబీ అని తలపోసిన వారు పొరబడ్డారు.

(2) సాయిబ్ (రజి). ఖల్లాద్ తండ్రిగారు. ప్రముఖ సహాబీలలో ఒకరు. మారుపేరు అబూ సలమా. బద్ర్ యుద్ధ మైదానంలో వీరమరణం పొందారు.

(٥٩٥) وَعَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ تَجَرَّدَ لِإِهْلاَلِهِ، وَاغْتَسَلَ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

595. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహ్రామ్ కట్టిన సందర్భంలో బట్టలు విడిచి స్నానం చేశారు. (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు - 'హసన్'గా నిర్ధారించారు)

### సారాంశం

ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసును 'హసన్'గా నిర్ధారించగా ఇమామ్ ఉఖైలీ (రహ్మ.లై) దీనిని 'జయీఫ్'గా ఖరారు చేశారు. అయితే ఈ విషయమై అసంఖ్యాకంగా హదీసులు వచ్చాయి. కనుక ఇహ్రామ్ సందర్భంగా స్నానం చేయటం 'మస్నూన్' అనటంలో సందేహానికి తావులేదు.

(٥٩٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ سُئِلَ مَا يَلْبَسُ الْمُحْرِمُ مِنَ الثِّيَابِ؟ قَالَ: «**لاَ يَلْبَسُ الْقَمِيصَ، وَلاَ الْعَمَائِمَ، وَلاَ السَّرَاوِيلاَتِ، وَلاَ الْبَرَانِسَ، وَلاَ الْخِفَافَ، إِلاَّ أَحَدٌ لاَ يَجِدُ نَعْلَيْنِ فَلْيَلْبَسِ الْخُفَّيْنِ، وَلْيَقْطَعْهُمَا أَسْفَلَ مِنَ الْكَعْبَيْنِ، وَلاَ تَلْبَسُوا شَيْئاً مِنَ الثِّيَابِ مَسَّهُ الزَّعْفَرَانُ، وَلاَ الْوَرْسُ**». مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِمُسْلِمٍ.

596. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "ఇహ్రామ్ కట్టుకునేవారు ఏం ధరించాలి?" అని దైవప్రవక్త (సఅసం) ను ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన (సఅసం) ఇలా వివరించారు: "చొక్కా, తలపాగా, జుబ్బా, పాజమా, టౌజర్, తోలు మేజోళ్లు తొడగరాదు. ఒకవేళ చెప్పులు లేని పక్షంలో మేజోళ్లు ధరించ వచ్చుగాని మోకాళ్ళ క్రిందినుంచీ వాటిని కత్తిరించాలి. కాషాయరంగు బట్టలు గానీ, పసుపు రంగరించిన వస్త్రాలుగానీ ధరించరాదు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

**సారాంశం**

'ఇహ్రామ్' కొరకు చొక్కా, పాజమా, జుబ్బా, టోపీ వంటివి ఉపయోగించరాదనీ, ఎవరి వద్దయినా చెప్పులు లేకపోయినట్లయితే వారు తమ తోలు మేజోళ్లను మోకాళ్ల క్రింది భాగం వరకు కత్తిరించి - పాదం కనిపించేలా - తొడుక్కోవాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ వ్యవహారంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.

(٥٩٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أُطَيِّبُ رَسُولَ اللهِ ﷺ لِإِحْرَامِهِ قَبْلَ أَنْ يُحْرِمَ، وَلِحِلِّهِ قَبْلَ أَن يَطُوفَ بِالْبَيْتِ. مُتَّفَقٌ عَلَيْهِ.

597. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఇహ్రామ్ కట్టక పూర్వం, ఇహ్రామ్ సమయంలో, ఇహ్రామ్ ను విడిచిన సమయంలో సువాసన పూసే దానిని. ఆయన (స) దైవగృహ ప్రదక్షిణ చేయకమునుపు కూడా."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇహ్రామ్ కట్టకపూర్వం సువాసన పూసుకోవటం మంచిది. ఇహ్రామ్ స్థితిలో ఆ సువాసన వస్తూ ఉంటుంది. కాని ఇహ్రామ్ దీక్షబూనిన తరువాత దాన్ని విరమించేవరకూ సుగంధ ద్రవ్యాలను ఉపయోగించకూడదు.

'కాబా గృహ ప్రదక్షిణ చేయకమునుపు' అని హదీసులో వచ్చింది. 'తవాఫె జియారత్' నేపథ్యంలో ఇలా అనబడింది. ఈ తవాఫ్ జిల్‌హజ్ 10వ తేదీన ఖుర్బానీ ఇచ్చి, (హల్ఖ్) క్షవరం చేసుకున్న మీదట చేయబడుతుంది.

(٥٩٨) وَعَنْ عُثْمَانَ بْنِ عَفَّانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «لاَ يَنْكِحُ الْمُحْرِمُ، وَلاَ يُنْكِحُ، وَلاَ يَخْطُبُ». رَوَاهُ مُسْلِمٌ.

598. హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు- "ఇహ్రామ్ స్థితిలో వివాహం చేసుకోరాదు, వివాహం చేయించరాదు, సంబంధం నిశ్చయించరాదు." (ముస్లిం)

**సారాంశం**

అంటే 'ఇహ్రామ్' దీక్షబూనిన తరువాత ఆ స్థితిలో తన నికాహ్ చేసుకోవటంగానీ, ఇంకొకరి నికాహ్ జరిపించటంగానీ, ఎవరికయినా వివాహ సందేశం పంపి పెళ్లి ఖాయం చేసుకోవటంగానీ నిషిద్ధం (హరామ్). దైవప్రవక్త (స) ఇహ్రామ్ స్థితిలో హజ్రత్ మైమూనా (ర.అన్హా)ను నికాహ్ చేసుకున్నారన్న ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ఒక భ్రమ మాత్రమే. హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) 'జాదుల్ మఆద్'లో దీనిపై క్షుణ్ణంగా చర్చించారు.

(٥٩٩) وَعَنْ أَبِي قَتَادَةَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ صَيْدِهِ الْحِمَارَ الْوَحْشِيَّ وَهُوَ غَيْرُ مُحْرِمٍ – قَالَ: فَقَالَ رَسُولُ اللهِ ﷺ لِأَصْحَابِهِ – وَكَانُوا مُحْرِمِينَ –: هَلْ مِنْكُمْ أَحَدٌ أَمَرَهُ، أَوْ أَشَارَ إِلَيْهِ بِشَيْءٍ؟ قَالُوا: لاَ، قَالَ: «فَكُلُوا مَا بَقِيَ مِنْ لَحْمِهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

599. హజ్రత్ అబూ ఖతాదా అన్సారీ (రజి), తానింకా ఇహ్రామ్ దీక్షబూనని సమయంలో అడవి గాడిద (జిబ్రా)ను వేటాడిన వృత్తాంతానికి సంబంధించి ఇలా అన్నారు : దైవప్రవక్త (సఅసం) ఇహ్రామ్ స్థితిలోవున్న తన సహచరుల నుద్దేశ్యించి "మీలో ఎవరయినా ఇతనికి ఈ మేరకు ఆజ్ఞాపించారా? లేక ఇతని వైపునకు ఎవరయినా ఈ మేరకు సంజ్ఞ చేశారా?" అని అడిగారు. 'లేదు' అని వాళ్లంతా సమాధానమిచ్చారు. "అయితే మిగిలివున్న దాని మాంసాన్ని తినండి" అని ఆయన (స) సెలవిచ్చారు.

(బుఖారీ, ముస్లిం)

## పూర్వరంగం

ఈ వృత్తాంతం యొక్క పూర్వరంగం ఇలా వుంది : హజ్రత్ అబూ ఖతాదా (రజి) దైవప్రవక్త (సఅసం)తో కలసి బయలుదేరారు. కాని ఈయన తన కొంతమంది సహచరులతోపాటు వెనుక ఉండిపోయారు. హజ్రత్ అబూ ఖతాద (రజి) అప్పటికింకా ఇహ్రామ్ కట్టుకోలేదు. కాని ఆయన వెంటనున్నవారు మాత్రం ఇహ్రామ్ కట్టుకున్నారు. వాళ్లంతా అడవి గాడిద (జిబ్రా)ను చూచీ చూడనట్లుగా వదిలేశారు. కాని అబూ ఖతాద (రజి) దృష్టి దానిపై పడగానే గుఱ్ఱమెక్కి దాన్ని వెంబడించసాగారు. తనకు తన కర్ర నివ్వమని ఆయన సహచరులను కోరారు. కాని వాళ్లంతా అందుకు నిరాకరించారు. అయినాసరే అబూ ఖతాద (రజి) అడవిగాడిదను వెంబడించి, గాయ పరిచారు. తరువాత దాన్ని జిబహ్ చేసి అబూ ఖతాద (రజి) కొంత మాంసం తిన్నారు. సహచరులు కూడా తిన్నారు. కాని తరువాత వాళ్లంతా సందిగ్ధంలో పడిపోయారు.

దైవప్రవక్త (స) ను సమీపించిన తరువాత జరిగినదంతా చెప్పారు. దాని సమాధానం హదీసు రూపంలో వచ్చింది.

ఇహ్రామ్ కట్టుకోని వ్యక్తి గనక అడవి జంతువును వేటాడితే, ఆ వేటలో ఇహ్రామ్ కట్టుకున్న వ్యక్తులు ఏవిధంగానూ సహకరించకుండా ఉంటే - అట్టి పరిస్థితిలో ఆ మాంసాన్ని వాళ్లంతా తినవచ్చు. అయితే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే హదీసులో ఉన్నాయి.

(٦٠٠) وَعَنِ الصَّعْبِ بْنِ جَثَّامَةَ اللَّيْثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ أَهْدَى لِرَسُولِ اللهِ ﷺ حِمَاراً وَحْشِيًّا، وَهُوَ بِالْأَبْوَاءِ أَوْ بِوَدَّانَ، فَرَدَّهُ عَلَيْهِ، وَقَالَ: «إِنَّا لَمْ نَرُدَّهُ عَلَيْكَ إِلاَّ أَنَّا حُرُمٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

600. హజ్రత్ సాబ్ బిన్ జస్సామ లైసీ (రజ) కథనం ప్రకారం, ఆయన ఒక అడవి గాడిద (జిబ్రా)ను కానుకగా దైవప్రవక్త (సఅసం) వద్దకు పంపించారు. ఆ సమయంలో ఆయన (స) 'అబ్వా' లేక 'వద్దాన్' అనే స్థలంలో వున్నారు. ఆయన (స) దాన్ని తిరిగి పంపిస్తూ, "మేము ఇహ్రామ్ స్థితిలో ఉండటం వల్ల దీన్ని వాపసు చేస్తున్నాము" అని సెల విచ్చారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసు ఇంతకు ముందు వచ్చిన హదీసుకు భిన్నంగా కనిపిస్తుంది. ముహ్రిమ్ కొరకు (ఇహ్రామ్ కట్టుకున్నవారి కొరకు) వేటాడిన జంతుమాంసం నిషిద్ధం. ఆ వేటలో ఇహ్రామ్ కట్టుకున్నవారు పాల్గొన్నా పాల్గొనకపోయినాసరే ఆ మాంసాన్ని వారు తినకూడదు. కాని మొదటి హదీసులో తినవచ్చని ఉంది. ఈ రెండు హదీసులను ఈ విధంగా క్రమబద్ధం చేయవచ్చు -

వేట ఇహ్రామ్ స్థితిలో వున్న వారి కోసమే చేయబడితే అట్టి జంతువుల మాంసం ముమ్మాటికీ నిషిద్ధమే. ముస్నద్ అహ్మద్, ఇబ్నె మాజాలోని ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అబూ ఖతాద (రజి)

దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, 'అయ్యా! మీ కోసమే నేను ఈ జంతువును వేటాడాను' అని అంటారు. కాని ఆయన (సఅసం) ఆ జంతుమాంసాన్ని ముట్టుకోనయినా లేదు.

ఇక తిర్మిజీలోని వేరొక హదీసును గమనించండి - హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం ఆయన (స) ఇలా అన్నారు: "ఇహ్రామ్ స్థితిలో నేలపై చేయబడిన వేట మీ కొరకు ధర్మసమ్మతమే. అయితే మీరు దాన్ని వేటాడటంగానీ, మీ కోసమని ప్రత్యేకంగా వేటాడి ఉండటంగాని జరగరాదు."

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే వేటలో ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ఇహ్రామ్ కట్టుకున్నవారి ప్రమేయం ఉంటే, లేదా వాళ్ల విందుకోసం ఆ జంతువు వేటాడబడి ఉంటే దాని మాంసం తినటం అధర్మం. ఇట్టి పరిస్థితి గనక లేకుంటే 'ముహ్రిమ్' వ్యక్తి వేటాడిన జంతు మాంసాన్ని తినవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

సాబ్ బిన్ జస్సామ (రజి). లైస్ తెగకు చెందినవారు. అందువల్ల లైసీగా పిలువబడ్డారు. 'వద్దాన్' మరియు 'అల్ అబ్వా'లలో ఉండేవారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు. ఖిలాపతె ఉస్మాన్ (రజి) వరకూ జీవించి ఉన్నారని ఇంకొక కథనం ఉంది.

(٦٠١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **خَمْسٌ مِنَ الدَّوَابِّ كُلُّهُنَّ فَوَاسِقُ، يُقْتَلْنَ فِي الْحِلِّ وَالْحَرَمِ: الْعَقْرَبُ، وَالْحِدَأَةُ، وَالْغُرَابُ، وَالْفَأْرَةُ، وَالْكَلْبُ الْعَقُورُ».** مُتَّفَقٌ عَلَيْهِ.

601. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "ఐదు రకాల జంతువులు హానికరమైనవి. వాటిని ఇహ్రామ్ స్థితిలో ఉన్నా లేకున్నా (కన బడిన చోటల్లా) చంపివేయాలి. అవే మంటే: (1) తేలు (2) గ్రద్ద (3) కాకి (4) ఎలుక (5) కరిచే (పిచ్చి) కుక్క.

(బుఖారీ, ముస్లిం)

(٦٠٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ احْتَجَمَ وَهُوَ مُحْرِمٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

602. నిశ్చయంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహ్రామ్ స్థితిలో నుండగా శరీరానికి సూది గ్రుచ్చి రక్తం తీశారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు. (బుఖారీ, ముస్లిం)

(٦٠٣) وَعَنْ كَعْبِ بْنِ عُجْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: حُمِلْتُ إِلَى رَسُولِ اللهِ

603. హజ్రత్ కాబ్ బిన్ ఉజ్రా (రజి) కథనం : (ఇహ్రామ్ స్థితిలో వున్న) నన్ను దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి ఎత్తుకు

ﷺ وَالْقَمْلُ يَتَنَاثَرُ عَلَى وَجْهِي، فَقَالَ: «مَا كُنْتُ أُرَى الْوَجَعَ بَلَغَ بِكَ مَا أَرَى، أَتَجِدُ شَاةً؟» قُلْتُ: لاَ، قَالَ: «فَصُمْ ثَلاَثَةَ أَيَّامٍ، أَوْ أَطْعِمْ سِتَّةَ مَسَاكِينَ، لِكُلِّ مِسْكِينٍ نِصْفُ صَاعٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

రావటం జరిగింది. పేలు నా ముఖంపై పడుతున్నాయి. ఆయన (స) నా పరిస్థితిని చూచి, "వ్యాధి నిన్ను నేను చూస్తున్న ఈ స్థితికి చేరుస్తుందని అనుకోలేదు. నీ దగ్గర మేక ఉందా?" అని అడిగారు. 'లేదు' అని నేను జవాబిచ్చాను. "మూడు రోజులు ఉపవాసం పాటించు లేదా ఆరుగురు పేదవాళ్లకు తలో అర్ధ 'సా' చొప్పున అన్నంపెట్టు" అని ఆయన (స) బోధించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఉపవాసం ఉండటం లేదా పేదవాళ్లకు అన్నం పెట్టడం అన్నది 'పరిహారం' గా అన్నమాట! ఇహ్రామ్ స్థితిలో ఉండటం మూలంగా కాబ్ బిన్ ఉజ్రా తలలోని పేలను కూడా చంపలేదు. దైవప్రవక్త (స) ఈయనకు శిరోముండనం చేయించుకోమని కూడా సలహా ఇచ్చారు.

### హదీసు ఉల్లేఖకులు

కాబ్ బిన్ ఉజ్రా (రజి) గొప్ప సహాబీలలో ఒకరు. అల్ బాలీ తెగకు చెందినవారు. అన్సార్ వర్గానికి మద్దతుదారులు. కొంతకాలం 'కూఫా'లో గడిపారు. ఎట్టకేలకు మదీనాలోనే హిజ్రీ 51లో మరణించారు.

(٦٠٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمَّا فَتَحَ اللَّهُ عَلَى رَسُولِهِ مَكَّةَ، قَامَ رَسُولُ اللهِ ﷺ فِي النَّاسِ، فَحَمِدَ اللَّهَ، وَأَثْنَى عَلَيْهِ، ثُمَّ قَالَ: «إِنَّ اللَّهَ تَعَالَى حَبَسَ عَنْ مَكَّةَ الْفِيلَ، وَسَلَّطَ عَلَيْهَا رَسُولَهُ

604. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : అల్లాహ్ తన సందేశహరుని (సల్లల్లాహు అలైహి వ సల్లం) కి మక్కా విజయం ప్రసాదించగా దైవప్రవక్త (సఅసం) ప్రజలమధ్య నిలబడి దైవ స్తోత్రం చేశారు. అనంతరం ఆయన (స) ఇలా అన్నారు : "నిశ్చయంగా అల్లాహ్ ఏనుగుల (బారి) నుండి మక్కాను కాపాడాడు. అయితే తన సందేశహరుని (సఅసం)కి, విశ్వాసులకు దీనిపై ఆధిక్యతను వొసగాడు. నిస్సందేహంగా నాకు పూర్వం మక్కా ఎవరికొరకు కూడా హలాల్ (ధర్మసమ్మతం) గావించబడ

وَالْمُؤْمِنِينَ، وَإِنَّهَا لَمْ تَحِلَّ لِأَحَدٍ كَانَ قَبْلِي، وَإِنَّمَا أُحِلَّتْ لِي سَاعَةً مِنْ نَهَارٍ، وَإِنَّهَا لَنْ تَحِلَّ لِأَحَدٍ بَعْدِي، فَلاَ يُنَفَّرُ صَيْدُهَا، وَلاَ يُخْتَلَى شَوْكُهَا، وَلاَ يَحِلُّ سَاقِطَتُهَا إِلاَّ لِمُنْشِدٍ. وَمَنْ قُتِلَ لَهُ قَتِيلٌ فَهُوَ بِخَيْرِ النَّظَرَيْنِ»، فَقَالَ الْعَبَّاسُ: إِلاَّ الْإِذْخِرَ، يَا رَسُولَ اللهِ! فَإِنَّا نَجْعَلُهُ فِي قُبُورِنَا وَبُيُوتِنَا، فَقَالَ: «إِلاَّ الْإِذْخِرَ». مُتَّفَقٌ عَلَيْهِ.

లేదు. కాని నా కోసం ఒక దినములో ఒక ఘడియ 'హలాల్' గావించబడింది. నిశ్చయంగా నా తదనంతరం ఇది ఎవరి కొరకూ హలాల్ అయి ఉండదు. అంటే ఇక్కడ దేనినయినా వేటాడటంగానీ, ఇక్కడి ముళ్ల వృక్షాలను నరకటంగానీ, క్రిందపడిన వస్తువును - దాన్ని పోగొట్టు కున్నవాడు గుర్తుపడితే తప్ప - ఎత్తు కోవటం గానీ ధర్మసమ్మతం కాదు. తమ మనిషి ఎవరైనా చంపబడితే వారు తమ ముందున్న రెండు మార్గాలలో ఏదో ఒకదానిని ఎన్నుకునే స్వేచ్ఛాధికారం కలిగి ఉంటారు." హజ్రత్ అబ్బాస్ (రజి) ఇలా విన్నవించుకున్నారు : 'దైవ ప్రవక్తా (స)! ఇజ్ఖిర్ (గడ్డి) తప్ప! ఎందుకంటే దాన్ని మేము సమాధులలో, ఇండ్లలో ఉపయోగిస్తాము' అని అన్నారు. అప్పుడాయన (స), "సరే. ఇజ్ఖిర్ తప్ప (అంటే దాన్ని కోసుకునేం దుకు అనుమతి ఇవ్వబడుతోంది)!" అన్నారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

తమ ముందున్న రెండు మార్గాలలో ఏదో ఒక దానిని ఎన్నుకోవటమంటే అర్థం వారు నేరస్థుడ్ని శిక్షించడానికయినా అంగీకరించాలి, లేదా రక్తపరిహారమన్నా వసూలు చేయాలి. రెండూ నెరవేరాలంటే అది కుదిరేపని కాదు. పైగా ఇది కూడా మరో అన్యాయం అవుతుంది.

'ఇజ్ఖిర్' అనేది ఒక రకమయిన సువాసనతో కూడుకున్న గడ్డి. దాన్ని అరబ్బులు ఇండ్ల పైకప్పు లపై వేసుకునేవారు. సమాధులను పూడ్చిపెట్టడానికి కూడా ఈ గడ్డిని ఉపయోగించేవారు.

పవిత్ర మక్కా ఇతరులకు హరాం (నిషిద్ధం) గావించబడటంలోని మర్మం ఏమిటంటే ఈ నగరంలో హత్య చేయటం, రక్తపాతం సృష్టించటం హరామ్. ఈ నగరంలో ప్రవేశించిన వ్యక్తికి ఒక విధంగా అభయం లభించినట్లే. అక్కడి జంతువులను వేటాడటం, వృక్షాలను నరకటం సయితం నిషిద్ధం. ఆఖరికి ఏదైనా వస్తువు నేలపై పడి వున్నా దాని యజమాని వచ్చే వరకూ ముట్టుకోరాదు. ఇన్ని విధాలుగా మక్కా నగరం ప్రజల కొరకు హరామ్ గావించబడింది.

(٦٠٥) وَعَنْ عَبْدِ اللهِ بْنِ زَيْدِ بْنِ عَاصِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِنَّ إِبْرَاهِيمَ حَرَّمَ مَكَّةَ، وَدَعَا لِأَهْلِهَا، وَإِنِّي حَرَّمْتُ الْمَدِينَةَ، كَمَا حَرَّمَ إِبْرَاهِيمُ مَكَّةَ؛ وَإِنِّي دَعَوْتُ فِي صَاعِهَا وَمُدِّهَا بِمِثْلِ مَا دَعَا بِهِ إِبْرَاهِيمُ لِأَهْلِ مَكَّةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

605. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నిశ్చయంగా ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కాకు పవిత్రతను కల్పించారు. ఇక్కడ నివసించే వారికై ప్రార్థించారు. ఏ విధంగానయితే ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కాను పవిత్రంగా ఖరారు చేశారో నిస్సందే హంగా (అదేవిధంగా) నేనూ మదీనాకు పవిత్రతను ఒసగాను. మక్కాలో నివ సించే వారికొరకు ఇబ్రాహీం (అలైహి స్సలాం) ఏ విధంగా ప్రార్థించారో అదే విధంగా నేనునూ మదీనా (కొలతలు, తూనికలైన) 'సా' మరియు 'ముద్'ల గురించి ప్రార్థించాను." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

మక్కా ముకర్రమా మాదిరిగా మదీనా తయ్యిబా కూడా పవిత్రమైనదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అంటే మదీనా నగరంలో కూడా జంతువులవేట, నరమేధం నిషేధించబడ్డాయి. అక్కడి చెట్లు నరకటం, దురాచారాలను సృష్టించటం కూడా నిషిద్ధమే.

(٦٠٦) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْمَدِينَةُ حَرَامٌ مَا بَيْنَ عَيْرٍ إِلَى ثَوْرٍ». رَوَاهُ مُسْلِمٌ.

606. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఐర్ నుండి సౌర్ వరకు గల మదీనా ప్రదేశమంతా పవిత్రమైనది (నిషిద్ధమైనది)." (ముస్లిం)

### సారాంశం

'ఐర్' ఒక పర్వతం పేరు. ఇది మదీనా నగరానికి దక్షిణాన ఉంది. 'సౌర్' అనేది ఒక చిన్న పర్వత గుట్ట. ఇది మదీనాకు ఉత్తరాన ఉహుద్ పర్వతం వెనుక ఉంది. సూర్ పర్వతం ఒకటి మక్కాల్లో కూడా ఉంది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ఆ 'సూర్' వేరు. ఈ 'సౌర్' వేరు. మక్కాలో ఉన్న సూర్ గుహలో దైవప్రవక్త (స) హిజ్రత్ సందర్భంగా తలదాచుకున్న సంగతి విదితమే.

ఈ హదీసు ప్రకారం ఐర్ - సౌర్‌ల మధ్య గల మదీనా ప్రాంతం అంతా పవిత్రమైనదనీ, అక్కడ నరమేధం, వేట, చెట్లు నరకటం వంటివన్నీ నిషేధించబడ్డాయనీ తెలుస్తోంది.

**5వ అధ్యాయం**

## ٥ - بَابُ صِفَةِ الْحَجِّ وَدُخُولِ مَكَّةَ

## హజ్ తీరు - మక్కాలో ప్రవేశించే విధము

(٦٠٧) عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ حَجَّ، فَخَرَجْنَا مَعَهُ، حَتَّى إِذَا أَتَيْنَا ذَا الْحُلَيْفَةِ فَوَلَدَتْ أَسْمَاءُ بِنْتُ عُمَيْسٍ، فَقَالَ: «**اِغْتَسِلِي، وَاسْتَثْفِرِي بِثَوْبٍ، وَأَحْرِمِي**»، وَصَلَّى رَسُولُ اللهِ ﷺ فِي الْمَسْجِدِ، ثُمَّ رَكِبَ الْقَصْوَاءَ، حَتَّى إِذَا اسْتَوَتْ بِهِ عَلَى الْبَيْدَاءِ، أَهَلَّ بِالتَّوْحِيدِ: «**لَبَّيْكَ اللَّهُمَّ لَبَّيْكَ، لاَ شَرِيكَ لَكَ، لَبَّيْكَ، إِنَّ الْحَمْدَ وَالنِّعْمَةَ لَكَ وَالْمُلْكَ،**

607. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్‌కు సన్నద్ధమవగా మేము కూడా ఆయన (స) వెంట బయలుదేరాము. మేమంతా 'జుల్ హులైఫా' వద్దకు చేరుకునేసరికి అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) ప్రసవించింది. "స్నానం చేసి ఏదైనా గుడ్డతో లోవుడుపు కట్టుకో. దానిపైన ఇహ్రామ్ ధరించు" అని ఆయన (స) ఆమెకు సలహా ఇచ్చారు. దైవప్రవక్త (సఅసం) మస్జిద్‌లో నమాజ్‌చేసి, (తన ఒంటె అయిన) 'ఖస్వా'పై స్వారీ అయ్యారు. 'బైదా' స్థలానికి చేరుకున్న తర్వాత ఆయన (స) ఈ విధంగా 'తల్బియా' పలికారు : "హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను. సాటిలేని స్వామీ! నేను (నీ సేవకై) హాజరయ్యాను. నిస్సందేహంగా స్తోత్రం నీకే తగును. అనుగ్రహాలన్నీ నీ ప్రసాదితాలే. సార్వభౌమత్వం కూడా నీదే. నీకు సహవర్తులెవరూ లేరు." కడకు మేము కాబా గృహ ప్రాంగణంలోకి ప్రవేశించాము. (నల్లరాయి గల) మూలస్థలాన్ని ఆయన (స) ముద్దాడారు. మూడుసార్లు (కాబా చుట్టూ) భుజాలు ఎగరవేస్తూ

لاَ شَرِيكَ لَكَ»، حَتَّى إِذَا أَتَيْنَا الْبَيْتَ اسْتَلَمَ الرُّكْنَ، فَرَمَلَ ثَلاَثاً، وَمَشَى أَرْبَعاً، ثُمَّ أَتَى مَقَامَ إِبْرَاهِيمَ فَصَلَّى، ثُمَّ رَجَعَ إِلَى الرُّكْنِ، فَاسْتَلَمَهُ، ثُمَّ خَرَجَ مِنَ الْبَابِ إِلَى الصَّفَا، فَلَمَّا دَنَا مِنَ الصَّفَا، قَرَأَ ﴿إِنَّ الصَّفَا وَالْمَرْوَةَ مِنْ شَعَائِرِ اللهِ﴾ «أَبْدَأُ بِمَا بَدَأَ اللَّهُ بِهِ»، فَرَقِيَ الصَّفَا حَتَّى رَأَى الْبَيْتَ، فَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَوَحَّدَ اللَّهَ، وَكَبَّرَهُ، وَقَالَ: «لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ، لاَ شَرِيكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ، لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، أَنْجَزَ وَعْدَهُ، وَنَصَرَ عَبْدَهُ، وَهَزَمَ الأَحْزَابَ وَحْدَهُ»، ثُمَّ دَعَا بَيْنَ ذَلِكَ قَالَ مِثْلَ هَذَا ثَلاَثَ مَرَّاتٍ، ثُمَّ

వేగంగా తిరిగారు. నాలుగుసార్లు మామూలుగానే తిరిగారు. తరువాత ఆయన (స) 'మఖామె ఇబ్రాహీం' వద్దకు వచ్చారు. అక్కడ నమాజ్ చేశారు. మళ్లీ హజ్రె అస్వద్ (నల్లరాయి) ఉన్న మూలకు వచ్చి దాన్ని ముద్దుపెట్టుకున్నారు. అనంతరం మస్జిదె హరామ్ ద్వారం గుండా 'సఫా' వైపునకు నడిచారు. సఫా దగ్గరకు చేరుకున్న తర్వాత ఈ ఆయత్‌ను పఠించారు : "ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షఆయిరిల్లాహ్" (నిస్సందేహంగా సఫా - మర్వా పర్వతాలు దైవచిహ్నాలలోనివి). తర్వాత ఇలా అన్నారు: "అల్లాహ్ ప్రారంభించిన చోటు నుంచే నేను ('సయీ'ని) ప్రారంభిస్తున్నాను." అప్పుడు సఫా పర్వతమెక్కారు. అక్కడినుంచి కాబా గృహాన్ని చూచారు. ఖిబ్లా వైపునకు తిరిగి దేవుని ఏకత్వాన్ని, ఘనతను కీర్తించారు. ఆయన (స) ఇలా అన్నారు : "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన ఏకేశ్వరుడు. ఆయన సహవర్తులెవరూ లేనివాడు. రాజ్యాధికారం ఆయనదే. శుభాలన్నీ ఆయనవే. ఆయన ప్రతిదానినీ చేయగల సమర్థుడు. అల్లాహ్ తప్ప మరో దేవుడు లేనేలేడు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసునికి తోడ్పడ్డాడు. అవిశ్వాసుల సమూహాన్ని తానొక్కడే ఓడించాడు." తరువాత వాటి మధ్య మూడుసార్లు దుఆ చేశారు. తరువాత సఫా పర్వతం నుంచి దిగి మర్వా వైపు

نَزَلَ مِنَ الصَّفَا إِلَى الْمَرْوَةِ، حَتَّى إِذَا انْصَبَّتْ قَدَمَاهُ فِيْ بَطْنِ الْوَادِيْ سَعَى، حَتَّى إِذَا صَعِدَ مَشَى إِلَى الْمَرْوَةِ، فَفَعَلَ عَلَى الْمَرْوَةِ كَمَا فَعَلَ عَلَى الصَّفَا، فَذَكَرَ الْحَدِيْثَ، وَفِيْهِ: فَلَمَّا كَانَ يَوْمُ التَّرْوِيَةِ تَوَجَّهُوا إِلَى مِنًى، وَرَكِبَ النَّبِيُّ ﷺ، فَصَلَّى بِهَا الظُّهْرَ وَالْعَصْرَ وَالْمَغْرِبَ وَالعِشَاءَ وَالْفَجْرَ، ثُمَّ مَكَثَ قَلِيْلاً حَتَّى طَلَعَتِ الشَّمْسُ، فَأَجَازَ حَتَّى أَتَى عَرَفَةَ، فَوَجَدَ الْقُبَّةَ قَدْ ضُرِبَتْ لَهُ بِنَمِرَةَ، فَنَزَلَ بِهَا، حَتَّى إِذَا زَالَتِ الشَّمْسُ أَمَرَ بِالْقَصْوَاءِ فَرُحِلَتْ لَهُ، فَأَتَى بَطْنَ الْوَادِيْ، فَخَطَبَ النَّاسَ، ثُمَّ أَذَّنَ، ثُمَّ أَقَامَ،

నకు వెళ్లారు. లోయలోకి అడుగులు పడగానే పరుగెత్తసాగారు. మెరక ప్రాంతం వరకూ పరుగెత్తారు. తరువాత మర్వాపైకి ఎక్కారు. సఫా పర్వతంపై చేసినదే మర్వా పర్వతంపై కూడా చేశారు. మరి జాబిర్ (రజి) హదీసు నంతటినీ వివరించారు - (ఆయన ప్రకారం) తర్వియ రోజు (జిల్ హజ్జ్ 8వ తేదీ) రాగానే అందరూ 'మినా' వైపునకు మళ్లారు. దైవప్రవక్త (సఅసం) ఒంటెపైనే ఉన్నారు. అక్కడ జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా మరియు ఫజ్ర్ నమాజులు చేశారు. తరువాత కొద్దిసేపు అక్కడ ఆగారు. సూర్యోదయం అయిన తరువాత అక్కడి నుంచి బయలుదేరి 'ముజ్దలిఫా' మీదుగా 'అరఫాత్' చేరుకున్నారు. అక్కడ 'నమిరా' అనే స్థలంలో వేయ బడిన శిబిరంలో ఆయన (స) విడిది చేశారు. పొద్దువాలిన తరువాత 'ఖస్వా' (ప్రవక్త ఒంటె)ను సిద్ధం చేయవల సిందిగా ఆదేశించారు. వాహనం సమ కూర్చబడింది. ఆయన (స) వాహనంపై లోయ మధ్య భాగంలోకి వచ్చారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తరువాత అజాన్ ఇప్పించారు. ఇఖామత్ చెప్పించారు. జుహ్ర్ నమాజ్ చేశారు. మళ్ళీ ఇఖామత్ చెప్పమని ఆదేశిం చారు. అనంతరం అస్ర్ నమాజ్ చేశారు. ఈ రెండు నమాజుల మధ్య మరే నమాజునూ చేయలేదు. తరువాత వాహనమెక్కి ఆగవలసిన చోటికి చేరు

فَصَلَّى الظُّهْرَ، ثُمَّ أَقَامَ فَصَلَّى الْعَصْرَ، وَلَمْ يُصَلِّ بَيْنَهُمَا شَيْئاً، ثُمَّ رَكِبَ حَتَّى أَتَى الْمَوقِفَ، فَجعَلَ بَطْنَ نَاقَتِهِ الْقَصْوَاءِ إِلَى الصَّخَرَاتِ وَجَعَلَ جَبَلَ الْمُشَاةِ بَيْنَ يَدَيْهِ، وَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَلَمْ يَزَلْ وَاقِفاً حَتَّى غَرَبَتِ الشَّمْسُ، وَذَهَبَتِ الصُّفْرَةُ قَلِيْلاً، حَتَّى إِذَا غَابَ الْقُرْصُ دَفَعَ، وَقَدْ شَنَقَ لِلْقَصْوَاءِ الزِّمَامَ، حَتَّى إِنَّ رَأْسَهَا لَيُصِيْبَ مَورِكَ رَحْلِهِ، وَيقُولُ بِيَدِهِ الْيُمْنَى: «**يَا أَيُّهَا النَّاسُ! اَلسَّكِيْنَةَ، اَلسَّكِيْنَةَ**»، وَكُلَّمَا أَتَى جَبَلاً أَرْخَى لَهَا قَلِيْلاً حَتَّى تَصْعَدَ، حَتَّى أَتَى الْمُزْدَلِفَةَ، فَصَلَّى بِهَا الْمَغْرِبَ وَالعِشَاءَ، بِأَذَانٍ وَّاحِدٍ وَإِقَامَتَيْنِ، وَلَمْ يُسَبِّحْ بَيْنَهُمَا شَيْئاً، ثُمَّ اضْطَجَعَ حَتَّى طَلَعَ الْفَجْرُ، فَصَلَّى الْفَجْرَ حِيْنَ تَبَيَّنَ لَهُ الصُّبْحُ، بِأَذَانٍ وَإِقَامَةٍ، ثُمَّ رَكِبَ حَتَّى أَتَى الْمَشْعَرَ الْحَرَامَ، فَاسْتَقْبَلَ الْقِبْلَةَ، فَدَعَا، وَكَبَّرَ، وَهَلَّلَ، فَلَمْ يَزَلْ وَاقِفاً حَتَّى أَسْفَرَ جِدًّا، فَدَفَعَ قَبْلَ أَنْ

కున్నారు. తన ఒంటె ఖస్వా డొక్కను రాళ్ల వైపునకు ఉండేలా తిప్పి, దారిలో నడిచేవారు తనకు ఎదురుగా ఉండేలా ఆగారు. ఆ సమయంలో ఆయన (స) తన ముఖాన్ని 'ఖిబ్లా' వైపునకు తిప్పి ఉంచారు. సూర్యాస్తమయమై, ఆకాశపు టంచున ఉండే పసుపుదనం మటు మాయమయ్యే వరకూ - అంటే సూర్యాస్త మయం పూర్తిగా జరిగేవరకూ - అక్కడే ఉండి, ఆ స్థితిలోనే అక్కడి నుంచి తిరోన్ముఖులయ్యారు. ఆ సమ యంలో ఆయన (స) ఒంటె పగ్గాలను బాగా లాగి పట్టుకోవటం వల్ల దాని తల ఒక్కోసారి ఆయన (స) కూర్చున్న బల్లకు తగల సాగింది. ఆ సమయంలో ఆయన (స) తన కుడిచేత్తో సైగ చేస్తూ, "ప్రజలారా! నెమ్మదిగా, నెమ్మదిగా పదండి" అని అనే వారు. కొత్తగా ఎక్కడ గుట్ట ఎదురు వచ్చినా అక్కడ ఒంటె పగ్గాలను కాస్త వదులుగా ఉంచేవారు. తద్వారా ఒంటె సులభంగా గుట్టను అధిగమిం చేది. ఆ విధంగా ఆయన (స) 'ముజ్దలిఫా'కు చేరుకున్నారు. అక్కడ ఒక అజాన్ మరియు రెండు ఇఖామత్‌లతో మగ్రిబ్, ఇషా నమాజులు చేశారు. ఆ రెండు నమాజులకు మధ్య మరే నఫిల్ నమాజు కూడా చేయలేదు. తరువాత పడు కున్నారు. తెల్లవారుతుండగా లేచి అజాన్ మరియు ఇఖామత్‌ల ద్వారా ఫజ్ర్ నమాజ్ చేశారు. అక్కడి నుంచి వాహన మెక్కి 'మష్‌అరుల్ హరామ్' చేరుకు

تَطْلُعَ الشَّمْسُ، حَتَّى أَتَى بَطْنَ مُحَسِّرٍ، فَحَرَّكَ قَلِيلاً، ثُمَّ سَلَكَ الطَّرِيْقَ الْوُسْطَى الَّتِيْ تَخْرُجُ عَلَى الْجَمْرَةِ الْكُبْرَى، حَتَّى أَتَى الْجَمْرَةَ الَّتِيْ عِنْدَ الشَّجَرَةِ، فَرَمَاهَا بِسَبْعِ حَصَيَاتٍ، يُكَبِّرُ مَعَ كُلِّ حَصَاةٍ مِّنْهَا، كلُّ حَصَاةٍ مِثْلِ حَصَى الْخَذْفِ، رَمَى مِن بَطْنِ الْوَادِيْ، ثُمَّ انْصَرَفَ إِلَى الْمَنْحَرِ، فَنَحَرَ، ثُمَّ رَكِبَ رَسُولُ اللهِ ﷺ فَأَفَاضَ إِلَى الْبَيْتِ، فَصَلَّى بِمَكَّةَ الظُّهْرَ. رَوَاهُ مُسْلِمٌ مُطَوَّلاً.

న్నారు. అక్కడ ఖిబ్లావైపునకు అభిముఖులై దుఆ చేశారు, దేవుని ఘనతను, ఆయన ఏకత్వాన్ని చాటారు. అక్కడ ఆయన బాగా తెల్లవారే వరకూ ఉండి, సూర్యోదయం కాకముందే తిరోన్ముఖులై 'ముహస్సర్' లోయలోకి వచ్చేశారు. అక్కడినుంచి ఒంటెను వేగంగా పోనిచ్చారు. 'పెద్ద జమ్రా' (పెద్ద షైతాన్) వరకూ చేర్చే మధ్య మార్గం గుండా పోసాగారు. తరువాత ఆయన (స) వృక్షం ప్రక్కనున్న జమ్రా వద్దకు చేరుకున్నారు. లోతట్టు స్థలంలో నుంచి ఏడు కంకరరాళ్లు దానిపై రువ్వారు. కంకర రువ్వే ప్రతిసారీ 'అల్లాహు అక్బర్' అని అనేవారు. ఆ కంకరరాళ్లలో ప్రతిదీ ఖర్జూరపు టెంకంత ఉంది. అక్కడి నుంచి ఆయన (స) ఖుర్బానీ స్థలం వద్దకు వెళ్లి, ఖుర్బానీ ఇచ్చి, బైతుల్లాహ్ (కాబా గృహం) వైపునకు పయనమయ్యారు. మక్కాలో జుహ్ర్ నమాజ్ చేశారు. (ఈ హదీసు 'ముస్లిం' లో సవివరంగా వచ్చింది)

(٦٠٨) وَعَنْ خُزَيْمَةَ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا فَرَغَ مِنْ تَلْبِيَتِهِ فِي حَجٍّ أَوْ عُمْرَةٍ سَأَلَ اللَّهَ رِضْوَانَهُ وَالْجَنَّةَ، وَاسْتَعَاذَ بِرَحْمَتِهِ مِنَ النَّارِ. رَوَاهُ الشَّافِعِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

608. హజ్రత్ ఖుజైమ బిన్ సాబిత్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ నల్లం) హజ్ లేదా ఉమ్రాలో 'తల్బియా' (లబ్బైక్) చెప్పటం పూర్తవగానే దైవప్రసన్నతను, స్వర్గాన్ని ఆశిస్తూ ప్రార్థించేవారు. దైవకారుణ్యాన్ని కోరుకోవటంతోపాటు, అగ్ని నుండి శరణు వేడేవారు." (ఇమామ్ షాఫయి - రహ్మ.లై- దీనిని బలహీన ఆధారంతో ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ ఖుజైమ బిన్ సాబిత్ బిన్ ఫాకిహ్ (రజి). అన్సార్ సహాబీ. ఔస్ తెగ యొక్క ఉప తెగ ఖతమీకి చెందినవారు. మారుపేరు అబూ ఇమారత. మక్కా విజయం సందర్భంగా ఖతమీ ఉపతెగ ధ్వజం ఈయన చేతిలోనే ఉంది. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) పక్షాన ఉన్నారు. ఆ సందర్భంగానే అమరగతినొందారు.

(٦٠٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «نَحَرْتُ هٰهُنَا، وَمِنًى كُلُّهَا مَنْحَرٌ، فَانْحَرُوا فِي رِحَالِكُمْ، وَوَقَفْتُ هٰهُنَا، وَعَرَفَةُ كُلُّهَا مَوْقِفٌ، وَوَقَفْتُ هٰهُنَا، وَجَمْعٌ كُلُّهَا مَوْقِفٌ». رَوَاهُ مُسْلِمٌ.

609. హజ్రత్ జాబిర్ కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నేను ఈ స్థలంలో ఖుర్బానీ ఇచ్చాను. అయితే 'మినా' ప్రదేశమంతా ఖుర్బానీ ఇచ్చే స్థలమే. కనుక మీరు ఇక్కడ ఆగిన చోటల్లా ఖుర్బానీ ఇవ్వవచ్చు. నేను ఇక్కడ ఆగి ఉన్నాను. కాని అరఫాత్ మైదానమంతా ఆగే స్థలమే -నేను ఇక్కడ ఆగి ఉన్నాను. కాని 'జమా' (ముజ్దలిఫా) అంతా ఆగే స్థలమే." (ముస్లిం)

### సారాంశం

హదీసులో 'ముజ్దలిఫా' అనే ప్రదేశాన్ని 'జమా' అనే పేరుతో ప్రస్తావించటం జరిగింది. దీని వెనుక ఒక కథనం ఉంది - హజ్రత్ ఆదం, హవ్వాలు స్వర్గం నుండి భువిమీద వేర్వేరు స్థలాలలో దింపబడగా వారిరువురూ ఈ స్థలంలో కలుసుకున్నారనీ, అందుచేత ఈ స్థలానికి 'జమా' అనే పేరు వచ్చిందనీ చెప్పుకుంటారు. హజ్ సందర్భంగా ప్రజలు ఇక్కడ జమ అవటం మూలంగానూ, మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఇక్కడ కలిపి చేయటం వల్లనూ దీనికి 'జమా' అనే పేరు పడిందని మరో కథనం.

(٦١٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ لَمَّا جَاءَ إِلَى مَكَّةَ دَخَلَهَا مِنْ أَعْلاَهَا، وَخَرَجَ مِنْ أَسْفَلِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

610. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సఅసం) హజ్ కొరకు మక్కాలో ప్రవేశించినపుడు మక్కా ఎగువ భాగం నుండి ప్రవేశించారు. అక్కడి నుంచి తిరిగివెళ్ళినపుడు మక్కా దిగువ భాగం నుండి బయలు దేరారు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) మక్కాలో ప్రవేశించిన, మక్కానుండి వెడలిపోయిన

ప్రదేశాల ప్రస్తావన వచ్చింది. ఆయన ప్రవేశించిన ఎగువ భాగం పేరు "తస్నియతుల్ ఉల్యా." వెడలివెళ్ళిన లోతట్టు ప్రదేశం పేరు "తస్నియతుల్ సుఫ్లా." ఈ మార్గం గుండా హజ్ కొరకు మక్కాలో ప్రవేశించడం మస్నూన్ అని కొంతమంది ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు. అయితే సౌలభ్యం ఉంటేనే ఇది అందరికీ సాధ్యపడుతుంది.

(٦١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ لاَ يَقْدُمُ مَكَّةَ إِلاَّ بَاتَ بِذِيْ طُوًى، حَتَّى يُصْبِحَ، وَيَغْتَسِلَ، وَيَذْكُرُ ذٰلِكَ عَنِ النَّبِيِّ ﷺ. مُتَّفَقٌ عَلَيْهِ.

611. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: ఆయన (ఇబ్నె ఉమర్) ఎప్పుడు మక్కా వచ్చినా 'జీ తువా' స్థలంలో రాత్రంతా ఆగి తెల్లవారాక స్నానం చేసేవారు. దైవ ప్రవక్త (సఅసం) ఈ విధంగానే చేసే వారని ఆయన అనేవారు. (బుఖారీ, ముస్లిం)

(٦١٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ يُقَبِّلُ الْحَجَرَ الْأَسْوَدَ، وَيَسْجُدُ عَلَيْهِ. رَوَاهُ الْحَاكِمُ مَرْفُوعاً، وَالْبَيْهَقِيُّ مَوْقُوفاً.

612. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్ (నల్లనిరాయి)ని ముద్దాడేవారు. దాని ముందు భాగంలో 'సజ్దా' చేసేవారు." (దీనిని హాకిమ్ 'మర్ఫూ' హదీసుగానూ, బైహఖీ 'మౌఖూఫ్'గానూ ఉల్లేఖించారు)

**సారాంశం**

హజ్రె అస్వద్‌ను ముద్దాడటం, అక్కడ సజ్దా చేయటం అవసరమన్నట్టు ఈ హదీసు వెల్లడిస్తోంది. అత్యధిక ఉలమాల అభిప్రాయం కూడా ఇదే. ఈ హదీసు కొంత ఆందోళనకరంగా ఉంది. హజ్రె అస్వద్ వద్ద సజ్దా చేయటం 'బిద్అత్' అని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అన్నారు. బహుశా దానికి నుదురు ఆనించేవారేమో! ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్ తదితరులు అక్కడ సజ్దా చేయటాన్ని ధర్మసమ్మతంగానే భావిస్తున్నారు. కాని ఇమామ్ మాలిక్ ఒక్కరే దీనిని బిద్అత్‌గా ఖరారు చేశారు.

(٦١٣) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَهُمُ النَّبِيُّ ﷺ أَنْ يَرْمُلُوا ثَلاَثَةَ أَشْوَاطٍ وَيَمْشُوا أَرْبَعاً، وَأَن يَمْشُوا بَيْنَ الرُّكْنَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ.

613. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : (కాబా ప్రదక్షిణ చేసే సమయంలో) మూడుసార్లు వేగంగా నడవాలనీ, రెండు 'రుకున్'ల మధ్య నాలుగుసార్లు సాధారణంగా నడవాలనీ దైవప్రవక్త (సఅసం) తన సహచరులను ఆజ్ఞాపించారు. (బుఖారీ, ముస్లిం)

(٦١٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ عَنْهُمَا: (أَنَّهُ كَانَ إِذَا طَافَ بِالْبَيْتِ الطَّوَافَ الْأَوَّلَ خَبَّ ثَلَاثاً وَمَشَى أَرْبَعاً. وَفِي رِوَايَةٍ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ إِذَا طَافَ فِي الْحَجِّ أَوِ الْعُمْرَةِ أَوَّلَ مَا يَقْدُمُ فَإِنَّهُ يَسْعَى ثَلَاثَةَ أَطْوَافٍ بِالْبَيْتِ وَيَمْشِي أَرْبَعَةً) مُتَّفَقٌ عَلَيْهِ.

614. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఎప్పుడు కాబా గృహంవద్ద మొదటి సారి తవాఫ్ చేసినా - మొదటి మూడు రౌండ్లు పహిల్వాన్ల మాదిరిగా నడిచే వారు. తరువాతి నాలుగు రౌండ్లు నెమ్మదిగా నడిచేవారు. వేరొక ఉల్లేఖనంలో ఉంది : (హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్- రజి - దైవప్రవక్త - సఅసం - గారి ఆచరణను వివరిస్తూ ఇలా అన్నారు) "నేను దైవప్రవక్త (స)ను చూచాను. ఆయన హజ్ చేసినా, ఉమ్రా చేసినా ప్రదక్షిణ సమయంలో మొదటి మూడు రౌండ్లు దాదాపు పరుగెత్తుతున్నట్లుగా తిరిగేవారు. మిగిలిన నాలుగు చుట్లు నెమ్మదిగా చుట్టివచ్చేవారు."
(ముత్తఫఖున్ అలైహ్)

(٦١٥) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَمْ أَرَ رَسُولَ اللهِ ﷺ يَسْتَلِمُ مِنَ الْبَيْتِ غَيْرَ الرُّكْنَيْنِ الْيَمَانِيَّيْنِ. رَوَاهُ مُسْلِمٌ.

615. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారిచే ఇంకొక ఉల్లేఖనం : "నేను దైవప్రవక్త (సఅసం)ను, 'రెండు యమానీ రుకున్లు' తప్ప బైతుల్లాహ్‌లోని మరో 'రుకున్'ను ముట్టుకోవటం చూడలేదు." (ముస్లిం)

(٦١٦) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَبَّلَ الْحَجَرَ الْأَسْوَدَ، وَقَالَ: إِنِّي أَعْلَمُ أَنَّكَ حَجَرٌ، لَا تَضُرُّ وَلَا تَنْفَعُ، وَلَوْلَا أَنِّي رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يُقَبِّلُكَ مَا قَبَّلْتُكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

616. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : ఆయన (ఉమర్ - రజి) హజ్రె అస్వద్‌ను ముద్దాడిన పిదప ఇలా అన్నారు : "నువ్వు ఒక రాయివన్న సంగతి నాకు బాగా తెలుసు. లాభనష్టాలకు నీవు యజమానివి కావు. దైవప్రవక్త (సఅసం) నిన్ను ముద్దాడుతుండగా నేను చూచి ఉండకపోతే, నిన్నెప్పుడూ ముద్దుపెట్టుకునే వాణ్ణికాను." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

'హజ్రె అస్వద్' అంటే అదేదో మహిమతో కూడుకున్నదనీ, లాభనష్టాలు చేకూర్చగల శక్తి దానికుందని తలచి ముద్దుపెట్టుకోవటం సరైనది కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమైపోయింది. కేవలం దైవప్రవక్త (స) ను అనుసరించే ఉద్దేశ్యంతో మాత్రమే ఆ రాయిని ముద్దుపెట్టుకోవటం జరుగుతుంది. రాళ్లు రప్పలను దైవాలుగా కొలిచే బహుదైవారాధకుల సిద్ధాంతాన్ని ఖండించే ఉద్దేశ్యంతో హజ్రత్ ఉమర్ (రజి) ఇలా ప్రకటించారు.

(٦١٧) وَعَنْ أَبِي الطُّفَيْلِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَطُوفُ بِالْبَيْتِ، وَيَسْتَلِمُ الرُّكْنَ بِمِحْجَنٍ مَعَهُ، وَيُقَبِّلُ الْمِحْجَنَ. رَوَاهُ مُسْلِمٌ.

617. హజ్రత్ అబూ తుఫైల్ (రజి) ఉల్లేఖనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను బైతుల్లాహ్ ప్రదక్షిణ చేస్తుండగాచూచాను. ఆయన (సఅసం) తన వద్దగల పొన్ను కర్రతో హజ్రె అస్వద్ ను తాకుతూ, ఆ కర్రను ముద్దాడేవారు."

(ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా వెల్లడయ్యేదేమిటంటే; జన సమూహం ఎక్కువగా ఉండి హజ్రె అస్వద్‌ను ముద్దుపెట్టుకోవటం కష్టసాధ్యం లేక అసంభవం అయినట్లయితే బెత్తంతో తాకి ఆ బెత్తాన్ని ముద్దు పెట్టుకోవచ్చు. ముస్నద్ అహ్మద్‌లోని ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉమర్ నుద్దేశ్యించి ఇలా అన్నారు: "నీవు బలశాలివి. హజ్రె అస్వద్‌ను సమీపించటం నీకు ఏ మాత్రం కష్టతరం కాదు. కాని తోసుకుంటూ వెళ్లటం వల్ల బలహీనులకు బాధ కలుగుతుంది. కనుక నీకు వీలు దొరికినప్పుడు చేత్తో తాకు. లేదా హజ్రె అస్వద్‌కు ఎదురుగా నిలబడి 'లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్' అని పలుకు. చాలు."

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే హజ్ క్రియలను నెరవేరుస్తున్నప్పుడు సాటి హజ్ యాత్రికులను బాధించటం, వారికి ఆటంకాలు సృష్టించటం ధర్మసమ్మతం కాదు. చేత్తో హజ్రె అస్వద్‌ను సంజ్ఞ చేసినపుడు ఆ చేతిని ముద్దాడకూడదు. చేత్తో లేదా బెత్తంతో హజ్రె అస్వద్‌ను తాకినప్పుడే వాటిని ముద్దుపెట్టుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

అబూ తుఫైల్ (రజి). పూర్తి వంశపరంపర ఇలా ఉంది: ఆమిర్ బిన్ వాసిలా లైసీ కినానీ (రజి). దైవప్రవక్త (సఅసం) మరణ సమయానికి ఈయన వయసు 8 సంవత్సరాలు. హిజ్రీ శకం 100లో మక్కాలో మరణించారు. మరో కథనం ప్రకారం హిజ్రీ 102లో మరణించారు. అందరికన్నా ఆఖరిలో మరణించిన ప్రవక్త ప్రియసహచరులు (సహాబీ) ఈయనే.

(٦١٨) وَعَنْ يَعْلَى بْنِ أُمَيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: طَافَ رَسُولُ اللهِ ﷺ مُضْطَبِعاً

618. హజ్రత్ యాల బిన్ ఉమయ్య (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక ఆకుపచ్చని దుప్పటితో 'తవాఫ్' చేశారు. దాన్ని

بِبُرْدٍ أَخْضَرَ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

ఆయన (స) కుడి చంక క్రిందనుంచి తీసుకుని ఎడమవైపు భుజంపై వేసుకున్నారు." (దీనిని 'ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

దుప్పటి కప్పుకున్న తీరు ప్రకారం కుడివైపు భుజం నగ్నంగా ఉంటుంది. మొదటిసారి ఉమ్రాలో దైవప్రవక్త (స) ఈ విధంగా దుప్పటి కప్పుకుని, మొదటి మూడు రౌండ్లు వేగంగా నడచి ముస్లింలు శారీరకంగాగానీ, మానసికంగాగానీ ఏమాత్రం బలహీనులుగా లేరని అక్కడి అవిశ్వాసులకు చాటి చెప్పదలిచారు. ఇబ్నె అబ్బాస్ కథనం ప్రకారం ; తరువాత ఈ పద్ధతే మస్నూన్ (సంప్రదాయం)గా ఖరారయింది.

**హదీసు ఉల్లేఖకులు**

యాల బిన్ ఉమయ్య (రజి). మారుపేరు అబూ సఫ్వాన్ తమీమి. మక్కావాసులు. ఖురైషు తెగకు మద్దతుదారులు. ప్రఖ్యాత సహచరులలో ఒకరు. హునైన్, తాయఫ్, తబూక్ యుద్ధాలలో పాల్గొని తన శౌర్యాన్ని ప్రదర్శించారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి)ల తరపున అధికారిగా నియమించబడేవారు. సుమారు 50 సంవత్సరాల వరకూ జీవించి ఉన్నారు.

(٦١٩) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ يُهِلُّ مِنَّا الْمُهِلُّ فَلاَ يُنْكَرُ عَلَيْهِ، وَيُكَبِّرُ مِنَّا الْمُكَبِّرُ فَلاَ يُنْكَرُ عَلَيْهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

619. హజ్రత్ అనస్ (రజి) కథనం : "మాలో కొంతమంది (కేవలం) 'లా ఇలాహ ఇల్లల్లాహ్" అని పలికేవారు. దీన్ని తప్పుగా భావించటం జరగలేదు. మాలో మరికొందరు 'తక్బీర్లు' పలికే వారు. దీన్ని కూడా తప్పుగా పరిగణించలేదు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో 'మినా' నుండి 'అరఫాత్' వెళ్ళే దారిలో హాజీల పరిస్థితి వివరించబడింది. వాళ్లు 'తల్బియా' పలకవలసిన సందర్భంలో తక్బీర్లు పలికినా దాన్ని దైవప్రవక్త (స) తప్పుగా తలంచలేదు.

(٦٢٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: بَعَثَنِي النَّبِيُّ ﷺ فِي الثَّقَلِ، أَوْ قَالَ: فِي الضَّعَفَةِ، مِنْ جَمْعٍ، بِلَيْلٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

620. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) నన్ను సామాను వెంట లేక బలహీనుల వెంట రాత్రిపూటే 'ముజ్దలిఫా'నుండి (మినా ప్రదేశానికి) పంపేశారు." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హజ్ సందర్భంగా జనం విపరీతంగా ఉంటారు. తొక్కినలాటలో వృద్ధులు, చిన్నపిల్లలకు హానికలిగే అవకాశముంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలోపెట్టుకుని, 'ముజ్దలిఫా'లో యాత్రీకులంతా రాత్రిపూట విశ్రమిస్తుండగా వృద్ధులను, చిన్న పిల్లలను, మహిళలను 'మినా' ప్రాంతానికి తరలించవచ్చు. సామాన్య జనులకు మాత్రం ఫజ్ర్ నమాజ్‌కు ముందు ప్రయాణమయ్యే అనుమతి లేదు.

(٦٢١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: اَسْتَأْذَنَتْ سَوْدَةُ رَسُولَ اللهِ ﷺ لَيْلَةَ الْمُزْدَلِفَةِ أَنْ تَدْفَعَ قَبْلَهُ، وَكَانَتْ ثَبْطَةً، يَعْنِي ثَقِيلَةً، فَأَذِنَ لَهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

621. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : హజ్రత్ సౌదా (ర.అన్‌హా) 'ముజ్దలిఫా'లో విడిది చేసినరాత్రి తాను తొందరగా బయలుదేరగలందులకు ఆయన (స) అనుమతి కోరారు. ఆమె లావుగా బొద్దుగా ఉండేవారు (అందు వల్ల కొద్ది దూరం నడచిన తరువాత ఆయాసంతో ఆగిపోయేవారు). అందు చేత ఆయన (సఅసం) ఆమెకు అనుమతినిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

వ్యాధి, వృద్ధాప్యం, నీరసంతో పాటు స్థూలకాయం కూడా షరీయత్‌పరమయిన ఒక కారణంగా పరిగణించబడుతుంది. ఇటువంటి వైకల్యం గలవారు 'ముజ్దలిఫా'లో రాత్రంతా విడిదిచేయకుండానే 'మినా' వైపునకు సాగిపోవచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ సౌదా (ర.అన్‌హా). పూర్తి వంశపరంపర ఇలా వుంది - సౌదా బిన్తె జమా బిన్ అబ్దె షమ్స్ ఖురషియా ఆమిరియా. ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల మాతలు)లో ఒకరు. మక్కాలోనే ఈమె ఇస్లాం స్వీకరించారు. తన భర్తతో కలసి రెండవసారి అబిసీనియాకు వలస వెళ్ళారు. ఆమె భర్త అక్కడే చనిపోయారు. హజ్రత్ ఖదీజా (ర.అన్‌హా) మరణానంతరం దైవప్రవక్త (సఅసం) ఈమెను వివాహమాడారు. హిజ్రీ 55లో ఈమె మరణించారు.

(٦٢٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ لَنَا رَسُولُ اللهِ ﷺ:

622. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "సూర్యోదయానికి ముందు కంకరరాళ్లు రువ్వరాదని దైవప్రవక్త

«لاَ تَرْمُوا الْجَمْرَةَ حَتَّى تَطْلُعَ الشَّمْسُ».
رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَفِيْهِ انْقِطَاعٌ.

(సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆదేశించారు." (దీనిని 'ఐదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - దీని పరంపరలో ఎక్కడో అంతరాయం ఏర్పడినట్లుంది)

**సారాంశం**

రాత్రిపూట 'రమీ' చేయటం ధర్మసమ్మతం కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. మెజారిటీ ఉలమాల దృష్టిలో సూర్యోదయం అయిన మీదట 'రమీ' ధర్మసమ్మతమవుతుంది. ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్‌ల దృష్టిలో అర్ధరాత్రి తరువాత రమీ చేయవచ్చు. ఇమామ్ అబూ హనీఫా కూడా సూర్యోదయం అయిన తరువాతే 'రమీ' చేయాలంటారు.

(٦٢٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَرْسَلَ النَّبِيُّ ﷺ بِأُمِّ سَلَمَةَ لَيْلَةَ النَّحْرِ، فَرَمَتِ الْجَمْرَةَ قَبْلَ الْفَجْرِ، ثُمَّ مَضَتْ، فَأَفَاضَتْ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ عَلَى شَرْطِ مُسْلِمٍ.

623. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్త (సఅసం) ఉమ్మె సలమా (ర.అన్హా)ను ఖుర్బానీ రాత్రి ముందే పంపేశారు. ఆమె తెల్లవారక ముందే కంకరరాళ్లు రువ్వి (మక్కా) వెళ్ళి తవాఫ్ చేశారు." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - దీని ప్రామాణికత 'ముస్లిం' షరతుపై ఆధారపడి ఉంది)

(٦٢٤) وَعَنْ عُرْوَةَ بْنِ مُضَرِّسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ شَهِدَ صَلاَتَنَا هَذِهِ، يَعْنِي بِالْمُزْدَلِفَةِ، فَوَقَفَ مَعَنَا حَتَّى نَدْفَعَ، وَقَدْ وَقَفَ بِعَرَفَةَ قَبْلَ ذَلِكَ

624. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉర్వ బిన్ ముజర్రిస్ (రజి) వివరించారు - ఎవరయితే ముజ్దలిఫాలో మా నమాజ్‌లో పాల్గొన్నాడో మరియు మేమిక్కడి నుంచి బయలుదేరేవరకూ మా వెంట నిలిచి ఉన్నాడో అంతకుముందు అరఫాత్‌లో రాత్రి లేక పగటిపూట నిరీక్షించాడో అతని హజ్ పరిపూర్ణమయి పోయింది. అతడు తన మలినాన్ని పారద్రోలినట్లే." (దీనిని ఐదుగురు ఉల్లే

لَيْلاً أَوْ نَهَاراً، فَقَدْ تَمَّ حَجُّهُ، وَقَضَى تَفَثَهُ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ.

ఖించారు - తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## హదీసు ఉల్లేఖకులు

ఉర్వ బిన్ ముజర్రిస్ (రజి). పూర్తి వంశపరంపరను చూస్తే ఇలా వుంది : ఉర్వ బిన్ ముజర్రిస్ బిన్ ఔస్ బిన్ హారిస బిన్ లామ్ అత్తాయి. అంతిమ హజ్ యాత్రలో పాల్గొన్న సహాబి. కూఫాలో స్థిరపడ్డారు. ఈయన గారి తరఫున 10 హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(٦٢٥) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّ الْمُشْرِكِيْنَ كَانُوا لاَ يُفِيْضُوْنَ حَتَّى تَطْلُعَ الشَّمْسُ، وَيَقُولُونَ: أَشْرِقْ ثَبِيْرُ! وَإِنَّ النَّبِيَّ ﷺ خَالَفَهُمْ، فَأَفَاضَ قَبْلَ أَنْ تَطْلُعَ الشَّمْسُ. رَوَاهُ الْبُخَارِيُّ.

625. హజ్రత్ ఉమర్ (రజి) ఇలా వివరించారు - "బహు దైవారాధకులు సూర్యోదయం అయిన తరువాత (ముజ్దలిఫా నుండి) వాపసు అయ్యే వారు. సబీర్ (అదొక పర్వతం పేరు) మెరిసిపోతుంది అని చెప్పుకునేవారు. దైవప్రవక్త (సఅసం) వాళ్ల అలవాటుకు భిన్నంగా - సూర్యోదయం కాక మునుపే (ముజ్దలిఫా) నుండి తిరిగి వచ్చారు."
(బుఖారీ)

(٦٢٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ وَأُسَامَةَ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُم، قَالاَ: لَمْ يَزَلِ النَّبِيُّ ﷺ يُلَبِّي حَتَّى رَمَى جَمْرَةَ الْعَقَبَةِ. رَوَاهُ الْبُخَارِيُّ.

626. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), ఉసామ బిన్ జైద్ (రజి)ల కథనం : "దైవప్రవక్త (సఅసం) జమ్రతుల్ అఖబా (చిన్న షైతాన్)పై కంకర రాళ్లు రువ్వే వరకూ 'తల్బియా' నినాదం చేస్తూనే ఉన్నారు." (బుఖారీ)

## హదీసు ఉల్లేఖకులు

ఉసామా బిన్ జైద్ (రజి). ఈయనకు గల మరోపేరు అబూ ముహమ్మద్ లేక అబూ జైద్. పూర్తి వంశపరంపరను చూస్తే ఇలా ఉంది - ఉసామా బిన్ జైద్ బిన్ హారిస బిన్ షరాహిల్ కల్బీ. దైవప్రవక్త (స) కు అత్యంత ప్రియతములైన స్వతంత్ర బానిస. తన మరణానికి ముందు దైవప్రవక్త (సఅసం) ఒక కీలకమయిన సైనిక పటాలానికి ఈయన్ని కమాండర్‌గా నియమించారు. ఆ సైనిక సమూహంలో హజ్రత్ అబూబక్ర్, హజ్రత్ ఉమర్ లాంటి ప్రముఖ సహాబీలు ఉన్నారు. మరి చూడబోతే అప్పటికి ఉసామా వయస్సు 18 మాత్రమే. ఈ సైన్యం దైవప్రవక్త (స) మరణం

కారణంగా పయనం కాలేకపోయింది. తరువాత హజ్రత్ అబూబక్ర్ (రజి) దీనిని పంపారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి నొందిన తరువాత హిజ్రీ 54లో ఈయన మరణించారు.

(٦٢٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ جَعَلَ الْبَيْتَ عَنْ يَسَارِهِ، وَمِنًى عَنْ يَمِيْنِهِ، وَرَمَى الْجَمْرَةَ بِسَبْعِ حَصَيَاتٍ، وَقَالَ: هَذَا مَقَامُ الَّذِي أُنْزِلَتْ عَلَيْهِ سُوْرَةُ الْبَقَرَةِ. مُتَّفَقٌ عَلَيْهِ.

627. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) వివరించారు: తాను, బైతుల్లాహ్ తన ఎడమ ప్రక్కకు, మినా కుడి ప్రక్కకు ఉండేటట్లు నిలబడి 'జమ్రా'పై ఏడు సార్లు రాళ్లు రువ్వారు. ఆయనిలా అన్నారు: ఆయన (స) ఇక్కడ నిలబడి ఉండగా ఆయన (స) పై బఖరా సూరా అవతరించింది . (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అంటే; బఖరా సూరాలోని హజ్ క్రియలకు సంబంధించిన ఆదేశాలు చాలా వరకు ఈ స్థలంలోనే అవతరించాయని భావం. హజ్ క్రియలు శాశ్వత ప్రాతిపదికగలవనీ, వాటిలో మార్పులు చేర్పులకు ఆస్కారం ఎంతమాత్రం లేదని ఈ హదీసు అంతరార్థం.

(٦٢٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَمَى رَسُولُ اللهِ ﷺ الْجَمْرَةَ يَوْمَ النَّحْرِ ضُحًى، وَأَمَّا بَعْدَ ذٰلِكَ، فَإِذَا زَالَتِ الشَّمْسُ. رَوَاهُ مُسْلِمٌ.

628. హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ రోజు చాష్త్ సమయాన జమ్రాపై కంకర రాళ్లు రువ్వారు. మరునాడు పొద్దువాలిన మీదట రువ్వారు." (ముస్లిం)

**సారాంశం**

మొదటిరోజు పొద్దు వాలకముందే రాళ్లు రువ్వాలి. మిగిలిన దినాలలో పొద్దు వాలిన తరువాతే రువ్వాలి. ఒకవేళ 10వ తేదీన పొద్దువాలక ముందు రాళ్లు రువ్వలేకపోతే, ఆ రోజే పొద్దువాలిన తరువాత రువ్వాలి.

(٦٢٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ كَانَ يَرْمِي الْجَمْرَةَ الدُّنْيَا بِسَبْعِ حَصَيَاتٍ، يُكَبِّرُ عَلَى إِثْرِ كُلِّ حَصَاةٍ، ثُمَّ يَتَقَدَّمُ، ثُمَّ يُسْهِلُ، فَيَقُومُ، فَيَسْتَقْبِلُ الْقِبْلَةَ،

629. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం ఆయన అన్నిటికన్నా ముందు దగ్గరలో వున్న జమ్రాపై ఏడు రాళ్లు రువ్వే వారు. ప్రతిసారీ రాయి రువ్వేటప్పుడు తక్బీర్ పలికేవారు. తరువాత ముందుకు పోయి మైదానంలో నిలబడేవారు. ఖిబ్లా వైపునకు అభిముఖమై సుదీర్ఘ సమయం ఖియామ్ చేసేవారు. చేతు

فَيَقُومُ طَوِيلاً، وَيَدْعُو، فَيَرْفَعُ يَدَيْهِ، ثُمَّ يَرْمِي الْوُسْطَى، ثُمَّ يَأْخُذُ ذَاتَ الشِّمَالِ، فَيُسْهِلُ، وَيَقُومُ مُسْتَقْبِلَ الْقِبْلَةِ، ثُمَّ يَدْعُو، فَيَرْفَعُ يَدَيْهِ، وَيَقُوْمُ طَوِيلاً، ثُمَّ يَرْمِي جَمْرَةَ ذَاتِ الْعَقَبَةِ، مِنْ بَطْنِ الْوَادِيْ، وَلاَ يَقِفُ عِنْدَهَا، ثُمَّ يَنْصَرِفُ، فَيَقُولُ: هٰكَذَا رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَفْعَلُهُ. رَوَاهُ الْبُخَارِيُّ.

లెత్తి దుఆ చేసేవారు. తరువాత మధ్య లో వున్న జమ్రాపై రాళ్లు రువ్వేవారు. తరువాత ఎడమవైపునకు వెళ్లేవారు. ఆ తరువాత మైదానంలోకి వచ్చి, ఖిబ్లా వైపునకు తిరిగి నిలబడేవారు. ఆ పైన చేతులెత్తి ప్రార్థించేవారు. అలా చాలా సేపు నిలబడి ఉండేవారు. ఆ తరువాత లోయ దిగువ వైపునుంచి జమ్రా అఖబాపై కంకరరాళ్లు రువ్వేవారు. అక్కడ మాత్రం నిలబడి ఉండక తిరిగి వచ్చేసేవారు. తాను దైవప్రవక్త (సఅసం) ఈ విధంగానే ఆచరించగా చూశానని ఇబ్నె ఉమర్ (రజి) చెప్పారు. (బుఖారీ)

**సారాంశం.**

జమ్రాపై రాళ్లు రువ్వే సమయంలో దైవప్రవక్త (సఅసం) అక్కడే నిలబడి ఉండేవారు కాదనీ, అక్కడినుంచి మైదాన ప్రాంతంలోనికి నడచివచ్చి, ఖిబ్లా వైపునకు తిరిగి ఎంతో నింపాదిగా దుఆ చేసేవారని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. కాబట్టి హజ్ యాత్రీకులు రాళ్లు రువ్వే సమయంలో అందరూ ఒకేచోట గుమికూడక విశాలమైన మైదానంలోకి తిరిగి రావాలి. ప్రశాంతంగా చేతులెత్తి దైవాన్ని వేడుకోవాలి. ఇలా చేయటం వల్ల తొక్కిసలాట నుండి తమను రక్షించుకున్నట్లూ అవుతుంది.

(٦٣٠) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «اللَّهُمَّ ارْحَمِ الْمُحَلِّقِينَ»، قَالُوا: وَالْمُقَصِّرِيْنَ، يَا رَسُولَ اللهِ! قَالَ فِي الثَّالِثَةِ: «وَالْمُقَصِّرِينَ». مُتَّفَقٌ عَلَيْهِ.

630. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రార్థించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "దేవా! శిరో ముండనం చేయించుకున్న హాజీలపై దయజూపు." సహచరులు ఇది విని, 'ఓ దైవప్రవక్తా (సఅసం)! జుత్తు కత్తిరించు కునే వారిపై కూడానా?' అని సందేహ పడగా, "జుత్తు కత్తిరించుకునేవారిపై కూడా" అని దైవప్రవక్త (స) మూడోసారి అన్నారు. (బుఖారీ, ముస్లిం)

(٦٣١) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ وَقَفَ فِي حَجَّةِ الْوَدَاعِ، فَجَعَلُوا يَسْأَلُونَهُ، فَقَالَ رَجُلٌ: لَمْ أَشْعُرْ، فَحَلَقْتُ قَبْلَ أَنْ أَذْبَحَ، قَالَ: «اِذْبَحْ وَلاَ حَرَجَ»، وَجَاءَ آخَرُ فَقَالَ: لَمْ أَشْعُرْ، فَنَحَرْتُ قَبْلَ أَنْ أَرْمِيَ، قَالَ: «اِرْمِ وَلاَ حَرَجَ»، فَمَا سُئِلَ يَوْمَئِذٍ عَنْ شَيْءٍ قُدِّمَ وَلاَ أُخِّرَ إِلاَّ قَالَ: «اِفْعَلْ وَلاَ حَرَجَ». مُتَّفَقٌ عَلَيْهِ.

631. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఒకచోట నిలుచున్నారు. సహచరులు ఆయన ఎదుట ధర్మసందేహాలు వెలిబుచ్చుతున్నారు. నాకు తెలీక ఖుర్బానీ ఇవ్వక ముందే శిరోముండనం చేయించుకున్నానని ఎవరో అన్నారు. "ఫరవాలేదు. ఇప్పుడు ఖుర్బానీ ఇవ్వు" అని ఆయన (స) సమాధానమిచ్చారు. తాను తెలీక కంకరరాళ్లు రువ్వకముందే ఖుర్బానీ ఇచ్చానని మరో వ్యక్తి విన్నవించుకోగా, "ఫరవాలేదు. ఇప్పుడు రాళ్లు రువ్వవచ్చు" అని ఆయన (స) సందేహ నివృత్తి చేశారు. ఆ రోజు ఆయన (స) ముందు పలువురు, ముందు చేయవలసింది వెనుక, వెనుక చేయవలసింది ముందు చేసినట్టు తమ పొరపాట్లను వెలిబుచ్చసాగారు. అందరికీ ఆయన (స) "ఏమీ ఫరవాలేదు. ఇప్పుడు వెళ్ళి సరిదిద్దుకోండి" అని చెప్పసాగారు.

(బుఖారీ, ముస్లిం)

(٦٣٢) وَعَنِ الْمِسْوَرِ بْنِ مَخْرَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَحَرَ قَبْلَ أَنْ يَحْلِقَ، وَأَمَرَ أَصْحَابَهُ بِذٰلِكَ. رَوَاهُ الْبُخَارِيُّ.

632. హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్రమ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా క్షవరం చేయించుకోకముందే ఖుర్బానీ ఇచ్చారు. తన సహచరులకు కూడా ఈ మేరకు ఆజ్ఞాపించారు. (బుఖారీ)

## హదీసు ఉల్లేఖకులు

మిస్వర్ బిన్ మఖ్రమ (రజి). శ్రీమంతులు. హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యోదంతం తరువాత మక్కాకు మకాం మార్చారు. యజీద్ బిన్ ముఆవియ హిజ్రీ 64లో మక్కాను ముట్టడించినపుడు ఆయన నమాజ్ చేస్తూ ఉండగా అగ్ని గోళం లాంటి ఒక ఆయుధం వచ్చి తగిలింది. ఈ గాయం తోనే ఆయన మరణించారు.

(٦٣٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا رَمَيْتُمْ وَحَلَقْتُمْ، فَقَدْ حَلَّ لَكُمُ الطِّيبُ، وَكُلُّ شَيْءٍ، إِلاَّ النِّسَاءَ**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَفِيْ إِسْنَادِهِ ضَعْفٌ.

633. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు : "కంకరరాళ్లు రువ్వి, క్షవరం చేయించుకున్న తరువాత ఒక్క భార్యలు తప్ప - సువాసన మరియు ప్రతిదీ మీ కొరకు ధర్మ సమ్మతం అయిపోయాయి." (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు- దీని పరంపర కొంత బలహీనంగా ఉంది)

(٦٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**لَيْسَ عَلَى النِّسَاءِ حَلْقٌ، وَإِنَّمَا عَلَى النِّسَاءِ التَّقْصِيرُ**». رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

634. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "స్త్రీలు శిరో ముండనం చేయరాదు. వారు (కొన్ని) శిరోజాలు కత్తిరించుకుంటే సరిపో తుంది." (అబూ దావూద్ దీనిని ప్రమాణ బద్ధమైన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

స్త్రీలు తలను పూర్తిగా గొరిగించుకోవలసిన అవసరం లేదని, వారు శిరోజాలు (కొన్ని) కత్తిరిస్తే సరిపోతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ధర్మవేత్తలంతా ఈ విషయమై ఏకీభవించారు.

(٦٣٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ الْعَبَّاسَ بْنَ عَبْدِ الْمُطَّلِبِ

635. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : 'మినా'లో గడపవలసిన రాత్రు లను మక్కాలో గడుపుతాననీ, తద్వారా

اسْتَأْذَنَ رَسُولَ اللهِ ﷺ أَن يَبِيتَ بِمَكَّةَ لَيَالِيَ مِنًى، مِنْ أَجْلِ سِقَايَتِهِ، فَأَذِنَ لَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

(హాజీలకు) జమ్ జమ్ జలం త్రాపేం దుకు వీలుకలుగుతుందని అబ్బాస్ బిన్ ముత్తలిబ్ (రజి) దైవప్రవక్త (సఅసం)ను విన్నవించుకోగా, అందుకు ఆయన (స) అనుమతిని ఇచ్చారు.

(బుఖారీ, ముస్లిం)

(٦٣٦) وَعَنْ عَاصِمِ بْنِ عَدِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَرْخَصَ لِرُعَاةِ الْإِبِلِ فِي الْبَيْتُوتَةِ عَنْ مِنًى، يَرْمُونَ يَوْمَ النَّحْرِ، ثُمَّ يَرْمُونَ الْغَدَ ومِنْ بَعْدِ الْغَدِ لِيَوْمَيْنِ، ثُمَّ يَرْمُونَ يَومَ النَّفْرِ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

636. హజ్రత్ ఆసిమ్ బిన్ అదీ (రజి) కథనం : ఒంటె కాపరులకు 'మినా' పరిధి వెలుపల రాత్రి గడపటానికి దైవ ప్రవక్త (సఅసం) అనుమతినిచ్చారు. ఖుర్బానీ ఇచ్చే రోజున కంకరరాళ్లు రువ్వటానికి, రెండో రోజు, మూడో రోజు కూడా రువ్వడానికి, అక్కడినుంచి వెళ్ళి పోయే రోజున కూడా రాళ్లు రువ్వడానికి వారికి (ప్రత్యేక) అనుమతి నొసగారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### హదీసు ఉల్లేఖకులు

ఆసిమ్ బిన్ అదీ (రజి). ఈయన మారుపేరు అబూ ఉబైద్ లేక అబూ అమ్ర్. బనూ ఉబైద్ బిన్ జైద్‌కు మద్దతుదారులు. బద్ర్ యుద్ధంలో, ఆ తర్వాతి యుద్ధాలలో కూడా పాల్గొన్నారు. బద్ర్ యుద్ధ సందర్భంగా ఈయన ఆలియా తెగలకు 'అమీర్'గా వ్యవహరించారని కూడా చెప్పబడుతోంది. హిజ్రీ 45లో మరణించారు. యమామ యుద్ధంలో వీర మరణం పొందారనీ, అప్పటికి ఆయన వయస్సు 120 సంవత్సరాలనీ మరో కథనం.

(٦٣٧) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: خَطَبَنَا رَسُولُ اللهِ ﷺ يَوْمَ النَّحْرِ، اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

637. హజ్రత్ అబూబక్రా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ ఇచ్చే రోజు ప్రసంగించారు. మరి హదీసునంతటినీ ఆయన వివరించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హజ్ జరుగుతున్న రోజుల్లో దైవప్రవక్త (స) అనేక ఉపన్యాసాలిచ్చారు. మాలికీ, హనఫీ ధర్మవేత్తల ప్రకారం జిల్ హజ్ 7వ తేదీన ఒక ప్రసంగం, అరఫాత్ మైదానంలో రెండవ ప్రసంగం, 11వ తేదీన మూడవ ప్రసంగం ఉంది. ఖుర్బానీ రోజున చేసిన ప్రసంగాన్ని హనఫీలు, మాలికీలు ప్రసంగంగా పరిగణించరు. దాన్ని కేవలం హితోపదేశంగా మాత్రమే భావిస్తారు. మరి కొంతమంది ధర్మవేత్తలు దీనిని సయితం ప్రసంగంగా తలంచారు. ఈ విధంగా వారి లెక్క ప్రకారం నాలుగు ప్రసంగాలవుతాయి.

(٦٣٨) وَعَنْ سَرَّاءَ بِنْتِ نَبْهَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خَطَبَنَا رَسُولُ اللهِ ﷺ يَوْمَ الرُّءُوسِ فَقَالَ: «أَلَيْسَ هَذَا أَوْسَطَ أَيَّامِ التَّشْرِيقِ؟» الْحَدِيْثَ. رَوَاهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

638. హజ్రత్ సర్రా బిన్తె నబ్హాన్ (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సఅసం) త్యాగోత్సవం నాడు మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగించారు. "ఏమిటీ? ఈ రోజు తష్రీఖ్ దినాలలోని మధ్య దినం కాదా?" అని ఆయన ఆ సందర్భంగా ప్రశ్నించారు. (దీనిని అబూదావూద్ ప్రమాణబద్ధమైన ఆధారాలతో ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

సర్రా బిన్తె నబ్హాన్ (ర.అన్హా). ఘనావియా తెగకు చెందిన మహిళ. దైవప్రవక్త (స) ప్రత్యక్ష సహచరురాలు (సహాబియా). రబీయ బిన్ అబ్దుర్రహ్మాన్ ఈమె నుండి హదీసును గ్రహించారు.

(٦٣٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهَا: «طَوَافُكِ بِالْبَيْتِ، وَسَعْيُكِ بَيْنَ الصَّفَا وَالْمَرْوَةِ، يَكْفِيكِ لِحَجِّكِ وَعُمْرَتِكِ». رَوَاهُ مُسْلِمٌ.

639. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఆమెనుద్దేశ్యించి ఇలా అన్నారు - "నీవు కాబా గృహ ప్రదక్షిణ చేసి, సఫా - మర్వాల మధ్య సయీ చేస్తే చాలు, నీ హజ్ మరియు ఉమ్రాలు నెరవేరుతాయి." (ముస్లిం)

### సారాంశం

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉమ్రా నిమిత్తం 'తల్బియా' పలికారు. కాని కాబా గృహాన్ని సమీపించకముందే బహిష్టు అయ్యారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆమెనుద్దేశ్యించి, "ఉమ్రాను వదలిపెట్టు. హజ్ కోసం (తరువాత) ఇహ్రామ్ దీక్షబూను" అని సలహా ఇచ్చారు. ఆ సందర్భంగా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) సహజంగానే కించిత్ నిరాశకు గురయ్యారు. దైవప్రవక్త (స) ఆమెను ఓదార్చే ధోరణిలో పై హదీసులోని మాటలన్నారు.

(٦٤٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ لَمْ يَرْمُلْ فِي السَّبْعِ الَّذِيْ أَفَاضَ فِيْهِ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ التِّرمِذِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

640. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తిరుగు ప్రయాణం సందర్భంగా కడసారి చేసిన తవాఫ్ (ప్రదక్షిణ)లో ఏడు రౌండ్లు తిరిగారు. కాని ఏ ఒక్క రౌండులో కూడా 'రమల్' చేయలేదు. (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమయిన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

'రమల్' అంటే వేగంగా నడవటం అని అర్థం. తొలిసారి 'తవాఫ్'లో మాత్రమే 'రమల్' ఉంటుంది. 'తవాఫె విదా'లోగానీ, 'తవాఫె ఇఫాజా'లోగానీ 'రమల్' ఉండదు.

'రమల్' కేవలం పురుషులకు మాత్రమే ప్రత్యేకం. ఇది స్త్రీలకు వర్తించదు. ఒకవేళ ఎవరయినా తొలిసారి తవాఫ్‌లో రమల్ చేయటం మరచిపోతే, మలిసారి తవాఫ్‌లో దాన్ని నెరవేర్చ వచ్చు.

(٦٤١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ صَلَّى الظُّهْرَ وَالعَصْرَ وَالْمَغْرِبَ وَالْعِشَاءَ، ثُمَّ رَقَدَ رَقْدَةً بِالْمُحَصَّبِ، ثُمَّ رَكِبَ إِلَى الْبَيْتِ، فَطَافَ بِهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

641. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) నిర్ణీత సమయాలలో (క్రమం ప్రకారం) జుహ్ర్ మరియు అస్ర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజులు చేశారు. 'ముహస్సబ్' స్థలంలో కాస్సేపు నిద్రపోయారు. తరువాత స్వారీ అయి బైతుల్లాహ్ వైపునకు వెళ్ళారు. తవాఫ్ చేశారు." (బుఖారీ)

**సారాంశం**

హజ్ ముగించుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్నప్పుడు చేసిన తవాఫ్ (తవాఫె విదా)ఇది. 'ముహస్సబ్' అనే స్థలం రెండు పర్వతాల మధ్య ఉంది. ఇది మక్కానుండి మినాకు గల దూరం కన్నా తక్కువే.

(٦٤٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّهَا لَمْ تَكُنْ تَفْعَلُ ذٰلِكَ – أَيِ النُّزُوْلَ

642. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) 'అబ్‌తహ్'లోయలో ఆగేవారు కాదు. దైవప్రవక్త (సఅసం) ఇక్కడ విడిది చేయ

بِالأَبْطَحِ – وَتَقُولُ: إِنَّمَا نَزَلَهُ رَسُولُ اللهِ ﷺ لِأَنَّهُ كَانَ مَنْزِلاً أَسْمَحَ لِخُرُوجِهِ. رَوَاهُ مُسْلِمٌ.

టానికి కారణం తిరుగు ప్రయాణంలో సౌలభ్యం చేకూరాలన్నది తప్ప మరేమీ కాదని ఆమె (ర.అన్హా) అంటూ ఉండే వారు. (ముస్లిం)

(٦٤٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أُمِرَ النَّاسُ أَن يَكُونَ آخِرُ عَهْدِهِمْ بِالْبَيْتِ، إِلاَّ أَنَّهُ خُفِّفَ عَنِ الْحَائِضِ. مُتَّفَقٌ عَلَيْهِ.

643. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ప్రజలకు ఇలా ఆజ్ఞాపించారు - "అన్నిం టికన్నా ఆఖరిలో మీరు చేయవలసిన పని కాబా గృహ ప్రదక్షిణ. అయితే రుతు స్రావానికి గురై వున్న స్త్రీల కొరకు ఇది మినహాయించబడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇది తవాఫె విదా (వీడ్కోలు ప్రదక్షిణ) కు సంబంధించిన ఆజ్ఞ. హజ్ క్రియలన్నింటినీ నెరవేర్చి తిరిగి వచ్చే సమయంలో ఈ ప్రదక్షిణ చేయబడుతుంది. ఒక్క ఇమామ్ మాలిక్ (రహ్మతుల్లై) తప్ప మిగిలిన ఇమాములందరి దృష్టిలో ఇది వాజిబ్ (తప్పనిసరి). ఒకవేళ ఏ కారణంగానయినా దీన్ని నెరవేర్చలేకపోతే పరిహారం (దమ్)గా ఒక మేకను ఇవ్వవలసి ఉంటుంది. అయితే బహిష్టు స్త్రీలకు ఇది వర్తించదు.

(٦٤٤) وَعَنِ ابْنِ الزُّبَيرِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«صَلاَةٌ فِي مَسْجِدِي هَذَا، أَفْضَلُ مِنْ أَلْفِ صَلاَةٍ فِيمَا سِوَاهُ، إِلاَّ الْمَسْجِدَ الحَرَامَ، وَصَلاَةٌ فِي الْمَسْجِدِ الْحَرَامِ، أَفْضَلُ مِنْ صَلاَةٍ فِي مَسْجِدِي هَذَا بِمِائَةِ صَلاَةٍ»**. رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

644. హజ్రత్ ఇబ్నె జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "నా ఈ మస్జిదులో చేసిన ఒక నమాజ్‌కు లభించే పుణ్యం ఇతర మస్జిదులలో చేసే నమాజ్‌కు లభించే పుణ్యంకన్నా వెయ్యిరెట్లు అధికం. ఇక మస్జిదె హరామ్ మాటే వేరు. మస్జిదె హరామ్‌లో చేసిన ఒక నమాజ్ నా ఈ మస్జిదులో చేసిన నూరు నమాజులకన్నా శ్రేష్ఠ మయినది." (అహ్మద్ దీనిని ఉల్లేఖిం చారు- ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసులో మస్జిదె నబవీ మరియు బైతుల్లాహ్‌లలో చేసే నమాజ్ యొక్క మహత్తు గురించి చెప్పబడింది. 'నా ఈ మస్జిద్' అని దైవప్రవక్త (స) అన్నారు. అంటే 'మస్జిదె నబవీ' అని దీని భావం.

'మస్జిదె అఖ్సా'లో చేసే ఒక నమాజ్ ఇతర మస్జిదులలో చేసే 500 నమాజులకు సమానమని 'తబ్రానీ'లోని ఒక ఉల్లేఖనంలో ఉంది. మస్జిదె నబవీలో చేసే ఒక నమాజ్‌కు ప్రాప్తమయ్యే పుణ్యఫలం వెయ్యి సాధారణ నమాజులకు సమానం. అలాగే మస్జిదె హరామ్‌లో చేసే ఒక నమాజ్ ఇతర మస్జిదులలో చేసే లక్ష నమాజులకు సమానం.

### హదీసు ఉల్లేఖకులు

ఇబ్నె జుబైర్ (రజి). అసలు పేరు అబ్దుల్లాహ్. మారుపేరు అబూబకర్. పూర్తి వంశపరంపర ఇలా వుంది - అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ బిన్ అవ్వామ్. ఖురైష్‌తో అనుబంధమున్న అసద్ తెగకు చెందినవారు. ఈయన తల్లి అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్హా) హిజ్రత్ సమయంలో గర్భవతిగా ఉన్నారు. 'ఖుబా' వద్దకు చేరుకునేసరికి ఇబ్నె జుబైర్ (రజి) జన్మించారు. హిజ్రత్ తరువాత ముస్లిం సమాజంలో జన్మించిన తొలి శిశువు ఈయనే. ఈయన అత్యధికంగా ఉపవాసాలు పాటించేవారు. ఎక్కువ సమయం దైవారాధనలో గడిపేవారు. మంచి శరీర సౌష్ఠవం కలవారు. వాక్చాతుర్యం గలవారు. సత్యప్రేమికులు. ఆత్మీయుల అగత్య స్థితిని అర్థం చేసుకునేవారు. హిజ్రీ 64లో యజీద్ బిన్ ముఆవియ మరణానంతరం ఈయన చేతిపై ప్రమాణం (బైత్) చేయటం జరిగింది. హిజాజ్, ఇరాక్, యమన్, ఈజిప్టు, సిరియాలోని అధికాంశ భాగంపై ఈయన పట్టు సంపాదించారు. హజ్జాజ్ బిన్ యూసుఫ్ సఖఫీ మక్కాలో ఈయన్ని దిగ్బంధం చేసి హిజ్రీ 73లో నిర్దాక్షిణ్యంగా ఉరివేసి చంపాడు.

### 6వ అధ్యాయం

## ٦ - بَابُ الفَوَاتِ وَالْإِحْصَارِ

## హజ్జ్‌ను కోల్పోయినవారు, ఆపబడినవారు

(٦٤٥) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَدْ أُحْصِرَ رَسُولُ اللهِ ﷺ، فَحَلَقَ رَأْسَهُ، وَجَامَعَ نِسَاءَهُ، وَنَحَرَ هَدْيَهُ،

645. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను కాబాగృహం వరకూ చేరకుండా ఆపటం జరిగింది. ఆయన (స) శిరోముండనం చేయించుకున్నారు. తన సతీమణులతో లైంగిక సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఖుర్బానీ (జంతు

حَتَّى اعْتَمَرَ عَاماً قَابِلاً. رَوَاهُ الْبُخَارِيُّ.

వును బలి)ఇచ్చారు. మళ్లీ వచ్చే సంవత్సరం ఆయన (స) ఉమ్రా చేశారు.

(బుఖారీ)

## సారాంశం

ఈ హదీసు హుదైబియా ఒప్పందాన్ని సూచిస్తోంది. హిజ్రీ 6వ సంవత్సరంలో దైవప్రవక్త (సఅసం) ఇహ్రామ్ కట్టుకుని తన సహచరుల వెంట హజ్ కోసం బయలుదేరారు. హుదైబియా వద్ద ముష్రిక్కులు అడ్డుకుని, ముందుకు వెళ్లనివ్వలేదు. ఆయన (స) అక్కడే 'ఇహ్రామ్' ను విడువవలసివచ్చింది. హుదైబియాలోనే ఖుర్బానీ ఇచ్చి క్షవరం చేయించుకున్నారు. ప్రవక్త సహచరులు కాస్సేపు తటపటాయించి, ఆ తరువాత ఇహ్రామ్ దీక్షను విరమించారు. తమ వద్ద వున్న జంతువులను ఖుర్బానీ ఇచ్చారు.

దీనినే 'ఇహ్సార్' అంటారు. ఇహ్సార్ అంటే అడ్డురావటం, నిలువరించటం, ముట్టడించటం, ఆటంకం సృష్టించటం అన్న అర్థాలు వస్తాయి. హజ్ యాత్రకు బయలుదేరిన వారిని దారిలో శత్రువులు అటకాయించి, హజ్ చేయకుండా అవరోధాలు సృష్టిస్తే అప్పుడేం చేయాలి? నిలువరించబడిన చోటే వారు తమ 'ఇహ్రామ్'ను విడువాలి. అయితే 'ఖుర్బానీ' ఎక్కడ ఇవ్వాలన్న విషయంపై ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇహ్రామ్‌ను విడిచిన చోటే ఖుర్బానీ ఇవ్వాలని అధికసంఖ్యాక పండితులు అభిప్రాయపడ్డారు. కాని హనఫీ ధర్మవేత్తల దృష్టిలో హరమ్ పరిధిలోనే ఖుర్బానీ ఇవ్వాలి. ఎవరిద్వారానయినా ఖుర్బానీ జంతువును హరమ్‌కు పంపించాలి. అలా వీలుపడకపోతే మాత్రం ఆపబడిన చోటే ఖుర్బానీ ఇవ్వవచ్చు.

ఇక హజ్ నుండి ఆపబడిన వ్యక్తిపై ఖుర్బానీ వాజిబ్ (తప్పనిసరి) అవుతుందా? లేదా? అన్నది మరో ప్రశ్న. చాలామంది ధర్మవేత్తలు 'అవున'ంటారు. ఇమామ్ మాలిక్ మాత్రం తప్పనిసరి (వాజిబ్) కాదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, హుదైబియాలో నిలువరించబడినపుడు ప్రవక్త సహచరులందరివద్దా ఖుర్బానీ జంతువులు లేవనీ, ఒకవేళ ఖుర్బానీ వాజిబ్ అయివుంటే అందరికోసం వాజిబ్ అయివుండేదికదా! అని ఆయన వాదించారు.

(٦٤٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَ النَّبِيُّ ﷺ عَلَى ضُبَاعَةَ بِنْتِ الزُّبَيْرِ بْنِ عَبْدِ الْمُطَّلِبِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنِّي أُرِيدُ الحَجَّ، وَأَنَا شَاكِيَةٌ، فَقَالَ النَّبِيُّ ﷺ: «حُجِّي وَاشْتَرِطِي أَنَّ مَحِلِّي حَيْثُ حَبَسْتَنِي». مُتَّفَقٌ عَلَيْهِ.

646. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుబాఅ బిన్తె జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర.అన్‌హా) ఇంటికి వెళ్ళగా, 'దైవప్రవక్తా (స)! నాకు హజ్ చేయాలని వుంది. కాని నేను వ్యాధిగ్రస్తురాలిని' అని ఆమె విన్నవించుకున్నది. దానికి ఆయన (స) ఇలా సలహా ఇచ్చారు - "హజ్ చెయ్యి. అయితే దేవా! నీవు నన్ను ఆపిన చోటే నేను 'ఇహ్రామ్' దీక్షను విరమిస్తాను అని షరతు పెట్టుకో."

(ముస్లిం)

## హదీసు ఉల్లేఖకులు

జుబాఅ బిన్తె జుబైర్ (ర.అన్హా). మారుపేరు ఉమ్మె హకీమ్! వంశపరంపర ఈ విధంగా ఉంది: జుబాఅ బిన్తె జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ బిన్ అబ్దె మునాఫ్. ఈమె దైవప్రవక్త (సఅసం) బాబాయి కూతురు. మిఖ్దాద్ బిన్ అస్వద్ భార్య. ఈమెకు అబ్దుల్లాహ్, కరీమా అనే ఇద్దరు పిల్లలున్నారు. హజ్రత్ అలీ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈమె మరణించారు.

(٦٤٧) وَعَنْ عِكْرِمَةَ عَنِ الْحَجَّاجِ ابْنِ عَمْرٍو الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ كُسِرَ أَوْ عَرِجَ فَقَدْ حَلَّ، وَعَلَيْهِ الْحَجُّ مِنْ قَابِلٍ»، قَالَ عِكْرَمَةُ: فَسَأَلْتُ ابْنَ عَبَّاسٍ وَأَبَا هُرَيْرَةَ عَنْ ذٰلِكَ، فَقَالاَ: صَدَقَ. رَوَاهُ الْخَمْسَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

647. హజ్రత్ ఇక్రిమ (రహ్మ.లై) హజ్జాజ్ బిన్ అమ్ర్ అన్సారీ (రజి) ఆధారంగా చేసిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "కాలు విరగ్గొట్టబడిన వాడు లేదా కుంటివాడైపోయినవాడు 'ఇహ్రామ్' స్థితినుండి బయటపడి పోయాడు. వచ్చే సంవత్సరం అతడు హజ్ చేయటం అనివార్యం." - ఇక్రిమ ఇలా తెలిపారు: దీనిగురించి నేను హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి)ను, అబూ హురైర (రజి)ను దర్యాప్తు చేయగా, "హజ్జాజ్ బిన్ అమ్ర్ నిజం చెప్పాడు" అని వారన్నారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు- తిర్మిజీ దీనిని ప్రమాణబద్ధమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

గత మూడు హదీసుల ద్వారా బోధపడేదేమిటంటే హజ్ కొరకు ఇహ్రామ్ దీక్షబూనిన వ్యక్తి మూడు కారణాల దృష్ట్యా ఇహ్రామ్‌ను విరమించగలడు. (1) ముట్టడించబడినందువల్ల లేదా నిలువరించబడినందువల్ల - ఈ ముట్టడి ఏ కారణంతో జరిగినాసరే. (2) ఫలానా పరిస్థితి ఎదురైతే నేను ఇహ్రామ్‌ను పరిత్యజిస్తానని ముందునుంచే సంకల్పం చేసుకుని (షరతు పెట్టుకుని) ఉండటం వల్ల. (3) ఏదైనా ప్రమాదానికి గురై కాలికి గాయమవటం వల్ల.

## హదీసు ఉల్లేఖకులు

(1) ఇక్రిమ (రహ్మ.లై). మారుపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) గారి బానిస. బర్బర్ తెగకు చెందినవారు. పెద్ద పండితుల కోవకు చెందినవారు. మక్కాకు

చెందిన 'ఫుకహా' (ధర్మవేత్తల)లో ఒకరుగా పరిగణించబడేవారు. తాబయీల మధ్యతరానికి చెందిన వారు. హిజ్రీ 107లో సరిగ్గా 80 సంవత్సరాల వయస్సులో మరణించారు.

(2) హజ్జాజ్ బిన్ అమ్ర్ అన్సారీ (రజి) : పూర్తి పరంపర ఇలా వుంది - హజ్జాజ్ బిన్ అమ్ర్ బిన్ గజియ అన్సారీ మాజినీ మదనీ. ప్రవక్త సహచరులలో ఒకరు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) వెంట ఉన్నారు. ఈయన రెండు హదీసులను ఉల్లేఖించారు. వాటిలో ఈ హదీసు ఒకటి.

## తుది పలుకులు

"బులూగుల్ మరామ్" మొదటి భాగం దీంతో సమాప్తమయిందని రచయిత హాఫిజుల్ అస్ర్, ఖాజియుల్ ఖుజాత్ (ఛీఫ్ జస్టిస్) అబుల్ ఫజల్ అహ్మద్ బిన్ అలీ బిన్ హజర్ అల్ కినానీ అల్ అస్ఖలానీ మిస్రీ తెలిపారు. కారుణ్యప్రభువైన అల్లాహ్ ఆయన మేళ్లను కలకాలం సజీవంగా ఉంచుగాక! హిజ్రీ 827 రబీవుల్ అవ్వల్ 12వ తేదీన ఈ పనిని ముగించాననీ, రెండవ భాగం 'వాణిజ్య పుస్తకం' నుండి మొదలవుతుందనీ ఆయన తెలియజేశారు. అల్లాహ్ ఈ రచయితను, ఆయన తల్లిదండ్రులనూ, సమస్త ముస్లిములనూ తన కారుణ్య ఛాయలోకి తీసుకోవాలని ప్రార్థన. మనకు అల్లాహ్యే చాలు. ఆయనే అత్యుత్తమ కార్యసాధకుడు!

# హదీసు మకరందం (బులూఘుల్ మరామ్) - 2

[ తెలుగు ]

# بُـــلـــوغُـــل مَـــــرَام - 2

[اللغة التلغو ]


రబువ జాలియాత్

الجاليات بالربوة

ఇబ్నె హజర్

ابن هجر

అనువాదం : - అజీజుర్రహ్మాన్

ترجمة: - عزيز الرحمان

పునర్విమర్శ : ముహమ్మద్ కరీముల్లాహ్

مراجعة: محمد كريم الله



రబువ జాలియాత్ - రియాద్

المكتب التعاوني للدعوة وتوعية الجاليات بالربوة بمدينة الرياض

2009 –1430

islamhouse.com


بسم الله الرحمن الرحيم

# హదీసు మకరందం

## బులూఘుల్ మరామ్

### రెండవ భాగం


సంకలనం

అబుల్ ఫజల్ షిహాబుద్దీన్ అహ్మద్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మాలై)

వ్యాఖ్యానం

మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్‌పూరి



అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్

హైదరాబాద్ - 59

**Hadeesu Makarandam - Part - 2**

Bulugh Al-Maram (Telugu)


Compiled by : Al-Hafiz Ibn Hajar Al-Asqalani (R.A.)

Commentary : Maulana Safi-ur-Rahman Mubarakpoori

Translated by : Al-Huq Educational & Welfare Society, Hyd.



*All Rights Reserved with Publishers*



First Edition : April, 2005

**Copies : 2000**

**Hadya : Rs. 225-00**

Published by : **AL HUQ TELUGU PUBLICATIONS**
Under the Management of
**Al-Huque Educational & Welfare Society**
Eidgah Compound, Akbar Bagh,
Sayeedabad, Hyderabad - 500 059.
Phone: 24550007, 24551582

E-mail : alhaqsociety@yahoo.com
website : www.alhaqsociety.org

Typeset by : Golden Graphics
Chatta Bazar, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# ఆకాంక్ష !

విశ్వవిఖ్యాత హదీసు గ్రంథం **"బులూఘ్-అల్-మరామ్"**ను అల్ హుఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోని **'అల్ హుఖ్ తెలుగు పబ్లికేషన్స్'** తెలుగులో ప్రచురించటం శుభసూచకం. అంతిమ దైవ సందేశహరులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనల సుగంధ పరిమళాన్ని తెలుగునాట గుబాళించే ప్రయత్నంలో ఈ పుస్తక ముద్రణ కూడా ఓ ప్రధాన ఘట్టమని మా అభిప్రాయం. ఇంతకు ముందు **అల్ హుఖ్ తెలుగు పబ్లికేషన్స్** ప్రచురించిన **"అల్లూలూ వల్ మరజాన్"** (మహాప్రవక్త-స-మహితోక్తులు) హదీసు గ్రంథానికి తెలుగు పాఠకుల నుండి లభిస్తున్న ఆదరణ మరువురానిది. ఇప్పుడు మీ ముందున్న ఈ **'హదీసు మకరందం'** కూడా మనందరి ధర్మావగాహనలో దోహదకారి కాగలదని భావిస్తున్నాము.

దైవచిత్తమయితే హదీసు, సీరత్‌లపై తెలుగులో మరెన్నో అమూల్యమైన గ్రంథాలను మీ ముందుకు తీసుకురావాలన్నది మా ఆకాంక్ష. కరుణామయుడైన అల్లాహ్ కటాక్షిస్తే, పాఠకులైన మీరంతా ఆదరువుగా నిలిస్తే ఈ ఆకాంక్ష నెరవేరటం అసంభవమేమీ కాదు. ఈ పుస్తక ముద్రణలో తోడ్పడిన శ్రేయోభిలాషులందరికీ దైవం ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని ప్రార్థన (ఆమీన్).

- ముహమ్మద్ యూసుఫ్

ప్రెసిడెంట్,
**అల్ హుఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్.**

# ఆప్త వచనం

మానవ జీవితంలో దైవాదేశాల భూమిక మౌలికమయింది, అనివార్యమయింది. దైవాదేశాల ఛాయలో సాగని జీవితం ఎండమావుల పాలయిపోతుంది. దైవాదేశాల పాలనకు ప్రధాన మార్గం దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సంప్రదాయం, సున్నత్. సున్నత్‌ని విడనాడితే దైవాదేశాల పాలన ఒక్క క్షణానికీ ముందుకు సాగదు. అందువల్లనే ఇస్లామీయ జీవన మార్గం ఉనికిలోకి వచ్చిన తొలినాటి నుండీ ప్రవక్త సంప్రదాయాన్ని పదిలపరచుకోవడం, దాన్ని ప్రాణ ప్రదంగా అనుసరించడం ముస్లిమ్ సముదాయంలో నిరంతరంగా కొనసాగిన విధానం.

మహనీయ ముహమ్మద్ (స) ఆచరణను, ఆయన సూక్తులను సేకరించి, సంకలనం చేసి, ప్రచురించడం, ప్రజలకు అందజేయడం కేవలం పుణ్యకార్యమే కాదు, ఇస్లామీయ జీవిత విధానం ప్రజల్లో కలకాలం సజీవపాత్ర వహించడానికి అనివార్యమయిన అంశం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవిత వివరాలు, ఆయన ప్రవచనాలు ఒక్కొక్క దాన్ని ఆయన అనుయాయులు భద్రపరచగా వాటిని గ్రంథస్థం చేసి వెలలేని సంపదను అనేక సంపుటాలలో పొందుపరచిన మహనీయులు చాలా మంది ఎనలేని మహోపకారాన్ని చేశారు తరువాతి తరాలకు. ఆ వేనవేల ప్రవచనాలు, ఆచరణల వివరాలు అందరికీ అందుబాటులో ఉన్నా వాటిని పూర్తిగా అధ్యయనం చేయడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. అందుకే అనేక సంకలనాలు తొలి నుంచీ వస్తున్నాయి. అలాంటి ఒక సంకలనమే "బులూగుల్ మరామ్."

"బులూగుల్ మరామ్" వంటి బృహత్ గ్రంథాన్ని పూర్తిగా తెలుగు ప్రజలకు అందజేయాలన్న సంకల్పం ఎంతయినా పుణ్యప్రదం, ప్రయోజనకరం కూడా. మిత్రులు, ఒకనాటి 'గీటురాయి' సంపాదక సహచరులు, శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ అనువాద బాధ్యతను వహించడం అనువాద ప్రామాణికతను చాటుతోంది. అనువాదం సహజంగా, సరళంగా సుబోధకంగా సాగింది. అక్కడక్కడ సరళత లోపించిందేమో అనిపించినా మొత్తానికి సులభగ్రాహ్యంగానే ఉంది. పరిపూర్ణత, పరిపక్వత అన్నది కేవలం పరమ ప్రభువుకే స్వంతం. మానవ మాత్రులమయిన మనం కేవలం ఆ గుణానికి స్వల్పమయిన నీడలుగానే అలరారగలం. పరిణతిని సాధించేందుకు కృషిచేసే సద్బుద్ధి దైవం అందరికీ ప్రసాదించాలని కోరుకుందాం.

ఈ అనువాద గ్రంథాన్ని అందంగా అలంకరించి ప్రచురించిన అల్ హుఖ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలోని 'అల్ హుఖ్ తెలుగు పబ్లికేషన్స్' వారు ఎంతయినా అభినందనీయులు. దైవం వారికి, వారికి తోడ్పడేవారికి ఇహపరాల శుభాలు అనుగ్రహించుగాక!...ఆమీన్

**- ఎస్.ఎమ్. మలిక్**
**గీటురాయి సంపాదకులు**
**05-05-2005**

మహా కరుణగలవాడు, అత్యంత దయామయుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను

# ఈ పుస్తకం గురించి...

ఇస్లామ్ ధర్మ సంస్థాపనా కార్యక్రమంలో ఖుర్ఆన్, హదీసు గ్రంథాలు రెండూ నిర్వహించే భూమిక దాదాపు సమానమైన ప్రాముఖ్యం కలది, ఏ ఒక్కటీ విస్మరించదగినది కాదు. రెండింటికీ మధ్య అవినాభావ సంబంధం ఉంది. అవిచ్ఛిన్నమైన అనుబంధం ఉంది. అవి పడుగూ పేకల్లాంటివి, ఇహపర లోకాల్లాంటివి. ఈ రెండు గ్రంథాలు ఇస్లామ్ మత ధర్మానికి మూలగ్రంథాలు, పునాది గ్రంథాలు.

దివ్యఖుర్ఆన్ గ్రంథం దైవప్రోక్తమైనది, దైవవాణి ద్వారా అవతరించినది. పవిత్ర హదీసు గ్రంథం అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) ప్రోక్తమైనది, ఆయన చెప్పినది, ఆయన చేసినది, ఆయన సంప్రదాయం, ఆయన ఆదర్శం. ఖుర్ఆన్ గ్రంథంలో విశ్వాసాలు, సిద్ధాంతాలు ఉంటే, హదీసు గ్రంథంలో వాటికి సంబంధించిన వ్యాఖ్యానాలు, వివరణలు, విశ్లేషణలు ఉన్నాయి. అపురూపమైన ఈ రెండింటి మిశ్రమమే ఇస్లామ్ ధర్మం. ఈ రెండూ ఇస్లామ్ రథ చక్రాలే. కనుక ఇస్లామ్‌పై నడిచేందుకు ఖుర్ఆన్, హదీసులను సమగ్రంగా అవగాహన చేసుకోవడం చాలా అవసరం. స్వయంగా మహాప్రవక్త (స)యే తన ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు: **"నేను మీ మధ్య రెండు వస్తువులను వదిలిపోతున్నాను. మీరు వాటిని గట్టిగా పట్టుకుని ఉన్నంత కాలం సన్మార్గం తప్పిపోరు. అవేమిటంటే, ఒకటి, అల్లాహ్ గ్రంథమైన దివ్యఖుర్ఆన్. రెండోది, ఆయన ప్రవక్త (స) యొక్క సంప్రదాయం."** ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఖుర్ఆన్, హదీసులు రెండూ ప్రళయం వచ్చేవరకు మార్గదర్శకాలుగా ఉంటాయి. మరణానంతరం, స్వర్గలోకానికి పోదలచుకున్నవారు, నరక జ్వాలల నుంచి తమను తాము రక్షించుకోదలచినవారు ఖుర్ఆన్, హదీసులను విశ్వసించటం, వాటి ప్రకారం తమ జీవితాలను మలచుకోవటం అత్యంతావశ్యకం.

ఇస్లామ్ కేవలం ఒక మతం మాత్రమే కాదు. అది ఒక సంపూర్ణమైన, సమగ్రమైన, ఆచరణ యోగ్యమైన జీవిత విధానం కూడా. అంతేకాదు అది సార్వజనీనం, సార్వకాలికం కూడా. మానవ జీవితానికి సంబంధించిన రంగాలు

ఎన్నయితే ఉన్నాయ్యో వాటన్నింటిని గురించీ అది చర్చిస్తుంది. వాటికి కావలసిన, సమంజసమైన, సహేతుకమైన మార్గదర్శక సూత్రాలను కూడా అది ప్రతిపాదిస్తుంది. వ్యక్తి మంచివాడు కావాలనీ, అప్పుడే ఒక మంచి కుటుంబం, ఒక మంచి సమాజం, ఒక మంచి ప్రభుత్వం ఉనికిలోకి వస్తాయని అది బోధిస్తుంది. దైవభక్తి, దైవభయం అనే సుగుణాలు వ్యక్తిలో బాధ్యతాభావాన్ని కలిగిస్తాయి. తాను చేసేది చెప్పేది అంతా దేవుడు చూస్తున్నాడనీ, మరణానంతరం తీర్పు దినం నాడు దానిని గురించి ఆయన అడుగుతాడనే సత్కార్యాలు చేస్తే స్వర్గానికి పోతాననీ, దుష్కార్యాలు చేస్తే నరకాగ్నికి గురి అవుతాననీ, అసలు జీవితం, శాశ్వతంగా ఉంటే జీవితం పరలోక జీవితమనీ, ఇహలోక జీవితం క్షణభంగురమనీ మనిషి ఆలోచిస్తాడు. ఇలాంటి ఆధ్యాత్మిక చింతన వ్యక్తిని విప్లవాత్మకంగా మార్చివేస్తుంది.

**'బులూఘుల్ మరామ్'** అనే హదీసుల సంకలన గ్రంథాన్ని **'హదీసు మకరందం'** అనే పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు అనువాదం చాలా సరళంగానూ, హాయిగానూ, మనోజ్ఞంగానూ ఉంది. ధర్మజ్ఞాన పిపాసులకు ఈ పుస్తకం అద్భుతంగా తోడ్పడుతుంది అనే విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. తెలుగు ధార్మిక సాహితీ జగత్తుకు ఇది ఒక కలికితురాయిగా అలరారుతుంది అన్నా, అది అతిశయోక్తి కాదు. కరుణామయుడైన అల్లాహ్ అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్, హైదరాబాద్ వారి ఈ కృషినీ, ఈ కృతినీ స్వీకరించుగాక! **-ఆమీన్**

**షేఖ్ హమీదుల్లా షరీఫ్**

**దివ్యఖుర్‌ఆన్ తెలుగు అనువాదకులు**

# విషయ సూచిక


**7. వాణిజ్య పుస్తకం** **1**

1వ అధ్యాయం : క్రయ విక్రయాలు 1
2వ అధ్యాయం : వ్యాపారంలో నిర్ణయాధికారం 35
3వ అధ్యాయం : వడ్డీ 37
4వ అధ్యాయం : 'అరాయ'గా వచ్చిన తోట ఫలాల అమ్మకానికి అనుమతి 48
5వ అధ్యాయం : అడ్వాన్సు చెల్లింపు, అప్పు మరియు కుదువ పెట్టడం గురించి 52
6వ అధ్యాయం : దివాలా తీయటం, జప్తు చేసుకోవటం గురించి 58
7వ అధ్యాయం : ఒడంబడిక 68
8వ అధ్యాయం : రుణం మార్పిడి, భరోసా 71
9వ అధ్యాయం : భాగస్వామ్యం, అధికారాల అప్పగింత 75
10వ అధ్యాయం : సత్యప్రకటన 80
11వ అధ్యాయం : అప్పుగా తీసుకున్న వస్తువుల గురించి 81
12వ అధ్యాయం : దురాక్రమణ 84
13వ అధ్యాయం : షుఫా 87
14వ అధ్యాయం : ముజారబత్ 91
15వ అధ్యాయం : నీటిపారుదల, కౌలుదారీ విధానం 93
16వ అధ్యాయం : బంజరు భూములను సాగుచేయటం 99
17వ అధ్యాయం : వక్ఫ్ 104
18వ అధ్యాయం : హిబా (స్వయం సమర్పణ), ఉమ్రా (శాశ్వత కానుక) మరియు రుఖ్బా 108
19వ అధ్యాయం : లుఖతా (దొరికిన వస్తువులు) 116
20వ అధ్యాయం : ఆస్తుల పంపకం 121
21వ అధ్యాయం : వీలునామా నియమాలు 130
22వ అధ్యాయం : అమానతు (అప్పగింత) 134

**8. నికాహ్ పుస్తకం** **135**

1వ అధ్యాయం : కుఫ్వ్, **ఖియార్** (సమానస్థాయి మరియు నిర్ణయాధికారం) 158
2వ అధ్యాయం : స్త్రీలతో(**భార్యలతో**) వ్యవహారసరళి 170

| | | | |
|---|---|---|---|
| 3వ అధ్యాయం | : | మహర్ హక్కు | 180 |
| 4వ అధ్యాయం | : | వలీమా | |
| 5వ అధ్యాయం | : | భార్యల మధ్య వంతుల విభజన | 196 |
| 6వ అధ్యాయం | : | ఖులా | 201 |
| 7వ అధ్యాయం | : | తలాఖ్ | 204 |
| 8వ అధ్యాయం | : | విడాకుల ఉపసంహరణ గురించి | 215 |
| 9వ అధ్యాయం | : | ఈలా, జిహార్, కఫ్ఫారా | 216 |
| 10వ అధ్యాయం | : | లియా (శాప ప్రకరణం) | 220 |
| 11వ అధ్యాయం | : | ఇద్దత్ (గడువు), శోకం, ప్రసవం | 229 |
| 12వ అధ్యాయం | : | పాల సంబంధం | 240 |
| 13వ అధ్యాయం | : | భరణం | 246 |
| 14వ అధ్యాయం | : | పోషణ, సంరక్షణ | 256 |

**9. అపరాధాల పుస్తకం** **260**

| | | | |
|---|---|---|---|
| 1వ అధ్యాయం | : | రక్తశుల్కం (దియత్) | 273 |
| 2వ అధ్యాయం | : | నిందారోపణలు, దైవంపై ప్రమాణంచేసి చెప్పటం | 283 |
| 3వ అధ్యాయం | : | తిరుగుబాటుదారులపై యుద్ధం | 286 |
| 4వ అధ్యాయం | : | దౌర్జన్యపరునితో పోరాడటం, ధర్మభ్రష్టుణ్ణి వధించటం గురించి | 291 |

**10. శిక్షల పుస్తకం** **297**

| | | | |
|---|---|---|---|
| 1వ అధ్యాయం | : | వ్యభిచారికి విధించబడే శిక్ష | 297 |
| 2వ అధ్యాయం | : | వ్యభిచార నిందారోపణ - శిక్ష | 311 |
| 3వ అధ్యాయం | : | దొంగతనానికి విధించబడే శిక్ష | 314 |
| 4వ అధ్యాయం | : | మద్యం సేవించినవానికి విధించబడే శిక్ష, మత్తు పదార్థాల గురించి | 323 |
| 5వ అధ్యాయం | : | తేలికపాటి శిక్షలు | 329 |

**11. జిహాద్ పుస్తకం** **333**

| | | | |
|---|---|---|---|
| 1వ అధ్యాయం | : | జిజ్యా మరియు తాత్కాలిక సంధి | 363 |
| 2వ అధ్యాయం | : | గుర్రపు స్వారీ, విలువిద్య | 369 |

**12. అన్నపానీయాల పుస్తకం** **373**

1వ అధ్యాయం : జంతువేట 379

2వ అధ్యాయం : ఖుర్బానీ ఆదేశం 388

3వ అధ్యాయం : అఖీఖా 394

**13. ప్రమాణాల, మొక్కుబడుల పుస్తకం** **397**

**14. వ్యాజ్యాల, తీర్పుల పుస్తకం** **409**

ఖాజీ (న్యాయమూర్తి గురించి) 409

1వ అధ్యాయం : సాక్ష్యాలు 417

2వ అధ్యాయం : ఆరోపణలు, ఆధారాలు 422

**15. బానిస విమోచన పుస్తకం** **429**

1వ అధ్యాయం : ముదబ్బర్, ముకాతబత్, ఉమ్ముల్ వలద్ 434

**16. వివిధ విషయాల పుస్తకం** 441

1వ అధ్యాయం : వినయ వినమ్రతలు 441

2వ అధ్యాయం : సత్కార్యం, బంధుత్వ సంబంధాల పెంపకం 451

3వ అధ్యాయం : సాత్వికత, ధర్మనిష్ఠ 459

4వ అధ్యాయం : దుర్గుణాలు, దురలవాట్ల గురించి హెచ్చరించటం 467

5వ అధ్యాయం : ఉత్తమ గుణగణాలకై ప్రోత్సహించటం 489

6వ అధ్యాయం : ధ్యానం మరియు దుఆ 501

**పారిభాషిక పదాలు (పదకోశం)** 522

**ఆణిముత్యాలు (హదీసువేత్తలు)** 562

1. శుచీ శుభ్రతల పుస్తకం

2. నమాజ్ పుస్తకం

3. అంత్యక్రియల పుస్తకం

4. జకాత్ పుస్తకం

5. ఉపవాసాల పుస్తకం

6. హజ్ పుస్తకం

... ఇవి

**హదీసు మకరందం**

మొదటి భాగంలో చేర్చించబడ్డాయి.

- ప్రకాశకులు

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 7. వాణిజ్య పుస్తకం
# كِتَابُ الْبُيُوعِ

## 1వ అధ్యాయం
## ١ - بَابُ شُرُوطِهِ وَمَا نُهِيَ عَنْهُ مِنْهُ
## క్రయ విక్రయాలు

(٦٤٨) عَنْ رِفَاعَةَ بْنِ رَافِعٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ سُئِلَ أَيُّ الْكَسْبِ أَطْيَبُ؟ قَالَ: «**عَمَلُ الرَّجُلِ بِيَدِهِ، وَكُلُّ بَيْعٍ مَبْرُورٍ**». رَوَاهُ الْبَزَّارُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

648. హజ్రత్ రిఫాఅ బిన్ రాఫె (రజి) కథనం : "అతి పవిత్రమయిన సంపాదన ఏది?" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రశ్నించగా, "మనిషి తన స్వహస్తాలతో ఆర్జించిన సంపాదన. దగా, మోసం లేనటువంటి అన్ని రకాల వర్తకం" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (బజ్జార్ దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٦٤٩) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ عَامَ الْفَتْحِ، وَهُوَ بِمَكَّةَ: «**إِنَّ اللَّهَ وَرَسُولَهُ حَرَّمَ بَيْعَ الْخَمْرِ وَالْمَيْتَةِ وَالْخِنْزِيرِ وَالْأَصْنَامِ**». فَقِيلَ: يَا رَسُولَ اللهِ أَرَأَيْتَ شُحُومَ الْمَيْتَةِ؟ فَإِنَّها تُطْلَى بِهَا السُّفُنُ، وَتُدهَنُ بِهَا الْجُلُودُ، وَيَسْتَصْبِحُ بِهَا النَّاسُ، فَقَالَ: «**لَا هُوَ حَرَامٌ**»، ثُمَّ قَالَ رَسُولُ اللهِ ﷺ عِنْدَ ذٰلِكَ: «**قَاتَلَ اللَّهُ الْيَهُودَ، إِنَّ اللَّهَ لَمَّا حَرَّمَ**

649. మక్కా విజయం వరించిన సంవత్సరం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కాలో ఈ విధంగా ఉపదేశించగా తాను విన్నానని హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: "నిశ్చయంగా దేవుడు మరియు ఆయన ప్రవక్త (స) మద్యం క్రయవిక్రయాలను, మృత జంతువు మరియు పంది క్రయవిక్రయాలను, విగ్రహాల వర్తకాన్ని 'హరామ్' (నిషిద్ధం) గావించారు." 'దైవ ప్రవక్త (సఅసం)! మరి మృత జంతువుల క్రొవ్వు

عَلَيْهِمْ شُحُومَهَا جَمَلُوهُ، ثُمَّ بَاعُوهُ، فَأَكَلُوا ثَمَنَهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

సంగతేమిటి? అది ఓడల సర్వీసు కోసం ఉపయోగపడుతుంది, చర్మాలకు పూయబడుతుంది, ప్రజలు దీంతో దీపాన్ని వెలిగించి కాంతిని పొందుతారు కదా!' అని సందేహపడగా "అయినాసరే! అదీ నిషిద్ధమే" అని ఆయన (సఅసం) స్పష్టపరచారు. ఆయన (సఅసం) ఇంకా ఇలా అన్నారు : "అల్లాహ్ యూదులను నాశనం చేయుగాక! అల్లాహ్ క్రొవ్వును యూదులకై నిషేధించగా వాళ్లు దాన్ని కరిగించి అమ్ముకున్నారు. తద్వారా వచ్చిన సొమ్మును ఆరగించారు."

(బుఖారీ, ముస్లిం)

(٦٥٠) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا اخْتَلَفَ الْمُتَبَايِعَانِ، وَلَيْسَ بَيْنَهُمَا بَيِّنَةٌ، فَالْقَوْلُ مَا يَقُولُ رَبُّ السِّلْعَةِ أَوْ يَتَتَارَكَانِ». رَوَاهُ الْخَمْسَةُ وَصَحَّحَهُ الْحَاكِمُ.

650. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె మస్వూద్ (రజి) తెలిపారు- ఆయన (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: "అమ్మేవాని, కొనేవాని మధ్య అభిప్రాయ భేదం ఏర్పడి వారి వాదనను బలపరచే సాక్ష్యం, తగు ఆధారం వారి రువురి వద్ద లేనపుడు వస్తువు యజమాని మాటనే లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది. లేదా వారిరువురూ ఆ లావాదేవీలను ఉపసంహరించుకోవాలి (దీనిని ఐదుగురూ ఉల్లేఖించగా, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు).

**సారాంశం**

అమ్మకందారు, కొనుగోలుదారు మధ్య భేదాభిప్రాయం పొడసూపినపుడు అమ్మకందారు

(వస్తువు యజమాని) మాటే ప్రాముఖ్యం సంతరించుకుంటుందని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. లేదంటే, కొనుగోలుదారుడు తాను చెల్లించిన మొత్తాన్ని వాపసు తీసుకోవాలి. అమ్మకందారుడు కూడా తాను అమ్మిన వస్తువును తీసేసుకుని లావాదేవీల ఒప్పందాన్ని రద్దుచేయాలి. అయితే వాపసు చేయబడే ఆ వస్తువు ఏమాత్రం దెబ్బతినకుండా - యథా స్థితిలో- ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ సందర్భంగా అమ్మకందారుడు, తాను చెప్పేదంతా అక్షరాలా నిజం అని ప్రమాణం చేసి మరీ చెప్పాలి. ప్రమాణం కూడా షరీయత్ నిబంధన కనుగుణంగా ఉండాలి.

(٦٥١) وَعَنْ أَبِي مَسْعُودٍ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ ثَمَنِ الْكَلْبِ، وَمَهْرِ الْبَغِيِّ، وَحُلْوَانِ الْكَاهِنِ. مُتَّفَقٌ عَلَيْهِ.

651. హజ్రత్ అబూ మస్‌వూద్ అన్సారీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కుక్కకు వెలకట్టడాన్ని, వేశ్య సంపాదనను, జ్యోతిష్కునికి ప్రతిఫలం ఇవ్వడాన్ని హరామ్ (నిషిద్ధం) గావించారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో కుక్కకు వెలకట్టడం, వేశ్య స్త్రీ వేశ్య వృత్తి ద్వారా ఆర్జించే సంపాదన, జ్యోతిష్కుడు జోస్యం చెప్పటం ద్వారా గడించే ఆదాయం నిషేధించబడ్డాయి. కుక్క స్వతహాగా అశుద్ధ జంతువు అయిన కారణంగా నిషిద్ధం. నిషిద్ధ వస్తువు నుండి మూల్యం రాబట్టడం కూడా నిషిద్ధమే. అలాగే ఇస్లాంలో వ్యభిచారం ముమ్మాటికీ నిషిద్ధం. కాబట్టి వ్యభిచారం ద్వారా ఆర్జించే డబ్బు కూడా హరామ్ అవుతుంది. జ్యోతిష్యం, సోదె చెప్పటం వంటివి నిషిద్ధం గనక వాటిని వృత్తిగా చేసుకుని డబ్బు గడించటం కూడా నిషిద్ధమే.

(٦٥٢) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّهُ كَانَ يَسِيْرُ عَلَى جَمَلٍ لَهُ قَدْ أَعْيَا، فَأَرَادَ أَن يُسَيِّبَهُ، قَالَ: فَلَحِقَنِي النَّبِيُّ ﷺ، فَدَعَا لِي، وَضَرَبَهُ، فَسَارَ سَيْراً لَمْ يَسِرْ مِثْلَهُ، قَالَ: بِعْنِيْهِ بِأُوقِيَّةٍ، قلت: لا ثم قال: بِعْنِيْهِ فَبِعْتُه بِأُوقِيَّةٍ، وَاشْتَرَطْتُ حُمْلاَنَهُ إِلَى أَهْلِيْ، فَلَمَّا بَلَغْتُ أَتَيْتُهُ بِالْجَمَلِ، فَنَقَدَنِيْ ثَمَنَهُ،

652. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : తాను బాగా అలసిపోయి, నీరసించిపోయిన ఒంటెపై ప్రయాణం చేస్తూ, ఆ ఒంటెను ఎలాగైనా వదిలించుకోవాలని అనుకున్నారు. హజ్రత్ జాబిర్ (రజి) ఇలా అంటున్నారు- "అంతలోనే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను కలుసుకున్నారు. ఆయన (సఅసం) నా కోసం ప్రార్థించారు. తరువాత ఆయన

ثُمَّ رَجَعْتُ، فَأَرْسَلَ فِيْ أَثَرِيْ، فَقَالَ: **أَتَرَانِي مَاكَسْتُكَ لِآخُذَ جَمَلَكَ؟ خُذْ جَمَلَكَ وَدَرَاهِمَكَ، فَهُوَ لَكَ.** مُتَّفَقٌ عَلَيْهِ. وَهَذَا السِّيَاقُ لِمُسْلِمٍ.

(స) ఒంటెను కొట్టగా, మునుపెన్నడూ పరుగెత్తనంత వేగంగా అది పోసాగింది. ఆయన (స) నన్నుద్దేశించి, 'ఒక ఊఖియా వెండికి బదులుగా ఈ ఒంటెను నాకు అమ్ముతావా?' అన్నారు. నేను 'లేదు' అన్నాను. 'ఈ ఒంటెను నాకు అమ్మేయి' అని ఆయన (స) మరోసారి కోరారు. నేనాయనకు ఒంటెను ఒక ఊఖియాకు బదులుగా అమ్మేశాను. అయితే నా ఇంటిదాకా దీనిపై కూర్చుని వెళతానని షరతు పెట్టాను. షరతు ప్రకారమే గమ్యం (మదీనా) చేరుకున్న పిమ్మట నేను ఒంటెను తోలుకుని దైవ ప్రవక్త(సఅసం) దగ్గరికి వెళ్ళాను. ఆయన (స) నాకు దాని నగదు వెలను చెల్లించారు. (వెల తీసుకుని) నేను ఇంటికి తిరిగి వచ్చాను. ఆయన (స) నా వెనుకే నా ఒంటెను తిప్పి పంపారు. ఆ సంద ర్భంగా ఆయన (స) ఇలా అన్నారు: "నీ ఒంటెను తీసేసుకునే ఉద్దేశ్యంతో మరీ తక్కువ ధర ఇచ్చానని నీవు భావిస్తూ ఉండవచ్చు. నీ ఒంటెను నీవు తీసుకో. దాని ధరను కూడా తీసేసుకో. ఇక మీదట ఇది నీది (నీకు కానుక లాంటిది)". (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

నీ దగ్గరున్న ఫలానా వస్తువును అమ్ముతావా? అని అడగటంలో తప్పులేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. వెల కట్టడం, ఆ వెలను అడగటం, అమ్మిన వస్తువును (వాహనం

లాంటిదయితే) ఇంటికెళ్ళే దాకా వాడుకుంటానని షరతు పెట్టడం కూడా ధర్మసమ్మతమే. కాకపోతే విక్రయించిన వస్తువుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడవలసి ఉంటుంది. అలాగే ఎవరికయినా ఇల్లు అమ్మినట్లయితే, ఫలానా తేదీ వరకు దాన్ని నేను వాడుకుంటానని కొనుగోలుదారునికి షరతు పెట్టవచ్చు. ప్రవక్త సహచరులైన హజ్రత్ ఉస్మాన్ (రజి) గారు కూడా ఒక ఇల్లును విక్రయిస్తూ, నెల రోజుల తరువాతే ఇల్లు ఖాళీ చేస్తానని షరతు విధించారు.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే మరో విషయమేమిటంటే ఒక వస్తువును బేరమాడేటప్పుడు కొనుగోలుదారు తన పలుకుబడినీ, పదవిని దుర్వినియోగం చేయరాదు. పైగా ఎదుటి వాని స్థితిని దృష్టిలో పెట్టుకుని అతనికి వీలైనంత ప్రయోజనం చేకూర్చేందుకు యత్నించాలి. అంటే త్యాగభావంతో మసలుకోవాలన్నమాట! దైవప్రవక్త (సఅసం) నెలకొల్పిన ఉదాహరణను మనం మరువరాదు. దైవప్రవక్త (స) ఒక దెబ్బకొట్టగానే ఒంటె వేగంగా పోవటం ఆయన(స) గారి మహిమల్లో ఒకటని భావించాలి.

(٦٥٣) وَعَنْهُ قَالَ: أَعْتَقَ رَجُلٌ مِنَّا عَبْداً لَهُ عَنْ دُبُرٍ، وَلَمْ يَكُن لَهُ مَالٌ غَيْرُهُ، فَدَعَا بِهِ النَّبِيُّ ﷺ فَبَاعَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

653. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) గారి చేతనే ఉల్లేఖించబడిన మరో హదీసు : "మాలోని ఒక వ్యక్తి తన బానిసకు తన తదనంతరం స్వేచ్ఛ నొసగుతున్నట్లు ప్రకటించాడు. మరి చూడబోతే ఆ ఒక్క బానిస తప్ప అతని వద్ద మరొక ఆస్తిలేదు. (అందుచేత) దైవప్రవక్త (సఅసం) ఆ బానిసను పిలిచి అతణ్ణి విక్రయించారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం బానిసకు స్వేచ్ఛ నొసగిన ఆ వ్యక్తి, ఆ సమయంలో రుణగ్రస్తుడై ఉండటంవల్ల అతని రుణభారాన్ని దించే ఉద్దేశ్యంతో దైవప్రవక్త (స) ఆ బానిసను అమ్మించారు. నయీమ్ బిన్ నుహ్హామ్ అనే వ్యక్తి ఆ బానిసను కొన్నారు. ఈ హదీసు ద్వారా అర్థమయ్యేదేమిటంటే, గత్యంతరం లేని స్థితి ఏర్పడినపుడు యజమాని తన బానిసను వేరొకరికి అమ్మటం సమంజసమే.

(٦٥٤) وَعَنْ مَيْمُونَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا زَوْجِ النَّبِيِّ ﷺ، أَنَّ فَأْرَةً وَقَعَتْ فِي سَمْنٍ، فَمَاتَتْ فِيهِ، فَسُئِلَ النَّبِيُّ ﷺ عَنْهَا

654. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సతీమణి హజ్రత్ మైమూన (ర.అన్హా) కథనం: ఒక చిట్టెలుక నేతిలో పడి చచ్చిపోయింది. దాని గురించి

فَقَالَ: «أَلْقُوهَا وَمَا حَوْلَهَا وَكُلُوهُ». رَوَاهُ الْبُخَارِيُّ، وَزَادَ أَحْمَدُ وَالنَّسَائِيُّ: «فِي سَمْنٍ جَامِدٍ».

దైవప్రవక్త(సఅసం)ను దర్యాప్తు చేయగా, "దాన్ని తీసి పారెయ్యండి. దానికి చుట్టు ప్రక్కల ఉన్న నేతిని కూడా పారబోసి మిగిలిన దానిని ఉపయోగించండి" అని ఆయన (స) ప్రవచించారు (బుఖారీ). నసాయి మరియు అహ్మద్‌లు 'గడ్డకట్టిన నేతిలో' అని అదనంగా పేర్కొన్నారు.

(٦٥٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا وَقَعَتِ الفَأْرَةُ فِي السَّمْنِ، فَإِنْ كَانَ جَامِداً فَأَلْقُوهَا وَمَا حَوْلَهَا، وَإِنْ كَانَ مَائِعاً فَلاَ تَقْرَبُوهُ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَقَدْ حَكَمَ عَلَيْهِ الْبُخَارِيُّ وَأَبُو حَاتِمٍ بِالْوَهَمِ.

655. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "ఎప్పుడయినా చిట్టెలుక (లేక చుంచెలుక) గనక నేతిలో పడితే, ఆ నెయ్యిగనక గడ్డ కట్టినదైతే అప్పుడా ఎలుకను, దాని చుట్టుప్రక్కల వున్న నెయ్యిని తీసి పార వెయ్యండి. ఒకవేళ నెయ్యి ద్రవ రూపంలో ఉంటే దాని దరిదాపులకు కూడా పోవద్దు సుమా!" (అహ్మద్, అబూ దావూద్‌లు దీనిని ఉల్లేఖించారు. బుఖారీ, అబూ హాతిమ్‌లు దీనిపై 'అనుమానం' వెలిబుచ్చారు).

**సారాంశం**

ఎలుక పడిన నేతి పదార్థం ఒకవేళ ద్రవరూపంలో ఉంటే, అట్టి స్థితిలో ఏ మేరకు ఎలుక ప్రభావం పడిందో, మరి ఏ మేరకు ఆ నెయ్యి పరిశుద్ధంగా ఉందో నిర్ధారించటం కష్టం గనక ఆ నేతిని పారవెయ్యక తప్పదు. దాన్ని మనం స్వయంగా ఉపయోగించటం సమ్మతం కానపుడు, ఇతరులకు అమ్మటం కూడా సమ్మతం కాదు. అందుకే దాని దరిదాపులకు కూడా పోరాదని హదీసులో చెప్పబడింది.

ఇమామ్ బుఖారీ (రహ్మ.లై), అబూ హాతిమ్ (రహ్మ.లై) ఈ హదీసుపై 'అనుమానం' వ్యక్తపరిచారు. ఎందుకంటే; ఇది 'ముస్నదె మైమూన' హదీసుగాని, 'ముస్నదె అబూ హురైర' కాదని వారిరువురూ అంటున్నారు.

(٦٥٦) وَعَنْ أَبِي الزُّبَيْرِ قَالَ: سَأَلْتُ جَابِراً عَنْ ثَمَنِ السِّنَّوْرِ وَالْكَلْبِ. فَقَالَ: زَجَرَ النَّبِيُّ ﷺ عَنْ ذٰلِكَ. رَوَاهُ مُسْلِمٌ وَالنَّسَائِيُّ وَزَادَ: «إِلاَّ كَلْبَ صَيْدٍ».

656. హాజ్రత్ అబూ జుబైర్(రజి) కథనం: నేను పిల్లి, కుక్కలకు వెల కట్టటం గురించి హాజ్రత్ జాబిర్ (రజి)ను అడగ్గా, "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయంపై మందలించారు" అని ఆయన (రజి) చెప్పారు. (ముస్లిం, నసాయి) "వేట కుక్క మినహా" అని నసాయిలో ఒక వాక్యం అదనంగా ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

అబూ జుబైర్ : ఈయన అసలు పేరు ముహమ్మద్ బిన్ ముస్లిం బిన్ తద్రుస్ అసదీ మక్కీ. హకీమ్ బిన్ హిజామ్ గారి బానిస. తాబయీ. ఈయన విశ్వసనీయులు మరియు ఈయన ఉల్లేఖనాలు ఎన్నదగినవి అన్న విషయంలో హదీసువేత్తలందరి మధ్యా ఏకాభిప్రాయముంది. హిజ్రీ 128లో మరణించారు.

(٦٥٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: جَاءَتْنِي بَرِيْرَةُ، فَقَالَتْ: إِنِّي كَاتَبْتُ أَهْلِيْ عَلَى تِسْعِ أَوَاقٍ، فِي كُلِّ عَامٍ أُوقِيَّةٌ، فَأَعِينِيْنِي! قُلْتُ: إِنْ أَحَبَّ أَهْلُكِ أَنْ أَعُدَّهَا لَهُمْ، وَيَكُونُ وَلَاؤُكِ لِيْ فَعَلْتُ، فَذَهَبَتْ بَرِيْرَةُ إِلَى أَهْلِهَا، فَقَالَتْ لَهُمْ، فَأَبَوا عَلَيْهَا، فَجَاءَتْ مِنْ عِنْدِهِمْ، وَرَسُولُ اللهِ ﷺ جَالِسٌ، فَقَالَتْ: إِنِّي قَدْ عَرَضْتُ ذٰلِكَ عَلَيْهِمْ فَأَبَوا، إِلاَّ أَنْ يَكُونَ الْوَلَاءُ لَهُمْ، فَسَمِعَ النَّبِيُّ ﷺ، فَأَخْبَرَتْ عَائِشَةُ النَّبِيَّ ﷺ، فَقَالَ: «خُذِيهَا وَاشْتَرِطِي لَهُمُ الْوَلَاءَ فَإِنَّمَا الْوَلَاءُ لِمَنْ

657. హాజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : (బానిసరాలైన) బరీరా (ర.అన్హా) నా దగ్గరకు వచ్చి, తాను తొమ్మిది ఊఖియాల వెండికి బదులుగా స్వేచ్ఛ పొందేలా తన యజమానితో ఒప్పందం (ముకాతబత్) చేసుకున్నానీ, ప్రతి ఏటా ఒక ఊఖియాను చెల్లిస్తాననీ, ఈ విషయంలో తనకు సహాయ పడమని ప్రాధేయపడింది. దానికి నేను, "నీ యజమాని గనక ఒప్పుకుంటే మొత్తం సొమ్ము ఒకేసారి ఇస్తాను. అయితే నీ 'వలా' (వారసులు లేని పక్షంలో నీ తదనంతరం నీ ఆస్తిపాస్తులు) నాకు సంక్రమించాలి. ఈ షరతును నీ యజమాని గనక అంగీకరిస్తే నీకు నేను

أَعْتَقَ»، فَفَعَلَتْ عَائِشَةُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، ثُمَّ قَامَ رَسُولُ اللهِ ﷺ فِي النَّاسِ خَطِيباً، فَحَمِدَ اللَّهَ وَأَثْنَى عَلَيْهِ، ثُمَّ قَالَ: «أَمَّا بَعْدُ، فَمَا بَالُ رِجَالٍ يَشْتَرِطُونَ شُرُوطاً لَيْسَتْ فِي كِتَابِ اللهِ عَزَّ وَجَلَّ؟ مَا كَانَ مِنْ شَرْطٍ لَيْسَ فِي كِتَابِ اللهِ فَهُوَ بَاطِلٌ، وَإِنْ كَانَ مِائَةَ شَرْطٍ، قَضَاءُ اللهِ أَحَقُّ، وَشَرْطُ اللهِ أَوْثَقُ،

సాయపడతాను" అని అన్నాను. ఈ ప్రతిపాదనను బరీరా (ర.అన్‌హా) తన యజమానుల దృష్టికి తీసుకువచ్చింది. కాని వారు ఈ ప్రతిపాదనను త్రోసి పుచ్చారు. బరీరా (ర.అన్‌హా) ఆమె వద్దకు వచ్చింది. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) అక్కడే కూర్చుని ఉన్నారు. "(అమ్మా!) నేను మీ ప్రతిపాదనను నా యజమానులకు వినిపించాను. కాని వాళ్లు దీన్ని ఆమోదించలేదు. 'వలా' హక్కు తమకు మాత్రమే దక్కాలని వాళ్ళు అంటున్నారు" అని ఆమె (ర.అన్‌హా) చెప్పింది. దైవప్రవక్త (సఅసం) ఈ విషయమంతా విన్నారు. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కూడా ఆయనకు ఈ సంగతిని విడమరచి చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స), "ఈమెను తీసేసుకో. ఈమె వారసత్వం కూడా నీకు సంక్రమించేలా షరతు పెట్టుకో. ఎందుకంటే స్వేచ్ఛనొసగిన వానికి మాత్రమే బానిస యొక్క వారసత్వం సంక్రమిస్తుంది" అని స్పష్టం చేశారు. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) అలాగే చేశారు. తరువాత దైవప్రవక్త (స) ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి నిల బడ్డారు. దైవస్తోత్రం చేసి, దేవుని ఘన తను కీర్తించిన తరువాత ఇలా అన్నారు: "ప్రజలకేమైపోయిందీ, వీళ్లు దైవ గ్రంథంలో లేని షరతులను కూడా

وَإِنَّمَا الْوَلَاءُ لِمَنْ أَعْتَقَ». مُتَّفَقٌ عَلَيْهِ، واللَّفْظُ لِلْبُخَارِيِّ، وَعِنْدَ مُسْلِمٍ قَالَ: «اشْتَرِيهَا، وَأَعْتِقِيهَا، وَاشْتَرِطِي لَهُمُ الْوَلَاءَ».

విధిస్తున్నారేమిటీ? (బాగా గుర్తుంచుకోండి) దైవగ్రంథంలో లేని వందలాది షరతులు పెట్టుకున్నాసరే - అవి అధర్మమైనవి. దేవుని నిర్ణయం సత్య బద్ధమైనది. దేవుడు విధించిన షరతు మాత్రమే అత్యంత దృఢమైనది, తిరుగు లేనిదీను. బానిసకు, స్వేచ్ఛను ప్రసాదించే వ్యక్తికి మాత్రమే 'వలా' హక్కు ప్రాప్తిస్తుంది.'' (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి) ''ఆమెను కొని స్వాతంత్ర్యం ప్రసాదించు. 'వలా' షరతు విధించ వచ్చు'' అని ముస్లింలో ఉంది.

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు వెల్లడవుతున్నాయి: ఉదాహరణకు - ఒక నిర్ణీత సొమ్ముపై, ఒక నిర్ణీత గడువును పెట్టుకుని యజమాని మరియు బానిస 'ముకాతబత్' అనే పద్ధతి ద్వారా విమోచన ఒప్పందం కుదుర్చుకోవచ్చు. బానిస తరపున వేరొక వ్యక్తి వచ్చి నిర్ణీత సొమ్మును చెల్లించగోరితే, అదీ ధర్మసమ్మతమే. ఇట్టి పరిస్థితిలో స్వేచ్ఛపొందిన బానిస మరణిస్తే అతని ఆస్తిపాస్తులు స్వేచ్ఛ ప్రసాదించిన వ్యక్తికి సంక్రమిస్తాయి.

తన యజమానితో ఒప్పందం (ముకాతబత్) చేసుకున్న బానిస స్థితిమంతుడు కానిపక్షంలో అతడు వేరొకరి దగ్గర ఆర్థిక సహాయం అర్థించటం ధర్మసమ్మతమే. 'ముకాతబత్' సొమ్మును వాయిదాల పద్ధతిపై కూడా చెల్లించవచ్చు. ఒక వ్యక్తికి బానిస చెరనుండి విడిపించే ఉద్దేశ్యంతో ఆర్థిక సాయం చేయవచ్చు. షరీయత్‌కు విరుద్ధమైన షరతులను నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చాలి. ఇలాంటి వ్యవహారాల్లో పరస్పర సలహా సంప్రతింపులు ఎంతో అవసరం. భార్య భర్తను ఏదేని కీలక విషయమై సంప్రతించినపుడు, భర్త చిత్తశుద్ధితో సలహా ఇవ్వాలి. ఏదేని ఒక విషయంలో ప్రజలు అజ్ఞానంతో మెలగినపుడు, ఆ విషయాన్ని ప్రజా బాహుళ్యంలోనికి తీసుకుపోవచ్చు. అయితే ఒక వ్యక్తిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, దాన్ని సర్వసాధారణమైన సవాలుగా తీసుకోవాలి. ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చే ముందు దైవస్తోత్రం చేయాలి. దైవ సహాయం అర్థించాలి.

## హదీసు ఉల్లేఖకులు

బరీరా (ర.అన్హా) : ఈమె విశ్వాసుల మాత అయిన హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి సేవకురాలు. అబూ అహ్మద్ బిన్ జహష్ కుటుంబంలో బానిసగా ఉండే ముగీస్‌ను ఈమె తొలుత వివాహమాడారు. అయితే ఈమె స్వేచ్ఛ పొందిన తరువాత దైవప్రవక్త (సఅసం) ఇచ్చిన నిర్ణయాధికారాన్ని పురస్కరించుకుని, ఇంకా బానిసత్వంలోనే మ్రగ్గుతున్న భర్త ముగీస్ నుండి వేర్పడ్డారు.

(٦٥٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى عُمَرُ عَنْ بَيْعِ أُمَّهَاتِ الْأَوْلَادِ، فَقَالَ: لاَ تُبَاعُ، وَلاَ تُوْهَبُ، وَلاَ تُوْرَثُ، يَسْتَمْتِعُ بِهَا مَا بَدَا لَهُ، فَإِذَا مَاتَ فَهِيَ حُرَّةٌ. رَوَاهُ الْبَيْهَقِيُّ وَمَالِكٌ، وَقَالَ: رَفَعَهُ بَعْضُ الرُّوَاةِ فَوَهِمَ.

658.హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "హజ్రత్ ఉమర్ (రజి) గారు సంతాన వతి అయిన బానిసరాలిని అమ్మటాన్ని నిషేధించారు. ఆమెను విక్రయించడం గానీ, కానుకగా ఎవరికయినా ఇవ్వటం గానీ, వారసత్వ సొమ్ముగా పంచిపెట్టడం గానీ కుదరదని ఆయన తేల్చి చెప్పారు. అతడు (యజమాని) బ్రతికి ఉన్నంత కాలం ఆమె సేవలను పొందవచ్చు. అతడు మరణించిన పిమ్మట ఆమె స్వతంత్రురాలవుతుంది అని కూడా ఆయన అన్నారు." (బైహఖీ, మాలిక్‌లు దీనిని ఉల్లేఖించారు)

## సారాంశం

అరబీలో 'ఉమ్మహాతుల్ ఔలాద్' అనే పదం వచ్చింది. ఇది బహువచనం. ఏకవచనంలో 'ఉమ్మె వలద్' అవుతుంది. ఉమ్మె వలద్ అనే పదం శిశువును కన్న బానిసరాలినుద్దేశ్యించి ఉపయోగించబడింది. యజమాని జీవించి ఉన్నంతకాలం ఆమె అతని బానిసరాలిగానే ఉంటుంది. ఆమెను అతడు అన్ని విధాలా ఉపయోగించుకోగలడు. మరి అతడు మరణించ గానే ఆమెకు స్వేచ్ఛ లభిస్తుంది. యజమాని సంతానానికి ఆమెపై ఎలాంటి హక్కు, అధికారం ఉండవు. యజమానిచే పిల్లవాణ్ణి కన్న బానిసరాలిని అమ్మవచ్చా? లేదా? అన్న విషయమై విద్వాంసుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఆమె కన్న శిశువు బ్రతికి ఉన్నా లేకపోయినా ఆమె క్రయవిక్రయాలు జరపటం హరామ్ (నిషిద్ధం) అని అత్యధికమంది పండితులు అభిప్రాయపడ్డారు. అయితే ఇమామ్ దావూద్ జాహిరీ గారు ఈమె క్రయవిక్రయాన్ని ధర్మసమ్మతంగా తలపోశారు.

(٦٥٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نَبِيْعُ سَرَارِيَنَا أُمَّهَاتِ الْأَوْلَادِ، والنَّبِيُّ ﷺ حَيٌّ، لاَ يَرَى بِذٰلِكَ بَأْساً. رَوَاهُ النَّسَائِيُّ وَابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

659. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "మేము సంతానవతులైన బానిసరాళ్లను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలోనే అమ్మేవాళ్లము. కాని ఆయన (సఅసం) ఈ అమ్మకంపై ఎలాంటి అభ్యంతరాన్ని వెలిబుచ్చ లేదు." (ఈ హదీసును నసాయి, ఇబ్నె మాజ, దారె ఖుత్నీలు ముగ్గురూ ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణిక మైనదిగా పేర్కొన్నారు).

(٦٦٠) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعِ فَضْلِ الْمَاءِ. رَوَاهُ مُسْلِمٌ، وَزَادَ فِي رِوَايَةٍ: «وَعَنْ بَيْعِ ضِرَابِ الْجَمَلِ».

660. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : "మిగులు జలాల విక్రయాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు" (ముస్లిం). మగ ఒంటెను ఆడ ఒంటెతో జత కట్టించి నందుకు ప్రతిఫలం తీసుకోవటాన్ని కూడా వారించినట్లు వేరొక ఉల్లేఖనంలో ఉంది.

## సారాంశం

(1) హదీసులోని "మిగులు జలాలు"అంటే భావం; ఏ ఒక్కరి సొంత భూమి కానటువంటి చోట నీరు ఉంటే ఆ నీరును త్రాగవచ్చు. తమ పశువులకు త్రాపవచ్చు. ఇంకా ఆ జలాల ద్వారా తమ పొలాలను కూడా తడుపుకోవచ్చు. అంతవరకూ సబబే. కాని ఆ జలాలను అమ్ముకోవటం మాత్రం సబబుకాదు. అయితే ఒకవేళ అతడు తన సొంతభూమిలో బావి త్రవ్వుకుంటే అప్పుడతనికి పూర్తి అధికారం ఉంటుంది.

(2) మగ ఒంటెను ఆడ ఒంటెతో జత కట్టించటమంటే భావం - ఆడ ఒంటె యద అయినపుడు మగ ఒంటెచే పొల్లించటం. ఇందునిమిత్తం ఆడ ఒంటె యజమాని నుండి బాడుగ లేక వేతనం వసూలు చేయటం నిషిద్ధం. ఈ రకమయిన లావాదేవీలు ఇప్పటికీ మననాట- ముఖ్యంగా పల్లెప్రాంతాల్లో - జరుగుతున్నాయి.

(٦٦١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ عَسْبِ الْفَحْلِ. رَوَاهُ الْبُخَارِيُّ.

661. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "పోతు వీర్యానికి గాను ప్రతిఫలం పుచ్చు కోవడాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిషేధించారు." (బుఖారీ)

**సారాంశం**

పై హదీసులో 'ఫహ్ల్' అనే పదం వచ్చింది. మగ జంతువును అరబీలో 'ఫహ్ల్' గా వ్యవహరిస్తారు. ఉదాహరణకు : దున్నపోతు, ఆంబోతు, గొర్రెపోతు, గుఱ్ఱం, ఒంటె ఇత్యాదివి. ఇలాంటి జంతువుల ద్వారా స్థలించబడే వీర్యాన్ని అమ్ముకోవటం నిషేధించబడింది.

పశువుల ఆసుపత్రులు సర్వసామాన్యం కాని మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ కొంత మంది దున్నపోతులను కేవలం ఈ ఉద్దేశ్యంతోనే పోషిస్తున్నారన్న సంగతి తెలుగువారికి తెలియనిది కాదు. - **అనువాదకుడు.**

(٦٦٢) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ بَيْعِ حَبَلِ الْحَبَلَةِ، وَكَانَ بَيْعاً يَتَبَايَعُهُ أَهْلُ الْجَاهِلِيَّةِ، كَانَ الرَّجُلُ يَبْتَاعُ الْجَزُورَ إِلَى أَنْ تُنْتَجَ النَّاقَةُ، ثُمَّ تُنْتَجَ الَّتِي فِي بَطْنِهَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

662. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) "హబలుల్ హబలా" వర్తకాన్ని నిషేధించారు. ఇలాంటి వర్తకం అజ్ఞానకాలంలో చేయబడేది. దీని ప్రకారం ఒక వ్యక్తి ఆడ ఒంటెను కొనేటప్పుడు; 'నేను దీని వెలను ఒంటె ఈనిన తరువాత (దూడ జన్మించిన తరువాత) చెల్లిస్తాను లేక ప్రస్తుతం ఒంటె కడుపులో ఉన్న దూడ పుట్టి పెద్దదై అది ఈనిన తర్వాత ఇస్తాను' అంటూ షరతులు పెట్టేవాడు. (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

**సారాంశం**

నిషేధించబడిన ఆ వర్తకంలో బహుశా రెండు భావాలు అంతర్లీనమై ఉండవచ్చు. ఒకటి: ఈ ఒంటె కడుపులో పెరుగుతున్న పిల్లఒంటె, అది పుట్టి, పెరిగి, సూడిదై ఈనిన తరువాత, అది పెట్టే పిల్లను నేను కొనదలుస్తున్నాను. కావాలంటే దాని మూల్యం ఈ రోజే తీసుకో. రెండు: ఈ ఒంటెను నేను నీకు ఇంత మొత్తానికిగాను అమ్ముతున్నాను. అయితే ఇది ఈనిన

తరువాత ఆ పిల్ల ఒంటెను మాత్రం నాకు ఇచ్చివేయాలి అని అమ్మకందారు పెట్టే షరతు. మరి కడుపులో పెరుగుతున్న పిల్ల పరిస్థితి గురించి ఎవరికీ తెలీదాయె! అస్పష్టమైన, సందిగ్ధంతో కూడుకున్న వస్తువుకు వెల కట్టడం నిషిద్ధం. ఇందులో దగా, మోసాలకు ఆస్కారముంటుంది. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై)ల అభిమతం కూడా ఇదే.

(٦٦٣) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنْ بَيْعِ الْوَلَاءِ وَعَنْ هِبَتِهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

663. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) గారిచే ఉల్లేఖించబడిన ఇంకొక హదీసు : "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'వలా'ను అమ్ముకోవటాన్ని, వేరొకరికి దానిని కానుకగా ఇవ్వడాన్ని వారించారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'వలా' అనేది ఒకవిధమైన వారసత్వ హక్కులాంటిది. ఇది స్వాతంత్ర్యం పొందిన బానిస తరపునుండి, స్వాతంత్ర్యం ప్రసాదించిన యజమానికి ఇవ్వబడుతుంది. పూర్వం అరబ్బులు స్వతంత్రుడయ్యేవాని మరణానికి ముందే బానిసను అమ్మేసేవారు లేక కానుకగా ఇచ్చేసేవారు. దైవప్రవక్త (సఅసం) దీనిని నిషేధించారు. ఈ హక్కు స్వాతంత్ర్యం ప్రసాదించే వ్యక్తి వారసులకు లభించాలి లేదా స్వయంగా ఆ వ్యక్తి అయినా ఆ హక్కును పొందాలన్నదే దీని ఉద్దేశ్యం. అందుకే అటువంటి బానిసను అమ్మటం లేదా కానుకగా ఇవ్వటం ధర్మసమ్మతం కాదు. అత్యధికమంది ఇస్లామీయ విద్వాంసుల అభిమతం కూడా ఇదే.

(٦٦٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعِ الْحَصَاةِ، وَعَنْ بَيْعِ الْغَرَرِ. رَوَاهُ مُسْلِمٌ.

664. హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), కంకరరాళ్లు విసిరి వర్తకం చేయడాన్ని, మోసపూరితమయిన వ్యాపారం చేయడాన్ని నిషేధించారు. (ముస్లిం)

**సారాంశం**

పూర్వం అరబ్బులు చిత్రవిచిత్రమయిన పందాలు వేసుకునేవారు. వాటిలో కంకరరాళ్లు రువ్వే పందెం కూడా ఒకటి. "నువ్వు ఈ రాయి విసిరి ఫలానా లక్ష్యాన్ని ఛేదిస్తే డబ్బు తీసుకోకుండానే ఈ వస్తువు నీకిచ్చేస్తాను" అని అమ్మకందారు కొనుగోలుదారునితో అనేవాడు. అలాగే గొఱ్ఱెల మంద వద్ద ఇద్దరు వ్యక్తులు నిలబడేవారు. వారిలో ఒకడు గుప్పెట్లో గులకరాళ్లు పట్టుకుని, ఈ రాయి ఏ గొఱ్ఱెకు తగులుతుందో దాన్ని నాకు ఇంత ధరకు ఇచ్చివేయాలి

అని షరతు పెట్టేవాడు. ఈ పందాలు పలు రకాలుగా ఉండేవి. వాణిజ్య రంగంలోని ప్రమాణాలను, పరపతిని పాడు చేసే ఇలాంటి చేష్టలను దైవప్రవక్త (స) నిషేధించారు.

అలాగే వస్తువులోని లోపాలను దాచిపెట్టి దాన్ని అమ్మటం; కొలతలు, తూనికలలో తగ్గించి ఇవ్వటం, చేసుకున్న ఒప్పందాలకు కట్టుబడి ఉండకపోవటం లాంటివన్నీ వర్తకంలో దగా, మోసం క్రిందికి వస్తాయి. ఇమామ్ నవవీ (రహ్మ.లై) గారు దగా, మోసం, వంచన లాంటి చెడుగుల క్రిందికివచ్చే కొన్ని విషయాలను ఉదాహరిస్తూ ఇలా అన్నారు: నిషిద్ధమయిన ఈ వ్యవహారంలో అనేక అంశాలు వస్తాయి. ఉదాహరణకు : - పారిపోయిన బానిసను ఇంకొకరికి అమ్మటం, తమ అధీనంలో లేని వస్తువులను విక్రయించటం, ఎక్కువ నీటిలో ఉన్న చేపల క్రయవిక్రయాలు జరపటం, పశువుల పొదుగుల్లో ఉన్న పాలను పితకకుండానే పాలకోసం బేరమాడటం, కడుపులో పెరుగుతున్న నలుసుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకోవటం, తూకం వేయని ధాన్యపు రాసులలో నుంచి కొంత భాగాన్ని అమ్మటం ఇత్యాదివి. ఇవన్నీ అధర్మమయిన వాణిజ్యం క్రిందికి వస్తాయి.

(٦٦٥) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **مَنِ اشْتَرَى طَعَاماً فَلاَ يَبِعْهُ حَتَّى يَكْتَالَهُ.** رَوَاهُ مُسْلِمٌ.

665. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు: "ఎవరైనా ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, ఆ ధాన్యాన్ని కొలిచే (లేక తూకం వేసే) వరకూ వేరొకరికి అమ్మరాదు." (ముస్లిం)

**సారాంశం**

ఒక వ్యక్తి ఎక్కడినుంచైనా ఒక ఆహార ధాన్యాన్ని కొన్నప్పుడు దాన్ని కొలవటమో, తూకం వేయటమో చేసిన మీదటే తన స్వాధీనంలోకి తెచ్చుకుంటాడు. మరి అదే వస్తువును కొంత కాలానికి ఇతరులకు అమ్మేటప్పుడు దాని బరువును సరిచూసుకోవటం ఎంతైనా అవసరం. ఎందుకంటే ధాన్యంలో తరుగు రావచ్చు. మరేమైనా జరగవచ్చు. అందుకే మరోసారి దాన్ని కొలిచే లేక తూకం వేసేదాకా అమ్మటం ధర్మసమ్మతం కాదని అత్యధికమంది విద్వాంసులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇలా చేయటం వల్ల తాము చేసే వర్తకంలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్న ఆత్మ తృప్తి కూడా వ్యాపారులకు ఉంటుంది. (సుబులుస్సలామ్)

(٦٦٦) وَعَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعَتَيْنِ فِي بَيْعَةٍ. رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

666. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: "వ్యాపారం చేసేటప్పుడు రెండు బేరాలను ఒకదానిలో కలగాపులగం చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు

وَلأَبِي دَاوُدَ: «مَنْ بَاعَ بَيْعَتَيْنِ فِي بَيْعَةٍ فَلَهُ أَوْكَسُهُمَا أَوِ الرِّبَا».

అలైహి వ సల్లం) నిషేధించారు" (అహ్మద్, నసాయి). తిర్మిజీ మరియు ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైన హదీసుగా ధృవీకరించారు.
"ఎవరయినా ఒకే వస్తువుకు రెండు ధరలు నిర్ధారిస్తే అతడు తక్కువ ధరతోనే నరిపెట్టు కోవాలి. అన్యధా అది వడ్డీ అవుతుంది" అని అబూ దావూద్‌లోని ఉల్లేఖనంలో ఉంది.

(٦٦٧) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ عَنْ أَبِيهِ عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ يَحِلُّ سَلَفٌ وَبَيْعٌ، وَلاَ شَرْطَانِ فِي بَيْعٍ، وَلاَ رِبْحُ مَا لَا يُضْمَنُ، وَلاَ بَيْعُ مَا لَيْسَ عِنْدَكَ**». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِي وَابْنُ خُزَيْمَةَ وَالْحَاكِمُ.

667. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: అమ్మకాన్ని మరియు అప్పును నమ్మిళితం చేయటం సమ్మతం కాదు. ఒకే బేరంలో రెండు రకాల షరతులు పెట్టడం కూడా సమ్మతం కాదు. వస్తువు తమ అధీనం లోకి రాకమునుపే దానిపై లాభం గడించటం కూడా ధర్మసమ్మతం కాదు. అదే విధంగా నీ దగ్గరలేని దాన్ని ఇతరులకు అమ్మటం కూడా ధర్మసమ్మతం కాదు." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు - తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ, హాకిమ్‌లు ముగ్గురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

وَأَخْرَجَهُ فِي عُلُومِ الْحَدِيثِ، مِنْ رِوَايَةِ أَبِي حَنِيفَةَ، عَنْ عَمْرٍو الْمَذْكُورِ، بِلَفْظِ «نَهى

ఇదే హదీసును పైన ప్రస్తావితులైన అమ్ర్ (రజి) గారి మధ్యవర్తిత్వంతో అబూ హనీఫా గారు- ప్రవక్త (సఅసం) షరతుతో కూడిన వర్తకం చేయడాన్ని వారించారు- అన్న పదాలతో ఉల్లేఖించినట్లు ఇమాం

عَنْ بَيْعٍ وَشَرْطٍ». وَمِنْ هَذَا الْوَجْهِ أَخْرَجَهُ الطَّبَرَانِيُّ فِي الْأَوْسَطِ، وَهُوَ غَرِيبٌ.

హాకిమ్‌గారు "ఉలూముల్ హదీస్" గ్రంథంలో పేర్కొన్నారు.

(దారె ఖుత్ని 'అవ్‌సత్' అను గ్రంథంలో ఇదేవిధంగా ఉల్లేఖించారు. అయితే అది అరుదైనది)

## హదీసు ఉల్లేఖకులు

సుప్రసిద్ధ నలుగురు ఇమాములో ఇమామ్ అబూ హనీఫాగారు ఒకరు. ఈయన అసలు పేరు నోమాన్ బిన్ సాబిత్ కూఫీ. బనూ తైముల్లాహ్ బిన్ సాలబ నుండి స్వేచ్ఛనొసగబడిన బానిస. పర్షియన్ అని కూడా ఒక వినికిడి ఉంది. పట్టు వస్త్రాలను అమ్మేవారు. హదీసు ఉల్లేఖనాలకు సంబంధించి హదీసువేత్తల ఒక వర్గం ఈయన్ని విశ్వసనీయునిగా ఖరారు చేయగా మరికొంతమంది జయీఫ్ ఉల్లేఖకులని పేర్కొన్నారు. ఫికహ్ (ధర్మావగాహన)లో ఈయనంతటి వాడిని తాను చూడలేదని ఇబ్నె ముబారక్ (రహ్మ.లై) గారు అన్నారు. దేవుడు ఆయనకు ప్రసాదించిన పేరు ప్రఖ్యాతులు అసాధారణమైనవి, ఆయన మాత్రం ఎన్నడూ ఇతరుల పొగడ్తలను ఆశించలేదు. ఫికహ్, దైవభక్తి, దైవపరాయణత మరియు దాన ధర్మాలలో పేరుమోసిన వ్యక్తి. హి.శ. 80వ పడిలో జన్మించారు. 150లో మరణించారు.

(٦٦٨) وَعَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعِ الْعُرْبَانِ. رَوَاهُ مَالِكٌ، قَالَ: بَلَغَنِي عَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ بِهِ.

668. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్‌గారే తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుండి సంగ్రహించిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యాపార లావాదేవీలలో 'బయానా' సొమ్మును నిషేధించారు. (దీనిని మాలిక్ - రహ్మ.లై - ఉల్లేఖించారు. ఈ హదీసు తనకు అమ్ర్ బిన్ షుఐబ్ ద్వారా అందిందని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) చెప్పారు)

## సారాంశం

అరబీలో 'ఉర్బాన్' అనే పదం వచ్చింది. దీని ప్రకారం ఒక వ్యక్తి మరోవ్యక్తి దగ్గర ఒక ఇల్లునో, ప్లాటునో, పశువునో కొంటాడు. బేరం కుదుర్చుకున్న దానికి తార్కాణంగా ఒక వెయ్యి రూపాయలు 'బయానా'గా అమ్మకందారునికి ఇస్తాడు. ఫలానా గడువులోగా తాను కొన్న

వస్తువుకు పూర్తి సొమ్మును చెల్లిస్తానని ఒప్పందం చేసుకుంటాడు. ఆ గడువులోగా అతడు పూర్తి సొమ్మును చెల్లిస్తే ఆ వస్తువు అతని సొంతమవుతుంది. లేనిపక్షంలో అతడు అమ్మకం దారునికి 'బయానా'గా ఇచ్చిన వెయ్యి రూపాయలు తిరిగి రావు. ఇటువంటి లావాదేవీలను దైవప్రవక్త (సఅసం) నిషేధించారు.

ఈ ఉల్లేఖనం ఆధారంగా ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) బయానా సొమ్మును అధర్మంగా భావిస్తున్నారు. అయితే ఈ హదీసు అందిన పరంపర బలహీనంగా ఉంది.

(٦٦٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: ابْتَعْتُ زَيْتاً فِي السُّوقِ، فَلَمَّا اسْتَوْجَبْتُهُ لَقِيَنِيْ رَجُلٌ فَأَعْطَانِيْ بِهِ رِبْحاً حَسَناً، فَأَرَدْتُ أَنْ أَضْرِبَ عَلَى يَدِ الرَّجُلِ، فَأَخَذَ رَجُلٌ مِّنْ خَلْفِيْ بِذِرَاعِيْ فَالْتَفَتُّ فَإِذَا هُوَ زَيْدُ بْنُ ثَابِتٍ، فَقَالَ: لاَ تَبِعْهُ حَيْثُ ابْتَعْتَهُ، حَتَّى تَحُوزَهُ إِلَى رَحْلِكَ، فَإِنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى أَنْ تُبَاعَ السِّلَعُ حَيْثُ تُبْتَاعُ، حَتَّى يَحُوزَهَا التُّجَّارُ إِلَى رِحَالِهِمْ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

669. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: నేను బజారు నుండి (జైతూన్) నూనె కొన్నాను. నేను కొన్న కొద్ది క్షణాల్లోనే ఒక వ్యక్తి నా వద్దకు వచ్చి, ఆ నూనెను తనకు అమ్మితే మంచి గిట్టుబాటు ధర ఇస్తానని బేరమాడసాగాడు. నేను కూడా ఆ వ్యక్తికి అమ్మాలనే అనుకున్నాను. అంతలోనే వెనుక నుంచి ఎవరో నా భుజంపై చేయివేశారు. నేను తిరిగి చూస్తే జైద్ బిన్ సాబిత్ (రజి) నిలబడి ఉన్నారు. ఆయన ఇలా అన్నారు: "మీరు సరుకును కొన్న చోటే అమ్మకూడదు. దాన్ని మీ ఇంటికి మోసుకువెళ్ళిన మీదట అమ్మవచ్చు. ఎందుకంటే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వస్తువులను కొన్నచోటే అమ్మడాన్ని వారించారు. అయితే వ్యాపారులు తాము కొనుగోలు చేసిన సరుకును, కారకాలను తమ స్థావరాలకు తరలించిన పిదప అమ్ముకుంటే అప్పుడది సమ్మతమేనని సెలవిచ్చారు." (అహ్మద్, అబూ దావూద్‌లు ఈ హదీసును ఉల్లేఖించారు. హదీసు

వాక్యాలు మాత్రం అబూ దావూద్ లోనివి. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٦٧٠) وَعَنْهُ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنِّي أَبِيعُ الإِبِلَ بِالْبَقِيعِ فَأَبِيعُ بِالدَّنَانِيرِ، وَآخُذُ الدَّرَاهِمَ، وَأَبِيعُ بِالدَّرَاهِمِ، وَآخُذُ الدَّنَانِيرَ، آخُذُ هٰذَا مِنْ هٰذِهِ، وَأُعْطِي هٰذِهِ مِنْ هٰذَا، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ بَأْسَ أَنْ تَأْخُذَهَا بِسِعْرِ يَوْمِهَا مَا لَمْ تَتَفَرَّقَا وَبَيْنَكُمَا شَيْءٌ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

670. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: 'ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను 'బఖీ'లో ఒంటెలను అమ్ముతాను. దీనార్లలో అమ్మి దిర్‌హమ్‌లు వసూలు చేస్తాను. (ఒక్కోసారి)దిర్‌హమ్‌లలో అమ్మి దీనార్లు కూడా వసూలు చేస్తాను. అంటే దిర్‌హమ్‌లకు బదులు దీనార్లు, దీనార్లకు బదులు దిర్‌హమ్‌లు తీసుకుంటూ ఉంటాను. దీనికి బదులు అది తీసుకుంటాను. దానికి బదులు ఇది ఇస్తూ ఉంటాను (ఇది సమ్మతమేనా?!)' అని నేను సందేహపడగా దైవప్రవక్త (సఅసం) ఇలా సమాధానమిచ్చారు - "ఆ రోజు తీసుకున్న ద్రవ్యాన్ని ఆ రోజే, ఆనాటి రేటు ప్రకారం మారకం చేస్తే అది ధర్మసమ్మతమే. అయితే క్రయ విక్రయాలు జరిపిన వారు పరస్పరం విడిపోకముందే వారు ఒండొకరికి బాకీపడకుండా ఉండాలి. (అట్టి పరిస్థితి లోనే ఇది ధర్మసమ్మతమవుతుంది)." (ఈ హదీసును ఐదుగురు ఉల్లేఖించగా, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

(٦٧١) وَعَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ النَّجْشِ. مُتَّفَقٌ عَلَيْهِ.

671. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) గారిచే ఉల్లేఖించబడిన ఇంకొక హదీసు

ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మోసపూరితమయిన వేలం పాట ద్వారా వస్తువులను అమ్మటాన్ని నిషేధించారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పై హదీసులో 'నజష్' అనే పదం ప్రయోగించబడింది. దీని ప్రకారం మార్కెట్టులో వస్తువులు అమ్మకానికై ప్రదర్శించబడుతుంటాయి. కొనుగోలుదారులు వచ్చి వస్తువులను పరికిస్తూ, వాటి ధర గురించి ఆరా తీస్తూ ఉంటారు. అంతలో ఒక వ్యక్తి హటాత్తుగా అక్కడ ప్రత్యక్షమై ఆ వస్తువుల నాణ్యత గురించి కోతలు కోయటం మొదలెడతాడు. ఇంత నాణ్యమైన ఈ వస్తువుకు ఇంత ధర ఇచ్చినా తక్కువేనంటూ వస్తువుల ధరను పెంచేస్తాడు. వాస్తవానికి ఆ వ్యక్తి వస్తువులను కొనడానికి రాలేదు. అమ్మకం దారునితో లోపాయికారిగా చేసుకున్న ఒప్పందం ప్రకారం అతగాడు అక్కడకు వచ్చి మార్కెట్టులో 'వైపరీత్యం' సృష్టించాడు. అతని మాయ మాటలకు మోసపోయిన జనం వాస్తవంగా కొనవలసిన ధరకంటే ఎక్కువ ధరకు వస్తువులను కొంటారు. తరువాత ఆ వ్యక్తి అమ్మకందారుని వద్దకు గప్‌చిప్‌గా వెళ్లి తనకు రావలసిన కమీషన్‌ను జేబులో వేసుకుంటాడు. ఇలాంటి వైపరీత్యాల వల్ల పరిపూర్ణమైన పోటీ విధానంలో సమతౌల్యం దెబ్బతింటుంది. కొనుగోలుదార్లకు చాలా అన్యాయం జరుగుతుంది. అందుకే షరీయత్ ఇటువంటి క్రయవిక్రయాలను నిషిద్ధంగా ఖరారు చేసింది. ఈ రకమయిన వేలంపాట నిస్సందేహంగా అధర్మమన్న విషయంలో పండితులందరి మధ్య ఏకాభిప్రాయముందని ఇమామ్ నవవీ (రహ్మతుల్లై) అంటున్నారు.

(٦٧٢) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنِ الْمُحَاقَلَةِ، وَالْمُزَابَنَةِ، وَالْمُخَابَرَةِ، وَعَنِ الثُّنْيَا،

672. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ముహాఖలా', 'ముజాబనా', 'ముఖాబరా' పద్ధతులను నిషేధించారు. వీటితో పాటు 'సున్‌యా' విధానాన్ని కూడా ఆయన (స) వారించారు. అయితే అమ్మకం జరిగే వస్తువుల్లో ఫలానా వస్తువును మినహాయించి మిగిలిన వాటిని అమ్ముతున్నాను అని స్పష్టంగా చెబితే అప్పుడది ధర్మసమ్మతమవుతుంది. (ఈ హదీసును ఇబ్నె మాజ

إِلاَّ أَنْ تُعْلَمَ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ ابْنَ مَاجَهْ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

గాకుండా మరో ఐదుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

1). ముహాఖలా : ముహాఖలా అంటే పొలంలో పంట కోతకు రాకముందే ధాన్యానికి బదులుగా పంటను అమ్మటం.

2). ముజాబనా: **చెట్టుకు కాచివున్న** కాయలను అదే కోవకు చెందిన ఎండు ఫలాల (డ్రై ఫ్రూట్స్)కు బదులుగా అమ్మివేయటం. ఉదాహరణకు ఎండు ఖర్జూరాలకు బదులుగా చెట్లకు పండుతూ ఉన్న ఖర్జూరాలను అమ్మటం. అలాగే ద్రాక్ష తోటలో కాపుకు రాబోతున్న ద్రాక్షపండ్లను ఎండు ద్రాక్ష (కిస్మిస్)కు మారుగా అమ్మివేయటం.

ఇలాంటి అమ్మకాలను దైవప్రవక్త (సఅసం) వారించారు. ఎందుకంటే ఇలాంటి స్థితిలో పంట దిగుబడి ఖచ్చితంగా ఎంత ఉంటుందో అంచనా వేయటం దుర్లభం. పంట కోసిన మీదట, అది ఎండి ఎంత బరువు వస్తుందో ఏమో! అది అంచనాలకు మించనూవచ్చు, తగ్గనూవచ్చు. ఎట్టి పరిస్థితిలోనూ ఉభయుల్లో ఎవరో ఒకరికి నష్టం వాటిల్లుతుంది. ధాన్యం ఒకే కోవకు చెందినదైనప్పుడు ఇచ్చి పుచ్చుకోవడాల్లో హెచ్చు తగ్గులుండకూడదు - హెచ్చు ధాన్యం ఎవరికయినా వస్తే అది వడ్డీ క్రిందికి వస్తుంది. (ఇస్లాంలో వడ్డీ నిషేధం కదా!)

3). ముఖాబరా : పొలం యజమానికీ - కౌలుదారునికీ మధ్య జరిగే ఒప్పందం ఇది. ఈ ఒప్పందం ప్రకారం పొలంలో ఫలానా భాగపు పంట తనకు ఇచ్చి, మిగిలిన భాగంలో పండే పంటను నువ్వు తీసుకోవచ్చు అని యజమాని కౌలుదారునికి షరతు పెడతాడు. ఇది వాంఛనీయం కాదు. ఎందుకంటే ఒక్కోసారి కౌలుదారునికి చెందవలసిన భాగంలో పంట దెబ్బతినవచ్చు, యజమానికి రావలసిన భాగం సురక్షితంగా ఉండవచ్చు. అలాగే ఒక్కోసారి యజమానికి చెందవలసిన పంట భాగానికి తెగులు పట్టి, కౌలుదారునికి చెందవలసిన భూభాగంలో పంట బాగా పండవచ్చు. రెండు పరిస్థితుల్లోనూ ఉభయుల్లో ఎవరో ఒకరికి నష్టం వాటిల్లవచ్చు. అందుకే ఈ పద్ధతిని దైవప్రవక్త (సఅసం) వారించారు.

దీనికి బదులుగా పండిన పంటలో ఇంత భాగం యజమానికీ, ఇంతభాగం కౌలుదారునికి చెందాలి అని వారిరువురూ ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటే; అది ఆక్షేపణీయం కాజాలదు. దైవప్రవక్త (స) కూడా ఖైబర్ వాసులతో ఈ విధమైన ఒప్పందమే చేసుకున్నారు.

4). సున్యా : అంటే నిర్ధారితంకాని, అస్పష్టమైన ఒకానొక వస్తు భాగాన్ని అమ్మకం నుండి మినహాయించటం. అంటే నేనీ ధాన్యపు కుప్పను అమ్ముతున్నాను గాని ఇందులోని ఒక భాగాన్ని మాత్రం అమ్మను అని చెప్పి కొనుగోలుదార్లను తికమక పెట్టడమన్నమాట! ఉదాహరణకు: వస్త్రాల థానులు, గొఱ్ఱెల మందలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయనుకోండి-

తాను వాటిని అమ్ముతున్నాను. అయితే వాటిలో కొంత భాగం అమ్మబోను అని అమ్మకం దారుడు అంటాడు. ఆ 'కొంతభాగం' ఏదీ అనేది స్పష్టంగా వేరుచేసి చూపడు. వాణిజ్యరంగంలో అవలంబించబడే ఇలాంటి అస్పష్టవైఖరి అయోమయంలో పడవేస్తుంది. అయితే గొఱ్ఱెల మందలో ఫలానా గొఱ్ఱెను మినహాయించి మిగతా వాటిని అమ్ముతాననో, ఫలానా వస్త్రపు ధాను తప్ప మిగిలిన వాటిని ఇస్తాననో స్పష్టంగా ప్రకటిస్తే అప్పుడది ధర్మసమ్మతమవుతుంది.

(٦٧٣) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الْمُحَاقَلَةِ، وَالْمُخَاضَرَةِ، وَالْمُلاَمَسَةِ، وَالْمُنَابَذَةِ، وَالْمُزَابَنَةِ. رَوَاهُ الْبُخَارِيُّ.

673. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వర్తకంలో ముహాఖలా, ముఖాజరా, ములామసా, మునాబజా, ముజాబనా పద్ధతులను నిషేధించారు. (బుఖారీ)

**సారాంశం**

ముఖాజరా : అంటే పండ్లు ఫలాలు, ఆహార ధాన్యాలు పండకముందే అమ్మకానికి పెట్టడం.

ములామసా, మునాబజా : 'ముస్లిం'లో హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనంలో ఈ రెండిటి తాత్పర్యం ఈ విధంగా ఉంది - 'ములామసా' ప్రకారం ఇరువురు వ్యక్తులు ఒండొకరి దుస్తులను చెప్పకుండానే ముట్టుకుంటారు. ఇలా ముట్టుకుంటే వారు క్రయవిక్రయాలకు సంబంధించి ఒక నిర్ణయానికి వచ్చినట్లే లెక్క. 'మునాబజా' అంటే ఇరువురు వ్యక్తులు వస్త్రాన్ని చూడకుండా, పరికించకుండానే ఒండొకరి వైపు వస్త్రాన్ని విసిరివేస్తారు. ఇలా విసిరివేయటమే బేరం కుదిరిందన్న దానికి తార్కాణంగా పరిగణించబడుతుంది.

బుఖారీ మరియు ముస్లింలలో హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ఉల్లేఖనంలో ఈ రెంటి వ్యాఖ్యానం ఇలా వుంది: కొనుగోలుదారు పగటిపూటైనా, రాత్రిపూటైనా ఇతరుల వస్త్రాన్ని చూడకుండానే, తనిఖీ చేయకుండానే కేవలం (వస్త్రాన్ని) ముట్టుకుంటే చాలు, దాన్ని కొన్నట్టే లెక్క. ఇక 'మునాబజా' అంటే ఏమిటో చూడండి - అమ్మకందారుడు, కొనుగోలుదారుడు- ఇద్దరూ ఒండొకరి వైపు తమ తమ వస్త్రాన్ని విసురుతారు. ఇలా విసరటమే వారివురి మధ్య జరిగిన వర్తకానికి ప్రతీక. ఆ సరుకును వారు చూడకపోయినా, పరస్పరం సంప్రతింపులు జరగకపోయినా సరే. కేవలం ముట్టుకోవటం, విసిరివేయటమే వాణిజ్య ఒడంబడికకు, లావాదేవీలకు ప్రత్యామ్నాయంగా భావించబడుతుందన్నమాట! వాణిజ్యరంగంలో అనర్థాలకు, అపసవ్యతలకు దారితీసే ఇటువంటి పోకడలను దైవప్రవక్త (సఅసం) గట్టిగా వారించారు.

(٦٧٤) وَعَنْ طَاوُسٍ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَلَقَّوُا الرُّكْبَانَ، وَلاَ يَبِيْعُ حَاضِرٌ

674. హజ్రత్ తావుస్ హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) నుండి సంగ్రహించిన విషయాన్ని ఇలా తెలియజేశారు : "వర్తక

لِبَادٍ»، قُلْتُ لِابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما: مَا قَوْلُهُ ﷺ لاَ يَبِيْعُ حَاضِرٌ لِبَادٍ؟ قَالَ: لاَ يَكُونُ لَهُ سِمْسَاراً. مُتَّفَقٌ عَلَيْهِ وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

సామగ్రిని (పట్టణాల్లోకి) తీసుకుని వచ్చే వర్తక బృందాలను ముందుగా వెళ్ళి కలుసుకోవటంగానీ, పల్లెవాసి సరుకును పట్టణవాసి అమ్మటంగానీ చేయకండి" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు. 'పట్టణవాసి పల్లెవాసి సరుకును అమ్మవద్దు' అన్న మాటలోని అంతరార్థం ఏమిటీ? అని నేను ఇబ్నె అబ్బాస్ (రజి)ను ప్రశ్నించగా 'పట్టణవాసి పల్లెటూరి వాళ్ళకు దళారిగా వ్యవహరించరాదు' అన్నది దీని మతలబు అని ఆయన వివరించారు. (బుఖారీ, ముస్లిం. ఈ వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

## సారాంశం

మధ్య దళారుల చేతికి చిక్కిన అమాయక పల్లెవాసులకు జరిగే అన్యాయం గురించి 1400 ఏళ్ల క్రితమే దైవప్రవక్త (సఅసం) అప్రమత్తం చేశారు. ఆధునిక యుగంలో సయితం ఈ అన్యాయం జరుగుతోంది. పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించటం లేదు సరికదా నశ్వర వస్తువులను పట్నానికి తరలించే గ్రామీణ రైతులను బ్రోకర్లు నిలువునా దోచుకుంటున్నారు. ఈ దోపిడీ నుండి కొంతవరకైనా రైతులను కాపాడే ఉద్దేశ్యంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రైతు బజార్' లాంటి వ్యవస్థను నెలకొల్పింది. కాగా; పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితమే ఈ నిలువుదోపిడీని పసిగట్టి, దానికి ముకుతాడు బిగించిన ఇస్లాం ఓ నిత్య నూతన వ్యవస్థ అనడంలో సందేహమేముందీ? - అనువాదకుడు

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ తావుస్‌గారి మరోపేరు అబూ అబ్దుర్రహ్మాన్. వంశపరంపర దృష్ట్యా తావుస్ బిన్ కీసాన్ హిమ్యరీ అనబడతారు. హిమ్యార్ తెగచే స్వేచ్ఛ నొసగబడిన బానిస. పారసీక జాతికి చెందిన వారు. ఆయన అసలు పేరు జక్వాన్ అనీ, తావుస్ అనేది ఆయన బిరుదు అని కూడా అనబడుతోంది. విశ్వసనీయులు. గొప్ప విద్వాంసులు. ధర్మావగాహనలో సాటిలేని మేటి. మూడో తరానికి చెందిన తాబయి. తాను 50 మంది సహాబీలను చూశానని ఆయన అనేవారు. ఈయన గురించి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వ్యాఖ్యానిస్తూ, 'తావుస్ జన్నతీ

(స్వర్గంలో ప్రవేశం పొందగలవారు) అని అనేవారు. తావుస్ లాంటి వారిని తాను చూడలేదని అమ్ర్ బిన్ దీనార్ అంటూ ఉండేవారు. హిజ్రీ 106వ ఏట ఈయన మరణించారు.

(٦٧٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَلَقَّوُا الْجَلَبَ، فَمَنْ تُلُقِّيَ فَاشْتُرِيَ مِنْهُ فَإِذَا أَتَى سَيِّدُهُ السُّوقَ فَهُوَ بِالْخِيَارِ**». رَوَاهُ مُسْلِمٌ.

675. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "బయటినుంచి నగరంలోనికి ఆహార ధాన్యం తెచ్చేవారిని ముందుగా (ఎదురుగా) వెళ్ళి కలుసుకోకండి. ఎవరయినా ముందుగానే వెళ్ళి మార్గమధ్యంలోనే సరకును కొంటే మార్కెట్టులో అమ్మిన తరువాత (ఆ ఒప్పందానికి కట్టుబడి ఉండే లేదా ఒప్పందాన్ని రద్దుపరచే) అధికారం సరుకు యజమానికి ఉంటుంది." (ముస్లిం)

**సారాంశం**

మార్కెట్టులో ఆ రోజు వస్తువుల ధర గురించి ఏమాత్రం తెలియని పల్లెవాసులకు ఎదురుగా వెళ్ళి బేరమాడటం వాంఛనీయం కాదు. ఎందుకంటే సరుకును కొనదలచిన వ్యక్తి ఎంతసేపటికీ చౌకధరకే కొనగోరుతాడు. మార్కెట్టులో వస్తువుల ధర ఒకటుంటే వాళ్లకు ఇంకొక ధర చెబుతాడు. ఇందులో మోసం జరగడానికి ఆస్కారముంటుంది. ఒక సోదరుడు మరో సోదరుని శ్రేయోభిలాషి అయి ఉండాలనీ, సాటి సోదరునికి దగా చేయరాదని ఇస్లాం అంటోంది. వర్తకంలో పరస్పర నమ్మకం, నిజాయితీ తత్పరత నెలకొని ఉండాలి. అందుకే తమ స్వార్థం కోసం, స్వప్రయోజనాల కోసం ఎదుటివారిని ఏమార్చే పద్ధతులను ఇస్లాం గర్హిస్తుంది.

(٦٧٦) وَعَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يَبِيْعَ حَاضِرٌ لِبَادٍ، وَلاَ تَنَاجَشُوا، وَلاَ يَبِيْعُ الرَّجُلُ عَلَى بَيْعِ أَخِيْهِ، وَلاَ يَخْطُبُ عَلَى خِطْبَةِ أَخِيْهِ، وَلاَ تَسْأَلُ الْمَرْأَةُ طَلاَقَ أُخْتِهَا، لِتَكْفَأَ مَا

676. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) క్రింది విషయాలను వారించారు: "పట్టణవాసి పల్లెటూరి వ్యక్తుల సరుకు అమ్మరాదు. వస్తువును కొనే ఉద్దేశం లేనపుడు ధర పెంచకండి. ఒక సోదరుడు వాణిజ్య ఒప్పందం చేసుకున్న

فِي إِنَائِهَا. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «لاَ يَسُومُ الْمُسْلِمُ عَلَى سَومِ أَخِيْهِ».

తరువాత మరో సోదరుడు ప్రమేయం చేసుకుని బేరసారాలు జరపరాదు. ఇంకా మీలోని ఒక సోదరుడు ఒక స్త్రీకి వివాహ సందేశం పంపినమీదట, మరొకరు ఆమెకు వివాహ సందేశం పంపకూడదు. ఏ స్త్రీ కూడా మరొక స్త్రీ హక్కును కాజేసే ఉద్దేశ్యంతో ఆమెకు విడాకులు ఇప్పించే ప్రయత్నం చెయ్య కూడదు. (బుఖారీ, ముస్లిం)

''ఏ వ్యక్తీ తన సోదరుడు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న మీదట దానిపై మరో ఒప్పందం చేయరాదు'' అని సహీహ్ ముస్లింలో ఉంది.

(٦٧٧) وَعَنْ أَبِي أَيُّوبَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «**مَنْ فَرَّقَ بَيْنَ وَالِدَةٍ وَوَلَدِهَا فَرَّقَ اللَّهُ بَيْنَهُ وَبَيْنَ أَحِبَّتِهِ يَوْمَ الْقِيَامَةِ**». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ التِّرمِذِيُّ وَالْحَاكِمُ، لَكِنْ فِي إِسْنَادِهِ مَقَالٌ، وَلَه شَاهِدٌ.

677. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా విన్నాను - ''ఎవరయితే తల్లీ-బిడ్డల మధ్య ఎడబాటును కల్పించాడో అతనికి - అతని ఆత్మీయులకు మధ్య అల్లాహ్ ప్రళయదినాన ఎడబాటు కల్పిస్తాడు.'' (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. తిర్మిజీ, హాకిమ్ దీనిని ప్రామాణికమైందిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో రక్త సంబంధాల ప్రాముఖ్యత నొక్కి వక్కాణించబడింది. పూర్వం అరేబియాలో బానిసలు, బానిసరాళ్లను విక్రయించేటప్పుడు కొంతమంది ఎంతో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారు. ఈ నేపథ్యంలోనే ఈ హదీసు వచ్చింది. బానిసరాళ్లను అమ్మేటప్పుడు - యుక్త వయస్సుకు రాని పిల్లలను వారి తల్లుల నుండి వేరు చేయరాదని, అలా చేయటం

వల్ల మాతృ మమతకు తీవ్రమయిన గాయం కలుగుతుందని పై హదీసులో చెప్పబడింది. ఎవరయితే ప్రాపంచిక జీవితంలో దయ, జాలి, కరుణ, వాత్సల్యం, మమతానురాగాలను మంట గలిపి బంధుత్వ సంబంధాల, రక్త సంబంధాల విచ్ఛిత్తికి పాల్పడతాడో అతడు పరలోక జీవితంలో తన ఆత్మీయులకు, అయినవాళ్ళకి దూరమైపోతాడని హదీసులో హెచ్చరించటం జరిగింది.

(٦٧٨) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنِي رَسُولُ اللهِ ﷺ أَنْ أَبِيْعَ غُلاَمَيْنِ أَخَوَيْنِ، فَبِعْتُهُمَا، فَفَرَّقْتُ بَيْنَهُمَا، فَذَكَرْتُ ذٰلِكَ لِلنَّبِيِّ ﷺ، فَقَالَ: «**أَدْرِكْهُمَا فَارْتَجِعْهُمَا، وَلاَ تَبِعْهُمَا إِلاَّ جَمِيعاً**». رَوَاهُ أَحْمَدُ، وَرِجَالُهُ ثِقَاتٌ، وَقَدْ صَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ وَالطَّبَرَانِيُّ وَابْنُ الْقَطَّانِ.

678. హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) కథనం : "ఇద్దరు బానిస అన్న దమ్ములను అమ్మమని దైవప్రవక్త (సఅసం) నన్ను ఆజ్ఞాపించగా నేను ఆ ఇరువురినీ వేర్వేరు వ్యక్తులకు అమ్మిన మీదట దైవప్రవక్త (సఅసం)కు సంగతి తెలియజేశాను. ఇది వినగానే ఆయన (స) ఇలా ఆదేశించారు: "ఆ ఇరువురినీ వాపసు తీసుకురా. ఇద్దరినీ కలిపి ఒకేచోట అమ్ము." (ఈ హదీసును అహ్మద్ ఉల్లేఖించారు. దీన్ని అందజేసిన వారు విశ్వసనీయులు. దీనిని ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్, తబ్రానీ, ఇబ్నె ఖత్తాన్ ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

**సారాంశం**

ఇంతకు ముందు వచ్చిన హదీసులో తల్లీ బిడ్డల మధ్య ఎడబాటు సృష్టించటం సమ్మతం కాదని చెప్పబడింది. ఈ హదీసులో అన్నదమ్ముల మధ్య సయితం ఎడబాటు సృష్టించరాదనీ వక్కాణించబడింది. అయితే అన్నదమ్ముల మధ్య ఏర్పడే ఎడబాటు తల్లీ బిడ్డల మధ్య ఏర్పడే ఎడబాటంత తీవ్రమైనది కాదని ప్రఖ్యాత విద్వాంసులు షౌకానీ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు.

ఈ ఎడబాటుకు వయోపరిమితి ఎంత? ఇది చిన్న పిల్లలకే వర్తిస్తుందా? పెద్దవారికి కూడానా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. యుక్త వయస్సుకు చేరిన వారి మధ్య ఎడబాటు జరిగితే అది అధర్మం కాజాలదని ప్రమాణబద్ధమైన ఆధారాల ద్వారా విదితమవుతున్నది.

(٦٧٩) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: غَلاَ السِّعْرُ فِي الْمَدِيْنَةِ عَلَى عَهْدِ رَسُولِ اللهِ فقال النَّاسُ: يا رسولَ اللهِ! غَلاَ السِّعرُ، فَسَعِّرْ لَنَا، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **«إِنَّ اللَّهَ هُوَ الْمُسَعِّرُ الْقَابِضُ الْبَاسِطُ الرَّازِقُ، وَإِنِّي لأَرْجُو أَنْ أَلْقَى اللَّهَ تَعَالَى وَلَيْسَ أَحَدٌ مِنْكُمْ يَطْلُبُنِي بِمَظْلَمَةٍ فِي دَمٍ وَلاَ مَالٍ»**. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

679. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో మదీనాలో వస్తువుల ధరలు బాగా పెరిగిపోయాయి. ఈ విషయం గురించి ప్రజలు, 'దైవప్రవక్తా (స)! వస్తువుల ధరలు చాలా పెరిగి పోయాయి. తమరు మా కొరకు ధరలు నిర్ధారించండి' అని విన్నవించుకోగా, దానికి దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: "ధరలు నిర్ధారించేవాడు అల్లాహ్‌యే. ఆయనే తగ్గిస్తాడు, చౌకగా చేస్తాడు. మరి ధరలు పెంచేవాడు, ఉపాధిని ప్రసాదించేవాడు కూడా ఆయనే. మీలో ఏ ఒక్కరూ రక్తం మరియు ఆస్తి విషయంలో తనకు అన్యాయం జరిగిందంటూ నాపై నిందమోపని స్థితిలో నేను సర్వోన్నతుడైన అల్లాహ్‌ను కలుసుకోగోరుతున్నాను." (నసాయి తప్ప మిగిలిన ఐదుగురూ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

వస్తువుల ధరలు పెరగకుండా ప్రభుత్వం తరపున ఆంక్షలు విధించటం సబబు కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దీనివల్ల ఒకవైపు వ్యాపారులు నష్టపోవటమే గాకుండా, వర్తకులు మరోవైపు వస్తువులను నిలువ చేయటం మొదలెడతారు. ఈ నిలువలు మార్కెట్టులో సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. డిమాండ్ - **సప్లై** మధ్య సమన్వయం దెబ్బతింటుంది. నిత్యావసర వస్తువులను సమకూర్చుకోలేక సామాన్య **జనులు** ఇబ్బందుల పాలవుతారు. బ్లాక్ మార్కెటింగ్ పురివిప్పుతుంది. పర్యవసానంగా సమాజంలో అసంతృప్తి, అశాంతి, అలజడులు రేకెత్తుతాయి.

(٦٨٠) وَعَنْ مَعْمَرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ رَسُولِ اللهِ ﷺ، قَالَ: «لاَ يَحْتَكِرُ إِلاَّ خَاطِئٌ». رَوَاهُ مُسْلِمٌ.

680. హజ్రత్ మామర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "పాపాత్ముడు తప్ప మరెవరూ ధరలు పెంచే సంకల్పంతో వస్తువులను నిలువ చేసి ఉంచడు." (ముస్లిమ్)

### సారాంశం

మార్కెట్టులో వస్తువులకు డిమాండు ఉన్నప్పటికీ ఇంకా ధరలు పెరుగుతాయనే ఆశతో కృత్రిమ నిలువలు చేసి ఉంచటం అధర్మమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. హదీసులో ఉపయోగించబడిన పదం (నిలువ) సర్వసామాన్యమైనది. అయితే మానవులు, పశువులు తినే వస్తువులకే ఈ పదం వర్తిస్తుందని, ఇతర వస్తువులకు వర్తించదని చాలామంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

వినియోగదారుల తరపున డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారస్తులు వస్తువులను దాచిపెడితే, అది ముమ్మాటికీ హరామ్ (అధర్మం)గా పరిగణించబడుతుంది. కాని రైతులు తాము పండించిన వ్యవసాయోత్పత్తులను నిలువచేసి ఉంచటం ఆక్షేపణీయం కాదు. అయితే రాజ్యంలో సర్వత్రా ఆహార వస్తువుల కొరత ఏర్పడినట్లయితే అలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులు సయితం తమ గిడ్డంగులను ఖాళీచేసి ఆహార వస్తువులను మార్కెట్టులో ప్రవేశ పెట్ట వలసి ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

మామర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ నాఫె బిన్ నజ్‌లా బిన్ హర్సాన్ అల్ అదవీ (రజి). ఈయన అబూ మామర్ గారి కుమారులు. అగ్రశ్రేణి సహాబీలలో ఒకరు. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. తొలుత అబిసీనియాకు వలస వెళ్ళారు. మదీనాకు ప్రస్థానం చేయటంలో కొంత ఆలస్యం అయింది. కడకు మదీనాలోనే స్థిరపడ్డారు.

(٦٨١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «لاَ تُصَرُّوا الإِبِلَ وَالْغَنَمَ، فَمَنِ ابْتَاعَهَا بَعْدُ فَهُوَ بِخَيْرِ النَّظَرَيْنِ بَعْدَ أَنْ يَحْلُبَهَا، إِنْ شَاءَ أَمْسَكَهَا،

681. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు: "ఒంటెలను, మేకలను విక్రయించే సమయంలో వాటి పాలను వాటి పొదుగుల్లో ఆపి ఉంచకండి. ఒకవేళ ఎవరయినా ఇలాంటి పశువులను కొంటే రెండు

وَإِنْ شَاءَ رَدَّهَا وَصَاعاً مِنْ تَمْرٍ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: فَهُوَ بِالْخِيَارِ ثَلاَثَةَ أَيَّامٍ. وَفِيْ رِوَايَةٍ لَهُ عَلَّقَهَا الْبُخَارِيُّ: «وَرَدَّ مَعَهَا صَاعاً مِّنْ طَعَامٍ لاَ سَمْرَآءَ». قَالَ الْبُخَارِيُّ: وَالتَّمْرُ أَكْثَرُ.

విషయాలలో ఏదో ఒక ఉత్తమమైన దానిని అవలంబించే స్వేచ్ఛాధికారం - పాలు పితికినమీదట - అతనికి (కొను గోలుదారునికి) ఉంటుంది. ఒకటి: ఆ పశువును తన వద్దనే ఉంచుకోవచ్చు లేదా రెండు: ఒక 'సా' ఖర్జూర పండ్లకు బదులుగా పశువును వాపసు చేయ వచ్చు" (బుఖారీ, ముస్లిం). "మూడు రోజుల దాకా అతను ఏదైనా నిర్ణయం గైకొనవచ్చు" అని 'ముస్లిం'లో ఉంది. 'ముస్లిం'లోని వేరొక ఉల్లేఖనాన్ని బుఖారీ 'ముఅల్లఖ్'గా నకలు చేశారు. అందులో 'దాంతోపాటు ఒక 'సా' ఏదైనా తినే వస్తువును వాపసు చేయాలి - గోధుమలు కాదు' అని ఉంది. ("అనేక ఉల్లేఖనాలలో ఖర్జూర పండ్ల ప్రస్తావన వచ్చింద"ని బుఖారీ పేర్కొన్నారు)

**సారాంశం**

సంతలో పశువులను కొనే సమయంలో కొనుగోలుదారులు పశువుల పొదుగులను చూచి, అవి ఇచ్చే పాల పరిమాణాన్ని కూడా చూచి మరీ కొంటూ ఉంటారు. కొనుగోలుదారుల నుండి ఎక్కువ ధరను రాబట్టే ఉద్దేశ్యంతో అమ్మకందారులు రెండు రోజులముందు నుంచే ఒక వైపు పశువులను బాగా మేత మేపుతూ, మరోవైపు పాలు పితకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. బేరం కుదిరే సమయంలో పాలు పితకగా, ఆ పశువులు మామూలుగా ఇచ్చే పాలకన్నా రెండు మూడు రెట్లు అధిక పరిమాణంలో ఇస్తాయి. నిశ్చయంగా ఇది కొనుగోలుదార్లను బోల్తాకొట్టించే ఎత్తుగడే. తీరా ఆ పశువును కొని ఇంటికి తీసుకువెళ్ళిన పిదప అది ఇచ్చే తక్కువ పాలను చూచి కొనుగోలుదారుడు నిరాశచెందుతాడు. అందుకే అమ్మే పశువుల పొదుగుల్లో పాలు ఆపి ఉంచడాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. అమ్మకం దారుని ఎత్తుగడలకు మోసపోయిన కొనుగోలుదారుడు ఆ పశువును ఉంచుకోవాలా లేక వాపసు చేయాలా అనేది అతని ఇష్టాయిష్టాలకే వదలివేయబడింది. ఒకవేళ అతను ఆ పశువును వాపసు చేయడానికే నిర్ణయించుకుంటే, అప్పటి వరకూ ఆ పశువు పాలను

వాడుకున్నందుకుగాను ప్రతిఫలంగా ఒక 'సా' ఖర్జూరపండ్లనో, ఆహార ధాన్యాలనో ఇచ్చి పంపటం మంచిదని చెప్పబడింది.

(٦٨٢) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَنِ اشْتَرَى شَاةً مُحَفَّلَةً فَرَدَّهَا فَلْيَرُدَّ مَعَهَا صَاعاً. رَوَاهُ الْبُخَارِيُّ، وَزَادَ الإِسْمَاعِيلِيُّ؛ «مِنْ تَمْرٍ».

682. హజ్రత్ ఇబ్నె మస్వూద్ (రజి) కథనం : "పొదుగులో పాలు నిలిపి ఉంచబడిన మేకను కొన్న వ్యక్తి, ఆ మేకను (అమ్మకందారునికి) వాపసు చేయదలిస్తే అతడు దానితోపాటు ఒక 'సా'ను కూడా వాపసు చేయాలి (బుఖారీ)." ఒక 'సా' ఖర్జూరపండ్లు అని ఇస్మాయిలీ అదనంగా నకలు చేశారు.

**సారాంశం**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) గారి ఫత్వా (తీర్పు) ఇంతకుముందు వచ్చిన హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖనాన్ని సూచిస్తోంది.

(٦٨٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ مَرَّ عَلَى صُبْرَةٍ مِنْ طَعَامٍ، فَأَدْخَلَ يَدَهُ فِيهَا، فَنَالَتْ أَصَابِعُهُ بَلَلاً، فَقَالَ: **مَا هَذَا؟ يَا صَاحِبَ الطَّعَامِ!** قَالَ: أَصَابَتْهُ السَّمَاءُ، يَا رَسُولَ اللهِ! قَالَ: **«أَفَلاَ جَعَلْتَهُ فَوْقَ الطَّعَامِ، كَيْ يَرَاهُ النَّاسُ، مَنْ غَشَّ فَلَيْسَ مِنِّي»**. رَوَاهُ مُسْلِمٌ.

683. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : ఒక ధాన్యపు రాసి ఉన్న వైపు నుంచి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాగిపోతూ దానిలోపల చేయి పెట్టారు. ఆయన (స) వ్రేళ్లకు తేమ తగిలింది. "ఓ ధాన్యపు యజమానీ! ఇదేమిటీ?" అని ఆయన (సఅసం) ప్రశ్నించారు. 'దైవప్రవక్తా (స)! ఆ ధాన్యం వర్షంలో తడిసింది' అని ఆ వ్యక్తి బదులిచ్చాడు. "అయితే నువ్వు తడిసిన ధాన్యాన్ని పైన అందరికీ కనిపించేలా ఎందుకు వేయలేదు? ఎవరు మోసానికి పాల్పడతారో వారితో నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆయన (సఅసం) హెచ్చరించారు. (ముస్లిం)

(٦٨٤) وَعَنْ عَبْدِ اللهِ بْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ حَبَسَ الْعِنَبَ أَيَّامَ القِطَافِ، حَتَّى يَبِيعَهُ مِمَّنْ يَتَّخِذُهُ خَمْراً، فَقَدْ تَقَحَّمَ النَّارَ عَلَى بَصِيرَةٍ**». رَوَاهُ الطَّبَرَانِيُّ فِي ٱلْأَوْسَطِ بِإِسْنَادٍ حَسَنٍ.

684. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) తన తండ్రి బురైద (రజి) ఆధారంగా ఉల్లేఖించారు: "ఎవరయితే ద్రాక్షపండ్లు కోతకు వచ్చినప్పటికీ, మద్యం తయారుచేసేవానికి అమ్మే ఉద్దేశ్యంతో (పంటను) ఆపి ఉంచాడో అతడు తెలిసీ నరకాగ్నిలో ప్రవేశించిన వాడవుతాడు." (ఈ హదీసును తబ్రానీ 'ఔసత్' గ్రంథంలో మంచి ఆధారాలతో ఉల్లేఖించారు)

(٦٨٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْخَرَاجُ بِالضَّمَانِ**». رَوَاهُ الْخَمْسَةُ، وَضَعَّفَهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ؛ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ وَابْنُ الْقَطَّانِ.

685. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) చెప్పారు : "వస్తువుకు బాధ్యత వహించిన వ్యక్తికే ఆ వస్తువు యొక్క లబ్ధి - ప్రతిఫలంగా - దక్కాలి." (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు. బుఖారీ మరియు అబూ దావూద్‌లు దీనిని 'బలహీనమైనది'గా ఖరారు చేశారు. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్, ఇబ్నె ఖత్తాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఉదాహరణకు ఒక వస్తువును కొనే సమయంలో ఆ వస్తువులోని లోపం కొనుగోలుదారునికి తెలీదు. అతడు ఆ వస్తువు ద్వారా కొన్ని రోజులో, లేక కొన్ని వారాలపాటో లబ్ధి పొందాడు. లోపం బయటపడిన తరువాత ఆ వస్తువును అమ్మకందారునికి వాపసు చేశాడు. ఈలోగా ఆ వస్తువు ద్వారా కలిగిన ప్రయోజనం కొనుగోలుదారునికే చెందాలి. ఎందుకంటే వస్తువు అతని అధీనంలో ఉంది. ఒకవేళ అతని అధీనంలో ఆ వస్తువుకు ఏదన్నా నష్టం జరిగితే ఆ నష్టం కూడా అతని ఖాతాలోనే చేరేది.

(٦٨٦) وَعَنْ عُرْوَةَ الْبَارِقِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَعْطَاهُ دِينَاراً لِيَشْتَرِيَ بِهِ أُضْحِيَّةً أَوْ شَاةً، فَاشْتَرَى بِهِ شَاتَيْنِ، فَبَاعَ إِحْدَاهُمَا بِدِينَارٍ، فَأَتَاهُ بِشَاةٍ وَدِينَارٍ، فَدَعَا لَهُ بِالْبَرَكَةِ فِي بَيْعِهِ، فَكَانَ لَوِ اشْتَرَى تُرَاباً لَرَبِحَ فِيهِ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَقَدْ أَخْرَجَهُ الْبُخَارِيُّ فِي ضِمْنِ حَدِيثٍ، وَلَمْ يَسُقْ لَفْظَهُ، وَأَوْرَدَ التِّرْمِذِيُّ لَهُ شَاهِداً مِنْ حَدِيثِ حَكِيمِ بْنِ حِزَامٍ.

686. హజ్రత్ ఉర్వ బారిఖి (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఖుర్బానీ పశువు లేదా మేకను కొనేందుకు ఒక దీనార్ ఇవ్వగా ఆయన ఒక్క దీనార్‌లో రెండు మేకలు కొన్నారు. తరువాత ఆ రెండు మేకలలో ఒకదానిని ఒక దీనారుకు అమ్మారు. ఒక దీనారును, ఒక మేకను తీసుకుని ఆయన (సఅసం) సమక్షంలో హాజర య్యారు. ఆయన (సఅసం) ఆ వ్యక్తి వ్యాపార లావాదేవీలలో సమృద్ధిని వొసగ మని దైవాన్ని ప్రార్థించారు. అంతే, అప్పటినుంచీ ఆ వ్యక్తి మట్టిని కొన్నాసరే అందులో తప్పకుండా లాభం వచ్చేది. ('అయిదుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు దీనిని ఉల్లేఖించారు. ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) ఒక హదీసును పేర్కొన్న సందర్భంగా దీనిని ఉల్లేఖించారు. అయితే ఈ పదాలు మాత్రం నకలు చేయలేదు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అత్యంత ముఖ్యమైన కొన్ని మౌలిక విషయాలు వెలుగులోనికి వస్తున్నాయి - 1) కార్యసాధకుడైన వ్యక్తి తన సంరక్షకుని సొమ్మును వ్యయపరచగలడు. అయితే ఆ మేరకు అతడు ముందుగానే సంరక్షకుని అనుమతి పొంది ఉండటం అవసరం. లేకుంటే ముందుగా విధించుకున్న షరతుల ప్రకారమే కార్యసాధకుడు మసలుకోవలసి ఉంటుంది. 2) ఇతరుల సొమ్మును తెలియబరచకుండానే అతడు విక్రయించగలడు. అయితే తెలియజేసినపుడు యజమాని తరపున సమ్మతి వ్యక్తం కావాలి. 3) 'ఖుర్బానీ' కొరకు కొన్న పశువును విక్రయించవచ్చు. దాని స్థానంలో ఇంకొక జంతువును కొననూవచ్చు. 4) యజమాని మేలును కాంక్షిస్తూ సమయోచితంగా వ్యవహరించిన వ్యక్తి కోసం ప్రార్థించటం (దుఆ చేయటం) మంచిది.

## హదీసు ఉల్లేఖకులు

ఉర్వ బారిఖీ (రజి). ఈయన ఇబ్నె జాద్ లేదా ఇబ్నె అబూ జాద్‌గా కూడా పిలువబడ్డారు. ఈయన తండ్రి పేరు అయాజ్ అని కూడా చెప్పబడుతోంది. బారిఖ్ తెగతో గల సంబంధం వల్ల బారిఖీగా వ్యవహరించబడ్డారు. బారిఖ్ అనే పేరుగల పర్వతం వద్ద స్థిరపడినందున బారిఖీగా పిలువబడ్డారన్న వాదన కూడా ఉంది. సుప్రసిద్ధ సహాబీ. హజ్రత్ ఉమర్ (రజి) ఈయన్ని తన పరిపాలనా కాలంలో కూఫా నగరానికి 'ఖాజీ'గా నియమించారు. కూఫాలోనే స్థిరపడ్డారు. కూఫావాసులు ఈయన ఆధారంగా హదీసులను చెప్పేవారు.

(٦٨٧) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ شِرَآءِ مَا فِيْ بُطُوْنِ الْأَنْعَامِ حَتَّى تَضَعَ، وَعَنْ بَيْعِ مَا فِيْ ضُرُوْعِهَا، وَعَنْ شِرَآءِ الْعَبْدِ وَهُوَ آبِقٌ، وَعَنْ شِرَآءِ الْمَغَانِمِ حَتَّى تُقْسَمَ، وَعَنْ شِرَآءِ الصَّدَقَاتِ حَتَّى تُقْبَضَ، وَعَنْ ضَرْبَةِ الْغَائِصِ. رَوَاهُ ابْنُ مَاجَهْ وَالْبَزَّارُ وَالدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

687. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పశువుల కడుపులో (పెరిగే) దూడను దాని జననానికి ముందే కొనడాన్ని, పొదుగులలో (నిల్వగా ఉన్న) పాలను పితకకుండానే (పశువులను) అమ్మడాన్ని, పలాయనంలో వున్న బానిసను కొనడాన్ని, విజయప్రాప్తిని అది పంపిణీకాకముందే కొనడాన్ని, సదకాలు ఒకరి అధీనంలోకి రాకముందే కొనడాన్ని, నీటిలో మునిగి వచ్చేవాడు తన ఒక మునకకు గాను వేతనం నిర్ధారించడాన్ని నిషేధించారు." (దీనిని ఇబ్నెమాజ, బజ్జార్, దారె ఖుత్నీ బలహీన ఆధారాల ద్వారా ఉల్లేఖించారు)

## సారాంశం

ఆరు విషయాలు ఈ హదీసులో నిషేధించబడ్డాయి. వాటిలో చిట్టచివరిది నీటిలో మునిగివచ్చేవాని గురించి. ఉదాహరణకు - ఒక వ్యక్తి; సముద్ర గర్భంలోనికి పోయి దొరికిందల్లా నీ కోసం పట్టుకు వస్తాను, అయితే ఒక మునకకు గాను నీవు ఇంత డబ్బు చెల్లించుకోవలసి వస్తుందని షరతు పెడతాడు. కాని సముద్రంలో అతనికి ఏం దొరుకుతుందో, ఎంత దొరుకుతుందో అతనికీ తెలీదు, డబ్బు చెల్లించేవానికీ తెలీదు. ఇలాంటి బేరాలు నీతి నిజాయితీలకు విరుద్ధమైనవి. మోసంతో కూడుకున్నవి.

(٦٨٨) وَعَنْ أَبِي مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَشْتَرُوا السَّمَكَ فِي الْمَاءِ، فَإِنَّهُ غَرَرٌ**». رَوَاهُ أَحْمَدُ، وَأَشَارَ إِلَى أَنَّ الصَّوَابَ وَقْفُهُ.

688. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "నీటిలో వున్న చేపను కొనకండి. ఎందు కంటే ఇందులో మోసం ఉంది." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇది 'మౌఖూఫ్' కోవకు చెందిన హదీసు అని అనటం ఎక్కువ సబబు అని ఆయన అభిప్రాయ పడ్డారు)

**సారాంశం**

నీటిలో వున్న చేపలను కొనటం భావ్యం కాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఎందుకంటే నీటిలో (చెరువులో) ఎన్ని చేపలున్నాయో, ఏ సైజు చేపలున్నాయో, ఏ కోవకు చెందిన చేపలున్నాయో అమ్మేవారికి గానీ, కొనేవారికిగానీ తెలీదు. తెలియని దానికి బేర మెందుకు? దీనికి బదులు చేపలు పట్టిన తరువాత వాటి పరిమాణాన్ని, బరువును, నాణ్యతను బట్టి ధర నిర్ధారించటం, క్రయవిక్రయాలు జరపటం సమంజసం.

ఈ హదీసు 'మౌఖూఫ్'గా ఖరారు చేయబడింది. పైగా ఇది బలహీనమైనది (జయీఫ్) కూడాను. అయితే ఈ హదీసును బలపరచే ఆధారాలు కూడా ఉన్నాయి.

(٦٨٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ تُبَاعَ ثَمَرَةٌ حَتَّى تُطْعِمَ، وَلاَ يُبَاعُ صُوفٌ عَلَى ظَهْرٍ، وَلاَ لَبَنٌ فِي ضَرْعٍ. رَوَاهُ الطَّبَرَانِيُّ فِي الأَوْسَطِ وَالدَّارَقُطْنِيُّ، وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيلِ لِعِكْرِمَةَ، وَهُوَ الرَّاجِحُ، وَأَخْرَجَهُ أَيْضاً مَوْقُوفاً عَلَى ابْنِ عَبَّاسٍ، بِإِسْنَادٍ قَوِيٍّ. وَرَجَّحَهُ الْبَيْهَقِيُّ.

689. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండ్లు (పండి) తినడానికి యోగ్యం కాక ముందే అమ్మడాన్ని వారించారు. అలాగే జంతువుల వీపులపై గల బొచ్చును, పొదుగులలో వున్న (పితకని) పాలను అమ్మడాన్ని కూడా వారించారు. (ఈ హదీసును తబ్రానీ తన 'ఔసత్'లో మరియు దారె ఖుత్నీ ఉల్లేఖించారు. అబూదావూద్ ఇక్రిమ గారి మురాసిల్‌లో వివరించారు. ఇదే సరైనది. దీనినే అబూదావూద్ ఇబ్నె

అబ్బాస్ నుండి 'మౌఖూఫ్'గా బలమైన ఆధారాలతో ఉల్లేఖించారు. బైహఖీ దీనిని ధృవీకరించారు.)

(٦٩٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ بَيْعِ الْمَضَامِينِ والمَلاقيحِ. رَوَاهُ البَزَّارُ، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

690. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పశువుల గర్భంలో ఉన్న దూడ (మజామీన్) అమ్మకాన్ని, మగ జంతువుల వెన్నులో ఉండే రేతస్సు (మలాఖీహ్) అమ్మకాన్ని నిషేధించారు. (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. ఈ హదీసు అందిన పరంపరలో బలహీనత ఉంది)

(٦٩١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ أَقَالَ مُسْلِماً بَيْعَتَهُ أَقَالَ اللَّهُ عَثْرَتَهُ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

691. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం: "ఏ అమ్మకందారైనా అమ్మబడిన వస్తువును ఒక ముస్లిం వాపసు చేయగా వాపసు తీసుకుంటే అల్లాహ్ అతని తప్పులను, అపరాధాలను మన్నిస్తాడు." (దీనిని అబూదావూద్, ఇబ్నె మాజాలు ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమని పేర్కొన్నారు)

**సారాంశం**

ఒక వస్తువు అమ్మకం జరిగిన తరువాత, కొనుగోలుదారుడు ఎత్తి చూపే లోపాలను అంగీకరిస్తూ ఆ వస్తువును అమ్మకందారుడు తిరిగి తీసుకుని వస్తువు వెలను ఇచ్చివేయటం త్యాగంతో కూడుకున్నదే. ఈ త్యాగానికి సిద్ధమైన వ్యక్తి పాపాలను దేవుడు క్షమిస్తాడు. పైగా అమ్మకందారుని ఈ మృదుత్వ వైఖరివల్ల మార్కెట్‌లో అతని పరపతి కూడా పెరుగుతుంది.

రెండవ అధ్యాయం

# వ్యాపారంలో నిర్ణయాధికారం

## ٢ - بَابُ الْخِيَارِ

(٦٩٢) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ قَالَ: «إِذَا ابْتَاعَ رَجُلَانِ فَكُلُّ وَاحِدٍ مِنْهُمَا بِالْخِيَارِ مَا لَمْ يَتَفَرَّقَا وَكَانَا جَمِيعاً، أَوْ يُخَيِّرُ أَحَدُهُمَا الْآخَرَ، فَإِنْ خَيَّرَ أَحَدُهُمَا الْآخَرَ فَتَبَايَعَا عَلَى ذَلِكَ فَقَدْ وَجَبَ الْبَيْعُ، وَإِنْ تَفَرَّقَا بَعْدَ أَنْ تَبَايَعَا وَلَمْ يَتْرُكْ وَاحِدٌ مِنْهُمَا الْبَيْعَ فَقَدْ وَجَبَ الْبَيْعُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

692. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - ఇద్దరు వ్యాపారులు పరస్పరం వ్యాపార వ్యవహారం ఖాయం చేసుకుంటున్నప్పుడు, వారిరువురూ విడిపోకుండా కలసి ఉన్నంత వరకూ - వారిద్దరికీ ఆ వ్యవహారానికి సంబంధించి హక్కు ఉంటుంది లేదా ఒకరు ఇంకొకరికి అధికారం ఇవ్వాలి. ఒకవేళ ఒకరు ఇంకొకరికి అధికారం ఇచ్చిన మీదట వ్యాపార వ్యవహారం ఖాయమైతే, ఖాయమైన తరువాత వారిద్దరూ పరస్పరం విడిపోతూ ఇద్దరిలో ఏ ఒక్కరూ ఒప్పందాన్ని రద్దు పరచకుండా ఉంటే ఇక ఆ వ్యాపార ఒప్పందం ఖరారైనట్లే." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

### సారాంశం

ఈ హదీసులో కొనుగోలుదారు - అమ్మకందారులకు క్రయవిక్రయాల ఒప్పందాన్ని కొనసాగించే లేక రద్దుపరచే హక్కు ఇవ్వబడింది. అయితే ఆ ఒప్పందం ఎన్నాళ్ల వరకు ఉంటుందో వాళ్లు ముందుగానే షరతులను విధించుకోవచ్చు. ఈ ఒప్పందం రకరకాలుగా ఉంటుంది. ఉదాహరణకు : ఒక షరతు ప్రకారం కొనుగోలుదారుడు వస్తువును కొన్న తరువాత దానిలోని లోపాల దృష్ట్యా అమ్మినవాడికి వాపసు చేస్తాడు. అమ్మిన వ్యక్తి మారు మాట్లాడకుండా వాపసు తీసుకొని దాని వెలను అతనికి ఇచ్చివేయవలసి ఉంటుంది. అలాగే కొనుగోలుదారుడు ఈ విధమైన షరతు కూడా విధిస్తాడు : తమ మధ్య వ్యాపార ఒప్పందం సూత్రప్రాయంగా మాత్రమే జరిగిందనీ, వస్తువు యొక్క నాణ్యతను తనిఖీచేసిన మీదటే తాను ఆ వస్తువును కొనేదీ

లేనిదీ తేల్చిచెబుతానని అంటాడు. ఈ లాంఛనాలన్నీ పూర్తయిన మీదట వ్యాపార వ్యవహారం ఓ కొలిక్కి వస్తుంది.

మొత్తమ్మీద షరీయత్ ఉభయ వర్గాల కోసం అసంఖ్యాకమైన సౌలభ్యాలను కల్పించింది. ఇరు వర్గాల మధ్య లేక ఇరువురు వ్యక్తుల మధ్య తగాదాలకు, మనస్పర్థలకు ఆస్కారం కలగకుండా ఉండాలన్నదే దీని ఉద్దేశ్యం.

(٦٩٣) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ عَنْ جَدِّهِ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الْبَائِعُ وَالْمُبْتَاعُ بِالْخِيَارِ حَتَّى يَتَفَرَّقَا، إِلاَّ أَنْ تَكُونَ صَفْقَةَ خِيَارٍ، وَلاَ يَحِلُّ لَهُ أَنْ يُفَارِقَهُ خَشْيَةَ أَنْ يَسْتَقِيلَهُ**». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ ابْنَ مَاجَهْ، وَرَوَاهُ الدَّارَقُطْنِيُّ وابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ، وَفِي رِوَايَةٍ: «**حَتَّى يَتَفَرَّقَا مِن مَّكَانِهِمَا**».

693. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి చేసిన ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "కొనుగోలు దారునికీ - అమ్మకందారునికీ - వారిరువురూ పరస్పరం విడిపోయే వరకూ - (వ్యవహారాన్ని ఖాయం చేసుకునే లేక రద్దుపరచే) హక్కు ఉంటుంది. అయితే ఒప్పందం ఆ తరహాకు చెందినదై ఉండాలన్నది షరతు. ఒప్పందాన్ని ఎక్కడ ఉపసంహరించుకుంటాడోనన్న భయంతో తొందరగా విడిపోవటం ధర్మ సమ్మతం కాదు. (ఐదుగురిలో ఇబ్నె మాజా తప్ప మిగిలిన వారంతా దీనిని ఉల్లేఖించారు. దారె ఖుత్నీ, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్‌లు కూడా ఉల్లేఖించారు. వేరొక ఉల్లేఖనంలో - "వారు తమ తమ స్థానాల నుండి నిష్క్రమించకుండా ఉన్నంత వరకు" అని ఉంది.

(٦٩٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: ذَكَرَ رَجُلٌ لِرَسُولِ اللهِ ﷺ

694.హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: వ్యాపారంలో తరచూ తన పట్ల మోసం జరుగుతోందని ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో

أَنَّهُ يُخْدَعُ فِي الْبُيُوعِ، فَقَالَ: «إِذَا بَايَعْتَ فَقُلْ: لاَ خِلاَبَةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

వాపోయాడు. దానికి దైవప్రవక్త (సఅసం) "నీవు క్రయవిక్రయాలు చేసేటప్పుడు ఎలాంటి మోసం జరగకూడదని (ఎదుటి వారికి) ముందే చెప్పేయాలి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

## ٣ - بَابُ الرِّبَا

## మూడవ అధ్యాయం

## వడ్డీ

(٦٩٥) عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ آكِلَ الرِّبَا وَمُؤْكِلَهُ وَكَاتِبَهُ وَشَاهِدَيْهِ، وَقَالَ: هُمْ سَوَآءٌ. رَوَاهُ مُسْلِمٌ، وَلِلْبُخَارِيِّ نَحْوُهُ مِنْ حَدِيثِ أَبِي جُحَيْفَةَ.

695. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వడ్డీ తీసుకునేవారినీ, ఇచ్చేవారినీ, ఈ లావాదేవీలను గురించి వ్రాసేవారినీ, దీనికి సాక్షులుగా ఉండే వారినీ ధూత్కరించారు. ఆయన (స) ఇంకా ఇలా అన్నారు- (ఈ పాపాన్ని మూట కట్టుకోవటంలో) వీరంతా సమానులే. (ముస్లిం - బుఖారీలో అబూ జుహైఫా (రజి)చే ఉల్లేఖించబడిన హదీసులో కూడా ఇలాగే ఉంది)

### సారాంశం

హదీసులో 'రిబా' అనే పదం వచ్చింది. రిబా అంటే అధికం, పెంపుదల అని అసలు అర్థం. లావాదేవీల సందర్భంగా ఒక వస్తువును లేదా పైకాన్ని ఒక నిర్ణీత కాలానికిగాను ఇచ్చి, దానిపై ఎక్కువ మొత్తం పుచ్చుకోవటమే రిబా. దీనినే మన నాట వడ్డీ అంటాము. ఈ వడ్డీ ఇస్లాంలో నిషిద్ధం. దాన్ని ఇవ్వటం, పుచ్చుకోవటం, ఈ వ్యవహారంలో దస్తావేజులు, నోటులు వ్రాయటం, దీనికి సాక్ష్యంగా ఉండటం - అన్నీ అధర్మమే. ఇలాంటి వారందరినీ దైవప్రవక్త (సఅసం) శపించారు. దివ్య ఖుర్ఆన్‌లో ఇది హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడింది.ఈ వడ్డీ .వ్యవహారాన్ని మానుకోని వారిపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) తరపున యుద్ధప్రకటన గావించబడింది. ఇది ఎంత శాపగ్రస్తమైన వ్యవస్థ అంటే యావత్తు ప్రపంచ ప్రజలు దీని వాతనపడి కోలుకోలేని స్థితిలో ఉన్నారు. ఈ శాపం నుండి బయటపడటానికి ముస్లింలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

(٦٩٦) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**الرِّبَا ثَلاَثَةٌ وَسَبْعُونَ بَاباً، أَيْسَرُهَا مِثْلُ أَنْ يَنْكِحَ الرَّجُلُ أُمَّهُ، وَإِنَّ أَرْبَى الرِّبَا عِرْضُ الرَّجُلِ الْمُسلِمِ**». رَوَاهُ ابْنُ مَاجَهْ مُخْتَصَراً، وَالْحَاكِمُ بِتَمَامِهِ، وَصَحَّحَهُ.

696. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) ఉల్లేఖించారు : ఆయన (స) ఇలా ప్రవచించారు - వడ్డీలో డెబ్భయి మూడు స్థాయిలు న్నాయి. వాటిలో అత్యంత హీనమైన స్థాయి (దశ) యొక్క పాపం; ఒక వ్యక్తి తన కన్న తల్లిని పెళ్ళాడటం వంటిది. వడ్డీ యొక్క అత్యంత తీవ్రస్థాయి పాపం ఒక ముస్లిం పరువు ప్రతిష్ఠలను మంట గలపటం. (దీనిని ఇబ్నె మాజ సంక్షిప్తం గానూ, హాకిమ్ సంపూర్ణంగానూ వివరిం చారు. వారు దీనిని ప్రామాణికమైన హదీసుగా కూడా పేర్కొన్నారు)

**సారాంశం**

వడ్డీ వ్యవస్థ ఎంత నీచమయినదో, జుగుప్సాకరమైనదో ఈ హదీసు ద్వారా చెప్పబడింది. అలాగే సాటి ముస్లిం చేయని ఒక పనిని గురించి అతని పరోక్షంలో చెప్పుకోవటం, మర్యాదస్తు లైన వారిని రచ్చకీడ్చి వారిపై నీలాపనిందలు మోపటం ఎంత ఘోరమైన తప్పిదమో కూడా ఇందులో చెప్పబడింది. ఇతరుల పరువు ప్రతిష్ఠలను మంటగలపాలన్న దుర్బుద్ధి మన వారిలో మరీ ఎక్కువైపోయింది. ఈ రోగం మన పుణ్య కార్యాలను హరించి - పరలోకంలో - ప్రభువు సమక్షంలో మనల్ని దరిద్రులుగా నిలబెడుతుందన్న సంగతిని మరువరాదు.

(٦٩٧) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**لاَ تَبِيعُوا الذَّهَبَ بِالذَّهَبِ إِلاَّ مِثْلاً بِمِثْلٍ، وَلاَ تُشِفُّوا بَعْضَهَا عَلَى بَعْضٍ، وَلاَ تَبِيعُوا الْوَرِقَ بِالْوَرِقِ**

697. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు - "బంగారానికి బంగారం సరిసమానంగా తప్ప (హెచ్చు తగ్గులు చేసి) అమ్మకండి. రెండిటి బరువు (విలువ)లో కూడా హెచ్చుతగ్గులు చేయకండి. అలాగే వెండికి వెండి

إِلاَّ مِثْلاً بِمِثْلٍ، وَلاَ تُشِفُّوا بَعْضَهَا عَلَى بَعْضٍ، وَلاَ تَبِيعُوا مِنْهَا غَائِباً بِنَاجِزٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

సరిసమానంగా తప్ప (హెచ్చు తగ్గులు చేసి) అమ్మకండి. ఆ రెండిటి బరువు (విలువ)లో కూడా ఎక్కువ తక్కువలు చేయకండి. ఈ రెండింటిలో లేని దానికి బదులుగా ఉన్న దానిని అమ్మకండి. (క్రయవిక్రయాలు రుణం రూపేణా జరపకండి అన్న అర్థం కూడా వస్తుంది) (బుఖారీ, ముస్లిం)

(٦٩٨) وَعَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الذَّهَبُ بِالذَّهَبِ، وَالفِضَّةُ بِالفِضَّةِ، وَالْبُرُّ بِالْبُرِّ، وَالشَّعِيرُ بِالشَّعِيرِ، وَالتَّمْرُ بِالتَّمْرِ، وَالْمِلْحُ بِالْمِلْحِ، مِثْلاً بِمِثْلٍ، سَوَاءً بِسَوَاءٍ، يَداً بِيَدٍ، فَإِذَا اخْتَلَفَتْ هَذِهِ الأَصْنَافُ فَبِيعُوا كَيْفَ شِئْتُمْ، إِذَا كَانَ يداً بِيدٍ». رَوَاهُ مُسْلِمٌ.

698. హజ్రత్ ఉబాద బిన్ సామిత్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి, గోధుమలకు బదులు గోధుమలు, బార్లీకి బదులు బార్లీ, ఖర్జూర పండ్లకు బదులు ఖర్జూర పండ్లు, ఉప్పుకు బదులు ఉప్పు - ఒకే విధమైనవి - సరిసమానంగా, రొక్కం తీసుకుని అమ్మాలి. అయితే వస్తువులు విభిన్నంగా ఉన్నప్పుడు కోరినవిధంగా అమ్మవచ్చు. కాని నగదు మాత్రమే ఇవ్వాలి." (ముస్లిం)

**సారాంశం**

'సరిసమానంగా' అని నొక్కి పలకటంలోని ఉద్దేశ్యం వ్యాపారులను వడ్డీ నుంచి దూరంగా ఉంచటమే. పై హదీసులో పేర్కొనబడిన 6 రకాల వస్తువులకు వడ్డీ (రిబా) నిషేధం తప్పక వర్తిస్తుంది. ఇవిగాక మిగిలిన వస్తువులకు వడ్డీ నిషేధాజ్ఞ వర్తిస్తుందా? లేదా? అన్న విషయంపై విద్వాంసులలో భేదాభిప్రాయం ఉంది. అయితే వడ్డీకి కారణభూతంగా పరిణమించే అంశాలు ఎక్కడైనా పొడసూపి అక్కడ వస్తువుల లావాదేవీల్లో హెచ్చుతగ్గులు చేయటం జరిగితే అది కూడా వడ్డీ క్రిందికే వస్తుందని మెజారిటీ ఉలమాలు అభిప్రాయపడుతున్నారు.

(٦٩٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اَلذَّهَبُ بِالذَّهَبِ وَزْناً بِوَزْنٍ، مِثْلاً بِمِثْلٍ، وَالْفِضَّةُ بِالْفِضَّةِ وَزْناً بِوَزْنٍ، مِثْلاً بِمِثْلٍ، فَمَنْ زَادَ أَوْ اسْتَزَادَ فَهُوَ رِباً**». رَوَاهُ مُسْلِمٌ.

699. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) వివరించారు : "బంగారానికి బదులు బంగారమే. కాని అది బరువులోనూ, నాణ్యత (కేరెట్)లోనూ సరితూగేదై ఉండాలి. వెండికి బదులు వెండి. అయితే అది బరువులోనూ, తరహాలోనూ సరిసమానంగా ఉండాలి. ఇంతకుమించి ఎవరైనా ఎక్కువ తీసుకున్నా, ఎక్కువ ఇచ్చినా అది 'వడ్డీ' అవుతుంది. (ముస్లిం)

(٧٠٠) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ وَأَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ اسْتَعْمَلَ رَجُلاً عَلَى خَيْبَرَ، فَجَاءَهُ بِتَمْرٍ جَنِيْبٍ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**أَكُلُّ تَمْرِ خَيْبَرَ هَكَذَا؟**» فَقَالَ: لاَ، واللهِ، يَا رَسُولَ اللهِ! إِنَّا لَنَأْخُذُ الصَّاعَ مِنْ هَذَا بِالصَّاعَيْنِ وَالثَّلاَثَةِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **لاَ تَفْعَلْ، بِعِ الْجَمْعَ**

700. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) మరియు హజ్రత్ అబూహురైర (రజి)ల కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తిని ఖైబర్ ప్రాంతపు శిస్తు వసూలు చేయడానికి నియమించారు. అతడు వెళ్ళి మేలు రకం ఖర్జూర పండ్లను వసూలుచేసి ఆయన (స) సమక్షంలోకి తెచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) "ఖైబర్‌లో ఉత్పత్తి అయ్యే ఖర్జూర పండ్లన్నీ ఇలాగే ఉంటాయా?" అని అడిగారు. దానికా వ్యక్తి, "లేదు దైవప్రవక్తా (స)! దైవసాక్షిగా చెబుతున్నాను. అన్నీ ఇలా ఉండవు. మేము ఇలాంటి ఒక 'సా' మేలు రకం ఖర్జూర పండ్లను రెండు 'సా'ల, మూడు 'సా'ల రెండవ రకం (నాసిరకం) ఖర్జూర పండ్లకు బదులుగా తీసుకుంటాము" అని సమాధానమిచ్చాడు. దైవప్రవక్త

بالدراهم، ثُمَّ ابْتَعْ بالدَّرَاهِمِ جَنِيباً»، وَقَالَ فِي الْمِيزَانِ مِثْلَ ذَلِكَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَلِمُسْلِمٍ: «وَكَذٰلِكَ الْمِيزَانُ».

(సఅసం) అతని ఈ మాట విని "అలా చేయకండి. నాసిరకం ఖర్జూర పండ్లను దిర్హమ్‌లకు బదులుగా అమ్మి, ఆ తరువాత ఆ దిర్హమ్‌లతో (నగదు ఇచ్చి) మేలు రకం ఖర్జూర పండ్లను కొనండి" అని సూచించారు. తూకం వేసే వస్తువుల విషయంలో కూడా ఇలాగే చేయాలి అని కూడా అన్నారు. (బుఖారీ, ముస్లిం) 'తూకంలోనూ ఇలాగే చేయాలి' అని ముస్లింలో ఉంది.

**సారాంశం**

వస్తువుల లావాదేవీలు జరిగినపుడు కొలతలు, తూనికల్లో ఖచ్చితంగా వ్యవహరించాలి. అలాగే ఆహార వస్తువుల నాణ్యతను కూడా సరిగ్గా బేరీజు వేయాలి. ఎందుకంటే మార్కెట్టులో మేలు రకం వస్తువుకు ఒక ధర, నాసి రకం వస్తువుకు మరొక ధర ఉంటుంది. పుచ్చుకునే సమయంలో మేలురకం వస్తువును పొంది, ఇచ్చే సమయంలో నాసిరకం వస్తువును ఇవ్వటం న్యాయసమ్మతం కాదు. ఇది ఉపకారికి అపకారం చేయటమే. అలాగే రెవిన్యూ అధికారులకు, తహసీల్దారులకు కూడా ఈ హదీసులో హితోపదేశం ఉంది. రైతులు పండించే పంటలో నాణ్యమైన భాగాన్ని శిస్తుగా వసూలు చేయటం ఎంతమాత్రం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది.

(٧٠١) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعِ الصُّبْرَةِ مِنَ التَّمْرِ لاَ يُعْلَمُ مَكِيْلُهَا بِالْكَيْلِ الْمُسَمَّى مِنَ التَّمْرِ. رَوَاهُ مُسْلِمٌ.

701. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొలవని ఖర్జూర పండ్ల రాసిని కొలిచిన నిర్ణీత ఖర్జూర పండ్ల రాసికి బదులుగా అమ్మడాన్ని వారించారు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో కొలవని ఖర్జూర పండ్ల రాసికి బదులుగా బరువు లేక తూకం నిర్ధారణ అయిన ఖర్జూర పండ్ల రాసిని అమ్మడం నిషేధించబడింది. ఎందుకంటే ఆ రాసి ఎంత బరువు ఉంటుందో లేక కొలతలో ఎంత పరిమాణంలో ఉంటుందో ఎవరికీ తెలీదు. కేవలం

అంచనాల ఆధారంగా రాసులకు రాసులే అమ్మివేయటం భావ్యం కాదు. ఈ పద్ధతివల్ల ఉభయుల్లో ఒకరికి నష్టం, ఇంకొకరికి అకారణంగా లాభం వస్తుంది. అందుకే ఇది నిషిద్ధంగా ఖరారు చేయబడింది.

(٧٠٢) وَعَنْ مَعْمَرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنِّي كُنْتُ أَسْمَعُ رَسُولَ اللهِ ﷺ يَقُوْلُ: «الطَّعَامُ بِالطَّعَامِ مِثْلاً بِمِثْلٍ، وَكَانَ طَعَامُنَا يَوْمَئِذٍ الشَّعِيرُ». رَوَاهُ مُسْلِمٌ.

702. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను వినేవాడినని హజ్రత్ మామర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు. ఆయన (సఅసం) ఇలా ప్రవచించారు - "ఆహార ధాన్యానికి బదులు ఆహార ధాన్యమే. (అయితే) అది ఒకే కోవకు మరియు ఒకే పరిమాణానికి చెందినదై ఉండాలి." ఆ రోజుల్లో బార్లీ (గింజలు) మా ఆహారంగా ఉండేది. (ముస్లిం)

**సారాంశం**

ఆహార ధాన్యాలను అమ్మదలిస్తే సరికి సరిగా అమ్మాలనీ, హెచ్చుతగ్గులు చేయటం నిషిద్ధమనీ ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. ఇంతకు ముందు వచ్చిన ఉబాద బిన్ సామిత్ (రజి) ఉల్లేఖనం (698) ప్రకారం గోధుమలు వేరు, బార్లీ వేరు. అవి రెండూ ఒకటి కావు. ప్రవక్త ప్రియసహచరుల అభిప్రాయం కూడా ఇదే. అందుచేత గోధుమలకు బదులు బార్లీ, బార్లీకి బదులుగా గోధుమల మారకం జరిగినపుడు అవి సరిసమానంగా ఉండనవసరం లేదు. కాని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) మాత్రం ఈ రెంటినీ ఒకే కోవకు చెందిన ధాన్యంగా పరిగణిస్తూ వీటి మారకంలో సరిసమానంగా ఇవ్వాలని అంటున్నారు.

(٧٠٣) وَعَنْ فَضَالَةَ بْنِ عُبَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: اشْتَرَيْتُ يَوْمَ خَيْبَرَ قِلاَدَةً بِاثْنَي عَشَرَ دِيْنَاراً، فِيْهَا ذَهَبٌ وخَرَزٌ، فَفَصَلْتُهَا، فَوَجَدْتُ فِيْهَا أَكْثَرَ مِنَ اثْنَي عَشَرَ دِيْنَاراً،

703. హజ్రత్ ఫజాలా బిన్ ఉబైద్ (రజి) కథనం : నేను ఖైబర్ పోరాటం జరిగిన నాడు ఒక నెక్లస్‌ను 12 దీనార్లకు కొన్నాను. ఆ హారంలో బంగారంతోపాటు రత్నాలు కూడా పొదగబడి ఉన్నాయి. నేను వాటిని వేరుచేసి చూడగా 12 దీనార్లకన్నా ఎక్కువ బంగారం ఉన్నట్లు తెలిసింది. నేనీ సంగతి దైవప్రవక్త (సఅసం) ముందు ప్రస్తావించగా,

فَذَكَرْتُ ذٰلِكَ لِلنَّبِيِّ ﷺ، فَقَالَ: «لاَ تُبَاعُ حَتَّى تُفْصَلَ». رَوَاهُ مُسْلِمٌ.

ఆయన (సఅసం) ఇలా ఉపదేశించారు: "వాటిని (బంగారాన్ని, రత్నాలను) వేరు పరచే దాకా అమ్మకూడదు." (ముస్లిం)

**సారాంశం**

బంగారంతో చేయబడిన నగలలో మరేదైనా రాయిగాని, రత్నంగానీ, మాణిక్యంగానీ పొదగబడి ఉంటే, వాటిని వేరుపరచే వరకూ బంగారం కింద లెక్కకట్టి అమ్మరాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. వాటిని వేరుచేయనిదే బంగారం బరువు ఎంతవుందో, ఇతరత్రా వస్తువుల బరువు ఎంత ఉందో స్పష్టంగా తెలిసిరాదు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) మరియు ఎంతోమంది ధర్మవేత్తల అభిప్రాయం కూడా ఇదే.

(٧٠٤) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ بَيْعِ الْحَيَوَانِ بِالْحَيَوَانِ نَسِيئَةً. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ الْجَارُودِ.

704. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పశువుకు బదులు పశువును అరువుగా అమ్మటాన్ని నిషిద్ధంగా ఖరారు చేశారు. (దీనిని ఐదుగురు ఉల్లేఖించారు- తిర్మిజీ, ఇబ్నె జారూద్‌లు దీన్ని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు)

(٧٠٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا تَبَايَعْتُمْ بِالعِينَةِ، وَأَخَذْتُمْ أَذْنَابَ الْبَقَرِ، وَرَضِيتُمْ بِالزَّرْعِ، وَتَرَكْتُمُ الْجِهَادَ،

705. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : (ఆయన - సఅసం - ఇలా ప్రవచించారు) "మీరు 'ఈనహ్' వ్యాపారం చేయసాగినపుడు, ఎడ్ల తోకలు పట్టుకుని, వ్యవసాయపనులలో లీనమై పోయి జిహాద్‌ను పరిత్యజించినపుడు అల్లాహ్ మీపై పరాభవాన్ని, అవమానాన్ని విధిస్తాడు. మరి మీరు (చేసిన పాపపాటును గ్రహించి) ధర్మం వైపునకు మరలిరానంత వరకూ ఈ (పరాభవ) స్థితిని మీ నుండి తొలగించడు." (దీనిని

سَلَّطَ اللَّهُ عَلَيْكُمْ ذُلاً لاَ يَنْزِعُهُ حَتَّى تَرْجِعُوا إِلَى دِينِكُمْ». رَوَاهُ أَبُو دَاوُدَ مِنْ رِوَايَةِ نَافِعٍ عَنْهُ، وَفِيْ إِسْنَادِهِ مَقَالٌ، وَلأَحْمَدَ نَحْوُهُ مِنْ رِوَايَةِ عَطَاءٍ، وَرِجَالُهُ ثِقَاتٌ، وَصَحَّحَهُ ابْنُ القَطَّانِ.

అబూదావూద్ నాఫె - రహ్మ.లై - ఉల్లేఖనం ఆధారంగా పొందుపరచారు. దీని పరంపరపై చర్చకు తావు కలిగినది. ముస్నద్ అహ్మద్‌లో వచ్చిన అతా - రహ్మ.లై - ఉల్లేఖనంలో కూడా ఇలాగే అనబడింది. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు. ఇబ్నె ఖత్తాన్ దీనిని దృఢమైనదిగా పేర్కొన్నారు)

## సారాంశం

ఈనహ్ : హదీసులో 'ఈనహ్' అనే పదం ప్రయోగించబడింది. ఇదొక రకమైన వ్యాపారానికి పెట్టబడిన పేరు. అమ్మకందారుడు కొనుగోలుదారుని బలహీనతను పసిగట్టి, దాన్ని 'సొమ్ము' చేసుకునే ఉద్దేశ్యంతో జరిపే వ్యాపార వ్యవహారమే ఈనహ్. దీనిప్రకారం కొనుగోలుదారుడు ఒక వస్తువును ఒక నిర్ణీత కాలానికి గాను అరువుగా కొంటాడు. గడువు ముగిసే నాటికి అప్పును చెల్లించలేడు. ఈ తరుణంలో అమ్మకందారుడు వచ్చి అదే వస్తువును అతను అమ్మిన ధరకన్నా తక్కువ ధరకు వాపసు తీసుకుంటాడు. ఉదాహరణకు : అమ్మేవాడు ఒక పుస్తకాన్ని వంద రూపాయలకు అమ్మి నెల రోజుల్లోగా పైకం చెల్లించాలని గడువు పెట్టాడు. పుస్తకాన్ని కొన్న వ్యక్తి ఆ గడువులోగా ఆర్థిక యిబ్బందుల వల్ల వంద రూపాయలు ఇవ్వలేకపోయాడు. అప్పుడు అమ్మేవాడు వచ్చి ఆ పుస్తకాన్ని 80 రూపాయల వెలకట్టి తీసుకుంటాడు. అంటే పుస్తకాన్ని కొన్న వ్యక్తి అమ్మిన వ్యక్తికి 20 రూపాయలు బాకీపడ్డాడు. కాగా; అమ్మిన వ్యక్తి తన పుస్తకాన్ని తాను తెచ్చుకోవటమే గాక నెల రోజుల స్వల్పకాలంలో 20 రూపాయలను మూట గట్టుకున్నాడు. ఉభయవర్గాలలో ఒక వర్గాన్ని తీవ్రంగా నష్టపరిచే ఈ పద్ధతిని మహాప్రవక్త (సఅసం) వారించారు.

అలాగే ముస్లింలు పొద్దస్తమానం వ్యవసాయోత్పత్తులలో, పాడి పంటలలో మునిగి తేలుతూ దైవమార్గంలో జరపవలసిన కృషిని విస్మరిస్తే జరిగే పర్యవసానం గురించి కూడా ఈ హదీసులో హెచ్చరించటం జరిగింది.

## హదీసు ఉల్లేఖకులు

నాఫె (రహ్మ.లై). అబూ అబ్దుల్లాహ్ నాఫె బిన్ సర్జిస్ మదనీ. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గారిచే స్వేచ్ఛ నొసగబడిన బానిస. ఈయన విశ్వసనీయులైన ఉల్లేఖకులు. ప్రఖ్యాత ధర్మవేత్త. అగ్రశ్రేణి తాబయీలలో ఒకరుగా పరిగణించబడతారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) చే ఉల్లేఖించబడిన హదీసులలో చాలా భాగం ఈయన చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. 'నాఫెగారు గనక ఇబ్నె ఉమర్ (రజి) ఆధారంగా ఏదన్నా హదీసును చెబితే ఆ హదీసును గురించి నేను ఇంకొకరి ద్వారా వినవలసిన అవసరమే లేదు' అని ఇమామ్ మాలిక్

(రహ్మ్‌లై) వ్యాఖ్యానించారు. ఇమామ్ మాలిక్ నాఫె గారి ద్వారా, నాఫెగారు ఇబ్నె ఉమర్ ఆధారంగా ఉల్లేఖించిన పరంపర అత్యంత దృఢమైనదని ఇమామ్ బుఖారీ అభిప్రాయపడ్డారు. నాఫె గారి సౌజన్యంతో చాలామంది హదీసులు చెప్పేవారు. ఈయన హిజ్రీ 117లో లేక ఆ తరువాత కాలంలో మరణించారు.

అతా (రహ్మ్‌లై) : ఇక్కడ అతా అంటే బహుశా అతా బిన్ అబూ ముస్లిం మైసరా ఖురాసానీ కావచ్చు. ఈయన ముహలబ్ బిన్ అబూ సుఫ్రా బానిస. మరోపేరు అబూ ఉస్మాన్. సిరియాలో స్థిరపడ్డారు. ప్రముఖులలో ఒకరుగా భావించబడేవారు. విశ్వసనీయులు. ధర్మనిష్ఠగలవారు. క్రమం తప్పకుండా రాత్రిపూట తహజ్జుద్ నమాజు చేసేవారు. అయితే ఈయన జ్ఞాపక శక్తి ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కువగా అనుమానానికి లోనయ్యేవారు. హిజ్రీ 135వ ఏట 85 ఏండ్ల వయసులో మరణించారు.

(٧٠٦) وَعَنْ أَبِي أُمَامَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «**مَنْ شَفَعَ لِأَخِيهِ شَفَاعَةً فَأَهْدَى لَهُ هَدِيَّةً عَلَيْهَا، فَقَبِلَهَا، فَقَدْ أَتَى بَابًا عَظِيمًا مِنْ أَبْوَابِ الرِّبَا**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَفِي إِسْنَادِهِ مَقَالٌ.

706. హజ్రత్ అబూ ఉమామ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు- "ఎవరయినా సాటి సోదరుని కోసం ఏదైనా సిఫారసు చేస్తే, (పనిపూర్తయిన తరువాత సంతోషంతో) అతను ఇతనికి ఏదన్నా కానుకను పంపించగా దాన్ని గనక ఇతను పుచ్చుకుంటే ఈ వ్యక్తి వడ్డీ యొక్క అతి పెద్ద ద్వారాన్ని సమీపించినట్లే."(దీనిని అహ్మద్, అబూ దావూద్‌లు ఉల్లేఖించారు - దీని పరంపర చర్చకు తావు కల్పించింది)

(٧٠٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ الرَّاشِيَ وَالْمُرْتَشِيَ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

707. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లంచం ఇచ్చేవానినీ, లంచం పుచ్చుకునేవానినీ (ఇద్దరినీ) శపించారు. (దీనిని అబూ దావూద్, తిర్మిజీ లిద్దరూ ఉల్లేఖించారు. తిర్మిజీ దీని ప్రామాణికతను ధృవీకరించారు)

**సారాంశం**

అధర్మంగా, అక్రమ పద్ధతుల ద్వారా ధనాన్ని ఆర్జించేందుకుగాను వెచ్చించబడే దానినే లంచమంటారు. ఎవరయినా ఈ అడ్డదారులు తొక్కారంటే న్యాయంగా, ధర్మంగా ఒకరికి చెందవలసిన హక్కును కొల్లగొట్టినట్లే లెక్క. అయితే ఎవరయినా సమాజంలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడానికి, తనకు రావలసిన హక్కును రాబట్టడానికి డబ్బును ఖర్చు పెడితే అది లంచం క్రిందికి రాదని ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు. కాని ఇలాంటి డబ్బును పుచ్చుకున్నవారు మాత్రం లంచగొండితనానికి పాల్పడినట్లే!

(٧٠٨) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ أَمَرَهُ أَنْ يُجَهِّزَ جَيْشاً، فَنَفِدَتِ الْإِبِلُ، فَأَمَرَهُ أَن يَأْخُذَ عَلَى قَلَائِصِ الصَّدَقَةِ، قَالَ: فَكُنْتُ آخُذُ الْبَعِيْرَ بِالْبَعِيْرَيْنِ إِلَى إِبِلِ الصَّدَقَةِ. رَوَاهُ الْحَاكِمُ وَالْبَيْهَقِيُّ، وَرِجَالُه ثِقَاتٌ.

708. హాజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు సైన్యాన్ని సిద్ధం చేయవలసిందిగా ఆజ్ఞాపించారు. కాని ఒంటెలు చాలిన్నని లేవు. అప్పుడు ఆయన (సఅసం) సదకా ఒంటెలపై (అప్పుగా ఒంటెలను) సేకరించవలసిందిగా ఆయన్ని ఆదేశించారు. 'ఒక ఒంటెను రెండు సదకా ఒంటెలకు బదులుగా తీసుకునేవాణ్ణి' అని ఆయన చెప్పారు. (హాకిమ్ మరియు బైహఖీ దీనిని ఉల్లేఖించారు - హదీసు అందజేసిన వారు నమ్మకస్థులు)

**సారాంశం**

'సదఖా ఒంటెలు' అంటే ప్రభుత్వ ధనాగారానికి జకాత్ రూపేణా, సదఖాల (దానధర్మాల) రూపేణా వచ్చే ఒంటెలని భావం. ఈ ఒంటెలు ప్రభుత్వ ధనాగారంలోకి వచ్చిన మీదట అప్పుగా తీసుకున్న ఒంటెలకు బదులుగా ఇవ్వవచ్చన్న ఉద్దేశ్యంతో దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా సూచించారు.

పశువుకు బదులుగా పశువును కొనవచ్చనీ, అమ్మవచ్చనీ **ఈ హదీసు** ద్వారా అవగతమవుతోంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) మరియు అత్యధికమంది ధర్మవేత్తలు ఈ రకపు క్రయవిక్రయాలను ధర్మ సమ్మతంగానే తలపోస్తున్నారు. కాని హనఫీ విద్వాంసులు మాత్రం ఇందుకు సుముఖంగా లేరు.

(٧٠٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الْمُزَابَنَةِ: أَنْ يَبِيْعَ ثَمَرَ حَائِطِهِ إِنْ كَانَ نَخْلاً بِتَمْرٍ كَيْلاً، وَإِنْ كَانَ كَرْماً أَن يَبِيْعَهُ بِزَبِيْبٍ كَيْلاً، وَإِنْ كَانَ زَرْعاً أَنْ يَبِيعَهُ بِكَيْلِ طَعَامٍ، نَهَى عَنْ ذٰلِكَ كُلِّهِ. مُتَّفَقٌ عَلَيْهِ.

709. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ముజాబనా' వర్తకం చేయడాన్ని వారించారు. ముజాబనా వర్తకమంటే ఒక వ్యక్తి తన తోటలోని తాజా ఖర్జూర పండ్లను ఎండు ఖర్జూర పండ్లకు బదులు అమ్మడం, లేదా తాజా ద్రాక్ష పండ్లను ఎండు ద్రాక్ష పండ్లకు బదులు అమ్మడం లేదా పొలంలోని పంటను (పచ్చి ధాన్యాన్ని) ఆరివున్న ధాన్యానికి బదులుగా అమ్మడం. ఆయన (సఅసం) ఈ రకమైన క్రయవిక్రయాలన్నింటినీ వారించారు. (బుఖారీ, ముస్లిం)

(٧١٠) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ، وَسُئِلَ عَنِ اشْتِرَاءِ الرُّطَبِ بِالتَّمْرِ، فَقَالَ: «**أَيَنْقُصُ الرُّطَبُ إِذَا يَبِسَ؟**» قَالُوا: نَعَمْ، فَنَهَى عَنْ ذٰلِكَ. رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ ابْنُ الْمَدِينِيْ وَالتِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

710. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ సాద్ బిన్ అబూ వక్కాస్ (రజి) తెలిపారు. "తాజా ఖర్జూర పండ్లను ఎండు ఖర్జూర పండ్లకు బదులుగా అమ్మవచ్చా?" అని ఆయన్ని (స) ప్రశ్నించగా "అవి ఎండిన తరువాత తూకంలో తగ్గుతాయా?" అని ఆయన (సఅసం) అడిగారు. "అవును" అని జనులు చెప్పారు. అప్పుడాయన (స), ఇలాంటి వర్తకం చేయరాదని తాకీదు చేశారు. (దీనిని ఐదుగురూ ఉల్లేఖించారు - ఇబ్నె మదీని, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైందిగా పేర్కొన్నారు)

(٧١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ بَيْعِ الْكَالِئِ بِالْكَالِئِ، يَعْنِي الدَّيْنِ بِالدَّيْنِ. رَوَاهُ إِسْحَاقُ وَالبَزَّارُ بِإِسْنَادٍ ضَعِيفٍ.

711. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అప్పుకు బదులుగా అప్పును అంటే రుణానికి బదులుగా రుణాన్ని అమ్మడాన్ని వారించారు. (దీనిని ఇస్‌హాఖ్, బజ్జార్ బలహీన ప్రమాణాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

అప్పును అప్పుకు బదులుగా అమ్మడం అధర్మమని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఉదాహరణకు : అస్లం అనే వ్యక్తి అహ్మద్ అనే వ్యక్తి వద్ద ఒక స్కూటర్‌ను 10 వేల రూపాయలకు కొని ఒక సంవత్సరకాలంలో పూర్తి డబ్బు చెల్లిస్తానని మాటిచ్చాడు. సంవత్సర కాలం గడచిపోయినా అస్లం డబ్బు చెల్లించే స్థితిలో లేడు. అతడు అహ్మద్ వద్దకుపోయి, మరికొంత గడువు ఇస్తే 12 వేలు ఇస్తానని అంటాడు. అంటే ఒకసారి తీసుకున్న అప్పుపై మరింత అప్పు ఇస్తానన్నాడు. ఈ అదనపు 2 వేల పైకం వడ్డీ క్రిందికి వస్తుంది.

**4వ అధ్యాయం**

## ٤ - بَابُ الرُّخْصَةِ فِي بَيْعِ الْعَرَايَا، وَبَيْعِ الْأُصُولِ وَالثِّمَارِ

## 'అరాయ'గా వచ్చిన తోట ఫలాల అమ్మకానికి అనుమతి

(٧١٢) عَنْ زَيْدِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: أَنَّ رَسُولَ اللهِ ﷺ رَخَّصَ فِي الْعَرَايَا أَنْ تُبَاعَ بِخَرْصِهَا كَيْلاً. مُتَّفَقٌ عَلَيْهِ.

712. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అరాయ' తోట పండ్ల అమ్మకానికి అనుమతి ఇచ్చారు. చెట్టుకు ఉన్న పండ్లను అంచనా వేసి కొలత రూపంలో వాటిని అమ్మవచ్చని చెప్పారు.

(బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ: رَخَّصَ فِي الْعَرِيَّةِ يَأْخُذُهَا أَهْلُ الْبَيْتِ بِخَرْصِهَا تَمْراً، يَأْكُلُونَهَا رُطَباً.

'అరియ్య' లావాదేవీల విషయంలో తోట యజమానులు ఒక అంచనా ప్రకారం ఎండు ఖర్జూరం ఇచ్చి తినడానికి తాజా ఖర్జూర పండ్లను తీసుకోవడానికి దైవప్రవక్త (సఅసం) అనుమతి ఇచ్చారని 'ముస్లిం'లో ఉంది.

**సారాంశం**

అరబ్బులు, దుర్భిక్షం ఏర్పడినప్పుడు తమ తోటల్లోని కొన్ని చెట్లను సమాజంలోని నిరుపేదలు, నిరాధార జీవుల కోసం కేటాయించేవారు. 'ఫలానా చెట్లకు కాచిన పండ్లు మీవి' అని పేదవారికి ముందుగానే చెప్పేసేవారు. ఈ రకమైన కానుకనే ఆ రోజుల్లో 'అరియ్యా'గా వ్యవహరించేవారు. 'అరాయా' అనేది బహువచనం. తమ కొరకు కేటాయించబడిన చెట్ల పండ్లు కోసుకోవటానికి పేద ప్రజలు పదే పదే తోటల్లోకి ప్రవేశించేవారు. ఈ రాకపోకలు తోట యజమానులను చీకాకు పెట్టేవి. లేదా ఈ విధంగా కూడా జరిగేది : నిరుపేదలు తమ ఇక్కట్ల దృష్ట్యా పంట కోతకు వచ్చేదాకా నిరీక్షించలేక తమ వాటా క్రిందికి వచ్చే పండ్లను ముందుగానే అమ్మేసేవారు. అంటే పండ్లు చెట్టు మీద ఉండగానే వాటిని ఎండు ఖర్జూరానికి బదులుగా అమ్మేసేవారు. ఈ పేద ప్రజలు పదే పదే తోటకు రావటం వల్ల కలిగే అసౌకర్యం నుంచి విముక్తి నొందే ఉద్దేశ్యంతో తోట యజమానులు చెట్లకున్న తాజా ఖర్జూర పండ్లకు బదులుగా ఎండు ఖర్జూరాలను కొలిచి ఇచ్చేవారు. ఈ రకమైన లావాదేవీలు 'ముజాబనా' వ్యాపారం క్రిందికి వస్తాయి. మరి ఇంతకుముందు 'ముజాబనా' వ్యాపారాన్ని దైవప్రవక్త (సఅసం) నిషేధించినట్లు వచ్చింది. అయితే నిరుపేదల, అగత్యపరుల ఇక్కట్ల దృష్ట్యా వారిపట్ల కొంత సడలింపుల వైఖరి కనబరచబడింది. కాని ఈ పద్ధతి కోసం కూడా ఒక షరతు విధించబడింది. అదేమంటే చెట్టుమీద ఉన్న తాజా ఫలాలను జాగ్రత్తగా అంచనావేసి, అవి ఎండిన తరువాత పరిమాణం లేక తూకంలో ఎంత వస్తాయో (ఆ తరుగుదలను) కూడా లెక్క కట్టి మరీ ఇవ్వవలసి ఉంటుంది.

(٧١٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ رَخَّصَ فِي بَيْعِ الْعَرَايَا بِخَرْصِهَا مِنَ التَّمْرِ فِيمَا دُونَ خَمْسَةِ أَوْسُقٍ، أَوْ فِي خَمْسَةِ أَوْسُقٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

713.హజ్రత్ అబూ హురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అరాయా' వ్యాపారానికి అనుమతించారు. అయితే తాజా ఖర్జూర పండ్లను ఎండు ఖర్జూర పండ్లకు బదులుగా సరిగ్గా అంచనావేసి అమ్మాలి. ఈ అమ్మకం కూడా ఐదు 'వసఖ్'ల బరువు కన్నా తక్కువగా లేదా ఐదు వసఖ్‌లకు సమానంగా ఉన్నప్పుడు మాత్రమే జరగాలి.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒక 'వసఖ్' నాలుగు మణుగుల బరువుకు సమానం. ఐదు వసఖ్‌లంటే ఇరవై మణుగులకన్నా తక్కువ బరువు ఉన్నప్పుడు మాత్రమే 'అరియా' పద్ధతిననుసరించి పండ్లను అమ్మటం ధర్మసమ్మతమని పై హదీసు ద్వారా తెలుస్తోంది.

'ఐదు వసఖ్‌ల బరువుకు సమానం' అన్న పదం హదీసులో ప్రయోగించబడిందా లేదా అన్న విషయమై ఉల్లేఖకులు కాస్త సందిగ్ధానికి లోనయ్యారు. ఈ ఉల్లేఖకుని పేరు దావూద్ బిన్ హుసైన్ అని అనబడుతోంది. ఈ సంశయం మూలంగా ఐదు వసఖ్‌లకన్నా తక్కువ బరువు ఉన్నప్పుడు మాత్రమే 'అరియా' పద్ధతి నవలంబించవచ్చునన్న భావాన్ని తీసుకోవటం శ్రేయస్కరం.

(٧١٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ بَيْعِ الثِّمَارِ حَتَّى يَبْدُوَ صَلاَحُهَا، نَهَى الْبَائِعَ وَالْمُبْتَاعَ. مُتَّفَقٌ عَلَيْهِ.

714. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: పండ్లు పరిపక్వ స్థితికి రానంతవరకూ వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పారు. ఇలాంటి పండ్లను అమ్మేవారిని, కొనేవారినీ కూడా ఆయన (స) వారించారు. (బుఖారీ, ముస్లిం) వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది - "పండ్లు పరిపక్వ స్థితికి రావటం (తినటానికి యోగ్యమైనవి కావటం) అంటే ఏమిటీ?"అని ఆయన్ని (స) ఎవరో ప్రశ్నించగా, "ప్రకృతి వైపరీత్యం నుండి, నష్టం నుండి సురక్షితంగా ఉండటం" అని ఆయన (స) బదులిచ్చారు.

وَفِي رِوَايَةٍ: وَكَانَ إِذَا سُئِلَ عَنْ صَلاَحِهَا، قَالَ: **حَتَّى تَذْهَبَ عَاهَتُهَا.**

(٧١٥) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ بَيْعِ الثِّمَارِ حَتَّى تَزْهُوَ، قِيْلَ: وَمَا زَهْوُهَا؟ قَالَ: «**تَحْمَارُّ وَتَصْفَارُّ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

715. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ఫలాలు పండకముందే అమ్మటాన్ని వారించారు. 'పండటమంటే అర్థమేమిటీ?' అని ప్రశ్నించగా "అవి ఎరుపు రంగును, పసుపు పచ్చని రంగును సంతరించుకోవటం" అని ఆయన (స) బదులిచ్చారు. (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు మాత్రం బుఖారీ లోనివి)

(٧١٦) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ بَيْعِ الْعِنَبِ حَتَّى يَسْوَدَّ، وَعَنْ بَيْعِ الْحَبِّ حَتَّى يَشْتَدَّ. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

716. హజ్రత్ అనస్ (రజి) కథనం : ద్రాక్ష నలుపు రంగును సంతరించుకోకముందే అమ్మటాన్ని, ధాన్యపు గింజ గట్టిపడక ముందే విక్రయించటాన్ని దైవప్రవక్త (నఅసం) వారించారు. (దీనిని ఐదుగురిలో నసాయి మినహా మిగిలిన వారంతా ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

(٧١٧) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لَوْ بِعْتَ مِنْ أَخِيكَ ثَمَراً، فَأَصَابَتْهُ جَائِحَةٌ، فَلاَ يَحِلُّ لَكَ أَنْ تَأْخُذَ مِنْهُ شَيْئاً، بِمَ تَأْخُذُ مَالَ أَخِيكَ بِغَيْرِ حَقٍّ؟»** رَوَاهُ مُسْلِمٌ وَفِي رِوَايَةٍ لَهُ: أَنَّ النَّبِيَّ ﷺ أَمَرَ بِوَضْعِ الْجَوَائِحِ.

717. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "నీవు గనక నీ సోదరునికి పండ్లు ఫలాలు అమ్మగా వాటిపై ఏదన్నా ఆపద, విపత్తు వచ్చిపడితే అట్టి స్థితిలో నీవు అతన్నుండి ఏమైనా తీసుకోవటం ధర్మసమ్మతం కాదు. న్యాయసమ్మతం గాకుండా నీ సోదరుని సొమ్మును ఎలా తీసుకుంటావు? (ముస్లిం)." ముస్లింలోని మరొక ఉల్లేఖనంలో, "దైవప్రవక్త (సల్లం) విపత్తుల్లో నష్టపోయినవాటి ధరలు మినహాయించమని ఆదేశించారు" అని ఉంది.

**సారాంశం**

కొనుగోలుదారుడు తోట పండ్లు భారీ ఎత్తున కొన్న కొద్ది సేపట్లోనే అతనిపై అనుకోని ఆపద ఏదైనా వచ్చిపడవచ్చు. ఉదాహరణకు : పండ్లను మార్కెట్టుకు తరలించకముందే అతడు పెను తుఫానులో చిక్కుకుపోవచ్చు. భారీ వర్షాల మూలంగా పండ్లు కుళ్ళిపోవచ్చు. అగ్ని ప్రమాదం లాంటిది జరగవచ్చు. ఇలాంటి పరిస్థితిలో కొనుగోలుదారుని పరిస్థితి అత్యంత దయనీయంగా మారిపోతుంది. అటువంటి ప్రకృతి బాధిత సోదరునిపట్ల ఉదారంగా మెలగటం

మానవ ధర్మం. మరయితే పండ్లు దొంగతనానికి, దోపిడీకి, బందిపోటుకు గురైనపుడు ఏం చేయాలి? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుంది. ఈ విషయంలో పండితుల మధ్య భిన్నాభి ప్రాయాలున్నాయి.

(٧١٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنِ ابْتَاعَ نَخْلاً بَعْدَ أَنْ تُؤَبَّرَ، فَثَمَرَتُهَا لِلْبَائِعِ الَّذِي بَاعَهَا، إِلاَّ أَنْ يَشْتَرِطَ الْمُبْتَاعُ». مُتَّفَقٌ عَلَيْهِ.

718. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం "ఎవరయినా ఖర్జూర చెట్టును 'అంటు' వేసిన మీదట కొంటే అట్టి పరిస్థితిలో పండ్లు అమ్మేవానికే చెందుతాయి - ఒకవేళ కొనుగోలు దారుడు ముందుగానే పండ్లు తనవి అని షరతు పెట్టుకుని ఉంటే అది వేరే విషయం." (బుఖారీ, ముస్లిం)

**5వ అధ్యాయం**

## ٥ - أَبْوَابُ السَّلَمِ وَالْقَرْضِ وَالرَّهْنِ

## అడ్వాన్సు చెల్లింపు, అప్పు మరియు కుదువ పెట్టడం గురించి

(٧١٩) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَدِمَ النَّبِيُّ ﷺ الْمَدِينَةَ، وَهُمْ يُسْلِفُونَ فِي الثِّمَارِ السَّنَةَ والسَّنَتَيْنِ،

719. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాకు ఏతెంచినపుడు (చూస్తే) మదీనావాసులు పండ్ల ఫలాల విషయంలో ఒక్కో సంవత్సరం, రెండేసి సంవత్సరాల అడ్వాన్సు చెల్లింపు ప్రాతి పదికపై వ్యాపారం చేస్తుండేవారు. అప్పుడు ఆయన (స) వారికి ఇలా ఉప దేశించారు - "ఎవరయినా పండ్ల కొరకు అడ్వాన్సు చెల్లిస్తే ఆ పండ్ల బరువు, కొలత, పరిమాణాలతోపాటు గడువును

فَقَالَ: «مَنْ أَسْلَفَ فِي ثَمَرٍ فَلْيُسْلِفْ فِي كَيْلٍ مَعْلُومٍ وَوَزْنٍ مَعْلُومٍ إِلَى أَجَلٍ مَعْلُومٍ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِلْبُخَارِيِّ: «مَنْ أَسْلَفَ فِي شَيْءٍ».

కూడా నిర్ధారించుకోవాలి." (బుఖారీ, ముస్లిం) బుఖారీలో, "ఏ వ్యక్తి అయినా ఏదేని సరుకు విషయంలో అడ్వాన్సుగా ఇస్తే" అన్న వాక్యం ఉంది.

(٧٢٠) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ أَبْزَى، وَعَبْدِ اللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالاَ: كُنَّا نُصِيبُ المَغَانِمَ مع رسول الله ﷺ وكان يَأْتِينَا أَنْبَاطٌ من أَنْبَاطِ الشَّامِ، فَنُسْلِفُهُم فِي الْحِنْطَةِ وَالشَّعِيْرِ وَالزَّيْتِ، – وَفِي رِوَايَةٍ «وَالزَّيْتِ» – إِلَى أَجَلٍ مُسَمًّى، قِيْلَ: أَكَانَ لَهُمْ زَرْعٌ؟ قَالاَ: مَا كُنَّا نَسْأَلُهُمْ عَنْ ذٰلِكَ. رَوَاهُ الْبُخَارِيُّ.

720. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా, అబ్దుల్లాహ్ బిన్ అబూ ఔఫాల కథనం: "మేము దైవప్రవక్త (సఅసం)తో కలసి (యుద్ధాలలో పాల్గొనేవారము) విజయ ప్రాప్తిగా వచ్చిన వాటాను తీసుకునే వాళ్ళం. సిరియా రాజ్యానికి చెందిన వ్యవసాయదారులు మా వద్దకు వస్తుండేవారు. మేము వారికి గోధుమలు, బార్లీ, ఎండు ద్రాక్ష - ఒక ఉల్లేఖనంలో జైతూన్ నూనె అని ఉంది - కోసం అడ్వాన్సు ఇచ్చి ఒక నిర్ణీత గడువుపై ఒప్పందం చేసుకునేవారు. 'వాళ్లు స్వయంగా వ్యవసాయం చేసే వాళ్ళా?' అని ప్రశ్నించబడగా 'మేమెప్పుడూ ఈ సంగతి వాళ్లను అడగలేదు' అని వారు సమాధానమిచ్చారు. (బుఖారీ)

**సారాంశం**

అడ్వాన్సు చెల్లించే నాటికి ఆయా వస్తువులు అందుబాటులో లేకపోయినప్పటికీ అందులో తప్పులేదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అయితే గడువు ముగిసేనాటికి ఆ సరుకు సరఫరా కావాలి అన్నది షరతు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై)ల అభిప్రాయం ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి అభిప్రాయంలో ఒప్పందం జరిగే నాటినుంచీ గడువు ముగిసే వరకూ ఆ వస్తువులు అందుబాటులో ఉండితీరాలి. ఎందుకంటే ఆ వస్తువుల కొరత గనక ఏర్పడి ఉంటే గడువు ముగిసే సమయానికి లభ్యం కాకపోవచ్చు.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా (రజి). ఈయన ఖుజాఅ తెగకు చెందిన వారు. పిన్న వయస్కులైన సహాబీలలో ఒకరు. ఖుజాఅ తెగ తరపున స్వాతంత్ర్య మొసగబడిన బానిస. ఈయన దైవప్రవక్త (సఅసం)ను చూచారు. ఆయన (స) సారథ్యంలో నమాజ్ కూడా చేశారు. కూఫాలో స్థిరపడ్డారు. హజ్రత్ అలీ (రజి) తన పరిపాలనా కాలంలో ఈయన్ని 'ఖురాసాన్'కు అధికారిగా నియమించారు. ఈయన కూఫాలోనే కన్నుమూశారు.

(٧٢١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**مَنْ أَخَذَ أَمْوَالَ النَّاسِ يُرِيدُ أَدَاءَهَا أَدَّى اللَّهُ عَنْهُ، وَمَنْ أَخَذَهَا يُرِيدُ إِتْلَافَهَا أَتْلَفَهُ اللَّهُ تَعَالَى**». رَوَاهُ الْبُخَارِيُّ.

721. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు : "ఎవరైతే జనుల సొమ్మును (అప్పుగా) తీసుకుని దాన్ని తిరిగి చెల్లించాలని ఆరాటపడుతుంటాడో అతని అప్పును తీర్చడంలో అల్లాహ్ తోడ్పడతాడు. మరెవరయితే వారి (జనుల) సొమ్మును కాజేయాలని సంకల్పించుకుంటాడో అతన్ని అల్లాహ్ వృధా పరుస్తాడు." (బుఖారీ)

(٧٢٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ فُلاناً قَدِمَ لَهُ بَزٌّ مِّنَ الشَّامِ، فَلَوْ بَعَثْتَ إِلَيْهِ، فَأَخَذْتَ مِنْهُ ثَوْبَيْنِ بِنَسِيئَةٍ إِلَى مَيْسَرَةٍ، فَأَرْسَلَ إِلَيْهِ، فَامْتَنَعَ. أَخْرَجَهُ الْحَاكِمُ والْبَيْهَقِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ.

722. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్తా (సఅసం)! సిరియా నుండి ఫలానా వ్యక్తి బట్టలు తెచ్చాడు. తమరు ఎవరినయినా పంపి, ఆర్థిక ఇబ్బందులు తొలగిన తరువాత డబ్బు చెల్లించే షరతుపై (అప్పుగా) రెండు వస్త్రాలు తెప్పించండి" అని ఆమె కోరారు. అప్పుడు దైవప్రవక్త (స) ఒక మనిషిని అందుకోసం పంపించారు. కాని ఆ వ్యక్తి (అప్పుగా ఇవ్వడానికి) నిరాకరించాడు.(దీనిని హాకిమ్ మరియు బైహఖీలు ఉల్లేఖించారు. ఈ హదీసును అందజేసినవారు విశ్వసనీయులు)

**సారాంశం**

వస్తువులను అప్పుగా కొనటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (సఅసం)కు అప్పుగా బట్టలు అమ్మడానికి నిరాకరించిన వ్యక్తి, బహుశా వ్యక్తిగతంగా ఆయన (స) పట్ల గల అక్కసు వల్ల అలా చేసి ఉంటాడు. ఆ వ్యక్తి యూదుడనీ, మహాప్రవక్త (స) పట్ల అతను వైర స్వభావం కలవాడనీ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

(٧٢٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الظَّهْرُ يُرْكَبُ بِنَفَقَتِهِ إِذَا كَانَ مَرْهُوناً، وَلَبَنُ الدَّرِّ يُشْرَبُ بنفقته إذا كان مَرْهُونًا وَعَلَى الَّذِي يَرْكَبُ وَيَشْرَبُ النَّفَقَةُ**». رَوَاهُ الْبُخَارِيُّ.

723. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు - "కుదువ (తాకట్టు) పెట్టబడిన పశువుపై అయ్యే వ్యయప్రయాసలకు బదులుగా (తాకట్టుగా ఉంచుకున్న వ్యక్తి) దాన్ని వాహనంగా వాడుకోవచ్చు. అది పాలు ఇచ్చే పశువు అయివుంటే దానికి మేత పెట్టినందుకు బదులుగా దాని పాలు కూడా త్రాగవచ్చు. అయితే దానికయ్యే ఖర్చులన్నీ అతడే భరించవలసి ఉంటుంది." (బుఖారీ)

**సారాంశం**

తన వద్ద తాకట్టుగా ఉంచబడిన పశువును మేపటమే గాకుండా, దాన్ని రక్షించవలసిన బాధ్యత కూడా అతనిపై ఉన్నందున దాన్ని అవసరానికి వాహనంగా ఉపయోగించుకునే హక్కు కూడా అతనికి ఉండవలసిందే. అలాగే పాలు ఇచ్చే పశువు అతని వద్ద ఉన్నప్పుడు దాని పాలు కూడా అతనే పితికి తీసుకోవచ్చు. ఇక్కడ ఆ పశువు యజమాని ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేదు. ఇమామ్ అహ్మద్ (రహ్మలై), ఇమామ్ ఇస్‌హాఖ్ (రహ్మలై) తదితరుల అభిమతం కూడా ఇదే.

పశువును తాకట్టుగా పెట్టుకున్న వ్యక్తి ఆ పశువుపై అయ్యే ఖర్చుల మేరకే దాన్ని ఉపయోగించుకోవాలనీ, అంతకు మించి ప్రయోజనం పొందరాదని మరి కొంతమంది ధర్మవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

తాకట్టుగా ఉన్న పశువు ద్వారా అసలు ఏమాత్రం లబ్ధి పొందకూడదనీ, లబ్ధి పొందే హక్కు వాస్తవానికి ఆ పశువు యజమానికి మాత్రమే ఉందని ఇంకొంతమంది పండితులు వాదిస్తున్నారు. కాని హదీసు వాక్యాలు ఈ వాదనతో ఏమాత్రం పొసగటం లేదు.

(٧٢٤) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ يَغْلَقُ الرَّهْنُ مِنْ صَاحِبِهِ الَّذِي رَهَنَهُ، لَهُ غُنْمُهُ وَعَلَيْهِ غُرْمُهُ**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّ الْمَحْفُوظَ عِنْدَ أَبِي دَاوُدَ وَغَيْرِهِ إِرْسَالُهُ.

724. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజి) తెలిపారు : "తాకట్టు పెట్టబడిన వస్తువు దాని యజమానికి చెందకుండా నిలిపి ఉంచకూడదు. దాని ప్రయోజనం కూడా అతనికే (యజమానికే) చెందాలి. దానిపై వచ్చే నష్టం కూడా అతనే భరించవలసి ఉంటుంది." (దీనిని దారె ఖుత్నీ, హాకిమ్ ఉల్లేఖించారు. దీన్ని అందజేసిన వారు విశ్వసనీయులే. అయితే అబూదావూద్ తదితరుల దృష్టిలో ఇది 'ముర్సల్'గా పరిగణించబడింది)

**సారాంశం**

వస్తువును కుదువ (తాకట్టు) పెట్టి రుణం తీసుకున్న వ్యక్తి నిర్ణీత గడువులోగా అప్పు తీర్చకపోతే తన వద్ద కుదువపెట్టుకున్న వ్యక్తి ఆ వస్తువును స్వాధీనం చేసుకునేవాడు. ఈ విధానాన్ని దైవప్రవక్త (స) వారించారని పై హదీసు చెబుతోంది. తన దగ్గర వస్తువును తాకట్టు పెట్టుకున్న వ్యక్తి ఆ వస్తువు ద్వారా ఎలాంటి లబ్ధి పొందరాదని వాదించే పండితులు ఈ హదీసునే ఆధారంగా తీసుకున్నారు. అయితే ఈ హదీసు ప్రామాణికత రీత్యా 'తిరుగులేనిది'గా ఖరారు కాజాలదు.

(٧٢٥) وَعَنْ أَبِي رَافِعٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ اسْتَسْلَفَ مِنْ رَجُلٍ بَكْراً، فَقَدِمَتْ عَلَيْهِ إِبِلٌ مِنْ إِبِلِ الصَّدَقَةِ، فَأَمَرَ

725. హజ్రత్ అబూ రాఫె (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తి నుండి పడుచు వయస్సులో వున్న ఒంటెను అప్పుగా తీసుకున్నారు. తరువాత ఆయన (సఅసం) వద్దకు సదఖా రూపేణా ఒంటెలు వచ్చాయి. ఆ వ్యక్తికి ఒక పడుచు ఒంటెను ఇచ్చి అప్పు తీర్చవలసిందిగా ఆయన (సఅసం)

أَبَا رَافِعٍ أَنْ يَقْضِيَ الرَّجُلَ بَكْرَه، فَقَالَ: «**لاَ أَجِدُ إِلاَّ خِيَاراً رَبَاعِيًا**»، قَالَ: «**أَعْطِهِ إِيَّاهُ، فَإِنَّ خِيَارَ النَّاسِ أَحْسَنُهُمْ قَضَاءً**. رَوَاهُ مُسْلِمٌ.

అబూ రాఫేను ఆజ్ఞాపించారు. 'ఇంత కన్నా పడుచు ఏడేళ్ళ ఒంటె కూడా ఉంది' అని నేను విన్నవించుకోగా "సరే, దాన్నే అతనికి ఇవ్వు. ఎందుకంటే రుణం తీర్చటంలో అత్యుత్తమంగా వ్యవహరించే వాడే ఉత్తముడు" అని ఆయన(న) సెలవిచ్చారు. (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే రుణగ్రస్తుడు రుణం తీర్చే సమయంలో తాను తీసుకున్న వస్తువుకన్నా - పరిమాణంలోనూ, నాణ్యతలోనూ - మంచి వస్తువును ఇష్ట పూర్వకంగా ఇస్తే అది సమ్మతమే. పైగా ఇది అతని కృతజ్ఞతా భావాన్ని, సంస్కారాన్ని వ్యక్తపరుస్తుంది. అయితే రుణం ఇచ్చే సమయంలో రుణదాత గనక; "నీవు నాకు ఇంతకన్నా మంచి వస్తువును తిరిగి ఇవ్వాలి సుమా!" అని షరతు విధిస్తేమటుకు అది అధర్మం అవుతుంది. ఇచ్చినదానికన్నా అధికంగా పుచ్చుకోజూస్తే అది కూడా వడ్డీ క్రిందికి వస్తుంది.

(٧٢٦) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**كُلُّ قَرْضٍ جَرَّ مَنْفَعَةً فَهُوَ رِباً**». رَوَاهُ الْحَارِثُ بْنُ أَبِي أُسَامَةَ، وَإِسْنَادُهُ سَاقِطٌ.

726. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "లాభాన్ని ఆర్జించిపెట్టే ఏ రుణమైనా అది వడ్డీ క్రిందికే వస్తుంది." (దీనిని హారిస్ బిన్ అబూ ఉసామా ఉల్లేఖించారు. దీని పరంపర పరిగణనలోకి వచ్చేది కాదు.

وَلَهُ شَاهِدٌ ضَعِيْفٌ عَنْ فَضَالَةَ بْنَ عُبَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عِنْدَ الْبَيْهَقِيِّ، وَآخَرُ مَوْقُوفٌ عَنْ عَبْدِ اللهِ بْنِ سَلاَمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عِنْدَ الْبُخَارِيِّ.

బైహఖీ దృష్టిలో ఫజాలా బిన్ ఉబైద్ (రజి) గారి హదీసు ఈ సందర్భంగా ఒక బలహీన సాక్షిగా ఉంది. బుఖారీలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) గారిచే ఉల్లేఖించబడిన 'మౌఖూఫ్' హదీసు కూడా ఈ సందర్భంగా పేర్కొనదగినది)

6వ అధ్యాయం

## దివాలా తీయటం, జప్తు చేసుకోవటం గురించి

## ٦ - بَابُ التَّفْلِيسِ وَالْحَجْرِ

(٧٢٧) عَنْ أَبِي بَكْرِ بْنِ عَبْدِ الرَّحْمٰنِ، عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْنَا رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَنْ أَدْرَكَ مَالَهُ بِعَيْنِهِ عِنْدَ رَجُلٍ قَدْ أَفْلَسَ فَهُوَ أَحَقُّ بِهِ مِنْ غَيْرِهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

727. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాము విన్నామని హజ్రత్ అబూహురైర (రజి) చెప్పినట్లుగా హజ్రత్ అబూబక్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ తెలియజేశారు : "ఎవరయినా దివాలా తీసిన వ్యక్తి దగ్గర తన వస్తువు యథాతథంగా ఉన్నట్టు కనుగొంటే ఆ వస్తువు పాలిట ఇతరులకన్నా అతనే ఎక్కువ హక్కుదారుడు అవుతాడు."

(బుఖారీ, ముస్లిం)

وَرَوَاهُ أَبُو دَاوُدَ وَمَالِكٌ مِّنْ رِوَايَةِ أَبِي بَكْرِ بْنِ عَبْدِ الرَّحْمٰنِ مُرْسَلاً، بِلَفْظِ: أَيُّمَا رَجُلٍ بَاعَ مَتَاعاً، فَأَفْلَسَ الَّذِي ابْتَاعَهُ، وَلَمْ يَقْبِضِ الَّذِي بَاعَهُ مِنْ ثَمَنِهِ شَيْئاً، فَوَجَدَ مَتَاعَهُ بِعَيْنِهِ، فَهُوَ أَحَقُّ بِهِ، وَإِنْ مَاتَ الْمُشْتَرِي فَصَاحِبُ الْمَتَاعِ أُسْوَةُ الْغُرَمَاءِ. وَوَصَلَهُ الْبَيْهَقِيُّ. وَضَعَّفَهُ تَبعاً لأَبِي دَاوُدَ.

అబూ దావూద్ మరియు మాలిక్‌లు అబూబక్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ నుండి క్రింది విధంగా ఒక 'ముర్సల్' ఉల్లేఖనాన్ని పేర్కొన్నారు. దాని ప్రకారం - "ఎవరయినా ఏదైనా వస్తువును గనక అమ్మితే, కొన్నవాడు దివాలా తీసేస్తే, అమ్మిన వాడికి ఆ వస్తువుకు సంబంధించిన పైకం అప్పటికింకా ఏమాత్రం ముట్టకుండా ఉంటే (అట్టి పరిస్థితిలో) అతడు గనక తన వస్తువును (కొన్న వ్యక్తి వద్ద) యథాస్థితిలో ఉన్నట్టు తెలుసుకుంటే ఆ వస్తువును తీసుకునేందుకు అతనే అందరికన్నా ఎక్కువ హక్కుదారుడు అవుతాడు. ఒకవేళ కొనుగోలుదారుడు మరణిస్తే మట్టుకు ఆ వస్తువు

యజమానితో పాటు ఇతర రుణ దాతలు కూడా దానిపై సమాన హక్కును పొందుతారు. (బైహఖీ దీనిని 'మౌసూల్' గా చెప్పినప్పటికీ, అబూదావూద్ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ దీనిని బలహీనం (జయీఫ్)గా ఖరారు చేశారు)

وَرَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ مِنْ رِوَايَةِ عُمَرَ بْنِ خَلْدَةَ، قَالَ: أَتَيْنَا أَبَا هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ فِي صَاحِبٍ لَنَا قَدْ أَفْلَسَ، فَقَالَ: لأَقْضِيَنَّ فِيكُمْ بِقَضَاءِ رَسُولِ اللهِ ﷺ: مَنْ أَفْلَسَ أَوْ مَاتَ، فَوَجَدَ رَجُلٌ مَتَاعَهُ بِعَيْنِهِ فَهُوَ أَحَقُّ بِهِ. وَصَحَّحَهُ الْحَاكِمُ، وَضَعَّفَهُ أَبُو دَاوُدَ، وَضَعَّفَ أَيْضاً هٰذِهِ الزِّيَادَةَ فِي ذِكْرِ الْمَوْتِ.

అబూదావూద్ మరియు ఇబ్నె మాజా దీనిని ఉమర్ బిన్ ఖల్దా ఉల్లేఖనం ఆధారంగా ఇలా వివరించారు - "మేము దివాలా తీసిన మా సహచరుని విషయమై సంప్రతించడానికి అబూహురైర (రజి) దగ్గరికి వచ్చాము. ఆయన (రజి) మమ్మల్ని ఉద్దేశ్యించి; 'నేను మీ వ్యవహారంలో దైవప్రవక్త (సఅసం) గారిచ్చిన తీర్పునే ఇస్తాను - (అదేమంటే) ఎవరైనా దివాలా తీస్తే లేదా మరణిస్తే (అట్టి స్థితిలో) ఏ మనిషి అయినా అతని వద్ద తన వస్తువు యధారూపంలో ఉన్నట్టు కనుగొంటే అతడే ఆ వస్తువుకు అందరికన్నా ఎక్కువ హక్కుదారుడు అవుతాడు' అని తెలిపారు." (దీనిని హాకిమ్ ప్రామాణికమైనదిగా ఖరారు చేయగా, ఇది బలహీనమైనది అని అబూదావూద్ పేర్కొన్నారు. అలాగే ఈ హదీసులో అదనంగా వచ్చిన మరణ ప్రస్తావనను కూడా ఆయన 'బలహీన మైనది'గా పేర్కొన్నారు)

## సారాంశం

ఈ హదీసులో తెలియజేయబడిన విషయాన్ని విడమరచి చెప్పాలంటే; ఎవరయినా ఒక వ్యక్తి ఒక మనిషి వద్ద అరువుగా సరుకు కొంటాడు. సరుకు కొన్న కొన్నాళ్ళకే ఏవో కారణాలవల్ల అతడు దివాలా తీస్తాడు. అప్పు చెల్లించడానికి తన వద్ద డబ్బు ఏమీ లేదని చేతులెత్తేశాడు. అలాంటి పరిస్థితిలో అతనికి సరుకును అమ్మిన వ్యక్తి వచ్చి తనఖీ చేయగా, తాను అరువుగా అమ్మిన వస్తువు అతని దగ్గర యథాతథంగా ఉన్నట్టు కనిపించింది. అటువంటి వస్తువును అమ్మకందారుడు నిస్సంకోచంగా తీసేసుకుని అతనితో చేసుకున్న వ్యాపార ఒప్పందాన్ని రద్దుపరచుకోవచ్చు. అత్యధికమంది విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే.

అయితే హనఫీల అభిమతం దీనికి కొంత భిన్నంగా ఉంది. హనఫీ పండితుల ప్రకారం ఆ అమ్మకందారుడు ఒక్కడే ఆ వస్తువుకు హక్కుదారుడు కాడు. దివాలా తీసిన వ్యక్తి ఎంత మందికి బాకీ పడ్డాడో వారందరికీ ఆ వస్తువు (నిష్పత్తిని బట్టి) చెందాలి. కాని ఈ అభిమతం హదీసు మూలంతో సమరసం చెందటం లేదన్నది గమనార్హం.

## హదీసు ఉల్లేఖకులు

(1) అబూబక్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ : ఈయన పూర్తి వంశపరంపర ఈ విధంగా ఉంది. అబూబక్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్ బిన్ హిషామ్ బిన్ ముగీరా మఖ్జూమ్ మదనీ. మదీనా మునవ్వరాకు ఖాజీగా నియమితులయ్యారు. ఈయన అసలు పేరు ముహమ్మద్ అనీ, ముగీరా అనీ, అబూబక్ర్ అనీ విభిన్న వాదనలున్నాయి. ఈయన మారుపేరు అబూ అబ్దుర్రహ్మాన్ అని కొందరన్నారు. ఈయన మారుపేరే అసలు పేరని మరికొందరు పేర్కొన్నారు. గొప్ప ధర్మవేత్త. ధర్మపరాయణులు. నమ్మకస్థులు. మహాప్రవక్త (స) అనుయాయులలో మూడో తరానికి చెందినవారు. వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ ఖిలాఫత్ కాలంలో మరణించారు. హజ్రత్ అబూ హురైర (రజి) నుండి ఈయన హదీసులు విన్నట్టు రుజువయింది.

(2) ఉమర్ బిన్ ఖల్దా : ఈయన మారుపేరు అబూ హఫ్స్. మదీనాకు చెందిన అన్సార్ వర్గీయులు. ఖాజీ పదవిని పొందారు. దైవభీతి గలవారు. సదాచార సంపన్నులు. సౌశీల్యం, పారిశుద్ధ్యం విషయంలో సాటిలేని మేటి. పరాక్రమశాలి. శత్రువులను గడగడలాడించే గాంభీర్యం ఆయన సొత్తు అనాలి. ఈయన హజ్రత్ అబూహురైర (రజి) నుండి హదీసులను ఉటంకించారు.

(٧٢٨) وَعَنْ عَمْرِو بْنِ الشَّرِيْدِ، عَنْ اَبِيْهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيُّ الْوَاجِدِ

728. హజ్రత్ అమ్ర్ బిన్ షరీద్ తన తండ్రిగారైన షరీద్ (రజి) ఆధారంగా ఉల్లేఖించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా

يُحِلُّ عِرْضَهُ وَعُقُوبَتَهُ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَعَلَّقَهُ الْبُخَارِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

ఉపదేశించారు - "ధనవంతుడు రుణం తీర్చటంలో తాత్సారం చేయటం అంటే తనను తాను అవమానపరచుకోవటం మరియు శిక్షార్హునిగా నిలబెట్టు కోవటమే." (దీనిని అబూదావూద్ మరియు నసాయి ఉల్లేఖించారు. బుఖారీ దీని పరంపరను ప్రస్తావించ కుండానే నకలు చేశారు. అయితే ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు)

## సారాంశం

శ్రీమంతుడు, ఆర్థికస్థోమత గల వ్యక్తి తాను రుణం చెల్లించగల తాహతు ఉండి కూడా పేరాశ, ధనవ్యామోహంవల్ల రుణం చెల్లించడానికి తాత్సారం చేయటం, కుంటిసాకులు చెప్పటం, వాయిదాలు వేయటం అనర్థదాయకం. ఇలాంటి వ్యక్తి తన అవాంఛనీయ ధోరణి ద్వారా రుణదాత సహనాన్ని పరీక్షించి, పరీక్షించి చివరకు అతని చేత నానా చీవాట్లు పెట్టించు కుంటాడు. అప్పటి వరకూ సొసైటీలో అతనికున్న పరువు ప్రతిష్ఠలు మంటగలుస్తాయి. అప్పటికీ అతని నైజంలో మార్పు రాకపోతే కోర్టుకీడ్వబడతాడు. కోర్టులో శిక్ష పడినా పడవచ్చు. ఈ కష్టాలన్నీ చేతులారా అతను కొనితెచ్చుకున్నవే గాని మరొకరి వల్ల వచ్చినవి కావు. కాబట్టి రుణం తీసుకున్న వారు అకారణంగా చెల్లింపును దాటవేయకుండా వీలైనంత త్వరగా ఆ బాధ్యతనుండి విముక్తి పొందేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

## హదీసు ఉల్లేఖకులు

(1) అమ్ర్-ఈయన మారు పేరు అబుల్ వలీద్. తాయఫ్ వాసులు. సఖీఫ్ తెగకు చెందిన వారు. అందుకే తాయఫీగా, సఖఫీగా కూడా పిలువబడ్డారు. విశ్వసనీయులైన తాబయి. ప్రవక్త (స) సహచరులలో మూడో కోవకు చెందినవారు.

(2) షరీద్ (రజి) : షరీద్ బిన్ సువైద్ సఖఫీ. మొదట ఈయన పేరు మాలిక్. దైవప్రవక్త (స) ఈయన పేరును మార్చి షరీద్ అని నామకరణం చేశారు. ఎందుకంటే ఈయన తన జాతికి చెందిన ఒక వ్యక్తిని హతమార్చి మక్కాకు వచ్చారు. అనంతరం ఇస్లాం స్వీకరించారు. ఈయన హజర్ మోత్‌కు చెందినవారన్న వాదన కూడా ఉంది.

(٧٢٩) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أُصِيْبَ رَجُلٌ فِيْ عَهْدِ رَسُولِ اللهِ ﷺ فِي ثِمَارٍ ابْتَاعَهَا، فَكَثُرَ دَيْنُهُ، فَأَفْلَسَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «تَصَدَّقُوا عَلَيْهِ»، فَتَصَدَّقَ النَّاسُ عَلَيْهِ، وَلَمْ يَبْلُغْ ذٰلِكَ وَفَاءَ دَيْنِهِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ لِغُرَمَائِهِ: «خُذُوا مَا وَجَدْتُمْ، وَلَيْسَ لَكُمْ إِلاَّ ذٰلِكَ». رَوَاهُ مُسْلِمٌ.

729. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఒక వ్యక్తి పండ్ల వ్యాపారంలో (బాగా) నష్ట పోయాడు. తత్కారణంగా అతడు అప్పులపాలవటమే గాక ఆఖరికి బికారిగా తయారయ్యాడు. అప్పుడు దైవ ప్రవక్త (సఅసం), "ఇతనికి దానధర్మాలు ఇవ్వండి" అని ప్రజలకు సూచించారు. ప్రజలతనికి దానాలు (సదకాలు) ఇచ్చారు గాని ఆ దానాలతో కూడా అప్పులు తీరేటట్టు కనిపించలేదు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) అతని రుణదాతలనుద్దేశించి, "(ఇతన్నుండి) వచ్చినమటుకే తీసుకోండి. ఇంతకు మించి మీ కోసం ఏమీలేదు" అని చెప్పారు. (ముస్లిం)

(٧٣٠) وَعَنِ ابْنِ كَعْبِ بْنِ مَالِكٍ عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ حَجَرَ عَلَى مُعَاذٍ مَالَهُ، وَبَاعَهُ فِي دَيْنٍ كَانَ

730. హజ్రత్ ఇబ్నె కాబ్ బిన్ మాలిక్ (రజి) తన తండ్రి ఆధారంగా చేసిన ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ముఆజ్ (రజి)కు ఆయన ఆస్తిపాస్తులను ఖర్చు చేయకుండా స్థంభింపజేశారు (సీజ్ చేశారు). తరువాత ఆయన ఇతరులకు ఇవ్వవలసివున్న బకాయిలకు బదులుగా ఆ ఆస్తిని అమ్మివేయించారు. (ఈ హదీసును దారె ఖుత్నీ ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు. అయితే

عَلَيْهِ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ مُرْسَلاً، وَرَجَّحَ إِرْسَالَهُ.

అబూదావూద్ దీనిని 'ముర్సల్'గా పేర్కొనటమేగాక, ముర్సల్‌గా పరిగణించటానికే ప్రాధాన్యత నివ్వాలని అన్నారు)

## సారాంశం

ఏ పౌరుడైనా పీకలలోతు అప్పుల్లో మునిగిపోతే రాజ్యాధికారిగానీ, ప్రభుత్వాధికారిగానీ జోక్యం చేసుకుని అతని ఆస్తిపాస్తులను, బ్యాంక్ బ్యాలెన్సులను స్థంభింపజేయవచ్చుననీ, ఆస్తుల లెక్క కట్టి అప్పుల వాళ్లకు తలోకాస్త పంచిపెట్టడం కూడా చేయవచ్చుననీ ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ప్రభుత్వం గనక ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండకపోతే, ఎగ్గొట్టే ఉద్దేశ్యం ఉన్న వారు తమ పలుకుబడిని ఉపయోగించి ఆస్తులను ఇతరుల పేర్ల మీద బదిలీ చేయటమో, తప్పుడు లెక్కలు చూపటమో చేసి పరుల సొమ్మును స్వాహా చేస్తారు. ఇలాంటి దగుల్బాజీల మూలంగా సమాజంలో సామనస్యం, సుహృద్భావం అంతరించి వైమనస్యం, వైరభావం చోటుచేసుకుంటాయి. అవి క్రమక్రమంగా కక్షలు, కార్పణ్యాలకు దారితీసి ప్రజా జీవితాన్ని దుర్భరం చేస్తాయి.

## హదీసు ఉల్లేఖకులు

(1) ఇబ్నె కాబ్ : మారు పేరు అబుల్ ఖత్తాబ్. పూర్తిపేరు అబ్దుర్రహ్మాన్ బిన్ కాబ్ బిన్ మాలిక్ అన్సారీ. మదీనా వాస్తవ్యులు. అగ్రశ్రేణి తాబయీన్లలో ఒకరు. విశ్వసనీయులు. దైవప్రవక్త (స) కాలంలో జన్మించారనీ, సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్ ఖిలాఫత్ కాలంలో మరణించారనీ అనబడుతుంది.

(2) కాబ్ బిన్ మాలిక్ (రజి) - కాబ్ బిన్ మాలిక్ బిన్ అబూ కాబ్ అన్సారీ. సులైమ్ తెగకు చెందినవారు. మదీనా వాస్తవ్యులు. 'రెండవ అఖబా ప్రమాణం'లో పాల్గొన్నారు. బద్ర్, తబూక్ యుద్ధాలు మినహా మిగిలిన పోరాటాలన్నింటిలో పాల్గొన్నారు. తబూక్ యుద్ధ సందర్భంగా వెనుక ఉండిపోయిన ముగ్గురు ప్రముఖ సహాబీలలో ఈయన ఒకరు. ఈయన చెందిన పశ్చాత్తాపం ఎంత గొప్పదంటే అది దేవుని దర్బారులో సమ్మతించి ఆమోదించబడినట్లు శుభవార్త ఇవ్వబడింది. ఒక ఉల్లేఖనం ప్రకారం హిజ్రీ 50లో, వేరొక ఉల్లేఖనం ప్రకారం హిజ్రీ 51లో - 77 సంవత్సరాల వయస్సులో ఈయన మరణించారు.

(٧٣١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: عُرِضْتُ عَلَى النَّبِيِّ ﷺ يَوْمَ أُحُدٍ، وَأَنَا ابْنُ أَرْبَعَ عَشْرَةَ سَنَةً، فَلَمْ

**731. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం:** ఉహుద్ యుద్ధం జరిగిన రోజున నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో హాజరుపరచబడ్డాను. అప్పటికి నాకు 14 ఏండ్లే. నేను యుద్ధంలో

يُجِزْنِي، وَعُرِضْتُ عَلَيْهِ يَوْمَ الْخَنْدَقِ، وَأَنَا ابْنُ خَمْسَ عَشْرَةَ سَنَةً، فَأَجَازَنِي. مُتَّفَقٌ عَلَيْهِ.

పాల్గొనేందుకు ఆయన (సఅసం) నిరాకరించారు. కందక (అగడ్త) యుద్ధం మొదలైన రోజున కూడా నేను ఆయన (సఅసం) సమక్షంలో హాజరుపరచ బడ్డాను. అప్పటికి నాకు 15 ఏండ్లు నిండాయి. అప్పుడాయన (సఅసం) యుద్ధం చేయడానికి నాకు అనుమతి ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لِلْبَيْهَقِيِّ: فَلَمْ يُجِزْنِي وَلَمْ يَرَنِي بَلَغْتُ». وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

బైహఖీ ఉల్లేఖనంలో ఇలా వుంది : "ఆయన(స) నాకు అనుమతి ఇవ్వ లేదు. నాకింకా యుక్త వయసు రాలేద నుకున్నారు." (ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు)

**సారాంశం**

యుద్ధానికి సంబంధించిన ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద ప్రస్తావించటంలోని ఔచిత్యం ఏమిటీ? అన్న ప్రశ్న ఇక్కడ జనించవచ్చు. 15 ఏండ్ల ప్రాయంలో మనిషి లావా దేవీలు జరపటానికి, వ్యవహారం చేయడానికి అర్హుడవుతాడని తెలియజెప్పటమే దీని ఉద్దేశం కావచ్చు. మగవారు 15 ఏండ్లకు ముందు పిన్నలుగా, 15 ఏండ్లు నిండగానే యువకులుగా పరిగణించబడతారని ఈ హదీసు చెబుతోంది. 15 ఏండ్లకన్నా తక్కువ వయసు వున్న వారిని సిపాయిల రిక్రూట్‌మెంట్ జరపరాదని కూడా ఈ హదీసు ద్వారా అర్థమవుతోంది. సిపాయిలను భర్తీ చేసే సమయంలో వయస్సుతోపాటు వారి ఆరోగ్యాన్ని, శరీర సౌష్ఠవాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న సంగతి కూడా దీనిద్వారా బోధపడుతున్నది.

(٧٣٢) وَعَنْ عَطِيَّةَ الْقُرَظِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: عُرِضْنَا عَلَى النَّبِيِّ ﷺ يَوْمَ قُرَيْظَةَ، فَكَانَ مَنْ أَنْبَتَ قُتِلَ، وَمَنْ لَمْ يُنْبِتْ

732. హజ్రత్ అతియ్య ఖురజీ (రజి) కథనం : "బనూ ఖురైజాతో జరిగిన యుద్ధ సందర్భంగా మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో హాజరుపరచబడ్డాము. ఎవరి నాభి క్రింద రోమాలు మొలచి ఉన్నాయో వారు వధించబడ్డారు. మరెవరికి (రోమాలు)

خَلِّي سَبِيلَهُ، فَكُنْتُ مِمَّنْ لَمْ يُنْبِتْ، فَخَلَّى سَبِيلِي. رَوَاهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

మొలవలేదో వారు వదలివేయబడ్డారు. రోమాలు మొలవని వారిలో నేనూ ఉన్నాను. అందుచేత నేను కూడా వదలివేయబడ్డాను." (దీనిని నలుగురు ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

పూర్వాపరాలను తెలుసుకోకుండా ఈ హదీసును చదివిన వారిలో అపార్థాలు జనించే అవకాశం ఉంది. అసలేం జరిగిందంటే అహ్జాబ్ యుద్ధం ముగిసిన వెంటనే ముస్లిం సేనలు బనూ ఖురైజ అనే తెగతో తలపడవలసి వచ్చింది. దీనికి కారణం; అహ్జాబ్ యుద్ధ సందర్భంగా బనూ ఖురైజ ముస్లింలతో చేసుకున్న మైత్రీ ఒప్పందాన్ని భగ్నం చేసి, శత్రు సైన్యంతో కుమ్మక్కు అవటమే. బనూ ఖురైజ చేసిన ఈ ద్రోహానికి, వంచనకుగాను వారిని శిక్షించాలని నిర్ణయం గైకొనబడింది. అయితే తమ వ్యవహారంలో హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) చేసే తీర్పును మాత్రమే తాము శిరసావహిస్తామని బనూ ఖురైజ సర్దారులు షరతు పెట్టారు. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) తమపట్ల మన్నింపుల వైఖరిని అవలంబిస్తారని బనూ ఖురైజ ఆశించింది. ఎందుకంటే బనూ ఖురైజాకు - హజ్రత్ సాద్‌కు చెందిన ఔస్ తెగకు మధ్య ప్రాచీన కాలం నుండే మైత్రీ సంబంధాలున్నాయి.

ఎట్టకేలకు హజ్రత్ సాద్ (రజి) తీర్పరిగా వచ్చి, బనూ ఖురైజాలో యుద్ధం చేయగల యువకులను హతమార్చాలనీ, వారి మహిళలను, పిల్లలను బానిసరాళ్లుగా, సేవకులుగా చేసుకోవాలని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు ననుసరించి యుక్త వయస్కులను హతమార్చి, పిన్న వయస్కులను వదలివేయటం జరిగింది. కొంతమంది విషయంలో వారు యుక్త వయస్కులా? కాదా? అన్న సంశయం ఏర్పడింది. అలాంటి వారికి బట్టలు విప్పి తనిఖీ చేశారు- నాభి క్రింద, మర్మాంగం వద్ద, చంకలలో రోమాలు మొలచిఉన్న వారికి మరణ దండన విధించి మిగిలినవారిని వదలివేశారు.

మర్మస్థానాలలో రోమాలు మొలవటం యుక్త వయస్సుకు ఒక తార్కాణమని కూడా ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. రోమాలు వచ్చిన వారికి షరీయత్ పరమైన ఆదేశాలన్నీ వర్తిస్తాయి. ఈ విషయంలో అందరిమధ్యా ఏకాభిప్రాయం ఉంది. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) మరియు ఇస్‌హాఖ్ (రహ్మ.లై)లు యుక్త వయస్సుకు చేరారనడానికి మూడు చిహ్నాలు ప్రస్తావించారని ఇమామ్ తిర్మిజీ (రహ్మ.లై) తెలిపారు. అవేమంటే; (1) వయస్సు 15 ఏండ్లు నిండాలి లేదా (2) వీర్య స్థలనం జరగటం మొదలవ్వాలి. (3) ఈ రెంటి నిర్ధారణ కూడా జరక్కపోతే నాభిక్రింద మొలచిన రోమాలను యుక్త వయస్సుకు నిదర్శనంగా పరిగణించాలి.

## హదీసు ఉల్లేఖకులు

అతియ్య ఖురజీ (రజి) - బనూ ఖురైజాకు చెందిన వ్యక్తి కావటం వల్ల ఖురజీగా వ్యవహరించబడ్డారు. యువ సహాబీలలో ఒకరు. ఈయన ద్వారా ఒక్క హదీసు మాత్రమే వివరించబడింది. కూఫాలో స్థిరపడ్డారని అనబడుతోంది. ఈయన తండ్రి పేరేమిటో తాను తెలుసుకోలేకపోయానని అల్లామా ఇబ్నె **అబ్దుల్ బర్ర్ తెలిపారు.** ముజాహిద్ తదితరులు ఆయన కథనాన్ని ఉదాహరించేవారు.

(٧٣٣) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ يَجُوزُ لِامْرَأَةٍ عَطِيَّةٌ إِلاَّ بِإِذْنِ زَوْجِهَا**».

733. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుండి గ్రహించిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "ఏ స్త్రీ కూడా తన భర్త అనుమతి లేకుండా కానుక ఇవ్వటం సమ్మతం కాదు." వేరొక ఉల్లేఖనంలో ఉంది : "ఏ స్త్రీ కూడా, తన భర్త తన శీలానికి రక్షకుడుగా ఉండగా ఆమె తన అధీనంలోని సొమ్ము విషయంలో సర్వస్వతంత్రంగా వ్యవహరించజాలదు."(దీనిని అహ్మద్ మరియు అస్హాబె సునన్ (తిర్మిజీ తప్ప) ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

وفي لفظ: **لاَ يَجُوزُ لِلْمَرْأَةِ أَمْرٌ فِي مَالِهَا، إِذَا مَلَكَ زَوْجُهَا عِصْمَتَهَا**. رَوَاهُ أَحْمَدُ وَأَصْحَابُ السُّنَنِ، إِلاَّ التِّرمِذِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

### సారాంశం

స్త్రీ తన స్వంత సొమ్మును కూడా భర్త అనుమతి లేకుండా తన ఇష్టానుసారం ఖర్చుపెట్టజాలదని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ప్రఖ్యాత తాబయి హజ్రత్ తావూస్ (రహ్మ.లై) ఈ హదీసు వెలుగులో ఫత్వా ఇస్తూ, "ఏ స్త్రీ కూడా తన స్వంత ఆస్తిని సయితం భర్తను సంప్రతించకుండా ఇష్టానుసారం ఖర్చుపెట్టుకోకూడదు" అని అన్నారు. స్త్రీ మూడవ వంతు భాగాన్ని భర్త అనుమతి లేకుండా ఖర్చుపెట్టుకోగలదని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. అయితే మిగిలిన ముగ్గురు ఇమాములు, మరియు అధిక సంఖ్యాక పండితులు; స్త్రీకి తన స్వంత ఆస్తిని తన అభీష్టం మేరకు ఖర్చుపెట్టుకునే అనుమతి ఉంది అని భావిస్తున్నారు. స్త్రీకి ఆమె భర్త నుండి మహర్ రూపంలో ఇవ్వబడే సొమ్ము ఆమె స్వంత సొమ్ము

అవుతుంది. అలాగే తల్లిదండ్రుల తరపున, ఆమె బంధువుల తరపున ఆమెకు ముట్టే కానుకలు, ఆస్తులు కూడా ఆమె ప్రాపర్టీగానే పరిగణించబడతాయి. అదీగాక ఆమె పెట్టిన పెట్టుబడుల ద్వారా వచ్చే లాభాలు కూడా ఆమెకే చెందుతాయి. వాటిపై ఆమె భర్తకు ఎలాంటి హక్కూ లేదు. అందువల్ల ఆమె తన సొమ్మును తన ఇష్టానుసారం ఖర్చుపెట్టుకోగలదు. దివ్య ఖుర్‌ఆన్ మరియు హదీసులలో దైవమార్గంలో ఖర్చుపెట్టమని వచ్చిన ఆదేశం వాంఛించేది కూడా ఇదే. అయినప్పటికీ ఈ ఖర్చుల విషయంలో భార్య తన భర్తను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ, అతని సమ్మతిని కూడా పొందుతూ ఉంటే ఎలాంటి అరమరికలు ఉండవు. పైగా ఇలాంటి సంప్రతింపుల వల్ల ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురం మరింత పటిష్టవంతమవుతుంది.

(٧٣٤) وَعَنْ قَبِيصَةَ بْنِ مُخَارِقٍ الْهِلاَلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ الْمَسْأَلَةَ لاَ تَحِلُّ إِلاَّ لِأَحَدِ ثَلاَثَةٍ: رَجُلٍ تَحَمَّلَ حَمَالَةً، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ، حَتَّى يُصِيبَ قَوَاماً، ثُمَّ يُمْسِك، وَرَجُلٍ أَصَابَتْهُ جَائِحَةٌ اجْتَاحَتْ مَالَهُ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ، حَتَّى يُصِيبَ قَوَاماً مِنْ عَيْشٍ، وَرَجُلٍ أَصَابَتْهُ فَاقَةٌ، حَتَّى يَقُولَ ثَلاَثَةٌ مِنْ ذَوِي الحِجَى مِنْ قَوْمِه: لَقَدْ أَصَابَتْ فُلاَناً فَاقَةٌ، فَحَلَّتْ لَهُ الْمَسْأَلَةُ. رَوَاهُ مُسْلِمٌ.

734. హజ్రత్ ఖబీస బిన్ ముఖారిఖ్ హలాలీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవ చించారు - "ముగ్గురు మనుషులకు తప్ప వేరొకరికి యాచించటం ధర్మ సమ్మతం కాదు. (వారిలో) ఒకడు : పూచీ కత్తుపై ఉన్నవాడు. అతడు ఆ నష్ట పరిహారం చెల్లించేవరకూ యాచించ వచ్చు. ఆ తరువాత యాచించడం మానుకోవాలి. మరొకడు : ఏదైనా ఆపదకు గురై, దాని మూలంగా సర్వస్వాన్నీ కోల్పోయినవాడు. తన బ్రతుకుతెరువుకు సంబంధించి ఏదైనా ఏర్పాటు జరిగేవరకూ అతడు యాచించటం ధర్మసమ్మతమే. ఇంకొకడు : పస్తులుండవలసిన స్థితికి గురైనవాడు- అయితే అతని ఆ దురవస్థ నిజమేనని ఆ జాతికి చెందిన ముగ్గురు విశ్వాస నీయులైన వ్యక్తులు సాక్ష్యం ఇవ్వాలి - ఈ వ్యక్తి కూడా యాచించటం ధర్మ సమ్మతమే." (ముస్లిం)

**సారాంశం**

పై హదీసులో మూడు రకాల మనుషులకు మాత్రమే చేయి చాచి అర్థించటానికి అనుమతి ఇవ్వబడింది. అదీ అనేక షరతులతో ఆమోదించటం జరిగింది. వారికోసం కూడా గడువు విధించబడింది. వారిలో మొదటి వ్యక్తి (పూచీకత్తుపై ఉన్నవాడు) దరిద్రుడు కాకపోయినప్పటికీ అతడు ప్రజల నుండి అడుక్కుని పరిహారాన్ని చెల్లించవచ్చు.

**7వ అధ్యాయం**

## ٧ - بَابُ الصُّلْحِ

## ఒడంబడిక

(٧٣٥) عَنْ عَمْرِو بْنِ عَوْفٍ الْمُزَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**الصُّلْحُ جَائِزٌ بَيْنَ الْمُسْلِمِينَ، إِلاَّ صُلْحاً حَرَّمَ حَلاَلاً، أَوْ أَحَلَّ حَرَاماً، وَالْمُسْلِمُونَ عَلَى شُرُوطِهِمْ. إِلاَّ شَرْطاً حَرَّمَ حَلاَلاً، أَوْ أَحَلَّ حَرَاماً**». رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَأَنْكَرُوا عَلَيْهِ، لِأَنَّ رَاوِيَه كَثِيْرُ بْنُ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ

735. హజ్రత్ అమ్ర్ బిన్ ఔఫ్ ముజనీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "ముస్లిం సోదరులు తమ మధ్య రాజీ కుదుర్చుకోవటం ధర్మ సమ్మతమే. అయితే ధర్మాన్ని (హలాల్‌ను) అధర్మం (హరామ్)గా, అధర్మాన్ని ధర్మంగా మార్చివేసే రాజీ ఒప్పందాలు చేసుకోవటం మాత్రం సమ్మతం కాదు. ధర్మ సమ్మతమైన వాటిని నిషిద్ధంగా ఖరారుచేసే, నిషిద్ధ విషయాన్ని సమ్మతమైనదిగా ప్రకటించే షరతులను మినహాయించి (మిగిలిన షరతులన్నింటిపై) ముస్లింలు స్థిరంగా ఉండాలి." (ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించి, దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. కాని ఇతర హదీసువేత్తలు ఈయన అభిప్రాయంతో ఏకీభవించ లేదు. ఎందుకంటే దీనిని అందజేసిన వారిలో ఒకతను - కసీర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఔఫ్ - బలహీనుడు. అనేక వైపుల నుండి అందినందువల్ల

عَوفٍ ضَعِيفٌ، وَكَأَنَّهُ اعْتَبَرَهُ بِكَثْرَةِ طُرُقِهِ، وَقَدْ صَحَّحَهُ ابْنُ حِبَّانَ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ.

తిర్మిజీ దీనిని 'సహీహ్' గా ఖరారు చేశారేమోననిపిస్తోంది. ఇబ్నె హిబ్బాన్ గారు హజ్రత్ అబూహురైర (రజి) హదీసు ఆధారంగా దీనిని ప్రామాణిక మైందిగా పేర్కొన్నారు)

## సారాంశం

ఈ హదీసులో కేవలం ముస్లిం సోదరుల మధ్య జరిగే ఒప్పందాల ప్రస్తావన వచ్చింది. కారణం; షరీయత్ ఆజ్ఞలు కేవలం ముస్లింలకే వర్తిస్తాయి. మిగిలిన విషయాల్లో అన్యమతస్థులతో సయితం ఒడంబడికలు చేసుకోవటం సమంజసమే. గ్రంథవహులైన యూదులు, క్రైస్తవులతో కూడా ఒప్పందాలు, సంధులు చేసుకోవచ్చు. బహుదైవారాధకులతో, నాస్తికులతో కూడా ఒప్పందం కుదుర్చుకోవటం సబబే. దైవప్రవక్త (స) సయితం స్వయంగా ఇటువంటి ఒప్పందాలు చేసుకున్నారు - ఆయన (స) మదీనాలోని యూదులతో, నజరాన్‌కు చెందిన క్రైస్తవులతో ఒప్పందం చేసుకున్నారు. మక్కాకు చెందిన ముష్రిక్కులతో సయితం హుదైబియా ఒడంబడిక చేసుకున్నారు.

సంధులు, ఒడంబడికలు చేసుకునే సమయంలో ఇస్లామీయ షరీయత్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలి. ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మబద్ధంగా మార్చివేసే ఏ ఒప్పందంపై కూడా వారు సంతకం చేయరాదు. ఉదాహరణకు : ఒక వ్యక్తికి లేక ఒక వర్గానికి మద్దతుగా మరో వ్యక్తిపై లేక మరో వర్గంపై అన్యాయంగా అపవాదు వేయటం, నలుగురిలో నవ్వులపాలు చేయటం అధర్మం (హరామ్)గా భావించబడుతుంది. అలాగే ఎవరయినా తన స్నేహితుణ్ణి ఉద్దేశ్యించి, 'నీ సంతోషం కోసం నేను ఏమైనా చేస్తాను. ఆఫీసుకి నా భార్యతో సయితం సంబంధం తెంచుకుంటాను' అని ఒట్టేసుకుంటే అది **హలాల్‌ను హరామ్‌గా చేసుకోవటమే అవుతుంది. షరీయత్ విధించిన హద్దులకు విరుద్ధంగా లేని ప్రతి** ఒప్పందాన్ని **ఇమామ్ షాఫయి (రహ్మ్‌లై)** తప్ప మిగిలిన ముగ్గురు ఇమాములు ధర్మసమ్మతంగానే భావిస్తున్నారు. అయితే ఎదుటి వర్గాన్ని బలవంతంచేసి, ఒత్తిడిద్వారా ఒడంబడిక చేసుకోవటం వాంఛనీయం కాదు. ఉభయ వర్గాలు రాజీపడి చేసుకున్న ఒప్పందమే సరైన ఒప్పందం.

## హదీసు ఉల్లేఖకులు

1. అమ్ర్ బిన్ ఔఫ్ (రజి) - అమ్ర్ బిన్ ఔఫ్ బిన్ జైద్ బిన్ మిల్హా ముజైనీ. ముజైనా తెగకు చెందినవారు. కసీర్ బిన్ అబ్దుల్లాహ్‌కు తాత అవుతారు. తొలి కాలంలోనే ముస్లిం అయ్యారు. బద్ర్‌లో పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని హరమె మదీనాకు అధికారిగా నియమించారు. చాలా అధికంగా విలపించేవారు. ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో మరణించారు.

2. కసీర్ బిన్ అబ్దుల్లాహ్ - హదీసువేత్తలకు ఈయనపై సదభిప్రాయం లేదు. 'ఇతను అబద్ధపు స్తంభాలలో ఒక స్తంభం' అని ఇమామ్ షాఫయి (రహ్మ.లై), అబూదావూద్ (రహ్మ.లై)లు వ్యాఖ్యానించారు. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)గారైతే, 'ఈతని హదీసులు త్రోసిపుచ్చదగినవి, వాటిని పట్టించుకోనవసరం లేదు' అని స్పష్టంగా చెప్పేశారు. 'అతడు నమ్మకస్థుడు కాడు' అని నసాయి అభిప్రాయపడ్డారు.

(٧٣٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ يَمْنَعُ جَارٌ جَارَهُ أَنْ يَغْرِزَ خَشَبَةً فِي جِدَارِهِ»، ثُمَّ يَقُوْلُ

736. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : " ఏ ఒక్కరూ తమ గోడకు తమ పొరుగు వాడు గూటం (లేక మేకు) కొడితే అభ్యంతరం పెట్టకూడదు."

أَبُو هُرَيْرَةُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: مَا لِيْ أَرَاكُمْ عَنْهَا مُعْرِضِيْنَ؟ وَاللهِ لأَرْمِيَنَّ بِهَا بَيْنَ أَكْتَافِكُمْ. مُتَّفَقٌ عَلَيْهِ.

అబూహురైర (రజి) స్వయంగా ఇలా అనేవారు - "మీరీ హదీసును ఆచరించడానికి వెనుకాడటం నేను గమనిస్తూనే ఉన్నాను. ఎందుకనీ? దైవసాక్షి! నేను దీన్ని మీ భుజాలపై దిగబెడతాను (మీపై విధించి తీరుతాను)." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇరుగు పొరుగుకు ఒండొకరిపై ఉన్న హక్కును ఈ హదీసు నొక్కి చెబుతోంది. ఒకరివల్ల ఇంకొకరికి కలిగే కించిత్ అసౌకర్యాన్ని దిగమ్రింగాలనీ, దైవప్రసన్నత కోసం పరస్పరం సర్దుకుపోవాలని కూడా దీన్నిబట్టి అవగతమవుతోంది. అవతల ఉన్నవారు గోడకు మేకు కొట్టినా లేక ప్రహరీ గోడపై బట్టలు ఆరేసుకున్నా, గోడపై లాంతరు పెట్టినా, బల్ల బిగించినా ఇవతల ఉన్న వారికి పెద్దగా ముంచుకుపోయిందేమీ లేదు.

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై)ల దృష్టిలో ఈ హదీసులోని ఆదేశాన్ని పాటించటం తప్పనిసరి (వాజిబ్). దీన్ని కాదన్నవారు పాపాత్ములవుతారు. పొరుగువారు గనక అతని ఈ సహాయ నిరాకరణను మన్నించకపోతే అతడు దైవసమక్షంలో శిక్షార్హుడవుతాడు.

హజ్రత్ అబూహురైర (రజి) అంతగట్టిగా శాసించారంటే ఆ రోజుల్లో ఆయన మదీనా నగరానికి 'అమీర్'గా ఉన్నారు. షరీయత్ ఆదేశాలను సమాజంలో ప్రవేశపెట్టి, వాటి ఆచరణకు సంబంధించి పర్యవేక్షణ జరపవలసిన బాధ్యత అమీర్‌పై ఉంటుంది. మదీనావాసులు (సహాబీలు కారు - సాధారణ జనం) ఈ హదీసును ఆచరించడానికి వెనుకాడటంతో హజ్రత్

అబూహురైర (రజి) కలత చెందారు. దైవప్రవక్త (స) ఉపదేశాన్ని గుర్తుచేసి ప్రజలను హెచ్చరించటం తన గురుతర బాధ్యతగా భావించారు - రజి అల్లాహు అన్హు.

(٧٣٧) وَعَنْ أَبِي حُمَيْدٍ السَّاعِدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَحِلُّ لِامْرِئٍ أَنْ يَأْخُذَ عَصَا أَخِيهِ بِغَيْرِ طِيبِ نَفْسٍ مِنْهُ». رَوَاهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ فِي صَحِيحَيْهِمَا.

737. హజ్రత్ అబూ హుమైద్ సాయిదీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉప దేశించారు - "తన సోదరుని కర్ర (లాఠీ) కూడా అతని సమ్మతి, అనుమతితో నిమిత్తం లేకుండా తీసుకోవటం ఏ ఒక్కరికీ ధర్మసమ్మతం కాదు." (ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని తమ సహీహ్ గ్రంథాలలో ఉల్లేఖించారు)

## ٨ - بَابُ الْحَوَالَةِ وَالضَّمَانِ

## 8వ అధ్యాయం

## రుణం మార్పిడి, భరోసా

(٧٣٨) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَطْلُ الْغَنِيِّ ظُلْمٌ، وَإِذَا أُتْبِعَ أَحَدُكُمْ عَلَى مَلِيءٍ فَلْيَتْبَعْ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ لأَحْمَدَ فَلْيَحْتَلْ.

738. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ హురైర (రజి) తెలియజేశారు : "శ్రీమంతుడు రుణం చెల్లించటంలో తాత్సారం చేయటం అన్యాయం. రుణగ్రస్తుడు తన రుణం తీర్చే విషయమై శ్రీమంతుని హవాలా (రెఫరెన్సు) ఇస్తే (రుణదాత) దాన్ని అంగీకరించాలి" (బుఖారీ, ముస్లిం). అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనంలో 'హవాలాను ఒప్పుకోవాలి' అని వుంది.

### సారాంశం

ఈ హదీసులో 'హవాలా' గురించి చెప్పబడింది. ఈ 'హవాలా'కు రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి: ఒక వ్యక్తి రుణం విషయంలో పూచీగా ఉంటాడు. అంటే ఫలానా వ్యక్తికి ఇంత పైకం అప్పుగా ఇవ్వు. దీనికి బాధ్యత నాది అని అంటాడు. రెండు : తాను చెల్లించ వలసిన బకాయిని ఫలానా వ్యక్తి నుండి వసూలు చేసుకో అని అంటాడు. ఉదాహరణకు -

'అఫ్సర్ - ఆరిఫ్ - ఇర్ఫాన్' అనే ముగ్గురు వ్యక్తులున్నారు. అఫ్సర్ అనేవాడికి ఆరిఫ్‌నుండి వెయ్యి రూపాయలు రావలసి ఉన్నాయి. ఆరిఫ్‌కు ఇర్ఫాన్ నుండి వెయ్యి రూపాయలు రావాలి. ఆరిఫ్, అఫ్సర్‌ను ఉద్దేశ్యించి నేను నీకు ఇవ్వవలసిన వెయ్యి రూపాయల బకాయిని ఇర్ఫాన్ నుండి తీసేసుకో అని అంటాడు. ఈ రకమయిన సర్దుబాటును షరీయత్ ఆమోదిస్తోంది. అయితే ఇర్ఫాన్ తాను ఆరిఫ్‌కు వెయ్యి రూపాయలు బాకీ ఉన్నానన్న సంగతి నిజమేననీ, ఆ మొత్తం నీకు ఇస్తానని అఫ్సర్‌తో చెప్పాలి.

అరబ్బు దేశాల బ్యాంకులలో 'డ్రాఫ్ట్'ను 'హవాలా'గా వ్యవహరిస్తారు. డ్రాఫ్ట్ తయారుచేసి ఇచ్చే బ్యాంకు పైకం జమచేసిన వ్యక్తికి ఒక రసీదు ఇచ్చి, ఈ రసీదు ఆధారంగా ఫలానా బ్యాంకు నుండి డబ్బు డ్రా చేసుకోవచ్చని అంటుంది. ఇదీ అక్కడ హవాలా యొక్క అధునాతన **పద్ధతి** ఇది షరీయత్‌కు అనువైనదే.

(٧٣٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: تُوُفِّيَ رَجُلٌ مِنَّا، فَغَسَّلْنَاهُ، وَحَنَّطْنَاهُ، وَكَفَّنَّاهُ، ثُمَّ أَتَيْنَا بِهِ رَسُولَ اللهِ ﷺ، فَقُلْنَا: تُصَلِّي عَلَيْهِ، فَخَطَا خُطاً، ثُمَّ قَالَ: **أَعَلَيْهِ دَيْنٌ؟** قُلْنَا: دِيْنَارَانِ، فَانْصَرَفَ، فَتَحَمَّلَهُمَا أَبُو قَتَادَةَ، فَأَتَيْنَاهُ، فَقَالَ أَبُو قَتَادَةَ: الدِّيْنَارَانِ عَلَيَّ، فَقَالَ

739. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : మాలోని ఒక వ్యక్తి చనిపోయాడు. మేము అతనికి (భౌతిక కాయానికి) స్నానం చేయించాము. సువాసన పూశాము. కఫన్ వస్త్రం తొడిగించాము. ఆ తరువాత అతన్ని (శవపేటికను) దైవ ప్రవక్త (సఅసం) సన్నిధికి తీసుకువచ్చి, "తమరు ఇతని అంత్యక్రియల ప్రార్థన చేయించాలి" అని అభ్యర్థించాము. ఆయన(స) కొన్ని అడుగులు ముందుకు రావటానికి లేచారు. మరి అంతలోనే, "ఇతను ఎవరికయినా ఏమైనా బాకీ పడి ఉన్నాడా?" అని దర్యాప్తు చేశారు. "రెండు దీనార్లు బాకీ పడి ఉన్నాడ"ని మేము విన్నవించుకున్నాము. ఇది వినగానే ఆయన (స) వెనక్కి వచ్చేశారు. అబూ ఖతాదా (రజి) ఆ రెండు దీనార్ల బాకీని చెల్లించే బాధ్యతను స్వీకరించారు. తరువాత మేమంతా ఆయన (స) వద్దకు వచ్చాము. "ఆ రెండు దీనార్ల

رَسُولُ اللهِ ﷺ: «**حَقَّ الْغَرِيمِ؟ وَبَرِئَ مِنْهُمَا الْمَيِّتُ؟** قَالَ: نَعَمْ، فَصَلَّى عَلَيْهِ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

బాధ్యత నాది" అని అబూ ఖతాద (రజి) చెప్పారు. "రుణగ్రస్తుని మాదిరిగా ఇది నీపై తప్పనిసరి అయిపోయింది. ఇక దీన్ని చెల్లించవలసిన బాధ్యత కేవలం నీదే. మృతుడు ఈ బాధ్యత నుండి విముక్తి పొందాడు. అవునా?" అని ఆయన (స) రెట్టించగా 'అవును' అని ఆయన ఒప్పుకున్నారు. అప్పుడు ఆయన (నఅనం) అతని నమాజె జనాజా చేయించారు." (అహ్మద్, అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్ లిరువురూ దీని ప్రామాణికతను ధృవీకరించారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన ముందుకు వస్తున్నాయి. (1) మృతుని తరపున రుణం చెల్లించే బాధ్యతను ఎవరయినా స్వీకరిస్తే అది సమంజసమే. (2) రుణం చెల్లిస్తానని పూచీగా ఉన్న వ్యక్తి ఆ పైకాన్ని మృతుని ఆస్తి నుండి తీసుకోజాలడు - అతడు తన కష్టార్జితం నుండి దాన్ని చెల్లించవలసి ఉంటుంది. (3) అప్పులైనా లేదా ఇతర దాసుల హక్కులైనా వాటిని తీర్చనంతవరకూ, హక్కుదారులు లేదా రుణదాతలు వాటిని క్షమించి వదలిపెట్టనంత వరకూ అవి సమసిపోవు. (4) అప్పు తీసుకోవటం ఎంతో సున్నితమైన, జఠిలమైన వ్యవహారం. సాధ్యమైనంతవరకు అప్పుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి. ఒకవేళ అప్పు తీసుకోవటం వినా మరో గత్యంతరం లేదనుకుంటే ఆ అప్పును వీలైనంత తొందరగా తీర్చివేసేందుకు ప్రయత్నించాలి.

(٧٤٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ كَانَ يُؤْتَى بِالرَّجُلِ الْمُتَوَفَّى عَلَيْهِ الدَّيْنُ، فَيَسْأَلُ، «**هَلْ تَرَكَ لِدَيْنِهِ مِنْ قَضَاءٍ**»؟ فَإِنْ حُدِّثَ أَنَّهُ تَرَكَ

740. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: రుణగ్రస్తుడై ఉన్న వ్యక్తి చనిపోయి అతని జనాజా (శవపేటిక)ను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు తీసుకురావటం జరిగితే, "ఇతను (మృతుడు) తన అప్పును తీర్చడానికి ఆస్తి ఏదైనా వదలిపోయాడా?" అని

وَفَاءً، صَلَّى عَلَيْهِ، وَإِلاَّ قَالَ: «صَلُّوا عَلَى صَاحِبِكُمْ»، فَلَمَّا فَتَحَ اللَّهُ عَلَيْهِ الْفُتُوحَ قَالَ: أَنَا أَوْلَى بِالْمُؤْمِنِينَ مِنْ أَنْفُسِهِمْ، فَمَنْ تُوُفِّيَ وَعَلَيْهِ دَيْنٌ، فَعَلَيَّ قَضَاؤُهُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: فَمَنْ مَاتَ وَلَمْ يَتْرُكْ وَفَاءً.

దైవప్రవక్త (సఅసం) అడిగేవారు. అతను అప్పు తీర్చడానికి సరిపడే అంత ఆస్తి వదలిపోయాడని సమాధానం వస్తే ఆయన (స) అతని జనాజా నమాజు చేయించేవారు. అలాంటి సమాధానం రాకపోతే "మీరే మీ సహచరుని జనాజా నమాజ్ చేసుకోండి" అని చెప్పేసేవారు.

కొంత కాలానికి దేవుడు (తన ప్రవక్త కోసం) విజయ ద్వారాలు తెరిచాడు. (అంటే పెద్ద ఎత్తున విజయప్రాప్తి రాసాగింది) అప్పుడాయన (సఅసం) ఇలా అన్నారు - "నేను విశ్వాసులకు వారి ప్రాణాలకన్నా సమీపంగా ఉన్నాను. కనుక (ఇకనుంచి) ఎవరయినా ముస్లిం చనిపోతే, అతను ఎవరికయినా బాకీ పడి ఉంటే, ఆ బాకీ నేను తీరుస్తాను" (బుఖారీ, ముస్లిం). బుఖారీలోని ఒక ఉల్లేఖనంలో "చనిపోయిన వ్యక్తి తన అప్పు తీర్చడానికి సరిపడేటంత ఆస్తిని వదలిపోకపోతే" అని ఉంది.

**సారాంశం**

తన రాజ్య ప్రజల అవసరాలను తీర్చవలసిన బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వంపై ఉందనీ, ఆఖరికి ఎవరయినా ముస్లిం రుణగ్రస్తుడై వున్న స్థితిలో చనిపోతే, అతని వారసులుగానీ, బంధుమిత్రులుగానీ అతని రుణాన్ని తీర్చే బాధ్యతను స్వీకరించకపోతే ఇస్లామీయ ప్రభుత్వమే బైతుల్‌మాల్ (ప్రభుత్వ ధనాగారం) నుండి దాన్ని తీరుస్తుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

మహనీయ ముహమ్మద్(సఅసం) కు సమాజంలోని రుణగ్రస్తుల, అగత్యపరుల, నిరాధార జీవులపట్ల గల దయాదాక్షిణ్యాలు కూడా ఈ హదీసు ద్వారా వ్యక్తమవుతున్నాయి.

రాజ్యాధికారులు తన రాజ్య ప్రజల పట్ల ఎంత బాధ్యతతో, మరెంత వాత్సల్యంతో మసలు కోవాలో కూడా ఈ హదీసు సూచిస్తోంది.

అప్పు తీర్చటం ఎంత ముఖ్యమైన బాధ్యతో ఈ హదీసు నొక్కి చెబుతోంది. మనిషి తాను జీవించి ఉండగానే అప్పు తీర్చటం చాలా మంచిది. రుణగ్రస్తుడు చనిపోయినప్పుడు అతని జనాజా నమాజు చేయడానికి దైవప్రవక్త (సఅసం) అంగీకరించలేదంటే, అది చూచి బ్రతికి ఉన్నవారు దైవానికి భయపడి తమ అప్పులను తీర్చివేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారని ఆయన ఆశించి ఉండవచ్చు.

(٧٤١) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ كَفَالَةَ فِي حَدٍّ». رَوَاهُ الْبَيْهَقِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ.

741. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుంచి విన్న దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "హద్దులు (శిక్షలు) విధించబడేటప్పుడు ఎలాంటి జామీను, పూచీ సమ్మతించబడదు." (బైహఖీ దీనిని బలహీన ప్రమాణాలతో ఉల్లేఖించారు)

**9వ అధ్యాయం**

## భాగస్వామ్యం, అధికారాల అప్పగింత

## ٩ - بَابُ الشَّرِكَةِ وَالوَكَالَةِ

(٧٤٢) عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «قَالَ اللَّهُ تَعَالَى: أَنَا ثَالِثُ الشَّرِيْكَيْنِ مَا لَمْ يَخُنْ

742. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ హురైర (రజి) చెప్పారు : "అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు - ఇద్దరు వ్యక్తులు భాగస్వాములుగా ఉండి, వారిరువురూ ఒండొకరికి ద్రోహం చేయకుండా ఉన్నంతవరకూ నేను వారి మధ్య మూడోవానిగా ఉంటాను. వారిలో ఏ ఒక్కరు ద్రోహానికి పాల్పడినా

أَحَدُهُمَا صَاحِبَهُ، فَإِذَا خَانَ خَرَجْتُ مِنْ بَيْنِهِمَا». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

నేను వారి మధ్య నుండి వైదొలగు తాను.'' (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని 'సహీహ్'గా పేర్కొన్నారు)

**సారాంశం**

వ్యాపారంలోగానీ, మరేదైనా వ్యవహరంలోగానీ ఇద్దరు వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నప్పుడు వారి మధ్య స్పష్టత, నిజాయితీ తత్పరత ఎంతో అవసరం. వారిరువురూ ముందుగా నిర్ధారించుకున్న నియమ నిబంధనలకు కట్టుబడి వ్యవహరించాలి. తమ విధానంలో ఏ మార్పు చేయాలనుకున్నా ఇరువురూ కలసి నిర్ణయం తీసుకోవాలి. వారి మధ్య దాపరికాలు, ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు. అలా వారిరువురూ ఒకే మాట పలికి, ఒకే బాటపై నడుస్తున్నప్పుడు మూడోవానిగా దేవుడు వారికి తోడ్పడుతూ ఉంటాడు. వారిని చల్లగా చూస్తాడు. వారి కార్యకలాపాలలో శుభాన్నీ, సమృద్ధినీ ఒసగుతూ ఉంటాడు. కష్టాలు, కడగండ్లనుండి వారిని కాపాడుతూ ఉంటాడు. మరి అదే వారిద్దరిలో ఏ ఒక్కడు అడ్డదారులు తొక్కి, ద్రోహానికి పాల్పడినా అల్లాహ్ ఆగ్రహించి, వారి మధ్యనుండి నిష్క్రమిస్తాడు. అల్లాహ్ ఎవరికి అండగా ఉండడో వారి స్థితి ఎలా తయారవుతుందో తెలిసిందేగా!

(٧٤٣) وَعَنِ السَّائِبِ الْمَخْزُومِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَانَ شَرِيكَ النَّبِيِّ ﷺ قَبْلَ الْبِعْثَةِ، فَجَاءَ يَوْمَ الْفَتْحِ، فَقَالَ: «مَرْحَباً بِأَخِي وَشَرِيكِي». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ.

743. హాజ్రత్ సాయిబ్ మఖ్జూమీ (రజి) కథనం : తను ఆయన (సఅసం)కు దైవదౌత్యం లభించకమునుపు ఆయన (స)తో కలసి వ్యాపారం చేసేవారు. మక్కా విజయం సందర్భంగా తాను అక్కడికి వచ్చినపుడు ''సోదరా! భాగస్వామీ! నీకు స్వాగతం'' అంటూ ఆయన (సఅసం) తనను ఎంతో మర్యాదగా, ఆప్యాయంగా పలకరించారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, ఇబ్నె మాజా - ముగ్గురూ ఉల్లేఖించారు)

**సారాంశం**

మహాప్రవక్త (సఅసం)కు ప్రవక్త పదవి లభించక పూర్వం నుండే అరేబియాలో, వ్యాపారంలో భాగస్వామ్యం (పార్ట్‌నర్‌షిప్) రివాజు ఉండేదని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది.

ఇస్లాం కూడా ఈ భాగస్వామ్య పద్ధతిని కొనసాగించింది. అయితే అజ్ఞానకాలంలో భాగస్వామ్య వ్యవస్థలోనున్న లొసుగులను, చెడుగులను దూరం చేసి వ్యాపార రంగాన్ని ప్రక్షాళనం చేసింది ఇస్లాం. తన పాత బిజినెస్ పార్ట్‌నర్‌కు దైవప్రవక్త (స) స్వాగతం పలికిన తీరు అనుసరణీయ మైనది. అందుకే పాత మిత్రులు, చిన్ననాటి స్నేహితులు, వ్యాపార భాగస్వాములు - చాలా కాలం తరువాత - కలుసుకున్నప్పుడు వారి యెడల నిర్లక్ష్యం కనబరచటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. పైగా వాళ్లను ఎంతో ఆప్యాయంగా పలకరించాలి. నగు మోముతో స్వాగతం పలికి, విశాల హృదయంతో మర్యాదచేసి పంపాలి.

## హదీసు ఉల్లేఖకులు

సాయిబ్ మఖ్జూమీ (రజి) - ఈయన పేరు సైఫీ బిన్ ఆయజ్ మఖ్జూమీ అని అల్లామా ఇబ్నె జవ్‌జీ (రహ్మ.లై) తన 'తల్ఖీహ్'లో పేర్కొన్నారు. ఈయన "సత్ప్రవర్తన ద్వారా మనసులు జయించబడిన వారి (ముఅల్లఫతుల్ ఖులూబ్)" లోని ఒక వ్యక్తి అని అల్లామా ఇబ్నె అబ్దుల్ బర్ర్ అభిప్రాయపడ్డారు. అయితే ఈయన నికార్సయిన ముస్లింగా నెగ్గుకువచ్చారు. దీర్ఘాయుషును పొందిన వారిలో ఈయన కూడా ఒకరు. అమీర్ ముఆవియ (రజి) పరిపాలనా కాలం వరకు బత్రికి ఉన్నారు.

(٧٤٤) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: اشْتَرَكْتُ أَنَا وَعَمَّارٌ وَسَعْدٌ فِيمَا نُصِيبُ يَوْمَ بَدْرٍ، الْحَدِيثَ، وَتَمَامُهُ: «فَجَاءَ سَعْدٌ بِأَسِيرَيْنِ، وَلَمْ أَجِئْ أَنَا وَعَمَّارٌ بِشَيْءٍ. رَوَاهُ النَّسَائِيُّ وَغَيْرُهُ.

744. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం : నేను, అమ్మార్ బిన్ యాసిర్ (రజి) మరియు సాద్ (రజి) కలసి బద్ర్ యుద్ధం నాడు పొందే వస్తువులను పంచుకోవాలని నిర్ణయించుకున్నాము. ఈ హదీసు ఆఖరి వాక్యం ఇలా వుంది: "ఆ రోజు సాద్ ఇద్దరు యుద్ధ ఖైదీలను తీసుకువచ్చారు. కాని నేనూ, అమ్మార్ ఏమీ తీసుకు రాలేక పోయాము." (దీనిని నసాయి తదితరులు ఉల్లేఖించారు)

(٧٤٥) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِاللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَرَدْتُ الْخُرُوجَ إِلَى خَيْبَرَ، فَأَتَيْتُ النَّبِيَّ ﷺ، فَقَالَ: «إِذَا أَتَيْتَ

745. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : నేను ఖైబర్‌కు వెళ్ళాలని నిశ్చయించుకుని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వచ్చాను. ఆయన (స) నన్నుద్దేశ్యించి, "నీవు

وَكِيلِي بِخَيْبَرَ، فَخُذْ مِنْهُ خَمْسَةَ عَشَرَ وَسْقاً». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ.

ఖైబర్‌లో మా ప్రతినిధిని కలుసుకున్న ప్పుడు అతన్నుండి పదిహేను వసఖ్‌ల (ఖర్జూర పండ్లు) వసూలు చేసుకో" అని చెప్పారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించటమే గాకుండా, ప్రామాణికమైనదిగా కూడా ఖరారు చేశారు)

**సారాంశం**

వ్యాపారులు ఇతర ప్రదేశాలలో తమ ఏజంట్లను, ప్రతినిధులను, కార్యసాధకులను నియమించుకుని నిర్ణీత అధికారాలు వారికి ఇవ్వవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (స) ఖుద్దుగా తమ ప్రతినిధిని ఖైబర్‌లో నియమించారు. అబూదావూద్‌లో పొందుపరచబడిన దాని ప్రకారం, 'దైవప్రవక్తా (స)! ఆ ప్రతినిధి నాకేదన్నా ఆనవాలు అడిగితే నేనేం చేయను?' అని హజ్రత్ జాబిర్ (రజి) సందేహపడగా, "అతని చేతిలో చెయ్యేసి మాట్లాడు. అదే ఆనవాలు" అని ఆయన (స) చెప్పారు. అంటే ఆయన (స) ఈ మేరకు ముందే సంకేతం ఇచ్చి ఉన్నారన్నమాట! ఈ విధంగా లావాదేవీలకు, వ్యవహారాలకు సంబంధించి తమ ఏజంట్లకు, ప్రతినిధులకు 'కోడ్' ఇవ్వటం ఆక్షేపణీయం కాదని దీన్నిబట్టి విదితమవుతున్నది.

(٧٤٦) وَعَنْ عُرْوَةَ الْبَارِقِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ بَعَثَهُ بِدِينَارٍ لِيَشْتَرِيَ لَهُ أُضْحِيَّةً، اَلْحَدِيْثَ. رَوَاهُ الْبُخَارِيُّ فِي أَثْنَاءِ حَدِيْثٍ، وَقَدْ تَقَدَّمَ

746. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఒక దీనారు ఇచ్చి, తన కోసం ఒక ఖుర్బానీ పశువును కొనుక్కు రమ్మన్నారు అని హజ్రత్ ఉర్వ బారిఖీ (రజి) తెలియజేశారు. (బుఖారీ హదీసు ఆరంభంలో దీనిని ఉల్లేఖించారు - దీని ప్రస్తావన ఇంతకు ముందే ఒక హదీసులో వచ్చింది)

(٧٤٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ عُمَرَ عَلَى الصَّدَقَةِ، اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

747. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జకాత్ సొమ్మును వసూలు చేసే నిమిత్తం హజ్రత్ ఉమర్ (రజి) ను తహసీల్దారుగా నియమించి పంపారు- (సశేషం) (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ప్రతినిధుల నియామకానికి నిరూపణగా ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకోవటం జరిగింది. పూర్తి హదీసు సారాంశం ఈ విధంగా ఉంది : హజ్రత్ ఉమర్ (రజి)గారు దైవప్రవక్త (స) వద్దకు వచ్చి హజ్రత్ అబ్బాస్ (రజి), ఖాలిద్ బిన్ వలీద్ (రజి), ఇబ్నె జమీల్ (రజి)లు తమ జకాత్‌ను ఇవ్వలేదని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు : "ఇబ్నె జమీల్ పేదవాడు, అతని దగ్గర ఏమీ ఉండేదికాదు. కాని అల్లాహ్ అతనికి కలిమిని ప్రసాదించి, స్థితిమంతునిగా చేశాడు. ఇప్పుడతడు దీని ఆధారంగానే అల్లాహ్‌పై ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. అతడు కపటిగా ఉండేవాడు. అయితే అనంతరం అతడు పశ్చాత్తాపం చెంది ముస్లింగా మారిపోయాడు. ఇక అబ్బాస్ (రజి) గారి జకాత్ అంటారా, దాన్ని చెల్లించే బాధ్యత నాది. ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సంగతి మీకు తెలిసిందే. ఆయన తన ఆస్తిపాస్తులను, సర్వస్వాన్నీ అల్లాహ్ కోసమే అర్పించాడు. మరింక అతన్నుంచి జకాత్ అడగటం భావ్యం కాదుకదా!"

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే రాజ్యాధిపతి జకాత్ సొమ్మును వసూలుచేసే బాధ్యతను తాను సముచితమనుకున్న వ్యక్తిపై మోపగలడు. బహుశా ఈ ఉద్దేశ్యంతోనే ఈ ఉల్లేఖనం ఈ అధ్యాయం క్రింద తీసుకోబడిందేమో!

(٧٤٨) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَحَرَ ثَلَاثاً وَّسِتِّيْنَ وَأَمَرَ عَلِيًّا رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنْ يَذْبَحَ الْبَاقِيَ، اَلْحَدِيْثَ. رَوَاهُ مُسْلِمٌ.

748. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా అరవై మూడు ఖుర్బానీ ఒంటెలను జిబహ్ చేశారు. మిగిలిన ఒంటెలను జిబహ్ చేయవలసిందిగా హజ్రత్ అలీ (రజి)ని కోరారు. -సశేషం...

(ముస్లిం)

**సారాంశం**

ఖుర్బానీ పశువులను 'జిబహ్' చేయడానికి కూడా తమ ప్రతినిధిని నియమించవచ్చునని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి)ని ఇందునిమిత్తం నియమించగా, ఆయన (రజి) 37 ఒంటెలను 'జిబహ్' చేశారు.

(٧٤٩) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فِي قِصَّةِ الْعَسِيْفِ، قَالَ النَّبِيُّ ﷺ:

749. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పాలేరు వృత్తాంతంపై తన

«وَاغْدُ يَا أُنَيْسُ عَلَى امْرَأَةِ هَذَا، فَإِنِ اعْتَرَفَتْ فَارْجُمْهَا»، الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

తీర్పును వినిపిస్తూ "ఉనైస్! నీవు ఆ స్త్రీ దగ్గరికి వెళ్లు. ఆమె (తన నేరం) ఒప్పుకుంటే రాళ్లు రువ్వే మరణ దండన విధించు" అని అన్నారు- సశేషం....

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'హద్దుల ప్రకరణం'లో కూడా ఈ హదీసు రానున్నది. దీని పూర్వాపరాలు ఇలా ఉన్నాయి: ఒక వ్యక్తి ఒక ఆసామీ దగ్గర పాలేరుగా ఉండేవాడు. అతను తన యజమాని భార్యతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. ఆ విషయం బయటపడింది. అప్పుడు పాలేరు తండ్రికి - ఆ స్త్రీ భర్తకీ మధ్య కుదిరిన రాజీ ఒప్పందం ప్రకారం పాలేరు నూరు మేకలను, ఒక బానిసరాలినీ యజమానికి పరిహారంగా ఇచ్చి బయటపడ్డాడు. ఆ తరువాత - వ్యభిచారానికి పాల్పడిన ఆ ఇద్దరికీ షరీయత్‌పరమైన శిక్ష వినిపించబడింది. అప్పుడు అపరాధులిద్దరూ దైవప్రవక్త (సఅసం) సమక్షంలోకి వచ్చి, జరిగినదంతా కూలంకషంగా వివరించారు. ఇదంతా విన్న మీదట దైవప్రవక్త (స) వ్యభిచారంచేసిన మగవానికి నూరు కొరడా దెబ్బలు కొట్టి, ఒక ఏడాదికాలం పాటు నగరం నుంచి బహిష్కరించే శిక్ష విధించారు. వ్యభిచరించిన స్త్రీ గురించి చెబుతూ, 'ఆమె గనక తన అపరాధాన్ని ఒప్పుకుంటే రాళ్లు రువ్వే శిక్ష విధించండి' అన్నారు. ఈ హదీసును బట్టి నేరస్థుల్ని శిక్షించే విషయమై కూడా తమ ప్రతినిధులను నియమించవచ్చునని తెలుస్తోంది. బహుశా ఈ ఉద్దేశ్యంతోనే రచయిత ఈ హదీసును ఇక్కడ ప్రస్తావించి ఉండవచ్చు.

**10వ అధ్యాయం**

## ١٠ - بَابُ الإِقْرَارِ

## సత్య ప్రకటన

(٧٥٠) عَنْ أَبِيْ ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِي رَسُولُ اللهِ ﷺ: «قُلِ الْحَقَّ وَلَوْ كَانَ مُرًّا». وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ فِي حَدِيْثٍ طَوِيْلٍ.

750. హజ్రత్ అబూజర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్నుద్దేశ్యించి, "సత్యం పలకండి - అది ఎంత చేదుగా ఉన్నా సరే" అని ఉపదేశించారు. (ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. ఇది ఒక సుదీర్ఘమయిన హదీసులోని భాగం)

**సారాంశం**

నిజం నిప్పులాంటిదని మన నాట కూడా అంటారు. నిజాన్ని నిర్మొహమాటంగా, నిర్దిష్టంగా,

నిర్ద్వంద్వంగా చెప్పటమే ధర్మం. అది ఎదుటివారికి మ్రింగుడుపడకపోయినా సరే, పరిస్థితులు తమకు ప్రతికూలంగా పరిణమించినాసరే - సత్యాన్ని వీడరాదు. సత్యానికి వ్యతిరేకంగా అసత్యం ఎంత ఆర్భాటం చేసినాసరే చివరికి సత్యమే జయిస్తుంది.

**11వ అధ్యాయం**

## అప్పుగా తీసుకున్న వస్తువుల గురించి

## ١١ - بَابُ الْعَارِيَةِ

(٧٥١) عَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عَلَى الْيَدِ مَا أَخَذَتْ، حَتَّى تُؤَدِّيَهُ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

751. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "(అరువుగా) పుచ్చుకున్న చెయ్యి తిరిగి ఇచ్చే వరకూ రుణపడి ఉంటుంది." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని సహీహ్‌గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే ఎవరయినా ఏ వస్తువునైనా ఒకరి నుంచి అరువుగా తీసుకున్నప్పుడు దాన్ని తిరిగి ఇవ్వవలసిన బాధ్యత అతనిపై ఉంటుంది. ఈ బాధ్యతను నెరవేర్చటం అనివార్యం. అరువుగా తీసుకున్న వస్తువు జమానతు ఎవరిది? ఈ జమానతు అరువుగా తీసుకున్న వ్యక్తిపై ఉంటుందా? లేదా? దీనిపై మూడు అభిప్రాయాలున్నాయి. (1) ఎట్టి పరిస్థితిలోనూ ఈ జమానతు అరువు తీసుకున్న వానిపై ఉంటుంది. దానికి సంబంధించి షరతు పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా అతనే బాధ్యుడు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), జైద్ బిన్ అలీ (రహ్మ.లై), అతా (రహ్మ.లై), అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల అభిప్రాయం కూడా ఇదే. (2) జమానతుకు సంబంధించిన షరతు విధించబడకుండా ఉంటే అరువుగా తీసుకున్న వ్యక్తిపై ఆ బాధ్యత లేదు. (3) ఒకవేళ షరతు పెట్టినప్పటికీ అతడు ఆ వస్తువు (అప్పగింత) పట్ల స్వామి ద్రోహానికి పాల్పడకుండా ఉన్నంతవరకూ అతనిపై జమానతు బాధ్యత ఉండదు.

(٧٥٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَدِّ

752. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ఎవరయినా నీ దగ్గర

**الْأَمَانَةَ إِلَى مَنِ ائْتَمَنَكَ، وَلاَ تَخُنْ مَنْ خَانَكَ»**: رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ أَبُو حَاتِمٍ الرَّازِيُّ.

ఏదైనా అప్పగింత (అమానతు)గా పెడితే ఆ అప్పగింతను అతనికి తిరిగి ఇచ్చి వెయ్యి. ఒకవేళ ఎవరయినా నీ పట్ల ద్రోహానికి పాల్పడితే (ఖయానత్ చేస్తే) నీవు మాత్రం అతనిపట్ల అలా చేయకు." (దీనిని అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ ప్రామాణికమైనదిగా పేర్కొనగా, అబూహాతిమ్ రాజీ మాత్రం దీనిని ఆక్షేపణీయమైనదిగా తలపోశారు)

(٧٥٣) وَعَنْ يَعْلَى بْنِ أُمَيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: **«إِذَا أَتَتْكَ رُسُلِي فَأَعْطِهِمْ ثَلاَثِينَ دِرْعاً»**، قُلْتُ: يَا رَسُولَ اللهِ! أَعَارِيَةٌ مَضْمُونَةٌ، أَوْ عَارِيَةٌ مُؤَدَّاةٌ؟ قَالَ: **بَلْ عَارِيَةٌ مُؤَدَّاةٌ**. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

753. హాజత్ యాల బిన్ ఉమయ్య (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాకు, "నీ దగ్గరికి నా తరపున దూతలు వచ్చినప్పుడు వారికి ముప్పయి కవచాలు ఇవ్వు" అని సూచించారు. "దైవప్రవక్తా (స)! అప్పుగా ఇవ్వాలా? లేక వస్తువును వాపసు చేసే షరతుపై ఇవ్వాలా?" అని నేను సందేహ పడగా "వస్తువును తిరిగి ఇచ్చే నిబంధ నపై ఇవ్వు" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

అరబీలో 'ఆరియా మజ్మూన', 'ఆరియా ముఅద్ద' అనే రెండు రకాల అరువులు ఉన్నాయి. 'ఆరియా మజ్మూన' ప్రకారం అరువుగా తీసుకున్న వస్తువుపోయినా, దెబ్బతిన్నా దాని వెలను చెల్లించవలసి ఉంటుంది. 'ఆరియా ముఅద్ద' ప్రకారం వస్తువు యథారూపంలో ఉంటే దాన్ని తిరిగి ఇవ్వాలి. ఒకవేళ తీసుకున్న వస్తువు చెడిపోయినా, పాక్షికంగా దెబ్బతిన్నా దాని మూల్యం చెల్లించవలసిన అవసరం లేదు.

(٧٥٤) وَعَنْ صَفْوَانَ بْنِ أُمَيَّةَ، أَنَّ النَّبِيَّ ﷺ اسْتَعَارَ مِنْهُ دُرُوعاً يَوْمَ حُنَيْنٍ، فَقَالَ: أَغَصْباً يَا مُحَمَّدُ (ﷺ)!» قَالَ: «بَلْ عَارِيَةٌ مَضْمُونَةٌ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأَخْرَجَ لَهُ شَاهِداً ضَعِيفاً عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما.

754. హజ్రత్ సఫ్వాన్ బిన్ ఉమయ్య (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హునైన్ యుద్ధ సందర్భంగా తన (సఫ్వాన్) వద్ద కొన్ని కవచాలు తీసుకున్నారు. "తమరు వీటిని బలవంతంగా తీసుకుంటున్నారా?" అని అతను సందేహం వ్యక్తపరచగా "లేదు, వీటిని తిరిగి వాపసుచేసే గ్యారంటీ (ఆరియా మజ్మూనా)పై తీసుకుంటున్నాను" అని ఆయన (స) అన్నారు. (దీన్ని అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. హాకిమ్ దీన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు. ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఒక బలహీన ఉల్లేఖనం కూడా దీనికి సాక్షిగా ఉంది)

## సారాంశం

ఒక్క ముస్లిములనుండే కాదు, ముస్లిమేతరుల నుండి కూడా అరువుగా వస్తువులు తీసుకోవచ్చని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. తిరిగి ఇచ్చే షరతుపై (ఆరియా మజ్మూనాపై) వస్తువును తీసుకున్నప్పుడు తిరిగి ఇవ్వటం తప్పనిసరి. ఒకవేళ ఆ వస్తువు పాడైపోతే తగు మూల్యం చెల్లించటం అనివార్యమవుతుంది. వస్తువును "ఆరియా ముఅద్ద" షరతుపై తీసుకున్న వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా వస్తువును చెడగొడితేమటుకు అతడు సయితం వస్తువు వెలను చెల్లించాల్సిందే.

## హదీసు ఉల్లేఖకులు

సఫ్వాన్ బిన్ ఉమయ్య (రజి) : వంశపరంపరను చూస్తే సఫ్వాన్ బిన్ ఉమయ్య బిన్ ఖలఫ్ బిన్ వహ్బ్ ఖురషీ అనబడతారు. మక్కావాసి. జుమహీ తెగకు చెందినవారు. సద్వ్యవహారం ద్వారా హృదయాలు జయించబడిన వారిలో ఈయన ఒకరు. మక్కా కురైషుల్లో మర్యాదస్తులుగా పేరుపొందారు. 'మక్కా విజయం'నాడు మక్కానుండి పారిపోయారు. అభయం ఇచ్చిన మీదట తిరిగి వచ్చారు. హునైన్ యుద్ధం ఆరంభమయ్యేనాటికి కూడా అవిశ్వాసిగానే ఉన్నారు. ఆ తరువాత ఇస్లాం స్వీకరించారు. ముస్లిం అయిన తరువాత మొక్కవోని సహనస్థయిర్యాలను కనబరిచారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి నొందిన రోజుల్లో ఈయన కూడా మరణించారు.

**12వ అధ్యాయం**

## దురాక్రమణ

## ١٢ - بَابُ الْغَصْبِ

755. హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ఎవరయినా ఇతరులకు చెందిన ఒక జానెడు స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నా, అల్లాహ్ ప్రళయదినాన ఆ భూమికి ఏడురెట్ల పరిమాణం గల గుదిబండను అతని మెడలో వేస్తాడు."

(బుఖారీ, ముస్లిం)

(٧٥٥) عَنْ سَعِيْدِ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**مَنِ اقْتَطَعَ شِبْراً مِنَ الأَرْضِ ظُلْماً، طَوَّقَهُ اللَّهُ إِيَّاهُ يَوْمَ الْقِيَامَةِ مِنْ سَبْعِ أَرَضِينَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

756. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణులలో ఎవరో ఒకామె ఇంటనుండగా, అక్కడికి విశ్వాసుల మాతృమూర్తి మరొకామె (ర.అన్హా) తన నౌకరు ద్వారా ఒక పాత్రను పంపించారు. అందులో ఏదో ఆహార పదార్థం ఉంది. అయితే అక్కడున్న సతీమణి చేయి విదిలించారు. ఆ పాత్ర క్రిందపడి పగిలి పోయింది. ఆయన (సఅసం) ఆ పాత్రను అతికించి, (క్రిందపడిన) వంటకాన్ని అందులో వేశారు. తరువాత తన సతీమణి నుద్దేశ్యించి, "ఇంద, ఇది తిను" అన్నారు. పగిలిపోయిన పాత్రను తానుంచుకుని మంచిపాత్రను నౌకరు ద్వారా పంపించారు (బుఖారీ, తిర్మిజీ). చేయి విదిలించి పాత్రను పగులగొట్టిన

(٧٥٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ عِنْدَ بَعْضِ نِسَآئِهِ، فَأَرْسَلَتْ، إِحْدَى أُمَّهَاتِ الْمُؤْمِنِيْنَ مَعَ خَادِمٍ لَهَا بِقَصْعَةٍ فِيْهَا طَعَامٌ، فَضَرَبَتْ يَدَهَا فَكَسَرَتِ الْقَصْعَةَ، فَضَمَّهَا، وَجَعَلَ فِيْهَا الطَّعَامَ وَقَالَ: كُلُوا، وَدَفَعَ الْقَصْعَةَ الصَّحِيْحَةَ لِلرَّسُولِ ، وَحَبَسَ الْمَكْسُورَةَ.

وَالتِّرْمِذِيُّ، وَسَمَّى الضَّارِبَةَ عَائِشَةَ، وَزَادَ: «فَقَالَ النَّبِيُّ ﷺ: «طَعَامٌ بِطَعَامٍ وَإِنَاءٌ بِإِنَاءٍ». وَصَحَّحَهُ.

ఆమె పేరు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అని అనబడింది. "భోజనానికి బదులు భోజనం - పాత్రకు బదులు పాత్ర" అని దైవప్రవక్త (స) చెప్పినట్లుగా కూడా తిర్మిజీ పొందుపరిచారు. (ఈ హదీసును తిర్మిజీ సహీహ్‌గా పేర్కొన్నారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) ఉన్న కుటీరంలోకి వంటకాన్ని పంపించిన విశ్వాసుల మాతృమూర్తి పేరు హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా)అనీ, కోపంతో చేయి విదిలించిన విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అనీ వేరొక ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది. ఈ హటాత్పరిణామానికి దైవప్రవక్త (సఅసం) ఏమాత్రం ఆగ్రహించలేదు సరికదా, ఆ వంటపాత్రను అతికించి ఇంట్లో పెట్టుకున్నారు. క్రిందపడిపోయిన వంటకాన్ని స్వయంగా లేపారు. ఆయన (స) గారి ఈ సకారాత్మక స్పందనకు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) నివ్వెరపోయారు. సిగ్గుపడ్డారు. వెంటనే తన తప్పిదాన్ని గ్రహించి, "దైవప్రవక్తా! నేను చేసిన తప్పుకు పరిహారం ఏమిటీ?" అని సందేహపడ్డారు. "ఏముందీ, భోజనానికి బదులు అలాంటి భోజనమే తయారుచేసి పంపాలి. పగిలిన వంటపాత్రకు బదులుగా పగలని పాత్ర ఇచ్చి పంపాలి" అని అన్నారు.

దైవప్రవక్త (స) సతీమణులుగా ఉన్నవారు ఇలా ప్రవర్తించటం భావ్యమేనా? అన్న ప్రశ్న పాఠకులలో ఈ సందర్భంగా జనించవచ్చు. కాని మనం ఎంతసేపటికీ దైవప్రవక్త (స) సతీమణులనే కోణం నుంచే ఎందుకు చూడాలి? వారినీ ఒక స్త్రీగా, ఒక భర్తకు భార్యగా ఎందుకు చూడకూడదు? మానవ సహజమైన దౌర్బల్యాలకు ప్రవక్త సతీమణులు కూడా అతీతులు కారన్న సంగతిని ఈ సందర్భంగా విస్మరించకూడదు.

(٧٥٧) وَعَنْ رَافِعِ بْنِ خَدِيجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ زَرَعَ فِي أَرْضِ قَوْمٍ بِغَيْرِ إِذْنِهِمْ، فَلَيْسَ لَهُ مِنَ الزَّرْعِ شَيْءٌ، وَلَهُ نَفَقَتُهُ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ

757. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: ఎవరయినా ఇతరుల భూమిలో వారి అనుమతి లేకుండా వ్యవసాయం చేస్తే అతనికి ఆ వ్యవసాయోత్పత్తినుండి ఎలాంటి వాటా లభించదు. కేవలం అతను వెచ్చించిన ఖర్చులు మాత్రం అతనికి ఇవ్వబడతాయి."(ఈ హదీసును

إِلاَّ النَّسَائِيَّ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَيُقَالُ: إِنَّ الْبُخَارِيَّ ضَعَّفَهُ.

అహ్మద్ మరియు 'నలుగురి'లో నసాయి తప్ప మిగిలినవారు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేయగా, బుఖారీ మాత్రం 'జయీఫ్'గా నిర్ధారించారని అనబడుతోంది)

(٧٥٨) وَعَنْ عُرْوَةَ بْنِ الزُّبَيْرِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَجُلٌ مِّنْ أَصْحَابِ رَسُولِ اللهِ ﷺ: إِنَّ رَجُلَيْنِ اخْتَصَمَا إِلَى رَسُولِ اللهِ ﷺ فِي أَرْضٍ غَرَسَ أَحَدُهُمَا فِيهَا نَخْلاً وَالأَرْضُ لِلآخَرِ، فَقَضَى رَسُولُ اللهِ ﷺ بِالأَرْضِ لِصَاحِبِهَا، وَأَمَرَ صَاحِبَ النَّخْلِ أَنْ يُخرِجَ نَخْلَهُ: وَقَالَ: **لَيْسَ لِعِرْقِ ظَالِمٍ حَقٌّ.** رَوَاهُ أَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ حَسَنٌ. وَآخِرُهُ عِنْدَ أَصْحَابِ السُّنَنِ مِنْ رِوَايَةِ عُرْوَةَ عَنْ سَعِيْدِ ابْنِ زَيْدٍ، وَاخْتُلِفَ فِيْ وَصْلِهِ وَإِرْسَالِهِ، وَفِيْ تَعْيِيْنِ صَحَابِيِّهِ.

758. హజ్రత్ ఉర్వ బిన్ జుబైర్ (రజి) కథనం : దైవప్రవక్త (స) సహచరులొకరు ఇలా తెలియజేశారు - ఇద్దరు వ్యక్తులు దైవప్రవక్త (సఅసం) దగ్గరికి ఒక భూమి తగాదాను తీసుకువచ్చారు. భూమి ఒకరిదై ఉండగా, అందులో ఖర్జూర చెట్లను మరొకరు నాటారు. అప్పుడాయన (స) ఇలా తీర్పు ఇచ్చారు : "భూమి యజమానిదే. ఖర్జూర మొక్కలను నాటినవాడు తన మొక్కలను పెకలించాలి." ఇంకా, "అన్యాయంతో కూడిన శ్రమకు ప్రతిఫలం ఏమీ ఇవ్వబడదు" అని కూడా ఆయన (స) అన్నారు. (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఈ హదీసు 'హసన్' కోవకు చెందినది. దీని చివరి భాగాన్ని సునన్ గ్రంథాల రచయితలు ఉర్వ బిన్ సయీద్ బిన్ జైద్ ఆధారంగా పొందుపరచారు. ఈ ఉల్లేఖనాన్ని 'ముర్సల్' అనాలా? లేక 'మౌసూల్' గా పరిగణించాలా? మొట్టమొదటిసారిగా దీన్ని అందజేసిన సహాబీ ఎవరు? అనే అంశాలపై భిన్నాభిప్రాయం వ్యక్తమైంది)

(٧٥٩) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي خُطْبَتِهِ يَوْمَ النَّحْرِ بِمِنًى: «إِنَّ دِمَاءَكُمْ وَأَمْوَالَكُمْ وَأَعْرَاضَكُمْ عَلَيْكُمْ حَرَامٌ، كَحُرْمَةِ يَوْمِكُمْ هَذَا، فِي بَلَدِكُمْ هَذَا، فِي شَهْرِكُمْ هَذَا». مُتَّفَقٌ عَلَيْهِ.

759. హజ్రత్ అబూబక్రా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ దినాన 'మినా'లో ప్రసంగిస్తూ ఇలా అన్నారు - "ఈ రోజు, ఈ నగరం, ఈ నెల మీ కొరకు ఎలా పవిత్రం (నిషిద్ధం) గావించబడ్డాయో అలాగే మీ రక్తం, మీ ఆస్తిపాస్తులు, మీ పరువు ప్రతిష్ఠలు పవిత్రం (నిషిద్ధం) గావించ బడ్డాయి (అన్యాయంగా మీరు వాటిని కబళించకూడదు). (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

రచయిత ఈ హదీసును ఈ అధ్యాయం మొదట్లోనే తీసుకుని ఉంటే చాలా బాగుండేది. మొత్తమ్మీద ఒక ముస్లిం ఆస్తిని అక్రమంగా, అన్యాయంగా స్వాధీనం చేసుకోవటం నిషిద్ధమని చెప్పటం ఇక్కడ ప్రధానోద్దేశ్యం. ఈ నిషేధంపై అందరిమధ్యా ఏకాభిప్రాయం ఉంది.

## 13వ అధ్యాయం

## ١٣ - بَابُ الشُّفْعَةِ

## షుఫా

(٧٦٠) عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَضَى رَسُولُ اللهِ ﷺ بِالشُّفْعَةِ فِي كُلِّ مَا لَمْ يُقْسَمْ، فَإِذَا وَقَعَتِ الْحُدُودُ وَصُرِّفَتِ الطُّرُقُ فَلاَ شُفْعَةَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ. وَفِي رِوَايَةٍ مُسْلِمٍ: الشُّفْعَةُ فِي كُلِّ شِرْكٍ، فِي أَرْضٍ، أَوْ رَبْعٍ، أَوْ حَائِطٍ، لاَ يَصْلُحُ أَن يَبِيْعَ حَتَّى يَعْرِضَ عَلَى

760. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : "విభజించబడని ఉమ్మడి భూమి విషయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) షుఫా ఆజ్ఞను జారీ చేశారు. అయితే హద్దులు వేసి, వేర్వేరు దారులు ఏర్పరచటం జరిగితే దానికి షుఫా ఆజ్ఞ వర్తించదు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి) 'ముస్లిం'లోని ఒక ఉల్లేఖనంలో 'షుఫా ఆజ్ఞ ప్రతి ఉమ్మడి వస్తువుకూ వర్తిస్తుంది' అని ఉంది. ఉదాహరణకు : భూమిలో,

شَرِيْكِهِ. وَفِي رِوَايَةِ الطَّحَاوِيِّ: «قَضَى النَّبِيُّ ﷺ بِالشُّفْعَةِ فِي كُلِّ شَيْءٍ». وَرِجَالُهُ ثِقَاتٌ.

నివాసగృహంలో, తోటలో. తమ భాగ స్వామి దృష్టికి తీసుకురాకుండా ఉమ్మడి వస్తువును అమ్మటం న్యాయసమ్మతం కాదు. దైవప్రవక్త (సఅసం) అన్ని రకాల వస్తువులలో షుఫా హక్కును ఇచ్చారని 'తహావీ'లో ఉంది. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు.

**సారాంశం**

'షుఫా' అంటే అసలు 'జత' అని అర్థం. కాని షరీయత్ పరిభాషలో షుఫా అంటే ఉమ్మడి ఆస్తికి సంబంధించిన వాటాను సంబంధిత భాగస్వామికి ఇవ్వటం అని భావం.

భూమిగానీ, తోటగానీ, ఇల్లుగానీ అమ్మేటప్పుడు పొరుగు వారి హక్కును దృష్టిలో పెట్టుకోవాలనీ, వాటిని కొనే హక్కు ఇతరులకు కల్పించటం కన్నా పొరుగువారికీ, సన్నిహితులకు కల్పించటం న్యాయసమ్మతమనీ ఈ హదీసు నేపథ్యంలో వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అయితే 'షుఫా' ఆజ్ఞ భాగస్వామికి (పార్ట్‌నర్‌కి) మాత్రమే వర్తిస్తుందిగానీ, ఇరుగుపొరుగు వారి విషయంలో వర్తించదని మరికొందరు భావిస్తున్నారు. మొత్తమ్మీద ఈ విషయంలో భేదాభిప్రాయం ఉంది.

(٧٦١) وَعَنْ أَبِي رَافِعٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْجَارُ أَحَقُّ بِصَقَبِهِ**». أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَلَهُ قِصَّةٌ.

761. హజ్రత్ అబూ రాఫె (రజి) కథనం: "పొరుగువాడు దగ్గరలో ఉండటం వల్ల (లావాదేవీల విషయంలో) ఎక్కువ ప్రాధాన్యత నివ్వదగినవాడు" అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు. (ఈ హదీసును బుఖారీ ఉల్లేఖించారు. దీనికి సంబంధించిన సుదీర్ఘ వృత్తాంతం ఉంది)

**సారాంశం**

దీని ద్వారా బోధపడేదేమంటే 'ఇరుగుపొరుగువారు' మనకు సమీపంలో ఉండటం వల్ల ఇతర ముస్లిములకన్నా వీరు మన పాలిట ఎక్కువ హక్కు కలిగి ఉంటారు. సహాయ సహకారాల విషయంలోగానీ, శ్రేయోభిలాష విషయంలోగానీ మనం ఇతరులకన్నా పొరుగు వారికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి.

ఈ హదీసు పూర్వాపరాలిలా ఉన్నాయి : అబూ రాఫె (రజి) సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) నుద్దేశ్యించి, "నీకు ప్రక్కలోనే కలసి వచ్చే నా కుటీరాలను నువ్వు కొనుక్కో" అని సలహా ఇచ్చారు. దానికి సాద్ (రజి), "దైవసాక్షి! నేను వాటిని కొనలేను" అని అన్నారు. ఆ సమయంలో అక్కడేవున్న మిస్వర్ "దైవసాక్షి! నువ్వు వాటిని కొనవలసిందే" అని పట్టుపట్టారు. అప్పుడు సాద్ (రజి), "అయితే నేను కూడా దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను వాటికి 4 వేల కన్నా ఎక్కువ ఇవ్వజాలను. ఇతను ఒకేసారి డబ్బు తీసుకుంటాడో, వాయిదాల పద్ధతిపై తీసుకుంటాడో ఇతని ఇష్టం" అన్నారు. ఈ సంభాషణ విన్న తరువాత అబూ రాఫె ఇలా అన్నారు - "నేను ఐదు వందల దీనార్లకే ఇచ్చేశాను. పొరుగువాడు మీకు దగ్గరలో ఉండటం మూలంగా ఎక్కువ హక్కుదారుడు అని దైవప్రవక్త (స) ఉపదేశిస్తుండగా నేను విని ఉండకపోతే, వీటిని నాలుగు వేలకు కూడా అమ్మేవాణ్ణి కాను. ఇప్పుడు నేను వీటిని ఐదు వందల దీనార్లకే ఇచ్చేస్తాను" అంటూ ఆయనకు ఇచ్చేశారు. బుఖారీ ఈ హదీసును "అర్ రుష్ఫఅతి అలా సాహిబిహ్ ఖబలల్ బైయి" అధ్యాయంలో ఉల్లేఖించారు.

(٧٦٢) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «جَارُ الدَّارِ أَحَقُّ بِالدَّارِ». رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّان، وَلَهُ عِلَّةٌ.

762. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) చెప్పారు : "ఇంటికి ఇరుగు పొరుగున ఉన్నవారు ఆ ఇంటి విషయంలో ఎక్కువ హక్కు కలిగి ఉంటారు." (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు. కాని ఇది అందిన తీరులో కొంత వైకల్యం ఏర్పడింది)

(٧٦٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْجَارُ أَحَقُّ بِشُفْعَةِ جَارِهِ، يُنْتَظَرُ بِهَا، وَإِنْ كَانَ غَائِباً، إِذَا

763. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు - ఇరుగు నున్నవాడు తన పొరుగువాని స్థిరాస్తి (కొనుగోలు) విషయంలో ఎక్కువ హక్కుదారుడు. ఆ సమయంలో

كَانَ طَرِيقُهُمَا وَاحِداً». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَرِجَالُهُ ثِقَاتٌ.

అతనక్కడ లేకపోయినప్పటికీ పొరుగు వాడైనందున అతని కోసం కొంతకాలం నిరీక్షించాలి. ఇరువురి కోసం దారి ఒక్కటే అయివున్నప్పుడు నిరీక్షించటం భావ్యం.'' (దీనిని అహ్మద్ మరియు నలుగురూ ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

(٧٦٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**الشُّفْعَةُ كَحَلِّ الْعِقَالِ**». رَوَاهُ ابْنُ مَاجَهْ وَالْبَزَّارُ، وَزَادَ: «**وَلاَ شُفْعَةَ لِغَائِبٍ**». وَإِسْنَادُهُ ضَعِيفٌ.

764. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : పొరుగునున్న వానికి ఆస్తి అమ్మటం త్రాడును విప్పటం లాంటిది. (ఇబ్నె మాజ మరియు బజ్జార్ దీనిని ఉల్లేఖించారు) గైర్హాజరై ఉన్న వ్యక్తికై ఎలాంటి హక్కు లేద'న్న అదనపు వాక్యాన్ని కూడా బజ్జార్ నకలు చేశారు. (దీని పరంపర బలహీన మైనది)

**సారాంశం**

ఈ హదీసులో క్రయవిక్రయాల సందర్భంగా పొరుగువారికి ప్రాధాన్యత నివ్వటం ఒంటె త్రాడును విప్పటంతో పోల్చటం జరిగింది. ఒంటె త్రాడు విప్పగానే అది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎలా లేచి నిలబడుతుందో అలాగే పొరుగునున్నవాడు ఇల్లును గానీ, భూమిని గానీ అమ్ముతున్నప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా అతనితో వ్యవహారం చేయాలి. ఆలస్యం చేసినపక్షంలో అతడు, షుఫా హక్కు (ప్రాధాన్యత నివ్వదగిన హక్కు)ను కోల్పోతాడు- ఇదీ హనఫీ పండితుల దృక్పథం. అయితే హదీసువేత్తల దృష్టిలో ఆలస్యం చేసినంత మాత్రాన షుఫా హక్కు వీగిపోదు. ఎందుకంటే షుఫాకు సంబంధించిన (ప్రామాణిక) హదీసులు తిరుగులేనివి. కాగా; ఇబ్నె ఉమర్ (రజి)చే ఉల్లేఖించబడిన ఈ హదీసు ప్రమాణబద్ధమైనది కాదు. హజ్రత్ జాబిర్ (రజి) గారి ద్వారా అందిన హదీసులో, పొరుగువాడు ఆ సమయంలో అక్కడ లేకపోతే కొంతకాలం వేచిచూడాలి అని చెప్పబడింది. ఆలస్యం వల్ల పొరుగువాని షుఫా హక్కు వీగిపోయే పక్షంలో మరి అతని కొరకు నిరీక్షించమనటంలో అర్థం ఏముందీ?

## 14వ అధ్యాయం

# ముజారబత్

## (పెట్టుబడిదారుల-వర్తకుల ఒడంబడిక)

## ١٤ - بَابُ الْقِرَاضِ

765. హాజ్రత్ సుహైబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : మూడు విషయాలు అత్యంత శుభప్రదమైనవి. ఒకటి: ఒక నిర్ణీత గడువు వరకు పైకం చెల్లించే షరతుపై వస్తువులు అమ్మటం. రెండు: పెట్టుబడిదారుడు మరియు వర్తకుడు కలసి ఒక అంగీకారానికి రావటం. మూడు: ఇంట్లో ఉపయోగించే గోధుమల్లో తప్ప అమ్మకానికి పెట్టిన గోధుమల్లో యవలు కలపకుండా ఉండటం. (ఈ హదీసును ఇబ్నె మాజ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

(٧٦٥) عَنْ صُهَيْبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «ثَلاَثٌ فِيهِنَّ الْبَرَكَةُ الْبَيْعُ إِلَى أَجَلٍ، وَالْمُقَارَضَةُ، وَخَلْطُ الْبُرِّ بِالشَّعِيرِ لِلْبَيْتِ، لاَ لِلْبَيْعِ». رَوَاهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ ضَعِيفٍ.

### సారాంశం

ఈ హదీసును అందజేసిన ముగ్గురు వ్యక్తుల గురించి పూర్తిగా తెలీకపోవటం చేత దీన్ని బలహీన ఆధారాలతో అందిన హదీసుగా పేర్కొనటం జరిగింది. ఆ ముగ్గురు వ్యక్తులు వీరు: (1) నసర్ బిన్ ఖాసిమ్. (2) అబ్దుర్రహీమ్ బిన్ దావూద్. (3) సాలెహ్ బిన్ సుహైబ్.

### హదీసు ఉల్లేఖకులు

సుహైబ్ (రజి). వంశపరంపర ప్రకారం అబూ యహ్యా సుహైబ్ బిన్ సినాన్ రూమీ అనబడతారు. వాస్తవానికి ఈయన అరబ్బే. నిమిర్ బిన్ ఖాసిత్ బిన్ వాయల్ తెగతో సంబంధమున్నవారు. రోమనులు బాల్యంలోనే ఈయన్ని పట్టుకున్నారు. రోమనుల మధ్యనే పెరిగి పెద్దవారయ్యారు. అందువల్ల రూమీగా పిలువబడ్డారు. ఒక కథనం ప్రకారం ప్రాజ్ఞవయస్సుకు చేరిన తరువాత రోమునుండి మక్కాకు పారిపోయి వచ్చారు. మక్కాలో అబ్దుల్లా బిన్ జదాన్‌తో మైత్రి కుదుర్చుకున్నారు. బనూ కల్బ్ అనే తెగ ఈయన్ని రోమనుల నుండి కొనుగోలు చేసి మక్కాకు తీసుకువచ్చిందనీ, మక్కాలో అబ్దుల్లా బిన్ జదాన్ అనే సుప్రసిద్ధ సహాబి ఈయన్ని

కొనుక్కున్నారనే వాదన కూడా ఉంది. దైవమార్గంలో నానా బాధలు భరించారు. తరువాత మదీనాకు వలసపోయారు. మదీనా మునవ్వరాలోనే హిజ్రీ 38లో మరణించారు.

(٧٦٦) وَعَنْ حَكِيْمِ بْنِ حِزَامٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَانَ يَشْتَرِطُ عَلَى الرَّجُلِ، إِذَا أَعْطَاهُ مَالاً مُقَارَضَةً، أَن لاَّ تَجْعَلَ مَالِيْ فِي كَبِدٍ رَطْبَةٍ، وَلاَ تَحْمِلَهُ فِيْ بَحْرٍ، وَلاَ تَنْزِلَ بِهِ فِي بَطْنِ مَسِيْلٍ، فَإِنْ فَعَلْتَ شَيْئاً مِنْ ذٰلِكَ، فَقَدْ ضَمِنْتَ مَالِي. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ.

766. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్(రజి) ఇలా తెలిపారు: "నేను ఎవరితో ఎప్పుడు 'ముజారబత్' ఒడంబడిక చేసుకున్నా వారి చేతికి పెట్టుబడిని ఇచ్చేటప్పుడు - నా సొమ్ముతో పశువుల వర్తకం చేయ రాదనీ, దాన్ని సముద్రంలోకి తీసుకెళ్ళ రాదనీ, వరదలు వచ్చే చోట ఈ పెట్టుబడి పెట్టరాదనీ, ఈ మూడింటిలో ఏ ఒక్క చేష్టకు ఒడిగట్టినా నా సొమ్ముకు నువ్వు స్వయంగా బాధ్యత వహించ వలసి ఉంటుందనీ అతనికి షరతు విధించేవాణ్ణి." (దీనిని దారె ఖుత్నీ ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

وَقَالَ مَالِكٌ فِي الْمُوَطَّإِ عَنِ الْعَلاَءِ بْنِ عَبْدِ الرَّحْمٰنِ بْنِ يَعْقُوبَ، عَنْ أَبِيْهِ عَنْ جَدِّهِ: أَنَّهُ عَمِلَ فِي مَالٍ لِعُثْمَانَ، عَلَى أَنَّ الرِّبْحَ بَيْنَهُمَا. وَهُوَ مَوْقُوفٌ صَحِيْحٌ.

## సారాంశం

పెట్టుబడిదారుడు వర్తకునితో వ్యవహారం చేసేటప్పుడు తన సొమ్ము విషయంలో తాను కోరిన షరతును ముందుగానే విధించుకోవచ్చని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. 'ముజారబత్' విధానంలో ఈ మేరకు అనుమతి ఉంది. ముజారబత్ విధానం ప్రకారం పెట్టుబడిదారుడు - వర్తకుడు ముందుగానే తాము చేయబోయే వ్యవహారానికి సంబంధించి ఒక అవగాహనకు వస్తారు. దాని ప్రకారం వారు లాభాలను పంచుకుంటారు. పెట్టుబడిదారుడు కేవలం పెట్టుబడి పెడతాడు. శ్రామికుడు కష్టపడి ఉత్పాదన చేస్తాడు. దానిపై వచ్చిన లాభాలను ముందుగా నిర్ణయించుకున్న నిష్పత్తి ప్రకారం వారిరువురూ పంపిణీ చేసుకుంటారు.

ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) మువత్తాలో అలా బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ యాఖూబ్ తండ్రి మరియు ఆయన తాత ఆధారంగా తెలిపిన దాని ప్రకారం, ఆయన హజ్రత్ ఉస్మాన్ (రజి) సొమ్ముతో లాభాలను పరస్పరం పంచుకునే షరతుపై వర్తకం చేశారు. (ఈ హదీసు మౌఖూఫ్ మరియు సహీహ్)

## హదీసు ఉల్లేఖకులు

(1) అలా : అబూ షిబ్ల్ అనేది మారుపేరు. వంశపరంపర ఈ విధంగా ఉంది : అలా బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ యాఖూబ్ జుహనీ. హురఖా తెగచే స్వేచ్ఛ నొసగబడిన బానిస.

మదీనా వాసులు. యువ తాబయీన్లలో ప్రముఖులు. సత్యసంధులు. అయితే హదీసులను చెప్పేటప్పుడు తడబాటుకు లోనయ్యేవారు. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) మరియు ఇతర హదీసువేత్తలు ఈయన్ని విశ్వసనీయులుగా ఖరారు చేశారు. ఖలీఫా మన్సూర్ అబ్బాస్ కాలంలో ఈయన మరణించారని వాఖిదీ తెలిపారు.

(2) అబ్దుర్రహ్మాన్ బిన్ యాఖూబ్ : ఈయన జుహైనా తెగకు చెందిన వారవటంచేత జుహనీగానూ, మదీనాలో స్థిరపడటం వల్ల మదనీగానూ పిలువబడ్డారు. సగటు తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడ్డారు. ఈయన తన తండ్రిగారి ద్వారానే కాకుండా హజ్రత్ అబూహురైరా (రజి), హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ద్వారా కూడా హదీసులు విన్నారు.

(3) యాఖూబ్ : యాఖూబ్ జుహనీ. హురఖా తెగ తరపున స్వేచ్ఛ నొసగబడిన బానిస. వృద్ధ తాబయీన్లలో ఒకరుగా పరిగణించబడతారు. ఈయన హజ్రత్ ఉమర్ (రజి)ను కలుసుకున్నారు. చాలా తక్కువ హదీసులు ఉల్లేఖించారు.

**15వ అధ్యాయం**

## నీటిపారుదల - కౌలుదారీ విధానం

## ١٥ - بَابُ الْمُسَاقَاةِ وَالْإِجَارَةِ

(٧٦٧) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ عَامَلَ أَهْلَ خَيْبَرَ بِشَطْرِ مَا يَخْرُجُ مِنْهَا مِنْ ثَمَرٍ أَوْ زَرْعٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

767. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (నల్లల్లాహు అలైహి వ సల్లం) ఖైబర్ వాసులతో వ్యవసాయ ఒప్పందం చేసుకున్నారు. పండ్లరూపంలో, వ్యవసాయోత్పత్తుల రూపంలో ప్రాప్తమయ్యే వాటిలో సగం వారికి ఇచ్చేటట్లు అంగీకారం కుదిరింది. (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لَهُمَا: فَسَأَلُوا أَنْ يُقِرَّهُمْ بِهَا، عَلَى أَنْ يَكْفُوا عَمَلَهَا، وَلَهُمْ نِصْفُ الثَّمَرِ، فَقَالَ لَهُمْ رَسُولُ اللهِ ﷺ: «نُقِرُّكُمْ بِهَا عَلَى ذَلِكَ مَا شِئْنَا»، فَقَرُّوا بِهَا، حَتَّى أَجْلاَهُمْ عُمَرُ.

ఉభయులూ (బుఖారీ మరియు ముస్లిం) పొందుపరచిన మరో ఉల్లేఖనంలో ఉంది- ఖైబర్ వాసులు (యూదులు) దైవప్రవక్త (స) వద్దకు వచ్చి, తమను అక్కడే ఉండేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా, అంటే భూములను తమ స్వాధీనంలో ఉంచు

కునేందుకు అనుమతించవలసిందిగా కోరారు. తాము వ్యవసాయం చేసుకుంటామనీ, వ్యవసాయోత్పత్తుల నుండి ముస్లింలకు సగభాగం ఇస్తామని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) "మేము తలచుకున్నంత కాలమే మిమ్మల్ని ఈ మేరకు అనుమతిస్తున్నాము" అని అన్నారు. ఈ మాట ప్రకారమే వాళ్ళను (యూదులను) వ్యవసాయ భూములపై ఉండనిచ్చారు. హజ్రత్ ఉమర్ (రజి) వాళ్లను నగర బహిష్కార శిక్ష విధించే వరకూ వాళ్లు, ఆ భూములను సాగుచేసుకుంటూనే ఉన్నారు. ముస్లింలోని ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది- యూదులు తమ సొంత సొమ్ములతోనే (పెట్టుబడితోనే) ఖైబర్ ఖర్జూర వృక్షాలను, భూములను సాగుచేసుకునే షరతుపై దైవప్రవక్త (సఅసం) భూములను వారికి అప్పజెప్పారు. అయితే వ్యవసాయోత్పత్తుల్లో సగభాగం వారికి ఇవ్వాలని ఒప్పందం కుదిరింది.

وَلِمُسْلِمٍ: أَنَّ رَسُولَ اللهِ ﷺ دَفَعَ إِلَى يَهُوْدِ خَيْبَرَ نَخْلَ خَيْبَرَ وَأَرْضَهَا، عَلَى أَنْ يَعْتَمِلُوهَا مِنْ أَمْوَالِهِمْ، وَلَهُمْ شَطْرُ ثَمَرِهَا.

**సారాంశం**

ఉత్పత్తులను సగం సగం పంచుకునే పద్ధతిపై కౌలుకు ఇవ్వటం సరైనదేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఒక్క ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మినహా మిగిలిన ముగ్గురు ఇమాములు, విద్వాంసులు ఈ సేద్య విధానానికి సుముఖంగానే ఉన్నారు.

సేద్యానికి (సాగుకు) సంబంధించిన ఖర్చులన్నీ ఖైబర్‌వాసులే భరించే షరతుపై దైవప్రవక్త (స) భూములను కౌలుకు ఇచ్చారు. ఉదాహరణకు భూమిని దున్నటం, కాలువలు త్రవ్వటం, నీరు వదలటం, నాట్లు వేయటం, కలుపు మొక్కలు తీయటం, పంటకు కాపలా కాయటం

- ఇత్యాది పనులన్నీ కౌలుదారులే చేసుకోవాలి. ఈ కౌలు పనిచేసిన ఖైబర్‌వాసులు దైవప్రవక్త (స) బానిసలని హనఫీలు అభిప్రాయపడ్డారు. కాని ఈ అభిప్రాయం సరైనది కాదు. దైవప్రవక్త (స) ఖైబర్ వాసులతో వ్యవహారం చేస్తున్నప్పుడు "దేవుడు మిమ్మల్ని ఇక్కడ ఉంచినంత కాలమే మేము మిమ్మల్ని ఈ భూములపై ఉండనిస్తాము" అని అన్నారు. ఒకవేళ వారు ఆయన(స) బానిసలే గనక అయివుంటే ఈ మాట అనవలసిన అవసరమే ఉండేది కాదు. వారు ఆయన (స) బానిసలు కారు అని దీని ద్వారా స్పష్టమవుతున్నది.

(٧٦٨) وَعَنْ حَنْظَلَةَ بْنِ قَيْسٍ، قَالَ: سَأَلْتُ رَافِعَ بْنَ خَدِيجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنْ إِكْرَاءِ الْأَرْضِ بِالذَّهَبِ وَالْفِضَّةِ، فَقَالَ: لَا بَأْسَ بِهِ، إِنَّمَا كَانَ النَّاسُ يُؤَاجِرُوْنَ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ عَلَى الْمَاذِيَانَاتِ، وَأَقْبَالِ الْجَدَاوِلِ، وَأَشْيَاءَ مِنَ الزَّرْعِ، فَيَهْلِكُ هٰذَا وَيَسْلَمُ هٰذَا، وَيَسْلَمُ هٰذَا وَيَهْلِكُ هٰذَا، وَلَمْ يَكُنْ لِلنَّاسِ كِرَاءٌ إِلَّا هٰذَا، فَلِذٰلِكَ زُجِرَ عَنْهُ، أَمَّا شَيْءٌ مَعْلُوْمٌ مَضْمُوْنٌ، فَلَا بَأْسَ بِهِ. رَوَاهُ مُسْلِمٌ.

768. హాజత్ హన్జల బిన్ ఖైస్ (రజి) కథనం : నేను రాఫె బిన్ ఖదీజ్ (రజి) నుద్దేశ్యించి, 'బంగారం, వెండికి బదులుగా భూములను కాంట్రాక్టుకు ఇవ్వటం సబబేనా?' అని అడిగాను. దానికాయన ఇలా అన్నారు : అందులో తప్పేమీ లేదు. దైవప్రవక్త (సఅసం) కాలంలో; 'పిల్ల కాలువలలో, నీరు పారే చోట పండే పంటతోపాటు పొలంలోని పంటలో కొంత భాగం నేను తీసుకుంటాను' అన్న షరతుపై ప్రజలు తమ భూములను ఇచ్చేవారు. అయితే ఒక్కోసారి ఇది (పిల్లకాలువలలోనూ, లోతట్టు స్థలాలలోనూ పండవలసిన భాగం) కొట్టుకుపోయేది. ఒక్కోసారి ఇక్కడ అసలేమీ పండేది కాదు. ప్రజలకు కాంట్రాక్టు ఈ పరిస్థితిలోనే లభించేది. అందుకే దైవప్రవక్త (సఅసం) ఈ విధానాన్ని నిషేధించారు. అయితే ముందుగానే ఏ విషయమైనా స్పష్టంగా నిర్ధారితమైతే అందులో తప్పులేదు.

(ముస్లిం)

وَفِيْهِ بَيَانٌ لِّمَا أُجْمِلَ فِي الْمُتَّفَقِ عَلَيْهِ مِنْ إِطْلَاقِ النَّهْيِ عَنْ كِرَاءِ الْأَرْضِ.

ఇందులో "భూమిని కాంట్రాక్టుపై ఇవ్వకండి" అన్న బుఖారీ, ముస్లింల క్లుప్త వ్యాఖ్యకు విపులీకరణ కూడా ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

హన్జల (రజి) : హన్జల బిన్ ఖైస్ బిన్ అమ్ర్ జురఖీ. అన్సారీ. మదీనాకు చెందిన విశ్వసనీయ తాబయి. ఒక కథనం ప్రకారం ఈయనకు దైవప్రవక్త (స)ను చూచే భాగ్యం కలిగింది.

(٧٦٩) وَعَنْ ثَابِتِ بْنِ الضَّحَّاكِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنِ الْمُزَارَعَةِ، وَأَمَرَ بِالْمُؤَاجَرَةِ. رَوَاهُ مُسْلِمٌ أَيْضاً.

769. హజ్రత్ సాబిత్ బిన్ జహ్హాక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) భూములను పాలికివ్వటాన్ని వారించారు. (ఒక నిర్ణీత గడువు వరకు) కాంట్రాక్టుపై ఇవ్వటానికి అనుమతించారు. (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసులో వచ్చిన వారింపును పండితులు "నహీయె తన్జీహి"గా తీసుకున్నారు. దీన్ని హరామ్ (నిషిద్ధం) అన్న భావంలో తీసుకోలేదు. అసలు విషయం ఏమిటంటే ఇస్లాం తొలికాలంలో ముస్లింలు, ముఖ్యంగా ముహాజిర్లు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. వారివద్ద భూములు లేవు. అన్సార్ల దగ్గర మాత్రం మిగులు భూములు ఉండేవి. దైవప్రవక్త (స) అన్సార్లకు- ముహాజిర్లకు మధ్య సోదర బంధాన్ని ఏర్పరచినట్లే, అన్సార్ల నుండి ముహాజిర్లకు భూములను ఉదార దృక్పథంతో ఇప్పించే ఉద్దేశ్యంతో ఈ 'పాలికిచ్చే పద్ధతి'ని వారించారు. ఈ వారింపు తాత్కాలికమైనదే కాని శాశ్వతమైనది కాదు.

## హదీసు ఉల్లేఖకులు

సాబిత్ బిన్ జహ్హాక్ (రజి). మారు పేరు అబూ యజీద్. వంశపరంపర ప్రకారం సాబిత్ బిన్ జహ్హాక్ బిన్ ఖలీఫా అనబడతారు. అన్సార్ సహాబీ. ఖజ్రజ్‌కు చెందిన అస్‌హల్ తెగ వారవటంచేత అస్‌హలీగా కూడా పిలువబడేవారు. సుప్రసిద్ధ సహాబీ. 'బైతె రిజ్వాన్'లో ప్రతిజ్ఞ చేసిన సహాబీలలో ఈయన కూడా ఒకరు. అప్పట్లో ఆయన పిన్న వయస్కులే. హిజ్రీ 45వ సంవత్సరంలో మరణించారని ఒక వాదన ఉంది. కాని వాస్తవానికి ఇబ్నె జుబైర్ కాలంలో కల్లోలం రేకెత్తినప్పుడు - హిజ్రీ 64లో - మరణించారు.

(٧٧٠) وَعَنْ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ قَالَ: اَحْتَجَمَ رَسُولُ اللهِ ﷺ، وَأَعْطَى الَّذِيْ حَجَمَهُ أَجْرَهُ، وَلَوْ كَانَ حَرَاماً لَمْ يُعْطِهِ. رَوَاهُ الْبُخَارِيُّ.

770. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శస్త్ర చికిత్స ద్వారా తన శరీరం నుంచి చెడు రక్తం తీయించుకున్నారు. రక్తం తీసిన వానికి వేతనం కూడా ఇచ్చారు. ఈ వేతనమే గనక అధర్మం (హరామ్) అయివుంటే ఆయన (స) దీనిని ఇచ్చి ఉండేవారు కారు." (బుఖారీ)

(٧٧١) وَعَنْ رَافِعِ بْنِ خَدِيْجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: كَسْبُ الْحَجَّامِ خَبِيْثٌ. رَوَاهُ مُسْلِمٌ.

771. హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు - శరీరంలోని కురుపును తొలగించినందుకు, చెడు రక్తం తీసినందుకుగాను పుచ్చుకునే వేతనం అధమమైన వేతనం." (ముస్లిం)

**సారాంశం**

హదీసులో 'ఖబీస్' అనే పదం వచ్చింది. అరబీలో ఖబీస్ అనే పదం ప్రయోగించబడటం వల్ల ఈ సంపాదనను నిషిద్ధ సంపాదనగా తలపోయవలసిన అవసరం లేదు. ఈ సంపాదన 'అత్యుత్తమమైనది కాదు' అన్న భావంలో మాత్రమే ఈ పదం ఉపయోగించబడింది. ధర్మవేత్తలు కూడా ఈ విధంగానే అభిప్రాయపడ్డారు. శరీరంలోని చెడు రక్తం తీయువాని సంపాదనను వారు ధర్మసమ్మతంగానే భావిస్తున్నారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ద్వారా కూడా ఈ సంగతి రుజువవుతున్నది.

(٧٧٢) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**قَالَ اللَّهُ عَزَّ وَجَلَّ: ثَلَاثَةٌ أَنَا خَصْمُهُمْ يَوْمَ الْقِيَامَةِ، رَجُلٌ أَعْطَى بِيْ ثُمَّ غَدَرَ، وَرَجُلٌ بَاعَ حرًّا**

772. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : గౌరవోన్నతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు - "ప్రళయదినాన నేను ముగ్గురు వ్యక్తులకు వ్యతిరేకంగా ఉంటాను. ఒకడు :

فَأَكَلَ ثَمَنَهُ، وَرَجُلٌ اسْتَأْجَرَ أَجِيراً فَاسْتَوْفَى مِنْهُ وَلَمْ يُعْطِهِ أَجْرَهُ». رَوَاهُ مُسْلِمٌ.

నా పేరు మీద ప్రమాణం చేసి, జామీను ఇచ్చి వాగ్దాన భంగం చేసినవాడు. మరొకడు : స్వతంత్రుడైన మనిషిని అమ్మి, తద్వారా వచ్చిన సొమ్మును తినేవాడు. ఇంకొకడు : కూలివానితో పనిమాత్రం చేయించుకుని అతని కూలి పూర్తిగా ఇవ్వనివాడు." (ముస్లిం)

(٧٧٣) وَعَنْ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِنَّ أَحَقَّ مَا أَخَذْتُمْ عَلَيْهِ أَجْراً كِتَابُ اللَّهِ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

773. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "దైవ గ్రంథానికి గాను తీసుకునే వేతనం నిస్సందేహంగా అన్నింటికన్నా శ్రేష్ఠ మైనది." (బుఖారీ)

**సారాంశం**

దివ్య ఖుర్ఆన్‌ను బోధించినందుకు, దానిని లిఖించినందుకు, ముద్రించినందుకుగాను పుచ్చుకునే వేతనం ధర్మసమ్మతమైనదేగాక, శ్రేష్ఠమైనది కూడాను అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ ఇస్‌హాఖ్ (రహ్మ.లై)ల అభిమతం కూడా ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో ఖుర్ఆన్ బోధనకుగాను జీతం పుచ్చుకోవటం ధర్మసమ్మతం కాదు. కాని ఎవరయినా ఒక అధ్యాపకునివద్ద వేతనం నిర్ధారించకుండానే ఖుర్ఆన్ బోధన గరపి సంతోషంగా (మన స్ఫూర్తిగా) ఏదైనా దక్షిణ ఇచ్చుకుంటే అందులో తప్పు లేదంటారీయన.

(٧٧٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَعْطُوا الْأَجِيرَ أَجْرَهُ، قَبْلَ أَنْ يَجِفَّ عَرَقُهُ». رَوَاهُ ابْنُ مَاجَهْ.

774. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "కూలివాని చెమట ఆరకముందే అతని కూలి ఇచ్చేయండి." (దీనిని ఇబ్నె మాజా ఉల్లేఖించారు - ఈ అధ్యాయం క్రింద అబూహురైర (రజి)చే ఉల్లేఖించబడిన ఉల్లేఖనాన్ని అబూ యాల, బైహఖీలు

وَفِي الْبَابِ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ

عَنْهُ عِنْدَ أَبِيْ يَعْلَى وَالْبَيْهَقِيِّ، وَجَابِرٍ عِنْدَ الطَّبَرَانِيِّ، وَكُلُّهَا ضِعَافٌ.

వివరించారు. తబ్రానీలో హజ్రత్ జాబిర్ (రజి)చే ఉల్లేఖించబడింది. అయితే ఈ ఉల్లేఖనాలన్నీ బలహీనమైనవే)

(٧٧٥) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنِ اسْتَأْجَرَ أَجِيراً فَلْيُتِمَّ لَهُ أُجْرَتَهُ**»، رَوَاهُ عَبْدُ الرَّزَّاقِ، وَفِيْهِ انْقِطَاعٌ، وَوَصَلَهُ الْبَيْهَقِيُّ مِنْ طَرِيْقِ أَبِيْ حَنِيْفَةَ.

775. దైవప్రవక్త (సఅసం) ప్రబోధించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలిపారు - "ఎవరయినా సరే ఒక వ్యక్తిని వేతనంపై పనికి నియమిస్తే అతనికి అతని శ్రమకు గాను పూర్తి ప్రతిఫలం ఇవ్వాలి." (దీనిని అబ్దుర్రజాఖ్ ఉల్లేఖించారు - దీని పరంపరలో లింకు తెగింది. బైహఖీ ఈ హదీసును అబూ హనీఫా (రహ్మ.లై) ద్వారా 'మౌసూల్'గా ఉల్లేఖించారు)

## ١٦ - بَابُ إِحْيَاءِ الْمَوَاتِ

## 16వ అధ్యాయం

## బంజరు భూములను సాగు చేయటం

(٧٧٦) وَعَنْ عُرْوَةَ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ عَمَّرَ أَرْضاً لَيْسَتْ لِأَحَدٍ فَهُوَ أَحَقُّ بِهَا**»، رَوَاهُ الْبُخَارِيُّ. قَالَ عُرْوَةُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: وَقَضَى بِهِ عُمَرُ فِي خِلَافَتِهِ.

776. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించినట్లు హజ్రత్ ఉర్వ (రజి) తెలిపారు - "ఎవరికీ చెందని - బంజరుగా పడివున్న - భూమిని సాగుచేసినవాడే ఆ భూమికి ఎక్కువ హక్కుదారుడు" (బుఖారీ). హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో ఈ ప్రవచనం ప్రకారమే నిర్ణయం గైకొనేవారని ఉర్వ (రజి) తెలిపారు.

**సారాంశం**

ఎవరి ఉపయోగంలోకీ రాకుండా బంజరుగా పడివున్న భూమిని ఎవరయినా మరమ్మత్తు చేసి దానిని సేద్యానికనువుగా చేస్తే ఆ భూమి వారి స్వంతమవుతుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అయితే ఆ భూమి సాటి ముస్లిం సోదరునికి చెందిన ఆస్తిగానీ, 'జిమ్మీ' సోదరుని పాలంగానీ అయివుండరాదన్నది షరతు. అంటే పోరంబోకు నేల అన్నమాట! అటువంటి భూమిని సాగుచేయటానికి రాజు అనుమతి పొందవలసిన అవసరం కూడా లేదు. అత్యధికమంది పండితుల దృక్పథం ఇదే. అయితే నేల సేద్యానికనువుగా మారినపుడు రాజ్యాధికారికి తెలియజేసి అతని ఆమోదాన్ని పొందాలని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలోనయితే ఎట్టి పరిస్థితిలోనూ రాజు అనుమతి లేకుండా సాగుచేయరాదు.

(٧٧٧) وَعَنْ سَعِيْدِ بْنِ زَيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ أَحْيَا أَرْضاً مَيْتَةً. فَهِيَ لَهُ». رَوَاهُ الثَّلاَثَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَقَالَ: رُوِيَ مُرْسَلاً، وَهُوَ كَمَا قَالَ، واخْتُلِفَ فِي صَحَابِيِّهِ، فَقِيْلَ: جَابِرٌ، وَقِيْلَ: عَائِشَةُ، وَقِيْلَ: عَبْدُ اللهِ بْنُ عُمَرَ، وَالرَّاجِحُ الْأَوَّلُ.

777. హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "ఎవరయితే బంజరుగా పడివున్న భూమిలో చెమటోడ్చి ప్రాణం పోస్తాడో ఆ భూమి అతని స్వంతమవుతుంది." (దీనిని ముగ్గురు ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని హసన్‌గా పేర్కొన్నారు. ఇది ముర్సల్‌గా ఉల్లేఖించబడిందని కూడా అన్నారు. ఇది ఆయన అన్నట్లుగానే ఉంది. ఈ హదీసును దైవప్రవక్త (స) నుండి తొలిసారిగా విన్న సహాబీ ఎవరు? అన్న విషయమై అభిప్రాయభేదం ఉంది. ఆ సహాబి హజ్రత్ జాబిర్ (రజి) అనీ, హజ్రత్ ఆయిషా(ర.అన్‌హా) అనీ, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) అనీ మూడు వాదనలున్నాయి. మొదటి పేరే ప్రాధాన్యత నివ్వదగినది)

**సారాంశం**

బంజరుగా, నిరుపయోగంగా ఉన్న భూమిని మృత భూమిగానూ, సేద్యం చేయబడే నేలను ప్రాణం పోసుకున్న నేలగానూ హదీసులో అభివర్ణించటం జరిగింది. బంజరుగా

పడివున్న భూమిని సేద్యానికి అనువుగా మలచటానికి, విత్తనాలు వేయడానికి, తోటలు పెంచటానికి, బావులు త్రవ్వడానికి ఎవరయినా ముందుకు వస్తే అటువంటి వారిని పై రెండు హదీసులలో ప్రోత్సహించటం జరిగింది. భూములు వృధాగా, నిరుపయోగంగా పడి ఉండటాన్ని ఇస్లాం ఇష్టపడదు. ఏదో ఒక విధంగా అవి ఉపయోగంలోకి రావాలి. ఉత్పత్తులు పెరగాలి. తద్వారా ప్రజల ఇక్కట్లు తొలగిపోవాలి. మానవ నైజం వాంఛించేది కూడా ఇదే.

(٧٧٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ الصَّعْبَ بْنَ جَثَّامَةَ اللَّيْثِيَّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَخْبَرَهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لاَ حِمَى إِلاَّ لِلَّهِ وَلِرَسُولِهِ». رَوَاهُ الْبُخَارِيُّ.

778. సాబ్ బిన్ జస్సామ లైసీ (రజి) తనకు చెప్పిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "అల్లాహ్ మరియు అయన ప్రవక్తకు తప్ప మేత మేసే నిర్ణీత భూభాగాలను తమ కొరకు ప్రత్యేకించుకోవటం ఎవరికీ ధర్మ సమ్మతం కాదు." (బుఖారీ)

**సారాంశం**

అజ్ఞాన కాలంలో అరేబియాలోని శ్రీమంతులు, పెత్తందార్లు బహిరంగ స్థలాలలో గడ్డి బాగా మొలచే భూభాగాలను తమ పశువుల కోసం ప్రత్యేకించుకునేవారు. వారు తమ కోసం కేటాయించుకున్న భూభాగాలలోకి ఇతరులు వెళ్ళి తమ పశువులను మేపలేరు. వాస్తవానికి ఇలాంటి భూములను ఎలా ఉపయోగించుకోవాలనేది రాజ్యాధికారి ఇచ్ఛపై ఆధారపడి ఉంటుంది. దైవమార్గంలో అంకితం చేయబడిన గుఱ్ఱాలను, ఒంటెలను మేపడానికి అలాంటి పచ్చని భూములను కేటాయించాలేగానీ ఎవరిష్టం వచ్చినట్లు వారు తమ కోసం కేటాయించుకోరాదని హదీసులో చెప్పబడింది.

(٧٧٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ ضَرَرَ وَلاَ

779. ఈయనగారి చేతనే (హజ్రత్ ఇబ్నె అబ్బాస్ - రజి గారిచే) ఉల్లేఖించబడిన మరో హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఒకరికి కీడు తలపెట్ట కండి. ఒకరి కీడుకు గురికాకండి." (అహ్మద్, ఇబ్నెమాజా లిరువురూ దీనిని

ضِرَارَ». رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَلَهُ مِنْ حَدِيْثِ أَبِي سَعِيْدٍ مِثْلُهُ، وَهُوَ فِي الْمُوَطَّإِ مُرْسَلٌ.

ఉల్లేఖించారు - ఇబ్నె మాజాలో అబూ సయీద్ సౌజన్యంతో హదీసు ఈ విధంగానే చెప్పబడింది. ఆ హదీసే 'మువత్తా'లో ముర్సల్‌గా పొందుపరచబడింది)

**సారాంశం**

ఈ హదీసులో సాటి సోదరునికి అపకారం తలపెట్టటం గురించి సూత్రప్రాయంగా ఒక విషయం చెప్పబడింది. 'చెరపకురా చెడెదవు' అన్న హితోక్తి అందరికీ తెలిసిందే. సాటి మనిషికి అపకారం చేసిన వ్యక్తి, అపకారం చేసిన మరు క్షణంనుంచే తన పాలిట ఒక శత్రువును చేజేతులా సృష్టించుకుంటాడు. ఇతని వేధింపులకు గురైన అవతలి వ్యక్తి ఇతన్ని అంత తేలిగ్గా వదలిపెడతాడని నమ్మకం ఏమిటి? అతను పగబట్టవచ్చు. పగ పాము వంటిది. అది అవకాశం కోసం ఎదురుచూచి తన ప్రత్యర్థిని కాటేయవచ్చు. అందుకే అకారణంగా సాటి సోదరుణ్ణి కష్టాల పాల్జేయటం, వేధించటం ఒక ముస్లిం స్థాయికి ఎంతమాత్రం తగదు.

(٧٨٠) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ أَحَاطَ حَائِطاً عَلَى أَرْضٍ فَهِيَ لَهُ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ الْجَارُودِ.

780. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ఎవరయినా ఒకరి ఆస్తి కానటువంటి భూమి చుట్టూ గోడ కట్టుకుంటే ఆ భూమి అతనిదై పోతుంది." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె జారూద్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٧٨١) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مُغَفَّلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ حَفَرَ بِئْراً فَلَهُ أَرْبَعُونَ ذِرَاعاً، عَطَناً لِمَاشِيَتِهِ**». رَوَاهُ ابن مَاجَه بِإِسْنَادٍ ضَعِيْفٍ.

781. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముగప్ఫల్ (రజి) ఉల్లేఖించారు - "ఎవరయినా ఎక్కడయినా బావిని త్రవ్వితే అక్కడ పశువులను కట్టి ఉంచే నిమిత్తం నలభై చేతుల పొడవు నేలను అతడు ఆక్రమించుకోవచ్చు." (దీనిని ఇబ్నెమాజా బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ఇది కూడా నిరుపయోగంగా ఉన్న బంజరు భూమికే వర్తిస్తుంది. బంజరుగా ఉన్న నేలలో బావి త్రవ్వి, సస్యశ్యామలం చేసిన వ్యక్తికి ఆ బావి చుట్టూ నలభై గజాల నేలను ఆక్రమించుకునే హక్కు ఉంటుంది. ఆ నేలలో అతడు తన పశువులను కట్టుకోవచ్చు. పశువుల కొట్టం నిర్మించుకోవచ్చు. లేదా గొఱ్ఱెల కోసం షెడ్డును వేసుకోవచ్చు.

(٧٨٢) وَعَنْ عَلْقَمَةَ بْنِ وَائِلٍ عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أَقْطَعَهُ أَرْضاً بِحَضْرَمَوتَ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

782. హజ్రత్ అల్ఖమ బిన్ వాయల్ తన తండ్రి వాయల్ (రజి) నుండి ఉల్లేఖించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఆయనకు హజర్‌మోత్‌లో భూమిని జాగీరుగా ఇచ్చారు. (అబూదావూద్, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**హదీసు ఉల్లేఖకులు**

అల్ఖమ బిన్ వాయల్. పూర్తి పేరు అల్ఖమ బిన్ వాయల్ బిన్ హుజ్ర్ హజ్రమీ. కూఫీగా కూడా పిలువబడేవారు. విశ్వసనీయులైన ఉల్లేఖకులు. ఇబ్నె హిబ్బాన్ ఈయన ఉల్లేఖనాలను విశ్వసనీయమైనవిగా పేర్కొన్నారు. ఈయన తన తండ్రినుండి, ముగీరా నుండి హదీసులను సంగ్రహించేవారు.

(٧٨٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ أَقْطَعَ الزُّبَيْرَ حُضْرَ فَرَسِهِ، فَأَجْرَى الْفَرَسَ حَتَّى قَامَ، ثُمَّ رَمَى بِسَوْطِهِ، فَقَالَ **أَعْطُوهُ حَيْثُ بَلَغَ السَّوْطُ**. رَوَاهُ أَبُو دَاوُدَ، وَفِيْهِ ضَعْفٌ.

783. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుబైర్ (రజి)కు ఆయన గుర్రం పరుగెత్తినంత దూరానికి సమానంగా భూమిని జాగీరుగా ఇచ్చారు. తన గుర్రం ఆగిన చోట ఆయన కొరడాను పడవేశారు. "కొరడా ఎక్కడ పడివుందో అక్కడి వరకూ గల భూమి జుబైర్ (రజి)దే" అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - కాని ఇందులో బలహీనత ఉంది)

**సారాంశం**

ఈ హదీసు దృష్ట్యా రాజ్యాధిపతి ఎవరయినా ఒక వ్యక్తి ధార్మిక, సామాజిక సేవలకు గుర్తింపుగా అతనికి కానుక రూపంలో జాగీరును ఇవ్వవచ్చు. అయితే జాగీరుగా ఇచ్చే ఆ భూమి ప్రభుత్వ భూమి అయి ఉండాలి. వేరొకరికి చెందిన భూమిని జాగీరుగా ఇవ్వడం కుదరదు.

(٧٨٤) وَعَنْ رَجُلٍ مِّنَ الصَّحَابَةِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: غَزَوْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَسَمِعْتُهُ يَقُولُ: **النَّاسُ شُرَكَاءُ فِي ثَلَاثٍ: فِي الْكَلَإِ وَالْمَاءِ وَالنَّارِ.** رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَرِجَالُهُ ثِقَاتٌ.

784. దైవప్రవక్త ప్రియ సహచరులలో ఒకరు ఇలా తెలియజేశారు : "నేను దైవ ప్రవక్త (సఅసం) వెంట ఒక యుద్ధంలో పాల్గొన్నాను. ఆయన (న) ఇలా ప్రబోధించగా నేను విన్నాను - 'మూడు వస్తువులలో అందరూ భాగస్థులే - గడ్డి, నీరు, అగ్ని." (అహ్మద్, అబూదావూద్- దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

**17వ అధ్యాయం**

## ١٧ - بَابُ الوَقْفِ

## వక్ఫ్

(٧٨٥) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِذَا مَاتَ الْإِنْسَانُ انْقَطَعَ عَنْهُ عَمَلُهُ، إِلَّا مِنْ ثَلَاثَةٍ: صَدَقَةٍ جَارِيَةٍ، أَوْ عِلْمٍ يُنْتَفَعُ بِهِ، أَوْ وَلَدٍ صَالِحٍ يَدْعُو لَهُ**». رَوَاهُ مُسْلِمٌ.

785. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు - మానవుడు చనిపోయినంతనే అతని కర్మల పరంపర తెగిపోతుంది. అయితే మూడు కర్మల ఫలం మాత్రం మరణానంతరం కూడా అతనికి లభిస్తూ ఉంటుంది. (1) ఎడతెగని దానం (సదఖా). (2) నిత్యం ప్రయోజనం చేకూర్చే విద్య. (3) మృతుని మన్నింపుకై వేడుకుంటూ ఉండే సజ్జన సంతానం.

**సారాంశం**

చనిపోయిన తరువాత కూడా మృతునికి అతని సత్కర్మల పుణ్యఫలం చేరుతూ

ఉంటుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ హదీసులో మూడు సత్కర్మలు ప్రస్తావించబడ్డాయి.

ఒకటి : ఎప్పుడూ ఎడతెగకుండా కొనసాగే దానధర్మాలు (సదఖయె జారియా). అంటే ప్రజా సంక్షేమాన్ని కోరుకుంటూ వక్ఫ్ చేయబడే ఆస్తులు. ఉదాహరణకు : బాటసారుల కోసం విశ్రాంతి నిలయాలను నిర్మించటం, బావులు త్రవ్వించటం, పంపుసెట్లు, కుళాయిలు వేయించటం, మస్జిదులను నిర్మించటం, ఆసుపత్రుల్ని నెలకొల్పటం, రోడ్లు వంతెనల నిర్మాణాన్ని చేపట్టడం - ఇత్యాదివన్నీ మనిషి తన జీవితంలో చేసుకుంటే మరణించిన తరువాత కూడా వాటి పుణ్యఫలం అతనికి చేకూరుతూ ఉంటుంది.

రెండు : ప్రయోజనకరమైన విద్యా శిక్షణ. జనులకు ధార్మిక విద్యను బోధించటం, విద్యనార్జించే ఏర్పాట్లు చేయటం, పేద విద్యార్థుల విద్యా విషయక ఖర్చుల్ని భరించటం, రచనా ప్రక్రియను కొనసాగించే వ్యవస్థను నెలకొల్పటం, విద్యాలయాలను స్థాపించటం, ధార్మిక గ్రంథాల ప్రచురణకై ఏర్పాట్లు చేయటం మొదలగువన్నీ ప్రయోజనకరమయిన విద్య క్రిందికే వస్తాయి.

మూడు : సజ్జన సంతానం. సజ్జన సంతానంలో కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు మాత్రమేగాక శుభాత్మల సహచర్యం కోసం ఆరాటపడుతూ వచ్చి శిక్షణ పొందిన శిష్యులు కూడా ఈ జాబితాలోకి వస్తారు. వారికి గనక శిక్షణ ఇచ్చి, మార్గభ్రష్టత నుంచి కాపాడి సన్మార్గంలో పయనింపజేసినట్లయితే ఈ సజ్జన సంతానం మృతుని మన్నింపు కోసం నిష్కల్మష మైన విశ్వాసంతో నిజప్రభువును వేడుకుంటుంది. పరలోకంలో ఉన్నత సోపానాలను ప్రసాదించమని ప్రార్థిస్తుంది. మృతుడు తన ప్రాపంచిక జీవితంలో చేసుకున్న ఈ సదాచరణల సత్ఫలితం అతనికి పరలోకంలో ఎడతెగకుండా చేరుతూ ఉంటుంది.

(٧٨٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: أَصَابَ عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَرْضاً بِخَيْبَرَ، فَأَتَى النَّبِيَّ ﷺ يَسْتَأْمِرُهُ فِيهَا، فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنِّي أَصَبْتُ أَرْضاً بِخَيْبَرَ، لَمْ أُصِبْ مَالاً قَطُّ هُوَ أَنْفَسُ عِنْدِيْ مِنْهُ، قَالَ: إِنْ شِئْتَ حَبَسْتَ أَصْلَهَا،

786. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: (నా తండ్రి) హజ్రత్ ఉమర్ (రజి)కు ఖైబర్ ప్రాంతంలో కొంత భూమి లభించింది. దీనికి సంబంధించి దైవ ప్రవక్త (సఅసం)ను సంప్రతించే ఉద్దేశ్యంతో (నా తండ్రిగారైన) హజ్రత్ ఉమర్ (రజి) ఆయన (స) వద్దకు వచ్చారు. "ఓ దైవప్రవక్తా (స)! నాకు ఖైబర్‌లో కొంత భూమి లభించింది. చాలా ఖరీదైన, సారవంతమైన భూమి అది. ఇంతకు ముందెన్నడూ నాకు

وَتَصَدَّقْتَ بِهَا، قَالَ: فَتَصَدَّقَ بِهَا عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ لاَ يُبَاعُ أَصْلُهَا، وَلاَ يُورَثُ، وَلاَ يُوهَبُ، فَتَصَدَّقَ بِهَا فِي الْفُقَرَآءِ، وَفِي الْقُرْبَى، وَفِي الرِّقَابِ، وَفِيْ سَبِيْلِ اللهِ، وَابْنِ السَّبِيْلِ، وَالضَّيْفِ، لاَ جُنَاحَ عَلَى مَنْ وَلِيَهَا أَن يَأْكُلَ مِنْهَا بِالْمَعْرُوفِ، وَيُطْعِمَ صَدِيْقاً، غَيْرَ مُتَمَوِّلٍ مَالاً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

ఇటువంటి భూమి ప్రాప్తించలేదు. నేనీ భూమిని దానంగా ఇవ్వదలిచాను" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన (స), "నీవు కోరుకుంటే అసలును నీ దగ్గరే వుంచుకుని, ఫలసాయాన్ని దానంగా ఇస్తూ ఉండవచ్చు" అని సలహా ఇచ్చారు. ఉల్లేఖకుని కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) ఈ భూమిని నిరుపేదల, బంధువుల కోసం, బానిసల విముక్తి కోసం, దైవమార్గం కోసం, బాటసారుల కోసం, అతిథి మర్యాదకోసం వక్ఫ్ (అంకితం) చేశారు. వాటి పర్యవేక్షకుడు ధర్మసమ్మతమైన రీతిలో తన స్వయం కోసం కొంత ఖర్చు పెట్టుకోవచ్చనీ, తన స్నేహితులకూ కొంత పెట్టవచ్చనీ వసీయతు కూడా చేశారు. అయితే సొమ్మును నిలువచేసి ఉంచరాదని షరతు విధించారు. (బుఖారీ, ముస్లిం - వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి. బుఖారీలోని వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి - "అసలును దానంగా ఇచ్చారు. అంటే వక్ఫ్ చేశారు. దాన్ని అమ్మనూ రాదు. కానుకగా ఇవ్వనూ రాదు. అయితే దాని ఫలసాయం మాత్రం దైవమార్గంలో ఖర్చుపెట్టబడుతుంది."

وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: تَصَدَّقَ بِأَصْلِهَا: لاَ يُبَاعُ، وَلاَ يُوْهَبُ، وَلَكِن يُنْفَقُ ثَمَرُهُ.

**సారాంశం**

ఆ భూమిని ఇతరులకు విక్రయించటంగానీ, కానుకగా ఇవ్వటం గానీ చేయరాదని హదీసులో చెప్పబడింది. అంటే ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తిని వేరొకరికి అమ్మకూడదు.

కానుక రూపంలో కూడా ఇవ్వకూడదు. హదీసు వెలుగులో బోధపడేది మాత్రం ఇదే. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మాత్రం; వక్ఫ్ ఆస్తిని అమ్మవచ్చు అని అభిప్రాయపడ్డారు. దీని గురించి ఆయన ప్రియశిష్యులైన ఇమామ్ అబూ యూసుఫ్ (రహ్మ.లై) ఏమంటున్నారో చూడండి: "ఈ హదీసు గనక ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టికి వచ్చి ఉంటే, బహుశా ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకునేవారేమో!"

(٧٨٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ عُمَرَ عَلَى الصَّدَقَةِ، اَلْحَدِيْثَ، وَفِيْهِ «فَأَمَّا خَالِدٌ، فَقَدِ احْتَبَسَ أَدْرَاعَهُ وَأَعْتَادَهُ فِي سَبِيْلِ اللهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

787. హజ్రత్ అబూహురైర (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ఉమర్ (రజి)ను సదఖాల (జకాత్ మరియు ఇతర దాన ధర్మాల) వసూళ్ళకై నియమించి పంపారు. (అల్ హదీస్) "ఖాలిద్ (రజి) అయితే తన కవచాలన్నింటినీ దైవ మార్గంలో వక్ఫ్ చేశాడు కదా!" అని ఇందులో (హదీసులో) వచ్చింది.

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

పూర్తి హదీసు ఇలా వుంది : ఇబ్నె జమీల్, ఖాలిద్ బిన్ వలీద్, దైవప్రవక్త (సఅసం) పినతండ్రి అయిన అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌లు జకాత్‌ను చెల్లించలేదు. వీళ్లను గురించి చెబుతూ దైవప్రవక్త (స), "ఇబ్నె జమీల్ ఒకప్పుడు నిరుపేదగా ఉండేవాడు. దేవుడు అతన్ని ధనికునిగా చేయగా ఇప్పుడతను పగ తీర్చుకుంటున్నాడు. ఇక ఖాలిద్ (రజి) అంటారా, మీరు అతని యెడల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు. అతనైతే తన కవచాలన్నింటినీ దైవమార్గంలో అర్పించాడు. అబ్బాస్ (రజి) గురించి ఇక చెప్పేదేముందీ! ఆయన (రజి) పై ఉన్న జకాత్‌ను చెల్లించే బాధ్యత నాది. ఫర్జ్‌గా చెల్లించవలసిన జకాత్‌తో పాటు, రెట్టింపు అదనంగా కూడా ఇస్తాను" అని అన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

ఖాలిద్ (రజి). మారు పేరు అబూ సులైమాన్. వంశపరంపర ప్రకారం - ఖాలిద్ బిన్ వలీద్ బిన్ ముగీరా మఖ్జూమీ ఖురషీ. తల్లి పేరు అస్మా. ఆమె లుబాబా సుఘ్రాగా కూడా పిలువబడేవారు. ఈమె హారిస్ కూతురు. హజ్రత్ ఖాలిద్ (రజి) మక్కా విజయానికి పూర్వం- హిజ్రీ 8లో - ఇస్లాం స్వీకరించారు. మరో కథనం ప్రకారం హిజ్రీ 5వ యేట లేక 6వ యేటలో ముస్లిం అయ్యారు. మక్కా విజయం, హునైన్ యుద్ధం, తబూక్ పోరాటంలో పాల్గొన్నారు. మౌతా యుద్ధం జరిగిన రోజు ఆయన చేతులపై తొమ్మిది ఖడ్గాలు విరిగాయి. దైవప్రవక్త

(స) ఈయనకు 'సైపుల్లాహ్' (దేవుని కరవాలం) అనే బిరుదు నిచ్చారు. హజ్రత్ అబూబకర్ (రజి) తన పరిపాలనా కాలంలో మార్గభ్రష్టతా ఉపద్రవం పుట్టినపుడు ఈయన్ని అధికారిగా నియమించారు. ఆ తరువాత పారసీకులను ఎదుర్కొన్నారు. అనంతరం ఈయన్ని సిరియా వైపునకు పంపగా, సిరియాలోని పెక్కు ప్రాంతాల్లో విజయ పతాకం ఎగురవేశారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈయనకు ఉద్వాసన పలికే వరకూ సేనాధిపతిగా కొనసాగారు. పదవీచ్యుతులైన పిదప 'హిమ్స్'లో స్థిరపడ్డారు. ఆఖరి ఘడియ వరకూ హిమ్స్‌లోనే ఉన్నారు. హిజ్రీ 21లో శాశ్వతంగా కన్నుమూశారు. 'హిమ్స్'కు ఒక మైలు దూరంలో వున్న ఒక పేటలో ఈయన అంత్యక్రియలు జరిగాయి.

**18వ అధ్యాయం**

## హిబా (స్వయం సమర్పణ), ఉమ్రా (శాశ్వత కానుక) మరియు రుఖ్బా

## ١٨ - بَابُ الْهِبَةِ وَالْعُمْرَى وَالرُّقْبَى

(٧٨٨) عَنِ النُّعْمَانِ بْنِ بَشِيرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ أَبَاهُ أَتَى بِهِ رَسُولَ اللهِ ﷺ، فَقَالَ: إِنِّي نَحَلْتُ ابْنِي هٰذَا غُلَاماً كَانَ لِيْ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**أَكُلَّ وَلَدِكَ نحلته مِثْلَ هٰذَا؟** فَقَالَ: لاَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **فَأَرْجِعْهُ**. وَفِيْ لَفْظٍ: فَانْطَلَقَ أَبِيْ إِلَى النَّبِيِّ ﷺ لِيُشْهِدَهُ عَلَى صَدَقَتِيْ، فَقَالَ: **أَفَعَلْتَ هٰذَا بِوَلَدِكَ كُلِّهِمْ؟** قَالَ: لاَ، قَالَ: «**اتَّقُوا اللَّهَ، وَاعْدِلُوا بَيْنَ أَوْلاَدِكُمْ**»، فَرَجَعَ أَبِي فَرَدَّ تِلْكَ الصَّدَقَةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

788. హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) కథనం : మా నాన్నగారు నన్ను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి తీసుకువచ్చి, "నేను నా బానిసను నా ఈ కుమారునికి హిబా చేశాను (సమర్పించాను)" అని అన్నారు. దైవప్రవక్త (స) ఇది విని, "మరి నీ కుమారులందరికీ ఇలాగే (బానిసలను) హిబా చేశావా?" అని దర్యాప్తు చేయగా 'లేద'ని సమాధానమిచ్చారాయన. "మరయితే (బానిసను) ఇతని నుండి వాపసు తీసుకో" అని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : "మా నాన్నగారు దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి, నాకు చేసిన 'హిబా' పై ఆయన్ని (సఅసం) సాక్షిగా ఉండమని కోరారు. 'నీవు నీ కొడుకులందరి

విషయంలో ఇలాగే వ్యవహరించావా?' అని ఆయన (స) వాకబు చేశారు. 'లేదు' అని ఆయన (నా తండ్రి) చెప్పారు. అప్పుడు ఆయన (సఅసం) 'దైవానికి భయపడు. నీ కొడుకులందరికీ న్యాయం చేకూర్చు' అని ఉపదేశించారు. ఆఖరికి మా నాన్నగారు ఈ హిబాను (కానుకను) వాపసు తీసుకున్నారు." (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لِّمُسْلِمٍ: قَالَ: **فَأَشْهِدْ عَلَى هٰذَا غَيْرِي، ثُمَّ قَالَ: «أَيَسُرُّكَ أَن يَكُونُوا لَكَ فِي الْبِرِّ سَوَآءً»** قَالَ: بلى. قال: **«فَلاَ إِذَنْ».**

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో "మరయితే నా బదులు వేరొకరిని సాక్షిగా పెట్టుకో" అని దైవప్రవక్త (సఅసం) అన్నారు. - "నీ సంతానమంతా నీ యెడల - సమానంగా- ఉత్తమంగా వ్యవహరించడాన్ని నువ్వు ఇష్టపడవా?" అని కూడా ఆయన (స) ఆ వ్యక్తిని ప్రశ్నించగా "ఎందుకు ఇష్టపడను?!"అని అతనన్నాడు. "మరయితే ఇలా చేయకు" అని ఆయన (సఅసం) ఉపదేశించారు.

**సారాంశం**

కానుకలను పిల్లలకు ఇచ్చేటప్పుడు సమానంగా - న్యాయంగా - ఇవ్వాలనీ, హెచ్చు తగ్గులను పాటించటం గానీ, కొందరికి అసలేమీ ఇవ్వకపోవటం గానీ చేయకూడదని పై హదీసు ద్వారా నిరూపితమవుతోంది. సమభావం కనబరచకపోతే అది అధర్మంతో కూడుకున్న కానుకగా పరిగణించబడుతుంది. ఇమామ్ అహ్మద్ (రహ్మలై), సౌరీ (రహ్మలై), ఇస్‌హాఖ్ (రహ్మలై)ల దృక్పథం కూడా ఇదే. సయీద్ బిన్ మన్సూర్ మరియు బైహఖీలలో వచ్చిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం మగ పిల్లలకు, ఆడ పిల్లలకు కూడా కానుకలను సమానంగా ఇవ్వవలసిందే. అయితే; సమానంగా ఇవ్వటం ఉత్తమమైన పద్ధతి మాత్రమేగానీ, తప్పనిసరి మాత్రం కాదని అత్యధికమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(٧٨٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ النَّبِيُّ ﷺ: «**الْعَائِدُ فِي هِبَتِهِ كَالْكَلْبِ يَقِيءُ ثُمَّ يَعُودُ فِي قَيْئِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: «**لَيْسَ لَنَا مَثَلُ السَّوْءِ، الَّذِي يَعُودُ فِي هِبَتِهِ كَالْكَلْبِ يَقِيءُ ثُمَّ يَرْجِعُ فِي قَيْئِهِ**».

789. హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరికయినా ఏదైనా వస్తువును కానుకగా ఇచ్చి, దాన్ని వాపసు తీసుకునేవాడు స్వయంగా కక్కి దాన్ని నాక్కునే కుక్క లాంటివాడు." (బుఖారీ, ముస్లిం) బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మా దృష్టిలో 'హిబా'ను తిరిగి తీసుకునేవానికన్నా చెడ్డవాడు మరొకడు లేడు. అతని ఉపమానం స్వయంగా కక్కి దాని వైపునకే మరలే కుక్క లాంటిది."

**సారాంశం**

ఒక వస్తువును ఎవరికయినా దానంగా గానీ, కానుక రూపేణగానీ ఇచ్చి దాన్ని తిరిగి తీసేసుకోవటం అధర్మం అని ఈ హదీసు చెబుతోంది. పైగా ఈ చేష్ట ఎంత నీచమైనదో, జుగుప్సాకరమైనదో చెప్పడానికి కుక్క చేష్టతో పోల్చటం జరిగింది. దానధర్మాలు చేసి గ్రహీత మనసు నొప్పించేవారికి, ఆత్మీయుల పట్ల సద్వ్యవహారం చేసి దెప్పిపొడిచే వారికి కూడా ఈ హదీసు పరోక్షంగా హెచ్చరిస్తోంది.

(٧٩٠) وَعَنِ ابْنِ عُمَرَ وَابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمْ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**لاَ يَحِلُّ لِرَجُلٍ مُسْلِمٍ أَنْ يُعْطِيَ الْعَطِيَّةَ ثُمَّ يَرْجِعَ فِيهَا، إِلاَّ الْوَالِدَ فِيمَا يُعْطِي وَلَدَهُ**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

790. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హాజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి), ఇబ్నె అబ్బాస్ (రజి)లు తెలిపారు - "ఇచ్చిన కానుకను తిరిగి తీసేసుకోవటం ఏ ముస్లిం పురుషునికీ ధర్మసమ్మతం కాదు - ఒక్క తండ్రికి తప్ప. తండ్రి మాత్రం తన సంతానానికి ఇచ్చిన కానుకను తిరిగి తీసుకోగలడు." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

ఇస్లామీయ సమాజంలో కానుకల ఇచ్చిపుచ్చుకోవడాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కానుకల ద్వారా పరస్పరం ప్రేమ పెంపొందుతుంది. కానుకను ఇచ్చిన తరువాత దాన్ని తిరిగి తీసుకోవటం ఒక్క తండ్రికి మాత్రమే సమ్మతం. ఇతరులు అలా చేయకూడదు.

(٧٩١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقْبَلُ الْهَدِيَّةَ، وَيُثِيبُ عَلَيْهَا. رَوَاهُ الْبُخَارِيُّ.

791. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కానుకలను స్వీకరించేవారు. వాటికి బదులుగా ఏదైనా ఇచ్చి పంపటం కూడా చేసేవారు." (బుఖారీ)

**సారాంశం**

కానుకలను స్వీకరించటం, కానుకలకు బదులుగా ఏదైనా ఇచ్చి పంపటం దైవప్రవక్త (సఅసం) సంప్రదాయమని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఆయన (స) కానుకలకు 'బదులు'ను అత్యంత ఉత్తమమైన రీతిలో ఇచ్చేవారని ఇబ్నె అబీ షైబాలో ఉంది. కానుకకు బదులు ఇచ్చేందుకు ఏమీలేకపోతే కృతజ్ఞతా పూర్వకమయిన మాటనైనా చెప్పాలి. "జజాకల్లాహు ఖైర" (అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ఇవ్వుగాక!) అనే శ్రేయోదాయకమైన వచనాలను పలకాలి. అవతలి వ్యక్తి నుంచి కూడా తనకు ఏదైనా కానుకగా ముడ్తుంది అనే సంకల్పంతో ఎవరైనా కానుకను పంపిస్తే అట్టి కానుక ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో ధర్మసమ్మతమైనది కాదు. ఇతర ఇమాముల దృష్టిలో మాత్రం ధర్మసమ్మతమే.

(٧٩٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: وَهَبَ رَجُلٌ لِرَسُولِ اللهِ ﷺ نَاقَةً، فَأَثَابَهُ عَلَيْهَا، فَقَالَ: رَضِيتَ؟ قَالَ:

792. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం)కు ఒక ఆడ ఒంటెను కానుకగా ఇచ్చాడు. దైవ ప్రవక్త (సఅసం) ఆ వ్యక్తికి ఏదో ఇచ్చి, "నీవు సంతృప్తి చెందావా?" అని అడిగారు. దానికా వ్యక్తి 'లేదు' అని అన్నాడు. అతనికి మరికొంత ఇచ్చి, "ఇప్పుడు సంతోషం కలిగిందా!" అని అడిగారు. అప్పటికీ అతను 'లేద'నే బదులిచ్చాడు. ఆయన(స) అతనికి ఇంకొంత కూడా ప్రసాదించి, "ఇప్పటికైనా నీకు సంతోషం కలిగిందా!" అని దర్యాప్తు

لاَ، فَزَادَهُ، فَقَالَ: رَضِيتَ؟ قَالَ: لاَ، فَزَادَهُ، فَقَالَ: رَضِيتَ؟ فَقَالَ: نَعَمْ. رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

చేశారు. అప్పుడతను 'అవును' అన్నాడు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమైందిగా పేర్కొన్నారు)

**సారాంశం**

కానుకను స్వీకరించి, దానికి బదులుగా ఏదైనా వస్తువును ఇవ్వటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అయితే కానుకను ఇచ్చిన వ్యక్తి, పుచ్చుకున్న వ్యక్తి నుంచి అతిగా ఆశించటం మాత్రం ఉత్తమం అనిపించుకోదు.

(٧٩٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْعُمْرَى لِمَنْ وُهِبَتْ لَهُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

793. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమ్రా (శాశ్వత కానుక) గురించి చెబుతూ, "ఒకరికి ఇవ్వబడిన ఉమ్రా (శాశ్వత కానుక) ఇక అతనిదే అవుతుంది" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ: **أَمْسِكُوا عَلَيْكُمْ أَمْوَالَكُمْ، وَلاَ تُفْسِدُوهَا، فَإِنَّهُ مَنْ أَعْمَرَ عُمْرَى، فَهِيَ لِلَّذِي أُعْمِرَهَا، حَيًّا وَمَيِّتاً، وَلِعَقِبِهِ.**

ముస్లింలోని ఉల్లేఖనంలో ఇలా వుంది: "మీరు మీ సొమ్ములను మీ వద్ద భద్రంగా ఉంచండి. వాటిని వృధా చేయకండి. ఎవరయినా ఒకరికి ఒక వస్తువును ఉమ్రా (శాశ్వత కానుక) గా ఇస్తే ఇక అది ఇవ్వబడిన వ్యక్తిదే అవుతుంది. బ్రతికి ఉండగానే కాకుండా మరణించిన తరువాత కూడా (అతనిదే). మరణానంతరం అది అతని వారసులకు చెందుతుంది.

وَفِي لَفْظٍ: إِنَّمَا الْعُمْرَى الَّتِي أَجَازَهَا

వేరొక ఉల్లేఖనంలోని వాక్యాలు ఇలా ఉన్నాయి - "ఏ ఉమ్రా (శాశ్వత కానుక)ను దైవప్రవక్త (స) సమ్మతించారో, ఆ ఉమ్రా అర్థమేమిటంటే, ఉమ్రా ఇచ్చే

رَسُولُ اللهِ ﷺ أَن يَقُولَ: هِيَ لَكَ وَلِعَقِبِكَ، فَأَمَّا إِذَا قَالَ: هِيَ لَكَ مَا عِشْتَ، فَإِنَّهَا تَرْجِعُ إِلَى صَاحِبِهَا.

వాడు, 'ఇది నీది. నీ తదనంతరం నీ సంతానానిది' అని స్పష్టంగా చెప్పి ఇస్తే అప్పుడది తీసుకున్న వ్యక్తికి ఆ విధంగానే దక్కుతుంది. ఒకవేళ ఇచ్చేవాడు, 'నీవు బ్రతికి ఉన్నంత కాలం ఇది నీది' అని చెబితే మాత్రం అతని తదనంతరం ఆ వస్తువు ఇచ్చిన వాని వైపునకు మళ్ళించ బడుతుంది."

وَلأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ: **لاَ تُرْقِبُوا، وَلاَ تُعْمِرُوا، فَمَنْ أُرْقِبَ شَيْئاً، أَوْ أُعْمِرَ شَيْئاً، فَهُوَ لِوَرَثَتِهِ.**

అబూదావూద్, నసాయి ఉల్లేఖనంలో ఉంది : మీరు రుఖ్బా గానీ, ఉమ్రాగానీ చేయకండి. ఎవరయినా ఏదయినా వస్తువును రుఖ్బా చేస్తే లేదా ఉమ్రాగా ఇస్తే అది అతని వారసులకు చెందు తుంది."

(٧٩٤) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: حَمَلْتُ عَلَى فَرَسٍ فِي سَبِيلِ اللهِ، فَأَضَاعَهُ صَاحِبُهُ، فَظَنَنْتُ أَنَّهُ بَائِعُهُ بِرُخْصٍ، فَسَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنْ ذٰلِكَ، فَقَالَ: «**لاَ تَبْتَعْهُ، وَإِنْ أَعْطَاكَهُ بِدِرْهَمٍ**» اَلْحَدِيثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

794. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : నేనొక గుర్రాన్ని దైవమార్గంలో స్వారీ కోసం ఒక వ్యక్తికి ఇచ్చాను. అయితే అతనా గుర్రాన్ని దుర్భర స్థితికి చేర్చాడు. అతనా గుర్రాన్ని తక్కువ ధరకు అమ్మే స్తాడేమోనని కూడా నేను భావించాను. దీని గురించి దైవప్రవక్త (స)ను అడిగి తెలుసుకుందామని తలంచి, 'నేనా గుర్రాన్ని కొనవచ్చా!' అని అడిగాను. దానికి ఆయన (స), "అతనా గుర్రాన్ని ఒక్క దిర్హంకు అమ్మినా సరే నీవు దాన్ని కొనకు" అని చెప్పారు - సశేషం -

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దానంగా ఇచ్చిన వస్తువును డబ్బు చెల్లించి కొనటం కూడా ధర్మసమ్మతం కాదని ఈ హదీసు చెబుతోంది. కొంతమంది విద్వాంసులు ఇలాంటి కొనుగోలును 'హరామ్' (నిషిద్ధం)గా ఖరారు చేయగా, మరికొంతమంది 'వారింపు'గా భావించారు. దైవప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (రజి)ను ఆ గుర్రం కొనేందుకు వారించటంలోని ఆంతర్యం ఏమిటంటే; వస్తువును దానంగా ఇచ్చిన వ్యక్తికే తిరిగి అమ్మవలసివచ్చినపుడు అమ్మేవాడు మొహమాటపడతాడు. అమ్మవలసిన ధరకన్నా తక్కువ ధరకే అమ్మేస్తాడు. ఒక విధంగా ఇది అమ్మకందారునికి నష్టం చేకూరుస్తుంది. అదే సమయంలో ఒకప్పుడు దానంగా ఇచ్చి ఇప్పుడు కొనుగోలు చేసిన వ్యక్తి చాలా తక్కువ ధరకు ఆ వస్తువును చేజిక్కించుకుంటాడు. అంటే ఇచ్చిన దానాన్ని తిరిగి పుచ్చుకున్నట్టు అవుతుంది. దానంగా ఇచ్చిన వస్తువును తిరిగి తీసేసుకోవటం కక్కిన దాన్ని నాకటంతో సమానమని లోగడ హదీసులో చెప్పబడటం ఈ సందర్భంగా గమనార్హం.

(٧٩٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**تَهَادُوا تَحَابُّوا**». رَوَاهُ الْبُخَارِيُّ فِي الْأَدَبِ الْمُفْرَدِ، وَأَبُو يَعْلَى بِإِسْنَادٍ حَسَنٍ.

795. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "పరస్పరం కానుకల్ని ఇచ్చిపుచ్చుకుంటూ ఉండండి. దీనివల్ల ఒండొకరి మధ్య ప్రేమ పెంపొందుతుంది." (ఈ హదీసును బుఖారీ అదబుల్ ముఫ్రిద్‌లో ఉల్లేఖించారు. అబూ యాలా దీనిని ఎన్నదగ్గ రీతిలో నకలు చేశారు)

**సారాంశం**

ఒకరు మరొకరికి కానుకను ఇవ్వటం ప్రేమకు సోపానం. కాగా; ఇస్లాం సభ్యసమాజ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు పెంపొందాలనీ, అంతరాల అగాధాలు, అసూయా ద్వేషాలు సమసిపోవాలని కాంక్షిస్తోంది. కాబట్టి ప్రజలు ఇతోధికంగా ఈ రివాజును కొనసాగించాలి.

(٧٩٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللَّهِ ﷺ: «**تَهَادُوا فَإِنَّ الْهَدِيَّةَ تَسُلُّ السَّخِيمَةَ**». رَوَاهُ الْبَزَّارُ بِإِسْنَادٍ ضَعِيفٍ.

796. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "పరస్పరం కానుకల మార్పిడి చేసుకుంటూ ఉండండి. ఎందుకంటే ఈ కానుక కాపట్యాన్ని, కార్కశ్యాన్ని తొలగిస్తుంది." (దీనిని బజ్జార్ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

(٧٩٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَا نِسَاءَ الْمُسْلِمَاتِ لاَ تَحْقِرَنَّ جَارَةٌ لِجَارَتِهَا وَلَوْ فِرْسِنَ شَاةٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

797. హజ్రత్ అబూహురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా తాకీదు చేశారు- "ఓ ముస్లిం మహిళల్లారా! ఏ ఇరుగు స్త్రీ కూడా తన పొరుగింటి స్త్రీకి కానుక పంపటాన్ని అల్పంగా భావించకూడదు - ఆఖరికి ఆ కానుక మేక కాలి గిట్ట అయినాసరే!" (బుఖారీ, ముస్లిం)

(٧٩٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ وَهَبَ هِبَةً فَهُوَ أَحَقُّ بِهَا، مَا لَمْ يُثَبْ عَلَيْهَا». رَوَاهُ الْحَاكِمُ، وَصَحَّحَهُ، وَالْمَحْفُوظُ مِن رِوَايَةِ ابْنِ عُمَرَ عَنْ عُمَرَ قَوْلُهُ.

798. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "ఎవరయినా ఏదైనా వస్తువును హిబా చేయగా (కానుకగా ఇవ్వగా) దానికి బదులు ఇవ్వ బడకుండా ఉంటే ఆ వస్తువుకు అతనే ఎక్కువ హక్కుదారుడు అవుతాడు." (దీనిని హాకిమ్ ఉల్లేఖించి, ప్రామాణిక మైనదిగా నిర్ధారించారు. వాస్తవానికి ఇది ఇబ్నె ఉమర్ (రజి) సౌజన్యంతో హజ్రత్ ఉమర్ (రజి) పలికిన పలుకులు)

**సారాంశం**

ఇదే అర్థాన్నిచ్చే రెండు ఉల్లేఖనాలు హజ్రత్ అబూహురైర (రజి), ఇబ్నె అబ్బాస్ (రజి)లచే కూడా ఉల్లేఖించబడ్డాయి. కొంతమంది ఈ ఉల్లేఖనాల ఆధారంగానే, కానుకకు బదులు తీసుకుని ఉన్న పరిస్థితుల్లో, ఆ కానుకను తిరిగి తీసుకోవటం హరామ్ (నిషిద్ధం) అవుతుందన్న ఆంక్ష విధించారు. అయితే అల్లామా షౌకానీ (రహ్మతుల్లై) ఇలా అంటున్నారు : హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి), అబూహురైర (రజి), సమురా (రజి)ల ఈ ఉల్లేఖనాలు బలహీనమైనవనీ, వాటిలో ప్రామాణికంగా ఖరారు చేయదగ్గ ఉల్లేఖనం ఏదీ లేదనీ ఇబ్నె జౌజీ అంటున్నారు. తబ్రానీ గారు తన "మోజముల్ కబీర్"లో ఇబ్నె అబ్బాస్ (రజి)చే చెప్పబడిన ఉల్లేఖనాన్ని ఉదాహరించారు. దాని ప్రకారం ఎవరయినా ఏదైనా వస్తువును కానుకగా ఇవ్వగా అతనికి బదులు ఇవ్వబడకుండా ఉన్నంతకాలం అతను మాత్రమే ఆ వస్తువు యెడల అందరికన్నా

ఎక్కువ హక్కుదారుడై ఉంటాడు. ఒకవేళ అతడు కానుకగా ఇచ్చిన వస్తువును తిరిగి తీసేసుకుంటే అతని ఉపమానం స్వయంగా కక్కి తరువాత దాన్ని నాకిన వానిలాంటిది. ఒకవేళ ఈ హదీసులు ప్రామాణికమైనవైతే ఈ వ్యవహారంలో మొదటి హదీసుకు విరుద్ధంగా పరిణమిస్తాయి. అంటే; బదులు తీసుకున్న కానుకలను తిరిగి తీసేసుకోవటాన్ని ఇవి హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేస్తున్నాయి. కాబట్టి బదులు తీసుకోకముందే హిబాగా ఇచ్చిన వస్తువును తిరిగి తీసుకోవటం సమ్మతమేనన్న మాట! అల్లామా షౌకానీ (రహ్మ్‌లై) గారి ఈ చర్చనుబట్టి ఆయన ఈ హదీసుల ప్రామాణికతపై సంతృప్తి చెందలేదనిపిస్తోంది.

**19వ అధ్యాయం**

## లుఖతా (దొరికిన వస్తువులు)

## ١٩ - بَابُ اللُّقَطَةِ

(٧٩٩) عَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَرَّ النَّبِيُّ ﷺ بِتَمْرَةٍ فِي الطَّرِيقِ، فَقَالَ: «لَوْلاَ أَنِّي أَخَافُ أَنْ تَكُونَ مِنَ الصَّدَقَةِ لأَكَلْتُهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

799. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నడచి వెళుతున్న దారిలో ఒక ఖర్జూర పండు క్రింద పడి వుండటం చూచి ఇలా అన్నారు - "ఇది సదఖా చేయబడిన (దానంగా ఇవ్వబడిన) దన్న అనుమానం రాకుండా ఉంటే నేను దీన్ని తప్పకుండా తినేవాణ్ణి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దారిలో దొరికిన వస్తువు అతి సామాన్యమైనదైతే దాన్ని ఉపయోగించుకోవటం సమ్మతమేనన్న దానికి ఈ హదీసు తార్కాణం. ఆ వస్తువును ఎత్తుకున్న వ్యక్తి దాని గురించి ప్రకటన చేయవలసిన అవసరం లేదు. పరధ్యానం లేక అలసత్వం వల్ల క్రిందపడి'పోయిన' వస్తువులను మూడు తరహాలుగా లెక్కకట్టవచ్చు.

ఒకటి : ఆ వస్తువు అతి సామాన్యమైనదై ఉండాలి. సాధారణంగా తినే వస్తువు. షరీయత్ ప్రకారం అలాంటి వస్తువులను ఎత్తుకుని, శుభ్రంచేసి, బిస్మిల్లాహ్ అంటూ తినవచ్చు. అలా తినటం తప్పుకాదు.

రెండు : ఆ వస్తువు మామూలు వస్తువే గాని అది తినే వస్తువు మాత్రం కాదు. అటువంటి వస్తువును గురించి ప్రజల మధ్య మూడు రోజుల వరకూ ప్రకటన గావించాలి. ఉదాహరణకు: సాధారణ కత్తి, బెత్తం, కర్ర మొదలగునవి.

మూడు : ఖరీదైన వస్తువు. దీనికి సంబంధించి దైవప్రవక్త (స) ఆదేశం ఏమిటంటే, దాని గురించి ఒక ఏడాది కాలం పాటు ప్రకటిస్తూ ఉండాలి. నేటి ఆధునిక కాలంలో వార్తాపత్రికల ద్వారా, రేడియో, టీవీల ద్వారా కూడా ఈ మేరకు ప్రకటించవచ్చు. మస్జిదుల బయట జనం

వచ్చే పోయే మార్గంలోనూ, బహిరంగ సభలలో కూడా ప్రకటనలు చేయవచ్చు. ఈ ప్రకటనలపై వచ్చే ఖర్చును అవసరమైతే పోయిన వస్తువు యొక్క యజమాని నుండి వసూలు చేయవచ్చు. ఏడాది కాలం పాటు ప్రకటించిన మీదట కూడా ఆ వస్తువు యజమాని ముందుకు రాకపోతే, అప్పుడు ఆ వస్తువును వాడుకోవచ్చు. ఆ వస్తువును వాడుకుంటున్నప్పుడు (లేదా అమ్ముకుంటున్నప్పుడు) ముందు జాగ్రత్తగా దాని ఆనవాళ్లను జ్ఞాపకముంచుకోవాలి. ఒకవేళ ఏనాడయినా ఆ వస్తువు యజమాని వచ్చి ఆరా తీస్తే అప్పుడు దాని మూల్యం అతనికి చెల్లించవచ్చు.

(٨٠٠) وَعَنْ زَيْدِ بْنِ خَالِدٍ الْجُهَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ، فَسَأَلَهُ عَنِ اللُّقَطَةِ، فَقَالَ: **اعْرِفْ عِفَاصَهَا وَوِكَاءَهَا، ثُمَّ عَرِّفْهَا سَنَةً، فَإِنْ جَاءَ صَاحِبُهَا، وَإِلاَّ فَشَأْنُكَ بِهَا**، قَالَ: فَضَالَّةُ الْغَنَمِ؟ قَالَ: **هِيَ لَكَ، أَوْ لأَخِيكَ، أَوْ لِلذِّئْبِ**، قَالَ: فَضَالَّةُ الإِبِلِ؟ قَالَ: **مَا لَكَ وَلَهَا؟ مَعَهَا سِقَاؤُهَا، وَحِذَاؤُهَا، تَرِدُ الْمَاءَ، وَتَأْكُلُ الشَّجَرَ، حَتَّى يَلْقَاهَا رَبُّهَا.** مُتَّفَقٌ عَلَيْهِ.

800. హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి దొరికిన వస్తువు గురించి సందేహం వెలిబుచ్చగా ఆయన (సఅసం) ఇలా చెప్పారు : "ఆ సంచినీ, దాని మూతి కట్టును గుర్తుంచుకొని, ఒక ఏడాదిపాటు ఆ వస్తువు గురించి ప్రజలలో ప్రకటిస్తూ ఉండు. ఆ వస్తువు యజమాని వస్తే దాన్ని అతనికిచ్చివెయ్యి. రాకపోతే నువ్వు కోరినవిధంగా దాన్ని ఖర్చు పెట్టుకో." తరువాత ఆ వ్యక్తి తప్పిపోయిన మేక గురించి విచారించగా, "అది నీది. లేక నీ సోదరునిది లేక తోడేలుదవుతుంది" అన్నారు దైవప్రవక్త (సఅసం). మళ్లీ ఆ వ్యక్తి, తప్పిపోయిన ఒంటె విషయంలో ఏం చేయాలి? అని సందేహపడగా "దాని సంగతి నీకెందుకు? దాంతోపాటు దాని గిట్టెలు ఉన్నాయి. దాని యజమాని వచ్చి తోలుకెళ్ళే వరకు అది ఆకులు అలములు మేస్తూ, నీళ్ళు త్రాగుతూ తిరుగుతుంటుంది" అని సమాధానమిచ్చారాయన (స). (బుఖారీ, ముస్లిం)

### హదీసు ఉల్లేఖకులు

జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి) : ఈయన నామాంతరం అబూ అబుర్రహ్మాన్ లేదా అబూ తల్హా. మదీనాలో ఉండటం వల్ల మదనీగా కూడా పిలువబడ్డారు. అగ్రశ్రేణి సహచరులలో ఒకరుగా పరిగణించబడతారు. మక్కా విజయం సందర్భంగా బనూ జుహైన తెగ వారి ధ్వజం ఈయన చేతికి ఇవ్వబడింది. కూఫాకు తరలివచ్చారు. కూఫాలోనే హిజ్రీ 68 లేదా హిజ్రీ 78 లేదా హిజ్రీ 75లో మరణించారు.

(٨٠١) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ آوَى ضَالَّةً فَهُوَ ضَالٌّ مَا لَمْ يُعَرِّفْهَا». رَوَاهُ مُسْلِمٌ.

801. హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి) కథనానుసారమే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రబోధించారు : "ఎవరయితే పోయిన వస్తువును తన దగ్గరపెట్టుకుని దాని గురించి ప్రకటనగావించలేదో అతడు స్వయంగా దారితప్పాడు."

(ముస్లిం)

### సారాంశం

దారిలో క్రిందపడివున్న వస్తువును, అది వేరితరుల చేతికి చిక్కితే దాని యజమానికి చేరదేమోనన్న అనుమానముంటే, అట్టి వస్తువును ఎత్తుకువచ్చి దాని గురించి అందరిమధ్య ప్రకటించాలి. ఆ వస్తువును సిసలయిన యజమానికి ముట్టజెప్పే ఉద్దేశ్యంతో దాన్ని భద్ర పరచాలి. ఇలా చేయటం సమంజసం. అయితే వస్తువును కాజేసే దురుద్దేశ్యంతో దాచిపెట్టి, దాని గురించి ప్రకటించకపోతే అది అధర్మమవుతుంది. అలా చేసినవాడు అపమార్గంలో తొలి అడుగు వేసినట్లే. కాబట్టి దారిలో కనబడిన ఇలాంటి వస్తువుల విషయంలో తాము న్యాయసమ్మతంగా వ్యవహరించలేమన్న అనుమానం ఏ కోశాన కలిగినా ఆ వస్తువు జోలికి పోకుండా ఉండటమే మంచిది.

(٨٠٢) وَعَنْ عِيَاضِ بْنِ حِمَارٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ وَجَدَ لُقَطَةً فَلْيُشْهِدْ ذَوَى عَدْلٍ، وَلْيَحْفَظْ عِفَاصَهَا، وَوِكَاءَهَا، ثُمَّ لاَ يَكْتُمْ، وَلاَ يُغَيِّبْ، فَإِنْ جَاءَ رَبُّهَا، فَهُوَ أَحَقُّ بِهَا، وَإِلاَّ فَهُوَ مَالُ اللهِ يُؤْتِيهِ مَنْ يَشَاءُ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ إِلاَّ

802. హజ్రత్ అయాజ్ బిన్ హిమార్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం : "ఎవరికయినా పోయిన వస్తువు ఎక్కడన్నా దొరికితే అతడు ఇద్దరు న్యాయశీలురైన వ్యక్తులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. అతడు స్వయాన ఆ వస్తువు మూతికట్టుడును, ముఖ్య ఆనవాళ్ళను

التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ وَابْنُ حِبَّانَ.

బాగా జ్ఞాపకముంచుకోవాలి. మరి ఆ వస్తువును గోప్యంగా ఉంచే ప్రయత్నం చేయకూడదు. తరువాత ఆ వస్తువు నిజ యజమాని వస్తే అతనే దాని అసలు హక్కుదారుడవుతాడు. ఒకవేళ (యజ మాని) రాకపోతే అది అల్లాహ్ సొత్తు అవుతుంది. ఆయన తాను తలచిన వారికి దాన్ని అనుగ్రహిస్తాడు." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలినవారు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ,ఇబ్నె జారూద్, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ఈ హదీసు ప్రకారం వస్తువు దారిలో దొరికిన సమయంలోనూ, వస్తువును యజమానికి ముట్టజెప్పే సమయంలోనూ ఇరువురు వ్యక్తులను సాక్ష్యంగా పెట్టుకోవటం వాజిబ్ (తప్పనిసరి) అని తెలుస్తోంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో సాక్షులను పెట్టుకోవటం ముస్తహబ్ (అభిలషణీయం). ఇలా చేయటం సర్వవిధాలా శ్రేయస్కరం. ఎందుకంటే ఒక్కోసారి ఒక వస్తువు కోసం ఇద్దరేసి, ముగ్గురేసి వ్యక్తులు వచ్చి అది తమదేనని వాదించవచ్చు. అప్పుడది ఎవరికిచ్చేది? వ్యవహారం వివాదాస్పదంగా మారుతుంది. అందుకే ఆ వస్తువుకు సంబంధించిన ఆనవాళ్ళను నోట్ చేసుకుని, న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా ఎంపిక చేసుకుని ఉంటే పకడ్బందీగా ఆ వస్తువును సిసలయిన యజమానికి అందజేసే ఆస్కారం ఉంటుంది.

## హదీసు ఉల్లేఖకులు

అయాజ్ బిన్ హిమార్ (రజి). సుప్రసిద్ధ సహాబి. తమీమ్ తెగకు చెందినవారు. 'బస్రా'లో స్థిరనివాస మేర్పరచుకున్నారు. హిజ్రీ 50వ సంవత్సరం వరకు జీవించి ఉన్నారు.

(٨٠٣) وَعَنْ عَبْدِ الرَّحْمَنِ بْنِ عُثْمَانَ التَّيْمِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ لُقَطَةِ الْحَاجِّ. رَوَاهُ مُسْلِمٌ.

803. హాజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఉస్మాన్ తమీమి (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హాజీలు పోగొట్టుకున్న వస్తువులను ఎత్తుకోరాదని తాకీదు చేశారు. (ముస్లిం)

## సారాంశం

హాజీల వస్తుసామగ్రిని ఇతరులు ఎత్తుకుపోరాదన్న ఉద్దేశ్యంతో ఇలా తాకీదు చేయటం జరిగింది. ఒకవేళ కనబడకుండాపోయిన హజ్ యాత్రికుల సామాన్లను, వస్తువులను వారికి ముట్టజెప్పే ఉద్దేశ్యంతో ఎత్తుకుంటే అందులో దోషం లేదు. ఎందుకంటే బుఖారీ, ముస్లింలలో పొందుపరచబడిన హజ్రత్ అబూహురైర (రజి) ఉల్లేఖనంలో - దారిలో దొరికిన వస్తువులను ప్రకటన చేసే ఉద్దేశ్యంతో ఎత్తుకోవటం ధర్మసమ్మతమేనని అనబడింది.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుర్రహ్మాన్ బిన్ ఉస్మాన్ (రజి). అబ్దుర్రహ్మాన్ బిన్ ఉస్మాన్ బిన్ ఉబైదుల్లాహ్ తైమి ఖురషీ. ఈయన తల్హా బిన్ ఉబైదుల్లా అన్న కుమారులు. సహాబిగా పరిగణించబడ్డారు. ఈయన దైవప్రవక్త (సఅసం) కాలంలో వున్నమాట నిజమేగాని దైవప్రవక్త (స)ను చూడలేదని ఒక వాదన ఉంది. హుదైబియా ఒప్పందం జరిగిన రోజున ఇస్లాం స్వీకరించారని కొందరు, మక్కా విజయం నాడు ముస్లిం అయ్యారని మరికొందరు అంటారు. హిజ్రీ 73వ యేట అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి)తో కలసి యుద్ధం చేశారు.

(٨٠٤) وَعَنِ الْمِقْدَامِ بْنِ مَعْدِيْكَرِبَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَلاَ لاَ يَحِلُّ ذُو نَابٍ مِنَ السَّبَاعِ، وَلاَ الْحِمَارُ الأَهْلِيُّ، وَلاَ اللُّقَطَةُ مِنْ مَالِ مُعَاهِدٍ، إِلاَّ أَنْ يَسْتَغْنِيَ عَنْهَا». رَوَاهُ أَبُو دَاوُدَ.

804. హజ్రత్ మిఖ్దామ్ బిన్ మాదీ కరిబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తాకీదు చేశారు : "బాగా వినండి! కోరలతో చీల్చే జంతువుగానీ, పెంపుడు గాడిదగానీ హలాల్ (ధర్మసమ్మతం) కావు. 'జిమ్మీ' పోగొట్టుకున్న వస్తువును ఎత్తుకోవటం కూడా మీ కొరకు సమ్మతం కాదు. ఒకవేళ ఆ వస్తువు యజమానికి దాని అవసరం అంతగా లేనట్లయితే ఫరవా లేదు." (అబూదావూద్)

## సారాంశం

హదీసులో ముఆహిద్ (జిమ్మీ) అనే పదం వచ్చింది. 'జిమ్మీలు' అంటే ముస్లిం రాజ్యపాలకులతో శాంతి ఒప్పందం చేసుకున్న ముస్లిమేతరులు. వారి ధన, మాన, ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ముస్లిం రాజ్యపాలకునిపై ఉంటుంది. అందుకే వారు పోగొట్టుకున్న వస్తువుల విషయంలోనూ, వారి అజమాయిషీ నుండి తప్పిపోయిన పశువుల విషయంలోనూ పరిపాలకులు మరియు సామాన్య ముస్లింలు కూడా కడు జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

మిఖ్దామ్ (రజి). మిఖ్దామ్ బిన్ మాదీ కరిబ్ - బిన్ అమ్ర్ అల్ కిందీ. అబూ కరీమా లేదా అబూ యహ్యా మారుపేరు. సుప్రసిద్ధ సహాబి. సిరియాలో స్థిరపడ్డారు. ఈయన హదీసు సిరియా వాసులలో ప్రసిద్ధి చెందింది. హిజ్రీ 47వ యేట చనిపోయారు. అప్పటికి ఈయన వయస్సు 91.

### 20వ అధ్యాయం

## ٢٠ - بَابُ الْفَرَائِضِ

## ఆస్తుల పంపకం

(٨٠٥) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَلْحِقُوا الْفَرَائِضَ بِأَهْلِهَا، فَمَا بَقِيَ فَهُوَ لِأَوْلَى رَجُلٍ ذَكَرٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

805. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : వారసుల కోసం షరీయత్ నిర్ధారించిన వాటాలను ఆయా హక్కుదారులకు ఇచ్చేయండి. ఆ తర్వాత మిగిలిన దానిని అతి సన్నిహితులయిన పురుష బంధువులకు ఇవ్వండి." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హదీసులో 'అహ్లె ఫరాయజ్' గురించి తాకీదు చేయబడింది. ఈ అధ్యాయం క్రింద షరీయత్ పరిభాషలో 'అహ్లె ఫరాయజ్' అంటే దైవగ్రంథమయిన ఖుర్ఆన్ మరియు మహాప్రవక్త (స) విధానం ప్రకారం ఆస్తుల వాటాలు పొందవలసిన వారసులని భావం. నిర్ధారిత వాటాలను ఆయా వారసులకు ఇచ్చివేసిన మీదట కూడా ఏదైనా మిగిలి వుంటే మృతునికి చాలా దగ్గరివారైన పురుష బంధువులకు ఇవ్వాలన్నమాట! మృతునికి అత్యంత సన్నిహితులైన వారిలో తొలుత కొడుకుల పేరు వస్తుంది. ఆ తరువాత మనవళ్ళు, ముని మనవళ్ళు మొదలగువారు. ఆ తరువాత మృతుని తండ్రి, తాత. ఆ తర్వాత భ్రాతృజులు, పినతండ్రి, పెత్తండ్రి మరియు వారి సంతతి.

(٨٠٦) وَعَنْ أُسَامَةَ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لَا يَرِثُ الْمُسْلِمُ الْكَافِرَ، وَلَا يَرِثُ الْكَافِرُ الْمُسْلِمَ». مُتَّفَقٌ عَلَيْهِ.

806. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - ఒక ముస్లిం ఒక అవిశ్వాసికి వారసుడుగానీ, ఒక అవిశ్వాసి ఒక ముస్లింకు వారసుడు గానీ కాలేరు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఏ ముస్లిం కూడా చనిపోయిన తన అవిశ్వాస స్నేహితునికి వారసుడు కాలేడనీ, అలాగే ఏ అవిశ్వాసి కూడా మరణించిన తన ముస్లిం మిత్రునికి వారసుడు కాజాలడని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అత్యధికమంది ముస్లిం విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే. అయితే మరి కొంతమంది పండితుల దృష్టిలో ఒక ముస్లిం ఒక అవిశ్వాసికి వారసుడు కాగలడు గాని ఒక అవిశ్వాసి మాత్రం ముస్లింకు వారసుడు కాజాలడు. హజ్రత్ ముఆజ్ (రజి), మస్‌రూఖ్ (రజి), సయీద్ బిన్ ముసైబ్ (రజి), ఇబ్రాహీం నఖ్‌యీ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై)ల అభిమతం ఇదే. "ఇస్లాం పెరిగే గుణం కల ధర్మమేగాని తరిగేది కాదు" అని హజ్రత్ ముఆజ్ (రజి) అంటారు. అయితే సర్వసాధారణమైన ఈ సూత్రానికి, ఇస్లాం వారసత్వ సంబంధమయిన ఆదేశాల నుండి వినాయింపు ఉంది. షరీయత్ ప్రకారం ముస్లిమైనవాడు అవిశ్వాసి యొక్క వారసుడు కాలేడు. అందుచేత అత్యధికమంది విద్వాంసుల అభిప్రాయమే ఈ సందర్భంగా ఎన్నదగినది.

(٨٠٧) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فِي بِنْتٍ، وَبِنْتِ ابْنٍ، وَأُخْتٍ، فَقَضَى النَّبِيُّ ﷺ «لِلاِبْنَةِ النِّصْفُ، وَلاِبْنَةِ الاِبْنِ السُّدُسُ، تَكْمِلَةَ الثُّلُثَيْنِ، وَمَا بَقِيَ فَلِلأُخْتِ». رَوَاهُ الْبُخَارِيُّ.

807. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూతురు, మనవరాలు, సోదరి (ముగ్గురూ) ఉండగా రెండొంతులను పూర్తి చేయడానికి కూతురికి సగ భాగం, మనవరాలికి 6వ భాగం ఇవ్వాలనీ, మిగిలినది సోదరీకి చెందుతుందని నిర్ణయించారు. (బుఖారీ)

(٨٠٨) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَتَوَارَثُ أَهْلُ مِلَّتَيْنِ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَأَخْرَجَهُ الْحَاكِمُ بِلَفْظِ أُسَامَةَ، وَرَوَى النَّسَائِيُّ حَدِيْثَ أُسَامَةَ بِهَذَا اللَّفْظِ.

808. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు- "రెండు భిన్నమతాల అవలంబీకులు ఒండొకరికి వారసులు కాజాలరు." (అహ్మద్ మరియు 'నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ఉసామా హదీసు పదాల నుండి నకలు చేశారు. నసాయి మాత్రం ఉసామా హదీసును ఈ హదీసు - అంటే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) - వాక్యాలతోనే వివరించారు)

(٨٠٩) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: إِنَّ ابْنَ ابْنِي، مَاتَ، فَمَا لِيْ مِنْ مِيْرَاثِهِ؟ فَقَالَ: **لَكَ السُّدُسُ**، فَلَمَّا وَلَّى دَعَاهُ، فَقَالَ: **لَكَ سُدُسٌ آخَرُ**، فَلَمَّا وَلَّى دَعَاهُ، فَقَالَ: إِنَّ **السُّدُسَ الآخَرَ طُعْمَةٌ**. رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ، وَهُوَ مِنْ رِوَايَةِ الْحَسَنِ الْبَصْرِيِّ عَنْ عِمْرَانَ، وَقِيْلَ: إِنَّهُ لَمْ يَسْمَعْ مِنْهُ.

809. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి "నా మనవడు చనిపోయాడు. అతను వదలి వెళ్ళిన అతని ఆస్తిలో నాకు ఎంత వస్తుంది?" అని సందేహ పడ్డాడు. "నీకు ఆరవ భాగం లభిస్తుంది" అని ఆయన (సఅసం) సమాధాన మిచ్చారు. మరి అతను వెళ్ళిపోతుండగా ఆయన (స) అతన్ని పిలిచి, "నీ కోసం మరో ఆరో వంతు కూడా ఉంటుంది" అని అన్నారు. ఆ వ్యక్తి తిరిగి వెళు తుండగా ఆయన (స) అతన్ని పిలిచి "ఆఖరి ఆరవ వంతు నీకు భత్యంగా లభిస్తుంది సుమా!" అని స్పష్టపరిచారు. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. ఈ ఉల్లేఖనాన్ని హసన్ బస్రీ గారు కూడా ఇమ్రాన్ (రజి) నుండి ఉల్లేఖించారు. అయితే హసన్ బస్రీ గారు ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) నుండి విన్నట్టు నిరూ పితం కాలేదని కూడా ఒక వాదన ఉంది)

**హదీసు ఉల్లేఖకులు**

హసన్ బస్రీ (రహ్మ.లై). హసన్ బిన్ అబుల్ హసన్ బస్రీ అన్సారీ. అన్సార్లచే స్వేచ్ఛ నొసగబడిన బానిస. ఈయన తండ్రి పేరు యసార్. ప్రజలను సన్మార్గం వైపునకు మరలించే నాయకులలో ఒకరు. విశ్వసనీయులు. ధర్మావగాహనలో అగ్రజులు, ధర్మనిష్ఠగలవారు. ఏకాంతాన్ని ఇష్టపడేవారు. విద్వాంసులు. సౌందర్యమూర్తి. తాబయీన్ల మూడవ తరానికి అధిపతి. హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన జన్మించారు. హజ్రత్ ఉస్మాన్

(రజి), హాజ్రత్ అలీ (రజి)లను ఈయన చూచి ఉన్నారు. కాని వారిద్దరి నుండి ఏ హదీసు కూడా వినలేదు. హిజ్రీ 110 వ సంవత్సరం రజబ్ నెలలో 90 ఏండ్ల ప్రాయంలో మరణించారు.

(٨١٠) وَعَنْ ابْنِ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا عَنْ أَبِيْهِ أَنَّ النَّبِيَّ ﷺ جَعَلَ لِلْجَدَّةِ السُّدُسَ، إِذَا لَمْ يَكُنْ دُوْنَهَا أُمٌّ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ، وَقَوَّاهُ ابْنُ عَدِيٍّ.

810. హాజ్రత్ ఇబ్నె బురైద (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాతమ్మ కోసం ఆరవ వంతును నిర్ధారించారు. అయితే వారసురాలిగా మధ్యలో తల్లి లేనపుడే ఇది వర్తిస్తుంది." (అబూ దావూద్, నసాయి లిరువురూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. ఇబ్నె అదీ దీనిని దృఢమైనదిగా పేర్కొన్నారు)

(٨١١) وَعَنِ الْمِقْدَامِ بْنِ مَعْدِيكَرِبَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْخَالُ وَارِثُ مَنْ لاَ وَارِثَ لَهُ». أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، سِوَى التِّرْمِذِيِّ، وَحَسَّنَهُ أَبُو زُرْعَةَ الرَّازِيُّ وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ حِبَّانَ.

811. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హాజ్రత్ మిఖ్దామ్ బిన్ మాదీ కరిబ్ (రజి) ఉల్లేఖించారు : "ఎవరికయినా వారసులెవరూ బ్రతికిలేని పక్షంలో అతనికి మేనమామ వారసుడవుతాడు." (ఈ హదీసును అహ్మద్ మరియు 'నులుగురి'లో తిర్మిజీ మినహా మిగిలిన వారు పేర్కొన్నారు - అబూజుర్ఆ, అల్ రాజీ దీనిని 'హసన్'గా నిర్ధారించారు. హాకిమ్ మరియు ఇబ్నె హిబ్బాన్‌లు మాత్రం ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం వారసులు, హక్కుదారులు ఎవరూ బ్రతికి లేనట్లయితే మేనమామ ఆస్తికి వారసుడవుతాడు. దగ్గరి బంధువులను వారసులుగా ప్రకటించే విషయంలో పండితుల మధ్య అభిప్రాయభేదం ఉంది. మేనమామ ఎంత హక్కుదారుడో పిన్నమ్మ కూడా అంతే హక్కు కలిగి ఉంటుందని మరికొందరు ఖరారు చేశారు. వారిరువురు కూడా జీవించి ఉండకపోతే ఆ ఆస్తి 'బైతుల్‌మాల్'లో జమ చేయబడుతుందని అన్నారు.

(٨١٢) وَعَنْ أَبِي أُمَامَةَ بْنِ سَهْلٍ قَالَ: كَتَبَ مَعِيَ عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ إِلَى أَبِي عُبَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**اللَّهُ وَرَسُولُهُ مَوْلَى مَنْ لاَ مَوْلَى لَهُ، والْخَالُ وَارِثُ مَنْ لاَ وَارِثَ لَهُ**». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، سِوَى أَبِي دَاوُدَ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

812. హజ్రత్ అబూ ఉమామ బిన్ సహ్ల్ (రజి) కథనం : హజ్రత్ ఉమర్ (రజి) గారు నా చేత అబూ ఉబైద (రజి) గార్కి ఒక లేఖ వ్రాయిస్తూ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించినట్లు ఉదాహరించారు - "సంరక్షులెవరూ లేనివారికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే సంరక్షకులు. వారసులెవరూ లేని వారికి మేనమామ వారసుడవుతాడు." (అహ్మద్ మరియు 'నలుగురి'లో అబూదావూద్ తప్ప మిగిలిన వారంతా ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు)

## హదీసు ఉల్లేఖకులు

1) అబూ ఉమామ బిన్ సహ్ల్ : ఈయన పేరు అస్అద్ అనీ, మరొక ఉల్లేఖనం ప్రకారం సాద్ అనీ తెలియవస్తోంది. అయితే ఈయన మారు పేరైన అబూ ఉమామగానే సుప్రసిద్ధులు. వంశపరంపర ఇలా ఉంది - అబూ ఉమామ బిన్ సహ్ల్ బిన్ హనీఫ్ బిన్ వాహబ్ అన్సారీ, ఔసి, మదనీ. మదీనాకు చెందిన అన్సార్ వర్గీయులు. ఔస్ తెగవారు. దైవప్రవక్త (సఅసం)ను చూచారుగానీ ఆయన (సఅసం) నుండి ఏదైనా విన్నట్టు ఆధారం లేదు. హిజ్రీ 100లో - 92 ఏళ్ళ ప్రాయంలో మరణించారు.

2) అబూ ఉబైద (రజి) : అబూ ఉబైద ఆమిర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జర్రాహ్ బిన్ హిలాల్ ఖుర్షీ ఫహ్రీ. స్వర్గలోక శుభవార్త నందుకున్న పదిమందిలో ఒకరు. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. అబిసీనియాకు హిజ్రత్ చేసిన వారిలో ఈయనా ఉన్నారు. బద్ర్ ఉహుద్‌ల నుండి తబూక్ వరకు జరిగిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఉహుద్ యుద్ధం జరిగిన రోజు దైవప్రవక్త (స) గారి శిరస్త్రాణం యొక్క రెండు లోహపు చువ్వలు ఆయన (స) దవడల్లోకి దిగిపోగా ఈయన వాటిని తన దంతాలతో లాగివేశారు. ఆ సమయంలో ఈయన గారి రెండు పల్లు ఊడిపోయాయి. సిరియా దిగ్విజయ యాత్రలో ముస్లిం సేనలకు సారథ్యం వహించారు. హిజ్రీ 18లో సంభవించిన అమ్వాస్ ప్లేగు వ్యాధి వాతన పడి చనిపోయారు.

(٨١٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**إِذَا اسْتَهَلَّ الْمَوْلُودُ وَرِثَ**. رَوَاهُ أَبُو دَاوُدَ. وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

813. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) చెప్పారు : "జన్మించిన శిశువు కేక వేసినంతనే , వారసుడుగా ఖరారై పోతాడు." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ 'ప్రామాణికం'గా ఖరారు చేశారు)

**సారాంశం**

కేక వేయటమంటే భావం ఏడవటం అనవచ్చు. సాధారణంగా పుట్టిన మరుక్షణమే శిశువు ఏడుపు ద్వారా ఈ ప్రపంచానికి తన ఉనికిని చాటి చెబుతుంది. అంటే సజీవంగా ఈ పుడమి పైకి అడుగు పెట్టానని చెబుతుందన్నమాట! ఈ విధంగా తన అస్థిత్వాన్ని చాటుకున్న ప్రతి జీవీ వారసత్వ హక్కును సంపాదించుకుంటుంది.

బిగ్గరగా అరిస్తేనే వారసత్వం లభిస్తుందా? ఏదేని కారణంగా ఒక శిశువు బిగ్గరగా కేక వేయలేకపోవచ్చు. కేవలం చలనం ద్వారా, శ్వాస ద్వారానే తాను సజీవంగా ఉన్నానని ప్రకటించవచ్చు. మరలాంటప్పుడు ఆ శిశువు వారసురాలు కాజాలదా?! అన్న సందేహం కలగ వచ్చు. ఏ విధంగా ఉనికిని చాటుకున్నా వారసత్వం లభించితీర్తుంది.

(٨١٤) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لَيْسَ لِلْقَاتِلِ مِنَ الْمِيرَاثِ شَيْءٌ**». رَوَاهُ النَّسَائِيُّ وَالدَّارَقُطْنِيُّ، وَقَوَّاهُ ابْنُ عَبْدِ الْبَرِّ، وَأَعَلَّهُ النَّسَائِيُّ، وَالصَّوَابُ وَقْفُهُ عَلَى عَمْرٍو.

814. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి ఆధారంగా, ఆయన తన తాతగారి ఆధారంగా తెలిపారు : "హంతకునికి హతుని ఆస్తినుండి ఏమీ లభించదు." (దీనిని నసాయి మరియు దారె ఖుత్నీ ఉల్లేఖించారు ఇబ్నె అబ్దుల్ బర్ దీనిని 'దృఢమైనది'గా ఖరారు చేశారు. కాని నసాయి మాత్రం 'మాలూల్'గా నిర్ధారించారు. వాస్తవానికి ఈ ఉల్లేఖనం 'మౌఖూఫ్.' అంటే ఇది అమ్ర్ గారిపై ఆధారపడి ఉందన్నది వాస్తవం)

**సారాంశం**

హంతకుడు హతుని ఆస్తిపాస్తుల నుండి ఏమీ పుచ్చుకోజాలడని ఈ హదీసును బట్టి విదితమవుతోంది. హంతకునికి హతుని స్వంత ఆస్తి నుండిగానీ, పరిహారంగా లభించిన మొత్తంలో నుండిగానీ చిల్లిగవ్వ కూడా హంతకునికి లభ్యం కాజాలదని అధిక సంఖ్యాక పండితులు అభిప్రాయపడ్డారు. అయితే ఇమామ్ మాలిక్ (రహ్మ్) అభిమతం మరోవిధంగా ఉంది. హతుని కుటుంబానికి 'రక్తపరిహారం'గా వచ్చిన సొమ్ములో నుంచి హంతకునికి ఏమీ దొరకదుగానీ, ఇతరత్రా ఆస్తిపాస్తుల్లో మాత్రం హక్కు ఉంటుందంటారు ఇమామ్ మాలిక్. అయితే ఈయనగారి వాదనకు అనుకూలంగా బలమైన నిదర్శనం ఏమీ లేదు. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అలీ (రజి) వంటి గొప్ప ఖలీఫాలే ఇమామ్ మాలిక్ (రహ్మ్) గారి అభిప్రాయానికి వ్యతిరేకంగా తీర్పులు చెప్పి ఉన్నారు.

(٨١٥) وَعَنْ عُمَرَ بْنِ الْخَطَّابِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَا أَحْرَزَ الْوَالِدُ أَوِ الْوَلَدُ فَهُوَ لِعَصَبَتِهِ مَنْ كَانَ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ وَصَحَّحَهُ ابْنُ الْمَدِينِيِّ وَابْنُ عَبْدِ الْبَرِّ.

815. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తెలిపారు : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధిస్తుండగా విన్నాను - "తండ్రిగానీ, సంతానంగానీ ప్రోగుచేసి తమ ఇంటికి తెచ్చినదంతా అది వారి "అసబా" (రక్త సంబంధీకుల) కు చెందుతుంది. (దీనిని అబూదావూద్, నసాయి, ఇబ్నెమాజ ఉల్లేఖించారు - ఇబ్నె మదీనీ, ఇబ్నె అబ్దుల్ బర్‌లు ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

ఈ హదీసులో చెప్పబడిన విషయంతో ఒక సంఘటన ముడిపడి ఉంది. ఆ రోజుల్లో ఒక స్త్రీ చనిపోయింది. ఆమె కొడుకులు ఆమె ఆస్తికి వారసులయ్యారు. కొంత కాలానికి కొడుకులు కూడా చనిపోయారు. అమ్ర్ బిన్ ఆస్ ఆ కొడుకులకు అసబా కోవకు చెందిన వారసులు కావటం చేత ఆయన వారి ఆస్తిపాస్తులకు వారసులయ్యారు. అంతలోనే ఆ స్త్రీచే స్వేచ్ఛ ప్రసాదించబడిన బానిస కూడా చనిపోయాడు. అమ్ర్ బిన్ ఆస్ ఆ బానిస ఆస్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ స్త్రీ సోదరుడు ఆ బానిస ఆస్తి తనకు రావాలని కేసు పెట్టాడు. ఆ సందర్భంగా హజ్రత్ ఉమర్ (రజి) గారు ఈ హదీసును జ్ఞాపకం చేసి, స్వేచ్ఛ నొసగబడిన ఆ బానిస ఆస్తిని ఆ స్త్రీ సోదరునికి ఇప్పించారు. స్వేచ్ఛ నొసగబడిన బానిస వదలివెళ్ళిన ఆస్తిని 'వలా'గా వ్యవహరిస్తారు. ఈ 'వలా' వారసత్వ హక్కుగా పరిగణించబడదు.

(٨١٦) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«الْوَلَاءُ لُحْمَةٌ كَلُحْمَةِ النَّسَبِ، لَا يُبَاعُ وَلَا يُوهَبُ»**. رَوَاهُ الْحَاكِمُ مِنْ طَرِيقِ الشَّافِعِيِّ، عَنْ مُحَمَّدِ بْنِ الْحَسَنِ، عَنْ أَبِي يُوسُفَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَأَعَلَّهُ الْبَيْهَقِيُّ.

816. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "స్వేచ్ఛ నొసగబడిన బానిస వదలివెళ్ళిన ఆస్తి (వలా) వ్యవహారం వంశపరంపర వ్యవహారం లాంటిది. దాన్ని అమ్మటం గానీ, ఒకరికి కానుకగా ఇవ్వటంగానీ కుదరదు." (ఈ హదీసును హాకిమ్ గారు షాఫయి ముహమ్మద్ బిన్ హసన్ ద్వారా, మరి ఆయన అబూ యూసుఫ్ ఆధారంగా ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని 'ప్రామాణికం' అన్నారు. అయితే బైహఖీ దీనిని 'మాలూల్'గా పేర్కొన్నారు)

## సారాంశం

ఈ హదీసులో 'వలా'ను వంశపరంపరతో పోల్చి దాని క్రయవిక్రయాలు జరపటంగానీ, మొక్కుబడిగా ఇవ్వటం గానీ, ఎవరికయినా కానుకగా ఇవ్వటంగానీ చేయరాదని స్పష్టం చేయడం జరిగింది. పూర్వం అరేబియాలో ప్రజలు 'వలా'ను (స్వేచ్ఛనొసగబడిన బానిస తరపున లభించిన మొత్తాన్ని) అమ్మటం, మొక్కుబడుల కోసం కేటాయించడం, కానుకల రూపేణా ఇవ్వటం చేసేవారు. దైవప్రవక్త (సఅసం) దీనిని వారించారు.

## హదీసు ఉల్లేఖకులు

1. ముహమ్మద్ బిన్ హసన్ : మరో పేరు అబూ అబ్దుల్లాహ్. వంశపరంపర ప్రకారం ముహమ్మద్ బిన్ హసన్ బిన్ ఫర్ఖద్ షైబానీ అనబడతారు. సుప్రసిద్ధ హనఫీ ఇమాములలో ఒకరు. హిజ్రీ 132లో జన్మించారు. కూఫాలో పెరిగి పెద్దవారయ్యారు. విద్యార్జన కోసం స్వస్థలం వదలి అనేక ప్రాంతాలు సందర్శించారు. గొప్ప గొప్ప విద్వాంసులను, ధర్మవేత్తలను కలుసుకున్నారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి ఆశ్రమంలో చాలా కాలం తర్ఫీదు పొందారు. అనంతరం అబూ యూసుఫ్ నుండి 'ఫికహ్' (ధర్మావగాహన) పాఠాలు తీసుకున్నారు. ఎన్నో సునిశిత అంశాలపై రచనలు చేశారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృక్పథాన్ని విస్తృతంగా వ్యాపింపజేశారు. హనఫీ దృక్పథానికి సంబంధించిన మూడు మూల స్థంభాలలో ఈయన కూడా ఒక స్థంభం వంటివారు. మూడు సంవత్సరాల దాకా ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) నుండి

కూడా విద్యార్జన చేశారు. ఈయన గురించి ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఇలా అనేవారు: "నేను ముహమ్మద్ బిన్ హసన్ లాంటి లావుపాటి మనిషి నెవరినీ చూడలేదు. అయినా ఎంతో చలాకీగా ఉండేవారు. దయార్ద్ర హృదయులు. మంచి సావాసి. ఆయన్ని మించిన శ్రేయోభిలాషిని నేను చూడలేదు." జ్ఞాపకశక్తి దృష్ట్యా హదీసులో ఈయన్ని 'జయీఫ్'గా ఖరారు చేయటం జరిగింది. హిజ్రీ 189లో 'రే' ప్రాంతంలోని 'రాన్‌బువియ' గ్రామంలో మరణించారు.

2. అబూ యూసుఫ్ : ఈయన అసలు పేరు ఇమామ్ యాఖూబ్ బిన్ ఇబ్రాహీమ్ అన్సారీ. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) గారి ప్రియతమ శిష్యులుగా సుప్రసిద్ధులు. ఇరాక్‌కు చెందిన ప్రఖ్యాత ధర్మవేత్తలలో ఒకరు. ఖాజియుల్ ఖుజాత్ హోదాను అలంకరించారు. కూఫాలో పెరిగి పెద్దవారయ్యారు. జీవితంలో అధికభాగం విద్యార్జనలోనే వెచ్చించారు. ఈయన తండ్రి పేదవారు. అందుచేత ఇమామ్ అబూ హనీఫా గారు తరచూ వందేసి దిర్హముల చొప్పున ఆర్థిక సాయంగా ఇస్తుండేవారు. యహ్యా బిన్ ముయిన్ ప్రకారం ధర్మవేత్తల వర్గంలో ఇమామ్ అబూ యూసుఫ్‌గారే ఎక్కువగా హదీసులో సునిశిత దృష్టిగలవారు. యహ్యా బిన్ యహ్యా తమీమి ఇలా అంటున్నారు : అబూ యూసుఫ్‌గారు మరణ సమయంలో ఇలా అంటూ ఉండగా నేను విన్నాను - "దైవగ్రంథం (ఖుర్‌ఆన్) మరియు సున్నత్ (హదీసు)లతో సమరసం చెందని నా (గత) ధార్మిక తీర్పులన్నింటినీ నేను ఉపసంహరించుకుంటున్నాను." హిజ్రీ 182 రబీవుల్ ఆఖిర్ నెలలో 69 ఏండ్ల వయసులో ఈయన మరణించారు.

(٨١٧) وَعَنْ أَبِي قِلَابَةَ، عَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَفْرَضُكُمْ زَيْدُ بْنُ ثَابِتٍ». أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، سِوَى أَبِي دَاوُدَ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ. وَأُعِلَّ بِالْإِرْسَالِ.

817. హజ్రత్ అబూ ఖిలాబ గారు హజ్రత్ అనస్ (రజి) ఆధారంగా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు : "మీలో అందరికన్నా ఎక్కువగా వారసత్వ నియమ నిబంధనల గురించి తెలిసినవారు జైద్ బిన్ సాబిత్ (రజి)." (ఈ హదీసును అహ్మద్ మరియు 'నలుగురి'లో అబూదావూద్ మినహా మిగిలిన వారంతా ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారుగాని ఇది 'ముర్సల్' అయిన కారణంగా దీనిని లోపభూయిష్టమైనదిగా పేర్కొన్నారు)

### సారాంశం

వాస్తవానికి ఇదొక సుదీర్ఘమైన హదీసులోని ఒక్క వాక్యం మాత్రమే. పూర్తి ఉల్లేఖనం ఇది : దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు - "నా అనుచర వర్గంలో అందరికన్నా దయార్ద్ర హృదయుడు, ప్రేమమయుడైన మనిషి అబూబకర్ (రజి). ధర్మావలంబనలో ఎంతో ఖచ్చితంగా, కఠినంగా వ్యవహరించే వ్యక్తి ఉమర్ (రజి). అందరికన్నా ఎక్కువగా బిడియం కలవాడు ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి). ధర్మాధర్మాల విచక్షణా జ్ఞానంలో అందరినీ మించినవాడు ముఆజ్ బిన్ జబల్ (రజి). అందరికన్నా బాగా, మధురంగా ఖుర్ఆన్ పారాయణం చేసే వ్యక్తి ఉబై బిన్ కాబ్ (రజి). కాగా; అందరికన్నా అధికంగా (వారసత్వ) ధర్మాలు తెలిసినవాడు జైద్ బిన్ సాబిత్ (రజి)" - అందువల్లనే ఇస్లామీయ విద్వాంసులు వారసత్వ పంపకాల్లో భేదాభిప్రాయం ఏర్పడినప్పుడు సాధారణంగా హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) అభిప్రాయానికే ప్రాధాన్యత నిస్తారు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ ఖిలాబ : ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ అమ్ర్ లేదా ఆమిర్ జుర్మీ బస్రీ. గొప్ప తాబయి. విశ్వసనీయులు. జ్ఞాన సంపన్నులు. అనేక ముర్సల్ హదీసులను ఉల్లేఖించారు. ఖాజీ పదవిని కాదని సిరియాకు వచ్చేశారు. హిజ్రీ 104 లేక 106 లేక 107 లో మరణించారు.

## 21వ అధ్యాయం

## వీలునామా నియమాలు

## ٢١ - بَابُ الْوَصَايَا

(٨١٨) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَا حَقُّ امْرِئٍ مُسْلِمٍ لَهُ شَيْءٌ يُرِيدُ أَنْ يُوصِيَ فِيهِ، يَبِيتُ لَيْلَتَيْنِ إِلاَّ وَوَصِيَّتُهُ مَكْتُوبَةٌ عِنْدَهُ».

مُتَّفَقٌ عَلَيْهِ.

818. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు - "ఒక ముస్లిం ఏదైనా వస్తువు గురించి వీలునామా వ్రాయాలని సంకల్పించుకున్నప్పుడు (వెంటనే వ్రాయాలి). రెండు రాత్రులు గడచిపోయినా వీలునామా వ్రాయకుండా దాన్ని అలాగే ఉంచటం అతనికి ఏమాత్రం శోభించదు."

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

'వీలునామా' అనేది ఎల్లప్పుడూ లిఖిత రూపంలో ఉండాలని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. వారసత్వ పంపకాలకు సంబంధించిన ఆయత్ అవతరించక పూర్వం

వీలునామా వ్రాయటం ప్రతి ఒక్కరికీ తప్పనిసరి అయ్యేది. అయితే వారసత్వ పద్ధతిని తెలిపే దైవవాక్యం అవతరించిన మీదట ఈ వీలునామా రద్దయింది. అంటే దివ్య ఖుర్‌ఆన్ నిర్ధారించిన వాటాల ప్రకారం మృతుని ఆస్తిని పంచుకోవలసి ఉంటుంది. అయితే ఆస్తిపరుడైన ప్రతి ఒక్కడూ ఒక నిర్ణీత భాగాన్ని తాను తలచుకున్న వారి పేరున 'వీలు' వ్రాయగలడు. ఉదాహరణకు : - కొడుకు జీవించి ఉండగా మనవడికి ఇవ్వవలసిన అవసరం లేకపోయినప్పటికీ అతని చదువు సంస్కారాల నిమిత్తం, పర్యవేక్షణ నిమిత్తం మూడో వంతు ఆస్తిని ఇవ్వమని 'వసీయతు' చేయవచ్చు.

(٨١٩) وَعَنْ سَعْدِ بْنِ أَبِي وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! أَنَا ذُوْ مَالٍ، وَلاَ يَرِثُنِيْ إِلاَّ ابْنَةٌ لِّيْ وَاحِدَةٌ، أَفَأَتَصَدَّقُ بِثُلُثَيْ مَالِيْ؟ قَالَ: لاَ، قُلْتُ: أَفَأَتَصَدَّقُ بِشَطْرِهِ؟ قَالَ: لاَ، قُلْتُ: أَفَأَتَصَدَّقُ بِثُلُثِهِ؟ قَالَ: اَلثُّلُثُ، وَالثُّلُثُ كَثِيْر، إِنَّكَ أَنْ تَذَرَ وَرَثَتَكَ أَغْنِيَآءَ خَيْرٌ مِّنْ أَنْ تَذَرَهُمْ عَالَةً يَتَكَفَّفُونَ النَّاسَ. مُتَّفَقٌ عَلَيْهِ.

819. హజ్రత్ సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి) కథనం : "ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను ధనవంతుణ్ణి. వారసుల్లో నాకు ఒక్కగా నొక్క కూతురు మాత్రమే ఉంది. అందు చేత నేను మూడింట రెండొంతుల ఆస్తిని దానంగా ఇవ్వవచ్చా?" అని అడిగాను. "ఇవ్వకూడదు" అని ఆయన (సఅసం) అన్నారు. "మరి నా ఆస్తిలో అర్ధభాగం దానం చేయనా?" అని నేను మళ్ళీ అడిగాను. "చేయకూడదు" అని ఆయన (స) బదులిచ్చారు. "పోనీ (మూడింట) ఒక వంతు దానంగా ఇవ్వవచ్చునా?" అని నేను సందేహం వెలిబుచ్చగా, "ఇవ్వవచ్చు. అయితే **ఆ** ఒక వంతు కూడా ఎక్కువే. నీ వారసులు ప్రజల ముందు చేతులు చాపి ముష్టెత్తుకునేలా వారిని నిరుపేదలుగా, నిరాధారులుగా చేసి వెళ్ళటంకన్నా వారిని స్థితిమంతులుగా వదలి వెళ్ళడం ఎంతో మంచిది" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఆస్తిపరుడు గరిష్టంగా మూడింట ఒక వంతు ఆస్తిని మాత్రమే వేరితరులకు వీలు

వ్రాయగలడని ఈ హదీసును బట్టి బోధపడుతున్నది. ఒకవేళ అంతకన్నా ఎక్కువగా వీలు వ్రాయడానికి హక్కుదారులు మనస్ఫూర్తిగా అనుమతిస్తే అది వేరే విషయం. కాని హక్కుదారులను కాకుండా వేరితరులకు అధికంగా దానధర్మాలు చేయటం వాంఛనీయం కూడా కాదు. సాధ్యమైనంత వరకు వారసులను మంచి స్థితిలో వదలి వెళ్ళాలి. వారు ఇతరుల ముందు చేయి చాపవలసిన హీన స్థితి ఏర్పడకుండా జాగ్రత్తపడాలి.

(٨٢٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَجُلاً أَتَى النَّبِيَّ ﷺ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّ أُمِّي افْتُلِتَتْ نَفْسُهَا، وَلَمْ تُوصِ، وَأَظُنُّهَا لَوْ تَكَلَّمَتْ تَصَدَّقَتْ، أَفَلَهَا أَجْرٌ إِنْ تَصَدَّقْتُ عَنْهَا؟ قَالَ: نَعَمْ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

820. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నా తల్లి అకస్మాత్తుగా చనిపోయింది. కాని ఆమె వీలు తయారుచేయలేదు. (చనిపోయే ముందు) ఆమె గనక మాట్లాడి ఉంటే దైవమార్గంలో (తప్పక) దానం చేసి ఉండేదని నా అనుమానం. మరి నేనిప్పుడు ఆమె తరపున దానం చేస్తే ఆమెకు పుణ్యం చేరుతుందా?" అని సందేహం వెలిబుచ్చాడు. దానికి ఆయన (సఅసం) "చేరుతుంది" అని సమాధాన మిచ్చారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

తల్లిదండ్రులు 'వసీయతు' చేయకపోయినప్పటికీ, వారి తరపున వారి పిల్లలు గనక దానధర్మాలు చేస్తే అది వారి తల్లిదండ్రులకు చేరుతుందని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. వసీయతు లేకపోయినా మృతుల తరపున దానధర్మాలు చేయటం ధర్మసమ్మతమే.

(٨٢١) وَعَنْ أَبِي أُمَامَةَ الْبَاهِلِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِنَّ اللَّهَ قَدْ أَعْطَى كُلَّ ذِي حَقٍّ حَقَّهُ.

821. హజ్రత్ అబూ ఉమామ బాహిలీ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధిస్తుండగా విన్నాను - "అల్లాహ్ ప్రతి హక్కుదారుని కోసం అతని హక్కును

فَلاَ وَصِيَّةَ لِوَارِثٍ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَحَسَّنَهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَقَوَّاهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ، وَرَوَاهُ الدَّارَقُطْنِيُّ مِنْ حَدِيثِ ابْنِ عَبَّاسٍ، وَزَادَ فِي آخِرِهِ: «إِلاَّ أَنْ يَشَآءَ الْوَرَثَةُ»، وَإِسْنَادُهُ حَسَنٌ.

నిర్ధారించాడు. కాబట్టి ఇకమీదట ఏ వారసుని విషయంలో కూడా వీలు వ్రాయవలసిన అవసరం లేదు." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురి'లో నసాయి తప్ప మిగిలినవారు ఉల్లేఖించారు - అహ్మద్, తిర్మిజీలు దీనిని 'హసన్'గా పేర్కొన్నారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్‌లు 'ధృఢమైనది'గా ఖరారు చేశారు) దారె ఖుత్నీ ఇబ్నె అబ్బాస్ (రజి) నుండి ఉల్లేఖించారు. చివరిలో "అతని వారసులు కోరితే తప్ప!" అనే వాక్యాన్ని అదనంగా చెప్పారు.

(٨٢٢) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ النَّبِيُّ ﷺ: «إِنَّ اللَّهَ تَصَدَّقَ عَلَيْكُمْ بِثُلُثِ أَمْوَالِكُمْ عِنْدَ وَفَاتِكُمْ، زِيَادَةً فِي حَسَنَاتِكُمْ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ. وَأَخْرَجَهُ أَحْمَدُ وَالْبَزَّارُ مِنْ حَدِيثِ أَبِي الدَّرْدَآءِ، وَابْنِ مَاجَهْ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ، وَكُلُّهَا ضَعِيفَةٌ، لَكِن قَدْ يُقَوِّي بَعْضُهَا بِبَعْضٍ، وَاللَّهُ أَعْلَمُ.

822. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీ పుణ్యకార్యాలు ఎక్కువయ్యేందుకు, మీకు మరణ సమయంలో మూడింట ఒక వంతు ఆస్తిని దానం చేసే అనుమతిని ఇచ్చి అల్లాహ్ మీకు మేలు చేశాడు." (దీనిని దారె ఖుత్నీ ఉల్లేఖించారు - అహ్మద్, బజ్జార్‌లు అబూ దర్దా (రజి) ఆధారంగా ఈ హదీసును ఉటంకించారు. కాగా; ఇబ్నె మాజా అబూహురైర (రజి) ఆధారంగా ఉటంకించారు. అయితే ఈ ఉల్లేఖనాలన్నీ బలహీనమైనవే. అయినప్పటికిన్నీ అవి పరస్పరం బలం చేకూర్చేవిగా ఉన్నాయి) అల్లాహ్‌యే బాగా ఎరుగు.

## 22వ అధ్యాయం

## అమానతు (అప్పగింత)

## ٢٢ - بَابُ الْوَدِيعَةِ

(٨٢٣) عَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**مَنْ أُودِعَ وَدِيعَةً فَلَيْسَ عَلَيْهِ ضَمَانٌ**». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَإِسْنَادُهُ ضَعِيفٌ.

823. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ.లై) తన తండ్రి నుండి, ఆయన తన తాత గారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ఎవరైనా ఒకరి వద్ద ఏదైనా వస్తువును అమానతు (అప్పగింత)గా భద్రపరిస్తే ఆ వస్తువును భద్రపరచిన వ్యక్తిపై ఎలాంటి పూచీ లేదు. (ఇబ్నె మాజా దీనిని ఉల్లేఖించారు - దీని పరంపర బలహీనమైనది)

وَبَابُ قِسْمِ الصَّدَقَاتِ تَقَدَّمَ فِي آخِرِ الزَّكَاةِ، وَبَابُ قِسْمِ الْفَيْءِ وَالْغَنِيمَةِ يَأْتِي عَقِبَ الْجِهَادِ إِنْ شَاءَ اللَّهُ تَعَالَى.

దానధర్మాల (నదఖాల) పంపిణీకి సంబంధించిన అధ్యాయం ఇంతకుముందే 'జకాత్ పుస్తకం' చివరిలో వచ్చేసింది. 'ఫై' మరియు 'యుద్ధప్రాప్తి' పంపకాలను వివరించే అధ్యాయం జిహాద్ పుస్తకం ఆఖరిలో రానున్నది -ఇన్షా అల్లాహ్!

### సారాంశం

ఈ హదీసు 'జయీఫ్'గా పేర్కొనబడింది. ఎందుకంటే హదీసును అందజేసిన వారిలో ఒకరైన ముసన్నా బిన్ సబాహ్‌ను ఇమామ్ అహ్మద్ - నసాయి వంటివారు పరిగణనలోకి తీసుకోవటం లేదు. అయితే ముసన్నా మంచివారనీ, అందుచేత ఆయన అందజేసిన హదీసును పొందు పరచవలసిందేనని, దానిని త్యజించరాదని ఇబ్నె మొయిన్ వక్కాణించారు.

అమానతు (అప్పగింత)గా వస్తువును భద్రపరచిన వ్యక్తిపై ఎలాంటి పూచీ (బాధ్యత) లేదన్న విషయంలో అత్యధిక మంది పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాని వస్తువును అప్పగింతగా పెట్టే సమయంలో వస్తువు యజమాని గనక పూచీ షరతు పెట్టినట్లయితే అట్టి పరిస్థితిలో భద్రపరచిన వ్యక్తిపై పూచీ బాధ్యత ఉంటుందని హసన్ బస్రీ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు.

# 8. నికాహ్ పుస్తకం

## ٨ - كِتَابُ النِّكَاحِ

(٨٢٤) عَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لَنَا رَسُولُ اللهِ ﷺ: يَا مَعْشَرَ الشَّبَابِ! مَنِ اسْتَطَاعَ مِنْكُمُ الْبَاءَةَ فَلْيَتَزَوَّجْ، فَإِنَّهُ أَغَضُّ لِلْبَصَرِ، وَأَحْصَنُ لِلْفَرْجِ، وَمَنْ لَمْ يَسْتَطِعْ فَعَلَيْهِ بِالصَّوْمِ، فَإِنَّهُ لَهُ وِجَاءٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

824. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఇలా ఉపదేశించారు -"ఓ నవయువకుల్లారా! మీలో నికాహ్ (వివాహం) చేసుకునే స్థోమత వున్నవారు నికాహ్ చేసుకోవాలి. ఎందుకంటే నికాహ్ చూపుల్ని కాపాడుతుంది, మర్మస్థానాన్ని పరిరక్షిస్తుంది. నికాహ్ చేసుకునే స్థోమతలేనివారు (నఫిల్) ఉపవాసాలు పాటిస్తూ ఉండాలి. ఎందుకంటే ఉపవాసం అతని పాలిట 'డాలు' వంటిది. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

నికాహ్ అంటే కలపటం, ఏకం చేయటం అని అర్థం. బంధించటం, ఒక నియమానికి కట్టుబడి ఉండేలా షరతు పెట్టడం అన్న అర్థాలు కూడా వస్తాయి. షరీయత్ పరిభాషలో నికాహ్ అంటే ఒక పురుషుడు - ఒక స్త్రీ కలసి జీవించడానికి, మమేకమవడానికి ధర్మసమ్మతిని ఇవ్వటం అని భావం.

సమాజాన్ని భావ కాలుష్యం నుండి కాపాడటానికి, నీతి బాహ్యత నుండి రక్షించడానికి దేవుడు సమ్మతించి ఆమోదించిన నికాహ్ (వైవాహిక) వ్యవస్థకు స్త్రీ పురుషులు కట్టుబడి ఉండటం అవసరం. ఎందుకంటే నికాహ్ మనిషిలో సౌశీల్యాన్ని, పారిశుధ్యాన్ని పరిరక్షిస్తుంది. చెడు ఆలోచనల నుండి, లైంగిక విశృంఖలత్వం నుండి యువతను కాపాడుతుంది.

ఒకవేళ ఎవరయినా వివాహం చేసుకుని భార్యను పోషించగల స్థోమతను కలిగి ఉండకపోతే, దైవం వారికి కలిమిని ప్రసాదించేవరకూ ఆత్మ నిగ్రహాన్ని పెంపొందించుకోవాలి. ఆత్మ నిగ్రహానికి, ఇంద్రియ నిగ్రహానికి అత్యుత్తమ సాధనం ఉపవాసం. అందుకే ఉపవాసాన్ని 'డాలు'గా అభివర్ణించటం జరిగింది. ఏ విధంగానయితే యుద్ధభూమిలో 'డాలు' శత్రువు దాడుల నుండి కాపాడుతుందో అదేవిధంగా 'ఉపవాసం' మనిషిలో బుసకొట్టే లైంగిక ఉద్రేకాల, పరిసరాల కవ్వింపుల వాతన పడకుండా కాపాడుతుంది.

(٨٢٥) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ حَمِدَ اللَّهَ، وَأَثْنَى عَلَيْهِ، وَقَالَ: «لَكِنِّي أَنَا أُصَلِّي، وَأَنَامُ، وَأَصُومُ، وَأُفْطِرُ، وَأَتَزَوَّجُ النِّسَاءَ، فَمَنْ رَغِبَ عَنْ سُنَّتِي فَلَيْسَ مِنِّي». مُتَّفَقٌ عَلَيْهِ.

825. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవస్తోత్రానంతరం ఇలా ఉద్బోధించారు - ".....అయితే నేను నమాజూ చేస్తాను, రాత్రిపూట నిద్ర కూడా పోతాను. ఉపవాసాలూ పాటిస్తాను, ఉపవాసాల విరమణ కూడా చేస్తాను. ఇంకా నేను స్త్రీలను కూడా వివాహ మాడతాను. కాబట్టి నా సంప్రదాయం పట్ల విముఖత చూపిన వానితో నాకె లాంటి సంబంధం లేదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) సహచరులలోని ముగ్గురు వ్యక్తులు అవలంబించిన అతివాదాన్ని అరికట్టే ఉద్దేశ్యంతో ఈ ఉపదేశం చేయబడింది. విషయాన్ని ముక్తసరిగా చెప్పడానికి రచయిత పూర్తి హదీసును ఇక్కడ పొందుపరచలేదేమో! ఆ ముగ్గురు సహచరులలో ఒకరు, తాను ఎల్లకాలం ఉపవాసం పాటిస్తానని నిశ్చయించుకోగా, తానసలు రాత్రిపూట నిద్రే పోననీ, రాత్రంతా జాగారం చేసి దైవధ్యానం చేస్తానని మరొకరు ప్రతినబూనారు. తనైతే అసలు వివాహమే చేసుకోనని మూడో వ్యక్తి తన దృఢ సంకల్పాన్ని ప్రకటించారు. ఈ విషయం తెలిసిన దైవప్రవక్త (స) వాళ్ళను పిలిపించి "ఈ రకంగా చెప్పిన ఆ ముగ్గురు మీరేనా? బాగా వినండి. దైవసాక్షి! నేను మీ అందరికన్నా అధికంగా దైవానికి భయపడేవాణ్ణి. మీకన్నా ఎక్కువగా ధర్మపరాయణత గలవాణ్ణి. అయితే మాత్రం?! నేను ఉపవాసాలూ పాటిస్తాను, ఉపవాసాల విరమణ కూడా చేస్తాను. రాత్రిపూట జాగారమూ చేస్తాను, నిద్రిస్తాను కూడా. స్త్రీలను నికాహ్ కూడా చేసుకుంటాను. ఇది నా ఆచరణా విధానం. కనుక ఇప్పుడెవరయినా తనంతట తానుగా తన స్వయంపై ఆంక్షలు విధించుకుని, నా విధానం పట్ల వైముఖ్య ధోరణిని కనబరిస్తే అతనితో నాకెట్టి సంబంధమూ లేదు సుమా!" అని తాకీదు చేశారు.

(٨٢٦) وَعَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُ بِالْبَاءَةِ، وَيَنْهَى عَنِ التَّبَتُّلِ نَهْياً شَدِيْدًا، وَيَقُولُ: «تَزَوَّجُوا الْوَدُودَ الْوَلُودَ، فَإِنِّي مُكَاثِرٌ بِكُمُ الأَنْبِيَاءَ يَوْمَ الْقِيَامَةِ». رَوَاهُ أَحْمَدُ،

826. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిత్యం నికాహ్ చేసుకోమని ఆదేశిస్తుండేవారు. బ్రహ్మచారిగా జీవితం

وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَلَهُ شَاهِدٌ عِنْدَ أَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ وَابْنِ حِبَّانَ أَيْضاً مِنْ حَدِيثِ مَعْقِلِ بْنِ يَسَارٍ.

గడపడాన్ని గట్టిగా వారించేవారు. ఆయన (స) ఇంకా ఇలా ఉపదేశించే వారు - "ఎక్కువగా ప్రేమించే, ఎక్కువ మంది పిల్లల్ని కనే స్త్రీలను వివాహ మాడండి. ఎందుకంటే నేను మీ అధిక జనాభా మూలంగా ప్రళయదినాన ఇతర దైవప్రవక్తల (అలైహి)పై గర్వపడతాను." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని 'ప్రామాణికం' గా పేర్కొన్నారు. ఇంకా ఈ హదీసుకు సంబంధించిన ఒక సాక్ష్యంగా అబూదావూద్, నసాయి, ఇబ్నె హిబ్బాన్‌లలో మాఖల్ బిన్ యసార్ (రజి) ఉల్లేఖనం కూడా ఉంది)

**సారాంశం**

హదీసులో 'తబత్తుల్' అనే పదం వచ్చింది. తబత్తుల్ అంటే స్త్రీలకు, వైవాహిక జీవితానికి దూరంగా ఉండటం, దాంపత్య సంబంధాలను త్రెంచుకుని సన్యాసిగా, సాత్వికునిగా జీవితం గడిపే వాడని భావం.

'అల్ వదూద్' అనే పదం కూడా ప్రయోగించబడింది. అంటే భర్తను అమితంగా ప్రేమించే భార్య. తన సద్గుణాల ద్వారా, సర్దుబాటు వైఖరిద్వారా, వినయ విధేయతల ద్వారా, ప్రేమానురాగాల ద్వారా భర్త మనసును జయించే ఉత్తమ ఇల్లాలు అని భావం.

"అల్ వలూద్" అని కూడా వచ్చింది. అంటే అధిక సంతానానికి జన్మనిచ్చే మహిళ. అమ్మాయి కుటుంబాన్ని, వంశపరంపరను చూచి ఈ విషయాన్ని పసిగట్టవచ్చు.

(٨٢٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**تُنْكَحُ الْمَرْأَةُ لِأَرْبَعٍ: لِمَالِهَا، وَلِحَسَبِهَا، وَلِجَمَالِهَا،**

827. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు : "నాలుగు ప్రాతిపదికలపై స్త్రీని వివాహమాడటం జరుగుతుంది. ఆమె ఐశ్వర్యం ఆధారంగా, ఆమె వంశం ఆధారంగా, ఆమె

وَلِدِينِهَا، فَاظْفَرْ بِذَاتِ الدِّينِ، تَرِبَتْ يَدَاكَ».
مُتَّفَقٌ عَلَيْهِ مَعَ بَقِيَّةِ السَّبْعَةِ.

అందచందాల ఆధారంగా, ఆమె ధార్మికత ఆధారంగా. అయితే ధార్మికురాలిని వివాహమాడండి. మేలు కలుగుతుంది." (బుఖారీ, ముస్లిం. మిగిలిన ఏడుగురు కూడా దీనిని ఉల్లేఖించారు)

**సారాంశం**

పెళ్ళి సంబంధాలు చూచేటప్పుడు ధార్మికురాలైన స్త్రీకి ప్రాధాన్యత నివ్వాలని ఈ హదీసు చెబుతోంది. అందాన్ని, ఐశ్వర్యాన్ని, అంతస్థును చూచి ముగ్ధులవటం సహజం. అయితే ఇవన్నీ శాశ్వతమైనవి కావు. పైగా ఈ మూడు ప్రాతిపదికలు ఒక్కోసారి అనర్థాలకు కూడా మూలం అవుతుంటాయి. కాని ధార్మికత శాశ్వతమైనది. ధార్మికురాలైన ఇల్లాలు ఇంటిల్లిపాదినీ ధర్మపథంలో నడిపిస్తుంది. స్త్రీ కేవలం ఒక భార్య మాత్రమే కాదు, ఆమె తన పిల్లలకు తల్లి కూడాను. కనుక ఆమె సద్గుణవతి, ధర్మవతి అయివున్నప్పుడే తన సంతానానికి మంచి శిక్షణను ఇచ్చి, ఉత్తమ సంస్కారాన్ని నూరిపోస్తుంది.

(٨٢٨) وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا رَفَّأَ إِنْسَاناً، إِذَا تَزَوَّجَ، قَالَ: «بَارَكَ اللَّهُ لَكَ، وَبَارَكَ عَلَيْكَ، وَجَمَعَ بَيْنَكُمَا فِي خَيْرٍ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

828. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పెళ్ళి చేసుకున్నవారిని చూచినప్పుడల్లా "దేవుడు శుభాన్ని వొసగుగాక! నీపై శుభాన్ని కురిపించుగాక!! మీరిరువురి కలయికలో శ్రేయోవికాసాలను పొందుపరచుగాక!!!" అని దీవించేవారు.

(٨٢٩) وَعَنْ عَبْدِ اللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: عَلَّمَنَا رَسُولُ اللهِ ﷺ التَّشَهُّدَ فِي الْحَاجَةِ «إِنَّ الْحَمْدَ للهِ، نَحْمَدُهُ، وَنَسْتَعِينُهُ، وَنَسْتَغْفِرُهُ، وَنَعُوذُ بِاللهِ مِنْ شُرُورِ أَنْفُسِنَا، مَنْ يَهْدِهِ اللَّهُ فَلاَ مُضِلَّ لَهُ،

829. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు అవసరాలు, అక్కరల సందర్భాలలో ఈ "తషహ్హుద్"ను నేర్పారు - ఇన్నల్ హమ్ద లిల్లాహి, నహ్మదుహు, వ నస్తయీనుహు, వ నస్తగ్ఫిరుహు, వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా, మఁ యహ్‌దిహిల్లాహు ఫలా ముజిల్లలహు,

وَمَنْ يُضْلِلْ فَلاَ هَادِيَ لَهُ، وَأَشْهَدُ أَنْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَأَشْهَدُ أَنَّ مُحَمَّداً عَبْدُهُ وَرَسُولُهُ وَيَقْرَأُ ثَلاَثَ آيَاتٍ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

వ మన్ యుజ్లిల్ ఫలా హాదియలహు- వ అష్దు అన్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు.''

(అర్థం : ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్ కొరకే. మేము ఆయన్నే స్తుతిస్తున్నాము. సహాయం కోసం ఆయన్నే అర్థిస్తు న్నాము. మన్నింపుకై ఆయన్నే వేడు కుంటున్నాము. ఆంతర్యాల్లో జనించే చెడుగు నుండి అల్లాహ్ శరణువేడు తున్నాము. అల్లాహ్ సన్మార్గం చూపిన వారిని ఎవరూ అపమార్గం పట్టించలేరు. అల్లాహ్ అపమార్గాన వదలివేసిన వారికి ఎవరూ సన్మార్గం ప్రసాదించలేరు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడని నేను సాక్ష్యమిస్తున్నాను - ముహమ్మద్ (సఅసం) దైవదాసుడనీ, దైవసందేశ హరుడని కూడా నేను సాక్ష్యమిస్తు న్నాను). అనంతరం ఆయన మూడు ఆయతులను పారాయణం చేశారు. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ, హాకిమ్ లిరు వురూ దీనిని 'హసన్'గా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ ప్రసంగం కేవలం ఒక్క నికాహ్ సందర్భంగానే గాకుండా ఏ అక్కర ఏర్పడినా ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) ఈ ప్రసంగం చేసేవారు. నికాహ్ (వివాహం) చేసుకునేవాడు సయితం స్వయంగా ఈ 'ఖుత్బా' చదువుకోవాలని అల్లామా అల్ యమానీ చెప్పారు. అయితే ఈ సంప్రదాయం త్యజించబడింది. ప్రసంగం చివరిలో పఠించే మూడు ఆయతుల వివరాలివి: 1) నిసా సూరాలోని మొదటి ఆయత్ ('రఖీబా' వరకు) 2) ఆలి ఇమ్రాన్ సూరా 11వ రుకూలోని

మొదటి ఆయత్ ('ముస్లిమూన్' వరకు) 3) అహ్జాబ్ సూరాలోని చివరి రుకూలోగల ఆయత్ ('అజీమా'వరకు). బాహ్యార్థగ్రాహులు ఈ ప్రసంగాన్ని వాజిబ్ (తప్పనిసరి)గా ఖరారు చేశారు. షాఫయీలలో అబూ అవానా కూడా దీనిని తప్పనిసరిగానే భావించారు. అయితే మిగిలిన విద్వాంసులందరి దృష్టిలో ఇది 'మస్నూన్' (సంప్రదాయం) మాత్రమే.

(٨٣٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا خَطَبَ أَحَدُكُمُ الْمَرْأَةَ فَإِنِ اسْتَطَاعَ أَنْ يَنْظُرَ مِنْهَا إِلَى مَا يَدْعُوهُ إِلَى نِكَاحِهَا فَلْيَفْعَلْ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَرِجَالُهُ ثِقَاتٌ، وَصَحَّحَهُ الْحَاكِمُ. وَلَهُ شَاهِدٌ عِنْدَ التِّرْمِذِيِّ وَالنَّسَائِيِّ عَنِ الْمُغِيرَةِ، وَعِنْدَ ابْنِ مَاجَهْ وَابْنِ حِبَّانَ مِنْ حَدِيثِ مُحَمَّدِ بْنِ مَسْلَمَةَ.

830. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ జాబిర్ (రజి) చెప్పారు : "మీలో ఎవరైనా ఏ మహిళకైనా వివాహ సందేశం పంపినట్లయితే వీలయినంత వరకు ఆమెను ఒకసారి చూసుకుని, ఆమె మీ దాంపత్య జీవితానికి తగునో లేదో నిర్ధారించుకోండి." (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులు ఎన్నదగినవారు. హాకిమ్ దీనిని 'ప్రామాణికం'గా ఖరారు చేశారు. తిర్మిజీ, నసాయిలలో ముగీరా ఉల్లేఖనం దీనికి సాక్ష్యంగా ఉంది. ఇబ్నె మాజా, ఇబ్నె హిబ్బాన్‌లలో ముహమ్మద్ బిన్ మస్లమ ఉల్లేఖనం సాక్ష్యంగా ఉంది)

## సారాంశం

ఈ హదీసును బట్టి స్పష్టమయ్యేదేమిటంటే పురుషుడు తాను వివాహమాడ దలచుకున్న స్త్రీని ఓ సారి స్వయంగా చూచుకోవటం మంచిది. ఇలా చూడటం అధిక సంఖ్యాక పండితుల దృష్టిలో అభిలషణీయం మాత్రమేగాని అనివార్యం కాదు. తమ బంధువుల్లోని విశ్వసనీయులైన ఒక మహిళను పంపి కాబోయే భార్యను చూడటం, ఆమె గుణగణాలను, వ్యవహార సరళిని గురించి తెలుసుకోవటం కూడా సమంజసమే. దైవప్రవక్త (సఅసం) వారు సయితం ఉమ్మె సులైమ్‌ను పంపించి ఆమె ద్వారా ఒక మహిళ గురించి వాకబు చేశారు.

## హదీసు ఉల్లేఖకులు

ముహమ్మద్ బిన్ మస్లమ : ఈయన జ్ఞానులైన సహాబీలలో ఒకరుగా పరిగణించబడేవారు. అన్సార్లలోని హారిస్ తెగకు చెందిన వారవటం చేత అన్సారీగా, హారిసీగా వ్యవహరించబడేవారు. ఒక్క తబూక్ మినహా మిగిలిన యుద్ధాలలో హాజరయ్యారు. మదీనాలో హజ్రత్ ముసాబ్

బిన్ ఉమైర్ (రజి) చేతుల మీదుగా ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 43వ సంవత్సరంలో 77 యేండ్ల వయసులో మరణించారు.

(٨٣١) وَلِمُسْلِمٍ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لِرَجُلٍ تَزَوَّجَ امْرَأَةً: **أَنَظَرْتَ إِلَيْهَا؟ قَالَ لاَ، قَالَ: اذْهَبْ فَانْظُرْ إِلَيْهَا.**

831. 'ముస్లిం'లో హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ఇలా వుంది : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పెళ్ళి చేసుకోబోతున్న ఒక వ్యక్తినుద్దేశ్యించి, "నువ్వామెను చూచావా?" అని అడిగారు. 'లేద'ని అతడు చెప్పాడు. "అయితే వెళ్ళి (ఒకసారి) ఆమెను చూసుకో" అని ఆయన (స) సలహా ఇచ్చారు.

**సారాంశం**

కాబోయే శ్రీమతిని చూడటం 'తప్పనిసరి' అన్నది దీని భావం కాదు. 'ఉత్తమం' అన్నదే ఈ హదీసు ఉద్దేశ్యం. ఈ 'చూపు' కూడా సంబంధం నిశ్చయం కాకముందే జరగాలి. అన్నీ అయిన తరువాత ఆఖరిక్షణంలో అమ్మాయి నచ్చలేదు పొమ్మంటే అమ్మాయి తరపువారికి మనస్తాపం కలుగుతుంది.

(٨٣٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لاَ يَخْطُبُ أَحَدُكُمْ عَلَى خِطْبَةِ أَخِيهِ، حَتَّى يَتْرُكَ الْخَاطِبُ قَبْلَهُ، أَوْ يَأْذَنَ لَهُ الْخَاطِبُ».** مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

832. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "మీలో ఎవరైనా ఒకరు ఒకచోట వివాహ సందేశం పంపినపుడు మరొకరు - తమ సోదరునికి పోటీగా - అక్కడికి తమ వైపునా వివాహ సందేశం పంపకండి. అయితే మొదటి వ్యక్తి తన ప్రయత్నాన్ని విరమించుకుంటే లేదా రెండవ వ్యక్తికి ఆ మేరకు అనుమతిస్తే అప్పుడు ముందడుగు వేయవచ్చు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒకరు ఒకచోట పెళ్ళి సంబంధం కోసం ప్రయత్నాలు చేస్తుండగా ఇంకొకరు మధ్యలో

తల దూర్చరాదని ఈ హదీసునుబట్టి విదితమవుతోంది. అయితే ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) సంఘటన దృష్ట్యా చూస్తే, ఒకే సమయంలో ఒక మహిళకు రెండు మూడు వివాహ సందేశాలు వచ్చినా తప్పులేదని తెలుస్తోంది. ఎందుకంటే ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా)కు రెండు పెళ్ళి సంబంధాలు రాగా, ఆమె దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి సలహా తీసుకున్నారు. అయితే ఈ సంఘటన ఈ హదీసుకు విరుద్ధమని భావించనవసరం లేదు. బహుశా రెండవ సందేశం పంపిన వారికి మొదటి సందేశం గురించి తెలీదేమో! పెండ్లి సంబంధం ఖాయమైన తరువాత, మరొకరు సందేశం పంపకూడదని, ఖాయం కాక మునుపైతే సందేశం పంపవచ్చని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు.

(٨٣٣) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ السَّاعِدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَتِ امْرَأَةٌ إِلَى رَسُولِ اللهِ ﷺ فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! جِئْتُ أَهَبُ لَكَ نَفْسِي، فَنَظَرَ إِلَيْهَا رَسُولُ اللهِ ﷺ، فَصَعَّدَ النَّظَرَ فِيهَا وَصَوَّبَهُ، ثُمَّ طَأْطَأَ رَسُولُ اللهِ ﷺ رَأْسَهُ، فَلَمَّا رَأَتِ الْمَرْأَةُ أَنَّهُ لَمْ يَقْضِ فِيهَا شَيْئاً جَلَسَتْ، فَقَامَ رَجُلٌ مِّنْ أَصْحَابِهِ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنْ لَّمْ تَكُنْ لَكَ بِهَا حَاجَةٌ

833. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ (రజి) కథనం : ఒక మహిళ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నా అంతట నేను మీకు సమర్పించుకునే ('హిబా' చేసుకునే) ఉద్దేశ్యంతో మీ దగ్గరకు వచ్చాను" అని విన్నవించుకుంది. దైవ ప్రవక్త (సఅసం) ఆమెను ఓసారి ఎగాదిగా చూసి తల దించుకున్నారు. దైవప్రవక్త (స) తన గురించి ఏ నిర్ణ యమూ తీసుకోలేదని తలపోసిన ఆ స్త్రీ అక్కడే క్రింద కూర్చుంది. అప్పుడు ప్రవక్త సహచరులలోని ఒకతను లేచి, "దైవ ప్రవక్తా (స)! ఆమె మీకక్కరలేకపోతే నాకిచ్చి పెళ్ళి జరిపించండి" అని విన్న వించుకున్నాడు. దైవప్రవక్త (స) అతని ఈ మాట విని, "నీ దగ్గర (మహర్‌గా ఇవ్వడానికి) ఏదైనా వస్తువు ఉందా?" అని అడిగారు. దానికా వ్యక్తి "దైవ సాక్షిగా చెబుతున్నాను దైవప్రవక్తా (స)! నా దగ్గర ఏమీలేదు" అని చెప్పాడు. "నీ ఇంటికెళ్ళి ఏదైనా దొరుకుతుందేమో

فَزَوِّجْنِيهَا، قَالَ: **فَهَلْ عِنْدَكَ مِنْ شَيْءٍ؟** فَقَالَ: لاَ، وَاللهِ يَا رَسُولَ اللهِ! فَقَالَ: **اَذْهَبْ إِلَى أَهْلِكَ، فَانْظُرْ هَلْ تَجِدُ شَيْئاً؟** فَذَهَبَ، ثُمَّ رَجَعَ، فَقَالَ: لاَ وَاللهِ، مَا وَجَدْتُ شَيْئاً. فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **اُنْظُرْ وَلَوْ خَاتماً مِنْ حَدِيْدٍ،** فَذَهَبَ ثُمَّ رَجَعَ، فَقَالَ: لاَ وَاللهِ يَا رَسُولَ اللهِ! وَلاَ خَاتَماً مِنْ حَدِيْدٍ، وَلٰكِن هٰذَا إِزَارِيْ (– قَالَ سَهْلٌ: – مَالَهُ رِدَآءٌ –) فَلَهَا نِصْفُهُ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: **مَا تَصْنَعُ بِإِزَارِكَ؟ إِنْ لَبِسْتَهُ لَمْ يَكُنْ عَلَيْهَا مِنه شَيْءٌ، وَإِنْ لَبِسَتْهُ لَمْ يَكُنْ عَلَيْكَ مِنه شَيْءٌ،** فَجَلَسَ الرَّجُلُ، حَتَّى إِذَا طَالَ مَجْلِسُهُ قَامَ، فَرَآهُ رَسُولُ اللهِ ﷺ مُوَلِّياً فَأَمَرَ بِهِ فَدُعِيَ به، فَلَمَّا جَآءَ، قَالَ: **مَاذَا مَعَكَ مِنَ الْقُرْآنِ؟** قَالَ: مَعِيَ سُورَةُ كَذَا، وَسُورَةُ كَذَا، عَدَّدَهَا، فَقَالَ: **تَقْرَؤُهُنَّ عَنْ ظَهْرِ قَلْبِكَ؟** قَالَ: نَعَمْ، قَالَ: **اَذْهَبْ فَقَدْ مَلَّكْتُكَهَا بِمَا**

వెతుకు" అని ఆయన (స) సలహా ఇచ్చారు. అతను ఇంటికి వెళ్ళి వచ్చి, "దైవసాక్షి! నా ఇంట్లో కూడా ఏ వస్తువూ లభించలేదు" అని అన్నాడు. "కాస్త జాగ్రత్తగా అన్వేషించు. ఒక ఇనుప ఉంగరం దొరికినా సరిపోతుంది" అని దైవప్రవక్త (స) అతన్ని పురమాయించారు. ఆ వ్యక్తి ఇంకొకసారి ఇంటికి వెళ్ళి, తిరిగొచ్చి ఇలా విన్నవించుకున్నాడు : "దైవప్రవక్తా (స)! దైవసాక్షిగా చెబుతున్నాను. ఇనుప ఉంగరం కూడా లేదు. అయితే నేను కట్టుకున్న ఈ లుంగీ మాత్రం ఉంది. ఇందులో నుంచే సగం చించి ఈమెకు (మహర్‌గా) ఇస్తాను." దైవప్రవక్త (స) అతని ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తూ, "దాన్ని ఆమె ఏం చేసుకుంటుంది? ఆ లుంగీని నువ్వు కట్టుకుంటే ఆమె (వంటి) పై ఏమీ మిగలదు. ఒకవేళ ఆమె కట్టుకుంటే, నువ్వు కట్టుకోవడానికి ఏమీ మిగలదు" అని అన్నారు.

ఇది విని ఆ వ్యక్తి (నోరు మెదపకుండా) అక్కడే కూర్చున్నాడు. చాలాసేపు అలాగే కూర్చున్నాడు. కడకు లేచి నిలబడ్డాడు. అతను వెన్నుచూపి తిరిగి వెళ్ళడం గమనించిన దైవప్రవక్త (స) అతణ్ణి పిలిపించమని ఆదేశించారు. అతను తిరిగి వచ్చిన తర్వాత, "నీకు ఖుర్‌ఆన్‌లో

**مَعَكَ مِنَ الْقُرْآنِ.** مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ. وَفِي رِوَايَةٍ لَهُ: «**اذْهَبْ فَقَدْ زَوَّجْتُكَهَا فَعَلِّمْهَا مِنَ الْقُرْآنِ**». وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: «**أَمْلَكْنَاكَهَا بِمَا مَعَكَ مِنَ الْقُرْآنِ**».

ఎంతభాగం జ్ఞాపకముంది?'' అని ఆయన (స) అడిగారు. ''ఫలానా ఫలానా సూరాలు జ్ఞాపకమున్నాయి'' అని చెప్పాడా వ్యక్తి సూరాలను లెక్కపెట్టుకుంటూ. ''మరి ఆ సూరాలను చూడకుండా అప్పజెప్పగలవా?'' అని ఆయన ప్రశ్నించగా, ''అప్పజెప్పగలను'' అని అతను సమాధానమిచ్చాడు. అప్పుడు ఆయన (స), ''వెళ్ళు. ఈ ఖుర్ఆన్ (సూరాల)కు బదులుగా ఈమెను నీ యాజమాన్యంలోకి ఇస్తున్నాను'' అని తీర్పు ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం 'ముస్లిం' లోనివి) ''వెళ్ళు. నేనీమెను నీ దాంపత్యంలోకి ఇచ్చేశాను. కాబట్టి నువ్వు కొంత ఖుర్ఆన్‌ను నేర్పు'' అని వేరొక ఉల్లేఖనంలో ఉంది. ''నీకు జ్ఞాపకమున్న ఈ ఖుర్ఆన్‌కు బదులుగా మేము నిన్ను ఈమెకు యజమానిగా చేశాము'' అని బుఖారీలో ఉంది.

وَلِأَبِي دَاوُدَ عَنْ أَبِي هُرَيْرَةَ، رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: مَا تَحْفَظُ؟ قَالَ: سُورَةَ الْبَقَرَةِ وَالَّتِي تَلِيهَا، قَالَ: **قُمْ، فَعَلِّمْهَا عِشْرِينَ آيَةً.**

అబూదావూద్‌లో హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ''నీవు ఎంత వరకు ఖుర్ఆన్ కంఠస్థం చేశావు?'' అని ఆయన (స) ప్రశ్నించగా, ''బఖరా సూరాతో పాటు, ఆ తర్వాతి సూరా (ఆలి ఇమ్రాన్)'' అని ఆ వ్యక్తి బదులిచ్చాడు. దానికాయన (స) ''సరే. ఆమెకు ఇరవై ఆయతులు నేర్పించు'' అని సలహా ఇచ్చారు.

(٨٣٤) وَعَنْ عَامِرِ بْنِ عَبْدِ اللهِ بْنِ الزُّبَيْرِ، عَنْ أَبِيْهِ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**أَعْلِنُوا النِّكَاحَ**». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

834. హజ్రత్ ఆమిర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) కథనం : ఈయన తన తండ్రి ఆధారంగా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు : "నికాహ్ గురించి ప్రకటన గావించండి." (దీనిని అహ్మద్ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైందిగా నిర్ధారించారు)

### సారాంశం

వివాహం రహస్యంగా, గుట్టుచప్పుడు కాని విధంగా చేసుకోరాదనీ, పైగా ఇది బహిరంగంగా - నలుగురికీ తెలిసేలా - చేసుకోవాలని ఈ హదీసు చెబుతోంది. వివాహం ఒక సామాజిక అంశం; సమాజంలోని కట్టుబాట్లతో, ధర్మాధర్మాలతో ముడిపడి ఉన్న విషయం. ఇరువురు అపరిచిత వ్యక్తుల సంబంధాలను సమ్మతించి ఆమోదించే పవిత్ర ఒప్పందమే వివాహం (నికాహ్). కాబట్టి ఈ సంగతి పరిసరాల వారికి తెలియాలి. లేకుంటే ఆ నూతన దంపతుల గురించి లోకంలో గుసగుసలు మొదలయ్యే అవకాశం ఉంటుంది.

### హదీసు ఉల్లేఖకులు

ఆమిర్ బిన్ అబ్దుల్లాహ్ : పూర్తి వంశపరంపర ప్రకారం ఆమిర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ బిన్ అవ్వామ్ అసదీ ఖురషీ. మదీనా వాసులు. తన తండ్రినోట, ఇతరుల నోట హదీసులు విన్నారు. దైవభక్తి పరాయణులు. ఎన్నదగిన తాబయీన్లలో ఒకరు. హిజ్రీ 124లో మరణించారు.

(٨٣٥) وَعَنْ أَبِي بُرْدَةَ عن أَبِيْ مُوْسَى، عَنْ أَبِيْهِ، قَالَ: قَالَ رَسولُ اللهِ ﷺ: «**لاَ نِكَاحَ إِلاَّ بِوَلِيٍّ**». رَوَاهُ أَحْمَد وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ الْمَدِيْنِيِّ وَالتِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ، وَأُعِلَّ بِالْإِرْسَالِ.

835. హజ్రత్ అబూ బుర్దా బిన్ అబూ మూసా తన తండ్రి ఆధారంగా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "సంరక్షకుడు (వలీ) లేకుండా నికాహ్ కానేకాదు." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. ఇమామ్ ఇబ్నె మదీనీ, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని సహీహ్‌గా

ఖరారు చేశారు. కాని ఈ హదీసు 'ముర్సల్' అవటంచేత లోప భూయిష్ట మైనదిగా తేల్చటం జరిగింది)

وَرَوَى الْإِمَامُ أَحْمَدُ، عَنِ الْحَسَنِ، عَنْ عِمْرَانَ بْنِ الْحُصَيْنِ مَرْفُوعاً: لاَ نِكَاحَ إِلاَّ بِوَلِيٍّ وَشَاهِدَيْنِ.

ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) గారు హసన్ ద్వారా, ఆయన ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) ద్వారా చేసిన 'మర్ఫూ' ఉల్లేఖనం ప్రకారం "సంరక్షకుడు మరియు ఇద్దరు సాక్షులు లేనిదే పెండ్లి జరిపించబడదు."

**సారాంశం**

వలీ లేక సంరక్షకుడు అనుమతి ఇచ్చేవరకూ నికాహ్ జరగదని ఈ హదీసు ఆధారంగా తెలుస్తోంది. ఈ హదీసును 30 మంది ప్రవక్త సహచరులు (ర.అన్హుం) చెప్పారు. అయితే చెప్పే తీరులో కొంత వైవిధ్యం ఉండటం మూలంగా కొందరి ఉల్లేఖనాలు 'జయీఫ్'గా పేర్కొనబడ్డాయి. ఒక సంరక్షకుడు, ఇద్దరు సాక్షులు లేకుండా నికాహ్ కాజాలదని అత్యధిక మంది ఉలమా కూడా తేల్చి చెప్పారు. 'వలీ' అంటే తండ్రి అన్నమాట! తండ్రి లేనిపక్షంలో తాత, పినతండ్రికి ఈ పెద్దరికం వర్తిస్తుంది. ఒకవేళ ఇద్దరు సంరక్షకులుండి వారిరువురి మధ్య అభిప్రాయభేదం ఏర్పడితే, అట్టి పరిస్థితిలో సమీప బంధువుకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఒకవేళ అసలు సంరక్షకుడే లేకుంటే రాజ్యాధికారి సంరక్షకుడవుతాడు.

(٨٣٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**أَيُّمَا امْرَأَةٍ نَكَحَتْ بِغَيْرِ إِذْنِ وَلِيِّهَا فَنِكَاحُهَا بَاطِلٌ، فَإِنْ دَخَلَ بِهَا فَلَهَا الْمَهْرُ بِمَا اسْتَحَلَّ مِنْ فَرْجِهَا، فَإِنِ اشْتَجَرُوا فَالسُّلْطَانُ وَلِيُّ مَنْ لاَ وَلِيَّ**

836. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు : ఏ స్త్రీ అయినా తన సంరక్షకుని (వలీ) అనుమతి లేకుండా వివాహం చేసుకుంటే, ఆమె వివాహం అధర్మం అవుతుంది. మరి, ఆమె భర్త గనక ఆమెతో సంభోగిస్తే, ఆమె మానాన్ని తన కొరకు ధర్మబద్ధంగా చేసుకున్నందుకు గాను ఆమెకు మహర్ హక్కు ఉంటుంది. మరి వారి మధ్య (అంటే సంరక్షకుని విషయమై) కలతలు రేగి, వారికెవరూ సంరక్షకులు లేకుండా

لَهُ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ أَبُو عَوَانَةَ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

ఉంటే రాజ్యాధికారి సంరక్షకుడుగా ఉంటాడు. ('నలుగురి'లో నసాయి తప్ప మిగిలిన వారు దీనిని ఉల్లేఖించారు. అబూ అవానా, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు ముగ్గురూ దీనిని ప్రామాణిక మైనదిగా నిర్ధారించారు)

(٨٣٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ تُنْكَحُ الْأَيِّمُ حَتَّى تُسْتَأْمَرَ، وَلاَ تُنْكَحُ الْبِكْرُ حَتَّى تُسْتَأْذَنَ**»، قَالُوا: يَا رَسُولَ اللهِ! وَكَيْفَ إِذْنُهَا؟ قَالَ: «**أَنْ تَسْكُتَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

837. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "వితంతువు వివాహం ఆమెను సంప్రతించనంత వరకూ చేయరాదు. అలాగే కన్య వివాహం ఆమె అంగీకారం పొంద నంత వరకూ జరిపించరాదు." - "ఓ దైవప్రవక్తా (స)! ఎలాంటి అంగీకారం?" అని అక్కడున్నవారు సందేహపడగా, "మౌనమే ఆమె అంగీకారం" అని దైవప్రవక్త (సఅసం) సమాధానమిచ్చారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా సామాజిక వ్యవస్థలో స్త్రీకి గల ప్రాముఖ్యతను ఇస్లాం నొక్కి చెబుతోంది. స్త్రీ ఇష్టాయిష్టాలతో ఏమాత్రం నిమిత్తం లేకుండా ఆమెను ఒక ఆట వస్తువుగా లెక్కకట్టే సమాజంలో ఇస్లాం ఆమెకొక సమున్నత స్థానాన్ని ప్రసాదించింది. వివాహాది విషయాలలో పూర్వం ఆమెను సంప్రతించటం అటుంచి కనీసం ఆమెకు తన మనసులోని మాటను చెప్పే అనుమతి కూడా ఉండేది కాదు. ఆమె సంరక్షకుడు ఆమెను, తాను కోరిన వాడికిచ్చి కట్టబెట్టేవాడు. కాదనే హక్కు స్త్రీకి లేదు. అయితే మహాప్రవక్త (స) స్త్రీ సమ్మతి లేకుండా ఆమె నికాహ్ జరిపించరాదని చెప్పి సమాజంలో ఆమె మనోరథానికి, ఎంపికకు తగిన గుర్తింపును ఇచ్చారు. భర్తను పోగొట్టుకున్న స్త్రీకి పునర్వివాహం జరిపించేటప్పుడు ఆమెను తప్పక సంప్రతించాలని, కన్యకు పెళ్ళి నిశ్చయం చేసేటప్పుడు ఆమె అంగీకారం పొందాలని ఆయన (స) బోధించారు.

(٨٣٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الثَّيِّبُ أَحَقُّ بِنَفْسِهَا مِنْ وَلِيِّهَا، وَالْبِكْرُ تُسْتَأْمَرُ، وَإِذْنُهَا سُكُوتُهَا**». رَوَاهُ مُسْلِمٌ.

838. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం చేశారు : భర్త చనిపోయిన స్త్రీ తన పునర్వివాహం విషయంలో తన సంరక్షకుని కన్నా ఎక్కువగా నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. అయితే కన్య అయినప్పుడు ఆమె అనుమతి తీసుకోవాలి. ఆమె మౌనమే ఆమె అంగీకారానికి ఆనవాలు." (ముస్లిం)

وَفِي لَفْظٍ: «**لَيْسَ لِلْوَلِيِّ مَعَ الثَّيِّبِ أَمْرٌ وَالْيَتِيمَةُ تُسْتَأْمَرُ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది : భర్తను పోగొట్టుకున్న స్త్రీ వ్యవహారంలో సంరక్షకునికి ఎలాంటి నిర్ణయాధికారం లేదు. (వితంతువు అభీష్టం ప్రకారమే పునర్వివాహం జరగాలి). అనాధల్ని కూడా వారి వివాహ విషయమై వారి సలహా తీసుకోవాలి. (దీనిని అబూ దావూద్, నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని 'ప్రామాణికం'గా ఖరారు చేశారు)

**సారాంశం**

అత్యధికమంది విద్వాంసులు ఈ హదీసుకు చెప్పిన భావార్థం ప్రకారం; ఒకవేళ సంరక్షకుడు (వలీ, గార్డియన్) స్వయంగా భర్త చనిపోయిన స్త్రీని నికాహ్ చేసుకోవడానికి సిద్ధపడితే, మరో వైపు అతనితో నికాహ్‌కు ఆ వితంతువు సుముఖంగా లేకపోతే అప్పుడామెపై ఎలాంటి బలవంతానికి, ఒత్తిడికి అస్కారముండరాదు. ఒకవేళ ఆ వితంతువు తాను కోరిన వ్యక్తిని పెళ్ళి చేసుకోదలచినపుడు సంరక్షకుడు అభ్యంతరం తెలిపితే అట్టి పరిస్థితిలో కూడా వితంతువు అభీష్టానికే ప్రాధాన్యత నివ్వబడుతుంది. అసలామె పునర్వివాహమే చేసుకోరాదని సంరక్షకులు మొండికేసినట్లయితే అట్టి పరిస్థితిలో వారు సంరక్షకులుగా ఉండే హక్కును కోల్పోతారు. ఆమె నికాహ్ బాధ్యతను ఖాజీ స్వయంగా వహిస్తాడు. స్త్రీ పునర్వివాహ హక్కు తిరుగులేనిది అనడానికి ఇదొక ప్రబల తార్కాణం.

(٨٣٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تُزَوِّجُ الْمَرْأَةُ الْمَرْأَةَ، وَلاَ تُزَوِّجُ الْمَرْأَةُ نَفْسَهَا**». رَوَاهُ ابْنُ مَاجَهْ وَالدَّارَقُطْنِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ.

839. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ స్త్రీ కూడా మరో స్త్రీకి సంరక్షకురాలిగా నిలిచి నికాహ్ చేయించటంగానీ, స్వయంగా తన నికాహ్ చేసుకోవటం గానీ చేయజాలదు." (ఇబ్నె మాజా, దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులంతా విశ్వసనీయులే)

**సారాంశం**

ఒక స్త్రీ మరో స్త్రీకి 'ప్యాట్రన్'గా ఉండి పెండ్లి జరిపించజాలదనీ, ఖుద్దుగా తన వివాహం సయితం 'వలీ' లేకుండా చేసుకోజాలదని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అత్యధిక మంది విద్వాంసుల అభిమతం కూడా ఇదే. అయితే హనఫీ ధర్మవేత్తల దృక్పథం మరోవిధంగా ఉంది. యుక్త వయస్కురాలు, వివేకవంతురాలైన ఒక మహిళ తన నికాహ్‌ను చేసుకోవటంతో పాటు, యుక్త వయస్సుకు చేరని తన కుమార్తె వివాహం సయితం జరిపించగలదనీ, వేరొకరి వివాహానికి 'వకీల్'గా కూడా ఉండగలదని హనఫీ పండితులు అభిప్రాయపడుతున్నారు.

(٨٤٠) وَعَنْ نَافِعٍ عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الشِّغَارِ، وَالشِّغَارُ أَنْ يُزَوِّجَ الرَّجُلُ ابْنَتَهُ عَلَى أَنْ يُزَوِّجَهُ الآخَرُ ابْنَتَهُ، وَلَيْسَ بَيْنَهُمَا صَدَاقٌ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاتَّفَقَا مِنْ وَجْهٍ آخَرَ عَلَى أَنَّ تَفْسِيرَ الشِّغَارِ مِنْ كَلاَمِ نَافِعٍ.

840. హజ్రత్ నాఫె, ఇబ్నె ఉమర్ (రజి) ఆధారంగా చేసిన కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) షిగార్ పద్ధతిని వారించారు. ఒక వ్యక్తి మహర్ ఇచ్చి పుచ్చుకోవడాలతో నిమిత్తం లేకుండా తన కుమార్తెను మరొక వ్యక్తి కిచ్చి పెళ్ళి జరిపించి, అతని కుమార్తెను తాను పెళ్ళి చేసుకోవడాన్నే 'షిగార్' అంటారు. (బుఖారీ, ముస్లిం - 'షిగార్' కు సంబంధించి ఇవ్వబడిన నిర్వచనం నాఫె గారిదన్న విషయంలో బుఖారీ, ముస్లిం లిరువురి మధ్య ఏకాభిప్రాయం ఉంది)

(٨٤١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ جَارِيَةً بِكْراً أَتَتِ النَّبِيَّ ﷺ، فَذَكَرَتْ أَنَّ أَبَاهَا زَوَّجَهَا وَهِيَ كَارِهَةٌ، فَخَيَّرَهَا رَسُولُ اللهِ ﷺ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَأُعِلَّ بِالْإِرْسَالِ.

841. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: ఒక యువతి (కన్య) దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, తన తండ్రి తన కిష్టంలేని వ్యక్తితో తన నికాహ్ (వివాహం) చేశాడని ఫిర్యాదు చేసింది. ఇది విని దైవప్రవక్త (సఅసం) ఆ యువతికి 'నిర్ణయాధికారం' ఇచ్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - ఈ హదీసు 'ముర్సల్' అయిన కారణంగా దీనిని లోపభూయిష్టంగా భావించటం జరిగింది)

**సారాంశం**

వధువు తండ్రి వధువుకు సంరక్షకుడని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. కూతురిని సంప్రతించకుండానే అతడు తన కూతురి వివాహమైతే జరపగలడు గాని, షరీయత్‌పరంగా ఆ వివాహ బంధాన్ని కొనసాగించే లేక రద్దుపరచే అధికారం కూతురికి ఉంటుంది.

(٨٤٢) وَعَنِ الْحَسَنِ، عَنْ سَمُرَةَ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **أَيُّمَا امْرَأَةٍ زَوَّجَهَا وَلِيَّانِ فَهِيَ لِلأَوَّلِ مِنْهُمَا.** رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

842. హజ్రత్ హసన్ (రజి), హజ్రత్ సముర (రజి) ఆధారంగా చేసిన ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఏ స్త్రీ నికాహ్ అయినా ఇద్దరు సంరక్షకులు (ఇరువురు వేర్వేరు వ్యక్తులతో) జరిపిస్తే ఈ స్త్రీ మొదటి భర్తకే చెందుతుంది." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ దీన్ని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం స్పష్టమయ్యేదేమిటంటే ఒక స్త్రీకి ఇద్దరు పెద్దలు సంరక్షకులుగా ఉండి, వారు తమకు నచ్చిన ఇరువురు వ్యక్తులతో ఆమె వివాహం జరిపిస్తే, ఆ ఇరువురిలో

మొదట నికాహ్ చేసుకున్న వ్యక్తి మాత్రమే ఆమెకు భర్త అవుతాడు. తరువాతి నికాహ్ అధర్మంగా ఖరారు చేయబడుతుంది. ఎందుకంటే ఇస్లామీయ షరీయత్ ఒక నికాహ్ రద్దు కానంతవరకూ మరో నికాహ్‌ను ఆమోదించదు. ఒకవేళ రెండు నికాహ్‌లు కూడా ఏకకాలంలో జరిగితే ఆ రెండూ అధర్మంగానే పరిగణించబడతాయి. వాటిల్లో ఏ ఒక్కటీ చెల్లదు. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలకు ఏమాత్రం తావులేదు.

(٨٤٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ **أَيُّمَا عَبْدٍ تَزَوَّجَ بِغَيْرِ إِذْنِ مَوَالِيْهِ وَأَهْلِهِ فَهُوَ عَاهِرٌ.** رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَكَذٰلِكَ ابْنُ حِبَّانَ.

843. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం - "ఏ బానిస అయితే తన యజమానుల, దొరల అనుమతి లేకుండా నికాహ్ చేసుకుంటాడో అతడు వ్యభిచారి అవుతాడు." (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అలాగే ఇబ్నె హిబ్బాన్ కూడా దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు)

(٨٤٤) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ يُجْمَعُ بَيْنَ الْمَرْأَةِ وَعَمَّتِهَا، وَلاَ بَيْنَ الْمَرْأَةِ وَخَالَتِهَا**». مُتَّفَقٌ عَلَيْهِ.

844. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు- "ఒకే పురుషుని నికాహ్ (వివాహ బంధం)లో మేనత్త మరియు ఆమె సోదర కుమార్తె ఉండరాదు. (అలాగే) పిన్ని మరియు ఆమె సోదరి కుమార్తె కూడా ఒక పురుషుని వివాహ బంధంలో (ఒకే సమయంలో) ఉండరాదు.

(బుఖారీ, ముస్లిం)

(٨٤٥) وَعَنْ عُثْمَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ يَنْكِحُ**

845. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ ఉస్మాన్ (రజి) చెప్పారు : "ఇహ్రామ్ కట్టుకున్న

**الْمُحْرِمُ، وَلاَ يَنْكِحُ»**. رَوَاهُ مُسْلِمٌ. وَفِي رِوَايَةٍ لَهُ: **«وَلاَ يَخْطُبُ»**. زَادَ ابْنُ حِبَّانَ **«وَلاَ يُخْطَبُ عَلَيْهِ»**.

వ్యక్తి స్వయంగా తన వివాహం చేసుకోవటం గానీ, ఇతరుల వివాహం జరిపించటం గానీ చేయరాదు.'' (ముస్లిం) ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ''వివాహ సందేశం కూడా పంపరాదు'' అని ఉంది. ''అతని వివాహ సందేశానికి సమాధానం కూడా ఇవ్వరాద''ని ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖించారు.

(٨٤٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: تَزَوَّجَ النَّبِيُّ ﷺ مَيْمُونَةَ وَهُوَ مُحْرِمٌ مُتَّفَقٌ عَلَيْهِ. وَلِمُسْلِمٍ عَنْ مَيْمُونَةَ نَفْسِهَا: أَنَّ النَّبِيَّ ﷺ تَزَوَّجَهَا وَهُوَ حَلاَلٌ.

846. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ మైమూనా (ర.అన్హా) ను వివాహం చేసుకున్నప్పుడు ఆయన (స) ఇహ్రాం స్థితిలో ఉన్నారు (బుఖారీ, ముస్లిం). అయితే 'ముస్లిం'లో స్వయంగా హజ్రత్ మైమూనా (ర. అన్హా) చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (స) తనను నికాహ్ చేసుకున్న సమయంలో ఆయన (స) 'హలాల్' స్థితిలోనే ఉన్నారు (ఇహ్రామ్ స్థితిలో లేరు).

**సారాంశం**

'ఇహ్రామ్' స్థితిలో ఉండటమంటే హజ్ మరియు ఉమ్రా కోసం దీక్షబూని రెండు తెల్లని వస్త్రాలను కట్టుకోవటం అన్నమాట! హజ్ లేక ఉమ్రా క్రియలు ముగిసే వరకూ 'ముహ్రిమ్'పై కొన్ని ఆంక్షలు ఉంటాయి. కొన్ని పనులు అతని కొరకు నిషేధించబడతాయి. వాటిలో పెండ్లి చేసుకోవటం కూడా ఒకటి.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇహ్రామ్ స్థితిలో చేసుకున్న ఈ నికాహ్‌ను నిదర్శనంగా పేర్కొంటూ కొంతమంది 'ముహ్రిమ్' నికాహ్ చేసుకోవటాన్ని ధర్మసమ్మతంగా భావిస్తున్నారు. అయితే పై హదీసులోని చివరి వాక్యంలో హజ్రత్ మైమూనా (ర.అన్హా) గారు స్వయంగా స్పష్టపరిచారు - ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) 'ముహ్రిమ్'గా లేరనీ, ఇహ్రామ్ ఆంక్షల నుండి విముక్తులై హలాల్ స్థితిలో ఉన్నారని! ఈ వివాహానికి మధ్యవర్తిగా ఉండి, వివాహం

జరిపించటంలో కీలకపాత్ర పోషించిన అబూరాఫె (రజి) గారు కూడా ఆ సమయంలో మహాప్రవక్త (స) హలాల్ స్థితిలోనే ఉన్నారని సాక్ష్యం ఇచ్చారు. ఒకానొక సంఘటనతో ప్రత్యక్ష సంబంధమున్న ఇరువురు విశ్వసనీయులైన వ్యక్తులు నిజానిజాలను లోకానికి చాటిచెప్పినప్పుడు అంచనాలపై ఆధారపడకూడదు. మూల విషయానికి సంబంధించిన సందేహం పటాపంచలైపోయిన తరువాత పాక్షిక, సాపేక్షిక విషయాలను పట్టుకుని ప్రాకులాడటం సమంజసం అనిపించుకోదు. అదీగాక అప్పటికి (అంటే మహాప్రవక్త (స) హజ్రత్ మైమూనాను వివాహమాడిన నాటికి) హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) వయస్సు పదేళ్లకు మించిలేదు. ఈ విషయాన్ని చెప్పటంలో ఇబ్నె అబ్బాస్ (రజి) గారి అంతరార్థం ఇంకొకటి అయి ఉండవచ్చు - దైవప్రవక్త (స) ఇహ్రామ్ స్థితిలో ఉన్నారంటే పవిత్ర మక్కా హద్దుల లోపల ఉన్నారనే భావంలో బహుశా ఆయన ఈ విధంగా అని ఉండవచ్చు! ఒకవేళ మహాప్రవక్త (స) నిజంగానే ఇహ్రామ్ స్థితిలో నికాహ్ చేసుకున్నారని అనుకున్నా, కొన్ని కొన్ని విషయాలలో అల్లాహ్ తన ప్రవక్త (స) కు ప్రత్యేకతను ఒసగాడన్న సత్యాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ప్రముఖ హదీసువేత్త షేఖ్ అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి "తుహ్ఫతుల్ అహోజీ" (సంపుటి : 2, పేజీ - 89) లో ఈ అంశంపై సుదీర్ఘ చర్చ జరిపారు. మొత్తమ్మీద జమ్‌హూర్ (అధిక సంఖ్యాక విద్వాంసుల) అభిప్రాయం ప్రాధాన్యత నివ్వదగినది.

(٨٤٧) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ أَحَقَّ الشُّرُوطِ أَنْ يُوَفَّى بِهِ، مَا اسْتَحْلَلْتُمْ بِهِ الْفُرُوجَ». مُتَّفَقٌ عَلَيْهِ.

847. హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉద్బోధించారు : "మీరు ఏ షరతులపై స్త్రీల మర్మాంగాలను మీ కోసం ధర్మసమ్మతం గావించుకున్నారో అవి మీరు నెరవేర్చడానికి అన్నింటికన్నా ఎక్కువ హక్కు కలిగిన షరతులు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసునుబట్టి బోధపడేదేమంటే ఒక పురుషుడు ఒక స్త్రీని తన కోసం ధర్మబద్ధం చేసుకోవడానికిగాను అతను నెరవేర్చవలసిన మొట్టమొదటి షరతు, అత్యంత ముఖ్యమయిన షరతు నికాహ్. ఎందుకంటే నికాహ్ ఎంతో సున్నితమయినది. నికాహ్ సందర్భంగా ఇరుపక్షాల వారు షరతులు పెట్టుకోవటం సమంజసమేనని 'సుబులుస్సలాం'లో అనబడింది. ఆ షరతు లేమిటి? వాటిలో 'మహర్' సొమ్మును భార్యకు చెల్లించటం ముఖ్యమైనది. 'మహర్' ద్వారానే ఒక స్త్రీ ఒక పురుషుని కోసం 'హలాల్' అవుతుందని కూడా కొందరు వ్యాఖ్యాతలు అభిప్రాయ

పడ్డారు. మొత్తానికి ఈ షరతుల విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. దాంపత్య హక్కులలో భార్య దేనిని అన్నింటికంటే ఎక్కువగా కోరుకుంటుందో దాన్ని నెర వేర్చటం కూడా ఒక ముఖ్యమైన షరతు అని కొందరి ఉవాచ. తనతో నికాహ్ కోసం స్త్రీని ఒప్పించే ప్రయత్నంలో పురుషుడు ఏ ఏ షరతులకు తలఒగ్గాడో వాటిని అక్షరాలా నెరవేర్చాలని ఇంకొంతమంది వ్యాఖ్యానించారు. అయితే ఈ షరతులు షరీయత్ రీత్యా అధర్మమైనవై ఉండరాదు.

(٨٤٨) وَعَنْ سَلَمَةَ بْنِ الْأَكْوَعِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: رَخَّصَ رَسُولُ اللهِ ﷺ عَامَ أَوْطَاسٍ فِي الْمُتْعَةِ ثَلَاثَةَ أَيَّامٍ، ثُمَّ نَهى عَنْهَا. رَوَاهُ مُسْلِمٌ.

848. హజ్రత్ సలమా బిన్ అక్వా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఔతాస్ యుద్ధం జరిగే రోజుల్లో మూడు రోజుల తాత్కాలిక నికాహ్ ఒప్పందం (ముతా) కొరకు అనుమతి ఇచ్చారు. అయితే తరువాత దీనిని వారించారు." (ముస్లిం)

**సారాంశం**

హదీసులో 'ముతా' అనే పదం ప్రయోగించబడింది. ముతా అనేది ఒక ఒప్పందం. దీని ప్రకారం ఒక పురుషుడు - ఒక స్త్రీ ఒక నిర్ణీత కాలం వరకు కలసి ఉండటానికి అగ్రిమెంట్ చేసుకుంటారు. గడువు పూర్తవగానే విడిపోతారు. మహాప్రవక్త (సఅసం) హయాంలో ఈ తాత్కాలిక నికాహ్ (ముతా) రెండుసార్లు హలాల్ (ధర్మసమ్మతం)గా, రెండుసార్లు హరామ్ (అధర్మం)గా చేయబడినట్లు వివిధ ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఔతాస్ (హునైన్) యుద్ధ సందర్భంగా ఆయన (స) మూడు రాత్రులకోసం దీనిని అనుమతించి, ఆ తరువాత శాశ్వతంగా నిషేధించారు. ఈనాడు ఎవరయినా ఈ "ముతా" విధానాన్ని అవలంబిస్తే అది ముమ్మాటికీ షరీయత్ ఉల్లంఘన క్రిందికే వస్తుందని గమనించాలి. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే హదీసులలో ఉన్నాయి.

(٨٤٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهى رَسُولُ اللهِ ﷺ عَنِ الْمُتْعَةِ عَامَ خَيْبَرَ. مُتَّفَقٌ عَلَيْهِ.

849. హజ్రత్ అలీ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖైబర్ దండయాత్ర జరిగిన సంవత్సరంలో ముతా పద్ధతి (స్త్రీలను తాత్కాలికంగా నికాహ్ చేసుకునే విధానాన్ని) వారించారు. (బుఖారీ, ముస్లిం)

(٨٥٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنْ مُتْعَةِ النِّسَاءِ، وَعَنْ أَكْلِ الْحُمُرِ الْأَهْلِيَّةِ يَوْمَ خَيْبَرَ. أَخْرَجَهُ السَّبْعَةُ إِلاَّ أَبَا دَاوُدَ.

850. హజ్రత్ అలీ (రజి) గారిచే మరో కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్త్రీలను తాత్కాలికంగా వివాహ మాడటాన్ని (ముతా చేసుకోవడాన్ని), పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని ఖైబర్ యుద్ధదినాన వారించారు. ('ఏడుగురి'లో అబూదావూద్ తప్ప అందరూ ఉల్లేఖించారు)

(٨٥١) وَعَنْ رَبِيعِ بْنِ سَبْرَةَ، عَنْ أَبِيهِ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِنِّي كُنْتُ أَذِنْتُ لَكُمْ فِي الاسْتِمْتَاعِ مِنَ النِّسَاءِ، وَإِنَّ اللَّهَ قَدْ حَرَّمَ ذَلِكَ إِلَى يَوْمِ الْقِيَامَةِ، فَمَنْ كَانَ عِنْدَهُ مِنْهُنَّ شَيْءٌ فَلْيُخْلِ سَبِيلَهَا، وَلاَ تَأْخُذُوا مِمَّا آتَيْتُمُوهُنَّ شَيْئاً**». أَخْرَجَهُ مُسْلِمٌ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ وَأَحْمَدُ وَابْنُ حِبَّانَ.

851. హజ్రత్ రబీ బిన్ సబ్ర తన తండ్రి ద్వారా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : నేను ఇంతకు ముందు మీకు స్త్రీలను తాత్కాలికంగా పెళ్ళి చేసుకోవడానికి అనుమతి ఇచ్చి ఉన్నాను. కాని ఇప్పుడు అల్లాహ్ ప్రళయదినం వరకూ ఈ పద్ధతిని నిషిద్ధం గావించాడు. కనుక ఎవరి వద్దయినా 'ముతా' ఒప్పందానికి సంబంధించిన స్త్రీ ఉన్నట్లయితే ఆమెను వదలివేయాలి. వారికి మీరు ఏదన్నా ఇచ్చి ఉంటే దాన్ని తిరిగి తీసుకోకండి." (దీనిని ముస్లిం, అబూదావూద్, నసాయి,ఇబ్నె మాజా, అహ్మద్ మరియు ఇబ్నె హిబ్బాన్‌లు ఉల్లేఖించారు)

### హదీసు ఉల్లేఖకులు

రబీ బిన్ సబ్ర. పూర్తి పరంపర ప్రకారం రబీ బిన్ సబ్ర బిన్ మాబద్ జుహ్నీ మదనీ అనబడతారు. నసాయి మరియు అజ్‌లీ లిరువురూ ఈయన్ని నమ్మదగ్గ వ్యక్తిగా పేర్కొన్నారు.

(٨٥٢) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ الْمُحَلِّلَ وَالْمُحَلَّلَ لَهُ. رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ،

852. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'హలాలా'కు పాల్పడిన

وَصَحَّحَهُ، وَفِي الْبَابِ عَنْ عَلِيٍّ، أَخْرَجَهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ.

వారినీ, ఎవరి కొరకు 'హలాలా'కు పాల్పడటం జరిగిందో వారిని కూడా ధూత్కరించారు. (అహ్మద్, నసాయి, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు- తిర్మిజీ దీనిని ప్రామాణికమైదిగా పేర్కొన్నారు. ఈ అధ్యాయంలో దీనికి సంబంధించిన హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖనం కూడా ఉంది. దానిని 'నలుగురి'లో నసాయి తప్ప అందరూ ఉల్లేఖించారు.

**సారాంశం**

పై హదీసులో 'హలాలా' అనే పదం వచ్చింది. 'హలాలా' చేష్టకు ఒడిగట్టే వాడిని 'ముహల్లిల్'గా వ్యవహరిస్తారు. మూడు విడాకులు పొందిన దంపతులను ధర్మబద్ధంగా మలిసారి నికాహ్ ద్వారా వారు ఏకం కావడానికి మార్గం సుగమం చేసే ఉద్దేశ్యంతో ఒక స్త్రీని నికాహ్ చేసుకుని, ఆమెతో సంభోగం జరిపి వెంటనే ఆమెకు విడాకులు (తలాఖ్) ఇచ్చే వ్యక్తి హలాలాకు పాల్పడిన వాడవుతాడు. అంటే ఈ కృత్యం వెనుక ఇరువురు మగాళ్ల స్వార్థం ఉంది. లేదా కనీసం ఒక మగవాడు తన స్వప్రయోజనం కోసం మరో మగాడిచేత ఈ పని చేయిస్తాడు. ఇది ఒక విధంగా షరీఅత్‌తో చెలగాటమాడటమే. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) 'హలాలా'కు పాల్పడిన వ్యక్తినీ, ఈ చేష్ట కోసం ఇంకొకరిని 'పావు'గా వాడుకున్న మాజీ భర్తను కూడా శపించారు. ఒక్క హనఫీలు తప్ప మెజారిటీ ఉలమాలంతా ఈ పనిని హరామ్‌గానే భావిస్తున్నారు. ఈ చేష్టను మనసున్న మంచి వారెవరూ హర్షించలేరు. ముస్లింలే గాకుండా ముస్లిమేతరులు సయితం దీన్ని దుష్ట చేష్టగా తలపోస్తున్నారు.

ఇక్కడ ఇంకొక విషయం కూడా గమనార్హమే. సంకల్పం లేక ఉద్దేశ్యంలో చెడుగు ఉంటేనే అది 'హలాలా'గా పరిగణించబడుతుంది. ఎలాంటి దురుద్దేశ్యం లేకుండా - కాకతాళీయంగానే - ఈ వివాహం జరిగి ఉండి, ఇతరత్రా కారణాల వల్ల ఈ వ్యక్తి ఆమెకు విడాకులిస్తే (లేదా ఆమె ఇతన్నుండి విడాకులు పుచ్చుకుంటే) అట్టి పరిస్థితిలో ఇద్దత్ (గడువు) పూర్తయిన తరువాత ఆమె తనకు మొదటిసారి విడాకులిచ్చిన మాజీ భర్తను తిరిగి వివాహం చేసుకోవచ్చు. అందులో ఎలాంటి దోషం లేదు.

(٨٥٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ

853. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "వ్యభిచార

**يَنْكِحُ الزَّانِي الْمَجْلُودُ إِلاَّ مِثْلَهُ»**. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَرِجَالُهُ ثِقَاتٌ.

నేరానికిగాను కొరడా దెబ్బల శిక్ష పడిన ఒక వ్యభిచారి, తన మాదిరిగా శిక్షను అనుభవించిన వ్యభిచారిణిని తప్ప మరొకరిని పెళ్ళి చేసుకోలేడు" (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. దీనిని అందజేసిన వారు విశ్వస నీయులు)

(٨٥٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: طَلَّقَ رَجُلٌ امْرَأَتَهُ ثَلَاثاً، فَتَزَوَّجَهَا رَجُلٌ، ثُمَّ طَلَّقَهَا قَبْلَ أَنْ يَدْخُلَ بِهَا. فَأَرَادَ زَوْجُهَا الْأَوَّلُ أَنْ يَتَزَوَّجَهَا، فَسَأَلَ رَسُولَ اللهِ ﷺ عَنْ ذٰلِكَ، فَقَالَ: **لاَ حَتَّى يَذُوقَ الْآخَرُ مِنْ عُسَيْلَتِهَا مَا ذَاقَ الْأَوَّلُ**. مُتَّفَقٌ عَلَيْهِ. وَاللَّفْظُ لِمُسْلِمٍ.

854. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: ఒక వ్యక్తి తన భార్యకు మూడు విడాకులు ఇచ్చాడు. (విడాకులు పొందిన) ఆ స్త్రీని మరో వ్యక్తి మను వాడాడు. కాని ఆ వ్యక్తి ఆమెతో సంభో గించకుండానే ఆమెకు విడాకులిచ్చే శాడు. అప్పుడు మొదటి (మాజీ) భర్త ఆమెను తిరిగి నికాహ్ చేసుకోదలిచి, ఆ విషయమై దైవ ప్రవక్త (సఅసం)ను సంప్రతించాడు. అప్పుడాయన (స) "లేదు. ఆమె మొదటి భర్తలా రెండవ భర్త కూడా ఆమెతో రసాస్వాదన పొంద నంతవరకూ ఆమెను తిరిగి వివాహ మాడకూడదు" అని స్పష్టం చేశారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం 'ముస్లిం'లోనివి)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే; మూడుసార్లు విడియాకులు పొందిన మహిళ, మరొక వివాహం చేసుకుని, ఆ దంపతుల మధ్య లైంగిక సంబంధాలు ఏర్పడిన మీదట, రెండవ భర్త కూడా ఆమెకు ఇష్టపూర్వకంగా విడాకులిస్తే (ఒకరి బలాత్కారానికి, ఒత్తిడికి, ప్రలోభాలకు లొంగకుండా తన మనస్ఫూర్తిగా విడాకులిస్తేనే) లేదా రెండవ భర్త మరణిస్తే,అప్పుడామె మొదటి (మాజీ) భర్తను పునర్వివాహం చేసుకోవడానికి షరీఅత్ రీత్యా అర్హురాలు అవుతుంది.

ఒకవేళ ఆమెను వివాహం చేసుకున్న రెండవ భర్తతో ఆమెకు లైంగిక సంబంధం ఏర్పడకపోయినా, లేదా ఆ రెండవ భర్త ఆమెను ఆస్వాదించలేక ఆమెకు విడాకులిచ్చేసినా, అట్టి స్థితిలో మొదటి (మాజీ) భర్తతో ఆమె నికాహ్ ధర్మసమ్మతం కాదు.

ఒకవేళ మొదటి (మాజీ) భర్త దురుద్దేశ్యంతో ఆమెకు ఇంకొకరితో నికాహ్ జరిపించి (హలాలా చేయించి) అతనితో ఆమెను రమింపజేసి, విడాకుల తతంగాన్ని కూడా పూర్తి చేయించి, ఆ స్త్రీని తిరిగి తన దాంపత్య జీవితంలోకి రప్పించుకునే మార్గం సుగమం చేసుకుంటే అసలది 'నికాహ్'యే అనిపించుకోదు. ఎందుకంటే ఇక్కడ సంకల్పంలో కల్మషం, కుళ్ళు నిండి ఉంది. ఈ 'పాపం'లో పాలు పంచుకున్న వారు. (ఇద్దరు పురుషులు + ఒక స్త్రీ) ముగ్గురూ **ధూత్కారులే.**

**1వ అధ్యాయం**

## కుఫ్వ్, ఖీయార్ (సమాన స్థాయి మరియు నిర్ణయాధికారం)

## ١ - بَابُ الْكَفَاءَةِ وَالْخِيَارِ

(٨٥٥) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْعَرَبُ بَعْضُهُمْ أَكْفَاءُ بَعْضٍ، وَالْمَوَالِي بَعْضُهُمْ أَكْفَاءُ بَعْضٍ، إِلاَّ حَائِكاً أَوْ حَجَّاماً**». رَوَاهُ الْحَاكِمُ، وَفِي إِسْنَادِهِ رَاوٍ لَمْ يُسَمَّ، وَاسْتَنْكَرَهُ أَبُو حَاتِمٍ، وَلَهُ شَاهِدٌ عِنْدَ الْبَزَّارِ عَنْ مُعَاذِ بْنِ جَبَلٍ بِسَنَدٍ مُنْقَطِعٍ.

855. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు - "అరబ్బులు ఒండొకరి కొరకు సరిజోడీ (కుఫ్వ్) అవుతారు. సాలెవారు, నాయీ బ్రాహ్మణులు తప్ప మిగిలిన అరబ్బేతరులు (మవాలీలు) కూడా పరస్పరం సమాన స్థాయి కలిగిన వారే-

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు. హదీసు అందిన పరంపరలో ఒక వ్యక్తి పేరు లేదు. ఆ వ్యక్తిని అబూహాతిమ్ 'మున్కర్'గా ఖరారు చేశారు. దీనికి సంబంధించిన ఒక ఆధారం బజ్జార్‌లో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)చే ఉల్లేఖించబడింది. అయితే దీని పరంపర కూడా తెగిపోయింది)

### సారాంశం

హదీసులో 'కుఫ్వ్' అనే పదం వచ్చింది. కుఫ్వ్ అంటే సరిపోలినది, సరితూగేది, సమస్థాయి కలది అని అసలు అర్థం. షరీఅత్ పరిభాషలో ధార్మికంగా, నైతికంగా సమానులుగా పరిగణించబడేవారని భావం. వృత్తిరీత్యా, వంశం దృష్ట్యా ఒకే స్థాయికి చెందిన వారని కూడా భావించబడుతోంది.

ఇక పోతే; ఈ హదీసు అందిన తీరును బట్టి ఇది ప్రామాణిక హదీసు కాదు. హదీసును అందజేసిన వారిలో ఒకతని గురించి హదీసువేత్తలకు సదభిప్రాయం లేదు. ఈ హదీసు 'మున్కర్' అనీ, ఇదొక కల్పన తప్ప మరేమీ కాదని అల్లామా ఇబ్నె అబ్దుల్ బర్ర్ అభిప్రాయ పడ్డారు.

(٨٥٦) وَعَنْ فَاطِمَةَ بِنْتِ قَيْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهَا: «**انْكِحِي أُسَامَةَ**». رَوَاهُ مُسْلِمٌ.

856. హజ్రత్ ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) కథనం : ఉసామా (రజి)ను వివాహమాడమని దైవప్రవక్త (సఅసం) నాకు సలహా ఇచ్చారు. (ముస్లిం)

### సారాంశం

సంకలనకర్త ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకోవటం కొంతమందికి అసందర్భంగా తోచవచ్చు. అయితే ఇస్లాంలో 'కుఫ్వ్'అనేది వంశం, వర్ణం ఆధారంగా లేదనీ, కేవలం ధార్మికత మాత్రమే కుఫ్వ్‌కు ప్రమాణ నికషమని చెప్పటం ఇక్కడ అసలు ఉద్దేశం. ఎందుకంటే ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) ఖురైష్ తెగకు చెందిన 'ఫిహ్ర్' వంశస్థురాలు. కులీన స్త్రీ. కాగా; హజ్రత్ ఉసామా (రజి) స్వయంగా ఒక బానిస. ఆయన తండ్రి కూడా బానిసే.

### హదీసు ఉల్లేఖకులు

ఫాతిమా బిన్తె ఖైస్ బిన్ ఖాలిద్ ఫిహ్రియ (ర.అన్హా) ప్రముఖ సహాబీ అయిన హజ్రత్ జహ్హాక్ (రజి) గారి సోదరిమణి. అందరికన్నా ముందు హిజ్రత్ చేసిన మహిళామణులలో ఈమె ఒకరు. ఈమె ఉల్లేఖనాలను ఒక పెద్ద సమూహం ఉటంకించింది. సౌందర్యవతి. విజ్ఞతా వివేచనలలో సాటి లేనివారు. మొదట ఈమె అబూ అమ్ర్ బిన్ హఫ్స్ (రజి) వివాహబంధంలో ఉండేవారు. ఆయన ఈమెకు విడాకులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ఈమెను ఉసామా బిన్ జైద్ (రజి)కిచ్చి నికాహ్ జరిపించారు. ఈ నికాహ్‌లో అల్లాహ్ ఎన్నో శుభశ్రేయాలను పొందుపరిచాడు. తన ఈ దాంపత్యజీవితాన్ని చూచి ప్రజలు ఈర్ష్య చెందేవారని ఫాతిమా బిన్తె ఖైస్ **(ర.అన్హా)** ఖుద్దుగా చెప్పారు.

(٨٥٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**يَا بَنِي بَيَاضَةَ أَنْكِحُوا أَبَا هِنْدٍ وَانْكِحُوا إِلَيْهِ، وَكَانَ حَجَّاماً**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالْحَاكِمُ بِسَنَدٍ حَسَنٍ.

857. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు: "ఓ బయాజా వంశీయులారా! అబూహింద్ వివాహం చేయండి. అతని కుమార్తెలను వివాహ మాడండి" అబూ హింద్ శస్త్ర చికిత్స ద్వారా శరీరం నుండి చెడు రక్తం తీసే వారన్న సంగతి గమనార్హం. (దీనిని అబూదావూద్, హాకిమ్ లిరువురూ 'హసన్'గా ఉల్లేఖించారు)

## సారాంశం

హదీసులో ప్రస్తావనకు వచ్చిన అబూహింద్ అసలు పేరు యసార్. అరేబియాలోని తెగలలో ఒకటైన బయాజాచే స్వేచ్ఛ నొసగబడిన బానిస ఈయన. అయితే స్వేచ్ఛ పొందిన ఆ బానిసను ఇట్టే వదలివేయకుండా, తమ వంశస్థురాలైన స్త్రీని అతనికిచ్చి వివాహం జరిపించమని మహనీయ ముహమ్మద్ (సఅసం) బయాజా వంశీయులకు సలహా ఇచ్చారు. ఈ విధంగా అంతిమ దైవప్రవక్త (సఅసం) కులగోత్రాల, వర్గ తెగల విషపు కోరలను పీకేశారు. ప్రఖ్యాత సహాబీ, అరేబియాలోని అత్యంత మర్యాదస్తులైన ఖురైష్ వంశస్థులగు హజ్రత్ అబ్దుర్రహాన్ బిన్ ఔఫ్ (రజి)గారు తన తోబట్టువు అయిన 'హాలా'ను నీగ్రో బానిస అయిన హజ్రత్ బిలాల్ (రజి)కిచ్చి నికాహ్ జరిపించి కులీనులు - కులహీనులన్న అజ్ఞానకాలపు అహంభావాలను తుత్తునియలు చేసేశారు. ద్వితీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ (రజి) తన పుత్రిక అయిన హజ్రత్ హఫ్సా (ర.అన్హా)ను దైవ ప్రవక్త (స) దాంపత్య జీవితంలోకి అడుగిడకముందు ఆమెను అరబ్బేతరులైన హజ్రత్ సల్మాన్ (రజి)కిచ్చి వివాహం జరిపించడానికి సిద్ధమైన విషయం కూడా విస్మరించరానిది. ఈ దృష్టాంతాల ద్వారా అవగతమయ్యేదేమిటీ? కులగోత్రాలు, అందచందాలు, ఆస్తి అంతస్థులు ఎంత ప్రాధాన్యత గలవైనప్పటికీ ధార్మిక ప్రాతిపదిక ముందు ఇవన్నీ దిగదుడుపు కావా?!

## హదీసు ఉల్లేఖకులు

అబూహింద్ (రజి): ఈయన పేరు యసార్. మరొక ఉల్లేఖనం ప్రకారం ఈయన అసలు పేరు సాలిమ్ బిన్ అబూ సాలిమ్. వేరొక ఉల్లేఖనానుసారం అబ్దుల్లాహ్ బిన్ హింద్. దైవప్రవక్త (సఅసం)కు శస్త్ర చికిత్స చేసే భాగ్యం ఈయనగారికి దక్కింది. బనూ బయాజాచే స్వేచ్ఛ నొసగబడిన బానిస. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి), అబూహురైర (రజి), జాబిర్ (రజి), ఖాలిద్ (రజి) వంటి గొప్ప సహాబీలు ఈయన నుండి ఉల్లేఖించారు.

(٨٥٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خُيِّرَتْ بَرِيرَةُ عَلَى زَوْجِهَا حِيْنَ عَتَقَتْ. مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيْثٍ طَوِيْلٍ.

وَلِمُسْلِمٍ عَنْهَا: «أَنَّ زَوْجَهَا كَانَ عبداً»، وَفِي رِوَايَةٍ عَنْهَا: «كَانَ حُرًّا»، وَالْأَوَّلُ أَثْبَتُ، وَصَحَّ عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عِنْدَ الْبُخَارِيِّ: «أَنَّهُ كَانَ عَبْداً».

858. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "హజ్రత్ బరీరా(ర.అన్హా)కు బానిసత్వం నుండి స్వాతంత్ర్యం లభించినపుడు, ఆమెకు తన భర్త విషయంలో (అతనితో దాంపత్య జీవితం కొనసాగించాలా? లేక విడాకులు పుచ్చుకోవాలా? అనే విషయంలో) నిర్ణయాధికారం ఇవ్వబడింది." (బుఖారీ, ముస్లిం - ఇది సుదీర్ఘ హదీసులోని ఒక భాగం)

'ముస్లిం'లోని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనంలోనే 'బరీరా భర్త ఒక బానిస' అని ఉంది. ఆమెగారి వేరొక ఉల్లేఖనంలో "అతడు స్వేచ్ఛాజీవి" అని కూడా ఉంది. అయితే మొదటి ఉల్లేఖనమే దృఢమైనది. బుఖారీలో ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ప్రామాణిక ఉవాచలో "అతడు బానిసే" అని వుంది.

**సారాంశం**

బానిసత్వంలో మగ్గే ఒక స్త్రీ బానిసత్వం నుండి విముక్తి నొందిన తరువాత బానిసగానున్న తన భర్తతో కాపురం చేయాలా వద్దా అనే విషయమై నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకుంటుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఈ విషయంలో అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. భర్త కూడా స్వేచ్ఛ నొసగబడిన వాడై ఉన్నప్పుడు భార్య గైకొనే నిర్ణయంపైన్నే అభిప్రాయభేదం ఉంది. ఒక అభిప్రాయం ప్రకారం ఇట్టి స్థితిలో భార్యకు ఎలాంటి నిర్ణయాధికారం ఉండదు- ఆమె తన భర్త దాంపత్యజీవితానికి కట్టుబడి ఉండవలసిందే. ఇది 'జమ్హూర్' అభిప్రాయం. ఈ హదీసు ఎంతో కీలకమైనది. ప్రాధాన్యతతో కూడుకున్నది. ఇస్లామీయ విద్వాంసులు **తమ** గ్రంథాలలో అనేకచోట్ల ఈ హదీసును ప్రస్తావించారు. స్వయంగా ఈ గ్రంథ రచయిత **(రహ్మతై)** కూడా ఈ హదీసు **ఆధారంగా** ఎన్నో అంశాలను వెలికి తీశారు. వాటి సంఖ్య 122కు చెరుకుంది. (సుబులుస్సలామ్).

(٨٥٩) وَعَنِ الضَّحَّاكِ بْنِ فَيْرُوْزَ الدَّيْلَمِيِّ، عَنْ أَبِيْهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنِّي أَسْلَمْتُ، وَتَحْتِي أُخْتَانِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**طَلِّقْ أَيَّتَهُمَا**

859. హజ్రత్ జహ్హాక్ బిన్ ఫైరూజ్ దైలమీ తన తండ్రి ఆధారంగా ఇలా కథనం చేశారు: ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను ఇస్లాంలో ప్రవేశించాను. అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ నా దాంపత్యజీవితంలో ఉన్నారు. మరి నేనేం చేయను? అని నేను (దైలమీ) విన్నవించుకోగా, "ఇద్దరి

شِئْتَ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالدَّارَقُطْنِيُّ وَالْبَيْهَقِيُّ، وَأَعَلَّهُ الْبُخَارِيُّ.

లో నీవు కోరిన ఒకామెకు విడాకులివ్వు" అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు. (దీనిని అహ్మద్, 'నలుగురి'లో నసాయి మినహా మిగిలిన వారందరూ ఉల్లేఖించారు- ఇబ్నె హిబ్బాన్, దారెఖుత్నీ, బైహఖీ దీనిని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు. అయితే బుఖారీ మాత్రం దీనిని 'మాలూల్' అన్నారు)

## సారాంశం

భార్యాభర్తలిరువురూ ఇస్లాంకు ముందు, వేరితర పద్ధతి ప్రకారం వివాహం చేసుకున్నప్పటికీ, ఇస్లాంలో ప్రవేశించిన తరువాత కూడా వారు దాంపత్య జీవితంలో కొనసాగుతారు. భర్త భార్యకు విడాకులు ఇచ్చే వరకూ దాంపత్య జీవితం నుండి ఆమె బయటపడజాలదు. ఇస్లాం స్వీకారం తరువాత ఇంకొకసారి వారు 'నికాహ్' చేసుకోవటం తప్పనిసరి కాదు.

ఇస్లాం ప్రకారం 'అక్కా చెల్లెళ్ళు' ఒకే సమయంలో ఒక వ్యక్తికి భార్యలుగా ఉండటం ధర్మసమ్మతం కాదు. అందుకే మహాప్రవక్త (స) ఇరువురిలో ఎవరో ఒకామెకు విడియాకులు ఇమ్మని సూచించారు.

**రెండు** దశాబ్దాల క్రితం తమిళనాడులో ప్రముఖ రాజకీయవాది, 'నీరోత్తమ్' పత్రిక **సంపాదకుడు**,'నాన్ కాథలిక్కుం ఇస్లాం' (నేను ఆరాధించే ఇస్లాం) రచయిత శ్రీ అడియార్ ఇస్లాం స్వీకరించి అబ్దుల్లా అడియార్‌గా మారినపుడు ఆయనకు సరిగ్గా ఇదే సమస్య ఎదురయింది. పూర్వాశ్రమంలో ఆయన అక్కాచెల్లెళ్ళిద్దరినీ వివాహమాడారు. అయితే ఇస్లాం స్వీకారం తరువాత ఆయన ఒకామెకు విడాకులిచ్చేశారు. - అనువాదకుడు.

ఇంకొక విషయం -

పూర్వాశ్రమంలో అతనికి అనేకమంది భార్యలుంటే, ఉదాహరణకు నలుగురికి మించి భార్యలుంటే, ఇస్లాంలోకి వచ్చిన మీదట నలుగురికి మించిన వారిని కూడా వదలివేయవలసి ఉంటుంది. వారిలో ఏ నలుగురిని తన దగ్గర ఉంచుకోవాలి? మొదటి నలుగురినా? చివరి నలుగురినా? అన్న సందేహం రావచ్చు. ఇది భర్త ఇష్టానికే **వదలివేయబడు**తుంది.'వీళ్ళలో నేను ఫలానా వారిని కోరుకుంటున్నాను' అని అంటే చాలు - **మిగిలిన వారు** అతన్నుండి వేర్పడిపోయినట్లే.

## హదీసు ఉల్లేఖకులు

1) జహ్హాక్ : అరబ్బేతరులు, దైలమీగా పిలువబడేవారు. దైలమ్ అనేది **అసలు** పారసీక

దేశంలోని ఒక పర్వతానికిగల పేరు. జహ్హాక్ సుప్రసిద్ధ తాబయీలలో ఒకరు. ఇబ్ను హిబ్బాన్ గారు ఈయన్ని ఎన్నదగ్గ వ్యక్తిగా ఖరారు చేశారు. ఈయన చాలా వరకు తండ్రి (ఫైరూజ్ దైలమీ) ఆధారంగా హదీసులను వినిపించేవారు. ఈయన హదీసులు బస్రా వాసులలో ఎక్కువగా ప్రస్తావించబడేవి.

2) తండ్రి (ఫైరూజ్ దైలమీ-రజి) : ఈయన హిమ్యరీగా కూడా పిలువబడేవారు. హిమ్యర్‌లో స్థిరపడటం చేత ఆయనకాపేరు సార్థకమయ్యింది. ఈయన పారసీకులు 'సన్‌ఆ'కు చెందిన వారు. దైవప్రవక్త (సఅసం)ను కలుసుకోవడానికి వచ్చిన బృందంలో ఈయన కూడా ఒకరు. యమన్‌లో తనను ప్రవక్తగా ప్రకటించుకున్న బూటకపు ప్రవక్త 'అస్వీ'ని ఈయన తుదముట్టించారు. ఈ వార్త దైవప్రవక్త (సఅసం) మరణ వ్యాధికి గురై ఉన్న కాలంలో ఆయన (స)కు అందింది. ఈయన హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో కన్నుమూశారు.

(٨٦٠) وَعَنْ سَالِمٍ، عَنْ أَبِيْهِ، أَنَّ غَيْلاَنَ بْنَ سَلَمَةَ أَسْلَمَ، وَلَهُ عَشْرُ نِسْوَةٍ، فَأَسْلَمْنَ مَعَهُ، فَأَمَرَهُ النَّبِيُّ ﷺ أَنْ يَتَخَيَّرَ مِنْهُنَّ أَرْبَعاً. رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَأَعَلَّهُ الْبُخَارِيُّ وَأَبُو زُرْعَةَ وَأَبُو حَاتِمٍ.

860. హజ్రత్ సాలిమ్ తన తండ్రి ఆధారంగా కథనం చేశారు: ఘైలాన్ బిన్ సలమా (రజి) ఇస్లాం స్వీకరించే నాటికి ఆయన దగ్గర పదిమంది భార్యలున్నారు. వాళ్ళందరూ ఘైలాన్‌తో పాటు ఇస్లాం స్వీకరించిన వాళ్ళే. అయితే దైవప్రవక్త (స) ఘైలాన్‌నుద్దేశించి "వారిలో నలుగురిని ఎంపిక చేసుకో" అని చెప్పారు. (దీనిని అహ్మద్ మరియు తిర్మిజీ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు ప్రామాణికమైనదిగా నిర్ధారించారు. బుఖారీ, అబూ జర్‌అ, అబూ హాతిమ్‌లు ఈ హదీసును లోపం కలదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఒక ముస్లిం ఏకకాలంలో నలుగురు భార్యలకన్నా ఎక్కువ మందిని కలిగి ఉండటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ ఆజ్ఞ ఒకటి కాదు, అనేక ఉల్లేఖనాల ద్వారా మన ముందుకు వస్తోంది. మరైతే దైవప్రవక్త (సఅసం) దాంపత్యజీవితంలో - ఏకకాలంలో - తొమ్మిదిమంది సతీమణులున్నారు కదా! అన్న సందేహం ఎవరికయినా

కలగవచ్చు. దైవప్రవక్త (స) వ్యవహారం ప్రత్యేకమైనది. అనాటి అరేబియా స్థితిగతుల రీత్యా, ధార్మిక, రాజకీయ పరమార్థాల దృష్ట్యా దేవుడు స్వయంగా తన ప్రవక్తకు ఈ ప్రత్యేక రాయితీని ప్రసాదించాడు. కనుక ఈ వ్యవహారంలో ఆక్షేపణకు తావులేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఫైలాన్ బిన్ సలమా (రజి) : బనీ సఖీఫ్ సర్దారులలో ఒకరు. తాయఫ్ విజయానంతరం ఇస్లాం స్వీకరించారు. మంచి కవి. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో మరణించారు.

(٨٦١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رَدَّ النَّبِيُّ ﷺ ابْنَتَهُ زَيْنَبَ عَلَى أَبِي الْعَاصِ بْنِ الرَّبِيعِ بَعْدَ سِتِّ سِنِينَ بِالنِّكَاحِ الْأَوَّلِ، وَلَمْ يُحْدِثْ نِكَاحاً. رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ أَحْمَدُ وَالْحَاكِمُ.

861. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తన కుమార్తెయగు జైనబ్ (ర.అన్హా)ను ఆరేళ్ళ తరువాత అబుల్ ఆస్ వద్దకు మొదటి నికాహ్ ఆధారం గానే పంపారు. కొత్తగా నికాహ్ చేయ లేదు."(దీనిని అహ్మద్, 'నలుగురి'లో నసాయి తప్ప అందరూ ఉల్లేఖించారు. అహ్మద్, హాకిమ్‌లు దీనిని ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు)

## హదీసు ఉల్లేఖకులు

1) జైనబ్ (ర.అన్హా) : జైనబ్ బిన్నె రసూల్ (సఅసం). ఈమె దైవప్రవక్త (స) కుమార్తెలలో అందరికన్నా పెద్దవారు. ఈమె తల్లి పేరు ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఖదీజతుల్ కుబ్రా (ర.అన్హా). మేనమామ కుమారుడగు అబుల్ ఆస్ బిన్ రబీతో ఈమె పెళ్ళి జరిగింది. ఒక అబ్బాయి పుట్టాడు. అతని పేరు అలీ. (యుక్త వయస్సుకు చేరగానే ఆ అబ్బాయి మరణించాడు. మక్కా విజయం సందర్భంగా ఈ అబ్బాయి దైవప్రవక్త (స) ఒంటెపై కూర్చుని ఉన్నాడు) ఈమె గార్కి ఉమామ అనే అమ్మాయి కూడా జన్మించింది. హజ్రత్ జైనబ్ (ర.అన్హా) బద్ర్ యుద్ధానంతరం హిజ్రత్ చేశారు. హిజ్రీ 8వ సంవత్సరం మరణించారు. దైవప్రవక్త (సఅసం) స్వయంగా ఆమెను సమాధిలోకి దించారు.

2) అబుల్ ఆస్ బిన్ రబీ (రజి) : ఈయన అసలు పేరు మిఖ్సమ్. పూర్తి పరంపర ఇలావుంది - మిఖ్సమ్ బిన్ రబీ బిన్ అబ్దుల్ ఉజ్జా. ఈయన అసలు పేరు లఖీత్ అని మరొక ఉవాచ. ఈయన దైవప్రవక్త(స) పెద్దల్లుడు. ప్రవక్తగారి పెద్ద కూతురు జైనబ్ (ర.అన్హా) ఈయన దాంపత్యంలోనే ఉన్నారు. ఇస్లాం స్వీకారానికి ముందు ఈయన బద్ర్ యుద్ధంలో ముస్లింలకు యుద్ధఖైదీగా పట్టుబడ్డారు. పరిహారం తీసుకోకుండానే ఈయన్ని

విడుదల చేయటం జరిగింది. అయితే జైనబ్ (ర.అన్హా)ను వెంటతీసుకెళ్ళమని ఆయన్ని కోరటం జరిగింది. ఆయన అలాగే చేశారు. ఆ తరువాత ఆయన (ఇస్లాం స్వీకరించి) మదీనాకు వలసవచ్చారు. ఆయన దైవప్రవక్త (స)కు బంధువు. ప్రియతములు. యమామ యుద్ధంలో అమరగతి నొందారు.

(٨٦٢) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ أَنَّ النَّبِيَّ ﷺ رَدَّ ابْنَتَهُ زَيْنَبَ عَلَى أَبِي الْعَاصِ بِنِكَاحٍ جَدِيْدٍ. قَالَ التِّرْمِذِيُّ: حَدِيْثُ ابْنِ عَبَّاسٍ أَجْوَدُ إِسْنَاداً، وَالْعَمَلُ عَلَى حَدِيْثِ عَمْرِو بْنِ شُعَيْبٍ.

862. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ.లై) తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన కుమార్తెయగు హజ్రత్ జైనబ్ (ర.అన్హా)ను అబుల్ ఆస్ వద్దకు సరికొత్తగా నికాహ్ చేసి పంపారు. (ఇబ్నె అబ్బాస్ - రజి-చే ఉల్లేఖించబడిన హదీసు ప్రామాణికత రీత్యా అత్యుత్తమ మైనదనీ, అయితే ఆచరణ అమ్ర్ బిన్ షుఐబ్‌చే ఉల్లేఖించబడిన హదీసుపై ఉందని తిర్మిజీ పేర్కొన్నారు)

(٨٦٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَسْلَمَتِ امْرَأَةٌ، فَتَزَوَّجَتْ، فَجَاءَ زَوْجُهَا: فَقَالَ: يَا رَسُولَ اللّٰهِ! إِنِّي كُنْتُ أَسْلَمْتُ، وَعَلِمَتْ بِإِسْلَامِيْ، فَانْتَزَعَهَا رَسُولُ اللّٰهِ ﷺ مِنْ زَوْجِهَا الْآخَرِ، وَرَدَّهَا إِلَى زَوْجِهَا الْأَوَّلِ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

863. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ఇలావుంది- ఒక స్త్రీ ఇస్లాం స్వీకరించింది. తరువాత వివాహం కూడా చేసుకుంది. అంతలో ఆమె మొదటి భర్త ప్రత్యక్షమై "ఓ దైవప్రవక్తా (స)! నేను కూడా ఇస్లాం స్వీకరించాను. ఈ సంగతి ఆమెకు కూడా తెలుసు" అని విజ్ఞాపన చేసుకున్నాడు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఆమెను అతన్నుండి (రెండవ భర్తనుండి) విడిపించి, మొదటి భర్త దగ్గరకు పంపించారు. (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజ దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు)

**సారాంశం**

ధర్మావలంబన విషయంలో భార్యాభర్తల మధ్య భేదాభిప్రాయం ఏర్పడి భార్య ముస్లిం అయిన కారణంగా వారిరువురి వేర్పాటుకు దారితీస్తే, విడిపోయిన తర్వాత స్త్రీ ఇద్దత్ (గడువు) పూర్తి కాకముందే భర్త కూడా ఇస్లాం స్వీకరిస్తే, అతను ఇస్లాం స్వీకరించిన సంగతి ఆ స్త్రీకి కూడా తెలిసి ఉంటే, అట్టి పరిస్థితిలో ఆ స్త్రీ వేరొక వ్యక్తితో నికాహ్ చేసుకోజాలదు. ఒకవేళ ఆమె అందరినీ ఎదిరించి నికాహ్ చేసుకుంటే అట్టి నికాహ్ అధర్మంగా పరిగణించబడుతుంది.

(٨٦٤) وَعَنْ زَيْدِ بْنِ كَعْبِ بْنِ عُجْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنْ أَبِيْهِ، قَالَ: تَزَوَّجَ رَسُولُ اللهِ ﷺ الْعَالِيَةَ مِنْ بَنِي غِفَارٍ، فَلَمَّا دَخَلَتْ عَلَيْهِ، وَوَضَعَتْ ثِيَابَهَا، رَأَى بِكَشْحِهَا بَيَاضاً، فَقَالَ النَّبِيُّ ﷺ: **اَلْبَسِي ثِيَابَكِ، وَٱلْحَقِي بِأَهْلِكِ، وَأَمَرَ لَهَا بِالصَّدَاقِ.** رَوَاهُ الْحَاكِمُ، وَفِي إِسْنَادِهِ جَمِيْلُ بْنُ زَيْدٍ، وَهُوَ مَجْهُولٌ، وَاخْتُلِفَ عَلَيْهِ فِي شَيْخِهِ اخْتِلافاً كَثِيْراً.

864. హజ్రత్ జైద్ బిన్ కాబ్ బిన్ ఉజ్రహ్ తన తండ్రి ఆధారంగా చేసిన కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గిఫార్ తెగకు చెందిన ఆలియా అనే మహిళను వివాహమాడారు. ఆమె దైవప్రవక్త (సఅసం) శయనాగారానికి వచ్చి బట్టలు విడిచింది. ఆమె వీపుపై బొల్లి (Leucoderma) ఉండటం ఆయన (సఅసం) గమనించి "ఇక బట్టలు తొడుక్కో. నీ పుట్టింటికి వెళ్ళిపో" అని చెప్పారు. మహర్ సొమ్మును ఇచ్చివేయాలి అని కూడా ఆమెనుద్దేశించి ఆయన (స) ఆదేశించారు. (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు- దీని పరంపరలో జమీల్ బిన్ జైద్ అనే వ్యక్తి ఉన్నాడు. అతని గురించిన పూర్తి వివరాలు లేవు. ఇతని గురువు విషయంలో కూడా తీవ్రమయిన భేదాభిప్రాయం ఉంది).

**సారాంశం**

బొల్లి (తెల్లమచ్చలు, తెల్లకుష్ఠురోగం) వంటి వ్యాధి మూలంగా నికాహ్ (వివాహం) రద్దవుతుందనీ, ఇటువంటి వ్యాధి ఉంటే ఆలుమగలు లైంగిక సంపర్కం జరపకుండానే విడిపోవచ్చుననీ ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. నాలుగు కారణాలపై స్త్రీల వైవాహిక బంధాన్ని రద్దుపరచవచ్చని హజ్రత్ అలీ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)ల ఉల్లేఖనం ద్వారా

బోధపడుతున్నది. ఆ నాలుగు కారణాలివి: ఉన్మాదం, కుష్టురోగం, బొల్లి, సుఖవ్యాధులు ఇత్యాదివి. అయితే ఈ హదీసు పరంపరలో లోపం ఉంది. అసహ్యకరమయిన వ్యాధి ఏదైనా సోకినపుడు మాత్రమే నికాహ్‌ను రద్దుపరచాలని అత్యధికమంది పండితులు భావిస్తున్నారు. అయితే దావూద్ జాహిరీ, ఇబ్నె హజమ్ వంటి విద్వాంసులు ఏదేని లోపం ఆధారంగా నికాహ్‌ను సుతరామూ రద్దు చేయరాదని అంటున్నారు.

## హదీసు ఉల్లేఖకులు

జైద్ బిన్ కాబ్ బిన్ ఉజ్రహ్. ఒక కథనం ప్రకారం ఈయనకు బనూ సాలిమ్ బిన్ ఔఫ్‌తో అనుబంధం ఉంది. బనూ సాలిమ్ బిన్ బలీ, ఖుజ్రజ్ తెగ మద్దతుదారులతో కూడా సంబంధం ఉందని మరొక కథనం ఉంది. ఈయన ఎన్నదగ్గ వ్యక్తి కాదన్న ఇబ్నె ముయీన్ పలుకులను అల్లామా జహ్‌బీ (రహ్మ.లై) 'ముస్తద్రక్' సంక్షిప్తీకరణలో నకలు చేశారు. మరి చూడబోతే ఇమామ్ ఇబ్నె ముయీన్ (రహ్మ.లై) ఈ అభిప్రాయాన్ని వెల్లడించింది జైద్ గురించి కాదు, జమీల్ బిన్ జైద్ గురించి మాత్రమే.

2) ఆలియా (ర.అన్హా) : గిఫార్ తెగకు చెందిన మహిళ. బనూ బకర్ బిన్ కిలాబ్ తెగతో సంబంధం గల స్త్రీ అని కూడా అనబడుతోంది. కిలాబియా వేరు - ఆలియా వేరు అని కూడా అనబడింది. దైవప్రవక్త (సఅసం) ఈమెను వివాహం చేసుకున్న చాలా కాలం తర్వాత విడాకులిచ్చారని మరో కథనం ఉంది.

3) జమీల్ బిన్ జైద్: 'తై' తెగకు చెందిన వారవటం చేత 'తాయి'గా పిలువబడేవారు. ఈయన ఎన్నదగ్గ వ్యక్తి కాదని ఇబ్నె ముయీన్, నసాయి వంటి ఇమాములు వక్కాణించారు. ఈయన అందజేసిన హదీసు సరిగ్గాలేదని **ఇమామ్ బుఖారీ** (రహ్మ.లై) అన్నారు. మిగిలిన ఇమాములు ఈయన హదీసును **'జాయిఫ్' అని అభిప్రాయపడ్డారు.**

(٨٦٥) وَعَنْ سَعِيدِ ابْنِ الْمُسَيَّبِ، أَنَّ عُمَرَ بْنَ الْخَطَّابِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَيُّمَا رَجُلٍ تَزَوَّجَ امْرَأَةً، فَدَخَلَ بِهَا، فَوَجَدَهَا بَرْصَاءَ، أَوْ مَجْنُونَةً، أَوْ مَجْذُومَةً، فَلَهَا

865. హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యబ్ కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) ఇలా చెప్పారు: ఎవరయినా ఒక స్త్రీని వివాహం చేసుకుని ఆమెతో సమాగమం జరిపిన మీదట, ఆమెకు బొల్లి ఉందనీ లేదా ఆమె పిచ్చిదనీ లేదా కుష్టురోగానికి గురై ఉందని తెలుసుకుంటే భర్త ఆమెను ముట్టుకున్నందుకుగాను, ఆమె మహర్ సామ్మాకు (శుల్కానికి) హక్కు

الصَّدَاقُ بِمَسِيْسِهِ إِيَّاهَا، وَهُوَ لَهُ عَلَى مَنْ غَرَّهُ مِنْهَا. أَخْرَجَهُ سَعِيْدُ بْنُ مَنْصُورٍ وَمَالِكٌ وَابْنُ أَبِي شَيْبَةَ، وَرِجَالُهُ ثِقَاتٌ.

దారు అయిపోతుంది. అయితే ఈ మహర్ సొమ్ము మోసగించిన వ్యక్తి (సంరక్షకుని) నుంచి వసూలు చేయ బడుతుంది. (ఈ హదీసును సయీద్ బిన్ మన్సూర్, మాలిక్, ఇబ్నె అబీ షైబా సేకరించారు. దీని ఉల్లేఖకుడు ఎన్న దగిన వ్యక్తి).

وَرَوَى سَعِيْدٌ أَيْضاً عَنْ عَلِيٍّ نَحْوَهُ، وَزَادَ: «وَبِهَا قَرَنٌ، فَزَوْجُهَا بِالْخِيَارِ، فَإِنْ مَسَّهَا فَلَهَا الْمَهْرُ بِمَا اسْتَحَلَّ مِنْ فَرْجِهَا».

సయీద్ గారు హజ్రత్ అలీ (రజి) నుండి కూడా ఇలాగే ఉటంకించారు. అయితే అందులో ఈ వాక్యాలు అదనంగా ఉన్నాయి: "(అవేమంటే) స్త్రీ సంభోగానికి పనికిరాని వ్యాధికి లోనై ఉంటే ఆమె భర్త స్వయంనిర్ణయాధికారం కలిగి ఉంటాడు. ఒకవేళ భర్త (అప్పటికే) ఆమెతో లైంగిక సంబంధం ఏర్పరచుకుంటే స్త్రీ గుప్త స్థానాన్ని ఉపయోగించి నందుకు బదులుగా ఆమెకు మహర్ సొమ్ము ఇవ్వాల్సి ఉంటుంది."

**సారాంశం**

ఈ హదీసులో స్త్రీ తరపు సంరక్షకులకు, మధ్యవర్తులకు హెచ్చరిక ఉంది. ఒక స్త్రీ దీర్ఘకాలిక లేక హానికరమయిన వ్యాధికి లోనై ఉన్నప్పటికీ ఆమె లోపాన్ని ఉద్దేశ్యపూర్వకంగా మరుగుపరచి ఆమెను ఒక మగవాడికిచ్చి కట్టబెట్టడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. పైగా ఇది మోసపూరితమైన పని. అలాగే ప్రమాదకరమైన రోగాల వాతన పడివున్న పురుషుడు ఒక మహిళను వివాహమాడటం కూడా వంచనతో కూడుకున్న పనే అవుతుంది. ఈ విధంగా మోసపోయిన స్త్రీ తన వివాహాన్ని రద్దుచేయగలదు. వధూవరులలో ఏ లోపం వున్నా దాన్ని పెళ్ళికి ముందే పెద్దలు స్పష్టంగా చెప్పివేయాలి.

భార్యతో ఏకాంతంలో గడిపితే చాలు మహర్ తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని, మహర్

చెల్లింపుకై లైంగిక సంబంధం ఏర్పడటం అనివార్యం ఏమీ కాదని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. హనఫీ విద్వాంసుల దృక్పథం ఇదే.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయమేమిటంటే; తీరా వివాహమైన తరువాత భార్యలో లోపం ఉందని తెలుసుకున్న భర్త, ఆమెకు విడాకులివ్వదలచగా 'మహర్' భాగాన్ని కూడా అతను మోయవలసిరావటం అన్యాయం. అదే సమయంలో ఆమెకు మహర్ లభించకపోవటం కూడా అన్యాయంగానే కనిపిస్తుంది. అందుకే ఇట్టి పరిస్థితుల్లో ఈ మహర్ చెల్లింపు భారాన్ని వధువు తరపు "పెద్దల"పై వడ్డించటం జరిగింది - వాళ్ళు అన్నీ తెలిసి కూడా దగా చేశారు గనక!

(٨٦٦) وَمِنْ طَرِيْقِ سَعِيْدِ بْنِ الْمُسَيَّبِ أَيْضاً قَالَ: قَضَى بِهِ عُمَرُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ فِي الْعِنِّيْنِ أَنْ يُؤَجَّلَ سَنَةً. وَرِجَالُهُ ثِقَاتٌ.

**866. హజ్రత్ సయీద్ బిన్ మసయ్యబ్** గారే చేసిన మరో కథనం : హజ్రత్ ఉమర్ (రజి) గారు మగసిరి లోపించిన వ్యక్తి విషయంలో (ఒక నిర్ణయానికి రావడానికి) ఏడాది గడువును నిర్ధారించారు. (ఈ ఉల్లేఖనాన్ని అందజేసిన వారు విశ్వసనీయులు)

**సారాంశం**

అంటే హజ్రత్ ఉమర్ (రజి) ఈ నిర్ణయాధికారం స్త్రీకి ఇచ్చారన్నమాట! హదీసులో 'ఇన్నీన్' అనే పదం వచ్చింది. మగసిరి లోపించిన (అంగస్థంభన జరగని) కారణంగా భార్య వద్దకు పోలేని వాడిని, భార్యను రతిలో సంతృప్త పరచలేకపోయిన వాడిని ఇన్నీన్‌గా వ్యవహరిస్తారు. ఇలాంటి వ్యక్తి విషయంలో మరీ తొందరపడకుండా, అతనికి కొంత గడువు ఇవ్వాలని హజ్రత్ ఉమర్ (రజి) భావించారు. అప్పటికీ అతనిలో ఆశించిన గుణం కనిపించకపోతే విడియాకులే శరణ్యం.

ఈ హదీసు ద్వారా బోధపడే ఇంకొక విషయమేమిటంటే; ఆలుమగల లైంగిక వాంఛల పరిపూర్తికై ధర్మబద్ధమైన మార్గాన్ని సుగమం చేసేదే నికాహ్ (వివాహం). మరి ఈ ఆశయమే ప్రాప్తించనపుడు నికాహ్‌కు అర్థమేలేదు. సాధారణంగా ఆలుమగల మధ్య రేగిన కలతలకు, అసంతృప్తికి, లోపించిన ప్రేమానుగారాలకు గల మూలకారణాలలో ఇదీ ఒకటై ఉంటుంది. సర్దుబాటు కోసం ప్రయత్నించే పెద్దలు లోతుల్లోకి పోతేగాని అసలు విషయం బయటపడదు. ఇలాంటి లైంగిక సంబంధమైన లోపం భర్తలో వున్నా, భార్యలో వున్నా నికాహ్ రద్దుకు సంబంధించిన 'నిర్ణయాధికారం' ఇవ్వాల్సిందే. అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) తన గ్రంథమైన 'జాదుల్ మఆద్'లో ఈ అభిమతాన్నే అనుసరించారు. అత్యధిక మంది విద్వాంసులు కూడా ఈ విధంగానే ఆలోచిస్తున్నారు.

**2వ అధ్యాయం**

## స్త్రీలతో (భార్యలతో) వ్యవహార సరళి

## ٢ - بَابُ عِشْرَةِ النِّسَاءِ

(٨٦٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَلْعُونٌ مَنْ أَتَى امْرَأَةً فِي دُبُرِهَا**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَاللَّفْظُ لَهُ، وَرِجَالُهُ ثِقَاتٌ، لٰكِن أُعِلَّ بِالْإِرْسَالِ.

867. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "స్త్రీ మల విసర్జనా మార్గంలో ('దుబుర్'లో) అంగప్రవేశం జరిపి సంభోగించే వాడు ధూత్కారి" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పారు. (ఈ హదీసును అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం నసాయికి చెందినవి. హదీసును అందజేసిన వారు విశ్వసనీయులు. అయితే ఈ హదీసు 'ముర్సల్' అవటం చేత లోపభూయిష్టంగా ఖరారు చేయ బడింది)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం లూత్ జాతి తరహాలో స్త్రీ మల విసర్జనా భాగంలోకి అంగప్రవేశం జరిపి సంభోగించటం హరామ్ (నిషిద్ధం). ఇమాములు ఈ చేష్టను అనుమతించినట్లు ఎవరయినా చెబితే వారు ఇమాములకు అబద్ధాన్ని అంటగట్టినట్లేనని, ఇమాములపై నీలాపనిందలు మోపినట్లేనని ఇమామ్ షాఫయి (రహ్మతుల్లై)పేర్కొన్నారు. 'వెనుక వైపు నుండి సంభోగించవచ్చు'అని అనటంలో, 'వెనుకభాగంలోకి అంగప్రవేశం జరపవచ్చు' అని అనటంలో చాలా వ్యత్యాసం ఉందనీ, రెండవది అధర్మమని ఆయన వ్యాఖ్యానించారు.

(٨٦٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لَا يَنْظُرُ اللَّهُ إِلَى رَجُلٍ أَتَى رَجُلًا، أَوْ امْرَأَةً فِي**

868. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఏ పురుషునితోనయినా లేక స్త్రీతో నయినా - లూత్ జాతి తరహాలో - మల విసర్జనా మార్గంలో అంగప్రవేశం జరిపి కామవాంఛ తీర్చుకునే వ్యక్తి వంక అల్లాహ్ చల్లని చూపు చూడడు." (దీన్ని

**دُبُرِهَا»**. رَوَاهُ التِّرْمِذِيُّ وَالنَّسَائِيُّ وَابْنُ حِبَّانَ، وَأُعِلَّ بِالْوَقْفِ.

తిర్మిజీ, నసాయి, ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖించారు - ఈ హదీసు 'మౌఖూఫ్' కావటం చేత దీన్ని లోపభూయిష్టంగా పేర్కొనటం జరిగింది).

(٨٦٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: **«مَنْ كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ فَلَا يُؤْذِ جَارَهُ، وَاسْتَوْصُوا بِالنِّسَاءِ خَيْرًا، فَإِنَّهُنَّ خُلِقْنَ مِنْ ضِلَعٍ، وَإِنَّ أَعْوَجَ شَيْءٍ فِي الضِّلَعِ أَعْلَاهُ، فَإِنْ ذَهَبْتَ تُقِيمُهُ كَسَرْتَهُ، وَإِنْ تَرَكْتَهُ لَمْ يَزَلْ أَعْوَجَ، فَاسْتَوْصُوا بِالنِّسَاءِ خَيْرًا»**. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ. وَلِمُسْلِمٍ: «فَإِنِ اسْتَمْتَعْتَ بِهَا اسْتَمْتَعْتَ بِهَا وَبِهَا عِوَجٌ، وَإِنْ ذَهَبْتَ تُقِيمُهَا كَسَرْتَهَا، وَكَسْرُهَا طَلَاقُهَا».

869. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాసం గలవారు తమ పొరుగు వారిని బాధించ కూడదు. స్త్రీల విషయంలో మేలును కోరుతూ చేసే ఉపదేశాన్ని శిరసావహించండి. నిశ్చయంగా వారిని (స్త్రీలను ప్రక్కటెముకచే సృజించటం జరిగింది. ప్రక్కటెముకలో చాలా వంకరగా ఉండేది దాని పైభాగం. ఒకవేళ నీవు దాన్ని తిన్నగా ఉండేలా చేయాలనుకుంటే దాన్ని విరగ్గొడతావు సుమా! ఒకవేళ ఆమెను ఆమె మానాన వదలి పెడితే ఎల్లప్పుడూ వంకరగానే ఉంటుంది. కాబట్టి స్త్రీల వ్యవహారంలో నిత్యం మేలును కోరే హితవును ఒప్పుకోండి". (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి). ముస్లిం ఉల్లేఖనంలో ఉంది - నీవు గనక ఆమె నుండి ప్రయోజనం పొందగోరితే వంకరతనం ఉన్నప్పటికీ ఆమె నుండి ప్రయోజనం పొందగలవు. ఒకవేళ నీవు గనక ఆమెను సరిచేయ జూస్తే విరిచివేస్తావు. విరిచివేయటమంటే "ఆమెకు విడాకులివ్వడమే".

**సారాంశం**

భార్యలతో ఉత్తమ రీతిలో కాపురం చేయాలనీ, వారియందున్న చిన్న చిన్న లోపాలను ఉపేక్షించి ఔదార్యం ప్రదర్శించాలని ఈ హదీసులో చెప్పబడింది. లోపాలు లేని వారెవరూ లేరు. కాకపోతే శారీరక స్వభావం రీత్యా, వారు అధిగమించే వివిధ దశల దృష్ట్యా మగవారికన్నా ఆడవారిలో చిరాకు, పెంకితనం కొంచెం ఎక్కువే ఉండవచ్చు. భర్త ప్రతి చిన్న విషయానికీ రాద్ధాంతం చేస్తూపోతే ఆలుమగల మధ్యనున్న అనురాగ గోపురం కూలిపోయే ప్రమాదం ఉంది. అందుకే పై హదీసులో చెప్పబడింది - స్త్రీల విషయంలో మంచిని కాంక్షించే సలహా ఎవరైనా ఇస్తే దాన్ని శిరసావహించండి అని!

(٨٧٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا مَعَ النَّبِيِّ ﷺ فِي غَزْوَةٍ، فَلَمَّا قَدِمْنَا الْمَدِينَةَ، ذَهَبْنَا لِنَدْخُلَ، فَقَالَ ﷺ: **«أَمْهِلُوا حَتَّى تَدْخُلُوا لَيْلاً، يَعْنِي عِشَاءً، لِكَيْ تَمْتَشِطَ الشَّعِثَةُ، وَتَسْتَحِدَّ الْمُغِيبَةُ»**. مُتَّفَقٌ عَلَيْهِ.

870. హజ్రత్ జాబిర్ (రజి) కథనం: మేమొక యుద్ధంలో దైవ ప్రవక్త (సఅసం) వెంట ఉన్నాము. (ప్రయాణం నుండి తిరిగి వస్తూ) మేము మదీనా చేరుకుని ఎవరింటికి వారు వెళ్ళబోతుండగా ఆయన (సఅసం) మమ్మల్ని ఉద్దేశ్యించి, "ఆగండి. పొద్దుగూకిన పిదప- అంటే ఇషా వేళ - మీ ఇళ్ళలోకి ప్రవేశించండి. మీరిలా చేయటం వలన జుత్తు చిందరవందరగా ఉన్న వారు (మీ భార్యలు) తైలసంస్కారం చేసుకుని జడవేసుకునే, నాభి క్రింది వెంట్రుకలను తొలగించుకునే అవకాశం వారికి లభిస్తుంది" అని సలహా ఇచ్చారు.

(బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لِلْبُخَارِيِّ: **«إِذَا أَطَالَ أَحَدُكُمُ الْغَيْبَةَ، فَلاَ يَطْرُقْ أَهْلَهُ لَيْلاً»**.

బుఖారీలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది - "మీలో ఎవరయినాసరే చాలా కాలం తర్వాత ప్రయాణం నుండి తిరిగి వచ్చినపుడు అకస్మాత్తుగా అర్ధరాత్రి సమయాన మీ ఇంట్లో జొరబడరాదు."

**సారాంశం**

భర్తలకు దూరంగా ఉండే భార్యలు అలంకరణ పట్ల అంతగా శ్రద్ధ చూపకుండా, ఉదాసీనంగా ఉండటం పరిపాటి. అదీగాక సుదీర్ఘ ప్రయాణాల నుండి - చాలా రోజుల తరువాత - అకస్మాత్తుగా తిరిగి వచ్చి రాత్రిపూట ఇంట్లో ప్రవేశిస్తే ఇంటి వారలు కించిత్ ఆశ్చర్యానికి గురవుతారు. భార్యను అస్తవ్యస్త స్థితిలో చూచిన భర్తకు ఆమెపట్ల అయిష్టత పెరుగుతుంది. కాబట్టి భర్త ఇలా అకస్మాత్తుగా ఊడిపడటం కన్నా వస్తున్నట్లు ముందుగానే కబురంపి వస్తే ఇల్లాలు తన ఇల్లూ వాకిలిని భర్త అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దుతుంది. ఈ రోజుల్లో విదేశాల్లో ఉంటున్న భర్తలకు సమాచారం అందజేయటంలో ఎలాంటి ఇబ్బందీ లేదు. టెలిఫోన్లు, స్పీడ్‌పోస్టు ద్వారా వాళ్లు ఫలానా తేదీన ఇంటికి వస్తున్నట్లు ముందుగానే తెలియజేయవచ్చు. ఇలాంటి సౌలభ్యాలున్న ఈ ఆధునిక కాలంలో వారు గ్రామాలకు వచ్చి తమ ఇండ్లకు వెళ్ళడానికి కొన్ని గంటలపాటు (సాయంత్రమయ్యే వరకూ) నిరీక్షించవలసిన పనిలేదు.

(٨٧١) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ شَرَّ النَّاسِ عِنْدَ اللهِ مَنْزِلَةً يَوْمَ الْقِيَامَةِ الرَّجُلُ يُفْضِي إِلَى امْرَأَتِهِ، وَتُفْضِي إِلَيْهِ. ثُمَّ يَنْشُرُ سِرَّهَا**». أَخْرَجَهُ مُسْلِمٌ.

871. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) చెప్పారు: "ఒండొకరి పొందుకోసం ఆరాటపడి, ఆ తరువాత ఆ (రతి) రహస్యాలను బహిర్గతం చేసేవారు (భార్యాభర్తలు) ప్రళయదినాన దైవసమక్షంలో అత్యంత నీచులుగా పరిగణించబడతారు."

(ముస్లిం)

**సారాంశం**

"భార్యాభర్తలు ఒండొకరికి దుస్తులవంటి వారు" అన్న దివ్యఖుర్‌ఆన్‌లోని వచనానికి వివరణ వంటిది ఈ హదీసు. దుస్తులు ఒంటికి శోభనిస్తాయి. దుస్తులు మనిషి మర్మ స్థానాలను ఎలా మరుగుపరచి అతన్ని ఒక సంస్కారవంతునిగా సమాజంలో నిలబెడతాయో అలాగే ఆలుమగలు తమ మధ్యనున్న రహస్య విషయాలను గోప్యంగా ఉంచి సంసార రథాన్ని శోభాయమానంగా మలచాలి. ముఖ్యంగా వారు పడకగదిలో - ఏకాంతంలో - గడిపిన క్షణాల గురించి, చేసుకున్న బాసలు, చెప్పుకున్న ఊసుల గురించి నలుగురిలో చెప్పుకుంటే నవ్వుల పాలవటం తప్ప ఏమీ మిగలదు. పైగా ఇలాంటి సంస్కారహీనులు పరలోకంలో దైవసన్నిధిలో - అత్యంత అల్పులుగా జమకట్టబడతారని హెచ్చరించబడింది.

(٨٧٢) وَعَنْ حَكِيْمِ بْنِ مُعَاوِيَةَ، عَنْ أَبِيْهِ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! مَا حَقُّ زَوْجِ أَحَدِنَا عَلَيْهِ؟ قَالَ: «**تُطْعِمُهَا إِذَا أَكَلْتَ، وَتَكْسُوهَا إِذَا اكْتَسَيْتَ، وَلاَ تَضْرِبِ الْوَجْهَ، وَلاَ تُقَبِّحْ، وَلاَ تَهْجُرْ إِلاَّ فِي الْبَيْتِ**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ، وَعَلَّقَ الْبُخَارِيُّ بَعْضَهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

872. హజ్రత్ హకీమ్ బిన్ ముఆవియా తన తండ్రి ఆధారంగా ఉల్లేఖించారు. ఆయన తండ్రి ఇలా అన్నారు : "ఓ దైవప్రవక్తా (స)! మా భార్యలకు మాపై ఉన్న హక్కు ఏమిటి? (అంటే వారి యెడల మా బాధ్యతలేమిటి?)" అని నేను దైవప్రవక్త (స) ను విన్నవించుకోగా ఆయన (స) ఇలా ఉపదేశించారు : "నీవు తిన్నదే ఆమెకూ పెట్టాలి. నీవు తొడిగినప్పుడల్లా (అంటే బట్టలు కొన్నప్పుడు) ఆమెకూ సమకూర్చాలి. ఆమె ముఖంపై కొట్టడంగానీ, తిట్టడంగానీ, నివాస గృహంలో తప్ప మరోచోట ఆమెను దూరంగా ఉంచటంగానీ చేయరాదు." (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి మరియు ఇబ్నెమాజా ఉల్లేఖించారు. బుఖారీ ఈ ఉల్లేఖనంలోని కొంత భాగాన్ని అనుబంధ అంశంగా తీసుకున్నారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ఈ హదీసులో భార్యల హక్కులు విశదీకరించబడటంతోపాటు ఉత్తమ రీతిలో కాపురం చేయాలని భర్తలకు తాకీదు చేయబడింది. పురుషాధిక్యత గల సమాజంలో భార్య ఏకాస్త కరకుగా మాట్లాడినా మరుక్షణం ఆమె చెంప ఛెళ్లుమనిపించటమో, చెడామడా ఆమెను తిట్టడమో జరుగుతూ ఉంటుంది. ఒకవేళ సంస్కరణ నిమిత్తం ఎప్పుడయినా స్వల్పంగా కొట్టవలసివచ్చినా ముఖంపై కొట్టరాదని కూడా అనబడింది. ఎందుకంటే 'ముఖారవిందం' మానవ శరీరావయవాల్లో అత్యంత గౌరవప్రదమైనది. చాచి చెంపపై కొట్టడమంటే ఆత్మ గౌరవాన్ని గాయపరచటమే.

బయట హోటళ్ళలో అడ్డదిడ్డంగా తింటూ, ఖరీదైన బట్టలు తొడిగి జల్సారాయుళ్లలా తిరిగే బాధ్యతా రహితులైన భర్తలకు ఈ హదీసులో మందలింపు ఉంది. అన్నపానీయాలలో, వస్త్ర ధారణలో తమ కోసం ఇష్టపడేదే ఆలుబిడ్డల కోసం కూడా ఇష్టపడాలనీ, తాము మంచి

బట్టలను కొనుక్కున్నప్పుడు ఇల్లాలిని కూడా విస్మరించరాదని ఈ హదీసులో ఉపదేశించబడింది.

భార్య ఒకవేళ భర్త యెడల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే ఆమెను సంస్కరించే ఉద్దేశ్యంతో ఇంట్లోనే ఆమెను దూరంగా ఉంచవచ్చు. పడకను వేరు చేసుకోవచ్చు. ఆమెలో మార్పు వచ్చే వరకూ ముభావంగా ఉండవచ్చు. అంతేగాని ఆమెని దండించే ఉద్దేశ్యంతో ఇంటినుండి బయటికి గెంటకూడదు. భర్త ఇంటికి రాకుండా వేరేచోట మకాం వేయటం కూడా శ్రేయస్కరం కాదు. మొత్తమ్మీద 'సంస్కరణా సరణి' అనేది షరీయత్ చూపే బాటలోనే సాగాలి.

(٨٧٣) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَتِ الْيَهُودُ تَقُولُ إِذَا أَتَى الرَّجُلُ امْرَأَتَهُ مِنْ دُبُرِهَا فِي قُبُلِهَا كَانَ الْوَلَدُ أَحْوَلَ، فَنَزَلَتْ ﴿نِسَاؤُكُمْ حَرْثٌ لَكُمْ فَأْتُوا حَرْثَكُمْ أَنَّى شِئْتُمْ﴾ الآيَةَ. مُتَّفَقٌ عَلَيْهِ. وَاللَّفْظُ لِمُسْلِمٍ.

873. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : భర్త తన భార్యను వెనుక వైపు నుంచి ఆక్రమించుకుని సంభోగం జరిపితే పిల్లవాడు అవిటివాడుగా పుడతాడని యూదులు అంటుండేవారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ (దివ్య ఖుర్ఆన్ లోని) ఈ వచనాన్ని అవతరింపజేశాడు- "మీ స్త్రీలు మీకు పంట పొలాలు లాంటి వారు. మీ పొలాలకు మీరు కోరిన విధంగా రావచ్చు." (బుఖారీ, ముస్లిం - వాక్యాలు ముస్లింలోనివి)

**సారాంశం**

ఒక్క 'లూత్ జాతి తరహా'లో తప్ప మరేవిధంగానయినా భర్తలు తమ భార్యలవద్దకు పోవచ్చు. లూత్ జాతివారి పద్ధతి అసహజమైనది. శాపగ్రస్తమైనది. దాని గురించి ఇంతకు ముందు హదీసులో చెప్పుకోవటం జరిగింది.

(٨٧٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَوْ أَنَّ أَحَدَكُمْ إِذَا أَرَادَ أَنْ يَأْتِيَ أَهْلَهُ قَالَ: بِسْمِ

874. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు - "మీలో ఎవరయినా తమ భార్య వద్దకు పోయినపుడు ఈ దుఆ పఠించాలి: 'బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్ నష్షయితాన వ జన్నిబిష్షయితాన మా రజఖ్తనా.'

للهِ، اللهمّ جَنِّبْنَا الشَيْطانَ، وَجَنِّبِ الشَّيْطَانَ مَا رَزَقْتَنَا، فَإِنَّهُ إِنْ يُقَدَّرْ بَيْنَهُمَا وَلَدٌ فِي ذَلِكَ، لَمْ يَضُرَّهُ الشَّيْطَانُ أَبَداً». مُتَّفَقٌ عَلَيْهِ.

(అర్థం: అల్లాహ్ పేరుతో - ఓ అల్లాహ్! మమ్మల్ని షైతాన్ కీడు నుంచి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానం దరికి కూడా షైతాన్ రాకుండా వాణ్ణి దూరంగా ఉంచు). ఇలా ప్రార్థిస్తే ఈ సమాగమం వల్ల వారి విధివ్రాత ప్రకారం వారికి కలగబోయే సంతానానికి షైతాన్ సుతరామూ కీడు కలిగించలేడు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

భార్యాభర్తలు లైంగిక వాంఛను తీర్చుకునే సమయంలో తమకు చిరకాల శత్రువు అయిన షైతాన్ కీడు నుండి దేవుని శరణు కోరమని ఉపదేశించబడింది. షైతాన్ మనిషి బహిరంగ శత్రువు. మనిషికి హాని కలిగించే ఏ కాస్త అవకాశం దొరికినా వాడు వదలిపెట్టడు. అందుకే ఆ సమయంలో దైవ నామస్మరణ చేయాలి. ఒక్క దైవనామ స్మరణ వల్లనే ఆ శాపగ్రస్తుణ్ణి దూరం ఉంచటం సాధ్యమవుతుంది. అదీగాక ఈ దుఆ చేసిన సందర్భంలో గర్భధారణ జరిగి శిశువు జన్మిస్తే ఆ శిశువు సయితం పైశాచిక శక్తుల బారినుండి సురక్షితంగా ఉంటుందని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది.

(٨٧٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِذَا دَعَا الرَّجُلُ امْرَأَتَهُ إِلَى فِرَاشِهِ، فَأَبَتْ أَنْ تَجِيءَ، فَبَاتَ غَضْبَانَ، لَعَنَتْهَا الْمَلَائِكَةُ حَتَّى تُصْبِحَ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ. وَلِمُسْلِمٍ: «كَانَ الَّذِي فِي السَّمَاءِ سَاخِطاً عَلَيْهَا، حَتَّى يَرْضَى عَنْهَا».

875. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "భర్త తన భార్యను పడక మీదికి పిలిచినప్పుడు, అతని వద్దకు రావడానికి (అకారణంగా) ఆమె నిరాకరిస్తే, తత్కారణంగా భర్త అసంతృప్తితో రాత్రి గడిపితే అట్టి స్థితిలో దైవదూతలు తెల్లవారే వరకూ ఆ స్త్రీని శపిస్తూ ఉంటారు."

(బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం బుఖారీలోనివి)

"భర్త భార్యపట్ల ప్రసన్నుడు కానంత వరకూ నింగినున్నవాడు సయితం ఆగ్రహంతో ఉంటాడు" అని ముస్లింలో ఉంది.

**సారాంశం**

తగు కారణమేదీ లేకుండానే భర్త లైంగిక కోర్కెను భార్య తీర్చకపోవటం మహా పాపమని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ఇది భర్త యొక్క ముఖ్యమయిన హక్కు. దీన్ని ఆమె విధిగా తీర్చాల్సి ఉంటుంది. అయితే భర్త కూడా ఆమె ఆరోగ్య స్థితినీ, ఆమె ఇబ్బందులను అర్థం చేసుకుని తదనుగుణంగా వ్యవహరించాలి.

(٨٧٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ لَعَنَ الْوَاصِلَةَ وَالْمُسْتَوْصِلَةَ، وَالْوَاشِمَةَ وَالْمُسْتَوْشِمَةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

876. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తలలో సవరం పేర్చే స్త్రీలను, సవరం వేయించుకునే స్త్రీలను, శరీరంపై పచ్చబొట్లు వేసే, వేయించుకోవాలనుకునే స్త్రీలను ధూత్కరించారు." (బుఖారీ, ముస్లిం)

(٨٧٧) وَعَنْ جُذَامَةَ بِنْتِ وَهْبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: حَضَرْتُ رَسُولَ اللهِ ﷺ فِي أُنَاسٍ، وَهُوَ يَقُولُ: «**لَقَدْ هَمَمْتُ أَنْ أَنْهَى عَنِ الْغِيلَةِ، فَنَظَرْتُ فِي الرُّومِ وَفَارِسَ، فَإِذَا هُمْ يُغِيلُونَ أَوْلَادَهُمْ، فَلَا يَضُرُّ ذٰلِكَ أَوْلَادَهُمْ شَيْئاً**» ثُمَّ سَأَلُوهُ عَنِ الْعَزْلِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**ذٰلِكَ الْوَأْدُ الْخَفِيُّ**». رَوَاهُ مُسْلِمٌ.

877. హజ్రత్ జుదామా బిన్తె వహ్బ్ (ర.అన్హా) కథనం: నేను దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన (స) కొంతమంది మధ్య కూర్చుని ఈ విధంగా చెబుతున్నారు : నేను 'గీలా'ను (చంటిపిల్లవాడికి పాలు పట్టే సమయంలో భార్యతో సంభోగించడాన్ని) వారించాలనుకున్నాను. అయితే వెంటనే రోమనులు, పారసీకులు నా దృష్టి పథంలో మెదిలారు. వారు కూడా తమకు చంటిపిల్లలుండగా 'గీలా' చేస్తున్నారుగాని ఈ చేష్ట వారి సంతానానికెలాంటి హానీ కల్గించటం లేదు." తరువాత ప్రజలు 'అజల్' (స్ఖలన సమయంలో వీర్యాన్ని బయట పడేయటం) గురించి ప్రశ్నించగా, "ఇది సజీవంగా పాతిపెట్టే రహస్య పద్ధతి" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

బాలింత తన శిశువుకు చనుబాలిస్తుండగా భర్త ఆమెతో సంభోగించడాన్ని 'గీలా' అంటారు. ఈ అవస్థలో భార్యతో సంభోగిస్తే అది శిశువు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, శరీరావయవాలు దెబ్బతింటాయని అరబ్బులు నమ్మేవారు. అయితే రోమనుల, పారసీకుల అనుభవాలను పరిశీలించిన మీదట అరబ్బుల నమ్మకంలో ఎలాంటి పసలేదని తేలిపోయింది.

ఇక 'అజల్' గురించి - భర్త భార్యతో సంభోగిస్తాడు. తీరా వీర్య స్థలనం కాబోతుండగా అంగాన్ని యోనిలోనుంచి బయటికి తీసేసి వీర్యాన్ని బయటపడేస్తాడు. దీనినే 'అజల్' అని అనటం జరిగింది. ఇది కూడా ఒకవిధమైన సంతాన నిరోధక చర్యే. ఇది నిజంగా 'సజీవ సమాధి' కాకపోయినా ఒక ప్రాణి పుడమిపైకి రాకుండా అడ్డుకోవడం వంటిదే. ఏ రేతస్సు బిందువుతో స్త్రీకి గర్భధారణ జరుగుతుందో, ఆ రేతస్సును బయటపడవేయటమంటే అది ముమ్మాటికీ కుటుంబ నియంత్రణా పథకంలో అంతర్భాగమే. అయితే ప్రాణమున్న ఒక శిశువును గోరీలో పాతిపెట్టడమంత పాశవిక చర్య మాత్రం కాదు.

**హదీసు ఉల్లేఖకులు**

జుదామా బిన్తె వహ్బ్ (ర.అన్హా) : అసద్ తెగకు చెందిన మహిళ కావటంచేత అసదియాగా కూడా పిలువబడేవారు. సుప్రసిద్ధ సహాబియా. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించిన మహాప్రవక్త (స) సహచర బృందంలో ఒకరు. హిజ్రత్ కూడా చేశారు. మక్కాలో ఇస్లాం స్వీకరించిన పిదప తన వాళ్ళందరినీ వదులుకున్నారు. అనీస్ బిన్ ఖతాదా (రజి)ను పెళ్ళి చేసుకున్నారు.

(٨٧٨) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً قَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّ لِيْ جَارِيَةً، وَأَنَا أَعْزِلُ عَنْهَا، وَأَنَا أَكْرَهُ أَنْ تَحْمِلَ، وَأَنَا أُرِيْدُ مَا يُرِيْدُ الرِّجَالُ، وَإِنَّ الْيَهُودَ تَحَدَّثُ أَنَّ الْعَزْلَ الْمَوْءُدَةُ الصُّغْرَى، قَالَ:

878. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం : ఒక వ్యక్తి ప్రవక్త మహనీయులనుద్దేశించి, "ఓ దైవప్రవక్తా (సఅసం)! నా దగ్గర ఒక బానిసరాలుంది. నేనామెతో సంభోగించినపుడు వీర్య స్థలనం యోనిలో జరగకుండా జాగ్రత్తపడుతున్నాను. ఎందుకంటే ఆమె గర్భవతి కావటం నాకిష్టం లేదు. సాధారణంగా మగవాళ్ళంతా కోరుకునే దాన్నే నేనూ కోరుకుంటున్నాను. మరేమో ఈ విధంగా వీర్యాన్ని బయట పడవేయటం 'చిన్న తరహా సజీవ సమాధి' వంటిదేనని

«كَذَبَتِ الْيَهُودُ، لَوْ أَرَادَ اللَّهُ أَنْ يَخْلُقَهُ مَا اسْتَطَعْتَ أَنْ تَصْرِفَهُ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ، وَالنَّسَائِيُّ وَالطَّحَاوِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ.

యూదులు అంటున్నారాయె (మరి నేనేం చేసేదీ?!)" అని సందేహం వెలిబుచ్చాడు. దానికాయన (న), "యూదులు చెప్పేది అబద్ధం. ఒకవేళ అల్లాహ్‌యే గనక సంతాన మివ్వదలిస్తే నీవు దానిని అడ్డుకోలేవు" అని అన్నారు. (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు - వాక్యాలు మాత్రం అబూదావూద్‌వి. నసాయి, తహావీలు కూడా దీన్ని ఉల్లేఖించారు. ఈ హదీసును అందజేసిన వారు విశ్వసనీయులు)

(٨٧٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نَعْزِلُ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ: وَالْقُرْآنُ يَنْزِلُ، وَلَوْ كَانَ شَيْءٌ يُنْهَى عنْهُ، لَنَهَانَا عَنْهُ الْقُرْآنُ. مُتَّفَقٌ عَلَيْهِ.

879. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో 'అజల్' చేసే వాళ్ళము. మరి అది ఖుర్‌ఆన్ అవతరిస్తున్న కాలం. ఇది గనక నిషిద్ధ చేష్ట అయివుంటే ఖుర్‌ఆన్ మమ్మల్ని దానికి సంబంధించి వారించి ఉండేది."

(బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ: فَبَلَغَ ذٰلِكَ نَبِيَّ اللهِ ﷺ فَلَمْ يَنْهَنَا عَنْهُ.

ముస్లింలోని ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది : "ఎట్టకేలకు ఈ విషయం దైవప్రవక్త (సఅసం)కు తెలిసింది. కాని ఆయన (స) మమ్మల్ని వారించలేదు."

**సారాంశం**

మొత్తానికి ఈ హదీసు ద్వారా సంభోగంలో 'అజల్' పద్ధతి ఆక్షేపణీయం కాదన్నదానికి ఆధారం లభిస్తోంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), కూఫా వాసులు, అత్యధికమంది పండితులు ఈ 'అజల్' ఆధారాన్ని అంగీకరిస్తున్నారు.

(٨٨٠) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يَطُوفُ عَلَى نِسَائِهِ بِغُسْلٍ وَاحِدٍ. أَخْرَجَاهُ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

880. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకే స్నానంతో భార్యలందరి వద్దకూ వెళ్ళేవారు." (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే సంభోగించిన వెంటనే లైంగిక అశుద్ధావస్థను దూరం చేసే స్నానం (గుసులె జనాబత్) చేయటం అనివార్యం కాదు. వంతుల వారీగా భార్యల వద్ద ఉండవలసిన ఆంక్ష దైవప్రవక్త (స) కు వర్తించదన్న సంగతి కూడా ఈ హదీసు వెలుగులో బోధపడుతున్నది. ఒకవేళ ఈ ఆంక్ష ఆయన (స) పై ఉంటే ఆయన (స) ఒకే రాత్రి సతీమణులందరి వద్దకూ పోయేవారు కాదు. 'వంతులవారీ పద్ధతి తప్పనిసరి' అని మెజారిటీ ఉలమా అంటున్నారు. అయితే దైవప్రవక్త (స) తన సతీమణుల అనుమతితో (అప్పుడప్పుడూ) ఇలా చేశారని వారు అభిప్రాయపడ్డారు. (సుబుల్)

**3వ అధ్యాయం**

## ٣ - بَابُ الصَّدَاقِ

## మహర్ హక్కు

(٨٨١) عَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ أَعْتَقَ صَفِيَّةَ، وَجَعَلَ عِتْقَهَا صَدَاقَهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

881. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫియా (ర.అన్హా) కు స్వేచ్ఛనొసగి, ఆ స్వేచ్ఛనే ఆమె 'మహర్'గా ఖరారు చేశారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒక బానిసకు లేక యుద్ధ ఖైదీకి ప్రసాదించే స్వాతంత్ర్యాన్ని 'మహర్'గా లెక్క కట్టవచ్చునన్న దానికి ఈ హదీసు తార్కాణం. "జమ్హూర్" (మెజారిటీ ఉలమా) దీంతో విభేదించారు. అయితే వారు తమ ఈ విభేదానికి గాను ప్రబలమైన ఆధారం కూడా సమకూర్చలేకపోయారు. ప్రయోజనకరమయిన ఒక వస్తువును ప్రసాదించి, దాన్ని 'మహర్'గా పరిగణించటం సబబేనని కూడా ఈ హదీసు నిరూపిస్తోంది. ఇంతకు ముందు వచ్చిన ఒక సంఘటనలో మహా ప్రవక్త (స) ఖుర్ఆన్ విద్య నేర్పడాన్ని మహర్‌గా పరిగణించారు.

## హదీసు ఉల్లేఖకులు

హజ్రత్ సఫియా (ర.అన్హా) : విశ్వాసుల మాత హజ్రత్ సఫియా (ర.అన్హా)హుయి బిన్ అఖ్తబ్ కుమార్తె. ఈమె వంశపరంపర దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహి) సోదరులైన హజ్రత్ హారూన్ (అలైహి)తో కలుస్తుంది. తొలుత ఈమె ఇబ్నె అబుల్ హుఖైఖ్ భార్యగా ఉన్నారు. అతడు ఖైబర్ యుద్ధంలో వధించబడ్డాడు. హజ్రత్ సఫియా (ర.అన్హా) యుద్ధ ఖైదీగా మదీనాకు తేబడ్డారు. తరువాత దైవప్రవక్త (స) ఈమెను తన దాంపత్య జీవితం కొరకు ఎంపిక చేసుకున్నారు. ఆమెకు స్వేచ్ఛను ప్రసాదించి, నికాహ్ చేసుకున్నారు. ఆమెకు ఇవ్వబడిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలనే 'మహర్'గా నిర్ధారించారు. ఈమె హిజ్రీ 50లో మరణించారు - బఖీలో అంత్యక్రియలు జరిగాయి.

(٨٨٢) وَعَنْ أَبِي سَلَمَةَ بْنِ عَبْدِ الرَّحْمٰنِ، أَنَّهُ قَالَ: سَأَلْتُ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، كَمْ كَانَ صَدَاقُ رَسُولِ اللّٰهِ ﷺ؟ قَالَتْ: كَانَ صَدَاقُهُ لِأَزْوَاجِهِ ثِنْتَي عَشْرَةَ أُوقِيَّةً، وَنَشًّا، قَالَتْ: أَتَدْرِي مَا النَّشُّ؟ قَالَ: قُلْتُ: لاَ، قَالَتْ: نِصْفُ أُوقِيَّةٍ، فَتِلْكَ خَمْسُمَائَةِ دِرْهَمٍ، فَهٰذَا صَدَاقُ رَسُولِ اللّٰهِ ﷺ لِأَزْوَاجِهِ. رَوَاهُ مُسْلِمٌ.

882. హజ్రత్ అబూ సలమా బిన్ అబ్దు ర్రహ్మాన్ (రహ్మ.లై) కథనం : "దైవప్రవక్త (సఅసం) తన సతీమణులకు ఇచ్చిన మహర్ ఎంత?" అని నేను హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ను ప్రశ్నించగా, "ఆయన(స) తన ధర్మపత్నులకు ఇచ్చిన మహర్ 12 ఊఖియాల ఒక నష్" అని ఆమె సమాధానమిచ్చారు. "నష్ అంటే ఎంతో నీకు తెలుసా?" అని ఆమెగారు తిరిగి నన్నే ప్రశ్నించారు. "నాకు తెలీదు" అని నేనన్నాను. "(నష్ అంటే) ఊఖియాలో సగభాగం. ఈ విధంగా ఇవి మొత్తం ఐదువందల దిర్హములు అవుతాయి. ఇదీ దైవప్రవక్త (సఅసం) సతీమణుల మహర్" అని ఆమె విడమరచి చెప్పారు. (ముస్లిం)

## హదీసు ఉల్లేఖకులు

అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ : అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ జుహ్రీ ఖురషీ అనబడతారు. ఒక కథనం ప్రకారం ఈయన మదీనా మునవ్వరాకు చెందిన ఏడుగురు

సుప్రసిద్ధ తాబయీ ధర్మవేత్తలలో ఒకరు. మారు పేరైన అబూ సలమా పేరుతోనే అందరికీ పరిచితులు. చాలా ఎక్కువ హదీసులను ఉల్లేఖించిన వారిలో ఈయన పేరు కూడా చేర్చబడుతుంది. అనేకమంది ప్రవక్త ప్రియ సహచరుల నోట ప్రవక్త (స) ప్రవచనాలను విన్నారు. ఈయన అందజేసిన ఉల్లేఖనాలను కూడా ఒక పెద్ద జమాఅత్ (సమూహం) సంగ్రహించింది. హిజ్రీ 74లో లేక హిజ్రీ 104లో మరణించారు.

(٨٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَمَّا تَزَوَّجَ عَلِيٌّ فَاطِمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ: «أَعْطِهَا شَيْئاً» قَالَ: مَا عِنْدِي شَيْءٌ، قَالَ: «فَأَيْنَ دِرْعُكَ الْحُطَمِيَّةُ؟» رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

883. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : హజ్రత్ అలీ (రజి) గారు హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) ను వివాహ మాడినపుడు "ఆమెకు ఏదన్నా ఇవ్వు" అని దైవప్రవక్త (సఅసం) సూచించారు. దానికి హజ్రత్ అలీ (రజి) "నా దగ్గరేమీ లేదు" అని దైవప్రవక్త (స)కు విన్నవించుకున్నారు. "నీ దగ్గరుండాల్సిన హుతమీ కవచం ఎక్కుడుంది?" అని ఆయన (సఅసం) వాకబు చేశారు. (ఈ హదీసును అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు -హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

మక్కానుండి మదీనాకు హిజ్రత్ (వలస) చేసిన రెండవ సంవత్సరం రమజాన్ నెలలో హజ్రత్ ఫాతిమాను హజ్రత్ అలీ నికాహ్ చేసుకున్నారు. జిల్ హజ్జ్ నెలలో కాపురం పెట్టారు.

ఈ హదీసు ద్వారా 'మహర్' హక్కుకు సంబంధించిన వివరాలు మన ముందుకు వచ్చాయి. వధువు తరపు సంరక్షకుడు వివాహానికి ముందు వరుని నుంచి మహర్ హక్కును డిమాండు చేయవచ్చుననీ, అయితే వరుని స్థోమతకు మించిన వస్తువును అతన్నుండి కోరటం భావ్యం కాదని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ప్రవక్త మహనీయుల (స) కు అగోచర జ్ఞానం లేదన్న సంగతి కూడా ఈ హదీసు ద్వారా మనకు అవగతమవుతోంది. ఒకవేళ ఆయన (స) కే గనక అగోచర జ్ఞానం ఉండి ఉంటే, నీ కవచం ఫలానా చోటుంది కదా! తీసుకురా అని ఆయన (స) అని ఉండేవారు. కాని ఆయన (స) అలా అనలేదు. 'కవచం ఎక్కడుంది?' అని దర్యాప్తు చేశారు. దైవప్రవక్తలు కూడా మానవమాత్రులేననీ, అగోచర జ్ఞాని ఒక్క దేవుడు మాత్రమేనని మనం గ్రహించాలి.

(٨٨٤) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **أَيُّمَا امْرَأَةٍ نَكَحَتْ عَلَى صَدَاقٍ أَوْ حِبَاءٍ أَوْ عِدَةٍ قَبْلَ عِصْمَةِ النِّكَاحِ، فَهُوَ لَهَا، وَمَا كَانَ بَعْدَ عِصْمَةِ النِّكَاحِ، فَهُوَ لِمَنْ أُعْطِيَهُ، وَأَحَقُّ مَا أُكْرِمَ الرَّجُلُ عَلَيْهِ ابْنَتُهُ أَوْ أُخْتُهُ**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ إِلاَّ التِّرْمِذِيَّ.

884. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రినుంచీ, ఆయన తన తాత గారి నుంచీ గ్రహించి చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ స్త్రీ అయినా మహర్, కానుక లేక నికాహ్‌కు ముందు చేయబడిన ఏదైనా వాగ్దానాన్ని పురస్కరించుకుని నికాహ్ చేసుకోబడితే అది కేవలం ఆ స్త్రీకి చెందవలసిన హక్కు అవుతుంది. అయితే నికాహ్ అనంతరం ఏదైనా కానుకను (భర్త) ఇస్తే, అతను ఎవరికిస్తే అది వారిదే అవుతుంది. ఏ పురుషుడైనా తన కూతురు లేక సోదరి మూలంగా ఇలాంటి పురస్కారానికి హక్కు దారుడవుతాడు." (దీనిని అహ్మద్, 'నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారు ఉల్లేఖించారు)

**సారాంశం**

సాధారణంగా 'మహర్' సొమ్ము వధువుకే చెందుతుంది. ఎందుకంటే మహర్ మూలంగానే భార్య భర్త కొరకు ధర్మసమ్మతం (హలాల్) అవుతుంది. ఈ మహర్ సొమ్మును ఆమె కోరుకున్న విధంగా ఉపయోగించుకోగలదు. ఆమె తన తండ్రికిగానీ, లేదా తనకు గార్డియన్‌గా వ్యవహరించిన వ్యక్తికిగానీ, సమీప బంధువుల్లో లేమికి గురైన వారికిగానీ, దైవమార్గంలోగానీ ఇచ్చుకోవచ్చు. ఈ విషయంలో ఆమెపై ఎలాంటి నిర్బంధం లేదు. మనస్ఫూర్తిగా ఆమె ఈ మహర్ సొమ్మును ఇస్తున్నప్పుడు ఆప్తులు పుచ్చుకోవటానికి సంశయంలో పడనవసరం లేదు.

వివాహం తరువాత ఇవ్వబడే కానుక లేక పురస్కారం 'మహర్' క్రిందికి రాదు. ఈ కానుకను భర్త ఎవరికి ఇస్తే వారు పుచ్చుకోవచ్చు. ఉదాహరణకు : భర్త తన మామగారి గౌరవార్థం ఏదన్నా ఇచ్చినా, తన బావమరిదికి ఏదన్నా గిఫ్ట్ ఇచ్చినా, లేదా అతడు స్వయంగా తన సతీమణికే ఏదన్నా ఇచ్చుకున్నా అది ఇతరత్రా కానుకగానే పరిగణించబడుతుంది తప్ప 'మహర్'గా మాత్రం లెక్కించబడదు.

(٨٨٥) وَعَنْ عَلْقَمَةَ، عَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سُئِلَ عَنْ رَجُلٍ تَزَوَّجَ امْرَأَةً، وَلَمْ يَفْرِضْ لَهَا صَدَاقاً، وَلَمْ يَدْخُلْ بِهَا، حَتَّى مَاتَ، فَقَالَ ابْنُ مَسْعُودٍ: لَهَا مِثْلُ صَدَاقِ نِسَائِهَا، لاَ وَكْسَ، وَلاَ شَطَطَ، وَعَلَيْهَا العِدَّةُ، وَلَهَا الْمِيْرَاثُ، فَقَامَ مَعْقَلُ بْنُ سِنَانٍ الْأَشْجَعِيُّ، فَقَالَ: قَضَى رَسُولُ اللهِ ﷺ فِي بَرْوَعَ بِنْتِ وَاشِقٍ امْرَأَةٍ مِنَّا مِثْلَ مَا قَضَيْتَ، فَفَرِحَ بِهَا ابْنُ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ جَمَاعَةٌ.

885. హజ్రత్ అల్ఖమ (రజి) వివరించారు: ఇబ్నె మస్‌వూద్ (రజి) గారిని ఒకానొక వ్యక్తి గురించి ప్రశ్నించటం జరిగింది. అతడు ఒక మహిళను వివాహమాడాడు. మరి అతను ఆమె కోసం 'మహర్' సొమ్మును ఖరారు చేయలేదు. అతనామెను అనుభవించకుండానే మరణించాడు. దానికి ఇబ్నె మస్‌వూద్ (రజి) సమాధానమిస్తూ, ఆమె వంశస్థులైన ఇతర స్త్రీలకు ఎంత మొత్తం మహర్ సొమ్ము లభించిందో అంత మహర్ ఆ మహిళకూ లభిస్తుంది. ఎక్కువగానీ, తక్కువగానీ ఇవ్వబడదు. అయితే ఆమె ఇద్దత్ (గడువు) ను పూర్తిచేయటం అవశ్యం. ఆ తరువాత ఆమెకు ఆస్తి హక్కు కూడా లభిస్తుంది" అని అన్నారు. ఇది విని మాఖల్ బిన్ సినాన్ అష్‌జయి (రజి) లేచి నిలబడి, "మా తెగకు చెందిన బరూఅ బిన్తె వాషిఖ్ అనే ఒక మహిళ విషయంలో దైవప్రవక్త (సఅసం) కూడా సరిగ్గా మీరు చెప్పినట్లే తీర్పు చెప్పారు" అని అన్నారు. దీనిపై ఇబ్నె మస్‌వూద్ (రజి) అమితానందం చెందారు. (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'సహీహ్'గా పేర్కొనగా, ఒక జమాఅత్ దీనిని 'హసన్'గా ఖరారు చేసింది).

**హదీసు ఉల్లేఖకులు**

1) అల్ఖమ : పూర్తి పరంపర ప్రకారం అల్ఖమ బిన్ ఖైస్ బిన్ అబూ షుబ్ల్ బిన్ మాలిక్

అనబడతారు. బనూ బక్ర్ బిన్ నఖ్ఆ తెగకు చెందినవారు. ప్రముఖ తాబయీలలో ఒకరు. ఇబ్నె మస్వూద్ హదీసు మూలంగా ప్రసిద్ధిచెందారు. అస్వద్ నఖ్యీకి బాబాయి అవుతారు. హిజ్రీ 61లో మరణించారు.

2) మాఖిల్ బిన్ సినాన్ అష్జయి (రజి) : మరోపేరు అబూ ముహమ్మద్. ప్రముఖ సహాబి. మక్కా విజయంలో పాల్గొన్నారు. కూఫాలో స్థిరపడ్డారు. ఈయన హదీసు కూఫాలో ప్రసిద్ధిచెందింది. హరా యుద్ధంలో ఈయన్ని నిర్బంధించి హత్య చేశారు.

3) బర్వా బిన్తె వాషిఖ్ (ర.అన్హా) : ప్రముఖ సహాబియా. ఈమె భర్తపేరు హిలాల్ బిన్ మర్వ (రజి). వివాహమైన తర్వాత ఈమెను కలుసుకోకముందే ఈమె భర్త మరణించారు.

(٨٨٦) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «مَنْ أَعْطَى فِي صَدَاقِ امْرَأَةٍ سَوِيقاً أَوْ تَمْراً فَقَدِ اسْتَحَلَّ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَأَشَارَ إِلَى تَرْجِيحِ وَقْفِهِ.

886. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి)కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరైనా 'మహర్'గా స్త్రీకి గోధుమ పిండిగానీ, ఖర్జూరంగానీ ఇస్తే అతడామెను తన కోసం ధర్మ సమ్మతం (హలాల్) చేసుకున్నట్లే." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఇది 'మౌఖూఫ్' అయివుంటుందని ఆయన తలపోశారు)

(٨٨٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَامِرِ بْنِ رَبِيعَةَ، عَنْ أَبِيهِ، أَنَّ النَّبِيَّ ﷺ أَجَازَ نِكَاحَ امْرَأَةٍ عَلَى نَعْلَيْنِ: أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَخُولِفَ فِي ذٰلِكَ.

887. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయ తన తండ్రి ఆధారంగా ఉల్లేఖించారు : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు పాదరక్షలకు బదులుగా ఒక స్త్రీ నికాహ్ను నిర్ధారించడానికి అనుమతిని ఇచ్చారు." (ఈ హదీసును తిర్మిజీ నకలు చేసి ప్రామాణికంగా పేర్కొన్నారు. అయితే ఇది ప్రామాణికమని అనబడటం పట్ల భేదాభిప్రాయం ఉంది)

### సారాంశం

స్త్రీ పురుషులు ఏ వస్తువు చెల్లింపుకు బదులుగా పరస్పరం ఏకం కావాలని ముందుగా నిర్ధారించుకుంటారో అదే వారి పాలిట 'మహర్'గా ఖరారవుతుందని ఈ హదీసును బట్టి అవగతమవుతోంది. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన స్త్రీ బనూ ఫజారా తెగకు చెందిన స్త్రీ. "పాద రక్షలకు బదులుగా నిన్ను నువ్వు నీ భర్తకు సమర్పించుకోవడానికి మనస్ఫూర్తిగా అంగీకరించావా?" అని దైవప్రవక్త (సఅసం) ఆమెను అడగ్గా "అవును" అని ఆమె బదులిచ్చింది. అప్పుడాయన (స) ఆమె నికాహ్‌ను (వివాహాన్ని) ధర్మసమ్మతంగా ప్రకటించారు.

### హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయ (రజి) : పూర్తి వంశపరంపరను చూస్తే అబూ ఇమ్రాన్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయ అల్ అద్‌వీ అల్ అన్‌జీ అనబడతారు. అయితే వంశపరంపరపై భిన్నాభిప్రాయాలున్నాయి. దైవప్రవక్త (సఅసం) చనిపోయేనాటికి ఈయన గారి వయస్సు 4 లేక 5 మాత్రమే. హిజ్రీ 85వ సంవత్సరంలో - మరో కథనం ప్రకారం - హిజ్రీ 90లో మరణించారు.

(٨٨٨) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: زَوَّجَ النَّبِيُّ ﷺ رَجُلاً امْرَأَةً بِخَاتَمٍ مِنْ حَدِيْدٍ. أَخْرَجَهُ الحَاكِمُ، وَهُوَ طَرَفٌ مِنَ الْحَدِيْثِ الطَّوِيْلِ الْمُتَقَدِّمِ فِي أَوَائِلِ النِّكَاحِ.

888. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇనుప ఉంగరాన్ని మహర్‌గా ఇప్పించి ఒక పురుషుని నికాహ్‌ను ఒక స్త్రీతో జరిపించారు. (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు - ఇది నికాహ్ ప్రకరణం ఆరంభంలో వచ్చిన సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం)

### సారాంశం

హజ్రత్ సహ్ల్ (రజి) కథనం చేసిన ఒక సుదీర్ఘమయిన హదీసు ఇంతకుముందే ఈ 'నికాహ్ పుస్తకం'లో వచ్చింది. ఆ స్త్రీ తనను తాను దైవప్రవక్త (స) కోసం సమర్పించుకుంది. 'ఇనుప ఉంగరానికి బదులుగా ఆయన (స) ఆ స్త్రీ నికాహ్ జరిపించారు' అని అందులో అనబడలేదు. ఆమెను పెళ్ళి చేసుకోదలచిన వ్యక్తి నుద్దేశ్యించి, కనీసం ఇనుప ఉంగరాన్నయినా తీసుకురా అని మాత్రమే ఆయన (స) ఆజ్ఞాపించారు. ఆ ఉంగరం కూడా అతని వద్ద లభ్యం కాకపోవటంతో, దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూరాలను నేర్పే షరతుపై ఆ స్త్రీని అతనికిచ్చి వివాహం జరిపించారు. సంకలనకర్త ఈ హదీసును ఇక్కడ - ఈ విధంగా - క్రోడీకరించటం వల్ల పాఠకులు సంశయానికి లోనయ్యే అవకాశం ఉంది.

(٨٨٩) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لاَ يَكُونُ الْمَهْرُ أَقَلَّ مِنْ عَشَرَةِ دَرَاهِمَ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ مَوْقُوفاً، وَفِي سَنَدِهِ مَقَالٌ.

889. హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) సెలవిచ్చారు: "మహర్ పది దిర్హములకన్నా తక్కువ ఉండరాదు." (దారె ఖుత్నీ దీనిని మౌఖూఫ్‌గా ఉల్లేఖించారు - దీని పరంపరపై చర్చకు ఆస్కారం ఉంది)

(٨٩٠) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**خَيْرُ الصَّدَاقِ أَيْسَرُهُ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

890. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) తెలిపారు : "అత్యంత సులువుగా చెల్లించగల మహర్ సొమ్ము అత్యుత్తమమైనది." (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు - హాకిమ్ ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٨٩١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ عَمْرَةَ بِنْتَ الْجَوْنِ تَعَوَّذَتْ مِن رَسُولِ اللهِ ﷺ، حِيْنَ أُدْخِلَتْ عَلَيْهِ، تَعْنِي لَمَّا تَزَوَّجَهَا، فَقَالَ: «لَقَدْ عُذْتِ بِمَعَاذٍ، **فَطَلِّقْهَا وَأَمَرَ أُسَامَةَ فَمَتَّعَهَا بِثَلاَثَةِ أَثْوَابٍ**». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَفِي إِسْنَادِهِ رَاوٍ مَتْرُوكٌ، وَأَصْلُ الْقِصَّةِ فِي الصَّحِيحِ مِنْ حَدِيثِ أَبِي أَسِيدٍ السَّاعِدِيِّ.

891. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : అమ్రా బిన్తె జౌన్ అనే మహిళ దైవప్రవక్త (సఅసం) గదిలోకి వచ్చినపుడు - అంటే ఆయన (సఅసం) ఆమెను నికాహ్ చేసుకున్నప్పుడు - ఆమె ఆయన (స) బారినుండి అల్లాహ్ శరణు వేడుకుంది. దానికి దైవప్రవక్త (స), "నీవు శరణు ఇచ్చే వానినే శరణు కోరావు" అని అన్నారు. తరువాత ఆయన (స) ఆమెకు విడాకులిచ్చారు. ఉసామాను ఉద్దేశ్యించి, "ఈమె ప్రయోజనార్థం ఈమెకు మూడు వస్త్రాలు ఇచ్చి పంపండి" అని ఆయన (స) ఆజ్ఞాపించారు. (ఈ హదీసును ఇబ్నె మాజా ఉల్లేఖించారు - దీని పరంపరలోని ఉల్లేఖకులలో ఒకరు ఎన్నదగ్గవారు కారు. దీని అసలు వృత్తాంతం సహీహ్ బుఖారీలో అబూ అసీద్ సాయిదీ ద్వారా చెప్పబడింది)

### సారాంశం

సహీహ్ బుఖారీలో అబూ అసీద్‌చే చేయబడిన కథనం ఇలా వుంది : జౌనియాను దైవప్రవక్త (స) వద్దకు తీసుకురావటం జరిగింది. ఆమె దైవప్రవక్త (స) ఏకాంతవాసంలోకి రాగానే "నిన్ను నువ్వు నా కొరకు సమర్పించుకో" అని ఆయన (స) అన్నారు. ఒక రాణీ తన పాలితులలోని ఒక పురుషునికి తనంతట తానై ఎలా సమర్పించుకుంటుంది? అని ఆమె అన్నది. ఆయన (స) ఆమె ఆవేశాన్ని చల్లార్చే ఉద్దేశంతో తన చేతిని ఆమె వైపునకు చాచారు. 'నేను నీ బారినుండి దేవుని శరణు వేడుతున్నాను' అని ఆమె చెప్పింది. ఆమె సంభాషణా తీరునుబట్టి అర్థమయ్యేదేమంటే, ఆమె తనను దైవప్రవక్త (స)కన్నా ఉత్తమురాలిగానయినా భావించి ఉండాలి లేదా దైవప్రవక్త (స) తనకు సరిజోడీ కాదని అయినా తలపోసి ఉండాలి. లేదా ఆయనే దైవప్రవక్త (స) అన్న సంగతి ఆమెకు తెలియకపోయి ఉండొచ్చు లేదా దైవప్రవక్త (స) తన వైపునకు చేయి చాపటంలోని ఉద్దేశ్యాన్ని ఆమె మరో విధంగానయినా భావించి ఉండవచ్చు. బుఖారీ : కితాబుల్ అష్రిబ - 30లో ఇలా వుంది - ఇంతకీ ఆయనెవరో నీకు తెలుసా? అని జనులు ఆమెను అడగ్గా 'లేదు' అని ఆమె జవాబిచ్చింది. 'ఆయన (స) దైవప్రవక్త. నీకు వివాహ సందేశం ఇచ్చేందుకు ఆయన నీ దగ్గరకు వచ్చారు' అని ప్రజలు చెప్పగా; 'అలాగా! అయితే పొరబడిన నేను దురదృష్టవంతురాలిని' అని అభిప్రాయపడింది. (అల్ హదీస్)

"మూడు వస్త్రాలు ఆమెకు ఆమె ప్రయోజనార్థం ఇచ్చి పంపండి" అని దైవప్రవక్త (స) ఆదేశించటం గమనార్హం. దివ్య ఖుర్‌ఆన్‌లోని దైవాదేశానుసారమే ఆయన (స) ఇలా అన్నారు. దైవాదేశం ఇది : "మీరు మీ స్త్రీలను ముట్టుకోకముందే లేక వారి మహర్ (స్త్రీ ధనం) నిర్ణయం కాకమునుపే మీరు వారికి విడాకులిస్తే, అది పాపం కాదు. అప్పుడు మీరు వారికి ఎంతో కొంత తప్పకుండా ఇవ్వాలి. ధనవంతుడైన వ్యక్తి తన శక్తికొలదీ, పేదవాడైన మనిషి తన స్థితినిబట్టీ ధర్మసమ్మతమైన విధంగా చెల్లించాలి. ఇది సజ్జనులైనవారి విధి." (2:236)

దాంపత్య సంబంధం ఏర్పడకముందే, పురుషుడు స్త్రీలకు విడాకులిస్తే - అప్పటికింకా మహర్ నిర్ణయం కూడా జరిగి ఉండకపోయినప్పటికీ - వారిని ఉత్తమ రీతిలో సాగనంపటం అవసరం. స్థోమత ప్రకారం వారికి లబ్ధిని చేకూర్చాలని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది.

### హదీసు ఉల్లేఖకులు

1) అమ్రా బిన్తె జౌన్ : ఈమె గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. హదీసులో ప్రస్తావనకు వచ్చిన జౌనియా ఈ పేరుగల స్త్రీయేనా? కాదా? అన్నది సందేహాస్పదంగా ఉంది. ఇబ్నె జౌజీ తన పుస్తకం 'అత్తల్ఖీహ్'లో ఆమె పేరు అస్మా బిన్తె నూమాన్ బిన్ అబూ అల్ జౌన్ బిన్ హారిస్ కిందియా అని అన్నారు. కాగా; అబూ అసీద్ హదీసులోని కొన్ని ఆధారాల ప్రకారం ఆమె పేరు ఉమైమి బిన్తె నూమాన్ బిన్ షరా జీల్ అని విదితమవుతోంది. ఇమామ్ జహ్రీ దృష్టిలో ఈమె ఫాతిమా బిన్తె జహ్హాక్. మొత్తానికి ఈ పేర్లన్నీ ఒక్కామె నుద్దేశించినవేనని ఇంకొక అభిప్రాయం ఉంది. ఈ విధంగా ఆమె పేరు గురించి చాలా తీవ్రమయిన అభిప్రాయభేదం ఏర్పడింది. ఆమె అసలు పేరు ఉమైమ అని భావించటం చాలా వరకు సమంజసం.

2) అబూ ఉసైద్ (రజి) : అసలు పేరు మాలిక్ బిన్ రబీయ బిన్ బద్ద్. అసలు పేరుకన్నా మారుపేరైన అబూ ఉసైద్‌గానే వినుతికెక్కారు. బద్ర్ తదితర సంగ్రామాలలో పాల్గొన్నారు. హిజ్రీ 30లో మరణించారు. వేరొక కథనం ప్రకారం హిజ్రీ 60లో మరణం సంభవించిందనీ, అందరికన్నా ఆఖరిలో మరణించిన బద్రీ సహాబీ ఈయనేనని అనబడుతోంది.

**4వ అధ్యాయం**

## వలీమా

## ٤ - بَابُ الْوَلِيمَةِ

892. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దుస్తులపై పసుపు పచ్చని రంగును చూచి "ఇదే మిటీ?" అని అడిగారు. "ఓ దైవప్రవక్తా (స)! నేను ఒక స్త్రీకి ఖర్జూరపు విత్తన మంత బంగారాన్ని మహర్‌గా ఇచ్చి వివాహమాడాను" అని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చెప్పారు. దానికాయన (స) "అల్లాహ్ నీకు శుభమొసగుగాక! ఒక మేకనయినానరే కోసి వలీమా విందు తప్పకుండా చెయ్యి" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

(٨٩٢) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ رَأَى عَلَى عَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ أَثَرَ صُفْرَةٍ، فقال: «ما هذا؟» قَالَ: يَا رَسُولَ اللهِ! إِنِّي تَزَوَّجْتُ امْرَأَةً عَلَى وَزْنِ نَوَاةٍ مِنْ ذَهَبٍ، قَالَ: «فَبَارَكَ اللَّهُ لَكَ، أَوْلِمْ وَلَوْ بِشَاةٍ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

### సారాంశం

వధూవరులు పరస్పరం ఏకం కావడాన్ని 'వలీమా' అంటారు. వారు తమ ఈ అన్యోన్య కలయికకు సంకేతంగా వలీమా విందును ఏర్పాటు చేయటం మస్నూన్ (సంప్రదాయం). కొంతమంది విద్వాంసులు ఈ వలీమా విందును వాజిబ్ (తప్పనిసరి)గా కూడా ఖరారు చేశారు.

వలీమా విందును వరుడు తన శక్తీ స్థోమతలకు తగ్గట్టుగా ఇవ్వవచ్చు. అయితే దుబారా ఖర్చు చేయకూడదు. దైవప్రవక్త (సఅసం) ఏర్పాటు చేసిన కొన్ని వలీమా విందుల్లో ఒక మేక కన్నా తక్కువ మాంసం ఉండేది. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆర్థిక స్థోమత దృష్ట్యా ఒక మేక కోయటం తక్కువ ఖర్చు క్రిందికే వస్తుంది. చివరకు చెప్పొచ్చేదేమిటంటే మనిషి తన స్థోమతను బట్టి వలీమాను ఏర్పాటు చేయవచ్చు.

(٨٩٣) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قال: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِذَا دُعِيَ أَحَدُكُمْ إِلَى الْوَلِيمَةِ فَلْيَأْتِهَا**». مُتَّفَقٌ عَلَيْهِ. وَلِمُسْلِمٍ: «**إِذَا دَعَا أَحَدُكُمْ أَخَاهُ فَلْيُجِبْ**»، عُرْساً كَانَ أَوْ نَحْوَهُ.

893. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "మీలో ఎవరినయినా వలీమా విందుకు ఆహ్వానిస్తే అతడు ఆ విందుకు వెళ్ళాలి" (బుఖారీ, ముస్లిం). ముస్లింలోని ఉల్లేఖనంలో ఉంది - "మీలో ఎవరికయినా అతని సోదరుని తరపున ఆహ్వానం అందితే ఆ ఆహ్వానాన్ని స్వీకరించాలి - అది పెళ్ళి ఆహ్వానమైనాసరే, అలాంటిదే మరోవిధమైన ఆహ్వానమైనా సరే!"

**సారాంశం**

వివాహ సందర్భంగా అందే వలీమా ఆహ్వానాన్ని అందుకోవటం తప్పనిసరి అని ఈ హదీసు చెబుతోంది. అత్యధిక మంది ఉలమా అభిప్రాయం కూడా ఇదే. అయితే ఆ ఆహ్వానంలో పాల్గొనడానికి ఏదయినా విషయం అవరోధంగా ఉంటే అప్పుడు దాన్ని బహిష్కరించవచ్చు. ఉదాహరణకు: విందు భోజనం అనుమానాస్పదం అయివుంటే లేదా ప్రత్యేకంగా ధనవంతులు, పలుకుబడి గలవారు మాత్రమే ఆ విందుకు ఆహ్వానించబడి ఉంటే, లేదా ఏదైనా అధర్మ కార్యంలో సహాయ సహకారాలు పొందే ఉద్దేశ్యంతో ఆహ్వానం ఇవ్వబడి ఉంటే లేదా షరీయత్‌కు విరుద్ధంగా గల పోకడలు ఆ సదనంలో జరుగుతూ ఉంటే అట్టి విందును బహిష్కరించటమే మంచిది.

(٨٩٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**شَرُّ الطَّعَامِ طَعَامُ الْوَلِيمَةِ يُمْنَعُهَا مَنْ يَأْتِيهَا، وَيُدْعَى إِلَيْهَا مَنْ يَأْبَاهَا، وَمَنْ لَمْ يُجِبِ الدَّعْوَةَ فَقَدْ عَصَى اللَّهَ وَرَسُولَهُ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

894. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: ఏ వలీమా విందులో వచ్చేవారిని (అగత్యపరులను) అడ్డుకోవటం జరుగుతుందో, రావడానికి నిరాకరించే వారిని (పదే పదే) ఆహ్వానించటం జరుగుతుందో ఆ వలీమా విందు అత్యంత నీచమైనది. కాగా; వలీమా ఆహ్వానాన్ని స్వీకరించనివాడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను ధిక్కరించాడు."

(ముస్లిం)

(٨٩٥) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا دُعِيَ أَحَدُكُمْ فَلْيُجِبْ، فَإِنْ كَانَ صَائِماً فَلْيُصَلِّ، وَإِنْ كَانَ مُفْطِراً فَلْيَطْعَمْ». أَخْرَجَهُ مُسْلِمٌ أَيْضاً.

895. హజ్రత్ అబూహురైరా (రజి) గారిదే ఇంకొక కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "మీలో ఎవరికయినా వలీమా ఆహ్వానం అందితే దాన్ని స్వీకరించాలి. ఒకవేళ అతడు (ఆహ్వానితుడు) ఉపవాసం ఉంటే (ఆహ్వానించిన వానికోసం) దుఆ చేయాలి. ఉపవాస స్థితిలో లేకుంటే మాత్రం విందు భోజనం చేయాలి."

(ముస్లిం)

وَلَهُ مِنْ حَدِيْثِ جَابِرٍ نَحْوُهُ، وَقَالَ: «فَإِنْ شَاءَ طَعِمَ، وَإِنْ شَاءَ تَرَكَ».

ముస్లింలో హజ్రత్ జాబిర్ (రజి) చే కూడా ఇలాగే ఉల్లేఖించబడింది. అందులో ఆయన (స) ఇలా చెప్పారని ఉంది - "అతడు కోరితే భోజనం చేయ వచ్చు. లేకుంటే వదలివేయవచ్చు."

(٨٩٦) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «طَعَامُ الْوَلِيمَةِ أَوَّلَ يَوْمٍ حَقٌّ، وَطَعَامُ يَوْمِ الثَّانِي سُنَّةٌ، وَطَعَامُ يَوْمِ الثَّالِثِ سُمْعَةٌ، وَمَنْ سَمَّعَ سَمَّعَ اللَّهُ بِهِ». رَوَاهُ التِّرمِذِيُّ، وَاسْتَغْرَبَهُ، وَرِجَالُهُ رِجَالُ الصَّحِيحِ، وَلَهُ شَاهِدٌ عَنْ أَنَسٍ عِنْدَ ابْنِ مَاجَهْ.

896. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) చెప్పారు : "వలీమా భోజనం మొదటి రోజు విధి. రెండవ రోజు సున్నత్. మూడవ రోజు భోజనం ప్రదర్శన కోసం, పరువు ప్రతిష్ఠల కోసం పెట్టే భోజనమే అవుతుంది. ఎవరయితే కుహనా ప్రతిష్ఠల కోసం ప్రాకులాడు తాడో అతణ్ణి అల్లాహ్ శిక్షిస్తాడు." (ఈ ఉల్లేఖనాన్ని తిర్మిజీ ఉల్లేఖించి, దీనిని 'అరుదైనది'గా ఖరారు చేశారు. వాస్తవానికి ఈ హదీసును అందజేసిన వారు సహీహ్ హదీసు ఉల్లేఖకుల కోవకు చెందినవారే. ఇబ్నెమాజాలో హజ్రత్ అనస్ (రజి) గారి ఒక హదీసు దీనికి సాక్షిగా ఉంది.

**సారాంశం**

రెండు రోజుల వరకూ వలీమా విందును ఏర్పాటు చేయవచ్చుననీ, మూడవ రోజు కూడా వలీమా విందు చేస్తే అది బడాయిని చాటుకోవటం క్రిందికే వస్తుందనీ ఈ హదీసు చెబుతోంది. అయితే మూడవ రోజు కూడా మొదటి రెండు రోజుల్లో ఆహ్వానించిన వారినే పిలిస్తే అప్పుడది విపరీత విషయంగానీ, కొత్త వారిని ఆహ్వానిస్తే తప్పులేదని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) గారైతే ఏడు రోజుల దాకా వలీమా విందు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) గారి ఈ హదీసుపై హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) ఏమంటారంటే; "దీని ఉల్లేఖకుల మాట పునఃపరిశీలించ దగినది. ఈ అధ్యాయం క్రింద వచ్చిన మరికొన్ని హదీసులు కూడా చర్చనీయాంశాలే." (సుబుల్)

(٨٩٧) وَعَنْ صَفِيَّةَ بِنْتِ شَيْبَةَ قَالَتْ: أَوْلَمَ النَّبِيُّ ﷺ عَلَى بَعْضِ نِسَائِهِ بِمُدَّيْنِ مِنْ شَعِيْرٍ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

897. హజ్రత్ సఫియా బిన్తె షైబ (ర.అన్‌హా) కథనం : "దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణుల్లో కొందరి వలీమా విందు కేవలం రెండు 'ముద్'ల శిష్ట గోధుమలతో సరిపెట్టుకున్నారు." (బుఖారీ)

**సారాంశం**

ఒక వ్యక్తి ఒకటికన్నా ఎక్కువ నికాహ్‌లు చేసుకున్నప్పుడు వలీమాలన్నీ ఒకే స్థాయిలో చేయాలని ఎక్కడా లేదు. అనాటి ఆర్థిక స్థితిగతులను బట్టి, పరిస్థితులనుబట్టి తగు రీతిలో వలీమా విందును ఏర్పాటు చేయవచ్చు. ఆయన (స) ఒక్కోసారి వలీమాలో మేక మాంసం పెట్టారు, కొన్నిసార్లు గోధుమ పిండితోనే విందు ఇచ్చారు. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) గారి వలీమాలోనయితే కేవలం రెండు 'ముద్'ల శిష్ట గోధుమలనే సమర్పించారు.

**హదీసు ఉల్లేఖకులు**

సఫియా బిన్తె షైబ బిన్ ఉస్మాన్ బిన్ అబూ తల్హా (ర.అన్‌హా) అబ్దుద్దార్ తెగకు చెందినవారు. ఈమె గారు దైవప్రవక్త (స)ను చూచారని ఒక కథనముండగా, చూడలేదని మరో కథనం ఉంది. ఈమె తాబయియా మాత్రమేనని ఇబ్నె సాద్ ఖచ్చితంగా చెప్పారు.

(٨٩٨) وَعَنْ أَنَسٍ قَالَ: أَقَامَ النَّبِيُّ ﷺ بَيْنَ خَيْبَرَ وَالْمَدِيْنَةِ ثَلاَثَ لَيَالٍ، يُبْنَى عَلَيْهِ بِصَفِيَّةَ، فَدَعَوتُ الْمُسْلِمِيْنَ إِلَى وَلِيْمَتِهِ، فَمَا كَانَ فِيْهَا مِنْ خُبْزٍ وَلاَ لَحْمٍ، وَمَا كَانَ فِيْهَا إِلاَّ

898. హజ్రత్ అనస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సఅసం) ఖైబర్ మరియు మదీనాల మధ్య దారిలో మూడు రోజులు గడిపారు. ఈ సందర్భంగానే ఆయన (సఅసం) సఫియా (ర.అన్‌హా)తో రాత్రి గడిపారు. నేను మరునాడు

أَنْ أَمَرَ بِالْأَنْطَاعِ فَبُسِطَتْ، فَأُلْقِيَ عَلَيْهَا التَّمْرُ وَالْأَقِطُ وَالسَّمْنُ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

దైవప్రవక్త (స) తరపున ముస్లిములను వలీమా విందుకు పిలిచాను. ఆ విందు భోజనంలో రొట్టెగానీ, మాంసం గానీ లేదు. ఆ ఉత్సవంలో ఆయన (స) సూచనానుసారం చాప (లేదా చర్మ వస్త్రం) పరచబడింది. దానిపై ఖర్జూర పండ్లు, జున్ను ముక్కలు, నెయ్యి వడ్డించబడ్డాయి." (బుఖారీ, ముస్లిం - వాక్యాలు బుఖారీలోనివి)

**సారాంశం**

ప్రయాణావస్థలో కూడా పెళ్ళి చేసుకోవటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఈ లెక్కన వివాహమహోత్సవానికి బంధువులు, ఆత్మీయులందరినీ పిలవటం అవశ్యం కూడా కాదు. వలీమా విందులో ఒకటికన్నా ఎక్కువ వంటకాలు వడ్డించవచ్చునని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. అయితే దుబారా ఖర్చు కూడదు.

(٨٩٩) وَعَنْ رَجُلٍ مِنْ أَصْحَابِ النَّبِيِّ ﷺ، قَالَ: إِذَا اجْتَمَعَ دَاعِيَانِ فَأَجِبْ أَقْرَبَهُمَا بَاباً، فَإِنْ سَبَقَ أَحَدُهُمَا فَأَجِبِ الَّذِيْ سَبَقَ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَسَنَدُهُ ضَعِيْفٌ.

899. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని ప్రవక్త సహచరులలోని ఒక సహచరుడు తెలిపారు - "ఇద్దరు వ్యక్తులు భోజనానికి ఆహ్వానిస్తే వారిలో ఎవరి గడప మీ ఇంటికి మరీ దగ్గరవుందో వారి ఆహ్వానాన్ని స్వీకరించండి. ఆ ఇరువురిలో ఎవరు ముందు ఆహ్వానిస్తే వారి ఆహ్వానాన్ని సమ్మతించి ఆమోదించండి." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - ఇది అందిన తీరు బలహీనంగా ఉంది)

(٩٠٠) وَعَنْ أَبِيْ جُحَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ آكُلُ مُتَّكِئاً**». رَوَاهُ الْبُخَارِيُّ.

900. హజ్రత్ అబూ జుహైఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నేను భోజనం చేసే సమయంలో దేనికీ ఆనుకోను." (బుఖారీ)

(٩٠١) وَعَنْ عُمَرَ بْنِ أَبِي سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِي رَسُولُ اللهِ ﷺ: **«يَا غُلَامُ سَمِّ اللَّهَ، وَكُلْ بِيَمِينِكَ، وَكُلْ مِمَّا يَلِيكَ»**. مُتَّفَقٌ عَلَيْهِ.

901. హజ్రత్ ఉమర్ బిన్ అబూ సలమా (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) నన్నుద్దేశించి, "అబ్బాయి! అల్లాహ్ పేరుతో తినటం మొదలెట్టు. నీ కుడి చేత్తో తిను. నీకు దగ్గరున్న పదార్థాన్ని తీసుకుని తిను" అని ఉపదేశించారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

భోజనానికి కూర్చున్నప్పుడు అన్నింటికన్నా ముందు బిస్మిల్లాహ్ పఠించి, కుడిచేత్తో తినాలనీ, ఒక కంచంలో ఒకరికన్నా ఎక్కువ మంది భుజిస్తున్నప్పుడు తమకు ముందున్న ఆహార పదార్థాన్ని తీసుకుని తినాలని ఈ హదీసు వల్ల స్పష్టమవుతున్నది. అయితే ఒకటి కన్నా ఎక్కువ ఆహార పదార్థాలు ముందున్నప్పుడు ఎవరికి నచ్చిన వెరైటీని వారు తీసుకోవచ్చు.

### హదీసు ఉల్లేఖకులు

ఉమర్ బిన్ అబూ సలమా (రజి) : ఉమర్ బిన్ అబూ సలమా అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ అసద్ బిన్ హిలాల్ మఖ్జూమీ. ఈయన ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) పుత్ర రత్నం. దైవప్రవక్త (స) శిక్షణలో ఆరితేరారు. అబిసీనియాలో జన్మించారు. ఈయన జననం అబిసీనియా హిజ్రత్‌కు - మదీనా హిజ్రత్‌కు మధ్య కాలంలో జరిగింది. హిజ్రీ 83లో మరణించారు.

(٩٠٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ أُتِيَ بِقَصْعَةٍ مِنْ ثَرِيْدٍ، فَقَالَ: **«كُلُوا مِنْ جَوَانِبِهَا، وَلَا تَأْكُلُوا مِنْ وَسَطِهَا، فَإِنَّ الْبَرَكَةَ تَنْزِلُ فِي وَسَطِهَا»**. رَوَاهُ الْأَرْبَعَةُ، وَهٰذَا لَفْظُ النَّسَائِيِّ، وَسَنَدُهُ صَحِيْحٌ.

902. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలోకి 'సరీద్' అనే వంటకంతో నింపబడిన ఒక పాత్ర తేబడింది. అప్పు డాయన (స), "పాత్ర అంచుల్లో నుంచి తీసుకుని తినండి. మధ్య నుండి తీసుకోకండి. ఎందుకంటే, సమృద్ధి (బరకత్) వర్షించేది మధ్య భాగంలోనే" అని ఉపదేశించారు. (దీనిని నలుగురు ఉల్లేఖించారు- హదీసు వాక్యాలు మాత్రం 'నసాయి' లోనివి. ఇది అందిన తీరు ప్రమాణ బద్ధమైనది)

(٩٠٢/١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: مَا عَابَ رَسُولُ اللهِ ﷺ طَعَامًا قَطُّ، كَانَ إِذَا اشْتَهَى شَيْئًا أَكَلَهُ، وَإِنْ كَرِهَهُ تَرَكَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

902. (అ) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ఎన్నడూ భోజనంలోని లోపాన్ని ఎత్తి చూపలేదు. ఏదైనా పదార్థాన్ని తిన దలచుకుంటే తినేవారు. రుచించకపోతే తినేవారు కారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

భోజన సందర్భంగా లోపాలను ఎత్తిచూపటం, వంటకాలపై వంకలు పెట్టడం సముచితం కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఇష్టముంటే తినాలి. ఏదైనా వంటకం తన అభిరుచికి అనుగుణంగా లేకుంటే - మౌనంగానే - దాన్ని వదలివేయాలి. అంతేగాని వంట చేసిన వారిని నిరుత్సాహపరచే మాటలనడంగానీ, ఆతిథ్యం ఇచ్చిన వారి మనసు నొప్పించే విధంగా ఏదైనా చెప్పటం గానీ చేయరాదు. ఇలా చేయటం వల్ల వండబడిన దైవప్రసాదితం పట్ల వైముఖ్య ధోరణిని కనబరచినట్లవుతుంది.

(٩٠٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَا تَأْكُلُوا بِالشِّمَالِ فَإِنَّ الشَّيْطَانَ يَأْكُلُ بِالشِّمَالِ». رَوَاهُ مُسْلِمٌ.

903. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు : "ఎడమ చేత్తో తిన కండి. ఎందుకంటే షైతాన్ ఎడమ చేత్తో తింటాడు." (ముస్లిం)

(٩٠٤) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ قَالَ: «إِذَا شَرِبَ أَحَدُكُمْ فَلَا يَتَنَفَّسْ فِي الْإِنَاءِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَلِأَبِي دَاوُدَ عَنِ ابْنِ عَبَّاسٍ نَحْوُهُ، وَزَادَ: «أَوْ يَنْفُخْ فِيهِ» وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

904. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) తెలియజేశారు : "మీలో ఎవరయినా సరే పానీయం త్రాగుతున్నప్పుడు పాత్రలో గాలి వీల్చరాదు." (బుఖారీ, ముస్లిం) ఇబ్నె అబ్బాస్ (రజి)చే అబూదావూద్‌లోనూ ఇలాగే ఉల్లేఖించబడింది. అయితే "అందులో ఊదరాదు" అన్న వాక్యం అదనంగా ఉంది.

**5వ అధ్యాయం**

## భార్యల మధ్య వంతుల విభజన

## ٥ - بَابُ القَسْمِ

905. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణుల మధ్య వంతులను నిర్ధారించే సమయంలో న్యాయం ధర్మాలను దృష్టిలో పెట్టుకునే వారు. ఆ తరువాత ఆయన (స) దైవ సన్నిధిలో ఇలా వేడుకునేవారు - "దేవా! నాకు సాధ్యమైనంత వరకు న్యాయ సమ్మతంగా ఈ వంతుల విభజన చేశాను. నా అధీనంలో లేని విషయం నీ అధీనంలో మాత్రమే ఉంది. (స్వామీ!) ఈ వ్యవహారంలో నన్ను నిందార్హునిగా నిలబెట్టకు." (దీనిని నలుగురు ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రమాణబద్ధమైనదిగా ఖరారు చేశారు. అయితే ఈ ఉల్లేఖనం 'ముర్సల్'అయి ఉండవచ్చని తిర్మిజీ నొక్కి చెప్పారు.)

(٩٠٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقْسِمُ لِنِسَائِهِ، فَيَعْدِلُ، وَيَقُولُ: «**اللَّهُمَّ هَذَا قَسْمِي فِيمَا أَمْلِكُ، فَلاَ تَلُمْنِي فِيمَا تَمْلِكُ، وَلاَ أَمْلِكُ**». رَوَاهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، لَكِنْ رَجَّحَ التِّرْمِذِيُّ إِرْسَالَهُ.

**సారాంశం**

భార్యల మధ్య న్యాయం చేయాలని, అందరినీ సమాన దృష్టితో చూడాలనీ, వారి హక్కులను వారికి ఇచ్చేటప్పుడు హెచ్చుతగ్గులు చేయరాదనీ ఈ హదీసు చెబుతోంది. అయితే మానసికంగా ఎవరైనా ఒకామె వైపునకు ఎక్కువ మొగ్గు చూపితే అది మనిషి అధీనంలో లేని విషయం. దానికతడు నిందార్హుడు కాడు. ఎందుకంటే భార్యలలో కొందరు మరికొందరికన్నా గుణ గణాలరీత్యా, అందచందాల దృష్ట్యా, కార్యదీక్షా దక్షతల దృష్ట్యా, తెలివి తేటల రీత్యా ముందంజ వేస్తారు. ఈ విషయాలనుబట్టి భర్త భార్యలలో ఒకరిద్దరి వైపునకు మానసికంగా ఎక్కువగా మొగ్గిపోతాడు. భౌతికంగా ఎవరి హక్కును వారికి ఇచ్చినప్పటికీ మానసికంగా అతనివల్ల ఏదైనా విపరీతం జరిగితే దాన్ని దేవుడే మన్నించాలి అని భావం.

(٩٠٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**مَنْ كَانَتْ لَهُ امْرَأَتَانِ فَمَالَ إِلَى إِحْدَاهُمَا جَاءَ يَوْمَ الْقِيَامَةِ وَشِقُّهُ مَائِلٌ**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَسَنَدُهُ صَحِيحٌ.

906. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రకటించారు : "ఏ వ్యక్తికయినా ఇద్దరు భార్యలుండి భర్త ఒకే భార్య వైపునకు మొగ్గిపోతే (రెండవ భార్యకు అన్యాయం చేస్తే) ప్రళయదినాన అతడు ఒక పార్శ్వం పడిపోయిన స్థితిలో లేచి వస్తాడు." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు - ఇది అందిన తీరు ప్రామాణికమైనది)

**సారాంశం**

భార్యల మధ్య న్యాయం చేయనివారికి ఈ హదీసులో తీవ్రమయిన హెచ్చరిక ఉంది. ఇక్కడ న్యాయం అంటే అర్థం ఇరువురు భార్యలకు సమానంగా అన్న వస్త్రాలను సమకూర్చటం. వంతుల వారీగా భర్త వారి వద్ద గడపటం, వారి సమస్యలను పరిష్కరించేటప్పుడు కూడా సమభావం కలిగి ఉండటం అన్నమాట! ఇవన్నీ అతని అధీనంలో ఉన్న విషయాలే. కాబట్టి వీటిని సమకూర్చే సమయంలో ఒకరికి అధికంగా ఇచ్చి, మరొకరిపట్ల చిన్నచూపు ప్రదర్శిస్తే అది పక్షపాతం అవుతుంది. ఈ పక్షపాత వైఖరే ప్రళయదినాన అతన్ని పక్షవాతానికి గురిచేస్తుంది.

(٩٠٧) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: «**مِنَ السُّنَّةِ إِذَا تَزَوَّجَ الرَّجُلُ الْبِكْرَ عَلَى الثَّيِّبِ، أَقَامَ عِنْدَهَا سَبْعاً، ثُمَّ قَسَمَ، وَإِذَا تَزَوَّجَ الثَّيِّبَ، أَقَامَ عِنْدَهَا ثَلَاثاً، ثُمَّ قَسَمَ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

907. హజ్రత్ అనస్ (రజి) కథనం : ఒక పురుషుడు తనకు భార్య ఉండగా, ఒక కన్యను పెళ్ళి చేసుకుంటే, ఆ నూతన వధువు వద్ద మొదటి ఏడు రాత్రులు గడపాలి. ఆ తర్వాత సమానంగా భార్యల మధ్య వంతుల వారీ పద్ధతిని పాటించాలి. ఒకవేళ అతను, భర్తను చవిచూసివున్న (సయ్యిబా) స్త్రీని నికాహ్ చేసుకుంటే,(మొదటి) మూడు రాత్రులు ఆమెతో గడిపి ఆ తర్వాత వంతుల వారీ పద్ధతిని పాటించాలి - ఇదే మస్నూన్ - సంప్రదాయం - (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు బుఖారీలోనివి).

(٩٠٨) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ لَمَّا تَزَوَّجَهَا، أَقَامَ عِنْدَهَا ثَلَاثًا، وَقَالَ: «**إِنَّهُ لَيْسَ بِكِ عَلَى أَهْلِكِ هَوَانٌ، إِنْ شِئْتِ سَبَّعْتُ لَكِ، وَإِنْ سَبَّعْتُ لَكِ سَبَّعْتُ لِنِسَائِي**». رَوَاهُ مُسْلِمٌ.

908. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనను వివాహం చేసుకున్న తరువాత తన దగ్గర మూడు రోజులు గడిపారు. ఆ సందర్భంగా ఆయన (సఅసం) ఇలా సెలవిచ్చారు : "నీ ఇంటివారలు నీ పట్ల చిన్నచూపు చూడలేదు. నేను గనక తలచుకుంటే నీ కొరకు ఏడు రోజులు కేటాయించి, ఆ తరువాత నా సతీమణులందరి వద్దా ఏడేసి రోజులు గడపగలను" అని అన్నారు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే దేమిటంటే, ఒక వ్యక్తి మొదటి నుండే వివాహితుడై ఉండి, మరో నవ వధువును చేసుకోదలిస్తే, అట్టి నవ వధువు కూడా భర్త చనిపోయిన లేక విడాకులు పొందిన స్త్రీ అయి ఉంటే, వివాహమైన మొదటి రాత్రి నుండీ ఆమె వద్ద నిరంతరం మూడు రాత్రులు గడపవచ్చు. ఒకవేళ ఆ నవ వధువు కన్య అయి ఉంటే ఆమె వద్ద ఏడు రాత్రులు గడపాలి. ఆ తరువాత భార్యలందరికీ సమానంగా వంతుల వారీ పద్ధతిని విభజించాలి. కన్య కోసం ఏడు రాత్రులు కేటాయించటంలోని మర్మం ఏమిటంటే ఆమె మొట్టమొదటిసారి పుట్టింటినుండి మెట్టింటికి వచ్చింది. కొత్త వాతావరణంలో అడుగుపెట్టింది. ఆమెకు ప్రతిదీ కొత్తే. ఇలాంటి పరిస్థితిలో వరుడు ఎక్కువ రోజులు ఆమెకు చేరువలో ఉంటే ఆ ఇంటి వాతావరణానికి ఆమె అలవాటుపడుతుంది.

(٩٠٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ سَوْدَةَ بِنْتَ زَمْعَةَ وَهَبَتْ يَوْمَهَا لِعَائِشَةَ، وَكَانَ النَّبِيُّ ﷺ يَقْسِمُ لِعَائِشَةَ يَوْمَهَا وَيَوْمَ سَوْدَةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

909. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: హజ్రత్ సౌదా బిన్తె జమ్ఆ (ర.అన్హా) తనకు వచ్చిన వంతు (రోజు)ను హజ్రత్ ఆయిషా(ర.అన్హా)కు కానుకగా సమర్పించారు. కాగా; దైవ ప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కొరకు ఆమె వంతును, హజ్రత్ సౌదా (ర.అన్హా) ఇచ్చేసిన వంతును కూడా వినియోగించుకునే వారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒక భార్య తన సవతికోసం తన వంతును కానుకగా ఇవ్వగలదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అయితే నిర్ణీత రోజుల నిర్ధారణ కాని పరిస్థితిలో ఈ కానుక ఒకసారి ఇచ్చినమీదట తిరిగి తీసుకోబడదు.

(٩١٠) وَعَنْ عُرْوَةَ قَالَ: قَالَتْ عَائِشَةُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: يَا ابْنَ أُخْتِيْ كَانَ رَسُولُ اللهِ ﷺ لاَ يُفَضِّلُ بَعْضَنَا عَلَىٰ بَعْضٍ فِي الْقَسْمِ، مِنْ مُكْثِهِ عِنْدَنَا وَكَانَ قَلَّ يَوْمٌ إِلاَّ وَهُوَ يَطُوفُ عَلَيْنَا جَمِيْعاً، فَيَدْنُو مِنْ كُلِّ امْرَأَةٍ، مِنْ غَيْرِ مَسِيْسٍ، حَتَّى يَبْلُغَ الَّتِيْ هُوَ يَوْمُهَا، فَيَبِيْتُ عِنْدَهَا. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

910. హజ్రత్ ఉర్వా (రజి) కథనం ప్రకారం హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఇలా చెప్పారు : "ఓ నా అక్క పుత్రుడా! దైవప్రవక్త (సఅసం) తన సతీమణులకు వంతులు కేటాయించేటప్పుడు ఏ ఒక్కరికీ మరొకరిపై శ్రేష్ఠత నొసగేవారు కారు. వంతులు కేటాయించబడి ఉన్నప్పటికీ ఆయన (స) మా వద్దకు రాకపోవటమన్నది - అరుదుగా తప్ప - జరిగేది కాదు. కాని ఎవరినీ ముట్టుకునే వారు కాదు. అలా తిరుగుతూ ఆ రోజు ఏ భార్య వంతు ఉంటుందో ఆమె వద్దకు వెళ్ళి ఆ రాత్రి ఆమె వద్దనే గడిపే వారు." (అహ్మద్, అబూదావూద్ - వాక్యాలు అబూదావూద్‌వి. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

وَلِمُسْلِمٍ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا صَلَّى الْعَصْرَ دَارَ عَلَى نِسَائِهِ، ثُمَّ يَدْنُو مِنْهُنَّ. الْحَدِيْثَ.

'ముస్లిం'లో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఉల్లేఖనం ఈ విధంగా ఉంది: "అస్ర్ నమాజు చేసిన తరువాత దైవప్రవక్త (సఅసం) భార్యలందరి వద్దకూ వెళ్ళేవారు. వారితో ఎంతో చనువుగా కూడా ఉండేవారు."

**సారాంశం**

పై హదీసు వెలుగులో బోధపడేదేమిటంటే దైవప్రవక్త (సఅసం) ప్రతి రోజూ తన సతీమణుల కుటీరాలకు స్వయంగా వెళ్ళి వాళ్ళ యోగక్షేమాలను దర్యాప్తు చేసేవారు. ఎంతో ఉల్లాసంగా వారిని పలకరించేవారు. ఒక వ్యక్తికి బహుభార్యలున్నప్పుడు ప్రతి ఒక్కరికీ వేర్వేరు

ఇల్లుగానీ, ప్రత్యేక గదిగానీ ఉండాలని కూడా ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఇలా చేయటం వల్ల ప్రైవసీ ఉంటుంది. ఈ మాత్రం వసతి సౌకర్యాన్ని కల్పించలేని వ్యక్తి భార్యల మధ్య న్యాయం చేయలేడు. భార్యల మధ్య న్యాయం చేసే శక్తి స్థోమత లేనివాడు ఒకటికి మించి పెళ్ళిళ్ళు చేసుకోవలసిన అవసరం కూడా లేదు.

(٩١١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ كَانَ يَسْأَلُ فِي مَرَضِهِ الَّذِيْ مَاتَ فِيْهِ: أَيْنَ أَنَا غَداً؟ يُرِيْدُ يَوْمَ عَائِشَةَ، فَأَذِنَ لَهُ أَزْوَاجُهُ، يَكُونُ حَيْثُ شَاءَ، فَكَانَ فِيْ بَيْتِ عَائِشَةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

911. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణ వ్యాధికి గురైవున్న రోజుల్లో కూడా "రేపు నా వంతు ఎవరిది?" అని అడిగి తెలుసుకునేవారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తో గడపవలసిన రోజును దృష్టిలో పెట్టుకుని ఆయన (స) ఈ విధంగా అడిగేవారు. తమరు కోరిన వారి వద్ద ఉండవచ్చని సతీమణులందరూ ఆయన (స)కు అనుమతి ఇచ్చేశారు. అప్పటినుంచీ ఆయన (స) హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దగ్గరే ఉండ సాగారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) హజ్రత్ మైమూనా (ర.అన్హా) ఇంట్లో ఉన్నప్పుడు తీవ్రమయిన అస్వస్థతకు గురయ్యారు. అదే ఆయన (స) మరణ వ్యాధిగా మారింది. ఈ వ్యాధివల్ల ఆయన చాలా నీరసించిపోయారు, భార్యలందరి కుటీరాలకు వెళ్ళలేనంత నిస్సహాయ స్థితి ఏర్పడింది. పరిస్థితిని అర్థం చేసుకున్న పుత్రిక హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) శోకం చేసుకుని తల్లులందరినీ సంప్రతించి, ఇక మీదట హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కుటీరంలోనే మహాప్రవక్త (స) ఉండేలా ఒప్పించారు. వారంతా ఈ మేరకు సమ్మతించారు. అనంతరం ప్రవక్త సతీమణుల మధ్య ఎలాంటి అరమరికలు, మనస్పర్థలు ఏర్పడరాదన్న ఉద్దేశ్యంతోనే వాళ్ళందరినీ సంప్రతించి ఆమోదం పొందవలసి వచ్చింది.

(٩١٢) وَعَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللّٰهِ ﷺ إِذَا أَرَادَ سَفَراً أَقْرَعَ بَيْنَ نِسَائِهِ، فَأَيَّتُهُنَّ

912. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి మరో కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎక్కడికైనా ప్రయాణానికి సంకల్పించుకున్నప్పుడల్లా తన

خَرَجَ سَهْمُهَا، خَرَجَ بِهَا مَعَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

భార్యల పేర్లు వ్రాసి చీటీలు వేసేవారు. చీటీలో ఎవరి పేరు వస్తే వారిని ప్రయాణంలో వెంటబెట్టుకుని వెళ్ళే వారు.''

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఏదైనా వ్యవహారం అస్పష్టంగా, నిర్ణయం తీసుకోవడానికి అనువుగా లేనపుడు 'చీటీ' వేయడంలో తప్పులేదని ఈ హదీసు నిరూపిస్తోంది.

(٩١٣) وَعَنْ عَبْدِ اللهِ بْنِ زَمْعَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَجْلِدْ أَحَدُكُمُ امْرَأَتَهُ جَلْدَ الْعَبْدِ». رَوَاهُ الْبُخَارِيُّ.

913. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జమ్ఆ (రజి) తెలిపారు- ''మీలో ఎవరయినా సరే మీ భార్యను బానిసల్ని బాదినట్లుగా బాదకండి.''

(బుఖారీ)

**హదీసు ఉల్లేఖకులు**

అబ్దుల్లాహ్ బిన్ జమ్ఆ (రజి): అబ్దుల్లాహ్ బిన్ జమ్ఆ బిన్ అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా అసదీ. ఈయన హజ్రత్ సౌదా (ర.అన్హా) గారి సోదరులు. సహాబీలలో ప్రముఖులు. మదీనా వాసులు. యౌముద్దార్‌లో అమరగతి నొందారు.

**7వ అధ్యాయం**

## ٦ - بَابُ الْخُلْعِ

## ఖులా

(٩١٤) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ امْرَأَةَ ثَابِتِ بْنِ قَيْسٍ أَتَتِ النَّبِيَّ ﷺ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! ثَابِتُ بْنُ قَيْسٍ مَا أَعِيبُ عَلَيْهِ فِي خُلُقٍ وَلاَ دِينٍ، وَلَكِنِّي أَكْرَهُ الْكُفْرَ فِي الإِسْلاَمِ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «أَتَرُدِّينَ عَلَيْهِ حَدِيقَتَهُ؟» فَقَالَتْ:

914. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: సాబిత్ బిన్ ఖైస్ (రజి) సతీమణి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు వచ్చి, ''ఓ దైవప్రవక్తా (స)! నేను సాబిత్ బిన్ ఖైస్ (రజి) గుణగణాల గురించి, ధర్మావలంబన గురించి ఎలాంటి ఫిర్యాదూ చేయలేను. అయితే ఇస్లాంలో తిరస్కార వైఖరి (కుఫ్ర్) కి ఒడిగట్టడం నాకేమాత్రం ఇష్టంలేదు''

نَعَمْ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «اِقْبَلِ الْحَدِيقَةَ وَطَلِّقْهَا تَطْلِيقَةً». رَوَاهُ الْبُخَارِيُّ. وَفِي رِوَايَةٍ لَهُ: «وَأَمَرَهُ بِطَلَاقِهَا».

అని విన్నవించుకుంది. "నీవు అతని తోటను అతనికి తిరిగి ఇవ్వగలవా?" అని ఆయన (స) ప్రశ్నించారు. "ఇవ్వగలను" అని ఆమె సమాధానమిచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స), "(ఓ సాబిత్!) నీ తోటను నువ్వు తీసేసుకుని ఆమెకు విడాకులిచ్చేయి" అని సూచించారు. (బుఖారీ)

وَلِأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ - وَحَسَّنَهُ -: أَنَّ امْرَأَةَ ثَابِتِ بْنِ قَيْسٍ اخْتَلَعَتْ مِنْهُ، فَجَعَلَ النَّبِيُّ ﷺ عِدَّتَهَا حَيْضَةً.

అబూదావూద్, తిర్మిజీలలో ఉంది - సాబిత్ బిన్ ఖైస్ (రజి) భార్య మహర్‌గా పొందిన ఆస్తిని వాపసు చేసింది (ఖులా కోరింది). దైవప్రవక్త (స) ఆమె కోసం ఒక రుతువును 'ఇద్దత్' (గడువు కాలం)గా ఖరారు చేశారు. (ఈ హదీసును తిర్మిజీ హసన్‌గా ఖరారు చేశారు)

وَفِي رِوَايَةِ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ. عِنْدَ ابْنِ مَاجَهْ: أَنَّ ثَابِتَ بْنَ قَيْسٍ كَانَ دَمِيماً، وَأَنَّ امْرَأَتَهُ قَالَتْ: لَوْلَا مَخَافَةُ اللهِ إِذَا دَخَلَ عَلَيَّ لَبَصَقْتُ فِي وَجْهِهِ.

ఇబ్నెమాజాలో అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి ఆధారంగా తన తాత గారి కథనాన్ని ఇలా వివరించారు - సాబిత్ బిన్ ఖైస్ (రజి) అందవికారుడు, నల్లని వాడు. ఆయన భార్య ఆయన అందవికారాన్ని గురించి, "నాకేగనక దైవ భయం లేనట్లయితే, ఆయన నా దగ్గరకు వచ్చినపుడు నేను ఆయన మొహంపై ఉమ్మేసేదాన్ని" అని చెప్పింది.

وَلِأَحْمَدَ مِنْ حَدِيثِ سَهْلِ بْنِ أَبِي حَثْمَةَ: «وَكَانَ ذَلِكَ أَوَّلَ خُلْعٍ فِي الْإِسْلَامِ».

ముస్నద్ అహ్మద్‌లో సహ్ల్ బిన్ అబూ హస్మా ఉల్లేఖనం ప్రకారం, ఇస్లాంలో ఇది భార్యాభర్తల వేర్పాటుకు సంబంధించిన మొట్టమొదటి సంఘటన (ఖులా).

**సారాంశం**

"ఇస్లాంలో తిరస్కార వైఖరి (కుఫ్ర్)కి ఒడిగట్టడం నాకేమాత్రం ఇష్టంలేదు" అని ఆమె చెప్పడంలోని ఆంతర్యం ఏమిటంటే భర్తపట్ల గల అయిష్టత మూలంగా నేను ఆయన యెడల ఎడమొహం పెడ మొహంగా ఉంటున్నాను. ఇది అవిధేయతకు తార్కాణం. భర్త పట్ల అవిధేయురాలై ఉండటం అంటే దేవుని ఆగ్రహానికి గురవటమే. నేను గనక ఆయనతో ఈ రకంగా కాపురం చేస్తూ ఉంటే అనుదినం ఇస్లాంకు వ్యతిరేకమయిన విధానానికి పాల్పడిన దాన్నవుతాను. కాబట్టి నన్ను ఈ వివాహ బంధం నుంచి విముక్తి నొసగండి అని ఆమె చెప్పదలచింది. దైవప్రవక్త (స) ఆమె మాటల్లోని ఆంతర్యాన్ని తక్షణం పసిగట్టి, 'నీ భర్త నీకు మహర్‌గా ఇచ్చిన తోటను మరి ఆయనకు తిరిగి ఇచ్చేస్తావా?' అని ప్రశ్నించారు. దానికామె మనస్ఫూర్తిగా అంగీకరించింది.

వివిధ ఉల్లేఖనాల ద్వారా తెలిసేదేమంటే సాబిత్ బిన్ ఖైస్ (రజి) సతీమణి ధర్మపరాయణురాలు. ధర్మావలంబనలో ఆమె ఖచ్చితంగా వ్యవహరిస్తూ, దైవాగ్రహానికి భయపడుతూ ఉండేది. ఈ సుగుణాలన్నింటితోపాటు ఆమె చాలా అందగత్తె. కాగా; సాబిత్ బిన్ ఖైస్ (రజి) పొట్టిగా, నల్లగా ఉండేవారు. పైగా కఠిన స్వభావులు. అప్పుడప్పుడూ భార్యను కొట్టేవారు కూడా. ఇలా అనేక కారణాలన్నీ కలసి కాపురంలో కలతలు రేగాయి. ఆలుమగల మధ్య దూరాలు పెరగసాగాయి. ఈ వైముఖ్య ధోరణి తన ధార్మిక జీవితానికి, తన పరలోక సాఫల్యానికి ఎక్కడ హానికరంగా పరిణమిస్తుందోనన్న భయం సాబిత్ బిన్ ఖైస్ (రజి) సతీమణిని పీడించసాగింది. అందుకే ఆమె దైవప్రవక్త (స) సలహా కోరింది. అంతటి ఉద్రిక్త పరిస్థితిలోనూ ఆమె తన భర్తపై ఎలాంటి ఆరోపణలు చేయకపోగా, ఆయనగారి గుణగణాలను, ధర్మావలంబనను కొనియాడటం ఆమెలోని నిజాయితీ తత్పరతకు ప్రబల నిదర్శనం.

తగు కారణమున్నప్పుడు భర్త తనకు మహర్‌గా ఇచ్చిన సొమ్మును వాపసుచేసి భార్య విడాకులు (ఖులా) పొందగలదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఇమాములలో ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల దృష్టిలో ఖులా కూడా విడాకుల వంటిదే. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) దృష్టిలో ఇది నికాహ్‌ను రద్దుపరచటంగా పరిగణించబడుతుంది. 'ఖులా' కోరిన భార్య మహర్ సొమ్మును తిరిగి ఇచ్చివేసే విషయమై ఇమాముల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. స్త్రీ తన భర్తపట్ల అయిష్టతను వ్యక్తపరచిన పక్షంలో ఆమె నుండి భర్త మహర్‌కన్నా ఎక్కువ పరిహారాన్ని డిమాండు చేయవచ్చునని ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌లు అంటున్నారు. మెజారిటీ విద్వాంసులు కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. అయితే ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్ (రహ్మ.లై) తదితరులు ఎక్కువ పరిహారం తీసుకోవటం సముచితం కాదని అభిప్రాయపడ్డారు.

## హదీసు ఉల్లేఖకులు

సాబిత్ బిన్ ఖైస్ (రజి) : అన్సారీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. అగ్రశ్రేణి ప్రవక్త సహచరులలో ఒకరుగా భావించబడతారు. పలు వ్యవహారాలలో అన్సార్ల తరపున, ప్రవక్త (స) తరపున అధికార ప్రతినిధిగా ఉండేవారు. ఉహుద్ యుద్ధంలోనూ, ఆ తరువాత జరిగిన యుద్ధాలన్నింటిలోనూ పాల్గొన్నారు. దైవప్రవక్త (స) ఈయనకు స్వర్గలోక శుభవార్త ఇచ్చారు. హిజ్రీ 12లో యమామ పోరాటంలో అమరగతి నొందారు.

## 8వ అధ్యాయం

## ٧ - بَابُ الطَّلَاقِ

## తలాఖ్

(٩١٥) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَبْغَضُ الحَلَالِ إِلَى اللهِ الطَّلَاقُ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَرَجَّحَ أَبُو حَاتِمٍ إِرْسَالَهُ.

915. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : ధర్మసమ్మత మైన విషయాలలో కెల్లా అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరమైనది తలాఖ్ (విడాకులు)." (ఈ హదీసును అబూ దావూద్, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అబూ హాతిమ్ మాత్రం దీన్ని 'ముర్సల్' అని నొక్కి చెప్పారు)

## సారాంశం

ధర్మ సమ్మతమైన విషయాలలోనూ అన్నింటినీ అల్లాహ్ ఇష్టపడడనీ, కొన్ని విషయాలను అసహ్యించుకుంటాడనీ ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ఈ విధంగా అల్లాహ్‌కు ఇష్టంలేని హలాల్ విషయాలలో 'తలాఖ్' కూడా ఒకటి. తలాఖ్ అధర్మమయిన విషయం కానప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే దాన్ని ఆశ్రయించాలి. ఎందుకంటే దాని మూలంగా కాపురాలు కూలిపోతాయి, కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుంది. పిల్లల పెంపకంపై తీవ్ర ప్రభావం పడుతుంది. షైతాన్ ఇష్టపడేది కూడా ఇలాంటి వాటినే. అందుకే వీలైనంతవరకు వ్యవహారం విడాకుల దాకా రాకుండా జాగ్రత్తపడాలి. పరిస్థితుల స్వరూపాన్ని బట్టి దీనికి సంబంధించిన అనేక పద్ధతులున్నాయి. వాటి వివరాలను వివిధ హదీసు, ఫికహ్ గ్రంథాలలో చూడవచ్చు.

(٩١٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ طَلَّقَ امْرَأَتَهُ، وَهِيَ حَائِضٌ، فِيْ عَهْدِ رَسُولِ اللهِ ﷺ، فَسَأَلَ عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ رَسُولَ اللهِ ﷺ عَنْ ذٰلِكَ، فَقَالَ: «**مُرْهُ، فَلْيُرَاجِعْهَا، ثُمَّ لْيُمْسِكْهَا حَتَّى تَطْهُرَ، ثُمَّ تَحِيضَ، ثُمَّ تَطْهُرَ، ثُمَّ إِنْ شَاءَ أَمْسَكَ بَعْدَ، وَإِنْ شَاءَ طَلَّقَ قَبْلَ أَنْ يَمَسَّ، فَتِلْكَ العِدَّةُ الَّتِي أَمَرَ اللَّهُ أَنْ تُطَلَّقَ لَهَا النِّسَاءُ**». مُتَّفَقٌ عَلَيْهِ.

916. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) కాలంలో ఈయన (ఇబ్నె ఉమర్) తన భార్యకు బహిష్టు స్థితిలో విడాకులిచ్చారు. ఆయన తండ్రి అయిన ఉమర్ (రజి) ఈ విషయాన్ని దైవప్రవక్త (స) దృష్టికి తీసుకురాగా ఆయన (స) ఇలా అన్నారు : "విడాకుల్ని ఉపసంహరించుకోమని అతనికి చెప్పండి. ఇంకా, ఆమె పరిశుద్ధం అయ్యే వరకు ఆమెను తన దగ్గరే ఆపి ఉంచాలి. మళ్ళీ ఆమె బహిష్టు అయి, తిరిగి పరిశుద్ధమయిన తరువాత అతను కావాలనుకుంటే ఆమెను ఆపి ఉంచుకోవచ్చు. లేదా విడాకులివ్వవచ్చు. అయితే అప్పటి వరకూ అతనామెతో సమాగమం జరపకూడదు. ఇదే విడాకుల గడువు. దీని ప్రకారమే స్త్రీలకు విడాకులివ్వాలని దేవుడు ఆజ్ఞాపించాడు." (బుఖారీ, ముస్లిం)

وَفِيْ رِوَايَةٍ لِّمُسْلِمٍ: «**مُرْهُ فَلْيُرَاجِعْهَا، ثُمَّ لِيُطَلِّقْهَا طَاهِراً أَوْ حَامِلاً**».

'ముస్లిం'లోని ఉల్లేఖనంలో ఉంది - "తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోమని అతనికి చెప్పండి. ఆ తరువాత ఆమె పరిశుద్ధస్థితిలో ఉన్నప్పుడు లేదా గర్భవతిగా ఉన్నప్పుడు మాత్రమే అతను ఆమెకు విడాకులు ఇవ్వాలి."

وَفِيْ رِوَايَةٍ أُخْرَى لِلْبُخَارِيِّ: «وَحُسِبَتْ عَلَيْهِ تَطْلِيقَةً».

"ఇది ఒక విడియాకుగా మాత్రమే లెక్కించబడుతుంది" అని బుఖారీలోని వేరొక కథనంలో ఉంది.

وَفِي رِوَايَةٍ لِّمُسْلِمٍ: قَالَ ابْنُ عُمَرَ: أَمَا أَنْتَ طَلَّقْتَهَا وَاحِدَةً أَوِ اثْنَتَيْنِ فَإِنَّ رَسُولَ اللهِ ﷺ أَمَرَنِي أَنْ أُرَاجِعَهَا، ثُمَّ أُمْسِكَهَا حَتَّى تَحِيْضَ حيضةً أُخْرَى، ثُمَّ أُمْهِلَهَا حَتَّى تَطْهُرَ، ثُمَّ أُطَلِّقَهَا قَبْلَ أَنْ أَمَسَّهَا، وَأَمَّا أَنْتَ طَلَّقْتَهَا ثَلَاثًا، فَقَدْ عَصَيْتَ رَبَّكَ فِيمَا أَمَرَكَ بِهِ مِنْ طَلَاقِ امْرَأَتِكَ.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇబ్నె ఉమర్ (రజి) ఇలా అన్నారు : ఒకవేళ నీవు నీ భార్యకు ఒకటి లేదా రెండు విడాకులిచ్చి ఉంటే; ఈ వ్యవహారంలో దైవప్రవక్త (స) నాకు ఇచ్చిన ఆజ్ఞ ఏమిటంటే- ఈ విడాకుల నిర్ణయాన్ని నేను ఉపసంహరించుకోవాలి. మలిసారి బహిష్టు అయ్యేవరకూ ఆమెను నా దగ్గరే ఆపి ఉంచాలి. ఆ తరువాత ఆమె పరిశుద్ధురాలయ్యే వరకూ అవకాశం ఇవ్వాలి. అప్పుడామెను తాకకముందే విడాకులివ్వాలి. ఒకవేళ నువ్వు ఆమెకు మూడుసార్లు విడాకులిచ్చేస్తే, నువ్వు నీ భార్యకు విడాకులిచ్చే విషయంలో దేవుని అవిధేయతకు ఒడిగట్టావు.''

وَفِي رِوَايَةٍ أُخْرَى: قَالَ عَبْدُاللهِ بْنُ عُمَرَ: فَرَدَّها عَلَيَّ، وَلَمْ يَرَهَا شَيْئًا، وَقَالَ: إِذَا طَهُرَتْ فَلْيُطَلِّقْ، أَوْ لِيُمْسِكْ.

వేరొక ఉల్లేఖనంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త (సఅసం) ఆమెను నా వద్దకు తిప్పి వంపారు. (నేనిచ్చిన) ఆ విడాకును గురించి ఏమీ అనలేదు. స్త్రీ పరిశుద్ధురాలైన పిదప నీవు (ఇబ్నె ఉమర్ - రజి) ఆమెకు విడాకులైనా ఇవ్వవచ్చు లేదా ఆపుకున్నా ఆపుకోవచ్చు అని సెలవిచ్చారు.

(٩١٧) وَعَنْ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: كَانَ الطَّلَاقُ عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ، وَأَبِي بَكْرٍ، وَسَنَتَيْنِ مِنْ

917. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలోనూ, అబూబకర్ (రజి) ఖిలాఫత్ కాలంలోనూ, హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలోని తొలి

خِلاَفَةِ عُمَرَ، طَلاَقُ الثَّلاَثِ وَاحِدَةً، فَقَالَ عُمَرُ: إِنَّ النَّاسَ قَدِ اسْتَعْجَلُوْا فِي أَمْرٍ كَانَتْ لَهُمْ فِيْهِ أَنَاةٌ، فَلَوْ أَمْضَيْنَاهُ عَلَيْهِمْ. فَأَمْضَاهُ عَلَيْهِمْ. رَوَاهُ مُسْلِمٌ.

రెండేళ్ళ కాలంలోనూ - ఏక కాలంలో ఇవ్వబడిన మూడు విడాకులు ఒక్క విడాకుగా మాత్రమే పరిగణించబడేది. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా ప్రకటించారు - "ప్రజలు తమకు ఇవ్వ బడిన సౌలభ్యాన్ని వినియోగించుకోవ టంలో వేగిరపడ్డారు. కాబట్టి మనం ఇప్పుడు దీనినే (మూడు విడాకులనే) వీళ్ళపై విధించాలి." అంతే. ఆయన (ఉమర్ - రజి) తన నిర్ణయాన్ని వారిపై విధించారు. (ముస్లిం)

(٩١٨) وَعَنْ مَحْمُوْدِ بْنِ لَبِيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أُخْبِرَ رَسُوْلُ اللهِ ﷺ عَنْ رَجُلٍ طَلَّقَ امْرَأَتَهُ ثَلاَثَ تَطْلِيْقَاتٍ جَمِيْعاً، فَقَامَ غَضْبَانَ، ثُمَّ قَالَ: **أَيُلْعَبُ بِكِتَابِ اللهِ، وَأَنَا بَيْنَ أَظْهُرِكُمْ؟** حَتَّى قَامَ رَجُلٌ، فَقَالَ: يَا رَسُوْلَ اللهِ! أَلاَ أَقْتُلُهُ. رَوَاهُ النَّسَائِيُّ، وَرُوَاتُهُ مُوَثَّقُوْنَ.

918. హజ్రత్ మహ్మూద్ బిన్ లబీద్ (రజి) కథనం : ఒక వ్యక్తి తన భార్యకు ఏకకాలంలో మూడుసార్లు విడాకులిచ్చా డని దైవప్రవక్త (సఅసం)కు తెలియ జేయగా, ఆయన (స) ఆగ్రహోదగ్రులై లేచి నిలబడ్డారు. ఆయన (స) ఆ సందర్భంగా ఇలా అన్నారు - "ఏమిటీ? నేను మీ మధ్య ఉండగానే దైవ గ్రంథంతో చెలగాటమాడుతున్నారా?!" అప్పుడు వెంటనే ఒక వ్యక్తి లేచి నిలబడి, "దైవప్రవక్తా (స)! నేనా వ్యక్తిని హత మార్చనా?!" అని విన్నవించుకున్నాడు. (నసాయి - దీని ఉల్లేఖకులు విశ్వస నీయులు)

**సారాంశం**

ఏక కాలంలో మూడుసార్లు విడాకులివ్వటం అధర్మమని ఈ హదీసును బట్టి విదితమవు తున్నది. ఇటువంటి విడాకులను ఉపసంహరించుకోవచ్చా? లేదా అన్న విషయం ఇందులో

లేదు. దైవప్రవక్త (స) ఈ మేరకు అనుమతి ఇచ్చిన ప్రస్తావన కూడా లేదు. అందుచేత విడాకులకు సంబంధించి వివిధ అభిమతాలకు అనుకూలంగా ఈ హదీసు ద్వారా సమర్థన లభించదు.

## హదీసు ఉల్లేఖకులు

మహ్మూద్ బిన్ లబీద్ (రజి) : మహ్మూద్ బిన్ లబీద్ బిన్ అబూ రాఫె అన్సారీ అష్‌హలీ. దైవప్రవక్త (స) కాలంలో జన్మించారు. ఈయన కూడా సహాబీయేనని ఇమామ్ బుఖారీ అంటున్నారు. ఈయన సహాబీ అవునా కాదా అన్న విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేమని అబూ హాతిమ్ అభిప్రాయపడ్డారు. ఇమామ్ ముస్లిం మాత్రం ఈయన్ని తాబయీల జాబితాలో చేర్చారు. మొత్తానికి ఈయన గొప్ప విద్వాంసులలో ఒకరు. హిజ్రీ 96లో మరణించారు.

(٩١٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: طَلَّقَ أَبُو رُكَانَةَ، أَمَّ رُكَانَةَ، فَقَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ: **رَاجِعِ امْرَأَتَكَ**». فَقَالَ: إِنِّي طَلَّقْتُهَا ثَلاَثاً، قَالَ: «**قَدْ عَلِمْتُ، رَاجِعْهَا**». رَوَاهُ أَبُو دَاوُدَ.

919. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: అబూ రుకానా తన భార్యకు విడాకులిచ్చారు. "ఉమ్మె రుకానా (ర.అన్‌హా)ను ఇచ్చిన విడాకును ఉప సంహరించుకో" అని దైవప్రవక్త (సఅసం) ఆయనకు ఆజ్ఞాపించారు. "నేనామెకు మూడు విడాకులు ఇచ్చేశాను కదా!" అని అబూ రుకానా సందేహపడగా "ఆ సంగతి నాకు తెలుసు. నువ్వు ఉపసంహరించుకో" అని దైవప్రవక్త (స) చెప్పారు. (అబూ దావూద్)

وَفِي لَفْظٍ لأَحْمَدَ: طَلَّقَ أَبُو رُكَانَةَ امْرَأَتَهُ فِي مَجْلِسٍ وَاحِدٍ ثَلاثاً، فَحَزِنَ عَلَيْهَا، فَقَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ: «**فَإِنَّهَا وَاحِدَةٌ**». وَفِي سَنَدِهِمَا ابْنُ إِسْحَاقَ، وَفِيهِ مَقَالٌ.

ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది - అబూరుకానా (రజి) ఒకేసారి మూడు విడాకులిచ్చేశారు. ఆ తరువాత తన చర్యపై ఆందోళన చెందారు. అప్పుడు దైవప్రవక్త (స) అబూరుకానా నుద్దేశించి, "ఆ మూడు విడాకులు ఒక విడాకుగానే పరిగణించ బడుతుంది" అని అన్నారు. (ఈ రెండు ఉల్లేఖనాలలోనూ ఇబ్నె ఇస్‌హాఖ్

ఉన్నారు. ఆయన గురించి చర్చకు తావు ఏర్పడింది)

وَقَدْ رَوَى أَبُو دَاوُدَ مِنْ وَجْهٍ آخَرَ، أَحْسَنَ مِنْهُ، أَنَّ أَبَا رُكَانَةَ طَلَّقَ امْرَأَتَهُ سُهَيْمَةَ الْبَتَّةَ، فَقَالَ: وَاللهِ مَا أَرَدْتُ بِهَا إِلاَّ وَاحِدَةً، فَرَدَّهَا إِلَيْهِ النَّبِيُّ ﷺ.

అబూ దావూద్ వేరొక సౌజన్యంతో చేసిన ఉల్లేఖనం ఇంతకన్నా మెరుగ్గా ఉంది. దీని ప్రకారం : అబూ రుకానా (రజి) తన భార్య సుహైమాకు తిరుగులేని విధంగా విడాకులిచ్చేశారు. ఆ తర్వాత ఆయన, 'దైవసాక్షి! నేను ఒకే తలాఖ్ సంకల్పంతో ఇలా చేశాను' అని అభిప్రాయపడగా, దైవప్రవక్త (స) ఉమ్మె రుకానా (ర.అన్హా)ను ఆయన వద్దకు వాపసు పంపించారు.

**హదీసు ఉల్లేఖకులు**

1. అబూ రుకానా (రజి) : అబూ రుకానా బిన్ అబ్దె యజీద్ బిన్ హాషిమ్ బిన్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్. మక్కా విజయయాత్రలో పాల్గొన్నారు. ఈయన దైవప్రవక్త (సఅసం) తో కుస్తీ పట్టారనీ, ఈ కుస్తీ పోటీయే ఈయన ఇస్లాం స్వీకారానికి కారణమయిందని చెబుతారు. అనంతరం మదీనాకు ప్రస్థానం చేశారు. అమీర్ ముఆవియా (రజి) ఖిలాఫత్ ఆరంభ కాలంలో మరణించారు. హిజ్రీ 41లో చనిపోయారని ఇంకొక వాదన. ఈయన సతీమణి పేరు సుహైమ.

2. ముహమ్మద్ బిన్ ఇస్హాఖ్ : మారుపేరు అబూ ఉబైదుల్లా. పూర్తిపేరు ముహమ్మద్ బిన్ ఇస్హాఖ్ బిన్ యసార్ ముత్తలబీ. ఖైస్ బిన్ మఖ్ఖమ మదనీగారి బానిస. జిహాద్, సైరు (షికారు) విషయంలో అందరికన్నా ముందుండేవారు. హిజ్రీ 51లో మరణించారు.

(٩٢٠) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «ثَلاَثٌ

920. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : మూడు విషయాలున్నాయి - వాటిని సంకల్పించుకుంటే చాలు సంకల్పం ఖరారైనట్లే. వేళాకోళానికి చెప్పినా అది సంకల్పంగానే పరిగణించబడుతుంది. అవేమంటే - "వివాహం, విడాకులు,

جِدُّهُنَّ جِدٌّ، وَهَزْلُهُنَّ جِدٌّ: النِّكَاحُ، وَالطَّلَاقُ، وَالرَّجْعَةُ». رَوَاهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

ఉపసంహారం." (దీనిని 'నలుగురి'లో నసాయి మినహా అందరూ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు)

وَفِيْ رِوَايَةٍ لِابْنِ عَدِيٍّ، مِنْ وَجْهٍ آخَرَ ضَعِيْفٍ: «الطَّلَاقُ، وَالْعِتَاقُ، وَالنِّكَاحُ».

ఇబ్నె అదీ గారి వేరొక 'జయీఫ్' ఉల్లేఖనంలో ఉంది - "విడాకులు, స్వేచ్ఛ, వివాహం."

وَلِلْحَارِثِ بْنِ أَبِيْ أُسَامَةَ، مِنْ حَدِيْثِ عُبَادَةَ بْنِ الصَّامِتِ، رَفَعَهُ: «**لاَ يَجُوْزُ اللَّعِبُ فِيْ ثَلَاثٍ: الطَّلَاقِ، وَالنِّكَاحِ، وَالْعِتَاقِ، فَمَنْ قَالَهُنَّ فَقَدْ وَجَبْنَ**». وَسَنَدُهُ ضَعِيْفٌ.

ఉబాదా బిన్ సామిత్ (రజి)చే 'మర్ఫూ'గా చెప్పబడిన హారిస్ బిన్ అబూ ఉసామా ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది : "మూడు విషయాలలో ఎగతాళి ధర్మసమ్మతం కాదు - అవి: విడాకులు, వివాహం మరియు స్వేచ్ఛ. ఎవరయినా ఈ విషయంలో ఆషామాషీగా నోటితో చెప్పినా అది అనివార్యమైపోతుంది." (దీని ఆధారం బలహీనమైనది)

(٩٢١) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «**إِنَّ اللَّهَ تَعَالَى تَجَاوَزَ عَنْ أُمَّتِي مَا حَدَّثَتْ بِهِ أَنْفُسَهَا، مَا لَمْ تَعْمَلْ، أَوْ تَكَلَّمْ**». مُتَّفَقٌ عَلَيْهِ.

921. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు : "నా అనుచర సమాజ సభ్యుల ఆంతర్యంలో జనించే దుష్ప్రేరణల విషయంలో అల్లాహ్ సడలింపుల వైఖరిని అవలంబించాడు.- (ఆంతర్యంలో జనించిన విషయాన్ని) చేయనంతవరకూ, నోటితో చెప్పనంత వరకూ (అది చేసినట్లుగా పరిగణించబడదు)." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మనసులో జనించే భావాలు, ఆలోచనలు, ప్రేరణల గురించి నిలదీయడం జరగదని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఉదాహరణకు : ఒక వ్యక్తి ఆంతర్యంలో తన భార్యకు

విడాకులివ్వాలన్న ఆలోచన పుట్టింది. లేదా ఫలానా స్త్రీని వివాహమాడాలన్న కోరిక కలిగింది. అంతమాత్రానికే అతను ఆ పని చేసేసినట్టు అర్థం కాదు. అలాగే ఎవరినయినా తలాక్ కొరకు వేధించి, కొట్టి బలవంతంగా అతని నోటితో 'తలాక్' అని చెప్పిస్తే అది తలాక్ అనిపించుకోదు. అయితే అది 'తలాకె మక్రూహ్' (బలవంతపు విడాకులు) అనీ, అటువంటి తలాక్ అయిపోయినట్లేనని హనఫీలు భావిస్తున్నారు. కాగా; హనఫీల భావన ఈ హదీసుకు వ్యతిరేకంగా ఉంది. అదేవిధంగా ఎవరయినా ఒక స్త్రీని బలవంతంగా నికాహ్ కొరకు ఒప్పిస్తే అటువంటి నికాహ్ నికాహ్యే కాదు.

(٩٢٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «**إِنَّ اللَّهَ تَعَالَى وَضَعَ عَنْ أُمَّتِي الْخَطَأَ، وَالنِّسْيَانَ، وَمَا اسْتُكْرِهُوا عَلَيْهِ**». رَوَاهُ ابْنُ مَاجَهْ. وَالْحَاكِمُ. وَقَالَ أَبُو حَاتِمٍ: لاَ يَثْبُتُ.

922. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "అల్లాహ్ నా అనుచర వర్గీయుల పొరబాట్లను, మరుపును, బలాత్కారానికి గురవటం వల్ల జరిగిపోయిన తప్పును మన్నిస్తాడు." (ఇబ్నెమాజా దీనిని ఉల్లేఖించారు. ఈ హదీసు సుస్పష్టమైనది కాదని అబూ హాతిమ్ వ్యాఖ్యానించారు)

(٩٢٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: إِذَا حَرَّمَ امْرَأَتَه، لَيْسَ بِشَيْءٍ وَقَالَ: لَقَدْ كَانَ لَكُمْ فِيْ رَسُولِ اللهِ أُسْوَةٌ حَسَنَةٌ. رَوَاهُ الْبُخَارِيُّ.

923. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఎవరయినా తన భార్య తన కొరకు ధర్మసమ్మతం కాదు అని అంటే అసలది లెక్కలోనికి తీసుకోదగ్గ విషయమే కాదు. ఆయన (రజి) ఇంకా ఇలా అన్నారు - "నిశ్చయంగా మీ కొరకు దైవప్రవక్త (సఅసం) జీవితం అత్యుత్తమమైన ఉదాహరణ."

وَلِمُسْلِمٍ: إِذَا حَرَّمَ الرَّجُلُ عَلَيْهِ امْرَأَتَهُ، فَهُوَ يَمِيْنٌ، يُكَفِّرُهَا.

'ముస్లిం'లో ఇలా వుంది : ఏ పురుషుడు అయినాసరే తన భార్య తన కొరకు ఇక మీదట హరామ్ (నిషిద్ధం) అని ఖరారు చేసుకుంటే అదొక 'ప్రమాణం' గా పరిగణించబడుతుంది. దానికి అతను పరిహారం చెల్లించవలసి ఉంటుంది."

**సారాంశం**

ఎవరయినా కోపావేశంలో తన భార్యనుద్దేశ్యించి, 'ఇక మీదట నువ్వు నా కోసం నిషిద్ధం (హరామ్) అయిపోయావు పో' అని చెప్పినంతమాత్రాన అది 'తలాఖె రజయీ' గానీ, 'బాయన్'గానీ, 'జిహార్'గానీ అయిపోయినట్లు లెక్కకాదు. అదొక ఆవేశపూరితమయిన 'ఒట్టు'. దానికి పరిహారం ఇవ్వవలసి ఉంటుంది. ముస్లింలోని హదీసు సారాంశం ఇదే. బుఖారీలో ఇబ్నె అబ్బాస్ (రజి) చే ఉల్లేఖించబడిన హదీసు కూడా పరిహారం (కఫ్ఫార) చెల్లించాలనే అంటోంది. ఈ అంశంపై పలువురు విద్వాంసుల మొత్తం 13 వ్యాఖ్యానాలు ఉన్నాయి. అయితే 'పరిహారం చెల్లించాలి' అన్న పలుకే ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) గారు మాత్రం దీనికి పరిహారం అక్కరలేదనీ, ఇదొక 'వ్యర్థమయిన మాట'గా పరిగణించబడుతుందని అభిప్రాయపడ్డారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దీనిని ప్రమాణం (ప్రతిజ్ఞ)గా ఖరారు చేస్తున్నారు. ప్రమాణానికి విరుగుడు పరిహారాన్ని చెల్లించడమే.

(٩٢٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ ابْنَةَ الْجَوْنِ لَمَّا أُدْخِلَتْ عَلَى رَسُولِ اللهِ ﷺ، وَدَنَا مِنْهَا: قَالَتْ: أَعُوذُ بِاللهِ مِنْكَ، فَقَالَ: «**لَقَدْ عُذْتِ بِعَظِيمٍ، اِلْحَقِي بِأَهْلِكِ**».

رَوَاهُ الْبُخَارِيُّ.

924. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : జౌన్ కుమార్తెను నికాహ్ అనంతరం దైవప్రవక్త (సఅసం) గదిలోకి పంపినపుడు ఆయన (స) ఆమెను సమీపించబోయారు. అప్పుడామె "నేను మీ బారినుండి అల్లాహ్ శరణు వేడుతున్నాను" అని చెప్పింది. అంతే. "నీవు సర్వోన్నతుడైన దేవుని శరణు కోరావు. ఇక నీవు నీ పుట్టింటికి వెళ్ళొచ్చు" అని ఆయన (సఅసం) అన్నారు. (బుఖారీ)

**సారాంశం**

సంకేతప్రాయమైన తలాఖ్ (లేక పరోక్ష తలాఖ్) కూడా ఒకటుంటుందని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ఒక తలాఖ్ మాత్రం స్పష్టమయింది. విడాకులిచ్చే వ్యక్తి నోటితో స్పష్టంగా నీకు విడాకులిస్తున్నానంటాడు. విడాకులిచ్చేవాని సంకల్పం ఇక్కడ ఎలా ఉన్నా అతడు నోటితో స్పష్టంగా చెప్పినందువల్ల ఆ తలాఖ్ అయిపోతుంది.

ఇక సంకేతప్రాయమైన తలాఖ్ (తలాఖె కినాయా) అంటే ఏమిటంటే, ఒక వ్యక్తి చెప్పిన మాటలను విడాకులుగా భావించడానికీ అస్కారముంటుంది, విడాకులు కాదని చెప్పడానికి కూడా అవకాశం ఉంటుంది. ఉదాహరణకు : 'ఇక నీవు స్వతంత్రురాలివి పో' 'నీ పుట్టింటికి పో' 'ఇక నీ దారి నీది, నా దారి నాది' లాంటి మాటల్ని భర్త చెబితే అట్టి పరిస్థితిలో అతని సంకల్పం మీద ఆ విషయం ఆధారపడి ఉంటుంది. విడాకులిచ్చే ఉద్దేశ్యంతోనే చూచాయగా

అతను ఆ మాటలు అని ఉంటే విడాకులు ఇచ్చేసినట్లే. కేవలం హెచ్చరించే ఉద్దేశ్యంతో అలా అని ఉంటే అప్పుడది విడాకులుగా పరిగణించబడదు. ఈ విషయంలో అందరి మధ్యా ఏకాభిప్రాయముంది.

(٩٢٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ طَلاَقَ إِلاَّ بَعْدَ نِكَاحٍ، وَلاَ عِتْقَ إِلاَّ بَعْدَ مِلْكٍ**». رَوَاهُ أَبُو يَعْلَى، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَهُوَ مَعْلُول، وَأَخْرَجَ ابْنُ مَاجَهْ عَنِ الْمِسْوَرِ بْنِ مَخْرَمَةَ مِثْلَهُ، وَإِسْنَادُهُ حَسَنٌ، لَكِنَّهُ مَعْلُوْلٌ أَيْضاً.

925. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నికాహ్ చేసుకుంటేనే గానీ ఎవరయినా తలాఖ్ ఇవ్వలేరు. అలాగే ఒకరిపై యాజమాన్యం పొందనంతవరకూ వారికి (బానిసత్వం నుండి) స్వేచ్ఛ నొసగలేరు." (దీనిని అబూ యాలా ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని 'ప్రమాణబద్ధం'గా పేర్కొన్నారు. నిజానికి ఇందులో ప్రామాణికత లోపించింది. ఇబ్నెమాజా గారు హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్రమ ఆధారంగా సంగ్రహించిన ఇలాంటిదే మరొక హదీసు కూడా పరంపర రీత్యా బాగానే ఉంది గాని అందులోనూ లోపం ఉంది)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఏ వ్యక్తి కూడా ఒక స్త్రీని వివాహమాడనిదే విడాకులు ఇవ్వలేడు. అలాగే ఎవరినయినా బానిసగా పొందిన మీదటే అతనికి బానిస బంధనాల నుండి విముక్తిని ఇవ్వగలడు. అంటే ఒక వస్తువును వదులుకోవటం అనేది ముందుగా అతడు దాన్ని పొందిన మీదటే సాధ్యం అవుతుంది. వేరొకరి సొత్తుపై అతనికి ఇలాంటి నిర్ణయాధికారం ఉండదు.

(٩٢٦) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ نَذْرَ لاِبْنِ آدَمَ فِيمَا لاَ يَمْلِكُ، وَلاَ عِتْقَ لَهُ فِيمَا لاَ يَمْلِكُ، وَلاَ طَلاَقَ لَهُ فِيمَا لاَ**

926. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి ఆధారంగా, ఆయన తన తాత గారి ఆధారంగా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - తన స్వాధీనంలో లేని వస్తువుపై ఆదం పుత్రుడు చేసు

يَمْلِكُ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَنَقَلَ عَنِ الْبُخَارِيِّ أَنَّهُ أَصَحُّ مَا وَرَدَ فِيهِ.

కున్న మొక్కుకు ఎలాంటి విలువా లేదు. అలాగే తన యాజమాన్యంలో లేని బానిసకు స్వేచ్ఛ నొసగటంగానీ, తన అధీనంలో లేని స్త్రీకి విడాకు లివ్వటంగానీ చెల్లనేరదు. (దీనిని అబూ దావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేర్కొనబడినదంతా అత్యంత ప్రామాణికమైనదన్న బుఖారీ వ్యాఖ్యానాన్ని కూడా ఆయన నకలు చేశారు)

**సారాంశం**

తనకు చెందని వస్తువుపై యాజమాన్య హక్కును చాటడంలో, నిర్ణయాధికారాన్ని చెలాయించడంలో అర్థం పర్థం లేదని ఈ హదీసు చెబుతోంది. ఎవరయినా ఇలాంటి నిర్ణయాధికారాన్ని ప్రకటిస్తే అది చెల్లనేరదని కూడా స్పష్టంగా చెప్పబడింది. అపరిచిత స్త్రీని ఉద్దేశ్యించి ఎవరయినా విడాకులిస్తే అది మూర్ఖత్వం అనిపించుకుంటుంది. ఉదాహరణకు: ఎవరైనా ఒక వివాహిత లేక అవివాహిత స్త్రీని ఉద్దేశ్యించి "నీవు విడాకులు పొందిన దానివి (లేక విడాకులు ఇవ్వబడినదానివి)" అని చెప్పి, కొంత కాలానికి అతనామెను వివాహమాడదలిస్తే, 'ఆ స్త్రీ విడాకులు పొందిన స్త్రీ కాజాలదు' అని పండితులు తేల్చి చెప్పారు.

(٩٢٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «رُفِعَ الْقَلَمُ عَنْ ثَلَاثَةٍ: عَنِ النَّائِمِ حَتَّى يَسْتَيْقِظَ، وَعَنِ الصَّغِيرِ حَتَّى يَكْبَرُ، وَعَنِ الْمَجْنُونِ حَتَّى

927. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలియజేశారు : ముగ్గురు వ్యక్తుల చర్యలు రికార్డుల్లోకి ఎక్క కుండా కలాన్ని ఆపి ఉంచటం జరుగు తుంది - నిద్రించిన వ్యక్తి మేల్కొనంత వరకూ, పసివాడు ప్రాజ్ఞతకు చేరుకో నంతవరకూ, మతి స్థిమితం లేనివాడు మానసిక స్థిమితాన్ని పొందనంతవరకూ. (అహ్మద్ మరియు 'నలుగురి'లో తిర్మిజీ

يَعْقِلَ، أَوْ يُفِيقَ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ إِلاَّ التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

తప్ప మిగిలిన అందరూ - అంటే అబూ దావూద్, ఇబ్నెమాజా, నసాయి - ఉల్లేఖించారు. ఈ హదీసును హాకిమ్ ప్రమాణబద్ధమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసు ఇక్కడ పొందుపరచబడటంలోని ప్రధాన ఉద్దేశ్యం నిద్రావస్థలో ఉన్న వ్యక్తిగానీ, ప్రాజ్ఞ వయస్సుకు చేరని వ్యక్తిగానీ, మతి స్థిమితం లేని వ్యక్తిగానీ ఇచ్చిన విడాకులు లెక్కలోకి రావు అని చెప్పటమే.

**8వ అధ్యాయం**

## విడాకుల ఉపసంహరణ గురించి

## ٨ - بَابُ الرَّجْعَةِ

(٩٢٨) عَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ سُئِلَ عَنِ الرَّجُلِ يُطَلِّقُ. ثُمَّ يُرَاجِعُ، وَلاَ يُشْهِدُ، فَقَالَ: أَشْهِدْ عَلَى طَلاَقِهَا، وَعَلَى رَجْعَتِهَا. رَوَاهُ أَبُو دَاوُدَ هٰكَذَا مَوْقُوفاً، وَسَنَدُهُ صَحِيْحٌ وَأَخْرَجَهُ الْبَيْهَقِيُّ بِلَفْظِ: (أَنَّ

928. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం : పదే పదే విడాకులిస్తూ, దాన్ని ఉపసంహరించుకుంటూ, ఈ సంఘటనలపై కనీసం సాక్షులను కూడా పెట్టని వ్యక్తి గురించి ప్రశ్నించగా "స్త్రీకి విడాకులిచ్చే సమయంలోనూ, ఉపసంహరించుకుని ఆమెను మరల్చుకునే సమయంలోనూ సాక్షులను పెట్టుకో" అని ఆయన సమాధానమిచ్చారు. (దీనిని అబూదావూద్ ఇదే విధంగా - మౌఖూఫ్‌గా - ఉల్లేఖించారు. ఇది అందిన పరంపర మాత్రం ప్రామాణిక మైనది. ఇమామ్ బైహఖీ ఈ ఉల్లేఖనాన్ని ఇలా ప్రస్తావించారు : తన భార్యను తిరిగి పిలుచుకుని, దానిపై సాక్ష్యం పెట్టని వ్యక్తి గురించి ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి)ను ప్రశ్నించగా, "ఇది సంప్రదాయం (మస్నూన్) కాదు.

عِمْرَانَ بْنَ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، سُئِلَ عَمَّنْ رَاجَعَ امْرَأَتَهُ وَلَمْ يُشْهِدْ، فَقَالَ فِيْ غَيْرِ سُنَّةٍ؟ فَلْيُشْهِدِ الْآنَ) وَزَادَ الطَّبَرَانِيُّ فِيْ رِوَايَةٍ (ويستغفر الله).

ఇప్పుడైనా అతను సాక్ష్యం ఉంచుకోవాలి" అని ఆయన సమాధానమిచ్చారు. "అతడు దైవాన్ని క్షమాపణకై వేడుకోవాలి" అన్న అదనపు వాక్యాన్ని తబ్రానీ ఒక ఉల్లేఖనంలో పేర్కొన్నారు)

(٩٢٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّهُ لَمَّا طَلَّقَ امْرَأَتَهُ، قَالَ النَّبِيُّ ﷺ لِعُمَرَ: «مُرْهُ، فَلْيُرَاجِعْهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

929. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం : తాను తన భార్యకు విడాకులు ఇవ్వగా, దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉమర్ (రజి)తో ఇలా అన్నారు: "అతని భార్యను మరల్చుకోమని అతనికి చెప్పండి." (బుఖారీ, ముస్లిం)

## ٩ - بَابُ الْإِيلَاءِ وَالظِّهَارِ وَالْكَفَّارَةِ

## 9వ అధ్యాయం

## ఈలా, జిహార్, కఫ్ఫారా

(٩٣٠) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: آلَى رَسُولُ اللهِ ﷺ مِنْ نِسَائِهِ، وَحَرَّمَ، فَجَعَلَ الْحَلَالَ حَرَاماً، وَجَعَلَ لِلْيَمِيْنِ كَفَّارَةً. رَوَاهُ التِّرمِذِيُّ، وَرُوَاتُه ثِقَاتٌ.

930. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక నిర్ణీత కాలం వరకు తన భార్యల వద్దకు పోనని ప్రతిన బూనారు. వారి వద్దకు పోవడాన్ని అధర్మం (హరామ్)గా చేసుకున్నారు. మరి ఆయన (స) ధర్మసమ్మతమయిన ఒక విషయాన్ని తనంతట తానుగా అధర్మంగా చేసుకున్నందుకు గాను పరిహారాన్ని నిర్ధారించారు. (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

### పూర్వాపరాలు

ఏ భర్త అయినా తన భార్యలతో నాలుగు నెలలు లేక అంతకన్నా ఎక్కువ రోజులు

సంబంధం పెట్టుకోనని ప్రతిన బూనటాన్ని షరీయత్ పరిభాషలో 'ఈలా' అంటారు. కాగా; దైవప్రవక్త (సఅసం) ఒక నెల రోజుల పాటు తన సతీమణుల వద్దకు పోనని ప్రతినబూనారు. దైవప్రవక్త (స) ఈ విధంగా నిశ్చయించుకోవడానికి అనేక కారణాలున్నాయి. దైవప్రవక్త (స) తన భార్యలలో ఒకామెకు ఒక విషయం చెప్పి దాన్ని రహస్యంగా ఉంచమన్నారు. కాని ఆమె ఆ రహస్యాన్ని బహిర్గతం చేసింది. ఇంటి ఖర్చుల విషయంలో భార్యలంతా కలసి దైవప్రవక్త (స)కు డిమాండు చేశారు. అదే రోజుల్లో తేనె సంఘటన కూడా సంభవించింది. ఆ రోజుల్లోనే దైవప్రవక్త (స) గుఱ్ఱంపై నుంచి క్రిందపడటం, ఆయన (స) కుడి ప్రక్క భాగం ఒడుసుకుపోవటం జరిగింది. ఈ పరిస్థితులన్నీ దైవప్రవక్త (స)ను చీకాకు పరచాయి. ముఖ్యంగా తేనె సేవింపు సంఘటన ఆయన్ని (స) మానసికంగా ఎంతో వ్యాకులతకు గురి చేసింది. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా అంటున్నారు : దైవప్రవక్త (స) తన సతీమణుల్లో ఒకరైన హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) ఇంట్లో ఆగి తేనె సేవించేవారు. ఓ రోజు నేను, హజ్రత్ హఫ్సా (ర.అన్హా) కలసి వ్యూహ రచన చేశాము - దైవప్రవక్త (సఅసం) మనిద్దరిలో ఎవరి కుటీరానికి వచ్చినా "మీ దగ్గర మగాఫీర్ (అదొక జిగురు పదార్థం. దాని వాసన రోత పుట్టిస్తుంది) వాసన వస్తోంది. మీరు గాని మగాఫీర్ తిన్నారా?" అని అడుగుదాం అని చెప్పుకున్నాం. దాని ప్రకారం దైవప్రవక్త (స) మా ఇద్దరిలో ఒకరి దగ్గరకు వచ్చినపుడు ఆమె ఈ మాటే అన్నది. దైవప్రవక్త (స) అది విని "నేను మగాఫీర్ తినలేదు. జైనబ్ దగ్గర తేనె మాత్రమే సేవించాను. సరే ఇకనుండి నేను ఎన్నటికీ తేనె సేవించను" అని ప్రతినబూనారు. ఈ సంగతి ఎవరికీ చెప్పవద్దని కూడా అన్నారు. అయితే తన ప్రవక్త ఈ విధంగా ఒక హలాల్ వస్తువును హరామ్‌గా ఖరారు చేసుకోవటాన్ని ఎత్తి చూపుతూ అల్లాహ్ ఈ ఆదేశాన్ని అవతరింపజేశాడు : "ఓ ప్రవక్తా! దేవుడు నీ కోసం ధర్మసమ్మతం గావించిన దాన్ని నీవు ఎందుకు నిషేధించుకుంటావు? (ఇలా చేసి) నీవు నీ భార్యలను సంతోషపెట్టదలిచావా? (సరే. జరిగిందేదో జరిగిపోయింది). దేవుడు క్షమాశీలి, దయామయుడు. ఆయన నీ కోసం ప్రమాణాల పాటింపు నుండి బయటపడే పద్ధతిని నిర్ణయించాడు. దేవుడు మీ రక్షకుడు, ఆయన సర్వం తెలిసినవాడు, వివేకవంతుడు." (తహ్రీమ్ - 1,2)

ఈ విధంగా దేవుడు ప్రమాణ భంగం చేసిన వారికి దాన్నుంచి బయటపడే మార్గం చూపాడు. ప్రమాణ భంగానికి పాల్పడిన వారు పరిహారం చెల్లించటం విధి.

(٩٣١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: إِذَا مَضَتْ أَرْبَعَةُ أَشْهُرٍ وَقَفَ الْمُوْلِيْ، حَتَّى يُطَلِّقَ، وَلاَ يَقَعُ عَلَيْهِ لطَّلاَقُ حَتَّى يُطَلِّقَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

931. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: "తన భార్య వద్దకు పోనని ప్రతినబూనిన వ్యక్తిని నాలుగు నెలల అనంతరం పరిపాలకుని సమక్షంలో హాజరుపరచాలి. న్యాయస్థానం సాక్షిగా అతను విడాకులు ఇవ్వనంతవరకూ అతన్ని వదలి పెట్టకూడదు. అతను నోటితో విడాకులు

ఇచ్చేవరకూ అది విడాకులుగా పరిగణించబడదు." (బుఖారీ)

(٩٣٢) وَعَنْ سُلَيْمَانَ بْنِ يَسَارٍ قَالَ: أَدْرَكْتُ بِضْعَةَ عَشَرَ رَجُلاً مِنْ أَصْحَابِ رَسُولِ اللهِ ﷺ، كُلُّهُمْ يَقِفُونَ الْمُولِي. رَوَاهُ الشَّافِعِيُّ.

932. హజ్రత్ సులైమాన్ బిన్ యసార్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సఅసం) వారి పదిమందికి మించిన సహచరులను చూశాను - వారు 'ఈలా' చేసే వారిని (4 మాసాల వరకు భార్య వద్దకు పోనని ప్రతిన బూనిన వానిని) నిలదీసి అడిగేవారు. (దీనిని షాఫయి ఉల్లేఖించారు)

**సారాంశం**

భార్య దగ్గరకు పోనని ఒట్టేసుకుని, నాలుగు నెలలు గడచిన తరువాత కూడా ఎవరయినా భార్యను కలవకపోయినంత మాత్రాన విడాకులుగా లెక్కకట్టే నవీనరం లేదని, విడాకులిస్తున్నట్లు అతను బహిరంగంగా చెప్పటం అవసరమని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) తదితరులు దీనికి అనుకూలంగా ఉన్నారు. అయితే నిర్ణీత గడువు ముగియగానే విడాకులు ఇచ్చినట్లు అయిపోతుందని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు ఆయన అనుయాయులు భావిస్తున్నారు.

(٩٣٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ إِيلاَءُ الْجَاهِلِيَّةِ السَّنَةَ وَالسَّنَتَيْنِ، فَوَقَّتَ اللَّهُ أَرْبَعَةَ أَشْهُرٍ، فَإِنْ كَانَ أَقَلَّ مِنْ أَرْبَعَةِ أَشْهُرٍ فَلَيْسَ بِإِيلاَءٍ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ.

933. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : అజ్ఞాన కాలపు 'ఈలా' గడువు ఏడాది నుంచి రెండేళ్ల దాకా ఉండేది. అయితే అల్లాహ్ దీని గడువును నాలుగు మాసాలుగా నిర్ధారించాడు. కనుక ఇప్పుడా గడువు నాలుగు మాసాల కన్నా తక్కువగా ఉంటే అది 'ఈలా' గా పరిగణించబడదు. (బైహఖీ)

(٩٣٤) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَجُلاً ظَاهَرَ مِنِ امْرَأَتِهِ، ثُمَّ وَقَعَ عَلَيْهَا، فَأَتَى النَّبِيَّ ﷺ، فَقَالَ: إِنِّي وَقَعْتُ عَلَيْهَا قَبْلَ

934. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఒక వ్యక్తి తన భార్య విషయంలో 'జిహార్'కు ఒడిగట్టాడు (అంటే; నువ్వు నా తల్లితో సమానం, భార్యగా

أَنْ أُكَفِّرَ، قَالَ: «**فَلاَ تَقْرَبْهَا، حَتَّى تَفْعَلَ مَا أَمَرَكَ اللَّهُ**». رَوَاهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرمِذِيُّ، وَرَجَّحَ النَّسَائِيُّ إِرْسَالَهُ، وَرَوَاهُ الْبَزَّارُ مِنْ وَجْهٍ آخَرَ عَنِ ابْنِ عَبَّاسٍ، وَزَادَ فِيهِ: «كَفِّرْ وَلاَ تَعُدْ».

నువ్వు నా కోసం నిషిద్ధం అని ప్రకటించాడు). తరువాత అతను తన భార్యతో సమాగమం కూడా చేశాడు. ఆ తర్వాత దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చి, "నేను పరిహారం చెల్లించక ముందే నా భార్యతో సంభోగించాను" అని విన్నవించుకున్నాడు. అది విని దైవప్రవక్త (స), "దైవాదేశాన్ని నెరవేర్చేదాకా ఇక ఆమె వద్దకు పోకు" అని ఉపదేశించారు. (దీనిని 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రమాణబద్ధమైనదిగా పేర్కొన్నారు. నసాయి మాత్రం దీన్ని 'ముర్సల్' అని నొక్కి చెప్పారు) బజ్జార్ వేరొక ఆధారంతో ఇబ్నె అబ్బాస్ (రజి) కథనాన్ని ఉటంకించారు. అందులో ఈ వాక్యం అదనంగా ఉంది - "పరిహారం చెల్లించు. అప్పటి వరకూ దాన్ని పునరావృతం కానివ్వకు."

(٩٣٥) وَعَنْ سَلَمَةَ بْنِ صَخْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: دَخَلَ رَمَضَانُ، فَخِفْتُ أَنْ أُصِيبَ امْرَأَتِي، فَظَاهَرْتُ مِنْهَا، فَانْكَشَفَ لِي شَيْءٌ مِنْهَا لَيْلَةً، فَوَقَعْتُ عَلَيْهَا فَقَالَ لِي رَسُولُ اللهِ ﷺ: «**حَرِّرْ رَقَبَةً**». فَقُلْتُ: مَا أَمْلِكُ إِلاَّ رَقَبَتِي. قَالَ: «**فَصُمْ شَهْرَيْنِ مُتَتَابِعَيْنِ**»، قُلْتُ: وَهَلْ أَصَبْتُ الَّذِي أَصَبْتُ إِلاَّ مِنَ

935. హజ్రత్ సలమా బిన్ సఖ్ర్ (రజి) కథనం : రమజాన్ నెల (ఉపవాసాల నెల) ఆరంభమయింది. నేను ఉపవాసాల నెలలో నా భార్యతో ఎక్కడ సంభోగిస్తానోనని భయపడ్డాను. ఈ భయం కొద్దీ నేను నా భార్యను 'జిహార్' చేశాను (ఆమెను నా తల్లిగా భావించటం మొదలెట్టాను). అయితే ఒక వెన్నెల రేయి ఆమె శరీరాచ్ఛాదన తొలగిపోవటంతో నేను ఆగలేక ఆమెతో రమించాను. (తరువాత ఈ విషయాన్ని దైవప్రవక్త - సఅసం - దృష్టికి తీసుకురాగా) "ఒక

الصِّيَامِ، قَالَ: «أَطْعِمْ عَرَقاً مِنْ تَمْرٍ سِتِّينَ مِسْكِيناً». أَخْرَجَهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ.

బానినకు విముక్తి నొనగు" అని దైవప్రవక్త (స) సూచించారు. "నేనే బానిసలాంటి వాణ్ణి. ఇంక నేను బానిసకు ఎలా విముక్తి నొసగేది?" అని నేను అన్నాను. "పోనీ, రెండు నెలల పాటు నాగా లేకుండా ఉపవాసాలుండు" అని ఆయన (స) సూచించారు. "ఈ బాధలన్నీ ఉపవాసాల మూలంగానే కదా వచ్చిపడ్డాయి?" అని నేనన్నాను. "సరే, అయితే ఒక తట్ట ఖర్జూర పండ్లను అరవైమంది నిరుపేదలకు తినిపించు"అని ఆయన (సఅసం) సలహా ఇచ్చారు. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురి'లో నసాయి మినహా మిగిలిన వారు ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## 10వ అధ్యాయం

## లియాన్ (శాప ప్రమాణం)

## ١٠ - بَابُ اللِّعَانِ

(٩٣٦) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَأَلَ فُلاَنٌ فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَرَأَيْتَ أَنْ لَو وَجَدَ أَحَدُنَا امْرَأَتَهُ عَلَى فَاحِشَةٍ

936. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: ఫలానా వ్యక్తి ఒకసారి వచ్చి, "ఓ దైవప్రవక్తా (సఅసం)! మాలో ఎవరయినా సరే తన భార్య ఎవరితోనయినా అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఉండగా చూస్తే ఏం చేయాలి? అతనే గనక ఇతరులతో చెప్పుకుంటూ తిరిగితే అది అత్యంత సిగ్గుచేటుగా ఉంటుంది. మరి అతను మౌనంగా ఉండాలా అంటే అదీ చాలా క్లిష్ట

كَيْفَ يَصْنَعُ؟ إِنْ تَكَلَّمَ تَكَلَّمَ بِأَمْرٍ عَظِيمٍ، وَإِنْ سَكَتَ سَكَتَ عَلَىٰ مِثْلِ ذٰلِكَ. فَلَمْ يُجِبْهُ، فَلَمَّا كَانَ بَعْدَ ذٰلِكَ أَتَاهُ، فَقَالَ: «إِنَّ الَّذِي سَأَلْتُكَ عَنْهُ قَدِ ابْتُلِيتُ بِهِ، فَأَنْزَلَ اللَّهُ الْآيَاتِ فِي سُورَةِ النُّورِ، فَتَلَاهُنَّ عَلَيْهِ وَوَعَظَهُ، وَذَكَّرَهُ، وَأَخْبَرَهُ أَنَّ عَذَابَ الدُّنْيَا أَهْوَنُ مِنْ عَذَابِ الْآخِرَةِ»، قَالَ: لَا، وَالَّذِي بَعَثَكَ بِالْحَقِّ، مَا كَذَبْتُ عَلَيْهَا، ثُمَّ دَعَاهَا فَوَعَظَهَا كَذٰلِكَ، قَالَتْ: لَا، وَالَّذِي بَعَثَكَ بِالْحَقِّ، إِنَّهُ لَكَاذِبٌ، فَبَدَأَ بِالرَّجُلِ، فَشَهِدَ أَرْبَعَ شَهَادَاتٍ بِاللهِ، ثُمَّ ثَنَّى بِالْمَرْأَةِ، ثُمَّ فَرَّقَ بَيْنَهُمَا. رَوَاهُ مُسْلِمٌ.

మయిన విషయమే'' అని సందేహం వెలిబుచ్చాడు. దీనికి ఆయన (సఅసం) సమాధానం ఇవ్వలేదు. ఆ వ్యక్తి మరో సారి కూడా వచ్చి, ''ఇంతకు ముందు నేను తమరి యెదుట చెప్పుకున్న సమస్యను ఎదుర్కొంటున్నది నేనే'' అని అన్నాడు. అప్పుడు అల్లాహ్ నూర్ సూరా లోని సూక్తులను అవతరింపజేశాడు. ఆయన (సఅసం) ఆ సూక్తులను అతనికి వినిపించి, అతనికి హితబోధ చేశారు. దేవుడు విధించే శిక్షను కూడా గుర్తు చేస్తూ, ''ఇహలోక శిక్ష పరలోక శిక్ష కన్నా చాలా తేలికపాటిది'' అని చెప్పారు. అప్పుడతను, ''లేదు. మిమ్మల్ని సత్యమిచ్చి పంపిన శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను. నేను ఆమెపై నీలాప నిందను మోపటం లేదు'' అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) నిందితురాలైన స్త్రీని పిలిపించి, ఆమెకు కూడా అదేవిధంగా హితబోధ చేశారు. దానికామె, ''కాదు, తమరిని సత్యసమేతంగా ప్రభవింపజేసిన దేవుని సాక్షిగా చెబుతున్నాను - ముమ్మాటికీ ఆ మగవాడు అబద్ధాలకోరు'' అని అన్నది. ఆ మాటలు విని ఆయన (స), ఆ పురుషునితోనే ప్రమాణ ప్రక్రియను ప్రారంభించారు. అతను నాలుగుసార్లు ప్రమాణం చేశాడు. తరువాత ఆయన (స) ఆ స్త్రీ చేత ప్రమాణం చేయించి ఇద్దరి మధ్యా వేర్పాటు చేశారు. (ముస్లిం)

**సారాంశం**

షరీయత్ పరిభాషలో దీన్ని 'లియాన్' అంటారు. లియాన్ అంటే అసలు పరస్పరం శపించుకోవటం అని అర్థం. భర్త తన భార్యపై అక్రమ సంబంధపు నిందను మోపి, సాక్షులను తీసుకురాలేని పక్షంలో ఆ భార్యాభర్తలు న్యాయాధికారి సమక్షంలో ప్రమాణం చేయడాన్ని 'లియాన్' అంటారు. ఈ సందర్భంగా ఆరోపించే వ్యక్తి నాలుగుసార్లు దేవునిపై ప్రమాణం చేసి, ఐదోసారి తాను గనక అబద్ధమాడి ఉంటే నాపై దేవుని శాపం పడుగాక! అని అంటాడు. స్త్రీ చేత కూడా అదేవిధంగా ప్రమాణం చేయించటం జరుగుతుంది. ఆమె నాలుగుసార్లు దేవునిపై ప్రమాణం చేసి,ఈ వ్యక్తి అబద్ధం చెబుతున్నాడని సాక్ష్యమివ్వాలి. అయిదోసారి, ఒకవేళ అతగాడు తన నిందారోపణలో సత్యవంతుడే అయితే దైవాగ్రహం నాపై విరుచుకుపడుగాక! అని అనాలి. ఈ విధంగా వారిరువురికీ ఇహలోకంలో విధించబడే శిక్ష తప్పుతుంది. అయితే వారిరువురిలో అపరాధానికి ఒడిగట్టిన వారెవరో దైవానికి తెలుసు. పరలోకంలో వ్యధాభరితమయిన శిక్ష వారి కోసం సిద్ధంగా ఉంటుంది.

(٩٣٧) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ لِلْمُتَلاَعِنَيْنِ: **«حِسَابُكُمَا عَلَى اللَّهِ، أَحَدُكُمَا كَاذِبٌ، لاَ سَبِيلَ لَكَ عَلَيْهَا»**، قَالَ: يَا رَسُولَ اللهِ! مَالِيْ؟ فَقَالَ: **«إِنْ كُنْتَ صَدَقْتَ عَلَيْهَا، فَهُوَ بِمَا اسْتَحْلَلْتَ مِنْ فَرْجِهَا، وَإِنْ كُنْتَ كَذَبْتَ عَلَيْهَا، فَذَاكَ أَبْعَدُ لَكَ مِنْهَا»**. مُتَّفَقٌ عَلَيْهِ.

937. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'లియాన్' (పరస్పర నిందారోపణలు) చేసుకున్న దంపతులనుద్దేశ్యించి, "మీరిద్దరి లెక్క దేవుని చేతిలో ఉంది. మీరిద్దరిలో ఒకరు మాత్రం అబద్ధం చెబుతున్నారు" అని అన్నారు. (ఆ తరువాత పురుషుడ్ని ఉద్దేశించి) "ఇక ఇప్పుడు ఈమెపై నీకు ఎలాంటి హక్కు లేదు" అని చెప్పారు. "దైవప్రవక్తా (స)! మరి నా సొమ్ము నాకు ఇప్పించండి" అని ప్రాధేయపడ్డాడు. దానికాయన (స), "నువ్వే గనక ఆమెపై మోపిన ఆరోపణ ఒకవేళ నిజమై ఉంటే, ఆమెను ధర్మ సమ్మతం చేసుకోవడానికి నీవు చెల్లించిన (మహర్) సొమ్ము ఆమె దగ్గర నువ్వు పొందిన దాంపత్య సుఖానికి సరి పోయింది. ఒకవేళ నువ్వామెపై అప నింద మోపి ఉంటే ఆ సొమ్ము నీకు మరింత దూరమైపోయింది" అని తీర్పు ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం)

(٩٣٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**أَبْصِرُوهَا، فَإِنْ جَاءَتْ بِهِ أَبْيَضَ، سَبِطاً، فَهُوَ لِزَوْجِهَا، وَإِنْ جَاءَتْ بِهِ أَكْحَلَ، جَعْدًا، فَهُوَ لِلَّذِي رَمَاهَا بِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

938. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు : "(ఆ) స్త్రీని బాగా గమనిస్తూ ఉండండి. ఆమె తెల్లగా ఉండే, తిన్నని జుట్టుగల శిశువును కంటే అది ఆమె భర్త ద్వారా జన్మించినదే. ఒకవేళ నల్లని కన్నులు, వంకీలు తిరిగిన జుత్తుగల శిశువును గనక ఆమె ప్రసవిస్తే, ఎవరితో ఆమెకు అక్రమ సంబంధం ఉందని ఆమె భర్త నిందారోపణ చేస్తున్నాడో అది అతని సంతానంగానే పరిగణించబడుతుంది."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

భర్త భార్యను అనుమానించి తగు సాక్ష్యం సమర్పించలేనపుడు, భార్య కనబోయే బిడ్డ రూపురేఖలను బట్టి కూడా నిజానిజాలను నిర్ధారించవచ్చని ఈ హదీసు చెబుతోంది. (ఆధునిక కాలంలోనయితే రక్త పరీక్ష ద్వారా సులువుగా నిజ నిర్ధారణ జరిగిపోతోంది). మహాప్రవక్త ఆ స్త్రీ కేసు విషయంలో ఏ ఏ ఆనవాళ్ళను పరిగణనలోకి తీసుకున్నారో సరిగ్గా అలాంటి ఆనవాళ్ళు కలిగిన శిశువునే కన్నది. అంటే ఆమెతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్న వ్యక్తి కళ్లు చాలా నల్లగా ఉండేవి. జుత్తు వంకీలు తిరిగి ఉండేది. ఇలాంటి పోలికలుగల శిశువునే కన్న తరువాత ఆమె నీతిబాహ్యమైన చేష్టకు పాల్పడిన స్త్రీ అని తేలిపోయింది. (ముస్లిం)

(٩٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَمَرَ رَجُلاً أَنْ يَضَعَ يَدَهُ عِنْدَ الْخَامِسَةِ عَلَىٰ فِيهِ، وَقَالَ: «**إِنَّهَا مُوجِبَةٌ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ.

939. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తికి ఈ విధంగా ఆజ్ఞాపించారు -"అతడు ఐదవసారి ప్రమాణం చేయబోతుండగా అతని నోటిపై చేయిని అడ్డుపెట్టు." ఆయన (స) ఇంకా ఇలా అన్నారు : "ఈ ఐదవ ప్రమాణం అతని వినాశానికి ప్రతీక." (అబూదావూద్, నసాయి - దీని ఉల్లేఖకులు ఎన్నదగినవారు)

(٩٤٠) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ الْمُتَلاَعِنَيْنِ – قَالَ: فَلَمَّا فَرَغَا مِنْ تَلاَعُنِهِمَا، قَالَ: كَذَبْتُ عَلَيْهَا يَا رَسُولَ اللهِ! إِنْ أَمْسَكْتُهَا، فَطَلَّقَهَا ثَلاَثاً قَبْلَ أَنْ يَأْمُرَهُ رَسُولُ اللهِ ﷺ. مُتَّفَقٌ عَلَيْهِ.

940. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం ప్రకారం 'లియాన్' (శాప ప్రమాణం) చేసిన ఇద్దరు వ్యక్తుల గురించి: - వారిద్దరూ లియాన్ తతంగం ముగించిన తరువాత భర్త దైవప్రవక్త (స) నుద్దేశ్యించి, "ఓ దైవప్రవక్తా (స)! ఇంత జరిగిన తరువాత కూడా ఇప్పుడు నేనామెను కాపురానికి పిలుచుకుంటే, ఆమెపై అబద్ధపు నిందను మోపినట్లే లెక్క" అని అన్నాడు. ఆ తరువాత అతను దైవప్రవక్త (స) గారి ఆజ్ఞ కోసం ఎదురు చూడకుండానే తన భార్యకు మూడు విడాకులు ఇచ్చేశాడు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'లియాన్' (శాప ప్రమాణం) అనేది శాశ్వత వేర్పాటుకు సంకేతం అన్న సంగతి తెలీకపోవటం చేత ఆ వ్యక్తి తన భార్యకు మూడు విడాకులు ఇచ్చి ఉంటాడు. కనుక అతడు ఇచ్చిన విడాకులు నిరర్థకం. ఎందుకంటే న్యాయాధికారి సమక్షంలో నిలబడి ఆ దంపతులు పరస్పరం శాపప్రమాణం చేసిన మీదట ఇక వారి మధ్య గల వివాహబంధం మిగిలి ఉండదు. ఆ దంపతులు ఆ క్షణం నుంచే ఒండొకరి కోసం హరామ్ (నిషిద్ధం) అయిపోతారు. కాకపోతే ఆ వ్యక్తి ఈ సందర్భంగా చేసిన విడాకుల ప్రకటన అతని ఆత్మాభిమానాన్ని, పౌరుషాన్ని అభివ్యక్తం చేస్తోంది. ఈ అభివ్యక్తి ఒక రకంగా ప్రశంసనీయం కూడాను. దైవప్రవక్త (స) తన ఈ సహచరుని ధోరణిపై ఆగ్రహం చెందలేదన్న సంగతి కూడా గమనార్హమే.

(٩٤١) وَعَنْ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَجُلاً جَاءَ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: إِنَّ امْرَأَتِي لاَ تَرُدُّ يَدَ لاَمِسٍ، قَالَ: «غَرِّبْهَا»، قَالَ: أَخَافُ أَنْ تَتْبَعَهَا نَفْسِي، قَالَ: «فَاسْتَمْتِعْ بِهَا». رَوَاهُ أَبُو دَاوُدَ وَالْبَزَّارُ، وَرِجَالُهُ

941. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (నల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిక ఎచ్చి, దైవప్రవక్త (స)! నా భార్య ఎవరి చేతినీ విదిలించదు" అని చెప్పాడు. ఇది విని ఆయన (స), "అయితే ఆమెను దూరం చేసుకో" అని సలహా ఇచ్చారు. దానికతను "కాని

ثِقَاتٌ. وَأَخْرَجَهُ النَّسَائِيُّ مِنْ وَجْهٍ آخَرَ عَنِ ابْنِ عَبَّاسٍ، بِلَفْظِ «قَالَ: «طَلِّقْهَا» قَالَ: لَا أَصْبِرُ عَنْهَا، قَالَ: «فَأَمْسِكْهَا».

నా మనసు ఆమెను వెంటాడుతూనే ఉంటుందేమోనని నాకు భయంగా ఉంది" అని విన్నవించుకున్నాడు. "మరయితే ఆమె ద్వారా ప్రయోజనం పొందుతూ ఉండు" అని ఆయన (స) సూచించారు. (ఈ హదీసును అబూ దావూద్, బజ్జార్ ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు). ఇబ్నె అబ్బాస్ (రజి) ఆధారంగా నసాయి దీనిని మరోవిధంగా సేకరించారు. దీని వాక్యాలు ఇలా ఉన్నాయి - "ఆమెకు విడాకులిచ్చేయి." "నేనామెను విడిచి ఉండలేను" అని అతనన్నాడు. "అలా అయితే ఆమెతోనే కాపురం చెయ్యి" అని ఆయన (స) చెప్పారు.

**సారాంశం**

"ఆమె ఎవరి చేతినీ విదిలించదు" అంటే ఇక్కడ భావం ఆమె చెడు నడత గల స్త్రీ అని కాదుగానీ, తనతో పరాచికాలాడే వారిని ఆమె నిర్ద్వంద్వంగా ఖండించదు అని భావం. తత్ఫలితంగా ఆమె పట్ల పరాయి వ్యక్తులలో దురుద్దేశ్యం జనించేందుకు ఆస్కారముంటుందని ఆమె భర్త తలపోశాడు. అందుకే ఆమె ధోరణి గురించి దైవప్రవక్త (స)కు ఫిర్యాదు చేశాడు. ఆలుమగల అనురాగ జీవితంలో అనుమానాల బీజాలు నాటుకోవటం మంచిది కాదు. రాను రాను అవి ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తాయి. భార్యాభర్తలు ఒండొకరిని ఎంతగానో కోరుకుంటున్నప్పుడు షరీయత్ సూచించిన హద్దులను గౌరవిస్తూ ఎవరి పరిమితుల్లో వారుండటం మంచిది. ఒకవైపు భార్యను విడిచి ఉండలేనని అంటూనే, మరో వైపు ఆమె గురించి ఫిర్యాదులు చేస్తూ తిరగటం అర్థం లేని విషయం. అందుకే "ఆమెకు విడాకులిచ్చేయ్" అని దైవప్రవక్త (స) స్పష్టంగా చెప్పేశారు. భార్యను అంతగా కోరుకుంటున్నప్పుడు ఆమెలోని చిన్న చిన్న లోటుపాట్లను పెద్ద మనసుతో మన్నించాలి. ఆమె 'ఉదార వైఖరి'వల్ల జనించే అనర్థాలేమిటో ఆమెకు విడమరచి చెప్పాలి. తద్వారా సంస్కరణ సాధ్యమవుతుంది.

(٩٤٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ حِيْنَ نَزَلَتْ آيَةُ الْمُتَلَاعِنَيْنِ: «**أَيُّمَا امْرَأَةٍ أَدْخَلَتْ عَلَى قَوْمٍ مَنْ لَيْسَ مِنْهُمْ فَلَيْسَتْ مِنَ اللهِ فِي شَيْءٍ، وَلَنْ يُدْخِلَهَا اللَّهُ جَنَّتَهُ، وَأَيُّمَا رَجُلٍ جَحَدَ وَلَدَهُ، وَهُوَ يَنْظُرُ إِلَيْهِ، احْتَجَبَ اللَّهُ عَنْهُ، وَفَضَحَهُ عَلَى رُءُوسِ الْأَوَّلِينَ وَالْآخِرِينَ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

942. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : 'లియాన్' (భార్యాభర్తలు పరస్పరం నిందారోపణ) చేసుకోవటం గురించి దైవసూక్తి అవతరించినపుడు వారందరూ దైవప్రవక్త (సఅసం) నోట విన్నారు. ఆయన (సఅసం) ఇలా అన్నారు : "ఏ స్త్రీ అయితే ఒక జాతిలో (వంశంలో) లేనటువంటి పిల్లవాణ్ణి తెచ్చిపెడుతుందో అటువంటి స్త్రీతో అల్లాహ్‌కు ఎట్టి సంబంధం లేదు. అటువంటి స్త్రీకి అల్లాహ్ సుతరామూ తన స్వర్గంలో స్థానం కల్పించడు. మరే పురుషుడైతే తనకు పుట్టిన బిడ్డను తన బిడ్డ కాదంటూ తిరస్కరిస్తాడో, అటు వంటి వ్యక్తిని ప్రళయదినాన అల్లాహ్ దర్శనమివ్వడు. ఇంకా అతన్ని తన పూర్వపు, తరువాయి సృష్టితాలందరి సమక్షంలో పరాభవం పాల్జేస్తాడు." (దీనిని అబూదావూద్, నసాయి, ఇబ్నె మాజా ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రమాణబద్ధమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఒక వంశంలో లేని పిల్లవాణ్ణి తెచ్చి పెట్టడమంటే భర్తను మోసగించటం అని అర్థం. భార్య చేసిన పాపం భర్తకు తెలియదు. ఆ పిల్లవాణ్ణి చూచి, అది 'తన రక్తం'అని ఆమె భర్త విశ్వసిస్తూ ఉంటాడు. కాని అతని భార్య మాత్రం విశ్వాస ఘాతుకానికి పాల్పడింది. ఒక వ్యక్తికి భార్యగా ఉంటూనే మరో మగాడితో అక్రమ సంబంధం ఏర్పరచుకుంది. తన కడుపులో పెరుగుతున్న ఆ నలుసు ఎవరి పాప ఫలమో స్వయంగా ఆమెకూ తెలుసు. కాని తనను నికాహ్ చేసుకున్న వ్యక్తికి మాత్రం తెలీదు. ఇలాంటి వంచనా శిల్ప నిష్ణాతుల బండారం ఇహలోకంలో ఒకవేళ బయల్పడకపోయినా ప్రళయదినాన తప్పక బట్టబయలు కానుంది. అటువంటి స్త్రీలు స్వర్గలోక సువాసనను ఆస్వాదించలేరని ఈ హదీసు చెబుతోంది.

అలాగే తన వీర్యాన్ని స్త్రీ గర్భ సంచిలోకి ప్రవేశపెట్టి, కనబోయే బిడ్డ కోసం ఎదురు చూచి, తీరా ఆమె బిడ్డను కన్న తర్వాత, ఆ బిడ్డ తనది కాదని బొంకే మగ మారాజులకు కూడా ఈ హదీసులో తీవ్రమయిన హెచ్చరిక ఉంది. దేవుడు ఇలాంటి కపటాగ్రేసరుల లోగుట్టును రట్టుచేసి మానవులందరి సమక్షంలో నవ్వుల పాల్జేస్తాడు.

(٩٤٣) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: مَنْ أَقَرَّ بِوَلَدِهِ طَرْفَةَ عَيْنٍ فَلَيْسَ لَهُ أَنْ يَنْفِيَهُ. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَهُوَ حَسَنٌ مَوْقُوفٌ.

943. హజ్రత్ ఉమర్ (రజి) కథనం: "ఎవరయినా సరే, ఒక్క క్షణం కోసం ఆ శిశువు తనదేనని ప్రకటించిన మీదట ఇక ఎన్నటికీ దాన్ని తృణీకరించలేడు." (బైహఖీ దీనిని ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనం ప్రామాణికమైనది మరియు మౌఖూఫ్ కోవకు చెందినది.)

**సారాంశం**

జీవితాలతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదనీ, ఒక శిశువును అది తన శిశువు అని అంగీకరించిన మీదట జీవితాంతం ఆ మాటకు కట్టుబడి ఉండవలసి వుంటుందనీ ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం సిహ్ఫమ్ బిన్ ఖతాదా అనే సహచరుడు కొన్ని ఆనవాళ్ళ ఆధారంగా ఒక శిశువును తిరస్కరించే ప్రయత్నం చేయగా, దైవప్రవక్త (స) అతని ప్రతిపాదనను అంగీకరించలేదు. వచ్చే హదీసులో దీని వివరాలున్నాయి.

(٩٤٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً قَالَ: يَا رَسُولَ اللهِ! إِنَّ امْرَأَتِي وَلَدَتْ غُلاماً أَسْوَدَ، قَالَ: «هَلْ لَكَ مِنْ إِبِلٍ؟» قَالَ: نَعَمْ، قَالَ: «فَمَا أَلْوَانُهَا؟» قَالَ: حُمْرٌ، قَالَ: «هَلْ فِيهَا مِنْ أَوْرَقَ؟» قَالَ:

944. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ఒక వ్యక్తి వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! మా ఆవిడకు నల్లని పిల్లవాడు పుట్టాడు (మరి నేనేమో ఎర్రగా వున్నాను. ఇది ఎలా సంభవం?)" అని సందేహం వెలిబుచ్చాడు. దైవప్రవక్త (స) అతని సందేహానికి సమాధానమిస్తూ "నీ దగ్గర ఒంటెలునాయా?" అని అడిగారు. "ఉన్నాయి" అన్నాడతను. "అవి ఏ ఏ రంగుల్లో ఉన్నాయి?" అని దైవప్రవక్త (స)తిరిగి ప్రశ్నించారు. "ఎరుపు రంగులో ఉన్నాయి?" అని అతడు సమాధాన మిచ్చాడు. "వాటిలో ఏదైనా బూడిద

نَعَمْ، قَالَ: «فَأَنَّى ذَلِكَ؟» قَالَ: لَعَلَّهُ نَزَعَهُ عِرْقٌ، قَالَ: «فَلَعَلَّ ابْنَكَ هَذَا نَزَعَهُ عِرْقٌ». مُتَّفَقٌ عَلَيْهِ. وَفِيْ رِوَايَةٍ لِّمُسْلِمٍ: «وَهُوَ يُعَرِّضُ بِأَن يَنْفِيَهُ» وَقَالَ فِي آخِرِهِ: «وَلَمْ يُرَخِّصْ لَهُ فِي ٱلِانْتِفَاءِ مِنْهُ».

రంగు ఒంటె కూడా ఉందా?" అని ఆయన (స) మళ్ళీ ప్రశ్నించగా, "అవును ఉంది" అని అతను బదులిచ్చాడు. "ఆ రంగు మరి ఎక్కణ్ణుంచి వచ్చింది?" అని దైవప్రవక్త (స) అడగ్గా, "బహుశా వాటి తాత ముత్తాతలలో ఎవరి పోలికయినా వచ్చి ఉంటుంది"అని ఆ వ్యక్తి అన్నాడు. "అదేవిధంగా నీ కొడుక్కి కూడా నీ వంశస్థుల్లోని ఎవరి రంగయినా వచ్చి ఉంటుంది" అని ఆయన (స) అతనికి సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం) ముస్లింలోని ఒక ఉల్లేఖనం ప్రకారం - అతడు ఈ పిల్లవాడు తన పిల్లవాడు కాదని చెప్పదలిచాడు. అయితే ఈ ఉల్లేఖనం చివర్లో ఆయన (స) అతని ప్రతిపాదనను తిరస్కరిస్తూ, అందుకు ఆమోదం తెలుపలేదు.

**సారాంశం**

ఈ హదీసులో - తన సహచరునిలో రేకెత్తిన ఒక తీవ్రమైన సందేహానికి దైవప్రవక్త (స) బహు చక్కగా సమాధానమిచ్చి, అతని అనుమానాన్ని దూరం చేశారు. తానుగానీ, తన భార్యగానీ నల్లవారు కానపుడు, మరి ఈ పిల్లవాడు నల్లగా ఎందుకున్నాడు? అన్నది ఆ సహచరునిలో కలిగిన సందేహం. ఈ సందేహాన్ని వెలిబుచ్చిన సహచరుణ్ణి దైవప్రవక్త (స) గట్టిగా మందలించడంగానీ, అతని భార్యను పిలిపించి సంజాయిషీ అడగటం గానీ చేయలేదు. దీనికి బదులు ఆయన (స) అరబ్బుల ఆలోచనా స్థాయికి దిగివచ్చి వాళ్లకు అర్థమయ్యే రీతిలో సమాధానపర్చాలని భావించారు. ఈ ప్రయత్నంలో ఆయన (స) సఫలీకృతులయ్యారు కూడా. ప్రశ్నించేవాని ఆలోచనా స్థాయినీ, అతని వృత్తినీ దృష్టిలో పెట్టుకుని అతనికి తొందరగా అర్థమయ్యే దృష్టాంతాల ఆధారంగా సమాధానం ఇవ్వాలనీ, అనవసరంగా తాత్విక చర్చలోకి పోరాదని కూడా ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఏదేని ఒక విషయంలో మనిషి తీవ్రమయిన సందిగ్ధానికి లోనైనపుడు విజ్ఞులను, వివేచనాపరులను సంప్రతించాలని, తద్వారా వారు సతమతమయ్యే సంక్లిష్ట పరిస్థితులనుంచి తేలిగ్గా బయటపడవచ్చునని బోధపడుతున్నది.

## 11వ అధ్యాయం

## ఇద్దత్ (గడువు), శోకం, ప్రసవం

## ١١ - بَابُ العِدَّةِ وَالْإِحْدَادِ وَالاسْتِبْرَاءِ وَغَيْرِ ذٰلِكَ

945. హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్రమ (రహ్మ.లై) కథనం ప్రకారం సుబైయ అస్లమియా (ర.అన్హా) గారు తన భర్త మరణించిన కొన్ని రోజులకు ప్రసవించారు. తరువాత ఆమెగారు దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, పునర్వివాహం కొరకు అనుమతి కోరారు. దైవప్రవక్త (సఅసం) అందుకు అనుమతి ఇవ్వగా ఆమె వివాహం చేసుకున్నారు. (దీనిని బుఖారీ ఉల్లేఖించారు. దీని మూలం బుఖారీ, ముస్లింలలో కూడా ఉంది). వేరొక ఉల్లేఖనంలో, ఆమె తన భర్త మరణించిన నలభై రోజులకు ప్రసవించిందని ఉంది.

(٩٤٥) عَنِ الْمِسْوَرِ بْنِ مَخْرَمَةَ، سُبَيْعَةَ الْأَسْلَمِيَّةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا نُفِسَتْ بَعْدَ وَفَاةِ زَوْجِهَا بِلَيَالٍ، فَجَاءَتِ النَّبِيَّ ﷺ، فَاسْتَأْذَنَتْهُ أَنْ تَنْكِحَ، فَأَذِنَ لَهَا، فَنَكَحَتْ. رَوَاهُ الْبُخَارِيُّ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ. وَفِي لَفْظٍ: أَنَّهَا وَضَعَتْ بَعْدَ وَفَاةِ زَوْجِهَا بِأَرْبَعِينَ لَيْلَةً.

'ముస్లిం' ఉల్లేఖనంలోని వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి : "పురిటి రక్తస్రావ స్థితిలో నికాహ్ చేసుకున్నా తప్పులేదని నేను భావిస్తున్నాను" అని జుహ్రీ అన్నారు. అయితే ఆమె ఆ స్థితి నుంచి బయటపడి స్నానంచేసి పరిశుద్ధురాలైన తర్వాత మాత్రమే ఆమె భర్త ఆమె వద్దకు పోగలడు."

وَفِي لَفْظٍ لِمُسْلِمٍ: قَالَ الزُّهْرِيُّ: وَلَا أَرَى بَأْساً أَنْ تَزَوَّجَ وَهِيَ فِي دَمِهَا، غَيْرَ أَنَّهُ لَا يَقْرَبُهَا زَوْجُهَا حَتَّى تَطْهُرَ.

### సారాంశం

భర్త చనిపోయిన స్త్రీ గర్భవతి అయివుంటే ఆమె ఇద్దత్ (గడువు) ఆమె ప్రసవంతోనే ముగుస్తుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన హజ్రత్ సుబైయ (ర.అన్హా) సుప్రసిద్ధ సహాబియా ఈమె మొదటి భర్త సాద్ ఇబ్నె ఖౌలా (రజి) అంతిమ హజ్ యాత్ర జరిగిన కొన్నాళ్ళకు మక్కాలో మరణించారు. భర్త చనిపోయిన నలభై

లేక యాభై రోజులకు సుబైయ (ర.అన్హా) బిడ్డను ప్రసవించారు. గర్భవతిగా ఉన్న స్త్రీ భర్త గనక చనిపోతే, ఆమె ప్రసవించగానే ఇద్దత్ (గడువు) సమాప్తమవుతుందని, ఆ నాటికి నాలుగు మాసాల పది రోజుల వ్యవధి పూర్తయినా కాకపోయినా దీనితో సంబంధం లేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

## హదీసు ఉల్లేఖకులు

1. సుబైయ (ర.అన్హా) : సుబైయ బిన్తె హారిస్ అస్లమియా. అస్లం తెగతో సంబంధం ఉన్న కారణంగా అస్లమియా అనబడ్డారు. సుప్రసిద్ధ మహిళా సహచరులలో ఒకరు. ఇబ్నె సాద్ ప్రకారం ఈమె హిజ్రత్ చేసి ఉన్నారు. తొలుత ఈమె సాద్ బిన్ ఖౌలా సతీమణిగా ఉన్నారు. అంతిమ హజ్ యాత్ర సందర్భంగా ఆయన చనిపోగా ఈమె తన జాతికి చెందిన ఒక నవ యువకుణ్ణి వివాహమాడింది. అతని పేరు అబూ సనాబీల్.

2. జుహ్రీ : ముహమ్మద్ బిన్ ముస్లిం బిన్ ఉబైదుల్లాహ్ బిన్ షిహాబుద్దీన్ ఖురషీ జుహ్రీ. గొప్ప విద్వాంసులు. హిజాజ్ - సిరియా ప్రాంతాలు రెండింటికీ మార్గదర్శక పండితులుగా వర్ధిల్లారు. నాల్గో తరానికి చెందిన అగ్రశ్రేణి ఉలమాలలో ఒకరుగా పరిగణించబడేవారు. ఆయన పాండితీ ప్రకర్షపై, నిర్ద్వంద్వ స్వభావంపై ఎవరికీ కించిత్ సందేహం కూడా లేదు. తాను ఇబ్నె షిహాబ్ వంటి సమగ్ర వ్యక్తిత్వం గల విద్వాంసుని చూడలేదని లైస్ వ్యాఖ్యానించారు. ఇబ్నె షిహాబ్ గొప్ప దాతృగుణం గలవారనీ, మనుషుల్లో ఆయన లాంటివారు బహు అరుదుగా ఉంటారనీ ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. హిజ్రీ 124లో ఈయన మరణించారు.

(٩٤٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: أُمِرَتْ بَرِيرَةُ أَنْ تَعْتَدَّ بِثَلَاثِ حِيَضٍ. رَوَاهُ ابْنُ مَاجَهْ، وَرُوَاتُهُ ثِقَاتٌ، لَكِنَّهُ مَعْلُولٌ.

946. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "మూడు రుతువులు (బహిష్టులు) అయ్యేవరకూ ఇద్దత్ (గడువు)లో ఉండాలని బరీరా (ర.అన్హా) కు ఆజ్ఞాపించబడింది." (దీనిని ఇబ్నెమాజా ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు. కాని ఉల్లేఖనంలో లోపం ఉంది)

## సారాంశం

ఈ హదీసులో హజ్రత్ బరీరా (ర.అన్హా) ప్రస్తావన వచ్చింది. ఈమె భర్తపేరు ముగీస్. హజ్రత్ బరీరాకు బానిసత్వం నుండి స్వేచ్ఛ లభించిందిగానీ భర్త మాత్రం ఇంకా బానిస బంధనాలలోనే చిక్కుకుని ఉన్నాడు. స్వేచ్ఛ నొసగబడిన బరీరా తన నిర్ణయాధికారాన్ని వినియోగించుకుంటూ తన బానిస భర్తతో గల నికాహ్ (వైవాహిక) బంధాన్ని రద్దుపరచింది. ఆ తర్వాత ఆమె మూడు బహిష్టు కాలాలు గడిచే దాకా 'ఇద్దత్'లో ఉండవలసి వచ్చింది.

(٩٤٧) وَعَنِ الشَّعْبِيِّ عَنْ فَاطِمَةَ بِنْتِ قَيْسٍ، عَنِ النَّبِيِّ ﷺ، فِي الْمُطَلَّقَةِ ثَلاَثاً لَيْسَ لَهَا سُكْنَى، وَلاَ نَفَقَةَ. رَوَاهُ مُسْلِمٌ.

947. ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) ఆధారంగా షాబీ చేసిన కథనం ప్రకారం మూడు విడాకులు పొందిన మహిళ గురించి దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఆమె కొరకు వసతి సౌలభ్యంగానీ, మనోవర్తిగానీ లేదు." (ముస్లిం)

(٩٤٨) وَعَنْ أُمِّ عَطِيَّةَ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ تُحِدُّ امْرَأَةٌ عَلَى مَيِّتٍ فَوْقَ ثَلاَثٍ، إِلاَّ عَلَى زَوْجٍ أَرْبَعَةَ أَشْهُرٍ وَعَشْراً، وَلاَ تَلْبَسُ ثَوْباً مَصْبُوغاً، إِلاَّ ثَوْبَ عَصْبٍ، وَلاَ تَكْتَحِلُ، وَلاَ تَمَسُّ طِيباً، إِلاَّ إِذَا طَهُرَتْ، نُبْذَةً مِنْ قُسْطٍ أَوْ أَظْفَارٍ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا لَفْظُ مُسْلِمٍ، وَلأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ مِنَ الزِّيَادَةِ: «وَلاَ تَخْتَضِبُ». وَلِلنَّسَائِيِّ: «وَلاَ تَمْتَشِطُ».

948. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) తెలిపారు - భర్త మరణించిన స్త్రీ తప్ప మరే స్త్రీ కూడా ఒకరి మరణంపై మూడు రోజులకన్నా ఎక్కువ శోకాన్ని పాటించకూడదు. భర్త చనిపోయిన స్త్రీ మాత్రం నాలుగు మాసాల పదిరోజులు సంతాపం పాటించవలసి ఉంటుంది. ఈ సంతాపకాలం (ఇద్దత్)లో ఆమె అద్దకపు వస్త్రాలు మినహా రంగు రంగుల బట్టలు తొడుక్కోవటంగానీ, కాటుక పెట్టుకోవటంగానీ, సువాసన పూసుకోవటంగానీ చేయకూడదు. అయితే బహిష్టు కాలం ముగిసి స్నానం చేసినప్పుడు మాత్రం కొంత సాంబ్రాణినీ, 'అజ్ఫార్' లాంటి సుగంధాన్ని ఉపయోగించవచ్చు." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు ముస్లింలోనివి). గోరింటాకు, శిరోజాలకు పూసుకునే రంగు ఉపయోగించరాదని అబూదావూద్, నసాయిలలో ఉంది. నసాయిలో, దువ్వెన కూడా ఉపయోగించరాదని ఉంది.

(٩٤٩) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: جَعَلْتُ عَلَى عَيْنِيْ صَبِراً، بَعْدَ أَنْ تُوُفِّيَ أَبُو سَلَمَةَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّهُ يَشُبُّ الْوَجْهَ، فَلاَ تَجْعَلِيهِ إِلاَّ بِاللَّيْلِ، وَانْزِعِيهِ بِالنَّهَارِ، وَلاَ تَمْتَشِطِي بِالطِّيبِ، وَلاَ بِالْحِنَّاءِ فَإِنَّهُ خِضَابٌ**»، قُلْتُ: بِأَيِّ شَيْءٍ أَمْتَشِطُ؟ قَالَ: «**بِالسِّدْرِ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَإِسْنَادُهُ حَسَنٌ.

949. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : అబూ సలమా చనిపోయిన తర్వాత నేను నా కళ్ళ క్రింది భాగాన 'సబిరా' అనే మూలికల లేపనాన్ని పూసుకున్నాను. అది చూచి దైవప్రవక్త (సఅసం), 'సబిరా' మొహం పైని మొటిమలను మాయంచేసి, ముఖ వర్చస్సును పెంచుతుంది. కనుక ఈ లేపనాన్ని నువ్వు రాత్రిపూట మాత్రం పట్టించు. పగటిపూట వద్దు. సువాసనతో కూడిన తైలంతో, గోరింటాకు తైలంతో తైల సంస్కారం చేసుకోకు. గోరింటాకు కూడా ఒకలాంటి రంగే" అని అన్నారు. "మరి నేను తల దువ్వుకునేదెలా?" అని నేను విన్నవించుకోగా, "రేగు ఆకులను నీళ్లలో నానబెట్టి వాటిని ఉపయోగించవచ్చు" అని ఆయన సూచించారు. (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఈ హదీసు పరంపర స్పష్టంగా ఉంది)

**సారాంశం**

భర్త చనిపోయిన స్త్రీలు ఇద్దత్ (శోకకాలం, సంతాప కాలం)లో సాధ్యమైనంత వరకు నిరాడంబరంగా ఉండాలనీ, అలంకరణలకు, ఆడంబరాలకూ దూరంగా ఉండాలనీ ఈ హదీసు సారాంశం. ఇద్దత్ (నాలుగు నెలల పదిరోజులు) ముగిసిన తర్వాత అలంకరణకు సంబంధించిన ఆంక్షలు వారిపై ఉండవు.

(٩٥٠) وَعَنْهَا أَنَّ امْرَأَةً قَالَتْ: يا رَسُولَ اللهِ! إِنَّ ابْنَتِيْ مَاتَ عَنْهَا زَوْجُهَا، وَقَدِ

950. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం : ఒక స్త్రీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నా కూతురి భర్త చనిపోయాడు. ఎక్కువగా విలపించడం వల్ల ఆమె కళ్లు కళా విహీనంగా మారాయి. ఆమె కళ్ళకు సుర్మా పూయ

اشْتَكَتْ عَيْنَهَا، أَفَنَكْحُلُهَا؟ قَالَ: لاَ. مُتَّفَقٌ عَلَيْهِ.

మంటారా?" అని విన్నవించుకున్నది. "వద్దు" అని ఆయన (స) చెప్పారు.

(బుఖారీ, ముస్లిం)

### సారాంశం

శోకం పాటించే వితంతువులు శోక కాలంలో కళ్లకు సుర్మా పూసుకోవటం, కాటుక పెట్టుకోవటం నిషిద్ధమని ఈ హదీసు చెబుతోంది. ఆరోగ్య కారణాల దృష్ట్యా కళ్లకు సుర్మా పూసుకోవటం మరీ అంతగా అవసరమైనపుడు రాత్రిపూట పూసుకోవచ్చు. పగటిపూట పూసుకోకూడదు. ఈ విషయమై ఒక స్త్రీ హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) ను సంప్రతించగా, రాత్రివేళ సుర్మా పూసుకుని పగటివేళ కడిగివేయి అని సలహా ఇచ్చారు.

(٩٥١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: طُلِّقَتْ خَالَتِيْ، فَأَرَادَتْ أَنْ تَجُدَّ نَخْلَهَا، فَزَجَرَهَا رَجُلٌ أَنْ تَخْرُجَ، فَأَتَتِ النَّبِيَّ ﷺ، فَقَالَ: «بَلْ جُدِّي نَخْلَكِ، فَإِنَّكِ عَسَى أَنْ تَصَّدَّقِي، أَوْ تَفْعَلِي مَعْرُوفاً». رَوَاهُ مُسْلِمٌ.

951. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : నా పిన్నికి విడాకులివ్వబడ్డాయి. ఆమె ఇద్దత్ (గడువు) కాలంలోనే ఖర్జూరపండ్లు కోత కోయడానికి ఇంటి గడప దాటి తోటకు వెళ్ళవలసి వచ్చింది. ఒకాయన ఆమెను మందలించగా, ఆమె ఈ విషయాన్ని దైవప్రవక్త (స) దృష్టికి తీసుకువచ్చింది. దీనికి దైవప్రవక్త (స), "నీవు నీ తోటలకు వెళ్ళి ఖర్జూరపండ్లు కోసుకోవచ్చు. ఈ సందర్భంగా నువ్వు దానమైనా చేయవచ్చు లేదా మరేదైనా సత్కార్యం నీ చేతుల మీదుగా జరగవచ్చు" అని చెప్పారు. (ముస్లిం)

### సారాంశం

ఇద్దత్ (గడువు)లో ఉన్న మహిళలు ఇంటిపట్టున ఉండటం వాంఛనీయమైనప్పటికీ, అనివార్య పరిస్థితుల దృష్ట్యా ఇంటి బయటకు పోవటంలో తప్పులేదనీ ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అయితే వెళ్ళిన పని పూర్తి కాగానే ఇంటి ముఖం పట్టాలి. అనవసర కాలక్షేపాల్లో నిమగ్నం కారాదు.

(٩٥٢) وَعَنْ فُرَيْعَةَ بِنْتِ مَالِكٍ، أَنَّ زَوْجَهَا خَرَجَ فِي طَلَبِ أَعْبُدٍ لَهُ، فَقَتَلُوهُ،

952. హజ్రత్ ఫురైయా బిన్తె మాలిక్ (ర.అన్హా) కథనం : నా భర్త పలాయనం చిత్తగించిన తన బానిసల అన్వేషణలో

قَالَتْ: فَسَأَلْتُ رَسُولَ اللهِ ﷺ أَنْ أَرْجِعَ إِلَىٰ أَهْلِي، فَإِنَّ زَوْجِي لَمْ يَتْرُكْ لِي مَسْكَناً يَمْلِكُهُ، وَلاَ نَفَقَةً، فَقَالَ: **نَعَمْ**، فَلَمَّا كُنْتُ فِي الْحُجْرَةِ نَادَانِي، فَقَالَ: **امْكُثِي فِي بَيْتِكِ حَتَّى يَبْلُغَ الْكِتَابُ أَجَلَهُ**، قَالَتْ: فَاعْتَدَدْتُ فِيهِ أَرْبَعَةَ أَشْهُرٍ وَعَشْراً، قَالَتْ: فَقَضَى بِهِ بَعْدَ ذٰلِكَ عُثْمَانُ. أَخْرَجَهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَالذُّهْلِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ وَغَيْرُهُمْ.

బయలుదేరాడు. వాళ్లు ఆయన్ని హత మార్చారు. నేను ఈ స్థితిలో నా పుట్టింటికి వెళ్ళిపోదామనే ఉద్దేశ్యాన్ని దైవప్రవక్త (స) సమక్షంలో వెల్లడించాను. ఎందుకంటే నా భర్త తన ఆస్తిగా ఇల్లును మిగిల్చి ఉంచటంగానీ, మనోవర్తిగా ఆస్తిని వదలి వెళ్ళడంగానీ చేయలేదు. దైవప్రవక్త (స) నా గోడునంతా విని "సరే (నీవు నీ పుట్టింటికి వెళ్ళవచ్చు)" అన్నారు. నేను నా కుటీరంలోకి ప్రవేశించగానే ఆయన (స) పిలుపు వినవచ్చింది. "నీవు నీ ఇద్దత్ (గడువు) సమాప్తమయ్యే వరకూ ప్రస్తుతముంటున్న ఇంట్లోనే ఉండు" అని ఆయన (సఅసం) ఉపదేశించారు. "నేను నా ఇద్దత్ (గడువు)కు సంబంధించిన నాలుగు నెలల పదిరోజుల కాలాన్ని ఆ ఇంట్లోనే గడిపాను" అని ఆమె (ర.అన్హా) వివరించారు. ఆమె ఇంకా ఇలా తెలిపారు - "హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా ఈ తీర్పు ననుసరించే ఈ విషయమై నిర్ణయం గైకొనేవారు." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ, జుహ్లీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ తదితరులు దీన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

భర్త చనిపోయిన స్త్రీ తన భర్తతో సంసారం చేసిన ఇంట్లోనే 'ఇద్దత్' గడువును పూర్తి చేయాలన్న దానికి ఈ హదీసు నిదర్శనం. పరిశోధనాత్మక ఉలమాల అభిప్రాయం కూడా ఇదే. వేరొక స్థలాన్ని ఇద్దత్ కొరకు నిర్ధారించుకుని అక్కడికి తరలటం ధర్మసమ్మతమేనని కూడా అనబడుతోంది.

**హదీసు ఉల్లేఖకులు**

ఫురైయ బిన్తె మాలిక్ బిన్ సినాన్ ఖుదరియ (ర.అన్హా). ప్రఖ్యాత సహాబీ అయిన హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) గారి తోబుట్టువు ఈమె. 'బైతె రిజ్వాన్' ఘట్టంలో ఈమె కూడా ఉన్నారు.

(٩٥٣) وَعَنْ فَاطِمَةَ بِنْتِ قَيْسٍ قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنَّ زَوْجِيْ طَلَّقَنِيْ ثَلاَثاً، وَأَخَافُ أَنْ يُقْتَحَمَ عَلَيَّ، قَالَ: فَأَمَرَهَا فَتَحَوَّلَتْ. رَوَاهُ مُسْلِمٌ.

953. హజ్రత్ ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) కథనం: "ఓ దైవప్రవక్త (సఅసం)! నా భర్త నాకు మూడు విడాకులు ఇచ్చేశాడు. అయితే నా వద్దకు ఎవరయినా అనుచిత రీతిలో జొరబడి నాపై ఏదన్నా అఘాయిత్యానికి పాల్పడతారేమోనని నాకు భయంగా ఉంది" అని నేను విన్నవించుకున్నాను. అప్పుడు దైవప్రవక్త (స), నేనా ఇంటి నుంచి వేరొక చోటికి వెళ్ళటానికి నాకు అనుమతిని ఇచ్చారు. ఆమె అక్కడి నుంచి ప్రస్థానం చేశారు. (ముస్లిం)

**సారాంశం**

తన ప్రాణానికి, మానమర్యాదలకు ముప్పు వాటిల్లే భయం ఉన్నప్పుడు స్త్రీ తన సమీప బంధువుల వద్దకు వెళ్ళి అక్కడే ఇద్దత్ (గడువు)ను పూర్తి చేయవచ్చు. ఉదాహరణకు : ఇల్లు సురక్షితంగా లేనపుడు, ఇరుగు పొరుగువారు వేధించే అవకాశం ఉన్నప్పుడు, ఒంటరితనాన్ని భరించలేననుకున్నప్పుడు ఆమె మకాం మార్చవచ్చు.

(٩٥٤) وَعَنْ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لاَ تُلبِسُوْا عَلَيْنَا: سُنَّةَ نَبِيِّنَا، عِدَّةُ أُمِّ الْوَلَدِ، إِذَا تُوُفِّيَ عَنْهَا سَيِّدُهَا، أَرْبَعَةُ

954. హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : "మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సంప్రదాయాన్ని మన కొరకు కలగాపులగం చేయకండి - 'ఉమ్మె వలద్' యజమాని చనిపోయినపుడు ఆమె ఇద్దత్ (గడువు) నాలుగు మాసాల పదిరోజులుగా నిర్ధారించబడింది." (దీనిని అహ్మద్, అబూ దావూద్, ఇబ్నెమాజా ఉల్లేఖించారు.

أَشْهُرٍ وَعَشْرٌ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأَعَلَّهُ الدَّارَقُطْنِيُّ بِالانْقِطَاعِ.

హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. దారె ఖుత్నీ దృష్టిలో - దీని పరంపరలో లోపం ఉంది)

**సారాంశం**

ఈ హదీసులో ఉమ్మె వలద్ ఇద్దత్ గురించి చెప్పబడింది. అయితే ఈ ఉల్లేఖనంలో లోపం ఉంది. ఎందుకంటే ఉల్లేఖకులలో ఒకరైన ఖుబైస బిన్ జువైబ్, అమ్ర్ బిన్ ఆస్ నుండి గ్రహించినట్లు ఉంది. కాని అమ్ర్ నుండి ఆయన విన్నట్టు ఆధారం ఏదీ లేదు. ఇమామ్ బైజాయి గారు ఉమ్మె వలద్ గడువును నాలుగు మాసాల పది రోజులని భావిస్తున్నారు. కాని ఇమామ్ షాఫయి, ఇమామ్ అహ్మద్, ఇమామ్ మాలిక్‌ల దృష్టిలో ఈ ఇద్దత్ ఒక రుతువు మాత్రమే. కాగా; ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో ఈ ఇద్దత్ మూడు రుతువులు. ఇమామ్ షాఫయి తదితరులేమంటారంటే; ఆమె ఇద్దత్ కేవలం ఒక్క రుతువు మాత్రమే. ఎందుకంటే ఆమె ఇల్లాలుగానీ, విడాకులు పొందిన స్త్రీగానీ కాదు (ఆమె కేవలం ఒక బానిసరాలు మాత్రమే). పురుషుని తాలూకు వీర్య కణాల ప్రభావం ఆమె గర్భం నుంచి తొలగిపోయిందనడానికి ఒక రుతుస్రావం సరిపోతుంది.

అమ్ర్ బిన్ ఆస్ (రజి) గారి నాలుగు నెలల పదిరోజుల కథనం విని ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) ఆశ్చర్యచకితులయ్యారు. ఇది దైవప్రవక్త (స) వారి ఏ సంప్రదాయం? అని ఆయన ప్రశ్నించారు. ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు: దైవప్రవక్త (స) సంప్రదాయం ప్రకారం 'నాలుగు మాసాల పదిరోజుల ఇద్దత్' ఆంక్ష స్వేచ్ఛాయుత స్త్రీకి మాత్రమే వర్తిస్తుంది. కాగా; ఉమ్మె వలద్ ఒక బానిసరాలు.

ఇదిలా వుండగా పరిశోధకులైన పండితులు ఈ హదీసును బలహీనమైన హదీసుగా ఖరారు చేశారు.

(٩٥٥) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: إِنَّمَا الْأَقْرَاءُ الْأَطْهَارُ. أَخْرَجَهُ مَالِكٌ وَأَحْمَدُ وَالنَّسَائِيُّ، فِي قِصَّةٍ، بِسَنَدٍ صَحِيحٍ.

955. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : 'అఖ్రా' అంటే అర్థం పరిశుద్ధతే (తుహర్). (దీనిని మాలిక్, అహ్మద్, నసాయి ఒకానొక వృత్తాంతంలో ప్రామాణిక ఆధారాల సహితంగా నకలు చేశారు)

(٩٥٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: طَلَاقُ الْأَمَةِ تَطْلِيقَتَانِ، وَعِدَّتُهَا حَيْضَتَانِ. رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَأَخْرَجَهُ

956. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: బానిసరాలి విడాకు రెండు విడాకులు మాత్రమే. ఆమె ఇద్దత్ (గడువు) కూడా

مَرْفُوعاً، وَضَعَّفَهُ، وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ وَابْنُ مَاجَهْ مِنْ حَدِيْثِ عَائِشَةَ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَخَالَفُوهُ، فَاتَّفَقُوا عَلىٰ ضَعْفِهِ.

రెండు రుతువులే. (దీనిని దారెఖుత్నీ ఉల్లేఖించారు. దీన్ని ఆయన 'మర్ఫూ'గా కూడా ఉల్లేఖించారు. అయితే 'జయీఫ్'గా ఖరారు చేశారు. అంతేగాక ఈ ఉల్లేఖనాన్ని అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నె మాజా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ఆధారంగా సేకరించారు. హాకిమ్ దీన్ని ప్రమాణబద్ధంగా ఖరారు చేశారు. అయితే ఇతర హదీసువేత్తలు దీన్ని వ్యతిరేకించారు. ఇది 'జయీఫ్' అన్న అభిప్రాయంపైనే వారంతా ఏకీభవించారు)

(٩٥٧) عَنْ رُوَيْفِعِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**لاَ يَحِلُّ لِامْرِىءٍ يُؤْمِنُ بِاللهِ وَالْيَوْمِ الْآخِرِ أَنْ يَسْقِيَ مَاءَهُ زَرْعَ غَيْرِهِ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَحَسَّنَهُ الْبَزَّارُ.

957. హజ్రత్ రువైఫీ బిన్ సాబిత్ కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : ఎవరయితే అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాసం కలిగి ఉన్నాడో అతనికి అన్యుల చేనును తన నీటితో తడపటం ధర్మసమ్మతం (హలాల్) కాదు.

**సారాంశం**

అన్యుల పొలాన్ని తమ నీటితో తడపటం అంటే అర్థం, తన వైవాహిక బంధంలో, తన రక్షణలో లేని స్త్రీపై కన్నువేయటం, వారిని లోబరచుకుని అక్రమంగా వారి గర్భాలలోకి తన వీర్య బిందువులను ప్రవేశపెట్టడం అన్నమాట! ధర్మసమ్మతమైన రీతిలో తన పొలాలకు పోయే బదులు, దొడ్డి దోవన ఇతరుల పొలాలపై పడేవారికి ఈ హదీసులో తీవ్రమయిన హెచ్చరిక ఉంది.

(٩٥٨) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فِي امْرَأَةِ الْمَفْقُودِ، تَرَبَّصُ أَرْبَعَ سِنِيْنَ، ثُمَّ

958. తప్పిపోయిన, ఎవరికీ చెప్పకుండా మాయమైపోయిన వాని భార్య గురించి చెబుతూ హజ్రత్ ఉమర్ (రజి), 'ఆమె నాలుగు సంవత్సరాల పాటు ఎదురు

تَعْتَدُّ أَرْبَعَةَ أَشْهُرٍ وَعَشْراً. أَخْرَجَهُ مَالِكٌ وَالشَّافِعِيُّ.

చూడాలి. ఆ తరువాత నాలుగు మాసాల పదిరోజులు ఇద్దత్ (గడువు)ను పూర్తి చేయాలి' అని అన్నారు. (మాలిక్, షాఫయీలు దీనిని సేకరించారు)

(٩٥٩) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اِمْرَأَةُ الْمَفْقُودِ امْرَأَتُهُ حَتَّى يَأْتِيَهَا الْبَيَانُ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ بِإِسْنَادٍ ضَعِيفٍ.

959. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) ఉల్లేఖించారు : కనిపించకుండా పోయిన మగవాని భార్య, అతని గురించి స్పష్టమయిన సమాచారం అందనంతవరకూ అతని భార్యగానే ఉంటుంది. (దారెఖుత్నీ దీనిని బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

(٩٦٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَبِيتَنَّ رَجُلٌ عِنْدَ امْرَأَةٍ، إِلاَّ أَنْ يَكُونَ نَاكِحاً، أَوْ ذا مَحْرَمٍ». أَخْرَجَهُ مُسْلِمٌ.

960. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ వ్యక్తీ మరో స్త్రీ దగ్గర ఒంటరిగా - అతడు ఆమె భర్త లేక మహ్రమ్ బంధువు (సోదరుడు, తండ్రి) అయివుంటే తప్ప - ఒక రాత్రి కూడా ఉండరాదు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు వెలుగులో అపరిచిత స్త్రీ ఇంట - ఒంటరిగా - ఒక మగవాడు ఉండటం హరాం (నిషిద్ధం). 'మహ్రమ్' వ్యక్తి అయితే ఎలాంటి అభ్యంతరం లేదు. ఎట్టి పరిస్థితిలోనూ ఆ స్త్రీతో వివాహం ధర్మసమ్మతం కాజాలని వ్యక్తిని 'మహ్రమ్' అని అంటారు.

(٩٦١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لاَ يَخْلُوَنَّ رَجُلٌ بِامْرَأَةٍ إِلاَّ مَعَ ذِي مَحْرَمٍ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

961. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : ఏ వ్యక్తి అయినాసరే ఒక స్త్రీతో కలసి - ఆమె 'మహ్రమ్' బంధువు అక్కడ లేనిదే - ఏకాంతంలో ఉండరాదు. (బుఖారీ)

(٩٦٢) وَعَنْ أَبِي سَعِيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي سَبَايَا أَوْطَاسٍ: «**لاَ تَوطَأُ حَامِلٌ حَتَّى تَضَعَ، وَلاَ غَيْرُ ذَاتِ حَمْلٍ، حَتَّى تَحِيضَ حَيْضَةً**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَلَهُ شَاهِدٌ عَنِ ابْنِ عَبَّاسٍ فِي الدَّارَقُطْنِيِّ.

962. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అవ్‌తాస్' యుద్ధ ఖైదీలుగా పట్టుబడిన మహిళల గురించి చెబుతూ, "గర్భవతి అయిన స్త్రీ ప్రసవించే వరకూ ఆమెతో లైంగిక సంబంధం ఏర్పరచుకోకండి. అలాగే గర్భవతి కాని స్త్రీతో కూడా - ఆమెకు బహిష్టు అయి పరిశుద్ధురాలయ్యే వరకూ - సంభోగం జరపకండి" అని చెప్పారు. (అబూదావూద్ ఈ హదీసును సేకరించారు. హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు. దారె ఖుత్నీలో ఇబ్నె అబ్బాస్ (రజి) ద్వారా కూడా దీనికి సాక్ష్యం ఉంది).

(٩٦٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**اَلْوَلَدُ لِلْفِرَاشِ، وَلِلْعَاهِرِ اَلْحَجَرُ**». مُتَّفَقٌ عَلَيْهِ مِنْ حَدِيْثِهِ، وَمِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا فِي قِصَّةٍ، وَعَنِ ابْنِ مَسْعُودٍ عِنْدَ النَّسَائِيِّ وَعَنْ عُثْمَانَ عِنْدَ أَبِي دَاوُدَ.

963. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "శిశువు ఎవరి పడకపై జన్మించిందో వారిదే అవుతుంది. **వ్యభిచారి కోసం రాయి మాత్రమే.**"

(బుఖారీ, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి.హా) వివరించిన వృత్తాంతంలో కూడా ఇలాగే ఉంది. ఈ హదీసుపై కూడా బుఖారీ ముస్లింలు ఏకాభిప్రాయాన్ని కల్గియున్నారు. ఇంకా నసాయీలో ఇబ్నె మస్‌వూద్ (రజి) గారిచేత మరియు అబూదావూద్‌లో హజ్రత్ ఉస్మాన్ (రజి) చేత ఈ హదీసు ఉల్లేఖించబడింది.

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం బిడ్డను కన్న స్త్రీ ఒక మగవానికి భార్య లేక అతని బానిసరాలు అయి ఉంటుంది. ఆ పిల్లవాడు కూడా ఆ తండ్రి సంతానంగానే పరిగణించబడతాడు. వారసత్వ హక్కులు ఆ పిల్లవాడికి సంక్రమిస్తాయి. తల్లిదండ్రుల యెడల అతని బాధ్యతలు కూడా అతనిపై ఉంటాయి. ఒకవేళ ఆ సంతానం అక్రమ సంబంధం వల్ల కలిగిన సంతానమైనప్పటికీ, రూపురేఖల్లో తండ్రిని పోలినవాడు కాకపోయినప్పటికీ చట్టం మాత్రం ఆ పిల్లవాణ్ణి ఫలానా వ్యక్తి సంతానంగానే పరిగణిస్తుంది. ఎందుకంటే ఆ పిల్లవాడు ఆ వ్యక్తి భార్య ప్రేగు త్రెంచుకుని పుట్టాడు.

అయితే శిశువు తండ్రి గనక ఆ పిల్లవాడు తన పిల్లవాడు కాదని చెబితే, అప్పుడు ఆ పిల్లవాని వంశపరంపరను తల్లితో ముడిపెట్టడం జరుగుతుంది. అంతేగాని, ఆమెతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్న వ్యభిచారి వైపునకు ఆ పిల్లవాడు మరలించబడడు.

**12వ అధ్యాయం**

## పాల సంబంధం

## ١٢ - بَابُ الرَّضَاعِ

(٩٦٤) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تُحَرِّمُ الْمَصَّةُ وَلاَ الْمَصَّتَانِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

964. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఒకటి రెండుసార్లు చనుబాలు పీల్చినంతమాత్రాన నిషిద్ధ (హుర్మత్) ఆజ్ఞ వర్తించదు." (ముస్లిం)

**సారాంశం**

ఏ పరిమాణంలో పాలు త్రాగటం వల్ల స్తన్య సంబంధిత వరుస ఏర్పడుతుంది? అన్న అంశంపై భేదాభిప్రాయం ఉంది. చనుబాలు కొద్ది పరిమాణంలో తాగినా, ఎక్కువ తాగినా పాలవరుస ఏర్పడినట్లే నన్నది మెజారిటీ విద్వాంసుల అభిప్రాయం. ఇమామ్ దావూద్ జాహిరీ, ఇమామ్ అహ్మద్, ఇమామ్ ఇస్హాఖ్, అబూ ఉబైద తదితరులు ఈ హదీసు వెలుగులో విషయాన్ని చర్చిస్తూ, మూడుసార్లు చనుబాలు పీలిస్తే చాలు పాల వరుస ఏర్పడుతుందని, రెండుసార్లు పీల్చటం వల్ల ఏర్పడదని అభిప్రాయపడ్డారు. ఐదుసార్లు కనీసం త్రాగి ఉంటేనే ఈ పాల వరుస ఖరారవుతుందని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అంటున్నారు.

"మీకు పాలు ఇచ్చిన తల్లులు మీ కొరకు నిషేధించబడ్డారు" (4:23) అని దివ్య ఖుర్ఆన్లో అనబడింది. ఇన్నిసార్లు అనిగానీ, ఇంత పరిమాణంలో అనిగానీ వివరించబడలేదు.

(٩٦٥) وَعَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «انْظُرْنَ مَنْ إِخْوَانُكُنَّ، فَإِنَّمَا الرَّضَاعَةُ مِنَ الْمَجَاعَةِ». مُتَّفَقٌ عَلَيْهِ.

965. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు : "నిజంగా ఎవరు సోదరుడో సరిగా పరికించి మరీ నిర్ధారించుకోవాలి. ఎందుకంటే (పసితనంలో) ఆకలి తీర్చడానికి పట్టే పాల వల్ల మాత్రమే పాల వరస ఏర్పడుతుంది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒకానొక సందర్భాన్ని పురస్కరించుకుని దైవప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆ సంఘటనను గురించి ఇలా అన్నారు : దైవప్రవక్త (స) ఓసారి నా

ఇంటికి వచ్చినపుడు ఒక వ్యక్తి నా దగ్గర కూర్చుని ఉన్నాడు. ఇది ఆయన (స)కు నచ్చలేదు. ఆయన (స) ముఖారవిందంపై అయిష్టత తొణికిసలాడింది. "దైవప్రవక్త (స)! ఇతను నాకు పాలవరస సోదరుడు కదా!" అని అన్నాను. దానికాయన (స), "నిజంగా నీ సోదరుడు ఎవరో బాగా పరికించి నిర్ధారించుకోవాలి" అని చెప్పారు.

(٩٦٦) وَعَنْهَا قَالَتْ: جَاءَتْ سَهْلَةُ بِنْتُ سُهَيْلٍ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ سَالِماً مَوْلَى أَبِي حُذَيْفَةَ مَعَنَا، فِي بَيْتِنَا، وَقَدْ بَلَغَ مَا يَبْلُغُ الرِّجَالُ، فَقَالَ: «**أَرْضِعِيهِ، تَحْرُمِي عَلَيْهِ**». رَوَاهُ مُسْلِمٌ.

966. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : సహ్లా బిన్తె సుహైల్ (ర.అన్హా) వచ్చి, "ఓ దైవప్రవక్త (స)! అబూ హుజైఫాచే విముక్తి నొసగబడిన బానిస సాలిమ్ మా దగ్గరే ఉంటున్నాడు. కాని ఇప్పుడతను ప్రాజ్ఞ వయస్సుకు చేరుకున్నాడు (ఇప్పుడు మేము అతని యెడల ఎలా మెలగాలి?)" అని అడిగారు. దానికి ఆయన (స), అతనికి నీ పాలు పట్టు. తద్వారా అతడు 'మహ్రమ్' అయిపోతాడు (అంటే అతనితో పాల వరస ఏర్పడుతుంది)" అని సలహా ఇచ్చారు. (ముస్లిం)

## సారాంశం

ఇక్కడ 'పాలు పట్టడం' అంటే అర్థం నేరుగా చనుబాలు ఇవ్వటం అని కాదు. బహుశా ఆమె పాలు పితికి త్రాగటానికి ఇచ్చి ఉండవచ్చు. సునన్ అబూదావూద్‌లోని ఉల్లేఖనం ప్రకారం ఆమె ఐదుసార్లు సాలిమ్‌కు పాలు త్రాపి, అతన్ని తన కుమారునిగా చేసుకున్నారు. ఈ ఉల్లేఖనం ఇమామ్ షాఫయి (రహ్మ.లై) గారి దృక్పథాన్ని సమర్థిస్తోంది.

ఈ వ్యవహారం ఒక్క పాలిమ్‌కు మాత్రమే ప్రత్యేకమని మెజారిటీ ఉలమాలు తేల్చి చెప్పారు. ఇతరుల వ్యవహారంలో ఈ ఆజ్ఞ వర్తించదు.

## హదీసు ఉల్లేఖకులు

1. సాలిమ్ (రజి) : సాలిమ్ బిన్ మాఖిల్. అబూ హుజైఫాచే స్వేచ్ఛ నొసగబడిన బానిస. మొదట ఈయన్ని ఒక అన్సార్ మహిళ కొన్నది. ఆమె పేరు లైలా. అబూ హుజైఫా ఈమెను కూడా నికాహ్ చేసుకున్నారు. అందువల్ల సాలిమ్ ఆమె వెంట అబూ హుజైఫా ఇంటికి వచ్చారు. అబూ హుజైఫా సాలిమ్‌ను తన పెంపుడు కొడుకుగా గ్రహించారు. బద్ర్ యుద్ధంలో సాలిమ్ పాల్గొన్నారు. తన సహచరుల్లో ఏ నలుగురి వద్ద ఖుర్ఆన్‌ను నేర్చుకోమని దైవప్రవక్త (స)

ఆజ్ఞాపించారో ఆ నలుగురిలో సాలిమ్ కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) మదీనాకు రాక మునుపు 'ఖుబా'లో ఈయన ముహాజిర్లకు నమాజ్‌లో సారథ్యం వహించేవారు. ఈయన వెనుక సామూహిక నమాజు చేసినవారిలో హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కూడా ఉన్నారు.

2. అబూ హుజైఫా (రజి) : ఒక కథనం ప్రకారం ఈయన అసలు పేరు ముహ్‌షిమ్. హాషిమ్ బిన్ ఉత్బా బిన్ అబ్దెషమ్స్ అని కూడా అనబడుతోంది. ఈయన గొప్ప మేధావులలో ఒకరు. బద్ర్, ఉహుద్ యుద్ధాలలోనూ, ఆ తరువాత జరిగిన యుద్ధాలలో కూడా ఉన్నారు. యమామ యుద్ధంలో వీర మరణం పొందారు. అప్పటికి ఆయన వయస్సు 53.

(٩٦٧) وَعَنْهَا أَنَّ أَفْلَحَ أَخَا أَبِي الْقُعَيْسِ جَاءَ يَسْتَأْذِنُ عَلَيْهَا بَعْدَ الْحِجَابِ، فَقَالَتْ: فَأَبَيْتُ أَنْ آذَنَ لَهُ، فَلَمَّا جَاءَ رَسُولُ اللهِ ﷺ: أَخْبَرْتُهُ الَّذِي صَنَعْتُهُ، فَأَمَرَنِي أَنْ آذَنَ لَهُ عَلَيَّ، وَقَالَ: إِنَّهُ عَمُّكِ. مُتَّفَقٌ عَلَيْهِ.

967. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : అబుల్ ఖువైస్ సోదరుడు అఫ్లహ్ మా ఇంట్లోకి రావడానికి నా అనుమతి కోరారు. ఇది 'పరదా' ఆదేశం అవతరించిన తరువాత జరిగిన సంఘటన. అందువల్ల నేను ఆయన్ని ఇంటి లోపలికి రావడానికి అనుమతించలేదు (అని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) అన్నారు). దైవప్రవక్త (సఅసం) ఇంటికి విచ్చేసిన తరువాత జరిగినదంతా ఆయన (స)కు వివరించాను. దైవప్రవక్త (సఅసం) ఇదంతా విని, "ఆయన్ని ఇంటి లోపలికి రావడానికి అనుమతిని ఇస్తూ ఉండు. ఆయన నీకు పినతండ్రి కదా!" అని అన్నారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే; ఏ స్త్రీ పాలైనా త్రాగి ఉంటే, ఆ స్త్రీ భర్త తండ్రి సమానుడవుతాడు. తల్లిదండ్రుల తరపున ఏ ఏ బంధుత్వాలు వివాహానికి హరామ్ అవుతాయో అలాగే పాల వరస వల్ల ఏర్పడిన బంధుత్వాలు కూడా హరామ్ అవుతాయి. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) పసితనంలో అబుల్ ఖువైస్ భార్య పాలు త్రాగి ఉండటం మూలంగా, అబుల్ ఖువైస్ సోదరుడైన అఫ్లహ్ ఆయిషా గార్కి పాల వరస పినతండ్రి అయిపోయారు. పాల ఉత్పత్తిలో స్త్రీ పురుషులిరువురి (సంపర్క) ప్రమేయం ఉంటుంది. కాబట్టి పాల వరస ఆ ఇరువురి తరపున ఏర్పడుతుంది.

## హదీసు ఉల్లేఖకులు

అష్లహ్. అబుల్ జాద్ మరో పేరు. అసలు పేరు మాత్రం అష్లహ్. దైవప్రవక్త (స) చే స్వేచ్ఛ నొసగబడిన బానిస. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) ఈయనకు స్వేచ్ఛ నొసగారని మరొక కథనం ఉంది. అబుల్ ఖువైస్ ఈయన సోదరులు. ఈయన పేరు జాద్ అనీ, వాయల్ బిన్ అష్లహ్ అష్అరీ అనీ, అష్లహ్ అనే పేరు నిజానికి ఈయన సోదరునిదనీ విభిన్న కథనాలున్నాయి. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి పాల వరస బాబాయిలు ఇద్దరన్న సంగతి గమనార్హం. వారిలో ఒకాయన దైవప్రవక్త (స) హయాంలోనే మరణించారు. ఇంకొక వ్యక్తి హజ్రత్ ఆయిషా (ర.అన్హా)కు పాలుపట్టినామె మరిది. ఆయన పేరు అష్లహ్.

(٩٦٨) وَعَنْهَا قَالَتْ: كَانَ فِيمَا أُنْزِلَ الْقُرْآنُ عَشْرَ رَضَعَاتٍ مَعْلُومَاتٍ يُحَرِّمْنَ، ثُمَّ نُسِخْنَ بِخَمْسٍ مَعْلُومَاتٍ، فَتُوُفِّيَ رَسُولُ اللهِ ﷺ وَهِيَ فِيمَا يُقْرَأُ مِنَ الْقُرْآنِ. رَوَاهُ مُسْلِمٌ.

968. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "పదిసార్లు పాలు త్రాగి ఉన్నట్లు ఖచ్చితంగా తెలిస్తేనే ఈ పాల వరస నికాహ్‌ను హరామ్ (నిషిద్ధం)గావిస్తుం దని ఖుర్ఆన్ ఆజ్ఞ అవతరించింది. కాని తరువాత ఈ ఆజ్ఞ రద్దు చేయబడింది. ఐదుసార్లు అని అనబడింది. ఆ కాలం లోనే దైవప్రవక్త (స) మరణించారు. ఆ సమయంలో ఈ ఐదు సంఖ్య ఖుర్ఆన్‌లో పఠించబడేది." (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసుకు వివరణగా ఇమామ్ నవవీ (రహ్మ.లై) ఇలా అన్నారు : "ఐదుసార్లు పాలు త్రాగి ఉంటే...." అనే ఆజ్ఞ కూడా రద్దయింది. అయితే ఇది రద్దు అయ్యే సమయానికే దైవప్రవక్త (సఅసం) అంతిమ ఘడియలు కూడా సమీపించాయి. ఆ రోజుల్లో కొంతమంది ఈ ఐదు సంఖ్య ఖుర్ఆన్‌లో అంతర్భాగమని తలపోసి, ఆ విధంగానే పారాయణం చేసేవారు. దైవప్రవక్త (స) మరణం తరువాత, ఈ సంఖ్య రద్దయిన సంగతిని సహచరులు తెలియజేయగా, అప్పటి వరకూ దీనిగురించి తెలియని వారు తమ పొరబాటును సరిదిద్దుకున్నారు. ఈ విషయంపై కడకు అందరూ ఏకీభవించారు.

(٩٦٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ أُرِيدَ عَلَى ابْنَةِ حَمْزَةَ، فَقَالَ: «**أَنَّهَا لاَ تَحِلُّ لِي، إِنَّهَا ابْنَةُ**

969. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "మీరు మీ పినతండ్రియగు హమ్జా (రజి) కుమార్తెను వివాహం చేసుకోండి" అని దైవప్రవక్త (సఅసం)ను

أَخِي مِنَ الرَّضَاعَةِ وَيَحْرُمُ مِنَ الرَّضَاعَةِ مَا يَحْرُمُ مِنَ النَّسَبِ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఒప్పించే ప్రయత్నం చేయగా ఆయన (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఆమెను నేను వివాహమాడటం ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఆమె నాకు పాల వరస సోదరుని కుమార్తె. ఏవిధంగా అనువంశిక బంధుత్వ ప్రాతిపదికపై ఒక స్త్రీ నిషిద్ధం అవుతుందో అదే విధంగా పాల వరస వల్ల కూడా నిషిద్ధం అవుతుంది." (బుఖారీ, ముస్లిం)

(٩٧٠) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَحْرُمُ مِنَ الرَّضَاعِ إِلاَّ مَا فَتَقَ الأَمْعَاءَ، وَكَانَ قَبْلَ الْفِطَامِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ هُوَ وَالْحَاكِمُ.

970. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "జీర్ణకోశాన్ని వ్యాకోచించేలా చేసే పాలు, పాల గడువుకు ముందు త్రాపే పాలు తప్ప మరే రకమయిన పాలు కూడా సంబంధాలను నిషిద్ధం గావించదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ, హాకిమ్ లిరువురూ దీనిని ప్రమాణబద్ధమైన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

అంటే ఒక శిశువుకు ఆకలి తీర్చడానికి కేవలం పాలు తప్ప మరో ఆహారం ఇవ్వబడని పసితనంలో గనక పాలు పట్టి ఉంటేనే స్తన్య సంబంధమైన వరస ఏర్పడుతుందని దీని భావం. పుట్టిన శిశువుకు పాలు తప్ప మరో ఘన పదార్థం ఆహారంగా ఇవ్వబడదు. అతని జీర్ణ కోశంలో పాలు మాత్రమే ఆహార పదార్థంగా ప్రవేశిస్తుంది. పాలతోనే ప్రేగులు వ్యాకోచిస్తాయి. పాలతోనే శిశువు శరీరం పెరుగుతుంది. పాలతోనే ఎముకలు బలపడతాయి.

(٩٧١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: لاَ رِضَاعَ إِلاَّ فِي الْحَوْلَيْنِ.

971. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: "పాలు పట్టే రెండేళ్ళ వ్యవధిలోపు తప్ప పాల సంబంధం వర్తించదు." (దీనిని దారె ఖుత్నీ, ఇబ్నె అదీ - ఇద్దరూ మర్ఫూ

رَوَاهُ الدَّارَقُطْنِيُّ وَابْنُ عَدِيٍّ مَرْفُوعاً وَمَوْقُوفاً، وَرَجَّحَا الْمَوْقُوفَ.

మరియు మౌఖూఫ్‌గా ఉల్లేఖించారు. అయితే దీన్ని మౌఖూఫ్ అనడానికే వారు మొగ్గుచూపారు)

(٩٧٢) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ رَضَاعَ إِلاَّ مَا أَنْشَزَ الْعَظْمَ، وَأَنْبَتَ اللَّحْمَ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ.

972. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) తెలిపారు : "(శిశువు) ఎముకలను గట్టిపరచే, మాంసాన్ని పెంపొందించే స్థాయిలో పట్టబడిన పాలు మాత్రమే పాల వరస (రజాఅత్)గా పరిగణించబడుతుంది." (అబూదావూద్)

(٩٧٣) وَعَنْ عُقْبَةَ بْنِ الْحَارِثِ أَنَّهُ تَزَوَّجَ أُمَّ يَحْيَى بِنْتَ أَبِي إِهَابٍ، فَجَاءَتِ امْرَأَةٌ، فَقَالَتْ قَدْ أَرْضَعْتُكُمَا، فَسَأَلَ النَّبِيَّ ﷺ، فَقَالَ: **كَيْفَ؟ وَقَدْ قِيلَ**، فَفَارَقَهَا عُقْبَةُ، وَنَكَحَتْ زَوْجاً غَيْرَهُ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

973. హజ్రత్ ఉఖబా బిన్ హారిస్ (రజి) కథనం : నేను ఉమ్మె యహ్యా బిన్తె అబూ ఇహాబ్ (రజి)ను వివాహమాడాను. అప్పుడు ఒక మహిళ వచ్చి, "అయ్యో! నేను మీ ఇద్దరికీ నా పాలు పట్టి ఉన్నానయ్యా" అని అన్నది. అప్పుడు నేను ఈ విషయమై దైవప్రవక్త (సఅసం)ను సంప్రతించగా, "పాల వరస గురించి స్పష్టంగా సమాచారం అందినమీదట ఇక నువ్వామెను నీ వివాహబంధంలో ఎలా ఉంచుతావు?" అని ఆయన (స) అన్నారు. అందువల్ల ఉఖబా ఆమెకు విడియాకులు ఇచ్చేశారు. ఆ స్త్రీని మరో వ్యక్తి పెళ్ళి చేసుకున్నాడు. (బుఖారీ)

## హదీసు ఉల్లేఖకులు

1. ఉఖబా బిన్ హారిస్ (రజి) : ఉఖబా బిన్ హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫిల్ బిన్ అబ్దె మునాఫ్ మక్కీ. ప్రఖ్యాత ప్రవక్త సహచరులు. మక్కా విజయం సందర్భంగా ముస్లిం అయ్యారు. ఆ తరువాత 50 ఏండ్లు జీవించి ఉన్నారు.

2. ఉమ్మె యహ్యా : అసలు పేరు ఘనియ్యా. ఘనియ్యా బిన్తె అబూ ఇహాబ్ బిన్ ఉవైర్ తమీమి. ఈమె అసలు పేరు జైనబ్ అని వేరొక కథనం ఉంది.

(٩٧٤) وَعَنْ زِيَادٍ السَّهْمِيِّ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ تُسْتَرْضَعَ الْحَمْقَى. أَخْرَجَهُ أَبُو دَاوُدَ. وَهُوَ مُرْسَلٌ، وَلَيْسَتْ لِزِيَادٍ صُحْبَةٌ.

974. హజ్రత్ జియాద్ సహ్మీ (రహ్మ.లై) తెలియజేసిన ఒక కథనం ప్రకారం; అవివేకులు, మందబుద్ధిగల మహిళలు పాలుపట్టడాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు. (అబూ దావూద్ దీనిని సేకరించారు. ఈ హదీసు 'ముర్సల్' కోవకు చెందినది. ఎందుకంటే జియాద్‌గారు సహాబీ కారు)

### సారాంశం

మూర్ఖులు, మందబుద్ధిగల వారు, విజ్ఞతా వివేచనలు బొత్తిగా లేని మహిళల చేత పాలుపట్టించరాదన్న ప్రబోధనంలోని మర్మం ఏమిటంటే తల్లి పిల్లవాడికి పాలు పట్టడంతోపాటు తన గుణగణాలను కూడా బదిలీ చేస్తుంది. ఆమె స్వభావం, లక్షణాలు పాల ద్వారా శిశువుకు అబ్బుతాయి. 'ఉగ్గుతో పెట్టిన విద్య' అనే తెలుగు నానుడి ఎరుకే కదా! పాలుపట్టే మహిళ ఉత్తమురాలై ఉంటే ఆ ఉత్తమ గుణాలు శిశువుకు కూడా అబ్బుతాయి. అందుకే వ్యభిచారిణులు, ధర్మవిహీనురాలైన స్త్రీల చేత పాలు త్రాగించరాదని ఇమామ్ గజాలీ (రహ్మ.లై) లాంటి ఇస్లామీయ విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

### హదీసు ఉల్లేఖకులు

జియాద్ సహ్మీ : ఈయన అమ్ర్ బిన్ ఆస్‌చే స్వేచ్ఛ నొసగబడిన బానిస అనీ, ముర్సల్ హదీసులను వివరించేవారని చెప్పబడుతోంది. ఈయన సహాబీ (ప్రవక్త ప్రత్యక్ష సహచరులు) మాత్రం కాదు.

## 13వ అధ్యాయం

## بَابُ النَّفَقَاتِ

## భరణం

(٩٧٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: دَخَلَتْ هِنْدٌ بِنْتُ عُتْبَةَ، امْرَأَةُ أَبِي سُفْيَانَ، عَلَى رَسُولِ اللهِ ﷺ، فَقَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ أَبَا سُفْيَانَ رَجُلٌ شَحِيحٌ، لَا

975. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : అబూ సుఫ్యాన్ భార్య హింద బిన్తె ఉతబా దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి "ఓ దైవప్రవక్తా (స)! అబూ సుఫ్యాన్ పిసినారి మనిషి. నాకు, నా పిల్లల ఖర్చులకు సరిపడినంత డబ్బు

يُعْطِينِي مِنَ ٱلنَّفَقَةِ مَا يَكْفِينِي، وَيَكْفِي بَنِيَّ، إِلاَّ مَا أَخَذْتُ مِنْ مَالِهِ بِغَيْرِ عِلْمِهِ، فَهَلْ عَلَيَّ فِيْ ذٰلِكَ مِنْ جُنَاحٍ؟ فَقَالَ: «خُذِي مِنْ مَالِهِ بِالْمَعْرُوفِ مَا يَكْفِيكِ، وَيَكْفِي بَنِيكِ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఆయన ఇవ్వడు. మరైతే నేను ఆయనకు చెప్పకుండా కొంత మొత్తం తీసుకోవచ్చా?" అని సందేహపడింది. దానికి ఆయన (సఅసం) "నీకు, నీ పిల్లల ఖర్చులకు సరిపోయేటంత సొమ్మును ఉత్తమ రీతిలో తీసుకోవచ్చు" అని సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

భర్త స్థితిమంతుడై ఉండి కూడా ఇంటి ఖర్చులకు డబ్బు లివ్వటంలో మరీ పిసినారిలా ప్రవర్తిస్తుంటే భార్య అతనికి చెప్పకుండానే అతని సంపాదనలో నుంచి అవసరం మేరకు తీసుకుని ఖర్చుపెట్టుకోవచ్చని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. అయితే దుబారా ఖర్చుకు అనుమతి లేదు. ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే, భర్త తన ఆలుబిడ్డల హక్కులను నెరవేర్చటంలో అశ్రద్ధ కనబరచినా, అన్యాయం చేసినా అతని గురించి భార్య ఫిర్యాదు చేయటం సమంజసమే. ఆఖరికి ఈ వ్యవహారాన్ని ఆమె న్యాయస్థానం దాకా కూడా తీసుకుపోవచ్చు. ఈ విషయం పరోక్ష నింద క్రిందికి రాదు. ఒకవేళ ఇదే గనక పరోక్షనింద అయి ఉంటే దైవప్రవక్త (స) అప్పటికప్పుడు హిందను వారించి ఉండేవారు.

## హదీసు ఉల్లేఖకులు

1. హింద బిన్తె ఉతబా బిన్ రబీయ బిన్ అబ్దె షమ్స్ (ర.అన్హా): మక్కా విజయం నాడు ఈమె తన భర్త అబూ సుఫ్యాన్ సమేతంగా ఇస్లాం స్వీకరించింది. ఈమె తండ్రి ఉతబా, బాబాయి షైబా, సోదరుడు వలీద్ బద్ర్ యుద్ధంలో వధించబడ్డారు. ఈ సంఘటన ఆమె మనసుపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రతీకారేచ్ఛతో రగలిపోసాగింది. ఉహుద్ యుద్ధంలో హజ్రత్ హమ్జా (రజి) వీరమరణం పొందినపుడు ఆమె ఆయన రొమ్మును చీల్చి కాలేయాన్ని తీసి నమిలింది. అజ్ఞానంలో ఆమె ఇంత కిరాతకంగా ప్రవర్తించినప్పటికీ తరువాత ఆమె ఇస్లాం పరిధిలోకి వచ్చిన మీదట దైవప్రవక్త (స) పెద్ద మనసుతో మన్నించారు. ఈమె హిజ్రీ 14వ సంవత్సరం ముహర్రం నెలలో మరణించింది.

2. అబూ సుఫ్యాన్ (రజి) : అసలు పేరు సఖర్. సఖర్ బిన్ హరబ్ బిన్ ఉమయ్యా బిన్ అబ్దె షమ్స్. దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా సమీకరించబడే అవిశ్వాసులకు నాయకుడు. సేనాధిపతి. మక్కా విజయం సందర్భంగా ఈయన ఇస్లాంలోకి ప్రవేశించారు. ఇస్లాం స్వీకారం తరువాత కడదాకా స్థయిర్యం కనబరచారు. తన జీవితంలో దీన్ని మరుపురాని మలుపుగా భావించేవారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో - హిజ్రీ 32లో - మరణించారు.

(٩٧٦) وَعَنْ طَارِقٍ الْمُحَارِبِيِّ، قَالَ: قَدِمْنَا الْمَدِينَةَ، فَإِذَا رَسُولُ اللهِ ﷺ قَائِمٌ عَلَى الْمِنْبَرِ، يَخْطُبُ النَّاسَ، وَيَقُولُ: «**يَدُ الْمُعْطِي الْعُلْيَا، وَابْدَأْ بِمَنْ تَعُولُ، أُمَّكَ، وَأَبَاكَ، وَأُخْتَكَ، وَأَخَاكَ، ثُمَّ أَدْنَاكَ فَأَدْنَاكَ**». رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالدَّارَقُطْنِيُّ.

976. హజ్రత్ తారిఖ్ ముహారిబీ (రజి) కథనం : మేము మదీనాకు వచ్చినపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వేదికపై నిలబడి ప్రసంగిస్తున్నారు - "ఇచ్చేవాని చేయి (పుచ్చుకునే వాని చేయికన్నా) గొప్పది. నీపై ఆధారపడి ఉన్న వారినుండి ఇవ్వటం మొదలెట్టు. వారిలో నీ తల్లి, నీ తండ్రి, నీ సోదరి, నీ సోదరుడు కూడా ఉన్నారు. ఆ తరువాత అత్యంత సమీప బంధువులను ఆదుకో" అని ఆయన (సఅసం) బోధించారు. (దీనిని నసాయి ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్, దారెఖుత్నీ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

## హదీసు ఉల్లేఖకులు

తారిఖ్ బిన్ అబ్దుల్లాహ్ ముహారిబీ (రజి). గిత్ఫాన్ తెగతో ఈయనకు సంబంధం ఉండేది. కొన్ని హదీసులు ఈయనచే ఉల్లేఖించబడ్డాయి.

(٩٧٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لِلْمَمْلُوكِ طَعَامُهُ وَكِسْوَتُهُ، وَلاَ يُكَلَّفُ مِنَ الْعَمَلِ إِلاَّ مَا يُطِيقُ**». رَوَاهُ مُسْلِمٌ.

977. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు : "బానిసకు అన్న వస్త్రాలు సమకూర్చే బాధ్యత యజమానిది. అతని శక్తికి మించిన పనిని అతనిచేత చేయించరాదు." (ముస్లిం)

(٩٧٨) وَعَنْ حَكِيمِ بْنِ مُعَاوِيَةَ الْقُشَيْرِيِّ، عَنْ أَبِيهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! مَا حَقُّ زَوْجَةِ أَحَدِنَا عَلَيْهِ؟ قَالَ: «**أَنْ تُطْعِمَهَا إِذَا طَعِمْتَ،**

978. హజ్రత్ హకీమ్ బిన్ ముఆవియ ఖుషైరీ తన తండ్రి ఆధారంగా చేసిన కథనం : "ఓ దైవప్రవక్తా (సఅసం)! మాలోని ప్రతి ఒక్కరిపై వారి భార్యలకు గల హక్కు ఏమిటీ?" అని నేను

وَتَكْسُوَهَا إِذَا اكْتَسَيْتَ، وَلاَ تَضْرِبِ الْوَجْهَ، وَلاَ تُقَبِّحْ» - اَلْحَدِيْثُ - وَتَقَدَّمَ فِي عِشْرَةِ النِّسَاءِ.

పళ్నించగా, "మీరు తిన్నప్పుడు ఆమెకూ పెట్టాలి. మీరు తొడిగినప్పుడు ఆమెకూ తొడిగించాలి. ఆమె మొహంపై కొట్ట కూడదు. ఆమెను తిట్టకూడదు" అని ఆయన (స) ప్రబోధించారు. (సుదీర్ఘ మయిన హదీసులోని ఒక భాగమిది) ఈ హదీసు ఇంతకుముందు "స్త్రీలతో వ్యవహార సరళి" అన్న అధ్యాయంలో వచ్చింది కూడ.

(٩٧٩) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، فِي حَدِيْثِ الْحَجِّ بِطُوْلِهِ، قَالَ فِيْ ذِكْرِ النِّسَاءِ: «وَلَهُنَّ عَلَيْكُمْ رِزْقُهُنَّ وَكِسْوَتُهُنَّ بِالْمَعْرُوفِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

979. హజ్రత్ జాబిర్ (రజి) హజ్‌కు సంబంధించిన దైవప్రవక్త (సఅసం) వారి సుదీర్ఘమయిన హదీసును వివరిస్తూ, ఆయన (సఅసం) ఈ విధంగా ప్రబోధించినట్లు తెలిపారు: "మీ భార్యలకు మీపై గల హక్కు ఏమిటంటే మీరు వారికి అన్నవస్త్రాలను ఉత్తమ రీతిలో సమకూర్చాలి." (ముస్లిం)

(٩٨٠) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ؛ قَالَ رَسُولُ اللهِ ﷺ: «كَفَى بِالْمَرْءِ إِثْماً أَنْ يُضَيِّعَ مَنْ يَقُوتُ». رَوَاهُ النَّسَائِيُّ، وَهُوَ عِنْدَ مُسْلِمٍ بِلَفْظِ «أَنْ يَحْبِسَ عَمَّنْ يَمْلِكُ قُوْتَهُ».

980. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: "ఎవరయినా ఒక వ్యక్తికి ఉపాధిని సమకూర్చే బాధ్యతను స్వీకరించి, ఆ బాధ్యతను విస్మరిస్తే అతడు పాపానికి ఒడిగట్టాడనడానికి ఈ ఒక్క దృష్టాంతం చాలు" (నసాయి). "ఒకరి ఉపాధికి యజమాని అయివుండి దాన్ని నిలిపివేస్తే..." అని 'ముస్లిం'లో ఉంది.

(٩٨١) وَعَنْ جَابِرٍ، يَرْفَعُهُ، فِي الْحَامِلِ الْمُتَوَفَّى عَنْهَا زَوْجُهَا، قَالَ: لاَ نَفَقَةَ لَهَا. أَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ، لَكِن قَالَ: الْمَحْفُوظُ

981. భర్త చనిపోయిన గర్భవతి అయిన మహిళ గురించి హజ్రత్ జాబిర్ (రజి)చే చేయబడిన 'మర్ఫూ' కథనం: "ఆమె కొరకు భరణం (మనోవర్తి) లేదు." (ఈ హదీసును బైహఖీ సేకరించారు. దీని

وَفْقُهُ، وَثَبَتَ نَفْيُ النَّفَقَةِ فِيْ حَدِيْثِ فَاطِمَةَ بِنْتِ قَيْسٍ، كَمَا تَقَدَّمَ، رَوَاهُ مُسْلِمٌ.

ఉల్లేఖకులు ఎన్నదగినవారే. కాని దీనిని 'మౌఖూఫ్' అనటమే సురక్షితమని ఇమామ్ బైహఖీ అభిప్రాయపడ్డారు. ఇంతకు ముందు వచ్చిన ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) హదీసు ద్వారా భరణం లేదని తేలిపోయింది. ఈ హదీసును 'ముస్లిం' ఉల్లేఖించారు)

**సారాంశం**

గర్భవతి అయిన మహిళ యొక్క భర్త చనిపోతే ఆమెకు భరణం ఇవ్వబడదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. గర్భవతికే భరణం లేనపుడు గర్భవతి కాని మహిళకు కూడా ఇచ్చే ప్రశ్నే తలెత్తదు. మూడు విడాకులు పొందిన గర్భవతికాని మహిళకు భరణంగానీ, వసతి సౌకర్యంగానీ (రెండూ) ఇవ్వబడవు. కాగా; మూడు విడాకులు పొందిన గర్భవతికి మాత్రం భరణం ఇవ్వబడుతుంది. కాని ప్రత్యేక వసతి సౌకర్యం కల్పించబడదు. వితంతువు అయిఉండి గర్భవతికాని మహిళకు భరణం - ఇవ్వబడదు - వసతి మాత్రం కల్పించబడుతుంది - వితంతువు అయిన గర్భవతి కోసం వసతి సౌకర్యం ఇవ్వబడుతుంది. భరణం ఇచ్చే విషయంలో మటుకు భేదాభిప్రాయం ఉంది. 'భరణం ఇవ్వబడదు' అనటమే సరైనది. భరణం మరియు వసతి గురించిన ఈ తర్జన భర్జన అంతా ఆ స్త్రీ 'ఇద్దత్'లో ఉన్నప్పటిదే. ఇద్దత్ (గడువు) ముగిసిన పిమ్మట ఇవి రెండూ ఆమెకు వర్తించవు.

(٩٨٢) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُوْلُ اللّٰهِ ﷺ: «**اَلْيَدُ الْعُلْيَا خَيْرٌ مِنَ الْيَدِ السُّفْلَى، وَيَبْدَأُ أَحَدُكُمْ بِمَنْ يَعُوْلُ، تَقُوْلُ الْمَرْأَةُ: أَطْعِمْنِي أَوْ طَلِّقْنِي**». رَوَاهُ الدَّارَقُطْنِيُّ، وَإِسْنَادُهُ حَسَنٌ.

982. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "పై చేయి క్రింది చేయికన్నా శ్రేష్ఠ మయినది. మీలో ప్రతి ఒక్కరూ మీ ఆలనా పాలనలో ఉన్న వారినుండి బాధ్యతల నిర్వర్తింపును మొదలెట్టాలి. 'ఇంటి ఖర్చులన్నా ఇవ్వు లేక విడాకు లన్నా ఇవ్వు' అని ఇల్లాలు తెగేసి చెప్పే పరిస్థితి రాకుండా చూసుకోండి." (ఈ హదీసును దారెఖుత్నీ 'హసన్'గా ఉల్లేఖించారు)

**సారాంశం**

ఇంటి బయట దుబారా ఖర్చు చేస్తూ, ఇంట్లో ఆలుబిడ్డలను ఇబ్బందిపెట్టే మగరాయుళ్ళకు ఈ హదీసులో హెచ్చరిక ఉంది. సంసార సమస్యలను పట్టించుకోకుండా పూలరంగడులా తిరిగే భర్తను భార్య నిలదీసి అడగగలదనీ, అవసరమైతే విడాకుల కోసం కూడా డిమాండు చేయగలదని పై హదీసు ద్వారా విదితమవుతోంది.

(٩٨٣) وَعَنْ سَعِيْدِ بْنِ الْمُسَيَّبِ، فِي الرَّجُلِ لاَ يَجِدُ مَا يُنْفِقُ عَلىٰ أَهْلِهِ، قَالَ: يُفَرَّقُ بَيْنَهُمَا. أَخْرَجَهُ سَعِيْدُ بْنُ مَنْصُورٍ، عَنْ سُفْيَانَ، عَنْ أَبِي الزِّنَادِ، عَنْهُ، قَالَ: قُلْتُ لِسَعِيْدٍ: سُنَّةٌ؟ فَقَالَ: سُنَّةٌ. وَهٰذَا مُرْسَلٌ قَوِيٌّ.

983. తన భార్యను పోషించలేని మనిషి గురించి హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యబ్ (రహ్మ.లై) చేసిన ఉల్లేఖనంలో "వారి మధ్య వేర్పాటు చేయబడుతుంది" అని వుంది. ఈ ఉల్లేఖనాన్ని సయీద్ బిన్ మన్సూర్ సుఫ్యాన్ ఆధారంగా, ఆయన అబూ జినాద్ సౌజన్యంతో సంగ్రహించారు - దీని ప్రకారం ; "ఇది సున్నత్ (సంప్రదాయం) అంటారా?" అని నేను సయీద్ బిన్ ముసయ్యబ్‌ను అడగ్గా "అవును, సున్నతే" అని ఆయన జవాబిచ్చారు. (ఇది 'ముర్సల్' హదీసు అన్నది దృఢమైనది)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం భర్త భార్య పోషణకయ్యే ఖర్చుల్ని ఇవ్వలేని పక్షంలో ఆ దంపతుల మధ్య 'వేర్పాటు' చేయబడుతుంది. హజ్రత్ అలీ (రజి), ఉమర్ (రజి), అబూహురైరా (రజి), తాబయీన్లలోని ఒక సమూహం, ఇంకా ధర్మవేత్తలైన ఇమాములలో ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై) తదితరులంతా ఈ నికాహ్‌ను రద్దుపరచే అధికారం స్త్రీకి ఇస్తున్నారు. జాహిరియా వర్గీయుల దృక్పథం కూడా ఇదే. 'లా జరర వలా జిరార' అనే హదీసును కూడా వారు తమ ఈ వాదనకు అనుకూలంగా ఉదాహరిస్తున్నారు.

అయితే భరణం ఇవ్వలేని పరిస్థితిలో వివాహాన్ని రద్దుచేసే అధికారం స్త్రీకి వర్తించదని హనఫీ పండితులు అభిప్రాయపడుతున్నారు. వీరు తమ అభిప్రాయానికి ఆధారంగా దివ్య ఖుర్‌ఆన్‌లోని 'వ అన్ ఖదర అలైహి రిజ్ఖహు....' అనే సూక్తిని సమర్పిస్తున్నారు.

ఈ సందర్భంగా అల్లామా హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) గారి పలుకులు గమనార్హమైనవి: ఆ స్త్రీ ఆ పురుషుణ్ణి వివాహమాడినపుడు అతను ఆరోగ్యవంతుడుగా ఉన్నాడు. అతని ఆర్థిక లేమి గురించి కూడా ఆ స్త్రీకి తెలుసు. లేదా వివాహ సమయంలో

అతని ఆర్థిక స్థితి మెరుగ్గానే ఉంది. కాని ఆ తర్వాత ఏవో కారణాలవల్ల ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఇట్టి పరిస్థితిలో ఆ స్త్రీకి ఆ వివాహాన్ని రద్దుపరచే అధికారం ఉండబోదు. ఎందుకంటే పరిస్థితులు మారటానికి అట్టే కాలం పట్టదు. నేడు అతను లేమికి గురై ఉన్నాడు. రేపు కలిమితో కళ కళ లాడవచ్చు. ఇదిగాక వేరితర పరిస్థితుల్లో మాత్రం స్త్రీకి, వివాహాన్ని రద్దుపరచే అధికారం ఉంటుంది. ఆ అధికారాన్ని ఆమె ఉపయోగించుకోదలిస్తే ఉపయోగించుకోవచ్చు.

స్త్రీకి వివాహాన్ని రద్దుపరచే అధికారం ఉందని వాదించిన ఇమాములలో ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) భర్తకు నెల రోజుల గడువు ఇస్తున్నారు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కేవలం మూడు రోజుల గడువు ఇస్తున్నారు. హమ్మాద్‌గారు మాత్రం ఏడాది కాలం వ్యవధి ఇచ్చారు.

## హదీసు ఉల్లేఖకులు

1. సుఫ్యాన్ : సుఫ్యాన్ బిన్ సయీద్ బిన్ మస్రూఖ్ సౌరి. అబూ అబ్దుల్లాహ్ కూఫీగా కూడా పిలువబడతారు. అగ్రశ్రేణి ఇమాములలో ఒకరుగా పరిగణించబడతారు. ఈయన ఇమామ్ అన్న విషయంలో అందరి మధ్యా ఏకాభిప్రాయం ఉంది. స్పష్టత, జ్ఞాపకశక్తి, హదీసు పరిజ్ఞానం, ధర్మనిష్ఠ - ఇత్యాది సుగుణాలు ఈయన సొంతం. హిజ్రీ 77లో జన్మించారు. హిజ్రీ 161వ సంవత్సరంలో బస్రాలో మరణించారు.

2. అబూ జినాద్ : ఈయన అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ జక్వాన్ - అమవీ. ఈయన సంరక్షకులు మదీనావాసులు. గొప్ప ఇమాములలో ఒకరు. ఈయన విశ్వసనీయులని ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) అన్నారు. అమీరుల్ మోమినీన్. హిజ్రీ 130 లేక 131లో మరణించారు.

(٩٨٤) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ كَتَبَ إِلَىٰ أُمَرَآءِ ٱلأَجْنَادِ، فِي رِجَالٍ غَابُوا عَنْ نِسَآئِهِمْ: أَنْ يَأْخُذُوهُمْ بِأَنْ يُنْفِقُوا، أَوْ يُطَلِّقُوا، فَإِنْ طَلَّقُوا بَعَثُوْا بِنَفَقَةِ مَا حَبَسُوا. أَخْرَجَهُ الشَّافِعِيُّ ثُمَّ الْبَيْهَقِيُّ بِإِسْنَادٍ حَسَنٍ.

984. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : సైన్యంలో చేరిన కారణంగా తమ భార్యలకు దూరంగా ఉంటున్న వారి గురించి ఆయన సేనాధిపతులకు వ్రాసి పంపిన సందేశంలో ఇలా పేర్కొన్నారు - "వారు తమ భార్యలకు మనోవర్తి పంపు తుండాలి. లేదా వారికి విడాకులైనా ఇవ్వాలి. ఒకవేళ విడాకులు గనక ఇస్తే తాము ఎంతకాలం దూరంగా ఉన్నారో అంత కాలానికి సరిబడా మనోవర్తిని పంపవలసి ఉంటుంది." (ఈ హదీసును ఇమామ్ షాఫయి, బైహఖీ ఉత్తమ ప్రమాణాలతో ఉల్లేఖించారు)

**సారాంశం**

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఇంత ఖచ్చితంగా ఉత్తర్వును జారీ చేయటం వెనుక ఒక సంఘటన ఉంది. ఒకరోజు రాత్రి ఆయన (రజి) ప్రజల కష్టసుఖాలను తెలుసుకునే ఉద్దేశ్యంతో వీధుల్లో గస్తీ చేస్తుండగా, భర్త ఎడబాటును భరించలేక, బాధాతప్త హృదయంతో గీతాలాపన చేస్తున్న ఒక స్త్రీ కంఠం ఆయనకు వినిపించింది. ఆమె భర్త ఒక సిపాయి. ఈ విరహ గీతం ఆయన్ని కదిలించింది. ఆయన వెంటనే తన కూతురు (దైవప్రవక్త సతీమణి) అయిన హజ్రత్ హఫ్సా (ర.అన్హా) దగ్గరకెళ్ళి, ఒక స్త్రీ తన భర్త లేకుండా ఎంతకాలం ఉండగలదని దర్యాప్తు చేశారు. నాలుగు మాసాలు ఉండగలదని ఆమె జవాబిచ్చారు. అంతే, హజ్రత్ ఉమర్ (రజి) సైనిక దళాధికారులకు ఉత్తర్వులు జారీ చేస్తూ, నాలుగు మాసాలు కాగానే సైనికులు తమ తమ ఇండ్లకు సెలవుపై వెళ్ళి తీరాలనీ, లేకుంటే తమ భార్యలకు విడాకులు ఇవ్వాలని ఆదేశించారు. మనిషి భావాలు భావోద్రేకాలను, ముఖ్యంగా స్త్రీ మానసిక స్థితిగతులను ఇస్లాం ఎంతగా పరిగణనలోకి తీసుకుంటుందో ఈ హదీసును బట్టి అర్థమవుతున్నది.

(٩٨٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! عِنْدِي دِينَارٌ؟ قَالَ: «أَنْفِقْهُ عَلَىٰ نَفْسِكَ»، قَالَ: عِنْدِي آخَرُ؟ قَالَ: «أَنْفِقْهُ عَلَىٰ وَلَدِكَ»، قَالَ: عِنْدِي آخَرُ؟ قَالَ: «أَنْفِقْهُ عَلَىٰ أَهْلِكَ»، قَالَ: عِنْدِي آخَرُ؟ قَالَ: «أَنْفِقْهُ عَلَىٰ خَادِمِكَ»، قَالَ: عِنْدِي

985. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నా దగ్గర ఒక దీనారు ఉంది" అని విన్నవించుకున్నాడు. "నీ స్వయం కోసం ఖర్చుపెట్టుకో" అని ఆయన (స) అన్నారు. "నా దగ్గర మరొకటి కూడా ఉంది" అని అతడు చెప్పగా "దాన్ని నీ సంతానంపై ఖర్చు పెట్టు" అని ఆయన (స) సూచించారు. "నా దగ్గర ఇంకొకటి కూడా ఉంది" అని అతను అభిప్రాయపడగా "నీ ఇల్లాలిపై ఖర్చుపెట్టు" అని ఆయన (స) సలహా ఇచ్చారు. "నా వద్ద ఇంకొకటి కూడా ఉంది" అని అతడు చెప్పగా, "దాన్ని నీ సేవకునిపై వెచ్చించు" అని ఆయన (స) సూచించారు. "నా దగ్గర ఇంకా వుంది"అని అతడు చెప్పగా, "దాన్ని ఖర్చుపెట్టే అవగాహన నీకు బాగానే ఉంది" అని ఆయన (సఅసం) సమా

آخَرُ؟ قَالَ: «أَنْتَ أَعْلَمُ». أَخْرَجَهُ الشَّافِعِيُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ، وَأَخْرَجَهُ النَّسَائِيُّ وَالْحَاكِمُ بِتَقْدِيمِ الزَّوْجَةِ عَلَى الْوَلَدِ.

ధానమిచ్చారు. (షాఫయి, అబూ దావూద్‌లు దీనిని వెలికి తీశారు. వాక్యాలు అబూదావూద్‌వి. నసాయి, హాకిమ్‌లు కూడా దీనిని సేకరించారు. వీరి సేకరణలో - 'సంతానం' అనే వాక్యానికి ముందు 'ఇల్లాలు' అనే మాట వచ్చింది)

**సారాంశం**

దేవుడు ఎవరికయినా తన కారుణ్యంతో అమితంగా అనుగ్రహిస్తే, అతడు దైవదాసులపై ఖర్చుపెట్టదలిస్తే, ఏ క్రమంలో ఖర్చు పెట్టాలో ఈ హదీసులో చెప్పబడింది. అందరికన్నా ముందు మనిషి తన ఆత్మకోసం డబ్బును వెచ్చించాలనీ, ఆ తరువాత హదీసులో సూచించబడిన క్రమంలో ఖర్చుపెట్టాలని చెప్పబడింది. ఆలుబిడ్డల, ఆత్మీయుల, తనపై ఆధారపడిన సేవకుల తరువాత సమాజంలోని ఇతరుల వంతు వస్తుంది.

(٩٨٦) وَعَنْ بَهْزِ بْنِ حَكِيمٍ، عَنْ أَبِيهِ عَنْ جَدِّهِ، قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! مَنْ أَبَرُّ؟ قَالَ: «أُمَّكَ»، قُلْتُ: ثُمَّ مَنْ؟ قَالَ: «أُمَّكَ»، قُلْتُ: ثُمَّ مَنْ؟ قَالَ: «أُمَّكَ»، قُلْتُ: ثُمَّ مَنْ؟ قَالَ: «أَبَاكَ، ثُمَّ الْأَقْرَبَ فَالْأَقْرَبَ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

986. హజ్రత్ బహ్జ్ బిన్ హాకిమ్ (రహ్మలై) తన తండ్రి ఆధారంగా తన తాతగారి నుండి ఉల్లేఖించారు : ఓ దైవ ప్రవక్తా (స)! నేను చూపే ఆదరణకు, సద్వ్యవహారానికి అందరికన్నా ఎక్కువ హక్కుదారులెవరు?" అని నేను విన్న వించుకోగా "నీ తల్లి" అని ఆయన (స) బదులిచ్చారు. "ఆ తరువాత ఎవరు?" అని నేను మళ్లీ ప్రశ్నించగా, "నీ తల్లి" అనే ఆయన సమాధానమిచ్చారు. "ఆ తరువాత ఎవరు?" అని నేను తిరిగి అడగ్గా, "నీ తల్లి" అనే ఆయన (స) చెప్పారు. "ఆ తర్వాత....?" అని నేను మళ్లీ సందేహపడగా "నీ తండ్రి, ఆపైన క్రమబద్ధంగా ఆత్మీయుల, బంధువుల వంతు వస్తుంది" అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. **(దీనిని అబూదావూద్, తిర్మిజీ వెలికి తీశారు.** తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

తండ్రి స్థానం కన్నా తల్లి స్థానం మరింత ఉన్నతమైనదని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. బిడ్డ తల్లి కడుపులో పడినప్పటినుండీ అతన్ని కని, పెంచి పెద్దవాణ్ణి చేసే వరకు తల్లి భరించే బాధల దృష్ట్యా గౌరవాదరణలకు ఆమె అందరికన్నా ఎక్కువ హక్కుదారు అని గట్టిగా తాకీదు చేయటం జరిగింది. అందుకే మహనీయ ముహమ్మద్ (స) వారు మూడుసార్లు "తల్లి" అని నొక్కి చెప్పి ఆమె ప్రాధాన్యతను అందరూ గుర్తించేలా చేశారు.

స్త్రీ సహజంగా బలహీనురాలు. కోమలాంగి. కొడుకులు కూతుళ్ళు పసివాళ్లుగా ఉన్నప్పుడు ఆమె వాళ్ల అల్లరి చేష్టల్ని ఎంతో ఓపికగా భరిస్తుంది. వాళ్లను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతుంది. కాని వాళ్లు పెద్దవారైనాక తల్లిని లక్ష్యపెట్టరు. ఆమె అదుపులో ఉండరు. పైగా ఆమె మనసును నొప్పించే మాటలంటారు. అందుకే; ఎట్టి పరిస్థితిలోనూ తల్లిని నిర్లక్ష్యం చేయరాదనీ, ఎంతో వినయ వినమ్రతలతో ఆమె సేవచేయాలని ఇస్లామీయ షరీయత్ నొక్కి వక్కాణించింది. అయితే ధర్మానికీ, షరీయత్‌కు విరుద్ధమయిన పని కోసం ఆమె ఒత్తిడి తీసుకువస్తే అప్పుడు ఆమె మాటను నిరాకరించవచ్చు.

**14వ అధ్యాయం**

## పోషణ - సంరక్షణ

## ١٤ - بَابُ الْحِضَانَةِ

(٩٨٧) عَنْ عَبْدِاللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ امْرَأَةً قَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ ابْنِيْ هٰذَا، كَانَ بَطْنِيْ لَهُ وِعَاءً، وَثَدْيِيْ لَهُ سِقَاءً، وَحِجْرِيْ لَهُ حِوَاءً، وَإِنَّ أَبَاهُ طَلَّقَنِيْ، وَأَرَادَ أَنْ يَنْزِعَهُ مِنِّي، فَقَالَ لَهَا رَسُولُ اللهِ ﷺ: «أَنْتِ أَحَقُّ بِهِ، مَا لَمْ تَنْكِحِي». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

987. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం : ఒక స్త్రీ దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నా ఈ చంటిపిల్లవాణ్ణి చూడండి, నా కడుపే వీడికి కంచంగా ఉండేది. నా చను(బా)లు వీడి పాలిట నీళ్ళ తిత్తిలా ఉండేవి. నా వెచ్చని ఒడి ఇతని నివాస స్థలంగా ఉండేది. కాని ఇప్పుడు ఇతని తండ్రి నాకు విడాకులిచ్చేశాడు. ఈ పసివాణ్ణి కూడా నా నుండి లాక్కోవాలని ఆయన చూస్తున్నాడు (ఇప్పుడు నేనేం చేసేది?) అని మొరపెట్టుకుంది. దానికి ఆయన (సఅసం) "నువ్వు రెండో వివాహం చేసుకునే వరకూ నువ్వే ఈ పసివాడిని నీ దగ్గర ఉంచుకోవడానికి ఎక్కువ హక్కుదారువి" అని చెప్పారు. (దీనిని అహ్మద్ మరియు అబూదావూద్

ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

(٩٨٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ امْرَأَةً قَالَتْ: يَا رَسُولَ اللهِ! إِنَّ زَوْجِي يُرِيْدُ أَنْ يَذْهَبَ بِابْنِي، وَقَدْ نَفَعَنِي، وَسَقَانِي مِنْ بِئْرِ أَبِي عِنَبَةَ، فَجَاءَ زَوْجُهَا، فَقَالَ النَّبِيُّ ﷺ: «يَا غُلَامُ! هَذَا أَبُوكَ، وَهَذِهِ أُمُّكَ، فَخُذْ بِيَدِ أَيِّهِمَا شِئْتَ، فَأَخَذَ بِيَدِ أُمِّهِ، فَانْطَلَقَتْ بِهِ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

988. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ఒక మహిళ వచ్చి, "ఓ దైవ ప్రవక్తా (స)! నా భర్త నా అబ్బాయిని నా నుండి లాక్కోవాలనుకుంటున్నాడు. మరేమో ఈ అబ్బాయి నాకు చేదోడు వాదోడుగా ఉన్నాడు. అబూ ఇనబా బావి నుండి నా కోసం నీళ్లు తోడుకుని వస్తాడు" అని చెప్పుకోసాగింది. అంత లోనే ఆమె భర్త కూడా వచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ఆ అబ్బాయి నుద్దేశ్యించి, "అబ్బాయి! ఈయన నీ తండ్రి. ఈమె నీ తల్లి. వీరిరువురిలో నీవు కోరిన వారి చేయి పట్టుకోవచ్చు" అని సూచించారు. ఆ అబ్బాయి తన తల్లి చేయిపట్టుకున్నాడు. ఆమె అతన్ని వెంటబెట్టుకుని వెళ్ళిపోయింది." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజి దీనిని ప్రామాణికమని పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో పిల్లవాడికి తన తల్లిదండ్రులిరువురిలో తాను కోరినవారి వద్ద ఉండే స్వేచ్ఛ ఇవ్వబడింది. కాని ఇంతకు ముందు వచ్చిన హదీసులో పిల్లవాడు తల్లి దగ్గరే ఉండాలని అనబడింది.

ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన పిల్లవాడు మరీ పసివాడు కాదు. కాస్త పెద్దవాడయ్యాడు. ఆలోచించే శక్తి అతనికుంది. అందుకే బాగా ఆలోచించి నిర్ణయం గైకొనే అవకాశం ఈ పిల్లవానికి ఇవ్వటం జరిగింది. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే పిల్లవాడు పెద్దవాడై, తన రక్షణకై తల్లిదండ్రులపై ఆధారపడవలసిన అగత్యం లేనపుడు - వారిద్దరిలో తాను కోరిన వారి వద్ద ఉండేందుకు షరీయత్ అతనికి అనుమతినిస్తోంది. ఎన్నేళ్ళ అబ్బాయికి ఈ నిర్ణయాధికారం ఇవ్వబడుతుంది? అంటే ఏడు లేక ఎనిమిదేళ్ళు అని ధర్మవేత్తలంటున్నారు. అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మాలై) ఇలా అంటున్నారు : ఆ పిల్లవాడి శ్రేయస్సు ఎందులో ఇమిడి ఉంటుందో

ఆ మేరకు నిర్ణయం గైకొనాలి. తండ్రికన్నా తల్లి ఎక్కువ శ్రద్ధతో పోషించగలదనుకుంటే తల్లికే ప్రాధాన్యతనివ్వాలి. ఈ సందర్భంగా చీటీలు వేసి అదృష్టాన్ని పరీక్షించుకోవటంగానీ, స్వేచ్ఛాధికారాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవటంగానీ సమంజసం కాదు. ఎందుకంటే పసివాడు పసివాడే. అతనిలో విజ్ఞతా వివేచనలుగానీ, దూరదృష్టిగానీ ఉండవు. కాబట్టి తల్లి దండ్రులిరువురిలో ఎవరు ఆ పసివానిపట్ల ఎక్కువ శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నారో వారికే ఆ పిల్లవాణ్ణి అప్పగించాలి. ఒకవేళ తల్లికన్నా తండ్రిలోనే ఈ శ్రద్ధాసక్తులు అధికంగా ఉన్నట్లయితే పిల్లవాణ్ణి తండ్రికే అప్పగించటం జరుగుతుంది.

ఆడపిల్ల అయినా, మగపిల్లవాడైనా - ఇద్దరూ తల్లి దగ్గరే ఉండాలని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అన్నారు.

అమ్మాయి అయితే తల్లి దగ్గర, అబ్బాయి అయితే తండ్రి దగ్గర ఉండాలని హనఫీ పండితులు అభిప్రాయపడ్డారు.

అయితే మొత్తమ్మీద అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై) గారి అభిప్రాయం న్యాయబద్ధంగా, హేతుబద్ధంగా కనిపిస్తోంది.

(٩٨٩) وَعَنْ رَافِعِ بْنِ سِنَانٍ أَنَّهُ أَسْلَمَ، وَأَبَتِ امْرَأَتُهُ أَنْ تُسْلِمَ، فَأَقْعَدَ النَّبِيُّ ﷺ الْأُمَّ نَاحِيَةً، وَالْأَبَ نَاحِيَةً، وَأَقْعَدَ الصَّبِيَّ بَيْنَهُمَا، فَمَالَ إِلَى أُمِّهِ، فَقَالَ: «**اللَّهُمَّ اهْدِهِ، فَمَالَ إِلَى أَبِيهِ، فَأَخَذَهُ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

989. హజ్రత్ రాఫె బిన్ సినాన్ (రజి) కథనం : ఆయన స్వయంగా ఇస్లాం స్వీకరించారు. కాని ఆయన సతీమణి ఇస్లాం స్వీకరించేందుకు నిరాకరించారు. అందుచేత దైవప్రవక్త (సఅసం) తల్లిని ఒక మూలన, తండ్రిని ఒక మూల కూర్చోబెట్టారు. పిల్లవాణ్ణి మాత్రం వారిద్దరి మధ్య కూర్చోబెట్టారు. పిల్లవాడు తల్లివైపు మొగ్గేలా ఉన్నాడు. (ఆ సమయంలో) దైవప్రవక్త (స), "దేవా! ఈ అబ్బాయికి సన్మార్గం చూపు" అని ప్రార్థించారు. ఆ తర్వాత ఆ అబ్బాయి తండ్రి వైపునకు వెళ్ళిపోయాడు. తండ్రి ఆ అబ్బాయిని పట్టుకున్నాడు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఆ పిల్లవాడు పసివాడనీ, మంచీచెడుల అవగాహన అతనికి ఇంకా రాలేదనీ ఈ హదీసును బట్టి అర్థమవుతున్నది. ఈ వివాదం ఒక పసిపిల్లవాడికి సంబంధించినదని అబూదావూద్‌లో

స్పష్టంగా చెప్పటం కూడా జరిగింది. ఆ స్త్రీ ఆ కాలంలో ఆ పిల్లవాడికి పాలు విడిపించే ప్రయత్నంలో వున్నప్పుడు ఈ సంఘటన జరిగింది.

### హదీసు ఉల్లేఖకులు

రాఫె బిన్ సినాన్ (రజి) : అబుల్ హకమ్ అన్సారీ ఔసీ. మదీనావాసులు. ప్రముఖ సహాబీ. 'అల్ అన్సాబ్'లో అబుల్ ఖాసిమ్ బిన్ సలామ్ ఈయన గురించి చెబుతూ, ఈయన అత్‌బూన్ సంతతికి చెందినవారనీ, ఆయన అసలు ఆమిర్ బిన్ సాలబ అనీ అన్నారు.

(٩٩٠) وَعَنِ الْبَرَآءِ بْنِ عَازِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَضَى فِي ابْنَةِ حَمْزَةَ لِخَالَتِهَا، وَقَالَ: «اَلْخَالَةُ بِمَنْزِلَةِ الْأُمِّ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

990. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హమ్జా కుమార్తె వ్యవహారంలో ఆమె పిన్నమ్మ పక్షాన తీర్పునిస్తూ "పిన్ని స్థాయి తల్లిలాంటిది" అని అన్నారు. (బుఖారీ)

وَأَخْرَجَهُ أَحْمَدُ مِنْ حَدِيثِ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: وَالْجَارِيَةُ عِنْدَ خَالَتِهَا فَإِنَّ الْخَالَةَ وَالِدَةٌ.

అహ్మద్ ఈ ఉల్లేఖనాన్ని హజ్రత్ అలీ (రజి) హదీసు ఆధారంగా చేస్తూ ఇలా అన్నారు: "పిన్న వయస్కురాలైన ఆడపిల్ల తన పినతల్లి వద్ద ఉంటుంది. ఎందుకంటే పినతల్లి తల్లిలాంటిది."

### సారాంశం

పై హదీసులో ప్రస్తావనకు వచ్చిన పినతల్లి పేరు అస్మా బిన్తె ఉమైస్. ఆడ పిల్ల పేరు అమ్మారా. ఉమామ అని కూడా అనబడుతోంది. మారుపేరు ఉమ్ముల్ ఫజల్. హజ్రత్ అలీ (రజి), హజ్రత్ జాఫర్ (రజి), జైద్‌ల మధ్య తగవు వచ్చినపుడు దైవప్రవక్త (సఅసం) తీర్పు ఇచ్చిన సందర్భం ఇది.

ఆ పిల్ల తన బాబాయి కూతురైనందువల్ల ఆ అమ్మాయి సంరక్షణా బాధ్యత తనదేనని హజ్రత్ అలీ (రజి) వాదించారు. ఈ పిల్ల నా బాబాయి కూతురు మాత్రమే గాకుండా, ఈమె పినతల్లి నా భార్య కూడా కావటం వల్ల ఈ పిల్లను పోషించే బాధ్యత తనపై ఎక్కువగా ఉందని హజ్రత్ జాఫర్ (రజి) వాదించసాగారు. ఆ పిల్ల తన అన్న కూతురైనందువల్ల తనకే దక్కాలని హజ్రత్ జైద్ (రజి) పట్టుబట్టారు. కేసును పలు కోణాల నుంచి పరిశీలించిన పిదప దైవప్రవక్త (సఅసం), పినతల్లికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు.

(٩٩١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا

991. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : "మీలో ఎవరి

أَتَى أَحَدَكُمْ خَادِمُهُ بِطَعَامِهِ فَإِنْ لَمْ يُجْلِسْهُ مَعَهُ فَلْيُنَاوِلْهُ لُقْمَةً أَوْ لُقْمَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

సేవకుడైనా భోజనం సమర్పిస్తే, అతడు ఆ సేవకుణ్ణి తనతో కూర్చోబెట్టుకుని అన్నం తినిపించలేకపోయినప్పటికీ కనీసం ఒకటి లేక రెండు ముద్దలైనా అతనికి పెట్టాలి." (బుఖారీ, ముస్లిం - వాక్యాలు బుఖారీలోనివి)

(٩٩٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «عُذِّبَتِ امْرَأَةٌ فِي هِرَّةٍ سَجَنَتْهَا حَتَّى مَاتَتْ، فَدَخَلَتِ النَّارَ فِيهَا، لاَ هِيَ أَطْعَمَتْهَا، وَسَقَتْهَا، إِذْ هِيَ حَبَسَتْهَا، وَلاَ هِيَ تَرَكَتْهَا تَأْكُلُ مِنْ خَشَاشِ الأَرْضِ». مُتَّفَقٌ عَلَيْهِ.

992. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ఒక స్త్రీ పిల్లిని బంధించి ఉంచినందుకు శిక్ష విధించబడింది. ఆమె పిల్లిని చాలా సేపు కట్టి ఉంచటంవల్ల అది చనిపోయింది. ఆమె ఆ పిల్లికి అన్నపానీయాలు పెట్టనూ లేదు, అది బయట ఎక్కడైనా ఏవైనా జంతువులను వేటాడి తినేందుకు దాన్ని వదలిపెట్టనూ లేదు. ఈ కారణంగా ఆ స్త్రీని నరకానికి ఆహుతి చేయటం జరిగింది. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

సంకలనకర్త (రహ్మ్) ఈ హదీసును, ఇంతకు ముందు వచ్చిన హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకోవటంలోని అంతరార్థం ఏమిటంటే పోషణా బాధ్యత అనేది చాలా ముఖ్యమైనది. తన అధీనంలో ఉన్నవారి గురించి పోషకుడు లేక సంరక్షకుడు ప్రశ్నించబడతాడు. తన సేవకుల విషయంలోనూ, తన అజమాయిషీలో వున్న పశువుల విషయంలోనూ అతడు ఎంతో బాధ్యతగా మసలుకోవలసి ఉంటుంది. యజమాని అయినవాడు తన సేవకుల అవసరాలను, భావావేశాలను దృష్టిలో పెట్టుకుని వారి మనసుకు గాయం తగలకుండా ప్రవర్తించాలి. వారి మానమర్యాదలను లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం, తన అధీనంలో వున్న జంతువుల ప్రాణం పోయేటంతటి దురవస్థను తీసుకురావటం మహాపరాధం క్రిందికి వస్తుంది. దీనికి సంబంధించి అతడు దైవసమక్షంలో శిక్షను అనుభవించవలసి ఉంటుంది.

# 9. అపరాధాల పుస్తకం
# ٩ - كِتَابُ الْجِنَايَاتِ

(٩٩٣) عَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَحِلُّ دَمُ امْرِىءٍ مُسْلِمٍ يَشْهَدُ أَنْ لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَأَنِّي رَسُولُ اللهِ إِلاَّ بِإِحْدَى ثَلاَثٍ: الثَّيِّبُ الزَّانِي، وَالنَّفْسُ بِالنَّفْسِ، وَالتَّارِكُ لِدِينِهِ الْمُفَارِقُ لِلْجَمَاعَةِ». مُتَّفَقٌ عَلَيْهِ.

993. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "అల్లాహ్ తప్ప మరో దైవం లేడనీ, నేను దైవప్రవక్తనని సాక్ష్యం ఇచ్చే ఏ ముస్లిం రక్తం (చిందించటం) కూడా ధర్మసమ్మతం కాదు. అయితే ముగ్గురు వ్యక్తులకు మాత్రం ఈ నిబంధన వర్తించదు - 1. వివాహితుడై ఉండి వ్యభిచారానికి పాల్పడినవాడు. 2. ప్రాణానికి బదులు ప్రాణం. 3. తన ధర్మాన్ని విడనాడి ముస్లిముల సామూహిక వ్యవస్థ నుండి వేర్పడినవాడు." (బుఖారీ, ముస్లిం)

(٩٩٤) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، عَنْ رَسُولِ اللهِ ﷺ قَالَ: «لاَ يَحِلُّ قَتْلُ مُسْلِمٍ إِلاَّ فِي إِحْدَى ثَلاَثِ خِصَالٍ: زَانٍ مُحْصَنٌ فَيُرْجَمُ، وَرَجُلٌ يَقْتُلُ مُسْلِماً مُتَعَمِّداً

994. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తెలిపారు : "మూడు పరిస్థితుల్లో ఏదైనా ఒకటి ఎర్పడితే తప్ప ఏ ముస్లిం వ్యక్తిని కూడా వధించటం ధర్మసమ్మతం కాదు - వివాహితుడై ఉండి వ్యభిచరించినవాడు; ఇతనికి రాళ్లు రువ్వే శిక్ష విధించాలి. ఉద్దేశ్యపూర్వకంగా ఒక ముస్లింను చంపినవాడు; ఇటువంటి వ్యక్తికి మరణదండన ఉంటుంది. ఇస్లాం ధర్మం నుండి భ్రష్టుడై, అల్లాహ్ మరియు ఆయన

فَيُقْتَلُ، وَرَجُلٌ يَخْرُجُ مِنَ الْإِسْلَامِ، فَيُحَارِبُ اللَّهَ وَرَسُولَهُ، فَيُقْتَلُ، أَوْ يُصْلَبُ، أَوْ يُنْفَى مِنَ الْأَرْضِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

ప్రవక్త (స) కు వ్యతిరేకంగా యుద్ధం మొదలెట్టినవాడు. ఇతను కూడా వధించ బడతాడు లేదా ఉరి శిక్షకు గురవుతాడు. లేదా దేశం నుంచి బహిష్కరించబడ తాడు." (దీనిని అబూదావూద్ మరియు నసాయి ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(٩٩٥) وَعَنْ عَبْدِاللهِ بْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: أَوَّلُ مَا يُقْضَى بَيْنَ النَّاسِ، يَوْمَ الْقِيَامَةِ، فِي الدِّمَاءِ». مُتَّفَقٌ عَلَيْهِ.

995. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) తెలియ జేశారు - "ప్రళయదినాన ప్రజల మధ్య తీర్పు ఇవ్వబడే వివాదాల్లో మొదటి వివాదాలు రక్తానికి సంబంధించిన వివా దాలై ఉంటాయి." (బుఖారీ, ముస్లిం)

(٩٩٦) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسولُ اللهِ ﷺ: «مَنْ قَتَلَ عَبْدَهُ قَتَلْنَاهُ، وَمَنْ جَدَعَ عَبْدَهُ جَدَعْنَاهُ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَهُوَ مِنْ رِوَايَةِ الْحَسَنِ الْبَصْرِيِّ عَنْ سَمُرَةَ، وَقَدِ اخْتُلِفَ فِيْ سَمَاعِهِ مِنْهُ.

996. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ సమురా (రజి) తెలిపారు : "ఏ యజమాని అయినా తన బానిసను చంపితే మేము అతన్ని చంపుతాము. మరెవరయితే అతని (బానిస) ముక్కును, చెవులను కోస్తాడో అతని ముక్కు చెవులను మేము కోస్తాము." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు. ఇది సమురా నుండి హసన్ బస్రీ సంగ్రహించిన ఉల్లేఖనం. అయితే సమురా చెప్పగా హసన్ బస్రీ విన్నారన్న విషయంలో భేదాభిప్రాయం ఉంది).

وَفِيْ رِوَايَةِ أَبِيْ دَاوُدَ وَالنَّسَائِيِّ: «**وَمَنْ خَصٰى عَبْدَهُ خَصَيْنَاهُ**». وَصَحَّحَ الْحَاكِمُ هٰذِهِ الزِّيَادَةَ.

అబూదావూద్, నసాయిల ఉల్లేఖనంలో "ఏ యజమాని అయితే తన బానిసను నపుంసకునిగా చేశాడో అతన్ని మేము నపుంసకునిగా మార్చివేస్తాము" అని ఉంది. (ఈ అదనపు పలుకులను హాకిమ్ 'దృఢమైనవి'గా పేర్కొన్నారు)

(٩٩٧) وَعَنْ عُمَرَ بْنِ الْخَطَّابِ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ، قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ يَقُولُ: «**لَا يُقَادُ الْوَالِدُ بِالْوَلَدِ**». رَوَاهُ أَحْمَدُ وَالتِّرْمِذِيُّ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ الْجَارُودِ وَالْبَيْهَقِيُّ، وَقَالَ التِّرْمِذِيُّ: إِنَّهُ مُضْطَرِبٌ.

997. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) తెలిపారు : "కొడుకును హతమార్చిన నేరానికి ప్రతిగా తండ్రిని హతమార్చటం తగదు." (దీనిని తిర్మిజీ, ఇబ్నెమాజా ఉల్లేఖించారు. ఇబ్నె జారూద్, బైహఖీలు దీనిని ప్రామాణికమైనదిగా ధృవీకరించారు. ఈ హదీసులో సందిగ్ధం ఉందని తిర్మిజీ అభిప్రాయపడ్డారు)

**సారాంశం**

పై హదీసులో 'ఖిసాస్' గురించిన ప్రస్తావన వచ్చింది. ఖిసాస్ అంటే హతుని హత్యకు ప్రతీకారంగా హంతకుణ్ణి హతమార్చటం అని అసలు అర్థం. ఈ హదీసు ప్రకారం ఒక వ్యక్తి తన కుమారుణ్ణి అంతమొందిస్తే అందుకు ప్రతిగా తండ్రి అంతమొందించబడడు. అయితే అతన్నుండి రక్త శుల్కం (దియత్) వసూలు చేయబడుతుందని చాలామంది ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

తండ్రిని అంతమొందించకపోవడానికి గల ముఖ్య కారణం ఏమిటంటే, తండ్రి తన కుమారుని ఉనికికి మూల పురుషుడుగాని, కుమారుడు తన తండ్రికి మూల పురుషుడు కాడు. అందుచేత కుమారుడు తన తండ్రిపై పగ తీర్చుకునే హక్కు కలిగి ఉండడు. అదీగాక ఏ తండ్రి అయినా తన కన్న కొడుకును ఉద్దేశ్యపూర్వకంగా హతమారుస్తాడన్నది అంతుబట్టని విషయం. ఒకవేళ అతనిచేత అలాంటి అమానుషం ఏదన్నా జరిగితే అది ఆవేశం వల్లనో, ఉన్మాదం వల్లనో, అలసత్వం వల్లనో జరిగిపోతుంది తప్ప పథకం ప్రకారం మాత్రం జరగదు. అలసత్వం వల్ల జరిగిన హత్యా నేరానికి గాను రక్తం చిందించబడదు (ఖిసాస్ ఉండదు). నష్టపరిహారం (దియత్) మాత్రమే వసూలు చేయబడుతుంది.

ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) గారి అభిప్రాయం ఈ విషయంలో కొంత భిన్నంగా ఉంది. తండ్రి గనక కన్నకొడుకును పడుకోబెట్టి, కిరాతకంగా - జంతువు కుత్తుక కోసినట్లుగా కోస్తే మాత్రం, తండ్రిని సయితం హతమార్చవలసిందే అని అంటారాయన.

తిర్మిజీ (రహ్మ.లై) ఈ హదీసులో సందిగ్ధానికి ఆస్కారముందని వ్యాఖ్యానించటానికి ప్రధాన కారణం దీని పరంపరలో ముసన్నా బిన్ సబాహ్ అనే వ్యక్తి ఉండటమే. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) దృష్టిలో ఈ హదీసుకు సంబంధించిన పరంపరలన్నింటిలోనూ లింకు తెగింది. అయితే బైహఖీ ఉల్లేఖనంలోని ఉల్లేఖకులంతా విశ్వసనీయులవటం చేత ఈ ఉల్లేఖనం ప్రమాణబద్ధమైందని అల్లామా ఇబ్నె హజర్ (రహ్మ.లై) తన గ్రంథం - తల్ఖీస్ - లో వివరించారు.

(٩٩٨) وَعَنْ أَبِيْ جُحَيْفَةَ قَالَ: قُلْتُ لِعَلِيٍّ: هَلْ عِنْدَكُمْ شَيْءٌ مِّنَ الْوَحْيِ، غَيْرَ الْقُرْآنِ؟ قَالَ: لاَ، وَالَّذِيْ فَلَقَ الْحَبَّةَ، وَبَرَأَ النَّسَمَةَ، إِلاَّ فَهْمٌ يُعْطِيْهِ اللّٰهُ تَعَالَى رَجُلاً فِي الْقُرْآنِ، وَمَا فِي هٰذِهِ الصَّحِيْفَةِ، قُلْتُ: وَمَا فِي هٰذِهِ الصَّحِيْفَةِ؟ قَالَ: اَلْعَقْلُ، وَفِكَاكُ الْأَسِيْرِ، وَأَنْ لاَّ يُقْتَلَ مُسْلِمٌ بِكَافِرٍ. رَوَاهُ الْبُخَارِيُّ.

998. హజ్రత్ అబూ జుహైఫా (రజి) కథనం : "మీ వద్ద ఖుర్ఆన్ గాకుండా వహీ (దైవవాణి) ద్వారా అవతరించిన మరేదైనా విషయం కూడా ఉందా?" అని నేను హజ్రత్ అలీ (రజి)ని అడగ్గా, ఆయన ఇలా చెప్పారు : "గింజను మొలకెత్తించిన, జీవాన్ని పుట్టించిన శక్తి మంతుని సాక్షిగా చెబుతున్నాను! దివ్య ఖుర్ఆన్ గురించి ఏ మనిషికైనా అల్లాహ్ ప్రసాదించే అవగాహనం మరియు ఈ గ్రంథంలో వున్న అంశం తప్ప (మరేమీ నా వద్దలేదు)." "మరి ఈ గ్రంథంలో వున్న అంశమేమిటీ?" అని నేను ప్రశ్నించగా, "రక్త పరిహారం గురించిన ఆదేశాలు, యుద్ధఖైదీ విడుదలకు సంబంధించిన ఆదేశం ఇందులో ఉన్నాయి. **ఏ ముస్లింనూ ఒక అవిశ్వాసికి బదులుగా హతమార్చటం జరగదు అని కూడా ఇందులో వుంది" అని ఆయన (రజి) వివరించారు (బుఖారీ). హజ్రత్ అలీ (రజి) గారి ఈ ఉల్లేఖనాన్ని అహ్మద్,**

وَأَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ مِنْ وَجْهٍ آخَرَ عَنْ عَلِيٍّ، وَقَالَ فِيْهِ: «**اَلْمُؤْمِنُوْنَ تَتَكَافَأُ دِمَآؤُهُمْ، وَيَسْعٰى بِذِمَّتِهِمْ أَدْنَاهُمْ، وَهُمْ يَدٌ عَلٰى مَنْ سِوَاهُمْ، وَلاَ يُقْتَلُ مُؤْمِنٌ بِكَافِرٍ، وَلا ذُوْ عَهْدٍ فِيْ عَهْدِهِ**». صَحَّحَهُ الْحَاكِمُ.

అబూదావూద్ మరియు నసాయి వేరొక ఆధారంతో పొందుపరచారు. అందులో ఇలా వుంది : "విశ్వాసులందరి రక్తం సమానమే. వారిలోని ఒక అతి సామాన్య మనిషి యొక్క బాధ్యతాస్థాయి ఓ గొప్ప మనిషితో సమానం. తమ విషయంలో తప్ప - ముస్లిమేతరులకు వ్యతిరేకంగా వారు అందరూ పరస్పరం ఒక్కటే. ఏ విశ్వాసినీ ఒక అవిశ్వాసికి బదులుగా హతమార్చటంగానీ, శాంతి ఒప్పందం చేసుకున్న ఏ 'జిమ్మీ'ని (ముస్లిమేతరుణ్ణి) వధించటం గానీ జరగదు." (ఈ ఉల్లేఖనాన్ని హాకిమ్ ప్రామాణికంగా ఖరారు చేశారు)

(٩٩٩) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ، رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ أَنَّ جَارِيَةً وُجِدَ رَأْسُهَا قَدْ رُضَّ بَيْنَ حَجَرَيْنِ، فَسَأَلُوهَا، مَنْ صَنَعَ بِكِ هٰذا؟ فُلَانٌ؟ فُلَانٌ؟ حَتّٰى ذَكَرُوا يَهُودِيًّا فَأَوْمَأَتْ بِرَأْسِهَا، فَأُخِذَ الْيَهُودِيُّ، فَأَقَرَّ، فَأَمَرَ رَسُولُ اللّٰهِ

999. హజ్రత్ అనస్ (రజి) కథనం: ఒక బానిసరాలు తలను రెండు రాళ్ళ మధ్య ఉంచి బద్దలు గొట్టిన స్థితిలో కనిపించింది. "నీ పట్ల ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారెవరు?" అని ప్రవక్త సహచరులు ఆమెను అడిగారు. (ఆమె మౌనం వహించింది). ఫలానా ఫలానా వారా? అని వారు స్వయంగా ప్రశ్నించ సాగారు. ఈ విధంగా వాళ్లు ఒక్కొక్కరి పేరునూ ప్రస్తావిస్తూ ఒక యూదుని పేరు చెప్పగానే 'అవున'న్నట్టు ఆమె తలూపింది. ఆ యూద వ్యక్తి నిర్బంధించబడ్డాడు. అతను తన తప్పును

ﷺ أَنْ يُرَضَّ رَأْسُهُ بَيْنَ حَجَرَيْنِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

అంగీకరించాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) "ఇతని తలను కూడా రెండు రాళ్ల మధ్యన ఉంచి బద్దలు గొట్టండి" అని ఆజ్ఞాపించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం 'ముస్లిం' లోనివి)

(١٠٠٠) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ غُلاماً لأُنَاسٍ فُقَرَاءَ قَطَعَ أُذُنَ غُلَامٍ لأُنَاسٍ أَغْنِيَاءَ، فَأَتَوُا النَّبِيَّ ﷺ فَلَمْ يَجْعَلْ لَهُمْ شَيْئاً. رَوَاهُ أَحْمَدُ وَالثَّلاثَةُ بِإِسْنَادٍ صَحِيحٍ.

1000. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : పేద వర్గానికి చెందిన ఒక బానిస, ధనిక వర్గానికి చెందిన ఒక బానిస చెవిని కోసివేయగా వారు దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చారు. కాని ఆయన (స) వారి కోసం ఏమీ నిర్ధారించలేదు. (దీనిని అహ్మద్ మరియు 'ముగ్గురూ' ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు)

(١٠٠١) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، أَنَّ رَجُلاً طَعَنَ رَجُلاً بِقَرْنٍ فِيْ رُكْبَتِهِ، فَجَاءَ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: أَقِدْنِيْ، فَقَالَ: حَتَّى تَبْرَأَ، ثُمَّ جَاءَ إِلَيْهِ، فَقَالَ: أَقِدْنِيْ،

1001. హజ్రత్ అమ్రు బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం; ఒక వ్యక్తి మరొకతని మోకాలిలోకి కొమ్మును గుచ్చేశాడు. అప్పుడతను దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, "నాకు అతన్నుంచి నష్టపరిహారం ఇప్పించండి" అని ప్రాధేయపడ్డాడు. దానికాయన (స), "గాయం మానిన తర్వాత రా" అని సలహా ఇచ్చారు. అతడు మళ్లీ (గాయం మానకముందే) ఆయన (స) వద్దకు వచ్చి, 'నాకు పరిహారం ఇప్పించండి'

فَأَفَادَهُ، ثُمَّ جَاءَ إِلَيْهِ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! عَرَجْتُ، فَقَالَ: **قَدْ نَهَيْتُكَ فَعَصَيْتَنِي، فَأَبْعَدَكَ اللَّهُ، وَبَطَلَ عَرَجُكَ**، ثُمَّ نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يُقْتَصَّ مِنْ جُرْحٍ حَتَّى يَبْرَأَ صَاحِبُهُ. رَوَاهُ أَحْمَدُ وَالدَّارَقُطْنِيُّ، وَأُعِلَّ بِالْإِرْسَالِ.

అన్నాడు. ఆయన (స) అతనికి పరిహారం ఇప్పించారు. కొంతకాలం గడచిన తర్వాత ఆ వ్యక్తి ఇంకొకసారి వచ్చి, "దైవప్రవక్తా! నేను కుంటివాణ్ణి అయి పోయాను" అని అన్నాడు. దానికి దైవ ప్రవక్త (స), "నేను ఎంత చెప్పినా వినక పోతివి. దేవుడు నిన్ను దూరం చేశాడు. నీ అవిటితనాన్ని నిరర్థకం గావించాడు" అని అన్నారు. ఆ తర్వాత ఆయన (స) ఇలా ప్రబోధించారు : "గాయపడిన వాడు తన గాయం మాని, పూర్తి స్వస్థత చేకూరేవరకూ గాయాల నష్టపరిహారం తీసుకోరాదు." (దీనిని అహ్మద్, దారె ఖుత్నీ ఉల్లేఖించారు. ఇది 'ముర్సల్' అయిన కారణంగా లోపభూయిష్ట మైనది)

**సారాంశం**

గాయం పూర్తిగా మానేవరకూ గాయపరచినవారి నుంచి నష్టపరిహారం తీసుకోరాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) దృష్టిలో గాయం మానేవరకూ వేచి ఉండటం తప్పనిసరి (వాజిబ్). ఇలా వేచి ఉండటాన్ని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిలషణీయం (ముస్తహబ్)గా భావిస్తున్నారు. ఎందుకంటే గాయం మానకపోవచ్చు, గాయం తిరగదోడి ఆ శరీరావయవాన్ని పూర్తిగా తీసివేయవలసిన అగత్యం ఏర్పడవచ్చు. కనుక ఈ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చిన తర్వాతే నష్టపరిహారాన్ని న్యాయ సమ్మతంగా అంచనా వేసే అవకాశముంటుంది. గాయం మానకముందే తొందరపడి పరిహారం కోసం హడావిడిచేస్తే తగినంత పరిహారం ముట్టకపోవచ్చు. ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన వ్యక్తికి దైవప్రవక్త (స) నష్టపరిహారంగా ఐదు ఒంటెలను మాత్రమే ఇప్పించారు. అతను గనక కాస్త ఓపిక పట్టి ఉంటే - వికలాంగుడైపోయినందుకు మొత్తం యాభై ఒంటెలు పరిహారంగా లభించేవి. ఓర్పు వహించక పోవటం వల్లనూ, దైవప్రవక్త (స) వారి సలహాను లక్ష్య పెట్టకపోవటం మూలంగానూ అతడు కేవలం ఐదు ఒంటెలతో సరిపుచ్చుకోవలసి వచ్చింది.

(١٠٠٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: اقْتَتَلَتِ امْرَأَتَانِ مِنْ هُذَيْلٍ، فَرَمَتْ إِحْدَاهُمَا الْأُخْرَى بِحَجَرٍ، فَقَتَلَتْهَا وَمَا فِي بَطْنِهَا، فَاخْتَصَمُوا إِلَى رَسُولِ اللهِ ﷺ، فَقَضَى رَسُولُ اللهِ ﷺ أَنَّ دِيَةَ جَنِينِهَا غُرَّةٌ: عَبْدٌ أَوْ وَلِيدَةٌ. وَقَضَى بِدِيَةِ الْمَرْأَةِ عَلَى عَاقِلَتِهَا، وَوَرَّثَهَا وَلَدَهَا وَمَنْ مَعَهُمْ، فَقَالَ حَمَلُ بْنُ النَّابِغَةِ الْهُذَلِيُّ: يَا رَسُولَ اللهِ! كَيْفَ نَغْرَمُ مَنْ لاَ شَرِبَ وَلاَ أَكَلَ؟ وَلاَ نَطَقَ وَلاَ اسْتَهَلَّ؟ فَمِثْلُ ذَلِكَ يُطَلُّ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّمَا هَذَا مِنْ إِخْوَانِ الْكُهَّانِ، مِنْ أَجْلِ سَجْعِهِ الَّذِي سَجَعَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1002. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : హుజైల్ తెగకు చెందిన ఇద్దరు స్త్రీలు పరస్పరం తగవుపడ్డారు. వారిలో ఒకామె మరొకామెపై పెద్ద రాయి విసిరింది. దాంతో ఆ స్త్రీతో పాటు ఆమె గర్భంలో వున్న శిశువు కూడా మరణించింది. ఆ మృతురాలి వారసులు కేసును దైవప్రవక్త (సఅసం) కొలువుకు తీసుకురాగా, దైవప్రవక్త (స) తీర్పు ఇస్తూ: "పుట్టని శిశువుకు బదులుగా ఒక బానిసరాలిని గానీ, బానిసనుగానీ ఇవ్వాలి. హత్య చేయబడిన స్త్రీకి బదులుగా హంతకురాలి వారసులు రక్తపరిహారం చెల్లించాలి. హతురాలి కుమారులకు, వారి వారసులకు ఆ రక్త పరిహారం దక్కుతుంద"ని చెప్పారు. ఈ తీర్పుపై హమ్ల్ బిన్ నాబిఘు హుజలీ (రజి) జోక్యం చేసుకుంటూ, "ఓ దైవప్రవక్తా (స)! ఏమీ త్రాగని, తినని, మాట్లాడని, కేకపెట్టని శిశువుకు పరిహారం మేమెలా చెల్లించేది?! ఈ తీర్పు సమంజసంగా లేదే?!" అని అభిప్రాయపడగా "ఇతను సోదె చెప్పేవారి సోదరుడిలా ఉన్నాడు. ఎందుకంటే ఇతను అల్లుతున్న పదజాలం కూడా సోదె చెప్పేవారి తరహాలోనే ఉంది" అని ఆయన (సఅసం) అన్నారు." (బుఖారీ)

وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ مِنْ

అబూదావూద్, నసాయి లిరువురూ సేకరించిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి)

حَدِيْثِ ابْنِ عَبَّاسٍ، أَنَّ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، سَأَلَ مَنْ شَهِدَ قَضَاءَ رَسُولِ اللهِ ﷺ فِي الْجَنِيْنِ قَالَ: فَقَامَ حَمَلُ بْنُ النَّابِغَةِ، فَقَالَ: كُنْتُ بَيْنَ امْرَأَتَيْنِ، فَضَرَبَتْ إِحْدَاهُمَا الْأُخْرَى، فَذَكَرَهُ مُخْتَصَراً وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

ఉల్లేఖనంలో హజ్రత్ ఉమర్ (రజి), "గర్భస్థ శిశువు మరణంపై దైవప్రవక్త (స) తీర్పు ఇచ్చిన సమయంలో అక్కడెవరున్నారు?" అని అడగ్గా, హమ్ల్ బిన్ నాబిఘు నిలబడి, "ఆ సమయంలో నేను ఆ ఇద్దరు మహిళల మధ్య ఉన్నాను. వారిలో ఒక మహిళ మరో మహిళపై రాయి విసిరింది.... తరువాత సంక్షిప్తంగా హదీసును వివరించారు." ఈ విషయాన్ని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలియజేశారు. (ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**హదీసు ఉల్లేఖకులు**

అసలు పేరు హమ్ల్ బిన్ నాబిఘు (రజి). హమ్ల్ బిన్ మాలిక్ బిన్ నాబిఘు హుజలీ. మారు పేరు అబూ నజ్లా. ప్రవక్త సహచరులుగా పరిగణించబడతారు. బస్రాలో స్థిరపడ్డారు.

(١٠٠٣) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ الرُّبَيِّعَ بِنْتَ النَّضْرِ – عَمَّتَهُ – كَسَرَتْ ثَنِيَّةَ جَارِيَةٍ، فَطَلَبُوا إِلَيْهَا الْعَفْوَ، فَأَبَوا، فَعَرَضُوا الْأَرْشَ، فَأَبَوا، فَأَتَوا رَسُولَ اللهِ ﷺ، فَأَبَوا، إِلاَّ الْقِصَاصَ، فَأَمَرَ رَسُولُ اللهِ ﷺ بِالْقِصَاصِ، فَقَالَ أَنَسُ بْنُ النَّضْرِ: يَا رَسُولَ اللهِ: أَتُكْسَرُ ثَنِيَّةُ الرُّبَيِّعِ؟ لاَ، وَالَّذِي بَعَثَكَ بِالْحَقِّ، لاَ

1003. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం ఆయన మేనత్త రుబై బిన్తె నజ్ర్ ఒక అన్సార్ బాలిక పన్ను విరగ్గొట్టింది. రుబై బంధువులు ఆ బాలిక ఆత్మీయుల వద్దకు వెళ్ళి క్షమాభిక్ష పెట్టమని అర్థించారు. కాని క్షమాభిక్ష పెట్టడానికి వాళ్లు నిరాకరించారు. పోనీ నష్టపరిహారం తీసుకోండి అని వారు ప్రతిపాదించగా ఈ ప్రతిపాదనను కూడా వారు త్రోసిపుచ్చారు. ఆఖరికి వాళ్లు దైవప్రవక్త (సఅసం) దర్బారుకు వచ్చి, తమకు ఖిసాస్ (పంటికి బదులుగా పన్ను) కావాల్సిందిగా పట్టుబట్టారు. పంటికి బదులుగా పన్నును విరగ్గొట్టడం తప్ప

تُكْسَرُ ثَنِيَّتُهَا، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «يَا أَنَسُ! كِتَابُ اللهِ الْقِصَاصُ»، فَرَضِيَ الْقَوْمُ، فَعَفَوْا، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ مِنْ عِبَادِ اللهِ مَنْ لَوْ أَقْسَمَ عَلَى اللهِ لَأَبَرَّهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

మరో శిక్షకు తాము సుతరామూ అంగీకరించబోమని వాళ్లు తేల్చి చెప్పటంతో, దైవప్రవక్త (స) ఆ మేరకే తీర్పు ఇచ్చారు. ఇది విని హజ్రత్ అనస్ బిన్ నజర్, "దైవప్రవక్తా (స)! ఏమిటీ, రుబై పన్ను విరగ్గొట్టబడుతుందా? లేదు. మీకు సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా చెబుతున్నాను. ఈమె దంతం విరగ్గొట్టబడదు" అని చెప్పారు. ఈ మాటలు విన్న దైవప్రవక్త (స), 'అనస్! దైవశాసనం మాత్రం పంటికి బదులు పన్ను అనే అంటోంది కదా!" అన్నారు. అంతలోనే అవతలి పక్షం వారు మెత్తబడి క్షమాభిక్ష పెట్టారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "దేవుని దాసులు కొందరున్నారు. వారు దేవుని పేర ప్రమాణం చేస్తే చాలు, దేవుడు వారి మనోరథాన్ని ఈడేరుస్తాడు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు బుఖారీ లోనివి)

## సారాంశం

ఈ హదీసు ద్వారా హజ్రత్ అనస్ బిన్ నజర్ (రజి) గారి గొప్పదనం తెలిసివస్తోంది. ఆయన దేవుని పేర ప్రమాణం చేసి ఇలా జరగరాదని మనస్సాక్షిని వెలిబుచ్చగానే దేవుడు ఆయన మనో భావానికనుగుణంగా పరిస్థితిని మలిచాడు. దేవునిపై ఆయన నిలిపిన నమ్మకాన్ని దేవుడు వమ్ము చేయలేదు.

హజ్రత్ అనస్ బిన్ నజర్ గారి ధోరణిని బట్టి ఆయన దైవప్రవక్త (స) తీర్పును ధిక్కరించారని భావించనవసరం లేదు. ఒకవేళ ఆయన మనసులో అలాంటి ఆలోచన లేశమయినా ఉండి ఉంటే దైవప్రవక్త (స) ఆయన మంచితనాన్ని కొనియాడి ఉండేవారు కాదు.

## హదీసు ఉల్లేఖకులు

1. రుబై బిన్తె నజర్ (ర.అన్హా) : ఈమె నజర్ బిన్ జమ్ జమ్ బిన్ జైద్ బిన్ హరామ్

కుమార్తె. దైవప్రవక్త (స) ప్రధాన సేవకులైన అనస్ బిన్ మాలిక్ (రజి) కు ఈమె మేనత్త అవుతారు. బద్ర్ యుద్ధంలో అమరగతి నొందిన హారిస బిన్ సురాఖ (రజి) గారి మాతృమూర్తి.

2. అనస్ బిన్ నజర్ (రజి) : ఈయన రుబై సోదరులు. అనస్ బిన్ మాలిక్ (రజి) గార్కి పినతండ్రి అవుతారు. బద్ర్ యుద్ధంలో పాల్గొనలేక పోయినందుకు తరచూ ఆత్మ పరిశీలన చేసుకునేవారు. ఉహుద్ యుద్ధం జరిగిన రోజున అవిశ్వాసుల సైన్యం వైపునకు దూసుకుపోయారు. నేను ఉహుద్ పర్వతం అంచున స్వర్గ సువాసనను ఆస్వాదిస్తున్నాను అంటూ శత్రువుకు ఎదురొడ్డి పోరాడుతూ వీరమరణం పొందారు.

(١٠٠٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ قُتِلَ فِي عِمِّيَّا، أَوْ فِي رَمِّيَّا بِحَجَرٍ أَوْ سَوْطٍ أَوْ عَصاً، فَعَقْلُهُ عَقْلُ الْخَطَإِ، وَمَنْ قُتِلَ عَمْداً، فَهُوَ قَوَدٌ، وَمَنْ حَالَ دُونَهُ، فَعَلَيْهِ لَعْنَةُ اللهِ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ بِإِسْنَادٍ قَوِيٍّ.

1004. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఏ వ్యక్తి అయినా పొరబాటున జరిగిన పోరాటంలో హతమార్చబడినా లేదా రాయి రువ్వినందుకు మరణించినా లేదా కొరడా దెబ్బకు, లాఠీ దెబ్బకు మరణించినా దాని నష్టపరిహారం పొరబాటు వల్ల జరిగిన దానికి చెల్లించే నష్టపరిహారమే అవుతుంది. అయితే ఎవరయినా ఉద్దేశ్యపూర్వకంగా (పథకం ప్రకారం) హత్య చేయబడితే మాత్రం దానికి రక్తపరిహారం (ఖిసాస్) ఇవ్వవలసి ఉంటుంది. రక్త పరిహారం పుచ్చుకునే విషయంలో ఎవరయినా అవరోధంగా నిలిస్తే అటువంటి వ్యక్తిపై దేవుని శాపం పడుతుంది." (ఈ హదీసును అబూ దావూద్, నసాయి దృఢమైన ఆధారాలతో ఉల్లేఖించారు)

(١٠٠٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «**إِذَا أَمْسَكَ الرَّجُلُ الرَّجُلَ، وَقَتَلَهُ الْآخَرُ، يُقْتَلُ**

1005. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "ఒక

الَّذِي قَتَلَهُ، وَيُحْبَسُ الَّذِي أَمْسَكَ». رَوَاهُ الدَّارَقُطْنِيُّ مَوْصُولاً وَمُرْسَلاً، وَصَحَّحَهُ ابْنُ الْقَطَّانِ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّ الْبَيْهَقِيَّ رَجَّحَ الْمُرْسَلَ.

వ్యక్తి ఇంకొకణ్ణి పట్టుకుని ఉండగా వేరొకడు పట్టుకోబడిన వాణ్ణి చంపితే హంతకుడు హతమార్చబడతాడు. కాగా; పట్టుకుని ఉన్నవాడు కారాగారంలో వేయబడతాడు." (దీనిని దారె ఖుత్నీ మౌసూల్ గానూ, ముర్సల్‌గానూ ఉల్లేఖించారు. ఇబ్నె ఖత్తాన్ దీన్ని ప్రామాణికంగా ఖరారు చేశారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు. అయితే బైహఖీ మాత్రం దీన్ని 'ముర్సల్' అని అనడానికే ప్రాధాన్యతనిచ్చారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఒక మనిషిని ఇద్దరు కలసి కుట్ర పన్ని మరీ చంపితే; కుట్రపన్నిన వారిలో ఒకడు హతుణ్ణి పట్టుకుని ఉండగా వేరొకడు హత్య చేస్తే అట్టి స్థితిలో హంతకుడు హతమార్చబడతాడు. పట్టుకుని ఉన్నవాడికి జైలు శిక్ష విధించబడుతుంది. ఈ జైలు శిక్ష యావజ్జీవ జైలు శిక్ష అయినా కావచ్చు లేదా న్యాయస్థానం నిర్ణయించిన గడువుపై అయినా ఆధారపడి ఉండవచ్చు. హనఫీ మరియు షాఫయీ ధర్మవేత్తల అభిమతం కూడా ఇదే. కాని ఇమామ్ మాలిక్ (రహ్మ్‌లై), నఖ్‌యీ (రహ్మ్‌లై), ఇబ్నె అబూలైలాల ప్రకారం హత్యానేరంలో పాల్గొన్న ఆ ఇద్దరూ చంపబడాల్సిందే. ఎందుకంటే ఇద్దరూ కలసి వ్యూహరచన చేశారు. ఆ పాపంలో ఇద్దరూ భాగస్థులే. పట్టుకున్నవాడే గనక పట్టుకోకపోతే బహుశా హతుడు తప్పించుకుని పారిపోయే వాడేమో! అసలా హత్యోదంతమే జరిగి ఉండేది కాదేమో!! ఆ హత్యోదంతంలో ఇరువురూ సమాన పాత్రను పోషించిన కారణంగా ఇరువురికీ సమానంగా శిక్ష పడవలసిందే.

(١٠٠٦) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ الْبَيْلَمَانِيِّ، أَنَّ النَّبِيَّ ﷺ قَتَلَ مُسْلِماً بِمُعَاهَدٍ، وَقَالَ: «أَنَا أَوْلَى مَنْ وَفَّى بِذِمَّتِهِ». أَخْرَجَهُ عَبْدُ

1006. హాజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ బైలమానీ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) ఒక ముఆహిద్ (ప్రాణరక్షణ ఒప్పందం చేసుకున్న అవిశ్వాసి)ని చంపిన నేరానికి ఒక ముస్లింకు మరణ దండన విధించారు. ఈ సందర్భంగా ఆయన (సఅసం) ఇలా అన్నారు -

الرَّزَّاقِ هٰكَذَا مُرْسَلاً، وَوَصَلَهُ الدَّارَقُطْنِيُّ بِذِكْرِ ابْنِ عُمَرَ فِيْهِ، وَإِسْنَادُ الْمَوصُولِ وَاهٍ.

"ప్రాణ రక్షణ ఒప్పందానికి కట్టుబడి ఉండేవారిలోకెల్లా నేను ఉత్తముడను." (అబ్దుర్రజ్జాఖ్ ఇదేవిధంగా దీన్ని 'ముర్సల్'గా ఉల్లేఖించారు. దారె ఖుత్నీ దీన్ని ఇబ్నె ఉమర్ (రజి) నుండి 'మౌసూల్'గా వివరించారు. అయితే దీని పరంపర బలహీనమైనది)

**హదీసు ఉల్లేఖకులు**

అబ్దుర్రహ్మాన్ బిన్ బైలమానీ. మదీనా వాసులు. చివరకు హరాన్‌లో స్థిరపడ్డారు. హదీసులను వివరించటంలో ఈయన బలహీన ఉల్లేఖకులని అబూహాతిం అభిప్రాయపడ్డారు. అయితే ఇబ్నె హిబ్బాన్ మాత్రం ఈయన్ని ఎన్నదగ్గ వ్యక్తిగా ఖరారు చేశారు. హదీసు విషయంలో ఈయన ఉల్లేఖనాలను పరిగణనలోకి తీసుకోజాలమని హాఫిజ్ అబ్దుల్ అజీమ్ అన్నారు.

(١٠٠٧) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قُتِلَ غُلَامٌ غِيْلَةً، فَقَالَ عُمَرُ: لَوِ اشْتَرَكَ فِيْهِ أَهْلُ صَنْعَاءَ لَقَتَلْتُهُمْ بِهِ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1007. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దగా, మోసంతో ఒక బానిసను హత్య చేయటం జరిగింది. ఈ సందర్భంగా హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ, ఈ హత్యా నేరంలో గనక 'సనా' వాసులంతా కలసి ఉన్నాసరే నేను వారందర్నీ చంపి ఉండేవాణ్ణి." (బుఖారీ)

(١٠٠٨) وَعَنْ أَبِيْ شُرَيْحٍ الْخُزَاعِيِّ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**فَمَنْ قُتِلَ لَهُ قَتِيلٌ، بَعْدَ مَقَالَتِي هٰذِهِ، فَأَهْلُهُ بَيْنَ خِيَرَتَيْنِ،**

1008. హజ్రత్ అబూ షురైహ్ ఖుజాయి కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "నా ఈ ప్రసంగం తరువాత ఒకవేళ ఎవరి మనిషయినా చంపబడితే హతుని వారసులకు రెండింటిలో ఏదో ఒక దానిని ఎన్నుకునే అధికారం ఉంటుంది - వారు రక్త పరిహారమన్నా తీసుకోవచ్చు లేదా హంతకుణ్ణి హత మార్చనయినా వచ్చు (మరణ దండనను

إِمَّا أَنْ يَأْخُذُوا الْعَقْلَ، أَوْ يَقْتُلُوا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ بِمَعْنَاهُ.

కోరవచ్చు). (ఈ హదీసును అబూ దావూద్, నసాయి ఉల్లేఖించారు- ఈ ఉల్లేఖనం యొక్క మూలం, దీని అర్థాన్ని సరిపోలిన హదీసు 'సహీ హైన్' లో హజ్రత్ అబూహురైరా (రజి)చే ఉల్లేఖించబడింది)

**హదీసు ఉల్లేఖకులు**

అబూ షురైహ్ ఖుజాయి : ఈయన అసలు పేరు అమ్ర్ బిన్ ఖువైలిద్ అని కొందరు, ఖువైలిద్ బిన్ అమ్ర్ కాబీ అదవీ అని మరికొందరు భావిస్తున్నారు. మక్కా విజయానికి ముందు ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 68లో మదీనాలో మరణించారు.

**మొదటి అధ్యాయం**

## ١ - بَابُ الدِّيَاتِ

## రక్తశుల్కం (దియత్)

(١٠٠٩) عَنْ أَبِي بَكْرِ بْنِ مُحَمَّدِ بْنِ عَمْرِو بْنِ حَزْمٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ أَنَّ النَّبِيَّ ﷺ كَتَبَ إِلَى أَهْلِ الْيَمَنِ فَذَكَرَ الْحَدِيثَ. وَفِيهِ أَنَّ مَنِ اعْتَبَطَ مُؤْمِناً قَتْلاً عَنْ بَيِّنَةٍ، فَإِنَّهُ قَوَدٌ، إِلاَّ أَنْ يَرْضَى أَوْلِيَاءُ الْمَقْتُولِ. وَإِنَّ فِي

1009. హజ్రత్ అబూబక్ర్ బిన్ ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ హజ్మ్ తన తండ్రి ఆధారంగా తన తాతగారి ఉల్లేఖనాన్ని వివరించారు : దైవప్రవక్త (సఅసం) యమన్ వాసులకు వ్రాశారు - **మరి హదీసునంతటినీ** వివరించారు- **అందులో** ఇలా లిఖించబడింది: "ఎవరయినా ఒక నిర్దోషి అయిన ముస్లింను చంపితే, ఈ హత్యకు సాక్షులుంటే అతనిపై ప్రతీకారం (ఖిసాస్) తీర్చుకోవటం తప్పనిసరి. ఒకవేళ హతుని వారసులు రాజీకివస్తే ఒక ప్రాణాన్ని తీసినందుకు పరిహారంగా నూరు ఒంటెలు ఇవ్వవలసి ఉంటుంది. ముక్కును గనక సమూలంగా కోసినట్లయితే దీనికి కూడా పూర్తి పరిహారం చెల్లించవలసి ఉంటుంది. రెండు కళ్లు,

النَّفْسِ الدِّيَةَ: مِائَةٌ مِّنَ الْإِبِلِ، وَفِي الْأَنْفِ إِذَا أُوْعِبَ جَدْعُهُ الدِّيَةُ، وَفِي الْعَيْنَيْنِ الدِّيَةُ، وَفِي اللِّسَانِ الدِّيَةُ، وَفِي الشَّفَتَيْنِ الدِّيَةُ، وَفِي الذَّكَرِ الدِّيَةُ، وَفِي الْبَيْضَتَيْنِ الدِّيَةُ، وَفِي الصُّلْبِ الدِّيَةُ، وَفِي الرِّجْلِ الْوَاحِدَةِ نِصْفُ الدِّيَةِ، وَفِي الْمَأْمُومَةِ ثُلُثُ الدِّيَةِ، وَفِي الْجَائِفَةِ ثُلُثُ الدِّيَةِ، وَفِي الْمُنَقِّلَةِ خَمْسَ عَشَرَةَ مِنَ الْإِبِلِ، وَفِي كُلِّ إِصْبَعٍ، مِنْ أَصَابِعِ الْيَدِ وَالرِّجْلِ عَشْرٌ مِّنَ الْإِبِلِ، وَفِي السِّنِّ خَمْسٌ مِّنَ الْإِبِلِ، وَفِي الْمُوضِحَةِ خَمْسٌ مِّن الْإِبِلِ، وَإِنَّ الرَّجُلَ يُقْتَلُ بِالْمَرْأَةِ، وَعَلَىٰ أَهْلِ الذَّهَبِ أَلْفُ دِيْنَارٍ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيلِ، وَالنَّسَائِيُّ وَابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُوْدِ وَابْنُ حِبَّانَ وَأَحْمَدُ، وَاخْتَلَفُوا فِي صِحَّتِهِ.

నాలుక, రెండుపెదాలకు బదులుగా కూడా పూర్తి పరిహారం ఇచ్చుకోవలసి ఉంటుంది. అలాగే మర్మావయవానికి, వృషణాలకు, వెన్నుకు బదులుగా పూర్తి పరిహారం ఉంది. ఒక కాలిని పోగొట్టినందుకు సగం పరిహారం (50 ఒంటెలు), మెదడును, ఉదరాన్ని గాయపరిస్తే మూడో వంతు పరిహారం ఉంటుంది. ఎముక విరిగేంతగా గాయపరిస్తే పదిహేను ఒంటెలు, కాళ్లు చేతులకు సంబంధించిన ఒక్కో వ్రేలికి బదులుగా పదేసి ఒంటెలు, ఒక పన్నును విరగ్గొట్టినందుకు ఐదు ఒంటెలు, ఎముక కనిపించేటంతగా గాయపరిస్తే ఐదు ఒంటెలు పరిహారంగా ఇవ్వవలసి ఉంటుంది. పురుషుణ్ణి, స్త్రీకి బదులుగా-పరిహారంగా - చంపటం జరుగుతుంది. ఒంటెలు లేని వారివద్ద బంగారం ఉంటే వెయ్యి దీనార్లు వసూలు చేయబడతాయి." (అబూదావూద్ దీనిని తన 'మరాసీల్'లో లిఖించారు. నసాయి, ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్, ఇబ్నె హిబ్బాన్ మరియు అహ్మద్‌లు ఉల్లేఖించారు. దీని ప్రమాణబద్ధతపై వారు విభేదించారు)

## హదీసు ఉల్లేఖకులు

అబూబక్ర్ బిన్ ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ హజ్మ్. అన్సారీ. నజారీ. మదీనావాసులు. ఖాజీ. ఈయన అసలు పేరు మారుపేరు - రెండూ ఒక్కటేనని కొందరు, అబూ ముహమ్మద్ అనేది మారుపేరని మరికొందరు వాదించారు. దైవభక్తి పరాయణులు. ఆరు హదీసు గ్రంథాలలోనూ ఈయన ఉల్లేఖనాలున్నాయి. తాబయీలలో ఐదవ తరానికి చెందినవారు. నలభై ఏళ్లుగా ఆయన రాత్రిపూట పడకపై నడుం వాల్చలేదని ఆయన సతీమణి చెప్పింది.

ఇబ్నె మొయీన్ ఈయన్ని విశ్వసనీయులుగా ఖరారు చేశారు. ఇబ్నె సాద్ కథనం ప్రకారం ఈయన హిజ్రీ 120లో మరణించారు.

(١٠١٠) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «دِيَةُ الْخَطَإِ أَخْمَاساً، عِشْرُونَ حِقَّةً، وَعِشْرُونَ جَذَعَةً، وَعِشْرُونَ بَنَاتِ مَخَاضٍ، وَعِشْرُونَ بَنَاتِ لَبُونٍ، وَعِشْرُونَ بَنِي لَبُونٍ» أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ. وَأَخْرَجَهُ الْأَرْبَعَةُ بِلَفْظِ: «وَعِشْرُونَ بَنِي مَخَاضٍ» بَدَلَ «بَنِي لَبُونٍ»، وَإِسْنَادُ الْأَوَّلِ أَقْوَى، وَأَخْرَجَهُ ابْنُ أَبِي شَيْبَةَ مِنْ وَجْهٍ آخَرَ مَوْقُوفاً، وَهُوَ أَصَحُّ مِنَ الْمَرْفُوعِ.

1010. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) తెలిపారు : పొరపాటున చేసిన హత్యకు పరిహారంగా ఐదు రకాల ఒంటెలు వసూలు చేయబడతాయి. మూడు సంవత్సరాలు నిండిన 20 ఒంటెలు, నాలుగు సంవత్సరాలు నిండిన 20 ఒంటెలు, రెండు సంవత్సరాలు నిండిన 20 ఆడ ఒంటెలు, ఒక ఏడాది వయస్సు గల 20 ఆడ ఒంటెలు, ఒక ఏడాది వయస్సుగల 20 మగ ఒంటెలు" (సునన్ దారె ఖుత్నీ). కాగా; 'నలుగురు' చేసిన ఉల్లేఖనంలో "ఒక ఏడాది వయస్సుకు బదులు రెండేండ్లు నిండిన 20 మగ ఒంటెలు" అన్న వాక్యం ఉంది. హదీసు పరంపర రీత్యా మొదటి ఉల్లేఖనమే దృఢమైనది. ఇబ్నె అబూ షైబ వేరొక వర్గం నుండి 'మౌఖూఫ్'గా చేసిన కథనం ఈ 'మర్ఫూ' కథనం కన్నా దృఢంగా ఉంది.

وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ مِنْ طَرِيقِ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ، رَفَعَهُ: الدِّيَةُ ثَلَاثُونَ حِقَّةً، وَثَلَاثُونَ جَذَعَةً، وَأَرْبَعُونَ خَلِفَةً، فِي بُطُونِهَا أَوْلَادُهَا.

అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుంచి, ఆయన తన తాత గారి నుండి ఉటంకించిన హదీసును అబూదావూద్, తిర్మిజీలు పొందుపరచారు. అందులో ఇలా వుంది : "పరిహారంగా మూడేళ్లు నిండిన 30 ఒంటెలు, నాలుగేళ్లు నిండిన 30 ఒంటెలు, 40 నూడి ఒంటెలు వసూలు చేయబడతాయి."

(١٠١١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِنَّ أَعْتَى النَّاسِ عَلَى اللهِ ثَلَاثَةٌ: مَنْ قَتَلَ فِي حَرَمِ اللهِ، أَوْ قَتَلَ غَيْرَ قَاتِلِهِ، أَوْ قَتَلَ لِذَحْلِ الْجَاهِلِيَّةِ». أَخْرَجَهُ ابْنُ حِبَّانَ فِي حَدِيثٍ، صَحَّحَهُ.

1011. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు : మూడు రకాల వ్యక్తులు అల్లాహ్ యెడల తీవ్ర మయిన ధిక్కారానికి పాల్పడినవారుగా పరిగణించబడతారు - 1. అల్లాహ్ నిషిద్ధపరచిన క్షేత్రంలో హత్య చేసిన వాడు. 2. తన వాళ్ళను హత్యచేయని వ్యక్తిని హతమార్చేవాడు. 3. అజ్ఞాన కాలపు పాత కక్షల, శత్రుత్వాల ప్రాతి పదికపై హత్యకు పాల్పడేవాడు. (ఇబ్నె హిబ్బాన్ ఒక హదీసును వివరిస్తూ దీన్ని ఉదాహరించారు. దీనిని ఆయన ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులో దేవుని పట్ల ధిక్కార వైఖరికి, తలబిరుసుతనానికి ఒడిగట్టే మూడు రకాల మనుషులు ప్రస్తావించబడ్డారు. వారిలో ఒకడు శాంతికి నిలయమైన పవిత్ర మక్కా నగరంలో హత్యాకాండకు ఒడిగట్టే దౌర్భాగ్యుడు. అసలు హత్య చేయటమే మహాపరాధం. అందునా దేవుని పుణ్యక్షేత్ర పరిధిలో (మక్కా మరియు మదీనాలలో) హత్య చేయటమంటే అది మరింత దారుణ మారణంగా భావించబడుతుంది. స్థలాన్నిబట్టి కూడా అపరాధం యొక్క తీవ్రత లెక్కించబడుతుందని దీన్నిబట్టి విదితమవుతున్నది. బహుశా ఈ కారణంగానేనేమో, మక్కా మదీనావంటి పుణ్యస్థలాలలో పారపాటున హత్యచేసిన వ్యక్తి నుండి కూడా భారీ స్థాయిలో పరిహారం తీసుకోబడుతుందని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అన్నారు.

అసలు హంతకుణ్ణే గాకుండా, మరొక వ్యక్తిని కూడా చంపటం మహాపరాధం. హంతకుణ్ణి శిక్షించే బాధ్యత ప్రభుత్వానిది. అయితే ప్రతీకార భావంతో రగిలిపోతూ హంతకునితోపాటు హంతకుని బంధువులనో, హంతకుని అన్నదమ్ములనో చంపటం చాలా తీవ్రమయిన విషయం. ఇటువంటి అఘాయిత్యానికి పాల్పడినవాడు దైవాజ్ఞలను ఉల్లంఘించినవాడుగా భావించబడతాడు.

(١٠١٢) وعَنْ عَبْدِاللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ رَسُولَ اللهِ

1012. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

ﷺ قَالَ: «أَلاَ إِنَّ دِيَةَ ٱلْخَطَإِ وشِبْهِ الْعَمْدِ، مَا كَانَ بِالسَّوْطِ وَالْعَصَا، مِائَةٌ مِنَ ٱلإِبِلِ، مِنْهَا أَرْبَعُونَ فِي بُطُونِهَا أَوْلاَدُهَا». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَآئِيُّ وَابْنُ ماجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

ఇలా ప్రవచించారు: పొరబాటున చేసిన హత్యకు చెల్లించే పరిహారమూ, కొరడా దెబ్బలవల్ల లాఠీ దెబ్బలవల్ల చనిపోయి నందుకు చెల్లించే పరిహారం ఒకేవిధంగా ఉంటాయి. పరిహారంగా ఇచ్చే (నూరు) ఒంటెలలో నలభై నూడి ఒంటెలై ఉండాలి. (దీనిని అబూదావూద్, నసాయి, ఇబ్నె మాజా సేకరించగా, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు)

(١٠١٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، قَالَ: «هٰذِهِ وَهٰذِهِ سَوَاءٌ يَعْنِي الْخِنْصَرَ وَٱلإِبْهَامَ». رَوَاهُ الْبُخَارِيُّ.

1013. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఇది మరియు ఇది - అంటే చిటికెన వ్రేలునూ, బొటన వ్రేలు సమానమే." (బుఖారీ)

وَلأَبِي دَاوُدَ وَالتِّرْمِذِيِّ: ٱلأَصَابِعُ سَوَآءٌ وَٱلأَسْنَانِ سَوَآءٌ، الثَّنِيَّةُ والضِّرْسُ سَوَآءٌ.

అబూదావూద్, తిర్మిజీల ఉల్లేఖనంలో ఉంది - వ్రేళ్ళన్నీ సమానమే. పళ్లన్నీ సమానమే. ముందున్న పళ్లు, లోపలి దంతాలు కూడా సమానమే. (కాబట్టి వీటన్నింటికీ చెల్లించబడే పరిహారం కూడా ఒక్కటే)

وَلاِبْنِ حِبَّانَ: دِيَةُ أَصَابِعِ الْيَدَيْنِ وَالرِّجْلَيْنِ سَوَآءٌ، عَشْرٌ مِّنَ ٱلإِبِلِ لِكُلِّ إِصْبَعٍ.

ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: కాళ్లు మరియు చేతుల వ్రేళ్లన్నింటికీ పరిహారం సమానమే. ఒక్కో వ్రేలికి పది ఒంటెల చొప్పున ఇవ్వవలసి ఉంటుంది."

(١٠١٤) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، رَفَعَهُ، قَالَ: مَنْ تَطَبَّبَ، وَلَمْ يَكُنْ بِالطِّبِّ مَعْرُوفاً، فَأَصَابَ نَفْساً فَمَا دُوْنَهَا، فَهُوَ ضَامِنٌ. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَهُوَ عِنْدَ أَبِي دَاوُدَ والنَّسَائِيِّ وَغَيْرِهِمَا، إِلاَّ أَنَّ مَنْ أَرْسَلَهُ أَقْوَى مِمَّنْ وَصَلَهُ.

1014. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుంచి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు : ''వైద్య సేవలో తనకు ప్రావీణ్యం లేకపోయినప్పటికీ తన్ను తాను వైద్యునిగా ప్రకటించుకుని మందులు ఇచ్చే వ్యక్తి (లోపభూయిష్ట చికిత్స) వల్ల మనిషి చచ్చిపోయినా, లేదా ఎవరికయినా ఏదైనా నష్టం వాటిల్లినా దానంతటికీ ఆ వ్యక్తే బాధ్యుడు.'' (దీనిని దారె ఖుత్నీ ఉల్లేఖించారు - హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అబూ దావూద్, నసాయి తదితర గ్రంథాలలో కూడా ఈ ఉల్లేఖనం ఉంది. అయితే దీనిని 'మౌసూల్'గా చేసిన కథనం కన్నా 'ముర్సల్'గా చేసిన కథనమే దృఢమైనదిగా ఉంది)

**సారాంశం**

అంటే ఎవరయినా వైద్య వృత్తిలో తగిన ప్రావీణ్యం, అనుభవం లేకపోయినప్పటికీ తనను గొప్ప వైద్యునిగా ఊహించుకుని బాధ్యతారహితంగా ట్రీట్‌మెంట్ చేస్తే, తత్కారణంగా వ్యాధిగ్రస్తులకు ఏదైనా పెద్ద నష్టం (ప్రాణనష్టం) వాటిల్లితే లేదా ఏదైనా శరీరావయవం చెడిపోతే ఈ నష్టానికంతటికీ ఆ వైద్యుడే బాధ్యుడు. తనవల్ల జరిగిన ఈ కీడుకుగాను అతడు నష్టపరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఒకవేళ అతడు ఆ పరిహారం చెల్లించలేకపోతే, ఆ భారం అతని వారసులపై కూడా వేయబడుతుంది. అల్లామా ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మతై) 'జాదుల్ మఆద్'లో వైద్యుడు తీసుకోవలసిన 20 జాగ్రత్తలను విశదీకరించారు. మిడిమిడి జ్ఞానంతో చేసిన చికిత్స వల్ల కలిగిన కీడుకుగాను అతన్నుండి పరిహారం వసూలు చేసే విషయంలో ధర్మవేత్తలందరి మధ్య ఏకాభిప్రాయముంది.

(١٠١٥) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «فِي الْمَوَاضِحِ خَمْسٌ خَمْسٌ مِّنَ الْإِبِلِ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ. وَزَادَ أَحْمَدُ: «وَالْأَصَابِعُ سَوَآءٌ كُلُّهُنَّ، عَشْرٌ عَشْرٌ مِنَ الْإِبِلِ»، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ.

1015. అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుంచి, ఆయన తన తాతగారి నుంచి చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఏ గాయం వల్ల ఎముక స్పష్టంగా కనిపిస్తుందో దానికి ఐదు ఒంటెలు పరిహారంగా ఇవ్వవలసి ఉంటుంది." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు) అహ్మద్ అదనంగా ఈ వాక్యం చేర్చారు : "వ్రేళ్లన్నింటికీ పరిహారం సమానమే. అంటే ఒక్కో వ్రేలికి పదేసి ఒంటెలు." (ఈ ఉల్లేఖనాన్ని ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్‌లు ప్రామాణికంగా ఖరారు చేశారు)

**సారాంశం**

కోట్లాట సందర్భంగా దెబ్బతగిలి, గాయమై ఎముక మాత్రం విరగకుండా ఎముక నుంచి మాంసం వేరైపోతే అట్టి పరిస్థితిలో ఐదు ఒంటెలను బాధితునికి పరిహారంగా ఇవ్వటం అనివార్యం. షాఫయీల, హనఫీల, ప్రవక్త సహచరుల్లోని ఒక పెద్ద వర్గం యొక్క అభిమతం కూడా ఇదే. అయితే వ్రేళ్లు తెగిపోతే మాత్రం ఒక్కో వ్రేలికిగాను పదేసి ఒంటెల చొప్పున ఇవ్వవలసి ఉంటుంది.

(١٠١٦) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عَقْلُ أَهْلِ الذِّمَّةِ نِصْفُ عَقْلِ الْمُسْلِمِينَ» رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ. وَلَفْظُ أَبِي دَاوُدَ: «دِيَةُ الْمُعَاهَدِ نِصْفُ دِيَةِ

1016. ఈ ఉల్లేఖనం కూడా ఆయన చేతనే ఉల్లేఖించబడింది. దీని ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "జిమ్మీలకు చెల్లించే పరిహారం ముస్లింలకు చెల్లించే పరిహారంలో సగభాగమై ఉంటుంది." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. అబూదావూద్‌లోని వాక్యం ఈ విధంగా ఉంది: "జిమ్మీకి ఇవ్వబడే పరిహారం

الْحُرِّ». وَلِلنَّسَائِيِّ: «عَقْلُ الْمَرْأَةِ مِثْلُ عَقْلِ الرَّجُلِ، حَتَّى يَبْلُغَ الثُّلُثَ مِنْ دِيَتِهَا». وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

స్వతంత్రునికి ఇచ్చే పరిహారంలో సగ భాగమై ఉంటుంది." నసాయిలోని ఉల్లే ఖనంలో ఇలా ఉంది - "స్త్రీకి ఇవ్వబడే పరిహారం కూడా పురుషునికి ఇవ్వబడే పరిహారం లాంటిదే. అయితే ఈ సమా నత మూడో వంతు పరిహారం వరకే వర్తిస్తుంది." (దీనిని ఇబ్నె ఖుజైమ ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

**సారాంశం**

1. 'జిమ్మీ'కి చెల్లించే శుల్కం (దియత్) ఒక ముస్లింకు చెల్లించే శుల్కంలో సగభాగమై ఉంటుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఇస్లామీయ రాజ్యంలో తాను కూడా పౌరులందరివలెనే ప్రశాంతంగా జీవించటానికి, రాజ్య శాసనాలు తనకు అన్నివిధాలా రక్షణ కల్పించేలా ఒప్పందం కుదుర్చుకునే 'అవిశ్వాసి'ని 'జిమ్మీ'గా వ్యవహరిస్తారు. అతని ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించవలసిన పూర్తి బాధ్యత ఇస్లామీయ వ్యవస్థపై ఉంటుంది.

2. స్త్రీలకు ఇవ్వబడే పరిహారం కూడా పురుషులకు ఇచ్చే పరిహారంలో సగమే అయి ఉంటుంది. అయితే నష్టం మూడో వంతుకు మాత్రమే పరిమితమై వున్న పక్షంలో స్త్రీ పురుషులందరికీ పరిహారం సమానంగా వర్తిస్తుంది. ఉదాహరణకు : ఒక స్త్రీకి, ఒక పురుషునికి- ఇద్దరిలో ఒక్కొక్కరికి మూడేసి వ్రేళ్లు తెగిపోయాయి. ఇట్టి పరిస్థితిలో ఒక్కో వ్రేలికి పదేసి ఒంటెల చొప్పున స్త్రీకి 30 ఒంటెలు, పురుషునికి కూడా 30 ఒంటెలు - పరిహారంగా - లభించాయి. ఇక్కడి వరకూ ఇద్దరూ సమానులే. అయితే స్త్రీకి నాలుగు వ్రేళ్లు తెగాయి, పురుషునికి కూడా నాలుగు వ్రేళ్లే తెగాయనుకోండి. ఈ స్థితిలో పురుషునికి 40 ఒంటెలు పరిహారంగా లభించగా, స్త్రీకి 20 ఒంటెలు మాత్రమే లభిస్తాయి. ఎందుకంటే 'నలభై' సంఖ్య నూరులో మూడో వంతుకు మించిపోయింది. అందుకే ఇట్టిస్థితిలో స్త్రీకి లభించే పరిహారం పురుషునికి లభించే పరిహారంలో సగం అయిపోయింది.

(١٠١٧) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عَقْلُ شِبْهِ الْعَمْدِ مُغَلَّظٌ، مِثْلُ عَقْلِ الْعَمْدِ، وَلاَ يُقْتَلُ صَاحِبُهُ،

1017. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ్‌లై) గారి చేతనే ఉటంకించబడిన కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఖత్లె షిబెహ్ అమద్"కు గాను ఇవ్వబడే పరిహారం ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్య

وَذٰلِكَ أَنْ يَنْزُوَ الشَّيْطَانُ فَيَكُونَ دَماً بَيْنَ النَّاسِ فِي غَيْرِ ضَغِينَةٍ، وَلاَ حَمْلِ سِلاَحٍ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَضَعَّفَهُ.

మాదిరిగా కఠినమైన పరిహారమే. అందుచేత హంతకుణ్ణి హతమార్చటం జరగదు. షైతాన్ వారి మధ్య ఎక్కడైనా జొరబడి ఎలాంటి శత్రుత్వం లేకుండానే, ఆయుధాలు కూడా లేకుండానే మరేదైనా వంకతో హత్యాకాండ మొదలయ్యేందుకు ఇందులో అస్కార ముంది.'' (దీనిని దారెఖుత్నీ వెలికి తీశారు. దీనిని బలహీన హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

హదీసులో 'ఖత్లె షిబెహ్ అమద్' అనే పదం వచ్చింది. అంటే కోపావస్థలో తేలికపాటి వస్తువులతో - సాధారణంగా మనిషి మరణానికి దారితీయని వస్తువులతో - కొట్టడం వల్ల మనిషి చనిపోతే దీనిని 'ఖత్లె షిబెహ్ అమద్' గా వ్యవహరిస్తారు. ఇది కూడా ఒకవిధంగా ఉద్దేశ్యపూర్వకహత్యే గాని దీనికి 'ఖిసాస్' ఉండదు.

(١٠١٨) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَتَلَ رَجُلٌ رَجُلاً عَلَى عَهْدِ رَسُولِ اللهِ ﷺ، فَجَعَلَ النَّبِيُّ ﷺ دِيَتَهُ اثْنَيْ عَشَرَ أَلْفاً. رَوَاهُ الْأَرْبَعَةُ، وَرَجَّحَ النَّسَائِيُّ وَأَبُو حَاتِمٍ إِرْسَالَهُ.

1018. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ''దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఒక వ్యక్తి మరో వ్యక్తిని హతమార్చగా, దైవప్రవక్త (నఅనం) అతనిపై వన్నెండువేల పరిహారం విధించారు.'' (దీనిని నలుగురు ఉల్లేఖించారు. నసాయి, అబూ హాతిం లిరువురూ ఈ ఉల్లేఖనం 'ముర్సల్' అయి ఉంటుందనడానికే ప్రాధాన్యమిచ్చారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే, ఒకవేళ పరిహారం చెల్లించవలసిన వారి వద్ద ఒంటెలు లేకపోయినట్లయితే నగదు రూపంలోనే పరిహారం వసూలు చేయవచ్చు. ఆ నగదు దీనారు రూపంలో వున్నా, దిర్హమ్ రూపంలోవున్నా, రూపాయి నోటుగా వున్నా ఫరవా లేదు. అయితే మార్కెట్టులో ఒంటె ధరను బట్టి మొత్తం నగదును నిర్ధారించవలసి ఉంటుంది.

(١٠١٩) وَعَنْ أَبِي رِمْثَةَ قَالَ: أَتَيْتُ النَّبِيَّ ﷺ، وَمَعِيَ ابْنِيْ، فَقَالَ: «مَنْ هَذَا؟» فَقُلْتُ: ابْنِيْ، وَأَشْهَدُ بِهِ، فَقَالَ: «أَمَا إِنَّهُ لاَ يَجْنِي عَلَيْكَ. وَلاَ تَجْنِي عَلَيْهِ». رَوَاهُ النَّسَائِيُّ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ.

1019. హజ్రత్ అబూరిమ్సా (రజి) కథనం: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో హాజరయ్యాను. నాతోపాటు నా కుమారుడు కూడా నా వెంట ఉన్నాడు. "ఇతనెవరు?" అని ఆయన (సఅసం) అడగ్గా "ఇతను నా కుమారుడు. ఈ విషయానికి తమరు సాక్షిగా ఉండాలి" అని నేను విన్నవించుకున్నాను. దానికి ఆయన (సఅసం), "నీ పాపాల, అపరాధాల బాధ్యత ఇతనిపై లేదు. అలాగే ఇతని అపరాధాల బాధ్యత నీపై లేదు"అని చెప్పారు. (దీనిని నసాయి, అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్‌లు దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

## సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడే ముఖ్య విషయమేమిటంటే, రక్తపరిహారం విషయంలో అపరాధిని తప్ప అతనికి బదులుగా మరోవ్యక్తిని పట్టుకోవటం జరగదు. ఆఖరికి తండ్రికి బదులుగా కొడుకునుగానీ, కొడుకుకు బదులుగా తండ్రినిగానీ పట్టుకోవటం జరగదు. మరి 'పొరబాటున చేసిన హత్య'కు గాను చెల్లించవలసిన పరిహారపు భారాన్ని వ్యాఖ్యాతలు వారసులపై మోపారుగదా! అన్న ప్రశ్న ఈ సందర్భంగా జనించవచ్చు. దీనికి జవాబు ఏమిటంటే; ఇది 'భారం'కాదు, సహకారభావం, ఆర్థిక సహాయం క్రిందికి వస్తుంది. సౌభ్రాతృత్వ భావం కోరే దయాదాక్షిణ్యాల వ్యవహారాన్ని దృష్టియందుంచుకుని, ఒక కుటుంబాన్ని నిలబెట్టే దృక్పథంతో ఈ చేయూత నివ్వబడుతుందన్నమాట! ఇలాంటి సద్వ్యవహారానికి సంబంధిత వ్యక్తులు సంతోషంతో ముందుకు వస్తుంటారు. తమలోని ఒక సోదరునిపై వచ్చిన ఆపదను తొలగించడానికి తలా ఓ చేయి వేస్తారు. ఎందుకంటే రేపటి రోజున అలాంటి ఆపదకు ఎవరయినా గురికావచ్చు. అలాంటి పరిస్థితుల్లో ఒండొకరికి చేదోడు వాదోడుగా ఉండాలి. మానవనైజం వాంఛించేది, మానవ సమాజం కాంక్షించేది కూడా ఇదే.

## హదీసు ఉల్లేఖకులు

అబూరిమ్సా (రజి) : ఒక కథనం ప్రకారం ఈయన పేరు హబీబ్ బిన్ హైయాన్. వేరొక

కథనం ప్రకారం రిఫాఅ బిన్ యస్రిబీ. తైమ్ తెగకు చెందినవారు. సుప్రసిద్ధ సహాబీ. కూఫాకు చెందిన సహాబీగా పరిగణించబడతారు.

**2వ అధ్యాయం**

## నిందారోపణలు, దైవంపై ప్రమాణం చేసి చెప్పటం

## ٢ - بَابُ دَعْوَى الدَّمِ وَالقَسَامَةِ

1020. హజ్రత్ సహ్ల్ బిన్ అబూ హస్మ (రజి) తన తెగకు చెందిన పెద్దవారు చెప్పిన వృత్తాంతాన్ని వివరించారు: (దీని ప్రకారం) అబ్దుల్లా బిన్ సహ్ల్, ముహైయ్యిస బిన్ మస్ఊద్ (రజి) తన పేదరికం దృష్ట్యా ఖైబర్‌కు వలసపోయేందుకు బయలుదేరారు. అయితే ముహైయ్యిసకు "అబ్దుల్లా బిన్ సహ్ల్ (రజి) హత్య చేయబడ్డారనీ, హంతకులు ఆయన్ని ఒక బావిలో పడవేశార"ని సమాచారమందింది. తరువాత ముహైయ్యిస యూదుల దగ్గరకు వచ్చి, "దైవసాక్షి! మీరే ఆయన్ని చంపేశారు" అని నిందించారు. దానికి వారు, "దేవుని తోడుగా చెబుతున్నాము- మేము ఆయన్ని చంపలేదు" అని అన్నారు. ఆ తరువాత ముహైయ్యిస, అతని సోదరుడు హువైయ్యిస మరియు అబ్దుర్రహ్మాన్ బిన్ సహ్ల్ - ముగ్గురూ కలసి దైవప్రవక్త (సఅసం) న్యాయస్థానానికి వచ్చారు. జరిగినదంతా ముహైయ్యిస చెప్పబోయారు. "పెద్దాయన, పెద్దాయన" అని దైవప్రవక్త (సఅసం) అన్నారు. అంటే, మీలో వయసులో ఎవరు పెద్దవారో వారు మాట్లాడాలి

(١٠٢٠) وَعَنْ سَهْلِ بْنِ أَبِي حَثْمَةَ، عَنْ رِجَالٍ مِّنْ كُبَرَآءِ قَوْمِهِ، أَنَّ عَبْدَ اللهِ بْنَ سَهْلٍ وَمُحَيِّصَةَ بْنَ مَسْعُودٍ خَرَجَا إِلَى خَيْبَرَ، مِنْ جَهْدٍ أَصَابَهُمْ، فَأَتَى مُحَيِّصَةُ، فَأَخْبَرَ أَنَّ عَبْدَاللهِ بْنَ سَهْلٍ قَدْ قُتِلَ، وَطُرِحَ فِيْ عَيْنٍ، فَأَتَى يَهُودَ، فَقَالَ: أَنْتُمْ وَاللهِ قَتَلْتُمُوهُ، قَالُوا: وَاللهِ مَا قَتَلْنَاهُ، فَأَقْبَلَ هُوَ، وَأَخُوهُ حُوَيِّصَةُ، وَعَبْدُ الرَّحْمٰنِ بْنُ سَهْلٍ، فَذَهَبَ مُحَيِّصَةُ لِيَتَكَلَّمَ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «كَبِّرْ كَبِّرْ»، يُرِيْدُ السِنَّ. فَتَكَلَّمَ حُوَيِّصَةُ، ثُمَّ تَكَلَّمَ مُحَيِّصَةُ، فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «إِمَّا أَنْ يَدُوا صَاحِبَكُمْ، وَإِمَّا أَنْ يَأْذَنُوا بِحَرْبٍ»، فَكَتَبَ

إِلَيْهِمْ فِي ذٰلِكَ كِتَاباً، فَكَتَبُواْ: إِنَّا وَاللهِ مَا قَتَلْنَاهُ، فَقَالَ لِحُوَيِّصَةَ، وَمُحَيِّصَةَ، وَعَبْدِ الرَّحْمٰنِ بْنِ سَهْلٍ: «**أَتَحْلِفُونَ، وَتَسْتَحِقُّونَ دَمَ صَاحِبِكُمْ؟**» قَالُوا: لاَ، قَالَ: «**فَيَحْلِفُ لَكُمْ يَهُودُ**»، قَالُوا: لَيْسُوا مُسْلِمِيْنَ، فَوَدَاهُ رَسُولُ اللهِ ﷺ مِنْ عِنْدِهِ، فَبَعَثَ إِلَيْهِمْ مِائَةَ نَاقَةٍ، قَالَ سَهْلٌ: فَلَقَدْ رَكَضَتْنِيْ مِنْهَا نَاقَةٌ حَمْرَآءُ. مُتَّفَقٌ عَلَيْهِ.

అన్నది ఆయన (స) ఉద్దేశ్యం. అప్పుడు హువైయ్యిస ఫిర్యాదు చేశారు. అనం తరం ముహైయ్యిస వివరంగా చెప్పారు. ఇదంతా విని "వాళ్లు మీ మనిషికి రక్తపరిహారమన్నా ఇవ్వాలి లేదా మీతో యుద్ధానికైనా సిద్ధంగా ఉండాలి" అని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. ఆ తరు వాత ఆయన (స) ఈ వ్యవహారం గురించి వాళ్లకు లేఖ వ్రాశారు. దానికి సమాధానంగా వాళ్లు (యూదులు), "దైవసాక్షి! మేము ఆయన్ని హత్య చేయలేదు" అని సంజాయిషీ వ్రాసి పంపారు. అప్పుడు దైవప్రవక్త (స) హువైయ్యిస, ముహైయ్యిస, అబ్దుర్ర హ్మాన్ బిన్ సహ్ల్ (రజి)ల నుద్దేశ్యించి, "మీరు దేవునిపై ప్రమాణం చేసి మీ మనిషి రక్త పరిహారం కొరకు దావా చేయగలరా?" అని అడిగారు. "లేదు" అని వారు సమాధానమిచ్చారు. "పోనీ, మీ సమక్షంలో యూదుల చేత ప్రమాణం చేయించనా?" అని దైవప్రవక్త (స) ప్రశ్నించగా, "వారు ముస్లింలు కారు కదా! (వారి ప్రమాణాలను నమ్మేదెలా?)" అని వారు బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) హతుని రక్త పరిహారాన్ని తన వద్దనుంచి (కోశా గారం నుంచి) చెల్లించారు. పరిహారంగా వారివద్దకు నూరు ఒంటెలను పంపిం చారు. "వాటిలోని ఒక ఎర్రని ఒంటె తనను కాలితో తన్నింద"ని సహ్ల్ (రజి) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

హంతకుడు ఫలానా వ్యక్తి అని ఇదమిత్థంగా తెలియకుండా - సందిగ్ధావస్థ ఏర్పడినప్పుడు అనుమానం వున్న వ్యక్తులచేత 'ప్రమాణాలు' చేయించవచ్చని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ పద్ధతి అజ్ఞాన కాలంలోనూ అమల్లో ఉండేది. ఇస్లాం కూడా ఈ పద్ధతిని సమ్మతించింది. ఈ సందర్భంగా మొత్తం యాభైమంది చేత ప్రమాణాలు చేయించబడతాయి. మేముగానీ, మా తెగ (వర్గం) వారుగానీ, మా గ్రామస్థులుగానీ, ఈ పాపం ఎరుగరు అని ప్రమాణ సందర్భంగా ప్రకటించాలి. అయితే ఈ రకమయిన ప్రమాణం కేవలం రక్తపరిహారపు కేసులోనే ఉంటుంది. ఇతర అపరాధాలకు ఇది వర్తించదు. ప్రమాణం ఇరు పక్షాలలో ఎవరి తరపున అయినా చేయించవచ్చు. హతుని తరపు వారసులు ప్రమాణం చేస్తున్నప్పుడు; "మా మనిషిని చంపిన వాళ్ళు వీళ్ళే" అని ప్రకటించవలసి ఉంటుంది. నిందితుని తరపు మనుషులు ప్రమాణం చేస్తున్నప్పుడు; తాము ఈ ఘోరానికి పాల్పడలేదని 50 మంది ప్రమాణం చేసి మరీ చెప్పవలసి ఉంటుంది. సామూహిక వ్యవహారాలు చేస్తున్నప్పుడు తొలుత పెద్దవాళ్ల మాటలకు ప్రాధాన్యమివ్వాలని కూడా ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

1. అబ్దుల్లాహ్ బిన్ సహ్ల్ (రజి) : అబ్దుల్లాహ్ బిన్ సహ్ల్ బిన్ జైద్ బిన్ కాబ్ బిన్ ఆమిర్ అన్సారీ హారిసీ. ఖైబర్‌లో హత్య చేయబడ్డారు. ఈయన మృతదేహం ఒక బావిలో కనిపించింది. ఆయన మెడ విరిచివేయబడింది.

2. ముహైయ్యిస (రజి) : అబూ సయీద్ ముహైయ్యిస బిన్ మస్‌ఊద్ బిన్ కాబ్ హారిసీ-అన్సారీ - మదనీ. హతులైన అబ్దుల్లాహ్ బిన్ సహ్ల్ (రజి) గారి బాబాయి కుమారుడు. సుప్రసిద్ధ సహాబీ. హిజ్రత్‌కు ముందే ఇస్లాం స్వీకరించారు. ఉహుద్, కందక యుద్ధాలతోసహా ముఖ్య సంగ్రామాలన్నింటిలోనూ పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని ఇస్లాం ధర్మప్రచారం నిమిత్తం 'ఫిదక్' ప్రాంతానికి పంపించారు.

3. హువైయ్యిస (రజి) : ఈయన ముహైయ్యిస గారి పెద్దన్న. హిజ్రీ 3వ సంవత్సరంలో ఇస్లాం స్వీకరించారు. ఉహుద్, కందక పోరాటాలతో పాటు, ఇతర యుద్ధాలలో కూడా దైవప్రవక్త (స) తో కలసి పాల్గొన్నారు.

4. అబ్దుర్రహ్మాన్ బిన్ సహ్ల్ (రజి) : ఈయన అబ్దుల్లాహ్ బిన్ సహ్ల్ గారి సోదరులు. ఈయన తల్లి పేరు లైలా బిన్తె నాఫె బిన్ ఆమిర్. ఈయన కూడా బద్ర్, ఉహుద్‌లతో సహా ముఖ్య పోరాటాలన్నింటిలో పాల్గొన్నారని అనబడుతోంది. ఒకసారి ఈయనకు పాము కాటేసింది. దైవప్రవక్త (స) సూచనానుసారం అమ్మారా బిన్ హజ్మ్ దివ్య ఖుర్‌ఆన్‌లోని సూక్తులను పఠించి ఈయనపై ఊదారు.

(١٠٢١) وَعَنْ رَجُلٍ مِّنَ الْأَنْصَارِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ أَقَرَّ الْقَسَامَةَ عَلَىٰ مَا كَانَتْ عَلَيْهِ فِي الْجَاهِلِيَّةِ، وَقَضَى بِهَا رَسُولُ اللهِ ﷺ بَيْنَ نَاسٍ مِّنَ الْأَنْصَارِ، فِي قَتِيلٍ ادَّعَوْهُ عَلَى الْيَهُودِ. رَوَاهُ مُسْلِمٌ.

1021. ఒక అన్సార్ సహాబీ కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అజ్ఞాన కాలం నాటి 'ప్రమాణాలను' యధాతథంగా కొనసాగించారు. అన్సార్ వర్గానికి చెందిన కొంత మంది మధ్య ఆయన (సఅసం) నిలబడి హతునికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఈ హత్యారోపణ యూదులపై చేయబడింది. (ముస్లిం)

**సారాంశం**

అజ్ఞానకాలం నాటి 'ప్రమాణాల' రీతి ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చింది. ఈ రీతిని దైవప్రవక్త (స) కొనసాగించారు. దీని పుట్టుపూర్వోత్తరాల్లోకి వెళ్ళి చూస్తే మక్కాలో ఒక ఖుర్రైష్ వ్యక్తి హాష్మీ వర్గానికి చెందిన ఒక మనిషిని హత్య చేశాడు. ఈ హత్య మూలంగా చాలా ఉద్రిక్తత నెలకొంది. హంతకుడు తనపై మోపబడిన ఆరోపణను త్రోసిపుచ్చాడు. ఆ క్లిష్ట పరిస్థితిలో అబూతాలిబ్ **నిలబడి మూడు ప్రతిపా**దనలు చేశారు : ఆ మూడింటిలో ఏదో ఒకదానిని ఎన్నుకోవచ్చని సలహా ఇచ్చారు. **అవేమంటే**; మాకు రక్తపరిహారమన్నా ఇవ్వండి. **లేదా** 50 మందిచే తాము ఈ నేరానికి పాల్పడలేదని ప్రమాణాలు అన్నా చేసి మరీ చెప్పించండి. **లేదా** హంతకుడన్న నిందారోపణ ఆధారంగా **మేము** ఇతన్ని హతమార్చడానికైనా అనుమతి ఇవ్వండి. ఆ రోజునుంచీ హత్యానేరంపై **అనుమానం రేకెత్తి**నపుడు ప్రమాణాలు చేయించే రివాజు కొనసాగుతూ వస్తోంది. నిందితునికి సంబంధించిన వారు ఈ ప్రమాణాలు గనక చేసినట్లయితే వారి నుంచి ఎలాంటి రక్తపరిహారం వసూలు చేయబడదు. ఈ వ్యవహారంలో ఇస్లామీయ షరీయత్ అవిశ్వాసుల ప్రమాణాలను సయితం స్వీకరిస్తుంది. అజ్ఞాన కాలం నాటి మంచి విషయాలను ఇస్లాం యధాతథంగా ఉంచిందని, వాటిని మార్చలేదని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

## ٣ - بَابُ قِتَالِ أَهْلِ الْبَغْيِ

## 3వ అధ్యాయం

## తిరుగుబాటుదారులపై యుద్ధం

(١٠٢٢) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ حَمَلَ عَلَيْنَا السِّلَاحَ فَلَيْسَ مِنَّا**». مُتَّفَقٌ عَلَيْهِ.

1022. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు : "మాకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టిన వానితో మాకెలాంటి సంబంధం లేదు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ముస్లింలు పరస్పరం అన్నదమ్ముల్లా మెలగాలనీ, ప్రేమైక భావంతో జీవనయాత్ర సాగించాలని ఇస్లాం ప్రబోధిస్తోంది. ఇంకా వారు పరస్పరం సానుభూతి, సహకారభావంతో వ్యవహరించాలనీ, ఒండొకరి శ్రేయాన్ని అభిలషిస్తూ ఉండాలని అది ఉపదేశిస్తున్నది. ఈ హదీసు ప్రకారం ఒక ముస్లిం మరో ముస్లింకు వ్యతిరేకంగా కత్తి కట్టడం, కయ్యానికి కాలుదువ్వటం ఇస్లాం ప్రబోధనలకు పూర్తిగా విరుద్ధం అన్నమాట! అందుకే మహనీయ ముహమ్మద్ (స) వారు స్పష్టంగా వక్కాణించారు - "మాకు వ్యతిరేకంగా ఆయుధమెత్తిన వానితో మాకెలాంటి సంబంధం లేద"ని!

ముస్లింల పనైతే పరస్పర సహాయసహకారాలేగాని పోట్లాటలు, కొట్లాటలు కావు. ఇలాంటి విచ్ఛిన్నకర కార్యకలాపాలకు తిరుగుబాటు భావాలు గలవారు మాత్రమే పాల్పడతారు. ఎవరయితే సమాజంలో అరాచకం, అలజడులను సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారో అటువంటివారిపై - ఖుర్ఆన్ ప్రకారం - యుద్ధ ప్రకటన చేయాలి. వారు తమ ఈ నకారాత్మక ధోరణిని మానుకోనంతవరకూ వారి మెడలు వంచే ప్రయత్నం చేయాలి. "వాళ్లు తమ తిరుగుబాటు ధోరణిని మాని దైవాజ్ఞ వైపునకు మరలిరానంత వరకూ వారితో యుద్ధం చేయండి" అని ఖుర్ఆన్ అంటోంది.

(١٠٢٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ خَرَجَ عَنِ الطَّاعَةِ، وَفَارَقَ الْجَمَاعَةَ، وَمَاتَ، فَمِيتَتُهُ مِيتَةٌ جَاهِلِيَّةٌ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1023. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరయినా నాయకునికి విధేయత చూపడానికి నిరాకరిస్తే, ముస్లింల సామూహిక వ్యవస్థ నుండి వేరుపడి పోయి ఉండగా ఆ స్థితిలోనే అతన్ని మృత్యువు కబళిస్తే, అతని ఈ మరణం అజ్ఞానావస్థకు చెందిన మరణం అవుతుంది." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఒక వ్యక్తి ఏవో కొన్ని విషయాల్లో విభేదించి ముస్లింల సామూహిక వ్యవస్థకు దూరమైనంతమాత్రాన - కేవలం ఈ వేర్పాటు ప్రాతిపదికపై - అతనిపై చర్య తీసుకోవటం భావ్యం కాదు. అతన్ని అతని మానాన వదలిపెట్టాలి. వేర్పడిన తరువాత అతను గనక తిరుగుబాటు ధోరణిని అవలంబిస్తే మాత్రం అప్పుడతనిపై చర్య తీసుకోవచ్చు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే; నాయకుడైనవాడు (అమీర్) బహిరంగంగా షరీయత్ ఆజ్ఞల్ని అతిక్రమించకుండా ఉన్నంతవరకూ అతనికి ముస్లింలు విధేయులై ఉండాల్సిందే.

షరీయత్‌కు బద్ధుడై ఉన్న అమీర్‌ను ధిక్కరించటం, అవిధేయత చూపటం తిరుగుబాటు క్రిందికి వస్తుంది. సజ్జనుడైన నాయకునికి విధేయత కనబరచటంపై విముఖుడై, సామూహిక వ్యవస్థ నుంచి వేర్పడిన వ్యక్తి స్థితి గొఱ్ఱెల మంద నుంచి తప్పిపోయిన గొఱ్ఱెలాంటిది. ఆ స్థితిలో ఒకవేళ అతనికి మరణం సంభవిస్తే అది అజ్ఞాన స్థితికి చెందిన మరణం అవుతుంది. అలాంటి మరణాన్ని మార్గ విహీనస్థితి మరణం అని అనవచ్చునేమోగాని, అవిశ్వాసస్థితి మరణం అని మాత్రం అనలేము. తిరుగుబాటు వైఖరికి ఒడిగట్టే ముస్లింతో పోరాడటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. అయితే పోరాడవలసింది ప్రభుత్వమేగాని వ్యక్తులు కాదు. ప్రతి వ్యక్తీ చట్టాన్ని తన చేతుల్లోకి తీసేసుకుంటే సమాజంలో శాంతి భద్రతలు అతలాకుతలమైపోతాయి.

(١٠٢٤) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «تَقْتُلُ عَمَّاراً الْفِئَةُ الْبَاغِيَةُ». رَوَاهُ مُسْلِمٌ.

1024. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు : "అమ్మార్‌ను తిరుగుబాటు వర్గం హత్య చేస్తుంది." (ముస్లిం)

## సారాంశం

సాధారణ చరిత్రకారుల కథనం ప్రకారం అమ్మార్ బిన్ యాసిర్ (రజి)ను సిఫ్ఫీన్ యుద్ధం జరిగిన రోజున అమీర్ ముఆవియా (రజి) సహచరులు హత్యచేశారు. కాని ఇది వాస్తవం కాదు. తృతీయ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి)ని హత్యచేసిన తిరుగుబాటు వర్గమే హజ్రత్ అలీ (రజి) - అమీర్ ముఆవియా (రజి)ల మధ్య చిచ్చుపెట్టింది. హజ్రత్ అలీ (రజి) సైనిక దళంలో ఆ తిరుగుబాటు వర్గం బొరబడి ఉంది. కాగా; హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) గారు హజ్రత్ అలీ (రజి) పక్షాన నిలిచారన్న సంగతి ఇక్కడ గమనార్హం. యుద్ధం జరుగుతున్న సమయంలో - ముస్లింలను నిరంతరం సంక్షోభంలో పడవేసి ఉంచాలని కోరుకునే ఈ తిరుగుబాటు వర్గం అకస్మాత్తుగా అమ్మార్ (రజి)పై దాడిచేసి చంపేసింది. ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) భవిష్యవాణి నిజమయింది. దైవప్రవక్త (స) సూచించిన ఈ తిరుగుబాటు వర్గం ఇదేనన్నమాట!

కాని కొంతమంది విమర్శకులు ఈ హదీసు ఆధారంగా అమీర్ ముఆవియా (రజి)ను తూలనాడటానికి కూడా వెనుకాడలేదు. మరి చూడబోతే మహాప్రవక్త (స) ప్రియసహచరుల స్థానం ఉన్నతమైనది. అల్లాహ్ వారిపై తన కారుణ్యాన్ని కురిపించాడు. వారితో ప్రసన్న డయ్యాడు. కాబట్టి మహాప్రవక్త ప్రియసహచరుల గురించి ఏమైనా వ్యాఖ్యానించ దలచు కున్నప్పుడు ఆచితూచి వ్యవహరించటం అవసరం.

(١٠٢٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**هَلْ تَدْرِي، يَا ابْنَ أُمِّ عَبْدٍ! كَيْفَ حُكْمُ اللَّهِ فِيمَنْ بَغَى مِنْ هَذِهِ الْأُمَّةِ؟**» قَالَ: اللَّهُ وَرَسُولُهُ أَعْلَمُ، قَالَ: «**لاَ يُجْهَزُ عَلَى جَرِيحِهَا، وَلاَ يُقْتَلُ أَسِيرُهَا، وَلاَ يُطْلَبُ هَارِبُهَا، وَلاَ يُقْسَمُ فَيْئُهَا**». رَوَاهُ الْبَزَّارُ وَالْحَاكِمُ، وَصَحَّحَهُ، فَوَهِمَ، لِأَنَّ فِي إِسْنَادِهِ كَوْثَرَ بْنِ حَكِيمٍ، وَهُوَ مَتْرُوكٌ.

1025. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక సహచరుణ్ణి ఉద్దేశ్యించి, "ఓ ఉమ్మె అబ్ద్ పుత్రుడా! ఈ సమాజంపై తిరుగుబాటు చేసిన వ్యక్తి విషయంలో దైవాజ్ఞ ఏమిటో నీకు తెలుసా?" అని ప్రశ్నించారు. "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) కే బాగా తెలుసు" అని ఆ సహచరుడు సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా వివరించారు : "అతని క్షతగాత్రులను చంపటంగానీ, అతని తరవు ఖైదీలను వధించటం గానీ, పారిపోయే వారిని వెంబడించటంగానీ, అతనికి చెందిన ఆస్తిపాస్తులను పంచుకోవటం గానీ జరగదు." (ఈ హదీసును బజ్జార్ మరియు హాకిమ్ లిరువురూ ఉల్లేఖించారు. దీనిని హాకిమ్ ప్రామాణికమైనదిగా కూడా ఖరారు చేశారు గాని ఆయన ఇక్కడ పొరబడ్డారు. ఎందుకంటే హదీసును అందజేసిన వారిలో ఒకరైన కౌసర్ బిన్ హకీమ్ ఎన్నదగ్గ వ్యక్తికాడు.

وَصَحَّ عَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِنْ طُرُقٍ نَحْوُهُ مَوْقُوفاً، أَخْرَجَهُ ابْنُ أَبِي شَيْبَةَ وَالْحَاكِمُ.

అయితే ఈ సందర్భంగా - ఇదేవిధంగా - విభిన్న వర్గాల ఆధారంగా హజ్రత్ అలీ (రజి) గారిచే 'మౌఖూఫ్'గా ఉల్లేఖించబడిన హదీసు ప్రామాణిక మైనది. (దీనిని ఇబ్నె అబీ షైబ, హాకిమ్ వెలికితీశారు)

### సారాంశం

ఈ హదీసు పరంపరలోని కౌసర్ బిన్ హకీమ్ ఎన్నదగ్గ వ్యక్తి కాడన్న విషయంపై అందరిమధ్యా ఏకాభిప్రాయముంది. తిరుగుబాటుదారులను ఉపేక్షించి వదలిపెట్టడం సమంజసం కాదు. నిశ్చయంగా వారితో యుద్ధం చేయటం ధర్మసమ్మతమే. అయితే వారి ఆస్తిపాస్తులు, పాడిపంటలు, పశువులను దోచుకోవటం గురించి, వారి క్షతగాత్రులను, పలాయనవాదులను పట్టుకుని వధించటం గురించి భేదాభిప్రాయముంది. వివరాల కోసం "సుబులుస్సలామ్" చూడగలరు.

### హదీసు ఉల్లేఖకులు

ఉల్లేఖకులలో ఒకరైన కౌసర్ బిన్ హకీమ్‌పై చాలామందికి సదభిప్రాయం లేదు. ఈయన కూఫా వాసి. 'హలబ్'లో స్థిరపడ్డారు. హదీసులను వివరించే సత్తా ఈయనకు ఏమాత్రం లేదని ఇబ్నె మొయీన్ అభిప్రాయపడ్డారు. ఈయన ఉల్లేఖనాలు బూటకమని ఇమామ్ అహ్మద్ వ్యాఖ్యానించారు.

(١٠٢٦) وَعَنْ عَرْفَجَةَ بْنِ شُرَيْحٍ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَنْ أَتَاكُمْ، وَأَمْرُكُمْ جَمِيعٌ، يُرِيدُ أَنْ يُفَرِّقَ جَمَاعَتَكُمْ، فَاقْتُلُوهُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1026. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అర్ఫజ బిన్ షురైహ్ (రజి) తెలిపారు : "మీరు ఒక నాయకుని (అమీర్)కి విధేయులై ఉండగా ఎవరయినాసరే మీ మధ్య వచ్చి మీ సంగఠిత వ్యవస్థలో అనైక్యతను సృష్టించే యత్నం చేస్తే అతన్ని హతమార్చండి." (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే ముఖ్య విషయం ఏమిటంటే ముస్లింలంతా కలసి ఒకానొక వ్యక్తిని తమ నాయకునిగానో, ఖలీఫాగానో ఎన్నుకుని తమ కార్యకలాపాలను సాఫీగా కొనసాగిస్తుండగా ఎవరయినా తమ స్వార్థ ప్రయోజనాల నిమిత్తం ముస్లింల సంగఠిత వ్యవస్థకు తూట్లు పొడిచే ప్రయత్నంచేస్తే, అటువంటి చీడ పురుగులను ఎంతమాత్రం ఉపేక్షించరాదు. శరీరంలో కుళ్ళిపోయిన భాగాన్ని శస్త్ర చికిత్స ద్వారా తీసిపారెయ్యటం ఎంత అవసరమో ఇలాంటి దుష్టులను ప్రజా జీవితాల నుంచి ఏరిపారెయ్యటం కూడా అంతే అవసరం.

### హదీసు ఉల్లేఖకులు

అర్ఫజ బిన్ షురైహ్ (రజి) : అష్‌జా తెగకు చెందిన వారవటం చేత అష్‌జయీగా పిలువబడ్డారు. ప్రముఖ సహాబీ. కూఫాలో స్థిరపడ్డారు.

4వ అధ్యాయం

## ٤ - بَابُ قِتَالِ الْجَانِي وَقَتْلِ الْمُرْتَدِّ

## దౌర్జన్యపరునితో పోరాడటం, ధర్మభ్రష్టుణ్ణి వధించటం గురించి

(١٠٢٧) عَنْ عَبْدِ اللهِ بن عمر رَضِيَ اللهُ تعالى عنهما قال: قال رسول الله ﷺ: «مَنْ قُتِلَ دُونَ مَالِهِ فَهُوَ شَهِيدٌ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

1027. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "తన ఆస్తిపాస్తులను రక్షించుకునే ప్రయత్నంలో చంపబడినవాడు అమరగతుడు." (అబూదావూద్, నసాయి, తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు- తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

### సారాంశం

ఇతరుల సామ్మును దోచుకునే ఉద్దేశ్యంతో వచ్చిన బందిపోటుతో పోరాడటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఈ పోరాటంలో యజమాని తన సామ్మును కాపాడుకునే యత్నంలో మరణిస్తే అతడు అమరగతుడవుతాడు. ఒకవేళ సామ్ముకు యజమాని అయిన వ్యక్తి చేతిలో బందిపోటు హతుడైతే, అప్పుడు యజమాని రక్తపరిహారం గానీ, జరిమానా గానీ చెల్లించవలసిన అవసరం లేదు. ఇంకా - ఈ హత్య పాపంగా కూడా పరిగణించబడదు. ఎందుకంటే యజమాని ఆత్మరక్షణ కోసం, ఆస్తి రక్షణ కోసం ప్రతిఘటించాడు.

ఇమామ్ ముస్లిం (రహ్మ.లై) వివరించిన హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం 'ఓ దైవప్రవక్తా (స)! ఎవరయినా నా సామ్మును తీసుకోవడానికి వస్తే నేనేం చేయను?' అని ఒక వ్యక్తి విన్నవించుకోగా "నువ్వతనికి ఇవ్వకు" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. 'ఒకవేళ అతడు నాపై దాడి చేస్తే....?!' అని అతను సందేహపడగా "నువ్వు అతన్ని ప్రతిఘటించు" అని ఆయన (స) సమాధానమిచ్చారు. 'ఒకవేళ అతడు నన్ను హతమారిస్తే....?!' అని ఆ వ్యక్తి మళ్లీ సందేహం వెలిబుచ్చగా "నువ్వు అమరగతినొందుతావు" అని ఆయన (స) చెప్పారు. 'ఒకవేళ నేనే అతన్ని హతమారిస్తే అప్పుడేమవుతుంది?' అని ఆ వ్యక్తి సందేహపడగా "అతడు అగ్నికి ఆహుతి అవుతాడు" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

ఇది ఆస్తి రక్షణకు సంబంధించిన ఆజ్ఞ. ఒకవేళ మనిషి తన ప్రాణరక్షణ కోసం, తన రక్తం కోసం, తన ధర్మ రక్షణ కోసం ప్రాణాలర్పించినా సరే అతడు అమరగతుడుగానే పరిగణించబడతాడు.

(١٠٢٨) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَاتَلَ يَعْلَى بْنُ أُمَيَّةَ رَجُلاً، فَعَضَّ أَحَدُهُمَا صَاحِبَهُ، فَانْتَزَعَ يَدَهُ مِنْ فَمِهِ، فَنَزَعَ ثَنِيَّتَهُ، فَاخْتَصَمَا إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: «أَيَعَضُّ أَحَدُكُمْ أَخَاهُ، كَمَا يَعَضُّ الْفَحْلُ؟ لاَ دِيَةَ لَهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

1028. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : యాలా బిన్ ఉమయ్యా (రజి) ఒక వ్యక్తితో తగాదా పడ్డారు. ఒండొకరు పళ్లతో కొరుక్కున్నారు. వారిలో ఒకరు రెండవ వ్యక్తి నోటి నుంచి తన చేతిని గుంజారు. ఈ గుంజులాట లో ఒకరి నోటిలోని దంతం ఊడిపో యింది. ఇద్దరూ కలసి దైవప్రవక్త (సఅసం) కొలువుకు వచ్చారు. దైవప్రవక్త (సఅసం) వారి నుద్దేశ్యించి, "ఏమిటీ, మీరు మగ ఒంటె కొరికినట్లుగా పరస్పరం ఇలా కొరుక్కుతింటారా? దీనికి ఎలాంటి నష్టపరిహారం లేదు పోండి" అని మందలించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లిం లోనివి)

**సారాంశం**

అవతలి వ్యక్తి బారి (కీడు) నుండి తన్ను కాపాడుకునే ప్రయత్నంలో ఒక వ్యక్తి ద్వారా ఏదన్నా తప్పు జరిగిపోతే దానికి గాను నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. అత్యధిక మంది పండితుల అభిప్రాయం కూడా ఇదే.

(١٠٢٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ أَبُو الْقَاسِمِ ﷺ: «لَوْ أَنَّ امْرَأً اطَّلَعَ عَلَيْكَ بِغَيْرِ إِذْنٍ، فَحَذَفْتَهُ بِحَصَاةٍ، فَفَقَأْتَ عَيْنَهُ، لَمْ يَكُنْ عَلَيْكَ جُنَاحٌ». مُتَّفَقٌ

1029. అబుల్ ఖాసిం (దైవప్రవక్త - సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: ఒకవేళ ఏ మగాడైనా అనుమతి లేకుండా నీ ఇంట్లోకి తొంగిచూసినందుకు రాయి రువ్వి నువ్వతని కన్నును పగులగొట్టినా అది పాపం కాదు." (బుఖారీ, ముస్లిం).

عَلَيْهِ. وَفِي لَفْظٍ لأَحْمَدَ وَالنَّسَائِيِّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ: «فَلاَ دِيَةَ لَهُ وَلاَ قِصَاصَ».

"దానికి నష్టపరిహారం గానీ, కన్నుకు బదులు కన్నుగానీ లేదు" అని అహ్మద్, నసాయిలు పేర్కొన్న ఉల్లేఖనంలో వుంది. ఈ వాక్యాలను ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమైనవిగా ఖరారు చేశారు.

(١٠٣٠) وَعَنِ الْبَرَاءِ بْنِ عَازِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَضَى رَسُولُ اللهِ ﷺ أَنَّ حِفْظَ الْحَوَائِطِ بِالنَّهَارِ عَلَى أَهْلِهَا، وَأَنَّ حِفْظَ الْمَاشِيَةِ بِاللَّيْلِ عَلَى أَهْلِهَا، وَأَنَّ عَلَى أَهْلِ الْمَاشِيَةِ مَا أَصَابَتْ مَاشِيَتُهُمْ بِاللَّيْلِ. رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، إِلاَّ التِّرمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَفِي إِسْنَادِهِ اخْتِلاَفٌ.

1030. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ బరాబిన్ ఆజిబ్ (రజి) ఉల్లేఖించారు : పగటిపూట తోట యజమాని తోటలకు కాపలాగా ఉండాలి. రాత్రిపూట పశువుల యజమాని తన పశువుల కాపలాకు బాధ్యుడు. ఒకవేళ రాత్రిపూట గనక ఏదైనా తోటలోకి పశువులు వచ్చి తోటకు నష్టం కలిగిస్తే ఆ నష్టపరిహారాన్ని పశువుల యజమాని చెల్లించవలసి ఉంటుంది." (ఈ హదీసును అహ్మద్, మరియు 'నలుగురి'లో తిర్మిజీ తప్ప మిగిలిన వారంతా ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని 'సహీహ్'గా ఖరారు చేశారు. అయితే దీని పరంపరపై భిన్నాభిప్రాయాలున్నాయి)

(١٠٣١) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ - فِي رَجُلٍ أَسْلَمَ، ثُمَّ تَهَوَّدَ -: لاَ أَجْلِسُ حَتَّى يُقْتَلَ، قَضَاءُ اللهِ وَرَسُولِهِ، فَأُمِرَ

1031. తొలుత ఇస్లాం స్వీకరించి తరువాత యూదునిగా మారిపోయిన వ్యక్తి గురించి హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) ఇలా వివరించారు: "ఇతడ్ని హత మార్చే వరకూ నేను కూర్చోను. ఇది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం) నిర్ణయం" అని నేనన్నాను.

بِهِ فَقُتِلَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ لأَبِي دَاوُدَ: «وَكَانَ قَدِ اسْتُتِيبَ قَبْلَ ذٰلِكَ».

మరి అతన్ని హతమార్చాలని ఆజ్ఞాపించబడింది. ఆ ఆజ్ఞ అమలుపరచబడింది" (బుఖారీ, ముస్లిం). హతమార్చడానికి ముందు పశ్చాత్తాపం చెందమని అతనితో చెప్పబడిందని అబూదావూద్ ఉల్లేఖనంలో వుంది.

**సారాంశం**

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కూర్చోనని చెప్పడానికి గల కారణం ఏమిటంటే, ముఆజ్ (రజి)కు ముందు దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) గారిని యమన్ ప్రాంతానికి ప్రభుత్వాధికారిగా నియమించి పంపారు. కొన్ని రోజుల తరువాత ముఆజ్ బిన్ జబల్ (రజి)ను కూడా పంపించారు. ముఆజ్ (రజి)గారు అబూ మూసా అష్అరీ (రజి) గారి దగ్గరకు వెళ్ళినప్పుడు ఒంటెమీద నుంచి దిగమని అబూ మూసా అష్అరీ కోరారు. ఆయన దిగటానికి వీలుగా దిండును కూడా ఊతంగా సమర్పించారు. అయితే ఆ సమయంలో అక్కడ, ఒక వ్యక్తి నిర్బంధించబడి ఉండటం చూచి, 'ఏమిటీ సంగతి?' అని ఆయన దర్యాప్తు చేశారు. ఇతను మొదట్లో యూదుడనీ, తరువాత ఇస్లాం స్వీకరించి, మరిప్పుడు యూదుడుగా మారిపోయాడని అబూ మూసా (రజి) వివరించారు. ఇతన్ని వధించే వరకూ నేను కూర్చోనని ఆ సందర్భంగా హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) పలికారు. అబూదావూద్‌లోని కథనంలో "ఇతన్ని హతమార్చేదాకా నేను ఒంటె మీది నుంచి దిగను" అని వుంది.

ధర్మభ్రష్టుడైన వ్యక్తికి శిక్ష విధించేముందు పశ్చాత్తాపం చెందేందుకు అవకాశం ఇవ్వాలని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. పశ్చాత్తాపం చెందేందుకు అవకాశమివ్వటం తప్పనిసరి (వాజిబ్) అని మెజారిటీ విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ధర్మభ్రష్టులైనవారు - పురుషుడైనా, స్త్రీ అయినాసరే - వారికి చేసిన తప్పును తెలుసుకుని ధర్మంపై మరలి వచ్చేందుకు ఒక అవకాశం ఇచ్చి తీరాలనీ, ఒకవేళ వారు ఈ అవకాశాన్ని త్రోసిపుచ్చితే మాత్రం మరణ దండన విధించాలని చెప్పబడింది. హజ్రత్ అబూబక్ర్ (రజి) పరిపాలనా కాలంలో ఒక స్త్రీ ధర్మభ్రష్టతకు పాల్పడినందుకు మరణ దండన విధించబడింది. శిక్షను అమలుపరుస్తున్నప్పుడు మహాప్రవక్త సహచరులు (రజి) కూడా అక్కడున్నారు. వారిలో ఎవరూ ఎలాంటి అభ్యంతరం తెలుపలేదు. ధర్మభ్రష్టతకు పాల్పడినవారికి మరణదండన విధించే విషయంలో ప్రవక్త సహచరుల మధ్య ఏకాభిప్రాయం ఉందన్న విషయానికి ఇది ప్రబల తార్కాణం. ఈ సంఘటన ద్వారా గమనార్హమైన మరికొన్ని ముఖ్యాంశాలు మన దృష్టికి వస్తున్నాయి. అవేమంటే;

1. గవర్నర్లను, ప్రభుత్వాధికార్లను నియమించే అధికారం రాజ్యాధికారికి ఉంటుంది.

2. అవసరమనుకుంటే ఏకకాలంలో ఒక పనిపై ఇద్దరు ప్రభుత్వాధికారులను కూడా నియమించవచ్చు.

3. ధర్మభ్రష్టతకు పాల్పడిన వారికి మరణదండన విధించే, షరీయత్‌ను (శాసనాంగాన్ని) అమలుపరచే బాధ్యత సంబంధిత ప్రభుత్వాధికారిపై ఉంటుంది.

4. తాను నియమించబడిన ప్రాంతానికి అధికారి వాహనంపై వెళ్లవచ్చు.

5. కేంద్రం నియమించి పంపిన అధికారులను స్థానిక అధికారులు సాదరంగా ఆహ్వానించాలి, వారి యెడల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి.

6. షరీయత్ చట్టాలను అమలు పరచటంలో తాత్సారం చేయరాదు. విచారణ జరిపి నేరస్థుని నేర నిర్ధారణ జరిగిన తక్షణమే శిక్షలను అమలుపరచాలి.

7. శిక్షలను బహిరంగంగా - ప్రజల సమక్షంలో - అమలు జరపాలి. ఇలా చేయటం వల్ల ప్రజలు శాసనోల్లంఘనకు పాల్పడకుండా ఉంటారు.

(١٠٣٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ بَدَّلَ دِينَهُ فَاقْتُلُوهُ». رَوَاهُ الْبُخَارِيُّ.

1032. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరయితే తన ధర్మాన్ని మార్చుకున్నాడో అతన్ని హతమార్చండి." (బుఖారీ)

**సారాంశం**

ధర్మభ్రష్టుడైన వ్యక్తికి విధించే దండన షరీయత్ ప్రకారం మరణ దండన మాత్రమేనని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. ఈ ధర్మభ్రష్టతకు పాల్పడిన వ్యక్తి పురుషుడైనా, స్త్రీ అయినా సరే శిక్ష శిక్షే. అయితే ఎవరయినా బహిరంగంగా ధర్మభ్రష్టుడైనట్లు చెబితేనే న్యాయస్థానం విచారణ జరిపి-తగు సాక్ష్యాల ఆధారంగా - ఈ శిక్ష విధిస్తుంది. కాని ఎవరయినా తన ధర్మభ్రష్ట నిర్ణయాన్ని బహిర్గతం చేయకుండా ఉంటే మాత్రం అతనికి మరణ దండన విధించబడదు. ఎవరయినా బలవంతంగా ధర్మభ్రష్టతకు గురిచేసినా సరే మరణ దండన అతనికి వర్తించదు.

(١٠٣٣) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ أَعْمَى كَانَتْ لَهُ أُمُّ وَلَدٍ، تَشْتِمُ النَّبِيَّ ﷺ، وَتَقَعُ فِيهِ، فَيَنْهَاهَا، فَلاَ تَنْتَهِي، فَلَمَّا كَانَ ذَاتَ لَيْلَةٍ أَخَذَ الْمِعْوَلَ، فَجَعَلَهُ فِي بَطْنِهَا، وَاتَّكَأَ

1033. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: ఒక అంధుడుండేవాడు. ఆయన వద్ద ఒక బానిస యువతి ఉండేది. ఆమె తరచూ దైవప్రవక్త (సఅసం)ను దూషిస్తూ ఉండేది. తన వైఖరిని మార్చుకోమని ఆ సహాబి (రజి) ఆమెకు ఎంతగానో నచ్చ జెప్పారు. అయినా ఆమె వినలేదు. ఒక రోజు రాత్రి ఆయన గెడ్డపలుగును ఆమె

عَلَيْهَا، فَقَتَلَهَا، فَبَلَغَ ذٰلِكَ النَّبِيَّ ﷺ، فَقَالَ: «أَلاَ اشْهَدُوا أَنَّ دَمَهَا هَدَرٌ». رَوَاهُ أَبُو دَاوُدَ، وَرُوَاتُهُ ثِقَاتٌ.

పొట్టపై ఉంచి తన బరువునంతటినీ దానిపై వేశారు. దాంతో ఆమె చని పోయింది. ఈ సంగతి దైవప్రవక్త (సఅసం)కు తెలిసింది. "ఆమె రక్తం వృధా అయిపోయిందన్న విషయానికి మీరంతా సాక్షులుగా ఉండండి" అని ఆయన (స) చెప్పారు. (అబూదావూద్- దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం)ను దూషించే, తూలనాడే వారికి విధించబడే శిక్ష మరణ శిక్షేనని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఈ విషయంపై యావత్తు ముస్లిం సమాజం ఏకీభావం వ్యక్తపరచిందని ఇమామ్ ఇబ్నె ముంజిర్ వక్కాణించారు. ఒకవేళ ముస్లిమేతరుడైన 'జిమ్మీ' వ్యక్తి ఈ విధంగా దూషించినా అతనికీ మరణ దండనే విధించబడుతుంది. దైవప్రవక్తను దూషించిన వ్యక్తులకు పశ్చాత్తాపం చెందేందుకు కూడా గడువు ఇవ్వబడదని మరికొంతమంది పండితులు వ్యాఖ్యానించారు.

# 10. శిక్షల పుస్తకం

# ١٠ - كِتَابُ الْحُدُودِ

## ١ - بَابُ حَدِّ الزَّانِيْ

(١٠٣٤) عَنْ أَبِي هُرَيْرَةَ وَزَيْدِ بْنِ خَالِدٍ الْجُهَنِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَجُلاً مِّنَ الْأَعْرَابِ أَتَى رَسُولَ اللهِ ﷺ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! أَنْشُدُكَ بِاللهِ إِلاَّ قَضَيْتَ لِيْ بِكِتَابِ اللهِ! فَقَالَ الْآخَرُ – وَهُوَ أَفْقَهُ مِنْهُ –: نَعَمْ، فَاقْضِ بَيْنَنَا بِكِتَابِ اللهِ، وَائْذَنْ لِيْ، فَقَالَ: قُلْ، قَالَ: إِنَّ ابْنِيْ كَانَ عَسِيْفاً عَلٰى هٰذَا، فَزَنَى بِامْرَأَتِهِ، وَإِنِّي أُخْبِرْتُ أَنَ عَلَى ابْنِي الرَّجْمَ، فَافْتَدَيْتُ مِنْهُ بِمِائَةِ شَاةٍ وَوَلِيْدَةٍ،

### మొదటి అధ్యాయం

## వ్యభిచారికి విధించబడే శిక్ష

1034. హజ్రత్ అబూహురైరా (రజి) మరియు జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి)ల కథనం : ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)సన్నిధికి వచ్చి, "దైవప్రవక్తా (స)! నేను దైవసాక్షిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను - తమరు నా వ్యవహారంలో దైవ గ్రంథం ఆధారంగా తీర్పివ్వండి" అని విన్నవించుకున్నాడు. ఆ తరువాత అతని కన్నా కాస్త ఎక్కువ విజ్ఞుడైన వ్యక్తి ముందుకు వచ్చి, 'మా వ్యవహారాన్ని దైవ గ్రంథం ఆధారంగానే పరిష్కరించండి. అయితే ఈ సందర్భంగా అనలేం జరిగిందో చెప్పడానికి అనుమతించండి" అని అన్నాడు. "సరే చెప్పు" అని ఆయన (సఅసం) అన్నారు. "నా కొడుకు ఇతని దగ్గర పాలేరుగా పనిచేసేవాడు. ఒక రోజు ఆ అబ్బాయి ఇతని భార్యతో వ్యభిచారం చేశాడు. నా కుమారునికి రాళ్లు రువ్వే శిక్ష విధించబడుతుందని నాకు తెలియగానే నష్టపరిహారంగా నేనితనికి నూరు మేకల్ని, ఒక బానిసరాలిని ఇచ్చాను. అయితే ఆ తరువాత నేను

فَسَأَلْتُ أَهْلَ الْعِلْمِ، فَأَخْبَرُونِي أَنَّ عَلَى ابْنِي جَلْدَ مِائَةٍ وَتَغْرِيبَ عَامٍ، وَأَنَّ عَلَى امْرَأَةِ هٰذَا الرَّجْمَ. فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «**وَالَّذِي نَفْسِي بِيَدِهِ لأَقْضِيَنَّ بَيْنَكُمَا بِكِتَابِ اللهِ، الْوَلِيدَةُ وَالْغَنَمُ رَدٌّ عَلَيْكَ، وَعَلَى ابْنِكَ جَلْدُ مِائَةٍ وَتَغْرِيبُ عَامٍ، وَاغْدُ يَا أُنَيْسُ! إِلَى امْرَأَةِ هٰذَا، فَإِنِ اعْتَرَفَتْ فَارْجُمْهَا**». مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا اللَّفْظُ لِمُسْلِمٍ.

విద్వాంసులను విచారించగా, నా కొడుకుకు నూరు కొరడా దెబ్బలు కొట్టాలనీ, ఒక ఏడాది కాలంపాటు నగరం నుంచి బహిష్కరించాలనీ, ఇతని భార్యకు శిలా శిక్ష విధించాలని వారు చెప్పారు" అని జరిగిందంతా వివరించాడు. దైవప్రవక్త (సఅసం) ఇదంతా విని, "ఎవరి అధీనంలో నా ప్రాణ ముందో ఆ శక్తిమంతుని సాక్షి! నేను మీ వ్యవహారాన్ని దైవగ్రంథం ప్రకారమే పరిష్కరిస్తాను. నీవు ఇచ్చిన మేకలు, బానిసరాలు నీకు తిరిగి ఇచ్చేయబడతాయి. నీ కొడుక్కి నూరు కొరడా దెబ్బల శిక్షతో పాటు, ఒక సంవత్సర కాలంపాటు నగర బహిష్కరణ గావించబడుతుంది. (తరువాత ఆయన తన సహచరుడు అనీస్ నుద్దేశ్యించి) ఉనైస్! నీవు ఈ వ్యక్తి భార్య దగ్గరకెళ్ళి విచారించు. ఆమె గనక తన నేరాన్ని ఒప్పుకుంటే శిలా శిక్ష విధించాలి" అని తీర్పు ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

వ్యభిచరించిన వ్యక్తి వివాహితుడైతే రాళ్లు రువ్వే శిక్ష విధించబడుతుందనీ, అవివాహితుడైతే నూరు కొరడా దెబ్బలు కొట్టడంతోపాటు ఒక సంవత్సర కాలం పాటు నగర బహిష్కరణ చేయబడుతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. హనఫీ పండితులు నగర బహిష్కరణకు అనుకూలంగా లేరు. అయితే ఈ ధోరణి హదీసుకు విరుద్ధమైనదన్నది గమనార్హం. వ్యభిచార నేరానికి బదులుగా నష్టపరిహారం చెల్లించి అవతలి వారితో రాజీకి రావటం కూడా సరైనది కాదు. మానమర్యాదల పరిరక్షణ నోట్లతో సాధ్యం కాదు, దానికోసం శిక్షలు కఠినంగా ఉండాలి. శిక్షలను అమలుపరచాలి

(١٠٣٥) وَعَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «خُذُوا عَنِّي، خُذُوا عَنِّي، فَقَدْ جَعَلَ اللَّهُ لَهُنَّ سَبِيلاً، الْبِكْرُ بِالْبِكْرِ جَلْدُ مِائَةٍ وَنَفْيُ سَنَةٍ، وَالثَّيِّبُ بِالثَّيِّبِ جَلْدُ مِائَةٍ وَالرَّجْمُ». رَوَاهُ مُسْلِمٌ.

1035. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) తెలిపారు : "(షరీయత్ ఆదేశాలను) నా నుండి గ్రహించండి. (సమాజ మర్యాదలను) నానుండి గ్రహించండి. అల్లాహ్ ఈ స్త్రీల కొరకు మార్గాన్ని స్పష్టపరిచాడు. అవివాహితుడైన వ్యక్తి అవివాహితురాలితో అక్రమ సంబంధం ఏర్పరచుకుంటే వారికి నూరు కొరడా దెబ్బల చొప్పున కొట్టబడతాయి. ఒక ఏడాది కాలం పాటు నగరం నుంచి బహిష్కరించటం జరుగుతుంది. ఒకవేళ వివాహితుడు వివాహితురాలితో వ్యభిచరిస్తే నూరు కొరడా దెబ్బలతో పాటు రాళ్లు రువ్వబడతాయి." (ముస్లిం)

(١٠٣٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أَتَى رَجُلٌ مِّنَ الْمُسْلِمِيْنَ رَسُولَ اللهِ ﷺ، وَهُوَ فِي الْمَسْجِدِ، فَنَادَاهُ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! إِنِّي زَنَيْتُ، فَأَعْرَضَ عَنْهُ، فَتَنَحَّى تِلْقَاءَ وَجْهِهِ، فَقَالَ يَا رَسُولَ اللهِ! إِنِّي زَنَيْتُ، فَأَعْرَضَ عَنْهُ، حَتَّى ثَنَّى ذٰلِكَ عَلَيْهِ أَرْبَعَ مَرَّاتٍ، فَلَمَّا شَهِدَ عَلٰى نَفْسِهِ أَرْبَعَ شَهَادَاتٍ دَعَاهُ رَسُولُ اللهِ ﷺ، فَقَالَ: «أَبِكَ جُنُونٌ؟»

1036. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ఒక ముస్లిం వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) మస్జిద్‌లో ఉన్నారు. "ఓ దైవప్రవక్తా (స)! నేను వ్యభిచారం చేశాను" అన్నాడు బిగ్గరగా. దైవప్రవక్త (స) తన ముఖాన్ని అతని వైపు నుంచి తిప్పుకున్నారు. అతను మరోసారి దైవప్రవక్త (స) ముందుకు వచ్చి "నేను వ్యభిచారం చేశాను" అని అన్నాడు. ఆయన (స) తన ముఖారవిందాన్ని తిప్పుకున్నారు. ఈ విధంగా ఆ వ్యక్తి నాలుగుసార్లు - ఆయన (స) ముందుకు వచ్చి తన

قَالَ: لاَ، قَالَ: «فَهَلْ أَحْصَنْتَ؟» قَالَ: نَعَمْ، فَقَالَ النَّبِيُّ ﷺ: «اِذْهَبُوا بِهِ، فَارْجُمُوهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు తనకు వ్యతిరేకంగా స్వయంగా నాలుగుసార్లు సాక్ష్యమిచ్చినందున ఆయన (స) అతణ్ణి తన దగ్గరికి పిలిచి "నీవేమైనా పిచ్చి వాడివా?" అని అడిగారు. "లేదండి" అని అన్నాడతను. "నీకు పెళ్ళయిందా?" అని మళ్లీ ప్రశ్నించారాయన (స). "అయిందండీ" అని బదులిచ్చాడు. అప్పుడు ఆయన (స) (తన సహచరుల నుద్దేశ్యించి) "ఇతణ్ణి తీసుకెళ్ళి రాళ్లు రువ్వండి" అని ఆదేశించారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ఆధారంగా కొంతమంది వ్యభిచార నేరం చేసిన మనిషి నాలుగుసార్లు నేరాన్ని ఒప్పుకోవాలన్న షరతు పెట్టారు. వాస్తవానికి హదీసులో ఆ వ్యక్తి తనంతట తానుగా నాలుగుసార్లు ఆ నేరానికి పాల్పడినట్లు చెప్పుకున్నాడు. ఆ మేరకు అతనిచేత ఎవరూ చెప్పించ లేదు. నాలుగు సార్లు నేరాన్ని ఒప్పుకోవాలన్న షరతు ఇందులో ఎక్కడా లేదు. అతని ఒప్పు కోలుపై దైవప్రవక్త (స) మాటిమాటికీ దాటవేసే ప్రయత్నం చేశారు. నాలుగుసార్లు ఆ వ్యక్తి సాక్ష్యం ఇచ్చిన తరువాత కూడా పలుకోణాల నుంచి ప్రశ్నలు వేసి ఈ వ్యవహారంలో ఎలాంటి అనుమానానికీ, మీమాంసకు తావు ఉండకుండా చేశారు. అన్ని విధాలుగా ఆ వ్యక్తి శిక్షార్హుడని స్పష్టంగా తేలిపోయిన తరువాతనే శిక్షను అమలుపరచమని ఆజ్ఞాపించారు. కాబట్టి ఈ హదీసు ఆధారంగా వ్యభిచార నేరస్థుడు తన నేరాన్ని నాలుగుసార్లు ఒప్పుకుని తీరాలని షరతు పెట్టడం సమంజసం కాదు.

(١٠٣٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَمَّا أَتَى مَاعِزُ بْنُ مَالِكٍ إِلَى النَّبِيِّ ﷺ قَالَ لَهُ: «لَعَلَّكَ قَبَّلْتَ، أَوْ غَمَزْتَ،

1037. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : మాయిజ్ బిన్ మాలిక్ (రజి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వచ్చినప్పుడు ఆయన (సఅసం) అతన్ని ఉద్దేశ్యించి, "బహుశా నువ్వు ముద్దుపెట్టుకోవటం, కౌగిలించుకోవటం లేదా కవ్వించటం, లేదా చెడు చూపు

أَوْ نَظَرْتَ»، قَالَ: لاَ، يَا رَسُولَ اللهِ! رَوَاهُ الْبُخَارِيُّ.

చూడటం లాంటివి చేశావేమో!" అని విచారించారు. "లేదు దైవప్రవక్తా (స)!" అని ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు.

*(బుఖారీ)*

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే వ్యభిచార నేరానికి పాల్పడిన వ్యక్తి స్పష్టంగా, తాను ఆ నేరానికి పాల్పడినట్లు అంగీకరించే వరకూ, అతడు ఎలాంటి ఒత్తిళ్ళకూ, ప్రలోభాలకు లొంగలేదని ఇదమిత్థంగా తెలియనంతవరకూ రాళ్లు రువ్వే శిక్షను అతనిపై విధించకూడదు.

(١٠٣٨) وَعَنْ عُمَرَ بْنِ الْخَطَّابِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ خَطَبَ، فَقَالَ: إِنَّ اللَّهَ بَعَثَ مُحَمَّداً بِالْحَقِّ، وَأَنْزَلَ عَلَيْهِ الْكِتَابَ، فَكَانَ فِيمَا أَنْزَلَ اللَّهُ عَلَيْهِ آيَةَ الرَّجْمِ، قَرَأْنَاهَا، وَوَعَيْنَاهَا، وَعَقَلْنَاهَا، فَرَجَمَ رَسُولُ اللهِ ﷺ، وَرَجَمْنَا بَعْدَهُ، فَأَخْشَى إِنَ طَالَ بِالنَّاسِ زَمَانٌ أَنْ يَقُولَ قَائِلٌ: مَا نَجِدُ الرَّجْمَ فِي كِتَابِ اللهِ، فَيَضِلُّوا بِتَرْكِ فَرِيْضَةٍ أَنْزَلَهَا اللَّهُ، وَأَنَّ الرَّجْمَ

1038. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం ప్రకారం ఆయన (స్వయంగా) ఇలా ప్రసంగించారు - ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు అల్లాహ్ సత్యాన్నిచ్చి పంపాడు. ఆయన (స) పై గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఆయన (స)పై అవతరింపజేసిన దానిలో శిలాశిక్షకు సంబంధించిన సూక్తి కూడా ఉంది. మేము స్వయంగా దాన్ని పఠించాము, జ్ఞాపకం కూడా చేసుకున్నాము. ఇంకా దాన్ని బాగా అర్థం చేసుకున్నాము, మనో మస్తిష్కాలలో పదిలపరచుకున్నాము. అంతేకాదు, దైవప్రవక్త (సఅసం) శిలా శిక్షను అమలుపరచారు. ఆయన (స) తదనంతరం మేము సయితం ఆ శిక్షను అమలుపరచాము. కాని కొంతకాలం గడచిన మీదట ప్రజలు, 'దైవగ్రంథంలో మేమెక్కడా శిలా శిక్ష గురించిన ప్రస్తావన చూడలేద'ని అంటారేమోనని నాకనుమానంగా ఉంది. ఈ విధంగా వారు దేవుడు అవతరింపజేసిన 'విధి'ని పరిత్యజించి

حَقٌّ فِي كِتَابِ اللهِ تَعَالىٰ عَلىٰ مَنْ زَنَى، إِذَا أَحْصَنَ، مِنَ الرِّجَالِ وَالنِّسَاءِ، إِذَا قَامَتِ الْبَيِّنَةُ، أَوْ كَانَ الْحَبَلُ، أَوِ الِاعْتِرَافُ. مُتَّفَقٌ عَلَيْهِ.

మార్గభ్రష్టులవుతారేమో! వాస్తవానికి దైవగ్రంథంలో శిలా శిక్ష ఉందన్నది సత్య బద్ధం. వివాహితుడై ఉండి, వ్యభిచారానికి పాల్పడిన వ్యక్తికి ఈ శిలా శిక్ష విధించబడుతుంది - వారు పురుషులైనా సరే, స్త్రీలైనా సరే - సాక్ష్యాలు ముందుకు వచ్చినమీదట లేదా గర్భవతి అని తెలిసినపుడు లేదా నేరస్థుడు తన నేరాన్ని స్వయంగా ఒప్పుకున్నప్పుడు (ఈ శిక్ష విధించబడుతుంది). (బుఖారీ)

**సారాంశం**

వ్యభిచార నేరం మూడు విధాలుగా నిరూపితం అవుతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. 1. నాలుగు సాక్ష్యాలుండాలి. 2. లేదా నేరస్థుడు తన నేరాన్ని తనంతట తానుగా అంగీకరించాలి. 3. లేదా స్త్రీ గర్భవతి అని నిర్ధారణ అవ్వాలి.

ఒకవేళ స్త్రీ పెళ్ళి కాకుండానే గర్భవతి అయినపక్షంలో ఏం చేయాలి? ఇట్టి స్థితిలో హద్దు (శిక్ష)ను విధించాల్సిందేనని హజ్రత్ ఉమర్ (రజి), ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఆయన శిష్యులు భావిస్తున్నారు. అయితే కేవలం గర్భవతి అన్న కారణంపై హద్దు (శిక్ష) విధించబడజాలదని ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూహనీఫా (రహ్మ.లై)లు అభిప్రాయపడుతున్నారు. ఈ హదీసు పలువురు సహాబీల (రజి)చే ఉల్లేఖించబడింది.

హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) ఉల్లేఖనంలో ఇలా ఉంది : అహ్జాబ్ సూరా బఖరా సూరాకు సమానంగా ఉండేది. తరువాత అందలి కొన్ని భాగాలు రద్దు అయినాయి. వివాహితుడైన పురుషుడుగానీ, వివాహితురాలైన స్త్రీగానీ వ్యభిచారం చేస్తే రాళ్లు రువ్వండి అనే సూక్తిని మేము అందులో పఠించేవారము. తరువాత ఈ సూక్తి పారాయణం రద్దు పరచబడింది. అయితే 'ఆదేశం' మాత్రం మిగిలివుంది.

(١٠٣٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالىٰ عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا زَنَتْ أَمَةُ أَحَدِكُمْ، فَتَبَيَّنَ زِنَاهَا، فَلْيَجْلِدْهَا الْحَدَّ، وَلَا يُثَرِّبْ عَلَيْهَا، ثُمَّ إِنْ

1039. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: "మీలోని ఎవరి బానిస స్త్రీ అయినా వ్యభిచారానికి పాల్పడి, ఆమె వ్యభిచరించినట్లు నిర్ధారణ అయితే అతడామెను శిక్షించాలి. అంతేగాని ఆమెను

زَنَت فَلْيَجْلِدْهَا الْحَدَّ، وَلاَ يُثَرِّبْ عَلَيْهَا، ثُمَّ إِنْ زَنَتِ الثَّالِثَةَ، فَتَبَيَّنَ زِنَاهَا، فَلْيَبِعْهَا، وَلَوْ بِحَبْلٍ مِنْ شَعَرٍ». مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا لَفْظُ مُسْلِمٍ.

ఛీత్కరించకూడదు. రెండవసారి కూడా ఆ బానిస స్త్రీ వ్యభిచారానికి ఒడిగడితే అప్పుడు కూడా శిక్ష విధించబడుతుంది- దూషించటం జరగదు. మరి ఆ బానిస స్త్రీ మూడవసారి కూడా వ్యభిచారానికి పాల్పడితే, వ్యభిచరించినట్లు స్పష్టంగా రుజువైతే ఆమెను అమ్మివేయాలి. ఆఖరికి వెంట్రుకలతో పేనబడిన త్రాడుకు బదులుగా అమ్మవలసి వచ్చినా సరే ఆమెను వదిలించుకోవాలి. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి)

**సారాంశం**

ఈ హదీసు ద్వారానూ, రాబోయే హజ్రత్ అలీ (రజి) హదీసు ద్వారానూ అర్థమయ్యే దేమిటంటే బానిస లేక బానిసరాలిపై యజమాని శిక్షను అమలుపరచగలడు. అయితే స్వతంత్రునిపై విధించే శిక్షలో ఇది సగం శిక్ష అయి ఉంటుంది. దివ్యగ్రంథంలో అల్లాహ్ సెలవిచ్చినట్లు; సౌశీల్యవతి అయిన స్వతంత్ర స్త్రీకి విధించబడే శిక్షలో ఇది సగం అయి ఉంటుంది. ఒకవేళ బానిసరాలు వివాహితురాలై ఉంటే, అట్టి పరిస్థితిలో ఆమెకు విధించబడే శిక్ష గురించి భేదాభిప్రాయం ఉంది. అంటే ఆమెపై శిక్ష విధించవలసింది ప్రభుత్వమా? లేక ఆమె యజమానా? యజమాని మాత్రమే ఈ స్థితిలోనూ శిక్ష విధించాలని మెజారిటీ విద్వాంసులు భావిస్తున్నారు. అయితే వివాహితురాలైన బానిసరాలిపై యజమాని శిక్ష విధించలేడని, ఎందుకంటే ఆమె ఒక్క యజమానికి మాత్రమే లోబడి లేదనీ, మరో వంక ఆమె భర్తకు కూడా ఆమెపై అజమాయిషీ ఉందనీ ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) అభిప్రాయ పడుతున్నారు. ఒకవేళ ఆ బానిసరాలి భర్త కూడా ఆ యజమానివద్దనే బానిసగా ఉంటే అట్టి స్థితిలో యజమానిదే తుది నిర్ణయమవుతుందని ఆయన చెప్పారు.

ఒక స్వతంత్రురాలైన స్త్రీ అక్రమ సంబంధానికి పాల్పడినట్లు ఏ ఏ ఆధారాలు, సాక్ష్యాలు సమర్పించబడతాయో అలాంటి సాక్ష్యాలే ఒక బానిసరాలి విషయంలో కూడా సమర్పించవలసి ఉంటుంది. మరి కొంతమంది దృష్టిలో ఈ సాక్ష్యాలేమీ అక్కరలేదు, ఆమె తప్పుచేసినట్లు ఆమె యజమాని దృఢ నిశ్చయానికి వస్తే చాలు.

(١٠٤٠) وعن عليٍّ رضي الله عنه قال: قال رسول الله ﷺ: «**أَقِيمُوا الْحُدُودَ عَلَى مَا مَلَكَتْ أَيْمانُكُم**» رَوَاهُ أبو دَاوُدَ، وهو في مُسْلِمٍ مَوْقُوفٌ.

1040: హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "మీ అధీనంలో వున్న బానిసరాలు (లేక బానిస - నేరస్థులని నిరూపితం అయినప్పుడు) శిక్షలు విధించండి." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - 'ముస్లిం' లో ఈ ఉల్లేఖనం 'మౌఖూఫ్'గా ఉంది)

(١٠٤١) وَعَنْ عِمْرَانَ بْنَ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ امْرَأَةً مِنْ جُهَيْنَةَ أَتَتِ النَّبِيَّ ﷺ، وَهِيَ حُبْلَى مِنَ الزِّنَا، فَقَالَتْ: يَا نَبِيَّ اللهِ! أَصَبْتُ حَدًّا، فَأَقِمْهُ عَلَيَّ، فَدَعَا رَسُولُ اللهِ ﷺ وَلِيَّهَا، فَقَالَ: «**أَحْسِنْ إِلَيْهَا، فَإِذَا وَضَعَتْ فَأْتِنِي بِهَا**»، فَفَعَلَ، فَأَمَرَ بِهَا فَشُكَّتْ عَلَيْهَا ثِيَابُهَا، ثُمَّ أَمَرَ بِهَا فَرُجِمَتْ، ثُمَّ صَلَّى عَلَيْهَا، فَقَالَ عُمَرُ: أَتُصَلِّي عَلَيْهَا يَا نَبِيَّ اللهِ! وَقَدْ زَنَتْ؟ فَقَالَ: «**لَقَدْ تَابَتْ تَوْبَةً، لَوْ**

1041. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : జుహైన తెగకు చెందిన ఒక స్త్రీ దైవప్రవక్త (సఅసం) దగ్గరికి వచ్చింది. అప్పటికి ఆమె తాను పాల్పడిన వ్యభిచార పాపఫలంగా గర్భవతి కూడా అయింది. "దైవప్రవక్తా (స)! నేను శిక్షార్హురాలిని. కనుక తమరు నాపై శిక్షను విధించండి" అని ప్రాధేయపడిందామె. దైవప్రవక్త (సఅసం) ఆమె తాలూకు సంరక్షకుణ్ణి పిలిపించి, "ఈమె యెడల దయాభావంతో మెలగు. ప్రసవించిన తరువాత ఈమెను నా వద్దకు తీసుకురా" అని సలహా ఇచ్చారు. ఆ వ్యక్తి దైవప్రవక్త (స) చెప్పినట్లే చేశాడు. ఆయన (స) ఆమె గురించి ఆదేశాలు జారీ చేశారు. ఆమె నిర్బంధించబడింది. ప్రవక్త ఆదేశానుసారం ఆమెపై రాళ్ళు రువ్వబడ్డాయి. తరువాత ఆమె అంత్యక్రియల నమాజ్ చేయబడింది. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) కల్పించుకుని, "ఓ దైవప్రవక్తా (స)! తమరు వ్యభిచారానికి

قُسِمَتْ بَيْنَ سَبْعِينَ مِنْ أَهْلِ الْمَدِينَةِ لَوَسِعَتْهُمْ، وَهَلْ وَجَدَتْ أَفْضَلَ مِنْ أَنْ جَادَتْ بِنَفْسِهَا لِلَّهِ تَعَالَى؟» رَوَاهُ مُسْلِمٌ.

పాల్పడిన ఒక పాపిష్టురాలి అంత్య క్రియల నమాజ్‌లో పాల్గొంటారా?" అని ఆశ్చర్యంగా అడగ్గా, ఆయన (సఅసం) ఇలా సమాధానమిచ్చారు : "ఈమె పశ్చాత్తాపం చెందింది. ఈమె చెందిన పశ్చాత్తాపం ఎంత గొప్పదంటే, ఒకవేళ దాన్ని మదీనా వాసుల్లోని డెబ్భయి మందికి పంచిపెట్టినా అది వారి (మన్నింపు)కై సరిపోతుంది. దైవం కోసం తన ప్రాణాన్ని సయితం ధారాదత్తం చేసిన ఇంతకన్నా గొప్ప త్యాగమయిని నీవు చూశావా?!" (ముస్లిం)

**సారాంశం**

గర్భవతి అయిన మహిళపై వ్యభిచార శిక్ష వెంటనే అమలుపరచబడదనీ, ప్రసవించిన తరువాత, పుట్టిన శిశువుకు పాలుపట్టే బాధ్యతను ఎవరయినా తీసుకున్న తరువాతనే ఈ శిక్ష విధించబడుతుందని పై హదీసు ద్వారా అవగతమవుతోంది. ఒకవేళ పాలుపట్టే ఏర్పాటు జరగని పక్షంలో రెండేండ్ల పాల గడువు కూడా ముగిసిన తరువాతే శిక్ష అమల్లోకి వస్తుంది.

కాలు జారిన ఆ మహిళ పట్ల దయాభావంతో మెలగమని దైవప్రవక్త (సఅసం) హితవు పలకటం గమనార్హం. సాధారణంగా ఇలాంటి తప్పుచేసిన స్త్రీని అయినవారు, కానివారు, అమ్మలక్కలు - అందరూ సూటిపోటి మాటలతో బ్రతుకు దుర్భరం చేసివేస్తారు. ఇలాంటి ప్రతికూల వాతావరణం ఆమెను అస్వస్థతకు గురిచేయటమే గాకుండా, ఆమె కడుపులో పెరిగే బిడ్డకు కూడా హానికరంగా పరిణమిస్తుంది.

రాళ్లు రువ్వే శిక్షకు గురైన అపరాధి - పురుషుడైనా, స్త్రీ అయినా - వారి అంత్యక్రియల నమాజ్ చెయ్యటం మాత్రం సంప్రదాయమే (మస్నూన్). ఇటువంటి వ్యక్తుల జనాజా నమాజ్‌లో సాధారణ ప్రజలు, ప్రముఖులు కూడా పాల్గొనాలని మెజారిటీ విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(١٠٤٢) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: رَجَمَ النَّبِيُّ ﷺ رَجُلاً مِّنْ أَسْلَمَ، وَرَجُلاً مِّنَ الْيَهُودِ، وَامْرَأَةً.

1042. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అస్లం తెగకు చెందిన ఒక వ్యక్తికి శిలా శిక్ష విధించారు. ఒక యూద పురుషునికీ, ఒక యూద స్త్రీకి

رَوَاهُ مُسْلِمٌ وَقِصَّةُ رَجْمِ الْيَهُودِيَّيْنِ فِي الصَّحِيحَيْنِ مِنْ حَدِيثِ ابْنِ عُمَرَ.

కూడా ఇలాంటి శిక్షే విధించారు. (ముస్లిం - యూద స్త్రీ పురుషుల శిలా శిక్ష వృత్తాంతం 'సహీహైన్'లో ఇబ్నె ఉమర్ (రజి)చే ఉల్లేఖించబడింది)

**సారాంశం**

వ్యభిచార నేరానికి పాల్పడిన ఒక యూద పురుషుడు, ఒక యూద స్త్రీకి సంబంధించిన సంఘటన బుఖారీ, ముస్లిం గ్రంథాలలోనే గాక సునన్ గ్రంథాలలోనూ వచ్చింది. దాని ప్రకారం; మదీనాలో కొందరు యూదులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి; మాలోని ఒక పురుషుడు, ఒక స్త్రీ వ్యభిచారానికి పాల్పడ్డారు అని తెలియజేశారు. దానికి ఆయన (స), "తౌరాత్ గ్రంథంలో శిలా శిక్ష గురించి ఏముందీ?" అని అడిగారు. "మేము వ్యభిచరించిన ఇద్దరి ముఖాలకు మసిపూసి, గాడిదపై కూర్చోబెట్టి ఊరేగిస్తాము - ఈ విధంగా వారిని అవమానపరుస్తాము" అని వివరించారు యూదులు. "ఒకవేళ మీరు చెప్పేదే నిజమైతే తౌరాత్ గ్రంథాన్ని తెచ్చి, దాన్ని చదవండి" అని దైవప్రవక్త (స) సూచించారు. యూదులు తౌరాత్ గ్రంథం తెచ్చి చదవసాగారు. శిలా శిక్ష ఆదేశం వున్న సూక్తి దగ్గరకు చేరగానే, దాన్ని పఠించే యువకుడు ఆ సూక్తిపై చేయిపెట్టి, దానికి క్రిందా, పైనా ఉన్న సూక్తులను పఠించసాగాడు. ఆ సమయంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) కూడా అక్కడున్నారు. "దైవప్రవక్తా! అతని చేయిని తీయమని చెప్పండి" అన్నారు. ఆ వ్యక్తి చెయ్యి తీస్తే అక్కడ శిలా శిక్షకు సంబంధించిన ఆజ్ఞ ఉంది. అప్పుడు దైవప్రవక్త (స) వారిద్దరినీ శిలా శిక్ష విధించమని ఆదేశించారు.

(١٠٤٣) وَعَنْ سَعِيدِ بْنِ سَعْدِ بْنِ عُبَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ فِي أَبْيَاتِنَا رُوَيْجِلٌ ضَعِيفٌ، فَخَبُثَ بِأَمَةٍ مِّنْ إِمَائِهِمْ فَذَكَرَ ذٰلِكَ سَعْدٌ لِّرَسُولِ اللهِ ﷺ، فَقَالَ: «اِضْرِبُوهُ حَدَّهُ»، فَقَالُوا: يَا رَسُولَ اللهِ! إِنَّهُ أَضْعَفُ مِنْ

1043. హజ్రత్ సయీద్ బిన్ సాద్ బిన్ ఉబాదా (రజి) కథనం : "మా ఇండ్లల్లో అత్యంత బలహీనుడు, బక్కవాడైన ఒక పాట్టి మనిషి ఉండేవాడు. అతడు మా బానిసరాళ్ళలో ఒకామెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ సంగతిని హజ్రత్ సాద్ (రజి) దైవప్రవక్త (సఅసం) దృష్టికి తీసుకురాగా; "అతణ్ణి శిక్షించండి" అని ఆయన (స) ఆదేశించారు. "దైవ ప్రవక్తా (సఅసం)! అతడు మరీ బలహీనంగా, బక్కపలచగా ఉన్నాడు కదా!" అని జనులు సందేహపడగా "నూరు

ذٰلِكَ، فَقَالَ: **خُذُوا عِثْكَالاً فِيهِ مِائَةُ شِمْرَاخٍ، ثُمَّ اضْرِبُوهُ بِهِ ضَرْبَةً وَاحِدَةً»، فَفَعَلُوا.** رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ وَابْنُ مَاجَهْ، وَإِسْنَادُهُ حَسَنٌ، لٰكِنْ اُخْتُلِفَ فِي وَصْلِهِ وَإِرْسَالِهِ.

రెమ్మలు గల ఒక ఖర్జూర మండను తీసుకుని ఒకేసారి వాడిపై ఝళిపించండి" అని దైవప్రవక్త (స) సూచించారు. ప్రజలు ఆయన (స) సూచనను యథాతథంగా పాటించారు. (దీనిని అహ్మద్, నసాయి, ఇబ్నె మాజాలు ఉల్లేఖించారు. దీని పరంపర 'హసన్' కోవకు చెందినది. ఇది మౌసూల్ మరియు ముర్సల్ కావటంపై భేదాభిప్రాయం ఉంది)

**సారాంశం**

ఈ హదీసు వల్ల అవగతమయ్యేదేమిటంటే అవివాహితుడైన వ్యభిచారి తీవ్ర వ్యాధిగ్రస్తుడుగానో, మరీ బలహీనుడిగానో ఉండి కొరడా దెబ్బలు తింటే చచ్చిపోతాడనుకున్నప్పుడు అతనిపట్ల కొంత సడలింపుల వైఖరిని అవలంబించవచ్చు. అయితే దెబ్బల సంఖ్యలో మాత్రం తగ్గింపు ఉండదు. నూరు రెమ్మలు గల మండను తీసుకుని ప్రతి రెమ్మా అతనికి తగిలేలా కొట్టాలని అత్యధికమంది ఉలమా భావించగా, నూరు రెమ్మలు గల మండతో ఒక్కసారి కొడితే సరిపోతుందని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. షరీయత్ విధించే శిక్షల పరమార్థం ప్రజలకు గుణపాఠం నేర్పడం మరియు శాంతిభద్రతలను నెలకొల్పడమేగాని మనుషులను చంపటం కాదు.

**హదీసు ఉల్లేఖకులు**

సయీద్ బిన్ సాద్ బిన్ ఉబాదా అన్సారీ (రజి) : సుప్రసిద్ధ సహాబీ. మరొక కథనం ప్రకారం తాబయీ అని తెలుస్తోంది. ఈయనచే కొన్ని హదీసులు ఉల్లేఖించబడ్డాయి. హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ (రజి) తన పరిపాలనా కాలంలో ఈయన్ని యమన్ అధికారిగా నియమించారు.

(١٠٤٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «مَنْ

1044. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : లూత్ జాతి చేష్టకు పాల్పడినట్లు నిర్ధారణ అయిన వారిని - ఆ చేష్ట చేసిన వారినీ, చేయించుకున్నవారిని - ఇద్దరినీ

وَجَدْتُمُوهُ يَعْمَلُ عَمَلَ قَوْمِ لُوطٍ، فَاقْتُلُوا الْفَاعِلَ وَالْمَفْعُولَ بِهِ، وَمَنْ وَجَدْتُمُوهُ وَقَعَ عَلَى بَهِيمَةٍ فَاقْتُلُوهُ وَاقْتُلُوا الْبَهِيمَةَ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَرِجَالُهُ مُوَثَّقُونَ. إِلاَّ أَنَّ فِيهِ اخْتِلَافاً.

చంపేయండి. అలాగే జంతువులతో, లైంగిక సంపర్కం చేస్తూ కంటపడిన వారిని - ఆ చేష్టకు ఒడిగట్టిన పురుషుణ్ణీ, ఆ జంతువును కూడా - వధించండి.'' (దీనిని అహ్మద్ మరియు 'నలుగురూ' ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకులు ఎన్న దగ్గ వారుగా ధృవీకరించబడ్డారు. అయితే ఈ అంశంపై స్వల్పమయిన భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్త మయ్యాయి)

**సారాంశం**

'లూత్ జాతి చేష్ట' అంటే అసహజమైన లైంగిక ప్రక్రియ. దైవప్రవక్త లూత్ (అలైహిస్సలాం) కాలం నాటి ప్రజలు సహజమైన లైంగిక ప్రక్రియకు బదులు అసహజమైన రీతికి పాల్పడటం వల్ల వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. ఆ చేష్ట నేడు 'హోమో సెక్సువాలిటీ'గా పిలువబడుతోంది. కొన్ని పాశ్చాత్య దేశాలు ఈ నీతిమాలిన చేష్టను చట్టబద్ధమైనదిగా ఖరారు చేశాయి కూడా.

అసహజమైన, పరమ జుగుప్సాకరమయిన ఈ చేష్టను ఇస్లాం నిషేధించటమే గాకుండా దీన్ని నీతిబాహ్యమైన పోకడగా కూడా భావిస్తోంది. సమాజంలోని సౌశీల్యాన్ని, పారిశుద్ధ్యాన్ని పాడుచేసి మానవతను ఉత్థానస్థితి నుంచి పతనానికి చేర్చే ఈ పోకడను సమూలంగా తుడిచిపెట్టాలన్న ఉద్దేశ్యంతోనే ఇటువంటి వికృత చేష్టకు పాల్పడేవారిని హతమార్చమని మహనీయ ముహమ్మద్ (సఅసం) ఆదేశించారు.

ఆధునిక యుగంలో ఎన్ని వైద్యసదుపాయాలు పెరిగినా, మరెన్ని రోగనిరోధక మాత్రలు, ఇంజెక్షన్లు కనుగొనబడినా మానవ సముదాయాలు మాయ రోగాల బారిన పడుతూనే ఉన్నాయంటే దానికి ప్రధాన కారణం ఇస్లామీయ షరీయత్ సూచిస్తున్న నియమాల ఉల్లంఘనేనన్న వాస్తవాన్ని విస్మరించరాదు.

(١٠٤٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا. أَنَّ النَّبِيَّ ﷺ ضَرَبَ وَغَرَّبَ،

1045. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యభిచారిని కొట్టడమేగాక నగరం నుంచి బహిష్కరించే శిక్ష కూడా విధించారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) వ్యభిచారిని కొట్టడంతోపాటు నగర

وَأَبُو بَكْرٍ ضَرَبَ وَغَرَّبَ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَرِجَالُهُ ثِقَاتٌ، إِلاَّ أَنَّهُ اخْتُلِفَ فِي وَقْفِهِ وَرَفْعِهِ.

బహిష్కార శిక్ష విధించారు. (ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించారు - దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు. కాని ఇది మౌఖూఫ్ మరియు మర్ఫూ అనే విషయంలో మటుకు అభిప్రాయభేదం ఉంది)

(١٠٤٦) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ الْمُخَنَّثِينَ مِنَ الرِّجَالِ، وَالْمُتَرَجِّلاَتِ مِنَ النِّسَاءِ، وَقَالَ: «**أَخْرِجُوهُمْ مِنْ بُيُوتِكُمْ**». رَوَاهُ الْبُخَارِيُّ.

1046. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఆడవారిలా వేషధారణ చేసే మగవారినీ, మగవారిలా తయారయ్యే ఆడవారినీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శపించారు. "వారిని మీ ఇండ్లలో నుంచి వెళ్ళగొట్టండి" అని కూడా ఆయన (సఅసం) పలికారు. (బుఖారీ)

(١٠٤٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**ادْفَعُوا الْحُدُودَ مَا وَجَدْتُمْ لَهَا مَدْفَعاً**». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَسَنَدُهُ ضَعِيفٌ.

1047. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "శిక్షలను తప్పించడానికి ఎంతగా ప్రయత్నించవచ్చునో అంతగానూ ప్రయత్నించండి." (దీనిని ఇబ్నెమాజా సేకరించారు. అయితే దీని ఆధారం బలహీనమైనది)

وَأَخْرَجَهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ، مِنْ حَدِيثِ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، بِلَفْظِ: ادْرَءُوا الْحُدُودَ عَنِ الْمُسْلِمِينَ مَا اسْتَطَعْتُمْ. وَهُوَ ضَعِيفٌ أَيْضاً.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఆధారంగా తిర్మిజీ, హాకిమ్‌లు వివరించిన హదీసు వాక్యం ఇలా వుంది : "సాధ్యమైనంత వరకు ముస్లిములను శిక్షల బారినుండి కాపాడటానికి ప్రయత్నించండి." (ఇది కూడా బలహీనమైనదే)

وَرَوَاهُ الْبَيْهَقِيُّ، عَنْ عَلِيٍّ، مِنْ قَوْلِهِ، بِلَفْظِ: ادْرَءُوا الْحُدُودَ بِالشُّبُهَاتِ.

హజ్రత్ అలీ (రజి) ఆధారంగా బైహఖీ పొందుపరచిన హదీసులో ఇలా అనబడింది: "సాక్ష్యాధారాలు లేని (అనుమానాస్పదమయిన) వాటికి శిక్షలను విధించకండి."

**సారాంశం**

నేర విచారణ సందర్భంగా ఏ కాస్త అనుమానం వచ్చినా తీర్పును వాయిదా వేయాలని ఈ హదీసు సూచిస్తోంది. నేరస్థుల్ని శిక్షించకుండా వదలివేయాలని దీని భావం ఎంతమాత్రం కాదు. కాకపోతే అన్ని కోణాల నుంచీ సమగ్రమయిన విచారణ జరపాలి. పూర్తిగా నేరనిర్ధారణ జరగనిదే శిక్షల్ని విధించకూడదు.

(١٠٤٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اجْتَنِبُوا هَذِهِ الْقَاذُورَاتِ الَّتِي نَهَى اللَّهُ تَعَالَى عَنْهَا، فَمَنْ أَلَمَّ بِهَا فَلْيَسْتَتِرْ بِسَتْرِ اللهِ تَعَالَى، وَلْيَتُبْ إِلَى اللهِ تَعَالَى، فَإِنَّهُ مَنْ يُبْدِ لَنَا صَفْحَتَهُ نُقِمْ عَلَيْهِ كِتَابَ اللهِ تَعَالَى». رَوَاهُ الْحَاكِمُ، وَهُوَ فِي الْمُوطَإِ مِنْ مَرَاسِيلِ زَيْدِ بْنِ أَسْلَمَ.

1048. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "అల్లాహ్ వారించిన పాడు పనులకు దూరంగా ఉండండి. ఒకవేళ ఎవరయినా ఆ పాడు పనుల వాతన పడిపోతే దేవుడు వేసిన తెరమరుగున అతడు ఉండిపోవాలి. దైవసన్నిధిలో (లోలోపలే కుమిలిపోతూ) పశ్చాత్తాపం చెందాలి. ఎందుకంటే తన పార్శ్వాన్ని (దోషాన్ని) మా ముందు బహిర్గతం చేసిన వానిపై మేము దైవగ్రంథాన్ని (దైవాజ్ఞను) విధించి తీరుతాము." (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు. ఇది మువత్తాలో జైద్ బిన్ అస్లంచే 'ముర్సల్'గా ఉల్లేఖించబడింది)

**సారాంశం**

మానవ సహజమైన దౌర్బల్యం వల్ల మనిషి చేత తప్పు జరగటం అనూహ్యం కాదు. అయితే అలాంటి తప్పు జరిగిపోయినప్పుడు మనిషి తన తప్పిదాన్ని ఇతరుల ముందు చెప్పుకుంటూ తిరిగేబదులు దైవసన్నిధిలోనే క్షమాభిక్ష వేడుకోవాలి. దేవుడు అతని దోషాలను తెరమరుగు చేయదలచినప్పుడు దైవ సమక్షంలోనే పశ్చాత్తాపంతో కుమిలిపోవటం శ్రేయస్కరం.

కాని 'తౌబా' అంటే చెడు నుంచి మంచి వైపునకు మరలటమన్న సంగతిని అతడు మరచిపోరాదు. తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టిన దాసులను దేవుడు మన్నించే మాట వాస్తవమేగాని, మాటిమాటికీ అక్రమాలకు పాల్పడవచ్చని మాత్రం దీని భావం కాదు. మానవుడు తన వల్ల జరిగిపోయిన తప్పిదం ఇంకోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తపడటమే సిసలయిన పశ్చాత్తాపం (తౌబా). సిసలయిన పశ్చాత్తాపం చెందే దాసులను దేవుడు అమితంగా ఇష్టపడతాడు, వారి అంతస్థులను పెంచుతాడు.

### హదీసు ఉల్లేఖకులు

జైద్ బిన్ అస్లం (రజి) : ఈయన బనూ అజ్లాన్‌కు చెందిన వ్యక్తి. ఈయన బనీ అమ్ర్ బిన్ ఔఫ్ అన్సారీకి మద్దతుదారులు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) పక్షాన నిలిచారు. ఈయన్ని తులైహ బిన్ ఖువైలిద్ అసదీ బజాఖా యుద్ధదినాన హిజ్రీ 11లో హతమార్చాడని హిషామ్ కల్బీ తెలిపారు.

### 2వ అధ్యాయం

## వ్యభిచార నిందారోపణ - శిక్ష

## ٢ - بَابُ حَدِّ الْقَذْفِ

(١٠٤٩) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: لَمَّا نَزَلَ عُذْرِي، قَامَ رَسُولُ اللهِ ﷺ عَلَى الْمِنْبَرِ، فَذَكَرَ ذٰلِكَ، وَتَلاَ الْقُرْآنَ، فَلَمَّا نَزَلَ أَمَرَ بِرَجُلَيْنِ وَامْرَأَةٍ فَضُرِبُوا الْحَدَّ. أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَأَشَارَ إِلَيْهِ الْبُخَارِيُّ.

1049. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : నా నిర్దోషిత్వాన్ని నిరూపించే దివ్య ఖుర్‌ఆన్ (సూక్తులు) అవతరించినపుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వేదికపై ఆసీనులై ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఖుర్‌ఆన్‌ను పారాయణం చేశారు. వేదిక నుంచి దిగిన తరువాత (ఈ అపనిందకు సూత్రధారులైన) ఇద్దరు పురుషులను, ఒక స్త్రీని శిక్షించమని ఆజ్ఞాపించగా వారిని శిక్షించటం జరిగింది. (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. బుఖారీ దీనిని ఉదాహరించారు)

### సారాంశం

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) తనపై వేయబడిన అభాండాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. "సౌశీల్యవతులైన స్త్రీలపై అపనిందను మోపి, దానికి సంబంధించిన నలుగురు సాక్షులను తీసుకురాలేకపోయిన వారికి ఎనభై కొరడా దెబ్బలు

కొట్టండి'' అని నూర్ సూరాలోని 4వ ఆయత్‌లో ఆదేశించబడింది. ఇంకా - దివ్య ఖుర్‌ఆన్‌లోని నూర్ సూరాలో (11వ సూక్తి నుండి 20వ సూక్తి వరకూ) హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) నిర్దోషిత్వాన్ని చాటిచెప్పడంతో పాటు ఈ అపనిందలో పాల్గొన్న విశ్వాసుల్లోని ఒక వర్గాన్ని హెచ్చరించటం జరిగింది.

(١٠٥٠) وَعَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: أَوَّلُ لِعَانٍ كَانَ فِي الْإِسْلَامِ أَنَّ شَرِيكَ بْنَ سَحْمَاءَ قَذَفَهُ هِلَالُ بْنُ أُمَيَّةَ بِامْرَأَتِهِ، فَقَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ: «**الْبَيِّنَةَ، وَإِلَّا فَحَدٌّ فِي ظَهْرِكَ**»، الْحَدِيثَ. أَخْرَجَهُ أَبُو يَعْلَى، وَرِجَالُهُ ثِقَاتٌ، وَفِي الْبُخَارِيِّ نَحْوُهُ مِنْ حَدِيثِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا.

1050. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : ఇస్లాంలో మొట్టమొదటి 'లియాన్' సంఘటన షరీక్ బిన్ సహ్మాకు సంబంధించిన సంఘటన. ఈయన, తన భార్యతో అక్రమ సంబంధం ఏర్పర చుకున్నట్టు హిలాల్ బిన్ ఉమయ్యాపై నింద మోపారు. అప్పుడు దైవప్రవక్త (నఅసం) ఈయన్ని (హిలాల్‌ను) ఉద్దేశ్యించి, ''సాక్షులను తీసుకురా. లేకుంటే నీ వీపుపై దెబ్బలు పడతాయి'' అని అన్నారు. (అబూ యాలా దీనిని వెలికి తీశారు. దీని ఉల్లేఖకులు ఎన్న దగినవారు. బుఖారీలోని ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనంలో కూడా ఇలాగే ఉంది)

**సారాంశం**

భర్త తన భార్యపై వ్యభిచార నింద మోపి తత్సంబంధమైన నలుగురు సాక్షులను తేలేని పక్షంలో అతడు స్వయంగా శిక్షార్హుడైపోతాడు. అయితే 'లియాన్' పద్ధతి ద్వారా ఈ శిక్షనుండి బయటపడవచ్చు.

ఎవరయినా తమ భార్యలపై నింద మోపినప్పుడు వారిద్దరూ తప్ప ఇతరులెవ్వరూ సాక్షులుగా వారి వద్ద లేని పక్షంలో వారిలో ఒక వ్యక్తి సాక్ష్యం (ఏమిటంటే, తాను) నాలుగు సార్లు అల్లాహ్‌పై ప్రమాణంచేసి తన నిందారోపణ సత్యమని తాను సాక్ష్యం చెప్పాలి. ఐదోసారి, ఒకవేళ తాను గనక (తన నిందారోపణలో) అబద్ధం చెప్పివుంటే, తనపై అల్లాహ్ శాపం పడుగాక! అని అనాలి. భార్య కూడా తన భర్తపై నిందారోపణ చేసి సాక్షుల్ని తీసుకు రాలేక పోయినప్పుడు ఇదేవిధంగా 'లియాన్' చేయవచ్చు. లియాన్ ఇంట్లో జరగకూడదు. ఇది న్యాయస్థానంలో మాత్రమే జరగాలి. భార్యాభర్తలిరువురి తరపునుండి లియాన్ జరిగిన తరువాత ఇక వారిద్దరూ ఒకరింకొకరి కొరకు నిషిద్ధులవుతారు.

## హదీసు ఉల్లేఖకులు

1. షరీక్ బిన్ సహ్మా (రజి) : ఈయన 'బలవీ' తెగకు చెందినవారు. అన్సార్లకు మద్దతు దారులు. హిలాల్ బిన్ ఉమయ్య అనే సహాబీ ఈయనపై నిందారోపణ చేశారు. ఒకానొక కథనం ప్రకారం ఈయన తన తండ్రితో కలసి ఉహుద్ సంగ్రామంలో కూడా పాల్గొన్నారు. బరాబిన్ మాలిక్‌కు ఈయన తల్లి తరపు సోదరుడవుతారు. ఈయన తండ్రి పేరు అబదా బిన్ మూతిబ్. ఈయన తల్లి పేరు సహ్మా.

2. హిలాల్ బిన్ ఉమయ్య (రజి) : అన్సార్‌లలోని ఔస్ తెగకు చెందినవారు. వాఖిఫీగా కూడా పిలువబడ్డారు. ప్రముఖ సహాబీలలో ఒకరుగా పరిగణించబడేవారు. తొలి కాలంలోనే ఇస్లాం స్వీకరించారు. బద్ర్, ఉహుద్ యుద్ధాలలో పాల్గొన్నారు. మక్కా విజయం నాడు బనూ వాఖిఫ్ తెగవారి ధ్వజం ఈయన చేతిలోనే ఉంది. తబూక్ యుద్ధ సందర్భంగా వెనక ఉండిపోయిన ముగ్గురు సహచరులలో ఈయన ఒకరు.

(١٠٥١) وَعَنْ عَبْدِاللهِ بْنِ عَامِرِ بْنِ رَبِيْعَةَ قَالَ: لَقَدْ أَدْرَكْتُ أَبَا بَكْرٍ وَعُمَرَ وَعُثْمَانَ وَمَنْ بَعْدَهُمْ، فَلَمْ أَرَهُمْ يَضْرِبُونَ الْمَمْلُوكَ فِي الْقَذْفِ إِلاَّ أَرْبَعِيْنَ. رَوَاهُ مَالِكٌ وَالثَّوْرِيُّ فِي جَامِعِهِ.

1051. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ బిన్ రబీయ కథనం : నేను హజ్రత్ అబూబక్ర్ (రజి), ఉమర్ (రజి), ఉస్మాన్ (రజి), ఆ తరువాత వారి కాలాన్ని కూడా చూశాను. కాని నిందారోపణ శిక్షలో బానిసలను నలభై (కొరడా దెబ్బల)కన్నా ఎక్కువగా కొట్టడాన్ని నేను చూడలేదు. (దీనిని మాలిక్ ఉల్లేఖించారు. సౌరీ తన గ్రంథం 'జామె'లో దీనిని పొందుపరచారు)

## సారాంశం

హదీసు ఉల్లేఖకులైన అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ గారి మరో పేరు అబూ ఇమ్రాన్. ఏడుగురు విశ్వ విఖ్యాత దివ్య ఖుర్ఆన్ స్వర శాస్త్రవేత్తలలో ఒకరు. తాబయీన్లలోని రెండో తరానికి చెందిన గొప్ప హాఫిజ్.

ఈ హదీసు ప్రకారం ఒక స్వతంత్రుడికి విధించబడే శిక్షలో సగం శిక్ష మాత్రమే బానిసకు, బానిసరాలికి విధించబడుతుంది. ఉదాహరణకు వ్యభిచార శిక్షకు గాను 50 కొరడా దెబ్బలు కొట్టబడతాయి. రాళ్లు రువ్వే శిక్ష లేదు. ఎందుకంటే మరణ శిక్షలో సగం శిక్ష అన్నది సాధ్యం కానిది. ఇక నిందారోపణకు సంబంధించిన కేసులో సగం శిక్షగా 40 కొరడా దెబ్బలు కొట్టబడతాయి. అత్యధిక మంది ధర్మవేత్తల విధానం కూడా ఇదే.

(١٠٥٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ قَذَفَ مَمْلُوكَهُ يُقَامُ عَلَيْهِ الْحَدُّ يَوْمَ الْقِيَامَةِ، إِلاَّ أَنْ يَكُونَ كَمَا قَالَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1052. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరయితే తన అధీనంలో వున్న బానిస (లేక బానిసరాలి)పై నింద మోపాడో అతనిపై ప్రళయదినాన శిక్ష విధించబడుతుంది. ఒకవేళ అతను తన నిందారోపణలో సత్యవంతుడై ఉంటే మాత్రం శిక్ష పడదు. (బుఖారీ, ముస్లిం)

**3వ అధ్యాయం**

## ٣ - بَابُ حَدِّ السَّرِقَةِ

## దొంగతనానికి విధించబడే శిక్ష

(١٠٥٣) عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تُقْطَعُ يَدُ سَارِقٍ إِلاَّ فِي رُبْعِ دِينَارٍ فَصَاعِداً». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ. وَلَفْظُ الْبُخَارِيِّ: «تُقْطَعُ يَدُ السَّارِقِ فِي رُبْعِ دِينَارٍ فَصَاعِداً».

1053. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "కనీసం పావు (1/4) దీనారు లేక అంత కన్నా ఎక్కువ దొంగిలిస్తే తప్ప ఏ దొంగ చేతినీ నరకరాదు." (బుఖారీ, ముస్లిం- హదీసు వాక్యాలు ముస్లింలోనివి) బుఖారీలో ఇలా వుంది : "పావు దీనారు మరియు అంతకన్నా ఎక్కువగా దొంగి లించినప్పుడే దొంగ చేతిని నరకాలి."

وَفِي رِوَايَةٍ لأَحْمَدَ: «اقْطَعُوا فِي رُبْعِ دِينَارٍ، وَلاَ تَقْطَعُوا فِيمَا هُوَ أَدْنىٰ مِنْ ذٰلِكَ».

అహ్మద్ ఉల్లేఖనం ఇలా ఉంది: పావు దీనారు దొంగిలిస్తే దొంగ చేతిని నరకండి. అంతకన్నా తక్కువ విలువ గల దొంగతనంపై చేతిని నరకకండి."

**సారాంశం**

నిర్ణీత పరిమాణంలో దొంగతనం చేసిన వారికి మాత్రమే చేతిని నరకాలని ఈ హదీసు

సూచిస్తోంది. మెజారిటీ ఉలమాల అభిప్రాయం కూడా ఇదే. అయితే హసన్ బస్రీ, జాహిరియ, ఖవారిజ్‌లు దివ్య ఖుర్‌ఆన్ ఆయత్ ఆధారంగా - ఎక్కువ తక్కువ పరిమాణాలతో నిమిత్తం లేకుండా - ప్రతి దొంగతనానికి చేతిని నరకాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చారు. కాని ఈ నిర్ణయం సరైనది కాదు. ఎందుకంటే దివ్య ఖుర్‌ఆన్‌కు హదీసు తాత్పర్యం మరియు వివరణ వంటిది. నిర్ణీత పరిమాణాన్ని హదీసు సూచిస్తున్నప్పుడు హదీసు ప్రకారమే శిక్షను అమలుపరచాలి. అయితే ఆ 'నిర్ణీత పరిమాణం' గురించి భిన్నాభిప్రాయాలు వెల్లడైనాయి. వాటిలో రెండు వాదనలు ప్రసిద్ధికెక్కాయి. మొదటిది: బంగారమైతే ఒక దీనారులో నాల్గోవంతు. వెండి అయితే కనీసం మూడు దిర్హములు. హిజాజ్ ప్రాంతానికి చెందిన ధర్మవేత్తలతోపాటు, ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయం కూడా ఇదే.

రెండవది : పది దిర్హముల విలువకు సమానమైన దొంగతనం. అంతకన్నా తక్కువ పరిమాణంలో దొంగతనం చేస్తే హస్తఖండన శిక్ష విధించబడదు. ఇమామ్ సుఫియాన్ సౌరితోపాటు హనఫీ పండితుల విధానం కూడా ఇదే.

వీరిలో మొదటి వర్గం వారు తమ వాదనకు ఆధారంగా సహీహైన్‌లోని హదీసును తీసుకోగా, రెండవ వర్గంవారు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) హదీసును ఆధారంగా తీసుకున్నారు. దీని ప్రకారం దైవప్రవక్త (సఅసం) హయాంలో పది దిర్హముల విలువగల 'డాలు'ను దొంగిలించిన వ్యక్తి చేతిని నరకటం జరిగింది.

(١٠٥٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ النَّبِيَّ ﷺ قَطَعَ فِي مِجَنٍّ ثَمَنُهُ ثَلاَثَةُ دَرَاهِمَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1054. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు దిర్హముల విలువ గల డాలును దొంగిలించినందుకు హస్త ఖండన శిక్ష విధించారు. (బుఖారీ, ముస్లిం)

(١٠٥٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَعَنَ اللَّهُ السَّارِقَ، يَسْرِقُ الْبَيْضَةَ فَتُقْطَعُ يَدُهُ، وَيَسْرِقُ الْحَبْلَ فَتُقْطَعُ يَدُهُ». مُتَّفَقٌ عَلَيْهِ أَيضاً.

1055. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "దొంగకు దేవుని శాపం కలుగుగాక! అతను గుడ్డును దొంగిలించి తన చేతిని నరికించుకుంటాడు, తాడును దొంగిలించి తన చేతిని నరికించుకుంటాడు."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

దొంగతనం చిన్నదైనా, పెద్దదైనా అది దొంగతనమేననీ, ప్రతి చిన్న దొంగతనానికి సయితం

హస్తఖండన శిక్ష విధించబడుతుందనీ ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. కోడిగుడ్డును, త్రాడును ఉపమానంగా పేర్కొనటంలోని అసలు ఉద్దేశ్యమేమిటంటే దొంగతనం అనేది ఎంతో నీచమైన జుగుప్సాకరమయిన చేష్ట. ఈ చేష్టకు అలవాటుపడిన వ్యక్తి సమాజం పట్ల రాను రానూ ఎంతో హానికరంగా పరిణమిస్తాడు. మొదట చిన్నా చితకా దొంగతనాలు చేస్తాడు, తరువాత మహాపరాధాలకు ఒడిగడతాడు. బందిపోటుగా, గజదొంగగా తయారవుతాడు. అందుకే ఇస్లామీయ షరీయత్ దొంగతనానికి కఠినమయిన శిక్షల్ని ప్రతిపాదించింది. ఆదిలోనే ఈ చెడుల వరదకు ఆనకట్ట వేయదలచింది.

(١٠٥٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عنها أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**أَتَشْفَعُ فِي حَدٍّ مِنْ حُدُودِ اللهِ تَعَالَى؟**» ثُمَّ قَامَ، فَخَطَبَ، فَقَالَ: «**أَيُّهَا النَّاسُ! إِنَّمَا أَهْلَكَ الَّذِينَ مِنْ قَبْلِكُمْ أَنَّهُمْ كَانُوا إِذَا سَرَقَ فِيهِمُ الشَّرِيفُ تَرَكُوهُ، وَإِذَا سَرَقَ فِيهِمُ الضَّعِيفُ أَقَامُوا عَلَيْهِ الْحَدَّ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ. وَلَهُ مِنْ وَجْهٍ آخَرَ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَتِ

1056. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఏమిటీ, నీవు దేవుడు నిర్ణయించిన శిక్షలలో ఒక శిక్ష గురించి (నా దగ్గర) సిఫారసు చేయదలిచావా?" ఇలా అంటూ ఆయన (స) లేచి నిలబడి (ప్రజల ముందు) ఉపన్యసించారు. ఆ సందర్భంగా ఆయన (స) ఇలా అన్నారు: "ప్రజలారా! మీకు పూర్వం గతించిన వారు ఎందుకు నాశనమయ్యారంటే; వారు తమలోని స్థితిమంతుడు, పేరు ప్రతిష్ఠలుగల వ్యక్తి ఎవరయినా దొంగతనం చేస్తే అతన్ని శిక్షించకుండా వదలి పెట్టేసేవారు. అదే పేదవాడు, బలహీనుడైన వ్యక్తి దొంగతనంచేస్తే అతడ్ని శిక్షించే వారు." (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యాలు మాత్రం ముస్లింలోనివి. ముస్లింలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చేతనే ఉల్లేఖించబడిన మరో కథనంలో ఇలా వుంది : ఒక స్త్రీ జనుల వద్ద (అరువుగా) వస్తువులు అడుగుతూ తిరిగేది. తిరిగి ఇవ్వడానికి మాత్రం

నిరాకరించేది. అందుచేత దైవప్రవక్త - సఅసం - ఆ స్త్రీకి హస్తఖండన శిక్ష విధించవలసిందిగా ఆదేశించారు)

ٱمْرَأَةٌ تَسْتَعِيرُ ٱلْمَتَاعَ، وَتَجْحَدُهُ فَأَمَرَ النَّبِيُّ ﷺ بِقَطْعِ يَدِهَا.

**సారాంశం**

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) నుద్దేశ్యించి, దైవప్రవక్త (సఅసం) ఆగ్రహంతో అన్న మాటలివి. ఫాతిమా అనే మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. దైవప్రవక్త (సఅసం) ఆమెకు హస్తఖండన శిక్ష విధించారు. అయితే ఈ శిక్షపై ఖురైష్ తెగవాళ్లు కలవరం చెందారు. వారు పరస్పరం సంప్రతించుకుని ఈ వ్యవహారాన్ని దైవప్రవక్త (సఅసం)కు నివేదించుకోవాలని అనుకున్నారు. దీనికోసం ఉసామా బిన్ జైద్ (రజి)సరైన వ్యక్తి అని కూడా వాళ్ళంతా తీర్మానించుకున్నారు. ఏ విధంగానైనా తమ వర్గానికి చెందిన ఒక 'మర్యాదస్తురాలి' చేయి తెగకుండా చూడాలన్నది వారందరి తాపత్రయం. వాళ్ళ కోరిక మేరకు ఉసామా బిన్ జైద్ (రజి) ప్రతినిధిగా వెళ్ళి వాళ్ళందరి అభిమతాన్ని గురించి విన్నవించుకున్నారు. ఇది విని మహాప్రవక్త (సఅసం) గారి ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. ఉసామా బిన్ జైద్ (రజి) లాంటి నికార్సయిన సహచరుడు ఈ విధంగా సిఫారసు చేయటం కూడా ఆయన (స) ఆగ్రహానికి మరో కారణం అయి ఉండవచ్చు.

మొత్తమ్మీద దైవప్రవక్త (స) వారి నిష్పాక్షిక న్యాయానికి, వజ్ర సంకల్పానికి ఈ హదీసు అద్దం పడుతోంది. శిక్షల విధింపులో సిఫార్సులకు తావులేదని కూడా ఈ హదీసు చాటి చెబుతోంది.

1057. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) తెలిపారు : అవినీతికి పాల్పడిన వానికి (వస్తువును) లాక్కుపోయేవానికి, దోచుకుపోయేవానికి హస్తఖండన శిక్ష వర్తించదు. (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు - తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

(١٠٥٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَيْسَ عَلَى خَائِنٍ وَلاَ مُخْتَلِسٍ وَلاَ مُنْتَهِبٍ قَطْعٌ». رَوَاهُ أَحْمَدُ وَٱلْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

1058. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) చెప్పారు : "పండ్లు ఫలాలు,

(١٠٥٨) وَعَنْ رَافِعِ بْنِ خَدِيْجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ

يَقُولُ «**لاَ قَطْعَ فِي ثَمَرٍ، وَلاَ فِي كَثَرٍ**». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ وَصَحَّحَهُ أَيْضاً التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఖర్జూర చెట్ల గుజ్జు (బెండు)ను తీసుకున్నందుకుగాను హస్తఖండన శిక్ష ఉండదు.'' (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(١٠٥٩) وَعَنْ أَبِي أُمَيَّةَ الْمَخْزُومِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أُتِيَ رَسُولُ اللهِ ﷺ بِلِصٍّ قَدِ اعْتَرَفَ اعْتِرَافاً، وَلَمْ يُوْجَدْ مَعَهُ مَتَاعٌ، فَقَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ: «**مَا إِخَالُكَ سَرَقْتَ**»، قَالَ: بَلىٰ، فَأَعَادَ عَلَيْهِ مَرَّتَيْنِ أَوْ ثَلاَثاً، فَأَمَرَ بِهِ، فَقُطِعَ، وَجِيءَ بِهِ، فَقَالَ: «**اسْتَغْفِرِ اللَّهَ، وَتُبْ إِلَيْهِ**». فَقَالَ: أَسْتَغْفِرُ اللَّهَ، وَأَتُوبُ إِلَيْهِ. فَقَالَ: «**اَللّٰهُمَّ تُبْ عَلَيْهِ**»

1059. హజ్రత్ అబూ ఉమయ్య మఖ్జూమీ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) దగ్గరికి ఒక దొంగ హాజరు పరచబడ్డాడు. అతడు తన దొంగతనాన్ని ఒప్పుకున్నాడు. కాని అతని దగ్గర దొంగిలించిన వస్తువులు మాత్రం లేవు. ''నువ్వు దొంగతనం చేశావంటే నాకు నమ్మశక్యం కావటం లేదు'' అని దైవ ప్రవక్త (సఅసం) అన్నారు. ''లేదండి, ఈ పని చేసింది నేనే'' **అని ఆ వ్యక్తి** అన్నాడు. ఆయన (సఅసం) **రెండు లేక మూడు** సార్లు ఇలాగే **ప్రశ్నించగా, అతను** ప్రతిసారీ తన **తప్పును అంగీకరించాడు.** అప్పుడాయన (స) అతని హస్తాన్ని ఖండించమని ఆదేశించారు. ఆదేశాను సారం అతని చేయి నరికివేయబడింది. అనంతరం ఆ వ్యక్తి దైవప్రవక్త (స) సమక్షంలో హాజరుపరచబడ్డాడు. ఆయన (సఅసం) అతనికి హితబోధ చేస్తూ, ''నీ పాపాన్ని క్షమించమని అల్లాహ్‌ను వేడుకో. ఆయన సమక్షంలో పశ్చాత్తాపం చెందు'' అని అన్నారు. నేను క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకుంటున్నాను, ఆయన సన్నిధిలో పశ్చాత్తాపం

ثَلاَثًا. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَاللفظ لَهُ، وَأَحْمَدَ وَالنَّسَائِيُّ. وَرِجَالُهُ ثِقَاتٌ.

చెందుతున్నానని అతడు అన్నాడు. "దేవా! ఇతని పశ్చాత్తాపాన్ని స్వీకరించు" అని ఆయన (సఅసం) మూడుసార్లు అతని కొరకు ప్రార్థించారు. (అబూ దావూద్ ఈ హదీసును సేకరించారు - హదీసు వాక్యాలు కూడా అబూ దావూద్‌కు చెందినవే. అహ్మద్, నసాయి కూడా దీనిని ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకులు నమ్మకస్థులు)

وَأَخْرَجَهُ الْحَاكِمُ، مِنْ حَدِيْثِ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، فَسَاقَهُ بِمَعْنَاهُ، وَقَالَ فِيْهِ: اَذْهَبُوا بِهِ فَاقْطَعُوهُ، ثُمَّ احْسِمُوهُ. وَأَخْرَجَهُ الْبَزَّارُ أَيْضاً، وَقَالَ: لاَ بَأْسَ بِإِسْنَادِهِ.

అబూహురైరా (రజి) ఆధారంగా హాకిమ్ ఈ హదీసును సంగ్రహించారు. దీని ప్రకారం ఆయన (నఅసం) ఇలా సెలవిచ్చారు : ఇతన్ని తీసుకెళ్ళి హస్తఖండన చేయండి. తరువాత (రక్తస్రావం జరగకుండా) కాపు పెట్టండి." (దీనిని బజ్జార్ ఉల్లేఖించారు. దీని పరంపరలో ఎలాంటి లోపం లేదని కూడా ఆయన అన్నారు)

## సారాంశం

ఈ హదీసు ద్వారా బోధపడేదేమిటంటే న్యాయస్థానంలో ఒక వ్యక్తి తన నేరాన్ని ఒప్పుకున్న తరువాత, అతను దొంగిలించిన వస్తు సామగ్రి అతనివద్ద లభించినా లభించకపోయినా అతనికి విధించబడే శిక్ష మాత్రం హస్తఖండనే. చేయిని నరికిన తరువాత రక్తస్రావాన్ని ఆపడానికి చేతిని వెచ్చని నూనెలో ముంచడమో లేదా మరేదైనా చికిత్స చేయటమో అవసరం. సకాలంలో ఈ నివారణోపాయం చేయకపోతే రక్తస్రావం అధికంగా జరిగి అది ప్రాణాంతకంగా పరిణమించే ప్రమాదముంది. ఒకవేళ అదేగనక జరిగితే రక్త పరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వంపై పడుతుంది. దొంగకు శిక్ష విధించడానికి అతడు తన నేరాన్ని ఒక్కసారి అంగీకరించినా చాలు అని అత్యధికమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అయితే ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇస్‌హాఖ్‌ల దృష్టిలో దొంగ కనీసం రెండుపార్లు నేరాన్ని ఒప్పుకున్న తరువాతే హస్తఖండన శిక్ష విధించాలి.

## హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమయ్య మఖ్జూమ్ (రజి): ఈయన హిజాజ్ ప్రాంతానికి చెందినవారు. సుప్రసిద్ధ

సహాబీ. అయితే ఈయనచేత ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది. హమ్మాద్ బిన్ మస్లమ కథనం ప్రకారం ఈయన మఖ్జూమ్ తెగవారు. హుమామ్ బిన్ యహ్యా ప్రకారం ఈయన అన్సారీ.

(١٠٦٠) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ يُغَرَّمُ السَّارِقُ إِذَا أُقِيمَ عَلَيْهِ الْحَدُّ**». رَوَاهُ النَّسَائِيُّ، وَبَيَّنَ أَنَّهُ مُنْقَطِعٌ، وَقَالَ أَبُو حَاتِمٍ: هُوَ مُنْكَرٌ.

1060. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తెలిపారు: "దొంగకు శిక్ష విధించబడిన తరువాత, ఇక (దొంగిలించబడిన) వస్తువుకు సంబంధించిన బాధ్యత అతనిపై లేదు." (ఈ హదీసును నసాయి ఉల్లేఖించారు. దీని పరంపరలో లోపం ఉందని ఆయన స్వయంగా స్పష్టీకరించారు. అబూ హాతిం దీనిని మున్కర్‌గా ఖరారు చేశారు)

(١٠٦١) وَعَنْ عَبْدِاللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما، عَنْ رَسُولِ اللهِ ﷺ، أَنَّهُ سُئِلَ عَنِ التَّمْرِ الْمُعَلَّقِ، فَقَالَ: «**مَنْ أَصَابَ بِفِيهِ، مِنْ ذِي حَاجَةٍ، غَيْرَ مُتَّخِذٍ خُبْنَةً، فَلاَ شَيْءَ عَلَيْهِ، وَمَنَ خَرَجَ بِشَيْءٍ مِنْهُ فَعَلَيْهِ الْغَرَامَةَ وَالْعُقُوبَةُ، وَمَنْ خَرَجَ بِشَيْءٍ مِنْهُ بَعْدَ أَنْ يُؤْوِيَهِ الْجَرِينُ، فَبَلَغَ ثَمَنَ الْمِجَنِّ،**

1061. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : చెట్టుమీద వ్రేలాడే ఖర్జూర పండ్ల గురించి దైవప్రవక్త (సఅసం)ను దర్యాప్తు చేయగా ఆయన (స) ఇలా వివరించారు - "ఎవరైనా ఆకలితో అలమటిస్తూ ఖర్జూర పండ్లు తుంచుకుంటే అతనికి శిక్ష ఉండదు. అయితే అతను ఆ పండ్లను మూట కట్టుకుపోరాదు. ఎవరయినా మూట గట్టుకునిపోతే అతనిపై జరిమానా వేయటంతో పాటు శిక్ష కూడా విధించబడుతుంది. ఇంకా **ఎవరయినా, యజమాని ఆ పండ్లను కోసి ఒక సురక్షిత స్థలంలో నిలువచేసి ఉండగా ఖర్జూరాలను తీసుకుపోతే ఆ పండ్లు ఒక డాలు విలువకు సమానంగా ఉంటే - అతనికి**

فَعَلَيْهِ الْقَطْعُ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَصَحَّحَهُ الْحَاكِمُ.

హస్తఖండన శిక్ష విధించబడుతుంది." (దీనిని అబూదావూద్, నసాయి వెలికి తీశారు. హాకిమ్ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులో వివిధ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పండ్లు కోతకు వచ్చి, ఇంకా కోత కోయకుండా చెట్టుకు వ్రేలాడుతున్న స్థితిలో ఎవరయినా ఆకలిగొన్న బాటసారి పండ్లు కోసుకు తిని ఆకలి తీర్చుకుంటే అతనిపై జరిమానా గానీ, శిక్షగానీ విధించబడదు. ఈ విషయంపై అందరిమధ్య ఏకాభిప్రాయం ఉంది. కాని కోసిన పండ్లతో కడుపు నింపుకుని, మిగిలిన వాటిని మూటకట్టుకునిపోతే మాత్రం శిక్ష విధించబడటంతోపాటు జరిమానా కూడా వడ్డించబడుతుంది. దొంగిలించిన వస్తువుల విలువకు రెండింతల జరిమానా వేయబడుతుంది, పది కొరడా దెబ్బల శిక్ష విధించబడుతుందని బైహఖీ ఉల్లేఖనంలో ఉంది. తోట యజమాని సురక్షిత ప్రదేశంలో భద్రపరచుకున్న పండ్లను గనక ఎత్తుకుపోతే, ఆ పండ్ల వెల షరీయత్ నిర్ధారించిన పరిమాణానికి సమానంగా ఉంటే అట్టి పరిస్థితిలో హస్తఖండన శిక్ష విధించబడుతుంది. ధనరూపేణా జరిమానా చెల్లించవచ్చునన్న సంగతి కూడా ఈ హదీసు ద్వారా వెల్లడవుతున్నది.

(١٠٦٢) وَعَنْ صَفْوَانَ بْنِ أُمَيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لَهُ – لَمَّا أَمَرَ بِقَطْعِ الَّذِي سَرَقَ رِدَاءَهُ فَشَفَعَ فِيْهِ –: «هَلَّا كَانَ ذٰلِكَ قَبْلَ أَنْ تَأْتِيَنِي بِهِ؟» أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ الْجَارُودِ وَالْحَاكِمُ.

1062. దుప్పటిని దొంగిలించిన వ్యక్తికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)హస్తఖండన శిక్ష విధించినపుడు తాను ఆ వ్యక్తి కోసం సిఫారసు చేయగా, "నా దగ్గరికి తీసుకురాకముందే నీవు ఇతనిపై ఎందుకు జాలి చూపలేదు?" అని దైవప్రవక్త (స) తనతో అన్నారని హజ్రత్ సఫ్వాన్ బిన్ ఉమయ్య (రజి) తెలిపారు. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు - ఇబ్నె జారూద్ మరియు హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

సఫ్వాన్ బిన్ ఉమయ్య (రజి) బత్హా లోయలోనో లేక మస్జిద్‌లోనో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఒక వ్యక్తి వచ్చి సఫ్వాన్ తలగడగా పెట్టుకుని ఉన్న దుప్పటిని లాక్కున్నాడు. ఆ

వ్యక్తి నిర్బంధించబడ్డాడు. అనంతరం అతన్ని దైవప్రవక్త (స) న్యాయస్థానంలో హాజరుపరచారు. దైవప్రవక్త (సఅసం) అతనికి హస్తఖండన శిక్ష విధించమని ఆదేశించారు. అప్పుడు సఫ్వాన్ అతన్ని క్షమిస్తున్నట్టు చెప్పారు. "ఇతన్ని నా దగ్గరకు తీసుకు రాకముందే ఎందుకు క్షమించలేదు?" అని దైవప్రవక్త (సఅసం) మందలించారు. ఆ తరువాత శిక్షను అమలు పరచమని ఆజ్ఞాపించారు. కేసు ఒకసారి న్యాయస్థానానికి వచ్చి, దానిపై విచారణ జరిపిన తరువాత ఇక మన్నింపుల వైఖరికి ఆస్కారముండదని ఈ హదీసు చెబుతోంది.

(١٠٦٣) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: جِيءَ بِسَارِقٍ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: «**اقْتُلُوهُ**»، فَقَالُوا: إِنَّمَا سَرَقَ يَا رَسُولَ اللهِ! قَالَ: «**اقْطَعُوه**»، فَقُطِعَ، ثُمَّ جِيءَ بِهِ الثَّانِيَةَ، فَقَالَ: «**اقْتُلُوهُ**»، فَذَكَرَ مِثْلَهُ، ثُمَّ جِيءَ بِهِ الثَّالِثَةَ، فَذَكَرَ مِثْلَهُ، ثُمَّ جِيءَ بِهِ الرَّابِعَةَ كَذٰلِكَ، ثُمَّ جِيءَ بِهِ الْخَامِسَةَ فَقَالَ: «**اقْتُلُوهُ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَاسْتَنْكَرَهُ، وَأَخْرَجَ مِنْ حَدِيثِ الْحَارِثِ بْنِ حَاطِبٍ نَحْوَهُ، وَذَكَرَ الشَّافِعِيُّ أَنَّ الْقَتْلَ فِي الْخَامِسَةِ مَنْسُوخٌ.

1063. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో ఒక దొంగ హాజరుపరచ బడ్డాడు. "ఇతన్ని హతమార్చండి" అని ఆయన (సఅసం) అన్నారు. 'దైవప్రవక్తా (స)! ఇతను దొంగతనం చేశాడు' అని అక్కడున్న జనులు చెప్పగా "అయితే ఇతని చేయి నరకండి" అని ఆయన (సఅసం) అన్నారు. ఆ వ్యక్తి చేయి నరికివేయబడింది. మరోసారి ఆ వ్యక్తిని హాజరుపరచగా, "ఇతన్ని చంపేయండి" అని ఆయన (స) అన్నారు. మునుపటి వలెనే ప్రజలు విన్నవించుకున్నారు. మూడోసారి తేబడినప్పుడు కూడా అదే సంగతి పునరావృతమయింది. నాల్గవ సారి కూడా అదే తతంగం. ఐదవసారి కూడా ఆ వ్యక్తిని బంధించి తీసుకురాగా, "ఇతనికి మరణ శిక్ష విధించండి" అని ఆయన (స) ఆదేశించారు.(దీనిని అబూ దావూద్, నసాయి ఉల్లేఖించారు - దీనిని మున్కర్‌గా ఖరారు చేశారు. హారిస్ బిన్ **హాతిబ్ హదీసు ద్వారా నసాయి కూడా ఇదే విధంగా తీసుకున్నారు. మరణ శిక్ష** విధించమని ఐదవసారి చెప్పిన సంగతి రద్దుపరచబడిందని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అన్నారు)

**సారాంశం**

దొంగతనం చేసిన నేరానికి మరణ శిక్ష విధించవచ్చని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. అయితే ఈ హదీసు ప్రామాణికమైనది కాదు. ఇది 'జయీఫ్' కోవకు చెందినది. ఈ ఉల్లేఖనం త్రోసిపుచ్చదగినదని ఇమామ్ ఇబ్నె అబ్దుల్ బర్ అభిప్రాయపడ్డారు. ఇది ఆచరణ యోగ్యం కానిదన్న విషయంలో విద్వాంసులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది.

**హదీసు ఉల్లేఖకులు**

హారిస్ బిన్ హాతిబ్ జుమహీ, ఖురషీ. అబిసీనియాలో పుట్టారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ తరపున హిజ్రీ 66లో మక్కాలో గవర్నరుగా నియమితులయ్యారు. ఆరేళ్ళు తన సేవల్ని అందించారు. మర్వాన్ హయాంలో కూడా ఆయనకు సహాయకులుగా ఉన్నారు. హజ్రత్ ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో మరణించారు.

**4వ అధ్యాయం**

## మద్యం సేవించిన వానికి విధించబడే శిక్ష, మత్తు పదార్థాల గురించి

## ٤ - بَابُ حَدِّ الشَّارِبِ وَبَيَانِ الْمُسْكِرِ

(١٠٦٤) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ أُتِيَ بِرَجُلٍ قَدْ شَرِبَ الْخَمْرَ، فَجَلَدَهُ بِجَرِيدَتَيْنِ نَحْوَ أَرْبَعِينَ. قَالَ: وَفَعَلَهُ أَبُو بَكْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، فَلَمَّا كَانَ عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، اسْتَشَارَ النَّاسَ، فَقَالَ عَبْدُ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ: أَخَفُّ الْحُدُودِ ثَمَانُونَ، فَأَمَرَ بِهِ عُمَرُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

1064. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) వద్దకు ఒక వ్యక్తి తేబడ్డాడు. అతడు మద్యం సేవించి ఉన్నాడు. అందువల్ల అతనికి రెండు బెత్తాలతో నలభయ్యేసి దెబ్బలు కొట్టబడ్డాయి. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : హజ్రత్ అబూబక్ర్ (రజి) కూడా ఈ శిక్ష విధించారు. హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఆయన కూడా ఈ విషయమై ప్రవక్త సహచరులను సంప్రతించగా; తేలికపాటి శిక్ష బెత్తంతో కొట్టే ఎనభై దెబ్బలని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) కూడా ఈ ఆదేశాన్ని జారీ చేశారు.

(బుఖారీ, ముస్లిం)

وَلِمُسْلِمٍ عَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ فِي قِصَّةِ الْوَلِيْدِ بْنِ عُقْبَةَ: جَلَدَ النَّبِيُّ ﷺ أَرْبَعِيْنَ، وَأَبُو بَكْرٍ أَرْبَعِيْنَ، وَعُمَرُ ثَمَانِيْنَ، وَكُلٌّ سُنَّةٌ، وَهٰذَا أَحَبُّ إِلَيَّ. وَفِي هٰذا الْحَدِيْثِ أَنَّ رَجُلاً شَهِدَ عَلَيْهِ أَنَّهُ رَآهُ يَتَقَيَّأُ الْخَمْرَ، فَقَالَ عُثْمَانُ إِنَّهُ لَمْ يَتَقَيَّأْهَا حَتَّى شَرِبَهَا.

'ముస్లిం'లో వలీద్ బిన్ ఉఖబా (రజి) వృత్తాంతంలో హజ్రత్ అలీ (రజి) చే ఇలా ఉల్లేఖించబడింది: దైవప్రవక్త (సఅసం) నలభై, అబూబక్ర్ (రజి) నలభై, ఉమర్ (రజి) ఎనభై దెబ్బుల శిక్ష విధించారు. వీటిలో ప్రతిదీ అనుసరణీయమే. అయితే నేను మాత్రం దీనిని (నలభై దెబ్బుల శిక్షను) ఇష్టపడతాను. ఈ హదీసులో ఇంకా ఇలా వుంది - వలీద్ మద్యాన్ని కక్కుతుండగా తాను చూశానని ఒక వ్యక్తి వలీద్‌కి వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చాడు. దీనిపై హజ్రత్ ఉస్మాన్ (రజి) స్పందిస్తూ, అతను మద్యం సేవించి ఉండకపోతే మద్యాన్ని ఎలా కక్కుతాడు?! అని అన్నారు.

### హదీసు ఉల్లేఖకులు

వలీద్ బిన్ ఉఖబా బిన్ ముయైత్ (రజి) : ఖురషీ. హజ్రత్ ఉస్మాన్ (రజి)కు దగ్గరి బంధువు. మక్కా విజయం నాడు ఇస్లాం స్వీకరించారు. ఖురైషులలో అత్యంత సౌమ్యుడుగా, పరాక్రమశాలిగా, సాహితీపరునిగా పేరుమోశారు. కవనంలో కూడా ప్రవేశం ఉండేది. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈయన్ని కూఫా గవర్నర్‌గా నియమించారు. మద్యం సేవించారన్న ఆరోపణపై పదవీచ్యుతుల్ని కూడా చేశారు. ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య గావించబడిన తరువాత సంక్షోభ పరిస్థితులకు దూరంగా ఉండిపోయారు. 'రిఖ్ఖా'లో స్థిరపడ్డారు. అక్కడే తనువు చాలించారు. బులైఖ్‌లో అంత్యక్రియలు జరిగాయి.

(١٠٦٥) وَعَنْ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ قَالَ فِي شَارِبِ الْخَمْرِ: «إِذَا شَرِبَ فَاجْلِدُوهُ، ثُمَّ إِذَا شَرِبَ الثَّانِيَةَ فَاجْلِدُوهُ، ثُمَّ إِذَا شَرِبَ الثَّالِثَةَ فَاجْلِدُوهُ، ثُمَّ إِذَا شَرِبَ الرَّابِعَةَ فَاضْرِبُوا

**1065. మద్యం సేవించిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా** ప్రవచించినట్లు హజ్రత్ ముఆవియా (రజి) చెప్పారు - "అతడు మద్యం సేవిస్తే కొరడా దెబ్బలు కొట్టండి. మళి సారి కూడా త్రాగితే మళ్ళీ కొరడా దెబ్బలు కొట్టండి. మూడవసారి కూడా త్రాగితే మళ్లీ కొరడా దెబ్బలు కొట్టండి.

عُنُقَهُ». أَخْرَجَهُ أَحْمَدُ وَهٰذَا لَفْظُهُ، وَالْأَرْبَعَةُ، وَذَكَرَ التِّرْمِذِيُّ مَا يَدُلُّ عَلَىٰ أَنَّهُ مَنْسُوخٌ، وَأَخْرَجَ ذٰلِكَ أَبُو دَاوُدَ صَرِيحاً عَنِ الزُّهْرِيِّ.

కాని నాల్గవసారి గనక మద్యం సేవిస్తే శిరచ్ఛేదనం చేయండి." (దీనిని అహ్మద్ వివరించారు - వాక్యాలు కూడా ఆయన గారివే. 'నలుగురు' కూడా ఈ హదీసును ఉల్లేఖించారు. తిర్మిజీ వివరించిన తీరునుబట్టి అతన్ని వధించే విషయం రద్దు చేయబడిందని తెలుస్తోంది. ఈ విషయాన్ని అబూ దావూద్ స్పష్టమయిన కథనంతో జుహ్రీ నుండి సంగ్రహించారు

**సారాంశం**

త్రాగుబోతుకు మరణశిక్ష విధించవచ్చునని ఈ హదీసు ద్వారా పైకి బోధపడుతోంది. అహ్లె జవాహిర్ మరియు ఇబ్నె హజమ్‌ల దృక్పథం కూడా ఇదే. అయితే మరణదండన రద్దు చేయబడిందని మెజారిటీ ఉలమా అభిప్రాయపడ్డారు.

(١٠٦٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا ضَرَبَ أَحَدُكُمْ فَلْيَتَّقِ الْوَجْهَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1066. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "మీలో ఎవరయినా శిక్షను విధిస్తే ముఖంపై కొట్టకండి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం శిక్ష విధించేటప్పుడు ముఖంపై కొట్టడాన్ని వారించటం జరిగింది. అలాగే చిన్న పిల్లలను గానీ, తమ అధీనంలో ఉండే ఇతరులనుగానీ శిక్షించే ఉద్దేశ్యంతో కొడితే - అప్పుడు ముఖంపై దెబ్బపడకుండా జాగ్రత్త వహించాలి. ముఖం మానవ మర్యాదకు ప్రతిరూపం వంటిది.

(١٠٦٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَا تُقَامُ الْحُدُودُ فِي الْمَسَاجِدِ». رَوَاهُ التِّرْمِذِيُّ وَالْحَاكِمُ.

1067. "మస్జిదుల లోపల శిక్షల్ని అమలుపరచరాద"ని మహాప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు. (తిర్మిజీ, హాకిమ్)

**సారాంశం**

మస్జిదులలో శిక్షలు విధించరాదని ఈ హదీసు చెబుతోంది. మస్జిదులు పవిత్ర స్థలాలు.

ఇవి కేవలం దైవదాస్యానికి, దైవనామ స్మరణకు సదాచరణకు ఉద్దేశ్యించినవి. ఇక్కడ దైవకారుణ్యం అవతరిస్తుంది. ఇలాంటి పవిత్ర స్థలాలలో శిక్షల్ని అమలుపరచటం వల్ల మస్జిదులు రక్తసిక్తం అవుతాయి. కారుణ్యం వర్షించే చోట కాఠిన్యం, కక్షలకు ప్రతీకలైన ఆచరణలు అమలుపరచరాదు. ఒకవేళ ఎవరయినా పుణ్య క్షేత్రమయిన పవిత్ర మక్కాలో అపరాధానికి ఒడిగట్టి అక్కడే తలదాచుకుంటే అక్కడికక్కడ అతన్ని శిక్షించరాదు. అతడు ఆ స్థలం వదలి వెలుపలికి వచ్చేలా ఆహార సరఫరాను నిలిపివేయాలి.

(١٠٦٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَقَدْ أَنْزَلَ اللَّهُ تَحْرِيمَ الْخَمْرِ، وَمَا بِالْمَدِينَةِ شَرَابٌ يُشْرَبُ إِلاَّ مِنْ تَمْرٍ. أَخْرَجَهُ مُسْلِمٌ.

1068. హజ్రత్ అనస్ (రజి) కథనం : "అల్లాహ్ మద్యాన్ని హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేసినపుడు మదీనాలో కేవలం ఖర్జూరంతో తయారు చేయబడిన మద్యం మాత్రమే సేవించబడేది."

(ముస్లిం)

**సారాంశం**

ఈ పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే ఒక్క ద్రాక్షపండ్లతో చేయబడిన మద్యం మాత్రమే గాకుండా మనిషిని మత్తులో పడవేసే, విజ్ఞతా వివేకాలను స్థంభింపజేసే ఏ పానీయమైనాసరే, అది ఏ వస్తువుతో తయారుచేయబడినా సరే అది నిషిద్ధంగానే భావించబడుతుంది. రాబోయే హదీసుల ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది.

(١٠٦٩) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَزَلَ تَحْرِيمُ الْخَمْرِ وَهِيَ مِنْ خَمْسَةٍ: مِنَ الْعِنَبِ، وَالتَّمْرِ، وَالْعَسَلِ، وَالْحِنْطَةِ، وَالشَّعِيرِ، وَالْخَمْرُ مَا خَامَرَ الْعَقْلَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1069. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : మద్యనిషేధాజ్ఞ అవతరించింది. ఆనాడు అయిదు వస్తువులతో అది ఉత్పత్తి చేయబడేది - ద్రాక్ష, ఖర్జూరం, తేనె, గోధుమలు, యవలు. మరియు ఖమ్ర్ అంటే బుద్ధీ వివేకాలను ఆవరించే అన్ని రకాల వస్తువులు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

సారాయి ఉత్పత్తికి దోహదపడే అయిదు వస్తువుల ప్రస్తావన ఇందులో వచ్చింది. ఆనాడు మద్యం తయారీకి సాధారణంగా ఈ పదార్థాలనే ఉపయోగించేవారు. మనిషి బుద్ధీ వివేకాలను క్రమ్మివేసి, మనోమస్తిష్కాలకు మత్తును, కిక్కును ఎక్కించే వస్తువులను ఆ రోజుల్లో 'ఖమ్ర్'గా (ఈ రోజుల్లో గుడుంబా, నాటు సారాయిలాగా) వ్యవహరించేవారు. అందుకే మద్యం ఖర్జూరపండ్ల నుండి తీసినా, ద్రాక్ష ద్వారా ఉత్పత్తి చేసినా అది నిషిద్ధం అనటంలో సందేహానికి తావులేదు

(١٠٧٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «كُلُّ مُسْكِرٍ خَمْرٌ، وَكُلُّ مُسْكِرٍ حَرَامٌ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1070."మత్తును కలిగించే ప్రతి వస్తువూ, 'ఖమ్ర్' క్రిందికే వస్తుంది. మత్తును కలిగించే ప్రతి వస్తువూ హరామే (నిషిద్ధమే)" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉద్బోధించినట్లు హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు. (ముస్లిం)

**సారాంశం**

మత్తును కలిగించే వస్తువు ద్రవ రూపంలో వున్నా, ఘన పదార్థంగా వున్నా, ఆల్కహాలు రూపంలో ఉన్నా, మరే రూపంలో వున్నా సరే అది నిషిద్ధం అనటంలో ఎలాంటి సందేహం లేదని పై హదీసు ద్వారా అవగతమవుతున్నది.

(١٠٧١) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَا أَسْكَرَ كَثِيرُهُ فَقَلِيلُهُ حَرَامٌ». أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1071. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) చెప్పారు: ఏ వస్తువు యొక్క అధిక మోతాదు మత్తునిస్తుందో, దాని అల్ప మోతాదు కూడా నిషిద్ధమే. (అహ్మద్ మరియు 'నలుగురు' దీనిని సేకరించారు. ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఎక్కువ మోతాదులో తీసుకున్న వస్తువు మనిషిని మత్తులో ముంచివేసినపుడు దాని తక్కువ మోతాదు కూడా నిషిద్ధమే మరి. అయితే హనఫీలు, బస్రాకు చెందిన ధర్మవేత్తల అభిప్రాయం మరోలా ఉంది. ద్రాక్ష, ఖర్జూరం తప్ప - మత్తును కలిగించే స్థాయికి చేరని పానీయం ధర్మసమ్మతమేనని వీళ్లు భావిస్తున్నారు. కాని హదీసు మాత్రం వీళ్ల అభిప్రాయాన్ని త్రోసిరాజంటున్నది.

(١٠٧٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُنْبَذُ لَهُ الزَّبِيبُ فِي السِّقَاءِ، فَيَشْرَبُهُ يَوْمَهُ، وَالْغَدَ، وَبَعْدَ

1072. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కోసం ఎండు ద్రాక్షపండ్లను నీళ్ల (తోలు) తిత్తిలో వేసి రసం తయారు

الْغَدِ، فَإِذَا كَانَ مَسَاءُ الثَّالِثَةِ شَرِبَهُ، وَسَقَاهُ، فَإِنْ فَضَلَ شَيْءٌ أَهْرَاقَهُ. أَخْرَجَهُ مُسْلِمٌ.

చేయబడేది. ఆయన (సఅసం) ఆ పండ్ల రసాన్ని ఆ రోజు, మరుసటి రోజు కూడా త్రాగేవారు. మూడవ రోజు కూడా సేవించేవారు. మూడో రోజు పొద్దుగూకేసరికి త్రాగి, ఇతరులకు కూడా త్రాగేందుకు ఇచ్చేవారు. అప్పటికీ మిగిలిపోతే పారబోసేవారు. (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే మహాప్రవక్త (స) ద్రాక్ష రసాన్ని సేవించేవారు. అయితే ఆ రసంలో మత్తును ఇచ్చే గుణం పొడసూపితే మాత్రం దాన్ని పారబోసేవారు. ఎండు ద్రాక్షపండ్ల నుంచి తీసిన రసం మూడు రోజుల వరకూ ఎట్టి పరిస్థితిలోనూ హలాల్ (ధర్మ సమ్మతం) అని దీని మతలబు ఎంతమాత్రం కాదు. మత్తును కలిగించకుండా ఉన్నంతవరకూ ఉపయోగించవచ్చన్న అర్థంలో దీన్ని తీసుకోవాలి.

(١٠٧٣) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِنَّ اللَّهَ لَمْ يَجْعَلْ شِفَاءَكُمْ فِيمَا حَرَّمَ عَلَيْكُمْ». أَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1073. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించినట్లు హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్‌హా) తెలియజేశారు : "అల్లాహ్ ఏ వస్తువునయితే మీ కొరకు నిషిద్ధంగా ఖరారు చేశాడో అందులో మీ కొరకు వ్యాధి నివారణను కలిగించే గుణాన్ని పొందుపరచలేదు." (దీనిని బైహఖీ సేకరించారు, ఇబ్నె అబ్బాస్ దీన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

మత్తులో పడవేసే వస్తువుల్లో 'రోగ నివారణ' లాంటి గుణాన్ని అల్లాహ్ ఏ మాత్రం పొందుపరచలేదని ఈ హదీసు స్పష్టపరుస్తోంది. కాబట్టి ఇలాంటి వస్తువులను చికిత్సగా ఉపయోగించటం కూడా అధర్మమే.

(١٠٧٤) وَعَنْ وَائِلٍ الْحَضْرَمِيِّ، أَنَّ طَارِقَ بْنَ سُوَيْدٍ سَأَلَ النَّبِيَّ ﷺ عَنِ الْخَمْرِ

1074. హజ్రత్ వాయల్ హజ్రమీ (రజి) కథనం: తారిఖ్ బిన్ సువైద్ (రజి)

يَصْنَعُهَا لِلدَّوَاءِ، فَقَالَ: «إِنَّهَا لَيْسَتْ بِدَوَاءٍ، وَلَكِنَّهَا دَاءٌ». أَخْرَجَهُ مُسْلِمٌ وَأَبُو دَاوُدَ وَغَيْرُهُمَا.

దైవప్రవక్త సమక్షంలో ఔషధ నిమిత్తం తయారు చేసే మద్యం గురించి అడగ్గా "అది మందు కానేకాదు, పైగా అదొక రోగం" అని ఆయన (స) సమాధాన మిచ్చారు. (దీనిని ముస్లిం, అబూ దావూద్, తదితరులు సేకరించారు)

**సారాంశం**

రోగానికి మందుగా మద్యాన్ని ఉపయోగించటం అధర్మం అని ఈ హదీసు చెబుతోంది. ఖుద్దుగా 'ఒక రోగం' అయిన వస్తువు రోగాన్ని ఎలా నయం చేస్తుంది?

**హదీసు ఉల్లేఖకులు**

తారిఖ్ బిన్ సువైద్ హజ్రమీ (రజి) : సహాబి. సువైద్ **బిన్ తారిఖ్**గా కూడా పిలువబడేవారు. జూఫీగా కూడా పిలువబడేవారు. ఈయనగారి చేత ఈ ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది. కూఫావాసులు ఈయన ఆధారంగా ఉటంకించేవారు.

**5వ అధ్యాయం**

## ٥ - بَابُ التَّعْزِيرِ وَحُكْمِ الصَّآئِلِ

## తేలికపాటి శిక్షలు

(١٠٧٥) عَنْ أَبِي بُرْدَةَ الْأَنْصَارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «لاَ يُجْلَدُ فَوْقَ عَشَرَةِ أَسْوَاطٍ إِلاَّ فِي حَدٍّ مِنْ حُدُودِ اللهِ تَعَالَى». مُتَّفَقٌ عَلَيْهِ.

1075. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా తాను విన్నానని హజ్రత్ అబూబుర్దా (రజి) చెప్పారు : "దేవుడు నిర్ణయించిన శిక్షల విషయం లో మినహా (మిగిలిన వాటిలో) పది కొరడా దెబ్బలకన్నా ఎక్కువ శిక్ష విధించ కూడదు." (బుఖారీ, ముస్లిం)

**హదీసు ఉల్లేఖకులు**

అబూ బుర్దా (రజి) : ఈయన అసలు పేరు హానీ బిన్ నియార్. బలవీ తెగకు చెందిన వారు. దైవప్రవక్త (స) సహచరులు. బద్ర్ తదితర యుద్ధాలలో హాజరయ్యారు. హిజ్రీ 41 లేక 42 లేదా 45వ సంవత్సరంలో మరణించారు.

(١٠٧٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «أَقِيلُوا ذَوِي

1076. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం)

الْهَيْئَاتِ عَثَرَاتِهِمْ إِلاَّ الْحُدُودَ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَالْبَيْهَقِيُّ.

ఇలా ప్రబోధించారు : "దేవుడు నిర్ణయించిన శిక్షల విషయంలో తప్ప- క్షంతవ్యం కాదగ్గ సజ్జనుల, మర్యాదస్తుల తప్పులను (ఔదార్యంతో) మన్నించండి." (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి, బైహఖీలు ఉల్లేఖించారు)

(١٠٧٧) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: مَا كُنْتُ لأُقِيمَ عَلَىٰ أَحَدٍ حَدًّا فَيَمُوتَ، فَأَجِدَ فِي نَفْسِي، إِلاَّ شَارِبَ الْخَمْرِ، فَإِنَّهُ لَوْ مَاتَ وَدَيْتُهُ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1077. హజ్రత్ అలీ (రజి) ఇలా అన్నారు: "మద్యం సేవించిన వ్యక్తిని తప్ప - మరెవరినీ అతని ప్రాణంపోయే విధంగా, ఆ దుఃఖం నా హృదయాన్ని కలచివేసే విధంగా **శిక్షంచను. ఒకవేళ** త్రాగుబోతు నేను విధించిన **శిక్షకు మరణిస్తే అతని** రక్తపరిహారం చెల్లిస్తాను." (బుఖారీ)

**సారాంశం**

త్రాగుబోతుకు విధించిన శిక్ష వల్ల అతడు మరణిస్తే రక్త పరిహారం చెల్లిస్తానని హజ్రత్ అలీ (రజి) చెప్పడానికి కారణమేమిటంటే, దైవప్రవక్త (సఅసం) త్రాగుబోతుకు ఇదమిత్థంగా శిక్షను నిర్దేశించలేదు. అందువల్ల త్రాగుబోతుకు విధించిన శిక్ష కారణంగా అతడు చచ్చిపోతే అది హత్యగానే పరిగణించబడుతుంది. హత్యా నేరానికి రక్తపరిహారం ఇవ్వటం తప్పనిసరి. మెజారిటీ విద్వాంసుల దృక్పథం కూడా ఈ విషయంలో ఇదే.

(١٠٧٨) وَعَنْ سَعِيدِ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ قُتِلَ دُونَ مَالِهِ فَهُوَ شَهِيدٌ». رَوَاهُ الأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1078. హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "తన ధన సంపదలను, ఆస్తిపాస్తులను రక్షించుకునే యత్నంలో ప్రాణాలర్పించిన వ్యక్తి అమరగతుడు." (దీనిని 'నలుగురు' ఉల్లేఖించగా, తిర్మిజీ ప్రామాణిక హదీసుగా ఖరారు చేశారు)

**సారాంశం**

తన ఆస్తిపాస్తులను, సాధన సంపత్తులను ఎవరయినా దోచుకుంటున్నప్పుడు యజమాని

శాయశక్తులా ప్రతిఘటించటం ధర్మసమ్మతమే గాకుండా, ఆ ప్రతిఘటన అనివార్యం కూడా అని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ ప్రతిఘటనలో ఒకవేళ యజమాని చేతిలో దోపిడీ దొంగ హతమైతే యజమాని ఎలాంటి నష్టపరిహారాన్నిగానీ, రక్తపరిహారాన్ని గానీ చెల్లించవలసిన అవసరం లేదు. దొంగవాని వధింపు నిరర్థకమైపోతుంది.

అలాగే ఎవరయినా తన ధర్మాన్ని, విశ్వాసాన్ని, తన ఆత్మను, తన ఆలుబిడ్డలను రక్షించుకునే యత్నంలో చంపబడితే అతడు అమరగతి నొందుతాడు. ఒకవేళ ఈ యత్నంలో అతడు ప్రత్యర్థిని చంపితే దానికిగాను పరిహారం చెల్లించనవసరం లేదు. దీనిని బట్టి ఇస్లాం ధన ప్రాణాలకు, మానమర్యాదలకు ఎంత ప్రాముఖ్యం ఇచ్చిందో ఊహించవచ్చు.

(١٠٧٩) وَعَنْ عَبْدِ اللهِ بْنِ خَبَّابٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: سَمِعْتُ أَبِيْ يَقُولُ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «**تَكُونُ فِتَنٌ، فَكُنْ فِيهَا عَبْدَ اللهِ الْمَقْتُولَ، وَلاَ تَكُنِ الْقَاتِلَ**». أَخْرَجَهُ ابْنُ أَبِي خَيْثَمَةَ وَالدَّارَقُطْنِيُّ، وَأَخْرَجَ أَحْمَدُ نَحْوَهُ عَنْ خَالِدِ بْنِ عُرْفُطَةَ.

1079. దైవప్రవక్త (సఅసం) ప్రబోధించగా తాను విన్నానని మా నాన్నగారు చెబుతుండగా ఆ విషయం నేను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖబ్బాబ్ (రజి) తెలిపారు : "నా తదనంతరం ఉపద్రవాలు (గందరగోళం, కల్లోలం, అయోమయ స్థితి) ఏర్పడతాయి. కనుక ఓ దైవదాసుడా! నీవు ఆ స్థితికి ఆహుతి అయిపో. హంతకుడుగా మాత్రం నిలబడకు." (దీనిని ఇబ్నె అబూ ఖైసమ, దారెఖుత్నీ సంగ్రహించారు. అహ్మద్ కూడా ఇదేవిధంగా ఖాలిద్ బిన్ ఉర్ఫుత నుండి ఉల్లేఖించారు)

**సారాంశం**

హదీసు మూలంలో 'ఫితన్' అనే పదం వచ్చింది. 'ఫితన్' అనేది 'ఫిత్నా' అనే పదానికి బహువచనం. ఇక్కడ ఫిత్నా అంటే భావం రక్తపాతం, నరమేధం! ఏది సత్యమో ఏది అసత్యమో, ఏది ధర్మమో ఏది అధర్మమో తెలియని అయోమయావస్థ!! ఇటువంటి అయోమయ స్థితి నెలకొన్నప్పుడు సాధ్యమైనంతవరకు వాటికి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని హదీసు చెబుతోంది. అయితే ఇరువర్గాల వారు సత్యాన్ని, ధర్మాన్ని లక్ష్యపెట్టకుండా పరస్పరం పోరాడుకుంటున్నప్పుడు - ఏ వర్గం సత్యంపై ఉన్నదని తెలిసిందో, ఆ వర్గానికి మద్దతు ఇవ్వాలి. అసత్యవాదుల మెడలు వంచే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్‌లో సర్వోన్నత ప్రభువు ఇలా సెలవిచ్చాడు:

"ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాల వారూ పరస్పరం పోట్లాడుకుంటే, వారి మధ్య రాజీ కుదిరించండి. తరువాత, ఒకవేళ వారిలో ఒక వర్గంవారు రెండో వర్గం వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసినవారు అల్లాహ్ ఆజ్ఞ వైపునకు మరలేవరకు వారికి వ్యతిరేకంగా పోరాడండి." (49:9)

కాని ఒకవేళ ఏ వర్గమైనా తనపై మెరుపుదాడి చేస్తే, లేదా తనను హతమార్చదలిస్తే, తన ఆస్తిపాస్తుల్ని దోచుకోబోతే అట్టి పరిస్థితిలో ఏం చేయాలి? పై హదీసు ప్రకారం ఆత్మ సమర్పణ చేసుకోవాలా? దైవప్రవక్త (స) వారి వేరొక ప్రబోధనం ప్రకారం ప్రతిఘటించవచ్చని తెలుస్తోంది - ఈ ప్రతిఘటనలో అతను చంపబడితే షహాదత్ (అమరగతి) స్థాయి ప్రాప్తిస్తుంది. ఈ రెండు హదీసుల వెలుగులో ఆలోచిస్తే పరిస్థితుల స్వరూపాన్ని జాగ్రత్తగా బేరీజువేసి తనకు శ్రేయస్కరమైనదని భావించిన పద్ధతిని ఎంచుకోవచ్చని బోధపడుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

1. అబ్దుల్లాహ్ బిన్ ఖబ్బాబ్ : ప్రఖ్యాత తాబయి. మదీనావాసులు. హిజ్రీ 27వ సంవత్సరంలో హజ్రత్ అలీ (రజి) పై తిరుగుబాటు అనంతరం నహర్‌వాన్ మార్గంలో ఖార్జీ వర్గం వారు ఈయన్ని హత్యచేశారు. ఈయన్ని హత్య చేసిన తరువాత వాళ్లు ఈయన ఇంటికి వెళ్ళి ఈయన సతీమణి కడుపును అమానుషంగా చీల్చారు. ఈయన కొడుకును చంపేశారు. ఈ సంఘటనే నహర్వాన్ యుద్ధానికి దారితీసింది. ఈ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) సహచరుల చేతుల్లో ఖార్జీయులంతా హతమార్చబడ్డారు. వారిలో ఏడుగురు మాత్రమే మిగిలారు. ఆ ఏడుగురే తరువాతి కాలంలో పొడసూపిన కల్లోలానికి సూత్రధారులయ్యారు.

2. ఖబ్బాబ్ (రజి) : ఖబ్బాబ్ బిన్ అరత్ బిన్ జందల తమీమి. దైవమార్గంలో అవివాహితుడుగా మిగిలిపోయిన వారిలో ఒకరు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. సిఫ్ఫీన్ సంగ్రామం నుండి తిరిగివస్తూ హిజ్రీ 37లో 73 సంవత్సరాల వయస్సులో కూఫాలో మరణించారు.

3. ఖాలిద్ బిన్ ఉర్ఫుత (రజి) : ఉజ్రా తెగకు చెందినవారు. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్కాస్ (రజి) తరపున కూఫాలో అధికారిగా నియమితులయ్యారు. హిజ్రీ 61లో మరణించారు. యజీద్ మరణానంతరం ముఖ్తార్ బిన్ అబూ ఉబైద్ ఈయన్ని హత్యచేశాడని, ఈ సంఘటన హిజ్రీ 64లో జరిగిందని అనబడుతోంది.

# 11. జిహాద్ పుస్తకం
# ١١ - كِتَابُ الْجِهَادِ

(١٠٨٠) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ مَاتَ، وَلَمْ يَغْزُ، وَلَمْ يُحَدِّثْ نَفْسَهُ بِهِ، مَاتَ عَلَى شُعْبَةٍ مِنْ نِفَاقٍ**». رَوَاهُ مُسْلِمٌ.

1080. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎన్నడూ ధర్మయుద్ధం (జిహాద్)లో పాల్గొనడంగానీ, మనసులో కనీసం దాని తలంపుగానీ, ఆకాంక్షగానీ కలగని స్థితిలో ఎవరయినా మరణిస్తే అతని మరణం కపటత్వంతో కూడిన మరణం అవుతుంది." (ముస్లిం)

**సారాంశం**

నిఘంటువు ప్రకారం 'జిహాద్' అంటే సాధన, పరిశ్రమ, ప్రయత్నం, కృషి, అభ్యాసం అన్న అర్థాలు వస్తాయి. అయితే షరీయత్ పరిభాషలో జిహాద్ అంటే అర్థం దైవధర్మాన్ని రక్షించటం, దైవవచన అభ్యున్నతి కోసం పాటుపడటం, సత్యధర్మాన్ని అణచివేయడానికి పూనుకున్న మిథ్యావాదులకు వ్యతిరేకంగా పోరాడటం.

ఈ హదీసు ప్రకారం ముస్లిం అయిన ప్రతి వ్యక్తీ జిహాద్ (ధర్మయుద్ధం) చేయకపోయినప్పటికీ దైవమార్గంలో పోరాడే అవకాశం లభిస్తే చిత్తశుద్ధితో పోరాడాలన్న ఆకాంక్షను కలిగి ఉండటం అవసరం. పైగా అలాంటి అవకాశాన్ని తమ అదృష్టంగా భావించాలి. ఒకవేళ ఆ మహదవకాశం లభించకపోతే దానికోసం నిరీక్షించాలి. పరిస్థితినిబట్టి ఒక విశ్వాసి దైవమార్గంలో పోరాడటానికి సన్నద్ధమవడం అతని విద్యుక్త ధర్మం. ఈ త్యాగ భావమే అసలు ఇస్లామీయ జీవన వ్యవస్థకు ఊపిరి వంటిది. ఒక విశ్వాసి తన జీవన ధ్యేయాన్నే విస్మరించినపుడు మరి విశ్వాసికీ - అవిశ్వాసికీ మధ్య వ్యత్యాసం ఏముంటుందీ? ఏ విశ్వాసి అయినా తన నిజ ధ్యేయాన్ని మరచిపోతే అతడు తన ఆత్మపై అన్యాయానికి ఒడిగట్టాడన్నమాటే!

(١٠٨١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**جَاهِدُوا الْمُشْرِكِينَ**

1081. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీ ధన ప్రాణాలతో, మీ వాగ్ధాటితో బహుదైవో

بِأَمْوَالِكُمْ، وَأَنْفُسِكُمْ، وَأَلْسِنَتِكُمْ». رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

పాసకులకు వ్యతిరేకంగా పోరాడండి." (దీనిని అహ్మద్, నసాయి ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవ విరోధులు, దుష్టశక్తులు, ధర్మ విహీనులు, దుర్మార్గులు దౌర్జన్యపరులకు వ్యతి రేకంగా- దైవమార్గంలో పోరాడటానికి - ప్రతి ఒక్కరూ ఎల్లవేళలా సన్నద్ధులై ఉండాలని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అంతేకాదు, ఈ ఆశయం కోసం ధనాన్ని వెచ్చించాలి. మనో వాక్కాయకర్మల చేత సత్యధర్మం కోసం అంకితం కావాలి. తమ ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా, ఇష్టాగోష్టుల ద్వారా జన సామాన్యానికి సత్యసందేశాన్ని అందజేయాలి. ఏకేశ్వరో పాసనా సిద్ధాంతాన్ని, దైవదౌత్య పరిసమాప్తి వాదాన్ని, మరణానంతర జీవిత విశ్వాసాన్ని స్పష్టంగా విడమరచి చెప్పి దీన్ని అవిశ్వాసులు నిరాకరించలేని పరిస్థితిని సృష్టించాలి. నేటి ఆధునిక యుగంలో ప్రచార ప్రసార విభాగాలు (పత్రికలు, రేడియో, టెలివిజన్) ఈ పనిని ఎంతో ప్రభావవంతంగా చేస్తున్నాయి. కాబట్టి ఇటువంటి ప్రసార సాధనాలను సద్వినియోగం చేసుకోవచ్చు.

(١٠٨٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّهَا قَالَتْ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! عَلَى النِّسَاءِ جِهَادٌ؟ قَالَ: «نَعَمْ، جِهَادٌ لَا قِتَالَ فِيهِ، هُوَ الْحَجُّ وَالْعُمْرَةُ». رَوَاهُ ابْنُ مَاجَهْ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

1082. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : "దైవప్రవక్తా (సఅసం)! మహిళ లపై కూడా జిహాద్ బాధ్యత ఉందా?" అని నేను ప్రశ్నించగా, "అవును, వారిపై కూడా జిహాద్ బాధ్యత ఉంది. అయితే అది యుద్ధరూపంలో కాదు. హజ్ మరియు ఉమ్రాల రూపంలో ఉంది." (దీనిని ఇబ్నెమాజా ఉల్లేఖించారు. దీని మూలం బుఖారీలో ఉంది)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమిటంటే పోరాడటం, చంపటం, చావటం మహిళల జిహాద్ కాదు. పవిత్ర మక్కా నగరానికి వెళ్ళి హజ్, ఉమ్రాలు చేయటమే వారి పాలిట జిహాద్. జిహాద్‌లో మనిషి సుదీర్ఘ ప్రయాణాలు చేయవలసి ఉంటుంది. కష్టాలు, బాధలు భరించవలసి ఉంటుంది. వ్యయప్రయాసలకు ఓర్చుకోవలసి ఉంటుంది. హజ్ ఉమ్రాలు ఒకింత వ్యయ ప్రయాసలతో కూడుకున్నవే. అందుకే హజ్ ఉమ్రాల వంటి ఆరాధనలనే స్త్రీల పాలిట

'జిహాద్'గా ఖరారు చేయటం జరిగింది. వారు హజ్ ఉమ్రాలు చేస్తే చాలు, జిహాద్ చేసినందుకు లభించే పుణ్యం లభిస్తుంది.

(١٠٨٣) وَعَنْ عَبْدِاللهِ ابْنِ عَمْرٍو رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ يَسْتَأْذِنُهُ فِي الْجِهَادِ، فَقَالَ: «أَحَيٌّ وَالِدَاكَ؟» فَقَالَ: نَعَمْ، قَالَ: «فَفِيهِمَا فَجَاهِدْ». مُتَّفَقٌ عَلَيْهِ.

1083. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చి ధర్మయుద్ధంలో పాల్గొనేందుకు తనను అనుమతించ మని అభ్యర్థించసాగాడు. "నీ తల్లిదండ్రులు బ్రతికే ఉన్నారా?" అని ఆయన (సఅసం) దర్యాప్తు చేశారు. అతను 'అవున'న్నాడు. "మరయితే వారిద్దరి (సేవ)కై పాటుపడు అని ఆయన (సఅసం) ప్రబోధించారు.(బుఖారీ, ముస్లిం)

وَلأَحْمَدَ وَأَبِي دَاوُدَ مِنْ حَدِيثِ أَبِي سَعِيدٍ نَحْوُهُ، وَزَادَ: «ارْجِعْ، فَاسْتَأْذِنْهُمَا، فَإِنْ أَذِنَا لَكَ، وَإِلاَّ فَبِرَّهُمَا».

ముస్నదె అహ్మద్, అబూదావూద్‌లలో అబూ సయీద్ ఉల్లేఖనంలో కూడా ఇలాగే ఉంది.కాని ఇందులో అదనంగా, "తిరిగి వెళ్ళు. వారిద్దరి అనుమతి కోరు. వారిద్దరు గనక నీకు అనుమతి ఇస్తే సరి. లేకపోతే వారి (దగ్గరే ఉండు. వారి) యెడల ఉత్తమంగా, వినమ్రంగా మెలగు" అన్న వాక్యాలున్నాయి.

**సారాంశం**

తల్లిదండ్రుల ప్రాముఖ్యాన్ని, వారి స్థానాన్ని, వారి సేవ వల్ల కలిగే పుణ్యాన్నీ ఈ హదీసు నొక్కి చెబుతోంది. ఇస్లాంలో జిహాద్‌కు ఉన్న ప్రాముఖ్యం తెలియనిది కాదు. అయినా అందులో పాల్గొనదలచిన వారు తల్లిదండ్రుల అనుమతి పొందాలని అనడాన్ని బట్టి తల్లిదండ్రుల సేవకు గల ప్రాధాన్యత ఎంతటిదో బోధపడుతోంది. జిహాద్ 'ఫర్జె కిఫాయ' అయితే మాతాపితల సేవ 'ఫర్జె ఐన్'. 'ఫర్జె కిఫాయ'ను సమాజంలోని కొంతమంది నెరవేర్చినా సరిపోతుంది. అయితే 'ఫర్జె ఐన్' ను అందరూ నెరవేర్చవలసిందే.

(١٠٨٤) وَعَنْ جَرِيْرٍ الْبَجَلِيِّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَنَا بَرِيءٌ مِنْ كُلِّ مُسْلِمٍ يُقِيمُ بَيْنَ الْمُشْرِكِينَ». رَوَاهُ الثَّلَاثَةُ، وَإِسْنَادُهُ صَحِيحٌ، وَرَجَّحَ الْبُخَارِيُّ إِرْسَالَهُ.

1084. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హాజ్రత్ జరీర్ బజలీ (రజి) చెప్పారు: "బహుదైవోపాసకుల మధ్య నివసించే ఏ ఒక్క ముస్లింకు (అతనికి ఏదైనా కీడు వాటిల్లినట్లయితే దానికి) నేను బాధ్యుణ్ణి కాను." (దీనిని ముగ్గురు ఉల్లేఖించారు. ఇది అందిన పరంపర పటిష్టమైనది. అయితే ఇది 'ముర్సల్' అని బుఖారీ నొక్కి చెప్పారు)

## సారాంశం

ఇస్లాం విరోధులు, బహుదైవోపాసకులు నివసిస్తున్న గ్రామాలలో, పేటలలోనే స్థిరపడిన ముస్లింలకు యుద్ధ సందర్భాలలో ముస్లిం యోధుల ద్వారా ఏదైనా ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవిస్తే ఆ బాధ్యత తనపై లేదన్నది మహాప్రవక్త (సఅసం) పలుకుల భావం. ఈ నష్టానికి ముజాహిదీన్‌లను (ముస్లిం యోధులను) బాధ్యులుగా భావించటం కూడా సరికాదు. ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడవచ్చన్న భయం ఉంటే ముస్లింలు ముందుగానే వేరితర ప్రాంతాలకు తరలి వెళ్ళాలి.

## హదీసు ఉల్లేఖకులు

జరీర్ బజ్లీ (రజి) : అబూ అమ్రిగా పిలువబడేవారు. వంశపరంపర ప్రకారం జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జాబిర్ బజ్లీ అనబడతారు. హిజ్రీ 10వ సంవత్సరంలో ఇస్లాం స్వీకరించారు. ఈయన గౌరవార్థం దైవప్రవక్త (సఅసం) దుప్పటి పరచి కూర్చోబెట్టారు. జిల్ ఖలాసా అనే విగ్రహాన్ని కూల్చడానికి ఈయన్ని పంపటం జరిగింది. ఆయన (స) కాలంలో యమన్ గవర్నర్‌గా కూడా నియమితులయ్యారు. "నేను ఇస్లాం స్వీకరించిన నాటినుంచీ ఎన్నడూ దైవప్రవక్త (స) నా పట్ల విముఖత చూపలేదు. సర్వదా చిరునవ్వుతో పలకరించేవారు" అని ఈయన తరచూ చెబుతుండేవారు. ఈయన పాదరక్షలు మరీ పొడవుగా ఉండేవి. మదాయన్ విజయయాత్రలో పాల్గొన్నారు. ఖాదిసియా యుద్ధంలో కుడిపక్ష దళానికి సారథ్యం వహించారు. ఈయన ఈ ఉమ్మత్ (ముస్లిం సమాజం)కు యూసుఫ్‌గా పరిగణించబడేవారు. హిజ్రీ 52 లేక 54 లో మరణించారు.

(١٠٨٥) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَا

1085. హాజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు :

هِجْرَةَ بَعْدَ الْفَتْحِ، وَلَكِنْ جِهَادٌ وَنِيَّةٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

"(మక్కా) విజయం తరువాత హిజ్రత్ (వలస) లేదు. కాని జిహాద్ మరియు సత్సంకల్పం మాత్రం మిగిలిఉన్నాయి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అంటే, మక్కా విజయం తరువాత అరేబియాలో ఇస్లామీయ వ్యవస్థ ఏర్పడింది. 'దారుస్సలాం' నెలకొన్నది. కాబట్టి ముస్లింలు ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి అనవసరంగా ప్రస్థానం చేయవలసిన అవసరం లేదు. అయితే 'దారుల్ కుఫ్ర్'లో నివసించే ముస్లింలకు ధర్మావలంబనలో ఇక్కట్లు ఎదురయినట్లయితే వారు తమ ధర్మరక్షణ కోసం, తమ విశ్వాసాన్ని కాపాడుకోవటం కోసం సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్ళవచ్చు. మక్కానుండి మదీనాకు ప్రస్థానం చేయవలసిన అగత్యం లేదుగాని, దారుల్ కుఫ్ర్‌నుండి దారుస్సలామ్ వైపునకు, చెడు వ్యవస్థ నుండి సత్య ప్రధానమైన వ్యవస్థ వైపునకు ప్రస్థానం చేయవలసిన అవకాశం మాత్రం ఎప్పటికీ ఉంటుంది.

అలాగే దుష్ట శిక్షణ - శిష్ట రక్షణ నిమిత్తం చేసే జిహాద్ (ధర్మయుద్ధం) కూడా ఎప్పటికీ ఉంటుంది.

(١٠٨٦) وَعَنْ أَبِي مُوسَى الْأَشْعَرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ قَاتَلَ لِتَكُونَ كَلِمَةُ اللهِ هِيَ الْعُلْيَا فَهُوَ فِي سَبِيلِ اللهِ» مُتَّفَقٌ عَلَيْهِ.

1086. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఏ వ్యక్తి అయితే దైవవాక్కు ఉన్నతం కావాలన్న సంకల్పంతో పోరాడాడో అతడే దైవమార్గంలో పోరాడే సిసలయిన యోధుడు." (బుఖారీ, ముస్లిం)

(١٠٨٧) وَعَنْ عَبْدِ اللهِ بْنِ السَّعْدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ

1087. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సాదీ (రజి) చెప్పారు: "శత్రువులతో యుద్ధం కొనసాగుతున్నంత కాలం హిజ్రత్ (ప్రస్థానం) కొరకు ద్వారాలు తెరచుకునే ఉంటాయి."

ﷺ: «لاَ تَنْقَطِعُ الْهِجْرَةُ مَا قُوتِلَ الْعَدُوُّ». رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

(దీనిని నసాయి ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమైనదిగా ధృవీకరించారు)

## సారాంశం

ఇస్లాం ఆరంభ కాలంలో ముస్లింల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఆ రోజుల్లో ఇస్లాంకు కేంద్ర స్థానంగా వున్న మదీనా వైపునకు ముస్లింలు తరలిపోనిదే కేంద్రం బలపడదు. అందుచేత ఆ కాలంలో హిజ్రత్ చేయటం ప్రతి ముస్లింపై ఫర్జ్ (విద్యుక్త ధర్మం) గావించబడింది. ఇబ్నె జరీర్ హదీసు ద్వారా స్పష్టమయ్యే ముఖ్యాంశం కూడా ఇదే.

అయితే కొంతకాలానికి పరిస్థితులలో ఆశించిన మార్పు వచ్చింది. మక్కా విజయం అనంతరం వివిధ ప్రాంతాలవారు, వివిధ తెగల వారు తండోపతండాలుగా ఇస్లాంలో ప్రవేశించసాగారు. ఇస్లామీయ రాజ్యం విస్తరించింది. అందుచేత ముస్లింలు హిజ్రత్ చేసి మదీనా వైపునకు రావటం తప్పనిసరి కాదని చెప్పబడింది.

కాని ప్రపంచంలోని ముస్లింలు - ఎవరైనాసరే - తమ ధర్మావలంబనలో కష్టాలు ఎదురైనపుడు వారు తమ విశ్వాసాన్ని కాపాడుకునే ఉద్దేశ్యంతో తమకు అనుకూలమైన ప్రదేశానికి వలసపోవచ్చు. ఈ అవకాశం ప్రళయదినం వరకూ ఉంటుంది. ఇబ్నె సాదీ (రజి) ఉల్లేఖించిన హదీసు సారాంశం ఇదే.

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుల్లాహ్ బిన్ సాదీ (రజి) : ఖురషీ ఆమిరీ. వాఖిదీ కథనం ప్రకారం ఈయన హిజ్రీ 57లో మరణించారు. కాగా; సాదీ అసలు పేరు అమ్ర్ లేదా ఖదామ లేదా అబ్దుల్లాహ్ బిన్ వఖ్దాన్.

(١٠٨٨) وَعَنْ نَافِعٍ قَالَ: أَغَارَ رَسُولُ اللهِ ﷺ عَلَى بَنِي الْمُصْطَلِقِ، وَهُمْ غَارُّونَ، فَقَتَلَ مُقَاتِلَتَهُمْ، وسَبَى ذَرَارِيَهُمْ. حَدَّثَنِي بِذٰلِكَ عَبْدُ اللهِ بْنُ عُمَرَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1088. హిజ్రత్ నాఫె (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బనూ ముస్తలిఖ్ వారిపై దాడి జరిపినప్పుడు ఆ తెగవారంతా ప్రమత్తతకు లోనై ఉన్నారు. వారిలో యుద్ధం చేయగలవారిని ఆయన (స) హతమార్చి, వారి పిల్లలను ఖైదీలుగా పట్టుకున్నారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ - రజి - ఈ సంగతిని నాకు వివరించారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'బనూ ముస్తలిఖ్' అనేది అరేబియాలోని ఒక సుప్రసిద్ధ తెగ. ఈ తెగతో హిజ్రీ 6వ యేట దైవప్రవక్త (స) తలపడవలసి వచ్చింది. ముస్తలిఖ్ తెగవారు ముస్లింలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్న వార్త అందటంతో దైవప్రవక్త (స) ఈ తెగపై ఆకస్మిక దాడి జరిపారు. ఆ సమయంలో ముస్తలిఖ్ తెగవారు ఎంతో అజాగ్రత్తతకు, అలసత్వానికి గురై ఉన్నారు. ముస్లిం సేనలు ఆ తెగకు చెందిన మహిళలను, వృద్ధులను, చిన్న పిల్లలను బందీలుగా పట్టుకుని, కదనానికి కాలు దువ్వగల వారిని వధించారు. ఇది ముర్రైసియా యుద్ధంగా పేరుమోసింది.

హజ్రత్ జువైరియ (ర.అన్హా) యుద్ధ ఖైదీగా పట్టుబడింది ఈ యుద్ధంలోనే. నిజానికి ఈమె హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ బిన్ షిమాస్ వాటాలోకి 'విజయప్రాప్తి'గా వచ్చారు. అయితే ఆయన ఆమెతో 'ముకాతబత్' (నిర్ణీత మొత్తంపై విడుదల చేసేందుకు ఒప్పందం) చేసుకున్నారు. ఆ నిర్ణీత సొమ్మును దైవప్రవక్త (స) స్వయంగా చెల్లించి ఆమెను వివాహమాడారు. దైవప్రవక్త (స) హజ్రత్ జువైరియా (ర.అన్హా) ను నికాహ్ చేసుకున్నారన్న వార్త వినగానే ముస్లింలు ఆమె తెగకు చెందిన యుద్ధ ఖైదీలను విడుదల చేసేశారు. ఈ విధంగా హజ్రత్ జువైరియా (ర.అన్హా) తన జాతి ప్రజల పాలిట ఎంతో శుభకరంగా పరిణమించారు. ఇఫ్క్ సంఘటన (హజ్రత్ ఆయిషా - ర.అన్హా -పై అపనింద మోపబడిన సంఘటన) కూడా ఈ యుద్ధ సందర్భంగానే జరిగింది. ఇంతకు ముందు ఇది పేర్కొనబడింది.

(١٠٨٩) وَعَنْ سُلَيْمَانَ بْنِ بُرَيْدَةَ، عَنْ أَبِيهِ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا أَمَّرَ أَمِيراً عَلَىٰ جَيْشٍ أَوْ سَرِيَّةٍ، أَوْصَاهُ فِي خَاصَّتِهِ بِتَقْوَى اللهِ، وَبِمَنْ مَعَهُ مِنَ الْمُسْلِمِينَ خَيْراً، ثُمَّ قَالَ: «اُغْزُوا بِسْمِ اللهِ فِي سَبِيلِ اللهِ، قَاتِلُوا مَنْ كَفَرَ بِاللهِ، اُغْزُوا، وَلاَ تَغُلُّوا، وَلاَ تَغْدِرُوا، وَلاَ تُمَثِّلُوا، وَلاَ تَقْتُلُوا وَلِيداً، وَإِذَا لَقِيتَ عَدُوَّكَ مِنَ الْمُشْرِكِينَ، فَادْعُهُمْ إِلَى ثَلاَثِ خِصَالٍ، فَأَيَّتَهُنَّ أَجَابُوكَ إِلَيْهَا فَاقْبَلْ مِنْهُمْ، وَكُفَّ عَنْهُمْ: اُدْعُهُمْ إِلَى الإِسْلاَمِ، فَإِنْ أَجَابُوكَ فَاقْبَلْ مِنْهُمْ، ثُمَّ ادْعُهُمْ إِلَى التَّحَوُّلِ

1089. హజ్రత్ సులైమాన్ బిన్ బురైద తన తండ్రి ఆధారంగా చేసిన కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎప్పుడైనా సైన్యానికి లేక దళానికి ఎవరినయినా సేనాధిపతిగా నియమిస్తున్నప్పుడు అతనికి దైవభీతిని నూరిపోసేవారు. తన ముస్లిం సోదరుల యెడల శ్రేయోభిలాషిగా మెలగాలని ఉపదేశించేవారు. అనంతరం ఇలా తాకీదు చేసేవారు : "అల్లాహ్ పేరుతో, అల్లాహ్ మార్గంలో పోరాడేందుకు బయలుదేరు. దైవధిక్కారులతో, అవిశ్వాసులతో పోరాడు. అవినీతికి పాల్పడకు. ద్రోహం చేయకు. అమానుషంగా ప్రవర్తించకు.

مِنْ دَارِهِمْ إِلَى دَارِ الْمُهَاجِرِينَ، فَإِنْ أَبَوْا فَأَخْبِرْهُمْ أَنَّهُمْ يَكُونُونَ كَأَعْرَابِ الْمُسْلِمِينَ: وَلاَ يَكُونُ لَهُمْ فِي الْغَنِيمَةِ وَالْفَيْءِ شَيْءٌ إِلاَّ أَنْ يُجَاهِدُوا مَعَ الْمُسْلِمِينَ، فَإِنْ هُمْ أَبَوْا: فَاسْأَلْهُمُ الْجِزْيَةَ، فَإِنْ هُمْ أَجَابُوكَ، فَاقْبَلْ مِنْهُمْ، فَإِنْ هُمْ أَبَوْا فَاسْتَعِنْ بِاللهِ تَعَالَى وَقَاتِلْهُمْ، وَإِذَا حَاصَرْتَ أَهْلَ حِصْنٍ:

పసివాళ్ళను చంపకు. బహుదైవోపాసకులతో, శత్రువులతో ముఖాముఖి అయినపుడు -యుద్ధానికి ముందు వారి ఎదుట మూడు ప్రతిపాదనలను పెట్టు. వాటిలో వారు దేన్ని శిరసావహించినా నువ్వు దాన్ని ఒప్పుకో. వారితో పోరాడకు. తరువాత, వారు తమ ఇల్లూ వాకిలిని విడిచిపెట్టి ముహాజిర్ల దేశం (దారుస్సలాం) వైపునకు తరలి రమ్మని వారికి చెప్పు. ఒకవేళ వారు నిరాకరిస్తే వారికి లభించే హక్కులు పల్లె ప్రాంతాల ముస్లింలకు లభించే హక్కులతో మాత్రమే సమానంగా ఉంటాయనీ, ముస్లింలతో కలసి ధర్మ యుద్ధంలో పాల్గొంటేతప్ప విజయప్రాప్తి (మాలె గనీమత్) లోగానీ, 'ఫై' ధనంలో గానీ వాటా లభించదనీ వారికి స్పష్టంగా చెప్పేయి. ఈ ప్రతిపాదనను కూడా వాళ్లు నిరాకరిస్తే వారి నుండి 'జిజ్‌యా' వసూలు చెయ్యి. ఒకవేళ వారు దీన్ని కూడా శిరసావహిస్తే నువ్వు కూడా దీన్ని ఆమోదించు. వాళ్లు కాదంటే మాత్రం దైవసహాయాన్ని అర్థిస్తూ వారితో పోరాటం మొదలెట్టు. నువ్వు ఏదైనా కోటను ముట్టడించినపుడు - అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) పూచీ షరతుపై వారు ఆత్మ సమర్పణ చేయ దలిస్తే నువ్వు ఆ బాధ్యతను స్వీకరిం

فَأَرَادُوكَ أَنْ تَجْعَلَ لَهُمْ ذِمَّةَ اللهِ وَذِمَّةَ نَبِيِّهِ فَلاَ تَفْعَلْ، وَلَكِنِ اجْعَلْ لَهُمْ ذِمَّتَكَ، فَإِنَّكُمْ أَنْ تَخْفِرُوا ذِمَمَكُمْ أَهْوَنُ مِنْ أَنْ تَخْفِرُوا ذِمَّةَ اللهِ، وَإِذَا أَرَادُوكَ أَنْ تُنْزِلَهُمْ عَلَى حُكْمِ اللهِ فَلاَ تَفْعَلْ، بَلْ عَلَى حُكْمِكَ، فَإِنَّكَ لاَ تَدْرِي أَتُصِيبُ فِيهِمْ حُكْمَ اللهِ أَمْ لاَ». أَخْرَجَهُ مُسْلِمٌ.

చకు. దానికి బదులు నువ్వు నీ తరపున ఆ మేరకు హామీని ఇవ్వు (దీనికి విరుద్ధం గా వ్యవహరించకు). ఎందుకంటే ఒకవేళ మీరు మీరిచ్చిన హామీని భంగ పరిస్తే ఇది దేవుని వూచీకత్తును భంగపరచటం కన్నా చాలా తేలికైనది. నువ్వు వాళ్ళను దైవాజ్ఞ మేరకు రాజీ పడేలా వాళ్లు కోరితే అలా చేయకు. నీ ఆజ్ఞ, నీ నిర్ణయంపై వాళ్లు రాజీకి వచ్చేలా చూసుకో. ఎందుకంటే, దైవనిర్ణయం, దైవప్రణాళిక ఏమిటో ఊహించగలిగే జ్ఞానం నీకు లేదు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో యుద్ధ నియమ నిబంధనలకు, వ్యూహానికి సంబంధించిన నిర్దిష్టమైన, ప్రామాణికమైన సూచనలు ఉన్నాయి. ధర్మవేత్తలు పలుకోణాల నుండి వీటిని విశ్లేషించారు. అయితే ఆ విశ్లేషణల్లో వైవిధ్యం ఉంది. వాటి వివరాల్లోకి పోతే చర్చ సుదీర్ఘమవుతుంది.

(١٠٩٠) وَعَنْ كَعْبِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ إِذَا أَرَادَ غَزْوَةً وَرَّى بِغَيْرِهَا. مُتَّفَقٌ عَلَيْهِ.

1090. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏదైనా యుద్ధానికి వెళ్ళదలచినపుడు గోప్యంగా వ్యూహ రచన చేసేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పై హదీసు(అరబీ)లో 'తౌరియ' అనే పదం వచ్చింది. ఇది యుద్ధతంత్రంలో భాగం. వెళ్ళవలసింది ఒక చోటికయితే వేరితర ప్రదేశాల గురించి చర్చించటం, ఒక దిశలో పయనించవలసి ఉంటే వేరొక దిశ గురించి వాకబు చేయటం - ఇదంతా వ్యూహరచన క్రిందికి వస్తుంది. శత్రువు గూఢచారులను, విరోధులను ఏమార్చడానికి, తమ సేనలను ఒకే త్రాటిపై నడిపించడానికి ఇలా పకడ్బందీగా వ్యవహరించటం అవసరం. ఈ వ్యూహరచన 'మోసం' క్రిందికి రాదు.

(١٠٩١) وَعَنْ مَعْقِلٍ، أَنَّ النُّعْمَانَ بْنَ مُقَرِّنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ رَسُولَ اللهِ ﷺ، إِذَا لَمْ يُقَاتِلْ أَوَّلَ النَّهَارِ أَخَّرَ الْقِتَالَ حَتَّى تَزُولَ الشَّمْسُ، وَتَهُبَّ الرِّيَاحُ وَيَنْزِلَ النَّصْرُ. رَوَاهُ أَحْمَدُ وَالثَّلَاثَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَأَصْلُهُ فِي الْبُخَارِيِّ.

1091. హజ్రత్ మాఖిల్ కథనం : హజ్రత్ నూమాన్ బిన్ ముఖర్రిన్ (రజి) ఇలా తెలిపారు - నేను దైవప్రవక్త (సఅసం)తో కలసి యుద్ధాలలో పాల్గొనేవాణ్ణి. ఆయన (స) ఉదయం పూట యుద్ధాన్ని ఆరంభించని పక్షంలో పొద్దు వాలిన పిదప ఆరంభించేవారు. అప్పుడు అనుకూల పవనాలు వీచి (సేనలకు దైవ) సహాయమందేది." (దీనిని అహ్మద్ మరియు 'ముగ్గురూ' ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని దృఢమైనదిగా పేర్కొన్నారు. దీని మూలం బుఖారీలో ఉంది)

### సారాంశం

యుద్ధం తెల్లవారినప్పుడుగానీ, మధ్యాహ్నం వేడితగ్గిన తరువాత గానీ మొదలెట్టాలనీ, ఈ రెండు వేళలు సేనల కొరకు ఆహ్లాదకరంగా ఉంటాయని ఈ హదీసు సారాంశం.

### హదీసు ఉల్లేఖకులు

నూమాన్ బిన్ ముఖర్రిన్ (రజి) : ముజన్ తెగకు చెందిన సహాబి. అబూబకర్ సిద్దీఖ్ (రజి), ఉమర్ ఫారూఖ్ (రజి)ల ఖిలాఫత్ కాలంలో ముస్లిం సేనలకు సారథ్యం వహించిన వారిలో ఈయన కూడా ఉన్నారు. ఈయన తన ఏడుగురు సోదరులతో కలసి హిజ్రత్ (వలస) చేశారు. అస్బహాన్ ప్రాంతాన్ని జయించారు. హిజ్రీ 21లో నహావంద్ యుద్ధంలో వీరమరణం పొందారు.

(١٠٩٢) وَعَنِ الصَّعْبِ بْنِ جَثَّامَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سُئِلَ رَسُولُ اللهِ ﷺ عَنِ الذَّرَارِيِّ مِنَ الْمُشْرِكِيْنَ، يُبَيَّتُونَ، فَيُصِيبُونَ مِن نِّسَائِهِمْ وَذَرَارِيِّهِمْ، فَقَالَ: «هُمْ مِنْهُمْ». مُتَّفَقٌ عَلَيْهِ.

1092. హజ్రత్ సాబ్ బిన్ జస్సామ (రజి) కథనం : బహు దైవారాధకులపై మెరుపు దాడి చేసినప్పుడు వారి స్త్రీలు, పిల్లలను కూడా హతమార్చటం జరుగుతుంది (మరి ఈ చర్య ధర్మసమ్మతమేనా?) అని దైవప్రవక్త (సఅసం) సమక్షంలో సందేహ పడగా "వారు కూడా వాళ్ళ వాళ్ళే కదా!" అని ఆయన (స) అన్నారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇంతకుముందు వచ్చిన ఒక హదీసులో - యుద్ధ సందర్భాలలో పిల్లలను హతమార్చ రాదని చెప్పబడింది. బహుశా ఈ హదీసు ఆధారంగానే యుద్ధ సమయంలో అవిశ్వాసుల పిల్లల జోలికి సుతరామూ పోరాదని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ ఔజాయి (రహ్మ.లై) భావిస్తున్నారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా - లక్ష్యాన్ని పెట్టుకుని - పసిపిల్లలను చంపరాదని ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు అధిక సంఖ్యాక పండితులు అభిప్రాయపడ్డారు.

(١٠٩٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لِرَجُلٍ تَبِعَهُ فِي يَوْمِ بَدْرٍ: «ارْجِعْ، فَلَنْ أَسْتَعِينَ بِمُشْرِكٍ». رَوَاهُ مُسْلِمٌ.

1093. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: బద్ర్ (యుద్ధ) దినాన తన పక్షాన వచ్చి చేరిన వ్యక్తినుద్దేశ్యించి దైవప్రవక్త (నఅనం), ''తిరిగి వెళ్ళిపో. నేను బహుదైవోపాసకుని (ముష్రిక్) సహాయం కోరడం లేదు'' అని అన్నారు. (ముస్లిం)

**సారాంశం**

యుద్ధ రంగంలో ముష్రిక్ (బహుదైవారాధకుని) సహాయ సహకారాలను పొందడానికి దైవప్రవక్త (సఅసం) సుతరామూ ఒప్పుకోలేదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. ఈ సంఘటన పూర్వాపరాలు ఇవి: బద్ర్ యుద్ధ మైదానం వైపునకు దైవప్రవక్త (సఅసం) తరలి వెళుతున్నారు. 'హర్ర' అనే స్థలం వద్దకు ఆయన చేరుకున్నప్పుడు ఒక ముష్రిక్కు ఎదురు పడ్డాడు. అతడు సాహసవంతుడే గాక బలశాలి కూడా. 'మీతో కలసి యుద్ధం చేసి విజయప్రాప్తి (మాలె గనీమత్) లో పాలుపంచుకోదలుస్తున్నాను' అని అతడు ప్రతిపాదించాడు. దానికి దైవ ప్రవక్త (స), "నువ్వు అల్లాహ్‌ను విశ్వసిస్తున్నావా? లేదా?" అని నిలదీశారు. 'లేదు' అన్నాడతను. "అయితే నేను బహుదైవారాధకుడైన ఏ వ్యక్తి సహాయాన్నీ కోరుకోవటం లేద"ని ఆయన (స) నిర్ధిష్టంగా చెప్పేశారు. అప్పుడతను ఇస్లాం స్వీకరించగా, ముస్లింల తరపున పోరాడటానికి అనుమతి ఇవ్వబడింది.

మరి అవిశ్వాసి (కాఫిర్) అయిన వ్యక్తి సహాయం పొందవచ్చా? అన్న సందేహం కూడా ఈ సందర్భంగా జనించవచ్చు. పొందవచ్చునని ఒక వర్గం అంటున్నది. అవసరం మేరకు సహాయ సహకారాలు పొందవచ్చునని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) మరియు ఆయన అనుయాయులు తలపోస్తున్నారు. హునైన్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (స) సఫ్వాన్ బిన్ ఉమయ్య తదితరుల నుండి ఆయుధాలను తీసుకోవడాన్ని, ఖైనుఖా యూదుల సహకారం పొందడాన్ని ఇక్కడ ఉదాహరించటం జరిగింది. తేలిందేమంటే యుద్ధ సామగ్రిగానీ, వ్యక్తుల అవసరంగానీ తీవ్రంగా ఏర్పడినపుడు సహకారం పొందటం విపరీతం కాదు.

(١٠٩٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ رَأَى امْرَأَةً مَقْتُولَةً فِي بَعْضِ مَغَازِيْهِ، فَأَنْكَرَ قَتْلَ النِّسَآءِ وَالصِّبْيَانِ. مُتَّفَقٌ عَلَيْهِ.

1094. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాను పాల్గొన్న ఒక యుద్ధంలో ఒక స్త్రీ వధించబడటం చూసి, స్త్రీలను, పిల్లలను హతమార్చే చర్యనుండి (అనుచరుల్ని) వారించారు. (బుఖారీ, ముస్లిం)

(١٠٩٥) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اُقْتُلُوا شُيُوخَ الْمُشْرِكِينَ، وَاسْتَبْقُوا شَرْخَهُمْ**». رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1095. హజ్రత్ సమురా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ముష్రిక్కులలోని అనుభవజ్ఞులను, నిపుణులను వధించండి. ప్రాజ్ఞ వయస్సుకు చేరని వారిని మిగిల్చి ఉంచండి." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించగా, తిర్మిజీ ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

శత్రుపక్షాన ఉన్న వారిలోని వృద్ధులను, అనుభవజ్ఞులను వధించమనటంలోని ఆంతర్యం ఏమిటంటే వాళ్లు రణనీతిలో ఆరితేరిన వారై ఉంటారు. ప్రత్యర్థిని ఎలా ఎదుర్కోవాలో, ఏ సమయంలో ఏ వ్యూహాన్ని అమలుపరచాలో వారికి క్షుణ్ణంగా తెలుసు. అందుకే ఇలాంటి నిపుణుల్ని తుదముట్టిస్తే **శత్రుసేనల్ని మానసికంగా కృంగదీసినట్లవుతుంది.** ఇక యుక్త వయస్సుకు చేరని పసివాళ్లను **వదలిపెట్టమనటంలోని మర్మం ఏమిటంటే;** భవిష్యత్తులో ఈ నవతరం సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వరికించి సత్యాన్ని **స్వీకరించవచ్చు!** సత్యధర్మ ఉన్నతికై పాటుపడవచ్చు. కాని వయస్సు మీదపడిన వారిలో ఈ 'స్వీకృత'గుణం బహు స్వల్పంగా ఉంటుంది.

(١٠٩٦) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُمْ تَبَارَزُوا يَوْمَ بَدْرٍ. رَوَاهُ الْبُخَارِيُّ، وَأَخْرَجَهُ أَبُو دَاوُدَ مُطَوَّلاً.

1096. బద్ర్ (సంగ్రామం జరిగిన) రోజున తాము వాళ్ళకు(అవిశ్వాసులకు) సవాలు చేశామని హజ్రత్ అలీ (రజి) తెలిపారు (బుఖారీ). అబూదావూద్‌లో ఈ హదీసు సవివరంగా ఉంది.

**సారాంశం**

సవాలు విసిరిన వారిలో హజ్రత్ అలీ (రజి), హజ్రత్ హమ్జా (రజి), ఉబైద బిన్ హారిస్ (రజి) ముఖ్యులు. హదీసు మూలంలో 'ముబారజత్' గురించి చెప్పబడింది. అంటే; యుద్ధరంగంలో ఇరుపక్షాల వారూ తమ సేనలను మోహరించి ఉండగా యుద్ధం ప్రారంభించే ముందు ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది యువకులు ముందుకు వచ్చి శత్రు సేనల్లోని యువకులను యుద్ధం కొరకు రమ్మని సవాలు చేస్తారు. దమ్ముంటే ముందుకు రమ్మంటూ ఉసిగొల్పుతారు. ఆ విధంగా ఇరుపక్షాలకు చెందిన కొంతమంది యోధుల మధ్య వ్యక్తిగత స్థాయి పోరాటం జరుగుతుంది. ఈ దృశ్యాన్ని ప్రత్యక్షంగా తిలకించిన ఇరుపక్షాల సేనలూ అప్పటికప్పుడు తమ శ్రేణులను రూపొందించుకుని కయ్యానికి కాలుదువ్వుతాయి. అసలు యుద్ధం అప్పుడు మొదలవుతుంది.

ఇకపోతే; పై హదీసులో ప్రస్తావనకు వచ్చిన 'ముబారజత్' (సవాలు)లో హజ్రత్ అలీ (రజి) వలీద్ బిన్ ఉతబాను వధించారు. హజ్రత్ హమ్జా (రజి) షైబ బిన్ రబీయాను అంతమొందించారు. హజ్రత్ ఉబైద బిన్ హారిస్ (రజి) - ఉతబా బిన్ రబీయాల మధ్య హోరాహోరి పోరు జరుగుతోంది. హజ్రత్ అలీ, హజ్రత్ హమ్జాలు ఉతబాపై ఒక్క ఉదుటున లంఘించి అతని కథను కంచికి చేర్చారు. హజ్రత్ ఉబైద (రజి) తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ని వారిరువురూ ఎత్తుకు వచ్చారు. తొడకు తగిలిన గాయం వల్ల రక్తం ఎక్కువగా స్రవించి, మదీనాకు తిరిగి వస్తున్న సమయంలో ఆయన తనువు చాలించారు.

(١٠٩٧) وَعَنْ أَبِي أَيُّوبَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: إِنَّمَا نَزَلَتْ هٰذِهِ الْآيَةُ فِينَا مَعْشَرَ الْأَنْصَارِ، يَعْنِي قَوْلَهُ تَعَالَى ﴿وَلَا تُلْقُوا بِأَيْدِيكُمْ إِلَى التَّهْلُكَةِ﴾ قَالَهُ رَدًّا عَلَىٰ مَنْ أَنْكَرَ عَلَىٰ مَنْ حَمَلَ عَلَىٰ صَفِّ الرُّومِ حَتَّى دَخَلَ فِيهِمْ. رَوَاهُ الثَّلَاثَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1097. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) కథనం: ఈ ఆయతు మాకు (అన్సార్లకు) అనుకూలంగా అవతరించింది - "చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి." (2:195) రోమనుల సైనిక పంక్తులపై మెరుపుదాడి చేసి, వారి పంక్తుల్లోకి దూసుకుపోయిన వాళ్ల చర్యను ఖండిస్తూ హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) ఈ సూక్తిని ఉదాహరించారు. (దీనిని 'ముగ్గురు' ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు ముగ్గురూ దీనిని ప్రామాణికమైన హదీసుగా నిర్ధారించారు)

**సారాంశం**

అస్లం బిన్ అబూ ఇమ్రాన్ ఈ హదీసు సందర్భాన్ని గురించి ఇలా వివరించారు : మేము ఇస్తాంబుల్‌లో ఉన్నాము. రోమనుల ఒక పెద్ద సైనిక సమూహం తమను నిలువరించడానికి ముందుకు వచ్చింది. ఆ సమయంలో ముస్లిం సైన్యంలోని ఒక యోధుడు రోమనులపై ఆకస్మిక దాడిచేసి, వారి పంక్తుల్లోకి దూసుకుపోయాడు. సురక్షితంగా తిరిగి వచ్చాడు. అతని పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను, తెగువను చూసిన ముస్లింలు అతన్ని శ్లాఘిస్తూ 'సుబ్‌హా నల్లాహ్' అని అన్నారు. తన ప్రాణాన్ని పణంగా పెట్టడానికి సిద్ధమయ్యాడు కదా! అని అబ్బురం చెందారు. అప్పుడు హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) కల్పించుకుని దివ్య ఖుర్‌ఆన్‌లోని సూక్తిని ఉదాహరించారు. ఈ సూక్తి అన్సార్ వర్గీయులను దృష్టిలో పెట్టుకునే అవతరించిందనీ, అయితే మీరందరూ ఈ సూక్తిని అర్థం చేసుకోవటంలో పొరబడుతున్నారని అన్నారు. తరువాత ఆయన ఈ సూక్తి యొక్క అసలు సందర్భాన్నీ, భావాన్ని తన సోదరులకు విశదీకరించారు.....

(١٠٩٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: حَرَّقَ رَسُولُ اللهِ ﷺ نَخْلَ بَنِي النَّضِيْرِ، وَقَطَّعَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1098. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బనూ నజీర్‌కు చెందిన ఖర్జూర చెట్లను నరికి వేయించారు, అగ్నికి ఆహుతి చేశారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

బనూ నజీర్ అనేది యూదుల ఒక తెగ. ఈ తెగవారు మదీనా నగరానికి దక్షిణాన నివసించేవారు. మహాప్రవక్త (సఅసం)కు - యూదులకు మధ్య అంతకు ముందు మైత్రీ ఒప్పందం ఉండేది. కాని యూదులు ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇస్లాం విరోధులతో కుమ్మక్కు అవడమేగాక, దైవప్రవక్త (సఅసం)ను హతమార్చడానికి కుట్రపన్నారు. అందువల్ల దైవప్రవక్త (సఅసం) బనూ నజీర్‌ను శిక్షించదలచి వారి కోటలను ముట్టడించారు. 15 రోజుల వరకూ దిగ్బంధం చేశారు. అనంతరం వారిని మదీనా నుండి నగర బహిష్కరణ శిక్ష విధించారు. వారి ఖర్జూర చెట్లను నరికి వేయమని చెప్పింది ఈ ముట్టడి సందర్భంగానే. సాధారణ సమయాలలో పండ్లు ఫలాలనిచ్చే తోటలను, వృక్షాలను నరకటం సమ్మతం కాదు గాని అసాధారణ, అనివార్య పరిస్థితుల్లో - శత్రువు మెడలు వంచడానికి - ఈ చర్య గైకొనటం సమ్మతమేనని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది.

(١٠٩٩) وَعَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَغُلُّوا، فَإِنَّ الْغُلُولَ نَارٌ وَعَارٌ عَلَى

1099. హజ్రత్ ఉబాద బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "(విజయప్రాప్తిలో) అవినీతికి

أَصْحَابِهِ فِي الدُّنْيَا وَالآخِرَةِ. رَوَاهُ أَحْمَدُ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

పాల్పడకండి. ఇది (ఈ అవినీతి మరియు ద్రోహం) ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అగ్నికి, పరాభవానికి కారణభూతమవుతుంది. (దీనిని అహ్మద్ మరియు నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

అప్పగింతల్లో, మాలె గనీమత్ (విజయప్రాప్తి)లో అవినీతికి పాల్పడటం, అక్రమంగా స్వాహా చేయటం చాలా పెద్ద అపరాధమని, ఈ ద్రోహానికి పాల్పడినవారు ప్రపంచ జీవితంలోనూ, పారలౌకిక జగతిలోనూ ఘోర అవమానానికి గురవటం ఖాయమనీ ఈ హదీసు చెబుతోంది. ముస్లిం యోధుడనబడేవాడు నిజాయితీపరునిగా మసలుకోవాలి. అవినీతిపరునిగా, మోసగాడుగా కళంకం తెచ్చుకోకూడదు. ఆస్తిపాస్తులను, విజయ ధనాన్ని ప్రోగుచేసుకోవటమే లక్ష్యంగా పెట్టుకోకుండా దైవప్రసన్నతను చూరగొనటాన్ని దైవహక్కుకు ఉన్నతిని కల్పించడాన్నే తన అసలు జీవన ధ్యేయంగా పెట్టుకోవాలి. ఈ ధ్యేయానికి కట్టుబడి ఉంటే ప్రపంచంలోనూ, పరలోకంలోనూ కూడా అతడు ఉన్నత సోపానాలను అధిరోహిస్తాడు. పరాభవం, అవమానం అతని దరికి రావు.

(١١٠٠) وَعَنْ عَوْفِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَضَى بِالسَّلَبِ لِلْقَاتِلِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَأَصْلُهُ عِنْدَ مُسْلِمٍ.

1100. హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా నిర్ణయించారు: "(ధర్మయుద్ధంలో చంపబడిన వాని) సాధన సంపత్తులు చంపిన వానికే దక్కుతాయి." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. దీని మూలం 'ముస్లిం' లో వుంది)

**సారాంశం**

అరబీలో 'సలబ్' అనే పదం వాడబడింది. సలబ్ అంటే యుద్ధంలో పోరాడి హతుడైన అవిశ్వాసి యొక్క వస్త్రాలు యుద్ధ సామగ్రి అని మెజారిటీ పండితులు భావిస్తున్నారు. అయితే వాహనంగా ఉపయోగపడే జంతువు ఈ పరిధిలోకి రాదని ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)

అభిప్రాయపడ్డారు. ఇమామ్ షాఫయి (రహ్మాలై) దృష్టిలో 'సలబ్' అంటే అవిశ్వాసుల యుద్ధ సామగ్రి.

(١١٠١) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ قَتْلِ أَبِيْ جَهْلٍ – قَالَ: فَابْتَدَرَاهُ بِسَيْفَيْهِمَا، حَتَّى قَتَلَاهُ، ثُمَّ انْصَرَفَا إِلَى رَسُولِ اللّٰهِ ﷺ، فَأَخْبَرَاهُ، فَقَالَ: «**أَيُّكُمَا قَتَلَهُ؟ هَلْ مَسَحْتُمَا سَيْفَيْكُمَا؟**» قَالَا: لَا، قَالَ: فَنَظَرَ فِيْهِمَا، فَقَالَ: «**كِلَاكُمَا قَتَلَهُ**» فَقَضَى ﷺ بِسَلَبِهِ لِمُعَاذِ بْنِ عَمْرِو بْنِ الْجَمُوحِ. مُتَّفَقٌ عَلَيْهِ.

1101. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అబూ జహల్ వధ గురించి వివరిస్తూ ఇలా అన్నారు : "(ఆ కుర్రవాళ్ళు) ఇద్దరూ తమ తమ ఖడ్గాలతో అబూ జహల్ వైపునకు దూసుకుపోయి అతన్ని హతమార్చారు. తరువాత వాళ్ళు దైవ ప్రవక్త (సఅసం) వైపునకు మరలివచ్చి, అబూ జహల్ కథ సమాప్తమైనట్లు తెలిపారు. అది విని "మీ ఇద్దరిలో అతడ్ని ఎవరు వధించారు?" అని దైవ ప్రవక్త (సఅసం) దర్యాప్తు చేశారు. "మీరు మీ ఖడ్గాలు కడుక్కున్నారా?" అని కూడా ఆయన (స) ప్రశ్నించారు. లేదని వాళ్లు సమాధానమిచ్చారు. దైవప్రవక్త (స) వారిద్దరి కరవాలాలను పరిశీలించి "మీరిద్దరూ అతడ్ని హతమార్చార"ని నిర్ధారించారు. తరువాత దైవప్రవక్త (సఅసం) అతని యుద్ధసామగ్రినంత టినీ ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జమూహ్‌కు ఇవ్వాలని నిర్ణయించారు.

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఇద్దరికి చెందవలసిన సంపదను ఒక్కరికే ఎలా ఇచ్చారన్న సందేహం కలుగవచ్చు. కాని అబూ జహల్ వధలో భాగస్థుడైన మరో యోధుడు ముఆజ్ బిన్ అఫ్రా ఆ రోజే యుద్ధం చేస్తూ అమరగతి నొందారు. అందువల్ల అబూ జహల్ సాధన, సంపత్తి అంతా ఒక్కరికే దక్కింది.

## హదీసు ఉల్లేఖకులు

ముఆజ్ బిన్ అమ్ర్ బిన్ జమూహ్ (రజి) : అన్సారీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు.

సులమీగా పిలువబడేవారు. బైతె అఖబాలోనూ, బద్ర్ సంగ్రామంలోనూ పాల్గొన్నారు. అబూ జహల్ కాలిని, తలను అతని శరీరం నుండి వేరుచేసింది ఈయనే. అబూ జహల్ కుమారుడైన ఇక్రిమ వేసిన వేటుకు ఈయన చేయి తెగిపోయింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(١١٠٢) وَعَنْ مَكْحُولٍ، أَنَّ النَّبِيَّ ﷺ نَصَبَ الْمَنْجَنِيْقَ عَلَىٰ أَهْلِ الطَّائِفِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيْلِ، وَرِجَالُهُ ثِقَاتٌ، وَوَصَلَهُ الْعُقَيْلِيُّ بِإِسْنَادٍ ضَعِيْفٍ عَنْ عَلِيٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ.

**1102. హజ్రత్ మక్‌హూల్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ నల్లం) తాయఫ్ వాసులను ఎదుర్కోవడానికి ఒక వినూత్న యుద్ధ పరికరాన్ని ఆవిష్కరించారు. (దీనిని అబూదావూద్ తన 'మురాసీల్'లో పొందుపరచారు. దీని ఉల్లేఖకులు నమ్మకస్థులు. అయితే ఉఖైల్‌గారు హజ్రత్ అలీ (రజి) నుండి అందిన బలహీన పరంపర ఆధారంగా దీనిని 'మౌసూల్'గా ఖరారు చేశారు)**

## సారాంశం

అరబీలో 'మున్జనిఖ్' అనే పదం ఉంది. అదొక ఆయుధ పరికరం. దాని ద్వారా పెద్ద పెద్ద బండరాళ్లు బద్దలుగొట్టబడేవి. కోట గోడలు కూల్చబడేవి. పటిష్టమైన, ఎత్తయిన కట్టడాలు నేలమట్టం చేయబడేవి. మహాప్రవక్త (సఅసం) ఇటువంటి యుద్ధపరికరాన్ని స్థాపించడాన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే శత్రువును చిత్తు చేయడానికి, విరోధి బలాన్ని నిర్వీర్యం చేయడానికి వినూత్న పద్ధతులను అవలంబించటం, నూతన ఆయుధాలను ఆవిష్కరించటం అవసరం. నేటి ఆధునిక యుగంలో అణ్వస్త్రాలు, అధునాతన మిజైళ్ళు తయారవుతున్న సంగతిని విస్మరించలేము కదా! మారణాయుధాల వల్ల మానవతకు, ప్రపంచ శాంతికి తీవ్రమయిన ముప్పు పొంచి ఉన్నప్పటికీ 'సంతులనం' కోసం వాటిని తయారు చేయక తప్పటం లేదని అభివృద్ధి చెందుతున్న దేశాలు వాదించటం గమనార్హం.

ఈ హదీసు ద్వారా తెలిసే మరో ముఖ్య విషయం ఏమిటంటే తాయఫ్ వాసులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మహాప్రవక్త (స) కూడా పాల్గొన్నారు. శత్రువర్గానికి చెందిన వారు కోట ద్వారాలు మూసేసుకుని లొంగిపోవడానికి సిద్ధంగా లేని పక్షంలో ఫిరంగుల ద్వారా, అధునాతన ఆయుధాల ద్వారా దాడిచేయవచ్చనీ, ఈ దాడిలో మహిళలకు, పసివాళ్ళకు ఒకవేళ ప్రాణ నష్టం కలిగితే సైనికులు నిందార్హులు కారని కూడా తెలుస్తోంది.

## హదీసు ఉల్లేఖకులు

మక్‌హూల్ : ఈయన డెమాస్కస్ పౌరులు. సిరియాకు చెందిన ప్రఖ్యాత ధర్మవేత్తలలో,

పండితులలో ఒకరు. సిరియాలో ఈయన్ని మించిన ఫఖీ (ధర్మవేత్త) నా దృష్టికి రాలేదని అబూ హాతిమ్ వక్కాణించారు. హిజ్రీ 113లో ఈయన మరణించారు.

(١١٠٣) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ دَخَلَ مَكَّةَ، وَعَلَىٰ رَأْسِهِ الْمِغْفَرُ، فَلَمَّا نَزَعَهُ جَاءَهُ رَجُلٌ، فَقَالَ: ابْنُ خَطَلٍ مُتَعَلِّقٌ بِأَسْتَارِ الْكَعْبَةِ، فَقَالَ: «اقْتُلُوهُ» مُتَّفَقٌ عَلَيْهِ.

1103. హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా నగరంలో ప్రవేశించినపుడు ఆయన (స) తలపై శిరస్త్రాణం ఉంది. దాన్ని ఆయన (స) తలపై నుంచి తీస్తుండగా ఒక వ్యక్తి దగ్గరకు వచ్చి, 'ఇబ్నె ఖతల్ కాబా గృహ తెరచాటున నక్కి ఉన్నాడు' అని అన్నాడు. దీనికాయన (స),"అతడ్ని వధించండి" అని చెప్పారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ధర్మభ్రష్టుడైపోయిన వాడ్ని, దైవప్రవక్త (సఅసం)ను **అవమానపరచే** విధంగా గేయాలు పాడే వారికి శరణు ఇచ్చే వారిని నిస్సంకోచంగా **హతమార్చవచ్చని** ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఇబ్నె ఖతల్ అనే వ్యక్తి తొలుత ఇస్లాం స్వీకరించాడు. జకాత్ సొమ్ము వసూలు చేసే ఉద్యోగిగా నియమితుడయ్యాడు. తరువాత అతను తన దగ్గర పనిచేసే ముస్లిం సేవకుణ్ణి హత్య చేశాడు. మద్యపానానికి అలవాటుపడి ధర్మభ్రష్టుడై పోయాడు. అతని దగ్గర ఇద్దరు బానిస స్త్రీలుండేవారు. వారిరువురూ మహాప్రవక్త (స)ను ఎగతాళి చేస్తూ వ్యంగ్యంగా పాటలు పాడేవారు. వారిలో ఒకామె వధించబడింది. రెండవ ఆమె శరణుకోరి ఇస్లాం స్వీకరించింది. ఇక ఇబ్నె ఖతల్ గురించి; మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త (స) హతమార్చమని సూచించిన తొమ్మండుగురిలో ఇబ్నె **ఖతల్ కూడా** ఉన్నాడు. వారిలో నలుగురు హత్య గావించబడగా, మిగిలిన ఐదుగురు క్షమాపణ కోరుకుని అనంతరం ఇస్లాం స్వీకరించారు.

(١١٠٤) وَعَنْ سَعِيْدِ بْنِ جُبَيْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَتَلَ يَوْمَ بَدْرٍ ثَلَاثَةً صَبْراً. أَخْرَجَهُ أَبُو دَاوُدَ فِي الْمَرَاسِيْلِ، وَرِجَالُهُ ثِقَاتٌ.

1104. హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బద్ర్ యుద్ధ దినాన ముగ్గురు వ్యక్తులను బంధించి తుదముట్టించారు." (దీనిని అబూదావూద్ తన 'మరాసీల్'లో నకలు చేశారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

## హదీసు ఉల్లేఖకులు

సయీద్ బిన్ జుబైర్ (రజి) : అగ్రజులైన తాబయీన్లలో ఒకరు. హజ్జాజ్ బిన్ యూసుఫ్ చేత నిర్దాక్షిణ్యంగా చంపబడిన వారిలో ఆఖరివారు. హదీసు, తఫ్సీర్ విద్యల్లో ఇమామ్‌గా పరిగణించబడ్డారు. "నేను సయీద్ బిన్ జుబైర్ హత్యా దృశ్యాన్ని చూశాను. శిరచ్ఛేదనం గావించబడినపుడు ఆయన రెండుసార్లు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని అన్నారు. మూడవసారి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనబోయారు కాని వాక్యాన్ని పూరించలేకపోయారు" అని ఖలీఫా చెప్పాడు. మైమూన్ బిన్ మహ్రాన్ ఈయన గురించి ఇలా అంటున్నారు: "సయీద్ బిన్ జుబైర్ మనకిక లేకపోవచ్చు. కాని భూమండలంలో ఆయనగారి ధర్మపరిజ్ఞానంపై ఆధారపడని వాడెవడూ ఉండడు." హిజ్రీ 90లో ఆయన హత్య గావించబడ్డారు. అప్పటికే ఆయన వార్ధక్యంలో ఉన్నారు.

(١١٠٥) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ رَسُولَ اللهِ ﷺ فَدَى رَجُلَيْنِ مِنَ الْمُسْلِمِينَ بِرَجُلٍ مِّنَ الْمُشْرِكِينَ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَأَصْلُهُ عِنْدَ مُسْلِمٍ.

1105. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ముష్రిక్కులకు చెందిన ఒక పురుష యుద్ధ ఖైదీని విడిచిపెట్టి దీనికి మారుగా ఇద్దరు ముస్లింలను విడిపించుకున్నారు. (దీనిని తిర్మిజీ వెలికి తీశారు. ప్రామాణిక మైన హదీసుగా ఖరారు చేశారు. దీని మూలం 'ముస్లిం'లో వుంది)

## సారాంశం

యుద్ధ ఖైదీల మార్పిడి సమంజసమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. అధిక సంఖ్యాక ఉలమాల అభిప్రాయం కూడా ఇదే. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో ఈ మార్పిడి సరైనది కాదు. యుద్ధ ఖైదీని హతమార్చటమో లేక బానిసగా చేసుకోవటమో చేయాలని ఈయన భావిస్తున్నారు. కాగా; ప్రవక్త సహచరులు బనూ అఖీల్ తెగకు చెందిన ఒక వ్యక్తిని నిర్బంధించగా, సఖీఫ్ తెగవారు ఇద్దరు ప్రవక్త సహచరులను పట్టుకున్నారు. ఎందుకంటే అఖీల్ తెగవారు సఖీఫ్ తెగకు మద్దతుదారులు. చివరకు ఆ వ్యక్తిని విడుదల చేసినందుకు బదులుగా సఖీఫ్ తెగవారు ఇరువురు ముస్లింలను వదిలేశారు. ఈ సంఘటన ఆధారంగా యుద్ధ ఖైదీలను పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవచ్చునని మెజారిటీ పండితులు అభిప్రాయపడ్డారు.

(١١٠٦) وَعَنْ صَخْرِ بْنِ الْعَيْلَةِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «إِنَّ الْقَوْمَ

1106. హజ్రత్ సఖ్ర్ బిన్ ఐలా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు

إِذَا أَسْلَمُوا أَحْرَزُوا دِمَاءَهُمْ وَأَمْوَالَهُمْ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَرِجَالُهُ مُوَثَّقُونَ.

అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "(బహు దైవారాధకులైన) ప్రజలు గనక ఇస్లాం స్వీకరిస్తే వారు రక్తాన్ని, ఆస్తిపాస్తులను రక్షించుకున్నట్లే." (అబూదావూద్ దీనిని ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

### సారాంశం

ముస్లిమేతరులు మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారితే వారి ధనప్రాణాల జోలికి పోవటం నిషిద్ధం (హరామ్) అని ఈ హదీసు భావం.

### హదీసు ఉల్లేఖకులు

సఖ్ర్ బిన్ ఐలా (రజి) : అహ్మసీగా పిలువబడేవారు. మారుపేరు అబూ హాజిమ్. ప్రవక్త సహచర్య భాగ్యం పొందారు. ఈయనచే ఈ ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది.

(١١٠٧) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ فِي أُسَارَىٰ بَدْرٍ: «لَوْ كَانَ الْمُطْعِمُ بْنُ عَدِيٍّ حَيًّا، ثُمَّ كَلَّمَنِي فِي هَؤُلَاءِ النَّتْنَى، لَتَرَكْتُهُمْ لَهُ». رَوَاهُ الْبُخَارِيُّ.

1107. హజ్రత్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజి) కథనం : బద్ర్ యుద్ధఖైదీల వ్యవహారంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఒకవేళ ముత్‌యిమ్ బిన్ అదీయే గనక ఇప్పటి వరకూ జీవించి ఉండి, నా దగ్గరకు వచ్చి ఈ మురికి మమతుల గురించి సిఫారసు చేసి ఉంటే అతని కోసం నేను వీళ్లను విడిచిపెట్టేవాణ్ణి." (బుఖారీ)

### సారాంశం

ముత్‌యిమ్ బిన్ అదీ పట్ల దైవప్రవక్త (స) కు గల ఆదరాభిమానాలకు ఈ హదీసు ప్రతిబింబం. దైవప్రవక్త (స) మొదటిసారి తాయఫ్ వచ్చి, అక్కడి బనూ సఖీఫ్ సర్దారులకు ఇస్లాం సందేశం ఇచ్చినపుడు సఖీఫ్ తెగ నాయకులు ఆయన (స) పట్ల ఎంతో అవమానకరంగా ప్రవర్తించారు. తుంటరివాళ్ళ చేత రాళ్లు రువ్వించారు. వాళ్ల దోరణిపట్ల ఎంతో నిరాశ చెంది దైవప్రవక్త (స) మక్కా వైపునకు తిరిగి వెళుతున్నప్పుడు ముత్‌యిమ్ బిన్ అదీ ఆయన (స)కు మర్యాద చేశాడు. ముష్రిక్కుల బారి నుండి రక్షణ కల్పించాడు. అతని సదమరవర్తనను దైవప్రవక్త (స) మరచిపోలేదు. అతనే గనక ఈ రోజు బ్రతికి ఉండి, ఈ మూర్ఖ మూకను

విడిచిపెట్టమని తనకు సిఫారసు చేసి ఉంటే తప్పకుండా వీళ్ళను విడిచిపెట్టి ఉండేవాణ్ణి అని ఆయన (స) అన్నారు. ఉపకారానికి బదులు ఉపకారమేననీ, ఉపకారానికి బదులు ఇవ్వటం సంప్రదాయం (మస్నూన్) అనీ ఈ హదీసు చెబుతోంది. ఉపకారం చేసిన వ్యక్తి ముస్లిం కాకపోయినా సరే, అతనికి 'బదులు' ను అత్యుత్తమ రీతిలో మరల్చాలని కూడా దీని ద్వారా అర్థమవుతున్నది. అలాగే సత్కార్యాలలో ఒకరి కొరకు సిఫారసు చేయటం, ఆ సిఫారసును ఆమోదించటం కూడా ధర్మసమ్మతమే.

(١١٠٨) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَصَبْنَا سَبَايَا يَوْمَ أَوْطَاسٍ لَهُنَّ أَزْوَاجٌ، فَتَحَرَّجُوا، فَأَنْزَلَ اللَّهُ تَعَالَى ﴿وَالْمُحْصَنَاتُ مِنَ النِّسَاءِ إِلاَّ مَا مَلَكَتْ أَيْمَانُكُمْ﴾ اَلْآيَةَ، أَخْرَجَهُ مُسْلِمٌ.

1108. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం: ఔతాస్ (యుద్ధం జరిగిన) రోజున కొంతమంది బానిస స్త్రీలు మా చేతికి చిక్కారు. అయితే వారి భర్తలు మాత్రం బ్రతికే ఉన్నారు. భర్తలు బ్రతికి ఉండగా వారితో సంబంధం ఏర్పరచుకోవడమెలా?! అని ముస్లింలు సంశయంలో పడ్డారు. ఆ సందర్భంగా సర్వోన్నతుడైన అల్లాహ్, "(యుద్ధంలో) మీ చేతికి చిక్కిన స్త్రీలు తప్ప, ఇతరుల వివాహబంధంలో ఉండే స్త్రీలు మీ కొరకు నిషిద్ధం." (అన్ నిసా : 24) అన్న సూక్తిని అవతరింపజేశాడు. (ముస్లిం)

**సారాంశం**

యుద్ధంలో స్త్రీలు ఖైదీలుగా పట్టుబడితే, పట్టుబడిన క్షణం నుంచే వారి పూర్వ వివాహ బంధం తెగిపోతుందని ఈ హదీసు భావం. ఒకవేళ ఆ స్త్రీలు గర్భవతులై ఉంటే ప్రసవించిన తరువాత, గర్భవతులు కాని పక్షంలో బహిష్టు తరువాత వారితో లైంగిక సంబంధం ఏర్పరచుకోవచ్చు. ఆ స్త్రీలు ముస్లింలే కానక్కరలేదు. ముస్లింలైనా, కాకపోయినా - యుద్ధానంతరం- అధికారికంగా పంపిణీ అయిన మీదట తమ తమ వాటాలోనికి వచ్చిన స్త్రీలతో నిస్సంకోచంగా రమించి రసాస్వాదన పొందవచ్చు.

(١١٠٩) وَعَنْ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ سَرِيَّةً، وَأَنَا فِيهِمْ، قِبَلَ نَجْدٍ، فَغَنِمُوا إِبِلاً كَثِيرَةً،

1109. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) ఒక చిన్న సైనిక బృందాన్ని 'నజ్ద్' వైపునకు పంపించారు.

فَكَانَتْ سُهْمَانُهُمْ اثْنَي عَشَرَ بَعِيْراً، وَنُفِّلُوْا بَعِيْراً بَعِيْراً. مُتَّفَقٌ عَلَيْهِ.

ఆ బృందంలో నేనూ ఉన్నాను. విజయ ప్రాప్తిగా చాలా ఒంటెలు వచ్చాయి. ఒక్కొక్కరికి - వారి భాగంగా - పన్నెండు ఒంటెలు చొప్పున పంచబడ్డాయి. ఆ తరువాత ఒక్కో ఒంటె చొప్పున అదనంగా ఇవ్వబడింది. (బుఖారీ, ముస్లిం)

(١١١٠) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَسَمَ رَسُولُ اللّٰهِ ﷺ يَوْمَ خَيْبَرَ لِلْفَرَسِ سَهْمَيْنِ، وَلِلرَّاجِلِ سَهْماً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

1110. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)చే మరో కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖైబర్ దినాన గుర్రంపై స్వారీ అయి ఉన్నవారికి రెండు వాటాల చొప్పున, కాలినడకన ఉన్నవారికి ఒక వాటా చొప్పున ఇచ్చారు. (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు బుఖారీ లోనివి)

وَلِأَبِي دَاوُدَ: أَسْهَمَ لِرَجُلٍ وَلِفَرَسِهِ ثَلَاثَةَ أَسْهُمٍ، سَهْمَيْنِ لِفَرَسِهِ، وَسَهْماً لَهُ.

అబూదావూద్ ఉల్లేఖనంలో ఇలా వుంది: ఆయన (నఅనం) కాలినడకన వచ్చిన యోధునికి ఒక భాగం, గుర్రంపై స్వారీ అయివున్న వానికి మూడు భాగాలు ఇచ్చారు. అంటే - రెండు భాగాలు గుర్రానికీ, ఒక భాగం అతనికి.

**సారాంశం**

గుర్రానికి రెండు భాగాలు కేటాయించడంలోని మర్మం ఏమిటంటే, గుఱ్ఱం ఆలనాపాలన కోసం, మేత కోసం చాలా ఎక్కువ ఖర్చు అవుతుంది. దాని మంచీచెబ్బరలను గనక పట్టించుకోకపోతే, కదన రంగంలో కష్టాలపాలు కావలసి వస్తుంది.

(١١١١) وَعَنْ مَعْنِ بْنِ يَزِيْدَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ رَسُولَ اللّٰهِ ﷺ

1111. హజ్రత్ మ'ఆన్ బిన్ యజీద్ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా విన్నాము: "(నిర్ణీత) భాగం కన్నా ఎక్కువగా ఏది

يَقُولُ: «لاَ نَفَلَ إِلاَّ بَعْدَ الْخُمُسِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الطَّحَاوِيُّ.

ఇవ్వబడినా అది ఖదో వంతు (ఖుమ్ముస్) నుంచి తీసి ఇవ్వబడుతుంది." (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. తహావీ ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించారు)

### సారాంశం

ఈ హదీసులో రెండు విషయాలు గమనార్హమైనవి: ఈ అదనపు భాగం మాలె గనీమత్ (విజయ ధనం) నుండి ఇవ్వబడుతుందా? లేక దైవప్రవక్త (స) కుటుంబీకులకు ఉద్దేశించబడిన 'ఖుమ్ముస్' లోనుంచి తీసి ఇవ్వబడుతుందా? ఈ హదీసులో దీని గురించిన స్పష్టమయిన సూచన ఏదీ లేదు. అదనపు భాగం ఇవ్వకముందే మాలె గనీమత్‌ను 5 భాగాలుగా విభజించాలన్న విషయం ఈ హదీసు ద్వారా స్థూలంగా బోధపడుతున్నది. వ్యాఖ్యాతలు దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.

### హదీసు ఉల్లేఖకులు

ఘాన్ బిన్ యజీద్ (రజి) : మాన్ బిన్ యజీద్ బిన్ అఖ్‌నస్ సులమీ. తండ్రితోపాటు ఈయన కూడా సహాబీగానే పరిగణించబడతారు. డెమాస్కస్‌ను జయించారు. కూఫాలో స్థిరపడ్డారు. ఈజిప్టులో ప్రవేశించిన తరువాత తిరిగి డెమాస్కస్‌కే వెళ్ళారు. మర్జ్ రాహిత్ యుద్ధంలో జహ్హాక్ బిన్ ఖైస్ (రజి)తో కలసి హిజ్రీ 43లో పాల్గొన్నారు. ఈ యుద్ధంలోనే అమరగతి నొందారు. హజ్రత్ ముఆవియా (రజి)తో కలసి ఆ కాలంనాటి యుద్ధాలలో పాల్గొన్నారని కూడా అనబడుతోంది.

(١١١٢) وَعَنْ حَبِيبِ بْنِ مَسْلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ رَسُولَ اللهِ ﷺ، نَفَّلَ الرُّبُعَ فِي الْبَدْأَةِ، وَالثُّلُثَ فِي الرَّجْعَةِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ الْجَارُودِ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1112. హజ్రత్ హబీబ్ బిన్ మస్లమ (రజి) కథనం : నేను దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యాను. సైనిక సమూహంతో తొలిసారి వెళ్ళి మెరుపు దాడి చేసినందుకు ఆయన (స) నాల్గోవంతు అదనపు భాగం ఇచ్చారు. మలిసారి వెళ్ళినపుడు మూడోవంతును ఇచ్చారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె జారూద్, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ దీనిని ప్రామాణికంగా పేర్కొన్నారు)

## హదీసు ఉల్లేఖకులు

హబీబ్ బిన్ మస్లమ (రజి) : అబూ అబుర్రహ్మాన్ ఫిహ్రీగా పిలువబడేవారు. మక్కావాసులు. ప్రవక్త సహచరుడు. చాలా మంది ఈయన్ని హబీబ్ రూమీగా ఎరుగుదురు. ఎందుకంటే రోమనులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో ఈయన నిర్వహించిన పాత్ర ముఖ్యమైనది. ఆర్మేనియాకు గవర్నరయ్యారు. ఆర్మేనియాలోనే హిజ్రీ 41 లేదా 42 లో మరణించారు.

(١١١٣) وَعَنْ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يُنَفِّلُ بَعْضَ مَنْ يَبْعَثُ مِنَ السَّرَايَا لِأَنْفُسِهِمْ خَاصَّةً، سِوَى قِسْمِ عَامَّةِ الْجَيْشِ. مُتَّفَقٌ عَلَيْهِ.

**1113. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅనం) కొన్ని సైనిక పటాలాలకు ప్రత్యేకంగా** - విజయప్రాప్తి వాటా గాకుండా - కొంత అదనపు మొత్తం కూడా ఇచ్చేశారు. ఇది సాధారణ సైనికుల పంపిణీలో ఉండేది కాదు.

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్త (సఅనం) సైనికులందరికీ ఈ అదనపు మొత్తాన్ని ఇచ్చేవారు కారనీ, కొంతమందికి మాత్రమే ప్రత్యేకంగా ఇచ్చేవారనీ, అది కూడా ప్రత్యేక పరమార్థాలతో వొసగేవారనీ ఈ హదీసునుబట్టి బోధపడుతున్నది. ఈ 'ప్రత్యేక పంపిణీ' కూడా సమానంగా ఉండేదికాదు. ఆయా సైనికుల సైనిక సేవలనుబట్టి, వారి అవసరాలు, స్థితిగతులనుబట్టి ఎవరికి ఎంత ఇవ్వాలో ఇచ్చేవారు. దీన్నిబట్టి అర్థమయ్యే దేమిటంటే ఇప్పటికీ ఒక రాజ్యాధిపతి తన సైనికుల్లో కొందరికి వారి సామర్థ్యాన్ని, దక్షతనుబట్టి ప్రత్యేక బహుమతులు ఇవ్వగలడు. పదోన్నతి కల్పించగలడు. పతకాలు, ప్రత్యేక చిహ్నాలతో సత్కరించగలడు. ఇలాంటి పురస్కారాలు, పారితోషికాలవల్ల యువ సైనికులకు ప్రోత్సాహం, ప్రేరణ లభిస్తాయి.

(١١١٤) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنَّا نُصِيبُ فِي مَغَازِينَا الْعَسَلَ وَالْعِنَبَ

**1114. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)చే మరో కథనం :** తేనె, ద్రాక్ష వంటివి యుద్ధ సమయాలలో మా చేతికి వస్తే మేము వాటిని తినేసేవారము. వాటిని తీసుకు పోయేవారం కాము (బుఖారీ). 'ఇలా తినేవారి నుండి 'ఖుమస్' (అయిదో వంతు) వసూలు చేయబడేది కాదు' అని అబూదావూద్ ఉల్లేఖనంలో ఉంది.

فَنَأْكُلُهُ، وَلاَ نَرْفَعُهُ. رَوَاهُ الْبُخَارِيُّ، وَلأَبِي دَاوُدَ «فَلَمْ يُؤْخَذْ مِنْهُمُ الْخُمُسُ»، وَصَحَّحَهُ ابْنُ حَبَّانَ.

ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు.

**సారాంశం**

యుద్ధ సమయాలలో యోధులకు తినుబండారాలు, పండ్లు ఫలాలు ఏవైనా చేతికి చిక్కితే వారు వాటిని కడుపునిండా ఆరగించవచ్చుగాని, వాటిని తీసుకుపోకూడదని ఈ హదీసు ద్వారా ఒక సూచన లభిస్తోంది. తినుబండారాలు తప్ప శత్రువుకు చెందిన ఇతరత్రా వస్తువులు - అంటే యుద్ధ సామగ్రి, పశువులు దొరికినపుడు వాటిని యుద్ధం కొరకు ఉపయోగించుకోవచ్చు. యుద్ధం ముగిసిన తరువాత 'విజయప్రాప్తి' (మాలె గనీమత్) పద్ధలో జమ చేయాలి.

(١١١٥) وَعَنْ عَبْدِاللهِ بْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَصَبْنَا طَعَاماً يَوْمَ خَيْبَرَ، فَكَانَ الرَّجُلُ يَجِيءُ، فَيَأْخُذُ مِنْهُ مِقْدَارَ مَا يَكْفِيهِ، ثُمَّ يَنْصَرِفُ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ الْجَارُودِ وَالْحَاكِمُ.

1115. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూ ఔఫా (రజి) కథనం : ఖైబర్ (యుద్ధ) దినాన తినే వస్తువులు మా చేతికి చిక్కాయి. అప్పుడు మాలోని ప్రతి ఒక్కడూ తనకు కావలసిన మేరకు దాన్ని తీసుకుని తినేవాడు, తరువాత తిరిగి వెళ్ళిపోయేవాడు. (దీనిని అబూ దావూద్ నకలు చేశారు. ఇబ్నె జారూద్, హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

తినే, త్రాగే పదార్థాలను (విజయ ప్రాప్తిగా) పంపిణీకాక ముందు సైనికులంతా తీసుకుని తినవచ్చని, ఇది ప్రశ్నించదగ్గ తీవ్రమయిన విషయం ఏమీ కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

(١١١٦) وَعَنْ رُوَيْفِعِ بْنِ ثَابِتٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ كَانَ يُؤْمِنُ بِاللهِ وَالْيَوْمِ الآخِرِ فَلاَ يَرْكَبْ دَابَّةً مِنْ فَيْءِ الْمُسْلِمِينَ، حَتَّى إِذَا أَعْجَفَهَا رَدَّهَا

1116. హజ్రత్ రువైఫీ బిన్ సాబిత్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం : "అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాస మున్న వ్యక్తి ముస్లింల విజయప్రాప్తిగా వచ్చిన గుర్రంపై స్వారీ చేయకూడదు -

فِيهِ، وَلاَ يَلْبَسَ ثَوْباً مِنْ فَيْءِ الْمُسْلِمِينَ، حَتَّى إِذَا أَخْلَقَهُ رَدَّهُ فِيهِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالدَّارِمِيُّ. وَرِجَالُهُ لاَ بَأْسَ بِهِمْ.

కడకు అది బలహీనమైపోతే దాన్ని వాపసు చేయాలి. ముస్లింల విజయ ప్రాప్తిగా లభ్యమయిన వాటిలోంచి ఒక్క వస్త్రం కూడా తీసుకుని తొడుక్కోరాదు. ఆఖరికి అది వెలసిపోవటమో, చినిగి పోవటమో జరిగితే దాన్ని బైతుల్‌మాల్ (ప్రభుత్వధనాగారం)లో జమ చేయాలి." (దీనిని అబూదావూద్, దారిమీ ఉల్లేఖించారు. ఈ హదీసును అందజేసిన వారంతా ఎన్నదగ్గవారే)

**సారాంశం**

మాలెగనీమత్ (విజయప్రాప్తి) గా వచ్చిన గుర్రాలను, దుస్తులను రణరంగంలో అవసరాన్నిబట్టి వాడుకోవచ్చుగానీ, సాధారణ సమయాలలో ఉపయోగించరాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. ఎప్పుడైనా తాత్కాలికంగా ఉపయోగించుకోవలసి వచ్చినా సైన్యాధిపతి నుండి విధిగా అనుమతి పొందవలసి ఉంటుందని మరికొంతమంది అభిప్రాయపడ్డారు.

(١١١٧) وَعَنْ أَبِي عُبَيْدَةَ بْنِ الْجَرَّاحِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللَّهِ ﷺ يَقُولُ: «يُجِيرُ عَلَى الْمُسْلِمِينَ بَعْضُهُمْ». أَخْرَجَهُ ابْنُ أَبِي شَيْبَةَ وَأَحْمَدُ، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

1117. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ అబూ ఉబైద బిన్ జర్రాహ్ (రజి) చెప్పారు: "ముస్లింలలో ఎవరయినా సరే అతడు ఇంకొకరికి శరణు (రక్షణ) ఇచ్చేందుకు అర్హుడే." (ఇబ్నె అబీ షైబా, అహ్మద్ దీనిని సేకరించారు - దీని పరంపరలో బలహీనత ఉంది)

وَلِلطَّيَالِسِيِّ مِنْ حَدِيثِ عَمْرِو بْنِ الْعَاصِ قَالَ: يُجِيرُ عَلَى الْمُسْلِمِينَ أَدْنَاهُمْ.

తయాలిసీ యొక్క హదీసులో అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ఈ విధంగా ఉంది: "ముస్లింలలోని అతి సామాన్యుడు సయితం ఇంకొకరికి రక్షణ ఇవ్వ గలడు."

وَفِي الصَّحِيْحَيْنِ عَنْ عَلِيٍّ قَالَ: ذِمَّةُ الْمُسْلِمِيْنَ وَاحِدَةٌ، يَسْعَى بِهَا أَدْنَاهُمْ. زَادَ ابْنُ مَاجَهْ وَمِنْ وَجْهٍ آخَرَ «وَيُجِيْرُ عَلَيْهِمْ أَقْصَاهُمْ».

సహీహైన్ (బుఖారీ, ముస్లిం)లో హజ్రత్ అలీ (రజి) చే చేయబడిన కథనం ఇలా ఉంది - "ముస్లింలందరూ ఇచ్చే రక్షణ ఒక్కటే. దానికోసం అధమాతి అధముడు కూడా ప్రయత్నించగలడు." ఇబ్నె మాజ వేరొక ఆధారంగా చేసిన కథనంలో అదనంగా ఇలా పేర్కొన్నారు : "వారికి సంబంధించిన చాలా దూరపు మనిషి కూడా శరణు ఇవ్వగలడు."

وَفِي الصَّحِيْحَيْنِ مِنْ حَدِيْثِ أُمِّ هَانِيءٍ «قَدْ أَجَرْنَا مَنْ أَجَرْتِ».

'సహీహైన్'లో ఉమ్మె హానీ (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు : నువ్వు రక్షణ ఇచ్చిన వారికి మేము కూడా రక్షణ ఇచ్చాము."

(١١١٨) وَعَنْ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: **لأُخْرِجَنَّ الْيَهُودَ وَالنَّصَارَى مِنْ جَزِيرَةِ الْعَرَبِ، حَتَّى لاَ أَدَعَ إِلاَّ مُسْلِماً**». رَوَاهُ مُسْلِمٌ.

1118. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ ఉమర్ (రజి) తెలిపారు : (దైవప్రవక్త - సఅసం - ఇలా చెప్పారు) - "నేను అరేబియా ద్వీపం నుండి యూదుల్ని, క్రైస్తవుల్ని వెళ్ళగొడ్తాను. కడకు అరేబియాలో ముస్లింలు తప్ప మరొకరు ఉండరు." (ముస్లిం)

**సారాంశం**

అరేబియా ద్వీపమంతా ముస్లింల రాజ్యంగా, ఇస్లామీయ వ్యవస్థగా అలరారాలన్నది దైవప్రవక్త (సఅసం) అభిలాష అని ఈ హదీసు చెబుతోంది. అవిశ్వాసులు, యూదులు, క్రైస్తవులు లేని సంపూర్ణ ఇస్లామీయ వ్యవస్థ అక్కడ నెలకొనాలని ఆయన (స) కాంక్షించారు. ఆయన (సఅసం) కాలంలో ఈ కోరిక పూర్తిగా నెరవేరకపోయినా, హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా వున్న కాలంలో దైవప్రవక్త (స) వాంఛను నెరవేర్చారు.

(١١١٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَتْ أَمْوَالُ بَنِي النَّضِيرِ مِمَّا أَفَاءَ اللَّهُ عَلَىٰ رَسُولِهِ، مِمَّا لَمْ يُوجِفْ عَلَيْهِ الْمُسْلِمُونَ بِخَيْلٍ وَّلاَ رِكَابٍ، فَكَانَتْ لِلنَّبِيِّ ﷺ خَاصَّةً، فَكَانَ يُنْفِقُ عَلَىٰ أَهْلِهِ نَفَقَةَ سَنَةٍ، وَمَا بَقِيَ يَجْعَلُهُ فِي الْكُرَاعِ وَالسِّلاَحِ، عُدَّةً فِي سَبِيلِ اللهِ عَزَّ وَجَلَّ. مُتَّفَقٌ عَلَيْهِ.

1119. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : "బనూ నజీర్ (యూద తెగ) నుండి లభించిన సిరిసంపదలు దేవుడు స్వయంగా దైవప్రవక్తకు ప్రసాదించిన విజయప్రాప్తి. దానికోసం ముస్లింలు తమ గుర్రాలు, ఒంటెలను వారి మీద నడపలేదు. అందుకే ఈ సిరిసంపదలు దైవప్రవక్త (సఅసం)కు మాత్రమే ప్రత్యేకించబడ్డాయి. దైవప్రవక్త (సఅసం) ఈ సంపద నుండి తమ భార్యాపిల్లల పోషణ కోసం ఒక ఏడాదికి సరిపడా ధనం తీసుకునేవారు. మిగిలిన ధనాన్ని ఆయుధాలు, గుర్రాల కోసం, సర్వోన్న తుడైన దేవుని మార్గంలో ఖర్చుల కోసం వెచ్చించేవారు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'బనూ నజీర్' అనేది మదీనా నగరంలో నివసించే ఓ పెద్ద యూద తెగ. దైవప్రవక్త (స)కు-బనూ నజీర్‌కి మధ్య మైత్రీ ఒప్పందం జరిగింది. కాని బద్ర్ యుద్ధం జరిగిన ఆర్నెల్ల తర్వాత ఈ తెగవారు ఒప్పందాన్ని ఖాతరు చేయకపోవటమేగాక, ముస్లింలకు కీడు తలపెట్టే కార్యకలాపాలను కొనసాగించారు. ఒప్పందంలోని షరతులను పదే పదే జ్ఞాపకం చేసి హెచ్చరించినా వాళ్లు తమ వైఖరిని మార్చుకోకపోవటంతో, దైవప్రవక్త (సఅసం) బనూ నజీర్‌పై దాడి చేశారు. వాళ్ళ వాడలను, కోటలను ముట్టడించారు. ఈ ముట్టడికి తట్టుకోలేక యూదులు తమ ఆస్తిపాస్తులను, సిరిసంపదలను వదలి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. ఎలాంటి ప్రతిఘటనా లేకుండానే వారి ఆస్తిపాస్తులు ఆయన (స) స్వాధీనంలోకి వచ్చాయి.

ఈ ఆస్తులు 'ఫై' ధనంగా ఖరారయ్యాయి. ఎందుకంటే ఇవి ఎలాంటి ప్రతిఘటనగానీ, సైనిక త్యాగాలు గానీ లేకుండా ప్రాప్తించాయి. ఈ విధంగా ప్రాప్తించిన ధనాన్ని 'మాలె గనీమత్' అనరు. 'ఫై'గా వ్యవహరిస్తారు. దేవుడు ఈ సంపదను దైవప్రవక్త (స) వైపునకు మరల్చాడు. అయినప్పటికీ ఆయన (స) అందులో నుంచి చాలా భాగం ముహాజిర్లలో పంచిపెట్టారు. అగత్యపరులైన ఇద్దరు అన్సార్ సహచరులకు కూడా ఇచ్చారు. మిగిలిన ధనాన్ని ఆయన (స) తన భార్యల కోసం, సమీప బంధువుల కోసం ఖర్చు పెట్టారు. ఆయన (సఅసం)

తదనంతరం ఆయన (స) అనుయాయులైన ఖలీఫాలు సయితం ఈ విధానాన్ని ఖచ్చితంగా పాటించారు. అంటే ఈ ఆస్తి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రవక్త సతీమణుల జరుగుబాటు కోసం ఇచ్చేవారు. మిగిలిన మొత్తంలో నుంచి నిరుపేదలు, అనాధల కోసం ఖర్చుపెట్టేవారు. అప్పటికీ ఇంకా మిగిలి ఉంటే ఆయుధాలు, గుర్రాల కొనుగోలు కోసం కేటాయించేవారు.

(١١٢٠) وَعَنْ مُعَاذٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: غَزَوْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ خَيْبَرَ، فَأَصَبْنَا فِيهَا غَنَماً، فَقَسَمَ فِينَا رَسُولُ اللهِ ﷺ طَآئِفَةً، وَجَعَلَ بَقِيَّتَها فِي الْمَغْنَمِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَرِجَالُهُ لاَ بَأْسَ بِهِمْ.

1120. హజ్రత్ ముఆజ్ (రజి) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి ఖైబర్ యుద్ధం చేశాము. ఆ యుద్ధ సందర్భంగా కొన్ని మేకలు విజయప్రాప్తిగా మా చేతికి చిక్కాయి. ఆ మందలో నుంచి కొన్నింటిని మాకిచ్చి మిగిలిన వాటిని ఆయన (స) విజయసొత్తులో చేర్చారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. దీని ఉల్లేఖకుల గురించి ఎలాంటి ఆక్షేపణలకు ఆస్కారం లేదు)

(١١٢١) وَعَنْ أَبِي رَافِعٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنِّي لاَ أَخِيسُ بِالْعَهْدِ، وَلاَ أَحْبِسُ الرُّسُلَ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَآئِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1121. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ రాఫె (రజి) చెప్పారు : "నిస్సందేహంగా నేను వాగ్దానాన్ని భంగపరచటంగానీ, దౌత్యవేత్తలను (రాయబారులను) నిర్బంధించటంగానీ చేయను." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం వాగ్దాన భంగానికి పాల్పడటం, నమ్మించి మోసం చేయటం ఎంతమాత్రం భావ్యం కాదు. అసలేం జరిగిందంటే, ఇస్లాం స్వీకారానికి మునుపు అబూరాఫె అవిశ్వాసుల తరపున దూతగా దైవప్రవక్త (సఅసం) దగ్గరికి వచ్చారు. ఆయన (స)

ముఖారవిందాన్ని, నగుమోమును చూడగానే అమితంగా ప్రభావితులై ఇస్లాం స్వీకారయోగ్యం పొందారు. తరువాత ఆయన దైవప్రవక్త (స)నుద్దేశించి, "ఓ దైవప్రవక్త (స)! వెనుదిరిగి వెళ్ళడానికి నా మనసు ఒప్పుకోవటం లేదు. కనుక తమరు నన్ను ఇక్కడే ఉండటానికి అనుమతించండి" అని ప్రాధేయపడగా "నేను వాగ్దాన భంగం చేయలేను. ద్రోహానికి పాల్పడలేను" అని ఆయన (స) అన్నారు.

దీన్నిబట్టి అవగతమయ్యే దేమిటంటే దూతగా, రాయబారులుగా వచ్చిన వ్యక్తులను సురక్షితంగా వారి స్వస్థలానికి తిరిగి పంపటం రాజ్యపాలకుల కర్తవ్యం. లేకుంటే అది ద్రోహంగా, మోసంగా పరిగణించబడుతుంది. రాయబారిగా వచ్చే వ్యక్తి ముస్లిం అయినా, ముస్లిం కాకపోయినా అతడ్ని సాదరంగా ఆహ్వానించాలనీ, మర్యాదపూర్వకంగా అతనితో వ్యవహరించాలని ఇస్లాం ఉపదేశిస్తోంది.

(١١٢٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «أَيُّمَا قَرْيَةٍ أَتَيْتُمُوهَا، فَأَقَمْتُمْ فِيهَا، فَسَهْمُكُمْ فِيهَا، وَأَيُّمَا قَرْيَةٍ عَصَتِ اللَّهَ وَرَسُولَهُ، فَإِنَّ خُمُسَهَا لِلَّهِ وَرَسُولِهِ، ثُمَّ هِيَ لَكُمْ». رَوَاهُ مُسْلِمٌ.

1122. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : 'ఏ పురములో మీరు శాంతియుతంగా ప్రవేశించినా, అక్కడ నివాసమేర్పరచుకున్నా అందులో మీ భాగం ఉంది. మరే పురములో దేవుడు మరియు దైవప్రవక్త యెడల అవిధేయత చూపబడిందో దాని 'ఖుమస్' (5వ వంతు విజయధనం) దేవుడు మరియు దైవప్రవక్తకు చెందుతుంది. మరి (5వ వంతు తీసిన తరువాత) అది కూడా మీలోనే పంచబడుతుంది." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే విషయం ఏమిటంటే ఎలాంటి ప్రతిఘటన గానీ, రక్తపాతం గానీ జరగకుండా విజయం వరించిన చోట లభించే సిరినంవదలను 'మాలెగనీమత్'గా కాకుండా 'ఫై'గా వ్యవహరిస్తారు. ఇటువంటి 'ఫై' ధనంలోనుంచి 'ఖుమస్' (5వ వంతు) తీయబడదు. ఎవరయితే ఈ 'ఫై' మొత్తంలోనుంచి కూడా 5వ వంతు తీయబడాలని భావిస్తున్నారో వారి భావనకు ఈ హదీసు విరుద్ధంగా పరిణమిస్తుంది.

'ఖుమస్' (5వ వంతు) అనేది దైవానికి, దైవప్రవక్తకు చెందవలసిన సొత్తు. అయితే అది కూడా అవసరాన్నిబట్టి ముస్లింల ప్రయోజనాలకే వెచ్చించబడుతుంది.

## 1వ అధ్యాయం

## ١ - بَابُ الْجِزْيَةِ وَالْهُدْنَةِ

## జిజ్‌యా మరియు తాత్కాలిక సంధి

(١١٢٣) عَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ عَوْفٍ، أَنَّ النَّبِيَّ ﷺ أَخَذَهَا، يَعْنِي الْجِزْيَةَ، مِنْ مُجُوسِ هَجَرَ. رَوَاهُ الْبُخَارِيُّ، وَلَهُ طَرِيقٌ فِي الْمُوَطَّإِ، فِيهَا انْقِطَاعٌ.

1123. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజర్‌కు చెందిన జోరాస్ట్రియన్ల నుండి జిజ్‌యా పుచ్చుకున్నారని హాజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చెప్పారు. (దీనిని బుఖారీ ఉల్లేఖించారు. 'మువత్తా'లో ఈ హదీసు కథనం మరో విధంగా ఉంది-దాని పరంపరలో లింకు తెగింది)

### సారాంశం

'జిజ్‌యా' అనే పదం హదీసులో వచ్చింది. జిజ్‌యా అంటే 'జుట్టుపన్ను' అని కొంతమంది చరిత్రకారులు భాష్యం చెప్పి ఇస్లాం మరియు ముస్లిం పరిపాలకుల పట్ల ప్రజల్లో ద్వేషాన్ని నూరిపోసే ప్రయత్నం చేశారు. ఇది వాస్తవానికి వక్రభాష్యం తప్ప మరేమీ కాదు.

'జిజ్‌యా' అనేది వాస్తవానికి 'దారుస్సలామ్'లో నివసించే 'జిమ్మీల' (ముస్లిమేతరుల) నుండి వారి ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించే గ్యారంటీపై ముస్లిం పరిపాలకులు వారినుండి వసూలు చేసే సుంకం మాత్రమే.

'దారుస్సలామ్' పై విదేశీయులు దండెత్తి వచ్చినప్పుడు వారిని **నిలువరించే, వారితో ప్రాణాలొడ్డి పోరాడే బాధ్యత జిమ్మీలనబడే ముస్లిమేతర పౌరులపై ఉండదు. దేశ రక్షణ బాధ్యత** ముస్లిం రాజ్యపాలకునిపై, ముస్లిం యోధులపై మాత్రమే ఉంటుంది. అంటే తమ రాజ్యంలోని 'జిమ్మీల' ధన మాన ప్రాణాల రక్షణ కోసం ముస్లిం యోధులు ఆత్మత్యాగానికి సిద్ధమవుతున్నందుకు ప్రతిఫలంగా మాత్రమే రాజ్యం ఈ 'జిజ్‌యా'ను వారి నుండి వసూలు చేస్తుంది. ఒకవేళ ముస్లిం పరిపాలకుడు గనక 'జిమ్మీల' ధన మాన ప్రాణాలకు - ఏ కారణంగానయినా - రక్షణ కల్పించడంలో విఫలమైనపుడు 'జిజ్‌యా'ను వసూలు చేసే అర్హతను అతడు కోల్పోతాడు.

ఇకపోతే; ముస్లిమేతరులు ఏ మతస్థులైనాసరే వారి నుండి జిజ్‌యాను వసూలు చేయవచ్చనీ, కొంతమంది పండితులు భావిస్తున్నట్లు ఇది ఒక్క గ్రంథవహుల (యూదులు, క్రైస్తవులు)కు మాత్రమే పరిమితం కాదనీ పై హదీసు ద్వారా స్పష్టమవుతున్నది.

(١١٢٤) وَعَنْ عَاصِمِ بْنِ عُمَرَ، عَنْ أَنَسٍ، وَعَنْ عُثْمَانَ بْنِ أَبِي سُلَيْمَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمْ أَنَّ النَّبِيَّ ﷺ بَعَثَ خَالِدَ بْنَ الْوَلِيْدِ إِلَىٰ أُكَيْدِرِ دَوْمَةَ الْجَنْدَلِ فَأَخَذُوهُ، فَأَتَوا بِهِ فَحَقَنَ دَمَهُ وَصَالَحَهُ عَلَى الْجِزْيَةِ. رَوَاهُ أَبُو دَاوُدَ.

1124. హజ్రత్ అనస్ (రజి), హజ్రత్ ఉస్మాన్ బిన్ అబూ సులైమాన్ (రజి)ల ఆధారంగా ఆసిమ్ బిన్ ఉమర్ (రహ్మ.లై) చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని 'దౌమతుల్ జందల్' పరిపాలకుడైన ఉకైదిర్ దగ్గరికి పంపారు. ఖాలిద్ (రజి) అతడ్ని బంధించి దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరుపరచగా ఆయన (స) అతనికి ప్రాణ రక్షణ కల్పించి, జిజ్‌యా చెల్లించే షరతుపై ఒప్పందం చేసుకున్నారు. (అబూదావూద్)

## సారాంశం

ఉకైదిర్ అరేబియా ప్రాంతానికి చెందిన క్రైస్తవ శ్రీమంతుడు. గస్సానీ తెగకు చెందినవాడు. దైవప్రవక్త (స) అతన్నుంచి జిజ్‌యా తీసుకోవడాన్నిబట్టి, అరేబియాకు చెందిన గ్రంథవహుల (అహ్లె కితాబ్) నుండి కూడా జిజ్‌యా తీసుకోవటం ధర్మసమ్మతమేనని బోధపడుతున్నది. అయితే ఖాజీ అబూ యూసుఫ్ అరబ్బు వ్యక్తి నుండి జిజ్‌యా వసూలు చేయటం పట్ల సుముఖంగా లేరు. కాని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై) తదితరులు మాత్రం అరబ్బు, అరబ్బేతర ముస్లిమేతరులందరి వద్దనుండి జిజ్‌యా తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

## హదీసు ఉల్లేఖకులు

1. ఆసిమ్ బిన్ ఉమర్ : అబూ ఉమర్ ఆసిమ్ బిన్ ఉమర్ బిన్ ఖతాదా బిన్ నూమాన్ అన్సారీ. ఎన్నదగ్గ తాబయీలలో ఒకరు. అనేక హదీసులను ఉల్లేఖించారు. ఇస్లామీయ చరిత్ర, మిలటరీ గణాంకాల విషయంలో నిపుణులు. ఈయన మరణ కాలం గురించి విభిన్న వాదనలున్నాయి. హిజ్రీ 119, 120, 121, 127, 129 అని రకరకాల అభిప్రాయాలున్నాయి.

2. ఉస్మాన్ బిన్ అబూ సులైమాన్ (రజి) : ఉస్మాన్ బిన్ అబూ సులైమాన్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్. మక్కాకు చెందిన ఖాజీ. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇబ్నె మొయిన్ (రహ్మ.లై), అబూహాతిమ్ (రహ్మ.లై)లు ఈయన్ని విశ్వసనీయులుగా ఖరారు చేశారు.

(١١٢٥) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ: بَعَثَنِي النَّبِيُّ ﷺ إِلَى الْيَمَنِ فَأَمَرَنِي أَنْ آخُذَ مِنْ كُلِّ حَالِمٍ دِينَاراً، أَوْ عِدْلَهُ مُعَافِرِيًّا. أَخْرَجَهُ الثَّلَاثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1125. హాజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం : దైవప్రవక్త (నఅసం) నన్ను యమన్ వైపునకు పంపిస్తూ, "నువ్వు యుక్త వయస్కులైన ప్రతి ఒక్కరి నుండీ ఒక దీనార్ చొప్పున జిజ్‌యానుగానీ, దానికి సమానమైన మాఫిరీ వస్త్రాన్నిగానీ వసూలు చెయ్యి" అని తాకీదు చేశారు. ('ముగ్గురు' దీనిని సేకరించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఒక సంవత్సరం కాలానికి గాను చెల్లించవలసిన తలసరి జిజ్‌యా ఒక దీనారు లేక దానికి సమానమైన విలువగల మరేదైనా వస్తువు అయి ఉంటుందని ఈ హదీసు ద్వారా వెల్లడవుతోంది. ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇమామ్ షాఫయి (రహ్మ.లై)ల విధానం ఇదే. అయితే ఒక్క దీనారు కనీస జిజ్‌యా అనీ, అంతకుమించి కూడా వసూలు చేయవచ్చనీ, ఈ జిజ్‌యా యుక్త వయస్కుడైన స్వతంత్ర పౌరుని నుంచి మాత్రమే తీసుకోవాలనీ, బానిసలకు ఇది వర్తించదని ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అన్నారు. (సుబుల్)

(١١٢٦) وَعَنْ عَائِذِ بْنِ عَمْرٍو الْمُزَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**اَلْإِسْلَامُ يَعْلُو، وَلَا يُعْلَى**» أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ.

1126. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హాజ్రత్ ఆయిజ్ బిన్ అమ్ర్ ముజనీ (రజి) తెలిపారు : "ఇస్లాం లోబరుచుకునే స్వభావం గలదే గాని లొంగి ఉండేది కాదు."

(సునన్ దారె ఖుత్నీ)

**సారాంశం**

ఇస్లాం నిత్యం పైచేయిగా ఉంటుందే తప్ప క్రింది చేయిగా ఉండదన్న సమాచారంతో పాటు, భవిష్యవాణి కూడా ఈ హదీసులో ఉంది. కాబట్టి ఇస్లాం అనుయాయులు సైద్ధాంతికం గానూ, క్రియాత్మకంగానూ ఈ ధర్మాన్ని పైచేయిగా ఉంచడానికి కృషి చేయాలి. ఇస్లాంను హెచ్చుతగ్గులు లేకుండా - ఉన్నదున్నట్టుగా - పరిచయం చేయాలి. ముందు వారు దీనికను గుణంగా ఆచరించాలి. తమ నిజ జీవితాల ద్వారా, సత్ప్రవర్తన ద్వారా ముస్లిమేతరులను ప్రభావితం చేయాలి.

**ముస్లిమేతర జాతులతో** సంధులు, ఒడంబడికలు చేసుకుంటున్నప్పుడు ఏదేని షరతు, **పైకి ఇస్లాం అనుయాయుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్టు** అనిపించినా **కలవర పడనవసరం లేదు.** ఎందుకంటే ఇస్లాం దైవ సమ్మతమైన, దేవుడు ఇష్టపడిన ధర్మం. అది ఎల్లప్పుడూ ఉన్నతంగానే ఉంటుంది. పరిస్థితులను సానుకూలంగా మలచటం దైవానికి ఏమాత్రం కష్టం కాదు. కాకపోతే ముస్లిం స్వయంగా చిత్తశుద్ధితో తమ ప్రభువు వైపునకు మరలాలి. అప్పుడే దేవుని కారుణ్య కడలి కదలివస్తుంది. కాగా; ఇస్లాం సైద్ధాంతికంగా, ప్రమాణాత్మకంగా కలకాలం పైచేయిగా ఉంటుందనేది మాత్రం తిరుగులేని సత్యం.

## హదీసు ఉల్లేఖకులు

ఆయిజ్ బిన్ అమ్ర్ ముజనీ (రజి) : మారుపేరు అబూ. బస్రాలో స్థిరపడ్డారు. సదాచార సంపన్నులైన సహాబీలలో ఒకరు. 'బైతుర్రిజ్వాన్' ఘట్టంలో పాల్గొన్నారు. యజీద్ బిన్ ముఆవియా పరిపాలనా కాలంలో మరణించారు.

(١١٢٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**لاَ تَبْدَءُوا الْيَهُودَ وَالنَّصَارَى بِالسَّلاَمِ، وَإِذَا لَقِيتُمْ أَحَدَهُمْ فِي طَرِيقٍ فَاضْطَرُّوهُ إِلَى أَضْيَقِهِ**». رَوَاهُ مُسْلِمٌ.

1127. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : యూదులు, క్రైస్తవులు మొదట మీకు సలాం చేసే వరకూ మీరు వారికి సలాం చేయకండి. మీరెవ్వడయినా దారిలో వారికి ఎదురుపడితే అతడు ఇరుకైన మార్గం వైపునకు తప్పుకునే స్థితిని కల్పించండి." (ముస్లిం)

## సారాంశం

ఈ హదీసునుబట్టి యూదులకు, క్రైస్తవులకు, జోరాస్ట్రియన్లకు, తదితర మతాల వారికి ముస్లింలు 'సలాం' చేయటంలో ముందంజ వేయటం సమ్మతం కాదు, అత్యధిక మంది పండితుల అభిప్రాయం కూడా ఇదే. అయితే హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తదితరులు మాత్రం గ్రంథవహులైన జిమ్మీలకు సలాం చేయవచ్చునని అంటున్నారు.

(١١٢٨) وَعَنِ الْمِسْوَرِ بْنِ مَخْرَمَةَ وَمَرْوَانَ أَنَّ النَّبِيَّ ﷺ خَرَجَ عَامَ الْحُدَيْبِيَةِ، فَذَكَرَ الْحَدِيثَ بِطُولِهِ، وَفِيهِ: «**هٰذَا مَا صَالَحَ عَلَيْهِ مُحَمَّدُ بْنُ عَبْدِاللهِ، سُهَيْلَ بْنَ عَمْرٍو:**

1128. హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్రమ మరియు మర్వాన్ (రజి)లు ఇద్దరూ ఇలా అంటున్నారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హుదైబియా

عَلَىٰ وَضْعِ الحَرْبِ عَشَرَ سِنِيْنَ، وَيَأْمَنُ فِيْهَا النَّاسُ، وَيَكُفُّ بَعْضُهُمْ عَنْ بَعْضٍ». اَخْرَجَهُ اَبُو دَاوُدَ وَاَصْلُهُ فِي الْبُخَارِيِّ.

(ఒప్పందం జరిగిన) సంవత్సరాన బయలుదేరారు. ఉల్లేఖకులు చెప్పిన సుదీర్ఘమయిన హదీసులో వచ్చిన ప్రస్తావన ఇది - ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (సఅసం) సుహైల్ బిన్ అమ్రితో చేసుకున్న ఒప్పందం ఇది. దీని (ఈ దస్తావేజు) ప్రకారం పది సంవత్సరాల దాకా యుద్ధం జరగదు. ఈ (పదేండ్ల) కాలంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉంటారు. వీరిలోని ప్రతి ఒక్కడూ (యుద్ధం నుండి) తన చేయిని ఆపుకుంటాడు. (అబూదావూద్. దీని మూలం బుఖారీలో ఉంది)

وَأَخْرَجَ مُسْلِمٌ بَعْضَهُ مِنْ حَدِيْثِ أَنَسٍ، وَفِيْهِ: أَنَّ مَنْ جَاءَنَا مِنْكُمْ لَمْ نَرُدَّهُ عَلَيْكُم، وَمَنْ جَاءَكُمْ مِنَّا رَدَدْتُمُوهُ عَلَيْنَا، فَقَالُوا: أَنَكْتُبُ هٰذَا؟ يَا رَسُولَ اللهِ! قَالَ: «نَعَمْ إِنَّهُ مَنْ

'ముస్లిం' ఈ హదీసులోని కొంత భాగాన్ని హజ్రత్ అనస్ (రజి) నుండి ఉల్లేఖించారు. అందులో ఇలా వుంది : "మీలో (ముస్లింలలో) నుంచి ఎవరు మా వద్దకు వచ్చినా అతన్ని మేము తిరిగి పంప బోము. మా మనుషుల్లో (అవిశ్వాసుల్లో) నుంచి ఎవరు మీ దగ్గరకు వచ్చినాసరే **అతడ్ని మీరు తిరిగి పంపించేయాలి.**" దీనిపై "ఓ దైవప్రవక్త (స)! మేము దీనిని వ్రాసుకోవాలా?!" అని ఆయన సహచరులు ఆశ్చర్యంతో ప్రశ్నించగా, ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "అవును. మాలో నుంచి ఎవడు పలాయనం చిత్తగించి వాళ్ళ వద్దకు వెళ్ళాడో అతన్ని అల్లాహ్ దూరం చేసేశాడు. మరెవరు వాళ్ళలో నుంచి

ذَهَبَ مِنَّا إِلَيْهِمْ فَأَبْعَدَهُ اللَّهُ، وَمَنْ جَاءَنَا مِنْهُمْ فَسَيَجْعَلُ اللَّهُ لَهُ فَرَجاً وَمَخْرَجاً».

పారిపోయి మా వద్దకు వచ్చాడో అతని కోసం అల్లాహ్ తప్పకుండా ఏదో ఒక మార్గం తెరుస్తాడు."

## సారాంశం

హుదైబియా ఒడంబడికలోని ప్రధాన షరతును ఈ హదీసు సూచిస్తోంది. మహాప్రవక్త (స) సాగించిన 23 ఏండ్ల ఇస్లామీయ చరిత్రలో హుదైబియా ఒప్పందం అత్యంత కీలకమైనది. హిజ్రీ 6వ సంవత్సరంలో మక్కా అవిశ్వాసులకు - మహాప్రవక్త (స)కు మధ్య 'హుదైబియా బావి' సమీపంలో జరిగిన ఈ సంధిలోని షరతులు చూడబోతే పైకి ముస్లింలను అవమాన పరచేవిగా కనిపిస్తాయి. ప్రవక్త ప్రియ సహచరుల్లో కొంతమంది ఈ షరతులను చదివి ఆవేశంతో ఊగిపోయారు. కాని మహనీయ ముహమ్మద్ (స) ఆ సందర్భంలో చూపిన నిగ్రహం, సమయ స్ఫూర్తి అందరికీ అనుసరణీయం. అపజయం అనుకున్న ఒప్పందాన్నే అల్లాహ్ స్పష్టమయిన విజయంగా పేర్కొన్నాడు. నిర్యుద్ధ సంధి ఫలితంగా ముస్లింలకు కొంత తెరిపి లభించింది. మహాప్రవక్త (స) సత్సమాజ రూపకల్పనపై, సందేశ ప్రధానమైన కార్యకలాపాలపై దృష్టిని కేంద్రీకరించారు. పర్యవసానంగా శీఘ్రగతిన అరేబియాలో ఇస్లాం విస్తరించింది. హిజ్రీ 10వ సంవత్సరం నాటికి అది అరేబియాలో అత్యంత బలోపేతమైన, తిరుగులేని శక్తిగా రూపొందింది.

## హదీసు ఉల్లేఖకులు

1. మర్వాన్ (రజి) : మర్వాన్ బిన్ హకమ్ అమవీ. ఖలీఫా అబ్దుల్ మలిక్‌కు తండ్రి. ఈయన హజ్రత్ ముఆవియా (రజి) తరపున మదీనా నగరానికి గవర్నర్‌గా నియమించబడ్డారు. యజీద్ చనిపోయిన మీదట అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) ఖిలాఫత్ విషయంలో ఆసక్తి కనబరిచారు. అతని కుమారుడగు ముఆవియా పదవీచ్యుతుడైన తరువాత ఈజిప్టు, సిరియాలకు రాజ్యాధికారి అయ్యారు. హిజ్రీ 65లో డెమాస్కస్‌లో తనువు చాలించారు.

2. సుహైల్ బిన్ అమ్ర (రజి) : ఈయన ఖురైషుల్లో మర్యాదస్తులుగా, మహా వక్తగా, పెద్ద మనిషిగా పరిగణించబడేవారు. బద్ర్ యుద్ధంలో ఖైదీగా ముస్లింలకు పట్టుబడ్డారు. అప్పటికి ఆయన ఇస్లాం స్వీకరించలేదు. మక్కా విజయం నాడు ఇస్లాంలో ప్రవేశించారు. అరేబియాలో ధర్మభ్రష్టతా ఉపద్రవం ప్రబలినపుడు ఖురైష్ తెగవారు ఈయన మూలంగా ఇస్లాంపై నిలకడ చూపారు. హిజ్రీ 14లో యర్మూక్ యుద్ధ సందర్భంగా హత్య గావించబడి వీర మరణం పొందారు. హిజ్రీ 18లో అమ్వాస్‌లో సంభవించిన ప్లేగు వ్యాధి సందర్భంగా మరణించారన్న వాదన కూడా ఉంది.

(١١٢٩) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ قَتَلَ مُعَاهِداً لَمْ يَرِحْ رَائِحَةَ الْجَنَّةِ، وَإِنَّ

1129. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు:

رِيحَهَا لَيُوجَدُ مِنْ مَسِيرَةِ أَرْبَعِينَ عَامًا». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

"ఎవరయితే 'ముఆహిద్'ను చంపుతాడో అతడు స్వర్గ సువాసనను ఆస్వాదించలేడు. కాగా; స్వర్గ సువాసన అనేది నలభై ఏళ్ళు ప్రయాణం చేసి పొందినంత దూరాన ఉంటుంది." (బుఖారి)

**సారాంశం**

హదీసులో 'ముఆహిద్' అనే పదం వచ్చింది. ముస్లిం రాజ్యపరిధిలో లేని ఒక ముస్లిమేతర వ్యక్తి - అంటే, ఇస్లామీయ ప్రభుత్వ రక్షణ పొందిన వ్యక్తిని 'ముఆహిద్' లేక 'అహదీ'గా వ్యవహరిస్తారు. ఇలాంటి **వ్యక్తిని అకారణంగా**, అన్యాయంగా హతమార్చటం నిషిద్ధం (హరామ్) అని ఈ హదీసు చెబుతోంది. **ఈ విధంగా హత్య**చేసిన ఒక ముస్లిం హంతకుని నుంచి పరిహారం తీసుకోబడదని కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఎందుకంటే అతడు ఒడిగట్టిన ఈ పాతకానికిగాను పరలోకంలో దేవుడు అతన్ని స్వర్గ సువాసనకు దూరం చేశాడు. నలభై ఏళ్ళ కాలం నిరంతరం ప్రయాణిస్తే గాని మనిషి ఆ సువాసనను ఆస్వాదించలేనంత దూరాన అది ఉంటుందనటాన్ని బట్టి ఈ హదీసులో ముస్లింలకు తీవ్రమయిన హెచ్చరిక ఉంది.

**2వ అధ్యాయం**

## ٢ - بَابُ السَّبَقِ وَالرَّمْيِ

## గుర్రపు స్వారీ, విలు విద్య

(١١٣٠) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَابَقَ النَّبِيُّ ﷺ بِالْخَيْلِ الَّتِي قَدْ أُضْمِرَتْ، مِنَ الْحَفْيَاءِ، وَكَانَ أَمَدُهَا ثَنِيَّةَ الْوَدَاعِ، وَسَابَقَ بَيْنَ الْخَيْلِ الَّتِي لَمْ تُضْمَرْ، مِنَ الثَّنِيَّةِ إِلَى مَسْجِدِ بَنِي زُرَيْقٍ، وَكَانَ ابْنُ عُمَرَ فِيمَنْ سَابَقَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1130. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తర్ఫీదు ఇవ్వబడిన గుర్రాలను 'హఫ్‌యా' నుండి 'సనియతుల్‌వదా' వరకు పరుగెత్తించారు. పూర్తిగా తర్ఫీదు కాని గుర్రాలను 'సనియా' నుండి 'బనూ జురైఖ్' మస్జిదు వరకు దౌడు తీయించారు. ఇబ్నె ఉమర్ (రజి) కూడా పరుగు పోటీలో పాల్గొన్నారు . (బుఖారీ, ముస్లిం)

زَادَ الْبُخَارِيُّ «قَالَ سُفْيَانُ: مِنَ الْحَفْيَاءِ

బుఖారీలో అదనంగా ఇలా వుంది : "హఫ్‌యా నుండి సనియతుల్ వదా వరకు ఐదారు మైళ్ళు ఉంటుంది. బనూ

إِلَى ثَنِيَّةِ الوَدَاعِ خَمْسَةُ أَمْيَالٍ، أَوْ سِتَّةٌ، وَمِنَ الثَّنِيَّةِ إِلَى مَسْجِدِ بَنِي زُرَيْقٍ مِيْلٌ».

**జురైఖ్** మస్జిద్ వర్కైతే ఒక మైలు దూరం మాత్రమే" అని సుఫ్యాన్ వివరించారు.

**సారాంశం**

దైవమార్గంలో పోరాటం కోసం గుర్రాలకు తర్ఫీదు నివ్వటం, పరుగు పోటీలు పెట్టడం, విలువిద్య విన్యాసాలు నిర్వహించటం, ఈటెల ప్రయోగం వంటివి ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలోని యుద్ధాలలో ఈ అంశాలు చాలా కీలకమైనవి. నేటి ఆధునిక యుద్ధ పద్ధతుల్లో చాలా మార్పు వచ్చింది కదా! శతఘ్నులు, టాంకులు, క్షిపణుల ప్రయోగం, యుద్ధ విమాన విన్యాసాలు, గెరిల్లా విధానాలు నేటి యుద్ధాల్లో కీలకాంశాలు.

(١١٣١) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ سَابَقَ بَيْنَ الْخَيْلِ، وَفَضَّلَ الْقُرَّحَ فِي الْغَايَةِ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1131. **హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుఱ్ఱాల మధ్య పరుగు పోటీలను** పెట్టారు. ఈ సందర్భంగా వయసులో, ఊపులో ఉన్న గుర్రాల దూరాన్ని నిర్ధారించటంలో వ్యత్యాసం కనబర్చారు. (దీనిని అహ్మద్, అబూదావూద్‌లు ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

పశువుల శక్తి సామర్థ్యాలను సరిగ్గా అంచనా వేసి, వాటి శక్తికి తగ్గ పని మాత్రమే వాటిచేత చేయించుకోవాలనీ, శక్తికి మించిన భారం మనుషులపైన్నే కాదు, పశువులపై సయితం వేయరాదనీ ఈ హదీసు చెబుతోంది. అందుకే దైవప్రవక్త (సఅసం) గుర్రాల పరుగును నిర్వహించేటప్పుడు ముసలి మరియు బలహీనమైన గుర్రాలను ఒక వరుసలోనూ, బలిష్టమైన, మంచి వయసులో వున్న గుర్రాలను మరొక వరుసలోనూ నిలబెట్టారు.

(١١٣٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَا سَبَقَ

1132. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు : "పరుగు పోటీలు కేవలం ఒంటెలు, గుర్రాలకే పరిమితం. గెలుపోటములు కేవలం

إِلاَّ فِي خُفٍّ، أَوْ نَصْلٍ، أَوْ حَافِرٍ» رَوَاهُ أَحْمَدُ. وَالثَّلاَثَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

విలువిద్యలోనే." (దీనిని అహ్మద్ మరియు ముగ్గురూ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

**సారాంశం**

నిర్ణీత బహుమానం లేక పారితోషికంపై పరుగు పోటీలలో పాల్గొనటం సమ్మతమే. అయితే జూదం, బ్రాకెట్టు, నేటి గుర్రపు పందాల తరహాలో ఇచ్చే మొత్తం మాత్రం ధర్మ సమ్మతం కాదు. గుర్రాలను, ఒంటెలను యుద్ధానికై తయారు చేసే ప్రయత్నంలో పోటీలుపెట్టడం, ఆ పోటీలో పాల్గొన్న రౌతులకు ముందుగా నిర్ధారించిన దాని ప్రకారం పారితోషికాలు ఇవ్వటం సమంజసమే. కాని పక్షులు, పావురాలను ఎగురవేసి పందాలు కాయటం, ఎనుబోతుల, పొట్టేళ్ళ మధ్య లడాయి పెట్టడం, కోడిపందాలు కాయటం వంటివి అధర్మంగా పరిగణించబడతాయి.

(١١٣٣) وَعَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ أَدْخَلَ فَرَساً بَيْنَ فَرَسَيْنِ، وَهُوَ لاَ يَأْمَنُ أَنْ يَسْبِقَ فَلاَ بَأْسَ بِهِ، فَإِنْ أَمِنَ فَهُوَ قِمَارٌ» رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ ضَعِيفٌ.

1133. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : "ఎవరయినా రెండు గుర్రాల మధ్య మూడో గుర్రాన్ని తెచ్చిపెడితే, ఆ గుర్రం (మొదటి రెండు గుఱ్ఱాలను) మించిపోతుందన్న నమ్మకం అతనికి లేకుంటే ఫరవా లేదు - కాని ఆ మూడవ గుర్రం ముందుకు దూసుకు పోతుందన్న దృఢ నమ్మకం ఉండి కూడా అతనా పనిచేస్తే అది జూదమవుతుంది." (దీనిని అహ్మద్, అబూదావూద్ ఉల్లేఖించారు. దీని పరంపర బలహీనమైనది)

(١١٣٤) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ، وَهُوَ عَلَى الْمِنْبَرِ، يَقُولُ: ﴿وَأَعِدُّوا لَهُمْ مَا اسْتَطَعْتُمْ مِنْ قُوَّةٍ وَمِنْ رِبَاطِ الْخَيْلِ﴾ اَلآيَة،

1134. హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) వేదికపై నిలబడి ఇది (ఈ ఆయత్) పఠిస్తుండగా నేను విన్నాను: "మీరు మీ

أَلاَ! إِنَّ الْقُوَّةَ الرَّمْيُ، أَلاَ! إِنَّ الْقُوَّةَ الرَّمْيُ، أَلاَ! إِنَّ الْقُوَّةَ الرَّمْيُ». رَوَاهُ مُسْلِمٌ.

శక్తిమేరకు **అత్యధిక** బలాన్ని, కట్టివేసి సిద్ధంగా ఉన్న గుర్రాలను వారిని ఎదుర్కోవటానికి సమాయత్తపరచుకోండి." (అన్ ఫాల్-60). "జాగ్రత్త! అసలు శక్తి విలువిద్యే. జాగ్రత్త! అసలు శక్తి విలువిద్యే." (అని కూడా అన్నారు). (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే దేమిటంటే శత్రు రాజ్యం నుండి తన ప్రజలను కాపాడుకోవటానికి నిత్యం సిద్ధంగా ఉండాలి. సైనికబలాన్ని, వాహనాలను ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ, పరిస్థితుల కనుగుణంగా తర్ఫీదునిస్తూ ఉండాలి. కొంగ్రొత్త ప్రయోగాలు చేయాలి. నేటి ఆధునిక యుద్ధ పరిభాషలో వాహనాలంటే విమానాలు, యుద్ధ టాంకులు, లాంఛర్లు, యుద్ధ నౌకలు వస్తాయి. అలాగే విలువిద్య అంటే కేవలం బాణాలే కావు - లక్ష్యాన్ని ఛేదించే తుపాకులు, ఫిరంగులు, క్షిపణుల్లాంటివన్నీ ఈ కోవలోకి వస్తాయి. ఇరుగు పొరుగు రాజ్యాలు సైనిక బలాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండగా నిస్సహాయంగా లేక నిర్లిప్తంగా ఉండిపోవటం ఏ జాతికైనా శ్రేయస్కరం కాదని హదీసు భావం. నేటి ఆధునిక ప్రపంచ పటాన్ని వీక్షించిన వారికి ఈ సంగతి ఇట్టే బోధపడుతుంది.

# 12. అన్న పానీయాల పుస్తకం

# ١٢ - كِتَابُ الْأَطْعِمَةِ

(١١٣٥) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «كُلُّ ذِي نَابٍ مِنَ السِّبَاعِ فَأَكْلُهُ حَرَامٌ». رَوَاهُ مُسْلِمٌ.

وَأَخْرَجَهُ مِنْ حَدِيثِ ابْنِ عَبَّاسٍ، بِلَفْظِ: «نَهَى». وَزَادَ: «وَكُلُّ ذِي مِخْلَبٍ مِّنَ الطَّيْرِ».

1135. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: కోరలు గల మృగాలలో దేన్నయినా సరే తినటం నిషిద్ధం (హరామ్). (ముస్లిం)

ముస్లింలోని ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం, 'దైవప్రవక్త (సఅసం) వారించారు' అనే పదంతో వుంది : "పక్షులలో కాళ్ళతో తన్నుకుపోయి, గోళ్ళతో వశపరచుకుని భక్షించే వాటిని తినటం నిషిద్ధం" అన్న వాక్యం అదనంగా ఉంది.

**సారాంశం**

ఈ హదీసులో తినకూడని జంతువులకు, పక్షులకు సంబంధించి స్పష్టమయిన ఆనవాళ్ళు సూచించబడ్డాయి. కోరలతో చీల్చి చెండాడే చతుష్పాదాలు, అంటే మాంసాన్ని భక్షించే జంతువులను తినటం నిషిద్ధం. అలాగే తన కాళ్లతోనూ, గోళ్ళ ఆధారంగానూ వస్తువును ఆక్రమించుకుని తినే పక్షులను కూడా తినకూడదు. ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), దావూద్ జాహిరీ (రహ్మ.లై) ప్రభృతులు ఈ విషయంలో ఈ సూత్రాన్నే అంగీకరించారు. అయినప్పటికీ క్రూర జంతువుల నిర్ధారణలో, వాటి వాస్తవికతలో భేదాభిప్రాయం మాత్రం ఉంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై) దృష్టిలో వేటాడి మాంసాన్ని భక్షించే ఏ జంతువు అయినాసరే అది 'క్రూర జంతువు' గానే భావించ బడుతుంది. ఈ లెక్కన పిల్లి సయితం ఆ 'కోవకే' చెందుతుంది. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ఉద్దేశ్యంలో, మనుషులపై దాడిచేసే జంతువులు క్రూర మృగాలు. ఉదాహరణకు: పులి, తోడేలు, సింహం, చిరుతపులి మొదలగునవి. నక్క లాంటి జంతువులు ఇందులోకి రావు. ఎందుకంటే ఇవి మనిషికి నష్టం చేకూర్చవు. అలాగే కాళ్ల క్రింద తొక్కిపెట్టి పీక్కుతినే పక్షులు కూడా నిషేధించబడ్డాయి. ఉదాహరణకు : డేగ, గ్రద్ద, రాబందు మొదలగునవి. అయితే ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) ఇలాంటి పక్షులను 'హరామ్' (నిషిద్ధం)గా ఖరారు చేయలేదు, 'మక్రూహ్' (అవాంఛనీయమైనవి)గా మాత్రమే తలపోస్తున్నారు.

(١١٣٦) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ يَوْمَ خَيْبَرَ عَنْ لُحُومِ الْحُمُرِ الْأَهْلِيَّةِ، وَأَذِنَ فِي لُحُومِ الْخَيْلِ. مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي لَفْظٍ لِلْبُخَارِيِّ: «وَرَخَّصَ».

1136. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖైబర్ (యుద్ధ) దినాన పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని వారించారు. గుర్రాల మాంసానికి మాత్రం అనుమతించారు. (బుఖారీ, ముస్లిం) బుఖారీ ఉల్లేఖనంలో 'అజినా' కు బదులు 'రఖ్ఖస' అనే పదం ఉంది. 'ఆయన (స) అనుమతి నిచ్చారు' అని దీని అర్థం.

**సారాంశం**

ఖైబర్ యుద్ధ దినాన పెంపుడు గాడిదల మాంసం తినడం నిషేధించబడినట్లు ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతున్నది. అంతకు ముందు దీనికి అనుమతి ఉండేది. నిషేధాజ్ఞలు క్రమక్రమంగా అవతరించాయి. పెంపుడు గాడిదలు 'హరామ్' గావించబడటంలోని ఆంతర్యం 'బుఖారీ' గ్రంథంలో వివరించబడింది - ఈ జంతువు కూడా అత్యంత అశుద్ధమైన వాటిలో ఒకటి. మెజారిటీ ఉలమాల, ప్రవక్త సహచరుల, తాబయీల అభిమతం కూడా ఇదే.

గుర్రాల మాంసం ధర్మ సమ్మతం అని హదీసు చెబుతోంది. ఇందుకు 'ఆయన (స) అనుమతించారు' అని అనటంలోని ఉద్దేశ్యం, బహుశా మొదట్లో గుర్రాల కొరత మూలంగా తాత్కాలికంగా వారించి, ఆ తరువాత అనుమతి ఇచ్చి ఉంటారు. జైద్ బిన్ అలీ, ఇమామ్ షాఫయి (రహ్మ.లై), ఇమామ్ అబూహనీఫా (రహ్మ.లై) గారి ప్రియశిష్యులు, ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై), ఇస్హాఖ్ బిన్ రాహ్వియ (రహ్మ.లై) తదితరులందరూ దీని ధర్మసమ్మతిపై ఏకీభవిస్తున్నారు. అయితే ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై)ల దృష్టిలో మాత్రం గుర్రపు మాంసం నిషిద్ధం. కాని ఈ హదీసు మరియు ఈ అంశం క్రిందవచ్చే మరికొన్ని హదీసులతో వీరి అభిప్రాయ లు సమరసం చెందటం లేదు.

(١١٣٧) وَعَنِ ابْنِ أَبِي أَوْفَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: غَزَوْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ سَبْعَ غَزَوَاتٍ، نَأْكُلُ الْجَرَادَ. مُتَّفَقٌ عَلَيْهِ.

1137. హజ్రత్ ఇబ్నె అబీ ఔఫా (రజి) కథనం : "మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి ఏడు యుద్ధాలు చేశాము. ఆ సందర్భంగా మేము మిడతలను తినేవాళ్ళం."

(బుఖారీ, ముస్లిం)

(١١٣٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ – فِي قِصَّةِ الْأَرْنَبِ – قَالَ: فَذَبَحَهَا فَبَعَثَ بِوَرِكِهَا إِلَى رَسُولِ اللهِ ﷺ، فَقَبِلَهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

1138. కుందేలుకు సంబంధించి హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు : (అబూ తల్హా) దానిని 'జిబహ్' చేయగా, దాని తొడ దైవప్రవక్త (సఅసం) కొరకు సమర్పించబడింది. ఆయన (స) దాన్ని స్వీకరించారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

కుందేలు మాంసం హలాల్ (ధర్మ సమ్మతం) అని పై హదీసు ద్వారా వెల్లడవుతోంది. కుందేటి మాంసమే గనక ధర్మసమ్మతం కానట్లయితే దైవప్రవక్త (స) స్వీకరించేవారు కాదు కదా!

(١١٣٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنْ قَتْلِ أَرْبَعٍ مِنَ الدَّوَابِّ: النَّمْلَةِ، وَالنَّحْلَةِ، وَالْهُدْهُدِ، وَالصُّرَدِ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1139. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) జంతువుల్లో నాల్గింటిని చంపటాన్ని వారించారు - 1. చీమలు, 2. తేనెటీగలు, 3. చిరత పక్షులు, 4. మంద పిచ్చుకలు. (దీనిని అహ్మద్, అబూదావూద్‌లు ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

వేటిని చంపరాదని దైవప్రవక్త (సఅసం) సూచించారో వాటిని చంపటం హరామ్ (నిషిద్ధం). ఈ విషయంలో మెజారిటీ విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే.

(١١٤٠) وَعَنِ ابْنِ أَبِي عَمَّارٍ قَالَ: قُلْتُ لِجَابِرٍ: الضَّبُعُ صَيْدٌ هِيَ؟ قَالَ: نَعَمْ،

1140. హజ్రత్ ఇబ్నె అబూ అమ్మార్ (రహ్మ.లై) కథనం : 'సివంగిని కూడా వేటాడవచ్చా?' అని నేను జాబిర్ (రజి)ని దర్యాప్తు చేయగా, 'అవును' అని ఆయన చెప్పారు. 'ఏమిటీ, ఈ మేరకు దైవప్రవక్త (సఅసం) చెప్పారా?!' అని నేను తిరిగి ప్రశ్నించగా 'అవును' అని ఆయన బదు

قُلْتُ: قَالَه رَسُولُ اللهِ ﷺ؟! قَالَ: نَعَمْ. رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ الْبُخَارِيُّ وَابْنُ حِبَّانَ.

లిచ్చారు. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. బుఖారీ, ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణిక మైనదిగా ఖరారు చేశారు)

## హదీసు ఉల్లేఖకులు

ఇబ్నె అబూ అమ్మార్ : ఈయన అసలు పేరు అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబూ అమ్మార్ - ఖురషీ - మక్కా వాసులు. ఎక్కువ సమయం ఆరాధనల్లోనే గడపటం చేత ప్రజలీయన్ని తపోనిష్ఠాపరాయణుడిగా, సాత్వికునిగా అభివర్ణించేవారు. ఇమామ్ నసాయి (రహ్మ.లై) ఈయన్ని విశ్వసనీయులుగా ఖరారు చేశారు.

(١١٤١) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّهُ سُئِلَ عَنِ الْقُنْفُذِ، فَقَالَ: ﴿قُلْ لَا أَجِدُ فِيمَا أُوحِيَ إِلَيَّ مُحَرَّماً﴾ الْآيَةَ فَقَالَ شَيْخٌ عِنْدَهُ: سَمِعْتُ أَبَا هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ يَقُولُ: ذُكِرَ عِنْدَ النَّبِيِّ ﷺ، فَقَالَ: «إِنَّهَا خَبِيثَةٌ مِنَ الْخَبَائِثِ». أَخْرَجَهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَإِسْنَادُهُ ضَعِيفٌ.

**1141. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: ముండ్ల పంది గురించి తనను దర్యాప్తు చేయగా తాను సమాధానంగా ఈ దైవాదేశాన్ని వినిపించారు** -"(ఓ ప్రవక్తా!) నా వద్దకు వచ్చిన వహీలో, తినేవాడి కొరకు ఏ వస్తువూ నిషేధించబడినట్లు నాకు కనిపించదు అని చెప్పు." (అల్ అన్ ఆమ్ - 145). అతని దగ్గర ఒక పెద్ద మనిషి కూర్చుని ఉన్నారు. ఆయన ఇలా అన్నారు - నేను హజ్రత్ అబూహురైరా (రజి) ద్వారా విన్నాను: దీని (ముండ్ల పంది) గురించిన ప్రస్తావన దైవప్రవక్త (సఅసం) ముందు తీసుకురాగా; "అది పరమ అశుద్ధ జంతువులలోని ఒక అశుద్ధ జంతువు" అని ఆయన (స) అన్నారు. (దీనిని అహ్మద్, అబూ దావూద్‌లు ఉల్లేఖించారు. దీని పరంపర బలహీనంగా ఉంది)

## సారాంశం

ఈ హదీసు ద్వారా ముండ్ల పంది నిషిద్ధమని విదితమవుతున్నది. ఇది చూడటానికి ఒక పెద్ద పిల్లి సైజులో ఉంటుంది. దాని శరీరంపై ముండ్లు ఉంటాయి. ప్రమాదం పొంచి ఉందని

తెలిస్తే అది తన ముండ్లను విరుచుకుని తన్ను రక్షించుకుంటుంది. శత్రువులకు కొరకరాని కొయ్యగా, పెద్ద పులులను సయితం హడలెత్తించే ఈ జంతువు ఒంటినిండా ఉండే సూది మొనల లాంటి ముళ్ళు ఒకింత భయం పుట్టిస్తాయి. దాని ముళ్ళు బారిన పడ్డవారు కోలుకోవటం కష్టం. పెద్ద పులులు, చిరుతలు సయితం దాని ముళ్ళ వేటుకు మరణిస్తుంటాయి. దాని ముళ్ళ మొనకు విషం లాంటి ఆల్కాహిలిక్ ద్రవపదార్థం ఉంటుంది. దీనివల్ల దాడికి గురైన జంతువులు సెప్టిక్ బారినపడి గాయాలు మానక చనిపోతాయి. మనుషులకు కూడా అదే ప్రమాదం ఉంటుంది. అందువల్ల సాధారణంగా ముళ్ళ పంది జోలికి వెళ్ళడానికి ఎవరూ సాహసించరు.

రాళ్లు, పొదలతో కూడిన చిట్టడవులలో భూమిలో బొరియలు వేసుకుని మనుగడ సాగించే ముళ్ళ పంది ఎలుక జాతికి చెందినది. దాని శరీరం కంటే వీపుపై ఉండే ముళ్ళు పెద్దగా ఉంటాయి. ఈ ముళ్ళ సైజు రెండు అంగుళాల నుంచి పది అంగుళాల వరకూ ఉంటుంది. ఇది రాత్రిపూట మాత్రమే సంచరించే నిశాచర జంతువు. ఇది కూడా పరమ అశుద్ధ జంతువుగా పరిగణించబడింది. అల్లాహ్ పరిశుద్ధమయిన వస్తువులను ధర్మసమ్మతంగానూ, అపరిశుద్ధమైన వస్తువులను అధర్మంగానూ ఖరారు చేశాడు.

ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)లు ఈ జంతువును హరామ్‌గా భావిస్తున్నారు. కాగా; హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మ.లై) దృష్టిలో ఈ హదీసు బలహీనమైనది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), **ఇబ్నె అబూ యాల** ప్రభృతులు ఈ జంతువును హలాల్‌గా తలపోస్తున్నారు. ఎందుకంటే ఈ జంతువు అధర్మం అన్నదానికి నిదర్శనం ఏదీ లేదన్నది వారి వాదన. వాస్తవం అల్లాహ్‌యే ఎరుగు (సుబుల్).

(١١٤٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ عَنِ الْجَلَّالَةِ وَأَلْبَانِهَا. أَخْرَجَهُ الْأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ.

**1142. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం:** మలినాన్ని (పెంటను) తినే పశువు మాంసం తినటాన్ని, దాని పాలు త్రాగటాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. ('నలుగురి'లో నసాయి తప్ప అందరూ దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు)

(١١٤٣) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ - فِي قِصَّةِ الْحِمَارِ الْوَحْشِيِّ -: فَأَكَلَ مِنْهُ النَّبِيُّ ﷺ. مُتَّفَقٌ عَلَيْهِ.

1143. హజ్రత్ అబూ ఖతాద (రజి) కంచర గాడిదను వేటాడిన వైనాన్ని వివరిస్తూ, దైవప్రవక్త (సఅసం) దాని మాంసాన్ని తిన్నారని చెప్పారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

కంచర గాడిద (జీబ్రా) **ధర్మసమ్మతమని ఈ** హదీసు చెబుతోంది. ఈ విషయంపై అందరిమధ్యా ఏకాభిప్రాయం ఉంది. హజ్రత్ **అబూ ఖతాదా** (రజి)గారి ఈ హదీసు ఇంతకు ముందు 'హజ్ పుస్తకం' లో వివరంగా వచ్చింది.

(١١٤٤) وَعَنْ أَسْمَاءَ بِنْتِ أَبِي بَكْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما قَالَتْ: نَحَرْنَا عَلَىٰ عَهْدِ رَسُولِ اللهِ فَرَساً فَأَكَلْنَاهُ. مُتَّفَقٌ عَلَيْهِ.

1144. హజ్రత్ అస్మా బిన్తె అబూబక్ర్ (ర.అన్హా) కథనం : "మేము దైవప్రవక్త (సఅసం) కాలంలో గుర్రాన్ని జిబహ్ చేయటమే గాకుండా దాని మాంసాన్ని కూడా తిన్నాము." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

గుర్రపు మాంసం తినటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. ఇంతకు ముందు కూడా హజ్రత్ జాబిర్ (రజి) హదీసు ద్వారా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

(١١٤٥) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: أُكِلَ الضَّبُّ عَلَىٰ مَائِدَةِ رَسُولِ اللهِ ﷺ. مُتَّفَقٌ عَلَيْهِ.

1145. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి భోజనం చాపపై 'జబ్బ్' అనే జంతువు మాంసం ఆరగించ బడింది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

'జబ్బ్' మాంసం ధర్మసమ్మతమని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. అత్యధిక మంది విద్వాంసుల అభిమతం కూడా ఇదే. అయితే కొంతమంది దీన్ని అధర్మం (హరామ్)గానూ, మరి కొంతమంది మక్రూహ్ (అయిష్టకర వస్తువు)గా కూడా భావిస్తున్నారు. 'జబ్బ్' అనే ఈ జంతువు మాంసాన్ని తినటాన్ని దైవప్రవక్త (స) వారించినట్లు వారు అబూ దావూద్ ఉల్లేఖనాన్ని ఆధారంగా చూపుతున్నారు. కాని 'సహీహైన్'కు చెందిన ఈ హదీసు ద్వారానూ, ఇతర హదీసుల ద్వారానూ బోధపడేదేమంటే ఈ వారింపు నిషేధంతో కూడుకున్నది కాదు. 'అయిష్టకరం' అన్న భావంలో మాత్రమే అది చెప్పబడింది. దైవప్రవక్త (స) స్వయంగా ఈ మాంసం తినలేదు. అయితే ఆయన ఈ మాంసాన్ని తినే తన సహచరులను ఆపనూ లేదు. పైగా ఆయన (స), "దీన్ని తినండి. ఇది ధర్మసమ్మతమే. అయితే నా ఆహారం మాత్రం ఇది కాదు" అని చెప్పినట్లు సహీహ్ ముస్లింలో ఉంది. స్పష్టమయిన ఈ ఉపదేశం ద్వారా అవగతమయ్యే దేమిటంటే ఈ ఆహారాన్ని ఆయన ఇష్టపడకపోయినప్పటికీ, దాన్ని అధర్మంగా మాత్రం ఖరారు చేయలేదు. ఇంతకీ 'జబ్బ్' అంటే ఏమిటీ? ఇది ఉడుం అని చాలా మంది పండితులు తలపోస్తున్నారు.

అయితే కొంతమంది విద్వాంసుల దృష్టిలో ఇది ఉడుం కానేకాదు. సాండ్ లిజర్డ్ (Sand Lizard) అనే ఇసుకపై ప్రాకే జంతువు - ఇసుక బల్లి!?

(١١٤٦) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ عُثْمَانَ الْقُرَشِيِّ، أَنَّ طَبِيْباً سَأَلَ رَسُولَ اللهِ ﷺ عَنِ الضِّفْدَعِ يَجْعَلُهَا فِي دَوَاءٍ، فَنَهَى عَنْ قَتْلِهَا. أَخْرَجَهُ أَحْمَدُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1146. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఉస్మాన్ ఖురషీ (రజి) కథనం : కప్పను మందుగా ఉపయోగించే విషయమై ఒక వైద్యుడు దైవప్రవక్త (సఅసం)ను సంప్రతించగా, కప్పను చంపటాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. (దీనిని అహ్మద్ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైందిగా నిర్ధారించారు)

**సారాంశం**

మందుల్లో ఉపయోగించే సదుద్దేశంతో కూడా కప్పను చంపరాదని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. "కప్పను చంపకండి. దాని బెకబెక కూడా దైవస్తోత్రమే" అని బైహఖీలో ఇబ్నె ఉమర్ (రజి) చే చేయబడిన కథనం ద్వారా తెలుస్తోంది.

**1వ అధ్యాయం**

## ١ - بَابُ الصَّيْدِ وَالذَّبَائِحِ

## జంతు వేట

(١١٤٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنِ اتَّخَذَ كَلْباً إِلاَّ كَلْبَ مَاشِيَةٍ، أَوْ صَيْدٍ، أَوْ زَرْعٍ، انْتُقِصَ مِنْ أَجْرِهِ كُلَّ يَوْمٍ قِيرَاطٌ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1147. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరయినాసరే పశువులను, సంపదను కాపాడుకునే ఉద్దేశ్యంతో పెంచుకునే కుక్కలు లేదా వేట కుక్కలు లేదా **వ్యవసాయోత్పత్తుల వరిరక్షణకై** ఉద్దేశ్యించిన కుక్కలు తప్ప వేరితర కుక్కను (సరదా కోసం) పెంచుకుంటే అతని పుణ్యంలో నుంచి ప్రతి రోజూ ఒకింత పుణ్యం తగ్గుతూ పోతుంది."

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

మనోరంజన కోసం, కాలక్షేపం కోసం, కుహనా ప్రతిష్ఠల కోసం కుక్కను పెంచటం నిషిద్ధ మని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. వ్యవసాయోత్పత్తుల, పాడిపంటల పరిరక్షణ కోసం, పశు సంపదను దొంగలబారి నుండి, శత్రువుల బారినుండి కాపాడుకునేందుకు కుక్కను పెంచుకుంటే తప్పులేదు. కేవలం సరదా కోసం గనక కుక్కను పోషిస్తే అనుదినం ఒక్కో యూనిట్ చొప్పున అతని పుణ్యం తగ్గుతూ ఉంటుంది.

(١١٤٨) وَعَنْ عَدِيِّ بْنِ حَاتِمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ لِي رَسُولُ اللهِ ﷺ: «إِذَا أَرْسَلْتَ كَلْبَكَ فَاذْكُرِ اسْمَ اللهِ عَلَيْهِ، فَإِنْ أَمْسَكَ عَلَيْكَ فَأَدْرَكْتَهُ حَيًّا فَاذْبَحْهُ، وَإِنْ أَدْرَكْتَهُ قَدْ قُتِلَ، وَلَمْ يَأْكُلْ مِنْهُ فَكُلْهُ، وَإِنْ وَجَدْتَ مَعَ كَلْبِكَ كَلْباً غَيْرَهُ، وَقَدْ قُتِلَ، فَلاَ تَأْكُلْ. فَإِنَّكَ لاَ تَدْرِي أَيُّهُمَا قَتَلَهُ، وَإِنْ رَمَيْتَ بِسَهْمِكَ فَاذْكُرِ اسْمَ اللهِ، فَإِنْ غَابَ عَنْكَ يَوْماً فَلَمْ تَجِدْ فِيهِ إِلاَّ أَثَرَ سَهْمِكَ فَكُلْ إِنْ

1148. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకీవిధంగా ఉపదేశించారని హజ్రత్ అదీ బిన్ హాతిమ్ (రజి) చెప్పారు: నువ్వు నీ వేట కుక్కను జంతువేట కోసం వదలినపుడు, దానిపై అల్లాహ్ పేరు పఠించు ('బిస్మిల్లాహ్' అని చెప్పు). మరి అది ఒకవేళ వేటాడిన జంతువును నీ కోసం ఆపి ఉంచితే, వేటాడబడిన ఆ జంతువు బ్రతికి ఉన్నట్లు నువ్వు చూస్తే దాన్ని 'జిబహ్' చేయి. ఒకవేళ వేటాడ బడిన ఆ జంతువు చనిపోయినా దాన్ని వేట కుక్క గనక ఇంకా ఏమీ తిని ఉండకపోతే నువ్వు దాన్ని తినవచ్చు. ఒకవేళ ఆ వేట కుక్కతో పాటు మరో కుక్క కూడా అక్కడ కనిపిస్తే, వేటాడ బడిన జంతువు కూడా చచ్చిపోయి ఉంటే, అప్పుడు దాన్ని తినవద్దు. ఎందు కంటే ఆ రెండు కుక్కల్లో ఏ కుక్క దాన్ని చంపిందో నీకు తెలీదు. ఒకవేళ నీవు బాణం (లేక ఈటె) వదిలితే దానిపై 'బిస్మిల్లాహ్' పఠించు. (నీ బాణానికి గురైన) వేట జంతువు ఒక రోజు తరువాతే నీకు కానవస్తే, దాని శరీరంపై నీ బాణం తప్ప మరొక బాణం గుర్తు లేకపోతే, అట్టి పరిస్థితిలో నువ్వా

شِئْتَ، وَإِنْ وَجَدْتَهُ غَرِيقاً فِي الْمَاءِ فَلاَ تَأْكُلْ». مُتَّفَقٌ عَلَيْهِ، وَهٰذَا لَفْظُ مُسْلِمٍ.

జంతువును తినదలచుకుంటే నిస్సంకోచంగా తినవచ్చు. అయితే బాణం దెబ్బ తగిలిన తరువాత ఆ జంతువు నీటిలో పడి చచ్చిపోతే మాత్రం దాన్ని తినకు. (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు ముస్లింలోనివి)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే తినడానికీ, లేదా లాభం గడించడానికీ వేటాడటం ధర్మసమ్మతమే. వేట కుక్కలతో జంతువును వేటాడినా, వేట పక్షుల సాయంతో వేటాడినా అట్టి జంతువులను తినటం హలాలే. అయితే ఈ సందర్భంగా రెండు నిబంధనలను పాటించాలి - 1. వేట కుక్కను వదిలేటప్పుడు 'బిస్మిల్లాహ్' పఠించటం తప్పనిసరి. 2. కుక్క శిక్షణ పొందినదై ఉండాలి. మరి శిక్షణ పొందిన కుక్క వేటాడిన జంతువులో ఏ కొంత భాగం తిన్నా ఆ జంతు మాంసం తినటం ధర్మ సమ్మతం కాదు. అది 'హరాం' అయిపోతుంది. వేటాడబడిన జంతువు సురక్షితంగా ఉంటే దాన్ని నిరభ్యంతరంగా తినవచ్చు. ఈ సందర్భంగా గమనించవలసిన ఇంకొక విషయమేమిటంటే, కుక్క వేట జంతువును తన దంతాలతో పట్టుకోగా, అది చనిపోతే దాన్ని తినవచ్చు. ఒకవేళ కుక్క శరీరపు దెబ్బతో అది మరణిస్తే మాత్రం తినటం హరామ్. వేటాడబడిన జంతువు మనిషి సమీపించే వరకూ బ్రతికి ఉంటే దాన్ని 'జిబహ్' చేయాలి. ఒకవేళ చచ్చిపోయినా తినటంలో అభ్యంతరం లేదు. వేట కుక్క జంతువును వేటాడక ముందు, దాని యజమాని అల్లాహ్ పేరును పఠించి మరీ వదలాలి. ఒకవేళ వేట కుక్క తనంతట తానే ఏదైనా జంతువును వేటాడితే అట్టి జంతువును తినటం సమ్మతం కాదు. మెజారిటీ ఉలమాల అభిమతం ఇదే.

బాణం లేక ఈటె ద్వారా వేటాడటం గురించి కూడా హదీసులో వచ్చింది. అయితే బాణాన్ని వదిలేటప్పుడు అల్లాహ్ పేరును స్మరించటం అవసరం. ఒకవేళ ఆ సమయంలో 'బిస్మిల్లాహ్' పఠించటం మరచిపోయినా వచ్చిన చిక్కు ఏమీ లేదు; అదీ సమ్మతమేనంటారు ఇమామ్ అబూ హనీఫా (రహ్మ.లై).

ఒకవేళ ఉద్దేశ్యపూర్వకంగా వదలివేసినా అట్టి జంతువును తినటం ఆక్షేపణీయం కాదని ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) భావిస్తున్నారు. ప్రవక్త ప్రియసహచరులలో ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయం కూడా ఇదే. జాహిరియా వర్గం మాత్రం మరపు వల్ల పఠించకపోయినా తినటం హరామేనంటోంది. ఈ తర్జన భర్జన తరువాత ప్రాధాన్యత నివ్వదగిన విషయం ఏమిటంటే, ముస్లిం వ్యక్తి చేసిన 'జిబహ్' లో అల్లాహ్ పేరు స్మరించలేదని ఖచ్చితంగా తెలిసిపోతే దాన్ని తినకుండా ఉండటమే శ్రేయస్కరం. అవునా?

కాదా? అన్న సంశయం ఏర్పడినట్లయితే అట్టి పరిస్థితిలో 'జిబహ్' చేసిన వ్యక్తి నికార్సయిన ముస్లిం అయివుంటే 'బిస్మిల్లాహ్' అంటూ ఆ మాంసాన్ని తినవచ్చు. ఒకవేళ బాణం తగిలిన పక్షి నీటిలో పడి చచ్చిపోతే దాన్ని తినకూడదు. ఎందుకంటే అది ఏకారణంగా చచ్చింది? - బాణం తగలటం వల్ల చచ్చిందా?! లేక నీటిలో మునగటం వల్ల ప్రాణం కోల్పోయిందా?! అన్నది సందేహాస్పదంగా మిగిలిపోతుంది. ఈ సందేహం మూలంగా దాన్ని తినకపోవటమే మేలు.

## హదీసు ఉల్లేఖకులు

అదీ బిన్ హాతిమ్ (రజి) : అదీ బిన్ హాతింతాయి. 'తై' తెగతో ఈయనకు సంబంధం ఉండేది. తండ్రి మాదిరిగానే ఈయన పేరు మోసిన దాత. హిజ్రీ 7వ సంవత్సరం, షాబాన్ నెలలో దైవప్రవక్త (సఅసం) దగ్గరకు ఒక బృందంగా వచ్చారు. అరేబియాలో ధర్మభ్రష్ట ఉపద్రవం పొడసూపినపుడు ఈయన తన తెగవారితో సహా ఇస్లాంపై స్థయిర్యం కనబరచారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయనకు అందిన మొట్టమొదటి సదఖా (జకాత్) అదీ బిన్ హాతిమ్ మరియు ఆయన జాతి వారి సదఖాయే. ముదాయన్ విజయంలో పాల్గొన్నారు. హజ్రత్ అలీ (రజి)తో కలసి యుద్ధాలలో పాల్గొన్నారు. జమల్ యుద్ధ సందర్భంగా ఈయన కన్ను ఒకటి పోయింది. దానధర్మాలలో, ఔదార్యంలో ఈయన నెలకొల్పిన ఉదాహరణలు విశ్వవిఖ్యాతి గాంచాయి. 120 సంవత్సరాలు జీవించి ఉన్నారు. హిజ్రీ 68లో మరణించారు.

(١١٤٩) وَعَنْ عَدِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنْ صَيْدِ الْمِعْرَاضِ فَقَالَ: «**إِذَا أَصَبْتَ بِحَدِّهِ فَكُلْ، وَإِذَا أَصَبْتَ بِعَرْضِهِ فَقَتَلَ فَإِنَّهُ وَقِيذٌ، فَلَا تَأْكُلْ**». رَوَاهُ الْبُخَارِيُّ.

1149. హజ్రత్ అదీ బిన్ హాతిం (రజి) కథనం : నేను మొనలేని బాణం (లేక ఈటె) తో చేసిన వేట గురించి దైవప్రవక్త (సఅసం)ను విచారించగా ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు : ఒకవేళ నీవు మొన వున్న వైపు నుంచి బాణం ప్రయోగిస్తే దాన్ని తినవచ్చు. ఒకవేళ అది అడ్డంగా తగిలి వేట జంతువు చచ్చిపోతే దెబ్బవల్ల చచ్చిన జంతువుగా పరిగణించ బడుతుంది. కాబట్టి దాన్ని తినకు.

(బుఖారీ)

## సారాంశం

వేట నియమాల్లోని ఒక ముఖ్యమైన నియమం పై హదీసులో సూచించబడింది. పదునైన

మొనగల వస్తువు వల్ల గాయమై, రక్తం ప్రవహించి జంతువు లేక పక్షి చనిపోతే దాన్ని తినటం హలాల్ (ధర్మ సమ్మతం). కాని మరేదైనా దెబ్బవల్ల చచ్చిపోతే మాత్రం తినటం హరామ్ (నిషిద్ధం). ఖుర్ఆన్ మరియు హదీసు - రెండింటి ద్వారా కూడా నిరూపితమైన విషయమిది.

(١١٥٠) وَعَنْ أَبِي ثَعْلَبَةَ، رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**إِذَا رَمَيْتَ بِسَهْمِكَ، فَغَابَ عَنْكَ، فَأَدْرَكْتَهُ: فَكُلْهُ، مَا لَمْ يُنْتِنْ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

1150. హజ్రత్ అబూ సాలబా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: నువ్వు నీ బాణంతో వేటాడగా, దానికి గురైన వేట జంతువు నీకు కనిపించ కుండా పోతే, ఆ తరువాత (మరునాడు) నీకు అగుపించి దుర్వాసన రాని స్థితిలో ఉంటే దాన్ని తినవచ్చు. (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే దేమిటంటే, ఏదైనా పక్షిని వేటాడిన తర్వాత అది గాయపడి, కంటికి కానరాని చోట వెళ్ళి పడిపోయి, తరువాత చచ్చిపోయిన స్థితిలో దొరికితే, దానిపై ఆ వేటగాని బాణం గుర్తు తప్ప మరొక గాయం గుర్తు ఏదీ లేకుండా ఉంటే - అప్పుడది కుళ్ళిపోకుండా ఉంటే - దాన్ని తినవచ్చు. కాని అదేగనక నీటిలోపడి చచ్చిపోతే మాత్రం దాన్ని తినటం నిషిద్ధం.

(١١٥١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: أَنَّ قَوْماً قَالُوا لِلنَّبِيِّ ﷺ: إِنَّ قَوْماً يَأْتُوْنَنَا بِاللَّحْمِ لاَ نَدْرِيْ أَذَكَرُوا اسْمَ اللهِ عَلَيْهِ، أَمْ لاَ؟ فَقَالَ: «**سَمُّوا اللَّهَ عَلَيْهِ أَنْتُمْ، وَكُلُوهُ**». رَوَاهُ الْبُخَارِيُّ.

1151. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : కొంతమంది సహచరులు దైవ ప్రవక్త (సఅసం) నుద్దేశ్యించి, "జనులు మా వద్దకు మాంసం తీసుకువస్తుం టారు. ఆ మాంసం ఎలాంటిదో, అది దేవుని పేరుతోనే కోసారో లేదో మాకు తెలీదు. ఇలాంటి పరిస్థితుల్లో మేమేం చేయాలి?" అని సందేహం వెలిబుచ్చగా, "మీరు దానిపై అల్లాహ్ పేరు స్మరించి తినండి" అని ఆయన (సఅసం) అన్నారు. (బుఖారీ)

**సారాంశం**

ఒక ముస్లిం తోటి ముస్లింపై సతతం సదనుమానం కలిగి ఉండాలనీ, ఏదేని ఒక వస్తువు

గురించి, అది ఖచ్చితంగా హరామ్ (నిషిద్ధం) అని తెలియనంతవరకూ సంశయాలు, సందేహాల ప్రాతిపదికన దాన్ని హరామ్‌గా ఖరారు చేయరాదనీ ఈ హదీసు ద్వారా అవగతం అవుతోంది. ముఖ్యంగా ఆ వస్తువు ఒక ముస్లిం అధీనంలో ఉన్నప్పుడు ఇలాంటి అనుమానాలకు అసలు ఆస్కారమే కలగకూడదు.

(١١٥٢) وَعَنْ عَبْدِاللهِ بْنِ مُغَفَّلٍ الْمُزَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ نَهَى عَنِ الْخَذْفِ، وَقَالَ إِنَّهَا: «**لاَ تَصِيدُ صَيْداً، وَلاَ تَنْكَأُ عَدُوًّا، وَلَكِنَّهَا تَكْسِرُ السِّنَّ، وَتَفْقَأُ الْعَيْنَ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

1152. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముగప్ఫల్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కంకర రాళ్ళు విసరి కొట్టడాన్ని వారించారు. ఇంకా ఆయన (స) ఇలా అన్నారు - ''నువ్వు వీటితో వేటాడనూ లేవు. శత్రువును తరిమి కొట్టనూ లేవు. కాకపోతే వీటివల్ల ఒకరి వళ్లు ఊడుతాయి లేదా కళ్లు పగులుతాయి.'' (బుఖారీ, ముస్లిం - వాక్యాలు ముస్లిం లోనివి)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే కంకర్రాళ్లు తగిలి చనిపోయిన పక్షులను తినటం ధర్మ సమ్మతం కాదు. కనుక ఈ చేష్ట వల్ల కలిగే లాభం కన్నా నష్టమే ఎక్కువ. ఈ లెక్కన ఘులైల్‌తో కొట్టిన జంతువును లేక పక్షిని తినటం కూడా హలాల్ కాదు. అలాగే తుపాకీ గుండుతో వేటాడిన జంతువును కూడా తినటం ధర్మసమ్మతం కాదని మెజారిటీ విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అయితే తుపాకీ గుండు శరీరంలోకి దూసుకుపోయి, రక్తాన్ని స్రవింపజేస్తుందని, అందుచేత తుపాకీ గుండుతో వేటాడిన జంతువును తినవచ్చనీ అల్లామా యమానీ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. (సుబుల్)

(١١٥٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهما، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**لاَ تَتَّخِذُوا شَيْئاً فِيهِ الرُّوحُ غَرَضاً**». رَوَاهُ مُسْلِمٌ.

1153. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ''ఏ ప్రాణినయినాసరే దాన్ని (నిర్బంధించి) గురిపెట్టి చంపరాదు'' అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సెలవిచ్చారు. (ముస్లిం)

**సారాంశం**

ప్రాణంతో వున్న ఏ జంతువు నైనాసరే కట్టేసి, గురిపెట్టి చంపటం హరామ్ అని ఈ హదీసు

చెబుతోంది. ఎందుకంటే ఇలాంటి పోకడవల్ల ఆ జంతువుకు ఎనలేని బాధ కలుగుతుంది. జంతువులను సయితం అనుచితంగా వేధించటానికి ఇస్లామీయ షరీయత్ అనుమతించదు.

(١١٥٤) وَعَنْ كَعْبِ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ امْرَأَةً ذَبَحَتْ شَاةً بِحَجَرٍ، فَسُئِلَ النَّبِيُّ ﷺ عَنْ ذٰلِكَ، فَأَمَرَ بِأَكْلِهَا. رَوَاهُ مُسْلِمٌ.

1154. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒక స్త్రీ రాతి ముక్కతో ఒక మేకను కోసింది. ఆ మేకను తినే విషయమై దైవప్రవక్త (సఅసం)ను విచారించగా "దాన్ని తినండి" అని ఆయన (సఅసం) ఆదేశించారు. **(బుఖారీ)**

**సారాంశం**

జంతువును 'జిబహ్' చేయడానికి కత్తిని మాత్రమే గాక, వేరితర వస్తువులను కూడా ఉపయోగించవచ్చని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. హదీసులో ప్రస్తావనకు వచ్చిన మహిళ ఉపయోగించిన రాతి ముక్క పదునైన మొనగలదని, దాంతో మేకను జిబహ్ చేయగా రక్తం ప్రవహించిందని వేరొక ఉల్లేఖనంలో ఉంది. ముస్లిం మహిళ జిబహ్ చేస్తే నిస్సంకోచంగా తినవచ్చునన్న సంగతి కూడా ఈ హదీసు ద్వారా నిరూపితమవుతోంది.

(١١٥٥) وَعَنْ رَافِعِ بْنِ خَدِيجٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**مَا أَنْهَرَ الدَّمَ وَذُكِرَ اسْمُ اللهِ عَلَيْهِ، فَكُلْ، لَيْسَ السِّنَّ وَالظُّفُرَ، أَمَّا السِّنُّ فَعَظْمٌ، وَأَمَّا الظُّفُرُ فَمُدَى الْحَبَشَةِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1155. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజి) తెలిపారు : రక్తాన్ని ప్రవహింపజేసే ఏ వస్తువుతోనయినా, అల్లాహ్ పేరు పఠించి జిబహ్ చేస్తే, ఆ జంతువును తిను. జిబహ్ చేసే పరికరం దంతంగానీ, గోరుగానీ అయి ఉండకూడదు. ఎందుకంటే దంతం కూడా ఎముకే. గోరు అబిసీనియన్ల కత్తి.

(బుఖారీ, ముస్లిం)

(١١٥٦) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِاللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يُقْتَلَ شَيْءٌ مِّنَ الدَّوَابِّ صَبْراً. رَوَاهُ مُسْلِمٌ.

1156. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : ఏ జంతువునైనా కట్టేసి చంపటాన్ని దైవప్రవక్త (సఅసం) వారించారు. (ముస్లిం)

## సారాంశం

కట్టివేసి చంపటం అంటే భావం సజీవమైన పశువును దేనికయినా కట్టేసి, గురిపెట్టి ఆయుధాన్ని ప్రయోగించి చంపటం. వినోదం కోసం అలా చేసినా, మరే ఉద్దేశ్యంతో చేసినా అది సమ్మతం కాదు. అయితే జిబహ్ చేసేందుకు పశువును కట్టివేస్తే అది సమ్మతమే. ఇది 'కట్టి చంపటం' క్రిందికి రాదు.

(١١٥٧) وَعَنْ شَدَّادِ بْنِ أَوْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ اللَّهَ كَتَبَ الْإِحْسَانَ عَلَى كُلِّ شَيْءٍ، فَإِذَا قَتَلْتُمْ فَأَحْسِنُوا الْقِتْلَةَ، وَإِذَا ذَبَحْتُمْ فَأَحْسِنُوا الذِّبْحَةَ، وَلْيُحِدَّ أَحَدُكُمْ شَفْرَتَهُ، وَلْيُرِحْ ذَبِيحَتَهُ**». رَوَاهُ مُسْلِمٌ.

1157. హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు- "అల్లాహ్ ప్రతి వస్తువు యెడల మేలు చేకూర్చడాన్ని విధిగా నిర్ధారించాడు. కాబట్టి మీరు చంపినా ఉత్తమ రీతిలోనే చంపండి. మీరు ఏదన్నా పశువును కోయదలచినపుడు ఉత్తమ పద్ధతిలో కోయండి. మీలో ప్రతి ఒక్కరూ (జిబహ్‌కు ఉపక్రమించినపుడు) తమ కత్తికి పదును పెట్టాలి. తాము జిబహ్ చేసే దానికి సౌఖ్యమొసగాలి." (ముస్లిం)

(١١٥٨) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**ذَكَاةُ الْجَنِينِ ذَكَاةُ أُمِّهِ**». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1158. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) తెలిపారు : "తల్లిని జిబహ్ చేస్తే దాని కడుపులోని శిశువు కూడా జిబహ్ అయిపోయినట్లే." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

## సారాంశం

ఇక్కడ 'తల్లి' అంటే ఆడ జంతువు అని భావం. జిబహ్ చేసిన సమయంలో ఒకవేళ అది సూడిదై ఉంటే, దాన్ని కోసిన మీదట దాని గర్భంలో వున్న శిశువు చనిపోయిన స్థితిలో ఉన్నప్పటికీ అది హలాల్ గానే పరిగణించబడుతుంది - దాన్ని ప్రత్యేకంగా జిబహ్ చేయవలసిన

అవసరం లేదు. ఇమామ్ అబూహనీఫా (రహ్మ్‌లై) మినహా విద్వాంసులందరి అభిప్రాయం ఇదే. ఇమామ్ అబూహనీఫా (రహ్మ్‌లై) మాత్రం దాన్ని తిరిగి 'జిబహ్' చేయాలని భావిస్తున్నారు.

(١١٥٩) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**الْمُسْلِمُ يَكْفِيهِ اسْمُهُ، فَإِنْ نَسِيَ أَنْ يُسَمِّيَ حِينَ يَذْبَحُ فَلْيُسَمِّ ثُمَّ لِيَأْكُلْ**». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ، وَفِيهِ رَاوٍ فِي حِفْظِهِ ضَعْفٌ، وَفِي إِسْنَادِهِ مُحَمَّدُ بْنُ يَزِيْدَ بْنِ سِنَانٍ، وَهُوَ صَدُوْقٌ ضَعِيْفُ الْحِفْظِ، وَأَخْرَجَهُ عَبْدُ الرَّزَّاقِ بِإِسْنَادٍ صَحِيْحٍ إِلَى ابْنِ عَبَّاسٍ، مَوْقُوفاً عَلَيْهِ. وَلَهُ شَاهِدٌ عِنْدَ أَبِي دَاوُدَ، فِي مَرَاسِيْلِهِ: بِلَفْظِ: «**ذَبِيْحَةُ الْمُسْلِمِ حَلاَلٌ، ذَكَرَ اسْمَ اللهِ عَلَيْهَا أَمْ لَمْ يَذْكُرْ**». وَرِجَالُهُ مُوَثَّقُونَ.

1159. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ముస్లిం కొరకు అల్లాహ్ నామమే చాలు. అందుచేత 'జిబహ్' సమయం లో దైవనామం మరచిపోయినట్లయితే 'బిస్మిల్లాహ్' పలికి తినేయాలి." (దారె ఖుత్నీ. దీని పరంపరలో ఉన్న ఒక ఉల్లేఖకుని జ్ఞాపక శక్తి సన్నగిల్లింది. దీని పరంపరలో ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ సినాన్ అనే వ్యక్తి ఉన్నాడు. అతను సత్యసంధుడే గాని అతని జ్ఞాపక శక్తి కూడా బలహీనమే. అబ్దుర్రజ్జాఖ్ మాత్రం ఇబ్నె అబ్బాస్ (రజి) నుండి దృఢమైన ఆధారాలతో నకలు చేశారు. అది మౌఖూఫ్ కోవకు చెందినది). ఈ హదీసు యొక్క సాక్ష్యం అబూదావూద్ 'మురాసిల్'లో లభిస్తుంది. "ముస్లిం చేసిన జిబహ్ - అతడు దానిపై అల్లాహ్ నామాన్ని స్మరించినా, స్మరించక పోయినా - అది ధర్మ సమ్మతమే" అన్న వాక్యాలు అందులో వున్నాయి. (దీని ఉల్లేఖకులంతా విశ్వసనీయులే).

**సారాంశం**

జిబహ్ సమయంలో 'తక్బీరె జిబహ్' ను మరచిపోయినప్పటికీ ఆ జంతువు హలాలే అన్నదానికి ఈ హదీసు ఒక నిదర్శనం. అయితే ఈ హదీసులు, 'జిబహ్ సమయంలో తక్బీర్

పలకటం తప్పనిసరి' అని చెప్పే సహీహ్ హదీసులతో ఏవిధంగానూ సరితూగలేవు. కాకపోతే ఈ హదీసులు 'తక్బీర్ తప్పనిసరి' అన్న వాదనలోని ఒత్తిడిని కొంత సడలింపజేస్తాయి.

### హదీసు ఉల్లేఖకులు

ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ సినాన్. ఈయన తమీమ్ తెగకు చెందినవారు. మరోపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన సాధు స్వభావుడేగాని, హదీసుల విషయంలో దృఢచిత్తం గలవారు కాదని అబూ హాతిం అన్నారు. ఆయనసలు లెక్కలోకి తీసుకోదగ్గవారు కాదని అబూదావూద్ వ్యాఖ్యానించారు. ఆయన గట్టివాడు కాడని ఇమామ్ నసాయి (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇబ్నె హిబ్బాన్ (రహ్మ.లై)ఈయన్ని విశ్వసనీయులలో చేర్చారు. ఈయన హిజ్రీ 220లో మరణించారు.

**2వ అధ్యాయం**

## ٢ - بَابُ الْأَضَاحِي

## ఖుర్బానీ ఆదేశాలు

(١١٦٠) عَنْ أَنَسِ بْنِ مَالِكٍ، رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ كَانَ يُضَحِّي بِكَبْشَيْنِ أَمْلَحَيْنِ أَقْرَنَيْنِ، وَيُسَمِّي، وَيُكَبِّرُ، وَيَضَعُ رِجْلَهُ عَلَىٰ صَفَاحِهِمَا. وَفِي لَفْظٍ: «ذَبَحَهُمَا بِيَدِهِ» مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي لَفْظٍ: «سَمِينَيْنِ». وَلِأَبِي عَوَانَةَ فِي صَحِيحِهِ: «نَمِينَيْنِ» بِالْمُثَلَّثَةِ بَدَلَ السِّينِ. وَفِي لَفْظٍ لِمُسْلِمٍ: «وَيَقُولُ بِسْمِ اللهِ وَاللَّهُ أَكْبَرُ».

1160. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు గొఱ్ఱెలను ఖుర్బానీ ఇచ్చేవారు. అవి తెలుపు నలుపు రంగుగలవై ఉండేవి. వాటికి కొమ్ములు ఉండేవి. (జిబహ్ చేసే సమయంలో) 'బిస్మిల్లాహ్' పఠించి 'తక్బీర్' పలికేవారు. గొర్రె మెడమీద తన కాలుపెట్టేవారు. ఆయన (స) వాటిని తమ స్వహస్తాలతో జిబహ్ చేశారని వేరొక ఉల్లేఖనంలో ఉంది. (బుఖారీ, ముస్లిం) "అవి బాగా బలిసినవి" అని మరొక ఉల్లేఖనంలో ఉంది. అబూ అవానా యొక్క సహీహ్‌లో 'సమీనైన్' అని వచ్చింది. అంటే "అవి ఖరీదైనవి." ఆయన (స) "బిస్మిల్లాహి వల్లాహు అక్బర్" అని పలికారని 'ముస్లిం' వాక్యాల ద్వారా తెలుస్తోంది.

وَلَهُ مِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَمَرَ بِكَبْشٍ أَقْرَنَ، يَطَأُ فِي سَوَادٍ، وَيَبْرُكُ فِي سَوَادٍ، وَيَنْظُرُ فِي سَوَادٍ، لِيُضَحِّيَ بِهِ، فَقَالَ: أَشْحَذِيْ الْمُدْيَةَ، ثُمَّ أَخَذَهَا فَأَضْجَعَهُ، ثُمَّ ذَبَحَهُ، وَقَالَ: بِسْمِ اللهِ، اللَّهُمَّ تَقَبَّلْ مِنْ مُحَمَّدٍ، وَآلِ مُحَمَّدٍ، وَمِنْ أُمَّةِ مُحَمَّدٍ. ﷺ

'ముస్లిం'లో హజ్రత్ ఆయిషా (ర.అ.) ఉల్లేఖనం ప్రకారం ఆయన (సఅసం) ఈ విధంగా ఆదేశించారు - "కొమ్ములు గల పొట్టేలు కావాలి. దాని కాళ్ళు, ఉదర భాగం నల్లగా ఉండాలి. కళ్లు కూడా నల్లగా ఉండాలి." ఇలాంటి పొట్టేలును ఆయన (స) ఖుర్బానీ ఇవ్వదలిచారు. ఆయన (స) ఇలా అన్నారు : "ఆయిషా! కత్తికి పదునుపెట్టు." తరువాత ఆయన (స) కత్తి పట్టుకుని పొట్టేలును క్రింద పడవేశారు. ఆపై దాన్ని జిబహ్ చేశారు. ఆ సందర్భంగా ఆయన (స) ఇలా పలికారు : "అల్లాహ్ పేరుతో. ఓ అల్లాహ్! ముహమ్మద్ (స), ముహమ్మద్ కుటుంబం, ముహమ్మద్ అనుచర సమాజం తరపున దీన్ని (ఈ ఖుర్బానీని) స్వీకరించు."

**సారాంశం**

ఈ హదీసు ద్వారా క్రింది అంశాలు నిరూపితమవుతున్నాయి -

1. దైవప్రవక్త (సఅసం) మదీనాలో కూడా ఖుర్బానీ ఇచ్చారు. 2. బాగా బలిసిన, ఖరీదైన గొఱ్ఱెను ఖుర్బానీ ఇవ్వడానికి ఆయన (స) ఇష్టపడేవారు. 3. ఖుర్బానీ ఇచ్చే ముందు కత్తికి బాగా పదునుపెట్టాలి. 4.జిబహ్ చేసే ముందు జంతువును పడుకోబెట్టాలి. 5. జిబహ్ చేయకముందు సాంప్రదాయక దుఆలు (వేడుకోళ్ళు) పఠించాలి. 6. కుటుంబం తరపున ఒక జంతువును ఖుర్బానీ చేసినా 'సున్నత్' నెరవేరుతుంది. 7. ఇతరులు జిబహ్ చేసినా తప్పులేదు గానీ మనిషి తన జంతువును తానే జిబహ్ చేయటం అభిలషణీయం.

(١١٦١) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ كَانَ لَهُ سَعَةٌ وَلَمْ يُضَحِّ فَلاَ يَقْرَبَنَّ مُصَلاَّنَا**».

1161. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఖుర్బానీ ఇచ్చే స్థోమత ఉండి కూడా

رَوَاهُ أَحْمَدُ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ لَكِن رَجَّحَ الأَئِمَّةُ غَيْرُهُ وَقْفَهُ.

ఖుర్బానీ ఇవ్వని వారు మా ఈద్గాహ్‌కు రానవసరం లేదు.'' (దీనిని అహ్మద్, ఇబ్నెమాజా ఉల్లేఖించారు. హాకిమ్ దీన్ని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు. ఇతర ఇమాములు మాత్రం ఈ హదీసును 'మౌఖూఫ్'గా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ఆధారంగా కొంతమంది ఖుర్బానీ ఇవ్వడాన్ని తప్పనిసరి (వాజిబ్) అని భావించారు. కాని ఇలా భావించటం సరైంది కాదు. మొదటి విషయం ఏమిటంటే ఈ హదీసు 'మౌఖూఫ్' కోవకు చెందినది. రెండోది : ఇది ''వెల్లుల్లి తిన్నవాడు మా మస్జిద్‌కు రానవసరం లేదు'' అన్న హదీసును పోలినది. మెజారిటీ విద్వాంసుల దృష్టిలో ఈ ఆదేశం పుణ్యప్రదమైన (అభిలషణీయమైన) విషయాన్ని నొక్కి వక్కాణిస్తోంది. వాస్తవానికి ఖుర్బానీ ఒక 'సున్నత్.' ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అది ఇస్లాం చిహ్నాలకు సంబంధించినది.

(١١٦٢) وَعَنْ جُنْدُبِ بْنِ سُفْيَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: شَهِدْتُ الْأَضْحَى مَعَ رَسُولِ اللهِ ﷺ، فَلَمَّا قَضَى صَلاَتَهُ بِالنَّاسِ نَظَرَ إِلَى غَنَمٍ قَدْ ذُبِحَتْ، فَقَالَ: «مَنْ ذَبَحَ قَبْلَ الصَّلاَةِ فَلْيَذْبَحْ شَاةً مَكَانَهَا، وَمَنْ لَمْ يَكُنْ ذَبَحَ فَلْيَذْبَحْ عَلَى اسْمِ اللهِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1162. హజ్రత్ జున్దుబ్ బిన్ సుఫ్యాన్ (రజి) కథనం : ''నేను ఖుర్బానీ పండుగ (బఖ్రీద్ పండుగ) రోజు దైవప్రవక్త (సఅసం) వెంట ఉన్నాను. ఆయన (స) ప్రజలతో కలసి నమాజ్ ముగించేసరికి ఒక మేక 'జిబహ్' చేయబడి ఉంది.దాన్ని చూసి ఆయన (సఅసం) ఇలా అన్నారు: ''ఎవరయినా నమాజుకు పూర్వం మేకను జిబహ్ చేసి ఉంటే అతను దానికి బదులు మళ్ళీ మరొక మేకను జిబహ్ చేయాలి. నమాజుకు ముందు ఖుర్బానీ ఇవ్వనివాడు (నమాజు తరువాత) అల్లాహ్ పేరుతో (అంటే బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ అని పఠించి) జిబహ్ చేయాలి. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఖుర్బానీ పశువును పండుగ నమాజ్ అనంతరం జిబహ్ చేయటమే సరైన సమయం అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఒకవేళ ఎవరయినా పండుగ నమాజ్‌కు పూర్వమే పశువును జిబహ్ చేస్తే ఆ 'ఖుర్బానీ' స్వీకారయోగ్యమవదు. అలా చేసిన వ్యక్తి తిరిగి ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది. ఇక ఖుర్బానీ ఇవ్వవలసిన కడపటి సమయం ఏది? అన్న విషయంలో భేదాభిప్రాయం ఉంది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై), ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై)ల దృష్టిలో జిల్‌హజ్జ్ 12వ తేదీ సాయంత్రం కడపటి సమయం. ఇమామ్ షాఫయి (రహ్మ.లై) ప్రకారం జిల్‌హజ్జ్ 13వ తేదీ సాయంత్రం కడపటి సమయం. దావూద్ జాహిరీ మరియు తాబయీన్లలోని ఒక సమూహం దృష్టిలో 'మినా'లోనయితే 12వ తేదీ వరకు ఖుర్బానీ ఇవ్వవచ్చు. వేరితర స్థలాలలోనయితే 'యౌమున్నహర్'న మాత్రమే ఖుర్బానీ ఇవ్వాలి. హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ.లై), హాఫిజ్ ఇబ్నె కసీర్ (రహ్మ.లై) ప్రభృతులు ఇమామ్ షాఫయి (రహ్మ.లై) అభిప్రాయాన్ని - ప్రామాణికత రీత్యా - ప్రాధాన్యత నివ్వదగినదిగా పేర్కొన్నారు. అంటే తష్రీఖ్ దినాలు గడిచేవరకు - జిల్ హజ్జ్ 13 వరకూ - ఖుర్బానీ ఇవ్వవచ్చని భావం.

## హదీసు ఉల్లేఖకులు

జున్దుబ్ బిన్ సుఫ్యాన్ (రజి) : జున్దుబ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ సుఫ్యాన్ (రజి). బజీలా తెగకు చెందినవారవటం చేత బజలీగా పిలువబడ్డారు. అలఖీగా కూడా వ్యవహరించబడ్డారు. అలఖీ తెగ బజీలా తెగ శాఖే. దైవప్రవక్త (స) ప్రియ సహచరులు. తొలుత 'కూఫా'లో ఉండేవారు. తరువాత బస్రాకు తరలివెళ్ళారు. హిజ్రీ 60 తరువాత మరణించారు.

(١١٦٣) وَعَنِ الْبَرَآءِ بْنِ عَازِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَامَ فِيْنَا رَسُولُ اللهِ ﷺ فَقَالَ: «أَرْبَعٌ لاَ تَجُوزُ فِي الضَّحَايَا: الْعَوْرَاءُ الْبَيِّنُ عَوَرُهَا، وَالْمَرِيضَةُ الْبَيِّنُ مَرَضُهَا، وَالْعَرْجَاءُ الْبَيِّنُ ضَلَعُهَا، وَالْكَبِيرَةُ الَّتِي لاَ

1163. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం : దైవప్రవక్త - సల్లల్లాహు అలైహి వ సల్లం - మా మధ్య నిలబడి ఇలా ఉపదేశించారు: "నాలుగు రకాల పశువులు ఖుర్బానీ కొరకు సమ్మతం కావు. ఒకటి: ఒంటి కన్ను పశువు. దానికి ఒక్క కన్ను మాత్రమే ఉన్నట్లు స్పష్టంగా తెలియాలి. రెండు : రోగగ్రస్త పశువు. అయితే దానికి రోగమున్నట్లు ఖచ్చితంగా నిర్ధారణ కావాలి. మూడు: కుంటి పశువు. అయితే దాని కుంటి తనం స్పష్టంగా కనిపించాలి. నాలుగు :

تُنْقِي». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ.

ఎముకల్లో సత్తువ లేనంతగా బాగా ముసలిదైపోయిన పశువు.'' (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

పైన పేర్కొనబడిన నాలుగు లోపాలు గల పశువులు ఖుర్బానీ కోసం యోగ్యమైనవి కావని ఈ హదీసు స్పష్టంగా చెబుతున్నది. వాటిలో ఏ ఒక్క లోపం ఉన్నా అది పనికిరాదు. ఈ నాలుగు లోపాలు కాక మరేదైనా ఇంతకన్నా తీవ్రమయిన లోపం ఉన్నా అది ఖుర్బానీకి పనికి రాదు. ఫలానా లోపం ఉన్నట్లు స్పష్టంగా నిర్ధారితమవ్వాలని అనటంలోని ఉద్దేశ్యం ఏమిటంటే ఆ లోపం స్వల్పస్థాయిలో - ఉండీ లేనట్లుగా - ఉంటే అప్పుడది లోపంగా పరిగణించబడదు. అది ఉపేక్షించదగిన లోపమే.

(١١٦٤) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَذْبَحُوا إِلاَّ مُسِنَّةً، إِلاَّ أَنْ يَعْسُرَ عَلَيْكُمْ، فَتَذْبَحُوا جَذَعَةً مِنَ الضَّأْنِ**». رَوَاهُ مُسْلِمٌ.

1164. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : ''వయసులో వున్న పశువును తప్ప 'జిబహ్' చేయకండి. కాని గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడినట్లయితే బలిష్ట మయిన ఆరు మాసాల పొట్టేలును కూడా జిబహ్ చేయవచ్చు'' అని దైవ ప్రవక్త (సఅసం) ఉపదేశించారు. (ముస్లిం)

**సారాంశం**

అరబీలో 'ముసిన్నా' అనే పదం వాడబడింది. ముసిన్నా అంటే రెండు పాల దంతాలు రాలి, వాటి స్థానంలో అసలు దంతాలు వచ్చిన పశువు అని భావం. ఆ స్థితికి చేరిన జంతువు మాత్రమే యుక్త వయస్సుకు చేరినట్లు లెక్క. మేక, గొఱ్ఱె (లేక పొట్టేలు) లాంటి పశువులు ఏడాది కాలానికి, ఆవు, గేదెలాంటి పశువులైతే మూడవ పడిలో పడేనాటికి ఈ 'ముసిన్నా' స్థితికి చేర్తాయి. అదే ఒంటె అయితే ఐదేళ్ళకు గాని ఈ పరిపక్వ స్థితికి చేరదు. కాని ఖుర్బానీ పశువులు లభ్యం కావటం కష్టతరమో లేక ఆర్థిక కారణాలవల్ల పెద్ద తరహా పశువుల ఖుర్బానీ కష్ట సాధ్యమవటమో జరిగితే అట్టి పరిస్థితిలో ఆరు నెలలు నిండిన గొఱ్ఱెలను కూడా జిబహ్ చేయవచ్చు. అయితే అవి ఆరోగ్యవంతంగా ఉండాలి. **బలిసి ఉండాలి.**

(١١٦٥) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَ رَسُولُ اللهِ ﷺ أَنْ نَسْتَشْرِفَ الْعَيْنَ وَالْأُذُنَ، وَلاَ نُضَحِّيَ بِعَوْرَآءَ، وَلاَ مُقَابَلَةٍ، وَلاَ مُدَابَرَةٍ، وَلاَ خَرْقَآءَ، وَلاَ شَرْقَآءَ». أَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1165. హజ్రత్ అలీ (రజి) కథనం : ఖుర్బానీ కొరకు ఉద్దేశ్యించిన జంతువు కళ్ళను, చెవులను బాగా చూసుకోమనీ, ఏ జంతువు అయినా ఒంటి కన్నుదై ఉన్నా లేక దాని చెవి ముందు వైపున గానీ వెనుక వైపునగానీ తెగి వ్రేలాడుతూ ఉన్నా, లేదా చెవి మధ్యలో నుంచి తెగి ఉన్నా లేదా పళ్ళు రాలిపోయి వున్నా - అలాంటి జంతువును ఖుర్బానీ ఇవ్వ రాదని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆదేశించారు. (ఈ హదీసును అహ్మద్ మరియు 'నలుగురు' సేకరించారు. తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(١١٦٦) وَعَنْ عَلِيِّ بْنِ أَبِي طَالِبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: أَمَرَنِي رَسُولُ اللهِ ﷺ أَنْ أَقُومَ عَلَى بُدْنِهِ، وَأَنْ أَقْسِمَ لُحُومَهَا وَجُلُودَهَا وَجِلاَلَهَا عَلَى الْمَسَاكِيْنَ، وَلاَ أُعْطِي فِي جِزَارَتِهَا مِنْهَا شَيْئاً. مُتَّفَقٌ عَلَيْهِ.

1166. హజ్రత్ అలీ (రజి) కథనం : నన్ను ఖుర్బానీకై ఉద్దేశ్యించిన ఒంటెలకు కాపలాగా ఉండవలసిందిగా దైవప్రవక్త (సఅసం) సూచించారు. ఇంకా వాటి మాంసాన్ని, చర్మాన్ని, జీనును (వస్త్రాన్ని) పేదలకు పంచిపెట్టాలనీ, కసాయి వానికి ఇందులో నుంచి ఏమీ ఇవ్వ రాదని ఆయన (సఅసం) ఆజ్ఞాపించారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

హజ్జతుల్ విదా (దైవప్రవక్త -సఅసం-వారి అంతిమ హజ్ యాత్ర) సందర్భంగా దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి)చే యమన్ నుండి తెప్పించిన ఒంటెలవి. అవి నూరు ఒంటెలని అనబడుతోంది. ఆ ఒంటెల మంచీ చెబ్బరలను చూడవలసిన బాధ్యత కూడా హజ్రత్ అలీ (రజి) పై మోపారు దైవప్రవక్త (స).

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయమేమిటంటే ఖుర్బానీ పశువుల (ఒంటెల) మాంసం, చర్మం, వాటిపై కప్పబడే గుడ్డ, ఒంటె త్రాడు - ఇత్యాదివన్నీ పేదలకు, అగత్యపరులకు ఇచ్చివేయాలి. కసాయివానికి ఇవేమీ ఇవ్వకూడదు. అయితే అతని శ్రమకుగాను వేతనం మాత్రం ఇవ్వాలి.

(١١٦٧) وَعَنْ جَابِرِ بْنِ عَبْدِاللهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: نَحَرْنَا مَعَ رَسُولِ اللهِ ﷺ عَامَ الْحُدَيْبِيَةِ الْبَدَنَةَ عَنْ سَبْعَةٍ، وَالْبَقَرَةَ عَنْ سَبْعَةٍ. رَوَاهُ مُسْلِمٌ.

1167. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : హుదైబియా ఒడంబడిక జరిగినప్పుడు మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలసి ఏడుగురు మనుషుల తరపున ఒక ఒంటె చొప్పున, ఏడుగురు వ్యక్తుల తరపున ఒక ఆవు చొప్పున జిబహ్ చేశాము. (ముస్లిం)

**సారాంశం**

ఖుర్బానీ కొరకు ఉద్దేశ్యించిన పెద్ద పశువులలో ఏడుగురు వ్యక్తులు భాగస్థులుగా చేరవచ్చని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఒంటెలాంటి పశువునయితే పది మంది కూడా కలసి ఖుర్బానీ ఇవ్వవచ్చు. తిర్మిజీలో ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ఇలా వుంది : "మేము ఒక ప్రయాణంలో దైవప్రవక్త (సఅసం) వెంట ఉన్నాము. ఖుర్బానీ సమయం ఆసన్నమవగానే ఏడుగురు వ్యక్తులు ఆవులో భాగస్వామ్యం పొందారు. ఒంటెలో పదిమంది భాగస్థులుగా చేరారు. ఈ ఉల్లేఖనం నసాయి, ఇబ్నె మాజాలలోనూ ఉంది."

**3వ అధ్యాయం**

## ٣ - بَابُ الْعَقِيقَةِ

## అఖీఖా

(١١٦٨) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ عَقَّ عَنِ الْحَسَنِ وَالْحُسَيْنِ كَبْشاً كَبْشاً. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ الْجَارُودِ وَعَبْدُ الحَقِّ، لَكِن رَجَّحَ

1168. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) హసన్ (రజి) మరియు హుసైన్ (రజి)ల తరపున ఒక్కో పొట్టేలును కోసి, అఖీఖా చేశారు. (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, ఇబ్నె జారూద్, అబ్దుల్ హఖ్ దీన్ని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. అయితే ఈ హదీసు 'ముర్సల్'అని అబూ హాతిమ్ నొక్కి

أَبُو حَاتِمٍ إِرْسَالَهُ، وَأَخْرَجَ ابْنُ حِبَّانَ مِنْ حَدِيْثِ أَنَسٍ نَحْوَهُ.

చెప్పారు. ఇంకా ఇబ్నె హిబ్బాన్ కూడా హాజత్ అనస్ (రజి) ఆధారంగా ఇలాగే ఉల్లేఖించారు).

## సారాంశం

పుట్టిన శిశువు తరపున జిబహ్ చేయబడే దానిని అఖీఖాగా వ్యవహరిస్తారు.

అయితే - గర్భస్థ శిశువు తలపై మొలిచే వెంట్రుకలను అసలు 'అఖీఖా' అంటారు. పుట్టిన శిశువుకు ఆ వెంట్రుకలు ఉన్న స్థితిలోనే పశువును జిబహ్ చేసి, శిరో ముండనం చేయటం జరుగుతుంది. పుట్టిన శిశువు మగ పిల్లవాడైనప్పటికీ అతని పేరున ఒక జంతువును జిబహ్ చేసినా సరిపోతుందని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది.

## హదీసు ఉల్లేఖకులు

హుసైన్ (రజి): ఈ హదీసులో ప్రస్తావనకు వచ్చిన హసన్ (రజి) గురించి ఈ పుస్తకం మొదటి భాగం (నమాజ్ పుస్తకం)లో చెప్పుకున్నాము. ఇక హాజత్ హుసైన్ (రజి) గురించి - ఈయన హాజత్ హసన్ సోదరులు. హాజత్ హసన్ (రజి) కన్నా సుమారు ఏడాది చిన్నవారు. ఇద్దరూ దైవప్రవక్త (సఅసం) ముద్దుల మనవళ్ళు. హాజత్ హుసైన్ (రజి) హిజ్రీ 61లో ముహర్రం 10వ తేదీన ఇరాక్‌లోని 'కర్బలా' కదన రంగంలో అమరగతి నొందారు. సదాచార సంపన్నులు; ప్రశంసలు, పొగడ్తలకు అతీతులు.

(١١٦٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ أَمَرَهُمْ أَنْ يُعَقَّ عَنِ الْغُلَامِ شَاتَانِ مُكَافِئَتَانِ، وَعَنِ الْجَارِيَةِ شَاةٌ. رَوَاهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ، وَأَخْرَجَهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ عَنْ أُمِّ كُرْزٍ الْكَعْبِيَّةِ نَحْوَهُ.

1169. హాజత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం : మగ పిల్లవాని తరపున ఒకే విధమైన రెండు మేకలు, ఆడ పిల్ల తరఫున ఒక మేకను కోని అఖీఖా చేయవలసిందిగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులకు ఆదేశించారు. (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు. ప్రామాణికంగా కూడా ఖరారు చేశారు. అహ్మద్ మరియు 'నలుగురు' కూడా ఉమ్మె కుర్జ్ కాబియా ద్వారా ఇదే విధంగా ఉటంకించారు)

## సారాంశం

ఇది 'జమ్హూర్' దృష్టిలో అభిలషణీయం. అయితే అఖీఖాలో మగపిల్లవాడైతే రెండు

మేకల్ని, ఆడపిల్ల అయితే ఒక మేకను జిబహ్ చేయాలని హదీసులో స్పష్టంగా చెప్పబడింది. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై) దృష్టిలో ఈ 'తేడా' కనబరచనవసరం లేదు. అయితే ఆయన అభిప్రాయం ఈ హదీసుకు విరుద్ధంగా ఉంది. ఖుర్బానీ పశువుల మాదిరిగా అఖీఖా పశువుల విషయంలో కఠినమైన షరతులైతే లేవుగాని మొత్తమ్మీద అఖీఖా పశువులో కూడా పెద్ద లోపం ఏదీ ఉండకూడదు. ఖుర్బానీ పశువులలో ఏ ఏ లోపాలు ఉండకుండా జాగ్రత్తపడమని చెప్పబడిందో వాటిని ఈ సందర్భంగా దృష్టిలో పెట్టుకోవటం అభిలషణీయం. అఖీఖా సందర్భంగా జిబహ్ చేసే పశువు 'ముసిన్నా' (నిర్ణీత వయస్సుకు చేరినదై) ఉండాలన్న షరతు కూడా ఏ హదీసులోనూ లేదు. అయితే అది మరీ మేకపిల్ల అయి ఉండకూడదు. ఇక్కడ అరబీలో 'షాతున్' అనే పదం ప్రయోగించబడింది. దీన్నిబట్టి అది కనీసం మేక అనిపించేలా ఉంటే చాలు.

### హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె కుర్జ్ కాబియా (ర.అన్హా) : ఖుజాఅ తెగకు చెందిన మహిళ. అందుచేత ఈమె ఖుజాయియగా పిలువబడ్డారు. సహాబియా (ప్రవక్త సహచరురాలు). అనేక హదీసులు ఈమెచే ఉల్లేఖించబడ్డాయి.

(١١٧٠) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**كُلُّ غُلَامٍ مُرْتَهَنٌ بِعَقِيقَتِهِ، تُذْبَحُ عَنْهُ يَوْمَ سَابِعِهِ، وَيُحْلَقُ وَيُسَمَّى**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1170. హజ్రత్ సమురా కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ప్రతి పిల్లవాడూ తన అఖీఖాకు బదులు 'తాకట్టు'గా ఉన్నాడు. పుట్టిన ఏడవ రోజున అతని అఖీఖా చేయాలి.శిరోముండనం చేయించాలి. అతనికి పేరు పెట్టాలి. (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

### సారాంశం

పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతని తలపైని వెంట్రుకలను తొలగించి, తలకు స్నానం చేయించాలని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. మరి అదే రోజున అతని అఖీఖా చేయటంతో పాటు, అతనికి నామకరణం కూడా చేయటం మంచిది.

# 13. ప్రమాణాల, మొక్కుబడుల పుస్తకం

## ١٣-كِتَابُ الْأَيْمَانِ وَالنُّذُورِ

(١١٧١) عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، أَنَّهُ أَدْرَكَ عُمَرَ بْنَ الْخَطَّابِ فِي رَكْبٍ، وَعُمَرُ يَحْلِفُ بِأَبِيهِ، فَنَادَاهُمْ رَسُولُ اللهِ ﷺ: «أَلَا! إِنَّ اللَّهَ يَنْهَاكُمْ أَنْ تَحْلِفُوا بِآبَائِكُمْ، فَمَنْ كَانَ حَالِفاً فَلْيَحْلِفْ بِاللهِ أَوْ لِيَصْمُتْ». مُتَّفَقٌ عَلَيْهِ.

1171. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)ని, కొందరు రౌతులతో కలసి వెళుతూ తన తండ్రి పేరుతో ప్రమాణం చేస్తూ ఉండటం చూశారు. అప్పుడాయన హజ్రత్ ఉమర్ (రజి)ని పిలిచి, "జాగ్రత్త! **అల్లాహ్ మిమ్మల్ని, మీ తాత ముత్తాతల** మీద ప్రమాణం చేయడాన్ని వారించాడు. కాబట్టి ఇక మీదట ఎవరయినా ప్రమాణం చేయదలచుకుంటే అల్లాహ్‌పై ప్రమాణం చేయాలి. లేకపోతే ఊరుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

وَفِي رِوَايَةٍ لأَبِي دَاوُدَ وَالنَّسَائِيِّ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مَرْفُوعاً: «لاَ تَحْلِفُوا بِآبَائِكُمْ، وَلاَ بِأُمَّهَاتِكُمْ، وَلاَ بِالْأَنْدَادِ، وَلاَ تَحْلِفُوا بِاللهِ إِلاَّ وَأَنْتُمْ صَادِقُونَ».

అబూదావూద్ మరియు నసాయి హజ్రత్ అబూహురైరా (రజి) నుండి చేసిన ఒక 'మర్ఫూ' ఉల్లేఖనంలో ఇలా వుంది : "మీ పితామహుల, తాతముత్తాతల, మీ మాతృమూర్తుల మీద మరియు అల్లాహ్‌కు సహవర్తులుగా ఉన్నవారి మీద ప్రమాణం చేయకండి. అల్లాహ్ మీద ప్రమాణం కూడా - మీరు సత్యవంతులైతేనే - చేయండి."

(١١٧٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**يَمِينُكَ عَلَى مَا يُصَدِّقُكَ بِهِ صَاحِبُكَ**». وَفِي رِوَايَةٍ: «**اَلْيَمِينُ عَلَى نِيَّةِ الْمُسْتَحْلِفِ**». أَخْرَجَهُمَا مُسْلِمٌ.

1172. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "నీ సహవాసి నిన్ను సత్యమూర్తిగా నమ్మినపుడే నీ ప్రమాణం అతనిపై నెరవేరుతుంది." వేరొక కథనంలో ఇలా వుంది: ప్రమాణాన్ని స్వీకరించేవాని సంకల్పాన్ని బట్టే ఆ ప్రమాణం అతనికి వర్తిస్తుంది." (ఈ రెండు హదీసుల ఉల్లేఖనాలూ 'ముస్లిం' చేశారు)

**సారాంశం**

ప్రమాణం చేయటం సరైనదేనని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. అయితే ప్రమాణం చేసేవాడు ఎదుటివాని ఉద్దేశానికి విరుద్ధంగా చెయ్యకుండా ఉన్నప్పుడే ఆ ప్రమాణం అతనికి వర్తిస్తుంది. ఒకవేళ ప్రమాణం దురుద్దేశ్యంతో చేస్తే లేదా అబద్ధపు ప్రమాణం చేస్తే దాని భారమంతా అతనిపైనే పడుతుంది.

(١١٧٣) وَعَنْ عَبْدِ الرَّحْمٰنِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**وَإِذَا حَلَفْتَ عَلَى يَمِينٍ، فَرَأَيْتَ غَيْرَهَا خَيْراً مِنْهَا، فَكَفِّرْ عَنْ يَمِينِكَ وَائْتِ الَّذِي هُوَ خَيْرٌ**». مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي لَفْظٍ لِلْبُخَارِيِّ: «**فَأْتِ الَّذِي هُوَ خَيْرٌ، وَكَفِّرْ عَن**

1173. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ సమురా (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు - "మీరు ఏదైనా వ్యవహారంపై ప్రమాణం చేసి, ఆ వ్యవహారానికి భిన్నంగా ఉన్నదే మంచిదని మీరు గ్రహించినపుడు ఆ ప్రమాణానికి పరిహారం చెల్లించండి (ప్రమాణాన్ని ఉపసంహరించుకోండి). మంచిదనుకున్న దాన్నే అనుసరించండి." (బుఖారీ, ముస్లిం) బుఖారీలోని వాక్యాలు ఇలా ఉన్నాయి - "ఉత్తమంగా ఉన్న పనిని చేయండి. ప్రమాణానికి పరిహారం

يَمِينِكَ». وَفِي رِوَايَةٍ لأَبِي دَاوُدَ: «فَكَفِّرْ عَنْ يَمِينِكَ. ثُمَّ ائْتِ الَّذِي هُوَ خَيْرٌ». وَإِسْنَادُهَا صَحِيحٌ.

(కప్పారా) చెల్లించండి.'' అబూదావూద్ ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది : ''మీ ప్రమాణానికి పరిహారం చెల్లించి, మెరుగైన పనిని చేయండి.'' (రెండు హదీసుల పరంపర కూడా దృఢమైనదే)

## హదీసు ఉల్లేఖకులు

అబ్దుర్రహ్మాన్ బిన్ సముర (రజి) : మారుపేరు అబూ సయీద్. ప్రవక్త సహచరులు. మక్కా విజయం సందర్భంగా ఇస్లాంలో చేరారు. సజిస్తాన్, కాబూల్‌లను జయించారు. బస్రాలో స్థిరపడ్డారు. హిజ్రీ 50లో లేదా ఆ తరువాత మరణించారు.

(١١٧٤) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ حَلَفَ عَلَى يَمِينٍ، فَقَالَ: إِنْ شَاءَ اللَّهُ، فَلاَ حِنْثَ عَلَيْهِ». رَوَاهُ أَحْمَدُ وَالأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1174. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ''ఎవరైనా ఏదైనా వ్యవహారంపై ప్రమాణం చేసి, వెంటనే 'ఇన్‌షాఅల్లాహ్' (దైవచిత్తమయితే) అని చెబితే ఆ ప్రమాణాన్ని భంగపరచినందుకు పరిహారం లేదు.'' (ఈ హదీసును అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

## సారాంశం

ప్రమాణం చేసేవాడు ప్రమాణం చేసిన తక్షణమే ''దైవచిత్తమయితే'' అని అంటే, అట్టి ప్రమాణాన్ని భంగపరచినందుకు 'కప్పారా' ఉండదని ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. ఎందుకంటే ప్రమాణాన్ని దైవేచ్ఛతో ముడిపెట్టినట్లయితే ఆ ప్రమాణం బాధ్యత అతనిపై ఉండదు. ఈ విషయంలో అందరిమధ్యా ఏకాభిప్రాయం ఉంది.

(١١٧٥) وَعَنْهُ، قَالَ: كَانَتْ يَمِينُ النَّبِيِّ

1175. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సఅసం) ప్రమాణం

ﷺ: «لاَ، وَمُقَلِّبِ الْقُلُوبِ». رَوَاهُ الْبُخَارِيُّ.

చేసినపుడు "కాదు.... మనసులను మార్చే వాని సాక్షిగా!" లాంటి పదాలను వాడేవారు." (బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) ప్రమాణం చేసే తీరు వివరించబడింది. ఏదేని సమావేశంలో జరిగే సంభాషణ లేక చర్చ సవ్యంగా లేకుంటే, దాన్ని ఖండిస్తున్నందుకు సూచనగా ఆయన 'లా' (అది కాదు) అన్న పదం ఉపయోగించేవారు. ఆ తరువాత దేవుని గుణగణాలతో కూడిన పేర్లపై ప్రమాణం చేసేవారు. దేవుని గుణ నామాలపై ప్రమాణం చేయడం కూడా సమ్మతమేనన్న దానికి ఈ హదీసు తార్కాణం.

(١١٧٦) وَعَنْ عَبْدِاللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: جَاءَ أَعْرَابِيٌّ إِلَى النَّبِيِّ ﷺ، فَقَالَ: يَا رَسُولَ اللهِ! مَا الْكَبَائِرُ؟ – فَذَكَرَ الْحَدِيْثَ، وَفِيْهِ – «الْيَمِيْنُ الْغَمُوسُ» – وَفِيْهِ – قُلْتُ: وَمَا الْيَمِيْنُ الْغَمُوسُ؟ قَالَ: «الَّتِي يُقْتَطَعُ بِهَا مَالُ امْرِىءٍ مُسْلِمٍ، هُوَ فِيهَا كَاذِبٌ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1176. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం: ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చి "పెద్ద పాపాలంటే ఏవి?" అని ఆయన్ని (స) ప్రశ్నించాడు. తరువాత అతను హదీసు నంతటినీ వివరించాడు. ఆ హదీసులో అబద్ధపు ప్రమాణం ప్రస్తావన కూడా వచ్చింది. "తప్పుడు ప్రమాణం ఏది?" అని నేను అడగ్గా, ఆయన (సఅసం) ఇలా చెప్పారు : "తప్పుడు ప్రమాణం అంటే కల్లబొల్లి మాటలతో ఒక ముస్లిం సొమ్మును కబళించటం." (బుఖారీ)

(١١٧٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، فِيْ قَوْلِهِ تَعَالَى ﴿لاَ يُؤَاخِذُكُمَ اللَّهُ بِاللَّغْوِ فِي أَيْمَانِكُمْ﴾ قَالَتْ: هُوَ قَوْلُ الرَّجُلِ:

1177. "మీరు చేసే అర్థం లేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు" అన్న దైవోపదేశానికి వ్యాఖ్యానంగా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారు ఇలా అన్నారు: అంటే అర్థం మనిషి 'లా, వల్లాహి' (లేదు... దేవుని తోడుగా)

لاَ، وَاللهِ، وَبَلى، وَاللهِ، أَخْرَجَهُ الْبُخَارِيُّ، وَأَوْرَدَهُ أَبُو دَاوُدَ مَرْفُوعاً.

అనీ, 'వ బలా, వల్లాహి' (అవును... దైవసాక్షి) అని అనటం అన్నమాట! (ఈ హదీసును బుఖారీ సేకరించారు. అబూదావూద్ దీనిని 'మర్ఫూ'గా ఉల్లేఖించారు).

(١١٧٨) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ لِلَّهِ تِسْعَةً وَتِسْعِينَ اسْماً مَنْ أَحْصَاهَا دَخَلَ الْجَنَّةَ**» مُتَّفَقٌ عَلَيْهِ. وَسَاقَ التِّرْمِذِيُّ وَابْنُ حِبَّانَ الْأَسْمَاءَ، وَالتَّحْقِيقُ أَنَّ سَرْدَهَا إِدْرَاجٌ مِنْ بَعْضِ الرُّوَاةِ.

1178. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు : "నిశ్చయంగా అల్లాహ్‌కు తొంభై తొమ్మిది పేర్లున్నాయి. ఎవరయితే వీటిని జ్ఞాపకం చేసుకున్నాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు" (బుఖారీ, ముస్లిం). తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లు ఆ పేర్లు కూడా వివరించారు. అయితే అసలు హదీసులో పేర్ల వివరాలు లేవని, ఉల్లేఖకులు తమ తరపున వాటిని నమోదు చేశారని పరిశోధనలో తేలింది.

(١١٧٩) وَعَنْ أُسَامَةَ بْنِ زَيْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ صُنِعَ إِلَيْهِ مَعْرُوفٌ، فَقَالَ لِفَاعِلِهِ: جَزَاكَ اللَّهُ خَيْراً، فَقَدْ أَبْلَغَ فِي الثَّنَاءِ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1179. హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరికయినా మేలు చేసి, వారి యెడల సద్వ్యవహారం చేస్తే అందుకు ప్రతిగా - సద్వ్యవహారం చేసే వానినుద్దేశ్యించి - 'దేవుడు మీకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!' అని అంటే అతడు తగు రీతిలో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు."

(ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించగా, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

(١١٨٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ نَهَى عَنِ النَّذْرِ، وَقَالَ: «**إِنَّهُ لاَ يَأْتِي بِخَيْرٍ، وَإِنَّما يُسْتَخْرَجُ بِهِ مِنَ الْبَخِيلِ**»، مُتَّفَقٌ عَلَيْهِ.

1180. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: మొక్కుబడులు చేసుకోవద్దని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు తాకీదు చేశారు. "మొక్కుబడి వల్ల ప్రాప్తించే శుభశ్రేయాలేమీ ఉండవు. కాకపోతే మొక్కుబడి మూలంగా పిసినారి సయితం డబ్బు ఖర్చుపెట్ట వలసి వస్తుంది" అని ఆయన (సఅసం) చెప్పారు (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

మొక్కుబడుల విషయంలో దైవప్రవక్త (స) వారించటంలోని ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే; మొక్కుకునేవాడు తన దానధర్మాలతో, పుణ్య కార్యాలతో ఏదో ఒక ప్రాపంచిక ప్రయోజనాన్ని, స్వార్థాన్ని ముడిపెడతాడు. ఈ రకమైన సత్కార్యంలో నిష్కల్మషత్వం ఒకింత లోపిస్తుంది. కనుక ఇది మనిషి ఔదార్యానికి, ఔన్నత్యానికి విరుద్ధమైనది. ఎప్పుడూ ఖర్చుపెట్టని పిసినిగొట్టు మాత్రమే ఇలాంటి పనులు చేస్తాడు. ఒకవేళ ఎప్పుడైనా, ఏదైనా చేసినా ఒక శ్రేష్ఠమైన వస్తువును పొందాలన్న తాపత్రయంతోనే చేస్తాడు. నిజానికి అతని మనసు ఆ దానధర్మాల విషయంలో ఊగిసలాడుతూనే ఉంటుంది. ఆదాయ మార్గాలు మూసుకుపోయి, ఇక్కట్లు మొదలైనపుడు తన పరిస్థితి చక్కబడాలన్న తలంపుతో దానధర్మాలు చేస్తానని మొక్కుకుంటాడు. ఆ లక్ష్యం నెరవేరినపుడే మొక్కుబడి తీరుస్తాడు. లేకపోతే మానేస్తాడు.

ఉదాహరణకు : దేవుడు నా వ్యాధిని దూరం చేసి నాకు స్వస్థతను చేకూరిస్తే నేను ఇంత మొత్తాన్ని దైవమార్గంలో ఇస్తాను. ఇంత సొమ్ము ఇవ్వటం అవశ్యంగా భావిస్తున్నాను అని అంటాడు. కాని స్వస్థత చేకూరిన మీదట మొక్కుబడి తీర్చడానికి ఊగిసలాడుతాడు. ఒకవేళ తీర్చినా అన్య మనస్కంగా తీర్చుతాడు. అందుకే ఇలాంటి అల్పబుద్ధికి ఆస్కారం ఏర్పడకుండా ఉండేందుకే బహుశా మొక్కుబడిని వారించటం జరిగింది.

(١١٨١) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**كَفَّارَةُ النَّذْرِ كَفَّارَةُ يَمِينٍ**». رَوَاهُ مُسْلِمٌ، وَزَادَ التِّرْمِذِيُّ فِيهِ: «**إِذَا لَمْ يُسَمِّهِ**». وَصَحَّحَهُ.

1181. హజ్రత్ ఉఖబా బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ప్రమాణ భంగం చేసినందుకు చెల్లించే పరిహారమే మొక్కుబడి విషయంలోనూ చెల్లించవలసి ఉంటుంది." (ముస్లిం) "అతడు పరిహారాన్ని నిర్ధారించని పక్షంలో" అని తిర్మిజీ అదనంగా పేర్కొన్నారు. (దీనిని ప్రామాణికమైనదిగా కూడా ఖరారు చేశారు)

وَلأَبِي دَاوُدَ مِنْ حَدِيثِ ابْنِ عَبَّاسٍ مَرْفُوعاً: «**مَنْ نَذَرَ نَذْراً لَمْ يُسَمِّهِ فَكَفَّارَتُهُ كَفَّارَةُ يَمِينٍ، وَمَنْ نَذَرَ نَذْراً فِي مَعْصِيَةٍ فَكَفَّارَتُهُ كَفَّارَةُ يَمِينٍ، وَمَنْ نَذَرَ نَذْراً لاَ يُطِيقُهُ فَكَفَّارَتُهُ كَفَّارَةُ يَمِينٍ**». وَإِسْنَادُهُ صَحِيحٌ إِلاَّ أَنَّ الْحُفَّاظَ رَجَّحُوا وَقْفَهُ.

అబూదావూద్‌లో ఇబ్నె అబ్బాస్ (రజి) చే 'మర్ఫూ'గా చేయబడిన కథనంలో ఇలా ఉంది: ఎవరయినాసరే ఏదేని విషయంలో మొక్కుకుని, దాని పరిహారాన్ని ప్రస్తావించకపోతే దాని పరిహారం, ప్రమాణ (భంగపు) పరిహారమే. ఎవరయినా అవిధేయతకు సంబంధించిన మొక్కుబడి చేసుకుంటే, దాని పరిహారం కూడా ప్రమాణభంగపు పరిహారమే. ఇంకా ఎవరయినా తన శక్తికి మించిన మొక్కుబడి చేసుకుంటే దాని పరిహారం కూడా ప్రమాణ భంగానికి పాల్పడినందుకు ఇచ్చే పరిహారమే." (దీని పరంపర ఎన్నదగినది. అయితే హదీసు సంస్కర్తలు ఈ ఉల్లేఖనం 'మౌఖూఫ్' అని నొక్కి వక్కాణించారు)

బుఖారీలో హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) చే ఇలా ఉల్లేఖించబడింది -

وَلِلْبُخَارِيِّ مِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: «**وَمَنْ نَذَرَ أَنْ يَعْصِيَ اللَّهَ فَلاَ يَعْصِهِ**».

"ఎవరయినా అల్లాహ్‌కు అవిధేయత చూపుతానని మొక్కుకుంటే అతడు అల్లాహ్‌కు అవిధేయత చూపకూడదు."

وَلِمُسْلِمٍ مِنْ حَدِيْثِ عِمْرَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «**لاَ وَفَاءَ لِنَذْرٍ فِي مَعْصِيَةٍ**».

"పాపం మరియు అవిధేయతలకు సంబంధించిన మొక్కుబడిని తీర్చ రాదు" అని 'ముస్లిం'లో ఇమ్రాన్ (రజి)చే ఉల్లేఖించబడింది.

(١١٨٢) وَعَنْ عُقْبَةَ بْنِ عَامِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَذَرَتْ أُخْتِيْ أَنْ تَمْشِيَ إِلىٰ بَيْتِ اللهِ حَافِيَةً، فَأَمَرَتْنِي أَنْ أَسْتَفْتِيَ لَهَا رَسُولَ اللهِ ﷺ فَاسْتَفْتَيْتُهُ. فَقَالَ النَّبِيُّ ﷺ: «**لِتَمْشِ وَلْتَرْكَبْ**» مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

1182. హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం : నా సోదరి కాలినడకన కాబా గృహానికి వెళ్తానని మొక్కుబడి చేసుకుని, దాని గురించి దైవప్రవక్త (సఅసం)ను విచారించి రమ్మని నన్ను పురమాయించింది. నేను దైవప్రవక్త (సఅసం) వద్దకు వెళ్ళి ఈ విషయమై ధార్మిక తీర్పు కోరగా "కాలి నడకతో పాటు ఆమె వాహనం కూడా ఎక్కి ప్రయాణం చేయాలి" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. (బుఖారీ, ముస్లిం - వాక్యాలు ముస్లింలోనివి)

وَلأَحْمَدَ وَالأَرْبَعَةِ، فَقَالَ: «**إِنَّ اللَّهَ لاَ يَصْنَعُ بِشَقَاءِ أُخْتِكَ شَيْئاً، مُرْهَا فَلْتَخْتَمِرْ، وَلْتَرْكَبْ، وَلْتَصُمْ ثَلاَثَةَ أَيَّامٍ**».

ముస్నదె అహ్మద్ మరియు 'నలుగురు' చేసిన ఉల్లేఖనం ప్రకారం ఆయన (సఅసం) ఇలా తీర్పు ఇచ్చారు : "అల్లాహ్ నీ సోదరిని కష్టాల్లో పడవేసి చేసేదేముంటుంది? దుప్పటి కప్పుకుని వాహనమెక్కమనీ, మూడు రోజులపాటు ఉపవాసముండమనీ ఆమెకు చెప్పు."

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం స్పష్టమయ్యేదేమిటంటే మక్కాలోని కాబా గృహం వద్దకు కాలినడకన వెళతానని ఎవరయినా మొక్కుకుంటే అలాంటి మొక్కుబడిని నెరవేర్చటం అవశ్యం ఏమీ కాదు. ఇమామ్ షాఫయి (రహ్మతై) అభిప్రాయం కూడా ఇదే.

(١١٨٣) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: اسْتَفْتَى سَعْدُ بْنُ عُبَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ رَسُولَ اللهِ ﷺ فِي نَذْرٍ كَانَ عَلَى أُمِّهِ، تُوُفِّيَتْ قَبْلَ أَنْ تَقْضِيَهُ، فَقَالَ: «**اقْضِهِ عَنْهَا**». مُتَّفَقٌ عَلَيْهِ.

1183. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) తన తల్లి చేసుకున్న మొక్కుబడి గురించి దైవప్రవక్త (సఅసం) ముందు ప్రస్తావిస్తూ, దాన్ని తీర్చక ముందే ఆమె చనిపోయిందని అన్నారు. దైవప్రవక్త (స) ఈ మాట విని, "ఆమె తరపున నువ్వా మొక్కుబడి తీర్చు" అని అన్నారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మృతులు తీర్చకుండా వెళ్ళిపోయిన తప్పనిసరి బాధ్యతలను, ముఖ్యంగా ధనపరమైన బాధ్యతలను వారి వారసులు తీర్చటం తప్పనిసరి అని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఆ మేరకు మృతులు 'వసీయతు' (వీలు) చేసి ఉండవలసిన అవసరం కూడా లేదు. వారసులకు స్వయంగా ఈ బాధ్యతా భావం ఉండాలి. వారసుల్లో ముఖ్యంగా సంతానంపై ఈ బాధ్యత ఎక్కువగా ఉంటుంది.

**హదీసు ఉల్లేఖకులు**

సాద్ బిన్ ఉబాదా (రజి) : ఖజ్రజ్ తెగకు నాయకుడు. యుద్ధ సందర్భాల్లో అన్సార్ల ధ్వజం ఈయన చేతిలో ఉండేది. దాతృగుణం కలవారు. ఈయనకు అరబీ వ్రాయటం వచ్చు. గజ ఈతలో, విలువిద్యలో నిష్ణాతులు. ఈ కారణంగానే ఈయన 'బహుముఖ ప్రజ్ఞాశాలి'గా పిలువబడేవారు. విస్తృతంగా దానధర్మాలు చేసేవారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) సారథ్యంపై బైత్ (ప్రమాణం) చేయకుండానే మదీనా నుండి వెళ్ళిపోయారు. హిజ్రీ 14 లేదా 15 లేదా 16వ సంవత్సరంలో డెమాస్కస్ పరిధిలోని 'హౌరాన్'లో జిన్ను ఈయన్ని హతమార్చాడని అనబడుతోంది.

(١١٨٤) وَعَنْ ثَابِتِ بْنِ الضَّحَّاكِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: نَذَرَ رَجُلٌ عَلَى

1184. హజ్రత్ సాబిత్ బిన్ జహ్హాక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఒక వ్యక్తి 'బువానా'

عَهْدِ رَسُولِ اللهِ ﷺ أَنْ يَنْحَرَ إِبِلاً بِبُوَانَةَ، فَأَتَى رَسُولَ اللهِ ﷺ، فَسَأَلَهُ، فَقَالَ: «**هَلْ كَانَ فِيهَا وَثَنٌ يُعْبَدُ**»؟ قَالَ: لاَ. قَالَ: «**فَهَلْ كَانَ فِيهَا عِيدٌ مِّنْ أَعْيَادِهِمْ**»؟ فَقَالَ: لاَ. فَقَالَ: «**أَوْفِ بِنَذْرِكَ، فَإِنَّهُ لاَ وَفَاءَ لِنَذْرٍ فِي مَعْصِيَةِ اللهِ، وَلاَ فِي قَطِيعَةِ رَحِمٍ، وَلاَ فِيمَا لاَ يَمْلِكُ ابْنُ آدَمَ**». رَوَاهُ أَبُو دَاوُدَ وَالطَّبَرَانِيُّ، وَاللَّفْظُ لَهُ، وَهُوَ صَحِيحُ الْإِسْنَادِ. وَلَهُ شَاهِدٌ مِّنْ حَدِيثِ كَرْدَمٍ عِنْدَ أَحْمَدَ.

అనే స్థలంలో ఒంటెను 'జిబహ్' చేస్తానని మొక్కుకున్నాడు. అతడు దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి ఈ విషయం గురించి సంప్రతించగా "ఆ స్థలంలో పూజించబడే విగ్రహం ఏదైనా ఉండేదా?!" అని ఆయన (సఅసం) ప్రశ్నించారు. 'లేద'ని అతను బదులిచ్చాడు. "అక్కడ అజ్ఞానకాలం నాటి తిరునాళ్ళు ఏమైనా జరిగేవా?" అని ఆయన (స) విచారించగా, 'లేద'ని అతనన్నాడు. "అయితే నీ మొక్కుబడిని తీర్చు. కాని అల్లాహ్ పట్ల ధిక్కార వైఖరి కలిగి ఉండే, సంబంధాలను త్రెంచే మొక్కుబడి, ఆదం పుత్రుని శక్తికి మించిన మొక్కుబడి మాత్రం తీర్చ కూడదు" అని ఆయన (సఅసం) ఉపదేశించారు. (అబూదావూద్, తబ్రానీ ఉల్లేఖించారు -వాక్యాలు తబ్రానీవి. దీని పరంపర ప్రామాణికమైనది. ముస్నదె అహ్మద్‌లో కర్‌దమ్ హదీసు దీనికి సాక్ష్యం)

**హదీసు ఉల్లేఖకులు**

కర్‌దమ్ (రజి) : కర్దమ్ బిన్ సుఫ్యాన్ సఖఫీ. ఈయన కుమార్తె మైమూనా (ర.అన్‌హా), అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)లు ఈయన నుండి ఉల్లేఖించారు.

(١١٨٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً قَالَ يَوْمَ الْفَتْحِ: يَا رَسُولَ اللهِ!

1185. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : ఒక వ్యక్తి మక్కా విజయం నాడు ఆయన (సఅసం) దగ్గరకు వచ్చి, "ఓ

إِنِّي نَذَرْتُ - إِنْ فَتَحَ اللَّهُ عَلَيْكَ مَكَّةَ - أَنْ أُصَلِّيَ فِيْ بَيْتِ الْمَقْدِسِ. فَقَالَ: **صَلِّ هَاهُنَا.** فَسَأَلَهُ، فَقَالَ: **صَلِّ هاهنا،** فَسَأَلَهُ فَقَالَ **شَأْنُكَ إِذَنْ.** رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

దైవప్రవక్తా (సఅసం)! మీ చేతుల మీదుగా దేవుడు మక్కా విజయం చేకూరిస్తే 'బైతుల్ మఖ్దిస్'లో నమాజ్ చేస్తానని నేను మొక్కుకున్నాను" అని విన్నవించుకున్నాడు. దానికాయన (స), "నమాజ్ ఇక్కడే చేసుకో" అని అన్నారు. ఆ వ్యక్తి తిరిగి విన్నవించుకోగా, "నమాజ్ ఇక్కడే చేసుకో" అని ఆయన (స) అన్నారు. ఆ వ్యక్తి మూడవసారి కూడా ప్రశ్నించగా "ఇక నీ ఇష్టం" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. (ముస్నదె అహ్మద్, అబూదావూద్, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(١١٨٦) وَعَنْ أَبِيْ سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**لاَ تُشَدُّ الرِّحَالُ إِلاَّ إِلَى ثَلاَثَةِ مَسَاجِدَ: مَسْجِدِ الْحَرَامِ، وَمَسْجِدِ الأَقْصَى، وَمَسْجِدِي هَذَا**». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِلْبُخَارِيِّ.

1186. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) చెప్పారు : "మూడు మస్జిదులు తప్ప మరో దాని సందర్శన నిమిత్తం ప్రయాణం చేయ రాదు. - (ఆ మూడు మస్జిదులు ఏవంటే) మస్జిదె హరామ్, మస్జిదె అక్సా, నా మస్జిద్ (మస్జిదె నబవీ)." (బుఖారీ, ముస్లిం - ఈ వాక్యాలు బుఖారీ లోనివి)

**సారాంశం**

ఈ హదీసు ఇంతకు ముందు (మొదటి భాగం) "ఏతెకాఫ్" అధ్యాయంలోనూ వచ్చింది. మరోసారి ఈ హదీసును ఇక్కడ పొందుపరచటంలోని ముఖ్యోద్దేశ్యం బహుశా ఈ మూడు మస్జిదులు తప్ప మరో మస్జిదునుగానీ, మరో స్థలాన్నిగానీ మొక్కుబడి తీర్చే స్థలంగా ఎంచుకోరాదన్నది కావచ్చు. (సబులుస్సలాం)

(١١٨٧) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قُلْتُ: يَا رَسُولَ اللهِ! إِنِّي نَذَرْتُ فِي الْجَاهِلِيَّةِ أَنْ أَعْتَكِفَ لَيْلَةً فِي الْمَسْجِدِ الْحَرَامِ. قَالَ: أَوْفِ بِنَذْرِكَ. مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ الْبُخَارِيُّ فِي رِوَايَةٍ: فَاعْتَكَفَ لَيْلَةً.

1187. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : "ఓ దైవప్రవక్తా (సఅసం)! నేను అజ్ఞాన కాలంలో మస్జిదె హరామ్‌లో ఒక రాత్రి దైవారాధనలో గడుపుతానని మొక్కుకున్నాను" అని విన్నవించుకోగా, "మరయితే మొక్కుబడి నెరవేర్చు" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు. (బుఖారీ, ముస్లిం) బుఖారీ తన ఉల్లేఖనంలో, "మరి ఆయన ఒక రాత్రి ఏతెకాఫ్ పాటించారు" అని అదనంగా పొందుపరచారు.

**సారాంశం**

అవిశ్వాసి అజ్ఞానకాలంలో (పూర్వాశ్రమంలో) ఏదైనా మొక్కుకుని ఉంటే ఇస్లాం స్వీకరించిన మీదట దానిని తీర్చటం అవసరమని ఈ హదీసు సూచిస్తోంది. ఇమామ్ బుఖారీ (రహ్మ.లై), ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ (రహ్మ.లై) మరియు షాఫయీలలోని ఒక వర్గం అభిప్రాయం ఇదే. కాని మెజారిటీ విద్వాంసుల దృష్టిలో అవిశ్వాసి మొక్కుబడి అసలు వర్తించదు. మరి అటువంటప్పుడు దాన్ని తీర్చే ప్రశ్నే ఉండదు కదా! ఉమర్ (రజి) గారు మొక్కుకున్నది మంచి మొక్కుగనక, పుణ్యం కోసం దైవప్రవక్త (స) తీర్చుకోమని చెప్పి ఉంటారని మాలికీ వర్గంలోని కొంతమంది అభిప్రాయపడ్డారు.

# 14. వ్యాజ్యాల, తీర్పుల పుస్తకం

# ١٤ - كِتَابُ الْقَضَاءِ

## ఖాజీ (న్యాయమూర్తి) గురించి

(١١٨٨) عَنْ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الْقُضَاةُ ثَلاَثَةٌ، اثْنَانِ فِي النَّارِ، وَوَاحِدٌ فِي الْجَنَّةِ: رَجُلٌ عَرَفَ الْحَقَّ فَقَضَى بِهِ فَهُوَ فِي الْجَنَّةِ. وَرَجُلٌ عَرَفَ الحَقَّ فَلَمْ يَقْضِ بِهِ، وَجَارَ فِي الْحُكْمِ فَهُوَ فِي النَّارِ. وَرَجُلٌ لَمْ يَعْرِفِ الْحَقَّ، فَقَضَى لِلنَّاسِ عَلَى جَهْلٍ فَهُوَ فِي النَّارِ**».

رَوَاهُ الْأَرْبَعَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1188. హజ్రత్ బురైదా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "న్యాయ మూర్తుల్లో మూడు రకాల వారుంటారు. వారిలో ఇద్దరు నరకవాసులు, ఒకడు స్వర్గవాసి. న్యాయం ఎటువైపు ఉందో పసిగట్టి తదనుగుణంగా తీర్పు ఇచ్చే వాడు ఒకడు. ఇతడు స్వర్గవాసి. న్యాయం ఎవరిపక్షాన ఉందో తెలుసు కుని కూడా దానికనుగుణంగా తీర్పు ఇవ్వనివాడు, పైపెచ్చు అన్యాయానికి పాల్పడినవాడు రెండవవాడు. ఇతడు నరకవాసి.ఇక మూడవవాడు న్యాయాన్ని గుర్తించలేడు, న్యాయానికనుగుణంగా నిర్ణయమూ గైకొనలేడు - పైగా అతను - జనుల మధ్య అజ్ఞానం అవివేకంతో కూడుకున్న తీర్పులు ఇచ్చాడు. అతడు కూడా నరకవాసియే. (ఈ హదీసును అబూదావూద్, నసాయి, తిర్మిజీ, ఇబ్నెమాజాలు ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించారు)

### సారాంశం

ఈ హదీసులో ఖాజీచేత న్యాయమూర్తి (జడ్జి)గా పిలువబడే వారి కోవలు సూచించబడ్డాయి. వీరిలో రెండు రకాల న్యాయమూర్తులు నరకానికి ఇంధనం కానున్నారు.

వారిలో ఒకడు; సత్యాన్ని (న్యాయాన్ని) తెలుసుకోలేనివాడు. రెండవవాడు: సత్యాన్ని తెలుసుకుని కూడా దానికనుగుణంగా ఆచరించనివాడు. దానికి అతని అవినీతీ కారణం కావచ్చు. పరిశోధనా ప్రక్రియలో అతను చూపిన అలసత్వం, సోమరితనం కూడా కారణం కావచ్చు. సత్యాన్ని తెలుసుకుని సత్యవంతుడికి న్యాయం చేకూర్చేవాడే సిసలయిన, నిష్పాక్షికమైన న్యాయమూర్తి. ఎటువంటి దురభిమానానికీ, పక్షపాతానికి తావివ్వకుండా నిష్పక్షపాతంగా, నిజాయితీగా తీర్పు ఇచ్చే న్యాయశీలి ఎవరేమనుకున్నా లెక్కచేయడు. "తప్పయినా, ఒప్పయినా నా వాళ్ళు" అనే దురభిమాన దృక్పథాన్ని దరికి రానివ్వడు. కాబట్టి బోధపడేదేమంటే 'న్యాయమూర్తి' హోదా కోసం బుద్ధీ కౌశల్యం, విజ్ఞతా వివేచనలుగల వ్యక్తిని ఎంపిక చేయాలి. అల్పుడు, మూర్ఖుడైన వాడికి ఈ హోదా కట్టబెట్టి ప్రజల్ని ఇక్కట్లపాలు చెయ్యకూడదు.

(١١٨٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ وَلِيَ الْقَضَاءَ فَقَدْ ذُبِحَ بِغَيْرِ سِكِّينٍ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ وَابْنُ حِبَّانَ.

1189. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ వ్యక్తికయితే న్యాయమూర్తి హోదా కట్టబెట్టడం జరిగిందో కత్తి లేకుండానే అతని కుత్తుక కోయబడింది (అని తెలుసుకోండి)." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. ఇబ్నె ఖుజైమ, మరియు ఇబ్నె హిబ్బాన్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

కుత్తుక కోయబడుతుందంటే అర్థం శారీరకంగా అతడు బాధించబడతాడని కాదు. న్యాయ నిర్ణయాలు చేయటంలో అతడు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, లేక పక్షపాతంతో ఏ పక్షాన మొగ్గిపోయినా అతని నిర్ణయం వల్ల సమాజానికి తీరని హాని కలుగుతుంది. అతని ఈ తప్పుడు నిర్ణయం వల్ల అతని పారలౌకిక జీవితం నాశనమవుతుందని భావం.

(١١٩٠) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّكُمْ سَتَحْرِصُونَ عَلَى الْإِمَارَةِ،

1190. హజ్రత్ అబూహురైరా (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "నిశ్చయంగా మీరు ప్రభుత్వాధికారం కోసం తప్పకుండా పరితపిస్తారు. కాని ప్రళయదినాన అది

وَسَتَكُونُ نَدَامَةً يَوْمَ الْقِيَامَةِ، فَنِعْمَتِ الْمُرْضِعَةُ، وَبِئْسَتِ الْفَاطِمَةُ». رَوَاهُ الْبُخَارِيُّ.

మీ పాలిట తలవంపుగా పరిణమించటం అవశ్యం. పాలిచ్చే తల్లి పుణ్యవతి. పాలు విడిపించే తల్లి పాపిష్టురాలు."
(బుఖారీ)

**సారాంశం**

రాజ్యాధికారం, జాతికి నేతృత్వం ఎంత బాధ్యతాయుత, మరెంత సున్నిత విషయమో ఈ హదీసులో చెప్పబడింది. అందుకే నేతృత్వానికి, అధికారానికి వీలయినంత వరకూ దూరంగా ఉండటానికే ప్రయత్నం చేయాలనీ, దాని కోసం అర్రులు చాచరాదనీ, పదవీ వ్యామోహం అసలే మంచిది కాదని కూడా సూచించబడింది. వేరొక హదీసులో ఏమనబడిందంటే, ప్రభుత్వం, రాజ్యాధికారం నిందార్హంగా ఉంటాయి. అధికారం చేజారిన వెంటనే పరాభవం మిగులుతుంది. పరలోకంలో అది మనిషిని శిక్షార్హుణ్ణి కూడా చేస్తుంది.

మనిషికి పదవి లభించినపుడు అంతా ఆకర్షణీయంగా కానవస్తుంది. అతని గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. మందీ మార్బలం ఉంటాయి. రాజ్యసంపద హస్తగతమవుతుంది. ప్రజలపై పెత్తనం చెలాయించే అవకాశం లభిస్తుంది. అంగరంగ వైభవం ఉట్టిపడుతుంది - ఒక దశ వరకూ అంతా సజావుగానే ఉంటుంది. కాని అవినీతి అక్రమాల చిట్టా బయట పడినప్పుడు, విచారణ కమీషన్లు నిలదీసినపుడు, ఇహలోకంలోనే 'లెక్కల పత్రం' రచ్చకెక్కుతుంది. అవమానాల పర్వం మొదలయిపోతుంది. ఇక పరలోకంలో తీసుకోబడే లెక్క సరేసరి. దాని కాఠిన్యం గురించి ప్రపంచ జీవితంలో ఊహించనయినా లేము. ఈ భయం చేతనే ముస్లిం సమాజంలోని సజ్జనులు అధికారానికి, పదవులకు అల్లంత దూరాన ఉండటానికే ఇష్టపడేవారు. కొంతమంది మహనీయులైతే రాజు విధించే శిక్షల్ని భరించటానికి కూడా అంగీకరించారు గాని, కీలకమైన ధర్మాసన పదవుల్ని పుచ్చుకోవడానికి ముందుకు రాలేదు. రాజ్యాధికార ఆరంభం అత్యంత రమణీయంగానే ఉంటుంది గాని దాని అంతిమ పరిణామం మాత్రం అత్యంత దుర్భరంగా ఉంటుంది. బహుశా ఈ కారణంగానే సజ్జనులు సదా పదవీ పటాటోపాలకు దూరంగా ఉన్నారు. తల్లి చనుబాలు త్రాగే బిడ్డనే చూడండి - పాలు త్రాగుతున్నంత కాలం అతను తల్లి ఒడిలో ఆనందంగా కేరింతలు కొడతాడు. కాని పాలు విడిపించే ప్రయత్నం **తల్లి చేసినపుడు** అసహనంతో చిందులేస్తాడు.

(١١٩١) وَعَنْ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِذَا حَكَمَ الْحَاكِمُ فَاجْتَهَدَ ثُمَّ أَصَابَ

1191. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) చెప్పారు: "న్యాయాధికారి ఏదైనా వ్యవహారంలో శక్తివంచన లేకుండా న్యాయంగా తీర్పివ్వడానికి కృషిచేసినప్పుడు, ఆ తీర్పు సరైనదై ఉంటే అతనికి రెట్టింపు పుణ్య

فَلَهُ أَجْرَانِ، وإِذَا حَكَمَ فاجْتَهَدَ ثُمَّ أَخْطَأَ فَلَهُ أَجْرٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఫలం లభిస్తుంది. ఒకవేళ ఎంత కృషి చేసినా తప్పుడు తీర్పు జరిగిపోతే అప్పుడు కూడా అతనికి ఒకింత పుణ్య ఫలం లభిస్తుంది. (బుఖారీ, ముస్లిం)

(١١٩٢) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «لاَ يَحْكُمْ أَحَدٌ بَيْنَ اثْنَيْنِ وَهُوَ غَضْبَانُ». مُتَّفَقٌ عَلَيْهِ.

1192. "మీలో ఎవరయినాసరే కోపంలో ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న తగాదాపై తీర్పు ఇవ్వటం తగదు" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూబక్రా (రజి) తెలిపారు. (బుఖారీ, ముస్లిం)

(١١٩٣) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا تَقَاضَى إِلَيْكَ رَجُلاَنِ فَلاَ تَقْضِ لِلأَوَّلِ حَتَّى تَسْمَعَ كَلاَمَ الآخَرِ، فَسَوفَ تَدْرِي كَيْفَ تَقْضِي». قَالَ عَلِيٌّ: فَمَا زِلْتُ قَاضِياً بَعْدُ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ وَقَوَّاهُ ابْنُ الْمَدِينِيِّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَلَهُ شَاهِدٌ عِنْدَ الْحَاكِمِ مِنْ حَدِيثِ ابْنِ عَبَّاسٍ.

1193. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "ఇద్దరు మనుషులు మీ దగ్గరకు న్యాయం కోసం వస్తే, ఆ ఇరువురి ఫిర్యాదును (పూర్తిగా) వినకముందే, ఎవరో ఒకరికి అనువుగా తీర్పు ఇవ్వకండి - (ఇరువురి వాదనను) విన్న మీదటే మీరు చేయాల్సిందేమిటో మీకు అర్థమవుతుంది." "ఆ రోజు నుండే నేను ఆ విధంగా చేస్తున్నాను" అని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు. ఇబ్నె మదీనీ ఈ హదీసును 'దృఢమైనది'గా పేర్కొన్నారు. ఇబ్నె హిబ్బాన్ మాత్రం దీన్ని 'ప్రామాణికం' అన్నారు. హాకిమ్ వద్ద దీని సాక్ష్యం ఇబ్నె అబ్బాస్ (రజి) హదీసు రూపంలో లభిస్తుంది.

**సారాంశం**

ఇరుపక్షాల వారి వాదోపవాదాలను పూర్తిగా, సావధానంగా విన్న మీదటే న్యాయమూర్తి ఆ తగాదాపై తీర్పు ఇవ్వాలనీ, ఎవరో ఒకరి ఫిర్యాదును విని తొందరపడి తీర్పు ఇవ్వటం ధర్మ సమ్మతం కాదని ఈ హదీసు సారాంశం. కక్షిదారుల గోడును విని బాగా పరికించాలి. వారు సమర్పించే ఆధారాలను నిశిత దృష్టితో గమనించాలి. తన అనుభవాన్నంతా ఉపయోగించి వారి హావభావాలను కూడా చూడాలి. ఆ తరువాతే తీర్పు ఇవ్వాలి. అలా కాకుండా ఏకపక్షంగా న్యాయ నిర్ణయం చేయటం మిథ్య అవుతుంది. ఒకవేళ ఆరోపితుడైన వ్యక్తి మౌనం వహిస్తే, లేక న్యాయస్థానంలో నోరు విప్పకపోతే, అవుననిగానీ, కాదని గానీ అనకపోతే, న్యాయస్థానం ఉత్తర్వు ఇచ్చినా హాజరు కాకపోతే అప్పుడేం చేయాలన్న సందేహం ఏర్పడవచ్చు. అట్టి పరిస్థితిలో న్యాయస్థానం, ఫిర్యాదు చేసిన వ్యక్తి కేసు ఆధారంగా తీర్పు ఇచ్చే అధికారం కలిగి ఉంటుంది. (సుబులుస్సలాం)

(١١٩٤) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«إِنَّكُمْ تَخْتَصِمُونَ إِلَيَّ، وَلَعَلَّ بَعْضَكُمْ أَنْ يَكُونَ أَلْحَنَ بِحُجَّتِهِ مِنْ بَعْضٍ، فَأَقْضِيَ لَهُ عَلَى نَحْوِ مَا أَسْمَعُ مِنْهُ، فَمَنْ قَطَعْتُ لَهُ مِنْ حَقِّ أَخِيهِ شَيْئاً فَإِنَّمَا أَقْطَعُ لَهُ قِطْعَةً مِنَ النَّارِ»**. مُتَّفَقٌ عَلَيْهِ.

1194. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) తెలిపారు : నిశ్చయంగా, మీరు మీ తగాదాలను నా దగ్గరకు తీసుకువస్తూ ఉంటారు. మీలో ఒక వర్గానికి చెందినవాడు తన వాదనకనుగుణమైన ఆధారాలను ఎంతో వాక్చాతుర్యంతో విశదీకరిస్తాడు. అతని మాటలు విని నేను అతనికి అనుకూలంగా తీర్పు ఇచ్చేందుకు అవకాశం ఉంది. కాబట్టి ఎవరికయినా అతని సోదరుని హక్కులో నుంచి ఏదన్నా వస్తువు నేను ఇచ్చినట్లయితే అతనికి (నరకంలోని) అగ్ని కణాన్ని ఇస్తున్నానని భావించండి." (బుఖారీ, ముస్లిం)

(١١٩٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: **«كَيْفَ تُقَدِّسُ أُمَّةٌ لاَ يُؤْخَذُ مِنْ شَدِيدِهِمْ**

1195. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా తాను విన్నానని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు : "బలవంతుని నుంచి బలహీనుని హక్కు ఇప్పించలేని సమాజం పవిత్ర సమాజం ఎలా అవుతుంది?" (ఇబ్నె

لِضَعِيفِهِمْ». رَوَاهُ ابْنُ حِبَّانَ، وَلَهُ شَاهِدٌ مِنْ حَدِيثِ بُرَيْدَةَ عِنْدَ الْبَزَّارِ. وَآخَرُ مِنْ حَدِيثِ أَبِي سَعِيدٍ عِنْدَ ابْنِ مَاجَهْ.

హిబ్బాన్ దీనిని ఉల్లేఖించారు. బజ్జార్ దృష్టిలో బురైదా (రజి) హదీసు దీనికి సాక్ష్యం. ఇబ్నెమాజాలో హజ్రత్ అబూ సయీద్ (రజి)చే ఉల్లేఖించబడిన మరో హదీసు కూడా దీనికి ప్రబల సాక్షిగా ఉంది)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం బలవంతుని నుండి బలహీనుని హక్కు ఇప్పించటం విద్యుక్త ధర్మం. ఏ ప్రభుత్వ ఉద్యోగులైనా, రాజ్యాధికారి అయినా బలహీనుని, పీడితుని, బాధితుని న్యాయ సమ్మతమైన హక్కును అతనికి ఇప్పించటంలో ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం లేక అశ్రద్ధ కనబరిస్తే, జాతి జనులు కూడా ఆ విషయమై నిలదీయకపోతే, పాలకుల నుండి సంజాయిషీ కోరకపోతే అట్టి పరిస్థితిలో యావత్తు జాతి అసమర్థమైన జాతిగా భావించబడుతుంది. ఎందుకంటే నేటి ఆధునిక యుగం ప్రజాస్వామిక యుగం. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారానే తమ ప్రతినిధులకు అధికారాన్ని అప్పగిస్తున్నారు. కాబట్టి పరిపాలకులు ఎప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడినా, సమాజంలోని బలహీనుల హక్కులు ఎక్కడ కాలరాయబడినా దాని గురించి పరిపాలకులను ప్రజలు పబ్లిగ్గా నిలదీయాలి. పాలకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రాజ్యాంగబద్ధంగా చేయవలసినదంతా చేయాలి. ఈ బాధ్యతా భావనను విస్మరించి నిరుపేదల, బలహీనుల స్థితిపై జాలి చూపనివారు పరలోకంలో - దైవసమక్షంలో - జవాబు చెప్పుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

(١١٩٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: **«يُدْعَى بِالْقَاضِي الْعَادِلِ يَوْمَ الْقِيَامَةِ، فَيَلْقَى مِنْ شِدَّةِ الْحِسَابِ مَا يَتَمَنَّى أَنَّهُ لَمْ يَقْضِ**

1196. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా తాను విన్నానని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు: ప్రళయదినాన (తీర్పు దినాన) న్యాయ శీలుడైన 'ఖాజీ' లెక్కల నిమిత్తం పిలువ బడినపుడు, అతడు తన లెక్క తీవ్రతను అంచనా వేసుకుంటాడు. తాను ప్రపంచంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఎన్నడూ (తన జీవితంలో) ఒక్క తీర్పు కూడా చెయ్యకుండాఉంటే బావుండునే! అని తలచుకుంటాడు. (ఈ హదీసు ఇబ్నె హిబ్బాన్ ఉల్లేఖించారు. బైహఖీ దీనిని నకలు చేశారు). అందులో ఈ

بَيْنَ اثْنَيْنِ فِي عُمُرِهِ». رَوَاهُ ابْنُ حِبَّانَ، وَأَخْرَجَهُ الْبَيْهَقِيُّ، وَلَفْظُهُ «فِي تَمْرَةٍ».

ఒక్క వాక్యం అదనంగా ఉంది - "ఎన్నడూ ఒక్క ఖర్జూరపండు గురించి కూడా తీర్పు ఇవ్వకుండా ఉంటే బావుండు."

**సారాంశం**

తీర్పు దినాన దేవుని దర్బారులో న్యాయమూర్తి చాలా గట్టిగా ప్రశ్నించబడతాడని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. కాబట్టి తీర్పరిగా ఉండే వ్యక్తి నిత్యం న్యాయదృష్టితో మసలుకోవాలనీ, అన్యాయానికి, పక్షపాత వైఖరికి కడు దూరంగా ఉండాలని దీనిద్వారా బోధపడుతున్నది. న్యాయం చేయనివాడు తీర్పు దినవు యజమాని విధించే వ్యధాభరితమయిన శిక్షకు సిద్ధంగా ఉండాలి మరి.

(١١٩٧) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَنْ يُفْلِحَ قَوْمٌ وَلَّوْا أَمْرَهُمُ امْرَأَةً». رَوَاهُ الْبُخَارِيُّ.

1197. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ బక్రా (రజి) తెలియజేశారు : "మహిళను పరిపాలకురాలిగా చేసుకున్న జాతి ఎన్నడూ సాఫల్యం పొందదు." (బుఖారీ)

**సారాంశం**

స్త్రీ సారథ్యం సమాజానికి మేలు చేకూర్చకపోగా హాని కలిగిస్తుందని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. మహాప్రవక్త (సఅసం) మరణించిన పిదప ఆయన (స) సతీమణుల్లో ఎవరికీ ఈ సారథ్య బాధ్యతలు అప్పగించబడలేదన్నది గమనార్హం. కుటుంబ యాజమాన్య బాధ్యతే ఆమెపై మోపబడనప్పుడు ఒక రాజ్య బాధ్యతలు ఎట్లా మోపబడతాయి?

(١١٩٨) وَعَنْ أَبِي مَرْيَمَ الْأَزْدِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنْ وَلَّاهُ اللَّهُ شَيْئاً مِنْ أَمْرِ الْمُسْلِمِينَ، فَاحْتَجَبَ عَنْ حَاجَتِهِمْ وَفَقِيرِهِمِ احْتَجَبَ اللَّهُ دُونَ حَاجَتِهِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ.

1198. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ మర్యమ్ అజ్‌దీ (రజి) వివరించారు: "ఏ వ్యక్తికయితే అల్లాహ్ ముస్లింల కార్య నిర్వహణకు సంబంధించిన అధికారిగా నియమించగా, **వారి అవసరాలు, అక్కరలు తీర్చకుండా అతడు తెర మరుగున ఉండిపోయాడో, అతన్ని ఆదుకునే విషయంలో అల్లాహ్ కూడా తెరమరుగున ఉండిపోతాడు.**"

**(అబూదావూద్, తిర్మిజీ)**

## సారాంశం

ప్రజా పనుల విషయంలో ప్రభుత్వాధికారులు ఎంతో బాధ్యతాయుతంగా, మరెంతో చురుకుగా మసలుకోవాలనీ, బద్ధకం, బాధ్యతా రాహిత్యం ఎంతమాత్రం క్షంతవ్యం కాబోవని ఈ హదీసు నొక్కి చెబుతోంది. బాధ్యతాయుతమయిన ఏ హోదా లభించినా అది దేవుని తరపున జరిగిన నిర్ణయం అని వారు తలపోయాలి. వారు ఆ హోదాలో నియుక్తం చేయబడింది ఎయిర్ కండీషన్డ్ బంగ్లాల్లో హాయిగా నిద్రపోవడానికి, విషయలాలసలో మునిగి ఉండటానికి కాదని గ్రహించాలి. భద్రతా సిబ్బంది గేటువద్ద పహరాగా నిలబడి ఉండగా వాళ్లు అద్దాల మేడల్లో సేద తీరుతూ ఉండటం, తమను కలుసుకోవడానికి వచ్చిన ప్రజా బాహుళ్యాన్ని గేటు వద్దనే వారి సిబ్బంది నిలువరించటం - బాధ్యతాయుత పరిపాలనా యంత్రాంగం అనిపించుకోదు. ప్రజా వ్యవహారాల్లో ఇలాంటి నిర్లక్ష్య వైఖరిని కనబరచిన అధికారిని అల్లాహ్ కూడా ప్రళయదినాన పట్టించుకోడు. అతడు ఇహలోక జీవితంలో సామాన్య జనులను ఎంతగా బాధించాడో అంతగానే అల్లాహ్ పరలోకంలో అతన్ని పరాభవం పాల్జేస్తాడు.

## హదీసు ఉల్లేఖకులు

అబూ మర్యమ్ అజ్దీ (రజి) : అసదీగా కూడా సుప్రసిద్ధులే. హజ్రమీగా కూడా పిలువబడేవారు. ప్రవక్త (స) సహచర్య భాగ్యం పొందారు. సిరియాలో హజ్రత్ ముఆవియా (రజి) వద్దకు వచ్చేశారు. ఆయనకు ఈ హదీసును వినిపించారు.

(١١٩٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَعَنَ رَسُولُ اللهِ ﷺ الرَّاشِيَ وَالْمُرْتَشِيَ فِي الْحُكْمِ. رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَحَسَّنَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَلَهُ شَاهِدٌ مِنْ حَدِيثِ عَبْدِاللهِ بْنِ عَمْرٍو عِنْدَ الْأَرْبَعَةِ إِلَّا النَّسَائِيَ.

1199. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : "తీర్పు వ్యవహారంలో లంచం ఇచ్చేవానినీ, లంచం పుచ్చుకునే వానినీ దైవప్రవక్త (సఅసం) ధూత్కరించారు." (ఈ హదీసును అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని హసన్‌గా ఖరారు చేశారు. ఇబ్నె హిబ్బాన్ దీన్ని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. నసాయి మినహా 'నలుగురి' దృష్టిలో అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) హదీసు దీనికి సాక్ష్యం)

## సారాంశం

ఈ హదీసులో లంచం ఇచ్చేవాడు, పుచ్చుకునేవాడు - ఇద్దరూ శపించబడ్డారు. కనుక లంచం ఇవ్వటం మరియు తీసుకోవటం - రెండునూ మహాపరాధం, ఘోర పాపంగా పరిగణించబడతాయి. ఎందుకంటే ఈ చెడుగు మూలంగా సమాజంలో పట్టపగలే దాసుల హక్కులు కొల్లగొట్టబడతాయి. నిజాయితీ స్థానే నిలువుదోపిడీ రాజ్యమేలుతుంది. ఇలాంటి అవినీతితో

కూడిన సమాజంలో ప్రజలు ఒండొకరి శ్రేయోభిలాషులుగా ఎలా రూపొందుతారు? ఒండొకరి సుఖదుఃఖాలలో - మంచీ చెబ్బరలలో ఎలా పాలుపంచుకుంటారు? పరోపకారం, త్యాగం వంటి సకారాత్మక భావాలు పెంపొందే బదులు వారిలో ప్రతీకారం, ద్వేషం వంటి నకారాత్మక భావాలు పొడసూపుతాయి.

(١٢٠٠) وَعَنْ عَبْدِاللهِ بْنِ الزُّبَيْرِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَضَى رَسُولُ اللهِ ﷺ أَنَّ الْخَصْمَيْنِ يَقْعُدَانِ بَيْنَ يَدَيِ الْحَاكِمِ. رَوَاهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1200. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) కథనం : "పోట్లాడుకున్న వ్యక్తులిరువురూ న్యాయాధికారి ఎదుట కూర్చోవాల"ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞాపించారు. (అబూ దావూద్ ఈ హదీసును ఉల్లేఖించగా, హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

ఈ హదీసులో రెండు విషయాలు ప్రధానంగా తెలుపబడ్డాయి. 1. న్యాయస్థానంలో నిందించేవాడు, నిందించబడేవాడు - ఇద్దరిపట్ల సమభావంతో ప్రవర్తించాలి. పక్షపాతం కూడదు. ఒకరి యెడల మర్యాదపూర్వకంగా వ్యవహరించి రెండో వ్యక్తిపట్ల దురుసుగా ప్రవర్తించటం ఎంతకీ తగదు.

2. తగాదా పడ్డ ఇద్దరూ న్యాయాధికారి సమక్షంలో కూర్చుని వివరణ ఇవ్వాలి. అంతేగాని నిలబడి సంజాయిషీ ఇవ్వరాదు.

**1వ అధ్యాయం**

## ١ - بَابُ الشَّهَادَاتِ

## సాక్ష్యాలు

(١٢٠١) عَنْ زَيْدِ بْنِ خَالِدٍ الْجُهَنِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**أَلاَ أُخْبِرُكُمْ بِخَيْرِ الشُّهَدَاءِ؟ هُوَ الَّذِي يَأْتِي بِشَهَادَتِهِ قَبْلَ أَنْ يُسْأَلَهَا**». رَوَاهُ مُسْلِمٌ.

1201. హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ జుహ్నీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "అత్యుత్తమ శ్రేణికి చెందిన సాక్షి ఎవరో నేను మీకు చెప్పనా? - సాక్ష్యమివ్వమని తనను ఎవరూ కోరకుండానే తనంతట తానుగా సాక్ష్యమిచ్చేవాడు." (ముస్లిం)

**సారాంశం**

మనిషి సాక్ష్యానికి కట్టుబడి ఉండటం, తన చర్మచక్షువులతో చూసిన దానిని, తన కర్ణపుటాలతో విన్న దానిని సంబంధిత వ్యక్తులు వచ్చి కోరినప్పుడు యధాతథంగా వివరించటం నిస్సందేహంగా నిజాయితీతో కూడుకున్న విషయమే. అయితే ఒకరు అభ్యర్థించకపోయినప్పటికీ పరిస్థితుల స్వరూపానికి మనిషి స్పందించి తన మనస్సాక్షిని అభివ్యక్తం చేయటం మరింత గొప్ప విషయం. ఒకానొక సంఘటనకు సంబంధించి తాను సాక్షిగా ఉండి కూడా, సంబంధిత వ్యక్తులు తన వద్దకు వచ్చి సాక్ష్యం కోరలేదుకదా! అని నిర్లిప్తంగా ఉండకూడదు. ఈ నిర్లిప్తత వల్ల బాధిత వ్యక్తికి న్యాయం చేకూరకపోవచ్చు. దుర్మార్గం ప్రబలిపోవచ్చు. అందుకే సాక్ష్యాల విషయంలో విశ్వాసులు చాలా ఖచ్చితంగా ఉండాలి. సాక్ష్యానికి కట్టుబడేవారిని దివ్య ఖుర్ఆన్ కొనియాడింది. సాక్ష్యాలను కప్పిపుచ్చే వారిని హెచ్చరించింది. ఉదాహరణకు : "సాక్ష్యాన్ని కప్పిపుచ్చకండి. సాక్ష్యాన్ని కప్పిపుచ్చినవాడి హృదయం పాపభూయిష్టమైనది." (2:283)అన్న ఖుర్ఆన్ సూక్తి గమనార్హం.

(١٢٠٢) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ خَيْرَكُمْ قَرْنِي، ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ، ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ، ثُمَّ يَكُونُ قَوْمٌ يَشْهَدُونَ، وَلاَ يُسْتَشْهَدُونَ، وَيَخُونُونَ وَلاَ يُؤْتَمَنُونَ، وَيَنْذِرُونَ وَلاَ يُوفُونَ، وَيَظْهَرُ فِيهِمُ السِّمَنُ».

مُتَّفَقٌ عَلَيْهِ.

1202. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు : నా కాలం మీ కాలాలన్నింటి కన్నా శ్రేష్ఠమైనది. ఆ తరువాత రాబోయే కాలం, మరి ఆ తరువాతి కాలం. ఆ తరువాత (కాలంలో) సాక్ష్యమివ్వమని కోరకపోయినా, సాక్ష్యాలిచ్చే జనులు పుట్టుకువస్తారు. వాళ్ళు అవినీతిపరులై ఉంటారు.వారిలో నిజాయితీ ఉండదు. మొక్కుకుంటారు గాని మొక్కుబడులు తీర్చరు. బాగా బలసి ఉంటారు.

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇంతకు ముందు వచ్చిన హదీసులో సాక్ష్యం కోరకపోయినా సాక్ష్యమివ్వటం మేలైన విషయంగా చెప్పబడగా, ఈ హదీసులో హానికరమైన విషయంగా పేర్కొనబడిందేమిటీ? అన్న సందేహం కలగవచ్చు. ఇది నకారాత్మక నేపథ్యంలో చెప్పబడింది. అంటే దురుద్దేశ్యంతో, విషయాన్ని వక్రీకరించే సంకల్పంతో వ్యవహారంలో జోక్యం చేసుకుని తప్పుడు సాక్ష్యం ఇచ్చే వారిపై ఈ హదీసులో ఆక్షేపణ ఉంది.

మంచి కాలం, చెడు కాలాలకు సంబంధించిన భవిష్యవాణి కూడా ఇందులో ఉంది. దైవప్రవక్త (స) గారి కాలం అన్నింటికన్నా శ్రేష్ఠమైనది. ఆ తరువాత సహాబీల కాలం, ఆపైన తాబయీల కాలం మంచివి. అయితే ప్రవక్త (స) ప్రియ సహచరులలో కూడా బద్ర్, ఉహుద్ సంగ్రామాలలో పాల్గొన్నవారు మరింత గొప్పవారు.

రాను రాను దేశ, సమాజాల్లో నైతికపు విలువలు అడుగంటి పోతాయనీ, ప్రజల హక్కులను కొల్లగొట్టే స్వార్థపరులు పుట్టుకువస్తారనీ, వారు అప్పగింతల్లో స్వామి ద్రోహానికి పాల్పడతారనీ, పిసినారితనం ప్రబలిపోయి మనసులో అనుకున్న వాటిని నెరవేర్చటానికి ఊగిసలాడతారనీ, 'తన', 'మన'ల కన్నా 'నా' అన్నదానికే ప్రాధాన్యతనిచ్చి పరుల సొమ్మును కబళించే ప్రయత్నాలు చేస్తారనీ, ఈ స్వార్థ ప్రియత్వం మూలంగానే వారి దేహాలపై కొవ్వు పెరిగిపోతుందనీ హదీసులో సంకేతం ఇవ్వబడింది.

(١٢٠٣) وَعَنْ عَبْدِاللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«لاَ تَجُوزُ شَهَادَةُ خَائِنٍ وَلاَ خَائِنَةٍ، وَلاَ ذِي غِمْرٍ عَلَى أَخِيهِ، وَلاَ تَجُوزُ شَهَادَةُ الْقَانِعِ لِأَهْلِ الْبَيْتِ»**. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ.

1203. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "అవినీతిపరుడైన పురుషుడు మరియు అవినీతిపరురాలైన స్త్రీ ఇచ్చే సాక్ష్యం ధర్మసమ్మతం కాదు. శత్రువు, కపటి అయిన వ్యక్తి తన సోదరునికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చినా అది సమ్మతం కాదు. ఒకరి సంరక్షణలో ఉన్న వ్యక్తి తన సంరక్షకుని కుటుంబీకులకు అనుకూలంగా ఇచ్చే సాక్ష్యం కూడా స్వీకారయోగ్యం కాదు."

(ముస్నద్ అహ్మద్, అబూదావూద్)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం నమ్మకద్రోహి, అవినీతిపరుడు, శత్రువు, కపటి ఇచ్చే సాక్ష్యం స్వీకార యోగ్యం కాజాలదు. అలాగే ఒకరి ఆలనా పాలనలో ఉన్న వ్యక్తి తన యజమాని కుటుంబీకులకు అనుకూలంగా ఇచ్చే సాక్ష్యం ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే అతడు పక్షపాత వైఖరి నవలంబించే అవకాశం ఉంది.

(١٢٠٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يَقُولُ:

1204. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెబుతుండగా తాను విన్నానని

«لاَ تَجُوزُ شَهَادَةُ بَدَوِيٍّ عَلَى صَاحِبِ قَرْيَةٍ». رَوَاهُ أَبُو دَاوُدَ وَابْنُ مَاجَهْ.

హజ్రత్ అబూహురైరా (రజి) తెలియ జేశారు : "ఒక బదవీ (పల్లెటూరి బైతు) ఒక పట్టణవాసి పక్షాన ఇచ్చే సాక్ష్యం స్వీకారయోగ్యం కాదు."

(అబూదావూద్, ఇబ్నెమాజా)

(١٢٠٥) وَعَنْ عُمَرَ بْنِ الْخَطَّابِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ خَطَبَ فَقَالَ: إِنَّ أُنَاساً كَانُوا يُؤْخَذُونَ بِالْوَحْيِ فِي عَهْدِ رَسُولِ اللهِ ﷺ، وَإِنَّ الْوَحْيَ قَدِ انْقَطَعَ، وَإِنَّمَا نَأْخُذُكُمْ الْآنَ بِمَا ظَهَرَ لَنَا مِنْ أَعْمَالِكُمْ. رَوَاهُ الْبُخَارِيُّ.

1205. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం : తను ప్రజలనుద్దేశ్యించి ఉపన్యసిస్తూ ఇలా అన్నారు : దైవప్రవక్త (స) కాలంలో ప్రజా వ్యవహారాలు 'వహీ' (దైవవాణి) ఆధారంగా నిర్ణయించబడేవి. ఇప్పుడు వహీ (దైవవాణి) అవతరణ ఆగిపోయింది. ఇప్పుడు మేము మీ వ్యవహారాలపై తీర్పు - మా సమక్షంలో బహిర్గతమయ్యే మీ ఆచరణలను బట్టి ఇస్తాము." (బుఖారీ)

**సారాంశం**

దీని ద్వారా తెలిసేదేమిటంటే దైవప్రవక్త (సఅసం) కాలంలో ఆయన (స)పై దైవవాణి అవతరించేది. ఆయన (స) మరణానంతరం ఈ 'వహీ' పరంపర ఆగిపోయింది - అంటే దైవదౌత్యం పరిసమాప్తమైంది. దైవధర్మం పరిపూర్ణమయింది. ఇకమీదట మరొక దైవప్రవక్త రావటంగానీ, ఆకాశం నుండి దైవవాణి అవతరించటం గానీ జరగవు. ఇప్పుడు ఎవరయినా తన్ను తాను దైవప్రవక్తనని ప్రకటించుకున్నా, తన వద్దకు దైవవాణి వస్తుందని చెప్పినా అతడు అసత్య ప్రకటన చేస్తున్నాడనీ, మానవ జగతిని మోసపుచ్చుతున్నాడనీ భావించాలి. ఇలా ప్రకటించేవాడు ఎంత గొప్ప విద్వాంసుడైనా సరే అతడు ఇస్లాం నుండి బహిష్కరించబడినట్లే.

ఇక హజ్రత్ ఉమర్ (రజి) పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే దైవప్రవక్త (స) కాలంలో నయితే ప్రజల వివాదాలు దైవసూచనానుసారం పరిష్కరించబడేవి. ఏదేని వ్యవహారంలో నిర్దిష్టమైన శాసనం లేనట్లయితే దేవుడు 'వహీ' ద్వారా తన ప్రవక్త (స)కు మార్గదర్శకత్వం వహించేవాడు. ఇస్లాం ధర్మం పరిపూర్ణమైపోయిన మీదట మనముందున్న ఇస్లామీయ షరీయత్ ననుసరించి ప్రజల వ్యవహారాలపై తీర్పులు ఇవ్వటం జరుగుతుంది. ఈ తీర్పులు ఇచ్చేటప్పుడు మనిషి బాహ్య ఆచరణల్ని, అతని గుణగణాలను, స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

(١٢٠٦) وَعَنْ أَبِي بَكْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ عَدَّ شَهَادَةَ الزُّوْرِ فِي أَكْبَرِ الْكَبَآئِرِ. مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيْثٍ طَوِيْلٍ.

1206. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబద్ధపు సాక్ష్యాన్ని మహాపరాధాలలో చేర్చారని హజ్రత్ అబూబక్రా (రజి) వివరించారు.(బుఖారీ మరియు ముస్లిం లోని సుదీర్ఘ హదీసులో భాగం ఇది)

**సారాంశం**

మహాపరాధాలు (ఘోర పాపాలు) అనేకం ఉంటాయని ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. అబద్ధపు సాక్ష్యం కూడా వాటిలో ఒకటి. ఇతర మహాపరాధాలలో ముఖ్యమైనవి - అల్లాహ్‌తోపాటు వేరొకరిని సహవర్తులుగా నిలబెట్టుకోవటం, తల్లిదండ్రులకు అవిధేయత చూపటం, అకారణంగా కదనరంగం నుండి పలాయనం చిత్తగించటం, సుశీలయగు వనితపై నీలాపనిందలు మోపటం మొదలగునవి. ఏ అపరాధాలకయితే షరీయత్ శిక్షల్ని నిర్ధారించిందో లేక పరలోకంలో వ్యధాభరితమయిన శిక్ష విధించబడుతుందని చెప్పబడిందో అవి మహాపరాధాలుగా ఎంచబడతాయి. అబద్ధపు సాక్ష్యాన్ని కూడా ఈ జాబితాలో చేర్చడాన్నిబట్టి చూస్తుంటే, ఈ అపరాధం వల్ల సమాజంలో ఎంత అరాచకం ప్రబలుతున్నదో అర్థం చేసుకోవచ్చు. అబద్ధపు సాక్ష్యాల నివారణే గనక జరిగితే కోర్టుల్లో కేసులు త్వరితగతిన తెమలుతాయి. ప్రజలకు త్వరగా న్యాయం లభిస్తుంది. వ్యయప్రయాసలు తగ్గుతాయి. అసలు న్యాయస్థానాల్లోని చెడుగు కంతటికీ ప్రధాన కారణం తప్పుడు సాక్ష్యాలే. అవినీతి కూడా వాటికి తోడై మొత్తం వ్యవస్థనే అతలాకుతలం చేసేస్తుంది. ఈ వ్యవస్థ నుండి వ్రేళ్ళూనుకున్న ఈ రెండు చెడుగులను గనక సమూలంగా పెకలిస్తే సమాజంలో శాంతి శ్రేయోభిలాషల వాతావరణం వెల్లివిరుస్తుంది.

(١٢٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ لِرَجُلٍ: «تَرَى الشَّمْسَ؟» قَالَ: نَعَمْ. قَالَ: «عَلَى مِثْلِهَا فَاشْهَدْ، أَوْ دَعْ». أَخْرَجَهُ ابْنُ عَدِيٍّ بِإِسْنَادٍ ضَعِيْفٍ، وَصَحَّحَهُ الْحَاكِمُ فَأَخْطَأَ.

1207. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సఅసం) ఒక వ్యక్తి నుద్దేశ్యించి, "నువ్వు సూర్యుణ్ణి చూస్తున్నావా?" అని అడిగారు. దానికావ్యక్తి 'అవున'న్నాడు. అప్పుడు ఆయన (స), "ఇటువంటి దేదీప్యమానమైన ఆధారం ఉంటేనే సాక్ష్యం ఇవ్వు లేకపోతే వదిలెయ్యి" అని తాకీదు చేశారు. (దీనిని ఇబ్నె అదీ బలహీన పరంపర ద్వారా సంగ్రహించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదని అన్నారంటే ఆయన పొరబడ్డారు).

**సారాంశం**

పగటి వెలుగులా విషయం తనకు స్పష్టంగా తెలిసి ఉన్నప్పుడే ఎవరయినాసరే దాని గురించి సాక్ష్యం ఇవ్వాలనీ లేకుంటే సాక్ష్యం ఇవ్వరాదని ఈ హదీసు చెబుతోంది. కేవలం ఊహ లేక అనుమానంపై అవునో, కాదో సాక్ష్యమివ్వటం ఘోరమయిన తప్పిదం.

(١٢٠٨) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَضَى بِيَمِينٍ وَشَاهِدٍ. أَخْرَجَهُ مُسلِمٌ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَقَالَ: إِسْنَادُهُ جَيِّدٌ.

1208. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక ప్రమాణం మరియు ఒక సాక్షి ఆధారంగా తీర్పు ఇచ్చారు.(ముస్లిం, అబూదావూద్, నసాయి దీనిని సేకరించారు - దీని పరంపర ఉత్తమమైనది)

(١٢٠٩) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مِثْلَهُ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1209. హజ్రత్ అబూహురైరా (రజి)చే చేయబడిన కథనం కూడా ఈ విధంగా (పై విధంగా)నే ఉంది. (దీనిని అబూదావూద్, తిర్మిజీ సంకలనం చేశారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**రెండవ అధ్యాయం**

## ٢ - بَابُ الدَّعْوَى وَالبَيِّنَاتِ

## ఆరోపణలు, ఆధారాలు

(١٢١٠) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**لَوْ يُعْطَى النَّاسُ بِدَعْوَاهُمْ لَادَّعَى نَاسٌ دِمَاءَ رِجَالٍ وَأَمْوَالَهُمْ، وَلَكِنَّ الْيَمِينَ عَلَى الْمُدَّعَى عَلَيْهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1210. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ఒకవేళ ప్రజలకు వారు చేసిన ఆరోపణల (వేసిన దావాల) ఆధారంగానే వారి హక్కు వారికిచ్చేస్తే, ప్రజలు ఇతరుల రక్తం మరియు సంపదల కోసం కూడా దావా చేస్తారు. అయితే ముద్దాయి విధిగా ప్రమాణం చేయవలసి ఉంటుంది. (బుఖారీ, ముస్లిం)

బైహఖీ ప్రామాణికమైన పరంపర ద్వారా

وَلِلْبَيْهَقِيِّ بِإِسْنَادٍ صَحِيحٍ: «الْبَيِّنَةُ عَلَى الْمُدَّعِي، وَالْيَمِينُ عَلَى مَنْ أَنْكَرَ».

చేసిన ఉల్లేఖనంలో ఇలా ఉంది : "సాక్ష్యంలోని నిజానిజాల బాధ్యత ఆరోపించిన వ్యక్తిపై ఉంటుంది. కాగా; ప్రమాణం యొక్క బాధ్యతను ఆరోపణను నిరాకరించిన వ్యక్తి స్వీకరించవలసి ఉంటుంది."

**సారాంశం**

ఈ హదీసులో తీర్పుకు సంబంధించిన ఒక ముఖ్యమైన సూత్రం వివరించబడింది. అదేమంటే ఆరోపించేవాడు (దావాచేసేవాడు) తన ఆరోపణలకు సంబంధించిన స్పష్టమయిన ఆధారాలను సమర్పించాలి. సాక్ష్యాలను తీసుకురావాలి. లేదా నిందితుడు తనపై మోపబడిన నిందను ఖుద్దుగా అంగీకరించాలి. ఒకవేళ అలా కానప్పుడు నిందితుడు తనపై మోపబడిన ఆరోపణలను బూటకమని రుజువు చేసే ఆధారాలను న్యాయస్థానానికి సమర్పించాలి. అదీ చేయలేనప్పుడు అతడు దైవంపై ప్రమాణం చేయాలి. అత్యధికమంది విద్వాంసుల అభిమతం కూడా ఇదే.

(١٢١١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ عَرَضَ عَلَى قَوْمٍ الْيَمِينَ فَأَسْرَعُوا، فَأَمَرَ أَنْ يُسْهَمَ بَيْنَهُمْ فِي الْيَمِينِ، أَيُّهُمْ يَحْلِفُ. رَوَاهُ الْبُخَارِيُّ.

1211. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకానొక విషయంలో గొడవ పడి తన దగ్గరకు వచ్చిన ఇరుపక్షాల వారిని ప్రమాణం చేయమని ఆదేశించగా, వాళ్లు దాని కోసం తక్షణం సిద్ధమయ్యారు. అప్పుడు ఆయన (సఅసం), "వీళ్ళల్లో ప్రమాణం చేయవలసిందెవరో చీటీ వేసి నిర్ధారించండి" అని అన్నారు. (బుఖారీ)

**సారాంశం**

తగాదాపడిన ఇరు పక్షాలవారు పరస్పరం నిందారోపణలు చేసుకుని - నిందించేవారెవరో, నిందితులెవరో ఖచ్చితంగా తేలనప్పుడు - వారినుండి ప్రమాణ స్వీకారం చేయించవలసి ఉంటుంది. వారిలో ఏ ఒక్కరైనా ప్రమాణం చేయడానికి నిరాకరిస్తే, అవతలి వ్యక్తి ప్రమాణం చేసి తన సొమ్మును తీసేసుకుంటాడు. ఒకవేళ ఇరువర్గాల వారు కూడా ప్రమాణం చేయడానికి సిద్ధపడితే అప్పుడు చీటీ (టాస్) వేయబడుతుంది. అందులో ఎవరి పేరు వస్తే వారు ప్రమాణం చేసి సొమ్ము తీసుకునేందుకు అర్హులవుతారు.

(١٢١٢) وَعَنْ أَبِي أُمَامَةَ الْحَارِثِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **«مَنِ اقْتَطَعَ حَقَّ امْرِىءٍ مُسْلِمٍ بِيَمِينِهِ فَقَدْ أَوْجَبَ اللَّهُ لَهُ النَّارَ، وَحَرَّمَ عَلَيْهِ الْجَنَّةَ».** فَقَالَ لَهُ رَجُلٌ: وَإِنْ كَانَ شَيْئاً يَسِيراً يَا رَسُولَ اللهِ؟ قَالَ: **«وَإِنْ كَانَ قَضِيباً مِنْ أَرَاكٍ».** رَوَاهُ مُسْلِمٌ.

1212. హజ్రత్ అబూ ఉమామ హారిసీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "ఎవరయినా తన ముస్లిం సోదరుని హక్కును తన ప్రమాణం చేత కాజేస్తే అల్లాహ్ అతని కోసం నరకాన్ని తప్పనిసరిగా సిద్ధం చేస్తాడు. అతని కోసం స్వర్గాన్ని నిషిద్ధం (హరామ్) గావిస్తాడు." 'ఓ దైవప్రవక్తా (సఅసం)! ఏదన్నా అతి స్వల్పమయిన వస్తువును కాజేస్తే...?!' అని ఒక వ్యక్తి సందేహపడగా, "..... వృక్షం యొక్క కొమ్మ అయినానరే" అని ఆయన (సఅసం) చెప్పారు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ ఉమామా (రజి) : అబూ ఉమామ బిన్ సాలబ అన్సారీ హారిసీ. ఈయన పేరుపై తీవ్రమయిన భేదాభిప్రాయం ఉంది. అయాస్ బిన్ సాలబ అనేది సరైన పేరని తెలుస్తోంది. ఖజ్రజ్ తెగకు చెందినవారు. వేరొక కథనం ప్రకారం బలవీగా కూడా పిలువబడ్డారు. సనాతన సహచరులలో ఒకరు. తన తల్లి సేవల్లో నిమగ్నులై ఉన్నందున బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు.

(١٢١٣) وَعَنِ الْأَشْعَثِ بْنِ قَيْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **«مَنْ حَلَفَ عَلَى يَمِينٍ، يَقْتَطِعُ بِهَا مَالَ امْرِىءٍ مُسْلِمٍ، هُوَ فِيهَا فَاجِرٌ، لَقِيَ اللَّهَ وَهُوَ عَلَيْهِ غَضْبَانُ».** مُتَّفَقٌ عَلَيْهِ.

1213. హజ్రత్ అష్అత్ బిన్ ఖైస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఏ వ్యక్తయితే అబద్ధ ప్రమాణం చేసి ఇతరుల సొమ్మును కాజేస్తాడో అతనికి అల్లాహ్ అత్యంత అప్రసన్నుడైన స్థితిలో దర్శనమిస్తాడు." (బుఖారీ, ముస్లిం)

### హదీసు ఉల్లేఖకులు

అష్అత్ బిన్ ఖైస్ (రజి) మాదీ కరిబ్ అల్‌కింది. అబూ ముహమ్మద్ ఈయన మారుపేరు. కూఫాలో స్థిరపడ్డారు. 'యర్‌మూక్' యుద్ధ సందర్భంగా ఈయన కన్ను ఒకటి పగిలిపోయింది.

గొప్ప దాత. పరోపకార గుణం ఈయనలో మెండుగా ఉండేది. ఒకానొక సందర్భంగా ఒట్టేసుకుని పరిహారంగా పదిహేను వేలు ఇచ్చారు. ఆజర్ బాయ్‌జాన్ ప్రాంతానికి గవర్నర్‌గా నియమితులయ్యారు. సిఫ్ఫీన్ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) పక్షాన నిలిచారు. హజ్రత్ అలీ (రజి) మరణించిన నలభై రోజులకు ఈయన కన్నుమూశారు. అప్పటికి ఈయన వయస్సు 63 సంవత్సరాలు.

(١٢١٤) وَعَنْ أَبِي مُوْسَى رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلَيْنِ اخْتَصَمَا فِي دَابَّةٍ، وَلَيْسَ لِوَاحِدٍ مِّنْهُمَا بَيِّنَةٌ، فَقَضَى بِهَا رَسُولُ اللهِ بَيْنَهُمَا نِصْفَيْنِ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَهٰذَا لَفْظُهُ، وَقَالَ: إِسْنَادُهُ جَيِّدٌ.

1214. హజ్రత్ అబూ మూసా (రజి) కథనం : ఇద్దరు వ్యక్తులు ఒక జంతువు విషయంలో తగాదాపడ్డారు. వారిద్దరిలో ఏ ఒక్కరు కూడా ఆ జంతువు తనదేనన్న దాని గురించి తగు ఆధారం చూపలేక పోయారు. అందుచేత ఆయన (సఅసం) ఆ జంతువును వారిద్దరికీ చెరి సగం చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఈ వాక్యాలు నసాయివి. దీని పరంపర చాలా బావుంది)

**సారాంశం**

ఈ హదీసుకు భావార్థంగా అల్లామా ఖత్తాబీ ఇలా అంటున్నారు. ఆ ఒంటె లేక ఆ జంతువును ఆ ఇద్దరూ బహుశా పట్టుకుని వచ్చి ఉంటారు. అందువల్లనే దైవప్రవక్త (సఅసం) ఆ జంతువును వారిద్దరి మధ్య పంచిపెట్టారు. అదే కాకుండా ఉంటే - అంటే ఆ ఇద్దరి వద్ద కాకుండా మరో మూడో వ్యక్తి అధీనంలో అది ఉండి ఉంటే - కేవలం డిమాండు చేసినంత మాత్రానికే అది వారికి లభించి ఉండేది కాదు.

(١٢١٥) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ حَلَفَ عَلَى مِنْبَرِي هَذَا بِيَمِينٍ آثِمَةٍ تَبَوَّأَ مَقْعَدَهُ مِنَ النَّارِ**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1215. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ నల్లం) ఇలా ప్రవచించారు : ఎవరయినా సరే నా ఈ వేదికపై నిలబడి అబద్ధపు ప్రమాణం చేశాడంటే అతడు తన నివాసాన్ని నరకంలో ఏర్పరచుకున్నట్లే.'' (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(١٢١٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «ثَلاَثَةٌ لاَ يُكَلِّمُهُمُ اللَّهُ يَوْمَ الْقِيَامَةِ، وَلاَ يَنْظُرُ إِلَيْهِمْ، وَلاَ يُزَكِّيهِمْ، وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ: رَجُلٌ عَلَى فَضْلِ مَاءٍ بِالْفَلاَةِ يَمْنَعُهُ مِنِ ابْنِ السَّبِيلِ. وَرَجُلٌ بَايَعَ رَجُلاً بِسِلْعَةٍ بَعْدَ الْعَصْرِ، فَحَلَفَ لَهُ بِاللهِ: لأَخَذَهَا بِكَذَا وَكَذَا، فَصَدَّقَهُ، وَهُوَ عَلَى غَيْرِ ذَلِكَ. وَرَجُلٌ بَايَعَ إِمَاماً لاَ يُبَايِعُهُ إِلاَّ لِلدُّنْيَا فَإِنْ أَعْطَاهُ مِنْهَا وَفَى، وَإِنْ لَمْ يُعْطِهِ مِنْهَا لَمْ يَفِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1216. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: ముగ్గురు వ్యక్తులతో అల్లాహ్ తీర్పు దినాన మాట్లాడటంగానీ, వారి వైపు కన్నెత్తి (చల్లని చూపు) చూడటం గానీ చేయడు. పాపాలనుండి వారిని పరిశుద్ధుల్ని కూడా చేయడు. పైగా వారికోసం వ్యధాభరితమయిన యాతన సిద్ధంగా ఉంటుంది. వారిలో ఒకడు ఒక బాటసారిని ఎడారి ప్రాంతంలో మిగులు జలాల నుండి సయితం ఆపేవాడు. రెండవవాడు : సాయం సమయాన (లేక అస్ర్ నమాజు అనంతరం) ఒక వస్తువును విక్రయిస్తూ, దాన్ని తాను ఇంత మొత్తానికి లోగడ కొన్నానని అల్లాహ్ పేరున ప్రమాణం చేసేవాడు. నిజానికి అతను చెప్పినంత ధరకు దాన్ని కొని ఉండడు. కాని కొనుగోలుదారు అతని మాటల్ని నమ్మి మోసపోతాడు. మూడవవాడు: ప్రాపంచిక పరమార్థాల కోసం రాజుకు విధేయుడై ఉంటానని ప్రతిజ్ఞ చేసినవాడు. రాజు తనకేదైనా ఇస్తున్నంత కాలం విశ్వాసపాత్రుడుగా ఉంటాడు. ఇవ్వకపోతే అసమ్మతివాదిగా మారిపోతాడు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం మిగులు జలాలను ఇతరులకు ఉపయోగపడకుండా ఆపుకోవటం, సాయంత్రం పూట అబద్ధపు ప్రమాణాలు చేసి వస్తువులను విక్రయించటం, ప్రాపంచిక స్వప్రయోజనాలను ఆశించి కాలపు చక్రవర్తిని సమర్థించటం - ఇవన్నీ విశ్వప్రభువు అప్రసన్నతకు కారణంగా పరిణమిస్తాయి. ఇలాంటి పనులు చేసేవారు పరమ ప్రభువు దయాదాక్షిణ్యాలకు, క్షమాభిక్షకు దూరమైపోతారు.

(١٢١٧) وَعَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلَيْنِ اخْتَصَمَا فِي نَاقَةٍ، فَقَالَ كُلُّ وَاحِدٍ مِنْهُمَا: نُتِجَتْ عِنْدِي، وَأَقَامَا بَيِّنَةً، فَقَضَى بِهَا رَسُولُ اللهِ ﷺ لِمَنْ هِيَ فِي يَدِهِ.

1217. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : ఇద్దరు వ్యక్తులు దైవప్రవక్త (సఅసం) కొలువుకు ఒంటె వివాదం తీసుకు వచ్చారు. ఒంటె తన చావిడీలోనే ఈనిందని వారిలో ప్రతి ఒక్కడూ వాదించసాగాడు. తమ వాదనకు అనుకూలంగా వాళ్ళు సాక్షుల్ని కూడా తీసుకువచ్చారు. ఇదంతా విని దైవప్రవక్త (స), ఒంటె అధీనంలో వున్న వ్యక్తికి అనుకూలంగా తీర్పు ఇచ్చారు.

(١٢١٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ رَدَّ الْيَمِينَ عَلَى طَالِبِ الْحَقِّ. رَوَاهُمَا الدَّارَقُطْنِيُّ، وَفِي إِسْنَادِهِمَا ضَعْفٌ.

1218. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ప్రమాణం చేసే బాధ్యతను ఆరోపించే వ్యక్తిపై మోపారు. (ఈ రెండు హదీసులను కూడా దారె ఖుత్నీ ఉల్లేఖించారు. ఈ రెంటి పరంపరలోనూ బలహీనత ఉంది)

**సారాంశం**

నిందితుడు తనపై మోపబడిన నిందను ఖండించే ఆధారంగానీ, సాక్షుల్నిగానీ తేలేకపోయినప్పుడు, నింద **అబద్ధమని ప్రమాణం** చేయడానికి కూడా నిరాకరించినపుడు 'ప్రమాణం' చేసే బాధ్యతను **నిందించేవాడు** స్వీకరించవలసి ఉంటుందని ఈ హదీసు ద్వారా తేటతెల్ల మవుతోంది.

(١٢١٩) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، قَالَتْ: دَخَلَ عَلَيَّ النَّبِيُّ ﷺ ذَاتَ يَوْمٍ مَسْرُوراً، تَبْرُقُ أَسَارِيرُ وَجْهِهِ، فَقَالَ: «**أَلَمْ تَرَيْ أَنَّ مُجَزِّزاً الْمُدْلِجِيَّ نَظَرَ آنِفاً إِلَىٰ زَيْدٍ**

1219. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : ఒకనాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సంతోషాతిశయంతో నా దగ్గరకు వచ్చారు. ఆయన (సఅసం) ముఖారవిందం ప్రకాశిస్తూ ఉంది. నన్నుద్దేశ్యించి ఆయన (న) ఇలా అన్నారు : "నీకు తెలుసా! ముజజ్జిజ్

بْنِ حَارِثَةَ وَأُسَامَةَ بْنِ زَيْدٍ، فَقَالَ: هٰذِهِ الْأَقْدَامُ بَعْضُهَا مِنْ بَعْضٍ». مُتَّفَقٌ عَلَيْهِ.

ముద్లిజీ ఇప్పుడిప్పుడే జైద్ బిన్ హారిస మరియు ఉసామా బిన్ జైద్ (ర.అన్) లను చూసి 'ఈ కాళ్ళు పరస్పర పోలికలు గలవి' అని అన్నాడు." (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

'ఏమిటీ ఇందులో ఉన్న విశేషం?' దైవప్రవక్త (స) ఈ మాటను విని అమితానందం చెందడానికి గల కారణం ఏమిటీ? అన్న సందేహం ఇక్కడ కలగటం సహజమే.

'ముజజ్జిజ్ ముద్లిజీ' ముఖ సాముద్రిక విద్యలో ప్రవేశమున్నవారు. ఈయన ముద్లిజ్ తెగ వారవటం చేత ముద్లిజీగా పిలువబడ్డారు.

జైద్ బిన్ హారిస - ఉసామ బిన్ జైద్‌లు ఇరువురూ ప్రక్క పక్కనే పండుకుని ఉండగా ముద్లిజీ వారిద్దరినీ చూశారు. ఆ సమయంలో దుప్పటి వారి ముఖాలపై ఉంది. పాదాలు మాత్రం కనిపిస్తున్నాయి. కేవలం పాదాలను చూసి నిదురిస్తున్న వారిద్దరూ ఒకే వంశ వృక్షానికి చెందినవారని ముద్లిజీ చెప్పటం మహాప్రవక్త (స)కు ఎంతో ఆనందం కలిగించింది. ఎందుకంటే ఉసామా బిన్ జైద్ (రజి) నలుపు రంగుపై కొంతమంది చెవులు కొరుక్కునేవారు. ఉసామా తండ్రి అయిన జైద్ బిన్ హారిస తెల్లగా ఉండటం వారి సంశయానికి అసలు కారణం. జైద్ సతీమణి అయిన ఉమ్మె ఐమన్ ఒక నీగ్రో (ఇథియోపియన్) మహిళ అన్న సంగతి ఇక్కడ గమనార్హం. **బహుశా** తల్లి రంగు ఉసామాకి వచ్చి ఉండవచ్చు. తండ్రి రంగు కొడుక్కి **రాకపోయినంతమాత్రాన** ముంచుకుపోయిందేమీ లేదు కదా! అయితే ముద్లిజీ కేవలం **పాదాలను చూచి వారిద్దరూ** తండ్రీకొడుకులన్న సంగతిని నిర్ధారించటం విశేషం! కులగోత్రాలు, నిమ్నోన్నతల వంటి అజ్ఞాన కాలపు అహంభావాలను రూపుమాపి దైవభక్తి, నీతీ నడవడికల ప్రాతిపదికలపై సత్సమాజాన్ని రూపొందించగోరిన మహనీయ ముహమ్మద్ (స) వారికి సహజంగానే ఈ విషయం తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చింది. అందుకే ఆనందంతో పరవశించిపోయారు. ఆ ఆనందాన్ని తన సతీమణితో కూడా పంచుకున్నారు. ఉసామా బిన్ జైద్ (రజి) పట్ల దైవప్రవక్త (స) కు గల ప్రత్యేక వాత్సల్యాన్ని కూడా ఈ హదీసు ప్రతిబింబిస్తూ ఉంది.

## హదీసు ఉల్లేఖకులు

ముజజ్జిజ్ ముద్లిజీ (రజి) : ముద్లజ్ తెగకు చెందినవారు. అజ్ఞానకాలంలో ముఖ సాముద్రిక విద్యలో నిష్ణాతునిగా పేరుగాంచారు.

# 15. బానిస విమోచన పుస్తకం
# ١٥ - كِتَابُ الْعِتْقِ

(١٢٢٠) عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَيُّمَا امْرِىءٍ مُسْلِمٍ أَعْتَقَ امْرَأً مُسْلِماً اسْتَنْقَذَ اللَّهُ بِكُلِّ عُضْوٍ مِنْهُ عُضواً مِنْهُ مِنَ النَّارِ» مُتَّفَقٌ عَلَيْهِ.

1220. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలియజేశారు : "ఏ ముస్లిమైనా ఒక ముస్లిం బానిసకు బానిసత్వం నుండి విముక్తి కలిగిస్తే, ఆ బానిసకున్న ప్రతి అవయవానికి బదులుగా అల్లాహ్ ఆ స్వేచ్ఛా ప్రదాతను నరకాగ్ని నుంచి విముక్తి నొసగుతాడు."

(బుఖారీ, ముస్లిం)

وَلِلتِّرْمِذِيِّ - وَصَحَّحَهُ - عَنْ أَبِي أُمَامَةَ: أَيُّمَا امْرِىءٍ مُسْلِمٍ أَعْتَقَ امْرَأَتَيْنِ مُسْلِمَتَيْنِ كَانَتَا فِكَاكَهُ مِنَ النَّارِ. وَلأَبِيْ دَاوُدَ مِنْ حَدِيْثِ كَعْبِ بْنِ مُرَّةَ: أَيُّما امْرَأَةٍ مُسْلِمَةٍ أَعْتَقَتِ امْرَأَةً مُسْلِمَةً كَانَتْ فِكَاكَها مِنَ النَّارِ.

తిర్మిజీలో తిర్మిజీ ప్రమాణబద్ధమైనదిగా ఖరారు చేసిన అబూ ఉమామ ఉల్లేఖనం ఒకటుంది: "ఏ ముస్లిం పురుషుడైనా ఇద్దరు ముస్లిం బానిస స్త్రీలకు దాస్య విముక్తిని కలిగిస్తే వారిద్దరూ ఆ పురుషుడు నరకం నుంచి విముక్తి నొందడానికి కారకులవుతారు."

అబూదావూద్‌లో కాబ్ బిన్ ముర్ర కథనం ఇలా వుంది: "ఏ ముస్లిం మహిళ అయినా ఒక ముస్లిం బానిస స్త్రీకి స్వేచ్ఛ నొసగినట్లయితే ఆ బానిస స్త్రీ ఆమెకు నరకం నుంచి విముక్తి పొందటంలో దోహదపడుతుంది."

**సారాంశం**

ఒక ముస్లిం స్త్రీకిగానీ, పురుషునికిగానీ స్వేచ్ఛా భాగ్యాన్ని ప్రసాదించటం మనిషి తన పరలోక జీవితాన్ని బాగుచేసుకోవటమేననీ, ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అతని పాలిట

మన్నింపుకు, కారుణ్యానికి దోహదకారిగా పరిణమిస్తాయనీ ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవప్రవక్త (సఅసం) పలు విధాలుగా ఈ సత్కార్యం కోసం తన సహచరుల్ని ప్రోత్సహించారు. ఈ దాస్య శృంఖలాల నుంచి మానవతకు విముక్తి నొసగటం అంటే మనిషి తన ఆత్మకు మేలు చేకూర్చుకోవటమేనని ఉపమానాల ద్వారా విడమరచి చెప్పారు. బానిసల హక్కులను స్పష్టపరిచారు. లేకపోతే ఆనాడు బానిసలు పశువుల కన్నా హీనంగా పరిగణించబడేవారు.

### హదీసు ఉల్లేఖకులు

కాబ్ బిన్ ముర్ర (రజి) : ముర్ర బిన్ కాబ్ అని మరి కొంతమంది అభిప్రాయపడ్డారు. మొదట బస్రాకు వచ్చారు. తరువాత జోర్డాన్‌కు ప్రస్థానం చేశారు. జోర్డాన్‌లోనే హిజ్రీ 57 లేదా 59లో మరణించారు.

(١٢٢١) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَأَلْتُ النَّبِيَّ ﷺ: أَيُّ الْعَمَلِ أَفْضَلُ؟ قَالَ: «**إِيمَانٌ بِاللهِ، وَجِهَادٌ فِي سَبِيلِهِ**». قُلْتُ: فَأَيُّ الرِّقَابِ أَفْضَلُ؟ قَالَ: «**أَغْلَاهَا ثَمَناً، وَأَنْفَسُهَا عِنْدَ أَهْلِهَا**». مُتَّفَقٌ عَلَيْهِ.

1221. హజ్రత్ అబూజర్ (రజి) కథనం: "అన్నింటికన్నా మేలైన ఆచరణ ఏది?" అని నేను దైవప్రవక్త (సఅసం)ను ప్రశ్నించగా, "దైవాన్ని విశ్వసించటం మరియు దైవమార్గంలో పోరాడటం" అని ఆయన (సఅసం) బదులిచ్చారు. "ఎలాంటి బానిసను విడుదల చేయటం శ్రేష్ఠమైనది?" అని నేను ప్రశ్నించగా, "చాలా ఎక్కువ ధర పలికే బానిస, యజమానుల దృష్టిలో ఉత్తమునిగా, ప్రియతమునిగా ఉండే బానిస" అని ఆయన (సఅసం) వివరించారు. (బుఖారీ, ముస్లిం)

(١٢٢٢) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ أَعْتَقَ شِرْكاً لَهُ فِي عَبْدٍ، فَكَانَ لَهُ مَالٌ يَبْلُغُ**

1222. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: 'ఎవరయినా ఉమ్మడి యాజమాన్యం క్రింద ఉన్న బానిసకు తన భాగం మేరకు స్వేచ్ఛ నివ్వదలచినప్పుడు ఇవ్వవచ్చు.

ثَمَنَ الْعَبْدِ، قُوِّمَ عَلَيْهِ قِيمَةَ عَدْلٍ، فَأَعْطَى شُرَكَاءَهُ حِصَصَهُمْ، وَعَتَقَ عَلَيْهِ الْعَبْدُ، وَإِلاَّ فَقَدْ عَتَقَ مِنْهُ مَا عَتَقَ». مُتَّفَقٌ عَلَيْهِ.

ఇంకా అతని దగ్గర బానిస విముక్తికి కావలసిన మిగతా సొమ్ముకూడా ఉంటే, న్యాయసమ్మతంగా బానిస ధరను నిర్ణయించి ఇతర భాగస్వాములకు ఇవ్వవలసిన మొత్తాన్ని అతనే తన పైకం నుండి చెల్లించి, ఆ బానిసకు పూర్తిగా స్వేచ్ఛ నొసగాలి. అలా చేయలేకపోతే అతను ఆ బానిసకు ఏ మేరకు స్వేచ్ఛ నిస్తాడో ఆ మేరకు ఆ బానిస స్వేచ్ఛా పరుడవుతాడు." (బుఖారీ, ముస్లిం)

وَلَهُمَا عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: «وَإِلاَّ قُوِّمَ عَلَيْهِ، وَاسْتُسْعِيَ غَيْرَ مَشْقُوقٍ عَلَيْهِ». وَقِيلَ: إِنَّ السِّعَايَةَ مُدْرَجَةٌ فِي الْخَبَرِ.

ఉభయులూ (బుఖారీ, ముస్లింలు) అబూహురైరా (రజి) నుండి సంగ్రహించిన కథనంలో ఇలా వుంది : లేకపోతే అతని ధర నిర్ణయించబడుతుంది. అతనిపై భారం వేయకుండానే స్వేచ్ఛ పొందే అవకాశం అతనికి ఇవ్వబడుతుంది."

(١٢٢٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَجْزِي وَلَدٌ وَالِدَهُ إِلاَّ أَنْ يَجِدَهُ مَمْلُوكاً فَيَشْتَرِيَهُ، ثُمَّ يُعْتِقَهُ». رَوَاهُ مُسْلِمٌ.

1223. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ కొడుకూ తన తండ్రికి ప్రత్యామ్నాయం కాజాలడు - బానిసగా ఉన్న తండ్రిని కొని, అతనికి స్వేచ్ఛను ప్రసాదిస్తే తప్ప!" (ముస్లిం)

**సారాంశం**

ఒక కొడుకు అసాధారణమైన రీతిలో తండ్రి సేవలు చేసినప్పటికీ తన తండ్రి మహోపకారానికి 'బదులు' చెల్లించలేడని హదీసు భావం. అయితే బానిసత్వం నుండి విమోచన నొసగటమన్నది ఎంత గొప్ప పనంటే; తండ్రి మహోపకారానికి బదులుగా దరిదాపుల్లోకి రాగల

సత్కార్యం ఏదన్నా ఉండగలదంటే అది బానిస విమోచనమే. అందునా బానిసత్వంలో మగ్గుతున్న తండ్రిని గనక కొని, అతన్ని దాస్య శృంఖలాల నుంచి విముక్తిని కలిగిస్తే ఇక ఆ కొడుకు తండ్రి రుణాన్ని చాలా వరకు తీర్చుకున్నాడని భావించవచ్చు.

(١٢٢٤) وَعَنْ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «**مَنْ مَلَكَ ذَا رَحِمٍ مَحْرَمٍ فَهُوَ حُرٌّ**». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ، وَرَجَّحَ جَمْعٌ مِنَ الْحُفَّاظِ أَنَّهُ مَوْقُوفٌ.

1224. హజ్రత్ సమురా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ వ్యక్తయినా 'జూరహం, మహ్రమ్' బానిస బంధువుకు యజమాని అయినట్ల యితే, ఇక ఆ బానిసకు బానిసత్వం నుండి విముక్తి లభించినట్టే." (దీనిని అహ్మద్ మరియు నలుగురు ఉల్లేఖించారు. హదీసువేత్తలలోని ఒక వర్గం దీన్ని 'మౌఖూఫ్'గా ఖరారు చేసింది.)

**సారాంశం**

హదీసువేత్తలు నుడివినట్లు ఇది మౌఖూఫ్ కోవకు చెందిన హదీసు. అయితే ఈ అధ్యాయం క్రింద మరికొన్ని హదీసులు కూడా ఉన్నాయి. వాటిలో ఒక హదీసును ఇబ్నె ఖత్తాన్, ఇబ్నె హజమ్‌లు ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. హదీసులో జూరహం, మహ్రమ్ అన్న పదాలు వచ్చాయి. అంటే అతి సమీప, రక్త సంబంధిత బంధువులన్నమాట. ఉదాహరణకు: తండ్రి, పినతండ్రి, సోదరుడు వగైరా.

(١٢٢٥) وَعَنْ عِمْرَانَ بْنِ حُصَيْنٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا أَنَّ رَجُلاً أَعْتَقَ سِتَّةَ مَمَالِيكَ لَهُ، عِنْدَ مَوْتِهِ، لَمْ يَكُنْ لَهُ مَالٌ غَيْرَهُمْ، فَدَعَا بِهِمْ رَسُولُ اللهِ ﷺ، فَجَزَّأَهُمْ

1225. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : ఒక వ్యక్తి తనకు మరణ ఘడియ సమీపించినపుడు తన దగ్గరున్న ఆరుగురు బానిసలకు విముక్తిని కలిగించాడు. ఈ బానిసలు తప్ప అతనికి వేరొక ఆస్తి అంటూ ఏమీ లేదు. ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త (సఅసం) వాళ్ళను పిలిపించి వారిని మూడు భాగాలుగా విభజించారు. ఆ తరువాత చీటీలు వేసి ఇద్దరు బానిసలను (మూడో

أَثْلاَثاً، ثُمَّ أَقْرَعَ بَيْنَهُمْ، فَأَعْتَقَ اثْنَيْنِ، وَأَرَقَّ أَرْبَعَةً، وَقَالَ لَهُ قَوْلاً شَدِيداً. رَوَاهُ مُسْلِمٌ.

వంతును) విడుదల చేశారు. మిగిలిన నలుగురినీ అలాగే ఉండనిచ్చారు. స్వేచ్ఛ నొసగిన వ్యక్తినుద్దేశ్యించి ఆయన (సఅసం) పరుష మాటల్ని కూడా అన్నారు. (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా మనకు అవగతమయ్యే ముఖ్య విషయమేమిటంటే మరణ సమయంలో చేసే సదఖా (దానం) 'వీలు'గా మాత్రమే పరిగణించబడుతుంది. షరీయత్ ప్రకారం మనిషి తాను వదలి వెళ్ళే ఆస్తి (తరకా)లో మూడో వంతును మాత్రమే 'వీలు' వ్రాయగలడు. అంతకన్నా ఎక్కువగా దానం చేయలేడు. ఒకవేళ ఎవరయినా మరణ వ్యాధికిలోనై వున్న సమయంలో మూడో వంతుకు మించి దానధర్మాలు చేయమని ప్రకటించినప్పటికీ అది ఆచరణయోగ్యమవదు. ఆ 'వసీయతు'ను సంస్కరించవలసిందే.

(١٢٢٦) وَعَنْ سَفِيْنَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنْتُ مَمْلُوكاً لِأُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، فَقَالَتْ: أُعْتِقُكَ، وَأَشْتَرِطُ عَلَيْكَ أَنْ تَخْدِمَ رَسُولَ اللهِ ﷺ مَا عِشْتَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ وَالْحَاكِمُ.

1226. హజ్రత్ సఫీనా (రజి) కథనం : నేను ఉమ్మె సలమా (ర.అన్హా) గారి బానిసగా ఉండేవాణ్ణి. అయితే ఆమె నన్నుద్దేశ్యించి, "నువ్వు జీవితాంతం దైవప్రవక్త (సఅసం) కు సేవచేయాలన్న షరతుపై నేను నీకు స్వేచ్ఛ నొసగుతున్నాను" అని అన్నది. (దీనిని అహ్మద్, అబూదావూద్, నసాయి, హాకిమ్‌లు ఉల్లేఖించారు)

**సారాంశం**

బానిసను బేషరతుగా విడుదల చేయడంతోపాటు, షరతులు పెట్టి స్వేచ్ఛనొసగటం కూడా సమంజసమేనని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతోంది.

(١٢٢٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِنَّمَا الْوَلاَءُ لِمَنْ أَعْتَقَ**». مُتَّفَقٌ عَلَيْهِ فِيْ حَدِيْثٍ طَوِيْلٍ.

1227. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు : "స్వేచ్ఛనొసగే వానికే 'వలా' హక్కు చెందుతుంది." (బుఖారీ, ముస్లిం - ఇది సుదీర్ఘమయిన హదీసులోని భాగం)

**సారాంశం**

స్వేచ్ఛ నొసగబడిన బానిస మరణించినపుడు అతను ఈ ప్రపంచంలో వదలి వెళ్ళిన ఆస్తిపాస్తులు - వారసులు లేని పక్షంలో - అతనికి స్వేచ్ఛనొసగిన ఒకప్పటి యజమానికి దక్కుతాయి. ఈ ఆస్తిపాస్తులనే 'వలా' గా వ్యవహరిస్తారు. ఈ హదీసు ఇంతకు ముందు కూడా 'వాణిజ్య పుస్తకం'లో వివరంగా వచ్చింది.

(١٢٢٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْوَلاَءُ لُحْمَةٌ كَلُحْمَةِ النَّسَبِ، لاَ يُبَاعُ وَلاَ يُوهَبُ». رَوَاهُ الشَّافِعِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَأَصْلُهُ فِي الصَّحِيحَيْنِ بِغَيْرِ هٰذَا اللَّفْظِ.

1228. హాజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: 'వలా' కూడా వంశం మాదిరిగా పెనవేసుకుని ఉండే ఒక భాగమే. దాన్ని అమ్మడంగానీ, కానుకగా ఇవ్వటంగానీ కుదరదు." (దీనిని షాఫయి ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. 'సహీహైన్'లో దీని మూలం ఉంది. అయితే ఈ వాక్యాలు అవి కావు).

**సారాంశం**

సమీప బంధువుకు వారసత్వ హక్కుగా ఆస్తి ఎలా సంక్రమిస్తుందో అలాగే బానిసకు స్వేచ్ఛ నొసగిన వ్యక్తికి 'వలా' సంక్రమిస్తుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. తండ్రీ-కొడుకుల మధ్య గల సంబంధం, అన్నదమ్ముల మధ్యగల అనుబంధం ఎటువంటిదో ఇదీ (వలా కూడా) అటువంటిదే. అందుకే 'వలా'ను విక్రయించడానికిగానీ, బహుమానంగా ఇవ్వడానికిగానీ వీలు లేదు. మెజారిటీ విద్వాంసుల అభిమతం కూడా ఇదే.

**1వ అధ్యాయం**

## بَابُ الْمُدَبَّرِ وَالْمُكَاتَبِ وَأُمِّ الْوَلَدِ

## ముదబ్బర్, ముకాతబ్, ఉమ్ముల్ వలద్

(١٢٢٩) عَنْ جَابِرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَجُلاً مِّنَ الْأَنْصَارِ أَعْتَقَ غُلاَماً لَّهُ عَنْ دُبُرٍ، وَلَمْ يَكُنْ لَهُ مَالٌ غَيْرُهُ، فَبَلَغَ ذٰلِكَ النَّبِيَّ

1229. హాజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం ఒక అన్సార్ సహచరుడు మరణ సమయంలో ఒక బానిసకు విముక్తి కలిగించాడు. మరి చూడబోతే అతని

ﷺ، فَقَالَ: «مَنْ يَشْتَرِيهِ مِنِّي؟» فَاشْتَرَاهُ نُعَيْمُ ابْنُ عَبْدِ اللهِ بِثَمَانِمَائَةِ دِرْهَمٍ، مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي لَفْظٍ لِلْبُخَارِيِّ: فَاحْتَاجَ.

ఆస్తి అదొక్కటే. ఈ విషయం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు తెలిసింది. దానికాయన (స), "ఆ బానిసను నా దగ్గరి నుంచి కొనే వారెవరు?" అని ప్రశ్నించారు. అప్పుడు నయీమ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఎనిమిది వందల దిర్హములకు ఆయన (స) నుండి కొనుగోలు చేశారు. (బుఖారీ, ముస్లిం). బుఖారీలో "అతడు అవసరం పడ్డాడు" అన్న వాక్యం ఉంది.

وَفِي رِوَايَةٍ لِلنَّسَائِيِّ: وَكَانَ عَلَيْهِ دَيْنٌ فَبَاعَهُ بِثَمَانِمَائَةِ دِرْهَمٍ، فَأَعْطَاهُ، وَقَالَ: «اقْضِ دَيْنَكَ».

నసాయిలోని ఉల్లేఖనంలో ఇలా వుంది: **అతను బాకీ పడి ఉన్నాడు. ఆయన (స) అతన్ని ఎనిమిది వందల దిర్హములకు** అమ్మి, ఆ సొమ్మును అతనికిస్తూ, "నీ బాకీ చెల్లించు" అని అన్నారు.

**సారాంశం**

ఈ అధ్యాయంలో బానిస విమోచనానికి సంబంధించిన మూడు పద్ధతులు సూచించబడ్డాయి: 1. ముదబ్బర్ 2. ముకాతబ్ 3. ఉమ్ముల్ వలద్.

ఒక యజమాని తన బానిసను ఉద్దేశ్యించి; నా మరణానంతరం నువ్వు స్వేచ్ఛపొందుతావు అని అంటే అట్టి బానిసను 'ముదబ్బర్' గా వ్యవహరిస్తారు.

ఒక నిర్ణీత మొత్తం యజమానికి చెల్లించి స్వేచ్ఛపొందే ఒప్పందం (ముకాతబత్) చేసుకున్న బానిసను 'ముకాతబ్'అని అంటారు.

తన యజమాని అజమాయిషీలో ఉంటూ అతనిచే సంతానాన్ని కన్న బానిసరాలిని 'ఉమ్ముల్ వలద్' అని పిలుస్తారు.

ఈ హదీసు ఇంతకు ముందు 'వాణిజ్య పుస్తకం'లోనూ వచ్చింది. ఈ హదీసు ప్రకారం బానిసను 'ముదబ్బర్'గా ప్రకటించటం సమంజసమే. అయితే యజమాని తన ఆస్తిలోని మూడోవంతు (వీలు) భాగంలో నుంచి ఈ మేరకు ప్రకటించాలని అత్యధికమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. ఒక వస్తువును మార్కెట్టులో అమ్మడానికి 'వేలం' వేయటంలో తప్పులేదని కూడా ఈ హదీసు చెబుతోంది. అంటే వస్తువు యజమాని మార్కెట్టులో ప్రజల ముందు దాన్ని ప్రవేశపెట్టి, తనకు రావలసిన గిట్టుబాటు ధర కోసం వేలం వేస్తాడు. వస్తువును

కొనదలచినవారు దాని ధరను పెంచుతూ పోతారు. గిట్టుబాటు ధర పలకగానే యజమాని దాన్ని అమ్మేస్తాడు. ప్రస్తుత మండీలలో కూడా సరకులు ఈ వేలం పద్ధతిపై అమ్ముడు పోతున్నాయి. ఈ పద్ధతి ధర్మసమ్మతమేనని హదీసు ద్వారా తెలియవస్తోంది.

## హదీసు ఉల్లేఖకులు

నయీమ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) : 'నఖ్ఖామ్' అనేది ఈయన బిరుదు. ఖురైష్‌కు చెందిన 'అదీ' తెగవారు. తొలి రోజుల్లోనే ఇస్లాం స్వీకరించారు. మొదట్లో తాను ఇస్లాంను విశ్వసించిన సంగతిని గోప్యంగా ఉంచారు. ఈయన మక్కానుండి హిజ్రత్ చేయదలచినపుడు అదీ తెగవారు అభ్యంతరం చెప్పారు. ఏ మతాన్ని అవలంబించినా తమకు ఆక్షేపణ లేదనీ, మక్కా నగరాన్ని మాత్రం విడిచిపోవద్దని తెగేసి చెప్పారు. ఎందుకంటే ఈయన వితంతువుల, అనాథల పోషణ కోసం భారీ స్థాయిలో ఖర్చుపెట్టేవారు. కడకు ఈయన హుదైబియా ఒప్పందం జరిగిన సంవత్సరం వలసపోయారు. ఖలీఫా హజ్రత్ అబూబక్ర్ లేదా హజ్రత్ ఉమర్ ఫారూఖ్‌ల హయాంలో సిరియా విజయం సందర్భంగా వీరమరణం పొందారు.

(١٢٣٠) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيْهِ، عَنْ جَدِّهِ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**الْمُكَاتَبُ عَبْدٌ، مَا بَقِيَ عَلَيْهِ مِنْ مُكَاتَبَتِهِ دِرْهَمٌ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ. وَأَصْلُهُ عِنْدَ أَحْمَدَ وَالثَّلَاثَةِ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1230. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, ఆయన తన తాతగారి నుంచి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "ముకాతబ్ (అయిన బానిస) తన యజమానితో చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించి ఒక్క దిర్హము బాకీ ఉన్నాసరే అతడు బానిసగానే ఉంటాడు." (దీనిని అబూ దావూద్ 'హసన్' కోవకు చెందిన పరంపర ఆధారంగా వెలికి తీశారు. దీని మూలం అహ్మద్ మరియు 'ముగ్గురి' వద్ద ఉంది. హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

## సారాంశం

యజమానితో ఒప్పందం చేసుకున్న బానిస ఆ నిర్ణీత మొత్తాన్ని పూర్తిగా చెల్లించేంతవరకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందజాలడని ఈ హదీసు తెలుపుతోంది. మెజారిటీ ఉలమా దృక్పథం కూడా ఇదే.

(١٢٣١) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَ لِإِحْدَاكُنَّ مُكَاتَبٌ، وَكَانَ عِنْدَهُ مَا يُؤَدِّي، فَلْتَحْتَجِبْ مِنْهُ». رَوَاهُ أَحْمَدُ وَالْأَرْبَعَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1231. హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు : "మీలో ఎవరివద్దయినా 'ముకాతబ్' (ఒప్పందం చేసుకున్న బానిస) ఉన్నప్పుడు, అతని దగ్గర సొమ్మును చెల్లించి స్వేచ్ఛ పొందగలిగేంత స్థోమత కూడా ఉన్నపుడు (యజమానురాలు) అతని యెడల 'పరదా' పాటించాలి." (దీనిని అహ్మద్ మరియు 'నలుగురు' ఉల్లేఖించారు. తిర్మిజీ ఈ హదీసును ప్రమాణబద్ధమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

నిర్ణీత డబ్బు చెల్లించి స్వేచ్ఛ పొందేందుకు యజమానురాలితో లిఖితపూర్వక ఒప్పందం చేసుకున్న బానిస, ఆ డబ్బును సమకూర్చుకోగానే యజమానురాలు అతనిపట్ల పరదా పాటించాలి. నిజానికి యజమానురాలు బానిస ముందు పరదా పాటించవలసిన అవసరం లేదు. పూర్తి సొమ్ము చెల్లించే వరకూ బానిస బానిసగానే ఉంటాడు. కాని మంచిని దృష్టిలో పెట్టుకుని 'జాగ్రత్త' పాటించబడుతుంది.

ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే మహిళ తన బానిసను చూడగలదు.

(١٢٣٢) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «يُؤَدَى الْمُكَاتَبُ بِقَدْرِ مَا عَتَقَ مِنْهُ دِيَةَ الْحُرِّ، وَبِقَدْرِ

1232. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : యజమానితో 'ముకాతబత్' చేసుకున్న బానిస ఏ మేరకు స్వేచ్ఛ పొంది ఉంటాడో ఆ మేరకు రక్త శుల్కం పొందగలడు. ఇంకా ఏ మేరకు బానిసత్వానికి కట్టుబడి ఉంటాడో ఆ మేరకే

مَارَقَّ مِنْهُ دِيَةَ الْعَبْدِ». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ.

పరిహారానికి అర్హుడు." (దీనిని అహ్మద్, నసాయి, అబూదావూద్ ఉల్లేఖించారు)

## సారాంశం

యజమానితో లిఖితపూర్వక ఒప్పందం కుదుర్చుకున్న బానిస (ముకాతబ్) గనక హత్యకు గురవుతే అట్టి పరిస్థితిలో రక్తపరిహారం ఏ నిష్పత్తిలో అతని వారసులకు ఇవ్వబడుతుందో ఈ హదీసులో సూచించబడింది. ఉదాహరణకు : - 'ముకాతబ్' అనబడే బానిస హత్యకు గురయ్యేనాటికి, అతడు తన యజమానికి సగం సొమ్ము చెల్లించి ఉన్నాడనుకోండి - అప్పుడు హంతకుడు సగం రక్తపరిహారం స్వతంత్ర వ్యక్తిది చెల్లించి, మిగతాది బానిసకు చెల్లించే నిష్పత్తిలో చెల్లిస్తాడు. అల్లామా ఖత్తాబీ (రహ్మ.లై) కథనం ప్రకారం ముకాతబ్ అనబడే బానిస పూర్తి సొమ్మును యజమానికి చెల్లించనంతవరకూ ఆ భారం అతనిపైనే ఉంటుంది. సాధారణంగా ధర్మవేత్తలందరూ ఇలాగే తలపోస్తున్నారు.

(١٢٣٣) وَعَنْ عَمْرِو بْنِ الْحَارِثِ، أَخِي جُوَيْرِيَةَ أُمِّ الْمُؤْمِنِيْنَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: مَا تَرَكَ رَسُولُ اللهِ ﷺ عِنْدَ مَوْتِهِ دِرْهَماً، وَلاَ دِيْنَاراً، وَلاَ عَبْداً، وَلاَ أَمَةً، وَلاَ شَيْئاً، إِلاَّ بَغْلَتَهُ الْبَيْضَاءَ، وَسِلاَحَهُ، وَأَرْضاً جَعَلَهَا صَدَقَةً. رَوَاهُ الْبُخَارِيُّ.

1233. విశ్వాసుల మాతయగు హజ్రత్ జువైరియా (ర.అన్హా) సోదరులైన హజ్రత్ అమ్ర్ బిన్ హారిస్ (రజి) గారు చేసిన కథనం ప్రకారం; దైవప్రవక్త (సఅసం) తన మరణ సమయంలో వార సత్వ ఆస్తిగా దిర్హములుగానీ, దీనార్లు గానీ, బానిసలుగానీ, బానిసరాండ్రు గానీ, మరే వస్తువుగానీ వదలి వెళ్ళలేదు. కేవలం ఒక తెల్లని కంచెర గాడిద, తన దైన యుద్ధ సామగ్రితో పాటు 'సదఖా'గా నిర్ధారించిన కొంతభూమి మాత్రం వదలి వెళ్ళారు. (బుఖారీ)

## సారాంశం

ప్రాపంచిక పటాటోపాలు, ఆస్తీ ఐశ్వర్యాల పట్ల దైవప్రవక్త (సఅసం)కు గల అనాసక్తతను, నిరపేక్షను ఈ హదీసు ఎత్తిచూపుతోంది. ఎందుకంటే ఆయన (స) అధీనంలో 63 మంది బానిసలుండేవారు. అందరినీ ఆయన (స) విడుదల చేసేశారు. తన వెనుక ఎలాంటి 'ఆస్తి'నీ విడిచిపెట్టలేదు. పైగా ఆయన (సఅసం) ఈ విధంగా సెలవిచ్చారు: దైవప్రవక్తలు దిర్హములను, దీనార్లను వారసుల కోసం వదలివెళ్ళరు. వారు వదలిన సొమ్ము ఏదన్నా ఉంటే అది 'సదఖా'గా మాత్రమే ఉంటుంది."

### హదీసు ఉల్లేఖకులు

అమ్ర్ బిన్ హారిస్ (రజి) : ఈయన ఇబ్నె హారిస్ బిన్ అబూజిరార్ బిన్ హబీబ్ ఖుజాయి, ముస్తలిఖీ. అంటే ఖుజాఅ తెగలోని ఒక భాగమైన ముస్తలిఖ్ శాఖకు చెందినవారు. ప్రవక్త సహచర్య భాగ్యం పొందారు. ఈయనచే ఈ ఒక్క హదీసు మాత్రమే ఉల్లేఖించబడింది.

(١٢٣٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَيُّمَا أَمَةٍ وَلَدَتْ مِنْ سَيِّدِهَا فَهِيَ حُرَّةٌ بَعْدَ مَوْتِهِ». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ وَالْحَاكِمُ بِإِسْنَادٍ ضَعِيفٍ، وَرَجَّحَ جَمَاعَةٌ وَقْفَهُ عَلَى عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ.

1234. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : "తన యజమాని వీర్యకణంతో శిశువును కన్న బానిసరాలు, యజమాని మరణించిన తరువాత స్వతంత్రురాలవుతుంది." (ఇబ్నె మాజా, హాకిమ్‌లు బలహీన పరంపర ద్వారా దీనిని ఉల్లేఖించారు. ఈ హదీసు పరంపర హజ్రత్ ఉమర్ (రజి) వరకే పరిమితమని హదీసువేత్తల్లోని ఒక వర్గం నొక్కి వక్కాణించింది.

### సారాంశం

'ఉమ్మె వలద్' (శిశువును కన్న బానిసరాలు) తన యజమాని మరణించిన వెంటనే స్వతంత్రురాలై పోతుందని ఈ హదీసు ద్వారానూ, ఇంతకు ముందు వచ్చిన వేరొక హదీసు ద్వారా కూడా విదితమవుతోంది. ఈ హదీసు పరంపరలో వున్న వారిలో హుసైన్ బిన్ అబ్దుల్లా హాష్మి చాలా బలహీన ఉల్లేఖకులవటం చేత ఇది బలహీన ఉల్లేఖనంగా భావించబడుతోంది.

(١٢٣٥) وَعَنْ سَهْلِ بْنِ حُنَيْفٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ أَعَانَ مُجَاهِداً فِي سَبِيلِ اللهِ، أَوْ غَارِماً فِي

1235. హజ్రత్ సహ్ల్ బిన్ హునైఫ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే దైవమార్గంలో పాటుపడే యోధునికి సాయం చేశాడో లేదా కష్ట కాలంలో రుణగ్రస్తుణ్ణి ఆదుకున్నాడో లేదా ఒక యజమానితో ధన ఒప్పందం కుదుర్చుకున్న బానిసకు కట్టు బాని సత్వం నుండి బయటపడడంలో

عُسْرَتِهِ، أَوْ مُكَاتَباً فِي رَقَبَتِهِ، أَظَلَّهُ اللَّهُ يَوْمَ لاَ ظِلَّ إِلاَّ ظِلُّهُ». رَوَاهُ أَحْمَدُ وَصَحَّحَهُ الْحَاكِمُ.

చేయూతనిచ్చాడో అటువంటి వ్యక్తికి అల్లాహ్, తన నీడ తప్ప మరొక నీడ ఉండని రోజున చల్లని నీడను ప్రసాదిస్తాడు." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

ఇస్లాం పరోపకారాన్ని, పరస్పర సహకార భావాన్ని, శ్రేయోభిలాషను ప్రబోధించే ధర్మం. ముఖ్యంగా కష్టకాలంలో ఒకరు ఇంకొకరికి అండగా నిలవాలని అది నొక్కి పలుకుతోంది. అందుకే ఈ హదీసులో రుణగ్రస్తుణ్ణి రుణభారం నుంచి విముక్తి కలిగించమనీ, దైవమార్గంలో జీవితాన్ని అంకితం చేసినవారి అక్కరలను తీర్చమనీ అది తన అనుయాయులను ప్రేరేపించింది. ఈ సత్కార్యాలు పరలోకంలో పనికి వస్తాయనీ, ఏ ఆశ్రయమూ లభించని పరీక్ష దినాన అవి దేవుని ఆశ్రయాన్ని కల్పిస్తాయని శుభవార్త కూడా ఇవ్వబడింది.

# 16. వివిధ విషయాల పుస్తకం

# ١٦ - كِتَابُ الْجَامِعِ

## ١ - بَابُ الْأَدَبِ

(١٢٣٦) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**حَقُّ الْمُسْلِمِ عَلَى الْمُسْلِمِ سِتٌّ، إِذَا لَقِيتَهُ فَسَلِّمْ عَلَيْهِ، وَإِذَا دَعَاكَ فَأَجِبْهُ، وَإِذَا اسْتَنْصَحَكَ فَانْصَحْهُ، وَإِذَا عَطَسَ فَحَمِدَاللَّهَ فَشَمِّتْهُ، وَإِذَا مَرِضَ فَعُدْهُ، وَإِذَا مَاتَ فَاتَّبِعْهُ**» رَوَاهُ مُسْلِمٌ.

## వినయ వినమ్రతలు

1236. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: ఒక ముస్లింకు మరొక ముస్లిం యెడల ఆరు బాధ్యతలున్నాయి. అవేమంటే; - (1) అతన్ని కలుసుకున్నప్పుడు నువ్వత నికి సలాం చెయ్యి. (2) అతనెప్పు డయినా నిన్ను ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించు. (3) అతనెప్పుడయినా సలహా కోరితే -శ్రేయోభిలాషిగా- మంచి సలహా ఇవ్వు. (4) అతనెప్పుడయినా తుమ్మిన మీదట 'అల్‌హమ్దులిల్లాహ్' అని అంటే, సమాధానంగా నువ్వు 'యర్‌హముకల్లాహ్' అని పలుకు. (5) అతను రోగగ్రస్తుడైతే నువ్వతన్ని పరా మర్శించు. (6) అతను మరణిస్తే నువ్వ తని అంత్యక్రియలలో పాల్గొను. (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో ఒక ముస్లిం యొక్క ఆరు హక్కులు సూచించబడ్డాయి. 'ముస్లిం'లోని వేరొక ఉల్లేఖనంలో ఐదింటి ప్రస్తావనే వచ్చింది. అందులో 'శ్రేయోభిలాష' గురించి లేదు. ఏదైనా వ్యవహారంలో ప్రమాణం చేయమని నిన్ను అతను కోరితే - అది నిజమయిన పక్షంలో- ప్రమాణం కూడా చెయ్యమని ఇంకొక హదీసులో ఉంది.

మొత్తమ్మీద ఈ హదీసు ద్వారా బోధపడేదేమంటే సాటి ముస్లిం యెడల తనపై ఉన్న ఈ ఆరు బాధ్యతలను ప్రతి ముస్లిం నెరవేర్చాలి. వీటిని నెరవేర్చటం తప్పనిసరి (వాజిబ్)

అని కొంతమంది పండితులు అభిప్రాయపడగా, నెరవేర్చటం వాంఛనీయం (ముస్తహబ్)అని మరి కొంతమంది వ్యాఖ్యానించారు. అయితే హదీసులోని పదజాలాన్నిబట్టి వాటిని నెరవేర్చటం తప్పనిసరి అని అనటమే సమంజసం.

(١٢٣٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**اُنْظُرُوا إِلَى مَنْ هُوَ أَسْفَلَ مِنْكُمْ، وَلاَ تَنْظُرُوا إِلَى مَنْ هُوَ فَوْقَكُمْ، فَهُوَ أَجْدَرُ أَنْ لاَ تَزْدَرُوا نِعْمَةَ اللهِ عَلَيْكُمْ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1237. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎల్లప్పుడూ మీకన్నా హీన స్థితిలో ఉన్న వారిని చూడండి. మీకన్నా ఉన్నత స్థితిలో ఉన్న వారి వంక చూడకండి. ఇదే మీ కొరకు శ్రేయస్కరం. (ఎందుకంటే మీరిలా చేసినపుడు) దేవుని ఏ అనుగ్రహం కూడా మీ దృష్టిలో అల్పంగా ఉండదు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దైవాన్ని విశ్వసించే వ్యక్తిలో సతతం తృప్తి, కృతజ్ఞతా భావం ఉండాలని ఈ హదీసు చెబుతోంది. ప్రాపంచికంగా తనకన్నా ఉన్నత స్థితిలో ఉన్న వారిని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు మనసులో అసూయాద్వేషాలు జనిస్తాయి. ఏ విధంగానయినా ఎదుటి వారిని మించిపోవాలన్న పేరాశ పుట్టుకు వస్తుంది. మరి ఈ ప్రాపంచిక లక్ష్యం కోసం అతడు ఎంతకైనా తెగిస్తాడు. ధర్మమార్గాన్ని పరిత్యజిస్తాడు. దీనికి బదులు మనిషి ఆర్థికంగా తనకన్నా హీన స్థితిలో ఉన్న వారిని చూసినపుడు దేవునిపట్ల అతనిలో కృతజ్ఞతాభావం జనిస్తుంది. పేదలపట్ల దయ, జాలి, ప్రేమ వంటి సకారాత్మక భావాలు పెంపొందుతాయి. వాళ్ల మంచీచెబ్బరల పట్ల అతను శ్రద్ధ వహించటం మొదలెడతాడు. పర్యవసానంగా సమాజంలోని ప్రజల దృష్టిలో కూడా అతనొక దయాశీలిగా, సత్పౌరునిగా ఉంటాడు.

(١٢٣٨) وَعَنِ النَّوَّاسِ بْنِ سَمْعَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنِ الْبِرِّ وَالْإِثْمِ، فَقَالَ: «**الْبِرُّ حُسْنُ**

1238. హజ్రత్ నవ్వాస్ బిన్ సమాన్(రజి) కథనం : సదాచరణ - దురాచరణల గురించి నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారిని దర్యాప్తు చేయగా ఆయన(స) ఇలా వివరించారు: "సద్గుణాలకు, సత్ప్రవర్తనకు మరో పేరే సదాచరణ. మరి ఏ పనిపట్ల నీ

الْخُلُقِ، وَالإِثْمُ مَا حَاكَ فِي صَدْرِكَ وَكَرِهْتَ أَنْ يَطَّلِعَ عَلَيْهِ النَّاسُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

మనసులో శంక కలుగుతుందో, మరి దేని గురించి ప్రజలు తెలుసుకోవటం నీకిష్టం లేదో అది దురాచరణ.'' (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో మంచీ చెడుల నిర్వచనం ఇవ్వబడింది. సదాచరణ - దురాచరణల వాస్తవికత వివరించబడింది.

సదాచరణ అంటే సాటి మనుషుల యెడల మృదువుగా మసలుకోవాలి. మమతాను రాగాలను పంచి పెట్టాలి. వారితో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవాలి. తోటి వారిని ఇక్కట్ల పాలు చెయ్యకూడదు. వారు మోయలేనంత భారం వారిపై మోపకూడదు. పైగా వీలయినంతవరకు వారిని ఆదుకోవాలి. వాళ్ళ భారాన్ని తనూ మోయాలి. మనో వాక్కాయ కర్మల చేత ఎదుటివారి మనసు నొప్పించకుండా జాగ్రత్తపడాలి. అకారణంగా ఆగ్రహాన్ని, అసహనాన్ని, ఆవేశాన్ని ప్రదర్శించరాదు. సాధ్యమైనంతవరకు సడలింపుల ధోరణిని అలవరచుకోవాలి. మన్నింపుల వైఖరిని అవలంబించాలి. అంతేగాని ప్రతి చిన్న విషయానికి తోటివారిని నిలదీయరాదు. తెగనాడకూడదు - ఇదే సదాచరణ!

ఏదేని పని పట్ల మనసు నుండి 'పచ్చని సంకేతం' లభించకపోగా, దాని పర్యవసానం దైవసన్నిధిలో ఎలా ఉంటుందో ఏమోనని మనసు ఊగిసలాటకు, సందిగ్ధానికి లోనయినట్లయితే ఆ పని మంచి పని కాదని తెలుసుకోండి. ఈ లోకం ఉన్నంతకాలం సత్యాసత్యాల, ఉచితానుచితాల, మంచీచెడుల మధ్య సంఘర్షణ కొనసాగుతూనే ఉంటుంది. ఏది ఉచితమో - మరేది అనుచితమో, ఏది మంచో - ఏది చెడో పరికించే సూదంటురాయిని ఈ హదీసు మన ముందుంచింది.

### హదీసు ఉల్లేఖకులు

నవ్వాస్ బిన్ సమాన్ (రజి) : నవ్వాస్ బిన్ సమాన్ బిన్ ఖాలిద్ కిలాబీ, ఆమిరీ. సిరియాకు చెందిన సహచరుల్లో ఒకరుగా పరిగణించబడతారు. ఈయన తండ్రి దైవప్రవక్త (స) దగ్గరకు ఒక బృందాన్ని పంపారనీ, దైవప్రవక్త (స) కోసం పాదరక్షలను కానుకగా పంపగా ప్రవక్త (స) వాటిని స్వీకరించారనీ అనబడుతోంది.

(١٢٣٩) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ: قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كُنْتُمْ ثَلاَثَةً فَلاَ يَتَنَاجَ اثْنَانِ دُونَ الآخَرِ، حَتَّى

1239. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: ''మీరు ముగ్గురు వ్యక్తులున్నప్పుడు - ఇద్దరు వ్యక్తులు ఏకమై, మూడో వానిని

تَخْتَلِطُوا بِالنَّاسِ، مِنْ أَجْلِ أَنَّ ذَلِكَ يُحْزِنُهُ». مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ.

వేరుచేసి, రహస్య సమాలోచన చేయరాదు. అతను (మూడో వ్యక్తి) జనవాహినిలో కలసిపోయిన తరువాత సమాలోచన జరుపుకుంటే అభ్యంతరం లేదు. ఎందుకంటే మీ (వేర్పాటు) ధోరణి అతణ్ణి దుఃఖానికి, మనస్తాపానికి లోను చేస్తుంది." (బుఖారీ, ముస్లిం-వాక్యాలు ముస్లింలోనివి)

**సారాంశం**

తోడుగా ఉన్న వ్యక్తిని ఉపేక్షించి ఇతరులతో గుసగుసలాడటాన్ని, రహస్య సమాలోచన జరపటాన్ని ఈ హదీసులో వారించటం జరిగింది. సాటి మనుషుల భావాలు, భావోద్రేకాలను ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకుని వాటిని గౌరవించాలనీ, ఏ దశలోనూ మనోభావాలను గాయపరచరాదని కూడా ఈ హదీసు మనకు ఉపదేశిస్తున్నది. ఈ ఉపదేశాన్ని లెక్క చేయకుండా తోటి మనిషిని వేరుపరిస్తే అతని మనసు చివుక్కుమంటుంది. వీళ్ళిద్దరూ కలసి నన్ను పరాయి వ్యక్తిగా చూస్తున్నారేనన్న ఆలోచన అతనిలో వస్తుంది. బహుశా తనకు వ్యతిరేకంగా ఏదైనా కుట్ర పన్నుతున్నారేమోనన్న అనుమానం కూడా వస్తుంది. ఈ అనుమానాలే వ్యక్తుల మధ్య అంతరాల అగాధాలను సృష్టిస్తాయి. పరస్పర సహకార భావం బదులు సహాయ నిరాకరణ ధోరణి ప్రబలుతుంది. కాబట్టి సామూహిక జీవనంలో కొందరు మరికొందరిని వేరుచేసి, ఇంకొందరితో కలసి రహస్య మంతనాలు సాగించటం, చెవులు కొరుక్కోవటం వారించబడింది. అయితే మూడో వ్యక్తి అక్కడ లేనపుడు ఇద్దరు కలసి సమాలోచన సాగించటం మాత్రం తప్పుకాదు.

(١٢٤٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يُقِيمُ الرَّجُلُ الرَّجُلَ مِنْ مَجْلِسِهِ ثُمَّ يَجْلِسُ فِيهِ، وَلَكِنْ تَفَسَّحُوا وَتَوَسَّعُوا». مُتَّفَقٌ عَلَيْهِ.

1240. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఉపదేశించారని హాజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : ఏ మనిషీ ఇంకొకరిని అతను కూర్చున్న చోటు నుంచి లేపి తను స్వయంగా కూర్చోవటం తగదు. ఒకవేళ స్థలాభావం ఉంటే సమావేశ స్థలంలో సర్దుకోవాలి. సదనంలో విశాలముండేలా చూసుకోవాలి."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో సభామర్యాదల శిక్షణ ఇవ్వబడింది. సభకు వచ్చే జనులు అధికంగా ఉన్నారనిపించినపుడు సభికులు సమయస్ఫూర్తితో సర్దుకుని, మరికొంతమంది అక్కడ ఆసీనులయ్యేలా ఖాళీ స్థలాన్ని కల్పించాలి. అయితే ఒక వ్యక్తి ముందు నుంచీ ఒకచోట కూర్చుని ఉండి, ఏదైనా ముఖ్యావసరం పడి కొన్ని నిమిషాల పాటు బయటికి వెళ్ళినంత మాత్రాన వేరొకరు వచ్చి ఆ స్థలాన్ని కబ్జా చేసుకోవటం వాంఛనీయం కాదు.

(١٢٤١) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا أَكَلَ أَحَدُكُمْ طَعَاماً فَلاَ يَمْسَحْ يَدَهُ حَتَّى يَلْعَقَهَا أَوْ يُلْعِقَهَا» مُتَّفَقٌ عَلَيْهِ.

1241. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరయినాసరే భోజనం చేస్తే, మీ చేతిని స్వయంగా నాకి తిననంత వరకూ, లేక నాకి తినిపించనంత వరకూ (చేతిని) శుభ్రం చేయకూడదు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో భోజన మర్యాదల్లోని ఒకానొక మర్యాద తెలుపబడింది. హదీసు పదజాలం కొందరికి సంస్కార విహీనం అనిపించవచ్చు. కాని ధార్మికంగా అందులో ఎన్నో పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. మనిషి భుజించే ఆహారం దైవప్రసాదితం. దైవప్రసాదితం పట్ల మనిషిలో నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం శోభాయమానం కాదు. అన్నం తినే సమయంలో అతనెంతో వినయంగా, సంస్కారవంతునిలా కూర్చోవాలి. మెతుకులు క్రింద పడకుండా తినాలి. కంచంలో భోజన పదార్థాలను ఎంగిలిచేసి వదలకుండా - పూర్తిగా తినాలి. చేతివ్రేళ్లకు తగిలి వున్న పదార్థం సయితం వృధా కాకుండా శుభ్రంగా నాకి తినాలి - ఈ చేష్టలన్నీ దైవానుగ్రహం పట్ల అతనికున్న శ్రద్ధాభక్తులను, కృతజ్ఞతా భావాన్ని సూచిస్తాయి. మనిషిలోని అహంకారాన్ని, మిడిసిపాటును త్రుంచటం కూడా ఇందలి పరమార్థాల్లో ఒకటి. అదీగాక, అతను తినే భోజనంలో దేవుడు ఏ భాగంలో 'శుభాన్ని' పొందుపరచి ఉంచాడో దాసునికి తెలీదు. అందుకే ఈ విధంగా తాకీదు చేయటం జరిగింది.

(١٢٤٢) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لِيُسَلِّمِ الصَّغِيرُ عَلَى الْكَبِيرِ، وَالْمَارُّ عَلَى الْقَاعِدِ،

1242. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "చిన్నవారు పెద్దవారికి, దారిలో నడిచేవారు కూర్చున్నవారికి, తక్కువ

وَالْقَلِيلُ عَلَى الْكَثِيرِ» مُتَّفَقٌ عَلَيْهِ. وَفِي رِوَايَةٍ لِمُسْلِمٍ: وَالرَّاكِبُ عَلَى الْمَاشِي.

సంఖ్యలో వున్నవారు అధిక సంఖ్యలో వున్న సమూహానికి 'సలాం' చేయాలి" (బుఖారీ, ముస్లిం). ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో "వాహనంపై వున్నవారు కాలినడకన వచ్చేవారికి సలాం చేయాలి" అని వుంది.

**సారాంశం**

ఈ హదీసులో పరస్పరం 'సలాం' చేసుకునే పద్ధతులు వివరించబడ్డాయి. "చిన్నవారు పెద్దవారికి సలాం చేయటంలో ముందంజ వేయాలి" అని చెప్పటం గమనార్హ విషయం. పెద్దలను ఆదరించటం, వారిపట్ల అణకువగా మెలగటం చిన్నల బాధ్యత. వచ్చేవారు కూర్చున్న వారికి సలాం చేయాలి అని ఉపదేశించటంలోని మర్మం ఏమిటంటే, వచ్చేవాడు ఏ ఉద్దేశ్యంతో వస్తున్నాడో కూర్చున్న వారికి తెలీదు. కాని అతను 'సలాం' చేశాడంటే తన తరపున అభయమిచ్చినట్లే. ఈ 'సలాం' తరువాత ఇక వారిరువురి మధ్య భయాందోళనలకు తావుండదు.

అలాగే వాహనంపై వెళ్ళేవారు నడచి వెళ్ళేవారిని సలాం చేయమనటంలోని ముఖ్యోద్దేశం, వాహనంపై వున్నవారు కాలి నడకన వెళ్ళేవారిని అల్ప దృష్టితో చూడరాదన్నది. సాధారణంగా మంచి ఖరీదైన వాహనాలపై ప్రయాణం చేసేవారిలో ఒకింత దర్పం, గర్వం తొణికిసలాడతాయి. ఈ గర్వం మంచి లక్షణం కాదు. దీన్ని అణచాలన్నది ఇస్లాం ఉద్దేశ్యం. కాలినడకన వచ్చే పోయే వారికి వాహనంపై వున్నవాడు సలాం చేశాడంటే అతనిపట్ల వినయాన్ని, అణకువని చూపినట్లే. ఈ అణకువే ఎదుటివారి మనసును జయిస్తుంది.

అసలు 'సలాం'ను సర్వసామాన్యం చేయటమే గొప్ప విషయం. అందులోనూ ఎవరు ముందంజ వేయాలి అన్న విషయాలు ఈ హదీసులో సూచించబడ్డాయి. ఇవి సామాజిక మర్యాదల్లో అంతర్భాగం అన్న విషయాన్ని మరువరాదు.

(١٢٤٣) وَعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يُجْزِئُ عَنِ الْجَمَاعَةِ – إِذَا مَرُّوا – أَنْ يُسَلِّمَ أَحَدُهُمْ، وَيُجْزِئُ عَنِ الْجَمَاعَةِ أَنْ يَرُدَّ أَحَدُهُمْ». رَوَاهُ أَحْمَدُ وَالْبَيْهَقِيُّ.

1243. హజ్రత్ అలీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ఏదైనా ఒక ప్రజాసమూహం ఒక చోటి నుంచి సాగిపోతున్నప్పుడు అందులో నుంచి ఒక్క వ్యక్తి 'సలాం' చేసినా సరిపోతుంది. ఇంకా, ఆ సమూహంలోని ఒక్క వ్యక్తి సలాంకు సమాధానం ఇచ్చినా చాలు."

(ముస్నదె అహ్మద్, సునన్ బైహఖీ)

**సారాంశం**

సలాం చేయటం, సలాంకు బదులు పలకటం 'ఫర్జె కిఫాయ' అని ఈ హదీసును బట్టి అర్థమవుతోంది. సమూహం లేక బృందంలో నుంచి ఏ ఒక్క వ్యక్తి సలాంపై స్పందించినా అది వారందరి తరపునా సరిపోతుంది.

(١٢٤٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَبْدَءُوا الْيَهُودَ وَالنَّصَارٰى بِالسَّلاَمِ، وَإِذَا لَقِيتُمُوهُمْ فِي طَرِيقٍ فَاضْطَرُّوهُمْ إِلَى أَضْيَقِهِ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

1244. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "యూదులు, క్రైస్తవులకు ముందుగా సలాం చేయ కండి. ఎప్పుడన్నా మార్గమధ్యంలో వారు తారసపడితే వారు ఇరుకైన దారిగుండా పోయే అనివార్య స్థితిని ఏర్పరచండి." (ముస్లిం)

(١٢٤٥) وَعَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**إِذَا عَطَسَ أَحَدُكُمْ فَلْيَقُلْ: الْحَمْدُلِلّٰهِ، وَلْيَقُلْ لَهُ أَخُوهُ: يَرْحَمُكَ اللّٰهُ. فَإِذَا قَالَ لَهُ: يَرْحَمُكَ اللّٰهُ، فَلْيَقُلْ لَهُ: يَهْدِيكُمُ اللّٰهُ وَيُصْلِحُ بَالَكُمْ**» أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1245. దైవప్రవక్త (సఅసం) ఉపదేశించి నట్లు హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు - ఆయన (స) ఈ విధంగా ఉపదేశించారు : మీలో ఎవరయినా తుమ్మితే అతడు అల్‌హమ్దులిల్లాహ్ (సమస్త స్తోత్రాలు అల్లాహ్ కొరకే) అని అనాలి. ఇది విన్న అతని సోదరుడు యర్‌హముకల్లాహ్ (అల్లాహ్ నీపై దయదలచుగాక!) అని బదులివ్వాలి. మరి ఇతను యర్‌హముకల్లాహ్ అని బదులిచ్చాడంటే దీనిపై స్పందిస్తూ తుమ్మిన వ్యక్తి ఈ విధంగా పలకాలి - "యహ్‌దీకుముల్లాహు వ యుస్‌లిహు బాలకుమ్" (అల్లాహ్ నీకు మార్గదర్శకత్వం వహించుగాక! నీ స్థితిని చక్కదిద్దుగాక!!) (బుఖారీ)

**సారాంశం**

తుమ్మిన వానికి బదులు ఇవ్వాలని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అయితే తుమ్మిన వ్యక్తి తొలుత 'అల్‌హమ్దులిల్లాహ్' అని పలికితేనే బదులు ఇవ్వడానికి అవకాశం ఏర్పడుతుంది. మూడుసార్లు మాత్రమే ఈ సమాధానం ఇవ్వబడుతుంది. నిరంతరం మూడు సార్లకంటే ఎక్కువగా తుమ్మితే అది జలుబుకు ఆనవాలని మహాప్రవక్త (స) సెలవిచ్చారు

(١٢٤٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَشْرَبَنَّ أَحَدُكُمْ قَائِماً». أَخْرَجَهُ مُسْلِمٌ.

1246. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీలో ఎవరూ నిలబడి నీళ్ళు త్రాగరాదు." (ముస్లిం)

**సారాంశం**

నిలబడి నీళ్ళు త్రాగటాన్ని ఈ హదీసు వారిస్తుంది. ఈ వారింపును మెజారిటీ విద్వాంసులు 'నహీయె తన్జీహీ'గా పరిగణించారు. అయితే ఇబ్నె హజమ్ గారు నిలబడి నీరు త్రాగటం నిషిద్ధం (హరామ్) అని అభిప్రాయపడ్డారు. మరికొంతమంది పండితులు నిలుచుని నీళ్ళు త్రాగటాన్ని 'మక్రూహ్' (అవాంఛనీయం, అయిష్టకర విషయం)గా తలపోశారు. దైవప్రవక్త (సఅసం)వారు జమ్ జమ్ జలాన్ని నిలబడి త్రాగినట్లు ఆధారముంది. బహుశా ఈ కారణంగానే మెజారిటీ విద్వాంసులు ఈ వారింపును 'నిషిద్ధాంశం'గా పేర్కొనలేదేమో!

(١٢٤٧) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا انْتَعَلَ أَحَدُكُمْ فَلْيَبْدَأْ بِالْيَمِينِ، وَإِذَا نَزَعَ فَلْيَبْدَأْ بِالشِّمَالِ، وَلْتَكُنِ الْيُمْنَى أَوَّلَهُمَا تُنْعَلُ، وَآخِرَهُمَا تُنْزَعُ». مُتَّفَقٌ عَلَيْهِ.

1247. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: మీలో ఎవరయినాసరే చెప్పులు తొడగ దలిస్తే మొదట కుడి పాదంలో తొడగండి. (చెప్పులు) విడవబోయినపుడు మొదట ఎడమ పాదం నుంచి విడవండి. అంటే కుడి కాలికి మొదట తొడగాలి, రెండు కాళ్లలోనుంచి ఆఖరిలో కుడి కాలినుంచి చెప్పు విడవాలి."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

గౌరవప్రదమైన, ప్రాముఖ్యంతో కూడుకున్న ప్రతి పనినీ కుడివైపు నుంచి ప్రారంభించాలనీ,

తక్కువ ప్రాముఖ్యం గల వాటిని ఎడమ వైపునుంచి మొదలెట్టాలని హదీసు భావం. ఉదాహరణకు : చెప్పులు ధరించటం, తల దువ్వుకోవటం, వుజూ చేయటం, చొక్కా, షరాయి తదితర బట్టలు ధరించటం - ఇవన్నీ కుడిచేత్తో మరియు కుడికాలితో ప్రారంభించాలి. ఇకపోతే; చెప్పులు విడువటం, మలమూత్ర శుద్ధి (ఇస్తింజా) చేయటం వంటివి ఎడమ వైపునుంచి ఆరంభించాలి. అలాగే మస్జిద్‌లో ప్రవేశించే సమయంలో మొదట కుడి కాలు పెట్టాలి, మస్జిద్ నుంచి బయటికి వెళ్ళే సమయంలో తొలుత ఎడమ కాలు బయట పెట్టాలి.

(١٢٤٨) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَمْشِ أَحَدُكُمْ فِي نَعْلٍ وَاحِدَةٍ، وَلْيُنْعِلْهُمَا جَمِيعاً، أَوْ لِيَخْلَعْهُمَا جَمِيعاً». مُتَّفَقٌ عَلَيْهِ.

1248. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తాకీదు చేశారు: "మీలో ఎవరూ ఒక చెప్పను తొడిగి తిరగరాదు. తొడిగితే రెండూ ఒకే సమయంలో తొడగాలి లేకపోతే రెంటినీ విడిచేయాలి." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు ప్రకారం ఒక్కగానొక్క చెప్ప లేక బూటు ధరించి తిరగటం భావ్యం కాదు. అసలు ఎవరయినా **చెప్పులు ఎందుకు** వేసుకుంటారు? పాదాల రక్షణ కోసం, ముళ్ళబారి నుండి, హానికరమయిన **వస్తువుల** నుండి కాళ్ళను కాపాడుకోవటం కోసమేకదా! మరలాంటప్పుడు ఒక కాలికి చెప్ప తొడిగి తిరిగితే రెండవ కాలు ఏం కావాలి? పైగా ఇలాంటి చేష్ట సైతాన్ చేష్ట అనిపించుకుంటుంది. ఒంటి కాలికి చెప్ప ధరించి తిరగటం మర్యాద కాదు, సంస్కారం ఉన్న వారెవరూ అలా చేయరు.

(١٢٤٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَنْظُرُ اللهُ إِلَى مَنْ جَرَّ ثَوْبَهُ خُيَلاَءَ» مُتَّفَقٌ عَلَيْهِ.

1249. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు : "అహంకారంతో తన అంగవస్త్రాన్ని పాదాల క్రిందికి వదలి, వెనుక ఈడ్చుకుంటూ నడిచే వ్యక్తి వైపు అల్లాహ్ దయాదృష్టితో చూడడు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పురుషులు కాలి మడమలకు దిగువ భాగాన అంగ వస్త్రాన్నిగానీ, దుప్పటిని గానీ వదలటం హరామ్ (నిషిద్ధం) అని ఈ హదీసు ద్వారా విదితమవుతున్నది. ఈ విధంగా వస్త్రాన్ని వదలటం అహంకారానికి, బడాయికి నిదర్శనం.

(١٢٥٠) وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا أَكَلَ أَحَدُكُمْ فَلْيَأْكُلْ بِيَمِينِهِ، وَإِذَا شَرِبَ فَلْيَشْرَبْ بِيَمِينِهِ، فَإِنَّ الشَّيْطَانَ يَأْكُلُ بِشِمَالِهِ، وَيَشْرَبُ بِشِمَالِهِ» أَخْرَجَهُ مُسْلِمٌ.

1250. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవ రయినా సరే భోజనం చేసినపుడు తమ కుడిచేత్తో భుజించాలి. ఎవరు పానీయం త్రాగినా తమ కుడిచేత్తోనే త్రాగాలి. ఎందుకంటే షైతాన్ తన ఎడమ చేత్తోనే తింటాడు - ఎడమ చేత్తోనే త్రాగుతాడు." (ముస్లిం)

**సారాంశం**

ఏదైనా బలమైన కారణముంటే తప్ప - అకారణంగా - ఎడమచేత్తో తినటం, త్రాగటం నిషిద్ధం. పైగా ఇది పైశాచిక పోకడను పోలినది.

(١٢٥١) وَعَنْ عَمْرِو بْنِ شُعَيْبٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «كُلْ، وَاشْرَبْ، وَالْبَسْ، وَتَصَدَّقْ، فِي غَيْرِ سَرَفٍ وَلاَ مَخِيلَةٍ» أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَأَحْمَدُ، وَعَلَّقَهُ الْبُخَارِيُّ.

1251. హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రహ్మ.లై) తన తండ్రి ఆధారంగా, ఆయన తన తాతగారి ఆధారంగా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "తిను, త్రాగు, తొడుగు. దానధర్మాలు చెయ్యి. కాని దుబారా ఖర్చుకు, గర్వానికి తావీయకు." (దీన్ని అబూదావూద్ మరియు అహ్మద్ ఉల్లేఖించారు - బుఖారీ ఈ హదీసు పరంపరను ప్రస్తావించకుండానే పొందుపరచారు)

**సారాంశం**

దుబారా ఖర్చు, అహంకారం ధర్మసమ్మతం కావు. ఇవి రెండూ అన్న పానీయాలలో చేయబడినా, వస్త్రధారణలో ప్రదర్శించబడినా, పుణ్య కార్యాలలో చూపబడినా - మొత్తమ్మీద అవి ముస్లింకు ఏమాత్రం శోభించవు. ఈ హదీసు మనిషి ప్రాపంచిక, పారలౌకిక పరమార్థాలను పరివేష్టించి వున్న హితబోధిని అని షేఖ్ అబ్దుల్ లతీఫ్ బుగ్దాదీ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు.

ఎందుకంటే దుబారా లేక అతి అనేది సర్వత్రా హానికరమే. అతిగా భుజిస్తే ఆరోగ్యం

పాడవుతుంది. ఆర్థిక స్థితిపై దాని ప్రభావం పడుతుంది. అలాగే అహంకారంతో విర్రవీగేవాడు అన్యుల దృష్టిలో దుర్జనుడుగా భావించబడతాడు. పరలోకంలోనయితే అవమానం, పరాభవాలే అతనికి మిగులుతాయి. (సుబుల్)

## 2వ అధ్యాయం

## ٢ - بَابُ الْبِرِّ وَالصِّلَةِ

## సత్కార్యం, బంధుత్వ సంబంధాల పెంపుదల

(١٢٥٢) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ أَحَبَّ أَنْ يُبْسَطَ لَهُ فِي رِزْقِهِ، وَأَنْ يُنْسَأَ لَهُ فِي أَثَرِهِ، فَلْيَصِلْ رَحِمَهُ**». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1252. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు- "ఎవరయితే తన ఉపాధిలో సమృద్ధి, విస్తృతి నొసగబడాలనీ మరియు దీర్ఘాయుషు ప్రాప్తించాలని కోరుకుంటాడో అతను బంధుత్వ సంబంధాలను పెంపొందించాలి." (బుఖారీ)

### సారాంశం

ఈ హదీసులో 'సిలారహ్మీ' గురించి నొక్కి వక్కాణించబడింది. సిలా రహ్మీ అంటే సమీప బంధువుల, ఆత్మీయుల పట్ల మంచిగా మెలగటం, వారికి ఉపకారం చేయటం, వారిని విడదీసే బదులు సాధ్యమైనంతవరకు వారిని కలపటానికి ప్రయత్నించటం అని అర్థం. ఈ కలుపుగోలుతనం అటు తన వంశస్థులతో పాటు, అత్తవారి తరపు బంధువులకు కూడా వర్తిస్తుంది. వారందరి యెడల ప్రేమగా మెలగాలి. వారికి ఉన్నంతలోనే చక్కగా మర్యాద చేయాలి. వారి తరపున బాధాకరమైన సంఘటనలు ఎదురైనప్పటికీ మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించాలి. ఈ విధంగా 'మేలు' చేసేవారి జీవితం సాఫీగా సాగుతుంది. వారి జీవితాన్ని అల్లాహ్ ఒడిదుడుకుల నుండి, వ్యాకులత నుండి రక్షిస్తాడు. అయిన వారి దృష్టిలో వారు ఆదరణీయులుగా నెగ్గుకు వస్తారు. మరణించిన పిదప కూడా ఆత్మీయులు అతన్ని మనసున్న మంచి మనిషిగా జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు.

(١٢٥٣) وَعَنْ جُبَيْرِ بْنِ مُطْعِمٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لَا يَدْخُلُ الْجَنَّةَ قَاطِعٌ**». يَعْنِي قَاطِعَ رَحِمٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

1253. హజ్రత్ జుబైర్ బిన్ ముత్యిమ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "బంధుత్వ సంబంధాలను త్రెంచే వాడు స్వర్గంలో ప్రవేశించడు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

బంధుత్వ సంబంధాల విచ్ఛిన్నానికి పాల్పడేవారి దుష్పరిణామం గురించి ఈ హదీసు హెచ్చరిస్తోంది. 'ఖతే రహ్మ' (సంబంధాల విచ్ఛిత్తి) మహాపరాధం, ఘోరపాపం. ఈ పాపానికి ఒడిగట్టిన వ్యక్తి వెంటనే స్వర్గ ప్రవేశానికి అర్హత పొందలేడు. ఏ మేరకు అతడు సంబంధాలను చెడగొట్టాడో ఆ మేరకు శిక్ష అనుభవించిన మీదటే స్వర్గంలో ప్రవేశిస్తాడు.

(١٢٥٤) وَعَنِ الْمُغِيْرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِنَّ اللّٰهَ حَرَّمَ عَلَيْكُمْ عُقُوقَ الْأُمَّهَاتِ، وَوَأْدَ الْبَنَاتِ، وَمَنْعاً وَهَاتِ، وَكَرِهَ لَكُمْ قِيلَ وَقَالَ، وَكَثْرَةَ السُّؤَالِ، وَإِضَاعَةَ الْمَالِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1254. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : మీరు మీ తల్లులకు అవిధేయత చూపటాన్ని, ఆడపిల్లలను సజీవ దహనం చేయటాన్ని, పరోపకారం చేయకపోవటాన్ని, ఇతరుల ముందు చేయి చాచి అర్థించటాన్ని అల్లాహ్ నిషేధించాడు. ఇంకా అధిక ప్రేలాపనలను, అధికంగా ప్రశ్నించటాన్ని, ధనాన్ని దుర్వినియోగపరచడాన్ని కూడా అల్లాహ్ ఇష్టపడడు."

(బుఖారీ, ముస్లిం)

(١٢٥٥) وَعَنْ عَبْدِاللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «رِضَا اللهِ فِي رِضَا الْوَالِدَيْنِ، وَسَخَطُ اللهِ فِي سُخْطِ الْوَالِدَيْنِ» أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1255. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) తెలిపారు: తల్లిదండ్రుల ప్రసన్నతలో దైవప్రసన్నత ఇమిడి ఉంది. తల్లిదండ్రుల అప్రసన్నత దేవుని అప్రసన్నతకు మూలమవుతుంది." (దీనిని తిర్మిజీ సేకరించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు ఈ హదీసును ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

తల్లిదండ్రులను ప్రసన్నుల్ని చేయాలని, వాళ్ళ అప్రసన్నతకు, ఆగ్రహానికి కారకులు కారాదని ఈ హదీసు చెబుతోంది. అయితే ఒకవేళ దేవుని ధిక్కారానికి షిర్క్‌కి సంబంధించిన

పనుల వైపునకు తల్లిదండ్రులు పురికొల్పితే మాత్రం వారి మాట వినవసరం లేదు. అధర్మ విషయాలలో తల్లిదండ్రుల పురమాయింపులను లెక్క చేయకూడదు.

(١٢٥٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**وَالَّذِي نَفْسِي بِيَدِهِ لاَ يُؤْمِنُ عَبْدٌ حَتَّى يُحِبَّ لِجَارِهِ أَوْ لِأَخِيهِ مَا يُحِبُّ لِنَفْسِهِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1256. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ పవిత్రమూర్తి సాక్షిగా చెబుతున్నాను - తన స్వయం కొరకు ఇష్టపడేదే తన ఇరుగు పొరుగు లేక తన సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ ఏ దాసుడూ విశ్వాసి (మోమిన్) కాలేడు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో విశ్వాస పరిపూర్ణత కొరకు ఒక షరతు విధించబడింది. అదేమంటే విశ్వాసి అయినవాడు తన కోసం ఇష్టపడే వస్తువునే తన పొరుగువారి కోసం లేదా తన తోటి సోదరుల కోసం కూడా ఇష్టపడాలి. సమాజంలో తన గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడించాలని అతను కాంక్షిస్తున్నపుడు ఇతరులు కూడా అలాగే కోరుకుంటారని అతడు తలపోయాలి. కనుక ఇతరుల గౌరవ ప్రతిష్ఠలకు తన తరపున విఘాతం కలగకుండా చూసుకోవాలి. తనకు శాంతీ సౌఖ్యాలు ప్రాప్తించాలని కోరుకున్నప్పుడు సాటి వ్యక్తుల కోసం కూడా అదేవిధంగా ఆలోచించాలి. వ్యక్తుల్లో ఇలాంటి సకారాత్మక ఆలోచనలున్నప్పుడు సమాజమంతా సుఖ శాంతులకు నిలయమవుతుంది. ప్రగతి పథంలో సాఫీగా సాగిపోతుంది. అశాంతి అలజడులుండవు. ఒకరింకొకరి శ్రేయస్సును అభిలషించే వారుగా, ఒండొకరి యెడల సానుభూతి పరులుగా ఉంటారు. ఒక సత్సమాజానికి ఉండవలసిన ప్రధాన లక్షణమిదే.

(١٢٥٧) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ أَيُّ الذَّنْبِ أَعْظَمُ؟ قَالَ: «**أَنْ تَجْعَلَ لِلّٰهِ نِدًّا، وَهُوَ خَلَقَكَ**»، قُلْتُ: ثُمَّ أَيٌّ، قَالَ: «**ثُمَّ أَنْ تَقْتُلَ**

1257. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం: "అన్నింటికన్నా పెద్దపాపం ఏది?" అని నేను దైవప్రవక్త (సఅసం)ను అడిగాను. దానికి ఆయన (సఅసం), "అల్లాహ్ నిన్ను సృష్టించిన వాడైనప్పటికీ, నువ్వు ఆయనకు సహవర్తునిగా ఇతరులను నిలబెట్టడం (మహాపరాధం)" అని సెలవిచ్చారు. "ఆ తరువాత (పెద్ద

وَلَدَكَ خَشْيَةَ أَنْ يَأْكُلَ مَعَكَ». قُلْتُ: ثُمَّ أَيٌّ؟ قَالَ: ثُمَّ أَنْ تُزَانِيَ بِحَلِيلَةِ جَارِكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

పాపం) ఏది?" అని మళ్లీ ప్రశ్నించగా, "మీతో కలసి తినేస్తారేమోనన్న భయం కొద్దీ నువ్వు నీ సంతానాన్ని హత మార్చటం" అని ఆయన (స) బదులిచ్చారు. "ఆ తరువాత (పెద్దపాపం) ఏది?" అని నేను తిరిగి ప్రశ్నించగా, "నువ్వు నీ పొరుగు నున్నవాని భార్యతో వ్యభిచరించటం"అని ఆయన (సఅసం) సమాధానమిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో మూడు ముఖ్య విషయాలున్నాయి. (1) నిజ ప్రభువుకు ఇతరుల్ని భాగస్వాములుగా కల్పించటం. (2) దారిద్ర్య భయంతో సంతానాన్ని హత్యచేయటం. (3) పొరుగింటాయన ఇల్లాలితో కులకటం - ఇవి మూడూ ఘోర పాపాలుగా సూచించబడ్డాయి. వీటిలో మొదటిది దేవుని హక్కు అయితే మిగిలిన రెండూ దాసుల హక్కులు.

'షిర్క్' చాలా పెద్ద పాపం అన్న సంగతి తెలిసిందే. దానితోపాటు మనిషి తన సంతానం ఉనికిని సయితం భరించలేకపోవటం, అకారణంగా తన సంతానం ఈ లోకంలోకి రాకుండా అడ్డుకోవటం కూడా మహాపరాధమే. అక్రమ లైంగిక సంబంధం కూడా అటువంటిదే. అసలు వ్యభిచారమే నీతి బాహ్యమైన చేష్ట. అందునా ఒక పొరుగింటి వనితతో అక్రమ సంబంధం పెట్టుకోవటమంటే అది మరింత ఘోరం అవుతుంది. ఇందులో నమ్మకద్రోహం కూడా ఉంది. మనిషి ఎంత దుర్మార్గుడైనప్పటికీ అతడు తన ఉనికి ద్వారా ఇరుగు పొరుగువారికి అభయం, రక్షణ కల్పించటం అతని కనీస బాధ్యత. దానికి బదులు అతడు పొరుగింటావిడపైనే కన్నేసి కాటేస్తే అది పరమ దుర్మార్గం క్రిందికి వస్తుంది. కంచే చేను మేస్తే ఇంక దాన్నెవరు కాపాడ తారు? - దేవుడు తప్ప!

(١٢٥٨) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ الْعَاصِ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مِنَ الْكَبَائِرِ شَتْمُ الرَّجُلِ وَالِدَيْهِ»، قِيلَ: وَهَلْ يَسُبُّ الرَّجُلُ وَالِدَيْهِ؟

1258. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం : "తమ తల్లిదండ్రులను దూషించటం (కూడా) పెద్ద పాపాలలోనిదే." "ఏమిటీ, తమ తల్లిదండ్రులను దూషించే వారు కూడా ఉంటారా?" అని ఎవరో ప్రశ్నించగా, "అవును! ఇతను

قَالَ: «نَعَمْ يَسُبُّ أَبَا الرَّجُلِ فَيَسُبُّ أَبَاهُ، وَيَسُبُّ أُمَّهُ فَيَسُبُّ أُمَّهُ». مُتَّفَقٌ عَلَيْهِ.

వేరొకరి తండ్రిని తిడతాడు. దానికి బదులుగా అతడు ఇతగాని తండ్రిని తిట్టిపోస్తాడు. ఇతను వేరొకరి తల్లిని దుర్భాషలాడగా జవాబుగా అతనేమో ఇతని తల్లిని దూషిస్తాడు.''

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఏదైనా ఒక పనికి లేదా సంఘటనకు ఎవరయినా కారకులైనట్లయితే అతడు స్వయంగా దానికి పాల్పడినట్లేనని ఈ హదీసునుబట్టి అర్థమవుతున్నది. వేరే మాటల్లో చెప్పాలంటే అధర్మమైన విషయానికి దోహదపడే విషయాలన్నీ అధర్మమైనవే. అధర్మమైన విషయంలో సహకరించే వ్యక్తి సంకల్పం ఎంత మంచిదైనప్పటికీ అతడు ఆ పాపం నుంచి తప్పించుకోలేడు. దాని పరిణామం హరామ్ (అధర్మం) అయిన కారణంగా దానితో ముడిపడి ఉన్న ప్రతిదీ హరామే అవుతుంది. కాబట్టి మన తల్లిదండ్రులను దూషణల, దుర్భాషల నుండి మనం కాపాడదలచుకుంటే ఇతరుల తల్లిదండ్రుల్ని దూషించకుండా ముందుగా జాగ్రత్తపడాలి.

(١٢٥٩) وَعَنْ أَبِي أَيُّوبَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «لاَ يَحِلُّ لِمُسْلِمٍ أَنْ يَهْجُرَ أَخَاهُ فَوْقَ ثَلاَثِ لَيَالٍ. يَلْتَقِيَانِ فَيُعْرِضُ هَذَا وَيُعْرِضُ هَذَا، وَخَيْرُهُمَا الَّذِي يَبْدَأُ بِالسَّلاَمِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1259. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : ''తన సోదరునితో మూడు రోజులకన్నా ఎక్కువగా సంబంధాన్ని త్రెంచుకోవటం, ఇద్దరూ ముఖాముఖీ అయినపుడు ఎడమొహం పెడమొహం పెట్టుకోవటం ఏ ముస్లిం కొరకూ ధర్మ సమ్మతం కాదు. వారిద్దరిలో ఎవరు 'సలాం'లో ముందంజ వేస్తాడో అతడే ఉత్తముడు.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఇద్దరు ముస్లింలు వ్యక్తిగత వ్యవహారాలలో తగాదాపడితే మూడు రోజుల్లోపు వారు తమ అంతరాలను తొలగించుకుని మామూలు స్థితిని ఏర్పరచుకోవాలి. ఒకవేళ వారి తగాదాకు కారణం ధర్మాధర్మాల వ్యవహారం అయివుంటే దానికి బహుశా ఒక హద్దు లేదు. జీవితాంతం సంబంధాలను తెగత్రెంపులు చేసుకున్నట్లు ప్రవక్త ప్రియ సహచరుల ఉపమానాల ద్వారా

తెలుస్తోంది. ఎందుకంటే ధర్మాధర్మాల వ్యవహారం విశ్వాసం (ఈమాన్)తో ముడిపడివున్న వ్యవహారం. ఆ కారణం నెలకొని ఉన్నంత కాలం తెగతెంపులకు ఆస్కారముంటుంది. తెగ తెంపులకు ఆధారభూతమైన సదరు కారణం సమసి పోయినపుడు - సంస్కరణ జరిగినపుడు- సంబంధాలను వెంటనే పునరుద్ధరించుకోవలసి ఉంటుంది. ఎందుకంటే నిజమయిన విశ్వాసి దృష్టిలో పరస్పర సంబంధాలకు ప్రమాణ నికషం దైవప్రసన్నతేగాని ప్రాపంచిక స్వార్థ ప్రయోజనాలు కావు.

(١٢٦٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**كُلُّ مَعْرُوفٍ صَدَقَةٌ**». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1260. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "మేలుతో కూడుకున్న ప్రతి మంచి పనీ పుణ్యకార్యమే (సదఖాయే)." (బుఖారీ)

**సారాంశం**

'సదఖా' అంటే కేవలం ధనపరమైన దానమే కాదనీ, పరోపకారంతో కూడుకున్న ప్రతి మంచి పని సదఖాయేననీ ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్‌లలో అబూదావూద్‌చే ఉల్లేఖించబడిన హదీసు ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "నీ సోదరుని సమక్షంలో చిరునవ్వును చిందించటం కూడా పుణ్యకార్యమే. ఒక మంచి పని వైపునకు అతనికి మార్గదర్శకత్వం చేయటం, అధర్మమైన ఒక పని నుండి అతణ్ణి ఆపటం కూడా పుణ్యకార్యమే. దారితప్పిన వాడికి దారి చూపించటం కూడా పుణ్యకార్యమే. ఆఖరికి; బాటసారుల బాధను తొలగించే సంకల్పంతో మార్గంలోని ఎముకలను, ముళ్ళను తొలగించటం కూడా పుణ్యకార్యమే. తన బొక్కెనతో తన సోదరుని బొక్కెనలో కొద్ది నీరు పోసినా, అదీ పుణ్యకార్యమే అవుతుంది."

(١٢٦١) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تَحْقِرَنَّ مِنَ الْمَعْرُوفِ شَيْئاً، وَلَوْ أَنْ تَلْقَى أَخَاكَ بِوَجْهٍ طَلْقٍ**».

1261. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఏ సత్కార్యాన్నీ అల్పంగా, అతి సామాన్యంగా తలపోయకండి - ఆఖరికి తమ సోదరుణ్ణి నగుమోముతో పలకరించటాన్నయినా సరే."

**సారాంశం**

ఏమీ చేయలేకపోయినా - కనీసం ఒక మంచి మాట మాట్లాడటం, ఎదుటివారిని ఆకట్టుకునే రీతిలో నవ్వుతూ పలకరించటం కూడా సత్కార్యం క్రిందికే వస్తుందని ఈ హదీసు

చెబుతోంది. ఏ విషయాలనయితే మనం అతి స్వల్పమైనవిగా ఊహించుకుని ఉపేక్షిస్తామో అవే ఒక్కోసారి మనల్ని ప్రజల నుండి దూరం చేస్తాయి. పిసినారిగా, గర్విష్టిగా మనల్ని నిలబెడతాయి. అందుకే మనం తోటి సోదరుల్ని పలకరించినా, తోటివారు మనల్ని పలకరించినా పరధ్యానంతో మాట్లాడరాదు. మాట్లాడేటప్పుడు ముఖంపై అసహనం, ఆగ్రహం వ్యక్తమవ కూడదు. భృకుటి ముడిపడకూడదు. నుదురు చిట్లించరాదు. కసురుకోవటం, చీకాకు పడటం వంటివి చేయకూడదు. విముఖత అసలే పనికిరాదు. మన ముఖ కవళికల ద్వారా, హావ భావాల ద్వారా వీలయినంత వరకు సంతోషాన్ని, తృప్తినీ అభివ్యక్తం చేయాలి.

(١٢٦٢) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا طَبَخْتَ مَرَقَةً فَأَكْثِرْ مَاءَهَا، وَتَعَاهَدْ جِيرَانَكَ». أَخْرَجَهُمَا مُسْلِمٌ.

1262. ఈయనగారే చేసిన మరొక కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "మీరు చారులాంటిది వండినపుడు అందులో కాస్త నీరు ఎక్కువగా పోయండి. కాని మీ పొరుగువారిని కనిపెడుతూ ఉండండి." (ఈ రెండు హదీసులనూ 'ముస్లిం' పొందుపరచారు)

**సారాంశం**

ఈ హదీసులో ఇరుగు పొరుగు వారి హక్కును నొక్కి చెప్పటం జరిగింది. కూర వండేటప్పుడు, మాంసాహారం తయారు చేసేటప్పుడు రోస్ట్, ఇగురు వంటివి చేసేబదులు షేర్వా, సూప్‌లాంటివి తయారు చేసుకోవాలనీ, అయితే పొరుగింటివారిని మాత్రం విస్మరించరాదని దీని భావం. అందునా ఇరుగు పొరుగువారు పేదవారైనపుడు వారికి కానుకగా పంపటం తప్పనిసరి. ఒకవేళ పొరుగింటివారు ధనవంతులై ఉంటే అప్పుడప్పుడూ సత్సంబంధాల కోసమైనా సరే పంపుతూ ఉండాలి.

వేరొక హదీసులో దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా వద్దకు వచ్చినప్పుడల్లా పొరుగువారి హక్కును గురించి గట్టిగా నొక్కి చెబుతుండేవారు. ఆయన నొక్కి వక్కాణిస్తున్న తీరునుబట్టి బహుశా పొరుగువారిని (ఆస్తిలో) వారసులుగా ప్రకటించటం జరుగుతుందా! అని నాకు ఒకింత సందేహం కలిగేది."

(١٢٦٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ نَفَّسَ عَنْ مُسْلِمٍ كُرْبَةً مِنْ كُرَبِ الدُّنْيَا نَفَّسَ اللهُ عَنْهُ كُرْبَةً مِنْ كُرَبِ يَوْمِ الْقِيَامَةِ، وَمَنْ

1263. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఎవరయినా సరే ప్రపంచంలోని ఆప

يَسَّرَ عَلَى مُعْسِرٍ يَسَّرَ اللّٰهُ عَلَيْهِ فِي الدُّنْيَا وَالْآخِرَةِ. وَمَنْ سَتَرَ مُسْلِماً سَتَرَهُ اللّٰهُ فِي الدُّنْيَا وَالْآخِرَةِ، وَاللّٰهُ فِي عَوْنِ الْعَبْدِ مَا كَانَ الْعَبْدُ فِي عَوْنِ أَخِيهِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

దల్లో నుంచి, ఏదేని ఒక ఆపదనుంచి ఏ ముస్లింనయినా గట్టెక్కిస్తే అల్లాహ్ ప్రళయ దినాన ప్రళయదినపు గండాలలోని ఏదేని ఒక గండం నుంచి అతన్ని గట్టెక్కిస్తాడు. ఎవరయినా ప్రాపంచికంగా లేమికి గురైన ఒక వ్యక్తికి వెసులుబాటు కల్పిస్తే అల్లాహ్ ఇహపరాలలో అతని కోసం వెసులుబాటును కల్పిస్తాడు. ఎవరయినా ఒక ముస్లిం బలహీనతను కప్పిపుచ్చితే అల్లాహ్ ఇహపరాలలో అతని లోగుట్టుపై ఆచ్ఛాదన వేసి ఉంచుతాడు. ఒక దాసుడు తోటి సోదరునికి సాయపడుతూ ఉన్నంత కాలం దేవుడు అతన్ని ఆదుకుంటూనే ఉంటాడు." (ముస్లిం)

(١٢٦٤) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «مَنْ دَلَّ عَلَى خَيْرٍ فَلَهُ مِثْلُ أَجْرِ فَاعِلِهِ» أَخْرَجَهُ مُسْلِمٌ.

1264. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరయినా ఒకరికి శ్రేయస్కరమైన, మేలుతో కూడుకున్న మార్గాన్ని చూపిస్తే అతనికి సయితం సన్మార్గాన్ని అవలంబించిన వానికి సమానంగా పుణ్యం లభిస్తుంది." (ముస్లిం)

**సారాంశం**

ఒక వ్యక్తికి మంచి మార్గం చూపిస్తే ఆ వ్యక్తి జీవితం ఎలాగూ బాగుపడుతుంది. అయితే మంచి మార్గం చూపిన వ్యక్తి సయితం మంచి మార్గంపై నడిచేవానికి సమానంగా పుణ్యం సంపాదిస్తాడని అనటం గమనార్హ విషయం. ఆ మంచి మార్గం వైపునకు ప్రత్యక్షంగా దర్శకత్వం వహించినా, పరోక్షంగా వహించినా పుణ్యం ప్రాప్తించటమనేది మాత్రం తథ్యం.

(١٢٦٥) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «مَنِ اسْتَعَاذَكُمْ بِاللهِ فَأَعِيذُوهُ، وَمَنْ سَأَلَكُمْ بِاللهِ فَأَعْطُوهُ، وَمَنْ أَتَى إِلَيْكُمْ مَعْرُوفاً فَكَافِئُوهُ، فَإِنْ لَمْ تَجِدُوا فَادْعُوا لَهُ». أَخْرَجَهُ الْبَيْهَقِيُّ.

1265. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలియజేశారు: "మీలో ఎవరైనా సరే అల్లాహ్ పేరుతో శరణు కోరితే అతనికి రక్షణ కల్పించండి. అల్లాహ్ పేరుతో ఎవరు అర్థించినా వారికి సాయపడండి. మీ యెడల ఎవరు ఉత్తమంగా వ్యవహరించినా దానికి బదులుగా మీరు కూడా వారి యెడల ఉత్తమంగా మసలుకోండి. ఒకవేళ మీలో అంతటి స్థోమత లేకపోతే వారి మేలు కోరుతూ ప్రార్థించండి."

(సునన్ బైహఖీ)

**సారాంశం**

ఈ హదీసులో దేవుని పేరుతో సాయం కోరిన వారిని ఆదుకోవాలనీ, ఉపకారానికి 'బదులు'ను ఉత్తమ రీతిలో తిరిగి ఇవ్వాలనీ తాకీదు చేయబడింది. అయితే దేవుని పేరుతో వేరొకరి సాయం కోరేవారు అచితూచి మరీ సాయం కోరాలి. ఎదుటివాడు అతని అవసరాన్ని తీర్చలేనంత క్లిష్టమయిన సాయం కోరి అతన్ని ఇరకాటంలో పెట్టకూడదు. దేవుని ప్రస్తావన తీసుకువచ్చి ఇబ్బందికరమైన రీతిలో సాయం కోరేవారిని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడని వేరొక హదీసు ద్వారా తెలుస్తోంది.

## ٣ - بَابُ الزُّهْدِ وَالْوَرَعِ

**3వ అధ్యాయం**

## సాత్వికత, ధర్మనిష్ఠ

(١٢٦٦) وَعَنِ النُّعْمَانِ بْنِ بَشِيرٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ – وَأَهْوَى النُّعْمَانُ بِإِصْبَعَيْهِ إِلَى أُذُنَيْهِ –: «إِنَّ الْحَلَالَ بَيِّنٌ، وَإِنَّ الْحَرَامَ بَيِّنٌ، وَبَيْنَهُمَا مُشْتَبِهَاتٌ، لاَ يَعْلَمُهُنَّ كَثِيرٌ مِنَ النَّاسِ، فَمَنِ اتَّقَى الشُّبُهَاتِ فَقَدِ اسْتَبْرَأَ

1266. దైవప్రవక్త (సఅసం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) చెప్పారు. ఆ సమయంలో నూమాన్ తన రెండు వ్రేళ్లను తన చెవుల వైపునకు తీసుకెళ్ళారు-"హలాల్ (ధర్మం) కూడా సుస్పష్టమే హరామ్ (అధర్మం) కూడా సుస్పష్టమే. ఈ రెండింటి మధ్య

لِدِينِهِ وَعِرْضِهِ، وَمَنْ وَقَعَ فِي الشُّبُهَاتِ وَقَعَ فِي الْحَرَامِ. كَالرَّاعِي يَرْعَى حَوْلَ الْحِمَى يُوشِكُ أَنْ يَقَعَ فِيهِ. أَلاَ! وَإِنَّ لِكُلِّ مَلِكٍ حِمىً، أَلاَ! وَإِنَّ حِمَى اللهِ مَحَارِمُهُ. أَلاَ! وَإِنَّ فِي الْجَسَدِ مُضْغَةً إِذَا صَلَحَتْ صَلَحَ الْجَسَدُ كُلُّهُ، وَإِذَا فَسَدَتْ فَسَدَ الْجَسَدُ كُلُّهُ، أَلاَ! وَهِيَ الْقَلْبُ». مُتَّفَقٌ عَلَيْهِ.

కొన్ని అస్పష్టమైన విషయాలున్నాయి. జనుల్లోని అధికులకు వీటి గురించి తెలీదు. కనుక ఎవరయితే ఈ అస్పష్ట విషయాలకు కూడా దూరంగా ఉన్నాడో అతడు తన ధర్మాన్ని, తన మానమర్యాదలను కాపాడుకున్నాడు. మరెవరయితే అస్పష్ట అంశాలలో పడిపోయాడో అతడు అధర్మంలో చిక్కుకుపోయాడు. కావలివాడు చేనుకు దగ్గరలో పశువులకు కాపలాగా ఉంటాడు. పశువులు చేనుకు అవతల మేస్తూనే ఏదో ఒక దశలో గట్టు దాటి చేలో పడతాయి. జాగ్రత్త! ప్రతి చక్రవర్తికీ సరిహద్దు ఉంటుంది. జాగ్రత్త! అధర్మ విషయాలు దేవుని సరిహద్దుల్లాంటివి. జాగ్రత్త! శరీరంలో మాంసపు ముద్ద ఒకటుంది. ఆ ముద్ద గనక బావుంటే శరీరమంతా బావుంటుంది. అది గనక చెడిపోతే శరీరమంతా చెడిపోతుంది. తస్మాత్! ఆ మాంసపు ముద్దే హృదయం." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు చాలా ముఖ్యమైనది. ఇస్లాం మూల సూత్రాలకు సంబంధించినది. ధర్మమేదో, అధర్మమేదో నిర్ధిష్టంగా **వేరు చేసి** చెప్పటం జరిగింది. అయినప్పటికీ కొన్ని అస్పష్టంగా ఉంటాయి. వాటికి సంబంధించి ఊగిసలాట, సందిగ్ధావస్థ నెలకొంటూ ఉంటుంది. అలాంటి అస్పష్ట, అనుమానాస్పద **విషయాలు** 'హరాం' అని **కూడా** ఖచ్చితంగా చెప్పబడి ఉండదు. అలా అని 'హలాల్' అనడానికి కూడా తగు ఆధారం కనబడదు. రెండు విధాలుగా కూడా అర్థం చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇలాంటి అస్పష్టమయిన విషయాలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

**పోతే**; శరీరం యొక్క స్వస్థత లేదా అస్వస్థత అనేది హృదయస్థితిపై ఆధారపడి ఉంటుందనీ, ఒక రాజ్యంలో రాజ్యాధిపతికి ఉన్న కీలక స్థానమే శరీరంలో హృదయానికి ఉంటుందనీ,

శరీరంలోని మిగతా అవయవాలన్నీ దాని నైర్మల్యంపై, నిష్కల్మషత్వంపై ఆధారభూతమై ఉంటాయనీ హదీసు చెబుతోంది. 'యథారాజా తథా ప్రజ' అన్నట్లు చక్రవర్తి సజ్జనుడై ఉంటే ప్రజలు కూడా సద్వర్తననే అలవరచుకుంటారు. చక్రవర్తే దుర్మార్గుడు, దుష్టుడు అయినపుడు ప్రజల నుండి మంచిని ఎలా ఆశించగలం?!

(١٢٦٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**تَعِسَ عَبْدُ الدِّينَارِ وَالدِّرْهَمِ وَالْقَطِيفَةِ، إِنْ أُعْطِيَ رَضِيَ، وَإِنْ لَمْ يُعْطَ لَمْ يَرْضَ**». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1267. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ప్రబోధనం: "దీనారు, దిర్హము, పట్టు వస్త్రాల దాసుడు నాశనమై పోవుగాక!- అవి లభించినంతకాలం సంతృప్తి చెందుతాడు. లభించకపోతే అసంతృప్తికి గురవుతాడు." (బుఖారీ)

**సారాంశం**

బంగారు, వెండి పట్టు వస్త్రాలు కలిగి ఉండటం, డబ్బును సంపాదించటం తప్పుకాదుగాని మనిషి ధనపూజలో లీనమవటం, వెండీ బంగారాలను, వజ్రవైఢూర్యాలను, పట్టు పీతాంబరాలను ప్రోగుచేసుకోవటమే అసలు జీవిత ధ్యేయంగా ఎంచుకోవటమే విపరీతం. ఈ ధన దాహం కూడా ఒక రకమయిన రుగ్మతే. దానికి లోనైనవాడు పరమ పీనాసిగానయినా మారిపోతాడు. లేదా అడ్డదారులైనా తొక్కుతాడు. తాను లక్ష్యంగా పెట్టుకున్నంత ధనాన్ని ప్రోగుచేసుకోగానే తలబిరుసుతనం వచ్చేస్తుంది. నేలపై నిక్కుతూ నడవసాగుతాడు. తన ఆస్తినీ, అంతస్థును లోకానికి చాటిచెప్పే ఉద్దేశ్యంతో లేనిపోని పోకడలు పోతాడు. ఎందుకంటే అతనికి 'ఖారూనీ తత్వం' ఆవహిస్తుంది. ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకున్న ఖారూన్ కుబేరునికి పట్టిన గతేమిటో తెలిసిందే కదా!

అందుకే ఆస్తిపరుడైనవాడు అణకువతో ఉండాలి. డబ్బును, బంగారాన్ని ఎక్కడుంచాలో అక్కడే ఉంచాలి. తన అభిరుచి అన్యుల్ని ఇరకాటంలో పెట్టకుండా సంయమనాన్ని సమయస్ఫూర్తిని ప్రదర్శించాలి. దేవుడు తనకు అనుగ్రహించిన దాంతో దైవదాసుల్లో లేమికి గురైన వారిని ఆదుకుంటూ ఉండాలి.

(١٢٦٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: أَخَذَ رَسُولُ اللهِ ﷺ بِمَنْكِبَيَّ، فَقَالَ: «**كُنْ فِي الدُّنْيَا كَأَنَّكَ غَرِيبٌ أَوْ عَابِرُ سَبِيلٍ**»، وَكَانَ ابْنُ عُمَرَ يَقُولُ: إِذَا أَمْسَيْتَ فَلاَ تَنْتَظِرِ الصَّبَاحَ، وَإِذَا أَصْبَحْتَ فَلاَ

1268. దైవప్రవక్త (సఅసం) తన భుజాలు పట్టుకుని ఈ విధంగా ఉపదేశించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "(ఓ ఇబ్నె ఉమర్!) ప్రపంచంలో ఒక అపరిచితునిలా లేదా బాటసారి మాదిరిగా జీవించు." ఇంకా ఈ విధంగా

تَنْتَظِرِ الْمَسَاءَ، وَخُذْ مِنْ صِحَّتِكَ لِسَقَمِكَ، وَمِنْ حَيَاتِكَ لِمَوْتِكَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

చెప్పేవారని ఇబ్నె ఉమర్ (రజి) తెలియ జేశారు - నువ్వు సాయంత్రాన్ని చూస్తే తెల్లవార్చేందుకు నిరీక్షించకు. తెల్లవారిస్తే సాయం సమయం కోసం ఎదురు చూడకు. ఆరోగ్యవంతునిగా ఉన్నప్పుడు అనారోగ్య స్థితిలో ఉపయోగపడే కొంత సామగ్రిని సమకూర్చుకో. జీవితంలోనే మరణ సన్నాహాలు మొదలెట్టు."

(బుఖారీ)

**సారాంశం**

ఈ ప్రపంచం శాశ్వతం కాదనీ, ఇదొక క్షణభంగురమనీ ఈ హదీసులో చెప్పబడింది. అందుకే ఈ లోకంలో వున్న వారంతా ఒక ప్రయాణీకుని తరహాలో జీవించాలనీ, ప్రపంచం అతని శాశ్వత నివాస స్థలం కాదనీ, ఒక బాటసారి దారి మధ్య మజిలీలో ఉన్నట్లే తలపోయాలనీ, అందుకే ప్రాపంచిక వస్తువుల పట్ల అమితమైన మక్కువను పెంచుకోరాదనీ ఇందులో బోధించబడింది.

ఆరోగ్యవంతునిగా ఉన్నప్పుడు సామగ్రిని సమకూర్చుకోవటమంటే అర్థం - మనిషి వ్యాధి గ్రస్తుడైనపుడు తగు విధంగా ఆరాధనలు చేయలేడు. సత్కార్యాలలో చురుకుగా పాల్గొనలేడు. అందుకే ఆరోగ్య స్థితిని మహాభాగ్యంగా భావించి ముందుగానే చేయగలిగినన్ని మంచి పనులు చేసుకోవాలి.

జీవితంలోనే మరణ సన్నాహాలు మొదలెట్టడమంటే భావం; మృత్యువు కబళించిన తరువాత ఇక అతనికి సత్కార్యాలు చేసే, దానధర్మాలు చేసే అవకాశం లభించదు. ప్రపంచంలో జీవించి ఉండగా చేసుకున్న మంచిపనులే మరణానంతర జీవిత బ్యాంకులో జమ అయి ఉంటాయి.

(١٢٦٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ، «مَنْ تَشَبَّهَ بِقَوْمٍ فَهُوَ مِنْهُمْ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1269. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఎవరయితే ఇతర జాతులను అనుకరించాడో అతడూ వారిలోని వాడే." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసును ప్రామాణిక మైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

భావ దారిద్ర్యాన్ని ఈ హదీసు ఖండిస్తోంది. ఎంతసేపటికీ, అరువు వెల్తురుపై ఆధారపడి ఉండటం, ఇస్లామేతర ఆచార వ్యవహారాలను అనుకరించటం అత్యంత అయిష్టకరమైన విషయమని ఈ హదీసు ద్వారా అవగతమవుతున్నది. "అనుకరణ"కు సంబంధించిన ఈ అధ్యాయం చాలా విస్తృతమయింది. ఇందులో ఆరాధనలు, ఆచార వ్యవహారాలు, అన్నపానీయాలు, వస్త్రధారణ, అలంకరణ, సంప్రదాయాలు, అలవాట్లు, పోకడలు - మొదలగు విషయాలు చేరి ఉన్నాయి. ఈ విషయాలన్నింటిలోనూ అన్యులను అనుకరించరాదని హదీసు చెబుతోంది. స్థలాభావం వల్ల వాటిని సవివరంగా విశ్లేషించలేకపోతున్నాము. అల్లామా నాసిరుద్దీన్ అల్ బానీ తన గ్రంథమైన "హిజాబుల్ మర్అతిల్ ముస్లిమ"లో ఈ అంశంపై కూలంకషంగా చర్చించారు.

(١٢٧٠) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كُنْتُ خَلْفَ النَّبِيِّ ﷺ يَوْماً فَقَالَ: «يَا غُلَامُ! اِحْفَظِ اللّٰهَ يَحْفَظْكَ، اِحْفَظِ اللّٰهَ تَجِدْهُ تُجَاهَكَ، وَإِذَا سَأَلْتَ فَاسْأَلِ اللّٰهَ، وَإِذَا اسْتَعَنْتَ فَاسْتَعِنْ بِاللّٰهِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ صَحِيْحٌ.

1270. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఒక రోజు నేను దైవప్రవక్త (సఅసం) వెనుక నిలబడి ఉన్నాను. ఆయన (సఅసం) నన్నుద్దేశించి, "అబ్బాయి! నువ్వు దైవాదేశాలను కాపాడు. దేవుడు నిన్ను కనిపెట్టుకుని ఉంటాడు. నువ్వు అల్లాహ్‌ను మాత్రమే ధ్యానించు. ఆయన నీ ముందరే ఉన్నట్లు నీవు గ్రహిస్తావు. నువ్వు ఎప్పుడు ఏది అడిగినా (కేవలం) అల్లాహ్‌నే అడుగు. ఎప్పుడు సహాయమర్థించవలసి వచ్చినా అల్లాహ్ సహాయమే అర్థించు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. హసన్ మరియు సహీహ్‌గా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో 'ఏకేశ్వరోపాసన' పాఠం సులభగ్రాహ్యమైన పద్ధతిలో చెప్పబడింది. దైవాదేశాలను కాపాడటమంటే భావం దేవుడు వేటిని సమ్మతించాడో వాటిని ఆచరించాలి. ఆయన నిషేధించినవాటి జోలికి పోకుండా జాగ్రత్తపడాలి. ఇతరులను కూడా అధర్మమయిన విషయాల నుండి ఆపాలి. ఈ విషయాల పట్ల శ్రద్ధ కనబరచిన వారిని దేవుడు సతతం దుష్టశక్తుల బారినుండి కాపాడుతూ ఉంటాడు. తీర్పుదినాన వారిని కనికరించి, నరకాగ్ని బారినుండి రక్షిస్తాడు.

ముస్నదె ఇమామ్ అహ్మద్‌లో పొందుపరచబడిన ఒక హదీసు ప్రకారం మహనీయ

ముహమ్మద్ (సఅసం) ఇలా ఉద్బోధించారు - లోకవాసులంతా కలసి నిన్ను పాడుచేయాలన్నా, నీకు నష్టం కలిగించాలనుకున్నా వారు నీకెలాంటి కీడు, నష్టం కలిగించలేరు. వారు నీ స్థితిని చక్కబరచనూ లేరు. వారంతా కలసినా దేవుడు నీ కోసం రాసిపెట్టినంత మాత్రమే నీకు లాభం చేకూర్చగలుగుతారు. ఒకవేళ వారు నష్టం చేకూర్చదలచినా దేవుడు రాసి పెట్టినంత నష్టమే చేకూర్చగలుగుతారు. అందులో వారెలాంటి హెచ్చుతగ్గులు చేయలేరు. ఎందుకంటే విధి వ్రాత వ్రాసే వారి కలములు ఇంకిపోయాయి. రికార్డులు చుట్టి ఉంచి వేయబడ్డాయి. ఇప్పుడు వాటిని పెంచటంగానీ, తగ్గించటంగానీ సంభవం కాదు."

(١٢٧١) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَاءَ رَجُلٌ إِلَى النَّبِيِّ ﷺ فَقَالَ: يَا رَسُولَ اللهِ! دُلَّنِيْ عَلَىٰ عَمَلٍ إِذَا عَمِلْتُهُ أَحَبَّنِيَ اللهُ، وَأَحَبَّنِيَ النَّاسُ. فَقَالَ: «ازْهَدْ فِي الدُّنْيَا، يُحِبُّكَ اللهُ، وَازْهَدْ فِيمَا عِنْدَ النَّاسِ، يُحِبُّكَ النَّاسُ». رَوَاهُ ابْنُ مَاجَهْ وَغَيْرُهُ، وَسَنَدُهُ حَسَنٌ.

1271. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు - "ఓ దైవప్రవక్తా (సఅసం)! దేనిని నేను ఆచరించటం వల్ల అల్లాహ్ నన్ను ఇష్ట పడతాడో మరియు ప్రజలు నన్ను ప్రేమిస్తారో అలాంటి ఆచరణ గురించి నాకు ఉపదేశించండి." దీనికి సమాధానంగా ఆయన (సఅసం) ఇలా ఉపదేశించారు: "ప్రపంచం పట్ల నిరపేక్షాభావం ఏర్పరచుకో. అల్లాహ్ నిన్ను ప్రేమిస్తాడు. జనుల దగ్గర ఉన్న దానిపై కూడా మక్కువ చూపకు. అప్పుడు జనులు కూడా నిన్ను ప్రేమించటం మొదలెడతారు." (ఈ హదీసును ఇబ్నె మాజా తదితరులు ఉల్లేఖించారు. దీని పరంపర స్పష్టమైనది)

(١٢٧٢) وَعَنْ سَعْدِ بْنِ أَبِيْ وَقَّاصٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «إِنَّ اللَّهَ يُحِبُّ الْعَبْدَ التَّقِيَّ الْغَنِيَّ الْخَفِيَّ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1272. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) తెలిపారు - భయభక్తులు కలిగి, ప్రపంచం పట్ల మక్కువ చూపకుండా, పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడకుండా ఉండే దాసులను అల్లాహ్ తన నేస్తంగా చేసుకుంటాడు." (ముస్లిం)

(١٢٧٣) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مِنْ حُسْنِ إِسْلَامِ الْمَرْءِ تَرْكُهُ مَا لاَ يَعْنِيهِ». رَوَاهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ.

1273. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "వ్యర్థమయిన, నిష్ప్రయోజనకరమైన విషయాలను మనిషి విడనాడటమే అతని ఇస్లాం ఉత్తమమైనదనడానికి ప్రబల నిదర్శనం." (ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించి, దీనిని హసన్‌గా ఖరారు చేశారు)

**సారాంశం**

దైవప్రవక్త (సఅసం) వారి పలుకుల్లో కొన్ని పలుకులు చాలా క్లుప్తంగా ఉంటాయి గాని అవి అత్యంత సమగ్రంగా కూడా ఉంటాయి. ఈ ప్రవచనం కూడా ఆ కోవకు చెందినదే. ప్రపంచంలో మనిషి జీవన ధ్యేయం దైవారాధన. ఒక నిజమైన విశ్వాసి ఎన్నడూ నిరర్థకమైన, నిష్ప్రయోజనకరమయిన పని చెయ్యడు. అతని 'విశ్వాసం' ఇలాంటి వాటిని చేయమని కాంక్షించదు కూడా. అతనీ ప్రపంచంలో కాలక్షేపం కోసం రాలేదు. పైగా అతను దైవారాధన కోసం, దైవప్రసన్నతను చూరగొనే నిమిత్తం ఉనికిలోకి తేబడ్డాడు. కాబట్టి జీవిత ధ్యేయానికి, సంస్కరణాసరణికి విరుద్ధమైన ఏ పనయినాసరే అది క్రియాశూన్యంగా, బూటకంగానే పరిగణించబడుతుంది. నిజ దాసుడు ఇలాంటి వృథాపనులకై కాలాన్ని నాశనం చేయడు. ఎందుకంటే దేవుడు ఇలాంటి వ్యర్థ విషయాలను ఇష్టపడడు.

(١٢٧٤) وَعَنِ الْمِقْدَامِ بْنِ مَعْدِيكَرِبَ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مَلأَ ابْنُ آدَمَ وِعَاءً شَرًّا مِنْ بَطْنٍ» أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

1274. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ మిఖ్దామ్ బిన్ మాదీ కరిబ్ (రజి) తెలియజేశారు: మనిషి అదేపనిగా నింపుకునే అత్యంత దుర్భరమైన కంచం అతని పొట్ట మాత్రమే." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. దీనిని హసన్‌గా ఖరారు చేశారు)

**సారాంశం**

మితిమీరిన తిండి కూడా ఒక దురలవాటేనని ఈ హదీసులో చెప్పబడింది. మనిషి జీవిక కోసం తిండి అవసరమే. పైగా అతని ఆరోగ్యం కోసం పౌష్టిక ఆహారం కూడా అవసరమే.

అయితే అది కూడా లెక్క ప్రకారమే ఉండాలి. తన దగ్గర ఉందికదా అని లేదా తేరగా వచ్చిపడింది కదా అని అదేపనిగా నింపుకోరాదు. ఈ 'అతి' అనేక అనర్థాలకు దారితీస్తుంది. మనిషి ఉదరం అనేక రోగాలకు జన్మస్థానం వంటిది. ఉదరం బావుంటే శరీరమంతా బావుంటుంది. మనిషి చురుకుగా ఉంటాడు. అందుకే అన్న పానీయాల విషయంలో రెండు అతివాదాలకు నడుమ మధ్యేమార్గాన్ని అనుసరించాలి. బాగా ఆకలైనపుడే భుజించాలి. కడుపు పూర్తిగా నిండకముందే భోజనాన్ని ముగించాలి.

అతిగా భుజించేవాని పొట్ట వ్యాకోచిస్తుంది. స్థూలకాయం వస్తుంది. మెదడు మొద్దుబారిపోతుంది. అదీగాక అటువంటి వ్యక్తి సమాజం దృష్టిలో తిండిపోతుగా భావించబడతాడు.

(١٢٧٥) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «كُلُّ بَنِي آدَمَ خَطَّاءٌ، وَخَيْرُ الْخَطَّائِينَ التَّوَّابُونَ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ وَابْنُ مَاجَهْ، وَسَنَدُهُ قَوِيٌّ.

1275. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: ప్రతి ఆదం పుత్రుడూ దోషం ఉన్నవాడే. అయితే అత్యధికంగా పశ్చాత్తాపం చెందే వారే దోషుల్లో ఉత్తములు. (తిర్మిజీ, ఇబ్నెమాజా ఈ హదీసును ఉల్లేఖించారు. దీని పరంపర దృఢమైనది)

**సారాంశం**

ఏ మనిషీ నిర్దోషి, నిరపరాధి కాజాలడనీ, ప్రతి ఒక్కరిలోనూ లోపాలు, బలహీనత లుండటం సహజమని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. దోష రహితులు కేవలం దైవ ప్రవక్తలు మాత్రమే. దేవుడు తన కృపతో వారిని మహాపరాధాల నుంచి రక్షించుకుంటాడు. సాధారణ జనులకు మాత్రం ఈ సూత్రం వర్తించదు. తప్పు జరగటం మానవ సహజం. అయితే తన వల్ల జరిగిన తప్పులపై మానవుడు సిగ్గుతో కుంచించుకుపోతూ దైవసమక్షంలో క్షమాభిక్ష వేడుకోవాలి. ఆ తప్పులు మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. ఇదే సిసలయిన పశ్చాత్తాపం. ఈ విధంగా పశ్చాత్తాపం చెందే దాసుల్ని అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు.

(١٢٧٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الصَّمْتُ حِكْمَةٌ، وَقَلِيلٌ فَاعِلُهُ». أَخْرَجَهُ الْبَيْهَقِيُّ فِي

1276. దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు - "నిశ్శబ్దంగా ఉండటం విజ్ఞతా వివేచనలకు నిదర్శనం. అయితే ఈ విధానాన్ని అవలంబించేవారు అతి కొద్దిమంది మాత్రమే ఉంటారు." (దీనిని బైహఖీ

الشُّعَبِ بِسَنَدٍ ضَعِيفٍ. وَصَحَّحَ أَنَّهُ مَوْقُوفٌ مِنْ قَوْلِ لُقْمَانَ الْحَكِيمِ.

షోబుల్ ఈమాన్‌లో బలహీన పరం పరతో ఉల్లేఖించారు. వాస్తవానికి ఇది హకీమ్ లుఖ్మాన్ పలుకు)

**సారాంశం**

వీలయినంతవరకు నిశ్శబ్దంగా ఉండటం, మౌనం వహించటం వివేకంతో, యుక్తితో కూడుకున్న విషయమని ఈ హదీసులో చెప్పబడింది. ఈ విధానాన్ని అవలంబించే వారు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారని కూడా చెప్పబడింది. ఇది నిజానికి హజ్రత్ లుఖ్మాన్ అలైహిస్సలాం ప్రవచనం అయినప్పటికీ ఎన్నో హదీసుల ద్వారా మౌనంగా ఉండటానికి సమర్థన లభిస్తోంది. అనవసర సంభాషణ, అధిక ప్రసంగం, వ్యర్థ ప్రలాపనలు ఖండించ బడ్డాయి. "నిశ్శబ్దంగా ఉన్నవాడు మోక్షం పొందాడు" అన్న హదీసు ఈ సందర్భంగా గమనించ దగినది. "ఎవరయినా మాట్లాడితే నిత్యం మంచి మాటలే మాట్లాడాలి. లేకపోతే ఊరుకోవాలి" అన్న హదీసు కూడా గమనార్హమే.

## ٤ - بَابُ التَّرْهِيبِ مِنْ مُسَاوِئِ الْأَخْلَاقِ

## 4వ అధ్యాయం
## దుర్గుణాలు, దురలవాట్ల గురించి హెచ్చరించటం

(١٢٧٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِيَّاكُمْ وَالْحَسَدَ، فَإِنَّ الْحَسَدَ يَأْكُلُ الْحَسَنَاتِ، كَمَا تَأْكُلُ النَّارُ الْحَطَبَ**». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَلابْنِ مَاجَهْ مِنْ حَدِيثِ أَنَسٍ نحوه.

1277. హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు - "అసూయకు దూరంగా ఉండండి. ఎందుకంటే అగ్ని కట్టెలను భస్మీపటలం చేసినట్లే అసూయ సత్కార్యాలను హరించివేస్తుంది." (దీనిని అబూదావూద్ సేకరించారు-ఇబ్నెమాజాలోనూ హజ్రత్ అనస్ (రజి)చే ఈ విధంగానే ఉల్లేఖించ బడింది)

**సారాంశం**

అసూయ లేక ఈర్ష్య పెద్ద పాపాల కోవకు చెందినది. ఈర్ష్య మూలంగానే షైతాన్ తొలిసారిగా దైవాన్ని ధిక్కరించాడు. ఖాబిల్ తన సోదరుడైన హాబిల్‌ని అసూయతోనే హత్య చేశాడు. దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) సోదరులు ఆయన యెడల చేసిన దుర్వ్యవహారానికి అసలు కారణం ఈ అసూయే. యూద పండితులు, అబ్దుల్లా బిన్ ఉబై

వంటి కపటులు మహాప్రవక్త (సఅసం) పట్ల చేసిన కపట చేష్టలన్నింటికీ మూలం ఈర్ష్యే. దీనికి సంబంధించిన ఉల్లేఖనాలనేకం ఉన్నాయి. ఇది విశ్వాసానికి విరుద్ధాంశం. అందుకే దీనికి దూరంగా ఉండమని మహనీయ ముహమ్మద్ (సఅసం) చాలా గట్టిగా తాకీదు చేశారు.

(١٢٧٨) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيْسَ الشَّدِيدُ بِالصُّرَعَةِ، إِنَّما الشَّدِيدُ الَّذِي يَمْلِكُ نَفْسَهُ عِنْدَ الْغَضَبِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1278. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "కుస్తీలో ఒకరిని చిత్తుచేసిన వాడు పహిల్వాను కాడు. వాస్తవానికి కోపం వచ్చినప్పుడు తన్ను తాను నిగ్రహించుకున్నవాడే సిసలైన పహిల్వాను." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ప్రత్యర్థినీ, శిక్షార్హుడైన శత్రువును క్షమించటం, ఉపేక్షించటం ఎంత గొప్పతనమో ఈ హదీసులో చెప్పబడింది. ఎదుటివానిపై చర్య తీసుకోదగ్గ శక్తి, అధికారం ఉండి కూడా సంయమనం పాటించాలనీ, ప్రతీకారం తీర్చుకునే బదులు వీలయినంత వరకు ఏదన్నా మేలు చేసి వదలిపెట్టాలని ప్రబోధించబడింది. మనోవాంఛలకు వ్యతిరేకంగా పోరాడుతూ, వాటికి కళ్ళెం బిగించిన గొప్పవారు మాత్రమే ఈ రకమైన ఉదాత్త వైఖరిని అవలంబించగలుగుతారు. ఎందుకంటే మనసు సతతం కసి తీర్చుకోమనే అంటుంది. మనసుకు వ్యతిరేకంగా జరిపే పోరాటం శత్రువుకు వ్యతిరేకంగా సాగించే పోరాటంకన్నా తీవ్రమయినది. అందుకే కోపావేశంలో ఓర్చుకోవటం, కోపాన్ని దిగమ్రింగటం సాహసానికి, శౌర్యానికి ప్రతిరూపమని మహనీయ ముహమ్మద్ (స) వారు సెలవిచ్చారు.

(١٢٧٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الظُّلْمُ ظُلُمَاتٌ يَوْمَ الْقِيَامَةِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1279. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ప్రళయదినాన 'అన్యాయం' అనేక అంధకారాలకు, కారుచీకట్లకు హేతువు అవుతుంది." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

హదీసులో 'జులుం' అనే పదం వాడబడింది. జులుం అంటే అన్యాయం అనీ, వేరొకరి హక్కును కొల్లగొట్టడమనీ అర్థం. ఈ దౌర్జన్యానికి పాల్పడినవాడు ప్రళయదినాన గాఢాంధ కారాల్లో తచ్చాడుతూ, అలుముకున్న చీకట్లలో అలమటిస్తూ ఉంటాడని హదీసు

హెచ్చరిస్తోంది. జులుం అనేక రకాలు. ఈ జులుం ఒకరి ప్రాణం పట్ల జరిగినా, ధనం పట్ల జరిగినా, దేవుని హక్కుల విషయంలో జులుం జరిగినా, దాసుల హక్కుల విషయంలో జులుం జరిగినా మొత్తానికి జులుం జులుమే. అది ముమ్మాటికీ నిషిద్ధమే (హరామే).

(١٢٨٠) وَعَنْ جَابِرٍ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اِتَّقُوا الظُّلْمَ، فَإِنَّ الظُّلْمَ ظُلُمَاتٌ يَوْمَ الْقِيَامَةِ. وَاتَّقُوا الشُّحَّ فَإِنَّهُ أَهْلَكَ مَنْ كَانَ قَبْلَكُمْ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1280. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: అన్యాయానికి దూరంగా ఉండండి. ఎందుకంటే అన్యాయం ప్రళయదినాన తమస్సుకు, చిమ్మచీకట్లకు కారణభూత మవుతుంది. ఇంకా, పిసినారితనం నుండి మిమ్మల్ని కాపాడుకోండి. మీకు పూర్వం గతించినవారు దీని (పిసినిగొట్టు తనం) మూలంగానే నాశనమయ్యారు." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో అన్యాయంతో పాటు, పీనాసితనం పట్ల అప్రమత్తంగా ఉండాలని తాకీదు చేయబడింది. 'అన్యాయం' తీర్పుదినాన అన్యాయస్థుడైన మనిషి పాలిట అంధకారబంధురంగా పరిణమిస్తుంది. అతనికి వెల్తురు, కాంతి కావలసిన తరుణంలో దట్టమైన చీకట్లు అతన్ని అలుముకుంటాయి.

పిసినారితనం కూడా ఒక దుర్గుణమే. పేరాశకు లోనైనవాడు, పిసినిగొట్టుగా తయారైన వాడు సమాజానికి మేలు చేకూర్చకపోగా, సమాజంలో అత్యంత హీనుడుగా భావించబడతాడు. పిసినారితనం నిత్యం మనస్పర్థలకు, కాఠిన్యానికి కారణభూతమవుతుంది. దుష్పరిణామాలకు దారితీస్తుంది.

(١٢٨١) وَعَنْ مَحْمُودِ بْنِ لَبِيْدٍ رَضِيَ اللّٰهُ تَعَالٰى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ أَخْوَفَ مَا أَخَافُ عَلَيْكُمُ الشِّرْكُ الأَصْغَرُ: الرِّيَاءُ». أَخْرَجَهُ أَحْمَدُ بِإِسْنَادٍ حَسَنٍ.

1281. హజ్రత్ మహ్మూద్ బిన్ లబీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "మీ గురించి అన్నింటి కన్నా ఎక్కువగా నేను చిన్న షిర్క్ (షిర్కె అస్గర్) - అంటే ప్రదర్శనాబుద్ధి విషయంలో భయపడుతున్నాను." (ఇమామ్ అహ్మద్ దీనిని 'హసన్' పరంపర నుండి సేకరించారు)

**సారాంశం**

ప్రదర్శనాబుద్ధి అనేది మనిషి మాటల్లోనూ, చేతల్లోనూ కూడా ఉంటుంది. మనిషి ఏదైనా మంచి పనిచేసి దాని ద్వారా దైవేతరుల మెప్పు పొందగోరటమే ప్రదర్శనాబుద్ధి. ఈ ప్రదర్శనాబుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. మనిషి తాను చేసిన గొప్ప పనిని ఎవరూ చూడక పోతే దాని గురించి నలుగురికీ చెప్పకుంటూ లేక చూపించుకుంటూ తిరగటం ఒక రకం. ప్రతి పనినీ నలుగురికీ చూపిస్తూ చేయటం రెండవ రకం. ఇవి రెండూ సమ్మతం కావు. అల్లాహ్ మరియు ప్రవక్త ఈ ప్రదర్శనా భావాన్ని ఈసడించుకున్నారు. దీన్ని కపటత్వానికి నిదర్శనంగా కూడా ఖరారు చేశారు. ప్రదర్శనాబుద్ధితో కూడిన ఏ పుణ్యకార్యమూ దైవ సమక్షంలో స్వీకరించబడదు. కాబట్టి అన్ని విధాలా - శాయశక్తులా - దీనికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి.

(١٢٨٢) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «آيَةُ الْمُنَافِقِ ثَلَاثٌ، إِذَا حَدَّثَ كَذَبَ، وَإِذَا وَعَدَ أَخْلَفَ، وَإِذَا اؤْتُمِنَ خَانَ». مُتَّفَقٌ عَلَيْهِ. وَلَهُمَا مِنْ حَدِيثِ عَبْدِاللهِ بْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا: «وَإِذَا خَاصَمَ فَجَرَ».

1282. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: **ఒక వ్యక్తి కపటి అవడానికి మూడు ఆనవాళ్ళు ఉంటాయి - మాట్లాడినపుడు** అతడు అబద్ధం చెబుతాడు. వాగ్దానం చేస్తే దాన్ని భంగపరుస్తాడు. అతని దగ్గర ఏదన్నా అప్పగింత(అమానతు)గా పెడితే అందులో ద్రోహానికి పాల్పడతాడు (బుఖారీ, ముస్లిం). బుఖారీ, ముస్లింలలోనే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనంలో ఇలా వుంది: "పోట్లాటకు దిగినపుడు తిట్ల పురాణం మొదలెడతాడు."

**సారాంశం**

ఈ హదీసులో 'కపటి' యొక్క నాలుగు గుర్తులు సూచించబడ్డాయి. "వాడు నమాజ్ చేసినప్పటికీ, ఉపవాసాలు పాటించినప్పటికీ తాను ముస్లింనని అతను ప్రకటించుకున్నప్పటికీ" (ఈ లోపాలు మాత్రం అతనిలో ఉంటాయి) అని 'ముస్లిం'లో అదనంగా ఉంది. ఇమామ్ నవవీ (రహ్మ్) ఈ సందర్భంగా ఇలా అంటున్నారు - "చాలామంది పరిశోధకులైన విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఈ అవలక్షణాలు కపటులలో ఉండేది నిజమే. కాని ఒక నికార్సయిన విశ్వాసిలో కూడా ఈ అవలక్షణాలు జనిస్తే అతను కూడా 'కపటిలాంటివాడు' గానే భావించబడతాడు. అంటే అతని స్వభావాన్నిబట్టి ఆ పదం అతని కోసం ప్రయోగించబడుతుంది.

(١٢٨٣) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «سِبَابُ الْمُسْلِمِ فُسُوقٌ، وَقِتَالُهُ كُفْرٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

1283. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు- ముస్లింను దూషించటం మహా పాపం. ఇక అతన్ని చంపటం అంటే అది అవిశ్వాసానికి, దైవధిక్కరణకు ప్రతీకే."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

హదీసులో 'ఫిస్ఖ్' అనే పదం ప్రయోగించబడింది. సాటి ముస్లింను దూషించినవాడు 'ఫాసిఖ్' అవుతాడు. అంటే దైవవిధేయతా పరిమితిని దాటిపోయినవాడు, హద్దులను అతిక్రమించినవాడన్న మాట! హద్దులను అతిక్రమించినవాడు పాపాత్ముడు, అపరాధి అవుతాడు.

ఇక 'ముస్లిం'ను చంపటం అంటే విశ్వాసాన్ని (ఈమాన్‌ను) త్రోసిరాజనటమే. అకారణంగా ఎవరయినా సాటి ముస్లింను చంపడాన్ని తన కొరకు ధర్మసమ్మతం గావించుకుంటే అతడు ఇస్లాంతో తాను ఏకీభవించటం లేదని క్రియాత్మకంగా రుజువు చేస్తున్నాడు. కనుక అతని ఈ చేష్ట 'కుఫ్ర్' క్రిందికి వస్తుంది.

సహీహ్ ముస్లింలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "నా అనుచర సమాజ సభ్యులందరూ క్షేమంగా, నిక్షేపంగా ఉండదగ్గవారే. అయితే బహిరంగంగా, నిస్సంకోచంగా పాపాలకు ఒడిగట్టేవారు మాత్రం దీనికి అర్హులు కారు."పాపాత్మునికి పాపకార్యాలను గురించి జాగరూకపరచటం గురించి పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. తబ్రానీలో 'హసన్' పరంపర ద్వారా సేకరించబడిన ఒక హదీసులో దైవప్రవక్త (స) ఈ విధంగా సెలవిచ్చారు: "మీరు ఎప్పటి వరకు పాపాత్ముని ఘోరకృత్యాలను చెప్పకుండా ఉంటారు? అతని బండారం బయటపెట్టి తగిన శాస్తి జరిగేలా చూడండి." ఈ హదీసు వెలుగులో దుర్మార్గుని దౌష్ట్యం నుండి ప్రజలు సురక్షితంగా ఉండగలిగేందుకు అతని దుర్మార్గాలను ఎండగడితే అది ముమ్మాటికీ ధర్మసమ్మతమే.

(١٢٨٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِيَّاكُمْ وَالظَّنَّ، فَإِنَّ الظَّنَّ أَكْذَبُ الْحَدِيثِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1284. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తాకీదు చేశారు: "దురనుమానానికి దూరంగా ఉండండి. ఎందుకంటే దురనుమానం చాలా పెద్ద అబద్ధంగా పరిగణించబడుతుంది."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

దురనుమానం ఒక పెద్ద అసత్య విషయంగా పరిగణించబడటానికి కారణం ఏమిటంటే మనిషి తనలో తానే దాన్ని పెంచి పోషించుకుంటూ పోతాడు. ఆఖరికి అసలేమీ లేని దాన్ని గురించి ఏదో ఒక సందర్భంగా నోటితో చెప్పేస్తాడు. అందుకే విద్వాంసులు దీన్ని అభాండంగా, అపనిందగా ఖరారు చేశారు. ఒకరిపై అపనింద మోపటం నిషిద్ధం కదా!

దీని ద్వారా తేటతెల్లమయిందేమిటంటే దురనుమానం అపనిందకు ఆనవాలు. అపనింద మహాపరాధం. పశ్చాత్తాపం చెందనిదే ఇది క్షమార్హం కాజాలదు. అందుకే వీలయినంత వరకు దీనికి దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే దురనుమానాలు, సంకోచాలు పుట్టిపెరిగే సమాజంలో సదనుమానం, సద్భావన అనేవి నిలదొక్కుకోలేవు. అలాంటి సమాజంలోని సభ్యుల మధ్య పరస్పర నమ్మకం, పరస్పర సహకార భావాల వాతావరణం కూడా ఏర్పడదు. ఒండొకరిని అడుగడుగునా శంకిస్తూ ఉంటారు. ఇది సమాజ అభ్యున్నతికి, వికాసానికి శుభ సూచకం కాదు సరికదా పతనానికి, అధోగతికి ఆనవాలు అవుతుంది. సత్సమాజ రూపకల్పనకు ఉపక్రమించినపుడు దురనుమానపు సూక్ష్మక్రిములను ఎప్పటికప్పుడు సంహరించటం అవసరం.

(١٢٨٥) وَعَنْ مَعْقِلِ بْنِ يَسَارٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَا مِنْ عَبْدٍ يَسْتَرْعِيهِ اللَّهُ رَعِيَّةً يَمُوتُ يَوْمَ يَمُوتُ وَهُوَ غَاشٌّ لِرَعِيَّتِهِ إِلاَّ حَرَّمَ اللَّهُ عَلَيْهِ الْجَنَّةَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1285. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధిస్తుండగా తాను విన్నానని హజ్రత్ మాఖిల్ బిన్ యసార్ (రజి) తెలిపారు: ఏ దాసుణ్ణి అయితే పరిపాలకునిగా చేసి ప్రజలను అతనికి అప్పగించటం జరుగుతుందో, అతను గనక ప్రజల మధ్య న్యాయం చేయని స్థితిలో, బాధ్యతను మరచిన స్థితిలో మరణిస్తే అటువంటి పరిపాలకుని కోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం గావిస్తాడు.'' (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పరిపాలకుడైనవాడు ప్రజల కష్టసుఖాలను పట్టించుకుంటూ సకాలంలో వారి సమస్యలను పరిష్కరించాలి. ప్రజల యెడల దయాభావం కలిగి ఉండాలి. ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి. ఒకరికి న్యాయం చేసి, వేరొకరి పట్ల పక్షపాత వైఖరి కనబరచకూడదు. మృదుత్వం, మన్నింపుల ధోరణిని అవలంబించాలి. ప్రజలపై చీటికీ మాటికీ పన్నుల భారం మోపి వారిని కష్టాలపాలు చెయ్యకూడదు. సాధ్యమైనంత వరకు వారికి వెసులుబాటు కల్పించాలి. వారి మానమర్యా

దలను మంట గలిపే చర్యలు తీసుకోరాదు. దొంగతనాలు, దోపిడీల నుండి, ఉగ్రవాదుల నుండి, కల్లోల జనకుల బారినుండి జన సామాన్యానికి రక్షణ కల్పించాలి.

దీనికి బదులు ఎంతసేపటికీ ప్రజలపై సుంకాలను వడ్డించి, ప్రజల రక్తాన్ని జలగలా పీల్చే ప్రయత్నం చేసే పరిపాలకులకు హదీసులో తీవ్రమయిన హెచ్చరిక చేయబడింది. ఇలాంటి బాధ్యతా రాహిత్యమైన, కఠిన హృదయులైన పరిపాలకులకు దేవుడు స్వర్గంలో చోటు కల్పించడు. ప్రజలను మోసం చేయటం చాలా పెద్ద పాపమని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. కాబట్టి స్వర్గంలో తమకు చోటు లభించాలని కోరుకునే పరిపాలకులు, నాయకులు ఇటువంటి చేష్టలకు దూరంగా ఉండాలి.

(١٢٨٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْها قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اللَّهُمَّ: مَنْ وَلِيَ مِنْ أَمْرِ أُمَّتِي شَيْئاً فَشَقَّ عَلَيْهِمْ فَاشْقُقْ عَلَيْهِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1286. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు - ''ఓ దేవా! నా అనుచర సమాజంలో ఎవరయినా, ఏదైనా కార్య నిర్వాహకునిగా నియుక్తుడై, అతడు జనులను కష్టాల పాల్జేస్తే నువ్వు అతన్ని ఇక్కట్లకు లోను చెయ్యి.'' (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో దుర్మార్గులైన పరిపాలకులను మహాప్రవక్త (సఅసం) శపించారు. దైవప్రవక్త ఎవరిసయినా శపిస్తే అది వృధాపోదన్న సంగతి గమనార్హం. అందుకే అధికార పగ్గాలు చేపట్టిన వారు నిత్యం ప్రజల యెడల మృదుత్వంతో మెలగాలి. పట్టువిడుపుల వైఖరిని అవలంబించాలి. దేవుడు తనను ప్రేమించాలనీ, తన యెడల దయాభావంతో మెలగాలనే గనక అతడు కోరుకుంటున్నట్లయితే అతడు తన పాలిత ప్రజల పట్ల కూడా దయాదాక్షిణ్యాల వైఖరినే అనుసరించాలి. కాఠిన్యానికి, అణచివేత విధానానికి స్వస్తి చెప్పాలి.

(١٢٨٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا قَاتَلَ أَحَدُكُمْ فَلْيَجْتَنِبِ الْوَجْهَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1287. దైవప్రవక్త (సఅసం) ప్రబోధించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు : ''మీలో ఎవరయినా కొట్లాటకు దిగితే మొహంపై కొట్టకుండా జాగ్రత్తపడాలి సుమా!''

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అసలు ఒకరిని కొట్టడం, దెబ్బలాడటమే తగని పని. ఒకవేళ మాటామాటా పెరిగి

ఎప్పుడయినా పరస్పరం తలపడే అవాంఛనీయ స్థితి ఏర్పడినా అట్టి పరిస్థితిలో మొహంపై కొట్టకుండా జాగ్రత్తపడాలని హదీసులో చెప్పబడటం ఆలోచించదగ్గ విషయం. ఎదుటివాడు మనల్ని రెచ్చగొట్టే మాట ఏదన్నా అన్నప్పుడు మనం మొట్టమొదట చేసేది కూడా అదే - ఎదుటివాని చెంప ఛెళ్ళుమనిపించటం! కాని ముఖారవిందం ఎంతో గౌరవప్రదమైనదనీ, ఆగ్రహావేశంలో సయితం దాని జోలికి పోరాదని ఈ హదీసు నొక్కి చెబుతోంది. దీనిప్రకారం ముఖంపై కొట్టడం హరామ్ (నిషిద్ధం). ఆఖరికి జంతువుల మొహంపై సయితం కొట్టకూడదు.

(١٢٨٨) وَعَنْهُ، أَنَّ رَجُلاً قَالَ: يَا رَسُولَ اللهِ! أَوْصِنِي. قَالَ: «لاَ تَغْضَبْ». فَرَدَّدَ مِرَاراً، وَقَالَ: «لاَ تَغْضَبْ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1288. హజ్రత్ అబూహురైరా (రజి) గారిదే మరో కథనం : 'నాకేదన్నా ఉపదేశించండి' అని ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం)కు విన్నవించుకున్నాడు. "కోపగించుకోకు!" అని ఆయన (సఅసం) ఉపదేశించారు. (అతడు అడిగిన) ప్రతిసారీ ఆయన (సఅసం) "కోపగించుకోకు" అనే బదులిచ్చారు." (బుఖారీ)

**సారాంశం**

ఈ హదీసులో కోపానికి, ఆగ్రహావేశాలకు దూరంగా ఉండమని తాకీదు చేయబడింది. మానవుడు కోపంలోనే ఎన్నో అన్యాయాలకు, అక్రమాలకు ఒడిగడతాడు. ఆ తరువాత చేసిన దానిపై సిగ్గుతో కుమిలిపోతుంటాడు. ఈ నేపథ్యంలో అల్లామా ఇబ్నె తీన్ ఇలా అంటున్నారు: ఈ హదీసులో ఇహపరాల మేళ్ళు పొందుపరచబడ్డాయి. ఎందుకంటే కోపావస్థలో మనిషిలో వాత్సల్యం, ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు మటుమాయమైపోతాయి. కోపం ఎప్పటికీ మనిషిని తెగత్రెంపుల వైపునకే తీసుకుపోతుంది. కోపంలో అతడు ఎదుటి వ్యక్తిపై కక్షసాధింపుకే ప్రయత్నిస్తాడు. ఇది ఇహపరాలలో మనిషి వైఫల్యానికి, వినాశానికి హేతువు అవుతుంది. ఈ కోపాన్నే గనక విడనాడితే మనిషి ప్రపంచంలోనూ, పరలోకంలోనూ సాఫల్యం పొందే సకారాత్మక పనుల వైపునకు మరలుతాడు.

అల్లామా ఖత్తాబీ (రహ్మలై) ఇలా అంటున్నారు - కోపానికి దూరంగా ఉండటమంటే అర్థం కోపానికి కారణభూతమయ్యే అంశాలకు దూరమవటమే. ఎందుకంటే కోపమన్నది స్వాభావికమైనది. దానికి కారణభూతమైన వాటిలో అహంకారం కూడా ఒకటి. పై హదీసులో దైవప్రవక్త (సఅసం), తన వద్దకు వచ్చిన వ్యక్తి స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని అతనికి 'కోపగించుకోకు' అన్న ఉపదేశం చేశారు. ఎందుకంటే ఆ వ్యక్తి ముక్కోపి. చీటికీ మాటికీ రుసరుసలాడేవాడు. ఆ వ్యక్తి పేరు సుఫియాన్ బిన్ అబ్దుల్లా సఖఫీ అని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. దైవప్రవక్త (స)ను ఉపదేశించమని కోరిన వ్యక్తి స్త్రీ అనీ, ఆమె పేరు జారియ బిన్తె ఖుదామా అని ముస్నదె ఇమామ్ అహ్మద్‌లో ఉంది.

(١٢٨٩) وَعَنْ خَوْلَةَ ٱلْأَنْصَارِيَّةِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ رِجَالاً يَتَخَوَّضُونَ فِي مَالِ اللهِ بِغَيْرِ حَقٍّ، فَلَهُمُ النَّارُ يَوْمَ الْقِيَامَةِ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1289. హజ్రత్ ఖౌల అన్సారియా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు : "కొంతమంది దేవుని సొత్తులో అన్యాయంగా జోక్యం చేసుకుంటూ ఉంటారు. ప్రళయదినాన ఇలాంటి వారి కోసం నరకాగ్ని ఉంది."

(బుఖారీ)

## సారాంశం

అన్యాయంగా అల్లాహ్ సొమ్మును కబళించేవారు నరకాగ్నికి ఆహుతి అవుతారని ఈ హదీసులో హెచ్చరించబడింది. అల్లాహ్ సొమ్ము అంటే ఏమిటీ? అల్లాహ్ సొమ్ములో 'బైతుల్మాల్'తో పాటు 'సదకాలు' కూడా వస్తాయి. ఉద్యోగిగా పనిచేసే వ్యక్తి బైతుల్మాల్ సొమ్మునుండి తన జరుగుబాటుకు కావలసినంత తీసుకోవటంలో తప్పులేదు. అంతకుమించి ఆ సొమ్మును తీసుకోవటం, ఆ సొమ్ముకు యజమాని అయి కూర్చోవటం, ఆ సొమ్మును ఇతర పద్దులకు కేటాయించటం మాత్రం ధర్మసమ్మతం కాదు. ఆ బైతుల్మాల్ వ్యవస్థకు అధిపతిగా ఉండే వ్యక్తిపై దాని సంరక్షణా బాధ్యత కూడా ఉండటం చేత అతడు సముచిత మైన రీతిలోనే అందులో నుంచి కొంత వినియోగించుకోవాలి. దుబారా ఖర్చు చెయ్యటంగానీ, పరిమితిని మించిన సొమ్మును అందులోనుంచి తీసుకోవటంగానీ చేస్తే అది అధర్మం అవుతుంది. దీని పర్యవసానం నరకాగ్నియే.

## హదీసు ఉల్లేఖకులు

ఖౌలా (ర.అన్హా) : ఖౌలా బిన్తె సామిర్. అన్సారియా. ఈమె అసలు ఖైస్ బిన్ ఫహద్ కుమార్తెయనీ, ఆయన బిరుదు సామిర్ అనీ ఇబ్నె అబ్దుల్ బర్ర్ ఉవాచ. ఈమె తొలుత హమ్జా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (రజి) సహధర్మచారిణిగా ఉన్నారు. ఉహుద్ యుద్ధంలో హజ్రత్ హమ్జా (రజి) వీరమరణం పొందిన సంగతి విదితమే. అనంతరం ఈమె నూమాన్ బిన్ అజ్లాన్ అన్సారీ జురఖీ (రజి)ని వివాహమాడారు.

(١٢٩٠) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ، فِيمَا يَرْوِيهِ عَنْ رَبِّهِ، قَالَ: «يَا عِبَادِي! إِنِّي حَرَّمْتُ الظُّلْمَ عَلَى نَفْسِي،

1290. దేవుడు తనకు తెలియజేసిన విషయాలను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరించినట్లు హజ్రత్ అబూజర్ (రజి) చెప్పారు - దేవుడు ఇలా సెలవిచ్చాడు: "ఓ నా దాసులారా! నేను అన్యాయాన్ని నా తరపునుండి నిషేధిం

وَجَعَلْتُهُ بَيْنَكُمْ مُحَرَّماً، فَلاَ تَظَالَمُوا». أَخْرَجَهُ مُسْلِمٌ.

చుకున్నాను. మీ మధ్య కూడా నిషేధించాను. కనుక మీరు ఒండొకరిపై అన్యాయానికి ఒడిగట్టకండి." (ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసు 'హదీసె ఖుదసీ' అనబడుతుంది. ఏ హదీసులోనయితే ప్రత్యక్షంగా సర్వోన్నతుడైన దేవుని పలుకులుంటాయో దాన్ని హదీసె ఖుదసీ అంటారు. ఈ హదీసు ప్రకారం అన్యాయస్థుడైన (దుర్మార్గుడైన) వాని కోసం ఎటువంటి రాయితీ లేక మినహాయింపు లేదు. నేను మీకు అన్యాయం చేయనప్పుడు మీరు కూడా పరస్పరం అన్యాయం చేయకండి అని దేవుడు చెప్పటాన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే 'అన్యాయం' అనేది మాచెర్ల చేష్ట. అన్యాయస్థుడికి ఇహలోకమూ పరలోకమూ లభించదు. అతడు ఎప్పటికీ నష్టంలోనే ఉంటాడు అని చెప్పబడింది.

(١٢٩١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ قَالَ: «أَتَدْرُونَ مَا الْغِيبَةُ؟» قَالُوا: اَللَّهُ وَرَسُولُهُ أَعْلَمُ. قَالَ: «ذِكْرُكَ أَخَاكَ بِمَا يَكْرَهُ». قَالَ: أَفَرَأَيْتَ إِنْ كَانَ فِي أَخِي مَا أَقُولُ؟ قَالَ: «إِنْ كَانَ فِيهِ مَا تَقُولُ فَقَدِ اغْتَبْتَهُ، وَإِنْ لَمْ يَكُنْ فِيهِ فَقَدْ بَهَتَّهُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1291. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: "పరోక్షనింద అంటే ఏమిటో మీకు తెలుసా?" అని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రశ్నించగా, 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని అక్కడున్న సహచరులు జవాబు ఇచ్చారు. అప్పుడు ఆయన (సఅసం) ఇలా వివరించారు- "నీవు ఎప్పుడయినా నీ సోదరుని గురించి చెడు ప్రస్తావన తీసుకువస్తే అది పరోక్ష నింద అవుతుంది." 'నేను ప్రస్తావించే విషయమే ఒకవేళ నా సోదరునిలో ఉంటేనూ?!' అని అక్కడున్నవారిలో ఒకరు సందేహపడగా, దానికి ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు: "నీవు నీ సోదరుని గురించి చెప్పేవన్నీ నిజంగానే అతనిలో ఉంటే నువ్వు అతని గురించి పరోక్షంగా నిందించినట్లు లెక్క. ఒకవేళ అతనిలో లేని విషయాన్ని గనక నువ్వు పరోక్షంలో చెబితే అది అపనింద అవుతుంది." (ముస్లిం)

**సారాంశం**

పరోక్ష నింద వేయటం లేక చాడీలు చెప్పటం అనేది ఎంతో హేయమైన పని. ఇది హరామ్ (నిషిద్ధం) అన్న విషయంలో ఏకాభిప్రాయముంది. పైగా ఇది పెద్ద పాపాల కోవకు చెందినది. పరోక్ష నిందకు పాల్పడటమంటే మృత సోదరుని మాంసం తినటమేనని ఖుర్ఆన్ వర్ణించింది. ఎందుకంటే పరోక్షంగా[1] నిందించేవాడు తన (ముస్లిం) సోదరుడు అక్కడ లేకపోవటం చూసి అతని మానమర్యాదలపై, పరువు ప్రతిష్ఠలపై దాడి చేస్తాడు.

(١٢٩٢) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَحَاسَدُوا، وَلاَ تَنَاجَشُوا، وَلاَ تَبَاغَضُوا، وَلاَ تَدَابَرُوا. وَلاَ يَبِعْ بَعْضُكُمْ عَلَى بيعِ بَعْضٍ، وَكُونُوا عِبَادَ اللهِ إِخْوَاناً، الْمُسْلِمُ أَخُو الْمُسْلِمِ، لاَ يَظْلِمُهُ وَلاَ يَخْذُلُهُ، وَلاَ يَحْقِرُهُ، التَّقْوَى هَهُنَا»، وَيُشِيرُ إِلَى صَدْرِهِ، ثَلاَثَ مَرَّاتٍ، «بِحَسْبِ امْرِىءٍ مِنَ الشَّرِّ أَنْ يَحْقِرَ أَخَاهُ الْمُسْلِمَ، كُلُّ الْمُسْلِمِ عَلَى الْمُسْلِمِ حَرَامٌ دَمُهُ وَمَالُهُ وَعِرْضُهُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1292. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఒండొకరిపై అసూయ చెందకండి. ధరలను పెంచకండి. ఒకరు ఇంకొకరి యెడల విముఖులై ఉండకండి. పరస్పరం వీపు వెనుక చాడీలు చెప్పకండి. ఒకరు ఒక వ్యవహారం చేసిన తరువాత మరొకరు దానిపై వ్యవహారం చేయకండి. దైవదాసులారా! పరస్పరం అన్న దమ్ములుగా మెలగండి. ముస్లిం ముస్లింకు సోదరుడు. అతడు సాటి సోదరునికి అన్యాయం చేయటంగానీ, అతన్ని నిస్సహాయస్థితిలో వదలి వేయటంగానీ చేయడు. అతన్ని అల్పునిగా కూడా భావించడు." తన ఎద వైపునకు ఆయన (స) మూడుసార్లు సంజ్ఞ చేస్తూ ఇలా పలికారు: "తఖ్వా (దైవభీతి, దైవభక్తి) ఇక్కడుంది. ఒక మనిషి పాపం చేశాడనటానికి అతడు తన ముస్లిం సోదరుణ్ణి అల్పునిగా భావించటం ఒక్కటి చాలు. ప్రతి ముస్లింపై సాటి ముస్లిం యొక్క రక్తం, ధనం, మర్యాద హరామ్ గావించ బడింది (నిషేధించబడింది)." (ముస్లిం)

**సారాంశం**

ఒక సత్సమాజంలోని సభ్యులు పరస్పరం ఎలా మెలగాలో, ఏ ఏ చెడుగులకు దూరంగా మసలుకోవాలో ఈ హదీసులో సమగ్రంగా చెప్పబడింది. సత్కర్మలను కాల్చి భస్మీపటలం చేసివేసే అసూయకు, ఈర్ష్యకు దూరంగా ఉండాలని ప్రత్యేకంగా తాకీదు చేయటం జరిగింది. ఆర్థికంగా కూడా న్యాయసమ్మతమైన రీతిలో మసలుకోవాలనీ, కేవలం ఒక ఆసామీని బాగుచేసే లక్ష్యంతో ధరలను విపరీతంగా పెంచరాదనీ, ఎందుకంటే కొనుగోలుదారు కూడా అతని సోదరుడేనన్న సంగతిని దృష్టిలోఉంచుకుని సముచితమైన పద్ధతిని అవలంబించాలని నొక్కి వక్కాణించబడింది.

ఓర్వలేనితనం, వైముఖ్య ధోరణి ఏ సమాజానికీ మంచిది కాదనీ, దీనిమూలంగా పరస్పర ప్రేమైక భావాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయనీ హెచ్చరించబడింది. ఒండొకరికి కీడు తలపెట్టకుండా జాగ్రత్త వహించాలనీ, పరస్పరం అన్నదమ్ములా మెలగవలెననీ ఉపదేశించ బడింది. వీపు వెనుక తమ సోదరుల చాడీలు చెప్పుకుంటూ తిరగటం, కూపీలు లాగటం మంచి లక్షణాలు కావనీ, తోటి సోదరుణ్ణి ఎట్టి పరిస్థితిలోనూ చిన్నచూపు చూడరాదనీ, ఒకరిని అల్పునిగా భావించటమనేది అహంకారానికి ఆనవాలనీ, ఇదొక భయంకరమైన రుగ్మత అనీ స్పష్టం చేయబడింది. ఒక ముస్లిం మరో ముస్లింకు సోదరుడు. అతడు ధనికుడైనా - బీదవాడైనా, చిన్నవాడైనా - పెద్దవాడైనా, అతని ధన మాన ప్రాణాలు ఎంతో గౌరవప్రదమైనవి. అకారణంగా ఎవరూ వాటి జోలికి పోకూడదు. ఇంకొకరి మానమర్యాదలతో, ధన ప్రాణాలతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదు.

(١٢٩٣) وَعَنْ قُطْبَةَ بْنِ مَالِكٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ: «**اللَّهُمَّ جَنِّبْنِي مُنْكَرَاتِ الأَخْلاَقِ، وَالأَعْمَالِ، وَالأَهْوَاءِ، وَالأَدْوَاءِ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَاللَّفْظُ لَهُ.

1293. హజ్రత్ ఖుత్బా బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరచూ ఈ విధంగా వేడుకుంటూ ఉండేవారు - "ఓ దేవా! నన్ను దుర్గుణాల నుంచీ, దుష్ట కోర్కెల నుంచీ, దుష్ట రోగాల నుంచీ కాపాడు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించగా, హాకిమ్ ప్రామాణికమైనదని పేర్కొన్నారు. వాక్యాలు కూడా ఆయనవే).

**సారాంశం**

దైవప్రవక్త (స) నిత్యం ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండేవారు. ఎందుకంటే ఆ చెడుగుల బారినుండి కాపాడేవాడు సర్వోన్నతుడైన దేవుడు మాత్రమే. దేవుడు మనిషికి సద్బుద్ధి నొసగనంతవరకూ అతడు ఈ అవగుణాల నుంచి తన్ను రక్షించుకోజాలడు.

**హదీసు ఉల్లేఖకులు**

ఖుత్‌బా బిన్ మాలిక్ (రజి) : బనూ సాలబాకు చెందినవారు. బనూ సాలబా బిన్ సాద్ బిన్ జుబ్‌యాన్. కూఫా వాసి. ఈయన భ్రాతృజుడైన జియాద్ బిన్ అలాఖా ఈయన నుండి హదీసులను ఉటంకించారు.

(١٢٩٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تُمَارِ أَخَاكَ، وَلاَ تُمَازِحْهُ، وَلا تَعِدْهُ مَوْعِداً فَتُخْلِفَهُ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ بِسَنَدٍ ضَعِيفٍ.

1294. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించినట్లు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు: "మీ ముస్లిం సోదరునితో గొడవ పడకండి, అతన్ని ఎగతాళి చేయకండి, నెరవేర్చలేనటు వంటి వాగ్దానాన్ని కూడా అతనికి చేయ కండి." (ఈ హదీసును తిర్మిజీ బలహీన పరంపర ద్వారా ఉల్లేఖించారు)

(١٢٩٥) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**خَصْلَتَانِ لاَ تَجْتَمِعَانِ فِي مُؤْمِنٍ: الْبُخْلُ وَسُوءُ الْخُلُقِ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَفِي سَنَدِهِ ضَعْفٌ.

1295. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచిం చారు: "రెండు గుణాలు ఒక విశ్వాసి (మోమిన్)లో ఇమిడి ఉండలేవు - ఒకటి: పిసినారితనం. రెండు: చెడు నడత." (దీనిని తిర్మిజీ సేకరించారు - దీని పరంపరలో బలహీనత ఉంది)

**సారాంశం**

ఒక విశ్వాసి ఏకకాలంలో పూర్తిగా చెడునడత గలవాడై, మరీ పిసినిగొట్టు అయి ఉండడని ఈ హదీసు చెబుతోంది. ఈమాన్ (విశ్వాసం) అనేది మనిషిలో సద్గుణాన్ని సృజిస్తుంది. ఒండొకరి శ్రేయాన్ని అభిలషించేలా మనుషులను మలుస్తుంది. మరలాంటప్పుడు ఒక వ్యక్తిలో ఒకే సమయంలో ఈ రెండు లోపాలు పొడసూపితే అతడు పరిపూర్ణ విశ్వాసి ఎలా అవుతాడు?

(١٢٩٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ:

1296. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు:

«الْمُسْتَبَّانِ مَا قَالاَ فَعَلَى الْبَادِىءِ، مَا لَمْ يَعْتَدِ الْمَظْلُومُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

"ఇద్దరు వ్యక్తులు పరస్పరం దూషణలకు దిగితే, వారిలో బాధితుడైనవాడు నిగ్రహం వహించినంతసేపూ దూషణను ప్రారంభించిన వానిపైనే ఆ పాపభారం పడుతుంది." (ముస్లిం)

(١٢٩٧) وَعَنْ أَبِي صِرْمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ ضَارَّ مُسْلِماً ضَارَّهُ اللَّهُ، وَمَنْ شَاقَّ مُسْلِماً شَاقَّ اللَّهُ عَلَيْهِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

1297. హజ్రత్ అబూ సిర్మా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఎవరయినా ఏ ముస్లింనయినా పీడిస్తే అల్లాహ్ అతన్ని పీడనకు గురిచేస్తాడు. మరెవరయినా ఏ ముస్లింనయినా ఇక్కట్ల పాల్జేస్తే అల్లాహ్ అతన్ని కష్టాల్లో పడవేస్తాడు." (ఈ హదీసును అబూ దావూద్, తిర్మిజీలు ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని స్పష్టమయిన కోవకు చెందిన హదీసుగా ఖరారు చేశారు)

### సారాంశం

ఈ హదీసులో తోటి ముస్లింను వేధించరాదని, అతన్ని కష్టాలకు లోను చేయరాదని హెచ్చరించటం జరిగింది. ఎవరయినా సాటి ముస్లింపై దౌర్జన్యానికి దిగితే, అకారణంగా అతనితో దెబ్బలాటకు దిగితే దేవుని దృష్టిలో అది చాలా తీవ్రమయిన విషయంగా పరిగణించబడుతుంది. అలాంటి వారి సంగతి చూసుకోవడానికి అల్లాహ్ ఒక్కడే చాలు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ సిర్మా (రజి): అసలు పేరు మాలిక్ బిన్ ఖైస్ లేదా ఖైస్ బిన్ మాలిక్. మాజిన్ తెగకు చెందినవారు. బద్ర్ తదితర యుద్ధాలలో పాల్గొన్నారు. ఈయన ద్వారా కొన్ని హదీసులు ఉల్లేఖించబడ్డాయి.

(١٢٩٨) وَعَنْ أَبِي الدَّرْدَاءِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللَّهَ

1298. హజ్రత్ అబూ అద్దర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు:

يَبْغَضُ الْفَاحِشَ الْبَذِيءَ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

"అల్లాహ్ దురలవాట్లు గలవాణ్ణి, నీతి బాహ్యమైన మాటలు పలికేవాణ్ణి అసహ్యించుకుంటాడు." (ఈ హదీసును తిర్మిజీ ప్రామాణికమైన పరంపర ద్వారా ఉల్లేఖించారు)

(١٢٩٩) وَلَهُ مِنْ حَدِيثِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ - رَفَعَهُ -: «لَيْسَ الْمُؤْمِنُ بِالطَّعَّانِ، وَلاَ اللَّعَّانِ، وَلاَ الْفَاحِشِ، وَلاَ الْبَذِيءِ». وَحَسَّنَهُ، وَصَحَّحَهُ الْحَاكِمُ، وَرَجَّحَ الدَّارَقُطْنِيُّ وَقْفَهُ.

1299. ఈయన (అబూ అద్దర్దా) గారే హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) నుండి చేసిన ఒక 'మర్ఫూ' ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది : "విశ్వాసి అయిన వాడు ఎక్కువగా ఎత్తిపొడుపు మాట లాడడు. ఎక్కువగా శాపనార్థాలు పెట్టడు. నీతిమాలిన మాటలనడు. లజ్జా విహీనుడు అయి ఉండడు." (తిర్మిజీ ఈ హదీసును'హసన్'గా ఖరారు చేశారు. హాకిమ్ మాత్రం దీనిని దృఢమైనదిగా పేర్కొన్నారు)

### సారాంశం

చెడు అనటం, చెడును అనుసరించటం, తిట్ల పురాణం మొదలెట్టడం ఒక పరిపూర్ణ విశ్వాసికి ఏ విధంగానూ శోభించదు.

### హదీసు ఉల్లేఖకులు

అబూ అద్దర్దా (రజి) : గొప్ప సహాబీలలో ఒకరు. ధర్మపరాయణులు. సాధుస్వభావులు. ఈయన అసలు పేరు ఉవైమిర్ బిన్ జైద్ లేదా ఇబ్నె ఆమిర్ లేదా ఇబ్నె మాలిక్ బిన్ అబ్దుల్లా బిన్ ఖైస్. ఖజ్రజ్ తెగవారు. బద్ర్ యుద్ధం జరిగిననాడు ఇస్లాం స్వీకరించారు. ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) మాత్రం ఈయన్ని బద్రీ సహచరులలో ఒకరుగా పరిగణించారు. దివ్య ఖుర్‌ఆన్ క్రోడీకరణలో సేవలందించారు. డెమాస్కస్‌కు ఖాజీగా నియమితులయ్యారు. ఈయన సుగుణాలను గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈయనగారి సువర్ణ సూక్తుల్లో ఒకటి ఇది : "తృటిలో సిద్ధించే కీర్తి సుదీర్ఘకాలంపాటు ఉదాసీనతకు లోనుచేస్తుంది." ఈయన హిజ్రీ 32వ సంవత్సరంలో మరణించారు.

(١٣٠٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ تَسُبُّوا

1300. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు:

الأَمْوَاتَ، فَإِنَّهُمْ قَدْ أَفْضَوْا إِلَى مَا قَدَّمُوا». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

"చనిపోయిన వారిని దూషించకండి. ఎందుకంటే (బ్రతికి ఉండగా)వారు చేసుకున్న కర్మలకు చేరుకున్నారు."

(బుఖారీ)

**సారాంశం**

చనిపోయిన వారెవరయినాసరే -వారిని నిందించటం, దూషించటం, విమర్శించటం తగదని ఈ హదీసులో తాకీదు చేయబడింది. ఎందుకంటే మృతుని దూషించటం వల్ల అతని అనుయాయుల మనసు నొచ్చుకోవచ్చు. అది పరస్పర వైరానికి, పగకు కారణభూతం కావచ్చు. అదీగాక చనిపోయినవారిని ఆడిపోసుకోవటం వల్ల ఒరిగేది ఏమీ ఉండదు. అతడెలాగూ తన ప్రభువు వద్దకు చేరుకున్నాడు. అతని వ్యవహారం ఇక మీదట ప్రభువు చేతుల్లో ఉంది. శిక్షించినా, క్షమించినా అది ఆయన ఇష్టం. మృతుణ్ణి ఒకరు దూషించినా దూషించకపోయినా అతనికి కలిగే నష్టం ఏమీ లేదు. మరి అటువంటి వారిని ఆడిపోసుకోవటం వల్ల ఒరిగేదేముందీ - ఆవేశాన్ని ఆ విధంగా చల్లార్చుకోవటం తప్ప!

(١٣٠١) وَعَنْ حُذَيْفَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لاَ يَدْخُلُ الْجَنَّةَ قَتَّاتٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

1301. హజ్రత్ హుజైఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు : "చాడీలు చెప్పేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు."

(బుఖారీ, ముస్లిం)

(١٣٠٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ كَفَّ غَضَبَهُ كَفَّ اللَّهُ عَنْهُ عَذَابَهُ». أَخْرَجَهُ الطَّبَرَانِيُّ فِي الأَوْسَطِ. وَلَهُ شَاهِدٌ مِّنْ حَدِيثِ ابْنِ عُمَرَ عِنْدَ ابْنِ أَبِي الدُّنْيَا.

1302. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు : "ఎవరయితే తన కోపాన్ని ఆపుకున్నాడో అల్లాహ్ అతన్నుండి తన శిక్షను ఆపుకుంటాడు."(దీనిని తబ్రానీ 'అల్ ఔసత్' నుండి సేకరించారు. ఇబ్నె అబూ అద్దున్యా ఉటంకించిన ఇబ్నె ఉమర్ (రజి) గారి హదీసు దీనికి సాక్ష్యంగా ఉంది)

**సారాంశం**

కోపాన్ని దిగమ్రింగటం ఎంత గొప్ప విషయమో ఈ హదీసులో వివరించబడింది. తమ

అధీనంలో వున్న, తమ చేతి క్రింద పనిచేసే వారి తప్పులను మన్నించటం, వారి తప్పిదాల వల్ల కలిగిన క్రోధాన్ని అణచుకోవటం ఔదార్యానికి ప్రతిరూపమని, ఈ ఔదార్యానికి ప్రతిగా దేవుడు కూడా కనికరిస్తాడని విదితమవుతోంది.

(١٣٠٣) وَعَنْ أَبِي بَكْرٍ الصِّدِّيقِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ يَدْخُلُ الْجَنَّةَ خَبٌّ، وَلاَ بَخِيلٌ، وَلاَ سَيِّءُ الْمَلَكَةِ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَفَرَّقَهُ حَدِيثَيْنِ، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

1303. హజ్రత్ అబూబక్ర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "దగాకోరు, పిసినారి, దుర్వర్తనుడు స్వర్గంలో ప్రవేశించడు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించారు. ఆయన దీన్ని రెండు హదీసులుగా-వేర్వేరుగా-వివరించారు. దీని పరంపరలో బలహీనత ఉంది)

**సారాంశం**

పై హదీసులో పేర్కొనబడిన మూడు అవగుణాలు ఉన్నవారు స్వర్గంలో ప్రవేశించలేరని అనబడిందంటే దీని భావం తమ చెడు చేష్టలకు ఫలితం అనుభవించిన మీదటే వారు స్వర్గంలోకి వెళతారన్నమాట!

(١٣٠٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ تَسَمَّعَ حَدِيثَ قَوْمٍ، وَهُمْ لَهُ كَارِهُونَ، صُبَّ فِي أُذُنَيْهِ الآنُكُ يَوْمَ الْقِيَامَةِ**». يَعْنِي الرَّصَاصَ. أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1304. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఏదేని ఒక వర్గం వారు తనను ఇష్ట పడటం లేదని తెలిసి కూడా ఎవరయినా వారు చెప్పుకునే విషయాన్ని వినే యత్నం చేస్తే, ప్రళయదినాన అతని రెండు చెవుల్లో సీసం వేయబడుతుంది."

(బుఖారీ)

**సారాంశం**

ఎవరైనా ఒక వర్గం వారు, లేక ఒక సమూహం ఏదేని ఒక విషయంపై మాట్లాడుకుంటు న్నప్పుడు వారి అనుమతి లేకుండా వారిలో కలసిపోవటంగానీ, చెవి యొగ్గి వారి మాటల్ని వినటంగానీ చేయకూడదు. ముఖ్యంగా కొంతమంది కలసి సమాలోచన చేస్తున్నప్పుడు, రహస్య మంతనాలు సాగిస్తున్నప్పుడు వాళ్ళు ఏం చెప్పుకుంటున్నారా! అని కూపీలు లాగే ప్రయత్నం చేయటం చాలా చెడ్డ పని ఇలాంటి వ్యక్తి చెవుల్లో తీర్పుదినాన సీసం కరిగించి పోయబడు

తుంది. ఇది సభా మర్యాదలకు సంబంధించిన ఒక ముఖ్యాంశం. దీన్ని గౌరవించటం అందరి బాధ్యత.

ఇమామ్ బుఖారీ (రహ్మాలై) తన గ్రంథమైన "అల్ అదబుల్ ముఫ్రిద్"లో చేసిన ఒక ఉల్లేఖనం ప్రకారం; ఇబ్నె ఉమర్ (రజి) గారు ఒక వ్యక్తితో సంభాషిస్తుండగా, ఇంకొకాయన వాళ్ళిద్దరికీ అతి చేరువలోకి వచ్చి నిలబడ్డాడు. అప్పుడు ఇబ్నె ఉమర్ (రజి) ఆ వ్యక్తి రొమ్ముపై తన అరచేతిని చరచి, ఇరువురు వ్యక్తులు ప్రత్యేకంగా చర్చించుకుంటూ ఉండగా, వాళ్ళ మాటల్ని వినకు, ఇలా వినటం నిషిద్ధం అని చెప్పారు. మొత్తమ్మీద ఒకరి రహస్య సమాలోచనను నక్కి వినటం, అందులో అనవసరంగా జోక్యం చేసుకోవటం ఏమాత్రం సమంజసం కాదు.

(١٣٠٥) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**طُوبَى لِمَنْ شَغَلَهُ عَيْبُهُ عَنْ عُيُوبِ النَّاسِ**». أَخْرَجَهُ الْبَزَّارُ بِإِسْنَادٍ حَسَنٍ.

1305. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరికయితే తన స్వీయ లోపాలు కానవస్తాయో, ఇతరుల లోపాలు కానరావో అతడు ధన్యుడు." (ఈ ఉల్లేఖనాన్ని బజ్జార్ 'హసన్' పరంపర నుండి సేకరించారు)

**సారాంశం**

ఇతరుల తప్పుల్ని ఎంచే ప్రయత్నంలో సమయాన్ని వృథా చేయకుండా తన స్వీయ తప్పుల్ని తెలుసుకుంటూ, వాటిని దూరం చేసుకునేందుకు కృషి చేసే వ్యక్తికి ఈ హదీసులో శుభవార్త ఇవ్వబడింది. తప్పును సరిదిద్దుకోవటం ఎంత కష్టమో గ్రహించిన వ్యక్తికి ఇతరుల తప్పుల్ని ఎంచే తీరికే దొరకదు. ఒకవేళ ఇతరుల్లో అతనికేదైనా లోపాలు కనిపించినా సాధ్యమైనంతవరకు వాటిని ఉపేక్షించేందుకు యత్నిస్తాడేగాని నలుగురిలో వారిని నవ్వులపాలు చేయడు. ఈ విధంగా ఆత్మావలోకనం చేసుకుంటూ, స్వీయ సంస్కరణపై ధ్యాస కనబరచే వారికి తీర్పు దినాన దేవుడు విస్తృతమైన నీడ గల వృక్షాన్ని ప్రసాదిస్తాడు.

(١٣٠٦) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ تَعَاظَمَ فِي نَفْسِهِ، وَاخْتَالَ فِي مِشْيَتِهِ لَقِيَ اللَّهَ**

1306. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "ఎవరయితే తన్ను తాను గొప్పవాడినని తలంచుకుని, గర్వాతిశయంతో నడుస్తాడో అతడు అల్లాహ్‌ను ఆగ్రహోదగ్రుడై ఉన్న

وَهُوَ عَلَيْهِ غَضْبَانُ». أَخْرَجَهُ الْحَاكِمُ، وَرِجَالُهُ ثِقَاتٌ.

స్థితిలో కలుసుకుంటాడు." (హాకిమ్ దీనిని సేకరించారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

**సారాంశం**

గర్వం, అహంకారంతో విర్రవీగటం దేవుని అప్రసన్నతకు, దైవాగ్రహానికి కారణ భూతమవుతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. వాస్తవానికి తాను అందరికన్నా గొప్పవాడినని అనుకునేవాడే నేలపై నిక్కుతూ నడుస్తాడు. తలబిరుసుతనాన్ని ప్రదర్శిస్తాడు. అల్లామా నవవీ (రహ్మ.లై) దృష్టిలో - మనిషి తనను ఎంతో ఉన్నతునిగా ఊహించుకుని ఇతరుల్ని అధములుగా భావించటం, సత్యాన్ని తృణీకరించటమే అహంకారం. ఇబ్నె హజర్ మక్కీ (రహ్మ.లై) ఇలా అభిప్రాయపడ్డారు: పెద్దరికం మరియు అహంకారం రెండు విధాలుగా ఉంటుంది. వాటిలో ఒకటి అంతర్గతమైనది, రెండవది బాహ్యపరమైనది. హదీసులోని మొదటి వాక్యం అంతరంగాన్ని, రెండవ వాక్యం బాహ్యాన్ని వివరిస్తోంది. ఇవి రెండూ మహాపరాధాల్లోకే వస్తాయి. షరీయతు రీత్యా ఇవి నిషిద్ధం (హరామ్). ఎవరిలోనయితే అణువంత అహంకారం ఉంటుందో అతడు స్వర్గంలో ప్రవేశించలేడని తిర్మిజీలోని ఒక ఉల్లేఖనం ద్వారా విదితమవు తున్నది.

(١٣٠٧) وَعَنْ سَهْلِ بْنِ سَعْدٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْعَجَلَةُ مِنَ الشَّيْطَانِ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ.

1307. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "తొందరపాటుతనం, శీఘ్రతా మన స్తత్వం షైతాన్ పని." (ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించి, దీనిని హసన్‌గా ఖరారు చేశారు)

**సారాంశం**

నిర్ధారిత పనులను సకాలంలో పూర్తి చెయ్యటంలో తప్పులేదు గాని, నిర్వర్తించటంలో మితిమీరిన వేగిరపాటు మంచిది కాదు. మితిమీరిన హడావిడి, శీఘ్రగతి మూలంగా ఆ పనికి సంబంధించిన ఉచితానుచితాలను, మంచీ చెబ్బరలను గురించి యోచన చేసే అవకాశం దొరకదు. తీరా ఆ పని అయిపోయిన మీదట అందలి లోపాలు తెలిసివస్తాయి. అందుకే ఈ దుందుడుకు స్వభావం వల్ల మనిషి ఒక్కోసారి నష్టపోతుంటాడు. పతనపు ఆఖరి అంచులదాకా వెళ్ళి పోతుంటాడు. నిజానికి ఇది షైతాన్ మాయ. ఈ మాయాజాలానికి లోనైన మనిషి నష్టాన్ని చవిచూడటం ఖాయం. కాబట్టి 'సహసా విధధీతన క్రియాం' అన్న సామెతను కూడా సదా దృష్టిలో పెట్టుకుని వెనుకా ముందు ఆలోచించటం మంచిది.

(١٣٠٨) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الشُّؤْمُ سُوءُ الْخُلُقِ**». أَخْرَجَهُ أَحْمَدُ، وَفِي إِسْنَادِهِ ضَعْفٌ.

1308. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "దుర్వర్తన దౌర్భాగ్య స్థితికి తార్కాణం." (దీన్ని అహ్మద్ ఉల్లేఖించారు. దీని పరంపర బలహీనమైనది).

### సారాంశం

మనిషిపై వచ్చే ఆపదలకు, దారిద్ర్యానికి, దౌర్భాగ్యకరస్థితికి అసలు కారణం అతడి చెడు నడతేననీ, అతని స్వయంకృతాల మూలంగానే శుభాలు అతన్నుంచి దూరం అవుతాయనీ ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. సద్వర్తన అయినా, దుర్వర్తన అయినా మనిషి అధీనంలోనే ఉంటాయి. అతను గనక తన దుర్వర్తనను సరిదిద్దుకుని సదాచారాన్ని అవలంబిస్తే దాని శుభం వల్ల అతని దరిద్రం కాస్తా వదలిపోవచ్చు. ఎందుకంటే రుజువర్తనుడైన మనిషి వైపునకు దేవుడు కూడా మరలుతాడు. అతని స్థితిని చక్కదిద్దుతాడు. అతని తేలికపాటి తప్పుల్ని మన్నించి కనికరిస్తాడు. కనుక మనిషి నిత్యం దుర్వర్తన వైపునుంచి 'సద్వర్తన' వైపునకు ప్రస్థానం చేసే చింతనలో ఉండాలి. దుర్వర్తన దౌర్భాగ్యానికి, దారిద్ర్యానికి చిహ్నమైతే సద్వర్తన శుభశ్రేయాలకు, సాఫల్యానికి సంకేతం!

(١٣٠٩) وَعَنْ أَبِي الدَّرْدَاءِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ اللَّعَّانِينَ لاَ يَكُونُونَ شُفَعَاءَ وَلاَ شُهَدَاءَ يَوْمَ القِيَامَةِ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

1309. హజ్రత్ అబూ అద్దర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నిస్సందేహంగా ఇతరులకు శాపనార్థాలు పెట్టేవారు ప్రళయదినాన సిఫారసు చేసే, సాక్ష్యం ఇచ్చే అర్హతను కోల్పోతారు." (ముస్లిం)

### సారాంశం

అదేపనిగా ఇతరుల్ని శపిస్తూ, ఇతరుల చర్యలను అనవసరంగా ఖండిస్తూ ఉండేవారిని అల్లాహ్ ఇష్టపడడనీ, తీర్పుదినాన అటువంటి వారు చేసే సిఫారసుల్ని, వారు ఇచ్చే సాక్ష్యాలను అల్లాహ్ ఒప్పుకోడని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే అకారణంగా అన్యుల్ని ఆడిపోసుకునేవారు, అన్యుల ఉనికిని సహించలేనివారు పాపాత్ములు (ఫాసిఖ్‌లు) అవుతారు. కాగా; పాపాత్ముల సిఫారసు స్వీకారయోగ్యమవదు. ఇలాంటి వారు దైవమార్గంలో అమరగతి నొందినప్పటికీ, ఇతరుల కోసం సిఫారసు చేసే అర్హతను పొందలేరని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(١٣١٠) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ عَيَّرَ أَخَاهُ بِذَنْبٍ لَمْ يَمُتْ حَتَّى يَعْمَلَهُ**».

أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَسَنَدُهُ مُنْقَطِعٌ.

1310. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైతే ఒక ముస్లిం చేత జరిగిపోయిన పాపాన్ని రట్టుచేసి రాద్ధాంతం చేస్తాడో అతను స్వయంగా ఆ పనికి పాల్పడి మరీ చస్తాడు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించి, ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. దీని పరంపరలో అంతరాయ ముంది).

**సారాంశం**

సాటి ప్రజల తప్పులను, పాపాలను అసలు ఎత్తి చూపకూడదని దీని భావం కాదు. కాకపోతే పబ్లిగ్గా వారి పాపాలను ప్రస్తావించి, నలుగురిలో నవ్వులపాలు చేసే యత్నం మాత్రం చేయకూడదు. ఎవరయితే ఇలాంటి దుష్ట సంకల్పం పూనుకుని ఉంటారో వారికీ అదే గతి పడుతుంది. సాధ్యమైనంతవరకు జనుల లోపాలను మరుగుపరచాలన్నది దేవుని అభిమతం. ఎందుకంటే ఆయన 'సత్తార్' - దాసుల లోటుపాట్లను మరుగుపరచేవాడు! ఎవరిలోనయితే ఈ లోపాలను మరుగుపరచే ఉదార స్వభావం ఉంటుందో వారి లోపాలను తీర్చుదినాన దేవుడు మరుగుపరుస్తాడు. వారి పరువు ప్రతిష్ఠలను కాపాడే బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకుంటాడు.

(١٣١١) وَعَنْ بَهْزِ بْنِ حَكِيمٍ، عَنْ أَبِيهِ، عَنْ جَدِّهِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**وَيْلٌ لِلَّذِي يُحَدِّثُ فَيَكْذِبُ لِيُضْحِكَ بِهِ القَوْمَ، وَيْلٌ لَهُ، ثُمَّ وَيْلٌ لَهُ**».

أَخْرَجَهُ الثَّلَاثَةُ، وَإِسْنَادُهُ قَوِيٌّ.

1311. హజ్రత్ బహ్జ్ బిన్ హకీమ్ తన తండ్రి ద్వారా, ఆయన తన తాతగారి ద్వారా చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "బూట కపు మాటలను, కల్లబొల్లి కబుర్లను ప్రజలకు వినిపించి హాస్యంలో ముంచెత్తే వాడికి మూడుతుంది. వాడికి మూడుతుంది. మరి వాడికి మూడు తుంది." (ఈ హదీసును 'ముగ్గురు' దృఢమైన పరంపర ఆధారంగా ఉల్లేఖించారు)

**సారాంశం**

ఆ మాటకువస్తే అబద్ధం చెప్పటం ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో నిషిద్ధం. ఇది కూడా పెద్ద పాపాల క్రిందికే వస్తుంది. అయితే అబద్ధాలు చెప్పి జనులకు హాస్యాన్ని పంచిపెట్టడం, అబద్ధాలతో ప్రజలకు వినోద సామగ్రిని సమకూర్చటం కూడా నిషిద్ధమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే ఆనందం అనేది ఏదైనా మంచి విషయంపై, శుభవార్తపై వెల్లడవ్వాలేగాని అబద్ధంపై కాదు. ఇలాంటి చేష్టకు పాల్పడేవాళ్ళను ఆపాలి లేదా అబద్ధాలతో కూడిన అటువంటి సమావేశాన్ని బహిష్కరించటమైనా చేయాలి.

(١٣١٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «كَفَّارَةُ مَنِ اغْتَبْتَهُ أَنْ تَسْتَغْفِرَ لَهُ». رَوَاهُ الْحَارِثُ بْنُ أَبِي أُسَامَةَ بِإِسْنَادٍ ضَعِيفٍ.

1312. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : ఎవరి గురించైతే నీవు చాడీలు చెప్పావో, దానికి పరిహారంగా నువ్వు అతని క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించాలి.'' (దీన్ని హారిస్ బిన్ అబీ ఉసామా బలహీన పరంపర ఆధారంగా ఉల్లేఖించారు)

**సారాంశం**

మనం ఎవరి వీపు వెనుక అయినా వారి గురించి చెడుగా చెప్పుకుంటే దానికి పరిహారంగా వారి మన్నింపుకోసం దైవాన్ని ప్రార్థిస్తే సరిపోతుందని ఈ హదీసు చెబుతోంది. అయితే ఆ వ్యక్తుల జాడ, చిరునామా తెలియనప్పుడైతే ఇది సరిపోతుందనీ, ఒకవేళ వాళ్లు ఎక్కడున్నారో తెలిసినప్పుడు మాత్రం వారి వద్దకు వెళ్ళి క్షమాపణ కోరుకోవలసిందేనని పండితులు వ్యాఖ్యానిస్తున్నారు.

(١٣١٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَبْغَضُ الرِّجَالِ إِلَى اللهِ الْأَلَدُّ الْخَصِمُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1313. హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు: ''జనుల్లో అందరికన్నా ఎక్కువగా పోట్లాడేవాడే దైవసన్నిధిలో అందరికన్నా ఎక్కువగా ఛీత్కరించబడతాడు.'' (ముస్లిం)

**సారాంశం**

సమాజంలో అందరూ ఒకచోట నివసిస్తున్నప్పుడు ఒకరి ద్వారా ఇంకొకరికి అసౌకర్యం కలగటం, అవాంఛనీయ సంఘటనలు ఎదురవటం మామూలే. అయితే ప్రతి చిన్న అసౌకర్యా

నికీ జగడమాడటం, నోరు పారేసుకోవటం, గలాటా సృష్టించి శాంతియుత జీవనాన్ని అతలాకుతలం చేసివేయటం మర్యాదస్తులకు ఏమాత్రం శోభించదు. దేవుని అప్రసన్నతకు, ఆగ్రహానికి కారకులయ్యేవారే ఇలాంటి పనులు చేస్తారు. తమ హక్కుల ప్రాప్తికై ప్రజలు సముచితమైన రీతిలో పోరాడటం సమంజసమేగాని ఉగ్రరూపం దాల్చటం, ఉన్మాదిలా ప్రవర్తించటం సుతరామూ సమంజసం కాదు. పైగా ఇలాంటి తీవ్రవాదం నిషిద్ధం.

## 5వ అధ్యాయం

## ٥ - بَابُ التَّرْغِيبِ فِي مَكَارِمِ الْأَخْلَاقِ

## ఉత్తమ గుణగణాలకై ప్రోత్సహించటం

(١٣١٤) عَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «عَلَيْكُمْ بِالصِّدْقِ، فَإِنَّ الصِّدْقَ يَهْدِي إِلَى الْبِرِّ، وَإِنَّ الْبِرَّ يَهْدِي إِلَى الْجَنَّةِ، وَمَا يَزَالُ الرَّجُلُ يَصْدُقُ، وَيَتَحَرَّى الصِّدْقَ حَتَّى يُكْتَبَ عِنْدَ اللهِ صِدِّيقاً، وَإِيَّاكُمْ وَالْكَذِبَ، فَإِنَّ الْكَذِبَ يَهْدِي إِلَى فُجُورٍ، وإن الفُجُورَ يَهْدِي إِلَى النَّارِ، وَمَا يَزَالُ الرَّجُلُ يَكْذِبُ، وَيَتَحَرَّى الْكَذِبَ حَتَّى يُكْتَبَ عِنْدَ اللهِ كَذَّاباً». مُتَّفَقٌ عَلَيْهِ.

1314. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "సత్యాన్ని విధిగా అవలంబించండి. సత్యం సత్కార్యం వైపునకు మార్గం చూపుతుంది. సత్కార్యం స్వర్గం వైపునకు గొనిపోతుంది. (సత్యావలంబనను మనిషి తన కోసం అనివార్యంగా చేసుకున్నందు వల్ల) మనిషి నిత్యం సత్యమే పలుకుతాడు, సత్యాన్వేషణలోనే ఉంటాడు - కడకు అతడు అల్లాహ్ సన్నిధిలో 'సత్యసంధుడు'గా వ్రాసుకోబడతాడు. అసత్యానికి దూరంగా ఉండండి. అసత్యం దుష్కార్యాల వైపునకు తీసుకుపోతుంది. దుష్కార్యం నరకాగ్ని వైపునకు గొనిపోతుంది. మనిషి నిత్యం అసత్యం పలుకుతూ, అసత్య మార్గంలోనే సాధన చేస్తున్నట్లయితే ఆఖరికి అల్లాహ్ సన్నిధిలో 'అసత్యవాది' గానే నమోదు చేయబడతాడు."

(బుఖారీ, ముస్లిం)

(١٣١٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِيَّاكُمْ وَالظَّنَّ، فَإِنَّ الظَّنَّ أَكْذَبُ الْحَدِيثِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1315. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "దురనుమానానికి దూరంగా మసలు కోండి. దురనుమానం అన్నింటికన్నా పెద్ద అసత్యం." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

పై రెండు హదీసులలోనూ అసత్యానికి దూరంగా ఉండాలనీ, సదా సత్యాన్ని అనుసరించాలని ఉపదేశించబడింది. సత్యానికి అంతిమ పరిణామం స్వర్గమే. అసత్యం నైవాగ్రహానికి కారణభూతమై, నరకాగ్నికి ఆహుతి చేస్తుంది. కాబట్టి ఎవరయితే తన జీవితంలోని సమస్త విభాగాలలో, సమస్త విషయాలలో సత్యాన్ని అవలంబిస్తాడో, సత్యాన్నే తన జీవన ధ్యేయంగా చేసుకుంటాడో అతడు స్వర్గానికి బాటను వేసుకుంటాడన్నమాట!

(١٣١٦) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِيَّاكُمْ وَالْجُلُوسَ بِالطُّرُقَاتِ**»، قَالُوا: يَا رَسُولَ اللهِ! مَا لَنَا بُدٌّ مِّنْ مَجَالِسِنَا، نَتَحَدَّثُ فِيهَا، قَالَ: «**فَأَمَّا إِذَا أَبَيْتُمْ فَأَعْطُوا الطَّرِيقَ حَقَّهُ**»، قَالُوا: وَمَا حَقُّهُ؟ قَالَ: «**غَضُّ الْبَصَرِ،**

1316. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "(జనులు నడిచే) దారిలో కూర్చోకండి." 'దారిలో కూర్చోవటం వినామాకు కుదరదే! మేమక్కడ కూర్చుని ముఖ్య విషయాలు మాట్లాడుకుంటాము కదా!' అని సహచరులు విన్నవించుకోగా, "దారిలో బైఠాయించటం తప్ప మరో గత్యంతరం లేదనుకుంటే మీరు దారి హక్కును ఇవ్వవలసి ఉంటుంది" అని ఆయన (స) చెప్పారు. 'దారి హక్కు అంటే ఏమిటీ?' అని ప్రియసహచరులు ప్రశ్నించగా, "చూపులను క్రిందికి ఉంచాలి. వచ్చేపోయే వారిని వేధించ కూడదు. సలాంకు జవాబు ఇవ్వాలి. మంచి గురించి ప్రబోధించాలి, చెడుల

وَكَفُّ الْأَذَى، وَرَدُّ السَّلَامِ، وَالْأَمْرُ بِالْمَعْرُوفِ، وَالنَّهْيُ عَنِ الْمُنْكَرِ». مُتَّفَقٌ عَلَيْهِ.

నుంచి (జనులను) వారించాలి" అని ఆయన (సఅసం) వివరించారు."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

జనులు సంచరించే మార్గాల్లో, వీధుల్లో, వాడల్లో బైఠాయించి కాలక్షేపానికి కబుర్లు చెప్పుకోవటం, వచ్చేపోయే వారికి ఇబ్బందికరంగా మారటం ఎంతమాత్రం అభిలషణీయం కాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. పైగా ఇలా కూర్చోవటం మర్యాద అనిపించుకోదు. వచ్చే పోయే వారిలో మహిళలు కూడా ఉంటారు. ఇలాంటి గ్రూపు మీటింగుల వల్ల వారు తీవ్రమయిన అసౌకర్యానికి లోనవుతారు. అదీగాక ఎక్కడంటే అక్కడ కూర్చోవటం వల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి.

'దారిహక్కు' అనే పదంలో ఎన్నో విషయాలు ఇమిడి ఉన్నాయి. వచ్చే పోయే వారిని వేధించకుండా ఉండటంతోపాటు దారి తప్పిన వారికి మార్గ దర్శకత్వం కూడా చేయవలసి ఉంటుంది. ఇబ్బందుల్లో ఉన్న బాటసారులకు సహాయ సహకారాలు కూడా అందించాలి. వచ్చే పోయే వారు తుమ్మిన తరువాత 'అల్‌హమ్దులిల్లాహ్' అనంటే సమాధానంగా 'యర్‌హముకల్లాహ్' అని కూడా పలకాలి.

(١٣١٧) وَعَنْ مُعَاوِيَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ يُرِدِ اللَّهُ بِهِ خَيْراً يُفَقِّهْهُ فِي الدِّينِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1317. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ ముఆవియా (రజి) తెలిపారు - "అల్లాహ్ ఏ వ్యక్తి ద్వారా మేలును, శ్రేయాన్ని అభిలషిస్తాడో అతనికి ధర్మావగాహనా శక్తిని (పుష్కలంగా) అనుగ్రహిస్తాడు."

(బుఖారీ, ముస్లిం)

(١٣١٨) وَعَنْ أَبِي الدَّرْدَاءِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا مِنْ شَيْءٍ فِي الْمِيزَانِ أَثْقَلُ مِنْ حُسْنِ الْخُلُقِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

1318. హజ్రత్ అబూ అద్దర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "దేవుని త్రాసులో మంచి నడవడిక కన్నా బరువైన వస్తువు మరొకటేదీ ఉండదు." (ఈ హదీసును అబూదావూద్ మరియు తిర్మిజీ ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

తీర్పు దినాన త్రాసులు కూడా ప్రత్యక్షమవుతాయనీ, మనుషుల కర్మలు వాటిలో తూయబడతాయనీ ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే త్రాసులో అన్నింటికన్నా ఎక్కువ బరువైన వస్తువు మనిషి సత్ప్రవర్తన అయి ఉంటుంది. దీన్నిబట్టి సత్ప్రవర్తన, సద్గుణం ఎంత ప్రాముఖ్యంతో కూడుకున్నవో ఊహించవచ్చు.

(١٣١٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْحَيَاءُ مِنَ الْإِيمَانِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1319. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ప్రీడ (లజ్జ) విశ్వాసంలో అంతర్భాగం."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

అరబీలో 'హయా' అనే పదం వచ్చింది.'హయా' అంటే అసలు లజ్జ, ప్రీడ, సిగ్గు, బిడియం అన్న అర్థాలు వస్తాయి. లజ్జ అనేది స్వాభావికమైనది. ఈ లజ్జా భావమే గనక మనిషిలో లేకపోతే అతను తన మర్మస్థానాలను కూడా రక్షించుకోడు. లజ్జ లేని వానిలో ఆత్మాభిమానం కూడా ఉండదు. లజ్జ లేనివాడు సమాజం విధించే కట్టుబాట్లను కూడా ఖాతరు చేయడు. లజ్జ మానవత్వానికి ప్రతిరూపం. అందుకే 'లజ్జ' ఈమాన్ (విశ్వాసం)లో అంతర్భాగంగా ఖరారు చేయబడింది ఈ హదీసులో.

లజ్జా గుణం మనిషిలో భీతినీ, బాధ్యతాభావాన్ని పెంపొందిస్తుంది. లజ్జ సౌశీల్యానికి, పారిశుద్ధ్యానికి సోపానం. లజ్జను మరచినవాడు చంచలుడైపోతాడు. లజ్జా విహీనుడైనవాడు నిర్భయంగా సిగ్గుమాలిన పనులకు పూనుకుంటాడు. అందుకే సంస్కృతంలో అనబడింది - "కామా తురాణాం న భయం న లజ్జ" అని!

(١٣٢٠) وَعَنْ أَبِي مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ مِمَّا أَدْرَكَ النَّاسُ مِنْ كَلَامِ النُّبُوَّةِ الْأُولَى: إِذَا لَمْ تَسْتَحِ فَاصْنَعْ مَا شِئْتَ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

1320. హజ్రత్ అబూ మస్‌వూద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం - "తొలి దైవదౌత్య పరంపరలో నుంచి జనులకు ప్రాప్తించిన వాటిలో, 'సిగ్గు, షరము విడిచేసినపుడు నువ్వు ఏం చేసుకున్నా అడ్డుండదు' అన్న ప్రబోధన కూడా ఉంది."

(బుఖారీ)

**సారాంశం**

'తొలి దైవదౌత్య పరంపర' అంటే భావం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు పూర్వం వచ్చిన దైవప్రవక్త (అలైహిముస్సలాం)లపై అవతరించిన దైవవాణి మరియు షరీయతు. అప్పటి షరీయతుల్లోని కొన్ని అంశాలు రద్దు కాలేదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. వాటిలో ఒకటి పై హదీసులోని ప్రబోధనం. సిగ్గు, బిడియం ఉన్నవాడు పాపానికి ఒడిగట్టేటప్పుడు ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తాడు. ఒకవేళ క్షణికావేశంలో తప్పుచేసినా, తరువాత దాన్ని తలచుకుని సిగ్గుతో కుమిలిపోతాడు.

కాని మనసులో సిగ్గు, షరము అసలేమీ లేనివాడు ఎవరినీ లెక్క చేయడు. సమాజం తనను గురించి ఏమనుకున్నా, తోటివారు తనను ఎంతగా ఈసడించుకున్నా నిక్షేపంగా ఉంటాడు. అందుకే ఈ నేపథ్యంలో కొంతమంది తత్వవేత్తలు ఇలా అన్నారు - ఏదైనా పనికి ఉపక్రమించినపుడు దాని కీడును ఎంచండి, దాని ఉచితానుచితాలను బాగా బేరీజు వేయండి. దానికి మీ మనస్సాక్షి నుండి 'పచ్చని సంకేతం' లభిస్తే సరి! లేనట్లయితే ఆ పనిని మానివేయండి!

(١٣٢١) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْمُؤْمِنُ الْقَوِيُّ خَيْرٌ وَأَحَبُّ إِلَى اللهِ مِنَ الْمُؤْمِنِ الضَّعِيفِ، وَفِي كُلٍّ خَيْرٌ، اِحْرِصْ عَلَى مَا يَنْفَعُكَ، وَاسْتَعِنْ بِاللهِ، وَلاَ تَعْجِزْ، وَإِنْ أَصَابَكَ شَيْءٌ فَلاَ تَقُلْ: لَوْ أَنِّي فَعَلْتُ كَذَا كَانَ كَذَا وَكَذَا، وَلَكِنْ قُلْ: قَدَّرَ اللَّهُ، وَمَا

1321. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: దైవ సన్నిధిలో బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికన్నా ఎక్కువ ప్రియతముడు, ప్రయోజనకుడూను. ఆ మాటకువస్తే ప్రతి విశ్వాసిలోనూ మేలు, మంచితనం ఉంటాయి. నీకు ప్రయోజనకరమైన దాన్ని నీవు ఆశించటంలో తప్పు లేదు. (అయితే) కేవలం దైవ సహాయాన్ని అర్థించు! అశక్తుడవై, నిస్సహాయుడవై కూర్చోకు. నీకు వస్తువు ప్రాప్తించినపుడు, 'నేను ఫలానా పనిని ఇలా చేసేబదులు ఇలా చేసివుంటే నాకు మరిన్ని లాభాలు చేకూరి ఉండేవి' అని అనకండి. దీనికిబదులు 'అల్లాహ్ నా కొరకు తలచినదే అయింది'

شاءَ فَعَلَ، فَإِنَّ «لَوْ» تَفْتَحُ عَمَلَ الشَّيْطَانِ». أَخْرَجَهُ مُسْلِمٌ.

అని అనండి. ఎందుకంటే 'అయితే... గీతే...' అనే ఊహాగానాలతో షైతాన్ ఆగడాలకు ద్వారం తెరచుకుంటుంది."

(ముస్లిం)

**సారాంశం**

'అయితే...గీతే....' లాంటి ఊహాగానాలకు తెరదించమని ఈ హదీసులో అనబడింది. కాని మరికొన్ని హదీసుల ద్వారా ఇలాంటి ఆత్మావలోకనానికి అవకాశం ఉందని తెలుస్తోంది. అందుకే ఇలాంటి ఊహాగానాలను 'నిషిద్ధం' అని అనే బదులు 'అయిష్టకరం' అనటం సబబుగా ఉంటుంది. కాని ఇలాంటి అంచనాలు వేసుకునే సమయంలో సంకల్పం నిష్కల్మషంగా ఉండాలని పండితులు చెబుతున్నారు.

బలహీనుడైన విశ్వాసికన్నా బలశాలి అయిన విశ్వాసి దేవుని దృష్టిలో ప్రియతముడు అని అనబడటం గమనార్హమైన విషయం. బలవంతుడైన వ్యక్తి ధర్మరక్షణ కోసం ఎక్కువ సేవలు అందిస్తాడు. అనారోగ్యంతో సతమతమయ్యే వ్యక్తికన్నా ఆరోగ్యవంతుడైన వాడు తన్ను తాను రక్షించుకోవటంతో పాటు, ఇతరులను కూడా రక్షిస్తాడు. అయితే మానవుడు ఎంత బలశాలి అయినప్పటికీ దైవ సహాయం లేనిదే అతడేమీ చేయజాలడన్న సత్యాన్ని ఈ సందర్భంగా విస్మరించరాదు. అందుకే సర్వకాల సర్వావస్థల్లో సహాయం కోసం సర్వోన్నతుడైన దైవాన్ని మాత్రమే వేడుకుంటూ, ఆయనపైన్నే భారం మోపి మరీ సాధన చేయాలి.

(١٣٢٢) وَعَنْ عِيَاضِ بْنِ حِمَارٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ اللَّهَ تَعَالَى أَوْحَى إِلَيَّ أَنْ تَوَاضَعُوا، حَتَّى لاَ يَبْغِيَ أَحَدٌ عَلَى أَحَدٍ، وَلاَ يَفْخَرَ أَحَدٌ عَلَى أَحَدٍ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1322. హజ్రత్ ఇయాజ్ బిన్ హిమార్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "వినయ వినమ్రతలను కలిగి ఉండమని దేవుడు నాపై 'వహీ' (దైవవాణి)ని అవతరింపజేశాడు. ఆఖరికి ఒకరు ఇంకొకరిపై దురుసుగా ప్రవర్తించడంగానీ, ఒకరింకొకరిపై అహంకారాన్ని ప్రదర్శించటంగానీ చేయకూడదు."

(ముస్లిం)

**సారాంశం**

నిత్యం వినయశీలురుగా ఉండాలనీ, ప్రజల యెడల వినమ్రులుగా మసలుకోవాలనీ ఈ హదీసులో తాకీదు చేయబడింది. మనిషి తన తెలివితేటలతో ఎంత ఎత్తుకు ఎదిగినా,

తన ప్రతిభతో ఎన్ని కీర్తి శిఖరాల అంబరాలను చుంబించినాసరే ఇతరుల ముందు తనను చిన్నవానిగానే లెక్కించుకోవాలి. ఇతరులను అధములుగా, అసమర్థులుగా జమకట్టరాదు - ఇదే అణకువ మరియు వినమ్రత. ఈ వినమ్రత ఉన్న మనిషి తోటి వారి దృష్టిలో చాలా ఎత్తుకు ఎదిగిపోతాడు. అందరి హృదయాలనూ జయిస్తాడు. తన చుట్టూ సానుకూల వాతావరణాన్ని సృష్టించుకుంటాడు. దీనికి భిన్నంగా బీరాలు పోయేవాడు, బడాయిని చాటుకునేవాడు, ఇతరులను అల్పులుగా జమకట్టేవాడు ప్రజాదరణను కోల్పోతాడు. తన శత్రువుల సంఖ్యను పెంచుకుంటూ పోతాడు. పరిసరాల వారికీ -తనకూ మధ్య అంతరాల అగాధాలను సృష్టించుకుంటాడు. పర్యవసానంగా దైవాగ్రహం కూడా అతనిపై విరుచుకు పడుతుంది.

(١٣٢٣) وَعَنْ أَبِي الدَّرْدَاءِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «**مَنْ رَدَّ عَنْ عِرْضِ أَخِيهِ بِالْغَيْبِ رَدَّ اللَّهُ عَنْ وَجْهِهِ النَّارَ يَوْمَ الْقِيَامَةِ**». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ، وَلِأَحْمَدَ مِنْ حَدِيثِ أَسْمَاءَ بِنْتِ يَزِيدَ نَحْوُهُ.

1323. హజ్రత్ అబూ అద్దర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరయితే తన సోదరుడు అక్కడ లేని సమయంలో అతని మానమర్యాదలను పరిరక్షిస్తాడో అతని ముఖాన్ని అల్లాహ్ ప్రళయదినాన నరకాగ్ని బారినుండి రక్షిస్తాడు." (ఈ హదీసును తిర్మిజీ ఉల్లేఖించి, 'హసన్'గా ఖరారు చేశారు. ముస్నదె అహ్మద్‌లో అస్మా బిన్తె యజీద్ (ర.అన్‌హా) హదీసు కూడా ఇదే విధంగా ఉంది).

**సారాంశం**

తమ సోదరుడు ఎవరయినా తమ దగ్గర లేని సమయంలో అతని గురించిన చెడు ప్రస్తావన తీసుకురాకుండా ఉండటం, ఒకవేళ అతని పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే విషయం ఏదైనా ప్రస్తావనకు వచ్చినా దాన్ని ప్రతిఘటించటం ఉదాత్త స్వభావానికి తార్కాణమని హదీసులో చెప్పబడింది. పరోపకార గుణం, మానవత్వ స్వభావం ఉన్న ఉత్తములే ఇటువంటి ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పగల్గుతారు. సాటి సోదరుని పరోక్షంలో అతని మానమర్యాదలపై 'దాడి' జరిగినప్పుడు అడ్డుకోకపోవటం కూడా నిందార్హమే. ఒకరి పరోక్షంలో 'దాడి' చేసినవారిని అప్పటికప్పుడు గట్టిగా నిలువరిస్తే, అతని కుటిల పన్నాగాన్ని నీరుగార్చినట్లవుతుంది. మరోసారి, మరొకరి విషయంలో అతడు అలా చేయకుండా జాగ్రత్తపడతాడు.

**హదీసు ఉల్లేఖకులు**

అస్మా బిన్తె యజీద్ (ర.అన్హా) : ఈమె యజీద్ బిన్ సకన్ కుమార్తె. అష్హల్ తెగతో సంబంధమున్నందున అష్హలియాగా కూడా పిలువబడేవారు. మంచి వక్త. మహిళా సమావేశాలలో ప్రసంగాలు చేసేవారు. యర్మూక్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆ రోజు ఆమె తన శిబిరానికి ఊతగా ఉన్న దొడ్డు కర్రతో తొమ్మండుగురు శత్రువులను సంహరించారు.

(١٣٢٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا نَقَصَتْ صَدَقَةٌ مِنْ مَالٍ، وَمَا زَادَ اللَّهُ عَبْداً بِعَفْوٍ إِلاَّ عِزًّا، وَمَا تَوَاضَعَ أَحَدٌ لِلَّهِ إِلاَّ رَفَعَهُ اللهُ تَعَالَى». أَخْرَجَهُ مُسْلِمٌ.

1324. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ఉపదేశించారు : "దానధర్మాలు ఏ సంపదలోనూ ఎలాంటి లోటునూ కలిగించవు. మన్నింపుల వైఖరిని అవలంబించే దానుని యొక్క గౌరవ ప్రతిష్ఠలను పెంచటమే అల్లాహ్ అభిమతం. కేవలం దైవప్రసన్నతను బడయటం తప్ప మరో ఉద్దేశ్యం లేకుండా వెనక్కి తగ్గే వ్యక్తికి అల్లాహ్ ఉన్నతిని ప్రసాదిస్తాడు."

(ముస్లిం)

**సారాంశం**

మనిషిని నైతికంగా ఉన్నత శిఖరాలకు చేర్చే మూడు విషయాలు ఈ హదీసులో ప్రస్తావించబడ్డాయి. ఇవి మూడు కూడా సద్గుణాలకు సరోవరం వంటివి. (1) దానధర్మాలు (2) మన్నింపు (3) అణకువ. ఈ మూడు గుణాలు కలిగివున్న వ్యక్తి త్వరితగతిన దైవప్రసన్నతను చూరగొంటాడు. దైవదాసులు కూడా అతన్ని అమితంగా ప్రేమించసాగుతారు. గౌరవ ప్రతిష్ఠలు పెరగటమంటే భావం ఇదే. తనను అతి సామాన్యునిగా ఊహించుకుంటూ, తోటివారిని తనకన్నా ఉత్తములని తలపోస్తూ, ఒకరి కోసం ఓ మెట్టు దిగివచ్చే, ఒకరి కోసం తన కుర్చీని ఖాళీ చేసే, ఒకరి కోసం తాను వెనుక సీట్లో కూర్చోవటానికే ఇష్టపడే వ్యక్తి పట్ల అందరిలోనూ 'స్వీకృత' భావం పెంపొందుతుంది. అటువంటి త్యాగధనునికి శత్రువులు కూడా ఉండరు. దైవప్రసన్నతను బడయటమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నందువల్ల దేవుడు అతని గౌరవోన్నతుల్ని పెంచుతాడు.

(١٣٢٥) وَعَنْ عَبْدِ اللهِ بْنِ سَلاَمٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ

1325. హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా

ﷺ: «يَا أَيُّهَا النَّاسُ! أَفْشُوا السَّلَامَ، وَصِلُوا الْأَرْحَامَ، وَأَطْعِمُوا الطَّعَامَ، وَصَلُّوا بِاللَّيْلِ، وَالنَّاسُ نِيَامٌ، تَدْخُلُوا الْجَنَّةَ بِسَلَامٍ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ.

ప్రబోధించారు : "ప్రజలారా! సలాంను సర్వసామాన్యం చేయండి. ఆప్తులను ఆదుకుంటూ ఉండండి. ప్రజలకు అన్నం పెట్టండి. రాత్రిపూట అందరూ ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో దైవ సమక్షంలో ఆరాధన చేయండి- శాంతంగా స్వర్గంలో ప్రవేశిస్తారు." (ఈ హదీసును తిర్మిజీ సేకరించారు. దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులో స్వర్గానికి సోపానాలుగా అభివర్ణించబడిన నాల్గు అంశాలలో మూడింటి సంబంధం దైవదాసుల (మానవుల)తో ఉంది. ఒకటి మాత్రం దైవంతో సంబంధం కలిగినది. అంటే ఈ నాల్గింటిలో దేవుని హక్కు ఒకటైతే మిగిలిన మూడూ దాసుల హక్కులన్నమాట! ఎవరయితే ఏకకాలంలో ఈ నాల్గు విధులను సక్రమంగా నిర్వర్తిస్తాడో అతని కొరకు స్వర్గబాట సరళమైపోతుంది. ఇలాంటి ధన్యజీవులు నిశ్చింతంగా స్వర్గానికి చేరుకుంటారు.

(١٣٢٦) وَعَنْ تَمِيْمٍ الدَّارِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الدِّينُ النَّصِيحَةُ»، ثَلَاثًا، قُلْنَا: لِمَنْ هِيَ يَا رَسُولَ اللهِ؟ قَالَ: «للهِ، وَلِكِتَابِهِ وَلِرَسُولِهِ، وَلِأَئِمَّةِ المسلِمِينَ وعامتِهِم». اخرَجَهُ مُسْلِمٌ.

1326. హాజ్రత్ తమీమ్ దారీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "శ్రేయోభిలాషకు మరో పేరే (ఇస్లాం) ధర్మం." ఇలా మూడుసార్లు చెప్పారు. 'దైవప్రవక్తా (సఅసం)! ఈ శ్రేయోభిలాష హక్కు ఎవరికోసం?' అని మేము ప్రశ్నించగా, "అల్లాహ్ కోసం, ఆయన గ్రంథం కోసం, ఆయన సందేశహరుని కోసం, ముస్లిము నాయకుల కోసం, వారి జన సామాన్యం కోసం!" అని ఆయన (సఅసం) విడమరచి చెప్పారు.

(ముస్లిం)

**హదీసు ఉల్లేఖకులు**

తమీమ్ దారీ (రజి) : అబూ రుఖైయ ఈయన మారుపేరు. పరంపర ప్రకారం తమీమ్ బిన్ ఔస్ బిన్ ఖారిజ దారీ అనబడతారు. హిజ్రీ 9వ సంవత్సరంలో ఇస్లాం స్వీకరించారు. బైతుల్ మఖ్దిస్‌లో స్థిరపడ్డారు. ఇబ్నె సీరీన్ కథనం ప్రకారం ఈయన దివ్యఖుర్‌ఆన్‌ను పూర్తిగా కంఠస్థం చేశారు. ఒక రాత్రిలో ఖుర్‌ఆన్ అంతటినీ పారాయణం చేసేవారు. హిజ్రీ 40లో మరణించారు.

(١٣٢٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَكْثَرُ مَا يُدْخِلُ الْجَنَّةَ تَقْوَى اللهِ وَحُسْنُ الْخُلُقِ».
أَخْرَجَهُ التِّرْمِذِيُّ وَصَحَّحَهُ الْحَاكِمُ.

1327. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "దైవభీతి మరియు సద్గుణం స్వర్గ ప్రవేశానికి ఎక్కువగా దోహదకారి అవుతాయి." (దీనిని తిర్మిజీ వెలికి తీశారు. హాకిమ్ ఈ హదీసును ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

'దైవభీతి' అన్నదానికి హదీసు మూలంలో 'తఖ్వా' అనే పదం ప్రయోగించబడింది. 'తఖ్వా' అంటే అసలు అర్థం దైవ సమ్మతమైన వాటిని అనుసరించటం, దేవుడు నిషేధించిన వాటి జోలికి పోకుండా ఉండటం. సాధారణంగా దైవభీతి, పరలోకభీతి ఉన్న వ్యక్తి మాత్రమే ఈ హద్దులను గౌరవిస్తాడు కదా!

ఇకపోతే; సద్గుణం లేక సత్ప్రవర్తన. దీన్ని కూడా స్వర్గానికి సోపానంగా అభివర్ణించడాన్ని బట్టి ఇస్లాంలో దీనికి గల ప్రాముఖ్యతను అంచనా వేయవచ్చు. ఈ రెండు గుణాలు వ్యక్తుల్లో, మానవ సముదాయాల్లో పెంపొందినప్పుడు ఇహలోకం నయితం భూతల స్వర్గంగా పరిణమిస్తుంది. ఇక పరలోకంలో దేవుడు శాశ్వత స్వర్గంలో నివాసం కల్పిస్తాడన్న వాగ్దానం ఉండనే ఉంది.

(١٣٢٨) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّكُمْ لاَ تَسَعُونَ النَّاسَ بِأَمْوَالِكُمْ، وَلَكِنْ لِيَسَعْهُمْ مِنْكُمْ بَسْطُ الوَجْهِ وَحُسْنُ

1328. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా బోధించారు : "మీరు ధన సంపత్తుల ద్వారా ప్రజలను సంతోషపెట్టలేరు. అందుకే మీరు సత్ప్రవర్తన, మృదుత్వం ద్వారా ప్రజల్లో

الْخُلُقِ». أَخْرَجَهُ أَبُو يَعْلَى وَصَحَّحَهُ الْحَاكِمُ.

సంతోషాన్ని, తృప్తినీ పెంపొందించే యత్నం చేయండి.'' (ఈ హదీసును అబూ యాలా ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

మనిషి కోర్కెలు అపరిమితమైనవి. వనరులు మాత్రం పరిమితమైనవి. అందుచేత ధనసంపత్తుల ద్వారా, డబ్బు ద్వారా ప్రజల్లో తృప్తినీ, సంతోషాన్ని సృజించటం కష్టం. దీనికి బదులు ప్రేమైక భావాల ద్వారా, చిరు మందహాసం ద్వారా, మృదుత్వం, మన్నింపుల స్వభావం ద్వారా ప్రజలను సంతోషపెట్టాలి. ముఖ్యంగా ప్రజా సముదాయాలకు నాయకులుగా, సంస్కర్తలుగా, మార్గదర్శకులుగా, పీఠాధిపతులుగా చెలామణీ అయ్యేవారు ఈ విషయాన్ని అనునిత్యం దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుకంటే వాక్చాతుర్యంతో, అందమైన ప్రసంగాలతో జనసామాన్యాన్ని, కార్యకర్తల్ని సమీకరించటం, సంస్థల్ని సంఘాలను నెలకొల్పటం సులభమే. కాని ఆ కార్యకర్తల్ని అయస్కాంతంలా ఆకర్షించి, వారు ఎప్పటికీ దూరం కాకుండా ఉండేలా ఆపి ఉంచటం చాలా కష్టం. ఆశయం పట్ల నిబద్ధత, లక్ష్యం పట్ల అచంచలమైన విశ్వాసంతో పాటు, దానికోసం పాటుపడే వారికి ప్రేమానురాగాలను పంచిపెట్టినప్పుడే వారు ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు దూసుకు పోగలుగుతారు.

(١٣٢٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْمُؤْمِنُ مِرْآةُ أَخِيهِ الْمُؤْمِنِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

1329. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ''ఒక విశ్వాసి మరో విశ్వాస సోదరునికి అద్దం లాంటివాడు.'' (దీనిని అబూ దావూద్ ఉల్లేఖించారు. దీని పరంపర హసన్ కోవకు చెందినది)

**సారాంశం**

అద్దం ఎంతో నిజాయితీ గలది. అది ఏ విషయంలోనూ హెచ్చుతగ్గులు చేయదు. ఉన్నదున్నట్టుగా చూపెడుతుంది. అద్దం మాట్లాడదు. అది ఉపన్యాసాలివ్వదు. అది నిశ్శబ్దంగా ఉంటూనే తనను చూచే వారికి హితబోధ చేస్తుంది. అద్దం చూసుకున్న మనిషి తన మొహంపై ఉన్న లోపాలను తిలకిస్తాడు. అద్దం వీపు వెనుక చాడీలు చెప్పటంగానీ, పరోక్షనింద చేయటంగానీ చేయదు. ఏం చెప్పాలనుకున్నా మొహం మీదే చెబుతుంది.

అలాగే ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు. అతన్ని చూచి అతన్నుండి నేర్చుకోవలసిన మంచి విషయాలేవయినా ఉంటే నేర్చుకుంటాడు. తనలోని లోపాలను

సరిదిద్దుకుంటాడు. అలాగే తన ముందున్న సోదరునిలో ఏవైనా లోపాలుంటే, అతని పరోక్షంలో వాటిని ప్రస్తావించే బదులు అతని ఎదుటే హెచ్చుతగ్గులు లేకుండా, నిర్మొహమాటంగా చెప్పాలి. అలా చెబితే ఎదుటివాడు ఏమనుకుంటాడో ఏమో అని సందేహపడ నవసరం లేదు. కాకపోతే అందరి ముందూ అతన్ని అవమానపరచకుండా ఏకాంతంలో నచ్చచెప్పవచ్చు. ఈ 'సంస్కరణ' కోసం వారిద్దరి మధ్య కించిత్ ఉద్రిక్తత ఏర్పడినా ఫరవా లేదు. వీపు వెనుక చాడీలు చెప్పటం కన్నా ఇది ఎన్నో రెట్లు మెరుగు. ఎందుకంటే; అద్దాన్నే ఉపమానంగా తీసుకోండి - అది క్రిందపడి ముక్కలైనాసరే రూపురేఖలను ప్రతిబింబించే దాని నైజంలో మాత్రం మార్పుండదు. అలాగే మనం ఒకరి శ్రేయాన్ని అభిలషిస్తున్నప్పుడు, వారు మన గురించి ఏమనుకుంటున్నారో ఏమోనని మనం మీనమేషాలు లెక్కించుకుంటూ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఇక సంస్కరణ జరిగేదెలా?! మన పనైతే అద్దం మాదిరిగా ఉన్నదున్నట్టుగా - నిష్కర్షగా, నిర్దిష్టంగా - చెప్పేయటమే!

(١٣٣٠) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُما قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**المُؤْمِنُ الَّذِي يُخَالِطُ النَّاسَ وَيَصْبِرُ عَلَى أَذَاهُمْ خَيْرٌ مِنَ الَّذِي لاَ يُخَالِطُ النَّاسَ وَلاَ يَصْبِرُ عَلَى أَذَاهُمْ**». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ بِإِسْنَادٍ حَسَنٍ، وَهُوَ عِنْدَ التِّرْمِذِيِّ، إِلاَّ أَنَّهُ لَمْ يُسَمِّ الصَّحَابِيَّ.

1330. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: జనుల మధ్య చొచ్చుకుపోతూ వారి ద్వారా కల్గే బాధాకరమైన విషయాలను సహించే విశ్వాసి, జనులకు దూరంగా మసలుకుంటూ, వాళ్ళ ద్వారా కల్గే బాధలను సహించలేని విశ్వాసికన్నా ఎంతో మంచివాడు, ఉత్తముడు." (ఈ హదీసును ఇబ్నెమాజా 'హసన్' పరంపర ద్వారా ఉల్లేఖించారు. ఈ హదీసు తిర్మిజీ లోనూ ఉంది. కాని అందులో సహాబీ (రజి) పేరు ప్రస్తావనకు రాలేదు)

**సారాంశం**

ప్రజలతో కలసిమెలసి ఉంటూ, వాళ్ళ సుఖదుఃఖాలలో పాలు పంచుకునే, వారి సమస్యలను పరిష్కరించే, ధర్మావలంబనలో వారికి మార్గదర్శకత్వం వహించే వ్యక్తి ఉత్తముడని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. ధర్మబోధన కోసం ఉపక్రమించిన వారికి బాధలు తప్పవు. ఈ విషయంలో జనుల తరపున ఎదురయ్యే అవమానాలను, వేధింపులను ఓర్పుతో భరిస్తూ, నేర్పుతో వాటిని అధిగమించవలసి ఉంటుంది. ఎందుకంటే మంచిని ప్రబోధించిన కారణంగా, ధర్మావలంబనకై పురికొల్పినందున అతనికి ఈ కష్టాలు ఎదురయ్యాయి. అతనే గనక ఈ

సత్కార్యానికి పూనుకోకుండా హాయిగా ఇంట్లో కూర్చుంటే ఈ ఇబ్బందులేమీ ఎదురయ్యేవి కావు. అందుకే ప్రజా జీవితాలకు ఆమడ దూరాన ఉండే వ్యక్తికన్నా బాధలను భరించడానికి ముందుకు వచ్చినవాడు ఎంతో గొప్పవాడు.

(١٣٣١) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اللَّهُمَّ كَمَا حَسَّنْتَ خَلْقِي، فَحَسِّنْ خُلُقِي». رَوَاهُ أَحْمَدُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1331. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "ఓ దేవా! నీవు నా రూపురేఖలను అందంగా మలచినట్లే, నా నడవడికను కూడా ఉత్తమంగా మలచు." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

సాధారణంగా అద్దం చూసుకున్నప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా వేడుకునేవారు. సృష్టి ప్రక్రియ రీత్యాగానీ, సత్ప్రవర్తన రీత్యాగానీ ఆయన (స) అందరికన్నా శ్రేష్ఠులు. అయినప్పటికీ ఆయన (స) ఇలా ప్రార్థించారంటే తన అనుచర సమాజం మేలు కోరి ఆయన (స) ఇలా చేశారు. వేడుకోలు వచనాలు అరబీలో ఇలా ఉన్నాయి - "అల్లాహుమ్మ కమా హస్సన్త ఖల్ఖీ ఫహస్సిన్ ఖుల్ఖీ."

**6వ అధ్యాయం**

## ٦ - بَابُ الذِّكْرِ وَالدُّعَاءِ

## ధ్యానం మరియు దుఆ

(١٣٣٢) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «يَقُولُ اللَّهُ تَعَالَى: أَنَا مَعَ عَبْدِي مَا ذَكَرَنِي

1332. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు - "నా దాసుడు నన్ను స్మరించినంతసేపూ, నా కోసం అతని అధరాలు కదలాడుతూ ఉన్నంతసేపూ నేనతనికి తోడుగా ఉంటాను." (ఈ హదీసును ఇబ్నెమాజా వెలికి తీశారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని

وَتَحَرَّكَتْ بِي شَفَتَاهُ». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ، وَذَكَرَهُ الْبُخَارِيُّ تَعْلِيقاً.

ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు. బుఖారీ దీని పూర్తి పరంపరను ప్రస్తావించకుండానే పొందుపరచారు)

**సారాంశం**

దైవధ్యానం, దైవనామ స్మరణల ప్రాశస్త్యం, మహత్మ్యం ఈ హదీసులో వివరించబడింది. దైవనామ స్మరణ వల్ల భక్తునికి కలిగే గొప్ప లాభం ఏమిటంటే, అతనికి దేవుని సామీప్యం లభిస్తుంది. ఇక దైవధ్యానం (జిక్ర్) అంటే ఏమిటీ? దేవుని ఏకత్వాన్ని, ఆయన గొప్పదనాన్ని స్తుతించటం! ఆయన పవిత్రతను కొనియాడటం!! దేవుని పట్ల అంతరంగంలో ఏర్పడివున్న ఆ పవిత్ర భావాలను నోటితో పలకటం!!! వేడుకోలు (దుఆ) లోనూ - ధ్యానం (జిక్ర్)లోనూ కొంచెం తేడా ఉంది. వేడుకోలులో కోరిక కలగలసి ఉంటుంది. కాని ధ్యానంలో కోరిక ఉండదు. కేవలం దేవుని ఘనతను, పవిత్రతను స్తుతించటమే ధ్యానం యొక్క ఉద్దేశ్యం అయి ఉంటుంది.

(١٣٣٣) وَعَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا عَمِلَ ابْنُ آدَمَ عَمَلاً أَنْجَى لَهُ مِنْ عَذَابِ اللهِ مِنْ ذِكْرِ اللهِ». أَخْرَجَهُ ابْنُ أَبِي شَيْبَةَ وَالطَّبَرَانِيُّ بِإِسْنَادٍ حَسَنٍ.

1333. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఆదం పుత్రుని ఏ ఆచరణ కూడా దైవనామ స్మరణను మించి దేవుని శిక్ష నుండి విముక్తం కలిగించదు." (ఈ హదీసును ఇబ్నె అబీ షైబా మరియు తబ్రానీ హసన్ పరంపర ఆధారంగా సేకరించారు)

**సారాంశం**

దైవనామ స్మరణ దేవుని శిక్షనుండి ముక్తిని కలిగిస్తుందని పై హదీసులో సెలవీయబడింది. పరలోక శిక్షనుండి మనిషిని కాపాడినట్లే ఈ దైవ నామస్మరణ ఇహలోకంలోనూ మనిషిని అశాంతి అలజడులనుంచీ, మానసిక వ్యాకులత నుండి రక్షిస్తుంది. ఇహలోకంలో మనిషికి ప్రతికూల పవనాలు ఎదురైనపుడు, ముఖ్యంగా మిథ్యావాదుల, దైవధిక్కారుల తరపునుంచి వేధింపులు మొదలైనప్పుడు అతడు ఓర్పుతో దైవ సహాయం అర్థించాలి, దైవాన్ని ధ్యానించాలని ఆదేశించబడింది. ఎందుకంటే అతడు దైవనామాన్ని స్మరిస్తున్నంతసేపూ దేవుడు అతనికి తోడుగా ఉంటాడు. ధర్మయుద్ధ సందర్భంగా కూడా యోధుడు తన నిజ ప్రభువును స్మరించినపుడు ఆయన అతనికి అండగా ఉంటాడు. తద్వారా విశ్వాసి రణరంగంలో అవలీలగా తన శత్రువును ఓడిస్తాడు.

(١٣٣٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا جَلَسَ قَوْمٌ مَجْلِساً يَذْكُرُونَ اللَّهَ فِيهِ إِلاَّ حَفَّتْهُمُ ٱلْمَلاَئِكَةُ، وَغَشِيَتْهُمُ الرَّحْمَةُ، وَذَكَرَهُمُ اللَّهُ فِيمَنْ عِنْدَهُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1334. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "ఏ ప్రజా సమూహమైనా దైవ నామాన్ని స్మరిస్తూ ఒక సమావేశంలో కూర్చొని ఉండగా దైవదూతలు వారిని చుట్టు ముట్టక పోవటం, దైవ కారుణ్యం వారిపై ఆవరించకపోవటం అన్నది అసంభవం. అంతేకాదు, అల్లాహ్ తన దూతల సమక్షంలో వాళ్లను గురించి ప్రస్తావిస్తాడు." (ముస్లిం)

**సారాంశం**

దైవధ్యానం చేస్తూ కూర్చునే వారి సమావేశాలు, సదస్సులు ఎంతో శుభప్రదమైనవని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. దైవధ్యానం ఇతర ఆచరణలన్నింటికన్నా మేలైనదని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. కొందరు సజ్జనులు దీని గురించి ఇలా వ్యాఖ్యానించారు : "దైవస్తోత్రం చేసి, దేవుని పవిత్రతను కొనియాడితే, దైవగ్రంథ పారాయణం చేస్తే అది నోటి ధ్యానం అవుతుంది. దైవభీతితో కళ్ళు చెమ్మగిల్లితే అది కంటి ధ్యానం అవుతుంది. దైవ వచనాలను, ధర్మోపదేశాలను జాగ్రత్తగా వింటే అవి చెవుల ధ్యానం అనిపించుకుంటుంది. దైవమార్గంలో ఖర్చుపెడితే అది చేతుల ధ్యానం అవుతుంది. అనునిత్యం అతని కార్యకలాపాలు దైవమార్గంలో కొనసాగినట్లయితే అది శరీరావయవాల ధ్యానం అవుతుంది. అనుక్షణం దైవానికి భయపడుతూ, దేవుని కారుణ్యం పట్ల ఆశాభావం కల్గి ఉంటే అది మనసు ధ్యానం అవుతుంది. సర్వస్వాన్నీ దేవుని పేర అర్పించి, దైవేచ్ఛపై రాజీపడిపోతే అది ఆత్మ ధ్యానం అవుతుంది. ఆ విధంగా మానవుడు మూర్తీభవించిన ధ్యానంగా మారిపోతాడు. దైవధ్యానం యొక్క అసలు ఉద్దేశ్యం ఇదే."

(١٣٣٥) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا قَعَدَ قَوْمٌ مَقْعَداً لَمْ يَذْكُرُوا اللَّهَ فِيهِ، وَلَمْ يُصَلُّوا عَلَى النَّبِيِّ ﷺ إِلاَّ كَانَ

1335. హజ్రత్ అబూహురైరా (రజి) గారి చేతనే ఉల్లేఖించబడిన మరో కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఏ ప్రజా సమూహమైనా తాను కూర్చున్న సదనంలో దైవనామ స్మరణ చేయటంగానీ, దైవప్రవక్త

عَلَيْهِمْ حَسْرَةً يَوْمَ الْقِيَامَةِ». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَقَالَ: حَسَنٌ.

(సఅసం)పై శాంతిని కురిపించమని వేడుకోవటంగానీ చేయకపోతే, ఆ సదనం ప్రళయదినాన వాళ్ళపాలిట తలవంపుగా పరిణమిస్తుంది." (దీనిని తిర్మిజీ సేకరించి, హసన్‌గా ఖరారు చేశారు)

**సారాంశం**

ప్రతి సదస్సులోనూ దైవనామ స్మరణతోపాటు, దైవప్రవక్త (స)పై 'దరూద్' వాక్యాలను కూడా పలకాలని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది. అయితే దరూద్ లేక సలామ్ పేరిట ఈ మధ్య కాలంలో మననాట ప్రబలిన పోకడ మహాప్రవక్త (స) కాలంలోగానీ, ప్రియ సహాబీల (రజి) కాలంలో గానీ లేదు. ఇది ప్రజలు కల్పించుకున్న కొత్త పుంత. దీన్ని వారు పుణ్యప్రదమైన అంశంగా భావించినప్పటికీ, నిజానికి అదొక బిద్అత్ - ధర్మంలో కల్పించబడిన ఓ కొత్త ఆచారం!

సామూహిక ధ్యానంలో ఖుర్ఆన్ హదీసుల ఉపదేశం, ధార్మిక శిక్షణ అన్నిటికన్నా ఉత్తమమైనవి. అందరూ ఒకచోట కూర్చుని తమ తమ తరపున దైవనామాన్ని స్మరించటం, దరూద్ పఠించటంలో కూడా తప్పలేదు.

(١٣٣٦) وَعَنْ أَبِي أَيُّوبَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ قَالَ: لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَحْدَهُ، لاَ شَرِيكَ لَهُ، لَهُ الْمُلْكُ، وَلَهُ الحَمْدُ، بِيَدِهِ الْخَيْرُ، يُحْيِي وَيُمِيتُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ، عَشْرَ مَرَّاتٍ، كَانَ كَمَنْ أَعْتَقَ أَرْبَعَةَ أَنْفُسٍ مِنْ وَلَدِ إِسْمَاعِيلَ». مُتَّفَقٌ عَلَيْهِ.

1336. హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవడు ఈ వచనాలను పదిసార్లు పలుకుతాడో అతను ఇస్మాయీల్ సంతతికి చెందిన నలుగురు అత్యుత్తమ బానిసల్ని విడుదల చేసిన వానితో సమానం. ఆ వచనాలివి: "లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీకలహు లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు బియదిహిల్ ఖైర్ యుహ్‌యీ వ యుమీతు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్."

(అనువాదం: అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయన ఒక్కడే. ఆయనకు సహవర్తులు ఎవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. సమస్త స్తోత్రములు, ప్రశంసలు ఆయనకే శోభిస్తాయి. మేళ్ళన్నీ ఆయన హస్తగతమై ఉన్నాయి. బ్రతికించేవాడూ, చంపేవాడూ ఆయనే. ఆయన ప్రతి దాన్నీ చేయగల సమర్థుడు.) (బుఖారీ, ముస్లిం)

(١٣٣٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**مَنْ قَالَ: سُبْحَانَ اللَّهِ وَبِحَمْدِهِ، مِائَةَ مَرَّةٍ، حُطَّتْ عَنْهُ خَطَايَاهُ، وَإِنْ كَانَتْ مِثْلَ زَبَدِ البَحْرِ**». مُتَّفَقٌ عَلَيْهِ.

1337. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "ఎవరయితే సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ (అల్లాహ్ తన స్తోత్ర సమేతంగా పవిత్రుడు) అన్న వచనాన్ని వందసార్లు పలికాడో అతని పాపాలు -అవి సముద్రపు నురుగుకు సమానంగా ఉన్నాసరే- తొలగించబడతాయి." (బుఖారీ, ముస్లిం)

(١٣٣٨) وَعَنْ جُوَيْرِيَةَ بِنْتِ الْحَارِثِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: قَالَ لِيْ رَسُولُ اللهِ ﷺ: «**لَقَدْ قُلْتُ بَعْدَكِ أَرْبَعَ كَلِمَاتٍ لَوْ وُزِنَتْ بِمَا قُلْتِ مُنْذُ اليَوْمِ لَوَزَنَتْهُنَّ: سُبْحَانَ اللهِ وَبِحَمْدِهِ، عَدَدَ خَلْقِهِ، وَرِضَاءَ نَفْسِهِ، وَزِنَةَ عَرْشِهِ، وَمِدَادَ كَلِمَاتِهِ**». أَخْرَجَهُ مُسْلِمٌ.

1338. జువైరియా బిన్తె హారిస్ (ర.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సఅసం) నాకు ఇలా ఉపదేశించారు : "నేను నీ తరువాత నాలుగు వచనాలు పఠించాను. మొదటినుంచీ ఇప్పటి వరకూ నువ్వు పఠించిన నీ వచనాలతో వీటిని పోలిస్తే, ఈ వచనాలు బరువులో మించిపోతాయి. ఆ వచనాలివి : (1) సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ, అదద ఖల్ఖిహీ (2) వ రిజాఅ నఫ్సిహీ (3) వ జినత అర్షిహీ (4) వ మిదాద కలిమాతిహీ (అనువాదం : అల్లాహ్ పవిత్రుడు - తన స్తోత్ర సమేతంగా, తన సృష్టితాల సంఖ్యకు సమానంగా. ఆయన ప్రసన్నత - ఆయన సింహాసనపు బరువు, ఆయన వచనాల విస్తృతికి సమానంగా)

(ముస్లిం)

**హదీసు ఉల్లేఖకులు**

జువైరియా బిన్తె హారిస్ (ర.అన్హా) : విశ్వాసుల మాతలలో ఒకరు. ముర్రైసిఆ యుద్ధంలో ఖైదీగా పట్టుబడ్డారు. సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమ్మాస్ వాటాలోకి వచ్చారు. అయితే ఆయన ఈమెగారితో ముకాతబత్ (విడుదలకు సంబంధించిన ఒప్పందం) చేసుకున్నారు. ఆ ముకాతబత్ మొత్తాన్ని దైవప్రవక్త (స) ఆయనకు చెల్లించి ఈమెను తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు. ఈ శుభవార్త వినగానే ప్రవక్త సహచరులంతా ఆమె వర్గానికి చెందిన ఖైదీలందరినీ విడిచిపెట్టేశారు. ఈ విధంగా ఈమెగారు తన తెగవారి పాలిట అందరికన్నా ఎక్కువ భాగ్యవంతురాలిగా పరిణమించారు. హిజ్రీ 56వ యేట మరణించారు.

(١٣٣٩) وَعَنْ أَبِي سَعِيْدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**البَاقِيَاتُ الصَّالِحَاتُ: لاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَسُبْحَانَ اللهِ، وَاللَّهُ أَكْبَرُ، وَالْحَمْدُلِلَّهِ، وَلاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللهِ**». أَخْرَجَهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

1339. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : 'చివరకు మిగిలే సత్కర్మలు' ఇవి: "లా ఇలాహ ఇల్లల్లాహు వ సుబ్హా నల్లాహి వల్హాహు అక్బర్. అల్హమ్దు లిల్లాహి వలా హౌలా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్." (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. అల్లాహ్ పవిత్రుడు. అందరి కన్నా గొప్పవాడు. స్తోత్రం ఆయన కొరకే. కీడును తొలగించడమైనా, మేలు పొందడమైనా అల్లాహ్ సహాయం లేనిదే సాధ్యం కాదు.) (అన్న వచనాలను మనసా వాచా విశ్వసించాలి).

(ఈ హదీసును నసాయి సేకరించారు. ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

అరబీలో "బాఖియాతుస్సాలిహాత్" అనే పదం వచ్చింది. అంటే మనిషి చనిపోయినప్పటికీ మిగిలి ఉండే అతని మంచి కర్మలు అని అర్థం. దైవ విధేయతతో కూడిన, లోక కళ్యాణానికి

ఉద్దేశ్యించిన ప్రతి పనీ మిగిలి ఉంటుంది. పై హదీసులో ప్రస్తావించబడిన వచనాలు కూడా దేవుని పట్ల గల నిష్కల్మషమైన విశ్వాసానికి ప్రతిబింబం వంటివి. అద్వితీయుడైన దేవుని యెడల గల ఈ విశ్వాసం సకల సదాచరణలకు, మేళ్ళకు నరోవరం వంటిది. ఈ 'విశ్వాసం' లేకుండా చేసే ఏ సత్కార్యం కూడా స్వీకృతి పొందదు. కాబట్టి హదీసులోని ఈ వచనాలు 'బాఖియాతుస్సాలిహాత్'కి వ్రేళ్ల వంటివి.

(١٣٤٠) وَعَنْ سَمُرَةَ بْنِ جُنْدُبٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «أَحَبُّ الْكَلَامِ إِلَى اللهِ أَرْبَعٌ، لاَ يَضُرُّكَ بِأَيِّهِنَّ بَدَأْتَ: سُبْحَانَ اللهِ، وَالْحَمْدُللهِ، وَلاَ إِلَهَ إِلاَّ اللَّهُ، وَاللَّهُ أَكْبَرُ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1340. హాజత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ఉద్బోధించారు: "దైవ నన్నిధిలో అన్నిటికన్నా ప్రియమైనవి, ఇష్టకరమైనవి ఈ నాలుగు పదాలు- వీటిలో ఏ ఒక్క దానితో మొదలెట్టినా నీకు హాని కలగదు- (అవేమంటే) సుబ్‌హానల్లాహి వల్‌హమ్దు లిల్లాహ్ వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ ((1) అల్లాహ్ పవిత్రుడు. (2) ఘనతకు, గొప్పదనానికి అధిపతి అయిన ఆయనకే సమస్త స్తోత్రాలు. (3) అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్య దైవం లేనేలేడు. (4) అల్లాహ్ అందరి కన్నా గొప్పవాడు.)"
(ముస్లిం)

(١٣٤١) وَعَنْ أَبِي مُوسَى الأَشْعَرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ لِي رَسُولُ اللهِ ﷺ: «يَا عَبْدَ اللهِ بْنَ قَيْسٍ! أَلاَ أَدُلُّكَ عَلَى كَنْزٍ مِنْ كُنُوزِ الجَنَّةِ؟ لاَ حَوْلَ وَلاَ قُوَّةَ إِلاَّ بِاللهِ». مُتَّفَقٌ عَلَيْهِ. زَادَ النَّسَائِيُّ: «وَلاَ مَلْجَأَ مِنَ اللهِ إِلاَّ إِلَيْهِ».

1341. తనను ఉద్దేశ్యించి దైవప్రవక్త (స) ఈ విధంగా సెలవిచ్చారని హాజత్ అబూ మూసా అష్‌అరీ (రజి) చెప్పారు: "ఓ అబ్దుల్లా బిన్ ఖైస్! స్వర్గంలోని నిధులలో ఒక నిధి ఏదో నేను నీకు తెలుపనా?- చెడునుంచి ముఖం త్రిప్పుకోవటం మరియు దైవసహాయం లేకుండా సత్కార్యం గురించి నొక్కి వక్కాణించటం సంభవం కాదు (అన్న యదార్థాన్ని గ్రహించటం.)" (బుఖారీ, ముస్లిం). "అల్లాహ్ వద్ద తప్ప వేరొక చోట ఆశ్రయం లేదు" అన్న వాక్యం నసాయిలో అదనంగా ఉంది.

**సారాంశం**

ఈ హదీసులో కూడా "లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి" యొక్క మహిమ గురించి చెప్పబడింది. ఒక వస్తువు ఎంత స్వచ్ఛమైంది, ఖరీదైనదై ఉంటుందో దాని అజ మాయిషీ కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. దాని భద్రత కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబడతాయి. కాగా; ఈ వచనాలు స్వర్గ నిధి వంటివి. కనుక వీటిని జాగ్రత్తగా కాపాడుకోవటం అవసరం. అంటే వీలయినంత అధికంగా వాటిని స్మరించాలి.

(١٣٤٢) وَعَنِ النُّعْمَانِ بْنِ بَشِيْرٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إِنَّ الدُّعَاءَ هُوَ الْعِبَادَةُ». رَوَاهُ الْأَرْبَعَةُ وَصَحَّحَهُ التِّرْمِذِيُّ.

1342. హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు - "నిస్సందేహంగా దుఆయే (వేడుకోలే) దైవారాధన. (దీనిని 'నలుగురు' ఉల్లేఖించగా, తిర్మిజీ ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

وَلَهُ مِنْ حَدِيْثِ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، مَرْفُوعاً، بِلَفْظِ: «الدُّعَاءُ مُخُّ الْعِبَادَةِ».

తిర్మిజీలోని హజ్రత్ అనస్ (రజి) కథనంలో 'అద్దుఆవు ముఖ్ఖుల్ ఇబాద' (దుఆ దైవారాధనా సారం వంటిది) అన్న వాక్యం ఉంది.

وَلَهُ مِنْ حَدِيْثِ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، رَفَعَهُ: «لَيْسَ شَيْءٌ أَكْرَمَ عَلَى اللهِ مِنَ الدُّعَاءِ». وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

తిర్మిజీలోనే హజ్రత్ అబూహురైరా (రజి)చే ఈ విధంగా ఉల్లేఖించబడింది: "దైవసన్నిధిలో దుఆ కన్నా ఎక్కువ గౌరవప్రదమైన వస్తువు మరొకటి లేదు." (ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ లిరువురూ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసులో దుఆ ఆరాధనగా ఖరారు చేయబడింది. దుఆలో మనిషి ఎవరిని అర్థిస్తాడు? నిజదైవాన్నే కదా! నిజదైవాన్ని అర్థించటం ఆరాధన అయినపుడు, మనిషి తన అవసరాల కోసం, కష్టాల నుంచి విముక్తి కోసం దైవేతరుల్ని అర్థించటం షిర్క్ (బహుదైవారాధన) అవుతుంది.

దుఆ ఎంత ప్రభావవంతమైందో అంచనా వేయదలచుకుంటే తబ్రానీలోగల హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనాన్ని పరిశీలించండి : కొన్ని సందర్భాలలో నింగినుంచి నేల మీదకు ఏదన్నా ఆపద అవతరిస్తున్న క్షణంలోనే కాకతాళీయంగా మనిషి భూమ్యాకాశాల ప్రభువును చేతులెత్తి అర్థిస్తూ ఉంటాడు. ఒకవైపున పై నుంచి క్రిందికి దిగివచ్చే ఆపద! మరో వైపున క్రింది నుంచి పైకి వెళుతున్న దాసుని అభ్యర్థన! ఇవి రెండూ శూన్యంలో ఢీ కొంటాయి. చిత్తశుద్ధితో కూడిన దాసుని అభ్యర్థన ఎంత ప్రభావం గలదో చూడండి! అది ఆ ఆపదను భువి పైకి రాకుండా ఆపేస్తుంది!

(١٣٤٣) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**الدُّعَاءُ بَيْنَ الأَذَانِ وَالإِقَامَةِ لاَ يُرَدّ**». أَخْرَجَهُ النَّسَائِيُّ وَغَيْرُهُ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَغَيْرُهُ.

1343. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "అజాన్ మరియు ఇఖామత్‌ల మధ్య (సమయంలో) చేసే దుఆ (వేడుకోలు) రద్దు చేయబడదు." (దీనిని నసాయి తదితరులు ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ తదితరులు దీన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

దుఆ స్వీకారయోగ్యం అవడానికి కొన్ని ప్రత్యేక ఘడియలున్నాయి. వాటిలో ఒకటి అజాన్ మరియు ఇఖామత్‌ల మధ్య గల ఘడియ. ఎందుకంటే ఆ సమయంలో మనిషి నమాజ్ కోసం సమాయత్తమై మస్జిదుకు వస్తాడు. అంటే, అతడు తన దైనందిన కార్యక్రమాలను ప్రక్కనబెట్టి దేవుని వైపునకు మరలివస్తాడు. సామూహిక నమాజు కోసం నిరీక్షిస్తూ ఉంటాడు. ఆ ఘడియలో ఆరాధనా గృహంలో ఒక లాంటి అనిర్వచనీయమైన వాతావరణం ఏర్పడుతుంది. తన వైపునకు తరలివస్తున్న దాసులను సర్వోన్నత ప్రభువు ఆసక్తికరంగా గమనిస్తూ ఉండే ప్రత్యేక ఘడియ అది! అందుకే ఆ కీలక ఘడియలో మనిషి తన కాలాన్ని వ్యర్థ ప్రేలాపనలతో వృధా చేయకూడదు.

(١٣٤٤) وَعَنْ سَلْمَانَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**إِنَّ رَبَّكُمْ كَرِيمٌ، يَسْتَحِي مِنْ عَبْدِهِ إِذَا رَفَعَ إِلَيْهِ يَدَيْهِ أَنْ يَرُدَّهُمَا صِفْراً**». أَخْرَجَهُ الأَرْبَعَةُ إِلاَّ النَّسَائِيَّ وَصَحَّحَهُ الْحَاكِمُ.

1344. హజ్రత్ సల్మాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు : "మీ ప్రభువు ఎంతో ఉదాత్తుడు, బిడియం కలవాడు. తన దాసుడు తన సన్నిధిలో చేతులు చాచి అర్థించినపుడు వట్టి చేతులతో మరలించడానికి ఆయన సిగ్గుపడతాడు."

('నలుగురి'లో నసాయి మినహా మిగిలిన వారు దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

చేతులెత్తి దుఆ చేయటం సమంజసమేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. పైగా దుఆ మర్యాదలలో ఇది కూడా ఒకటి. అల్లాహ్ సన్నిధిలో ఎత్తబడిన అశక్తుడైన దాసుని చేతులు వట్టిగా వాపసు చేయబడవు. దుఆయే ఇస్తిస్ఖా సమయంలో దైవప్రవక్త (స) మామూలు దుఆ సమయాల కన్నా మరింత పైకి తన చేతుల్ని ఎత్తేవారు.

(١٣٤٥) وَعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ إِذَا مَدَّ يَدَيْهِ فِي الدُّعَاءِ لَمْ يَرُدُّهُمَا حَتَّى يَمْسَحَ بِهِمَا وَجْهَهُ. أَخْرَجَهُ التِّرْمِذِيُّ. وَلَهُ شَوَاهِدُ مِنْهَا حَدِيْثُ ابْنِ عَبَّاسٍ عِنْدَ أَبِي دَاوُدَ وَغَيْرِهِ، وَمَجْمُوعُهَا يَقْتَضِي أَنَّهُ حَدِيْثٌ حَسَنٌ.

1345. హజ్రత్ ఉమర్ (రజి) కథనం : "దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) 'దుఆ' కోసం చేతులెత్తిన తరువాత అరచేతులను తన ముఖారవిందంపై స్పర్శించేదాకా చేతులు దించేవారు కారు." (దీనిని తిర్మిజీ వెలికి తీశారు. దీనిని సమర్థించే హదీసులనేకం ఉన్నాయి. అబూదావూద్ ప్రభృతుల వద్ద గల ఇబ్నె అబ్బాస్ (రజి) హదీసు కూడా వాటిలో ఒకటి. మొత్తానికి ఈ హదీసు హసన్ కోవకు చెందినదని తెలుస్తోంది.)

**సారాంశం**

దుఆ (వేడుకోలు, ప్రార్థన)ను ముగించిన తరువాత రెండు అరచేతులను ముఖంపై తుడుచుకోవటమో లేక త్రిప్పుకోవటమో చేయాలని ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. ఎందుకంటే దుఆ కొరకు ఎత్తబడిన చేతులు దైవకారుణ్యంతో నిండి ఉంటాయి. అందుకే ఆ చేతులను కృతజ్ఞతా భావంతో మొహానికి అద్దుకోవాలి. మొహం శరీరావయవాలలోకెల్లా అత్యంత గౌరవప్రదమైన అవయవం. అదీగాక ముఖారవిందం సమస్త శరీరావయవాల స్థితిని వ్యక్తపరిచే ప్రతినిధి లాంటిది. ఈ ప్రతినిధికి గనక ఆ గౌరవం లభిస్తే శరీరావయవాలన్నింటికీ ప్రాతినిధ్యం లభించినట్టే.

ఈ హదీసు పరంపరలో ఒకరైన హమ్మాద్ బిన్ ఈసా జుహ్నీ బలహీన ఉల్లేఖకులు. అయితే హదీసుకు సంబంధించిన ఇతర సాక్షులు కూడా ఉండటం వల్ల హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మాలై) ఈ హదీసును హసన్‌గా ఖరారు చేశారు.

(١٣٤٦) وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِنَّ أَوْلَى النَّاسِ بِي يَوْمَ الْقِيَامَةِ أَكْثَرُهُمْ عَلَيَّ

1346. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "నాపై శాంతిని కురిపించమని అత్యధి

صَلاَةً». أَخْرَجَهُ التِّرْمِذِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

కంగా దైవాన్ని వేడుకునే వారు ప్రళయ దినాన నాకు అత్యంత సమీపంలో ఉంటారు.'' (తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా పేర్కొన్నారు)

**సారాంశం**

తీర్పుదినాన అంతిమ దైవ సందేశహరులైన ముహమ్మద్ (సఅసం) సామీప్యాన్ని, సహచర్యాన్ని పొందగొనేవారు అత్యధికంగా ఆయన (స) పై దరూద్ వాక్యాలను పఠిస్తూ ఉండాలని ఇందులో చెప్పబడింది. ఇమామ్ ఇబ్నె హిబ్బాన్ ఈ హదీసు నేపథ్యంలో ఇలా వ్యాఖ్యానించారు: ''ఈ హదీసు ద్వారా హదీసు వేత్తల ప్రాశస్త్యం స్పష్టమవుతున్నది. వాళ్ళు అహోరాత్రులు మాట్లాడుతూ, లిఖిస్తూ దైవప్రవక్త (స)పై దరూదె షరీఫ్ పంపిస్తూ ఉంటారు. దరూద్‌కు సంబంధించిన అనేక వాక్యాలు హదీసులో ఉన్నాయి. వాటన్నిటిలోకీ శ్రేష్ఠమైనది 'దరూదె ఇబ్రాహీమ్'. ఇది ప్రతి నమాజులో పఠించబడుతుంది.

(١٣٤٧) وَعَنْ شَدَّادِ بْنِ أَوْسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «سَيِّدُ الاسْتِغْفَارِ أَنْ يَقُولَ الْعَبْدُ: اللَّهُمَّ! أَنْتَ رَبِّي، لاَ إِلَهَ إِلاَّ أَنْتَ، خَلَقْتَنِي، وَأَنَا عَبْدُكَ، وَأَنَا عَلَى عَهْدِكَ وَوَعْدِكَ مَا اسْتَطَعْتُ، أَعُوذُ بِكَ مِنْ شَرِّ مَا صَنَعْتُ، أَبُوءُ لَكَ بِنِعْمَتِكَ

1347. హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: అత్యుత్తమ శ్రేణికి చెందిన మన్నింపు వాక్యాలు (సయ్యిదుల్ ఇస్తిగ్ఫార్) ఏమిటంటే దాసుడు ఈ విధంగా వేడుకోవాలి : ''ఓ దేవా! నీవు మా ప్రభువు మరియు సంరక్షకుడవు. నీవు తప్ప మరో ఆరాధ్యదైవం లేదు. నన్ను సృష్టించిన వాడవు నువ్వే. నేను నీ దాసుడను. నా శక్తి వంచన లేకుండా నీ మాటకు, నీకిచ్చిన వాగ్దానానికి కట్టుబడి ఉన్నాను. నేను ఒడిగట్టిన అపరాధపు బారినుండి నీ శరణు వేడుతున్నాను. నీవు నాకు చేసిన ఉపకారాలను ఒప్పుకుంటున్నాను. నీ సమక్షంలో నా పాపాలను అంగీకరిస్తున్నాను. కనుక (స్వామీ!)

عَلَيَّ، وَأَبُوءُ لَكَ بِذَنْبِي، فَاغْفِرْ لِي، فَإِنَّهُ لاَ يَغْفِرُ الذُّنُوبَ إِلاَّ أَنْتَ». أَخْرَجَهُ الْبُخَارِيُّ.

నన్ను మన్నించు. నీవు తప్ప పాపాలను మన్నించే వాడెవడూ లేడు." (బుఖారీ)

(١٣٤٨) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: لَمْ يَكُنْ رَسُولُ اللهِ ﷺ يَدَعُ هٰؤُلاَءِ الْكَلِمَاتِ، حِيْنَ يُمْسِي وَحِيْنَ يُصْبِحُ: «اللَّهُمَّ! إِنِّي أَسْأَلُكَ الْعَافِيَةَ فِي دِيْنِي وَدُنْيَايَ وَأَهْلِي وَمَالِي، اللَّهُمَّ اسْتُرْ عَوْرَاتِي، وَآمِنْ رَوْعَاتِي، وَاحْفَظْنِي مِنْ بَيْنِ يَدَيَّ، وَمِنْ خَلْفِي، وَعَنْ يَمِيْنِي، وَعَنْ شِمَالِي، وَمِنْ فَوْقِي، وَأَعُوذُ بِعَظَمَتِكَ أَنْ أُغْتَالَ مِنْ تَحْتِي». أَخْرَجَهُ النَّسَائِيُّ وَابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1348. హాజత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ వచనాలను రేయింబవళ్ళలో ఎన్నడూ విడనాడేవారు కాదు. (అవేమంటే) "ఓ దేవా! నా ధర్మం (పరలోకం), నా ఇహలోకం, నా ఆలుబిడ్డలు, నా సిరిసంపదల విషయంలో నేను నీ రక్షణ కోర్తున్నాను. స్వామీ! నా లోపాలను తెరమరుగు గావించు, భీతావహ స్థితినుంచీ, ఖేదం నుంచి నన్ను కాపాడు. దేవా! ముందు నుంచీ, వెనుక నుంచీ, కుడి ఎడమల నుంచీ నన్ను రక్షించు. అకస్మాత్తుగా క్రింది నుంచి వినాశనం గావించబడటం నుంచి నేను నీ ఔన్నత్యపు శరణు కోరుతున్నాను." (నసాయి, ఇబ్నెమాజా దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా పేర్కొన్నారు)

**సారాంశం**

ఈ హదీసులో ఆరు వైపుల నుంచి దేవుని రక్షణ కోరటం జరిగింది. ఎందుకంటే మానవుడు పై నుంచీ, క్రింది నుంచీ, కుడి వైపు నుంచీ, ఎడమ వైపునుంచీ - నలు వైపుల నుంచీ శత్రువుల వ్యూహంలో చిక్కుకుని ఉన్నాడు. ఈ శత్రువులు మనుషుల్లో, జిన్నుల్లో, షైతానుల్లో కూడా ఉన్నారు. ముఖ్యంగా భూమిలో కూరుకుపోవటం, ముంపునకు గురవటం వంటి ప్రమాదాల నుంచి శరణు కోరబడింది. దాంతోపాటు ధర్మావలంబనలో చిత్తశుద్ధి, పాపాలకు దూరంగా ఉండటం, ఇహలోకంలో శాంతి, ఆలుబిడ్డల క్షేమం, సిరిసంపదల్లో శుభశ్రేయాలు ఒనగూరటం, గోచర అగోచర ఆపదల నుండి సురక్షితంగా ఉండటం, రోగాల బారినుండి కుశలంగా ఉండటం వంటి వివిధ విషయాలలో కూడా దేవుని శరణు కోరటం జరిగింది. నిజానికి ఈ కడగండ్ల బారినుండి మానవులను కాపాడేవాడు ఆ ఒక్క దేవుడే. ఆయన

కటాక్ష వీక్షణాలు లేకుండా ఏ మనిషీ తన పాపాలనుండి, తన శత్రువుల నుండి సురక్షితంగా ఉండలేడు సుమా!

(١٣٤٩) وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ: **«اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ زَوَالِ نِعْمَتِكَ، وَتَحَوُّلِ عَافِيَتِكَ، وَفُجَاءَةِ نِقْمَتِكَ، وَجَمِيعِ سَخَطِكَ»**. أَخْرَجَهُ مُسْلِمٌ.

1349. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరచూ ఈ విధంగా ప్రవచించేవారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు : "ఓ అల్లాహ్! నేను నీ అనుగ్రహాల క్రమ క్షీణత నుంచి నీ శరణు కోర్తున్నాను. నీవు ప్రసాదించిన కలిమి కరిగిపోవటం, అకస్మాత్తుగా ఆపద విరుచుకు పడటం, అన్ని రకాల అసమ్మతి ఆవరించటం, ఆగ్రహోదగ్ర స్థితి నెలకొనటం నుంచి (నీ శరణు వేడుతున్నాను)." (ముస్లిం)

**సారాంశం**

దైవానుగ్రహాలు క్షీణ దశలో ఉన్నాయంటే అది మనిషి స్వయంకృతమేనని గ్రహించాలి. మనిషి సంకల్పంలో చెడుగు వచ్చి, అతని కర్మలు పెడత్రోవపడితే అతనిపై నుంచి దేవుని కటాక్ష వీక్షణాలు తొలగిపోతాయి. తత్ఫలితంగా అతడు కష్టాలకు, కడగండ్లకు ఎదురీదవలసిన దుస్థితి ఏర్పడుతుంది. అందుకే అతడు ఎప్పుడయినా దైవానుగ్రహాలు క్షీణించటం నుంచి శరణు వేడుకున్నాడంటే, తన దుష్కర్మల బారినుండి దేవుని శరణు కోరాడని భావించాలి.

(١٣٥٠) وَعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرٍو رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ: **«اللَّهُمَّ! إِنِّي أَعُوذُ بِكَ مِنْ غَلَبَةِ الدَّيْنِ، وَغَلَبَةِ الْعَدُوِّ، وَشَمَاتَةِ الْأَعْدَاءِ»**. رَوَاهُ النَّسَائِيُّ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

1350. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వేడుకుంటూ ఉండేవారు: "దేవా! రుణభారం నుంచి, శత్రువు నాపై ఆధిపత్యం వహించటం నుంచీ, విరోధులు నన్ను చూసి ఇకిలించే దుస్థితి నుంచీ నేను నీ శరణు వేడుతున్నాను." (నసాయి దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

(١٣٥١) وَعَنْ بُرَيْدَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: سَمِعَ النَّبِيُّ ﷺ رَجُلاً يَقُولُ: اللَّهُمَّ! إِنِّي أَسْأَلُكَ بِأَنِّي أَشْهَدُ أَنَّكَ أَنْتَ اللَّهُ، لاَ إِلٰهَ إِلاَّ أَنْتَ، ٱلأَحَدُ الصَّمَدُ، الَّذِيْ لَمْ يَلِدْ وَلَمْ يُوْلَدْ، وَلَمْ يَكُنْ لَهُ كُفُوًا أَحَدٌ. فَقَالَ: «**لَقَدْ سَأَلَ اللَّهَ بِاسْمِهِ الَّذِي إِذَا سُئِلَ بِهِ أَعْطَى، وَإِذَا دُعِيَ بِهِ أَجَابَ**». أَخْرَجَهُ ٱلأَرْبَعَةُ وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

1351. ఒక వ్యక్తి ఈ వేడుకోలు వచనాలు పలుకుతుండగా దైవప్రవక్త (సఅసం) విన్నారని హజ్రత్ బురైద (రజి) చెప్పారు. (ఆ వ్యక్తి ఇలా వేడుకున్నాడు) : "దేవా! నేను నిన్ను అర్థిస్తున్నాను. ఎందుకంటే నీవు తప్ప మరో దేవుడు లేడనీ, నీవు తప్ప ఆరాధించదగినవాడు వేరెవ్వడూ లేడనీ, నీవు ఏకేశ్వరుడవనీ, అక్కర లేనివాడవనీ, ఎవరినీ కనని వాడవనీ, ఎవరికీ సంతానం కాని వాడవనీ, సహవర్తులెవరూ లేనివాడవనీ నేను సాక్ష్యమిస్తున్నాను." దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "ఈ వ్యక్తి అల్లాహ్ యొక్క ఏ గుణగణాల ఆధారంగా అర్థించాడంటే, ఎప్పుడు వీటి ఆధారంగా అర్థించినా ఆయన అనుగ్రహిస్తాడు. దుఆ చేసినప్పుడల్లా ఆయన దానికి ఆమోద ముద్ర వేస్తాడు." (దీనిని అబూదావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజా ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైందిగా ఖరారు చేశారు)

**సారాంశం**

'దుఆ' సందర్భంగా ఈ హదీసులోని వచనాలను పఠించాలనీ, అవి దుఆ స్వీకరించబడటంలో దోహదకారి అవుతాయని దీని సారాంశం.

(١٣٥٢) وَعَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ: إِذَا أَصْبَحَ، يَقُولُ: «**اللَّهُمَّ! بِكَ أَصْبَحْنَا، وَبِكَ أَمْسَيْنَا، وَبِكَ نَحْيَا، وَبِكَ نَمُوتُ، وَإِلَيْكَ**

1352. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : తెల్లవారినప్పుడు దైవప్రవక్త (సఅసం) "ఓ అల్లాహ్! నీ మూలంగానే మేము తెల్లవార్చాము, నీ మూలంగానే మేము సాయంత్రం చేశాము, నీ ద్వారానే మేము జీవిస్తున్నాము, నీ

النُّشُورُ». وَإِذَا أَمْسَى قَالَ مِثْلَ ذٰلِكَ، إِلاَّ أَنَّهُ قَالَ: «وَإِلَيْكَ الْمَصِيرُ». أَخْرَجَهُ الْأَرْبَعَةُ.

ద్వారానే మాకు మరణం సంభవిస్తుంది, నీ వైపునకే వేమము తిరిగి లేపబడనున్నాము" అని పఠించేవారు. సాయంత్రమైనపుడు కూడా ఆయన (స) ఈ వేడుకోలు వచనాలను పఠించేవారు. అయితే 'నీ వైపునకే తిరిగి లేపబడ నున్నాము' అనే బదులు 'నీ వైపునకే మరలి రానున్నాము' అని అనేవారు. (ఈ హదీసును నలుగురు - అబూదావూద్, తిర్మిజీ, నసాయి మరియు ఇబ్నెమాజా - ఉల్లేఖించారు).

**సారాంశం**

మనిషికి ఏ భాగ్యం ప్రాప్తించినా అది దేవుని తరపుననే ప్రాప్తిస్తుందనీ, అందులో వలీల ప్రమేయంగానీ, దైవదూతల ప్రయత్నంగానీ, ప్రవక్తల జోక్యం గానీ ఉండదనీ, వాళ్ళు సయితం దేవుని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటారని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. నిద్రకీ-మరణానికీ ప్రగాఢమైన సంబంధం ఉందని కూడా ఈ హదీసు వల్ల తెలుస్తోంది. మనిషి నిద్రనుండి మేల్కొన్నాడంటే ఒక విధంగా చచ్చి బ్రతికినట్లే. అందుకే సాయంత్రం పూట చేసే వేడుకోలులో 'మసీర్' (మరలి రానున్నాము) అనే పదం ఉపయోగించబడింది. ఎందుకంటే అది నిద్రించే సమయం.

(١٣٥٣) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ أَكْثَرُ دُعَاءِ رَسُولِ اللهِ ﷺ: «رَبَّنَا آتِنَا فِي الدُّنْيَا حَسَنَةً، وَفِي الْآخِرَةِ حَسَنَةً، وَقِنَا عَذَابَ النَّارِ». مُتَّفَقٌ عَلَيْهِ.

1353. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అత్యధికంగా ఈ దుఆ చేసే వారు: "ఓ మా ప్రభువా! మాకు ప్రపంచంలోనూ మేలును ఒసగు. పరలోకంలోనూ మేలును ప్రసాదించు. ఇంకా మమ్మల్ని అగ్ని యాతన నుండి కాపాడు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో వచ్చిన అరబీ వేడుకోలు వచనాలను దైవప్రవక్త (సఅసం) అత్యధికంగా పఠించేవారు. ఆ వచనాలు ఇవి: "రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్, వ ఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్."

ఇది ఎంతో సమగ్రమైన వేడుకోలు. ఖాజీ అయాజ్ అభిప్రాయం ప్రకారం ఇహపరాల పరమార్థాలన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. ఈ దుఆలోని 'హసనతన్' అనే పదంలో ప్రాపంచికంగా సత్కార్యాలు, సజ్జన సంతానం, విస్తృతమైన ఉపాధి, ప్రయోజనకరమయిన విద్య, యోగక్షేమాలు అన్నీ వచ్చేస్తాయి. కేవలం ఒక్క 'హసనతన్' అనే పదం పలికి ఈ ప్రాపంచిక శుభాలన్నీ జుర్రుకోవచ్చు.

ఇక పారలౌకికంగా చూస్తే ఈ ఒక్క పదం పలికి స్వర్గప్రవేశాన్ని కోరుకున్నట్లయింది. పరలోకంలో మనిషి ఎదుర్కొనే సంక్లిష్ట సమస్యల, ఆందోళనలనుండి అభయాన్ని, తేలికపాటి లెక్కను, నరకాగ్నినుండి విముక్తిని ప్రభువు సమక్షంలో కోరుకున్నట్లవుతుంది.

(١٣٥٤) وَعَنْ أَبِي مُوسَى الْأَشْعَرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَدْعُو «اللَّهُمَّ اغْفِرْ لِي خَطِيئَتِي وَجَهْلِي وَإِسْرَافِي فِي أَمْرِي، وَمَا أَنْتَ أَعْلَمُ بِهِ مِنِّي، اللَّهُمَّ اغْفِرْ لِي جِدِّي وَهَزْلِي، وَخَطَئِي وَعَمْدِي، وَكُلُّ ذَلِكَ عِنْدِي، اللَّهُمَّ اغْفِرْ لِي مَا قَدَّمْتُ، وَمَا أَخَّرْتُ، وَمَا أَسْرَرْتُ، وَمَا أَعْلَنْتُ، وَمَا أَنْتَ أَعْلَمُ بِهِ مِنِّي، أَنْتَ الْمُقَدِّمُ، وَأَنْتَ الْمُؤَخِّرُ، وَأَنْتَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ». مُتَّفَقٌ عَلَيْهِ.

1354. హజ్రత్ అబూ మూసా అష్అరి (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండేవారు: "ఓ అల్లాహ్! నా తప్పును క్షమించు. అజ్ఞానంతో కూడు కున్న నా పనులను, నా కార్యకలా పాలలో దొర్లిన వైపరీత్యాలను దయతో మన్నించు. ఇంకా - నా గురించి నీకు తెలిసివున్న వాటినన్నింటినీ క్షమించు. ఓ దేవా! సంకల్పికంగా, అసంకల్పికంగా నా వల్ల జరిగిన తప్పిదాలను మన్నించు - అవి నా మరుపువల్ల జరిగినా, ఉద్దేశ్య పూర్వకంగా జరిగినా దానంతటికీ నేనే బాధ్యుడను. స్వామీ! నా వల్ల జరిగి పోయినదీ, ఇకమీదట నేను చేయబో యేదీ, నేను కనిపించకుండా ఉంచినదీ, నా వల్ల బహిర్గతం గావించబడినదీ, నా గురించి నీకు తెలిసినదీ - సర్వాన్నీ క్షమించు. నువ్వే తొలివాడవు, నువ్వే చివరివాడవు. నీవు సర్వమూ చేయగల సమర్థుడవు." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

తన అనుచర సమాజానికి శిక్షణ ఇచ్చే నిమిత్తం దైవప్రవక్త (సఅసం) ఈ విధమైన ప్రార్థనలు చేసేవారు. దైవప్రవక్తలయితే నిర్దోషులు, సాధుస్వభావులు అయి ఉంటారు. వారి ద్వారా ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు జరగవు. ఎప్పుడయినా మానవ సహజమైన దౌర్బల్యం వల్ల పొరబాటు వారి ద్వారా జరగబోతే దేవుడు వారిని ఆ పొరబాటు నుండి కాపాడుతాడు.

పై హదీసులోని 'దుఆ'ను దైవప్రవక్త (స) నమాజు ఆఖరి దశలో - అంటే తషహ్హుద్ చదివిన తరువాత - పఠించేవారు అని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. నమాజు ముగించిన తరువాత పఠించేవారని మరికొంతమంది అభిప్రాయపడ్డారు. రెండు విధాలుగా కూడా ఆయన (స) ఈ దుఆ చేసి ఉండవచ్చు.

(١٣٥٥) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ: «اللَّهُمَّ! أَصْلِحْ لِي دِينِي الَّذِي هُوَ عِصْمَةُ أَمْرِي، وَأَصْلِحْ لِي دُنْيَايَ الَّتِي فِيهَا مَعَاشِي، وَأَصْلِحْ لِي آخِرَتِي الَّتِي إِلَيْهَا مَعَادِي، وَاجْعَلِ الْحَيَاةَ زِيَادَةً لِي فِي كُلِّ خَيْرٍ، وَاجْعَلِ الْمَوْتَ رَاحَةً لِي مِنْ كُلِّ شَرٍّ». أَخْرَجَهُ مُسْلِمٌ.

1355. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా వేడుకునే వారు : "ఓ దేవా! నా కొరకు ధర్మాన్ని సవ్యంగా ఉంచు. ఎందుకంటే నా వ్యవహారాలు చక్కబడేది దీని మూలంగానే. నా కోసం నా ప్రపంచాన్ని సజావుగా ఉంచు. ఎందుకంటే నా జీవితం దానిపైనే ఆధారభూతమై ఉంది. నా కోసం నా పరలోకాన్ని చక్కదిద్దు. ఎందుకంటే నేను మరలి పోవలసింది దాని వైపునకే. (స్వామీ!) నా జీవితాన్ని మంచి పనుల వృద్ధికి మూలకారణంగా మలచు. ఇంకా మరణాన్ని అన్ని రకాల చెడుగుల నుండి ముక్తి దాయినిగా చేయి." (ముస్లిం)

**సారాంశం**

ఈ 'వేడుకోలు'లోనూ ఇహపరాల శుభాలు అర్థించబడ్డాయి. ఇహలోకపు మేలయినా, పరలోకపు శుభమయినా సృష్టికర్త అధీనంలో మాత్రమే ఉంటాయని ఒక నిజ విశ్వాసి దృఢంగా నమ్ముతాడు. ఈ హదీసును చదివిన వారెవరయినా మృత్యువును కోరటం సమంజసం అన్న

అర్థం తీసుకోరాదు. నిజానికి మరణానంతరం ఎదురయ్యే సమస్యలను సులువుగా అధిగమించే ప్రశాంత స్థితిని ప్రసాదించమని మాత్రమే హదీసులో కోరబడింది.

(١٣٥٦) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَقُولُ: «**اللَّهُمَّ انْفَعْنِي بِمَا عَلَّمْتَنِي، وَعَلِّمْنِي مَا يَنْفَعُنِي، وَارْزُقْنِي عِلْماً يَنْفَعُنِي**». رَوَاهُ النَّسَائِيُّ وَالْحَاكِمُ.

1356. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రార్థిస్తూ ఉండేవారు : "ఓ అల్లాహ్! నీవు నాకు ప్రసాదించిన జ్ఞానాన్ని నా పాలిట ప్రయోజనకరమయినదిగా మలచు. నాకు ప్రయోజనాన్ని చేకూర్చే జ్ఞానాన్ని మాత్రమే ప్రసాదించు. ఇంకా నాకు ప్రయోజనదాయకమైన జ్ఞానాన్ని వొసగు." (దీనిని నసాయి మరియు హాకిమ్ ఉల్లేఖించారు)

وَلِلتِّرْمِذِيِّ مِنْ حَدِيثِ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ نَحْوُهُ، وَقَالَ فِي آخِرِهِ: «**وَزِدْنِي عِلْماً. اَلْحَمْدُ للهِ عَلَىٰ كُلِّ حَالٍ، وَأَعُوذُ بِاللهِ مِنْ حَالِ أَهْلِ النَّارِ**». وَإِسْنَادُهُ حَسَنٌ.

తిర్మిజీలో అబూహురైరా (రజి)చే కూడా ఈ విధంగానే ఉల్లేఖించబడింది. అయితే దీని చివర్లో ఈ వాక్యం అదనంగా ఉంది - "నా జ్ఞానంలో వృద్ధినొసగు. సర్వావస్థల్లో దైవానికే కృతజ్ఞతలు. ఇంకా, నేను నరకవాసుల దురవస్థ నుండి దేవుని శరణు కోర్తున్నాను."

**సారాంశం**

ప్రపంచంలోనూ, పరలోకంలోనూ కూడా లాభదాయకమయ్యే విద్యకై ఈ హదీసులో అభ్యర్థించటం జరిగింది. పరలోకంలో వినాశకరంగా పరిణమించే విషయాన్ని అర్థించటం ఒక విశ్వాసికి సుతరామూ శోభించదు. ఎందుకంటే విశ్వాసి దృష్టిలో అసలు సిసలు సాఫల్యం పరలోక సాఫల్యమే. ఇక ప్రయోజనదాయకమైన జ్ఞానం అంటే ఏమిటి? అదెలా ఉంటుంది? అన్న ప్రశ్న ఈ సందర్భంగా అందరి మనసులలో జనించవచ్చు. విశ్వాసానికి శక్తినీ, పుష్టినీ ప్రసాదించి మనిషిని కార్యోన్ముఖుడ్ని చేసేదే అసలు ప్రయోజనకరమైన జ్ఞానం. ప్రాపంచిక వ్యవహారాలను చక్కదిద్దుకుని, అధర్మ విషయాలకు దూరంగా మసలుకునే లక్ష్యంతో ప్రాపంచిక విద్యను అనుగ్రహించమని దైవాన్ని కోరడం కూడా తప్పు కాదు. పైగా ఇలా కోరుకోవటం వల్ల మనిషికి దైవంపై గల ఈమాన్ (విశ్వాసం) పెరుగుతుంది. ప్రాపంచిక విద్యలలో

కూడా ముస్లింలు ముందంజ వేయటం, సమకాలీన సైద్ధాంతిక సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవటం ఎంతైనా అవసరం. లేకపోతే అవిశ్వాసులు అన్ని విధాలుగా వారిపై ఆధిపత్యం సంపాదించి వారి బ్రతుకును దుర్భరం చేసేస్తారు.

ఈనాడు మనం ప్రపంచ పటాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అవగతమయ్యేది కూడా ఇదే! వైజ్ఞానికంగా, సాంకేతికంగా పురోగతి సాధించిన ముస్లిమేతర దేశాలు నేడు యావత్తు ప్రపంచాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నాయి. తమ దగ్గరున్న అణ్వాయుధాల బలంతో ప్రపంచంలో ఎక్కడ ఏ మార్పు తీసుకురావాలనుకున్నా తీసుకురాగలమని వారు క్రియాత్మకంగా చాటి చెబుతున్నారు. అదే సమయంలో అపారమైన చమురు సంపదను కలిగివున్న అరబ్బు దేశాలు దిక్కుతోచక దిక్కులు చూసే నిస్సహాయస్థితికి లోనై ఉన్నాయి. ఈ స్థితి సూచించేదేమిటీ? వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో ముస్లింలు వహించిన అశ్రద్ధకు, అనాసక్తతకు ఇది ప్రతీక కాదా?!

(١٣٥٧) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، أَنَّ النَّبِيَّ ﷺ عَلَّمَهَا هٰذَا الدُّعَاءَ: «**اللَّهُمَّ! إِنِّي أَسْأَلُكَ مِنَ الْخَيْرِ كُلِّهِ، عَاجِلِهِ وَآجِلِهِ، مَا عَلِمْتُ مِنْهُ وَمَا لَمْ أَعْلَمْ، وَأَعُوذُ بِكَ مِنَ الشَّرِّ كُلِّهِ عَاجِلِهِ وَآجِلِهِ، مَا عَلِمْتُ مِنْهُ وَمَا لَمْ أَعْلَمْ، اللَّهُمَّ! إِنِّي أَسْأَلُكَ مِنْ خَيْرِ مَا سَأَلَكَ عَبْدُكَ وَنَبِيُّكَ، وَأَعُوذُ بِكَ مِنْ شَرِّ مَا عَاذَ مِنْهُ عَبْدُكَ وَنَبِيُّكَ، اللَّهُمَّ! إِنِّي أَسْأَلُكَ**

1357. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు ఈ దుఆను నేర్పారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలియ జేశారు. ( ఆ దుఆ ఇది) - "దేవా! నేను అన్ని రకాల మేళ్లను నీ నుండి అర్థిస్తు న్నాను - అవి తొందరగా ప్రాప్తించేవైనా, ఆలస్యంగా ప్రాప్తించేవైనా, అవి నాకు తెలిసినవైనా, తెలియనివైనా! అన్ని రకాల కీడునుంచి నేను నీ శరణు వేడు తున్నాను - అది త్వరగా వచ్చేదైనా, ఆలస్యంగా వచ్చేదైనా, దాని గురించి నాకు తెలిసివున్నా, నా జ్ఞానపరిధిలోకి రానిదైనా సరే. దేవా! నీ దాసుడు మరియు నీ ప్రవక్త ఏ శ్రేయం కొరకు నిన్ను అర్థించారో నేనూ దాని కోసమే నిన్ను వేడుకుంటున్నాను. నీ దాసుడు మరియు ప్రవక్త ఏ కీడు నుంచి నీ శరణు కోరారో నేనూ దాని బారినుంచి నీ రక్షణ కోర్తున్నాను. ఓ అల్లాహ్! నేను నిన్ను స్వర్గం కోసం అభ్యర్థించు కుంటున్నాను. ఏ కర్మ మరియు ఏ వాక్కు స్వర్గానికి సమీపంలో చేరుస్తాయో

الْجَنَّةَ، وَمَا قَرَّبَ إِلَيْهَا مِنْ قَوْلٍ أَوْ عَمَلٍ، وَأَعُوذُ بِكَ مِنَ النَّارِ، وَمَا قَرَّبَ إِلَيْهَا مِنْ قَوْلٍ أَوْ عَمَلٍ، وَأَسْأَلُكَ أَنْ تَجْعَلَ كُلَّ قَضَاءٍ قَضَيْتَهُ لِي خَيْراً». أَخْرَجَهُ ابْنُ مَاجَهْ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ.

వాటి కోసం నిన్ను అర్థిస్తున్నాను. నరకం నుండి నీ రక్షణ కోర్తున్నాను. నరకానికి చేరువ చేసే వాక్కాయ కర్మల నుంచి కూడా నీ రక్షణ కోర్తున్నాను. నీవు నా కొరకు గైకొనే నిర్ణయాన్ని నా పాలిట శ్రేయోదాయకం గావించే విషయమై కూడా నీకు విన్నపం చేసుకుంటున్నాను." (ఇబ్నెమాజా దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్ మరియు హాకిమ్‌లు దృఢమైనదిగా ఖరారు చేశారు).

**సారాంశం**

ఇది కూడా సమగ్రమయిన దుఆలలో ఒకటి. ఈ 'దుఆ'లో పలు విషయాలు కోరబడటంతో పాటు, పలు విషయాల నుండి శరణు వేడుకోవటం కూడా జరిగింది. దైవప్రవక్త (స) ఏ విషయాల కోసం అర్థించారో ఆ విషయాలను తానూ కోరుకుంటున్నానని, ప్రవక్త(స) వారు ఏ హానికరమయిన విషయాల నుండి దేవుని శరణు వేడారో వాటి బారి నుంచి తనూ శరణు వేడుతున్నానని విశ్వాసుల మాతృమూర్తి (ర.అన్హా) అనటం మనమంతా గమనించ దగిన విషయం. ఇహపరాలకు సంబంధించిన ఏ ఒక్క విషయం కూడా ఇందులో ఉపేక్షించబడలేదు.

(١٣٥٨) وَأَخْرَجَ الشَّيْخَانِ عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «كَلِمَتَانِ حَبِيبَتَانِ إِلَى الرَّحْمٰنِ خَفِيفَتَانِ عَلَى اللِّسَانِ ثَقِيلَتَانِ فِي الْمِيزَانِ: سُبْحَانَ اللهِ وَبِحَمْدِهِ سُبْحَانَ اللهِ الْعَظِيمِ».

1358. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: రెండు వచనాలు కరుణామయునికి ఎంతో ప్రియమైనవి. నాలుక (నోటి)పై ఎంతో తేలికైనవి. త్రాసులో మాత్రం బరువైనవి. (అవేమంటే) సుబ్హానల్లాహి వ బిహమ్దిహీ, సుబ్హానల్లాహిల్ అజీమ్ (అల్లాహ్ పవిత్రుడు, స్తుతించదగిన వాడు. అల్లాహ్ పవిత్రుడు. సర్వోన్నతుడు). (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులోని రెండు వచనాలు నాలుకపై తేలికైనవి అంటే దీని భావం వాటిని ఉచ్చరించటం, కంఠస్థం చేసుకోవటం చాలా తేలిక. త్రాసులో బరువైనవంటే; అనేక క్లిష్టమయిన పుణ్యకార్యాలు త్రాసులో బరువుగా ఉన్నట్లే. ఈ రెండు సద్వచనాలు కూడా ఎంతో బరువును సంతరించుకుంటాయి. ప్రళయదినాన మనుషుల కర్మలు తూకం వేయబడతాయనీ, ఇందు నిమిత్తం త్రాసు నెలకొల్పబడుతుందని కూడా ఈ హదీసు ద్వారా బోధపడుతున్నది. విశ్వప్రభువు అయిన అల్లాహ్ యొక్క ఔదార్యం, కారుణ్య గుణం కూడా దీనిద్వారా వెల్లడవుతోంది. తన దాసులు చిత్తశుద్ధితో చేసే తేలికపాటి పుణ్యకార్యాలను కూడా ఆయన తన దయతో బరువైనవిగా మార్చుతాడు. కొద్దిపాటి పుణ్యానికి కూడా ఎన్నోరెట్ల పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఇది కేవలం ఆయన కృప, కారుణ్యం మాత్రమే. ఆయన కారుణ్యం అన్నింటినీ పరివేష్టించి ఉంది.

قَالَ مُصَنِّفُهُ – الشَّيْخُ الْإِمَامُ الْعَالِمُ الْعَلَّامَةُ قَاضِي الْقُضَاةِ شَيْخُ الْإِسْلَامِ أَمْتَعَ اللَّهُ بِوُجُودِهِ الْأَنَامَ – فَرَغَ مِنْهُ مُلَخِّصُهُ أَحْمَدُ بْنُ عَلِيِّ بْنُ مُحَمَّدِ بْنِ حَجَرٍ فِيْ حَادِيَ عَشَرَ شَهْرِ رَبِيْعِ الْأَوَّلِ سَنَةَ ثَمَانٍ وَعِشْرِيْنَ وَثَمَانِمَائَةٍ، حَامِداً لِلّٰهِ تَعَالىٰ وَمُصَلِّياً عَلىٰ رَسُوْلِهِ ﷺ وَمُكَرِّماً وَمُبَجِّلاً وَمُعَظِّماً.

"బులూగుల్ మరామ్" గ్రంథ సంకలనాన్ని హిజ్రా 828, రబీవుల్ అవ్వల్ నెల, 11వ తేదీన సర్వోన్నతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అంతిమ దైవసందేశహరుల (సఅసం) వారిపై శాంతి శ్రేయాలను కురిపించవలసిందిగా వేడుకుంటూ, ఆయన (స)కు కడు వినయ వినమ్రతలతో, గౌరవంతో నివాళిని ఘటిస్తూ, సంపూర్తి గావించానని విశ్వవిఖ్యాత ఇస్లామీయ ధర్మవేత్త, ఖాజియుల్ ఖుజాత్ అల్లామా అహ్మద్ బిన్ అలీ బిన్ ముహమ్మద్ బిన్ హజర్ - రహ్మాలై - తెలియజేశారు. (అల్లాహ్ ఈయన జ్ఞాన ఖని నుండి ప్రాణి కోటికి విస్తృతమైన ప్రయోజనాన్ని పొందే సద్బుద్ధిని ప్రసాదించుగాక!)

కారుణ్య ప్రభువైన అల్లాహ్ గ్రంథకర్తకు, వ్యాఖ్యాతకు, ఈ బృహత్తర కార్యంలో ఆదరువుగా నిలిచిన వారందరికీ తన కారుణ్య సాగరంలో నుంచి భాగాన్ని ప్రసాదించుగాక! వీరందరికీ దైవప్రవక్తల, అమరగతుల, ప్రవక్త ప్రియసహచరుల, సజ్జనుల సాంగత్యాన్ని, సామీప్యాన్ని ఎాసగుగాక!!

**ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్.**

**వ ఆఖరూ దాలానా అనిల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్.**

# హదీసు మకరందం - 2

## అనుబంధం - 1

## పదకోశం

ఆలిమ్ (العالم) : జ్ఞాని, ఇస్లామీయ విద్వాంసుడు, మేధావి.

అబ్ద్ (العبد) : మగ బానిస

ఆద్ (عاد) : నూహ్ (నోవహు) తరువాత నివసించిన ఒక ఆదిమ తెగ. చాలా సంపన్నమైనదే గానీ అల్లాహ్‌కు అవిధేయత చూపిన అల్లరి తెగ. అందుకే అల్లాహ్ ఈ తెగను భయంకరమైన పెను గాలితో సర్వనాశనం చేశాడు.

అద్ దబూర్ (الدبور) : పడమటి గాలి.

అజాన్ (الأذان) : సలాత్ (ప్రార్థన)కు పిలుపు. ప్రార్థనకు సమయం ఆసన్న మయ్యిందని బిగ్గరగా పిలుస్తారు. ఆ పిలుపులోని పలుకులివే: అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అష్‌హదు అఁల్లా యిలాహ ఇల్లల్లాహ్, అష్‌హదు అఁల్లా యిలాహ ఇల్లల్లాహ్, అష్‌హదు అన్న ముహమ్మద ర్రసూలుల్లాహ్, అష్‌హదుఅన్న ముహమ్మద ర్రసూలుల్లాహ్, హయ్యా అలస్సలాహ్, హయ్యా అలస్స లాహ్, హయ్యా అలల్ ఫలాహ్, హయ్యా అలల్ ఫలాహ్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా యిలాహ ఇల్లల్లాహ్. (సహీహ్ బుఖారీ:1వ సంపుటి, 334వ పేజీ చూడండి).

అహ్‌కామ్ (الأحكام) : ఆజ్ఞలు. ఇస్లామ్ ధర్మశాస్త్రం ప్రకారం అయిదు రకాల ఆజ్ఞ లున్నాయి.
1. తప్పనిసరివి(వాజిబ్). 2. అభిలషణీయమైనవి (ముస్తహబ్). 3. నిషిద్ధమైనవి (ముహర్రమ్). 4. నిషిద్ధమైనవి కావుగానీ అయిష్టకరమైనవి (మక్రూహ్). 5 సమ్మతించబడినవి - చట్ట బద్ధమైనవి (హలాల్).

ఈనా (العينة) : ఇందులో ఒక రకం ఏమిటంటే - ఎవరైనా కొంత మొత్తం అప్పు అడిగితే, ఆ అప్పు డబ్బుగా ఇవ్వకుండా అంతకంటే ఎక్కువ ఖరీదుకు ఏదైనా వస్తువును అంటగట్టి, తిరిగి అదే వస్తువును అప్పు అడిగిన మొత్తానికి, అంటే తక్కువ ధరకు తిరిగి తీసుకోవటం. అలా అతన్ని ఆ ధర తేడా మొత్తానికి బాకీదారుగా చేస్తున్నాడు. దీని ద్వారా ముస్లిములు పతనమై

పోవటానికి రెండు కారణాలు అని తెలుస్తున్నది. ఒకటి ధర్మయుద్ధాన్ని వదిలిపెట్టడం, రెండవది మోసం చెయ్యడం, అక్రమంగా సంపాదించడం.

అయ్యిమ్ (الأيم) : లైంగికానుభవం కలిగిన స్త్రీ. ఆమె విధవరాలు కావచ్చు లేదా విడాకులు పొందిన స్త్రీ అయి ఉండొచ్చు.

అజ్వా (العجوى) : ఒత్తిన మెత్తటి ఖర్జూరాలు లేక ఖర్జూరాలలో ఒక రకం.

అల్ అహ్‌జాబ్ (الأحزاب) : కుట్రదారులు. ఖురైషులలో అవిశ్వాసులు, మదీనాలో ముస్లిములపై దాడిచేసిన అరబ్బులు, యూదుల గురించి ఈ పదం వాడబడింది. వాళ్ళంతా గత్యంతరం లేక తిరుగు ముఖం పట్టారు.

అల్-అమానహ్ (الأمانة) : అమానతు, నమ్మకం, నైతిక బాధ్యత, నిజాయితీ, అల్లాహ్ విధించిన విధులన్నీ.

అల్-అకీక్ (العقيق) : మదీనాకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక లోయ.

అల్-అర్‌బా (الأربعة) : నలుగురు హదీసు సంకలన కర్తలు-అబూదావూద్, నసాయి, తిర్మిజీ, ఇబ్నె మాజహ్.

అల్-అవామిర్ (العوامر) : ఇళ్ళలో నివసించే పాములు.

అల్-బహీరా (البحيرة) : పాలిచ్చే ఆడ ఒంటె. దీని పాలను విగ్రహాలకు, ఇతర బూటకపు దేవతలకు వాడేవారు.

అల్-బైదా (البيداء) : మదీనా నుండి మక్కా వెళ్ళేదారిలో దక్షిణాన ఉన్న ప్రదేశం.

అల్-బైతుల్ మామూర్ (البيت المعمور) ఏడవ ఆకాశంపైన అల్లాహ్ నివాసం.

అల్-బత్‌ష్ (البطش) : గట్టిపట్టు.

అల్-ఫాతిహా (الفاتحة) : ఖురాన్‌లోని మొదటి సూరా

అల్-ఫిర్‌దౌస్ (الفردوس) : స్వర్గంలోని మధ్య మరియు పై భాగం.

అల్-ఘూబా (الغابة) : అడివి. మదీనా దగ్గర్లో పేరున్న ఓ ప్రాంతం.

అల్-గుర్రుల్ ముహజ్జలూన్ (الغر المحجلون) : పునరుత్థాన దినాన ముస్లిములకు పెట్టే పేరు. ఎందుకంటే వుజూలో శుభ్రం చేసుకున్న వారి దేహభాగాలు మెరుస్తుంటాయి.

అల్-హరూరియా (الحرورية) : సంప్రదాయం లేని ఒక ప్రత్యేక మత వర్గం.

అల్-హస్బా (الحصباء) : హజ్‌కు సంబంధించిన క్రియలన్నీ పూర్తి చేసుకున్నాక యాత్రికులు మక్కా బయటకు వెళ్ళే ఓ చోటు.

అల్ హిజానహ్ (الحضانة) : పిల్లల పెంపకం, సాకటం.

అల్ హిజ్ర్ (الحجر) : కాబాలో ఉత్తర దిక్కున కప్పు లేకుండా ప్రహరీతో ఉన్న ప్రదేశం.

అల్ హుదైబియా (الحديبية) : మక్కా నుండి జెద్దా వెళ్ళే దారిలో 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఒక ప్రసిద్ధ ప్రాంతం. హిజ్రీ 6వ సంవత్సరంలో ఇక్కడే ఒక ఒప్పందం జరిగింది. ప్రవక్తను ఆయన అనుచరుల్నీ ఉమ్రా చేయకుండా కురైషులు ఆపారు.

అల్ ఇహ్దాద్ (الإحداد) : చనిపోయిన భర్తను గూర్చిన అంగలార్పు.

అల్ ఇహ్తిబా (الاحتباء) : కూర్చునే ఓ పద్ధతి. మలుగులు మీద కూర్చొని కాళ్ళ చుట్టూ చేతులు పట్టుకునే పద్ధతి.

అల్ ఇస్తిబ్రా (الاستبراء) : కొత్తగా కొన్న బానిస స్త్రీ విషయంలో ఒక ఋతుకాలం సంభోగించకుండా గడపటం

అల్ జియిర్రానా (الجعرانة) : మక్కాకు కొన్ని కిలోమీటర్ల దూరంలోని ఒక ప్రదేశం. హునైన్ యుద్ధంలో లభించిన వాటిని ప్రవక్త ఇక్కడే పంచారు. ఇక్కడే ఆయన ఇహ్రామ్ స్థితిని పొంది ఉమ్రా చేశారు.

అల్ జుహ్ఫా (الجحفة) : సిరియా ప్రజల మీఖాత్ (ఇహ్రాం దీక్షబూనే స్థలం).

అల్ కబాయిర్ (الكبائر) : అతిపెద్ద పాపాలు.

అల్ కౌసర్ (الكوثر) : స్వర్గంలోని సరస్సు (సూరా 108 చూడండి).

అల్ ఖమ్సా (الخمسة) : అయిదుగురు హదీసు సంకలన కర్తలు - అబూదావూద్, నసాయీ, తిర్మిజీ, ఇబ్నె మాజా, అహ్మద్.

అల్ లిజామ్ (اللزام) : వ్యవహారాల పరిష్కారం. ముస్లిములు, అన్యుల మధ్య తగాదాల పరిష్కారానికి బద్ర్-యుద్ధ సమయంలో ఈ పద్ధతి అవలంబించబడినట్లు హదీసులో ఉంది.

అల్ మదీనా (المدينة) : సౌదీ అరేబియాలో ప్రవక్త మస్జిదు ఉన్న ప్రసిద్ధ పట్టణం. పూర్వం దీన్ని యస్రిబ్ అని పిలిచేవారు.

అల్ మఘాజీ (المغازي) : పవిత్ర యుద్ధాలు లేదా యుద్ధం జరిగే స్థలం లేదా అల్లాహ్ మార్గంలో యుద్ధం చేసే యోధుని గుణగణాలు, క్రియలు.

అల్ మనాసీ (المناصع) : మదీనా వెలుపల ఉన్న విశాల పీఠభూమి.

మఖామె మహ్మూద్ (المقام المحمود) : స్వర్గంలోని ఎత్తైన ప్రదేశం. ఇది కేవలం ముహమ్మద్ ప్రవక్త(స)కు మాత్రమే ఇవ్వబడుతుంది. ఇంకెవ్వరికీ ఇవ్వబడదు. (సహీహ బుఖారీ, 6వ సంపుటి, 242వ హదీసు చూడండి).

అల్ మర్వా (المروة) : మక్కాలోని ఒక పర్వతం, దాని ప్రక్కగా పవిత్రమైన మస్జిదుల్ హరామ్ ఉంది.

అల్ మష్అరుల్ హరామ్ (المشعر الحرام) ముజ్దలిఫా వద్ద ఒక పవిత్రమైన స్థలము.

అల్ మసీహ్ అద్ దజ్జాల్ (المسيح الدجال) : నకిలీ మెస్సయ్యా లేదా క్రీస్తు విరోధి (ఖురాన్‌లోని 6:158 సంపుటినీ మరియు హదీసులు 649 మరియు 650ని సహీహ్ బుఖారీ నాల్గవ సంపుటిలో చూడండి).

**మస్జిదె అఖ్సా** (المسجد الأقصى) : జెరూసలేమ్‌లోని మహా పవిత్రమైన మస్జిదు.

**మస్జిదె హరామ్** (المسجد الحرام) : మక్కాలోని మహా పవిత్రమైన మస్జిదు. కాబా అందులోనే నెలకొని ఉన్నది.

అల్ ముహస్సబ్ (المحصب) : మక్కా వెలుపల ఉన్న ఒక లోయ. దీనిని కొన్ని సందర్భాల్లో ఖైఫ్ బానీ కినానా అని కూడా పిలుస్తారు.

అల్ ముతఅవ్విలూన్ (المتأولون) : తమ ముస్లిం సహోదరుల గురించి కుఫ్ర్‌పై తప్పుడు అభిప్రాయాలు కలిగించేవారు.

అల్ ఖసామా (القسامة) : ఎవర్నో చంపాడన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి యొక్క తెగలోని ఏభై మంది చేసిన ప్రమాణము.

అల్ ఖస్వా (القصواء) : ప్రవక్త యొక్క ఆడ ఒంటె పేరు.

అల్ ఖిసాస్ (القصاص) : గాయపరచినవారిని ప్రతీకారంగా సమానంగా శిక్షించే ధర్మసూత్రాలు.

**అల్ వాసిల్** (الواصل) : తన బంధుమిత్రాదులతో మంచి సంబంధాలు కలిగి ఉండేవాడు.

**అల్లాహు అక్బర్** (الله أكبر) : అల్లాహ్ మహా గొప్పవాడు.

**అమతు అల్** (الأمة) : ఆడ బానిస.

అంబిజానియా (الأنبجانية) : మచ్చలు లేని సాధారణ ఊలు గుడ్డ.

ఆమీన్ (آمين) : ఓ అల్లాహ్! నా ప్రార్థనను అంగీకరించు.

అమ్మాబాద్ (أما بعد) : ప్రసంగంలోని ముఖ్యమైన విషయాల నుంచి ఉపోద్ఘాతాన్ని వేరు చేసే ఒక గుర్తు. ఈ ఉపోద్ఘాతము అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని, కీర్తినీ తెలియజేసేటటువంటిది. దీని ఖచ్చిత మైన అర్థం ఏమిటంటే "తరువాత వచ్చేది ఏదైనా సరే" అని. "దాని తరువాత" అని మామూలుగా అనువాదం చేస్తారు.

అన్ నజాషి (النجاشي) : ఇథియోపియా రాజు యొక్క బిరుదు - నీగస్.

అన్ నజష్ (النجش) : అంత ఎక్కువ ధర పలకకపోయినా, దాన్ని ఎవర్నైనా ఆకర్షించి, దాన్ని కొనేలా చెసి మోసగించడానికి ఉపయోగించే కుయుక్తి. కావాలని ధర పెంచడం.

అన్ నజ్వా (النجوى) : పునరుత్థాన దినాన అల్లాహ్ మరియు అతని దాసుల మధ్య జరిగే ఒక సంభాషణ. దాన్ని రహస్య చర్చ, సమావేశం అని కూడా అనవచ్చు. (ఖురాన్ 58:7-13 మరియు 11:18 పాద సూచికలు, అల్ బుఖారీ 3వ సంపుటి 621వ హదీసు చూడండి).

అన్సార్ (الأنصار) : మదీనా వాసులైన ప్రవక్త (సఅసం) యొక్క సహచరులు.

మక్కా తదితర ప్రాంతాల నుండి ముస్లిం కాందిశీకుల్ని చేర్చుకొని ఇస్లామును స్వీకరించినవారు.

అన్‌జా (العنزة) : కత్తివంటి తల కలగిన ఒక కర్ర.

అఖీఖా (العقيقة) : బిడ్డ పుట్టిన సందర్భంగా అల్లాహ్‌కు కృతజ్ఞతగా ఒకటి లేదా రెండు గొర్రెలను **బలి** ఇవ్వడం. (సహీహ్ బుఖారీ : 7వ సంపుటిలోని **అఖీఖా** అనే పుస్తకంలో 272వ పేజీ చూడండి).

**అఖ్రా హల్ఖా** (عقرى حلقى) : ఇది కేవలం **ఆశ్చర్యార్థక**మైన పదము. ఇది నిరాకరించడాన్ని సూచిస్తుంది.

అరఫా (రోజు) (عرفة) : భక్తులు హజ్ క్రియలు నెరవేర్చే జుల్ హిజ్జా నెలలోని తొమ్మిదవ రోజు.

అరఫాత్ (عرفات) : మక్కా యొక్క ఆగ్నేయంలో ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రఖ్యాత యాత్రా స్థలం.

అరాక్ (الأراك) : సివాక్ అనే పనుదోము పుల్లను తయారు చేసే ఒక చెట్టు.

అరియ్యా (العرية) : బై అల్ అరాయా అనేది ఒక రకమైన అమ్మకం. అరీయా యొక్క యజమానిని తాజా కర్జూరం అమ్మడానికి అనుమతిస్తారు. కర్జూరాలు ఇంకా చెట్టుపైన గెలల్లోనే ఉన్నప్పుడు, ఎండిపోయిన వాటిని కూడా అంచనా వేసి అమ్మడానికి అనుమతిస్తారు. (సహీహ్ బుఖారీ 3వ సంపుటం 389, 394, 397వ హదీసులు చదవండి).

అర్ రిజాఅత్ (الرضاعة) : సొంత బిడ్డ, ఎవరిదైనా బిడ్డకు పాలివ్వటం.

అర్రజ్‌అత్ (الرجعة) : మొదటి లేదా రెండవ విడాకుల తరువాత భర్త తన భార్యని వెనక్కి తెచ్చుకోవడం.

అర్ రజం (الرجم) : వివాహితులై అక్రమ లైంగిక సంబంధాలు కలిగి ఉన్న వారిని రాళ్ళతో కొట్టి చంపే ఇస్లామిక్ ధర్మసూత్రం.

అర్ - రుకియా (الرقية) : జబ్బుల్ని నయం చేసే పవిత్రమైన ప్రసంగం. ఇది ఒక వైద్యం. అల్ ఫాతిహా సూరాగాని మరేదైనా సూరాగాని చదివి ఉమ్మితో పాటు రోగి శరీరంపైన ఊదటం.

అర్ష్ (الأرش) : గాయపరచబడిన వ్యక్తికి గాయపరిచిన వ్యక్తి చెల్లించే పరిహారం.

అసబా (العصبة) : చనిపోయిన వ్యక్తి యొక్క తండ్రివైపు మగ బంధువులు.

అస్బ (العصب) : యమన్ అనే దేశంలో తయారైనటువంటి ఒక రకం ముతక గుడ్డ.

అస్‌హాబ్ అస్ సుఫ్ఫా (أصحاب الصفة) : మదీనాలోని ప్రవక్త మస్జిదులోనే ఉండి అక్కడ జరిగే మతపరమైన బోధనా సమావేశాల్లో పాల్గొనే యసభై మందికి పైగా పేదవారు.

అస్‌హాబ్ అస్ సునన్ (أصحاب السنن) : ఇస్లామీయ ధర్మశాస్త్రంలో హదీసు ప్రవచనాల సంకలన కర్తలు.

అస్‌హాబ్ అష్ షజరా (اصحاب الشجرة) : ప్రవక్త యొక్క అనుచరులు. హుదైబియా వద్ద ఖురైషులకు వ్యతిరేకమై ఇస్లాం మతాన్ని రక్షించడానికి ప్రతిజ్ఞ చేసినవారు.

అష్ షహాదా (الشهادة) : 1). విశ్వాస ప్రకటన. 2). అల్లాహ్‌ని తప్ప ఇంకా ఎవరినీ పూజించే హక్కు లేదు మరియు ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ యొక్క ప్రవక్త.

అష్ షిఖాఖ్ (الشقاق) : భార్యాభర్తల మధ్య లేక ఎవరైనా ఇద్దరు వ్యక్తుల మధ్య వేర్పాటు.

ఆషూరా (العاشوراء) : ముహర్రమ్ నెలలోని పదవ రోజు. (ఇస్లామిక్ కాలెండర్‌లోని మొదటి నెల).

అస్ర్ (العصر) : మధ్యాహ్నం, అస్ర్ ప్రార్థనా సమయం.

అస్ సబా (الصبا) : తూర్పు గాలి.

అస్ సబ్‌ఆ (السبعة) : హదీసు యొక్క ఏడుగురు సంకలన కర్తలు - బుఖారీ, ముస్లిం, అబూదావూద్, నసాయి, తిర్మిజీ, ఇబ్నె మాజహ్, అహ్మద్.

అస్ సాయిబా (السائبة) : దేవుళ్ళ పేరుమీద, బూటకపు దేవతల పేరుమీద పాలాల్లో, బీళ్ళలో వదిలివేయబడిన ఒక ఆడ ఒంటె (ఖురాన్ 5:103 చూడండి).

అస్ సలాత్ (الصلاة) : ఇఖామత్ - అస్ సలాత్‌ని చూడండి.

అస్ సౌమ్ (الصوم) : ఉపవాసం-ఫజ్ర్ (ఉదయం) ప్రార్థనకు ముందు అజాన్‌నుంచి సూర్యాస్తమయం దాకా ఏమీ తినకుండా, త్రాగకుండా, ఏ విధమైన లైంగిక సంబంధాలు లేకుండా ఉండటం.

అస్ సిహాహ్ అస్-సిత్తహ్ (الصحاح الستة) : హదీసు యొక్క ఆరు పుస్తకాలు: బుఖారీ, ముస్లిం, అబూదావూద్, నసాయి, తిర్మిజి మరియు ఇబ్నె మాజహ్.

అస్ సిరాత్ (الصراط) : నిజానికి సిరాత్ అంటే 'ఒక దారి'. అంతే కాకుండా తీర్పు దినమున ప్రజలు నరకాగ్ని మంటల మీద నడవటానికి వేయబడిన ఒక వంతెన అనే అర్థం కూడా వస్తుంది. అది కత్తి కంటే పదునైనది, వెంట్రుక కంటే సన్ననిదీ అని, మనుషుల్ని పట్టుకోవటానికి దానిపై కొక్కెములు ఉంటాయనీ వర్ణించబడింది.

అస్ సిత్తా (الستة) : బుఖారీ, ముస్లిం, అబూదావూద్, నసాయి, తిర్మిజి, ఇబ్నె మాజహ్ అనే ఆరుగురు హదీసు సంకలనకర్తలు మరియు

హదీసుల సంకలనాలను సిహాసిత్తా అంటారు.

అత్ తన్యీమ్ (التنعيم) : మక్కాలో ఇహ్రామ్ స్థితిలోకి వెళ్ళి ఉమ్రా చేయడానికి మక్కాకి ఉత్తరాన ఉన్న ఒక ప్రదేశం.

అస్ సలాసహ్ (الثلاثة) : హదీసు యొక్క ముగ్గురు సంకలనకర్తలు - అబూదావూద్, నసాయి, తిర్మిజి.

అల్ ఔరత్ (العورة) : ఇతరుల ముందు నగ్నంగా కనపడకూడని శరీర భాగం.

అవాలీ అల్ మదీనా (عوالى المدينة) : ఆరు లేదా అంతకంటే ఎక్కువ కిలోమీటర్ల దూరంలో ఉన్న మదీనా బయటి ప్రదేశం.

అవాఖిన్ (أواق) : ఏకవచనం "ఉఖియా". 5 అవాఖిన్‌లు అంటే ఎమన్ యొక్క 22 వెండి రియాళ్ళు లేదా 200 వెండి దిర్హమ్‌లు (640 గ్రాములు). (సహీహ్ అల్ బుఖారీ, రెండవ సంపుటి, హదీసు నెం. 526ని చూడండి).

అవ్‌సఖ్ (أوسق) : వసఖ్ యొక్క బహువచనం. 60 'సా'లు 135 కి.గ్రా. సమానమైన ఒక ప్రమాణము. కొంచెం ఎక్కువైనా తక్కువైనా కావచ్చు.

అయ్యాం అత్ తష్రీఖ్ (أيام التشريق) : జుల్ హిజ్జా యొక్క పదకొండు, పన్నెండు మరియు పదమూడు తేదీలకు ఉపయోగించే ఒక పదం.

ఆయాత్ (الآيات) : సాక్ష్యాలు, ఋజువులు, నిదర్శనాలు, వాక్యాలు, గుర్తులు మొదలైనవి.

ఆయతుల్ కుర్సీ (آية الكرسي) : ఖురాన్‌లో సూరా అల్ బఖరాలోని 255వ వాక్యం.

అజల్ (العزل) : బాహ్య స్థలనం. పిల్లలు పుట్టకూడదనే ఆలోచనతో శిశ్నాన్ని యోని నుండి బయటకు తీసి వీర్యాన్ని స్థలించటం.

అజ్లామ్ (الأزلام) : యదార్థంగా దీని అర్థం 'బాణాలు' అని. ఇక్కడ దీని అర్థం బాణాలు మంచి అదృష్టాన్ని లేక నిర్ణయాన్నీ కొనితేవాలని అజ్ఞానకాలపు అరబ్బుల చేత పాటించబడినవి.

అజ్ జిహార్ (الظهار) : నీతో కలిసి ఉండటం నా తల్లితో కాపురం చేసినంత అన్యాయం అని, భర్త భార్యతో అనడం.

బదనా (بدنة) : మక్కా యాత్రీకులచేత బలివ్వటానికి తీసుకువెళ్ళబడిన ఒంటె, ఆవు లేదా ఎద్దు.

బాజఖ్ (الباذق) : ద్రాక్షతో చేసిన ఒక రకమైన మత్తు పదార్థం.

బద్ర్ (البدر) : మదీనాకి 150 కి.మీ. దూరంలో ఉన్న ఒక ప్రదేశము ఇస్లాం చరిత్రలో ముస్లింలు, ఖురైషీ మతద్రోహుల మధ్య జరిగిన మొదటి గొప్ప యుద్ధం.

బైఅత్ (البيعة): ఇస్లాం మతానుసారంగా, ఇమామ్‌కు వినయంగా ఉండే పౌరుల చేత చేయబడిన ప్రతిజ్ఞ.

బైవుస్ సలఫ్ (بيع السلف): సలఫ్‌ని చూడండి.

బైవుస్ సలమ్ (بيع السلم): సలమ్‌ని చూడండి.

బైవుల్ హసాత్ (بيع الحصاة): రాళ్లు విసిరి కొట్టే మోసపూరిత వ్యాపారం. ఈ వ్యాపారంలో అమ్మేవాడు కొనేవాడిని ఒక రాయి వెయ్యమని అడిగి, ఆ రాయి ఎక్కడ పడుతుందో ఆ వస్తువుని ముందే నిర్ణయించ బడిన ధరకి విక్రయిస్తాడు. ఈ వ్యాపారం నిజానికి నిషేధించ బడింది. ఎందుకంటే ఇందులో మోసం ఉంది. రాయి పడ్డ వస్తువు ధర నిజానికి అంతకంటే ఎక్కువ ధర అయ్యిండొచ్చు లేదా తక్కువ అయ్యుండొచ్చు. ఇలాంటి మోసపు వ్యాపారాలన్నీ నిషేధించబడ్డాయి. తప్పిపోయిన బానిసను, జంతువును అమ్మటం, ఎగిరే పక్షుల్ని, నీళ్ళలోని చేపల్ని అమ్మటం మొదలైనవి.

బైత్ ఉల్ మక్దిస్ (بيت المقدس): బైత్ అంటే ఇల్లు; ఇది జెరూసలెంలోని ఒక ప్రఖ్యాత మస్జిదు. బైతుల్లాహ్ అంటే దేవుని ఇల్లు. ఇస్లాం ప్రపంచంలో దీనికి మూడవ పవిత్రమైన మస్జిదుగా పేరుంది. మక్కాలోని మస్జిదుల్ హరాం మొదటిదైతే, మదీనాలోని ప్రవక్త యొక్క మస్జిదు రెండవది.

బైత్ ఉల్ మిద్రాస్ (بيت المدراس): మదీనాలోని ఒక స్థలం (ఇది యూదుల కేంద్రం).

బైఅతుర్రిజ్వాన్ (بيعة الرضوان): హిజ్రీ 6వ సంవత్సరంలో ఖురైషులతో సంప్రదింపులకోసం వెళ్ళిన ఉస్మాన్(రజి)ను పట్టి బంధించారు. ఆయనకేమైనా అపాయం జరిగితే యుద్ధం చేస్తామని హుదైబియా వద్ద సహాబా చేసిన శపథం.

బాలామ్ (بالام): ఎద్దు.

బనూ అల్ అస్ఫర్ (بنو الأصفر): బైజాన్ టైన్ వాసులు.

బఖీ (البقيع): ప్రవక్త యొక్క అనేకమంది అనుచరులను పూడ్చిపెట్టిన మదీనాలోని ప్రజల శ్మశానం.

బర్ర్ (البرّ): భక్తి.

బిద్అత్ (البدعة): వదంతి (లేదా మతంలో ప్రవేశపెట్టబడిన ఏదైనా కొత్త పోకడ).

బిన్తె లబూన్ (بنت لبون): రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె.

బిన్తె మఖాజ్ (بنت مخاض): ఒక సంవత్సరం వయస్సు గల ఆడ ఒంటె.

బుఆస్ (بعاث): మదీనా నుంచి మూడు కి.మీ. కంటే ఎక్కువ దూరంలో నున్న

ఒక స్థలం. ఇస్లాంకు ముందు ఔస్ మరియు ఖజ్రజ్ తెగల మధ్య యుద్ధం జరిగిన చోటు.

బురాఖ్ (بـراق) : గాడిదకంటే పెద్దగా గుర్రంకంటే చిన్నగా ఉండే ఒక జంతువు, దీనిమీదే ప్రవక్త(సఅసం) మేరాజ్ (స్వర్గారోహణం)కు వెళ్ళారు.

బుర్ద్, బుర్దా (البرد، البردة) : నల్ల గడులున్న బిగువైన బట్ట.

బుర్నుస్ (البرنس) : పడగ గల తొడుగు.

బురుద్ (البُرُد) : బరీద్‌కు బహువచనం. ఒక బరీద్ = 4 ఫర్సాక్ = 12 మైళ్ళు = 19.31 కి.మీ.

బుత్‌హాన్ (بطحان) : మదీనాలోని ఒక లోయ.

జగాబిస్ (الضغابيس) : నక్క దోసకాయలు (జగ్‌బూస్‌కు బహువచనం).

దయ్యాన్ (الديـان) : అల్లాహ్; ప్రజలకు వారి కార్యాలను బట్టి తీర్పు చెప్పేవాడు అని అర్థం.

దజ్జాల్ (الدجـال) : క్రీస్తు విరోధి లేదా నకిలీ మెషయా. (అల్ మసీహ్ అద్ దజ్జాల్). అబద్ధీకుడు, మోసగాడు, మాయగాడు అని అర్థం (ఖురాన్ 6 : 158 పాదసూచిక, సహీహ్ బుఖారీ 4వ సంపుటి 649, 650 హదీసులు చూడండి).

దానిఖ్ (دانق) : ఆరోవంతు దిర్హంకు సమానమైన ఒక నాణెము.

దారుల్ ఖజా (دارالقضاء) : న్యాయస్థానము.

జాతె ఇర్ఖ్ (ذات عرق) : ఇరాక్ నుంచి వచ్చే యాత్రికుల కోసం ఉన్న మీఖాత్.

జాత్ ఉన్‌నితాఖైన్ (ذات النطاقين) : అబూబకర్ కూతురు అస్మా. దీని అర్థం రెండు నడికట్లు వేసుకున్న స్త్రీ. ఆమెకాపేరు ప్రవక్త (సఅసం) చేత పెట్టబడినది.

జాత్ ఉర్ రిఖా (ذات الرقاع) : ఇది ప్రవక్త (సఅసం) పాల్గొన్న ఒక యుద్ధం పేరు. "చారలున్నది" అని అర్థం. ముస్లిములు చెప్పులు కూడా లేకుండా కటిక దరిద్రులై ఉన్నప్పుడు, కాళ్ళకు రక్షణగా చింపి గుడ్డలు కట్టుకుని యుద్ధం చేశారు. అలా ఆ యుద్ధానికీ పేరొచ్చింది.

జవిల్ అర్హాం (ذوو الأرحام) : అమ్మ తరపు బంధువులు.

జిమ్మీ (الذمـي) : ఇస్లామ్ ప్రభుత్వ రక్షణలో ఉన్న ఒక ముస్లిమేతరుడు.

జీతువా (ذی طـوی) : మక్కా లోయల్లో ఒకటి, అందులో ఆ పేరున్న ఒక బావి ఉంది. ప్రవక్త (సఅసం) జీవితకాలంలో మక్కా ఒక చిన్న నగరం. అప్పుడు ఈ బావి సరిహద్దుకు వెలుపల ఉండేది.

ఈ రోజుల్లో మక్కా పెద్ద నగరం. అయితే ఈ బావి నగర సరిహద్దుల లోపలే ఉంది.

జూ మహ్రమ్ (ذو محرم): ఒక స్త్రీ తనకు దగ్గరి సంబంధం కారణంగా పెళ్ళి చేసుకోకూడని మగాడు. (ఉదాహరణకు సోదరుడు, తండ్రి, బాబాయి వగైరా).

జవిల్ ఫురూజ్ (ذوالفرائض): వారసత్వ భాగం ఖురాన్‌లో నిర్ధారించబడినవాళ్ళు. మిగతా వాళ్ళను 'అసబా' అంటారు.

జుల్ హిజ్జా (ذوالحجة): ఇస్లామిక్ క్యాలెండర్‌లోని పన్నెండవ నెల.

జుల్ హులైఫా (ذو الحليفة): మదీనా ప్రజల యొక్క మీఖాత్. ఇప్పుడు దానిని అబ్యార్ అలీ అని పిలుస్తారు.

జుల్ ఖలసా (ذو الخلصة): విగ్రహాలను ఆరాధించే యమన్‌లోని ఒక ఇల్లు. ఇది ఖతాం మరియు బజైలా తెగలకు చెందినది.

జుల్ ఖఅద (ذو القعدة): ఇస్లామిక్ క్యాలెండర్‌లోని పదకొండవ నెల.

జుల్ ఖర్నైన్ (ذو القرنين): ప్రపంచాన్ని పాలించిన, నమ్మకస్తుడైన ఒక గొప్ప పాలకుడు. ఆయన కథ ఖుర్‌ఆన్ 18:83లో ఉంది.

జున్ నూరైన్ (ذو النورين): ప్రవక్త (సఅసం) గారి ఇద్దరు కుమార్తెలు రుఖయా (ర.అన్‌హా) మరియు ఉమ్మె కుల్సూమ్ (ర.అన్‌హా)లను పెళ్ళి చేసుకున్న ఖలీఫా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)కు మారు పేరు. మొదటి ఆవిడ చనిపోయిన తరువాత రెండవ ఆవిడను ఆయన పెళ్ళి చేసుకున్నారు.

దీబాజ్ (الديباج): స్వచ్ఛమైన పట్టు వస్త్రం.

దీనార్ (الدينار): పురాతనమైన బంగారు నాణెం.

దిర్హమ్ (الدرهم): 50 బార్లీ గింజల బరువు తూగే వెండి నాణెం. అంచులు కత్తిరించబడి ఉంటుంది. ఊఖియా అనే బంగారు నాణెంలో 1/12వ వంతు విలువ కలిగి ఉంటుంది.

దియత్ (الدية): (దియాత్ బహువచనం) హత్య, గాయాలకు పరిహారంగా చెల్లించే రక్త ధనం. (అనుకోకుండా చేసినవి) బాధితుని బంధువులకు హంతకుడు చెల్లిస్తాడు.

జుహా (الضحى): ఉదయం పూట.

ఈదుల్ అజ్‌హా (عيد الأضحى): జుల్ హిజ్జా నెలలో పదవ రోజున మొదలయ్యే ముస్లిముల నాలుగు రోజుల పండుగ.

ఈదుల్ ఫిత్ర్ (عيد الفطر): రమజాన్ నెల తరువాత వచ్చే షవ్వాల్ నెలలో మొదటి రోజుతో మొదలయ్యే ముస్లిముల పండుగ. ఫితర్ అనగా

ఉపవాసాన్ని వీడటం. ముస్లిములు రమజాన్ నెల మొత్తం (ఇస్లామిక్ క్యాలెండర్‌లోని తొమ్మిదవ నెల) ఉపవాసం ఉంటారు. షవ్వాల్ నెల వస్తే, వారు ఉపవాసాన్ని ఆపేస్తారు.

ఫిదక్ (فدك) : మదీనా దగ్గరి ఒక ఊరు.

ఫాహిష్ (الفاحش) : నీతిమాలిన మాటలు మాట్లాడేవాడు.

ఫై (الفيء) : పోరాడకుండానే దొరికిన యుద్ధ ప్రాప్తి.

ఫజ్ర్ (الفجر) : సూర్యోదయానికి ముందు ఉదయ ప్రార్థన.

ఫకీహ్ (الفقيه) : ధార్మిక తీర్పులు చెప్పగల జ్ఞాని.

ఫరాయిజ్ (الفرائض) : మృతుని బంధువులకొచ్చే భాగం. 1/2, 1/4, 1/3, 1/6, 1/8, 2/3 లాంటి భాగాలు ఖురాన్‌లో చెప్పబడ్డాయి (4:11, 12, 176).

ఫరక్ (الفرق) : కొలిచే గిన్నె.

ఫర్జె ఐన్ (فرض العين) : ఇది ఒక వ్యక్తిగత విధి. ప్రతి ఒక్కడూ తన పనికి బాధ్యుడై ఉండడం.

ఫర్జె కిఫాయా (فرض الكفاية) : ఇది ఉమ్మడి బాధ్యత. అందరి పాత్ర లేకపోయినా ఒక వ్యక్తి అందరి తరపునా పనికి బద్ధుడై ఉండడం.

ఫరీజా (الفريضة) : ఆజ్ఞాపించబడిన బాధ్యత (ఫరాయిజ్ బహువచనం).

ఫర్రుజ్ (الفروج) : వెనుక వైపు తెరిచిన ఖబా.

ఫర్సఖ్ (الفرسخ) : మూడు మైళ్ళ దూరం. 1 మైలు = 6000 దోరా = 1760 గజాలు = 1.6 కి.మీ. (పరసంగ్ - పర్షియన్ దూరమానపు కొలత).

ఫతాత్ (الفتاة) : ఒక ఆడ బానిస లేదా యవ్వన స్త్రీ.

ఫిదియా (الفدية) : మతాచారాలు తప్పినందుకు చెల్లించే పరిహారం. మామూలుగా దీన్ని డబ్బు, ఆహార పదార్థాలు లేదా జంతు బలి ద్వారా పరిహారంగా చెల్లిస్తారు.

ఫికహ్ (الفقه) : ఇస్లామిక్ ధర్మశాస్త్రం.

ఫిత్నా (الفتنة) : పరీక్షలు, బాధ, మత విషయమై నెలకొనే అయోమయ స్థితి, ముస్లిముల మధ్య గొడవలు. (బహువచనం ఫితన్).

గరర్ (الغرر) : లేని వస్తువును అమ్మటం, ఉదా - ఇంకా పట్టని చేప.

గాజి (الغازي) : జిహాద్ (ధర్మ యుద్ధం)లో పాల్గొని తిరిగి వస్తున్న ఒక ముస్లిం యోధుడు.

గజ్వా (الغزوة) : ప్రవక్త (సఅసం) నాయకత్వంలో పెద్ద సైన్యంతో జరిగిన పవిత్ర యుద్ధం. ఇది అల్లాహ్ కార్యం నిమిత్తం జరిగింది.

గజ్‌వత్ ఉల్ ఖందఖ్ (غزوة الخندق) : శత్రువులను అడ్డగించడం కోసం మదీనాలో ముస్లిములు తవ్విన కందకం. తొలి ముస్లిములకు - అవిశ్వాసులకు మధ్య జరిగిన ఒక యుద్ధానికి పేరు.

ఘీలా (الغيلة) : శిశువు పాలు మానే ముందు భార్యతో జరిగే సంభోగం.

ఘైరత్ (الغيرة) : స్త్రీలలో సహజంగా ఉండే అసూయ మరియు పౌరుషం. ఆత్మ గౌరవం దెబ్బతిన్నప్పుడు వచ్చే కోపం, పరువు ప్రతిష్ఠలు భంగపడినప్పుడు కలిగే ఆగ్రహం.

ఘులూల్ (الغلول) : పంపిణీకి ముందు యుద్ధ లాభాన్ని దొంగలించడం.

ఘురఫ్ (الغرف) : ప్రత్యేకమైన నివాసాలు.

గుసుల్ (الغسل) : ఆచారం ప్రకారం స్నానం చేయటం. 'జునుబ్' అయిన వాడికి (అశుద్ధతకు లోనైనవారికి)ది అవసరం.

హబలుల్ హబలా (حبل الحبلة) : హబలుల్ హబలా అనేది రెండు రకాల వ్యాపారం. ఒక జంతువుకు పుట్టబోయే పిల్లల్ని ముందుగానే డబ్బిచ్చి కొనటం - మొదటి పద్ధతైతే, జంతువును మాత్రమే అమ్మి దాని పిల్లల్ని ఉంచుకోవటం రెండో పద్ధతి. రెండూ నిషిద్ధాలే.

హదస్ అల్ అస్ఘర్ (الحدث الأصغر) : కాలకృత్యములు తీర్చుకోవటం, అపాన వాయువు వదలడం, మూత్ర విసర్జన.

హదస్ అల్ అక్బర్ (الحدث الأكبر) : రతిక్రీడ, వీర్య స్ఖలనం వల్ల ఏర్పడే అశుద్ధావస్థ.

హదీసు (الحديث) : ఈ క్రిందివి హదీసు యొక్క వర్గీకరణలు : ప్రవక్త ప్రవచించిన వాక్యాలు, చేతలు మరియు ఆయన స్వయంగా ఆమోదించిన విషయాలు. (బహువచనం అహాదీసు).

జయీఫ్ (బలహీనమైనవి) (الضعيف) : ఖచ్చితత్వం లేని వివరణలు. ఇవి సహీహ్ (ప్రామాణికమైనవి) కావు, హసన్ (సుస్పష్టమైనవి) కావు. అందువలన ఇస్లామ్ దృష్టిలో వాడకూడనివి.

గరీబ్ (అరుదైనది) (الغريب) : నమ్మకస్తులు చెప్పిన వివరణల సందర్భానికి భిన్నంగా మరొకరు చెప్పింది. ఇవి బలమైనవీ (సహీహ్) కావచ్చు, బలహీనమైనవీ (జయీఫ్) కావచ్చు.

హసన్ (ఫరవాలేనివి) (الحسن) : నమ్మకస్తులు చెప్పిన ముస్నద్ హదీసులు. సహీహ్ స్థాయికి చేరువలోనివి.

మజ్‌హూల్ (తెలియనివి) (المجهول) : హదీసులు చెప్పిన వారి పరంపరలో ఎవరైనా అనామక వ్యక్తి ఉన్నవి.

మఖ్తూ (తెగిపోయినవి) (المقطوع) : 1. మాటలు, చేతలు తాబయి వద్ద ఆగిపోయినవి. 2. అసంపూర్ణ ఉల్లేఖకుల పరంపర కలిగినవి. 3. "ఇలా చేసేవాళ్ళం"-

అని సహాబీలు వర్ణించినవి.

మర్ఫూ (జాడ తెలిసేవి) (المرفوع) : ప్రవక్తను ఉద్దేశించిన హదీసు. అది మాటగానీ, చేతగానీ, ముత్తసిల్ (అంతరాయం లేని పరంపర గలది) ముస్నతా (అంతరాయం కలిగినది) లేదా ముర్సల్ (ప్రవక్త సహచరుని పేరు సూచించబడనిది) ఏదైనా కావచ్చు.

మౌఖూఫ్ (الموقوف) : (సహచరుల వద్ద పరంపర ఆగిపోయినది) - ప్రవక్త సహచరులైన సహాబీల గురించిన హదీసు. సహాబీలు ఇచ్చిన వివరణ, వర్ణన, సమాచారం. వీటిని అసర్ అని కూడా అంటారు.

ముజ్‌తరిబ్ (అయోమయంగా ఉండేవి) - హదీసు మూలం గురించి ఉల్లేఖకులు విభేదించినవి. ఒకరి అభిప్రాయానికి మరొకరి అభిప్రాయం బలం చేకూర్చనివి. ఈ విభేదం హదీసు వాక్యాలను గురించీ కావచ్చు, ఉల్లేఖకుల గురించీ కావచ్చు.

ముస్నతి (తెగిపోయినవి) (المنقطع) : ఉల్లేఖకుల పరంపర అసంపూర్తిగా ఉన్నవి. లేక అపరిచిత ఉల్లేఖకులను కలిగినవి.

ముర్సల్ (సూచించబడనివి): (المرسل) ప్రవక్త నుండి మొదలుపెట్టి సహచరుడిని సూచించకుండా తాబయీ వద్ద ఉల్లేఖకుల పరంపర ఆగిపోయినవి.

ముస్నద్ (విషయపూర్వకమైనవి) (المسند) : 1. వ్యాఖ్యాతల పరంపరతో ప్రవక్తను చేరే పరిపూర్ణమైన హదీసులు. 2. ఒక వ్యాఖ్యాతకు చెందిన హదీసులన్నీ కూర్చబడిన సంకలనం.

ముత్తసిల్ (సంబంధించినవి): (المتصل) లేదా మౌసూల్ - వ్యాఖ్యాతల పరంపరలో మూలస్థానాన్ని పూర్తిగా చేరేవి. అవి ప్రవక్తకు చెందిన మర్ఫూ (జాడ తెలిసినవి) కావచ్చు లేదా సహాబీలతో ముగిసే మౌఖూఫ్ (జాడ తెలియనివి) కావచ్చు.

సహీహ్ (బలమైనవి) (الصحيح) : ఉల్లేఖకుల పరంపర తెగిపోని ముస్నద్ హదీసు. వ్యాఖ్యానం అందరు వ్యాఖ్యాతల నుండి పరిపూర్ణంగా నమ్మకమైనదిగా మూలస్థానం వరకు అంగీకరిం చబడినవి. ఇందులో షాజ్ (విరుద్ధమైనవి)గానీ ముఅల్లల్ (తప్పుడువి)గానీ ఉండవు.

హదీ (الهدي) : ఒక జంతువు (ఒంటె, ఆవు, గొర్రె లేదా మేక) ను యాత్రికులు బలిగా ఇవ్వడం.

హైస్ (الحيس) : వెన్న, ఖర్జూరం మరియు జున్నుతో తయారు చేయబడిన వంటకం.

హజ్ (الحج) : మక్కా యాత్ర.

హజ్జుల్ అక్బర్ (الحج الأكبر) : (జుల్ హిజ్జా యొక్క పదవ రోజు) నహర్ రోజు.

హజ్జుల్ అస్గర్ (الحج الأصغر) : ఉమ్రాహ్.

హజ్జుల్ ఇఫ్రాద్ (حج الإفراد) : దీనిలో యాత్రికుడు హజ్ యాత్ర చేసే ఉద్దేశంతో మాత్రమే ఇహ్రామ్ స్థితిలోకి వెళతాడు.

హజ్జుల్ ఖిరాన్ (حج القران) : దీనిలో యాత్రికుడు ఉమ్రా మరియు హజ్ రెండూ చేసే ఉద్దేశంలో ఉన్నప్పుడు ఇహ్రామ్ స్థితిలోకి వెళతాడు.

హజ్జుత్ తమత్తు (حج التمتع) : దీనిలో యాత్రికుడు ఉమ్రా చేసే ఉద్దేశంతో ఇహ్రామ్ స్థితిలోకి వెళ్తాడు. తరువాత తవాఫ్ మరియు సయీ చేసి ఇహ్రామ్‌లో నుంచి బైటికి వస్తాడు. హజ్ రోజుల్లో అతడు ఇహ్రాం స్థితిలోకి మళ్ళీ వెళ్ళి హజ్‌ను పూర్తి చేస్తాడు.

హజ్జతుల్ విదా (حجة الوداع) : ప్రవక్త (స) చనిపోయే ముందు సంవత్సరం రోజుల్లో చేసిన హజ్ యాత్ర.

హజ్జె మబ్రూర్ (حج المبرور) : చట్టబద్ధంగా సంపాదించిన డబ్బుతో, ప్రవక్త "సున్నత్" ప్రకారం నెరవేర్చిన, అల్లాహ్ చేత ఒప్పుకోబడిన, సంపూర్ణమైన హజ్ యాత్ర.

హజ్జామ్ (الحجام) : సూది ద్వారా శరీరం నుంచి చెడురక్తాన్ని తీసేవాడు

హలాల్ (الحلال) : ధర్మబద్ధం.

హలాలా (الحلالة) : మూడు విడాకులు పొందిన స్త్రీ తిరిగి తన మాజీ భర్తను పెండ్లి చేసుకునేందుకు వీలుగా మరొకడు తాత్కాలికంగా ఆమెను చేసుకోవటం. ఇది ధర్మ విరుద్ధం. కాల పరిమితి నిర్ణయించబడినా నిర్ణయించబడకపోయినా విడాకుల కోసం చేసుకునే పెళ్ళి అనైతికం.

హుమజ్ (الهمز) : పిచ్చితనం లేదా చెడు సలహాలు.

హనీఫ్ (الحنيف) : స్వచ్ఛమైన ఏక దైవారాధన (అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకపోవటం).

హన్తా (هنتاه) : ఓ వ్యక్తిని పేరుతో పిలవడం ఇష్టం లేనప్పుడు పిలిచే పదం (స్త్రీలను పిలవడానికి వాడుతారు).

హనూత్ (الحنوط) : శవాలకు పూసే ఓ సుగంధ ద్రవ్యం.

హరామ్ (الحرام) : అధర్మం, నిషిద్ధం లేదా మతపరంగా శిక్షార్హమైన నిషిద్ధ అంశం.

హరమ్ (الحرم) : మక్కా మరియు మదీనాలలోని పవిత్ర ప్రదేశాలు.

హరూరా (الحروراء) : ఇరాక్‌లోని ఒక పట్టణం.

హర్బా (الحربة) : ఒక చిన్న బల్లెము.

హర్జ్ (الهرج) : చంపడం.

హర్రా (الحرة) : మదీనాలో నల్లరాళ్లతో కప్పబడిన ఒక చోటు.

హసీర్ (الحصير) : ఖర్జూరపు చెట్టు ఆకులతో తయారు చేయబడి, మనిషంత పొడవుగా ఉండే చాప.

హవాలా (الحوالة) : ఋణాన్ని ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి బదలాయించడం. ఋణం ఇచ్చినవాడి నుండి తీసుకున్న వాడిని విడిపిస్తూ మరొకడు ఆ అప్పుకు పూచీపడే ఒప్పందం.

హవాజిన్ (الهوازن) : ఖురైషులలో ఒక తెగ.

హయా (الحياء) : దీనికి చాలా అర్థాలు ఉన్నాయి - సిగ్గు, బిడియం, వ్రీడ, అణకువ, ఆత్మ గౌరవం, లజ్జ మొదలైనవి. హయా అనేది రెండు రకాలు - మంచి మరియు చెడు. మంచి 'హయా' అంటే అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స) చేయవద్దన్న పనులు చేయడానికి సిగ్గుపడటం, అలాగే 'చెడు హయా' అనగా అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స) చేయమన్న పనులను చేయడానికి సిగ్గుపడటం.

హిబా (الهبة) : అల్లాహ్ పేరుతో ఇంకెవ్వరికైనా బహుమతి ఇవ్వడం.

హిజాబ్ (الحجاب) : ముస్లిం మహిళలు తల నుంచి పాదాల దాకా కప్పుకోవడానికి వీలుగా ఉండే పొడవైన దుస్తులు.

హిజ్రత్ (الهجرة) : దీని అర్థం 'వలస పోవటం'. 4 సందర్భాల్లో ఈ పదం వాడుతారు: 1. మతపరమైన రక్షణ దొరక్క శత్రువు నుండి సురక్షిత ప్రాంతానికి ముస్లిములు వలసపోవటం. 2. మొదటి ముస్లింలు మక్కానుండి అబిసీనియా (ఇథియోపియా)కు తరువాత మదీనాకు వలసపోవటం. 3. మక్కా నుండి మదీనాకు ప్రవక్త (స) వలసపోవటం. 4. మక్కా నుంచి మదీనాకు ప్రవక్త (స) వలసపోయినప్పటి నుండి ఇస్లామిక్ క్యాలండర్ (కాలమానం) మొదలయ్యింది.

హిలాబ్ (حلاب) : ఒక రకమైన అత్తరు.

హిమా (الحمى) : ఒకరికి సొంతమైన పొలము, పచ్చికబయలు.

హిమ్యాన్ (حميان) : డబ్బు పెట్టుకోడానికి ఉపయోగించే పర్సులాంటి ఒక రకమైన బెల్టు.

హిన్నా (الحناء) : జుట్టుకు రంగువేసుకోడానికి ఉపయోగించే ఒక చెట్టు (హెన్నా) ఆకు. ఇది గోరింటాకు.

హిఖ్ఖా (الحقة) : మూడు సంవత్సరాల వయస్సుగల ఒక ఆడ ఒంటె.

హిరా (الحراء) : మక్కా దగ్గర ఒక పర్వతంలోని పేరుపొందిన ఒక గుహ.

హూర్ (الحور): వరదగూడును పోలిన నల్లని కళ్ళతో, తెల్లని మేని ఛాయతో అల్లాహ్ సృజించిన సుందరాంగులు. వీరు ఆదం సంతానం కాదు. (ఇబ్నె ఖయ్యిమ్ వ్రాసిన హాదీ అల్ అర్వా 54వ అధ్యాయం 147వ పేజీ చూడండి).

హుబల్ (هبل): ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో కాబాలో ఉన్న ఒక విగ్రహం.

హుబ్లా (الحبلى): ఒక రకమైన ఎడారి చెట్టు.

హుదా (الحداء): ఒంటెలు తోలే వాళ్ళు, వాటికి హుషారు కలిగించడానికి పలికేమాటలు.

హుదూద్ (الحدود): 'హలాల్' మరియు 'హరామ్' కోసం అంటే అనుమతించ బడిన, అనుమతించబడని వాటి మధ్య అల్లాహ్ నియమించిన పరిమితులు. (హద్‌కు బహువచనం).

హుజ్రా (الحجرة): గది, సభాస్థలి.

హుకుమ్ (الحكم): అల్లాహ్ తీర్పు లేదా న్యాయ నిర్ణయం.

హుమ్స్ (حمس): ఖురైష్ తెగ, వారి సంతానం మరియు హుమ్స్ అని పిలువ బడే వారి సహాయులు. దీనికి మరో అర్థం ఆసక్తి మరియు ఖచ్చితత్వం. హుమ్స్ ఈ విధంగా అనేవారు, "మేము అల్లాహ్ యొక్క ప్రజలం మరియు మక్కా దాటి బైటికి వెళ్ళం." వీరు మిగతా ప్రజలకంటే గొప్పవారు అనుకునేవారు.

హునైన్ (الحنين): మక్కా మరియు తాయిఫ్‌ల మధ్య ఉన్న ఒక లోయ. అక్కడ ప్రవక్త(స)కు ఖురైషీలకు మధ్య యుద్ధం జరిగింది.

ఇద్దత్ (العدة): విడాకుల అనంతరం లేదా భర్త చనిపోయాక స్త్రీ వేచి ఉండాల్సిన సమయం. తరువాత ఆమె పెళ్ళి చేసుకోవచ్చు.

ఇజ్ఖిర్ (الإذخر): లోహాల్ని కరిగించడానికి ఉపయోగపడే ఒక రకమైన గడ్డి. ఇంటి పైకప్పులకు, నేలమీదకు, సమాధుల మీద కూడా దీన్ని పరుస్తారు.

ఇఫ్తార్ (الإفطار): ఉపవాసాన్ని విరమించడం. 'సౌమ్'కు వ్యతిరేక పదం.

ఇహ్రామ్ (الإحرام): ఇతర సమయాల్లో అనుమతించబడినవాటినే చేయగూడని స్థితి. ఈ స్థితిలో ఉమ్రా, హజ్ విధులు నెరవేరుస్తారు. ఈ విధులు నెరవేరుస్తానని మానసికంగా, వాచకంగా కూడా పలకాలి. తరువాత తల్బియా పలకాలి. నడుము చుట్టూ ఇజారు, శరీర పైభాగంలో రిదా అనే తెల్లని వస్త్రాలు మాత్రమే కట్టుకోవాలి.

ఇహ్తికార్ (الاحتكار) : భవిష్యత్తులో లాభం కోసం వస్తువుల్ని దాచిపెట్టడం. ఇది నిషిద్ధం. ఎందుకంటే దీనివల్ల వస్తువుల కృత్రిమ కొరత ఏర్పడుతుంది.

ఇజారా (الإجارة) : ఎవరో ఒకరిని తన లాభంలో భాగస్వామిని చేయడం లేదా దేన్నైనా ఇతరులకు అద్దెకు ఇవ్వడం.

ఈలియా (ايلياء) : జెరూసలెం (ఎరూషలేము).

ఇమామ్ (الإمام) : ప్రార్థనలో ముందుండి నడిపించేవాడు, ముస్లిం పరిపాలకుడు, ఖలీఫా.

ఈమాన్ (الإيمان) : నమ్మకం, విశ్వాసం.

ఇమ్లాస్ (الإملاص): గర్భవతిని కడుపుపై కొట్టడం వల్ల జరిగే గర్భస్రావం.

ఇఖామత్ (الإقامة) : అజాన్‌లో రెండుసార్లు పలికే వాక్యాలను (చివర్లో పలికే అల్లాహు అక్బర్‌ను తప్ప) కుదించడం. ఇఖామత్ కాగానే ప్రార్థన మొదలవుతుంది.

ఇఖామతె సలాత్ (إقامة الصلاة) : సలాత్ (నమాజు) చేయడం. ఇది చాలా మంది ముస్లిములకు అర్థం కాలేదు. దీని అర్థం :

(అ) ప్రతీ ఒక ముస్లిం, స్త్రీగానీ, పురుషుడు గానీ, 'సలాత్' (ప్రార్థనలు) విషయంలో కొన్ని నియమాలకు బద్ధుడై ఉండాలి. రోజుకి ఐదుసార్లు నిర్ణీత వేళల్లో ప్రార్థనలు చేయాలి. పురుషులైతే మస్జిదులో, స్త్రీలు ఇంట్లో ప్రార్థనలు చేయాలి. ప్రవక్త (స) చెప్పినట్లు "పిల్లల్ని ఏడు సంవత్సరాల వయస్సు నుంచీ ప్రార్థన చేయమని ఆదేశించాలి. పదేళ్ళ వయస్సు నుంచి చేయని పక్షంలో దండించవచ్చు కూడా. ముస్లిములు ఈ ప్రార్థనా నియమాలు పాటించే విషయంలో, వీటిని సక్రమంగా నిర్వర్తించే విషయంలో కుటుంబ పెద్దగానీ, ఆ ఊరి పెద్దగానీ లేదా ఆ దేశ ముస్లిం పాలకుడు అల్లాహ్ ముందు బాధ్యులై ఉంటారు.

(ఆ) ముహమ్మదు ప్రవక్త (సఅసం) నమాజు ఎలా చేశారో - అంటే నిలబడటం, ఒంగోటం, మోకరించటం, కూర్చోవటం వంటి నియమ నిబంధనలన్నీ అలాగే చేయడం. "నేనెలా నమాజు చేస్తానో అలాగే చేయండి" అన్నారాయన. (సహీహుల్ బుఖారీ 1వ సంపుటి ప్రవక్త నమాజు పద్ధతి గురించిన హదీసులు 702, 703, 704, 723, 786, 787లను చూడండి.) నమాజు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకటంతో ప్రారంభమవు

తుంది. అల్ ఫాతిహా సూరా మొదట చదవాలి. నిలబడటం, వంగటం, మోకరించటం, కూర్చోవటం లాంటి వివిధ భంగిమలతో కొనసాగి తస్లీమ్ అంటే సలాం చేయటంతో ముగుస్తుంది.

ఇషా (العشاء): రాత్రి నమాజు సూర్యాస్తమయం తరువాత గంటన్నర సమయం నుండి మొదలవుతుంది. అర్ధరాత్రి వరకు దీని కాలపరిమితి.

ఇష్తిమాల్ అస్సమ్మహ్ (اشتمال الصماء): ఈ రెండు పద్ధతుల్లో దుస్తులు ధరించడం - 1. ఒక భుజాన్ని వస్త్రంతో కప్పి రెండవ దాన్ని ఆచ్ఛాదన లేకుండా వదిలి వేయడం. 2. కూర్చొని నిండా వస్త్రాన్ని కప్పుకున్నా మర్మాంగాలు మాత్రం కనబడుతూనే ఉండటం.

అస్నాద్ (الإسناد): (సనద్ యొక్క బహువచనం). ప్రవక్త హదీసులను వివరించిన వారి వరంపర.

ఇస్తబ్రక్ (استبرق): మంచి పట్టు వస్త్రం, చిక్కటి దీబాజ్.

ఇస్తిహాజా (الاستحاضة): స్త్రీకి మామూలు సమయాలలో (పరిశుద్ధావస్థలో) కలిగే రక్తస్రావం. (సహీహ్ బుఖారీ 1వ సంపుటి 303వ హదీసు, 10వ అధ్యాయం 183వ పేజీ చూడండి).

ఇస్తిహ్సాన్ (الاستحسان): మనస్సాక్షి మేరకే తీర్పు ఇవ్వటం. దాన్ని బయటికి వ్యక్తీకరించలేరు. అబూ హనీఫా వర్గీయులు మాత్రమే ఇలా చెబుతారు. మిగతా సున్నీ పండితులు ఈ పద్ధతిని ఒప్పుకోరు.

ఇస్తిఖారా (الاستخارة): రెండు రకాతులతో వ్యక్తి చేసే ప్రార్థన - ప్రార్థనలో ఆ వ్యక్తి తనను సరియైన మార్గంలో నడిపించమని అల్లాహ్‌ని వేడుకుంటాడు - చేయబోయే పనిలో మార్గదర్శకత్వం కోసం. (సహీహుల్ బుఖారీలోని హదీసులు - హదీసు నెం. 263, రెండవ సంపుటి; హదీసు నెం. 391, ఎనిమిదవ సంపుటి; హదీసు నెం. 487, తొమ్మిదవ సంపుటి).

ఇస్తిస్ఖా (الاستسقاء): కరువు కాలంలో వర్షాలు కురిపించమని అల్లాహ్‌ను మొరపెట్టుకుంటూ రెండు రకాత్‌లతో చేసే ప్రార్థన.

ఏతెకాఫ్ (الاعتكاف): ఏకాంతవాసం. మస్జిదులో అల్లాహ్‌ను మాత్రమే ప్రార్థించడం కోసం ఆ స్థితిలో ఉన్నంతకాలం వ్యక్తి తన భార్యతో లైంగిక సంబంధాలు పెట్టుకోకూడదు. అలాగే అత్యవసర పరిస్థితిలో తప్ప మస్జిదు నుండి బైటికి వెళ్ళకూడదు. శవయాత్రలో పాల్గొనటానికి, కాలకృత్యాలు తీర్చుకోవటం లాంటి వాటికి వెళ్ళొచ్చు.

ఈలా (الإيلاء) : ఒక భర్త తన భార్య దగ్గరకు కొంతకాలం వరకు వెళ్ళనని చేసే ప్రమాణం.

ఇజార్ (الإزار) : దేహంలో క్రింది సగ భాగాన్ని కప్పుతూ నడుంకి కింద కట్టే ఒక వస్త్రం.

జిజ్ఆహ్ (الجذعة) : నాల్గు సంవత్సరాల వయస్సుగల ఆడ ఒంటె.

జహన్నమ్ (جهنم) : నరకం, అగ్ని.

జాహిలియ్యత్ (الجاهلية) : 1. ప్రవక్త (సఅసం) రాక ముందున్న అజ్ఞాన కాలం. 2. ప్రవక్త (సఅసం) కు ముందున్న ఇస్లామేతర సంప్రదాయాలు, దురాచారాలు.

జలీల్ (الجليل) : మక్కాలో పెరిగే మంచి వాసనగల ఒక రకమైన గడ్డి.

జల్సత్ ఉల్ ఇస్తిరాహత్ (جلسة الاستراحة) : ప్రార్థనలో మోకరించిన స్థితినుండి లేచి నిలబడే స్థితికి మధ్యలో కొద్దిసేపు కూర్చుని ఉండటం.

జమ్వు (الجمع) : మక్కా దగ్గర 'ముజ్దలిఫా' అనబడే ఒక పేరున్న చోటు.

జమ్రా (الجمرة) : ప్రాకార ప్రదేశంలో చిన్న రాతి స్థంభం. మినాలో 3 జమ్రాలున్నాయి. మినాలో ఈదుల్ అజ్హా నాలుగు రోజుల్లో ఈ జమ్రాల మీద రాళ్ళు రువ్వటం హజ్ విధుల్లో ఒకటి.

జమ్రత్ అల్ అఖబా (جمرة العقبة) : 'మినా'లో రాళ్ళతో కట్టబడిన మూడు స్తంభాల్లో ఒకటి. ఇది మక్కా ఉన్న దిశలో మినా ముఖద్వారం వద్ద నెలకొని ఉన్నది.

జనాబత్ (الجنابة) : భార్యతో సంభోగానంతర స్థితి లేదా స్వప్న స్ఖలనానంతర పరిస్థితి. అతను ఈ స్థితిలో విధిగా స్నానం (గుసుల్) చేయాలి. అది వీలు కాకపోతే తయమ్ముమ్ చేయాలి.

జనాజా (الجنازة) : అంత్యక్రియలు. జనాయిజ్ బహువచనం.

జన్నత్ (الجنة) : స్వర్గం.

జనీబ్ (الجنيب) : మేలురకపు ఖర్జూరం.

జిహాద్ (الجهاد) : అల్లాహ్ మార్గంలో జరిగే పవిత్రయుద్ధం. అల్లాహ్ వాక్కు (ఇస్లాం)ను సమున్నత స్థానంలో నిలిపే ప్రయత్నం. ఇస్లాం మౌలికాంశాల్లో ఇదొకటి.

జిమార్ (الجمار) : జమ్రాకు బహువచనం.

జిన్ (الجن) : ఒక సృష్టితము. అగ్ని నుండి అల్లాహ్ సృష్టించిన జీవులు. మనుషుల్ని మట్టినుండి, దైవదూతల్ని కాంతి నుండి సృష్టించాడు.

జిజ్యా (الجزية) : ఇస్లామిక్ ప్రభుత్వ రక్షణలో నివసిస్తున్న ముస్లిమేతర ప్రజలపై విధించబడే పన్ను. (సహీహ్ బుఖారీ : 4వ సంపుటి 251వ

పేజీ మరియు హదీసు సంఖ్య 384, 385, 386 చూడండి).

జుబ్బా (الجبة) : ఒక పొడవాటి చొక్కా.

జుమాదుస్ సానియా (جمادى الثانية) : ఇస్లామిక్ క్యాలెండర్‌లో ఆరవ నెల.

జుమా (الجمعة) : శుక్రవారం.

జునుబ్ (الجنب) : 'జనాబత్' (అశుద్ధ) స్థితిలో ఉన్న ఒక వ్యక్తి.

జుర్ఫమ్ (جرهم) : ఒక అరబ్ తెగ పేరు.

కాబా (الكعبة) : చతురస్రాకారంలో మస్జిదుల్ హరాం (మక్కాలోని ఒక పవిత్ర మస్జిదు)లో ముస్లింలు ముఖం తిప్పి ప్రార్థన చేసే వైపున కట్టబడిన ఒక కట్టడం.

కఫాలా (الكفالة) : ఋణగ్రహీత ఫలానా ప్రదేశానికి వచ్చి బాకీ చెల్లిస్తాడనీ, లేదా శిక్ష పొందుతాడని ఋణదాతకు ఇచ్చే హామీ.

కఫ్ఫారా (الكفارة) : తప్పు మాట్లాడినందుకు, తప్పుడు పని చేసినందుకు ఇస్లాంలో చేసుకునే ప్రాయశ్చిత్తం లేదా చెల్లించే పరిహారం.

కాఫిర్ (الكافر) : అల్లాహ్‌ని, ఆయన సందేశహరులని, ఆయన దూతలని, పవిత్రమైన పుస్తకాలనీ, తీర్పుదినాన్నీ, అల్ ఖదర్ అనే విధి వ్రాతను ధిక్కరించినవాడు. కుఫ్ఫార్ బహువచనం.

కంజ్ (الكنز) : జకాత్ చెల్లించకుండా దాచిన వెండి బంగారాలు (ఖురాన్ 9 : 34 చూడండి).

కత్మ్ (الكتم) : జుట్టుకి రంగు వేయడానికి ఉపయోగపడే ఒక మొక్క.

కౌసర్ (الكوثر) : అల్ కౌసర్ చూడండి.

ఖజిరా (خضرة) : ఒక రకం పంట.

ఖైబర్ (خيبر) : మదీనాకి 100 కి.మీ. దూరంలో ఉన్న ఖర్జూరం పండే ఒక గ్రామం మరియు అక్కడి ఒయాసిస్సు. ప్రవక్త (స) కాలంలో అక్కడ బనూ నజీర్ అని పిలువబడే ఒక యూదు తెగ ఉండేది. హిజ్రీ 5వ సంవత్సరంలో ముస్లిములు ఆ ప్రదేశాన్ని జయించారు.

ఖలీఫా (الخليفة) : ప్రతినిధి, వారసుడు. ప్రవక్త (సఅసం) మరణించిన తరువాత పరిపాలించిన మొదటి నలుగురు పాలకులకు ఈ పదం ఉపయోగించబడింది. 'ఖులఫా' బహువచనం.

ఖలీల్ (الخليل) : హృదయపూర్వకంగా ప్రేమించేవాడు. ఆ ప్రేమ స్నేహితుని కంటే, ప్రియునికంటే ఉన్నతమైనది. ప్రవక్త (స) కు ఒక్కడే ఖలీల్ ఉన్నాడు. ఆయన అల్లాహ్. కానీ అల్లాహ్‌కు ఎందరో ఖలీల్‌లు ఉన్నారు.

ఖలూఖ్ (الخلوق) : ఒక రకమైన అత్తరు.

ఖమ్ర్ (الخمر) : మత్తుమందు, ఆల్కహాల్ వగైరా.

ఖమీసా (الخميصة) : చతురస్రాకారంలో గుర్తులు ఉన్న నల్లటి ఊలు దుప్పటి.

ఖందఖ్ (الخندق) : గజ్వత్ ఉల్ ఖందఖ్‌ను చూడండి.

ఖిరాజ్ (الخراج) : పంటపై పదవ భాగం లేదా ఇరవయ్యవ భాగంగా విధించ బడిన జకాత్.

ఖుసూఫ్ (الخسوف) : చంద్రగ్రహణం.

ఖవారిజ్ (الخوارج) : మతాన్ని నమ్మకుండా, మిగతా ముస్లిములతో ఏకీభవించ కుండా ఉండే జనం.

ఖజీర్ (లేదా) ఖజీరా (الخزير، الخزيرة) : బార్లీపిండి, మాంసం చారు, కొవ్వుతో చేయబడిన ప్రత్యేక వంటకం.

ఖిలాఫత్ (الخلافة) : 1. వారసత్వం. 2. ఇస్లామీయ నాయకత్వం.

ఖిమార్ (الخمار) : ఒక స్త్రీ తన తలను, మెడనూ కప్పుకోవడానికి ఉపయోగించే ఒక గుడ్డ ముక్క.

ఖుఫ్ఫ్ (الخف) : తోలు సాక్సులు.

ఖులా (الخلع) : భార్య భర్తకు కొంత మొత్తాన్ని ఇచ్చి లేదా అతను ఇచ్చిన మహర్ తిరిగి ఇచ్చేసి, అతని నుండి విడాకులు తీసుకోవడం.

ఖుమ్రా (الخمرة) : తల, చేతులకు సరిపోయేంతటి ఒక చిన్న చాప (సలాత్‌లో మోకరించేటప్పుడు).

ఖుమ్స్ (الخمس) : యుద్ధలాభంలో అల్లాహ్ పనికోసం ఐదవ భాగం ఇవ్వటం. (ఖురాన్ 8 : 41).

ఖుషూ (الخشوع) : అల్లాహ్ ముందు దీనత్వం.

ఖుత్బా (الخطبة) : మతపరమైన ప్రసంగం.

ఖుత్బత్ ఉన్ నికాహ్ (خطبة النكاح) : పెళ్ళి సమయంలో ఇచ్చే ప్రసంగం.

ఖుజాఅ (الخزاعة) : బనూ ఖుజాఅ, ఒక అరేబియన్ తెగ.

కుహుల్ (الكحل) : కంటికి పెట్టుకునే సుర్మా.

కూఫా (الكوفة) : ఇరాక్‌లో ఒక పట్టణం.

కుఫ్ర్ (الكفر) : ఇస్లామ్ విశ్వాసాల్లో దేన్నయినా నమ్మకపోవటం. అంటే అల్లాహ్, ఆయన ప్రవక్తలు, ఆయన గ్రంథాలు, పునరుత్థానదినం, అల్ ఖదర్ (దైవనిర్ణయాలు, ఆయన విధించినవి తప్పక అమలు జరుగుతాయి) అనే అంశాలను త్రోసి రాజనటం.

కుఫ్ఫ్ (الكفء) : పోలిక. నాలుగు విషయాల్లో సమానత్వం, పోలిక, సరి

తూగటం- మతం, వంశం, వృత్తి, స్వాతంత్ర్యం. వీటిలో మతం అంగీకరించబడింది. వంశాన్నిమాత్రం నిజమైన హదీసులు అంగీకరించలేదు. ఇక మిగతా వృత్తి, స్వేచ్ఛలను అన్నీ అంగీకరించాయి. కుఫూ కాకుండా ఇతరత్రా వివాహాలను నిషేధించారు. కుఫూలో చేసుకోవటం ఎన్నో విధాల మేలు.

కున్నియ్యత్ (الكنية) : ఒక మగాణ్ని "ఫలానా వాడి తండ్రీ" అనిగానీ, ఒక స్త్రీని "ఫలానావారి తల్లీ" అని గానీ పిలవడం. ఇది అరబ్బుల ఆచారం.

కుసూఫ్ (الكسوف) : సూర్యగ్రహణం.

లబ్బైక వ సాదైక (لبيك وسعديك) : నీ పిలుపుకి నేను స్పందించాను. నేను నీ ఆజ్ఞలకి అనుగుణంగా ఉంటాను.

లా యిలాహ ఇల్లల్లాహ్ (لا إله إلا الله) : అల్లాహ్ తప్ప వేరే నిజమైన దేవుడు ఎవ్వరూ లేరు.

లైలత్ ఉల్ ఖద్ర్ (ليلة القدر) : రమజాన్ నెలలోని చివరి పది రాత్రులలో ఒక రాత్రి. అల్లాహ్ ఆ రాత్రిని వెయ్యి నెలల కంటే మేలైనదిగా వర్ణించాడు. ఆ రేయి అల్లాహ్‌ని ప్రార్థించి ఖురాన్ చదివిన వాడికి, వెయ్యి నెలలు ప్రార్థించిన దానికంటే గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. (అంటే 83 సంవత్సరాల 4 నెలల పుణ్యం). (ఖురాన్ 97 : 1-5, సహీ బుఖారీ 3వ సంపుటి 2వ అధ్యాయం 231వ హదీసు).

లాత్, ఉజ్జా (اللات والعزى) : ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో హిజాజ్‌లో ఆరాధించ బడిన ప్రఖ్యాత విగ్రహాలు.

లియాన్ (اللعان) : ఒక భర్త తన భార్యమీద ఎవరితోనో అక్రమ సంబంధం ఉందనే నింద మోపినప్పుడు వారిద్దరూ చేసుకునే ప్రమాణం. (నూర్ 24 : 6 - 9)

**లుఖతా** (اللقطة) : ఏదైనా వస్తువు పోగొట్టుకున్న సొంతదారునికి కాకుండా వేరేవాడికి దొరకడం.

మఆఫిరి (معافري) : యమెన్ తరహా దుస్తులు.

మగాఫిర్ (المغافير) : చెడువాసన కలిగినటువంటి జిగురు.

మగ్‌రిబ్ (المغرب) : సూర్యాస్తమయం, సాయంత్ర ప్రార్థన.

మహ్రమ్ (المحرم) : జూమహ్రాని చూడండి.

మహ్ర్ (المهر) : పెళ్ళి సమయంలో భర్త భార్యకిచ్చే సొమ్ము.

**మక్రూహ్** (المكروه) : అవాంఛనీయమైనది. శిక్షార్హం కాకపోయినా మతం దృష్ట్యా అయిష్టకరమైనది.

మమ్లూక్ (المملوك) : ఒక మగ బానిస.

మనాసికుల్ హజ్ వల్ ఉమ్రాహ్ (مناسك الحج والعمرة) : కాబా యొక్క తవాఫ్, సఫా మర్వాల సయీ. అర్ఫాత్, ముజ్దలిఫాలలో ఆగటం, జమ్రాత్‌లో రాళ్ళు రువ్వటం (రమీ), జంతువుల్ని బలి ఇవ్వటం (హజ్ పుస్తకంలో బుఖారీ 2,3 సంపుటాల్లో ఉమ్రా చూడండి).

మనీహా (المنيحة) : ఎవరికైనా ఒక ఆడ ఒంటెనుగానీ, గొర్రెనుగాని బహుమతి రూపంలో ఇవ్వడం. దానివల్ల వాటి పాలను అతడు ఉపయోగించుకుని తిరిగి ఆ జంతువును దాని యజమానికి ఇచ్చి వేయడం.

మఖామె ఇబ్రాహీం (مقام إبراهيم) : ఇబ్రాహీం మరియు ఇస్మాయీల్ కాబా గృహాన్ని కడుతున్నప్పుడు ఇబ్రాహీం నుంచున్న రాయి (చోటు).

మాషా అల్లాహ్ (ما شاء الله) : 'దేవుడు తలచినదే' అని అర్థం. ఇది శుభ సంకేతం.

మష్రూబా (الشربة) : పటిష్టమైన గది.

మస్జిద్ (المسجد) : మస్జిదు (ముస్లింల ప్రార్థనాలయం)

మసానీ (المثاني) : పదే పదే వల్లించబడే ఖురాన్ వాక్యాలు. ప్రార్థనలో అల్ ఫాతిహా సూరాలోని వాక్యాలు.

మౌలా (المولى) : దీనికి చాలా అర్థాలున్నాయి. కొన్ని : విడుదల పొందిన బానిస, లేదా యజమాని లేదా అల్లాహ్.

మౌలాయా (مولايا) : కట్టుబానిసగానీ, విడుదల పొందిన బానిసగానీ తన యజమానిని వేడుకునేటప్పుడు, నా ప్రభువా, నా స్వామీ అనటం.

మౌకూజా (الموقوذة) : ఒక జంతువును కర్రతోగానీ రాళ్ళతోగానీ కొట్టి చంపటం (అదీ పూర్తిగా చంపకుండా).

మవాలీ (الموالي) : అరబ్బేతరులు లేదా పూర్వపు బానిసలు.

మయాసిర్ (الميائر) : పట్టు పరుపులు.

మిహ్జన్ (المحجن) : పట్టుకోటానికి వంపు కలిగిన ఒక చేతి కర్ర.

మిజన్నా (المجنّ) : మక్కాలోని ఒక ప్రదేశం.

మినా (منى) : అరఫాత్ రోడ్డులో మక్కా వెలుపల ఉన్న ఒక యాత్రాస్థలం. ఇది మక్కా నుంచి ఎనిమిది కి.మీ. అరఫాత్ నుంచి పదహారు కి.మీ. దూరంలో ఉంది.

మీఖాత్ (الميقات) : హజ్ లేదా ఉమ్రా చేసేవాళ్ళు 'ఇహ్రామ్' దీక్షబూనటం కోసం మక్కా వెళ్ళే దారిలో ప్రవక్త (స) సూచించిన వివిధ ప్రదేశాలు.

మీరాజ్ (المعراض) : ఈకలు లేని బాణం.

మేరాజ్ (المعراج) : ప్రవక్త (సశరీరుడై) స్వర్గారోహణ చేయటం. (సహీహ్ బుఖారీ

1వ సంపుటి 345వ హదీసు, 4వ సంపుటి 429వ హదీసు, 5వ సంపుటి 227వ హదీసు. ఇంకా, ఖురాన్ 53:12 చూడండి).

మిర్బద్ (المربد): ఖర్జూరాలు ఎండబెట్టే చోటు.

మిస్ర్ (مصر): ఈజిప్టు.

మిస్వాక్ (المسواك): అరాక్ చెట్టు వేర్లనుండి తయారుచేసిన పనుదోము పుల్ల.

మిస్ఖాల్ (المثقال): తూకపురాయి. 4 2/7 గ్రాములు. బంగారాన్ని తూయటానికి వాడుతారు. 20 మిస్ఖాల్ = సుమారు 94 గ్రాములు.

ముఅజ్జిన్ (المؤذن): నమాజ్ చెయ్యడానికి రండి అంటూ బిగ్గరగా అజాన్ ఇచ్చేవాడు.

ముఆహిద్ (المعاهد): 1. శాంతి ఒడంబడిక కుదుర్చుకున్న ఒక ముస్లిమేతరుడు. 2. వీసాతో ఒక ఇస్లామీయ రాజ్యానికి వచ్చి ఉద్యోగం చేస్తున్న ఒక ముస్లిమేతరుడు.

ముఅల్లఫత్ ఉల్ ఖులూబ్ (مؤلفة القلوب): ఇస్లాంలో కుదురుగా ఉండేందుకుగాను కొత్తగా చేరిన ముస్లిములకు ప్రవక్త (స) చేసిన దానధర్మాలు.

ముఅర్రస్ (المعرس): అష్ షజరా కన్నా మినాకు దగ్గరగా ఉన్న ప్రదేశం.

ముఅవ్వజాత్ (المعوذات): సూరయె ఫలఖ్ (113) మరియు సూరయె నాస్ (114).

ముబష్షిరాత్ (المبشرات): శుభ సందేశాలు. (10:64 పాదసూచికలు, సహీహ్ బుఖారీ 9వ సంపుటి 119వ హదీసు చూడండి).

మూబిఖాత్ (الموبقات): గొప్ప వినాశకర పాపాలు.

ముదబ్బర్ (المدبر): మరణానంతరం దాస్య విమోచన పొందుతానని యజమాని వాగ్దానాన్ని పొందినవాడు.

ముజారబత్ (المضاربة): ఒక రకం ఒప్పందం. ఇందులో ప్రజావసరాల నిమిత్తం వేతనం ఇవ్వకపోవటాన్ని మన్నించారు. కార్మికుని నిర్లక్ష్యం వల్లగానీ, కావాలని చేసిన తప్పువల్లగానీ నష్టం జరిగితే అతనిదే బాధ్యత. లేకపోతే లేదు. అలాగే పెట్టుబడిదారు విధించిన షరతులకు, సూచనలకు భిన్నంగా సహభాగస్తుడు ప్రవర్తిస్తే నష్టానికి అతనిదే బాధ్యత.

ముద్ (المد): ఒక కిలో గ్రాములో మూడింట రెండు వంతుల కొలత (సుమారు). ఇది కొంచెం తక్కువ లేదా ఎక్కువైనా కావచ్చు.

ముఫస్సల్ (లేదా)

ముఫస్సలాత్ (المفصل، المفصلات): 'ఖాఫ్' నుండి మొదలై దివ్య ఖురాన్ చివరి దాకా ఉండే సూరాలు. (అంటే 50 నుండి 114 సూరాలు).

ముహాజిర్ (المهاجر): మక్కాను జయించిన దానికి ముందు, ప్రవక్త (స) జీవిత

కాలంలో ఎక్కడెక్కడి నుంచో మదీనాకు వలస వచ్చిన ముస్లిములలో ఎవరైనా ఒకరు, ఇంకా అల్లాహ్ మరియు ఇస్లాం నిమిత్తము వలసపోయే వ్యక్తి. అంతేకాకుండా అల్లాహ్ నిషేధించిన వాటన్నింటినీ వదిలేసే వ్యక్తి.

ముహాఖలా (المحاقلة) : నూర్చిన ధాన్యంతో పాటు, పంటలోని కోయని ధాన్యాన్ని కూడా కలిపి అమ్మటం.

ముహర్రం (المحرم) : ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల.

ముహ్కమ్ (المحكم) : రద్దుకాని ఆదేశాలకు సంబంధించిన ఖురాన్ వాక్యాలు.

ముహ్రిమ్ (المحرم) : ఏ వ్యక్తైనా 'హజ్' లేదా 'ఉమ్రాహ్' చేయడం కోసం 'ఇహ్రామ్' స్థితిని వహించుట.

ముహ్రిమా (المحرمة) : 'ఇహ్రామ్' స్థితిలో ఉన్న స్త్రీ.

ముహ్సర్ (المحصر) : 'హజ్' లేదా 'ఉమ్రాహ్' చేయాలనుకున్నా ఏదో ఒక అడ్డంకి వల్ల చేయలేకపోయిన ఒక ముహ్రిమ్.

ముజాహిద్ (المجاهد) : 'జిహాద్'లో వున్న ముస్లిం యోధుడు.

ముజజ్జిజ్ (المجزز) : చేతి గుర్తులను, పాదాలను పరిశీలించి వంశ నిర్ధారణ చేసే పండితులు.

ముజ్తహిదూన్ (المجتهدون) : ఖురాన్‌లోను, ప్రవక్త (స) సున్నత్‌లోను ఆధారాలు దొరకనిదే మత అభిప్రాయాలను అంగీకరించని స్వతంత్ర మత పండితులు.

ముకాతబత్ (المكاتب) : తన విడుదల కోసం కొంత మొత్తాన్ని యజమానికి పరిహారంగా చెల్లించటానికి బానిస (స్త్రీ లేదా పురుషుడు) చేసుకునే ఒప్పందం.

ముఖాబరా (المخابرة) : పండే పంటలో సగానికో, మూడో వంతుకో కౌలుకివ్వటం. ఈ పద్ధతి అనుమతించబడింది. ఖైబర్‌లోని యూదులతో ప్రవక్త (స) ఈ పద్ధతే పాటించారు. నిషేధించబడిన పద్ధతి ఏంటంటే, మొత్తం భూమిలో ఈ భాగంలో పండిన పంట యజమానిదనీ, ఆ భాగంలో పండింది కౌలుదారుదనీ చెప్పటం. దీనివల్ల యజమానులకు కౌలుదారులకూ గొడవలు వచ్చేవి. నిర్ణీత శాతం ప్రకారం మొత్తం పంటను ఇద్దరూ పంచుకోటానికి అంగీకరిస్తే తప్పలేదు.

ముఖాజరా (المخاضرة) : కోతకు రాకుముందే పచ్చి పంటను కొనటం.

ముఖ్రమ్ (المخضرم) : ప్రవక్త (స) జీవితకాలంలో ముస్లింగా మారినా, ప్రవక్త(స)ను చూడలేకపోయిన వ్యక్తి.

ములాఅనా (الملاعنة) : 'లియాన్' చేయటం.

ములామసా(లమస్) (الملامسة) : కళ్ళు మూసుకొనిగానీ, చీకట్లోగానీ, కేవలం వస్తువును చేత్తో తాకి నిర్ణీత ధరకు కొనటం. ఉదాహరణకు ఒకడు బట్టల వ్యాపారి దగ్గరకెళ్ళి, నేను కళ్ళు మూసుకొని నీ బట్టల తాను తాకుతాను. ఏ తాను నా చేతికి తగిలితే ఆ తాను ఇంత ధరకు నాకు అమ్మాలి అంటాడు. ఈ తరహా వ్యాపారం నిషేధించబడింది. దీన్ని 'లమస్' అని కూడా అంటారు.

ముల్‌హిదూన్ (الملحدون) : మత విరోధులు.

మునాబజా (المنابذة) : మునాబజా ద్వారా జరిగే అమ్మకం జూదం లాంటిది. వస్తువుల్ని చూడకుండానే వాటిని పరస్పరం మార్చుకోటానికి ఇద్దరు వ్యక్తులు అంగీకరించటం."నీ బట్టలకు బదులు నా బట్టలు ఇస్తాను" అంటాడొకడు. ఇద్దరిలో ఎవరూ ఎవరి బట్టలూ చూసుకోరు. అలాగే "నాకున్నది నీకిస్తాను. నీ కున్నది నాకివ్వు" అని అనొచ్చు. ఎవడికెంతుందో తెలుసుకోకుండానే ఒకరిదొకరు కొనుక్కుంటారు.

ముఖైయ్యర్ (المقير) : మత్తు పానీయాలు తయారు చేయడానికి ఉపయోగపడే కుండ యొక్క పేరు.

ముఖారజా (المخارضة) : అల్ ముఖారజా లేదా అల్ ఖిరాజ్. తన ఆస్తితో వ్యాపారం చేయటానికి ఒక భాగస్వామిని అనుమతిస్తూ యజమాని చేసిన ఒప్పందం. అందులో వచ్చే లాభాన్ని వ్యాపారంలోని భాగస్వాములు సమానంగా పంచుకోవాలి. నష్టాన్ని మాత్రం యజమానే భరించాలి.

ముసల్లా (المصلى) : ఒక ప్రార్థనా స్థలం.

ముసాఖాత్ (المساقاة) : **తోట మాలి** పని. పాలానికి **నీళ్ళు** పెట్టడం, సేద్యం చేయడం, యజమానితో కలిసి పంటను పంచుకోవటం. దీన్ని అల్ ముజారా అని కూడా అంటారు. ముసాఖాత్‌కు ముజారాకు తేడా ఏంటంటే మొదటిది ధాన్యం కోసం అయితే రెండవది పండ్ల చెట్ల కోసం.

ముష్రికూన్ (المشركون) : బహుదైవారాధకులు, విగ్రహారాధకులు. అల్లాహ్ ఏకదైవారాధనపై, ప్రవక్త ముహమ్మద్(స)పై నమ్మకం లేనివారు.

ముస్తహాజా (المستحاضة) : సాధారణ రుతు కాలాల్లో కాకుండా మధ్యలో **రక్తస్రావం** జరిగే స్త్రీ.

ముత్‌ఆ (المتعة) : తాత్కాలిక వివాహం. ఇస్లాం తొలి రోజుల్లో, ఎవడైనా ఇంటికి దూర ప్రాంతంలో ఉంటే అనుమతించబడ్డాడు. తరువాత ఇది రద్దు చేయబడింది.

ముతఫహ్హిష్ (المتفحش) : చెడు మాటలు వ్యాప్తి చేసే వ్యక్తి.

మూతకిఫ్ (المعتكف) : 'ఏతికాఫ్' స్థితిలో ఉన్న వ్యక్తి.

ముతషాబిహాత్ (المتشابهات) : స్పష్టంగా లేకుండా అర్థం చేసుకోవటానికి కష్టంగా ఉన్న ఖురాన్ వాక్యాలు.

ముత్రస్ (مترس) : ఒక పర్షియన్ పదం. "భయపడవద్దు" అని దీని అర్థం.

ముత్తఫఖ్ అలైహ్ (متفق عليه) : దీని అర్థం "అంగీకరించబడినవి", ' "ఉభయోకీభవిత." ఈ పదాన్ని బుఖారీ మరియు ముస్లిం హదీసుల గురించి వాడతారు.

ముత్తఖూన్ (المتقون) : నమ్మకం గల మరియు అల్లాహ్‌కి భయపడే మంచి వ్యక్తులు మరియు అల్లాహ్‌ని అమితంగా ప్రేమించేవారు (అల్లాహ్ నిషేధించిన పనుల జోలికి పోకుండా, పాపాల నుంచి చెడు పనుల నుంచీ దూరంగా ఉంటూ, చేయమన్న పనులను చేసేవారు).

మువత్తా (الموطا) : నాలుగు 'ఫిఖ్ ఇమాము'లలో ఒకరైన, ఇమామ్ మాలిక్‌చే సంకలనం చేయబడిన హదీసు పుస్తకం.

ముజాబనా (المزابنة) : పచ్చి ఖర్జూరాలకు బదులు ఎండు ఖర్జూరాలు, పచ్చి ద్రాక్షకు బదులు ఎండుద్రాక్ష కొలిచి అమ్మటం. ఎండు పండ్లను కొలిస్తే పచ్చి పండ్లను గెలలపైనే అంచనా వేస్తారు.

ముజప్ఫత్ (المزفت) : మత్తు పానీయాలు తయారుచేయడానికి ఉపయోగపడే కుండ పేరు.

ముజారా (المزارعة) : అల్ ముజారా అంటే సేద్యం కోసం భూమిని వేరే ఎవరికైనా ఇచ్చి ఉత్పత్తిని పంచుకోవడం. ప్రవక్త (స) ఈ పద్ధతిని ఆపలేదు. భూమి తక్కువగా ఉండి అన్సారులు, ముహాజిర్లు ఎక్కువగా ఉన్నప్పుడు, ఎవరు ఎంత ఎక్కువగా సేద్యం చేయగలిగితే అంత త్వరగా చేసేలా ఆదేశించారు. అయితే మిగిలిన భూమిని 'ముజారా' పద్ధతిలో ఉత్పత్తిని పంచుకోకుండా 'ఇజారా' పద్ధతిలో కౌలుకు ఇమ్మన్నారు. ఎందుకంటే ఇజారా కౌలుదారుకు సౌకర్యంగా ఉంటుంది. తరువాత అందరికీ తగినంత భూమి దొరికినందువల్ల ఈ ఆంక్షను ఎత్తివేశారు.

ముజ్దలిఫా (المزدلفة) : అరఫాత్ మరియు మినాల మధ్య ఉన్న ప్రాంతం. యాత్రికులు అరఫాత్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు అక్కడ ఆగి, ఆ రాత్రి పూర్తిగాగానీ లేదా అంతకంటే ఎక్కువ సేపుగానీ ఉండాలి.

జుల్ హిజ్జా తొమ్మిది లేదా పదవ రోజున, వీరంతా కలిసి మగ్రిబ్ మరియు ఇషా ప్రార్థనలు చేయాలి.

నబీజ్ (النبيذ) : ఖర్జూరాలు లేదా ద్రాక్ష పండ్లను నానబెట్టే నీరు. అయితే పులియనివ్వరు.

నాజిహా (الناضحة) : వ్యవసాయ పనులకు ఉపయోగపడే ఒంటె.

నజి (النفى) : బాణంలో ఒక భాగం.

నఫస్ (النفث) : చేతబడి, మంత్ర విద్య.

నఫఖ్ (النفخ) : సాతాను బుసకొట్టడం.

నహద్ (النهد) : ప్రయాణంలోని ఖర్చులను పంచుకోవడం లేదా ప్రయాణీకుల ఆహారాన్నంతటినీ ప్రయాణీకులందరూ సమానంగా పంచుకోవడం.

నహ్ర్ (النحر) : గొంతు మొదట్లోని కరోటిడ్ ధమనిని కోయటం ద్వారా ఒంటెను జిబహ్ చేయటం. జుల్ హిజ్జా 10వ రోజున యాత్రికులు జంతువుల్ని బలి ఇస్తారు.

నజ్ద్ (نجد) : ఎత్తైన భూమి అని అర్థం. లిహామా - ఇరాక్‌ల మధ్య విశాల భూమి.

నమీమా (النميمة) : ఇద్దరి మధ్య శత్రుత్వం పెంచటానికి తప్పుడు సమాచారం చేరవేస్తూ ఉండటం.

నఖీబ్ (النقيب) : ఒక ప్రయాణంలో ఆరుగురు వ్యక్తుల మీద నాయకత్వం వహించిన వ్యక్తి. ఒక తెగలోని ముఖ్యుడు.

నఖీర్ (النقير) : మత్తుపానీయాలు తయారు చేయడానికి ఉపయోగపడే ఒక కుండ పేరు.

నస్ల్ (النصل) : బాణంలోని ఒక భాగం.

నవాఫిల్ (النوافل) : (నఫిల్ ఏక వచనం) తప్పనిసరి ప్రార్థనలు 'ఫరాయిజ్' అయితే స్వచ్ఛంద ప్రార్థనలు 'నవాఫిల్' అనబడతాయి.

నికాహ్ (النكاح) : ఇస్లాం ధర్మం ప్రకారం జరిగే పెళ్ళి.

నిసాబ్ (النصاب) : జకాత్ చెల్లించటానికి ఉండాల్సిన కనీస ఆస్తి. 20 మిస్ఖాల బంగారం అంటే 94 గ్రాములు. 200 దిర్హముల వెండి అంటే 640 గ్రాములు, 5 అవ్‌సక్‌ల ధాన్యం లేదా పండ్లు అంటే 673 1/2 కిలోలు, 5 ఒంటెలు, 5 ఆవులు, 40 గొర్రెలు.

నష్ (النش) : 1/2 ఉఖియా (సుమారు 64 గ్రాములు)తో సమానమైన బరువు.

నూన్ (نون) : చేప.

కల్పించేవాడు. అల్లాహ్ యొక్క అనేక పేర్లలో రబ్ కూడా ఒకటి. దీనికి దగ్గరి పదం 'ప్రభువు' అని వాడాము. ప్రభువు అని ఎక్కడ వచ్చినా రబ్ అని అర్థం చేసుకోండి.

రబ్బుక్ (ربك) : నీ ప్రభువు, నీ గురువు.

రబీ ఉల్ అవ్వల్ (ربيع الأول) : ఇస్లామిక్ క్యాలెండర్‌లో మూడవ నెల.

రాహిలా (الراحلة) : సవారీ చేయడానికి ఉపయోగపడే ఆడ ఒంటె.

రహ్న్ (الرهن) : షరీయత్ ప్రకారం, అర్ రహ్న్ (తాకట్టు) అంటే అప్పు లేదా ఋణాన్ని తీసుకునేటప్పుడు అప్పు ఇచ్చేవారికి హామీగా కొంత ఆస్తిని, వస్తువును ఇవ్వడం.

రయ్యాన్ (الريان) : తరచుగా ఉపవాసాలు చేసే భక్తులు ఈ స్వర్గ ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు.

రజబ్ (رجب) : ఇస్లామిక్ క్యాలండర్‌లో ఏడవ నెల.

రకాతు (الركعة) : ముస్లిముల సలాత్ (నమాజు)లో రకాత్‌లుంటాయి. ఒక రకాతు అంటే ఒకసారి నిలబడటం, ఒకసారి వంగటం, రెండుసార్లు మోకరిల్లటం ఉంటాయి.

రమజాన్ (رمضان) : సౌమ్ (ఉపవాసాలు) ఉండే నెల. ఇస్లామిక్ క్యాలెండర్‌లో ఇది తొమ్మిదవ నెల. ఈ నెలలోనే ఖురాన్ అవతరణ ప్రారంభం అయింది. ఖద్ర్ రాత్రి ప్రవక్త(స)పై అవతరించింది. బద్ర్ యుద్ధం ఈ నెలలోనే జరిగింది.

రమల్ (الرمل) : తనలోని శారీరక శక్తిని తెలియజేసే, భుజాలు ఎగురవేస్తూ కాళ్ళు కదిలిస్తూ నడిచే వేగవంతమైన నడక. కాబా చుట్టూ తిరిగేటప్పుడు 'తవాఫ్' యొక్క మొదటి మూడు రౌండ్లలో దీన్ని గమనించవచ్చు. దీన్ని కేవలం మగవారు మాత్రమే చేస్తారు. ఆడవారు కాదు.

రమీ (الرمي) : మినా వద్ద జిమార్ వైపు రాళ్ళు విసరడం.

రిబా (الربا) : వడ్డీ, పెరుగుదల. ఇది రెండు రకాలుగా ఉంటుంది. (1). రిబా నసీయా, అప్పు ఇచ్చిన డబ్బుపై వచ్చే వడ్డీ. (2) రిబా ఫజల్, తక్కువ నాణ్యత గల సరుకులు అధికంగా ఇచ్చి ఎక్కువ నాణ్యతగల సరుకులు తీసుకోవడం. ఉదాహరణకు తక్కువ నాణ్యతగల ఖర్జూరాలను ఇచ్చి ఎక్కువ నాణ్యతగల ఖర్జూరాలను పెద్ద మొత్తంలో తీసుకోవడం. ఇస్లాం ఈ రకమైన అన్యాయపు వడ్డీలను నిషేధిస్తుంది.

రిదా (الرداء) : శరీరపు పై భాగాన్ని కప్పడానికి వేసుకునే గుడ్డ ముక్క.

రికాజ్ (الركاز) : పూడ్చిపెట్టిన సంపద.

రూహుల్లాహ్ (روح الله) : రూహ్ మరియు అల్లాహ్ అనే రెండు నామవాచకాల పద బంధం రూహుల్లాహ్. ప్రవక్త (స) అనుచరులలోని తొలి పండితుల వివరణల ప్రకారం రెండు నామవాచకాల లింగ నిర్మాణాల మధ్య తేడా విశదపరిచే వ్యాకరణ నియమం ఇలా ఉంది:

(1). రెండు నామవాచకాల్లో ఒకటి అల్లాహ్, రెండవది ఒక వ్యక్తి లేదా వస్తువు అయినప్పుడు. ఉదా॥ 1. బైతుల్లాహ్ - అల్లాహ్ ఇల్లు. 2. రసూలుల్లాహ్ - అల్లాహ్ సందేశహరుడు. 3. అబ్దుల్లాహ్- అల్లాహ్ దాసుడు. 4. రూహుల్లాహ్ - అల్లాహ్ ఆత్మ వగైరా.

రెండవ నామవాచకం యొక్క నియమం-సందేశకుడు, ఇల్లు, దాసుడు, ఆత్మ లాంటివన్నీ అల్లాహ్ చేత సృష్టించబడ్డాయి గనుక గౌరవనీయమైనవి. అల్లాహ్ ఆత్మ అంటే అల్లాహ్ సృష్టించిన ఆత్మ. ఉదా॥ ఈసా, "అవ్వ" అంటే అయ్యింది. ఆదాము సృష్టిలాగా.

2) ఒకటి అల్లాహ్ రెండవది వ్యక్తో వస్తువో కానప్పుడు - అది సృష్టించబడింది కాదు. అల్లాహ్ గుణగణాలన్నమాట. ఉదా॥ 1. అల్లాహ్ జ్ఞానము (ఇల్ముల్లాహ్). 2. అల్లాహ్ జీవం (హయాతుల్లాహ్). 3. అల్లాహ్ వాక్కు (కలాముల్లా) 4. అల్లా స్వంతం (జాతుల్లాహ్) వగైరా.

రుఖ్బా (رقبى) : ఒక ఇంటిని ఎవరికైనా జీవితకాలం ఉండనిచ్చే వీలుగా ఇవ్వడం, కానీ ఒక ఆస్థిగా మాత్రం కాదు.

సా (الصاع) : 4 ముద్ (3 కి.గ్రా) లతో సమానమైన కొలత.

సబా అల్‌మసానీ (سبع المثاني) : పదే పదే చదివే ఏడు చరణాలు. ఉదా ॥ సూరయె ఫాతిహా.

సబాహా (صباحاه) : సహాయం కోసం చేసే ఆర్తనాదం.

సాబిఉన్ (الصابئون) : యూదులు కాదు క్రైస్తవులూ కాదు. జబూర్ గ్రంథాన్ని చదువుతూ "లా యిలాహ ఇల్లల్లాహ్" అనే వాక్యాన్ని విశ్వసించే వారు. ఇరాక్‌లో ఈ జాతి గతించింది.

సాదాన్ (السعدان) : జంతువులు మేయడానికి వీలుగా ఉండే ఒక ముళ్ళ మొక్క.

సదఖా (الصدقة) : దయతో ఇచ్చినది ఏదైనా.

సఫా మరియు మర్వా (الصفا والمروة) : తూర్పు వైపున మక్కా ప్రక్కన ఉన్న అల్ మస్జిద్ అల్ హరామ్ (పవిత్రమైన మస్జిద్) వద్ద ఉన్న రెండు పర్వతాలు. ఉమ్రా లేదా హజ్ చేసేవారు ఈ పర్వతాల మధ్య ఏడుసార్లు నడవాలి. దీనినే 'సయీ' అంటారు.

సహ్బా (صهباء) : కైబర్ దగ్గరి ప్రదేశం.

సహీహైన్ (الصحيحين) : రెండు హదీసు పుస్తకాలు - బుఖారీ మరియు ముస్లిం.

సహూర్ (السحور) : సౌమ్ (ఉపవాసం) ఉంటున్న వ్యక్తి ఫజ్ర్ (ఉదయం) నమాజుకు ముందు రాత్రిపూట తీసుకునే ఆహారం.

సహ్వ్ (السهو) : మర్చిపోవడం (నమాజులో ఎన్ని రకాతులు చేశాడో మర్చిపోవడంలాంటి పొరపాట్లు జరగటం. అలాంటప్పుడు ఆ వ్యక్తి అదనంగా రెండు సజ్దాలు చేయాలి).

సకీనహ్ (السكينة) : నెమ్మదితనం, మౌనం, శాంతం మరియు స్థిమితం మొదలైనవి.

సలబ్ (السلب) : యుద్ధంలో చనిపోయిన యోధునికి చెందినవి (గుర్రం, ఆయుధాలు మొ.)

సలఫ్ (السلف) : తరువాత ఇవ్వబడే సరుకుల కోసం ముందుగానే డబ్బులు చెల్లించే అమ్మకం.

సలమ్ (السلم) : సలఫ్‌కి పర్యాయ పదం.

సమీ అల్లాహు లిమన్ హమిదహ్: (سمع الله لمن حمده) తనను స్తుతించేవాని మొర అల్లాహ్ విన్నాడు.

సమూర్ (السمر) : ఒక రకమైన చెట్టు.

సనహ్ (سناه) : ఇథియోపియన్ భాషలో దీని అర్థం 'మంచి' అని.

సరియ్యా (السرية) : ప్రవక్త (స) స్వయంగా పాల్గొనకుండా జిహాద్ చేయటానికి పంపిన ఓ చిన్న సైనిక పటాలం.

సరిఫ్ (سرف) : మక్కాకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రదేశం.

సవీఖ్ (السويق) : వేపిన గోధుమలు లేదా బార్లీ గింజల పొడితో చేయబడిన ఒక రకమైన అంబలి (చక్కెర మరియు ఖర్జూరాలతో కూడా).

సయీ (السعي) : హజ్ మరియు ఉమ్రాహ్ చేసేటప్పుడు మక్కాలో సఫా మరియు మర్వా పర్వతాల మధ్య ఏడుసార్లు పరుగెత్తడం.

సయ్యిద్ (السيد) : యజమాని లేదా దొర (ఈ పదాన్ని ప్రవక్త (స) యొక్క వారసులకు పేరుగా వాడతారు).

సయ్యిదీ (سيدي) : నా యజమాని.

షాబాన్ (شعبان) : ఇస్లామిక్ క్యాలెండర్‌లో ఎనిమిదవ నెల.

షామ్ (الشام) : సిరియా, పాలస్తీనా, లెబనాన్ మరియు జోర్డాన్ ప్రాంతాలు.

షవ్వాల్ (شوال) : ఇస్లామిక్ క్యాలెండర్‌లో పదవ నెల.

షిగార్ (الشغار) : ఇది ఒక రకమైన పెళ్ళి, ఇందులో వ్యక్తులు పెళ్ళిలో తమ కూతుళ్లను లేదా చెల్లెళ్ళను మహ్ర్ లేకుండానే ఇచ్చిపుచ్చుకుంటారు.

షిరాక్ (الشراك): ఒక తోలు కట్టు.

షిర్క్ (الشرك): బహుదైవారాధన, అల్లాహ్‌తో పాటు ఇతరులను కూడా పూజించడం.

షుఫా (الشفعة): ముందుగా జరిగే విక్రయము.

సిద్దీఖ్ మరియు సిద్దీఖూన్ (الصديق والصديقون): ప్రవక్తను ముందుగా నమ్మి అనుసరించినవారు. (ఖురాన్ : 4 : 69)

సిద్ర్ (السدر): రేగుచెట్టు (లేదా నిబ్క్ చెట్టు).

సిద్రత్ ఉల్ ముంతహా (سدرة المنتهى): స్వర్గానికి దగ్గరగా ఉన్న ఏడవ ఆకాశంపై ఉన్న నబ్క్ చెట్టు (స్వర్గం పైఅంచులోఉన్న రేగు చెట్టు).

సిఫ్ఫీన్ (صفين): ఉస్మాన్(రజి)ను చంపిన తరువాత సిఫ్ఫీన్‌లో హజ్రత్ అలీ (రజి) అనుచరులు హజ్రత్ ముఆవియ (రజి) అనుచరుల మధ్య జరిగిన యుద్ధం.

సివాక్ (السواك): అల్ అరాక్ చెట్టు యొక్క వేరు ముక్క. ఇది పనుదోము పుల్లగా వాడుకోవడానికి ఉపయోగపడుతుంది.

సుబ్‌హానల్లాహ్ (سبحان الله): పవిత్రత అల్లాహ్‌కే!

సుహూలియా (السحولية): ఒక కాటన్ బట్ట, దీని పేరు యమెన్‌లోని సుహుల్ అనే గ్రామం పేరు నుంచి సంగ్రహించబడింది.

సున్దస్ (السندس): ఒక రకమైన పట్టు బట్ట.

సున్నత్ (السنة): ముస్లిములు అనుసరించవలసి ఉన్న ప్రవక్త (స) యొక్క ప్రవచనాలు, ప్రార్థనా పద్ధతులు, ఆజ్ఞలు, క్రమమైన మార్గాలు మొదలగునవి.

సుత్రా (السترة): ఒక స్తంభం, కర్ర, గోడ. నమాజు చేసే వ్యక్తికి - ఇతరులకు మధ్య హద్దుగా ఒక అడుగు ఎత్తున ఉండేది.

తాబయి (التابعي): (బహువచనం తాబయీన్. అంటే అర్థం అనుచరులు లేదా వారసులు). ప్రవక్త యొక్క సహచరుడిని కలిసిన లేదా అనుసరించిన వ్యక్తికి పెట్టే పేరు.

తబూక్ (تبوك): మదీనాకి ఉత్తరాన 700 కిలో మీటర్ల దూరంలో ఉన్న పేరెన్నికగన్న టౌను.

తాగూత్ (الطاغوت): తాగూత్ అనే పదానికి చాలా అర్థాలున్నాయి. నిజ దేవుడైన అల్లాహ్‌ని తప్ప పూజించబడేది ఏదైనా అని దీని అర్థం. అనగా బూటకపు దేవుళ్ళు. అది సైతాన్ కావచ్చు, దెయ్యాలు, విగ్రహాలు, రాళ్ళు, సూర్యుడు, నక్షత్రాలు, దేవదూతలు

మనుషులూ కావచ్చు. ఉదా ॥ జీసస్ (ఏసు క్రీస్తు), అల్లాహ్ యొక్క దూతలు, తప్పగా పూజించబడేవారు మరియు 'తాగూత్' గా భావించబడేవారు. ఋషులు, సమాధులు, పాలకులు, నాయకులు మొదలైన వారు తప్పగా పూజించ బడుతున్నారు, అలాగే అనుసరించబడుతున్నారు.

తహజ్జుద్ (التهجد) : ఇషా ప్రార్థన తరువాత ఫజ్ర్ ప్రార్థనకు ముందు, రాత్రి ఏ సమయంలోనైనా చేసే నఫిల్ నమాజు.

తహ్నీక్ (التحنيك) : ఇది ఇస్లామిక్ ఆచార పద్ధతి, దీనిలో ఖర్జూరాన్ని నమలడం, పిల్లవాడి నోటిలో ఖర్జూరపు రసాన్ని కొంత పోసి, వాడి చెవుల్లో 'అజాన్' వాక్యాలు చెప్పడం(సహీ బుఖారీ : అఖీఖా ప్రకరణం 7వ సంపుటి 272వ పేజీ చూడండి).

తయ్యిబా (الطيبة) : మదీనా నగరం యొక్క పేర్లలో ఒకటి.

తాయిఫ్ (الطائف) : మక్కా దగ్గరి పేరుగాంచిన టౌను.

తక్బీర్ (التكبير) : 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ అత్యంత గొప్పవాడు) అని అనడం.

తక్బీరతుఅత్ (التكبيرة) . 'అల్లాహు అక్బర్' అని ఒకసారి అనడం.

తల్బినా (التلبينة) : పిండి మరియు తేనెతో చేయబడిన వంటకం.

తల్బియా (التلبية) : 'లబ్బైక్, అల్లాహుమ్మ లబ్బైక్' అని అనడం (ఓ అల్లాహ్! నీ ఆజ్ఞలను శిరసావహిస్తూ హాజరయ్యాను, నీ పిలుపుకు స్పందించాను).

తరావీహ్ (التراويح): రమజాన్ యొక్క రాత్రులలో 'ఇషా' ప్రార్థనల తర్వాత ఇష్టప్రకారంగా చేసే అదనపు ప్రార్థనలు. వీటిని వ్యక్తిగతంగా గానీ లేక ప్రార్థనా సమూహంతో గానీ చేయవచ్చు.

తరిబత్ యమీనుక : (نربت يمينك) (నీ కుడి చెయ్యి దుమ్ములో ఉండునుగాక). ఇది హెచ్చరిక. నేను చెప్పినది నువ్వు చెయ్యకపోతే నువ్వు గొప్ప ప్రయోజనాన్ని పోగొట్టుకుంటావు. మట్టి కొట్టుకుపోతావు అని చెప్పటం.

తర్జీ (الترجيع) : ముఅజ్జిన్ చేత అజాన్ యొక్క పదాలను రెండుసార్లు మళ్ళీ చెప్పించడం.

తషహ్హుద్ (التشهد) : ప్రార్థనను చదవడం: అత్ తహియ్యాతు లిల్లాహి....(నుంచి).... వ అష్‌హదుఅన్న ముహమ్మదర్ రసూలల్లాహ్" (వరకు) ఖువూద్‌లో కూర్చుని చెప్పటం. (బుఖారీ : 1వ సంపుటి 794వ హదీసు). అల్లాహ్ తప్ప ఆరాధనీయుడెవడూ లేడనీ, ముహమ్మదు అల్లాహ్ ప్రవక్త (స)అనీ ప్రకటించడం.

తస్లీమ్ (التسليم) : సలాత్ (నమాజు)ను ముగించిన తరువాత, వ్యక్తి తన ముఖాన్ని కుడి వైపునకు, ఎడమ వైపునకు తిప్పి అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్ (శాంతి మరియు అల్లాహ్ యొక్క దయ నీ మీద ఉండునుగాక!) అని అనటం. దీనినే తస్లీమ్ అంటారు.

తౌహీద్ (التوحيد) : తౌహీద్ అనగా అల్లాహ్ ఒక్కడే దేవుడు అని ప్రకటించడం. దీనికి మూడు రూపాలున్నాయి:

(అ) అల్లాహ్ ప్రభుత్వం యొక్క ఏకత్వం: **తౌహీద్-అర్-రుబూబియ్యా.** విశ్వం అంతటికీ ఒకే ఒక్క దేవుడు ఉన్నాడని నమ్మడం, దాని సృష్టికర్త, నిర్వాహకుడు, వ్యూహకర్త, భద్రత నిచ్చేవాడు అల్లాహ్ ఒక్కడేనని విశ్వసించటం.

(ఆ) అల్లాహ్‌ని ప్రార్థించడంలోని ఏకత్వం : **తౌహీద్-అల్-ఉలూహియ్యా.** పూజించబడే హక్కు అల్లాహ్‌కు తప్ప వేరే ఏవ్వరికీ లేదని నమ్మడం (ఉదాహరణకు ప్రార్థించడం, వేడుకోవడం, సహాయాన్ని అడగటం, ప్రమాణం చేయడం, ఇవ్వడం, ఉపకారం చేయడం, ఉపవాసం, యాత్ర.... మొదలగునవి).

(ఇ) అల్లాహ్ పేర్లు, గుణగణాలలోని ఏకత్వం : **తౌహీద్ అల్ అస్మా వస్ సిఫాత్:** ఇవి నమ్మాలి : 1. ఆయన, ఆయన సందేశహరుడు పిలిచిన పేర్లతో తప్ప అల్లాహ్‌ను మరో పేరుతో పిలవకూడదని, 2. అల్లాహ్ గుణగణాలను, పేర్లను మరొకరికి పెట్టకూడదని (ఉదా: అల్ కరీమ్). 3. ఖురాన్‌లోను, ముహమ్మదు గారి ద్వారా అల్లాహ్ వెల్లడించిన తన గుణగణాలను ధృవీకరించాలని, వాటిని మార్చకూడదనీ, ఉపేక్షించకూడదనీ, సృష్టితాలలో మరేదైనా పోలిక వచ్చేలా ఈ పేర్లను వక్రీకరించడం కూడదనీ. ఉదాహరణకు: ఖురాన్‌లో చెప్పబడినట్లు అల్లాహ్ తన సింహాసనం మీద కూర్చున్నాడనీ (20:5), అనంత కరుణామయుడు (అల్లాహ్) ఏడవ ఆకాశంలోని బలమైన సింహాసనంపై నుండి లేచాడనీ, జుల్ హిజ్జా 9వ రోజు అయిన అర్ఫాత్ రోజున మాత్రమే ఆయన మొదటి ఆకాశానికి దిగివస్తాడని, ముహమ్మద్ (స) గారు చెప్పినట్లు ఆ రోజు రాత్రి మూడవ భాగంలో ఆయన తన జ్ఞానంతో మన మధ్య ఉంటాడుగానీ, తన దేహంతో కాదు. ఆయన్ని పోలిందేదీ లేదు. ఆయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు. (42 : 11)

వహీ (الوحي) : అల్లాహ్ తన ప్రవక్తలకిచ్చే జ్ఞానము లేదా ప్రేరణ.

వైహక (ويحك) : అల్లాహ్ నీ యందు దయతో ఉండునుగాక!

వైలక (ويلك) : నీకు శ్రమ కలుగుగాక!

వలా (الـولاء) : అల్ వలా అంటే స్వతంత్రుడైన బానిస యొక్క ఆస్థిని, అతనికి స్వాతంత్ర్యం ఇచ్చిన వ్యక్తి వారసత్వంగా పొందగలిగే హక్కు వలా వారసత్వ పరంపరలో భాగం అని హదీసు స్పష్టం చేసింది. దాన్ని అమ్మటం, దానం చెయ్యటం నిషిద్ధం.

వలీ (الولي) : (బహు వచనం ఔలియా) రక్షకుడు, సంరక్షకుడు, మోసే వాడు, సహాయకుడు, స్నేహితుడు.

వలీమా (الوليمة) : పెళ్ళి విందు.

వఖ్ఫ్ (الوقف) : మతపరమైన దానము, ఆస్తి.

వర్స్ (الورس) : పసుపు రంగు వెయ్యడానికి ఉపయోగపడే ఒక రకమైన పాద మొక్క.

**వసాయా** (الوصايا) : వీలునామాలు లేదా నిబంధనలు (ఏకవచనం : వసియ్యత్).

**వస్క్** (الوسق) : (బహువచనం : అవ్సఖ్ లేదా అవ్ఖ్) సుమారు 60 సా = 135 కి.గ్రాలకు సమానమైన కొలత. ఇది కొంచెం ఎక్కువ కావచ్చు లేదా తక్కువ కావచ్చు.

విసాల్ (الوصال) : నిరంతరంగా ఒక రోజు కంటే ఎక్కువగా ఉపవాసం ఉండటం.

వసీలా (الوسيلة) : అల్లాహ్ దయను పొంది ఆయనకు దగ్గరయ్యే మార్గాలు.

వుజూ (الوضوء) : శుద్ధి. ముఖము, మోచేతుల వరకు చేతులు, గిలకల వరకు కాళ్ళు కడుక్కోవటం, చెవులు, తల తడి చేత్తో తుడుచుకోవటం. ఇది కాబా చుట్టూ ప్రదక్షిణ కోసం, ప్రార్థనల కోసం చేస్తారు.

యలమ్లమ్ (يلملم) : యమన్ ప్రజల మీఖాత్.

యమామ (اليمامة) : సౌదీ అరేబియాలో నజ్ద్ వైపున్న ఓ ప్రాంతం. తొలినాళ్ళ ముస్లిములకు, ముసైలిమా అనే అబద్ధ ప్రవక్త అనుచరులకు మధ్య యుద్ధం ఇక్కడ జరిగింది.

యఖీన్ (اليقين) : ఖచ్చితమైన పూర్తి నమ్మకం.

యర్మూక్ (اليرموك) : సిరియాలోని ప్రదేశం.

యస్రిబ్ (يثرب) : **మదీనా** పేర్లలో ఇదొకటి.

యౌమున్నఫర్ (يوم النفر) : **జుల్ హిజ్జా** 12 లేదా 13వ దినం. అరఫాత్, ముజ్దలిఫాలలో **హజ్** క్రియలన్నీ ముగించుకున్న తరువాత యాత్రికులు మినాను **వదిలి** వెళతారు.

యౌమున్నహర్ (يوم النحر) : జుల్ హిజ్జా 10వ రోజు. జంతువులను బలి ఇచ్చేరోజు.

యౌముత్తర్వియా (يوم التروية) : జుల్ హిజ్జా 8వ రోజు. యాత్రికులు మక్కా వదిలి మినాకు వెళ్ళే రోజు.

యౌముర్రుఊస్ (يوم الرؤوس) : "తలల రోజు" అని అర్థం. ఈదుల్ అజ్హా తరువాత రోజు.

జకాత్ (الزكاة) : ముస్లిం సమాజంలోని పేదల ప్రయోజనం కోసం ప్రతి ముస్లిము ఏడాదికోసారి తన సంపదలో నుంచి చెల్లించే నిర్ణీత మొత్తం. జకాత్ చెల్లించటం తప్పనిసరి. ఎందుకంటే ఇది ఇస్లాం అయిదు స్థంభాల్లో ఒకటి. ముస్లిం సమాజం సురక్షితం, సుసంపన్నం కావటం కోసం, సామాజిక న్యాయాన్ని అందించటం కోసం జకాత్ ముఖ్యమైన ఆర్థిక విధానం.

జకాతుల్ ఫిత్ర్ (زكاة الفطر) : ఈదుల్ ఫితర్ నమాజుకు ముందు తప్పనిసరిగా చేసే సదకా. (నహీహ్ బుఖారీ : 2వ సంపుటి జకాతుల్ ఫిత్ర్ గ్రంథం 339వ పేజీ చూడండి).

జమ్ జమ్ (زمزم) : మక్కాలోని మస్జిదె హరామ్‌లో ఉన్న పవిత్ర బావి.

జనాదిఖా (الزنادقة) : నాస్తికులు.

జర్నబ్ (زرنب) : మంచి వాసన వచ్చే గడ్డి.

జుహ్ర్ (الظهر) : మధ్యాహ్నం, మధ్యాహ్న ప్రార్థనను జుహ్ర్ అంటారు.

# హదీసుల క్రోడీకరణకై అపారమైన సేవ చేసిన ఇమాముల, హదీసువేత్తల సంక్షిప్త జీవిత చరిత్ర

# ఏడుగురు ఇమాములు

## 1. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై)

ధార్మిక జగత్తులో పీష్వాగా, మార్గదర్శకుడుగా పరిగణించబడే నలుగురు ఇమాములలో ఈయన ఒకరు. ఈయన అసలు పేరు అబూ అబ్దుల్లాహ్ అహ్మద్ బిన్ ముహమ్మద్ బిన్ హంబల్ షైబానీ. హిజ్రీ 174వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ నెలలో జన్మించారు. హిజ్రీ 241, రబీవుల్ అవ్వల్ నెల 12వ తేదీ శుక్రవారం నాడు బుగ్దాద్‌లో కాలధర్మం చెందారు. ధర్మమార్గంలో కఠినాతికఠినమైన పరీక్షల్ని ఎదుర్కొని, కదలని కొండలా స్థయిర్యాన్ని ప్రదర్శించిన గొప్ప విద్వాంసులు. ఈయనకు 10లక్షల హదీసులు కంఠస్థం అయి ఉండేవి. ఈయన మరణించిన రోజున 20వేల మంది క్రైస్తవులు, యూదులు, పారసీకులు ధర్మపరివర్తన చెంది ఇస్లాం పరిధిలోకి వచ్చారని అనబడుతోంది.

## 2. ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బుఖారీ (రహ్మ.లై)

హదీసు విద్యలో ఈయన హదీసువేత్తలందరికీ ఇమామ్‌గా పరిగణించబడతారు. పూర్తి పేరు అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బిన్ ఇబ్రాహీమ్ బిన్ ముగీరా బిన్ బర్దిజ్బాహ్ జూఫీ బుఖారీ. ప్రస్తుత ఉజ్బెకిస్తాన్‌లోని బుఖారాలో హిజ్రీ 194వ సంవత్సరం షవ్వాల్ మాసంలో జన్మించారు.

హదీసుల సంకలనం కోసం ప్రపంచంలో విస్తృతంగా పర్యటించారు. హదీసు విద్యకు సంబంధించినంత వరకు ఈయన 'దేవుని చిహ్నం'గా భావించబడేవారు. ఆయన సంకలనం చేసిన హదీసు గ్రంథం "అల్ జామె అస్సహీహ్" దివ్య ఖుర్‌ఆన్ తరువాత ఇస్లాం జగత్తులో అత్యంత ప్రామాణికమైన గ్రంథంగా పరిగణించబడుతోంది. ఈయన హిజ్రీ 256వ సంవత్సరం ఈదుల్ ఫిత్ర్ రాత్రి సమర్‌ఖండ్‌లో తనువు చాలించారు.

## 3. ఇమామ్ ముస్లిం బిన్ హజ్జాజ్ (రహ్మ.లై)

ఈయన ప్రఖ్యాత హదీసు ఇమాములలో ఒకరు. పూర్తిపేరు ముస్లిం బిన్ హజ్జాజ్ ఖుషైరీ నీసాపూరీ. ఈయన హిజ్రీ శకం 204లో మష్‌హద్ నగరానికి సమీపంలో వున్న నీసాపూర్ పట్టణంలో జన్మించారు. ప్రస్తుతం ఈ స్థలం ఈరాన్‌లో ఉంది. ఈయన సంకలనం చేసిన 'సహీహ్ ముస్లిం' గ్రంథం ప్రపంచంలో 'సహీహ్ బుఖారీ' తరువాత రెండో ప్రామాణిక హదీసుల సంకలనంగా పరిగణించబడుతున్నది. ఈయన ఇమామ్ బుఖారీతో సహా అనేకమంది అగ్ర ఇమాముల ద్వారా హదీసులు విన్నారు.

హదీసు విద్యార్జన కోసం ఇరాఖ్, హిజాజ్ ప్రాంతాలలో పర్యటించారు. హిజ్రీ 271లో మరణించారు.

### 4. ఇమామ్ అబూదావూద్ సులైమాన్ బిన్ అష్అస్ (రహ్మ.లై)

ఎన్నదగ్గ హదీసువేత్తలలో ఈయన కూడా ఒకరు. పూర్తిపేరు అబూదావూద్ సులైమాన్ బిన్ ఇస్హాఖ్ అజ్దీ సజిస్తానీ. 'సుననె అబూదావూద్' ఈయన విరచితమే. ఈయన హిజ్రీ 202లో జన్మించారు. హిజ్రీ 276 షవ్వాల్ నెల 15వ తేదీ శుక్రవారం నాడు తన నిజప్రభువు వద్దకు చేరుకున్నారు. హదీసు విద్యలో సాటిలేని మేటి. ఈ విద్య ఆయనకు కొట్టిన పిండి అనీ, హజ్రత్ దావూద్ అలైహిస్సలాం ముందు ఉక్కు ఎలా మెత్తబడిపోయిందో అలాగే హజ్రత్ అబూదావూద్ ముందు హదీసు విద్య సులువై పోయిందని మేధావులు కొనియాడారు. మహాప్రవక్త (సఅసం)వారి ఐదు లక్షల ప్రవచనాలను తాను లిఖించాననీ, తాను వ్రాసిన సునన్ గ్రంథంలోని హదీసులు ఆ ఐదు లక్షల హదీసుల్లో కొన్ని మాత్రమేనని ఆయన అంటుండేవారు.

### 5. ఇమామ్ అబూ ఈసా ముహమ్మద్ బిన్ ఈసా తిర్మిజీ (రహ్మ.లై)

ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) గారి శిక్షణలో పోతపోయబడిన ప్రియ శిష్యులలో ఇమామ్ తిర్మిజీ ఒకరు. ఉజ్బెకిస్తాన్‌లోని తిర్మిజ్ అనే పట్టణంలో హిజ్రీ 209లో జన్మించారు. 'జామె తిర్మిజీ' అనే గ్రంథాన్ని సంకలనం చేశారు. ఇందులో సుమారు 4వేల హదీసులున్నాయి. తన గురువర్యులైన ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) మరణంపై ఈయన అమితంగా దుఃఖించారు. ఆ దుఃఖంతోనే ఆయన కంటి చూపు పూర్తిగా పోయింది. చాలా కాలం పాటు అంధులుగానే ఉండి, హిజ్రీ 279లో తన నిజ నేస్తాన్ని చేరుకున్నారు.

### 6. ఇమామ్ అబూ అబ్దుర్రహ్మాన్ అహ్మద్ బిన్ షుఐబ్ నసాయి (రహ్మ.లై)

ఖురాసాన్‌లోని 'నసా' పట్టణంలో హి.శ. 215లో ఇమామ్ నసాయి పుట్టారు. హదీసు విద్యలో నిష్ణాతులు. హదీసులను కంఠస్థం చేసుకోవటంలో దిట్ట. అందుకే హాఫిజె హదీస్‌గా పిలువబడ్డారు. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం గ్రంథాల తరువాత చాలా తక్కువ బలహీన (జయీఫ్) ఉల్లేఖనాలు గల హదీసు సంకలనాల్లో ఇమామ్ నసాయి గారి 'సునన్' ఒకటి. ఈయన ఈజిప్టులో కొంతకాలం స్థిరపడిన తరువాత డెమాస్కస్‌కు ప్రస్థానం చేశారు. అక్కడి నుంచే "అల్ ఖసాయిస్ ఫీ ఫజ్లె అలీ - రజి" అనే రచన చేశారు. దీనిపై తీవ్ర విమర్శల వెల్లువ పెల్లుబికింది. విమర్శకులు ఆయనపై విరుచుకుపడ్డారు. అనంతరం ఆయన మక్కా నగరానికి చేరుకున్నారు. మక్కాలోనే హి.శ. 303లో తనువు చాలించారు.

### 7. ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజా (రహ్మ.లై)

ఇబ్నె మాజాగా సుప్రసిద్ధులు. హి.శ. 207లో ఖజ్వీనీలో జన్మించారు. ఈయన సునన్

అను గ్రంథాన్ని రచించారు. ఈయన ఇమామ్ మాలిక్ సహవాసుల నుండి హదీసులను విన్నారు. ఇమామ్ మాలిక్ శిష్యునిగా అధ్యయనం చేశారు. ఈయన ద్వారా భారీ సంఖ్యలో జనులు హదీసులను ఉటంకించారు. ఈయన హదీసులలో బలహీన (జయీఫ్) ఉల్లేఖనాలు అనేకం ఉన్నాయి. ఇమామ్ ఇబ్నె మాజా హి.శ. 273 రమజాన్ నెలలో మరణించారు.

## ఇంకా ఇతర ప్రముఖ హదీసు విద్వాంసులు

### 8. ఇస్‌హాఖ్ బిన్ రాహ్వేహ్ (రహ్మ్‌లై)

ఈయన హదీసుల ఇమాముగానేగాక, హదీసుల గొప్ప హాఫిజ్ (సంస్మర్త)గా కూడా ప్రసిద్ధిచెందారు. నీసాపూర్‌కి చెందినవారు. నీసాపూర్ విద్వాంసులుగానే గాక, సమకాలీన ఖ్రాక్ ప్రదేశాల "షేఖ్"గా ఖ్యాతి గడించారు. "ఇరాఖ్‌లో ఇస్‌హాఖ్ బిన్ రాహ్వేహ్‌తో సమ ఉజ్జీ కాగల మరో వ్యక్తిని నేను చూడలేద"ని ఇమామ్ అహ్మద్ (రహ్మ్‌లై) కితాబు ఇచ్చారు. "స్థిరత్వం, జ్ఞాపకశక్తి, మేలిమి లాంటి విషయాలలో ఇస్‌హాఖ్ బిన్ రాహ్వేహ్ అబ్బురపడదగ్గ వ్యక్తి" అని ఇమామ్ అబూహాతిం కొనియాడారు. ఇస్‌హాఖ్ బిన్ రాహ్వేహ్ హిజ్రీ 166లో జన్మించారు. వేరొక కథనం ప్రకారం హిజ్రీ 161లో పుట్టారు. హిజ్రీ 238 షాబాన్‌లో మరణించారు.

### 9. అహ్మద్ బిన్ ఇబ్రాహీం ఇస్మాయిలీ (రహ్మ్‌లై)

ఈయన ఇమాముగా, హాఫిజ్‌గా, ఎన్నదగ్గ ఆలిమ్‌గా, షేఖుల్ ఇస్లాంగా సుప్రసిద్ధులు. పూర్తిపేరు అబూబక్ర్ అహ్మద్ బిన్ ఇబ్రాహీం బిన్ ఇస్మాయీల్ బిన్ అబ్బాస్ ఇస్మాయిలీ జుర్జానీ. తన స్వస్థలంలో ప్రఖ్యాత షాఫయి విద్వాంసునిగా పరిగణించబడ్డారు. ఆయన ఎన్నో ప్రామాణికమైన రచనలు చేశారు. వాటిలో ముస్నదె ఉమర్ (రజి) కూడా ఒకటి. ఈయన గురించి ఇమామ్ హాకిమ్ ఇలా అంటున్నారు: "ఇస్మాయిలీ తన కాలపు అరుదైన వ్యక్తుల్లో ఒకరు. హదీసువేత్తల, ధర్మవేత్తల నాయకుడు. సత్సీలం, ఉదార స్వభావంలో వారందరికీ మార్గదర్శకుడు." ఇస్మాయిలీ హిజ్రీ 277లో జన్మించారు. 94 సంవత్సరాల ప్రాయంలో - హిజ్రీ 371 రజబ్ నెలలో - తన నిజప్రభువును చేరుకున్నారు.

### 10. అహ్మద్ బిన్ అమ్ర్ బజ్జార్ (రహ్మ్‌లై)

ఈయన ఇమాము, హాఫిజ్ మాత్రమేగాక గొప్ప విద్వాంసులు కూడా. పూర్తిపేరు అబూబక్ర్ అహ్మద్ బిన్ అమ్ర్ బిన్ అబ్దుల్ ఖాలిఖ్ బస్రీ. ఈయన అగ్రశ్రేణి ఇమాములలో ఒకరుగా భావించబడతారు. 'అల్ ముస్నదుల్ కబీర్', 'అల్ ఇలల్' అనే రెండు గ్రంథాలను రచించారు. ఇమామ్ తబ్రానీ, తదితర ఇమాముల దగ్గర విద్య నార్జించారు.ఈయన హిజ్రీ 292లో మరణించారు.

### 11. అహ్మద్ బిన్ హుసైన్ బైహఖీ (రహ్మ.లై)

నీసాపూర్‌కు సమీపంలోనున్న బైహఖ్ పట్టణవాసులు. అసలు పేరు అబూబక్ర్ అహ్మద్ బిన్ హుసైన్. ఎన్నదగ్గ ఇమాముగా, విద్వాంసునిగా, హదీసుల సంస్మర్తగా పేరు మోశారు. హిజ్రీ 374లో జన్మించారు. హిజ్రీ 458లో తనువు చాలించారు. షాఫయి ధర్మవేత్తలలో అగ్రజులుగా పరిగణించబడతారు. ఎన్నో రచనలు చేశారు. వాటిలో సుననె కుబ్రా, సుననె సుఘ్రా, అల్ మబ్సూత్, అల్ అస్మా వస్సిఫాత్ ఎన్నదగినవి. "ఈయన రచనలన్నింటినీ కలిపితే ఇంచుమించు వెయ్యి సంపుటాలవుతాయి" అని ఇమామ్ జహ్బీ వక్కాణించారు.

### 12. అబూ హాతిం ముహమ్మద్ బిన్ ఇద్రీస్ రాజీ (రహ్మ.లై)

ఈయన అగ్రశ్రేణి హాఫిజ్‌గా, ఇమాముగా పేరుమోశారు. హిజ్రీ 195లో జన్మించారు. హిజ్రీ 277లో మరణించారు. హదీసుల ప్రామాణికతను నిర్ధారించే విద్యలో ఈయనకు మంచి ప్రవేశం ఉంది.

### 13. అబ్దుల్లాహ్ బిన్ అలీ బిన్ జారూద్ (రహ్మ.లై)

అత్యుత్తమ శ్రేణికి చెందిన ఇమామ్ మరియు హాఫిజ్. ఈయన పూర్తి పేరు అబూ ముహమ్మద్ అబ్దుల్లాహ్ బిన్ అలీ బిన్ జారూద్ నీసాపూరీ. మక్కా సమీపంలో నివసించేవారు. "అల్ ముస్తఖా ఫిల్ అహ్కామ్" అనే గ్రంథాన్ని రచించారు. హిజ్రీ 307లో మరణించారు.

### 14. హారిస్ బిన్ అబూ ఉసామ (రహ్మ.లై)

పూర్తిపేరు అబూ ముహమ్మద్ హారిస్ బిన్ అబూ ఉసామా ముహమ్మద్ బిన్ దాహిర్ తమీమి బుగ్దాది. ఈయన హాఫిజ్. 'ముస్నద్' అనే రచనను మొదలెట్టారు గాని పూర్తి చేయలేకపోయారు. ఈయన విశ్వసనీయులని ఇబ్రాహీం హర్బీ, అబూ హాతింలు వక్కాణించారు. సత్యసంధులని ఇమామ్ దారె ఖుత్ని కితాబు ఇచ్చారు. ఈయన హిజ్రీ 186లో పుట్టారు. హిజ్రీ 282లో అరఫా రోజున మరణించారు.

### 15. అబూ అబ్దుల్లాహ్ అల్ హాకిమ్ (రహ్మ.లై)

ప్రముఖ హదీసు పరిశోధకులు. పూర్తిపేరు అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ అల్ హాకిమ్ **నీసాపూరీ**. ఇబ్నుల్ బైయిగా పిలువబడేవారు. హిజ్రీ 321లో జన్మించారు. "అల్ ముస్తద్రక్ **అల స్సహీహైన్**" అనే గ్రంథాన్ని రచించారు. సుమారు రెండువేల మంది గురువులను కలుసుకుని, వారి దగ్గర విద్యాభ్యాసం చేశారు. దైవభక్తి పరాయణులు. ప్రామాణికమైన రచనలెన్నో చేశారు. ఈయన హిజ్రీ 405వ సంవత్సరం సఫర్ నెలలో శాశ్వతంగా కన్ను మూశారు.

### 16. అబూహాతిం ముహమ్మద్ బిన్ హిబ్బాన్ (రహ్మ.లై)

ప్రఖ్యాత ఇమాములలో ఒకరు. సజిస్తాన్‌లోని ఒకానొక పురమైన 'బుస్త్'కు చెందిన వారు. గొప్ప హదీసువేత్త, ధర్మవేత్త. ఇమామ్ ఇబ్నె ఖుజైమ (రహ్మ.లై)గారి ప్రియ శిష్యులలో ఒకరు. హిజ్రీ 354లో సమర్‌ఖండ్‌లో మరణించారు.

### 17. ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ బిన్ ఖుజైమ (రహ్మ.లై)

షేఖుల్ ఇస్లాంగా, గొప్ప హాఫిజ్‌గా, అగ్రశ్రేణి ఇమాములలో ఒకరుగా ఖ్యాతి గడించారు. హిజ్రీ 223లో నీసాపూర్‌లో జన్మించారు. ఖురాసాన్ ప్రాంతానికి ఇమాముగా, హాఫిజ్‌గా సేవలందించారు. 140కి పైచిలుకు రచనలు చేశారు. కడకు హిజ్రీ 311లో నీసాపూర్‌లో మరణించారు.

### 18. ఇబ్నె అబూ ఖైసమ (రహ్మ.లై)

ఈయన ఇమాముగా, హాఫిజ్‌గా, పరిశోధకునిగా ధార్మిక సేవలందించారు. పూర్తిపేరు అబూబక్ర్ అహ్మద్ బిన్ అబూ ఖైసమ జుహైర్ బిన్ హర్బ్ నసాయి బుగ్దాదీ. 'తారీఖుల్ కబీర్' అనే గ్రంథాన్ని వ్రాశారు. "ఈయన విశ్వసనీయులు మరియు ఎన్నదగినవార"ని దారె ఖుత్నీ ధృవీకరించారు. ఈయన గురించి ఖతీబ్ బుగ్దాదీ ఇలా అంటున్నారు : "ఇబ్నె అబూ ఖైసమ నమ్మకస్థులు, విద్వాంసుడు, నిజాయితీపరులు, చరిత్రలో మంచి ప్రజ్ఞాశాలి, కవనంలో మంచి ప్రవేశం ఉన్న వ్యక్తి." ఈయన ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ.లై), ఇబ్నె మొయిన్‌ల వద్ద హదీసు విద్య నేర్చుకున్నారు. 94 ఏండ్ల వయస్సులో (హిజ్రీ 289లో) మరణించారు.

### 19. అలీ బిన్ ఉమర్ దారె ఖుత్నీ (రహ్మ.లై)

బుగ్దాద్ నగరంలో 'దారె ఖుతన్' పేటకు చెందినవారు. పూర్తి పేరు అబుల్ హసన్ అలీ బిన్ ఉమర్ బిన్ అహ్మద్ బిన్ మహ్దీ బగ్దాదీ. గొప్ప హాఫిజ్ మాత్రమే గాక సాటిలేని ఇమామ్ కూడా. హిజ్రీ 306లో జన్మించారు. ఈయనకు హదీసు విద్యపై మంచి పట్టు ఉండేది. హదీసుల కథనంలో దొర్లే పొరపాట్లను పసిగట్టడంలోనూ, ఉల్లేఖకుల పేర్లను బాగా జ్ఞాపకముంచుకోవటంలోనూ దిట్ట. దారెఖుత్నీ హిజ్రీ 385లో మరణించారు.

### 20. ఇమామ్ దారిమీ (రహ్మ.లై)

పూర్తి పేరు అబూ ముహమ్మద్ అబ్దుల్లాహ్ బిన్ అబ్దురహ్మాన్ బిన్ ఫజల్ బిన్ బహ్‌రామ్ తమీమి దారిమీ సమర్‌ఖందీ.. సమర్‌ఖండ్‌లో షేఖుల్ ఇస్లాంగా, హదీసుల హాఫిజ్‌గా, ఇమామ్‌గా ఖ్యాతి గడించారు. "అల్ ముస్నదుల్ ఆలి" అనే గ్రంథాన్ని రచించారు. హరమైన్, ఖురాసాన్, సిరియా, ఇరాఖ్, ఈజిప్టులలో హదీసు విద్యనార్జించారు. ఇమామ్ ముస్లిం, అబూదావూద్, తిర్మిజీ, నసాయి, తదితర హదీసు

ఇమాములు ఈయన ద్వారా హదీసులను ఉల్లేఖించారు. ఇమామ్ దారిమీ బహుముఖ ప్రజ్ఞాశాలి. కడు వివేచనాపరులు. సద్గుణ సంపన్నులు. నిజాయితీ తత్పరత, మృదుత్వాలకు మారు పేరు ఆయన. ధర్మ నిష్ఠాపరులు. షరీయత్ సూత్రాలను వర్తమాన సమస్యలకు అన్వయింపజేసే విషయంలో ఆయనకు ఆయనే సాటి. సాధు స్వభావులు. ప్రాపంచిక వ్యామోహాలకు దూరంగా ఉండేవారు. హిజ్రీ 181లో జన్మించిన ఇమామ్ దారిమీ హిజ్రీ 255 జిల్ హజ్జ్ 8వ తేదీన మరణించారు.

## 21. అబూదావూద్ తయాలిసీ (రహ్మ.లై)

హదీసులను కంఠస్థం చేసుకున్న ప్రముఖులలో ఈయన చాలా గొప్పవారు. ఈయన పూర్తి పేరు సులైమాన్ బిన్ దావూద్ బిన్ జారూద్ బస్రీ. జన్మతః పారసీకులు. అల్ జుబైర్‌చే స్వేచ్ఛ నొసగబడిన బానిస. "మేము తయాలిసీని మించిన హదీసుల సంస్మర్తను చూడలేదు" అని ఖల్లాస్ మరియు అల్ మదీనీ చెప్పేవారు. "ఆయన్ని మించిన సత్యసంధులను నేను ఎరుగను" అని ఇబ్నె మహ్దీ వక్కాణించారు. ఆయన వెయ్యిమంది గురువులను కలుసుకుని హదీసులను సంకలనం చేశారు. హిజ్రీ 204లో - 80 ఏళ్ల వయస్సులో - మరణించారు.

## 22. ఇబ్నె అబూ అద్దున్యా (రహ్మ.లై)

ఈయన ప్రముఖ హదీసువేత్త, సజ్జనుల కోవకు చెందిన విద్వాంసులు. పూర్తిపేరు అబూబక్ర్ అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్ బిన్ ఉబైద్ బిన్ సుఫ్యాన్ బిన్ అబూ అద్దున్యా ఖురషీ, ఉమవీ, బుగ్దాదీ. విముక్తి నొసగబడిన కురైష్ బానిస. ఎన్నో పుస్తకాలను రచించారు. ఖలీఫాల, సర్దారుల సంతతిలోని పలు విద్యార్థులకు ఈయన చదువులు చెప్పారు. ఈయన దగ్గర శిక్షణ పొందినవారిలో మోతజిద్ బిల్లాహ్ కూడా ఉన్నారు. ఇబ్నె అబూ అద్దున్యా హిజ్రీ 208లో జన్మించారు. హిజ్రీ 281లో మరణించారు.

## 23. ఇమామ్ జుహ్లీ (రహ్మ.లై)

పూర్తి పేరు అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ యహ్యా బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఖాలిద్ బిన్ ఫారిస్. హదీసు పరిజ్ఞానంలో అమీరుల్ మోమినీన్‌గా పిలువబడేవారు. బనూ జుహ్లాకు చెందినవారు. స్వేచ్ఛ నొసగబడిన బానిస. ఈయన హరమైన్, సిరియా, ఈజిప్టు, ఇరాఖ్, రే, ఖురాసాన్, యమన్ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడి విద్వాంసుల హదీసు పాఠాలు విన్నారు. ఆ విధంగా తన అవిరళ కృషిచే హదీసు విద్యలో ఉన్నత సోపానాలను అధిరోహించారు. ఖురాసాన్‌లో మహాజ్ఞానిగా ఖ్యాతి గడించి, బోధకునిగా సేవలందించారు. "జుహ్రీ హదీసుల పరిజ్ఞానంలో నేను ముహమ్మద్ బిన్ యహ్యా జుహ్లీని మించిని వ్యక్తిని ఎరుగను" అని ఇమామ్ అహ్మద్ (రహ్మ.లై) కితాబు ఇచ్చారు. ఇమామ్ జుహ్లీ హిజ్రీ 180 తరువాత జన్మించారు. హిజ్రీ 258లో కాలధర్మం చెందారు.

### 24. అబూ జుర్ఆ రాజీ (రహ్మ్‌లై)

ఈయన పూర్తి పేరు ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్ కరీం బిన్ యజీద్ బిన్ ఫరూఖ్ అబూ జుర్ఆ రాజీ. ఖురైష్ తెగకు చెందినవారు. స్వేచ్ఛ పొందిన బానిస. అత్యుత్తమ శ్రేణికి చెందిన హదీసువేత్త. ఇమామ్ ముస్లిం, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజా తదితర హదీసువేత్తలు ఈయన ద్వారా హదీసులను ఉటంకించారు. ఈయన గురించి ఇమామ్ జహబీ ఇలా అంటున్నారు: "అబూ జుర్ఆ రాజీ హరమైన్ (మక్కా, మదీనా), ఇరాక్, సిరియా, అరేబియా ద్వీపం, ఖురాసాన్ మరియు ఈజిప్టు ప్రాంతాలను సందర్శించి చాలామంది ఇమాములను కలుసుకున్నారు. జ్ఞాపకశక్తి, వివేచన, ధార్మికత, చిత్తశుద్ధి, జ్ఞానం, సదాచరణ వంటి విషయాలలో ఆయన తన కాలపు ప్రముఖ వ్యక్తుల్లో ఒకరుగా భావించబడతారు." 74 సంవత్సరాల వయస్సులో (హిజ్రీ 274లో) అశాశ్వతమైన ఈ ప్రాపంచిక జీవితాన్ని విడిచి పరలోకానికి ప్రస్థానం చేశారు.

### 25. సయీద్ బిన్ మన్సూర్ (రహ్మ్‌లై)

పూర్తి పేరు సయీద్ బిన్ మన్సూర్ బిన్ షూబ మర్వజీ. పవిత్ర మక్కా నగరానికి సమీపంలో నివసించేవారు. 'సునన్' అనే గ్రంథాన్ని లిఖించారు. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారు ఈయన సేవల్ని కొనియాడారు. "సయీద్ బిన్ మన్సూర్ (రహ్మ్‌లై) గారు తమ జ్ఞాపకశక్తి నుపయోగించి మా చేత పదివేల హదీసులు వ్రాయించారు" అని హర్బ్ కర్మానీ వక్కాణించారు. సయీద్ బిన్ మన్సూర్ హిజ్రీ 227 రమజాన్ నెలలో పవిత్ర మక్కాలో మరణించారు.

### 26. ఇబ్నె సకన్ (రహ్మ్‌లై)

ఈయన హాఫిజ్, ఇమాము మరియు విశ్వసనీయులైన విద్వాంసులు. పూర్తి పేరు అబూ అలీ సయీద్ బిన్ ఉస్మాన్ సకన్ బుగ్దాదీ. హదీసుల అధ్యయనంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. హదీసు గ్రంథాలను సంకలనం చేసి హదీసుల సేవ చేసిన ప్రముఖులుగా నిలిచిపోయారు. ఇబ్నె సకన్ హిజ్రీ 294లో జన్మించారు. హిజ్రీ 353లో మరణించారు.

### 27. ముహమ్మద్ బిన్ ఇద్రీస్ షాఫయి (రహ్మ్‌లై)

ధార్మిక జగత్తులో మార్గదర్శకునిగా, పీష్వాగా ఖరారు చేయబడిన నలుగురు ఇమాములలో ఈయన ఒకరు. ఈయన పూర్తి వంశ పరంపర ఈ విధంగా ఉంది : అబూ అబ్దుల్లాహ్ ముహమ్మద్ బిన్ ఇద్రీస్ బిన్ అబ్బాస్ బిన్ ఉస్మాన్ బిన్ షాఫయి బిన్ సాయిబ్ బిన్ ఉబైద్ బిన్ అబ్దె యజీద్ బిన్ హాషిమ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్ ఖురషీ మక్కీ. ఈజిప్టులో స్థిరపడ్డారు. హిజ్రీ 150లో గాజాలో జన్మించారు. అనంతరం మక్కాకు తేబడ్డారు. హిజ్రీ 204వ సంవత్సరం రజబ్ నెల చివరి తేదీ శుక్రవారం రాత్రి తన నిజప్రభువు వద్దకు చేరుకున్నారు. ఈయన ముస్లిం

సమాజానికి మార్గదర్శక ఇమాముగా నిలిచారు. సమకాలీన ధర్మవేత్తలలో విశిష్టమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు. సాహితీ సముద్రంలో మహోత్తుంగ తరంగంలా కనిపించారు. ధర్మావగాహనా (ఫికహ్) సూత్రాలకు రూపకల్పన చేసి, ఈ ప్రక్రియకు ఒక ఒరవడిని ప్రసాదించారు. ఈయన తాతగారైన షాఫయి ఒక సహాబి అన్న విషయం గమనార్హం. ఆయన తన ప్రాజ్ఞ వయస్సులో మహనీయ ముహమ్మద్ (సఅసం)ను చూశారు.

## 28. అబూబక్ర్ బిన్ అబూ షైబ (రహ్మ.లై)

పూర్తి పేరు అబూబక్ర్ అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్ బిన్ అబూషైబ ఇబ్రాహీం బిన్ ఉస్మాన్ బిన్ హవాసీ అన్సీ. గొప్ప హాఫిజ్. అరుదైన వ్యక్తిత్వం. హదీసు విద్యలో మేరువు వంటివారు. "అల్ ముస్నద్ వల్ ముసన్నఫ్" సహా అనేక రచనలు చేశారు. ఇమామ్ అబూ జుర్ఆ, ఇమామ్ బుఖారీ, ఇమామ్ ముస్లిం, ఇమామ్ అబూదావూద్ తదితర ప్రముఖ హదీసు ఇమాములు ఈయన ద్వారా హదీసులను ఉటంకించారు. ఈయన హిజ్రీ 235 ముహర్రం మాసంలో మరణించారు.

## 29. సులైమాన్ బిన్ అహ్మద్ (రహ్మ.లై)

పూర్తిపేరు అబుల్ ఖాసిం సులైమాన్ బిన్ అహ్మద్ బిన్ అయ్యూబ్ బిన్ ముతైర్ లఖ్మీ తబరానీ. ఈయన ఎన్నదగ్గ ఇమాములలో ఒకరు. వెయ్యిమంది గురువుల నుంచి హదీసులను సంగ్రహించారు. హదీసు విద్యార్జన నిమిత్తం సిరియా నుండి బయలుదేరి 23 ఏండ్లు ప్రయాణంలో గడిపారు. ఆయన అసంఖ్యాకమైన రచనలు చేశారు. ఆయన రచనా ప్రక్రియ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. 'అల్ ముఅజ్జముల్ కబీర్', 'అల్ అజముల్ ఔసత్,' 'అల్ ముఅజముస్సగీర్' వాటిలో ఎన్నదగినవి. హిజ్రీ 260లో సిరియాలోని తబరియాలో జన్మించిన తబ్రానీ అస్ఫహాన్‌లో స్థిరపడ్డారు. అస్ఫహాన్‌లోనే హిజ్రీ 360లో తనువు చాలించారు.

## 30. అహ్మద్ బిన్ ముహమ్మద్ తహావీ (రహ్మ.లై)

ఈయన సమకాలీన ఇమాములలో ఒకరు. హాఫిజ్ మరియు ఆచార్యులు. ఈయన పూర్తిపేరు అబూ జాఫర్ అహ్మద్ బిన్ ముహమ్మద్ సలామా బిన్ సలమ అజ్డీ మిస్రీ తహావీ హనఫీ. హిజ్రీ 228 లేదా 227లో జన్మించారు. ఈజిప్టులోని 'తహా' అనే గ్రామం ఆయన స్వస్థలం కావటంచేత తహావీ అనబడ్డారు. మొదట్లో ఈయన షాఫయీ పండితునిగా ఉండేవారు. తన మేనమామ అగు ముజ్నీ దగ్గర విద్య నభ్యసించేవారు. అయితే ఆయనతో ఏర్పడిన మనస్పర్థల వల్ల ఇబ్నె అబీ ఇమ్రాన్ హనఫీ వైపునకు వెళ్ళిపోయారు. ఆనాటి నుంచి హనఫీ దృక్పథాన్ని వ్యాపింపచేసేందుకు అహోరాత్రులు కృషి సలిపారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఆయన కరపత్రాలు ప్రచురించారు. హదీసులను సేకరించారు. ఆయన లిఖించిన గ్రంథాలలో 'మానీ అల్ ఆసార్' ముఖ్యమైంది. తహావీ హిజ్రీ 321లో మరణించారు.

### 31. ఇబ్నె అబ్దుల్ బర్ర్ (రహ్మ.లై)

ఈయన ఇమాముగా, విద్వాంసునిగా, హాఫిజ్‌గా ఖ్యాతి చెందారు. పూర్తిపేరు అబూ ఉమర్ యూసుఫ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ బర్ర్ బిన్ ఆసిమ్ నమరీ ఖుర్తుబీ. హిజ్రీ 368లో జన్మించారు. ఈయన అపారమైన జ్ఞాపకశక్తి కలవారు. మహామేధావి. వంశవృక్షాన్ని వివరించే విద్యలో మంచి ప్రవేశం ఉండేది. "హదీసు అవగాహనకు సంబంధించిన మూల సూత్రాలపై తర్జన భర్జన చేయటంలో ఆయన్ని మించిన వారిని నేను చూడలేదు" అని ఇబ్నె హజమ్ వక్కాణించారు. ఎన్నో పుస్తకాలు వ్రాశారు. వాటిలో 'అల్ ఇస్తియాబ్' విశ్వవిఖ్యాతి చెందింది. ఇబ్నె అబ్దుల్ బర్ర్ హిజ్రీ 463 రబీవుస్సానీ మాసంలో - 95 ఏండ్ల వయస్సులో - మరణించారు.

### 32. అబ్దుల్ హఖ్ (రహ్మ.లై)

ఈయన పూర్తి పేరు అబూ ముహమ్మద్ అబ్దుల్ హఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ హుసైన్ బిన్ సయీద్ అజ్డీ ఇష్బిలీ. హిజ్రీ 510లో జన్మించారు. స్పెయిన్‌లోని బిజాయాలో నివాసమున్నారు. ఈ ప్రాంతంలోనే తన జ్ఞాన పరిమళాన్ని పంచిపెట్టారు. హాఫిజ్ మాత్రమేగాక గొప్ప విద్వాంసులు కూడా. బిజాయాలో బోధకునిగా ఉంటూనే ఎన్నో గ్రంథాలు వ్రాశారు. ఇస్లాం ధర్మశాస్త్ర కోవిదులు. హదీసు శాస్త్రంపై మంచి పట్టు కలవారు. దైవప్రవక్త (స) విధానాన్ని అనుసరించటంలో చాలా ఖచ్చితంగా వ్యవహరించేవారు. ధర్మనిష్ఠాపరులు, ప్రాపంచిక వ్యామోహాలకు దూరంగా ఉండేవారు. సాహిత్యం, కళలపై ఎంతో ఆసక్తిని కనబరచేవారు. అబ్దుల్ హఖ్ 581వ సంవత్సరం రబీవుస్సానీ మాసంలో బిజాయాలో మరణించారు.

### 33. అబ్దుర్రజ్జాఖ్ బిన్ హుమామ్ (రహ్మ.లై)

ఈయన ఇమాము మాత్రమే కాదు, గొప్ప హదీసుల సంస్మర్త (హాఫిజ్) కూడా. పూర్తి పేరు అబూబక్ర్ అబ్దుర్రజ్జాఖ్ బిన్ హుమామ్ బిన్ నాఫె హిమేరీ సనానీ. జ్ఞాన ఖని. ఇమామ్ అహ్మద్, ఇస్‌హాఖ్, ఇబ్నె మొయిన్, జుహ్లీ వంటి ప్రముఖులు ఈయన ద్వారా హదీసులను ఉటంకించారు. వార్ధక్యంలో కంటి చూపు పోయింది. జ్ఞాపకశక్తి కూడా క్షీణించింది. 85 సంవత్సరాలు జీవించి హిజ్రీ 211లో ఈ ప్రపంచాన్ని వీడి పోయారు.

### 34. అబ్దుల్లాహ్ బిన్ అదీ (రహ్మ.లై)

ఈయన విశ్వ విఖ్యాత ఇమాము మాత్రమే గాక ఎన్నదగిన హదీసుల హాఫిజ్ కూడా. పూర్తిపేరు అబూ ముహమ్మద్ అబ్దుల్లాహ్ బిన్ అదీ జుర్జానీ. ఇబ్నుల్ ఖిసార్ అనే పేరుతో పిలువబడేవారు. హిజ్రీ 279లో జన్మించారు. హిజ్రీ 375లో మరణించారు.

### 35. ముహమ్మద్ బిన్ అమ్ర్ అఖీలీ (రహ్మ.లై)

ఈయన కూడా ఇమాము మరియు హదీసుల సంస్మర్తగా ప్రసిద్ధిచెందారు. పూర్తిపేరు

అబూ జాఫర్ ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ మూసా బిన్ హమాద్ అఖీలీ. అగ్రశ్రేణి ఇస్లామీయ విద్వాంసులలో ఒకరు. ఎన్నో గ్రంథాలను రచించారు. వాటిలో 'కితాబుజ్జువాఫుల్ కబీర్' పేర్కొనదగినది. ఈయన జ్ఞాపకశక్తి కొనియాడదగినది. మక్కా మదీనాలలో నివసించారు. హిజ్రీ 322లో కాలధర్మం చెందారు.

## 36. అలీ బిన్ మదీని (రహ్మ.లై)

హదీసుల క్రోడీకరణలో అత్యుత్తమ శ్రేణికి చెందిన కోవిదులుగా పరిగణించబడ్డారీయన. ఈయన పూర్తి పేరు అబుల్ హసన్ అలీ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ బిన్ నజీ సాదీ. ఇమామ్ బుఖారీ, ఇమామ్ అబూదావూద్ సహా ఎంతోమంది హదీసు ఇమాములు ఈయన ద్వారా హదీసులను ఉటంకించారు. "దైవ ప్రవక్త (సఅసం) ప్రవచనాలను అందరికన్నా బాగా ఎరిగినవారు అలీ బిన్ మదీని" అని ఇబ్నె మహ్దీ వ్యాఖ్యానించారు. ఇమామ్ బుఖారీ ఇలా అంటున్నారు : "తన్ను తాను [illegible]నిగా, చిన్నవానిగా తలచుకునే విషయంలో నేను అలీ బిన్ మదీనీని మించి[illegible]రిని ఎరుగను." హిజ్రీ 161లో జన్మించిన అలీ బిన్ మదీనీ హిజ్రీ 234లో సామిరా (ఇరాఖ్)లో మరణించారు.

## 37. అలీ బిన్ ముహమ్మద్ ఇబ్నుల్ ఖత్తాన్ (రహ్మ.లై)

ఈయన పూర్తి పేరు అబుల్ హసన్ అలీ బిన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ మలిక్ ఫాసీ. ఈయన స్పెయిన్‌లోని ఖుర్తుబాలో హిజ్రీ 562లో జన్మించారు. మొరాకోలోని 'ఫాస్' పట్టణంలో నివసించేవారు. హాఫిజ్‌గా, ఇమాముగా, విమర్శకునిగా ప్రధాన భూమికను నిర్వర్తించారు. హదీసు ఉల్లేఖకుల విషయంలోగానీ, హదీసుల క్రోడీకరణ విషయంలో గాని అపారమైన పరిజ్ఞానం గల వ్యక్తిగా భావించబడ్డారు. అనేక గ్రంథాలను రచించారు. హిజ్రీ 628 రబీవుల్ అవ్వల్ నెలలో తనువు చాలించారు.

## 38. ఇమామ్ మాలిక్ (రహ్మ.లై)

ఇస్లాం జగతిలోని నలుగురు ప్రధాన ఇమాములలో ఈయన ఒకరు. మదీనా తయ్యిబాకు ఇమాముగా, ముస్లిం సమాజానికి చెందిన గొప్ప ధర్మవేత్తగా, అహ్లె హదీసు సమూహానికి నాయకునిగా పరిగణించబడేవారు. ఈయన పూర్తి పేరు అబూ అబ్దుల్లాహ్ మాలిక్ బిన్ అనస్ బిన్ మాలిక్ బిన్ అబూ ఆమిర్ అస్‌బహీ. హిజ్రీ 93 లేదా 94లో జన్మించారు. తొమ్మిది వందల కన్నా ఎక్కువ మంది అధ్యాపకుల వద్ద ఈయన హదీసు జ్ఞానాన్ని ఆర్జించారు. లెక్కకు మించిన జనులు ఈయన ఆధారంగా హదీసులను ఉటంకించారు. ఈయన ప్రియ శిష్యులలో ఇమామ్ షాఫయి (రహ్మ.లై) కూడా ఒకరు. ప్రపంచానికి హదీసు జ్ఞాన కాంతిని అందించిన ఇమామ్ మాలిక్ హిజ్రీ 179 రబీవుల్ అవ్వల్ నెలలో కన్ను మూశారు.

## 39. ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ ఇబ్నె మంద (రహ్మ.లై)

ఈయన పెద్ద ఇమాములలో ఒకరు. హదీసుల సంస్మర్తగా సేవలందించారు. భారీ సంఖ్యలో హదీసులను కంఠస్థం చేసుకున్న హదీసువేత్తల సరసన నిలబడతారు. హదీసుల జ్ఞానాన్ని ఆర్జించాలన్న తపనతో ప్రపంచ పర్యటన చేశారు. పర్యటన ముగించుకుని వచ్చే సమయానికి ఆయన వద్ద 40 పుస్తకాల మూటలు కనిపించాయి. ఈయనకు విద్యాబోధన చేసిన గురువుల సంఖ్య 1700. హిజ్రీ 310లో జన్మించిన ఇబ్నె మంద హిజ్రీ 395లో ప్రపంచ జీవన యాత్రను చాలించి పరలోకానికి సాగిపోయారు.

## 40. అబూ నుఐమ్ అస్‌ఫహానీ (రహ్మ.లై)

ఈయన పూర్తి పేరు అహ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అహ్మద్ బిన్ ఇస్‌హాఖ్ బిన్ మూసా బిన్ మహ్‌రాన్ అస్‌ఫహానీ (రహ్మ.లై). అత్యుత్తమ శ్రేణికి చెందిన హదీసు ఇమాములలో ఒకరు. ఈయన పేరెన్నికగన్న విద్వాంసుల వద్ద విద్య నార్జించగా, ఎన్నదగ్గ ఎంతోమంది పండితులు ఈయన వద్ద ధర్మజ్ఞానాన్ని ఆర్జించారు. అనేక రచనలు చేశారు. వాటిలో ముస్తఖ్రజ్ అలా సహీ బుఖారీ, ముస్తఖ్రజ్ అలా సహీహ్ ముస్లిం, హులియతుల్ ఔలియా పేర్కొనదగినవి. **ముఖ్యంగా** 'హులియతుల్ ఔలియా' అమిత ప్రజాదరణ పొందింది. ఈ గ్రంథం **నీసాపూర్‌కు** పంపబడినపుడు అక్కడి స్థానికులు 400 దీనార్లు చెల్లించి మరీ కొన్నారని చెప్పుకుంటారు. హిజ్రీ 334 రజబ్ నెలలో జన్మించిన అబూనుఐమ్ హిజ్రీ 430, ముహర్రం నెలలో అస్ఫహాన్‌లో మరణించారు.

## 41. అబూ యాల అహ్మద్ బిన్ అలీ (రహ్మ.లై)

ఈయన పూర్తి పేరు అహ్మద్ బిన్ అలీ బిన్ ముసన్నా బిన్ యహ్యా బిన్ ఈసా బిన్ హిలాల్ తమీమి. హిజ్రీ 210 షవ్వాల్ నెలలో జన్మించారు. అరేబియా ద్వీపంలో ప్రముఖ హాఫిజ్‌గా, ముహద్దిస్ (హదీసువేత్త)గా ప్రసిద్ధిచెందారు. 'అల్ ముస్నదుల్ కబీర్' అనే గ్రంథాన్ని రచించారు. గొప్ప సహనశీలిగా, నిజాయితీపరునిగా, సత్యసంధునిగా పేరుగాంచారు. ఈయన గురించి సమఆనీ ఇలా అంటున్నారు : "నేను హాఫిజ్ ఇస్మాయీల్ బిన్ ముహమ్మద్ బిన్ ఫజ్ల్ చెప్పగా విన్నాను - 'నేను ఎన్నో గ్రంథాలు చదివాను. ఉదాహరణకు ముస్నదుల్ అదనీ, ముస్నదె ఇబ్నె మనీ మొదలగునవి. ఇవన్నీ నదీనదాల వంటివి. అయితే ముస్నదె అబూ యాలా **మాత్రం** ఈ నదీనదాలన్నింటినీ తనలో కలుపుకునే సాగర సంగమం." అబూ యాలా హిజ్రీ 210, షవ్వాల్ నెలలో జన్మించారు. హిజ్రీ 307లో మరణించారు.

# ప్రచురణలు

| పుస్తకాలు | వెల రూ. |
|---|---|
| 1. మహాప్రవక్త (స) మహితోక్తులు (మొదటి భాగం) | 150-00 |
| 2. మహాప్రవక్త (స) మహితోక్తులు (రెండవ భాగం) | 100-00 |
| 3. హదీసు మకరందం (మొదటి భాగం) | 250-00 |
| 4. హదీసు మకరందం (రెండవ భాగం) | 225-00 |
| 5. పవిత్ర ఖుర్‌ఆన్ పరిచయం | 22-00 |
| 6. ఇస్లాం ధర్మశాస్త్రం (మొదటి భాగం) | 45-00 |
| 7. ఇస్లాం ధర్మశాస్త్రం (రెండవ భాగం) | 40-00 |
| 8. ఇస్లాం జీవన శైలి | 20-00 |
| 9. హృదయాల విజేత ముహమ్మద్ (స) | 27-00 |
| 10. ఆదర్శ మహిళ హజ్రత్ ఆయిషా (ర.అ) | 50-00 |
| 11. దేవుడు ఒక్కడే | 12-00 |
| 12. మస్జిద్ వ్యవస్థ | 20-00 |
| 13. రమజాన్ శుభాలు | 8-00 |
| 14. తల్లిదండ్రుల హక్కులు | 5-00 |
| 15. భార్యాభర్తల హక్కులు | 5-00 |
| 16. సంతానం హక్కులు | 5-00 |
| 17. అజాన్ | 4-00 |
| 18. బాలలు : ఇస్లాం | 9-00 |
| 19. స్త్రీ : ఇస్లాం వెలుగులో | 18-00 |
| 20. కారుణ్యం కురిసే వేళ | 5-00 |
| 21. ప్రవక్త గారి ప్రార్థనలు | 16-00 |
| 22. సత్యపథంలో అవరోధాలు | 6-00 |
| 23. రుజుమార్గం | 12-00 |
| 24. నూరె ఫాతిహా సారాంశం | 5-00 |
| 25. సుమధుర సందేశం | 12-00 |
| 26. ప్రవక్తల పిలుపు | 12-00 |
| 27. మానవ జీవితంపై సమాజ్ ప్రభావం | 15-00 |
| 28. వడ్డీ | 8-00 |
| 29. ఇస్లాం మెచ్చిన మహిళలు | 14-00 |
| 30. హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మలై) | 12-00 |
| 31. సమాధి....!? | 4-00 |
| 32. అసూయ | 8-00 |
| 33. మానసిక రుగ్మతలు | 8-00 |
| 34. ఆలస్యం అమృతం విషం | 8-00 |
| 35. పశ్చాత్తాపం | 12-00 |
| 36. పరదా | 6-00 |
| 37. ముహమ్మద్ (స) క్రీస్తు సహజ వారసులు | 16-00 |
| 38. ఇస్లాం నైతిక విధానం (మొదటి భాగం) | 15-00 |
| 39. ఇస్లాం నైతిక విధానం (రెండవ భాగం) | 12-00 |
| 40. మార్గదర్శక ఖలీఫా-హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) | 12-00 |
| 41. మార్గదర్శక ఖలీఫా- హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) | 15-00 |
| 42. అల్లాహ్ శరణు | 8-00 |
| 43. సమాధుల సందర్శన | 10-00 |


**Al Huq Telugu Publications**

*Under* **Al-Huque Educational & Welfare Society**

Eidgah Compound, Akbar Bagh, Sayeedabad, Hyderabad-59

Phone: 24550007, 24557265, 9391146132, 9441055065

website: www.alhaqsociety.org Email:alhaqsociety@yahoo.com